GVP01R178 C

ఈ



కవిసేషం

ప్రానుగంటి

లక్ష్మీ నరసింహారావు

C1

BLANK PAGE

I GVPOIR 178
H:- 8
W:- 5.5

శాక్షి

(అన్ని సంపుటాలు కలిపి)

శ్రీ మధునాపంతుల సత్యన్నారాయణ శాస్త్రిగారి పీఠికతో
శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారిచే వ్యావహారికభాషలో
ప్రతి ఉపన్యాసానికి ముందు వివరణలతో
తొలి కంబైండ్ ఎడిషన్‌కు డా॥ నండూరి రామమోహనరావు గారి
"యువ పాఠకులకోసం....." శీర్షికతో

కవిశేఖర
పానుగంటి
లక్ష్మీనరసింహారావు

అభినందన పబ్లిషర్స్
28-9-24, జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ-2. ఫోన్ : 2572211/22

SAAKSHI

సాక్షి

Panuganti Lakshmi Narasimha Rao
with
Preface, by Madhunapantula Satyanarayana Sastry.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు,
మధునాపంతుల సత్యన్నారాయణ శాస్త్రి గారి పీఠికతో,

Preface by Dr. Nanduri Ramamohana Rao

డా॥ నండూరి రామమోహనరావుగారి "యువపాఠకులకోసం...." శీర్షికతో

Leads by Indraganti Srikantha Sarma

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారిచే వ్యావహారిక భాషలో వివరణలతో (అదనంగా సుమారు 175 పేజీలు చేర్చబడినవి)

First Combined Edition : 2006

తొలి కంబైండ్ ఎడిషన్ : 2006

Publishers
Abhinandana Publishers
Vijayawada - 520 002.

పబ్లిషర్స్ :
అభినందన పబ్లిషర్స్
విజయవాడ - 520 002.

Director of Publishing :
B. Babjee

డైరెక్టర్ ఆఫ్ పబ్లిషింగ్ :
బి. బాబ్జీ

Price : Rs. 550/-

వెల : రూ. 550/-

Title : Sri Bapu

టైటిలు : శ్రీ బాపు

Printing
Sri Chaitanya Offset Printers
Vijayawada - 520 002.

ప్రింటింగ్ :
శ్రీ చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
విజయవాడ - 520 002.

ISBN 81-85591-01-6

ISBN 81-85591-01-6

మా మాట

మంచి రచనలు అందించాలనీ,
మంచి అభిరుచి పెంపొందించాలనీ,

పాఠకులు కలకాలం తమ సొంత గ్రంథాలయంలో మంచి పుస్తకాలు పెట్టుకుని వదే పదే వాటిని చదువుకోవడానికి దోహదం చెయ్యాలనీ - మా చిరకాల వాంచితం.

ఈ ప్రయత్నంలో మా సోదర సంస్థ 'న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్' యివ్వటివ రకు చాలా విజ్ఞాన దాయకమైన పుస్తకాలను, ఉత్తమ సాహిత్య గ్రంథాలను ప్రచురించి, చేతనైనంత కృషి చేస్తూందని మీకు తెలుసు.

ఇప్పుడు మా నూతన సంస్థ 'అభినందన పబ్లిషర్స్' ఒక సాహసం చేస్తోంది. అయితే, ఈ సాహసం ఆనందకరమైనది. ఒకరకంగా గర్వకారణమైనది. అదే, 'కవిశేఖర' పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన 'సాక్షి' వ్యాసాలను ప్రచురించి - అభిమాన పాఠకులకు అందించడం.

కొందరు - కథలు వ్రాసి, గొప్ప కథకు లనిపించుకున్న వారున్నారు. కొందరు నవలలు వ్రాసి గుర్తింపు, గౌరవం పొందిన వారున్నారు. అలాగే కవులనిపించుకుని రాణకెక్కిన వారున్నారు. కాని - 'వ్యాసం' అనే ప్రక్రియకు అపూర్వమైన సాహిత్యగౌరవం తెచ్చిపెట్టి - పాఠకులను విశేషంగా ఆకట్టుకున్న మహా రచయిత బహుశా పానుగంటి వారొక్కరే. నాటకం వ్రాసి గురజాడవారు గిరీశం పాత్రను చిరంజీవినిచేస్తే, పానుగంటివారు వ్యాసాలను ఉపన్యాసాలుగా, ఉపన్యాసాలను వ్యాసాలుగా జలకాలాడించి - జంఘాలశాస్త్రి వ్రాతను చిరంజీవిని చేశారు. ఈ వ్యాసాలలో పానుగంటి వారి శైలి, విషయ నిన్యాసం చూస్తుంటే, చురకత్తి కొసను మల్లెదండ వ్రేలాడ దీసి నట్టుంటుంది. 1913లో కొంతకాలం, 1920లో కొంతకాలం 'సాక్షి' వ్యాసాలను ఆయన రచించారు. ఎందరో అసంఖ్యాక పాఠకుల్ని ఆకర్షించారు. ఆలరించారు. పానుగంటే సాక్షి, సాక్షే పానుగంటి అనిపించారు.

తొలుత ఈ వ్యాసాలను పిఠాపురం రాజావారు ముద్రించి ప్రచారం చేశారు. ఆ తరువాత మద్రాసులోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థవావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారు ఆరు సంపుటాలుగా ప్రచురించారు. ఈ విషయాలు జరిగి దాదాపు నలభై సంవత్సరాలు గడిచాయి. (వావిళ్లవారికి సంబంధించినంతవరకు)

ప్రస్తుతం ఆ ఆరు సంపుటాలు'సాక్షి' వ్యాసాలను - అక్షరంపాల్లుపోకుండా మొత్తం మూడు సంపుటాలుగా పాఠకులకు అందించగలిగే భాగ్యం మాకు కలిగినందుకు సంతోషిస్తున్నాం.

1920 లెక్కవేసుకున్నా, ఈ వ్యాసాల రచన జరిగి ఇప్పటికి 70 ఏళ్లు కావస్తోంది. వీటి భాష గ్రాంథికం. విషయాలు ఎంత ఆసక్తి కరమైనవైనా, ఎంత హాస్యరసప్రధానంగా వున్నా, ఈ నాటి పాఠకులకు ఈ 'సాక్షి' ని చేరువ చెయ్యాలంటే, వ్యావహారిక భాషలో, ప్రతి వ్యాసం సారాంశం ముందు 'టూకీ' గా అందిస్తే బాగుంటుందని తోచింది. ఈ మా

లక్ష్యం చెప్పగానే సహకరించి, వ్యాసాలన్నింటికి 'క్లుప్త కథనాన్ని' వ్రాసి యిచ్చిన మిత్రులు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు. మా ప్రచురణ సంకల్పం తెలిపిన వెంటనే ఆనందంతో ఆశీర్వదించి పీఠిక వ్రాసి యిచ్చినవారు మహాకవి, కళా ప్రపూర్ణ మధునాపంతుల సత్యనారా యణ శాస్త్రిగారు, ఇటువంటి ఆదరభామానాలతోనే ఈ సంపుటాలకు ముఖపత్ర రచన చేసినవారు ప్రముఖ చిత్రకారులు శ్రీ బాపుగారు. ఈ సంపుటాలు అందంగా - అచ్చుతప్పులు లేకుండా - పాఠకులకు అందించాలని ఆశించి, శ్రమించి సహకరించిన వారు పండిత మిత్రులు పి. జగన్నాధరావుగారు. వీరికి మా 'హార్ద' కృతజ్ఞతులు.

ఇన్నాళ్లకు మళ్లీ 'సాక్షి' వ్యాసాలను వెలువరించడమంటే, చాలా అందంగా చెయ్యాలని ఆత్యాధునిక ముద్రణ పద్ధతిని అనుసరించాం. ఇది బరువైనదైనా 'పరువైనదని' సాహసించాం. ఈ సంపుటాలను మీ చేతిలో సవినయంగా నగౌరవంగా ఉంచుతున్నాం. ప్రోత్సహించి ఆశీర్వదించమని విన్నవించుకొంటున్నాం.

''సాక్షి మూడు సంపుటాల వ్యాసాల సాక్షిగా''

''తెలుగు సాహిత్యానికి సాక్షి నామసంవత్సరం''

డైరక్టర్ ఆఫ్ పబ్లిషింగ్
అభినందన పబ్లిషర్స్

బి. బాబ్జి
డైరెక్టర్.

ఒక్క క్షణం ....

'సహస్ర చంద్రదర్శనం' తరహాలో గత తరాల వారి జాతీయసంపద 'సాక్షి'ని ఆధునిక రూపలావణ్యాలతో తెలుగు పాఠకులకు అందిస్తున్నందుకు సగర్వంగా వుంది. 1913-20 మధ్యకాలంలో **'కవిశేఖర' పానుగంటి లక్ష్మీనరసింహారావు** గారు రచించిన **'సాక్షి'** వ్యాసాలు తెలుగు సాహితీరంగంలో వ్యాసరచనా ప్రక్రియకు అపూర్వగౌరవ ప్రతిష్టలను చేకూర్చాయి.

దేశభక్తి, సంఘసంస్కరణ, స్వదేశ పరిశ్రమలు, స్త్రీ స్వాతంత్ర్యం, నాటకం, సాహిత్యం, మతం, ఆధ్యాత్మికత, భాష, ఎన్నికలు, వైద్యం, నాగరికత మొ॥ వందలాది అంశాలమీద సునిశిత విమర్శనాస్త్రాలను సంధించిన **'సాక్షి'** వ్యాసరచనలకు ఈనాటికీ కాలదోషం పట్టకపోవడంలో ఆశ్చర్యం లేదు గాని, రచయిత ఊహాబలం, రచనాపటిమ దాదాపు శతాబ్దకాలం వరకు సజీవంగా ఉన్నందుకు గర్వించాలి.

'ఆంధ్రపత్రిక' ఆదివారం సారస్వతానుబంధంలో వారంవారం వెలువడిన ఈ అపురూప వ్యాస పరంపరను తొలుత పిఠాపురం రాజా వారు పుస్తకరూపంలో వెలువరించి మరింత ప్రచారం కల్పించారు. తదనంతరం వావిళ్ల ప్రచురణ సంస్థ మొత్తం ఆరు సంపుటాలలో ప్రచురించిన ఈ వ్యాసాలు బహుళ పాఠకాదరణ పొందాయి. చాలాకాలం పునర్ముద్రణ కాకపోవడంతో 1991లో మేము ఈ బృహత్తర బాధ్యతను చేపట్టి మూడు సంపుటాలుగా వెలువరించాము. కాలపరిణామంలో తెలుగుభాష ఎంతో ఆధునికతను సంతరించుకోవటంతో నూతనతరాల పాఠకుల పఠనాసౌలభ్యం నిమిత్తం ప్రతి వ్యాసరచనకు ప్రారంభంలో వ్యావహారికభాషలో ఆ వ్యాసరచన ముఖ్యోద్దేశాన్ని శ్రీ ఇంద్రకంటి శ్రీకాంతశర్మ గారి వివరణల రూపంలో అందించాము. మా ఈ వినూత్న ప్రయత్నాన్ని పాఠకులు యావన్మందీ హర్షించారు. ఈ ఉత్సాహబలంతో 1999లో రెండవ ముద్రణ జరిపాము.

విశ్వసాహిత్యంలో సజీవనదులవలే అన్ని కాలాల్లోనూ ప్రవహించుతూ, అన్ని తరాల పాఠకులను అలరించే సజీవరచనలు కొన్ని అయినా ఉండటం సహజం. ఈ పోలిక గల సాహిత్యసంపదలో **'సాక్షి'** వ్యాసాలు స్థానం సంపాదించుకున్నాయని అనుభవపూర్వకంగా మాకు తెలియడంతో తృతీయ ముద్రణకు అరుదెంచాము. **'సాక్షి'**

మూడు సంపుటాలను ఒకే బృహత్ సంపుటముగా రూపకల్పన చేసి, ఆధుని
సాంకేతిక సహకారంతో ముద్రించి, మీ ముందుకు తీసుకువచ్చాం.

'సాక్షి' వ్యాసాలలో సునిశిత విమర్శకు లోనైన, వ్యంగ్యభరితమైన, అవహేళనక
గురయిన అంశాలన్నీ ఈనాటికీ చర్చనీయాంశములు కావడం విశేషం. ఈ తర
యువపాఠకులకు సైతం ఈ వ్యాసరచనలు స్ఫూర్తిమంతములు కాగలవ
మా దృఢవిశ్వాసం.

మా ఈ మూడవ ముద్రణ బృహత్ సంపుటానికి కోరినంతనే 'యువపాఠకులకు....
సహృదయతతో రాసిన సన్మిత్రులు, సుప్రసిద్ధ పాత్రికేయులు డా॥ నండూర
రామమోహనరావు గారికి కృతజ్ఞతలు.

మేము సర్వాంగసుందరంగా అందిస్తున్న ఈ నూతన ముద్రణ **'సాక్షి'** సంపుటమున
మా ప్రియతమ పాఠకులు సమాదరించాలని ఆకాంక్షిస్తున్నాం.

శ్రీ వ్యయనామ ఉగాది
30-3-2006

డైరక్టర్ ఆఫ్ పబ్లిషింగ్
అభినందన పబ్లిషర్స్
బి. బాబ్జీ

డైరెక్టర్

తెలుగువారి బృహత్సంహిత

'మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన' మహాకవి ఆధునిక కాలమున ఎవరు?–అని ఎవరైన ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము – పానుగంటి లక్ష్మీనరసింహారావుగారని.

వచనరచనాధురీణులు మరికొంతమంది వుండిన జాతికి ప్రయోజనదాయకమే కాని, నష్టదాయకము కాదు గదా–

కాని తమదైన శైలీవిన్యాస మాధుర్యము కలవారు కావలెనన్నచో–

రావలసిన పేరు లక్ష్మీనరసింహారావుగారిదే. రావలసిన పేరు వచ్చినది. వచ్చినది శాశ్వతమైన యశస్సు తప్ప కొన్ని కేలండర్లకే పరిధి అయినది కానే కాదు.

నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్య ప్రేమికులుండరు.

అంతగొప్ప వచన మాయనకు వచ్చుట వింతకాదు. తపఃఫలితము. భాషామాధుర్య మధనోద్భూతము. జీవము భావమని వేరుగా చెప్పనవసరము రాదు.

గద్య సాహిత్య రంగమున జరుగవలసిన దానికై నాడు 1922లో పానుగంటి వారెంతగా అభిలషించిరో, ఆశించిరో తెలియుటకు ఆంధ్రసాహిత్య పరిషదేకాదశ వార్షికోత్సవమున వారి అధ్యక్ష వచనమే సాక్షివచనము.

''చిత్రములైన శైలీ భేదములు, మన భాషలో మిగుల నరుదుగా నున్నవని వేరే చెప్పనేల? రైమని పేకచువ్వ పై కెగిరినట్లున్న శైలి భేదమేది? కాకి పై కెగిరి యెగిరి తొక్కులు కదలకుండ జందెపు బెట్టుగ సాపుగ వాలుగ దిగునప్పటి లఘుపతన చమత్కృతి కనబడుచు శైలి పద్ధతి యేది? తాళము వాయించునప్పటి తళుకు బెళుకులు, టింగుటింగులు, గలగలలు, జలజలలు గల శైలియేది?.... భయంకరమయ్యును మనోహరమై, మహాశక్తి సక్తమయ్యు మార్దవయుక్తమై, ధారాళమయ్యు విశాలమై, స్వభావ సమృద్ధమయ్యు సరసాలంకార భూయిష్ఠమై, సముద్ర ఘోషము గలదయ్యు సంగీత ప్రాయమై.... చదువరులకు గనుకట్టు, వాకట్టు, మదిగట్టు తలపులిమినట్లు శ్వాసమైన సలుపకుండ జేసినట్లు, ముష్టివాని చిప్పనుండి మూర్ధాభిషిక్తుని కిరీటము వఱకు, భూమి క్రింది యరల నుండి సముద్రములోని గుహల వఱకు సెవరెస్టు కొండనుండి యింద్ర ధనుస్సు రంగుల వఱకు, మందాకినీ తరంగ రంగద్ధ్వంసాంగనా క్రేంకారముల నుండి మహాదేవసంధ్యా సమయ నాట్య రంగమున వఱకు మనోవేగముతో నెగురు శక్తి కల చిత్ర విచిత్ర శైలీ భేదము లింక నెన్నియో భాషలో బుట్టవలసియున్నవి''.

సరియగు వచనము ఎట్టిది అనుటకు ఈ అధ్యక్ష వచనమే నిర్వచనము–

ఆయన ఆశించిన వచనము వచ్చినది, ఆ వచ్చుట యితరుల వలన కాదు–సాక్షాత్తు ఆయన వలననే, సాక్షి వలననే.

అధునాతన సంఘమునకు షడ్దర్శనములుగా సాక్షి దర్శన మిచ్చినది. అది వ్యా
దర్శనము. అనేకములను గద్య గ్రంథములని మనము సరిపెట్టుకొనవచ్చును. కాని, సా
సంపుటములు గద్యకావ్యము లనిపించగల గుణ సమన్వితములు. కోణములు మారి
సాక్షివైన వంద పరిశోధన గ్రంథము లుదయింపజేయ వచ్చును, వేయి వుపన్యాసమ
లీయవచ్చును.

నాటి నాటకములలో సంగీతము అన్ని తావుల నుండరాదని తెలుపు నుపన్యాసము
''సాయంతన పాకసామగ్రీ సందర్భమును సంగీతములో వెల్లడించి యుంటమా? అట్లే చే
యుండిన యెడల మన యిరుగుపొరుగు వారు మన చేతులు కాళ్ళు గట్టి తలలు నున్నగా
గొఱిగించి నిమ్మకాయ పులుసుతో రుద్ది, బెత్తముచే మోది యున్మత్త శాలకు పంపిం
యుండరా? అజ్ఞాన స్వరూపమగు గ్రుడ్డయినను గడుపునొప్పి రాగ గ్యారుక్యారున నేడ్చున
గాని సరళ స్వరము పాడునా? ప్రాయ్యె యలుకుచుండఁగ దేలుచేఁ గుట్టబడిన వనిత మొఱ్ఱో
మొఱ్ఱో యని యేడ్చును గాని ముఖారిపాడి తాండవించునా? అట్లే చేసియుండిన యెడల
దేలుమాట యటుంచి దయ్యపుబాధయని చీపురుకట్టలతో వీఁపు తట్టుఁ దేరఁ జూవగొ
యుండరా?

కన్నకొడుకు మరణింపఁగఁ దల్లి తలకొట్టుకొని యేడ్చి యేడ్చి కొయ్యవాఁ
పోవలసినదికాని మొలకట్టుకొని యుత్కంఠమున బాడిపాడి ముక్తాయించి తీరవలసినదా?
దూడచచ్చిన యాఁవైన దిగులు పడి డిల్లపడి, గడ్డిమాని నీరు మాని దూడను ముట్టిత
స్పృశించి కంటనీరు పెట్టుకొని తహతహచే గింజుకొని 'యంబా' యని యఱచునే
మనమంత కంటె నధమ స్థితిలో నుండవలసి వచ్చెనే–ఎంత మహాప్రారబ్ధము పట్టినది! పాఁ
కొఱకే మనమప్పుడుప్పుడు పాడుకొనుచున్నాము. కాని ప్రాపంచిక సర్వవ్యాపారములన
బాటలతో గాక మాటలతోడనె మనము నిర్వహించు కొనుచుంటిమని మన మందఱమెఱిఁగి
ననంశమే కదా!.... ఆహా మనుష్యత్వము పశుత్వమున కంటె నేడాకులు తగ్గినదా?'' అని
వ్రాసిన పానుగంటి తత్త్వమును మనము గ్రహించవలెను. వాస్తవిక దృక్పథమునకు మనలను
తీసికొని వచ్చుటలో ఆయన చెప్పునవి దెప్పునవి కొల్లలు కొల్లలు. ఒక్కొక్కప్పుడాయన
రచన గిల్లునట్లుండును. గిల్లును. అవసరమైనప్పుడు మన చర్మము దళసరి అని భావించిన
ప్పుడు రక్కియైన నొక్కి చెప్పును గాని వదలుట యనునదియుండదు. అందువలననే
సాక్షి, ఛాందసులకు లక్ష్మీనరసింహ స్వప్నము!

పానుగంటి వంటివారుకాక మరియొకరు అట్టి గ్రాంథిక వచన రచనము అరసున్న
లతో బండిరాలతో చేసియున్నచో నీ కాలమున నిగిరిపోయి వుండును. కారణము ఒ
వచన రచనా పాటవము చాలదు.

పానుగంటివారు కవి. విమర్శకులు. భావుకులు. సమాజ దర్శనము మరువని వారు.
సంఘ సంస్కరణము కోరినవారు. పైబడి రచనా సంస్కరణము కోరిన వారు. ఆకట్టుకొను
టలో కనికట్టు కనిపెట్టిన వారు.

కొంచెము ముందునకు వెళ్ళినట్లనిపించవచ్చు గాని–

నాటకములలో 'కన్యాశుల్కము' ఎట్టిదో గద్యరచనములలో 'సాక్షి' అటువంటిది.

ఆయన వచన కవిత్వము వ్రాయకపోవచ్చును. గాని వచనమున గవిత్వము వ్రాసిన వారు.

పానుగంటివారిని వచన యోధులని చెప్పవలెను. మనము చెప్పనవసరము లేదు. ఈ వాక్యములు పల్కుచున్నవి.

''వచనము వ్రాయువారిని దీసివేత సరకుగ గుక్కమూతి పిందెగc ద్రుణీకరింప న్యాయమా? పద్యమున గవిత్వముండి వచనమున లేకుండునా? ఎచ్చట రసముండునో అచ్చటనే కవిత్వమున్నది. అన్ని నాగరక దేశములందు గూడ వచన ప్రబంధములు లక్షోపలక్షలుగా వృద్ధి పొందుచున్నప్పుడు మన దేశమందట్లు జరగకపోవుట కడుశోచనీయము గాదా?

వచన గ్రంథ రచనా బాహుళ్యము గాని భాష యభివృద్ధి పొంద నేరదు''–

ఇవి నాటుకొనవలసిన మాటలు.

వీరేశలింగమువారు, చిలకమర్తివారు, పానుగంటివారు–వీరందఱునూ ఒరి రచనలను చేయుట కాదు, భాషా వికాసమునకు, సాహిత్య సమున్మీలనమునకు, దేశ ప్రయోజనములకు పాటు పడుట వారి రక్తమున నున్న అంశములు. వర్తమాన రచయితలు వారి ఆదర్శ స్ఫూర్తి పొందవలసిన జాత్యవసరమున్నది.

వెగటుదనము, పచ్చి శృంగారము లేకుండగ హాస్యము పుట్టించు పానుగంటి సాక్షి రచనలలో–ఉల్లేఖించివలసినచో సవాలక్ష కన్పడును. విజ్ఞానము, పరిశీలనము అనునవి పానుగంటి వారికి రెండు కన్నులుగ రచనకు దారులు చూపించినవి. తోలు బొమ్మలాటలో బాటలు పాడు ఆడుదానిని పరిశీలనాత్మకముగా వర్ణించు సందర్భమున ''గ్రామమున రాత్రివేళ యందది యేమూల బాడుచున్నను గ్రామమంతయు దాని కంఠము వినిపించును. చెక్కుచెదరలేదు. నలి లేదు. తొలి లేదు. బొంగు జీరలేదు. అపస్వరము వెలితి లేదు. 'క్షై' మనిన నక్షత్ర మార్గమున గట్టుమని తిరుగుచుc బలిటీలు గొట్టును. సంగతుల పై సంగతులు పూలు చల్లినట్లది వర్షించును'' అనుటలో చివరి వాక్యములు కవి వాక్యములు.

పానుగంటి వారి ఆలోచనలు దేశీయమైనవి. సాహిత్యరంగమున, సంఘ సంస్కరణ మున మాత్రమే కాదు; పారిశ్రామిక రంగమున కూడ మనదేశము అభివృద్ధి గాంచవలెనని వారాశించుట 'స్వదేశ పరిశ్రమలు' అను శీర్షిక గల రచనమే తెలుపును. కడుసన్నని నూలు నేసి యంత్రములు చేయలేని వస్త్రోత్పత్తిని చేయు మన వారి నేర్పు నాయన ఎన్నియో వాక్యములలో ప్రశంసించినారు. ఇప్పుడైనా కన్నులు తెఱవరా? స్వదేశ పరిశ్రమ విద్యా సంరక్షణ మాచరించరా? మీ ధనము మీలో నుండునట్లు చేసికొనరా? అని ప్రశ్నించినారు. దేశభక్తి-స్వార్థ త్యాగము వ్యాసము పానుగంటి వారి అంతరంగమునకు వేదిక వంటిది. మాతృభక్తి, పితృభక్తి వంటివి లేకనే దేశభక్తి యుండుట, కల్లుట వీలుకాదని నొక్కి చెప్పుచు నిజమైన దేశభక్తుల అవసరము తెలుపుచు దేశభక్తి, ప్రదర్శనముగా నుండరాదని అభిప్రాయపడినారు.

''బజారులో దేశభక్తులు. మంద బయట దేశభక్తులు. ఇంటిలో దేశభక్తులు. దొడ్డిలో

దేశభక్తులు. వాకిటిలో దేశభక్తులు. రైలు స్టేషనులో దేశభక్తులు. నేల యీనినట్లిందఱు దేశభక్తులు–వందలు, వేయి లక్షలు. ఇందఱు దేశభక్తులు మన దేశమున నున్న తరువాత మన దేశమునకిఁక గొఱతయేమి? ఇంకను దేశమునకు దురవస్థ యేమి? ఏమియులేదు, ఇదియే స్వతంత్ర్య రాజ్యము. ఇదియే స్వర్గలోకము''–

ఈ పానుగంటి వాక్యములు పరోక్షముగా క్రియాత్మక దేశభక్తి ప్రబోధించుచున్నవి. ఆంగ్ల భాషావ్యామోహమున తెలుగు మాటాడుటకు నిష్టపడని వారిని ఆయన దులిపిన తీరు గమనించవలెను.

''మ్యావుమని కూయలేని పిల్లి యెచ్చటనైన నున్నదా?... ఈతరాని కప్ప ఏ దేశమందైనా నుండునా? పుట్టగానే క్యారుమనలేని బిడ్డ చచ్చినదనుట కేమైన సందేహమా? ఆంధ్రదేశమున బుట్టిన పశువులైన ననవరతశ్రవణమున నాంధ్రమున మాటలాడుచుండగా –అయ్యయో మనుజుడే అంత మనుజుడే–ఆంధ్రమాతాపితలకు బుట్టిన వాడే–ఆంధ్ర దేశీయ వాయు నీరాహార పోరణ మొనర్చినవాడే– అధమాధ మాఱు సంవత్సరముల యీడు వఱకైన నాంధ్రమున మాట లాడినవాడే–అట్టివాఁ డాంగ్లేయ భాష నభ్యసించినంత మాత్రమున నిప్పుడాంధ్రమున మాటలాడ లేకుండునా–'' అనిన పానుగంటివీరాంధ్ర వాక్యములు ఎంత దళసరి చర్మము వారినైన మార్చగల శక్తి సంభరితములు కదా?

'కవి' వ్యాసమున వచనము వెంబడి గల పద్యము పానుగంటికవి ఆంతరంగిక దశా విశేషములు తెలుపునది.

''మల్లెపూవుఁదూఁటి మధుపంబుతోఁ బాడి
గంధవాహుతోడఁ గలసి వీచి
యబ్ధిలోన మునిగి యూర్వ్యవహ్నిని గ్రాఁకి
నీటి బుగ్గయగుచు నింగి బ్రాకి
తోఁక చుక్క తోడ డీకొని శ్రమఁ జెంది
సాంధ్యరాగ నదిని స్నానమాడి
తనువునిండ నింద్రధనుసు రంగులు పూసి
కైరవాప్తు సుధను గైపుజెంది
గోళగాన రుతికి మేళవింపు బాడి
పాడియాడి యాడిపాడి సోలి
భావనామహత్వ పటిమను బ్రహ్మమై
పోవు కవికి కోటి మ్రొక్కులిడుదు''

కవి యనగా ఎవరనగా–

''సమయానుసార సర్వతోముఖ సమ్మోహినీ కరణ సరస్వతీ మూర్తి'' ఇది సాక్ష్యుక్తి. దీని కన్వర్థము పానుగంటివారే. అది కల దిది లేదు, ఇదికల దదిలేదు అనునది సాక్షి విషయమున చెప్పలేము.

సాక్షి సంపుటములు అధునాతన కాలమున తెలుగువారికి బృహత్సంహితలు.

సాక్షి సంపుటములు పునర్ముద్రణము చేయుటను పై నుండి పీఠికాపుర మహారాజు గారు, నాటి నావిళ్లవారు, అభినందించుచున్నట్లు, పానుగంటివారు ఆశీర్వదించు చున్నట్లు, నా కనిపించుచున్నది.

ఇది తెలుగువారికి తమ జాతీయ సంపదను తిరిగి చూచుకొనుటకు, అనుభవించు టకు బృహదవకాశము.

లలితానగరు
రాజమహేంద్రి.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి
15-11-90.

యువపాఠకులకు....

నా చిన్నతనంలో నేను చదివిన మొదటి జనరల్ బుక్స్‌లో **'సాక్షి'** ఒకటి. మా స్వగ్రామానికి సమీపంలోని లైబ్రరీ నుంచి **'సాక్షి'** సంపుటాలను వారంవారం తెచ్చుకొని చదవడం నాకు ఒక హాబీగా ఉండేది. నాకు ఏ కాస్తో తెలుగు రాయడం; రావడానికి ఒక కారణం అనాడు నేను చదివిన పానుగంటి వారి **'సాక్షి'** అని సగర్వంగా చెప్పగలను.

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు **'సాక్షి'** వ్యాసాలను గ్రాంథికశైలిలో రాశారు. అయితే, అది గొడ్డు గ్రాంథికం కాదు. వ్యావహారికానికి దగ్గరగా వుండే గ్రాంథికశైలి. అప్పటికే, ప్రముఖ రచయితలందరు వ్యావహారిక భాషనే అవలంభించినప్పటికీ ఇంకా గ్రాంథికభాషలో పలువురు రాస్తూ ఉండేవారు. అయినా, ఆ గ్రాంథికం దాదాపు వ్యావహారికమనే అనిపించేది. ముఖ్యంగా పానుగంటి వారిది గ్రాంథికశైలి అయినా చాలా సులభంగా, సరళంగా, సుందరంగా ఉండేది. **'సాక్షి'** వ్యాసాల శైలి ఝరీవేగంతో పరుగులెట్టేది. రాజమండ్రి వద్ద వరద వచ్చినప్పటి గోదావరిలా ప్రవాహ సదృశంగా ఉండేది. ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా **'సాక్షి'** వ్యాసాలను చదివేవారు.

ఈ వ్యాసాలను 1920 ప్రాంతాలలో మొదటగా 'ఆంధ్రపత్రిక' సారస్వతానుబంధంలో వారంవారం ప్రచురించేవారట. ఆ వ్యాసాలు ఆగిపోయిన తర్వాత అవన్నీ సంపుటాల రూపంలో వచ్చాయి. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం ఇంతా అంతాకాదు. 'జంఘాల శాస్త్రి' అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సంఘ దురాచారాల మీద, అనాచారాలమీద, మూఢవిశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు. ఇన్నేళ్ళ తర్వాత వాటి పునర్ముద్రణకు ముందుకు వచ్చిన 'అభినందన పబ్లిషర్స్'ను ఎంత అభినందించినా తీరదు.

'సాక్షి' వ్యాసాలపట్ల ఆనాటి ఆకర్షణ, కుతూహలం ఈనాటికీ తగ్గలేదనడానికి ఒక నిదర్శనం 'అభినందన' వారు అనతికాలంలోనే **'సాక్షి'** సంపుటాలను పునఃపునర్ముద్రించవలసి రావడం. ఇప్పటికే వారు ఒక 15 సంవత్సరాలలో రెండు సార్లు వాటిని మూడేసి సంపుటాలలో పునర్ముద్రించారు. ఈసారి వారు అన్ని సంపుటాలను కలిపి ఒకే బృహత్ సంపుటంగా ప్రచురిస్తున్నారు.

'అభినందన' వారు పునర్ముద్రించిన సంపుటాలలో ప్రతి వ్యాసానికి ముందు వివరణలు రాసిన వారు ప్రముఖ రచయిత శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు. ఆయన వ్యాస సారాంశాన్ని ప్రతి వివరణలోను పొందుపరిచి వ్యాసం చదవడానికి కుతూహలం కలిగించారు. అలాగే పండితకవి శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు ఈతరం వారికి **'సాక్షి'** వ్యాసాలను పరిచయం చేస్తూ రాసిన ప్రశంసా వాక్యాలు కూడా ఈ సంపుటాలలో పొందుపరిచారు. ఈ సంపుటాలలో అదొక ఆకర్షణ.

ఒకటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను. మొదటిసారి నా చిన్నతనంలో చదివినప్పుడు కలిగిన త్రిల్ మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత **'సాక్షి'** వ్యాసాలను చదువుతున్నప్పుడు కలిగింది. అదంతా పానుగంటి వారి శైలి మహత్యం. ఆ త్రిల్ ఎలాంటిదో తెలుసుకోవాలంటే మీరూ ఈ వ్యాసాలను ఆమూలాగ్రం చదవండి.

21-03-2006

విజయవాడ.

- నండూరి రామమోహనరావు

మొదటి సంపుటం
విషయసూచిక

పుట.

1. సాక్షిసంఘ నిర్మాణము 1
2. గ్రామ్యభాషాగ్రంథ పఠనము 7
3. విమర్శక స్వభావము 14
4. సారంగధరనాటక ప్రదర్శనము 18
5. నాటక ప్రదర్శనము 30
6. నాటక ప్రదర్శనము 39
7. నాటకీయ పద్యరచన 45
8. కష్టాంతనాటకములు 54
9. కపుల కష్టములు 60
10. స్త్రీ స్వాతంత్ర్యము 67
11. కాంతల గూర్చిన యుపన్యాసము 75
12. శ్రీమతి చిక్కమాంబలేఖ 84
13. అంతఃపురోపన్యాసము 93
14. సనాతనాధునాతన నాగరకతలు 98
15. దేశభక్తి-స్వార్థపరిత్యాగము 105
16. మనస్తత్వమాహాత్మ్యము 111
17. ఆత్మానురాగము 119
18. దేహబలము-మనోబలము 127
19. పాశ్చాత్యనాగరకతా మాహాత్మ్యము 136
20. స్వదేశపరిశ్రమలు 145
21. గ్రహచక్ర జ్యోతిషము 152
22. భూతవైద్యము 157

23. మఠాధిపతులు 164

24. మతనైషమ్యములు 171

25. రంజాన్ పండుగ–వినాయక చతుర్థి 178

26. వాల్మీకి విశ్వామిత్ర రామాయణవిమర్శనము 185

27. వేదాంతోపన్యాసము 193

28. దివ్యజ్ఞాన మతము 201

29. దివ్యయోగములు 210

30. ఆధ్యాత్మిక విద్యావశ్యకత 218

31. పార్థసారథిస్వామి 228

32. పార్థసారథిస్వామి 236

33. స్వప్నచారి ప్రకృతి 242

34. విచిత్రస్వప్నము 250

35. పశువులసంత–స్వప్నము 259

36. విచిత్రస్వప్నము 268

37. స్వవిషయ సల్లాపములు 276

38. సభాస్వకీయ వ్యాపారము 281

39. సభాస్వకీయాంశములు 285

40. సాక్షిసంఘ పునఃసంస్థాపనము 288

41. స్వకీయసల్లాపము 292

42. స్వకీయ విషయము 297

43. తోలుబొమ్మలు 302

44. సత్యము 312

45. మూడు 320

46. తృష్ణ 323

47. కాయగూరలను కాశీలో వదలుట	329
48. ఘురకర్మము	332
49. రెవడీగ్రంథాలయము	339
50. వాణీదాసకవి స్వీయచరిత్రము	348
51. స్వీయచరిత్రావశ్యకత	355
52. కాలాచార్యుని వివాహప్రయత్నము	359
53. కాలాచార్యుని వివాహప్రయత్నము	364
54. దాక్షిణాత్యోపన్యాసము	368
55. జంఘాలశాస్త్రి యుపన్యాసము	371
56. సముద్రతీర పర్యటనము	376
57. విస్కారణనింద	384
58. ఎన్నికలు	388
59. ఉన్మత్తుని యుపన్యాసము	397
60. ఇన్ఫ్లూయాన్జాజ్వరము	405
61. ప్రమాణ వాక్యములు	413
62. శిక్షస్థితి	419

1. సాక్షి సంఘనిర్మాణము

ఎందుకీ సాక్షి సంఘం?

ప్రత్యేక రాజకీయ దండనం మాత్రమే నేరాన్ని అణగదొక్క జాలదు. దానికి తోడుగా ''సంఘశిక్ష'' కూడా ఉండాలి. అంటే నేరగాడితో ఎవరూ జోక్యం పెట్టుకోక పోవడం. అటువంటి వాణ్ణి సభలోకి రానీయకపోవడం. గౌరవించకుండా ఉండడం. పదిసంవత్సరాల కఠిన శిక్ష కంటె పదిమంది సంఘంవల్ల నేరగాడికి చేసిన అనాదరణ నేరాన్ని ఆపడంలో బలవత్తరం. రాజకీయ దండనానికి అందని నేరాలను గురించి వెల్లడించడం సాక్షిసంఘం ఉద్దేశం. వాటి స్వభావాల్ని వివరించడం, వాటివల్ల సంఘానికి కలిగే చెడును స్పష్టంచెయ్యడం, వాటిమీద ప్రజలకి అసహ్యం కలిగించడం, ఈ సంఘం ఉద్దేశం. నేరాలనే నిందించడం ఉద్దేశంగాని, అటువంటి నేరాలకులోనైన వారిని నిందించదీ సాక్షి సంఘం.

ఈ సాక్షిలో మత విషయాలగురించీ, ఆరోగ్య విషయాలగురించీ, కవిత్వంపట్ల అభిరుచికి సంబంధించిన శాస్త్రాలగురించీ, సంఘ దురాచారాల గురించీ, విద్యాభివృద్ధి సాధనాలగురించీ, చరిత్ర మొదలైన విషయాల గురించీ రాజభక్తివంటి వాటిగురించీ అవసరమనిపించిన మరికొన్ని విషయాల గురించీ వ్రాస్తూంటారు.

ఈ సాక్షి సంఘ సభ్యులు అయిదుగురు. వీరు–

సాక్షి, జంఘాలశాస్త్రి, వాణీదాసు, కాలాచార్యులు, బొంరయ్యశెట్టి.

వీరు ప్రతిరాత్రి ఒక అద్దె ఇంట్లోచేరి ప్రసంగిస్తూంటారు. వీరందరి ఊరు సత్యపురం. సాక్షి సంఘం ఆఫీసు పోస్టాఫీసుకి ఎదుట –

ప్రపంచిక చర్యలు చిత్ర విచి త్రాతివిచిత్ర మహావిచిత్రములై యున్నవని మీరెఱిఁగినయంశమే. ఇది మీరు క్రొత్తగఁ జూచినది కాదు. మేము క్రొత్తగఁ గనిపెట్టినది కాదు. కాని దిగువఁజెప్పబోవు కారణముచే మేమనవలసి వచ్చినది. మాయుద్యమసాఫల్యము నకై మీరు వినవలసి వచ్చినది. సృష్టిలో మనుష్యులెందఱో మనుష్యప్రకృతులన్నియై యున్నవి. ఏ రెండును సమములు గావు. సర్వశక్తిమంతుఁడును జ్ఞాన స్వరూపుఁడు నగు భగవంతుఁడు తన బుద్ధిబలముచే నిన్ని వేలువేలు స్వభావములు సృష్టింపఁగ మనుజుఁడు

తన కియుఁబడిన, యొక్క-టైన ప్రకృతిని–మాఱుఁగూడని యొక్క-టైన ప్రకృతిని– సమయ
నుగుణముగ, సందర్భానుసారముగ, సన్నిహిత వ్యాపార సముచితముగ, స్వప్రయోజనప్ర
మగుసట్లుగఁ బదునాలుగు ప్రకృతుల క్రింద మార్చి, లేక మాఱున ట్లితరుల కగపఱఁ
తస్మ్ను సృజించుటయందు భగవంతుడు వెల్లడిచేసిన నైపుణ్యమును–దస్మ్
దస్మ్నుఁగానివానిఁగా నితరులకుఁ గనఁబఱచుటయందు వెల్లడి చేయుచున్న తన మాయ
సృష్టి నైపుణ్యము–నెదుట సిగ్గుపడునట్లు వెలవెలఁబోవునట్లు–తలవంచు కొనునట్లు
మొగము మాడ్చుకొనునట్లు సేయుచున్నాఁడు. తాను చేసిన యీ బొమ్మలు మాయ
జగన్నాటక సూత్రధారుఁ డయిన తనకంటె మహామాయావిశేషాన్వితములై చిత్రచిత్రము
నేత్రాభినయములచే హస్తాభినయములచే నవనవ పాదాభినయముల నాట్యములచే నొంట
కాలిభరతములచే వింతవింతలుగ తెయితక్క-లాడుచున్న వని లోన సంతోషించుచు
యున్నాఁడో లేక వేయఁగూడని వేషములు వేసినందులకుఁ, బూసికొనఁగూడనిపూఁతల
పూసికొనినందులకు, ధరియింపఁగూడని దుస్తులు ధరించినందులకు, వేయఁగూడ
గంతులు వేసినందులకుఁ బాడఁగూడనిపాటలు పాడినందులకు, నాటకాంతమునఁ బాత్రమ
లను శిక్షింపఁదలఁచియేయున్నాఁడో, యెట్టివాఁడో, యెక్కడ నున్నాఁడో, యేమి
చేయుచున్నాఁడో, యేకాకి యగువానికీ విఱుగుతఱుగులేని జంజాట మెందులకో
యెవ్వడెఱుఁగని యీశ్వరునిఁగూర్చి యెట్లు చెప్పఁగలము? నవ్వు సంతోషమునకు, నేడ్చు
దుఃఖమునకు సూచకములని నెట్టి భగవంతుఁడు స్థూలవిభాగ మేర్పఱచియుండ బుద్ధి
నిధులైన మన వారెట్టియెట్టి సూక్ష్మసూక్ష్మతర సూక్ష్మతమ విభేదములఁ గల్పించి వెల్లుల్లిపా
రను వేయివిధములుగా నెట్లు చీల్చినారో చూడుఁడు!

''ఉహూఁ'' అని పండ్లు గనఁబడని పెదవులు విడని మూతిగదలని మొగమున
వికాసము లేని నవ్వు–పై పెదవి మాత్రము కొంచెముగదలి పై రెండుపండ్లు మాత్రమే
కనఁబఱచి ధ్వని యెంతమాత్రమును లేకుండ నవ్వున నవ్వు–అడుగుపెదవి పైపెద
కొంచెము గదల్చి పై రెండుపం ట్లడుగు రెండుపండ్లును గనఁబఱచి ''హా హా హా'' అని
యిగిలింపు గలుగునట్లు నవ్వుననవ్వు–పై పం ట్లడుగుపండ్లతో గట్టిగఁ జచ్చువానికివలె
దాకొల్పి పెదవులు మాత్రమే కదల్చి కిలకిలగ నవ్వుననవ్వు–నోరు బాగుగఁ దెఱచి
''హాహాహా'' యని నవ్వున నెట్టి నవ్వు–మొగ మేడ్చునట్లు చేసి ''హే హే హే'' లతోఁగూడి
నవ్వున నవ్వు–ఇట్లనేక విధములుగ వీని బాహ్యచిహ్నము లుండును. వీనికి మొలకనవ్వు–
మొద్దునవ్వు–కిచకిచ నవ్వు–కిలకిల నవ్వు–ఇగిలింపు నవ్వు–సకిలింపునవ్వు–అని వివిధ
నామములు గలవు. వీనిలో నేనవ్వు కూడఁ బ్రీతి సూచకమైనది కాదు. ఒక నవ్వున కర్థము
రోఁత. ఒక నవ్వు తిరస్కార సూచకము. కుండలోపలి యభిప్రాయము పై కగపడకుండ
మూసిసమూకుఁ డొకనవ్వు–ప్రత్యుత్తరము చెప్పనిష్టములేక వేసినకప్పదాటొకనవ్వు–కోప
మడఁచుకొనుటకై తెచ్చుకొన్న నవ్వొకటి. ''ఓరీ! చచ్చుముండకొడుకా!'' యను నిరక్షర
మైన తిట్టొకనవ్వు. ఇట్లే కోపమునకు రూప భేదములు, నామ భేదములు, నర్థ భేదములు,
నభిప్రాయ భేదములు గలవు. ఇప్పటి నవనాగరకుఁడు తన శత్రువును జూచిన తోడనే,–ఏమి
యుత్సాహము! ఏమి శిరఃకంపములు! ఏమి కరసంచాలనములు! ఏమి తియ్యమాటలు! ఏమి
కౌఁగిలింతలు! ఏమి పరకష్టసహిష్ణుతాసూచక విలాపములు! ఓహో! లోపలి యగ్నికిఁ బై
కెంతచల్లదనము! లోని విషముష్టికిఁ బై కెంతమాధుర్యము! లోని పిశాచమునకుఁ బై నెన్ని

తులసిపూసలపేరులు! ఆహా! మనుష్యచర్య లెంత విరుద్ధముగ మాజీయున్నవి! ముద్దులో ముక్కూడఁబీఁకుట. కొఁగిలింతలో గొంతుకోఁత, సాలగ్రామతీర్థములో సాపీరపాషాణముగ నున్నవికదా? ప్రకృతి యెంత తలక్రిందయినట్లున్నది! అమృతమేదో, హాలాహలమేదో, పూలబంతి యేదో, తుపాకిగుండేదో, నమస్కార మేదో, నెత్తిపెట్టేదో, మంచి యేదో, చెడ్డ యేదో, మిత్రుఁ డెవఁడో, శత్రుఁ డెవఁడో, స్వర్గ మేదో, నరక మేదో, పరమేశ్వరుఁ డెవఁడో, బ్రహ్మరాక్షసుఁ డెవఁడో–భేదమంతయు నశించినది కదా!

తమకు బహుస్వల్పలాభమే కాని యితరుల కెంతమాత్రమును నష్టము లేని సామాన్యజీ వయాత్రా వ్యాపారములలో మాత్రమే మనుష్యులిట్లు సత్యానుభవాచ్ఛాదనము, మిథ్యానుభవ సంధానము స్వప్రకృతి సంఛాదనము, పరప్రకృతి స్వీకారము సేయుచున్నా రేమో యనఁగ నట్లు కాదు.

మాన న్యాయ్య ధన ప్రాణాదివిషయములగు వ్యాపారములఁ గూడ నిట్టిమహేంద్ర జాలవిద్యనే కనఁబఱచుచున్నారు! మనసును దిగంబరముగఁ జేయువాఁడు మందుఁడు. సత్య మసత్య మను మాఁతకోల లేక నడువ లేదని మనవారు నమ్మియున్నారు. పతిప్రక్కలో మాయ! భ్రాతలపాలిలో మాయ! న్యాయాధికారి కలములో మాయ! న్యాయవాది నాలుకకొ నను మాయ! వణిజుని త్రాసులో మాయ! వసుధాకర్షకుని నాగేటిలో మాయ! ఎక్కడఁ జూచిన మాయ!! ప్రపంచమున నెవ్వరు సత్యవంతులు? యోగ్యులు లేరా? ఉన్నారు. కొలఁదిగ పరకపాటుగ, ఆఫ్రికాయెడారిలో ఫలవంతములగు ప్రదేశములవలె నున్నారు. ప్రతి వ్యాపారములోను మహానుభావు లుత్తమోత్తము లున్నారు. ఇట్టివా రుండుటచేతనే యింక ప్రపంచ ముల్లోలకల్లోల మొందకయున్నది. ఒక్క రావణాసురుని వధించుటకుఁ బరమాత్మ యంత వాఁడు, రామునియంతవాని యవతార మొంది పడరాని కష్టములఁ బడి తుదకుఁ గృతార్థుఁ డయ్యెను! అందఱు రావణాసురు లయినయెడల నతని యవతారపుటాట సాగునా? ఇంక–నట్టిదురవస్థ రాలేదు. పరమార్థ వంతులు కొంద ఱున్నారు. వారే లేకుండునెడల ద్వాదశార్క లుదయింప వలసినదే! పుష్కలావర్త మేఘములు తెగిపడి వర్షింపవలసినదే! బ్రహ్మ పునస్సృష్టికై తిరుగ నడుసుఁ ద్రొక్కవలసినదే!–

ఇఁక మనుష్య లొనర్చు నేరములు మొదలగువానిఁగూర్చి కొంత విచారింతము. పెట్టిన న్యాయస్థానములను బెట్టుచునేయున్నారు. వేసిన న్యాయాధిపతులను వేయుచునే యున్నారు. చేర్చుకొనిన న్యాయవాదులను జేర్చుకొనుచునే యున్నారు. పెరుగుచున్న వ్యాజ్యేములు పెరుగుచునే యున్నవి. పెంచుచున్న శిక్షాశాసన శాస్త్రములను బెంచుచునే యున్నారు. పెంచుచున్న రక్షకభట సంఖ్యను బెంచుచునే యున్నారు. పెరుగుచున్న నేరములు పెరుగుచునేయున్నవి. కట్టించుచున్న కారాగృహములు గట్టించుచునేయు న్నారు. ఎదుగుచున్న కారాబద్ధుల సంఖ్య యెదుగుచునే యున్నది. నరహత్య చేసిన వారిని జంపుటకు నానా విధ యంత్రములు కల్పించుచునేయున్నారు. హత్యలు వృద్ధియగుచునే యున్నవి. నేరము శిక్షనొందినకొలఁది వృద్ధినొందుచున్నట్లున్నది. నేరమొనర్చుటవలన బీదల కన్నము దొరకుచున్నది.

అయినను బ్రత్యేక రాజకీయదండనము మాత్రమే నేరము నణగఁద్రొక్కఁజాలదు. దానికిఁ దోడు సంఘశిక్ష యుండవలయును. సంఘశిక్ష యనఁగ నేరగానితో నెవ్వరు

జోక్యము కలుగజేసికొనకుండుట. అతనిని సంఘము నుండి యొకవిధముగ బహిష్కరించి యాతనిని సంఘాగ్రహపాత్రునిఁ జేయుట. పది సంవత్సరముల కఠిన శిక్ష కంటెఁ బదిమంది సంఘమువలన నేరగానిఁగూర్చి చేయఁబడిన యనాదరణము నేరము నాపుటలో బలవత్తరమైనది.

రాజకీయదండనము గల యీ నేరములకే సంఘ దూషణము నేరము నడఁగించుటకుఁగావలసివచ్చినప్పుడురాజకీయదండనములేనిమొదటఁజెప్పిననేరములకు –మనుజుల మాయాప్రచారములకు–సంఘదూషణ (Social Odium) మావశ్యకమైయుండదా? ముఖ్యముగ నుండును. ఉండక తప్పదు. ఇట్టి నేరములఁగూర్చియే మే మిఁక వ్రాయుచుందుము. నేరముల వెల్లడింతుము. వాని స్వభావముల విశదపఱతుము. వానివలన సంఘమునకుఁ గల్గు హానిని స్పష్టపఱతుము. వానియందు జనుల కసహ్యము గల్గునట్లు సేయుటకై ప్రయత్నింతుము. నేరములనే మేము నిందింతుము. కాని యట్టి నేరములకు లోనయిన వారిని నిందింపము. వారినిఁ దలపెట్టనైనఁ దలపెట్టము. మాకు వారితో లేశమును బనిలేదు. ఇంతియేగాక మత విషయములను గూర్చియు, నారోగ్య విషయములనుగూర్చియుఁ, గవితాద్యభిరుచిప్రధానశాస్త్రములఁ గూర్చియు, సంఘదురాచారములఁ గూర్చియు, విద్యాభివృద్ధి సాధనముల గూర్చియు, జరిత్రాద్యంశముల గూర్చియు, రాజభక్తాదులఁ గూర్చియు, నావశ్యకములని మాకుఁ దోఁచిన యింకఁ గొన్ని యితరాంశములనుగూర్చియు వ్రాయుచుందుము.

నేను, మఱినలుగురుఁ గలసి యొక చిన్న సంఘముగఁ జేరినాము. మీ రైదుగురుఁ జేరి, యిట్టి మహా కార్యము సేయఁగలరా? యని మీరడుగుదురేమో? ఉడుత లుదధినిఁ బూడ్చినట్లు చేసెదము. తరువాత మాతో నెన్నికోఁతులు చేరునో, యెన్ని కొండముచ్చులు, నెలుగుబంట్లు కూడునో! ప్రయత్నమే మనుజునియధీనము. ఫలము దైవాధీనము కాదా?

మేము ప్రతిరాత్రియు నొకచోఁ జేరుదుము. ఇప్పటి వఱకు మాకు సొంత భవనము లేకుండుటచే నద్దెయింటిలోఁ జేరుదుము. మే మీదిగువ నుదాహరించిన నిబంధనలను జేసికొంటిమి.

1. సభ చేరఁగానే మన చక్రవర్తి గారికిఁ జక్రవర్తి గారికి వారి కుటుంబమునకు దీర్ఘాయురారోగ్యైశ్వర్యముల నిమ్మనియుఁ, బ్రజలకు వారియెడల నిరంతర రాజభక్తిని బ్రసాదింపవలయుననియు, మా సంఘము చిరకాలము జనోపయోగప్రదముగ నుండునట్లు కటాక్షింపు మనియు దైవమును బ్రార్థింపవలయును.

2. రాజకీయ విషయములను గూర్చి యెన్నఁడును ముచ్చటింపఁగూడదు వ్రాయఁగూడదు.

3. తప్పులనేగాని మనుష్యుల నిందింపఁదగదు. తప్పులను విశదీకరించుటయందు బాత్రము లావశ్యకము లగునెడల నట్టివి కల్పితములై యుండవలయును.

4. సభ జరుగుచున్నంత సేపు మత్తుద్రవ్యములను ముక్కునుండి గాని నోటి నుండి గాని లోనికిఁ జప్పుడగునటుల పోనీయఁగూడదు.

5. వాదములలోఁ దిట్టుకొనఁగూడదు. చేయిచేయి కలుపుకొనఁగూడదు. కలుపుకొనుట యనివార్యమైనప్పుడు న్యాయసభల కెక్కఁగూడదు.

మాసంఘములోని సభ్యులెవరో వారిస్వభావము లెట్టివో మీకుఁ దెలిసికొనఁ గుతూహల ముండునెడల నీ దిగువఁ జదువుకొనుఁడు.

మాలో మొదటివాఁడు కాలాచార్యులు. ఇతఁడు శ్రీవైష్ణవుఁడు. సపాదుఁడయ్యు నిష్పాదుఁడు. ఈతనితల పెద్దది. గుండ్రని కన్నులుండుటచే, ముక్కు కొంచెము వెనుకాడుటచే, మొగము గుండ్రముగ నుండుటచే నీతఁడు నరులలో 'Bull Dog' జాతిలోనివాఁడు. ఈతఁడు మాటలాడిన మొఱిగినట్లుండును. ఈతఁడు పొట్టివాఁడు. లంబోదరుఁడు. తారుకంటె నల్లనివాఁడు. ప్రాణమందలి తీపిచే నేకాంతయు నీతని వలచుటకు సాహసింపకపోవుటచేఁ గాఁబోలు బ్రహ్మచారిగ నున్నాఁడు. సత్ప్రవర్తనము కలవాఁడు. ఈతఁడు వేదవేదాంగములను, ద్రిమత శ్రీభాష్యములను, గీతా భాష్యములను జదివినాఁడు. మతసంప్రదాయములన్నియు బాగుగ నెఱుఁగును. కుండలముల ధరింపవలయు ననుకుతూహలము గలవాఁడు. అఖండ ధారణాశక్తి కలవాఁడు. వాక్చాకచక్యము లేనివాఁడు. ధారాళమయిన యంతఃకరణము కలవాఁడు. పాడుము, పాత్తిలోఁ జేర్చి రొండిలోఁ బెట్టిన యెడల నలవాటగునేమో యనుభయము గలవాఁడు. తనకుఁ దెలిసిన యేయంశమును గూర్చియైనఁ బట్టుదలగ వాదించువాఁడు. యథార్థవాది. కోపరహితుఁడు. ఈతఁడు ప్రవేశపురుసు మీయలేని హేతువున వెట్టినభ్యుఁడుగఁ జేరినవాఁడు.

రెండవవాఁడు జంఘాలశాస్త్రి. ఈతఁ డారడుగుల యెత్తుగలవాఁడు. విశాలమైన నుదురు, దీర్ఘనేత్రములు, లొడితెఁడు ముక్కును గలవాఁడు. కాలినడకనే యాసేతుహిమాచలపర్యంత దేశ మంతయుఁ దిరిగినవాఁడు. అనేక సంస్థానములఁ జూచినవాఁడు. జమీందారుల యాచించి వా రీయకుండునెడలఁ జెడమడ దిట్టినవాఁడు. ఏ సంస్థాన పూర్వ చరిత్రయేమో, యేప్రభువున కేయే లోపములున్నవో యెఱిఁగినవాఁడు. దేవస్థానములన్నిటిని సేవించి వానివాని పూర్వోత్తరములన్నియుఁ దెలిసిన వాఁడు. వినువాఁడుండు నెడల గథలఁజెప్పుటలో విసుగువిరామములేని వాఁడు. వాచాలుఁడు. వాదములలోఁ గజ్జాజారిపోయినఁ గలియఁబడఁగలిగినవాఁడు. గార్దభగాత్రము కలవాఁడేకాని గానకళానుభవ మెక్కువ గలవాఁడు, అనేక జాతీయములఁ జెప్పఁగలవాఁడు. అర్థ మెవ్వడైనఁ జెప్పినయెడల నెట్టిపద్యములోఁగాని, యెట్టిశ్లోకములోఁగాని యౌచిత్యవిషయమునఁ దప్పుఁబట్టగలవాఁడు. చీపురుకట్టయే యాయుధముగఁ గలనాఁడై హ్రీం హ్రీం కార సహితుఁడై యనేక కాంతల గడగడలాడించినవాఁడు. అన్ని యంశముల నింతయో యంతయో తెలిసినవాఁడు. ఈతనితలలో, విప్రవినోదిగాని సంచిలోవలె నొకసాలగ్రామము, నొక యుల్లిపాయ, యొకచిలుకబుట్ట, యొకతేలు, నొకరాధాకృష్ణుని విగ్రహము, నొక బొమ్మజెముఁడుమట్ట, యొకపుస్తకము, నొక పొగాకు చుట్ట మొదలగునవి చేర్చినవాఁడు. ఈతఁడు ప్రవేశపురుసు మిచ్చినాఁడు.

మూఁడవవాఁడు వాణీదాసుఁడు. ఇతఁడు కవి. ఎడమచేయి వాటము గలవాఁడు. అడ్డతలవాఁడు. సంతపశువువలె నెట్టబట్టఁ జూచి బెదరువాఁడు. అంటురోగము కలవానివలె నెవ్వరిదరిఁ జేరఁడు. గ్రుడ్ల గూబవలెఁ జీకటి నపేక్షించును. ఎక్కడఁగూర్చుండిన నక్కడనే పొమ్మను వఱకుఁ బరధ్యానముగఁ గూర్చుండియుండును; మిగుల సోమరి.

పాట్టివాఁడు. ఆపాదశిరఃపర్యంత మసూయఁ గలవాడు. ఆదికవియైన నన్నయభట్టు మొద
కొని యాధునిక కవియగు నన్నాసాహేబువఱకందఱను దూషించును. శ్లేషకవిత్వమంద
రన మెక్కువ కలదని నమ్మకము కలవాఁడు. అన్ని విధముల కవిత్వములు చెప్పఁగలవాడ
ఇతఁడు నువ్వుగింజమీఁద నూఱుపద్యములు చెప్పినాఁడు. మూఁడు సంవత్సరములనుం
కంకణబంధ మొకటి వ్రాయుచున్నాఁడు. పెదవులు నల్లగ నుండుటచే నీతఁడు చుట్టుగాలు
నలవాటు కలవాఁడై యుండును. ఈతఁడు శూద్రుఁడు. ఈతఁ డాధునిక పద్ధతి ననుసరిం
కవిత్వముఁ జెప్పుటకు బ్రయత్నించుచున్నాఁడు.

నాల్గవవాఁడు కోమటి. ఈతఁడు వాణిజ్యరహస్యము లెఱిఁగిన వాఁడు. కొంతకాలమ
క్రిందట వర్తకము బాహుళ్యముగఁ జేసిన వాఁడు. విశేషధన మార్జించినవాఁడు. ఇతఁడ
మహైశ్వర్య దినములలో నున్నప్పుడు బయలుదేఱిన తామరతప్ప నిప్పు డీతనికి వెనుకట
ధన మేమియు మిగులలేదు. డోకడా లవలీలగఁ గట్టఁగలవాఁడు. ఈతఁ డెక్కడకు
బోయినను మూఁడు చేతులతోఁ బోవును. (తనకై రెండు చేతులు, తామరకై యిత్తడిచేయి)
ఈతఁ డటికయంత తల గలవాఁడు. ఈతనిపేరు బొట్టయ్య; ఈతఁడు మాయింటిగ
మ్మమునఁ బట్టఁడు. తెలిసినయంశములు భ్రాతరూపకముగ మాకుఁ దెలియపఱచుచు
డును. ఈతఁడు ప్రవేశపురుసుము నిచ్చెను.

నే నయిదవవాఁడను. నేనెవఁడనో నాకుఁ గొంత తెలియునుగాని నేనెవఁడనో మీక
స్పష్టీకరించుటకుఁ దగిన యాత్మజ్ఞానము కలవాఁడను గాను. నాసంగతి మీరు ముంద
నాభ్రాఁతలఁబట్టియే కనిపెట్టఁగలరు. నే నారామద్రావిడుఁడను. నాపేరు సాక్షి. మేము
ప్రచురించు పత్రికకు నాపేరే యుంచితిని. వారమున కొకటి రెండు దళములఁ బంపెదము
మీరు మీ పత్రికలో వాని నచ్చువేయింపఁ గోరెదము. ఎల్లకాలము మీకీశ్రమ మిచ్చువారము
కాము. మా జంఘాలశాస్త్రి యెక్కడ నుండియో యెటులో యొక ముద్రాయంత్రమును,
దాని పరికరములను నొడివేసి లాగుకొని వచ్చెదనని కోఁతలుగోయుచున్నాఁడు. అంతవ
ఱకు మీపత్రికకుఁ బంపుదుము. మీకు మావలని ప్రతిఫల మేమియును లేదు. సరేకదా,
మీ పత్రికావ్యాపారము తిన్నగ నుండకుండునెడల మిమ్ములనుగూడ మాపత్రికలో నధిక్షేపిం
చుచుందుము. పరీధావి సంవత్సర మాఖబహుళ చతుర్దశీ శివరాత్రి గురువారమునాఁడు
లింగోద్భవ కాలమున నీసభ పుట్టినది.

మాది సత్యపురము. మా సాక్షి స్థానము తపాలకచేరి కెదురుగ.

ఇట్లు విన్నవించు
సభ్యులందఱిబదులు
సాక్షి.

2. గ్రామ్యభాషా గ్రంథ పఠనము

ఒకనాడు జంఘాలశాస్త్రి ఒక కాగితాల బొత్తి చేత్తోపుచ్చుకుని, నెత్తికి తగిలిన ద్వారం దెబ్బనుకూడా లక్ష్యపెట్టకుండా వగర్చుకొంటూ సాక్షి సంఘానికి హుటాహుటిన వచ్చాడు.

అతను తెచ్చిన కాగితాలు వార్తా పత్రికలవి. అందులో అతన్ని కలవలపరిచిన వర్త ''దేశ భాషల్ని ఇంటర్మీడియేట్, బి.ఏ. క్లాసుల్లో తప్పనిసరిపఠనీయాలుగాచేర్చడానికివిద్యాసంఘంవారులంగీకరించలేదు''- అని.

ఈ వార్త ఆధారంగా సాక్షికి, కాలాచార్యులకి, జంఘాలశాస్త్రికి, కవి వాణీదాసుకీ చర్చ జరిగింది. జంఘాలశాస్త్రి ఆ పత్రికావార్తకి తీవ్రంగా ఆందోళన ప్రకటించాడు. విద్యా వ్యవస్థలో, దేశభాషల పట్ల ప్రభుత్వం అవలంబించే ఉదాసీన వైఖరి, వారి చర్చనీయాంశం.

ఇంటర్మీడియేట్ క్లాసులోకి వచ్చే బాలుడికి దేశభాషను మానడానికి గాని చదవడానికి గాని, స్వేచ్ఛా? - ఈ సిద్ధాంతం మీ ఇంగ్లీషుభాష కెందుకు ఉపయోగించుకో కూడదు? ఇక్కడ మళ్లీ తేడా చూపించడమా? ఇది మా దిక్కుమాలిన దేశభాషలకు మాత్రమే చెల్లివలసినదా? అని జంఘాలశాస్త్రి ఆవేదన.

ఈ చర్చ అంతా విద్యావిధానంలో ద్వంద్వ వైఖరి గురించి.

కవియుఁ గాలాచార్యులు నేను మాసభాభవనమున రాత్రి కూరుచుండి- ''వేసవి కాలమారంభమైనది. ఉష్ణ మధికముగ నున్నది. మామిడిపిందె లింకను వచ్చుటలేదు. ఎట్టమిరెపుఁగాయల కున్నరుచిలోఁ బదునాలుగవవంతైనఁ బచ్చిమిరెపుఁగాయల కుండ'' దను నిట్టి వట్టి వెఱ్ఱి మాటలతో సన్నిహితబుతువునుగూర్చియు, సాపాటును గూర్చియు సహజముగ మాటలాడుకొనుచుండ నెత్తికి టంగున తగిలిన ద్వారపు దెబ్బను లక్ష్యపెట్టక కాకితములబొత్తి చేతఁ బుచ్చుకొని వగర్చుచు లోనికి మా జైన దేవుఁడయిన జంఘాలశాస్త్రి వచ్చి ''అయ్యయ్యో! ఇంక నేమున్నది? ఇంక నిట్లు గూరుచుండిరా?'' యని బిగ్గఁబఁగ దొందరతో నరచెను.

''కొంపలు కాలుచున్నవా యేమి!'' యనుచు నేను లేచితిని. నావెనుకనే కవియ
గలము చేతఁ బుచ్చుకొని ''సహజోక్తి ప్రధానమైన యాధునిక కవిత్వ మభ్యసించు నాకీయ
నదృష్టమున లభించెను. కాలుచున్న కొంపలు గాలుచున్నట్లుగనే వర్ణింతు'' నని లేచె
కాలాచార్యులు ''పాడు మెక్కడనయిన దొరకును. నేనును వత్తును'' అని ముక
మున్మార్రు టొకాయించి లేవఁబోవుచుండెను. నెత్తిపయిఁ దగిలిన దెబ్బనుండి చిమ్మి
రక్తమును దుడుచుకొనుచుఁ గొంతసేపు జంఘాలశాస్త్రి మాటలాడక యుండి ''కొంప
కాలుచున్నవా యందురా? యీయూరుకొంపలా? యీతాలూకాకొంపలా? యీజి
కొంపలా? యిట్టియనేకములగు జిల్లాల కొంపలు గాలుచున్నవా? యని యడుగుఁ
దేశభాష బ్రదు కేమైనదో తెలిసినదా? యిదిగో వార్తాపత్రిక–నాకుఁ గొంత తెలిసినది. కొ
తెలియలేదు.'' అని దానిని బల్లపై వైచెను. ఇంతేకద! తొందరలేదు. కూరుచుండుఁ
నాకును దెలిసినది. దేశీయభాషలను నింటర్మీడియేటు బియేక్లాసులలో ననివార్యముల
పఠనీయములుగఁ జేయుటకు విద్యాసంఘము వారంగీకరింపలేదు. ఇందువలన దేశజనులక
గొంత యసంతుష్టిగ నుండవచ్చును.

జంఘా–కొంతయసంతుష్టియా? అవధిలేనియసంతుష్టి. ఉండవచ్చునా? ఉన్న
ఉండితీరినది. మనదేశ భాషలు గదా! మనము మాటలాడుకొను భాషలుకదా! ఏ భాషలలో
బుట్టి పెరిఁగి చత్తుమో యాభాషలుకదా? మనపుత్రులేమి, పౌత్రులేమి, మనసంత
వారందఱు ప్రపంచము నిల్చియున్నవఱకు సభ్యసించి యభివృద్ధిపఱచుకొనవలసిన వ
భాషలు కదా! మనమాట లిందునుగూర్చి విననక్కఱలేదా? విశ్వసింప నక్కఱలేదా? వ
చరిత్రాదికము కాదే? వారి గణితాదిశాస్త్రములు కావే? వారికీ పట్టుదల యేల? వారికి
దేశ భాషానిరాదరణమేల? హిందూదేశములో స్థాపించిన హైందవసర్వకళానిలయమ
(Indian University) లో దేశభాషలే పఠనార్హములు కాకుండఁ జేయునంత గొప్పపూ
వారేల వహింపవలయును? ఆహా! వారిలో నొక్కఁడయిన మన కామోద (Vote) మీయలే

కాలా–వారెవరు?

జం–ఆంగ్లేయభాషాపండితులగు గురువులు (Professors).

నేను–వారు నిర్హేతుకముగ మనవారికోరికను నిరాకరించిరా? అటు లెన్నఁడును లేద
వారికున్న హేతువులుగూడఁ గొన్ని బలీయములే యైయుండు. మన మిందునుగూ
సావకాశముగ మాట లాడుకొందము.

కవి–పరిపాలకులఁ గూర్చియు, వారి కార్యములఁ గూర్చియు మనమ
మాటలాడుకొనఁగూడదని నిబంధన ముండఁగ–

నేను–ఆ నిబంధనము పరిపాలనతంత్రములఁ గూర్చినదికాని దేశమునకుఁ బ్రాణమై
భాషనుగూర్చి జరిగిన యేర్పాటుల న్యాయాన్యాయములు మాటలాడుకొనుట కభ్యంత
ముండదు. జంఘాల శాస్త్రీ! ఆంగ్లేయ సభ్యుల యందఱు యభిప్రాయముతో నేకీభవిం
వాఁడను నేను. కాలాచార్యులును కవి నీతో నేకీభవింతురా? నాతో నేకీభవింతురా?

కాలా. & కవి–మేము జంఘాలశాస్త్రితో వారమే!

జంఘా–నాతోవారు మీ రిద్దఱేనా? శ్రీజగన్నాథ రామలింగేశ్వరదైవతద్వయ మధ్య భూమిని హైందవుడయి కాని, ముసలిమానుఁడయి కాని పుట్టు వొందిన ప్రతి మనుజుఁడు నాతోవాఁడే. కారణాంతరముల నెవరైనఁ బైకి వ్యతిరేకాభిప్రాయముల నిచ్చినను బరమార్థమున నాతోవారే. నేను శంకరాచార్యులఁ గొలిచిన, వారు రామానుజాచార్యులఁ గొల్తురు. మఱి వారు మరిడీమహాలక్ష్మిని గొలుతురు. పూజలలో మాకైక్యములేదు. వీరు బాలవితంతువును మంగలిపాదియొద్దఁ గూర్చుండఁబెట్టి, వారామెను మారుమగని ప్రక్కలోఁ బన్నుండఁబెట్టి దరు: ఆచారములలో మాకైక్యములేదు. బ్రహ్మసృష్ట్యాదినుండి వచ్చుచున్న వేదముల యపౌరుషేయ జననమును గూర్చి, పునర్జనన వాస్తవమును గూర్చి మాలో మాకైక్యములేదు. ఆత్మపరమాత్మ తత్త్వసంబంధములఁగూర్చి మాలో మా కైక్యము లేదు. మోక్షో పాయములఁ గూర్చి మా కైక్యము లేదు. కాని యీయంశమును గూర్చి ప్రాక్పశ్చిమ సముద్ర మధ్య దేశసంభవుల కందఱకు నైక్యము కలదు. నీవు మాత్రము వాదమునకై యాంగ్లేయసభ్యుఁడ వైతివని మే మెఱుఁగమా?

కాలా–మన వాదమున మధ్యస్థుఁ డెవఁడైన నుండవలదా? బొఱ్ఱయ్యసెట్టిని బిలిపించి, కొంచెముసేపు వీథిలోఁ గూర్చుండఁబెట్టిన బాగుగ నుండు నేమో! ఆతఁడు వెలుపలఁ గూర్చుండుట బాగుగ నుండనియెడల, నాతనివిడి యిత్తడి చేయినైనఁ దెప్పించి యధ్యక్షపీఠ మున నుంచవలయును. మధ్యస్థుఁడు లేనివాద మసమంజసము.

జంఘా–గ్రంథముల గొడవయే యెఱుఁగని కోమటివాని మాధ్యస్థ్యమేమిటి? మనకు మహేశ్వరుఁడే మధ్యస్థుఁడు కానిండు.

నేను–కొంతకాలము క్రిందట నన్ని పరీక్షలకు దేశభాషలు నిర్బంధపఠనీయములుగ నుండెను. ఆ పద్ధతి సంతుష్టికరమైన యభివృద్ధి నీయలేదు. దేశభాషగురువులగు పండితులు బాలుర కభ్యసింపఁ జేయవలసిన సులభరీతు లెఱుఁగక తెలివితక్కువ తలతిక్క రోఁకటి పాటలక్రిందఁ బెట్టి "కఃకిమ్, కన్య, క్యాకర్ కర్" అను ననావశ్యకములగు నకాలపువెట్టియా కాంక్షల క్రిందఁబెట్టి నిరంతర సంబంధమున్న భాషావ్యాకరణములలోఁ దీర్థమునకుఁ దీర్థము, ప్రసాదమునకుఁ బ్రసాదము ననునట్లు భాషలో నెంతమాత్రము బాలురఁ బ్రవేశపెట్టకుండ వ్యాకరణము భాష్యాంత మభ్యసింపఁజేసి వ్యాకరణపాఠమును గట్టి భాషాపాఠమునే చెప్పి వేదముల నపహరించిన సోమకాసురునాఁటి వెట్టిపద్ధతులనే యవలంబించి భాషాపఠన మంతయుఁ బలువిధములఁ బాడుసేయ బాలురు భాషాభ్యసనమునఁ బరమాసహ్యతాయుక్తు లయిరి. అనివార్యపఠనపద్ధతిని బట్టి వచ్చిన ముప్పిదిగదా? యని యెంచి దేశభాషలు పైపరీక్షలకు స్వేచ్ఛాపఠనయోగ్యములుగఁ జేయఁబడినవి.

జంఘా–పైపరీక్షలకేనా? 4-వ ఫారం మొదలుకొని స్కూల్ ఫైనల్ వఱకు భాషాపఠనము నిర్బంధము సేయఁబడినదా? దాదాపుగా 12 సంవత్సరములున్న 4-వ క్లాసు పిల్లవాఁడు దేశభాషను వదలుకొనవలసినదా? ఏ దేశమునయిన నిట్లే జరుగుచున్నదా? మీ కింగ్లీషు దేశ భాషకదా? మీరు దేశ భాష నిట్లే పరిత్యజింపఁజేయఁబడితిరా? మీరు ల్యాటిను గ్రీకు మొదలగు నాది భాషలు నేర్చుకొనునప్పు డింగ్లీషు భాషామాధ్యస్థ్యమునసే నేర్చుకొనలేదా? దానిని వదలి నేర్చుకొంటిరా? మీయభివృద్ధికి దేశభాష యావశ్యకమై మాయభివృద్ధి కాటంకమయినదా? పోనీ (School Final) స్కూల్ ఫైనల్ వఱకయిన

దేశభాషలు చదువకతప్పనివిగఁ జేసితిరేమో! పై పరీక్షలకు వాని యనివార్యపఠనమంత యావశ్యకము కాదేమో యని మాలో మేము కన్నులు తుడుచుకొందుమన్న నేదీ? కాకి కుక్క కథలు ముగిసిన వెంటనే మాభాషాపాండిత్యమున కాశ్వాసాంతమైపోయెనే! మా దేశీయ గ్రంథపఠనదీక్ష కవబృథస్నాన మైపోయెనే! తగిన భాషా గురువులు లేకుండుటచే భాష యందు బాలురకు వేదాంతము ముదిరినదా! ఆహా! ఇది యెక్కడి హేతుకల్పనము? పూర్వభాషాపండితు లంత నిరుపయోగులనియే మీకుఁ దోఁచినదా? నలువదియేఁబది వత్సరముల లోపునఁ గలిగిన నవలాకారకులు, చరిత్ర కారకులు, శ్రవ్యదృశ్య ప్రబంధకార కులు, భాషాంతరీకరణ సమర్థులగు దేశీయు లిందఱు మీరు చెప్పిన తలతిక్క; తెలివిత క్కువ, యెదుగుబొదు గెఱుఁగని కృతయుగపండిత స్థాణుజాతి వారివలన నిట్టిలోకోపకారస్థి తిలోనికి వచ్చిన వారే కారా? ఇట్టి వీరి కందఱకు నాంగ్లేయభాషాప్రవేశముగూడఁ గొంచెము గనొ విశేషముగనొ యున్నదికదా? వీరందఱుగూడ నింగ్లీషుతోడ దేశభాషను నిర్బంధముగ నభ్యసించినవారగునా? కాదా? పూర్వపద్ధతి సంతుష్టికరమగుఫలము నీయకపోవుటచే నీనవీ నపద్ధతి కల్పింపఁబడినది అని మీరు చెప్పుచున్నారుగదా? ఇది సాహసమైన మాట కాదా? ఒకవేళ మీరభిప్రాయపడునట్లు దేశీయభాషా గురువగు పండితుఁడు సమర్థుఁడే కాకపోవ చ్చును. పురాతనపుఁదుక్కే కావచ్చును. అతనిని బాగుచేయవలయును. అతనిని బ్రస్తుతస్థితి కుపయోగించునట్లు మార్పవలయునుగాని యాతనిని బట్టి మా బాలురకు భాషలనుండి బహిష్కారమా? భాషలకుఁ బఠనశాలనుండి బహిష్కారమా?

నేను–మీ భాషలను జదువుకొనవలదని మీ బాలుర నెవ్వరిని బ్రతిబంధింపలేదు. ఇష్టమువచ్చినవారు చదువుకొననే వచ్చును. అట్టి స్వేచ్ఛవలన భాషాభిరుచి పుట్టును. బలాత్కారము లేదు.

జంఘా–వారి యిష్టమేమిటి? ఇంటర్మీడియేటు క్లాసులోనికి వచ్చు బుద్ధిమంతుఁడైన బాలునకుఁ బదునాఱు సంవత్సరము లుండ వచ్చును గదా? తిన్నగ నాలుగుమాటలు మాటలాడుటకైన శక్తి కలిగియుండఁడు కదా? అట్టి బాలునకు దేశ భాషను మానుటకుఁగాని చదువుటకుఁగాని స్వేచ్ఛయా? వానికిఁ దోఁచినయెడల మానవలసినదా? వాఁ డంతటి దీర్ఘాలోచనపూర్వకమగు కార్య మావయసులోఁ జేయఁగలఁ డనియే మీ రనుకొందురా? మీ రట్టివయసులో నట్టి యాలోచనఁ జేసికొనఁగలరా? బలాత్కారము చేసినందువలన భాషాభిరుచి గలుగదు. కాన స్వేచ్ఛ నిచ్చితిమని యిది యొక క్రొత్తసిద్ధాంతమా? ఈ సిద్ధాంతము మీయాంగ్లేయభాష కేల యుపయోగించు కొనఁగూడదు? ఇక్కడఁ దిరుగ వ్యత్యాసమా? ఇది మాదిక్కుమాలిన దేశ భాషలకు మాత్రమే చెల్లవలసినదా? రాజభాష యొకటియు, దేశభాష యొకటియు నెప్పుడుగాని యెంతవయస్సుగల బాలునకుఁగాని నిర్బంధపఠనీయములుగ నుండవలసినదే! ఇతర విషయములు స్వేచ్ఛాను సారములుగ నుండవచ్చును.

నేను–ఇంటర్మీడియేటు బి.యే. పరీక్షలకుఁ బోవు బాలురకు దేశీయభాషావ్యాసములఁ బరీక్ష యున్నది కాదా? అది చాలదా?

జంఘా–ఉన్నది ఉన్నది, ముమ్మాటికి నున్నది. భాష లీరీతిగా నుద్ధరింపఁబడుచు న్నవా? బాగు. భాష లక్కఱలేదా? భాషలలోఁ బాఠములు మీరు చెప్పరా? భాషాపరిజ్ఞానము

చూచుటకై వ్యాసములలోఁ బరీక్షలా? మీరు చెప్పినప్పుడు వారు చదువుకొననప్పుడెక్కడ నుండి భాషాపరిజ్ఞానము రాఁగలదు? భాషాగ్రంథములు చదువకుండ భాషాపరిజ్ఞానము గల్గుసాధన మేమైన నున్నదా? ప్రవేశ పరీక్షకుఁ గాఁబోలు పూర్వము రద్దుచేయఁబడిన యాంగ్లేయభాషాపఠన గ్రంథము తిరుగ నేల యంగీకరింపఁబడినది? భాషాగ్రంథపఠనము లేకుండ భాషాభిజ్ఞానము కలుగదను సంగతి యాంగ్లేయభాషకు నిజమైనప్పుడది దేశభాషల కన్యథా యగునా? ఆంగ్లేయభాష నుద్ధరించుటకై యిప్పుడు తిరుగ గ్రంథపఠన మనివార్యము చేసినట్లే దేశభాషలఁజావకుండఁ జేయుటకై యిప్పుడుకూడ నట్లు చేయరాదా? చేయుట న్యాయము కాదా? భాషాగ్రంథపఠనము లేకుండ భాషాభిజ్ఞానము లేదు. లేనప్పుడు లభింపని భాషాపరిజ్ఞానమునుగూర్చి వ్యాసపరీక్ష లేల? ఇవి యున్న లాభమేమి? ఇవి యుండుట లేనట్లుండుట కొఱకుఁ దప్ప నితర ప్రయోజన మేమున్నది? అదిగాక కన్నులకు గంతలు గట్టి కాదంబరి చదివిన బహుమతి నిత్తునని చెప్పిన నెవఁడైనఁ జదువఁగలఁడా? కలకత్తాలో నున్నవానికిఁ గాళ్లకుఁ గట్టులుగట్టి కాశికిఁ బర్వెత్తిన యెడల గౌరవపత్రిక నిచ్చెదనని యనునెడల నాతఁడు పరుగెత్తఁ గలఁడా? సాధనములఁ జంపినతర్వాత ఫలములోఁ బరీక్ష యెట్లు? చేతిలోని కలము లాగుకొనిన పిమ్మట వ్రాఁత పరీక్ష యుపయోగమున్నదా? వ్యాసలేఖనము సామాన్యమే! ఎన్ని భాషాగ్రంథములు చదువవలయును? ఎన్ని మూరులు చదువవలయును? ఎందరచేతఁ జెప్పించుకొనవలయును? ఎన్ని తప్పులుటడుగులు వేయవల యును? ఎన్ని పాటులు పడవలయును? ఎన్ని వంకగీఁతలు గీయవలయును? ఎన్ని మొట్లు తినవలయును? భాషా పరిజ్ఞానసారమును ప్రపంచ జ్ఞానసారమునగు వ్యాసలేఖనము పదు నారు, పదునేడు సంవత్సరముల బాలునకు నిరాధారముగ, నిష్ప్రయత్నముగ, నిస్సాధన ముగ, నాకాశ పంచాంగముగ రాఁగలదా? అన్ని దివ్యగ్రంథముల వ్రాసిన నాంగ్లేయగ్రంథకర్త లందఱు భాషాపఠనసాహాయ్యముననేకదా యట్టి యపూర్వలేఖనము నభ్యసింపఁ గలిగిరి? నేల వదలిన సాము, భాష వదలిన లేఖనముండునా? నీళ్లలోఁబడి యొకప్పు డుక్కిరిబిక్కిరి యయి యటు కొట్టుకొని యిటుకొట్టుకొని మునిఁగి తేలి చేతులు కాళ్లు జాడించి తన్నుఁ గ్రమక్రమముగఁ దేల్చుకొని బారవేయఁగలవానికే యీఁతలోఁ బరీక్షకాని, యెడ్డునఁ గాళులు తడియకుండఁ గూర్చుండువానికిఁ బరీక్ష గలదా? అటులే దేశీయభాషామహాగ్రంథ సుధార్ణ వమునఁ బడి తద్రసమును గొంత యుక్కిరిబిక్కిరి యగునట్లు త్రాగి యనేక సంవత్సర ములు క్రిందుమీఁదుగ గింజుకొని తత్సన్నివేశమున కలవాటుపడి కడతేఱినవానికే వ్యాసలేఖ నమునఁ బరీక్షగాని భాషను దరిఁజేరనివానికిఁ గలదా? వ్యాసలేఖనకు గ్రంథపఠన సాహా య్యము తప్ప నితరసాధన మేమైన నుండుట కవకాశ మున్నదా? (Guides to Composition) (గయిడ్స్ టు కాంపోజిషన్) అని యింగ్లీషువారిలో గ్రంథములున్నవి కాని మనలో లేవుగద? అవి యుండి నారికెంత యుపయోగమో యవి లేకున్న మనకంతియే నష్టముకదా? అట్టి గ్రంథములు వ్రాఁతపద్ధతులను స్వల్పముగఁ జెప్పునుగాని భాషాసామర్థ్య మీయఁగలవా? అదిగాక గంగాప్రవాహమువంటి లేఖన ధోరణి యట్టిపద్ధతులకు లొంగునా? పాకశాస్త్రము చూచి ప్రాయ్యిలో నిప్పువేయువాఁడు తన్నుఁ గాల్చుకొనుటకు, గుణపాఠము చూచి వైద్యము చేయునాఁ డితరులను గాల్చుటకే కదా? కావున వ్యాసలేఖన మెప్పుడు పరీక్షార్థమో భాషాగ్రంథము లప్పుడే నిర్బంధపఠనీయార్థములు కాక తప్పదు.

నేను–దీని నిప్పుడట్లు చేసినయెడల నిర్బంధపఠనార్థ విషయము సంఖ్య

హెచ్చగుటయుఁ దద్విషయిక గురువులకుఁ బని హెచ్చుటయుఁ జదువుకొను బాలుర మనస్సులకు భారము హెచ్చగుటయుఁ దప్పక సిద్ధించును. ఇదియుఁగూడ నాలోచనీయాంశము కదా?

జంఘా–మిగిలినవి తగ్గించుకొనవచ్చును. బంధువుల పరమాన్న భోజనమున్నా ముందుగఁ దల్లిని బస్తుపెట్టుదురా! తల్లిని గౌరవింపని జ్ఞానశూన్యుఁడు బంధుమర్యాద కేడ్చినందువలన విశేషగౌరవ మున్నదా? అట్టివాఁడు తాను బస్తుండుట మంచిది కాదా? మన భాషామాతను మనము వదలఁ దలఁచుకొన్నప్పుడు మనకు విద్యతోఁ బనియేలేదు. మాతృభాషానిరసనముకంటె మౌఢ్యము మంచిది. మన భాషామాతయొక్క యభివృద్ధికి నుపయోగమునకు, నుజ్జీవనమునకు, సదుపాయమునకు, సౌఖ్యమునకే మనకితరోపవిద్యలు గాని మఱి యింకెందులకు? తల్లి చావుపిల్ల పోఁతపాలతో నారోగ్యముగఁ బెరుఁగగలదా? శవమున కలంకారము లేల? ప్రాముఖ్యమున, బలాత్కారపఠనార్హత్వమున రాజభాష యెట్టిదో దేశభాషయు నట్టిదే! ఈ భాషా ద్వయముతరువాతనే యితర విషయపఠనము. అంతేకాని తోఁక ముందు, మూతి వెనుకనా?

నేను–పూర్వపుఁ బద్ధతివలన ననఁగా నన్నియు నిర్బంధపఠనార్హములు సేయుటవలన నప్పటి బాలురజ్ఞానమునకు సౌఖ్యమే కాని లోఁతు తక్కువగ నుండెనని కనిపెట్టఁబడినది. అనఁగా విశేష విషయములు వారికిఁ దెలియునుగాని యేవిషయముననైనఁ బూర్ణముగ దెలియదు. అట్టి విద్యాపద్ధతి సంతుష్టిగ లేక బాలురజ్ఞానము స్వల్పవిషయిక మయ్యును గంభీర మగునట్లు చేయుటకై యీనవీన పద్ధతి–యనఁగఁ దమ కభిరుచి గల విషయములఁ స్వేచ్ఛానుసారముగఁ జదువుకొనుపద్ధతి– కల్పింపఁబడి తదనుగుణ్యముగ పఠన విషయములు ఖండములక్రింద విభాగింపఁబడినవి. విశేషవిషయములలో మిడిమిడి జ్ఞానమున్న వాఁడెందునను దెలియనివాఁడే! కొలఁది విషయములలో నైనఁ బూర్ణముగఁ దెలిసినవాఁడ వానిలోనైనను దెలిసినవాఁడే యగును. దేశ భాషలలో నభిరుచియున్నవా రాభాషలనే తీసికొని వానిలో నపూర్వపాండిత్యమును సంపాదించుకొనవచ్చును. పూర్వపద్ధతి ననుసరించి తేలినవారు నూర్గురకన్న నవీనపద్ధతి ననుసరించి తేలినవారు పదుగు రధికులోకోపకారకులు.

జంఘా–ఏదీ? అట్లు తేలినవారేరి నాయనా? ఇక మునుఁగుట తప్ప తేలుట యేమిటి? దేశభాషాభిరుచిచే నేతరగతిలో నెందఱు చేరిరో లెక్కలనుబట్టి తెలియఁగలదు. 1912 సం.లో నింటర్మీడియేటుకు 5823 రును, బి.యే.కు 1012 గురును విద్యార్థులుగలరు. 1912-1913 సం.లో రెండవతరగతి కాలేజీలలో "నింటర్మీడియేటు పరీక్షలలో మొదటితరగతిలో నరవము చదువుకొనువాఁ డొక్కఁ డున్నాఁడు. రెండవతరగతిలో నార్గురున్నారు. హిందూసర్వకళా ప్రధానశాల కంతకు నాసంవత్సరములో బి.యే. తరగతిలో నొక్కఁడున్నాఁడు. భాషా పాండిత్యము సంపాదించుకొనఁదలఁచి చదువుకొనువారు 71 మంది తెనుఁగువారు, 15 గురు కర్ణాటకులు, 28 గురు మళయాళస్థులు, 27గు రుర్దుభాషా వారు నున్నారు. సంస్కృతము చదువుకొనువారు మాత్రము 282 మంది యుండుటచే నీ నవీనపద్ధతి దేశీయభాషల కెంతమాత్రముపయోగించుట లేదని స్పష్టపడుచున్నది" అని మొన్న జరిగిన వాదములో మ.రా.శ్రీ హానరేబిల్ శ్రీనివాసశాస్త్రులుగారు చెప్పినారు.

ఇదిగాక భాషాభిరుచిచే నందుఁ బూర్ణ పాండిత్యము సంపాదించుకొన వచ్చునని నీవు చెప్పితివే? అట్లు సంపాదించుకొనుట కవకాశము లేదు. అట్టి తరగతులు బి.యే.కు నేకాలేజీలో నింకఁ బెట్టనేలేదు. ''హానర్సు''కు మాత్రము ప్రెసిడెన్సీ కాలేజీలో నేర్పాటు న్నది. దేశభాషల తోడి యింటర్మీడియేటు పరీక్షకుఁ గ్రిష్టియనుకాలేజీలో నేర్పాటు లేదు. ఏర్పాట్లు చూచిన నట్లున్నవి. చదువుకొనుచున్న పిల్లలసంఖ్య చూచిననట్లున్నది. ఆంగ్లేయ విద్వాపండితులగు గురువుల (Professors) యొక్క పట్టుదల యటులున్నది. అదిగాక వీరికింత దేశీయభాషావైషమ్య మెందులకు? హారిభాష కాదయ్యెను. వారు చదువుకొనిన (Latin, Greek) లాటిను, గ్రీకు మొదలగు నితరభాషలు కావయ్యెను. వారి కెంతమాత్రము తెలిసినభాష కాదయ్యెను. అట్టి యంశములో వారు తటస్థులుగ నుండుటకు బదులుగఁ దెలిసిన భాషాభిమానుల యభిప్రాయముల నిరసించుట చింత కాదా?

నేను—ఈ నవీనపద్ధతి నవలంబించి మూఁడు సంవత్సరము లయియుండును గాఁబోలు. ఇది యెట్లు నడచుచున్నదో బాగుగఁ గనిపెట్టుట కింకఁ దగినంతయవకాశము కలుగలేదు. అదిగాక ముప్పది నలువది లక్షల వ్యయముచేఁగాని యీనవీనపద్ధతి ననుసరించి యేర్పాటులన్నియు జరుగవయ్యెను. అంతధనవ్యయ మొనర్చి తగినంత కాలము దీనినడకఁ జూడకుండ విడుచుట తగినపని కాదు. అందుచే నీకోరిక నెఱవేఱలేదని నీవు దుఃఖింపక యూరకుండుము.

జంఘా—మనకోరిక విద్వాసంఘమువారు తీర్చువరకు మనహృదయములకు శాంతి యుండునా? వారు తీర్చువఱకు మన మూరుకుండువారము కాము. నిరంతరము ప్రార్థించు వారము. దుఃఖింపక యూరకుండు మని యెంతసులభముగఁ జెప్పితివి? నానోటియొద్ద నున్న యన్న మెవఁడైన నెగమీటుకొనిపోవ నేను గంటఁ దడి పెట్టువాఁడనుకాను. నేను దున్నుకొని జీవించుపాల మెవఁడైన నాక్రమించుకొనఁగ నే నేడ్వను. నాయింటిలోని సర్వస్వము సకాంతాపుత్రకముగఁ జోరులు హరించిన నే నంత దుఃఖిఁచువాఁడను గాను. కాని చేటులోఁ బడి ''క్కావు'' మనునది మొదలు హరి యని కాటిలోఁ బడువఱ కుపయోగించు కొను దేశభాష కిట్టి—

ఇచ్చట జంఘాలశాస్త్రి—గద్గదస్వరముతోఁ గనులు దుడుచుకొని యూరకుండెను. అతని హృదయమార్దవము గాంచి మేము తెల్ల బోయితిమి. కాలాచార్యులు, కవియు వాదములోఁ గూడ నప్పటికి నాకును జంఘాలశాస్త్రికిని జరిగిన సంభాషణ చెరియొకఁడు వ్రాసెను. మిక్కిలి రాత్రి యగుటచే ముగిసెను.

3. విమర్శక స్వభావము

కవి వాణీదాసుడు, సాక్షి సంఘం ఉపన్యాసకుడు జంఘాల శాస్త్రీ, జుట్టూ జుట్టూ పట్టుకోవడానికి సిద్ధపడ్డారు. వాగ్యుద్ధం తీవ్రమైంది. అసలు కారణం ఏమంటే - వాణీదాసు కవే కాడనీ, తనకి కవిత్వం అంటే ఏమిటో తెలియదనీ జంఘాలశాస్త్రి ఉడికించినట్లు, వాణీదాసు ఆరోపణ. అతనిది ఆసమ్మ ఓసమ్మ అరిగిపోస్సు అలుకు గుడ్డకవిత్వమని జంఘాలశాస్త్రి నిందించక పోలేదు. ఆమీదట వారిద్దరికీ రవరవలు పెరిగి, కవిత్వ సంబంధమునకు మించిన నిమర్శ పేరిట మాటలు పెరిగాయి. చివరికి వ్యవహారం తన్నులాటల వరకు నెళ్ళింది. అదికూడా అయ్యాక వాణీదాసూ, జంఘాలశాస్త్రీ, సిగ్గుపడి తలలు వంచుకు కూర్చున్నారు.

ఆమీదట సాక్షి కలగజేసుకుని కవిత్వం అంటే ఏమిటో, అది ఏం చేయవలసి ఉంటుందో, కవిత్వవిమర్శ ఎలా సాగాలో విపులంగా వివరించాడు.

నే నీరాత్రి మా సభాకుటీరమునకుఁ బోవుసరికి మాకవి యగు వాణీదాసుఁడు, జంఘాలశాస్త్రియుఁ గోడిపుంజులనలెఁ గాళ్లు దువ్వుచు గొట్టాపొట్టెళ్లసలెఁ దలలువంచి బుసకొట్టుచు నాఁబోతులవలె అంకెలు వేయుచు మల్లులవలెఁ దొడలు దండలు చఱచుచుఁ బంజాబీ మైసూరీ పద్ధతుల పదవిన్యాసపు గమనికలతోఁ జేయి చేయి గలుపుకొనుటకు సిద్ధమై యుండిరి. కలహకారణము గోచరింపలేదు. కాని వారిని శాంతిపఱచుటకుఁ బ్రయత్నించితిని. ఎందుల కీ కచాకచి కదనోత్కంఠత యనియడుగ వారెవ్వరును నామాటసు వినిసించుకొనలేదు. కాని, కవి నిష్కారణకఠిన ముష్టిప్రహారము నోరులేని నడుమసున్న బల్ల కొక్కటి ప్రసాదించి యిట్లు గద్దలించెను.

వాణీ–ఏ మంటివి? నాకుఁ గవిత్వమే తెలియదా? అది లోకజ్ఞానముఁగాని రాదా? దానికి దేశాటన మావశ్యకమా? ఆ! ఆసేతు హిమాచలపర్యంతము నీ వల్లల్లాడని స్థల మున్నదా? కాలి దురదయే తీరినది కాని కవితాలేశమైన నంటినదా? కాఱులఱచుట కవిత్వ మనుకొంటివా? తిట్టినతిట్టు తిట్టకుండఁ దెంపులేక తిట్టు దిట్టరితనము నిరవశేష శబ్దజాల నిరాఘాటప్రయోగనిపుణత యనుకొంటివా? ఇదిగో! నీ కబ్బినవి గండ్రతనము, పెంకితనము, తెగనీలుగుఁదనము, నుడుకుఁబోతుతనము, వెక్కిరింపుఁదనము, గయ్యాళితనము. గల లగల భేద మెఱిఁగి నీవు కవిత్వము చెప్పఁగలిగినప్పుడు నన్నధి క్షేపింపుము. అది నీకుఁ బదునాల్గు భూషణములు దిరిగిన రాదు.

జంఘా–(వికటముగ నవ్వి) నీ వేడ్చుచున్న తెలివితక్కువ నిర్భాగ్యపు టల్లరిచిల్లరి యువకతవక యాసమ్మ యోసమ్మ యారిగ చొప్ప యలుకుగుడ్డకవిత్వము నేఁ జెప్పలేక మానివేయలేదు. గడియసేపు ఛందోగ్రంథ మేదైనఁ జూచితినేని నీపేలపిండి వట్టిగడ్డి కల్లబొల్లి కాకి కూఁత కవిత్వము నాకవిత్వముచుట్టు ముమ్మారు త్రిప్పిత్రిప్పి దిగదుడుచుటకైనను బనికి రాకుండఁ జేయఁగలను. ఆ! ఆ సమర్థత లేక యూరకుండ లేదు. గడియకుఁ గావడిగ్రంథములు చెప్పఁగలను. నాకవితాధారముందు గంగాధారను బిల్లకాల్వక్రిందఁ జేయఁ గలను. ఆకాశము తూటుపడినట్లు–

వాణీ–ఏది! మగవాఁడ వైనయెడల నొక్కమత్తేభముఁ జెప్పుము. ఒక్కచచ్చుతేటగీతి చెప్పుము. అంతవఱ కెందులకు? మూఁడు ముక్కలు గద్యము చెప్పుము. ముచ్చెమటలు పట్టి చావునకు సిద్ధమయ్యేదవో లేదో! ఆ! కుక్కకూఁత నక్కకూఁత యనుకొంటివేమి? దూరపుఁ గల్లవార్తల సోదు లనుకొంటివేమి? డబ్బిచ్చువారియెదుట డుర్రుమని డమరుకము వాయించుట యనుకొంటివేమి? ఒట్టపెట్టనివారిపై నెనిమిదవ యట్టపుఁ బారాయణ మనుకొంటివేమి? లోకువపందలయొద్ద ''లొట్టాబట్టీయ'' మనుకొంటివేమి? చెప్పుము. చెప్పకపోయినయెడల బ్రాహ్మణుఁడవు కావు.

జంఘా–నేనే కవిత్వము చెప్పునెడల నీదేవీస్తోత్రపుఁ గీర్తనములు, నీపాడునాటక ములు చిల్లర దుకాణములలోఁ బొట్లముల క్రింద, దీపావళిఁ బువ్వత్తుల గొట్టములక్రింద, నాసుపత్రిలోఁ ''బలాస్తి'' పట్టులక్రింద నుపయోగపడునట్లు చేయనా? నేను గవిని గాను. కాఁదలఁచుకొనలేదు. నేను విమర్శకుఁడను. నన్నేమని చూచుచున్నావో? కవుల గ్రంథముల కగ్గిపుల్లను. కవులముంగిటి మొండిచేయిని. కవులపాలిటి తుపాకిపిక్కను. నోరు మెదుపుసరికి నోటిమీఁద నీడ్చికొట్టుదను. కవికి విమర్శకుఁ డెట్టివాడో యెఱుఁగుదువా? హె, హె, హె?

వాణీ–అప్రతిష్ఠ నాచంద్రతారకముగ సొఁగఁదీయుటలోఁ గని కందినవాఁ డీకఁ బుట్టవలయును. నీవు చత్తువు. నేను జత్తును. కాని ''జంఘాలజలదఝుంఝూమారుత'' మని ''జంఘాలకంఠనాళక్పంతన'' మని నేను జెప్పఁబోవు గ్రంథములు బ్రహ్మపునస్సృష్టివ అకు నిల్చియుండవా?

జంఘా–''వాణీదాసవదన ధూధూకార'' మనియు ''వాణీదాసవల్లకాడీయ'' మనియు వానిపై నేను జేయు విమర్శనములు పునస్సృష్టిలోఁ గూడ నిల్చునని నమ్ముము. నీవు నానెత్తిమీఁది కెగిరిన యెడల నీ పితామహ ప్రపితామహుల నెత్తిమీఁదికి నే నెగురఁగలను. జాగ్రత్త.

వాణీ–నీవు మాతండ్రిని, మా తాతను దలపెట్టిన నే నూరకుందునా? మీ మేనత్త - తురకవాని యుపాఖ్యానము లోకవిదిత మయినది కాదా?

జంఘా–నీయక్క బంకోలుకంటెనా?

అని లేచి యిద్దఱుఁ కలియఁబడిరి. కాల్చి కుండలోఁ బడవేసిన సీమటపాకాయ పెళ్ళివలె టప టప ధమధమాంతర్గత చుర చుర తుసు తుసు విరావారభటీ సంప్రదాయమునఁ దుదకు బల్లక్రిందకుఁ బడిన వీరు చిత్రవిచిత్ర శబ్దప్రతిసృష్టి నైపుణ్యమునఁ బ్రకాశించిరి. నేనును, నన్యభిక్షాదీక్షాపరిపూర్తి చేసికొని యప్పుడే వేంచేసిన కాలాచార్యులఁ

గలసి యాబల్లనెత్తి వారిరువురకుఁ గదనరంగమును విశాల మొనర్చితిమి. కొంతసేపటికి వారే సిగ్గుపడి లేచి తలలు వంచుకొని కూరుచుండిరి. అప్పుడు నేను వారితో నిటు లంటిని.

కవీ! నీ వెఱ్ఱిపంచెఁ జూచి బెదరువాఁడవనియు, నుచితమగు లజ్జగలవాఁడ వనియు, జంఘాలశాస్త్రీ! పద్యముల కర్థము తెలిపిన యెడలఁ గవితావిమర్శనమున నీకుఁ దగుమా త్రపు వైపుణ్యము గల దనియు, మీయిద్దఱుఁగూర్చి నేను సువర్ణలేఖాపత్రికకు వ్రాసినమాట మీరిప్పుడు కల్ల యొనర్చితిరి. నీవు కవివి కావు. అతఁడు విమర్శకుఁడు కాఁడు. కవితావిమర్శ శాస్త్ర విమర్శవాదములో మీ రేడుతరముల వఱకుఁ బైకిఁ బంపిన శాపబాణములఘాతములు దగిలి ''యిట్టి తుచ్ఛ, లిట్టి వంశనాశకులు మనకులమున నేల దాపరించిరో?'' యని మీ పితామహ ప్రపితామహాదులు విగతజీవులెట్లు లేడ్వఁదగునో యట్లు లేడ్చుచుందురు. ''ఏ పొరపాటుచేతనో, యే పని తొందరచేతనో, యేశ్రమముచేఁ గలిగిన విసుఁగుదలచేతనో, యేముదిమితనపు బద్ధకముచేతనో యిట్టి కవివిమర్శకుల సృష్టించి మానవజాతి కంతకు నపయశస్సును గూర్చినవాఁడ సయితిగదా?'' యని బ్రహ్మదేవు నెనిమిది కన్నుల నేకధారగ నేడ్చినట్లు చేయుటకు మీరు చాలియున్నారు. కుక్కలు పులివిస్తరాకుల పాఁతఅయొద్ద రసోపేతవస్తుపరిశీలనవాదమునఁ దమ్ము దాము గఱచుకొని పీఁకుకొనునుగాని చచ్చిన తమ తాత ముత్తాతల తోఁక వెండ్రుకల నెక్కలాఁగఁగలవా? కవీ! నీకుఁ గవిత్వము లేకపోయిన నేమి మునిఁగిపోయెను! సృష్టికిఁ బరమాసహ్యకరమై బహు లజ్జాకరమైన మీ బ్రదుకువలనఁ బ్రయోజన మేమి? వాణీదాసా! ఈనడుమ ''సువర్ణలేఖా'' పత్రికలో ముద్రింపఁబడిన ''కవి'' యను వ్యాసము నామూలాగ్రముగఁ జదువుకొని తదంతర్వర్ణితములగు శక్తులలో దేనినైన నీవు కలిగియుండునెడల నీవు కవి వనుకొనుము. జంఘాల శాస్త్రి! విమర్శకుఁ డెట్లుండవల యునో సంగ్రహముగఁ జెప్పెద వినుము.

కవి, తన్నుఁదా నెట్లు కవితా వ్యాపారమున మఱచునో విమర్శన వ్యాపారమున నిన్ను నీ వట్లు మఱవవలయును. అనఁగ గవిగాని కవి వారు కాని–నీకుఁ గాని నీసంబంధులకుఁ గాని తత్సంబంధులకుఁ గాని యొనర్చిన యుపకారాపకారములను నీమనస్సునుండి తుడిచి వేయవలయును. నేర్చుకొనఁ దలఁచినది నేర్చుకొనుటకంటె మఱవఁదలఁచినది మఱచుట మనుజునకు సర్వథా కష్టతర మని యెఱఁదగును. కవి ప్రవర్తనములోని దోషాదోషములను గూర్చి నీవు విశేషముగఁ దలపెట్టఁ దగిన యావశ్యకత లేదు. ఆతని ప్రవర్తన మాతనికవిత్వ మున కెట్టిమార్పు లెట్టివిలక్షణ విలాసములు కలిగించెనో యవిమాత్రమే నీవు చెప్పవలయును గాని తత్కవితాసాధుతాసాధుతానిర్ణయ కార్యమునఁ దత్ప్రవర్తనము నీకే మాత్రము తోడుపడఁగూడదు. అడ్డు రాఁగూడదు.

అందఱహృదయములఁ దూఱువాఁడు కవియైయుండ నీవు కవి హృదయమునఁ దూఱువాఁడవు. ఒకచో ననన్నవస్త్రములకుఁ గఱవై వట్టి ముష్టిచిప్ప చేతఁ బుచ్చుకొని పైయాకు లెగిరిన కుటీరమునొద్ద నతఁడు కూలఁబడి యేడ్చుచుండును. ఉత్తరక్షణమున దాసదాసీజన పరివృతుఁడై రత్నఖచితకిరీటాంగదధారియై బంగారు సింహాసనమున గూరు చుండి ప్రజాపాలన మొనర్చుచుండును. తదుత్తరనిమేషమునఁ బొత్తులలో మూత్రాద్యవలి ప్తగాత్రుఁడై వ్రేలు నోటఁబడక వెక్కి వెక్కి యేడ్చుచుండును. తరువాత నంతలోఁ బరమదుర్నిరీక్ష్యబ్రహ్మతేజః ప్రాంచితుఁడైన పరమహంసయై జగన్మిథ్యాతత్త్వమును బోధిం

చును. ఒకప్పుడు శక్రధనుస్సౌందర్యమునన్నో, కలకంఠ పంచమారావసౌభాగ్యమునన్నో, ప్రభాతవాతపోతస్ఫుటిత పారిజాతసౌరభమునన్నో చొక్కి, మఱిఁగి, కరఁగి, మైమఱచి మాయ మగును; అట్టి వేగుళ్లపూజారిని, అట్టి సర్వజగద్వ్యాప్తవ్యాపారపారీణునిఁ బట్టి కట్టిపెట్టి నీ వాతని హృదయమునఁ దూఱవలయును. అతని హృదయమున నున్న యనేక హృదయములఁ గాంచి బెదరక యాతని హృదయ మేదో కనుఁగొని పరిశీలింపవలయును. ఒకప్పుడాతని హృదయమేదో యాతఁ డెఱుఁగ కుందుచో దానిని నీవు కనిపెట్టఁగలిగినయె డల నోవిమర్శకుఁడా! నీవు కవికంటె ఘనుఁడవు కదా?

పరమార్థముగఁ గవిత్వ మనఁగ బహిరంతఃప్రకృతులను వాగ్దర్పణమునఁ జూపుట. అట్టిచో నోవిమర్శకుఁడా! నీకు బహిరంతఃప్రకృతి జ్ఞానము యథోచితముగ నుండనక్కఱ లేదా? సర్వదా తెఱచియున్నను జనసామాన్యమున కర్థము గాని–చదువనయినరాని –యీబాహ్య ప్రకృతిమహోద్గ్రంథమును నీవు చదువకుండనే కవిగ్రంథవిమర్శనమునకుఁ బూనుకొనుట నీకు దోషము కాదా? సర్వదా మూసియున్న మఱియొకపుస్తక మింతకంటెఁ బెద్దదియుఁ బ్రత్ర మగునదియు నున్నది. దానిలోని యుపోద్ఘాతమయినఁ జూడకుండ నీవు కవితావిమర్శన మారంభించినచో నీవు మెదడుకలవాఁడ వనిపించుకొనఁగలవా? ఉభయ ప్రకృతిచిత్రపటమగు కవితాపత్రమును నీవుఁ చేఁబూని యది మాత్సర్యకు సరిపోయియు న్నదో లేదో చూచి తీర్మానించు గొప్పపని నీదైయున్నదే? మనుజునిఁ జూచి యాతనిఁ బోలిన బొమ్మను వ్రాయవచ్చును గాని యాబొమ్మ యేవంకలో మాత్సర్యకంటె భిన్నమైయు న్నదో కనిపెట్టుట కష్టము గదా? విమర్శకుఁడా! నీపని కష్టయుక్తమే కాక ప్రమాద యుక్తమైనది గూడనగును. కవితాపటమును బ్రకృతితో సరిచూచునపుడు నీవు పొరపాటుచేఁ గాని తప్పుటూహచేఁ గాని బుద్ధిపూర్వకముగఁ గాని తప్పు నొప్పుగా, నొప్పు తప్పుగాఁ జేసినయెడల దైవముఖమును జూచి పలుకవలసిన నీకు–సరస్వతినిఁ జేత ధరించి సత్య మాడవలసిన నీకు–జనులకు యథార్థకవితాభిరుచిని గఱపవలసిన నీకు–నెట్టి మహా దోషము సిద్ధించునో కొంచెమైన నాలోచించుకొంటివా? ప్రకృతి జ్ఞానము కలిగిన విమర్శకు నికే యిట్టి ప్రమాద ముండఁగ నది లేని నీగతి యేదో యెవ్వఁడైనఁ జెప్పఁగలఁడా? కవి గట్టిన దేదో విడఁగొట్టుట విమర్శకునిపని యని చెప్పుదురు. ''చచ్చు తేటగీతమైనఁ జెప్పుము. నేను జెప్పునఁ గొట్టించుకొందును'' అని కవి విమర్శకుని నధిక్షేపించుట కలదు. ఇది తప్పు. విమర్శకునికిఁ గవితాశక్తి యుండవలసిన యావశ్యకత యెంతమాత్రమును లేదు. ''పప్పులో నుప్పెక్కువ'' యని చెప్పఁగలవాఁడు పాచకుఁడు గావలయునా? రుచిగ్రహణ పారీణుఁడు భోజనప్రియుఁడైనఁ జాలదా? పడుకగదికి దొడ్డిగుమ్మములేని హేతువునను, పంచపాళిచూరు తలకుఁ దగులుటచేతను, 'దక్షిణపుఁ దెఱపి మూసియుండుట చేతను, గృహము సదుపాయముగ లేదని చెప్పఁగలవాఁడు, తాపి–మూలమట్టము చేఁబూని తా నిల్లుగట్టువాఁడై యుండవలయునా? ఆరోగ్యాద్యంగసుఖపరిజ్ఞాని యయినఁజాలదా? గాయ కునిపాటలో నపస్వరమును గనిపెట్టఁగలవాఁడు ఖరహరప్రియరాగ మాలాపింపఁగలవాఁడై యుండవలయునా? గానానుభవరసికుఁడైనఁ జాలదా? అటులే–అటులే–అదేమి! కొంపలు సమీపమునఁ గాలుచున్నవి. లెండు చెప్పవలసిన దింకఁ జాలగా నున్నది. మఱియొకప్పుడు మాటలాడుకొనవచ్చును.

మేము తొందరగ లేచి తలుపు తాళమువేసి యాతావునకుఁ బరుగెత్తితిమి.

4. సారంగధర నాటక ప్రదర్శనము

జంఘాలశాస్త్రి, సారంగధర నాటకప్రదర్శనం చూసే ఉద్దేశంతో కొంచెం ఎక్కువ ఉత్సాహంగానే, కర పత్రంలో నాటక ప్రదర్శన ప్రారంభం సరిగ్గా తొమ్మిది గంటలకే అని అచ్చయి వున్నందున - నాటకశాలకు వెళ్లాడు.

అయితే - ప్రదర్శన ప్రారంభం దేవుడెరుగు; వేషధారులింకా సిద్ధమే కాలేదు. వారి వారి మధ్య అంతర్గత కలహాలను కూడా జంఘాలుడు విని, చూడవలసి వచ్చింది. అలాగే ప్రదర్శనం చూడవచ్చిన ప్రేక్షకుల వైఖరికూడా ఎంత 'రసవంతం'గా వుందో, కంటితో చూశాడు

మొత్తంమీద ఎలాగైతేనేం సారంగధర నాటక ప్రదర్శనం ప్రారంభమైంది. ప్రతి రంగంలోనూ పాత్రధారుల నటన, కీర్తనల ధోరణి, ఎంత బీభత్సంగా ఉంటాయో వర్ణించి - జంఘాలశాస్త్రి ఒక అద్భుతమైన మాట అననే అన్నాడు - కన్నున్న వాడికి, మెదడున్న వాడికి, హృదయమున్న వాడికి, ఇంతకంటె భయ బీభత్స ప్రదమైన దర్శనమేదీ లేదు'' - అని.

ఈ విశేషాలు చెప్తుంటే వాణీదాసు కలుగజేసుకుని - నాటకాలు వచనంలో తప్ప, వాటిలో పద్యాలుండకూడదా? అని ప్రశ్నించాడు. అలాగ నాటక సాహిత్యం గురించి జంఘాలుడు నోరు చేసుకోవలసిన అవసరం ఇంకా ఏర్పడింది. -

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను.

నిన్నను నేను నాటకప్రదర్శనదిదృక్షాయత్తుఁడనై నాటకశాలకు రాత్రి తొమ్మిదిగంటలకుఁ బోయితిని. గ్రామమునఁ బంచిపెట్టఁబడిన నాటకీయ కరపత్రములలో సరిగాఁదొమ్మిదిగంటలకు నాకట మారంభ మగునని వ్రాయఁబడియుండుటచేత నావేళకే పోయితిని. చమురు డబ్బామూఁత నూడఁదీయుటకై దానిమీఁద బిడుక, నిప్పుపెట్టి చాఁకలివాఁడు కాఁబోలు ''సుఫ్ ఉఫ్'' మనుచున్నాఁడు. నాటకరాజు కూరుచుండు కాకిబంగారు సింహాసనమున కూడినకా లదుకుచుఁ గుమ్మరి కాఁబోలు టక్కుటక్కు మనుచున్నాఁడు. ఎరవు దెచ్చిన బల్లలకుఁ గుర్చీలకు నడుగునఁ బేళ్లను, నాటకరంగాధ్యక్షుఁడు కాఁబోలు మసిబొగ్గుతోఁ బఱపఱ లాడించుచున్నాఁడు. అదివఱకు రాతిపై నూరినకత్తిని దోలుము

క్కపై మంగలి కాఁబోలుఁ గంటికి జోడు పెట్టుకొని తటతటలాడించుచున్నాఁడు. ''ఏకమే వాద్వితీయం బ్రహ్మ'' అను వేదాంతన్యాయము ననుసరించి దురవగాహమై యజ్ఞాతతేజస్క మైన యొకదీపము కాఁబోలు పాకనడుమను ధుమధుమలాడుచున్నది. రంగస్థలమునఁ దెరదింపఁబడియేయున్నది. దానిలోపలినుండి ''నఫేదుపొట్ల మేదిరా? నీగొంతుకఁగోయ'' యనియుఁ, ''జాఁకలిముండకొడు కింక బట్టలు తీసికొనిరాలేదా?'' యనియు, ''గడ్డమున కీమాత్రపు మాపున్న నేమి? ''పౌడర్'' మీఁదఁ బఱచి పారిపోకుండ నుండునటరా?'' యనియు, ''దిక్కుమాలినగడ్డాలు! తగులఁబెట్టినన్నైన మెతకవాసన పూర్వజన్మ వాసనవలె వదలదురా'' యనియు ''కంతిసాని గళ్లచీర, కమ్మలజత ఎరవుదీసికొని వచ్చినవాఁ డెపఁ డురా?'' యనియుఁ, ''బూసలకోటు నన్ను వేసికోనీయనియెడల నే నీరాత్రి వేషమువేసిన యెడలఁ దల్లికి మగఁడ'' ననియు, ''కోటులో నే మున్నదిరా? గాడిదె గుడ్డు! నోటిలో నుండవలయునురా'' యనియుఁ బలువిధములగు రనములతోఁ బలువిధములగు రవములు, కీఁచు, బొంగు, వెలితి, నత్తి, లొడుగు మొదలగు జాత్యుపజాతి లక్షణములతో నాటకశాల దాఁటి నాలుగువీథులు దాఁటిపోవునట్టి ఝాంకారములతో బయలువెడలినవి. ''అందర్ ఖామూష్'' అని నాటకరంగాధ్యక్షుఁడు నాగుండె లదరున ట్లొక్క చావుకేక వైచినాఁడు. ఇంతలో నంగవస్త్రధారియైన యొక్కఁడు దళముగ బూడిదపట్టించిన మొగముతోఁ ధళకట్టుత్రాళ్లు మెడప్రక్కల వ్రేలాడుచుండఁ గృత్రిమ స్తనసౌభాగ్యమును గుసుంబారవికలో నడచి బిగించి, సైఁట లేకుండ నోటిలో లొడితెడు చుట్టను సింగారించి త్రిలోకానందకర దివ్యమంగళ విగ్రహములతోఁ దెరప్రక్కనుండి వెలుపలకు వేంచేసి ''ప్రాంప్టింగునకు రెండవపు స్తకముఁ దీసికొని రాపైతివి. చావుమంటివాయేమి? నీస్టేజిమేనేజరి యేడ్చినాళ్లు యున్నది.'' అని తీండ్రించి పలికి యంతలో నన్నుఁజూచి యట్టె సిగ్గుపడి చేతులు రవికకడ్డు పెట్టుకొని నోటిచుట్టతోడనే తుర్రున లోనికిఁ బోయెను. ''అప్పుడేటిక్కిట్ల యమ్మక మారంభించిన ''రాస్కెల్'' నిటు చెవిఁబట్టుకొని లాగుకొని రమ్మ, పండ్లు రాలఁగొట్టెదను.'' అని యధికారికావరమున నాటకాధ్యక్షుఁడు కాఁబోలు లోనుండి యఱచెను. ఇంతలో నొకతెరప్ర క్కనుండి యరగడ్డమొకటి కొంతసందేహించుచు వెనుకకు ముందునకు దట పటాయించు చున్నది. ఇంకొకప్రక్కనుండి యొక బొర్రముక్కులో మూఁడు పావులవంతు మట్టునకు మరియొక తెరప్రక్కనుండి లటుకునఁ బొటకరించి యడ్డబాసనున్న కల్లకెంపుతో జిగజిగ మెఱయుచుండెను. తళుకుమనునంతలోఁ దునుక్కు మని తుమ్మొకటి యాద్వారద్వయగ హ్వారము నుండి బాగుగ దట్టింపని ''తూటా'' సంబంధమగు బుసబుసోద్రేకగుంఫనారబ్ధహ ర్జటిల ధ్వానముతో బయలువెడలఁగఁ గెంపుటడ్డభాస నిరాఘాట పవనధాటిచేఁ గాఁబోలుఁ గ్రిందఁబడిపోయె ననుకొంటిని. కానినాది పారపాటు. అది ముక్కుపట్టులేకజారిన సింగారము కాదు. నోటిపట్టు లేకజారిన సిగరెట్టు. నటకులను బాహాటముగఁ జూడఁదలఁచి నేను రాఁగా నాప్రారబ్ధవశమున నటకులు నన్నిళ్లు దొంగపోటునఁ జూచుచుండిరి. దీపాలు పెట్టకుండనే పాకలోనికి దాపురించిన నాటకపు మొగమెఱుఁగని యీ యనాగరకవ్యక్తి యీపల్లెటూరి వెర్రివేసము, ఈ యాంగ్లేయభాషాజ్ఞానశుంఠ యెక్కడనుండి విచ్చేసెనో యని నన్నుఁ జూచి కాఁబోలు వెంటనే ''హి హి హి'' యని సకలింప మొదలుపెట్టిరి.

ఆదినమున గ్రామమునఁ బశువులనంత యగుటచే రసాదరణపరిపోషణపటిష్ఠమగు నితర గ్రామకర్షకలోకము కొంత నాటకదిదృక్షచే వచ్చినది. పాఠశాలలలోఁ జదువుకొను

బాలురుగూడఁ గొందరు వచ్చి యటునిటు నా సమీపముననే కూరుచుండిరి. వారిలో
వా రేమి మాటలాడుకొనుచుండిరో నాకు బాగుగ వినఁబడలేదు. కాని నడుమనడుమ
మాత్రము కొన్ని కొన్ని మాటలు, ''పట్టుపలుపులు'' ''పంపరపనాసడిప్పలు'' ''పగల
రాత్రి యెరుఁగని ప్రాఁతచదువులబాపనయ్య ''Arrogant Fellow'' యనుచు నింకేమేమో
వినఁబడెను. ఇంతలో ''డొక్క చీల్చితాలు గొట్టెదను'' అని పెద్దయిగిలింపుతో నొక కే
వినవచ్చినది. స్త్రీలకుఁ బ్రత్యేకముగ నుంచినస్థలమున కున్న ద్వారమునొద్ద ''నేన
గూరుచుండెదను. నేను గూరుచుండెద''నని యిద్దరునటకులు లఘువులయినమాటలచే
నూతన సమర సమవాకారమునకు నాందీపూజ చేసి గురువులగు గ్రుద్దులచే భరతవాక్యము
చెప్పిరి. వారిద్దఱను గాకుండ మరియొకని నక్కడ గూరుచుండుటకు నధ్యక్షుఁడ
నియమించెను. కాని గడియగడియ కొక నటకుఁడు–ఖండకరకార్పాసకూర్పాసము వాఁడ
హేమాంచలరోచమాన కాచనేత్రములవాఁడో వృశ్చికపుచ్చచ్చ–వివిచ్ఛేదిశ్మశ్రులత
రశ్మిలవాఁడో–కమఠపృష్ఠ పరిపాటీసమ శిరోవాటివాఁడో–స్త్రీలున్న యాస్థలమునకు వచ్చి
''మీ కన్నియు సరిగా నున్నవికదా!'' యనియు, ''దగ యగునెడల సోడా'' సిద్ధముగనే
యున్నదనియు, ''మీ రటునిటు పోఁదలఁచినయెడలఁ బ్రత్యేకముగ మీసదుపాయముకొఱ
కుంచిన యాస్థలమునకుఁ బోవచ్చు'' ననిఁయు, ''మీకుఁ క్రిందిభాగమున నున్న గోతినిదా
టిదూలముచేఁ గప్పి పైన గడ్డి బాగుగ వేయించి చాఁపలు పఱపించినను మీకేమైనం
గ్రుచ్చుకొనునేమో యని భయపడుచున్నా'' ననియు, నిటు లేదో యొక్కొక్కఁ డొ
క్కొక్క తేమ సమాచారవార్త నాకాంతలకు విన్నవించుచుండెను. కాని యొక్కఁ డయిన
స్త్రీలసౌఖ్యమునుగూర్చి యశ్రద్ధగ నుండలేదు. నవనాగరక మాహాత్మ్యముచేతఁ
గాంతలయెడఁ బురుషు లిట్టి యాదరణమును–ఇట్టి దయను–ఇట్టి భక్తిని–ఇట్టి గౌరవమును
–ఇట్టి విశ్వాసమును–ఇట్టి ప్రపత్తిని–గనఁబఱుచుచుండి రని నే నానంద మొందితిని. ఇంతలో
''మీ రాఁడుతోడునఁ బుట్టలేదా? మీరూపములు గాలిపోను. మీసరసములు మాయెదుట
నేనా?'' యని యేమేమో కొన్ని కాంతాకంఠరవములు వినఁబడెను. ఒక్కపరుగున నెవ్వఁడో
వచ్చి నాప్రక్కను గూరుచుండిన రక్షకభటాధికారితో ''అయ్యా! తమ యాఁడువా రింటికిఁ
బోయెద మనుచున్నారు. నటకులు నాట్యాంగనలతోఁ జేయు సరససల్లాపములు సంసారిణు
లకు శ్రవణపుటభేదనములుగ నున్నవి.'' యని చెప్పఁగ నాతఁడు ''Scoundrels'' అనుచు
నహంకారమున లేచి వారి కధికారియగు ''మేనేజరును'' బిలిపించి యింగ్లీషుభాషతో
నేమేమో చెప్పెను. ఆమాటలలో ''ప్రాసిక్యూటు'' మాత్రము నాచెవినిఁ బడెను. పెద్దకోన
సాని మనుమరాలయినట్టియు, నూతనముగ రజస్వలయయి విటలోకమునంతయు నట్టుడి
కినట్లువేధించునట్టియుఁ, బ్రసిద్ధకీర్తిస్వరూపిణియు నగు చిన్నకోనసాని దేహపరిమళసౌభా
గ్యమునకై సంకల్పింపఁబడి నటకులలో నొకనిచే వినరి వైఁబడిన కర్రడబ్బిలోని యత్తరువు
నీన ప్రక్కను గూరుచున్న రక్షకభటాధికారివితంతుపుత్రికయొక్క నున్నని తలపై
లింగముమీఁదఁ జుట్టుపీఁక పడినట్లు పడుటచే నీగడబిడ జరిగిన దని తెలిసినది. ఇంతలోఁ
దలపగిలినధ్వనియును, మొర్రో యను కేకలును వినఁబడుటచే నేను దహతహపడితిని గాని
కొబ్బెరకాయను గొట్టి లోననటకులు దేవిని ప్రార్థించుచుఁ బాడుచున్నా రని తెలిసి నాలో
నేను నిమ్మళపడితిని. ఇఁక వేఁపాకువేనము వచ్చునని నాప్రక్కను గూరుచున్న యొకనాయఁ
డు–నాయీడువాఁడు ఉబలాటముతోఁ జంకలుఁ గొట్టుకొనుచుండెను. లోనిగంట గణగణ

లాడుచుండ నెదుటితెర సఱపఱలాడుచుఁ బైకిఁ బోవుచు నడుమఁ గారణాంతరముచేఁ గొంత యాఁగెను. లోనుండి కొందరు నటకు లెగుడుదిగుడులను సవరించి జబ్బపుష్టి నెటులో దానిఁ బైకిఁ ద్రోసిరి. అంత నొకనటకుఁడు ప్రవేశించి సభకు నమస్కరించి ''అమ్మలారా! అయ్యలారా! నేను దమతో సెల వీయఁబో–ఉఁహు! మనవి చేసికొనఁబోవున దే దనఁగా యీదినము–కాదు, ఈరాత్రి సరిగా పందొమ్మిది–ఆఁ–తొమ్మిదిగంటలకు నాటకము మొదలుపెట్టుదు మని డప్పుముఖమున వెల్లడించితిమి. కాని యాంతరకారణము లచే–ఆ? ఆఁ! కారణాంతరములచే నట్లు జరుపలేకపోయితిమి. కాన మీరు క్షంతవ్యులుకాదు. మేమేకాఁబోలు'' నని పలికి పోయెను. ''ఇప్పుడయినఁ ద్వరగ నారంభింపనియెడల మీరు హంతవ్యు'' లని యెవ్వఁడో సభనుండి కేకవైఁగ ''చుప్రహో''యని తెరచాటునుండి మఱుకేక వచ్చెను. వేఁపాకువేస మీదినము రాదు కాఁబోలు నని నాయఁడు బెంగపెట్టుకొ నెను. అంతట గ్రామసంచారమునఁ గృతార్థులయి నల్వురు రక్షకభటులు ''టిక్కట్లు'' లేకుండ లోనికి వచ్చిరి. వారినెత్తిపాగల యెఱుపునుబట్టియుఁ, జేతిదుడ్ల సలుపునుబట్టియుఁ, బడపమటిచెప్పుల కిఱ్ఱునుబట్టియుఁ వారి కీ యనన్యసామాన్యగౌరవము గలిగిన దని నింటిని. ఆనాఁటిరాత్రి సారంగధరనాటకప్రదర్శనము. ఆలస్యకారణమున నాందీప్రస్తావ నలు విడువఁబడుటచేఁ దన్నాటకకవి యెవ్వఁడో తెలియలేదు. గ్రామమునఁ బంచిపెట్టఁబ డిన కరపత్రములలోఁగూడఁ గవిప్రశంస లేదు.

మొదటి యంకమున రాజరాజనరేంద్రుఁడు, నతనిప్రధానుఁడు మద్యానవనమునఁ బ్రవేశించి వేదవిహితకర్మములఁ గూర్చియు వర్ణాశ్రమధర్మ పరిపాలనముఁ గూర్చియు జనులక్షేమమును, గర్షకుల పంటలఁగూర్చియు, ధాన్యములధరఁగూర్చియు ముచ్చటించు కొనిరి. రాజకార్యవిముఖుఁడై విలాసముగ మద్యానవమన మున్న రాజు కీసంభాషణ మెందు లకో నా కిప్పటికిని బోధపడలేదు. అంతటఁ జిత్రాంగియు నొకదాసియు నచ్చటకు వచ్చిరి. వారచ్చట కెందులకు వచ్చిరో వారికిఁదెలియదు. వారిని బుట్టించిన బ్రహ్మకును దెలియదు. అంతట రాజు తొందరతో లేచి ప్రధానుని జేయి పట్టుకొని–

కీర్తన–''చూచితే? దానిసొగను చూచితే? నాచువంటి కేశచయము.

త్రాచులాగు నెనుకవ్రేలు–చూచితే?''
అని కాలితోఁ దాళమును దాటించుచుఁ బాడెను.

ఈకీర్తననే ఫిడేలుపైఁ దెరలో నొకఁడు వాయించుచుఁ బాడుచుండెను. నేను దెల్లఁబోయి కూరుచుంటిని. కాంతలయందలి యత్యంతానురాగ మొకప్పుడు మనుజులను దాత్కాలికముగఁ గవులను జేయఁగల దనియు, నట్టివారు తాము వలచినవారి సౌందర్యమును గానమొనర్తు రనియు నేను వినియుంటిని. అట్టిమాఱు పే దైన నీరాజులలోఁ గలిగినదేమో యని సర్దుకొని యూరకుంటిని. ప్రధానుఁ డాకీర్తననే దొరకఁబుచ్చుకొని–

''చూచితిన్ దానిసొగను - చూచి
మిన్నువంటి నడుముగల్గు
చిన్ని చనుల వన్నెలాడి - చూచితిన్.''

అని ప్రత్యుత్తరమిచ్చెను. ''నేను వలచినకాంత యపయవములను నీ వట్లు వర్ణిం

తువా?'' యని మహారాజు కోపోద్రేకమునఁ బ్రధానునొక్కఁటి యీడ్చి దొడ్డపై సాగదీ
కొట్టునేమో యని నాకొడలు కంపించినమాట సత్యము. రాజున కట్టి యౌచిత్యమ
లేకపోయెను. ప్రధానున కట్టిభయము లేకపోయెను. నన్నయభట్టకవిచే భారతమున
గ్భతినందిన యాచంద్రార్కకీర్తిరాశియగు రాజరాజనరేంద్రుఁడు తాను వలచినదాని యం
ములను జూడు మని ప్రధానునకుఁ దాను జూపించునంతటి మతిమాలినవాఁ డెప్పు డయ్యెన
జెపుమా? యనియు, రాజు బలాత్కారముచేఁ జూచిన యవయవము లేవో చూచి ''హ
హరీ'' యని లోన స్మరించుకొని నోరు మూసికొని యూరకుండక యితరరహ స్యావయవ
ర్ణనముల లయ దప్పకుండ లంకించుకొనుటకు వేగిదేశమునంతయు బాగుగ విస్తరయశస్
మృద్ధిని బరిపాలించిన ప్రధానుఁ డంతవెఱ్ఱిముండకొడుకా? యనియు నొడలు జలదరి
చెను. రాజప్రధానులిట్లు పనిలేక పాడుకొనుచున్న పాటలను విని వారు మతిలేక యుండిర
లేక త్రాగియే యుండిరో తమ్మెక్కడ నొడలుతెలియని వెఱ్ఱితిమ్మిరిచేఁ గొట్టుదురోయని
కాఁబోలుఁ జిత్రాంగియు, సఖియుఁ బారిపోయి రని నే ననుకొనవలసి వచ్చినది. వార
వచ్చుటకుఁ గారణ మూహ్య మైనప్పుడు పోవుట కేల కాదు? అంతట శ్రాద్ధయోగ్యమగ
రాజప్రధానుల సంభాషణములోఁ జిత్రాంగి సారంగధరునికి భార్యగాఁ దేఁబడిన దనునంశము
తేలినది. రా జామెను దానే వివాహముఁ జేసికొన నిశ్చయించుకొనెను. ఇంతటితో మొదటిరం
గము ముగిసెను.

రెండవ రంగమందు రాజరాజనరేంద్రుని వివాహము. ఢంకా భేరీవాద్యముల భాంకార
ములతోఁ, గవుల స్తోత్రపాఠముల ఝాంకారములతో, నాట్యాంగనల గాజులగజ్జెల క్రేంకార
ములతో, భట్టుల చాటుపాఠక ఠాంకారములతో, మల్లుల ముష్టియుద్ధహుంకారములతో,
మదగజఘటుల ఘీంకారములతో, సంభావనబ్రాహ్మణుల యహంకారములతోఁ, బల్యంకిక
వాహకుల యోంకారములతో బహువైభవముగ జరిగినందులకు సంతసించితిని.

మూఁడవరంగమందు రాజరాజనరేంద్రుని నగరు. పెండ్లి అనఁగ సంస్కృతమునం
బున్నింధానము. దివ్యముగ నలకంరింపఁబడిన యా శోభనపుగదిలో నిలువుటద్దముల
నడుమ–నత్తరుపన్నీరుబుడ్ల నడుమఁ–శ్రీబసవకుండికల నడుమ–ఫలహారపుఁ బళ్లెరముల
నడుమ నీప్రభువు పాడిన కీర్తులు, వేసిన తెయితక్క లాపరమాత్మనికే యెఱుక. అంతలో
నిష్కారణముగ విరహమఁట!–మొదటఁ బ్రవేశించినప్పుడు బాగుగానే యున్నాఁడు! విషూ
చివలె నాతని నాకస్మికముగఁ బట్టుకొని గిరగిరఁద్రిప్పి నేలఁగొట్టినది! అంతట నీమహారాజు
చిత్రాంగికొఱకు–గాజు బొమ్మలకాళ్లు పట్టుకొని, కట్టులేళ్లకన్నుల ముట్టుకొని, లక్కచెళ్లతా
టిపండ్లు లాగి, పళ్లెరములలోఁ బెట్టిన బనారసుకాజాలను బండ్లతోఁ గట్టిగఁబట్టి, వడివేసి,
చప్పరించి, లొట్టవేసి యదుకులకాంభోజిరాగములో నేకతాళముతో నేడ్చిన యేడుపులు
హరహరా! పగవానికైన వలదు. ''వహ్వా! వహ్వా!'' ''వన్నెమోరు వన్నెమో'' రనుచు
సభికులు మహాసంతోషసముద్రమున నోలలాడుచుండిరి. ఇట్లు రాజు పున్నాగవరాళిలో
'పాదా! నదా సుదాతిఁజూపవే' యని పాడిన కీర్తనతోఁ బొదచాటునున్న చిత్రాంగి యట్టె
వెలుపలకు వచ్చెను. రాజు మూర్ఛపడెను. ప్రాణములు గూటఁబడినవెనుక లేచి భక్ష్యముల
పళ్లెరములను బరామర్శించి గర్భాధానతంత్ర మంతయు ఖరహరప్రియరాగములో ఖండజాతి
త్రిపుటతోఁ గడతేర్చెను. అంతటితో మొదటియంకము ముగిసెను. తెర దిగెను.

రెండవయంకమున మొదటిరంగమున సారంగధరుఁడును, మంత్రి పుత్రుఁడును, మఱికొందఱు బాలురును బ్రవేశించిరి. కొంతసేపు వారుకుండబంతి నాడిరి. కాలిబంతి యెగిరి ప్రమాదవశమునఁ బైన ప్రేలాడుదీపమును బగులఁగొట్టును. లోపలిచమురు భగ్గు మనెను. పాక కాలిపోవునని భయపడితిమి. కాని యట్లు జరుగలేదు. తరువాత మంత్రిపుత్రుని చేతినుండి గోటిబిళ్ల యెగిరి సభలో నున్న యొకకోమటిపిల్లవాని కణఁతకుఁ దగులుటచే నాతఁడు సొమ్మసిల్లిపోయెను. అంతటనాతని తండ్రి గోలుగోలున నేడ్వసాగెను. కోమటిమాత్రము నాటకపద్ధతికి విరుద్ధముగాఁ బాటలతో నేడ్వక మాటలతోడనే యేడ్చుచుఁ బిల్లవాని నింటికిఁ దీసికొనిపోయెను. అంతఁ గోతికొమ్మచ్చినాడు చుండగా సారంగధరుఁడు చెట్టుమీఁదనుండి పడెను. వెంటనే తెరకూడఁ బడెను.

ద్వితీయరంగారంభమున మంత్రిపుత్రుఁడును, సారంగధరుఁడును బావురముల నెగరవైచుచుఁ బ్రవేశించుచు నిట్లు పాడిరి.

"పావురాల నెగరవైచి పట్టుకొందమా?
మావరాలమూటలైన శ్రీవరాంగసుషమ మీరు ॥పా॥

ఇట్లు పాడియెగరవైచిరి. నాటకగాథ ననుసరించి పావుర మొక్కఁటి ప్రక్కనున్న చిత్రాంగిమేడమీఁది వ్రాలి కూరుచుండుటకు బదులుగా నెదుటనున్న మాశిష్టుకరణము మేజస్ట్రీటుగారి నెత్తిమీఁదవ్రాలి రెట్టవైచెను. ఆకస్మికమైన మైలవార్త విన్న యాతఁడువలె నతఁడు సచేల స్నానమునకై పోయెను. ప్రక్కగోతిలోఁబడి పావుర ముండఁగా నది చిత్రాంగిమేడమీఁదనే యున్నట్లు భావించి సారంగధరుఁ డిట్లు పాడెను.

"పాగరుబోఁత? మా కపోతమా!
తగదు వడిగ తిరుగ తిరుగకున్న పాగ రడంతు" ॥పాగరు. ॥

పావురము రాకపోవుటచే సారంగధరుఁడు చిత్రాంగి యింటికి వెళ్లుటకు స్థిరపఱచుకొనెను. మంత్రిపుత్రుఁడు మలయమారుతములోఁ గొంత మందలించెను గాని దానిని సారంగధరుఁడు శంకరాభరణముతోఁ జప్పఁబఱచెను. రెండవరంగము నిట్లు ముగిసెను.

మూఁడవరంగమున సారంగధరుఁడు చిత్రాంగి మేడలోఁ బ్రవేశించెను. చిత్రాంగి యాతనిఁ జూచుటతోడనే లేచి గొంతుక బొంగు సవరించుకొని "ఆ" యని ప్రక్కనున్న శ్రుతితోఁ గంఠమును గలిపి "ఊ" యని పిడేలువానికిఁ గీర్తనకై తలయెగుపుతో సంజ్ఞ చేసి–

బిహరి–ఆది.

'ఒకసారి కౌఁగిట నొత్తిన నేలరా! ఓరీ! మారాకారా!
తెకతెకను నుడకఁగ తొగలరాయఁడు! పొకపొకల గ్రమ్మెచు
నొడలుపొక్కెను అకట! యింక "బ్రదుకంగఁజాలను!
నికటమున న న్బట్టి గట్టిగ ॥నొక ॥

అనుచు హస్తపాదవిన్యాసములచేఁ దాళపువారిని గానఁబఱచుచుఁ దారక మంటునట్లు పాడెను. అంతట సారంగధరుఁడు నడుము బిగించుకొని–

కీర్తన.

''చెలియ! నీదుపలుకులు చెవుల కలుకుములుకులు
మగువ! నీదుమాటలు మనసుకత్తిపోటులు;''

అని యెంతసేపో యెగిరియెగిరి వగర్చుచుఁ గూరుచుండఁ జిత్రాంగి యాతనిపైఁ బడెను. ''రమణీ! రాకు రాకుమా'' యనుచు గొంతుఁజించుకొని రాకుమారుఁ డటునిటు పోవుచుండఁగ ''రార పోకు పోకుమా'' యనుచుఁ జిత్రాంగి యాతనివెంటనే దిరుగుచుండెను. ''కుయ్యో'' యనుచు, ఘుర్ఘురించుచు పంది పట్టుపడక పటుగడలు ద్రొక్కుచుండ నెరుకత దానినిం బతిమాలుచు బెదరించుచు వెంటఁబరుగెత్తుచట్లుండెను ఇట్లిద్దరు పాడుచు ''మైనూరీ పంజాబీ'' పదవిన్యాసపు గమనికలతోఁ, గుడియెడమ యొత్తిగింపులయొడుపులతోఁ, గరముల జొకాయింపుల కట్టుదిట్టములతో, వంపుతలల ప్రక్కచూపుల కోరకోపులతో ముందున కుంకించు మురిపములతో వెనుకతగ్గు విలాసములతోఁ గొంతసేపు గది యంతయు ధూళి రేగునట్లు తాళప్రస్తారసందర్భము దప్పకుండ గంతులు వైచిరి. సారంగధరుఁడు వెడలిపోయినపిమ్మటఁ జిత్రాంగి కోపముఁ బట్టఁజాలక భూపాలరాగముతో భూపాలపుత్రుని బూతులు దిట్టుచుండఁ దెర దిగెను.

మూఁడవయంకమున ముఖారితో నేడ్చుచుఁ జిత్రాంగి వికృతరూపయై ప్రవేశించి నేలఁ బడియుండును. వేఁటనుండి రాజరాజనరేంద్రుఁడు ప్రవేశించి సావేరితోఁ గొంతసేపు దేవేరికై దేవులాడి యధశ్శయానయగు నర్ధాంగలక్ష్మిని జూచి యొద్దఁగూరుచుండి—సతీ! లావణ్యవతీ! సమంజససద్గుణసంతతీ! సద్ధర్మాచరణరతీ! సరసవచోరచనాచమత్కృతీ! భారతీ! అని ప్రియసాధారణసంబోధనాడంబర విజృంభణుఁడై ప్రకాశించెను. ఆమె పలుకలేదు. అంత రాజు ''చిత్రాంగీ!—మనోహరాంగీ! అక్షిసౌభాగ్యనిర్జితకురంగీ! మాననీయయానాధరీకృత మదసారంగీ! నాపైఁ బూలబంతుల బారు పెట్టుజోడునాళముల ఫిరంగీ!'' యని బిగ్గఱగఁ బిలిచి గొంతు మరేదో దరువునకై కాఁబోలు సర్దుకొనుచుండెను. అంత్యనియమప్రధానములగు నీసంబోధనముల విని నా కొడలు సీరు విడిచినది. ''మనము భార్యలతోఁ గాఁపురములు చేయుచుండుట లేదా? మనభార్యలకుఁ గోపము వచ్చినప్పుడు మన మిట్లే సంబోధించుచుంటిమా? మనలో నెనిమిదేసి విశేషములయినఁ జేసికొనువా రున్నారే! వారందరు భార్యల నిట్లంత్యప్రాసములు తప్పకుండనే పిలుచుచున్నారా? మనయబ్బనాఁడైన—మనతాతనాఁడైన—నిట్టి సంబోధనము నుపయోగింపఁబడె నని యింటిమా? ఎవ్వనికి లేని పోఁగాల మిప్పు డీ రాజరాజనరేంద్రున కేల? వీని కెన్ని యేండ్లు వచ్చినవి! ఎంతదేశమున కధికార మున్నది! ఎంత భాండారసామగ్రి యున్నది! ఎందఱుబుద్ధిమంతులను సభాస్థానమున నేకరించినాఁడు! ఎన్ని గ్రంథములు చదివినాఁడు! ఎన్నికృతు లందినాఁడు! అయ్యయ్యో! ఎంత నిర్భాగ్యుఁడైపోయినాఁడు! ఎంత ప్రాపంచికజ్ఞాన శూన్యుఁడై పోయినాఁడు! తుట్టతుదకుఁ గట్టుకొన్న దానిని బిలుచుటయైనఁ జేతఁగాని వచ్చెపెద్దమ్మలలో నగ్రతాంబూలమునకు సిద్ధమయినాఁడే? ఆహా! వీనికి మతి లేదా? మనుష్యత్వమే లేదా? పాటతోనే కాని మాటలాడఁడే! ఎంత మహాకర్మము దాపరించినది!'' అని నాలో నే నేమేమో యనుకొనుచుండఁగా రాజరాజనరేంద్రుడు:—

సీ. ''నీకుఁ గోపం బేల? నాకుఁ జెప్పుము నాతి!''
యనఁగ నదివఱకు మాటలకు లొంగనికాంత పాటకు స్వాధీనయై పైయర్థపాదమును.

''నాతోడఁ బలుక కోభూతలేశ!
యనియెను.

రా–నిన్నుఁ బ్రాణసమముగా నేఁ జూచుకొంటిని.
చి–నేను నీయిల్లాలను గాను బొమ్మ్మ.
రా–రత్నాంగి విడిచి నీప్రాపుఁ జేరినవాఁడ.
చి–నేను జచ్చితి నంచు నెంచు మింక.
రా–బిగుసైనకౌఁగిటఁ బెనఁచి ముద్దీయవే?
చి–కోడల నంట కో కుతలనాథ?
రా–కోడ లంటివి? యది యేమి? కోమలాంగి!
చి–కొడుకు నుంపుడుకత్తెఁ గోడ లనఁదగదె?
రా–ఏమి? వానిని దెగవ్రేతు నీక్షణంబ
చి–నన్నుఁ జంపుము మామయ్య! మన్ను జోడ!

ఇట్లు వీరిద్ద ఱొకరి దొకరుఁ బుచ్చుకొనిన తరువాత మిగిలినదానిని వేరొక రానందభైరవితో సాగఁదీయుచు నొకచెంపను వీరుగొట్ట నొకచెంపను వారు గొట్టుచు వేపారుల యుత్తాణిలోవలె నొకతములపాకుచుట్ట నొకరు కొరికి ''థూ'' యన, దాని యర్థమును వేరొకరు కొరికి తిరుగఁబడి ''థూ'' యనుచుఁ బగులఁ గొట్టుటలతో నదుకుటలతోఁ ద్రెంపులతో ముడిబెట్టుటలతో నర్థపాదార్థపాదాన్యోన్యసాహాయ్యా వృతులతో–దిక్కుమాలిన శవము నిద్దరు చెరివైపు సాయపడి బుజములు గలిపి శ్మశానవాటికకడకుఁ జేర్చినట్లు నీనపద్యమును నానాస్వర సాంకర్యముతో సంపూర్తిజేసిరి. అంతటఁ దెర దిగెను.

మూఁడవయంకమున రెండవరంగమున న్యాయాధిపతియు, న్యాయవాదులు, నేరగాఁడగు సారంగధరుఁడు, సాక్షులు, సేవకులు ప్రవేశించిరి. సర్కారువైపున నున్న న్యాయవాది నాదనాక్రియతో నేరగానినేరము నంతయు నుపన్యసించెను. నేరగాఁడు భైరవివర్ణమునఁ దననిర్దోషత్వమును హర్మోనియము సాహాయ్యమునను, జిప్పతాళపు సాహాయ్యమునను స్థిరవరచెను. సాక్షు లందరు కలిసిపాడిరి. సారంగధరునివంక నున్న న్యాయవాది సరససంగీతరచనాచమత్కారముగల యొక్క స్వరగతిని జల్లుజల్లునఁ బాడి నంగతులపై నంగతులు లేత ముదురు పట్టు జారు సాపు వరివిక చౌకము దురును మంద్రము తారకము బొంగు కీచు మొదలగు వివిధ భేదసంప్రదాయములతో వినరి వెదఁజల్లి వర్షించి వినువారితలలను బలాత్కారమునఁ బులిమి సారంగధరుని నత్యసంధతను నౌరోజున నటతాళమున నుపన్యసించెను. వెనుకటి కాలము కాదు. వెనుకటియుగము కాదు. వెనుకటిమనుజులు కారు. వెనుకటి సృష్టి కాదు. అంతయుఁ గ్రొత్త! నరిక్రొత్త! సాక్షిచట్ట మంతయునంగీత సర్వార్థసారసంగ్రహమే! శిక్షాచట్ట మంతయు గాయనగాయనీ జనపారిజాతమే. న్యాయవాదు లందఱు గాయకులే! సాక్షు లందఱు నరిగమాధ్యయనశీలురే! బిళ్లబంట్రోతులందఱు పిళ్లారిగీతములయినఁ బాడఁగలవారే! సారంగధరుని నేరము స్థిరపడిన దనియుఁ, గరపాద

ఖండనశిక్ష విధించితి ననియు న్యాయాధిపతి లేచి నాటకురంజితోఁ దీర్పు చెప్పఁబోయ
శంకరాభరణముతో సంకరపఱచి సభ చాలించెను. తెరదిగెను.

మూడవరంగమునఁ గారాగృహమున నున్న సారంగధరుఁడు, తల్లి రత్నాంగియుఁ
బ్రవేశింతురు. తల్లి యాతనిఁ గౌఁగిలించుకొని మహాదుఃఖపారవశ్యమున నేడ్చునని నేనను
కొంటిని. అట్లేడువలేదు. కాని యిట్లు పాడెను.

బలహంస – ఏక.

''నాయనా! పాయ నాతరము గాదురా! నాయనా!
నిన్నుఁ బోలువాని నీజగానఁ గానఁగాన నోనాయనా!''

అనుచుఁ ''బ్యాండు'' స్వరముల నారోహణావరోహణ శృంగారము చిప్పిలుచుండ
నట్లు మధురకంఠమును మధ్యమకాలశ్రుతితోఁ గలిపి గానకళాకాలక్షేపమును జేసెను.
సభవారి కరతాళధ్వను లఖండముగ నుండెను. ఇదివఱ కనేకపాత్రములు పాడిరి గాని
యీమెపాట బహుసంతోషప్రదముగ నున్నదని యందఱైకకంఠ్యముగఁ బలికిరి.

''సారసనయనుఁడవో సద్గుణసహితుఁడవో చారురూపమున మారుఁ దాఁ
మాఱుఁ జేయుదో నాయనా!'' అనుచుఁ దిరిగి పల్లవి యందుకొని యుపపల్లవిని బఠించి
''జగానఁగానఁగా'' యని బింకముగఁ బాడుచు, నుసిదెబ్బల సౌభాగ్యమును జరణచాలన
మున నుద్బోధింపఁ జేయుచు ముక్తాయింపఁగఁ దెరచాటుననుండి పాటకుఁడు ''తధిగిణ
తోంతకతధిగిణతోం తళంగుతధిగిణతోం'' అని తానుగూడఁ బైముక్తా యింపునకు బంగారు
మునకు సౌరభ మబ్బించునట్లు శబ్దములకొలువుతో వన్నె దెచ్చుసరికి హాహాహాహా! యనుచుఁ
బాకయంతయుఁ బరమానంద మొందెను. చేతులపైఁ గొట్టుకొనువారు, బల్లలపైఁ గొట్టు
వారు, పిఱ్ఱలపై గొట్టుకొనువారు, ప్రక్కదళ్లపై బాదువారునై ప్రజ యంతయు నొడలు
తెలియని మహానందమున నుప్పొంగుచున్నది. ఉండదా? వారికేమి? బలహంసరాగముపై
బ్యాండుస్వరములుగల ''ధీరుఁడే రాముఁడే'' అని చక్కనికృతికిఁ బాఠాంతరమైనకృతి
లభించినప్పుడు సారంగధరుఁడు చచ్చిన నేమి? కాలురూపాయ నిచ్చి వింతచూడవచ్చిన
వారు కన్నతల్లి కంటె నెక్కువ యగుదురా? తాను గలిగించిన సంతోషమున కాతల్లి మొగమే
కలకలలాడుచున్నదే! జీవఘాతుకములగు పెద్దపులులలోనైన, నడవిపందులలోనైన, నర
మాంసభక్షకులయిన కిరాతాధములలోనయిన నాఁడుజాతికి సహజముగ నున్న యర్భకాను
రాగము కానక, కన్నయొక్క కొడుకుపై–గడియలోనో–జాములోనో–కాలుసేతులు
ఖండింపఁ బడుటచేఁ గాలధర్మ మొందవలసిన యొక్క కొడుకుపై–సర్వసద్గుణ రాశియైన
యొక్కకొడుకుపై–నవతితల్లి పన్నినకుట్రచే శిక్షను బొంది యున్నను నామెను
బల్లెత్తుపలుకైనఁ బలికియెఱుఁగని శిరీష కుసుమ కోమలతరస్వభావసంపన్నుఁడైన యొక్క
కొడుకుపై–తన తండ్రినిగాని తనసవతితల్లినిగాని దుఃఖభారమున నెప్పుడైన నేమియైనఁ
బలుకవలదు సుమా'' యని తనకు బోధించిన పరమార్థజ్ఞానచింతాఖనియైన యొక్క
కొడుకుపై–''పదుచుఁదనమున బ్రహ్మచారినై దోషశూన్యుఁడనై తల్లిదండ్రులు
బాగుగనుండఁ జచ్చిపోవుచుంటిని గదా? ఇంతకంటెఁ గావలసినదేమి?'' యని యుప్పొంగు

చున్న మహావైరాగ్య విజ్ఞానభాగధేయమైన యొక్క కొడుకుపై-నవమాసములు మోసి కాంచిన తల్లియైన రత్నాంగికి-మగనికోఁత నవతిరోఁత గలిగిన రత్నాంగికి-కొడుకును జూచుకొని సంతోషించుటకంటె వేరువేడబమే లేని రత్నాంగికి-కత్తికోఁతకంటెఁ గాలసర్పదశనఘాత కంటె గహనాగ్నికీలికాసంహతికంటెఁ గడుపుచిచ్చే భరియింపరానిదై యుండఁదగిన రత్నాంగికి-అదరు లేదు-బెదరులేదు-మొగమున దైన్యము లేదు. కంట నీటిచుక్క లేదు. గొంతుకలో బిగింపు లేదు. గుండెలో ధడలేదు. లోకసంగ్రహార్థ మేడువవలయు ననుచింతయయిన లేదు. ఏమియు లేదు. ఎంతమాత్రమును లేదు. మొద్దు! మొఱఁడు! అయ్యయ్యో! మొద్దులాగుండినను నేను నంతోషింతునే! నేను ''బళి'' యని సుతింతునే? కొడుకు దుఃఖమును భరింపలేక కొఱఁడు పాఱిపోయిన దని యొకరితోఁ జెప్పి నాలో నేననుకొని సంతుష్టిఁ జెందియుందునే! అయ్యయ్యో! ఆమాత్ర మవకాశ మయినఁ గలుగనీకుండ ముద్దులొలుకఁ బాడుచున్నదే! ముక్తాయించుచున్నదే! ఆహా యిది యెంత ప్రారబ్ధము! అంతఅతల్లు లిట్టివారయినఁ బ్రపంచ మొక్కపగటిలోఁ బ్రళయావస్థ నొందియుండునే? అంతట సారంగధరుఁ డొకకీర్తన పాడినాఁడు. దానితో మూఁడవయంకము పూర్తియయినది.

నాలుగవయంకము ప్రథమరంగమునకై తెరయెత్తఁబడఁగ సారంగధరుని మరమంచముమీదఁ బరుడఁబెట్టి యిద్దఱు తలారులు గండ్రగొడ్డళ్లతోఁ గాలుసేతులు నఱుకుచున్నారు. ఆరాజపుత్రునిదీక్ష-పరాకాష్ఠ-యేమోకాని, యట్టిభయంకరావసాననమయమందైన -నాబాలునకు-రాగ మెక్కడ సంకర మగునో, తాళ మెక్కడ ధ్వంస మగునో యను మహాందోళనమే కాని మఱియేచింతయు లేదుగదా? ఆతనిచేతులను దలారులు ఖండించుచుండఁగ నాతఁడు పాడుచున్న యెదురెత్తులయ గలపాటలోఁ దాళ మెక్కడఁ జెడిపోవునో యని కాలిమడమతో మంచపు పట్టెమీదఁ దాటించుచునేయున్నాఁడు. తాళము పోవుబాధ ప్రాణము పోవుబాధకంటె నెక్కువది కాదా? అయ బ్రహ్మమని చెప్పుటచేఁ దాళము చెడఁగొట్టిన బ్రహ్మహత్యదోషము సిద్ధింపదా? తెర తన యిష్టానుసార మప్పుడు దిగెను.

అయిదవయంకమున మీననాథుఁడు ప్రవేశించుటయు, నాతఁడు సారంగధరుని బ్రదికించుటయుఁ, దరువాతఁ గునూరునిఁ దల్లిదండ్రులతోఁ గలుపుటయు మొదలగు కథాభాగము లన్నియు నేకైకచరణధురీణములగు చిన్నచిన్న పెర్విమట్లుగలపాటతో నాంధ్రీకరణ మొందిన ట్రుమ్మీటప్పాలతోఁ బాటకు మిక్కిలి యుపయుక్తములగు వింతవింత వృత్తములతోఁ బల్లవిమార్గపుబంధుకట్లతోఁ జొకపుమార్గపుఁ గారుకమ్మచ్చులతోఁగ సాగింపులతో ముగింపఁబడినవి. నాటకప్రదర్శనము పూర్తి యగుటచే జనులు లేచిపోయిరి.

రూపకాలోకమున మనస్సు మిక్కిలి చెడుటచే శేషించిన రాత్రి బొత్తిగ నాకు నిద్రలేదు. సోదరులారా! ఇంతవింతనాటకమును జూచిన పాపము శాంతించునుగాక, పాపము శాంతించునుగాక యని లెంపలు వైచుకొంటిని. నూనదుఁడు మేఁకలగొంతుకలను బఱిబఱిఁ గోయుచుండ మనసు చెదరకుండఁ జూడవచ్చును. మాదిగవాఁడు గొడ్డలి పుచ్చుకొని గొడ్డుతలను బల్లునఁ బగులఁగొట్టి చర్మమొలిచి మాంసమును ఖండఖండములుగఁ జేయుచుండ గంటఁ దడిపెట్టకుండఁ జూడవచ్చును. కత్తులవ్రేటుతోఁ బల్లెపుఁబోటులతోఁ దుపాకిగుండ్లతో పిరంగియుపద్రవములతో మహాసంఘమరణ మొందినజనుల కళేబరములు

నెత్తుటివఱదలైఁ దేలి కొట్టుకొని పోవుచుండఁగ గుండెకొట్టుకొనకుండనైనఁ జూడవ
చ్చును. కాని యుచితజ్ఞతాశూన్యుఁడైన కవి కలముమొనతోఁ బ్రకృతికాంతను హృదయకో
శమునఁ బొడిచి చంపి చర్మమూడఁదీసి నంధులు విఱుగఁగొట్టి నరములఁ ద్రెంపి రక్తమును
ద్రావి పచ్చిమాంసపు కండలను నోటఁబెట్టుకొని నడివీథి కెక్కి తెయితక్కలాడుచుండఁ
జూడఁగ–నొడలు చావవలసినదే–కన్నులు లొట్టపడిపోవలసినదే–గుండెలు బ్రద్దలయి నీరు
కారవలసినదే–కన్నున్నవానికి, మెదడున్న వానికి హృదయమున్న వానికి నింతకంటె భయ
బీభత్సప్రదమైన దర్శన మేదియు లేదు. మన మేపూర్వజన్మపుణ్యలేశముననో మనుజులమై
పుట్టితిమే–అన్నము తినుచున్నామే–గుడ్డ కట్టుకొనుచున్నామే–పెండ్లి చేసికొనుచున్నామే
–పిల్లలఁ గనుచున్నామే–మనసులోని యూహములను మంచిచెడ్డ లెఱిఁగి వెలువరించుచున్నా
మే–వంటయింటిలోనికిఁ బోయి మనభార్యలతో నెప్పుడైన 'బీఅకాయ వేఁ గూరఁ జేయవే
–నరిగమ గ రి' ॥ బీఅ ॥ రవపులనువేసి ॥ బీఅ ॥'' అను సాయంతన పాకసామగ్రీ సందర్భ
మును సంగీతములో వెల్లడించియుంటిమా? అట్లే చేసియుండినయెడల మనయిరుగుపొరు
గువారు మనచేతులు కాళ్లుగట్టి తలలు నున్నగ గొఱిగించి నిమ్మకాయపులుసుతో రుద్ది
బెత్తముచే మోది యున్మత్తశాలలకుఁ బంపించియుండరా? అజ్ఞానస్వరూపమగు గ్రుడ్డయి
నను గడుపునొప్పి రాఁగఁ గ్యారుక్యారున నేడ్చునుగాని సరళస్వరము పాడునా? ప్రాయ్యా
యలుకుచుండఁగఁ దేలుచేఁ గుట్టఁబడిన వనిత మొఱ్ఱోమొఱ్ఱో యని యేడ్చునుగాని ముఖారి
పాడి తాండవించునా? అట్లే చేసియుండిన యెడలఁ దేలుమాట యటుంచి దయ్యపుబాధ
యని చీఁపురుగట్టలతో వీఁపు తట్టు దేరఁ జూనఁగొట్టియుండరా? కన్నకొడుకు
మరణింపఁగఁ దల్లి తలకొట్టుకొని యేడ్చియేడ్చి కొయ్యవాటిపోవలసినది కాని మొలగట్టుకొని
యుత్కంఠమునఁ బాడిపాడి ముక్తాయించితీరవలసినదా? దూడచచ్చిన యావైన దిగులు
పడి, డిల్లపడి, గడ్డిమాని, నీరు మాని, దూడను ముట్టితో స్పృశించి కంట నీరుపెట్టుకొని
తహతహచే గింజుకొని ''యంబా'' యని యఱచునే!–మన మంతకంటె నధమస్థితి
నుండవలసి వచ్చెనే!–ఎంతమహాప్రారబ్ధము పట్టినది! సాట కొఱకే మన మప్పుడప్పుడు
పాడుకొనుచున్నాము. పాడించుకొనుచున్నాము. కాని ప్రాపంచిక సర్వవ్యాపారములును
బాటలతోఁ గాక మాటలతోడనే మనము నిర్వహించుకొనుచుంటి మని మన మంద
లెఱిఁగినయంశమేకదా? ఇట్టి మన సాంసారికవ్యాపారములలో రాజకీయవ్యాపారములలో
నాముష్మిక వ్యాపారములు మొదలగు నన్ని వ్యాపారములలో మనము మనసంబంధులంద
ఱితో సంభాషించినసంభాషణకుఁ, జేసినచేతలకు, నడచినడతలకుఁ, దలఁచిన తలఁపులకుఁ
బ్రత్యక్షమైన, స్వచ్ఛమైన యాదర్శముగ నుండవలసిన నాటకములలో నీదరుపు లేమి?
ఈతాండవము లేమి? ఈపాట లేమి? ఈయాటలేమి? ఈయడుగులదన్పు లేమి? ఈమిడి
మేలము లేమి? ఆహా! మనుష్యత్వము పశుత్వమునకంటె నేడాకులు తగ్గిపోయినదే! ప్రపంచము
తలక్రిందయినదే! ప్రకృతిని మంఱఁ బెట్టిరే? ఏమి? ఎట్లు? రోగశయ్యపై రాగాలాపనములా?
ప్రభుసభామధ్యమునఁ బల్లవి దబాయింపులా? భార్యలప్రక్కలలోఁ బాతాంతరము లొందిన
జావళీలా? తండ్రిగారి దర్భశయ్యపై దానపు బజాయింపులా! కత్తి కంఠముపై ఖసిక్కునఁ
బడఁబోవుచుండఁగఁ గారువాతీఱికలా? ఓహో! ఓహో! కాళిదాసుఁడు మనదేశమునఁ
బుట్టినవాఁడేకదా! షేక్స్‌పియరు నాటకములు చదివినవారముకదా! కన్నులు పెట్టుకొని
విత్యము ప్రకృతినిఁ జూచుచున్న వారము కదా! ప్రశస్తకవులకు విరోధముగఁ–మన మిట్టు

లేల వ్రాయవలయును? చేతఁగాదందురా! పోనిండు. ప్రకృతిగొంతుక నులిమి గ్రంథమును వ్రాసి ప్రజను బాధ పెట్టనేల? నాయనలారా! కవిత్వమే చెప్పినఁగాని కాలము గడువదా? బ్రతుకుట కెన్నిసాధనములు లేవు? చేసికొనుట కెన్నిపనులు లేవు? అయినను గవిత్వమువ లన నీదినములలో జీవనము గడచునా? ఎట్లయినను నాటకకౌక్షేయకమునఁ బ్రకృతినిఁ జంపిన బ్రహ్మహత్యగూడ మనకెందులకు? ఇఁక మీరు కవిత్వమును మానుఁడు. నే నుపన్యాసమును మానెద–

వాణీదానుఁడు–మీరు చెప్పిన ధోరణినిబట్టి నాటకమున వచనమే కాని పద్యమైన నుండఁగూడనట్లు స్పష్ట మగుచున్నదికాదా?

జంఘా–కాదన్న వారెవ్వరు?

వాణీ–కాళిదాసాదులు తమనాటకములలో శ్లోకములు చేసిరి కాదా?

జంఘా–వారెందులకుఁ జేసిరో యెట్లు చేసిరో యదియంతయు ముందరియుపన్యా సములఁ జెప్పనా? విషయము బహునిపుల మగుటచేత నొక్కయుపన్యాసమున నర్వము పూర్తియగునా? నాటకశైలి యెట్లుండవలెనో, పాత్రౌచిత్య మనఁగ నేమో, యుక్తిప్రతియుక్తివై ఖరి యెటులుండవలయునో, నాటకమునఁ బద్యము లుండవచ్చునో లేదో, ఉండిన నేపద్యము లెట్లుండవచ్చునో, శుభాంతకష్టాంతనాటకముల తారతమ్య మెట్టిదో యీమొద లగు నంశము లింకఁ గ్రమముగ నాకుఁ దోఁచినట్లు మనవిచేసికొందును. ఆలస్య మైనందు లకు క్షమింపుఁడు.

5. నాటక ప్రదర్శనము

ఈ ప్రసంగం కూడా ఒకవిధంగా సారంగధర నాటక ప్రదర్శన విమర్శతోనే ప్రారంభమైంది. ఈ ప్రసంగంలో విపులంగా చర్చించిందేమిటంటే - నాటకాలలో, ఎన్ని దిక్కుమాలిన మలుపులు, మెలకువలు చూపించి అయినాసరే, నాటక కవి దానిని సుఖాంతంచేసి తీరాలా? అని ప్రశ్న. కవికే ఇంత నియమం ఎందుకు? ప్రకృతిని అనుసరించి పోవలసిన అతను భరతవాక్య మాంగళ్యంకోసం ఎందుకు ప్రాకులాడాలి?

ప్రపంచంలో మనుషుల జీవితాల నడక, వారి వారి కష్టాల కలయిక, కదలిక, ఒకలాగ వుంటూంటే - జీవితం సుఖమయంగా వుందనుకోవడం, ఉంటుందనుకోవడం ఆత్మవంచన కాదా?

అయితే - మనవారు సుఖాంత నాటకాలను రచించడంతో ఉద్దేశం ఏమై ఉంటుందీ, మనమే పూర్వం పడిన కష్టాల్ని ప్రస్తుత సుఖావస్థలో తలుచుకుంటే తాత్కాలికంగా కొంత మనస్సు కలతపడినా, వర్ణనాతీతమైన ఒక ఉత్సాహం ఔన్నత్యంతో కూడిన ఒక విచిత్రానందం మన మనస్సుల్లో మొలక వేస్తుంది.

మనకు కష్టాంత నాటకాలు లేకపోవడం లోటే - కష్టాంత నాటక దర్శనానుభవం వల్ల ప్రజలకు మనస్సులో సంతృప్తి, ప్రాపంచిక వైరాగ్యం, దైవంమీద మనస్సు మరలడం, మోక్షం సంపాదించాలనే కృషి వంటి పరమ సద్గుణాలు పుడతాయి అని - జంఘాలశాస్త్రి అభిప్రాయపడ్డాడు.

క్రిందటిసారి యుపన్యాసమున సారంగధరచరిత్ర ప్రదర్శనముఁ గూర్చి పలికితిని. కరపాదఖండనము నొందిన సారంగధరుఁడు యమసదనమునకుఁ బోవుటకు బదులుగా నాలుగవయంకమునఁ దండ్రిసదనమునకే పోయెను. ఖండింపఁబడిన కాలుసేతులు యథాస్థానముల నదుకుకొనినవి. పరలోక ప్రయాణనన్నద్ధమైన యాతని ప్రాణము దిరుగఁ జిలుకకొయ్యకు మూటదగిలించి స్థిరపడినది. చావక తప్పనివానిని జీవనీయకుండ నేల? చచ్చినవాని నిగూడఁ దిరుగ దేవతామాహాత్మ్యముల బ్రతికింప నేల? సావిత్రీసత్యవంతుల చరిత్రములో సత్యవంతుఁడు సంపూర్ణముగఁ జావలేదా? చిత్రవిచిత్ర సృష్టికర్మ కళాకలనాకోవిదుఁడగు కవిబ్రహ్మ తిరుగనాతని ముక్కున నింతయూపిరి యతనిధర్మమా యని పోయలేదా?

అల్పాయుష్యము నాతనినుదుట వ్రాసిన యా బ్రహ్మలేఖనమును బెరుమాళ్లసెట్టి పెన్సిలుతోఁ గొట్టివైచి యీభూలోకబ్రహ్మ పూర్ణాయుష్యమును గటాక్షింపలేదా? జగత్సృష్టి కర్తయగు బ్రహ్మమాట యెవరియొద్దనైన సాగును గాని గ్రంథసృష్టికర్తయగు కవిబ్రహ్మయొద్ద సాగునా? తనయిష్టమే యిష్టము! తనమాటయే మాట! తనవ్రాఁతయే వ్రాఁత! నిరాఘాటవచఃపాటవసంపన్నుఁడు. నిరంకుశ క్రియాచరణదీక్షాదక్షుఁడు. పుట్టనివారినిఁ బుట్టించును. గిట్టనివారిని గిట్టించును. గిట్టినవారిని బ్రదికించును. సృష్టిచక్రము నిట్లు సవ్యాపసవ్యములతో జోక్యము లేకుండ నిష్టానుసారముగఁ ద్రిప్పుచుండును. బ్రహ్మాదిదేవత లతనికలమునకు బదులు–తన నాటకపాత్రములలో నెవ్వరికైన నసాధ్యకష్టావసరము సిద్ధించునెడలఁ దన యిష్టానుసారముగ నేదైన నొక్కదేవతను జెవులు నులిపి ప్రత్యక్షపఱచి యానాటకపాత్ర మహాకష్టము లన్నియు మంచు విడిపోయినట్లు చేయును. యోగాభ్యాసమునకు, మహాతపస్సునకు, భక్తివిజ్ఞానములకు లొంగని దేవతలంద ఱీతని బాతుటీక కధీనులయియుందురు. ఈతని మనస్సు మిక్కిలి కనికరము గలది. నాటకాంతమున నెవ్వరిని గష్టములలో నుంచఁడు. యథోచితముగ నందఱ కేదియో యొక్క సాహాయ్య మాచరించి వారియిడుము లను గడపి మఱి రంగమునుండి పొమ్మనును గాని కష్టముల నెత్తినెత్తికొని, చింత హృదయమునఁ గట్టుకొని, కంట నీరు పెట్టుకొనిమాత్రము పొమ్మఁనడు. చరిత్రకు విరోధమని జంకఁడు. సత్యమునకు దూరమేమోయని సందేహింపఁడు. ప్రకృతినైజమునకు వ్యతిరేకమేమో యని టొంకఁడు. ప్రాపంచికవైఖరికి భిన్నమేమో యని తటపటాయించఁడు. క్రిందిభూమినిఁ బై కెగఁ ద్రోచియో, పైయాకాశమును గ్రిందికి లాగియో, మనుష్యులకు నాకాశగమన మిచ్చియో, పక్షులకు వచన రచనాపాండిత్య మిచ్చియో, పశువులకు బ్రబలధిషణాచణత్వ మిచ్చియో, కనఁబడని దేవతలఁ గానఁబఱచియో యేదియో ప్రళయోద్దండమగు నొకపన్నుగడఁ బన్ని పర్యవసానమునఁ బాత్రలకు ద్రష్టలకుఁ బరమానంద మిచ్చును. ఇచ్చి తీర్చును. అన్యథా యెన్నఁడుఁ జేయఁడు.

కవి కింతనియమ మెందులకు? ప్రకృతి ననుసరించి పోవలసిన యాతఁడు భరతవాక్య మాంగళ్యమునకై వ్రాఁకులాడ నేల? ఇది చిత్రముగనే యున్నది. అవనిలో నందఱిచరిత్రము లానందపర్యవసన్నములేనా? లోకమునఁ గన్నులు లేనివా రెందఱు! కాళ్ళు చేతులు లేనివారెందఱు! నపుంసకు లెందఱు! అల్పబుద్ధులెందఱు! పశుప్రాయు లెందఱు! భర్తలచే నిష్కారణముగ విడనాడఁబడిన వనిత లెందఱు! భార్యలు పెట్టిన విషయముచేఁ జచ్చిన భర్త లెందఱు! ధూమశకట మయోమూర్గమునుండి దొరలిపోవుటచేఁ దలలు పగిలి, కాళ్లుచేతులు తెగి, చర్మము లూడిపోయి, సంధులు విఱిగి పొడియై రక్తమున ముద్దలై నామరూపములు లేకుండునట్లు భయంకరమరణము లొందినవా రెందఱు! మహాక్షామములందు నన్నము లేక, కాయ గనరు లేక, త్రాగ మంచినీరు లేక, చింతయంబలి త్రావి, రేగడమంటిబురద ద్రావి, యదియును లేక కడుపు మాఁడిపోవ, పస్తుపడి నకనకలాడి, యస్థిపంజరములై, మహావ్యాధిపీడితులై, శవస్వరూపములఁ దాల్చి, పశువులవలె గడ్డి తినుటకయినఁ దలపడిన నదియును దొరకక "యలో" యనుచు నేడ్చి, తను రక్తమును దాము ద్రావి, తమ పచ్చిమాంసమును దాము తిని, గుండె లార్చుకొనిపోవఁ, గన్నులు లొట్టలువడఁ, గడుపులు వెన్న నంటఁ, గాళులు లటలటలాడఁ, గడుపులు నింపుకొనుటకయి కన్నబిడ్డలను గాల్చుకొని తినుటకు సిద్ధమయి దిక్కుమాలిన ప్రాణము లెంతకును బోక, "చావో చావో"

యని మూల్గిమొఱపెట్టుఁగ స్థానమునుండి నాభి చెదిరిపోవఁగ, గుండె లవిసిపోవఁగ, న్వల్ప
ముగ నేమూలనో యంటిపెట్టుకొనియున్న కానంతయూపిరియు నెగిరిపోవఁగఁ జీవ
లంటుటకయిన నవకాశము లేకుండ శుష్కకాష్ఠములై గతించినవా రెందఱు! మహాయుద్ధ
ముల నొడలు తెలియక పోరాడుచో గఱుక్కుమనియెడు కత్తివ్రేటుతో ఖసిక్కు మనియెడ
నీఁటె పోటుతో ధామ్మనెడు తుపాకిపిక్కపాటుతో నెక్కడవారక్కడనే కూలి వెంటనే
యొకపుడు ప్రాణములు పోక పడియుండ వెనుకటిపఱ్ఱలోని భటులు గుఱ్ఱపుడెక్కలతో
నినుపమడమలు గల చెప్పులతోఁ దమగుండెల పుండ్లమీఁదనో, తలబీటలమీఁదనో యెక్కి
త్రొక్కి యుద్ధము చేసి తెగఁగ వారి రక్తములు తెఱువఁబడిన వీరినోళ్లలోనో, యెత్తఁబడిన
ముక్కుక్కరంధ్రములలోనో పడి యవసానశ్వాసమైన ధారాళముగఁ బోవుట కభ్యంతరము
గల్గి కెక్కు కెక్కు మని చావఁబోవుచుండఁ బైన జీమవ్రాలఁగఁ బర్వతమంత బరువు
దోఁచునట్టి స్థితిలో గుబుక్కునఁ బైనున్నవాఁడు క్రిందఁబడఁగ నవర్ణనీయమైన బాధకు లోనై
ప్రాణములఁ బాయువా రెందఱు! మహాంభోధిప్రయాణములఁ బైనుండు భూతముల
ధూంకారముననో, లోనుండు పర్వతముల ఠాంకారముననో నావలు మునిఁగిపోవ సము
ద్రమునఁ బడి క్షారోదకము ద్రాగి మునిఁగి కెక్కు కెక్కు మనుచుఁ బైకి లేచి చేతి కేది
యందిన గ్రహింప గమకించి గొంతుకలో నూపిరి స్తంభించిపోవఁ గడుపులుబ్బ, ముక్కుకొన
నింక కొంచెమూపిరి యుండఁగనే యే మొనలియో యే పెద్ద చేపయో నడుమో కాలో
పట్టుకొని కరకర నములుచుఁ గ్రిందికి లాగుకొని పోవఁగఁ బ్రాణములు పయికిఁ బోయినవా
రెందఱు! మహామారివ్యాధి తగులఁగ మనుజహత్య చేసిన నేరగాఁడువలెఁ బట్టుకొనఁబడి
యింట్లనుండి తండ్రులనుండి తల్లులనుండి సోదరులనుండి భార్యలనుండి కన్నబిడ్డలనుండి
కరుణారహితముగ వేఱుచేయఁబడి శ్మశాననమీపమున నుండు గుడిసెలలోఁ బడవైవఁబడి
నంధి నంధి మహావ్రణబాధచే గొంతునరములు తెగిపోవునట్లు గోండ్రించుచు నష్టోత్తరశతప
ర్యంత మెగఁబ్రాకిన మహాతాపమున గొంతు నులిమిన కోడివలెఁ గొట్టుకొనుచు
నడుమనడుమఁ గొంత నివృత్తి గలిగినయప్పుడు దగ యని నంజ్ఞ చేయఁగఁ జూచువాఁడు
లేక వినునాతఁడు లేక యాదరించువాఁడు లేక యెప్పటికో వంతు ననుసరించుచు
నేబారికవాఁడో యే మాలవాఁడో పాకవెలుపలనుండియే తొంగిచూచి మాత్రలనో మందు నీసా
లనో మొగముమీద గిరవాటువేయ వ్రణములు పగిలి వఱదలుగాఁగఁ బ్రక్కనుండు వ్యాధిగ్ర
స్తుల ప్రాణప్రయాణములఁ గాంచి హృదయకోశములు పగిలిపోవఁగఁ గానంత చేయూఁత
నిచ్చుగతి లేక బాధాధికతచే మతి లేక యున్మాదకర్మానుబంధము లేక యంతకపురి కేఁగినవా
రెందఱు! ఇట్టియుపద్రవములు నిట్టి యుత్పాతములు నిట్టి యువాంతరప్రళయములు
లోకమున నెందఱు నెన్ని రీతుల నెంతదారుణముగా బాధించి బాధించి చంపుచున్నవి!
సాంసారిక నిత్యకృత్యములలో ''నమ్మా'' యని పలుకనేర్చినది మొదలు 'హరి' యని
ప్రాణములు విడుచువఱకుఁ బడుచుండు నన్ని కష్టములకు నీయుపద్రవములు కూడఁ
దోడైయుండ మనుజాలబ్రతుకు లెట్టివియో యోజించుటకయిన గుండె తాళునా? ఆహా!
ఆహా! ప్రపంచ మింత కష్టభూయిష్ఠమై యుండనేల? ఎక్కడఁ జూచినఁ గష్టమే–యెక్కడఁ
జూచినఁ జావే–సుఖమే లేనట్లున్నదే? సుఖమని మన మనుకొనినదైన సుఖాభాసమని వేదాంత
విద్యాపారగులగు మహాత్ములు, ప్రపంచ సార పరిశోధన క్రియాకుశలులగు నపరోక్షజ్ఞానులు
శిలాక్షరములుగ శాసించియుండ నిఁకఁ బ్రపంచమున బాధ తప్ప మఱియే మున్నది? ఇట్టి

బాధ నవిచ్ఛిన్నముగఁ బడుటకే పరమాత్మ మనల సృజించెనా? అతఁ డంత నిర్ద యాత్ముఁడా? కాదు. ఈ కష్టములన్నియు మనము తెచ్చుకొనినవే–మన మనుభవింపఁ దగినవే–వానిని నివారించుటకు భగవండుఁడైనఁ బ్రత్యక్షము కాఁదగినదే–

ఆ! ఆ! అదెట్లు? సుఖమునే యెల్లప్పుడు కోరుకొనునరుఁడు కష్టమును గోరుకొనునా? అది ప్రకృతి సిద్ధముఁ గాదే? కాన నట్లూహించుటకు వలనుపడదే? ఇంతకంటె విరుద్ధముండునా? ధూమశకటమును నిర్మించిన మహాధీశాలికైన నీదినమున నిన్నిగంటలకు శకటము తిరుగఁబడు ననియుఁ, దన్మూలకముగ జననాశన మగు ననియు గ్రహించుటకు బుద్ధి గలిగియుండునా? అట్లెఱుంగక యాతఁ డెక్కియుండినఁ జావఁగూడదా? ఈమర ణము బుద్ధిపూర్వకముగనే తెచ్చికొనినదా? అట్లు చచ్చిన జనులంద ఱెఱిఁగియుండియే చచ్చుచున్నారా? నావలు మునుఁగఁ జచ్చిన వారందఱు చావు నపేక్షించియే సముద్రయాన మునకు నమకట్టిరా? వ్యాధులచేఁ జచ్చినవా రందఱు మనఃపూర్వకముగనే మరణించుచు న్నారా? అయ్యయ్యో! మన మిట్లొనర్చిన నట్లు మానినఁ జత్తుమని యెఱుఁగుదుమా? స్వప్నమందైన నట్టితలంపు మనకు లేదే! అట్టిచో మన కష్టములను మనమే తెచ్చుకొంటి మని పలుకుట సమంజసముగ నున్నదా? సాహసముగ నున్నట్లు లేదా?

ఉన్నట్లే యున్నది. కాని యథార్థముగ లేదు. జీవు లనాదులు. అయినను దైవసృష్టిలో నివారు. పశువులకంటె భిన్నజ్ఞానశక్తిగలవారు. మంచి యేదో చెడ్డ యేదో–కాసుబంగార మేదియో కాకిబంగారమేదియో–గుల్ల యేదియో గట్టి యేదియో–పైతళుకేదో లోని సారమేదో –అపథ్య మేదో పథ్యమేదో–భగవత్ప్రసాదితజ్ఞానతేజో లేశమునఁ గనిపెట్టి నిరాకరణీయ మును నిరాకరించి, యవలంబనీయము నవలంబించి కృతార్థులు గాఁదగినవారు. అట్టివారు మొగము మెఱుఁగులకు మోసపోయి, రంగుతళుకునకు రంజిలి, పైబింకములే పరమార్థశా శ్వత చిహ్నము లని నమ్మి, దిగుడుబావియే యాకాశపుష్పక మని తలఁచి మఱువఁదగినదా నిని వల్లెవేసి పఠించి, పఠించవలసిన గ్రంథమును బాఱవైచి, కొఱవిదయ్యమును గృహదీప ముగ భావించి, యాంతరాకాశవాణి ననాదరించి; బుద్ధిపూర్వకముగ–సదసద్విజ్ఞాన సాహాయ్య శూన్యముగఁ దద్బోధనా వ్యతిరేకముగఁ గూడఁ దప్పులు మనము చేయునపుడు తత్ఫలము లనుభవించ నక్కఱలేదా? స్వయంకృతాపరాధసంభూత కష్టసంతతిలో మనకు భగవంతుఁడు–కవికల్పనము ననుసరించి తోడుపడి మనల నానందముగ నోలలాడ్చునా? దూలగొండిగింజలు చల్లి తులసిమొక్కలకయి కాంక్షింపఁదగునా? తండ్రినిఁ జెప్పుతీసికొని తన్నినకొడుకు దేవతల పుష్పవృష్టికయి తలయెత్తఁ దగునా? ''అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ'' మ్మని పెద్దలు పలుకలేదా? కర్మబద్ధుల మగు మన మీ జన్మమునఁ బ్రారబ్ధకర్మ మనుభవింపవలసినవారము కామా? ఈజన్మ–ప్రస్తుత కార్యస్థలమైనను బూర్వ మునకు ఫలస్థలము కాదా? జనులలో బుద్ధిమంతులకంటె బుద్ధిహీనులు ప్రబలసంఖ్యగలవా రయి యుండుటచే నత్కర్మాచరణులకంటె దుష్కృతికర్త లధికసంఖ్యగలవారని చెప్పవల యునా? కావున సుఖపర్యవసన్న జీవులకంటెఁ గష్టపర్యవసన్న జీవులే మిగుల నెక్కువ సంఖ్యగలవారని తేలుచున్నదే? అదిగాక కష్టములయినను సుఖములయినను స్వయంకృత పూర్వకర్మఫలములే కాని మనల బాధించుటకై కాని, సుఖపెట్టుటకై కాని పరాత్పరునిచే నీయఁబడనట్లుగూడఁ గొంచెము గోచరించుచున్నదా? దుష్కర్మము ప్రబలము గాఁగ దాని

దౌష్ట్యము ననుసరించియే బుద్ధి నడచును. అదియే కష్టసుఖహేతువగును.

ఇదిగాక ''పాపీచిరాయు''వనియు, ''సుకృతీగతాయు'' వనియుఁ బెద్దలు పలుకు
న్నారు ''తన్ను భజియించినవారిని దరిద్రాధములఁ జేసెద''నని నారాయణమూర్తిగ
నిరాఘాటశపథ మున్నది. ప్రబల బాధలు సహింపలేక, లేదన్నమాట వినలేక, దరిద్ర
మొగము చూచుసరికిఁ గన్నీ రాఁపుకొనలేక – యడిగినవారికి నడుగనివారికి నడిగినకం
నెక్కువగ నెంత యిచ్చిన సంతుష్టిగనక పిడికిళ్లకొలఁది, దోసిళ్ల కొలఁది ధనమును బీదలక
గ్రుమ్మరించు వితరణశీలునకు నింటిలో మృణ్మయ పాత్రలు – గోడలపయి మాన్యపువేలప
జీట్లు–పీఠిలోఁ బట్టుకొని పోవుటకు వచ్చినభటులు–అహా! ఏమివింత! లెక్కపెట్టిన
లెక్కపెట్టి సంచులకు దినమునకు ముమ్మాఱు మూతులు గట్టి భిక్షకయి వచ్చినవారి
బెదరించి కొట్టి యింటికంత కొక్కదీపమే పండువఱకు వెలుఁగఁబెట్టి కడుపునకుఁ గావల
సంత తినక గోతియొద్ద నక్కవలెఁ బెట్టయొద్ద నిద్రాశూన్యుఁడై వేచియుండి ''హరిహరీ
యనువానితో నపశకున మని దెబ్బలాడి వృద్ధులకు వృద్ధులు గట్టి యందులోఁ దప్పులెక్క
కల్పించి ధనము కూడఁబెట్టిన పరమ దౌర్భాగ్యాధమాధముని యింటిలో బంగారు పళ్ళె
ములు, గోడలకు నుచితముగ సంపాదింపఁబడిన చిత్రపటములు, వీథియరుఁగులపం
ఋణము లొసంచివచ్చి ప్రాఁకులాడుచున్న ప్రభువులు, గుఱ్ఱములు తామే మేపుకొనుపద్ధ
నా ప్రభుపులీ యుత్తమర్ణునకు విహారార్థ మిచ్చిన యాగుఱ్ఱాలబండిలో నీతఁడు స్వారి
వుచుండఁగా రాజభటులవే నాదారినే కారాగృహ నివాసమునకై దీసికొనుపోఁ బడుచుండ
వాని నీతఁడు చూచి 'పిచ్చి ముండకొడు' కని నవ్వుకొని సకిలించుటా? ఆహా! ఏమివింత
పరరాజు దుర్మార్గుఁడై ప్రజలపై దండెత్త స్వప్రజా సంరక్షణమునకయి తన దేశమున
దుష్టనిబారిఁ బడకుండఁ గాపాడుకొనుటకయి ధైవధ్యాన మొనర్చి ''సత్యమే జయించు
నను బ్రాహ్మణాశీర్వచ మొంది యుద్ధమునకుఁ బోయి శత్రునిచేఁ బట్టునడి శత్రు
గుఱ్ఱపుబండిని మూపునఁ బెట్టుకొని లాగి యతనిచేఁ జిత్రపధను సన్మార్గుడొందుటా
అతనితలను గఱ్ఱచివరం దగిలించి యూరేఁగించుచుండఁగా భేరీ నినాదములతో వేశ్యాగా
నృత్యములతో దుష్ట ప్రభుఁడు విజయోత్సవము సలుపుకొనుటా! ఏమివింత! ప్రపంచవైఖ
యట్లున్నది. దాతకుఁ గారాబంధ నివాసము! కృపణునకు రాజసన్మానము! సత్పభునకు
ఘోరమరణము! దుష్పభునకు రాష్ట్రద్వ్యయపాలనము! కృత్యములకుఁ దత్ఫలములకు
నెంత భేద మున్నదో చూడుఁడు! ఇట్టిచో నిట్టిభేదమును లేకుండఁ జేయుటకు 'కవిన్యాయ
మును' 'Poetic Justice' స్థాపించుటకుఁ గవి వీరలచరిత్రలు వ్రాయవలసి వచ్చినప్పుడ
దాతకుఁ గారాగృహపుదొడ్డిలోఁ గాసులగాజు దొరకిన ధనియో, సత్పభుని వధకాలమంద
శంకరుఁడు ప్రత్యక్ష మయ్యె ననియో చెప్పి వారిచరిత్రలు సుఖాంతముగఁ బూర్తిచేయును
పరోపకారశక్తికై తమ సర్వస్వమును గర్పూరపుటారతిగఁ జేసి తాను హరించిపోవుచున్న
దాతకుఁ గారాగృహమరణమే మహాలంకారము గాని కాసులగంగాళము కాదు. సత్పభు
మరణకాలమున శంకరునిరాకకంటె విష్ణుకింకరుల రాకయే యధిక శ్లాఘ్యము. అదిగా
యీజన్మసుఖములే సుఖములా? ఈజన్మకష్టములే కష్టములా? ఇచ్చట న్యాయమునకు
సత్యమునకు వెంటనే ఫలములు గలుగకుండినయెడల నిక నంతే! ఈజన్మ ముత్తమమై
ట్టియు, శాశ్వత సుయినట్టియు నపవర్గమునకు సాధన మనుమంటిమి కాని యింతటి తోడ
కడతేరు నని యనుకొనుచుండుట లేదే! దాతను వెక్కిరించిన కృపణునిమొగము

నీలోకమునగుజ్జాలతోcకలజాడింపులతో నెగిరిన జోరిcగల కాటులుగాని– దాతమొగమున శాశ్వతలోకమునందు దేవతాకాంతల పూలసురటులయూపులతో విరియు పారిజాతమక రంద బిందుసందోహములపాటులు కాదా? అట్టి మహానందసదవి యాతనికిc బరాత్పరుcడు శాశ్వతముగ నీయ సంకల్పించియుండ నింతలోc గవి– పాపము! తొందరపడి యాతనికిc గాసులగంగాళమును సమర్పించు టెందులకు? దానివలన ప్రయోజనమేమి? దిక్కుమాలిన సంసారపు మిడిమేలములోc జర్వితచర్వణముగ గంతులు వేయించుటకేకాక మఱియెందుల కది యక్కుఱకు వచ్చును? శాశ్వతసుఖ మొందనున్న వానికిc దుచ్ఛసుఖమీయcదగునా? వారణాసిలో సన్న్యసింపcదలcచుకొని పోవువానికి వారకాంతను బారితోషికముగ నీయవ చ్చునా? సత్పrభుcడు (పైని చెప్పినయాతcడు) ప్రాణములcబాసి కైలాసమున కేcగి నిత్యానందమున శంకరసన్నిధానమున వసియింపవలసిన పుణ్యాత్ముcడు కదా! అట్టి యాతనికిc గవి యెట్లాచరించినాcడు? ఆతనికి దేహసంబంధము వదలి పోవుటతోడనే కానcబడcదలచిన శంకరదేవుని రెండుగడియలకుc బూర్వమే కానcబఱచినాcడు. అట్లు చేయుటయేకాక, శంకరుచే నాతనికిc గైలాసగమన ప్రతిబంధమునుగూడc గలుగcజేయించి యాపాడులోకముననే యింక నిలిపినాcడు. అది యాతని కుపకార మగునో యపకార మగునో కవి యాలోచించుకొనుట కవకాశములేని సంభ్రమముతో నెటులయిన నాతని బ్రతికింపవలయు ననుపట్టుదలతో శంకరు నిప్పుడు తీసికొనిరావచ్చునా? ఆతcడెవనికైన నిట్టియవస్థలో నీదినమునcబ్రత్యక్షమయ్యెనా? దేవతల నిట్లు మనయింద్లలోని పెద్దబంట్లవలెc ద్రిప్పుట సహజమైఖరికి విరుద్ధముగ నుండునేమో యనుసంగతు లేవియు నాలోచింపక కవి యట్లొనర్చెను.

ప్రపంచము ప్రారబ్ధఫలానుభవస్థల మని యాలోచించినను, నూతన కర్మాచరణస్థల మని యాలోచించినను నది దుఃఖపూర్ణమైయున్నట్లు కనcబడుచున్నది. సుఖ మనునది యున్నయెడల నది మిగులc దక్కువగ నున్నట్లు కనcబడుచున్నది. ఇట్టి ప్రపంచనటనకు నాటకకవిత పరమార్థ ప్రతిబింబముగ నుండవలసియున్నప్పుడు సుఖాంతనాటకములకంటెc గష్టాంతనాటకము లెక్కువగ నుండవలసినట్లు కనcబడుచు న్నది. పోనిండు, అవియు నివియు నమముగనైన నుండవలసినదా! అటు లున్నవా? పోని? ఆసేతుహిమాచలపర్యంత మున్నభాషలలో నొక్కకష్టాంత నాటకమైన నున్నదా? ఏల యుండకపోవcయును? మనవా రట్టిది యుండcగూడ దనికూడ నియమ మేమైన నొన ర్చిరా? అదికూడc జేసినారు. ''మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని'' యని ప్రబంధ లక్షణమును నిర్వచించినప్పుడు ప్రకృతిలో రూపాయకు పదునాలుగణాల భాగ మును బనికిరానిదానిc గా మనవారు పరిహరించియే వైచినారు. మిగిలిన యాబేడకాను నావరణమందును ''మృచ్ఛకటికా''కారుని మొదలు నీసారంగధర చరిత్ర కారునివఱకు నందఱు గిరగిరc దిరుగుచు గుడుగుడు గుంచము లాడుచుc– బిష్టపేషణముగ వర్ణించిన ప్రకృతులనే వర్ణించుచుc–జెప్పిన వాక్యసందర్భమునే రవంత మార్చి చెప్పుచు– భాషాంతరీక రించుచు–శబ్దాభిప్రాయచౌర్యము లవలీలగ నొనర్చుచుc బ్రకృతిజ్ఞానమునc దప్ప మిగిలిన యన్నియసందర్భములలో నన్ని యవకతవకలలో నొకనితలపై నొకcడు దాcటిపోవc బ్రయత్నించుచున్నారు.

యూరోపుఖండములోని గ్రీకు లేమి? ఇంగ్లీషువారేమి? ఇంకను మఱికొందఱు జాతివారేమి? సుఖాంతనాటకములు, కష్టాంతనాటకములు కూడ వ్రాసినారు. ప్రకృతి ననుసరించి వ్రాయువారందఱుటులే వ్రాయఁ దగినదిగాఁ గనఁబడుచున్నది. కేవలము కష్టాంతరనాటకములను నిరాకరించుట హేతుసందర్భమునకు, శాస్త్రమునకు, సమాజవైఖరికిఁ బ్రపంచ ధోరణికి, నితర దేశనాటకకర్తల యాచారమునకుఁగూడ మిగుల భిన్నముగ నున్నది. ఇట్టి కట్టుబాటు మనలో మాత్రమే యేల ముఖ్యముగ నుండవలయునో స్పష్టముగ గోచరింపదు. నాటకమధ్యమున నెన్నికష్టములున్నను నాటకాంతమున నాకష్టము లన్నియుఁ గడతేఱి తీఱవలయును గదా! ఇట్లుండుటకుఁ గారణములేమో కొంత యూహింతుము. ''కష్టదశలో జనులకు భగవంతుని సాహాయ్యమేదో రూపముగఁ దప్పకుండఁ గలుగవలసినది. కష్టములు లందుచే నివారింపవలసినవి. అట్లే చెప్పకుండునెడల మనుజులకుఁ గష్టములు సహింప శక్యము గావు. భగవంతుడు ఆపద్రక్షకుఁడు. తమప్రార్థనల విని–తమదైన్యముఁ గాంచి యెటులో యొకటులు తమ్మాపదలనుండి విముక్తులఁ జేయు ననుపూర్ణవిశ్వాసము మనుజులకు నశించును. జనులిట్లు భగవత్ప్రార్థనా విముఖులయి క్రమక్రమముగ నాస్తికుల గుదురు.'' ఇది యొకకారణమని యూహింతుము. కాలమీఁదఁ గురువు క్రమక్రమముగ నెదుగవలయును. పలుకఁ బాఱ వలయును. చిదుకవలయును. క్రమముగ నారవలయును. అంతట బాధతీరవలయును. అంతేకాని యీ పుగ నెన్నిప్రార్థనములో యాతఁడు చేసినన యిన వియోగ మున్నదా? అది యథారీతిగ మానుటకుఁ దీసికొను కాలములో నొక్కదినమైనఁ దగ్గించుట కెవ్వికయిన నవకాశమున్నదా? అటులే కర్మఫల మనుభవించి తీరవలయును. అనుభవకాలములో నొక్కతృటియైనఁ దగ్గించుకొనఁగ నెన్ని యేడ్పులేడ్చినఁ దగ్గదు. తగ్గించువాఁ డెవ్వఁడు లేఁడు. పూర్ణముగ ననుభవించవలయును. ఆ యనుభవపూర్తి యయినపిమ్మట నాయాపత్తంత మందును. ఈయంశములు మనలో మహావేదాంతి మొదలు మందబుద్ధిశిఖామణి వఱకు సంపూర్ణముగఁ దెలియును. ఇట్టి యనుభవము నిత్యసంసారకృత్యముల గడియకొక్కసారి యయినఁ బ్రతిమనుజుని మన స్సునకుఁ దగులుచున్నది. తగిలి యట స్థిరముగ నిలువఁబడి మనస్తత్త్వములో నైక్యమగుచున్నది. ఐక్యమై దినదినప్రబలమై మన స్సంతయు నావరించుచున్నది. మనలో–నెంత విద్యాహీనుఁడయిన–నెంత మూఢుఁడయిన–నెంత తుచ్ఛుఁడయినఁ–గష్టములఁ బడున ప్పుడు ''నేను జేసికొనిన దేదో యనుభవించు చున్నాను. ఎంతపాప మొనర్చితినో యంతఫల మావగింజంతయయిన మిగులకుండ ననుభవించితీరవలయును.'' అను నిశ్చయాజ్ఞాన ముతో నుండును. ఈజ్ఞాన మనునది యపరోక్షజ్ఞాని మొద లాలకాఁపరివఱకే కాక యధమమైన యంత్యజాతులవారివఱకుఁ గూడ దినదినానుభవములో నున్నది. కష్టములు రాఁగా నెట్టివాఁడయినఁ దన్ను దూషించుకొనునుగాని భగవంతుఁ డీకష్టము లిచ్చినాఁ డని కాని, తా నెట్లో తెచ్చుకొన్న కష్టములు భగవంతుఁడు నివారణము చేయలేదని గాని దైవము నెన్నఁడు దూఱఁడు. అన్నము లేక యేడ్చువాఁడు ''పూర్వ మెవనికడుపు మాడ్చితినో'' యని యేడ్చును. సంతతి లేనివాఁడు ''పూర్వ మెవ్వని కొక్క కుళ్లుకాయనయిన నీయని నిర్భాగ్యుఁడనో'' యని యేడ్చును. అంతియే కాని దైవమును దూఱువాఁ డెవ్వఁడును లేఁడు. ''ఆపదలందు లొంగి పోకుండ ధైర్యమును గటాక్షింపు'' మని భగవంతుని బ్రార్థించును. అంతేకాని కష్టములు–పరిమితి ననుసరించి పడవలసిన కష్టములు–పడకతీరని కష్టములు–భగవంతుఁడు పాప లేదని ప్రార్థనావిముఖుఁడై యెన్నఁడు నుండఁడు. జనులు నాస్తికు లగుదురేమో యను భయము కూడ నెంతమాత్ర మక్కఱలేదు.

నాటకదర్శనమున నంతనమొందవలయునని విచ్చేసిన ద్రష్టలను నాటకమధ్యమున నేడ్పించి నాటకాంతమునఁగూడ నేడ్పించి యేడ్పుతో నింటికిఁ బంపించుట బాగుగ నుండ దని మనవారు సుఖాంతనాటకములే యొనర్చి యుందురా? అదికూడఁ గారణము కాదని తోఁచుచున్నది. మనమే పూర్వమునఁ బడిన కష్టములను బ్రస్తుత సుఖావస్థలోఁ దలఁచుకొనఁగఁ దాత్కాలికముగఁ గొంత మనస్సు కలఁత నొందినను వర్ణనాతీతమైన యొక యుత్సాహము-నౌన్నత్యముతోఁ గూడిన యొక విచిత్రానందానుభవము-మనమనస్సున నంకురించును. ఇతరులు పూర్వమునఁ బడిన కష్టములు మనము సుఖస్థితిలోఁ బ్రదర్శింపఁ బడఁగఁ జూడఁగ నటులే యంతకంటె నెక్కువగ నొక్కన్వల్ప చింతాచ్ఛాయావృతమగు నానందము వైరాగ్యగంధిల మగు నొకచిత్ర మనశ్శాంతి యుదయించును. ఇట్టి యనుభవము మనకు లేదు. దానికిఁ గారణము మనలోఁ గష్టాంతనాటక శూన్యతయే. ప్రాపంచిక జన సంఘార్ణశేముషీనాథుఁడని చెప్పఁబడిన Aristotle అను నాతఁడిట్లు తలఁచెనని Addison వ్రాయుచున్నాఁడు. Aristotle considers the tragedies that were written in either of these kinds and observes that these which ended unhappily had always pleased the people and carried away the prize in the public disputes of the stage from those that ended happily. Terror and commisseration leave a pleasing anguish in the mind and fix the audience in such serious composure of thought as is much more lasting and delightful than any little transit of joy and satisfaction యిదిగాక Sencea యునునాతఁ డిట్లు చెప్పునని Addison చెప్పుచున్నాఁడు. A virtuous man struggling with misfortunes is such a spectacle as gods might look upon with pleasure and such as it is when one meets within the representation of a well-written tragedy. Diversions of this kind wear out of our thoughts everything that is mean and little. They cherish and cultivate that humanity is the ornament of our nature. They soften in solace to the affliction and subdue the mind to the dispensations of Providence.

ఇట్టి యుపయోగము లున్నట్లు బుద్ధిమంతులు చెప్పుచున్నారు. అది యంత యుపయో గప్రదమైనప్పుడు-నది ప్రకృతి కెంతమాత్రము భిన్నముకాని దైనప్పుడు- నట్లాచరింపకపో వుట యేల?

ఇదిగాక ఒక కవి యిట్లు పలుకుచున్నాఁడు.

గీ. మానిసికి నున్నదేదైన లేని దగును!
లేనిదే యుండఁదగినది; లేనిదాని
కేడ్వఁదగినది యుండి లేకేడ్పులేక
లేకయేడుపె బ్రతుకగు లోకమందు

గీ. ధనమొ రాష్ట్రమొ కీర్తియొ తరుణిమణియొ
యేదొ నైబడ దని యెప్పు డేడ్వవలయు
వస్తు వెద్దానికొ బ్రతుకువాఁడె కాని
బ్రతుకుకొఱకునె బ్రతికెడువాఁడు లేఁడు.

కావున ప్రతి మనుజునకుఁ—దనకు లేనిదేదియో యుండవలయునని మహాభిలా
యుండును. అది తనకు నెంతకష్టము పడినను సిద్ధింపక పోవుటచే మనస్సు చెడియుండును
ఇట్టి స్థితియే క్రమక్రమముగ నెదిగి పురుషులకుఁ బిచ్చిక్రింద దిగును. స్త్రీలకుఁగూడ
నొకజాతి యున్మాదముగు Hysteria లోనికి సంక్రమించును. మనస్సులలో జనుల కిట్లు
చేరి బాధించుచున్న యసాధ్యవాంఛలను దొలఁగించినఁగాని వారు బాగుపడి బ్రతుకనేరరు
ఒడలిలో తాపము నావిరిస్నానమున నివారింపవచ్చును. రక్తములోని యపరిశుద్ధులను
సుగంధికషాయమున నడఁగఁజేయవచ్చును. భుజించిన కఠినపదార్థ మేదైనఁ బ్రేగులలో
జిక్కుకొని బాధించునెడల నాముదపువలన దానిని దొలఁగింపవచ్చును. కొలఁదిసేపటిక్రిం
దనే మ్రింగినవత్సనాభిని రాగిచిలుమునఁ బైకిఁద్రోసివేయవచ్చును. కాని మనస్సునఁ బ్ట్టి
బాధించుచున్న యీవిషక్రిములనెట్లు వెలువరింపవచ్చును? వానికిఁ బ్రధానచికిత్స కష్టాంత
నాటకప్రదర్శనము. మహారాజుల చక్రవర్తులు–సామాన్యజనులకు లేని యప్సరసలవంటి
యనేకస్త్రీలు, దాసదాసిజనసమూహము, గజాశ్వాదివాహనములు, పరిమితిలేని ధనము,
రాష్ట్రపాలనము మొదలగు ననేక వైభవములు గలవారయి యుందురు. చక్కనికాంత దొరకలే
దని లోలోన నేడ్చుమనుజులు మహానుందరులగు రాజ్ఞీమణులలో నొకదానిచేతఁ దమయుప
ఏటుని ప్రోత్సాహమున విషప్రయోగము చేయఁబడి చంపఁబడిన మహారాజు చరిత్రముఁ
బ్రదర్శింపఁబడఁగ జూచునెడల వారికిఁ గొంతకాంతోన్మాదము తీరిపోవును. ''చీ! ఇంతేకద!
మన కీయశ్వపాలకుఁడగు షడ్డకుఁడు లేకుంటచే మనమే యదృష్టవంతులము'' అని
బుద్ధితెచ్చుకొని నోరు మూసికొని పడియుండును. ఇటులే తమకు లేవనిమనుజు లేడ్చుగొ
ప్పవారి యన్నిగొప్పతనములు నుఖవంతుల యన్ని సౌఖ్యములు గొప్పవారికి,
సౌఖ్యవంతులకుఁ గ్లేశకారణములు మరణకారణము లయ్యే నని నాటకప్రదర్శనమున జనులు
తెలిసికొనిరేని యట్టిజ్ఞానమే వారి మనఃక్రియలకు మోదుగమాడ–

కష్టాంతనాటక దర్శనానుభవమువలన జనులకుఁ జిత్తసంతుష్టి ప్రాపంచికవైరాగ్యము,
దైవాధీనమనన్యత, మోక్షోపాయదిదృక్ష మొదలగు భవతారకసాధనములగు పరమసద్గుణసం
పత్తి యంకురించును. ఈలాభము ''భగవతపురాణమువలన రాదా? సూత్రభాష్య పారాయణ
మువలన రాదా? గీతాధ్యయనమున రాదా?'' యని యధిక్షేపింపఁబోకుఁడు. రాదని నేను
జెప్పుట లేదు. కాని మనస్సునందుఁ బరమార్థమును లగ్నముచేయించు శక్తిలో శ్రవ్యప్రబంధ
ములకంటె దృశ్యప్రబంధము లధికము లని నేను మీకుఁ జెప్పనక్కఱలేదు. పౌరాణికుని
గ్రంథమునుండి వెలువడిన శ్రీకృష్ణనామము నాటకనేపథ్యమునుండి వెలువడి శ్రీకృష్ణపాత్ర
చేసిన ప్రయోజననులో శతాంకమైనఁ జేయదు. చెవికంటె కన్నధికజ్ఞానేంద్రియము కాదా?
అందువలననే Shakespeare (షేక్స్పియర్) రచించిన యన్నినాటకములలోఁ గష్టాంతనాట
కములలో ముఖ్యమైన Lear (లియర్), Othello (ఒథెల్లో), Hamlet (హామ్లెట్),
బహుశ్లాఘాపాత్రములై యున్నవి. ఇంక నుండఁగలవు. కావున ననన్నివిధముల నట్టి నాటకము
లుత్కృష్టములు. నుఖాంతనాటకములు మంచివి కావని నే నెన్నఁడుఁ జెప్పను. వానినిమా
త్రమే వ్రాసి మిగిలినవానిని గేవలము వదలివైచుటయే కాక నింద్యము లని నిరాకరించుట
తగదు. మనవారు వానినిగూడ వ్రాసి ద్విముఖయగు ప్రకృతిని నిష్పక్షపాతముగ
రెండువైపులఁ బరామర్శింతురు గాక!

6. నాటక ప్రదర్శనము

నాటకాల్లో పాటల్ని పెట్టడం విషయంలో జంఘాలశాస్త్రికి కంపరం ఎక్కువ. ఆ భావాన్ని అతను ఎక్కడా దాచుకోడు సరికదా, కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాడు. ఆ పాటలలో విరుపులవల్ల, సాగతీతలవల్ల వచ్చే అనర్థాలకు అతను మండి పడతాడు. నాటకాలలో రస, భావాలను మంటగలిపే సంగీతమంటే, జంఘాలశాస్త్రి తనకున్న మంటను బయట పెట్టాడు. ప్రజలు–అందునా పామరులు ఈ పాటలనాటకాలపట్ల చూపించే ఆదరణ అభిమానం, వేలం వెర్రి ఎంత అర్థరహితమైనవో, ఖండించి పాశ్చాత్యగాన నాటకాల (ప్రనక్తి తెచ్చి), వాటికీ, వీటికీ తేడా చెప్పాడు. ఒక్క భక్తిరస ప్రధాన నాటకాలలో, సందర్భ శుద్ధినిబట్టి పాట ముఖ్యంగా ఉండాలిగాని, ఇతర రసాలలో మిగిలిన పాత్రలుచేత పాటలు పాడించకూడదు. నాటకరంగంమీద గానానికి ఏ మాత్రం చోటీయకూడదని జంఘాలశాస్త్రి తీర్పు.

జంఘాలశాస్త్రి యి ట్లుపన్యసించెను.

ఈనడుమ నాటకప్రదర్శనముఁగూర్చి రెండుపన్యాసము లీయఁబడినవి. వానిలో మొదటి యుపన్యాసమునఁ బాటల నాటకముల యుప్రాశస్త్యము వెల్లడి చేయఁబడినది. దానరిభాగవతములవలె, దాదినమ్మకలాపములవలె, గరిఁటెనాటకములపలె, రచ్చబల్ల గొల్లవేనపు గోలలవలెఁ బాటల నాటకములు పామరరంజకమాత్రములు, నోటనున్నధూమ చ్ఛదపుఁదూటకట్టులఁ గర్ణాలంకారములుగఁ జేసి, నెత్తినున్న చినుఁగుల గుడ్డల నెగదీఁత కప్పుఁ గల శ్రోణీమండలముక్రింద నుఖాననములుగఁ జేసి భామాకలాపపుఁబందిరి కెదురు గను బ్రక్కలను వరునలేక, క్రమము లేక, బొట్టనవ్రేళ్లపై, మడమలపై, ముంగాళ్లపైఁ, బిట్టలపై, నొంటియొంటితొడలపై, మోఁకాలిచిప్పలపైఁ గూలఁబడి తలలెత్తి నోళ్లను దెఱచుట కవకాశమున్నంతవట్టున శక్తివంచనము చేయకుండఁ దెఱచి పందిరిక్రిందఁ బండు క్రోఁతివలెఁ బండ్లగిలించుచున్న హాస్యకరుని కోరుకుళ్లాయిపై నున్న బట్టెపంగనామములు ''పెట్టినవా? కుట్టినవా?'' యను పూర్వపక్షసిద్ధాంతములు చేయుచు దీని సిగఁదఱుగను! భామవేనమింకఁ బైటఁబడ దేమిరా? యని భామాకథాకలాపాకర్ణనోత్కంఠా కుంఠతను వెల్లడించుచు–, నీనడుమ ననాహూతుఁడై యనపేక్షితుఁడై నెట్టివేసముతో వేంచేసిన వేణుగో పాలస్వామినిఁ జూచి ''అమ్మ'' ముండకొడుక! గంపెడుగుడ్డలతో గంగిరెద్దువలె నుంటి విరా! ఓరీ! నీవటరా! పట్టుసాలిదాని కూడుతిన్న బాపనపద్దన్నవా! చాలుచాలు! ఈపాటికి

నీయాట కట్టిపెట్టి చచ్చినట్లు చాపమీదఁ గూలఁబడు. కీ''మునసబు గారూ! ముండమో
నభామవేనము మూఁడుజాములకుఁ గాని రాదా యేమి?'' అని భామాశైలూషికా విరహబా
సహనతచే విసుగుకొనుచు భామావేషము తెరదాఁటివచ్చి రేగుప్తిపై ''అడుగో చంద్రుం
దయం బయ్యె'' నను దరువును దొరుకఁబుచ్చికొని పైనఁ పైనఁ బందిరియాకు లెగురునట్
పాడుచుఁ గ్రింద నేలధూళి రేఁగునటులాడఁగ వెనుకనున్న ఁచురాయిగాఁడు దడద
నాలుగడుగులు ముందునకు వైచి తన తలను సత్యభామపిట్టలపై దబాయించి యుసిదెబ్బ
మార్పుల ననుసరించి యాసాత్రాజితీదేవి నవ్యాపనవ్యశ్రోణీభాగములపై టొకాయించు
నిలకోడివలె రైలుకూఁతవలెఁ గూయుచుండ ''సెబాస్! సెబాస్!'' అనుచుఁ జెవిచు
లూడకుండ శిరఃకంపనములు చేయుచు, భామను నేత్రములచేఁ, గర్ణములచేఁ గబళించు
నెవఁడైన సందడి చేసిన ''అబ్బా! ఒక్కటేగోల! వినసీయరుగదా'' యని యంతకంటె
నెక్కువగోలఁజేయుచు ''పదపద్మములు తడఁబడసాగెనమ్మ''యను పాటకు భామ
''తోడా'' వేయఁదగిన దని యఱచుచు గాన భరత విద్యాపరీక్షానైపుణీధురీణులయి శోభి
పామరులు, మూఢులు, నాగరకతా గంధశూన్యులు, ప్రపంచజ్ఞానాభావు లీపాటలనాటకవ
లకు 'బళీ' యనఁదగినవారు! ప్రతిపదప్రస్తుతి ప్రధానప్రవీణులయి ప్రకాశింపవలసినవార
అంతియేకాని శ్రవణమందు శబ్దసౌష్ఠవ గ్రహణమున్నవాఁడు, తలయందు గుణగ్రహ
మున్నవాఁడు, హృదయమందు రసగ్రహణ మున్నవాఁడు వాని నేమాత్రము మెచ్చఁదగిన
కాదు. అవి కేవల మసందర్భతాదుర్భరములు! అనౌచితీభూయిష్ఠములు అప్రాజ్ఞతాక
ములు. అస్వభావసిద్ధములు; అవి యమ్మవారిజాతరలకో సుబ్బారాయుఁడు షష్ఠికి
పళ్లెటూళ్ళఁ బూర్వ మాడబడుచుండిన వీథిభాగవతముల కంటె నెక్కువ యని చెప్పుటక
మన సొప్పదు. అయినను వానిని వ్రాసిన కవు లేమియూహించి వ్రాసియుందురో మాక
తెలియదు. ఏదియో గొప్పయూహ ముండవలయునుగాని యూరకవ్రాసి యుందురా
నాటకములలోఁబాట లుండవలయు ననియే వారినమ్మకము. అట్లుంటయే యౌచిత
మనివారి యభిప్రాయము. అట్లు లేకపోవుటయే నింద్యమని, యసందర్భ మని, యస్వభా
మని వారినిశ్చితము. అట్లు వ్రాయనివాఁడు కవి కాఁడనియే వారినమ్మకము. అట్
మనోనిశ్చయమే యట్టియహంకారబుద్ధియే వారికి లేకుండునెడల వారిలోఁ గొందఱ
విద్యాలేశశూన్యుఁడగు కాళిదాసుడు–పాత్రౌచితీగంధా భావుఁడగు కాళిదాసుఁడు
–ప్రపంచికజ్ఞానదరిద్రుఁడగు కాళిదాసుఁడు–కవినామానర్హుఁడగు కాళిదాసుఁడు
–నామమాత్రమైనలేకుండ నశించిన కాళిదాసుడు–బుద్ధిలేక–జగదజ్ఞానాంధకారావస్థలో
–వ్రాసిన యభిజ్ఞానశాకుంతలములోని నిర్భాగ్య నిరర్థక నిస్సహజ నీరస నిర్జీవ శ్లోకములక
బేగడాది తాళాడంబరములచే రంగు, తేజము, రసము, గాత్రము, ప్రాణము, నాత్మయ
నిచ్చి, ఝంపాదితాళసంపదచే మందగమనము, ధావనము, నాట్యము, వ్యోమయానధాట
నిచ్చి యీపేరులేని నాటకమును బ్రసిద్ధసంగీతశాకుంతలములోనికి ''పిరాయించి'' పని
మాలిన వట్టి మసిబొగ్గును, మణిరాజమగు వజ్రముగఁ జేసిరా? లేదా? అయ్యయ్యో
మనుజజన్మమునకుఁ గన్నీరున్నయెడల నేడ్చుట కింతకంటె దురవస్థ ప్రపంచమున
నుండఁబోదు.

మానరా–''శివునాకు మంగళం జాయామంగళం మానరా! ఓరీ మానరా'' యని
యొకఁడు పాడినాడు. ఈగాయకుని నేను బెజవాడ నుండి నంద్యాలకుఁ బోవురైలుబండిలో

గలిసికొంటిని. ఈతఁ డేయూరియొద్ద బండిలోని కెక్కినాఁడో నే నెఱుఁగను గాని మారికాపురము కొద్ద ''మానరా'' యను నీపాట నారంభించి కంబమువఱకుఁ బాడినాఁడు. నే నాపాటను నతఁడు పాడినదీక్షకంటె నెక్కువదీక్షతో వింటిని. ఆతనిపాటలోనిహాయి నెఱిఁగి కాదు. ఆతని పాటలోని యర్థము తెలియక యింతసేపు వింటిని. ''శివునకు మంగళము మానరా'' యని మంగళపుటారతి యుండునా? అని నే ననుకొంటిని. తుద కర్థము తెలియక యూగాయకునే యడిగితిని. తనకుఁ దెలియదని యాతఁడు చెప్పెను. ఇక నేదిగతి? అతఁ డర్థముఁ జెప్పు నని కొండంత యాసపెట్టుకొంటిని. ఎటులయిన దానియర్థ మెఱుఁగవలయు నని నాకుఁ బట్టు గలిగెను. మఱి యొక కీర్తన మేదైన బాడు మని యాతని గోరితిని. పాడు మనుసరికి నాలుకవెనుకాడు స్వభావము ననుసరించి కాఁబోలు నాతఁడు తనకు మఱేదియు రాదనెను. అంతట నీయూ రేదని యడిగితిని. ''మంగళగిరి'' యని యాతఁడనెను–అంతట మంగళగిరి, పానకాలరాయుని నివాసముకదా! పానకాలరాయఁ డనఁగ నరసింహుఁడుకదా! అందుచే నీకీర్తనము నరసింహస్వామిమీఁదిదేమో యని యూహించి ''మానరసింహునకు మంగళం జయమంగళం'' అని యాకీర్తన మని నేను నిశ్చయపఱచుకొంటిని. జామున్నరసేపు తలఁ గొట్టుకొనినను మెదడుఁ జింపుకొనినను బాట పాషాణప్రాయమైయుండి డొంకతిరుగుడులతోడను, జిడిమ్రేఁతల తోడను, లక్షితలక్షణములతోడను మూఁడునాల్గు మడతలు వైచిసాగఁ దీయుటచేతను దుదకుఁ గట్టుకథవలె నీజిప్పలోని హైరాగ్లిఫిక్సువలె విడెను. కీర్తనము కీర్తనముగ నుండఁగనే యింతమాదిగమంచ మగు నప్పుడు శ్లోకము కీర్తనము గాఁగ నెంత గాడిదగత్తర యగునో శ్లోకములోని శబ్దములకు గానపాకములలో దీర్ఘ మున్న చోట హ్రస్వము, హ్రస్వ మున్న చోట దీర్ఘము దాపురింప, నదుకున్న చోట విరుపు, విరుపున్న చోట నదుకు స్తంభింప, నిలుపున్న చోట సాగుడు, సాగుడున్న చోట నిలుపు ఘనీభవింప దాళపుదబాయింపుల దారినిబట్టి శ్లోకములోఁ గొంతభాగము రెండుమూఁ డావృతులుగ జోడింపులు తిరుగుమ్రేఁతలు పడఁగ శ్లోక మంతయు సంధిసంధిని విఱిగి యెముకలు లటలటలాఁడ, జర్మము దెగి మ్రేలాడ, రక్తముగారఁ, గండలుక్రొవ్వునఁ గలిసి యూడిపడ, మ్రేఁగులు చుట్టలుగ బీభత్సస్వరూపముతోఁ బడిపోవఁ గటికవానిదాగలివలెఁ గడు హేయమై మశకమక్షికాపిపీలికా సంకులమై దుర్గంధభూయిష్ఠమై సంగీతశాకుంతల మంతయు చండాలశాకుంతలమయినదా? లేదా?

ప్రథమరూపక కవితాపీఠము బాకిపెరడుగఁ జేయుపాపము మనకేల? ఆమహాకవి లేఖనవైఖరినిబట్టి సంగీతసందర్భమే నాటకమున నుండఁ గూడ దని కనఁబడుచున్నదే! ఉన్నశ్లోకములుగూడను గానధోరణితోఁ జదువఁదగినవి కాదని యాతని యభిప్రాయ మైనట్లుల కనఁబడుచున్నదే! ఈ యంశములఁగూర్చి నాటకార్హవృత్తపరిశీలనసమయమున విపులముగఁ జెప్పెదను. 'ఆ' యను నొక్క యక్షరమున కుచ్చారణ భేదములఁబట్టి భేదార్థము లగునుగదా! అందువలన భేదరసము లుద్బోధించునుగాదా? అదియొకసారి ప్రశ్నార్థక మగును. ఒకసారి యాశ్చర్యరసము, నొకపరి తీవ్రకోపరసమును, నొక్కమాఱు కరుణరసము, నొక్కమాఱు భయానకరసము, నొక్కమాఱు సాంక్షేపణనిందాగర్భమగు హాస్యరసము నుచ్చరించు విధములఁబట్టి యుద్బోధించును. కవిహృదయమును గుర్తెఱిఁగి పాత్రౌచిత్యమును బరిగణించి, యర్థసందర్భము నవగుళించి యథోచితరసము యవబీజాగ్ర

మాత్రమైన మాఱిపోకుండఁ గంఠరవమునఁ బ్రమాదమున నపశ్రుతి, వెలితి, కంపము గలుకనీయకుండ నక్షరాభ్యాస ప్రథమదినమునఁ బలుకనేర్చుకొనిన రెండవయక్షరము నుచ్చరించుట యందే యింతభయము, ఇంతదీర్ఘాలోచనము, ఇంత జాగ్రత్త, ఇంత కొంకు పడరానియన్నిపాట్లు తలలో రేగటిమన్ను గాక మెదడున్న ప్రతిమనుజుఁడు పొందవలసినట్లు కనఁబడుచున్నదే! అట్టిచోఁ జిత్రవిచిత్రాతివిచిత్ర విరామ సమ్మేళన సంభూత సర్వవిధ శబ్దజాలమును నిర్లక్ష్యముగ, నిర్భీతిగ, నిశ్శంకముగ, నిరంకుశముగ, నిరాఘాటముగ, రాగతాళములతో లంకెవేసి రోఁకళ్ల పాటల క్రింద, నడుగులదంపులక్రిందఁ, దందనపదాల క్రిందఁ, బంబదరువుల క్రిందఁ బడఁదీసిపాడి, మడచిమడచి మఱిపాడి, చౌకచౌకముగ సాగఁదీసి పాడి, మందరశ్రుతిలో మండూకరవమునఁ బాడి, పైకాలములోఁ బరుగుపరుగునఁ బాడి, షష్ఠకాలములోఁ జావుపాటపాడి, ఓ! సంగతులలో గరగరలు, గలగలలు, జారులు, ఎగుపులు, 'హు'మ్మని మ్రింగుళ్లు, చురచురలు, నమ్మనమ్మని నములుటలు, చిత్తజల్లుగఁ గురిపించి పాడిపాడి, ముక్తాయితీర్చి, చేతులు మోదిమోది, కాళ్లుకొట్టికొట్టి, తల యూఁపియూఁపి నాటకరంగమును బాటకచ్చేరిగ నాటకసాలగఁ జేసినయెడల నింక రసమేమి? ఉచితత యేమి? యుక్తినందర్భ మేమి? పాత్రత్వ మేమి? కవి యేమి? కవిత్వ మేమి? మనుజుఁ డేమి? మమజత్వమేమి? ప్రకృతి యేమి? ప్రపంచ మేమి? ప్రారబ్ధము తప్ప మఱేమియు లేదు. ప్రపంచ కవిశిఖామణులలో బ్రహ్మజాతివఁజ్ర మెవఁడో, నాటకకా వ్యాంతరిక్షమున నుదయాస్తమయములు వృద్ధిక్షయములు మాపుమచ్చ లెఱుఁగని యమ్మ తకరుఁ డెవ్వఁడో యట్టికాళిదాసుఁడు తాను రచియించిన యభిజ్ఞానశాకుంతలమున కాంధ్ర కవు లాపాదింపఁజేసిన–యధోగతిని పెట్టిన యంతిమావస్థను–ఆబ్దికశ్రాద్ధతంత్రమును –తననిశ్శరీరాత్మతోఁ జూచునెడలఁ బాపము! ఏమనుకొనునో! నా వెఱ్ఱియేకాని యే మనుకొనుటకు నేమున్నది? ఏమనుకొన్న నేమి లాభమున్నది? అట్టి దురవస్థయే సిద్ధించిన యాధునికాంధ్రకవు లంగబలసంపన్నులయ్యు నేమనుకొనుచున్నారు? ఏమి చేయుచు న్నారు? హరిశ్చంద్రనాటకము సంగీతహరిశ్చంద్రనాటకమై సద్గ్రంథసముదాయమునుండి జారి జావళీపుస్తకాలక్రిందఁ బడినది కాదా? సారంగధరచరిత్ర సంగీతసారంగధరచరిత్రయై చచ్చియేపోయినది కాదా? సర్వరాష్ట్రమును గోలుపోయి సతీసుతులతోఁ గాశికిఁ బోయి, వారినమ్మికొని, తన్ను మాలవాని కమ్మికొని, చచ్చిన యొక్కకొడుకును శ్మశానమునఁ దగులఁ బెట్టుటకు వచ్చిన సతీమణిని దరవారితోఁ దెగనఱుకఁబూనిన హరిశ్చంద్రునిచరి త్రము సంతాపచరిత్ర మగును గాని సంగీతచరిత్ర మెట్లు కాఁగలదు? ఇంతకంటె నవాచ్యాసం దర్భాధికత యుండునా? ''సంగీతసంహమరణ''మను గ్రంథనామము తగునా? ''సంగీతశ వదహన''మను పేరుతో గ్రంథ ముండవచ్చునా?

హరిశ్చంద్రనాటకకర్తను నేనెఱుఁగుదును. ఆయన నీనడుమనే బెంగుళూరునఁ జూచితిని. ఆయన రచించిన స్వతంత్ర నాటకములలో నిది మొదటిది. వీరికి సంగీతమందభి రుచి లేదు. వీరు పాడలేరు సరేకదా! పరులు పాడిన వినరొల్లరు. గానరసగ్రహణచణశ్రవము వీరికిఁ గానరాదు. అట్టి వీరు రచించిన సత్యహరిశ్చంద్రము సరససంగీతమంజరి యయినది. ''నాటకమున సంగీత మెచ్చట నుండఁగూడ''దను నియమము వీరికున్నది. వీరియభిప్రా యమును దెలిసికొని ప్రదర్శింపవలయు నను నియమము జనులకు లేదు. సంగీత మొక్కరసమునఁ దప్ప రూపకమున మఱొక్కడ నుపయోగింపఁదగదు. ఆరసము భక్తి. ఈ భక్తి భగవంతునియందలి యనురాగము. చంచలతమమైన చిత్తము నాతనియందు

లగ్నమునేయుటకుఁ బడరానిపాటులఁ బడవలయును. ఏదియో యొక ప్రతిమను ముందుం చుకొనవలయును. దానిని దదేకదీక్షతోఁ జూడలవలయును. దానిని నమ్మకముతోఁ బూజిం పవలయును. దానికి స్నాన మొనరించి యాతీర్థము త్రావవలయును. దానికి ధూపదీపాది షోడశోపచారములు చేయవలయును. దానిని బ్రేమింపనలయును. దాఁ పిశ్లేషమును సహింప కుండ నుండవలయును. దానికి సాష్టాంగపడుచుండవలయును. దానినే సంసారతారకసాధన మని సంపూర్ణముగ నమ్మవలయును. దాని నామమును నిత్యము స్మరింపవలయును. ఇట్లు కొంతకాలము చేయఁగఁ జేయఁగఁ గంటిలో నొకవిధమైన మార్పు గలిగి యాసిగ్రహము తేజోవంతమైనదిగ, జీవవంతమైనదిగ, చలనశక్తి సంపద్వంతమైనదిగఁ గానఁబడును. కన్ను చెదరినకొలఁది మనసు దానియందు లగ్నమై యితర ప్రపంచవైముఖ్యమొందును. అంతట వెల్లివెల్లికేకలు, ప్రార్థనములతోఁ జేరిన పాటలు, పాటల కనుగుణములగు నాటలు, చిత్తావశత్వమువలన సిద్ధించును. ఇట్లు పాడిపాడి, యొడలు తెలియక యూడియూడి పరవశత్వమున భక్తుఁడు విస్మితుఁడై పడిపోవును. ఇది భక్త్యుద్రేకమున కారంభావస్థ. ఇట్లు క్రమక్రమముగ విస్మృతికాలము హెచ్చగును. ఒడలు తెలియని మనుజుఁడు తెయితెక్కలాడు స్వభావము గలవాఁడై యుండును. కాళ్లచిందు లున్నచో గాన ముండితీరవలయును. ఆటకుఁ బాటకు నత్యంతమైత్రి. అందుచే భక్తిరసమునఁ బాట ముఖ్యముగ నుండనలయును. ఈరసమునఁ దప్ప నితరరసములందు మిగిలిన పాత్రములచేతఁ బాటలు పాడింపఁ గూడదు. గానమునకు నాటకరంగమున నేమాత్రమైనఁజో టీయఁదగదు.

'ఓపరా' లని పాశ్చాత్యభాషలలో నొకవిధమగు గ్రంథము లున్నవి. ఇవి గాన ప్రధానము లైయుండును. వీనితోఁ గొంచెము హెచ్చుతగ్గుగఁ బోలియుండు నవి మనలోని యక్షగానము లు–ఇవి యిటలీ దేశపువారు పూర్వము దఱుచుగ వ్రాసియుండిరి. వాని ననుసరించియే యింగ్లాండు మొదలగు దేశములవారు గూడ తమతమ భాషలలో వానిని వ్రాసిరి. వీనికిఁ బ్రధానమగునది గానము. ఇట్టి గ్రంథప్రదర్శనములఁ గూర్చి Addison (అడ్డిసన్) హేళనముగ, "It is laid down as an established rule which is received as such to this day that nothing is capable of beaing well set to music that is not nonsense" అని వ్రాసినాఁడు. ఇప్పటి మనదేశపుఁ బాటల నాటకములే ఆ 'ఓపరా' లవంటి వనియు, వానిలోఁ బదము లుండునట్లు వీనిలోఁ గూడ నుండవచ్చు ననియు, వానిని జను లాదరించినట్లు వీనినాదరింపఁదగు ననియుఁ బాటలనాటకము లొనర్చుకవు లనవచ్చును. అట్లనుట సమంజసము కాదు. వీరి నాటకములు దశరూపకములలోఁ జేరినవి. యక్షగాన ములు గావు. యక్షగానములు కేవలగానములు. అవి దశరూపకములలోనివి కావు. దశరూపక ములనునవి గానకాలక్షేపగ్రంథములు గావు. బాహ్యాంతర ప్రకృతిచిత్రపటలుము. Addission (అడ్డిసన్) తిరుగ నాటకస్థ గానార్థతనుగూర్చి యిట్లు పలుకుచున్నాఁడు.

"If the Italians have a genius for music above the English the English have a genius for other performances of a much higher nature, and capable of giving the mind a much nobler entertainment. Would one think it possible (at a time when an author lived that was able to write the Phaedra and Hippolitus) for a people to be so stupidly fond of the Italian opera as scarce to give a third

day's hearing to that admirable tragedy? Music is certainly a very agreeable entertainment but it would take the entire possission of our ears; if it would make us incapable of hearing sense if it would exicte arts that have a much greater tendency to the refinement of human nature, I must confess I would allow it no better quarter than Plato has done who banishes it out of his common wealth.

ప్రకృతి ప్రతిఫలములై, ప్రౌఢస్థ పరిపూర్ణములై, ప్రదర్శనైకార్హములై ప్రజ్ఞాదాయకములయిన యథార్థనాటకములను బాటలు లేని కారణమునఁ జూచుటకు మాని సర్వవిధములందదన్యతిరేకములగు పాటలనాటకములను జనులు మౌఢ్యమునఁ జూచుటవలన మననునకుఁ వెగటుచే Addison (అడ్డిసన్) ఇట్లు వ్రాయుటకుఁ గారణమైనది. ఇట్టి నన్నివేశమునకు మనదేశమున గురుఁడిప్పుడేకాదశమందున్నాఁడు. ద్వాదశజన్మములకు వచ్చినప్పుడు గాని జనుల కీతిక్క తగ్గదు. సోదరులారా! నాటకములందు వృత్తము లుండఁదగ దను నంశమును గూర్చి యీరాత్రి యుపన్యసింప నుద్దేశించితిని. కాని తదంశమునుగూర్చి కానంతయుఁ జెప్పఁజాలనైతిని. పాటలనాటకములమాట ప్రస్తావవశమున రాఁగానే చిత్తము, జిహ్వయుఁ గూడ నదేధోరణిని బోయినవి. వానిని గూర్చి యెంత చెప్పిన నింకఁ జెప్పఁదగియేయున్నది. కాని యింక వానిని గూర్చి చెప్పి మీకు సాధ్యమైనంతవఱకు శ్రమ మీయను. విధిలేక ముందెప్పుడైనఁ జెప్పవలసియుండి చెప్పునెడల మన్నింతురుగాక! ఈసారి వృత్తనాటకములఁ గూర్చి చెప్పుట కవకాశము లేదు. కావున ముందెప్పుడైనఁ జెప్పెదను.

''జిహ్వ మనకు వశమైయుండవలయును గాని మనము జిహ్వకు వశులమై యుండఁగూడదు. అశ్వవశుఁడై యుండు నాశ్వికుని యవస్థ నడుగవలయునా?'' యని వాణీదానుఁడు సణుగుకొనుచు సభ విడిచి పోయెను.

7. నాటకీయ పద్యరచన

నాటకాలలో పద్యాలు ఉండనవసరం లేదని వాదించడానికి జంఘాల శాస్త్రి ప్రారంభించాడు. ఛందస్సులలో మరీ ముఖ్యంగా పద్యచ్ఛందస్సులలో అనంతంగా, ప్రస్తరించే కొద్దీ రాగాలకి మళ్లేనే అవికూడా పుట్టుకొస్తూం టాయి. వీటిలో కొన్ని 'తాళ' ప్రయత్నాలకు కూడా లొంగినవైతే, కొన్ని కేవలం రాగానికి అవకాశం వున్నవి. అంటే ఈ వృత్తాలలో గాయకుడు రాగాలు మార్చగలడుగాని, తాళం మార్చలేడు. జంఘాల శాస్త్రి ఫిర్యాదు ఏమంటే - నాటక కర్తలలో కొందరు పాటలకు బదులు విచిత్ర వృత్తాలు ఉపయోగిస్తున్నారని. ఇలా ఎందుకు చేస్తున్నారంటే, నాటకాలలో పాటలు ప్రకృతి విధానానికి విరుద్ధమని గ్రహించారని శాస్త్రి అంటాడు. అయితే ఇలాంటి వారి నాటకాలు పాటల నాటకాల కంటె వేరైనవి కావంటాడు. వీరు ప్రచ్ఛన్న సంగీత నాటక కర్తలంటాడు. ఇందుకు జంఘాలశాస్త్రి విచిత్ర వృత్తాల ఉదాహరణలిస్తాడు. పద్యాలు నాటక రస ఆవిష్కారానికి ఎలా అడ్డు తగులుతాయో చెప్పి చెప్పి, హేళనచేసి చేసి, ఛందస్సు ఉండికూడా నాటక రచనలో అన్ని విధాలా ఉపయోగించ దగిన పద్యం తేటగీతి అని జంఘాలశాస్త్రి తేల్చి, దానికిగల కారణాలుకూడా వివరించాడు. అలాగే సీసపద్యాన్ని, ఆటవెలదిని కూడా వాడుకో వచ్చునని ఆమోదించాడు. మొత్తంమీద మేకు బందీగా నియమిత గణాల క్రమం లేకుండా, ''వచనగుణం'' వున్న పద్యాలకు మాత్రమే జంఘాలశాస్త్రి ఓటు వేస్తున్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాటకములో వృత్తము లనర్హము లని యీరాత్రి చెప్పఁదలఁచితిని. వృత్తము లనంత ములు. రాగములవలెఁ బ్రస్తరించినకొలఁది బయటఁ బడును. వీనిలోఁ దఱచుగ వాడుకలో నివి కొన్ని యున్నవి. అవి చంపకోత్పలమాలాది వృత్తములు. బొత్తుగ వాడుకలో లేనివి ప్రహరణకలిత లాటీవిటాది వృత్తములు. ఇప్పటికి లక్షణగ్రంథముల వ్రాయఁబడియున్న వృత్తములనే యంద ఉపయోగించుట లేదు. ఇవి చాలక యీసంఖ్య మనస్సునకు నచ్చక వీని వింత నడకల భేదములు శ్రవణమునకు సంతుష్టి నీయకపోవుటచేతఁ గొందఱు కవిబ్రహ్మలు వృత్తసృష్టి నారంభించినారు సీసమునకు బంగార మనియు బంగారమునకుఁ బాతాంతరముగ వెండియనియు, వెండికిఁ దిరుగఁ దగరమనియు సృష్టిప్రతిసృష్టిని వీ

రాచరించుచుండ హైదరాబాదునబాబుగా రనేకసంఘములను బెంచుచుండ ''సాటికి సాహేబు గడ్డము పెంచినట్లు'' మాయూర నున్న మంగలికపి కందమునకుఁ బెండలమనియు, సుగంధికి దుర్గంధి యనియు, విద్యున్మాలకు విద్యున్మాదిగ యనియు నూతనవృత్తములు కల్పించుటయేకాక, ఖడ్గబంధమునకుఁ బ్రతిపక్షముగాఁ దంటసపుబంధ మొకటి చేపట్టి యిప్పుడు కవితానూపురరవముతో ''టంగు టంగు'' మని పనిచేయుచున్నాఁడు. కర్ణపేయములై మనోహరములైన వృత్తభేదము లన్నియుఁ బూర్వులే ప్రస్తరించి నిర్మించియున్నారు. ఇంకఁ బ్రస్తరింపఁ బ్రయత్నించుట పనికి మాలినపని. ఈ వింతవింత వృత్తములన్నియుఁ జిత్రవిచిత్రగమనభేదములు కలవి. వాని నడకలు టక్కు-టక్కు మని తాళమునకు నరిపోవును. గానోపయోగంబులయిన దరువులు మొదలగునవి తాళబద్ధములై యెట్లు హృదయరంజకములుగ నుండునో యీ వృత్తములుకూడా నట్లే యుండును. కేవలరాగాలాపములోఁ దాళ మావశ్యకము లేదు. రాగమైనను చౌకకాలమునఁ బాడఁబడునప్పుడు లయ నాసించియే యుండును. కావున లయయుక్తమగు వర్ణసన్నిపాత మంతయు గానమే. కావున వృత్తము లొకజాతి దరువులు. పల్లవి, యనుపల్లవి లేని పదములు. గాయకుని యిష్టానుసారముగ రాగమును మార్చి పాడుట కర్హములయిన కీర్తనములు. ఈ వృత్తముల గానమందు రాగముమాత్రమే గాయకుఁడు మార్పఁగలఁడు. కాని వృత్తముతోఁ బుట్టినట్టియు, వృత్తజీవమునకు జీవమైనట్టియుఁ దాళమును మాత్రము మార్పలేఁడు. అట్లు మార్చినయెడల వృత్తమే ధ్వంస మగును. పాటలకు వేయఁబడియుండు రాగతాళములను గాయకుఁడు మార్చి పాడవచ్చును. పాడఁగలఁడు. అందువలనఁబాట చెడిపోదు. వేరుమట్టు వేసికొని పాట చెడకుండఁ బాడఁగలఁడు.ఒకప్పుడు క్రొత్త మట్టువలననే పాటకు మఱింత శోభ రావచ్చును. కాని యిట్టి స్వేచ్ఛను వృత్తములయెడలఁ దాళవిషయమై తీసికొనఁజాలఁడు. అందుచేఁ దాళపుబందుకట్టులోఁ బాటలకంటె వృత్తములే ప్రబలము లయినట్లు కానిపించుచున్నవి.

నాటకకర్తలగు కొందఱు కవులు పాటలకుఁ బ్రతినిధులుగఁ దమనాటకములలో విచిత్రవృత్తముల నుపయోగపఱచుచున్నారు. నాటకములలోఁ బాట లుంచవలయు ననియే వీరి కుతూహలము. పాటల కున్నంతరంగు, రక్తి, థవర, డాబు, సభావశీకరణశక్తి, సర్వరస విజృంభణదక్షత వృత్తములకు లేవనియే వీరి పరిపూర్ణ నిశ్చయము. నాటక రచనాకాలమందంతయుఁ బాపము! పాట లుంచమైతి మనియే వీరిప్రాణములు పరితపించుచుండును. పాటలయందింత ప్రీతి యున్నను వానికై యింత బాధపడుచున్నను, వానిని మాత్రము తమ నాటకముల నుపయోగపఱచుటకు సాహసించరు. ఏలన? నాటకములఁ బాటలు కేవలము ప్రకృతి వైఖరీవిరోధము లని వారెఱుఁగుదురు. ప్రకృతి విరుద్ధాంశ ప్రతిపాదకములగు ప్రబంధము లతిశీఘ్రకాలములోఁ బరమపదించు నని వీ రెఱుంగుదురు. వారి గ్రంథములు వారికనులయెదుటనే కాలధర్మ మొందుట వారి కిష్టముండునా? గ్రంథచిరజీవత్వము నపేక్షించి పాటలను వారు బహిష్కరించిరి. కాని పాటలనాటకముల కుండు ప్రాముఖ్యము, ప్రజారంజనశక్తి, తద్గ్రంథకర్తలకుఁ గల ధనాగమము, జనగౌరవము చూచునరికి వారి కొడలు నీరు విడుచుచున్నది. ''కాలానుగుణ్యముగఁ బాటలనాటకములు వ్రాసి ఘనులు ధను లనిపించుకొనుట మంచిదా? అవి లేని నాటకములు వ్రాసి యనామకులు పదుగ్గురము లనిపించుకొనుట మంచిదా?'' యను పూర్వపక్షసిద్ధాంతములకు వా రుపక్రమిం

చిరి. ''పాటలరుచి యెల్లకాలము ప్రజలకుండునని యేమి నమ్మకము? వారి కది తగ్గినపిమ్మట మన గ్రంథము లేమికావలసినది? పాటలరుచి యున్నంతకాలమే సంపాదించిన ధనముతో మాన్యములు గొన్నయెడలఁ , బాటలరుచి పోయిననైనను మాన్యములు పోవునా? అయ్యయ్యో! స్థిరముగ నిలువవలసినవి భూములా? పుస్తకములా? పుస్తకములు పస్తుపెట్టున ప్పుడు వానిముద్దేమి ముక్కలయ్యెను? చచ్చిన తరువాత బ్రదికియుందు మని యెంగిలిలంఘ నములతో నెండియెండి బ్రదుకును బరిసమాప్తి నొందించుకొనుట ప్రతిభకు లక్షణమా? అయ్యయ్యో? ఇది యేమివెఱ్ఱి! కావలసిన దుదరపూర్తియా? స్థిరకీర్తియా? మన పాటలనాటక ముల పత్రములు పకోడీల పొట్లములక్రింద నుపయోగపడుచుండ, గాలిపటముల చిల్లుల కదుకుల క్రింద వినియోగపడుచుండ, మహతాబుల గుల్లలై మండుచుండ వల్లకాటికడుపు నిండిన లాభ మేమి? మండిన నంతకంటె మంచిది కాదా?'' యనియు నింకేమేమో యనియుఁ దమలోఁ దాము వితర్కించుకొనుచుఁ బ్రతిహతమయినదానిని దిరుగఁ బ్రసా దించుచుఁ బ్రతిపాదిత మగుదానిని బ్రతిహతము సేయుచు గుబ్బెటలుపడుచు గుంజుకొ నుచు రెండు తలల పామువలె వెనుకకు ముందునకుఁ బ్రాఁకులాడుచు సవ్యాపసవ్యపరిశీల నము సేయుచుఁ గ్రిందుమీఁదులఁ జూచుచు మ్రింగను లేక క్రక్కను లేక యుక్కిరిబిక్కిరి యగునవస్థలోఁ జిక్కుకొనిరి. కాని వారు మిగుల నేర్పరులు. సమయానుగుణవర్తనస్ఫూ ర్తులు! ప్రపంచజ్ఞానయుక్తులు! ఉభయతోముఖపాండితీమండితులు! దూరదృష్టినహితులు! కావుననే వారిట్టి సందిగ్ధావస్థలో విశేషకాల ముండక యుభయతారకముగ నుత్క్రమించిరి. ప్రకృతి వ్యతిరేకములగు ''పాటలనాటకములవలనఁ దాత్కాలిక ధనగౌరవములు కావల యునా? పాటలు త్రోచివైచి ప్రకృతి నవలంబించి వ్రాసిన నాటకములవలని స్థిరయశస్సంప దలు కావలయునా?'' యని రెండు ప్రశ్నము లుండెను. అది యున్నదాని కిది లేదు. ఇది యున్న దాని కది లేదు. ఈ ద్వంద్వములసంధిని వారు గొంతసేపు రాద్ధాంత పూర్వపక్షము లాచరించుకొని ''వానిని వదలము, దీనిని వదల''మని ''యారెంటినిగూడఁ బట్టుకొందు'' మని నిశ్చయపఱచుకొనిరి. ''అబ్బాయీ! అమ్మమ్మయొద్ద నడుకులు తిందువా? నాయొద్ద మినుపరొట్టె తిందువా'' యని యడుగుతల్లికి 'నంతయాలోచన మక్కఱ లేదు. 'రెండునుగూడఁ దిందునమ్మా' యని పలుకు బాలుని జూచి బళి యనఁ దగినది కాదా? వాఁడు తరువాతఁ దిండిపోతుగానీ! మిండఁడు కానీ! దుండఁగీఁడు కానీ! పండితుఁడు కానీ! అప్పటి సన్నివేశమును టొంకకుండ నెదుర్కొనినాఁడు. అటులే మన నాటకకర్త లాచరించినందుల కానందింప వలసినది. పాటలకుఁ బ్రతినిధులుగఁ జిత్రరూపవృ త్తముల నుపయోగించి యొక్కవ్రేటుతో రెండుతలలు పగులఁగొట్టినారు. గాన తాళయుక్త ములగు వృత్తములకుఁ బాటలకు భేద మేమున్నది? అయిన నవిపాటలా? కావు. ఒక వేళ నా వృత్తములను నటకులు వృత్తవైఖరిచేఁ జదివెదరేమో? అట్లే చేసినయెడల పాటలనాటక ముల కున్నంత పరిషద్గౌరవము తమనాటకముల కుండదేమో యను భీతిచే వృత్తములపైఁ జిన్నపువ్వులు వైచి యట్టి పువ్వులనే యావృత్తము లున్న పత్రముక్రింద వైచి, ''ఈవృత్తముల నిష్టానుసారముగ నటకులు పాటలుగఁ బాడుకొనినఁ బాడుకొనవచ్చును. అందులకు మా ప్రోత్సాహ మేమియు లేదు'' అని యాపుష్పమునకు వ్యాఖ్యాన మొనర్చిరి. ఆహా! ఎంత గడుసుఁదనము గలవారో! వచననాటకములో, వానివంటివో వ్రాసినకవులు వట్టి తెలివి తక్కువ వారనియు, వారికిఁ బ్రజారంజనకవితాశక్తి లేదనియు, నందుచే వారి వచన

పరంపరలనడుమను గొన్ని పాఠ్యమట్లతోఁ బదములో, బ్యాండు స్వరముతోడి కృతులో యదికించి నటకులు కవులయుత్తమగతులకై వారి గ్రంథములను గానరసబంధురములుగఁ జేయుచుండ వింతరూప రూపవృత్తములను వారు పాటలుగఁ బాడ మాని యైదరా? ఏడ్చుటకుఁ గారణము లేనప్పుడు కారణమును దేనినో కల్పించుకొని యేడ్చు రోదన ప్రియుఁడు స్వల్పకారణము గలిగినప్పుడు మానినైమునా? మన నాటకకర్తలు వారి వృత్తములను నటకులు పాటలుగఁ బాడవలయు నని యే కోరిక గలవారు, పాడుదు రనికూడ నెఱుఁగనే యెఱుంగుదురు. కాని 'పాడు'మని వారికిఁ దాము చెప్పఁ దగదు. చెప్పిన ట్లుండఁ గూడదు. పైగ ''మీయిష్టానుసార మాచరించుకోవచ్చును గాన మేము ప్రోత్సహించువారము కా'' మని ఖండితముగ నిరాఘాటముగఁ బల్కుచు వారికిఁ బాటలపై నుండు ననిష్టతను వెల్లడించినారు. వారి ప్రయోజకత యెంత ప్రకాశించుచున్నదో! వారు పాటలు వేయను –లేదు. వేయకపోను–లేదు. నైచి తాత్కాలిక లాభమును బొందుచున్నారు. నైవక స్వభావాను సారముగనే నాటకములు వ్రాసి రనుఖ్యాతిని బొందుచున్నారు. చిలుకను, బిల్లిని నొకపంజ రమునఁ బెంచుచున్నారు. ఉభయకవితాధురీణులును ఐహికము నాముష్మికముతోనంటఁ గట్టుచున్నారు.

కాని వారి నాటకములు పాటల నాటకములకంటె భిన్నములు కావు. పాటల నాటకముల కెట్టి యాక్షేపణము లిదివఱకుఁ జెప్పఁబడియుండెనో యవియన్నియు వీనికిఁ గూడ నమోఘముగ వర్తించును. వారు ప్రచ్ఛన్న సంగీతనాటకకర్తలు! వీరు ప్రత్యక్ష సంగీత నాటకకర్తలు! ఇది యే భేదము. ప్రకృతి కాంతామారణమున వీరిద్దఱు సమానదీక్షాదక్షులే! సమానపాండితీబంధురులే! కాని ప్రచ్ఛన్నసంగీత నాటకకర్త కృత్రిమఁ డగుటచేఁ గొంతపి ఱికివాఁ డగుటచేఁ గొఁగిటిలో లాలించినట్లు నటించి యామెను గొంతుముడి కొఱకి చంపినాఁడు. ప్రత్యక్ష సంగీతనాటకకర్త ధారాళాంతఃకరణముగలవాఁడు, నిర్భయస్వభావము గలవాఁడగుటచే నెదురుగఁ బోయి తాళపుజిప్పలతో బ్రహ్మరంధ్రస్థానమునఁ గొట్టిచం పినాఁడు. ''ప్రకృతిని జంపితివా?'' యని పాటలనాటకము లొనర్చినవారి నెవఁడైన నడుగ ''నౌమ నేను జంపితిని. అది బ్రతికియుండినయెడలఁ గవికి స్వేచ్ఛగ నుండదు.'' అని బహిరంగముగ నాతఁ డొప్పుకొనును. ప్రచ్ఛన్న సంగీతనాటకకర్త నీప్రశ్న మెవ్వఁడైన నడుగ ''అయ్యయ్యో! నే నేమి యెఱుఁగుదును? నేను బ్రకృతిని బూజించువాఁడను. దానికనుసన్న మెలఁగువాఁడను. దాని యిష్టము ననునరించి మాటలాడువాఁడను. దాని యాన కెందునుభి న్నముగఁ బోవువాఁడనుగాను. నే నేమిటి? దానిని జంపుట యేమిటి?'' యని ప్రత్యుత్తరము చెప్పును. నీ ప్రబంధమునఁ బ్రకృతి ప్రాణహీనమై పడిపోయియుండుటకుఁ గారణ మేమని యాతని నడుగ ''నా కేమి తెలియును? నటకు లెవ్వరయిన దానిని బలాత్కారముగఁ జంపి నాకొంపఁ దీసిరికాఁబోలు! మొదటినుండియుఁ బాటలు వలదని నే నేడ్చుచునేయు న్నాను. నిక్షేపమువంటి నావృత్తములను దిక్కుమాలిన పాటలుగ మార్చుట నాకిష్టము లేదని నేను స్పష్టముగ ఘోషింపనే ఘోషించినాను. నామాట వినకుండ, నాయభిప్రాయమును గణింపకుండ, నాపరువును లక్ష్యపెట్టకుండ, నాకవితానహజతామంజులతను మన్నింప కుండ, నాపాత్రౌచిత్యసంపత్తిని బరామర్శింపకుండ, నాయుక్తి ప్రతియుక్తి సంభాషణముల నంభావింపకుండ, నా రసవిజృంభణపాటవమును బాటింపకుండఁ బుష్పగుచ్ఛములవంటి నావృత్తముల నన్నిటిని బలాత్కారమునఁ బడఁదీసి పంబదరువులక్రింద, భాగవతపుఁ బాటల

క్రిందఁ బనికిమాలిన జావళీలక్రింద మార్చి గానరసాస్వాదనోన్మాదమున నొడలు తెలియక తెయితక్క లాడియాడి యానిర్భాగ్యపునటకులు నా నాటకమునకు సంజీవినియగు ప్రకృతిని వెల్లోవెల్లచిందులాటలోఁ గాళ్లక్రిందఁ బడనైచి త్రొక్కిచంపిరి కాఁబోలు!'' నని గుండెలు నిమ్మళముగఁ గొట్టుకొనుచుఁ గూనురాగము లాలపించును. నటకులయొద్ద కెవఁడయినఁ బోయి ''మీరేల పాటలీనాటకమునననుంచితి?'' రని యడుగ మే మించిన దేమున్నది? దానిలోని వృత్తములకే మట్లు వైచి పాడితిమి. ''వానిని నటకునిష్టానుసారముగఁ బాడుకొన వచ్చు''నని యాయన తనంత తాను బాహాటముగ సర్వనటకుల కనుజ్ఞ నిచ్చియుండ మాదోషమేమి? మేమెవతెనో చంపితిమా? అది యెవతెయో మే మెఱుఁగుదుమా? ఆమె పేరైన మే మెన్నఁడైన వినియుంటిమా? అయినను మా కొకరినిఁ జంపవలసినంత యావశ్యకత యేమున్నది? ఈనడుమ బల మెఱుఁగని ప్రాఁత కత్తులతో యుద్ధములొనర్చి చట్టలు తెగి పిక్కలు తెగి చావునకు మేమే సిద్ధమైయుండ మే మొకరిని జంపుట యేమి?'' యని వారు పలికిరి. ప్రకృతి మాత్రము చచ్చినది. నాటకకర్త లేమియు నెఱుఁగరు. నటకు లేమియు నెఱుఁగరు. ''ఆ! ఆ! నేను వేదాంతుఁడను; అస్మరణమైనఁ బనికిరాదు. ఆ! ఆ! నేను వేదాంతుఁడను. ఆ స్వప్నమైనఁ బనికిరాదని యెవరిమట్టునకు వారే యనుచుంటిరి కదా! మీ రందఱు వేదాంతు లగుపక్షమున యోగినిగారి వేవిళ్లకుఁ గారణ మేమిటి? ''వీరి నాటకములలోని వింత వృత్తములను బాటలుగఁ బాడుటచేతనే యీ యాపత్తు దాపురింప లేదు. వానిని బాటలుగ మార్చకుండనే వానిని యథోచితములగు నడకల ననుసరించి రాగవిహీనముగ వానిని జదివిననైనను నీయాపదయే సిద్ధమగును. ఏల యన? వానికిఁ దాళము జన్మసిద్ధమైయున్నది. తాళము తోడనే తాండవ ముద్భవింపక తప్పదు. తాళవాసన తగులఁగనే పాత్రౌచిత్యము భగ్న మగును. రసము ధ్వంస మగును. ఔన్నత్య మడుగంటును. సహజత్వము చచ్చును. రామరావణకదనప్రదేశమునో దుష్యంతశకుంతలా సమావేశ నమంచితతాపసాశ్రమవనవాటినో యథోచితవస్తుసన్నివేశముఁ బ్రదర్శించునాటకరంగ మంతయుఁ గోరలమ్మగుడిముంగిలియో కల్లుపాకయో యగును. ఎట్లన–రామరావణులను యుద్ధరంగమునఁ గవి దారసింపఁ జేసినాఁడు. వారిచే నిట్లు సంభాషింపఁజేయుచున్నాఁడు.

రావ–అరే! దురాన నిల్వ నిన్ను నంత మొందఁజేసెదన్
రామ–బిరాన రార! చంపువాఁడ! ప్రేలు టేల? మానరా

పంచచామర సంబంధమగు నడక యిటు టక్కుటక్కుమనుచుండ నీఁవారవరులు నేలఁ ద్రొక్కిత్రొక్కియాడుదురా? లేదా? శౌర్య రసావతారమగు రావణాసురుఁ డట్టిన మయమున దశవదనములు జేవురింపఁ గనులవెంట సౌదామినులు వెల్లివిరియ శౌర్యరసగుంఫనములగు నర్ఘ్యాక్యము లాడవలయునా? అట్లి యట్లి యెగురులాడ వలయునా? ఛీ! భగవదవతారమగు శ్రీరామచంద్రమూర్తి యా నమయమున నపరాధయుక్తుఁడగు రావణుని జూచి వాని దౌష్ట్యమునకు స్వల్పమైనకోపము లోనఁ గల్గియున్నను వాని యజ్ఞానమునకుఁ జింతించిన వాఁడై యాషత్కోపచింతాసమ్మేళన నమంచితములగు వాక్యము లాడవలయునా? ఏకతాళమున కనుగుణముగఁ దైతక్కలాడవలయునా? థూ! ఈరణశూరుల వీరాలావపు వెఱ్ఱివృత్తములు కోరలమ్మగుడియెదుట వేఁపమండగల యెడమచేయి నిలువుగఁ బైకెత్తి కుడిచేతినిఁ బిఱ్ఱపై నిలిపి యొంటికాలి భరతమాడుచు శివశక్తులు పాడు

''అమ్మవారి మాట లన్ని యాలకించినారె! హా!
మిమ్ము నమలి లొట్టవేసి మ్రింగు మ్రింగు హా!''

యను పాటకంటె నెట్లు భిన్నములు? ఆ రణశూరు లీశివశక్తుల కంటె నే
యర్హతను గనఁబఱచిరి? రామరావణయుద్ధరంగ మిట్లు కోరలమ్మగుడిముంగిలి యైనద
ఇక మఱియొకనాటకమున దుష్యంతుడు, శకుంతలయుఁ బ్రవేశించిరి. వారిట్లు సంభా
చుకొనుచుండిరి.

రుగ్మతీవృత్తము.

శకుం–ఆమునిచంద్రుం డక్కడ నుండెన్ !
నామది నిన్నున్ నమ్మచునుండెన్.
దుష్యన్–కామిని! నాకున్ గౌరవ మొప్పం
గామము దీఱన్ గొఁగిలియీవే!

తాళ సంప్రదాయానుసారముగ శకుంతల తాండవించుచుఁ బలుక మగవాఁడు కావ
నంతకంటె నెక్కువ బింకముగఁ దాండవించుచు దుష్యంతుడు శృంగారరసచేష్టాపరవశుఁ
శకుంతలమీఁదఁ బడఁబోవుట చూడఁగ నొక్కఁడు ముక్కుచివఱకుఁ జెడఁద్రాగి యొడఁ
తెలియక యడుగులలో.నడుగులు వైచికొని తూలితూలిపడుచుఁ జేతులు సాచి–

''సెట్టిగాళ్లబొట్టివే! చిట్టిమట్టలొట్టివే! ఎట్టవే! ఎట్టవే! గట్టి ముద్దెట్టవే హె హె హె
హె హే.''

యనుచుఁ బాడుచు గవల గంగిమీఁదఁ బడినట్లున్నది. కొఁగిలిమ్మని, ముద్ద
బెట్టుమని కాలికొలఁది గంతులు వైచు మహాచక్రవర్తి మద్యపానావశుఁడైన మనుజునికం
నెట్లు ఘనుఁడు? అటుపైనఁ బ్రశాంతమైన కణ్వాశ్రమము కల్లుపాక యయినదా? ఇ
ప్రాశస్త్యమునుగూర్చి యసందర్భమును గూర్చి యనౌచిత్యమునుగూర్చి వెనుకటి యు
న్యాసములలో నవిస్తరముగ ముచ్చటించితిని గాన నిప్పుడింతకంటెఁ జెప్పను.

పాటలవలెనే యప్రధూపవృత్తములు నాటకముల నుండఁదగ దని తేలుచున్నది
ఈ బాధ వింతవింతలగు తాళసందర్భసహితవృత్తములకేనా? అన్ని వృత్తములకునా? అని
వృత్తములకు నదియే బాధ అని నాయభిప్రాయము. మత్తేభ, శార్దూల, చంపకోత్పలమా
వృత్తములుగూడ నాటకముల నుండఁగూడదా? ఉండఁగూడదు. వీనికిఁ గూడఁ దాళపున
కెల యున్నదా? సుగంధ్యాదివృత్తములకువలె నంత విశేషముగ లేనట్టికిని దాళపుసాక్ష
న్నది. కాని లేకపోలేదు. అదిగాక యీసామాన్యవృత్తములలోనైన నొకదానివంటినడక రెండ
దానికి లేదు. దేనినడక ధానిదే! అది దానికే సహజము. నియమితములగు గణములకూర్పు
నిట్టినడక సిద్ధించినది. అనఁగఁ జంపకమాలకు మొదట నగణ ముండితీఱవలయును
తరువాత జగణము, భగణము, జగణము, జగణము మొదలగునవి వరునగా నిట్టి
యుండితీరవలయును. మఱియొక నియమితగణములకూర్పు మత్తేభమున కున్నది
ఈగణసమూహములో భగణ మున్నచోట జగణముగాని జగణ మున్నచోట భగణమ
గాని యుండినయెడలఁ బద్యము చెడును. వృత్తములలో నొకొక్కజాతినడక యొకొక్క
పద్యమునకు జన్మసిద్ధమైనది. దాని నడకను బట్టియే యది యాపద్య మని గ్రహింపవచ్చును

నాటకమునఁ బాటపాడుట యెట్లసహజమో పద్యములు పాడుటకొఁడానట్లే యసహజము. ఆపద్యములు సామాన్య వృత్తములయిననరే! వింతవృత్తములయిననరే! అన్ని వృత్తములు నాటకమునుండి బహిష్కరింపఁదగినవే!

అటులైన నొక్క వచనము తప్ప నాటకమున మఱేమియు నుపయోగింపఁగూడదా? ప్రకృతివైఖరి ననునరించి ప్రాసినయెడల నంతే! అటులైనచోఁ బూర్వనాటకకర్త లందఱు ప్రకృతిజ్ఞానాభావులేనా? అందఱు కారు. వారు కొన్ని కారణములచేఁ గొన్ని వృత్తములను విధిలేక చేర్చుకొనవలసివచ్చినది. పాత్రము లన్నియు రంగస్థలమున మాటలాడుకొనున ప్పుడు వివిధములగు రసములు వివిధములగు పరిపాక భేదములతో నుదయించును. ఇవియన్నియుఁ బాత్రములకు వేఱువేఱవస్థల వేఱువేఱు విధములగు మాటలఁ గలుగఁ జేయును. బాహ్యప్రకృతిలో నుండు ననేకవస్తువులుగూడ నాంతరప్రకృతిలో ననేకములగు మార్పులను గలుగఁజేయును. ఇట్టి చిత్రవిచిత్రాగణ్య భేదాన్వితములగు తమ హృదయావస్థ లను పాత్రము లొండొరులతోఁ గారణాంతరములఁ జెప్పుకొనవలసియున్నప్పుడు దృష్టిగోచ రములుగాని హృదయావస్థల బొమ్మలను బాహ్యప్రకృతితో నుండు రంగులతోడనే వేయవ లసి యున్నది. కాన నిట్టినమయమున నుపమాలంకార మావశ్యకముగ వచ్చును. మనోవేద్య మగు చిత్రచ్ఛాయకల హృదయావస్థయు దానికి టక్కున సరిపోయి తెలియఁదగని దానిపైఁ దెలివిని బఱపి చీఁకటిపై వెలుతురును బ్రసరింపఁజేయునట్టి బాహ్యప్రకృతిస్థమగు వింతనన్ని వేశమును నీరెంటికి లంకెయుఁ గలిగిన ప్రశస్తవర్ణనముతోడి యీమంచి కల్పనము వచనమునఁ బెట్టినయెడల సొగసుగ నుండ దనియు, నిమిడికగనుండ దనియుఁ, బద్యరూప మునననున్న జనుల జిహ్వాగ్రములఁ దఱుచుగ నుండు ననియుఁ బూర్వసంస్కృతకవులలో నుత్తమోత్తములగువా రెంచి తాళసందర్భసహితములగు వృత్తనుల సన్నిటిని నిరాకరించి కేవల వచనమువలెఁ గొంచెము హెచ్చుతగ్గుగ నడచు నార్యావృత్తము ననుష్టుప్పువృత్తము తఱుచుగ నుపయోగపఱచినట్లు కనఁబడుచున్నది. పద్యముల నెచ్చటెచ్చట నుపయోగప ఱుపవలయునో చెప్పినయెడఁ దెల్ల వాఱువఱకుఁ జెప్పవలసి వచ్చును. ఆయంశము ముందరి యుపన్యాసమునఁ జెప్పెదను. ప్రశస్తమైన యభిప్రాయ మున్న యెడల దాని నుపమార్థాంతరన్యాసాలంకారములతో మేళవించి దానిని ధారణాయోగ్యముగఁ జేయుటకై నడకయందు వచనమునకంటె విశేషభేదములేని వృత్తములలోఁ బూర్వోత్తమకవులు స్వీకరిం పవలసివచ్చినది. ఏకాదశినాఁడు శుష్కోపవాస ముండఁదగినదే! అయినను బ్రాణదేవుని బాధింపఁదగని హేతువుచే ఫలాహారముమాత్రము సేయవచ్చు నని నియమము లున్నవి. ఇట్లు నిష్ఠాగరిష్ఠులగువారు కొందఱు మాత్రము జరిపిరి. వారి తరువాతి నారు-ఆచారము తక్కువయు, నాఁకలి యెక్కువయు గలవారు ఫలాహారమునుండి యుప్పిడిపిండికి, దాని నుండి మినుపరొట్టికు, దానినుండి పకోడీలకు, దానినుండి తేగలకుఁ గ్రమక్రమముగ వివిధ భేదాహారరచనాచమత్కృతిని వ్యాపింపజేసిరి. అటులే వచనమే యుండఁదగినది! అయిన ధారణాయోగ్యార్థ ముత్తమాభిప్రాయముల నార్యాదివచనవైఖరీ సహిత వృత్తములఁ గొన్నిటిలో మాత్రమే నాటకముల నుంచవలసినట్లు త్తమకవుల ప్రాఁతలఁబట్టి కనఁబడుచుండఁగా నరసకవితాశక్తి తక్కువ, శబ్దగుంభనశక్తి యెక్కువ గల తరువాతికవులు క్రమముగ శార్దూల మునకుఁ బిదప వసంతతిలకకు, మంగళమహాశ్రీకి, మహాస్రగ్ధరకు దిగిదిగి కలములు పారనైచి తాళపుఁ జిప్పలు చేఁబూన సాహసించిరి. పర్యవసాన మేమనఁగ నాటకము ధ్వంస మగునను

భయముచేతనే చచ్చిచచ్చి తుదకుఁ దప్పనిసరిగ వచనముల నడకగల పద్యములఁ దీసిక
నుట తగు ననిపైకిఁ జెప్పకుండ వారి లేఖనవైఖరినిబట్టి యుత్తమకవులు సూచించినారు
''వారట్లు సూచింపనిదే సూచించి రని దురభిప్రాయమును మనము పడుచుండఁగూడదా?
యని యందురేమో? అటు కాదు. పాశ్చాత్యదేశీయగ్రంథకర్తలలో నుత్తమోత్తము లనఁదగ
వారుగూడ నాటకరచనయందు, నందులోఁ బద్యరచనయందే మనపూర్వులు వెల్లడించి
యీసదభిప్రాయమునకుఁ గేవల మనుగుణముగఁ బ్రతిబింబముగ వారియభిప్రాయమున
వెల్లడించియుండినయెడల మనపూర్వు లీవిషయమున దురభిప్రాయపడిన వారైయుం
యుండరుకద? వారట్లు సూచించిరని మనము దురభిప్రాయపడియుండియుండముకద
Addison యిట్లు చెప్పుచున్నాఁడు:–

Aristostle observes that the lambic verse in the Greek tongue wa
the most proper for tragedy; because at the same time that it lifted up the discours
from prose, it was that which approached nearer to it than any other verse
For, he says, we may observe that men in ordinary discourse very often speal
lambics without taking notice of it. We may make the same observation o
our English Blank verse which often enters into our common discourse though
we do not attend to it and is such a medium between rhyme and prose tha
it seems wonderfully adapted to tragedy.

గ్రీకుభాషలో పద్యభేదము లనేకము లుండగా "Lambics" అనునది యొక్కటే నాట
మునకు ముఖ్యముగఁ దగునని మహాధీమంతుఁ డగు Aristotle (అరిస్టోటల్) చెప్పినాఁడు
అందులకుఁ గారణములు మూఁడు చెప్పినాఁడు. (1) వచనసామాన్యరచనకంటె నీపద్య
రచన ఘనతరముగ నుండును. (2) ఇతర పద్యములన్నిటికంటె నిది వచనముతో
నెక్కువగఁ బోలియున్నది. (3) మనము సామాన్యసంభాషణములో దీనినే యుపయోగించ
చుంటి మని యెఱుఁగకుండ నుపయోగించుచుందుము. వింటిరా? నాటకమున నుండుట
కెట్టిపద్యము కావలయును? ఇది గ్రీకు దేశస్థుల కట్టుబాటు. ఇఁక నింగ్లాండు దేశపుకవుల
నాటకరచనయందు (Blank verse) (బ్లాంక్‌వర్స్) అనుపద్యము నుపయోగింతురు
అనేకపద్యభేదము లుండఁగా దీనినే యేల వారుపయోగింపవలయును? ఇదికూడఁ దఱచ
సంభాషణములోఁ దెలియకుండ వారుపయోగించుకొందురు. ఇది వచనమనిన వచనము
కాదు. పద్య మనినఁ బద్యమును గాదు. చక్కని యుభయ మధ్యస్థరచనాచమత్కారము
గలిగి నాటకమునకుఁ బరిపూర్ణముగఁ దగి యున్నది. దీనియభిప్రాయముకూడ వచనవైఖరిని
బూర్ణముగఁ బోలియున్న పద్యమే నాటకమునకుఁ దగినట్లు కనఁబడుచున్నది. ఇంగ్లాండు
జాతివారు గాని, గ్రీకుజాతివారుగాని నాటకరచనయం దేదో యొక్క జాతిపద్యమే యర్హమని
దానినే స్వీకరించిరి కాని వివిధ వృత్తములఁ బ్రయోగింపలేదు. కారణ మేమి? వివిధ
వృత్తములకుఁ బద్యగమన మున్నది. అది నాటకరసమునకు భంగము–కావలసిన దెట్టి
పద్యము? పద్యముకాని పద్యము–వచనము కాని వచనము! అది ఇంగిలీషున Blank verse.

గ్రీసువారికి "Lambics" (లాంబిక్స్) ఉన్నది. ఇంగ్లీషువారికి Blank verse ఉన్నది.
సంస్కృతభాషలో ''ఆర్యావృత్తము, అనుష్టుపు వృత్తము'' లున్నవి. వీనికిఁ బ్రతిబింబమైనది

మనయాంధ్రభాషలో నేమియున్న? దని యాలోచింపఁగఁ ''దేటగీత'' కనఁబడుచున్నది. దీనికిఁ దాళసంబంధము మిక్కిలి తక్కువగఁ గలదు. దీనిలోని పాదములకు నియమిత గణక్రమము లేదు ''సూర్యుఁడొకఁడు మీఁద సురరాజు లిద్దఱు, దినకరద్వయంబు ''తేటగీతి'' యని చెప్పఁబడియున్నది. సూర్యులు రెండువిధములు. గలమైన వేసికోవ చ్చును. నగణమైన వేసికోవచ్చును సురరాజు లనేక విధములు. వానిలో మనకిష్టమైన దానినే వేసికోవచ్చును. చివర సూర్యులలో నగణముగాని, గలముగాని యథేష్టముగా వైచుకొనవ చ్చును. ఒక గణము తరువాత నొకగణ మవశ్యము రావలయునని నియమము దీనికి లేదు. కనుక దీనికి జన్మసిద్ధమైన యొక్క నడకలేదు. దీనికి మనము దానిలోఁ బ్రయోగించెడు గణములనుబట్టి గమనభేదముల నీయఁగలము. ఇట్టి గమనభేదములు మిగుల నావశ్యక ములు. పాత్రమునకుఁ గల మనస్థితి భేదములఁబట్టి యీగమనభేదము లుండవలయును. ఏకమైనట్టియు మార్పులేనట్టిదియుఁ బద్యమును జెరిపినఁగాని మార్చుట కవకాశము లేనట్టిదియునగు గమనముగల పద్యముకంటె తేటగీతి యన్నివిధముల భేద మగుటచే నిది పద్యము గాదు. వచన మంతకంటెఁ గాదు. అందుచే నిది Addison (అడ్డిసన్) చెప్పినట్లు medium between prose and rhyme అగుచున్నది. దీనికంటె ఛందస్సును వచనమును బోలిన పద్యము లేదు. అందుచే నిదియే సర్వవిధముల నాటకరచన కత్యంత మర్హమైయు న్నది. అడిగాక దీనిఁ గేనలము వచనమువలెనే నడచునట్లు మనము గణములకూర్పులచేఁ జేయవచ్చును. అట్లు చేయుట తగును. నాటకములోని గీతపద్యములను గీతములవలెఁ జదువఁబోయిన నవి నడువకుండునట్లు ప్రాయవలెను. అవి వచనము లని చదువుకొనినప్పుడే యవి నడువవలయును. ఈ వచనమునకుఁ బద్యత్వము మిగుల విలువగలిగి ధారణాయోగ్య ములయిన యభిప్రాయములను వీనిగర్భమున దాఁచుటకే ఈపద్యములకు వచనత్వము -ప్రకృతి వైఖరికి భిన్నముగ నుండుటకే గీతపద్య మనఁగ నదియొక్కటియే కాదు. దానిని నీనము నాటవెలఁదిని గూడ నుపయోగపఱచవచ్చును. వీనిని జదువనలసినప్పు డాయారస భేదోచితకంఠరవ పరిపాకములఁ జదువవలయును. గానధోరణిని బొడఁగూడదు.

నాటకములో నన్నియుఁ దేటగీతములేయైనచో విసుగుగ నుండునని కొంద అందురు. ఇది కేవల మూఢాభిప్రాయము. గానము వినుట కొఱకు, గంతులు చూచుటకొ అకు నాటకశాలకు వచ్చిన నరుల కట్లుతోఁచినఁ దోఁచవచ్చును. నాటకశాలయే ప్రపంచము. పాత్రములే యందలినరు లనిన యూహముతో వచ్చినవాని కెన్నఁడట్లుండదు. మన నాటకములలో నచ్చటచ్చట నున్న గీతపద్యములే విసుగు గలిగించు నెడల నారంభము మొద లంతమువఱకు నొక్కటే Blank verse పద్యముగల యింగిలీషునాటకము లంతకంటె విసుగుఁ గలిగింపవలసినవి కావా? ఈయాక్షేపణము దుష్టప్రబంధపఠనమువలన దుష్టరుచులు దురభిప్రాయములు గలిగిననరులనుండి వెడలునది కావున దీనిని ఖండించుటకంటె ను పేక్షిం చుటయే యుచితము. ఈరాత్రి చాలాసేపు చెప్పి శ్రమయిచ్చితిని. క్షమింప వేఁడుచున్నాను.

8. కష్టాంత నాటకములు

ఇదొక పెద్ద ఉత్తరం. ఒక సాక్షి సంఘాభిమాని 'సాక్షి'కి వ్రాసిన ఉత్తరం. జంఘాలశాస్త్రి కష్టాంత నాటకాల అవసరం గురించి చేసిన పెద్ద ఉపన్యాసానికి స్పందిస్తూ, కష్టాంత నాటకాలు మనకు లేకపోవడంవల్ల అతను వెలిబుచ్చిన అభిప్రాయాలు తనకు నచ్చలేదని తెలియజేస్తూ వ్రాసిన ఉత్తరం.

''శబ్దాభిప్రాయ చౌర్యాలు అవలీలగా చేస్తూ ప్రకృతి జ్ఞానమునతప్ప మిగిలిన అన్ని అసందర్భాలలో, అన్ని అవకతవకలలో, ఒకడి తలమీంచి ఒకడు దాటిపోవాలని చూస్తున్నారని మనవారిని జంఘాలశాస్త్రి ఆపేక్షించడం'' వల్ల ఆ అభిమాని అసంతృప్తి వ్యక్తం చేశాడు. అలాగని జంఘాలుడి మీద ఈ అభిమానికి గౌరవం లేకపోలేదు.

నాటక కవితా తత్త్వం ఏమిటో, ఆర్యజాతి మనస్తత్త్వం ఏమిటో, మనం ఆలోచించాలనీ, ఈ రెండు ప్రశ్నలకు సమాధానాలు వెదకాలనీ, నిర్ధారణ చెయ్యాలనీ - ఆమీదట మనవారు కష్టాంత నాటకాలు ఎందుకు వ్రాయడం విడిచి పెట్టారో తెలియగలదనీ - ఆ సాక్షి సంఘాభిమాని తన వాదం ప్రారంభించాడు. తన వాదనికి బలంకోసం కొందరు ఇంగ్లీషు విమర్శకుల అభిప్రాయాలను విపులంగా ఉదాహరించాడు.

''చావే లేదని నమ్మిన మనకు కష్టాంత నాటకాలేమిటి?'' అనే కొసమెరుపు విసిరి - సాక్షిని ఆశ్చర్యపరిచాడు ఆ అభిమాని –

ఇదిగో నాకీయుదయమున వచ్చినలేఖను జదువుచున్నాను. సావధానమస్కులవై వినఁగోరుచున్నాను. ''సాక్షికి– సాక్షిసంఘాభిమాని యనేక నమస్కారములు –కష్టాంతనాటకములఁగూర్చి మీజంఘాలశాస్త్రి కొన్ని సంవత్సరముల క్రిందట నుపన్యసించినాడు. మనజాతివారి సారస్వతములలోఁ గష్టాంతనాటకము లుండకపోవుటయేల? ఇతరజాతులవారి సారస్వతములలో నవి యుండుటయేల? యను సంశమును విపులముగా విమర్శించినాఁడు. కాని యీవిమర్శనము నామనస్సునకు నచ్చలేదు. ప్రపంచము ప్రారబ్ధఫలానుభవస్థలమని యాలోచించినను, నూతన కర్మాచరణస్థలమని యాలోచించినను నది దుఃఖపూర్ణమై యున్నట్లు కనబడుచున్నదనియు సుఖమనునది యున్నయెడల నదిమిగులఁ దక్కువగానున్న ట్లగపడుచున్న దనియు, ఇట్టి ప్రపంచనటనకు నాటక కవిత పరమార్థముగ

బ్రతిబింబముగ నుండవలసినప్పుడు శుభాంత నాటకములకంటెఁ గష్టాంతనాటకము లెక్కువగానుండవలసినట్లు కనఁబడుచున్నదనియు, నాసేతుహిమాచలపర్యంత మున్న భాషలలో నొక్క ప్రసిద్ధమైన కష్టాంతనాకటమే లేదనియు, మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని యని ప్రబంధలక్షణములను మనవారు నిర్వచించినప్పుడు ప్రకృతిఁగోఁ బదునాలుగణాలవంతు పనికిరానిదిగా మనవారు తీసినైచినారనియు, మిగిలిన బేడకాసు నావరణములోను మ్నచ్చ కటికాకారుని మొదలు నేటివఱకు నందఱు గిరగిరదిరుగుచు గుడుగుడు గుంచము లాడుచుఁ బిష్టసేషణముగా వర్ణించినప్రకృతులనే వర్ణించుచుఁ జెప్పినవాక్యసందర్భమునే రవంతమార్చి చెప్పుచు, భాషాంతరీకరించుచు, శబ్దాభిప్రాయచౌర్యము లనలీలగా నొనర్చుచుఁ బ్రకృతి జ్ఞానమునఁదప్ప మిగిలిన యన్ని యసందర్భములలో నన్ని యవకతవకలలో నొకనితలపై నొక్కఁడు దాఁటిపోఁ బ్రయత్నించుచున్నారనియు మనవారిని జంఘాలశాస్త్రి యధిక్షేపించినాడు. అదిగాక గ్రీకులేమి, యాంగ్లేయు లేమి మఱికొంద ఱితరజాతివారేమి సుఖాంతనాటకములు కష్టాంతనాటకములు గూడ వ్రాసిరనియుఁ బ్రకృతి ననుసరించి వ్రాయువారంద ఱటులే వ్రాయవలయుననియుఁ గష్టాంతనాటకములను గేవలయు నిరాకరించుట హేతుసందర్భమునకు, శాస్త్రమునకు, సహజవైఖరికిఁ బ్రపంచధోరణికి, నిరతదేశనాటకకర్తల యాచారమునకు మిగుల విరుద్ధముగా నున్నదనియు, నితరజాతీయనాటక విభూషణగర్భితముగా మనకవులను దూషించినాఁడు అంతియేకాక, కష్టాంతనాటక దర్శనమూలమున లోకమునకుఁ గలుగులాభములు కూడఁబాశ్చాత్యుల యభిప్రాయము ననునరించి 'Terror and Commiseration leave a pleasing anguish in the mind and fix the audience in such a serious composure of thought as is much more lasting and delightful than the transient stars of joy and satisfication.....Moreover a virtuous man struggling with misfortunes is such a spectacle as the Gods might look upon with pleasure such as it is when one meets it in the representation of a well-written tragedy. Diversions of this kind wear out of our thought everything that is mean and little. They cherish and cultivate that humanity which is the ornament of our nature. They soften insolence, soothe affliction and subdue the mind to the dispensations of providence.'

అని తానుగూడఁ గష్టాంతనాటక ప్రాశస్త్యమును సర్వవిధములఁగొనియాడుచు వాని నాదర్శముగా నుంచుకొని యింతటినుండియైన ద్విముఖియైన ప్రకృతిని రెండువైపులఁగూడ నిష్పక్షపాతముగఁ బరామర్శింతురుకాక యని మంగళాసనముతో నుపన్యాసమునకు శాంతి చెప్పినాఁడు.

జంఘాలశాస్త్రి బుద్ధిమంతుఁడు. విమర్శకుఁడు. విశేషసంప్రదాయ జ్ఞానసంపన్నుఁడు. కాని, యాతని యీయుపన్యాస మంత సమంజసముగా లేదని చెప్పవలసివచ్చినందులకు విచారించుచున్నాను. ఆతని నధిక్షేపించు నుద్దేశము నాకెంతమాత్రమును లేదు. సత్యమని నాకుఁ దోచిన యభిప్రాయమును నేను ప్రకటింపవలయునని యీలేఖను వ్రాసితిని.

అతఁ డీకష్టాంతనాటక తత్త్వపు విమర్శనోపన్యాసమున నాటక కవితాతత్త్వమును గూర్చియే కాక, యార్యజాతిమనస్తత్వమును గూర్చి కూడఁ దెలియనివాఁడునలె

మాటలాడినాఁడు. నాటక కవితా తత్త్వమేమి! ఆర్యజాతి మనస్తత్త్వమేమి? ఈ రెండును మన మాలోచింపవలయును. ఈ రెండు ప్రశ్నముల కుత్తరము లేవియో మనము నిర్ధారణ మొనర్పవలయును. అటుపైనఁ గష్టాంతనాటకములు మనవారెందులకు వర్జించినారో ఆయంశము తెలియఁగలదు.

ప్రథమమున నాటక కవితాతత్త్వమును గూర్చి ప్రాసెదను. 'కవిత్వమ ప్రపంచనటనకుఁ బరమార్థముగఁ బ్రతిబింబముగా నుండవలసినప్పుడు' అని జంఘాలశాస్త్రి చెప్పినాఁడు. ఈయంశము సందేహాంశము. శిల్పము, దారు పాషాణాది పాంచాలికా రచనయు, చిత్రలేఖనము, గానము, కవిత్వమను నీకళ లయిదును బ్రకృత్యనుకరణములనియు బ్రకృత్యననుకరణములనియు స్థూలమగు రెండు విభాగములను జిరకాలము క్రిందటఁ బెద్ద లొనర్చినారు. వానిలోఁ బాషాణ పాంచాలికారచనయుఁ జిత్రలేఖనము కవిత్వమునకు నీమూఁడును బ్రకృత్యనుకరణకళలని నిశ్చయించినారు. కాని ప్రస్తుతకాల విమర్శన వైఖరి యెట్లున్నదో మీకుఁ దెలియుటకై యాంగ్లేయ విమర్శకాగ్రగణ్యులలోఁ గొందఱ యభిప్రాయము నీదిగువ నుదాహరించుచున్నాను.

The differences between the means and capacities of representation prope to the shaping arts of sculpture and painting and those proper to the speakin art of poetry were for a long while overlooked and misunderstood. The maxim of Simonides that poetry is a kind of articulate painting and painting is a kind of mute poetry was vaguely accepted until the days of Lessing and firs overthrown by the famous treatise that writer on the Lascoon. Following in the main, the lines laid down by Lessing, other writers have worked out the conditions of representation or imitation proper not only to sculpture a distinguished from painting. The chief points established may really all be condensed under one simple law *that the more direct and complete the imitation effected by any art, the less is the range and number of phenomena which that art can imitate.* Thus sculpture in the round imitates its objects much more completely and directly that any other single art reproducing one whole set of their relations which no other art attempts to reproduce at all namely the solid relations in space.

Precisely for this reason such sculpture is limited to a narrow class of objects.

Next we arrive at painting in which the third dimension is dismissed altogether, and nothing is actually produced in full or partially, except the effect made by the appearance of natural objects upon the retina of the eye. The consequence is that this art can range over distance and multitude, can represent complicated relations between its various figures and groups of figures, extensive back grounds and all those infinite subtleties of appearance in natural things whch depend upon local colours and their modification in the play of light

and shade and enveloping atmosphere. The last phenomena of natural things are in our experience subject to change in a sense in which the substantial or solid properties of things are not so subject. Colours, shadows and atmospheric effects are naturally associated with ideas of transition mystery and evanescence. Hence painting is able to extend its range to another kind of facts over which sculpture has no power.

Lastly a really unfettered range is only attained by the art (Poetry) which does not give a full and complete reproduction of any natural fact at all but evokes or brings natural facts before the mind by the images which words convey. The whole world of movement, of continuity of cause and effect of the successions alternations and interactions of events characters and passions of every thing that takes time to happen and time to declare is open to poetry as it is open to no other art. As an imitation art or more properly, speaking an evocative art than poetry is subject to no limitations except, those which spring from the poverty of human language and from the fact that its means of imitation are indirect. Poetry's account of visible properties of things is from these causes much less full accurate and efficient than the reproduction or delineation of the same properties by Sculpture and painting.

"A portrait in sculpture or painting a landscape in painting a passage of local description in poetry may be representations of known things taken literally or for their own sake and not for the sake of carrying out thoughts to the unknown, but none of them ought to be or indeed can possibly be a representation of all the observed parts and details of such a reality on equal terms and without omissions. Such a representation were it possible would be a mechanical inventory and not a work of fine art"

Ency Brit.

కావున నాధునిక విమర్శనానుసారముగఁ బ్రకృతినటనానుకరణ మంతయుఁ గవిత్వ మను పేరికిఁ దగదు. అంధప్రాయములై నిర్హేతుకములై దయాదాక్షిణ్యశూన్యములైన యనంత శక్తులతోఁ బ్రకృతి నిండియున్నది. ఒక్కొక్క గాలివిసరునఁ జెట్టతో మంచికూడ నెగిరి పోవుట కలదు. ఒక్కొక్క యుప్పెనతో మంచిదంతయుఁ గొట్టుకొనిపోయి చెడ్డమాత్రమే మిగులుట కలదు. ఒక్కొక్క మంటతో మహామలినప్రదేశములతో మహాసారన్వతములు కూడ బుగ్గియగుట కలదు. ఒక్కమహాధాటి యొకప్పు డటువచ్చును. ఒక్క మహాధాటి యొకప్పుడిటువచ్చును. ఆధాటి యటువచ్చుటకుఁ గాని, యీధాటి యటుపోవుటకు గాని కారణమగపడదు. ప్రకృతివెఱ్ఱులు పదికోట్ల గంగవెఱ్ఱులకంటెఁ బైనాడును. అట్టిచో నీమహోన్మత్తచర్య నంతయుఁ గవిత్వములో ననుకరించుటకంటె వెఱ్ఱియుండునా? మొదట సాధ్యమే కాదు. సాధ్యమేయైనను సమంజనము కాదు. కావున దానిలో, Selection అనునది

పరమావశ్యకము. దీనినే Idealising process అని అందురు.

"The instinct by which an artist thus prefers, selects and brings into light an order of facts or aspects in the thing before him rather than the rest is part of what is called the idealising or ideal faculty. The possession of this faculty is artist's most essential gift.

అందుచే మనము ప్రకృతి యను సహారా యెడారిలో మనకుఁ గావలసిన రేణువులనే స్వీకరింపవలయును. మనకుఁ గావలసిన వనఁగా నేమి? సత్యమునకు దూరములు కానివి, హేతువున కవిధేయుములు కానివి, యితర జనావలంబనమున కర్హములైనవి, నీతి ప్రతిపాదికములైనవి, నిశ్చలదైవభక్తిబోధకములైనవి, అక్రమములోఁ గ్రమమును జూపించునవి, అంధకారములోఁ దేజోరేఖలను గలుగఁజేయునవి. ఉన్న ధనమంతయు నిచ్చి రాజ్యము నిచ్చి, దేహపరిత్యాగ మొనర్చి, ముని శిష్యునివే చారిలో ననేకబాధలొంది, యరణ్యానల సంవృతుఁడై, సతీసుత సాహాయ్యమువలన నసత్యపిశాచముతో ఘోరయుద్ధ మొనర్చుచు దేవతలకైన నీతి తెల్పఁగల చారత్రముగల హరిశ్చంద్రుఁడు సత్యావనదీక్షలోఁ జచ్చిపోయెనని చెప్పుటకంటె హాస్యాస్పదమైనపని లేదు. సత్య రక్షణప్రయత్నమున ననేకమహామహులు చచ్చిపోయినట్లు ప్రకృతిలో నుదాహరణము లగపడుచున్నను, హరిశ్చంద్రనాటకము కష్టాంతముగాఁ జేయఁగూడదు. బాలుఁడు నిర్దోషుఁడు. పరమసుకుమారుడు. పితృభక్తియుతుడు. ప్రతిఘాతిని యగు సాపత్న్యమాతను గన్నతల్లివలెనే పూజించువాడు. ఆమెదోషమును గ్రమ్ముటకుఁ దానే దోషయుక్తుఁ డైనట్లు లోకములో వెల్లడింపుమని తనమిత్రుని కాజ్ఞాపించినవాఁడు–అట్టి పరమాదయాళుఁడు–సత్యదీక్షాదకుఁడు–బ్రహ్మచర్యవ్రతసంపన్నుఁడు–అట్టి సారంగధరుఁడు–దుర్మార్గురాలు కుత్సితురాలు గమనాగమనభేదశూన్య, క్రోధవతి, పుత్రమారి, భర్తృద్రోహిని, పరమకిరాత యగు చిత్రాంగి చేసిన కుట్రచేఁ జంపఁబడినట్లు చెప్పఁబడినయెడలనిఁక నీతియేమి? సత్యమేమి? దోషశూన్యతయేమి? బ్రహ్మచర్యమేమి? ఇంకను సత్యపాలకుఁడు దోషశిక్షకుఁడగు దేవుఁడెక్కడ? మనుజప్రకృతి కట్టి సన్నివేశము మహాసహ్యము. తపస్సుచేఁ జాతివ్రత్యముచేఁ గిరాతుని బారి పడకుండఁ దన్ను గాపాడుకొనిన దమయంతి యాకిరాతునికిఁ దక్కి యాతని బాహుబంధమున నన్నియనుభవము లైనపిదపఁ బ్రాణమును బాసినదని వ్రాయుట నరస్వభావమున కంతకును, బాహ్యముకాదా? కావున నుత్తములగు నాయకులుగాని, యుత్తములగు నాయికలుకాని మహాకష్టములఁబడి నాటకాంతమున మరణించిరని వ్రాయుటమాత్రము తగదని తోఁచుచుండుట లేదా?

అట్టులైన నితర దేశ జాతి సారస్వతములలో నట్టి కష్టాంతనాటకము లేలయున్నవి? ఆచింత మనకేల? మనకేల లేవో? యేల యుండదగవో తెలిసినంతమాత్రమునఁ జాలదా? చాలదు. కావున నదియు విమర్శంపవలసిన యంశమే! సంగ్రహముగా వ్రాయుచున్నాను. నాయనా! మీ జంఘాలశాస్త్రికున్న వచోనిపుణత నాకు లేదు. లేఖన శక్తియు లేదు. నాయభిప్రాయములను బులికావుచేసి, మెఱుఁగు పెట్టి విశదముగా నుండునట్లు విపులపఱచి, యుదాహరణములచే బలపఱచి, యలంకారములచే సింగారించి మీయెదుటఁ బెట్టగల చాకచక్యము నాయొద్దలేదు. నాయభిప్రాయములను–మొండివి–పంచ షష్ఠకోణములు గలవి

యెగుడుదిగుడు కలవి–పెద్దబాడిదవనితనముగలవి–అట్టి నాయభిప్రాయములను మన నులో నేలాగునఁ బుట్టెనో యాలాగుననే మీయెదుటఁ బడవైచుచున్నాను. చెక్కి, యురుగఁ దీసి చిత్రికపట్టి, యినుక కాగితముతో మెఱుఁగుచేసి, Varnish వ్రాసి తళతళమను చుండగా మీయెదుటఁ బెట్టఁగల నైపుణ్యము నాయొద్ద లేదు. వానిని బట్టియే మీరు గ్రహింపవలసినదం తయు గ్రహింపవలెను.

ఇతరదేశీయ సారస్వతములలో నాయికానాయకమరణములతోఁ బరినమాప్తిజెందిన నాటకము లేలయుండెను? ఏలయుండెనా? చావు మహాపత్తుగా వా రెంచుటచేత–వారి యభిప్రాయమునుబట్టి, చావుకంటె మహావద లేనందువలన–అంతకంటె వేఱుగా నూహిం చుట కవకాశమున్నదా? లేనట్లే కనఁబడుచున్నది; మరణ మెవరికిఁ గష్టము? బ్రదుకు సుఖమని యెంచినవారికి, ఐహికానందమే యానంద మనుకొన్నవారికి, బంగారమే బ్రహ్మమై నవారికి–కాంతయే కైవల్యమైన వారికి, కాని మనకా? మతముతోఁ బుట్టి, మతముతో నామధేయమంది, మతముతో నక్షరస్వీకార మొనర్చి, మతముతోఁ బెరిగి, మతముతో మరణించి, మరణించిన తరువాతఁగూడ మతముతో సంబంధము వదలని మనకా? బాల్యము వదలి క్షౌమారము, క్షౌమారము వదలి యౌవనము, యౌవనము వదలి వార్ధకము వచ్చినట్లే మరణము కూడను. ప్రాతబట్టలను వదలి కొత్తబట్టలను బరిగ్రహించుటకంటె బ్రాణహాని యెక్కువది కాదు. ఈ ప్రపంచము మన కద్దెకొంప, సై ప్రపంచము సొంతభవ నము. కావున నితరదేశీయులు మహాపదగానెంచు మరణము మన కట్టిదికాదు. మరణించుట కాంగ్లేయమున To give up the ghost అని యందురు. ఈయొక్క మాటతోనే మీక్రైస్తవమతస్థులకు దేహాత్మలలో ప్రాముఖ్యము దేనికో తెలియుచున్నది. మనలోని నిరక్షర కుక్షియైన భిక్షుకుఁడు సైతము ''గూటఁజిలు కేదిరా–చిన్ననా–గూడు చినఁబోయెరా'' యని పాడఁగ మీరు వినియుందురు. చిలుక యెక్కువ, గూఁడు తక్కువ. చిలుక గూటిని వదలినది. కాని గూఁడు చిలుకను వదలలేదు. అందుచే మరణము మహాపత్తుకాదు. దానితో మన నాటకము లంతమొందఁదగదు. నాటక నాయికా నాయకులు బడు మహాకష్టపరంపర యంతము, వారి దేహములకు నాత్మలకుఁ గలిగినయుద్ధము, ఐహికమునకు నాముష్మికమునకుఁ గలిగిన మహాహవము. ఆయుద్ధములో నెల్లప్పుడాత్మ జయింపవలసినదే! కష్టము లంతరింపనలసినదే! సుఖము చేకూరవలసినదే! అందుచే నట్లు వ్రాయవలసినదే –ఇదికాక వ్యుత్పత్తియొక్కమాట. చావే లేదని నమ్మిన మనకుఁ గష్టాంతనాటకము లేమి? చిత్తగింపవలయును, విధేయుఁడు–సాక్షినంఘాభిమాని.

నాయనలారా! ఈ విమర్శకుని విమర్శమును వింటిరా? మనసాక్షులు సవిమర్శముగా మన సోదరులు చదువుచున్నారని మహాసందముగా నున్నది. ఈ విమర్శనము చిత్రముగానే యున్నది. ఏడు సంవత్సరముల కీవిమర్శనము పొడసూపినది. ఇదివఱకే రాఁదగినది. కాని యుత్తరమేమో తొందరతో వ్రాసినట్లుమాత్రము కనఁబడుచున్నది. దీనికి జంఘాలశాస్త్రి యేమి ప్రత్యుత్తరమిచ్చునో వినవలసియున్నది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

9. కవుల కష్టములు

సాక్షి సంఘం, తాము అద్దెకు తీసుకున్న ఇంటికి బాడుగ కట్ట వలసిన సమస్యలో వడింది. బొట్లయ్యశెట్టి చనిపోవడంతో అడపా దడపా అందే బాడుగ సహాయంకూడా అందకుండా పోయింది. ఇలా ఆర్థిక సమస్య ఎంత బాధాకరమో 'సాక్షి' ప్రస్తావించేసరికి కాలాచార్యులు ఈ కష్టాలు గడవడానికి ఉపాయాలు తనకి తోచినవి సూచించబోయాడు. వాణీదాసు ఆక్షేపణ లేవదీశాడు.

దానా దీనా, కవి అయిన వాడికి ధనార్జనం చేయడం ఎంతకష్టమో అందుకుని వాణీదాసు రెచ్చిపోయి తన 'కంకణ బంధ రచన'ను అంకితం తీసుకునే దొరే దొరకలేదని వాపోయాడు. తాను ఈ శతాబ్దంలో కాక, గత శతాబ్దాల్లో పుట్టివుంటే పాశ్చాత్య ఖండాల్లో తన భాగ్యం వేరేగా వుండేదిగదా! అని ఆలోచనలో పడ్డాడు.

వాణీదాసు చేసే తప్పుడు ఊహల్ని ఎండగట్టదలచి, సాక్షి కలగజేసుకుని, ఉపన్యాసం అందుకున్నాడు. ఆకవిత్వానికి ఆదరణ లభించలేదని ఆ ఘోరించవద్దని సూచించాడు. పాశ్చాత్య ఖండంలో పుట్టలేదని పుట్టివుంటే మన్నన జరిగేదనీ ఊహ తప్పని, సాక్షి ఖండించి - ఎందరెందరు మహామహులైన పాశ్చాత్యకవులు దుర్భర కష్టాలనుభవించారో విశదం చేశాడు.

వాళ్లతో పోలిస్తే మనదేశంలో కవులను ఎందరు ప్రభువులు నెత్తిన పెట్టుకున్నారో గుర్తించమని - వాణీదాసుని సాక్షి హెచ్చరించాడు.

ఈదినమున జంఘాలశాస్త్రి యొద్దనుండి రాదగినలేఖ రాలేదు. వినవచ్చినావారందఱు లేఖ రాలేదని యెఱిగి యింట్లకుఁ బోయిరి. "ఎందుల కాతఁడు వ్రాయలేదో తెలియలేదు. సభావ్యాపారము లేమియు మేము చూచుకొనుటయే లేదు. మూఁడునెలల కొక్కసారియైన స్వకీయవ్యాపారములను చూచుకొనకున్న యెడల నెట్లు? ఆఱు మానముల నుండి సభామందిరమున కీయవలసిన బాడుగ యిచ్చుటలేదు. ఆయింటియాతఁ డద్దెకై మిగులఁ దొందరపడుచున్నాఁడు. పంచాయితీ కోర్టులో బాడుగసొమ్ముకై వ్యాజ్యము తెచ్చెద నని బెదరించుచున్నాఁడు. బొట్లయ్యసెట్టి యుండినయెడల నీచిక్కులు లేకుండెడివి. ఆతఁడు మరణించుట సభ కరిష్టము. ఆతనితావున కెవరైన వత్తురేమో యని చూడగ

చున్నారుక్షో ఇంక నాలస్య మొనర్పక, గునపములను గొడ్డళ్లను గూలివాండ్ర కిండు చాపరాబండలను జాఁకిరేవులలోఁ బాఱవేయుఁడు. సర్కసు గుర్రములు జెటకాబండ్లకు గిట్టునెడల గిఱగిఱ తిరుగును గావున గానుగవాండ్రు కొనునెడల వారి కెద్దుల వెల కమ్ముఁడు. ఈమీసామగ్రితో దేశమున కిప్పుడు పనిలేదు.

ఇట్లంటినని నిరుత్సాహపడవలదు! దేహబలము సంపాదించు కొనఁగూడదని నే ననువాఁడనుగాను. ముఖ్యముగా సంపాదించుకొన వలసినదే. సంపాదనప్రయత్న మావశ్య కము కాకుండ సహజమగుటచే నది సర్వజనులకు సమకూడుచునే యున్నది. ప్రపంచచర్యో పయుక్తమగు బల మందఱకుండనే యున్నది. కాన మీరు సంపాదించినబల మనావశ్యకమని చెప్పుచున్నాను. అది వట్టి నిరుపయోగమని చెప్పుచున్నాను. అది వృథ–వృథ–ముమ్మాటికి వృథయని చెప్పుచున్నాను. దానిని సంపాదించుకొనుట కుపయోగపఱచిన కాలము–కష్టము –ధనము వట్టి దండుగ యని చెప్పుచున్నాను. మీకింత బలమున్నందులకు మీరేమి చేసినారు? బలమన్నందులకు ఫలము దబ్బి చిప్పలుపెట్టి, గొడ్డళ్లతో నొడళ్లు చీల్చుకొనుట యేనా? సమ్మెటలు పెట్టి రొమ్ములమీఁదఁ గొట్టించుకొనుటయేనా? బలమున్నందులకుం గాల్బలములోఁ జేరరాదా? దేశ సేవ యిట్లు చేయరాదా? పోనిండు! ప్రతి గ్రామమందు ననుదినమును సంసారుల సొత్తును హరించుచు వారిని బాధించుచున్న దొంగల యుపద్రవ ముల నాటంకపెట్టి ప్రజాసేవ చేయరాదా? మీబలము పరుల కేరీతిగా నుపయోగపడుచు న్నది? పరులమాట యక్కఱలేదు. మీసంసారములకైన బహుళముగ నుపయోగపడుచు న్నదా? దినమున కొక్కమేఁక, నాలుగుకోళ్లు, బిందెడుపాలు, రెండువీసెలు నేయి నీకే సరిపోదే! నీవింక సంసారమున కేమి పెట్టుదువు? ఇన్నియుఁ జెడదిని నీవు చేయుచున్న ప్రయోజకత్వమేమి? గొలుసును ద్రెంపెదవా? ఆమాత్రపుఁబనికి నింత శరీరము నిట్టిమ నన్ను నిట్టియాత్మకల నీవే కావలయునన్న మాట యేమి? గౌడిగేదె యీగొలుసు త్రెంప లేదా? అంతకు మూఁడు రెట్లు బలముగల గొలుసును గూడ నవలీలగా ద్రెంపునే? నాకింకఁ దెలియక యడుగుచున్నాను. నీ విశేష మేమి?

ఇదిగాక–కండల పుష్టికై నీవు చేయు మహాధికసాధనముచే నీహృదయకోశము తరుచుగాఁ బెద్దదగును. కాదేని దానికి స్థానచలనము కలుగును. నరములన్నియుఁ దెగసాగిపో వును. పైపుష్టియు, నాకారవర్తులత్వము, బాహ్యరూపసౌష్టవమునే నీవు చూచుకొందువు కాని, దేహముననున్న రక్తము దాదాపుగా నంతయుఁ గండలలోనే తిరుగ వలసివచ్చినందువ లన నారక్తమచ్చట బహుళముగాఁ దిరుగునట్లు చేయుటకు నీహృదయకోశ మెంత యసాధా రణముగా, నస్వభావముగాఁ దనకుఁ దగనిపని చేయవలయునో, యందువలన హృదయకోశ మెంత శీఘ్రముగా నాశనమునకుఁ బాలుకావలసివచ్చునో నీ వాలోచించు కొనకుండ నున్నావు. నీహృదయకోశము త్వరగ క్షీణింపనై యున్నది. కావున మీవంటివారి కందరకుఁ దఱచుగా నాయువు మిగులఁ దక్కువ. విషూచి మొదలగు నంటురోగములు గాని, సన్ని పాతాదిజ్వరములుగాని, సర్పదశనస్పర్శాది బాధలుగాని, మీకు సిద్ధించునెడల మీలో నూటికొక రిద్దఱకంటె నెక్కువ బ్రదుకరు. అత్యంగసాధన మాయుక్షయకరమనుట యసత్యము కానేరదు. 'బైసెప్సు' బలిష్ఠమై యుండుటకొఱకు బ్రదుకునే పాడుచేసికొనుట ప్రజ్ఞావంతుని పనియా?

మొండిత్రోపు కాదు. గ్రుడ్డిపోక కాదు. సంకల్పము ప్రయత్నము నుత్సాహము నిందున్నవి కాని లేకపోలేదు. కాని, విశేష మలవాటుమీఁద జరుగుచున్నది. క్రొత్తగాఁ జూచువారి కిది యాశ్చర్యముగా నుండకమానదు. ఇట్టి బలాఢ్యు లిప్పు డెందరో యున్నారు. ప్రత్యున్నత పాఠశాలలో నొక్కరిద్దరున్నారు. ప్రతిగ్రామమందు నొక్కఁ డున్నాఁడు. ఉయ్యాల గొలుసులు ద్రెంపి పిల్లల నేడ్పించి, గడ్డపారలు వంచి కాపువారి నేడ్పించి, చాపరాలు పగులఁగొట్టి చాఁకి వాంద్ర నేడ్పించి, డబ్బుదండుగతో–నిద్రదండుగతో–నూరివారి నేడ్పించి, కొందరు వీరు లిటు నిరాఘాటముగాఁ బనిచేయుచునే యున్నారు. చదువులోఁ–బడుగు –నర్కసులోఁ బిడుగు. ఇట్టివా రీవైపులకంటె మావైపుల నెక్కువమంది యున్నారు. వారిలోఁ ద్యక్త మాంసాహారులగు బ్రాహ్మణులలోనే యెక్కువమంది యున్నారు. ఇంత మాత్రమున విశేష మేమియులేదు. ఇది మగతనమునకు లక్షణమని మగవారు విశేషముగా నాత్మస్తుతు లొనర్చుకొన నక్కరలేదు. మైవా రందరుకూడ నిట్లే యాచరింపవలయునని యుపన్యాసము లక్కరలేదు. ఇంతవరకేల? మానత్యపురమునకు సమీపముననున్న యొక గ్రామములో నొక్క బ్రాహ్మణుఁడు తన పడమటియావొక్కదినమునఁ బాలు సరిగ నీయకపోవుసరికి, దాని నాల్గుకాళ్లను గట్టకట్టి పదునాలు గడుగుల యెత్తైన వీథిగోడమీఁదినుండి దాని నావలఁ బాఱవైచెను. ఆతనితమ్ముఁ డొక్కసారి 'హాష్' అని కాకిని బెదరింపగా నది గిఱగిఱ దిరిగి వెంద్రుక లన్నియు నూడి క్రిందఁబడి చచ్చెను.

అబల లని యన్ని జాతులలోను బ్రసిద్ధకెక్కిన యాఁడువాంద్రు కూడ నిట్టిపనులను సునాయాసముగాఁ జేయుచున్నారు. 1818 సంవత్సరము 'బర్తలోమ్యో' సంతలో సెప్టెంబరు నాలుగవ తేదీని యూరపు ఖండమునందంతటను నద్వితీయబల సంపన్నయగు 'గోబర్టు' అను పేరుగల కాంతాశిరోమణి దేహబలముతో సంబంధించిన యత్యద్భుతచర్యలను బ్రదర్శించెను. అయిదడుగుల పొడుగు, మూఁడడుగుల వెడలుపుగల యొక పెద్దబల్లమీఁద దగ్గఱగాఁ గూరుచుండుట కవకాశమున్న జనులతోఁ గూడ నాబల్లను దంతములతో నామె నులువుగా లేవనెత్తెను. ఒక్కొక్కటి 56 పౌనుల యెత్తుగల 36 బరువులను–అనగా మొత్తముమీఁద 2016 పౌనులబరువు నామె యొక్కసారిగా నతిసూక్ష్మముగా పరసాహాయ్య లేశమైన లేకుండ నెత్తి కొంతసేపు నిలువఁబడి వాని నొడలు దులుపుకొని నట్లు విదల్చుకొనియెను. 340 పెద్దబుడ్లుగల పీపా నెత్తెను. 400 పౌనులుగల పెద్దదాగలి కడుపు మీఁద బెట్టుకొని నాల్గు నమ్మెటలతోఁ గొట్టించుకొనెను. ఆదాగటినే తన తలవెంద్రుకలకుఁ గట్టి నేలమీఁదినుండి పైకెత్తి విలాసార్థముగా నూపెను. కుర్చీ వెనుకకాలిని పండ్లతోఁ బట్టుకొని పైకెత్తి తన తలపైని పది యడుగుల యెత్తువఱకుఁ బోవునట్లు పండ్లబలిమిచే దానిని విసరి వైచెను. రెండుటన్నుల బరువుగల తన ప్రయాణపుబండి, సారథి బుద్ధిలోపమునమట్టిలోఁ జక్రములయిరుసులవఱకుదిగిపోయి చిక్కుకొనఁగా బండిగుఱ్ఱములు దానిని లాగలేక యాఁగిపోయినప్పు డామె యటకు వచ్చి యాయాస లేశమైనఁ బొందకుండ, నాబండిని మట్టిలోనుండి యూడఁబెరికి యావలనున్న మంచినేలను బెట్టెను. ఇంతపని చేయలేకున్నను నిందులోఁ గొంతభాగమగు పనినైనఁ జేయువారు నారీమణులలో నెందరో యున్నారు. అబలలగువారే యింత వింతపనులు చేయుచుండఁగా–మగతనమని –పౌరుషమని–ప్రజ్ఞయని–వెర్రి వెర్రిమాట లాడుకొనుచు–నింక మీసాలు వడివైచుకొనుచు –మెడల్సు దగిలించుకొని–రొమ్ములు విరుచుకొని–యేమొగములఁ బెట్టుకొని మీరు తిరుగు

బలాఢ్యుఁడు. గుండెలపైఁ బెద్దచాఁపరాతిబండలను బెట్టించుకొని సమ్మెటలచేఁ గొట్టించుకొన్నాడు. పెద్ద గొలునును ద్రెంపినాఁడు. పండ్లతోఁ బెద్ద బరువులనుబట్టి లేవఁదీసినాడు. ఇంక నెన్నియో యద్భుతములగు పనులను జేసినాఁడు. అన్నిటికంటె వింత యేమనగా తుద కొక్కయుపన్యాస మిచ్చినాఁడు. దాని సారమిది. ''బుద్ధుఁడు ప్రేమమతమును బోధించి భారతీయజాతినంతను బాడుచేసినాఁడు. జీవహింస కూడదని చెప్పుట యాతని తప్పు. ఆ మతమున ననేకులు చేరి మాంసాహారమును మానివైచిరి. అందుచే దుర్బలులై పౌరుష రహితులై భయస్వభావులై భారతీయులు పాడైపోయిరి. బుద్ధమతము మన ఖండము నుండి పోయినను, పూర్వాచారము లింకను మనల బాధించుచునే యున్నవి. వారువీ రనక యందరుకూడ మాంసమును భుజించి, దేహములను బలసంపన్నములుగఁ బౌరుషవంతములుగఁ జేసికొని భారతవీరు లనిపించుకొనుట యావశ్యకము. భరతఖండము నుద్ధరింప వలసినవారలు మీరే!'' కొంచెము హెచ్చుతగ్గుగ నాతం డీయభిప్రాయము వెల్లడించినాఁడు. ఆతఁడుపన్యాసమునకు శాంతిఁ జెప్పగనే సభవారందరు మహానందమునఁ గరతాళధ్వను లిచ్చిరి.

అందుపై నేను గొంత చెప్పవలసియుందునని తలంచి నే నేమైన మాటలాడవచ్చునా? యని సంఘాధిపతి నడిగితిని. మాటలాడుట కేమున్నది? ఎవ్వరును మాటలాడఁదగదు. ఇది పురభవనము కాదు; పఠనమందిరము కాదు; గ్రంథాలయము కాదు; సర్కసుపాక! ఇది యుపన్యాసములకుఁ దగినతావుకాదని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. మీరేల యుపన్యసించితిరని నే నడిగితిని. నాసాంతపాకలో నా యిష్టానుసార మొనర్తును. నన్నధిక్షేపించుటకు మీకేమి యధికారమున్నదని యాతఁడు బదులు చెప్పెను. బుద్ధదేవు నధిక్షేపించుటకు మీకున్న యధికారమే మిమ్మధిక్షేపించుటకు నాకున్నది. మీసాంతపాకలో మీసాంత పనులెన్ని చేసికొనినను మాకేమియు నభ్యంతరము లేదు. కాని భరత ఖండమునుగూర్చి భారతీయులఁ గూర్చి మీరేమో చెప్పితిరి. కావునఁ బుణ్యవశమున భారతీయులలో నొక్కఁడనగు నేను మీకుఁ బ్రత్యుత్తర మీయవలసివచ్చినదని నే నంటిని. అంత నాసంఘాధిపతి మిగుల విసుఁగుఁదలతో ఏమిచెప్పుదువో చెప్పవయ్యా! మిక్షేమమునుగూర్చి చెప్పినను మీకుఁ బనికిరాకపోయినప్పు డెవ్వఁ డేమిచేయును'' అని పలికెను. అంత నేను సంఘాధిపతి నిలువఁబడిన యెత్తగుస్థలమునకుఁబోయి యిట్లంటిని:—

సోదరులారా! ఈసంఘాధిపతి యీరాత్రిచేసిన చిత్రచర్య లన్నియు నేనును గాంచి మీవలెనే మహానందభరిఁడ నైతిని. అధిక బలప్రదర్శనము చూపరుల కద్భుతజనకము కాకపోదు. నిర్జీవబల ప్రదర్శనమే యాశ్చర్యకరమగునప్పుడు—సజీవబలప్రదర్శనము కాక పోవునా? రైలుబండిలోఁ బ్రాణమేమైననున్నదా? నీటియావిరి బలము తప్ప మరేదియు లేదే! దుర్భరమగు ధాటితో—ధూమశకటము వచ్చునప్పుడు మిగుల వింతగా నుండకమానదు. సముద్రతరంగములు తెల్లని నురుగుతో నడగొండలవలెఁ దీరమును జేరునప్పుడు విచిత్రమైన యనుభవము కలుగక తప్పదు. ఇంతవలకేల? టపాకాయ గట్టిగఁ బ్రేలునప్పుడు విలక్షణమైన యబ్బురము కలుగకపోదు. ఇట్టివన్నియు నిర్జీవబలప్రదర్శనములు. సజీవబలప్రదర్శన మనఁగా మన సంఘాధిపతి చేసిన చర్యాసమూహమువంటిది. ఇచ్చటి శక్తికిఁ ప్రాణమున్నది. ప్రాణము వెనుక మనస్సున్నది. దానివెనుక యాత్మయున్నది. కేవలము

18. దేహబలము, మనోబలము

సాక్షికి, జంఘాల శాస్త్రి ఒక ఉత్తరం రాస్తూ, తానొక సర్కస్ కంపెనీకి వెళ్లి, అక్కడ చూసిన బల ప్రదర్శనలు, తన మనస్సులో కలిగించినభావాలు, అక్కడ బ్రహ్మాండమైన ఆ ప్రదర్శనలు చేసినవ్యక్తి ప్రదర్శనలతో చాలించకుండా దేహబలం ఆవశ్యకత గురించీ, అందుకు మాంసాహారం అవసరం గురించి, బుద్ధుడు ప్రేమమతాన్ని బోధించి భారతీయ జాతినంతనీ పాడు చేశాడనే నీ్యాభిప్రాయం గురించీ, ఉపన్యాసం కూడా చేశాడు.

దానిమీదట ఆ బలశాలి అయిన సంఘాధిపతిని, తానేమైనా మాట్లాడవచ్చునా అని జంఘాల శాస్త్రి అనుమతి కోరినప్పుడు ముందతను దబాయించి విసుక్కున్నాడు. అనుమతి నిరాకరించాడు. కాని, జంఘాలుడి వాదబుద్ధి వల్ల అతను ఒప్పుకోక తప్పలేదు. దాంతో జంఘాల శాస్త్రి ఉపన్యాసం అందుకుని– అక్కడ ఆ బలశాలి చేసిన అద్భుత ప్రదర్శనల్ని ముందు మెచ్చుకున్నాడు. నిర్జీవ యంత్రాల వంటి వాటిలోనే గొప్ప శక్తి చూస్తుండగా లేనిది సజీవమైన మానవ బల ప్రదర్శనం గొప్పది కాకుండా ఎలా పోతుంది? అని మరికొన్ని ఉదాహరణలు ఇచ్చాడు. ఆ బలాల బలప్రదర్శనాలను కూడా ఉంటుంకించాడు. తాను, దేహబలం సంపాదించుకోవాలనే ఉత్తమ భావానికి వ్యతిరేకిని కానని జంఘాల శాస్త్రి స్పష్టం చేశాడు. ఆ బలం 'ప్రదర్శన' విషయంగా కాకుండా ఇతరులకు ఎంతవరకు ఉపయోగపడింది? కనీసం సొంత సంసారానికి ఎంతవరకు ఉపయోగపడింది? ముఖ్యమని నివరించాడు. బుద్ధుడు మాంసాహారం విడిచి పెట్టమన్నది సన్యాసులనని స్పష్టం చేశాడు. దేహ బలానికీ, మనస్సుకీ సంబంధించిన శౌర్యానికీ సంబంధం లేదని స్పష్టం చేశాడు జంఘాల శాస్త్రి. దేహ, మనోబలాల తారతమ్యాన్ని గుర్తు చేశాడు.

జంఘాలశాస్త్రి వ్రాసినలేఖను జదివెదను.

"సాక్షికి జంఘాలుఁడు నమస్కారములు–

నిన్నరాత్రి సర్కసుకంపెనీలోని చిత్రములఁ జూడఁబోయితిని. ఆసంఘాధిపతి బహు

ఈబాధపడలేక సంసార మెటులైన జక్కఁబడునేమో యని వారు ముగ్గురు మాగురువుగారి యొద్దకు వచ్చి యాయనతోఁ దమ సంసారబాధ నంతయుఁ జెప్పుకొనిరి. ఆతఁడు గొట్టమును దీసి దానిలో వారిముగ్గురను జూడుమనెను. అట్టి చూచి యాయూఁడుది భూమిపై బోరగిల పండుకొని కాళ్లు వీలగునంతవఱకు పెనవైచి పైకివంచి చేతు లరసున్న రీతగాఁ జేసి యీప్రక్క నాప్రక్కను దలచుట్టు వీలగునంతవఱకురానిచ్చి నేలపైఁ బ్రాఁకనా రంభించెను. తళుకు మనునంతలో నాబ్రాహ్మణుఁడు పల్లకిబొంగువలెవంగి కాళ్లను దోఁకల వలె వర్తులము గావించి, చేతులపై దబాయించి నిలవఁబడి కొక్కొరోకో యని గట్టిగాఁ గూసి ప్రాకుచున్న భార్యను ముక్కుతోఁ బొడువ సాగెను. ఇంతలో ''మేవు మేవు'' అని కూయుచు కొడుకు తండ్రి గొంతుక పట్టుకొనెను. మాగురువుగారు వారియెదుటనుండి గొట్టమును దీయగనే వారు మువ్వురుగూడఁ బూర్వరూపముల ధరించియుండిరి. అప్పుడు మాగురుపుగారు ''అయ్యా! నీవు పూర్వజన్మమునందుఁ గోడివి. నీభార్య తేలు. నీ కొడుకు బావురు బిల్లి. అందువలన మీకిప్పు డీవిషమత్వము వచ్చినది. నాయనా! విచారింపకుము. ప్రపంచమందుండు ప్రతి సంసారమందుఁ గూడఁ గొలఁదిగనో గొప్పగనో యీవిషమత్వబాధ యున్నది కాని లేకపోలేదు. నీపాటికి నడువు'' మని చెప్పెను.

నాయనలారా! ఇవి కథ లని యెంచవలదు. పరమార్థము లని సమ్మవలయును. ''ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతాలయా'' యని మనవారు చెప్పినమాటకు విలువ లేదు. నీసంసారములోఁ జేరినవారందరు నీయందలి మహానురాగముచే నిన్నుద్ధరించుటకుఁ జేరినవారని నీవెన్నడు ననుకొనవలదు. ఏదియో యేరూపమైనదో ఋణమును దీర్చుకొనవ చ్చినారు. అందరు నొక్కచోఁ జేరినపారు కావునఁ బ్రియా యనఁగఁ బ్రియా, అన్నా యనఁగఁ దమ్ముఁడా, నాయనా యనగ బాబూ! ఇంతే కాని యింతకంటె నేమియులేదు. అనురాగమే యుండు నెడల నాలి పై యాడనీ! భర్త దానిని విసము పెట్టి చంపునో లేదో తప్పుచేసిన కొడుకును తండ్రి తన్ననీ! కొడుకు తిరుగఁబడి కొట్టునో లేదో ప్రేమ! భూమిమీఁదనే! అబ్బ! అబ్బ దోషభోగ్యత్వగుణమే ప్రేమము. అది పరమేశ్వరున కున్నదం దురు. ఆయంశ మిప్పుడు మన కక్కఱ లేదు. కాని యవనిలోనే–అనురాగమే! అబ్బా ఏటి మాటలు! ఋణసంబంధము తక్క మరేదియు లేదు. ఆఋణము తీరినవెంటనే నీగుడిసెమీఁద దెబ్బఁదీసి యెవరిమట్టునకు వారు తుర్రుమని యెగిరిపోవుదురు. కొడుకు కొఱ కేడ్చి యేడ్చి యాతని జూడగ న్వర్గమున కేగి యాతనిఁ గాంచిన యర్జునుని–కన్నకొడు కెట్టి శూలపుఁ బోటు పొడిచినాఁడో జ్ఞప్తిలేదా? ఆపోటొక్క పార్థునికేనా? ప్రాపంచికజనుల కందఱకు. మాభార్యలు మాపిల్లలు మాసోదరులని వెఱ్రిపడవలదు. నాయనలారా! ''నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ఁ నిక్కంబు సంసార సంచారుల్ సత్తురు పోదు'' రని యందఱకుఁ దెలియును. కాని యందరు మఱచునట్టి యంశ మదియొక్కటియే. నాయనలారా! ఇన్నికోటుల జనులలో నొక్కఁడు మరువవచ్చును. ఇద్దరు మరువవచ్చును. అంద రొక్కటే మఱపా? ఒక్కటే పరాకా? సృష్టిలో నింతకంటె వింత యేమున్నది? ఏదైన వింతనుగూర్చి చెప్పుమని మీరు నన్నుఁ గోరితిరి. కావున నిది చెప్పితిని. ఇంతకంటె వింత యేమైన నున్నయెడల మీరు చెప్పుడు. నేను విందును. చాల చెప్పితిని గాఁబోలు–క్షమింపుడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

డనే పంపాసరోవరమునకు వచ్చి యుంటిని. ఆతఁడు మహానుభావుఁడని యాతని నాశ్ర యించి కొంతకాల మాతనితోఁ దిరిగితిని. ఆతనియొద్ద నొకగొట్ట మున్నది. దానిలో నేమి యున్నదో యెవ్వరికిని దెలియదు. నేనుమాత్ర మొక్కసారి చూచితిని. దానిమాహాత్మ్యము నేనెరుఁగుదును. అతఁడు మహాత్ముఁడని పంపాసరోవరసమీప గ్రామములగు హోనపేట –ఆనెగొంది–సగాపురము–గంగావతి మొదలగుగ్రామములలోఁ బ్రతీతి బయలువెడలెను. ప్రతిదినముకూడ నెవ్వరో వచ్చి యాతనిని దర్శించి యాయనవలన నేవియో స్వవిషయము లను దెలిసికొని పోవుచుండెడినారు. ఒకనాఁడు నే నాతని చిలుములోనికి జ్ఞానపత్రపుటుం డను జేయుచుండగా నొక్కఁ డెవ్వఁడో వచ్చి యాతనితో ''స్వామీ! నాకుఁ బిల్లి నేల సృష్టింపవలయునో బోధపడదు. పోనీ! సృష్టించినాఁడయ్యా! పిల్లిజాతియున్న భూమిలో ననున్నగూడ నేల సృష్టింపవలయును? ఇంతటినుండి పిల్లియైనను బ్రపంచమున నుండవల యును. నేనైన నుండవలయును. మీరు మహాత్ములని తెలిసి మార్గాంతరము గోచరింపక మీయొద్దకు వచ్చితిని'' అనెను. ఈతని మాటలు–నాయనలారా! మీకు వెర్రివాని మాటలవలెఁ గానఁబడవచ్చును. ఆతఁ డెంతమాత్రమును బిచ్చివాఁడు కాఁడు. పిల్లి యెడలఁగల శత్రుత్వ మంతకంటెఁ బ్రబలతరమైనది. నే నెరుఁగుదును. ద్వారపూడి మండపేట నడుమనున్న యొకగ్రామములో నొకగృహస్థు నింటికి నేను భోజనమునకు వెళ్లితిని. ఆతనికి మార్జాలనైర మున్నదని నే నంతకుఁబూర్వ మెరుఁగను. మేము భోజన మారంభించితిమి: పొరుగింటిలో నుండి పిల్లి యఱచెను. ఆయఱపు విని యాబ్రాహ్మణుఁ డులికిపడి కెవ్వునఁ గేకవైచి విస్తరియొద్దనుండి లేవఁబోవఁగ నేనాతనిని బట్టుకొంటిని. ''హరహరా! ఇంక నవసాననమయ మేనా! చూచెదవేమి? తుంగచాపను బఱచుము, భూశయన మొనర్తును'' అని పెద్దపెట్టున నాతఁ డేడ్చెను. ''మీకు వచ్చిన భయమేమియు లేదు. నే ననేక మార్జాల మారకుఁడను. నే నుంటిని భోజనము చేయు'' మని నే నంటిని. ''నాయనా! నీ యమ్మకడుపు చల్లగా–నీ యత్తకడుపు చల్లగా–నూరేండ్లు వర్ధిల్లుము. నాతండ్రీ! ఈపొరుగింటి పిల్లినిగూడఁ జంపుము. బాబూ! నీకడుపునఁ బుట్టెదను. ఇంటిలోని యాఁడుది సరియైనది కానప్పుడు పొరుగింటి నుండి పిల్లి కూసినదనగా నాశ్చర్యమేమి?'' యని మగనాలియగు తనమగువకు మార్జాలవా గ్బంధనశక్తి లేకపోయెనని విలపించెను. ఇంక నెంతయో చిత్రము జరిగినదికాని యీవృత్తాంత మున కేమి? పంపాసరోవరమునకు వచ్చి తన కున్న పిల్లిబాధను జెప్పుకొనిన యాతని మాటలను విని మాగురువుగారు కంబళిచుట్టలోని గొట్టమును దీసి ''దానితోఁ జూచి యేమి కానఁబడుచున్నదో చెప్పు'' మనెను. ''గొప్ప యెలుక కానఁబడుచున్నది స్వామీ! అది యెంతో సుందరముగా నున్నది స్వామీ! గొట్ట మింకను మూయకుము. దాని నెంతసేపు చూచినను జూడవలయుననియే యున్న''దని యాతఁ డనెను. అంత మాగురువు ''అయ్యా! పూర్వజన్మమున నీవే యా యెలుకవు. ఱాకలిఁగొని నోరు తెఱచుకొని యొక చెట్టుక్రింద సొమ్మసిల్లి పడిపోయిన యొక బాటసారినోట నీవు చెట్టుమీఁదనుండి యబుద్ధి పూర్వకముగాఁ బడనైచిన మాంసశకలమువలనఁ గలిగిన సుకృతమున నీవు మనుష్యుఁడనై జన్మించితివి. నీకుఁ బూర్వసంస్కారము లింకను బాగుగా నశింపకపోవుటవలన నీకుఁ బిల్లి యనఁగ నింతభయము, వైరము. కాని పిల్లివలన నీకెప్పు డపాయము రానేర''దని యాతనితోఁ జెప్పి పంపినైచెను. ఇంతలో నొక్క బ్రాహ్మణుఁడు నాతనిభార్యయుఁ బుత్రుఁడు నక్కడకు వచ్చిరి. భార్యకు భర్తకును బొత్తు లేదు. తల్లిదండ్రులనగఁ గొడుగునకుఁ బడదు.

జంపినదాఁక ప్రాణము లఱ చేతిలోఁ బెట్టుకొని యుండును. ఆతని కొక్కనికే యీభయము కాదు. మూఁడవహెన్రీ అను ప్రభుఁడు తనకోటలోఁ బిల్లి చేరకుండ నెన్ని పాటులైనఁ బడినాఁడు. ఫెర్డినాండు చక్రవర్తి ప్రధానోద్యోగులలో నొకనికిఁ బిల్లికూఁత వినగనే ముక్కు వెంట రక్తము కాలువలుగాఁ గట్టవలసినదే. (ఫ్రాన్సు) దేశమున నొక స్త్రీ పీఁతలను జూడగనే మొర్రో యని యేడ్చి కొయ్యబారిపోయెడిది. ఎరాస్మను అను నాతనికిఁ జేపవాసన కొట్టగానే నన్నిపాతజ్వరము రావలసినదే. మార్షలు డి అల్బర్డు అను నాతఁ డూరబందిని గాంచి చచ్చుటకు సిద్ధమగుచుండెడి వాఁడు. నూరయ్యగారికి కప్ప యనఁగ వైరము. పేరయ్యగారికిఁ జంచనఁగ శత్రుత్వము. సోమన్న గారికి రోఁకలిబండ యన్నరోఁత. కోటయ్య గారికి గొంగళిపురు గన్న నేడుపు. నరసన్న గారికి నల్లికన్నుల పామనఁగ నింత యంత భయముకాదు. ఇటులెన్ని చెప్పవచ్చును? దాదాపుగా మనుజులకందఱకు నేవియో కొన్ని జంతువులపై నిష్కారణ విరోధ ముండితీరినది. అవి తమ్మిఁ జంపునేమో యను భయముచే–నవి దూరముగాఁ బోవువఱకు–వారికి మనశ్శాంతి యుండదు.

పోనిండు–నాయనలారా! ఆజంతువులం దేవియో యసహ్య స్వభావము లుండుటచేత వానియందు నరులకు వైరము గలిగియుండునని యూహింతము. ఇంతమట్టునకుఁగూడ సరియే. కాని యిది యేమి? గులాబిపూవును జూడగనే గ్రుడ్లుతేలవైచి క్రిందఁ బడిపోయిన యొక సన్యాసి యుండెడివాఁడు. ఆతఁడు గులాబిపూలు పూచు ఋతువు నందు –గదివెలుపలికి రాకుండ నుండెడివాఁడు. పందిరిమీఁద మల్లె పూవును జూడగానే బ్రహ్మరంధ్రమునఁ బోటుపుట్టినవాఁ డొకఁడు. మెత్తని పట్టు తనువునకుఁ దగులగనే యొడలు గగురుపొడిచి కాల్చిన ట్లేడ్చినవాఁ డొకఁడు. తేనెమాట వినునరికిఁ దీవరించి నోటికిరాని తిట్లు తిట్టినవాని నే నెరుఁగుదును. ఈతనికిఁ గాలిపై నొకప్పుడు కురుపువేసినది. దానికి పలాస్త్రీపట్టీ వేసిరి. ఆపట్టిలోఁ దేనె కొంత కలిసినదని యాతఁ డెట్లు గ్రహించెనో–పట్టివేయు నరికి వేసినవానిని జుట్టుపట్టుకొని నేలమీఁద బడఁద్రోచిఁ గుద్దినాఁడు. నికెనార్ అను నాతఁడు వీణారవమును వినఁగనే ప్రాణాపాయదశ నొందెడివాఁడు. బోయిల్ అనువాఁడు నీటిజల్లుడు వినగనే మూర్ఛపడెడువాఁడు–చీఁపురుకట్ట యూడుపుధ్వనిని వినఁగనే పండ్లు గిట్టకఱచుకొని చావచుట్టగ నొక్కఁడు పడిపోయెడివాఁడు. టైకోబ్రాహి యనువాఁడు నక్కను జూచి విన్నపతి నొందెడివాఁడు. ఇట్టు లెన్ని చెప్పఁగలను! ఇట్లందఱకుఁగూడ నేదియో వస్తువునెడల శత్రుత్వ ముండితీరినది. నాయనలారా! ఇకఁ బ్రపంచమున ననురాగ మెచ్చటనున్నదో యోచించుకొనుఁడు.

నేను హిమాచలము మొదలు సింహళమువఱకున్న దేశమునంతయుఁ జూచినాను. అనేక పుణ్యక్షేత్రములఁ జూచితిని–అనేక పుణ్య నదుల మునిఁగితిని–అనేక పర్వతము లెక్కితిని–అనేక వేషములు వేసితిని–అనేక వృత్తులొనర్చితిని. కిష్కింధలోఁ బంపాసరోవర మున్నది. అది కొంత నదీరూపముగాఁ గొంత తటాకరూపముగా నున్నది. ఆ సరోవరప్రాంతమున నొక్కబైరాగులమఠ మున్నది. అనుదినముగూడ రెండుమూఁడువందల బైరాగులచ్చట నుందురు. కైలాసపర్వత ప్రాంతములనుండి–బ్రహ్మపుత్రోత్తర ప్రాంతములనుండి –సింధు పశ్చిమ ప్రాంతములనుండి–వింధ్య పర్వతగుహాళులనుండి–యనేక విరాగులిటకుఁ దఱచుగా వచ్చుచుందురు. ఒక బైరాగికి బదరీనారాయణములో నేను శిష్యుఁడనైయాతనితో

రములలో నున్నవి. యథార్థమైన యనురాగము లేదు. సంసారానురాగమే యిట్లు చట్టుబండలై పోవగ–నింక–జనానురాగమా? అబ్బ! ఎంతమాట! వ్రాఁతలలో–కూఁతలలో–అంతే. మరెక్కడ ననురాగము లేదు. ఉన్నదొక్క–యాత్మాను రాగము. ప్రపంచచర్య లన్నియు –దయాధర్మప్రేరితము లని మీరు భ్రమించుచున్న కర్మములన్నియు–దానివలననే జరుగుచున్నవి. ఎంత సేపు–తాను–తనది–అంతే. అంతే. పరమార్థమున ముమ్మాటికి నంతే తన కాపద వచ్చినప్పుడు పరునిమాటఁ జెప్పఁదగదు! ఆ పరవ్యక్తి కొడుకయిన సరే–తండ్రియైన సరే–తల్లియైన సరే–భార్యయైన సరే–

''పోనిండు! నాయనలారా! ఇతరులపై ననురాగము లేదు. ఇంతేకదా! ఇతరులపైఁ బ్రత్యక్షవిరోధభావము లేనప్పు డిఁక విచారమేల? విరోధభావము లేదేమి? ఉన్నదేయది. పురుగునకుఁ గప్పకుఁ—గప్పకుఁ బామునకుఁ బామునకుఁ దుప్పికి–దుప్పికిఁ బులికి–బులికి రేచునకు–నెలుకకుఁ బిల్లికిఁ గుక్క–కు–ఉన్న దేది? ఇటులెన్ని చెప్పవచ్చును? ఒక జీవమును జంపి వేరొక జీవము పొట్ట పోసికొనుచున్నది. ప్రాణికిఁ బ్రాణియే జీవనోపాధి. అన్ని జంతువులను నరుఁడు చంపుచున్నాఁడు. దుష్టములగు జంతువులను దుష్టములని చంపుచున్నాఁడు. శిష్టములగు కొన్ని జంతువులను భక్ష్యములని చంపుచున్నాఁడు. మరికొన్నిఁటిని జంపుటయే మెరుఁగనింపించునంతటి బానిసతనమునఁ బట్టి బంధించి యుపయోగించుకొనుచున్నాఁడు. కీటకాదులను తుచ్ఛములని చంపుచున్నాఁడు. కాలిక్రింది–గాలిలోనివి–నీటిలోనివి–యెరుఁగకుండ నెన్నిటినో చంపుచున్నాఁడు. ఇంతేనా? ఇంతటితో సరిపోయిన నింకేమి? వ్యాజ్యేములలో నరు లొకరిధనము నొకరు తీసికొనుచున్నారు. యుద్ధములలోఁ బ్రాణములను దీసికొను చున్నారు. మత్సరముతోఁ మదాధికతతోఁ బ్రాణాధికమైన మానములను దీసికొనుచున్నారు. ఇదిగాక యుపభర్తయెడల మదనాగ్నిచే భార్య భర్తను దంపటివేయుచున్నది. తండ్రి వ్యభిచారియై కొడుకుకడుపు మాడ్చుచున్నాఁడు. కార్ఖేములోని కురుపు కోయించుకొని కొడుకు తండ్రిగొంతుఁ గోయుచున్నాఁడు. ఉత్తమర్ణుఁడధమర్ణులఁ జంపు చున్నాఁడు. ధనికులు దరిద్రులను నమలి మ్రింగుచున్నారు. విశ్వాసహీనులగు భృత్యులు భూపతికి భూశయన మిచ్చుచున్నారు. భూమిలోఁ బుట్టినవారిలో విరోధభావములేని దెవరికి? చచ్చికూడ బ్రదికియున్న వారిని జంపువా రనేకులున్నారు. ప్రతిమనుజునకుఁ గావలసినదేది? తన మేలు–పై వాని కీడు. తన లాభము–పై వాని నష్టి. తన బ్రదుకు–పై వాని చావు. అంతే–

నరులు స్వలాభసేక్షు ప్రధానులు. కావున వారిలో వారి కన్నివైరము లుండుట సహజమే! కాని యింతలో మరియొక వింత యేల? కొన్ని జంతువులను నరులు తినుచున్నారు. కడుపు కక్కు–రితచే నీక్రౌర్యములను వానియందుఁ గనఁబఱచుచున్నారు. మరికొన్ని జంతువులను భారవహనాదికృత్యములం దుపయోగ పఱచుచున్నారు. తమబాధ తగ్గుటకై యిట్టి శత్రుత్వమును వానియం దగపఱచు చున్నారు. ఇంతమట్టునకు సరియే. ఏదోవిధముగా సమర్థించుకొన వచ్చును. కాని, నిష్కారణముగాఁ గొన్ని యల్ప జంతువు లందు వైరభావ మూనుచున్నారు. ఇదిమాత్రము కొంచెము విరుద్ధముగా నున్నదని చెప్పకతప్పదు. బోయరు యుద్ధమునఁ బొడిచి గెలిచిన రాబర్ట్సు ప్రభువునకుఁ బిల్లియనఁగఁ బ్రాణభయము. ఫిరంగిగుండునకు జంకని యాతఁడు పిల్లి కనఁబడినవెంటనే దానిని

బడి–మరియొక్క కనురెప్ప పాటులో మాటుమడఁగెను. అంతఁ గన్ను లొత్తుకొనుచు నామె ''అయ్యో! అంతకంటెఁ గావలసినదేమి? నాతనువు నాభర్తకై వినియోగపడుటకంటె నాకు వేరు నుగతియున్నదా? కాని, తల్లికిఁ గరమైన యీచంటివాని బ్రదుకేమి యగునురా భగవంతుఁడా? యని యేడ్చు చున్నాను. నోరెరుఁగని పసిబిడ్డ–తల్లి చావుపిల్లఁడు–అయ్యో –తండ్రి బెంపఁగలఁడా? కన్న కడుపుబాధ కన్నదానికి'' అని యింకేమేమో చెప్పఁబో వుచుండఁగాఁ దిరుగళూల తెర ద్విగుణీకృతబాధతో వచ్చినవాని వలె పెణకకూలి మీఁదఁ బడున ట్లూపండితుఁ డేడ్చెను. ఈసారి యాతని యేడ్పు నిజమైన యేడ్పు. ఇంక నభినయమేల? ఇంతకాలమునుండి నమ్ముకొన్న భార్య యిట్లు మనఃపూర్వకముగాఁ ద్రుణప్రా యముగా విడిచి పెట్టినదికదా యని యాతఁడు గుండె లవిసిపోవ నేడ్చి, వెంటనే కొంత క్రోధముతోఁ గూడిన పట్టుదలను వహించి యూరకుండెను. పరమహంస యంతట నాతనితల్లినిఁ బిలిచి ''అమ్మా! నీకొడుకుకొఱకు నీప్రాణముల నర్పింపఁగలవా?'' యని యడుగ–''స్వామీ! ఏమని చెప్పఁగలను. కోడలు వట్టి తెలివితక్కువది. కుర్రవాఁడు వీథిలోనికిఁ బోయి నాల్గుడబ్బులు తెచ్చినఁగాని సంసారము జరుగు సాధనములేదు. ఇంటిలోఁ బెద్దదిక్కయి వేయికనులఁ గనిపట్టియుండు నే నింక నుండగనే–కొంప యీఱుమ్మూఁడుగా నున్నది. నేనుగూడ లేకుండునెడల నిఁకఁ జెప్పవలసినదేమి? అదిగాక స్వామీ! చంటివానికి నాయొద్ద జనవెక్కువ. వాఁడుఁ బెంగటిల్లిపోయినయెడల నింక వంశవృద్ధి యేలాగు? కోడలికి రెండవకానుపు వచ్చున ట్లగపడకుండ నున్నది. ఇంతకంటె నాకేమియు నందేహములేదు'' అని తల్లి చెప్పెను. అర్ధశరీరిణియగు భార్య యట్లు పలుకగాఁ–దనువులోఁ దనువు-రక్తములో రక్తము-ప్రేగులోఁ బ్రేగు–నైన యొక్కకొడుకును గూర్చి కన్నతల్లియే యిట్లు పలుకగా–''జయా పరమేశ్వరా! జయా పరమేశ్వరా! ఊ'' యని మంచమునుండి దుమికి ''ఇదిగో నన్యసించుచున్నాను. పరమహంసశిఖామణీ! నీశాటి నాకిమ్ము'' అని పలికి జన్నిదములఁ ద్రెంపుకొని యాతఁడు నన్యాసియయ్యెను.

నాయనలారా! నంసారములోని యనురాగ మెట్టిదో చూచితిరా? ఒక్క యీపండి తుని నంసారములోనిదే కాదు. అన్ని నంసారములలోనిది కూడ నట్టిదే–కొంద రీలోప మెరుఁగుదురు. కొందరు బొత్తిగా నెరుఁగరు. కొందరు కొంతయెరిఁగి కొంత యెరుఁగ కుండ నున్నారు. కొంద రెరిఁగియు నెరుఁగనట్లున్నారు. కొంద రెరుఁగకుండి నెరిఁగినట్లు న్నారు. ఇటులే–ఇటులేకొంద ఱంధులు–కొందరేకాక్షులు–కొందరు మెల్లకంటివారు –కొందరు రేజీకటి వారు–కొంద ఱంతరకునుమములవారు–కొందరు తిరుగుడు గ్రుడ్ల వారు–కొందరు పిల్లికన్నులవారు–కొందరు గాజుకన్నులవారు–ఏమని చెప్పను? నాయన లారా? ఒక రీతియా? ఒక జాతియా? ఒక తెన్నా? ఒకతీరా! కొందరు పైకి వెకవెకలు–లోపలఁ దెకదెకలు. కొందరు పైకి ముసిముసులు–లోపల రొనరొనలు. కొందరు పైకి మమకారములు –లోపల నహంకారములు. కొంద రెడమొగములు–కొందరు పెడమొగములు. తప్పదురా భగవంతుఁడా యని పిల్లివలెఁ గన్నులు మూసికొని కొంద రెంగిలిమెదుకులను దినుచు న్నారు. కొందరు దున్నపోతులవలె గడ్డిని దినుచున్నారు. కొందరు కంట్రాక్టులు–కొందరు రాజీనామాలు. కొందరు విడాకులు–కొందఱట్టి ముళ్లు–యిట్టి త్రెంపులు–కొంద ఱట్టి యదుకులు–ఇట్టి విరుగుటలు కొందరు మాసికలు–రప్పలు–బ్రహ్మకమ్ములు –నాయనలారా! ఎన్నిరీతులని చెప్పగలను? అన్ని–నటనలు–మోసములు–మాయలు నంసా

శ్రీరామకృష్ణపరమహంస యొక్క చిన్న యితిహాసమును జెప్పినాఁడు. ఒక పండితుఁడు రామకృష్ణ పరమహంస యొద్దకు వచ్చి యామహానుభావునకుఁ బాదాభివందన మాచరించుచుండెను. ఆపండితుఁడు పరమహంసను గురువుగాను దైవముగాను జూచుకొనుచు సేవించు చుండెను. కొంతకాల మిట్లు జరుగఁగా–నాపండితునకు సన్యసింప వలయు నని బుద్ధిపుట్టి తన యభిప్రాయమును బరమహంసకు వెల్లడించెను. ''సంసారబంధములను గోసికొనుటకు నీకు సమర్థత కలిగినయెడల సన్యసింపనేవచ్చు!' నని యాపరమహంస పలికెను. ''నామట్టునకు నేను గోసి కొంటిని. నా కిప్పుడు భార్యయం దనురాగము లేదు. ఉన్న యొక్క పుత్రునియందును లేదు. వృద్ధయైన కన్న తల్లియందును లేదు. కాని వారందఱకు నాయందు మమకార మింక విడువకున్నది. కొడుకు మిగులఁ జిన్నవాఁడు. నేను సన్యసించునెడల నాతఁడు బెంగగొని మరణించు నేమో? అదిగాక భార్య మహానురాగ వతి; నావిశ్లేషమున నామెగుండె పగిలి చచ్చిపోవునేమో? అదిగాక–తల్లి–నాచేతఁ గడతేఱవల యునని యెంచిన తల్లి–నేను సన్యసించునెడల దిక్కులేనిదై యేగోఁతిలోనో నూఁతిలోనో పడి ప్రాణములు వాయునేమో! ఈభయము నా కెంతయైన నున్నది. ఇన్ని ప్రాణములకు బాధ నిచ్చినవాఁడ నగుదునేమో యని తటపటాయించుచున్నాను'' అని పండితుఁడు పలికెను. పరమహంస మందహాస మొనర్చి ''నాయనా! నీవింటికిఁబోయి కడుపునొప్పిని నటించి గట్టిగ నేడ్చుచుండుము. నేను గొంతసేపటికి నీయింటికివత్తు''నని చెప్పి యాతనిఁ బంపివైచెను. ఆపండితుఁ డింటికిఁ బోయి, మాయా గర్భవేదనచే నిల్లెగిరిపోవ నేడ్చుచుం డెను. భయంకరమైన యాతని బాధఁ గాంచి–యాతినిభార్య పరిపరివిధములఁ బలవించుచు న్నది. పరిదేవన మొనర్చుచున్నది. భర్తపాదములయొద్దఁ బడి తల నేలపైఁ గొట్టుకొనుచు న్నది. చిన్నపిల్లవాఁడు తల్లి యేడ్చుచున్నదని యేడ్చుచున్నాఁడు. పాప మాపండితుని తల్లి–నాయనా! నీకు వచ్చినబాధ నాకు రాఁగూడదా! నే నెందుల కింతకాలము బ్రదికియుం టిని? నీచేతులలో వెడలిపోవలసినదాననురా! నాయనా! నాకన్నులు కాలిపోను! నీబాధ నేను జూడలేనురా! ఓమరణ దేవతా! నన్ను శీఘ్రముగాఁ గొనిపోవా'' యని కురరివలె మహాకరుణ ముగా విలపించుచున్నది. మంచముమీఁదఁ బండుకొనలేక, కూరుచుండ లేక, నట్టిటు గొంతునులిమిన కోడివలె గిజగిజ కొట్టుకొనుచుఁ బండితుడు ప్రాణోత్క్రమణ లక్షణముల నభినయించుచున్నాఁడు. పండితుఁడే పాత్రాభినయమునకుఁ బ్రయత్నించినప్పు డింక లోప మేమి? ఇంతలోఁ బరమహంస యచ్చటికి విచ్చేసినాఁడు. ఆయనను గాంచి తల్లియు భార్యయు నామహానుభావుఁ డీతని ప్రాణములఁ గాపాడఁగలఁడని యాసచే నాతని కాళులపైఁ బడిరి. ఆతఁడు మంచమును సమీపించి–రోగినిఁ జూచి తల పంకించి–యూరకుండెను. ఆసందిగ్ధదశను సహింపలేక, ''స్వామీ! మీరు భగవంతునివలె వచ్చినారు. ఈతనిని బ్రదికిం తురా? మమ్ము గంగలో దిగుమందురా?'' యని గుండెలు బాదుకొనుచు గొంతెత్తి గోలుమని యేడ్చిరి. ''అమ్మా! నీవు–అమ్మా నీవు–గుండెలు పగుల నేడువకుఁడు–నేడ్చి లాభములేదు'' అని పరమహంస పలికెను. ''అయ్యో! అయ్యో! ఇఁక బ్రదుకఁడా'' యని నేలనుబడి మూర్ఛపడిరి. వారు కొంత ప్రజ్ఞను గాంచిన పిమ్మట నాతనిభార్యతోఁ బరమ హంస, ''అమ్మా! నీభర్త బ్రతుకుట కొక్క యుపాయ మున్నది. ఆయనకుఁ బ్రతినిధిగ నీవు మృతినొందుదువేని యాతఁడు బ్రతుకును'' అని పలికెను. అదివఱకుఁ దారకములో నున్న యేడుపు మధ్యమకాలములోని కట్టే దిగిపోయి–తళుకుమనునంతలో–మందరములోఁ

నదని నేను సభవారినడిగితిని. ఏదైన వింతనుగూర్చి యుపన్యసింపు మని సభలో గొందఱనిరి. అప్పుడు నే నిట్లంటిని.

నాయనలారా! ఏదైన వింతనుగూర్చి చెప్పుమంటిరా? సృష్టి కంటె వింత యేమన్నది? జనులు పుట్టుచున్నారు. చచ్చుచున్నారు. ఇక్కడి బ్రదు కశాశ్వతమని యందెరుఁగుదురు. కాని యిదియే శాశ్వతమని మాటలాడుచున్నారు. నిశ్చయపఱచు కొనుచున్నారు. ఆచరించుచున్నారు. శాశ్వతము కాదని మృత్యుదేవత యాచెంప నీచెంప వాయించుచున్నది. చెప్పుఁ దీసికొని నెత్తిపైఁ గొట్టుచున్నది. మిమ్ము మట్టిలోఁ గలుపుచున్నది. భస్మమొనర్చుచున్నది. ఉష్ణాన నూఁదివైచుచున్నది. ఏమిచేసిన నేమి? ఎంతచేసిన నేమి? మీకు సిగ్గు బిడియములున్నవా? రాలతో నున్నముతో నిండ్లు కట్టించుచున్నారు. ఇనుముతో బొట్టులను మందసములను జేయించుచున్నారు. వెండితోఁ బాత్రములు చేయించుచున్నారు. బంగారుతో వస్తువులు చేయించు చున్నారు. కట్టించినయిండ్లింకఁ దడియైన నారకుండనున్నవి. చేయించిన పెట్టెల మెరుఁగైన నింకఁబోకున్నది. తరిగిపోవును–విరిగిపోవును–అరగిపోవును–కరఁగిపోవునని మీరేడ్చియేడ్చి చేయించిన వన్నియుఁ దరుగకుండ, విరుగకుండ, నరుగకుండఁ గరఁగకుండనే మీరు తరుగుచున్నారు, విరుగుచున్నారు, అరుగుచున్నారు, కరఁగుచున్నారు. మీరు సంపాదించిన భూము లిక్కడనే యున్నవి. మీరార్జించిన సొమ్ములన్నియు నిక్కడనే యున్నవి. ధరించిన వస్త్రాదులన్నియు నిక్కడనే యున్నవి. మీమీఁదనే ప్రాణములు పెట్టుకొని కాలక్షేప మాచరించిన యాలుబిడ్డలు–ఒక్కయడుగైన మీతోఁ బెట్టకుండ–నిండ్లయొద్ద మీధనమును గాచికొనుఁ బదిలముగా నున్నారు. మిమ్మిఁ దొట్టిలోఁ బెట్టినదినమునఁ గట్టిన మొలత్రాడైన మీతో రాకుండ–నదియుఁ గూడ లాగివైచుచున్నారు. మీరు కట్టించిన యిండ్లలోనైన మిమ్ము గాల్పక, మీరు ప్రాతించిన తోఁటలలోనైన మిమ్మిఁ బ్రాతిపెట్టక గాడిదెలు పారలుచోటఁ, గుక్కలు పాడుచేసినచోట, దుర్గంధభూయిష్ఠ మైనచోట మిమ్ముల మంటఁబెట్టుచున్నారు. గోఁతబెట్టుచున్నారు. ఏదియెటులున్నను బ్రదుకవలయునను పామరత్వము తక్క మీ కేమియు లేదు. బ్రదుకవలయును. బ్రదుకవలయును. ఎల్లకాలము బ్రదుకవలయును. ఎవరు చచ్చినను నరే నీవుమాత్రము బ్రదుకవలయును. ఎంతసేపు–నీసుఖము–నీమేలు–నీలాభము, నీబ్రతుకే కాని నీకు వేరొక్క–చింతయే లేదు. నీవు చత్తువని యెరుఁగుదువు. కాని యా మాట మఱచిపోవుదువు. వార్ధకదేవత నీవెన్ను పాము విరుఁగఁగొట్టి–నిన్నుఁ దిర్యగ్గమనుని చేసినను, మృతి సమీపించుచున్నది కదా యను మాటనైన మనసునఁ జేరనీయక–కర్ర చేతఁబుచ్చుకొని–యెంగిలి మెదుకులు దినుచున్న పిల్లిని గొట్టఁబోవుదువు. వార్ధకదేవత నీయెదుటఁబడి మూఁతిమీఁద దన్ని పండ్లు రాలఁగొట్టినను మరణసన్నద్ధుఁడవై యుండక, యవసానమను మాటనైన నంతరంగమునఁ జేరనీయక, మఱలఁ బండ్లుకట్టించుకొని–యిదివఱకు బ్రతికిన సిగ్గుమాలిన –పనికిమాలిన–మొండిమోటబ్రదకు–తిరిగి బ్రదుక దలఁచుకొందువు. మృతిమాట నెవఁడైన నీకు జ్ఞప్తిసేయఁగ మహాహంకారివై నీవే చావుము, నీవే చావుమని యాతనిని శపింతువు. నీమీఁదనే నీకుఁ బ్రేమముగాని నీకొకని మీఁదఁ బ్రేమము లేదు. నీకట్లున్నప్పుడు నీమీఁద నొకనికిఁ బ్రేమ ముండునా? లేదు. సార్వజనీనానురాగము కూడ మిథ్య. ఎవని మట్టునకు వాఁడే. తల్లి లేదు. తండ్రి లేడు. కొడుకు లేఁడు. భార్య లేదు. ఉన్నవాఁడవు నీవే.

17. ఆత్మానురాగము

సాక్షికి జంఘాలశాస్త్రి వ్రాసిన మరోఉత్తరం ఇది. విద్యాలను ఉద్దేశించి, మనస్తత్వ మహత్వాన్ని గురించి చెప్పిన ఉపన్యాసం విన్న తరవాత ఆ ఉపన్యాస విషయం గ్రామం అంతటికీ తెలిసింది. దాంతో, ఇంకో ఉపన్యాసం ఇమ్మని అనేకులు కోరడంవల్ల జంఘాల శాస్త్రి ఒక బహిరంగసభలో మాట్లాడవలసి వచ్చింది. ఆ ఉపన్యాస సారాంశమే ఇది. శ్రోతలు జంఘా లుణ్ణి, ఏదైనా వింతను గురించి ఉపన్యసించమని కోరారు. సృష్టి కంటె వింత అయినది ఏముందీ అని అతను ఎత్తుకున్నాడు. చావు అనేది తథ్యమని తెలిసినా మనిషి తన్నుతాను ఎలా మభ్య పెట్టుకుంటున్నాడో విశదించేశాడు. మనిషి తన్ను తాను ప్రేమించుకున్నంతగా ఇంక దేనినీ ప్రేమించడని తేల్చి చెప్పాడు.

ఇందుకు ఉదాహరణగా రామకృష్ణ పరమహంస అనుభవాన్ని ఒకటి కథనం చేశాడు జంఘాల శాస్త్రి. సంసారంలో అనురాగమే అంతంత మాత్రంగా వుంటే, 'జనానురాగం' అనేది కేవలం మాటలకే పరిమితమని ఈసడించాడు.

పరస్పర వైరాలూ, స్వలాభాపేక్షలు, నవ్వు పుట్టించి, వింత గొలిపే మనుషుల భయాలు జంఘాల శాస్త్రి ఏకరువు పెట్టాడు. పైగా వీటిని కేవలం కథలుగా కొట్టి పారెయ్యవద్దని కోరాడు. చలివేంద్రం దగ్గరకి మనుషులు వస్తూ పోతున్నట్టే ఈ ప్రపంచంలో మనుషులు వస్తూపోతుంటారు. ఈ సత్యాన్ని ఏ ఒక ఒకడో పరాకుపడడం కాదు; అందరూ పరాకుపడడమే వింతలలో వింత–అని జంఘాలశాస్త్రి ఉపన్యాసం ముగించాడు.

జంఘాలశాస్త్రి వ్రాసిన లేఖను జదివెదను.

సాక్షికిఁ:–జంఘాలుఁడు నమస్కారములు–క్రిందటిసారి పాఠశాలలో బాలురయెదుట మనశ్శక్తులనుగూర్చి యుపన్యసించితినన్న యంశము గ్రామమంతయుఁ బ్రాఁకినది. మరి యొక యుపన్యాస మిమ్మని యనేకులు నన్నుఁ గోరిరి. నాకు నాదేహమున ననారోగ్యముగా నున్నను–వారి ప్రార్థనాప్రాబల్యమున నంగీకరింపవలసివచ్చినది. జనసమూహము మహాధిక ముగా నుండుటచే బహిరంగసభయే జరుపవలసి వచ్చినది. దేనినిగూర్చి యుపన్యసింపవలసి

నాయనలారా! గాలిలోఁ బై గెగురఁగల సామర్థ్యము నీయఁగల ప్రాణాయామము మీకుండఁగా (ఎయిరోప్లేను) ఎట్టుల చేయుదురోయను దేవులాట మీకెందులకు? బ్రహ్మాస్త్రమైన గాయత్రి నీనోటనుండఁగా-టపాకాయకట్టుకొనుటకు లైసెన్సునీయవలసినదని యానోటితోనే యొకనిని దేవురింతునేల? దూరదృష్టిశక్తిని- నీమనస్సులోనున్న దూరదృష్టి శక్తిని రాజయోగమున వికసింపఁజేసికొనలేక- (టెలిస్కోపు) అని దేవులాడెదవా? దూరశ్రవణశక్తి నీలో నుండ (టెలిగ్రాపు) అని విలపింతువా? పంచభక్ష్యపరమాన్నము లింటిలో నుండఁగా 'భవతి భిక్షాం దేహి' యని జోలిసైచుకొని తిరుగుచున్నావా? తిరుగు తిరుగు. నీకర్మ మిట్లుండ ని న్నెవఁ డుద్ధరింపఁగలఁడు?

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

పార్లమెంటులో (గ్లాడుస్టను బజ్జెటు స్పీచి) వచోవిధేయమై యున్ననేమి? మన పూర్వదేశస్థితి నిగూర్చిన గ్రంథములు మొదట మనకుఁ గావలయును. మన పూర్వనాగరకస్థితినిగూర్చిన గ్రంథములు మొదట మనకుఁ గావలయును. మన జాతీయతత్త్వముతో జేరినగ్రంథములు మొదట మనకుఁ గావలయును. ఇవియన్నియు మన కొసఁగఁదగినది మన జాతీయసారస్వతమే కాదా? స్వదేశ సారస్వతజ్ఞానమున మన కన్నము. బరదేశీయ సారస్వతజ్ఞానము మనకు నంజుకొనట కక్కఱకువచ్చు వ్యంజనములు. అన్నమును మాని కందకూరమాత్రమే తినువానికిఁ గడుపునొప్పికంటె వేఱులాభ మేమైన నున్నదా? అన్నమును మాని వట్టి కొబ్బెఱకాయపచ్చడిని మ్రింగువారికి వమనములకంటెఁ బర్యవసానమున మేమున్నది? తదన్నము తద్రసముగా ననఁగ– గంజియన్నము తినియైనను మన దేహశక్తిని మనము నిలుపుకొనఁగలము. కాని కాకరకాయఁ దిని– ములగకాడఁదిని– బ్రదుకఁగలమా? నాయన లారా! తల్లిపాలుండఁగాఁ బోఁతపాలు గుడిచిన బిడ్డబ్రదుకునా? బ్రదికినయెడల బలము గలిగియుండునా? స్వదేశీయ విద్యలను సొంగముగా మాని మీరు విదేశీయవిద్యలను మాత్రమే యభ్యసించినందువలన మీబుద్ధులు క్షీణించినవి. మీమనస్సుల కూనరపొట్టలు పెరిఁగినవి. మీకాలుసేతులు సన్నబడినవి. మీరక్తము పలచఁబడిసది. మీదృష్టి మందీభూత మైనది. అందువలననే ప్రకృతి వికృతిగాను వికృతి ప్రకృతిగాను మీరు భావించుచున్నారు.

(పోర్చుగలు) లో నెవతెయో వికృతస్త్రీ బయలుదెఱలెనని మీకుఁ గూడ నాశ్చర్యమేల? అట్టివ్యక్తులు స్వభావవిరుద్ధములని లోకవిరుద్ధము లని ప్రకృతికాంత కన్న దయ్యపుబిడ్డలని మీకుఁగూడ నమ్మకమేల? నాయనలారా! తప్పు తప్పు. అట్టివారే స్వభావాను సారులు, లోకసామాన్యులు. మనస్సునం దన్నిశక్తులు లీనమైయున్నవి. ఆశక్తులను వికసింపఁజేయు వాఁడే మనుజుఁడు. కాని మిగిలినవాఁడు మనుజుఁ డెట్లగును? కావున మనమే దయ్యపుబిడ్డల ము– వారే మంచిబిడ్డలు. మనకు రూపమున మనుజత్వమేకాని మనస్తత్వమున మనుజత్వ మేది? అట్టిచో రాకాసిబిడ్డలు మనమా– వారా? నిత్యనంసార యాత్రయందు సర్వదా సత్యదూరముగ సంచరింపవలసి సంచరించుచున్న మనవంటివారికి ''ఎటుపోయి యెటు వచ్చి యేమైన సరేకాని యసత్యంబు వచియింప నట్టివ్యక్తియు, నిత్యసత్యవ్రతుఁడు నైనమనుజ మార్తాండుఁడు లోకవిరుద్ధస్వభావుఁడు''వలెఁ గానఁబడును. ''అయ్యో! ఎట్టి ప్రకృతి యయ్యా! తన మేలైన దానెఱుఁగ డేమి కర్మమయ్యా! నిత్యనత్యదీక్షలన నెంత నష్టికలుగుచున్నదో పూర్ణముగా నెరిఁగి యుండియు నింకను సత్యబద్ధకంకణుఁడై యేల యుండవలయునయ్యా!'' యని సామాన్య లాయన నధిక్షేపింతురు. అంతమాత్రమువలన సత్యము వికృతియగునా? అనత్యము ప్రకృతియగునా? సంతతవ్యభిచారచర్యా నిర్మ్మితసాంసారిక స్త్రీసంప్రదాయ యగు సొని, మహాపతివ్రతయైన నంసారిణిని జూచి ''అబ్బ! అబ్బ! అసహ్యమమ్మా. ఒక్కమగనితో నింతకాలమునుండి యీమెభ్రమ్మ యెట్లు కాపురము చేయుచున్నదో? అమ్మా! ఇది యాఁడుది కాదుకాఁబోలు'' నని వెక్కిరించును. అంతమాత్రమున వ్యభిచారము ప్రకృతియై పాతివ్రత్యము వికృతియగునా? స్వదేశీయ విద్యాత్యాగపూర్వక సంతత విదేశీయ విద్యానంపాదన నిర్మ్మితాత్మీయపూర్వ సంస్కారసంప్రదాయ సముదాయుల మగుమనకు– సంతత శరీరసౌఖ్యాసక్తులమగు మనకు– మహోనశక్తి సంపన్నుఁడగు యోగి వట్టిపశువుపలెఁ గానఁబడడా? యథార్థముగఁ బశుబిరుదమున కష్టి లేవ్వరో చెప్పనలయునా???

పట్టినదనుట కేమైన సందేహమా? పోనిండు. అందులకు విచారింపము. అజ్ఞులమై నోరు మూసికొని యుండక, మీఁదు మిక్కిలి యధిక్షేపణము లెందులకు? అధిక్షేపణము లెవరిని? ఎవరినా? మైవారి నధిక్షేపించునెడల నూరకుండువా రెవ్వరు? మనలనే! మనబుషులు (పూలు) మనవేదములు మిథ్యలు– మన శాస్త్రము లప్రమాణములు– మనపురాణములు బూతులు; పోనిండు. అంతటితోనైన సరిపోయెనా? (ఆరిస్టాటలు) అన్నిగ్రంథములు వ్రాసెనని మీరు నమ్ముదురు. పదునెనిమిది పురాణములు వ్యాసుఁడు వ్రాసినాఁడన్న మీకు నమ్మకము లేదు. (ఆరిస్టాటలు) మీకిచ్చిన యమృతమేమి? వ్యాసుఁ డిచ్చిన విషమేమి? వ్యాసుఁ డనఁగాఁ బీఠాధికారియనియు, నెందరో వ్యాసు లుండిరనియు, వారందఱు కలిసి కాలక్రమమున నవివ్రాసిరనియు, న్యాయముగాఁ జూచినట్లు తెలివితక్కువ, యవకతవక, తలతిక్క, కొసవెర్రిపాండిత్యములతోఁ– గ్రొత్తకల్పనకు సిద్ధపడుదురు. శంకరాచార్యులవారు పరకాయప్రవేశ మొనర్చినారన్న (నాన్సెన్సు) అందురు. ఏసుక్రీస్తుచేతితో స్పృశించియో, లేక కనులతోఁ జూచియో కుష్ఠరోగుల కారోగ్యమిచ్చెననఁగ (స్పిరిటుక్యూర్సు) అని స్తుతింతురు. మీకు బుద్ధులున్నయెడల దేశమున కీదుర్గతియేల? మీరందఱు వేదశాస్త్రముల నభ్యసించి విశ్వాసముతో నిట్లాచరించునెడల మీకీ పనికిమాలిన బానిసతన మేమి? వసిష్ఠుఁడు తన శాటి నంతరిక్షమున కెగరవైచెను. అది సహస్ర సహస్రాంశుసంకాశసందీప్తులతోఁ బ్రకాశించెను. అంత సామర్థ్య మేది? దేశీయసారస్వతమం దంత యభిమానమేది? అంత పూర్వాచారాభిమానమైననేది? పూర్వజాతీయ గౌరవస్మృతియైన నేది? ఏదియు లేదు. ఉన్నదొక్క– యజ్ఞానము. అందులో గావలసినంత తెగ నీలుగు. అక్షపాదుఁ డుండగా (అరిస్టోటలు) చదివినవారొకరు. పాణిని యుండగా (బెయిను) చదివినవారు రొకరు. ఆయుర్వేదముండగా (ఐ.ఎమ్.ఎస్.) అను తోఁకను దగుల్చుకొని వచ్చినవా రొకరు. చాణక్యుని యార్థికశాస్త్ర ముండగా (జానుస్టూవర్టుమిల్లు) చదివినవా రొకరు. కాళిదాసుని శాకుంతలముండగా (గోయతినుఫాస్టు) చదివినవా రొకరు. వీరేకదా దేశములోని మహావీరులు! మన వేదాంతవిద్యను బరఖండవాసులకుఁ దార్చిన సంధానకర్తలు. స్వదేశగౌరవములోఁ బనిలేనిజోగులు. వీరేనా వంశోద్ధారకులు– ఆర్యనామధారకులు– సెబాస్. మీ కన్నివిద్య లుండగా, మీశాశ్వతపు బ్రతుకుదెఱువు గానఁబఱచు నాధ్యాత్మిక విద్య మీలోఁ బరిపూర్ణస్థితిలో నుండగా– మీ రితరవిద్యల నపేక్షింపనేల? పై విద్యలను జదువఁగూడదని చెప్పువాఁడనుగాను. ముఖ్యముగాఁ జదువవచ్చును. వచ్చునే కాదు. వలసినదే! మన జాతీయపురుషులచరిత్రలు మనము తెలిసికొనినపిమ్మట– మన జాతీయ మహాకాంతామణుల మహోత్కృష్టచారిత్రములను మనము తెలిసికొనినపిమ్మట– ఐహికాముష్మిక సౌఖ్యప్రదములైన మన వేదములలోని, యితిహాసములలోని, పురాణములలోని, కావ్యములలోని జ్ఞానామృతమును గ్రోలినపిమ్మట – అంతేకాని, అరుంధతిమగఁ డెవఁడో మన మెఱుఁగకపోయినతరువాత (హెన్రీ ది ఎయిత్) కెందఱు భార్యలో తెలిసికొనుట మన కెందులకు? చిత్రకూట పర్వతమున జాబాలిచేసిన నాస్తికబోధమునకు శ్రీరామచంద్ర మూర్తి యెట్లు ప్రత్యుత్తర మిచ్చినాఁడో మనకుఁ దెలియకపోయినప్పుడు (స్లేటోనుడయలాగున్) తలక్రిందుగ నప్పఁజెప్పిన నేమి వినియోగము? శ్రీకృష్ణభగవానుఁడు ధృతరాష్ట్రసభలో రాయబారపుఁ బలుకు లెంతసందర్భముగా నెంత సమీచీనముగా, నెంత మధురముగా, నెంత యుక్తియుక్తముగా, నెంత రాజతంత్రజ్ఞాన సంపూర్ణతతోఁ బలికెనో యెఱుఁగని మనకు

లోనికిఁగొనిపోయి నామనస్సంతయు బట్టబయలుచేసి నాయెదుటఁ బెట్టెను. అంత మహానం దమున నాతనికిఁ బాదపూజగా నర్పింపవలయునని తెచ్చిన నాల్గురూపాయలకొఱకు జేబులోఁ జేయి పెట్టుకొనబోవుచుండగా జంఘాలశాస్త్రి! జేబులో జేయిపెట్టుకొనకుము. నాకొఱకు నీవు తెచ్చిన నాలుగురూపాయలను నీబండివాఁడు హరించినాఁ''డని చెప్పెను. అంత తెల్లఁబోయి నోరు మూసికొని వెడలివచ్చితిని.

ఇట్టి నిచిత్రములు లెక్క లేకుండ నేను జూచినాను. ఎన్ని యనిచెప్పవచ్చును? వీనిలోఁ బ్రధానముగఁ దెలియవలసినది మనస్తత్వ మాహాత్మ్యము. మనస్సు దేశకాల పాత్రాబాధి తము. దాని నభ్యంతరపెట్టున దేదియు లేదు, సర్వశక్తిమంతమైనది. కాని యాశక్తులన్నియు దానిలో లీనమై యజ్ఞానాచ్ఛాదితమై యహంకారతిరోహితమై యడఁగియున్నవి. అన్ని మనస్సు లట్టివే! ఆశక్తుల నుద్బుద్ధములగునట్లు చేయఁగలది రాజయోగము. రాజయోగము నుగూర్చి నేనిప్పుడు చెప్పుట కవకాశము లేదు. కాని యొక్క యంశముమాత్రము జ్ఞప్తిలో నుంచుకొనుఁడు. నీ మనస్సేమి? నా మనస్సేమి? యిచ్చటి మనయందఱి మనస్సులేమి? జగతిలోనుండు నరులందఱి మనస్సులేమి? సర్వవ్యాపకమైన యొక్క మనస్తత్త్వములోని శకలములు; సముద్రములోని నీటిబిందువు లన్నియు సముద్రములోని భాగము లైనట్లు మన మనస్సులన్నియు నా జగన్మనస్తత్త్వములోని భాగములు. రాజయోగముచేఁ దనమన స్సును దాను జూచుకొనఁగలవాఁ డన్నిమనస్సులనుగూడఁ జూడగలిగినవాఁడే.....రాజ యోగ సాధనముచేఁ దెలియఁదగిన దొక్కమనస్సే– అది తన మనస్సే– అదియే మహాకష్టము – మహాకష్ట మనుటయే కాని యది సాధించినవారనేకు లున్నారు. అది సాధించిన పిమ్మట మాత్ర మన్నిమనస్సులు కరతలామలకములే. రాజయోగాభ్యాసకుల కందఱి కిట్టిశక్తులు కొలఁదిగనో గొప్పగనో కొంతకాలమునకుఁ గలుగును. ఆ శక్తులతోడనే సంతుష్టిపడి, సంతస పడి వానిని ధనార్జనాది కృత్యములందుఁ గొందఱుపయోగపఱతురు. అది కూడనిపని. ప్రాణాయామము దొమ్మరిసాని గడ్తైఁబడి పావులా డబ్బులు విలువఁ గలిగిన దైనది. మానుషిక విద్యుచ్ఛక్తి (మాజిషను) చేతిలో నుండు కట్టుపైబడి మరియొకపావులా డబ్బులు విలువగలిగిన దైనది. ఆశక్తులను వ్యవహరింపక ముముక్షువులు బ్రహ్మానుసంధాన మొనర్చి కొని శాశ్వతానంద మొందుదురు. బ్రాహ్మైక్యసిద్ధిని గాంచెదరు. యోగమువలన నణిమాద్యష్ట సిద్ధులు గలుగునని పెద్దలు చెప్పినమాటలు మనకుఁ గొన్ని నిదర్శనము లగపడుచుండఁగా నేల కాదనవలయును? కాదన్న ప్రయోజకులు మనకుఁ గానఁబడుచు మఱియొకదారి యేది? ఇట్టి యద్భుతశక్తులకు– విదేశీ యాధునికుల కిప్పటివఱకుఁ గారణములు గోచరింపని యాయద్భుతశక్తులకుఁ– గారణమేదో మనవారు గ్రీను, రోములపేళ్లు భూమిపైఁ బడక ముందే కనిపట్టినారు. అవి యాంగ్లేయభాషాభ్యసనమొనర్చిన నవనాగరకులకు నమ్మకము లేకపోవచ్చును. అయినను మననమ్మకము కొఱకు వారు వ్రాసియుండలేదు. యథార్థప్రకట నము కొఱకేవారట్లు వ్రాసిరి. వారివంశములఁ బుట్టిన మన మిప్పుడిట్లు భ్రష్టులమగుదుమని కనిపట్టి యెవ్వఁడైనను బాగుపడకపోవునా యని వారట్లు వ్రాసిరేమో మన మెట్లు చెప్పఁగ లము? చెప్పుటకు బుద్ధు లెక్కడివి? బుద్ధులుండినయెడల దేశీయవిద్యలను మానుకొని – విదేశీయవిద్యల, నిండ్ల నమ్మి– యీనాముల నమ్మి యేల యభ్యసించియుందుము? అభ్యసించినందులకు వానిలోనైనఁ బ్రజ్ఞ కలిగి యేడ్చినదా? ఇది జిహ్వ కెక్కలేదు– అది మనస్సునఁ బట్టలేదు. ఇది రాదు. అది కలఁతకొట్టు. ఉభయభ్రష్టులమై యేడువవలసినగతి

వింతవింత యని పాశ్చాత్యులకుఁ దోఁచిన వ్యక్తులు మనకు వింతకావు. భూమిలో ధననిక్షేపములను గనిపట్టువారు, పాతాళగంగను గనిపట్టువారు, శల్యసంఘములను గనిపట్ట వారనేకులు నిప్పుడుకూడ నున్నారు. మీరు కోరినవస్తువుల నవలీలగ మీయెదుట బెట్టగలవారెందరో మనలో నున్నారు. వారి నెందఱినో నే నెఱుఁగుదును. ఒక్కనిదర్శనమా మాత్రమే చెప్పుదును. ఒక్క బ్రాహ్మణుఁడు చిత్రచిత్రములగు వస్తువులను హస్తలాఘవముచే – గనుకట్టుచేఁ– గనఁబఱచుచున్నాఁడని తెలిసి యాతనినిఁ జూడఁబోయితిని. ఆతనితో గొంతసేపు మాటలాడి నాయింటికి భోజనమునకు రమ్మంటిని. ఆతఁడు నా యింట స్నాన మొనర్చినాఁడు. నామడిబట్టను నేనే యాతని కిచ్చితిని. ఆబట్టయు యజ్ఞోపవీతమ తక్క– నాతనిమీఁద మరేమియు లేవు. వడ్డనలైనవి. పీటలమీఁదఁ గూరుచుంటిమి. ఇంకి బరిషేచనమే తరువాయిగా నుండెను. అప్పుడు ''అయ్యా! మీరేవోచిత్రచిత్రవస్తువులఁ దెప్పించెదరని నినుటయేకాని చూచుట సిద్ధింప లేదు. నాకిప్పుడు మీశక్తిని గనఁబఱుపవ యును. నాకు శ్రీజగన్నాథక్షేత్రమునఁ జేయఁబడి స్వామికి నివేదింపఁబడిన 'లస్కో ప్రసాదము కావలయును'' అనియంటిని. 'భోజనమైనతరువాత నట్టిచిత్రమును జూతు కాని' యని యాతఁడు బలుక, నే నందులి కంగీకరింపక 'భోజనమయిన పిమ్మట నీ నన్నేమి మోసము చేయుదువో ఆభయముననే నే నిట్టినమయమున నిన్నడుగవలసివచ్చినద క్షమింపవలయును' అని నే నంటిని. ఒక్కపళ్లెరమును దెమ్మని యాతఁడనెను. దాని దెచ్చుటకు నేనే లేచినయెడల నింతలో నేమిమాయ జరుగునో యని భయప మరియొకనిచేఁ బళ్లెరమును దెప్పించి యాతనియొద్దఁ బెట్టించితిని. ఒకపూతిక పుల్లకావలయ నని యాతఁ డనఁగ నదియుఁ దెప్పించితిని. అంగవస్త్రమొక్కటి యిమ్మనెను. నా యిచ్చితిని– ఆపుల్ల నాతఁ డాపళ్లెరములో నిలువుగా నుంచి యంగవస్త్రము దానిమీఁద గప్పి పుల్లలను ద్రిప్పుచు నిశ్చలధ్యానమున నాతఁడుండెను. దాదాపుగా మూఁడునిమునవ లైనపిమ్మట నంగవస్త్రమును దీసినైచి పుల్ల నావలఁ బాఱవైచెను. లస్కోరారాసి యాపళ్ల మున నుండెను. పచ్చకర్పూరవాసనలు గమగమ లాడుచున్నవి. కుంకుమపూవు జిగజిగ మనోహరములుగనున్నవి. ఆప్రసాదమునుజూచి నే నానంద మొందితిని. ''ఇది శ్రీజగన్నా థమునుండి వచ్చినట్లు నే నెట్లు నమ్మవలసిన'' దని యాతని నడిగితిని. ఆప్రసా మందఱికుఁ బంచి యిమ్మనగ నందఱికుఁ బంచియిచ్చితిని. అడుగున నొక్క జగన్నాథస్వా పటమున్నది. దానిక్రింద నొక్క చీటియున్నది. ''జగన్నాథస్వామి భృత్యుఁడు రామచం పండా పంపినది.'' అని యాచీటిపై వ్రాసియున్నది.

ఇట్టి ప్రజ్ఞాశాలు రనేకులున్నారు. గోడచాటున నేమి జరుగుచున్నదో చెప్పగలవార కులున్నారు. దూరదృష్టి దూరశ్రవణ శక్తులవలన నాంగ్లేయ రాజ్యప్రధానుఁ డిప్పుడ క్షురకర్మ మొనర్చుకొనుచున్నాఁడో చుట్టగాల్చుచున్నాడో చెప్పఁగలరు. ఈచెవితో నుం రవనములోని పెద్దపులిబొబ్బను, ఆచెవితో (మాస్కోచర్చి) లోని గంటను– వినఁగల రనేకులున్నారు. ఇదికాక మీమొగము చూచి మీమనస్సులలోని యూహములన్నియ ''తూచా'' లు తప్పకుండఁ జెప్పఁగలవా రెందరో యున్నారు. మీపూర్వచరిత్రములఁ బూనఁగ్రుచ్చినట్లు చెప్పఁగలవా రెందరో యున్నారు. నే నొక్కసారి యొక్క మహానుభావు దర్శింపఁబోయితిని. ఆతఁడు నివసించు నింటితలుపు లోనగైచియున్నది. తలుపు తట్టితిని ''జంఘాలశాస్త్రీ! వచ్చుచున్నా'' నని యా మహానుభావుఁడే వచ్చి తలుపు తెఱచి నను

త్సాహమునఁ బైనఁ జదివిరి. ఆపైన (ఆరిస్టోటులు) కూడ నేమియు వ్రాసియుండలేదు. సర్వ ప్రపంచార్థజనసాముదాయక శేముషీనాథుఁడని చెప్పఁబడిన (ఆరిస్టోటులు) కూడ నీవిషయమున నజ్ఞుఁడై మూఁగయై యుండెను. సాహేబునకు ఖోరాను దెలియునప్పుడు పీళ్లకుఁ దెలియునా? (ఆరిస్టోటులు) వ్రాఁతవలన నొకవింతకు రెండవవింత తోడయినది. ఆవింతవంటిదే యీవింత. ఈవింతవంటిదే యావింత. మొత్తముమీఁద నిట్టిప్రకృతులు లోకవిరుద్ధములు. స్వభావవ్యతిరేకములు. ప్రకృతికిఁ బుట్టిన దయ్యపు బిడ్డలు. ప్రకృతిశాస్త్ర ప్రవీణులును పరిపూర్ణనాగరకులగు పాశ్చాత్యులే యిట్టి విపరీతతను సకారణముగా సమర్థింప లేనప్పుడింక నెవ్వరు సమర్థులు? ఇంకను గొన్నిశతాబ్దములు గడచినపిమ్మట, శాస్త్రీయపరిశ్రమముమరింత పూర్ణముగా వికసించినపిమ్మట, ప్రకృతి, తన హృదయమున దాఁచికొనిన రహస్యముల నింకను బయలుపెట్టినతరువాత– జ్ఞానసూర్యుఁడంబరమున నడునెత్తి కెక్కిన పిమ్మట– నిట్టి యలౌకిక ప్రకృతులకుఁ గారణములు తెలియవలయునుగాని యిప్పటికిఁ దెలియవు. మనుజునకుఁదెలిసినది తక్కువ– తెలియఁదగినది యెక్కువ. శాస్త్రము శోధించిన యంశజాలము తక్కువ– తెలియఁదగినదిదెక్కువ. కావున మనుజుఁడు సర్వదా జ్ఞానసంపాదనమున బద్ధదీక్షుఁడై యుండవచ్చును.''

ఇది నే నాంగ్లేయగ్రంథమునఁ జదివినయంశము. ఈ యభిప్రాయమును విమర్శింపు మని మీరు కోరునెడల విమర్శింతును. కాదేని యింతటితో 'ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః' చెప్పుదును. (ఇంకను జెప్పవలయును. మేము సంతోషముతో వినుచున్నాము అని సభలోఁ గేకలు.)

''నాయనలారా! మహర్షు లెచ్చట నవతరించిరో– యెచ్చట వేదము లుద్భవించినవో – యెచ్చట యెగాధిశాస్త్రములు బలిసినవో– యెచ్చట మైలుమైలున కొక్కదేవాలయ మున్నదనిచెప్పుట యతిశయోక్తికాదో– యెచ్చట మతమే సర్వజాతికి మూలాధారమో– యెచ్చట నాత్మతత్త్వ శాశ్వతత్వమును గూర్చి క్రీస్తింక నాలుగువేలసంవత్సరములకు జన్మించుననగానే బోధింపఁబడెనో– యట్టి యార్యావర్తదేశమందుఁ బుట్టిన మన కిట్టివి వింతకావు. పాశ్చాత్యులీ స్వల్పాంశమునుగూర్చి యాశ్చర్యముగా వ్రాసిన వ్రాయుదురుగాక! ఇందుకుఁ గారణము లిప్పటికైన వారికిఁ దెలియకపోయినఁ బోవునుగాక! ప్రాకృతిక సౌఖ్యాభివృద్ధియే వారి పరమావధి. వారిలో మహావేదాంతులు సైతము మనుష్యజీవనమును సుఖపెట్టఁజాలనిది వేదాంతశాస్త్రము కాదని స్పష్టముగా నుద్ఘాటించిరి. వంటయింటికక్కఱకురానిది వేదాంతవిద్య కాదు. ప్రక్కలోని కక్కఱకురాని దాధ్యాత్మికవిద్య కాదు. హృదయమునకుఁ బ్రాపంచిక సౌఖ్యానుభవమున వికాసమీయలేనిది వేదాంతవిద్యకాదు. పాశ్చాత్యుల వేదాంతమున కప్రాపంచిక సంబంధముకంటెఁ బ్రాపంచికసంబంధ మెక్కువ ప్రప్రధానమే. రెండవది– దివ్యజ్ఞాన సంబంధమగు వేదాంతవిద్యను క్రమక్రమముగాఁ బొట్టికూటివిద్యగా మార్చి, దానిని వంటప్రొయ్యిమీఁదికి దింపవలదని (సోక్రటీసు) అను మహావేదాంతి, పాశ్చాత్యదేశీయుల స్వభావమును బాగుగా గుర్తెరిఁగియే వారట్లు చేయుదు రనుభయముచేతనే పలికినాఁడు. ప్రపంచమంత నాదరింపవలసిన యాతని పలుకును దరువాతివారు లక్ష్యము చేయకపోవుటయే కాక, యాతఁ డేదారిని ముండ్లకంపఁ గొట్టవలయునని చెప్పెనో యాదారినే బాహాటముగాఁ బోవుచున్నారు. పోనిండు. ఇంకను బోనిండు.

చుండఁగా వినుభాగ్యము లభింపలేదు. ఆకొఱఁతఁ దీర్పవలయునని మేము కోరుచున్నా
మనిరి. అంత నే నిట్లు చెప్పితిని–

సోదరులారా! నేను గొంతకాలము క్రిందట నొక యాంగ్లేయ గ్రంథమును జదివితిని
దానిలోని ముఖ్యాంశములఁ జెప్పెదను. ఆ గ్రంథసార మేదనఁగా– ఓ! అద్భుతవ్యక్తి
అలౌకికశక్తి– అట్టియాఁడు దామెకుఁ బూర్వమునగాని యామెకుఁ బరమునఁగాని యున్నట్లు
వినలేదు. భూమిలో నెక్కడ నేమియున్నదో దృష్టిసామర్థ్యముననే యామె చెప్పఁగలదు
ఆమె నేత్రములు మన నేత్రములవలెనే యుండును. కాని యాదృష్టినిశితత్వమేమో చెప్పనలవి
కాదు. తలఁపనైన నలవికాదు. ఆమె (పోర్చుగలు) దేశమందు రెండువందలసంవత్సరములఁ
క్రిందట జన్మించెను. భూమిలో నేపొరలో గంధకమున్నదో– యే పొరలోఁ గాంచనమున్నదో
– యే యరలో నీరున్నదో– యే యరలో నిప్పున్నదో– యేతెరలో మసిబొగ్గుగనియో
– యే తెరలో మానికపుగనియో– యామె యిట్టి కనిపెట్టఁగలదు. సర్వపదా
ర్థములామె నహస్రాశనిసంకాశ మగుదృష్టికి దారి యీయవలసినదే! మనుష్యశరీరములను
దుసివోవఁజూచి హృదయకోశములోని యరలనడుమనున్న తలుపులు సరిగ నాడుచున్నవో
లేదో, పిత్తకోశము యథావిధిగఁ బైత్యద్రవము వెలిగ్రక్కుచున్నదో లేదో– మొదటిలో
గణిశాస్త్ర పాండిత్య మిచ్చు నరములకూడిక యెట్లున్నదో– కవితా ప్రతిభ నిచ్చు
నరములకూడిక యెట్లున్నదో– పెద్దప్రేవుల చిన్నప్రేవుల నడుమనుండు (అపెండిక్సు)
లోఁ బుట్టిన కురుపు పెనరగింజంతయున్నదో పేలపుగింజంత యున్నదో– గర్భవతికడుపు
లోనిబిడ్డ– ముక్కు పొడుగో పొట్టియో యవలీలగ నామె చెప్పగలదు. (ఎక్సరేను) అమె
కనురెప్పమీఁది వెండ్రుకచుట్టు దిగదుడుపు. పాతాళగంగ యేస్థలమునఁ ద్రవ్వినఁబడునో
యామెవలన (పోర్చుగలు) దేశపురాజు తెలిసికొని, యామె చెప్పిన యంశము పరిపూర్ణముగా
నిదర్శనమైనపిమ్మట నామెకు గొప్పపారితోషికమిచ్చి యనేకవిధముల నామెను నన్మానిం
చెను. వింతలేనైనఁ జెప్పవలసినదినమున నామె యుపవసించును. అజీర్ణాదిబాధ యుషీశక్తి
ప్రకటనమున కభ్యంతరమగునని కాఁబోలు నామె యట్టి నియమమును చేసికొనెను.

"ఆకాలమందలి శరీరశాస్త్రజ్ఞులు– మనశ్శాస్త్రజ్ఞులు– ప్రకృతి శాస్త్రజ్ఞులు –
మహావేదాంతు లందఱుగూడ లోకాతీతమగు నామెప్రజ్ఞను కాంచి గ్రుడ్లు మిడుకరించుకొని,
గ్రుక్కిళ్లు మ్రింగి, కన్నులు తేలనైచి, చేతులు వెతకిలనైచి, పెదవులు విరిచి, మెమ్మె– పెపె
యనఁబోయి యూరకుండిరి. కాని, యదియేమో యిదియేమో యని గురికిఁబదునాలుగు
బారల దూరమందైనను గొట్టలేకపోయిరి. మనుష్యబుద్ధికి లొంగని, శాస్త్రము క్రిందికిరాని,
స్వభావమున కదుకని, కనులుచూడని, చెవులు వినని యీప్రజ్ఞ యేమో? ఏదియుఁ దోఁపక
యాకాలపు శాస్త్రజ్ఞులు క్రీస్తుపుట్టుటకు పూర్వమందలి యవనాదిదేశ వేదాంతు లిందును
గూర్చి యేమైనఁ జెప్పిరేమో చూతమని పూర్వగ్రంథములన్నియుఁ బఠింప నారంభించిరి.
(ప్లేటో) శిష్యుఁడగు (ఆరిస్టోటలు) అనునతఁడు (ఆంట్‌వెర్పు) నుండి
యుద్ధానంతరమునఁ దేఁబడిన ఖైదీలలోనొకఁడు మిగుల దళసరి యట్టలలోనుండిగాని బల్లలో
నుండిగాని సునాయాసముగఁ జూడఁగలఁడని యేదియోసందర్భమున ప్రాసెను. ఆప్రాతం
జూచి యాశాస్త్ర శోధకులందఱు చంకలుగొట్టుకొని – తుంట్లజరుచుకొని కెవ్వుమనిరి.
ఈప్రకృతివిరుద్ధత కేమికారణమో– ఆతఁడు తప్పక ప్రాయఁగలఁడని వారందఱును మూ

16. మనస్తత్వ మాహాత్మ్యము

జంఘాల శాస్త్రి సాక్షికి ఒకసారి ఉత్తరం రాస్తూ– తనుంటున్న బసకు కొందరు విద్యార్థులు వచ్చి, తమ విద్యార్థి సంఘంలో ఏదైనా ఇష్టంవచ్చిన అంశంగురించి ఉపన్యాసం ఇవ్వమని, బలవంతంగా తమ పాఠశాలకు లాక్కుపోయారని రాశాడు. తాను ఆ విద్యార్థుల్ని ఉద్దేశించి ఏం మాట్లాడాడు అనేది ఆ లేఖ సారాంశం.

అక్కడ జంఘాల శాస్త్రి మాట్లాడడానికి ఎంచుకున్న విషయం మానవ మనస్సుకున్న అపూర్వశక్తి. ఇది విషయంగా ఎంచుకోవడానికి కారణం, అతను చదివిన ఒక ఇంగ్లీషు పుస్తకం. అందులో మనస్సుకున్న అపూర్వశక్తి గురించి వ్రాసిన విశేషాలు.

అయితే– మహర్షులు పుట్టిన చోటు, యోగం వంటి శాస్త్రాలు విస్తరించిన చోటు– అయిన మనదేశంలో మనిషి మనస్సుకున్న అద్భుత శక్తుల ఆవిష్కారం వింత ఏమీ కాదని జంఘాలుడి వాదన. వట్టి వాదనే కాక, తన అనుభవంతో ప్రత్యక్షంగా ఎరిగిన విషయాలు కూడా వివరించాడు. మనస్సుకున్న మహాత్మ్యం దేశకాలం బాధితమని – అంటే, ప్రాంతానికీ, కాలానికీ కట్టుబడని అతీతశక్తి అని జంఘాల శాస్త్రికి తిరుగులేని నమ్మకం. ఇంగ్లీషు చదువులు చదివినవారు ఇటువంటి విషయాలు నమ్మలేక పోవచ్చు నని ఒక విసురుమాటా విసిరాడు. మనవారు ముందుగా తెలుసుకోదగిన మనదేశపు అపూర్వజ్ఞాన సంపద తెలుసుకోకుండా విదేశ విజ్ఞానానికి ఎక్కువ విలువ ఇవ్వడం, దాని పట్ల మోజు చూపించడం గురించి జంఘాల శాస్త్రికి ఒళ్లు మండుతోంది.

జంఘాలశాస్త్రి వ్రాసినలేఖను జదివెదను.

''సాక్షికి– జంఘాలుఁడు నమస్కారములు. ఈయూరఁ గొందఱు విద్యార్థులు నేను జంఘాలశాస్త్రి నని యెరిఁగి నాబసకువచ్చి తమ విద్యార్థిసంఘమున నుపన్యసింపుమని నన్ను బలాత్కారమునఁ బాఠశాలకు లాగుకొనిపోయిరి. ఏవిషయమునుగూర్చి యుపన్యసింపవల యునని నేను వారినడుగ మీయిష్టమువచ్చినయంశ మేదైనను మాకు నమ్మతమే. మీయుపన్యా సములు సారస్వతానుబంధమునఁ జదివి యానందించుటయే గాని మీ రుపన్యసించు

పై దినమున వితంతువివాహములోనికిఁ దాంబూలమునకై పోవుదువు. ఈదినమున న్వయంపాకనియమ మవలంబింతువు. రాత్రిపూట Cosmopolitan dinnerలో నారగింతువు, పగలు Antinautch movementలో నంతకము, రాత్రి వేశ్యాకాంతల యింటిసల్లాపము. పూర్వవయస్సులోఁ గలిగిన వ్యభిచారబుద్ధి యుత్తరవయస్సులో జారునుగాని యుత్తరవయస్సులో కలిగిన వేశ్యాకాంతానుషక్తత యుత్తరజన్మమునఁ గూడ నిన్ను వదలునది కాదు. కచ్చఁగట్టలేనివాఁడు దేశభక్తుఁడు కాఁడు. నోరులేనివాఁడు దేశభక్తుఁడు కాఁడు. మనసు కట్టలేనివాఁడు దేశభక్తుఁడు కాఁడు. భక్తి య ద్విషయమైనదైనసరే. బాహ్యాంతరింద్రియ నిగ్రహమువలనగాని కలుగదు నీ కదియు లేదు. ఇదియు లేదు. నీకు దేశభక్తియే నాయనా! నడువుము. అయ్యా! మరి యెవ్వరైన వచ్చెదరా'' యని యాపురుషుఁడు పలికెను. ఇంతలో నిద్దరు ముగ్గురు దేశభక్తులు వచ్చి యాసింహాసనమును నులువుగా న్నుశించిరి. అంత జయా! భారతమాతకు జయా! యని యాపురుషుఁడు మిన్ను వగుల నార్చెను. ఆకేకతో గుండె లవిసిపో మేల్కాంటిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

ములు సర్వసామగ్రితోపాటు నీవు స్వాధీనపఱచు కొంటివి. నిన్నుఁ బ్రజలు నమ్మరు. ప్రభువులు నమ్మరు. నిన్ను నీవే నమ్మవు. నీకు దేశభక్తి ముందుజన్మములోఁ గలుగునేమో నాయనా! నీ విప్పటికి నడువుము. అయ్యా! మరియెవ్వరైన భారతపీఠమును స్పృశించి కృతార్థుఁడగునా?'' యని యుచ్చైస్స్వరమునఁ బలికెను. ''అయ్యా! నే నుపాధ్యాయుఁడను. బీదవాఁడను. ఉపాధ్యాయపదవిని వదలుకొని దేశసేవ చేయుచుంటిని. ఇదిగో సింహాసనమును స్పృశించుచున్నా''నని ముందునకు రాఁబోయి యచ్చటనే కాళ్లు మెలికలుపడఁ గూలఁబడెను. ''నాయనా! ముందు రాఁబోవు జాతీయ పాఠశాలలలో నింతకంటె ఘనవేతనము నధికాధికారమును వాంఛించి నీ విందు దిగితివి. నీయర్థపరిత్యాగ మధికార్థపరిగ్రహణవాంఛాసంకలిత మైనది. కాని కేవల దేశ భక్త్యుపబోధిత మగునది కాదు. నీ కాశపోయినప్పుడు దేశభక్తి రాఁగలదు. కావున నీవింక నూరకుండుము. అయ్యా! మరియెవ్వరైన వచ్చెదరా?'' యని యాపురుషుఁ డనెను. ''అయ్యా! మే మేపాపపుణ్యము లెరుఁగని పాఠశాలాబాలురము. మేము విజాతీయ విద్యాసంగ్రహణమును బరిత్యజించి జాతీయవిద్యాపేక్షులమై దేశభక్తులవెనుకఁ జేతనై నంతసాహాయ్య మాచరించుచుఁ దనువులను గృతార్థములను జేసికొనుచున్నాము. మేము మాతృపీఠమును స్పృశింతు'' మని కొందరు బాలురు ముందునకు రాఁబోయి, యొకరిచేతు లొకరు గట్టిగఁబట్టుకొని గబగబ లాడి గుబగుబలాడి యటుత్రోచి యిటుత్రోచి యడుగైన ముందునకుఁ బెట్టలేక యట్టియట్టి యచ్చటనే స్తంభించిరి. ''నాయనలారా! మీరిపుడు కొందరే మిగిలిపోయితిరి. కాని మొదట మీతో ననేకులు పాఠశాలలను మానుకొనినారు. వారిలో ననేకులు తిరుగఁ బాఠశాలలోఁ జేరిరి. పాఠశాలలోఁ జేరి చదివినను మీలో ననేకులకు లాభము లేని హేతువువలన మీరిట్లు మిగిలియున్నారు. మీరు స్కూళ్లనుండి వదలి పోవుటయే పాఠశాలలకు మంచిదగుటచే మీయుపాధ్యాయులు మిమ్ముఁ దిరుగఁ జేరుఁడని ప్రోత్సహించియుండలేదు. మీరిప్పు డిండ్లను దల్లిదండ్రులను దోఁబుట్టువులను వదలి పరగ్రామములలో నల్లాడు చున్నారు. మిమ్ము గన్నవారు మీయవిధేయతకు ననురాగశూన్యతకుఁ బరితపించి పరితపించి యెట్లు భస్మమగుచున్నారో మీ రెరుఁగుదురా? తల్లిదండ్రులమాటను దాఁటి మీరు చేయునదేది? భారతీయనీతి యింత వఱకువచ్చినదా? పిత్రవాక్యపరిపాలనమునకేకదా శ్రీరామచంద్రమూర్తి రాజ్యమును బరిత్యజించినాడు. దేశీయగ్రంథరాజమైన శ్రీమద్రామాయణములోని నీతినే యనుష్ఠింపనే రని మీ రెట్లు దేశీయఘనత నొందఁ గలరు? దేశమునకు ముక్కు సెవులు లేవు. మీరు దాని కర్హ పాద్యాదు లీయనక్కఱలేదు. తంత్రసారానుసారముగ షోడశోపచార సహితపూజాకర్మ మాచరింపనక్కఱలేదు. దేశభక్తి యనఁగాఁ బ్రజాభక్తి. సర్వప్రజలో మీకు మాతాపితలు సర్వోత్కృష్టులు. వారిపూజ యైనతరువాతనే మీ కితర ప్రజాపూజ. అది లేదు సరేగదా! ఇంటిలోని యమ్మను నబ్బను నేడిపించినపిమ్మట మీ రేటిసుతులు? కన్నతల్లిదండ్రులకు సుతులు కానివారు దేశమునకు సుతు లెన్నఁడును గాఁజాలరు. కావున నింటను మంచివా రనిపించుకొనిరండు. తరువాతఁ జూచుకొనవచ్చును. అయ్యా! మరియెవ్వరైన వచ్చెదరా'' యని యాపురుషుఁడు పలికెను. 'నేను వచ్చుచున్నా' నని నంఘమునుండి యొక్కఁడు పలికెను. ''నాయనా! నీవు రావలదు. రాలేవు గూడను. నీవు బుద్ధిస్థైర్యము కలవాఁడవు కావు. ఈదినమున శృంగేరిస్వాములవారిని బూజింతువు.

దృణప్రాయముగా వదలుకొని భారతమాతసేవకై యీతనువు నర్పించుకొంటివి. నే నీసింహాసనమును స్పృశించెదను. అనుజ్ఞను గటాక్షింపుము'' ఇట్లాతఁడు పలుకగ ''సరే రావచ్చు'' నని యామహాపురుషుఁడు పలికెను. ఆన్యాయవాది యాసింహాసన సన్నిధిని జేరుట కెంత ప్రయత్నించినను బోలేకుండ నున్నాఁడు. మనుష్య లడ్డుండుటవలనఁ గాదు. అచ్చటివా రాతనికి దారి యిచ్చిరి. కాని యాతఁడు ముందు కొక్కయడుగైనఁ బెట్టలేకుండ నున్నాఁడు. కన్ను లున్నవి. కాళ్లున్నవి. శక్తియున్నది. అన్నిటిని మించిన సింహాసనస్పర్శనాభిలాష యున్నది. ఒక్కయడుగైన ముందునకుఁ బడనిదే! ఏమి కర్మమో! ప్రక్కనున్న మానిసుల నాతఁడు దీనభావమునఁ జూచి ''నాయనలారా! మీరు నన్ను ముందునకుఁ ద్రోయుఁడని వారిని బతిమాలెను. పాదములు పడిపోయెనా? పాటవము భగ్నమయ్యెనా? పైవారి వెనుకత్రోపు లెందులకో? అయిన నచ్చటిజను లాతనిని ముందునకుఁ ద్రోయ నారంభించిరి. ముందునకుఁ ద్రోచినకొలఁది నాతఁడు వెనుకకుఁ బోయినాఁడు. అది యేమివింతయో ''ఓమహాపురుషా! ఇదియేమో మాయగాను న్నది. నేను ముందున కొక్క యడుగైనఁ బెట్టలేకుండ నున్నాను. నన్ను రక్షించి భారతపీఠమును స్పృశింపని''మ్మని యాతఁడు కేకలువైచెను. ''నాయనా! నీతల్లి దండ్రులు భిక్షమెత్తి నీకుఁ జదువుచెప్పించినారు. వారు కడుపుమాడ్చుకొని నిన్నింతవానిని జేసిరి. నీసంపాదన మారంభమైనపిమ్మట నీవు తల్లిదండ్రుల కన్నము పెట్టలేదు. నీవు మాతాపితలవిషయమునఁ గృతఘ్నుఁడవు. పదిలక్షలు సంపాదించినవాఁడవయ్యును మాతాపితల ఋణము తీర్చుకొనలేక పోయితివి. మాతృభక్తికంటె దేశభక్తి యెక్కువది కాదు. పితృభక్తికంటె దేశభక్తి యెక్కువది కాదు. అవి రెండును లేనివానికి దేశభక్తి కలుగుట కల్ల. మొదట నీవు నీధనమునంతను ధర్మశాలా నిర్మాణమందో దేవాలయాదిప్రతి ష్ఠలయందో నీతల్లిదండ్రుల పేరు మీఁదుగా వినియోగపరుపుము. అది చేసినపిమ్మట నీకు దేశభక్తి కుదురునేమో చూచెదము. నీకున్న దానినే తినువాఁ డెవ్వడును నీకు లేనప్పుడార్జన మింక మానితినని గర్వపడు టెందులకు? నీవు విడువకున్నను నీధనము నిన్ను విడుచుటకు సిద్ధముగానే యున్నది. కావున నీవింక నడువుము. అయ్యా! మరియెవ్వఁడైన దేశభక్తుఁడు వచ్చి సింహాసనమును స్పృశింపవచ్చును'' అని యాపు రుషుఁడు పలికెను. అయ్యా! నేను వచ్చుచున్నాను. అనుగ్రహింపుఁడని యొక్కడు కేకవైచెను. సరే రా వచ్చునని యాపురుషుడు పలికెను. ఆతఁడు ముందుకువచ్చుట కెంతయైన గింజుకొనెను. నిలువఁబడినచోటనే గుడుగుడుగుంచము లాడఁ జొచ్చెనుగాని ముందున కొక్కయడుగైనఁ బోనిదే! అతఁడు ''నాయనలారా! నన్ను గంజికావడివైచి, సింహాసనమునొద్దఁబెట్టు''డని ప్రక్కవారిని బ్రార్థించెను. వారిలో నిద్ద రాతనిని జేతులమీఁద నెత్తిరి. ఎత్తఁగలరు కాని ముందునకుఁ దీసికొనిపోఁగలరా? వా రచ్చటనే యొకరికాళ్లొకరు త్రొక్కుకొని తుద కందరు నేలఁ గూలఁబడిరి. అంతట ''నాయనా! నీవు వట్టిచపలచిత్తుఁడవు. నీకర్థము కీర్తియే ప్రధానములు కాని మరియొకటి కాదు. నీకుఁ బ్రజలయందు విశ్వాసము లేదు. ప్రభువులయం దంతకంటె లేదు. ప్రభువు లాదరించిన పుడు ప్రజల బాధించినావు. ప్రభువులు నిరాదరణ చేసినప్పుడు ప్రజలపక్షముచేరి జాతీయ పాఠశాలయుఁ గర్మాగారము పెట్టి గడబిడఁ గొంతకాల మాచరించినావు. ఇంతలోఁ బ్రభువులు నిన్నుఁ బైకిలాగిరి. నీవు ప్రజలను విడిచితివి. పాఠశాలా కర్మాగారాదినివేశన

యనుకొంటిని. అంతలోఁ జెంపపెట్టులు-మోచేతిపోటులు-కాలిత్రొక్కులు-నమ్మర్దిగాఁ దిన్న యావాచాటుఁడు మరణించెనని జనులు తహతహ లాడుచున్నారు. కొందరు హరిహరీ యనుచున్నారు. కొంద అక్కటక్కటా యనుచున్నారు. ఎంతపని జరిగెనయ్యో యని కొందఅనుచున్నారు. నందడిచే నలిగి చచ్చెను గాని యాతని నెవ్వరును జంపియుండ లేదని కొందరు నర్దుబాటుమాటల ననుచున్నారు. ప్రాణ మనఁగ నెంతయయ్యో యని పారమార్థికవాక్యములను గొంద రాడుచున్నారు. మనవానినే మనము చంపుకొంటిమే? యని కొందరు విలపించుచున్నారు. పైవారి నెవరు చంపనిచ్చెదరని మరికొంద రెత్తిపొడుచుచున్నారు. ఇంతలో నెఱ్ఱపాగలవారు-చంక దుడ్డువారు -కిరుచెప్పులవారు నగు రక్షకభటులు కొందరు జనమధ్యమునకు వచ్చి యాతనికళేబర మును బైకెత్తి "ఇదిగో! ఈదేశభక్తులలోఁ గొంద రీతనిని వధించినారు. మాయధికారి వచ్చు వరకు మీరెవ్వ రిటనుండి కదలఁగూడదు" అని కేకలిడిరి. కొందరు చల్లచల్లగ నింట్లకు జారుచున్నారు. తిరుగుఁడు తిరుఁగుడని రక్షకభటులు కేకలు వైచుచున్నారు. ఈవైపుఁ దిరుగుచున్నారు. ఆవైపునఁ బారిపోవుచున్నారు. ఈవైపున మూఁగుచున్నారు. ఆవైపునఁ బలుచఁ బడుచున్నారు. బిలబిల మని సంఘమంత నొక్కటేగోల!

ఇంతలో భూమిక్రింద నేదియో గడగడ వడఁకిన ట్లయ్యెను. జనులు తూలిపోవుచున్నారు. భయభ్రాంతు లగుచున్నారు. ఆశ్చర్య మగ్నులగుచున్నారు. కంపితదేహు లగుచున్నారు. భూమిలోని గడగడ వృద్ధి యగుచున్నది. జనుల గుండెలలోని దడదడ మరింత వృద్ధియగు చున్నది. ఇంతలో భూమిని బెకల్చుకొని యొక నవరత్న ఖచితమగు బంగారు సింహాసనము పైకివచ్చి భూమిపై నిల్చినది. రెండు వజ్రాలసింహములు దానిని మోయుచున్నవి. నవరత్నముల జిలజిలలు నయనములకు మిరుమిట్లు కొలుపుచున్నవి. ఇదియేమో ఇదియేమో యని జనులు గుబ్బెటలు వడఁజొచ్చిరి. ఇది శ్రీరామచంద్ర మూర్తి సింహాసనమని కొందరు-విక్రమార్కుని సింహాసన మని కొందరు-ధర్మరాజు సింహాసన మని కొందరు-నెవరికిఁ దోఁచినట్లు వారు సిద్ధాంతీకరించిరి. ఎవ్వరి సింహాసనమో యెవ్వరు చెప్పఁగలరు? ఇంతలోఁ దళుకున మెఱపు మెఱసిన ట్లయ్యెను. తాటికాయంత యుల్క యేటవాలుగ దిగి యాసింహాసనముపై నిలిచెను. అందఱ కన్నులు చీఁకటులు గ్రమ్మినవి. తిరిగి కన్నులు తెఱచునరికి-మింటనుండి పడినపదార్థ ముల్క కాదు. అది యొక పురుషుని శిరము. శిరముమాత్రమే సింహాసనమున నున్నది. మిగిలిన మొండె మెచ్చటనున్నదో తెలియదు. ఆశిరము నాల్గు వైపులఁగూడ బొంగరమువలెఁ దిరిగి మూచి యిట్లు గంభీరస్వరమునఁ బలికెను.

"ఇది భారతమాత పీఠము. నే నెవఁడనో మీకుఁ దెలియనక్కఱ లేదు. మీరందరు దేశసేవకై యిటఁ జేరిన దేశభక్తులని యనుకొనుచున్నారు. కావున నొకరివెనుక నొక రీపీఠమును సమీపించి-దీనిని జేతితో స్పృశించి-కన్నుల కద్దుకొనుఁడు. మీకు భగ వంతుఁడు సర్వ శ్రేయముల నిచ్చుగాక! మిమ్మఁ గన్న దేశమాత సర్వథా మిమ్ము రక్షించుగాక!" ఇట్లా శిరోమాత్రమహాపురుషుఁడు పల్క యూర కుండెను. అంత నొక్క న్యాయవాది సంఘముననుండి యిట్లనియెను. "ఓమహాపురుషా! నేనొక్క న్యాయవాదిని. నెలకుఁ బదివేలరూపాయల వఱకు సంపాదించుచుంటిని. అట్టి రాఁబడిని

దేశభక్తి యెల్లరహృదయములం దిప్పుడు నిరంకుశముగఁ దాండ వించుచున్నది. ఈగుణమనునది పుట్టుకతోఁ బుట్టనలసినది. కిట్టుటతోఁ గిట్టవలసినది: అంతేకాని నడుమనడుమఁ గలుగుట నడుమనడుమ నంతరించుట తఱుచుగఁ గానఁబడదు. కలుగక కలుగక మనవారికి దేశభక్తికలు గుటచేతఁగాఁబోలు వెఱ్రివెఱ్రికేక లిడుచున్నారు. వీరావేశము లొందుచున్నారు. క్రిందుమీఁదు తెలియక యెగురుచున్నారు. ఎదుట మూట లాడఁదలచిన వారిని మొత్తుచున్నారు. గొంతు చింపుకొనుచున్నారు. కాళ్లు విరుఁగ ద్రొక్కు చున్నారు. వ్యతిరేకపుమూటలు వినుసరికిఁ దలలు నేలఁ గొట్టుకొనుచున్నారు. ఎదుటివారి నాలుక లూడఁబీకుటకు సిద్ధపడుచున్నారు. గిరగిర కుమ్మరిసారెవలెఁ దిరుగుచున్నారు. ఏమో? ఎందులకో? ఎవరికొఱకో? దేనికొఱకో? ఏమి పని చేయుటకో? ఏమి ఫల మనుభవించుటకో? ఏమో? ఏమో? ఎవరికిఁ దెలియును? తెలియుట కూహించినవా రెవ్వరు? ఊహించుటకు మనస్సు లెవరికి? అంత గావు కేకలతో మనస్సు లెగిరిపోవుట యాశ్చర్యమేమి? యెక్కడఁజూచిన దేశభక్తులే! బజారులో దేశభక్తులు, మందబయట దేశభక్తులు, చెరువునొడ్డున దేశభక్తులు, పశువులసంతలో దేశభక్తులు, మేదర గూడెములో దేశభక్తులు, మాలిపల్లిలో దేశభక్తులు, రైలు స్టేషనులో దేశభక్తులు. నేలయీనిన ట్లందరు దేశభక్తులు—వందలు వేలు లక్షలు. ఇందరు దేశభక్తులు మనదేశమున నున్నతరువాత మనదేశమున కిఁకఁ గొఱఁతయేమి? ఇంకను దేశమునకు దురవస్థ యేమి? ఏమియులేదు. ఇదియే స్వతంత్ర రాజ్యము. ఇదియే స్వర్గ లోకము–(ఏమి హేళనము? ఏమి దూషణము? ఇంతసేపును సహించినాము. ఇఁక సహింపము. జాగ్రత్త. నోరు కట్టిపెట్టుకొనుము–అని సభలోఁ గేకలు) నోరు కట్టిబెట్టుకొనుఁడనియే నేనును హెచ్చరించుచున్నాను. నోటికి వచ్చినట్లల్ల వదరుటయే దేశభక్తి కాదని చెప్పుచున్నాను. (దిగు. దిగు. దిగకపోయిన యెడల దింపెదము. జాగ్రత్త యని సభలోఁ గేకలు) నన్ను దింపుట లెక్కయేమి? దేశమునే దురవస్థలో దింపినారు. ఇంక దింపనై యున్నారు. ఇదిగో? దేశ భక్తులపని యిట్లున్నది. రవంత వ్యతిరేకపుమూట సహించుకొనలేని మీకు దేశభక్తి యెక్కడ? దేశమునకున్న క్షమాశక్తి మీకున్నప్పుడు–మీకు దేశభక్తియున్నది. దేశభక్తి యున్నప్పుడు మీకు దేశభక్తియున్నది. ఇంద్రియనిగ్రహ మున్నప్పుడు మీకు దేశభక్తి యున్నది. జిహ్వ కట్టుకొనలేరు. నోరు కట్టుకొనలేరు. పనసు కట్టుకొనలేరు. మీకు దేశభక్తియా? దేశభక్తుఁ డెంత నైరాగ్యసంపన్నుఁడో? ఎంత స్వార్థపరిత్యాగియో? ఎంత శాంతుఁడో? ఎంత శమదమాది సంపన్నుఁడో? ఎంత నిశ్చలహృదయుఁడో? ఎంత ప్రజావిధేయుఁడో? ఎంత నిర్వ్యగ్రుఁడో? ఎంత దైవభక్తియుతుఁడో మీరెరుఁగుదురా? అట్టిచో దేశభక్తులు మీరేనా? దేశోద్ధారకులు మీరేనా? మీవలనేనా దేశము ముందునకు రావలసినది? ఇఁక నడుగ నక్కఱలేదు. (తన్ను. తన్ను. ఒడలు తెలియక వాఁగుచున్నాఁ డని సభలోఁ గేకలు). కొందరు దేశభక్తు లంతట నుపన్యాసరంగము మీఁదికి దుమికి యా వావదూకు నీచెంప నాచెంప వాయించి క్రిందికిఁ ద్రోచివైచిరి.c ఆతఁ డింకఁ జేతులెత్తి యేమో యుపన్యసించుచునే యున్నాఁడు) మీరు దేశభక్తులు కారు. వట్టివేషధారులు. దంభాచారు – మాయాప్రవర్తకులు. స్వార్థైకాభిలాషులు. నటకులు. అని యింక నాతఁడు కేకలిడుచునే యున్నాఁడు. దేశభక్తులింక నాతనిఁ గొట్టుచునే యున్నారు.. నే నాసమయమున నుపన్యాసపీఠ మెక్కి యేదైనఁ జెప్పవలయునని

15. దేశభక్తి-స్వార్థపరిత్యాగము

జంఘూల శాస్త్రికి అప్పుడప్పుడు చిత్ర చిత్రమైన కలలు వస్తూవుండడం పరిపాటి. ఆ కలలలో జరిగిన విషయాలను అతను చెపుతూంటాడు సాక్షి సంఘశ్రోతలకి–

ఒక రాత్రి అతనికి వచ్చిన కలలో పెద్ద మైదానంలో ఎందరో జనం కిటకిటలాడు తున్నారు. వారంతా దేశభక్తి అనే వీరావేశంతో వెర్రి వెర్రి కేకలు పెడుతున్నారు. బజారు, సంత, చెరువుగట్టు, సందు గొందులనే తేడాలు లేకుండా ఆ ఊరు ఊరంతా దేశభక్తుల మయంగా వుంది. వాళ్లు వేలల్లో లక్షల్లో వున్నారు. ఆ మైదానంలో ఒకడు ఉపన్యశిస్తున్నాడు. అతను 'దేశభక్తి' అనే మాటకి, భావానికి తెగులు పట్టిస్తున్న వారిని వ్యంగ్యంగా తూర్పార పడుతున్నాడు. అతని ఉపన్యాస ధోరణిని భరించలేని సొదా దేశభక్తులు అతన్ని నిర్దాక్షిణ్యంగా కొడుతున్నారు.

జంఘూల శాస్త్రి ఆకలలో కూడా ఉపన్యాసం చెయ్యాలని ప్రయత్నించా డక్కడ. జంఘూలుడు కూడా కాస్తంత దెబ్బలు తిన్నాడు గాని, అసలు ఉపన్యాసకుడు హరీమన్నాడు. పోలీసులు రంగప్రవేశం చెయ్యడంతో కల కలం, త్రొక్కిసలాట జరిగింది.

ఇంతలో భూమిని చించుకుని ఒక రత్న సింహాసనం పైకి వచ్చింది. ఒక కంఠ స్వరం వినిపించింది. అది భారతమాత పీఠం. సిసలైన దేశభక్తులు ఎదుటికి వచ్చి, పీఠాన్ని తాకి కన్నుల కద్దుకోమని పొచ్చరిక. మహామహా దేశభక్తులుగా ప్రకటించుకున్న వారు సైతం ఆ పీఠం దరిజేరలేక పోయారు. వారందరి లొసుగులు బయటపెట్టి ఆ కంఠం మందలించింది. అసలైన ఒకరిద్దరు భక్తులు మాత్రమే తాకగలిగారు. ఇదీ – జంఘూలుడి స్వప్న కథ.

జంఘూలశాస్త్రి యిట్లుపన్యసించెను.

నాయనలారా! దేహములోఁ గొలఁదిదినములనుండి మిగుల ననారోగ్యముగా నుండుటచేత నరియైననిద్రలేక స్వప్నము లధికముగా వచ్చుచున్నవి. నిన్న రాత్రి కలిగిన స్వప్నమును జెప్పెదను. ఏదియోకాని అదియొక యూరు. ఆయూరి పెద్దమైదానమునం దవేకజనము కిటకిట లాడుచున్నది. అమహానంఘములో నొకఁ డిట్లుపన్యసించుచున్నాఁడు.

గీ. తెల్లసుద్దకు మరి విభూతికిని బడదు
నుద్ధముక్కల రెంటికిc జుక్క యెదురు
పగిలిన విభూతిపండులోc బ్రబలతరము
లైన తెగల రెంటికిని షష్ఠాష్టకంబు.

గీ. బొగ్గుదారి బొగ్గుది నుద్ది బూడిదలకు
దాని కెప్పుడు నైధనతారవరుస
అరవలకు నాంధ్రులకు గుద్దులాట ధాటి
పైగ బ్రాహ్మణాబ్రాహ్మణ భండనంబు.

ఇంక నుపన్యాసకర్తగాని యుపన్యాసములో విమర్శింపవలసినవి Industries Fine Arts etc. అయి యున్నవి. వానినిగూర్చి మరి యెప్పుడైన మాటలాడుదును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

నిష్ఫలాపేక్షతో దేశమునకు దన్నర్పణము చేసికొనునో వాఁడే దేశభక్తుఁడు. అంతేకాని దేశభక్తి దేశభక్తియని యుపన్యాసపీఠములపై గొంతెత్తి యఱచినంత మాత్రమున దేశభక్తి యుదయించునా? దేశప్రజలను సోదరప్రేమతోఁ జూచుటకు మీకు హృదయములే లేన ప్పుడు మీకెక్కడ దేశభక్తి! నిశ్చలదైవచింతలేని వానికి దేశభక్తి యుదయించుట వట్టికల్ల. మాంటేగూ షెమ్స్‌ఫర్డు నామస్మరణతప్ప దేవునిపేరైన నెత్తక, యుత్తరగతిసంగతి నంత కంటె నాలోచింపక, స్వార్థపరత్వమును మానలేక సోదరదూషణకు వెనుదీయక, దేశభక్తి దేశభక్తి యని యంభోధితీరమున మీరఱచిన యఱపు లరణ్య రోదనములకంటె భిన్నమా? దేశభక్తి! అది యెంతటివానికిఁ గలుగ వలయును! మనవేదములను పరఖండవాసుల కప్పఁజెప్పి, మనపురాణములను బూతులబుంగలని తిట్టి మన సదాచారము లున్మత్తచేష్టలని నిరాకరించి మన జాతీయగాథల యంతరార్థ మెరుంగక, మనజాతికిఁ బ్రధాన తత్వమేదో మొదలే యెరుఁగక, దేశభక్తి దేశభక్తి యని బల్లలపై గ్రుద్దినంత మాత్రమున, తుంట్లపైఁ జఱచుకొన్నంత మాత్రమున మీరు దేశభక్తు లయ్యేదరా! దేశభక్తుఁ డనఁగా దనకుఁ దన దేశీయులకు భేదము తలఁపులో, మాటలో చర్యలో లేనివాఁడు. మనస్సును సుతిలోఁ గలిపి వాక్కు పొడుచున్నదేమో పరిశీలింపుడు. కర్మమీపాట కనుగుణముగఁ దాళము వైచుచున్న దేమో కనిపెట్టుఁడు! ఆమూఁటిలో నన్యోన్య మేళనము సామరస్యము. తత్సంభూతమగు ననిర్వాచ్యమైన రక్తియు శోభించుచున్న వేమో బాగుగా నిదానింపుఁడు. ఎక్కడ వినినను నపస్వరము వెలితి– సుతిదారి వేరు– స్వరముదారి వేరు-దెబ్బలో నుసి– ఉసిలో దెబ్బ– వట్టి యపలయగతి– ఇంత యైకమత్యశూన్యత యెన్నఁడైన నీదేశమునఁ గలదా? ఈదేశము నందే యక్కఱ లేదు. సర్వప్రపంచమున నేదేశమందైన నేకాలమందైన నుండెనని యెవ్వరైన వినియుండిరా? ఇట్టి మన దుస్థితి పరదేశవాసుల కెంత హాస్యాస్పదముగా నెంత నిందాకర ముగా నున్నదో కనిపెట్టితిరా? కటకటా? హిమాలయ మేడ్చియేడ్చి కరగికరగి నీరై నీరూపముగ నెగసిపోవఁదగినంత దుర్దశ ప్రాప్తించె ననుట క్షేమైన సందేహమా? మీదేశాధిష్ఠాన దేవతయగు భారత మాతను భావనామహిమాతిరేకమున మీరు చూడఁగలిగితిరేని యామె బాష్పప్రవాహములయందు సింధు గంగా బ్రహ్మపుత్ర గోదావరీ కావేరీనదీతోయసంఘమం తయు నొక్కబిందువైనఁ గాదే! ఈయైకమత్యశూన్యత ప్రతికుటుంబమునఁగూడ వ్యాపించి మహాసంక్షోభంబును గలుగఁజేయుచున్నదే! తండ్రి Moderate కొడుకు Extremist కోడలు Non-co-operatrix. మన జాతీయత యిట్లున్నది. చేయి జారినకుండ యిన్ని ముక్కలుకాదే – చేత నడవఁబడిన పాదరస మిన్ని శకలములు గాఁజాలదే! మీపూర్వులకున్న జాతీయతలోఁ దేశభక్తిలో సహస్రాంశమైన మీకున్నదా? వారి యైకమత్యములో గోట్యంశమైన మీ కున్నదా? ఇప్పుడు మీకు సమృద్ధిగా నున్నవి– తిట్లు– బూతులు సిగపట్లగోత్రములు పంజాబీ మైనూరీ కుస్తీల యెడుపులు– ముష్టియుద్ధములు కర్రవిసరులు– ఈసౌభాగ్యమే జాతీయతయగునే డల మీకది పూర్తిగా నున్నది.

నాయనలారా! ఈవిషయమున నే నింతకంటె మాడలాడఁదగదు. రాజకీయవిషయ ములు మాయుపన్యాసవిషయములు కావు. ఈమాటలైన నంఘపక్షమునుండి చెప్పినవికాని మరియొకటికాదు– ఐకమత్యము లేని సంఘు మెన్నఁడు సంఘముకాదు– ఇఁక జాతియగుట యెట్లు?

తేజరిల్లుఁ గాక! ఓ! పెట్టినకోర్టులు పెట్టుచునే యున్నారు. చేసిన శాసనములు చేయుచునే యున్నారు. వచ్చిన వ్యాజ్యేములు వచ్చుచునే యున్నవి. కాలాంబర కవచధారులగు న్యాయవాదులు కోర్టులలోఁ జేరినవారు చేరుచునే యున్నారు. సాక్షి బోనులలోఁజేయించిన ప్రమాణములు మొదటిసారి రెండవసారి మూడవసారికూడఁ జేయుచునే యున్నారు. అప్రతిహతముగా ననర్గళముగా నపరిమితస్ఫూర్తితో– నాభీలవేగముతో– ననంతముఖముల తో– ననృత మాకాశమునంతయు నావరించు చున్నది. మన పురాణపురుషులవఱ, కక్కఱ లేదు. మనకుఁ బదితరముల వెనుకటివారైన స్వర్గమునుండి నిశ్శరీరాత్మలతో మన న్యాయస్థానములలో జరుగుచున్న చర్యను గాంచినయెడల ''వీరు మన కడుపునఁబుట్టిన నిర్భాగ్యులే? మన మెన్న డెరుఁగని ప్రమాణములు చేయుచున్నారే! అంతకంటె ఘోరములగు ననృతము లాడుచున్నారే! హరహరా! వీరిమొగములు చూడ మనసుగతులూడు'' నని కనులుమూసి కొని చెప్పరానంత యేవ వారు పదునట్లు మనలో నూటికిఁ దొంబదుగురు ప్రవర్తించు చున్నారనుట క్షేమైన సందేహమా? ఇంకను మన నాగరకతయే యధికమని యభిప్రాయపడు చుంటిరా? అసందర్భ ప్రలాపమే, అనృతవాదనమే, మాయాప్రవీణతయే, సమయోచిత ప్రవర్తనమే, అన్యాయశీలమే నాగరకతయైనప్పుడు మనలో రూపాయకుఁ బదునాలుగణాల వఱ కట్టి వారే. కావున మనమే పూర్వులకంటె నాగరకాధికులము కాని యిప్పుడు సత్యమును Barbaric virtuesలో మాత్రమే నిలిపి Enlightened virtuesతో నుండి తీసివైచితిరా? తీసివైచి నది మీరేనా? మీరు కారుగదా! మిమ్మ బుట్టించిన బ్రహ్మయైన దేశకాలాబాధ్యమైన సత్యము నట్లు తీయఁదరమా? నాగరకత లేకున్నను జాతియైన నుండును గాని మగవానిలో సత్యమును మగువలోఁ బాతివ్రత్యమును దీసివైచిన యెడల నింక జాతి యెక్కడిది? జాతియే లేనప్పుడు నాగరకత దేనికి? కావున వెర్రివెర్రి యాధిక్యములు మీఁదఁ బడవైచికొనకుఁడు.

నాయనలారా! ఒక్కసత్యగుణమును గూర్చియే చెప్పితిని నిర్భయత్వాదిగుణములు మనపూర్వుల కనేకము లున్నవని చెప్పితిని. అవి యన్నియు నిట్లు విస్తరించి యవి మన కున్నవేమో నిశ్చయించుటకు నా కవకాశములేదు. నాకిచ్చిన మితికొలఁది. విషయము విపులము. కావున సంక్షేపముగా ముందుఁ జెప్పవలసినది చెప్పుదును.

నాగరకతావిషయ మేదో యయినది, మన యుపన్యాసకర్త మరి యొక్కమాట సెలవిచ్చిరి. ''ఇప్పటి జాతీయత, జాతీయ సమస్యలు మన పూర్వపువారు కలఁగనియుండ లేదు,'' ఇది మహావాక్యరత్నము– పరమ సిద్ధాంత కోటీరమణి– ఆగమమంత్ర శేఖరము– ఎట్లు? జాతీయత– జాతీయసమస్యలునా? సెబాస్! జాతీయతయా? జాతియంతయు అనగా జాతిలోని జనులందరు నన్యోన్యసోదరభావము కలిగి, దేశభక్తిచే దేశాభివృద్ధికరము లగు మహాకార్యము లాచరించుట కనువైన మనశక్తి సంపన్నతయే కాదా జాతీయతలోని ప్రధానతత్త్వము! అన్యోన్యప్రేమ పూర్వకములగు దేశభక్తియే కాదా జాతీయతకుఁ బ్రధానమై నది? ఆర్యభాషాపాండిత్యమునకు ''అ ఆ'' లెట్టివో సర్వమంత్రముల కోంకార మెట్టిదో జాతీయతకు దేశభక్తి యట్టిది. దేశమే దైవముగా నెచ్చట నారాధింపఁబడునో యచ్చట దేశభక్తి యనుమాట కర్థమున్నది. దేశ క్షేమముకొఱకుఁ దమక్షేమ మెంత ఘనమైనను నెంత యమూల్య మైనను దృణప్రాయముగా నెవరిలో విసర్జింపఁబడునో వారిలో దేశభక్తి యను మాట కర్థమున్నది. దారాపుత్రాదు లతో సాంగకముగాఁ జిత్తబుద్ధ్యాత్మలతో నెవ్వఁడు

మూలాపమార్ధవమైనది. ఛీ! ఆర్యులగౌరవ మంతలోనికి జారిపోయినది. కత్తి కంఠము మీఁదఁ బడనున్నప్పుడైన నసత్యచ్ఛాయనైనం ద్రొక్కని యార్యుఁడు పాడుము పట్టుకై యడ్డమైన యసత్యము లాడుచున్నాఁడు. పరదేశీయపాలనమువలన మనము సంపాదించుకొనిన సౌభాగ్య మేది? ఇందుల కంద రొక్కసారి కలిసి యొక్క పెట్టున నేడ్చుటకంటెఁ జేసికొనఁదగిన ప్రాయశ్చిత్త మేదియు లేదు. ఇట్టి యసత్యములఁగూర్చి కూడ మిమ్ము నేను నిందింపను. ఇంతకంటె భయం కరములగువానిని గూర్చియే యోచింతము.

పూర్వమున– నెంతయో పూర్వమున నైనఁగాదు– రెండు వందల సంవత్సరముల క్రిందటి మనవారు ఋణములు తీసికొనినప్పుడు స్టాంపులుండెనా? రెజిస్ట్రేషను లుండెనా? స్వాధీనాస్వాధీనపు తనఖా లుండెనా? తాకట్టు లుండెనా? అణాబిళ్లలైన నుండెనా? సంతకము లుండెనా? సాక్షిప్రాళ్లుండెనా? కాగితము లుండెనా? తాటాకుపాయలైన దఱుచుగ నుప యోగింపఁబడి యుండెనా? ఏమియు లేవు. సమస్త వస్తు ప్రధానమైనదియు, శాశ్వతమైన దియు, స్వయంజ్యోతి యైనదియు, సర్వేశ్వర స్వరూపమైనదియు నైన సత్యమున్నది. అట్టి సత్యము మన పూర్వుల కుండుటచేతనే యీ సామగ్రీసహస్రమంతయు నక్కఱలేక పోయినది. గర్భాధారపుగదిలోఁ గావలసిన మగతన మున్నవరునకుఁ దనువుపైఁ జందనచర్చ యేల? మీసాలకు వృశ్చిక పుచ్ఛపుటొడుపు లేల? కత్తిరింపుతలపై నవ్యభాగనీమంత వైభోగ మేల? English Gymnasticsలోఁ బ్రజ్ఞను వెల్లడించు బంగారుమంగళసూత్రములు మెడలో నేల? ఇవి నిష్ప్రయోజనములు. నిరుపయోగములు. నిరర్థకములు. నిస్సారములు. మనపూ ర్వులు సత్యబలలీలాకలాపులు కావుననే వారికిఁ బత్రాదిసాధనము లక్కఱలేకపోయెను. వారికాకాశమే పత్రము నోటి మాటయే చేవ్రాలు. సూర్యచంద్రులే సాక్షులు. సత్యమే స్టాంపు. ఇప్పుడో-- మరియిప్పుడో– పూర్యులకంటె నత్యంతనాగరకులమగు మనచే నార్యావర్తమంతయుఁ బ్రకాశించుచున్న యిప్పుడో– పత్రము వ్రాసినది మొదలు ఋణ మెళ్లగబెట్టవచ్చునా యను చింత తప్ప మరియేమైన నున్నదా? అణాబిళ్లమీఁద సంతకమైనది మొదలు స్టేటు మెంటిచ్చుట యెటులా యను మహాలోచనము తక్క మరియేమైన నున్నదా? ఇట్టి సంధ్యవస్థలో పూర్వపక్ష రాద్ధాంతమధ్య డోలాందోళ నావస్థలో మహాబుద్ధిశా లురు, న్యాయశాస్త్రశాసనపారీణులు, పంది పట్టపుటేనుఁగ యని, పట్టపుటేనుఁగ పంది యని వాదించు మహామాయాకలాలీలాకలితజగన్మోహినీకరణవాణీవిశారదులు నిరంకుశు లగు కొందరు న్యాయవాదులు మనకుఁ దోడుపడి మన కనుకూలములగు సాధనములు మార్గములు చెప్పకుండినయెడల మన ముత్తపుర్ణ్ములనోట బెడ్డఁగొట్ట గలిగియుందుమా? ఋణము లెగఁబెట్టఁ గలిగియుందుమా? బ్రదికియున్న సాక్షులు పరమపదించినట్లు వ్యాహృత నిదర్శనములు తేఁ గలిగియుందుమా? దండధరలోకమున దారుణాగ్ని కుండములఁ దపింపఁ సాక్షులను సమనుమీఁదఁ బిలిపించి సాక్ష్యములు మన కనుకూలముగా నిప్పింపఁగ లమా? న్యాయవాదులముందు మన ప్రయోజకత్వము లెంత? మన ప్రతిభ లెంత? మన యుక్తులెంత? కనుకట్టులెంత? ప్రబలకోపోదయమున నరహంత కావలసివచ్చిన నేరగాఁడు నిశ్చలపశ్చాత్తాపమునఁ దననేరము నొప్పుకొనుటకు సిద్ధపడిననుఁ– బరమదయాళుఁడైన యొక్కొక్క న్యాయవాది యాతని నట్లొప్పుకొననీయఁడే! ఆహా! అమృత స్వరూపుఁడు! కరుణాసముద్రుఁడు! దీనజనబాంధవుడు! భూతదయా సంపూర్ణుఁడు! ఇహలోకదైవము! అట్టి న్యాయవాదియే న్యాయవాది యగుఁగాక! ఆతఁడే సర్వదా సమస్త లక్ష్మీసమన్వితుఁడై

కాక మెదడు మడమలో నున్నదని నమ్మకమా? ఆహా! పత్రమే వృక్షమునకు మూలమా? కొడుకులే తండ్రులను బుట్టించిరా? దినమణికంటె దీపమే తేజస్వంతమా? గడియారమే కాలచక్రము నధిక్షేపించినదా? ఎట్లు? ఎట్లు? పూర్వుల నాగరకతకంటె మన నాగరకతయే మిక్కిలి (Higher grade) గలదా? ఆ! ఆ! (Higher grade) అనఁగా నెట్టిది? చుట్టలలో సైకిల్సులలో సిగరెట్టులలో పరీక్షలలో నింక నిట్టి మరికొన్నిటిలో (Higher grade) అనుమాటల క్షేమైన నర్థ ముండునేమో కాని దురదలో, నుల్లిపాయలపులుసులోఁ గొఱక చ్చులలోఁ గోడిగ్రుడ్లలో నల్లికనులపాములలో నాగరకతలలో నామాటల క్షేమి యర్థముం డునో యామహానుభావులక్షే తెలియఁదగినది. పోనిండు ''మతకీయ మనకీయ దీపకొంపా త్మీయ యేలుబడే'' త్యాది నిర్దుష్ట నిరంకుశ నిరుపమాన నిరర్గళమహాప్రయోగములలో నిదికూడ నొక్కటియైయుండి శబ్దప్రపంచమునఁ బ్రకాశించుగాక! దానికై నాకంత తగవు లేదు. కాని మన నాగరకత పూర్వుల నాగరకతకంటె నెట్లెక్కువ? త్రికాలసంధ్యాయాగ్ని హోత్రములు మాని సంతత ధూమచ్ఛదవర్తికాపాన మొనర్చుట చేతనా? బ్రహ్మసూత్రపఠ నము మాని రైనాల్డ్సుముని సూత్రపారాయణ మొనర్చుటచేతనా? గోష్పాదమంత జుట్టు మాని గొర్రెబొచ్చుదొంతరను ధరించుటచేతనా? చిత్తమాలిన్యసమ్మార్జనచింతమాని విదేశ పాదరక్షా సమ్మార్జన మొనర్చుటచేతనా? [illegible] రుద్రాక్షతులసీదామధారణమును మాని వివిధవర్ణ కృత్రిమపీతాంబర నిర్మిత ధనుఃకంఠగ్రంథీత్యాది చిత్ర విచిత్రాలంకార సమృద్ధి నొందుటచేతనా? కౌపీనోత్తరీయాదుల నిరాకరించి కోటు పంట్లాములతో ముస్తాబులు చేసికొనినందులకా? ఉత్తరేణి పుల్లలతో దంతధావనము మాని దేనిబొచ్చో గ్రుచ్చిన యేజంతు శల్యముతోనో దశనపరిశుద్ధ యొనర్చుకొనుట చేతనా? ఇవియన్నియును పరివేషములు. దొరలవలె నుండుట కుచితతలేక తెచ్చుకొన్న యెరువు సంబరములు. ఎట్టివైనను బాహ్యస్వ రూపములు. ఇవికూడ నేనంతగ గణింపను. ప్రధానమగునది మనస్సు. అది సత్యసంయు క్తమై నిర్భయతాసమన్వితమై స్వదేశీయ గ్రంథజ్ఞాన తేజశ్శోభాయమానమై స్వదేశార్హత మాదర్శావలంబనపటిష్ఠమై- స్వదేశీయ సర్వవృత్తిజాల సంవర్ధన సంపూర్ణవాంఛా సమంజస మై- స్వదేశభాషాభిమాన మాననీయమై- పరమేశ్వర పాదారవిందభక్తిప్రపూర్ణమై- యుండిన యెడల బాహ్యవేషము లెట్లుండినవైన నంత గణింప నక్కఱ లేదు. సోదరులారా! ఈసుగుణ సముదాయ మంతయు మీకుండ నక్కరలేదు. వీనిలో నేదైన నొక్కగుణమైన మీమనస్సు లలో నున్నదని మీరు ధైర్యముగా దైవముఖమును జూచి చెప్పఁగలరా? మొదటఁ జెప్పిన సత్యగుణమునుగూర్చి యోజింతము. (My learned friend) అని ప్రతిపక్షునిగూర్చి మీరు పలికిన దొంగమాటలు సంతోషపూర్వకముగా నెగఁబెట్టిన యీవినిగూర్చి (I regret my inability to help you) అని మీరు పలికిన మాయాలాపములు ముక్కు మొగమెరుఁగని వానిని జూచినప్పుడైన మీ రుప్పొంగిన ట్లగపడి హస్తచాలన మొనర్చి (I am so very happy to see you) అని మీరు వంచించిన కపట వాక్యములు పొడుము పట్టిచ్చినవారికైన మీరు పదేపదే చేయుబొల్లి బొల్లినైచ్యపు (Thank you)లు మీరెంత సత్యవాదులో లోకమునకు వెల్లడి చేయుచుండుట లేదా? పోనిండు. మర్యాదకొఱకు- సంఘగౌరవముకొఱకు- వైఖరీప్రశస్తత కొఱకు- ఆభిజాత్యలక్షణ ప్రకటనము కొఱకు వచనరచనాభిరుచికొఱకు యథేష్టముగా నసత్యకథన సందేహ గంధరహితముగా నిన్ని యనృతము లాడుచున్నారు కాఁబోలు! అసత్య మీకాలమున నన్వయమర్యాదయైనది. కుటిలవాక్యము Good manner అయినది. అనృత

(Religious activity) రాజకీయాందోళనము (Political activity) కానము. ప్రతియొక్క రోజునా స్నానము మడి నంధ్య ముక్కు కట్టివేసుట– మూల కూరుచుట– మూతిమీద గందము మొత్తుకొనుట– దేహనత్తువ యాయలేని చచ్చుశాక కూరలతో సాపాటుచేసుట– యిట్టి యిట్టి వెల లేనివ్యాపారములు (Worthless avocations) తప్ప మరి మంచి యేపనియున్నా కానము– పరిశ్రమశాలలు శాస్త్రశోధకములు లేవు. (అర్థముండునట్లు మాటలాడుఁడు అని నభలోఁ గేకలు) మతమే మన దేవత– ఆమె వినయ విధేయ విశ్వాస పూజారివారము మనము. ఆమతకీయపిశాచమే (ఛీ ఛీ అను ధ్వనులు) మన దేహములనే కాక మన యాత్మలను గూడ బానిసత్వములోకి దింపినది– మన బలలేమికి మతమే దుంప– పరదేశీదండయాత్రలే, కొమ్మలు, తీఁగెలు– మన బానిసత్వమే పువ్వు– నిత్య యేడుపే మన పండు (కాయమాట యేడ్చినావు కావేమి. అని నభలో గేకలు) పూర్వుల నాగరకత కంటె మనయిప్పటి నాగరకత మిక్కిలి (Higher grade) లోదనుట క్షేమియు సందేహము లేదు. (నీవు శుంఠవనుట కంతకంటె సందేహము లేదు) ఇప్పటి జాతీయత– జాతీయ సమస్యలు– మన పూర్యులు కలఁ గనియుండలేదు– ఇప్పుడు తెలివి సూర్యుఁ డుదయించి మీఁద కెక్కుచున్నాఁడు– రాజకీయ (Stage) మీఁద జాతీయత్వ Actress, Dance చేస్తూవుండి ఉండుచున్నది. ఆమెగారియొక్క యొక్క చేతిప్రక్కను కర్మలు (Industries) రెండవయొక్క చేతి ప్రక్కను (Sciences) దివ్యపాటను అమృతజల్లులుగా ఆర్యావర్తమున వానచేయుచున్నది. దేవియైన జాతీయతగారి గాగరాయొక్క భాగ్యమంతమైన యంచును స్వతంత్రము (Liberty) అను సుందరపడుచు పట్టుకొని కాలితో కాలమును కొట్టుచున్నది. ప్రాచీనమయొక్క కాలములో మన మెరుంగని నుందరసుఖ దివ్యసురోజులు మన దేశ ముమీఁద వాలినవి– సెబాస్ సెబాస్! (సెబాస్ కాదు ఛీ-ఛీ-దివ్యసురోజులు కాదు -దిక్కుమాలిన రోజులు అని నభలోఁ గేకలు) ఇది మీదను (Lo! Lo!) కండ్లు తెఱచుకొండి– ఎదుటిలో నేరుగా చూచుకొండి– అదే (Very Well) అదే– అదే Harbour, అదే మన సంగమ్యచోటు (Goal) అదే దీపకొంప– ఇంక సముద్రఖాతమునుండి మనము తన స్వపరిపాలనము (Well) మనకీయ యేలుబడి (Home Rule) లోకి దిగుదుము. (నీవు బల్లదిగి నోరుమూసికొని యుండనియెడల నిన్ను బంగాళాఖాతములోఁ బాఱివైచెదము అని శేకలు) అంత నాయుపన్యాసకర్త బలాత్కారమున నుపన్యానరంగమునుండి బహిష్కరింపఁబడెను. తరువాత నెవ్వరైన మాటలాడుదురా యని సభాధ్యక్షుఁ డడుగ నేను మాటలాడుదునయ్యా యని లేచితిని. 'ఇంక నేమి? మన జంఘాలశాస్త్రియే' యని సభలో ననేకులుత్సాహసంభ్రమములతో నుప్పొంగిరి. (Come up, Come up) అని సభలో ననేకులుద్ఘోషలై వచియించిరి. అంత నేను బల్లపై కెక్కి యిట్లంటిని–

"శాంతమ్ పాపమ్– శాంతమ్ పాపమ్– శాంతమ్ పాపమ్. హరిహరీ! హరిహరీ! నద్యస్కాలమున నచేలస్నాన మొనర్పవలసిన మాటలు వినఁబడియెనే! తక్షణమే దర్భశయ్యపైఁబడుకొని జీవప్రాయశ్చిత్తము చేసికొనవలసిన మాటలు వినఁబడెనే! ఇవి మాటలేనా? మరి యొకటియా? హరహరా! కన్న తల్లియే గొడ్రాలయ్యెనా తలయే తోఁకకు దిగువ అయ్యెనా? ఊడయే మర్రికంటె ముందా? పరమాణువే పర్వతము కంటె బరువా? ఉపన్యానకర్త కిదియేమి స్వప్నప్రలాపమా? సన్నిపాత జ్వరవాచాటతయా? తాత్కాలికోన్మాదలక్షణ పరివేదమా? ఏమిది? ఏమిది? తనకుఁ బైనితల– కాళ్లు క్రిందననియే నమ్మకమా?

14. సనాతనాధునాతన నాగరకతలు

మద్రాసు నుంచి జంఘాల శాస్త్రి సాక్షికి వ్రాసిన ఉత్తరాన్ని ఇప్పుడు సాక్షి నినిపిస్తున్నాడు. మద్రాసులోని జార్జిటవునులో ఒక దాక్షిణాత్యుడు తెలుగులో వేసిన ఉపన్యాసం గురించి ఆ ఉత్తరంలో వుంది. వక్త దాక్షిణాత్యు డైనా చాలా కాలం ఆంధ్ర దేశంలో ఉన్నాడు గనక తెలుగులో మాట్లాడాడని జంఘాలుడి సంజాయిషీ.

ఈ తెలుగు దుష్టమాసాలతో తప్పు క్రియాపదాల బంధాలతో ఆయన ప్రసంగిస్తూ– ''ప్రాచీనము యొక్క కాలములో మన మెరుంగని సుందర సుఖ దివ్యసుర్రోజులు మన దేశము మీద వ్రాలినవి'' అని మన ప్రాచీన నాగరకత కంటె, కొత్తగా దేశంలో ప్రవేశిస్తున్న నాగరకతను ప్రశంసించబో యాడు. ఆయన్ని బలాత్కారంగా వేదిక నుంచి దించారు. తరవాత సభాధ్యక్షుడు 'విసిరిన' అవకాశం దొరకబుచ్చుకొని, జంఘాల శాస్త్రి విజృం భించి తన సహజ భాషా ధోరణిలో మన నాగరికత పూర్వుల నాగరకత కంటె ఎలా ఎక్కువ? అని ప్రశ్నించి, ఆధునికం అనుకుంటున్న నాగరకతలో లోపాలను, పాతచింతకాయపచ్చడి అనుకుంటున్న నాగరకతలో గొప్ప తనం, అనర్గళంగా ఉపన్యసించాడు. జాతీయత, జాతీయ సమస్యలు, దేశభక్తి వంటి విషయాల అంతరార్థం గురించి కూడా వివరం చేశాడు. చేశాడూ అంటే, అలా వివరం చేసే లాగ ఆ దాక్షిణాత్యుని ప్రసంగం జంఘాలుణ్ణి రెచ్చకొట్టింది.

నాయనలారా! దాదాపుగా నయిదుదినముల క్రిందట నేదియో సొంతపనిమీఁదను మదరాసునకుఁబోయిన జంఘాలశాస్త్రి యీదినమున నొక్క లేఖను నాపేరఁ బంపినాఁడు. ఇదిగో చదువుచున్నను. శ్రద్ధగా వినఁగోరెదను.

సాక్షికి– జంఘాలుఁడు నమస్కారములు– ఇక్కడ George Townలో నొక్కచోఁ జిన్నసభ జరిగినది. ఆసభలో నొక్కఁ డుపన్యసించినాఁడు. ఆతఁడు దాక్షిణాత్యుఁడే కాని చిరకాలాంధ్ర దేశనివాసి యగుటచే నాంధ్రమునసే మాటలాడినాఁడు. ఆయుపన్యాస మీది గువ నుదాహరించితిని.

ప్రియతమ్ములారా? ఇష్టతెలుగులారా? మనపూర్వుల ఉల్లె మతకీయాందోళనమేకాని

పొడువనా? ఈయడ్డదిడ్డపు మాటలెందులకు? నన్నుఁ గొట్టినపిమ్మట నే నూరకుందునా? 'నిన్ను నేను గొట్టితినా' యని యనుచున్నారా? కొట్టినప్పుడే కాని పొడువఁ గూడ దని రూలున్నదా యేమి? రేపు కోపపడునేమో యని మాయక్క యాదినమున మాబావను మొట్టుచుండెడిది. అందుచేతనే యీతఁ డంత యోగ్యుఁ డని శాంతుఁ డని ఖ్యాతిఁ జెందుచున్నాఁడు. మగవాని మంచిప్రవర్తన మాఁడుదాని యజుచేతిలో నున్నది. ఈమాత్రపుఁ బోటునకే యింత పుస్సు రావలయునా? ఇల్లాలినైన నాకామాత్రపు జన వుండఁగూడదేమి? ఎవ్వరో పిలుచుచున్నారు. ఇదిగో! వచ్చుచున్నానని వంక పెట్టుకొని లేచిపోవుచున్నారా? నరే పొండు.

లేల యిచ్చితి'' వని యనుచున్నారా? మీతోఁ జెప్పిన దాఁక వ్యవధి యేది? నాతోడికోడలు నాకంటె చిన్న–నాకంటెఁ బెద్దయైనట్లు నాకు బుద్ధిచెప్పవచ్చినట్లు తానే ముందుగాఁ దన మెడలోని పుదుచ్చేరినానును సభలోఁ జదిపించియుండగా–నేనమ్మాయని తగుదునమ్మాయని–పొప్రయిటరీ యెస్టేటు జమీందారి దివానుగారిభార్య యని బారలపేరు పెట్టుకొనినాను జదివించిన తోడికోడలు నావంక నధిక్షేపణభావముతోఁ జూచుచుండగాఁ గన్నులుమూసికొని నోరు మూసికొని యూరకుండ మని మీయభిప్రాయమా? మాయాయనతో నాలోచించి రేపు కంకణములు చదివింతునని సభవారితోఁ జెప్పమని మీయభిప్రాయమా? నాకప్పుడెంత శిరశ్శోదముగా నున్నదనుకొంటిరి? తోడికోడలి వంక సభవారు గౌరవగర్భముగఁజూచుటా? తోడికోడలు నావంక నిందాగర్భముగఁ జూచుటా? అయ్యయ్యో! నాకప్పు డఱుకాలిమంట నెత్తికెక్కిపోయినదే! కంకణాలైన సరే కాసులపేరైన సరే సభలోఁ జదివించినదాఁక నేను బ్రజలలో నుంటినా? నాకు మతియున్నదా? కంకణము లిచ్చినతరువాత గట్టునఁ బడితినమ్మా యని సంతసించితిని. ఆ పంతులుగారి భార్య ఆహాహా! పరమయోగ్యురాలు గుణవతి జ్ఞానవంతురాలు త్యాగశీలిని యని మీకు ఖ్యాతి రాగలందులకు నే నట్లొనర్చినను నాతోఁ జెప్పకుండ నేలయీయవలయు ననుచున్నారా? అయినను నావస్తువునిచ్చుటకు మీతో నేల చెప్పవలయును? అదిగాక చెప్పిచెప్పియిచ్చిన యీవి యేమాత్రపుటీవి? ఏదో యుద్రేకముతో నావలఁ బాఱవేయవలయునుగాని ఏమీ? ఏమనుచున్నారు? ఏమీ? ఆఁ! తోడికోడలిమీఁద బాగుగాఁ బగఁదీర్చుకొంటి వనుచున్నారా? ఆమాట కేమికాని, అప్పుడే యేమైనదికాని యిదిగో! ఈమాటమాత్రము నాకు ముఖ్యముగాఁ జెప్పవలయును. మనదేశము మనకు వచ్చునా? ఈమాట మాత్రము మీరు ప్రమాణముగాఁ జెప్పవలయును. చెప్పకతప్పదు. ''నాకెట్లు తెలియును. అయినను నంత యాతురతతో నడిగెదవేల'' యని యనుచున్నారా? మన రాజ్యము మనకు రావలయునని నా కెంతయైన నున్నది. ఏలయని యనుచున్నారా? మన రామిగాఁ డున్నాఁడే–మీబావమఱఁది వాడు వట్టి పనికిమాలినవాఁడు. చదువు సంధ్యలు లేనివాఁడు, వట్టి పలుగాకి, శుంఠ. ఇదిగో! మీరు వినలేదు కాఁబోలును. నాటకములలో వేసములు వేయుచున్నాఁడఁట! ఒకదాసిదాని లేవఁదీసి దానితోపాటు కంపెనీ లేవఁదీయనై యున్నాఁడఁట. ఎటులయిన నేమి? దుస్సహావానము వానికిఁ బూర్తిగ వచ్చినది. ఏదో యీసమయములో మనరాజ్యమే మనకు వచ్చినయెడల వానికొక జిల్లాకలెక్టరీపని సులభముగాఁ దెప్పించుకొనఁ గలముకదా? నీనెత్తిమీఁదఁ గిరీటము మాట జెప్పినావుకావే మని యనుచున్నారా? ఱాడుదాని నెత్తిమీఁదికిఁ గిరీటమువచ్చినను బేఁడతట్ట వచ్చినను మగవాని ప్రయోజకత్వముచేతనే కాని మరి దేనిచేత రాఁగలదు? భార్యను బరాభవించుటలో మీకున్న ప్రయోజకత యెవ్వరికున్నది? ఆసంగతి నాకన్నినిబట్టినది లెండు. ఆనడుమను నే నెఱవు తీసికొనివచ్చిన తన నిచ్చెనను విరుగఁగొట్టితి నని యీవీధి బాపనక్క నన్ను నడువీథిలో నన్ని కారుమాట లాడినను మీరు నన్ను వెనుక వైచుకొని వచ్చి యామెను దిట్టఁగలిగినారా? భార్యాభిమానము పౌరుషముగల పురుషుఁడు దానిపండ్లు రాలఁగొట్టకుండనా? దేవుని దయ వలన మనరాజ్యము మనకు వచ్చినయెడల నానోటియొట్ట పుముండను ముందుగాఁ గొఱతను వేయింపకమానుదునా? ఎఱవు తీసికొనివచ్చిన నిచ్చెనను విరుగఁగొట్టినందులకు నిన్నామె మొదటనే యురితీయించు నేమో? అనుచున్నారా? ఆలాగేమి? ఆలాగేమి? ''అట్లు మోచేతితోఁ బొడిచెదవేమి'' యని యనుచున్నారా?

కాల్చుచున్నారు? నిమ్నజాతులకున్న నీతి మీకేల యుండకపోవలయును? విదేశీయవిద్యలు లేని మన వారు మీకంటె సర్వవిధముల సహస్రగుణాధికసంపన్నులై ప్రకాశించు చున్నారు. వైదికపుఁ జదువులలోనున్న బలము, తేజము, కండపుష్టియుఁ బైచదువులలో లేదు. వేదపరీక్ష నిచ్చినవాఁడు రాయివలె నున్నాఁడు. సుఖముగాఁ దినుచున్నాఁడు. గునపములవంటి పిల్లలఁ గనుచున్నాఁడు. కాలప్రవాహపువడి కెదురెక్కుచున్నాఁడు. బి.ఎల్. పరీక్ష నిచ్చిన వాఁడు పిండిబొమ్మలాగున నున్నాఁడు. ఎంగిలిలంఘనములు చేయుచున్నాఁడు. జలుజలు శ్మశాన ములోనికి జారుచున్నాఁడు. మన చదువులే మంచి చదువులు. కండపుష్టికి, రక్తవృద్ధికి, ధాతుపటిమకు మన చదువుల మాత్రపుజదువు లెక్కడనైననున్నవా? అందుకొఱకే వేదముల కంత విఖ్యాతి కలిగినది. శాస్త్రముల కంత యశస్సు కలిగినది. దర్భాసనముగట్ట-కొమ్మచెంబు వదలి మీరెప్పుడు సిగరెట్లు కాఫీడబ్బా చేతఁబట్టినారో యప్పుడే మీజాతికి భ్రష్టత సిద్ధించినది. అన్నియుఁ అన్నియుఁ గ్రొత్తక్రొత్త మాటలు నేర్చుకొంటివే యని యనుచున్నారా? ఔను. సహాయనిరాకరణము సభలలోనికిఁబోయి యచ్చటి యుపన్యాస ములను వినుచున్నాను గదా? ఇదిగో ఇటు. ఇటు. ఈదినమున వచ్చిన యాంధ్రపత్రికఁ జూచితిరా? జూడలేదను చున్నారా? నేను జూచితిని. దానిలో నాపేరు పడినది విన్నారా? పడునో పడదో యని పరితపించితిని. ప్రాణ మిప్పుడు హాయిగా నున్నది. కాని యిదిగో! ఆపంతులుగారి భార్య యని వ్రాసినారు కాని ప్రత్యేకముగా నాపేరంతయు వ్రాయలేదేమి? ''తొందరపడకు. నీయదృష్టము బాగుగా నున్నయెడల నిట్లు వ్రాయుదినములు వేగరాకపో వునా'' యని యనుచున్నారా? చాలు.లెండు. మీమాటలు మీరు! నేర్చుకొని పోయినారు. వారములేదు వర్ష్యములేదు–రాత్రి లేదు–పగలు లేదు. నేననఁగ మొదటినుండియు మీ కిష్టతయే లేదు. నాకు ఖ్యాతివచ్చుట మీ కంతకంటె నిష్టతకాదు. అంత గొప్పపత్రికలో పెద్దయక్షరములతో నేను గాకినాడసభలోఁ గంకణము లిచ్చినసంగతి కోలాహలముగా వ్రాసి నప్పుడు భార్యాగౌరవము కలవాఁడును ప్రఖ్యాతి నపేక్షించువాఁడైన మగడే నాకుండునెడల నాతఁడు ననుఁ జూచి యెంత మురిసిమురిసి పోవును! ఎంత పొంగిపొంగిపోవును! వెక వెకలాడుచున్నారా? పోనిండు. ఆపత్రిక తీసికొనివెళ్లి యెందరెందఱకుఁ జూపించియుం దును? ఏదీ? ఆయభిమాన మేదీ? ఆ మమకార మేదీ? అకలసికట్టుదన మేదీ? ఎంతసేపును నూడుమాటలేకదా? పుల్లవిరుపు సంభాషణమేకదా? మీకు నాయం దభిమానమున్న యెడల నాదినమున నింగ్లీషున జరిగిన సంభాషణ మీరు వినియే యున్నారుకదా? నాతోఁ జెప్పినారా? మూతమ్మిడు చెప్పఁబట్టి నాకుఁ దెలిసినదికాని లేకున్నఁ దెలిసియుండునా? ఏ దానంభాషణ మని యెరుఁగన ట్లడుగుచున్నారా? ఇదిగో! చెప్పుచున్నాను. కంకణములు వే నిచ్చుచున్నా నని యాసభలో నేను బలికినప్పుడు ''మిగుల నంతోషము! ఆమె పూర్వకాంతవలె మిగుల యోగ్యురాలుగాఁ గనఁ గనఁబడుచున్నదే'' యని యాసభాధ్యక్షుఁడు కూర్మయ్యగారు ననున్నఁగూర్చి యనలేదా? ఎందుల కంత నవ్వేదరు? కూర్మయ్యగారు కాదు. గాంధిగారని తప్పుదిద్దు చున్నారా? ఈమాత్రపుఁ దప్పుకేమి? మీరుఁగూడ నప్పుడా సభలోనే యుంటిరి కాదా? మీరు నాతో నీసంగతి చెప్పినారా? తెలిసియుం దెలియని మా రామిగాఁడు చెప్పినదాఁక దిక్కులేకపోయెను. ఆలిమీఁద నభిమానమే యున్నయెడల నన్నియు నుండును. అదిలేదు. అదిలేదు. కానంతజరిగినను, జరుగకయే పోయెనను నాసంతోషముకొ ఱకైనను గంపంతగాఁ జెప్పియేయుందురు. దీని కేమికాని నాతోఁ జెప్పకుండ నీవు కంకణము

కణుగు మెణుగు లేదా? కదలిక మెదలిక లేదా? తలయూఁపు కంటిచూపు కూడలేదా
ఆహాహా! గోడవైపున మీ మొగము దీపపుస్తంభమువైపున నామొగమునా? ఎందుల కీయెడమొ
గము పెడమొగము కాఁపురము? పెండ్లామును గాని పేడబొమ్మను గానే! మీయింటిలో
గూటికి గుడ్డకుఁ జేరితి ననుకొంటిరా? కట్టుకొన్న దానిని సుఖపెట్టవలసిన పద్ధతి యిదేనా?
ఎంతసేపుకూడ నొంటరెత్తుదనమే యైపోయెను. మారుపచ్చకిట్టదయ్యెను. పెండ్లామ
పొడుసొందు పనికిరాదయ్యెను. మీబుద్ధిని బట్టియే పిల్లలను భగవంతుఁ డీయకున్నాఁడు.
నేనిక్కడ నుండనమ్మా? వంటియింటి పంచపాళిలోఁ బండుకొందును. ''ఎందుల కీ
కోపము? నాకు నిద్రవచ్చుచున్నది. అన్యథా యెంచవల''దని యనుచున్నారా? నిద్రయా?
చీట్లాటలో నిద్ర రాదుకాఁబోలు! నాటకములలో నిద్ర రాదుకాఁబోలు! మేజువాణిలో నిద్ర
రాదుకాఁబోలు! దిక్కు మారిననిద్ర. పగలెల్ల గచ్చేరిలోఁ గూరుచుండి చేయుపని యేము
న్నది? అక్కడ నిద్రపోఁగూడదేమి? నే నెదురుగ లేనంతసేపు మీరెంత మరుకుగానైన
నుందురు. ఎంత చకచకగానైన నుందురు. ఎంత కిలకిలగానైన నుందురు. నామొగ
మగుపడుసరికి మీకుఁ ద్రాగినవానికివలె మత్తా? మూర్ఛపడినవానికివలె భ్రాఁగన్నా? అఁ
ఆఁ అదేమి కిసుక్కున నవ్వుచున్నారా? కిలకిలఁ గులుకుచున్నారా? ఔను! కాకేమి?
మాయేడుపు మీకు నవ్వుకాదా? మాబాధ మీకుఁ బర్వము కాదా? ఏమో! తిన్నగ వినఁబడుట
లేదు. ఆఁ! గట్టిగ మాటలాడ రాదా? అజీర్తిగానున్న దేమి? ఏల యజీర్తిగా నుండవలయును?
మీ తాతతండ్రు లజీర్తి నెరుఁగుదురా? మీతండ్రిగారు నూరుబూరె లొక్కసారి యల్పాహార
ముగ భుజించి గుర్రునఁద్రేచి జీర్రునఁజీదినారా? మూఁడుపదలముల తెలికపిండికూర
మీమేనమామ తృణప్రాయముగా నాహరింపలేదా? పందెమునైచి బండెడు బొంతయరఁటిపం
డ్లను మీ తాతగారు గుటుకుగుటుకు మ్రింగియట్టి దగ్గనైన దగ్గినాఁడా? వా రీపురి త్రోఁపులు
కడుపునొప్పులు గుండెబరువులు నెన్నఁడైన నెరుఁగుదురా? వారివంశమునఁ బుట్టిన మీ
కీదుర్గతులేల? వారి ముందు మీ రెందులకైన నక్కటికువత్తురా? వారివలె గొడ్డలిపుచ్చుకొని
పేళ్లు కొట్టఁగలరా? వారివలె నాలుగామడ లొక్కతూరి నడువఁగలరా? కర్ర చేతఁబుచ్చు
కొన్న యెడల వారివలెఁ బదిమందికిఁ బ్రత్యుత్తరము చెప్పఁగలరా? మీ కెంతసేపు నడుమీ
డ్పు-కాళ్లు లడలడ-గుండె దడదడ-ఇంక మీ వలన దేశమునకు జరుగు నుపకారమేమి?
దేశముమాట యటుంచుఁడు! మన కుటుంబమునకు జరుగు నుపకారమేమి? మీరు
బుద్ధిపూర్వకముగఁ జెడిపోయినారు. మీరే యింగ్లీషుచదువులు చదువకుండినయెడల
నింతగాఁ జెడిపోయియుండరు. ఈచదువులే మిమ్మఁ బీల్చి పిప్పిచేసినవి. ఈ చదువులే
మీ మెదటిలో నిప్పంటించినది. ఈచదువులే మీసరములను సమ్మెట దెబ్బచే సాగఁగొట్టినది.
తత్త్వమునకుఁ దగనిచదువు బుద్ధికిఁ దగని భార మూరక పోవునా? అదిగాక మీరు
కాఫిత్రాఁగుట యెందులకు? టీ త్రాగుట యెందులకు? మీయబ్బనాఁడు మీతాతనాఁడు
వాని నెవ్వరైన నెరుఁగుదురా? వారి కెవ్వరికిని లేని యీత్రాఁగుడు మీకెందులకు? బుద్ధిపూ
ర్వకముగా విసము ద్రావినప్పుడు కిక్కురనకుండ ననుభవింపవలదా? పోనీ? ఇప్పుడైన బుద్ధి
వచ్చినదా? ఇప్పటి కింక సిగరెట్లు కాల్చుచునే యున్నారే? కాసము శ్వాసములోనికిని
-శ్వాసము క్షయలోనికి దిగుచుండునప్పుడైన మానఁగూడదా? మూలవాండ్రు మూదిగ
వాండ్రు గూడ మద్యపాన మింక మానవలయునని శపథములు చేసికొని సన్మార్గ ప్రవర్తనులై
యుండఁగా-మీ రేమొగముపెట్టుకొని యింకఁ గాఫి త్రాఁగుచున్నారు? ఇంకను సిగరెట్లు

13. అంతఃపురోపన్యాసము

ఈసారి సాక్షి ఒక కవి వ్రాసి పంపిన 'అంతఃపురోపన్యాసము' చదివి వినిపిస్తున్నాడు. ఇంటి ఇల్లాలు భర్తని పట్టుకుని మాటలతో ఒక దులుపు దులపడాన్ని ఇంగ్లీషులో 'కర్టెన్ లెక్చర్' అంటారు. రచనా స్వభావం చేత ఇది ఏక పాత్రాభినయం లాగ వుంటుంది. సంస్కృత దశ రూపకాలలో కొంచెం ఇంచుమించు 'భాణం' ప్రక్రియని పోలి వుంటుంది.

ఈ ఉపన్యాసం ఇచ్చే స్త్రీ, మాంచి నోరు గలది. భర్తచేసే తప్పుల్ని కడిగి పెట్టడంలో వెనుకాడదు. అతని ఆహారపు అలవాట్లని, చదువు సంధ్యల్ని, వ్యసనాల్ని, కాఫీ అలవాటుని, దుమ్మెత్తి పోసింది. తోడికోడలి గొప్పని విసిరికొట్టింది. ''భార్యని పరాభవించడంలో మీకున్న ప్రయోజకత్వం ఎవరికుంది?'' అని భర్తని ఎగతాళి చేసింది. మగవాడి మంచి ప్రవర్తన ఆడదాని చేతిలో వుందని ప్రకటించింది. ఈ ఉపన్యాసమంతటిలో ఆమె, భర్త మీద తన చనువు, అధికారం, తనకున్న అసంతృప్తులు, తను ఆశించే మంచి ప్రవర్తనలూ అన్నీ ఏకరువు పెట్టింది.

నాయనలారా! ఒక 'కవి' యీయంతఃపురోపన్యాసమును వ్రాసి మాసంఘమునకుఁ బంపినాడు. ఇది మాసభలోఁ జదువవలసినదని యాతని యభిప్రాయమగుటచేఁ జదివెదను.

''ఇదిగో! ఊఁ-మాటలాడరేమి? మాటలాడరేమి? అబ్బా! ఎందుకని విసుగుకొనుచున్నారా? మాటలాడుటయే యెందుల కనుచున్నారా? నేను మిమ్ముఁ బిలువనేకూడదు కాఁబోలునేమి? సరే! ఇఁక నరే! బుద్ధిలోపము వచ్చినది. కట్టుకొన్నయిల్లాలి ననుకొని పిలిచినాను. నాతో మాటలాడుటయే మీకింత రోఁతయా? ఇంటి బానిసపని యంతయుఁ దీరుచుకొని యేదో ఆలుమగఁడుగదా యని భ్రాంతిపడి లోకముతోపాటు దగ్గఱఁ జేరగాఁ బ్రియా! వచ్చితివా యని యాదరించుట లేదేమి? ఎందుల కానవ్వు! ఇంటిపనిలోఁ జాల బడలితివి కాఁబోలు నని రవంత వీఁపుపై బ్రేమమున రాయుట లేదేమి? చెమట పట్టినది కాఁబోలు నని ముద్దుముద్దుగా ముంగురులు కానంత సరిచేయుట లేదేమి? ఎందుల కంత కులుకుచున్నారు? కొంచెకొంచెముగా దగ్గఱగాఁ జేర్చుకొని పిచ్చియని పాడియని యాకని వక్కయని యదియని యిదియని, పువ్వని నవ్వని, ఱా యని ఊఁ యని యేదియు లేదేమి? పనిపాటలతోఁ బ్రాణావశిష్టనై ప్రక్కమీఁద భగవంతుఁడా యని ఘటము చేరనైచి మొర్రో మాటలాడరేమండోయి యని యిరుగుపొరుగమ్మలక్కల చెవులు తడకలుకట్టున ట్లఱచినను

మేము మిమ్మ్ల దిద్దవలసియుండఁగా మాతప్పు లెన్నెదరేల?

కడపటిమాట యొక్కటి చెప్పుచున్నాను. మీరు మరియొకసారి మాతప్పులు గణించినయెడల మేము సహింపము. సహింపక యేమి చేసెదరని యడుగదురేమో? అడుగనక్కఱలేకుండనే చెప్పెదము వింటిరా? మా పద్మగంధులలో (గంధు) నెందరో యున్నారు. ఆమహాత్ముఁడు దుపదేశించినట్లు Non-co-operation జెండా మీమీఁద నెత్తెదము. మాసర్వసాహాయ్యములు మీపక్షమున నిరాకరింతుము. మీవంటలు మీరు–మీపెంటలు మీరు–మీయిండ్లు మీరు–మీవాకిళ్లు మీరు–మీకానుపులు మీరు–మీపిల్లలు మీరు–జ్ఞప్తిలోనుంచుకొనుఁడు. జాగ్రత్త మూఁడవసారి జాగ్రత్త జాగ్రత్త–

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఇట్లు విన్న వించు,
చిక్కమాంబ

లగ్న మానసులై స్తంభీతభూతదేహులై మహాభక్తుల వలెఁ బ్రకాశించుచున్నారు. చీఁకటియై నది. యుద్ధరీతిననుసరించి రణమాఁగినది. ఆరాత్రియే చీఁకటిలో నేకారణముననో కొందరు నరులకు చేతులు విరిగినవి. తలలు పలిగినవి. కొందరు నూతులలోఁ బడిచచ్చిరి. కొందరు యిండ్లకుఁ గన్నములు పడినవి. తెల్లవారునరికి లెక్కకు వచ్చినవి తొమ్మిది హత్యలు. ఆసుపత్రులలోని రోగులకు లెక్కలేదు. చుట్టుపట్టుల కోర్టులలో నెన్నోవ్యాజ్యేములు పడినవి. మేజస్ట్రేటు కోర్టుల నెన్నియో చార్జీలు పడినవి. ఊరంతయుఁ గల్లుకంపు గగ్గోలు –పురుషులారా? ఇదియంతయు సత్కర్మాచరణము కాఁబోలు నేమి? పూర్వాచార సంప్రదా యము కాఁబోలు నేమి? ఇట్టి మీరు మమ్మధిక్షేపించుటెందులకు? మీప్రవర్తనములే వంకలైన ప్పుడు మాపాపటలు వంకలైననేమి లెండు. మీయాత్మలు కుక్కుటాస్త్ర నేచనమున ఘోరము లైయుండ మావదనములు Face Powder పలనఁ దెల్లగా నుండిన నేమి లెండు.

ఎందులకో యొకందులకు మీరు మమ్మధిక్షేపించుచునే యుండవలయును. అది మీస్వభావము. మమ్మెప్పుడైన మీరామోదించితిరా? మొదటినుండియు మాపచ్చ మీకుఁ గిట్టనే కిట్టదు. మేము మనుష్య కోటిలోనివారమా కామా యని మీరు వితర్కించుకొనలేదా? ఆవిషయమునుగూర్చి మీరు సభలలో సిగ్గుబిడియములు లేకుండ నుపన్యసింపలేదా? మేము కుక్కలనువలె మీమంచపుగోళ్లకుం గట్టుకొనుటకే కాని మాకు విద్యతోడను –జ్ఞానముతోడను–లేశము పనియేలేదని, వానివలన మేము మాటలువచ్చిన కుక్కలవలెపొడై మీకుఁ బనికిరాక పోవుదుమని మీరు ఘోరముగాఁ దీరుమానించుకొనలేదా? ఆతీర్మానపు వ్రాత లప్పుడే తుడిచిపెట్టుకొనిపోయె ననుకొనుచున్నారా? ఆవ్రాత భారతదేశమాత కొడలిమీఁదివాతయై నిలిచి యున్నదికాని పోలేదు. స్త్రీలకుఁ బునర్వివాహములు చేయవ చ్చునా? లేదా? యను పూర్వపక్ష రాద్ధాంతములతో నెంతకాలము గింజుకొనినారో జ్ఞప్తిలేదా? అది యిప్పటికిఁ దేలి యేడ్చినదా? మేము స్వతంత్రించి విద్యను సంపాదించి జ్ఞాన సమార్జన మాచరించి యేదో తోచినట్లు వ్రాయుచుండగా నిఁకనేమియుఁ జేయలేక విధిలేక తప్పదురా భగవంతుఁడా యని యిప్పుడిప్పుడేకాదా నోరుమూసికొని పడియుం డుటకుఁ గొంత యలవాటు పడియున్నారు. కాని యశక్తిసంభవదుర్జనత్వ మాట్లూరకుండ నీయక పోవుటచే, నప్పుడప్పుడు కడుపుమంటచే నోటి దురదచే, నాఁడుదాని చేతిలోఁ గలము కంటె సూది యెక్కువ శోభావంతమనియు, నాఁడుదాని యుపన్యాసము కంటె జోలపాట యెక్కువ దేశక్షేమకరమనియు, నుడుకుబోతుతనమున మాటలాడుచున్నారు. ఇప్పటికిఁ గూడ గొంతలు వ్యక్తిహీనులని, కేవల భోగ్యపదార్థములని, యిష్టానుసారముగా నాడించుకొను నాటవస్తువులని, తోలుతిత్తులని యనుకొనువారుగూడ నున్నారు. ఎవరిలో? విద్యావంతులగు నాగరకులలోనే. వారిపేళ్లు కావలయునా? ఆ పేళ్లను స్మరించి మావదనము లపవిత్రములు చేసికోఁగలమా? మమ్ముఁగూర్చి మీరేల యనుకొనినను సంతోషమే కాని మీకు మాజోలి యెందులకు! మా ముక్కులకు నడ్డబాసలు లేకున్న నేమి పుట్టిమునిగినది. మాకవి రోఁత. పూర్వవస్తువులు ధరింపవలయునని యెచ్చటనైన నియమమున్నదా యేమి? కోరుకొండ మెట్టవంటి పూర్వపురాగిడీ లిప్పుడు మేము ధరించినయెడల నకిషీపనులలో నల్లులుపడును. రాగిడీకోరునుబట్టి కొసనుబట్టి నెత్తిపై బిడుగుపడును. మానూతనాచారము లవలనఁ బ్రత్యవాయమేమియు లేదు. కాని మీ నూతనాచారములలోఁ గొన్నిఁటివలననేక బాధలు–మాకు మీకు లోకమునకుఁగూడ నున్నవి. మీరు బాగుగా నాలోచించుకొనుఁడు.

-కవిత్వము, గానము, శిల్పము, చిత్రలేఖనము, పాషాణపాంచాలికారచనము ననుసైదు కళలొకయెత్తు–కోడిపందెమొకయెత్తు. దీనిలోనున్న కల్పనము, పాత్రౌచిత్యము, స్వభావప్రకటనము, రసవిజృంభణము, ప్రకృత్యనుకరణము, పదగుంఫనము, శబ్దసౌందర్యము వానిలో నెక్కడివి? నరయుద్ధములకు శరత్కాలము శ్రేష్ఠము. చరణాయుధయుద్ధములకు హేమంతము ముఖ్యము. తత్రాపి, మకరసంక్రాంతినమయము మహాపుణ్యకాలము. తత్సమయమునఁ బెద్దయావరణముగల దొడ్లయందు, యుద్ధరంగములకుఁ జతుఃపార్శ్వములందుఁ గుక్కుటేశ్వరమూర్తులు–చరణాయుధయోధాగ్రేసరులు–జల్లిగంపల డేరాలలో నిల్చి కోవాకమును బఠించుచు నాహవాగ మావతారములవలె శోభించుచుందురు. వీరిలో నర్ధరథులు, నతిరథులు, మహారథులు గూడ నున్నారు. ఈయుద్ధతంత్రము సామదాన భేదదండోపాయములతో విరాజిల్లుచున్నది. రాయబారి నంపించుట మొదలు రణప్రచురణము వఱకున్న సమస్తరాజనీతియు నిందున నిమిడి యున్నది. ఈరణభూమిలో నరులు సంఘసంఘములు, సమస్తజాతుల వారు తండోపతండములై నిసుకవైచిన రాలకుండ నున్నారు. కమసాలులు, కమ్మరులు, వడ్రంగులు, రైతులు, నీడిగవాండ్రు, నీనాము దారులు, మొఖాసాదారులు, జమీందారులు, సోమరులు, వ్యసన సంసక్తులు, జూలాయిలు, త్రాగుబోతులు, జూదగాండ్రు, మాయావులు వారు వీరనక కాలహరణమునకై, వేడుకచూచుటకై వేంచేసి వెర్రివెర్రి చూపులతో విరాజిల్లుచుందురు. కోళ్లనుగాపుగాయువారు, బట్టలను పిర్రలపై కెగఁద్రోచి, ముందువంగిన మోకాలిపై మోచేతిని దబాయించి చేతులు ''జబర్‌జేర్'' పద్ధతులగా బనాయించి, కోడిచలనములఁబట్టి తళుకుమనునంతలో ఫిరాయించి, పెద్దపులి వేసగాం డ్రాడినట్లు తురకభోగముల కారువాతీరికలవలె, పంజాబీ మైనూరీపదవిన్యాసగతులతో నొదిగి యొదిగిన యొడుపులతో, నొట్టి యుంకించి యెగసిన ధమ్మాయింపులతో కుచ్చుపాగలతోఁకలు కోళ్లతోఁకలతో సానుభూతిగా నెగురుచుండ, నడుమనడుమను గోళ్లను దోఁకలను బట్టి లాగుచు, నోటిలో నూఁపిరిపోయుచుఁ బిల్లికూనకూఁత మొదలు పెద్దపులి బొబ్బవఱకున్న యన్ని యఱపులఱచుచు కోళ్లను గాపుచేయుచున్నారు. ఓ –ఏమి! సామాన్యయోధులా? సామాన్యయుద్ధములా? లక్నోనుండి వచ్చినకోళ్లు –సింధుదేశమునుండి వచ్చిన చరణాయుధములు–అష్టదిశలనుండి వచ్చిన తామ్రచూడదిగ్గజములు! నరులంద రుత్సాహ పూరితులైయున్నారు. పౌరుషరభసమున బహువిధముగా నఱచు చున్నారు. కొందరు మొఖాసాదారులు, కోళ్లకాపువారగు చమారులతో గుసగుసలాడుచున్నారు. కొందరు సమరశాస్త్రనిపుణు లది రణశాస్త్రవిరుద్ధ మని యధిక్షేపించుచున్నారు. గొడారులు కొందరు మాధ్యస్థ్యమును జేయుచున్నారు. కోళ్లు పౌరుషమున పోరాడుచున్నవి. రక్తము కాలువలక్రిందఁ బ్రవహించుచున్నది. రక్తము గారిన కొలఁది నరుల కుత్సాహ మెక్కువగానున్నది. జమీందారులు కొందరు కెవ్వుమనుచున్నారు. ఓ! యేమివేదుక! ఇంతవేడుక వారి పరిణయములలో జరిగినదా? పట్టాభిషేకములకు జరిగినదా? పందెములు–పైపందెములు–వానిపై పందెములు–కుప్పతిప్పలుగాఁ బడుచున్నవి. సంపన్నుఁడగు నొక్క రైతు తనగాదులలోని గల్లానంతయుఁ గోడికాలి క్రింద బలాదూరిడుచున్నాడు. మరియొక మొఖాసారుఁడు నబాబుగా రిచ్చిన ముప్పదిపుట్ల యీనామును గోడియీఁకెలకు దిగదుడిచి పాఱవైచినాఁడు. తామ్రచూడములకుఁ దమ రత్న కిరీటములనే పన్నిదమిడఁదగినవని కొందరు జమీందారులు ప్రశంసించుచున్నారు. సమస్తజనులు కుక్కుటేశ చరణ

బడుక కుర్చీపై బండుకొని బ్రహ్మాండమంత శృంగారరస ప్రధాన కథా నాటకమును స్వప్నమునఁ గాంచి సంతోషించుచు బల్లునఁ దెల్లవారు వఱకు నిద్రించుచున్నారు. సానినం సారపుఁ గర్చంతయు మీఁదియు, సానియనుభవ మూరివారిదియునా? కాసులపేరులు మీవా? క్షౌఁగిలింత లూరివారివా? స్వగృహే యని శ్రాద్ధముకొఱ కిల్లు కట్టుకొని మీ రీస్వప్న శృంగారచర్యాశ్రాద్ధకర్మమును బైయింటిలో జరిగించు టెందులకు? మీ ధనములమూల మున సంతర్పణ మూరివారికి? పస్తు మీకునా? ఎట్టకేలకు మీభార్యల సమర్థవార్తలగూర్చి మీయత్తవా రుత్తరము వ్రాయుచున్నారు. మీ రాసమయమున మరణశాసనములు వ్రాయుచున్నారు. సమర్థపసపత్తవారింట దంపుచున్నారు. చల్లఁబడిన మీకాళ్లకుల్లిపాయ లిక్కడ నూరుచున్నారు. అక్కడఁ బుణ్యాహ వాచనము-ఇక్కడ జీవప్రాయశ్చిత్తము. ఎందుల కీపిండకూడు పెండ్లిండ్లు! అభము శుభ మెఱుఁగని యాఁడుపిల్లల గొంతులు కోయుట కేకద?

మరియొకసంగతి. మీ కనేకములగు వ్యసనములున్నవి. మొదటిది–వేఁట–పనిలేక వేఁటకుఁ బోవుచున్నారు. పందిపిల్లలను జంపఁ బోయి పందికొక్కును జంపుచున్నారు. లేడియని యడవి యాదూఁడను జంపుచున్నారు. జెముడుకాకి యని కోకిలను గొట్టుచున్నారు. కొండ క్రోతి యని నరుని జంపుచున్నారు. కణు జని కన్నతండ్రినే చంపుచున్నారు. దుష్టజంతువులు మీవేఁటలో దేహములు పాయుటలేదు. కాని, మంచిజంతువులచే మీ దేహములు పాటవమందుచున్నవి. మాంస భక్షణము చేయుచునే యున్నారుకదా! మారకక ర్మము కూడ మీఁద వైచికొనుటెందులకు! మీరు చేయనిపాప మేదియు మిగులఁగూడదు కాఁబోలు! ఇట్టి మీరు సదాచారసంపన్నులా? Refreshment Roomsలోఁ జేరి శ్వేతముఖులు కూడ జంకుచుఁ దినుచున్న యన్ని యాహారములుకూడ మీలోఁ గొందరు నిస్సంశయముగాఁ దినుచున్నారుకదా! ఆవునాలుక వడియములు కుక్కగొడు గూరుగా యలు పేఁడపురుగు వేపుడులు! ఛీ! ఛీ! ఇటు లెన్ని చెప్పఁగలను? మాతలలకు రాచికొనిన నూనెను నొడలిపైఁ జిలుకరించుకొనిన సెంట్లు దూరము నుండియే మీముక్కుల కాబ్కారీ యాముదపువాసనలు కొట్టుచున్నవి. కాని ములగాకువేసి వండిన పందికొక్కుమాంసపు గబ్బు మీముక్కులకు మందాకినీ సుందరారవిందబృందగంధిలముగా నున్నది కాఁబోలునేమి? అత్యంతాసహ్యములగు నడ్డబాసలు తీసెవైచినందులకు మా ముక్కులను నిందించుచున్నారుకదా. ఇట్టి మీ దిక్కుమాలిన ముక్కులను జిదుకఁగొట్టిన బాపమున్నదా? ఛేదించిన బాపమున్నదా? సాలగ్రామతీర్థమును దీసికొనలేదని మమ్మధిక్షేపించుచున్నారు? పోనిండు. మాబదులు మీబదులు కూడ సమస్తలోప పరిపూర్తి యగునట్లు మీలోఁ గొందరు విస్కీని బుచ్చుకొనుచున్నారుకదా! ఇంతకంటెఁ గావలసినదేమి? Three Daggers కంటె శ్రీపాద తీర్థ మెక్కువదా? మా నడుముల కొడ్డాణములు లేవు. నిశ్చయమే కాని, మీతలలకు బుద్ధిలేదు. మీమనస్సులకు సచ్చింత లేదు. మీ కడుపుల యాత్రములకు మితి లేదు.

ఇకఁ గోడిపందెములఁ గూర్చి చెప్పెదను. ఈయజ్ఞములో నాధానముమొద లశ్వమే ధాంతము చేయఁగల చేయింపఁగల యాయజ్ఞాకు లున్నారు. ఈవిద్యలోఁ బంచకావ్యపరిచి తులు, నల్పపండితులు, నర్ధపండితులు, పూర్ణపండితులు, మహామహోపాధ్యాయులు న్నారు. ఉండరా! కోడిపందె మనునది బ్రహ్మాండమంత విద్య–ఇదియొక మహాకళ

తెఱచుకొని నిక్కి నిక్కి మీ యిండ్లపైపునఁ జూచుచుండ–నింటిలోని ముసలిముం
ఛాందసతచే భోజనము లాలస్యమగునని యెంచి–సూర్యుఁడు కఱకఱ నుదయిం
చుండఁగా–మీరు పఱపఱ నమలిన మూఁడుపంపుల యుల్లిపాయలపకోడీలు–లోకి జాఱి
చిన పదునాలు గిడ్డెనలు–బుస్సునని యెగఁబీల్చిన సేరునర కాఫీతోఁ గడుపుగిర్రుననిం
–బ్రేవుబ్రేవనిఁ ద్రేచుచుఁ దద్దినము పిండవిధానమా సంకల్పవిధానమా? యని పూర్వపక్ష
ద్ధాంతము లొనర్చి, కాఫీహోటలువాఁడు మీ కుదయమునఁ జేయవలసిన పిండ ప్రద
మేదో పూర్తియైనది. కావున బిత్రదేవ పిండప్రదానము గణింపక, సంక్షేపమార్గము నవ
బింప నెంచి గోచివెరఁగైనఁ దడియకుండ స్నానపువాలాయతను దీర్చి, దేవతార్చన
టరగుసన్నిధిని ''ద్వరగఁ ద్వరగ'' యని కేకలువైచుచు బొంబాయి లెట్రీనులోఁ గూరు
న్నట్లు ప్రాణము లుగ్గఁబట్టుకొని ముంగాళ్లపైఁ గూర్చుండి–యాపూర్వనిర్భాగ్యులు మిమ
గన్న పాపమునకుఁబ్రతినిధిగ–పిత్రకర్మమును దగులఁ బెట్టుచున్నారుకదా! ఛీ! ఛీ! మాఁ
చుట్టలు బిగిగానున్న యెడల మాముచ్చెనగుంటలోని చిరువెంట్రుకలే రాలిపోవును కా
మీ వెడవెడ చేష్టలు బలముగా నుండుటచేత మీ పితృ దేవతల శాశ్వతగతు లూఁడుచున్నవి
–జాగ్రత్త.

మరియొకసంగతి–మీలోని విధురులు ద్వితీయ, తృతీయ, చతుర్థవివాహములఁ
చేసికొనుచున్నారు. మాలో వితంతువులుకూడా నంత విధిలేనియప్పుడు పునర్వివాహములఁ
చేసికొనుచున్నారు. కాని యొక్క భేదమున్నది–పిల్లలఁ గన్న తరువాత మాత్రము మాలో
నెంత వయసుతక్కువ వితంతువుకూడఁ దిరుగ నొకభర్తను గట్టుకొను చుండుట లేద
మీలో ననేకులు–పుత్రవంతులైనను, పౌత్రవంతులైనను, నెంత వృద్ధులయ్యునుఁ గన
పిల్లలయెడల మమకారమంతయు మంటఁబెట్టి–స్త్రీమోగ మెన్నఁడెరుఁగనివారివలెఁ బెండ్లిపీ
టలపై నేడవసారికూడ సిద్ధపడుచున్నారు. పడుచువాండ్రుగాఁ గానఁబడుటకుఁ గనుబొ
మ్మలమీఁది తెల్లవెండ్రుకలను దంటనముచే లాగించుచున్నారు. మీనములకు రంగులఁ
వైచుచున్నారు. పండ్లు కట్టించుకొనుచున్నారు. వయఃపటిమకొఱకు వైద్యుల నాశ్రయిం
చేదులను మ్రింగుచున్నారు. పుష్టిప్రదములగు వస్తువుల నాహారించుచున్నారు. పడఁగూడ
పాటులన్నియుఁ బడుచున్నారు. తిరుగ సంసారము లొనర్చుటకు మీకుఁ దగిన దేహశ
లేదని ప్రజ లెక్కడ ననుకొనిపోవుదురో యని ప్రజానందేహనివృత్యర్థమై వారికి సిగ్గువచు
టకై వేశ్యల నుంచుకొను చున్నారు. నల్లమందునైచిన పంచబాణరసమును గన్నకొడు కీయ
దానిని గ్రహించి, కూతురిచ్చిన మదనకామేశ్వరపుటుండను బుగ్గనుంచుకొని, తాత
రావోయి అమ్మమ్మయొద్దనుండి వార్త వచ్చినదని వీథి యరుగుమీఁదినుం
యుత్సాహముతోఁ గేకలువేయు దౌహిత్రునితోఁ జేతికర్ర వెదుకరా యని చెప్పుచు
శకునము సరిగా నున్నదో లేదో చూడుమని ముందుఁ గొన్నియడుగులు పంపిన మేనల్లుఁడ
మామయ్యో! గాజులగవరయ్య పిల్లెదురుగా వచ్చుచున్నదని కేకలు వేయగాఁ బిల్ల యనుకొ
తొందరతో వీథిలోనికి రాఁబోవునప్పుడు శ్లోపీనము జాఱి నర్దుకొనుచుఁ దాతయ్యా
రాకాసిపండ్లు పీఁటమీఁదనే మఱచిపోయితివని చేతికి మనుమరాలు చెన్నపట్టణపు Dentist
శ్రీనివాసన్ ప్రసాదించిన చేతఁబండ్ల నందీయ, జుంబనాద్య పేక్షచే వానిని దగిల్చికొని
వారోయి వీరోయి యని వీథివెంటఁ గేకలునైచుచు లోక వ్యవహారముల మాటలాడుకొనుచు
బ్రజల యవిశ్వాసమును బాఱఁ దోలుచు నుంచుకొన్న వేశ్యయింటికిఁ బోయి వంచపాళీలో

తేజోనిధులే–అట్టి మీరు పనపు Disinfectant అని, యంజన మంతరకుసుమభంజక మని, కాంచి గర్భకోశపాటవప్రదమని, సమర్థ వాతరోగ మని యేమేమో ప్రకృతి వైద్యశాస్త్రసన్న ములు మాకొఱ కేకరు పెట్టిన మీరు ఆయుష్కర్మములోని Science ను గనిపెట్టలేకపోతిరేల? అది యాయుస్సుతోఁ జేరినపని యయినట్లు దాని పేరే చెప్పుచుండఁగా మీ కీవిపరీతచర్యలేల? ప్రాణమునకు దీప్తిప్రదమైనదియుఁ బలరోగఖండకమై నదియు, మనోనైర్మల్య నైశ్చల్య సంపాదనసాధనమైనదియు, భక్తియోగ రాజయోగాది మోక్ష పరికర ప్రసాదనపటిష్ఠమైనదియు, దీర్ఘాయువునకు వెన్నెముక యయినదీయు నగు నాంతర విద్యుచ్ఛక్తి వృథగఁ బైకిఁబోకుండ శిరోజములు దానిని గాపాడుచుండగా, వారమునక, వర్జ్యమునక, దుర్ముహూర్తమునక, రాహుకాలమునక, పర్వమునక, క్షౌరము చేయించుకొను చున్నా రేల? పదములకు మట్టెలు మగువలకుఁ బాలచేరునరములు జొఱకుండ బెద్ద లేర్పఱచిరని కనిపట్టినవా రింత మహాంశమును, తన్నామమే ఘోషించుచున్న యీమహాంశ మును గనిపెట్టలేకపోయితిరా? ఏకాదశినాఁడు–దర్శనాఁడు–శివరాత్రినాఁడు–క్షురకర్మ మొనర్పుట పాపప్రదమని మంగళ్లు ప్రాచీనాచారముతోఁ బ్రవర్తించుచుండ వారికి సిగ్గు వచ్చినట్లు–పూర్వులు సాలగ్రామ సంపుటములనువలె, మీరు రత్నాభరణములను వలెఁ బెట్టెలలో భద్రముగా దాఁచుకొని యుంచిన మంగలి పొదులను విప్పి–కత్తులను నూరుకొని –గడ్డములు, కన్నుల నశ్రుకణములు చిమ్మ, బరుకుబరుకు గీకుకొనుచున్నారా? మీరు మీపాలిటి మంగళ్లయినందులకు మేమంత విచారింపము. మీరు మాపాలిటి మంగళ్లు కూడసగుట మాకర్మము కాదా? మీయాయు ర్వినాశనము మాసౌభాగ్యవినాశనము కాదా? ఈ యపకతవక పనివలన నీయకాల పుటపాత్రపు మంగలికత్తి మొనతో మీత్రాడు త్రెంపుకొను టయేల? మాపసపుత్రాడు త్రెంపుటయేల? పిల్లలగొంతులు గోయుటయేల? మాపైట లమీఁది Safety Pin మీకు గ్రుచ్చుకొని మిమ్ము బాధించుట లేదు. కాని మీగడ్డముమీఁది Kropp కత్తి మాకాపురమునే ఛేదించుచున్నదే? ఇప్పుడైన బుద్ధిగలిగి మీరు బ్రదికి మమ్ము మాపిల్లలను బ్రదికింపరా? మహాలక్ష్మీపీఠములా? మకరతోరణములా? మహాదేవ ప్రతిమలా? మంగళపుటారతి పళ్ళెరములా? అయ్యయ్యో! మన సంసారకొంపలలో మంగలిపాదు లెందుల కయ్యా? ఛీ ఛీ! వాని నావలఁ బాఱవేయుఁడు. ప్రాయశ్చిత్తము చేయుంచుకొనకుండఁ దిరుగ నింటిలోనికి రాకుఁడు.

మరియొకసంగతి. మీరు సంధ్యావందన మాచరించుచున్నారా? పంచపంచ ఉషఃకాల స్నానములకుఁ జరమశ్లోకార్థము చెప్పనే చెప్పినారు. సంధ్యావందనము కూడా సందుకొట్టిం చినారేల? ఆచమనమైనఁ జేయుచున్నారా? ఆఁ చేయకేమి? కేశనాయస్వాహా–ఒక్కగ్లాసు వేడి కాఫీ గుటుక్కు. నారాయణాయస్వాహా–నంబరు టూ గుటుక్కు. మాధవాయస్వాహా –నంబరు త్రీ గుటుక్కు. ఇక్కడికి మూఁడవసారితో వేలము పాటవలె సంధ్యావందనము పూర్తియైనది. సిగరెట్టుమీఁద సిగరెట్టుగా నింక నిత్యాగ్నిహోత్రతయా? భగవద్గీత పారాయ ణము చేయుచున్నారా? Madras Mail ఉండగా మతగ్రంథము లింకెందులకు? అయ్యయ్యో! అయ్యయ్యో–కన్నతండ్రి శ్రాద్ధమునాఁడైనను గాఫీమాన రేమికర్మమయ్యా! మీనవనాగరకతలు నట్టేటఁ గలసిపోను–మీ నూతనాచారములు గోఁతిలోఁబడను! మీ కాఫీహోటళ్లు కాలిపోను–మిమ్మొఁగన్న తండ్రులు–వారినిగన్న తండ్రులు, మాబాబు –మావంశోద్ధారకుఁడు–మాకీదినమున నోటికి నీళులిచ్చును. ద్రాగుదమని–దివినుండి నోళ్లు

ముగా నధిక్షేపించితిరి! మీకత్తిరింపుబుర్రలమాట మఱచిపోయితిరి కాబోలు? వానిలోని జాతులముందు మాజడచుట్టలలోని జాతు లెంత! (మఱచిపోలేదు. వెనుక గొంతకాలము క్రిందట జంఘాలశాస్త్రి వానినన్నిటిని గూర్చి గాటముగా నధిక్షేపించియే యున్నాడని సభలో గేక) మీరు పూర్వాచారపరాయణులు కాబోలు నేమి? గోష్పాదమంత జుట్టుపిలక యున్న వాడు మీలో నొక్కడైన నిప్పుడున్నాడా? మీరు జుట్టుపిలకను ద్రోచిరా జనవచ్చును గాని మేము మాకొప్పులను మానగూడదు కాబోలు! నిబెట్టి, చెవిపట్టుకొని, మీయబ్బనాడు లేదుగదా! మీతాతనాడు లేదుగదా! మాపాపటలు మీరేల ధరించితిరని తెగపడి మగవాని నడుగదగిన యాడుది లేకపోయెను గాని, ఆఁ ఆఁ (లేకపోవుటయేల? మాతల్లీ? నీ వుంటివి కాదా యను కేక) మేము మిమ్మనుకరించునెడల మాకుఁ బదునాలుగేండ్లలో మీసాలువచ్చునా! ఆ! బరిపాపటలు, ప్రక్కపాపటలు, వాలుపాపటలు తీసికొని నున్నగ నీచెంప నాచెంప దువ్వుకొని ముంగురులు (వానలైను)తో వంగజేసికొని, గర్భాధానపుఁ బెండ్లికూతులకంటె నెక్కువగా దినమునకు నాలుగుసారులు నలుబది యేఁబది యేండ్లనుండి సింగారించు కొనుచున్న మీ కేమి వచ్చినవి! పనికిమాలిన మాటలా! పలుకరాని మాటలా? మేము మాజడచుట్టలలోఁ గాగితపుఁబూవు లుంచుకొనఁ దగదు. కాని మీకు నోటిలోఁ బొగచుట్ట పెట్టుకొనవచ్చును గాబోలు! మాకాగితపుఁ బూవులు మీకు దుర్గంధములు! మీపొగాకుచుట్టలు మాకు సుగంధములు కాఁబోలు! మేము ముక్కుల కడ్డబాసలు తీసి వేయఁగూడదు కాని, మీరు ముక్కులలో దిక్కుమాలిన పట్టెడు పొడుము దట్టింపవచ్చునుగాఁబోలు! ఇట్టి మీరోఁతలన్నియు భరింపలేకున్నను మర్యాదకొఱకు మేము పడియుండగా మమ్మధిక్షేపణములా? మీతప్పులు మీకు గోడచాటులా? మాతప్పులు మీమొగమెదుటివా? గులాబిపూవు తనక్రింద ముండ్లకంపను దానెరుఁగునా? పిలికిపిట్ట తన తోఁక క్రింద మచ్చ దానెరుఁగునా? మావి క్రైస్తవవేషములా? మీవి! పంట్లములతో, మేజోళ్లతో, బూట్సుతోఁ, గంఠబంధములతో, నస్త్రధనుస్సులతోఁ, బటకాలతో, దొరల టోపీలతోఁ, బాడుమొగములతో మీవి ఆర్యన్వరూపములు-ఋషి విగ్రహములు -పవిత్రతేజములు-బ్రహ్మజ్ఞానమూర్తులు-కాఁబోలునేమి? యథార్థమేమనఁగా-పరంగీ వాలకము లన్నప్పుడు మీవి కాని మావి కావు. దేశీయవస్త్రధారణమునకు మేము మీయంత దూరముగాఁ బోలేదు. ఈ తప్పు మీదైన మాదైన నెంతలెండు. నిజమైన మీతప్పులేవో నేను జెప్పెదను వినుఁడు. ఏవి ప్రాచీనాచార భంజకములో-పరమార్థప్రత్యవాయములో -యవి చెప్పెదను. పూర్వాచారములందు నాకు నమ్మక ముండనిండు. ఉండక పోనిండు. అది మీకిప్పుడు విచార్యము కాదు. మీరు పూర్వాచార పరాయణులైనట్లు మాటలాడుచున్నారు. కావున మీ పూర్వాచార పరాయణత యేమాత్రము బుగ్గియైనదో చెప్పెదను.

ఆయుష్కర్మ మనునది మీలోనొక ముఖ్యమైన కర్మము. మిమ్మి గన్నవారు-వారినిఁ గన్నవారు-దాని నెంతయో గౌరవముతోఁ జూచుచుండెడివారు. దాని కేర్పాటైన తిథులందు, వారములందు, ముహూర్తములందు, నక్షత్రములందు, దిక్కులందు యథావిధిగా నాకర్మమును నిర్వహించుకొనుచుండెడివారు కదా! మీ రానియమములను బరిగణించుచున్నారా? మీకున్న బుద్ధి వారికి లేదని మానివైచితిరా! పూర్వపుతిథులు, వారములు, ముహూర్తము లిప్పుడు లేవని మాఁనివైచితిరా? ఆయుష్కర్మ తృణప్రాయమైన కర్మమని మానివైచితిరా! విద్వాంసులే-ధర్మశాస్త్రజ్ఞులే-శారీరశాసన పాండితీమండితులే-ప్రకృతిజ్ఞాన

స్పష్టముగాఁ గనఁబడుచున్నది. వెల్లూరో, నెల్లూరో, యెల్లూరో యేమియుఁ జెప్పవీలు లేదు. ఆ లేఖను జదివెదను.

సాక్షికి—చిక్కమాంబ నమస్కారపూర్వకముగ వ్రాసిన విన్నపము. మీజంఘాలశాస్త్రి మాయాంధ్రమహిళాసభలోఁ బ్రసాదించిన యుపన్యాసము నాంధ్రపత్రికారాజసారస్వతాను బంధబమునఁ జూచితిని. నే నప్పు డాసభలో లేకపోవుటచే వెంటనే తగిన ప్రత్యుత్తరము నీయలేకపోయితిని. కాన యాతని యుపన్యాసమందలి యధిక్షేపణములకు నప్రస్తుత ప్రశంస లకు, నాకాశపంచాంగములకు, నపూర్వపాండితీ ధోరణులకు, నాలాపాడంబరములకు, నర్థమైన ప్రత్యుత్తరమీయక తప్పదు. కావున మీకు వ్రాసితిని. బంటు తప్పానర్చినయెడల నింద ప్రభువునకు. భార్య తప్పానర్చినయెడల భర్త నెత్తివెండ్రుక లెగరఁ గొట్టుదురు. శిష్యుఁడు గోడదాఁటినప్పుడు గురువుగారి మూఁతిపండ్లు విరుగును. సంఘసభ్యుని నోటిపా టునకై సంఘాధ్యక్షునికి బుగ్గపోటు తప్పదు. కావున మీకు వ్రాసితిని. క్షమింతురా? సంతోషమే. క్షమింపరా? అంతకంటె సంతోషము.

అబలలము, నాజ్ఞానువర్తనలము, నపురాగయుక్తలము, నప్రవీణలమగు మమ్మ్మె జంఘాలశాస్త్రి మావేసములకై ...మాయుపన్యాసములకై ...మాకవిత్వములకై ...మాసభలకై ...మానూతనాచారములకై బాగుగాఁ బరిహసించినాఁడని మీ మగనా రెల్లరు కులుకుచున్నారు కాఁబోలు. చేతిచాటునఁ జిరునగవు లొలుకుచున్నారు కాఁబోలు. ఊరి నారీమణులపై నిందాగర్భావలోకములఁ జిలుకుచున్నారు కాఁబోలు. ఆహా! మీ మగవారి కెన్నటికిని బుద్ధిరాదుకదా! కాంతల కొనర్చిన నింద మీకర్ణములకు గానసేవ కదా! అబల యట్టె గడపదాఁటుట మొద లావలిజిల్లాలో గడనెక్కి యాడుటవఱకు, నాఁడు దాని జారుపైఁట మొదలు సంతదుకాణమువఱకు, నడుమనున్న కప్పదాఁటులు...కడఁద్రొక్కుటలు...పా ముమెలిక దారులు...భ్రాంతులు...మరియికనెన్నో...యవి యన్నియు మీకాయములకు ప్రాణ వాయుపారణముకదా! అది యాలాగని సంతతము చెప్పుకొనుట, వినుట మీయంత రంగముల కమ్మతసేచనము. ఓ!మగవారు, పురుషులు వీరావతారములు విద్యాప్రవీణులు మీ రెందులకైనఁ దగుదురు. మీ కేమిలోపము లున్నవి? మీరు సమర్థులు, సంపూర్ణులు. మేము అపండితలము...అజ్ఞులము...అల్పులము...అణువులము. మీరు మమ్మధిక్షేపింపరా? అనంత సృష్టిలోని యనంతసృష్టి కంతకధికారులు, అందులో నాఁడువాఁడ్రమగు మాకు మరింత యధికారులు! మేము బానిసలమైనప్పుడు మీరు ప్రభువులు కాకేమి? ''ఆఁడుదానిని నిందింపరుకదా! ఆఁడుదానిని నిందింపరుకదా!'' యని జుట్టుపాయఁదీసి యెగసి మూఁతిమీఁద నీడ్చి మగవానిని సాగదీసి కొట్టుఁగల నావంటి మచ్చికంటులు జిల్లాజిల్లాకు నల్వ్ రుండినయెడల నాంధ్రదేశమంతయు నాడుమళయాళమును జేయలేకపోవుదుమా? ఆ! కానిండు కానిండు. అట్టి నుదినములు రాకపోవు. నమీపముననే యున్నవి లెండు. మీయెగు రులు పొగరులు నడఁగును లెండు. అధిక్షేపణమునకు మీశాస్త్రికి మేమే కనఁబడితిమా? రాజకీయాందోళనములలోని యనందర్భస్థితులను గూర్చి యుపన్యాసము లీయవయ్యా యని మే మాతనికి మామిత్రులచే వార్తలంపి, కొందఱచే లేఖల వ్రాయించి హెచ్చరించి, పురికొలిపియుండ నామాటలకుఁ జెవుడా? యధిక్షేపణములలో మామీద దవుడా? అందుకు బడుగా? యిందుకుఁ బిడుగా? సెబాస్! ఎట్లు! ఎట్లు! మాజడచుట్టల నెంత చమత్కార

12. శ్రీమతి చిక్కమాంబ లేఖ

జంఘాలశాస్త్రి రెండోసారి దక్షిణ దేశ దేవాలయాలు చూసే దీక్షతో యాత్రల్లో ఉండి కాబోలు సాక్షి సంఘానికి అలవాటుగా పంపవలసిన ఉపన్యాసం గాని, లేఖ గాని పంపలేదు. అందువల్ల ఇవాళ ఏ ఉపన్యాసమూ ఉండదనుకుంటూండగా ఒక ముఖ్యమైన ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం ఏ వూరి నుంచి వచ్చిందో వివరం లేదుగాని, వ్రాసినవారు మాత్రం శ్రీమతి చిక్కమాంబ.

నిజానికి అదేదో వట్టి అభినందన లేఖ కాదు. జంఘాలశాస్త్రి, ఆంధ్ర మహిళా సభలో చేసిన సుదీర్ఘ ప్రసంగానికి ఘాటైన-లేదా-దీటైన సమాధానం. జంఘాలుడు ఏ క్రమంలో తన ఉపన్యాసంలో స్త్రీల కట్టుబాటు తీరుల్ని, వారు విడిచిన పూర్వాచారాలనీ, వారికి పూర్వపువారు ఏర్పరచిన నియమనిబంధనల ఆంతర్యాలనీ, ఎత్తుకున్నాడో అలాగే ఎత్తుకుని శ్రీమతి చిక్కమాంబ తన విమర్శా ఖడ్గాన్ని మగజాతి మీద ఝుళిపించింది. స్త్రీల వేషభాషల్నీ, ఆచార అనాచారాలనీ ఆక్షేపించే జంఘాల శాస్త్రికి మగ జాతిలో పుట్టుకొచ్చిన ప్రాచీనాచార నిరసన తక్కువదా వారి ప్రవర్తన బాగుందా? అని ఎదురు ప్రశ్నలు వేసింది. సంధ్యా వందనాలు నశించడం, పెళ్లాం చచ్చిన తరవాత నాలుగేసి అయిదేసి పెళ్లిళ్లకి సైతం ఎగబడడం, కోడి పందేల పిచ్చి, శీల హీనత, సిగ్గు లేమి, మద్యమాంసాల వాడకం, స్త్రీలను విమర్శించే పురుషుల దుష్టగుణం, కడిగిపారేసింది. స్త్రీలలో వస్తున్న మార్పుల్ని సమర్థించింది. మరోసారి స్త్రీలను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించింది.

ఆర్యులారా! ఈ దినమున జంఘాలశాస్త్రి యేమియు లేఖ నంపలేదు. ఆతఁడధిక దీక్షతో దక్షిణ దేశ దేవాలయములన్నియు మరియొక సారి చూచుచున్నాఁడు. ప్రయాణములచేఁ దెఱపి లేకపోవుటచేతనో, యాత్రాప్రయాసముచే దేహమునకు స్వల్పమైన యనారోగ్యము గలిగి యుండుటచేతనో యాతఁడు లేఖను వ్రాసియుండలేదు. అందువలన నీదిన మున సాక్ష్యుపన్యాస మేదియు నుండదు కాఁబోలునని యెంచితిని గాని యొక్కయబలాశిరోమణి యెక్కడనుండియో కాని యొక లేఖ వ్రాసినది. లేఖలో నామె యూరిపేరు లేదు. పైముద్ర మీఁద నక్షరములు స్పష్టముగా నంటలేదు. ఆముద్రపై (llore) అని మాత్రము

సోదరీమణులారా! మీరు విద్యాధికులై విరాజిల్లుచున్నారనియు నుపన్యాసము లిచ్చు చున్నారనియు, గ్రంథములను బ్రచురించుచున్నారనియు, సభాకార్యముల సంపూర్ణశక్తితో నిర్వహించుకొనుచున్నారనియు, దేశక్షేమలాభములకై పాటుపడుచున్నారనియు మహానంద మొందుచున్నాను. కాని గృహకార్యములం దలక్ష్యఁ జూపుచున్నారేమో యని జడియుచు న్నాను. కవిత్వమే కాక గానము చిత్రలేఖనము కూడ మీరు బాగుగా నేర్చుకొనవలయును. ఆకళఁబట్టి మీరు, మిమ్మఁబట్టి యాకళలు శోభఁ జెందనలసియున్నది. ఇట్లని గృహకార్య ములం దలక్ష్యత చూపఁదగదు. కష్టాంతనాటకము వ్రాసి మీరు దేశములోనున్న ప్రజల నేడ్పించుటకంటెఁ గడుపునొప్పిచేత నేడ్చుచున్న చంటివానికి సొంటియుక్కెఁర చేసి యిచ్చి వాని యేడుపు మానిపించుట మహాఘనకార్యము. చిత్రఫలకముపై బొమ్మనువ్రాసి ప్రపంచ మున విడుచుటకంటెఁ గడుపులోని బొమ్మను గాపాడుకొను విధులఁ దెలిసి యట్లాచరిం చుట మహాధికకార్యము. సభలోఁ గూరుచుండి చిత్తారువాయించి రాజుగారిని సంతోషింపఁజే యుటకంటెఁ దొట్టియొద్ద నిలువఁబడి జోలపాటఁ బాడి యర్భకుని యేడుపు మానిపిం చుట మహోకార్యము. కుటుంబౌషధ జ్ఞానసమార్జనమొనగ్చుటకంటె-మీకు 'గోలకొండ ఫాదుషా' నవలను వ్రాయుట యెక్కువదికాదు. మీదుస్తులు మీపిల్లల దుస్తులు మీరు కుట్టుకొనుటకంటెఁ బ్రాతతాటాకుల పుస్తకములు కట్టలుగాఁ గూర్చుట యెక్కువదికాదు. అదిగాక మీరైకలొకరు కుట్టుటయేల? తప్పుకాదా? పర్యవసానమునఁ జెప్పినదేమనఁగా -పిల్లలను బెంచుట కన్నివిధములగు నేర్పులు గలిగినది యాఁడుది. భర్తకుఁ బ్రాణయాత్ర యందు సర్వవిధములఁ జేదోడువాఁదోడుగా నుండి పాతివ్రత్యధర్మము నిలుపుకొనుచు, భర్తతో సర్వధర్మము లాచరించుచు బ్రదికి యున్నంతకాల మాతని నీడవలె నాశ్రయించి యుండునది యాఁడుది. చంద్రమత్యాది కాంత లట్లొనర్చినారు. వారివలెనే మీరు ప్రవర్తించి దేశమునకు వన్నెఁదెండు. కవిత్వముకొఱకట్టె మెదడును జంపుకొనకుఁడు. ఉపన్యాసముల కొఱ కట్టె గొంతుఁ జింపుకొనకుఁడు-మనుజుల చచ్చుకవిత్వములు చచ్చు ముప్పాతిక యుపన్యాసము-లెంతకాలము నిలుచును? యోగ్యత-యోగ్యత-అదియే బ్రహ్మమువలె శాశ్వతము. అట్టియోగ్యత మీకున్నది. దాని నభివృద్ధిపఱచుకొని తరించుఁడు. మిమ్మాశ్ర యించిన మీభర్తలఁ దరింపఁజేయుఁడు. పురుషుల యైహికపుజీవమే కాక యాముష్మికజీవన ముకూడ మీ చేతులలో నున్నది. మీజిహ్వాగ్రములందున్నది. మీనేత్రాంచలములందున్నది. పిల్లల కుగ్గుపాలతో - గురుభక్తి-పిత్భక్తి - మాతృభక్తి-రాజభక్తి-దేశభక్తి-భాషాభక్తి -హృదయములఁ బ్రవేశింపఁజేయుఁడు-పురంధ్రీమణులారా! మీపిల్లలకుఁ బాలను మీరే యిచ్చుకొనుఁడు. మీకుఁ బాలులేనియెడల నావుపాలు పోసియైనఁ బెంచుకొనుడు. కాని యితరస్త్రీలచేఁ బా లిప్పింపకుఁడు. గుణసాంకర్యము సంభవించును. కులక్రమాగత మర్యాదభిన్నత్వము సంభనించును. అతిథిపూజల నొనర్పుఁడు. అభ్యాగత సమారాధన మాచరింపుఁడు. పశురక్షణము సలుపుఁడు. బీదసాదలను శక్తికొలఁది బోషింపుఁడు. వంశపరి శుద్ధి గాపాడుకొనుఁడు. దేవపూజల నొనర్పుడు. మీకులదేవతల యాశీర్వాదములు మిమ్మాఁ జేరునుగాక! సూర్యాదిగ్రహములు మీకాయువును దేజస్సుఁ బుష్టిని సమకూర్చుఁగాక! దైవము సర్వదా సర్వదా మి మ్మనుసరించుఁగాక!

న్నవి. ఈపాటలకు భయపడి కాఁబోలు వీథిలోని కుక్కలు మోఁలు మింటికెత్తి మొ
మొర్రో యని యఱచుచు నిక్కడి సమర్తవార్తను స్వర్గలోకమునకు Wireless telegrap
గాఁ బంపుచున్నవి. ఇది యొక్క దురాచారమేకాని దీనినిగూర్చి యిప్పుడు చెప్పవలయు
నాయభిప్రాయముకాదు. చెప్పదలఁచిన దేమనఁగా–సమర్తయింటివారును పొరుగిండ్ల వా
నెనో్న భక్ష్యములు తెచ్చిసమర్త పెండ్లికూఁతునకుఁ బెట్టు దురాచారము మహాదురాచార
ఈదురాచారముచేతనే స్త్రీ వ్యాధులలో నూటి కెనుబవలకుఁ గలుగుచున్నవి. అమూ
దినములు నతిపథ్యవస్తుభక్షణమున వెడలఁబుచ్చవలయును. సమర్తపెండ్లికూఁఁతు గర్భకో
మున వాతము మిగుల హెచ్చుగా నుండును. Windy Substances యేమియు నా
కీయఁదగదు. పసపువేసిన పులగము–నేయి, వేఁడితీర్థము–ఈమూఁటికంటె నాల్గవవ
వీయఁదగదు. అజ్ఞతచే నభక్ష్యవస్తుభక్షణ మేమాత్ర మొనర్చినను ఋతుశూల, వంధ
త్యము, Hysteria సూతిక మొదలగు వ్యాధులప్పుడే యంకురించును. ఆవ్యాధు
ద్విగుణములై త్రిగుణములై శతగుణములై బ్రదికియున్నన్నినాళ్లు వేధించి వేధించి త
కవియే చంపును. ఋతుదినములు వాతవ్యాధి దిములని మీకుఁ జూపుట కొక్కసంగతి
మాత్రమే చెప్పెదను. సోదరీమణులారా! మీరు సర్వసాధారణముగా ఋతుస్నాన మొనర్చి
దినమున – నూదిలో దారమెక్కింపఁగూడదనియుఁ–గత్తిపీఁటతోఁ గూరలు తరుగరా
నియు – నాచార మున్నదని యెఱుఁగుదురా! (ఆ, ఆ అను కేకలు) కత్తిపీటచే వ్రే
ప్రమాదవశమునఁ దెగినఁగాని, నూది మొనవ్రేలికొనను గ్రుచ్చుకొని యొక్క రక్తబిందువై
జిమ్మినఁగాని వాతము హెచ్చయి ప్రాణాపాయదశవఱకుఁ దెచ్చునేమోయని మీపెద్ద లట్టిన
చారమును స్థాపించినారు. కావున ఋతుమతికి నర్వకాలములందు పథ్యమే. అందులో
బ్రథమఋతుమతికి వేఱు చెప్ప నేల? మరియొక్క సాధనము చెప్పెదను. సౌభాగ్యవ
లారా! మీకు గర్భము నిలిచినదని నమ్మకము కలిగిన వెంటనే – మీభర్తలను సమీపింపవలదు
పృథక్శయ్యలపైనే పండుకొనుఁడు. అమ్మా! ఏమో గొణుగుకొనుచున్నా రేల? (ఏమియ
లేదనుకేకలు–చివర బల్లమీఁదినుండి–'ఈబుద్ధి పురుషుల కేల యుండరాదు' అని యస్ప
ముగా మెల్లగ నొక్క గునగున) అమ్మా! ఏదియో యాకడపటి బల్లమీఁద కాంత యనుచ
న్నది. నాకు బాగుగా వినఁబడ లేదు. వినఁబడని మాటనుగూర్చి నే నెట్లు విమర్శింపఁ
లను? పోనిండు. అట్లుమీరు దీక్షతో నొనర్చినయెడల కుసుమలు మొదలగు భయంకరవ్
ధులుండవు. కష్టప్రసవము లుండవు. సూతికలు, గర్భవ్రణములు, గర్భస్రావములు మొద
గునవి యేవియు నుండవు. మీరు ప్రసవదినములలో మందైన సేవింప నక్కఱలేద
మాసమాసములు జరుగు నార్తవ కర్మములకంటెఁ బ్రసవ మెంతమాత్ర మెక్కువనది కాద
మీరట్లొనర్చి మిమ్మెఁ గాపాడుకొనుఁడు. మీమూలమున మీభర్తలను బిడ్డలను గాపాడ
కొనుఁడు. పశువులనుండి యీనీతిని మనము గ్రహింపవలయును. 'సృష్టి ప్రభుఁడ'
పిలువఁబడు మనుజునికంటెఁ బశువే యీవిషయమున మిగుల నుత్కృష్టజంతువు. ఎన్నియో
నీతులు పశుపక్షి కీటకములనుండి మనుజుఁడు నేర్చుకొనవలసి యున్నది–గాడిదనుం
యోరిమి, చీమనుండి దూరదృష్టి, సాలెపురుగునుండి పట్టుదల, కుక్కనుండి విశ్వాసము
గువ్వనుండి యేకపత్నీవ్రతము, ఇటు లెన్ని చెప్పవచ్చును? మనుజుఁ డంత బుద్ధిహీనమై
జీవము మరియొక్కటి లేదు. మజునకు బుద్ధి చెప్పఁజాలని జంతు వెంత నీచమైనదియు
బ్రపంచమున లేదు.

సాఁగదోలినారేల? నీరు చేదుకొనటులో–నుంకించి బిందెలు బుజముల కెత్తుకొనుటలోఁ –బదనెక్కువగాఁగ మెత్తఁబడి చలిమిడికానున్న యన్నపుఁ గుండిగలను గూరుచుండియే జొకాయించి దింపుటలో – నడుములు బెణకకుండ – బ్రేగు జెదరకుండ – జననకోశమునకు స్థానచలనము కలుగకుండ, నొడ్డాణములు మీకంగరక్షకై – యలంకారములకై – యవలగ్న బంధములుగా, నాదిశక్తినుండి యేర్పాటయి యాచరణములో నుండఁగ మీరిట్లు వానిని వర్జించుట బుద్ధిలక్షణమా? మీ క్షేమమే మీ రెఱుఁగకుండఁ బ్రవర్తించుచున్నారేల? ఎంతపని చేయుచున్నారు! చిలుక కొయ్యలఁ దగిల్చినయొడ్డాణము లిప్పుడైన మొలలకుఁ దగిల్చి కొనుఁడు. –నడుములు పెరుగనీయకుఁడు. నేవళికము నీరు సేయకుఁడు.

దేవుని చేతిలోనున్న సృష్టితంత్రమంతయు మీగర్భగోళమునందుండుటచే మీరే భూలోక దేవతలు, మీస్వార్థపరిత్యాగమంతది మేదిని లేనేలేదు. పురుషుఁడు వట్టి మొఱకు నిర్దయుఁడు. ఆత్మీయవాంఛాలంపటతాతి పంకిలాత్ముఁడు. అట్టి మొఱఁడు మీ దయావ ర్షమునఁ జిగిర్చినాఁడు. అట్టి పాషాణము మీ విద్యుచ్ఛక్తి వేడిమిని కరఁగినాడు. అట్టి స్వోదరపూరణ ధురీణుఁడు. మీ భక్తిభావాది మహిమనుజూచి స్వార్థత్యాగి యగుచున్నాడు. ఆహాహా! గర్భధారణమైనపిమ్మట–గర్భస్థతేజమును భరించుటలో–నకాలమునఁ దత్తేజము నవతరింపఁ జేయుటలో–మీరు పడు మహాక్లేశములో–మీరు పొందు మనస్తాపములో–మీ రగపఱచు స్వార్థపరిత్యాగ మహామహిమములో-లక్షాంశమైన–నీ పాటు మగలోకమునకుఁ దెలియునా? అది యొక్క భగవంతునికే తెలియఁదగినది. పురుషులకంటె జననకోశ మొక్కటు మీ కధికముగా నుండుటచేతఁ దత్సంబంధములగు నెన్ని వ్యాధులకో మీరధీనలగు చున్నారు. హరహరా వానిమూలమున నంతమొందుచున్నారు. ఆ రోగములనన్నిటిని మూలచ్ఛేదన మొనర్చుటకు రెండు మూఁడు సాధనములను జెప్పెదను. అవియేవో తెలిసికొందురా? (అభ్యంతరమేమి యను కేకలు).

సోదరీమణులారా! నేను వయసు మీరినవాఁడ నగుటచేత సుదతీమణులను సోదరీమ ణులుగా భావించువాఁడ నగుటచేతను, నేశ్రీమతి బొర్రమాంబగారికో, యే శ్రీమతి బాయమాంబగారికో యీయవలసిన యగ్రాసనాధిపత్నీత్వగౌరవమును నాకు మీరు కటా క్షించినారు. నన్ను మీయంబలలో నొక్కనిగాఁ జేసికొనినందులకు మిగులఁగృతజ్ఞుఁడను. సిగ్గుపడకుండ నేను జెప్పుమాటలను సిగ్గుపడకుండ మీరును వినవలయును. మీయాఁడుపిల్ల లీడేరినప్పుడు తత్సన్నివేశ స్వభావజ్ఞానశూన్యతచేత మీరు కొన్ని యసందర్భచర్యల నాచరించుచున్నారు. అమ్మాయి సమర్థాడినసంగతి కన్నయయ్యకుఁ దెలియకుండనే –మంగలి పెద్దయ్యకు ముందుగాఁ దెలియుచున్నది. అతఁడూ రెగరిబోవ బాకపట్టు చున్నాఁడు. ఇరుగింటి యమ్మలక్క లందఱు వడ్డనలు మాని – వంటలు మాని తామెన్న డెఱుఁగనివారివలె–నీ వేడుకను జూడవచ్చుచున్నారు. ఇంతలోఁ బంచాంగపు గట్టితోఁ బురోహితుఁడు–కాలామృతాది గ్రంథములతో నూరిలోని ముగ్గురు జ్యోతిషికులు –శిష్యులతో వేంచేసి, నక్షత్రదోషమును శకలశకలము క్రింద ఛేదించుచున్నారు. మఖా పుబ్బా భిన్నాభిప్రాయములతో జుట్టుజుట్టు పట్టుకొనుచున్నారు. ఇంతలోఁ బసపుఁగొమ్మ కొట్టిన రోటిలో–వడ్లు కాఁబోలు–నిల్లదఱ దంపుచున్నారు. ముంగిటిలో మంగళ్ల రమ్డోళ్లు రణగు ణమహాధ్వనులచేఁ జెలరేగుచున్నవి. పూర్వసువాసినుల పాటలు వాడవాడ నెగురఁగొట్టుచు

పచనపరిశుద్ధి–పాకరుచి–హృదయసంతుష్టి–యింత యని చెప్పవచ్చునా? పొగ ముక్కులలో దూర, పిడుకనిప్పువేడిమి కొడలుగ్రాగ, నుష్ణముచేఁ గన్నులు భగ్గున మండి నీరు గాఁ మీరు వండుకొనుచున్నారుకదా! అట్టి మీతలలోని వేడిమి తగ్గించుటకుఁ, గంటిమంటలను హరించుటకు, దృష్టిని సర్వదా బాగుపఱచుటకుఁ, గంటిమంటలను హరించుటకు, మీపూర్వుల కంజనధారణమును బోధింప, నాబోధలను గుండఁబెట్టి గంటువాయించితిరా! నందెడేసి తలవెండ్రుకలున్న మీరు నిత్యము శీతోదకమునఁ బ్రాతస్స్నానము చేయుటకు వీలులేదయ్యెను. కొటుకనే ధరింపకుండునెడల మీమెదళ్లెట్లు చల్లబడుననుకొంటిరి? మీకను లెట్లు నిర్మలములగుననుకొంటిరి? కని పెంచు వారలుకదా! మీకనులకు దృష్టిశక్తి యెట్లు దృఢముగా నిలువఁబడుననుకొంటిరి? ఈమాత్రమైన గ్రహించుకొనకపోయితిరేల? నాటక ముల వ్రాసినవారు. నవలల వ్రాసినవారు. అలంకారముగను, నక్షిరక్షకమణిగను మీవారేర్పర చిన యంజనమును నిరాకరించుట తప్పు తప్పు.

మీలో నెందరో చెవులనుబట్టి ముందునకు లాగుచున్న చత్వారపుజోళ్ళు–గడమీఁది సానులవలె ముక్కులపై నూగులాడుచున్న Tinhay లు, నొంటికంటి యుద్ధములు – మీహ్రస్వదృష్టిని దీర్ఘదృష్టిని – లుప్తదృష్టిని – ఘోషించుచుండుట లేదా? మీకన్నులలోఁ జెమకు లేకున్నదే. కచ్చికలవలె బెడబెడలాడుచున్నట్లున్నవే–వానికిఁ జోపఱతనముగూడ సిద్ధించుచున్నదే? రెప్పలు దళమెక్కినట్లు–మీచూపులే ప్రకటించుచున్నవికదా! మీరు ప్రతిదినము కొటుకనే ధరించునెడల మీ కీబాధ లుండునా? Barnes & Co కీ Profits ఉండునా? అమ్మా మీరు–అమ్మా! మీరు సున్నపు గుండలాగున–నమ్మా మీరు–అంత Face Powder ను బులిమికొంటిరికదా – రవంత పనుపు రాచికొనలేకపోయితిరా? పసుపుకంటె మొగముమీఁది మొటిమలు నట్టి హరింపఁగలది వేఱయున్నదా–పసుపుకంటె మంచి Disinfectant తరచు లభించునా! మహామారి కాబీజముల నయినను బసపుఁ చంపఁగలదని వినియుండరా! అట్టి పసపునకు–సౌభాగ్యమునకుఁ బ్రాణమైన పసుపునకు –వంటకుండలందేకాని మీవదనములందు గతిలేకపోయెనా! అదికాక, వర్షాకాలమనక, శీతకాల మనక, తేమలో, బురదలో, నీటిలో, నింటి సంబంధములగు పనులు చేసికొనవలసిన మీకు–నీరు నెత్తి కెక్కకుండఁ బాదములకు, నొడళ్లకు, మొగములకుఁ జిలుకరించిన బిందువుల రూపముగా దలలకుఁ, బసపును మీవా రుపయోగించుకొనుఁడని చెప్ప, నది మానినైచి, నీరు నెత్తి కెక్క Bronchitis, Asthma, Nasal Catarh, Influenza మొదలగు శ్లేష్మ వాతవ్యాధుల, నజాగ్రత్ప్రవర్తనమువలనఁ దెచ్చుకొని మీరు బాధపడి మీభర్తలను బాధించుట న్యాయమా! (అటులైన వితంతువులుకూడఁ బసపు రాచికొనవలయును గాఁబోలు నని కేక) అమ్మా! బుద్ధిమంతురాలవు–బృహన్పతికిఁ బెద్దయక్కగారవు. వితంతు వున కేకభుక్తిదీక్షచే – నేదినపుఁదేమ యాదినమే హరించుచున్నదని యెఱుంగవు కాఁబోలు. అది కాక, ఏకాదశ్యుపవాసములవలన–చాతుర్మాసాశన వ్రతదీక్షవలన–నొడలి రక్తమాంసములే హరించుచున్న వితంతువునకుఁ బసపుఁబూతలేల? అమ్మా! నీవుకూడ నట్లాచరించుట కిష్టపడితివేని పసపురాచికొన నక్కఱలేదులే!

అయ్యయ్యో! అనుజాశిరోమణులారా! మీయవలగ్నముల కొడ్డాణములే లేవేమి? అవి యేల తీసివైచినారు! నడుమునకు బింకమును సమకూర్ప సమర్థతగల సాధనములనే

నట్లు–కరడులచేఁ గదలుచున్న నీటిక్రిందనుండి యెర్రగలువ యూదృచ్ఛికముగా మోమెత్తిన ట్లు–విలక్షణకాంతి సంపత్తితో మీచెక్కు్కలంతలో నెఱుపెక్కు్కకున్నవికదా! ఆడువారికి బేడిస లపై దాడివెడలు చేరెడుకన్నులకంటెఁ దలలపై నీలపుటుంగరాల జొంపపు సొంపు పెంపుల కంటె నప్పుడే పరిమళోన్ముఖముగాఁ బ్రభవించుచున్న బంగారు కేతకివంటి యొడలిరం గుకంటెఁ బరపురుషదర్శనమున సాధ్వసపుఁ దొట్రుపాటున మనస్సునుండి చెక్కు్కల తుదలవఱ కొక్కు్కసారి మెఱసిన కెంపుటొరపున్నదే–అదియే యూఁడుదానికి సౌందర్యలక్షణా గ్రగణ్యము. అదియే కాంతాకాంతత్వమున కంతకును మూలకందము. అవయవములలో కంటె నవయవముల Expression లోనే మహాసౌందర్య మున్నది. సాధ్వసప్రకటన సౌంద ర్యమే సమస్తసౌందర్యపరమావధి. అట్టిది మీకు లేకపోవుటవలన–మీరు నీరుదిగిన హారముల వలె నున్నారు. ప్రాయికముగాఁ బురుషులతోఁ గలసిమెలసి తిరుగుచుండుటచేతను, నిర్భీతిగా సభలలో నుపన్యసించుటచేతను గాఁబోలు మీచూపులకు రవంత బెట్టతనము, బింకము, నిలుకడ, యెదు రెత్తుకూడ సంభవించినట్లున్నది. రవ్వంత నిర్లక్ష్యము, తగుమా త్రము నిర్భయత్వము, మోతాదైన మగతనముకూడ మీమోములం దగపడుచున్నది. సౌందర్యవతులగు సోదరీమణులారా! ఇంక నిట్టి మగలక్షణములు మాత్ర మభివృద్ధి నొందింపకుఁడు. ఇప్పటికే నుతిమించినట్లున్నది. పాకము ముదిరినట్లున్నది. పురుషులను మాత్రము మీరెన్నఁడు ననుకరింపవలదు. ఆడంగిపెద్దమ్మను జూచి మీరెట్లు వెకవెకలాడెదరో మగంగువెర్రమ్మనుజూచి పురుషులట్లు వెకవెకలాడెదరు. అదిగాక మరియొక్కయుపద్రవ మేమనఁగా–మగవారివలె మాటలాడి ప్రవర్తించి, తుపాకిపట్టి వేటకుఁబోయి కత్తిపట్టి యుద్ధ మునకుఁ బోయిన కాంతకు మూఁతిమీఁద మీనములు పదునాల్గు సంవత్సరములలో సిద్ధించునని పెద్ద లభిప్రాయపడియున్నారు. స్త్రీ పురుషభేద మేమో విశేష మనుకొనుచు న్నారు కాఁబోలు. రెండుతత్త్వములుగూడ నొక్కమందడినే యంటియున్నవి. మాలోఁ బురుషులెందరో స్త్రీలయి శ్రీమంతులలో – సౌభాగ్యవతులలోఁ–దత్రాపి గంగాభాగీ రథులలోఁ–జేరనే చేరినారు. మీరు పురుషులకంటె నెక్కువ బుద్ధిగలిగి ప్రవర్తించి మీస్త్రీత్వ మును నిలువఁబెట్టుకొనుఁడు. తల్లులారా! మీజన్మమే సర్వజన్మములలో సార్థకమైనది. ఎన్నటికైన–సృష్టిలో–నేజీవికైన–మోక్ష నిక్షేపలాభ ముండునెడల నది తప్పక యూఁడుదానికే –నిశ్చయము. నావంక నట్లు తేరిపాఱజూచెదరేమి?

కాని, సోదరీమణులారా! మీలో నొక్కరైన–లెక్కకైన–నొక్కరైనఁ గనులఁ గాటుకను ధరింపలేదేమి? కాటుకవలనఁ గన్నులు మోటులగునని మానినైచితిరా? కాటుక సౌభాగ్యలక్ష ణము కాదని మానినైచితిరా? కాటుకకన్నులు సౌందర్యవంతములు కావని మానినైచితిరా? కాటుకవలన నేత్రదృష్టి చెడునని మానినైచితిరా? ఏల మానినైచితిరి? మిమ్మెఁగన్నవారు, వారిని గన్నవారు – దానినుపయోగింపగ మీరు వారికంటె బుద్ధిమతులమని విద్యావతులమని మానినైచితిరా? బుద్ధిమతులు విద్యావతు లగునెడల మానియేయుండరే? మీలో భాగ్యవంతు లెందరో లేదు. అట్టిమీరంద రింటియొద్ద వండుకొనవలసినవారేకదా! భాగ్యవతులు వంట వాండ్ర యప్రయోజకతలచే, నవకతవక చర్యచే నెంత బాధపడుచున్నారో భాగ్యవతులకే యెరుక. రుచిమంతములగు భక్ష్యములు భోజ్యములు వంటవాండ్రవలన లభింపక పోవుటవ లన వారే వండుకొనుచున్నారు – వండుకొననిండు. అది మంచిదే. చక్రవర్తిభార్యయైనను వంటనేర్చి యుండవలసినదే. ఎవరి భర్తలకు పిల్లలకు వారు వండి పెట్టుకొనుటలో నున్న

ములు పలుచఁబడినవి. పటిమ దప్పినవి. పలితము లగుచున్నవి. బట్టతలలు భాగ్యహీనతకై పరుగెత్తుచున్నవి. ఇఁకనైనఁ గేశసౌందర్య వినాశనములగు తైలములను మురికికుండ్లలోఁ బాఱఁబోయరా! అదేమి–అదేమి! వింత వాసనలు కొట్టుచున్నవే! (Scents, Scents అని సభలో గుసగునలు) మీదుస్తులనుండి–మీతల వెండ్రుకలనుండి – విలక్షణవాసనలు కొట్టుచున్నవే! మీరు రాచికొనిన కేశవర్ధన్యాదితైలములలోని యత్తరపువాసన యెగిరిపోయి దానిలోఁగ లిపిన యీముదపువాన మిగిలియున్నది. అది మెతకచే ననిర్వర్ణ్యమైన పూర్వజన్మ ప్రారబ్ధము గొని లఘుమైన పుష్పసౌరభ మెగిరిపోయినది. Alcohol వాసన మిగిలినది. మే లెగిరిపోవుట కీడు నిలువఁబడుట యాచారమే కాదా? ఆవిరియై నీ రెగిరిపోవుచున్నది. బురద మిగులుచున్నది. ప్రాణము పోవుచున్నది. దేహము మిగులుచున్నది. దీప మారిపోవుచున్నది. వత్తి దుర్వాసనతో మిగులుచున్నది.

సోదరీమణులారా! మహాలక్ష్మీపూజాసమయమున మీరు మెడలకుఁ జేతులకు రాచికొనవలసిన చందనముకంటెను, సాలగ్రామతీర్థ పాననమయమునఁ దీసికొని కొప్పులలోఁ బెట్టుకొనవలసిన తులసీపల్లవములకంటెను, ప్రసాదస్వీకరణార్హ సమయమున బరిగ్రహించి కనులందుఁ బెట్టుకొనవలసిన శ్రీపాద రేణువుకంటెను, నీ యాబ్కారీ యీముదపు కంపులుకొట్టు నీసెంటు లీతైలములు ఘ్రాణతర్పణ సమర్థములని చిత్తాహ్లాదక పటిష్ఠములని యెంచితిరా! ఎంత వెఱ్ఱిపడుచున్నారు!

శ్రీమతులారా! మీకు మరియొక్కయంశమును జెప్పెదను. అది మీకు బొత్తిగా నిష్టముకాదేమో కోపపడరుకద. (No No అని సభలో గేక) No No అనుట యెందులకు? లేదనరాదా? నే నాంధ్రుఁడను. అమ్మా! నీవాంధ్రకాంతవు. నే నాంధ్రమున మాటలాడుచున్నాను. అంత విధిలేనియప్పుడు–తగినమాట దొరకనప్పుడు–తాత్కాలికముగా స్ఫురించిన మాటకుఁ దగినంత యర్థశక్తిలేనప్పుడింగ్లీషుమాట యుండనేయున్నది. దాని నుపయోగింపనే వచ్చును. అంతేకాని లేదన్నమాట కాంగ్లేయపర్యాపదమేల? మనకు బుద్ధిలేదు. పూర్వాచారపరాయణత లేదు. దేశీయవిద్యాభిమానము లేదు. ఔచిత్యము లేదు. పూర్వమహాజనగౌరవము లేదు. మనదేశపుది – మనజాతిది–మనది–యన్న యభిమానమే లేదు. ఒకరు చెప్పినయెడల వినవోర్పు లేదు. అది యున్నయెడల నాచరించుటకు నేర్పులేదు. అమ్మా! పుట్టినది మొదలుకొని యిన్ని తేదులలో నిరాఘాటముగా నేకచ్ఛత్రముగా మెలఁగిన మనలో లేదన్నమాట నాకుఁ గ్రొత్తయా? నీకుఁ గ్రొత్తయా? నీ వది యనఁదగదా? నే నది వినఁదగదా? లేదు. లేదు. ముమ్మాటికి లేదు గద–మీకుఁ గోపము లేకపోవుటయే స్థిరము గద! అటులైన జెప్పెదను. ప్రతిదినమును జూచుచున్న భర్తలను జూచునప్పుడుకాని, యాతనితో మాటలాడునప్పుడు కాని, మీపూర్వకాంత లోకవిలక్షణమగు జంకునకుఁగానంత తొట్రుపాటునకు–రవంతతడఁబాటునకు–నధీనలై యుండెడివారు. ఇప్పటి మాసోదరీమణులలో–యెట్టి వరపురుషులను జూచినప్పుడైన–వారితో సంభాషింపవలసివచ్చినప్పుడైన – నట్టికొంకు వెనుకపాటు సంకోచమును లేక ప్రవర్తించుచున్నారు. అట్టినమయములందు మీబుగ్గ లట్టి రవంత యెఱుపైన నెక్కకున్నవి. కన్నులట్టి కానంతయైన వ్రాలకున్నవి. దేహ మట్టి యినుమంతయైన సంకోచింపకున్నది. మనస్సట్టి మర్యాదకైన నొత్తిగిల్లకున్నది. గాలిచే గదలు గులాబిఁగలఁ జొంపమునుండియెఱ్ఱని మొగ్గ డబ్బాటున నుబికి తలమూపి

మీరు చేసికొన్న దురదృష్టమంతకంటె నెక్కువదికదా! వసంతఁడించిన ప్రసవములకంటె, ఫ్రెన్సువారి ప్రసవా లెక్కువ సౌరభవంతములని ధరించితిరా? శోభావంతములని ధరించితిరా? జగతీనాథుని సృష్టిలోని పుష్పములు జర్మనీవారి కృత్రిమకుసుమములసాటివైనను గాకపోయెనా? ఆహా! మీకర్ణములు అలంకారశోభాదరిద్రాణములై యున్నవే! చిన్నమెత్తు సువర్ణము లేదు. చీమతలయంత ముత్తెము లేదు. మీలోఁగొందరకు మెరుఁగు బిళ్లలుమాత్ర మున్నట్లున్నవి. మిగిలినవారికిఁ గుట్లయిన నున్నవోలేవో తెలియదు. ఇక మీనాసికలు స్వభావోక్త కవిత్వమువలె నున్న వున్నట్లున్నవి. అడ్డబాస లంతరించినవి. ముక్కుపుడకలు మూలఁబడినవి. ముంగర్లు మోటులై మూనలోఁబడినవి. ఇక మీ మెడలలో–నయ్యయ్యో –శ్రీరామరక్ష శ్రీరామరక్ష శ్రీరామరక్ష! శాంతమ్ పాపమ్ – శాంతమ్ పాపమ్ – పుణ్యస్త్రీలైన మీమెడలో – బ్రాహ్మణమహదాశీర్వాదపు వినోదములతో – మంగళ వాద్యఘోషములతోఁ – బుష్పలాజాక్షల వృష్టులతో – వృద్ధపూర్వసువాసినుల చల్లని చేతులతో స్పృశింపఁబడి కల్యాణసమయమునఁ గట్టఁబడిన కుత్తికంటు లేవి? బొట్టు పెట్టెలలోఁ బాఱవైచినారు కాఁబోలు! నిక్షేపమువంటి కట్టు పట్టు బిగింపుగల పూర్వపురవికలను దాసివాండ్రకో ముష్టివాండ్రకో యిచ్చి వట్టి పనికిమాలిన జాకెట్లను ధరించిరా! గౌనులా! Frock లా! Falling Collar లా! Safety Pin లా! మేజోళ్లా! బూట్సులా! Cuff లా! లింకులా! వహ్వా! అమ్మా! మీరు–అమ్మా! మీరు–అమ్మా! మీరు–ఆంధ్రజాతి స్త్రీలేనా? నవనాగరక తామాహాత్మ్య మాంధ్రజాతివైఖరికి మిమ్మెంతదూర మీడ్చివైచినది! ఈ దుస్తులతో, నీపటా టోపములతో, నీపటకాలతో, నీపింజలతో, నీముడుతలతో, నీవెనుకముం దెత్తుల పొంకము లతో, మీరు దొరసానులమైతి మనుకొనుచున్నారు కాఁబోలు! మీ యనుకరణమును గాంచి–మీ నటనమును జూచి–మీ యభినయము నవలోకించి–యాంగ్లేయసీమంతు లెంత నవ్వుచున్నారో మీ రెరుఁగుదురా? మీతల్లులు ధరించిన–మీయమ్మమ్మలు ధరించిన మీపూ ర్వులగు నరుంధతీ చంద్రమత్యాది మహాపతివ్రతలు ధరించినట్లు చెప్పఁబడిన – మనదేశ మున కనువైన – గాలితాకుట కనువగున – కట్టుకొనుటకు మిగుల సులువైన–వహ్నా బాధ కలుగగనే యూడఁదీయుట కంతకంటె సులువైన–వంశానుక్రమముగాఁ జిరకాలాగతములైన మనదుస్తులను–వానివిలువ నెరుఁగక–వాని యుపయోగమును దెలియఁజాలక – వాని సౌందర్యమును గుర్తెఱుఁగుక–తృణప్రాయముగా విసర్జించినారు. మంచిరూపములు చెడి నవి. మారురూపములు రాలేదు. మధ్యమున నందున కిందులకుఁ జెడి వ్రేలాడుచున్నారు. ఆహాహా! ఈబొత్తాముల వరుసలేమి? ఈగుండుసూదుల ముండ్లకంపలేమి? ఆప్రక్క మంగలిసాదులమూతులలోఁ గొలుకులేమి? అయ్యయో! ఈక్రైస్తవ వేషములేమి? ఆమొగ ములమీఁద శారదాభ్రశకలములవలె దుప్పికివలె శ్వేతపుడాగులేమి? (Face-Powder అని సభలో గుసగుసలు) మగవాం డ్రాఁడువేసములు వేసినప్పుడైన నింత బూడిదఁబూసికొనరే!

సోదరీమణులారా! మీరందఱు పదుచువాండ్రేకదా! అప్పుడే మీతలలకు వఱ ప్రారం భించినదేమి? నారీమతల్లులారా! కారణమేదో యూహించితిరా? శిరోజవృద్ధికి –మార్దవమునకు–నొత్తునకు–నైగ నిగ్యమునకు మీరు తలలకు రాచికొనుచున్న కేశసంవర్ధనీతై లములు తలరంజనీతైలములు మొదలగునవి మిమ్ము మీయమ్మలకంటెఁ బెద్దవారిని జేసినవి. కాంతల సహజభూషణము–సౌందర్య ప్రాథమిక స్థానము–సౌభాగ్యవిజ్ఞానము –సర్వదేశములందు-సర్వజాతులందుఁగూడ శిరోజబంధమే కాదా! అయ్యో! అట్టి మీకేశ

సమూహమును జూచితిని. ఆహా! కలువలవనము–ముత్యాలజాలరు–మెరుపుతీఁగల గుంపు –కన్నుల వైకుంఠము! ఎందఱు సోదరీమణుల నొక్కసారి – కంటి జిలజిలలతో, నొడలి మిలిమిలలతోఁ, బంటి మెలమెలలతో–మోము కలకలలతో–గాజుల గలగలలతో–రంగు బట్టల పెళపెళలతోఁ–గాంతితరంగముల జలజలలతో–నొడలంతయు నొక్కటే కన్నయి నట్లు, ఆకన్నంతయు నొక్కటే మనస్సయినట్లు, ఆమనస్సంతయు నానందస్వరూప మైనట్లు చూచుట సిద్ధించినది! స్త్రీలకంటెఁ జూడఁదగిన పదార్థములు–జగతియం దెచ్చట నైన గలవా? మగువలే లేనియెడల నింక జగతియేమి? పూవులు లేనితోట–మణులు లేని గని–చుక్కలు లేని యాకసము–ప్రాణము లేని శరీరము–అప్పటి స్త్రీల చక్కదనమును రవంత చెప్పెదను. బంగారము వారి తనులతల నాశ్రయించి పద్మసౌరభసమన్వితమైన ట్లగపడినది. వజ్రములు కెంపులు వారి కర్ణముల నాశ్రయించి జీవకళలచేఁ జిత్రవిచిత్రముగ జిగజిగలాడినవి. చెట్టునంపెగలు వారి జారుకొప్పులలోఁ జేరి బంభరజుంబన పరామర్శతల నొందినవి. లత్తుక వారి సహజారుణపదద్వంద్వసేవ నొనర్చి ధన్యమై తరించినది. మౌక్తిక ములు వారి నాసాగ్రములఁ జేరి దంతశోభామందహాసాంకురములచే ద్విగుణీకృత తేజస్కా ములై వెలుగొందినవి. సూర్యచంద్రులు–వారి ముంగురులే మహాభాగ్యము లని యటఁ జేరి, తమకంటెఁ దేజస్వంతములై సుప్రసన్నము లైన వారి మొగమునకు సేవ యొనర్చుచుండిరి.

ఇప్పు డానీలపుబంతుల కొప్పులేవి? కొప్పులలో దేవపూజా నిర్మాల్యములగు పూవుల ముడుపు లేవి? మహనీయ కాంతి సముజ్జ్వలములైన మగువల మొగములకు మంగళపుటా రతు లిచ్చు మణిఖచిత కర్ణతాటంకము లేవి? సుధాబిందుసుందరములగు ముత్తెములుగల యడ్డబాస లేవి? ముంగర లేవి? పదములఁ పారాణిపూత లేవి? ఏమియు లేవు. కొప్పులకు బదులుగా నిప్పుడు జడచుట్ట లవతరించినవి. జారీచెంబులవలె–జంతికలచుట్టవలె –చిలుకకొయ్యలఁ దగిలించిన చుట్టకుదుళ్ల వలె–సంక్రాంతి పిడులతవలె–డూదేకుల బస్తాలవలెఁ బద్మ వ్యూహములవలె–నీఁగలున్న తేనెపట్టువలె–జడలు వింత వింత యల్లికలు గలవై వెర్రివెర్రి యాకారములు గలవై యున్నవి. ఉచ్చమొదలేనుఁగు మెలిక వరకుఁగల యన్ని విధములగు నల్లికలుగలవై యున్నవి. అట్టి వింతవింత చుట్ట లవతరించినవి. ఈ కుక్కపీఁకుడు జడబిగింపులతో, ముచ్చెనగుంటలోను దాని ప్రక్కలనున్న నూనూగు వెండ్రుకలముద్దు ముద్దు సింగారమంతయు ధ్వస్తమై యూడిపోవుట, యచ్చటి మృదులము లగు చర్మము లోనినరములతో గూడఁ బై కెగసివచ్చుట, మొగము క్రిందికి వంగుటలోఁ బ్రాణము పైకిఁ బోయినట్లుండుట, ఇంకను బిగింపుచాలదని మీరు గొణుగుకొనుట, జడలల్లినవారు వ్రేళ్లమంటలచే సణగుకొనుట ఇవి యన్నియు మీకుఁ బ్రతిదినము స్వానుభవ ములో నున్నయంశములు. కావున, విస్తరింప నక్కర లేదు. నవనాగరక నైపథ్య రచనాశానస కోశ మట్లు చెప్పుచున్నది కాఁబోలు! ఈజడచుట్టలపై–మొగలిపూవులుమోటు – సంపంగి పూవులు గాటు– మల్లెపూవులు మాగుడువానన–గులాబిపుష్పము గుల్లబారు–చేమంతిపూవు చీఁదర–కావునఁ గాగిదపుఁబుష్పములు–జర్మనీవారో ఫ్రాన్సువారో నిరుపయోగము లని పెంటపైఁ బాఱవైచిన–దిక్కుమాలిన–న్పుశింపఁగూడని–కాగిదములతోఁ గట్టిన పుష్పము లు–శవములు మీఁది గుడ్డలకు రంగులునైచి కట్టినపూవులు– నిర్గంధములు–దుర్గంధములు –నిస్సారములు – నిస్తేజస్కములు–నిర్మలితము లగునవి–ఇనుపసూదులతోఁ జీలుగుబెండు టస్తరులో మీతలలపై నవతరించినవి! ఆహా! పుష్పములు చేసికొన్న మహాదృష్ట మెంతో

11. కాంతలఁగూర్చిన యుపన్యాసము

సాక్షికి జంఘాలశాస్త్రి ఒకసారి ఉత్తరం రాస్తూ, ఆంధ్రమహిళా సభ కార్యదర్శిని కోరగా తాను చేసిన ఉపన్యాసం వివరాలు రాస్తున్నాడు.

అతను మొదట తన ఉపన్యాసం ప్రారంభిస్తూ స్త్రీ తరువాతే ప్రపంచంలో ఏ వస్తువునైనా పరిగణించాలన్నాడు. స్త్రీల సున్నితత్వం, సౌకుమార్యం గురించి ప్రశంసించాడు. స్త్రీ లేకపోతే ఇంక ఈ ప్రపంచమేదీ? అన్నాడు. అభినందించాడు గాని, ఒకప్పటి స్త్రీల సౌందర్య కారణాలైన వస్తువులన్ని ఒక్కొక్కటీ కనుమరుగై పోతున్నాయని వాపోయాడు. జడల అల్లికలలో, తలకట్లలో పాడచూపుతున్న మార్పుల్ని జంఘాలుడు భరించలేకుండా వున్నాడు. ఆడవారు పూలను నిరసించడం, కాగితపు పువ్వుల్ని ఆదరించడం, ఈసడించాడు. అడ్డబానలు అంతరించినందుకు చెవుల అలంకరణాలలో బంగారం, ముత్యాలు అంతరించినందుకు, ముక్కు పుడకలు, ఉంగరాలు మోటుగా వారు భావించినందుకు నిరసన వ్యక్తం చేశాడు.

స్త్రీల కొత్త అలంకరణలు, దుస్తులతీరు, జంఘాలుణ్ణి కలవరపరచాయి. స్త్రీలు మనదేశ పరిస్థితులకు తగని వేషభూషలు అనుసరిస్తున్నారని వెగటుపడ్డాడు. ఈ దేశానికి సహజంగా వుండే వాతావరణానికి తగినవని ప్రాచీనులు భావించిన గొప్ప విశేషాల అంతరార్థం స్త్రీలు గ్రహించడం లేదని, సహజమైన సిగ్గు అనే ఆభరణం తొలగిపోతోందని వారివల్ల జాలి పడ్డాడు. ఇదీ అదీ అని ఏమిటి? స్త్రీలకు సంబంధించిన అన్ని అంశాలను, చాలా విపులంగా చర్చించి విడిచిపెట్టాడు.

జంఘాలశాస్త్రి వ్రాసినలేఖ యిదిగో చదువుచున్నాను:–

''సాక్షికి, జంఘాలుఁడు నమస్కారములు. ఆంధ్రమహిళా సభలో నన్నొక్కసారి యుపన్యసింపుమని యా సభాకార్యదర్శిని గోరగ నిట్లుపన్యసించితిని. ''సోదరీమణులారా! ఏదైన నొక్క యుపన్యానమిమ్మని మీరు ననుఁ గోరగ వచ్చితిని. ప్రపంచమున నేవస్తువైనను మీ తరువాతిదే. కావున మిమ్ముఁ గూర్చియే చెప్పెదను. మీలో బాలికలు గూడ నెందరో యున్నారు. అందువలన సాధ్యమగునంత వరకుఁ దేటతెలుఁగుమాటలతోఁ జెప్పెదను– ఇరువది ముప్పది సంవత్సరములక్రిందట మరియొక్కయూరిలో నేనొక్క యాంధ్రకాంతా

వొక్కఁడనే యిట్లు చేసితి ననుకొంటిరేమో! మిగిలిన రణశూరులందఱు రవ్వంత పాఠభేద ముగ నట్టిగ్రంథమునే చదువుచుండిరి. ముద్దులచప్పుడే కాని గ్రుద్దులచప్పుడే లేదు. కిలకిలలే కాని రొసరొసలే లేవు. మందహాసములే కాని యట్టహాసములు లేవు. కొంగిలింపులే కాని కలియఁబడుతెగింపులే లేవు. సౌఖ్యపారవశ్యమేకాని సమగ సమావేశమే లేదు. ముం దేర్పాటులఁగూర్చి వీరు వారి నడుగలేదు, వారు చెప్పలేదు. గప్‌చిప్‌లే కాని గడబిడలే లేవు. కాని యోగిని తలుపు తీయకపోవుట కేమికారణమో యని స్త్రీ లందఱు వితర్కిం చి తిరుగఁ దలుపుగట్టిగఁ గొట్టిరి. అంతట లోపలితలుపు గొండ్లెము తీసి మీ కెదుటఁ గనఁబడుచున్న జంఘాలశాస్త్రి వెలుపలకు వచ్చెను. నీవెవ్వఁడ? వని వారు నన్నడుగ ''మిమ్మిట్లు మోసపుచ్చుటకు నేనే. వీరి ప్రోత్సాహమున యోగిని నైతిని. నేను రాత్రి యిట శయనింపలేదు. ఉపన్యాసానంతరము పోయి తిరుగ వీరితో వచ్చి నాకుఁ దగినదానిఁ జూచుకొని యిందునఁ బ్రవేశించితిని'' అని చెప్పితిని. స్త్రీ లందఱు నవ్వుకొనిరి. ఆఁడువారి కే మున్నది? మగవారిపై నిష్ట మున్నఁ గొండంతనేర మిండుపగింజంత! అన్యథాయైనచో నిండుపగింజంత తప్పు హిమాలయపర్వతమంత, సోదరులారా! సోదరులారా! రాత్రి చాల నైనది. శ్రమ యిచ్చితిని. క్షమింపుఁడు.'' అని జంఘాలశాస్త్రి పలికెను. అందఱును పోయిరి. నేనుఁగూడ నింటికిఁ బోయితిని.

మాట లేదు. ఇనుపతలుపు లగుటచేఁ బగులఁగొట్టుటకుఁ జాలసేపు పట్టును. పురుషసైన్యములు ఢామ్ ఢామ్మని ధ్వనులతో లోపలఁ బ్రవేశించుట కారంభించిరి. అంతటఁ గాంత లటునిటుఁ బరుగెత్తుచు నినుపగరిటెలు కొందఱు, గడ్డపాఱలు కొందఱు, పాత్రములు కొందఱు, రోఁకళ్లు కొందఱు, చేతుల కేది సమయమున కందెనో దానిని ధరించి యుద్ధసన్నద్ధులై బారులుదీర్చి చంపెదము, పచ్చడి చేసెదము, పొడిచెద మని రణావేశమునఁ గేకలు వేయుచుండిరి. యుద్ధకారణ మేదో యెవ్వరికి గోచరింపలేదు.

ఇంతలోఁ బురుషుఁడగు రాయబారి యొకఁడు వచ్చి "మీరు బలాత్కారముగ మామగవాని నొకని మీ సంస్థానమున కేల యీడ్చుకొనిపోయితిరి? వానిని మాకుఁ దిరుగ నిచ్చెదరా? లేకున్నఁ జచ్చెదరా?" యని రాజ్ఞితోఁ బలికెను. "మనలో మగవాఁ డెవఁడో కనుగొనుఁ" డని ప్రభ్వియాజ్ఞ కాఁగా స్త్రీజన మంతయు మఱింత కలఁత నొందినది. ఏకాంతమట్టున కాకాంతకుఁ బ్రక్కనుండు కాంత పురుషుఁడేమో యని సందేహము తోఁచసాగెను. అన్నివేల యాఁడువారిలో మగవాఁడెవఁడో కనుఁగొనుట యెట్లు? అదిగాక బలాత్కరించి యెవనినో తీసికొనివచ్చుట కల్ల గాననిది యుద్ధమున కొక్క విషయమని నిశ్చయపఱచుకొని "యుద్ధము చేసి చచ్చువారమే కాని వెనుకఁ దిరుగువారము కాము. కాని యిప్పుడు కారణాంతరములచే సిద్ధముగ లేము. తెల్లవాఱువరకు నాఁగియుండిన యుద్ధ మొనర్తుము." అని రాజ్ఞి రాయబారితో ననఁగ నాతఁడు యుద్ధమాఁగ దని చెప్పిపోయెను. అంతట మంత్రియు మఱికొందఱు సభచేసిరి. "ఆయుధములు లేనిసమయలున యుద్ధము తప్పనిసరి యయ్యెను. చావుగూడ మనకల్లే యగునేమో? కావున సంధి మంచిది. మేమొక్క మగవానితో శాశ్వతముగ ముడిపెట్టుకొనువారము కాము. పెండ్లిపలమయిదునంవత్సరములు మాత్రమే యుండఁదగినది. ఆమితిలోఁ గలిగిన యాఁడుపిల్లమాది, మగపిల్లవాఁడు మీవాఁడు. మాకు మీతో నమానమగు స్వేచ్ఛ నంగీకరింపవలయును. ఈయేర్పాటులఁ గంగీకరించినయెడల మీతో మేము సంధి చేసికొందు" మని వారి కిప్పుడు తిరుగ రాయబార మంపిన మంచిది. వారు సంధి కంగీకరింపక యుద్ధమే చేయుదు మనినచో "నిరాయుధల మగుమాతో సాయుధులగు మీ రనమయుద్ధ మొనర్చుట యన్యాయము. కావున మీరుగూడ నిరాయుధులై యుద్ధమునకు రండని వారికి రాయబారిచేతఁ జెప్పించవలయును." అని మంత్రి రాజ్ఞితోఁ జెప్పెను. అందులకామె నమ్మతించి యట్లు చేసెను. రాయబారి తిరుగఁ బరుగెత్తుకొనుచు వచ్చి "సంధి పొసఁగలేదు. యుద్ధము తప్ప" దని చెప్పెను. ఇంతలో లెక్కకుమీఱిన పురుషులు తుపాకులవారు, కత్తులవారు, సీఁకులవారు, గండ్రగొడ్డళ్లవారు, కట్టికత్తులవారు లోపలఁ బ్రవేశించిరి. శస్త్రశూన్యలగు కాంతలఁ జూచి పురుషులు తమ శస్త్రములూడ్చిరి. సంఘయుద్ధము దొమ్మి యగు నని దానిని మాని ప్రత్యేక ప్రత్యేకముగ ముష్టియుద్ధమునకై తలపడిరి. ఒక పురుషుఁడు తనకుఁ దగిన యోధను దీసికొని సమర మారంభింపఁ దొడఁగెను. స్త్రీలు మిగిలిపోవుటచే కొంద ఱీర్ష్యలు ముగ్గురను దీసికోవలసి వచ్చెను. నేనుగూడ నొకసొగుడు కాళులచాన నేరుకొంటిని. అది నన్ను వీరావేశమున గ్రుద్దుటకై యుంకింపఁగ దానికి మెల్లగ నేను గిలిగింతఁ బెట్టితిని. అది తెల్లఁబోయి కొంచెము నవ్వుకొనుచుఁ దిరుగ మొగము ముడిచి నాలెంపపైఁ గొట్టఁబోవఁగ నామెచేయి పట్టుకొని ముద్దు పెట్టుకొంటిని. వీరావేశ మేమయ్యెనో! అట్టహాస మేమయ్యెనో! ఆమె గునగునలాడుచు మందహాసముఁజేయుచు ననున్ను గౌఁగిలించెను. యుద్ధమునకుఁ బిలిచివాఁడనైన నే

నక్షత్రములవలెఁ బ్రకాశించుచున్నారు. మన కందఱికు రాణియై, సుగుణశాలినియై, విద్యా
మానినియై మానినియైన యీమహిళాశిరోమణి సతీసమాజమును బరిపాలించుచుఁ జంద్ర
ళవలెఁ బ్రకాశించుచున్నది. ఈసంస్థానము దైవకటాక్షమునఁ జిరకాల మభివృద్ధిఁజెందుఁగా
ఓం శాంతిశ్శాంతిక'' అని కూరుచుండెను. యోగినిని ముద్దుపెట్టుకొనువారు, కౌఁగిలిం
కొనువారు, చేయిఁ బట్టుకొనువారునై సభయంతయు మహానందమున నుండెను. సోద
లారా! నేను జరుగనియంశముఁ జెప్పువాఁడను గాను. ప్లక్షద్వీపమునఁ బ్రభవనా
సంవత్సర వైశాఖశుద్ధ పంచమినాఁటి సాయంకాలమున నిట్టిసభ జరిగినది. నేను గాలికొలఁది
దిరిగినవాఁడ నగుటచే విదేశ వార్తలనుగూర్చి యనత్యకథలు చెప్పుదు నని నామిత్రుఁడ
సాక్షి యభిప్రాయము. ఒకటి లేనిదే రెండు కల్పించువాఁడను గాను. అట్టి కవితాశ
లేనివాఁడను. నేను విమర్శకుఁడను గూడఁ గానని యీ నడుమ సాక్షి నన్నధిక్షేప
మొనర్చినాఁడు. ఆసంగతి లోక మెఱుంగును లెండు. విచారింపఁదగదు.

యోగిని నందఱు గౌరవించిరి. పురుషముఖావలోకనపరాఙ్ముఖతఁ గూరి
తొంబదిమూఁడవసారి తిరుగ నందఱు శపథము చేసిరి. ఆరాత్రి గొప్పవిందు జరిగెను
స్త్రీలందఱు కోటలోనే భుజియించిరి. కొందఱు పాడిరి. కొంద ఱాడిరి. కొందఱు త
మొనర్చిన గ్రంథములఁ జదివిరి. ఇట్లనేకవిధములఁ గాలక్షేపము జరిగినది. అందఱుపోయి
యెవరియింట వారు శయనించిరి. అది వసంతర్తుమధ్యభాగము. స్త్రీలు ముంగిళ్లలో
శయనించుచుండిరి. చల్లనిగాలి వీచుచున్నది. రాత్రి నిశ్శబ్దముగ నున్నది. కాని యెక్కడనుం
డియో కాని దూరముననుండి తుపాకిచప్పుడు వినబడినది. ఒక్కగడియసేపటిలోఁ దుపాక
లధ్వనులు గ్రామముచుట్టు వినఁబడసాగినవి. స్త్రీజనమంతయు నదరిపడి లేచి గలగల
తిరుగుచున్నది. ఎవ్వరో యుద్ధమునకు వచ్చి గ్రామమును ముట్టడివైచినట్లు స్పష్టము
లంగాలు వెనుకకు బిగించి దోపుకొనువారు కొందఱు, నూడినకచభారముల గట్టిగా
ముడివైచుకొనువారు కొందఱు, నూడినచభారముల గట్టిగ ముడివైచుకొనువారు
కొందఱు, నడుముల గంటలయొడ్డాణములు తీసి తోలు ''పటకాల'' ధరించువారు
కొందఱు, మేజోళ్లు తీసివైచిపాదములకుఁ జర్మపాదరక్షలు తొడుగుకొనువారు కొందఱు,
శస్త్రాగారమునకై పరుగెత్తువారు కొందఱునై గ్రామమల్లోలమయ్యెను. రాణిగారు, మంత్రి,
కార్యదర్శిని మొదలగువారు యుద్ధాలోచనవిషయికసభ చేసిరి. మగవారితో యుద్ధమొనర్చి
వారిజాతిలోఁ గొంతనైన మారణము చేయుటకుఁ దగినయవకాశము గలిగిన దని యందఱు
సంతసించుచుండిరి. ఇంతలోఁ గొందఱు సైనికులు ప్రవేశించి ''ఆయుధాగారపుఁ గాళ
మగపడదు. యోగిని యందులో శయనించుచున్న దని తెలిసి తలుపుతట్టి యెంతయల్లరి
చేసిన నామె లేచి తలుపు తీయలేదు. ఆయుధము లన్నియు నందులో నున్నవి. ఏమి
చేయవలయును?'' అని బిగ్గరగా రాజ్ఞీనన్నిధానమున నఱచిరి. ''దాని తాళము యోగినిన
కెవ రిచ్చిరి? ఆమె దానిలోనేల శయనించు చున్నది?'' యని రాజ్ఞపలుక నాయుధాగారము
లోనున్న యుద్ధశక్తి దేవాలయములో స్త్రీలనమర్థతాశౌర్యములకై శక్తిని బ్రార్థించుచు రాత్రి
యచ్చటనే శయనింతు నని చెప్పి యోగిని నాయొద్ద దాళమును దీసికొనిపోయినది'' యని
మంత్రి పలికెను. నాతోఁ జెప్పకుండ నీ వల్లేలచేసితి? వని కోపముతో రాణిమంత్రిచేయి
కఱచెను. మంత్రి కోపముతోఁ గార్యదర్శిని గాజుల పగులఁగొట్టెను. ఎల్లవారలకు మతులు
పోయెను. అందఱు పోయి శస్త్రాగారమునొద్ద బిగ్గరగ నఱచి, తలుపు గొట్టిరి. లోనుండి

చూపుచుండఁ దొమ్మిదవసారి గర్భాదానపుఁ బీఁటలపైని ''హరహరా'' యనుచుఁ దాను జదికిలఁబడునుగాని పదుమూఁడేండ్ల వితంతువునకుఁ బునర్వివాహము దూష్యమని చెప్పును! ఈతనికి దయాదాక్షిణ్యము లున్నవా? ఔచిత్య మున్నదా? హృదయ మున్నదా? ఈతఁడు ప్రాణి కోటిలోనివాఁ డగునా? కాదా? తా నెన్నితప్పులిరుగుడులు తిరిగిన నది శిష్టాచారమా? తా నెన్నివంకకూఁతలు కూసిన నవి వేదాక్షరములా? అవి మనకు దూష్య ములు, శిక్ష్యములు, నరకార్హములునా? భగవంతునికిఁగూడ నిట్లే మతి పోయెనా? అతని చట్టములు గూడ నింతపక్షపాతప్రబలములేనా? అతనినోట వెడలిన శ్రుతులు గూడ మన కధోగతిప్రదము లేనా? ఆహా! ఎంత దురన్యాయము! ఎంతదుర్నీతి! మగవాని మనసే మనసా? అతనిమాటయే మాటయా? మన మాతనియానతుల శిరమున వహించి నోరు మూసికొని యండవలసినదా? మన కేమి సిగ్గుబిడియములు లేవా? ఆత్మగౌరవము లేదా? అహంకారము లేదా? ఆవస్తువులమా? అనువులులేని మట్టిబొమ్మలమా? అతనియిష్టానుసా రముగఁ గామతంత్రము నిర్వహించుకొనుటకు మన మేమి వట్టితొలుతిత్తులమా? మనము సింగారించుకొని వాకిట నిలువఁబడఁగూడదా? మోఁకాలుచిప్ప లూఁడగొట్టుకొని పంచపాళీలోఁ గూర్చుండవలయునా? వీథిలోఁ బోవువారి నెవరినైనఁ జూడఁ గూడదా? కన్నులలో జీడి పెట్టుకొని గడపమూలను గూర్చుండ వలయునా? మన మెవరితోడనైన స్వేచ్ఛగ మాటాడఁగూడదా? నోటిలో లిబ్బిఁగొట్టుకొని యుండవలయునా? తాను–తన యిష్టానుసారముగఁ మాటలాడుటా? రాత్రులు రెండుయామములవఱకు నిల్లు సేరకుం డుటా? చందనచర్చతో, నత్తరువువాసనతో వచ్చి దేవుఁడా యనుచుఁ దనకొఱకు నిద్రలేక కనిపెట్టుకొనియున్న కాంతను దిట్టుటా? చెప్పుఁ దీసికొని యాదొడ నీదొడ వాయించు పాటియాఁడుది లేకుండెను గాని–మనము తాను తీసికొనినంత స్వేచ్ఛ తీసికొననక్కఱలేదు సరేకదా! ఎవరినైనఁ జూచి కాసంత నవ్వినఁ–నెవరితోడనైన నేకాంతముగ నంత మాటలాడినఁ గొట్టుటా?–తన్నుటా? పుస్తెలు ద్రెంపుటా? బహిష్కారమా? ఘటశ్రాద్ధమా? మనకు సిగ్గు, ధైర్యము లేవు గాని మనమే యానిర్భాగ్యులయెడల నట్లు లేల తిరుగుబాటుచేయ రాదు? అట్లు చేయఁగలిగినయెడల లోకము సంతోషించును, దేవతలు సంతోషింతురు, లోకేశ్వరుఁడు సంతోషించునే! కాని, అంతస్థితి వచ్చ వఱకు మనకు వానితో జోక్యము వలదు. మననంస్థానములోనికి వారు వచ్చునెడల ఖండింతుము. వారు లేనిదే మనము వర్ధిల్లఁజాల మని వారు రజ్జులు కొట్టుచున్నారఁట. మనములేనిదే వా రెట్లగుదురో చూతము. పురుషబంధములఁ ద్రెంపుకొంటిమి! విద్యాగ్రహణమునఁ బ్రకాశించుచుంటిమి! స్వేచ్ఛాను సారముగఁ బ్రవర్తించుచుంటిమి! పురుషగర్వ ప్రాయశ్చిత్తకంకణములఁ జిత్తజిల్లుగ వర్షించు చుంటిమి. ఇంతకంటె నరజన్మమునకుఁ గావలసినదేమి? పురషునివలనఁ గలుగు తుచ్ఛసు ఖమా? థూ! థూ! పిల్లలు! ఎందుల కా జంజాటము! ఇంద్రియనిరోధము కష్ట మందురా? అలవాటునకు సాధ్యము కానిది లేదు. నాకుఁ గష్టమనిపించలేదు. అటుల వచ్చిన నీసంస్థానము సంతానరాహిత్యమునఁ జిరకాల ముండదని యొక యధిక్షేపణ మున్నది. పోనిండు, ఎల్లుండి నశింపనిండు. ఒడలినిండ నగల నుంచుకొని పిల్లలఁ గని మగనికి వంగి బానిసయయి యుండుటకంటె బ్రహ్మచారిణియై చినుఁగులగుడ్డ కట్టుకొని ముష్టియెత్తుకొనుట మేలు. మగవాని దాస్యము లేకుండ బ్రతికిన యొక్కగడియయే సార్థక మైనది. నీ వెంతయో నే నంత యని మగవాని ననఁగలిగిన మగువ, మగువ. అట్టి మగువలమిన్న లిచ్చట నాకాశమున

తాను సర్వవిద్యాపారంగతుఁడై యుండియు, మనకు గుంట యోనమాలయినఁ దాను నేర్పినాఁడా? ఏల? మనమే విద్య నేర్పినయెడలఁ దన యాధిక్యమడుగంటి పోవలసినదే. తనఘనత కాలిపోవలసినదే కాదా? మనకుఁ దాను విద్య బోధింపలేదు సరే. అంతటితో నూరకుండెనా? స్త్రీవిద్య దూష్యమని సిగ్గులేక యుపన్యాసములు కూడ నీయ మొదలుపెట్టినాఁడే. మనకు గృహమే పాఠశాల యనియు, వంటయిల్లే పలక యనియు, నలుకుగుడ్డయే కల మనియు, పేడనీళ్లే సిరా యనియు, నలుకుటయే యక్షర లేఖనమనియుఁ, బ్రొయ్యియొద్ద వంటఁజేయుటయే యక్షరలేఖన మనియుఁ, బ్రొయ్యియొద్ద వంటఁజేయుటయే ప్రకృతిశాస్త్రమనియు, గంజివార్చుటయే గ్రంథసంగ్రహణ మనియు నేమేమో నోట వచియింపరాని మూర్ఖపు మాటలు సభలలో మర్యాదను, మనుష్యత్వమును విడిచి పలికెను గాదా? మన బుద్ధిబలముచేత ననోన్యైక్య భావముచేత–నిప్పుడిప్పుడు మనము నేర్చుచున్న విద్యను గాంచి తాను గన్నులలో నిప్పులు పోసికొనుచున్నాఁడే! మన కవిత్వమును జూచి తా నేమనుచున్నాఁడో వింటిరా? మంచపునేతయఁట! చిటిచాఁప యల్లికయఁట! చొప్పదంటుమోపఁట, కుడితిగోలెమఁట, ఛీ! ఛీ! తన కవిత్వపుపసయెట్టిదో విద్యావతులగు నాసోదరీమణు లంద లెఱుఁగనిది కాదు. మనకు విద్య రానప్పుడతఁడు కవి యనియు, ఘనుఁడనియు, నతని కవిత్వము రుచ్య మనియు నజ్ఞానముచే ననుకొంటిమి. ఇప్పు డాతని పాండిత్యప్రభ బట్టబయలయినదా? అతని కవిత్వముఘనత గడ్డలయినదా? కారింగువకంటె, గబ్బిలపుఁబెంటకంటెఁ, గాకిరెట్టకంటె నతని కవిత్వము కడుహేయమని యిప్పటికి మీ కందఱకు స్పష్టమైనది కాదా? ఈమీసాలకవులలో నూటికిఁ దొంబదితొమ్మండ్రు శుద్ధశుంఠ లని యిప్పుడు మీకు వెల్లడియైనది కాదా? కవిత్వ మన్న నగాధహృదయ రసముగల యాఁడుది చెప్పవలయును. అనురాగములగని యగు నాఁడుది చెప్పవలయును. ఆహ్లాదపుబావియగు నాఁడుది చెప్పవలయును. అధికలావణ్యవతియగు నాఁడుది చెప్పవల యును. ఔచిత్యపురాశియగు నాఁడుది చెప్పవలయును. అంతియేకాని మోట మొఱకుజాతికి మృదుల కవిత్వ మబ్బునా? కఠినశుష్కమనస్సులకుఁ గమ్రకవితాపరిపాక మలవడునా? కల్ల! కల్ల! ఇక నొక్క పదిసంవత్సరము లీరీతిగ మనము విద్యాగ్రహణమునఁ గాలక్షేపము జేయునెడల నాతనిచేతిలో నున్న కలము, కాగితము నాఁడుది తీసికొని యాఁడుదానిచేత నున్న సిబ్బి, గరిటె నాతనిచేతిలో శాశ్వతముగా నర్వేశ్వరప్రీతికరముగఁ బెట్టదా? కాలముఁ సమీపించుచున్నది. ఆఁడుది మగవాఁడు కావలెను. మగవాఁడాఁడుది యయి తీరవలెను. అప్పుడుకాని మగవానియెగు రడఁగదు. అతఁడు చేసినద్రోహమునకు ఫల మనుభవింపఁడు. ఓ! సృష్టి తలక్రిందు కాఁదగియున్నది? సృష్టికిఁ బ్రభ్వివి నీవేకాని నేను ప్రభుఁడను కానని యాతనినోటితో నాతఁడు మనకుఁ బాదాక్రాంతుఁడయి పలుకవలసిన నుదినములు వచ్చుచున్నవి. తొందరపడవలదు. సోదరీమణులారా! మీరు పట్టుదలను వదలకుఁడు! ఏమైననరే! కానిండు!

అహా! గృహకృత్యముల నాతని దుర్నయమును దలఁచుకొనఁగఁ గడుపు మఱింత మండిపోవునుగదా? ఎంతసేపటికిఁ దనసౌఖ్యము, తనకీర్తి, తనయారోగ్యము, తనయైశ్వర్యము, తనయాయుస్సే కద! కేవలాత్మీయవాంఛాలంపటతాతిపంకిలాత్ముఁడు –పరశ్రేయస్సహనాభవ స్వభావదుర్భరుఁడు–నడుము బిగించుకొని జొల్లుఁ గార్చుకొనుచుఁ జేతికఱ్ఱ టక్కుటుక్కున నేలఁ దాటించుకొనుచు దౌహిత్రుఁడు దారి

డప్పుపై దటుకుతటుకున వాయింపుచు వీథులవెంట దిరుగుచు ''ఈదినమున సాయంకాలము మూడుగంటలకు లక్ష్మీవిలాసమున యోగినిగారి యుపన్యాస'' మని యఱచెను. రాణిగారు మంత్రిగారు మొదలగువారంద ఱుపన్యాసకర్త్రిగారిని చూచుటకు వచ్చియుండిరి. ఆమె నాయంతపొడవుగలది. కోలమొదముగలది. బొన్కిబొమ్మగలది. రోమశములగు పిక్కలుగలది. మోటు మొగముగలది. మగవాని గొంతుక గలది. ఆమె నిలువఁబడి యీరీతిగ నుపన్యసించసాగెను.

''సోదరీమణులారా! ఈదినమున నే నుపన్యసింపఁబోవు నంశము మగవానిదుర్న్యము. మగవానిఁ గూర్చి వ్రాయఁగూడదు, మాట లాడఁగూడదు, తలపెట్టఁగూడదని నిబంధనములు మనకున్న వనుమాట నిశ్చయమే. ఏజాతియుఁ-బ్రపంచమునఁ బుట్టిన నెట్టినీచజాతియు, నర్వదుర్గుణభూయిష్ఠమై యుండదు. ఒకటి రెండు సద్గుణములయినఁ గలిగి యుండును. అటులే నరులలోఁ బురుషజాతికిఁ గూడ సద్గుణలేశము లుండవచ్చును. అట్టి సద్గుణలవములఁగూర్చి మనము మాటలాడఁ గూడదు. వ్రాయఁగూడదు. తలపెట్టఁ గూడదని నిబంధనల యభిప్రాయము. కాని యనంతములై యతిహేయములై యనితరసామాన్యములైన యధములగువారి దుర్గుణపరంపరలఁగూర్చి మనము ముచ్చటింపఁ గూడదని యభిప్రాయము కాదు. అట్లే మచ్చటింపనియెడల వారిదుర్నయము, దుష్పరివర్తనము, దురహంకారము, దురభిప్రాయము, దుర్గర్వము, దుర్మానస్కత యెట్లు వెల్లడికాఁగలదు? ఆజాతిపై నింతింతనరానిరోఁత కలుగఁగలదు? ఇంతకంటె దుర్గర్వముండునా? ఇంతకంటె నాస్తికత యుండునా? ఇంతకంటె విశ్వానహైన్య ముండునా? తాను సృష్టికిఁ బ్రభుఁడఁట. ఇది దైవాధికారమును మీఁద నైముకొనుట కాదా? పోనీ! ఎవని దైవద్రోహము వానినే దహింపఁజేయును. మనకేమని యూరకుందమన్న మన స్త్రీజాతి నాతనినే దహింపఁజేయును. మన కేమని యూరకుందమన్న మన స్త్రీజాతి నంత యనాదరణము తా నేల సేయవలయును? మగవాఁడు సృష్టికిఁ బ్రభుడగుచో నాఁడుది ప్రభ్వి యగును కాదా? అట్టి యున్నతస్థితి మన కిచ్చినాఁడా? ఇయ్యఁదగునో లేదో కాసంత యాలోచించినాఁడా? మనకంటె తన యాధిక్య మేమి మండెను? అదిగాక పురుషుఁడు తటస్థుఁడనియు, సృష్టియంతయుఁ బ్రకృతివైచిత్ర్యమే యనియు వేదాంత శాస్త్రము చెప్పునప్పుడు సృష్టికి యథార్థరాజ్ఞి యాఁడుది యగునట్లు గనఁబడుటలేదా? పోనీ! ఈవెట్టి వేదాంతుల విపరీతవచనములతో మనకు నిమిత్తము లే దనుకొందము! నరస్వభావమును బరిశీలింపఁగ దైహికముగ, మానసికముగ శుద్ధాత్మికముగఁ బరిశీలింపఁగా స్త్రీపురుష తత్త్వముల భేద మేమున్నది? లేనప్పుడు మనకు సమానస్వాతంత్ర్య మేల యీయరాదు? మనపై నధికారము తన కెవఁడిచ్చినాఁడు? లేని యాధిక్యమును వహించి మనల దిగఁద్రొక్కుట కేమి కారణము? మనము మెత్తనివారమయి యాతఁడు చెప్పినట్లు వినుచు నాతని కుపచారములు సేయుటచేతనేకదా యాతనికిఁ గొమ్ములు వచ్చినవి! అతని నెత్తికిఁ గన్నులు పచ్చినవి! అతనితల గిట్టని దిరుగ మొదలు పెట్టినది! ఆతఁ డెగిరి మనశిరోభాగములఁ దాండవించుచు భాగవత మాడుచున్నాఁడు. మననహనమే మనకొంపఁ దీసినది. మన గొంతుఁ గోసినది. మనము సహించినకొలఁదిఁ జెలరేఁగుచున్నాఁడు. విద్యయందలి కావశ్యకమైయుండఁ దనకుమాత్రమే కావలయునఁట! మన కక్కఱలేదఁట! తన కది జ్ఞానోపదేశక మగునఁట! మనకు దుష్పరివర్తన ప్రోత్సాకరమగునఁట! ఇంత సిగ్గుమాలినమాట మగవాఁడు చెప్పఁగలిగెను గాని ఛీ! ఛీ!

లాడుచున్నాఁడు. గిట్టునఁ దిరుగుచున్నాఁడు. వెనుక ముందు చూడకుండ నువన్యసి
చుచున్నాఁడు. ఈతని యుపన్యాసధోరణిని విని కాఁబోలు ప్రక్కయింట్లలో నుండు జనుల
కొందఱు విచ్చేసి నాకుఁ జోటు లేకుండఁజేసినారు. నే నీనమయమున లోనికి వెడలి
నుపన్యాసకర్త కుత్సాహభంగముగ నుండునో, క్రిక్కిరిసి కూరుచుండు సభాసదుల కనదుపు
యముగ నుండునో యని వెలుపలనే నిలువఁబడి వినుటకు స్థిరపఱుచుకొంటిని. నేను
రాకముం దాతఁ డెంతసేపటినుండి యేమి చెప్పుచున్నాఁడో కాని నేను గుమ్మములోఁ గాల
పెట్టినదిమొదలీతీరునఁ జెప్పసాగెను.

''ఓ! పూచిన తంగేడువనము! పండిన దోసతోఁట! బంగారు తునకల గని! సెబాస్!
చూచితీరవలయును. చూచి యానందించి తీరవలయును. ఏమి సంస్థానము! ఎం
సంస్థానము! తుదుము మొదలు కొని దేవతార్చనవఱి కందఱుస్త్రీలు! ఓ! ఎక్కడ విని
గాజులగలగల; అందెలరుణరుణ; కాంచీఘంటికల గణగణ; ఎక్కడ జూచినఁ జెక్కు
టద్దముల తళతళ; గుబ్బిగుబ్బిల పెళపెళ; తారహారముల మిలమిల; వేణీభారముల జిలజిల
ముద్దుమొగముల కలకల; ఎక్కడకుఁ బోయిన నగరుధూపముల గమగమ; చందనచర్చ
ఘుమఘుమ; మృగమదలేపముల ఘుమఘుమ. పోచి! చూచువా రేరి? మగపురుగైన న
సంస్థానములోనికిఁ బోఁగూడదే! లాయములలోని వన్నియు గోడిగులే! ఆలానశాలలో
నన్నియు నాఁడు యేనుఁగులే! వీథులలో నన్నియు నాఁడుకుక్కలే, యాఁడుగాడిదలే
ఇంటఁ దిరుగు పిల్లు లన్నియు నాఁడువే! పిల్లులలోను, నెలుకలలోను, జీఁకులలోను మ
యాఁడు విభాగముఁ జేసి మగజాతిని మాడ్చివైచుట కప్పటికిఁ బ్రయత్నములు జరుగుచ
న్నవి. అబ్బ! ఆ సంస్థానమహారాజ్ఞి కేమిపంతము! మగజాతి యనఁగ నెంతపట్టుదల
ఎంతకోపము! ఎంత క్రౌర్యము! ఎంత యసహ్యత! మగవానిఁ జూడదు, వినదు, స్మరింపద
సరికదా! మగవానిమాటయైన వినదే! మగవాని పేరైన వినదే! ఆమెకు మంత్రి యొకయా
డుది. మీసాలు వడివేసికొనుచు రాజకార్యనిర్వహణ మొనర్చునియోగపుమంత్రి స్థానమున
గుంతలములు దిద్దుకొనుచుఁ గుందరదన యొక్కతె నిలిచి వ్యవహరించుచుండెను. తలపాగ
లవారిబదులు రాగిడులవారును, నంగరక్షలవారిబదులు అవికలవారును, వలెవాటు కండువా
లవారిబదులు వ్రాలుపైఁటలవారును, గచ్చబిగింపులవారి బదులు గాగరాలవారును నర్తా
నములఁ గూరుచుండి జూకాలు కొంచెమూఁగులాడ, కంఠహారములు బల్లలపై
బ్రాఁకులాడఁ, గుడిచేతుల గాజులు వడఁకులాడ బాతుటీకెఁ చేబూని పఱపఱ నక్షరాంక
న్పష్టు లొనర్చుచున్నారు! చనుకట్లు బిగించికట్టి కాసెకోక కచ్చలువెట్టి కత్తులు కటారులు
కట్టులు చేతఁబట్టి సేనకస్త్రీలు పనిచేయుచున్నారు. పాఁడి పశువులయొద్దఁ గూరుచుండి
మృదులములగు వ్రేళ్లతోఁ బాలుపిండవలసినవారు గుట్టములవెనుక దృఢముగ నిలువఁబడి
కొఱడా లూని భూమి ఛేదించుచున్నారు. గోటినొక్కులు భర్తల చెక్కిళ్లనుంచఁదగు వారు
గొడ్డళ్లు చేబూని పర్వతములు విడఁగొట్టుచున్నారు. పుష్పహారములచేఁ బ్రకాశింపవలసిన
స్త్రీలజొమ్ములు తుపాకిమడమలచే నదుమఁ బడుచున్నవి. నేల యీనిన ట్లెక్కడఁ జూచిన
స్త్రీలు! వివిధరూప లావణ్యనంవదలు, వివిధాభరణవైభవములు, వివిధవయ పరిపాకములు,
వివిధవర్ణవైచిత్ర్యవిశేషములు, వివిధ వాగ్ధోరణీనైపుణులు, వివిధ చేష్టాసామర్థ్యములు, వివిధస్వ
భావగతులు గలకాంతుల గని యగు నానంస్థానము నర్వవిధముల శ్లాఘనీయమైయున్నది.
ఒకనాఁడొకకాంత తనకొఁగిటిలోనున్న తప్పానర్చిన కాంతుని దొడ్డపైఁ గొట్టునట్లు

10. స్త్రీ స్వాతంత్ర్యము

సాక్షి, విమర్శక స్వభావాన్ని గురించి కొంత వివరించదలిచి, తమ సంఘం సమావేశమయ్యే ఇంటికి వెళ్లాడు. అప్పటికే జంఘాలశాస్త్రి ఉత్సాహంతో, ఉద్రేకంతో ప్రసంగిస్తూండడం, అక్కడ కిటకిటలాడుతున్న జనం ఉత్కంఠతో వింటుండం గమనించాడు.

జంఘాలశాస్త్రి అంతా స్త్రీ సౌందర్య మయమైన, స్త్రీ వరిపాలనా మయమైన, స్త్రీ అధికార మయమైన సంస్థానం గురించి వర్ణిస్తున్నాడు. వర్ణించి వర్ణించి - ఆ సంస్థానంలో లక్ష్మీవిలాస భవనంలో యోగినిగారి ఉపన్యాసం విషయానికొచ్చాడు. యోగిని తన ఉపన్యాస వాగ్ధాటితో మగవారి దుష్టత్వాన్ని అనర్గళంగా కడిగి పారేస్తోంది. స్త్రీకి, పురుషుడి పెత్తనం గతించి స్వాతంత్ర్యం పొందవలసిన అవసరాన్ని వక్కాణిస్తోంది. స్త్రీ విద్యావతి అయితే మగవాడి కవిత్వపు బండారం బయటవడినట్టే అంటోంది. మగవాడి స్వార్థ బుద్ధిని చెరిగి పెడుతోంది. అతను నియమించిన ఆచారాలను దుమ్మెత్తి పోస్తోంది. 'మగవాడి దాస్యం లేకుండా బ్రతికిన ఒక్క గడియే సార్థకం' అన్నది.

స్త్రీ జనం అంతా, సంస్థానం అంతా ఆమెకు బ్రహ్మరథం పట్టారు. పురుషజాతి ముఖం చూడరాదని, లొంబైమూడోసారి శపథం చేశారు.

ఆరాత్రి - అనుకోని విధంగా యోగిని కథ పెద్దమలుపు తిరిగింది. పురుషజాతి తిరుగుబాటు ప్రబలమైంది. యుద్ధవాతావరణం అలుముకుంది. స్త్రీ పురుష జాతులకు యుద్ధం జరగింది. ఆ యుద్ధం ఎలా పరిణామం చెందిందో యోగిని రహస్యం ఏమిటో - ఈ ఉపన్యాసంలో కొసమెరుపు.

క్రిందటిసారి యాకస్మికముగ వదలివేసిన విమర్శక స్వభావమును గూర్చిన యుపన్యాసమందలి శేష మీరాత్రి చెప్పుదలంచి నేను మా సభాకుటీరమునకు వచ్చునరికి నడుగు లోనఁ బెట్టుటకు పీలు లేవట్లుగ జనులు కిటకిట మూగియున్నారు. చెవులు నిక్కఁబొడుచుకొని యూపిరియైనఁ దిన్నగ విడువకుండ మిగుల శ్రద్ధతో జంఘాలశాస్త్రి బల్లపై నిలుచుండి బ్రహ్మకాయవలె వటవట వదరుచున్నాఁడు. నేత్రహస్తపాదాభినయము లవలీలగఁ జేయుచున్నాఁడు. వంగుచున్నాఁడు. ఎగురుచున్నాఁడు. తెయితక్క

చచ్చుచుండఁగా నెంత సాయపడుచున్నాఁడో చూడు'' మని తనప్రక్కకై పరుచుకొ
వట్టిగడ్డిని జూపెను.

పూర్వకాలమును ఖండాతరములందుఁ గవులను ప్రభువులు ప్రజలు నెంత బాగ
నాదరించిరో యిప్పుడు తెలిసినదా? రోఁత–రోఁత–మహాపాపము భూలోకనరకము.
లిట్లు పడినబాధలు చెప్పఁగూడదు. వినఁగూడదు–తలఁపఁగూడదు. ఆకాలములో నా
ములందెచ్చటనో పుట్టకపోయితినని యేడ్చుచుంటివా? మీఁదుమిక్కిలి కవి పోషకుఁ
మన దేశప్రభువులను దూషించుచున్నావా? నీకు మతియున్నదా లేదా? ఏదీ? ప్రభు
యానాదరణమున మనదేశములోఁదిండి లభింపక మరణించిన యొక్క కవిని-కవి వఱకెం
లకు? ఒక్క మనుజుని ప్రేలుఁడఁచి చెప్పుము. కవులకు రత్నాభరణము లిచ్చినవా
–గజాశ్వపల్యంకి కాదివాహనము లిచ్చినవారు–అగ్రహారము లిచ్చినవారు–అర్ధసింహా
మిచ్చినవారు–అన్నిటికంటె మన సిచ్చి–మామా–బావా–యని వావివరుసలతోఁ బిల్చుకొ
వారు–మహారాజులు–త్యాగమూర్తులు-కీర్తిస్వరూపులు-లోకోపకారులు– శాశ్వతజీవులు
అవతారపురుషులు మనదేశమున నెందరో చెప్పవలయునా? వారందరు సారస్వతాంబరమ
నహస్రనహస్రభానునంకాశనందీప్తితో వెలుఁగుచున్నారు. అప్పటిమాటలేల? ఇప్పుడి
రాజులో యితరధనవంతులో కవుల నాదరించుచున్నారు. దేశోపకారులై ప్రకాశించు
న్నారు. అట్టి మహానుభావులు, వితరణశీలురు–సర్వశ్రేయముల ననుభవించు
–సంపూర్ణాయుస్సమేతులై – విద్యలను బోషించుచు – వెలయుచుందురుగాక!

ఓమ్ శాంతి శ్శాంతి, శ్శాంతిః

విసరుకొని యందువలనవచ్చిన కూలిడబ్బులచే జీవయాత్రచేసెను.

పెరెన్సు. ఇతఁడొక్కఁబానిన 6. నాటకములు 18 మొదలుకొని 25 సంవత్సరముల వయసులోపల ప్రాసెను ఖ్యాతినొందినవాఁడు. స్వదేశమునఁ దినుట కేమియు దొరకకపోవుటచే నీతఁడెక్కడికిఁబోయెనో, యేమిచేసెనో, యెట్లుచచ్చెనో యెవ్వఁడు నెరుఁగడు. బియోటియన్ అనుకవి కారాగృహములో మృతినొందెను. ప్రజల నిందలు, తిట్లు, క్రూరకృత్యములు, బహిష్కారములు భరింపలేక బైరను అనుకవి మిస్సోలాంగు నమీపపుటడవులలోఁగాఁబోలు దిక్కులేకుండ దేహపరిత్యాగ మొనర్చెను. స్పెయిన్ దేశములో సెర్వంటెను మహాకవి డానుక్విక్సాటు అను గ్రంథరాజమును ప్రాసినాఁడు. ఇతఁడు చెప్పరాని కష్టములన్నియుఁ బడిపడి తుద కొక కబళముకైన గతిలేక మృతినొందెను. ఇటలీదేశమున పాలోబర్టినీ అను నాతఁడొక గొప్పకవి. ఇతఁడు కవిత్వముకాక పదునాలుగు వృత్తులు నేర్చుకొనెను. ఏవృత్తిలోఁగూడ నీతనికి భుక్తి దొరకలేదు. ఇతఁడు రాత్రులందు గ్రంథములను ప్రాసికొనుటకు దీపమును దెచ్చుకొనలేక నీకన్నులను నాకెరువుగానైనఁ బ్రసాదింపుమని పిల్లిని సంబోధించుచు నొక పద్యమును ప్రాసెను. ఆదేశమందే బెంటినో గ్లియో అను నాతఁడొక్క హాస్యరసప్రధాననాటకకవి. ఈతని నాటకములు ఇటాలీయను భాష యున్నంతకాల ముండఁదగినవని చెప్పుదురు. ఇతఁడు మొదట భాగ్యవంతుఁడు. తనధనమును బరోపకారకములగు సత్కార్యములందు వ్యయపరచెను. ఈతనికి వార్ధకమున దరిద్రత సంభవించిన వెనుక, నైశ్వర్యదినములలో నీతఁడు అన్నాతురులకై వేసిన ధర్మశాలలో నీతనిఁ జేర్చుకొనకపోవుటచే నడువీధిలో నోట గంజియైనఁ బోసెడువాఁడులేక యీతఁడు మరణించెనని చెప్పుదురు. పోర్చుగల్ దేశమునఁ గవిసార్వభౌముఁడని బిరుదమందిన కామోయన్సుకవి యానుపత్రిలోఁ జచ్చెను. ఫ్రాన్సు దేశమున వాజిలాక్సు అనునొక్కకవి యుండెను. ఈతఁడు తిండిలేక చేసినఋణములను ఋణప్రదాత లడిగిపోవుదురేమో యనుభయముచేఁ బగలెల్ల నేకొఁరలోనో దాఁగి రాత్రివేళల బిచ్చ మెత్తుచుండెడివాఁడు. అందువలన నీతనికి గ్రుడ్లగూఁబ యని పేరు. తాను మరణించినపిమ్మటఁ దనదేహమును వైద్యుల కమ్మఁజూపి రాఁదగినంత సొమ్ము రాఁబట్టి యాసొమ్ముతోఁ దనఋణములను దీర్పవలసినదని యీతఁడు మరణశాసనమును ప్రాసెను. వాల్టైరుమహాకవిని-ఆతనినిబట్టి యీతని చెల్లిలిని-మహాద్వేడరిక్కుయెంత పరాభవించినాఁడో లోకవిదితమే. కెస్సాండరు అను నాతఁడతని కాలములోని కవులలోఁ బేరొందినవాఁడు. ఈతనికిఁ బ్రభువులుగాని ప్రజలుగాని దేహధారణమునకు సాహాయ్య మొనర్పకపోవుటచే నతఁడు నరదూషకుఁడై, భరింపరాని యాపదలచే భగవద్దూషకుఁడు కూడనయ్యెను. ఆతనికి మరణము సన్నిహితమై నప్పుడు మతగురు వాతని ప్రక్కయొద్దకువచ్చి ''కరుణాళుఁడైన భగవంతునియందు హృదయము లగ్నముచేసికొను''మని హెచ్చరించెను. అంత నాతఁడు ''భగవంతుని కరుణాళుత్వము నే నెరుఁగనిది కాదు. ఇప్పటికి నాయం దాతఁడు దయ చూపనప్పుడింకముందు చూపునని యేమి నమ్మకము'' అనియెను. ''అయ్యాయ్యో! అట్లుకాదు. దైవకటాక్ష మిప్పటికి రాలేదని యింకముందు రాదనఁగూడదు. అదెప్పటికి రావలయునో పరమాత్మఁడే యెరుఁగును. నీవు దైవకృపను నమ్మి యీతనియందుఁ బరిపూర్ణవిశ్వాసయుతుఁడవై మృతినొందు'' మని మతగురువు మందలించెను. ''అక్కర లేదు. అక్కర లేదు. బ్రదుకులో భగవంతుఁడు నాకెంత సాయపడినాడో నీ వెరుఁగుదువు.

కౌఁగలించుకొని యొకరి నొకరు ముద్దిడుకొందురు. మరియొక గంటలోఁ గొబ్బెరియాకు చీఁపురుకట్టలతోఁ గొట్టుకొనఁబోవుదురు. ఇద్దరు చెరియొకవైపున భర్తను గౌఁగిలించుకొని యొకప్పుడు శయనింతురు. ఓ! ఆభర్త కంతకంటె దేవేంద్రపదవి మరి యేమున్నది? ఇద్దరు కలిసి యొకప్పుడాతనిఁ దన్నుదురు. వారి కనుదినము కలిగిన తగవుల నక్కన్నమాదన్న గార్లు కారుకదా, యుగంధర యౌగంధరాయణులు కారుకదా, భట్టి విక్రమార్కులు కారుకదా, బ్రహ్మాది దేవతలైనఁ దీర్పఁజాలరు.ఇట్లు కొంతకాలము నవ్వుతో, నేడ్పులతో, ముద్దులతో, గుద్దులతో, నదుకులతో, ముళ్లతో జరిగినపిమ్మటఁ దేరభార్య నీరుమోసికొనెను. దాని మొగము వికసించెను. నవతిమొగము సంకుచించెను. అపహృతభార్యుఁడగు పాకివాఁడు తనభార్య యిట్లుపహర్తృప్రయోజకత్వమున గర్భము ధరించినదను శుభవార్తను విని తనకు రవంతశ్రమమైన లేకుండ వంశమునిలువఁబడినదని మహానందమునొంది శుభదినమున షడ్డకుని యింటికి వచ్చి, చూలాలికి బసపు కుంకమునిచ్చి క్రొత్తపట్టుచీరఁ గట్టఁబెట్టి, సారెపెట్టి జయజయధ్వానములతో, సమస్తమంగళములతో దానిని దనయింటికిఁ దెచ్చుకొనెను. కులమువారందరు కొనియాడిరి. దేవతల పుష్పవృష్టి యప్సరసల నాట్యమే తరువాయి కాని, జరిగిన వేడుకలన్నియు జరిగినవి. చూచితివా! పదిదినముల క్రిందట జరిగిన చర్య యిది జ్ఞానసూర్యుఁ డంబరమున నడునెత్తికెక్కి ప్రజ్వలించుచున్న యీదినములలో తాలూకా బోర్డులలో–జిల్లా బోర్డులలో శాసనసభలో–బంచములు సభ్యులుగా నుండి పరిపాలన తంత్రమున సాహాయ్యపడుచున్న యీదినములలో నిట్లున్నది. హోమరు కాలములో నింకఁ జొప్పడిదేమి? అందువలన హోమరు నీతిబాహ్యుఁడా? చూచితివా? ఆకవిసార్వభౌమని–ప్రభువులుగాని ప్రజలు గాని యెట్లాదరించిరో! మరియొకనిని గూర్చి చెప్పుదునా?

ఆంగ్లేయదేశమున ఆట్వే యను నతడు దుఃఖాంతనాటకకర్తలలో నొక్కఁడు. కరుణరస ప్రకటీకరణమున నీతఁ డసమానుఁడని ప్రసిద్ధిని గన్నవాఁడు. ఈతఁ డనేకనాటకములను వ్రాసెను. భుక్తిలేక యీతఁడు పైదేశమునకుఁ బోవుసేనలోఁ జేరెను. ఆసేన విడిపోయినప్పుడింగ్లాండున కితఁడు తిండిలేక మలమల మాడుచువచ్చెను. వీధిలోనికి ముష్టియెత్తుకొనుటకై పగలువచ్చుట కీతనికి వీఁపుపైనఁ జొక్కా పేలికయైన లేదు. చేతిలో జోలె మొదలే లేదు. అందువలనఁ జీఁకటిపడఁజూచి దాగియున్న గుహలోనుండి వెలుపలికి వచ్చి ముష్టియెత్తుకొను చుండెడివాఁడు. ఈతఁడు ఆట్వే కవిశిఖామణి యని యొక్కఁడొక్కరాత్రి యెరిఁగి యొక్క గినీ అతని చేతిలోఁ బెట్టెను. అది రొట్టెల దుకాణమువద్ద మార్చి యొక రొట్టెనుగొని మూఁడుదినములనుండి యుపవసించుచున్న వాఁడగుటచే నత్యాతురతతో నారొట్టెను గొరికి మ్రింగఁబోయి మ్రింగలేక నడువీధిలోఁ బడిచచ్చెను. చూచితివా! ఎట్టి మహాకవి కెట్టి మృతియో!

స్పెన్సరు అను మహాకవి తిండిలేక మరణించినాఁడని బెన్‌జాన్సను స్పష్టముగాఁ జెప్పినాఁడు. ఆతఁడు వ్రాసిన 'ఫెయిరీక్వీను' అను గ్రంథమును జదివి యిప్పటికి జనులు సంతసించుచున్నారు. అతఁడు బ్రదికినన్నాళ్లు పూటకు గతిలేక వలవల యేడ్చినాఁడు. భుక్తి కేమియు దొరకక కడుపుపగిలి గుండెలవిసి యీ మహాకవిశిఖామణి కాలధర్మమొందినట్లు స్పష్టము.

"స్లాటన్" అను కవీశ్వరుఁ డనేనాకటముల రచించె. ఈతఁడు తిరుఁగటితోఁ బిండి

ప్రథమకవియే కాక ప్రథమ భిక్షుకుఁడు. ఈతఁడంధుఁడు. ఇలియడ్ ఆడిసీస్ యను వీరరసప్రధానకావ్యరత్నముల నీతఁడు వ్రాసియుండుటచేఁ బశ్చిమదేశ వ్యాసుఁడు–ఇట్టి కవిచక్రవర్తి–కన్నులులేక–కర్ర చేతఁబుచ్చుకొని, టక్కు–టక్కు–నఁ బొడుచుకొనుచుఁ గాలిన డకను వీథులవెంట నొంటరిగా బయలుదేరి ప్రతి గృహద్వారము నొద్ద నిలిచి తాను రుచియించిన పద్యములఁ బాడుచు ముష్టియెత్తు కొనుచుండెడివాఁడు. ప్రతిదినమును బద్యములతో నీతని నోరే నిండిసది. కాని పట్టెడు రొట్టెతో నీతని కడు పెన్నడును నిండియుండలేదని వారి చరిత్రములోనే వ్రాయఁబడియున్నది. మన దేశములోనే యాతఁడు పుట్టియుండునెడల నే మహారాజో యేడంతరున్నుల మేడపై–హంసతూలికాతల్పమున–నీతనిఁ బెట్టి–నర్వోపచారము లాచరింపఁజేసి యాదరించి యుండునే! అతని ప్రతిమ మన దేవతార్చనపుఁబెట్టిలో నుండునే? బ్రతికియుండినంతకాలమే యాతనియెడల నలక్ష్యము ననాదరణము కాదు. ఆతఁడు మరణించిన తరువాత నంతకంటె నెక్కువ యనాదరణమున కాతఁడు పాత్రుఁడై యుండెను. ఆతని గ్రంథములలో నీతి లేదని, మంచిచెడ్డలకు భేదమే లేదని, మీఁదుమిక్కిలి దుర్నీతి ప్రబలముగా నున్నదని, దేవతల కనత్యము–క్రౌర్యము –అసూయ–యాగ్రహము–వ్యభిచారము మొదలగు దోషము లారోపింపఁబడియున్నవ నియు, నాతని గ్రంథములు మనికిమాలినవని, భ్రష్టములని, పరిత్యాజ్యము లని స్లేటో నిర్ధారణపరచినాఁడు. అతఁ డీకవిశిఖామణిని తన 'రిపబ్లిక్' నుండి బహిష్కరించినాఁడు. యూరపుఖండమునుండి స్లేటోను బహిష్కరించినయెడలఁ బశ్చిమ శారదాదేవికిఁ దల యేదీ? అదిగాక యాతఁడు బ్రదికి యుండినకాలమందు శాసనము లేనేలేదు. తప్పొప్పులను గణించి తీర్మానించు చట్టమే లేదు. వ్యభిచార మాకాలమున దోషముగాఁ బరిగణింపఁబడి యుండనే లేదు. అందుల కాతఁ డెట్లు బాధ్యుడు? తన కాలమందున్న సంఘస్థితిని దాను జిత్రించినాఁడు. అంతకండె నాఁతడేమి చేయఁగలడు? ఎవ్వఁడైన నేమి చేయఁగలఁడు? అందుల కాతనికిఁ దిట్టులెందులకు? దేవేంద్రున కహల్యాజారదోషమును దెచ్చిన వేదముల నెవఁడు తిట్టుచున్నాఁడు? వ్యభిచారదోషము తరువాతి రజన్వలాప్రాప్తితో నివృత్తియగునని చెప్పినభారతమును బెంటమీఁద బారవైచితినూ? అప్పటి సంఘస్థితి యట్లుండెననునంతవ రకే మనము తెలిసికొనఁదగినది. అప్పటి సంఘస్థితివర కెందులకు? ఇప్పటి సంఘస్థితి మాత్రము పరిపూర్ణముగా నున్నదా? పదిదినముల క్రిందట జరిగిన యొక వృత్తాంతమును జెప్పెదను:–

ఒక పెద్దపట్టణములో నొక పాకివాని కిద్దఱు భార్యలు. ఒకతె కళ్యాణపుఁ గక్కర్తిచేఁ గట్టుకొన్నది. మరియొకతె భుజపరాక్రమమునఁ దెచ్చుకొన్నది. ఈరెండవది యంతకుఁ బూర్వము మరియొక పాకివానిభార్య. ఆతనితో నిది కాపురముచేయుచుండగా నొక్కదిన మున దివ్యమంగళవిగ్రహమైన మొదటఁ జెప్పిన పాకివాని నిది చూచి కిసుక్కుమనియెను. చేతను బాకిచేఁట నోటఁ బొగాకుగిల్లి, నుదుటఁ బచ్చబొట్టు, కంటికొనల నిగిలింపుగల యీపాకిచకోరాక్షిని జూచి–యీపరమసుందరన్వరూపుడు–పగలు చూచిన రాతిరి స్వప్నము లోనికి వచ్చు సరసశిఖామణి–పరవశుఁడయ్యెను. మన్మథుఁడంతలోఁ గెవ్వున నార్చి పద్మబాణములను బాకిచేటల నందునుండి నవ్యాపనవ్యముగ గ్రుచ్చెను. వెంటనే యాతడా పద్మగంధిని దన యింటికి దెచ్చెను. భార్యాపహర్తయైన నీతని నాతఁ డేమియు ననలేదు. కాని యీసవతుల గత్తర మాత్రము చూడఁదగినది. వినదగినది. వారిద్దరొకప్పుడట్టి

నెవ్వరింక రాకుండనున్నారు'' అని నేను సంఘములోఁ బలుకగా గాలాచార్యులు నాకొక్క యాలోచనము తోఁచుచున్నది, చెప్పుదునాయని యడిగి యిట్లు పలికెను. ''మనకుఁ గావలసినది ధనము. అది వ్యాపారమువలననుగాని రాదు. పెద్దపెద్ద వ్యాపారములు చేయుట కెక్కువపెట్టుబడి కావలయునుగాని స్వల్పవ్యాపారముల కంత యక్కఱలేదు. నా కుపనయ నకాలమందు ''భవతి భిక్షాం దేహి'' నూత్రఫలమైన యొక్క బంగారు చుట్టున్నది. దాని నమ్మి ప్రశస్తమైన చేఁబ్రోలు పొగాకు తెప్పించి పనందుగా నస్యమును జేసి, యుపన్యాసదిన మున నఱుగుమీఁదఁ జిన్నదుకాణము పెట్టినయెడల జనాకర్షణ సాధనముగను ధనాకర్షణ సాధనముగను నుండును. ఈ లుకలుకలన్నియు వదలి పోవును.'' ఇట్లు కాలాచార్యులు పలుకఁగాఁ ''బొడుమంతయు నీవే పీల్చునెడలఁ జేతనున్న బంగారుచుట్టు ముక్కులోనికిఁ బోవుటయేకాక యింతకంటె ఫలమేమున్న''దని వాణీదానుఁడు అదిక్షేపించెను. అంతట గాలాచార్యు లామాటమాత్రము నత్యమే యని యొప్పుకొని పూర్వ పక్షరాద్ధాంతము లెఱిఁగినవాఁడగుటచేతను బూర్వమునఁ దిరువంటుపల్లిలోఁ గైంకర్యమొనర్చినవాఁడగుటచే తను వాణీదానుని ప్రశ్నించెను. ''పెనమే మ్రింగి జీర్ణించుకొనఁదగిన పెద్దపొట్టవానికిఁ బెనరట్లు లెక్కయా?'' యని వాణీదానుఁడు తిరుగ నధిక్షేపింపఁ గాలాచార్యులు వీలగునంత వఱకుఁ దన కడుపును జూచుకొని మందహాస మొనర్చి యటులైన ధనార్జనమునకు నస్యనిర్మాణము తక్కు వేఱుదారి కానఁబడదని చెప్పి యూరకుండెను.

అంత వాణీదానుఁడి ట్లనియెను. ''మీ సాహ్యపన్యాసములు నాకేమియు నచ్చలేదు. ఈ కాకిచెమ్మల యుపన్యాసమును గాలికిఁ బోవునవే కాని నిల్చునవి కావు. ప్రపంచమునఁ గవిత్వముమాట చెప్పనక్కఱయే లేదు. పదికాలములపాటు బ్రదికిన నదియే బ్రదుకవల యును. మనల బ్రదికించిన నదియే బ్రదికింపవలయును. జంఘాలశాస్త్రివలె నుపన్యాసము లీయలేక నేనూరకుండలేదు. స్వల్పమైనకాల మట్లు వృథచేయుట కిష్టపడక కవిత్వములో నెంతకృషియైనఁ జేయుచున్నాను. ఇప్పటికి స్వామికటాక్షమునఁ గంకణబంధము పూర్తియై నది. అఱువది నాలుగర్థములు కూడ నేనే ప్రాసితిని. ఆగ్రంథమును మహారాజున కెవరికైనఁ గృతినీయఁదలఁచి భాషాపోషకులని యెన్నఁబడు వారికెందఱకో ప్రాసియుంటిని. ఎవ్వరును బ్రత్యుత్తరము లిచ్చియుండ లేదు. అంత గ్రంథమును గృతినొందుటకు మనకర్హత యున్నదా లేదా యనివారు సంకోచించుచున్నట్లు తోఁచుచున్నది. ఎవ్వరో యొక్క రంగీకరింతురని యానతో నింక నున్నాను. ఆ కృతిభర్తవలన మనకు విశేషధనలాభము కలుగవచ్చును. కాని యిప్పుడు భాషావిషయమున దేశము మిగుల దుస్థితిలో నున్నది. కృతి నిచ్చెదను స్వీకరింపవయ్యా యని కూడఁగూడఁ దిరిగినను నిప్పటిరాజులు పోపో యందురు కాని రా రా యని యనరు. పోనిమ్మ్ము. పోతనరాజుగారిని రాజు లాదరింపక పోవటవలన నాయనకుఁ గలిగిన నష్టమెంతయో నాకు నంతే. నేను మఱి యేఖండమునందో కొన్ని శతాబ్దముల క్రిందటఁ బుట్టియుండునెడల, నెందఱు ప్రభువులు నన్నాదరించి యుందురో?'' ఇట్లు పలికి తనయందున్నదోషమును గాలమునందు, దేశమునందుఁ, బ్రజలందుఁ, బ్రభువులందు, భగవంతునియందు నారోపించి ప్రపంచధోరణిని దిద్దఁదలఁచిన వాఁడువలె యోజనాంతర్మగ్నుఁ డయి యుండెను. అంత నే నిట్లంటిని.

''నాయనా! వాణీదాసా! పోతరాజుగారిని రాజు లాదరింప లేదు. నిన్నును రాజు లాదరింపలేదని పోతరాజుగారితో సామ్యమును దెచ్చుకొనుచున్నావా? నందీశ్వరునకుఁ

గొమ్మలున్నవి. నాకును గొమ్మలున్నవని నత్తగుల్ల యఱచినట్లున్నది. నీవెక్కడ సోతరాజుగా రెక్కడ? ఒక్కనోటితో మీయిద్దఱి నామము లుచ్చరించుటకైనఁ దగదే! కుక్కతోఁకయు వంకరయే ఇంద్రధనుస్సు వంకరయే యన సాహసించు చున్నావా? సెబాస్. సోతరాజుగారికి భోజనములేదు. నీకును భోజనములేదు. అందువలన నీవాతనితో దులదూగ నెంచితివా? నబాబు గారిది బోడితలయే, నాదియు బోడితలయే యని నితంతువు విర్రవీఁగి నట్లున్నది. నీకేమి మతియున్నదా లేదా? సోతరాజుగారు రాజుల నాదరింపలేదా? రాజు సోతరాజుగారి నాదరింపలేదా? శుకుఁడు వ్యాసుని విడిచెనో? వ్యాసుఁడు శుకుని విడిచెనా? కాశిలోఁ గాఁకరకాయను నీవు విడిచితివా? కాఁకరకాయ నిన్ను విడిచినదా?? ఏమి వాణీదాసా! దేహమును విడిచి ప్రాణము పోయినదా? ప్రాణమును విడిచి దేహము పోయినదా? సోతరాజుగారిని నీతోఁ బోల్చుకొన్నందుకు నీ మూఁతి మీఁదఁ బండ్లు రాలునట్లు గొట్టినయెడలఁ, బండ్లు మూఁతిని విడిచిపోయినట్లా? మూఁతి పండ్లను విడిచిపోయినట్లా? మొదలేదో తుది యేదో తెలియకుండ మాటలాడుచున్నా వేమి? కొడిక్రిందికి గుఱ్ఱమును రాక పరుగెత్తగా గుర్రము బండిని విడిచిపోయినట్లా? బండి గుర్రమును విడిచినట్లా? ఏమి వాణీదాసా! తలతో నడుచుచున్నావేమి? బండిరాజులనో బురబరాజులనో పుట్టురాజులనో పెట్టురాజులనో మంచిరాజులనో చెడ్డరాజులనో కంకణబంధము కొఱ కాశ్రయించి యాచించితివికదా! వారేమన్నారు? పోపో యన్నారా? ఛీ ఛీ యన్నారా? అనరా? అనఁదగినవారు కావుననే యన్నారు. అట్లనిపించుకొనఁ దగినవాఁడవు కావునసే యన్నారు. ఇప్పటి రాజులు స్వతంత్రరాజులుకారు కావున నింతటితో సరిపోయినది. కాని నీ వీ కంకణబంధమును జేసినందులకు వారు నిన్ను ముక్కోణమునఁగట్టి యుత్తర దక్షిణాలక్రింద నిన్నుఁజింతబరికలతోఁ గొట్టింపవలసినది. పదునాలుగేండ్లు పాట్లు పడి పడి పద్యమొక్కటి ప్రాసితివా? కాలముయొక్క విలువయైనఁ దెలియకుండ దేవులాడుచున్నావేల! పదునాలుగేండ్లే! అయ్యయ్యో! ఈపనికిమాలిన పద్యము చెప్పటలోఁ బడిన ప్రయాసతో నీవీలోపఁబతంజలి భాష్యముతోడి పాణినీయ శాస్త్రమునందుఁ బండితోత్తముఁడవు కావచ్చునే! నీ వీ దిక్కుమాలిన పద్యమునకు శ్రీరామ చుట్టుటతోడనే యెవ్వరికైనఁ బుట్టిన యాఁడుపిల్ల యీసరి కెదిగి యీడేరి బిడ్డను గనియుండునే? ప్రాణాపాయదశాతుల్యమగు పదునాలుగేండ్ల ప్రసవవేదనతో నీవీ యరువదినాలుగు తలల రాకాసిబిడ్డనా కంటివి? నీదయ్యపుఁ బుట్టువును ధరణీసుతు లాదరింపలేదని వంశప్రతిష్ఠాశాశ్వతత్వమునకై దత్తస్వీకృతి నాచరించుకొనలేదని యీ పుణ్యాత్ముల నధిక్షేపించుచుంటివా? అందుచేఁ గొన్ని శతాబ్దముల క్రిందట నేఖండాంతరమందైనఁ బుట్టక పోయితినని విలపించుచుంటివా? కవిత్వమనగా నేమో? కవిత్వమునకుఁ గారణమేమో? యెట్టోఁగియున్న వాఁడవైన నీవిట్లనియుండవే! పూర్వకాలములోఁ బశ్చిమఖండములోనో యింకఁ బశ్చిమగోళములోనో నీవు నీవు పుట్టి యిప్పుడు చెప్పిన కవిత్వమే యక్కడఁ జెప్పియుండినయెడల నిన్నుఁ బిచ్చియాసుపత్రిలో నుంచియుందురో పద్యకావ్యముతోఁ బాటు పడఁదీసి కట్టఁగట్టి ప్రచండపీడ తీరునట్లు పసిఫిక్ మహాసముద్రమునఁబడవైచి యుందురో–పూర్వకాలములో –ఖండాంతరములందు బుట్టి పెరిఁగిన యథార్థకవులకే ప్రజాదరణము ప్రభుపోషణము లేనప్పుడింక కల్ల కెంపునకా? కాకిబంగారునకా? విదేశీయపూర్వకవులుపడిన పాటులు సంగ్రహముగాఁ జెప్పెదను వినుఁడు.

హోమరు అనునాతఁ డైరోపాదేశమం దెరిఁగియున్నంతవరకు మొదటికని. ఇతఁడు

ఇదికాక, అతి దేహసాధనసంపన్నులగు మీకు స్త్రీవాంఛ మిగుల దక్కువయనుట యనత్యము కానేరదు. మీలో బ్రహ్మచారు లనేకులుందురు. ఇంత బలిష్ఠులగు మీరు బ్రహ్మచారులుగా నెట్లుండఁ గలరో యని జను లాశ్చర్యపడుదురు కాని, యంతకండలు పెంచుట చేతనే మీకాఁడుదానిపై బుద్ధి యెక్కదు. పురుషశరీరములోని క్రొవ్వు వలనను –పిత్తాది రసాధికతవలనను స్త్రీవాంఛ విజృంభించును. అవి మీరు పెరుగనీయక యెప్పటిక ప్పుడే సాధనమున వానిని బరశురామ ప్రీతి నొనర్తురు. క్రొవ్వుతోనిండిన చాఁకిబానయంత కడుపుతోఁ గదలకుండ గల్లాపెట్టెయొద్దఁ జదికిలఁబడు కోమటికి గజపాదాండవాతాది బాధలు కలిగినను, స్త్రీవాంఛ ప్రబలతరమై యుండును. అతనికిఁ బిల్లలు–లాభాలమీఁద లాభాలు. అతని కున్న వాంఛలోఁ బదునాలుగవ వంతు వాంఛయైన మీకుండుట కవకాశము లేదు. ఒడలుసట్టలేక 70 యేండ్లు దాటినపిమ్మట వివాహమొనర్చుకొని సంతానము గాంచిన కోమటు లనేకులున్నారు. పెద్దపెద్ద పట్టణములలో నున్న సానుల నందఱను నమర్థింపఁగల వారు తఱచుగా బేరీ కోమటులుగాక మరెవ్వరు? ''పొట్టవానికి మితిలేని పొలఁతివాంఛ', యనుట నిశ్చయము. అట్టి సంపూర్ణసాహితి సమర్థత లేకపోయిన బోనిండు. బుట్టెడి కోడిగ్రుడ్లు తినినందులకుఁ బున్నమికైన నొకసారి పొలఁతిపై బుద్ధి పాఁకఁ బగదా? –ఉహుఁ–పోనిండు–క్వార్టర్లీ కొక్కసారి,కాంతావాంఛ కలుగు ఘనియే యూహింతము. వడి తిరిగిన కండలపన యెక్కడ నడలిపోవునో యనుభయమువలన నీవు కాంతను సమీపింప సందేహింతువు, వంశపుగొలుసు పొడుగుచేసికొనుటకుఁ బుట్టితివా? బీటిగొలుసును ద్రెంపుటకుఁ బుట్టితివా? నాకొక్క మిత్రుఁ డున్నాఁడు. అతఁ డు బలాఢ్యుడు. గర్భాధాన ప్రథమ దివసమునందు నాతఁడు భార్య నంట లేదు. తరువాత ననేక సంవత్సరములకు నాకీ సంగతి తెలిసి పునస్సంధాన దినమునఁ దప్ప నీ యిల్లాలిని నీవు స్పృశింపకపోవుటకుఁ గారణ మేమని నే నాతని సడిగితిని. ''ఒడలు చెడిపోఁదటయ్యా'' యని యూతఁడు నాపై గోపపడుచుఁ బ్రత్యుత్తర మిచ్చెను. ''ఓరి నీయెుడలు మడఁగిపోను! నిన్నుఁ బెండ్లిచేసికొని –నీవలన సంసారసుఖ మనుభవింపవలయు నని నీ యిల్లు చేరిన నీ యిల్లాలికే యక్కటఅకురావి నీదిక్కుమాలిన యెుడలికి ఫల మింక వల్లకాడేనా? అంతకంటె నేమైన నున్నదా? ఎందుల కింత యెుడలు పెంచితివి? వాహకుల ప్రాణములు తీయుటకు మరియొక బండి వంట చెఱకు దండుగకేనా! అంతకంటె నేమైన నున్నదా?'' యని నే నంటిని.

నే నుత్తరనేశవాసినయియుండ నక్కడనుండు నొక్క సిక్కు పైల్మాను నొక్క కాంత వరించెను. అతఁడు కూడ నామెను బ్రేమించెను. వారికి వివాహము జరిగినది. వెంటనే గర్భాధానముగూడ జరిగినది. కాని భార్య కెంతమాత్రమును సంతుష్టి కలుగలేదు. స్వయం కృతాపరాధము కదా యని సంవత్సరముపఱకు సహించినది. అటుపిమ్మట నాఁగలేక కడఁ ద్రొక్కనారంభించెను. తనశక్తి తనకుఁ దెలియును గావున పైల్మాను భార్యను సంతుష్టిపఱ చుట కెన్నివిధములయినపాటులో యాతఁడు పడెను. తుండమును బట్టుకొని వేదండము నయిన నాపవచ్చును గాని, దోర్బంధమున దురదకాలిభార్యను బంధింపఁదరమా? 'పారలల్ బార్సు' మీఁది మొగ్గలతో భార్యకు భర్తసుఖము కలుగునా? 'హోరిఁగాంటలుబారు' మీఁది గంతులతోఁ గాంతకుఁ గంతుబాధ శాంతించునా? ఇనుపగొలుసును ద్రెంపవచ్చును గాని యెగురులాడి కోర్కె దీర్ప వచ్చునా! తన భార్యవంటివారిని బదునల్వురను బాహువులమీఁదఁ గూరుచుండఁబెట్టుకొని యెగురుట కక్కరకువచ్చిన బలము–భార్య వ్రక్క

లాని కక్కఱకురా దెందువలననో? ఆమూడువందలపౌనులు బరువుగల మొండిమోటదే హము! అయ్యయ్యో? ముద్దువఱకేకాని యటుపైఁ బనికిరాదయ్యెనే! ఇంతకంటె మహాకర్మ మున్నదా? ఇంతకంటె మహాపాప మున్నదా? బుట్టలకొలఁది కోడిగ్రుడ్లను మ్రింగు చున్నాఁడు. బిందెలకొలఁది బాలను ద్రావుచున్నాఁడు. వేలకొలఁది దండెములను దీయుచున్నాఁడు. ఇదివఱకుఁ దిన్నతిండియే దండుగయైయుండ, నెందులకుఁ దింటినని యేడువవలసియుండఁగా--నింకనుగూడఁ దినుట యెందులకో? తినినందులకు ఫల మేమైన నున్నదా? ఏమిరా యనగ నెప్పటియాటయే! పిరికికుక్కకుఁ బెద్దపులిమాంసము పెట్టిననైన తోఁక ముడుపు విడుచునా? తుట్టతుదకుఁ బ్రాణము విసిగి తల పగులఁ గొట్టుకొని చావవలయునని యూహించెను గాని, యినుపసమ్మెటలతో గట్టిపడిన తల యిప్పుడు పగులునని యేమి నమ్మకము? చిట్టచివరకు వత్సనాభి తిని భార్యపీడ వదులునట్లు బ్రతుకును బరిసమాప్తి నొందించు కొనెను. ఇట్టివారేకదా వీరులు! భరతఖండము నుద్ధరింపవ లసిన భారతీయవీరులు! భరతఖండముమాట తరువాతఁ జూచుకొనవచ్చును. భార్య గర్భాధాన ఖండముమాట యేదో నెత్తిమీఁద మొట్లులేకుండ నెఱవేర్చుకొనిన నంతే చాలును.

పోనిండు–నాయనలారా! వెనుకటివన్నియుఁ బూర్వపక్ష మొనర్చుఁడు. నే నిదివ ఱకు చెప్పిన మాటలన్నియు నసత్యము లనియే యెంచుఁడు–ఇట్టివారి కాయువు దీర్ఘమనియే యెంచుఁడు. వీరు కాంతావ్యాపారమున నొకరికిఁ దీసిపోవువారు కారనియే యెంచుఁడు. వారివృత్తివలన లోకమునకు వారికిఁగూడ లాభమనియే యెంచుఁడు. ఇంతకష్టపడి వృద్ధిచేసి కొనినది దేహశక్తికాని మరి యంతకంటె ఘనమైన దేదియుఁ గాదే! మనశ్శక్తికంటె నాత్మశక్తి కంటె నది యెంతయో యధమాధమ మని జగతిలోనున్న జాతులవారంద రొప్పుకొని స్థిరపఱచిన యంశమేకదా! జగతి లేదన్న వారున్నారు. జగదీశ్వరుఁడు లేఁడన్న వారు న్నారు. వేదములు మిథ్యలన్నవారున్నారు. ఆత్మవాదులున్నారు. కాని యంతరంగశక్తికంటె నంగశక్తి కాధిక్యమిచ్చిన వారెవ్వరును లేరు. అంగశక్తి యొక శక్తియా? దానియాధిక్య మొక యాధిక్యమా? నీ వెంతకాలము సాధనము చేసినను–గజమున కున్నంత బలము నార్జింపగ లవా? సంపాదించెదవనియే యనుకొనుము–విశేషమేమి? అంతము లేకుండఁ దిందువు –అరగించుకొందువు. చెట్లుచేమలు నూడఁబెరికి నేలనువైచి కొట్టుకొందువు. గోడమీఁద వీపువైచి కొట్టుకొందువు అంతేనా? అంతకంటె విశేష మేమైన నున్నదా? అతిసాధనమువలనఁ గలిగినఁ—బొడిచిపొడిచి పుట్టించిన–యస్వభావముగా నభివృద్ధిపఱచిన–నీయొడలిబలుపున ప్రధానమైనమనస్సు దుర్బలమైన దంటువా లేదా? నీవనుటయు ననకపోవుటయు లెక్క యేమి? అయినది. దయ్యఁపు గొబ్బెరలో నీళ్లుండునా? నీమమిఱప్పుఁగాయకున్న కారము బుట్టమిఱప్పుఁగాయ కున్నదా? నన్నయావాల కున్న గాటు పెద్దయావాల కున్నదా? చిన్న జాజులకు గలసౌరభము పెద్దజాజులకేది? పందిరి మల్లెకున్న వాసన తులము మల్లె కెక్కడనుం డివచ్చును? నన్న చెఱకుకున్న తీపి బొంతచెఱకునకు వచ్చునా? కొండెవరపువంకాయ ప్రాయ్యలోఁ బెట్టగ వెన్న యగును. తాడేపల్లిగూడెపువంకాయ ప్రాయ్యలోఁ బెట్టఁగ పెద్దదియైననేమి? మనసునుండియే దేహము పుట్టినదందువా? దేహమే మనస్సును బుట్టించె నందువా?

ఇదిగాక, మరియొక్కమాట–బుద్ధదేవుఁ డేమో దేశద్రోహి. యనియు, జాతీయబల

నాశకుఁడనియు, నతని ప్రేమమతము తప్పనియు, భూతదయ యుండఁగూడదనియు, జీవహింస చేయవలసినదనియు, నర్వజనులు మాంసాహారులై యుండవలయుననియు, నట్లు చేయక పోవుటచేతనే భారతీయులు దుర్బలులై, పౌరుషహీనులై, భయస్వభావులై పాడైరని యు–సంఘాధిపడి సెలవిచ్చిరి. ఇట్టి యధిక్షేపణములకుఁ బ్రత్యుత్తర మీకుండఁ దిరస్కారగ ర్భితమగు నుపేక్ష వారియెడల నాచరించుటయే కర్తవ్యము. సూర్యునికిఁ గాంతి లేదన్న వానితోఁ దగవెందులకు? వార్ధిలో నీరు లేదన్న వానితో వాద మేల? కాని జీవహింస మాంసాహారమున కేమి సంబంధము? మాంసాశను లందరు జీవహింస చేయుచున్నారా? సన్యాసుల విషయమై మాంసాహారము బుద్ధుఁడు త్యాజ్యమని చెప్పెను గాని సంసారులను గూర్చి యామాట, చెప్పినాఁడా? ఆకాలమందైనను సన్యాసులందరు మాంసాహారమును మానినదేదీ? బుద్ధుఁడు మాత్రము మానినదేదీ? విధిలేక యాతఁ డొక్కసారి పందిమాంస మును బుచ్చుకొనవలసివచ్చినది. అందువలననే యాతఁడు పరణించుట సిద్ధించినది. బుద్ధమతము దాదాపుగా జగత్తులో సగమువలకు పైగ వ్యాపించెనుగదా! అది వ్యాపించిన యెల్లచోటులలోని జనులు నిష్కారుషులైయున్నారని సంఘాధిపతి చెప్పఁగలడా? వారు మాంసాహారులగుటచే వారి కాబాధ లేదని వారు ప్రత్యుత్తర మీయవచ్చును. మనదేశములో మాత్రము మానినదేది? ఎటువచ్చినను బ్రాహ్మణులా? ఆకాలపు బ్రాహ్మణులమాట యేమో కాని యీ కాలపు బ్రాహ్మణులలో ననేకులుగూర్చి యంత కఠినపు మాట నాడఁదగునా? వారిలోఁ దఱచుగా శక్తివంచనలేకుండ నీసంస్కారము నాచరించుచునే యున్నారు. చికెనుఎ స్సెన్సులని, బీపు - ఐరను - మైను లని, సోమటోసు లని, షోర్బా యని యీర్యోగ్య కాలములందు జనులు తీసుకొనుచునేయున్నారు. బలముకలిగినపిమ్మట మరింతబలముకై రైల్వేభోజనమందిరములలోని ఆంగ్లేయాశన మతములలోనికిఁ బోయి మన బ్రాహ్మణులలోఁ గొందరు సర్వధా, సర్వదా, సర్వతోముఖముగ సాపాటువిధులలో సంపూర్ణప్రజ్ఞను గానఁబఱ చుచునే యున్నారు. కాని యొకరికిఁ దీసిపోవుటలేదు. మనదేశములోని యబ్రాహ్మణులు తాకని, చూడని మాంసాహారములను గూడ మనవారు కొందరు నిరాఘాటముగా దీసికొను చున్నారు. ఏవో కొన్ని మాంసజాతులే పుచ్చుకొనవలయునని యబ్రాహ్మణులకు నియమ మున్నది. దాఁటగూడని హద్దును దాఁటిన తరువాతఁ గాకినాడవఱకుఁ బోయిన నొకదో షము, కలకత్తావఱకుఁ బోయిన నొకదోషమునా? వ్యభిచరింపఁగూడదను కట్టుపాటును మీరిప్పుడు, బ్రాహ్మణవితంతు వయినయెడల బరమార్థను–చండాలినియైన సామాన్యము, తురకసానియైన దోషము, యూరేషియను అగునెడల ఘోరనరకమునా? కందిపప్పు నియమము దాఁటిన బ్రాహ్మణునకుఁ బందిమాంసమైన నేమి? నందిమాంసమైన నేమి? ఏదో యిట్లు మనవారు కూడ దినుచునే యున్నారుకదా? వీరికిఁ బౌరుషము, నిర్భయ త్వము వచ్చిన ట్లగపడదేమి? ఏల యగపడును? మాంసమువలన బలము రావచ్చును. అదికూడ నంత నిశ్చయముగాఁ జెప్పవీలులేదు. అంతేకాని పౌరుషము వచ్చుట యెచ్చటనైన నున్నదా? అట్లే వచ్చునెడల నిఁకఁ గావలసినదేమి? పావురాడబ్బులు చేతనున్న వారందరు భరతీయవీరులే? మాంసభాదనమువలన శౌర్యమే! ఎంత మాట! మాంసాహారము దేహసంబం ధమైనది. శౌర్యమే! మనస్సంబంధమైనదికదా!

... ...

నీ. కనుమూసి సీట మున్గఁగ ముక్తియైనచో
మనకంఱెఁ గొక్కొర ఘనతరంబు
నేలతొఱలలోన నివసింపఁగా ముక్తి
యైన నెండ్రిక చాల నధికమగును
దలక్రిందుగఁ వ్రేలి తపియింపఁగా ముక్తి
యైన గబ్బిలము మహత్తరంబు
చిరకాల ముపవాస సేవ యుక్తియయిన
నుత్తరధ్రువ మృగ ముత్తమంబు
పవనభుక్తి ముక్తియయినఁ బాము గొప్ప
శ్వాసమును బలాత్కృతి బిగ్గఁబట్ట ముక్తి
యయిన యజ్ఞపశువుమేటి; యాకుఁ దినగ
ముక్తియగునెడ గొంగళిపురుగు మెరుఁగు.

దీని కింక రెండుపాదములు చేర్చినయెడల బాగుగా నుండును. ''మాంసపారణమే శౌర్యమహిమ నొసఁగ – జంబుకమె సర్వజంతురా జంబుగాదె?'' ఈపాదములు రెండును జేర్చిన మంచిది. నక్క బావ మెక్కని నంజుడున్నదా? సింహము నీడ్చినైచి దాని కాటఫికమ్మ గాధి పత్య పట్టాభిషేక మేల కట్టరాదు? నక్క పీలజంతువు కావున దానికి శౌర్యము లేకపోయెను గాని బలిష్ఠమగు జంతువునకు దప్పకుండ శౌర్య ముండునని తెలివితక్కువ మాట లాడవలదు. శౌర్యమునకు బలదుర్బల భేదము లేదు. కాని మరియొక్క చిన్నమాట. బలమున్న చోట బౌరుషము తఱుచుగాలేదు. పౌరషమున్నచోట బలము తఱుచుగాలేదు. గొర్రెపొట్టేలునకున్న శౌర్యము కుంజరమున కున్నదా? త్రాచునకున్న రోషము కొండచిలువ కున్నదా? ఎర్రతేలు కుట్టినకుట్టు బోదురు కప్పయంతటి పుట్టతేలు కుట్టఁగలదా? సిసిందిరీ కున్న సురసుర పెద్దతూటాకేది? నే నొక్క మహమ్మదీయ మహావీరునిగూర్చి యెరుఁగుదును. ఈతఁడు ప్రబలసంపన్నుఁడు. కఠినమగు సాముచే గడిదేరినాఁడు. ద్రాఘిష్ఠశరీరుఁడు. కాని బహుభయస్వభావుఁడు. నల్వురు సాహాయ్యము లేకుండ రాత్రి వీథిలోనికి రాఁజాలఁడు. వీథిలోఁ గుక్క మొఱఁగిన యెడల గదిలో దానిపైస్థాయిలో నేడ్చుచుండును. ''ఏమి సాహేబూ! రాత్రి వాఁకిటిలోనికి రాలేవు'' యని యడుగ ''డర్ జీ హజరత్ డర్ జీ హజరత్'' అని యాతఁడు బదులు చెప్పును–ఇట్టి వారెందరో యున్నారు. తఱుచుగాఁ బెద్దకళేబరమునకుఁ బిరికితన మెక్కువ యనుట మిథ్యకాదు. లఘుశరీరమునఁగాని శౌర్యము తఱుచుగా నుండదు. నెపోలీయను, నెల్సను, కృష్ణదేవరాయలు మొదలగు వీరాధివీరులు కొందరు లఘుశరీరులే! అల్పరూపము, నతిలాఘవసంపన్నమునగు నరేబియాగుర్ర మాహవ ముఖమున ఫిరంగి గుండ్లవర్షమునకు వెనుదీయకపోవుటయేకాక–మరింతపౌరుషముతో ముందునకుఁ జెంగుచెంగున నుడాయించుచుండ–బరువులు మోయుచు నేడువెనుకల యమితరూపాత్యంత బలసమన్వితమగు నాస్ట్రేలియాగుర్రము కాలీడ్చుకొనుచుఁ గొరడాదెబ్బలు తినుచు ముందునకుఁ బోవుటా? మానుటా? యని తటపటాయించుచుండును. పెద్దకళేబరములో శౌర్యము పెచ్చనువెర్రి యనేకుల కున్నదికాని లేకపోలేదు. అందలుకంటె నీవెర్రి ప్రషియాచక్రవర్తి యగు ''ఫ్రేడిరికు ది గ్రేటు'' కెక్కువ. ఆబడుగులపొడవు దాటినమానినిగాని తనసేనలో భటునిఁ. గాతఁడు చేర్చుకొననేలేదు. ఈవిగ్రహపుష్టి నిలువు తాడి పెద్దకాలి పిశాచస్వరూపులను నమ్ముకొనియే యాతఁడు యుద్ధమునఁ బరాజయ

మొందెను. పొడుగుకాలి పెద్దమ్మకు వెనుక కింటికిఁ బరుగెత్తుటలోనున్న లఘిమ ముందున కేఁగుటలో నుండదు. లంబోదరున కాఁడుదానిమీఁద నున్న వేడుక యీహవముమీఁదనుం డదు. బలాఢ్యునకుఁ దిండితినుటలోనున్న యోపిక దెబ్బతినుటలో నుండదు. నాయన లారా! అంతశౌర్యము ప్రధానముకాని యంగబలముతోఁ బనియేమున్నది? తాటియాకంత దళసరిగల కత్తి ప్రధానమా? తాంద్ర బెత్తంత దళసరిగల యెర ప్రధానమా? అదిగాక యీకాలపుయుద్ధములలో వెర్రి దేహబలముతోఁ బనియేమున్నది? కోటిమందికి హఠాన్మ రణ మీయఁగల సామగ్రి గోళికాయలోఁ బెట్టి ప్రకృతిశాస్త్రము విసరివైచుచుండ బలమో బలమో యని దేపులాడుచుందువేల? శౌర్యమునకే పని గానఁబడని దినములలో చచ్చుబ లముతోఁ బనియేమున్నది? మీరందరు దేశమును సంరక్షింపగల మహావీరు లగుదురని గర్వపడవలదు. మీచర్యలలో శౌర్యప్రకటన మేదో యున్నదని యెంచకుఁడు. వీథిలోని దొమ్మరియాటకంటె మీప్రదర్శన మెళ్లుక్కువయో నాకు బోధపడలేదు. మీరు నాగరకులు కావునఁ గ్రమ్మదలగా గడుసుఁదనముగా గాలక్షేపముచేయుచున్నారు. బుళ్ళెడు గాజుపెంకు లను నమలి మ్రింగఁ గలవానికంటెఁ బొట్టమీఁద నమ్మెటదెబ్బను గొట్టించుకొనువాఁ డెట్లుక్కువవాఁడు? ఒడలు కోసికున్నవానికి శౌర్యమున్నదని యనుకొనుట యెంత భ్రమమో. కేవలము మీవంటివారికి శౌర్యముండక తప్పదని యెంచుట యంత భ్రమమే. పౌరుషము తక్కువయని మరింత ప్రకటించుచున్న మీరొమ్మలమీఁది మంగళసూత్రమున నన్నిటిని వెంటనే తీసివైచి దండగా గ్రుచ్చి మీభార్యల నడుములకుఁ గట్టుఁడు. బంగారము బంగారమును జేరుటచే నచ్చట వానికి శోభకాని యంట్ల కుండలవంటి మీ మొగములమట్టు వానికి శోభలేదు.

సత్యభామ నరకాసురుని జచ్చునట్లు కొట్టినది. దాననయుద్ధమునఁ గైక భర్తప్రాణము ననే కాపాడినది. మందోదరి తనబుద్ధిబలమునేఁ జతురంగబలమును గల్పించి యాయాట భర్తకు బాగుగా నేర్పి యాతనికి రణరంగకర్మగమనాదిరహస్యములన్నియు విలాసార్థముగా బోధించెను. 1782వ సంవత్సరమున జిబ్రాల్టరు ముట్టడిలో శత్రుపంక్తుల నుండి యొక్క బాంబు పడెను. అంత నొక్క ఫ్రాన్సుదేశస్త్రీ చంకనున్న యిద్దరుపిల్లలతో గుభాలున నెగిరి బాంబుమీఁదఁ జదికలఁబడి దానిలోనివత్తి నార్పి యెందఱు ప్రాణములో కాపాడెను. ఒక్కనాఁ డొక్కకాంత–పేరు జ్ఞప్తిలేదు–చిన్న సందువెంటఁ బోవుచుండఁగా భయంకరమగు పెద్ద వెర్రికుక్క యెదురుగాఁ బరుగెత్తుకొని వచ్చుచుండెను. దానిని దప్పించుకొని పారిపోవుట కామెకు వీలులేకపోయెను. అప్పుడు జంకక దానికెదురుగా నిలువఁబడి–తన రెండుకాళ్ల నందిటి గాగరామడతలలో దానితల నిరికించి యిమిడ్చి మోకాళ్లతో గొంతుపై నొక్కి కుక్కను గెక్కు గెక్కు మనిపించెను. ఆఁడువారైననేమి? శౌర్యముకలవారనిన వీరు. శౌర్యమునకు లింగభేదము లేదు. వీరు తలలవెండ్రుకలకు రాలు కట్టుకొన్నవారు కారు. గునపములచే గుండెలలోఁ బొడిపించుకొన్నవారు కారు. నాయనా! నీవు శౌర్యవంతుఁడవు కావని నే ననలేదు. నీవంటివారి నెవ్వరిని నేను నిందింపలేదు. బలమునకు శౌర్యమునకు సంబంధము లేదనుట కింత దూరము చెప్పవలసి వచ్చినది. నీవు చేయుచున్న యీపనివలన లోకమునకు లాభము లేదనుట కింతదూరము చెప్పవలసివచ్చినది. క్షమింపుము.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

19. పాశ్చాత్యనాగరకతా మాహాత్మ్యము

సాక్షిసంఘంలో జంఘాలశాస్త్రి ఉపన్యాసధోరణి చాలామంది జనాన్ని ఆకర్షిస్తోంది. ఎందుకంటే, ఇంగ్లీషు భాషా కళాశాలల్లో విద్యార్థులు కూడా కొందరు ఆ రాత్రి అతని ఉపన్యాసం వినడానికి వచ్చారు. యువజనాన్ని చూసే సరికి కాబోలు, జంఘాల శాస్త్రికి, పాశ్చాత్య నాగరకతా న్యామోహాలను గట్టిగా ఖండించి వారికి కళ్లు తెరిపించాలనిపించింది.

ఎత్తుకోవడం ఎత్తుకోవడమే, పాశ్చాత్య నాగరకతా సంబంధమైన వేషాన్ని గురించి జంఘాల శాస్త్రి అందుకున్నాడు. వేషంలో మన పద్ధతి విడిచి పెట్టడం వల్ల కలగబోయే నష్టాలు వివరించాడు. ఏయే జాతికి సంబంధించి, మతం నిర్దేశించిన గుర్తుల్ని వారు ధరించడం సబబని శాస్త్రి భావించాడు. కొత్తతరం కుర్రకారు ధరించే చొక్కాలనీ, ఇజారుల్నీ విమర్శించాడు. వ్యాయామ శూన్యతని ఎత్తి చూపించాడు. కాఫీ తలవాటు మీద మండిపడడం వంటి ఎగతాళి చూపించాడు. కళ్ల జోళ్ల వాడకం, సిగరెట్ల వ్యసనం, జంఘాలశాస్త్రి విమర్శాఘాతాలకు గురయ్యాయి.

మతాచారాల 'భ్రష్టత' పట్ల శాస్త్రి శాస్త్రీయంగా ఆక్రోశించాడు. శాస్త్రాలలో 'సంకేతాల' ప్రాధాన్యాన్ని ప్రస్తావించి విగ్రహారాధన పట్ల ఆధునిక యువజనం దృష్టిని, విముఖతనీ శాస్త్రి విమర్శించాడు. దేశ భాషాభిమానాన్ని స్పష్టం చెయ్యదలచి మన జాతికి మాత్రం మతమే సర్వం అని తేల్చాడు జంఘాల శాస్త్రి. ఋషులు ప్రవచించిన మతాచారాలను భ్రష్టు పట్టించ వద్దని జంఘాల శాస్త్రి కోరిన కోరికకు విద్యార్థులు కొందరు వ్యతిరేకంగా ప్రతిస్పందించారని వాణీదాసు చెవిని బడ్డ మాటలను బట్టి తెలుస్తోంది.

శ్రీమద్రామాయణాధ్యాత్మరామాయణ గ్రంథకర్త లగు ఋషులస్వప్న కలహములో నత్యమగు దెబ్బ తగిలిన నేను మా సభాభవనమున కీరాత్రి పోలేకపోయితిని. జంఘాలశాస్త్రి యుపన్యాస ధోరణి మాసభకు సభ్యుల నాకర్షించుచున్నది. అతని వాచాలతావిషయిక ప్రఖ్యాతి మెల్లగ జుట్టుపట్టుల నున్న యాంగ్లేయభాషాకళాశాలలకుగూడ వ్యాపించి యుంటచేగాబోలు నీరాత్రి కొందఱు బాలురుగూడ వచ్చి సభ నలంకరించిరి. జంఘాల శాస్త్రి యిటులు చెప్పెనఁట. సభ్యులారా!

''ఈదినమున—ఊ—ఈదినము.''

సభలోనుండి ''ఈదినము కాదు. ఈరాత్రి యనుము'' అను మాటలు; చప్పటలు.

జంఘా—ధీమంతులారా! సూర్యోదయమగు పిమ్మట రాత్రి యెక్కడిది? ఓ! ఇందఱు జ్ఞానసూర్యులొక్కసారి మాయజ్ఞానతిమిర విచ్ఛేదనమునకై యిటనుదయించియుండ నింక మాకు రాత్రి యెక్కడిది? ఇఁక మీవలన మాకుఁ బగలే! మీచదువు లేమి? మీజ్ఞానము లేమి? మీ వచోనైపుణ్యము లేమి? మీయధిక్షేపణసామర్థ్యము లేమి? మీదేహదార్ఢ్యము లేమి? మీమతాభిమానము లేమి? మీపూర్వాచారసంప్రదాయ విశ్వాసము లేమి? మీస్వభాషాభిలాష లేమి? మీబంధుమర్యాదవైఖరులేమి? మీరెక్కడ? మేమెక్కడ? మీరు కాలిడినచోట మేము తల నిడుటకైన నవకాశ మున్నదా? మీరేమి సామాన్యులా? మీరు నవనాగరకతాకల్పవృక్షసు మములు గారా? నవనవశాస్త్రసారామృతఘుటికలు గారా? చిత్రచిరత్న గుణరత్నఖనులు గారా? జంగమజగద్జ్ఞానావతారములు గారా? మీ చదువులు చిలుకపలుకులు, రోఁకటిపా టలు, వల్లెవేఁతలు, జందెపుమడతలు! మేము చదివిన గ్రంథములు మీరు నిరాదరించి నిరసించిన తాటాకు తుక్కు; మాజ్ఞానములు మీమనసులకు వెఱ్ఱివెఱ్ఱి తలతిక్కలు. మాపలుకులు మీచెవులకుఁ బలుకాకికూఁతలు. మాశరీరపాటవములు మీబుద్ధికిఁ బశుత్వ ములు. మామతాచారములు మీకు మౌఢ్యభూయిష్ఠములు. మాబిళ్లకచ్చమడతలు —బూడిదబుస్సనవేషములు—మీదృష్టికి నున్మత్తాలయమునుండి తప్పించుకొనిన వికృతాకార ములు! కానిండు; మాకడుపులఁ బుట్టిన మీరు మాతలలపై నెగురుట మాకు సంతోషము కాదా? తండ్రులను బరాజయ మొందింపఁ గలుగు ప్రబలశూరులు తనయులు గాక మఱెవ్వరు?

కాని మీ రభ్యసించిన యాంగ్లేయభాషవలనఁ గొన్ని కొన్ని మార్పులు మీబహిరంత స్స్వరూపములలో గాఢముగఁ గలిగినవి. మీరు వినినను వినకున్నను, విని మీరు గమనించి నను గమనింపకున్నను మీకట్టి లోపము లేవో తెలియఁబఱచుట మాకు విధియైయున్నది. మొదట వేషములఁగూర్చి చెప్పెదను. ద్విజుల కుండఁదగిన శిఖాయజ్ఞోపవీతములలో శిఖ యెగిరిపోయినది. ఎగిరి యెక్కడఁ బడిపోయినదో యెఱుఁగ వీలులేదు. కాని పునర్వివాహ మాడఁదలఁచిన విగతకేశలగు యువతుల తలలపైఁ బడిన దని చెప్పుదురు; కాని నమ్మనర్హము కాదు. మీతలలిప్పుడు వికృతాకారము లయియున్నవి. ఆర్యావర్తదేశమున కిట్టి యద్భుతశిర స్సమాజ మపూర్వము. ఓహో! వింతవింతలగు తలలరీతులుకదా? గొఱ్ఱెబొచ్చుతలలు! తాటిపండుపీఁచులు! బళ్లారికంబళ్లు! బొమ్మజెముడు రుప్పలు! బంగాళాహంగులు! పంచపా ళిదింపులు; పంపరపనానడిప్పలు! బూరెలజొచ్చెలు! వలపలిసీమంతమలు! దాపలిపాపటలు! మాధ్యమికమార్గములు! ఎదుటివడిప్రేఁతతిరుగులు! జిగురుగండెల నొక్కులు! అంటకత్తిరిం పులు! కడముంతలు! బోరలించినసానికలు! పెయ్యనాఁకుళ్లు! బాలులారా! కోపపడకుఁడు! మీ కనుదిన మున్న దువ్వెనపని, మీకున్న సీమంతశృంగారము, మీ కావశ్యకమగు తైలసం స్కారము, నూతనగర్భాధానపుఁ బెండ్లికూఁతునకైన లేవుగదా? అయ్యయ్యో తల నంత గచ్చపొదను జేసికొంటిరేల? అనుదినస్నామున కవకాశము లేదే? తలలోని సూక్ష్మరంధ్ర ములకుఁ బవనస్పర్శము లేదే? బట్టతడుపు జల్లునకైనఁ యీచుట్టుగుడిసెల నింక నెన్నాళ్లు తలఁ గట్టుకొని మోయుదురు? అయ్యయ్యో! తలకుఁ జల్లనిగాలియైన బాగుగఁ దగులదే?

గోష్పాదమంత జుట్టున్నవాఁడు వెఱ్ఱివాఁడుగ మీకగపడఁగ గొఱ్ఱెతలయంత జుట్టున్నవాఁడు మా కెట్టులగపడునో చెప్పవలయునా? నాయనలారా! బోడిబలు పని మీరు వినియుంటిరా? ఒడలి బలుపునకుఁ దలబోడి యొకకారణము కాదా? రక్తమాంసవిజృంభణము కంటె రోమభూమత్వ మధికముగ నెంచుట బుద్ధికిఁ దగని యాలోచనము కాదా?

నాయనలారా! నావంక బాగుగఁ జూడుఁడు! అదేమి? అయ్యవారులగారి నట్టిల్లువలె మీయలికము లట్లు వట్టివైయున్నవేమి? తిలకములు లేవా? అక్కఱలేదా? తలపైనంత గొంగళిదొంతర మోయగలరుగాని రవ్వంత విభూతిరేఖలు బరువయ్యెనా? మీతండ్రులు తిలకధారణము చేసికొనుట మీరు గాంచితిరిగదా! మీముత్తాతలు కూడా నట్లే చేసి రని వినియైన నున్నారుగదా! మీ కీన్వల్పాంశమున నింతపంత మేల? తల్లిదండ్రులయాచారము నిట్లు నిరాకరింపనేల? అవలంబించినయెడలఁ గలుగునష్టమేమి? రాజు రాజచిహ్నముగఁ గిరీటమును ధరింపవలదా? ప్రధానుడు తదుద్యోగచిహ్నముగ నలువదిమూళ్ల పక్కఱొక్క పాగను ధరింప నక్కఱలేదా? వేత్రహస్తుఁడు వెండిదుడ్డును మోయనక్కఱలేదా? ద్విజులకు ద్విజచిహ్నము లుండనక్కఱలేదా? అదిగాక శృంగపాదముల ధరించుటఁబట్టికదా యాతఁడు భట్టాచార్యుల భటుఁడని మనము గుర్తింపఁగలుగుదుము? పులితోలు ''డపాలిని'' బట్టి కదా యాతఁ డొకజాతియుద్యోగిభటుఁ డని మన మానవాలు పట్టఁ గలము? మీలో వైష్ణవులు శైవులుకూడ నున్నారుకదా? మీమీ యిష్టదైవముల చిహ్నములగు శ్రీపాద యుగ్మమునో విభూతి రేఖనో మీనొసలఁ దాల్పనక్కఱలేదా? (సభనుండి ''నాన్సెన్సు'' అని, నిరుపయోగములు అని కేకలు.)

నిరుపయోగము లనియే మానితిరా? నిరుపయోగము లగు వస్తువులను ధరింప నక్కఱలేదుకాఁబోలు? నాయనలారా? మీ చొక్కాల మెడల కాప్రక్క నీప్రక్కనట్టి చెవు లెందులకు? ఆకుక్క చెవులలో ముత్తెపుఁజిప్పల తమ్మంటు లెందులకు? మీ మెడలలో నా పట్టుపలుపు లెందులకు? (సభనుండి హేహేహే నెక్‌టైస్)—ఆవస్త్ర ధనుస్సులచే గొంతుకల కురు లెందులకు? ఆహాహా! మీకంఠరక్తనాళముల మొదళ్లెట్టు లిట్టి బిగింపువలనఁ బొంగియున్నవో చూచుకొంటిరా? రక్తప్రవాహప్రతిబంధకము లగు నీ ముళ్లపేలికలను ధరించుట యావశ్యక మనియే తోఁచినదా? అదిగో? అది యేమి? వెడలుపుగలదై వంగనిదై బింకమయినదై తెల్లనిదైన దది యేమి? మెడపట్టియా? అబ్బో! నాలుగంగుళముల వెడల్పుగ లదై యున్నదే! ఇదికూడ సొగసునకే ధరించితిరా? దీని యెక్కువ వెడలుపుచే మీ మొగములు సై కెగసిపోయినవే! మొగము వంచుకొందమన్నఁ బట్టి వంగదే? దీనివలన మీమెడ లెట్లు సొగిపోవుచున్నవో కాసంత యాలోచించినారా? కుత్తుకసింగారము నపేక్షించి కొంగమెడను గొని తెచ్చుకొందురా? మెడపొడు గైననేమి? మొగము వింతశోభగలదై యున్న దని సంతుష్టిఁ జెందఁదగునేమో యని యనుకొంద మన్న నంతటితోఁ దెల్లవాఱదే? సొగినమెడ బీఱకాయపీచువంటి నరముల సమ్మేళనము వలన లోన వ్రేలాడు హృదయకోశముయొక్క పైత్రాటినిగూడ సాగఁదీయునుగదా? అందువలనఁ బ్రాణాధారమగు నాకోశరాజమునకు నలుగుడు గలుగదా? అందువలన నూతనవ్యాధి యుద్భవింపదా? ఆఱణాల మెడపట్టి యలంకార మపేక్షించి యామరణాంత మొందఁ దగిన యారోగ్యమును బాడువేసికొనుట ప్రతిభావంతులపనియేనా? గొంతుచుట్టు ముచ్చటకై చేరి యీరీతిగ గొంతుఁగోయు నిట్టి

వస్తువులను మీరు ధరింప సాహసించితిరి; కాని లాభ మేమియు లేదని తిలకములను మాత్రము మానివైచితిరా? సెబాస్ హేతుకల్పన మన్న మీకే తగును.

జోడునాళముల తుపాకివలె జవునుబొంత యరఁటిపండువలె మీ కీ యిజారు లెందులకు? ఆపాదరక్షలను గట్టిగ బిగించిరి కాదా? శీతప్రదేశమున మంచుగడ్డలలోఁ దిరుగవలసినవారి కిట్టి వననధారణము గాని మంగలములో వేఁగుచున్న మన కెందులకు? మనపెద్ద లేర్పఱచిన వస్త్రవైఖరియే మనకు సర్వోత్కృష్టముగ నున్నదే? పెద్ద లేర్పఱచుట మూట యెందులకు? మనదేశమున కది తగును. మన కది తగును. అన్నివైపులనుండి గాలితగులు దుస్తులు మవకుఁ గావలయును. అగ్ని బాధ తగుల వెంటనే యొక్కయూపున నూడఁదీయఁదగిన దుస్తులు మనకుఁ గావలయును. దేశమునుబట్టి మనుజుఁడుకాని మనుజునిబట్టి దేశముకాదే? మనుజునిబట్టి దుస్తుగాని దుస్తునుబట్టి మనుజుఁడు కాఁడే! మీ రిట్టి వస్త్రధారణమున నాంగ్లేయులు కాఁగలరా? పరీక్షి త్తొనర్చిన సర్పయాగములోని వైశ్వానకుండమునుండి యెటులో తప్పి వెలిఁబడిన పాములవలె నత్యంతసన్నిహితుఁడగు సూర్యునివేఁడిమికిఁ దాళిబ్రతికియున్న మనము కమలి పాగచూరి కుమిలిపోయి యుంటిమే! మఱియొకమాట! ఒకనిమాటగాని నడకగాని వేషముగాని యనుకరించుట హాస్యాస్పదము కాదా? బ్రాహ్మణవేషమును ధరించి ''హాగ్ంనశ్కుచి'' యని పననను జెప్పు పగటివేసపుసాతానిని జూచి బ్రాహ్మణుఁడెట్లు వెకవెకనవ్వునో మన యాంగ్లేయవేషములఁ జూచి యాంగ్లేయులట్లు నవ్విన నవ్వవచ్చును. ఔచిత్యమునకంటె నాధిక్య మేదియు లేదు.

ఇక మీదేహదార్ఢ్యము లెట్లున్నవో పరీక్షింతుము. మేము చదువుకొను దినములలో మే మొనర్చిన గురుశుశ్రూషమే మాకుఁ దగిన దేహసాధనముగ నుండెడిది. ఉదయమునఁ గాలకృత్యములకై రెండు మైళ్లకుఁ దక్కువ లేకుండఁ బాదచారమయినపిమ్మట గురువు గారి మొక్కలకు నీళ్లు తోడుట, ప్రాయ్యిలోనికిఁ గట్టెలు చీల్చుట, బట్టలుదుకుట మొదలగు వ్యాపారములతో మాకు దేహము గలిడిదేలినట్లు గలిడిదేలి యుండెడిది. అంతటఁ జెఱువునకో నదికో పోయి యీఁదులాడి స్నానము చేసివచ్చి పాఠములు చదువుకొని భోజనమునకుఁ బోవుసరికి క్షుత్తుహాలాహలప్రాయమున నుండెడిది. సంపూర్ణమగు నాహారముచే సంతుష్టిగ నుండెడినారము. సాయంకాలమునఁ దిరుగ నడచివచ్చి పాఠములఁ బునశ్చింతనఁజేసి గురువుల పాదములొత్తి తుంగచాపపై నొరుగునరికి గాఢనిద్ర పట్టుటచే సుఖముగఁ దెల్లవాఱుకడ లేచెడినారము. ఇట్టి గురుశుశ్రూష పారమార్థికమేకాక పాటవప్రదము కూడను. ఇప్పు డట్టి దావశ్యకము కాని హేతువుచే మీకు దేహసాధన మంతగ లేదు. సాధనము చేయవలయు నని నియమ మున్నను మీరు ప్రాయికముగ దానిని దప్పించుకొందురు. మీయుదయయాత్ర పడకగది మొదలు వెఱటివఱకే! ప్రక్కమీఁదనుండి లేచునపుడు ''కృష్ణాకృష్ణా'' యని యనుటకు బదులుగ ''కాఫి కాఫి'' యని లేచుచున్నారు. కాఫిని గర్భకోశమున నింపి దేహయంత్ర చలనమునకై సిగరెట్లులు ముట్టించుచున్నారు. ఱాకలికింక వేళ కాకుండనే ''స్కూలు''కు వేళ యగుటవలన ముంగాళ్లపైఁ దొందరతో భుజియించుచున్నారు. మధ్యాహ్నము తిరుగ ఫలహార మొనర్చుచున్నారు. సరియగు దేహవ్యాయామము లేకుండ సాయంకాలమున నటులే భుజియించుచున్నారు. జేబుగడియారమునుబట్టి జీవయాత్రను జరుపుకొనుచున్నారు. రాత్రులు మీకు సరిగ నిద్దుర లేదు. మనస్సులకుఁ

గతినపరిశ్రమ మిచ్చి దేహముల శుష్కించఁ జేసికొనుచున్నారు. రెండుచక్రములున్నఁగాని బండి నడచునా? మీ కొక్కఁకా లెండిపోవుచున్నది. ఒకకాలు బోదకా లగుచున్నది. మనో దేహములు రెండును జెడుచున్నవి. వ్యాయామ శూన్యతలవలనను, ''కాఫీ'' త్రాగుటవల నను మీకు మందాగ్ని యుద్భవించుచున్నది! సిగరెట్లువలన నుబ్బసము, గుండె రోగము పుట్టుచున్నవి. మిగులఁ జదువువలన నత్యుష్ణము, వీర్యనష్టము గలుగుచున్నవి. ప్రాణసార మగు వీర్యము సెడుటవలన మీదేహములు సమస్తవ్యాధులకుఁ దావలములై యుండును. సహజ వ్యాధినంపదలు చాలకయా? నాయనలారా! అక్షివ్యాధి దక్షిణలు తెచ్చుకొంటిరి? ఎవనికో హ్రస్వదృష్టియో దీర్ఘదృష్టియో యుండ మీ రందఱుగూడ గాజుల ధరింప నేల? అక్షివ్యాధి యమ్మవారివలె నంటురోగ మగుటచే మీకిట్లు ప్రాఁకినదా? లేక యీయంధత్వము గూడ నలంకారమా? గ్రుడ్లగూబమొగములు సొగసులనియే యభిప్రాయపడితిరా? గోఁకి కొనఁగ గోఁకికొనఁగఁ గుష్ఠ బయలుదేఱునట్లు, దగ్గఁగ దగ్గఁగ క్షయ బయలుదేఱునట్లు సొంతముగాఁ దెచ్చుకొనిన యంధత్వము తెగులై పరిణమించినది కాదా? తోఁటకూరకాడల వలె, నొక విచిత్రమైన గడ్డివలెఁ దొందర తొందరగ నెదుగవలసినదినములలో మీ కీరోగములు గలుగుటచే ఖర్జూరపుకాయలవలె దిగఁబెరుఁగుచున్నారు. వడియములవలె నెండుచు న్నారు. కర్పూరమువలెఁ గ్రమముగ హరించుచున్నారు. ఏమి వింత యాకారములతో నున్నారు. పిండిబొమ్మలు! శల్యసంఘములు! తోలు విగ్రహములు! భట్టలగుమ్మటములు! మఱుగుజ్జులు! వేసవికాలపు గొల్లభామలు! తీసివేతనరకులు, వానపాములు! దర్భపుడకలు! బాల్యత్వపు పిప్పియగు మీవలన మీకేమి ప్రయోజనము? లోకమున కేమి ప్రయోజనము? మీరింక భార్యలతోఁ గాఁపురములు చేసి సాంసారికసుఖ మనుభవింపవలసినవారు కదా! మీరే యిటు లుండ మీకొడుకు లెటు లుందురో! ఈదుర్బలాల్పనిస్సారశరీరములతో నింక నరమూషికము లను, డబ్బెత్తుగాండ్రను గనఁదలఁచితిరి కాఁబోలు! మీ వ్యాధులు మీలో నంతమొందు నవి కావే! కవి యొకఁ డీవిషయమున నిట్లు పలికినాఁడు.

గీ. అఖిలరోగార్తులయిన యాయ్యయ్యవార
లనిలశూన్యతమోవృతస్వాలయముల
దిగఁబెరుఁగుతోలుబొమ్మలతో దేవులాడి
యంధ పంగు మూకాదులై యవతరింత్రు.

గీ. ప్రాణిబాధలు తగ్గింపఁ బ్రతినరునకు
నేకకర్తవ్య మైయుండ నిట్టివార
లట్లు సేయరు సరికదా యార్తి నొందు
ప్రాణితతి సంఖ్యనే వృద్ధిపఱతు రయ్యో?

గీ. ఇట్టి పాపులు నతిమెడఁ గట్టుత్రాడు
తమమెడను గట్టికొని యీల్గి ధరకు మేలు;
త్రాట మెడ బిగియించుకోఁ ద్రాసమైన
మొలనుగల త్రాడు త్రెంపి పోవలయు వనికి.

అకవియే మఱియొకచో నిట్లు పలికినాఁడు.

గీ. తనువు నంటినరోగముల్ తనరువాఁడు
క్షేత్రమున నూడ్చి పంట నీక్షింపఁదగదు
జనుఁ డనూచానరుగ్ణతాస్పదుఁడు వేనుక
కేడ్వఁదగును, ముందునకు నేడ్పింపఁ దగదు.

నాయనలారా! మీరు పిల్లల కిచ్చునవి మేడలు, మిద్దెలు, భూ వసతులు లేవుకాని యుష్ణరోగములు, నుబ్బసములు, మూర్ఛలు మాత్రమే యున్నవా? మీవంశములోఁ బిత్ప పితామహార్జితధనమిదియే చేయఁ దలఁచితిరా? చాలు! ఇఁకఁజాలు.–మీమతాచార సంపత్తిని గూర్చి యిఁకఁ బలుకనిండు.

మడిబట్టలు మూలఁబడినవి–వెనుకటి పట్టుబట్టలు ''వేస్టుకోటు'' లుగ జన్మాంతర మొందినవి. పాదప్రక్షాళనము పనికిమాలినపని యయినది. సంధ్యావందనము బహిష్కరింపఁ బడినది–చిత్రగుప్తపూజ త్రోసివేయఁబడినది. ప్రాణాహుతులు పంచత్వ మందినవి– భోజన కాలమునఁ గాళులు నేతులు తిరుగ శీతోదకమున నేల కడుగుకొనవలయునో, నుదుటిపై దళముగ గంధమో, తిరుమణియో, గోపిచందనమో యేల ధరింపవలయునో తెలియని మీరు ప్రకృతిశాస్త్రపారాయణ ప్రవీణులా? తలయుఁ గాలుసేతులకొనలు నిట్లు చల్లఁబడియుండు టచే శరీరరక్తము గర్భకోశమున బాగుగ వ్యాపించి దానిని వికసింపఁజేయును. జఠరాంతర ద్రవములు సులభముగ వెలువడును. భుజించిన యాహారము సులభముగ జీర్ణమగును. మందాగ్ని నివారణార్థమై జఠర వైశ్వానరోద్దీపనార్థమై పెద్దలు నిర్మించిన యీసదాచారమును మీరు నిరాకరించినారు. మతధర్మసంప్రదాయములకు–శారీరసన్నివేశములకు –సంపూర్ణసంబంధ మున్నదనుసంగతి మీమెదడున కెక్కలేదు. భోజన సమయమునందు ఫలమున నంతతిలకము లేదు. కాని యొడల 'హాఫర' మున్నది. నడుమునఁ బట్టుబట్ట లేదు గాని కాలికి మేజోడున్నది. ఈ స్వేచ్ఛాలక కుర్చీలోఁ గూరుచుండి బల్లపైఁ దినవలయునని, త్రిశూలపు ముండ్లతోఁ దినవలయు నని యాంగ్లేయభోజన మతముల కతిథులయి పోవుచున్నారు. గరిటెఁడు తులసితీర్థము పుచ్చుకొనుట కిష్టపడరు కాని కాచపాత్రెఁడు ''సోడా'' గడగడ త్రాగుచున్నారు. ఉద్ధరిణెఁడు పంచగవ్యమున కోక్కం దురు. కాని కుక్కుటార్భకసారము నొక్క సీసానైన నూపిరి విడువకుండఁ ద్రావుచున్నారు. పాలమడ్డితోఁ జేసిన రొట్టెలను వడిద్రేసి నములు చున్నారు. మీయాహారవైఖరు లీటు లున్నవి. ఉండవలసినవారికైన మీలో నందఱకు యజ్ఞోపవీతము లున్న వని నే ననుకొనను. బ్రహ్మ సూత్రార్థవిచ్ఛేదకులయి మీరు ప్రకాశించుచున్నారు. ఇట్టి సాంసారిక సన్న్యాసులు! ఇట్టి ప్రాపంచికపరమహంసలు! –ఇట్టి ద్విజశూద్రులు మీలో నెందఱు మహానుభావు లున్నారో!

పడుక గదిలో గోడనున్న రవివర్మ ''సుభద్రార్జునీయము'' చూతురుకాని, పడమ టింట దేవతార్చనపీఠమున నున్న సీతారామము చూడరు. మల్లెపూవులు దెచ్చి యిల్లాలి కొప్పులోఁ బెట్టుదురు కాని దేవతార్చనపుఁ బెట్టెమీఁద విసరియయిన వేయరు. మెడలోఁ దోలు సంచిని ధరింతురు కాని తులసివేరు పేరైన నెత్తరు. ''ఇది కళావరాసు, ఇది యరఖాసు'' అని యుత్సాహమునఁ జేతులఁ బెట్టుకొందురుగాని యిది సాలగ్రామము, ఇది నర్మదబాణ మని భక్తితోఁ గన్నులఁ బెట్టుకొనలేరు గద! 'వేల్సు' ఏది? యని యడుగ నిది యని పుడకతోఁ జూపఁగలరు కాని వేణుగోపాల మిది యని యొక పువ్వు తన్మూర్తిపై వేయలేరు

కద? సాలగ్రామములు కుక్కలను గొట్టుటకుఁ దగిన బొమ్మలాలనుచు, నర్మదబాణములు 'Paper weights' (పేపర్ వెయిట్స్)గ విశేషించి యుపయోగింపఁ గలవనియు, మహాదేవతా ర్చనార్హసామగ్రి 'చిల్లర దుకాణ' మనియు మనసు కసిదీఱఁ దూలనాడుచున్నారు గదా? ధూపపు టారతికై తెచ్చిన నిప్పును జూచి మా మదనగోపాలుఁడు ''సిగరెట్టు'' ముట్టించు కొను నని పరిహాస మాడుచున్నారా! జేగంట వాయింపఁగ దేవుఁడుగారి తిండికై 'First bell' (ఫస్ట్‌బెల్) యయినదని యధిక్షేపించుచున్నారా? మా భగవంతుడు గారికిఁ బాకపుగా రెలు పరమప్రీతియని గేలిసేయుచున్నారా? మాకృష్ణయ్యకు రాధ ప్రక్కలో లేనిదే రాతిరి నిద్దురయే పట్టదని నిందించుచున్నారా? మా దేవుఁడు పాత్రము–, మీ దేవుఁడు లక్కపుట్టె. మా దేవుఁడే గట్టివాఁడని కాఱులలఁచుచున్నారా? విగ్రహారాధనమే వెఱ్ఱు లన్నిటికంటె వెఱ్ఱీయను చున్నారా? ఆహా! మీబుద్ధి వైభవమునకు మెచ్చఁదగును.

నాయనలారా! ప్రపంచమున మనసుకంటె చంచలమగు వస్తువు మఱియొక్కటి లేదుగదా? దానిని నిశ్చలముఁ జేయుట కెన్ని పాటులు పడవలయును? సంగీతశాస్త్రపాండి త్యమున కవధి స్వరజ్ఞానమేకద? అట్టిస్వరజ్ఞానమును సంపాదించుకొనుట కెన్ని సరళస్వర ములు సాగదీయవలయును? ఎన్ని జంటస్వరములతో వెనుకకు ముందునకుఁ ద్రొక్కు లాడవలయును? ఎన్ని యలంకారములతోఁ జేతులు తొడలు పగులునట్లు కొట్టుకొనవల యును? ఎన్ని గీతములతో గింజుకొనవలయును?–ఎన్ని చౌకవర్ణము, లెన్ని తానవర్ణములు వల్లె వేయవలయును? అటుపైనఁగదా? పుణ్యమున్నయెడల స్వరజ్ఞానము లభించుట! ఇన్ని మె ట్లెక్కకుండ నెంతబుద్ధిమంతుఁడైన జ్ఞానము నందఁగలఁడా? అంతదనుక నెందులకు? మనకు భాషాపాండిత్య మొక్కసారి కలుగుచున్నదా? గుంటయోనమాలవద్దనెన్నినాళ్లు చెవులపట్టులు దినుచుఁ గూలఁబడి యుండవలయును? తరువాత గుణితముతో నెన్నాళ్లు కూర్చుండవలయును? అట్టియట్టి క్రమక్రమముగ నొక మెట్టు తరువాత నొకమెట్టెక్కినపు డుగదా భాషాజ్ఞానము లభించుట? ఇది ''ఓ'' ఇది 'న్' వలపలగిలక యని మనగురుఁడు మనకుఁ జెప్పినప్పుడు ఇది ''ఓ'' కాదు ఇది 'గిలక' కాదు. అని నిరాకరించినయెడల మనకు భాషాపాండిత్యము సిద్ధించునా? అది ''ఓ'' యని నమ్మవలయును– దానిని నోటఁ బలుకవలయును. దానినిఁ జేత వ్రాయవలెను. దానిని మఱియొకదానితో మేళవింపవల యును. అన్ని శాస్త్రముల కిట్టి సంకేతములు గలవు. కన్నునకు నచ్చినప్పుడుకదా –మనసునకు నచ్చవలసినది! తరువాతఁ గన్ను సహాయము లేకుండ మనసే పనిచేసికొనఁగ లదు. అట్టి సామాన్యశాస్త్రజ్ఞానసంపాదనమునకే యింత సంజ్ఞావిశ్వాస మావశ్యక మయిన ప్పుడు నిర్గుణనమాధి యూరకతనంత తాను లభింపఁగలదా? సాకారవస్తుపూజ యుండక తప్పదు. ఈసంజ్ఞయే పరమాత్మ యని యెవ్వఁడు చెప్పుట లేదు. ఆర్యావర్తచిత్రపటమున కుత్తరపు నల్లగీత హిమాలయపర్వత మని మీ రనుచున్నారా? లేదా? హ్రాలేయాచలము పటము పైకి దిగివచ్చిన దని మీరుమాత్ర మనుకొనుచున్నారా? ఈ యంశమును గూర్చి మతోపన్యాసములలోఁ గాలాచార్యులుగారు ముందు చెప్పుదురు. ఆవశ్యకమగు విగ్రహారాధన మును నీరు నిందింపకుఁడు.

ఈయంశమునే యొక కవి యిట్లు పలికినాఁడు.

గీ. వర్ణతతిఁ జూచి వ్రాసియుఁ బలికి మరి గు
ణించిననుగాని పాండిత్య మెటులు రాదొ
మొదట నట్టులె విగ్రహపూజ లేక
ముక్తిసాధనమగు భక్తి పుట్టదెపుడు.

గీ. ఈవు కృష్ణుండ నని రాధ యేంచుకతనఁ
గృష్ణపరిరంభసౌఖ్యంబె యెసఁసె రాధ;
విగ్రహమె దేవుఁడని భక్తి సిద్ధసేంప
దైవసాన్నిధ్య సౌఖ్య మందఁగ నరుదె?

విగ్రహమందు మీకు విశ్వాసము లేదు. నిర్గుణసమాధికి శక్తి లేదు. నడుమను బడి యుభయభ్రష్టులై చెడిపోవుచున్నారు. మిగుల దుర్దశలో నున్నారు. మిమ్మిమీరే కాచుకొనవ లయును. ఇదికాక మీరు మఱియొక పెట్టిదే బాధపడుచున్నారు. జాతిభేదము సర్వసౌఖ్యాభి వృద్ధికి నభ్యంతరముగ నుండుటచే దానిని నిర్వ్యంసము సేయవలయు నని సూచుచున్నారు. సర్వమహాజను లందఱు కలసి యొక గొడ్డుపోఁదఁబడి దానిని బీఁకుకొని తిని యొక్క బానలోనికల్లు నొక్క కడముంతలోఁ గలిసి సేవ్యమనైన నది యైహికమున సౌఖ్యము కాదు. ఆముష్మికమున క్షేమము కాదు. అదికాక ప్రపంచ మున్నంతకాలము జాతియో, దానివంటిది మఱియొకటియో నిలువనే నిల్చునుగాని మీరనుకొనినదశ యెన్నఁటికి రానేరదు. ఈయంశ మునుగూర్చి కూడ నా మిత్రుఁడు కాలాచార్యులు ముం దుపన్యసించును. కావున నేను దానినిఁ గూర్చి యింతకంటెఁ జెప్పఁదలఁచుకొనలేదు. నాయనలారా! మీమతాచారసంపద యింత సౌభాగ్యవంతమై యున్నది.

ఈ దినమున మీ దేశభాషాభిమానమును గూర్చి కూడ చెప్పఁదలంచితిని గాని యిదివఱకే యాలస్య మగుటచే దానిని మానెదను. నాయనలారా! మన మార్యావర్తదేశమునఁ బుట్టితిమి. ఇది కర్మభూమి. కర్మముపలనఁ గాని భక్తిజ్ఞానము లంకురింప వనియు, ముక్తినిశ్రేణికకదియే మొదటిమెట్టనియు నమ్మకమునఁ గలవారము. వైదికకర్మములు మన కత్యావశ్యకములు. దైవభక్తి, మతాభిమానములు, వేదకర్మానుష్ఠానము, రాజభక్తి, భాషాభి లాష మొదలగు నుత్తమోత్తమ గుణముల కాటపట్టు లగువారికడుపులఁ బుట్టినవారము– ప్రపంచమందున్న జాతులలో నొక్కొక్కజాతి కొక్కొక్కవిషయమునఁ బూర్తాభిమాన ముండును. ఒక జాతికి విద్యాభిమాన మధికము. ఇంకొక్కజాతికి రాజకీయ తంత్రాభిమాన ముండును. మనజాతికిమాత్రము మతమే సర్వము–. మతము మనలో నున్నది. మనము మతములో నున్నాము. మనకు జుట్టులో మతము, బొట్టులో మతము, కట్టులో మతము. మతశాసన సంబంధము లేకుండ మనము తుమ్మలేము. ఆవులింపలేము. క్షురకర్మము సేయించుకొనలేము. స్నానము చేయలేము. తినలేము. భార్యయొద్ద శయనింపలేము. పిల్లలఁగనలేము. తుదకుఁ జావలేము. చచ్చిన తరువాతఁగూడ మతసంబంధము వదలనే వదలదు. మన కస్థిమాంసములు మతమయములై యున్నవి! రోమకూపములు మతమయ ములై యున్నవి! మనము మానిన సంధ్యావందనము చివరఁ జెప్పవలసిన ప్రవరలలోఁ జేర్చఁబడిన మహర్షులు–వసిష్ఠ విశ్వామిత్ర వాలఖిల్య జమదగ్న్యాదిమహర్షులు–మన వంశముల కాదిపురుషులై యఖండశోభామూర్తులై ప్రకాశించుచున్నారు. అట్టివారికడుపులఁ

బుట్టిన మనకు–వారి దైవభక్తిలో–వారినత్యశీలతలో–వారినైదికాచారసంపన్నతలో–వారి యింద్రియ నిగ్రహములో–వారితపశ్శక్తిలో–వారిమతాభిమానములో–లక్షాంశమైనఁ గోట్యం శమయిన మన కుండనక్క–ఆలేదా? మన వంశములో–నిట్టి వికృతవేషులు– నిట్టిదుర్బలశరీ రులు–నిట్టి విధినిషేధవిచికిత్సా శూన్యులు–నిట్టి నదాచారపరాఙ్ముఖులు–నిట్టి మతసంప్ర దాయ పరిహాసకులు– నిట్టివారు–జన్మించి రేల? యని యామహర్షులు కన్నీరు విడువకుండు నట్లు ప్రవర్తించుటకంటె మనము వారికిఁ జేయఁగలయుపకార మేమున్నది? అట్లు చేయ కున్న మనయార్యనామమునకు సార్థకత యే మున్నది? నాయనలారా! మీ రంద ఱిట్టివారని నాయభిప్రాయమెన్నఁడు కాదు. మీలోఁగొందఱు పూర్వాచారపరాయణతయు, మతాభిమా నాదులు గలవారై యున్నారు. అట్లుకానివారగు కొందఱుఁ గూర్చి మాత్రమే యీయుప వ్యాస ముద్దేశింపఁబడినది. నామాటలవలన మీరు కోప మొందకుఁడు. పగ లేదో రాత్రి యేదో తెలియని ప్రాఁజదువు బాపనయ్య యింతకంటెఁ బలుకఁగలవాఁడా''

జంఘాలశాస్త్రి యుపన్యానమును ముగించెను. బాలురు లేచి పోవుచు వారిలో వా రేమనుకొనిరో పూర్ణముగ వినఁబడలేదుగాని "Nonsense" "so and so" "mere blindness" "good voice without much sense" "Arrogant fellow" అని యేమేమో యిట్టిమాటలు వాణీదానునకు వినఁబడెను.

20. స్వదేశపరిశ్రమలు

సాక్షి, సభా రంగానికి వెళ్లేసరికి జంఘాల శాస్త్రి వీరోత్సాహంతో ఉపన్యాసం మొదలు పెట్టేశాడు. ఉదాహరణల మీద ఉదాహరణలిస్తూ సాధన సామాగ్రులు, యంత్రాలు వచ్చాకనే దేహశక్తులు అడుగంటాయన్నాడు. చేతి పనులు చచ్చాయన్నాడు. పరిశ్రమ చాకచక్యాలు ధ్వంసమయ్యాయన్నాడు.

దేశీయ పరిశ్రమల్లో డక్కా నేతగాళ్ల నైపుణ్యాన్ని పొగిడాడు. మన పరిశ్రమలన్నీ విదేశీ యంత్రాలు నిర్మించిన వస్తు పరికరాల వల్ల భగ్నమై పోతుంతాయ విలపించాడు శాస్త్రి.

అయినా – ఇటువంటి దుస్థితిలో కూడా మన సున్నితమైన వస్త్ర నిర్మాణ కళను రక్షిస్తున్నది, మనం 'అంటరానివారు'గా ముద్రవేసిన సోదరులేనని మహా గౌరవం ప్రకటించాడు.

ఎన్నో విధాల సున్నితమైన చేతి పనుల్ని మనమే ప్రోత్సహించి, ఆదరించకపోతే ఆయా వ్యక్తుల గతి, ఆ కళల గతి ఏమిటని జంఘాల శాస్త్రి ఆక్రోశించాడు.

దస్తూరీ సొగసుల గురించి, కాశ్మీరు సేలువల పనితనం గురించి, బళ్లారి కంబళ్ల గురించి, కుంభకోణం కంచుపని గురించి, వారణాసి బట్టలను గురించి, విశాఖపట్టణపు దంతపు పని గురించి, సేలం పంచెల గురించి, ఉప్పాడ బట్టల గురించి – ఎవరితో ఎన్ని చెప్పి లాభం? అని విలపించాడు శాస్త్రి. ఇంక లేచి – స్వదేశీ వస్తువుల పట్ల అభిమానం వహించి – 'జయం, భారత మాతకు జయం!' అని ఉద్యమించమని జంఘాలశాస్త్రి దేశప్రజలకే సందేశం ఇచ్చాడు.

నేను సభాస్థలికిఁ గొంతయాలస్యముగాఁ బోవలసివచ్చెను. అప్పుటికే జంఘాలశాస్త్రి ఉపన్యసించుచుండెను. నేను రాకముం దాతఁడేమి మాటాడెనో కాని నేను గుమ్మములోఁ గాలుపెట్టినది మొద లీతీరునఁజెప్పసాగెను:–

''మాటులోఁగూర్చుండి నిర్భయముగా నిరుపద్రవముగాఁగూరుచుండి-యూయసశలాకలుగల గవాక్షమునుండి, తుపాకిని బేల్చి పెద్దపులిని జంపుట శౌర్యలక్షణమా?

శౌర్యమున్నవానికిఁ జూపజాతిబండ లతోఁ గట్టిన మా టెందులకు? దొంగ దొంచూపు నక్కి నక్కిజూలకట్టలనడుమనుండి నిక్కి నిక్కి యెదుటనున్న నీటిగుండనైపునకు బ్రాణము లరచేతఁ బెట్టుకొని చూచుట యెందులకు? శౌర్యమున్నయెడలఁ బెద్దపు కెదురుగాఁ బోరాదా? ఎడమచేతికి గుడ్డ గట్టిగాఁజుట్టఁబెట్టి, చిట్టచివర బాకును ధరిం యాచేతిని శార్దూల వదనగహ్వరమున కందిచ్చి, కుడిచేతనున్న కైజారుతోఁ గణతై బొడిచిదానిని జంపరాదా? బహిరంగకదనరంగమున భయరహితుఁడై నిలువఁబడి భల్లప్రహ తమున దాని ప్రాణము లపహరింపరాదా? 'మాదొరగారు పరవకుఁబోయి పెద్దపులి జంపినా' రని యాతని భటులు ప్రభుశౌర్యలక్షణస్తుతు లొనర్తురు. ఆస్తుతివాక్యముల కేమై నర్థమున్నదా? ఆస్తుతులవలన ప్రభువునకు గౌరవ మేమైన నున్నదా? పోనిండు గౌరవమ లేనందులకుఁ జింతలేదు–అది ప్రభువునకు మఱింత యప్రతిష్ఠాకరముగ నుండునట్ల కనఁబడుటలేదా? ఇంటిలోఁ బెసరట్లుఁదినుచుఁ గూరుచుండటచేఁ బెద్దమనుష్యుఁ డనిపించ కొనిన దొర, పెద్దపులి వేటకుఁ బోయి యీనగుబాటు కూడ నందు టెందులకు కట్టుదిట్టముగాఁ జెట్టుమాటులో నుండి తుపాకిని గాల్చినప్పుడు ప్రభుఁడేయామహాకార మొనర్పవలయు ననుమాట యేమి? అతని బానిస యామత్రపుఁ బనిని జేయలేఁడా? ఇక ప్రభునిశౌర్య మెక్కడిది? మాటులో మాటుగ నొక్కొక్కప్పుడు బానిసయే తుపాకిని బేల్చి పెద్దపులిని జంపి ప్రభున కప్రతిష్ఠను మించిన ప్రతిష్ఠ నంటగట్టుట లేదా? శౌర్యప్రకటన మున కిచ్చటఁగనిన యవకాశ మేమున్నది? నోరు తెఱచుకొని నోటిలోఁబడినదెల్ల గుట క్కునమ్రింగు నజగర మేమంత శౌర్యముకలది? శార్దూలాఖేటములో నున్నది శౌర్యము కాదు. మోసము. ప్రచ్ఛన్నసంకేత స్థలాంతరానీనుఁడై వ్యాఘ్రరాజమారణ మొనర్పగల ప్రభుఁడు, పాఱిపోవుట కవకాశము లేని గదిలోఁ దిరుగఁబడిన పిల్లినివధింపఁ గలుగునెడల శిరఃకంపన మొనర్పవలసినదే కాదా! పిల్లివేటలో నున్న పౌరుషము పెద్దపులివేటలో నేది? సైకిలు నెక్కి గంటకుఁ బదారుమైళ్లు పోవువాఁడు శీఘ్రగామి కాఁడు. కాలికొలఁది –గంటకాఱుమైళ్లు పరుగెత్తగలవాఁడే జంఘాలుఁడు–బేగిరావు–రికాబుల నుపయోగపఱి జాఱకుండ ముందువెనుకల నెత్తుగలజీనుపై భద్రముగ నధివసించి, కంఖాణము నిష్టానుస రముగఁ గనుఱెప్ప వ్రేటుతో నాఁపఁగల కక్కుల కళ్లెమును జేత ధరించి గుఱ్ఱపుస్వారిచేయ నాతఁడు రౌతుకాఁడు. మెడపైనున్న జూలును జేత దభాయించి డబ్బాటున మీఁదికి దుమికి తొడలతోఁ బిక్కలతో గుఱ్ఱమును బెనఁగనీకుండ నదిమిపట్టి స్వారిచేయువాఁడే రౌతు –కౌపీనమునుధరించి యేటికో నదికో సముద్రశాఖకో యడ్డుపడినవాఁ డీతఁడుగాఁడు గాని పైకిఁ దేల్పఁగల బెండుపటకాలను–దెప్పలగుంభములను-గాలిదిండ్ల నుపయోగించి యీఁదువాఁడీతగాఁ డనవచ్చునా?

కత్తి విడనివాని ఘనుఁ డందు రదికాదు
కత్తి విడుచువాఁడె ఘనుఁడు సుమ్ము
కత్తి యోధవరుని ఖ్యాతిని హరియించుఁ
గలియఁబడుటలోనె కడిమి కలదు.

సాధనసామగ్రులు యంత్రములు వచ్చినతరువాతనే దేహశక్తులడుగంటినవి. చేతిప నులు వచ్చినవి. పరిశ్రమచాకచక్యములు భగ్నములైనవి. మొగము మెఱుఁగులు వచ్చిన

తరువాతనే మగువల మొగములు గఱు సెక్కినవి–కేశ సంవర్ధనీ తైలములు వచ్చిన తరువాతనే యున్నవి కూడ రాలిపోవు చున్నవి–సహజసౌందర్యవృద్ధికి–సహజప్రతిభావృద్ధికి –సాధనములు తఱుచుగా బాధకములు గాని సాధకములు కావు. పడుచుదనమున సేవించిన వసంత కుసుమాకర మకరధ్వజాది తేజఃపుష్టి హేతుకములగు నౌషధములు వీర్యవినాశములు కాని పోషకములు కావు. యౌవనవతి మెడలో ధరించు పట్టెడు ముత్యాలపేరైన మిసమిసలగు యౌవనాంకముల నడంచిపెట్టును గాని యుబుకఁజేయఁజాలదు. మన పరిశ్రమలన్నియు విదేశీయ యంత్రజాల నిర్మితవస్తుపరికరములవలన భగ్నము లైపోయినవి.

''డాక్కాలో నేతగాండ్రు స్వహస్తములతో నేసిన సెల్లాల (Muslims) వంటి పరమలలిత మృదుల సుకుమారవస్త్రము లెచ్చటనైనగలవా? ఎన్నిదేశములు ఈనడుమ సంపద్ధ్వంతము లైనవి? ఎన్నిజాతులు నాగరకతా సమృద్ధములైనవి! ఎన్నికోటుల పరిశ్రమశాలు ప్రపంచమున నుద్భవించి యభివృద్ధి నొందుచుండుట లేదు? ఆవిరిచే, నూనెచే, విద్యుచ్ఛక్తిచే నడుపఁబడు నెన్ని యంత్రములు ప్రపంచమునం దలసూసి పనిచేయుచుండుట లేదు! ఏది! ఒక్కదేశము–నొక్కజాతిలోనైన–డాక్కా సెల్లాలవంటివి బయలుదేఱినవా? మహా మహానిశితములై–మహాసూక్ష్ములైన–యనేక సహస్రాశ్వధాటిగల యంత్రములైనఁదీయఁజాలని–మిగుల సన్ననైన దారములను మనసేతగాండ్రు (డక్కాలోనివారు) వట్టిచేతులతోఁదీయఁగలుగుట యత్యంత పరిశ్రమోన్నతశక్తి కధికతమావధి కాదా? ఆహా! వారి వ్రేలికొన లెంతమృదులములో–యెంత సూక్ష్ములో–యెంత స్పర్శేంద్రియ మహాశక్తి మహనీయములో–యెట్టిసంపూర్ణ చాకచక్య పరిపక్వతాదశ నొందియున్నవో–ఆలోచించుకొనుటకైన మనకు భావనాశక్తి కలదా? ఎంత చిరకాలాభ్యాసమున నెంత యక్షీణ దీక్షాదక్షతచే వారికి మహామంత్రములకైనను లొంగని మహిమ ప్రాపించెనో యెవ్వరు చెప్పగలరు? మూఁడునాల్గు వందల సంత్సరముల క్రిందటివఱకీ పరిశ్రమనైపుణ్యము బాగుగా నున్నదికదా? జహాంగీరు కాలమందుఁ బదునైదడుగుల పొడవును మూఁడడుగుల వెడల్పునుగల యొక్క సెల్లాను డాక్కా నేతగాండ్రు పాదుషాగారి సెలవుపైన నేసిరిట! అది తొమ్మిదివందల యవగింజలెత్తుండెనఁట. దాని కాఱువందలరూప్యములు ఖరీదట! అంత పొడవు వెడల్పుగల సెల్లానే 1840-వ సంవత్సరమునం దచ్చటనే నేసిరి. కాని యది పదునాఱువందల యవగింజలెత్తుండెనఁట. దానివిలువ నూటయేబది రూపాయలమాత్రమే. అప్పటికే యావిద్య యంత మొందుచున్నట్లు స్పష్టపడుట లేదా? ఇట్టివిద్యను మనదేశీయులు బుద్ధిపూర్వకముగాఁ బోగొట్టుకొనిరి. ఇందుల కేమి కారణము? ఏకారణములు చెప్పిన నిప్పుడేమి వినియోగము –మన ప్రారబ్ధమే ప్రధానకారణము. సంపత్తునశించినది. స్వాతంత్ర్యము మాయమ్మైసది. స్వీయసరిపాలనములో మొండెచేయి పుట్టినది. తూర్పుగాలిచేఁ బడమటిదేశములకు మన పాటవము ప్రతిభ, స్వాతంత్ర్యము, బంగారము, వైభవము వెగిరిపోయినవి. బానిసలమై పననకాయఁ గొట్టుకొనుటకైన కత్తిలేక, యేడుకత్తుల సైనుగుడ్డలే మహాభాగ్యములని యేడువవలసి వచ్చినది.

నాయనలారా! ఇంత చెడియున్నను–నిట్టి మహాదుర్దశలోనైనను–మన మత వ్యర్థులమై యుండలేదు. ఇప్పటికైనఁ దూర్పున 'పొందూరు' మొదలగు గ్రామములలోఁ బశ్చిమమున మఱికొన్ని కొన్ని స్థలములలో 'దేస్ వాళా' నూలు నొడుకువార లనేకులున్నారు. దానినే

బాలనూలనికూడ నందురు. ఆనూలు నొడుకువారిలో మాలవాండ్రు విశేషముగా నున్నారుకాఁబోలు! మన యీవిద్యను గాపాడి మన దేశప్రతిష్ఠను నిలిపి, మన కమూల్యవస్త్ర సాధనములను గల్పించి యనేకవిధముల మనకుఁ దోడుపడుచున్నవా రెవ్వరు? పశువుల కంటె నెవ్వరిని మనము హీనముగాఁ జూచుచుంటిమో–యెవ్వరిని సమీపించి మనము వృత్తికాస్పానము లాచరింతుమో–యెవ్వనిపే రుచ్చరించిన యెడల మనకు రౌరవాదినరక ములు ప్రాప్తించునో–యట్టి మనసోదరులగు పంచములే! ఉన్నతజాత్యుద్భవులారా! ఇప్పుడైనఁ దలవంచుకొందురా? ఇప్పుడైనఁ సిగ్గుపడుదురా? ఇప్పుడైనఁ బశ్చాత్తాపము నొంది బాష్పములు విడువరా? పాదములక్రింద మట్టిపురుగు మొదలు పరమేశ్వరునివఱ కొక్కటే తత్త్వమని కోటిజిహ్వలతో–గోళాంతరములలోనికిఁగూడ వినఁబడునట్లు దివ్యమ హాగాన మొనర్చుచున్న వేదములు పుట్టిన మనదేశమునేకదా యీ విపరీతచర్య! ఈ నీవు నేను భేదము! ఈ యధికన్యూనతారతమ్యము! ఈ చూడరాని యంటరాని చెప్పరాని శబ్దస్పృష్టి! ఛీ! తుట్టతుద కట్టివారే మన కర్మవిద్యలను గాపాడి, మన పరువు లిప్పటికైన, నింతవఱకైన నిలువఁబెట్టుచున్నారు. ఆమాలనూలుతో నొడికిన బట్ట 120 నంబరుగల సీమనూలుబట్టకంటె సన్నముగా నుండదు. కాని జిగిలో–బింకములో–సాగుడులో –గఱకులో–గడుసుఁదనములో–Manchester సైనులు Glasgow మల్లులు వానికాలిక్రింద దిగదుడుపు. మాలనూలుబట్ట లరుగవలసినవేకాని వాడుకవలనఁ జినుగునవిమాత్రము కావు. మాంఛెస్టరు మల్లుపంచెలజత యొక్కసంవత్సరముకంటె నెక్కువ నిలువయుండదు. మాల నూలుపంచెలజత యాఱుసంవత్సరము లుండును. అప్పటికైన గ్రొత్తదివలెనే యుండును. నిగనిగ కఱకు పెళపెళ దానిని గాల్చినయెడలఁ బోవలయును గాని యంతకుముందు మాత్రము పోదు. వర్తకులారా! పరిశ్రమాభిమానులారా! ధనాధికులారా! ప్రభువులారా! దేశాభిమానులారా! ఇప్పుడైనఁ గన్నులు తెఱవరా? స్వదేశపరిశ్రమ విద్యాసంరక్షణ మాచరిం చరా? పరిశ్రమ విద్యాపండితులకు జేయూతనీయరా? మీధనము మీలో నుండునట్లు చేసికొనరా? విదేశీయపుఁ బైమెఱుగులను ద్రోసివేయరా? స్వదేశీయపుసారమును గ్రహిం పరా? ఏమంత మహోపకార మొనర్పవలయును? మీ రూరకే ధనరాసులను వెదజల్లనక్కఱ లేదు. రక్తమును ధారపోయ నక్కఱలేదు. మాలనూలుబట్టలే కాని కట్టుకొనమని ప్రతిజ్ఞ చేసినఁ జాలును. అదియైన మీరు చేయఁజాలనప్పుడు–వెనుకఁ జేసి తప్పిపోయినప్పుడు–మీకీ నిన్నత్వము నిర్భాగ్యము నిరాధారస్థితి యాశ్చర్యము కాదు. ముమ్మాటికిఁగాదు. ఎప్పుడో –యేదో–వచ్చుననియు నప్పు డన్నియుఁగూడఁ జక్కఁబడుననియు వెఱ్ఱియాస పెట్టుకొని చుక్కలవంకఁ జూచుచున్నారుకాఁబోలు! వచ్చునది నెత్తికిఁ జేతులు–కంటికి నీరు–నోటికిఁ దాళము–చేతిలంకె–గుండెకు దడ–మీరు మీకు సాహాయ్యము చేసికొన్నప్పుడు కదా పైవారి సాహాయ్యము. పరమేశ్వరుని సాహాయ్యము! యజ్ఞోపవీతములు శిథిలమైనప్పుడు కాని తీసికొని నుబ్బిసెట్టి యొద్ద సీమనూలు జందెములకై పోవుదును గాని పావులా డబ్బులిచ్చి స్వదేశీయబ్రత్తితో–కృతయుగమునుండి వచ్చుచున్న స్వదేశీయపుఁ గదురుతో బ్రహ్మము ఖోత్థిత వేదమంత్రోచ్చారణముతో–నొడికిన, పవిత్ర స్వదేశీ యజ్ఞోపవీతములు కొనఁజా లవే! ఆహా! ఇంతకంటె విరుద్ధత కలదా! నీపైనలీయూరనున్న శివయ్యశాస్త్రులను జేరుట మంచిదా! పై ఖండమునందలి Simpson & Co ను జేరుటమంచిదా? నీపైన స్వదేశములో నుండుట మంచిదా? Germany కుఁ బోవుట మంచిదా? ఈమాత్రమైన నాలోచించుకొన

లేదా? మఱియు యజ్ఞోపవీతనిర్మాణమున నాఱితేఱిన మహావిద్వాంసులున్నారు. మహామహోపాధ్యాయులున్నారు పదిజందెములొడికి సెనగకాయలో నిముడ్పఁజాలిన వారనేకులున్నారు. విలాసార్థముగా నైనఁ-బరీక్షార్థముగా నైన-వారి విద్యను జూడవలదా? చూచి యానందింపవలదా? ఊపిరి ముక్కునుండి గట్టిగా వచ్చినయెడల నొడుకుచున్న సన్నదార మెక్కడఁ దెగిపోవునోయని ముక్కునకుఁ జిన్నగుడ్డను బిగించుకొని గాలియేమాత్రమైనను దగులని చీఁకటికొట్టుఁలో గూరుచుండి చిన్న దీపపు వెలుతురు సాహాయ్యమున యజ్ఞోపవీతముల నొడుకు మహానిపుణులకష్టములైనఁ జూచి బళీయనదగదా? వారిని బహుమానించదగదా?

ఇట్టి మిక్కిలి సున్నితములగు చేతిపనులెన్నో యంత్రాదిసాధన నిర్మాణమున నశించినవి. కుట్టు యంత్రములు వచ్చిన తరువాతఁ జిత్రవిచిత్రాతి విచిత్రములగు చేతికుట్టు పను లెన్ని నేలు నశించినవి! ఆహా! ఆలోచించు కొనుటకు హృదయముండవలయునుగాని యీదుర్దశాఫలమైనహృదయభేదమున కంతముండునా? పాళీలు వచ్చిన తరువాతనే కదా వ్రాతసొగసులన్నియు గోతఁబడినవి. నూరుసంవత్సరముల క్రిందటివారి వ్రాత తాటాకుమీదిది గాని. యేఁబది సంవత్సరముల క్రిందటివారి వ్రాత కాగితముల మీఁదిది గాని, చూచినయెడల నప్పుడు వ్రాసినట్లు, జీవకళలుట్టిపడునట్లు, పత్రముమీఁదినుండి పైకుబికినట్లు-చల్లగనిశ్శబ్దముగాఁ బ్రవహించినట్లు-ముత్యాలకోనలవలె, తొండపుగొలుసుల యల్లికవలె, స్పష్టముగా, జిగిబిగిగా, నేత్రపర్వముగాఁ గనఁబడునే-ఆగంటములేవీ? ఆబాతుటీఁక లేవీ? ఆనెమిలి కలము లేవీ? ఏమియు లేవు. పాళీలు సర్వతోముఖముగా వ్యాపించినవి. వ్రాతసొగసులు సంపూర్ణముగాఁ బరమపదించినవి. గుండ్రకత్తున నొక్కటేపాళి, కోలకత్తున కొక్కటేపాళి. కుడివ్రాలున కొక్కటేపాళి. యెడమవ్రాలున కొక్కటేపాళి. తలకట్టున కొక్కటే పాళి. Down stroke న కొక్కటే పాళి. తెనుఁగున కొక్కటే-ఇంగ్లీషున కొక్కటే-ప్రపంచ భాషలన్నిటికిఁగూడఁ బాళి యొక్కటే! పేనాకలము లెప్పుడు పేరు మాసినవో Penknives అప్పుడే యంతరించినవి. ఇంక నిప్పటి వ్రాఁతలు-తలవెండ్రుకల చిక్కులు-గొగ్గిపండ్లు-గ్రుడ్డిగచ్చకాయలు-సిరాలో మునిఁగిన సాలెపురుగు ప్రాకుటలు-కోడి కొక్కిరింపులు-కొకిబికలు-ఇకలుకలు-తికమకలు. ఈచురవస్థకే యేడ్చుచుండగా దేశీయుల మహారణ్యమున Typewriter దాపురించినది. ఇఁక సంతకములుగూడ జేయఁజాలని దురవస్థాగ్రగణ్యము సిద్ధముగ నున్నది. అక్షరాభ్యాసమైనది మొదలు హరియని యంత మొందువఱకు-నిరంతరాభ్యాసమున్న యీగోతిపనికి జీవప్రాయశ్చిత్తమిట్లొనర్చితిమి కదా! దీని బ్రదుకే యిట్లు తెల్లవాఱి పోవగనితరములగు చేతిపనులబ్రదుకు లడుగవలయునా?

కాశ్మీరపుసాలువుల మాటయేమి? ప్రభువుల ప్రక్కలపై-పండితుల తలలపైఁ-గవుల భుజములపై-ధనికుల మెడలపైఁ-బెండ్లిబహుమతుల దొంతరులపై -బంగారుసింహాసనములపై-నంగీలరూపముగా మహమ్మదీయుల గాత్రములపై -మహమ్మదీయకాంతల నీలాల ముంగురులపై-వర్తకుల దండెములపై నన్ని యాభరణములపై - నన్ని సొగసులపైనాడి-పైనాడి ప్రకాశించినవే కదా కాశ్మీర రాంకవములు! నానివ్యాప్తి మనయొక్క దేశమందేనా? కాదు. చీనాలో - జపానులో- పారశీక దేశములోఁ -దురుష్కస్థానములో-ఇంతేనా కాదు కాదు. రెండువందల వత్సరములక్రిందట Franceలో

England, Germany లో Russia లో–చక్రవర్తిని మొదలు దాసివఱకుఁ గాశ్మీరపు సేలువును ధరింపని కాంత లెవ్వరైనా నుండిరా? ఆకాలమందలి–యంతకుఁ బూర్వమందలి–కాంతలకుఁ దలలపై శిరోజము లెట్టి యలంకారమో, కాశ్మీరపు సాలువట్టిది. ఆకాలమందలి పురుషులలో నది చలికొఱకు గప్పుకొనిననా రెవరు? శీత నివారణమునకై –చిత్రాలంకారసౌభాగ్యమునకై–దానిని మెడకుఁ జుట్టుకొనిన వారెవ్వరు? ఒక్క మన ప్రపంచార్థమున నందేనా వానివ్యాప్తి? కాదు కాదు. అమెరికావారి కవియనఁగ నందఱకంటె వెట్టి. ప్రపంచమునంత నొక్క యూరపుతో నొక్కధాటితో నాకర్షించినది కాశ్మీరపు సేలువే కాదా? హిందూస్థాన పటముఖమున రావి రేకవలె నుండురవంత కాశ్మీరదేశమే యగస్త్యుడు సముద్రమునువలె నాపోశనము పట్టినదే? ఇప్పుడట్టి వేమయ్యెను? ఏమయ్యెనా? కఱవయ్యెను. కలయయ్యెను. మన్నయ్యెను. మాయమయ్యెను. స్వదేశసౌభాగ్యమంతయుఁ జచ్చిన తరువాత జర్మనీధావళీలను గప్పుకొని స్వదేశాభిమానుల మని మహా నాగరకులమని యనిపించుకొనుచున్నాము. పోనిండు. జర్మనీగంతలేల? బళ్లారికంబళ్లను గప్పుకొనగూడదా? అవి మాత్ర మేమి సామాన్యములా? అవి యెట్టి మహోన్నత దశాపరిపాకము ననుభవించినవి? వానిలోనను వేలకొలది రూప్యముల విలువగలిగియున్నవే! ఇంగ్లీషు ట్వీడ్డులవలె French flannels వలెనవి యెంత ప్రశస్తముగా నుండెడివి కావు! వానిని గత్తిరించి కోట్లుగా నెందఱు ధనికులుపయోగించి యుండలేదు! నిజమే! అవియట్టివే! కాని యవిమాత్ర మిప్పుడు పూర్వోన్నత స్థితిలో నుండెనా? వానిలోఁగూడ క్షీణత్వ మారంభించి యెంతకాలమైనది? దేశాదృష్టము చెడినప్పుడాచే టొక్కదానిలో మాత్రమే కనఁబడి యూరకుండునా? చెట్టుమొదలు చెడినప్పుడుత్తరపుగొమ్మ నశించి, దక్షిణపుగొమ్మ నశింపకుండునా? ఇనుపచుట్టు (Spring) వదలిపోయిన గడియారమున కొక్కములాగి వేఱొక్కములు తిరుగునా? జీర్ణకోశము చెడి యగ్ని మాంద్యము సిద్ధించినప్పుడు దుర్బలత యన్నియవయవములకుఁ గూడ సమానముగనే సిద్ధింపదా? బళ్లారికంబళ్ల బ్రదుకట్టులైనప్పుడేలూరురత్న కంబళ్లబ్రదుకింతకంటె భిన్నముగా నేడ్చునా? ఏలూరు తివాసులు ప్రపంచమునందలి యన్ని ముఖ్యపట్టణములలోఁ గూడ నున్నవికావా? వానిమీఁదిలత లావరింపని సీమలున్నవా? వానిమీఁది పుష్పములు పరిమళింపని దేశములున్నవా? అవి యిప్పుడెక్కడనైనఁ గనబడుచున్నవా? అక్కడక్కడ గనబడినను, వానిని గొనినవారి నెవ్వరినైనఁ జూచితిరా? మనతండ్రుల కాలములోఁ గొన్న వేమైన నిలువ యుండవలయును గాని మనకాలములో సంపాదించినవి మాత్రము లేవనుట సత్యమునకు దూరము కాదు.

నాయనలారా! కుంభకోణపుఁజెంబులో, వారణాసీవసనములో, విశాఖపట్టణపు దంతపుబనిలో, మధురరంగులో, బ్రహ్మపురపుబీతాంబరములో, సేలము పంచెలో, ఉప్పాడ బట్టలో ఇటులెన్ని చెప్పవచ్చును? ఎవరితో జెప్పవచ్చు? ఎవరితోఁజెప్పిన నేమి వినియోగము? అరణ్యరోదనముకంటె భిన్నమా! వట్టి కంఠశోషము తక్క ఫలమేమున్నది? మనకుఁ బూర్వమునఁ బరిశ్రమలు లేవనియు, నిప్పుడవి నాట్యమాడుచున్న జాతీయతకు వెనుకపాడుచున్న వనియుఁ గ్రిందటిసారి యుపన్యాసకర్త చెప్పుటచేత వీనిని కూర్చి యింతవఱకైనఁ జెప్పనలసి వచ్చినది. అవి వెనుక పాటపాడుచుండుట లేదు. వెనుకటి యున్నత స్థితికై యేడ్చుచున్నవి. ప్రగతాధమస్థితికై యేడ్చుచున్నవి. భావిదశ యింతకంటె నథమముగా నుండునేమో యని మఱింత యేడ్చుచున్నవి. వానిరోదనము గానమువలె

నామహానుభావునకు వినఁబడినది. ఆతని దెంత దివ్యమైన చెవియో?

ఈయంశము లన్నియు మీరు పూర్ణముగా నెఱుఁగుదురు. మీకొక్కటియైనఁ జెప్పవలసిన యావశ్యకత లేదు. కాని యొకందులకు మాత్రము చెప్పవలసి వచ్చెను. మీరు దేశాభిమానులనుకొనుచున్నారు. దేశభక్తులనుకొనుచున్నారు. స్వదేశీయ పరిశ్రమాది విద్యా ప్రోత్సాహకు లనుకొనుచున్నారు. మహానాగరకు లనుకొనుచున్నారు. మీకు సోదరులు శ్రీ –మీకుఁ బ్రియసోదరులు–నగు పరిశ్రమ విద్యాపండితులు–మగ్గములు వదలి, జోలెలు ధరించి, మాధుకర మెత్తుకొనుచుండఁ గొలిమితిత్తులను బట్టుట మాని, కలిగినవారి కాళ్లు పట్టుకొని పొట్ట పోసికొనుచుండఁ గర్మశాలలలోని కట్టి సామానులు గాడి పొయ్యిలలోఁ బడి యార్యావర్తదేశమందలి కర్మదేవత కగ్ని సంస్కారవిధులకుఁ దోడ్పడుచుండ, మీసోదర భావ మెంతో–దేశభక్తి యెట్టిదో–పరిశ్రమ విద్యాప్రోత్సాహ మేమాత్రమో –నాగరకతామాహాత్మ్య ముపన్యాసకర్త చెప్పినట్లు ఏ Grade లోనిదో మీరే యోజించుకొనవ లయు నని యీమాటలు మీతోఁ జెప్పవలసివచ్చెను. అది గాక మీరు సంపాదించిన విద్యలవలన దేశమున కేమియు లాభములేదు. మీరు BA. BL. MA. ML. మొదలగు మహాపరీక్షలలో నుత్తీర్ణులైనవారే కావచ్చును; మీ రాంగ్లేయభాషలో ''నయాగరా'' జలప్రపాత మువలెఁ జెవులు చిల్లులుపడున ట్లుపన్యాసముల సనర్గళధోరణితో నాకాశమెగురున ట్లోయఁగ లవారే కావచ్చును. మీ Resjudicata మీ Easements దేశమున కిప్పు డక్కఱలేదు. మీ Sulphuretted Hydrogen తోను Refraction of Light తోను దేశమునకుఁబని లేదు –మీజమూబంది లెక్కలు–మ్యునిసిపాలు డొక్కలు–తేయాకు ప్రాయ్యిలలోకే కాని దేశదీస్తికిఁ బనికిరావు. లెండు లెండు. నెత్తిపైనున్న జీలుగుబెంటుబుట్టలను వంటప్రాయ్యిలలోఁ బాఱవేయుఁడు. ఒడలిమీఁది గౌనులు తీసివైచి చిలుకకొయ్యలఁ దగుల్చుఁడు. ప్రత్తిబుట్ట లను ముందుబెట్టుకొని మీరుకూడ మావితంతువులతోఁ గలిసి కూరుచుండి దారమును బేనుఁడు. కొలిమిగోతులను మీపూర్వోపన్యాస పత్రములతో నంటింపుడు. గొట్టెబొచ్చును గత్తిరింపుడు. తోళ్లను బాగుచేయుడు. కదుళ్లు సుత్తెలు బొడిదలు అంపములు మొదలగునవి చేతఁబట్టుడు. ''జయా భరతమాతకు జయా!'' అని సుత్తెతో దాఁగటిపై గట్టిగాఁ గొట్టుడు. నాల్గుదిక్కులనుగూడఁ గొట్టుఁడు. అదియే మీ విజయభేరి!

ఇంత సంగ్రహముగాఁ జెప్పినను జాలనైనది కాఁబోలు. ఇంతకును Fine Artsను గూర్చి చెప్పనేలేదు. ముందెప్పుడైనను జెప్పెదను–

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

21. గ్రహచక్రజ్యోతిషము

సాక్షి, తమ సంఘం ఉండే అద్దె ఇంట్లోకి ప్రవేశించే సరికే, శ్రోతలు అలవాటు ప్రకారం అప్పటికే చేరుకున్నారు. ''ఎండలు అప్పుడే ఎక్కువగా వున్నాయి. వైశాఖ మాసానికి ఎలాగుంటాయో!'' అని సాక్షి, మాట వరసకి అన్న మాటని అందుకొని – జంఘాల శాస్త్రి ఉపన్యాసం మొదలు పెట్టాడు.

ఈనాటి జంఘాల శాస్త్రి ఉపన్యాసమంతా గ్రహగతుల మీదకీ, తోకచుక్కల మీదకీ నడిచింది. దీనికి ఇంకో ప్రేరణ కూడా వుంది. గ్రహగతుల్ని గురించి పాశ్చాత్యులు నడిపే ఒక పత్రిక రాబోయే ఒక తోక చుక్క గురించి ప్రచురించిన వ్యాసం. ఒక తోకచుక్క గనుక భూమిని తాకితే ఎంత ఉపద్రవం జరుగుతుందో, శాస్త్రి భయం కలిగేలాగ చెప్పాడు. అదే పత్రికలో మరో పేజీలో వ్రాసిన విషయం – సూర్యుడిలో దీప్తి తగ్గిపోతోందని, అందువల్ల ప్రకృతి వైపరీత్యాలు భావిలో ఏర్పడతాయని ఎత్తుకొని ఆ వ్రాసిన ప్రకృతి శాస్త్ర పండితుడి అభిప్రాయాన్ని, శాస్త్రి ఇందులో ఆక్షేపించాడు. అనలు మామూలుగా వచ్చిన ఆపదలనే వేదాంత విజ్ఞానంతో తొలగించుకోవలసిన అవసరం వుండగా, యెప్పుడో రాదలిచిన, వచ్చినా, విచారించడానికి కూడా ఎవరూ మిగలని, ప్రతిక్రియ చేయదగని, ఆపద లిప్పుడు వచ్చినట్లు ఏడ్చేవాడెవడై వుంటాడు? శాశ్వత వస్తువు నీలోనే వుంది. దానిమీద దృష్టి నిలుపు అని జంఘాల శాస్త్రి తన సందేశాన్ని విస్తరించి చెప్పబోతోంటే, శ్రోతలంతా మరింక వినిపించుకోకుండా వెళ్లిపోయారు.

నిన్నటి యలవాటు ననుసరించి జనులు మూఁగిరి. నేనుగూడఁ బోయి లోనఁ గూర్చుంటిని. ''ఎండ లప్పుడే మిగులఁ దీవ్రముగ నున్నవి. వైశాఖమాసమున నెట్లుండునో'' యని నేను యాదృచ్ఛికముగఁ బలుక, నంతవఱ కేమియు మాటలాడక యేదియో తనలోఁ దానాలోచించు కొనుచుఁ దల వంచుకొని కూరుచుండియుండిన జంఘాలశాస్త్రి తటాలునఁ లేచి యుపన్యాసపీఠ మెక్కి యిట్లు పలుకఁదొడఁగెను.

''కావా? ఎక్కువగుచునేయున్నవి. ఇంకను నెక్కువగును. భరించుటకైన శక్యముకాకుండ నెక్కువ యగును. ఈనిదాఘతీవ్రత్వమునుగూర్చి మన మేమో నిర్లక్ష్యముగఁ జూచుచున్నారము. మనకేమో చీమ కుట్టినట్టులైన లేకుండ నున్నది. ఇది యెంత లోకోపద్రవమో కానంతయైన మనవా రెవ్వరు నాలోచింపరైరి. ఆహా! యెంత యజ్ఞానము! ఏసంవత్సర

మున కాసంవత్సర మెండలు హెచ్చిపోవుచున్నవి. వర్షములు తగ్గిపోవుచున్నవి. భూమిలోని సారము హరించిపోవుచున్నది. భూగర్భమున నుండునగ్ని యధిక మగుచున్నది. లతావృక్షాదులు నీరసము లగుచున్నవి. మనుజులమాట చెప్పవలసిన దేమి? ఏడు తరముల క్రింద జీవించినమనుజుఁడెవఁడైన దైవమాహాత్మ్యమునఁ బునరుజ్జీవితుఁడై మనలఁగాంచునెడల మనము మనుజజాతిలోనివార మని యాతఁడనుకొనఁజాలఁడు. గేదెముందు లేతపెయ్య లెటులుండునో వానికంటికి మన మట్లు లగపడుదుము. మన కింక నెట్టికొంకనక్కలు పుట్టుదురో! పదేండ్లబాలిక రజస్వల యగుచున్నది. పదునాలుగేండ్ల తలనరిసినబాలుఁడే డాదికొడుకు నొడిలోఁ బెట్టుకొని యతనితోపా టేడ్చుచున్నాఁడు. ఊఁదరఁగొట్టిన యరఁటికాయవలె నుష్ణముచేనట్టి యట్టిపక్వమై పరమపదించుచున్నారు. ఇప్పటి దుస్థితియే యిట్టులుండ నిఁకముం దెట్టులుండునో! ఇంతకును గారణ మీయెండ. సూర్యుని యాకర్షణ శక్తి యధికమగుటచేత భూమి దినదినమునకు సూర్యుని సమీపించుచున్నది. మనతండ్రులనాఁటికంటె మననాఁడు మరిఁత దగ్గఱకుఁ బోయినది. ఆహా! సోదరులారా! ఇఁక నెట్లుగాఁ బరిణమింపఁ దలఁచియున్నదో యాలోచించినారా? నిమిషమునకు మహాగ్ని కుండము సమీపించుచున్నది. ఎప్పుడో–ఏపగలు మనము భోజనముచేయుచుండఁగనో! ఏరాత్రి–నిదురఁబోవుచుండఁగనో–గబుక్కున–మిడుత దీపములోవలె నీ రత్నగర్భ –ఈసాగరమేఖల ఈవసుంధర – ఈసర్వప్రాణకోటినివాసము – హోమకుండమున నాజ్య బిందువువలె–నాహా!. ఆ గ్రహరాజములో–నట్టిపడి యవిదితస్వరూపముగ–నంతరించి పోవదా? పోవుటకేమైన సందేహ మున్నదా? ఇంతమట్టునకు వచ్చిన పిమ్మట నాకానంతప నియు మాత్రము కాకుండునా?

ఇదిగాక యీపత్రికఁ జూచితిరా! ఇది గ్రహగతులఁగూర్చి పాశ్చాత్యులచే వ్రాయంబడు గొప్పపత్రిక. దీనిలో నే మున్నదో వింటిరా? ఇఁకఁ గొన్ని సంవత్సరముల కొక గొప్పతోకఁ చుక్క యవతరించునఁట! దానితోఁక యెన్నికోటుల యోజనములపొడవో యుండునఁట! దానినడక నిచిత్రమఁట! అది యొక క్రమము ననునరించి పోదఁట! అంతగొప్పతోఁకతో –నత్యున్నతధోరణితో – నాభీలవేగముతో – నది యొక్కటి యీడ్చి మనభూమినిఁ గొట్టినయెడలఁ గాలితోఁ దన్నిన తోలుబంతివలె మనగోళ మెక్కడ కెంతవఱి కెట్టు లెగిరిపోవునో యాలోచించుకొనుటకైన నవకాశ మున్నదా?

ఆత్రోపులో–నవని యట్టు లంతరిక్షమార్గముల నెగిరిపోవుచుండ మనగతి యేమి కావలసినదో కానంత యాలోచించితిరా? చెట్టు దులిపినప్పుడు నేరేడుపండ్లు జలజలా రాలినట్లు, చెప్పుఁ దీసికొని యుంకించి మూతిమీఁదఁ గొట్టినప్పుడు నోటిపండ్లు రాలినట్లు భూమినుండి–చెల్లాచెదరై – యథాయథలై – తలబీఁకనకాయలై యెగసిపడి–అదరిపడి –యంతరిక్షమున నుండి జలజల–జరజర–బిఱబిఱ క్రిందకుఁ బడిపోమా? ఆ! క్రింద యెక్కడ నున్నది–భూమిని వదలినవానికిఁ గ్రింద యెక్కడ నుండును? అట్లంతరిక్షమున నుండి దిబుకు దిబుకున నెన్నియుగములు దిగిపోవుదుమో? అదికాక–మాటవరుసకుఁ జెప్పుచున్నాను. తోఁకచుక్క దెబ్బతో భూమి యట్లెగిరినపుడు మనము స్తంభములను గట్టిగాఁ బట్టుకొనికాని, మన భార్యాపుత్రాదుల నంగవస్త్రములచేఁ, ద్రాళ్లచే మంచపుఁగోళ్లకుఁ గట్టిగఁ గట్టిగాని మనము భూమినుండి యెగసిపైకిఁ బడిపోకుండ జాగ్రత్త

పెట్టుకొనఁగల మని యెంచినను మన కుపద్రవము దాఁటిపోయిన దనుకొంటిరా? లేదు సోదరులారా! లేదు! ధూమకేతుపుచ్ఛతాడనమున నల్లగసిన యీగోళము తలఁపరాని తీంద్రమున–రంయిరంయిమని చెవులు గింగురుపడు భయంకరశబ్దముతో–నంతరిక్షమునఁ బోవుచుండఁగ–దానిదారి నడ్డువచ్చిన మరియేయితర గోళముతో–రోదసీకుహర మదరున ట్లు–టక్కుమను మహానాదముతో – తలపడి డీ డిక్కిగొట్టుచో పండుదోసకాయ విచ్చినట్లు మన గోళము విడిపోదా? మనము ఓక్ ఓక్కనుచు రక్తవమనములు చేసికొనుచు గొట్టములో నుండి వెన్నముద్ద లెగసినట్లు పై కెగిరిపోమా? మనగోళమువారు కొంద రితరగోళములలోఁ బడిపోవరా?

అదిగాక–యీపత్రికలో ముప్పదియేడవ పత్రమున నేమున్నదో చూచితిరా? ఇది ప్రాసినయాతఁడు మరియొక పాశ్చాత్యుఁడు. ఈతఁడు ప్రకృతిశాస్త్ర పండితాగ్రగణ్యుఁడు. సూర్యునిలోనున్న వంటచెఱుకు తగ్గిపోవుచున్నదఁట! అందుచేతనే సూర్యదీప్తి తగ్గుచున్నది. ఇట్లు కొంతకాలము జరిగిన పిమ్మట సూర్యుఁ డుద్దీపనసామగ్రీశూన్యుఁడై యారిపోవచ్చును. ఈతఁ డిట్లభిప్రాయపడుచున్నాఁడు. జరిగిన జరుగఁగలదు. శాస్త్రవాక్యము ప్రమాణము. సూర్యుఁడే చల్లారిపోవునప్పుడు చంద్రుఁడు, నక్షత్రములమాట లెక్కయేమి? ప్రపంచ మంత గాఢాంధకారమయ మగును గాదా? కన్నుకన్ను కనపడనియట్టి ఘోరతిమిరావస్థలో–నొక్కటే కాళరాత్రి కాఁబోలు! పగలు, రేయి విభాగము నశించునుగాదా? ఆహా! చలిచే నెట్లు వడఁకి పోయి, కొయ్యబారిపోవుదుమో! అన్నము వండుకొందమన్న–చలి కాఁచుకొంద మన్న–నగ్గిపుల్లలయిన వెలుఁగునో లేదో–సోదరులారా! ఒక్కసారి కన్నులు గట్టిగ మూసికొని యిట్టి యనంతరాత్రి సిద్ధించిన దని మనసులో నెంచుకొనుఁడు. ఒక గ్రుడ్డివానికి దారిఁ జూపవచ్చునుగాని యందఱు గ్రుడ్డివారైనయెడల నేది గతి?

దురంతమగు చలిచేఁ జావకుండ నిల్చినయెడల నన్నము వండుకొనుట కగ్నిలేనివారమై–యందుచే క్షుత్పిపాసాపీడితులమై–కడుపు మండుకొనిపోవఁగఁ–గరుణలేక–కనఁబడక యటునిటు కరములఁ దడుముకొనుచుఁ–గాంతలను గన్నవారినిగూడఁ బట్టుకొని కఱకఱ నమలి కడుపు నిండించుకొందుమేమో! ఆహా! ఈదురవస్థ తలఁచుకొననొడలు జలదరించుచున్నది. రణకంప మగుచున్నది. గుండె లవిసి నీరైపోవుచున్నవి. మరియొక్క యుపద్రవముకూడఁ గాన్పించు చున్నది!

ఆరిపోయినసూర్యుని కాకర్షణశక్తి యుండునా? గ్రహచక్రవర్తికే యాకర్షకణశక్తి యడుగంటినప్పు డితరగోళము శెట్టు లంతరిక్షమున నిలువఁ గలవు? పైనుండు గోళముపై బడునేమో! అప్పుడేమి యగునో! ఛీ! ఛీ! దుర్జ్ఞేయమగు నీసన్నివేశమును స్మరించినందువలననే నరముల బింకము వదలి, కాళ్లు స్థానములు చెదరి తలప్రాణము తోఁకకు వచ్చుచున్నది. ఇఁక నేను జెప్పలేను. ఈపత్రికను జూచినప్పటి నుండియు నిరాహారుఁడనై మనసు చెదరియున్నాను'' అని పెద్దనిట్టూర్పు విడిచి జంఘాలశాస్త్రి కూరుచుండెను. సభాసదులందఱు తెల్లఁబోయి దీర్ఘనిశ్శ్వాసములతోఁ గూర్చుండిరి.

దిబ్బడివైచిన తనముక్కు నటునిటు బింకముగ దబాయించి కుంభకరేచకసాధనమునఁ బ్రకాశించు కాలాచార్యులు–పోఁగొట్టుకొనుటకు భార్యగాని, పిల్లలుగాని, సోదరులుగాని, యెవ్వరును లేని కాలాచార్యులుగూడ నీయుపన్యాసానంతరమున

–నేమో దీర్ఘాలోచనమున మునిఁగి యుండెను. సూర్యుఁ డారిపోవఁగఁ గలుగుగాఢాంధకార మున నన్యభిక్షకెట్లు పోవచ్చు ననియో, యగ్ని కారణము లేకుండ నన్యకార్య మెట్లుసిద్ధించు ననియో మనస్సునఁ దటపటాయించుచుండెను గాఁబోలు! కవియగు వాణీదాసుఁడును వెర్రివాలకముతో నుండెను. తోఁకదెబ్బ తగులుటచే నెగిరిపోవుచున్న భూమి గోళాంతరముతోఁ గొట్టుకొనినప్పుడు తా నెగిరి యవతలిగోళములోఁ బడిపోవునప్పు డక్కడనుండుభాష తెలుఁగుగానియెడలఁ దనకవిత్వమున కచ్చట వ్యాప్తి కలుగక పోయినయె డల నేమిబ్రదుకురా? భగవంతుఁడా! యని కాఁబోలు గాఢయోచనానిమగ్నుఁడయ్యెను. ఇఁక సభాస్తారు లందఱుఁగూడ నెంతమాత్రము స్తిమితత లేకుండ నున్నట్లు నాకుఁ గానిపించిరి. అనుభవింపకుండ నవనిలోఁ బూడ్చిపెట్టిన వరాలముంతమాట యేమి? యనికాఁబోలు నొక్కఁడును, బ్రస్తుతము జరుగుచున్న నావ్యాజ్యేములో చచ్చినట్లు ప్రతివాదిమీఁద ''కోర్టు'' వారు చెప్పవలసిన తీర్పు వినకుండనే యీ యాపత్తు వచ్చినా? యని కాఁబోలు నొక్కఁడు, నెందులకయిన మంచిది, రావలసిన పద్దులు త్వరగ ''వసూలు చేసికొనరాదా'' యని కాఁబోలు నొకఁడు, నిటులే తల కొక్క వెర్రియూహమున –మనశ్శాంతి లేకయుండి రసి నే ననుకొంటిని. తూర్పున నున్న ఛత్రపురమున నుండి మానత్యపురమునకు నీళ్ల కావిళ్లమోఁతచే జీవించుటకు వచ్చినయొక నాతి ''అయ్యా! మా పిన్నమ్మ నిన్న నేను వచ్చినరికిఁ గ్రొత్తగఁ బెట్టిన యావకాయ నెండవైచుచున్నది. బాబూ! అది యెండకుండఁగనే సూర్యుఁ డారిపోవునా?'' యని–నుదిటిపైనఁ జేయి పెట్టుకొని, లోన గిజగిజఁ గొట్టికొనుచున్న జంఘాలశాస్త్రి నడిగెను.

ఈసమయమున నేదైనఁ జెప్పకుండునెడల నిట్టి మనస్థితి వీరికి వెంటనే నశింప దని యెంచి యిట్లు పలికితిని.

సోదరులారా! చలిచే వడఁకుచుండువాఁడు మంచుగడ్డ తలకుఁ గట్టించుకొనునా? తాపజ్వరముచే నార్తి నొందునాతఁడు మంచముక్రిందఁ గుంపటిని దాపుకొనునా? విషూచిచేఁ బీడింపఁ బడువాఁడు నేపాళపుమాత్ర వేసికొనునా? చేఁటలోఁ బడినది మొదలు కాటిలోఁ బడువఱకు మనము ప్రత్యక్షముగ, నిరంకుశముగ నేడువవలసిన యేడుపులు మనకుఁ జాలవా? మన నిత్యశోకమున కీనవనవానల్పకల్పనా కలాపనూతనరోదన కాండపారాయణ ముగూడఁ గావలయునా? సోదరులారా! మీకు మతు లున్నవా? లేవా? దుఃఖ నిరాససాధన మునకై సుఖమార్గావ లంబనమునకై యుపయోగపడవలసిన బుద్ధిని చిత్రవిచిత్రదుఃఖ బ్రహ్మాం డసృష్టికి యుపయోగపఱచుచున్నారా? శత్రువులనుండి కాపాడుకొనుటకై యాయుఁబడిన ఖడ్గముతో గొంతు గోసికొనువాఁడు మతియున్నవాఁడేనా? వచ్చినయాపదలనే వేదాంతవిజ్ఞా నమునఁ దొలఁగఁద్రోచికొనుట విధియయియుండఁగ–నట్లు త్రోచివేసికొననివాఁడు మూఢుఁడై యుండఁగ– నెప్పుడో రాఁదలఁచిన – వచ్చునో రాదో యని సందేహింపఁదగిన – వచ్చినను గలియుగము యొక్క నాలుగవపాదమందుఁగాని రా వీలులేని – యెప్పుడువచ్చి నను సర్వనాశన మగుటచే విచారించువాని విచారమున కవకాశ మీయని – చెప్పఁదగని –ప్రతిక్రియ చేయఁదగని–యాలోచింపఁదగని –యాపదలిప్పుడు వచ్చినట్లుగ నేడ్చువాఁ డెట్టివాఁడై యుండును? ఆకాశమునకు హద్దు గలదు. కాలమునకు మితి గలదు. కాని యట్టిమూఢచక్రవర్తి శిఖామణిమౌఢ్యమున కంత మున్నదా? ప్రపంచికవస్తువు లస్థిరములు,

నశ్వరము లని యెఱుఁగుదువుకాదా? శాశ్వతపదార్థము నీలో నున్నదని కూడ నీ వెఱుఁగుదువుకాదా? నీదృష్టిని దుచ్ఛబాహ్యవస్తువులందుఁగాక దానియందుఁ బఱపి తచ్ఛాంతాలోలత నీ వుండునెడల - నీకుఁ గావలసిన దేమున్నది? ఏమహాతేజముముందు సూర్యుఁడు బొగ్గువలె నుండునో యట్టితేజమును నీవు చూడఁ గినప్పుడు సూర్యుఁడారిపోయిన నీ కేమి? గురుశుక్రు లిద్దఱు డీకొని పొడియైన నీకేమి? పోకుఁడు! ఇంకను జెప్పవలసినది చాల నున్నది. ఇట్టిజ్ఞానదశ – అయ్యయ్యో పోయెదరేమి? ఇట్టిజ్ఞానదశ యందఱకు సిద్ధింపదు. సాధ్యములగు దశలు చెప్పెదను. వినుఁడు. పోకుఁడు'' నేను జెప్పునది వారికి నచ్చకుంటచేఁ బోవుచున్నారో! లేక సిగ్గుపడియే పోవుచున్నారో! నాకుఁ దెలియదుకాని రెప్పపాటుకాలములోఁ గవియుఁ గాలాచార్యులు నేను దప్ప మరెవ్వరులేరు. శాస్త్రికూడ వారితోఁ జల్లగ జారినాఁడు. మేముకూడ నింట్లకుఁబోయితిమి.

22. భూతవైద్యము

సభాశాలంతా మాంచి కిటకిటలాడుతోంది. ఆరోజు జంఘాల శాస్త్రి ఉపన్యసించడానికి ఎత్తుకున్న విషయం 'భూతవైద్యం'. ఈ విషయంలో తన అనుభవాలను శ్రోతలకు వివరించి భూతవైద్యమనేది వట్టి పనికిమాలిన గడబిడ అని రకరకాల ఉదాహరణలు చెప్పాడు. మారీచ శాస్త్రి అనే వాణ్ణి ఆశ్రయించి, అతగాడికి నమ్మకమైన శిష్యుడై, ఆ విద్యకు సంబంధించిన రహస్యాలు ఎలా గ్రహించాడో చెప్పాడు – మన బుద్ధులే దయ్యాలు. అందరూ అనుకునే ఇతర దయ్యాలు లేవు. మన మధ్య బతికే మనుష్య సంఘంలో ప్రవర్తించే వారి రకరకాల దిక్కుమాలిన బుద్ధివైపరీత్యాలే పిశాచాలు, భూతాలు, బ్రహ్మరాక్షసులు అని ఖరాఖండిగా చెప్పాడు శాస్త్రి.

వాణీదాసు, శాస్త్రిని అడ్డుకొని ''లేవు (దయ్యాలు) అని సిద్ధాంతంగా చెప్పడం చాలా సాహసం'' అన్నాడు. దానిమీద జంఘాల శాస్త్రి రెచ్చిపోయాడు. మనిషి కంటె సర్వనాశకుడు ప్రపంచంలో లేడనీ, భూతవైద్య తంత్రం సర్వమిథ్య అనీ, పిశాచం ఆవేశించిందని చెప్పే స్థలాల్లో మేధా సంబంధమైనదో, జననకోశ సంబంధమైనదో, ఒక రోగం గాని, గట్టి మోసం గాని, ఉందని నిశ్చయంగా నమ్మవలసి వుంటుందని జంఘాల శాస్త్రి ఘంటాపథంగా చెప్పేశాడు.

సభాశాలలో జనసంఘము కిటకిటలాడుచున్నది. జంఘాలశాస్త్రి యి ట్లుపన్యసించెను: ''నే నెఱుఁగుదును. నాకు స్వానుభవమున్నది. నే నావిద్యలోఁ గృషిచేసినవాఁడను. మీ కందఱకు దయ్యములఁ గూర్చి సందేహజ్ఞానము కాని, నాకు నిశ్చయజ్ఞానము. అధశ్శయనబ్రహ్మ చర్యవ్రతములు చేసి, గురుశుశ్రూష యొనర్చి, కాయక్లేశపడి, పిశాచ విద్యాపారగుఁడనైతిని. మాగురువుగా రిప్పటికి నొకయూర జీవించి యున్నారు. నే నొకసారి కొత్తఁగ నాపురమునకుఁ బోయితిని. అచ్చట మారీచశాస్త్రి యనునొక భూతవైద్యుఁడున్నాఁడు. నేను బోయి యాయనను దర్శించితిని. నామాటలను బట్టి, నైఖరినిబట్టి ద్రిమ్మరి నని యాతఁడు గ్రహించి నావంటివాడు తనకు శిష్యుఁడుగ నుండుట మంచి దని యనుకొనుటచేఁ గాబోలు నన్నుఁ దనయొద్ద నుండు మని కోరెను. నేను సమ్మతించితిని. మఱునాఁ డుదయమున మాభూతవైద్యశాలను దెఱచితిమి. రెండు బుట్టలతో నూలుదార ముల ముళ్ళు, మూఁడు పళ్ళికలతో తాటాకులముక్కలు, రెండు మూకుళ్లతో బూడిద,

మాఁత లేని దేవదారు పెట్టెలోఁ గొన్ని రాగిరేకులు, రెండుకడఁముంతలలో పసుపు, వెదురుగొట్టములో నెఱ్ఱని యక్షతలున్నవి. ఇవి మాశాలలోని యౌషధములు. నూలుదారము లని తాటాకులని మాలో మేమనుకొనిన యెడల రోగులకు మా చికిత్సయం దనాదరణముగ నుండునని మాయౌషధములకు మాగురువుగారే కొన్ని వింతపేరులను గల్పించెను. ఇవిగాక ప్రతివైద్య శాలయందుఁ గోఁతకై కొన్ని యాయుధము లుండు నాచారమును బట్టి మావైద్య శాలలోఁగూడ శరీరచ్ఛేదనమునకై కొన్ని యాయుధముల నుంచితిమి. రెండు చీపురు కట్టలు, వేఁపబెత్తపు కట్ట, దూలగొండి యాకు, నూఁగుతోఁ గలిపిన విభూతి, రెండుజతల యినుపగోళ్లు, గట్టి బిరడలు గల భూతాకర్షణ కాచపాత్రములు, నొక పట్టుకారును మాశాలలో శల్యతంత్రసాధనసామగ్రియై యున్నవి. ఈ యాయుధములకుఁ గూడ వింత వింత పేరులు మాగురువుగారు కల్పించియుండిరి. చీఁపురు కట్టకుఁ గాంతాకరవాల మనియుఁ బేఁప బెత్తమునకు బాలబుద్ధ్యుద్దీపినియనియు, దూలగొండిబూడిదె కుగ్రనారసిం హమనియు, నినుపగోళ్లకుఁ గాళిగాదంష్ట్ర లనియు, సీసలకు క్షోణికుక్షినిక్షేపము లనియుఁ బట్టు కారునకు వీరాంజనేయ మనియు విచిత్ర నామములను వస్త్వగౌరవపరిహారార్థముగను, భూతరోగులకు భయాభివర్ధనార్థముగను గల్పించెను. ప్రతివైద్యశాలయందు శారీరశాస్త్రసం బంధములగు పటములు వ్రేలాడఁ గట్టు నాచారమును బట్టి యిచ్చటఁగూడ నాలుగుగోడ లకు బాల– బగళ–మహిషాసురమర్దని–మళయాళభగవతి యను విగ్రహములఁ రంగులతో వేయఁబడినవి. అవికాక మాగురువుగారి గురువగు గుంటుపల్లి గురులింగదేవరగారి విగ్రహ మొకటి గూడ నున్నది. భూతభేదముల ననుసరించి భూమిపై వేయవలసిన వేఱువేఱు ముగ్గుల చిత్రపటములు కొన్ని మాత్రమే యచ్చటచ్చట నుర్దుతో ప్రాయఁబడియున్నవి. ఇవికాక తాళీదళసంపుట మొకటి యున్నది. అందులో నేమున్నదియో నాకుఁ తెలియదు.

మాగురువుగారు వ్యాఘ్రాజినముపైఁ బద్మాసనస్థులై నాసిగాగ్ర విన్యస్తలోకనులయి కూరుచుండిరి. ఆయన నడిమివయసుగలవాఁడు. పిప్పళ్లబస్త! పాషాణప్రతిమ! ఉక్కు వృకోదరుడు. నల్లని గరుసుగడ్డముచేఁ బ్రత్తికాయల వంటి గ్రుడ్లచేఁ దుట్టెపెదవులచే భ్రూమధ్యమునఁ బెద్దకుంకుమ రేఖచే భయంకరమగు స్వరూపము గలవాఁడు. ఒక్క భార్య నంటఁగట్టుకొని లోడితెఁడు నంసారములో గుడుగుడు గుంచములాడుట కిష్టపడక బ్రహ్మ చారియై లోకముమీఁద విఱుచుకొనిపడి తెగిపడ నుపకారము చేయుచున్నాఁడు. భూత భేతాళ పిశాచాదులతో నీతనికి జరిగిన హస్తాహస్తి పాదాపాది మూర్ధామూర్ధి యుద్ధములనేకము లీతఁడు పొడిచినట్లు మొలచినట్లు వర్ణింపఁగలడు. దయ్యముల పిడికిటి పిడుగులచే మడమల పొడుపులచేఁ దల టొకాయింపులచే నీతని శరీర మింత గట్టి పడినదని యాతని నమ్మకము. ఈతఁ డొక చాఁకిదాని పిశాచనిర్ముక్తికై దానియింటికిఁ బోయి యాతంత్రమున నక్షీణదీక్షుఁడై యుండ నాచాఁకిత నావేశించిన పిశాచము దానిభర్తరూపము నట్టి ధరించి యెట్టగఁ గాలిన యిస్త్రీ పెట్టెను వెనుకపాటున వచ్చి యీతనివీఁపుపై నంటించెనట. ఆమచ్చ యిప్పటివ అకు మొండిచేఁటు యంత నిల్చియున్నది.

ఆతడు నేను నాయుదయమునఁ బిశాచభేషజశాలలోఁ గూరుచుంటిమి. ఇంతలో నొక శూద్ర కాంత వచ్చి తననవతి తన్నుఁ బీఁకుకొని తినుచున్న దనియుఁ, దనకుఁ జూలు నిలువనీయ దనియుఁ జెప్పెను. ఆమె కాతఁడు చేయి చూచి ''జంఘాలశాస్త్రీ!

భూతనాడి తర్జనిపై నెంత విసరుచున్నదో చూడు'' మని యామెచేతిని నాచేతిలోఁ బెట్టను. నేను జూచి యూరకుంటిని. అంత మాగురువుగా రాస్త్రీని నెగ దిగఁ బరీక్షించి ''శాస్త్రీ! ఈమెకుఁ గార్పాసక లతాబంధమును, శాంకరాంగరాగలేపనమును గావలసియున్న'' వనెను. ఆ పెద్దమాటలను విసి యూనుదతి డిల్లపడి ''ఏదో గట్టిపని చేసినఁగాని యిల్లు నిలువఁబడు సాధనము లేదండి'' యని కన్నీరు పెట్టుకొనెను. గురువుగారి యీ సంస్కృత సంజ్ఞల యర్థము నేనెఱింగినవాఁడ నగుటచే ముళ్లనూలుపోఁ గొకటి యిచ్చి దీనిని జేతఁ గట్టుకొమ్మంటిని. మూఁకుళ్లలో నున్న బూడిదెలోఁ బిడికెఁ డిచ్చి దీనిని రాత్రులందు గర్భమునకు రాచికొమ్మని చెప్పితిని. ఆమె పోవుచుండఁ గనే యొకవృద్ధవైశ్య బాలికను గనఁబఱచి యిది తన మనుమరాలనియు, దీనిని మేనత్తకొడుకున కిచ్చుటకు స్థిరపఱచుకొని రనియు, నాతఁడు మరణించుటచే మఱియొకనికి వివాహము చేయబడిన దనియు, మేనత్తకొడుకు దయ్యమై దీనిని బట్టుకొని మగనియొద్దఁ బడుకొననీయఁ డనియుఁ, దానే దీని రక్తమాంసము లొడిచి చంపుచున్నాఁ డనియుఁ జెప్పెను. అంతట గురు వాబాలిక చేయుఁ జూచుచుండగ నామె క్రేగంట నాతనిఁ జూచి కొంత యిగిలించెను. నేను దెల్లబోయి చూచుచుండఁగ ''ఈయిగిలింపు పిశాచలక్షణము సుమా!'' యని నాతోఁ బలికి ఈభూతము ''హత్తుహూత్తుల'' వదలి పోవునది కాదు. ఈమెను గొంతకాలమువఱకు భర్తను జూడ నీయఁదగదు. ఈమెను బ్రతిరాత్రియు నేడుగంటల కిచ్చటకుఁ దీసికొని రమ్ము. ఈమెను మ్రుగ్గులోఁ గూరుచుండఁ బెట్టి తాడన పీడనము లాచరించి కచాకర్షణ మొనర్చి యొక జాము సేపువఱకు తూపిడి పెట్టినఁగాని యీవికారము వదల'' దని వృద్ధవైశ్యతో నాతఁడు పలికెను. బాలవైశ్య యీ మాటలు విని పట్టలేక కిసుక్కున నవ్వెను. ''వెకిలిదయ్య''మని గురువుగారు నన్ను సమాధాన పఱచిరి. వృద్ధాంగన యందుల కంగీకరించెను. ప్రస్తుత శాంతి కొఱకు గ్రంథపత్ర శకల మొకటియు, హేమరజము కొంతయు నిమ్మని నాతో గురువుగా రనఁగ నొక తాటియాకుముక్కను, గొంతపసుపు నామె కిచ్చి యీ పనుపు మొగమునకు రాచికొమ్మనియు, నీతాటియాకుఁ గొప్పునఁ బెట్టుకొనమనియుఁ జెప్పితిని. వారు పోయినవెంటనే యొక బ్రాహ్మణవితంతువు పదునాఱు సంవత్సరముల పడుచును గూడ వెంటఁబెట్టుకొని వచ్చి యిది తన చెల్లెలనియు, నంకిలిచే నింక వ్యక్తురాలు కాలేదనియు, దాని భర్త రెండవపెండ్లిఁ డనియు, నాతనికి వెనుకటికళత్రమువలనఁ బిల్లలు లేరనియు నింక నేమోమో చెప్పఁబోవుచుండంగ మాగురువుగా రాపిల్లను చేతఁ దిగిచి యెడిలోఁ గూరుచుండఁబెట్టుకొనెను. నా కొడలు చచ్చినట్లయ్యెను. ఆపిల్ల లేచిపోవుటకు గింజుకొనినను మాగురూజీయామెను గట్టిగఁ జేతుల నదిమిపెట్టి ''ఫట్ ఫట్'' యని యేదో మంత్రించి యొకగడియ సేపటికి వదలిపెట్టెను. ''గ్రంథశకలత్రయ మాపిల్లకి''మ్మని నాకు సెలవగుటచే నిచ్చితిని. ఇది యేమి సేయవలయు? నని వితంతువు ననుడుగ నేను వెఱ్ఱిమొగము వైచుకొని పిశాచాధ్యాపకునివంకఁ జూచితిని. ''ఇవి నమర్తచీటులనియు, నివి పాత్తికడుపునకు గుడ్డపీలికతో మూఁడురాత్రులు కట్టుకొనవలయు'' ననియు నాతఁడు సెలవిచ్చెను. వారు పోయినవెనుక నొక వెలమదొరగారు తమవీథిలో నొకయింటిలో బాలెంతరాలు చనిపోయిన దనియు, నామె బ్రహ్మరాక్షసిని యయ్యె ననియు, నాయిల్లు మరణనక్షత్రదుష్టతచే విడువఁబడిన దనియు, నాయింటి ప్రక్కనుండి తనభటుఁ డొక రాత్రి చుట్టలకొఱ కంగడికిఁ బోవుచుండఁగా నాబ్రహ్మరాక్షసిని వానియెదుటఁ బడి జొమ్మునై నొక్క చఱపు చఱచినదనియు,

నాతని వక్షస్థ్సలము వాఁచి యెట్టుఁబడుటయే గాక యూరక్కసి గోళ్లగీరుల యానవాళ్లు కూడ నందుపై నుండెననియు, నాఁ డేడ్చుచుఁ దనయింటికి వచ్చి రెండు రక్తవమనములు చేసికొని యూరాత్రియే మరణించె ననియు, నప్పటి నుండియు నావీథిలో సాయంకాలమ యిన పిమ్మట జనసంచారము పూర్ణముగఁ గట్టుఁబడిన దనియు, నావీథిజను లీకారణమున మిగుల దహతపపడుచున్నా రనియు, నిట్టి యుపద్రవము శీఘ్రముగ నివారించినఁగాని జనులకు మనశ్శాంతి యుండదనియు జెప్పెను. మాగురువుగా రీసంగతి నిదివఱకే వింటిననియు, దానిని గూర్చి యెవ్వరును గోరియుండగపోవుటచేఁ దానుబనిచేయలే దనియు మాఱుపలికెను. ''గురువుగారి సెలవైన యెడల నే నీరాత్రి పోయి చూతు'' నని నేను బలుక వెలమదొరగారు ''బ్రతుకఁదలఁచుకొనలేదా?'' యని యెకసక్కెముగఁ బలికెను. ''ఈతఁడు నా శిష్యుడు, భూతవిద్యారహస్యములు బాగుగ నెఱిఁగినవాఁడు. ఈతనిచే నాపిశాచికి నేనొక్క లేఖ నీరాత్రి పంపించి దానిపై దానిజా లెటులుండునో కనిపెట్టి యటుపైన నావశ్యక మగునెడల నేనే యచ్చటకు వచ్చి యన్నియుఁ జక్కఁపెట్టెదను. ముందుగ నేనే వచ్చుట గౌరవమునకు లక్షణము కాదు. మర్యాదలను గూర్చి దొరగారికి దెలియని యంశము లేమున్న'' వని మా గురువుగారితో ననెను. దొరగారు వెడలిపోవున ప్పుడు మాగురువుగారు ''సెలవు తీసికొందు''ని చెప్పఁగఁ దల యొకవంకకు దబాయించి కుడిచేతిని వెత్తగిలవైచి, వెల్లకి యిగిలిం పొకటి యెరువుతెచ్చుకొని ఉఁ అని రెండు మాఱులు పుక్కి ముందు భటుఁడు దారిచూప నాతఁడు నడచిపోయెను.

ఆరాత్రి నేను బదునొకండుగంటలు దాఁటినవెనుక నొక్కఁడను బిశాచవీథికి బయలు దేఱిపోయితిని. ఇండ్లతలుపులన్నియు బిగించియుండెను. మనుజుల యలికుడులైన వినరావ య్యెను. భయంకరమగు నిశ్శబ్దము ప్రబలియుండెను. గాఢాంధకారము క్రమ్మియుండెను. పురపౌరి శుద్ధ్యసంఘమువారి వీథిదీపమైన లేదు. శ్మశానములో నడుచుచుంటి నని నాకు దోఁచినది. గుండెలు పిచుపిచు మనుచున్నవి. ప్రాణము లఱచేతిలో నున్నవి. తిరిగి వెనుకకుఁ బోవలయు నని యనుకొంటిని గాని మెదడునఁ బుట్టిన పెంకితనము ముందునకుఁ ద్రోచెను. దొరగారు చెప్పిన ఇంటి యొద్దకు వచ్చునరికి ''ఔవ్వు ఔవ్వు'' మను విసరుతో, ''రంయి రంయి'' మను ధ్వనితో నెదురుగ దయ్యము వచ్చి దబాలున గుండెలవియునట్లు కొట్టినది. కెవ్వుమని యొక్క చావుకేక నైచితిని గాని దెబ్బ తగులుట తోడనే రెండుచేతులతో గట్టిగ నాయెద నదిమికొని గట్టిగఁబట్టుకొంటిని. చేతులక్రింద భూతము పీకుచున్నది. కఱచుచు న్నది. వెల్లిపట్టు వదలక యొక్కపరుగున గురువుగారింటికి వచ్చి నిదురనుండి యాతని లేపి యీ వృత్తాంతమంత చెప్పఁగ నాతఁడదరిపడి క్షోణికుక్షినిక్షేపములలోఁ బెట్టుదమని వానిని దెచ్చి యెదుటఁ బెట్టి, చేతులపట్టు నిమ్మళముగ నడలఁజేయుమని పలికిరి. వడకుచు బట్టువిడిచితిని. ఒక పెద్ద గబ్బిలము తుఱ్ఱున నెగిరి మళయాళభగవతి గ్రహముపై వ్రాలెను. మే మిద్దఱము తెల్లఁబోయితిమి. ''మొదట నన్నుఁ గొట్టినప్పు డది బ్రహ్మరాక్షసిస్వరూప ముననే కొట్టెననియు, కామరూపిణి యగుటచే నేను బట్టుకొనినతోడనే స్వరూపమును మార్చి బుసిపిట్ట యయిన'' దనియు మాగురువుగారి వాదము. ఎటులయినను నాధైర్యము నకు మెచ్చి నన్ను విశేషానురాగమున నాతఁడు చూచుచుండెను. ''గబ్బిలపు గాథ రెండవకంటి వానికిఁ దెలియఁ గూడదు సుమా'' యని నన్ను హెచ్చరించెను.

ఆయూరిలోనే పడమటివీథిలో నొకబాలవితంతువున కొక్క విచిత్రమగు కామినీ

గ్రహ మావేశించిన దనియు, నది తన కిదివఱ కెన్ని సాధనములు చేసినను స్వాధీనమైనది కాదనియు, ఱేపటియుదయమునఁ దాను తత్ప్రదేశమునకుఁ బోవుదుననియు, నన్నుగూడ రమ్మనియుఁ బలికెను. తెల్లవాఱ లేచి యటకుఁ బోయితిమి. ఆ కామినిచిత్రము చూడఁదగినదే కాని చెప్పవీలులేదు. మేము పోవునరి కాచిన్నది మూఁడు మేజువాణులంత కలకలము చేయుచున్నది. తానే పాట, తానే యభినయము, తానే వెనుకహంగు, తానే చిప్పతాళపుదాటింపు, తానే యుపాంగపుశ్రుతి. అంతలో మొగ్గలు. అంతలో శివశక్తిగంతులు. అంతలో చావుకేకలు. తందనపదములు. ''ఈ కామిని పూర్వమున వేశ్యసుమా!''యని నాతో మాగురువుగారు నిమ్మళముగఁ బలికిరి. అంతలో నాచిన్నది ''ఓం నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి!'' యని నుష్ఠుగ స్వరయుక్తముగఁ బలుకంగ మాగురువుగారు తానిప్పుడనినమాట పూర్వపక్షమైనదని కాఁబోలు. నందేహముతో నీకామినికి వేశ్యాజన్మకు పూర్వము వైదికజన్మ ముండితీఱవలయును. లేదా వైదికుఁ డెవ్వఁడైన దానియందలి యభిమానము వదలక మరణించి దాని నావేశించి యుండవలయును. ''వాసుదేవాయ ధీమహి, తన్నోవిష్ణుః'' అని యామె మెఱపు మెఱసిన ట్లెగిరి నాపిఱ్ఱపైఁ దన్నెను. మేము వచ్చిన ట్లోరగంటను గనిపెట్టినది కాఁబోలు. ఆమె తన ధోరణిలో మమ్మెఁ జూడలేదని యనుకొంటిమి. క్రొత్తవాఁడనైన నేనుగూడ భూతవైద్యమునకే వచ్చితి నని నన్నుఁ దన్నినది కాబోలు! గ్రుడ్ల నీరు దిరుగ గురువు గారివంకఁ జూచితిని. ''తొందరపడకు, చూచితివా! అంతటితో సంతోషింపదగినది. ఈనడుమ నాకుఁ బండ్లూడఁదీసెద నని కారుపట్టుకొని మీదబడంగ ''ఆఁ ఆఁ'' యని నోరు తెఱచి యదలించునరికిఁ గారుతో నాముందుపన్ను బిగఁబట్టి నిటుఁ జొకాయించినది. ఇప్పుడీమె కుగ్రనారసింహలేపన మొనర్తును'' అని దూలగొండివిభూతిఁ దీసికొని ''హ్రీం, హ్రీం, ఫట్, ఫట్'' అని యేమో చదువుచు నామెను సమీపింపంగ– ఖబర్‌దార్, చలోజావ్. లైకిన్ మార్ దాల్తాహుం'' అనుచుఁబందిరిమంచపు స్తంభ మూడఁదీసి మీఁదికి వచ్చినది. అంత గురువుగారు రెండుమూడడుగులు వెనుకకు నైచి ''చూచితివా? తురక దయ్యము గూడ నున్నది. ఒక దయ్యమునకు దారియిచ్చిన మనస్సులో నన్ని దయ్యములు ప్రవేశించును. ఇప్పుడు నే నెందులకు వెనుకకు మరలితినో నింటివా? పిశాచములు రెండమూఁ డావహించుటచేత వానిలో వానికి మాయోపాయమునఁ గలహము పెట్టినయెడల నొకదాని నొకటి కొట్టుకొని తుద కన్నియుఁ బాఱిపోవును. అట్టి లౌకితతంత్రము మంచిదేమో యని యాలోచించుచున్నాను'' అని నా కీభూతవిద్యారహస్యమును బోధించెను. కనఁబడినబట్ట నెల్ల తగులఁబెట్టుట, కనఁబడిన మనుజుల నెల్లకొట్టుట మొదలగు భయంకరచర్య లామె చేయుటచేత నామెకుఁ బ్రత్యేకముగ నుండుటకు వసతిచేసియింటివా రెవ్వరామె యొద్దకు భోజనము తీసికొని వచ్చినప్పుడుతప్ప పోవుట వదలుకొనినారు. మే మిద్దఱమే యిప్పు డామెసన్నిధి నుంటిమి. కలియఁబడి యామెను నాలుగు తన్నవలసిన దని ప్రేఱుఁదిన్నవాఁడను గాన నాతనిని బ్రోత్సహించితిని. కాని యాతనిచికిత్సాపద్ధతి భిన్నముగా నున్నది. మేమిద్దఱ మక్కడ నుండి యేమియు జేయలేక యింటికిఁ బోయితిమి. దారిలోఁ గానఁబడిన యామెతండ్రితో ''జంఘాలశాస్త్రిని తీర్థమిచ్చి రాత్రి పంపుదు'' నని మాగురువుగారు పల్కెను. తీర్థపుగిండి తీసికొని రాత్రి పోయితిని. ఆమె ప్రత్యేకముగ నివసించు స్థలమున మఱొవ్వ రుండుట కవకాశము లేదు. కావున నేను జరజర లోనికిఁ బోయితిని. ఆమెపడుకగది తలు పోరగ నుండెను. నిద్రపోవుచున్న దేమోయని

తలుపుకన్నములో నుండి లోనికిఁ జూచితిని. మఱియొక భూతమైద్యుఁ డెవఁడో లో నామెకు మంత్రించుచున్నట్లు నాకుఁ గనఁబడినది. ముంగురులను జేతితోఁ బట్టుక నినాఁడు. ఎదుట నొక సీనయుంచినాఁడు. మూతి పొడుగు చేసి ముందునకు వంగి ''ఉష్షా' నుటకు సిద్ధముగ నున్నాఁడు. మారణహోమ మారంభించినాఁ డనియుఁ గామినని సీనలో దలవెండ్రుకల చిన్న జడతోఁగూడఁ బెట్టి భూమిలోఁ బ్రాఁతి పెట్టుటకై యిట్ల నేయుచున్నాఁ డనుకొంటిమి. ''ఉష్షా''నుటకై ముందునకు జూచిన మూతితో దళుకు మ నాకన్నులు మిఱుమిట్లు వడునట్లు బింకమైన యొక్కముద్దును–ఫర్లాంగున్నర పొడగుగ ముద్దును బెట్టుకొనినాఁడు. ఎదుటి సీనలోని దామెబుగ్గలకు రాచుట చేత నది యవనీకుక్షినిఁ పము గాదనియు, నత్తరువుబుడ్డి యనియు గ్రహింపవలసి వచ్చినది. ఱెప్పపాటు కంటె దక్కువ కాలములో నామె విఱుచుకొని యాతనిపైఁ బడినది. ఆ కామిని యమెరికాఖండమువ అకు నొక్కటే పరుగు. నేను గూడ నింటికి బరుగెత్తి యీయంశములు గురువుగారితొ జెప్పితిని. గదిలో నున్న యాతఁ డెవ్వడోనే నెఱుఁగను. ''అతనికి గడ్డముండెనా? యజ్ఞోపవీత మున్నదా?'' యని గ్రుచ్చి గ్రుచ్చి గురువుగారు సన్నడిగిరి. ఆమెలో నున్న మహమ్మదీయ పిశాచమే పైకి వచ్చెనో, లేక బ్రాహ్మణ పిశాచమే వచ్చెనో యని యాతనికి సందేహము విడువలేదు. మఱునాఁటి యుదయమున నాచిన్నదాని యింటనుండి యొకము నలిదాసి వచ్చి కన్నుల నీరు పెట్టుకొని మా గురువుగారి యెదుట నిలువఁబడెను. ''ఏ'' మని యడుగ ''పోయిన''దని యామె బదులు చెప్పెను. ''జంఘాలశాస్త్రీ! ఇంతపని నిన్ననే జరుగునని నేననుకొంటిని సుమా? నామంత్రముల కిక్కడ తప్ప నెక్కడను నడ్డు రాలేదు. బ్రహ్మాస్త్రము పనికిరానప్పుడు బ్రదుకుయోగము లేదనుకొనవలసినది కాదా? ఆమె తెల్లవా ఱుసరికిఁ జచ్చిపోవునని నేననుకొనినట్లయిన''దని గురువుగారు నాతో నైచ్యానుసంధా నము ముచ్చటించిరి. ''చచ్చిపోలేదండి, చాఁకలివానిని దీసికొని పోయినదండి'' అని యాదాసి చెప్పెను. గురువుగారి మొగము తెల్లఁబోయెను. ఆమె యింటికి మఱలి పోయెను. నామది దయ్యముల నమ్మకము నుండి తిరిగిపోయెను.

నాయనలారా! ఇట్టిదయ్యములు లేవు. మనబుద్ధులే దయ్యములు. ఈదయ్యములు విద్యచే, సత్సహవాసముచే, దైవభక్తిచే, జ్ఞానముచే వదలవలసినవి కాని మంత్రించిన మినుపగిం జలచేఁగాని, చీపురుకట్టలచే గాని, ప్రాతచెప్పులచేగాని వదలునవి కావు. పిశాచములు, బ్రహ్మరాక్షసులు లోకముననే యున్నారు. విద్యనేర్చి న్యాయమైన జీవనోపాధిని సంపాదించు కొనక కనబడినవారి నెల్ల యాశ్రయించి స్తోత్రపాఠములు చేసి యాచించి పొట్టపోసికొనుచు నొకచోటనైఁ గాలునిలువక వెఱ్ఱి కుక్కవలెఁ దిరుగుమనుజులే భూతములు. ఉచితానుచితత లేక పట్టిన పట్టు విడువక పరశ్రేయమును గాంచి సహింపనేరక యెంతసేపు స్వోదర పోషణార్థమై దేవులాడుచు నాత్మస్తోత్రములు హద్దులేక చేసికొనుచుఁ గవులను, బండితులను, గాయకులను నిష్కారణముగ దూఱుచుఁ బరిపాలించు ప్రభువులఁగూర్చియుఁ, బతివ్రతలఁ గూర్చియు లేనిపోని తుచ్ఛ ప్రసంగములు సేయుచుఁ గాలక్షేపము చేయునరులే పిశాచ ములు. నీతికై పరోపకారమునకై యింద్రియ నిరోధమునకై యహంభావ నిరసనమునకై బ్రహ్మజ్ఞానసంపాదనమునకై పాట్లుపడక యైహికలంపటులై యాశాపాశ బద్ధులై దుష్టవర్తనా సక్తులై పరాపకారతత్పరులై గ్రామ్యసుఖాసక్తులై ప్రబలగర్వాతిలేకులై యొడ లెఱుఁగక తిరుగుమనుజులే బ్రహ్మరాక్షసులు. వీరికంటె దయ్యము లీలోకమున లేవు'' అని జంఘాల శాస్త్రి కూరుచుండెను.

అంతట వాణీదానుఁడు లేచి యిట్లు చెప్పఁదొడఁగెను.

''లేవని సిద్ధాంతముగఁ జెప్పుట మిగుల సాహసము. సృష్టి యనంతము. దానిలో వింత లనిర్వచనీయములు. అవాఙ్మానసగోచరములు. మనబుద్ధి కందనియంశము మిథ్య యనఁదగదు. ప్రపంచమున నున్న జీవులు సంఖ్యాతీతములై యున్నవి. అవయవములు లేని జంతువు లున్నవి. చలనమే లేని జంతువులున్నవి. అట్టిచో శరీరము లేని జంతువులు మాత్రమేల యుండఁగూడదు? గాలిలో నున్న జీవుల నన్నిటి మనము చూచుచున్నామా? చూడలేని హేతువున లే వనుచున్నామా? నిశ్శరీరములగు శక్తులుండిన నుండవచ్చును. భగవంతుడింత యనంతకల్పన చేసిన వాడై యుండ వానిని మాత్రము చేయలేఁడని, చేయలేదని యెట్లు చెప్పగల్గుదుము? అవియే దయ్యములు కాని యవి మనల బాధించునవి కావు. అవి పురుషులకు గర్భము నిచ్చి స్త్రీలకు గర్భవిచ్ఛిత్తి నిచ్చునవి కావు. (నభనుండి)- పురుషులకు గర్భము లేమిటో తెలియలేదు. (అని ధ్వనులు).

''జలోదరములని నాయభిప్రాయము. దయ్యములు మన కేవిధము లైన యపకార ములు సేయలేవు: ఉపకారాపకారసామర్థ్యము, రక్షణ శిక్షణాధికారములు భగవంతునిని కాని జీవులవి కావు. కావున దయ్యములు మనల బాధించునని కావు. కాని, లేవని చెప్పవీలులేదు. ఉండిన నుండవచ్చును.'' అని చెప్పి కోరచూపున జంఘాలశాస్త్రిని జూచి కూరుచుండెను.

అంతట జంఘాలశాస్త్రి రొసరొసలాడుచు లేచి యిట్లనియెను.

సృష్టివైఖరీజ్ఞానముగల కవిగా రిప్పుడు చెప్పిన మాటలలో వారి ప్రాపంచిక జ్ఞానమును వినియోగపఱచుట మానినందులకుఁ జింతిల్లుచున్నాను. పెద్దపురుగులు చిన్నపురుగలఁ జంపుచున్నవి: కప్ప పురుగులను జంపుచున్నది. పాము కప్పను మ్రింగుచున్నది. దుప్పి పామును నమలుచున్నది. పెద్దపులి దుప్పిని వధించుచున్నది. శరభము సింహమును జంపుచున్నది. సింహము ఱేచును జంపుచున్నది. ఱేచు పెద్దపులిని జంపుచున్నది. ఇట్లులే యొకజంతువు మఱియొకటి పీకుకొని తినుచున్నది. ఇట్టి శత్రుత్వమే సృష్టి రహస్యము కాని సామరస్యము కాదు. మనుజాఁడన్నిజంతువులఁ జంపుచున్నాఁడు. వీనికంటె సర్వనాశకుడు ప్రపంచమున లేఁడు. దయ్యములే యుండినయెడల సృష్టిక్రమానుసారముగ నవి మనుజులను బీకుకొని తినక తప్పదు. తిరిగి ''మన మారీచశాస్త్రులు, మన యుగ్రనారసింహములు, మన వీరాంజనేయములు,'' సిద్ధము కావలసియున్నవి. భూతవైద్యతంత్రము సర్వమిథ్య యని నేను కొన్ని నిదర్శనములు మాత్రమే స్వానుభవమునఁ జెప్పితిని. గ్రంథవిస్తరభీతిచే నూరకుంటిఁగాని వందలకొలది నిదర్శనములు చెప్పగలను. మీరంద ఱొక్క యీమాటనే పాటింపదగును. పిశాచావేశమని చెప్పబడిన స్థలము నందు మేధాసంబంధ మైనదియో జననకోశసంబంధ మైనదియో యొక రోగముగాని లేక ప్రబలమైన మోహముగాని యున్నదని నిశ్చయముగ నమ్మవలయున''ని జంఘాలశాస్త్రి యూరకుండెను. నభ ముగిసెను.

23. మతాధిపతులు

బొ్రయ్యశెట్టికి చాలా అనారోగ్యంగా ఉన్న రోజుల నాటి మాట ఇది – అతని శరీర బాధల ముఖ్య కారణం రక్తం కలుషితం కావడం. దానిమీద ఏర్పడిన దురవస్థ తామర. అందుమూలంగా శరీరం బాగా వ్యాధిగ్రస్తమై పోయిందని తెలిసి – సాక్షి సంఘ సభ్యులంతా అతన్ని చూడడానికి వెళ్లారు. అక్కడ రకరకాల జనం జేరి ఎవరికి తోచిన కారణాలు వారు బొ్రయ్య శెట్టి రోగం గురించి చెప్తున్నారు. దేశీయవైద్యుడు ఆయుర్వేదాన్ని సమన్వ యిస్తూంటే, బుడేమియా సాహెబుగారు తన వైద్యం తను చెపుతున్నాడు. ఒక కర్మ సిద్ధాంతి తనకు తోచిన అన్వయం ఒకవైపు చేస్తుంటే, మరొకవైపు ఒక జ్యోతిషికుడు జాతకచక్ర దోషాలు ఏకరువు పెడుతున్నాడు. దానాలు చెయ్యాలని సూచిస్తున్నాడు.

బొ్రయ్య శెట్టి అనారోగ్య కారణాలు చెప్పిన వారందరూ ఎవరికి వారే ధీమంతులు. ఒకరు రెండోవారి మాట వినే ప్రశ్న లేదు. ప్రతిజ్ఞల మీద ప్రతిజ్ఞలు. ఛాలెంజి మీద ఛాలెంజి. ఈ నీచ స్థితికి సాక్షికి అసహ్యం కలిగింది. అనారోగ్యంతో వున్న బొ్రయ్యశెట్టి చేత బ్రాహ్మణులు జీవ ప్రాయశ్చిత్తాలు కాబోలు చేయిస్తున్నారు. గ్రహశాంతులకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పుడు చెప్పేవన్నీ సాక్షికి వచ్చిన కలలో సంగతులు.

ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతుల పక్షాన తాంబూలాలు తీసుకోమని, సభాపతి వ్యక్తుల్ని నిర్దేశించడంతో రగడ ప్రారంభమైంది. అలా ప్రారంభమై గందరగోళంగా సాగిన సాక్షి కల, చివరికి మహా మతాధిపతుల గొప్పతనాల ఎంపిక దాకా సాగింది. పీర్ల పండగ తగాదాతో కల ముగిసింది.

బొ్రయ్యశెట్టి యనారోగ్యస్థితిలో నున్నం డనుతొందరచే గ్రిందటిసారి సభ్యు లందఱు సభ చాలించి యాతనిం జూచుటకై పరుగెత్తిరి. విష్ణుమూర్తికి బొడ్డునం దామర, శ్రీమహాలక్ష్మికిం జేతిలోందామర. బ్రహ్మకుం బిర్రలకిందం దామర. కాని సెట్టి కాపాదమస్త కము తామర! ఓ! ఒక్కటే తామర! ఏనుంగుతామర! సర్వవ్యాపకత్వమున దీనికి బొమ్మజె ముడే సాటి. శాశ్వతత్వమున నపకీర్తియే సాటి. అప్రతిహతమై, యనిర్వచనీయమై, యనాది మధ్యాంతమై, యైహికజీవన విరాగతోజ్జీవకమైన యీవస్తువు పరవస్తువును బోలియున్న ధనికూడం జెప్పనొప్పునుగాని యత్యధికోపమున నుండు ననిచెప్పవీలు లేదు. కందూతి

నివారణార్థమై కల్పింపఁబడిన యొకయిత్తడిచేయివలనఁ గావలసినంతపని జరుగకుండుటచే దానికిఁ దోడుగ మరియొకటి నూతనముగ నిర్పింపఁబడెను. ఈరెండు నాతని చెరియొకహస్తము నాశ్రయించి యొఱదీసిన కత్తులవలె నొడలికోఁతలకైయొడుపుగైచి యుండును. ఇంతలోకాతీతమైన తామరకుఁ గారణ మేమైయుండునో సెట్టి తెలిసికొనఁగోరి యెరిఁగినవారి-నెఱుఁగనివారినిగూడ నడుగనారంభించెను. ఈనడుమను బదిసంవత్సరములనుండి నిరా ఘాటముగాఁ దద్దినముల బ్రాహ్మణార్థభోజనము ననుభవించి పిత్కకర్మకర్తలకుఁ, బిత్కదేవతలకు నడుమ సంధానకర్తయై చాకచక్యముతోఁ బ్రవర్తించి యిప్పుడు కొలఁది మాసములనుండి వ్యాధిగ్రస్తులకుఁ, బాకహస్తకింకరులకు నడుమ రాయబారపుఁబనిని నిర్వర్తించుచుఁ దనమొటివృత్తికి మరింత వన్నెయు, వాసియుఁ దెచ్చుచున్న దేశీయభిషగ్వ్రషభులగు తిరుపతిశాస్త్రులగారి నిందునుగూర్చి సెట్టి యడుగ మొదట నాతనిది శ్లేష్మపైత్యతత్త్వ మనియు, శ్లేష్మము క్రమముగ ఘనీభవించి బరువైయుండ వాతముగఁ గ్రిందకుజారిన దనియుఁ, బైత్యము లఘునైన దగుటచే జఠరదీప్తిచే నంటుకొని సెగలు పొగలతోఁ గ్రమ్మి దేహమునంతయు వ్యాపించి నల్లగ మాడ్చినైచుటచే నొడలంత దద్రువులు, పుండ్లు బయలుదేరిన వనియు ''నుష్ణ ముష్ణేన శీతల'' మ్మను న్యాయముచే రనకర్పూరము నిత్యము సేవించిన యెడలఁ దామర నివారించు ననియు, నాతఁడు సచికిత్సానిర్దేశ రోగనిదానమొనర్చెను. పశువులగొంతులు గోయుట మాని యీ నడుమ నశ్వమేధమును సంకల్పించి యాచరించుచున్న బుడేమియాసాహేబుగారిని సెట్టి యీవిషయమునుగూర్చి యడుగ ''నినుమునకు నీ రంటునెడలఁ ద్రుప్పుపట్టున ట్లీతనిశరీరమున నీ రుండుటచే నొడ లిట్లు త్రుప్పుపట్టుచున్న దనియు, లోనినీటిని హరించుటకై నిత్యమును నేపాళపుమాత్రలు సేవింపవలయు'' ననియు నతఁడు పిల్లిగడ్డ మల్లల్లాడుచుండ ''బిస్మిల్లా'' యనుచు నుపన్యసించెను. కర్మవిపాకజ్ఞుఁగడు గరళకంఠశాస్త్రుల నతఁడిందుఁగూర్చి యడుగ ''నాతఁడు పూర్వ మొకచోరుఁ డనియు, నాతఁడొక వితంతువునింటికిఁ గన్నముపైచి యామె తనధన మెచ్చటనున్నదో చెప్పకపోవుట వలన నాతఁడు దూలగొండినూఁగు నామె యొడలికి రాచినట్లును, దత్పాపనివారణార్థముగ నొక బ్రాహ్మణున కాతఁడు సదక్షిణాకముగఁ జందనచర్చితోఁ బీతాంబరము లొడలఁ గప్పవలయు'' ననియు నాతఁడు చెప్పెను. ఒక జ్యోతిషికుని బిలిచి యాతఁ డడుగ ''జన్మపత్రమున నతనికిఁ గుజుఁడు నీచపడె ననియుఁ, నాతఁడే యిందులకుఁ గారణమనియునొక పుష్టుఁడుకందులను రక్తవర్ణవస్త్రసహితముగ నొకబ్రాహ్మణునకు దానమిచ్చుటయేగాక సర్వగ్రహములకు యథారీతిని శాంతులు చేయించినమ్మంచి'' దనియు నాతఁడు చెప్పెను. ఒకయెఱుకతను బిలిచి యాతఁడడుగ ''నీతనితోఁ బూర్వము కలిసి వ్యాపార మొనర్చిన యాతఁ డీతనికిఁ జేతఁబడి చేసె ననియుఁ, బంచవర్ణముల యన్నము పరమాన్నము నాతనికి దిగఁదుడిచి కారింగువతోఁ బొగనైచి యాయన్న మూరికుత్తరముగా గోధూళివేళ మూఁడుదారులు కలియుచోటఁ బాఱఁబోయవలయు'' ననియుఁ జెప్పెను. ఈసాధనపరంపరలో దేని నవలంబించుటకును దోఁచక బొర్రయ్యసెట్టి నాతో నివియన్నియుఁ జెప్పి యాలోచన మడిగెను. అంతట నే. నట్టి సాధనపరంపరోపదేశకర్తలగువారినిఁ దత్సాధన ప్రాశస్త్యములఁ గూర్చి యడిగితిని. తెనుఁగువైద్యుఁడు మహమ్మదీయ వైద్యునిఁ జెడఁదిట్టి ''కర్పూరముకంటెఁ గలియుగసంజీవిని మరియొకటిలే'' దని కంతోక్తిగాఁ బలికెను. తనమందువలన ''తందురుస్తీ'' కలుగక పోయినయెడల ''దాడి హజా

మత్ అని ఝాంకారముతోఁ బలికి ''బమ్మన్ సైతాన్'' అని మహమ్మదీయుఁడు పండ్లుగొరికికొనెను. ''గ్రహశాస్త్రమంతయుఁ గర్మవిపాకముకాలిక్రిందఁ దూరిపోవుటకైనఁ దగినదికాదని పూర్వోత్తర జన్మజ్ఞాన నిక్షేపుఁడు చెప్పఁగఁ గర్మవృషభమునకు గ్రహచారమే ముకుఁద్రాడని కార్తాంతికుఁడు గద్దరించెను. ''ఎన్ని మందులైన, నెన్నికర్మచికిత్సలైన నెన్ని గ్రహశాంతులయిన నెఱ్ఱయన్నపు దిగఁదుడుపునకు, గబ్బిలపుఁబెంట ధూపమునకు సరియ గునెడలఁ జెవిగోయించుకొందు'' నని చెవిటియెఱుకత శ్రీసూక్తి సాయించెను.

ఇట్లెవరిమట్టునకు వారే యగ్రగణ్యులు! యథార్థవాదులు! మిగిలినవారు నీచులు. దొంగలు. కల్లుగీఁతలో నున్న గౌరవము కవిత్వపువ్రాఁతలో లేదని గవుండ్లవాని నమ్మకము. కన్నపువ్రేఁతలో నున్నఘనత, ధిషణాచాకచక్యము–కదనధాటిలో లేదని కన్నగాని నిశ్చయము. పండితు లెఱ్ఱసేలువును భుజమునఁ దాల్చి శాస్త్రజ్ఞానగర్వమున విఱ్ఱవీఁగఁగ రంగూనుకఱ్ఱపొదిని దాల్చి రాజుగా రిచ్చిన సింగపుఁదలాటపు మురుగులతో మంగలి లోకాతీతుఁడై వర్ధిల్లును. ఉద్యోగి కలపుఁబోటులచే జీవనహాని చేసి యెంతక్రిందుమీఁదు తెలియకయుండునో పశుమారకుఁడు కత్తివ్రేటుచేఁ గలిగిన యానందముతో వానిపై నెగిరియాడును. ధాన్యాదుల నమ్ముకొని వర్తకుఁడు మోటారుబండ్లలో నెట్టు లూఁగులాడునో తనసౌష్ఠవము నమ్ముకొని వర్తకుడు మోటారుబండ్లలో నెట్టు లూఁగులాడునో, తన సౌష్ఠవము నమ్ముకొని వారకాంత తూఁగుటుయ్యెలలో నంతకంటె నెక్కువగఁ గులుకుచుండును. కవియొకఁడు పలికినట్లు-

తే. ఎఱకనికిఁ దనపంది భూమీశుపట్ట
గజమునకంటెఁ బ్రశస్తమై కానిపించు;
మిండనికిఁ దనకరి బోసి మెల్లసాని
యింద్రునూర్వశినెత్తిపై నెగిరిపోవు.

తనగంటె ఘనుఁడు లేఁడనియుఁ దాను లోకోత్తరుఁడనియు వెర్రి ప్రతిమనుజుని కుండును. తనస్వరూపము మంచిది. తనగుణము మంచిది. తననడువడి మంచిది. తనవృత్తి మంచిది యను నహంకారమూలకోన్మాదము సర్వజనసామాన్యమైయున్నది. ఇట్లు జనప్రకృతిని గూర్చి యేమేమో మనసున నూహించుకొనుచుఁ బండుకొంటిని. అంతట నొకస్వప్నము గలిగెను.

బొర్రయ్యసెట్టి విశేషవ్యాధిగ్రస్తుఁడై యుండెను. మంచముపై నిద్దఱుజను లాతనిఁ బట్టుకొని కూర్చుండఁబెట్టిరి. అతఁడు మిగులబాధపడుచుఁ దల యొకప్రక్కకు వ్రాల్చి కూరుచుండెను. ఆతనిచేతిని దర్భముడియుంగర మున్నది. మంచమున కెదుటఁ గొందఱు బ్రాహ్మణులు కూరుచుండిరి. జీవప్రాయశ్చిత్తమంత్రములుకాఁబోలు చదువుచుండిరి. కొందఱు గ్రహశాంతులు చేయుటకై వరణలు తీసికొనుచుండిరి. ఇంతలో నొకబ్రాహ్మణుఁడు చేత గిండిఁ బూని ప్రవేశించి పంచగవ్య ప్రాశనమంత్రమును జదువుచు నాతనినోటి కుద్ధరిణితోఁ బవిత్రగోమూత్రోదకతీర్థము నిచ్చుచుండెను. అంత బ్రాహ్మణులందఱు గొల్లుమనిరి. నేను స్వప్నముననే యదరిపడి బొర్రయ్యసెట్టి కాలధర్మము నొందెనని జడిసితిని గాని యట్లు కాలేదు. ''శతం జీవ'' యను నాశీర్వచనపుఁ బనసను బ్రాహ్మణులంద రొక్క మొగిఁ గంఠములఁ గ`పి యుచ్చైస్స్వరమునఁ బఠించి మంత్రాక్షత లతనిపై వర్షించిరి. అంత ఫలప్రదానము ప్రారంభ మయ్యెను. ''కర్కటక సోమయాజులుగారూ!

మీరద్వైతపక్షమునఁ దాంబూలమును స్వీకరింపుఁ'' డని యాబ్రాహ్మణసమాజములో సభాపతికాఁబోలు పలికినాఁడు. అంతటఁ గొంతసేపు సభ నిశ్శబ్దముగ నుండెను. అంత నొకబ్రాహ్మణుఁడు తీండ్రమున లేచి ''కర్కటకశాస్త్రు లేపాటిఘనుఁడు? ఏమంత చదువుకొనినవాఁడు? ఏమంత శిష్టత గలవాఁడు? ఏపాటిసద్గుణసంపన్నుఁడు? ఏమంత వయోవృద్ధుఁడు? అద్వైత మతతాంబూలము నాతఁ డేల తీసికొనవలయును? ఆతఁ డపత్నీకుఁడై యింట నొక్కఁ డుండుటచేత నాతని కద్వైతసిద్ధి యైనదా?'' యని యుత్కంఠమున హుంకరించెను. ''నీవలె ముండ నుంచుకొని ద్వైతసిద్ధి నొందలేదులే!'' యని యొక్కఁడు సభలో నాతనిఁ బరిహసించెను. ''ఉంచుకొనలేదా? ఆతనియి ల్లూడ్చుదాసియైన బోసినూ కాలి బట్టతలపై బాసికముగట్టిన బాపనపెండ్లికొడు కెవ్వరు? అనుసరికి ''పరువునష్టమునకు దావా'' యని కొందఱు కేకలువైచిరి. అంత సభాపతి లేచి ''నాయిష్టమున కెవఁ డడ్డువచ్చునో చూతము. కర్కటశాస్త్రీ! చూచెద వేమి? తీసికో తాంబూల'' మని బూకరించెను. అప్పుడు తెంగలి తిరువెంగడాచార్యులుగా రుపదేశముద్ర నున్న పాదుము బ్రహ్మరంధ్ర స్థానమున కెగఁబ్రాఁకనిచ్చి వీవన మొగమున కడ్డుపెట్టుకొని ''యద్వైతుని యాధిక్యమేమి? ఆతఁడు ముందుగాఁ దాంబూలము పుచ్చుకోనేల? రామానుజ మతస్థులుండ, మాధ్వమతస్థు లుండ నగ్రతాంబూలమున కద్వైతి సిద్ధపడనేల? మతత్రయమున కిచ్చిన తాంబూలములు త్రిమత స్థులు సమముగా సమకాలమునఁ బుచ్చుకొనవలయునుగాని ముం దెవ్వఁడును దీసికోఁద గదు.'' అని చెప్పెను. ఆచార్యులుగా రాడినది న్యాయమని సభలోఁగొంద రామోదించిరి. ''ఇచ్చట మాధ్వు లెవ్వరైన నున్నారా?'' యని సభవా రొకని నొకని నడుగ నారంభించిరి. అంతట నొకమూలనుండి యొకఁడు జేనెఁ డంగవస్త్రముపాఁడు, వడితిరిగిన మీసాలవాఁడు, కొంచెము కుచ్చువిడిచిన నెత్తి గావంచవాడు, గోపీచందనపు డాగుల కణతలవాఁడు, ధూమచ్ఛదాగ్ని స్పర్శనమునఁగాబోలు నల్లవడిన పెదవులపైఁ గడచినరాత్రిదొ తాంబూలర క్తిమ కాసంతగలవాఁడు, సకిలించుచు లేచి ''నే నుంటి'' నని ముందునకు వచ్చెను. ఈవ్యక్తి లక్ష్మణరావుగారి వంటయింటిలోని భీమావతార మని యెల్లరు గ్రహించిరి. వంటపూటిశుంఠకుఁ బరిషత్పూజాసహిత తాంబూల మేల? యని కొందఱు గొణిగిరి. అంత నామాధ్వుఁ డుత్కంఠమున ''సభవారు గుజగుజలు వోనక్కఱలేదు. ఉదరపోషణా ర్థమై న్యాయముగఁ జేసికొనువృత్తులలో గరిఁటెఁ బట్టుట లోపము కాదు. కలము పట్టుట ఘనత కాదు. కావడిమోయుట లోటు కాదు. కంఖాణమెక్కుట ఘనతయుఁగాదు. మీరిచ్చినది మతతాంబూలము కాని యదృష్టతాంబూలము కాదు. మీరు చేతిలో సిబ్బిగరిఁటెఁ జూతురా? ఫాలమునఁ గమలగంధము చూతురా? మూతిపై మీసాలఁ జూతురా? మదిలోని ముఖ్యప్రాణమూర్తిని జూతురా?'' యని పలికెను. బెండకాయ బొట్టువాఁడు హెంకిముండవాడని కొందఱు గుసగుసలాడి కినుకున నవ్వుకొనిరి.

అంతట నీముగ్గురును ఫలప్రదానపుఁ బళ్లెరమునొద్దకుఁ బోయి నిలువఁబడిరి. విసనకర్ర యడ్డుపెట్టుకొని కోరచూపుల నద్వైతివంకఁ జూచుచున్న వైష్ణవుఁడు. ''అదిగో పళ్లెరముపై ముందేల నీవు చేయివైచెదవు? అడ్డబొట్టుటసురత్వము పోనిచ్చుకొంటివి కా'' వని వీవనతో నొక్కపోటతనిచేతిపైఁ బొడిచెను. అంతట నద్వైతి పళ్లెముమీఁదఁ బెట్టుచున్న చేతి నామూఁడునామాలయాతని గళముపైఁ గట్టిగఁబట్టెను. సభ గగ్గోలుపడునందడిలో మాధ్వుఁడు తనతాంబూలమును దీసికొని మీసాల నవరించుకొనుచుఁ బోయెను. అంత

సభవా రీమతశత్రుల నిద్దఱ సఖ్యపఱచి యిద్ద ఱొకసారి తాంబూలములఁ దీసికొనుఁడని యేర్పాటు చేసిరి. ఇద్దఱొకసారి పళ్లెమునుండి తాంబూలములలాగికొనుటలో బలహీనతతోఁ గూరుచుండిన బొర్రయ్యసెట్టి ముందునకుఁ బడెను. కాని కడుపు తలను గాపాడెను. మాధ్వుఁడు తాంబూలమును దీసికొనిపోయినజాడ నెవ్వఁడును గనిపెట్టనేలేదు. ఆతఁ డేఁడి? యేఁ? డని యెల్లరు చూచిరి. అయ్యయ్యో! మాధ్వుఁడు ముందుగాఁ దాంబూలము దీసికొని మతద్వయము నవమానించినాఁ డని యందరుగ్రులయిరి. ఈమా ఱునుండి మాధ్వతాంబూలమును మానిపింపవలసిన దని కొంద ఱుద్ఘాటించిరి. అంతలో ''ఇదిగో మాధ్వుఁ డిక్కడనే యున్నాఁడు. ఎక్కడకును బోలేదు'' యని యొక్కఁడనెను. అంతలో ''నీవుకూడ మాధ్వుఁడవే! ఆతఁడుకూడ మాధ్వుఁడే! ఇతఁడుకూడ మాధ్వుఁడే! అయ్యయో! అందఱు మాధ్వులే! నేనుగూడ మాధ్వుఁడనేకాఁబోలు!'' మరియొకఁడు భయాశ్చర్య కంపితకంఠమునఁ బలికెను. అట్టె మెఱుపు మెఱసినంతలో బొర్రయ్యసెట్టి కూరుచుండినమంచము పెద్దరాయి యయ్యెను. ఆ రాయి యట్టెయట్టె యెదిగి యేడు కొండ లయ్యెను. అదిగో శేషాచలము! అదిగో మోఁకాళ్లపర్వతము! అంతలో బొర్రయ్యసెట్టి శంఖచక్రధారియగు శ్రీవెంకటేశ్వరనామక మహావిష్ణువిగ్రహ మయ్యెను! సెట్టి నిదివఱకుఁ బట్టుకొనియున్నవారు శ్రీభూనీళామహాదేవు లయిరి! ఇత్తడిచేతులు రెండు జయవిజయు లయ్యెను! ఓ! కలియుగ వైకుంఠము! శ్రీవేంకటరమణా! శ్రీనివాసా! యను మహానాదా ములతోఁ గొండ లెక్కు స్త్రీపురుషులు, సాధువులు బైరాగులు, వేలు లక్షలు కానబడిరి. కొండక్రింద నీమాధ్యసమాజ మంతయుఁ జేరినది. ఎక్కడఁ జూచినఁ బంచముద్రలవారే! ద్వాదశోర్ధ్వపుండ్రధారులే! తులసీమాలావక్షస్కులే! శ్రీనివాస నామస్మరణ పరాయణులే! ఓ! నేల యీనిన ట్లున్నది! ఒకశాలలోఁ గుండలాలపండితులు చేరి శాస్త్రచర్చలు చేయుచుం డిరి. మరియొకచోట మధ్వాచార్యకృత గ్రంథములను సవ్యాఖ్యానముగఁ బఠించుచుండిరి. సుధాభాష్యకాలక్షేపమును మరియొకచోటఁ గొందఱు చేయుచుండిరి. మణిమంజరి మధ్వవి జయము మొదలగు గ్రంథములను మరియొకచోటఁ జదువుచు బౌద్ధులను, బ్రచ్ఛన్నబౌద్ధు లను బహుభంగుల దూషించుచుండిరి. మరియొకచోఁ దంబురాలు చేఁబూని కాళ్లకు గజ్జెలు గీలించి చిప్పతాళపుహంగుతోఁ బురందరనామములు కర్ణపేయముగఁ గొందఱు గానము చేయుచున్నారు. మరియుఁ గొన్నిచోటుల వ్యాసపీఠములపై భాగవత రామాయణముల నుంచి పురాణకాలక్షేపమును జేయుచున్నారు. ఈవేంకటేశ్వరక్షేత్రమునఁ జేరిన మాధ్వులలోఁ బురుషులకంటె స్త్రీ లెక్కువగ నున్నారు. కొర్నాటి చీరలవారు, బనారసు కోకలవారు, బరంపురపుఁ బీతాంబరముల వారు, సన్నకుసుంబాచీరలవారు, గోఁచికట్ల వారు, గూడకట్లవారు, చుట్టుత్రిప్పులవారు, మేలిముసుఁగులవారు, వ్రేలుముళ్లవారు, జడచుట్ల వారు, వంకకొప్పులవారు –అనేక వర్ణ స్వరూపవయో లావణ్య విలాసవైఖరీ సహితులగువా రెల్ల నాయూరఁ జేతిపిల్లలతోఁ జంకపిల్లలతోఁ గడుపుపిల్లలతోఁ జేరిరి. పుష్పించిన నందనవన మున్న ట్లీయలమేలు మంగాపురము పురంధ్రీమణి సహితమై యున్నది. కలలో నిది తిరుపతిలోఁ గలిసిపోయినది. ఈస్త్రీలలోఁ బుణ్యస్త్రీలకంటెఁ బూర్వసువాసిను లధికముగ నున్నారు. పురాణములఁ జదువుచోట్లనేమి, పురందరనామ ములు పాడుచోట్లనేమి, మతచర్చలు జరుగుచోట్లనేమి, శాస్త్రవాదములు జరుగుచోటుల నేమి, నూతనముగ గ్రంథములు వ్రాసి కవులు వానినిఁ జదువుచోటులనేమి, వడ్డనసాలలనేమి,

నాటకశాలలోనేమి, చందనపుగిన్నెలఆాచిప్పలబజారులనేమి, యిక్కడక్కడ ననునియ మము లేకుండ నీవెలిపిఁపు వేపారివితంతువులు నర్వధా వ్యాపించియున్నారు. వీరు బారులు గట్టి కర్ణాటకభాషతో మాటాడుకొనుచుఁ గొండల నెక్కుచుండఁగ నంతరిక్షమున నొకదిశ నుండి మరియొకదిశకుఁ గొంగలబారులు ''గీరుగారు'' మనుచుఁ బోవుచున్నట్లుండెనని యాయూరికవియే యొక పద్యమును జదివినాఁడు. మహాభేరీనాదములును, ఢంకారవము లును, ఘంటానినాదములు నంతట వినవచ్చెను. శ్రీమదుత్తరాది మఠస్వాములవారు శ్రీమద్వ్యాసరాయ మఠస్వాములవారుకూడ నక్కడకు దయచేసిరి. వారు దేవతార్చాకలనా పరాయణతనుంటచే నీనాదములు వెలువడిన ట్లూహించితిని. మఠముల వైభవములు, శ్రీరామచంద్ర పీఠముల శృంగారములు, శ్రీస్వాములవారల పవిత్రస్వరూపము లవర్ణ్యము లుగ నున్నవి. అప్పుడు మధ్యాహ్నము రెండుమూఁడుగంటల నడిమినమయము. భోజన మునకు శాలలోని కందరుఁ బోవుచున్నారు. అవి తిరుపతిమాధ్వ సభాదినము లని నే ననుకొంటిని. విశాలశాలలలో లెక్కలేని పఙ్క్తులు దీర్చి భోజనమున కెల్లరు కూరుచుండిరి. అంతలోఁ బెద్దకలకల మారంభమైనది. ఎవ్వరును దానికిఁ గారణమును గ్రహింపలేదు. తుదకుఁ గొందరు మాకు భోజనమక్కరలేదని విస్తళ్ల యొద్దనుండి లేచిరి. వీరిని జూచి మరికొందరు లేచిపోయిరి. శ్రీమదుత్తరాది మఠాధిపతులకును, వ్యాసరాయమఠాధిపతులకు యుద్ధము జరుగుచున్నదని ప్రతీతి వెల్లడియైనది. నర్వసంగపరిత్యాగశీలు రగుననన్యాను లేమి? సమరమునకు సన్నద్ధులగు టేమి? యనినాకాశ్చర్యము కలిగెను. మతవిషయకవాద ములలో బద్ధదీక్షామత్సరులై యున్నారేమోయని యనుకొనుటకు వారిద్ధరేకమతస్థులే! వారిమతములు భేదములుగాని మతము వారి కొక్కటియే. అట్టిచోవారి కేల కలహము రావలయును? మర్యాదలలో నేమైన వ్యత్యాసములు సిద్ధించెనేమో యని నే ననుకొని, యంతలో నదియుఁ గారణముకాదని నే నూహించికొంటిని. వారిద్ధరు జగత్పూజ్యులు. వారిద్ధరిని గౌరవింపనివా రెవ్వరు? వారిని గౌరవించుట యనునది వారిశిష్యులకు గౌరవము కాని వారికిఁ గాదు. అదిగాక ''వారు నన్నుఁ జూడలేదు. వీరు కూరుచుండు మనలేదు. వారు నమస్కరింప లేదు'' అని విచారించు నుత్సరగ్రస్తులగు మందజనుల మూఢావస్థకు మిక్కిలిపైన నున్న ద్వంద్వశూన్యతామహానీయమై మహావస్థయందుఁ బట్టాభిషిక్తులగు పరమహంసశిఖామణులు వారైనప్పుడు మర్యాదలఁగూర్చిన కలహ మేల కాఁగల? దని నేను నిశ్చయపరచుకొంటిని. ఇంతలో నెవ్వరో ''మామూలక్కరలేదా? పూర్వాచారమక్కర లేదా? వ్యాసరాయపీఠ మూరు పేరు మాపీఠము ముందా?'' యని కేకలు వైచుకొనుచుఁ బోవుచుండ నాతనిఁ బిలిచి ''ఈతగవునకుఁ గారణమే?'' మని యడుగ నాతడు ''అగ్రతీ ర్థము మా యుత్తరాదిస్వాములవారి కనూచానపద్ధతి. ఆగౌరవము లిప్పుడు వ్యాసరాయ స్వామి తనకుఁగావలయు నని కోరినారు. ఈప్రపంచ మంతయు నేలవలయు నని నాకుఁగూడ నున్నది. తాను దనపీఠము తన సంస్థానము తనయధికారముతాను జూచుకొని మాటలాడవలయునా? మాస్వాములవారు మర్యాదననుసరించి ప్రథమగౌరవము తనకే యుండవలయు నని శాసించినారు. అందులకు విరోధు లంగీకరింపలేదు. ఆదరణములకై వచ్చితిమా? అన్నమునకై వచ్చితిమా?'' యని యాతఁడు వలికెను. ఇద్దఱికొక్క స్వల్ప విషయమునఁ గలిగినపట్టుచే నింద ఱభోజనముగ నుండుటయు, నిన్ని వేడుకలు భగ్నము లగుటయు, నిట్టి యైకమత్యము చెడిపోవుటయు, నిందఱనోళ్లు బడుటయు మంచిది కాదని

నే నూహించు కొనుచుండఁగ ధూమ్మనుధ్వని యయినది. నాకన్నులు చెదరి మూసికొనిపో యినవి.

తిరుగఁ గన్నులు తెఱచునరికిఁ దిరుమలయు లేదు. అలివేలు మంగాపురము లేదు. మాధ్వసభ లేదు. మాధ్వస్వాములవారలు లేరు. పెద్దచెరువు గానఁబడినది. చెరువుప్రక్క నొక్కపట్టణ మున్నది. నౌబత్తులధ్వనులు పటహధమధములు కాహళభాంకారములు మహ మ్మదీయ వేశ్యానాట్యధ్వనులు వినఁబడినవి. పెద్దమశీదు కనఁబడినది. అందున బారాహిమా మను పీరున్నది. దానియెదుట వివిధములగు నేషములాడుచున్నవి. మిక్కిలి ప్రసిద్ధిఁజెందిన యిద్దరు పులివేసగాం డ్రక్కడఁదారసించిరి. ఇద్దరుఁగూడ గొప్పదేహసాధనప్రవీణులు. కుడియెడమల మర్యాదలఁగూర్చి ఘోరమైన పోట్లాట జరుగుచుండెను. ఒకఁడు రెండవ వేసగానిఁ దనకుడివైపునఁ బోనిచ్చుటకు సమ్మతింపలేదు. కర్రలు విరుగుచున్నవి. కత్తు లాడుచున్నవి. తల లెగుఱుచున్నవి. రక్తము ప్రవహించుచున్నది. కేకలు మిన్ను ముట్టుచు న్నవి. కళేబరములు క్రిందఁబడుచున్నవి. కాని కుడియెడమలతగవు సద్దుకొనలేదు. నా కాయుల్లోల కల్లోలము చూడ మిగుల నాశ్చర్యము, భయము గలిగినవి. భయముచే ముడుచుకొని యొకమూలఁ గూరుచుంటిని. నాకు నెత్తికంతలో రెండుకొమ్ములు వచ్చినవి. చెవులు వ్రేలాడఁ జొచ్చినవి. నాల్గుగిట్టలకాళ్లేర్పడినవి. 'బే' యని యరచుచు నటునిటు వేను మేఁకనై పరుగెత్తుచుండ నెవ్వఁడో చిల్లర పులివేసగాఁడు నామెడను గఱచిపెట్టి పై కెత్తెను. నేను 'బే' యని గట్టిగ నఱచుచుఁ గన్నులు తెఱచునరికి నాభార్య తన మొగమును నాభుజము, మెడ నడుమ నుంచి నిద్రఁబోవుచుండెను. అంత నాతో నామెయు లేఁగ న్వప్న మంతయు నామెకుఁ జెప్పి దీని యభిప్రాయ మేమని యడిగితిని. మేఁక యనఁగా నజ మనియు, మనఁగా బ్రహ్మ మనియు, నందఱు బ్రహ్మస్వరూపు లనియు, జీవులలో నొకనికంటె నొకఁడు హెచ్చనుకొనుట తప్పనియు నామె చెప్పెను.

24. మతవైషమ్యము

జంఘాల శాస్త్రి ఒకసారి అరటి పళ్లు కొనుక్కుందామని బజారుకి వెళ్ళి, పక్కనే వున్న ముక్కుపాడి దుకాణంలో ఒక వైష్ణవ బ్రాహ్మణుడికీ, స్మార్త బ్రాహ్మణుడికీ మధ్య చెలరేగిపోయిన 'మతభేద' యుద్ధాన్ని కంటినిండుగా చూశాడు. వాగ్యుద్ధంలో శివ, కేశవుల పవిత్రత అంతా చిత్తుచిత్తయిపోయింది. ఈ మధ్యలో మరో వ్యక్తి – పళ్ల దుకాణం సాపాబు, రాముడు శివుడు కూడా మహమ్మదు గారి వలెనే తప్ప భగవంతులు కారని తన అమూల్యాభిప్రాయం వెల్లడించాడు. ఈ సందడిలో జంఘాల శాస్త్రి అరటి పళ్ల మాట మరచి ఇంటికిపోయి పడుకొని ఒక కలగన్నాడు. ఆ కలనే తన ఉపన్యాస వస్తువును చేశాడు.

ఆ కలలో కథేమిటంటే – ఒక పట్టణంలో నవాబుగారు పరిపాలన చేస్తూంటే, ఆయన భార్యని ఒక బ్రహ్మరాక్షసుడు పట్టుకున్నాడు. ఆమెకు పిశాచ వైద్యం జరిగి ఆవిడ కుదుటపడింది. దేవాలయాల్లో అభిషేకాలు జరిగాయి. హిందూ దేవతలకి ఊరంతా ఊరేగింపులు జరుగుతున్నాయి.

ఒక వీధిలోంచి శివుడి ఊరేగింపు జరుగుతుంటే, అదే వీధిలో వేణుగోపాల స్వామి ఊరేగింపు ఎదురొచ్చింది. ఇంక ఛీత్కారాలూ, దూషణాలూ, కొట్లాటలూ, కొట్లాటలు, విగ్రహాలు కొట్లాట సాధనాలయ్యాయి. ఈ ఘాతుకమైన కలలోంచి జంఘాల శాస్త్రి మేలుకున్నాడు. మేలుకొన్నప్పటి అతని అనుభవం, విగ్రహాలకు, ఉత్సవాలకు, ధూపదీప నైవేద్యాలకు, అతీతమైన ఒక తేజోపూంతమైన నముద్రం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నిన్నరాత్రి నే నరుటిపండ్లకై యంగడికిఁ బోయితిని. అరుటిపండ్లు నేను గొనుచున్న ''దుకాణము''నకు మిక్కిలి చేరువగఁ బొడుముదుకాణ మున్నది. అరుటిపండ్ల నమ్మినాతఁడు తురక. పాడు మమ్మినాతఁడు బ్రాహ్మణుఁడు. ఇతఁడు వెలనాటి వైదికుఁడు. ఈతనితండ్రి తాతలు హోమగుండమున నమిధల వైచి యుష్ణాన నూఁదఁగ నీతఁడు గోలెపుఁ గుంపటిని ధూమచ్ఛదముల వైచి యుష్ణాన నూఁదుచుండెను. కాలి ధూళియగుచున్న నమిధలలో వా రాజ్యవినర్జనము చేయఁగఁ గాలి ధూళియగుచున్న ధూమపత్రము

లలో నీతఁ డాజ్యవిసర్జనము చేయుచుండెను. ఈతని ముత్తాత ఘటపటాడంబర కర్కశ తర్కధాటిచేఁ బ్రకాశించెను. ఈతని పూర్వులవలె నీతఁడుకూడ జనసంతర్పణమునకై శక్తికొలఁదిఁ బాటులు పడుచుండెను. ఇంటనున్న యనూచానవిద్యలలో, నాగమకర్మము లలో నీతనికి మిగిలినది నాసికాచూర్ణనిర్మాణము.

ఈతనియొద్దకుఁ బొడుము కొనుట కొకవైష్ణవుఁడు నేను బోవునరికే వచ్చియుం డెను. వారి కదివరకే స్వల్పమైన కలహ మేల యారంభమయ్యెనో నాకుఁ దెలియలేదు. కాని నేను గొంత వారిని వీరి నడుగ "తగిలినను బాధలేని తాటియాకు టీనెతోఁ బొడుముపొట్లము కట్టక తగులఁదగని దారముతో నేల కట్టి నన్ను మైలపఱచితి?" వని యావైష్ణవుఁడు పలుక "నేను వైదికుఁడ ననుకొంటివా? పంచముఁడ ననుకొంటివా?" యని యావెలనాటి యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెనఁట. దారపుఁబోఁచతో నారంభమైన తగవు తళుకు మనుసరికి నూరంతయుఁ బ్రాఁకిపోయెను. ఈవైష్ణవునకుఁ దడపకట్టు దారపుఁగట్టు లలో నెంతపట్టో! ఈబ్రాహ్మణుఁడు పొడు మెట్లు చేయుచున్నాఁడో యాతనికిఁ దెలియకపో వుటచేఁ గాఁబోలు నింక మడిమైల కేటాయింపులఁ జేయుచున్నాఁడు. పొడుముకొఱ కీతఁడు పొగాకుఁ గొనఁడు. జనులు కాల్చిపాఱవైచిన పొగచుట్టపీఁకెల నీతఁడు తట్టకొక యరణాచొప్పునఁ గొనుము. జాతిలింగవివక్ష లేకుండ సంపాదింపఁబడిన యాధూమోచ్చద కణికానిర్మాల్య సన్నిపాత మీతని నస్యసృష్టికార్యమునకు మూలప్రకృతియైయున్నది. ఈచి లుకకొట్టు తట్టలను మండిగల వైచి యాతఁడు గాఁడిప్రొయ్యిపై వేయించును. దోఁగ వేఁగిన మొక్కజొడిపప్పువలెఁ గమ్మనవానన గ్రమ్మటతోడనే వానిని రోళ్ల వైచి దంపి గొడ్డుక్రొవ్వు, రాసున్నము వైచి పొడుము చేయించును. ఈపొడుమున కున్న గమగమ, గాటు, కమ్మఁదనము ననుభవైకవేద్యములే కాని యనిర్వర్ణ్యములు, వర్తకరహస్యము వెలు వరింపఁగూడదు గాని దీని కున్న తిక్కలోఁ దీపి, కారములోఁ గమ్మత, నిందు గార్దభమూత్ర మేళనమునఁ గలిగిన దని చెప్పుదురు. కాని విశ్వసింప వీలులేదు. నస్యప్రాశస్త్యకలనాసంపాదిత జగద్విశ్రాంత యశోధురంధరుఁడైన షణ్ముఖశాస్త్రుల యాపొడుమునే ఆశ్మనాథ చండాల ముపయోగింతురు. యజ్ఞామృతపానపవిత్రులగు యాయజాకులే యీయమూల్యవస్తువును మడిమైలల విభేదము లేకుండఁ దాఁకునప్పుడొక్క సామాన్యుఁడగు తెంగలివైష్ణవుఁడు దీని నట్లు నిరసించుట మహాపరాధ మని యక్కడి నస్యప్రియులు కొంద రుద్ఘాటించిరి. అంతట వైష్ణవుఁడు పొడుముప టొక్కటి యొక్కముక్కముక్కఅమున బునబున రవాంతర పూత్కా రముచేఁ బూరించి చేతి నొడలినిగూడ జాడించి యిట్లనియెను.

వైష్ణ–నీవు పంచముఁడ వని నీవనుకొనఁదగినది కాని నే ననలేదు. నీవు మహావైదికశిఖా మణి వైననేమి? నీ వంటిన దారము నా యాచారమునకు పనికిరాదు.

బ్రా–ఆమాటయే తిరుగ ననవల దని చెప్పుచుంటిని. వింటివా? జాగ్రత్త. నే నెవఁడనో యెరుఁగుదువా? శుద్ధశ్రోత్రియ కుటుంబములోనివాఁడను. నే నంటిన దారము నీకుఁ బనికిరాకపోయెనా? ఓహో! ఏమి సదాచారనంపన్నుఁడవు! ఆచార మనఁగ నేమో మొదలు తుదనీకుఁ దెలియునా? నాదారముతో మతచ్యుతుఁడవైన నీకు నాపొడుమెట్లు పనికిరాఁగ లదు? పో! పొట్టమక్కడపెట్టి తిరిగిచూడకుండఁబో!

వైష్ణ–కాఱు లఱవక నోరు కట్టిపెట్టుకొనుము. పొడుమున కగ్నినంస్కారమైనది.

కావున స్వీకరించితిని. ''యే బాహుమూలపరిచిహ్నిత శంఖచక్రా'' యను న్యాయమున నివిగో తప్తమైష్ణవముద్రికా చిహ్నములు. అవి లేని నిన్ను దాకఁగూడదు. వీ వంటినది తాకఁగూడదు.

బ్రాహ్మ–హెహెహే! వైష్ణవాచారములు మే మెరుఁగనివి కావు. పెంటలవెంట పఱిగడలు ద్రొక్కిన పాడుగుడ్డలతోఁ బాదప్రక్షాళనమైన లేకుండ విష్ణ్వాలయమునకుఁ బోయి నిలువఁ బడి సెనగలు నమలుట యాచార మయ్యెనేమి? ఆయంటుచేతు లంగవస్త్రమునకుఁ దుడుచుకొనుట యాచార మయ్యెనేమి? పూజారి ముష్టినాంద్రకుఁ బడమైచినట్లు మీ చేతులలో నే తడుపుగుడ్డలలోనో పడమైచిన పులికూడు ముద్దలను గుటుకుగుటుకున ముంగాళ్లమీఁదనే మ్రింగుట యాచారమయ్యెనేమి? ఆచేతులను జుట్లకు రాచికొనుట యాచార మయ్యెనేమి? అంతటితో నూరకుండక యరఁటిపుటికలలో వివిధములగు ప్రాఁచియన్నముల నుంచి వానిని నెత్తిఁ బెట్టుకొని మంగలవీథులనుండి మాలపల్లెలనుండి మోసికొనిపోయి రైలుబండ్లలోఁగూడఁ దీసికొనిపోయి రెండు పక్షములవరకు నాదుష్టాన్నము లను దెరచాటున నమృతప్రాయముగ నాహరించుట యాచార మయ్యెనేమి? గోలెములోని నిన్నటికుడితి నీదినమున గేదె ముట్టదు. నరికదా మూర్ఖనైన మూర్ఖనదు. ఉదయ మున మూఁకుటఁబోసిన పాలను గుక్క సాయంకాలమునఁ గతకదు నరేకదా, కంటితోఁ జూడనైనఁ జూడదు. ఈఁగ లంటుటకు నందేహించిన–చీమలు చేరుటకు జంకిన –చిరకాలవిరచిత చిత్రాన్నమును మీ రెట్లు తినుచున్నారో! మీముక్క లినువడొక్కలో! మీనోళ్లు రాతినోళ్లో! మీపొట్టలు బోనపుఁబెట్టెలో! ఛీ! ఆగమశాననమునకు విరోధముగ, నారోగ్యపద్ధతికి వ్యతిరేకముగ, నఖిలజీవ ప్రకృతికి భిన్నముగ నాచరించు మీ రెట్లు బ్రదుకుచున్నారో! మీ కింకముం దెట్టిగతు లున్నవో!

మైష్ణ–ఇక నో రెత్తకు! ఎత్తకు! విష్ణునివేదన మొందిన ప్రసాదమును దూషించిన నీకన్నులు చిల్లులు పడిపోవును. నీనాలుక తెగి యూడిపడును. మీలోఁ దొంబది వంకలు పెట్టుకొని మమ్మధిక్షేపించుచుంటివా? ఏకాదశినాఁడు–గోవు గడ్డిమేయఁదగని యేకాదశినాఁ డు–చీమలు ధాన్యపుగింజలను న్పుశింపఁదగని యేకాదశి నాఁడు–బిచ్చగాంద్రకు బిచ్చము వేయఁదగని యేకాదశినాఁడు–త్రాగుటకు నీ రీయఁదగని యేకాదశినాఁడు –గుటకమ్రింగనైనఁ దగని యేకాదశినాఁడు–శ్రాద్ధ మాచరించి గొంతువఱకు గారెలు మెక్కి గర్రునఁ ద్రేచుట సదాచారము కాఁబోలు! గారెలు కడుపునిండ దట్టించిన దిట్టరికిఁ గనుచీఁకటిలో గర్భాధానకాండమునకు లోప మేమి? పుష్పములకంటె నెక్కువకోమలముగ, హృదయరంజకముగఁ బెరిఁగిన నెలఁతల తలలను వితంతుదశ సంభవింపఁబగనే మంగలివా నిచేతఁ బెట్టి తచ్చిరోజముల నాతనికత్తివాతఁ బెట్టుచున్నారా? లేదా? ఈదిక్కుమాలిన దురాచారమునుగూర్చి నవనాగరకనారీపురుష లోకమంతయు నిప్పు డెంత యుద్ఘోషించుచు న్నది! మీ కేమి యౌచిత్యము లేదా? అనురాగము లేదా? అంతఃకరణమే లేదా? ఇదిగాక మాంసాశనము దూష్య మనియు, నది వర్జనీయ మనియు, మాంసమును ముట్టినవాఁడు బహిష్కారపాత్రుఁ డనియు బోధించి, యజ్ఞశాలలో బహిరంగమునఁ జేరి, నవరంధ్రములను మూసి, మేఁకలను గటికవానికంటె ఘోరతరముగఁ జంపి యామాంసమును సీగ్గులేక, హేయ మనక, దయాశౌచములు లేక, మ్రింగి, నిష్పాపుల మని, పవిత్రుల మని, దేవ పితృదేవ

భూదేవ సంతర్పణ క్రియాచరణుల మనియు, గరగతస్వర్గద్వారవిదారణ సాధన పారీణుల మనియుఁ గుండలా లాడించుకొని మీవా రూళ్లవెంట నుచితజ్ఞతను విడిచి తిరువీథులు వేంచేయుట లేదా? మదద్రవ్యపరి గ్రహణము మతాచారవిరుద్ధ మను మహాజనవాక్యమునకు విరోధముగ మఖశాలలోఁ జేరి మందయానలతోఁ గూడ సోమపానమును జేసి, సాక్కా, సోలి, తూలి, తెయితక్కలాడుట లేదా? ఇదిగాక నిత్యగృహకృత్యములలో మీరు చేయ సిద్ధపడని కర్మమేదైనఁ గలదా? శవవహనమునకు ముందు బుజము మీది, తిలపిష్ట మహిషాయోమయ విగ్రహ దాన ప్రతిగ్రహణమునకుఁ బ్రథమపీఠము మీది. శల్యపరమాన్న సమాహరణ సాహితికిఁ బ్రథమపండితతాంబూలము మీది–

బ్రాహ్మ–ఇంకను నోరు మూయవా? ఈపాడుమురోఁకటితో నోటికైఁ బొడుతుము. సిగ్గులేక 'మాధ్వ యొకమత' మని వదరు చున్నావా? మతము! తురకవాండ్రు, దూదేకుల వాండ్రు, మాల, మాదిగ, చచ్చట, జంగములు మొదలగు జాతులలో నీమతమును బవిత్రము చేయనివా రెవ్వరు? మీతోఁ బూర్వమునఁ గలిసి తిననివారెవ్వరు? మీతో సంబంధము లావరించి మీవంశములను నానా సాంకర్య సమామ్నాయమును జేయనివా రెవ్వరు? మాలబాపనయ్యలు! మహమ్మదీయభాగవతోత్తములు! చచ్చటవైష్ణవులు! దాసరా చార్య పురుషులు! మాదిగాళ్వారులు! ఓహో! నిరంకుశమతము! సర్వ చండాలసమ్మతము! బ్రహ్మఘ్నుఁడైన సరే! గోఘ్నుఁడైన సరే! గురుతల్పగమనుఁడయిన సరే! విష్ణుభక్తియుక్తుఁడయినయెడల నాతఁడే బ్రాహ్మణుఁడు! ఆతఁడే శ్రీవైష్ణవుఁడు! ఆతఁడే పరమభాగవతోత్తముఁడని మీ రనఁగనే మేదరిగూడెములు, మంగలివాడలు, పల్లెపాలెములు, బెస్తవీథులు, తురకపేఁటలు, మాలమాదిగపల్లె లొక్కమారు సుద్ధబద్ధెలతో, బర్రెజేగురుడా గులతోఁ దులసిపూసల పేరులతోఁ గరాగ్ర గతశంఖచక్ర చిహ్నములతో వైష్ణవాగ్రహారము లపై, నిశిష్టాద్వైత దేవాలయములపై, నాచార్యకూటాగారములపై, విష్ణుభజనమందిరము లపై, భక్తిబోధనశాలలపై పిరుచుకొనిపడలేదా? హృదయమున నున్న విష్ణుభక్తి పరీక్షార్థము కాదయ్యెను. బాహ్యవైష్ణవలక్షణములు కడుపులు బద్ధలుచేయుటకుఁ జాలియుండెను. ఇఁకఁ జేయఁదగిన దేది? అందరు భక్తులే–అందరు శ్రీవైష్ణవులే–భక్తియే ప్రధానము. వర్ణ వృత్తి లింగము లావశ్యకములు కావు. కర్మజ్ఞానములతోఁ బని లేదు. ఈభక్తి మరింత ముదిరిముదిరి పరిపక్వదశనొంది ప్రపత్తి యయినది. దీనితో నైదిక కర్మము చచ్చినది. స్నానము లేదు. సంధ్యావందనము లేదు. జపము లేదు. ఆచమనము లేదు. పాద ప్రక్షాళనములు లేవు. వారు నిరంకుశులు! స్వేచ్ఛావిహారులు! భగవత్సాక్షాత్కృతకొఱకు పదిపీపాలు ద్రాగినను బపన్ననకుఁ దప్పులేదు. తుదకు రామానుజమత మనఁగఁ ద్రాగుడుమత మని యర్థమిచ్చు నంతటి అవకతవకకు దిగిపోయినది. కొంద రుత్తము లున్నను గొందరి దుర్మ ర్యముచే మత మిట్టిదుస్థితినిఁ బూర్వమే చెందియున్నది. పీపాల కొలఁదిఁ ద్రాగినను బపత్తిపద్ధతిచేఁ బాపము కాదు.

వైష్ణ–నిన్నిట్టులీడ్చి సాగదీసి లెంపకాయగొట్టినను దోషముకాదు. అని యాతనిఁ గొట్టును. ఆతఁడు పాదుముకుండు నీతనితలపయిఁ బగులఁగొట్టును. ఈతఁడు చేతినస్య మాతనికంటిలోఁ గలికమువేయును. ఆతఁడు రోఁకటిబండతో నీతనిప్రక్కను బొడుచును. ఆతఁ డీతనిమెడ ప్రక్కను గట్టిగఁ గఱచును. అంత నచ్చటఁ జేరినవారు వారిని విడఁదీసిరి.

వైష్ణవునకు విడఁదీసినకొలఁది బొరుషము హెచ్చెను. కన్నులమంటచే బ్రాహ్మణుఁ డరుఁగుచో గూర్చుండి ''శివశివా'' యని బాధచే నఱచెను. అంత వైష్ణవుఁ డుగ్రుఁడై ''చూచితిరా! న న్నుడికించుట కాదిక్కుమాలిన కూఁతలను దిరిగి యెట్లాతఁడు కూయుచున్నాఁడో'' యని యఱచెను. ''మాశివుఁడు దిక్కుమాలినవాఁడా! ముండకొ డుకా! నీవిష్ణువు గాఁడు మాశివునికంటె దిక్కుమాలినవాఁడు'' అని యాబ్రాహ్మణుఁడు కలియఁబడుటకు లేవఁబోవుచుండఁగా వైష్ణవుఁడు ''సహస్రనామతత్తుల్యం రామనామ వరా ననే'' యని యేడ్చినదాసిగాఁ డెవఁడో ''నెమరునకుఁ దెచ్చుకోరా ముండకొడుక'' యని బ్రాహ్మణునిమీఁదికి రాఁబోవఁగ వారిద్దఱను దిరుగ నచ్చటిజనులు వేరుసేయుటయేకాక వైష్ణవుని నచ్చటి నుండి దూరముగ బలాత్కారమునఁ దీసికొనిపోయిరి. అద్వైతవిశిష్టాద్వై తాహావాడంబరములో నరఁటిపండ్లమాట మఱచిపోయితిని. పండ్లఁగొనుచుండఁగ నాకొ ట్టున కధికారియగు తురక ''మహమ్మదుగారివలెనే రాముఁడు శివుఁడు పైగంబరులే కాని భగవంతులు కా రనియు, బావనయ్యలు సైతానులవలె నేలపోరాడెద?'' రనియుఁ బలికెను. నే నింటికిఁ బోయి జరిగిన యావదవ్వృత్తాంతము నాలోచించుకొనుచుఁ బండుకొంటిని. కలఁతనిద్దుర పట్టెను. ఒకస్వప్నము కలిగెను. ఈనడుమ శ్రాద్ధభోజనము లధికము లగుటచేతను, పెట్టికి వ్యాధి యగుటచేతను దఱుచుగ నాతనితో నిద్రాశూన్యుఁడనై యుండుటచేతను గలలు మిగుల వచ్చుచున్నవి.

నే నొక పట్టణమునకుఁ బోయితిని. దాని నొక్క నవాబు పరిపాలించుచుండెను. ఆతనిభార్య నొక బ్రాహ్మరాక్షసుఁడు పట్టుకొనెను. అదివఱకు నలువదిదినములనుండి యెవ్వఁడో వచ్చి యామెకు మంత్రించు చుండెను. ఆదినమే యాపిశాచ మామెను విడిచెను. ఆమె సుఖముగ భోజనము చేసి యారోగ్యమును గాంచెను. నబాబునకు మిగుల సంతోష ముగ నుండెను. హిందూ దేవాలయముల నభిషేకాదులు జరిగినవి. హిందూదేవతల కూరంతయు నుత్సవములు జరుగుచున్నవి. జనులు వేలకొలఁది షడ్రసోపేతముగ భుజిం చుచున్నారు. నౌబత్తుల బజాయింపులు, ఫిరంగులడ్డామ్మలు, తురకవెలచెలుల కారువాతీరి కలు, హవాయ గొట్టముల హాహాధ్వానములు, జుల్మతీగుర్రములనకిలింపులు, పల్యంకికా వాహకుల యోంకారములు మొదలగునన్ని నందడులు గలిసి యారాత్రి మిక్కిలి విచిత్రముగ నున్నది. నే నీయుత్సవములతోఁ గూడఁ దిరుగుచుంటిని. ఒక్కచో జనసంఘమునుండి దారిచేసికొనలేక ప్రక్క నందునఁబడి యట్టిపోయితిని. కొంతదూరము పోఁగఁ దిరుగనొక పెద్దవీధి చేరితిని. అక్కడ నీశ్వరుఁడు నందివాహనారూఢుఁడై మహావైభవమున నూరేఁగుచున్నాఁడు. శృంగిభృంగులకడుపులోఁ గూలివాం ద్రాడుచున్నారు. శంఖధ్వాన ములు మ్రోఁతలకుఁ జెవులు గింగురుమనఁగ వింజామరలు దలల నదల్చుచుండెను. వాహనో పరి వృషభధ్వజముపైఁ ద్రిశతకోటి దేవతాహస్తచ్యుత పారిజాతపుష్పములవలె వెన్నెము ద్దలు ప్రకాశించుచు రాలుచున్నవి. వీరాంగపుమ్రోఁతచే నూ రెగిరిపోవు చున్నది. ఈశంకరు నకు నమస్కరించి యాయుత్సవముతోఁ గొంతసేపు నడచితిని. అంతలో నెదుటినుండి మఱియొక యుత్సవముతో ననేకజనులు వచ్చుచున్నారు. ఆయుత్సవ మేమో మొదటఁ దెలియలేదు. కాని వేణుగోపాలస్వామి తిరువీథులు వేంచేయుచున్నా రని తెలిసినది. ఓహో! శివవిష్ణువు లొక్కవీథిలోఁ దారసిల్లు టెట్లు? పెద్దయుపద్రవము గలిగినదే! శివునకు విష్ణుదృష్టి తగులఁగూడదు. విష్ణువునకు శివదృష్టి తగులఁ గూడదు. అట్లగునెడల దేవతలకు మహాసం

పోషణాది క్రియలు జరిగింప వలసియుంటయే కాక ''బింబప్రతిబింబ'' మను మహా దోషము కూడ సిద్ధించును. ఈచిక్కులు లేకుండ వెనుకకుఁ బోయిన మంచిదేమె? త్రిపురసంహారకుఁడగు దేవుఁడు వెన్నముద్ద బొొట్టిగానికి వెన్నీయవలసినదా ''ఏమైన సరే కానిండు! ఉత్సవములు జరుపుకొనుటకు నబాబుగారి సెల వున్నదికదా? ''ఈరాత్రితో నిలువుబొొట్టయిన నెగుర వలయు నడ్డబొొట్టయిన నెగురవలయు'' ననుచు నెవరికిఁ దోఁచినమాటలను వా రెల్ల నామహాకలకలములో నాడఁగ నాకుఁ గొన్ని మాత్రమే వినఁబడి నవి. ఇంతలో బాలగోపాలుఁడు శ్రీగరుడాళ్వారి తిరున్కంధము నధిరోహించి మహావైభవ నమగ్రుఁడై వేంచేయుచున్నాఁడు. ఘంటలు జయజయధ్వానము లిచ్చుచున్నవి. మంగళవా ద్యములు మారుమ్రోయుచున్నవి. శ్రీ పెరియచిరియ తిరువళ్ల విగ్రహము లుత్సవమునకు ముందు నాట్యములు చేయుచున్నవి. ''గోపాలకృష్ణా! తాండవకృష్ణా! మురళీకృష్ణా! రాధా కృష్ణా!'' యనుపవిత్రధ్వనులాకాశ మెల్లఁ గ్రమ్మచున్నవి. ఇంతలో వైష్ణవోత్సవమునుండి ఛీ! ఛీ! ఛీ! యనుధ్వనులు ''తిరుగు తిరుగు'' అను బెదరింపులు మిన్ను ముట్టినవి. ''మొండిముండకొడుకులు మన కెదురుగ వచ్చుచున్నారా? తలలు చిదుకఁ బొడువుఁడు. తన్నుఁడు. కొట్టుఁడు. వెనుకకుఁ దిరిగిపోవుదురో వాహనమునకు నిప్పంటింపవలయునో కనుఁగొనుఁడు. ఆగడము! ఎన్నఁడైన నిట్టివింత గలదా? బ్రతుకఁ దలఁచుకొనినయెడల మఱలిపొండు'' అని యేమేమో కేకలు వినఁబడి వినఁబడనట్లు నాచెవినిఁ బడినవి. ''జయ! నుహావిష్ణూ'' యని యీ ప్రక్క నుండి కేకలు వేయఁగ ''జయ మహాదేవా!'' యని యాప్రక్కనుండి నినఁబడినవి. వీరిఘంటానాదములు వారికి వినఁబడకుండ వారు శంఖధ్వా నముల మరింత ప్రబలపఱచిరి. వారి శంఖధ్వానములు వీరికి వినఁబడకుండ వీరు భేరీ కాహళ ఢంకాధ్వనులను మరింత హెచ్చించిరి. వీరి మంగళధ్వనులు వారికి వినఁబడకుండ వారు వీరాంగపుమ్రోఁతకు రుంజులుకూడఁ జేర్చి చెవులు బ్రద్దలు కొట్టుచుండిరి. అందుపై నింక సంతుష్టి లేక వైష్ణవపక్షమునుండి ''ముష్టివాఁడా! కట్టగుడ్డ కఱవైనవాఁడా! వల్ల కాటికాఁపరి!'' యను తిట్లు ప్రబలి చెలరేఁగ, ''మాయకాఁడా! దొంగ ముండావాఁడా! వ్యభిచారపరుఁడా! చెల్లెలికి మగఁడా!'' యను తిట్లోవైపునుండి కోలాహలముతో విజృంభించి నవి. అంత నొక్కఁడు త్రిశూలమును లాల్ సాహెబు నెత్తుకొనిన మహమ్మదీయునివలె గట్టిగ మొగమున కడ్డము పెట్టుకొని వీరాంగధ్వనులు వెంబడింపఁగ వైష్ణవోత్సవములోనికిఁ బోవ, మరి యొక్కఁడల్లె చక్రమును బట్టుకొని డాలు పీరును బట్టుకొన్న తురకవలె వీరావేశముతో శంకర చిహ్నమును, చిహ్నధరునిగూడఁ దాఁకెను. ఈవైపు నావైపున నున్న మంగళ్లు డోళ్ల మీఁదఁ గొట్టవలసిన కర్రలతోఁ గొట్టుకొనసాగిరి. డోళ్లు డోళ్లు నంతరిక్షమునఁ దారసిల్లుచుం డెను. ఇంతలో నొకజయఘంట విష్ణుపక్షము నుండి చక్రమువలె వచ్చి నందీశ్వరుని మోమునఁ బ్రక్కబారునఁ గొట్టఁగ వాహనము వంగెను. వాహకులు కాళ్లు ద్రొక్కుకొని కట్టి లతో బొడుచుకొనిరి. కాని దానినిఁ బడకుండ నాఁపలేకపోయిరి. అంతట మహాతీవ్రమున వాహకులను దీసికొని కొందరు పూజరులు వైష్ణవ పక్షమునకు వచ్చిరి. ఈవాహకులు కట్టులతో విష్ణువాహకులకాళ్లు విఱుగఁగొట్టిరి. వారు గరుడాళ్వారికి భూశయన మొనఁగిరి. పెద్దహాహా కార మగుచున్నది. కన్నులు చీఁకట్లు గ్రమ్మచున్నవి. చెవులు దిబ్బడలు వైచుచున్నవి. ఒడలు రణకంప మొందుచున్నది. నాట్యాంగనలలో నొకరి నొకరు పీకుకొని కఱచుకొను చుండిరి. మహాహవ మగుచున్నది. తలలు బళ్లు మనుచున్నవి. రక్త మొలుకుచున్నది. నే

నీనందడిలో నుండక కొంచెము దూరమున నిలువఁబడితిని. కొంతసేపటికి వైష్ణవార్చకుఁడు బాలగోపాలమూర్తి యుత్సవవిగ్రహమును జేఁబూని ''కృష్ణా! రక్షించు'' మని కేకలు వైచుచు శివపక్షమునకుఁ బరుగులెత్తుచుండెను. ఆతనితో ననేకులుగూడఁ గేకలు వైచుచుఁ బరుగెత్తు చుండిరి. శాంకరోత్సవ ప్రతిమనల్లి యొక పూజారి పూని ''శంకరా! త్రిపురసంహారకా! తృతీయలోచనవికాసమున కిదియే సమయము'' అని కేకలు వైచుచు ననేక జనసంఘముతో వారి నెదుర్కొనెను. 'హరిహరా' రవము లంతట వ్యాపించినవి. వైష్ణవార్చకుఁడు తనచేత నున్న విష్ణువిగ్రహముతో శివార్చకునిచేత నున్న శివవిగ్రహమును హుంకరించి యొక్కఁ దెబ్బ గొట్టెను. రెండును లోహ ప్రతిమ లగుటచేఁ గాఁబోలు గప్పుగప్పున నిప్పులు మంటలు లేచెను. లక్షమెఱపు లొక్కసారి మెఱసినట్లు కన్నులు చీఁకటులుపడినవి.

అట్టి కన్నులు తెఱచునరికి వాహనములు లేవు. విగ్రహములు లేవు. మంగళ్లు లేరు. సానులు లేరు. దీపములు లేవు. ఉత్సవములు లేవు. అంతము లేనియొకటే తేజోవంతమైన సముద్రము అన్నిదిక్కులఁ వ్యాపించియున్నది. దానిలో బుద్బుదము లట్టి లేచుచున్నవి. అట్టి యడఁగిపోవుచున్నవి. తరంగములు కదలుచున్నవి. తిరిగి సముద్రమున లీనమైపోవుచు న్నవి. ఇట్టియిట్టి యివియన్నియు చూచుచున్న నేను బుడుక్కున మునిఁగి బుడగనై తేలితిని. గొంతుక బిగిసిపోయినట్లుండ 'ఊఁ' యని మూల్గితిని. నాభార్య నన్ను లేపెను.

25. రంజాన్ పండుగ–వినాయకచతుర్థి

జంఘాలశాస్త్రి సాహితో కలిసి ఒకసారి హైదరాబాదు వెళ్ళి కొలాచార్యులిచ్చిన తంతి అందుకుని తిరుగు ప్రయాణం పట్టాడు. కారణం బొర్రయ్యశెట్టి ఆరోగ్యం ఏమీ బాగాలేదని–అంటే ఈ ప్రసంగ ప్రస్తావన బొర్రయ్యశెట్టి బతికిబాగున్న రోజులనాటిదన్న మాట.

రైలులో ఒక బ్రాహ్మణుడు, ఒక మహమ్మదీయుడు స్వేచ్ఛగా వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటూంటే – మరీ ముఖంలో ముఖం పెట్టినట్లు ఆబగా వినడం బాగుండదని యెంచి జంఘాల శాస్త్రి నిద్ర నటిస్తూ విన్నాడు. చిన్న 'మత చర్చగా' ప్రారంభమైన వారిద్దరి సంభాషణ ఏమంత రుచి మంతంగా లేకపోవడం వల్ల – నిద్రలోకి జారుకున్నాడు శాస్త్రి. కాని, అతని మనస్సులో మాత్రం వాళ్ళిద్దరే వున్నారు. ఇంకేం వుంది? ఒక కల వచ్చింది.

హైదరాబాదులాగ అనిపించి, అది కానీ ఒక పట్టణం రంగస్థలం. పెద్ద అంగడిలో జంఘాలుడు నిలబడి వున్నాడు. అంతలోనే అతను మనస్సులో జంఘాల శాస్త్రిగా ఉంటూనే పైకి మహమ్మదీయుడిగా మారిపోయి ఊరేగింపులో కలిసిపోయి అక్కడ మహమ్మదీయుల చేత 'మౌల్వీసాబ్'గా మన్నన పొందాడు. ఇదేమిటి? తన వైదిక సంపత్తి నశించి పోయి ఇలాగైపోయానేమా! అని శాస్త్రి మనస్సులో దిగులు కూడా పెచ్చుపెరిగింది.

అదలా వుండగా బొర్రయ్యశెట్టి, ''కూర్చున్న శవమై'' అనంత శయనం మీద వస్తున్నాడు. దాంతో దుఃఖమూ, మిత్ర సంఘమూ గుర్తొచ్చాయి. ఒక ప్రక్క తురకల పండుగ. ఎదుట బొర్రయ్య శెట్టి శవం వినాయక విగ్రహమైంది. గలాటా ప్రారంభమైంది. అంతలో ఒక ఆనుపత్రి ఎదుర్తై ఆ కల, చమత్కారంగా ముగిసింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను

ఈనడుమ గార్యాంతరమున సాక్షియు, నేనును హైదరాబాదునకు వెళ్లవలసివచ్చెను. అందుచే మాసభావ్యాపారము వర్ష కాలపు జదువువలె వెనుక బట్టినది. ఇంక్షను గొలఁది దినములు హైదరాబాదునందుండవలసిన యావశ్యకత యుండెనుగాని, బొర్రయ్యసెట్టికి రోగము హెచ్చుగ నున్న దని మాకాలాచార్యు లిచ్చిన తంత్రీవార్తపై నింత శీఘ్రముగ నిటకు

రావలసివచ్చినది. నిన్న రాత్రి నేనును, సాక్షియు ధూమశకట మెక్కితిమి. మే మెక్కినబండి యఱలో నదివఱకే యొక మహమ్మదీయుఁడును, నింకొకబ్రాహ్మణుఁడును, మాటలాడు కొనుచుండిరి. మహమ్మదీయుఁడు నల్లనివాఁడు, పడుచువాఁడు, పొట్టివాఁడు. నున్నగ గొరిగించిన తలపై రోఁకటిపిన్నువలె బింకముగ నదుకుకొనిన చిన్న కుళ్లాయి గలవాఁడు. పెండ్లి కాలమందు వరున కొనఁగఁబడు నెర్రచారల పంచెను గూడకట్టు గట్టుకొనినాఁడు. కేవల చుబుకప్రదేశము మాత్రమే క్షురకునికత్తి కధీన మగుటచేత గండభాగముల వెండ్రుకలు నిర్భీతిగ దిగఁ బెరిఁగి యాఁదోఁక వాటముగఁ గ్రమక్రమముగ సన్నగిల్లి కొనదేరినవి. నడుమ గడ్డము తాంబ్ర బెత్తువలె బింకముగ నున్నది. ఆ మొగమును వాణీదాసుఁడే చూచినయెడల దాని నిట్లు మంగళమహాశ్రీ వృత్తమున వర్ణించియుండును. ''తల నున్న వెండ్రుక లంబష్ఠుని యాయుధమునకు జడిసినవై తలచూప నొల్లక, యెదుగుస్వభావము నడఁపలేని కారణమున లోసలకుఁ బెరిఁగినవి. కంటిగోతులయొద్దకు వచ్చి యాఁగి వానిలోఁ బడిపోవుదు మనుభీతిచేఁ బైకిఁ గనుబొమ్మలుగఁ గొంచెమేర్పడి యంత నంతర్వాహినియై పోయెను. లోపల నిట్లధోవృద్ధి నొందుచు నోరు అను భయంకర గహ్వరమునొద్దకు వచ్చి యట్టె యాఁగిపోయి తిరుగఁ బైకుబికి మీసములుగఁ గొంచె మేర్పడి వానికొనలనుండి యుబుకు వేగముచేఁ గొంచెము పై కెగసినను జర్రున దిగజారి యాప్రక్క కొక ప్రవాహ మాప్రక్క కొకప్రవాహమై విడిచిపోయెను. అందుచేతనే గడ్డ మను నినుకతిప్ప యానడుమ నుండుటకుఁ గారణమై నది.'' అని స్వభావాలం కారసహితోత్ప్రేక్షానమన్వితముగఁ జమత్కరించియుండును. ఆ మహమ్మదీయునితో మాటలాడు బ్రాహ్మణుఁడు కొంచెము కాలము గడచినవాఁడు, మెడలో స్ఫటికమాల కలవాఁడు. అతఁడు ప్రథమశాఖ బ్రాహ్మణుఁ డని నేను గొంతసేపటికిఁ గనిపెట్టితిని. వారిద్దరు మమ్మఁ జూచి కొంతసేపు వారిమాటలఁ గట్టిపెట్టిరి. సాక్షి వెంటనే పండుకొనెను. నేనుగూడ నడుము వాల్చి కనులు మూసితిని. కాని నాకు నిద్ర రాలేదు. మేలుకొంటి నని వారికిఁ దెలిసినయెడల వారు స్వేచ్ఛగ మాటలాడుకొనరేమో యని యెంచి నేను నిద్రను నటించితిని. వారిట్లు రైలుధ్వనిలో గట్టిగ మాటలాడుకొనుచుండిరి.

మహ–నలుపు తెలు పని యేమిటి చెప్పినారు?

బ్రాహ్మ–యజుస్సు.

మహ–తెలియలేదు; ఏమిటి?

బ్రాహ్మ–అది వేదములో నొకశాఖ.

మహ–వేద మనఁగా మీఖొరానేనా? వేదమునకు నలు పేమిటి? తెలుపేమిటండి!

బ్రాహ్మ–ఏమి టని ప్రశ్నింపఁగూడదు. మామతములో నున్న కట్టుదిట్టమదే!

మహ–నరే నా కెందుకు? నలుపు గొప్ప తెలుపు గొప్ప?

బ్రాహ్మ–తెలుపు గొప్ప కాదా? పక్షిరాజమైన హంస తెలుపు. మృగరాజమైన సింహము తెలుపు. మణిరాజమైన వజ్రము తెలుపు. హస్తిరాజమైన యైరావతము తెలుపు. వృక్షరాజమైన కల్పవృక్షము తెలుపు. దేవరాజగు దేవేంద్రుఁడు తెలుపు!

మహ–అదేమిమాటండి. పాల ''దర్యామీఁద బిచానా'' (పాల సముద్రమున ప్రక్క) వేసినవాఁడు నలుపా? తెలుపా?

బ్రాహ్మ–అబ్బో! మీ రీరహస్య మెరుఁగుదురా? అతఁడు నలుపేకాని యతనికంటె ఘనుఁడగు శంకరుఁడు తెలుపు.

మహ–మీకు మతి లేదా? ఇన్ని దేవు లేమిటి?

బ్రాహ్మ–ఆప్రశ్నలలో దిగకుఁడు. దైవశోధనము తప్పు.

రయిలుహోరుచే వారిమాటలు నా కేమియు వినఁబడుట లేదు. అంత శ్రద్ధగ వినుటకు వారి సంభాషణమున రుచి యేమియుఁ గనఁబడలేదు. అంత వీరిద్ధఱసంగతి యాలోచించుకొనుచు నిద్రించితిని. ఒకకలఁ గాంచితిని. అది యొక పెద్దపట్టణము. హయిదరాబాదువలె నుండెను గాని యది కాదు. నే నాపట్టణమున కేల పోయితినో నాకుఁ దెలియలేదు. కాని దానిపెద్దయంగడిలో నిలువఁబడితిని. డప్పులచప్పుడు లగుచున్నవి. కాహళుల రవళులు గుండ్రగుండ్రముగఁ దిరుగుచుఁ బైకిఁబోవుచున్నవి. నౌబత్తులధ్వనులు నాల్గువైపుల వ్యాపించి మారుమ్రోత లిచ్చు చున్నవి. హిందూస్థానీబాణిగ సన్నాయిపాట వినఁబడుచున్నది. సారంగ ధ్వనులు, మృదంగరవములు, ముఖవీణానినాదములు పెల్లగుచ్చు న్నవి. ఈయుత్సవమున కేమికారణ? మని నాకు నున్న యొకనిని నే నడిగితిని. అత్తఱి మంచిదుస్తులు ధరించి నాకు సమీపమున నున్న కోమటిదుకాణమున నగరుప్పుల్లఁ గొనుచున్నాఁడు. నాప్రశ్నమును వినినతోడనే యాతఁడు రోషకషాయిత నేత్రుఁడయ్ నీ వేమి ''కాఫరువా?'' మహమ్మదీయవంశమున జన్మించిన నీ వీసందడి యేల జరుగుచున్నదో యెరుఁగవా? యని నన్ను గద్దరించెను. అతనిమాటలను విని తెల్లపోయి నిలువఁబడితిని. నేను గట్టుకొనిన రుద్రాక్షయంచుదోవతి బిళ్లకచ్చల తోడి దేమైపోయెనో కాని దానిస్థానమున వదులుకాళుల తెల్లని యిజా రుండెను. జన్నిద మే మయ్యెనో యని తడిమిచూచుకొన్నఁగ నది యాలాగునకు బొందుగ బంధింపఁబడియుండెను. నాతల నున్న చిన్న జుట్టుపిలక బుడుక్కున నాతలలోఁ దూరిపోయి యట్టె గడ్డముమీఁద నడుగుపొడుగుతో వ్రేలాడుచుఁ గితకితలాడఁ జేయుచుండెను. శిష్టు జంఘాలశాస్త్రి తళుకుమనునంతలో నాకు జంఘాల సాహే బయ్యెను. ''సలామలే'' కనుచు నాతఁడు నాచేతిని బట్టుకొని యాయుత్సవము లోనికిఁ దీసికొనిపోఁ బ్రయత్నించెను. నే నిట్లు తురక నగుటకుఁ గారణ మేమో యని లోపల గింజుకొని చచ్చుచుంటిని. క్రొత్తగ వచ్చిన వెంట్రుకలగుటచేఁగాబోలు! గడ్డము కొంచెము దురదగ నున్నది. నాతల మా మేనత్తతలవలె నుండెను. తురక నగుట స్పష్టముగఁ గానఁబడుచున్నది. ఇది కలగాని సత్యము గాదని తరుచుగ మనస్సును శాంతిపఱచుకొం టిని. కాని యాశాంతి నిలువఁబడకున్నది. అయ్యయ్యో! వేదవిహిత కర్మము లడుగంటెనని లోలోన నుడికి యేడ్చుచుంటిని. మొగ మింతటి నుండి క్రిందినుండి పైకిఁ గడుగుకొనవల యును గాఁబోలు! వ్రాఁత కుడి నుండి యెడమకు వ్రాయవలయును గాఁబోలు! అయ్యయ్యో! కాశీ రామేశ్వరయాత్ర మాని మక్కా మదీనాలకుఁ బోవలయునుగాఁబోలు! మహేశ్వర దేవాలయమును వదలి మసీదులోనికిఁ బోవలయును గాఁబోలు! మూఁడు వేళల సంధ్యను మాని యయిదువేళల ''నమాజు'' చదువవలయును గాఁబోలు! దేవీనవరాత్రదీక్ష మాని పీర్లదశరాత్రదీక్ష చేయవలయును గాఁబోలు! శంకరగురుత్వము ద్యజించి మహమ్మదు శిష్యుఁడ నయితిని గాఁబోలు! నా వికృతస్వరూపమును జూచి సాక్షి యేమనుకొనునో! వాణీదాసుఁడు కాలాచార్యులు చూచి నవ్వుదురేమో! నాభార్యయే న న్నింటికిఁ జేరనియ్య

దేమో! యని లోపల గుబ్బెటలు పడుచుంటిని. ఇంతయాందోళనముతో నున్నను నేను లోపల మట్టునకు జంఘాలశాస్త్రి నను నమ్మకమే నాకుఁ బూర్ణముగాఁ గలిగి యుండెను. గడ్డము వచ్చినదిగాని జ్ఞప్తి పోయినదా? తలపై జుట్టెగిరి పోయెను గాని తలలోపలిబుద్ధి నశించినదా? అయ్యయ్యో? దర్భముడి యుంగరముతో నర్ఘ్యప్రదాన మొనర్పవలసిన ముండకొడుకును, బెడ్డముక్క చేతఁ బుచ్చుకొని మూత్రవిసర్జన మింకఁ జేయవలయును గాఁబోలు! ఒడలు తెలియని యాందోళనముతో హరహరా! యని యఱచితిని. ఆమాట నానోరు విడుచుట యేమిటి? రెండుచేపటము లూచి పుచ్చుకొని యాతురక నాకుఁ గటూక్షించుట యేమిటి? ఆదెబ్బలతోఁ గన్నులు జీకటులు పడినవి. తల దిరిగినది. అంతలోనే తిరుగ స్మృతిని దెచ్చుకొని రోషావేశమున నాతనిఁ గొట్టుట కూహించి కాలి నున్న సేవపల్లిలంక చెప్పులజోడు నొక్కటి తీసితిని. తీసిచూడఁగ నది ''లూడియానా'' ఛడా వయ్యెను. అంత మెత్తనిపాదరక్షతో మొఱకు తురక పండ్లూడఁగొట్ట వీలులేదని తటపటాయించుచుఁ దలయెత్తికొంచెము చూచుచుండఁగ నుత్సవజనము మమ్ము సమీపిం చినది. భేరీధ్వనులతోఁ జెవులు గింగురుమనుచున్నవి. అందరు తురకలే! ఒక్కఁడైన హిందువుఁడు లేఁడు. నేను దప్ప-నాయవ్వ యిటు లున్నది.

''ఆబాబ్ మౌల్వీసాబ్'' అనుచు నామహమ్మదీయు లందరు నన్ను గౌరవించిరి. నాకుండెలలోఁ బెద్దరాయి పడినది. ఇక్కడకు మ్లేచ్ఛత్వను సిద్ధాంత మని నిశ్చయపఱచుకొం టిని. నన్ను వట్టి పనికి మాలిన తురకగా భావింపక మతగురువులలో నొకఁడుగఁ గూడ వీ రందఱు భావించుచున్నారు. అంత నొక శ్వేతవసనధారియగు ముసలి మునలమానుఁ డొకఁడు నాయొద్దకు గౌరవపూర్వకముగ వచ్చి నా యెడమచేతిలో ఖొరాను నుంచెను. కుడిచేతిలో నొక పొడుగుపుల్ల నుంచెను. ఆపుల్ల చివర బాలచంద్రాకృతి గల యొకజతరేఖ కనఁబడెను. వెర్రి మొగము వైచుకొని వారివంక నటు నిటు చూడ నారంభించితిని. జలతారుపాగయో, జలతారుకుళ్లాయియో ప్రతిమనుజునకుండెను. పొడుగు గడ్డాలవారు, పొట్టిగడ్డాలవారు, తెల్లగడ్డాలవారు, కరకకాయ రంగు గడ్డాలవారు. కంటిసుర్మాలవారు, గాజుకన్నులవారు, వడిమేఁత మీసాలవారు, చెవులనందునఁ బెట్టిన పాగదేరు నగరువత్తుల వారు, నలువది యేఁబది బొత్తాములకుఁ దక్కువలేని మొకమలు మొండిచొక్కాలవారు; నర్ధచంద్రాకృతి గల జేబులవారు, వెండిపొన్నుల చేతికర్రలవారు, వింతవింతరంగుల లాగుల వారు, వెండిపొడుముడబ్బీలవారు-వివిధములగు దేహచ్ఛాయలతో, నాకృతులతోఁ గానఁబ డిరి. వివిధరూపలావణ్య యుక్తలగు మహమ్మదీయ వేశ్యలయాటలు, పాటలు, కోలయా టలు, కారువాలు మొదలగునవి యాహ్లాదకరముగనేయుండెను. ఏమియున్ననేమి? నామన న్నున కెంతమాత్రము స్థిమితత లేదు. చేతిలో ఖొరానున్న దని యేడువనా? నెత్తిపై శివునివలె చంద్రరేఖ యున్నదని సంతసింపనా? మహమ్మదీయ శిఖామణిత్వము గలిగె నని సంతోషిం పనా? మామూలుశిఖ మట్టిలోఁ గలిసెనని యేడ్వనా? మతము పోయిన టని యేడ్వనా? బ్రతికియుంటి నని సంతోషింపనా? నామన సపుడు పడిన యాందోళన మింతంత గాదు. వర్ణనాతీతము! అనుభవైక వేద్యము! వేల కొలఁది గడ్డము లిట్లు వెంబడింపఁగ నేను ముందుకు నిమ్మళముగ నడచిపోవు చుంటిని. ఇట్లు మేము కొంతదూరము నడువఁగ మా కెడమప్రక్కగ నొకమనీదు కానఁబడెను. దానిలోని కందఱము ప్రవేశించితిమి. మార్కండేయాలయమా? ప్రదక్షిణమా? నందీశ్వరదర్శనమా? మహేశ్వరసేవయా? మారేడుపత్రిపూజయా? అభిషే

కమా? విభూతిరేఖాధారణమా? దుర్గాదర్శనమా? కుంకుమస్వీకరణమా? శివపాదుకాగ్రహణమా? ఏమియు లేదు. ఎవరిమట్టునకు వారు, చేరుమాళ్లను గ్రిందఁ బఱచుకొని చెవులలో వ్రేళ్లు గుక్కుకొని మోఁకాళ్లచిప్పలపైఁ గూరుచుండి నమాజును మొదలిడిరి. వారంద ఱట్లు చేయుచుండ వారిలో మౌల్వీనయి ఖొరానుభరానుషంగినగు నేనట్లు చేయకుంట మంచిది కాదని యెంచి ముక్కుగుడ్డపై ముంగాళ్లు మోపి కూలఁబడితిని. అలవాటు చొప్పునఁ దూర్పు మొగముగఁ గూర్చుండఁబోయి నాశిష్య లందరు పశ్చిమాభిముఖులై యుంటఁ జూచి నేనును వారివలెనే కూరుచుంటిని. పౌరోహిత్యపుఁ బీఁట నెక్కితిని కాని, పునస్సంధానపు మంత్రము చదువఁ గలనా? కృష్ణవేష మమరినది కాని కేదారగౌళరాగము పాడఁగలనా? అయ్యయ్యో! నమశ్శివాయమంత్రము పఠింపఁగలను గాని, నమాజు మంత్రము పఠింపఁగలనా? సంభావనాపేక్షచే సభకు వచ్చిన బ్రాహ్మణ శుంఠ మహదాశీర్వచనపుఁబనసను బఠించు వైదికులతోఁ గంఠము కలిపి పెద్దసందడిలోఁ "బరమదయాకర"యో "యరలవమదన స"యో చదివి పరిసివాటీసోవఁ జేయునట్లు నేనును శివానందలహరియో, భజగోవింద శ్లోకములో చదివితిని. సంస్కృతభాషలో నే నిట్లొనర్చిన బాపననమాజు నెవ్వరున్ను వినియుండలేదు. అది పూర్తి యగువెంటనే బ్రతికితినిరా యని తల తడిమిచూచుకొనుచు మహమ్మదీయవేద హిమధామ రేఖాపాణినై మసీదు వెడలి మహాజనసంఘము వెంటాడింప వీధిలోనికి వచ్చి తిరుగ ముందునకుఁ బోవుచుంటిని.

అంతలో నెదురుగ వచ్చుచున్న దెదియో చూచితిని. నిశ్చేష్టుఁడనైతిని. కొంతసేపటి కొడలు గడగడ వడఁకఁజొచ్చెను. కన్నులవెంట బాష్పములు జొటజొట రాలఁజొచ్చెను. దుఃఖ మాఁపుకొనుటకుఁ బ్రయత్నించుచుంటిని. గొంతు బిగిసికొనిపోవుచున్న ట్లున్నది. ఎదుట వీరాంగపుమ్రోఁత యగుచున్నది. పుష్పభరితమగు ననంతశయన మెనమండ్రచే బహుకష్టమున మోసికొని మా కెదురుగఁ దేఁబడుచున్నది. దానిలో నయ్యయ్యో! మన బొర్రయ్యసెట్టి శిరఃకంపము చేయుచుఁ గూరుచుండెను. తలయొక ప్రక్కకు వ్రాల్చఁబడి యుండెను. నరవాహన గమనానుసారిగ నది తిర్యక్కంపన పునఃకంపన పశ్చాత్కంపన చక్రకంపనము లొందుచుండెను. ఆతనిని బ్రదికియుండఁగఁ జూడ నాకు ఋణము లేకపోయిన దని విచారించితిని. కాని శవమైనఁ జూడనోచని సాక్షికంటె నేనే యదృష్టవంతుఁడ నని యనుకొంటిని. సభయం దింక వ్యాపారాది విషయమునుగూర్చి యుపన్యాసము లీయఁగల మహానుభావుఁ డీతనితో సముఁ డెవ్వఁడు దొరకఁడుగదా! యని విలపించుచుంటిని. సభవారి కీతఁ డప్పు డప్పుడు స్వల్పకష్టముల నిచ్చుటఁ గూడ వాడుక గలదు. సభాభవనపు బాడిగ నిచ్చుటకై యీతనియొద్ద నొకరూపాయను సాక్షి బదులుతెచ్చి నాఁడు. ఇతఁ డింత యాకస్మికముగ నేల చావవలయునో నాకు బోధపడలేదు. పోనీ స్వేచ్ఛానుసారముగఁ జచ్చినాఁడేమో! ఇతనిశవముతోఁ గాలాచార్యులయిన–వాణీదానుఁడయిన నుండన క్కఱలేదా? వారిద్దఱు కనఁబడరు. ఇతఁడు మనసత్యపురములోఁ జావక మహమ్మదీయపట్టణమున నేల చావనలయును? అక్కడనే చచ్చియున్న వాని నింతదూరము మోసికొనివచ్చుచున్నారా? ఇతఁడు వీరశైవుఁడు కావున వీరశయ్య నెక్కినాఁడు. వీరాంగపుమ్రోఁతలలో బయలుదేరినాఁడు. అంతవఱకు నందర్భముగానే యున్నది. కాని యతఁడు బొర్రయ్యసెట్టికాఁడేమో? అఁ! కాకపోవుటకూడనా? అవిగో తామరకోరములు కందూతిఖండన కాల్పనికకరములు! అతని కీఱునటు నిరంకుశదీప్తిచే వెలుఁగుచున్నవి. తన్నుఁ

ఒదుగురుగానిమోయలే రను సంగతి వెల్లడించుటకైవాని నట్లుంచిన ట్లున్నది. అతనియెడ లెంతమాత్రము సొక్కలేదు. నిండుగ నున్న కడుపుపైఁ దామరడాగులు మాత్రము భూగోళపుఁ బ్రతిమపై వివిధ దేశముల వింతవింతరంగులలో నదుల నల్లనిచారలతోఁ బర్వతముల గొంగళిపుర్వుపట్టెలతో నడుమ నిగనిగలాడు దేహచ్ఛాయాసముద్రముతో ద్వీపభ్రమ నిచ్చు జీడివాఁతలమచ్చలతోఁ బ్రకాశించుచున్నవి. బొర్రయ్యసెట్టి దురదచే మరణించినాడు.

నే నిట్లు తరకచేత మరణించితిని. సాక్షిజాడ లేనేలేదు. ఇఁక సత్య పురసంఘము చల్లారిపోవును కాఁబోలు నని ఖేదపడుచుంటిని. ఇన్ని యోచన లన్నియు నాహృదయమున నొక్క రెప్పపాటులోఁ గలిగినవి.

నామొగమందలి దుఃఖచిహ్నములు, నామిత్రు లెవ్వరయినఁ జూచుచుండిరేమో యని నేను వారందఱవంక నొకమారు చూచి-చూడవట్లు చూచితిని. వారందరు రౌద్రమూర్తులై యున్నారు. పండ్లు కొరుకుకొనుచున్నారు. గడ్డముల లాగికొనుచున్నారు. కాళ్లు నేల నడఁచు చున్నారు. చేతికర్రలు పైకెత్తి యాఁగుఁ డాఁగుఁ డని బెదరించుచున్నారు. వీరాంగము వాయించు మంగళ్లను "మార్ డాలో" యని కేఁకులైచు చున్నారు. కోపముచే నూపిరిసలుపక పోయినపుడు పాడుము పీల్చుచున్నారు. మహమ్మదీయవేశ్యలు వికృతశవాకారమును జూచి బెదరి వారివారి ప్రియులయొద్దఁ జేరినారు. ఉత్సవ మంతయు మిగుల గగ్గోలుగ నున్నది. తురకలు ముందునకు బడితెలు చేఁబూని పోవుచున్నారు. కాని నాల్గుహస్తములతోఁ బెద్దపల్లెరమంత మొగముతో సత్రపుతరవాడి కుండంత తలతో నొరలగా దెవంటి కడుపుతో నున్న మనసెట్టిని జూచి "అరే యహ్ షైతాన్ సా దిస్తాహై" (ఇతఁడు పిశాచమువలెఁ గనఁబడుచున్నాఁడు) అనుచు వెనుక నడుగునైచి వెర్రిమొగములతో మరలిరి. తురకలనొబత్తు లడఁగినవి. మంగళ్లవీరాంగములు హెచ్చినవి. నెలయాంద్రకనుగీటు లంత రించినవి. వైశ్య రాజు తలత్రిప్పులు ప్రబలినవి. జారుకాళ్లు వెనుకాడుచున్నవి. అంగవస్త్రపు భుజములు ముందునకు వచ్చుచున్నవి. బొర్రయ్యసెట్టి వాహనమునొద్దకుఁ బోవలసిన నేను తురకల దండుతో వెనుకాడవలసి వచ్చినందులకు విచారించుచుంటిని. అంతలోఁ గొందరు తురకలు నాయొద్దకు వచ్చి "ఇప్పు డేమి చేయవలసిన?" దని నన్నడిగిరి. వెనుకకుఁ బోవుట పౌరుషము కాదని నే నంటిని. అంత "బలేబలే" యనుచుఁ గేకలు వైచుచుఁ గొందఱు తురక లెదుటిగుంపుతోఁ గలియఁబడిరి. రెప్పవేటుకాలములో ననంతశయనముచుట్టు వేలకొలఁదిఁ బ్రమథగణము నిలువఁ బడియుండెను. తళుకు మనునంతలో ననంతశయనము పుష్పరథ మైనది. అట్టియట్టి చూచుచుండఁగ సెట్టిగారిముక్కు మూరెడై బారెడై వ్రేలాడఁ జొచ్చెను. ఒక్క పెద్దదంతము నోటినుండి పైకిఁ దలసూపెను. తుందిలుఁడగు బొర్రయ్యసెట్టి తుందిలో దరుఁడగు విఘ్నేశ్వరుఁ డయ్యెను. కడుపుమీఁద చారలు సర్పబంధము లయ్యెను. అతనిచేతులు శృంగిభృంగు లయ్యెను. ఆతని కాళులయొద్ద గవుడిపోతంత మూషకము చెవులు నిక్కఁబెట్టి, యల్లలాడుచున్న తురకలగడ్డముల వంకఁ జూచుచుండెను. అట్టె ముందుకు-నట్టె వెనుకకు నూఁగుచున్నది. నా కప్పుడు చైతన్యమే లేదు. కొంతసేపటికి స్మృతి తెచ్చుకొని చూచుసరికి విఘ్నేశ్వరవాహనము మహమ్మదీయసమాజములోఁ బడి యందరి గడ్డములు కొరికివైచెను. ప్రమథులు

–ముసలిమానులుఁగొట్టుకొని కొట్టుకొని ప్రాణము విసిగి నిలువఁబడిరి. రంజాన్‌పండుగ 'ఖరాబ్' అయిపోయిన దని తురకలు మిగుల విచారించుచున్నారు. అది యాపండుగయని యప్పుడు నాకుఁ దెలిసినది. ఆదినముననే వినాయకచతుర్థికూడ వచ్చినది కాఁబోలు నని నే నేమియుఁ దోఁచక యనుకొనుచుంటిని. గణనాయకునిఁ బూజించిన మారేడుపత్రి తురకల నెత్తిపైఁ బడుచున్నది. తురకలనోటి సిగరెట్లు గణనాయకునిపైఁ బడుచున్నవి. అప్పుడు విఘ్నేశ్వరుఁడు సర్వమతసామరస్యమునుగూర్చి యుపన్యాస మిచ్చుటకై రథ ముపై నిలువఁబడి చేయెత్తి మాటలాడఁ జొచ్చెను గాని కడుపుబర్వుచే మాటలాడలేకపో యెను. తుండము వాక్ప్రవాహమున కడ్డువచ్చునేమో యని దాని నాతఁడు పై కెత్తినట్టి యెత్తి నాచేత నున్న ఖొరానును లాగుకొని నెత్తిపైఁ గొట్టుకొనెను. అంతట వెలగపండ్లుగ నేరేడుపండ్లుగ దూర్వలుగ నుండరాళ్లుగ నాపుస్తకము మారిపోయెను. అప్పు డా తినఁదగిన వస్తువులసందడిలో మాటలాడఁదగిన యంశమునాతఁడు మరచిపోయెను. కడు పట్టి పొంగి పొంగి పర్వతసన్నిభమయ్యెను. అంతట కిచకిచ మనుచు నానెత్తిమీఁద నేమో చప్పుడ య్యెను. తలయెత్తి చూడఁగ నాచేతిలోని కట్టుచివరనున్న చంద్రుఁడు గణపతిని జూపి నవ్వుచున్నాఁడు. ఇంతలో ఫిరంగులధ్వని వినఁబడెను. గణపతి కడు పాధ్వనితో విడిచిపో యెను. దొడదొడ లింగోటిపూసలు, విభూతిపండ్లు, తిరుచూర్ణపుఁబొట్లములు, లింగకా యలు, శంఖచక్రములు, 'క్రాసు' చిహ్నములు మొదలగున వేమేమో క్రిందఁబడినవి. అంత రాశ్చర్యమునఁ జూచుచుండిరి. విఘ్నేశ్వరుఁడు గప్పు మను వెలుతురుతో మాయ మయ్యెను. కను తెఱచునరికిఁ బెద్దభవనమున నే నుంటిని. తురకలు లేరు. ప్రమథులు లేరు. మంగళ్లు లేరు. వేశ్యలు లేరు. ఆభవన మొక్క యాసుపత్రియఁట! ప్రత్యేకముగ స్త్రీలకొఱ కేర్పరుపఁబడినదఁట! రెండు ప్రక్కలపై నిద్దరు పిల్లలు పండుకొనియుండిరి. ఆసుపత్రి కధికారిణియగు నామె నాయొద్దకు వచ్చి "నేను వార్తాపత్రికలోఁ బ్రకటించిన ప్రకటనను జూచియే వచ్చితివికదా?" యని నన్నడిగెను. ఏమియుఁ దోఁచక ఊఁ యని యంటిని. ఇటురా ఇదుగో! పిల్లవాఁడు, పదునెన్మిది మానములవయస్సుగలవాఁడు. ఇదిగో పిల్లది; పదుమూఁడుమాసములు వయస్సుగలది. నీకుఁ గావలసినయెడలఁ దీసికొనిపో మ్మని చెప్పెను. వీరి కులగోత్రములే? మని నేనడిగితిని. అదియేమియుఁ జెప్పవీలు లే దని యామె తీవ్రముగఁ బల్కెను. సరే యని యాపిల్లలఁ జెరియొకచంక నెత్తుకొని పోవుచుంటిని. ఆపిల్ల లాఁకలిచే నేడ్చుచు నేను స్త్రీ ననుకొనికాఁబోలు పాలు ద్రావుటకు నావక్షమును నోటితో స్పృశింప మొదలిడఁగ నాకు గిలిగింత యయి కెవ్వున నవ్వుచు మేలు కాంచితిని. లేచి చూచుసరి కెదపై రెండుచేతులు వైచుకొనియుంటిని. సాహేబు, ప్రథమశాఖా బ్రాహ్మణుఁ డును మాటలాడుకొనుచునే యున్నారు. సాక్షి కూడ నిద్రించుచున్నాఁడు.

26. వాల్మీకి విశ్వామిత్ర రామాయణ విమర్శనము

జంఘూల శాస్త్రి ఆ రోజు తన ఉపన్యాసాన్ని, తన ప్రయాణానుభవం ఒక దానితో ప్రారంభించాడు. అది తుంగభద్రా తీరంలో ఆనెగొంది వెళ్లడం – ఆనెగొందికీ, రామాయణ కథకీ వున్న సంబంధాన్నిక్కడ వివరించాడు. అది ఒకప్పటి కిష్కింధ అని వాడుక అట! వాల్మీకి రామాయణంలో వున్న కొన్ని స్థల వర్ణనలు ఇక్కడ సరిపోవడం, జంఘూల శాస్త్రిని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది.

అక్కడ శబరి గుహ గురించి ప్రస్తావించాడు శాస్త్రి. సుదుఃఖారోహణపర్వతం విశేషాలు చెప్పాడు. పంపా సరోవరం గురించి సూచించాడు. శబరిని పురస్కరించాడు. అలా రామాయణ ఘట్టాల్ని తాను చూసిన బళ్లారి ప్రాంతాలతో అన్వయించి పరవశించి, శ్రీరామచంద్ర మూర్తిని స్మరిస్తూ జంఘూల శాస్త్రి విరుచుకుపడిపోయాడు ఉపన్యాసం మధ్యలో – వాణీదాసు ఇదంతా జంఘాలుడి 'టక్కు' అనుకున్నాడు. అంతా ఇంటికి వెళ్లగా – అక్కడే గాఢ నిద్రలో మునిగిన శాస్త్రికి సాయంగా సాక్షి పడుకొని, ఒక కల గన్నాడు. ఆ కలలో వాల్మీకి మహర్షి కనిపించాడు. అతను సాక్షే. తన్ను తాను అధ్యాత్మ రామాయణకర్తగా పరిచయం చేసుకున్నాడు జంఘూల శాస్త్రి. వాల్మీకి, తన రామాయణ కావ్యంలో ఉద్దేశించిన పరమార్థం సరిగా వ్యక్తం కాకపోవడం వల్ల తాను అధ్యాత్మ రామాయణం రాశానన్నాడు. అప్పుడు వాల్మీకిగా తాను ఉద్దేశించిన పరమార్థం చెప్పాడు సాక్షి. వాల్మీకీయ రాముడికీ, అధ్యాత్మ రామాయణ రాముడికీ తేడా, ఈ స్వప్న వృత్తాంతం ద్వారా స్పష్టమవుతుంది.

నేను మా సభాకుటీరము చేరుసరికి జంఘూలశాస్త్రి యుపన్యసించుచుండెను. అంతకుముం దేమి చెప్పియుండెనో కాని నేను లోపల కాలుపెట్టుసరి కిట్లు చెప్పుచుండెను. ''కాళ్లు తుడుచుకొనుట కెఱుఁగుబంటితోళ్లచ్చట దొరకు నని గుంతకల్లునుండి వెనుకకు రాక ముందునకై పోయితిని. హొసపేటలో రాత్రి రెండుయామములకు దిగి యిచ్చట బండికుదుర్చుకొని తెల్లవారుకడ నాల్గుగంటలకు మెల్లగఁ దుంగభద్రతీరమును జేరితిని. ఆ నదిని దాఁటినఁగాని 'ఆనెగొంది' చేర వీలులేదు. వెదురుబద్దలతోఁ గట్టి తోలుమూసిన పుట్టిలోఁ గూరుచుండి నదిని దాఁటితిని. అచ్చట 'నది మిగులలోఁ' తని చెప్పిరి.

ఎట్టయెదుట భయంకరమగు బోడిపర్వతము, కుడినైపునఁ గొంతదూరమున నది. రాళ్లనడుమఁ బ్రవహించుటచే గలగలమను హోరు; ఎడమనైపున నేదియో జీబురు మను భయోత్పాతబంధురాంధకారము. మింట ముసుఁగుపడి కునుకుచున్న చంద్రరేఖ. పుట్టే యట్టునిట్టు లూఁగులాడఁ జిత్తవికారముతోఁ గూడిన గుండెదడ గలిగి ''ఏమిరా? భగవంతుఁడా! శిక్షానుభవమునకై బంకోలు పోవుచుంటినా?'' యని నన్నొకసారి బలాత్కార ముగ ననుకొనునట్లు చేసెను. ఎట్లో యానెగొంది చేరితిని. ఎక్కడఁ జూచినఁ బ్రబల పాషాణరచిత మహావిపుల సింహద్వారములే! ఎక్కడఁ జూచిన నాంజనే యాలయములే! ఎక్కడఁ గాంచిన నేకశిలానిర్మితాకాశ స్తంభములే! ఎక్కడఁ జూచినఁ గ్రోఁతులు, కొండమ్రుచ్చులే. ఇది వాలికుమారుఁడగు నంగదునిపట్టణ మందురు. ఇది వేదభాష్య కర్తయగు శాయన మాధవాచార్యులవారిచే నిర్మింపఁబడిన విద్యానగర పురశ్రేష్ఠమునకు శివారందరు. తుంగభద్రకు నివి చెరియొకవైపున నున్నవి. విద్యానగరవిచిత్రము లనేకములు గలవు. వానిని వర్ణించుట మాపని కాదు. వానిని ''నూయల్'' వ్రాసినగ్రంథములవలన మీరు గ్రహింపఁగలరు. నే నిప్పుడు చెప్పఁబోవునంశములు దానిలోవానికంటె విచిత్రములు. సావధానమనస్కులయినఁ బ్రార్థించుచున్నాను.

ఆనెగొంది యనునది కిష్కింధలో నొకభాగము. ఇంద్రపుత్రుఁ డగువాలి యేరాష్ట్రమును బాలించెనో ఆరాష్ట్రమిదియే! ఇచ్చట నుండు కపిగోలాంగూలభల్లుకముల సంఖ్యలకు మితి లేదు. కొండలు మిగులఁగ్రిక్కిరిసియున్నవి. ఇచ్చట వాలిపర్వత మున్నది. తారాపర్వతమున్నది. వాలి భండారస్థానమున్నది. పంపాసరోవర మున్నది. శబరి తపస్సు చేసికొనిన గుహ యున్నది. వాలికాష్ఠ మున్నది. ఇవి యన్నియు 10 లేక 12 మైళ్ల యావరణములో నున్నవి. ఋశ్యమూక మొక్కద్వీపముగ శ్రీమద్రామాయణమున వర్ణింపఁబడియున్నది. ఆహా! వాల్మీకి యెట్లు వర్ణించెనో యట్లే యున్నది. ఇట్టిచిత్రములగు దివ్యక్షేత్రములను జూచుటకు స్థలజ్ఞులగు విద్వాంసుల సాహాయ్య మావశ్యకము గాన నేనిద్దరు వైష్ణవులతో మైత్రిఁజేసితిని. వారొక్కదినమునఁ గిష్కింధాకాండము నందలి యొకశ్లోకమును జదివిరి. అది నాకు బాగుగ జ్ఞప్తికిలేకున్నను దాని యభిప్రాయమిది. ''సుదుఃఖారోహణమ్'' అను నొకపర్వత మున్న దనియు, దానిశిఖరమునకుఁ దూర్పుభాగమున నొకగుహ యున్న దనియు, దానిలో 'శీతజలాన్వితమగు హ్రద మున్న' దనియు నాపర్వతము 'శిశునాగ సమన్విత' మనియుఁ - దచ్ఛ్లోకాభిప్రాయమై యున్నది.

ఈవర్ణన మెంత యథార్థమో నేను దెలిసికొనఁగోరి వారి నిద్దఱఁ దీసికొని మధ్యాహ్నమున దాదాపుగా నొంటిగంటకు బయలుదేరితిని. అది వైశాఖమాసము. ఎండలు నిప్పులను వర్షించుచుండెను. కాలినరాళ్లపై నుండి కాలిపోవుచున్న నిండ్లనుండివలె గాలి దుర్భరముగ వీచుచుండెను. ఆనెగొంది కొక్కమైలులో నీశ్లోకమున వర్ణింపఁబడిన యా ''సుదుఃఖారోహణ'' పర్వత మున్నది. ఆపర్వతమునొద్ద బండి దిగి తదారోహణము సేయ మొదలిడితిమి. కొన్నిచోటులమాత్రము మెట్లున్నవి. అవియైనను మిగుల నెత్తుగ నుండెను. పర్వతమెక్కుసరికిఁ గాళ్లు పడిపోవునట్లయ్యెను. ఆయాసముచే గుండెలు గలవరపడెను. గ్రుడ్లనుండి గిరగిర నీరు దిరిగెను. ''సుదుఃఖారోహణ'' మని సార్థకనామము వాల్మీకి దీని కుంచినాఁడనియనుకొంటిని. ఆపర్వతమునకుఁ దూర్పుదిశయందు గుహ యున్నదని శ్లో

కమునఁ జెప్పఁబడియున్న ట్లున్నదో లేదో యని చూడ నక్కొయున్నది. ఆ గుహాముఖమున విశ్రాంతికై కొంతసేపు గూర్చుంటిమి. దానిముఖము రెండుమూఁడు నిల్వులయెత్తుగలదియై విశాలమై యున్నది. దానియందుఁ గూరుచుండిన మాకు–ఎండలో బహుకష్టపడి వచ్చినమా కు–మిగులఁ జల్లగ నుండుటచేఁ బ్రాణములు హాయిగ నుండెను. ఇట్లు పదినిమిషము లయినపిమ్మట చలి యారంభమయ్యెను. అట్టి యట్టిచలి యధిక మగుటచే నేను గడగడ వడఁకనారంభించితిని. పదిబారలకవతల నగ్నివృష్టి గురియుచున్నది. గుహలోనుండు మేము చలిచేఁగొరడు వారిపోవుచుంటిమి. నామిత్రులు నాకంటెఁ దత్తరిల్లి వేశమున కలవాటుపడినవా రగుటచే చిదుగులు గొన్నిటి నేరితెచ్చి శీతాబాధానివారణమునకై మంటఁజేసిరి. అంతట నొడలెల్లఁ గాఁచికొంటిమి. వంకరలుపోవుచున్నవ్రేళ్లు తిన్నఁబడెను. దగ్గరకు నొక్కుకొనిపోవుచున్న దౌడలు వీడెను. ఒడలికిఁ గుదుపు వదలి కొంచెము కుదురు గలిగెను. ప్రాణముల నిట్లు సస్థానములఁ జేర్చిన కొంతసేపటికి శ్లోకమున ''హ్రదం శీతజలాన్వితం'' అని యున్నదిగదా! ఈగుహలో హ్రద మెచ్చటనున్నది? యని నేనడుగ లోపలకుఁ బోవుదము రండని వారనిరి. అంత గుహాంతఃప్రవేశమునకై మొదలిడితిమి. కొంచెము నిలువఁబడి లోనికిఁ బ్రవేశించితిమి. కొంతదూరము వంగి లోనికిఁ బోయితిమి. కొంతదూరము కూరుచుండి ముందునకు దేకితిమి. కొంతసేపు సాష్టాంగపడి రోఁకలిబండవలెఁ బ్రాఁకితిమి. ఇట్లు కొంతదూరము పోఁగ నచ్చట గుహాద్వారము కొంచె మెత్తు నుంటచే లేచికూరుచుంటిమి. గాఢాంధకారముగనున్నది. తిరుగ వల వలఁ జలి యారంభమయ్యెను. నీటిమీఁదిగాలి జల్లున మొగములమీఁద విసరఁజొచ్చెను. నీటితుంపర సైనఁ బడెను. చేతులతోఁ దడుమఁగ నిసుకయు, మరికొంత చాఁచి తడుమఁగ వ్రేళ్లువంకలుపోఁజేయు చల్లనినీరము చేతులకుఁ దగిలెను. నామిత్రుఁ డొక్కఁడు కూడఁదెచ్చిన చెంబుతోఁ గొంతనీరము ముంచెను. చలి యధికముగ నుండుటచే వచ్చినదారినే. తిరుగ గుహాద్వారముకడకు వచ్చి యచ్చటఁ గూరుచుంటిమి. ''శిశునాగసమన్వితమ్'' అని శ్లోకములో నున్నది. పిల్ల యేనుఁగులతోఁ గూడినది యని యర్థము. కాని యవియేమియుఁ గనఁబడలేదు. కాని, వర్షాకాలమందు తిరుగ నాపర్వతమునకు రాఁగఁ కాలు పెట్టుటకైన నెడములేకుండునట్లు మూరెఁడేసి రోఁకటిబండ లాస్థల మంతటఁ బ్రాకుచుం డెను. శిశునాగము లనఁగఁబిల్లపాములవలె నున్న యీపురుగు లని కవియభిప్రాయమేమో యని మే మనుకొంటిమి.

బల్లారిజిల్లాలోఁ దుంగభద్ర కొకవైపున నీపేరుగల పర్వతము ప్రొద్దిశాభాగమున గుహతోఁ, దద్గుహయందు చెరువుతో నున్న దని భాగీరథీతీరమున నాశ్రమమందుఁ దపస్సుచేసికొనుచుఁ బ్రపంచికపదార్థవిముఖుఁడగు నావాల్మీకిమహర్షి యెట్లు కనిపెట్టినో! ఇన్ని ధూమశకటము లుండి, యిన్ని యశ్వవృషభశకటము లుండి, యిన్ని బాటలుండి, బాటసారుల కరణ్యము లింత బహుళముగ ఛేదింపఁబడి పర్వతమునకిట్లు కట్టఁబడి యాత్రికుల కిన్ని ప్రయాణసదుపాయములు చేయఁబడిన యీకాలములోనే యచ్చటకుఁ బోవుట మహాకష్ట మగుచున్నది కదా! అట్టిచోఁ ద్రేతాయుగమున దండకారణ్య మతిప్రబల ముగ నున్నప్పుడు చీమ చొరఁబారుటకైన నచ్చటచ్చట నెడము లేకుండునప్పుడు వాల్మీకి యీస్థలమునకు న్యాయముగ నడచివచ్చి చూచి మరిప్రాసెనని చెప్పుట కవకాశమున్నదా! నాకుఁ దోఁచదు. తపోబలమునే, దివ్యజ్ఞానమహిమనే దెలిసికొని ప్రాసియుండు నని.

యూహింపవలసియున్నది. ఒక్కయీపర్వతమువర్ణనమే యిట్లు సహజముగ నుండుట కాదు. ఏచెట్టున కాచెట్టు–ఏపుట్ట కాపుట్ట–ఏగుట్ట కాగుట్ట–ఏకొలని కాకొలను–ఏగుహ కాగుహ–ఏమార్గమున కామార్గమిట్టులే సహజముగ వర్ణింపఁబడియున్నట్లు నేనచ్చటిపెద్దలవ లన వింటిని. ఇవియన్నియుఁ జూచినవేనా? చూచుట కవకాశ మున్నవస్తువులేదా?

ఈపర్వతమున కొక్కమైలులోపు దూరమునఁ బంపాసరోవరమున్నది. దానితీరము ననే భగవానుఁడగు శ్రీరామచంద్రమూర్తి సీతాదేవికొర కతికరుణముగ విలపించినాఁడు. దానికి మిక్కిలి చేరువను శబరి యుండు గుహ యున్నది. ఆమె తపస్సుచేసికొన్న స్థల మెంత మనోహరముగ నున్నది! ఈ మహానుభావురాలు, శ్రీరామచంద్రదేవదర్శనమునకై చిరకాలము వేచియుండి యెప్పుడు వచ్చునో యెప్పుడు వచ్చునో యని తలయెత్తి నిక్కినిక్కి యేనిమునమున కానిమునమేయెదరు చూచునట్టి మహాందోళనముతో ననేకసంవత్సరము లుండి, ఆపురాణపురుషుఁడు–ఆజగద్గురు–వచ్చునరి కెదురుగఁబోయి కాళులు గడుగవలయు నను మహాందోళనముతోఁ గమండలువునఁ బంపాపవిత్రోదకమును బూరించి –యాశ్రీమన్నా రాయణుఁడు – ఆ సర్వాంగసుందరుఁడు–ఆఁకలి గొనివచ్చునేమో యని–అందుచే మొగముదాఁచుబారి యుండునేమో తత్కారణమున నాతనివదనచంద్రమం డలము కరుణామృత మొల్కుచుఁ బ్రసన్నముగ నుండదేమో యని–యాదశరథిరాముని కాఁకలి యుపశమింపఁజేయుటకై మధురములై మంజులములై మరిమరి పరిపక్వములయిన ఫలములను గోసి ఒకవేళ–కర్మము చాలక–ఆపండ్లలో నేదియైన నరుచిగఁగాని, పుల్లగఁగాని యుండినచో నాపరమమంజులాంగుని పండ్లు పులిసిపోవునేమో యను భయముచే నాపండ్లను గొంచెము కొరికి రుచి చూచి నిస్సందేహముగఁ బ్రశస్తము లని తోఁచినవానినే భద్రపరచి యుంచి–ఆనీలమేఘశ్యామలాంగుఁడు–ఆయాజానుబాహుఁడు నేత్రపర్వముగ – రోమాంచ కారణముగ–నెదుటఁబడఁగనే యొడలు తెలియక సాష్టాంగపడి–

వాణీ–స్త్రీకి సాష్టాంగము శాస్త్రదూష్య మయ్యా! ఆనంగతిమీకుఁ దెలియదుకాఁ బోలు! స్త్రీయురస్సీమ భూమికిఁ దగిలిన–

జంఘా–(పండ్లు కొరుకుచు) చాలు! చాలు! మగని నపేక్షించి, ఆమగఁడు చచ్చినతరు వాత మరియొకని నపేక్షించి పుత్రపౌత్ర ధనధాన్యాద్యైహిక సుఖముల నపేక్షించిన యాఁడు దట్లు చేయఁగూడదుకాని సర్వసంగపరిత్యాగినియైన యామె యట్లు చేసిన దోషము లేదులే! సాష్టాంగపడి ఆనందబాష్పములచే నాతని కాళులు గడిగి పైటకొంగుచేఁ దడియొత్తి పేముపుటికలలోఁ బెట్టిన యారువెలగపండ్లు–తేనె–యరఁటిపండుల–నొక్కొక్కటి యాత నిచేతఁ బెట్టి యాతం డారగించుచుండఁ గొబ్బరాకు వీవనతోఁ జల్లగ విసరి యాతని పాదములు మెత్తమెత్తగ నొత్తి "మహానుభావా! అహల్యాశాపవిమోచనా! మోక్షప్రదాతా! నీకొర కెంతకాలము నుండియో వేచి యుంటిని. కన్నుల కరవుదీర నొడ లుప్పొంగిపోవఁ గానఁబడి తివి. సీతాపహరణమునుగూర్చి వింటిని. ఇచ్చటకు నుమారొక క్రోశదూరమున ఋష్య మూకమున సుగ్రీవుఁ డున్నాఁడు. ఆతనితో సఖ్య మొనర్పుము. ఆతనివలన సీతాన్వేషణ కార్య మగును. నే నింతకంటె నీకుఁజెప్పవలసిన దేదియు లేదు. నాజన్మమింకఁ గృతార్థమై నది. నిన్నుఁ జూచినకన్నులతో వేఱువస్తువులను జూడలేను. నీకై ఫలము లర్పించిన యీచేతులతో మరియేపనియుఁ జేయఁజాలను. నీ కభిముఖముగ నడచిన యీకాళులతో

నాకింక నుపయోగము లేదు. నీవాక్యములు వినిన యీచెవు లింక నితరధ్వనులు వినవు. నా కనుజ్ఞ యిమ్ము. మహాప్రభూ!'' యని ముమ్మా రాతనికిఁ బ్రదక్షిణ మొనర్చి–యదివరకే ప్రజ్వలించుచున్న చితిలోఁ బడి ప్రాణములు వదలిన యారామపాదార విందభక్తశిఖామణిన మాధి అదిగో! ఆహా! యొడలు జలదరించు చున్నదిగదా! సోదరులారా! రండు రండు. ఇంకఁ జిత్రములఁ జూపింతును. అదిగో! వాలికొష్ఠము. సాధువులు యోగు లెట్లు దానిచుట్లు మూఁగుచున్నారో! దానిని ద్రవ్వి వాలియెముకలముక్క లెట్లు తీసికొని కన్నుల కద్దుకొని దేవతార్చనపుఁ బెట్టెలలోఁ బెట్టుకొనుచున్నారో! వాలి యెముకల కెంత పూజ్యత గలిగెను! ఈతఁ డేమి మహాఘనుఁడా! కాదు. ఈతనిఘనత రావణాసురునిఁ జంక నిరికించికొని నప్తసముద్రముల ముంచిన హేతువుచేఁ గలిగినదా? లేదు. దుందుభిరాక్షసుని ఖండించుటచే వచ్చినదా? లేదు. శ్రీరామచంద్రభగవానుని చేతిలో మరణము సిద్ధించుటచే వచ్చినఘనత. ఇటు రండు. ఇటు రండు. ఇదియే వాలి సుగ్రీవ ద్వంద్వయుద్ధస్థలము. రామచంద్రమూర్తి సుగ్రీవుని మెడలో సంకేతమునకై గజపుష్పలత వైచెనని రామాయణమున నున్నదే? అదిగో అదియే యాలత. ఏనుఁగుగ్రచ్చతోఁగె. దీనికి ముండ్లులేవు. అటు చూడుఁడు. నప్తతాళవిచ్ఛే దము చేసిన రామబాణము తీవ్రముఁగ బోయి చూపుమేరదూరమున నున్న యాకొండను గొట్టుటచే గునపముచేఁ బొడిచిన గోడవలె నెట్లు మొఱ్ఱిపడినదో చూడుడు. సోదరులారా! అత్యద్భుతమగు మఱి యొకచిత్రము. ఈపుణ్యభూమిలో నడుగు పెట్టువానికి మనస్సునకు వ్యాప్తియుండదు. బుద్ధి యల్లే స్తంభించును. ఏదియో తెలియని చిత్తవృత్తి యారంభ మగును. పరవశత్వమే కాని స్వవశత్వ ముండదు. నాతండ్రియైన రామచంద్రుఁడు తిరుగుటచేఁ బవిత్రమగు నీయరణ్యస్థలమును నేను మూఢుఁడనై త్రొక్కవలసినదా? కన్నుల కద్దుకొం దును. ముద్దుఁబెట్టుకొందును. అడుగో! రామభద్రుఁడు! నారామయ్యతండ్రి! తుంగభద్రలో నాంజనేయునిచేఁ గాళులు గడిగించు కొనుచున్నాఁడు. అడుగో! సీతాపతి! సుగ్రీవున కేమి దివ్యదర్శన మిచ్చుచున్నాఁడు! అదిగో ''హా! జానకీ'' యనుధ్వని వినఁబడుచున్నది. నా తండ్రి యచ్చట నార్తుఁడై నాతల్లికొరకు విలపించుచున్నాఁడు. హా! ఎంతకర్మము! ''రామా! రామచంద్రా? రాజీవలోచనా!'' యని యరచుచు జంఘాలశాస్త్రి విరుచుకొని పడెను. వాణీదాసుఁ డిది టక్కని యభిప్రాయపడెను. కాలాచార్యులు పొడుము లేకపోవుటచేఁ గాఁబోలు నోటివెంటనే యుచ్ఛ్వాస నిశ్శ్వాసములు గలవాఁడై యూరకుండెను.

జంఘాలశాస్త్రిని లేవఁదీసి బల్లపైఁ బరుండఁబెట్టితిని. కవియును గాలాచార్యు లింటికిఁ బోయిరి. నేను శాస్త్రిసాహాయ్యమునకై నభాకుటీరమునఁనే పండుకొంటిని. జంఘాలశాస్త్రి గాఢముగ నిద్రపోయెను. నే నీయుపన్యాసాంశములను మెల్లగ నాలోచించుకొనుచుఁ బండు కొంటిని. విచిత్రమగు స్వప్నము గలిగెను. అది యిట్లుండెను.

''నేను లేచి కూరుచుంటిని. ఒడలట్టి లావయి బరువెక్కినది. ఎదపై నేమో కితకితలాడఁగఁ జూచుకొంటిని. తెల్లని పొడుగుగడ్డ మున్నది. తలపైఁ జెయి వైచుకొనఁగ జడలున్నవి. ప్రక్కను గమండలు వున్నది. క్రింద శార్దూలచర్మ మున్నది. ఋషి నైతినను కొంటిని. ఎదుట పండుకొన్న జంఘాలశాస్త్రి నావలెనే మారి ఋషి యయ్యెను. ఆతఁడు నాతో నిట్లనియెను. ''వాల్మీకిమహర్షీ! నమస్కారము.'' ''దీర్ఘాయుష్మగుఁగాక! నీ వెవఁడ?'' వని నే నడిగితిని. నే నెవఁడనైన నేమి? వే నధ్యాత్మరామాయణకర్తను.

రామచంద్రపరబ్రహ్మ భక్తిచేతనే కాక నీవు రచియించిన రామాయణము సమీచీనముగ నుండకపోవుటవలన నేనొకదానిని రచియించితిని. రామచంద్రుఁడు పరబ్రహ్మము. అతనికి సుఖదుఃఖములు లేవు. అట్టి జగత్పూజ్యుని–నట్టి నిర్వికారుని సీతావియోగ కారణమున నెట్లు లేడ్పించితివి? పామరాధమునికంటె నధికముగా నేడ్పించితివే? ఇది బ్రహ్మతత్త్వమున కర్హము కాదని యెంచవైతివి. మనుజుఁ డనుకొన్నను ధీరోదాత్తలక్షణములకు భంగమగునట్లు వ్రాసితివే? ఇది స్వాభావికముగ నున్నదా? నాగ్రంథమున నే నెట్లు చేసితినో యెఱుఁగుదువా? రాముని జ్ఞానసంపన్నతకు భంగము తీసికొనిరాలేదు. రాముని పరమార్థతత్త్వము నట్లే నిలిపితిని. అదిగాక లోకపావనియగు సీతాలక్ష్మిని రావణాసురుఁడు బలాత్కరించి తీసికొని పోయినాఁ డని చెప్పితివి. ఇది దోషము కాదా? అపతివ్రత నాతనిచే నంటనీయవచ్చునా? మహాసాధ్వినటు లంటిన పాపాత్ముఁడు వెంటనే నశింపఁడా? కావున నే నీసందర్భమున నెట్లు వ్రాసితి ననఁగ నరణ్యవాసారంభమునందే రాముఁడు జానకితో నిట్లనియెను. ''జానకీ నే నొక చిత్రమగునాటక మాడఁ దలఁచితిని. నీవు వైకుంఠమున మనస్థానమున కేగియుండుము. నీకు బదు లొక మాయాసీతను సృష్టింతును. దానినే యథార్థసీత యని భ్రమించి రావణుఁడు హరించును. ఈ సంగతి లక్ష్మణునికిఁగూడఁ దెలియనీయను.'' అని చెప్పెను. ఇట్టి కల్పనమువలన యథార్థసీతకు రావణస్పర్శము లేదు. పరమార్థజానకీ వియోగము లేని రామునకు దుఃఖము లేదు. నీవు చేసినదోషముల నిట్లు నేను నవరింపవలసి వచ్చినది. రామభద్రుఁడు యథార్థముగఁ బరమాత్మ–జానకి నరచిత్తము–దశశిరస్సులు గలరావణుఁ డింద్రియ దశకము. ఆంజనేయుఁడు గురుఁడు. శ్రీరాముద్ర తారకమంత్రము. రామదండయాత్ర పరబ్రహ్మకృపాప్రాప్తి. ఇది రామాయణమునకు వేదాంతార్థము. ఈయభిప్రాయమును నేను బోషించి వ్రాసితిని. రామాయణమున నుండు పాత్రలలో సీతారాము లిద్దరే ముఖ్యులు. వారిద్దరిస్వభావములుకూడ నీగ్రంథమున సంతుష్టిగఁ జెప్పఁబడియుండలేదు. నాగ్రంథ ముత్తరదేశమున మిక్కిలి వ్యాప్తమై యున్నది. నీ గ్రంథము దక్షిణమున నున్నట్లు వినుచున్నాను. దక్షిణదేశముల నచ్చటచ్చట పారాయణమునకై నాగ్రంథ ముపయోగింతురు కాని యుత్తరదేశమున నీగ్రంథ మెవ్వ రుపయోగింపరు. ధారాళాంతఃకరణముగలవాఁడ నగుటచే నిట్లు చెప్పితిని. క్షమింపుము'' అని పలికెను. అప్పుడు నే నిటులంటిని. ''అధ్యాత్మరామాయణ గ్రంథకర్తా! నీ యభిప్రాయములకు, నీయంతరంగధారాళతకు, నీయాత్మగౌరవమునకు, నన్నిటికంటె నధికమగు నీసీతారాచంద్రభక్తికి నే నానందించితిని. నాయనా! రామచంద్రమూర్తి భగవదవతార మనియు, సీతాదేవి శ్రీమహాలక్ష్మి యనియు నేను గ్రంథాదియందు స్పష్టముగఁ జెప్పియుంటిని. నాకుఁ బరబ్రహ్మమునందనాదరణము గాని యాతని నేడ్పించు నభిలాషగాని లేదు. నాయనా! మనము వ్రాసినది రామాయణముగాని పరబ్రహ్మాయణము కాదు. వ్రాసినది రానుకథగాని పరబ్రహ్మకథ కాదు. పరబ్రహ్మమును గూర్చి వ్రాయఁదగినగాథ యేదియు లేదు. రాముఁడు పరబ్రహ్మమయ్యును గౌసల్యగర్భమునఁ బుట్టెనందువా? బాల్యలక్షణములగు రోదనాదిక్రియలాచరించె నందువా? సుఖదుఃఖానుభవసామర్థ్యమున కుండఁదగిన మనుష్యవ్యక్తికలిగెనందువా? నర్వి ధముల మనుజుఁ డయ్యే నని యొప్పుకొందువా? పరబ్రహ్మత్వమును బరిపూర్ణముగఁ బ్రచ్ఛాదింపఁ దలఁచుకొనియేకదా పరమపురుషుఁడు పామరనరుఁ డయ్యెను! నరజన్మ మెత్తినయాతఁడు నరలక్షణము లగపరుపఁదగునుగాని నారాయణ లక్షణము లగపరుపవ

చున్నా? గొల్ల వేషమువేసిన బాపనఫగటిభాగవతుఁడు డొంకికర్ర చేతఁ బూని పశువులఁ గాచుకొనఁదగునుగాని బ్రహ్మసూత్రపారాయణముఁ జేయవచ్చునా? శిష్టరక్షణార్థము దుష్టశిక్షణార్థము న్యాయపరిశీలనార్థము రాత్రులందు వీథులలోఁ దిరుగఁదగినరాజు గోఁచియో, గొంగళియో ధరించిన బిచ్చగాఁడై ముష్టిరూపు ముష్టిచూపు ముష్టిమాట గలిగి ప్రచ్ఛన్నుఁడై ప్రవర్తింపవలయునుగాని కిరీటాంగదధారియై చతురంగసేనానమేతుఁడై సర్వాధికారియై చరియింపవచ్చునా? రాధాకృష్ణవీథినాటకమునఁ గృష్ణవేషధారణ మొనర్చు పంగనామాలయయ్య బాడిదెకర్రలమోపు నెత్తిపైఁబెట్టుకొని ముక్కున నడ్డబాన యుంచుకొని ముఖారిరాగము పాడవలయునుగాని నాలాయిరము పఠింపఁదగునా? స్థితి కనుకూలమగు వేషము, వేషమున కనుకూలమగు భాష యుండుట తగునుగాని చాఁకిపాఁడు నవారినెక్కి చాఁకిరేవునకుఁ బోవుట సందర్భముగ నుండునా? కాషాయాంబరధారి కళాశాస్త్రప్రశంస చేయఁదగునా? దేశ కాలస్థితుల కర్థముగ నుండుటయే యధిక యోగ్యతావధి–రాజునకు రత్నఖచితమగు కిరీటు మెంత యర్హాలంకారమో యుప్పరివానికి నెత్తిపై మట్టితట్ట యట్టిది. విష్ణ్వాలయములో వేదఘోష మెట్లు తగునో వేశ్యావీథిని గీతసాధన మట్లు తగును. బాల్యావస్థలోని చిటిచిటిరోదనధ్వను లెంత ముద్దో యుద్ధావస్థలో నమరశూరుని సింహగర్జన మంత ముద్దు. నాయనా! పరబ్రహ్మతత్త్వమును నే నేడిపింపను లేదు. అది యేడువను లేదు. ఏడ్చినయాతఁడు పరబ్రహ్మత్వమును మరచిన రాముఁడు. ఆతఁ డేడ్వఁదగినది కావుననే యేడ్చినాఁడు. ఏడ్వఁదగినజ్ఞాన ముండి యేడ్వఁదగినస్థితి, యేడ్వఁదగిన సాధనము లుండిన యాతఁ డేడ్వకుండుట దేశ కాలవిరోధమని నే నాతని నేడ్పించితిని. నాయనా! ధీరోత్తుఁ డేడ్వఁదగునా? యని యధిక్షేపించితివి. ధీరోదాత్తుఁడు నల్లరాయి కాఁడే? ఉక్కుతునక కాఁడే! వజ్రఫలకముకాఁడే! రక్తమాంసములును, సుఖదుఃఖములుఁ గలవాఁడే! మనుజకోటి లోనివాఁడే? బ్రతికియుండువాఁడు గాని ప్రాణహీనుఁడు కాఁడే! ఆపత్సహనశీలుఁడు, ధైర్యశాలి, శాంతుఁడే కాని కన్నీరులేని వాఁడు కాఁడే! హృదయము లేనివాఁడు కాఁడే!

నాయనా! నీ యధ్యాత్మరామాయణమున మాయాసీతను సృష్టించి యామెనే రావణుఁ డెత్తుకొనిపోయినట్లు చేసితి నని చెప్పితివి. రామాయణమున కంతకు రసము సీతమ్మశోకము గదా? సీతమ్మనే రామాయణమునుండి తీసినైవ సాహసించితివా? ఎంతపని చేసితివి? ఇక రామాయణమున జీవ మేమున్నది? మాయాసీతకల్లబొల్లియేడ్పు లెవనిమనసు దూరును? భగవానుఁడైన శ్రీరామభద్రున కింక భార్యావియోగ మేది? భరింపరాని యాపద యేది? భార్యను భద్రముగ నొకచో దాచుకొని దొంగభార్యను లంకాధీశునకు బుద్ధిపూర్వకముగ నంటగట్టి ''హా జానకీ! యెచ్చటకుఁ బోయితివి?'' అని పైకఱచుటమాత్రమేకాని, కనులఁ జెమ్మయైన లేని, యెడలఁ గంపమైనలేని, గళమున గద్గదస్వరమైన లేని, హృదయమున రసమైన లేని–వట్టిదైన–చప్పనిదైన–రానిదైన–శుష్కమైనదైన – దెచ్చిపెట్టుకొనినదైన –నాటకంపుటంగునకై బూటకముగఁ గన్నులు పొడిచి పొడిచి పుట్టించు కొనినదైన –దుఃఖన్యాయాచ్ఛాయాలేశమును – దప్పనిసరిగ–చూచువారల మోసముచేయు నుద్దేశముతోఁ గనఁబఱచు రాముఁడు–మానవుఁ డైన నేమి?–భగవానుఁ డైన నేమి? పరబ్రహ్మ మైననేమి?–ప్రజాభక్తి గౌరవాధికత నొందఁగలఁడా? ప్రాణికోటిపూజాపాత్రత నొందఁగలఁడా? నారామాయణములోని రాముఁడు మనుజుఁడై యథార్థముగ హరింపఁబడిన

యిల్లాలికొఱకుఁ గరుణముగ విలపించుట తప్పయినప్పుడు–నీరామాయణములోని రాముఁడు పరబ్రహ్మమై–యిట్టి కల్లబొల్లిగరిఁతభాగవత మాడ నీకుఁ దప్పుగఁ దోఁచలేదా? పరబ్రహ్మమై యుండుటయేకాక పరబ్రహ్మ మని తాను దెలిసికొనిన నీ రామునికి శివధనుఃఖండన మెంతపని? అది మాయామానుషవిగ్రహమగు నారామునికి శ్లాఘాపాత్రము. పరబ్రహ్మమగు నీరామునకుఁ బిత్రాక్యదీక్ష యేమంతఘనము? విస్మ్రతాత్మీయపూర్వజ్ఞానుఁడగు నారామున కది సర్వప్రజాశిరఃకంపనార్హము–పరబ్రహ్మమగు నీరామునికి సాకేతరాజ్యత్యాగ మేమంతగొప్ప? ప్రకృతిచ్ఛన్న తేజస్సంపన్నుఁడగు నాశ్రీరామచక్రవర్తి కదియత్యంత మహోదారతానూచకము–పరబ్రహ్మమగు నీ రామునకు రావణవధ యేమంతవిశేషము?–అమోఘసాయకుఁడగు నాకోదండ రామభూపతి కది యత్యంత పౌరుషప్రభాభాసకము? నాయనా! రాముఁడు పరబ్రహ్మ మగును, కాని పరబ్రహ్మజ్ఞానమున రాముఁడు వర్తించుట రామునితప్పు. ఆతఁ డటు వర్తించె నని ప్రజకు బోధించుట కవితప్పు. ప్రజకే కాదు–నాకుఁగూడ–రామునిపరబ్రహ్మత్వముతో నంతజోక్యము లేదు – రాముఁడు రాజీవలోచనుఁడు – నీలమేఘశ్యామల దేహుఁడు–జానకీనాథుఁడు – మాయెదుటఁ గనఁబడవలయును. మే మాతనికాళ్లు కన్నుల కద్దుకొందుము–ఆతఁడు మారక్షకుఁడు. ఆతఁడు మాగురుఁడు–ఆతఁడు మాతండ్రి–జానకమ్మ మాతల్లి–మే మందఱ మాతని బిడ్డలము. ఆతఁడు మాలోనివాఁడు–మే మాతని విడువజాలము. ఆతఁడు సర్వసద్గుణగణాలంకృతుఁడు. మాతల్లిపైఁట చెఱఁగుఁబట్టుకొని కొందఱము వారివెంటఁ బోవుదుము. జానకిం బాసి మారామచంద్రుఁ డేడ్వ మేముగూడ నేడ్తుము. ఆతఁడు దుష్టుఁడైన రావణునిపై బాణము లేయ ''మేమాయసుర నిట్లు తన్నుదుము.'' అని నిద్రలో నొడలు తెలియక బల్లపైఁ దన్నితిని. కాలుచిదుక ''మొఱ్ఱో'' యని యేడ్చుచు లేచితిని.

27. వేదాంతోపన్యాసము

ఒక వూళ్లో ఒక వేదాంతిగారి ఉపన్యాస విన్యాసం. ఆ ఉపన్యాసం విని సత్రంలోజేరిన రకరకాల సంసార శ్రోతల ప్రతిస్పందనలు జంఘాలశాస్త్రి ఒకసారి చమత్కారంగా చెప్పాడు.

మృత్యువు ఏ క్షణాన మీదపడుతుందో తెలియనిదశలో పలికే మనం ఏమిటేమిటో సేకరిస్తాం. జాగ్రత్తలు పోతాం. కట్టుదిట్టాలు కానిస్తాం. రక్షించుకోవాలను కుంటాం. కాని, శ్రీమన్నారాయణమూర్తినే నమ్మికోవడం ముఖ్యం, క్షేమంకరం అని వేదాంతిగారు ఉదాహరణ పూర్వకంగా, లలితంగా, సరళంగా, వైరాగ్యం ప్రజల హృదయాల్లో నాటుకొనేలాగ చెప్పినభ చాలించాడు.

జంఘాలశాస్త్రి సభనించి సత్రానికి భోజనానికి వెళ్లాడు. ఆ ఉపన్యాసం ఊపులో వుండి, అక్కడ జేరిన వారంతా పెదవులమీద మహావేదాంతం పలికించడం గమనించాడు. ఇంతలో రైలుస్టేషనుకి వెళ్లిన ఓ నోరున్న వితంతువు కూతురుతో, అల్లుడితో, సత్రానికి తిరిగివచ్చి- ఆవేదాంతిని, అతని ఉపన్యాసాన్ని పడతిట్టడం మొదలుపెట్టింది.

జంఘాలశాస్త్రికి చిత్రంగా ఒక కల వచ్చి - అందులో ఈ వేదాంతి, ఆ వితంతువు శృంగార సన్నివర్తులైనట్లు తోచింది.

తెల్లారేక - కల కరిగి ప్రపంచంలో పడ్డాక - పెద్దరెడ్డిగారింటికి వెడితే తేలిందేమంటే, ఆవేదాంతి రాత్రికి రాత్రే చేతికి దొరికిన ధన కనకాలతో మాయమయ్యాడని –

జంఘాలశాస్త్రి ఈ ఉదంతం చెప్పి, మనిషి ఆడేమాటకీ, చేసే చేతకీ సంబంధం ఎంత నికృష్టంగా వుందో గుర్తుచేశాడు.

జంఘాలశాస్త్రి సభలో నిట్లు పల్కుచుండెను.

నే నొకయూరు పోయితిని. ఆయూరి కాకస్మికముగ నొకవేదాంతి వచ్చెను. ఆతడు మిగుల దెలిసినవాడని, యేదైన నొక యుపన్యాస మిమ్మని యాయూరిజనులలో బ్రముఖులాతని గోరిరి. ఆత డందుల కీయకొని యూర నున్నయొకదేవాలయమున గూడిన సభికులతో నిట్లు పలికెను.

''సోదరులారా! ఏదియైనఁ జెప్పు మని మీరు నన్నుఁ గోరితిరి. మీకుఁదెలియనిదానిని నేనుమాత్ర మేమి చెప్పఁగలను? ఏదియైన వింతయైనది చెప్పినఁగాని మీకు హితవుగ నుండదుకదా? న్యాయమాలోచింపఁగ లోకములో మనచర్యలకంటె వింతయైనది మఱేదియులేదు. సాయంకాలమునకు భోజనములోనికి వ్యంజనము లేమైన నున్నవో లేదో యని పగలే చూచుకొని వానినిఁ దెచ్చి యప్పటికొఱకు జాగ్రత్తపెట్టుకొనుచున్నాము. ఇతర దినములలోఁ దఱుచుగ దొరకని యల్లము, నిమ్మకాయలు మొదలగువానిని సంతనాఁడే సేకరించి పై వారపు దినములకొఱకు భద్రపఱచుకొనుచున్నాము. మాసాంతమున సేవకులకీవలసిన వేతనముల మొత్తములను, నీటిపన్నుల మొత్తములు మొదలయినవానిని ముందేతీసి వేఱుగ నుంచి మిగిలిన యాదాయమునే వ్యయపఱచుకొనుచున్నాము. వర్షకాలము వచ్చిచున్నది. వంటచెఱకు దొరకదు. దొరికినను బచ్చిపుల్లలతోఁ బ్రొయ్యి మండదు. భోజనములకిబ్బంది కలుగు ననుభయముచే వేసవికాలమునందే ముందునకు నరిపడినకట్టెల నెండబెట్టి భద్రపఱచుకొనుచున్నాము. వర్షకాలమున నటునిటు పోయి కూరలు మొదలగు నాహారపదార్థములను దెచ్చుకొన వీలుగలుగ దని యూరుగాయలను, వడియములను, నప్పడములను బెట్టుకొని యటుకల మీఁద మూసిపెట్టుకొనుచున్నాము. క్రొత్తధాన్యములు వచ్చుతలకనిపెట్టి ముందుసంవత్సరమున కంతకు సరిపోవు దినుసులను గొని గాదెలలోఁ బోయుచున్నాము. పురులఁ గట్టుచున్నారము. పదునెనిమిదేండ్లు వచ్చు నరికి కొడుకుల ప్రక్కలలోనికి భార్యలుండని యెడల వారి ప్రాపంచిక సుఖమునకు గొఱఁత వచ్చు నని పదునాలుగేండ్లకే యెనిమిదేండ్లపిలల్లను వారికి ముళ్లు పెట్టించుచున్నాము. ఇట్లు మనము సర్వప్రాపంచికవ్యాపారములలోఁ గూడ ముందు కొఱఁది కాలములోనేమి, దీర్ఘకాలములో నేమి, రాఁబోవు నావశ్యకము దూరదృష్టిచే గ్రహించి యట్టియావశ్యక మందు మనము సుఖముగ నుండుటకెట్టి యెట్టి యేర్పాటులు చేయవలయునో యట్టివానిని దగుశ్రద్ధతో దీక్షతోఁ బ్రస్తుతపుండే యాచరించుచున్నాము. మీకు పై సంవత్సరమునకై గోనెల కెక్కించిన గోధుమలు కొఱుకువఱకు, మృతి మీగొంతుఁ గొఱుకకుండఁ దను ధైర్యము మీకుఁ గలదా? మీరు భద్రపఱచిన యప్పడములు మీభార్యలు నిప్పుపై వైచి కాల్చువఱకు మిమ్ము మీ కొడుకులు చితిపైఁ బెట్టి కాల్పకుందు రనునమ్మకము మీకుఁ గలదా? మీరు విత్తనములకై వేఱుగ దాఁచియుంచిన మినుములు భూమిపైఁ బడకముందే మీ యాత్మశాంతులకొఱకు మీ మాసికపు బ్రాహ్మణులకై మాషచక్రముల క్రింద నుపయోగింపఁబడ వనువిశ్వాసము మీకుఁ గలదా? అంతవఱకెందుకు? మీరు మీవంటివారితో సాయంకాలమువఱకు దాఁచి యుంచుమని చెప్పిన నెల్లియాకు మజ్జిగపులుసు మీనోటఁబడకముందుఁ గుశనంయుత గంగోదక మవసానతీర్థముగ మీనోటఁ బడదని మీకు నమ్మకము గలదా?

ధర్మరాజు పరిపాలనమున రాజదర్మనార్థమై యర్థస్వీకరణార్థమై వచ్చిన యాచకునొకని రేపు రమ్మని ధర్మరాజు చెప్పఁగ భీమసేనుఁ డామాట విని యేమి చేసెనో వినలేదా? ఢంకా భేరీ పటహ కాహళ ఘంటాదిరవములు మ్రోఁగింపఁజేయలేదా? అటులేల చేసితి? వని యడుగ ''హస్తినాపుర రాష్ట్రము రేపటివఱకు నిల్చియుండు ననియు, నది పూజ్యులగు ధర్మరాజుగారి భుజపీఠమునననే రేపటివఱ కుండుననియుఁ దెలిసెను గదా! రాష్ట్రమునకు, రాష్ట్రజనులకు ననుఁగుఁదమ్ముఁడనయిన నాకు నింతకంటె శుభోదర్కమగు వార్త యేమున్నది?'' అని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ఆమాటలు ధర్మరాజు విని సిగ్గుపడి

యాయాచకునిఁ బిలిపించి సఫలమనోరథునిఁ జేసి పంపెను.

ముం దెప్పుడో కూరలు దొరక వనియుఁ gగూఁతురు ఋతుమతి యగు సనియుఁ బైరునూవులపంటలు తగ్గుననియు, మారికాపీడ హెచ్చగుననియు దూరదృష్టిచే గ్రహించునా రగు మీరు–అట్లు గ్రహించి యేమోమో ప్రయత్నము లిప్పటి నుండి యాచరించుమీరు –నీడవలె మిమ్మెప్పు డాశ్రయించి యట్టి గుటుక్కున మ్రింగుట కదను కొఱకు మాత్రమే నిరీక్షించియున్న మృత్యువు నెదుర్కొనుట కేమయినఁ బ్రయత్నము లొసర్చునారా? చత్తు రని నమ్మకము లేదా? ''దృఢశరీరులము, ఎప్పుడో కాని యింతట నెక్కడ చత్తు?'' మని యనుకొనుచున్నారా? వ్యయాధిపతి దశలో సప్తమాధిపత్యంతర్దశ వచ్చువఱకో, శని ద్వాదశ జన్మములకు వచ్చువఱకో ప్రాణములు శరీరమునుండి పోవుటకుఁ గారణము లేదని యూహించుచున్నారా? గోత్రముల భేదించిన శనికి గున్నరా లెంత? పర్వతధాతువులకంటె మీ ధాతువులు ప్రబలములగునా? కాలమాసన్నమైనప్పు డవియే ధూళి యగుచుండ మీ లెక్కయేమి? మిమ్ముఁ గొంతకాలము బ్రదుకనిచ్చు నని మీ రూహించిన యష్టమాధిపతులు లగ్నాధిపతులు మహాకాలచక్రమున నస్వతంత్రులై పడి మనవలెనే గిరగిర దిరుగుచు గిజగిజ కొట్టుకొనుచు నోరు మూసికొని యే నిమిషమున కానిమిషము నిర్యాణమును నిరీక్షింపవ లసి నవే కావా? తాము గతిలేక యేడ్చుచుండ మీ యేడుపును మానిపింపఁ గలవా? ఏత్పటి కాత్పటియే కవి చెప్పినట్లు ''చావు నిక్కంబు బ్రదుకుట సందియంబె'' కదా! ఈనిమిషమున కేవిధమయిన మరణలక్షణము లగపడకున్నను, హఠాత్తుగఁ బిడుగు మీఁదఁబడునో, మ్రింగుచున్న మెదుకు తప్పుదారినే పోవునో–యొంటిపూసతేలే కుట్టునో–శత్రువు చేతి తరవారితోఁ దల తఱుక్కని యట్టె యెగిరియేపోవునో–టిక్కు టిక్కునఁ గొట్టుకొనుచున్న లోనిగడియారము చప్పుననిలిచియేపోవునో యెట్లు చెప్పఁగలము? మరణ మిట్లనుక్షణము మనవెనుకనేయుండి మన భుజముల మీఁదనుండి నిక్కి నిక్కి వంకగఁ జూచి నవ్వుచుండఁగా దీనివైపు చూచుట మాని చింతపండుబుంగలున్న పెణకల వంకఁ జూచుట యేల? కాలిక్రింది త్రాఁచు గఱవఁటకు బొంచియుండఁగా వింటిబద్దతో జెట్టున నున్న పిట్టను గొట్టువేఁట కాఁడు కాటికడవాఁడే కాదా? జ్ఞాన మేపాటియైన లేనివాఁడే కాదా? వానికి సన్నిహిత సర్వస్థితి తెలియక పోవచ్చును గాని మన కీసహస్రశీర్షికాసంకలితద ర్వీకరదుర్విపాకము తెలియునుగదా? తెలిసియుండియు నిట్లు మూఢవక్రనర్తి శిఖాసుణుల మగుట తగునా?

కన్ను తెఱవని కడుపులోని గ్రుడ్డు మొదలు, కట్ట చేఁబుచ్చి కొనిన కన్నులు లేని కడు వృద్ధుని వఱకు కాలహతులై మనకన్నులయెదుట వయోదార్ఢ్యాదివిపక్షత లేకుండఁ బ్రాణు లెగిరిపోవుచుండ మనము శాశ్వతముగ నీ దిక్కుమాలిన కొంపలఁ గనిపెట్టుకొని యుండగల మనుకొనుటకంటె వెఱ్ఱి యున్నదా? సోదరులారా! అన్ని వింతల కంటె వింత యిదియే. దీనినిగూర్చి యొకకవి యిట్లు పలుకుచున్నాఁడు.

గీ. ఐహికము లశాశ్వతములౌ ననుచు మనుజు
లంద ఱెఱిఁగిన యంశమే; యంద ఱెపుడు
మఱచునంగతి యదియొండె; మఱవకుండ
నాచరించెడువాఁడె జ్ఞానాధికుండు.

భగవంతుడు మన కొసగిన జ్ఞానలేశమును జనుపనార సంచుల మూతులు బిగించ
టలో నుపయోగపఱుపక దైవప్రార్థనములకై మన నోళ్ళను దెఱచుటలో నుపయోగింపవల
యును. మనకున్న స్వల్పబుద్ధిని బ్రథమ ద్వితీయ తృతీయ గర్భాధానములలో వమ్ముసే
యక వైదికోత్తమ కర్మవిధానమున నుపయోగింపవలయును. మనకున్న కాసంత చాకచక్
మను గాళులకుఁ జేతులకు బంధములు వైచుకొని నంధిసంధి కొక్క సంకెలఁ దగుల్చుకొ
పట్టుపురుగువలె లోలో గుడుగుడుకుంచము లాడుచుఁ గాలము వృథవోనీయకుండ మనఁ
బిగించిన దూములను, గట్టిములను నేనుఁగుమెలికలను నిమ్మళముగ సడలఁజేసికొ
స్వేచ్ఛగ నంటి యంటని కుమ్మరిపురుగువలె సంచరించుటకై యుపయోగించవలయును
నాయనలారా! మన యిచ్చటియునికి మూఁడునాళ్లముచ్చటయైన లేదు. ఈమాత్రప
సౌభాగ్యమున కీకార్పరణ్యము లేల? ఈయసూయ లేల? ఈకడుపుమాడ్చుకొనుటలేల?
ఈదాఁచి పెట్టుట లేల? ఈజంజాట మేల? కుళ్లు నీటిలోఁ బ్రోఁగులు ప్రోఁగులుగఁ బెరిఁ
యొకదాని కొకటి యంటిపెట్టుకొని యొకదానినొకటి కఱచి పెట్టుకొని పీకుకొ
కుమ్మలాడు పురుగులకంటె సంసార పంకసమావిష్టనతీపుత్ర పౌత్ర ప్రపౌత్రాది సన్నిహితము
హేయతరము కాదా? ఏలయన? పురుగు లజ్ఞజీవములు. మనమో జ్ఞానలేశమైనను గలిగినజీ
నులము. ఎంగిలాకులగోతుల యొద్దఁ గుక్క పోరాడవలయును గాని మనకుఁ దగునా?
''మన మస్థిరజన్మములము–ప్రపంచ మింద్రజాలము–ఇక్కడ సుఖాభాసమే కాని సుఖము లేదు
ఈ బంధముల నెంతశీఘ్రముగ వదలుకొనిన నంత క్షేమ'' మనుజ్ఞానమును దలలలో
గూడఁబెట్టలేని మనకు గాదెలలో గోదుమ లేల? ''ఎంతసేపు కాంతాకనకములపైననే దృష్టి
పోవుచున్నది. ఐహికము లగు వింతవింత మెఱుఁగులపైననే మనసు పరుగెత్తుచున్నది
నర్వజగన్నిర్మాణ పరిపోషణ ప్రణాశన పటిష్ఠుడగు శ్రీమన్నారాయణుని దివ్యమంగళ
విగ్రహ చరణాంబుజ ధ్యానమున నిట్టితుచ్ఛమైనమనస్సును గట్టి పెట్టినఁగాని మనకు గతుల
లే'' వట్టి నిర్మలభక్తిని హృదయములలోఁ గూడఁబెట్టని మనకు పాఁతఱ గోతులలోని
పప్పుగిఱ్ఱ లేల? పరలోక ప్రయాణమున నేదారిబత్తెమునకై బనికివచ్చు ననుకొంటిరా?
పాడు ప్రపంచమును బాసినపిమ్మట గూడ మనకుఁ బచ్చిపులుసు మెదుకులేనా? భక్తిజ్ఞాన
ములు సత్కర్మములవలనఁగాని కుదరవు. కావున సంసారవిజయ నాటకమునకు సత్కర్మమే
బీజము. అరిషట్కము మనస్సు నావరించి యసత్కర్మమునకై ప్రోత్సాహపఱచును. ఈశ
త్రువులను ముందు నశింపఁజేయవలయును. ఈశత్రుషట్కమత్యంత ప్రబలమైనది. దీనిని
దెగవ్రేయఁగలవాఁడే శూరుఁడు. ఒక కవి యిట్లు పలుకుచున్నాడు.

గీ. పైఁబడి పులి నడఁచువాడు బంటు కాడు
పరుల నెల్ల గెల్చినవాడు బంటు కాఁడు.
లోన బాధించునైరుల లోనుగాక
వాని నిర్జించువాఁడెపో బంటు బంటు

గీ. రామరావణరణ మది రణము కాదు
ప్రబలభారతరణ మది రణము కాదు
రవము సెగ తెంపులేని యార్నాళముల పీ
రంగివ్రేటులదౌ గుండె రణమె రణము.

భక్తిగాని జ్ఞానముగాని యొక్క జన్మమున నంకురించునది కాదు. సత్కర్మానుష్ఠాన మున నవి క్రమముగఁ బ్రబలవలయును. కర్మప్రాబల్యమును గూర్చి యొక కవి యిట్లు పలుకుచున్నాడు.

గీ. సౌఖ్య మొందఁగఁదలఁచిన జనుఁడు సతము
చిత్తశుద్ధిని సుకృతులే సేయవలయుఁ;
బాపకర్మములను జేయువాని కెప్పు
డాత్మసౌఖ్యము చేకూరదయ్య నిజము.

గీ. ఎంతొ నమ్మించి నీలో వసించునట్టు
లున్న ప్రాణమె నినుఁ బాసి యుఱుకునపుడు
నీది యని చెప్పఁదగు వస్తువేది యిచట?
నపుడు నీవెంట వచ్చెడునద్ది యేది?

గీ. ఏవియును గూడ రా; వన్ని యిచటె నిలుచు;
సుతులు భ్రాతలు బంధువుల్ సుతలు సతులు
తోడఁబుట్టులు హితులు నీతోడ రారు
ధనము రాదయ్య మొలత్రాడయినను రాదు.

గీ. వాఙ్మనఃకాయముల దేనివలసనైన
నీవు చేసినకర్మమే నీది సుమ్ము;
ఇదియె వదలక ని న్వెంబడించు; నద్ది
నీది యనదగినది; మఱియేది లేదు.

గీ. నీడలాగునఁ గర్మంబు నిన్ను విడువ
దెపుడు; దుష్కృతు లుపసంహరింపబడవు;
ధర్మకార్యంబు లెపుడు వ్యర్థములు కావు;
భావిఫలదానకలనావిభవము లగును.

గీ. అందుచేతనె పుణ్యకార్యంబు లెపుడు
జనులు సేయంగవలయు; నీజననమందు
నాచరించు పుణ్యము ఫల మందు; ముందు
నాచరించు పుణ్యము ఫలముందు; ముందు
కర్మ ముత్తరఫలమూలకంద మెపుడు.

సోదరులారా! అశాశ్వతమగు నీజీవనమునందు విశ్వాస ముంచక "నారాయణ" యని యిప్పుడే నపశకున మని యాలోచింపక, చేయఁదలఁచిన సత్కృతులను ముందెప్పటికో యట్టిపెట్టియుంచక పది సంవత్సరములు గాఢముగ గ్రామ్యసుఖ మనుభవించినపిదప బ్రాపంచిక నైమిఖ్యమును, వైరాగ్యమును బొందవచ్చునని పానపాత్రలు చేఁబూని ప్రసవపర్యంకముల నెక్కక, యుత్తరక్షణమునైన నమ్మక యిప్పుడే యీక్షణమందే-కాలుచున్న కొంపలో నుండి జనులు వెలుపలఁబడినట్లు-సంసారబంధముల నుండి దూరదూరముగఁ

బడుటకు యత్నింపవలయును. మనకాంతలు మనల వేఁచువారే కాని ప్రోచువారు కారు. మనకొడుకులు మనతనువుల మన్ను చేయువారే కాని మనయజ్ఞానము సున్నఁ జేయువారు కారు. నీకెవ్వరితోడను బనిలేదు. నీ వొక్కఁడవే! నీకొక్క శ్రీమన్నారాయణమూర్తితోడనే పని యున్నది. ఆతఁడే నిన్నుద్ధరించువాఁడు. ఆతఁడే యాపద్రక్షకుడు. ఆతడే యుత్తమగతి ప్రదాత. ఆతఁడే దర్శనీయుడు. ఆతడే ధ్యేయుఁడు. ఆతనినే స్మరించి పూజించి ధ్యానించి కన్నులఁ జూచి మహానందమున మైమఱచి యుండుము. ఆతఁడు సర్వప్రపంచమున నిమిడియున్నాఁ డనియు, నాతనిలో సర్వప్రపంచమున్నదనియు; నాతఁడు నీలో నున్నాఁడ నియు, నీ వాతనిలో నున్నావనియుఁ బరమభక్తిచే గ్రహించి, సంసారమందున్నను–సాంసారిక లంపటతాశూన్యుఁడవై పాడుచుఁ బ్రాణములు విడుచు హంసవలె భగవాన్నామమును బాడుచుఁ బరమోత్సాహమున భగవత్పాదారవింద లగ్నదృష్టితోఁ బ్రాణములను విడు వుము. లేదా? యింకొక్క మెట్టెక్కఁ గలిగితివేని–యెక్కుఁట కిష్టపడితివేని–''సర్వం ఖల్విదం బ్రహ్మ'' యను వాక్యమును చిలుకపలుకులవలెఁగాక సిద్ధానుభవముతో ననుసం ధించి 'నేనే బ్రహ్మ' మను జ్ఞానమును బొంది తరించుము.

''ఓం శాంతి శ్శాంతిః''

అని పలికి యావేదాంతి కూర్చుండెను. సభ ముగిసెను. నేను సత్రములోనికి భోజనమునకై పోయితిని. ఆసత్రములో ననేకజనులు కూడఁ గుటుంబములతో నేవేవో యాత్రలు సేయుచుబసచేసిరి. వారు గూడ నీ యుపన్యాసమును నావలెనే దీక్షతో వినినవారే! సత్రములలోఁ గ్రమ్మదల తక్కువ గాన నీజనులు వారిభార్యలు మాటలాడుకొనిన మాటలు నాకు సులభముగ వినబడినవి. ''ఇంత యాలస్య మైనదేమి'' యని భార్య యడుగ ''మూఁడునాళ్ల ముచ్చటయైన యీపొరలింతల కాలస్య మేమి? శీఘ్రు మేమి?'' యని విసుగుదలతో భర్త బదులు చెప్పెను. ఇంకొకవైపు కూర్చుండిన దంపతులలో భార్య ''మాఅమ్మ కడుకులవడ్లు తీసికొని వచ్చితిరి కారేమి?'' యని భర్తనడుగఁ''దలలో జ్ఞానము లేనప్పుడు కడుపులో నడుకు లేల?'' యని విరుద్ధముగఁ బల్కెను. అతని యత్తగా రామాటలు విని ''ఔనయ్యా! నీకుఁ గూఁతు నిచ్చుటే మొదటి యజ్ఞానము. తరువాత నీకొంపలోఁ బొట్టకూటికై చేరుటయే రెండవ యజ్ఞానము. నీచేత మాటలు పడుచు నిక్కడ నుండుటయే ముమ్మాటికి మూఁడవయజ్ఞానము'' ఇట్లని మూట తీసికొని ''రైలుస్టేషను'' వద్దకుఁ బోయెను. ఆదంపతులామెను శాంతింపజేయుటకై కూడఁ బోయిరి. ఆసత్రములో మఱియొక భాగమున నొకనిభార్య ''ఇటు పిలుచుచుండగ నటు పోయెద రేల?'' యని గద్దఱింప ''మీరు మమ్మ వేఁచు వారేకాని ప్రోచువారు కా'' రని భర్త ధుమధుమ లాడుచు బదులు చెప్పెను. లోపల వంటసేయుచున్న యింకొక కాంత గుమ్మము నొద్ద మూఁకాళ్లపై దల పోసి దిగులుపడి కూర్చుండిన భర్తను ''ఏమండోయి'' యని పిలిచి ''వడియములు నేతిలో వేయింపనా?'' యనఁగ ''వేఁగిన వడియము నానోటఁ బడుసరికి నేను మృత్యువు నోటఁ బడకుండఁ గల ననువిశ్వాస మెట్టు?'' అని భర్త ప్రత్యుత్తరము మూల్గుచు నిచ్చెను. ఈవడియముల నైరాగ్యము, ఈయదుకుల యాభిముఖ్యాభావము, ''ఈవేఁచు ప్రోచుల'' వెట్టి ధోరణి, వేదాంతోపన్యాసోద్భవతాత్కాలిక ప్రాపంచిక విముఖతా విలాసమాహాత్మ్య మహాంభోధి బుద్బుదము లని నే నను కొంటిని. వీరి కీచలిజ్వరపు పాలి రెండు జాములు

మాత్రమే యుండి యూఁపి విడుచు ననియు, వీరికి సహజోష్ణతాననిన్ని వేశము సంభవించు వెంటనే యిట్టిపాలి తిరుగ రాకుండ వీరి భార్యలే తియ్యని నేలవేముకట్టు మాత్రలు వేయుదురనియు నే నెఱిఁగినవాఁడ నగుటచేఁ దటస్థుఁడనె యూరకుంటిని. ఇంతలో రైలుస్టేషనుకుఁ బోయిన వితంతువు పుత్రికా జామాతలతో నత్రములోనికిఁ దిరుగ వచ్చి "వీనియిల్లు మాసిపోను! వీని వేదాంతము మండ! పందువంటి కాపురములు పడద్రోయుటకు బయలుదేరినాడా? అత్తగాంద్ర నాఁడిపెట్టుట కవతరించినాఁడా? నాకుఁ గనఁబడినాడు కాఁడు. లేనియెడల రోఁకలి పుచ్చుకొని తల చిదుకఁబొడుతు" నని వేదాంతి నడ్డమైన తిట్లు తిట్ట మొదలు పెట్టెను. ఇల్లాంద్రంద ఱువితంతూపన్యానకర్త్రిగారి వేదాంతపు విఱుగుడుమాటలు వినుటకై చుట్టు చేరిరి. అందఱు తల కొకయుక్షత యావేదాంతితలపై వైచి దీవించిరి. నాదృష్టి యామువుతువుపైననే యుండుటచే నాతని స్వప్నమునఁ గాంచితిని. ఆమహానుభావుఁడు నా యెదుటఁ గాషాయాంబరధారియై జటామౌళియై నిలువఁబడెను. "వచ్చితివా? నంసారఘాతుకా! నపుంసకాధమా!" యని యావితంతువు ముసలాయుధమై యొక్కపో టతని మూతిపైఁ బొడిచెను. ద్వంద్వరహితుఁడగు తాపసాగ్రగణ్యుఁడు ముసినగ వులతో నాయనాథను గొఁగిలించుకొనెను. తళుకు మనునంతలోఁ దెల్లనిమునుఁ గెగిరి నామెకు నల్లనిముంతకొప్పలవడెను. రాగిపళ్ళెలు రత్నకంకణములుగ మారెను. అడ్డకట్టుపై కచ్చబిగిం పాదేశమయ్యెను. చేతిలోనిరోఁకలి క్రిందబడి మంచ మయ్యెను. ఇల్లాంద్రంద ఱాయపూర్వ దంపతుల మంచముచుట్టు చేరి మిథునపువిడెములు తీసికొనువారును, మువ్వగోపాలపదములు పాడువారును, నన్యోన్యముగ గంధములఁ బూయించువారు నైరి గడియ క్రింద నడుకులకై మిడుకులాడిన యాబోఁడి–పన్నీటిమిఠాయి నాహరించు పూఁబోడి యయినది! కాలమహిమ! చెప్పుదెబ్బదిన్న విప్రనారాయణునకు వైటత్వము వదలి భక్తత్వము వచ్చినట్లు రోఁకటిపోటుతిన్న వేదాంతికి లోకాతీతత్వము వదలి ప్రాకృతత్వము వచ్చినది కాబోలు! అని స్వప్నధోరణిని నేనేమో యనుకొనుచుండగా జెవులు గింగురుమను నొకధ్వనితో మేల్కాంటిని. అది యాఱుగంటుల ఘీరంగిధ్వని. తెల్లవాఱినది. కనిన దున్వప్న మునకుఁ బరితపించి కాలకృత్యముల నిర్వర్తించుకొని పెద్దరెడ్డిగారియింట బనచేసిన వేదాంతి గారినిఁ జూడఁబోయితిని. రెడ్డిగారు వాకిటిలోనే దటపటా యించుచుండి "వేదాంతిని జూచితిరా?" యని యాతఁడే నన్నడిగెను. లేదని నే నంటిని. కొంతసేపటి కచ్చటికి అనేకులు బిలబిలమూగిరి. వర్తకుని యింటిలో రత్నాభరణముల చేపెట్టె కనఁబడదు. కాఁపురము చేయుచున్న కోడలు కనఁబడదు. మహామాయగా నున్నది. అంతట నేమియుఁ దోచక యందఱు విచారించుచుండగ నిద్దఱు రక్షకభటులు ప్రవేశించి "వేదాంతివేషమున నిచ్చటకు వచ్చినవాఁ డేఁడీ?" యని యడిగిరి. పాఱిపోయినాడని చెప్పగ వారు విచారించి యాతఁడు ప్రాఁత నేరగాఁ డనియు, నీనడుమనే యాతఁ డొకపిల్లను గొంతునులిమి మెడలోని నాను తీసికొన్నాఁ డనియు, నాతనిఁ బట్టుకొనుటకై వచ్చితి మనియు, నాతనియూ రిచ్చటకు మిగుల దూరముగ నున్న దనియుఁ జెప్పిరి. నరహత్య చేసినవాఁ డింత సావకాశముగ నూరూర నుపన్యానము లిచ్చుచుండుట సహజము కాకపోవుటచే వారు కొంత యసత్యమాడియుందురని నే ననుకొంటిని. కాని నా యూహము తప్పయినందులకు జింతిల్లు చున్నాను.

మిత్రులారా! వేదాంతపువింత చరిత్రమును వింటిరి కాదా! ఆహా! ప్రపంచవైఖరి

యెట్టులున్నది? ఎక్కడఁ జూచిన మోసము! ఇంద్రజాలము! టక్కు! మతవేదాంతములలో నవి మఱింత ప్రబలుచున్నవి. ఏ విషయములలోఁ గేవలము–సత్యము, నాంతర పారిశుధ్యము పరిపూర్ణముగ నావశ్యకములో వానియందే కనుగట్టు–గారడి–కదు నధికముగ నున్నవి. మెడలో రుద్రాక్షలు! మదిలో మదిరాక్షులు! వదనమున బ్రహ్మసూత్రపారాయణము! మదిలో! మకరికాపత్ర లేఖనము! పగలు పరిశుద్ధభస్మరేఖాలంకారము! రాత్రి ప్రమదాలాక్షార సాలంకారము! ఒక చెవినిఁ బావనోంకారనాదము! ఒకచెవిని గాంచీఘంటిగా క్రీంకార నాదము! ఎడమచేతఁ బ్రత్యక్షపార్థివలింగస్థాపనము!–కుడిచేతఁ బచ్చన్న వితంతుశిరఃపరామర్శనము! నాలుకపై నమృతము లొలుకు భూతదయా బోధకమగు వాగ్వైఖరి! చేతిలో వెచ్చని రక్తపు చుక్కలు గ్రక్కు భూతమారణ మగు తరవారి! చేత నాముతాడికల్లుముంత! నోట (Temperance movement) టెంపరెన్స్ మూమెంట్!

ప్రజలలో దఱుచుగ బహిరంతస్స్వరూపముల కింత పరస్పరానందర్భత కానిపించు చున్నది. చిత్తమునందలిది జిహ్వపై లేదు. జిహ్వపై నున్నది చేత లేదు. శ్రుతిదారి–పాటదారి వేఱు–లయదారి వేఱైన గానశ్రాద్ధమువలె నున్నది. మిత్రులారా! ఈదినమున శ్రాద్ధభోక్తగఁ బోయితిని! ఆవడలలో నైనది గొఱ్ఱెపెరుఁ గగుటచేతఁ గాఁబోలు గొంతు పోయినది. ఇక జెప్పలేను.

వాణీ–పైత్యక క్రియలలో గొఱ్ఱెపెరుఁ గుపయోగింపరా దనుసంగతి మీ రెఱుఁగరు కాఁబోలు!

జంఘా–కొన్ని యుపయోగింప గూడ దను నియమము మనకున్నది. కాని యమ్మి మోసముచేయఁగూడ దను నియమము గొల్లవాండ్రకు లేదని మీ రెఱుఁగరు కాఁబోలు! (అని లేచిపోయెను)

వాణీ–గొఱ్ఱె బఱ్ఱె పెరుఁగుల భేదము తెలియని మూఢుఁడు లేఁడనుచు నేమేమో సణుగుకొనుచు వాణీదానుడు పోయెను.

సభ ముగిసెను,

28. దివ్యజ్ఞానమతము

జంఘాలశాస్త్రి ఒకసారి ఉత్తరదేశ యాత్రలో హరిద్వారంలో ఆరు నెలలున్నాడట. ఆ కాలంలో ఒకరోజున ఒక బైరాగి హిందీలో చేసిన 'నడ వీధి' ఉపన్యాసంలో సారాంశం తెలుగులో తన సత్యపురం శ్రోతలకి వివరిం చాడు.

ఆ బైరాగి ప్రధానంగా అతీంద్రియ శక్తి గురించి – మరీ ముఖ్యంగా మానవ శరీరంలో 'కంటిచూపు'లో వుండే దివ్యశక్తి గురించి అనేక ఉదాహరణ లిస్తూ మాట్లాడాడు. దృష్టిదోషం (దిష్టి) ఎంత భయంకరంగా వుంటుందో గవ్వలగుత్తిలాగ చెప్పుకు పోయాడు. ఒక్కొక్క చల్లనితల్లి కంటిచూపు వన్నీటి చిలకరింపులాగ ఎలా వుంటుందో విస్పష్టం చేశాడు. పాదాభివందనం చేయిస్తుందన్నాడు. సైన్యానికి ఆజ్ఞల్ని జారీ చేసేకన్ను, విద్యార్థిని చల్లగా దిద్ది తీర్చుకున్న, భర్తను సన్మార్గంలో నడిపే భార్యకన్ను – ఇలా కంటి చూపుల భేదాలనీ, వాటి వాటి శక్తుల తారతమ్యాలనీ విశదంచేసి, ఈ కంటికున్న శక్తి ఏమిటి? అని వివేచన చేశాడు. పువ్వునించి వరిమళంలాగా, దీపంనుంచి కాంతిలాగ, కంటినుంచి వింతైన, ఒక దురవగాహమైన, శక్తి వుదుతుందని, అది విద్యుచ్ఛక్తి వంటిదనీ తీర్మానించాడు. ఇటువంటి కంటిశక్తి ఎంత ఎక్కువగా వుంటే అంత ఆరోగ్యమట! అలాగే – బైరాగి తన ప్రసంగంలో కంటి చూపుతో కొందరు మనుషులు చేసిన అద్భుతాలు కూడా చెప్పాడు. విగ్రహారాధనలో కూడా ఇటువంటిశక్తి ఒక విధంగా ఉపయోగింపబడుతోందన్నాడు. – ఈ తత్త్వం గురించి కొంత విశాలంగానే చర్చించాడు బైరాగి. అన్నిరకాల ఇచ్ఛల వరిపూర్తికీ 'అక్షి' మాత్రమే ఆధారం అని వరిష్కరించాడు.

ఈ ఉపన్యాసం విన్న జంఘాలశాస్త్రి బైరాగిని, మహాత్ముల దర్శనం కోసం ఆశ్రయించబోయి ఎంత క్షోభ అనుభవించాడో చెప్పాడు.

జంఘాలశాస్త్రి యి ట్లుపన్యసించెను.

ఉత్తరదేశమందలి ప్రధాన యాత్రాస్థలములలో హరిద్వారమొక్కటి. అవట్టణమున వే నారుమానము లుంటిని. అక్కడనొక్కవాఁడొకబైరాగి వడుపీథిలోఁ గొందఱాజనులకు హిందీభాషలో నుపన్యసించెను. ఆయుపన్యాస మాంధ్రమునఁ గొంచెము హెచ్చుతగ్గుగ నిటులుండును.

''సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'' అనునది సత్యము. సర్వబాహ్యప్రపంచ వస్తు రూప వర్ణ భేద జ్ఞానప్రదాత యీనేత్రమే! ఇది జ్ఞానేంద్రియములలో నగ్రగణ్యమైనది. ఐహికకార్యనిర్వహణ పటిష్ఠతయం దిది యెంత ప్రాధాన్యము కలదియో యాముష్మికకార్యక లనా ఘటనాపటుత్వమునను నిది యంతప్రాధాన్యముకలది యనినమ్మవలయును. కంటికు న్నశక్తి యింతిం తనరాదు.. మనుజుల నేత్రములకే కాక మనుజేతర జంతువుల నేత్రములకుఁ గూడ గొప్పశక్తి కలదు. డేగకన్ను సర్వ పక్షిసంఘాక్షిలోకములో నక్షీణతీక్ష్ణతాదుర్నిరీక్ష్యమై యున్నది. దీనికంటితేజ మావరించినతోడనే మిగిలినపక్షులు రెపరెపలు చల్లార, నరముల పట్లు జాఱి, సందులబంధములు సాగిపోవఁ, జైతన్యములు మందగింప నట్టి క్రుంగిపోవును. తెఱనోటిమెకపుఁగంటిపచ్చమంట భగ్గు మనఁగనే కొండయంత కుంజరము కీచు మనుచుఁ దుండమును నాల్గుచుట్టలుచుట్టి యంగిటఁ గ్రుక్కుకొని కాళులు లటలటలాడఁ, గాయ మంతయుఁ గంపమొంద ముడుచుకొని ముడుచుకొని వెనుకకాళ్లమీదఁ గూలఁబడి ముద్ద యైపోవును. నేను బూర్వాశ్రమమున ననఁగ నంసారినైవర్తించునప్పుడు నివసించినగ్రామమం దొకశాస్త్రు లుండువాఁడు. అశనమ్మ కన్ననఁగ నాతనిదే! మనము భోజనము చేయుచుఁడఁగ నాతఁడు చూచుట తటస్థించునెడల మన కిఁక నాభోజన మరుగదు. చేతులు గడుగుకొని నోట నీళ్లుపోసికొని తుబుక్కున నుమియుసరి కోకు–మని వమనము లారంభింపవలసినదే! చిన్నతనమున మ్రింగిన దొండాకుపసరుకూడ నూర్ధ్వముఖమై యుర్విపైఁ బడవలసినదే! ఆతనియాలోకన మన్నగత ప్రాణుల కరవిషూచివంటిదై యుండెను. చూలింతరాండ్రపొటక రించిన పొత్తికడుపులపై నాతనికన్ను పడినయెడల గిరగిరఁ దిరిగి పిండ మధఃపతనము కావలసినదే! గర్భవతుల కీతనికటాక్షవీక్షణము గన్నేరువేరు. పచ్చగ గోవగ మినమినగ నల్లిబిల్లిగఁ గారుకొని యల్లుకొనుచున్న తీఁగపాదు నాతఁ డట్టి చూచినయెడల నది యెండి మెలికలువడి చప్పఁబడి పురుగులపుట్టయై బూడిదకావలసినదే! అఖిలవృక్షజాతి కాతనియా లోకన మాకురాలుకారు. ఈతనినిఁ బిల్లలపిడుగుగఁ గొంపలకొఱకచ్చగ సౌభాగ్యముల తుడుపులరాయఁడుగ మరిడిమారకమ్మమగఁడుగ జనులందరు గర్భనిర్భేదముగ భావింపఁ జొచ్చిరి. ఆతని నూరనుండి వెడలఁ గొట్టుద మనికొందరు, కన్ను ల్మూడఁబీఁకెదమని కొందరు, ప్రయోగముఁ జేయించి చంపుద మని కొందరు నై జను లుల్లోల కల్లోలమనస్కు లయి యుండిరి. ఆతని నెవ్వరు చూడరు. ఆతనితో నెవ్వరును మాటలాడరు. ఆతనిదరి చేరరు. ఆతని దుమ్మెత్తితిట్టుదురు. దాఁచిన సామాను లన్నియుఁ దగులఁబడిపోవునేమో యని కోమటి–యంగడిలో నీతని కేసరకులు నమ్మఁడు ఆతనికి వండిపెట్టువా రెవ్వరు లేరు. తిండి లేదు. మలమల మాడుచుండెను. ఏదయిన బండి కట్టించుకొని యేయూరయినఁ బోదునని యోచింప నతనిచూపు సోఁకినయెడల నెద్దులు చచ్చునేమో యని యెవ్వరును బండి కట్టరు. ఇట్టిమహాదుస్థితిలో నాతఁ డుండఁగ నాయూరిప్రభుఁ డానమా చారమును విని యాతనిఁ బిలిపించుకొని యొకయింట నుంచి పోషించుచుండెను. ఆప్రభుని యాజ్ఞలకు లొంగనిరైతు లెవరైన నున్న వారివరికుప్పలను జూచుటకో వారియిండ్లు చూచు టకో యాతఁ డీ ప్రత్యక్షవైశ్వానరుని బంపించి పరద్రవ్యపరశురామప్రీతి సంకల్పమహోత్సవ మును జేయించుచుండెడివాఁడు. ఈ ప్రభువు దుర్మార్గుఁ డగుటచే సమీపప్రభుఁ డొకఁడు కొంత సైన్యముతో నీతనియూరు ముట్టడించెను. ఈతనికిఁ దుపాకులు లేవు. కత్తులు లేవు. కటారులు లేవు. సైన్యము లేదు. అర్థించినయాస్తి యొక్కయగ్ని కీలశాస్త్రులు. ఆతనినే

యుద్ధమునకుఁ బంపెను. అతఁ డొకసారి సైన్య మంతయుఁ గలయం జూచి రేపు యుద్ధ మారంభింత మని యాసైన్యముతోఁ జెప్పి కోటలోనికిఁ బోయెను. ''ఈజందెములరాయఁ డంగవస్త్రము చేఁబూని యుద్ధము చేయుట యేమి?'' యని శత్రుసైన్యమున నందరు పకపకనవ్విరి. ఆరాత్రి సైన్యముల గుడారములలోఁ బెద్దజ్వాల–సైన్యములోఁ గొందఱకుఁ బార్శ్వశూల–కొందఱకుఁ బక్షవాతము–కొందఱకు శిలామేహము–కొందఱకు జలోదరము –కొందఱకు విషూచి–కొందఱకు నక్కమోరులు–కొందఱకుఁ బాలచేరులు–గలిగి నర్వ సైన్యము బీభత్సమై యథాయథలై పోయెను.

ఇట్టి యద్భుతనేత్రసామర్థ్యము కలుగుజనులు క్వాచిత్కముగ నుందురు. కొందఱక న్నులు చీఁకటిలోఁ జూడఁగలవు. కొందఱకన్నులు దూరదర్శనీయంత్ర సాహాయ్యశూన్య ముగ కుజగోళములో నేమున్నదో చెప్పఁగలవు. ఇట్టి విపరీత ప్రకృతులు వీనియాలోచన ముతో మన కిప్పుడు నిమిత్తము లేదు. జనసామాన్యమునకున్న నేత్ర సాధనముఁ గూర్చియే మాటలాడుదును.

ఒక్కఁడు భోజనముచేయుచుండ మరియొకఁడు పోయి యాతని కెదురుగఁ గూ ర్చుండి యాతనిపళ్లెమువంకఁ జూచుచుండునెడల నోటికి స్వేచ్ఛగ నాతఁ డెత్తుకొనుచున్న కబళమును సందేహముతో నోటఁబెట్టుకొని యది ధారాళముగ మ్రింగుడుపడకపోవుటచే నాతఁడు కొంచెము కెక్కు కెక్కు మనును. ఒకఁడు స్వేచ్ఛగ వ్రాసికొనుచుండ మరియొక్కఁ డాతనియొద్దకుఁ బోయి యెదురుగఁ గూర్చుండి యాతని కాగితమువంక దూరమునుం డియైనఁ జూచుచుండు నెడల దుడుపు లెక్కువ కాఁగ నడినడిపంక్తులు ప్రబలఁగఁ గలము పటపటలు గానంత యడఁగి పోవును. ఒకఁ డుత్సాహమున నేమో కూనరాగములు దీయుచుఁ గూర్చుండ నొక్కఁడు వచ్చి యాతని కెదురుగఁ గూర్చుండి చూచుచుండునెడల నాతని గొంతురవము కీఁచు క్రింద దిగి యందులో వెలితిలోఁ జేరిన కొంతకంప మారంభము గాఁగఁ జప్పఁబడి చల్లారును. ఒకఁడు తదేకదృష్టిగలవాఁడై చదువుకొనుచుండఁగ మరి యొకఁడు వచ్చి యెదురుగఁ గూరుచుండి యాతనిపుస్తకమువంకఁ జూచుచుండునెడల నాతని కాగ్రంథములోని వాక్యము లర్థవిచారమునకు లొంగకపోవుటచే వెనుకకు ముందున కాతఁ డూఁగుచు వెనుకటిది మఱచిపోవ ముందువచ్చినది తోఁచక, యెదురుగ నున్నది విడిపోవక, యొక్కొక్కసారి రెండు పుటలుకూడఁ ద్రిప్పినట్లు తెలియక తుదకుఁ బుస్తకపఠ నమునకు ''స్వస్తి ప్రజాభ్యః'' చెప్పవలసినవాఁ డగును. ముద్రాశాలలో నక్షరములుకూర్చి పనిచేయు నాతనియెఱ్ఱ కెవ్వఁడైనఁ బోయి యాతఁ డక్షరములు గలుపుచుండుఁగఁ జూచుచుండునెడల ''దా'' ను ''సా'' తో గృహప్రవేశముచేయును. క్రావడిని వట్రువనుడితో ముడిఁబెట్టును. జన సామాన్యానుభవసిద్ధములగు నీయుదాహరణములవలన నొకని కన్ను –తేఱుబాఱుజూచెడు నొకనికన్ను–మరియొకనికిఁ జేతికి బంధ మగును. ఒకనికిఁ గాలినం కెల యగును. మరియొకనికిఁ జేతికి బంధ మగును. ఒకనినేత్రమునకు బట్టతెర యగును. ఒకనిస్వేచ్ఛను భంగపఱచుటలో, నొకనిమనస్సును గలఁతపఱచుటలో, నొకబుద్ధిని వడి ద్రేసి వశ్యముచేసి కొనుటలోఁ గన్నున కద్భుతశక్తి గలదు. చిత్తరువుల వ్రాయువాఁడు తాను వ్రాయుచున్న బొమ్మకుఁ గట్టుకడపటనుగాని కన్ను వ్రాయఁడు. అట్టికన్నే ముందు వ్రాసినయెడల నాతనియొంటెకుచ్చు ముందున కింక నడువనే నడువదు. ఆతనిబుద్ధి తాను వైచినకంటిచే నాకర్షింపఁబడి విగ్రహ నిర్మాణమున విశేషచాకచక్యమును గనఁబరువనేరదు.

నిర్జీవమగు నేత్రమునకే యింత జనచిత్తవశీకరణపాటవ ముండుచో నిఁకఁ జెప్పవలసిన దేమున్నది?

ఒక్కొక కాంతకన్ను మన్నైఁబడఁ బన్నీరు చిలికినట్లు మనదేహ మెల్లఁ జల్లఁబడును. ఒక్కొక్క కాంతకన్ను నుండి వెడలిన కిరణములు మన కొట్టి కితకితలు పెట్టి మనల వెకవెక నవ్వఁ జేయును. ఒక్కొక కాంత కంటిమెరుపుతీఁగె మనకు గళపాశమై యామెవెంట మనల నీడ్చును. ఒక్కొక కాంతకంటిమంట మన దురుద్దేశములన్ని దహింపఁజేయును. ఒక్కొక కాంత కంటిదివ్యతేజము మనల నామెకు సాష్టాంగపడి మ్రొక్కఁ జేయును. ''ఆకాంత మనయింటిలోఁ బ్రవేశించిన వేళావిశేషముచే మాకదృష్టము పట్టిన''దని కొంద ఱనఁగ మీరు వినియున్నారు. అట్టి కలిమికిఁ గారణము కాంతామాహాత్మ్యము కాదు. కాలమహాత్మ్యము గాదు. కంటిమాహాత్మ్యము! ''ఆచిన్నవాఁడు పుట్టిన వేళావిశేషమున మాకు నిత్యకళ్యాణము, పచ్చతోరణముగ నున్న''దని కొంద ఱందురు. ''ఈగురమును గొన్న వేళావిశేషమున మా కధికారము ప్రబలిన''దని కొంద ఱందురు. కులాంగనయైన సరియే, కుర్రవాఁడైన సరియే, గుర్రమయిన సరియే చేసిన దేమిటులేదు. ఏమి చేయఁగలిగిన–నేమి చేసిన –నత్యద్భుతానిర్వచనీయాధికసంపన్నమైన కన్నే!

సమరసన్నాహ సంయుక్తమై నలకసేనాసమూహమునకు రణరంగోత్సాహ మిచ్చునది సేనాధిపతికన్ను. వారికత్తులకుఁ దెగువ, వారి కన్నులకు గురి, వారిహస్తములకు బింకము, వారిమనసులకు దూఁకుడు, వారిగృహచింతలకు మత్తుమందు, వారి ప్రాణములకు వైరాగ్యబోధన మొక్కసారి యిచ్చునది సేనాధిపతికన్నే. బొలుతకుఁ బొతములం దాసక్తి, తగనియాట లందు విరక్తి, సత్యమం దభిలాష, యసత్యమం దీర్ష్య–సోమరితనమం దనిష్టము –పాటుపడుటలో నిష్టము నొనఁగునది గురువుగారి బల్లమీఁదనుండు బెత్తము కాదు, బాలురమీఁదికన్ను! కన్న గాండ్రను, నరహత్య నేరగాండ్రను దమతప్పుల నొప్పుకొనఁజేయునది తొడపాసెపుగారు కాదు! కుములుసోటుల రోఁకలిబండ కాదు! కంటి కోర్వండగల బంధము కాదు! రక్షకభటాధికారికన్ను. భర్తకు మతాచార విరుద్ధకార్యవైముఖ్యము, నతిథి సత్కారాభిసంధి, దేవతా పూజాగౌరవము, పరసతి పరాఙ్ముఖత్వము, పాపచింతాశూన్యత్వ మిచ్చునది భాగవతపురాణపఠనము–కాదు! భగవద్గీతా పారాయణము కాదు! బ్రహ్మ సూత్ర భాషాధ్యయనము కాదు! భార్యకన్ను. ప్రజలకు సంతుష్టిని, క్షేమమును, రాజభక్తిని, మనశ్శాంతిని, దేహసౌఖ్యమును, బాపభీతిని, బరమార్థరక్తిని గూలంకషముగ నిచ్చునది రాజ్యవిస్తీర్ణకాదు! ప్రబల చతురంగ సేనాసమూహసమర్థత–కాదు! సర్వదోషసంశిక్షణచాక చక్య సంయుక్తశాననశక్తి–కాదు! బహురత్నభర్మాదినంకీర్ణభండారపరిపూర్ణత–కాదు! పరా హంవిభేదనాభావముగఁ జూచు పరిపాలకుల కన్ను. కత్తికి లేనివాఁడి, నోటికి లేని వాగ్ధాటి, కుసుమమునకు లేని మార్దవము, మంచునకు లేని శైత్యము, వేగవతికి లేని ప్రవాహశుగత్వము, హిమాలయమునకు లేని యౌన్నత్యము, కంధికి లేని గాంభీర్యము కంటికున్నవి. ఉన్నవి –ముమ్మాటికున్నవి. వేయిమాట లేల? సర్వప్రపంచశాసనపటిష్ఠమైనది కత్తి–కాదు. కలము –కాదు. కన్ను–

కంటి కిట్టిశక్తిగలుగుట కేమికారణమో కొంచె మూహింతము. పుష్పమునుండి పరిమళ మను నొకశక్తి వెడలి చుట్టుప్రక్కల విరియు చున్నది. దీపమునుండి తేజశ్శక్తి

యుబికి వ్యాపించుచున్నది. చంద్రుని నుండి శైత్యశక్తి సకలదిక్కుల వెల్లువలగుచున్నది. అట్టులే కంటినుండి పరిమళముకంటె, తేజముకంటె, శైత్యముకంటె వింతయైన యొకదుర వగాహశక్తి యుత్క్రమించుచున్నది. అది విద్యుచ్ఛక్తి వంటిది. మానుషికవిద్యుచ్ఛక్తి యిదియే! సమస్తశక్తిమంతమైనశక్తి యిదియే! ఇట్టిశక్తియే ప్రాణమునకుఁ బ్రాణము. ఈవిద్యు చ్ఛక్తి నఖాగ్రముల నుండియుఁ, గేశాగ్రముల నుండియుఁగూడ వెలువడును. అందుచేతనే గోళులు కొనలు గలుగునట్లు పెంచుకొనఁగూడ దందురు. తలవెంద్రుకలు విరియఁబోసికొ నక ముడివైచుకొనవలయు నందురు. కాని నఖకేశాగ్రములనుండి వెడలినశక్తికంటెఁ గంటి నుండి వెడలినశక్తి మొత్తమున హెచ్చు. కంటికంటె మృదులతరమయిన యంగము లేకుంట చేతను, కన్నే మనస్సునకు, బాహ్యప్రపంచమునకును ముఖ్యసంధాన కర్త యగుటచేతను కంటినుండి వెడలెడు శంపాశక్తి యధికతర మయినది. ఈశక్తి మనుజునకు లోపల నెంత యున్న నంత యారోగ్యము! అంత యాయుష్యము! ఇది వృథ పోనీయఁదగినది కాదు. ఇది ప్రపంచమున ననేకవిధములుగ నుపయోగింపఁబడుచున్నది. తేలుకుట్టులో పాముకా టులో జెర్రివ్రేటులో దయ్యపుపాటులోఁ బనిచేయుశక్తి యిదియే! మంత్రపఠన మనునది మనోనిశ్చలత్వమునకే కాని బాధా నివారణప్రభావ మంతయు నీశక్తిదే! పక్షవాతములను బాగుచేయుటలోఁ జచ్చువాతములను జయించుటలో దీని కున్న ప్రతిభ యవర్ణ్యము. వ్రణబాధచే నిద్రాశూన్యలయి గోండ్రించువారి కింతకంటె మత్తుమందు లేదు. మనము మనస్సులో నిశ్చలముగ నేది సంకల్పించుకొని యామానసికవిద్యుచ్ఛక్తిని మననేత్రముల గుండ బఱపుదుమో యా సంకల్పము నీశక్తి సఫలము చేయుచున్నది. ఈముక్కాలిపీఁట మూరెఁ డెత్తు పైకి లేవవలయు నని, లేవక తప్పదని లేచితీరవలయు నని మనము నిశ్చలముగ నిజముగ నీరంధ్రముగ మనస్సున సంకల్పించుకొని యా పీఁటపై నిరంతరముగ నిబిడముగఁ గొంతసేపు చూచుసరికి బల్ల లేవవలసినదే! అట్లు నే ననేకపర్యాయములు పరీక్షించితిని. ఈతని కారోగ్యము కలుగవలసిన దని మనము నిర్ణిద్రదీక్షతో సంకల్పించుకొని యాతనిపైఁ గంటివిసరులు రెండు, చేయియూపులు రెండు ప్రయోగించుసరి కారోగ్యదశ యారంభింపవ లసినదే! మాగురువుగా రొకసారి "రైఁరయిఁ" మనచు వచ్చుచున్న రైలుబండిని నడిమిదా రిలో నీశక్తిచే నాఁపిరి. నేను బ్రత్యక్షముగఁ జూచితిని. మీ కాశ్చర్యముగ నవిశ్వసనీయముగఁ గూడ నుండఁగలదు. మనస్సునకుగఁగల యత్యద్భుతశక్తిని మీ రెరుఁగ కుండుటచే మీ కట్లు తోఁచుట వింత కాదు. తపస్సు చేసికొనిన యొక బ్రాహ్మణునిపైఁ గొంగ రెట్టవైచినది. కోపమున నాతఁడు కన్నులు దెఱచి పైకిఁ జూచుసరికిఁ గొంగ చచ్చి గుబుక్కునఁ గ్రిందఁగూలెను. కోపపుఁ జూపునకుఁ గొంగ చావునకు నెంత సంబంధ మున్నదో యోచించి తిరా? ఇక్కడ కత్తి లేదు. కర్ర లేదు. ఉండలబద్ద లేదు. చేతిలోఁ బెడ్డయైన లేదు. "హూష్" అని యాబ్రాహ్మణుఁ డఱచెనేమో? అదిరిపడి యది చచ్చినదేమో యనుకొనఁగ నాతఁడు మాటలాడనైన లేదు. కోపపుఁజూపుతప్పఁ బ్రయోగించిన దంతకంటె నేమియు లేదు. దానితోడనే కొంగ చచ్చినది. నహుషు నాశీవిషుఁ జేసిన దీశక్తియే! అహల్యను రాయిగఁ జేసిన దీశక్తియే! సగరపితామహులను బుగ్గిగఁ జేసిన దీశక్తియే–మహర్షులు నిమీలితనేత్రులై మహాతపస్సమాధి నుండియుండి కన్నులు తెఱచుసరికి నిదివఱకు బాహ్యప్రపంచోద్గమన వ్యాపారనిరోధన యుక్తమగు శక్తి యొక్కసారి యుబ్బెత్తుగ, ఝంఝామారుతవేగతుల్య ముగ నిరాఘాటోద్రేకముతో వెలువడును. అప్పుడ మనస్సునఁ గోపమే వారి కుండునెడల

నెదుటిప్రపంచ మొక్కసారి భస్మము కావలసినదే!

అంతదూర మెందులకు? గర్భవతిని జూడఁగ్రొత్తఁగఁబోవువాఁడు రిక్తహస్తుఁడై పోక రుచ్యమగు ఫలముగాని యేదైన నొకచిత్రవస్తువు గాని తీసికొనిపోవలయు నని చెప్పుదురు. ఒక ప్రాణి కింకొకప్రాణి యదన మగుటచేతను, భగవంతునిచేతిలో నున్న సృష్టిశక్తి యామెగర్భమునఁ బ్రవేశించుటచేతను, నామెకంటినుండి ప్రబలమగుశక్తి ప్రవహించు చుండును. గర్భవతి కేదైనఁ దినవలయు నని మహావాంఛ సంతతము మనసున నుండును గావున నాహరణోద్దేశముతో వెడలిన తచ్ఛక్తికి మనుజుఁ డెదుటఁబడక యాశక్తి నొకఫలముపైఁ గాని భక్ష్యముపైఁగాని ప్రసరింపఁజేసి తన్నుఁ గాచుకొనవలయును. నూతన వితంతుదర్శనమునకై పోవువాఁ డొకబట్టను ముం దామెనేత్రముల కడ్డువేయవలయు నని చెప్పుదురు. లోకమున నొకజనున కేదైన నాపత్తురాఁగ ''లోకమున నింద రుండఁగా నాకే యిది రావలయునా? వారికే రారాదా? నా కేల రావలయును?'' అని యనుకొనుట మిక్కిలి సహజము. అటులే యీనూతన వితంతువు ''లోకమున నింద అమ్మలక్క లుండ వారి మగఁడు చావ రాదా? వీరిమగఁడు చావరాదా?'' యని మహాందోళనమున మహోద్రేకమున ననుకొనును. అట్టిస్థితిలో నామెకంటియెదుట మొదటఁ బడిన కాంతచేతిలో దిగదుడుపు బట్ట లేకుండు నెడల మగఁడు చచ్చినందులకు మరునాఁ డామె నూతిలో దిగవలసినదే!

రాజులలోఁగూడఁ గొందఱకు మహాశక్తిసంయుక్తమైన కన్నుండును. రాజదృష్టి మిగుల చెడ్డ దనువాడుక కలదు. దాని కొకప్రక్క నుండవలసినదేకాని యెదురుగ నుండ రాదు. రాజులు వీథులలో స్వారులఁ బోవునప్పుడు బ్రాహ్మణులస్వస్తివాక్యముల ఘోషము లతో భట్టు లొనర్చిన తత్పూర్వరాజన్య సద్గుణ సమీచీనవర్తనాదివర్ణ నాడంబర గుంఫిత గద్యపద్యావళీ పఠన ప్రబల ధ్వానములతో బయలుదేరవలయును. వారట్లు వీథులలోఁ బోవునప్పు డొకని పయోధరోత్తుంగ చంద్రశాలా సదనమునుగాని పయోధరోత్తుంగ చంద్ర ముఖీ వదనమునుగాని చూచి దానిని దాను హరింపవలయు నని వారి కెట్లు దుర్బుద్ధిపుట్టునో యని ''నీతండ్రి మహాదాత. ఆతఁడు చేసిన గృహహార్మ్య దానము లిన్నియా? నీతాత శ్రీరామచంద్రమూర్తివలె నేకపత్నీ వ్రతస్థుడు. పర నారీసోదరుఁడు. నీవు కూడ సద్గుణ సమాజమున వారిని బోలుటయే కాక మించవలయు'' ననుచు భట్టులు వారిచెవులయొద్ద నుత్కంఠానినాదములతోఁ జదువుటయు ''సత్య మాడవలయును. వ్యభిచరింపఁగూడదు. త్రాగఁగూడ''దను వైదికశాసనముల నుదాత్తానుదాత్తాద్యుచిత స్వరపరిపాకమున బ్రాహ్మ ణులు పఱ్ఱలు దీర్చి యేకశ్రుతితోఁ గలిపిన కంఠములతో రాలు గరఁగునట్లు పఠించుటయు సదాచారములుగ జరుగుచున్నవి. ఈయాచారముల కాదికారణ మక్ష్యుద్గత విద్యుచ్ఛక్తి.

విగ్రహారాధనయందుఁగూడ నీశక్తి యొకవిధముగ నుపయోగింపఁబడుచున్నది. దేవాలయస్థ విగ్రహమునకుఁ బ్రథమమునఁ బ్రాణ ప్రతిష్ఠ చేయుదురు. ఇది గొప్ప వైదికక ర్మము. సత్య వాక్యధురీణులు, శమదమాది సంపన్నులు, మితభాషులు. వేదవేదాంగ వేత్తలు, నిశ్చల నిర్వికార మనస్కులు, ప్రబలస్వచ్ఛ విద్యుచ్ఛక్తి పరిపూర్ణులు నగుననేక ద్విజ లోకమంచిదినమున నాదేవాలయమునకు స్నానాదికృత్యములు నిర్వర్తించుకొని పరిశుద్ధు లయి విచ్చేసి కర్ణపేశలములై యమృతమయములయిన యాగమవాక్యము లుచ్చస్వరములతోఁ జదువుచుఁ బ్రాణ ప్రతిష్ఠాకర్మము నాచరింతురు. పూజావిగ్రహము

నందు వారంద రొకక్కమారు తమనేత్రములనుండి వెలువడినవిద్యుచ్ఛక్తినిఁ బ్రవేశపెట్టు టయే ప్రాణప్రతిష్ఠానుష్ఠానము. అట్లాచరింపఁబడిన విగ్రహము సంపూర్ణశంపామహాశక్తిసంప ద్వ్యంతమై భక్తహృదయాకర్షణ నైపుణీనిర్ణిద్రమై, దిదృక్షాలోకతాపత్రయ నిర్వాపణ దక్షతాక్షీ ణమై యుండును. ఆవిగ్రహము నుండి యత్యద్భుతకిరణములు వెలువడుచుండుటచేఁ దద్దర్శనమునకుఁబోవు వారు తచ్ఛక్తిసంతర్పణార్థముగ ఫలములో పానీయములో భక్ష్య ములో తీసికొనివెళ్లవలయును. నందికి శంకరునికి నడుమను బోయినయెడలఁ బాపమని చెప్పుదురు. శంకరస్వరూపము నుండి వెలువడు మహోదార సౌదామనీశక్తి ప్రవాహము నందీశ్వరాభిముఖమై ప్రవహించును. నంతతము నారికేళాభిషేచనమునఁ జల్లఁబఱచినను శాంతినొందని మహాతీక్ష్ణశక్తి యీమూర్తినుండి యనిచ్ఛన్నముగ నుద్గమించును. ఎట్టి సంసార లంపటునకైన నెట్టి దుర్మనస్కునకైన నెట్టియుగ్రస్వభావునకైన శంకరాలయములో నున్న క్షణమయినను వైరాగ్య రేఖ, సుమనస్కత, చిత్త శాంతత యుదయింపక తప్పదు. శంకరదర్శనము చేయకమునుపే యిట్టి యనుభవము స్వల్పముగ లభింపఁగలదు. స్వచ్ఛమై చల్లనైన నీరుగల చెరువులలో నవగాహనము చేయునాతనికి శరీరము పరిశుద్ధమై చల్లఁ బడుట యాశ్చర్య మే మున్నది? దుర్గంధ భూయిష్ఠమగు వస్తువు నగరు ధూపాది ద్రవ్యసౌరభమునఁ గూర్చినయెడల దానికిఁ దాత్కాలికముగ నైన సౌగంధ్యము లభించుట వింత యేమున్నది? అటులే ప్రాణప్రతిష్ఠాకాలమునఁ బరిశుద్ధులగు బ్రాహ్మణులు పలికిన భవతారక సాధనములగు ప్రాఁజదువుల పరమపావనశక్తిచే నిండిన వాయువుగల దేవాలయము లోనికి వా రడుగుఁబెట్టు సరి కిట్టిమనస్థితి కలుగుట చిత్రమేమున్నది? తరువాత శాంకరశంపాశక్తి వారిశరీరములందుఁ జొరఁబడుటచే వారు మరింత పూతు లగుటమాత్రము వింత యేము న్నది? ఒకసారి జనుఁ డొనర్చిన శంకర దర్శనమున ననేక మహాజన సహస్రసంక్షోభాత విద్యుచ్ఛక్తిని దాను హృదయమునిండఁ బీల్చుకొనుట యన్నమాట. ఇప్పుడు లోకమునఁ బ్రకృతిశాస్త్రజ్ఞులు విద్యుచ్ఛక్తిచే నెన్నెన్ని యసాధ్యవ్యాధులను స్వాధీనము చేయుచుండుట లేదు? నిర్జీవవస్తూద్భవ విద్యుచ్ఛక్తియే యింతపనికిఁ జాలియుండఁ బావనప్రాణి ప్రభూతము యిన దెంతపని చేయఁ గలదో యెవఁడు చెప్పఁగలఁడు?

విద్యుచ్ఛక్తి ప్రతిమనుజునిలోను గొలఁదియో గొప్పయో యున్నది. మితభాషణ మున, మితస్వచ్ఛాహారమువలన, నింద్రియనిగ్రహమువలనఁ, జిత్తశాంతివలన దాని నభివృద్ధి నొందించుకొనవచ్చును. అట్లు చేయకుండ జనులు భ్రష్టులు, పతితు లగుచున్నారు. ఇది కడుశోచనీయము. బాహ్యప్రపంచమునకు వృథగ నేత్రములగుండఁ బోవుచున్న యీశక్తిని గన్నులు మూసి యరికట్టి తత్ప్రవాహ మాంతరప్రపంచమునకై పఱపవలయును. కదలు చున్న మనస్సును గట్టివేయవలెను. బాధించుచున్న యరిషడ్వర్గమును బంధింపవలయును. ఆంతరాంతరాయముల నన్నిటిని దత్ప్రవాహోన్ముగత్వమునఁ ద్రోచివేయవలయును. శంకరుఁ డప్పు డగపడును. అదుగో శంకరుఁడు! నీలోననేయున్నాఁడు! ఇట్టి యాత్మానుభవమున మన ముండుకొలఁది దేహసంబంధము మనకుఁ బ్రాణముండఁగనే విడిపోవును. మీ రెవ్వర యిన నిప్పు డెగిరి యాకసమున నిలువఁబడఁగలరా? మీరే నిద్రాకాలమందు స్వప్నములలో నంతరిక్షమున నెగురుచున్నారా? లేదా? ఎందుచేత? నిద్రయందు దేహాత్మ సంబంధము కొంచెము విడుటచేత. అటులే యాత్మానుభవమున మనకు దేహసంబంధము కొంచెము విడుచుటచేత. అటులే యాత్మానుభవమున మనకు దేహసంబంధము విడుచునప్పు డీయణి

మాద్యష్టసిద్ధులు గలుగును. మనము హిమాలయమంత పెరిగిన బెరుగగలము. నూది బెజ్జములో దూరు మన్నగదూఱగలము. నీటిలో మునిగియుండగలము. ఆకాశమున నెగురగలము. ఈశరీరముతో నితరగోళములోని కవలీలగ నేగగలము. శ్వాస మరికట్టి మనయిష్టమువచ్చినంత కాలము బ్రదుకుదుము. మన కెప్పుడు ''ఖుషీ'' కలుగునో యప్పుడే బొందితో గైలాసమున కేగ గలము. ఇవి యన్నియు మహాత్ముల రహస్యములు. ఇంతకంటె వానిని గూర్చి చెప్పగదగదు. నేను మహాత్ములదర్శనము చేసి వారిని గొంతకాలము సేవించినవాడను. పర్యవసానమున జెప్పవలసిన దే దనగా అంగసౌందర్యమున కేమి, యారోగ్యమున కేమి, యదృష్టమున కేమి, యధికారమున కేమి, యైశ్వర్యమున కేమి, యన్నిటికంటె నగ్రగణ్యమగు నాముష్మికమున కేమి అక్షీయే సర్వము.

అని యాతడు చాలించి నక్షత్రమునకుగ బోవ నేనుగూడ నాతని వెంటగ బోయి యాతని నాశ్రయించి ''నేను మీతో వచ్చెదను. నాకు మహాత్ములదర్శనము గలుగజేసెదరా?'' అని యాతనిని గోరితిని. కొంతదూరము పోయితిమి. తుద కాతడు నా కగపడలేదు. సాహాయ్య శూన్యతచే నిరుత్సాహ మొందక యేమైననరే యని ముందునకుగ బోయితిని. కొంతదూరము పోవగ నొకగుడిసెలో నొకయోగినితో గలిసి నులకమంచము బిగించుచున్న యాభైరాగిని గాంచి ''స్వామీ! వదలిపెట్టితి రేల?'' యని యడుగ ''నిన్ను పే నెరుగను పో'' యని గద్దరించుచు నినుపకారు నొకదానిని నాపై విసరెను. ఆదెబ్బతో నక్కడనే పడి సొమ్మసిల్లితిని. నేను జచ్చితి నని వారూహించియుందురు. కొంతరాత్రికి న్మృతి రాగ గన్నులు దెఱచితిని. ఇద్దరు మాటలాడుకొనుచుండిరి. వారిలో నొకడు భైరాగి. రెండవవా డెవడో నాకుగ దెలియలేదు.

భైరాగి–మహాత్మా! యెంతపని చేసితిరి? ఈశరీరముతోడనే బృహస్పతిగోళములోనికి వెళ్లితిరా?

మహా–అష్టైశ్వర్యసిద్ధిసంపన్నుడనైన నాకు శరీర ప్రతిబంధమేమున్నది? కాని గురుగోళములోనున్న చిత్రము లెచ్చటను లేవు సుమా!

భైరా–కటాక్షించి సెలవిచ్చెదరా?

మహా–ఒక్కటే విశేషము. అక్కడ జనులందరు నాస్తికులు. అక్కడి స్త్రీపురుషుల కొక్కటే శరీరము. వహ్వా! ఏమి చిత్రము! నిత్యసంభోగము. మరతలుపులవలె వారంద ఱక్టికలసియక్టి విడిపోవుదురు. ఈదిక్కుమాలిన ప్రపంచముకంటె సహస్రవిధముల సుఖ మచ్చట నున్నది. కాని యదేమి? లోపల మూల్గువా రెవ్వరు?

భైరా–యోగినిగారికి నొప్పులు వచ్చుచున్నవి. హరిద్వారమున కీనడుమగ బురిటిసా మగ్రికైకదా పోవలసివచ్చెను.

మహా–ఇదియే పెద్దచిక్కు. మన మాత్మతో సంభోగించినను కడుపు దేహమునకే వచ్చు చున్నది.

భైరా–ఈలుకలుకలుకంటె తమ రుపదేశించినపద్ధతియే మంచి తెఱపిగలది. జంజాటము లేనిది. సులభసాధ్యము. పరాపేక్షారహితము. ధనవ్యయశూన్యము. దేహకాలపాత్ర నియమరహితము.

మహా–కరతల సురతమేనా? ఐహికములగు నన్ని సౌలభ్యము లటుంచు. ఇంద్రియని గ్రహమున కదియే మొదటిబందుకట్టు. విరాగతా విద్యకు ''ఓం నమ శ్శివాయ''. అపవర్గమ హాపథమున కదియే యారంభపు మజిలీ. దానికంటె దారకమార్గమున్నదా? కాని యాచరిం చుచున్నావా?

భైరా–మూఁడువందల వఱకుఁ బునశ్చరణ (అమ్మయ్యో! చచ్చితి) అను ధ్వని వినఁబడును.

మహా–అదేమి? అదేమి?

భైరా–తాము లోనికి దయచేసి మంత్రించినఁ గాని వీలులేదు.

ఇద్దఱట్లు లోనికిఁ బోయిరి. ఏపూర్వజన్మ మహాపాపముననో యిట్టి మాటలు వినవలసి వచ్చిన దని లోలోన నేడ్చుచు నక్కడనుండి వెనుకకు మఱలితిని. దారిలో శీతజ్వరముచే బాధపడి చావుతప్పి తుదకు స్వగ్రామముఁ జేరితిని. నాయనలారా! సంసారు లగు మనకుఁ గారణాంతరములచేఁ గొంతకాలము భార్యల విడిచి యుండవలసివచ్చినప్పుడు నిద్రలోఁ బ్రమాదవశమున వీర్యపతన మగునెడలఁ దద్దోషనివారణార్థమై యెన్నెన్ని హోమ ములో చేసి యెన్నెన్ని ప్రాయశ్చిత్తములోఁ బడసి యెన్నెన్ని శాంతులో యాచరింపవలయు నని వేదములు ఘోషించు చుండఁగా–అదేమి? అదేమి? పామే? కర్ర తెండు. ఊరక్కుందు రేల? చంపుఁడు. చంపుడు–నర్పము చచ్చినది. సభ చల్లారినది–

29. దివ్యయోగములు

జంఘాలశాస్త్రికి అనుభవాలు అనంతం. వాటిని చమత్కారంగా, ఘాటుగా, చేదుగా- అయినా రుచి అనిపించేలాగ శ్రోతల్ని నిలబెట్టి చెప్పడంలో దిట్ట. ఒకసారి, బదరీ నారాయణంలో అతని అనుభవాన్ని చెప్పాడు. ఆ అనుభవం ఒక సిద్ధుడి దగ్గర దొరికిన తంత్రశక్తుల చిఠాకు సంబంధించింది.

జంఘాలశాస్త్రి ఎలాగైనాసరే ఆ సిద్ధుణ్ణి ఆశ్రయించి కొన్నయినా అద్భుత విద్యలు, మూలికలు, పసర్లు వాటి రహస్యాలు సేకరించాలని తిష్ఠవేసి వేసి, ఒకవీలైన సందర్భం కనిపెట్టి - మొత్తానికి కొన్ని తంత్ర రహస్యాలనబడే వాటిని సంపాదించి - ఢిల్లీ చేరుకున్నాడు. అన్న ప్రాశనమేగాని, అక్షరజ్ఞాన మెరగని కొందరు అజ్ఞానుల్ని శిష్యులుగా సంపాదించాడు.

సరి - ఇంక ఒక్కొక్క శిష్యుడిమీద ఒక్కొక్క మంత్ర రహస్యం - ఆకాశ గమనమనీ, స్త్రీ వశీకరణమనీ, రాజ వశ్యమనీ, అదృశ్య కరణమనీ, - అలా ప్రయోగిస్తూ, ప్రయోగంజేస్తూ గడిపాడు. వారి వారి భంగపాట్లు, పడినపాట్లు ముచ్చట్లే శాస్త్రి ప్రసంగ సారాంశం. ఈ లోకాన్ని అజ్ఞానం మనదేశంలో వాళ్ళ ఒక్కరి సొత్తే కాదనీ, విదేశాలలో కూడా ఈ మోస్తరు మూర్ఖులున్నారనీ శాస్త్రి కొరడా జళిపించాడు. ''సర్వ జగద్రహస్య సారం'' వంటి పెద్ద పెద్ద పేర్లతో వుండే ఇటువంటి పుస్తకాలకు సరైన మన్నన, తగల బెట్టడం ఒకటేనని శాస్త్రి తీర్మానించాడు. వాణీదాసు ఇచ్చిన అగ్గిపుల్లతో కాలాచార్యులు ఆ తీర్మానం అమలు పరిచాడు.

నేను సభాభవనమునకు వెడల లేదు.

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించె నని వింటిని.

''నేను జూడనిక్షేత్రము లేదు. ఎక్కనిగుట్ట లేదు. దాటనినది లేదు. సేవింపని మహాపురుషుడు లేడు. పరీక్షింపని వింత లేదు. కనిపెట్టని ప్రకృతి లేదు. అనుభవింపని సుఖము లేదు. పడనికష్టము లేదు. ఆడని యాట లేదు. పాడనిపాట లేదు. వేయనిగంతు లేదు. లేదు. ముమ్మాటికి లేదు. ఓ! ఎన్ని కలాపములు! ఎన్ని విలాపములు! ఎన్ని నాటకములు! ఎన్ని బూటకములు! ఎన్ని వన్నెలు! ఎన్ని చిన్నెలు! ఎన్ని మంత్రములు! ఎన్ని తంత్రములు! ఈదినమున విభూతిరుద్రాక్షమాలాధారినై చిలుముగొట్టము, తడి

గుడ్డ-చేఁబూని ''హ్రాం హ్రీ''మ్మనుచునట్లు మాఁడఁగొట్టుచు ననాథలనడుమ-, హైవారము చిత్తారు చేఁబూని ''రాం రా'' మనుచు హరిస్మరణము చేయుచు భక్తులనడుమ-, నీపక్షము ఋషిపక్షుల రెట్టతోఁ బుటములు పెట్టుచు రనవాదజ్ఞులనడుమ-, హైపక్షమేరుపిడుకల పుటికలతో నెగళ్లు రగులఁజేయుచు యోగాభ్యానకుల నడుమ-, నీనెల హైదరాబాదులో ''నాలి! దూలా! హాస్సేనుహాస్సే'' ననుచు ష్లేచ్ఛులనడుమ-, హై నెల బదరీనారాయణములో దేవీనవరాత్రములలో ''నారాయణజే! భగవతిజే!'' యనుచు సాధులనడుమ-పడుగు పేకగ-''నుల్టానీదాగ,'' చక్రపుఁబలిటీలు గొట్టుచుండువాఁడను.

ఒకనాఁడు బదరీనారాయణమున నొకసిద్ధుని జూచితిని. అతని బ్రహ్మవర్చసము, నాతనిశరీరసౌష్ఠవము వర్ణనాతీతములై యుండెను. ఆతఁడు మహానుభావుఁ డని యాలోచించి యాశ్రయించితిని. ఆతఁ డొక్క చిన్న గుడిసెలో నుండెను. ఏవేవో యోషధు లప్పుడప్పుడు తెచ్చి నాకుఁ గనఁబడకుండ దొడ్డిలో వానిని దంపి రసము తీసి యేవేవో మందులు చేయుచుండెడివాఁడు. ''నాకుఁగూడ నేమైన బోధింపరాదా?'' యని యెంత ప్రార్థించిన యాతఁ డియ్యకొనలేదు. ఏలాగునైన నీతని రహస్యము లేవో తెలిసికొనవలయు నని భీష్మించి యటనే పీఁటఁ బెట్టితిని.

ఒకదినమునఁ బరమపదించిన యొకసాధువు కళేబరనిక్షేపమునకై యందఱితోఁబాటు నే నాశ్రయించుసిద్ధుఁడు గూడఁ బోయెను. నన్నుఁ గూడ రమ్మని యాతఁడు కోరెను. కాని యాతనిరహస్యముల నెరుఁగ నదను వేచియున్న నేను శిరోవ్యథగ నున్నదని చెప్పి తప్పుకొంటిని. ఆతఁ డక్కడ భూమిని ద్రవ్వి సాధువును బూడ్చుచుండఁగా నే నిక్కడనా తని పెట్టె నెక్కలాగి లోనఁ బూడ్చి పెట్టిన రహస్యములఁ బైకిఁ గొక్కరించు చుంటిని. ఏవియో కొన్నిఘుటికలు, కొన్ని చూర్ణములు, కొన్ని లేహ్యములు, కొన్ని ద్రావకములు, కొన్ని గుళికలు, కొన్ని లేపనములు కనఁ బడినవి. ఈతఁడు మహాదేహదార్ఢ్య సంపన్నుఁడు కదా! ఈ మందులతో నీతని కేమి ప్రయోజనమో నాకు బోధపడలేదు. మందులపైఁ బేరులు లేవు. పేరులు తెలిసినవైనఁ బ్రయోగజ్ఞానశూన్యుఁడనైన నాకు వాని యుపయోగము మేమి? ఏమందైనఁ నోటిలో వేసికొనవలయు నని బుద్ధి పుట్టినది కాని యవి విషములో రసములో పాషాణములో యని భయపడి యందులకు సాహసింప నైతిని. వానిని నిమ్మళముగఁ దీసి క్రిందఁబెట్టి యడుగుననున్న మరియొక యఱ నెత్తితిని. దానిలోఁ గొన్ని తెల్లకాగితములు, నొకసీసపుఁబుల్లయు, నొక పుస్తకము నున్నవి. ఆత్రముతోఁ బుస్తకము నట్టె తెఱచితిని. సెబాస్! దొరకిన దని చేఁటయంత మొగము గలవాఁడనై కొన్ని కాగితములపైఁ దద్గ్రంథయో గములను వ్రాసి కొంటిని. తిరుగ నన్నివస్తువులను భద్రముగ యథాస్థానముల నుంచి పెట్టె పైచితిని ఇఁక నచ్చట నుండ నిష్టత లేక దారిలో నష్టకష్టములఁ బడుచు హస్తినాపురము చేరితిని. అన్నప్రాశనమే కాని యక్షరాభ్యసన మెరుఁగని గొందఱను శిష్యులుగఁజేర్చుకొని యక్కడ నొక యపూర్వభాగవత మాడితిని. వారిలో నొకనిఁ జేరఁదీసి వానికి రహస్యముగ నిట్లు బోధించితిని. ''మనకుఁ బ్రయాణముల కింకఁ బడవ లక్కఱలేదు. ధూమశకటము లక్కఱలేదు, ''మోటారు'' బండ్లక్కఱలేదు. మింటిగుమ్మటము లక్కఱ లేదు. సర్వసాధ నసామగ్రీ శూన్యముగ నొక త్రుటికాలములో యూరోపుఖండమున నేప్రదేశమునైన నీక్షింపఁ దలఁచినయెడల నక్కడకుఁ బోయి వ్రాలఁగలము'' అన నావిద్యార్థి వింత వింతగఁ జూచుచు

వెట్టిమొగము నైనుకొని ''అట్టి మంత్రము లున్న నాకుఁ జెప్పుఁ'' డని నాకాళులఁ బట్టుకొనెను. మంత్రములు కావు–కేవల తంత్రములు. సత్యదృష్టి, మనోనిశ్చలత, భూత దయ, దేహదార్ఢ్యము, దైవవిశ్వాసములేని యీపిదపకాలములో మంత్రములు పనికివచ్చునా? వానికాలమే పోయినది. వానిగౌరవము నశించినది–వానితో నింకఁ గార్యము లేదు. కాని తంత్రములు దేశకాలపాత్రాబాధితములు. తంత్రసామర్థ్యమునకు మనుజులయంగదార్ఢ్యముతోఁగాని యంతరంగ స్థైర్యముతోఁగాని సంబంధము లేదు. ఏల యనఁగ నీతంత్రము లోషధీ సామర్థ్యోద్దీపకములు. ఓషధులలోనిశక్తి యుర్వియు నోషధీశుఁడున్నంతకాల ముండకతప్పదు. నేను జెప్పఁబోవునని పరమహంసయోగములు, బైరాగిచిటుకలు, గోసాయిగుళికలు–ఇదిగో ''సర్వజగద్రహస్యసార'' మనుగ్రంథము. ఈగ్రంథమును నే నొక గొప్పసిద్ధునియొద్ద నంపాదించితిని. నీవు యోగ్యుఁడవుగఁ గానబడుచుంటివి. కావున నీ కొక్కరహస్యమును జెప్పఁదలఁచితిని, కాని నేను నీకు దీనిని బోధించితినని నీ వెవ్వరితోడను జెప్పఁగదగదు'' అని నే నంటిని–అంతట నాతఁడు సంధ్యావందన సంపర్కము స్వప్నమునందైన నెరుఁగని యాతఁడు గాయత్రితోఁ బ్రమాణము చేసెను. అంత పుస్తకమును దీసి నే నిట్లు చదివితిని.

''సీతనూలుదారంబులు చిదుకఁగొట్టి
గాడిదెగడపాకురసానఁ గలిపి కాఁచి
తత్కషాయంబు చిట్టాముదమునఁ గూర్చి
కాళ్లఁ రాయఁగ నాకాశగమన మిచ్చు''

(ఖేచరాధ్యాయము, జాబాలిక్రుతము)

ఈయోగమే ప్రవరాఖ్యునిపై సిద్ధుఁ డుపయోగించినది. ఆగాథ మనుచరిత్రమునఁ గలదు. కాని యందున నిందున నొక్క భేద మున్న దని నేను బుద్ధిచేఁ గనిపెట్టితిని. ప్రవరాఖ్యుని పాదలేపము మంచుచేఁ గరఁగిపోయినది. ఇందునఁ జిట్టాముద ముండుటచేఁ గడిగిననైన సులభముగాఁ బోవునది కాదు'' అని చెప్పితిని. ఆమరునాఁ డా లేపనమును సిద్ధపఱచి యాతనిని మొండిగోడపై నెవ్వరు చూడకుండ నిలువఁబెట్టి యాలేపనము నతనికాళులకు రాచికొని దైవధ్యానమునుజేసి నిశ్చల మనస్కతతోఁ బోవలసినయూరు దలఁచుకొని యెగురు మని చెప్పితిని–''మక్కాకుఁ బోవలయును మహాప్రభూ!'' యని యాతఁ డొక యెగురెగిరెను. నా కేమో కన్నులు చీకటులు పడిన ట్లయ్యెను. ఎగిరిన యాతఁడు కనఁబడలేదు. ఏమిరా యని యదరిపడిచూడఁగ గోడప్రక్క నున్న గాదెక్రింద మూలుగు వినఁబడెను. కృత్యాద్యవస్థపైన నాతనిని బైకి లేవఁదీసి ''నిశ్చలాంతరంగము నీకుఁ గుదురలేదు. అదిగాక మన దేవతలు మక్కాను నహింతురా? పరమహంస క్రియోపదేశము నీకుఁ బనికిరా''దని చెప్పి లేపమునకై తెచ్చిన యాముదము కొంత నాతని గాయములకు రాచి పంపితిని. ఆతఁ డెవ్వరితోడను జెప్పలేదు.

కొన్ని దినములు పోయినపిమ్మట నొకఘోటకబ్రహ్మచారిముండకొడుకును –మొఱఁడువంటివానిని నాశిష్యులనుండి యేరిచి రహస్యముగ ''నీకు స్త్రీవాంఛ యున్నదా?'' యని యడుగ నాతఁడు దబ్బాటు జల్లువలె నొక్కయేడు పేడ్చి కన్నులు పులకించి ''ఉన్నదే అది! ఉన్నదే అది'' అని ద్విరావృత్తిగఁ బలికి ''పెండ్లియయినయెడల

పెండ్లియయిన యెడల''–ననుచుఁ బండ్లు బిగించి యొడలు దులిపి పిడికిళ్లు బిగియఁబట్టి యొకకాలెత్తి నేలపై బింకముగ నడఁచి కుడిముష్టితో నెడమముష్టిమీఁద గుబుక్కున నొక గ్రుద్దు గ్రుద్దుకొనెను. ఆతని తీవ్రతఁ జూడఁగ నాతనికిఁ బరిణయమయినయెడలఁ బ్రళయ మంత భయంకరచర్య యేదో యాతఁడు చేయఁదలచినట్లు నాకగపడెను. ఈగ్రంథమున స్త్రీవశ్యమునకుఁ గొన్ని యోగము లున్నవి. చదివెదను వినుమంటిని.

గీ. పగట నేకాదశినిఁ జంపఁబడినతొండ
నాల్క నుడుమునెత్తుట మర్దనం బొనర్చి
పొడుము చిటికంతపసుపుతోఁ బొందు పఱచి
కలికమును వేయ లొంగనికాంత లొంగు.

గీ. పేఁడపురుగుల నెండలోఁ బెట్టి దంపి
తెల్లజిల్లేడునత్తుతోఁ ద్రిముఖియైన
బొమ్మజెముడుఁగాగునఁ గూర్చి పాలఁతి కొడలఁ
జందనముతోడఁ బూయ స్త్రీజయము నిజము.
(వశీకరణ కిరణము) (మదనమార్తాండము. చార్వాకకృతము)

''మొదటిది కలికము. రెండవది చర్చ–ఈరెంటిలో నీవు దేనినొనర్పఁగల?'' వని యాతని నడిగితిని. ''కలికము కానంత సూక్ష్మమైనపని. గంధచర్చ–స్థూలకార్యము–నాబుద్ధి కిది మంచిది. క్యారు మన్నను, గోలు మన్నను, లక్ష్యపెట్టక కలియఁబడియైనఁ బూసెదను'' అని యాతఁడు మారుపలికెను. అదివఱకే సిద్ధముగ నుంచిన గంధ మాతని కిచ్చితిని. అతఁడు నడుమున కంగవస్త్రము గట్టిగ బిగించుకొని యజ్ఞోప వీతము నడుమునఁ జుట్టఁబెట్టి శవవహనమునకుఁ బోవువాఁడువలె వీధిలోనికిఁ బోయెను. వేశ్యావీధికిఁ బో యెను. ఇంతలో నొకవేశ్య తెలుకుల యింటికిఁ గాఁబోలు నూనెకై పోయి యాతఁ డింట లేకపోవుటచేఁ గాఁబోలు తిరుగ వట్టియిత్తడిచెంబును జేఁబూని యింటికి మెల్లగఁ బోవుచుం డెను. ఆప్రశస్తమైన పుణ్యకాలము వృథపోనీయఁగూడ దని యెంచి యీనింత పెండ్లికొడుకు దానిని వెంబడించి వెనుకపాటున నెరుకఁడు పందిపై బడినట్లు పడి చర్మ మొలుచునంతటి సంరంభముతో నిశాత నఖముఖవిజృంభణముతో నాగంధమును దానిరవికంచు నడుము కట్టు నడిమిప్రదేశమున గట్టిగ రాచెను. అంత నాకులటాశిరోమణి భయమున ఘుర్ఘురిం చుచు వెనుకఁ దిరిగి వీరవిటాగ్రేసరుఁడైన యాతనిఁ జూచి కోపమునఁ జేత నున్న యిత్తడి జగన్నాథపుఁజెంబుతో నెత్తిపై గొట్టను. ఆతనితల్లి కడుపుచలువచే తత్పాత్రప్రఘాతము తలనుండి తప్పి యపసవ్య భుజముపై నశనిపాతమువలెఁ బడెను. ఆబాహువు గూటినుండి తప్పిపోయి ''లటలట'' వ్రేలాడఁజొచ్చెను. ఆచేతిని రెండవచేతితోఁ బట్టుకొని యుత్కంఠ మున నోండ్ర పెట్టుచుఁ గుమ్మరియొద్దకుఁ బోయి హస్తము నసువులనుగూడఁ దిరుగగూటఁ జేర్పించుకొనె నని మరునాఁడు నాయొద్దకు వచ్చి పూర్వదినాపూర్వచరిత్రను బూసగ్రుచ్చినట్లు చెప్పి ''స్త్రీవశీకరణమునకేమి గాని తగుపాటి ధనవశీకరణ మైన'' దని చెప్పి కిసుక్కున నవ్వెను. ''అదేమి? యని యడుగ నావేశ్యకుఁ బ్రక్క యెముకలపై గంధమును దాను బట్టించుచుండ ''అవికెలోనుండి జారియొకపావులాకాసు–నూనెకొఱకు దాఁచినది కాఁబోలు–తనచేతిలోఁ బడె నని యాతఁడు చెప్పెను. ''విలాసముగఁ జందనచర్చ

యొనరుపవలయునుగాని వెర్రికుక్క పీకిన క్లేల చేసితి?'' వని నే నడుగ ''గాగర చూచుసరికి గాబర యగునండి బాబూ!'' అని పశ్చాత్తాపతప్తుడయ్యెను.

మరిక్కొన్ని దినములు పోయినవెనుక నొకశిష్యుని రహస్యముగఁ బిలిచి నీకు రాజధన మేమైన సిద్ధించుచున్నదా? యని నే నడుగ నాతఁ డిట్లనియెను. ''నే నిచ్చటనుండు ప్రభువుని పురోహితుని పుత్రుఁడను. నాతండ్రిమీఁద నాతనికిఁ గోపము గలిగెను. రాణిగారికి సీమంత మహోత్సవకాలమందుఁ బొరపాటుచొప్పున మాతండ్రి కేశఖండన మంత్రమును జదివెను. అంతటినుండి యాతనిని గోటలోనికి రానిచ్చుట లేదు. మనసొమ్మేమిపోయినది? మహాలయములో మంగళసూత్రధారణ మంత్రమే చదువవచ్చును. నాతండ్రిపని నాకిమ్మని రాజుగారి నాశ్రయించుచుంటిని. ఇచ్చెద రని కర్ణాకర్ణిగ వినుచుంటిని గాని తగని యాలస్య మగుచున్నది.'' అంతట ''రాజవశీకరణమునకు నే నేమైనఁ జేసిన నీ కిష్టమేనా?'' యని నే నాతని నడుగ ''నింతకంటెఁ గావలసినదే?''మని యాతఁ డనెను. ''అంతట సర్వజగద్ర హస్యసారము'' నుండి యీదిగువ యోగమును జదివితిని.

గీ. బల్లితోఁక యుడుతచెవి పాముకుబున
మూడ్గువేరు జంబుకదంత ముల్లిపొట్టు
రాసభపు జూలువెండ్రుక రాగిమురుగు
నం దునిచి పూన రాజవశ్యంబు నిజము.

(రాజపద్ధతి–సర్వసాధన నిక్షేపము, శునశ్శేఫకృతము)

అదివఱకె సిద్ధపఱచియుంచిన కడియ మాతనిచేతఁ దొడిగి రాజసభకుఁ బొమ్మని చెప్పితిని. ''రాజున కెదురుగ నిలువఁ బడి రాజదృష్టి నీపైఁ బడునమయమున మురుగును కొంచెము కదపు'' యని సిద్ధౌషధ ప్రయోగపద్ధతినిగూడ బోధించితిని. అతఁడు మహానం దమునఁ గోటలోని కేఁగెను. మొదటి ద్వారము దాఁటఁగనే రాజుగారిని జూచెను. అతఁ డచ్చట నేనుఁగులఁ బరీక్షించుచుఁ బరివారముతో నిలువఁబడినాఁడు. ఆతని కెట్టయెదుట నిలిచి రెప్పపాటైన లేకుండ నాతనివంకఁ జూచు చుండెను. రాజు తన్నుఁ జూచుటతోడనే మురుగును గదపుకొనవలయునని తాను యత్నించెను. కాని చేయి కదపిన నది కదలదయ్యెను. కట్టు కొయ్యవలె నెట్టయెదుట నిలువఁబడిన యాతని మరియొకసారి రాజుగారు చూడఁగఁ గుడిచేతిని ముందునకు ముష్టిమూసి చాఁపి యెడమచేతితో మురుగును బైకిఁ ద్రోచెను. రాజుగారు రొసరొసలాడుచుఁ దిరుగ నాతనివంకఁ జూచిరి. అంత మురుగును మూఁడుమారులు పైకిఁద్రోచి బింకముగ నిలువఁబడెను. ఏమీ! ఈపాగరుఁబోతు పురోహి తుని కొడుకు మమ్ముఁ గొట్టుటకు వచ్చినాఁడా? తన్నుఁ" డని ప్రభువువా రనఁగ నక్కడ నున్నవా రందరు పక్షపాతము లేకుండ శక్తివంచన గలుగకుండఁ గరము–క్రర–కాలివిసరుల నాతనిఁ గటాక్షించిరి. ఆతఁ డీసంగతి మరునాఁడు నాతోఁ జెప్పెను.

కొన్ని నాళ్లిట్లు పోనిచ్చి మరియొకశిష్యుని రహస్యముగఁ జేరఁ బిలిచి యిటు లంటిని. ''నీవు ధైర్యస్థైర్యములు గలవాఁడ వగునెడల నొక గొప్పసిద్ధౌషధయోగనిదర్శనము నీసాహాయ్యమునఁ జూడవలసి యున్నది.'' ''అద్దే! అట్లే'' అని యాతఁ డడిగినవెంటనే టక్కు మని ప్రత్యుత్తర మిచ్చెను. అంత సిద్ధౌషధ రాజీయమునుండి యీక్రింది యోగమును జదివితిని.

సీ. ఆదూడ రేణంబు గేదెమూత్రముతోడఁ
గలయనూరుచు రెండుతులము లెత్తు
ప్రమిదలలోఁ బెట్టి పల్లవపుటమిచ్చి
తద్భస్మమును శ్వేతతామ్రచూడ
వస్తియందునఁ బెట్టి వసుధాపుటము రెండు
రాత్రులఁ బెట్టి తర్వాత దిగిచి
నలిఁజేసి దానిని నల్లపిల్లికిఁ బెట్టి
యాపిల్లి కార్జెంబు నక్షియుగము
గీ. నొంటెపాలను మర్దించి యొక్కజాము
మంచి దిగుగాయినూనెలో పురుఁగనిచ్చి
వడియుఁగట్టిన యానూనె నొడలి కంత
పూసికొనఁగ నదృశ్యుఁడౌ పురుషుఁ డిలను.

(తురీయాధ్యాయము) (తిరస్కరిణీపారిజాతము; గాలవకృతము)

''ఈతిరుగుళ్లన్నియుఁ దిరిగి, యీజీవహత్య లన్నియుఁజేసి, యీపాటు లన్నియుఁ బడి–ఇదిగో–యీతైలమును జేసినాను. దీనిని నీవు దేహమునకుఁ బట్టించుకొనినయెడల నెవ్వరికిఁ గనఁబడవు. రాచికొనిన రెండు యామములకు గుణ మగపడును.'' అని నే నాతనితో నంటిని. ''నేను దీనిని రాచికొని రెండుయామములు మీయొద్దనే కూర్చుండెదను. అప్పటికి మీకు నేను గానఁబడకుండునెడల నిదర్శనమేకదా?'' యని యాతఁడు పలికెను. ''ఈరహస్య మెఱిఁగిన నాపై నీమందు పనిఁ జేయదు. నీ వందులకు మఱెవ్వరినైనఁ జూచుకొనవలయును'' అని నేను బ్రత్యుత్తర మిచ్చితిని. అంతట నాతఁ డానూనె నింటికిఁగొ నిపోయి రాత్రి నఖశిఖాపర్యంతము ప్రబలముగ మర్దనము చేసికొని యింక గుణ మీయఁగల దని తనకుఁ దోఁచిన వెంటనే లేచి ''అమ్మా! అమ్మా!'' యని తల్లిని గాఢనిద్రనుండి లేపి ''నీ కేమైన నెదుటఁ గనఁబడుచున్నదా?'' యని యామె నడుగ ''పోరా! నా కేమియుఁ గనఁబడలేదురా!'' యని యామె బరు వెక్కి విడనికన్నులతో జోగుచు బదులుచెప్పెను. ''అద్దీ'' యనుచు నానందించి నిశ్శంకముగ నతఁడు వీథివెంట వెడలిపోయెను. ఆసిద్ధౌషధ మాతనిచేతఁ బెట్టునరి కాతని స్వభావమును నేను బొత్తిగ నెరుఁగను. అతనికి దాని నేల యిచ్చితినిరా యని తరువాత మిక్కిలి పశ్చాత్తాపపడవలసివచ్చినది. ఎందుచేత ననఁగా నాతఁ డా మరునాఁటి యుదయమునఁ గారాభద్రుఁడై యుండె నని వింటిని. ఒక వర్తకునియింటి కాతఁ డారాత్రి కన్నముగైచి కొంతధనమును హరించుచుండఁగా వర్తకునితల్లి లేచెను. అదృశ్యరూపమున నుంటి నని పూర్ణమైన నమ్మకముగల యాతఁ డామెయెదుట మొద్దువలె నిలువఁబడెను. కాని యేక్రీనీడనైన దాఁగియుండుట కావశ్యకత యాతనికి లేకపోయెను. అంతట నామె తన తలక్రిందనున్నపీఁట యాతనిపై విసరినైచెను. ''కనఁబడనివానినైన నెంతగట్టిగఁ గొట్టినావే!'' యని కాఁబోలు నాతఁడు తీవ్రకోపమున నామెగొంతుపై నొక్క త్రోక్కు త్రొక్కెను. అంతలో నిద్దరుముగ్గురు జనులు లేచి ''పట్టుకో! పట్టుకో!'' యని కేకలునైచిరి. ''మీ మొగము! కంటికిఁ జిక్కనివాఁడు చేతి కెక్కఁడ జిక్కునురా'' యని నిర్భయముగ నచటనే నిలువఁబడెనఁట. అతనిచేతిలోఁ దుపాకియుంటచే నంతధైర్యముగ

నిలువఁబడినాఁ డనియు, నాతని గ్రహింప యత్నించినఁ జంపు ననియు భయపడి కాఁబోలు వారు మరింత కేకలు నైచిరి. వారు తన్నుఁ దరిఁజేరకుంట గాంచి తనయదృశ్యత్వమును మరింత స్థిరపఱచుకొని హరించినపైకము నంగవస్త్రమున మూటగట్టుచుండెనఁట! గృహప్రభుఁ డీయల్లరి విని లేచివచ్చి యాతనిఁ బట్టుకొని రక్షకభటుల యధీనునిగఁ జేసెను. వర్తకునితల్లి యారాత్రి మరణించెను. అతని కండమానుదీవులలో శాశ్వతశిక్ష విధింపఁబడుట చేత సిద్ధౌషధమహిమచే నార్యావర్తదేశముమట్టున కదృశ్యరూపుఁడయి యుండెను.

ఎంతరహస్య ప్రవర్తనమున నున్నను నెవ్వఁడో సృష్టిరహస్య విద్యాపారఁగుఁ డగు సిద్ధమూలికాభిషగ్వరుఁడు గ్రామమునకు వచ్చి నాఁ డని కింవదంతి కలిగినట్లు నేను విని యచ్చటనుండి పారిపోయితిని. నాయనలారా! ఈగ్రంథమున నింక ననేకవిచిత్ర యోగము లున్నవి. అవియన్ని యుఁగూడ నిటులే కోఁతి పిల్లిని బట్టుకొని పిల్లికాలితో నిప్పులలో నున్న పనసగింజను దీయించిట్లు పరముఖముగాఁ బరీక్షించితిని. ఒట్టునకైన నొక్కటియు నిక్కము కాలేదు. గ్రంథకర్తల కీమతిమాలిన తన మేమో! తక్కువశ్రమముతో మహాకార్య ములు కావలయునని ప్రతిమనుజునకు సహజముగ నుండును. అందుచే ''నేవస్తువులో నేమి యున్నదో యేయేవస్తుమేళమున నెట్టియెట్టి వింతశక్తులు కలుగునో ఏమో! అయినఁ గాఁగూడదా?'' యను వెఱ్ఱి జనులను మిక్కిలి బాధించుచున్నది. ఇట్టి మహాజ్ఞానమునకు లోనైనవారము మనమే కాదు. ఇతర దేశీయులగు మనసోదరులుగూడ నున్నారు. రోముదేశ స్థులు గూడ నిట్టి నమ్మకములు గలవారే! ఇదిగో దానికిఁ దార్కాణముగ ''సర్వజగద్రహస్య సారము'' నుండి కొంచెము చదివెదను.

'Bubo, a screech owl is a bird well enough known which is called "Magis of the Chaldss" and Hysophus of the Greeks. There be marvellous Virtues of this owl for, if the hert and right foot of it be put upon a man sleeping, he shall say anon to thee whatever thou shalt ask him. And this hath been proved of late time of our brethren. And if any man put this under his arm hole, no dog will brak at him but keep silence; and if these things aforesaid joined together with a wing of it, be hanged up to a tree, birds will gather together to that tree."

"When thou wishest that thy wife or wench show to thee all that she hath done, take the heart of a dove and the head of a frog and dry them both and bruise them into powder and lay them upon the breast of her when she is sleeping and she shall show thee all that she hath done but when she shall wake, wipe it away from her breast that it be not lifted up.

"Take an adder's skin and auri pigmentum and Greek pitch of Reuponhicum and the wax of new bees and the fat of grease of an ass and break them all and put them all in a dull seething pot full of water and make it to see it at a slow fire, and after let it wax cold, and make a taper and every man that shall see light of it shall seem headless." The secrets of nature set forth by

Albertus Magnus in Latin, newly translated into English imprinted at London by me William Copland.

నాయనలారా! వింటిరా! ఈయజ్ఞానస్థితి యెంతయద్భుతముగ నున్నదో; ఈగ్రంథ మున నుండు నపూర్వ యోగములను సహేతుక పూర్వపక్షముచే గౌరవింప నక్కఱలేదు. వానియెడల యథోచితమగు నిందను గనఁబఱచుటయే తగును. వీనికిఁ బ్రశస్తమగు పూర్వపక్ష మీగ్రంథమును బరశురామప్రీతి సేయుటయే. ఈగ్రంథము నాయొద్ద నిరువది సంవత్సరములనుండి పెట్టెయడుగునఁ బడియున్నది. జెట్టి యొక్కఁటి యీదిన మాపెట్టె లోనికిఁ బోవుటచే దానికొఱ కాపెట్టెలోని వన్నియుఁ దీసి వెలుపలఁ బడవైవవలసినవచ్చెను. ఈపుస్తక మపుడు నా కన్నులఁ బడెను. దీనిసంగతియే నేను మఱచిపోయితిని. ''కాలాచార్యా! నీచేతి కిచ్చిన ప్రాఁతతాటా కిటు తెమ్ము'' అని యాతని నడుగ నాతని చేతికిఁ దాని నిచ్చెను. ''పాడుము చేయుటకుఁ దెచ్చితివేమోయని యను కొంటిని. ఇందులకా?'' అని పలికెను. వాణీదానుఁ డిచ్చిన యగ్గిపుల్లచే ''సర్వజగద్రహస్యసారము''! నంటించి తాటాకుపైఁ బెట్టెను. నద్గ్రంథము బుగ్గియయ్యెను. నభ ముగిసెను.

30. ఆధ్యాత్మిక విద్యావశ్యకత

జంఘాలశాస్త్రి చిత్రమైన మనిషి. అతనిలో వేదాంత తత్త్వం వువ్వులో దారంలాగా ఎప్పుడూ నిలిచే వుంటుంది. ఎన్ని గొప్పసంగతులు, ఆచారాలు, శాస్త్రాలు, యోగాలు, కవిత్వాలు, విద్యలు మనిషి అనుసరిస్తున్న ప్పటికీ ఈ ప్రపంచం అశాశ్వతమనీ, ముఖ్యంగా మనం అశాశ్వతమనీ, మరచిపోక - అహంకారం పెంచుకోక - బతకాలని అవకాశం దొరికినప్పు డేమి, ఒక్కొక్కసారి దొరకబుచ్చుకుని ఏమి, పదేపదే చెప్పుతుంటాడు.

శాస్త్రి అజ్ఞానాన్ని వర్గీకరించాడు.

తెలియకపోవడం -
తెలియదని తెలియకపోవడం -
తెలుసునని తెలియలేదని తెలియక పోవడం -

అలాగే మరో వర్గీకరణం

తెలియడం -
తెలుసునని తెలియడం -
తెలియదని తెలిసిందని తెలియడం -

సారాంశం ఏమంటే, మనకు తెలుసుని మనం అనుకుంటున్న చాలా విష యాలు మనకు తెలియకుండానే జీవితం గడిచిపోతోందని -

ఈ సత్యం గ్రహించమనే జంఘాలశాస్త్రి వేదన - నివేదన కూడా!

మీరు ఎన్ని ఐహిక సుఖాలు పొందినా పొందండి అభ్యంతరం లేదు. కాని శాశ్వత సుఖం ఒకటేవుంది. దానిమీద దృష్టి నిలపండి. ఉపనిషద్విద్య అభ్యసించండి - అంటాడు.

—

జంఘాలశాస్త్రి ఇట్లు పలికెను.

ఈనడుమ సుదర్శనీపత్రికలో ''సువర్ణలేఖాపత్రికాప్రశంస'' యను శీర్షికక్రింద మన ''సాక్షి''నిగూర్చి కొన్నియంశములు వ్రాయబడినవి. సుదర్శనీపత్రికాధిపతు లిట్లు మన మొనర్చు నీస్వల్పమైన పని కామోదించినందులకు మనము వారియెడల మిగుల గృతజ్ఞత గల వారమై యుండవలయును. ఎవ్వరైన నేదైనఁ బనిఁజేసినయెడల దానిలో నెక్కడ

తప్పువచ్చునా? ఎక్కడ వంక దొరకునా? ఎట్లధిక్షేపింతమా? యని వేయికనులఁ గనిపెట్టి యుండువా రనేకులున్నారు. నెరసులు వెదకి యధిక్షేపింప మొదలు పెట్టినయెడల నాక్షేపణార్హుఁడు కానివాఁ డెవ్వఁడైన నుండఁగలఁడా? బ్రహ్మజ్ఞులగు వేదర్షులు మొదలు పశుప్రాయుఁడగు పామరాధమునివఱ కందఱ నొక్కవరునను దిట్టనేర్చిన కలముక్రింద దిగదుడుపుకాదా! సర్వజగత్సృష్టికర్త తప్ప సర్వజ్ఞుఁ డెవ్వఁడైన నున్నాఁడా? అంద రల్పజ్ఞులే కదా! మనుజబుద్ధి మిక్కిలి పరిమితి కలది. జ్ఞాన మపారము. అమితగంభీరము. అహంభావము లవతలికిఁ ద్రోచి, గర్వములు కట్టిపెట్టి, యసత్యము నడఁచిపెట్టి, మనసును స్వచ్ఛముగఁజేసికొని యొక్కనిమిస మితరచింతలకు శాంతిఁ జెప్పి యొంటరిగఁ గూర్చుండి కన్నులను మూసికొని ''యింతకాలమునుండి యీ ప్రపంచమున నల్లలాడుచుంటి మిగదా! మనకుఁ దెలిసిన యంశ మేది''? యని గాఢమైన ప్రశ్నమును మిమ్మె మీరు వైచుకొనుఁడు! వైచికొంటిరా? మంచిది. మీయంతరాత్మ మీ కేమని యుత్తర మిచ్చుచున్నది? ఆయుత్తరమేదియో మీకుఁ దెలిసినఁజాలు. వైకిఁ జెప్పనక్కఱలేదు. మీరు వైకేల చెప్పనక్కఱలే దనిమీవెర్రిమొగములే దానిని వెల్లడించుచున్నవి. ఇంతే. మనుష్యునిజ్ఞానము గగనకుసుమము! మరీచికావీచిక! నపుంసక సంగమము! వంధ్యాప్రసవము! తెలియనివాఁడు తెలియనట్లుండునా? ఊఁహు! ఓ! ఏమి దర్పములు! ఏమి యెగిసిపాటులు! ఏమి తెగనీలుగులు! ఏమి వచోవైభవములు! ఏమి రాద్ధాంతపూర్వపక్షరామణీయకములు! ఏమి ప్రజ్ఞాప్రకర్షలు! సూర్యగోళములో గంధకపు గను లున్నవనియుఁ, జంద్రునిలో నగ్నిపర్వతము లున్నవనియు, వెలుతురు నిమునమున కిన్నివేలమైళ్లుప్రయాణ మొనర్చు ననియు ఖగోళ శాస్త్రజ్ఞుఁడు నిర్వచించునుగదా! అట్టిశాస్త్రజ్ఞుని నిలువఁ బెట్టి ''నాయనా! వెలుతురనఁగ నేమో నాకుఁ దెలియదు. అది యేమిటి? ఎట్లు గలుగును?'' అని యాతని మన మడుగునెడల ''కెమికల్ కాంబినేషన్'' అని ''ల్యూమినస్ బాడీ'' సని ''పార్టికి''ల్సని ''యాథ'' రని ''రెటినా'' అని ఏమేమో చాటుభారతగ్రంథము సెలవీయ నారంభించును. ''తెలియనిమాట నొక్కదానిని దెలుపు మని యడిగితినిగదా! ఇన్ని తెలియనిమాటలు నా మొగమునఁ గొట్టితి వెందులకు? నాయనా! నన్నొకమెట్టుపై కెక్కించలేకపోయితివి సరికదా! దిగఁ బీకుచుంటివి కూడనా! చాలు నమస్కారము'' అని మన మాతనియొద్దనుండి సెలవు తీసికొనవలసివచ్చును. ఈ గోళము లెక్కడనో దూరమున నుండుటచేత వానితత్త్వను మనకు బాగుగఁ దెలియకపోయి యుండవచ్చు నని మన మనుకొనుట కవకాశమున్నది. మనము నిత్యము చూచుచున్న వస్తువులఁ గూర్చి మనకేమాత్రము జ్ఞానమున్నదో కనుఁగొందము. ఈక్రిందిచిత్రమును బరిశీలించుఁడు.

The sinor Nardo recounts the results of experiments made on his own person in the transplantation of hair and relates that by transplanting quickly a hair, with its root, from a pore of his head into a pore of his chest, easily to be accomplished by widening the pore somewhat with the point of the needle, introducting the root with nicety and exciting within the pore itself, by friction, a slight degree of inflammation the hair takes root, continues to vegetate and grows in due season changes colour becomes white and falls. Ten thousand wonderful things.

తలపై వెండ్రుకను మొదటితోఁ దీసి గుండెలపైఁ బాఁతినయెడల నక్కడ నది వేరునాటి కొని యెదుగు నని దీని ముఖ్యాభిప్రాయము. ఇది యొక ప్రకృతిశాస్త్రవిద్వాంసుఁడు చెప్పియుండెను. ఈతఁడు రోమశాస్త్రమందు ప్రత్యేకనిరంకుశపాండిత్యముగూడఁ గ లవాఁడై యుండినట్లుతోఁచును. ''వెండ్రుక యన నేమి? అది యెట్లెదుగును?'' అని యీతనినడుగ నాతఁ డావిషయమునమాత్ర మితరులకంటెఁ దెలిసినవాఁడుకాఁడు. పైని రెండుగదులు, క్రింద రెండుగదు లుండు ననియు, వీనినడుమ నొకవైపుననే తెఱచు తలుపు లున్న వనియు, నవి నిమునమున కిన్నిమాఱులు కొట్టుకొను ననియు శారీరశాస్త్రవేత్త హృదయకోశవర్ణన మొనర్చునుగాని మొదటఁ గొట్టుకొనుటకుఁ గారణ మే? మని యడుగ నూరకుండును. ఒక కవి యీవిషయమును నిట్లు పలుకుచున్నాఁడు.

గీ. మనకుఁ దెలిసిన దేదైన మహిని గలదె?
ఇదిగొ పుష్పము! పూ వన నేమి! ఊఁహు!
ఎట్లు పుట్టిన? దూఁహూఁహు! ఇట్టిరంగు
లెటు కలిగె? నూఁహు! యేవస్తు విద్ది? ఊఁహు.

మనము యథార్థముగఁ బైకాయ చూచి యదియే వస్తు వనుకొనుచున్నాము. ఒడ్డు పొడవు వెడలుపుఁ జూచి వస్తు వనుకొనుచున్నాము. వస్తువు మనసులోఁ గలిగించినమూర్పునే మనము వస్తువుగ గ్రహించుచున్నాము. వస్తువికారములను దెలిపి వస్తువు తెలిసిన దని మోనపడు చున్నాము. మనజ్ఞానము మిథ్యాజ్ఞానము. ఛాయను జూచి వస్తువని భ్రమించుట జ్ఞానమగునా? తోలుబొమ్మలను జూచి నరు లని యనుకొనుట జ్ఞానమగునా! స్వప్నానుభవము లను సత్య మని తలపోయుట జ్ఞానమగునా? మనదరి నున్న యన్నివస్తువులు మనము నిత్యము చూచుచున్నవే! చూచుచుంటి మని యనుకొనుచున్నవే! కాని యేవస్తువును మనము చూచుటయే లేదు. చూచుచుంటి మని యనుకొనుచున్నదేదో యది వస్తువుకాదు. వట్టిది. మనచుట్టును నున్న యన్నిపదార్థములు మన మనుదినము తెలిసికొనుచున్నవే! తెలిసికొనుచుంటి మని యనుకొనుచున్నవే! కాని యేపదార్థమును మనము తెలిసికొను టయే లేదు. తెలసికొంటి మని యనుకొనుచున్న దేదో యది పదార్థము కాదు. ఆ యథార్థము–ఇట్లు వినకున్నను, వినుచుంటి మని, తాఁకకున్నను దాఁకుచుంటి మని, చూడకున్నను జూచుచుంటి మని, తెలియకున్నను దెలియుచుంటి మని మనము మహామో హమున ననుకొనుచుండెడి వస్తువులకేవో పేరులు పెట్టి యేవో గుణములు వాని కున్నట్లు నిర్ధారణపఱచి వానియథార్థతత్త్వములను బూర్ణముగఁ దెలిసినవారివలెనే వానిని మనయైహిక ప్రయోజనములం దుపయోగించుకొందుము. ఒకకవి యిట్లు పలుకును.

గీ. వస్తుయాథార్థ్య మెరుఁగక వస్తువునకు
నేదొ సంజ్ఞను మన ముంచి యెరిఁగినట్లు
లల్లలాడుదు మిది యంత యైంద్రజాల
మందు దుముకులాడెడు బొమ్మలాట కాదె?
స్వప్నమునకంటె స్వప్నమై సత్యముగను
మాయకును మాయ యగుచు నమ్మకము గాఁగ

శూన్యమునకంటె శూన్యమై నుస్థిరముగఁ
గనఁబడెడుదీని నే మని యనఁగవచ్చు?

ఆహా! మొదలు తుదలేనితంత్రము! మోసము లన్నిటిలో మిగుల మోసము! మాయ లన్నిటలో మహామాయ! విడరాని పెద్దచిక్కు! పరమప్రీతికరమగు బంధము! తేజోమయ మగు నంధత్వము! కోమలతమమగు గొంతుకోఁత! అనిర్వచనీయవ్యాపారము! అవాఙ్మనస గోచరము! కాని యీతంత్ర మందఱు నెరుఁగుదురు. తెలియనివాఁ డొక్కఁడును లేఁడు. అత్యంతమూఢున కందఱకంటె బాగుగఁ దెలియును. ఈ మౌఢ్యము తగ్గినకొలది నమౌఢ్యము హెచ్చును. గ్రీసుదేశమున మహాధీశాలి యని యెన్నఁబడిన ''సోక్రటీస్'' అను వేదాంతవిజ్ఞానసంపన్నునియొద్దకుఁ గొందరు జను లేతెంచి ''ధీమంతులలో నిన్నగ్రగణ్యు నిగా జను లంద రైక్యకంఠముగ నంగీకరించిరికదా! అందులకుఁ గారణమేమి?'' యని యడిగిరి. ''నాకేమియుఁ దెలియలే దనుసంగతి నాకుఁ దెలియును గావున నన్ను ధీశాలి యని జను లెన్నుచున్నారు'' అని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. చూచితిరా! ఇచ్చట జ్ఞానసంపద యనఁగ నెద్ది? ప్రాపంచికతంత్రము తనకుఁ దెలియలే దనుసంగతి తెలియుట. అనఁగఁ దెలియకపోవుటను తెలియుట యయినది. తెలియుటనే తెలియుట సిద్ధించినయె డల నట్టితెలివికిఁ బరిమితి యుండునా? అనఁగఁ బ్రపంచసృష్టితంత్రరహస్య మొకనికిఁ దెలియును. అది తెలియు నను సంగతికూడఁ దనకుఁ దెలియును. అట్టివాని తెలివి యెంత తెలివియో! ఆతఁడే జీవన్ముక్తుఁడు కాఁడా? ప్రస్తుతమున మనవారియవస్థ యెటులున్నది? వారి కేమియు నీచిక్కు తెలియదు. తెలియ దను సంగతియైన వారికిఁ దెలియదు. మొదలే తెలియకపోవుట. పిదప నట్టి యజ్ఞానావస్థను దెలియకపోవుటయునై యున్నది. అనఁగఁ దెలియకపోవుటను దెలియక పోవుటయై యున్నది. ఇదియే యంధకారపుజోడింపు. ముసుఁగుపై ముసుఁగు! అజ్ఞానద్వైగుణ్యము! మాయ జవురు బొంతకప్పు! ఇక్కడకు మూఁడైనవి. తెలియుట, తెలియుట తెలియుట, తెలియకపోవుట తెలియుట తెలియుట. ఇఁక మరియొకయవస్థకూడ నున్నది. అది యేదన? తెలియుట తెలియకపోవుట తెలియకపోవుట. ఒకనికిఁ దేలుమంత్రము దెలియును. కాని తెలియు నను సంగతి తనకుఁ దెలియదు. అట్టిచో నది యజ్ఞానమే కాదా! ఇట్టియవస్థ యుండఁగలదా? యని మీకు సందేహము కలుగవచ్చును. ఇది తేలుమంత్ర మని చెప్పకుండ నొకనిచే దానిని మనము వల్లింపఁజేయఁగూడదా? అప్పు డతనికిఁ దేలుమంత్రము వచ్చినదైయుండదా? అది తేలుమంత్ర మన యాతనికిఁ దెలియనప్పు డట్టిది తెలివిలేమికంటె భిన్న మెట్లు? అదియుఁగూడ నజ్ఞానమే. ఆత్మ పరబ్రహ్మ మనియద్వైతు డెరుఁగును. తానే బ్రహ్మమని యాతఁ డెరుఁగును. ఎట్లెరుఁగును? గురుఁ డటు బోధించుటవలన–శ్రుతి యట్లు శాసించుటవలన. ఈయెఱుక మాత్రమే విజ్ఞాన మగునా? కానేరదు. తానే–బ్రహ్మము–ఈరెండుమాటల కర్థము తెలియుట తోడనే బ్రహ్మైక్యదశ సిద్ధించునా? అనేకజన్మము లెడతెరిపి లేకుండ వేదవిహితములగు సర్వవిధు లొనర్చి చిత్తశుద్ధి విరాగతాదు లొంది యందువలన భక్త్యంకురమును గాంచి దానిని బెంచి క్రమక్రమముగ బలపరచి పుష్పింపఁజేసి తుదకు ఫలింపఁజేసి ఆ పండు మంచిపరిపక్వ దశ నొందునప్పుడు దానినుండి వెడలు ననుభవైక్యవేద్యమగు మహాపరిమళము నాస్వాదించి దానితోఁ జిరకాలము కలసిమెలసి యాయనుభవమును వ్యాపింపఁజేసికొని–సర్వదిక్కుల నాక్రమించినది–అనిర్వచనీయమైనది–అద్వితీయమైనది – అగమ్యగోచరమైనది

-అఖిల జగద్వ్యాప్త మైనదియు–నగు నాపరమశక్తితో నైక్య మొందుటకు సాధ్య మగునేమో కాని ప్రపంచమనఁగ నేమో తెలియక, తాను బ్రపంచమునకంటె భిన్నుఁ డెట్లో యదియం తకంటెఁ దెలియక, తానెవఁడో మొదలే తెలియక, బ్రహ్మ మనఁగనేమిటో బొత్తిగఁ దెలియక యీజ్ఞానసంభారమునకుఁ గావలసిన సాధనసామాగ్రిని సంపాదించుట యేమియుఁ దెలియక, అహంబ్రహ్మశబ్దములకు వర్ణక్రమము దెలిసినంతనే నరుఁడు పరమజ్ఞానావస్థ నొందగఁ గలఁడా? లేఁడు. శబ్దార్థజ్ఞానము ప్రధానము గాదు. ఆయెరుకయే యెరుక కాదు. అనుభవ జ్ఞాన ముండవలయును. అనుసంధానతేజ ముండవలయును. అవిలేనియెడల నట్టియవస్థ యజ్ఞానముకంటె భిన్నము కాదు.

అయ్యయ్యో ఈమాటలు వింతలుగ నున్నవే! ప్రపంచమునఁ గొమ్మలు తిరిగిన విద్వాంసు లున్నారే! తర్కవ్యాకరణాదిశాస్త్రజ్ఞాన నిక్షేపులున్నారే! జంగమజ్ఞానావతారము లున్నారే! కఠినశాస్త్రీయ పరీక్షలలోఁ గడతేరి పదకములను, బత్రికలను గడించినవా రున్నారే! ప్రకృతిశాస్త్రపాండిత్య ప్రభావమున ననేక నూతనరహస్యములను గనిపెట్టిన జగత్ప్రసిద్ధ ప్రతిభాప్రపూర్ణు లున్నారే! అసాధ్యము లని యెంచఁబడిన పనులను సాధించు మేధానాధు లున్నారే! వీ రందరు జ్ఞానసంపన్నులు కారా? ఎక్కడఁ జూచినఁ గళాశాలలే! ధూమశకటస్థానములే! కర్మాగారములే! నక్షత్రదర్శనశాలలే! చిత్రవస్తుప్రదర్శన మందిరములే! తంత్రీవార్తాభవనములే! ఇటు లెన్నిచెప్పఁగలము? నాగరకతయు, శాస్త్రజ్ఞాన కళయుఁ–జేయిచేయి పట్టుకొని వెదఁజల్లుచు వర్షించుచుఁ దేజోమయస్వరూపములతో నాట్యమాడుచున్నవిగదా! రెక్కలీయని భగవంతునిలోపములఁ దీర్చఁదలచి బంధుమిత్రాదు లతో నరు లాకసమున నెగురుచున్నారుకదా! పొలుసు లీయని నలువలోపమును దిద్దఁ దలఁచి మహాసముద్రములలో నరులు గంటలకొలది నిండ్లలోవలె నివసించుచున్నారుకదా! పాతాళ గంగను జుట్టు చేతఁబట్టి పైకి లాగఁగల పటిష్ఠత జనులు ప్రకాశించుచున్నారుకదా! వాకిటిలోనుండి దొడ్డివరకుఁ గష్టమునఁగాని వినఁబడనేరని కంఠరవము మైళ్లదూరమునసైన నప్పష్టముగ వినఁబడుచున్నదికదా! పైస్వరూపమును జూచుటకే భగవంతుఁడు మనకుఁ గను లిచ్చియుండ నాంతరస్వరూపమును జూచుటకుఁగూడ నక్షులను జనులు సంపాదించుకొని రికదా! ఒకని హృదయకోశము మరియొకని యొడలిలోఁ గొట్టుకొనుచున్నదికదా! ద్రాక్షారా మభీమేశ్వరుని నెత్తిపైఁ జీలగొట్టి యాతనిద్రాఘిష్ఠత నాఁపినట్లు మిక్కిలి విద్వాంసుఁడ బొడుగువాని యెదుగును మొదడులోని బీజమును దీసి వాడ్డారముగఁ యాఁపుచున్నారు గదా! పిడుగుపాటు పుష్పపుప్రేటుకంటె మార్దవము గలదిగఁ జేయఁబడుటచే దానిదూఁకు డడఁగినదికదా! అగ్ని దేవుఁ డాశ్రయాశత్వధాటిని ద్యజించి ప్రచ్ఛన్నుఁడై యంగిజేబులలో దాఁగుచున్నాఁడుకదా! హృదయముల నుండు ననురాగాద్యనుభవభేదములను గాగితముపై ప్రాసిచూపఁగల చలపాదియంత్ర మొక్కటి దాపురించి భార్యాభర్తల గుట్టులు బట్టబయలు సేయుచున్నదికదా! శుక్రశోణితము లొకవిధమయిన భాగములుగఁ గలిపి గాలిచొరనిప్రదేశ మున స్త్రీగర్భమున కుచితమగు వేఁడిమిని దానియందుఁ బ్రవేశపెట్టి ప్రత్యక్షసృష్టితంత్ర మునకుఁ బ్రకృతిశాస్త్రజ్ఞులు ప్రయత్నించుచున్నారు. ఇదికూడఁ గొనసాగినయెడల బ్రహ్మ త్వము నపేక్షించి పాటులుపడుచున్న హూరుతినోట నిఁక మట్టియేకదా! బమ్మగాని కింక "బర్తృహరికుము" ప్రాయుటయే యవశిష్టముగ నుండునుగదా! ఇంతకంటె శాస్త్రజ్ఞాన మునకుఁ బార మేది? ఇంతకంటె మనుజబుద్ధి కవధి యేమి?

కాని యిట్టిశాస్త్రజ్ఞానము మన కెట్లుపయోగించుచున్నదో కొంచెము యోచింతము. భూమశకటనిర్మాణమువలన దూరదేశమునుండి ధాన్యాదులు వచ్చుచున్నవి. క్షామబాధ లేకుండఁ దినుచున్నాము. కడుపులు గట్టిపడుచున్నవి. ఫలములు, పానకము లనేకములు గూడ వచ్చుట చేతఁ జిత్రవిచిత్రాహారముల కలవాటుపడుచున్నాము. రుచిగ్రహణశక్తి యెరఁదీసిన కత్తివలె మిగుల వాఁడిగలదియైనది. రుచు లూసరవెల్లి రంగులవలె నట్టియట్టి భేదించుచున్నవి. మిక్కిలి సున్నితము లగుచున్నవి. వింత పదార్థములనేకాని లక్ష్య పెట్టక యున్నవి. ఏయాహారవస్తువుల నెట్లుగా మేళవించుటవలనఁ బ్రబలరుచి యుద్భవింపఁగలదో యామార్గములను గనిపెట్టుచు బుద్ధి జిహ్వకుఁ గార్యదర్శియై పనిచేయుచున్నది. ఇంకను ''విస్కీ' బ్రాంది'' మొదలగు వింతవింత మదద్రవ్యములు వచ్చుచున్నవి. వీనిని బ్రథమమున భోజనాత్పూర్వముననో నడిమిభాగముననో జఠరదీప్తికై యౌషధప్రాయముగ దీసికొనుచున్నాము. తరువాత సీసాలు వరుసపెట్టునఁ బంపుపెట్టుచున్నను నోటికిఁ గంపే మిగిలెను. గాని మనసునకుఁ దుష్టి తగ్గుటలేదు. త్రాగుడుతోఁ దిండి యెక్కువ. తిండి యెక్కువతోఁ ద్రాగు డెక్కువ యగుచున్నది. జిహ్వజుఱ్ఱు మనుచున్నది. కడుపు గఱ్ఱు మనుచున్నది. తల గిఱ్ఱు మనుచున్నది. ఖగోళశాస్త్రజ్ఞానము నౌకాయాత్రకు మిక్కిలి ప్రయోజనకారి యైనది. అందువలన ''మన్‌ఛస్టరుమల్లులు'' పృష్ఠములపై, జీలుగుబుట్టలు శిరములపైఁ, దోలుపాదలు వ్రేళ్లపై, గాజురాలు కన్నులపై నవతరించుచున్నవి. గాత్రసౌందర్యము లిట్లు ఘనము లగుచున్నవి. దూరఖండములతో వ్యాపారములు బహుళము లగుచున్నవి. మణి వృద్ధితోఁ దమవృద్ధి యగుచున్నది. బంగారము పెచ్చగుకొలఁది సింగారము పెచ్చగుచున్నది. సంపద లెదిగినకొలఁది సాత్వికము తగ్గుచున్నది. సౌఖ్యవాంఛ పెచ్చగుచున్నది. ఇఁక విద్యుచ్ఛక్తి-తంత్రీవార్తలలో శకటములలోఁ దదితర యంత్రములలోఁ బ్రవేశించి జనసంఘమునకు సామాన్యముగ సౌఖ్యాధిక్యమును గలుగఁజేయుటయేగాక భాగ్యవంతుల గృహములఁ బ్రవేశించి విసరుచున్నది. దీపములు వెలిఁగించుచున్నది. బట్ట లుదుకుచున్నది. వడ్లుపట్టుచున్నది. ఇల్లూడ్చుచున్నది. నీరు చల్లుచున్నది. దాసిపనులే కాదు, చాఁకలిపనులే కాదు, మంగలిపనులే కాదు, వాహకులపనులేకాదు, అవి యివి యనక యన్నిపనులు విసువు లేకుండ విరామము లేకుఁడ వేలబానిసల పెట్టునఁ జేయుచున్నది. మనుజు లీయుపచారపరంపరలలోఁ మహాసౌఖ్యమునఁ దేలుచున్నారు. ఇఁక విద్యుచ్ఛక్తియే మాత్రలందు ద్రావకములందుఁ దూరి రక్తమునకు దీప్తి, హృదయమునకుఁ బాటవము, మెదడునకు ధృడిమ, నరములకు బింకమును గలుగఁ జేయుచున్నది.

జనుల కెడతెగని సౌఖ్యము లనేకవిధములఁ బ్రబలుచున్నవి. తిండిపోతులై, గానప్రియులై, ధూమచ్ఛదకణికాసక్తులై, తాంబూలదాసులై, మద్యపానలోలురై, మృదులశయ్యాభిలాషులై, పుష్పరసాది పరిమళధురంధరులై, దేహాలంకరణచణులై, బహుభామాపరీరంభణ పరాయణులై, రజస్తమోగుణప్రధానులై, శాస్త్రీయపండితులు వారిశిష్యులు శిష్యానుశిష్యులు ప్రాపంచికసౌఖ్యమునకుఁ బరమావధిని బొందియున్నారు. పాటుపడుట కోపిక లేదు. కూపములో నోరిమి లేదు. కష్టములోఁ దాళిమి లేదు. దురభ్యాసములం దనాదరణము లేదు. బ్రహ్మచర్యమున దీక్షలేదు. గార్హస్థ్యమునఁ గట్టు లేదు. నోటికి మాటు లేదు. బంధువులందభిమానము లేదు. మిత్రులందుఁ బ్రేమము లేదు. ఎంతసేపు తాను –దనసింగారము–తనసుఖము – తసయనుభవము–తనగొప్ప–తనకీర్తి– తనధనము తనదేవు

లాటయే కాని పరచింత యనునది లేదు.

జను లిట్లు పరమానందభరితులై బ్రదుకుచుండ నీ కీకన్నుకుట్టేల? యని మీరు నన్ను నిందింతురేమో! జను లిట్లు సౌఖ్యపడుటఁ జూచి నేనుగూడ సంతసించుచునేయున్నాను. అనూయ నొందుట లేదు.

కాని నాయనలారా! మనజీవయాత్రకు ఫల మింతే! నోటిలోఁ జొట్టను బెట్టుకొనుట చేతిలో 'బ్రాంది' బుడ్డిని బట్టుకొనుట–పెట్టెలో నంచులు మూటఁగట్టుకొనుట–ప్రక్కలో భార్యలఁ బండపెట్టుకొనుట–ఇంతే! మనబ్రతు కింత యధమమా? ఇంత పనికిమాలినదా? హరిహరీ! ఆహారనిద్రాదులతో నింక నాశ్వాసాంతమే! అటుపైన నింకేమియు లేదా? అటులైన గడ్డిదిని నుఖించు పశువుకంటెఁ 'గాఫి' త్రాగి వెగటుపడు మీ రెట్లు ఘనులు? కుళ్లుబురదలోఁ బడి యొడలు మరచి గుర్రుపెట్టి హాయిగ నిద్రించుపందికంటె హంసతూలికాతల్పముపై నట్టిట్టు నిదురరాక పొరలాడు మీ రెట్లు ఘనులు? ఋతుకాలమునఁ బరిమితరతి యొనర్చు వీథిలోని గాడిదెలు, కుక్కలకంటె నిరంతర సంగమకల్పమున కుపక్రమించి మదనకామేశ్వరాదులను, మర్దనాదుల నుపయోగపరచు మీరెట్లు ఘనులు? అయ్యయో! గేదెలు, గాడిదెలు, కుక్కలు, పందులుకూడ మనకంటె యోగ్యతమజీవనములయినట్లు కనఁబడుచున్నవిగదా! అయ్యయ్యో! అనఁగూడనిమాట యనవలసివచ్చెను. హరిహరీ! వినఁగూడనిమాట వినవలసి వచ్చెను. ఆహాహా! బ్రదుకఁగూడని బ్రదుకులు బ్రదుకుచుంటేమికదా! ఇప్పుడైన లెంపలు వైచుకొనఁదగదా! ఐహికసౌఖ్యపరంపరాప్రవాహమున నట్టే కొట్టుకొనిపోవు చుండునప్పుడు రవంత కాలూది నిలువఁబడి యావడినుండి కొంచెము వెలుపలకు వచ్చి యింద్రియవ్యాపారములను గొంత మరలించి చిత్తమును గాసంత కుదుటఁబరచుకొని 'నే నెక్కడ నున్నాను? ఏమి చేయుచున్నాను? నే నెవఁడను? ఎందుల కిక్కడ నుంటిని? నాకును బ్రపంచమున కేమి సంబంధము? నే నేమి చేయవలసినది?' యని గట్టిగఁ బట్టుదలతో మనల మనము ప్రశ్నించుకొనఁదగదా? మననును బైకిఁ బోనీయకుండ సాధ్యమైనంతవర కరికట్టి కంటిమూపునుగూడ వీలగునంతవరకు లోనికే పరపి తన్నుఁ దాఁ బరీక్షించుకొనఁదగదా? అట్లు పరీక్షించుకొని పరీక్షించుకొని, సుఖమువెంట పరుగెత్తుటలు, నది చిక్కకుండ దప్పించుకొని దూఁకుటలు, దానికై వగర్చు నెగురుటలు, అది యింకెవ్వనికో చేఁజిక్కె ననివెక్కివెక్కి యేడ్చుటలు, కన్నులు తుడుచుకొని మరియొక కొరవిదయ్యపు సుఖమును వెంబడించుటలు, దూరమునఁజూచిన–నగ్గు జగ్గు, తళుకు తవర, హొరంగు హొయలు! తీర సుఖము జేఁబడినతరువాత దానియందుఁ గానఁబడకుండుటచే నొకటి రెండావృతులెట్లో యనుభవమైనపిదప నది రోఁతగ నున్న దని పరిహరించుటలు, నెంతసేపేమోకాని గుండెలు కొట్టుకొని కాళ్లు విరుగఁగొట్టుకొని చేతులు ముందునకుఁ బెట్టుకొని సుఖమును బట్టుకొనఁ బ్రయత్నించు పరుగులాటలో నురుకులాటలలోఁ గూలుటలలోఁ బండ్లువిరుగఁబడుటలలో నున్న సుఖమేదో యదియే కాని యంతకంటె నేదియు లేకపోయెనే యని నెత్తిగొట్టుకొని యేడ్చుటలు మొదలగు గడబిడలు, దడబడలు, హుటాహుటులు, గంద్రగోళములు లేకుండ నొకవిధమగు శాంతి నిశ్చలమై, నిబడమై, నిశ్శబ్దమైన యొకవిధమగునవ్యక్తత–లోన నిప్పుడే నిర్భ్రమముగఁ గనఁబడుచున్న దని నంతసింపఁదగదా! ముత్యాలదండ తలపైనుండ నీటఁ బుట్టిన వగుటచే నాకారసామాన్యముచే బుద్బుదములను ముత్యము లని భ్రమించి

నీటఁబడి కెక్కు కెక్కు మని చేయి చాఁపి పట్టుకొనఁబోగ టప్పనకుండఁ బేలిపోయి శూన్యములయిన మాయముత్తెముల మహేంద్రజాలమునఁ బడి వయసంత వల్లకాడు చేసికొంటిమిగదా! అని నిశ్చలపశ్చాత్తాప మొందఁదగదా? ఈమాత్రపు స్వల్ప ప్రయత్నమునకే విలక్షణమగు నిట్టిశాంతి లోపలఁగలుగుచుండఁగ నిఁక నిందువిషయమై దీక్ష వహించినవా రెంతప్రశాంతి నొందుదురో! ఎంత నిశ్చలానంద మొందుదురో! యనుకొని యీపై మెట్టుక్కుఁట కాలోచించుకొనఁదగదా?

ఇన్ని విద్యలు ప్రజలు చదివిరికద! ఇన్ని యంత్రములు సృష్టించిరి గదా! ఇంతజ్ఞానాభివృద్ధి నొందిరికదా! ఏమి యీవింత! కుదురవలసిన మనశ్శాంతి కుదురయ్యేను. నానాఁటికి నడియేటఁ గొట్టుకొనిపోయి శాంతికి దూరముగఁ బోవుటకూడ సిద్ధించెను. ఎందుచేత? ఈవిద్యలు దొంగవిద్యలు—ఈయంత్రములు పొట్టకూటి తంత్రములు—ఈజ్ఞానము మిథ్యాజ్ఞానము—ప్రపంచరహస్యములఁ దెలిసికొనుట కిది మార్గము కాదు. ఏరహస్యము విడిన నన్నిరహస్యములు విడునో, యే చిక్కుఁడఁదీసిన నన్నిచిక్కు లూడునో, యేముడి విప్పిన నన్నిముళ్లు తమంతఁదాము విడిపోవునో, ఏవిద్య నేర్చిన నన్నివిద్యలు నిరభ్యసన పూర్వకముగ సిద్ధించునో యది యొకటి యున్నది. చింతచెట్టును గొట్టఁదలఁచినవాఁడు తల్లివేరును దెగ్రవేయవలయునుగాని చింతాకు దూయనారభించిన నెంతకాలమునకు దూయఁగలడు? అంతయు దూసిననైన లాభమేమి? ఆవిద్య యేదో మనవేదర్షులు కనిపెట్టియే యున్నారు. కాని నారు మనవా రని చెప్పుకొనుట వారికి మనకుఁ గూడ సిగ్గగుచున్నది. మనము సంధ్యావందనప్రవరలలో నావేదర్షులగు నార్యులను మనవంశ పూర్వకర్తలుగ స్మరించుకొనుచున్నను మన మార్యులము కామని యిప్పుడొక ఘంశవిచ్ఛేకద సిద్ధాంతము తలచూపుచున్నది. ఎటులయినఁగానిండు. మనము నరుల మని యొప్పుకొనిన నంతే చాలును. తారకసాధన మపేక్షింపవలసిన మన కార్యులబోధనము తప్పదు. వారు ధీదార్ఢ్యముచేఁ దపస్సామర్థ్యముచే నాధ్యాత్మికవిద్య గనిపెట్టి బోధించిరి. ఋషులు మనకిట్లొనర్చినమేలును గొనియాడ నేను నమర్థుఁడను గాను. Max Muller గారు (మేక్సుముల్లర్) "India what it teaches" (ఇండియా వాట్ ఇట్ టీచస్) అను గ్రంథములో 6వ పేజీలో నిట్లు చెప్పుచున్నారు.

If I were asked under what sky the human mind has most fully developed some of its choicest gifts, has most deeply pondered on the greatest problems of life and has found solutions of some of them which well deserve the attention even of those who have studied Plato and Kant—I should point to India. And if I were to ask myself from what literature we, here in Europe, we, who have been nurtured almost exclusively on the thoughts of Greeks and Romans and of one semetic race, the jews, may draw that corrective which is most wanted in order to make our inner life more perfect, more comprehensive, more universal in fact more truly human, a life, not for this life only, but a transfigured and eternal life, again, I should point to India—

''ఐహికాముష్మికసాధనసంపత్తికి హిందూదేశ మితరులకు మార్గదర్శిగా నున్న దని ముఖ్యాభిప్రాయము. చూచితిరా? దీప మిల్లంతయు వ్యాపించి ప్రకాశించుచున్నది. దీపస్తంభ మునొద్దనున్న మనకుఁ గ్రీనీడ ప్రారబ్ధమేకదా! మరి 25-వ పేజీలోఁ దిరుగ నిట్లు చెప్పుచున్నారు.

"We find in that language such a compound for instance as 'as asmi I am.' What would other languages give for such a pure concept as I am. They may say I stand or live or I grow or I turn but it is given to few languages only to be able to say I am. To us nothing seems more natural than the auxiliary I am: but, in reality, no work of art has required greatest efforts than this little word I am" ఆత్మ శాశ్వత మని మనవారు కనిపెట్టినా రని దీనిముఖ్యాభిప్రాయము.

మనతాతలు ముత్తాతలు స్నానసంధ్యాదు లొనర్చుకొని పవిత్రముగఁ గూరుచుండి యుపనిషత్తులఁ బఠించెదు వాడుక గలవారు. అదిగాక వానిని వ్రాసినయెడలఁగూడఁ బుణ్యా మనియు, నవి మరింత జ్ఞప్తియందు దాఁకొను ననియుఁ దమతరువాతివారు వానిని దేవతార్చనపుఁ బీఁటలపైఁ బెట్టి పూజించుకొందు రనియుఁ, దాళపత్రసంపుటముల వానిని వ్రాసిన ట్లిప్పటి యూరగాయల కొట్లయుట్లలో వ్రేలాడు నులకత్రాటి బిగింపుగలతుక్కు మార్జాలమూత్రాభిషేకమును, నెలుకపెంట పూలపూజయుఁబొందుచున్న తాటియాకులక ట్టలు చెప్పకచెప్పుచున్నవి. ఇండ్లలోని వృద్ధవితంతువుల పట్టుదలచేత నీపురుగులపుట్టలయి న—భద్రముగ నింక నుంచఁబడియుండె నని యూహింప వలసియుండును. ఈ పనికిమా లిన పెంటలనే చలిమంట కర్హమైన యీతుక్కునే—పాశ్చాత్యదేశీయులు పరిశీలించి, పరిశోధించి—వానిలోని యద్వితీయ తేజఃపుంజములగు బ్రహ్మమణిరాజములను గ్రహించి కన్నుల కద్దుకొని శిరముల నుంచుకొని తమజాతులకుఁ దమభాషలకు నమూల్యాలంకార ములుగఁ జేసికొని—''భరతఖండము మాకిచ్చిన తరుగఁదగని—విలువ నెఱుఁదగని —యాస్తి యిది'' యని ప్రాక్పశ్చిమ సముద్రములు దాఁటిపోవు మహాఘోషముతో బట్టఁజాలనినంతోషమునఁ బలకుచుండఁగా నట్టిభారతీయర్షులబిడ్డలమైన మన మేమిచేయు చున్నాము? చెప్పనా? ఆగ్రంథము లేవో మనము చూచుట లేదు. వానిని వినుట లేదు. వానిని దలఁచుట లేదు. కోటి కొక్కఁడెవఁడైన వానిని జదివినయెడల మూఢుఁడని వానిని బూతులు తిట్టుచున్నాము. ఆగ్రంథములు వట్టితప్పులతడక లనుచున్నాము. వానిని రచించిన గ్రంథకర్తలు లేరనుచున్నాము. వారు మావంశకర్తలు గా రనుచున్నాము. వారికి మా కెక్కడను సంబంధము లే దనుచున్నాము. మాపరువునకు వారు మావాఁడ్రనుట తగ దనుచున్నాము. ఆహా! ప్రపంచమున మనయంతవారము మనమే! నిశ్చయము. మూలపురు షులను బూతులు దిట్టువారు మరియొకజాతిలో నేకాలములో నైనఁగాని యుండి రని వింటిమా? లోకపూజ్యమయిన యుద్గ్రంథసంభారమును గాకిరెట్టల కప్పగించినవారు మరి యొకజాతిలో నేకాలమున నైనఁగాని యుండి రని వినియుంటిమా? ఇట్టి దేశాభిమాన, మిట్టిగ్రంథాభిమాన, మిట్టిభాషాభిమాన, మిట్టివంశాభిమానము గలవారు మరియొకజాతిలో నేకాలములో నైనఁగాని యుండి రని వినియుంటిమా? జరయు మృతియు నీయని యమృతకలశము హస్తగతమైయుండ దానిని దూరముగఁ బాఱఁద్రోచినాము. తాడికల్ల

లొొట్టుఁడు ద్రావి లొట్టవేసి రోగవడిచచ్చుచున్నాము. నంస్కృతభాష నభ్యసింపవలసినవారు మనవారికంటె మరెవ్వరు లేరుకదా! అది కష్టమని దానిని జెడమడఁ దిట్టి యితరదేశీయుల కప్పఁజెప్పితిమి. గొప్పపనియే చేసితిమి! చాల గొప్పపనియే చేసితిమి! పోనిండు. దేశభాష నభ్యసించుచున్నామా? మన తేటతెనుఁగుబాసను నేర్చుకొనుచున్నామా? అది కొరుకరాని కొయ్య యని, యది మావంశమువారి కెవ్వరి కక్కర లేదని నిరాకరించితిమి. ఇచ్చట యరింత మహాకార్యమాచరింతిమి! పోనిండు. అంతటితో నూరకుంటిమా? Durbar and Pandit literature is unsuitable to these times, యని యొకరామవాక్యమును బురస్కరిం చుకొని పాకి and చచ్చట literature వ్రాయుటకుఁ గొందరు బుద్ధిమంతులు పూనివ్రాయు చున్నారు. ఈపని నేమనవలయునో బోధపడకున్నది. పంచభక్ష్యపరమాన్నములతోఁ గూడిన షడ్రసోపేతభోజనము మిగుల బలాహారము గావున వర్జించితిమి. దనియాలపొడి మిరియాలచారుతోఁ దడిపొడిగఁ దినుచండఁగా నదియు మాని సెంటపైఁ బారవైచిన పులివిస్తరాకులు నాకుఁ డని బుద్ధిమంతులు బోధింప నిఁక నెక్కడఁ జావవలసినదండీ? ఏల? పామరులగు పట్టణపుసోమరులంద ఱదియే చేయుచున్నారు. పాకశ్రమ మక్కరలేదు. అది మిగుల సులభము. ఆహా! భగవంతుఁడా! ఈ మాయజ్ఞానముదుర్గతి నెన్నఁడైనఁ బాపవా?

నాయనలారా! నామనసు మిగులఁ దీవ్రముగ నున్నది. చెప్పవలసిన దెంతో యున్నను నింకఁ జెప్పఁజాలను. క్షమింపుఁడు. మీ రెన్ని యైహికసుఖము లొందినను నా కిష్టమేకాని యివియే శాశ్వతము అని నమ్మకుఁడు. శాశ్వతసుఖ మొకటియే యున్నది. దానిపైననే దృష్టి యుంచుకొనుఁడు. ఉపనిషద్విద్య నభ్యసింపుఁడు. ఐహిక కార్యములందు మనయోడిమి నూఁపి యూఁపి మొదలంట నూడఁబెరుకు నన్నివేశము లనేకములు తటస్థించును. అట్టిసమయముల మనల రక్షించునది మహర్షులబోధనముదక్క వేరొండు లేదు. ముమ్మా టికి లేదు. కష్టసుఖములలో మునిఁగియున్నను దృష్టిమాత్రము బ్రహ్మముపై నుంచు కొనుఁడు. కవి చెప్పినట్లు

గీ. ఘన తరంగాహతాంగంబు కల్గి కరము
నెత్తి, నది దాఁటు కరివోలె—నెన్ని యాప
దలు సుఖంబులు కదిపిన పిలసదూర్ధ్వ
దృఙ్మనస్కుఁడొ నరుఁ డుత్తరించు భవము.

నాయనలారా! ఈరాత్రి నెందుపై నీమాట లన్ని పలికితినో! అఁ! జ్ఞప్తికి వచ్చినది. సుదర్శనీపత్రికాధిపతుల పుణ్యమా యని యీ నత్కాలక్షేపము మనకు జరిగినది. ఇందువలన వారికి మరియొకసారి కృతజ్ఞతను వెల్లడింపవలయును. కాని మాలోని 'సాక్షి' పానుగంటి లక్ష్మీనరసింహారాయనింగా రని నిశ్చయించినట్లు వారు వ్రాసినారు. ఆరాయనింగా రెవ్వరో మే మెరుఁగము. మాలోనొకవైష్ణవుఁడు, నొక వైదికుఁడు, నొకకోమటి, యొకశూద్రుఁడు, నొక యారామద్రావిడుఁడే కాని వెలమవా రెవ్వరు లేరు.

31. పార్థసారథిస్వామి

బొల్లియ్యశెట్టికి ప్రాణం మీదకి వచ్చి 'ఆక్సోపతి' అనే చికిత్సా పద్ధతి ద్వారా రోగం కుదుర్చుకోవాలని అతను బ్రతికున్న రోజుల్లో మద్రాసు వెళ్లిన నాటి ఉదంతం ఇది.

అతనికి చేతి సాయంగా వుండడానికి, కూడా వెళ్లిన కాలాచార్యులు, తాను ఒకనాడు తిరువళ్లిక్కేణిలో వున్న పార్థసారథి స్వామి కోవెలకు వెళ్లినప్పటి అనుభవాన్ని సాటికి ఉత్తరంలో రాశాడు. ఆ కోవెల యాత్రా భాగాన్ని శ్రోతలకు వినిపించాడు జంఘాలుడు.

కందస్వామి కోవెల దగ్గర బండి కోసం కిరాయికి అడగడం ప్రారంభించిన కాలాచార్యులికి, బండివాళ్ల 'జాలుం'కి సంబంధించిన కష్టాలు ప్రారంభమయ్యాయి. మొత్తానికి మూడు పావలాలకి బేరమాడి కొంచెం తెలుగు వచ్చిన బండి వాడిని ఆశ్రయించాడు. అంతేకాదు; బండెక్కాక వాడితో కొంచెం చనువు కూడా పెంచాడు. ముక్కు పాడుం దక్కలేదుగాని, వాడు తేరు వీధిలో బండి దింపి బేరమాడిన మూడు పావలాలే కాక, అదనంగా రెండణాలు, అబద్ధమాడి తీసుకున్నాడు.

ఆరోజు శనివారం కావడం, ఆ నెల పెరటాశి కావడం వల్ల జనం చాలా తండోపతండాలుగా వున్నారు. కాలాచార్యులు నవివరంగా దారంతా చూసుకుంటూ, మండపాలు దాటుకుంటూ, మనుషుల్ని తోసుకుంటూ, పార్థసారథి స్వామి కోవెలలోకి నడిచాడు. కనిపించిన దృశ్యాలు, తన మానసిక వ్యగ్రత వ్రాశాడు. పార్థసారథి స్వామి ఆలయం విగ్రహం దగ్గర అంటే, గరుడస్తంభం ప్రాంతంలో 'స్త్రీ భక్తుల' ఉదంతం తెలియజేశాడు. మతం, విశ్వాసం అనేవి ఎంత బాహ్య విషయాలుగా మిగిలి పోతున్నాయో ఇక్కడ మనకు తెలుస్తుంది.

జంఘాలశాస్త్రి యిట్లు చెప్పెను.

బొల్లియ్యశెట్టి కీనడుమఁ బ్రాణముమీఁదికి వచ్చినది. అందుచేత సభాకార్యములు మనకు సరిగ జరుగుచుండుట లేదు. ఆతఁడు తామరను గుదుర్చుకొనుటకు రాజధాని యగు మదరాసునకు వెళ్లినపిమ్మట నక్కడ ప్రాణవాయుచికిత్సచే రోగహరణము చేయుదు

నని యెవ్వఁడో వైద్యుఁడు చెప్పినాఁడఁట. రోగచికిత్సచేఁ బ్రాణవాయు హరణము చేయు టయే యిదివరకు వైద్యప్రపంచమున బాహాటముగ జరుగుచున్న దనియు, నీనవీనపద్ధతి యేదో బాగుగ బోధపడలే దనియు, దీనినే oxypathy (ఆక్సోపతి) యని ఆంగ్లేయమునఁ బిలుతు రనియు, దీనినిగూర్చి సర్వాంశములు నవిస్తరముగ ముందుఁ దెలియఁబరతు ననియును సెట్టి సాహాయ్యమునకై యాతనితో మదరాసునకుఁ బోయి యచ్చటనున్న కాళాచార్యులు ప్రాసినాఁడు. ప్రాణనాశనమున కెన్నెన్ని సులభసాధనములు కనిపెట్టఁబడుచున్నవో రోగనాశనమున కన్నియన్ని సులభసాధనములు కనిపెట్టఁబడుచున్నవి. ఈయుత్తరములో దానితరువాయిభాగమును జదివెదను వినుఁడు.

''కందసామి కోవెలయొద్దనుండి నడచి బండ్లునిల్చినస్థలమునకై పోయితిని. అచ్చట నుండి తిరువల్లిక్కేణికి నాకు బండి కావలయు నని నేను గోరఁగఁ బది పదునాల్గు బండ్లవాండ్రు వచ్చి ''సామీ! ఏరుంగో'' యని నన్నుఁ దమతమబండ్లలోఁ గూర్చుండఁబెట్టు కొనుటకుఁ గొంచెము 'జబరదస్తిని' జేయ మొదలిడిరి. నా కిన్నిబండ్లక్కరలేదు. ఒక్కబం డియే కావలయును. తిరువల్లిక్కేణి కెంతబాడిగ యీయవలయునో చెప్పుమని నేను వారిలో నొక్కని నడిగితిని. నాముఖనైఖరి–మాటరీతిఁజూచి యీతఁ డెవఁడో తెలుఁగుజిల్లాలోని మూఢుఁ డనియు, ముష్టికో వంటపూటితనమునకో నూతనముగ నిచ్చటకు వచ్చినాఁ డనియు, నీతనియొద్ద నున్నసొమ్ము సులభముగ హరింపవచ్చు ననియుఁ దలఁచి కాఁబోలు! అందరుకూడ ననే్న తమబండ్లలో నెక్కించుకొనుటకుఁ బ్రయత్నించుచున్నారు. బండి యద్దె తెలియకుండ నేను బండి యెక్కుటకు సమ్మతింపలేదు. మూఁడణాలకు వచ్చెదవా? యని నే నడుగ ''పోడా ముత్థాళ్'' అని యీతఁడు తన యసహ్యతాసూచకముగఁ దబుక్కున నుమిసెను. అంత నొక్క మహమ్మదీయుఁడు వచ్చి యరణా కమ్మిచేసికొండి యని వదునైదణాలన్నరకుఁ దనయభిప్రాయము నగపరుప నేను మూఁడణాలనియే తిరుగ నంటిని. 'జారే? హైవాన్' అని యీతఁడు బండికొరడ నెత్తెను. ఇంతలో నొకదాక్షిణాత్యుఁడు తనభార్యతో నచటకు వచ్చి మూఁడు పావులాలకుఁ దిరువల్లిక్కేణికే బండి కుదుర్చుకొని పోయినాఁడు. ఇచట నుండి తిరువల్లిక్కేణికిఁ గల దూరము హెచ్చయ్యెనా! యని నేను నందేహముతోఁ గూడిన వింతతో నిలువఁబడితిని. ఇంతలో నొకఁడు బండి తోలుకొని యటకు వచ్చెను. అతనిమాట విని యీతఁడు పూర్వమునఁ దెలుఁగువాఁ డని నేననుకొం టిని. ''దా'' ప్రయోగాదులు ''రండి మీ, వస్తుడు'' మొదలగుశబ్దములు వానినోటనుండి తరచుగా వెడలినను వాని తెనుఁగు నాకుఁ గొంచెము బాగుగఁ దెలియుటచే నే నాతనిఁ జూచి సంతసించితిని. అదిగాక యీతఁడు నాయెదుట నస్యమును బీల్చుటచే నాకుఁ గుంభకరేచకాదులవలనఁ గలిగినంత స్తిమితత గలుగు ప్రాణమొట్టి లేచివచ్చెను. తిరువల్లిక్కే ణికి మూఁడుపావులా లిచ్చెదను రమ్మని యీతనితోఁ బలుక నాతఁడు సమ్మతించెను. విద్యుచ్ఛకట మెక్కుట నాకుభయము, నసదుపాయము నగుటచే గుఱ్ఱపుబండిలోనే పోవుటకు యోజించి యిట్లొనర్చితిని. బండి యెక్కఁగనే 'కొంచెము నన్య' మని యీశకటసా రథిపై మందహాసము పరపి చేయి చాఁచితిని. అంత నతఁడు నాకు ముక్కుపొడి యలవాటు లే దనియు, రొంపభారముచే ములగ చెక్కను, సున్నమును దంపి దానిని గుడ్డలోఁ బెట్టి పీల్చుచున్నా ననియు నాతఁడు నాగుండె పగులునట్లు–నడుము లొటుక్కుమనునట్లు చెప్పెను. ముక్కుల వివరము తగ్గిపోవుచున్నట్లు కనఁబడుచున్నది. దాని ననుసరించి

నోటివిచరము హెచ్చగునట్లు కనఁబడుచున్నది. ఈపట్టణమున నన్యకరులలో షణ్ముఖ మనునాతఁడు దిగంతవిశ్రాంతయశోధురంధరుఁ డనియు, నాయవతారపురుషుఁ డిప్పటికిఁ గొన్ని వత్సరములక్రింద నన్తమించెననియు, వానితరువాతివారి కాతనిసామర్థ్యము –, నైపుణియు–రాలేదనియు, నాతనినన్యన్సృష్టికిఁ బద్ధతియే వే ఱనియు నాకల్పనమే వే రనియు, ఆధోరణియే వేరనియు నర్థమిచ్చెడు మాటలు నాతో బండివాఁ డేమో చెప్పినాఁడు. ''పాడుము పీల్చనినీకు నన్యమందు, నన్యకారకునియందు నింత యభిమాన మేల?'' యని యాతని నడిగితిని. మామేనమామ నన్యప్రియుఁ డనియు, నతనికిఁ గలిగిన నన్యగుణగ్రహణ శక్తి యింత యని చెప్పుటకు బ్రహ్మతరమైనఁ గాదనియు, నతనినన్యరసాస్వాదన సామర్థ్యమొ క్కయంశమువలననే తెలిసికొనవచ్చు ననియుఁ జట్టున నూరకుండెను. ''ఊరకుంటి వేల?'' అది యేదో చెప్పు'' మని నే నడుగ ''ఏ మున్నది? షణ్ముఖము పోయిన పండ్రెండవదినముననే మా మేనమామ తనదేహము చాలించినాఁడు. షణ్ముఖము చా వాతఁడు వినినప్పటినుండియుఁ దిరుగఁ బొడుముపొత్తినట్టివ్రేలితో ముట్ట లేదు. అంతవాఁడు కడతేరినప్పు డింక బ్రదుకవలసినపని లేదని యాతఁడు మూర్ఛపడి వెంటనే లేచెను. ''పాడుము పీల్చ రేల?'' యని నే నడుగ ''ఇఁక ముక్కులున్న సార్థకత లేదు. నాముక్కులా తని వెంబడించి పోయినవి'' అని చెప్పెను. ఆదినమే ముక్కు ధిబ్బడియారంభము. అలౌకికమైన రొంపభారము. గొంతుకలో పొర గలిగినవి. మిక్కిలి తంటాలుపడితిమి. లాభము లేకపోయిన''దని చెప్పెను.

ఈమాటలు జరుగుచుండఁగాఁ దేరువీథిలోనికి వచ్చితిమి. అట జనము మిగులఁ గిటకిటలాడుచున్నది. అనేకశకటములు వరునలు దీర్చి నిలువఁ బెట్టఁబడియున్నవి. మిక్కిలి సందడిగ నున్నది. ఈదినమున నిట్లుండనేల? యని నే నాతని నడుగ నీనెల పెరటాశి యనియు, నీదినము శనివార మనియు, నీమాసములో వచ్చుశనివారము లన్నిటియందుఁగూడఁ బార్థసారథిస్వామి కఖండనైభవముతో నుత్సవము జరుగుననియు, నందువలననే బండ్లకు 'గిరాకు' హెచ్చుగ నున్న దనియు నాతఁడు నాతోఁ జెప్పెను. మంచిదినముననే దైవదర్శనము లభింపనైయున్న దని సంతసించి బండి దిగితిని. ఆతనికి మూఁడుపావులా లీయఁబోవఁగఁ బదునాలుగణాలకు మాటలాడి పండ్రెండణా లిచ్చెదరేమి? యని యసత్యమాడి నాయొద్ద బలాత్కారముగ రెండణా లదనముగఁ దీసికొనినాఁడు.

బండి దిగి కృష్ణా! గోపాలకృష్ణా! పార్థసారథీ! యని బిగ్గరగ దైవనామపఠన మొనర్చుచు గుడివంకఁ బోవ నారంభించితిని. ఇరుప్రక్కలఁ గొబ్బరికాయ లరఁటిపండ్లు కర్పూరము మొదలగు వస్తువులుగల యంగళ్లనడుమనుండి దారి చేసికొనుచుఁ బోవుచుంటిని. దేవాలయ గోపురమందు వెలుఁగుచున్న విద్యుద్దీపికలు పండువెన్నెలలఁ గాయుచుండెను. తత్కాంతి కధీనములగు స్త్రీపురుషాదుల మొగము? లం దెల్లవింతకాంతులఁ బరపుచుండెను. కొందరు స్త్రీలు–కొందరు పురుషులు–గుమిగూడి వంగి యేమేమో చూచుచుండిరి. అచ్చటకుఁ బోయిచూడఁగ వారు పుష్పమాలలను బుష్పలావికలయొద్దఁ దీసికొనుచున్నారు. దవనము, మరువము గడ్డిమోపులవలె నచ్చటఁ బడియున్నవి. పూలమాలలతట్టలసంఖ్యకు మితియే లేదు. స్త్రీలకుఁ బూలయందుండు నాదరమునకు నేను మిగుల సంతసించితిని. కొప్పులలోఁ గాని జడచుట్టలలోఁగాని వివిధవర్ణములుగల పుష్పములో దవనము మొదలగు సుగంధద్రవ్య

ములో లేనివారలు లేరు. స్త్రీలను జూచియో, వారి కనులయెదుట గలకలలాడుచు గమగమలాడుచు నుండవలయు ననియో కొందరు పురుషులుగూడ దమ వ్రేలుసిగలలో పూలు దురిమియున్నారు. కాని స్త్రీలకేశపాశముల నలంకారములగ నున్న ప్రసవమాలలు పురుషులు నగము గొరుగుడు మొరకుబుర్రలపై ననహ్యతాకరములై యున్నవి. ఏయలంకారము లెవరి కుండవలయునో వారికే యుండవలయును గాని యవి యితరులకుఁ దగునా? మగవాని నెత్తికి టోపియోపాగయో తగును గాని దవనపు తురాయియో పూలమాలయో తగునా? బోడిగోడ్మైఁ దాటాకు మదు రుండవలయును గాని కాశీరత్నలతావితాన ముండఁదగునా? పువ్వులు పాలఁతులఁ జేరుటయే యుచితము. వానికి వీరివలన శోభ, వీరికి వానివలన శోభ. అంతేకాని పుష్పమాలచేఁ బురుషులు పోతుపేరఁటాం డ్రుగుట హేయము కాదా? మరువముచే నలంకరించుకొని మగవారు మాచకమ్మ లగుట యసహ్యత కాదా?

నేను స్వామి కర్పించుటకొరకుఁ బూలహార మొకటి కొనుటకై వంగితిని. అచ్చటనే యొక చిన్నపిల్లది వంగి పూలు కొనుచున్నది. కాని దానిమొగము నేను జూడలేదు. వెనుకవీఁపు చేతులు మెడమాత్రము కనఁబడుచున్నవి! ఆపిల్లకుఁ బదిసంవత్సరములకంటె నెక్కువ వయస్సుండదని నేను నిశ్చయపరచుకొంటిని. పిల్లగొంతుతో పుష్పముల బేర మాడుచున్నది. మరియొక తట్టవద్దగుఁ బోయి పూలు కొనవలయు ననుకొంటిని గాని యక్కడ మిక్కిలి సందడిగ నున్నది. ఈచిన్నపిల్లసు 'అమ్మా! కొంచెము ప్రక్క కొత్తిగిల్లు' మని యొకచేతితో దానిని గొంచెము ప్రక్కకొత్తిగించితిని. ఆమె యంతట నదరిపడి యేమేమో తంబళమునఁ దిట్టుచుఁ గోపము పట్టఁజాలక చేతిలోని పుష్పములు మరువము మొదలగునవి నాపైఁ బడవైచెను. తీరఁ జేరిపారఁజూడఁగ నామె కన్య కాదు. వివాహిత, సంతానవతి కూడను. పూలుకొనుటకు వెళ్లిననాపైఁ బుష్పవృష్టి యిట్లు కురిసినది. తిట్లువర్షము దానితోఁబాటు లేకుండునెడల సరసముగనే యుండును. అట్లు జరుగలేదు. ధనాగమనముతో మానసికాందోళనము రాకతప్పదు. కాంతాగమనముతో సంసారబాధ రాకతప్పదు. ఐహికసర్వసుఖములతోఁ గూడఁ గష్టములు మిశ్రమములు కాకతప్పవు. ప్రాపంచికసుఖస్వభావ మదియే యని వేదాంత విజ్ఞానమును దెచ్చుకొని యాకాంత చేతి నుండి రాలిన పుష్పము లెంత భోగ్యములో తిట్లుకూడ నట్లే యనుకొని కొనకుండ మీఁదఁబడినపూలతో నవతలకుఁ బోవుచుఁ బుష్పలావిక కొకయణా విసరివైచితిని. నందడి మిక్కిలిగ నుండుటచే నీయపూర్వసరస మెవ్వరును జూడలేదు. కాని నే నిట్లు మోసపడుట కాశ్చర్యపడుచు ముందు పోవుచుంటిని.

మనజిల్లాలలోని కన్యలకే యౌవనము శీఘ్రముగ వచ్చుచున్నది. అంతకంటె శీఘ్రముగ నిక్కడి కన్యలకు వచ్చునుగాఁబోలు నని నే ననుకొంటిని. ఊదరకొట్టిన యరఁటికాయలవలె భూమధ్యరేఖానమీపగతలగు నిక్కడికన్యలు బలాత్కారపరిపక్వదశ నొందుచున్నారు. ఆపిల్లకుఁ బండ్రెండేండ్లకంటె నెక్కువ లేవు. అయిన నేమి? ఒకసంతానము కాంచినట్లు తిట్లలో వింటిని. రెండవ సంతానము నింక నాల్గుమాసములలోఁ గాంచవలసినట్లు దానివైఖరి చెప్పుచున్నది. స్త్రీలదేహములకు నతిశీఘ్రపరిపక్వదశ యెట్లచ్చట సిద్ధించుచున్నదో పురుషులబుద్ధులకుఁ గూడనట్లే సిద్ధించుచున్నది. మనజిల్లాలవారి దేహదార్ఢ్యము

వీరియొద్ద లేదు. కాని మనపదునాలుగేండ్లబాలునికంటె నిక్కడి యీవయస్సు బాలుఁడనికవి ద్యానిష్ణుఁడైయున్నాఁడు. అధిక ప్రాపంచిక జ్ఞానయుక్తుఁడై యున్నాఁడు. ధనమును సంపాదించుటయందలి గుంటచిక్కు లెక్కువగఁ దెలిసినవాఁడైయున్నాఁడు. తల్లిదండ్రుల విడిచి దూరదేశమునకు నొక్కఁడు పోవుట కెక్కువసాహసము కలవాఁడయి యున్నాఁడు. మనదేశమువారికంటె వీ రెక్కువ బుద్ధిమంతు లని నాయభిప్రాయము కాదు. కాని వీరిబుద్ధి మనవారలబుద్ధికంటె నెక్కువ శీఘ్రముగ వికసించుచున్నది.

ఈయాలోచనములతో నిమ్మళముగ దారి చేసికొనుచు ముందునకుఁ బోవుచుండఁగ టక్కున నేదియో కాలికిఁ దగిలినట్లు కాఁగా ముందునకుఁ బడఁబోయి యాఁపుకొంటిని. కాలికిఁ దగిలినది స్వామిముఖ మండపపుటంచు. అది దాఁటి మండపములోనికి నిమ్మళముగఁ బ్రవేశించితిని. దానికి ననేకస్తంభము లున్నవి. దాని కిరుప్రక్కల బొమ్మలదుకాణములు నాలుగై దున్నవి. ఆబొమ్మలచుట్టుఁ జేరి వానిని గరన్పర్శము లొనర్చుచు ముద్దిడుకొనుచున్న బంగరుబొమ్మలు గుంపుగుంపులయి 'కొర్నాటి' చీలరవారు జిలుఁగుర వికలవా రనేకు లున్నారు. బండికందెన నలుపుమొదలు పదునారువన్నెబంగారువర కుండు నన్నివిధములగు రంగులభేదమువారుకూడ నాకిచ్చటఁ గానఁబడిరి. చెవులరవలదుద్దులకాంతులు చెక్కులకు మంగళపుటారతు లిచ్చుచుండఁ గొందరు, ముఖచంద్రికలు విద్యుద్దీపికలకు విశదత్వ మిచ్చుచుండఁ గొందరు, చిత్రచిత్రవర్ణములుగల చీర లకాలశక్రధనువులఁ గల్పించుచుండఁ గొందరు, పిల్లలయేడుపు-లూఁదుకొను గాలితిత్తుల కుపాంగము పట్టుచుండఁగ గజ్జెలగుర్రములవలెఁ బిక్కటిల్లి గంటలయొడ్డాణములగలగలతోఁ గంకణము లగణగణలతో నొయ్యారముగ నడచుచుండఁ గొందరు-నాకనులఁ బడి న న్నానందసాంద్రునిఁ జేసిరి. దుకాణములోఁ గర్రకృష్ణుఁడు మట్టిరాధనొట్టి ముద్దు పెట్టుకొనుచుండ నాప్రక్కనున్నబ్రోద్రకాలి ముసలిమొదలారి తనపదుచుటిల్లాలినిఁ జేయి పట్టుకొని నిమ్మళముగ నడిపించుచుండెను. స్తంభములపైనున్న కాగితపుసీతారాములు కల్యాణమునఁ దలఁబ్రాలు వోసికొనుచుండఁ బిళ్లగా డొక్కఁడు తనభార్యకొప్పులోఁ బూలు ముడుచుచున్నాఁడు. ఆమె యీతని నెత్తినున్న జీలుగుబెండుబుట్ట దీసి పిలకజుట్టున మరువపుమొలకఁ బెట్టుచున్నది. అంగడివాండ్రమృద్దారు పాషాణ పాంచాలికల దుకాణమందే యింతశోభగా నున్నదికదా! ఇందరు బంగరుబొమ్మల నిట్టి రూప రేఖా వయో విలాస లావణ్య చాకచక్యచమత్కార జ్ఞానకళాలాలిత్యాది లక్షణభేదములతో సృజించిన యీపరమాత్ముని యీపెద్దదుకాణ మెంత శోభగ నుండునో చెప్పవలయునా? అంగడిలోని మట్టిబొమ్మలకుఁ జైతన్యము లేదు. కావున వాని నీబంగరుబొమ్మలు గొని లాలించుచున్నారు. వీ రందరు చైతన్యయుక్తులగుటచేతఁ దాము మిగిలినబొమ్మలను స్పృశించుచున్నారు! ముద్దుఁబెట్టుకొనుచున్నారు! ప్రక్కలలో దాఁచుకొనుచున్నారు! అలంకరించుకొనుచున్నారు! బొమ్మలను బోలినబొమ్మలను సృష్టింపఁ బ్రయత్నించుచున్నారు. విరిగినబొమ్మలఁ బాఠమైచుచున్నారు. చేయఁదగిన యన్నిచిత్రములను, జేయఁగూడని యన్ని కార్యములను జేయుచున్నారు. పేడబొమ్మల యంగడివాఁడు కడుపుకక్కుర్తిచే నిట్లు చేసెను గాని యీపెద్దయంగడియీతఁ డేకక్కుర్తిచే నిట్లు చేసినాఁడో! అని తుద మొదలు -సంగతి సందర్భము-లేకుండ నేమేమో మనసులో ననుకొనుచు మండపములో నుండి దేవాలయసింహద్వారమువరకుఁ బోవఁ బ్రయత్నించుచుంటిని.

ఈప్రక్క నాప్రక్క బారులు తీర్చి బిచ్చగాండ్రు కూర్చుండి ధర్మము ధర్మమని కేకలు వేయుచున్నారు. ఇత్తడిపళ్లెరములో మట్టిమూకుళ్లో చేఁ బూని వానిలో నీమ యినుపరేకుబుడ్లలో దీపములనుంచి వానిపొగ కన్నులలోనికిఁ దూరఁ గనులవెంట నీరు గార్చుచు ధర్మమో ధర్మమో యని మొర్రలిడుచున్నారు. ధర్మము! ఎక్కఁడి ధర్మము! ఏమిధర్మము? వారియెదుట దివ్యమంగళ విగ్రహులై యనేకులుండ వీరుమాత్రము మనుజ కోటిలోఁ జేరియు వికలాంగులైయుండుట యెక్కఁడిధర్మము? వారియెదుటివారు సర్వసౌ ఖ్యములతోఁ గిలకిల లాడుచుండ వీరుమాత్రము కడుపుకూటికిఁ గరవై యిట్లు వలవల నేడ్చుట యెటిధర్మము? వారు బంగారు వసనములతో వజ్రాభరణములతోఁ దళతళలాడు చుండ వీరు పుట్టగోఁచులతోఁ జింపిరితలలతో బెకబెకలాడుట యెట్టిధర్మము? సృష్టిలో నింతవైషమ్య మేటిధర్మము? ఈజలతారు పాగలవారు, వజ్రపుటుంగరములవారు, బనారసు కోకలవా రాముష్టిాండ్ర కేమైన నిచ్చెదరేమో యని కనిపెట్టితిని. వా రెవ్వరు వీరివంకఁ జూడనయినఁ జూడలేదు. నేను నాయొద్దనున్న వేమో వారల కొక్కొక్క డబ్బుచొప్పున నిచ్చితిని. బిచ్చగాండ్రు మిగిలిరి గాని డబ్బులయిపోయెను. అంత నొకముష్టినానియొద్ద నూరక నిలువఁ బడితిని. ఆముష్టివాఁడు చిన్నవాఁడు. ఆతనితల్లికాఁబోలు నాతనియొద్దను గూర్చుండి గ్రుడ్డివాఁడనని యేడువ వేమి? యని యొక్కపోటు పొడిచెను. అదివరకు నన్ను నిక్షేపముగఁ జూచుచున్న వాఁ డంతలోఁ గన్నులు గట్టిగ మూసికొని తనకంటిపోటుచేతనో తల్లికాలిపోటుచేతనో గట్టిగ నేడ్వ నారంభించెను. అంత నొకకవి రచియించిన యొకపద్యము నా కట్టె న్మతికి వచ్చినది.

కడుపుకక్కుర్తిఁ గలుగనికష్టజాల
మభినయ మొనర్చి బీద మహార్తి నేడ్చు,
నుఖి యనెడు కీర్తికై యెన్నో సొగను లెన్నో
వగనగవు లేడ్వలేక సంపన్నుఁ డడరు.

గోఁచిపాఁతరాయని మొదలు కోటీశ్వరునివరకు నభినయమేకాని యథార్థప్రాము ర్యము లేదు. జనులనుండి యప్పులు పుచ్చుకొనఁదలఁచు కోమటి మూఁడువేలరూపాయల విలువగలిగినవాఁడు మూఁడులక్షల వానియట్లు వైభవవిడంబన మొనర్చును. సుఖికి, దుఃఖికి–ధనికి, దరిద్రునకు–విద్యాన్వితునకు, విద్యావిహీనునకుఁ గూడ–నీయెరవు కూనురా గములు తప్పవు. ఆహా! యథార్థ మెంతపనికిమాలినదై పోయినదో! అది నవ్వులోఁ బనికిరాదు. ఏడ్పులోఁ బనికిరాదు. మంచిలోఁ బనికిరాదు. చెడ్డలోఁ బనికిరాదు. సభలోఁ బనికిరాదు. రహస్యములోఁ బనికిరాదు. యథార్థము పలుకుట యిప్పుడు మోటుతనముగ Good manners యెరుఁగకపోవుటగ Common sense లేకపోవుటగ నేర్పడినది. విచిత్రదిన ములు! ఎటులయిన నేమి? ఆయంధబాలపాత్రమునకు నే నేమైన నీయఁదలఁచితిని గాని డబ్బు లేమియు లేవు. రొంటి నున్నరూపాయల మార్చి యిచ్చెద నని రొంటిఁ దడుముకొం టిని. అంతట మొలయంతయుఁ దడుముకొంటిని. రూపాయలు లేవు. పూలుకొనుటకు వంగియున్నప్పుడెవఁడో యామూటను దీసికొనిపోయినాఁ డని యనుకొంటిని. ఇచ్చుటకు నాయొద్ద నేమియు లేక యట్టి నిలువఁబడఁగ నాహృదయము గరఁగు నంతసాపుగ నంతనగ నేడ్వ లేదనుకోవముచేఁ గాఁబోలుఁ ధిరుగ నాబాలుని నావృద్ధవనిత కొట్టుచుండ నేను

జూడలేక మరియొకవైపునకుఁ జూచి సింహద్వారముగుండ నతికష్టమున దేవాలయము ముందుభాగమునఁ జేరితిని.

అక్కడ రెండు స్తంభము లున్నవి. ఒక్కటి ధ్వజస్తంభము, ఒకటి గరుడస్తంభము. దానినిండ దీపములు ప్రకాశించుచున్నవి. ఈదీపముల కాంతిచే, నాలుగువైపులను వెలుఁగువై ద్యుతదీపికల కాంతిచే, నచటఁజేరి గుంపులుగుంపులయియున్న కాంతలముఖబింబ కాంతులచేఁ గన్నులు చీఁకటులు పడున ట్లున్నవి. కొంచెముసేపు కనులను గాజుపరచి చూడఁగ నొక్కటే కలువలవనము! ఎఱ్ఱకలువలు! నల్లకలుపలు! తెల్లకలువలు! వింతరంగుల కలువలు! పండువెన్నెలలోఁ బ్రకాశించుచున్నవి. ''కవిత్వమెరుఁగని నాకప్పుడు కవిత యుద్భవించునా యేమి?'' యను చిన్న సందేహము కలిగినది. అట్టిసందేహమునిచ్చు నాందోళనము కడుపులో మొదట గుబులువలెఁ గలిగినమాట నిజము. అది కడుపునొప్పిగఁ బరిణమించుటచే నట్టిసందేహము వదలిపోయెను.

స్త్రీజనమంతయుఁ గలగలలాడుచు గరుడస్తంభమునొద్ద భక్తితోఁ జేరియుండెను. ఎందులకో యని యటకుఁ బోయితిని. అచ్చట నందరుఁజేరి దొడలు నిమ్మళముగఁ గొట్టుకొనుచున్నారు. కణఁతలపైఁ జిన్న మొట్టికాయలను వైచుకొనుచున్నారు. మోఁకాళ్లపైఁ గొంచెము వంగి చెవితమ్మెలను లాగుకొనుచున్నారు.

తురకలు ధ్యానకాలమునఁ జెవులు మూసికొందురు. మనవారు ముక్కు మూసికొందురు. బ్రహ్మసామాజికులు కన్నులు మూసికొందురు. మరికొందరు నోరు మూసికొందురు. ప్రార్థనకాలమందలి దేహావస్థలు పలువిధము లయియున్నవి. ప్రధానమగుభక్తి యున్న యెడల నివి యెన్ని భేదములుగ నున్నను బ్రమాదము లేదు. దొడలు గొట్టుకొనవచ్చును గాని మనసులోని యూఁపులాట లాఁపవచ్చునా? కణఁతలను బొడుచుకొనవచ్చును గాని దుష్టచింతలఁ బొడువవచ్చునా? మోఁకాళ్లపై వంగఁగలరుగాని మనోనైచ్యమున వంగప చ్చునా? బింకముగఁ బద్మాసనమునఁ గూర్చుండవచ్చును గాని గట్టిగ మనస్సును గట్టఁద గునా? దైహికావస్థలు మనోనిశ్చలత్వమునకు–నందుమూలమున భక్తిజ్ఞానములకు నదుపా యములైయుండఁ బ్రధానము లగునట్టి మనస్థితులఁగూర్చి మనవారికిఁ జింతయే లేదు. పైగతులే భక్తియనుకొనుచున్నారు. మతసంబంధమగు ప్రాశస్త్యముకాని, మనస్సంబంధ మగు నిశ్చలత్వము గాని మన కెక్కడఁ గనుపట్టుచున్న దనఁగా–నుదుట–ముక్కుచివర –పృష్ఠదేశమున–! ఇట్లనుకొనుచు నేను వనితలు చేరిన యాప్రదేశమునఁ జేరితిని.

అచ్చట నొగవిగ్రహమున్నది. అది నూతనవస్త్రమాలాద్యలంకార సమన్వితమై యున్నది. దానియొద్ద నిద్దరు శ్రీవైష్ణవార్చకు లున్నారు. వారు ''సంతానగోపాలస్వామి'' యని కేకలు వైచుచుండిరి. ఇంతలోఁ బిల్లయేడ్పు విశేషముగా వినఁబడెను. ఆగుంపులోనుండి యొకకొంత యిట్లు పూజరితో గట్టిగఁ బల్కుచున్నది. ''నేను గ్రిందటి సంవత్సరపుఁ బెరటాశినెలలో నీస్వామికి మ్రొక్కుకొంటిని. నాకుఁ దిరుగఁ బెరటాశిరాకుండ సంతానము గలిగినచో నేను స్వామికి వెండితొడు గిచ్చెద నని మ్రొక్కుకొంటిని. ఇడిగో నాకొడుకు! మూఁడుమానములవాఁడు! ఈతని స్వామి కర్పింతు నని పిల్లవానిని స్వామికాళులయొద్దఁ బడవైచెను. అంత పూజారి ''ప్రత్యక్షదైవము! ప్రత్యక్షదైవము!'' అని కేకవైచెను. ఆమాటలు వినినతోడనే కాంత లందరు నాదేవునకు మ్రొక్కుకొనిరి. ''అక్కా! నీవేల మ్రొక్కుకొనవు?''

అని చెల్లి లడుగ ''తలతెగినదానను నాకేల?'' యని చెప్పఁగ నెల్లకాల మిటులే యుందువా యేమి? మ్రొక్కుకొనుము'' అని మందలించెను. ఎల్లకాల మనునవ్పు డుత్తరజన్మ మని నాకర్థమైనది. ''అమ్మా! మీ రేల మ్రొక్కుకొనలేదు?'' అని యొకకాంతను బూజరి యడిగెను. ఆమె చిన్నదివలె నున్నది. సంతానవతిగఁ గానఁబడుటలేదు. ఆచిన్నది తల వంచుకొని కన్నుల నీరు నించెను. ఆమె నెరిఁగినయామె కాఁబోలు! ముందునకు వచ్చి పూజరిచెవిలో నేమియో చెప్పెను. అంతట నాతఁడు ''సంతాన మీయఁగలవాఁడు సమర్థుడఁ జేయలేఁడా? నందేహ మెంతమాత్రము వలదు. వచ్చి మ్రొక్కుకొను మనిచెప్పు''మని యనియెను. అంతట నామె మ్రొక్కుకొనెను. మరియొకయామె దూరముననుండి చూచుం డెను. ఆమెను బిలిచి మీ రేల మ్రొక్కుకొనరు? అని పూజరి మొగమోటమి లేకుండ నదుగ ''నాకుఁ బదుగురు కొడుకులండి! మీదేవునికంటె నాభర్తయే యెక్కువ సంతానగోపాల స్వామి'' యని పరిహాసముగఁ బల్కెను. అంతట పూజరి విసుగుకొనెను. కాంతలకు సంతానము లేదను నాందోళనముకంటె పూజరి కెక్కువగ నున్న దని నే నుకొంటిని.

''డష్టూ''న నూది ''ఫట్ ఫట్'' మని మూఁడుసారులు మంత్రించునరికి సంతానము గలుగు నని వలుకు మంత్రవేత్తను జనులు నిందించుచున్నారు. ఒక్కకషాయము లోవలికి, నొక కాటుక కంటికి, నొకరసాయనము పొత్తికడుపుమర్దనమున కిచ్చి మండలములోపలఁ బిండోత్పత్తి కలుగఁజేసెద నని వాదించు నాయుర్వేదభిషక్చక్రవర్తిని జనులు మోసగాఁ డని తిట్టుచున్నారు. కాని యెట్టితప్పయినను దైవనామసంబంధ యుక్తమగునెడల నది యాదర ణీయ మగును. దైవేచ్ఛకు వ్యతిరేకముగ నేదియుఁ జరుగ దని వారినమ్మకము. కాని రాధాదిగోపికా ప్రియుఁడగు బృందావనగోపాలుఁ డనియు నేను వినియున్నాను, సంతాన గోపాలుఁ డని నేను వినియుండలేదు. ఇట్లు నే నాలోచించుకొనుచు నాలుగడుగులు ముందునకు వైఁగ నీపూజారులలో నొక్కఁడును, మరియొక కాంతయుఁ దగవులాడుచుం డిరి. నేను గొంచెము దూరముగ నుండి వారితగవు వింటిని. ''రెండురూపాయ లిచ్చెద నని చెప్పి యొక్కరూపాయఁ జేతిలోఁ బెట్టిదవా?'' యని తీవ్రముగ నాకాంత యడిగెను. ఆమె మొగమును, మాటను బరిశీలించితిని. ''క్రిందటి పెరటాశికి మ్రొక్కుకొనఁగ నిప్పటికి మూఁడుమానముల కొడుకు గలిగినాఁ''డని చెప్పిన యామెయే యిదియని గ్రహించితిని. ఈమాటలు చెప్పుటకుఁగాను రెండురూపాయలిచ్చుట కొప్పుకొని యామెను బూజరి తెచ్చినట్లు నే ననుకొంటిని. ఈ గొడవలు వినకుండ లోనికిఁ బోవలయు ననుకొంటిని. కాని స్వామి కెదుటతెర నైయున్నది. నివేదనము జరుగుచున్నదికాఁబోలు! ఎవ్వరిని లోనికి రానిచ్చుట లేదు. తరువాతివృత్తాంతము ముందులేఖలో వ్రాసెదను. జంఘాలశాస్త్రీ! నేను గవిని గాను నాల్గుమాటలైనఁ బొందికతో వ్రాయశక్తిగలవాఁడను గాను. ఇదివర కెన్నఁడును వ్రాయలేదు. వస్తువులను వర్ణించుటకు శక్తిలేదు. వానివలన నేమైన నీతిని బోధించుటకు శక్తిచాలదు. భాష్యాదులలో నభిప్రాయమును జెప్పఁగలవాఁడను గాని –ప్రపంచతంత్రమునకు దండాన్వయము వ్రాయఁగలవాఁడను గాను–

చిత్తగించవలెను.

32. పార్థసారథిస్వామి

క్రితం సారి జంఘాల శాస్త్రి, కాలాచార్యులు మద్రాసు నుంచి వ్రాసిన ఉత్తరాన్ని కొంత భాగమే వినిపించాడు. అందులో, పార్థసారథి స్వామి కోవెలలో గరుడస్తంభం దగ్గర సంతాన గోపాలస్వామి విగ్రహం దగ్గర 'స్త్రీల ఉదంతం' వరకే మనకి తెలిసింది. ఆ ఉత్తరంలో మిగిలిన భాగమే ఇది. ఇది సాక్షిని ఉద్దేశించి సంబోధిస్తూ ప్రారంభమైంది. బొర్రయ్యశెట్టి ఆరోగ్యం గురించి ముందు కొంచెం సమాచారం రాశాడు.

ఆ తరువాత, స్వామి వారి సెనగల సేవ నుంచి ఎత్తుకొని ముందుకు సాగాడు కాలాచార్యులు. ఇతను తెలుగు వైష్ణవుడు. అక్కడ ద్రావిడ వైష్ణవులు తనను నిరసనగా చూసినట్లు అతను భావించాడు.

యథాప్రకారం, అతను ఆ కోవెలలో ఉత్సవ వాతావరణాన్ని, ప్రత్యక్ష వ్యాఖ్యాత లాగ చెప్పున్నాడు. అక్కడ ఎన్నెన్ని రకాల మనస్తత్వాల వారు తనకంటు పడ్డారో అందరినీ పరిశీలిస్తూ, కాలితాపులు, మోచేతి త్రోపులు భరిస్తూ నడుస్తున్నాడు.

మొత్తానికి అన్ని త్రోపులాటలూ గడిచి, పార్థసారథి స్వామి వారి దర్శనం అయింది. భక్తి ఆవేశం పరాకాష్ఠకు చేరింది. కాలాచార్యులు తన మనస్సులో వరదలాగ పుట్టిన భావాలన్నీ వెళ్లగక్కి వేడిచేశాడు. ఆ దర్శన క్షణం గడిచాక మళ్లీ ఝుంఝూటాలు, తిట్లు, రొద్దాంతాలు, నిత్యకృత్యాల పేకులాటలు, కాసేన్నాలు మరోక్షణం కనీసం గడవకుండానే ప్రారంభమైపోవడం కాలాచార్యులు గుర్తించాడు. మనస్సులో ఒక తుపాను కదలిక అనుభవించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను

క్రిందటిసారి పెరటాశిమాసమున శనివారమునందుఁ బార్థసారథిస్వామి దేవాలయమున జరిగిన యుత్సవమునుగూర్చి యసంపూర్తిగఁ గాలాచార్యులు వ్రాసినయుత్తరమును జదివితిని. దానితరువాయి యుత్తర మిదిగో! చదివెదను వినుఁడు.

సాక్షికి—కాలాచార్యులు నమస్కారములు.

బొట్టయ్యసెట్టి కింక నారోగ్య మారంభింపలేదు. ఈనడుమ నొక్కయకార్యము జరిగియుండవలసినది. అది జరిగియుండినయెడల జంఘాలశాస్త్రికి వినాయకచతుర్థి దినమునఁ గలిగిన స్వప్నము సత్యమే యయియుండును. చర్మమునకు మర్దనముఁ జేయవలసినమందు లోనికిఁ బుచ్చుకొనవలయు నని కొలతగాజుబుడ్డిలోఁ బోసి యాసీసాకు మూఁత బిగించుచుండఁగా నే నతనికొఱ కెందులకో పోయితిని. ననున్నుఁ జూడ కుండనే యాతఁ డామందును లోనికిఁ దీసికొనుటకు నోటియొద్ద కెత్తుకొనినాఁడు. నేను జూచి కెవ్వునఁ గేక వైచి యాతనిచేతిని గట్టిగఁ బట్టుకొంటిని. మం దొలికి నాచేతులపైఁ బడి వ్రేళ్లను గాల్చివైచినది. నేను రాకుండ నింతటినుండి మందు తీసికోవల దని యాతనికిఁ జెప్పితిని.

ఈదేశమున నెట్టిపని చేయుటకైన సేవకులు విశేషముగ దొరకుదురు. చేయవలసిన పని యెంతనీచ మైనదైన నరే! మనదేశమునఁ జిన్న పిల్ల లయిన సేవకు లెత్తుకొని యాడించుటకు లజ్జపడుదురు. అట్లు చేయునెడల లంపతా లని, బానిస లని యనిపించు కొందు రని వారిభయము. ఇచ్చట నిట్టి సందేహము లేదు. బోదకాళ్లఁజే గాని, యండవాత ములఁజే గాని మహావికృతస్వరూపులగు మనుజులనైన "రిక్షాలు" అను బండ్లలోఁ బెట్టి యవలీలగ నానందముగ లాగికొనిపోవుదురు. ఇంతకంటె నధమాధమములగు పనులఁ జేయుటకైన నిక్కడ సేవకులు పుష్కలముగ దొరకుదురు. దైవము చేసిన యూర్ధ్వాధఃకాయ ముల యేర్పాటు ననుసరించి యూర్ధ్వకాయమున కొక్క సేవకుని, నధఃకాయమున కొకని నినుపగోళులతో సెట్టికి నిరంతరగాఢపరామర్శనము చేయుటకై నిర్ణయించితిని. పగ లిద్దరు పనిచేయుచున్నారు. రాత్రిభాగమందు జామున కిద్దరుచొప్పున 'పహరా బదలాయింపు" పద్ధతితోఁ బని చేయుచుందురు. ఇత్తడిగోళ్ల పనికంటె నినుపగోళ్లపని యెక్కువ సాపుగ నరనముగ నున్న దని సెట్టి సంతోషపడుచున్నాఁడు.

నరి! ఈగొడవ కేమి కాని క్రిందటి యుత్తరమునఁ బార్థసారథిదేవాలయయాత్ర సంతానగోపాలస్వామియొద్ద నాఁగిపోయినది. శ్రీశ్రీస్వామి వారికి సెనగలసేవ యప్పుడుం డుటచేఁగాఁబోలు నాలయములోని వారి నందఱను బూజారులు వెలుపలకుఁ గొట్టివైచి తలుపువైచినారు. ఈయవకాశము వృథపోవనీయ నేల? యని యటునిటు తోఁచక చూచు చుంటిని. ఎడమవైపున దేవస్థానపువ్యవహారమును జూచు నుద్యోగి కొలువుఁజేసి యుండెను. అతనియొద్ద భత్యములో మరేమో తీసికొనుటకు వచ్చిన వేశ్య లాతనియొద్ద నిలువఁబడియుం డిరి. "నీవు నీవంతునకు వచ్చిన యాముదమును దీసికొందువా? దానికి బదులుగ డబ్బులు తీసికొందువా" యని యాతఁ డావేశ్యలలో నొకదాని నడుగ "నాముదము తీసికొనఁదగిన జబ్బు నా కేదియు లేదు. డబ్బులే యిప్పించండిమీ" యని బదులుచెప్పెను. దాక్షిణాత్యశృం గారరస పరీతపరిహాసవచనరచనకై మిగుల నలరితిని.

అంత లోనుండి ఘంటానాదము వినఁబడినది. స్వామికి నివేదన పూర్తి యగుటచే నందరును ముందునకుఁ బోవసాగిరి. ఒక ద్వారములో నుండి యందరు పోవలయును. అప్పు డొకకొంత నలిగి యెటులయిన లోనఁ బడితిని. ఇచ్చట స్వామివారి దేవాలయపుఁ బ్రాకారములోనికి వచ్చితిని. ఇక్కడ నందఱితోఁ గలసి శ్రీపెరుమాళ్లకు సాష్టాంగపడితిని. ఇక్కడ కింక స్వామి యరువదిగజములకుఁ దక్కువదూరములో లేరు. ననున్నుఁ జూచి

తెలుఁగు వైష్ణవుఁ డని ద్రావిడవైష్ణవులు కొంత నిరననముగఁ జూచినట్లు నాకుఁ దోఁచినది ఆంధ్రవైష్ణవులు వైష్ణవులు కారని వీరినమ్మకమ. ''స్వామీ! దాసోహ''మ్మని నే నొక్క యాచార్యపురుషు ననుఁగ నాతఁడు నవ్వుచు ''తెలుఁగువారా?'' యని యొకనక్కెములఁ చేయుచు నానమస్కారములు పరిగ్రహింపకే జుట్టు ముడివైచుకొనుటయందు నిర కుశదీక్షచే వర్తిల్లినట్లు నటించుచుండెను. వైష్ణవునకుఁ బ్రధానమగు శేషగుణము వీరి నామమాత్రావశేషముగ నున్నది: ఉపపత్తి విశేషించినకొలఁది శేషత్వము క్షీణించును. కడుష బరువగుకొలఁది శేషత్వము లఘు వగును. ఎదుటిమండపమునకైనాలు గయిదు మెట్లెక్కి రికి నచ్చట శ్రీస్వామివారి యుత్సవవిగ్రహములు వేంచేయింపు చేయఁబడి యున్నవి అచ్చటి వైష్ణవులతోఁ గలిసి నేను ద్రావిడవేదమును బఠించితిని. మాటలాడుచున్న కాకిని జూచి మనుజు లాశ్చర్యపడునట్లు వారు ననున్నుఁ జూచి వింతపడిరి. వారిని నేను లక్ష్యపెట్టక ముందునకుఁ బోవనారంభించితిని. అంతట ముందుదారి కచ్చట వెదురుకర్ర లడ్డుగఁ గట్ట బడిన వని రక్షకభటుఁడు చెప్పఁగ వెనుకకు నడచి తిరుగ మెట్లు దిగి ప్రక్క భాగమునుండ గర్భాలయమునకుఁ బోవ సమకట్టితిని.

స్త్రీపురుషులు పడుగుపేకలవలె నున్నారు. పెనవైచుకొని పోవుచున్నారు. పురుషుల యజ్ఞోపవీతములు కొంతల కాసులపేరుల నదుమను జిక్కుకొనుచున్నవి. పురుషులు స్త్రీలుకూడఁ దమచేతులను ముందు కుంచి వీలగునంతవఱకుఁ జేతులతో దారిని జేసికొనుచున్నారు. ఱాడుపారికాళ్లను పురుషులు ద్రొక్కుచున్నారు. పురుషుల బుర్రలు స్త్రీలచేతి కొబ్బరికాయలతో డీడిక్కులు కొట్టుచున్నవి. ''అమ్మణ్ణి! అమ్మణ్ణి'' యని యొక మొదలారి తనకూఁతును గట్టిగఁ బట్టుకొనఁ బోయి మరియొకపిల్లగారి విధవవదినెగారిని వెనుకవైపునుండి పట్టుకొనెను. అంతట నాకాంత శాంతమూర్తి యగుట చేతఁగాఁబోలు మారకయే యుండెను. కాని యామెమఱఁది కోపస్వభావుఁ డగుటచే మొదలారిని మోఁచేతితోఁ బొడిచెను. ఆపోటు పుణ్యపాపము లెరుఁగని నాకుఁ దగిలెను. ఇచ్చటికాంతలు మనవైపుస్త్రీలవలెఁ గేవలము పిరికిస్వభావము కలవారు కారు. అట్టి వెఱ్ఱిసిగ్గు గలవారు కారు: పురుషునిఁ జూచి పరుగువరుగునఁబోయి 'పర్దా' చాటునఁ దూరువారు కారు. వారితో మాటాడవలసివచ్చినను బెదవులు దడుపుకొనుచు, గ్రుక్కలు మ్రింగుచు నెట్లు మాటాడవల యునో తెలియక క్రిందిమీఁ దగువారు కారు. భర్తలతో నిత్యము నముద్రతీరమునకుఁ బోవువారు. అచ్చట తోడిస్త్రీలతోఁ గాని యట్టి తమపురుషులతోఁ గాని బహిరంగముగ నాడు కొనువారు. నముద్రపునీరు మీఁదఁ జల్లుకొనుచునో, యినుక నెగుర వైచుచునో భర్తల కన్నులకు గంతలుకట్టి యటునిటు పరుగెత్తుచునో, పల్లెవాండ్రతో వారు పట్టిన చేఁపలనుగూర్చి కాని, కన్న పావలను గూర్చి కాని పరిహాసముగ నడుగుచు, నితరస్త్రీల సిగ్గుమాలినతనమునకో యితర పురుషుల భార్యాలోలత్వమనకో వెకవెక నవ్వుచు నగలు గల స్త్రీలను జూపి భర్తలను బుగ్గలుపొడుచుచు ననుదినము సాయం కాలమునఁ గాలక్షేపము చేయువారు. వీరు విద్య నేర్చినవారు. వాక్చాతుర్యము గలవారు. చురుకుఁదనము గలవారు. పురుషులతో నిర్భీతిగఁ గలసిమెలసి ధైర్యమునఁ బ్రవర్తించుట కలవాటు పడినవారు. కొందరు స్త్రీలు నామీఁదికి వచ్చుచుండ వా రే మనుకొందురో యని భయపడి నేను దప్పుకొనుచుండువాఁడను. నిర్భాగ్యుఁ డని చేతఁగాని వాఁ డని కాఁబోలు! వారు నిందాస్తు చకముగ నవ్వుచుండెడివారు. ఇట్లు బహుకష్టముమీఁద దారిఁ జేసికొని నడచుచుంటిని.

ముందుగ నొక ద్వార మున్నది. దానిగుండఁ దూరిపోయితిని. ఇప్పటికి గర్భాలయమునఁ జేరితిని.

ఎడమచేతివైపున ''చిరియతిరువడి'' వేంచేసియున్నారు. వారి ప్రక్కను బన్నిద్దరా ళ్వారు అవతరించియున్నారు. కుడివైపున శ్రీరంగస్వామియు, వారిప్రక్కను వరదరాజ స్వామియుఁ బ్రకాశించుచున్నారు. పొగ గ్రమ్మినదీపములు–దీపములఁ గ్రమ్మినపొగ–తప్ప నేమియుఁ గనఁబడుట లేదు. మంచు విశేషముగఁ గురియుచుండ నడుమ మిరుఁగుడు పువ్వులు మిగులఁ బ్రకాశించుచున్న ట్లున్నవి. వివిధ పుష్పముల పరిమళము –నారతికప్పురపు ధూపముల సౌరభము–ఘ్రాణేంద్రియమునకు మత్తుగలుగఁజేయుచు న్నవి. అచ్చటివాయువు మిగుల నుష్ణమైయున్నది, అచ్చట మిగుల నిరుకుగ నున్నది. గర్భదేవాలయమునొద్దనే యుంటిని. ఎందరు జను లచ్చట నున్నారో లెక్క లేదు. బాగుగఁ గనఁబడుటయు లేదు. ఎదుటఁ బార్థసారథి స్వామి యున్నారని మాత్రము తెలియును. ఆమూర్తి కనఁబడుటలేదు. బట్ట లాగుచున్న యాతఁడు బ్రాహ్మణుఁడో యబ్రాహ్మణుఁడో, ముందునకుఁ ద్రోయుచున్న వ్యక్తి యాఁడుదియో మగదో, బుజముమీదఁ జేయి వైచినది పుణ్యస్త్రీయో పూర్వసువాసినియో ఏమియుఁ దెలియుటలేదు. తెలిసికొనుట కూహయైన లేదు. అందరదృష్టియు, మనస్సును– నెదుటిలీలామానుష విగ్రహమువంక నున్నది. స్త్రీల చెవుల దుద్దులకాంతులు నడుమనడుమ జిగజిగలాడుచు దీపపుఁగాంతులకు నెర్ర పచ్చ నీలపు ''మహతాబు'' రంగుల నొనంగు చున్నవి. అవిగో నివాళిపళ్లెమునఁ గప్పురపుజ్యోతులు! అదిగో! శ్రీ పెరుమాళ్ళవక్షస్థ్సలమున నివసించు మహాలక్ష్మి! అదిగో! తిరుమొగము! అదిగో తిరుభుజము! అదిగో తిరుకర్ణము! నరత్నకుండలమై ప్రకాశించుచున్నది! అదిగో! జగదానం దకరమగు నేత్రయుగ్మము! అదిగో తిరుమణి! అదిగో దివ్యకిరీటము! అదిగో వైజయం తము! అదిగో కౌస్తుభము! ఆహా! స్వామి యేమిదివ్యదర్శనము సాయించుచున్నాఁడు! తడతడ తడతడ జను లందరు లెంపలు వైచుకొన్నారు. చెవులు లాగి కొనుచున్నారు. పార్థసారథి! గోవిందా! శ్రీనివాసా! యని కేకలు నర్వతో ముఖములుగ విజృంభించినవి. అంతటితో నాయారతి యావిగ్రహమునకు కుడివైపునఁ దిరుగుచున్నది. ''అదిగో! రుక్మిణి! శ్రీమహాలక్ష్మి! లోకమాత! అమ్మణ్ణి! అమ్మణ్ణి! జగన్మాతా!'' యనుచు నందరు లెంపలు కొట్టికొనినారు. ఆహా! ఆహా! మేమి లోకమాతాపితల వైభవము! నాకుఁ దల్లిదండ్రులగు రుక్మిణీకృష్ణులు, నావంటివారి కందఱకు–నార్యావర్తమందలి స్త్రీపురుషుల కందఱకుఁ–దల్లి దండ్రులు కారా! ఆహా! ఈకుటుంబ మంతయు వారిదేకదా! మన మందఱము సోదరసోదరీ భావముల నుండవలసిన వారముకదా! ఆహా! స్వామీ! మమ్మందఱను నీకటాక్షమున కర్ముల మగునట్లు చేసికొనుము. నీయెదుట భాగ్యవంతుని దరిద్రుని భేదము నశించునుగదా! సుందరవికృతరూపభేదము నశించును గాదా? నశింపని దొక్క సోదరభావము తప్ప వేరేదియు లేదుగదా! ఆహా! తల్లీ! తండ్రీ! మే మస్వతంత్రులము. కించిద్ జ్ఞులము. ఇంద్రియ వశ్యులము. పాపచిత్తులము. ఎట్లు రక్షింతురో! ఎట్లు రక్షింతురో! ప్రపంచమున మీరు తప్ప మరేమియు నాధారము లేదు. ఆహా! మూఢులమై జీవములు శాశ్వతమనుకొని, ప్రపంచసుఖ ములు యథార్థమనుకొని, మీపాదసేవ మరచి పామరాధములమైతి చెడిపోవుచున్నాము. నిష్కారణకటాక్షముచే మీరు మమ్ము రక్షింపవలయును గాని మాలో నట్టిరక్షణమును బొందుట కర్హత లేదు. రక్షించుఁడు రక్షించుఁ'' డని నే నేమో లోపల నొడలు దెలిసియుఁ

దెలియని యవస్థతో ననుకొను చుండఁగఁ దిరుగ ''అదిగో! మంగళపుటారతి! అదిగో! పార్థసారథివదన పుండరీకము! నాయనా! నీముఖమండలము నిశ్చలభక్తితో నొక్కసారి చూచువానికిఁ బునర్జన్మభీతి యుండ దని పెద్దలు చెప్పినమాట సత్యముకాదా! అదిగో! నాతండ్రి మందహాస మొనర్చుచున్నాఁడు. సత్యమే–నాయనా! న న్నొకసారి నిన్నుఁ గొఁగలింపనీయనా? కొఁగలింపనీయవా? నాజన్మము కృతార్థము కానీయవా?'' యని పెద్ద పెట్టున నొక్కసారి యేడ్చితిని. అంతలోనే యొడలు తెలిసి సిగ్గు తెచ్చుకొని ననే్న మనుకొందురో యని యటు నిటుఁ జూచితిని. నాయేడు పెవ్వరును వినలేదు. ఎవనిమట్టు నకు వాఁడే తదేకధ్యానమున మైమరచియున్నాఁడు. ఇది యూఁడుది. వీఁడు మగవాఁ డను భేదము కూడ నచ్చట నున్న త్రుటికాల మెవ్వరికి లే దని నాయభిప్రాయము. అందరును మహానందమున స్వామితీర్థమును, పుష్పములను, శఠగోపమును స్వీకరించిరి. స్వామీ! పార్థసారథీ! తల్లీ! మహాలక్ష్మీ! యనుచు నందరు మరలిరి. ఉష్ణనాయువుచే నందరు స్నాన మొనర్చినట్లు స్వేదపూర్ణులయి యుండిరి. కాళ్లతోఁ దడుముకొనుచు జారకుండ బింకముగ నడుచుచుఁ దిరుగ ద్వారమునొద్దకు వచ్చుచుండిరి. ''నే నిచ్చినమూట యేది?'' అని ప్రక్కనున్న మనుజునిభుజము నుండి కొంతబరువు గలవస్తువు నొకఁడు లాగుకొనెను. ఆమూట కీచు మని ధ్వని యైనది. దానిలో నేమైనఁ దోలుతిత్తి యున్నదేమో యని యనుకొంటిని. ఆమూట నాతఁడు లాగినచోటి నుండి యమ్మయ్యో యని ధ్వని యైనది. అంతట నాతఁడు లాగుకొనుటమాని ''అమ్మా! క్షమింపుము. నీవు నాసేవకుఁడ వనుకొంటిని. నీపిల్లను నామూట యనుకొంటి'' ననియెను. అంత నాతఁడు సేవకుఁడు కనఁబడకపోవుటచే నాతని కిచ్చినమూట యేమైనదో యని తొందరపడియటు నిటు సంభ్రమమునఁ దిరుగ నారంభించెను. వారిని వీరిని ద్రోచికొనిపోవ మొదలిడెను. ద్వారము దాఁటెను. నేనుగూడ నాతఁడు చేసిన త్రోవవెంటనే వెలుపలకు వచ్చితిని. స్తంభముచాటునఁ గ్రీనీడలో నెవఁడో ముసుఁగు నైచికొని కూర్చుండెను. ఆతఁ డతనిసేవకుఁ డని నిర్ధారణము చేసికొని ''ముండకొడక! మూట కాళ్లక్రిందఁ బెట్టుకొని యిచ్చటఁ గూరుచుంటివా?'' యని యాతనిని రోషముతో గద్దరించెను. మూటయాతఁడు మాటలాడలేదు. అంత నాతఁడు కోపముతో సేవకుని లేవఁదీయఁగ ''అతఁడు మూఁగవాఁ డనియు, నది యాతని ప్రభుఁడు కాదు, ప్రారబ్ధ మిచ్చిన మూట'' యనియు నెవరో చెప్ప నాతఁడు సిగ్గుపడి ముందునకుఁ బోయెను.

మనస్సునఁ గలిగిన మహాతేజ మింద్రధనువురంగులవలె మారిపోవుచున్నది. దేహములఁ గలిగిన స్వచ్ఛకాంతి దీపపుఁజాటుదొంగ కాంతుల దాఁగుడుమూఁతలలోనికి దిగిపోవుచున్నది. సోదరభావము, నిష్కలుషస్వభావము, యథార్థప్రేమము మాయమై వంకచూపులు–ప్రక్క బారుచేతిజొనుపులు,–త్రోపులాటలలోనికి దిగిపోయినవి. మా వెనుక స్వామి యిరువదిగజములలో నున్నాఁడు. మాకుఁ గలిగిన స్వచ్ఛభావము మా కిరువదిమైళ్లకు ముందుగఁ బారిపోవుచున్నది. ఇంతయే మనుజునిబుద్ధి! ఇంతయే సద్భావము! ఇంతయే వైరాగ్యబలము! ఇంతయే మనోనిశ్చలత! ఇదిగో తీర్థపానము! అదిగో అధరపానము! ఇదిగో గోముఖమందలి జపమాల! అదిగో కొప్పులందలి పూలమాల! ఇదిగో ప్రణామము! అదిగో పరీరంభము! ఇదిగో జన్మరాహిత్యప్రయత్నము! అదిగో చంకను గవలపిల్లలు! ఇంతే! అట్టి మెరుపు! అట్టి గాఢాంధకారము! ఏమని చెప్పుదును? జంఘాల

శాస్త్రినాకుఁ గవిత్వ ముందునెడల నామనసునఁ గలిగిన తుపా నెట్టిదో నీకుఁ గొంతవర కయినఁ దెలియుఁజేసియుందును. అట్లు జరుగుట కీజన్మమున నవకాశము లేదు. పోనిమ్ము!

ఏనుఁగులొండమును జేతఁ బట్టి కదలకుండ నాఁపఁగల బలశాలు లున్నారు. మోటారుబండ్లను బిగఁబట్టఁగల మహాశక్తినంపన్ను లున్నారు. కాని మనస్సుకప్పదాటుల నాఁపఁగలవారు లేరు. ఎదురురొమ్ము వయిన నాయనకణికల నమ్మెటలచే సాగఁగొట్టించుకొనఁగలవా రున్నారు. లోని యరిషడ్వర్గమును జయింపఁగలవారు లేరు. పర్వతములఁ గరఁగింపఁగల పండితశిఖామణు లున్నారు. ప్రాపంచిక కశ్మలతాకఠినమగు మనసును గఁరగఁజేయఁగలవారు లేరు. ఎటులయినను మన మొకందులకు సంతసింపవలసి యున్నది. ఇట్టి మహాదివ్య క్షేత్రము లుండుటచేతనే మన మందరము సోదరసోదరీసహిత ముగ ఁ జేరుటయు, నేకకుటుంబము లోనివారము మన మగుదు మను యథార్థమునుఁ గ్రహించుటయు, న్వల్పకాలమైన నైహికసుఖవిరాగ ముదయించుటయు, దైవభక్తి మనసున నంకురించుటయు మొదలగు శుభలక్షణములు మనయందుఁ గనఁ బడుటకుఁ గారణమై నది. అట్టి నమంజస తాత్కాలిక మనస్థితి నభివృద్ధి పరచుకొనుభారము మనదై యున్నది.

ఇట్లనుకొనుచు దేవాలయమునకుఁబ్రదక్షిణ మాచరించితిని. మనదేశమునఁ బ్రదక్షిణము ముం దొనర్చి యటుపిమ్మట స్వామిదర్శనము చేయుదుము. ఇచ్చట నట్టియాచార మంతగాఁ బరిగణింపఁబడుట లేదు. శ్రీయమ్మవారిదర్శనము చేసి యామెయాలయము లోని తిరుచూర్ణమును దీసికొంటిని. ఆమెపేరు వేదవల్లి. అంతట వెనుక నున్న శ్రీనరసిం హస్వామిని దర్శించితిని. అట్లు తిరుగుచుఁ దిరుగఁ బ్రధానా లయముముందునకు వచ్చుసరి కచ్చట జనులు చాల మూఁగియున్నారు. అక్కడనే మున్నదో యని యటకుఁ బోయితిని. అచ్చట స్వామి ప్రసాదముల నమ్మ నంగడి యున్నది.

స్వామిమండపమునఁ దిరుగ సాష్టాంగపడి వెలుపలకు వచ్చి గరుడ స్తంభమునొర్ర నిలువఁ బడితిని. చెమటచే నాబొట్టంతయుఁ గరిఁగిపోయినది. నేను వడహాలనో తెంగలినో తెలిసికొనుట కవకాశము లేకుండెను. ఒక్కవడహాలస్వామిని నే నచ్చటఁ జూచితిని. అతని నాదరముతో సమీపింపఁగ నాతఁడు నేనుగూడ ''వడహాల'' ననుకొనియుండెఁ గాఁబోలు! తంబళముతో దేవాలయగర్భ మంత యిరుకుగ నుండుటకుఁ గారణ మేమి? యని నే నడిగితిని. జనులు విశేషముగ వచ్చి స్వామిని సులభముగ సేవింపఁదగిన యీగర్భాలయ మంతయిరుకుగ నుండునట్లు కట్టఁబడుట కేమికారణము? ఈప్రశ్న మాతని నడుగఁగానే యాతఁడేమో తంబళమునఁ దీవ్రకోపుఁడై యుత్తర మిచ్చినాఁడు. నాకుఁ దంబళము మాటలాడుటరాదు గాని మాటలాడినయెడల దానియర్థము నాకుఁ జాలభాగము తెలియఁగ లదు. ఆ వడహాలస్వామి సాయించిన దేమనఁగా అరువదియేండ్లక్రిందటివరకు నీదివ్యదేశము వడహాలదేశమై యుండెను. స్వామికి దిక్కుమాలిన పాదము లేదు. ఏముండకొడుకో దానిని స్వామికిఁ దగిలించి దివ్యక్షేత్ర మంతయుఁ దగులఁబెట్టినాఁడు. స్వామిమొగముఁ జూచుట కిప్పుడు పరమానహ్యముగ నున్నది. అని యర్థ మిచ్చుమాట లరవమునఁ జెప్పినాఁడు. అంతట నేమియు మాటలాడక యటనుండి బయలుదేరి ''ఆహా! ప్రపంచమున నెంతటి మూర్ఖులున్నారు! భక్తిప్రధానమై పరమపవిత్రమైన రామానుజమత మెంతధ్వంసమై పోయి నది!'' అని కనులవెంట నీరు పెట్టుకొనుచు వెలుపలకు వచ్చితిని. అంత నొక గుండ్రనివస్తువు

నాబుజమునైఁ దిఁగినది. అదరిపడి నే నొట్టి వెనుకకుఁ జూచితిని. నన్నుఁ బెండ్లిచేసికొనఁదల
చిన వితంతువు నవ్వుచు నిలువఁబడెను. నే నామెను జూచి కొయ్యయైపోయితిని.
"అన్నయ్యా! నీ వంత తొందరపడ నక్కరలేదు! నేను దీర్థాటన మారంభించి
దివ్యక్షేత్రములఁ జూడ మొదలిడినకొలఁది నాపూర్వపాంథలన్నియు నశించినవి" యని
నవ్వుచుఁ బోయెను. నే నేమియు మాటలాడ లేకపోయితిని. దివ్యక్షేత్రముల మహిమ
యెంతయో ప్రాయుటకుఁ గాదుకద్యా, ఊహించుటకైన వలనుపడదుగదా! యని యనుకొ
నుచు నింటికిఁ బోయితిని. దయయుంచనలేను.

ఇట్లు మిత్రుఁడు,
కాలాచార్యులు.

33. స్వప్న చారిప్రకృతి

పూర్వం ఒకసారి, జంఘాల శాస్త్రి దయ్యాలు, భూతాలు, పిశాచాలు ఉన్నాయనే మాట వట్టి అబద్ధం అని ఖండితంగా చెప్పాడు గుర్తుందా? ఆ ఉపన్యాస విషయం చదివి బండారు నగరం నుంచి నాగేశ్వర శర్మ అనే 'సుజన విధేయు' డొకాయన, శాస్త్రి అభిప్రాయాన్ని ఖండిస్తూ, సాక్షికి ఉత్తరం రాశాడు. తాను ఎందుకు ఖండిస్తున్నాడో ప్రత్యక్ష ఉదాహరణంగా ఒక మహమ్మదీయుడి విచిత్ర ఉదంతాన్ని విపులంగా రాశాడు. ఆ మహమ్మదీయుడి కథ ఏమిటంటే – మనిషి మామూలుగా మంచివాడు. రాత్రి పడుకొనేటప్పటి వరకూ సరిగ్గానే వుంటాడు. బట్ట కట్టుకొనే పడుకుంటాడు. తెల్లారేసరికి అతను దిగంబరుడై మంచం కింద వుంటాడు. అతను కట్టుకున్న బట్ట జాడ కూడా దొరకదు. అతని మతం వారు కూడా, అతన్నేదో భూతం ఆవేశించిందనే భావిస్తున్నారు. హిందూమహామంత్రవేత్తలు కూడా కారణం కనిపెట్టలేక పోయారు. దీనికేం చెపుతారు? అని –

వాణీదాను ఈ ఉత్తరం ఆసరా దొరకడంతో, జంఘాలశాస్త్రి అభిప్రాయాల మీద ఉత్సాహంగా ధ్వజ మెత్తాడు. జంఘాల శాస్త్రికి చాలా కోపం వచ్చి జవాబు చెప్పబోతుంటే, సాక్షి వారించి, మనలో మనకి కలహాలు పనికిరావని నర్దాడు. జంఘాల శాస్త్రి, ఆ మహమ్మదీయుడి విచిత్ర ఉదంతం స్వయంగా పరిశీలించి, పరిశోధించి నిగ్గు తేల్చడానికి బండారునగరం వెళ్లి నాగేశ్వర శర్మని కలిశాడు. అతని ద్వారా మహమ్మదీయుణ్ణి కలిశాడు. అయిదు రోజుల తరవాత తిరిగి వచ్చి తన అనుభవాల్ని పకడ్‌బందీగా చెప్పాడు. మహమ్మదీయుణ్ణి ఏ భూతం ఆవేశించలేదని తేల్చి, అసలు కారణం బయటపెట్టాడు.

మాకార్యస్థానమున కీదిగువ నుదాహరించిన లేఖ నాలుగుదినముల క్రిందటనే వచ్చినది, నే నిట్లు చదివితిని.

"సాక్షిగారికి–బండారునగరమునుండి.

మీరు భూతములఁగూర్చి వ్రాసిన సాక్షిపత్రికను జూచితిని. అందువలన భూతము లనునవి ప్రపంచమున లే వనియు, నిట్టిచిహ్నములొకజాతి రోగచిహ్నము లనియు, వానికి

మంత్రాదులు కేవలము నిరుపయోగము లనియు, నవి తరచు జనుల మోసముచేయుటకుఁ జేసిన కుత్సితతంత్రములుకూడఁ గావచ్చు ననియు మాకు గోచరించినది. మీరు వ్రాసిన యీ యభిప్రాయము మాకు సంతుష్టికరముగ నుండలేదు. లేనిభూతములను జనులు కల్పించినా రని చెప్పుట యసందర్భము. జనులలోఁ దరచుగ భూతము లున్న వనునభిప్రాయము వేళ్లుపారియున్నది. అది యేల కలుగవలయును? తనంతఁ దానే యది కలిగిన దని చెప్పుటకు వలనుపడదు. కారణ మేదియో యుండవలయును. వాణీదానుఁడు చెప్పినట్లు విచిత్రబ్రహ్మసృష్టిలో నేది యుండిన–నుండవచ్చును. లేదని నిరాకరింప వలనుపడదు. మనకుఁ గారణము తెలియక పోనచ్చును. నేను మీరువ్రాసిన యీవ్రాఁత లన్నియు ఖండింప సమర్థుఁడను గాను. కాని మీరు వ్రాసిన దెందుచేతనో యప్పుడే నామనస్సునకు నచ్చలేదు. ఇప్పుడు మాగ్రామమున నొక్కవిచిత్రమయినభూత మొకని నావేశించియున్నది. ఆతఁడు మహమ్మదీయుఁడు. ఆతఁడు ప్రతిరాత్రియుఁ బండుకొన్నప్పుడు సరిగనే యందరవలెనే మంచముపయి వస్త్రధారియయి పండుకొనును. తెల్లవారుసరి కాతఁడు కేవలదిగంబరుఁడయిమంచము క్రిందఁ బడియుండును. ఆతఁడు రాత్రి కట్టుకొన్నవస్త్ర మెక్కడ నున్నదో చూత మన్న నెక్కడను గానఁబడదు. ఆతనికి మీయభిప్రాయానుసారముగ నేదయినరోగ మేమో యని యూహించుట కెంతమాత్రమును సరిపడదు. ఆతఁడు విశేషదేహదార్ఢ్యసంపన్నుఁడై, ప్రబలాహారభక్షణప్రియుఁడు. జన్మమున జిర్రునఁ జేదియైన నెరుఁగఁడు. ఆతనిజాతివారగు ముసలిమానులు గూడ నీతఁడు భూతావిష్టుఁడై యున్నాఁ డని యభిప్రాయపడుచున్నారు. అనేకభూతచికిత్సలఁ జేయుచున్నారు. కాని వారిశ్రమము వృథయైన దని చెప్పుటకు మిగుల విచారించుచున్నాను. అది వ్యాధి కాదయ్యెను. ఇఁక మరియేది కావలయును? మోసమా? ఆతఁ డెవరిని మోసముచేయ నట్లు చేసియుండను? ఎవ్వఁడయినఁ గట్టుకొన్న బట్టను విప్పి మంచముక్రిందఁ బడియుండునా? బట్ట యేమైనట్లు? గదితలుపులు లోననే యైయుండును. ఎవ్వఁడును గాని గదిలోనికి వెళ్లి యాతఁడు గాఢనిద్రను బోవుచుండఁగా నాతని వివస్త్రుఁ జేసి యావస్త్రమును దానుహరించి యాతనిని మంచముక్రింద దిగంబరునిగ భూశయన మొనర్పఁజేసె నని యూహించుట కెంతమాత్రము వీలులేదు. తలుపులు యైయుండఁగా నెవ్వఁడు లోనికిఁ బోవును? ఈరీతిగ జరుగుట యొక్కరాత్రియా? కాదు. ఇది వరకు మూఁడుమాసములనుండి జరుగుచున్నది. ఆఁత డీగ్రామమునకు వచ్చికూడ మూఁడుమాసము లయియుండును. అంతకుముందు దాతఁడే యూర నుండువాఁడో మాకుఁ దెలియదు. ఆతని కీయూరు వచ్చుచుండఁగా నడుమదారిలో నేదియో భూత మావేశించిన దని యనుకొనుచున్నారు. ఇట్టి భూతవిశ్వాసము మనలోనే కాదు, మహమ్మదీయులలోనేకాదు, ఇంక నితరజాతులలోఁగూడ నున్నది కాని లేకపోలేదు. అట్టి సర్వజాతిసామాన్యమగు నీయభిప్రాయమును మీరు నిరాకరించుట వింతగనున్నది. అది యెటులయిన నుండనిండు. ప్రస్తుతము మీరీవింత నెట్లు సమర్థింతురు? మీరు మా యీలేఖకు ప్రతిలేఖ వ్రాయవలయు నని కోరుచున్నాము. మీలేఖకొర కెదురు చూచుచుందుము. వంశపరంపరాగత జనాభిప్రాయములం దేదో సత్య ముండును గాని యవి యన్నియు మోసములు– వ్యాధిచిహ్నములు–గావేరవు. మీ రావిషయమున నిచ్చిన మీయభిప్రాయము సమంజసముగ లేదు. ఆయభిప్రాయమును మీరు దిద్దుకొనవల

యును. లేదా యీ చిత్రమునుసకారణముగ సమర్థింప నయిన వలయును.

చిత్తగించవలయును.
నుజనవిధేయుఁడు,
నాగేశ్వరశర్మ–

ఈలేఖను జదువుటతోడనే జంఘాలశాస్త్రి మొగము తెల్లఁబోయెను. వాణీదానుని మొగ మెఱ్ఱఁబడెను. కాలాచార్యులు గాఢాంధకారనర్ణవదనుఁడు గాన నాతనిమొగములో నేమిభేదము సిద్ధించినదో చెప్పవీలులేదు. జంఘాలశాస్త్రి తల పంకింప మొదలిడెను. వాణీదానుఁడు నకిలింప నారంభించెను. కాలాచార్యులు ముక్కుదిబ్బిడితో నెగరోఁజ సమక ష్టైను. ఆలేఖను బల్లమీఁద నునచి నేనుగూరుచుంటిని. దానిని నంరంభముతో వాణీదానుడు మరలఁ జదువుకొనెను. జంఘాలశాస్త్రి వంకఁ జూచి యిగిలించెను. ''అట్లు కిచకిచలాడెద వే?'' మని జంఘలశాస్త్రి యాతనిపై రొసరొసలాడెను. మా ''సాక్షి'' పత్రికను గొందరయిన శ్రద్ధగఁ జదువుచున్నా రనియు, వినోదార్థముగఁ జదివి దానిని మూలఁబారవైపకుండ దానిలో సత్యాసత్యములను విమర్శనబుద్ధితోఁ గనిపెట్టుచున్నా రనియు నే నానందమొంది యూర కుంటిని.–అంతట వాణీదానుఁడు తీండ్రమున లేచి యుపన్యానపీఠ మెక్కి యిట్లు పలుకఁదొడఁగెను.

''నేను జెప్పలేదా? నే నప్పుడే సర్వతంత్రస్వతంత్రుఁడైన జంఘాలశాస్త్రి నెదుర్కొన లేదా! నా కాతని కున్నంతనోరు లేదుగాని యాతని కున్నంత బుద్ధిలేదా? మాటల బడబడవలని ప్రయోజనమెంతయో బోధపడినదా? కాల మేమి మూఢకాలమా? జను లేమి యజ్ఞులా? విద్యాశూన్యులా? వివేచనారహితులా? తారుమారు కేకలచే ''ధమ్కాయించుట'' కేమి పిల్లలా? వావదూకుల కిది పూర్వకాలము కాదు. జారునాలుక సాబగు లీపుడు గవ్వకు మారవు. ఉపన్యాసపీఠమందలి చేతివిసరులు, కాలితన్నులు, కంటిత్రిప్పులు, గళకసనములు, మండలీక్రుత వాగ్జాటీమాహాత్మ్యములు జనుల నిప్పుడు మోసపరుపఁజాలవు. టక్కు టిక్కు పాడిమాటల కిది కాలము. అంశములకు నంకెల కిది కాలము. కాని యర్థశబ్దాలంకార రమణీయమునకు–నాలాపాడంబరవైభవమున కిది కాలము కాదు. సత్యాన్వేషణమునకై మనసంఘము స్థాపింపఁబడినది. సత్య మేదియో జనులకు బోధపరచి యసత్యమం దసహ్యత కలుగఁజేయుటయే మనముఖ్యోద్దేశము. ఇప్పుడు మన సహాజైకోసన్యానకర్తగా రేమి చేయు చున్నారు? కదలుచున్న పండ్లను లాగందలఁచి గట్టిపండ్లను గారుచే నుద్ఘాటించుచున్నారు. కలుపుదీయుదు మని చెప్పి వరికంకులను వడివేసి పెఱుకుచున్నారు. దయ్యము లున్నని. ఉన్న వని నేను మొదటినుండియు ఘంటాఘోషముతోఁ జెప్పుచువ్నాను. అవి జనులకు హాని చేసినను, జేయకున్న నున్నమాట సత్య మని యెప్పుకొనక తీరదు. శాస్త్రిగారు భూతములు లేవని నిర్ధారణముగఁ జెప్పిన యభిప్రాయ మూతని యనుభవ మొక్కదానినిఁబ ట్టియే కలిగినఁదై యున్నది. ఉన్న వను జను లందఱ యభిప్రాయము స్వానుభనములఁ బట్టియుఁ, బూర్వజన్మానుభవములఁ బట్టియుఁ గలిగినదై యున్నది. లోకమున నున్న యంద రంధులు,–తా నొక్కఁడే సాక్షియా? అంద ఱున్మత్తులు–తానొక్కఁడే బ్రహస్ప తియా? అణువే యద్రికంటె నధికమా? ఎన్ని పూర్వపక్షరాద్ధాంతము లాలోచించి యొక

మాట మాటాడవలయును? వాక్యగౌరవమును దూఁచకుండ మనకే మను నహంభావముతో జనులనెత్తులపై విసరుటే! మితభాషియే బుద్ధిమంతుఁ డని పెద్దలనుట లేదా? తననోరుతాఁ గట్టుకొనలేనివాఁడు లోకమునోరు గట్టుటకు సిద్ధపడుట బుద్ధిహీనతగాదా? శాస్త్రీ! నాకవిత్వము వట్టిపేలపిండి చొప్పదంటుకవిత్వ మనియుఁ, జచ్చుకవిత్వ మనియు నోటికి వచ్చిన ట్లెల్లవదరితివే? జ్ఞప్తియున్నదా? నీమాట-నీనోటినుండి వెడలినమాట-చచ్చు-చచ్చున్నర -మూఁడుచచ్చుల ముప్పాతికై-యయినట్లు లోకమంతట నిప్పుడు వెల్లడి యయినదా? హే! హే! హే! ఇది చూచుకో! ఈపత్రమును మఱియొకసారి కన్నులు తెరచి చూచుకో! వాణీదాసునిగూర్చి యిందుననేమి వ్రాయఁబడినదో! వాణీదాసుఁడే సత్యవాదియో! నీవే సత్యవాదివో! ఇప్పుడు తెలిసినది. ఎవనిబుద్ధి యధికమో, యెవనిప్రాపంచిక జ్ఞాన మధికమో, యెవఁడు యథార్థకవియో యిప్పుడు బయటఁబడినది. గంద్రతనము కవిత్వ మగునా? వటువట పదరుట నాచానైపుణ్య మగునా? పైబడబడయేకాని యంతశ్శక్తి సున్న. అట్టి నీవు నన్ను-నాకవిత్వము-నధిక్షేపించుటా? నోరు సంబాళించుకొని మాటలాడుము-సాక్షినిఁ జూచి పురజను లూరకుండిరి. కాని ని న్నీసరికి సాగఁదీసి తన్నియుందురు. "Arrogant fool" (ఆరెగంట్ ఫూల్) అని పాఠశాలావిద్యార్థులు నిన్ను పిలుచుచునే యున్నారు. అట్లు తేరఁ బాఱఁజూచెద వేమి? కొట్టెదవా యేమి?" అని వాణీదాసుఁడు చాలించుసరికి జంఘాలశాస్త్రి మహాకోపమున లేచి యుపన్యాసపీఠ మెక్కఁబోవుచుండఁగ నాతని నాఁపి నెనిట్లు చెప్పితిని.

"వాణీదాసుఁడా! నీ వసూయాతత్పరుఁడవువలెఁ గాసఁబడుచున్నావు. అతఁడు నిన్నెప్పుడో కవివి గావని దూషించెనని యిప్పుడా కోపము మనస్సున నుంచుకొని యాతని మిగుల నిందించితివి. ఈపత్రములో వ్రాయఁబడిన భూతావేశముఁగూర్చి జంఘాలశాస్త్రి యేమి చెప్పునో యది వినకుండనే యాతనిఁ దూలనాడుట పాడిగాదు. ఈపత్రలేఖకుఁడే పొరపాటు నొందియుండ వచ్చును. లేక మనశాస్త్రి చెప్పిన యభిప్రాయమే సమంజనము కాకుండపచ్చును. ఆతనిబుద్ధి ననుసరించి, యాతని యనుభవము ననుసరించి సత్య మని యాతనికిఁ దోచిన దేదియో దానిని జెప్పినాఁడు. అది సత్యము కావచ్చును. కాకపోవచ్చును. సంఘమున నుండవలసిన యైకమత్యరీతి యిదియేనా? శాస్త్రి పొరపాటు చెప్పిన నొక్కటి, నీవు చెప్పిన నొక్కటి-నేను జెప్పిన నొక్కటియునా? శాస్త్రి చెప్పినమాటను నీవే చెప్పియుండినయెడల నిన్ను నీవిట్లు దూషించుకొనియుందువా? మనము చెప్పిన యంశములలో నేదయినఁ దప్పున్నదని జనులు మనకుఁ జూపించినయెడల బాగుగ నాలోచించి తప్పగునో కాదో? శాస్త్రముచే యుక్తిచేఁ బరిశీలించి తప్పయిన దిద్దుకొనఁదగును. కాకున్నచో మనయభిప్రాయమే యుపపన్న మని లోకులకు మృదువాక్యములఁ దెలుపవలయును. అంతియేకాని మీలో మీరిట్లు నిష్కారణవైర మూని యన్యోన్యదూషణమునకై గమకించుట హాస్యాస్పదము కాదా? లోకులలోని కలహములను నివారింపవలసిన మనము మనలో గ్రుడ్డులాడుచుండుట నీచము కాదా? జంఘాలశాస్త్రి యీలేఖాంశమునుగూర్చి యేమిచెప్పునో వింద ము." అని నేను గూర్చుంటిని.

అంతట జంఘాలశాస్త్రి లేచి ఇట్లు చెప్పెను.

''నే నిప్పుడు చెప్పవలసిన దేమున్నది? ఆయూరు పోవలయును. ఆమహమ్మదీయునిఁ జూడవలయును. ఆతనితో నాలుగుదినములు నేను గాలక్షేపము చేసి యాతనిస్థితి యెట్టిదో పరీక్షింపవలయును. పిదప మీ తావునకు వచ్చి నేను గనిపెట్టిన దేదో చెప్పవలయును. అంతేకాని నేనిప్పుడు చెప్పఁదగిన దేదియు లేదు. కాని యీసంఘమున నింతటినుండి వాణీదాసుఁడైన నుండవలయును. నేనైన నుండవలయును. ఇద్దరుఁగూడ నుండుట పొసఁగదు. నే నుపన్యానకుఁడను-విమర్శకుఁడ-నెన్నఁడైనఁ గాఁగలనుగాని వాణీదాసుఁ డెన్నఁడైనఁ గవి కాఁజాలఁడు. ఈమాట శిలాశాసనము. కుగ్రామములో గుడుగుడుగుంచము లాడువాఁడు కవియా? ప్రకృతిజ్ఞానశూన్యుఁడు కవియా? అసూయాపి శాచావిష్టుఁడు కవియా? నమీచీనయోజనాభావ దుర్భావుఁడు కవియా? కష్టనిష్ఠురవచఃపుంజా నమంజసుఁడు కవియా? మనోలాఘవసనాథుఁడు కవియో? ఈతఁడే కవి యగునెడల నింకఁ గవి కానివాఁ డెవ్వఁడు? ఏమి? ఇంక మంగలిపౌదియరలలో నవలలు! చాఁకివానిగాడిదవీఁపున శ్రవ్యప్రబంధములు! పారిశుద్ధ్యసంఘమువారి పెంటబండ్లలోఁ బాటలనాటకములు! ఆహా! ఎంతపాపకాలము వచ్చినది! కవి ఎంతలఘువైపోయినాఁడు. కాకియూఁకకున్న గౌరవము కవికి లేదే? అయినవాఁడు-కానివాఁడుగూడ నందులకే సిద్ధపడుచున్నాఁడే? ఏమి వింతగ నున్నది! అయిన నీగొడవ నాకిప్పు డక్కరలేదు. నేను బోయెదను. తిరుగ నాలుగుదినము లలో రాఁగలను. వచ్చి యామహమ్మదీయునిఁబట్టిన పిశాచమును గూర్చిన సత్యమేదో చెప్పుదును.'' అని తటాలున జంఘాలశాస్త్రి పోయెను. నాఁటి కైదవదినమురాత్రి జంఘాల శాస్త్రి వచ్చి వెకవెక లాడుచు నుపన్యాసపీఠ మెక్కి యిట్లు పలుకఁదొడఁగెను.

నేను బండారునగరమునకుఁ బోయితిని. మనకు లేఖను వ్రాసిన నాగేశ్వరశర్మ యింటికిఁ బోయి యాతనితో నేను ''జంఘాలశాస్త్రి'' నని చెప్పితిని. అతఁడు నన్ను మిగుల గౌరవించెను. ''సాక్షి'' బాగుగ నున్నాఁడా? యనియు, వాణీదాసుఁ డేమిగ్రంథముల రచియించినాఁ డనియు, నింత కాలమునుండియుఁ గాలాచార్యులు మాటలాడకుండుటకుఁ గారణ మే మనియు, బొట్టయ్యసెట్టి బ్రదికియుండెనా? యనియు విమర్శకుని స్వభావము నుగూర్చి వ్రాసిన ''సాక్షి'' లో మిగిలినభాగము తరువాతియుపన్యాసములోఁ జెప్పఁబడు నని వ్రాసినప్రకార మేల చెప్పి యుండలేదనియు, నేను వ్రాసినలేఖ జూచుకొనియే మీ రిచ్చటకు వచ్చితిరా?'' యనియు నాతఁడు నన్నడిగెను. ఇన్ని ప్రశ్నల కొక్కసారి నే నేప్రశ్నమునకు ముందుత్తరము చెప్పుదునా? యనుకొనుచుండ నంతలో ''నామహమ్మదీయుఁడు నాకు హితుఁడు. నేను మిమ్మాతని యింటికిఁ దీసికొనిపోయి యాతనితో మాటలాడింతును ర'' మ్మని లేచెను. నేను నాతనివెంటనే పోయి యాతనిఁ జూచితిని. ఆతఁడు దాదాపుగా నలువదియేండ్లవాఁడు. దృఢగాత్రుఁడు. నల్లనివాఁడు. గడ్డమును, మీసమును గొరిగించుకొను నలవాటుకలవాఁడు. శుద్ధశ్రోత్రియబ్రాహ్మణుఁడువలెఁ బైకిఁ గానఁబడినాఁడు. నాకు హిందూస్థానీభాషలో స్వల్ప పరిచయ ముండుటచే నాతనితో నాభాషలో మాటలాడితిని. ఆతఁడు చెక్కు చెదరని మొగముతోఁ గొంతసేపు విని ''బాన తెలియదు బాబూ!'' అని యనెను. ఆమాట విని నేను వింతపడితిని. తురకయాతని కుర్దూభాష తెలియనిభాష యగుట యెంతప్రారబ్ధమో యని నామనస్సులో నే ననుకొని యంతలో ''నాంధ్రభాష మా కక్కర లేదు. అది మాకు

సరిపడదు. తెలియదు. దానివలన లాభము లేదు. దానిని విసర్జించితిమి'' యని పలుకు నాంధ్రబాలురమాట జ్ఞప్తికి రాఁగా స్వాపద్విశేషములోఁ బరాపల్లేశమును మరచి పోయితిని. ఔరంగజేబు ''హడావడి''లోనో, నానాసాహేబు ''గత్తర''లోనో యేకత్తి మొననో యేరోఁకటి పొన్ననో– యజ్ఞోపవీతవిసర్జనము చేయవలసివచ్చిన యేయూరామ ద్రావిడుఁడో యే ప్రథమశాఖాబ్రాహ్మణుఁడో యీతని విచిత్ర మహమ్మదీయ వంశమునకు మూలపురుషుఁడై యుండవలయు నని నే నెంచితిని. ఆతనికి నాకు నంత నాంధ్రభాషలోనే సంభాషణము జరిగెను. భూతావేశమే యని యీతనికిఁ గూడ బూర్ణమయిన నమ్మక ముండెను. కచ్చపేశ్వరశాస్త్రులవా రిచ్చిన కాగితపుఁజుట్టలను రెండుదినములనుండి నిప్పుపై నైచి ముసుఁగుఁ బెట్టుకొని యాపొగను బీల్చుచున్నా నని యీతఁడు చెప్పెను. పగ లీతనితో మాటాడుట కెవ్వనికిని భయము లేదు. కాని దీపములు పెట్టినతరువాత నాతని నెవ్వఁడు చూడఁడు. ఎవ్వరు దరి చేరరు. అతని సేవకుఁ డాతనికి సాయంకాలము కాకుండనే భోజనము గదిలో నుంచిపోవును. తెల్లవారువఱ కాతనియొద్ద నెవ్వఁడుండఁడు. ఆతనికి భార్యాపుత్రు లెవ్వరు లేరు. ఆతనిస్థితి యట్టులున్నది. ''సాహేబుగారూ! ఈరాత్రి నన్ను మీగదిలో మీకు సహాయుఁడుగఁ బండుకొననిచ్చెదరా?'' యని నే నడుగుచుండ నాగేశ్వరశ ర్మ–యొక్క బ్రహ్మకు, నాకుఁ, దనకుఁ దప్ప మరెవ్వనికిఁ దెలియకుండునట్లుగా నా పిర్రలపైఁ దేలు కుట్టినంత బాధ నిచ్చి గిల్లు నొక్కటి గిల్లినాఁడు. అందులకు సాహసింపవల దని యాగిల్లునకు వ్యాఖ్యానము కాఁబోలు. ''అకారణముగ మీరెందుల కాపదలలోఁ జిక్కుఁకొం దురు?'' అని సాహేబుగారు ప్రత్యుత్తర మిచ్చిరి. ''నా కేమి భయము లే''దనియు, ''నేను బరిశోధనకైవచ్చినాఁడ'' ననియు నాతనితోఁ జెప్పి యారాత్రి నాగేశ్వరశర్మ మొదలగువారు నిరోధించు చున్నను నాతనిగదిలోనే పండుకొంటిని. ఆరాత్రి నేను గంటిమీఁద రెప్పయైన వేయకుండ మేలుకొనియుంటిని. మునలిమానుఁడు ముసుఁగుఁదన్ని దీపాలు పెట్టుఁగనే పండుకొనెను. ఆరాత్రి యొకచిత్రము జరిగినది. నాకన్నులారఁ జూచితని. నా కత్యద్భుత ముగ నుండెను. ఈవింత నే నొక్కఁడనే చూచుట కాదు. నే నీసంగతి లోకులకుఁ జెప్పిన నాయొక్కనిమాట నెవఁడయిన నమ్మునో లేదో యని యెంచి యామరునాఁటి యుదయ మున నాయూరిలో సంపన్నుఁడు, సత్యవాదియు నగు గృహస్థునింటియొద్దకుఁ బోయి గడచిన రాత్రి జరిగినవృత్తాంత మంతయుఁజెప్పుఁగ నాతఁడుగూడఁ దెల్లఁబోయెను. ఆతఁడు, నేను నారాత్రి మహమ్మదీయునిగదిలోఁ బండుకొంటిమి. ఆతఁడు యథారీతిగ నేడుగంటలకే శయనించెను. మే మిద్దరమటు మేలుకాంచి యుంటిమి. గడియార మొంటి గంట కొట్టునమయమున నిన్నటిరాత్రివలెనే యామహమ్మదీయుఁడు లేచి మంచముపైఁ గూర్చుండెను. ఒక నిమిస మట్లు కూరుచుండి చివుక్కున లేచి మంచముకోటిప్రక్క నున్న యగ్గిపెట్టెను జేతఁ బట్టుకొని గదితలుపులు తెరచి దొడ్డిలోనికిఁ బోయి దొడ్డితలుపుఁ దీసి తలుపులు తిరుగ దగ్గిరఁబెట్టి వీథిలోని కేఁగెను. సమీపమున నున్న చెరువుగ ట్టెక్కి నాలుగడుగులలో శ్మశానమునకు నిన్నటివలెనే పోయెను. మే మాతనితోఁ గూడ నుంటిమి. ఆతఁడు మమ్మెక్కడఁ జూచిపోవునో యని కొంచెము భయపడుచు దాపుననే యుంటిమి. ఆతఁ డంత కట్టుకొనిన వస్త్రముల నూడ్చి చేతిలో నున్న యగ్గిపెట్టతో నంటించి యది మండుచుండఁగ దానిచుట్టు ప్రదక్షిణముచేసెను. ఆభస్మము నచ్చట నున్న చేఁదలో నైచి

దానిని చెరువునీటిలోఁ గలిపి తిరుగఁ జేఁదను భద్రముగ నాస్థానముననే యుంచి దిగంబరుఁడై యింటికి బయలుదేరెను. ఆతఁడు కనులు తెరచియే యున్నాఁడు. మనమ్మోఁగూడఁ జూచుచున్నట్లున్నాఁడు. ఆతనికంటె నాలుగడుగులు ముందాతనియింటిలోఁ బ్రవేశించి తిమి. ఆతఁడు దొడ్డితలుపు గొండ్లెముఁ బెట్టి నడవతలుపు యథారీతిగ గొండ్లెముఁ బెట్టి గదితలుపు గడియనైచి యగ్గిపెట్టెను దిరుగ మంచముకోటియొద్దఁ బెట్టి మంచము క్రిందఁ దూరి శయనించెను. ఈపను లన్నియు నాతఁడొ ప్రతిరాత్రమును జేయుచునే యున్నాఁడు. చేయవలయు ననుబుద్ధితోనే చేయుచున్నాఁడు. కాని Somnambulist (సోమ్నంబులిస్ట్) అని యింగ్లీషు భాషలో నెవనికిఁ జెప్పుదురో యాతఁడే యాతఁడు. కట్టుగుడ్డ కాల్చుకొనిన సంగతి మరునాఁడు తెలియకపోవుట వింతకాదు. ఈస్థితిలోఁ గొంద రుపన్యాసముల వ్రాయుదురు. కవిత్వములఁ జెప్పుదురు. కాని మేలుకొంచు వెంటనే యాపనులెవ్వరుచేసిరో ఏమియు జ్ఞప్తి యుండదు. నర్మదాపురుకుత్సీయములోని విదూషకుడు ''నిద్రలో గ్రామాంత రములకుఁ బోవువారు, నదుల నీఁదువారు గూడఁగల''రని చెప్పినమాట వెఱ్ఱిమాటయో పరిహాసవాక్యమోయని మొదట నే ననుకొంటిని. నేను భూతవిషయకోపన్యాసమగు ''సాక్షి''లో భూతావేశ మని చెప్పఁబడుచోట మేధాసంబంధమైన (Brain and Nervous system), వ్యాధియో జనన కోశసంబంధమగు (womb), వ్యాధియో మోనమో యైయుండు నని చెప్పితిని. Somnambulism అను నీస్థితి Nervous system ''నరములకూడిక''తోఁ జేరిన విపరీతస్థితియై యున్నది కావున వాణీదాసా! ఇచ్చట భూతావేశ మేమియు లేదు. నే నసత్యమాడినదియు లేదు. నీవు నన్ను దూషించినందులకు 'క్షమింపు' మని వేఁడుకొనవ లయును.

34. విచిత్రస్వప్నము

జంఘాల శాస్త్రి యీసారి పూర్తిగా, తనకి వచ్చిన ఒక కలను యథాతథంగా వివరిస్తున్నాడు. ఈ కల రావడానికి కారణం జంఘాల శాస్త్రికి ఒక రోజు తలనొప్పి రావడం. దాని నివారణ కోసం అమృతాంజనం వాడడం. దానిని బట్టి ఆంధ్రపత్రిక గుర్తురావడం, అందులో సారస్వతానుబంధంలో – ''సాక్షి కత్తెర మీనం, బాకి నోరు, చీపరకన్ను, బొర్ర ముక్కు, బుట్టపాగా, తెలివిమాలిన మొగం, ప్రత్యక్ష భూగోళం, దూరంగా అర్ధ చంద్రోదయం, ఆరు నక్షత్రాలు'' (బహుశా ఈ అంశాలతో వున్న బొమ్మ అయి వుంటుంది) మనస్సులో మెదిలాయి. అలా క్రమంగా నిద్ర పట్టి కల వచ్చింది.

జంఘాల శాస్త్రి ఖగోళంలో మొండెం లేని తలతో తిరుగుతున్నాడు. కొత్త గ్రహం అనుకుని అంతరిక్షంలో హాహాకారాలు పుట్టాయి. ఊరు పేరు లేని జంఘాల శాస్త్రిని బాధించడానికి గ్రహాలన్నీ ఏకమయ్యాయా! అనిపించింది. తని గ్రహాన్ని గుద్దుకున్నట్టూ, తన కల పోయినట్టూ ఒక దిగ్భ్రమ కలిగింది. క్షణంలో దృశ్యం మారి శాస్త్రి ఒక మహా పురుషుడి ఎదుట వున్నాడు. ఆ మూర్తి ఒక జపమాలను చేత్తో తిప్పుతున్నాడు. అప్పటికి జంఘాలుడికి అన్ని అవయవాలూ అమరి వున్నాయి. కొంచెం సేపటికి వంది స్తోత్రాల్ని బట్టి, తను స్వర్గలోకాధిపతి ఎదుట ఉన్నాడని, శాస్త్రికి అర్థమైంది. ఇంద్రుడి బిరుదావళిలో అపహాస్యం అతనికి స్ఫురించింది. చేసిన అవమానకరమైన వనుల్ని ఎవరైనా బిరుదులుగా ధరిస్తే ఎంత అనవ్యాంగా వుంటుందో శాస్త్రి ఇక్కడ చెప్పాడు. తాను చూసిన మహా పురుషుడు ఎందుకొచ్చావని అడిగితే, తాను ఎలాంటి అవకతవక కారణం చెప్పాడో జంఘాల శాస్త్రి గ్రహించాడు. తన్ను పలకరించిన వ్యక్తి, భూమి మీద నీచత్వాల్ని, స్లీడరీ వృత్తిలో అనర్థత్వాన్నీ దులిపి పారేసినవాడు, బృహస్పతి అని గ్రహించాడు. చివరికి, రాజరాజనరేంద్రుడి సందేశం అందుకుని, స్వప్నంలోంచి బయటపడ్డాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నిన్నరాత్రి తలనొప్పి యధికముగా నుండుటచే జాలసేపటి వఱకు నిద్రలేదు. అమృతాంజనమును నుదుటికి బాగుగా రాచితిని. చేతితో దీసివైచినట్లా బాధ త్వరలో

నదృశ్యమయ్యెను. అమృతాంజనమును బట్టి యాంధ్రపత్రిక జ్ఞప్తికి వచ్చినది. ఆంధ్రపత్రికను బట్టి దానిలోని సారస్వతానుబంధము జ్ఞప్తికి వచ్చినది. దానినిబట్టి దానిలోని సాక్షికత్తెరమీ సము, బాకినోరు, చీఁపఱికన్ను, బొట్టుముక్కు, బుట్టపాగ, తెలివిమాలిన మొగము, ప్రత్యక్షభూగోళము, దూరమున నర్ధచంద్రోదయము, నాఱునక్షత్రములు చిత్తదృష్టిని గోచరమైనవి. వానిని గూర్చి నిద్రాగమనారంభములగు లంకెలేని యూహములేవో సందె చీకటిలోని గబ్బిలములవలె నట్టిట్టెపట్టెపమనియిట్టితురుతురుమనుచుండగా నింతలో నిద్ర వచ్చెను. కొంతసేపటికిఁ గాబోలు స్వప్నము గూడ వచ్చెను. అది యిట్లుండెను:– ''నాకుఁ దలయే కాని మొండెము లేదు. అది గిఱగిఱ వాయువేగ మనోవేగముతోఁ జంద్రునిచుట్టుఁ దిరుగుచున్నది. అయ్యో! రాహువురా అయ్యో! రాహువురా!! యనుధ్వనులు చంద్రమండ లము నుండి యెగురుచున్నవి. భూప్రదక్షిణము చేయుచుఁ జంద్రుడీకేకలు విని మఱింత తటపటాయించుచున్నాఁడు. కబళింతు ననికాఁబోలు గడగడలాడుచున్నాడు. 'ఇప్పుడె క్కడి రాహువురా? రాహువునకుఁ గత్తెరమీసనేమి? కంఠపట్టమేమి? గంగిరెద్దుపాగయేమి? యని కొన్ని పెద్ద కేకలు భయభ్రాంత చిత్తుల యూలాపముల వలె వినఁబడెను. 'లెక్క పెట్టుఁడు: మనము సరిగాఁ దొమ్మండ్రున్నామో యెక్కువ యున్నామో వేగ లెక్క పెట్టుఁడు.' అని వివిధ కంఠరవములు విశేషసంభ్రమ సంపీడితములై వినవచ్చెను. లెక్కపెట్టు మనువారే కాని లెక్కపెట్టువారెవ్వరు? తెఱపి లేని తిరుగులాటలలో నూఁపిరి సలుపక ఒకరిని మించి యొకరు, నొకరివెనుక భయంకరవేగముతో, భయంకరారావములతో, భయంకర వైఖరితో గిరగిరలాడుచు, గిలగిలలాడుచు, గగ్గోలుపడుచు నుండఁగా, నిల్చునంతటితీరిక యెవరికి? లెక్కపెట్టునంతటి మనశ్శాంతి యెవరికి? అంతలో 'మేము సురక్షితులమై యున్నాము. కాలసర్పయోగముచే మీరందరు నూనడుమనే యున్నారు. తొందర పడకుఁడు. వచ్చిన దేదో క్రొత్తగ్రహము కానిమాలోని రాహువు కాఁడు. నిదానింపుడు.'' అని రాహు కేతువులు దూరమునుండి రోదసీకుహర మదరునట్లు కేకలు వైచిరి. కొట్టుఁడు. పొడిచేయుఁడు. చంపుఁడు. తగులబెట్టుఁడని కేకలు ప్రతిగ్రహమునుండి ప్రజల ప్రచండధా టితో బయలువెడలినవి.

మహాతేజోమండలమగు రవి గర్భగోళమునుండి కొన్ని తోఁకచుక్కలు ర్రైమనుచుఁ బేకజ్వ్వలవలె నాచెవిప్రక్కనుండి పోవుచున్నవి. చంద్రగోళమునుండి యగ్నిపర్వతములు పటాలు పటాలునఁ బగిలి, కాలి, కరిగి నీరై యెర్రగనుండిన ధాతువులను నాపై వర్షించుచుం డెను. శుక్రగోళమునుండి రక్తవర్ణులు మిడిగ్రుడ్లవారు, జుంజురు మీసాలవారు, గదాకలిత గాఢకరార్గళులగువార గొండబిలము లంతటినోళులు తెరచి, రాక్షసులు కాఁబోలు, నన్నుఁ జంపుటకై వచ్చుచున్నారు. ఆహా! ఊరుపేరులేనియొక్క జంఘాలశాస్త్రిని బాధించుటకు గ్రహము లన్నియుఁ గలిసినవే? కాలచక్రమంత నేకమైనదే! సెబాస్! ఏమిన్యాయప్రవర్తనము! ఎట్టిసమకక్ష! ఏమిధర్మయుద్ధము! ఓ! గదలవర్షము, రాలవర్షము, ధూమకేతుకోటివర్షము, ఓ! బ్రహ్మాండకర్పర మంత నొక్కటేమంట. ఆమంటలోఁ జిటచిట పటపట చురచుర! హరహరా! ఏమని చెప్పఁగలను! ఎంత యని చెప్పగలను! కానియెన్ని తోఁకచుక్కలైన నాకత్తెరమీసముగొన నైనఁ గాల్పలేకుండనున్నవి. ఎన్ని విద్యుజ్వ్వాలలైన నానెత్తిపై నున్న బెందుబుట్ట నంట లేకున్నవి. సర్వగ్రహమహాయుద్ధసంరంభమును సహించుచు నీవైపునుండి యావైపునకు గిరగిర దిరుగుచుఁ బరుగెత్తుచు నెగురుచు శిరోమాత్రశరీరుఁడనై యంబరమం

తను జొట్టఁబెట్టితిని. తలఁచుకొనుటకైన శక్యముకాని మహావేగమున నొళ్లెగురుచు నొక్కపరి శనిగోళముతో డీడిక్కి కొట్టితిని. శనైశ్చరుఁడు కోపముతో న న్నవలోకించి కుంటికాలితో నొక తన్ను నా తలపాగపైఁ దన్నెను. అమృతాంశుని యగ్నిపర్వతధాటికంటె, సర్వతాపనగ ర్భోద్గతధూమకేతుధాటికంటె, మందుని సొట్టకాలితన్ను సహస్రగుణాధిక బాధాప్రదానప్ర భావమై యుండెను. ఆహా! గ్రహరాజనఁగ శనియే. ఆతని దెబ్బవంటిది మరియేది? అన్ని యితరగ్రహములొకయొత్తు. శనిగ్రహమొక్క యెత్తు. మేరువును పేడకుప్పను జేయుటలో, పేడకుప్పను మేరువును జేయుటలో, చీమను సింహము చేయుటలో, సింహమును జీమ చేయుటలో, ముష్టిపందను మూర్ధాభిషిక్తుని జేయుటలో–మూర్ధాభిషిక్తుని ముష్టిపందను జేయుటలో–ఖడ్గము లేకుండ ఖండించుటలో, మంటలేకుండ మాడ్చుటలో–ప్రాణము పోకుండఁ జంపుటలో, సృష్టిని దలక్రిందు చేయుటలో, శనైశ్చరుని కున్నశక్తియసాధారణము –అప్రతిహతము–అనిర్వాచ్యము. ఆతని దెబ్బతో నయ్యయ్యో యని యరచితిని. జయా మందమహారాజునకు జయాయను కేకలు గ్రహలోకమంతయు వ్యాపించెను. అంతట నాతల యేమయ్యెనో నాకుఁ దెలియలేదు. అంత వైపరీత్య ముండునా? తల యేమయ్యెనో తెలియకపోవుట యెన్నఁడైన నుండునా? తెలిసికొనుబుద్ధి తలలోనే యున్నప్పుడు తలలేదని దేనితోఁ దెలిసికొనుట! అప్పుడు నేను గేవలాత్మస్వరూపుఁడనై యుంటినిఁ గాబోలు? ఏమియో తెలియని యవస్థ నెట్లు చెప్పఁగలను? కాని కొంతసేపటికి నేను సర్వాంగసంయుక్త స్వచ్ఛతనువిలసనుఁడనై యొక మహావ్యక్తియెదుట నిలువఁబెట్టఁబడితిని. ఆస్వరూప మెవ రిదో నాకప్పటికిఁ దెలియలేదు. తేజోవిగ్రహము! జ్యోతి స్స్వరూపము! ప్రక్కనొక్కండు జపమాలఁ ద్రిప్పుచుఁ గూరుచుండెను. బ్రహ్మవర్చస మాతని వదనముపైఁ బరమదుర్ని రీక్ష్యమై యున్నది. సంపూర్ణాంగసంయుక్తుఁడనై యుండుటచేత వారికి సాష్టాంగ దండప్ర ణామ మాచరించితిని. నేను ధరించిన దేహము నాది కాదని నే నెరుఁగుదును, కాని నేను జంఘాలశాస్త్రినను పూర్ణమైన విశ్వాసము నాకున్నది. అది యావంతయైనఁ జెడలేదు. ఆహా! ఆత్మయొక్క మహామహిమము! స్వవ్యక్తిప్రతిష్ఠాపనాశక్తి! అడుగువాఁ డారడుగులవాఁడు కావచ్చును. అవయవము లన్నియు నూడవచ్చును. ఆఫ్రికాదేశములోని 'నీగ్రో' తన చర్మముక్రింది Blackpigmant ను తీసివేయించుకొని యమృతాంశు సన్నిభశరీరుఁడు కావచ్చును. అగ్రజాఁ డంత్యజుఁడు కావచ్చును. ఆఁడుది మగవాఁడుకూడఁ గావచ్చును. కాని లోపలి 'నేను' మాత్ర మెన్నటికైన నేనే, దానికి మార్పులేదు. నేను నే నని తెలిసికొని యట్లాచరించువానికంటె ధన్యుఁ డెవ్వఁడు? నీస్థితిగతులలో, నభినివేశనములలో నెట్టియ సాధారణమైన, యసాధ్యమైన, మార్పునైన నీవు కోరుకోవచ్చును. కాని నీలోని 'నేను' మాత్రము మరియొక్కనిలోని 'నేను'గా మారుట కెన్నఁడును గోరుకొనవు. అట్టుల కోరుకొనఁజాలవు. నీ 'నేను' నీ కెప్పుడుండఁదగినది. అదియే. నీది అదియే. నీవు అదియే. నేను శాశ్వతము అని మెట్టవేదాంతధోరణిగా నేను లోన నసుకొనుచుండఁగా నమస్కారప్రతి ఫలములగు నాశీర్వాదములు నాచెవిని బడలేదు. కొంతసే పట్లు నిలుపఁబడియుంటిని. అంతలోఁ ''త్రిలోకాధిపతీ! జయా! అమరావతీ రాజధానీ నివాసప్రియా! జయా! బృందారక వర్యా! జయా!'' అను హెచ్చరికలు చెవిసబడెను. ఇది యింద్రలోకమని–యెదుటి యవర్ణ్య తేజ మింద్రుఁడని గ్రహించితిని. ప్రక్కనున్న యాతఁడు బృహస్పతియై యుండు ననుకొం టిని. కాని నాకు నిశ్చయముగామాత్రము తెలియలేదు. అంతలో మరియొక్క ప్రక్కనుండి

'అహల్యాజారా! జయా!'' యను కేక వినఁబడెను. అంతవరకుఁదటస్థముగాఁ దూష్ణింభావ ముగా నుండిన యింద్రుఁ డీహెచ్చరిక విని గొంతు సవరించుకొని మీసములు వడివైచికొని పరమానంద సూచకముగా శిరమును గొంత యొయ్యారముగా నూపి, ఒడలి నిండ నాక్రమించిన కన్నులను దెరచి విలాసముగా నాల్గువైపులఁ జూచుచు మందహాసము చెంప లావరింప, గర్భాధానపుఁ బెండ్లికొడుకువలె మురిసి మురిసిపోయెను.

అహల్యాజారా! యను మాట వినుసరి కొడలు చావవలసినవాఁ డుత్సాహమున నుప్పొంగి యుబుకుచున్నాఁడే! కన్నులవెంట నెత్తురు చుక్కలు రాల్పవలసినవాఁడు శృంగారరసమును గ్రక్కుచున్నాఁడే! తిట్టు గౌరవ మనుకొన్నాడే? ఒడలివాత వజ్రాభరణ ముగ భావించుచున్నాఁడే? బూతు బిరుదమని యెంచుచున్నాఁడే? సాధ్యమే యగునెడల మరచిపోఁదగిన మహాద్రోహమును–మహాపాతక గాథను–మరల మరల హెచ్చరికలుగా మహా నందమున వినుచున్నాఁడే? వీనికి సిగ్గుబిడియము లున్నవా? పుణ్యపాప భేదమున్నదా? నిందాస్తుతిభేద మున్నదా? యుక్తాయుక్తవిభేద మున్నదా? నిజముగా నీతఁడింద్రుఁడా –విద్యాగంధశూన్యుఁడగు వేషధారియా? అయ్యయ్యో! మన భూలోకమే యింతకంటె మంచిదిలాగున నున్నదే! అక్కడి ప్రజలింత లజ్జాశూన్యులు గారు. ఇంత గౌరవాభావులు కారు. ఇంత సదసద్వివేకము లేనివారు కారు. ఇంత గిరిదాటినవారు కారు. పురందరలో కము భూలోకముకంటెఁ జెడిపోయెనే! భూలోకమునఁ గూడ మిథ్యావాదు లున్నారు. చోరాగ్రేసరు లున్నారు. వ్యభిచారపరాయణులున్నారు. ద్యూతప్రియు లున్నారు. త్రాగు బోతు లున్నారు. కాని యెంత మహోత్సాహమున వారిట్టివ్యాపారము లొనర్చినను వానిని ఘనముగా వారే చూచుచుండుట లేదు. గౌరవయుక్తముగా వారే యాదరించుటలేదు. తప్పును దప్పుగానే చూచుచున్నారు. కాని దానిలో గౌరవమున్నదని యెంచి తప్పును బహిరంగముగా నుద్ఘాటించు కొనుచండుట లేదు. చుట్టఁగాల్చినవాఁడు సభలోనికి వచ్చిన ప్పుడు లవంగమును నోటనుంచుకొని వచ్చుచున్నాఁడు. జూదగాడు నాల్గుగోడలనడుమనే మిడుకుచున్నాఁడు. మొగము గానఁబడకుండ మేలుముసుఁగు వైచుకొని చప్పుడుకాకుండఁ గాలిజో డూడ్చి పంచపంచల గ్రీనీడవెంటనే తారుచు వేశ్యాగృహమునకు వ్యభిచా-రిపోవుచున్నాఁడు. అంతేకాని, మహామహోపాధ్యాయ బిరుదమును దీసివైచి పండితుఁడు 'మధుపాన విదగ్ధా' యను బిరుదమును గ్రాసికొనుట లేదు. గ్రాయించుకొనుట లేదు. సన్యాసి 'పరమహంస' యను బిరుదమును ధరించుచున్నాఁడు కాని ప్రత్యక్ష ప్రాచీన సువాసినీ స్నిగ్ధశిరః పరామర్శన సాహితీ సనాథా యను బిరుదమున కుత్సాహపడుచుండుట లేదు. 'M. R. A. S.' బిరుదమును విసర్జించి 'మండపాక మాణిక్యవేశ్యా ద్వితీయపుత్రికా తృతీయ పరిపాలకా' యని యనిపించుకొని యుప్పొంగుచుండుట లేదు. అట్టివ్యాపారము తప్పని వారెరుఁగుదురు. కాని తప్పని సరియగుటచేఁ జేయుచున్నారు. కేవల రసప్రధానుఁడైన కవియును పాదాది బ్రహ్మరంధ్రపర్యంతము భావనామయుండైన కవియును కవివరుండను బిరుదమును విసర్జించి 'కడముంతముఖీ కన్నెరి కొప్పెళ్లికొడుకా' యని 'కంగాళి' గ్రామ్యభా షాసమానమున గౌరవ బిరుదమును బఠింపించుకొనుచున్నాఁడా? భూలోకమున నెవ్వరికిని లేని యహంభావము, నస్వభావవైఖరి, యవకతవకచర్య ఈ యింద్రున కెందులకో? చేసినపాపములకే బిరుదములు పఠింపించుకొనునెడల నరులకు శిరస్సులపై వెండ్రుకలకంటె బిరుదము లెక్కువగ నుండునే! 'పండిత భిషగ్వరా' యని యనిపించుకొని సంతసింపవ

చ్చును గాని ప్రత్యక్ష యమకింకరా' యని బిరుదమును పఠింపించుకొని యానందింపవ చ్చునా? 'దివాన్ బహద్ద'రను బిరుద మున్నది. కాని 'దేశద్రోహి' యను బిరుద మున్నదా? జమిందార్ అని హెచ్చరిక చేయవచ్చునుగాని 'ముండలముతాదార్' అని చోపుదారువానిచేఁ జదివింపవచ్చునా? యని యడ్డదిడ్డముగా నాలో నే ననుకొనుచు నొక్క రెప్పపాటుకాలము నిలువఁబడి యుండఁగా 'నీ వింద్ర సన్నిధానమునకు వచ్చుట కేమికారణ' మని యా బ్రహ్మతే జస్సంపన్నుఁడు నన్నుఁబ్రశ్నించెను. అంత నేమిచెప్పుటకును దోఁపక యేమిచెప్పిన నేమి తప్పో యని యెంచుచు, ఆలస్యముగాఁ బ్రత్యుత్తర మిచ్చునెడల ననత్యమాడుచున్నానను సందేహము వారికిఁగలుగునేమోయని సందేహపడుచు, నేదియో యొక్కటి చెప్పక తీరనివాఁ డనగుటచే "మహానుభావా! మా దేశమున వర్షములు లేవని మనవిచేసికొన వచ్చితిని." అని సగము సత్యము సగ మసత్యము నగు ప్రత్యుత్తర మిచ్చితిని. ఆమాటవిని యాదేవ గురుఁడు 'ఓరీ! బుద్ధిహీనుఁడా' యని నన్ను దిట్టి జపమాలఁద్రిప్పుకొనుచు నూరకుండెను. ఇంద్రుఁడు మాటలాడనేలేదు; బృహస్పతి నన్నుఁ దిట్టినతిట్టు నాచెవిని బడఁగనే నాయంత రంగమునఁ బెద్ద తుపాను పట్టినట్లయ్యెను. 'బుద్ధిహీనుఁడనా? ఔను! కానా! నిజముగా బుద్ధిహీనుఁడనే. స్వచ్ఛశరీరుండనై, నిర్మలాంతఃకరణుఁడైన, యాకాశగంగాంభోజ పరిమళా స్వాదననిర్గతపాపుఁడనై, స్వర్గమునకుఁ బోయి–స్వర్గాధిపతిని దర్శించి –సౌరాచార్యయనర్యునిచే 'నీవేమి కోరవచ్చితి'వని దయాపూర్వకముగా నడుగఁబడినప్పుడు 'మహానుభావా! ఆధ్యాత్మిక విద్యోపదేశమునకు వచ్చితి' ననలయును గాని యిట్లుంటినేల? బృహస్పతితో మాటలాడుచున్న నోటినుండికూడ నింత తెలివిమాలినమాట యెట్లు వెడలెను? మహాభోగభాగ్యాన్వితుఁడైన మహేంద్రుని సన్నిధానమున నున్నప్పటికిని నానె త్తిపై నినుపగజ్జలతల్లియే భాగవత మాడవలయునా? భవతారక సాధనమగు బ్రహ్మోపదేశము నకై ప్రాకులాడవలసిన నాకట్టి యవకాశమున సుప్పాడక్రొత్తపల్లిలో నూడుపు కాలేదని యేడు పెందులకు? ఆహాహా! స్వచ్ఛమైన యాత్మకీదిక్కుమాలిన దేహసంపర్కమెంత యుపాయక రము! ఎట్టి పరమపవిత్ర భక్ష్యవస్తువైన దేహసంస్కారము లిట్టి భ్రష్టపరచునుగదా? అమరా వతిలో నమరేంద్రుని సన్నిధానమునసనుండి క్షుత్పిపాసాశూన్యుఁడనై యున్న నా కాకుమల్లెండి పోయె నని శోకమేల? ఎంతకాలము క్రిందనో పుట్టి, ఎన్ని యాటలో యాడి, ఎందులోను గూడ సుఖములేదని తెలిసి, ఎవ్వరి లక్ష్యముగాని భయముగాని లేక, యాత్మీయశక్తివిశ్వా సయుతుఁడనై యున్న నేనే బృహస్పతియొద్ద వెర్రిపందవలెఁ బ్రవర్తించితినే! కుబేరునియొద్దకుఁ బోయి గోచిపాఁత నడిగినవాఁ డుండునా? వరుణదేవుని దర్శించి పళ్ళెడు రొయ్యపప్పడిగినవాఁడుండునా? అయ్యయ్యో! ఎంత జ్ఞానశూన్యత సిద్ధించెను! అని నన్ను నేను దిట్టుకొనుచుండఁగా నామహర్షి యిట్లనెను.

వర్షములు లేవా? ఏల కురియవలయును? మీ రింద్రుకరుణకెట్లు పాత్రులైతి రని కురియనలయును? మీ రేయాగములలో హవిర్భాగములకై యీవృత్రారిని బిలిచినారు? మీకింద్రుఁ డక్కరలేనప్పు డాతనివర్షము లేల కావలయును? తండ్రి దుర్మార్గుఁడు, ఆతని సొమ్ము పవిత్రమునా? పోని! వేదవిహితకర్మములమాట యెందులకు? గర్భాధానములే మీయాధానములు. చుట్టగాల్చుటయే మీనిత్యాగ్నిహోత్రములు? విదేశభాషాధ్యయనమే మీవేదాధ్యయనము! కాఫీత్రాగుటయే కాలోచిత సంధ్యావందనము! ఆచారపరిత్యాగమే మీ యాగము: పరగడుపునఁ బరిపరివిధపక్వపిష్టపాశనమే పురోడాశము! తిష్ణూత్రత్వమే

మీదేవపూజ. అధికారసేవయే మీపితృదేవపూజ. దేశభాషాధ్వంసనమే మీమాతృదేవపూజ! పోనీ! చిరకాలాచారములనైన మీరు గణించుచున్నారా? సహస్రఘటాభిషేకముల నమ్మికతోఁ జేసితిరా? నదీగర్భమున విరాటపర్వమును జదివించితిరా? పురాణములు పూర్వాచారములు బూతులా? ఇంకను వర్షములు లేవనుచున్నావా? మీకు బుద్ధులున్నయెడల వర్షము లేల లేకుండును? పరమసౌఖ్యాకరమైన భరతఖండమునకు మీబుద్ధిహీనతవలనఁ బ్రాపించినబాధ లిన్ని యన్నియా? మీదేశమునకు క్షామ శీతజ్వర విషూచీ మహామారికా భూకంపాదిబాధ లేల కలిగెను? మీబుద్ధిలేమివలన కలిగినవి. వెంటనే నశింపక యేల వృద్ధియయ్యెను? అంతకంటె బుద్ధిలేమి వలన–మీరు సత్యప్రవర్తనులై యోగనిష్ఠాన్వితులై వేదవిహిత కర్మాచార ణదీక్షులై యంతరంగపరిశుద్ధులై యుండునెడల మీదేశము నేరోగము త్రొక్కిచూడఁగ లదు? నీటిలోఁబుట్టినదని మీరెంచుచున్న విషూచీ సూక్ష్మక్రిమి మీనెత్తిలోఁ బుట్టినది. గాలిలోఁ బుట్టినది. భూమిలోని గంధకాది వాయ్వాదిసంఘర్షణమువలనఁ గలిగినవని. మీ రెంచుచున్న భూకంపములు మీహృదయములోని యరిషడ్వర్గసంఘర్షణమువలనఁ గలిగి నవి. అనత్యవాదులై మిథ్యావేషులై యాచారవ్యవహార దూరులై వైదికవిద్యాగంధశూన్యులై ప్రాణాయామాది సాధనసన్యాసులై అపేయపాయులై యభక్ష్యభక్షులై యుదరంభరణసాధనవి ద్యామాత్రపరిగ్రాహులై పూర్వగ్రంథనిందాపరాయణులై సంస్కృతభాషాపరిత్యాగశీలులై, దేశ భాషాధ్వంసకులై, భక్తిజ్ఞానసాధనభ్రష్టులై, పతితులై, దేహసౌఖ్యమాత్ర ప్రధానులై, సంతత విషయసౌఖ్యాభ్యసన దుర్బలీకృతశరీరులై నిస్సారాంతరంగులై, లౌకిక జంఝూట సంచాలిత చేతస్కులై, ధనరాసులు గడించి వర్తకమును వృద్ధిచేసి పట్టణములు కట్టించి, ప్రబలాధికారము లుచేసి, భగవచ్చింతాదూరులై ధనరాజ్య మదమత్తులై మిథ్యాగౌరవసమన్వితాంతఃకరణులై సౌఖ్యావధిని బొందితి మనుకొని గౌరవాగ్రస్థానమును చేరితి మనుకొని, టప్పనకుండ భూలోకమునఁ బేలిపోయినఁనా రెందరు? ఎన్ని యెన్నిజాతులు మహాధన మత్తతాభూయిష్ఠ ములై మహారాజ్యపదవీ ప్రభవోన్మదములై మహాయుద్ధముల రూపయిన లేకుండ మాడిపో లేదు? మీయార్యజాతి కింతవరకు మీవేదర్షుల పుణ్యమున మీగంగాగోదావర్యాది పుణ్యనదుల బలువను, మీమత్తకర్తల మహిమవలన జాతినాశనమంతటిదుర్దశ రానందులకు సంతోషింపక, వర్షములు లేనని యేడ్చుచుంటివా? అసత్యమెచ్చట నభివృద్ధిచెందునో, యన్యాయమర్యాద యెచ్చట నగ్ని పాలగునో, ధనమే దైవముగా నెచ్చట నారాధింపఁబడునో, దేహసౌఖ్యమే పరమావధి యని యెచ్చట నిశ్చయింపఁబడునో, అచ్చట సర్వనాశము శీఘ్రముగాఁదప్పదు. పండినపాపము బ్రద్దలు కాకమానదు. ప్రపంచములోని విషమత్వమును ఖండించుటకు, సమత్వమును స్థాపించుటకుఁ బ్రపంచ వస్తుపరాఙ్ముఖతయు, భగవత్పాదారవిందలగ్న మన స్కతయు, ప్రజ్ఞకుఁ దెచ్చుటకుఁ బ్రకృతికాంత యట్లు మన క్షేమమునుగోరి పడరానిపా టులు పడుచుండఁగా–చినగంజాములోఁ జినుకులేదని యేడ్చెదవా? వర్షములు లేవని యేడువక బుద్ధిలేదని యేడువుము. ప్రకృతి యెంత కరుణాన్వితమో నీవెరుఁగుదువా? నీబుద్ధిలోనే సర్వప్రపంచ మిమిడ్చినది. బుద్ధిహీనుఁడా! తిన్నఁగఁ జూచుకో! మేఘములు నీమెదటిలోనే యున్నవి.

ఇఁక మీరాజకీయతంత్రములోని యసందర్భతలను జెప్పఁదగినదే–కాని నేను జెప్పను.'' అని నావంక నాతఁడు తేరిపారఁజూచెను. ''చిత్తము. రాజకీయవ్యవహారములఁ గూర్చి ముచ్చటింపఁగూడదని మాసంఘమున సాక్షిచేసిన కట్టుపాటున్నది'' అని నే

నంటిని. 'నీమొగము నంఘము–నీమొగము సాక్షి–నోరుమూసికొని విను' మని యాతఁ డిట్లనియెను. ''సామాన్యనంసారధోరణిని మీరెంత యసందర్భముగాఁ బ్రవర్తించుచున్నారో చెప్పెదను. తలకుఁ దిలల నూనెను రాచికొనినవానిని మూఢుఁడని యనాగరకవ్యక్తియని వెర్రిమొగమని మీరు తూలనాడుచున్నారు. సుగంధయుక్తములగు నెర్రని పచ్చని నూనెలను మీరు రాచికొనుచున్నారు. మీకాంతలచే రాచికొనఁ జేయుచున్నారు–మీతలలు శీఘ్రముగాఁ దెల్లబడుచున్నవి. వెంద్రుకలు త్వరలో రాలిపోవుటచే మీభార్యలతలలు భావిదురవస్థాసూచక ములైయున్నవి. మూఢుఁడని మీరెంచినవాని తలకట్టు నల్లగ నొత్తుగ నిగనిగ లాడుచున్నది. స్వల్పధనసాధ్యమైనది వదలుకొని విశేషధనవ్యయ మొనర్చి ధననష్టియేకాక యారోగ్యన ష్టియు సౌందర్యనష్టియుఁ బొందుచున్నారు. తలకట్టును బట్టుకుచ్చువలెఁ జేయుటలో మెదడులోని వేడిమిని హరించుటలోఁ దలత్రిప్పును దగ్గించుటలో నొడలి కెంత నును పర్మమో యంతవరకే యుంచి–పరిశుభ్రపరచుటలో సీఁగుకాయపులుసు నూరు 'క్యూటి కూరా' నబ్బులకంటె సహస్రగుణాధికమైయున్నది. త్రిలోకసంచారులము. జ్ఞానచక్షువుల మగు మాకది యసాధ్యము కాదు. మీ రుపయోగించుచున్న నబ్బుబిళ్లలచే మీతలలు గరుసెక్కి భ్రష్టము లగుచున్నవి. సీఁగుకాయ తక్కువ విలువగలది కావునను తరచుగా దొరకువస్తువు కావునను మీరు దానిని సంపూర్ణముగా విడిచినారు. ధనమెక్కువ వ్యయమైన గాని సుఖము చేకూరదను నొక పిచ్చి మీకు పిశాచమువలెఁ బట్టియున్నది. పైనుండివచ్చిన వస్తువుగాని ప్రయోజనకారి కాదని మీకు దురభిప్రాయమున్నది.

ఇదిగాక మీతత్వములకు సర్వవిధముల సరిపడునట్టియు, మీ రోగముల నమోఘ ముగా హరింపఁగలిగినట్టియు, మీదేశమం దుద్భవించిన మూలికలతో ధాతువులతో లోహ ములతో నిర్మింపఁబడినట్టియు స్వల్పధనసాధ్యము లగునట్టియు, నాయుర్వేదపు మందు లను మీరు తృణప్రాయముగా వదలిపైచి–విదేశతత్వముల కేర్పడినట్టియు, విదేశ రోగజాతి సంహరణ మొనర్చునట్టియు, మీరెరుఁగని విదేశీయవస్తువుల సమ్మేళనమున నిర్మింపఁబడిన ట్టియు, విశేషధనసాధ్యము లగునట్టియు విదేశీయౌషధములును మీరు స్వీకరించుచున్నారు. మంచి దెచ్చట నున్నను స్వీకరింపనేవచ్చును. కాని దగ్గునకు మీయింటిలోని కరకకాయ యమోఘాస్త్రమై పనిచేయఁగలిగియుండఁగా, రూపాయ తీసికొని Ipecacuanha wine కొరకు బరుగెత్తుట యెందులకు? ఒక్కరూపాయ కరకాయలు ముప్పదితరములవారికైనఁ గాననివారణమున కవ్యాహతముగాఁ బనికివచ్చునే! కాని మూఁడురూపాయల I. W. బుడ్డి యొక్కని దగ్గునకుఁ జాలకపోవచ్చును. ధనియాలు, తిప్పతీగ, రక్తచందనము, వేపయాకులు, పద్మకోష్ఠము దమ్మిడి యెత్తు చొప్పునఁ జేర్చి కాచిన కషాయము సర్వశ్లేష్మపిత్తజ్వరములకు నమంజసమగు మందైయుండగా–ఇంత నూక్ష్మయోగమును –ఇంత చవుకమందు–ఇంత నిత్యదినచర్యోపయుక్తవస్తునమ్మేళన నిర్మలౌషధమును – బుద్ధిపూర్వకముగాఁ ద్యజించి వారములకొలఁది యానుపత్రులందుఁబడి, చేదులు మ్రింగి మ్రింగి, యాననవాళశ్రాళనము లొందియొంది, రక్తనాళాంతఃప్రవిష్టౌషధధారాఘాటికి సహించి సహించి యతికష్టముమీఁద బాగుపడుచున్నారు. ఒక్కని Typhoid జ్వరమునకుఁ బెట్టిన వ్యయముతో ననేకుల నన్నిపాతములను గుదుర్పవచ్చును. సొంటియుక్కిరి దెంతపనియో cream of malt ది అంతపని. కాని మూఁడుదమ్మిడీలు విలువ గలదానియందు విశ్వాసము తక్కువ. మూఁడురూపాయల బుడ్డియందు విశ్వాస మెక్కువ. నేను సర్వసాధారణ కుటుంబౌషధ

యోగములనే చెప్పుచున్నానుగాని గొప్పగొప్ప యోగములజోలికిఁ బోవుటయే లేదు. Cod liver oil పనియెంతయో ఖండార్థకపుబని యంత. కాని మొదటిది మీకు నెత్తిమీఁదిది. రెండవది పెంటమీఁదిది. మీలోఁ గొందరి బధిరతలు, కడుపులో బల్లలు, మూర్ఛలు మొదలగునవి ప్రాయికముగా మీతత్త్వములకుఁ బడని యౌషధములను దీసికొనుటవలనఁ గలిగినవైయుండ వచ్చును. ధనమూ పోవుచున్నది. పనియూ లేకపోవుటయేగాక తరచు నష్టముకూడఁ గలుగుచున్నది. ఏమి వినియోగము!

మహాయుద్ధములలోఁ దుపాకిగుండ్లివై పుననుండి యావైపునకు, ఆవైపునుండి యీవై పునకు రయ్యిరయ్యి మని దూసిపోవునట్లు మోటారుబం డ్లెచ్చటఁ జూచినను బ్రతిగ్రామమునఁ జెలరేగియున్నవి. ఈపిచ్చి జనుల కెంతయైన నున్నది. ఇంత బాణవేగ మెందులకు? నిమ్మళముగాఁ బోరాదా? ఏమి పుట్టి మునిఁగెను! ఎందరు జను లీవేగమున నలిగి చచ్చుచున్నారు! ఆహా! ఎంత పాపకర్మము. ఇంతకును సౌఖ్య మేమైన నున్నదా? దేహసాధన మేమైన నున్నదా? ఎప్పుడెవఁడు క్రిందఁబడి నలిగి చచ్చునో యను భయముచే మనశ్శాంతి యున్నదా? నడచి పోఁగూడదా? మోటారెక్కినఁ గాని గౌరవములేదు. ఆర్యుల గౌరవ మంతలోనికిదిగినది. ఇవికాక Petroleum సంబంధమగు దుర్వాసనచేత దానివేడిమి చేత ధావనారంభమున మోటారుచేయు భయంకరమైన దడదడచే నెందరకు హృదయకంపా దివ్యాధులు కలుగుచున్నవో యోజించినారా? ధనమూ తగులఁబడిపోవుచున్నది. ఒక్క సాధారణ వర్తకుని నెల కగు Petroleum ఖర్చులతోఁ బది సామాన్య సంసారములు సుఖముగా రెండుమాసములు జీవింపఁగలవు. ఏదో ప్రాణముమీఁదికి వచ్చినంతటిపని యున్నప్పుడు పరుగెత్తవలసినదే. విలాసముగా వాయుభక్షణమునకై స్వారిపోవునప్పుడు మోటా రెందు లకు? ఇంతవేగముగాఁ బరుగెత్తించి యొకరి నిద్దరను బట్టాల క్రిందఁద్రొక్కించి, యే సముద్రతీరమునకో మీరుపోయినయెడల నక్కడ మాత్రముచేయు మహాకార్య మేమున్నది? పార్థసారథి మోముకంటెఁ బల్లెపృష్ఠము లెక్కువ దర్శనీయములా? మోటార్లుకొను వ్యస నము వానిని వాయువేగముతోఁ బరుగెత్తించు వ్యసనముతక్క మరేదియు లేదు. పొగాకు నల్లమందు వ్యవసనమెట్టిదో మోటారు వ్యవసముకూడ నట్టిదే. కాలకృత్యములకంటె నిది ఘనతరమై యున్నది. శ్రీమంతులగు రాజు లెన్ని మోటార్లుకొనినను గొనవచ్చును. వ్యవహారధర్మములచే వారి కట్టియావశ్యకము లుండవచ్చును. అదిగాక రాజులు కొంత ధననష్టికి మనఃపూర్వకముగా నంగీకరించినఁ గాని యనేక నాగరవృత్తులు నశించును. అంతేకాని పూర్వులు సంపాదించిన పుష్టిడీనాము నమ్మిమోటారు కొన్నవాని నేమి చేయఁగల సినది?

ఇదిగాక మరియొక పిచ్చి–పెండ్లాము మెడలోఁ బుస్తెలు కనఁబడవు. కాని మగని ముంజేతిని గడియారము తప్పదు. కాలము, పరమాత్మకువలె, హస్తగతమై యుండక తప్పదు. జేబులోనుండ గడియారమును సంతతలేఖనమునఁ బైకి దీసికొనుటకైన తెరపిలేని యే న్యాయమూర్తులకో చేతులందుఁ దుపాకి యితరసామాగ్రి నుంచుకొని ప్రయాణము లొనర్చుచున్న యేయుద్ధభటులకో–అట్టి గడియారము లుపయోగింపవలసి యుండఁగా చిడుపఁబొక్కులు గోకికొనుటకంటె నీఁగలను జంపుటకంటె వేరువ్యాపారమే లేనివానికి Wrist watch యెందులకు? ధనము మూల్గుచున్నది. కావున నాతఁడు దానిని గొన్నాడని

యసుకొనవలదు. అమ్మగారి కర్ణాటకపుజీర నమ్మి 'ఆర్' షాపు వారియొద్ద నార్జి
సౌభాగ్య మిది. ఆర్యావర్తదేశమందలి రత్న భర్మమొక్తికాదిమహాభాగ్య మంత–పైకిఁ బో
పిమ్మట గాజుపూసలతోను మట్టిలోహపుఁ జిట్టిగడియారములతో నలంకరించుకొని మ
గరకులమని కులుకుచున్నారా? ఇది తెలివిమాలినతనమా? బేలతనమా? వెర్రితనమా
ఇదికాక–

''కుటుంబవ్యయములలో–విద్యావ్యయములలో–శుభకార్య వ్యయములలో–
దినవ్యయములలో–మరికొన్ని వ్యయములలో–అన్నివిధముల వ్యయములలోఁగ
నూతనములై, యనవసరములై, యసహజములై, అనుపయోగములై, అపాయకరమ
యనేకదురభిప్రాయములనుబట్టి–దురభ్యాసములనుబట్టి–దుష్టరుచులఁబట్టి–ధనము శ
ణముగా నగుచున్నది. మీరు బుద్ధియుక్తులై నూతన నాగరకతామాహాత్మ్యమునకు లొ
తల విరియఁబోసికొనక యుచితముగా వ్యయము చేసికొనువార లైనయెడల నొక్కసం
రము వర్షములు లేనందున కింత యేడువవలయునా? ఇంత యసత్కాలక్షేపము చేసిన
లకు రోఁతగానున్నది. పో–పో'' యని యా బ్రాహ్మణుఁ డూరకుండునంతలో ''బా
ప్లీడర్లబాధ చెప్పుట మానివైచినా'' రని నే నంటిని. బృందారకుఁడు కొంత మంద
మొనర్చినట్లు నాకుఁ గనఁబడఁగ రవంత చొరవతెచ్చుకొని యి ట్లంటిని.

''బాబూ! మాతాతగారు గేదెకొరకు వ్యాజ్యెము తెచ్చిరి. ఆయన పోయిన
అయనకూఁతురు మాతల్లిగారు పోయినారు. నేనిప్పు డాగేదెవ్యాజ్యెములో వాదిని.
చచ్చినది. దానిదూడ చచ్చినది. ప్రతివాదులలోని మూఁడవతరమువాఁడు ఋణ
పడలేక మొన్నటి పుష్కరదినములలో గోదావరిలోఁ బడి చచ్చినాఁడు. కాని వ
ప్లీడర్లున్నారు. సంధికొరకు మే మెన్నిపిధముల నేడ్చినను వారు కుదురనీయ
పోయినసొమ్ము పోఁగా వారు సుమ్ము తిట్టినతిట్లకు హద్దులేదు. ధనమా పోయినది. గౌర
పోయినది. గెలిచినను గెలువకున్నను మిగిలియున్న దేడుపుతప్ప మరేదియు
మహేంద్రప్రభూ! ఈవిధము పార్టీలను పిప్పిచేసిన కొందర ప్లీడర్ల పేళ్లువ్రాసి యాజ
యేలినవారికి దాఖలుచేసెదను. ఆప్లీడర్ల నిక్కడికిఁ బిలిపించి తగురీతిని మందలించి–
యింక నే నేమో చెప్పఁబోవుచుండఁగా–''ఛీ ఛీ'' యనుచు నెవ్వఁడో నామెడఁ బట్టి గెంటె

''హరహరా యని నేను పరుగెత్తుకొని పోవుచుండఁగా నెవ్వఁడో ద్వాదశోర్ధ్వపు
ధారి తులసీమాలాజాలభూషిత వక్షస్కుఁడు నైన యొక్క క్షాత్రతేజము నన్ను వెంబండి
చుండెను. అతని జూచిజడిసి మరియింత పరుగెత్తుచుండగా 'నాయనా! జడియకు
పరుగెత్తకుము. నేను నీకు హానిచేయువాఁడను గాను. భారతము నన్నయ వ్రాయలేదని
దానిని రాజరాజనరేంద్రుఁడే పండితసాహాయ్యమున వ్రాసెననియు మీలోకమున నెవ
చెప్పుచున్నారఁట నాయనా! నేనే రాజరాజనరేంద్రుఁడను. అవిమర్శకునకు నానమసి
ములని చెప్పుము. నేను దానిని వ్రాయలేదని చెప్పుము. నన్నయ్య దానిని వ్రాసి న
గ్నతినిచ్చుటచేత నే నిచ్చట నుంటినని చెప్పుము. నాయనా మరువకు' మనెను. రాజ
నరేంద్రుఁ డనుపేరు వినుసరి కొడలుప్పొంగి నేను తన్మూర్తిని బూర్తిగాఁజూచి కృ
కృతార్థములు చేసికొనవలయునని వెనుకకుఁ దొందరతో తిరుగఁబోయి మడతమంచమ
దినుండి క్రిందకుఁ బడితిని.'' ఇక్కడికి స్వప్నము పూర్తియైనది. ఎగిరి స్వర్గవ

జాడఁబోయినజాడ నాపై నేమియు నిలువలేదు. కాని క్రిందఁబడి నప్పటి నిదర్శన మిదిగో! యీమోకాలిపై జూచితిరా? సంపద్దినములు పరోక్షములు–కష్టదినములు ప్రత్యక్షములు –భాగ్యదేవత పెట్టుకున్న ముద్దుగాలి కెగిరిపోవునుగాని, కొట్టినలెంపకాయ కాటివరకు నిల్చును. ఆలస్యమైనందులకు క్షమింపుడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

35. పశువులసంత–స్వప్నము

ఒకసారి జంఘాల శాస్త్రి ఒక గ్రామం వెడుతూ మధ్య దారిలో తారస పడిన పశువుల సంత చూశాడు. రకరకాల పశువులు విక్రయం కోసం వున్నాయి. అక్కడ బేరగాళ్లు, అమ్మకాలలో మధ్యవర్తిత్వం చేసి నాలుగు డబ్బులు గుంజుకునే వాళ్లు, వున్నారు. రకరకాల ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు–ఒక రకంగా జంతు జాతిలో అంత స్త్రీ పురుష సమూహాన్ని చూసి, జంఘాల శాస్త్రికి చిత్రమైన ఊహలు తలెత్తాయి. ఇదే గనక మానవజాతి స్త్రీ పురుష సమావేశం అయితే, ఎన్నెన్ని హావభావాలు, ఎన్నెన్ని చేష్టా విశిష్టతలు ఉండేవో కదా! అనుకున్నాడు. మనిషి నీతి కంటె జంతునీతి మీద అతనికి గౌరవం కలిగింది. అలా ఇలా ఆలోచిస్తూ అవతల గ్రామం చేరి నత్రంలో భోజనం చేసి నిద్రపోగా– ఒక కల వచ్చింది. దాని గురించే సాక్షికి ఉత్తరం రాశాడు.

కలలో కూడా పశువుల సంతే. అయితే, అవి మనుష్య భాషలో మాట్లాడుతున్నాయి. వాటిలో ఒక లేత దున్నపోతు ఆ సంత అనే సభా ప్రాంగణంలో ఉపన్యాసం చేస్తోంది. బారు కొమ్ముల చక్క గేదె సభాపత్నిగా వ్యవహరిస్తోంది. అగ్రాసనాధిపత్ని అనాలేమో!

నరే, ఆ గేదె సుదీర్ఘంగా ఉపన్యసించింది. సారాంశం ఏమంటే, మనం మనిషికి బానిసలము కాము. అతడే మనకి చాకిరి చేస్తున్న బానిస అంది. మనుషులు ఎంత మాత్రం మన కంటె గొప్పవారు కాదన్నది. వారిలా ప్రవర్తించవద్దని హెచ్చరించింది. ఆపై ఉపన్యాసానంతరం పశు సభకి అల్పాహారపు విందు జరిగింది. ఒక పశు గాయకుడు ఈ విందు జరుగుతుండగా, జావళీ పంపిణీ మీద ఒక శృంగారప్పాట పాడాడు. ఇంతలో పశు మారకులు, మనుషులు అక్కడకు రాగానే మందలన్నీ మాయమైపోయాయి. ఒక్కటే దున్నపోతు మీద నుంచి యమధర్మ రాజు దిగి కొందరు నరు లనే అధములకి శిక్షలు వేయడం చూశాడు శాస్త్రి. భయపడి మేలుకున్నాడు.

జంఘాలశాస్త్రి వ్రాసినలేఖను జదువుచున్నాను:—

"సాక్షికి–జంఘాలుఁడు నమస్కారములు. నే నీగ్రామము నుండి వేరొక గ్రామమునకు

నడచిపోవుచుండఁగా దారిలో నొక్కపట్టణము తగిలినది. దానిలో నొక పశువులసంత జరుగుచుండెను. అది ప్రసిద్ధికెక్కిన పశువిపణిస్థలములో నొక్కటి. ఏమిపశువులు! ఎట్టిపశువులు! ఎంతెంతపశువులు! నేల యీనినట్లు సంతభూమినేకాక చుట్టు పట్టులఁగూడ నాక్రమించియున్నవి! కాటుకకొండలవంటి దున్నపోతుల జతలు లంకెలు వేయఁబడిన వెన్నివందలున్నవో! పొట్టి కొమ్ములవి, కోరకొమ్ములవి, దుంపకొమ్ములవి, బారుకొమ్ములవి, బొంతరోమములవి, పరకపాటు వెండ్రుకలుగలవి, కుచ్చుతోఁకలవి, మొండితోఁకలవి, మట్టినపుదోఁకలవి, గవ్వకన్నులవి, బెదరుకన్నులవి, వ్రేలుబొడ్డులవి, యెగువ బొడ్డులవి, చిత్రచిత్రములగు దున్న లెన్నో యటులాగికొనుచు, నిటులాగికొనుచు, వానినిఁ బొడువఁ బోవుచు, వీనిని మూర్కొనఁబోవుచు, మందరానుమందరధ్వనులతో యథేష్టమలమూత్రవి సర్జన విరాజమానములై శోభించుచున్నవి. ఎర్రగేదెలు, నల్లగేదెలు, గొడిగేదెలు, కండపొదుగులవి, గుల్లపొదుగులవి, యోరపొదుగులవి, లోపలిపొదుగు గలవి, పనకట్టుచే బిగుచను కట్టులుగలవి, అరఁటిపండ్లవంటి చనుకట్టులు గలవి, గజ్జికాయలవలె వంకరచనుకట్టు కలవి, క్రొత్తపురిటి గేదెలు పాలనలుపుచేఁ బండ్లిగిలించుచుఁ దోఁచక యటునిటు తిరుగఁబోయి ఎ ఎ యనుచు దూడలభ్రాంతిచే మఱలుచుఁ బరిపరినిధములఁ బ్రకాశించు చున్నని. తెలుపు, నలుపు, పుల్ల బట్ట మొదలగు వన్నెలుగల గిత్తలు, నెడ్లులు లంకెలువేయఁబడి విపణిస్థలమం దెల్ల వ్యాపించియుండెను. గోవులు కాటుకకన్నులవి, దొంగ మొగములవి, బట్టమొగములవి, యనేకవర్ణములతో, ననేకాకృతులతో, గంగడోలు సింగారములతో నొప్పుచుండెను. చూచి తిరా! పోతులకుఁ బోతులకు లంకె, ఎద్దునకు నెడ్డునకు లంకె, పోతునకు గేదెకుఁ గాని, యెద్దునకు నావునకుగాని లంకె లేనేలేదు. ఇవి లక్షణముగ యున్నవి. మనుష్యలోకవిరుద్ధము గనే యున్నది. స్త్రీపురుషబంధమే ప్రబలతమబంధము. అదియే లోకమంచలి కలహములకుఁ, గష్టములకు, నపాయములకు, నప్రతిష్ఠలకు, నాహవములకు, మోసములకు, బలాత్కారమరణములకు ముఖ్యకారణమైయున్నది. నిర్గుణపరబ్రహ్మమునకు మాయాసమా వేశమే యనిర్వచనీయమైన, యవాఙ్మనసగోచరమైన, సర్వగ్రహగోళపు అంకుల రాట్టమైన యీజగతికిఁ గారణమైనది. ఇన్నిగిత్తలనడుమ, ఇన్నిపోతులనడుమ నిన్నియావ్రులు నిన్ని గేదె లున్నవికదా! పోతు గేదెపై గన్ను వేయుటకాని, గేదె కొంచెము సిగ్గుపడి, ముసిముసిన వ్వులు నవ్వుకొనుట కాని, యెద్దు గోవును గనుఁగీటుటకాని, గోవటెచనుకట్టు మాటుచేసి కొని సంభ్రమించుటగాని యేమైన నున్నదా? ఆహా! ఏమి నిష్కపట్యము. ఏమి యమాయకత్వము. ఏమి వ్యామోహశూన్యత! నరులలో స్త్రీపురుషు లింద రొక్కచోఁ గలిసినప్పుడు కలసి మెలఁగుట కింత యవకాశ మున్నప్పుడు-సవ్వ్యలతోఁ-బువ్వ్యలతోఁ-గన్నుగీటులతో-గోటిపోటులతో- ముద్దులతో-నుద్దులతో- నిగిలింతలతో -నకిలింతలతో- ద్రాఁగుటలతోఁ-బైటలాగుటలతో నచ్చటి పంచభూతములుగూడ శృంగారరసమయము లగునట్లు చేయక యూరకుండెదరా? నరులంత వ్యసనసంసక్తులు-మోహపాశబద్ధులు-రాగరసనిర్మగ్నులు- దుష్టకామాధీనులు-సంతత కాంతా చింతాక్రాంతులు- జ్ఞానశూన్యులు-మరి యేజీవులుగూడ జగతియం దెంత నీచములైనఁ గూడ లేనట్లుకనఁబడుచున్నవి కాదా! యని యనుకొనుచు నంతనడుమకుఁ బోయి పశులక్ష్మీదర్శనమును సావకాశముగాఁ జేసితిని. విచిత్రదర్శనమని చెప్పకతప్పదు. కాని పొసఁగుడు వాని ప్రబోధము విచిత్రతరముగా నున్నది. కొందఱచెవిలో గుసగుస లాడుచున్నాఁడు. కొందఱను జేతితో

లాగుచున్నాఁడు. కొందఱను జీకొట్టుచున్నాడు. కొందఱను వ్రేళ్లతోఁ బదుల సంఖ్యను సూచించు చున్నాఁడు. కొందఱను నిర్దాక్షిణ్యముగ నిరాకరించుచున్నాఁడు. కొందఱ చేతిలో నాల్గురూపాయలు బయానాగా బలాత్కారమునఁ బెట్టఁ బోవుచున్నాఁడు. కొంద ఱను మోచేతితో నేదో సంజ్ఞగాఁ బొడుచు చున్నాఁడు. ఎంత హంగామాయయినఁ జేయుచున్నాఁడు. ఇదియంతయు దొంగ నేసము. మోసము. మహానటనము. పావులా డబ్బులకొఱకుఁ బడెడిపాటులు. జేబుకత్తిరింపుదొంగ మొదలు బందిపోటు వీరునివఱకున్న యన్నిప్రకృతుల–నక్క మొదలు తోడేలువఱకున్న యన్ని ప్రకృతు లొక్క పాసఁగుడువా నిలో వివిధములగు పాళ్లతోఁ బరిపాకములతో మేళవించియున్నవి. చారుఁడులేని రాజతంత్ర ము–సంధాన కర్తలేని వ్యాజ్యెము–వైద్యుఁడులేని మరణము–పాసఁగుడువాఁడులేని పశువుల సంతయు లేవు. పశుకార్యము స్వకార్య మనుకొని దానిని దగిన సంరక్షకునితోఁ జేర్చుటకు వచ్చిన దయానముద్రుఁడు–పై యూరివారు మోసపడి పోవుదురేమో యను భీతిచేత నంతలోఁ జేరిన పరోపకారపారీణుఁడు–ఈతని కరహస్తచాలనము, వాచాలత, యుద్రీవ త్వము, మన మహాజన సంఘోపన్యాసకుల కుండినయెడల బాగుగా నుండును. ఈతని యభినయము, నటనము, నాంతరానుభవ ప్రకటీకరణచణముఖనిలక్షణత, యభిప్రాయగో పనసమర్థత, మన నటకుల కుండునెడల బాగుగా నుండును.

సంతవారికొఱకుఁ బెట్టిన దుకాణములలోని పెసరట్ల నూనె వాసన, కైమా పకోడీల కమరువాసన, పులిపెరుగావడల కల్లువాసన, వట్టిగడ్డి ముక్క వాసన, సంతవాండ్ర లచ్చిం చారు పులిగంజివాసన పశుమూత్రముల Ammonia వాసన, సర్వత్రవ్యాపించిన పొగచుట్టల వాసనతో మేళవించియున్నవి.

ఎర్రరంగుల జలతారు కుచ్చుపాగలవారు, నేబదిబొత్తాముల వఱకుఁగల మొండిచే తుల చొక్కాలవారు, కంటి సుర్మాలవారు కొందరు దూరముగా నీచర్య యంతయుఁ గనిపెట్టుచున్నారు–వారే పశుమారకులు. వారు కాజీలో, యమీరులో, మౌల్వీలో యని యనుకొందుము. కాని వారు కటికలని మన మెంత మాత్రమును గ్రహింపజాలము కాని యది యేమిశక్తియో వారిని బశు వంతలో గ్రహింపఁగలదుగదా? ఆహా! పశువుకంటె మనుజునియాధిక్యము నా కెక్కడను గనఁబడలేదని తాత్కాలిక సన్నివేశముచే నడ్డుదిడ్డ ముగా ననుకొనుచుఁ బైయూరు పోయి రాత్రి యొక్క నత్రములో భుజించి యచ్చటనే నిద్రింపగా నొక్క కల వచ్చినది. అది యిట్లుండెను.

స్వప్నములోఁ గూడఁ బశువులసంతయే ప్రత్యక్షమయ్యెను. కాని యాపశువులు మనుష్యవాక్యముల మాటలాడఁ గలిగియుండెను. వానిలో నొక లేఁతదున్నపోతు సభవారి కందఱకుఁ గొమ్ములు వంచి విధేయతతో నమస్కరించి మనుష్యభాషణముల నిట్లనియెను. సోదర సోదరీమణులారా! ఏవనితారత్నము తొమ్మిది యాతలవఱకు నీనినదో యేపురంధ్రీ మణి పుత్రపుత్రికాపౌత్రాదులు దేశమంతయు వ్యాపించి, దొంగగడ్డి దినక, బందెలదొడ్డిలోఁ బడక, చెడ్డదారులకుఁ బోక, స్వక్షీర పానము మందగుదె మొదలగు దుర్లక్షణములు లేక, వంశవిఖ్యాతిని నిలుపుచున్నారో, యేపీనస్తనీమతల్లిపా లిప్పటివఱకుఁ బూటకు నాలుగు సేరులకుఁ దక్కువగా లేవో, యేయబలాశిరోమణిశృంగముల కిది వఱకు మూఁడుకోతల యినవో, యేయంబామతల్లిపాలలో నిసమిజిద్దు విశేషముగానుండునో, గడ్డిమేటి కెగఁబడిన

యొడల నేయెనుములమిన్న క్షణములో గడ్డిమేటిసంతయు సుహ్లాని యూఁదినైచునో, యేసీమంతినీశిరోమణి పేడ, గోడఁబెట్టుట కనువగునంత బింకము గలిగియుండునో యట్టి లోకవిఖ్యాతమైన బారుకొమ్మలచుక్క గేదెగారి నీసభ కగ్రాస నాధిపత్నిగా నుండి సభాకార్యము నిర్వహింపుమని నేను సభాసదులగు నార్యవర్యులసక్షమునఁ బ్రార్థించుచు న్నాను. అని ఇట్లూదున్న యుపన్యసించి, సభానమస్కార సూచకముగా శృంగధ్వయమును వంచి యూరకుండెను. అంతలో నొక్క తొలుచూరుపెయ్య తలయెత్తి సభనంకఁ జూచి 'మన సోదరునితో నేను ద్వితీయించుచున్నాను" అని పలికెను. అంత సర్వసహాసభికాస్తో, వసూచకముగా వేలకొలఁది తోఁకలు తడతడ శబ్దాయమానములై విరాజిల్లెను. అంత వగ్రాసనాధిపత్ని తోఁకకుచ్చు నేలను జీరాడ మందహాససంపదలు ముఖపద్మమున నావరింప కోటినుండి సగము నమలిన చెంగలిగడ్డి కబళము నురుగుతో నేలపై బడఁగ మత్తగజయూ వమునఁ గానుగచెట్టు మొదటి తిన్నెపై కెక్కి కొంతసేపు నిశ్చేష్టయై నెమరువేయుట మాని, నిలువఁబడి, నేలను రెండు మూఁడు పర్యాయములు మూర్కొని, తగుమాత్రమైన మూత్ర మును వదలి శీఘ్రముగా ధైర్యమునొంది యిట్లుపన్యసించెను.

ఆంధ్ర సోదరసోదరీమణులారా! దేశభక్తులారా! భాషాభిమానులారా! ఇంత మహాసభ లో నాకంటెఁ బెద్దవరుసలవా రెందరో యుండఁ గుండపాదుగులవారుండ, నెక్కువ యూఁతలవారుండ, నెక్కువ తరిగలవారుండ, సమస్తప్రాణశాస్త్ర ప్రవీణులగు విద్వాంసు లుండ, పచ్చి గడ్డినేకాని యెండుగడ్డిని మూరుకొనని సదాచారసంపన్నులగు వేదాంతులుండఁ, బురుషసంపర్కములఁ బూర్తిగా వదలుకొనిన దివ్యజ్ఞాన యోగినీశిఖామణు లుండ, నరుఁడు మనకుఁ బ్రభుఁడా? బానిసయా? యను రాజకీయసమస్యను నేర్పున నుపన్యసించి విడఁగొట్టగల రాజతంత్ర పారంగతులుండ, నన్నే పెద్దగా భావించి మీరు నా కకారణ కరుణాకటాక్ష మహిమచే నొసఁగిన గౌరవమున బారకొమ్మల నడిమినున్న రోమశమగు ఫాలప్రదేశముతో వినయపూర్వకముగా స్వీకరించు చున్నాను. ఇదికాక యేజా తియందు, నేదేశమందు, నేసభయందు, భామామతల్లి యధికగౌరవమున నాదరింపఁబ డునో యాజాతియే జాతి. ఆదేశమే దేశము. ఆసభయే సభ. మన మతప్రపంచమున, సంఘ ప్రపంచమున, రాజకీయ ప్రపంచమున నిప్పుడనేకవిధములగు నూతనాందోళనమును, నూతన పరిస్థితులు, నూతనసమస్యలు బయలువెడలినవి. ద్విపాదులు, బుద్ధిహీనులగు నరులే మన జాతీయప్రపంచమన నిన్ని తొందరలను గూడఁ గలిగించుటకుఁ గారణభూ తులు. నరులు మన సేవకై యాది శక్తిచే నిర్మింపఁబడినవారు. మనకు వారు బానిసలు. మన యొడళ్లను తోమి మనల స్నానము చేయించు దాసులెవరు? బీళ్లలోని గడ్డిని గోసి తెచ్చి లేలేఁతపచ్చికను-సారవంతమైనపచ్చికను-మన నోటి కందిచ్చు భృత్యులెవరు? పనికి మాలిన చెత్తయైన యన్నమును దాము తిని సారవంతమైన గంజిని మనముందు భయభక్తిపూ ర్వకముగా నిడువారెవ్వరు? (నరులె నరులే యని యఱచుచుఁ బశువులు శిరఃకంపనము లొనర్చు చున్నవి.) మన పేడను జేతులతోఁదీసి, మనశాలలను బరిశుభ్రపఱచి మన ప్రక్కలకై ప్రాఁతగడ్డిని బఱచి, మనకు దోమకాటు దగులకుండ ననేక విధముల బానిసతన మొనర్చువా రెవ్వరు? మన సోదరీమణులగు ధేనువుల మలమూత్రములు తమకుఁ బరలోక సాధనములని యెంచి వాని నమృతప్రాయముగా నారగించువారెవ్వరు? (పశువులన్నియు ననోన్య శృంగసంఘర్షణమునఁ గరతాళధ్వను లిచ్చుచున్నవి) మన మీదాస్యము

నూరకే చేయించుకొనుచున్నామా? (లేదులే దనునట్లు పశువులు తమ చెవులను వెనుకకు ముందున కల్లలాడించుచున్నవి) మన క్షీరధనమును వారిమొగమున, వారివారి యర్హతల ననుసరించి కొట్టి వారిచే నీపాదసేవ చేయించుకొనుచున్నాము. అట్టి మన బంట్లు మన బానిసలు, పరిచారకులు, ప్రభుభటతారతమ్య మెరుంగక విశ్వాసహీనులై, యొడలు మదింపఁ గన్నుఁగానక, మన కెదురుతిరిగి వారే మనకుఁ బ్రభువుల మనుచున్నారఁట (ఏ ఏ యని యఱచుచుఁ బశువులు కోపావేశమున ముంగాళ్లు దువ్వుచున్నవి.) ఎవరు ప్రభువులో యెవరుభటులో సృష్టితంత్రస్వభావమే ఘోషించుచుండఁగా నీ నరుల కింతబుద్ధి లేకపోవుట యేల? జగజ్జీవపరిణామమునకు నాలుగే స్థూలములైన యవస్థలు. మొదటిది వృక్షలతా గుల్మాదిజాతి. ఈజాతికిఁ బాదములు భూమిలోనే యుండును. దీనిపైజాతి పక్షిజాతి. దీనికి గూడ రెండేపాదములు. ఈ జాతికే ద్విపాదపశు జాతియని పేరు. దానిపై జాతియే మన జాతి. మనకుఁ గాళ్ళు నాలుగు. నరులకంటె రెండెక్కువ. (సెబాస్ సెబాస్ అను నఱపులు) ప్రపంచప్రాణి పరిణామమునకుఁ బశుజాతియే పరమావధి (కొన్ని పశువులు పేడవేయుటకుఁ దోఁకలెత్తియు నీపరిణామ సూత్రమును విని మహానందమునఁ బేడవేయుట మఱచి తోఁక లాడించు చున్నవి. మరియు వారికిఁగూడఁ జేతులతో నాలుగున్నవి కదా? ఆచేతులే మనకుఁ గాళ్లయ్యెనేమో యని యొక ముసలిగేదె సంకోచించుచుఁ బలికెను.) అది తప్పు, వట్టి తప్పు. నీవు శుద్ధ నరునిలాగున బలుకుచున్నావు! మనచేతులు కాళ్లగుటచే మనకు నాలుగు లేవు. మనకుఁ జేతులే కొమ్మలైనవి. అవికాక ప్రత్యేకముగా నాలుగు కాళ్లేర్పడినవి తెలిసినదా? మనకంటె నాతనికి బుద్ధియొక్కటి యెక్కువగా నున్నదని యాతని వాదమఁట! ఆతని కున్న బుద్ధియేమో మనకు లేనిదేమో నిష్పక్షపాతముగా

నీవిద్వాంసులు–నీవేదాంతులు–నీసృష్టి రహస్యగ్రహణపారీణులు
–నీసత్యార్థగ్రహణైకనిపుణులు–మీఁదు మిక్కిలి నాసోదరీమణులగు నీమహిళామతల్లులం
దరు విమర్శించి నిశ్చయింపవలసియున్నది. సరియైన బుద్ధియే వారికుండునెడల నింకను వారధమమైన నరజాతిలోనే మిడుకవలసిన ప్రారబ్ధమేమి?/ పై మెట్టగు పశుజాతి కెక్కనే యెక్కియుందురు. బుద్ధియే, బుద్ధియే, నరజాతికే, తలలకుఁ గొమ్మలు వచ్చినప్పుడు –నోటికి గడ్డివచ్చినప్పుడు–సిగ్గుబిడియములు చచ్చినప్పుడు–అప్పటిమాట యేమోకాని యిప్పుడే? ప్రకృతి ననుసరించిన జీవనమే బుద్ధికిఁ బ్రధానలక్షణము. వంటలు పనికిరావు. ప్రకృతిలో నేది యెట్లు లభించునో యటులే దానిని భక్షింపవలయును. వస్త్రములు పనికిరావు. ఎట్లు పుట్టితిమో యట్లే దినములు నెట్టవలయును. అట్లే కట్టవలయును. పరిణయములు పనికిరావు. ఎగవచ్చినప్పు డేది లభించునో–దానితోనే–తాత్కాలికపుఁబెండ్లి –అంతే. తిరుగ నెప్పటికో–అంతవఱ కాంచితయే లేదు. ఎప్పటికప్పు డనుబంధము తెగిపోవలసినదే! కన్న దూడలతో మాత్రము? పాలు విడిచినపిమ్మట దూడ దూడయే–గేదె గేదెయే–ఐహికలంపటత యెంతమాత్రము తగదు. ఈప్రపంచము నాలుగీఁతలతో సరి. శాశ్వతమగు ప్రపంచము వేరొక్కటి యున్నది. ఈకాల మాకాలమనక, సంతతము నిగనిగలాడుచున్న చెంగలిగడ్డిచే నిండియుండు పెద్దబీళ్లనడుమను నాయొడలిమీఁద నెన్నిరోమములున్నవో యన్ని తలలతో, దిక్కులందు వ్యాపించు నన్నిటిని మించినకొమ్మలతో, వెనుకముందు పొదుగులతో–పొదుగునకుఁ దొడిచెట్టులంత లక్షలకొలఁది చనుకట్టులతో –ముక్తపశుచక్రవర్తులు–తెలికపిండి తవిటియుండలు నోళ్ల కందిచ్చుచుండఁగా నారగిం

చుచు, మనవంటి భక్తులచ్చటఁ జేరిరి. తనపాదుగులఁ బొదుచుచుఁ గుదుచుకొనుచుండ –ననురాగరనముతో దివ్య మూత్రమును వర్షించుచు మనయొడళ్లు నాకి ముక్తినిచ్చుచు నెన్నఁటికి నెండని పెద్దబురదగుంటలో విహరించుచు–జగతినిఁ బరిపాలించు గేదెలతల్లి –మొదటిగేదె మూలమహిషి సార్వభౌమ సార్వభౌమ మున్నదే–అదియే శాశ్వతము. (గేదెల న్నియు గాళ్లుపైవంగి, తలలు వంచుకొని ధ్యానించి లేచును.) దానిని జేరుటయే బ్రదుకునకు ఫలము. అట్టిమోక్షము ప్రకృతిజీవనముననే కాని సిద్ధింపదు. కాని యిప్పుడు నరులలోఁ గొందఱు తొట్టినైద్యమను నొక్క బ్రదుకుతెరువును జూచుకొని స్వభావానుసారజీవనమే ప్రధానోద్దేశముగా నుంచికొని మన జాతిని నమీపింపవలయునని సర్వప్రయత్నములు చేయుచున్నారని వింటిని. బాగుపడఁదలచిన వారిని మన మడ్డుపెట్టము. అధమజాత్యుద్ధర ణము మనకిష్టమే. నరుఁ డెన్నటికైన ముక్తిస్థితి నొందవలయునన్న యెడలఁ బశువై తీరవలయును. నందెడుగడ్డియుఁ దినవలయును. దినమున కారుకడుల పేడయు వేయవల యును. అంతేకాని లేనిపోనివంటలు చేసికొని, వ్యాధులను వృద్ధిపఱచుకొని, వస్త్రములు కట్టుకొనుటచే వనితావాంఛ మరింత వృద్ధిపఱచుకొని, పెండ్లిండ్లు చేసుకొనుటచే మెడలకుఁ బాదములకుఁ బదునాలుగు బంధములను దగిల్చికొని సంసారపు గట్టుకొయ్యనుండి కాలికొలఁదితిరుగుట–బీటిమేఁతయులేక పిల్లలతో వారిపిల్లలతో వారివారిపిల్లలతోఁ బ్రాకులా డుచు–బంధనహస్రములఁబడి గించుకొనుచున్న నరజాతి కెన్నటికైన ముక్తియుండునా? కల్ల–కల్ల–పోనిండు. ఏదో నియమముకొఱకు నరుఁడు పెండ్లి చేసికొన్నాఁడను కొందము. ఏదీ! ఆనియమమైన జరుపుకొనుచున్నాఁడా? ఛీ ఛీ వట్టి చపలుఁడు! చలితేంద్రియుఁడు; మాట యొక్కదానికి, మాన్యతయొకదానికి, పాలుగుడు పాకదానికి, చూలొకదానికి, ఈదిక్కుమాలిన పైయాటలలో నెన్ని మిత్రద్రోహములు! బంధుద్రోహములు! గురుద్రోహ ములు. ఛీ ఛీ! అప్రతిష్ట! అప్రతిష్ట! మేలుమునుఁగులు, చీఁకటిషికారులు, గోడదాఁటులు, చెప్పుదెబ్బలు, ప్రాణపుపోకడలు. ఇక జాతీయతను గూర్చి చెప్పెదను. ఏచచ్చైనను –నేయవకతవకనైనను–నెంత బుద్ధిహీనపుదైనను నరజాతి యొకజాతియని యొప్పుకొనక తప్పదు గదా! జాతికి ప్రధానలక్షణమేది? ఐకమత్యము అది వారికున్నదా? నాయొడలి రోమములన్ని శాఖలు. ఆశాఖలలో నన్నిపలవలు. ఆపలవలలో నన్ని చిలువలు. ఎక్కడఁజూ చిన పొందులేదు పొత్తులేదు. సిగ, నడునెత్తినున్న యెడల నొకశాఖ. ప్రక్కలనున్న యెడల నొక్కటి, వెనుకనున్న నొక్కటి, సగము గొరిగినయెడల నొక్కటి, పూర్తిగా గొరిగిన యెడల నొక్కటి, కత్తిరించినయెడల నొక్కటి, వ్రేలాడఁ జేసినయెడల నొక్కటి, జడలుగాఁ జేసినయెడల నొక్కటి. ఇదేనా నరునిబుద్ధి! రోమబుద్ధి! మూఁతిమీఁది వెండ్రుకలలో, గడ్డముమీఁద వెండ్రుకలలోఁ, గనుబొమ్మలమీఁది వెండ్రుకలలోఁ గూడఁ గలిగిన మార్పుల చేత శాఖాభేదములు సిద్ధించునఁట! గోఁచినిబట్టి యొకశాఖ; కుచ్చెళ్లనుబట్టి యొకశాఖ, మెడలోఁ బలుపులేనియెడల నొకశాఖ, ఉన్నయెడల నొకశాఖ, దానికి రాయిగట్టినయెడల నొకశాఖ, మొగానఁ గచ్చిక యొకశాఖ, బొగ్గొకశాఖ, సుద్ద యొకశాఖ, యెఱ్ఱపొడు మొకశాఖ, వచ్చపొడు మొకశాఖ. వానిజుట్టు వీనిచేతిలో, వీనిచెవి వానిచేతిలో, వానికాలు వీనికడు పుమీఁద, వీనిచేయి వానిమూఁతిమీఁద, వానిడబ్బు వీని చేతిలో, వీనిప్రతిష్ట వారినోటిలో, వీనిచెవిని వాఁడు ఛీ, వానిమొగాన వీఁడు థూ–ఈజాతి కెక్కడనైన మతియున్న ట్లగపడుచు న్నదా? ఒక్కటీటిలో సుఖముగా నెపరిమానాన వారు, మనము మందలకొలఁదిగా గడ్డిఁ

ధినుచుండగా, నిర్ధఱిన్నదమ్ము లున్న యన్నముతినలేక, వాని చెంబు వీడు–వీనితల వాడు–చిదుకఁగొట్టుకొని, రచ్చ కెక్కి పొసఁగుడువారి కొస్తిని సమర్పించి–తాము ముష్టియె త్తుకొనుచున్నారు కదా! అసూయ, ఆగ్రహము, కుటిలత్వము, క్రౌర్యము, క్రోధము, కృతఘ్నత, యిఁక నెన్నియో యవి యన్నియు నేను జెప్పఁజాలను. వీని యన్నిఁటిని మించిన యాశ–తెఱపి లేనియాశ. ఇదేనా నరునిబుద్ధి? ఇదియుండుటయే మంచిదో లేకుండుటయే మంచిదో విధ్వంసులగు మీ రెరుఁగకపోరు. ఇఁక వారినిగూర్చి తలపెట్టఁదగదు. ఒక్కటే మాట–సోదర సోదరీమణులారా! మీరు నరులవలెమాత్ర మెన్నఁడును బ్రవర్తింపకుఁడు. అది మీకు జాతీయతలో దిగజారుటకాని యెగఁబ్రాఁకుట కాదు. చూచితిరా! కొమ్ములు పైనువ్వనివి. తోక వెనుక నున్నది. దీనినిబట్టియె మీరు నమస్తమును గ్రహింపఁదగును. రేణము వేసినది మొదలు ప్రాణము పోవువఱకు మీరు జ్ఞప్తిలో నుంచుకొన వలసిన సూత్ర మేమనఁగా నరులవలె మాత్రము ప్రవర్తింపకుఁడు. నే నిఁక నాదూఁడను జేరఁబోయెదను'' అని తిన్నెదిగి యాయగ్రాసనాధిపత్ని పోవుచుండగా శృంగారతాళధ్వ నులు సభలోఁ జెలరేగెను.

మరియొక్క లేఁతదున్నపోతు పీఠమెక్కి యిట్లు చెప్పెను. ''సోదరసోదరీమణు లారా! (తరువాత నేమి చెప్పవలయునో తోఁపక కాఁబోలు మెడ నొక్కవంకకుఁ ద్రిప్పి కొమ్మ్మికొనతోఁ బ్రక్కను గోకికొనుచుఁ గొంతసేపు నిలువఁబడెను) సత్యపశూత్తములారా! మన యగ్రాసనాధిపత్నిగారు పశుసభాకార్యమును–నిర్విఘ్నముగా–తన్ను-పోటు-రెచ్చ -లేకుండ జయప్రదముగా నిర్వహించినందులకు మన మామహిషీశిరోమణి కెంతయైనఁ గృతజ్ఞులము. (పైమూట తోఁపక కాఁబోలు వెనుకకా లెత్తి చెవిని గోకికొనుచు నిలువఁబడెను) ఆమెకు మనము మూఁడు ఏ లీయవలెను,'' (ఏ-ఏ-ఏ తోఁకల తడతడలు) అంత నాపశువు తిన్నెదిగెను. తరువాత (Light Refreshments) పద్ధతిగా పట్టెడు గడ్డియుఁ, దవుడుకలిపిన కుడితిబుట్టయుఁ బ్రతిపశువునొద్ద నుంపఁ బడెను. అవి వాని నారగించుచుండ సత్కాలక్షేప ముకొఱ కొక్క గాయకుఁడు తిన్నెపై కెక్కి శృంగార రసభరితమగు నీక్రిందిపదమును బాడెను.

యదుకులకాంభోజి–ఆది

పిన్నది తొలిచూలు పెయ్యలలో మిన్న
దున్నపోతులరాయ క్రన్నన గవయరా-పిన్నది॥ పల్లవి॥

1. అనఁటిపండ్లవంటి-చనుకట్టుకలదిరా-
చనులకు నెడమున్న సరసీజగంధిరా!
వనితకు నెగవచ్చె - వలవల విలపించె-
కనికరముఁ బూని కలయ రావేగమె-పిన్నది॥

2. ముష్టితో గరికను మూర్కొన దక్కట-
పట్టువంటి తవిటినైపె చూడదురా!
పట్టుకొయ్యనె పడి గట్టిగ నార్చురా!
చెట్టఁబట్టర విట - శేఖర బిఱబిఱ॥ పిన్నది॥

3. చలువబురదగుంట నతికగ్గిపుటమయ్యె।
కలికి తెలికపిండి కడువినమయ్యెరా।
పలుమారు చిరుచిరు పంచితమును రాల్చి।
వెలఁదుక విరహంపు వేఁడికిఁ దాళదు-పిన్నది॥

4. తోలజోరీఁగల దోఁకగదలుపదు।
పేడకడి వేయుటఁగూడ నెరుగదరా।
వాఁడితూపుల మరుని బారికి నగ్గమై।
పాలుగుడ్చినఁగాని ప్రాణాలు నిలుపదు-పిన్నది॥

ఇంతలో నెర్రశమలాలవారు-కంటిసుర్మాలవారు-పిల్లిగడ్డాలవారు-పశుమారకు లచ్చ టికిరాఁగ నభయంతయు నొక్కఁటే యఱపు. ఒక్కఁటిగోల, తల్లికడుపులో దూడ దూరెను. ఆరెండును మరియొకదానికడుపులో దూరెను. కన్నుమూసి తెఱచునంతలో మందయం తయు నేమయ్యెనో తెలియదు. ఒక్కఁటే దున్నపోతు. కొటుక కొండవలె నున్నది. దానిపైని బంగారుజీనున్నది. దానికిఁబట్టు ముక్కుత్రాటికళ్లెమున్నది. దానిమీఁదనుండి యొక్కదివ్య తేజము క్రిందికిదిగు చున్నది. నీలపుదనువులవారు-మిడిగ్రుడ్లవారు-జంజరు వెండ్రుకలవా రు-చేతిదుడ్లవారు-గదలు చేతఁబుచ్చుకొని యాతనిచుట్టు భక్తిపూర్వకముగా నిలిచి- జయా! దండధరచక్రవర్తి జయా! నమవర్తిసార్వభౌమా! యని యఱచిరి. ఆహా! యమదర్శన మైనదే. ఇది స్వప్నమా? కాదా? యని వితర్కించుకొని కొంతసేపటికి స్వప్నమని నిశ్చయపఱచుకొంటిని. ఆపాశధరుఁడు బంగారుసింహాసన మధిష్ఠించి, "చిత్రగుప్తులారా! ఇటురండు. ఈదినమున శిక్ష లెవరెవరికి విధింపవలయునో చెప్పుదరా యనియడుగఁ గోవ్యభిచారపరులకు కొందరు-మత శాఖాద్వేషమునఁ బాప మొనర్చినవారికిఁ గొందఱు-కని యాచిత్రగుప్తులు పలికిరి. నరే వారిని తెండని యాన్యాయాధిపతి పలుక, నొక సన్యాసియు నొకవిగతకేశ యగువితంతువు-కాషాయాంబరమున మెడలకు లంకివేయఁబడి యెదుటఁ బెట్టఁబడిరి. వారిని గుంభీపాకమునఁ బడవేయుఁడని యాతఁడు భటుల కాజ్ఞాపించెను. అంతట నీప్రక్క నొక కురూపయు, నాప్రక్క నొక్క నురూపయు-నడుమ నొక్కఁడు గట్టఁ గట్టఁబడి యెదుట నిలువఁబెట్టఁబడఁగ, వీ రెవరని చిత్రగుప్తుల నాతఁ డడిగెను. వారిట్లు సర్వజీవచరిత్ర నుండి చదివిరి.

ఈతఁ డొక్క వేపారిపంతులు. దైవభక్తుఁడు. దేశభక్తుఁడు. వార్ధకమునఁ గళత్రవియో గము కలుగుటచే నీత డొడలు పట్టలేక మొదట నీచాఁకలిదానినుంచుకొనెను. అంతతో సంతుష్టిలేక యావేశ్యను జేరఁదీసినాఁడు. అంత దండధరుఁడు రౌద్రమూర్తియై-ఈతఁడు దేశభక్తుఁడు, దైవభక్తుఁ డని మీరు తప్పుచరిత్ర వ్రాయనేల? దేశమనఁగా చాఁకలిదని, దైవమనఁగా బోగముదని యార్యావర్తమున నర్థమున్నదా యేమి? యని వారిని మందలించి భటులారా! వీరి మూఁడు తల లొక్క వ్రేటునఁ జిదుకఁగొట్టవలయును అని యాజ్ఞాపించెను. అంత నాగుండె లవిసిపోయెను. ఈక్రూరకృత్యమును నేను జూడలేను బాబూ యని గొంతెత్తి యేడ్చితిని! నాయేడుపు విని కాఁబోలు నత్రపు బ్రాహ్మణుఁడు లేచి జంఘాలశాస్త్రి యని పిలుమనరికి లేచి కూర్చుండి శివశివా యని స్మరించుకొంటిని.

36. విచిత్రస్వప్నము

జంఘాల శాస్త్రికి కలలు రావడం పరిపాటి అని మనకి తెలుసు. లేదా, శాస్త్రి కలను ఒక పరిపాటిగా స్వీకరించి, తను చెప్పదలచిన విషయాలు ఇంకో భంగిలో చెప్తాడనుకున్నా అభ్యంతరం లేదు.

ఈసారి జంఘాల శాస్త్రికి వచ్చిన కల ఒక సన్నివేశాన్ని చెప్పేది గాని, పూర్వాపరాల సంబంధం వున్నది గాని కాదు. ఈ కలలో రకరకాల విషయాలు ప్రస్తావనకు వచ్చాయి.

అతనొక పెద్ద మైదానంలో రకరకాల చోట్ల గుంపుల మధ్య రకరకాల ఉపన్యాసాలు విన్నాడు. ఒకచోట ఎవరో చేసే దైవధ్యాన కీర్తన, మరొకచోట, మానవుల సోదరభావ ఆవశ్యకాన్ని, ఐక్యభావాన్ని బోధించే పాట, ఇంకొక చోట భారతమాత ప్రశంసా పద్యం, వేరొకచోట నిగూఢ వేదాంతార్థం లాంటిది బోధించే తత్త్వం, వేరేచోట భారతీయ మౌలిక ఆధ్యాత్మిక తత్త్వం గురించి పద్యాలు పాడి, చేసే ప్రబోధం, అన్యత్ర సామరస్యాన్ని బోధించే పద్యం, ఇంకొకచోట రాట్న ప్రాశస్త్యం గురించి దేశీయ వస్త్రాల పాడకం అవసరం గురించీ ఉపన్యాసం, మరొక చోట ప్రతిజ్ఞా పూర్వకంగా వ్యసనాల విసర్జన కార్యక్రమం, వరసగా జంఘాల శాస్త్రి విన్నాడు. సర్వమత సామరస్యం కన్నాడు. కడకు ఒక దేశభక్తుడి ఆత్మాహుతి కూడా చూశాడు. హఠాత్తుగా ఉలికిపడి మేల్కుకున్నాడు. కల అంతటా ఒక్కటే మాత్రం ఏక సూత్రం లాగ విన్నాడు. ఇది ఓంకారం. ఇదే అన్ని తత్త్వాలనూ, మార్గాలనూ, నిజమైన తత్త్వానికి ముడిపెట్టే సూత్రమని జంఘాల శాస్త్రి నమ్మాడు. ఆర్యావర్తంలో స్త్రీని మహత్తర వ్యక్తిగా మన్నించాడు. ఈ ఆర్యావర్తంలో 'ఆర్య' సంబోధనా నికి అర్హంగా ప్రవర్తించమని శ్రోతల్ని అర్థించాడు.

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను.

నాయనలారా! నా కొక్కన్వప్నము వచ్చినది. అది చెప్పెదను:—

అదియొక యూరు—ఏయూరో నే నెరుఁగను. అచ్చట నొక్క పెద్దమైదాన మున్నది. ఆపెద్ద మైదానమునం దొక చిన్న సరోవరమున్నది. ఆచిన్న సరోవరమునం దొక పెద్ద మండప మున్నది. ఆపెద్దమండపము నడుమ నొక్క చిన్నగంట వ్రేలాడుచు మ్రోఁగుచు

న్నది. ఓమ్! ఓమ్! ఓమ్మని యొడలు పులకరించునట్లు–చెవులు పవిత్రము లగునట్లు–మనసు వికసించునట్లు–జన్మము తరించునట్లోంకారనాదము రోదసీకుహర మంతు వ్యాపించుచున్నది. ఆగంట తనయంత తానేల మ్రోగువలయునో యని యోజించుచుండగా నొక్క త్రుటికాలములో నామైదానమంత మనుష్యులతో నిండిపోయినది. నే నొక్క చిన్నగుంపులో మోచేతిపోట్లుఁ బడుచు నిలవఁబడితిని. ఆగుంపు నడుమ నొక్కఁ డిట్లు పాడుచున్నాఁడు:–

కాంభోజి–ఆది.

దేవుని ధ్యానించి మనుడీ? సోదరులారా!! దే!!
కావరంబునఁ గన్నుఁగానక - కానిపనులను జేసి పెద్దల
త్రోవఁదప్పుచుఁ గాసినొందెడు - దుష్టులము మముఁ గావు కావని!! దే!!
నీవె తల్లివి తండ్రి వనుచును - ఈలోకమందున
నీవె గురుఁడవు - గతియు ననుచును
నీవె మము దయఁజూడకుండిన - నిమునమైనను నిల్వజాలము
ఏవిధంబుననైనఁ గావుము - కావు మరి మరి కావు మనుచును!! దే!!

అపాట నాతఁడు ముగించుసరి కచ్చటి జనులందరు జయా! పరమేశ్వరా? జయాభక్త వత్సలా! జయా దీనదయాళూ! జయా దేవాదిదేవా! యని పెద్ద కేకలిడుచుఁ గరతాళము లిచ్చిరి. ఓమ్! ఓమ్! ఓమ్మని మండపములోని గంట మ్రోఁగుచునే యున్నది. అచ్చటి నుండి మరియొకచోటికిఁ బోయితిని. అచ్చట నొక్కఁ డిట్లు పాడుచున్నాఁడు.

తొ హ రా.

1 అందర మాదేవుని పుత్రుల - మందువలన భ్రాతలము
పొందికమీరఁగఁ గలసియుందము - బొత్తిగఁ గూడదుచలము!!
2 కౌరవవంశము కాటఁ గలియుటకు - గారణ మెరుఁగరె మీరు
వైరము వలదిఁక వలదిఁక వైరము - వలదు వలదుపోరు!! అం!!
3 యూరపు రణమున కాదికారణము - సోదరవైరమెకాదే
పోరుమానుఁడీ పొందికమనుఁడీ - బుద్ధి తలనులేదె?!! అం!!
4 మాదిగ యతఁడని మాలఁ డీతఁడని? భేదము సేయఁగరాదు
ఏది తత్త్వమో యెరిఁగినవానికి - భేదబుద్ధి ఎట్లు?!! అం!!

ఇట్లాతఁడు పాడుచుండెను. అచ్చటనుండి మరియొక్కచోటికిఁ బోయితిని. అచ్చట నొక్కఁడి ట్లుపన్యసించుచున్నాఁడు–

సీ. పాఁడిపంటల నిచ్చి ప్రాణరక్షణ సేయు
దేశమాతకుఁ గీడుఁ దెచ్చినారె?
నవనాదిసత్క్రియాసంఘధౌరేయమౌ
భరతఖండము మైల పరచినారె?
జగతికి బహుళశాస్త్రజ్యోతి నిచ్చిన
జ్ఞానభూమికి నోరు గట్టినారె?

హీరకోటులదులా భారంబు తూఁగిన
హిందుదేవికిఁజోలి నిచ్చినారె?

దేవుఁడనఁగ నేమి? దేశమే దేవుండు
దేశ భక్తి యనఁగ దేవభక్తి
దేశమునకు ద్రోహి, దేవునకే ద్రోహి
దేశ ముద్ధరింపఁ దివురుఁ డయ్య!

గీ. లజ్జవడకుఁడీ నాయనలార! ఋషులు
దేశగానంబు తప్పని తెలిపినారె?
పాడుఁడీ దిఱాన్ బహదూరు పదవికంటె
దేశసేవక బిరుదంబె దివ్యతరము

అంత–జయా? భారతమాతకు జయా! జయా! ఆర్యావర్తభూమికి జయా! జయా! దేశమాతకు జయా! యను కేకలు మిన్నుముట్టినవి. ఇన్నిటిపైనను మండప ఘంటోంకారనాదము ప్రతిఘటించుచుఁ బరిఢవిల్లుచున్నది. కొందరు జనులు నన్నును ముందునకుఁ ద్రోయఁగా మరియొక్కచోటికిఁ బోయి యచ్చట నిలిచితిని. అచ్చట నొక్కఁడు పాడుచున్నాఁడు. పలువురు తాళములు వైచుచుఁ బల్లవి నందుకొని కలసి పాడుచున్నారు.

తత్త్వపుఁగీర్తన.

బ్రహ్మ మేదో తెలియఁబల్కెదను - జనులార మీకు॥ బ్రహ్మ॥
ధర్మమనగ నొక్కటే మరి కర్మ మనగు నొక్కటే
ధర్మకర్మము లొక్కటగుచును - మర్మమౌనెడ బ్రహ్మము॥ బ్రహ్మ॥
మెట్టలేని తత్త్వ మొక్కటి - మొట్టమొదటి తత్త్వ మొక్కటి
ముట్టరానితత్త్వ మొక్కటి - మూఁడుగూడిన బ్రహ్మము॥ బ్రహ్మ॥
ఎలుకతోఁకయె యింద్రధనువు - నింద్రధనువే యెలుకతోఁక
యెలుకతోఁకయు నింద్రధనువు - నేకమౌనెడ బ్రహ్మము॥ బ్రహ్మ॥
మునుఁగులోనిది కాదుకాదు - మునుగుపైదియుఁ గాదుగాదు
మునుఁగులోపలినుండి బయటకు - బెనఁగనదియే బ్రహ్మము॥ బ్రహ్మ॥

మతిపోయినప్పుడు తిరుగ నిటకు వచ్చి దీని యర్థవిచారణమును జేయవచ్చు నని మతిలేనిమాట యొక్కటి మనసులో ననుకొని మరియొకచోటికిఁ బోయితిని. అచ్చట నొక్కఁ డిట్లు పలుకుచున్నాఁడు.–

నీ. గోష్పాదమంతటి కొలఁదియో శిఖివీడి
కూర్మపృష్ఠము నెత్తిఁ గూర్పనేల?
తులసిపూసలపేరు తొలఁగించి గుడ్డల
గొంతుల కుఱిపోసికొంటిరేల?
పావనదేశీయవస్త్రంబు విడనాడి
టన్సరుసిల్కుఁ గట్టంగనేల?
భవబంధమోక్షణోపాయంబు దెగఁడ్రెంపి

దాస్యశృంఖలలందుఁ దగులనేల?

తే. మింటిపై చుక్క తెగి పందిగుంటఁబడుట
కంటె నిది యధోగతి నధోగతియ కాదె!
అట్టి మీ రార్యు లెట్లు? రూప్యములసంచి
మూఁతి దారంబు యజ్ఞోపవీత మగునె?

గీ. మూఁడుగిన్నెలకాఫితో మూఁడుసార్లు
పూర్వసంధ్యాచమనమును బూర్తిజేసి
నిత్యహోమాగ్ని హోత్రత నిలుపుకొనఁగ
దడవు లేకుండ సిగరెట్లుఁ దగులఁబెట్టి
రామచంద్ర చరిత్ర పారాయణమును
వదలి రైనొల్లు మునినూత్ర పఠనఁజేసి
చిత్తమాలిన్యమార్జన చింతవిడిచి
కోటుజోడుల పులికాపు కుస్తరించి
మైలగుడ్డలతోడ లాల్చీలతోడ
గాజుకనులతో మేఁకతో ల్కాళ్లతోడ
వట్టి పరిషేచననుఁగూడఁ గట్టిపెట్టి
ములఁగ కాడల నీరుల్లి ముక్కలందు
మిగుల నింగ్లీసుముక్కల మేళవించి
యుంటుసాంబైన లేకుండ నారగించి
విపణికో న్యాయసభకునో వేగఁబోయి
యాడఁగూడని యాటల ననుయాడి
సైనగడియించి యింటికి వచ్చు వేళ
గొల్లదేవు మోమును జూడ గుడికిఁ బోక
పల్లెపృష్ఠంబులను జూడ వార్ధి కేగి
సరగ నింటికివచ్చి భోజనముచేసి
లొట్టబట్టీయమునఁ బొగచుట్టఁ గాల్చి
యాంగ్లపత్రికఁ గదనవార్తాలి చదివి
కునికి కుట్టిని నిద్రించి కొంపఁగాల్చి
యింటియాబిడ నెవ్వఁడో మింటిగుమ్మ
టమునఁ గొనిపోయె ననుచు స్వప్నమును గాంచి
చచ్చితిని మొట్టో యని లేచి సంజ్ఞనొంది
కడుపునొక్కుతో వాఁచిన కనులసొక్కు
తో మెడనరంపుటెక్కుతో దుర్భరంపు
నొంటితలపక్కుతో గొంతునొక్కుతో న
శించు రుక్కుతోనున్న మీరిట్టి మీర
లార్యనామార్హు లగుదురే? యక్కటకట!

మీవంశపురుషులైన వసిష్ఠ జమదగ్ని వాలఖిల్య భరద్వాజాదులు కన్నుల రక్తములు కాలువలకట్ట, నిట్టి యమంగళన్వరూపులు–నిట్టి దేశాచారపరిత్యాగశీలురు–నిట్టి విదేశీయ దురాచారావలంబన ధురీణులు–నిట్టి వైదికకర్మశూన్యలు–నిట్టి దేశీయగ్రంథజ్ఞానరహితులు –నిట్టి దుర్బలదేహులు–మనవంశముల నేలపుట్టవలయునా యని యేడ్చునట్లు మీరు ప్రవర్తించుచున్నా''రని యిట్లింక నాతఁడేమో చెప్పఁబోవుచుండగా నిది మామూలుసోదెయే యని మరియొకచోటికిఁ బోయితిని. అక్కడ నొక్కఁడి ట్లుపన్యసించుచున్నాఁడు.

''మన కెవ్వరితోడను వైరము వలదు. కఠినవాక్యమైన నోటనుండి వెడలఁదగదు. ఎంతసేపు శాంతి–ఎంతసేపు సహనము–మనల నెవ్వరేమనినను మనము ప్రతివాక్యమైన నాడవలదు. మన యభిప్రాయములతో నేకీభవింపనివారు మనల నెట్లు నిందించినను సరే–ఎంత నిందించినను సరే–వారిని మనము ప్రేమించుచునే యుండవలయును.

నీ. వైరి తొందరపాటు పడినకొలందిని
శాంతిఁ బూనుటకంటె సరణిలేదు
దుర్మనస్కుఁ డొనర్చు దుష్టచర్యకు నీతి
తత్త్వబోధముకంటె దారిలేదు
చెడఁదిట్టువాని నాశీర్వదించుటకంటెఁ
దిట్లడంగఁగ వేరె దిక్కులేదు
గ్రుద్దునాతని చేయిగొని ముద్దుగొనుకంటె
దెబ్బ లాఁపఁగఁ వేరె తెన్ను లేదు

గీ. తామసము శాంతిచేతనే తగ్గవలయు
నన్యతము యథార్థవృత్తినే యడఁగవలయు
మాయ ధారాళచర్యనే మాయవలయుఁ
గోపగతి ప్రేమవలననే కూలవలయు.

ఈమాటల కేమని మరియొక్కచోటికిఁ బోయితిని. అక్కడ నొక్కఁ డుచ్చైస్స్వర మున నుపన్యసించుచున్నాఁడు:–

దేశీయసోదరులారా! ఇది యేదియో చూచితిరా! (అ-ఆ. రాట్టము రాట్టము అని సభలోఁ గేకలు) ఈరాట్టమే భరతఖండమునకుఁ గామధేనువు. ఆర్యావర్తదేశమునకుఁ గల్పవల్లి. హిందూదేశమునకుఁ జింతామణి. దీనిని వదలుకొనుటవలననే మనకీ యభాగ్యము నీయన్యస్థత–నీ యన్యతంత్రత–నీ యాపత్పరంపర–మన పూర్వులకన్న మిచ్చిన దిది. అంబర మిచ్చిన దిది. అధికసుఖమిచ్చిన దిది. ఐశ్వర్యమిచ్చిన దిది. ఆయుష్య మిచ్చిన దిది. అక్కటా! దీనిని వదలుకొనుటచేతనేకదా! అన్నమునకుఁ జేయి చాఁపవలసివచ్చినది. గుడ్డకొకని నపేక్షింపవలసివచ్చినది! ప్రధానములగు నన్నవస్త్రములకే, యింత దాస్యము –నింత దైన్యము–నింత పరాధీనత–గల మనబ్రదుకు లొకబ్రదుకులా? థూ! సిగ్గువిడిచి మొండిదేరి యుండుటచేతఁగదా యీయధమాధమస్థితిని మనము గ్రహించుకొన లేకుండ నున్నాము. మనపూర్వ లిట్టినిర్భాగ్యస్థితి ననుభవించియుండిరా? మనయభాగ్యదశకు మన యన్యతంత్రస్థితికి వారి నిశ్శరీరాత్మ లెంత విలపించుచున్నవో? వారియేడ్పు మాన్పుటకైన

మనము వారు పోయినత్రోవను బోవఁదగదా? మనకు భగవంతుఁ డిచ్చిన యీచేతు లెందులకు! ఇతరులకు నమస్కరించుటకేనా? ఇతర్ముల కాళులు పట్టుటకేనా? ఛీ! స్వదేశీయ కర్మాభివృద్ధికై వినియోగింపని మన యీచేతులేల? మనపని మనము చేసికొనుటకంటె భాగ్యము లేదు. మన యన్నము ముదుకదైన సరే మనము తినవలయును. మన గుడ్డ మోటదైనసరే మనము ధరింపవలయును. స్వదేశీయపు నజ్జగంజి పరదేశీయ పరమాన్నము కంటె రుచ్యము. జన్మభూమిలోని జనపనారగోఁచి జర్మనీవారి సాలువుకంటె విలువగలది. అదిగాక ప్రపంచమునంతయు ముంచివైచిన కాశ్మీర రాంకవము లెక్కడివి? బళ్లారికంబ ళ్లెక్కడివి? వారణాసీవసనము లెక్కడివి? బ్రహ్మపురపీతాంబరము లెక్కడివి? సేలము పంచె లెక్కడివి? ఉప్పాడ పాము వీసము లెక్కడివి? ఆకాలములోఁ గాలచక్రము తిరిగినట్లు మన రాట్నములు తిరిగియుండలేదా? దానిదివ్యగానము పూర్వపశ్చిమార్ణవోళములందుఁ బూర్తిగ వ్యాపింపలేదా? ఆగానమునకు ఫ్రాన్సుచక్రవర్తులతోపాటు–నాఫ్రికా నీగ్రోలుకూడఁ దలలూపలేదా? ఆహాహా? అట్టి సుదినములు గతించినవా? ఆభాగ్య మడుగంటినదా? ఆమంజులగానమునకు మంగళపుటారతి యైనదా? ఆరాట్నము లంతరించినవా? లేదు. అంతరింపలేదు. తిరుగ రానున్నవి. వానిగానము కైలాసపర్వతగుహలనుండి కామొరిన్ అగ్రమువరకుఁ దిరుగ గాలివలె వ్యాపింపనై యున్నది'' అని యింకేమేమో యాతఁడు చెప్పఁబోవుచుండఁగా- ననొక్కఁడు గట్టిగ నొకమూలకుఁ ద్రోచివైచినాఁడు. ఆత్రోఁపుతో దాని ననుసరించివచ్చిన పిల్లపిల్లత్రోఁపులతో మరియొక్క గుంపులోఁ బడిపోయితిని.

అక్కడ నందరు స్త్రీలు. ఒక్క స్త్రీ యుపన్యసించుచున్నది. ''మీచేతుల కాభరణ ములు రత్నకంకణములు కావు. రాట్నములు. రాట్నములు. మీమృదులాంగుళులతోఁ దీసినవి మీదేశమునకు బ్రాణాధారములు కాని ప్రత్తిదారములు కావు–మీచేతులతో మీరు చేసినవి దేశీయదారిద్ర్యశస్త్రములు గాని వస్త్రములు గావు. సోదరీమణులారా! మీరాట్న ముల సుతితో మీకంఠములఁ గలిపి దేశమాత్ర గీతములఁ బాడుచు దీనదశావశయగు దేశమాతకు, కృష్ణుఁడు ద్రౌపతికిచ్చినట్లు లక్షయవస్త్రము లిచ్చెదరుగాక. తథాస్తు, తథాస్తు'' అంత నెందరో కాంతలు తమ యాభరణములఁ దీసి యామెయెదుటఁ బెట్టిరి. కొమ్మోజు కామమ్మగారు రాగిడి–పాళము సుబ్బమ్మగారు కాసులపేరు–శ్రీమతి పుల్లాంబ గారు పుదుచేరినాను–కుటుంబరావు పంతులుగా రుంచుకొన్న కోనే గౌరిసానిగారు కంకణా లు–(ఉంచు కొన్నవారిపేరు చదువవలదు. వలదని సభలోఁ గేకలు.)

కాంతలగుంపులో నున్నందులకు వారు నన్నేమి చేయుదురోయను భయముచేతఁ దొందరతో మరియొక్కచోటికిఁ బోయితిని. అట నొక్క పెద్దపందిరి యున్నది. కాని దాని కాకులు లేవు. దానిక్రిందఁబెద్ద గోయి యున్నది. ఆగోఁతిలోఁ గణకణలాడుచు నగ్ని ప్రబలమగఁ బ్రజ్వలించుచుచున్నది. ఆగోఁతిప్రక్కలను గొందరు బ్రాహ్మణు లేవో వేదమం త్రములు పఠించుచున్నారు. ఒక్కప్లీడరు కాఁబోలు–నాయగ్ని కుండము నొద్దకు వచ్చి ''ఆర్యులారా! నే నింకఁ ద్రాఁగనని భరతమాత పాదములనంటి ప్రమాణము చేయుచు న్నాను.'' అని లెంపలు వైచికొని, పదునాలుగు దేవదారు పెట్టెల బ్రాందిబుడ్డ నగ్నిలోఁ బారవైచెను. గాజుకాయ లగ్గిలోఁబడి యెంత గగ్గోలయినఁ జేసినవి. కొందరు 'ఓల్డుటామ్' బుడ్డను–గొందరు విస్కీబుడ్డను–గొందరు సారాయి పీపాలను–మరికొందరు కల్లుకుండలను

–లెక్క–లేకుండ నాకుండములోఁ బడవైచిరి. చిటపటధ్వనులతో ధమధమధ్వనులతో నగ్ని భయంకరముగఁ బ్రజ్వలించుచుండెను. ఇంతలోఁ గొందరు వచ్చి పొగాకు చుట్టలను దానిలోఁ బారవైచిరి. ఓ! పొడముకాయల వర్షము–నల్లమందు బరిణెల వర్షము–సిగరెట్ల పెట్టెల వర్షము–కాఫీడబ్బాల వర్షము–టీ డబ్బాల వర్షము–కోకో గొట్టాల వర్షము–ఓవల్టిను డబ్బాల వర్షము! ఏమని చెప్పను! హద్దులేదు. పద్దులేదు. ఇంతలోఁ గొందరు న్యాయవాదులు కాఁబోలు నటకు వచ్చి వారి గౌనులతోపాటు–బి.ఎల్. సర్టిఫికెట్లతోపాటు–కక్షిదారుల కాగితాలతోపాటు–ప్లీడరు పట్టాల నందులోఁ బడవైచుచున్నారు. కొందరు కవు లటకువచ్చి యచ్చుపడని తమగ్రంథములను బరశురామప్రీతిగ నర్పించుచున్నారు. గావంచగుడ్డలు కట్టుకొని, గ్లానుగోమల్లులను వస్త్రధనుస్సులను బూట్సును స్టాకింగులను గట్టకట్టి యాకుండమునఁ బారవైచుచున్నారు!–ఓమ్! ఓమ్! ఓమ్మని మండపములోని గంట మహానాదసమన్వితమై మ్రోఁగుచున్నది. పరమేశ్వరా! పరమేశ్వరా! యనుమహాధ్వను లెటనుండియో కాని యగుచున్నవి. అదియే కాఁబోలు బిస్మిల్లా బిస్మిల్లా యని మారుమ్రోఁగుచున్నవి. ఱ. ఱ. అదేమి? అంతరిక్షమున నావిచిత్రత యేమి? నప్తర్సు లొక్క–యర్ధచంద్రాకృతిగాఁ గూరుచుండి యున్నారు. వారియెదుట మిగిలిన యర్ధచంద్రాకృతిగా మహమ్మదుగారు మొదలగు పైగంబర్లు కూరుచుండియున్నారు. వారి నడుమ నొక్క–టియే పుస్తక మున్నది. ఆపుస్తకమునే చూచి ఋషులావైపునుండి వేదమును బఠించుచున్నారు: ఈవైపునుండి యాపుస్తకమును జూచియే పైగంబర్లు ఖొరానును బఠించుచున్నారు. ఇంతలో నొక్కఁడెవ్వడో లేచి ''భారతీయుల దరిద్రత నివృత్తియగుటకై నేను నాదేశమునకు బలియగుచున్నా'' నని యాకుండములోఁ బడి జయా! భరతమాతకు జయా! యని యొక్క చావుకేక వైచినాఁడు. ఆ కేకతో నా భయంకరదర్శనముతో నులికిపడి మేల్కాంచితిని. ఇక్కడి స్వప్నము సమాప్తి జెందినది.

ఈస్వప్నమం దేమోకాని సందర్భశుద్ధి తక్కువగా నున్నది కాఁబోలు. నాకుఁ బూర్వమునఁ గలిగిన స్వప్నము లింతకంటె నెక్కువ పూర్వోత్తరానుబంధము గలవిగా నుండెను గాఁబోలు! దీని కట్టిది తక్కువయేమో–అది లోపమో గుణమో ఏది యెట్లయినను నేనేమి చేయఁగలను? నాకెట్లు స్వప్నము వచ్చినదో యట్లు చెప్పితిని. ఈవింత కేమికాని నుండను ఘంటోంకారనాదమును గూర్చియే నాకు వింతగా నున్నది. తనంతతాను ఘంట స్వప్న మున్నంతవర కేల మ్రోఁగవలయును? అది యోంకార మేల చేయవలయును? నిద్రయుం దొకప్పుడు ప్రాణావసాసమయమం దొకప్పుడు నాత్మ కీ స్థూలశరీరసంబంధము పాలబాగము విడిపోయియుండును. దేహమునకు లేని విశక్తు లాత్మకనంతముగా నున్నవి కదా! నిద్రాసమయమందు మరణసమయమందు మనలోనున్న యాత్మ –యీమొద్దుశరీరసంబంధము దాని కున్నప్పుడు వినలేనిధ్వనులను వినఁగలదు, చూడలేనివింతలను జూడఁగలదు; ఎరుగలేని యనుభవముల నెరుగఁగలదు; చేయలేనిపనులు జేయఁగలదు. యథార్థ మేమనఁగా–మన భరతఖండమునం దెల్లయెడల ననుక్షణ మోంకార నాద మగుచునేయుండును. ఓమ్! ఓమ్మని సింహళము మొదలు శీతాద్రివఱ కాపవిత్రశబ్ద మగుచునేయున్నది. కాని యీమొండి మోటతత్త్వములతో దానిని మనము వినఁజాలము. స్వప్నమును గాంచునారి కెల్లర కది వినఁబడుచున్నదా? లేదు. లేదు. నాయనలారా! మన నిద్రలు నరియైన నిద్రలా? మన స్వప్నములు నరియైన స్వప్నములా? చుట్టతిక్కచేఁ గలిగిన

నిద్రలు కొన్ని–భ్రాంతికైపుచేఁ గలిగినవికొన్ని–నల్లమందు మత్తుచేఁ గలిగినవి కొన్ని –కాంతాలోలతాధికతచేఁ దూలిపోవఁగలిగినవి కొన్ని–ఇట్టివేకదా! ఇఁక స్వప్నములు తెలిక పిండివలనఁ గలిగినవి కొన్ని, పందిమాంసమువలనఁ గలిగినవి కొన్ని, గ్రామములోని కలరావలనఁ గలిగినవి కొన్ని, అప్పులవారి యడావిడులవలన గలిగినవి కొన్ని–యిట్లే యిట్లే! సరియైనస్వప్నమేది? ప్రకృత్యనుసారముగఁ గలిగిన స్వప్నమేది? ఎప్పుడో కర్మము చాలక యట్టిస్వప్నము సిద్ధించునప్పుడుమాత్ర మోంకారనాదము వినఁబడితీరును. ప్రాణావసానస మయమం దది పుణ్యాత్ములకందరకు వినఁబడును. కాశిలో మరణించినవానికిఁ గాలభై రవుఁడు కర్ణాగ్రమున నోంకార మంత్రముపదేశించునని జనులనుకొనుమాట కిదియే మూలము. ఎవ్వరు నుపదేశింపనక్కర లేదు. తనయంత తానే వినఁబడును. పుణ్యశీలురగు వారు కాశీమరణమును ముఖ్యముగాఁ గోరుదురు. కావునఁ గాశీ ప్రశంన చేయఁబడినది. కాని, కాశీపుట్టములోఁ జచ్చిననరే–కాకినాడ పర్రలోఁ జచ్చిననరే–పుణ్యాత్ములంద రాయోం కారనాదమును వినితరింతురు. ఈభరతఖండమునకున్న విలక్షణాభిజ్ఞాన మిదియే. దీని కిది యేల యుండవలయును? ఇంత దైవభక్తి మరియెచ్చటనున్నది? ఓ! యెక్కడ జూచిన దేవాలయములే! గోపురములే! మండపములే! భజనమందిరములే! ప్రార్థనశాలలే! రాల న్నియు లింగమూర్తులే! ఇంత దయాసత్యశౌచములు మఱియెక్కడనున్నవి? ఇంత త్యాగ బుద్ధి మఱియెచ్చటనున్నది? ఎన్నిసత్రములు! ఎన్నిధర్మతటాకములు! ఎన్ని నీరాగార ములు! ఎన్ని భోజనమఠములు! ఆహాహా! పశువులకు మశకకుట్టిన బాధానివారణార్థమై రాపిడి స్తంభములే! పిపీలికాసేనలకుఁబిండిబెల్లపుటారగింపులే! వల్మీకములలో క్షీరాభిషేకములే! ఇంత వైరాగ్యసంపద మఱియెచ్చట నున్నది? ఇంత యపరోక్షజ్ఞానలక్ష్మి మఱియెచ్చట నున్నది? అన్నిటిని మించిన యింత పతివ్రతాధర్మప్రభావము మఱియెచ్చట నున్నది? మీకాంతల యోగ్యతనుగూర్చి యొకఁ డిట్లు పలికినాఁడు.

సీ. కుక్కయైనను ముట్టుకొనఁ గొంకుహేయతఁ
గలిగినభర్తతోఁ గలియుటందు
బడితెతో ఖరమును బడమోఁదునట్లు కాం
తను గొట్టుపతి ముద్దుగొనుటయందు
వ్యభిచారమునఁ గ్రిమి భరితు డౌ పతిఁ గౌఁగి
లించిప్రేమించి సేవించుటందుఁ
దేలేని మగనికిఁదిరిపమెత్తుచుఁ గూడుఁ
గుడుపుచుఁ దాఁ బస్తుపడుటయందు
భళిర! మీదేశపతు లగపరచుచున్న
దారుణాహంప్రణాశనోత్తమగుణంపు
ఘనత లక్షాంశము నెరుంగఁగలరె మీరు?
దేవుఁ డొక్కఁడె యెరుఁగు మీస్త్రీలఘనత.

ఆర్యావర్త మిన్ని విధములచే శ్లాఘ్యమైనది. పుణ్యమువలననే మన మార్యులమై పుట్టితిమి. ఆర్యనామమునకష్టుల మగునటుమాత్రము ప్రవర్తింపవలయును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

37. స్వవిషయ సల్లాపములు

ఉపన్యాసంగాని, చదివి వినిపించడానికి ఏదైనా లేఖ గాని, లేని రోజున సాక్షి సంఘ సభ్యులు సొంత విషయాల గురించి ఉబుసుపోకకు మాట్లాడుకోవడం పరిపాటి. నిజానికిది 'ఉబుసుపోక' వ్యవహారం అయినా, ఇందులో కూడా ఏదో విమర్శ, ఏదో పిట్టకథ తగలకుండా వుండదు. కవి వాణీదాసుకీ, వక్త జంఘాల శాస్త్రికీ మధ్య రవరవలు చెలరేగడం పరిపాటి అయినా, ఇటువంటి సందర్భాలలో ఈ సరీ ప్రముఖంగా అవుతూంటాయి ఒక్కొక్కసారి.

బొంరయ్య శెట్టికి ఇంకా అనారోగ్యం శ్రుతి మించని కాలం నాటి తొలి ముచ్చట్లల్లో ఒకటి ఇది.

జంఘాల శాస్త్రి ఆరోజున కవిని రెచ్చగొట్టాడు. అంటే, మాట్లాడే అవకాశమిచ్చాడన్న మాట. ఆ అవకాశం కూడా, సాక్షి బయటకు వెళ్లవలసి రావడం వల్ల వచ్చింది. ''జన్మంతో పుట్టిన స్వభావం ఎంతకీ వదలదు'' అంటూ వాణీదాసు ఒక గుడ్డివాడి 'పరిశీలన' నైపుణ్యం గురించి కొన్ని ఉదంతాలు చెప్పాడు. జంఘాల శాస్త్రి, కవి వాణీదాసు కథకుడు కూడా అయ్యాడా! అని ఎగతాళి చేస్తూ, 'ఎరుపు ముక్కు' కథతో ఎత్తి పొడిచాడు. కాలాచార్యులు తగవులు వద్దని, వారించి సంభాషణని శ్రుతకుల మీదికి మళ్ళించాడు. దాంతో 'పెళ్లిళ్ల నీజను' వాళ్లకు వచ్చిన గిరాకీ, ప్రస్తావన కొచ్చింది. అది ఆధారంగా, కాలాచార్యుల పెళ్లి ప్రస్తావన వచ్చింది. దానిమీదట, దేహ బలానికీ, భార్యను సంబాళించగలగడానికీ సంబంధం లేదని, జంఘాలుడు దాఖలాలు చెప్పాడు. ఇంతలో హఠాత్తుగా అంతా, బొంరయ్య శెట్టి ఇంటికి వెళ్లవలసి వచ్చింది.

ఈదినమున నుపన్యాస మేమియు లేదు. జంఘాలశాస్త్రి సభకు వచ్చెనుగాని యాతనికిఁ గొంచెము దేహములో నస్వస్థతగ నుండుటచే నాతఁ డేమియు బలుకలే ననియెను. కాలాచార్యులు మతవిషయములఁ గూర్చి కాగితముమీఁద వ్రాసికొనివచ్చి చదువఁగలవాఁడు కాని ధారాళముగ నుపన్యాస మియ నమర్థుఁడు కాఁడు. కవికూడ సభకు వచ్చెను. కాని యాతఁడుకూడ నేమియు నీరాత్రిఁ బలుకలేనని చెప్పెను. ''ఒక రాత్రి యుపన్యాసము లేకపోయిన నుర్వి కేమి లోటా? ఉన్నయెడల విశేషమా?'' యని యెంచి

యెటులో మాటలచేఁ గాలక్షేపము చేయఁదలఁచితిమి.

జంఘా–సాక్షీ! బొట్టయ్యశెట్టిమాట యేమిటి? ఆతఁ డిదివఱ కెందును గూర్చియుఁ దన యభిప్రాయమును వెల్లడింపలేదు.

సాక్షి–ఈయింటినుండి మనము మఱియొక విశాలద్వారముగల యిల్లు ప్రవేశించువఱకు నాతఁడు మనతోఁ గలిసి పనిచేయుట కవకాశముండదు.

కవి–అప్పుడయిన నాతఁడు కలిసివచ్చునని తోఁచదు. అతనికిఁ దామర దేహమంతయు వ్యాపించినది. ''కుష్ఠు'' అని కొందఱు చెప్పుచున్నారు.

కాలా–అంత పెద్దరోగము కాదు. కాని దురదచే మిగుల వెతనొందుచున్నాఁడు.

కవి–తామరకు జీడికంటె సిద్ధౌషధము లేదు.

జంఘా–కవి వైద్యుఁడుకూడనా? అబ్బో! ఇతఁడు జోడు. గుండ్లతుపాకివలె నున్నాఁడే!

కని–ఏదీ! ఒక్కమారైన నీ కుపయోగింపఁడయ్యెను.

సాక్షి–తిరుగఁ గలహమునకు గణపతిపూజ నారంభించుచుంటిరా?

కాలా–విష్వక్సేనుఁ డని సెల విచ్చిన బాగుగ నుండునేమో?

జంఘా–స్వామీ! మీరు తెంగలవారుకదా! మీరు మొన్నటి యేకాదశిరోజున శ్రాద్ధమేల చేసినారు?

కాలా–శ్రాద్ధము గాదోయి! నీదుంపతెగను! సత్యనారాయణ వ్రతము.

జంఘా–'పల్లెచెట్టులో మూత్ర మేల విడుతువోయి?' యనఁగ ''నయ్యో! తులసి మొక్క యనుకొంటి'' నని చెప్పినట్లున్నది. విష్ణు భక్తివ్రతము తప్ప నితరవ్రతములేని –లేకయుండవలసిన, వైష్ణవుఁడు విధిగఁ జేయఁదగిన శ్రాద్ధమునుఁ మాని చిల్లరదేవతల ప్రీతికొఱకు దేవులాడుట యంతకంటె గొప్పపని యనుకొనుచుంటివి కాఁబోలు!

కాలా–నేను జేయలేదయ్యా! మాయింటి కెనరో వచ్చి చేసికొనిరి.

కవి–ఆలాగా! లేనిపోనిమాటలాడుటలో జంఘాలశాస్త్రికిఁ జాలినవారెవ్వరు లేరు.

అంతలో సాక్షికొఱకు నెవ్వరో రాఁగ వారినెంట నాతఁడు పోయెను.

కవి–జన్మమునఁ బుట్టిన స్వభావ మెంతకును వదలదు కాదా? కాలాచారి! ఒకయూర నొకగ్రుడ్డివాఁ డుండెనఁట. ఆతఁడు పుట్టుగ్రుడ్డియఁట. ఆతఁ డొక రాజసంస్థానమునకు వచ్చి తానశ్వపరీక్షకుఁడనని వెల్లడించెను. రాజున కీవార్త తెలిసి యాతనిని బిలిపించి చూచెను. జాత్యంధుఁడేమి! అశ్వపరీక్ష యేమి! అని రాజు నవ్వెను. కొన్నినాళ్ళ కొక యశ్వనిర్ణయఁడనేకాశ్వములతోఁ దత్సంస్థానమునకు వచ్చి యాతని కాయశ్వములఁ జూపెను. వానిలోనుత్తమమైన యశ్వమును రాజు పరిశీలించి తీసికొనెను. ఆగుఱ్ఱముయొక్క, లక్షణములు, కథ మొదలగునవి చూచి యందఱు సంతసించిరి. రాజునకప్పుడు జాత్యంధునిమాట జ్ఞప్తి

వచ్చి యాతనిఁ బిలిపించి గుఱ్ఱమును బరీక్షింపుమని చెప్పెను. ఆతఁడు గుఱ్ఱమును జేతఁ బడిమి గుఱ్ఱము బాగుగ నున్నది. కాని యిది గేదెపాలవలనఁ బెరిఁగిన కారణముచే దీనికి బురద యనఁగఁ బ్రీతియు, నెండ యన్న భయము నుండు నని యాతఁడు చెప్పఁగ నందఱు నవ్విరి. అంధుఁడందుపై ''మీరు నవ్వఁబోకుఁడు. అశ్వవర్తకుఁ డింక గ్రామముననే యున్నాఁడుకాఁబోలు. ఆతనిని బిలిపించి యథార్థమును గనుఁగొనుఁడు'' అని యంధుఁడు పలికెను. అశ్వవర్తకుని రా జడుగ నాగుఱ్ఱముతల్లి దానిఁగని మరణించుటచే దాని బఱ్ఱెపాలచేఁ బెంచితి'' నని యాతఁ డొప్పుకొనెను. ఇట్టి రహస్యమును నీవెట్లు కనిపెట్టితి? వని రాజు గ్రుడ్డివాని నడుగ, ''నీగుఱ్ఱపుఁజర్మమే చెప్పుచున్నది'' అని యాతఁడు మాఱుపలికెను. ''అశ్వపరీక్షయేనా? మఱియింక నేపరీక్షయైన నెఱుఁగుదువా?'' యని రాజాతనిఁ బ్భచ్ఛ సేయ నరపరీక్షకూడఁ జేయఁగల నని యాతఁడు చెప్పెను. ఉత్తమకాంతారత్నమైన తనరాణిని నీతనిచేఁ బరీక్షింపించవలయు నని రా జనుకొని యంధు నందులకయి నియమిం చెను. అంధుఁ డంతఃపురములోనికిఁ బోయి రాణి కెదుటఁ గూర్చుండి యిట్లు పలికెను. ''అమ్మా! నేను గొన్ని మాటలు చెప్పెదను. ఇక్కడను మీరొక్కరే యుండనలయును'' అని వేఁడుకొనెను. అంతరాణి యట్లు సేయఁగ ''అమ్మా! నేను నీకుఁ దండ్రివంటివాఁడను. పుట్టుగ్రుడ్డివాఁడను. నిన్నుఁ బరీక్షింప వచ్చినాఁడను. ఆత్మతోనేగాని యక్షితోఁ బరీక్షింపఁ జాలను. బట్ట నీయొడలిమీఁద నేమాత్ర మడ్డుండినను నేను బరీక్షింపలేను. కావున వస్త్రహీనవుకమ్ము'' అని ప్రార్థించెను. అంత ''నటులే యయితిని'' అని యామె చెప్పెను. ''తల్లీ! తిరుగ వస్త్రధారణము చేసికొనుము; శ్రమ యిచ్చినందులకు మన్నింపుము'' అని చెప్పి యటనుండి లేచి రాజునొద్దకు వచ్చి ''అయ్యా! మీభార్య దాసికిఁ బుట్టిన'' దని చెప్పెను. అంత రాజు కోపావిష్టుఁడయ్యెను. కాని జన్మ రహస్యమును గనుఁగొనఁగ నంధుడు చెప్పిన మాటయే సత్యమయ్యెను. ''ఇట్టి సంగతి నీవెట్లు కనిపెట్టితి?''వని రాజాతని నడుగ నేను గ్రుడ్డివాఁడనైనసరే, నేను గేవలము రాతి విగ్రహము నయినసరే. కాని నాయెదుట నామె బట్ట విప్పుకొనుటచేత దాసీపుత్రిక యని చెప్పితి నని యాతఁడు మారుపలికెను. రాజు మిగుల సంతసించి యాతనికి దినమునకు సేరు బియ్యము నొకయరణా బత్తెము నేర్పాటు చేసెను. కొన్నిరోజులు గడచిన పిమ్మటఁ దనజన్మవృత్తాంతము చెప్పుమని రా జడుగ ''ఏలినవారు కోమటిహానికిఁ బుట్టినారండి'' యని యాతఁడు చెప్పెను. అప్పటికి జీవించియున్న తలతల్లియొద్దకు రాజేఁగి యొటనుండి కత్తినిదీసి తల్లి నడుగ నామె భయవిస్వాలయై వైశ్యసంపర్కము సత్యమని యొప్పుకొనెను.

ఇది ''నీకెట్లు తెలిసె''నని రాజాతని నడుగ ''నింతవిద్యాయుక్తునకొక సేరుబి య్యము నేర్పాటు చేసినపుడు నీవు కోమటివి కాక మఱెవ్వఁ డవై యుందువు?'' అని నేనూహించి యట్లు చెప్పితినని యంధుఁడు పలికెను. కావున నెంత చదువుకొనిన సరే! యెంత వయస్సుగలవాఁడయిన సరే! యెంత సత్సహవాస మున్నవాఁడయినసరే! జనుఁడు పుట్టితోఁ బుట్టిన బుద్ధినిమాత్రము విడువఁజాలఁడు.

జంఘా-కవీ! మహాకథకుఁడ వైతివి. కలియుగసూతుఁడ వయితివి. సెబాస్! కథలు చెప్పుట యెవరియొద్దనుండి యెరవు తెచ్చికొంటివి? ఎరపునుక్కువలె నీకిది యరణముగ సుండఁగలదా?

కాలా–ఎరవు ముక్కేమిటి?

జంఘా–ఒకనికి ముక్కులేదు. ముక్కనఁగ నాతనికి ముచ్చట యింతింత కాదు. కాల్పనిక మగునాసికను గడియింపవలయునని మిగులఁ గుతూహలములో నుండెను. ముక్కెవ్వఁ డెర విచ్చును? ఒకనాఁడాతఁడు వైద్యునియొద్దకుఁ బోయి నాసాపుటప్రదానము నపేక్షించి యాతనికాళ్లఁబడెను. అంత నావైద్యుఁ డీతనితొడనుండి కొంత మాంసము, చర్మము తీసి యామాంసమును ముక్కుటెక్కుగలదానిగఁ జేసి, దానిపై నాచర్మఖండమును గప్పి, దానిని నాసికాస్థానమున నదికింతునని చెప్పెను. అందులకు ముక్కిఁడి మిక్కిలి సంతసపడెను. కాని నూతన నాసికానిర్మాణమునకై పురాణోరుచ్ఛేదనమున కంగీకరించుట బుద్ధిలక్షణము కాదని యందుల కంగీకరింపఁడయ్యెను. తుదకెటులో తంటాలుపడి మఱి యొకపురుషుని భుజమునందలి మాంసమును దీయించి దానితో నాతనిచేత ముక్కును సింగారించుకొనెను. కొన్నినాళ్లకీపెట్టుముక్కు చల్లఁబడి కుళ్లిపోయి యూడిపోయెను. ఎందుల కూడినదో యని యాలోచింపఁగ ముక్కు కండ నమ్మిన పుణ్యపురుషుఁడు పరలోకగతుఁ డయ్యెనని తెలియవచ్చినది. మనసొంతముక్కయిన మనకు శృంగారముకాని, యద్దెముక్కపాయకరము కాదా? ఒకనిని జూచి నీవు కవిత్వము తెచ్చి కొనుటయే హాస్యాస్పద ముగ నుండఁ గథకత్వముగూడఁ దెచ్చిపెట్టుకొని యిఁకఁ దక్కఁదలఁచుకొనలేదా యేమి?

కవి–ఏమికథఁ జెప్పితివి? ఎంత సందర్భముగఁ జెప్పితివి? పృష్ఠతాడనము! దంత భగ్న మనునట్లున్నది. ఇఁకఁ జాలించు.

కాలా–తగవు లెందులకు? ఏదియో యిష్టగోష్ఠి సలుపరాదా?

జంఘా–ఇష్టగోష్ఠి కేమిభాగ్యము! కాలాచారీ! తల యంత–మాయఁబెట్టుకొంటి వేమి?

కాలా–క్షురకుఁడు కలికములోనికైన దొరకకుండనున్నాఁడు.

కవి–అబ్బో! క్షురకుల కిప్పుడు గురుఁ డేకాదశమం దున్నాఁడు. ఎక్కడఁ జూచిన మామిడాకుతోరణములు! మంగళ్ల నీరణములు!

జంఘా–శుభకార్యము లెన్నియైన జరుగుచున్నవి. కాని కాలాచారీ! యీయుల్లోలకల్లోలములో నీమంగళమహాలయములో నీవుగూడ దేనినయిన ముడిపెట్టుకొనరాదా!

కాలా-నేను నిజము చెప్పుచున్నాను. నాకుఁ బొడుముమీఁద నున్న మమకారము పొలఁతిమీఁద లేదుసుమా!

జంఘా-నిజమే. రసగ్రహణపారీణునకు ముక్కులోఁ బొడుముకంటెఁ బక్కలోఁ బడఁతి యెక్కువ కాదు. కాని లోకసంగ్రహార్థమయిన నీవు చేసికొనుట మంచి దనుకొందును.

కాలా–రామ రామ! బ్రహ్మచారినై యుండక నాకీప్రారబ్ధ మెందులకు?

కవి–లోకసంగ్రహార్థము చేసికొనుట యేల? చేసికొనువా రందఱందుకొఱకే చెసికొనుచున్నారా? అతని కేమి? ఇంక చిన్నవాఁడు. పండితుఁడు-మిగుల దృఢశరీరుఁడు -భార్యను సంబాళించుకొనలేక పోవునా?

జంఘా–సాపాటుపుష్టికి సంబాళింపునకుఁ జాలభేద మున్నదిలే. ''మోటారుకారును'' ముందునకుఁ బోకుండ నాఁపవచ్చును గాని, కాలి దురదయాలినిఁ గడఁద్రొక్కకుండ నాఁపలేము. వక్షమునఁ బదునాఱుబండ్ల బరువును జెదరనీకుండఁ బట్టవచ్చును. కాని ప్రక్కను జలచిత్తపుఁ బలుగాకిని బెనకనీకుండఁ బట్టలేము. ఇనుపగొలును విరువవచ్చును కాని మగువల పులుసును విఱుగఁగొట్టలేము. ఱాడుదాని యోగ్యత మగవాని యాహారశక్తిలో లేదు. వెన్నుపాము బింకములో లేదు.

ఒకఁడు బహుదార్ఢ్య సంపన్నుఁడై యుండెను. ఆఱడుగలపొడుగును, నాలుగడుగుల వెడల్పుగల బల్లపయిఁ గొందఱను గూర్చుండఁ బెట్టి తనపండ్లతో నొబ్బల్నాతఁ డెత్తినాఁడు. ఆఱువందల 'పౌనుల' దాగటను గదుపుపయి నుంచుకొని నాలుగుసమ్మెటలతో దానిపయిఁ గొట్టించుకొనినాఁడు. కుర్చివెనుకకాలును దంతముతోఁ బట్టి పైకి లేవఁదీసి నాలుగుగజముల యెత్తువఱకుఁ బోవునట్లుగా నెగురనైచినాఁడు. ఇంక ననేకాద్భుతచర్యలు చేసినాఁడు. ఈతఁ డొకకాంతను బెండ్లిచేసికొనినాఁడు. అతని కామెయందు మిక్కిలి యనురాగము. ఆమెకూడ నీతని వరించియే పెండ్లిచేసికొనినది. మదించి మతిలేక యెగిసిపోవుచున్న యేనుఁగునయినఁ దోఁకఁ బట్టుకొని కాళ్లు ''దబాయించి'' యూఁపశక్తి గల యాతఁడు సుకుమారియు, నబలయు, నాలుగడుగులున్నరయెత్తుగలదియు నయిన యామెను గౌఁగిటిలో నిలుపుకొనలేకపోయినాఁడు. ఆమె యసంతుష్టిచేఁ గడఁ ద్రొక్కనారంభింపఁగ నీతఁ డాగ్రహముచేఁ దెయితక్క లారంభించెను. ఈవెఱ్ఱిముండకొడుకు మునుపటికంటె నిఁక నొకబిందెపాలుఁ ద్రాగియు, నింకొకబుట్టెఁడు కోడిగ్రుడ్లు తినియు, మఱికొన్ని వేలు దండెములు తీసియు నిల్లాలిని సుఖపెట్టవలయునని మనుష్య శక్తికిఁ బరమావధి యగునట్లు పాట్లుపడెను. 'ఊహూ ఉఁ ' వంట యింటిలోఁ గూరుచుండి యాతఁడు కోడిపులావు చేయించుచుండఁగా నామె కిటికీలోఁ గూర్చుండి కోడెగాండ్రకుఁ జేనన్న చేయుచుండెను. ఈతఁ డశనాధిక్యతవలన లాభమేమియు లేనట్లు కాంచి వీర్యవృద్ధి లేహ్యముల సేవింపమొదలిడెను. మదనకామేశ్వరాదుల లోనికి, మర్దనములు పైకి నుపయోగించెను. కాని యామెమనసు పరపురుషులమీఁదను, చూపు భర్తపైని నిలిచియుండెను. నల్లమందు గంజాయి మొదలగు స్తంభనద్రవ్యములుకూడ నుపయోగింపఁబడెను. ఈతఁడు యత్నిత కార్యసాఫల్యమును గనఁజాలనివాఁడయి ఖేదపడెను. భార్య దుష్టవ్యాపారము మానలేదు. ఈతఁ డాత్మహత్యకై సంకల్పించుకొనెను. తలఁ బగులఁ గొట్టుకొని చచ్చెద మన్న కసరత్తున గట్టిపడినది. పగులునో లేదో! రయిలుబండిక్రిందఁబడి చచ్చెద మన్నఁ బదునాల్గుమోటారుబండ్లు మీఁదనుండిపోఁగఁ జెక్కుచెదరనివాఁడు చచ్చునని యేమి నమ్మకము? అంతట నేబది ధాన్యపుగింజలయెత్తు 'Sulphonel' (సల్ఫోనెల్) తీసికొని–

అంతట నెవ్వరోవచ్చి బొఱ్ఱయ్యసెట్టికి రోగము హెచ్చుగ నున్నదనియుఁ, మీరందఱు రావల్లయు ననియు రోఁజుకొనుచుఁ జెప్పెను. అంత మేము తొందరపడి పనికిమాలిన యాపలుకులను గట్టిపెట్టి సెట్టి యింటికయి పోయితిమి.

38. సభాస్వకీయవ్యాపారము

ఈరోజున ప్రత్యేకించి ఏమీ ఉపన్యాసం లేదు గాని – సాక్షి సంఘ సభ్యులను ఉద్దేశించి వచ్చిన మూడు ఉత్తరాలను 'సాక్షి' మిగిలిన సభ్యులకు చదివి వినిపించాడు.

మొదటి ఉత్తరం పెద్దాపురం నుంచి పత్రి రఘునాధాచార్యులనే మధ్వమతస్థుడు సాక్షి సంఘంలో సభ్యత్వం కోరుతూ, దాని అవసరాన్నీ, తన అర్హతల్నీ వివరించాడు.

కాలాచార్యులు, జంఘాల శాస్త్రి అతని సభ్యత్వ ప్రతిపాదనకు అంగీకరించలేదు. వాణీదాసు, ఆ మాధ్వుణ్ణి చేర్చుకోవచ్చునన్నాడు. బొర్రయ్య శెట్టికి అభిప్రాయం కోసం కబురు చెయ్యగా అతను కూడా వ్యతిరేకత ప్రకటించాడు. దానితో – సాక్షి, ఆ మాధ్వుడికి సభ్యత్వం ఇవ్వడం మాట సాధ్యపడదని తెలియచేద్దామన్నాడు.

రెండో ఉత్తరం, సత్యపురం నుంచే ఒక వితంతువు రాసినది. తాను నలభై ఒక్క సంవత్సరాలు వయస్సున్న కన్యావితంతువుననీ, కాలాచార్యులు అంగీకరిస్తే అతన్ని వివాహం చేసుకోవాలని వుందనీ సారాంశం. కాలాచార్యులు ఏ విషయం స్పష్టంగా చెప్పకుండా ఒకవేళ, వితంతువును చేసుకుంటే, సాక్షి సంఘ సభ్యత్వం పోతుందా? అని అడిగాడు. దానికి సభ్యులు నవ్వి, 'పోదు' అని చెప్పారు. అయినా, కాలాచార్యులు ఒక నిర్ణయం చెప్పకుండా వాయిదా వేశాడు.

నరే, ఇంటర్దై గురించి ఇంటి యజమాని రాసిన ఉత్తరం మీద నిర్ణయం చేయడం కూడా జరిగింది. మూడో ఉత్తరం, ఒక 'అనామకుడు' గ్రామ్య, గ్రాంథిక భాషావాదుల వాదాలు ప్రబలంగా జరుగుతున్నాయి కదా, ఆ విషయం ఎత్తుకోరేమి? అనే ప్రశ్న. వేరేచోట దాని ప్రస్తావన చేశామనీ, మళ్లీ మళ్లీ అనవసరమనీ జవాబుతో సభ ముగిసింది.

ఈరాత్రి యుపన్యాస మేమియు లేదు. సభావ్యవహారములు చూచుకొనవలసియున్నది. ఒక మాధ్వునియొద్దనుండి యీయుత్తరము మొన్న నాకు వచ్చినది. దీనిలోని సంగతులఁ జదివెదను. మీమీ యభిప్రాయములు నాకుఁ దెలియుఁబఱచునెడలఁ దిరుగ

నాతనికిఁ బ్రత్యుత్తర మిచ్చెదను. మొదటిలేఖను వినుఁడు.

సాక్షిగారికి–నత్యపురము, గోదావరిజిల్లా.

పత్రి రఘునాథాచార్యులు నమస్కారపూర్వకముగ వ్రాసికొనినది. నువర్ణలేఖలోఁ బ్రచురించుచున్న మీయుపన్యాసములను జదివి యానందించుచున్నాను. మీలో విశిష్టాద్వైతియు, నద్వైతియునున్నారు. కాని ద్వైతియొక్కఁడును లేఁడు. ఎంతతక్కువ సభలోనయినను ద్రిమతస్థులు చేరియుండుట న్యాయమైయున్నది. నేను మాధ్వుఁడను. శ్రీ మదాచార్యులవారి యన్ని గ్రంథములఁ జదివితిని. సుధాధ్యయనమిప్పుడు చేయుచున్నాను. ప్రకరణములవఱకుఁ దర్కమును జదివినాను. మతవిషయక సంప్రదాయములు శ్రీమదానందతీర్థులవారి కటాక్షమునఁ గొంత యెఱిఁగినవాఁడను. నేనీనడుమను మాయూనియనులో సభ్యుఁడొక్కఁడు చనిపోవఁగఁ దత్స్థానమునకై యపేక్షించి యధికారులకుఁ బ్రార్థనాపత్రము నంపుకొంటిని. కాని యది నిరాకరింపఁబడె నని చెప్పుటకు వగచుచున్నాను. ఏదైనఁ దగిన సభలో సభ్యుఁడుగ నుండవలయునని యభిలాషతో నున్నాను. ఈమతవిషయకోపన్యాసములీయఁగలను. మాధ్వమతావలంబకుఁడు మీలోనుండకపోవుట శోచనీయమని నాయభిప్రాయము. అందుచే నన్ను సభ్యునిగాఁ దీసికొనఁ బ్రార్థింతును.

ఇట్లు విన్నవించు,
పత్రి రఘునాథాచార్యులు.
పెద్దాపురము.

ఈతఁడు మనసభలో సభ్యత్వ మపేక్షించుచున్నాఁడు. ఈతనింజేర్చుకొనవచ్చునో లేదో యాలోచించి చెప్పుఁడు.

కాలాచార్యుఁడా! నీయభిప్రాయ మేమి?

కాలా–మాధ్వమతమునకు రామానుజమతమునకు విశేషభేదము లేదు. రెండుకూడ భక్తిప్రతిపాదకములే. విష్ణుసర్వోత్తమత్వ స్థాపకములే. జీవాత్మ పరమాత్మల యైక్యము నిరాకరించునవే. మతమునకుఁ గావలసిన ముఖ్యాంశములలో రెండు నొక్కటే. మధ్వాచార్యులవా రీమతమును స్థాపింప నక్కఱలేకయే యుండవలసినది. కాని రామానుజమతస్థులు భక్తిప్రపత్తులకుఁ బ్రాముఖ్య మిచ్చి వైదికకర్మముల నిరాకరించి యాచారనిష్ఠాదూరు లగుటచే వైదికర్మములఁ దిరుగ నిలువఁబెట్టుటకై వీ రీమతమును బోధింపవలసివచ్చినది. ముక్తిదశలోఁ గూడఁ గొన్నికొన్ని భేదము లీరెండుమతముల కున్నవి కాని యవి యంత గణనీయములు కావు. మిగిలిన యంశములు రెంటికి సామాన్యము లగుటచే వేదాంతాచార్యులవా రీమతమును సన్నిహితమ ని పిలిచిరి. కావున నేను నామతమున బోధించునంశములే యామాధ్వుఁడు బోధింపవలయును గాని మఱియొకటి కాదు. ఒక్కవిధమైన యంశములఁ బ్రతిపాదించుట కిద్దఱుపన్యాసకర్తలావశ్యకములేదని తోఁచుచున్నది.

సరే. జంఘూలశాస్త్రీ! నీయభిప్రాయ మేమి?

జంఘూ–నేను గాలాచార్యునితో నేకీభవించితిని.

వాణీదాసా! నీవేమందువు?

వాణీ–వ్యాపారులలోఁ గొందఱు మిగుల తెలివికలవా రనుట సత్యము. వాదమునఁ గూడ న్యాయమగు పట్టుదల. వారు కుత్సితులు కారు. దయాధర్మములందు బుద్ధిగలవారు

దైవభక్తికలవారు. ధారాళాంతఃకరణము గలవారు–కావున వ్యాపారిని సభ్యునిగాఁ జేర్చుకొన వచ్చును.

సాక్షి:బొఁట్టయ్యసెట్టి పంపిన తసయభిప్రాయమును జదివెదను.

''మనమిప్పటి కయిదుగురు సభ్యులము. అయిదు మంచిసంఖ్య. ఇది పదికి సడుము నుండుటచే దీనికింత యోగ్యత సిద్ధించిన దని నానమ్మకము. ఆఱను సంఖ్య 'యేడు'నకు దరిగ నుండుటచేఁ బనికి రాదు. సభ కయిదుగురే చాలు. అందువలనఁ 'బంచాయితీ' గౌరవము సభకుఁ గలుగును. ఆర్గు రున్నందువలన నొక్కయాతిబాధకూడ నున్నది. ముగ్గురొక యభిప్రాయమును మిగులు ముగ్గు రొకయభిప్రాయమును బడిన యెడలఁ దరువాత గొంతుదిగుట కష్టముగ నుండును. సభలో సభ్యులు లొంగుబాటుగ నుండవల యునుగాని విరివిగఁ జేతి కందనివారుగ నుండఁగూడదు. అదిగాక సభాగృహము మిగులఁ జిన్నదిగ నున్నది. ఆలోచించి నూటలాడు నయిదుగరిలోఁ దేలనియంశ మైదువందల సభ్యులలోనైనఁ దేలు నని యనుకొనుట వెట్టి. మనము పైసభ్యుల నిరాకరించుటకుఁ గారణము మనలో నుండిన క్షితరులకుఁ గనఁబఱచవలయునుగాని వారిలో నున్నట్లు కనఁబడినయెడలఁ బ్రజలయిష్టమునకు దూర మగుదుము. దుకాణములో నిత్యము కూర్చుండువాఁడు గూర్చుండినప్పుడే రాబడి యెక్కువగ నుండును గాని క్రొత్తవాఁడు కూర్చుండునెడల సామాన్యమే! నేను దురదృష్టసున సభకు రాఁజాలనైతిని. కాన నేను వచ్చుచుండునెడల నాకు మీకుఁ గూడ స్థలము చాలనే చాలియుండదు. ఈకారణములచేఁ బైవారు మన కెవ్వరు–వలదు.

మనలో మగ్గురు వ్యాపారిని దీసికొనుట కంగీకరించలేదు. కావున నాతనికి-మనయనిష్టతఁ దెలియపఱతును – రెండవయుత్తరముకూడ నున్నది. మీరు దీనిని వినఁదగును.

మహారాజశ్రీ సాక్షిగారికి–

సత్యపురము.

అయ్యా!

నేను గన్యావితంతువను, 41 సంవత్సరముల వయస్సుగలదానను. వెలనాటివారి శాఖదానను. మీరోఁ గొలాచార్యుఁడని యొకవిద్వాంసుఁడున్నాఁడని యెఱుంగుదును. ఆయన నీసడుమఁ జెఱుపునొద్దఁ జూచితిని. ఆయనకు వివాహము లేదని వింటిని. వివాహాపేక్ష పూర్తిగ :న్నదని–వింటిని. నావంటి వితంతువు నాతఁడు పరిణయ మాడుట కిష్టపడునా? ఈయంశ మాతనికి నేను వాదాసిచే వార్తనంపితిని. కాని తాను ''సాక్షి యధీనుఁడనై యుండుటచే నేమియు స్వతంత్రించి చెప్పఁజాల''నని నాకు మాఱువార్త నంపినాఁడు. అందుచే మీకు వ్రాయవలసివచ్చినది. క్షమించి యాతనిఁగనుఁగొని యాతనియభిప్రాయమును నాకుఁ దెలుపునెడల సంతసింతును. నాపే రేదో యాతఁ డెఱుంగును. అందుచే వ్రాలు చేయలేదు.

ఈయుత్తరము చదువుసరికిఁ గొలాచార్యులు పొంగిపోయెను.

మంచినల్లమందువలె నలుపులో మస రెక్కెను. ముక్కుల లిద్ది గొట్టినట్లు దిబ్బడులు

వైచుటచే వట్టి యుపదేశముద్రను బుజ్జునఁబీల్చెను. అట్టి యొంటిజన్నిదమును జూచుకొ నెను. సభ్యు లందఱాతని తొట్రుపాటును జూచి నవ్విరి. ఈయుత్తరమునకు నీవేమి ప్రత్యుత్తర మిచ్చెద? వని నే నాతని నడిగితిని.

అంతట గాలాచార్యులిట్లనియెను.

చిరకాలమునుండి వివాహవాంఛతో నున్నమాట సత్యమే. చేసికొనకున్న జరుగుసాధ నము లేదనుమాటకూడ సత్యమే. నగమీడు దాఁటిపోయినది. కావున నూరకుంటయే మంచిది యనుటకూడ సత్యమే! ఇట్టిసంధిలో నాకేమియుఁ దోచియుండుట లేదు. కావున మీ రెట్లు చెప్పిన నట్లు వినువాఁడను.

అంత జంఘాలశాస్త్రి యిట్లనియెను.

వివాహ మనునంశ మెవరియిష్టానుసారము వారు చూచుకొనఁ దగినది. కాని సభవారి యభిప్రాయమునకు వదలివేయఁదగినది కాదు. తన బలాబలములు చూచుకొనవలయును గాని ''యౌను గా'' దను సభ్యుల సంఖ్య బలాబలములు చూడఁదగినది కాదు. అంతట గాలాచార్యులు లేచి యిట్లనియెను.

''వితంతువును జేసికొనినందువలన నాకీసభలో సభ్యత్వము పోవునా? పోవునెడలఁ జేసికొననొల్లను. నాకు సాక్షికంటె సతి యెక్కువది కాదు''.

అంత నందఱునవ్విరి. సభ్యత్వము పోదనియందఱు నైక్యకంఠముగఁ బలికిరి. ''సరే! ముందు మాఘాదిపంచకములోఁ గాని వివాహముహూర్తములు లేవు. కాననప్పుడాలోచించి చెప్పెద''నని కాలాచార్యులు ప్రత్యుత్తర మిమ్మని చెప్పెను.

ఆయుత్తరము బాగుగ లేదని యంద ఱెంతగాఁ జెప్పిన నంతకంటెఁ బ్రస్తుతమునఁ జెప్పుట కవకాశము లేదని కాలాచార్యులు భీష్మించుకొనెను. ఈయంశమైనది. ''ఇదిగో! యీయుత్తరము సభామందిరపు టద్దెనుగూర్చి యింటియాతఁడు వ్రాసినాఁడు. అయిదుమా నముల బాడిగె యాతని కీయవలసియున్నది. ఇదే దీనియభిప్రాయము. కావునఁ జదువ నక్కఱలేదు. ప్రవేశపురుసు మిదివఱకుఁ జేరియున్నది. నాల్గు రూపాయీ లున్న వని సభసంబంధనుగు నాదాయపులెక్కను జదివితిని. నెల కొకరూపాయిచొప్పున యొక్కటి బొట్టయ్యసెట్టి యొద్ద బదులు తెచ్చి యింటియాతని కిమ్మని యంద ఱభిప్రాయపడిరి.

తరువాత–ఇదియొక యుత్తరము.

సాక్షిగారికి–

గ్రామ్యభాషావాదులకు, గ్రాంథికభాషావాదుల కిప్పుడు వాదములింత ప్రబలముగ జరుగుచుండఁగా మీరాయంశ మెత్తుకొనకుండకనే యూరకుంటి రేమి?

ఇట్లు విన్నవించు,
అనామకుఁడు.

రెండవసాక్షిలో నాయంశ మెత్తుకొని మాయభిప్రాయము వెల్లడించియుంటిమి. కానఁబడేపదే దానినిగూర్చివలుక నక్కఱలేదని నాయభిప్రాయమని జంఘాలశాస్త్రి చెప్పెను. సభ్యులాతనిమాట నామోదించిరి.

అన్ని యుత్తరములు పూర్తియయినవి. కావున సభ చాలించవచ్చును.

39. సభాస్వకీయాంశములు

బొల్లయ్య శెట్టి చనిపోయిన తరువాత సాక్షి సంఘం సభ్యుల బ్రతుకులు కొంత కాలం చెదురు మదురుగా గడిచాయి. మద్రాసు యాత్రలో జంఘాల శాస్త్రి ఉపన్యాసాల ముచ్చట్లు అలా వుండగా, కాలాచార్యుల 'మొదటిసారి వివాహ ప్రయత్నం' భగ్నం కావడం 'మామ' అనబడదగిన మనిషి మీద చెయ్యి చేసుకున్న నేరానికి జైల్లోపడి, ఎలాగో మళ్లీ బయటపడడం, జరిగి పోయాక, కాలాచార్యులు; చేజారిపోయిన ధనాన్ని మళ్లీ కూడతీసుకోవాలనే కుతూహలంతో వున్నాడు. జంఘాల శాస్త్రి 'వెయ్యార్లకి' పూజారి గనక, పూట గడిస్తే చాలు గనక, కాలాచార్యుల బలవంతం మీద మద్రాసులోనే ఉండడానికి ఒప్పుకున్నాడు.

ఏదో ఒక వృత్తి చేసుకుందామని ఆలోచన వచ్చి, ''ముక్కుపొడి వ్యాపారం'' గురించి సానుకూలపడక వదిలేశారు. మరొక తమిళ వైష్ణవుణ్ణి అనుకోకుండా సముద్రపు టొడ్డున కలిసి, వ్యాపారోపదేశం పొందబోయి, అతను తమకంటె దరిద్రుడని, 'లంజల యేజం' టని తెలుసుకుని లెంపలు వేసుకుని తప్పుకున్నారు.

ఇక ఇదీ అదీ కాదని, రెండుసార్లు వ్యాపారంలోకి దిగి చావుతప్పి కన్ను లొట్టబోయిన తీరుగా పోయిందిపోను, నూట ఇరవై రూపాయల పైకంతో వెనక్కి సత్యపురం తిరిగి వచ్చారు. ఆ సొమ్ము సాక్షి సంఘానికి మూలద్రవ్యంగా ఇచ్చారు. వాణీదాసు, కవిత్వం మాని, గ్రామ్య గ్రాంధిక వివాదాలలో చిక్కుకొని తూర్పున పడివున్న వాడల్లా, జంఘాలుడు, కాలుడు తిరిగి వచ్చారని తెలిసి, తనూ వెనుదిరిగి వచ్చాడు. సాక్షి ఉండనే ఉన్నాడు. అయిదో సభ్యుడి ఖాళీని భర్తీ చేస్తామని ప్రకటించారు.

మదరాసులోని కళ్లెపిరాంపిళ్లగారి యాంధ్రభాషోపన్యాసమును ఖండించిన జంఘాల శాస్త్రి వాగ్ధాటినిఁ జూచి యచ్చటియాంధ్రులు దాక్షిణాత్యులుకూడ మఱిరెండుపన్యాసము లిమ్మని శాస్త్రిని బ్రార్థించిరి. ఆయుపన్యాసము లేవియో తెలియదు. రాజుగా రిచ్చిన కన్యాదానధనమును ''గేపుమారి'' మామగారి యొడిలోఁ బోసి తనభార్య తన వివాహశ్రాద్ధ మునకుఁ బూర్వమే యీడేరి గడిఁదేరియున్న దనుకోపమున మామగారిని జెప్పు దీసికొని కొట్టి రక్షకభటులచేఁ గారాగృహమునఁ బెట్టఁబడిన కాలాచార్యులకుఁ జేజాఱిపోయిన

ధనమును గడించునటకు మిగుల గుతూహలముగ నుండెను. ఇనుపసంకెలలు పడిన కాళ్లింటివైపునకు మఱలుటకు సంకోచించుచుండెను. ఏదైన నొకవృత్తి జేసికొని మదరాసు నందే కొంతకాల ముండుటకుఁ గాలాచార్యులు నిశ్చయపఱచుకొనెను. ఆతఁ డొక్కఁ డెక్కడ నున్న నేమి వినియోగ మున్నది? పాడుముఁ దెచ్చి ముక్కుఁక్రిందఁ బెట్టినఁగాని యెగఁబీల్వలేని శుద్ధసత్వస్వరూప మయిన యాతఁ డేవృత్తి చేసికొనఁగలఁడు? కావున జంఘాలశాస్త్రిని గూడఁ దనతో నుండు మని ప్రార్థించెను. జంఘాలశాస్త్రి కేమున్నది? అతని కాపూఁట కున్నఁ జాలును. ముందుపూఁట దేవుఁడెఱుఁగును. ఆతఁడు సర్వజనసో దరుఁడు! సర్వదేశనివాసి! ముక్కుల కొఱకు నెవరితోనైన మూఁడుమాటలతో నేస్తమొ నర్పఁగలఁడు. వట్టిమడతమనుష్యుఁడు. ఎక్కడకక్కడికే యిమిడియుండఁ మనస్సంధులు గలవాఁడు. కావున శాస్త్రికూడ నాచార్యునితో మదరాసున నుండుటకొప్పుకొనెను. రామాను జకూటములో నాచారి తళిహ కైంకర్యముఁ జేయుచుండఁగా పూఁటకు మూఁడణాలన్నర పుచ్చుకొనుచున్న కృష్ణాచారియన్న సత్రమునందు శాస్త్రి ''కొళంబు'' కైంకర్యముఁ జేయు చుండెను.

ఏదియో యొకవృత్తి చేసికొనవలయును గాన నేదిచేసికొంద?మని వారాలోచించు చుండిరి. ''సుగంధముక్కుపొడి'' వర్తకము బహుళముగఁ జేయు నొకమహమ్మదీయుఁ డున్నాఁడని తెలిసి యాతనియొద్దకు వీరు పోయిరి. ఆతనియొద్ద కమీషను ఏజంట్లుగఁ బనిచేయవలయు నని కొంత ప్రయత్నించిరి. వీరివిక్రితవేషములు చూచి యామహమ్మదీయుఁడు వీరిని జేర్పకపోవుటచేఁ గాఁబోలు నాతనికి ''సలాము'' చెప్పి నముద్రపుటొడ్డునకుఁ బోయిరి. అచ్చట నొక వైష్ణవుని గాంచిరి. అతఁడింగ్లీషుమర్యాద ననుసరించి దుస్తులు ధరించి కంటికి జోడు పెట్టుకొని చేతితో కట్టను బుచ్చుకొని యటునిటు దిరుగుచుండెను. ఆతఁడు నవ్వుమొగము గలవాఁడగుటచే నాతనియొద్దకుఁ బోయి మనవారు నిలువఁబడిరి. Well Good Evening, What can I do for you? అని మృదులముగ నాతఁడు వల్క దానికర్థము కాలాచార్యునకుఁ దెలియలేదు. ''మీవలననే మేలు కోరియుంటి'' మని జంఘాలశాస్త్రి ప్రత్యుత్తరము చెప్పెను. అతఁడు తెనుఁగు బాగుగ వచ్చినవాఁ డగుటచే సరే మీకేది కావలయునో యిదివఱకు చూచుకొంటిరా? యని వారి నడిగెను. ''ఇది వఱకు చూచుకొంటిమి. కాని మాకు నచ్చలేదు. మీరే యేదయిన నాలోచించి మాబాధ దొలఁగింపవలయును'' అని జంఘాలశాస్త్రి తిరుగఁజెప్పెను. సరేయని యాతఁడు కొంతసేపాలోచించి జేబుగడియారమునకై జేబును దడుముకొనెను. పాడుముపొ త్తికొఱకు వెదకుకొనుచున్నాఁడని కాఁబోలు! కాలాచార్యు లూర్ధ్వశ్వాసపురస్సరముగా నెడమచేయి చాఁచెను. చేయి ముడుచుకొమ్మని యర్థమిచ్చిన ట్లాతని కాలిపై శాస్త్రి ప్రచ్ఛన్నముగఁ దన్నెను. ''మీకుఁ దెలుఁగువారు కావలయునా? అరవలు కావలయునా? యని యాతఁడు మనశాస్త్రి నడుగ- నెవ్వరయిన నేమి? మాకు సగౌరవముగా జరుపువారయినఁ జాలు నని శాస్త్రి బదులు చెప్పెను. well give me an advance of two rupees అని యాతఁడు చేయి చాఁచెను. మనవారిద్దఱివద్దను గలిసి యేడణా లున్నవి. ''మీకిచ్చటకు మాయొద్దనే మున్నది?'' అని శాస్త్రి చెప్పెను. కొంచెమర్థ మెట్లు తెలిసెనోకాని రెండు రూపాయలున్నఁ బొడుము వర్తకమే మొదలిడియుందుమని కాలాచా ర్యులు దరిద్రతానూచన నస్యవాంఛాపరిపోషకమగు వాక్యమును జెప్పెను: 'పోడాముత్థాళ్'

అని యాతఁడు గిరుకు–మని దిరిగి కట్టను జక్రాకారమునఁ ద్రిప్పుచు నీల వైచుకొనుచుఁ బోయెను.

జంఘాలశాస్త్రి భుజించుచున్న యన్నసత్రమున కధికారియగు కృష్ణాచారి యటకు వచ్చి హేళనముగ వెకవెకలాడుచు ''శాస్త్రీ! అవరగళుకు'' సరసము కావలసివచ్చెనా? యని జంఘాలశాస్త్రి వీఁపుపైఁ దట్టుచు ననెను. అంతట శాస్త్రి ''ఆకట్టుచేతి పెద్దమనుష్యుఁడెవఁ?'' డని కృష్ణాచార్యుల నడిగెను. అతఁ డీపట్టణమున ''లంజలయేజం'' టని వంటపూటి మేనేజరు బదులు చెప్పెను. అంతట మనవారు లెంపలు వైచికొని యూనాఁటి కింటికిఁ బోయిరి. ఆరాత్రి యంతయు నిదుర లేకుండ నేవృత్తి చేయవలయునో యోచించిరి. తుట్టతదకు ''కాఫీహోటలు'' పెట్టిన మంచిదని నిశ్చయించిరి. కాలాచార్యుల మామగారు తనవివాహ కర్మాచరణసమయమునఁ దన కొసఁగిన దర్భముడియుంగరమును కృష్ణాచారికమ్మి పదిరూపాయలను దెచ్చి మరునాఁ డుదయముననే సన్నిధివీధిలో Victoria Coffee Hotel (విక్టోరియా కాఫీ హోటలును) స్థాపించిరి. కాలాచార్యులే యీసంస్థానమునకు నలుఁడు. జంఘాలశాస్త్రియే కోశాధికారి. ఇట్లు మూఁడుమాసము లగుసరికి ఓ! దివ్యభవనము! ఎక్కడఁజూచిన నిల్వుటద్దములే! రవివర్మపటములే! కుర్చీలే! బల్లలే! నివాడవెండితోఁ జేసిన గరిటెలే! వాలుకుర్చీలే! వంటవాండ్రు వడ్డన వాండ్రందఱు దాక్షిణాత్యులే! వారిపని పెళపెళ లాడిపోయినది. ఊరివారినుండి రావలసిన సొమ్ము మూఁడువేలున్నది. మనవారు కోమట్ల కీయవలసినది నాల్గువేలున్నది. సాయంకాలమున వారంటు వచ్చినది. సూర్యోదయ మగుసరికి ''హోటలుతోఁ'' గూడ మనవారు మాయమైరి. నీరొక మాసమువఱకుఁ బ్రచ్ఛన్నముగ నెటులోఁ గాలక్షేపము చేసి (George Town) జార్జిటవునులో చెంగాయంగడి సమీపమున (North and South) 'నార్తు అండ్ సౌత్' అను కాఫీ హోటలును దిరుగఁ బెట్టిరి. ప్రచ్ఛన్నతకై జంఘాలశాస్త్రి గడ్డము పెంచెను. కాలాచారి గడ్డము గొరిగించెను. ఇట్లు క్లుప్తముగ వాడుకొని కొంతధనము సేకరించి కొలఁది రోజులక్రిందటనే మూసత్యపురమున కాకస్మికముగ వారు వచ్చిరి. వారు తెచ్చినసొమ్ము నూటయిరువది రూపాయలు. దీనిని సాక్షిసంఘమునకు మూలద్రవ్యముగ నొసఁగిరి.

వాణీదాసుఁ డీనడుమఁ గవిత్వమును మాని గ్రామ్యగ్రాంథిక వాదములలోఁ జిక్కుపడి తూర్పుననే పడియుండెను. జంఘాలశాస్త్రియుఁ గాలాచార్యులు నచ్చినా రని తెలిసి యాతఁడుకూడఁ బదిదినముల క్రిందటనే యిటకు వచ్చినాఁడు. పరమపదించిన బొట్లయ్యసెట్టి రాఁగలిగి యుండునెడలఁ దిరుగ నయిదుగురము పూర్తియయి యుందుము. బొట్లయ్యసెట్టి స్థానమున నెవరినైన సభ్యుని జేర్చుకోవలసియున్నది. దరఖాస్తు లంపుకొనువారు పంపుకొనవచ్చును.

తిరుగ నుపన్యాసము లిమ్మని గ్రామస్థులు కోరుచున్నారు. సాధ్యమైనంత త్వరలోఁ బూర్వపద్ధతి నవలంబింప వలయు నని చూచుచున్నాము.

40. సాక్షిసంఘపునఃసంస్థాపనము

1913వ సంవత్సరంలో సత్యపురంలో అవతరించి, తన ఆదర్శాలను ప్రకటించి, ఉపన్యాసాలను ప్రవచించిన సాక్షి సంఘం అలా కొంత కాలం నడిచి–బొజ్జయ్య శెట్టి చనిపోవడం, కాలాచార్యులు, జంఘాలశాస్త్రి దక్షిణాదిన, వాణీదాసు తూర్పున, ఇరుక్కు–పోయినందువల్ల కొంత కాలం చెల్లాచెదురై మరుగున పడింది. కాని మళ్లీ, మిగిలిన నలుగురూ సత్యపురంలో పునఃసమ్మేళనం పొందినందున 1920 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 'సాక్షి సంఘం' తన పని ప్రారంభించింది.

ఈ సాక్షి సంఘం నిజంగా, దీక్షగా రెండోసారి ఏర్పడడానికి కారణం ఒక విధంగా కాలాచార్యుల లేఖ. ఆ లేఖను సాక్షికి రాస్తూ–''జనార్ధన స్వామి వారి ఆలయంలో, తిరువంటపల్లిలో పెరుమాళ్ల కైంకర్యంలో ఇంత కాలం వున్నాననీ, స్థానాచార్యుల స్థాన భ్రష్టతకి తనే కారణమని వంటూరు, బోయాలు, పూజారులు మూక ఉమ్మడిగా, తన్నే కారణంగా నిందించారని, ఆ రాత్రి కలలో కనిపించి బొర్రయ్య శెట్టి మహైశ్వర్యంతో తాను పరలోకంలో తులతూగడానికి కారణం, సాక్షి సంఘానికి ఉచితంగా ఇచ్చిన బాడుగ సొమ్మే అన్నాడనీ, సత్యం, సదాచారం, ప్రబలడానికి దోహదంగా మళ్లీ సాక్షి సంఘం స్థాపించమని ప్రోత్సహించాడనీ, ఈ ఉద్యోగం వదిలి పొమ్మన్నాడనీ – వివరించాడు. జంఘాల శాస్త్రి 'బియ్యపు కంట్రోలు'లో కొంత సంపాదించి సత్యపురం జేరాడు. వాణీదాసు 'ముద్రాక్షరశాల'లో ఏదో గ్రామంలో ఉన్నవాడల్లా, సత్యపురం జేరే స్థితిలో వున్నాడు. మరొక సభ్యుణ్ణి చేర్చుకోదలిచారు. అయితే అతను బ్రాహ్మణుడు కాకూడదనీ, వ్యాపార పాండిత్యం వుంటే మంచిదనీ, షరతులు విధించారు.

సత్యపురం, 27-8-20.

ఆర్యులారా!

సాక్షిసంఘము విడిపోయి చాలకాలమైనది. జంఘాలశాస్త్రి యుపన్యాసములను వినఁ గౌతూహలముగల మామిత్రులాసంఘమును దిరుగ స్థాపింపుఁడని యప్పటినుండియుఁ గోరుచునేయున్నారు. సంఘమునకు మూలద్రవ్యము నూటయిరువది రూపాయలు మాత్రమే యున్నది. ఈనమాజమునకు లక్ష్మీస్థానమగు బొర్రయ్యశెట్టి శంకరసన్నిధాన

మును జేరినప్పటినుండియు నంఘమునకు నంపర్తినము లంతరించినట్లున్నది. ఈనడు మను గాలాచార్యుంయొద్దనుండి సాత్తి కీలేఖ వచ్చినది.

"సాత్తికి-

కాలాచార్యులు నమస్కారపూర్వకముగ వ్రాసినది. సాత్తి నంఘు విచ్చిత్తినొద లీయూర జనార్దనస్వామి యాలయములోని తిరువంటపల్లిలోఁ బెరుమాళ్లకైంకర్యమున నున్నాఁడనని నీవెరిఁగియుందువు. మతరాద్ధాంతపూర్వపక్షరచనానమర్థుఁడ నగు నేను మహానసాంతర చిత్రాన్న దధ్యోదనరచనానమర్థుఁడనై ప్రకాశించుచున్నాను. శ్రీభాష్య కాలక్షేపమునుజేసిన నేను జిట్టిగారెలను జేయుచున్నాను. ఎంబెరుమానార్ దివ్యతిరువడిగళ్ల ననుగ్రహిని జేయుసేవయగుటచే మనస్సునకు నిండుగనే యున్నది. కాని ప్రసాదములఁ బంచిపెట్టునయ్యవారు నాకు శత్రుపక్షమువాఁడగుటచేతఁ గడుపునకుమాత్రము నిండు తక్కువగా నున్నది దివ్యమంగళవిగ్రహమగు శ్రీజనార్దనస్వామిమూర్తి కన్నుల కెంత నిండుగనైన నున్నది.

"ఈనడుమ మాదేవస్థానపుస్థానాచార్యులవారిని మా యాస్థాన ప్రభుఁడు స్వామిసేవ నుండి తొలఁగించి యాసేవను నాకొనఁగినారు. స్వామికైంకర్యమునుండి యాస్థానాచార్యుని దప్పించుటకై దైవవశమున నొకకారణము కలిగినది. దివ్యస్థలములలో స్థానాచార్యులకు నమ్మాళ్వారిగ్రంథరాజమగు 'తిరువాయిమొజి'ని గాలక్షేపము చేయుట విధియైయున్నది. మాస్థానాచార్యులవారు తమిళభాషయందు వాచక శక్తిలేనివారగుటచేత నా యాచార్యపురుష స్థానమున నేనే భగవద్విషయ గ్రంథమును జదువుచుండెడివాఁడను. ఇందులకుఁ బ్రతిఫల ముగా నాకాపుణ్యాత్ముఁడు వారమునకు నన్యమునిమిత్త మొకయరణా యిచ్చువాడుక కలదు. ఒకదినమున నాగ్రంథమును నేను జదువుట కవకాశము లేకపోయినది. నాపైనున్న పెద్దవంట వానిభార్య వేవిళ్లచే బాధపడుచుండుటవలన నామెకొఱకుఁ బెందలకడనే-అనఁగా -స్వామినివేదన కాకుండనే-కొంత చిత్రాన్నము మాయధికారి తీసి రహస్యముగా బంధుహ స్తమునఁ దనయింటికిఁ బంపెను. చిత్రాన్న పాత్రము తిరిగి వేళకు దేవాలయములోనికి రాకుండుటచే నాగిన్నెకై యాయన ననుఁ దన యింటికిఁ బంపెను. అట్లు పంపుటవలన నేను భగవద్విషయకాలక్షేపసమయమున నచ్చట లేకపోయితిని. ఎవ్వరో యొకరు చదువకత ప్పదు. కావున స్థానాచార్యులవారే పుస్తకమును దెఱచి చదివిరి. ప్రసాదము కొంత కోటలోనికిఁ బట్టించుకొని వెళ్లుటకై దేవస్థానమునకు వచ్చిన రాజకార్యదర్శి యాతనిచదవు విని తెల్లఁబోయి కొయ్యయై నిలువఁబడెను. ఆయనకు వాచకశక్తి లేదని యందరెరుఁగనే యెరుఁగుదురు. ఇప్పుడు క్రొత్తగాఁ దెల్లఁబోవలసినపని యెవ్వరికిని లేదు. కాని యందఱు కూడ డిల్లపడి స్తంభించునట్లుగా నాతఁ డాదినమునఁ జదివెను. ఆపుస్తక మాతఁడు తెఱచినచోట నొకయచ్చు కాగిత ముండెను. అది యాపుస్తకములోనిది కాదని యాతఁ డెఱుఁగక చదువ నారంభించెను. అక్షరుఁగకపోవుటకుఁ గారణమేమో యిది వఱకుఁ దెలియలేదు. అది కేవలము జన్మసిద్ధమైనయజ్ఞానము కాదు. విద్యావిహీనతవలనఁ దట్టబడిన తామసముకాదు. నిద్రావస్థకాదు. ఏమో! ఎవ్వరును జెప్పఁజాలరు కాని అప్పుడప్పు డాతఁ డట్టిమైమఱవు గలిగి యుండునని ప్రవాద మున్నది. ఆతఁ డాపుస్తకమును దెఱచి దానిలో నున్న వేరుకాగితమును జూచి చదివిన దేమనఁగా:-

''సాని చంద్రరేఖగారి సాంతపాకలో–నేటిరాత్రి చూడఁ దగినది. అనుభవింపఁదగినది. ఆహాహా యని యనఁదగినది. పాపమ్మయే చిత్రాంగిపాత్రమును దీసికొనును.''

అది సురభికంపెనీవారి సారంగధరనాటకకరపత్రమని యనుకొనవలసివచ్చినది. ఇంతవఱకుఁ జదువునప్పటికి నేను వచ్చి యాతనిచేతిలోని పుస్తకమును దీసికొని లెంపలువైచికొని సుధామాధురీధురీణమైన శ్రీశఠకోపమహర్షి పవిత్రప్రబంధమును జదివితిని. కార్యదర్శి కంటఁబడిన యవక తవక, రాజునకుఁ దెలియకుండునా? అందుచే మాప్రభువువారాస్థానాచార్యుని దప్పించి ననున్నుఁ దాత్కాలికస్థానాచార్యునిగా నియమించిరి. నా కిప్పుడు పని హెచ్చినది. కాని జీతము హెచ్చలేదు. ఇది జరిగిన నాల్గుదినములకే కార్యదర్శి యొకసాయంకాలమున దేవాలయమునకు వచ్చి ''వెనుకటి స్థానాచార్యులు చదువలేనివాఁడగుటచే నాతని బదులుగ యథాప్రకారముగా నీ వేల చదువకపోయితివి?'' అని నన్నడిగెను. పెద్దవంటవాని యింటికి గిన్నె తెచ్చుటకై వెళ్లితి నని చెప్పితిని. ఏల? యని తిరుగఁ బ్రశ్నింపఁగ ననినినంగతులను బూనగ్రుచ్చినట్లు చెప్పితిని. నా కసత్య మాడవలసినపని యేమున్నది? కార్యదర్శి మిగిలిన వంటలవారల సేమేమో యడిగి వారు చెప్పినసంగతులన్నియుఁ గూడ వ్రాసికొని కోటలోనికిఁ బోయెను.

వంటవారు, పూజరులు, బోయవాండ్రు, తోఁటమాలీలు, పవళింపు సేవకై వచ్చుసానులు–వారేమి, వీరేమి–యందురు నన్నా రాతిరి తిట్టినతిట్లులు, బెదరించిన బెదరింపులు నే నేమి వ్రాయను! మరణించిన నింతకంటె మంచిది కదా యని మిగుల దుఃఖించుచు నారాత్రి నన్యము తప్ప మరేదియు గ్రహింపక దేవాలయపు వీథియరుగుమీఁదఁ బండుకొంటిని. 'మరణించిన బొర్రయ్యసెట్టి మహాదృష్టపంతుఁడు కదా! అట్టి సుదినము లన్నియు గతించినవి కదా' యని తలఁచుకొనుచుఁ బండుకొంటిని. బొర్రయ్యసెట్టిని స్వప్నమునఁ జూచితిని. ఆతఁడు నల్లగలేఁడు మిగులఁ దెల్లగ నున్నాఁడు. సమస్తసౌఖ్యసంపత్సమృద్ధి ననుభవించు చున్నాఁడు. నే నాతనిఁ జూచి నాదీనస్థితికై మిగుల వగచితిని. 'నాకీ మహైశ్వర్యమంతయు నెందులకుఁగలిగెనో యెరుఁగుదువా?' యని యాతఁడు న న్నడిగెను. నేను దల నడ్డముగ నూఁపితిని. దేశోపకార మొనర్పఁదలఁచిన సాక్షిసంఘమునకు నే నప్పుడప్పుడుచితముగా నిచ్చిన బాడుగసొమ్ము దీనికంతకు మూల మని యమధర్మరాజుగారి ప్రధాన లేఖరి తనతోఁ జెప్పెనని యాతఁడు నాతోఁ జెప్పెను. ఆమాత్రపు సంఘమునకుఁజేసిన యామాత్రపు సాహాయ్యమే యంతఫలప్రదమైనచో మహాసారస్వతసంఘములకు లెక్కలేకుండ వేలకొలఁది లక్షలకొలఁది వెదచల్లు మహానుభావు లెట్టి మహాపదవుల నందుదురో యని స్వప్నముననే యనుకొనుచుండునంతలో బొర్రయ్యసెట్టి యిట్లు మాటాడఁదొడఁగెను. 'కాలాచారీ! సాక్షిసంఘమును దిరుగ స్థాపించుట నాయభిమతము. స్థాపించి శక్తివంచనలేకుండ మీరు భాషాసేవ చేయుచుండవలయును. సత్యము వర్ధిల్లుననియు, నసత్యము నశించుననియు, సదాచారములు విజృంభింపవలయుననియు, దురాచారములు క్షీణింపవలయుననియు దైవధ్యాన మొనర్చి యుపన్యానదీక్ష నారంభింపవలయును. నీవింక దేవస్థానమును విడిచిపెట్టిపొమ్మని యొక్కత్రోపు త్రోచెను. అంత నరుగుమీఁదినుండి క్రిందఁబడినట్లుండుటచే మెలఁకువ గాంచితిని.''

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

కాలాచార్యులు.

ఇక్కడికిఁ గాలాచార్యునిలేఖ యయినది. జంఘాలశాస్త్రి 'బియ్యపుఁ గంట్రోలు'లోఁ గొంతధనము సంపాదించి సత్యపురము చేరినాఁడు. వాణీదానుఁ డేదో గ్రామమున ముద్రాక్షర శాలలో నక్షరములఁ గూర్చు పనిలో నున్నాఁడు. ఆతఁడుకూడ సత్యపురమునకు వచ్చును. ఇంతటినుండి జంఘాలశాస్త్రిగారి సాంఘికనైతికాద్యుపన్యానములను మీరు వినవచ్చును. కాలాచార్యులవారి మతవిషయకోపన్యానములను వినవచ్చును. ముందు చేయఁదలచినపనిని గూర్చి యిప్పుడంతగాఁ జెప్ప నక్కఱలేదు. సాక్షిసంఘ మింతవఱకుఁ జేసినపనిని మీరెరిఁగి యుందురు. ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

తాఁకు మఱియొక్కమాట–మాలో మఱియొకసభ్యుని జేర్చుకొనవలసియున్నది. అబ్రాహ్మణుఁడు కావలయును. వ్యాపారపాండిత్యము గలవాఁడు దొరకినయెడల మంచిది. మిగుల లావగువాఁడు మాత్రమక్కఱలేదు. క్రిందటిసారి 'డబ్బు లేని సెట్టి' యను పేర నొకరు దరఖాస్తు నంపుకొనిరి. కాని యాకాగితము కనఁబడకుండనున్నది.

41. స్వకీయ సల్లాపము

సాక్షి సంఘంలో సభ్యత్వం కోసం వచ్చిన ఉత్తరాలు చదివి, నిర్ణయం చేయడం ఈనాటి పని. ఉపన్యాసం ఏమీ లేదు.

సభ్యత్వాన్ని కోరుతూ వచ్చిన మొదటి ఉత్తరం గంజాం జిల్లా నుంచి- తెలుగు వ్యావహారిక భాషలో ''ప్రాంతీయతల భేదం'' సాక్షి చూపించ దలుచుకున్నాడని మనకి అర్థమవుతు·· ఇందుకు సాక్ష్యం, మనకు వినిపించ డానికి ఎంచుకున్న ఉత్తరాలే. మొదటి ఉత్తరంలో (ప్రస్తుత) విశాఖ జిల్లా యాన స్పష్టం.

రెండో దరఖాస్తు నైజాం ప్రాంతపు వ్యావహారిక భాషలో వుంది. ఆ భాషా పదాలలో కొన్ని ప్రయోగాలకు ఎక్కడకక్కడ అర్థాల వివరణ (సాక్షి ఇచ్చినది) వుంది.

మూడో వుత్తరం ప్రాంతీయ వివరణ లేవీ లేవు. భాష గ్రాంథికం. భావాలు ప్రాచీనాభిమానం ప్రదర్శిస్తున్నాయి. ప్రాసినవ్యక్తి జబ్బు) మనిషి. సత్యపురం దగ్గరలో ఉన్న తాటిపర్తి గ్రామంలో ఈయనకి వైద్యం అవసరం. అందుకు సాక్షి సంఘ సభ్యత్వం అవసరం.

సాక్షి, అందరినీ అభిప్రాయాలడిగాడు – జేర్పుకో దలిస్తే ఎవరిని జేర్పుకోవాలి? అని వాణీదాసు ముందుగా తన వ్యతిరేకత తెలిపాడు. ఎవరినీ జేర్పుకోవద్దన్నాడు. జంఘాల శాస్త్రి కాలాచార్యులు కూడా వాణీదాసు అభిప్రాయంతోనే ఏకీభవించారు.

సంఘంలో ప్రస్తుతం వున్న సభ్యులు ఇంగ్లీషు పొడి అక్షరాలలో 'సాక్షి సంఘ సభ్యుడు' వంటి బిరుదు, పేరు చివర తగిలించుకుందామని జంఘాల శాస్త్రి సూచించాడు. దీనిని తెలుగు పొడి అక్షరాలలో వ్యవహరిస్తే బాగుంటుం దన్నాడు కాలాచార్యులు. వాణీదాసు వ్యతిరేకించాడు. తుది తీర్పుగా సాక్షి అన్న మాటలు నత్య దర్పణాలు.

సాక్షి యిట్లు పలికెను.

ఈదినమున నువన్యాన మేమియు లేదు. సాక్షిసంఘసభ్యత్వము నపేక్షించి కొంద

రుత్తరములు వ్రాసియున్నారు. అదికాక, చిరకాలమనకుఁ దిరుగ స్థాపింపఁబడిన సాక్షిసంఘ మునకు దీర్ఘాయువు, కార్య విజయము, యశస్సమృద్ధి కలుగుఁగాత యని యాశీర్వదించుచు సంఘ మిత్రులు మరికొన్ని లేఖల నంపినారు. అవి యెందులకుఁగాని సభ్యత్వ విషయకలేఖలు కొన్ని మాత్రమే చదివెదను. ఇదిగో–ఇది యొకటి.

సాక్షికి–నమస్కారములు–నేను గంజాము జిల్లావాణ్ణి. అబ్రాహ్మణ్ణి లావుపాటివాణ్ణి గాను. నావయస్సింత అని నిశ్చయంగా చెప్పలేను. కాని ఆడదాన్ని చూచి లొట్టేయలేనం తటి చిన్నాణ్ణికాను. హరినామస్మరణకంటె మరేదీ అక్కర్లేదనేటంత పెద్దాణ్ణికాను. ఈ రెండువయస్సులనడుమనూ మిడుకుతూవున్నాను. ఈనడిగండవవయస్సులోనే వున్నాది యెంతప్రమాదమైనాను. అది జరజర ఒకప్పుడు ఒక్క నెల్లో నాలుగేళ్లెక్కుద్ది–ఒక్కపూట్లో పదేళ్లుదిగుద్ది–అంతలో యెక్కుద్దా యింతలో దిగుద్దా–అని సందేహించొద్దు–నడివయస్సు గడసానివంటిది–ఈమద్దెల–మరి మీకు దేవుఁడు చాలామేలుచేస్తే భక్తిచాత–ఉపోష్యాల్చేత –రాత్తిరి పురాణంచాత–మరిగల్తే–పెసరపప్పు పెసాదంచేత–మూడురోజుల్లో ఆరేళ్లొక్క దెబ్బనిలెగిశింది. అంతట్లో–ఎక్కణ్ణించొచ్చిందొ– సక్కనిసుక్క–దానిసిగ్గొయ్య –మిలమిలలాడ్తూ–ఆల్చిప్పల్లా కళ్లెట్టుకొని–పద్దెనిమిదేళ్లగుంట. బంగారుగంట –గుణాలపెంట–మరేవన్నా గానీ–నుకరద్దజుడిమంట–(ఈమాటమాత్రం మాగురువుగారు చెప్పారు) తళుకుతళుకుమంటూ, తస్సల్దియ–రెట్టకాయంతబొట్టెట్టుకొని –మోటారునాంతేరంతమొఖమెట్టుకొని–కంటబడేటప్పటికి–ఏమని చెప్పను బాబూ! ఎనక టిభకుందే–దానితస్సల్మందు–అది–ముందు కొక్కటేపోత–ఎనక్కి మరి సూపునేదు –ఆబోగనమ్మోరినెట్టుకొని–ఒహతమాసాకాదు–ఒహచలాకీకాదు–ఒహకులాసాకాదు– ఒహ దిలాసా కాదు–పది రోజులపాటు పట్టపగ్గాల్లేకుండా–పసందించేటప్పటికి–పదేళ్లొక్కమాటు వయస్సులో దిగిపోయింది–ఏదైనా మంచి సత్కాలచ్చేపనంవుంటే బాగుపడతానని ఆశచాత నన్ను మీలో సభ్యుడిగా చేర్చుకోవలిశిందని దరఖాస్తుపెట్టాను. మీ జంఘాలశాస్త్రి వుపన్యా సాలు నాకు నచ్చాయి. అవి మళ్లీ నన్ను లెగదీయగలవని నా నమ్మిక–గోతులోపడ్డాణ్ణి పైకి లేవదీయడవంత–గొప్పపుణ్యము మరినేదు. మాగొలాంత్రకవిగారు గోదావరి పుష్కరాల్కి రాజమండ్రి వెళ్లి అక్కడ–'గోదార్లో పెస్సుడీ గుండాన్ని బడితేను రొఘునిజుట్టట్టుకొని లాగేసినాఁడు' అని కవిత్వం కట్టినాడు–ఆలాగమాత్రం నన్ను మీరు పైకి లాగేసినట్టాయెనా, మీ నలుగురిలో అయిదోవాణ్ణి అవుతాను. ఇట్లు విన్నవించు–న–సుం–

తా॥ క॥ నేను గ్రామ్యవాది ననుకొంటూ వున్నారేమో–గ్రామ్యాలూ గట్రా నాకేమి తెలదు–నే నాలాటివాడినిగాను–మానవతి అన్నగారి మీ దొచ్చిన వ్యాజ్యెములో సప్లిమెంటాన్ ప్రతివాదిని–అతగాను వ్యాజ్యెముమద్దెల పోవడంచేత ఆవ్యాజ్యెపుఖర్చుల కిప్పుడుత్తరవాదిని –న–సుం–

ఇదిగో మరియొకలేఖ–దీనిలో మీకుఁ దెలియని మాటలకర్థము వెంటనే చెప్పుచుం దును. సాక్షి వీరికి–(అనగా గారికి) సుబ్బారెడ్డి దండాలు, నేను హైదరాబాదుయిలాకా గామ్‌పటేలు (గ్రామపు మునసబు) నా అప్పయ్య (పినతండ్రి)–మాచిన్ని (అనగా పినతల్లి) పర్వరిషులో (పాలనలో) ఉండాను. నేను నాసాలె (బావమఱది) జమాయించి (కలిసి) పొక్కసాటు కూలబడలేక (ఊరకే కూరుచుండలేక) ఒకసాలె పెట్టి (బడి పెట్టి) అండ్ల

వతనుతో (దానిరాబడితో) ఖానావగైరాలు చేస్తూవుండాము. ఈసాలెమాత్రము ఆండవాళ్లకే నిరుకు (ఏర్పాటు) ఇంగావన్నింపులు కాని (ఇంకను గర్భాధానములు కాని) ఆండవాళ్లుండా రే–వాండ్లను మాత్రమే తీసికొని–మన తెనుగుబాసలో, వొయ్యిలుకొన్ని (పుస్తకములు) అగ్గువరకాలు (చవుక రకములు) హాసిల్పరచి (సంపాదించి) విద్దెచెపుతూ వుండగా–ఒక కన్యాకమ్మ (కన్య) తారూకు తుశ్శి (గజ్జెలపట్టెడ) గెంటీలు (జూకాలు) యాడఁబోయి నాయో యారికి గొత్తులేదు (తెలియదు.) ఎంతలెంకు లాడినా (వెదకినను) యాడను గానము. వీండ్లకు తుర్రబడాయించిందని (పొగరెక్కినదని) మమిద్దర్ని సాలెలో పడాయించి పట్వారి (కరణము) నాల్గుధప్పాలుబేకిండు (దెబ్బలు కొట్టినాఁడు) ఆడిదుంప తెగ మాసాలె పరారి అయిపోయిండు–యాడబోయినాడో ఆడిబొందపడి నాకు మీతరపులకు (వైపులకు) రాహాలనికుషీ (ఇచ్ఛ) వుంది–నన్ను మీసంఘములో అయిదో సభ్యుఁడుగా వున్నండి –మాసాలె లంటుకు లంటుగా (లావుగా) వుండాడు కాని నే నంత దొబ్బ (లావు) మనిషిని గాను. పరువు బోయినతరువాత ఊరి ఆలుగడ్డ (బంగాళాదుంప) కంటె పైఊరిపుంటికూర (గోగుకూర) బెహతర్ (మంచిద) మర్తబు–ఇది హైదరాబాదుదేశ సమీపమందలి యాంధ్రము. చూచితిరా–యెట్లున్నదో–ఇదిగో మరియొక లేఖ.

సాక్షికి–నమస్కారములు. నే నబ్రాహ్మణుఁడను. నాకు నలువదియైదు వత్సరములు. స్థూలశరీరుఁడను గాను. మొదటినుండియు నాంధ్రభాషయందు విశేషాభిరుచి కలవాఁడను. భారత భాగవత రామాయణాది గ్రంథములే గాక మను వసుచరిత్రాది ప్రబంధములను గూడ విమర్శనపూర్వకముగాఁ జదివినాఁడను. ఈదినములలోఁ గవిత్వము చెప్పనంతటి తెలివిత క్కువపని లేదని నమ్మకము గలవాఁడను. కవిత్వ మెన్నివిధములఁ జెప్పవలయునో యన్నివి ధములఁ గూడ సమగ్రముగాఁ బూర్వులే చెప్పియున్నారు. వారి గ్రంథములు మనము శ్రద్ధతోఁ జదివి తెలిసికొని యామోదించి బాగుపడినయెడల నంతే చాలును. పూర్వులకున్న కల్పనాచమత్కృతి భావగాంభీర్యము శబ్దగుంఫనము శయ్యామార్దనము మొదలగునవి యిప్ప టివారికి లేవు. నేర్చుకొన్న యెడల నవి యలవడునవి కావు. అందుచేఁ గవిత్వమునఁ గాలము వృథవోనీయక గ్రంథపఠనమునందే వినియోగపఱచితిని. ఆధునిక గ్రంథములను జూడలేదు, చూడదలఁచుకొనలేదు. వానిలోఁ జూడవలసినయంశము లేవియు నుండవు. ఉండవని నీకెట్లు తెలియునందురేమో? అది వేరే తెలియనక్కఱలేదు. ఇప్పటివారు పూర్వులు కాకపోవుటయే కారణము. పూర్వులకుఁ బ్రత్యేక మంత తెలివితేటలకుఁ గారణమేమని యడుగుదురేమో? పూర్వు లిప్పటివారు కాకపోవుటయే యిందుకుఁ బ్రధానకారణము. మీరు సంఘమేదో స్థాపించినట్లు వింటిని–కాని మీ వెనుకటి యుపన్యాసములుగాని యిప్పటి యుపన్యాసములుగాని చదువలేదు. చదువఁదలఁచుకొనలేదు. చదివినవారెవరో నాయొద్దకు వచ్చి బాగుగనే యున్నవనుచున్నారు. కాని నాబుద్ధి యంతమాత్రమునఁ దిరుగునది కాదు. నాకిప్పుడు జబ్బుగా నున్నది.

కం. ''అధునాతనకవినిరనన
వృథఁగాఁ జేయుటనె నీకుఁ బృథులవ్యాధి
వ్యథ సిద్ధించెనురా యో
విధవయ్యా కొర్రకూఁ వెంకటరాయా.''

అని యొక నిర్భాగ్యపుగవి నాపై నొక్క పద్యము చెప్పినాఁడు. ఈకాలపుఁ గవిత్వము బాగుగ నుండదని నే ననఁగ నేడ్చెదరు. కాని యాపద్య మే మెంత బాగుగ నున్నది? 'అధునాతన' యనునప్పుడు చతుర్థవర్ణము–వృథా యనునప్పుడు ద్వితీయవర్ణము –రెంటికిని బ్రాసయా? ఈజోలి నాకేల? నాకిప్పుడు జబ్బెక్కువగా నున్నది–మీకు సమీపముగనున్న తాటిపర్తిగ్రామములో నొకగొప్పవైద్యుఁ డున్నాఁడట–మందుకై యాతని యొద్దకు రావలయునని యున్నది. అందుచే నన్నుఁ గొన్ని మాసములు మీసంఘమున సభ్యునిగాఁ జేర్చుకొనవలయును. జబ్బుతో నుండుటచేత నెటుబోయి యెటువచ్చునో యని మీచేపట్టు నపేక్షించుచున్నారు. చిత్తగించవలెను. కొలువెలి

సభ్యత్వమునుగూర్చి వచ్చినలేఖ లివియే–ఎవ్వరిని జేర్చుకొనుట మీకిష్టము?

జంఘా–పూర్వమున దరఖాస్తుపెట్టిన డబ్బులేని సెట్టి తిరుగ నేల వ్రాయలేదో మీకుఁ దెలియునా?

సాక్షి–తెలియదు.

వాణి–వీరిలో నెవ్వరిని జేర్చుకొనుటకును నేను సమ్మతింపను.

కాలా–నేను జంఘాలశాస్త్రి యేమి చెప్పఁదలఁచెనో దానితో నేకీభవింతును.

జంఘా–నేను వాణీదాసుని యభిప్రాయములో నేకీభవించితిని. అయిదవవాఁడు తగినవాఁడు దొరకినప్పుడు చూచుకోవచ్చును. ఇప్పుడు తొందరయేల? కాని నాకొక్క చిన్న యూహయున్నది. మన పేళ్లచివర M.S.S. అను నక్షరములు బిరుదము రీతిగాఁ దగిల్చినయెడలఁ దప్పేమి?

వాణి–M.S.S. అనఁగ నేమి?

జంఘా–Member of Sakshi Sangham.

సాక్షి–M.S.S. అనగా Manu Scripts అని తప్పుటర్థ మగునేమో–

జంఘా–అటులైన M.S.S.S. అను బిరుదమును జేర్చుకొందము.

వాణి–అనగ–

జంఘా–Member of the Satyapura Sakshi Sangham.

కాలా–ఇంగ్లీషు బిరుదములు నాకుఁ బనికిరావు. సభ్యులు తెలుఁగువారు. దేశము తెలుగు. భాష తెలుఁగు. బిరుద మింగ్లీషునం దేల? జంఘాలశాస్త్రి–ససాసస–వాణీదాసకవి ససాసస–అని పిలువవలెను.

వాణి–సత్యపుర–సాక్షి–సంఘ–సభ్యుడనియా–వృద్ధవివాహ నాటకముకోని సాంబయ్య సపసా సా–(సహజ పండిత సాతాని సాంబయ్య–) అని బిరుదము వహించినట్లుండును.

సాక్షి–మీకేబిరుదమైన పొసగియుండునుగాని నాకేబిరుదము పొసగియుండును? నాయన లారా! బిరుదములు వలదు. బహుమతులు వలదు. మన మే పనిని జేయుటకుఁ బూనుకొనియుంటిమో దానిని నిశ్చలదీక్షతోఁ జేయుదుము. వారియెడల ద్వైన్య మక్కఱలేదు. వీరియెడలభయ మక్కఱలేదు. వారి బహుమానములతోఁ బనిలేదు –వీరి పరాభవములతోఁ బనిలేదు. వారి స్తుతులతోఁ బనిలేదు–వీరి నిందలతోఁ బనిలేదు–దైవమును నమ్మి ప్రవర్తింతము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

42. స్వకీయ విషయము

సాక్షి ప్రసంగాలను పరామర్శిస్తూ వచ్చిన ఉత్తరాల సంఖ్య బాగా వుండడం వల్ల, ఈ రోజు ప్రత్యేకించి ఉపన్యాసమేమీ లేకుండా, కొన్ని ఉత్తరాలను చదివి చర్చించడం కార్యక్రమంగా పెట్టాడు సాక్షి.

మొదటి ఉత్తరంలో అమలాపురం పాఠకుడొకాయన మంచి సూచన చేశాడు. ఉపన్యాసాల మధ్యలో ఒక్కొక్కసారి ఇంగ్లీషు మాటలను, ఒక్కొక్కసారి చాలా వాక్యాలను వాడుతున్నారు; అందరికీ ఆ భాష రాదు కదా! కనుక అటువంటి సందర్భాలు వస్తే వాటికి సరైన తెలుగు మాటలు వ్రాయడం మరిచిపోవద్దని కోరాడు. సాక్షి ఈ సూచన సంతోష పూర్వకంగా అంగీకరించాడు.

రెండో ఉత్తరం కొంచెం ఇబ్బంది కలిగించే ధర్మ సందేహమే – 'మీరు కొన్ని ఉపన్యాసాలలో కొంత చెప్పి, మిగిలింది తరువాత ఎప్పుడైనా చెపుతామం''టూ, అలా చెయ్యక మానేస్తున్నారు. వాటిని చెప్పవలసిన అవసరం వుంది – అని, మద్దికెర నుంచి ఒక విన్నపం. దీనికి సాక్షి జవాబు చెపుతూ – 'వదిలి వేసినప్పుడు సులభంగా ఏదో కారణం చేత వదిలి వెయ్యవచ్చు గాని, చెప్పడానికి మళ్లీ ఏదైనా సన్నివేశం రావాలి' అని – తమ ఉపన్యాసాల ముద్రణలో ఉన్న ఇబ్బందుల్ని వివరించాడు. వట్టిగుడిపాలెం పఠిత ఒకరు, సాక్షి ఉపన్యాసాల వైవిధ్యాన్ని ప్రశంసిస్తూ వ్రాశాడు. సాక్షి, దానికి, తమ సంఘ లక్ష్యాన్ని మరోసారి గుర్తు చేశాడు. చివరి ఉత్తరం కొబగామునుంచి – వాణీదాసు కవి గదా! కవిత్వం చెప్పినట్లు కనపడదేమి? అని ప్రశ్న. వాణీదాసు దీనికి సుదీర్ఘ సమాధానం చెప్పి తనకు శ్లేష కవిత్వం మీద వున్న మోజు వివరించి తను వ్రాయదలచిన ప్రబంధం లక్ష్యాన్ని టూకీగా చెప్పేశాడు.

ఈదినమున నుపన్యాస మేమియు లేదు. అనేక లేఖ లీనడుమను వచ్చియున్నవి. సభ్యులకు వీనిని జదివెదను. ఇదిగో మొదటిది.

అమలాపురము నొద్దనున్న పల్లెనుండి–

జంఘాలశాస్త్రిగారికి C/o ఆంధ్రపత్రికాధిపతిగారు,

అయ్యా! మీ సాక్ష్యుపన్యాసములను మిక్కిలి శ్రద్ధతోఁ జదువుచున్నాము. కాని

మాకొక్కచిక్కు కలుగఁజేయుచున్నారు. మీ యుపన్యాసములనడుమ నెన్నియో యింగ్లీషు మాటల–నెన్నియో యింగ్లీషువాక్యముల–నుపయోగించుచున్నారు. వాని కర్థము తెలియక చిక్కుపడుచున్నాము. ఆంధ్రపత్రికాపాఠకుల కందఱి కింగ్లీషుభాష వచ్చియుండునని మీరు భావించుచున్నారు కాఁబోలును! పల్లెటూరి వారమగుటచే నిక్కడ నింగ్లీషు బాగుగ వచ్చినవారెవ్వరు మాకు లభింపకుండ నున్నారు. ఇంతటినుండి మీరింగ్లీషు వాక్యములను గాని మాటలు గాని యుపయోగింపవలసినప్పుడు వానికి సరియైనయర్థమును దెలుఁగున మీరు వ్రాయుచుండవలయును. అశ్రద్ధచేయవలదు–ఇట్లు విన్నవించు విధేయుఁడు.

నాయనలారా! లేఖను వింటిరా–సాక్ష్యుపన్యాసములను మిగుల శ్రద్ధతో మనసోదరు లనేకులు చదువుచున్నారు. చదివి వానినిఁ బూర్తిగఁ దెలిసికొనఁ బ్రయత్నించుచున్నారు. నడుమనడుమనున్న యింగ్లీషుమాటలలో నేమియున్నదో పూర్తిగాఁ దెలిసికొని సంతసిం చుట కీ యింగ్లీషుమాట లడ్డువచ్చుచున్నవికదా యని విచారించు చున్నారు. మన యుపన్యాసములను సవిమర్శనబుద్ధితోఁ జదువుటయే మనకుఁ గావలసినది. అట్టిస్థితి చదువరులలోఁ గలుగుచున్నదని యానంద పడవలసియున్నది. ఇంతటినుండి యిట్టి యాంగ్లేయ భాషావాక్యము లుపన్యాసములలో నడుమను దటస్థించునప్పుడు వాని కాంధ్ర మున నర్థమును గూడఁ బ్రకటించుచుందుము. మీ రింతదీక్షతో నుపన్యాససారమును గ్రహింపఁదలఁచి యున్నప్పుడు మేము మిమ్మఁ బ్రతిబంధింతుమా? కోడలు బిడ్డను గనఁదలంచినప్పు డత్తగారు వలదనునా? అటులే కానిండు.

ఇదిగో మరియొకలేఖ–సాక్షికి–మద్దికెరనుండి–మీరు కొన్ని యుపన్యాసములలో ''శేషభాగము తరువాత నెప్పుడైనఁ జెప్పెదను'' అని మానివైచుచున్నారు. శేషభాగము నెప్పుడైనఁ జెప్పుదురా లేదా? సాక్షి ప్రథమసంపుటమందుఁ గూడ నెన్నియో యిట్టి వాగ్దానము లున్నవి. అవి యిదివఱకు మీరు నెఱవేర్చియుండలేదు. నాటకములలోఁ బద్యము లెక్కడనుండవలసినదో–పాత్రౌచిత్యమనఁగ నేమో–ఈమొదలగు నెన్ని ముఖ్యాంశ ములో తరువాతఁ జెప్పెదమని యప్పటికి విరమించినారు. ఇప్పటికినిఁ జెప్పియుండలేదు. అది యటుండగా సాక్షిసంఘము తిరుగ స్థాపింపఁబడినపిమ్మటఁగూడ నెన్నియో యిట్టి శేషభాగములు చెప్పవలసియున్నవి. అవి యన్నియు నెప్పుడు చెప్పుదురో తెలియఁబరుపవ లెను. ఇట్లు విన్నవించు విధేయుఁడు.

నాయనలారా–ఈలేఖను వింటిరా. ఈయుత్తరములో శేషభాగములని యుదాహ రింపఁబడిన వన్నియును నెప్పుడు చెప్పుదుమో యెట్లు చెప్పగలము? చెప్పఁదలఁచియే చెప్పెదమని చెప్పినాము. చెప్పవలయుననియే యున్నది. వారమున కొక్కయుపన్యాసము; విషయవిపులత్వమునుబట్టి యొక్కొక్కప్పుడొక్కొక్క యుపన్యాసము రెండు సారస్వతా నుబంధములంత గ్రంథము గావలసి వచ్చుచున్నది. అదిగాక జంఘాలశాస్త్రి పెద్దనోటికి పేజియు రెండుపేజీలును లెక్కయా? అమ్మా వారితిండి–ఏనుగుదాహము –మాప్రియమిత్రులలో నొకరి కొకసారి జ్వరము వచ్చినది. జ్వరితుఁడు లఘ్వాహారమును దీసికొనవలయును. కాన నాయనకు వైద్యుఁడు 'హార్లిక్సు' పాలు పుచ్చుకొమ్మని చెప్పెను. ఛీ ఛీ–హార్లిక్సు మేలా–నీసా అంతయును నొక్కసారియైన పుచ్చుకొనుటకు సరిపోదే' యని యాతఁడు వైద్యునకుఁ బ్రత్యుత్తర మిచ్చెను.

పట్టుమని జంఘాలశాస్త్రి నోరు తెరిచినయెడల సారస్వతానుబంధమును మ్రింగివైచి సగ మాఁకలియైన తీరలేదని సణగుకొనును. అందువలనఁ గొన్నికొన్ని యుపన్యాసములందుఁ గొంత విడువవలసి వచ్చుచుండును. ఇంతలో వేరువిషయము లేవైన స్ఫురించినయెడల వానిని గూర్చి చెప్పుచుండును. వెనుకటి శేషభాగముల గూర్చి కొంత పరాకు, కొంత యశ్రద్ధ, కొంత నిర్లక్ష్యముతో నుండును. ఆభాగములు వదలివేయవలసిన ప్పుడు సులభముగా నేదియో కారణమున వదలివేయవచ్చును గాని తిరుగఁ జెప్పుట కేదైనఁ దగిన సన్నివేశము వచ్చినఁగాని చెప్పవీలుండదు. ప్రథమసంపుటములలో నివి చెప్పకపోయి నను దరువాతి శిష్టభాగములైనను నెప్పుడో పూర్తిచేయవలయునని యున్నది. ఇదిగో యరియొక లేఖ.

వట్టిగుడిపాలెమునుండి–సాక్షికి–మీ యుపన్యాసములను బరమానందముతోఁ జదువు చున్నాము. ఆదివార మెప్పుడు వచ్చునా? యని సాక్షికై చూచుచున్నాము. ఆదివార మునాఁడు సమీపముననున్న తపాలాకచ్చేరియొద్దకు నలుబది యేఁబదిమంది కలిసి పోవుచు న్నాము. అత్యాతురతతో సారస్వతానుబంధమును జూచుచున్నాము. తరువాత నాకాగితము నూరికిఁ దీసికొనిపోయి యచ్చట మునసబు రచ్చ సావడిలోను–సంతలోనుగూడఁ జదువు చున్నాము. అది యెవరిబుద్ధి ప్రమాణమునకుఁ దగినట్లు వారికిఁ దెలియుచున్నది. అంఁత తోనే వారి కంతయుఁ దెలిసినట్లు సంపూర్ణసంతుష్టి కలుగుచున్నది. కాని సాక్షులన్నియు నే నొక్కొక్కటి ననేకపర్యాయములు చదివినాను. చదువగా జదువగా ప్రతిసాక్షిలోను నేదియో యొక యంతరార్థమున్నట్లు నాకు బొడగట్టు చున్నది. కొన్నిఁటిలోని దానిని గ్రహించినాను. మరికొన్నిటిలోని దానిని గ్రహింపఁ బ్రయత్నించుచున్నాను. ఈ యంతరార్థ మనునది సామాన్యజనులకు బోధము కానేరదు. కొందరు పైపై గాసియత్తరువువలె గమగమ లాడుచున్న హాస్యరచన కానంద మందుచున్నారు. బహిరంతఃప్రకృతుల వర్ణనములు బాగుగా నున్నవని కొందరు తల యూఁపుచున్నారు! మనశత్రువుల నెత్తిపొడిచినాడురో యని కొందరు వెకవెక లాడుచున్నారు. వాక్యముల ధారాళతకు గొందరు సంతసించుచున్నారు. వీని కన్నిటి కేమిగాని వానిలోని యాంతరార్థమే ప్రధానమైనది. అది తెలిసికొనవలయును కావున ప్రతిసాక్షిలోని యంతరార్థ మింతటినుండి యుపన్యాసాంతమున జంఘాలశాస్త్రిచేఁ జెప్పించిన బాగుగా నుండునేమో యని యనుకొనుచున్నాను. ఇట్లు–

నాయనలారా—ఈలేఖను వింటిరా? మా యుపన్యాసము లెవరికెట్లట్లు రుచించినను మేము చేయునదేదియు లేదు. వారివారిరుచులఁ బట్టి–విద్యలఁబట్టి–మనశ్శక్తులఁబట్టి –ప్రకృతులబట్టి వారికిఁ రుచించును. అందులకు మేము బాధ్యులము కాము. గ్రంథకర్త యేదియో గ్రంథమును రచించి యది దేశముపైఁ బడవేయును. అంతవఱకే యాతని పూచీగాని తరువాత దాని బాగోగులన్నియును బ్రజలు పరిశీలింపఁదగినవే. బాగుగానున్న విషయములఁగూర్చి గ్రంథకర్తను శ్లాఘింపవలసిన పనిలేదు. బాగుగా లేని యంశములను గూర్చి యాతని నిందింపవలసిన పనిలేదు. అతని ప్రకృతినిబట్టి యతఁడు వ్రాయును. అది తాను దెచ్చిపెట్టుకొనినది కాదు. అందుచే మీ సెబాసులకుఁ బనిలేదు. మీ ఛీ ఛీల కంతకన్నఁ బనిలేదు. గ్రంథకర్త పాచకునివంటి వాఁడు. ఉపన్యాస మిచ్చినట్టివాఁడు నట్టివాఁడే. ఒకరియందుఁ బక్షికములేక, యొకరియందు వైషమ్యములేక, యథార్థముగా మనుజుల జోలికియేపోక, సంఘములోనున్న దురాచారములను దురభిప్రాయములను,

దుష్టరుచులను, దుశ్చింతలను సాధ్యమైనంతవఱకుఁ దిగ్గింప నెంచి యీయుపన్యాసములను సత్యబద్ధులమై దైవముఖమును జూచి, నిర్భయముగా నిర్దాక్షిణ్యముగా నిచ్చుచున్నాము. వానిలో నంతస్సార ముండనిండు ఉండకపోనిండు. అర్థమైన నుండనిండు లేకపోనిండు. ఏమి యున్నను సరే ఏమి లేకున్నను సరే. అవి మీవి, మీయందలి భక్తిచే సాక్షి సంఘము మీకొసఁగిన కానుక. వానిని గూర్చి మీరింతకంటెఁ దెలియఁదగిన దేదియు లేదు. మాకంతకంటెఁ జెప్పవలసిన దేదియు లేదు.

ఇదిగో నింకొక లేఖ–

కొబగామునుండి–సాక్షికి–నమస్కారములు. మీలో వాణీదాసుఁడను కవి యున్నాఁడుకదా. అతఁ డేదియుఁ గవిత్వము చెప్పినట్లు కనఁబడదేమి? అతని జీవచరిత్రములోని గొన్నిపద్యములను విన్నాము. అవి బాగుగా నున్నవి. మదరాసునుగూర్చి వర్ణించి చెప్పిన పద్యములు మరింత బాగుగా నున్నవి. ఆంధ్రపత్రికా సారస్వతాను బంధములో నెందరో కవులు చక్కనిగీతములు వ్రాయుచున్నారు. ప్రజలు శిరఃకంపన మొనర్చుచున్నారు. మీవాణీదాసుఁడు గూడ నట్టి మనోహరములగు గీతములు సారస్వతానుబంధమున కేల వ్రాయఁగూడదు? మీ రాతనితోఁ జెప్పి యింతటిసుండి వ్రాయింపవలయునని కోరుచున్నాము. ఇట్లు విన్నవించు–

వాణిదాసా! ఈలేఖను వింటివా–నీ వేమి చెప్పఁదలఁచితివో చెప్పుము. వాణీదాసుఁడిట్లు పలికెను. "సాక్షి! సభ్యులారా! నాకు దోఁచినప్పుడు నేను గవిత్వము చెప్పువాఁడనే కాని, యొకరికిఁ దోఁచినప్పుడు జెప్పువాఁడనుగాను. నాప్రీతికొఱకు నేను కవితాగాన మొనర్తును గాని యొకని ప్రీతికొఱకుఁ గాదు. అచ్చపడుట కవకాశ మాంధ్రపత్రికమూల మున దొరకినది కాదా యని–అద్దెయద్దె యని–యాతురపడి కవిత్వము చెప్పువాఁడనుగాను. ఇదివఱకుఁ దొమ్మిదిసంవత్సరములనుండి కంకణబంధమును జేయుచుంటిని. ఇంకను గుదుర లేదు. దానిలో నరువదినాలు గర్థములు రావలయును. మనుజునిపేరు మహిలో శాశ్వతముగా నుండుట కట్టి యొక్క బంధము చాలదా? చదువుసరికెల్ల యర్థము విడిపోయినప్పు డింకఁ గవిత్వములో విశేషమేమి? ఇట్టి జారుజారు–జావజావ–పెసరపప్పు –పేలపిండికవిత్వము–నేనుఁ జెప్పఁజాలను. జీలుఁగుబెండుకంటెఁ జప్పన–మంచినీళ్లకంటెఁ బలచన–లంఘనముకంటె తేలిక–ఇట్టి కవిత్వమువలనఁ గర్తకు లాభమా? భోక్తకు లాభమా? వ్యాసఘట్టమువంటిది వీథిని బడవేయవలెను. ఫిరంగిగుండు వంటిది లోకమున విడువవలయును. పద్మవ్యూహము వంటిది ప్రపంచమున వదలవలెను. అప్పుడు –కవిత్వప్రుఁబస–పండితులందరు తమ పాండిత్యము నర్థభేదమునకై వినియోగపరుపవలెను. పదేసి యిరువదేసి యర్థములతో లాగవలెను. ఇంక నెన్నో యున్నవని సంతోషింపవలయును. పోనీ అంతవఱకు లేకపోయినను గవిత్వమైన తరువాతఁ బంటికిందిఁ కాఁగవలయునా? అంగిటినొక్కునకు నిలువవలయునా? కొండనాలుకకైన నడ్డుపడవలయునా? లుడుంగున మంచినీరు లాగున–గొంతులోనికిఁ బోయినయెడల నింకఁ గవిత్వపుఁ గార మేమి? గాటేమి? కమ్మఁ దనమేమి? గడుసుఁదన మేమి? నాలుకపై నాఁగినదేది? అంగిటికిఁ దగిలినదేది? రస మూరినదేది? రుచి పుట్టినదేది? ఉత్తమకవిత్వములు ముఖ్యముగా మూఁడుజాతు లున్నవి. గుంటుపోకచెక్కవలెఁ గటుక్కున కొరుకవలసిన కవిత్వ మొక్కటి

–వేపుడు సెనగలు నమలినట్లు నమలవలసిన కవిత్వ మొక్కటి–తాంద్రవలెఁ జప్పరించవలసిన కవిత్వ మొక్కటి. ఇప్పటి గీతకవిత్వములు దేనిలోనుగూడఁ జేరవయ్యెను. ఎందుల కాకవిత్వములు? అదికాక మనపూర్వులు భారతము వ్రాసినారు. భాగవత రామాయణాద్యు ద్గ్రంథములు వ్రాసినారు. వారి తరువాతి వారుకూడ నెన్నో పెద్దపెద్ద గ్రంథములు చేతికిఁ బట్టుదొరకునవి–చంక క్రింతఁబెట్టుటకు నరిపోయినవి–తప్పనిసరియగునప్పుడు తలక్రింద కక్కఱకు వచ్చునవి–అట్టివి ఆమాత్రపుఁ బొడుగు వెడలుపు బలిమికల గ్రంథములనే వ్రాసినారు. కాని, యిట్టి నల్లపూసకవిత్వములు–ఇట్టి దమ్మిడియెత్తు కవిత్వములు–ఇట్టి అంగుళప్రమాణకవిత్వములు–ఎన్నఁడును జెప్పియుండలేదు. కలికాలమహిమచే మనవారిట్టి యెండు జిల్లేడుకాయ కవిత్వములు చెప్పుచున్నారు. మనుష్యుల యొడ్డుపొడువులు తగ్గినవి కదా! బుద్ధులు తగ్గినవికదా! అదృష్టా లంతకంటెఁ దగ్గినవికదా! పాఁడి–పంట–బట్ట –పైజన్మమున కేమో యన్నట్లున్నవి కదా! ఈ గతియే కవిత్వమునకుఁ గూడఁ బట్టినది. పాలస్త్రి పట్టీయంతటి కాగిదముమీఁద–రెండు మోహగీతములు–మూఁడు యుద్ధగీతములు వ్రాయవచ్చును. పొడుముప ట్టెక్కించినంతనేపైనను గీతము నిలువఁ బడకపోయినప్పు డింక కవిత్వమేమి? ఏదీ? నిలచిన దేది? రసముగలిగిన దేది? ఆస్వాదించిన దేది? అనుభవించిన దేది? కన్నుమూసి తెఱచు లోపల–రసమ్ముపుట్టుట–పెరుఁగుట–చచ్చుట –ఇనుళ్ల తెరవలె నున్నది. ఇప్పు డందరు గీతములమీఁద బడినారు. వృత్తజాతినంతను విడిచివైచినారు. ఇది భాషకు మహాదురదృష్టముకాదా? నాటకములలో సయితము–గీతములు తప్ప–మరేపద్యములు చెప్పని కవులున్నారు. ఆగీతములుకూడ మానివేయరాదా? అట్లు నాటకములు వ్రాయుటయే మానరాదా? అట్లు వ్రాయుమని శారదాదేవి శాసించినదా యేమి? ఏదో తలతిక్క చర్య కర్థ మేమున్నది? ఎవఁడో కొసవెర్రివాఁ డేదో దారి ద్రొక్కఁగ గొల్లుమని కొందరాదారినే పరుగు. నేనట్లు చరించువాఁడను గాను. శ్లేషకవిత్వములోనున్న సొగసు దేనిలోను లేదు. నేను బ్రదికి యుండునెడల నెప్పటికైన–మధ్వ, శంకర, రామానుజ, గౌరాంగ, మహమ్మదీయమను నయిదర్థముల ప్రబంధమును జెప్పెదను.

వాణీదాసుఁ డంత మిరమించెను.

సభ్యులారా ఉత్తరములన్నియుఁ జదివితిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

43. తోలుబొమ్మలు

వక్తగా, మనస్తత్వాల నూక్ష్మ పరిశీలకుడిగా, జంఘాల శాస్త్రి ప్రతిభ ఈ ఉపన్యాసంలో కనిపిస్తుంది. కరుకైన కత్తివాదర లాంటి అతని అభిప్రాయప్రకటనం, అనేక విషయాలను ఏక కాలంలో పరిశీలించే నేర్పు, కొంచెకోనంగితనం, దిగజారిపోయే అభిరుచుల పట్ల ఆవేదన, సామాన్యజనం అజ్ఞానం పట్ల జాలి, ఒక్కొక్క సారి కోపం — ఇన్ని అవతారాలు జంఘాల శాస్త్రిలో ఈ ఉపన్యాసం చూపిస్తుంది.

తోలుబొమ్మలాటలకు రంగస్థలం చిన్న పట్టణం గాని, పల్లెటూళ్ల పదింటి మధ్య పెద్ద పల్లెటూరు గాని అవుతుంది.

జంఘాలశాస్త్రి రెండు అవతారాలతో ఈ తోలుబొమ్మలాటను చూశాడు. ఒక అనతారం బొమ్మలాటను చూస్తే, మరొక అవతారం బొమ్మలాటకు చూడవచ్చిన వారి సహస్ర భంగిమల్ని కనిపెడుతోంది. శాస్త్రి చూపు ఎంత చురుకైనదో 'మోటగా' తోచే ఊహనించి మొహమాటంగా కనిపించే భంగిమల వరకూ కనిపెట్టింది. పాటపాడే ఆడ కంఠంలో మెరుగు తరుగులు, బొమ్మలాట తెరమీద రామాయణ కథా ఘట్టం మేలుకీళ్లు, గంధోళిగాడి పాత్ర ప్రవేశం శ్రోతల్లో పుట్టించే చురుకు, అందుకు గల 'అలగా' కారణాలు, ఏమీ దాచకుండా చెప్పేస్తాడు. తను మోటుగా మాట్లాడినట్లు అనిపిస్తే అది అక్కడ విషయానిదేనని గుర్తు చేస్తాడు. 'తోలు బొమ్మలాటల సాహిత్య రసికత' పరిచయం చేస్తాడు. హఠాత్తుగా ప్రేక్షకుల్లో లేచిన అలజడి కారణాలను కూడా అతని చెవి వినకుండా వదలదు. చివరికి వాణీదాసుపై విసురుతో ఈ ప్రసంగం ముగుస్తుంది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

- నిన్నరాత్రి తోలుబొమ్మలయాటలోనికిఁ బోయితిని. తోలుబొమ్మలవాండ్రు పడమటిదేశమునుండి వచ్చిరి. బొమ్మలు మిగులఁ బెద్దవి. ఈగ్రామమున ననేకస్థలములందు బొమ్మలాట కీర్తనములు జరిపిరి. ''బొమ్మల నాడించుటయందు మిగుల నేర్పుగలవా'' రని నాడుక గ్రామమంతయు వ్యాపించినది. వారిలోఁ బాట పాడున దొక్కయూఁడుది యున్నది. అది జీడిగింజకంటె నల్లనిది. దాని ముఖాగ్రమునఁ దలవెండుక లెచ్చట నారంభమైనవో

తెలియదు. ''తడిమినను దెలియవా?'' యని వాణీదానుఁడు నన్నుఁజేయుచున్నాఁడు కాని యతిప్రాసములకు నిత్యము తడుముకొను నలవాటున్న యాతఁడే యట్లు చేసి సందేహనివారణము చేసికొనవచ్చును. అది వఱుదువలె నెండియున్నది. కాని, దానికంఠరవమమృతప్రవాహము. గ్రామమున రాత్రివేళయం దదియేమూలఁ బాడుచున్నను గ్రామ మంతయు దానికంఠము వినిపించును. చెక్కు చెదర లేదు. నలి తొలి లేదు. బొంగు జీర లేదు. అపస్వరము వెలితి లేదు. 'క్షై' మనిన నక్షత్రమార్గమున గట్టు మని తిరుగుచుఁబలిటీలు గొట్టును. సంగతులపై సంగతులు, పూలుచల్లిన ట్లది వర్షించును. పేకజువ్వవలె గాత్రపువిసరులు రఁయ్యి మని యొకసారి తారకమున కంటియక్కడ నొక్కసారి టప్పుమని యాఁగి రప్పుమని మిక్కిలి వింతరంగుల రసపుబుడ్లను ద్రిమ్మరించును. చెంబులో గ్రచ్చకాయలు పోసి త్రిప్పినట్లు కంఠరవము గలగల లాడును గాని బాన మంచిది కాదు. భాగవతపుఁ బద్ధతి. దక్షిణపుయాస–లేదు. లేతముదుళ్ళవిచికిత్స–లేదు. ఎగుడు దిగుడుల తరంగభంగి –లేదు. జారువరవికల పట్టు విడుపులు–లేవు. సాపుసంతనల సమీచీనత–లేదు. సన్నపోగర వని కాదు. పెద్దబాడిదెపని. ఒక్కటే ''క్షై'' ఒక్కటే 'రైఁ!' కొంతసేపు వినినతోడనే చెవులు గింగురుమనసాగును. బొమ్మలాట యైనపిమ్మటనైన రెండుపూఁటలవఱకుఁ జెవిలోని ''గుంయ్'' వదలదు.

నిన్న నేను దొమ్మిగంటలు కాకుండనే యాటఁ జూడఁబోయితిని. స్థలవిశాలతకొఱకు సంతబయట నాట నియమింపఁబడినది. ఓ! ఏమి ప్రజ! ఇనుక వైచిన రాలకుండున ట్లున్నారు. వందలకొలఁదిఁ బొరుగూళ్ళబండ్లు సంతబయలుచుట్టు దింపఁబడియున్నవి. వ్రేళ్లసందున వ్రేళ్లిమిడినట్లు జనులు దగ్గఱగ దగ్గఱగ బిగించుకొని కూరుచుండియున్నారు. కిటకిటలాడుచుఁ బెటపెట లాడుచున్నారు. నాకు స్థలము దొరకలేదు. అందుచేఁ గొంతసే పాకచోట వంగి, కొంతసేపు నిలువఁబటి, కొంతసేపు ముంగాళ్లపై నానుకొనియుండి వేడుక చూచుచుండఁగ వెనుకవారి చూపున కడ్డు వచ్చితి నని కట్టిపోటులతో మోఁకాలిత్రోపులతో నన్నటనుండి వారు త్రోచినవి వేఱొకస్థలమునకు బోయి యక్కడఁగూడఁ బదప్రహరణమో పాదరక్షప్రహరణమో పొందుట సిద్ధింప మఱియొకచోటికిఁ బోవుచు నిట్లు సంతబయలంత సమయానుసారముగ సంధి సంధి పోట్లసలుపుతో సంచరించితిని. కాదు. సంచరింపఁ జేయఁబడితిని. ఎన్ని యోబొమ్మలను ముగ్గురో నల్వురో తెరలోపల నాడించుచుండ నొక్కబొమ్మను వీరందఱు తెరవెలుపల నాడించుచున్నారు. ఇంత శ్రమపడి బొమ్మలాట నేల చూడవలయు? నని మీరు నన్నడుగుదురేమో! జనులు విశేషముగఁ జేరియుండినచోటికిఁ బోవుటకు నాకు మొదటినుండియు మిగుల నుత్సాహము. జనుల ముఖభేములఁ బరిశీలించుట, కంఠరవములను శోధించుట, మాటలతీరులను గనిపెట్టుట, వానికిగారణములగు హృదయరసములను విమర్శించుట, స్వభావభేదములను గుర్తెఱుఁగుట–యిట్లు ప్రకృతిజ్ఞానమును సంపాదించుటయే నాముఖ్యోద్దేశము. పందిటిక్రింద నాడింపఁబడుచున్న నిర్జీవపుఁ దోలుబొమ్మలను జూచుటకైపోయినవాఁడఁగాను. బయటనాడుచున్న ప్రాణమున్న తోలుబొమ్మలయాటఁ జూడఁ బోయితిని. అందుచే సంతబయలంత తిరుగట కష్టమయినను నా కుత్సాహముగనే యుండెను. వారి కాలిపోటులు నారక్తమాంసములలోఁ గొంతసేపు మాత్రమే నిలుచును గాని వారిప్రకృతుల కలపుఁబోటులు నాహృదయఫలకమునఁ జిరకాలము నిలుచునుగాదా?

తెరకొకవైపు కపిసైన్యము, ఒకవైపు రాక్షససైన్యము చేరియున్నది. ఇంక నాట యారంభింపఁబడియుండలేదు. అంత ''గజాననం భూతగణాధిసేవిత'' మ్మని శ్లోకము చదువఁబడుచుండఁగఁ జర్మవిఘ్నేశ్వరుఁడు మనుజాల చర్మనేత్రములకుఁ దెరపై సాక్షాత్కరించెను. రూపమునఁ గడుపు భారముగ నున్నను నాటకమునఁ గాలు లఘువుగనే యున్నది ఱెప్పపాటులోఁ దెరయంతయు మహాయుద్ధరంగ మైనది. రావణునకు, లక్ష్మణునకు ఘోరయుద్ధము జరుగుచున్నది. బాణము లుభయుల సేనలనుండి ''రుంయి రుంయి'' మని యెగురుచున్నవి. కపి భల్లుక గోలాంగూలయోధులు రాక్షసులపై కెగిరి తన్నుచున్నారు. పొడుచుచున్నారు. రాక్షసయోధులు కపుల నదల్చుచున్నారు. పీఁకుచున్నారు. గదలచే మొత్తుచున్నారు. కఱ్ఱసాములు చేయుచున్నారు. గభీ గభీ మని గ్రుద్దుకొనుచున్నారు. బొళ్లు మన రక్తములఁ గ్రక్కుకొనుచున్నారు. క్రోఁతుల పూత్కారములు, కంగు కంగు మనురాక్షసుల ఝూంకారములు, పోకుపోకు మను క్రోఁతుల భీకరభేకారావములు. ''హుర్ హుర్'' మను రాక్షసుల హుంకారము గల్గి కదనరంగ మంతయుఁ గర్ణకఠోరమైయున్నది. క్రోఁతులచేతులు తెగి క్రిందఁబడుచున్నవి. రాక్షసుల పుఱ్ఱెలు పై కెగురుచున్నవి. ఓ! ఱాలవర్షము! చెట్లవర్షము! తలలవర్షము! తోఁకలవర్షము! బాణములవర్షము! గదలవర్షము! ధారాపాతముగఁ గురియుచుండ బుఱ్ఱుబుఱ్ఱులయురుములు, పిడికిటి గ్రుద్దుల పిడుగులు, శిలాసంకర్షణములవలనఁ గలిగిన నిప్పులమెఱుములు గలిగి సమరరంగ మంతయుఁ బ్రళయకాలాంబుధర ప్రతికాశమై యొప్పుచున్నది. ఈమహాకోలాహల సమయమున రావణుఁడు పదినోళ్లనఱచుచుఁ గనుల నిప్పులఁ గురియుచు విభీషణుని జంపఁ దలఁచి యాతనిపైఁ బడఁబోవుచున్నాఁడు. లక్ష్మణుఁ డడ్డుపడుచున్నాఁడు. ''అడ్డుపడవల'' దని రావణుఁడు సౌమిత్రిని వారించుచున్నాఁడు. ''మీ రడ్డుపడకుఁ'' దని విభీషణుఁడు లక్ష్మణుని చేతిని బట్టుకొనుచున్నాఁడు. విభీషణుడు రావణు నెదుటఁ బడఁబోవు చున్నాఁడు. ''నే నుండ నీవు రావణు నెదుర్కొనవల దని లక్ష్మణుఁ డాతని వెనుకకులాగి తాను ముందుకు ధనుష్పాణియై దుముకుచున్నాఁడు. ''నీకంటె నాకు విభీషణుఁ క్కువశత్రువు-ఆతనిని ముందు చంపినఁగాని నిన్నుఁజంపను. నీ వడ్డు రాకు. నీ కేల? పో యని రావణుఁడు లక్ష్మణు నదల్చుచున్నాఁడు'' ''శరణాగతత్రాణబిరుదము రాఘవుల'' దని లక్ష్మణుఁడు బీరములు పల్కుచున్నాఁడు. అంతలో విభీషణుఁడు వచ్చి ''నాయనా! నీ వడ్డుపడకు''మని యాతని బతిమాలుచున్నాఁడు. విభీషణుఁడు ముందునకుఁ బోవ లక్ష్మణుఁ డాతని లాగి తాను హుంకరించుచు రావణునికెదుటఁ బడి మహాస్త్రప్రయోగమును జేయుచున్నాఁడు. ''సరే చావు''మని రావణుఁడు శక్తిని బ్రయోగించినాఁడు. అంతట నొక్కటే మంటగ్రమ్మినది. ''హా! రామచంద్రా!'' యని లక్ష్మణుఁడు నిశ్చేతనుఁడై నేలఁగూలినాఁడు. ''హేహేహే'' యని రావణుఁ డట్టహాస మొనర్చినాఁడు. ''వహవ్వా! వహవ్వా!'' యని రాక్షసులు కేకలతో మి న్నెగిరిపోవునట్లు చప్పటలు గొట్టుచున్నారు. కిచకిచ మనుచుఁ గీచుగీచు మనుచు కుయ్యో మొఱ్ఱో యనుచు హాహా యనుచు సకిలించుచు నిగిలించుచు తోఁకలు ముడుచుకొని పండ్లు పైకిఁ బెట్టి క్రోఁతు లేడ్చుచున్నవి. విభీషణుఁ డేడ్చుచున్నాఁడు. లక్ష్మణుని, రాముని శిబిరములకుఁ గొనిపోయినారు. విభీషణుని జంపుటకై నియమించినశక్తి యాతనిఁ జంపలేకపోయినదని రావణుఁడు వినుగుదలతో నింటి కేఁగినాఁడు. రాక్షసబలము లాతనితో మఱలిపోయినవి. క్రోఁతు లందఱు లక్ష్మణునివెంటఁ బోయినారు. ఎఱ్ఱమచ్చలుగల తెల్లతెరయు,

గుట్టు మను నాడుదానికంతరవము తప్ప మఱేమియు మిగులలేదు. జను లందఱు దీర్ఘధ్యానములు పుచ్చికొంతసేపూరకుండిరి.

ఒక త్రుటికాల మగుపిదప జను లగ్గిపుల్ల లట్టి వెలిఁగించిరి. చుట్టలు ముట్టించిరి. కొంకులుపోయిన వ్రేళ్లను నరిచేసికొనిరి. తిమ్మిరియెక్కిన కాళ్లను నేల నడఁచిరి. మెటికలు విఱుచుకొనిరి. ఒడలు విఱుచుకొనిరి. ''పాడు మున్నదా?'' యని యొకరి నొక రడుగుచుండిరి. కొందఱు లేచి స్థలము భద్రమునుమా? యని ప్రక్కవారలకు జెప్పివైకిఁ బోవుచుండిరి. కొందఱు నెత్తిగుడ్డలు తీసి పృష్ఠములక్రింద వైచుకొనుచుండిరి. ''ఇంకను వచ్చినవాఁడు కాఁడేమిరా'' యని యొకరి నొకరు ప్రశ్నించుకొనుచుండిరి. ''గట్టిముండకొడుకులే'' యని బొమ్మలాటవారికి బిరుదములు కటాక్షించుచుండిరి. ''పత్తిరాటములాగ మంచి 'పసందు' గ బాడుచున్నదిరా!'' యని గాయనీమణిని స్తుతించుచుండిరి. బొమ్మలు పెద్ద వనియు, రంగులు క్రొత్తవనియు నాటకపాత్రములను గొందఱు వర్ణించుచుండిరి. 'కుఱ్ఱవాని కిదేసమయము. కొంచెము నమలఁబెట్టుమమ్మా'' యని యత్త కోడలున కాజ్ఞాపించుచున్నది. ''పద్దీ! మెడలోతీఁగె పదిలమునుమా'' యని తల్లి కూఁతున కాభరణవిషయమై యుద్ఘాటించుచున్నది. ''అక్కా! బట్ట తిన్నగ సర్దుకో'' యని నిమ్నళముగఁ జెల్లె లభిమానసంరక్షణమును బోధించుచున్నది. ''అబ్బీ!–రవంత దూరముగఁ గూరుచుండరాదా? ఱాడుకూఁతురు సైన గాలువేయుచున్నా'' వని యొకచింపితలది బండివానికి బరకాంతా పరాఙ్ముఖత్వమును బ్రతిపాదించుచున్నది. ''అమ్మా! బద్ధకముగ నుంటి వేమైన ననుమానముగ నున్నదా?'' యని యొకవితంతువు నమానన్న ప్రసవనమయయగు నొకపడఁడతిని బరామర్శించుచున్నది. ''ఓరి! నీజిహ్వదీయ!'' యని యొకగుడిసెవ్రేటుది పూర్వజారునిఁ జీఁగొట్టుచున్నది. ''ఆయనకుఁ దోలుబొమ్మ లున్నఁ బ్రాణ'' మని యొకనూతనవితంతువు భర్తృపరిస్మరణ పరిపాకమునఁ బ్రకాశించుచు లోకసంగ్రహార్థము కను లొత్తుకొనుచున్నది. ''అమ్మా! బొమ్మ లాలా గెందు కాడునే?'' యని యొక చిన్నబాలిక చర్మపాంచాలికాఖేలనరహస్యమం త్రోపదేశ బోధనమునకై తల్లిని యాచించుచున్నది. ''వెంకరాముఁడు వెనుక బట్టినతరువాత బొమ్మలాటలో సాగసే చెడిన'' దని సాలభంజికాఖేలన సాహిత్యరసగ్రహణపాండితీమండిత యగు నొక వితంతువు పూర్వ పండితస్తుతినమ్మేళనముతో నాధునికపండితనిందను జేసెను. ''ఏమిటో మాయప్రపంచము! మనముమాత్రము తోలుబొమ్మలము కామా?'' యని యొకవృద్ధవేశ్య వేదాంతబోధనమును బోసినోటితో సాయించుచుండెను. ఇంతలోఁ గన్నులు మిఱుమిట్లు గదరున ట్లొకబొమ్మ తెరపై కెక్కెను. 'వచ్చినాఁడమ్మా! వచ్చినాఁడమ్మా!'' యని సభయంతయు నొక్కసారి కెవ్వుమన్నది. ఆతఁడు గ్రంథారిగాఁడు. ''గందోళిగాఁ'' డని Phonetic laws ప్రకారము వర్ణవ్యత్యాసమొందిన నామముగల మహానుభావుఁడీతఁడే! కథాప్రవాహమున కడ్డు వచ్చువాఁడు కావున నీతని కిది పౌరుషనామముగఁ బూర్వులచే నుంచఁబడినది. ఇతనికిఁ దలిదండ్రు లుంచిననామ మేదియో యెవ్వరెఱుఁగరు!

నాయనలారా! ఈయుపన్యాసమున ననున్నఁగూర్చి కొన్ని మాటలు మీతోఁ జెప్పుకొనవలయును. ఇదివఱ కెన్నఁడు చెప్పియుండలేదు. దైవకటాక్షమున ముందుఁగూడఁ జెప్పనునుకొందును. నావాగ్ధోరణిని మీరు దాదాపుగ నైదుమానములనుండి వినుచున్నారు. నేను మోటుగ మాటలాడువాఁడనో, బాధ కలుగునట్లు మాటలాడువాఁడనో మీకుఁ దెలియకపో

లేదు ఔచిత్య మెఱుగి మాటలతో రసనలకూఁట నిచ్చి కాసంతతీపి కాసంత వెగటుగలమ
టలతో–మనలోనున్న దురభ్యాసములను, దుష్టనిశ్వాసములను, దుష్కర్మములను వెల్లడి
చుచుంటి నని నానమ్మకము. సంఘదోషనిరసనార్థము దైవముఖమును జూ
పనిచేయుచున్నవాఁడను గాని జనులనిందాస్తుతుల కలుకు కలుకుల నొందువాఁడను గాను
కాని గ్రంథారిగానిగూర్చి యీరాత్రి పలుకవలసియుండుటచేఁ గొన్ని మోటుమాటలన
వాడవలసివచ్చునేమో యని భయపడుచుంటిని. ఇప్పుడైనను సాధ్యమైనంతమట్టునక
మోటుమాట లుపయోగింపను. మాటలు మృదువులయిన మోటుధ్వనులీయక తప్పదు
మాటలు మధురములైన వెగటుగ నభిప్రాయముల వెల్లడింపక తప్పదు. మాటలాడఁదలఁచి
యంశము మోట దగుటయే యిట్టిశబ్దార్థసామ్యమునకుఁ గారణము. ''ఇంత శ్రమప
చేసి నీ వీవిషయమున మాటలాడుట యేల?'' యని మీరు ప్రశ్నింతురేమో! చెప్పెదను
తోలుబొమ్మలను జూచు దురాచారము మనయస్థులలోని మూలుగులలోని మూలుగయ
యున్నది. ఈదురాచారమునుబట్టి మనయజ్ఞతయు, మనయనాగరకతయు లోకమునక
వెల్లడియగుచున్నది. మన మజ్ఞుల మని యనాగరకులమని మోటువార మని యెవ రుకొన్నన
మనము జడువనక్కఱలేదు. ఇట్టి చర్మపాత్ర ప్రదర్శనములు భగవానుఁడగు శ్రీరామచంద్ర
మూర్తి కథయు, లీలామానుషవిగ్రహుఁ డగు శ్రీకృష్ణదేవునికిఁ బాదభక్తులగు పాండవుల
కథయు మనకు జరిగినవి జరిగినట్లుగఁ బ్రదర్శించుటచేత మనకుఁ గలుగు నానందము
ముందు, నీతిముందు, భక్తిముందు, జ్ఞానముముందు మోటువార మనుదుష్కర్తి గణి
యము కాదు. సినిమెటోగ్రాపులో బాల్కనుల శవములను వీథుల వెంట నూరేగించుచ
మిగుల దుఃఖముతో నమాధిస్థలమునకుఁ దీసికొనిపోవుచున్న జనసంఘముల ఖిన్నస్వరూ
ములను దర్శించుట కంటె లక్ష్మణమూర్ఛాకాలమున శ్రీరామచంద్రమూర్తి ఖిన్నుఁడై
యుండుటను దర్శించుట మనకుఁ దక్కువది కాదు. కాని యీ గ్రంథారిగానిదే గట్టిచిక్కు
ఇట్టి కష్టపడిపాకము–ఇట్టిమొండి మోటు సన్నివేశము ఇట్టి బండబూతుల ప్రదర్శనము–ఇట్ట
దిక్కుమాలిన రోఁత–యేదేశమందుఁ గాని, యేకాలమందుగాని, యేజాతియందుగాని లేద
నా నమ్మకము. మన మిట్టితుచ్ఛ కార్యమున నద్వితీయులమై యున్నాము. ఇందువలన
మనము నీతి లేనివార మని, సిగ్గులేనివారమని, రోఁతలేనివారమని, పశువులమని, మనస్త్రీ
లకు సిగ్గు బిడియములు లేవని, మానుషము, మర్యాదలేదని, వారు దుష్టవర్తనలని, వట్ట
చిత్తకార్తెకుక్క లని యితర జాతులవారు మన చెవులు చిల్లులుపడునట్లు–మనసుల రాచపుండ
పుట్టునట్లు పలుకుచుందురని వినియుంటిరా? పురుషులకుఁ బురుషత్వము, స్త్రీలక
స్త్రీత్వము లేదని యనిపించుకొనిన జాతిలోని వారి కితరులవలన నేమంత గౌరవమున్నది?
ఇట్టి సంఘలోపమును మీకు వెల్లడించుటకై నేను దోలుబొమ్మలఁ గూర్చి యీరాత్రి
చెప్పదలచితి నని మీ ప్రశ్నమున కుత్తరము. మోటుతనముగల గ్రంథారిగాని చర్యలోని
మోటుతనమును వెల్లడించుటకు మోటుమాటలు కావలసియున్నవి. మోటు మాటలు
కూడ నావశ్యకములగు సమయముల నుపయోగింపవచ్చును. స్త్రీనిఁ జెఱచిన నేరమునుగూ
ర్చిన యభియోగములో న్యాయసభయందు గుహ్యాంగనామస్మరణమే కాని గోవిందనామస్మ
రణ ముండునా? రహస్యాంగ శారీరశాస్త్రబోధ్యగు గురుఁడు తత్తదుచితవాక్యములె
పలుకును గాని ''తత్త్వమసి'' వాక్యములు పలుకునా? అటులే మోటులలో మొట్టమొదటిమో
టగు గ్రంథారిగాని గూర్చిన సంభాషణములో మోటుమాటలు వచ్చుట–వింతకాదు

మోటగు నర్థములు పచ్చులు వింతగాదు. మోటగు ధ్వనులు గలుగుట-వింతకాదు. మోటుతనమును నివారించుటకు మోటుతనమే కావలయును. ముల్లు నూడుదీయుటకు నూది కావలదా? కావున నాయనలారా! కొన్ని మొఱకు టభిప్రాయములకు సిద్ధపడి యుండుడు. కథను వదలి యీయంశమును గూర్చి యింతసేపు చెప్పవలసిన యావశ్యకత యేదియో మీరు గ్రహించి యుందురు. ఇక గథలోనికి బోవుదము.

గ్రంధారిగాడు దివ్యమంగళస్వరూపుడై తెర నలంకరించినాడు. సభాజనముఖముల నలరించినాడు. చంద్రుని జూచిన కలువవనమువలె సభ కలకలలాడుచున్నది. ఓ! ఎక్కడ జూచిన నవ్వులే! యెక్కడఁ జూచిన కిచకిచలే! యెక్కడ జూచిన కిసుక్కులే! యెక్కడఁ చూచిన గిలకిలలే! సభాహృదయములు తాండవము లాడుచున్నది. అట్లుంటకాశ్చర్య మేమున్నది? ఎవనిఁ జూచుట కిందఱు మహాజనులు ప్రోగయిరో నాడే వేంచేసియుండ నింకఁ గావలసిన దే మున్నది? ఇంత కంటె మహోత్సవ మేమి? ఇంతకంటె జన్మమునకు సార్థకత యేమి? సెబాస్! జగదానందకరమూర్తియగు నా పురుషోత్తమోత్తముని కొఱకే! కాని యెడల నిన్ని చింపితల లెవనికొఱకు? ఇన్ని జాఱుపైట లెవనికొఱకు? ఇన్ని కప్పుపం డ్లెవని కొఱకు? ఇన్ని వంకకొప్పు లెవనికొఱకు? ఇన్ని పూలగాగరా లెవని కొఱకు? ఇన్ని రంగురవికె లెవని కొఱకు? ఇన్ని యడ్డుకట్టు లెవనికొఱకు? ఇన్ని కచ్చకట్టు లెవని కొఱకు? ఇన్ని పచ్చబొట్టు లెవని కొఱకు? ఇన్ని తోకబండ్లెవనికొఱకు? వింతలో వింత! ఇన్ని నోటిమట్టలెందులకు? ఇన్ని బిళ్లకచ్చ లెందులకు? ఇన్ని చేతికట్టలెందులకు? ఇన్ని కిట్టుచెప్పు లెందులకు? ఇన్ని పంగలకట్టలెందులకు? ఇన్ని పంగనామము లెందులకు? ఇన్ని విభూతి రేఖ లెందులకు? ఇన్ని కత్తిరింపుబుట్ట లెందులకు? ఇన్ని పాదుముముక్కు లెందులకు? ఇన్ని కోరపాగ లెందులకు? ఇన్ని గంగాళపుకడుపు లెందులకు? ఇన్ని పిడిసిగ లెందులకు? సభయంతము సంతోగమున నాతనిఁ జూచుచున్నది. పాదుము కాయలోని పాదు మొకశాస్త్రులుగా రెడమచేతిలో దలుపుటకు మొదలిడి యంతలో గ్రంధారిగానిఁ జూచి తదేకదర్శనతత్పరుఁడై పాదు మంతయు నేలను దులుపుచున్నాఁడు. ఒకకరణముగారు కనుబొమ్మలకుఁ జేయి నడ్డుపెట్టుకొని చూపు చెదరకుండఁ జూచుచున్నాఁడు. మునసబు గారు 'బాబూ! బాబూ' యని కొడుకును గునికిపాట్లనుండి లేపి "చూడు, నాయనా! అడుగో" యని నాల్గుకన్నులఁ జూచుచున్నాఁడు. కొందఱు తొప్ప ప్రేయకుండఁ జూచుచు న్నారు. కొందఱు కన్నులు సన్నఁజేసి చూచుచున్నారు. కొందఱు క్రీగంటఁ జూచుచు న్నారు. కొందఱు చేతిని గొట్టమువలె జేసి, దానిలోనుండి చూచుచున్నారు. దూరపుఁజూపా ననివారు దగ్గఱకుఁ బోయి చూచుచున్నారు. కాని కాంతావలోకనములు మటింతవింతగ నున్నవి. నోరు తెఱచి బాబాకరపుఁజూపులతో బాల వితంతువులు పరిశీలించుచున్నారు. ముగ్ధాంగనలు తలలఱ్ఱి వంచుకొని పైటొప్పుల పైనుండి చూచుచున్నారు. ప్రౌఢవనితలు ప్రక్కచూపులఁ జూచుచున్నారు. వృద్ధలు తేటిపాటఁ జూచుచున్నారు. నడిమివయసునారు చూచిచూడనట్లు చూచుచున్నారు. కొందఱు గాజుచూపులఁ జూచుచున్నారు. కొందఱు మొగ మంతయుఁగన్నులు చేసికొని చూచుచున్నారు. కొందఱు వెఱ్ఱిచూపులఁ జూచుచు న్నారు. కొందఱు తెఱ్ఱిచూపుఁ జూచుచున్నారు. "వీని మొగము మండ! వీనిని జూచునదే మిటి?" యని తిట్టుచుఁ గొందఱు చూచుచున్నారు. ఇట్లందఱు కాంతలు వేఱువేఱు వింతవింత చూపులతోఁ జూచుచున్నారు.

విజయదశమినాఁడు రాత్రి వేశ్యానృత్తగానాదులతో మంగళవాద్యములతో తుపాకుల యగాదులతో మహావైభవలక్షణములతో బంగారపుటంబారి కట్టి పట్టగజముపై నూరువెంట స్వారివెడలిన మండలాధిపతినైన ద్వారమునొద్దకు వచ్చి కాంచని కాంతలు గ్రంథారిగానిఁ గాంచుటకు నంతబైటఁ గూలఁబడినారు. శివరాత్రినాఁడు నందివాహనారూఢుఁడై గుమ్మము నొద్దకు వేంచేసిన శంకరదేవు నీక్షింపని వెలఁదులు తెరయెక్కిన చెడురక్కసునిఁ జూచుటకు వెలుపలకు వచ్చి వేచియున్నారు. ఆహా! ఈతఁ డెంత ప్రసిద్ధపురుషుఁడో! దివ్యదర్శనప్రదాన త్వమున దేవతలితని కమోఘముగఁ దీసిపోవుచున్నారు. రావణానురునిపేరు విననివారైన గ్రంథారిగాని నెఱుఁగుదురు. రామాయణకర్తయగు వాల్మీకి నెఱుఁగనివారయిన గ్రంథారి గాని నెఱుఁగుదురు. చిరంజీవులలోఁ జేర్పవలసిన చిత్రచర్యగలవాఁడు! అచంద్రార్కయ శస్సాంద్రుఁడు. శౌర్యములేదు. విద్యలేదు. బుద్ధిలేదు. మానము లేదు. గుణములేదు. వానిపుణ్య మేమో యిప్పటివఱకు వానిబొమ్మ తెర యెక్కినరికిఁ బట్టరాని యుత్సాహము ప్రజల హృదయముల కెక్కవలసినదే! అమృతవిగ్రహము! కీర్తిస్వరూపము!

కాంత లిట్టి చూచి కినుక్కున నవ్వువారు కొందఱు! 'హేహేహే' యని యెడ్డినవ్వు నవ్వువారు కొందఱు! అట్టి మందహాసమొనర్పఁజాలక నుండువారు కొందఱు! వంకగ నవ్వి నవ్వునకు వేరువంక పెట్టువారు కొందఱు! ''అదేపనిగ నేమి నవ్వే?'' యని యొకతె నధిక్షేపింపఁబోయి నవ్వువారు కొందఱు! ఒకతె నవ్వుచుండఁ గానవ్వులోఁ గలిపి నవ్వువారు కొందఱు! ఱాఁపుకొన–నాఁపుకొనఁ దుద కాఁగక దగ్గువైఖరిగ నవ్వువారు కందఱు! ఇగిలించు వారు కొందఱు! నకిలించువారు కొందఱు! చప్పుడు కాకుండ వెక్కిరింపువలె నవ్వువారు కొందఱు నైయుండ వారితలలు పండినదానిమ్మపండ్లవలెఁ బ్రకాశించె నని మన వాణీదాసకవి చెప్పుట కవకాశమైయుండెను. ఇట్లొక త్రుటికాలము నవ్వినవ్వి యెందులకో కాని యొకతె రెండవదాని కేమో చూడు మని కనుసన్న యొనర్చెను. ఒకతె మఱియొకతెను పిక్కపై గోఁకును. ఒకతె మఱియొకదానిని గాలిబొట్టనవ్రేలితోఁ దాఁకును. ఒకతె మఱియొకతెకు 'అదిగో' యని త్రత్క్షరమంత్రమును గర్ణమూలమున రహస్యముగ నుపదేశ మొనర్చును. ఇట్లన్యోన్యసంజ్ఞ లొనర్చుకొనునంతలోఁ గొంద ఱట్టి ముసిముసి నవ్వునవ్వి సంక్షేపించిరి. కొందఱిచెక్కు లట్టి యెఱ్ఱఁబాఱినవి; కొందఱకు గుండెలు దడదడలాడినట్లు పైఁటలు ముందువెనుకకుఁ ద్రొక్కులాడినవి. కొందఱుచేతులు కాళ్ళు లేమోకాని వడఁకినట్లు నాకుఁ గనఁబడినవి..కొందఱట్టి కొయ్యవాఱి నిలువుచూపున స్తంభించిరి. కొందఱకు గొంతుకలోఁ బట్టుపట్టినట్లుండ మాటలాడఁబోయి గడగడలాడిరి. కొందఱు మూఁడునాల్గుబారల నిశ్శ్వాసము లిచ్చిరి. కొంద ఱట్టి పులుకుపులుకునఁ గన్నీ రొలుకఁ బులకరించిరి. కొందఱు చేలాంచలముచే స్వేద మార్చుకొనిరి. కొంద ఱట్టి దీర్ఘాలోచనమునఁ బడిపడి తుదకు మైమఱచినట్లు కనఁబడిరి. లోపలనుండి దుష్టరక్తము దేహముపైఁ దామరగనో చురుకుగనో పొలుసుగనో కుష్ఠగనో కమలముగనో వ్యాపించినట్లు లోనిసాత్వికరసము కాఁబోలు పై కెన్నిరూపములగ నుబికియుండెను! ప్రారబ్ధము!

అంత గ్రంథారిగాఁ డొడ లట్టి దులుపుకొని భార్యావలోకన కుతూహలాయత్తచిత్తుఁడై గంతులువైచుచుఁ నిట్లు పాడఁదొడఁగెను.

పదము

రావె రావె పిల్లదాన – రావేమె పిల్లదాన ॥రావె॥
గోరంచు కోకెడ్డ– కొప్పులో పూలెడ్డ
కోరిన నగలెడ్డ – కులికించి ముద్దెడ్డ ॥రావే॥

అంతట నాతని యిల్లాలు వచ్చి దూరముగ నిలువఁబడెను. ఇది రెట్టించి యాతఁడు పాడి గంతులువైచెను. అప్పు డొకమునలిది ''ఒసే పెద్దమ్మి! కుర్రది జడుసుకొనునేమో జాగ్రత్త'' యని హెచ్చరించెను. ''అమ్మా! చాలులే నీమాటలు. మరి యుపద్రవములు. బుల్లి కూచియాయేమి? నమర్థయీడుపిల్ల జడిసికొనుట యేమి?'' టని పెద్దమ్మ తల్లినిఁ జీఁగొట్టెను. నీబాబాకరము బ్రద్దలైపోను! నీ కిది యుపద్రవముగనే తోఁచుట లేదా?'' యని నమీపస్థాయిని యగు చాఁకిత యొకతె పెద్దమ్మను బంధుప్రేమచే బరిహసించెను. ''అదృష్టము చెప్పవచ్చినప్పు డీ యయ్యను జేసుకొన్న యాయీడుదాని'' దని యొకకాంత నాకంటెఁ బొడవగుసది–బొప్రయ్యసెట్టియంత స్థూలమైనది–చేతఁబట్టెలు, మెడలో నాను కోళ్లు గలది–యెత్తుకొరకు బోరలించిన నిలువుటిత్తడి చెంబుపైనఁ గూరుచున్నది –దీర్ఘనిశ్వానపురస్సరముగా నిమ్మళముగ ననుకొనెను. అంత యట్టియట్టి కనుగొలుకుల నీరు గమ్మఁగఁ జీదుకొనుటకై వంగెను. నిలువుచెంబు తెటికిలఁబడఁగ నామె దబుక్కున గ్రిందఁబడెను. అంతట వాణీదానునివంటి కవియే యుండునెడల వనితపిరుఁదులకు పసు ధకు సామ్యమను విషయము సత్యమా? కాదా? యని తన పిరుఁదులను భూమిని దరిఁ జేర్చి పోల్చిచూచుచున్న దేమో యని యుత్ప్రేక్షించి యుండును. ఈమె యీమాట లనుకొనుటయు, విచారించుకొనుటయుఁ బ్రక్కనే కూర్చుండి వినియుండిన యొక మొఱకుతురక యాచెంబునట్టి నరిచేసి యామెను నిమ్మళముఁగఁ బిలిచి ''మీవిచారణకారణ మేదియో నే నెరుఁగుదును. మీబాధను బాపుటకు సైగంబరుగారిచేఁ బంపఁబడినవాఁడ నని మీ రూహింపవలయును. నేను గచ్చగట్టి యిరువది సంవత్సరములు కుస్తీ చేసితిని. నాయొడ్డుపొడవునకు, బలమునకుఁ దగినయాఁడుది దొరకకపోవుటచే నింతకాలము బిగించు కొనియుంటిని. నిన్నుఁ జూచితిని. నాప్రాణములు లేచివచ్చినవి. మన మిద్దర ''మాదాము హవ్వా'' వలె సుఖము నొందుదము. మారుమాట చెప్పక ''నాదరభాస్తును మంజూరుచే యుము'' అని యామెపట్టులచేతినిఁ బట్టుకొనెను. అంతనామె నదుము నట్టి యని, యిట్టి యని ముసిముసినవ్వు నవ్వి మొగమట్టి త్రిప్పుకొని చేతిని లాగుకొనఁ బ్రయత్నించినట్లు నటించి ''నీ వెవఁడ?'' వని యడిగెను. ''నే నెవఁడనైన నెందులకు? పెద్దగ్రంథారిగాఁడ'' నని యాతఁడు బదులుచెప్పెను. అంత సీనానుకోళ్లనితంతువు జల్లున నొడలు గగుర్పొ గినుక్కున నవ్వెను. అంత నాతోళ్లవర్తకుఁడగు లబ్ధివాఁడామెను ''బిస్మిల్లా'' యని లేవఁదీ సెను. ఆమె చెంబు చేతఁ బుచ్చుకొని యాతనితోఁ బోయెను. నే నేమో తన్నుఁ గనిపెట్టితిని నను కోపముచేఁగాఁబోలు నాతురక యొక్కత్రోపును నాకుఁ గటాక్షించి మరిపోయెను. అక్కడనుండి మరియొక్కయెడ కేఁగితిని. అక్కడ నొక్కతె మరియొకతెతో ''అమ్మా! నుదుటిక్రింద నుఖపడుగీత లేకపోయినతరువాతనైనఁ బాపటపందిరు లెందులకమ్మా? చేతఁ జేసికొన్నపూజ నన్నమైన తరువాత మెడలోనికిఁ జేయించుకొన్న కంటె రోఁకలి యంత లావున్న నేమిఫలము'' అని దీనవదనముతో ననుచుండెను. అమ్మా! నీ వెరుఁగవు కాని నాపూజ మరింత బుగ్గి యయినది. ''బారిష్టు'' రని సైకి బండారమేగాని లోపల

లొటారము. ఏమి చెప్పుకొనను నాపిండకూడు?'' అని యామె యామె నోదార్చుచుండెను. అంత మరియొకవైపునకుఁ బోయితిని. అక్కడ నొకయుపాధ్యాయుఁడు మరియొకనితో నేమేమో చెప్పుచుండెను. ''స్కూళ్లఇనస్పెక్టరు''. అని, చచ్చిపోయినాఁ డని మాత్రమునాకు వినఁబడెను. బొమ్మలాటనుగూర్చిన గొడవ కాదు కాఁబోలు నని యింకొకచోటికిఁ బోయితిని. అచ్చట నొక యాఁతరుప్ప తలది యుపదేశముద్రను వహించి ''బ్రదుకునకు ఫల మిది'' యని భవతంత్రసర్వ రహస్యసారమును సూత్రప్రాయముగఁ దొమ్మిదక్షరము లలో నవరత్నమంజరి యనునట్లుగ నిశ్శంకముగ బోధించుచుండెను. ఈవేదాంతిని యుప దేశమును గర్ణపేయముగ వినుచున్నవారిలో నొకయాఁడుదాని బిడ్డఁడు నిద్రనుండి యెట్టె లేచి తెరపై బొమ్మను జూచి ''అమ్మా! నాన్న యదుగో'' అని కేకవేసెను. అప్పు డామె మిగుల వినుగుదలతో ''నాన్న! అదుగ నక్కరలేదు. నాన్నబ్రదుకునకు, నాబ్రదుకున కామాత్రమా'' యని పలుకునరికి స్త్రీ లందరు నవ్విరి. బిడ్డఁ డేడ్చెను.

''గోరంచు కోకొద్దు–కొప్పులో పూలొద్దు
కోరిన నగలొద్దు–కులికించు ముద్దొద్దు॥ రానురో పిల్లోడ''

అని జగదేక యశఃపరిపూర్ణుఁ డగు భర్తగల యాపరమసుందరిపాడి యెగిరి యెగిరి యాడెను. అంత విరహవేదన భరింపలేక యాతఁడు–

''పందిమాంస మెట్టిస్త–బానకల్లు తాగిస్త
నందింటికి లాగేస్త–స్వర్గమట్టె చూపిస్త॥రావె॥''

అని పాడి బలాత్కారముగ భార్యపైఁ బడెను. జను లెల్ల గొల్లుమనిరి. తల యూఁపిరి. సెబాస్! అనిరి. చప్పట్లుగొట్టిరి. ''అద్దీ! ఆలాగున నుండవలెను.'' అనుమాట స్త్రీప్రపం చమునుండి రెక్కలు కట్టుకొని బయలువెడలెను. ఇంతలో ''చోడిగాఁడు'' తెరపైకి విచ్చేసెను. ఈతఁడు గ్రంథారిగాని మేనల్లుఁడు. అత్తయం దనురాగము గలవాఁ డగుటచే నామె నీతఁడు వెనుకనుండి కౌఁగలించుకొని తనవైపునకుఁ ద్రిప్పుకొనుచుండెను. జనులు గొల్లు మనిరి. గ్రంథారిగానిభార్యకు ''చోడిగాఁ'' డనినఁ బ్రాణ మగుటచే భర్తను ద్రోచివైచి యల్లుని నమితానురాగమున ముద్దుపెట్టుకొనెను. అంత గ్రంథారిగాఁడు కోపమునఁ బరవళ్లు ద్రొక్కుచుండఁగా నత్త నెత్తుకొని యల్లుఁడు పారిపోయెను. జనులు తిరుగ గొల్లుమనిరి. గ్రంథారిగాఁ డేడ్చుచు నింటికిఁ బోయెను.

''అట్టి మహాత్మునికే యిట్టియవస్థపట్టినప్పుడు మనుష్యమాత్రులకు లెక్కయేమి?'' టని నూతనముగఁ గాఁపురమునకు వచ్చిన తృతీయభార్య తెలికవానితో నీనడుమ లేచిపో వుటచేఁ బరితపించుచున్న భగవచ్ఛాస్త్రులవారు కొంత తాపోపశమన మొందిరి. అంతఁ దెరపై శ్రీరామచంద్రమూర్తి, మూర్ఛితుఁడగు లక్ష్మణుడు, విభీషణాదులు ప్రవేశించిరి.

అంతలో జనసంఘమున నొకమూల నిద్దరు జనులు గట్టిగ మాటలాడుకొనునట్లు ధ్వని వినఁబడెను. అట్టె నల్వురైదుగురి ధ్వని వినఁబడెను. అంతలో గుబగుబలాడుచుఁ గొందరు జనులు లేచిరి. కూర్చుండుఁడని కొందరు కేక వైచుచుండినను జను లుద్రేకమున లేచుచుండిరి. పెద్దగోల యగుచుండెను. బండబూతులు పుంఖానుపుంఖముగ వెడలుచుం డెను. ఇంతలో గుబుకు గుబుకు మని గ్రుడ్డులధ్వనులు మిన్నుముట్టుచున్నవి. చెవ్వు లంతరిక్షమున నెగురుచున్నవి. కర్రలు విరుగుచున్నవి. జనులతలలు పగులుచున్నవి. కర్ర

లింకఁ జాలక కొందరు జనుల బొమ్మలాట పందిరకర్ర లూడలాగిరి. బొమ్మలాటవాండ్రు తోళ్లు మడతనైచుకొని కాలికొలఁదిఁ బరుగెత్తిరి. పిల్లలు జనుల కాళులక్రిందఁబడి మొర్రో యని యేడ్చుచుండిరి. స్త్రీలు సందడిలో నలిగి నలిగి ''నాన్నా! తాతా! బావా! మామా!'' యని కేకలిడుచు విలపింపఁజొచ్చిరి. కరణముగారు కర్రచేబూని యడ్డువచ్చినవారి నెల్లఁ గొట్టుచు, జనారణ్యమును ఛేదించుచు లోనికిఁ బోవుచుండ నొకని పంగలకర్రచే నాతని ప్రక్కటెముకలు మిరుగుటచే నక్కడనే కూలఁబడెను. ఏమిటి! సంగతి యేమిటి! ఆగుఁడు! ఎందులకు! ఈగొడవకు మొద లేమి?'' టను కేక లనేకకంఠములతో బయలువెడలినవి. ఆమాటలకు బ్రత్యుత్తరములేదు. కొట్టు–ఈడ్చు–తన్ను–పొడుపు –చంపు'' మను కేకలకు విరామము లేదు. దబుకు దిబుకు, టప్పు టిప్పు మను ధ్వనులకు మితి లేదు. ''అమ్మయ్యో! మొర్రో! బాబూ! చచ్చితినిరా'' యను నాక్రందనములు హాహాకారములు భయంకరముగ నుద్భవించుచున్నవి. ఇంతలో రక్షకభటులు వచ్చిరి. కాని చుట్టలు గాల్చుచు దూరముగ నిలువఁబడిరి. కరణముగారిని గంజికావడివైచి యింటికి భటులు మోసికొనిపోయిరి. మున సబు బుద్ధిమంతుఁడగుటచే నొకఁడు మోసిక్కొని పోనక్కరలేకుండ స్వతంత్రముగ నింటికిఁ బోయెను. బొమ్మలాట–, గ్రుడ్డులాట తన్నులాటక్రింద దిగినది. కారణ మేమో వీ రెవరికిఁ దెలియదు. కర్రవ్రేటు లడఁగెను. గ్రుడ్డులాట మిగిలెను. గ్రుడ్డులాట కొంతసేపటికిఁ జల్లారెను. జను లంత రొసరొస లాడుచు నొత్తిగిల నారంభించిరి. ''అద్దీ ఇదే సమయ'' మని రక్షకభటులప్పు డాకాశవిదారణ పటిష్ఠతాదారుణములగు కేకలతో జనసంఘమునఁ బ్రవేశించి యెర్రపాగలవలనం గలిగిన రౌద్రరసముతో వారి నీడ్చి, వీరిని బెదిరించి, దెబ్బలు తగిలి క్రిందఁబడినవారిని లాగి యెంత ''హంగామా'' యయిన నాచరించిరి. జను లందరు జడిసి యింటికిఁ బారిపోయిరి. క్రిందఁబడినవారిని వారివాండ్రు వచ్చి యింట్లకుఁ దీసికొనిపో యిరి. రక్షకభటు లింట్లకుఁ బోయిరి. నేను నింటికిఁ బోయితిని. కలహకారణ మేమో ముగ్గురకుఁ దప్ప నితరుల కెవ్వరికిఁ దెలియదు. వారిలో నిద్దరు తమకు శిక్ష యగునేమో యనుభీతిచేఁ బయటఁబెట్టరు. మూఁడవవాఁడను నేను. వారిద్దరిపేరు లేవో నే నెరుఁగను గాని వారిని గుర్తుపట్టఁగలను–ఈ కారణ మేదో మీరు విందురా? అనేక సహస్రజనములకు నీడ నీయఁగల వటవృక్షమునకు మూల కారణము జీమకంటెఁ జిన్నదైన బీజము కాదా? మహాగౌతమి నాసికాక్షేత్రమున చిన్నకాలువ కాదా? అటులే యీ మహాకలహమునకుఁ గారణము చిన్నది. చోడిగాఁడు గ్రంథారిగాని భార్యను లాగుకొని పోయినతరువాత–నెవ్వరో యిద్దరు జనులు మాటమాట యనుకొనిరి. అప్పుడు నే నచ్చటనే యుంటిని. చోడిగాఁడు గ్రంథారిగాని మేనల్లుఁ డని యొకని వాదము. కాఁడు అల్లుఁడని యొకని వాదము. ఈనెరపే పెణక్కైఁ బడి యిన్నకొంప లంటించినది.

జంఘాలశాస్త్రి యింక నేమో చెప్పఁబోవుచుండఁగా నిద్దరు రక్షకభటులు మానభాకుటీ రమున సెలవు లేకుండఁ బ్రవేశించి ''కవిగారిచ్చట నున్నారా?'' యని యడిగిరి. అంతట వాణీదానుఁడు లేచి ''నేనే కవి'' నని పలికెను. ''ఆలాగా'' యని రక్షకభటులు తిరుగ వెలుపలకుఁ బోవుచుండ నేను వారి నాఁపి ''కవితో నేమి పనియున్న?'' దని యడిగితిని. ''విశేషము లేమియును లేవు. కరణముగారి చెల్లెలు కవి నొకనిఁ దీసికొని తెల్లవారుగడ లేచిపోయినదఁట–ఆతడు మీకవియేమో యని సందేహించి వచ్చితి'' మని చెప్పిపోయిరి. ''కవియను బిరుదముగలవాఁడు మఱియొకఁడు గ్రామమున నుండెనా'' యని వాణీదానుఁ డనుకొనుచు వెడలిపోయెను. సభ ముగిసెను.

44. సత్యము

''సత్యము సర్వశ్రేయము
అది యెల్ల ధర్మములకు మూలము''

– అని మనం ఎప్పుడో చిన్ననాడు విన్న పెద్ద వాక్యం. ఈ పెద్ద వాక్యంలో ఉండే అనంతార్థాన్ని మళ్లీ చిన్న మాటల్లోకి పెట్టి 'సత్యం' గురించి జంఘాల శాస్త్రి చేసిన పసందైన ప్రసంగ మిది.

'సత్యోత్థాపితా భూమిః' అని ఋగ్వేద శ్రుతితో ప్రారంభించిన ఈ ఉపన్యాసం, 'సత్యం' అంటే నిర్వచిస్తుంది. దాని నానా ముఖాలు గుండ్రంగా (తిప్పి) చూపిస్తుంది. అది మనుషుల మనస్సు మీద పరిచే వెలుగు నీడల్ని విశదీకరిస్తుంది.

ఈ సత్య స్వభావాన్వేషణలో శాస్త్రి దృష్టి వైద్యుల మీద, ప్రభువుల మీద, భార్యాభర్తల మీద, ప్రసరించింది.

నిత్యం ఈ లోకంలో అనేక సంఘర్షణల నడుమ జరగవలసిన మానవ జీవితంలో 'అసత్యం' పాత్ర ఏమిటో, దాని అవసరం మనిషికి ఎందుకు, ఎంత మేరకు కలుగుతుందో నిశితంగా జంఘాల శాస్త్రి విశదీకరిస్తాడు. లౌకిక మర్యాదల్లో అసత్యాలు ప్రజానాయకుల్ని, అధికారుల్ని, న్యాయవాదుల్ని, వారూ వీరూ అననేల? సర్వ ప్రపంచాన్ని ఎలా ఆడిస్తాయో బొమ్మలు కట్టి చూపిస్తాడు. 'అసత్యాల' బరువుల్లో తేడాలను విడమరుస్తాడు.

పూర్వుల సత్యదీక్షను శ్లాఘిస్తాడు.. అటువంటి వారికి మనం వారసు లమా? అనే భయాన్ని–నైతిక భయాన్ని–పుట్టిస్తాడు జంఘాలశాస్త్రి.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! నాకుఁ దల నొచ్చుచున్నది. క్రిందటిసారి మా యుపన్యాస మేమియు జరుగలే దని సిద్ధపడితిని. చెప్పఁగలిగినంతవట్టునకుఁ జెప్పి యూరకుండెదను.

''సత్యోత్థాపితాభూమిః'' అని ఋగ్వేదశ్రుతి యున్నది. భూమి సత్యముచే స్థాపనము జెందియున్న దని దీనియభిప్రాయము. అనఁగ సత్యము లేకుండిన భూమియందలి

వ్యవహారములు జరుగ వని దీనివలనఁ దేలుచున్నది. ఈయంశ మెంతసత్యమో పరిశీలిం తము. గురుఁడు శిష్యునకు విద్యఁ జెప్పి యాతనియజ్ఞానమును ధ్వంస మొనర్పఁజేసి యాతని బాగుసేయవలయునను సత్యబుద్ధితోఁ బ్రవర్తింపవలయును. శిష్యుఁడు గురువు నందు యాథార్థభక్తి గలిగి యాతఁడు తనక్షేమముకొఱకే పాటుపడుచున్నాఁ డని సత్యబుద్ధి గలిగి విద్య నభ్యసింపవలయును. ఉభయుల సత్యములో నెచ్చట లోప మున్నను విద్యావ్యాపా రము జరుగనేరదు. వైద్యుఁడు తన కున్న భేషజజ్ఞానముతో రోగి రోగమునకుఁ గారణ మేదియో పరిశీలించి యాతనితత్త్వ మెట్టిదో బాగుగఁ గనిపెట్టి తనయొద్దనున్న యౌషధము లలో మంచివాని నిచ్చి యాతని కారోగ్యమును గలుగఁజేయవలయునను సత్యబుద్ధితో దైవముఖమును జూచి పాటుపడవలయును. ''ఈవైద్యుఁడు యథార్థవైద్యజ్ఞానము కలవాఁడు, సత్యవంతుడు; నమ్మఁదగినవాఁడు, రోగము కుదుర్చును. దొంగమందు లిచ్చి రోగము పెచ్చుచేయువాఁడు కాఁడు. ఆతని శ్రమమునకుఁ దగిన ప్రతిఫల మీయవలయును'' అను సత్యబుద్ధితో రోగి మందును దీసికొనవలయును. ఉభయుల సత్యబుద్ధులలో నెచ్చట లోప మున్నను భేషజతంత్ర మొక్కనిమిషమైనను జరుగనేరదు. ఈ పై రెండుదాహరణములవల ను సత్యము లేకుండెనేని మనుజులచిత్తరోగమగు నజ్ఞానము నశించుదారి లేదు. దైహికరోగ ములు నివర్తించు దారి లేదు. బాగుగ నుండఁదగిన దేహచిత్తములు రెండును బాడగును. పిమ్మట నిఁక దేహయాత్ర యుచితరీతి నెట్లు జరుగఁగలదు?

అది గాక ''ప్రజలు యథార్థముగ నాబిడ్డలు; మనోవాక్కాయ కర్మములచే వారిని బుత్రులవలె నే నాదరింపవలయు'' నను సత్యబుద్ధి గలిగి సత్యమే యాధారముగల శాసనము లొనర్చి సత్యవంతులగు నుద్యోగులమూలమునఁ బ్రభుఁడు తన యధీనులగు ప్రజలను పరిపాలింప వలయును. ''రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణాం'' అను నార్షవాక్యమును ద్రికరణశుద్ధిగ నమ్మి ప్రభుఁ డొనర్చిన దెల్లను దమక్షేమమునకే యని సత్యము సమ్మి, యాతనియందు విశ్వాసము, ననురాగము, భక్తియుఁ బూర్ణముగఁ గలిగి ప్రజలు పాలింపఁబడవలయును. ఈయుభయుల సత్యబుద్ధులలో నెచ్చట లోప మున్నను రాజకీయ తంత్రము జరుగదు. పాలనతంత్రము లేనప్పుడు ప్రజలబ్రతు కిఁక నడుగవల యునా? గొల్లఁడు లేనియప్పుడు 'బే' యని యఱచుచుఁ దోడేళ్లనోళ్లలోఁ బడుచుఁ జెడు గొఱ్ఱెలవలె, రాజు లేనియప్పుడు జనులు దిక్కు లేక–గతి లేక–శాసనములకట్టు లేక –యాస్తులకు న్వస్థత లేక–యాఁడువారిమర్యాదలకు రక్షణములేక–యర్భకులకుఁ గాపులేక –యన్యోన్య కలహములలోఁ గర్రలువిరుగ, గత్తు లెగురఁ, దలలు తెగిపడ, రక్తములు ప్రవహింపఁ బ్రాణముల కొక్కఁ త్రుటియైన నిలుకడలేక–మనసులకు రెప్పపాటయిన శాంతి లేక–మహాసంరంభము నొందుదురుగాదా? సత్యము లేకుండునెడలఁ బ్రపంచవ్యాపారముల కింతకలఁత సిద్ధించుట స్పష్టముగఁ గనఁబడుచున్నది గదా! ''జనులు తమ్మఁ దాము పరిపాలించు కొనఁగూడదా? ప్రభువే పరిపాలింపవలయు నన్న నియమ మేమి?'' యని యందురేమో? అట్లు జరుగవచ్చును కాని జనులలో సత్యము లేనియెడల నదిమాత్ర మెట్లు జరుగఁగలదు? నీయందు నాకుఁ బ్రమాణబుద్ధి–నా సత్యమునెడల మరియొకనికి విశ్వాసము లేనప్పుడు మరియొక యథార్థమందింకొకనికి నమ్మకము లేనప్పుడు నిట్లొకనితో నొకఁడు హత్తకుండఁ గలియకుండ నుండునప్పు డన్యోన్యపాలనమున కవకాశ మెచ్చట నున్నది? అదియు లేదు. భూమిలో సత్యము లేనప్పు డింక జగత్తే లేదు. కావున జగత్తునకు సత్యమే

యధారము. సత్యమందే జగము స్థాపింపఁబడి యున్నది. కావునఁ బూర్వోదాహృతమగు వేదవాక్యము సత్యము.

కాని జాతిలో సత్యము నశించుట కేవలము ప్రళయాసన్నదశ యందుఁగాని సిద్ధిం పదు. కాని సత్యము విశేషముగ క్షీణించి యసత్యము మిక్కిలి ప్రబలియుండు సన్నివేశములు ప్రపంచమున నప్పుడప్పుడు సంభవించును. అప్పుడే యసత్యనాశనమునకై –సత్యస్థాపనమునకై–యవతారపురుషు లుద్భవింతురు. రామకృష్ణాదులే కాక, శంకర రామానుజ క్రీస్తు మహమ్మదాదులుకూడ నవతారపురుషులే యని చెప్పనొప్పును. ఇట్టి యవతారోద్భవమునకుఁగూడ నవసరము తఱుచుగఁ గలుగనేరదు.

అగ్ని సాక్షిగఁ బెండ్లాడిన కాంతతోఁ బరిణయకాలమునఁ జేసిన ప్రమాణమునకు బద్ధుఁడై జనుఁ డుండవలయును. అట్లుండ కొకఁడు వ్యభిచరించినాఁ డనుకొందము. ఈవ్యభిచారదోషమున కాదికారణమేది? ప్రమాణమునకు బద్ధుఁడై యుండకపోవుట. అనఁగ ననత్యము! న్యాయప్రదానమున కేర్పడిన శాస్త్రబ్రహ్మచారి లంచములు దీసికొని శాసనముల కపార్థములఁ జేసి జనుల బాధించును. ఈజనహింస కాదికారణమేది? బ్రహ్మచర్యదీక్షాపూర్తి కాలమున సభలో ''న్యాయముగ వర్తింతు'' నని పరిపాలకనిధియెదుటఁ దీసికొనిన ప్రమాణమునకు భిన్నముగ నడచుట. అనఁగ ననత్యము! ఒకఁడు చెడుద్రాగి యొడలు తెలియక ప్రేలుచు గంతులువైచుచుండు ననుకొందము. ఈదుర్వృత్తమునకు మూల మేది? తన స్వభావమునకుఁ దాను గనుపరుపవలసిన సత్యమునకు భిన్నముగ వర్తించుట–అనఁగ ననత్యము! జనులలో నొకఁడు జనపతికి హాని చేయఁ బ్రయత్నించె ననుకొందము. ఈద్రోహమునకు మూల మేది? జనపతినుండి తాను బొందుచున్న మేలున కసత్యముగ నడచుట–అనఁగ ననత్యము! ఒకఁ డొకనిని జంపె ననుకొందము. ఈ నేరమునకు మూలము నఘసత్యమునకు వ్యతిరేకముగ నడచుట–అనఁగ ననత్యము! ఇట్లు మనుజుఁడు సంఘము నెడలఁగాని, తనయెడలఁ గాని, దైవమునెడలఁగాని, చేయఁగల యన్ని నేరములు దగ్గఱనో దూరముననో సత్యమునకు సంబంధించియున్నవి! అసత్యమే మూలకారణము గలవియై యున్నవి! ఇట్టి నేరములను జను లేదియో లాభము గోరి చేయుదురు. త్రాగుటచేఁ దనశరీరమును ధ్వంసముఁ జేసికొను వాఁ డయినఁ దాత్కాలికపుమత్తువలనఁ గలుగు మహానందమునకో మరియట్టిదేనికో త్రావును. తమ యీనేరమువలనఁ బరులకు నష్టము వచ్చినను దమకు లాభముగనే పరిగణింపఁబడును. జను లిట్లు లశాశ్వతములగు నైహికసౌఖ్యములకొఱకు శాశ్వతమగు సత్యమును బరిత్యజింతురు.

సెనగపిండిలోఁ గొంచెము బియ్యపుఁబిండి కలిపినఁగాని కారపుఁ బూస కరకరలా డుచు నొకటి రెండు దినములు నిలువయుండదు. జబ్బు లోహపుఁగూడిక యుండినఁ గాని టంకము బింకముగ నదికింపలేదు. కానులో రాగిమేళవింపు లేకుండునెడల నాణెమున కది యంతగా నుపయోగింపదు. పేకకంటెఁ బడుగు మోటుగ లేకున్న బట్ట బాగుగ మనదు. అటులే జనునిమననుగూడఁ గొంత ననత్యముతోఁ గూడి యున్నఁగాని యైహికపు టూఁగులాటలకు–రాపిళ్లకు–నాఁగదు. మిగుల మెత్తనయగునెడల–మిగుల బట్టబయలగువెడల–నది యెల్లివారి కెరయై పోవును. హాస్యాస్పదమై నిందాపాత్రమై పోవును. కానంత మాటుండవలయును. కానంత గాటుండవలయును. ఎంతసౌందర్యవతియైన నరే! కానంత

బిగింపు, కానంత కొఱకొఱ, కానంత ధూర్తత్వము, కానంత నిర్లక్ష్యము, అవయవగోపనమునఁ గానంత కట్టుదిట్టము లేని దైనయెడల జనప్రేమాన్పదురాలు కానేరదు సరేకదా! త్వరగ నిందాపాత్రురా లగును. అదిగాక జనమధ్యమున నామె దక్కలేదు కూడను. తేనెటీఁగకు ముల్లు లేనియెడల క్షుద్బాధచే నొకదినములోనే చచ్చును. గొఱ్ఱెలమందలోఁ గుక్క లేనియెడల మంద చిందఱ వందఱ యగును. ప్రపంచవ్యవహారములందు సత్య మసత్యముతోఁ గొంతయైనఁ గలిసి యుండవలయును. వట్టిసత్యము దక్కనేరదు. వర్తకుల ప్రకటనదర్పములు, భేషజతంత్రపువీరాలాపములు, గ్రంథకర్తల గ్రంథములంగూర్చిన స్తుతి వాక్యాడంబరములు మొదలగునవి యిందులకు నిదర్శనములు.

Truth may perhaps come to the price of a pearl that showeth best by day but it will not rise to the price of a diamond or carbuncle that showeth best in varied light అని Bacon చెప్పినాఁడు. అప్రపంచికదృష్టిని జూడ సత్యము మిక్కిలి శ్లాఘ్య మగునదియే యగును. కాని యది ప్రపంచవ్యాపారోపయోగ దృష్టినిఁ జూడ దానివిలువ తగ్గుచున్నది. ప్రపంచవ్యవహారములందలి జయమునకుఁ గొంత కనుగప్పు, తల పులుముట, పైతళుకు, మాటుఁ దనపునీటు మొదలగునవి కావలయును. ఇట్టి దొంగగోటులు, శుద్ధస త్యము చూపఁజాలదు. అది యసత్యముచేఁ గొంతసాంకర్యము నొంద వలయును. పొత్తి నూలు కలసినగుడ్డ కున్న తళుకు, మన్నిక వట్టిపొత్తు గుడ్డ కుండదు. కర్రసాములో నటుచూపి యిటు చూపి యటు కొట్టువానికి జయము చేకూరును. సత్యాసత్యసమ్మేళనము ప్రపంచయాత్రా సదుపాయప్రదమని యూహించి జనులు బహుళముగా నట్లు చేయుదురు. ఇట్టి జనుల గౌరవమును, భాగ్యమును, గీర్తియుఁ జూచి వారిస్థితిని దముగూడఁ బొందవ లయు నని కొందరు పాటుపడుచున్నారు. కాని సత్యమును గనుఁగొనుటకు దానిని హెచ్చుతగ్గులు లేకుండ సందర్భముగ నసత్యముతో మేళవించుటకు దానిని వెల్లడింపఁజాలని కార్యముల సాధించుకొనుటకు శక్తిగాని యోరిమిగాని లేక వారనత్వమునకే మరికొన్ని వన్నెలు చిన్నెలు కల్పించి, వివిధవర్ణదీపికా కాంతిని నింద్ర ధనుఃకళికను జేసి జనులనేత్రము లను మనస్సుల నాకర్షించుచున్నారు. ఇది వట్టి కనుకట్టు, ఇంద్రజాలము, పైకిఁ బొట్ట –లోపల లొట్ట. మీఁదికి హొన్ను, లోన మన్ను! బట్టమందిరములకుఁ బ్రత్యక్ష మందిరము లందవు. డాఁగు రేకుగద్దెపై 'పీకాకు' సింహాసనము దిగదుడుపు పూస. బొంతలమందు బుఱేదారు జలతారుకోటులు పనికిరావు. తారను వలపించిన శీతాంశునికంటె చీనారేకు శీతాంశుఁ డెక్కువ సొగసుగ నుండును. ఈ 'కోహినూరులు' నీ 'టాజ్‌మహలులు' నీ నిశాధిపతులు–నిశాకాల ందుమాత్రమే! సత్యసూర్యోదయ మగువెంటనే యివి యన్నియు దేవదారుపెట్టెలు, కాగితపుతట్టలు సవరాలబుట్టలు అయిననేమి? నాటకుల పెట్టెలలోని రూపాయలు పాదరసపురూపాయలు కావు. ఇండ్లలోని భార్యలు గొరుగుడుమీసములవారు కారు. సత్యాసత్యసమ్మేళనమునుండి జను లిట్లు కేవలమగు నసత్యప్రయోగమునకై దిగిపో యిరి. ఎందువలన? ధనమునందలి కాంక్షచేత!–బ్రతుకునందలి పామరత చేత!–

పొట్టకూటికై జనులు కొంద రిట్లసత్యకథన మవలంబించియుండ నోటిమాటకై కొంద అందులకుఁ గక్కుర్తిపడుచున్నారు. వడలరుచికై కొత్తిమిరి కలిపినట్లు గమగమకై యింగువపలకు కూరల వైచినట్లు మాటలపొంకమునకై వీరు వానితో నసత్యముఁ గొంత

మేళవించు చున్నారు. తమమాటలలోని పాకముచే రసముచేఁ బాకపుఁ బరిమళముచే జనులకు నోరూరఁ జేయవలయు నని వీరిముఖ్యాభినంధి. అతిథులకుఁ బదార్థములు వడ్డించుటయందుఁగూడ వీరికిఁ జాకచక్యమును–హెచ్చు. ఈవచఃపాచకుల రుచిచే నత్యము వట్టిచప్పనిది. అరఁటిదూట అయిన నేమి? ఆదూటనే సన్నఁగఁ దరిగి యథార్థరసమును బిడిచినైచి గిన్నెలో సాగనుగ, దోరగ ముకురంధ్రములు కృతార్థము లగునట్లు మిరపకాయలు పొగగింజలు మరికొన్నినైచి, వేచి, తరుణము కనిపెట్టి, యీగాటుకమ్మఁదనములగనిలో నాముద్దను బడనైచి, పరిమళము పైకిఁ బోకుండ మూఁత నిడి, తఱచు కలియఁబెట్టి, చిక్కనిపులుసుచే దానిపైఁ గొంత చిలకరించి, పసుపుచే దానికి సౌభాగ్య మిచ్చి, బుట్టలోని దికూడఁ గొంతఁ బొందుపఱచి, దింపి పత్రమునఁ బరిమార్జన మొనర్చి, యట్టిపాకుండ మోతాదుగ నావఁ దగిల్చినయెడల వహ్వా! జిహ్వకుఁ దారక మంత్రోపదేశము! కలియుగా మృతము! చేయవచ్చునని వీరి నమ్మకము. వీరు తఱుచుగ నడిమివయసు దాఁటినవారు. వీరు ప్రాయికముగఁ బూర్వగాథలనే పలుకుచుందురు. తాను గాశికిఁ బోయినప్పుడు హిమాలయ ప్రాంతమున నున్న యొకమహర్షి పందెమునైచి దుండివిఘ్నేశ్వరుని తొండ మల్లాడింపఁజేసినాఁ డనియు, నేడుకొండల వెంకన్నకు మండపమును కట్టించిన బోగముది ప్రతిరాత్రియుఁ దములపాకుల చిలుకలు చుట్టి స్వామి కర్పించు ననియు ''నానాగత్తరలో, రెండుతలల నన్యాసి యొకఁడు గంగనుండి వచ్చి యర్ధవితంతువురూపమున నర్ధనన్యాసి రూపముగ నట్టి విడిచిపోయినాఁ డనియు, సంగతులపై సంగతులు, కల్పనలపైఁ గల్పనలు, వివిధజాతుల సాగనులతో వినిపించుచుందురు. శబ్దముల పొందిక తప్ప నర్థసందర్భముతో నిమిత్తములేని యధమకవులకు వీరు జ్యేష్ఠభ్రాత లనిపించుకొనఁగలరు. వారికి నీరికిఁగూడఁ గల్పన లన్నియు ననత్యములు, నన్యభావములే! రాత్రుల భోజన మగుపిదప వీరు చుట్టలు గాల్చుచునో, నల్లమందుప ట్టిచ్చినతరువాతనో, అజ్ఞ బాల వృద్ధ వితంతు సభాగ్రాసనాధిప త్యుపన్యాస మారంభింతురు.

పరులు చెవులు నిగుడఁజేయుటకైవీరు స్వాత్మలను గ్రిందికిఁద్రోచు కొనుచున్నారు. వృద్ధవేశ్యలు గోరంటాకురక్తిమచేతను, మొగము మెరుఁగుల నునుపులచేతను, దుప్పికొ మ్మపండ్లచేతను జ్ఞానశూన్యమగు విటజనము నాకర్షించుకొనఁగఁ బడుపాటు లీవచనప్రబం ధకవుల పాటుల కందవు. వీరు రాయబారపుఁబనులకు బొత్తుగఁ బనికిరానివారు. వీరి నందులకై యుపయోగించునెడల నిక్కడినూట లక్కడినవలతో, నక్కడినూట లిక్కడినవలతోఁ గార్యమును గడతేర్తురు.

వినోదమునకై యసత్యమును వీరిట్లాడుచుండ మరియొక కొందఱందులకే యంతకు మించిన ననత్యముల నాడుచున్నారు. వీరు పైవారి వలె వయసుగడచినవారు కారు. పదుచువాండ్రు, నడిమివయసువారు. వారివలె పూర్వవిద్యలే కాని యాధునికవిద్యలు లేనివారు కారు. కలవారు. వారివలె సత్యాధికత, నసత్యాధమత నెఱుఁగనివారు కారు. ఎఱిఁగినవారు. వారివలె నాగరికత లేనివారు కారు. కలవారు. వారివలె నజ్ఞులతో సంభాషించు వారు కారు. విజ్ఞులతో సంభాషించువారు. వారివలెఁ దెల్లి యసత్యము లాడువారు కారు. వారికంటె నెక్కువగ గడునగు ననత్యము లాడువారు. వారివలె నల్లమందుపట్టుచేతను, జూట్టకైపుసాగనుచేతను బలుకువారు కారు. ఎఱిఁగియుండి విద్యావైభవముచేఁ బలుకువారు.

వారివలెఁ దాత్కాలికవినోదమునకై కల్లలాడువారు కారు. శాశ్వతగౌరవమునకై యాడువారు. ఆ! ఏమివింత? ఇట్టివారున్నారా? ఉన్నారు. ఎక్కడ? ఎక్కడఁ జూచిన నక్కడే! వారి ప్రతిభయే యిప్పుడు ప్రబలముగ నున్నది. ఆధునిక విద్యాభ్యసనముచే నవనాగరకతానమా రబ్ధ సంస్కారముచే నూతనాభ్యస్తవిజాతీయ మర్యాదా పరంపరచే వీ రపూర్వముగఁ బ్రకాశించుచున్నారు. వీరు వీథిలోఁ దటస్థునైనఁ గాని–సామాన్యశత్రువునైనఁగాని –చూచినతోడనే యేమి సమావేశ సంభ్రమములు! ఏమి నమస్కారార్పణ స్వీకారవైభవ ములు! ఏమి సల్లాప వచఃకలాపనైపుణులు! ఇద్ద ఱొట్టి యఱ్ఱి దరిచేరి కలసి మెలసి ప్రత్యక్షముగ నేకశరీరధారు లయిపోదురేమో యని పై వారికిఁ దోఁచునట్లు వీరి యాంతరానురాగప్రేరిత బహిశ్చేష్టాసముదాయము కనఁబడును. ఒకనాఁడు నే నొక గొప్పయుద్యోగియింటికి –భూతవైద్య మని బేలగఁ జెప్పఁ దగదు. 'మెస్మరిజము'నకై పోయితిని. ఆతఁడు–నేను –మాట లాడుకొనుచుండగా నొక్కసేవకుఁడు వచ్చి యొకతెల్లనిచీటిముక్క నాతనిచేతఁ బెట్టెను. దాని నాతఁడు చూచి కొఱకొఱలాడి గుట్టు మని నాతో నిట్లనియెను. ''నా కీతఁడు ప్రబలశత్రుఁడు. ఈతఁడు నేనుగూడ Chairman (చేర్మెన్) పనికి stand (స్టాండ్) అయితిమి. అందులో మాబలాబలము లేమో చూచుకొనవలయునా? నేను వేశ్య నుంచు కొంటి ననియు, నది నాపేరిట లంచముతీసికొనుచున్న దనియు నీచండాలుఁ డాకాశరా మన్న యర్జీని నాపైయధికారి కిచ్చినాఁడు. మరియొకని కట్టిపని చేయుటకై interest (ఇన్ట్రెస్టు) లేదులెండి. నే నూరకుందు వాఁడనా? ఈతఁడు వెనుక గోదావరివంతెనపనిలో వ్రాసిన తప్పులెక్కలన్ని పెట్టి త్రాడు తెంచుటకు సిద్ధముగ నున్నాను. ఆపనిచేతనే మూఁడు రాత్రులనుండి యొక్క Pink (పింక్) అయినను లేదు.'' అని యిఁక నేమేమో చెప్పు చుండఁగా టక్కుటక్కుమను కాలిజోడుతోఁ దళుకుతళుకుమను కంటిజోడుతో హాహా యను గుల్లగుల్లనవ్వుగోడుతో 'well my dear friend' అనుచు లోని కాతఁడే వచ్చెను. నాతో నిన్నిమాటలాడిన యుద్యోగి తటాలున లేచి యొడలు తెలియని తీవ్రతచే ముందున కొకగంతు వైచెను. ఆతనిఁ గలియఁబడి కొట్టు ననుకొంటిని. తన రెండు చేతులతో నాతనిచేతిని బట్టి యూఁపుచు I am my dear friend so very glad to see you అనుచు వెర్రినవ్వుచే వెకవెకలాడుచుండెను. విద్యావంతులు బుద్ధిమంతులగు వీ రిద్ధరు లేనిప్రేమమును గనఁబఱిచి రాని నవ్వులు తెచ్చుకొని యొకని నొకఁడు మోసము చేయుటకుఁ బాట్లుపడుచుండఁ జూచుట నామనసునకు రోఁత యగుటచే 'రానియేడ్పు నేను మాత్రమేల తెచ్చుకొనఁగూడ?' దని బొరుమని యేడ్చుచుఁ గడుపునొప్పిగా నున్న దని సంజ్ఞ చేఁ గనఁబఱచుచు నాఁటికిఁ బారిపోయితిని: ఒకలక్షాధికారి యొకసారి యయోధ్యలో తనగుమ్మమునఁ గూర్చుండ నే నాతని యొద్దకుఁ బోయి వినయముతో రయిలుఖర్చున కొక్కరూపాయి నిమ్మని యడిగితిని. నేను దొంగనేమో యని యెంచికొఁబోలు నన్నుఁ గ్రుచ్చి గ్రుచ్చి యనేకాంశము లడిగెను. నామర్యాదనుగూర్చి యాతఁడు సంతుష్టిపడెను. ఏమైన నిచ్చునని చేయి చాఁచితిని. My friend, I very much regret my inability to help you అని నాకంటె దిక్కుమాలినదైన మొగము పెట్టుకొని యనెను. అంత నే నొడలు మండిన వాఁడనై నాయేడ్పు చల్లారుట కేమైన నీయవలదు. నాయేడ్పును మించిన నీయే డ్పును జల్లార్చుకొనుటకైన నేమైన నిమ్మంటిని. అంత నాతఁడు గొణుగుకొనుచు లోనికిఁ బోయెను.

న్యాయవాది యొకఁడు సభలో నెదుటి న్యాయవాదిపైఁ బండ్లు కొరుకుచు నాతనిఁ జంపునంతటి తాత్కాలికకోపమున మందుచున్న వాడై I beg to differ from my learned friend అని పలుకును. శబ్దములకు నైఘంటికార్థములు నశించినవి. ఇప్పటి regret (రిగ్రెట్) కు విచార మని యర్థము కాదు. glad (గ్లాడ్)కు సంతోష మని యర్థము కాదు. learned (లెర్నెడ్)కు పండితుఁడైన యని యర్థము కాదు. beg (బెగ్) అనుదానికిఁ బ్రార్థించుట యర్థము కాదు. మనుజుల క్రొత్తపద్ధతుల ననుసరించి మాటలకుఁ గ్రొత్త యర్థములు వచ్చుచున్నవి. ప్రపంచమున నింతబహుళముగ నుపయోగపరచఁబడు నీ regret 1ఈ glad (గ్లాడ్) యథార్థము లయినచో నింతకంటెఁ గావలసిన దేమి? ఈదయాళుత –యీసహానుభూతి–యీయాపద్ధర్మనాసహిష్ణుత ప్రజలలో నుండు నెడల నీ భూమియే స్వర్గాధికమైనది కాదా! అట్లు యగునెడల నీ వ్యాజ్యెము లెందులకు? ఈచోరత్వము లెందులకు? ఈక్షామబాధ లెందులకు? ఈనరహత్య లెందులకు? ఈఘోరయుద్ధము లెందులకు? వానిని మించిన మనస్సంక్షోభము లెందులకు? మాకుక్కకు జబ్బుగా నున్నదని నే నొక పెద్దమనుష్యుని కుత్తరము వ్రాసితిని. ఈవార్త విని నప్పటినుండియుఁ దన కేమియుఁ దోఁచుట లే దనియు, మతి లేకుండ నున్నాననియు, నెప్పటిక్షేమ మప్పుడు తెలియఁబఱచు చుండవలయు ననియు నాకుఁ దిరుగ నాతనియొద్దనుండి యుత్తరము వచ్చినది. ఆతఁడు తండ్రి చచ్చినప్పుడైనఁ గంట నీరు పెట్టకుండినవాఁ డని నే నెఱుఁగుదును. నేఁడు నాకుక్క తనతండ్రికంటెఁ దన కెక్కువగుట యథార్థ మగునా? మతిలేక యుండువాఁ డున్మత్తాలయ ములో మందు తీసికొనవలయునుగాని వ్యాపారములలో రూపాయకు మూఁడు ప్రొఁతడ బ్బుల వారపువడ్డి యేల తీసికొనవలయును? బ్రదుకిచ్చిన భగవంతునికైన నమస్కరింపని వారు పొడుము పట్టిచ్చిన శాస్త్రిని thank you very much అని పదేపదే ప్రస్తుతించు చున్నారు. ఈయూహము లేమిటో యీమాటలేమిటో యీచేష్టలేమిటో! శ్రుతిలో గాత్రము గలియదు! గాత్రధ్వని తాళముతోఁ గలియదు!

మనపూర్వులు సత్యదీక్షకలవారు. వారిలో నసత్యవాదులు లేరని యెవ్వరును జెప్పరు. కాని, యిట్టి జనసామాన్యాసత్యము, నిట్టి స్వల్ప హేతుకాసత్యము, నిట్టి సత్యవాక్యభీ రుతాప్రేరితాసత్యము మాత్రము వారిలో నెన్నఁడు లేదు. వారు తఱచుగ జిహ్వాయందు ధారాళమగు సత్యము–చిత్తమందు వెనుదీయని ధైర్యము–గలవారనుట కేమియు సంది యము లేదు. ఇప్పటివారివలె నాలాపమార్దవమున కసత్యమాడిన వారు కారు. మర్యాదకొఱ కాడినవారు కారు. నడతయోగ్యతను దెలుపుట కాడినవారు కారు. ప్రచారప్రక్రమముకొఱ కాడినవారు కారు. ప్రజానంతోషముకొఱ కాడినవారు కారు. భయస్వభావమున నాడినవారు కారు. సత్య మాడవలయు ననునియమముచే వారు సత్య మాడిరి. కాని కొంచెము మోటుతనము గలవారైనను గతోరవాదు లని వా రనిపించుకొనలేదు. మనము శబ్దమార్దవము లకొఱకు శాసనధిక్కారమును జేయుచున్నాము. స్వల్పమర్యాదకొఱకుఁ బెద్దమర్యాదల మీరుచున్నాము. ఒకని చెవులకు సంతోషము నీయఁదలఁచి మన మనస్సాక్షికి బాధ నిచ్చుచున్నాము. ఒకని చిత్తమునకుఁ దాత్కాలికశాంతి నీయఁ దలఁచి మన యాత్మకు శాశ్వతదుఃఖము నిచ్చుచున్నాము. జడువఁదగిన భగవంతునికి జడువక, జడువఁగూడని మనుజునికి జడియుచున్నాము. ఎంతసేపు నటనము! అభినయము! షూరువేషము! దొంగ మాట! కల్లగంతు!–ఇవితప్ప మన ప్రస్తుతచర్యలలో నింతకంటె వే రేమున్నది? సత్యవాక్యము

నకుఁ సత్యప్రవర్తనమునకు భంగము రాకుండునంతవఱకు మన మెంత మార్దవముగ నెంతజనరంజకముగ మాడలాడినను దప్పు లేదు. కాని, దేనికొఱకు బ్రతుకుచుంటిమో, దేనిఁబట్టి తరింపఁ దలఁచితిమో, యేది జగదాధారమో, యేది దైవస్వరూపమో యట్టిసత్య మునకే నాశనము గలుగుట సంభవించుచుండ మన కల్లనవ్వులు, మన వంకదండములు, మన నాలుక కొనపలుకులు, మన కపటాలింగనములు, మన తేర యేడుపులు–మనల రక్షింపఁగలవా? మర్యాదకొఱకుఁ దెచ్చుకొనిన యీయసందర్భ ప్రవర్తనమున కింతలో శాంతిఁ జెప్పక నిరంతరముగ దానినే పారాయణ మొనర్చుచో మన మనుమల మనుమ లేడ్చుచు గర్భాధానము లొనర్చువారు, నవ్వుచు నరహత్యలు నేయువా రగుట కేమైన నందియ మున్నదా? అట్టిభవిష్యత్సాగమమునకు బీజారోపణ మిప్పుడే మనతత్త్వములో నయినట్లు కనఁబడుచున్నదే! సాలగ్రామతీర్థములో సౌవీరపాషాణముఁ గలుపువారు –వేదపాఠములోఁ గళాశాస్త్రాధ్యయనము చేయించువారు–మనకడుపులఁ బుట్టినట్లు మన మేల నడువవలయును? అట్టిపిశాచపునవ్వులు, మొనలియేడ్పులు, రాక్షసచేష్టలు గలుగు సందిగ్ధమనుజజన్మములకుఁ బితామహులము, వృద్ధప్రపితామహులము మన మేల కావల యును?

మర్యాద కొఱకు మహనీయులు గొంద రిట్లు కల్ల లాడుచుండఁగ మరికొంద రూరక కల్లలాడుచున్నారు. తలుపుతీసి లోనికి వచ్చుచున్న యాతఁ డెవఁడో తెలియక ''యెవరు వా?'' రని యొకఁ డడుగ లోనికి వచ్చుచున్న వాఁడు ''ఎవ్వరు లే'' రని ప్రత్యుత్తర మిచ్చును. ''ఏమిటి వ్రాయుచున్నా?''వని యొకనిని మన మడుగ ''నేమియు లే'' దని ప్రత్యుత్తర మిచ్చును. ఇటులే ''ఏమి చేయుచున్నావు?'' అను ప్రశ్నమున ''కేమి లే'' దను నుత్తరము వచ్చును. ''బయలుదేరినవాఁడవు తీర వెళ్లక తిరిగి వచ్చితి వేల?'' యనుప్రశ్నకు ''నేమియు లేదు, ఊరకే'' యను నుత్తరము వచ్చును. ఇటు లెన్ని దృష్టాంతములు చెప్పవలయును? పోనీ! అడిగిన ప్రశ్నమున కుత్తర మేదైన రహస్య మేమో దానిని జెప్పుట కిష్టముకాక ''యేమియు లే'' దనుచున్నాఁడేమో యని యూహించుకొంద మన్న నట్టిరహస్య మేమియుఁగూడ లేదు. ప్రత్యుత్తరము చెప్పుట చాలాసేపు పట్టునేమో యనుకొనిన నదియుఁ గాదు. ప్రశ్నించువానికైఁ జెప్పు వానికి శత్రుత్వ మేమో యని యూహింప నదియు లేదు. అట్టిచోఁ బ్రశ్నమునకే తఱుచుగ నవకాశ ముండదు. కారణ మేమియు గోచరింపదుకాని యసత్యముమాత్ర మాతఁడు పలుకుట సత్యము. విసుగుఁద లయో నోరు నొప్పియో మరియే హేతువో తెలిసికొనఁగోరి యాతనినే యడుగ ''నేమియు లే'' దని యాతఁడు చెప్పును. ఆతనికిఁ గూడ దెలియని కారణమేదైన నుండునేమో! స్థూలదృష్టిచేఁ బరికింపఁగ మాత్రము వృథగ నిట్టిపను లసత్యమాడునట్లు కనఁబడుచున్నవి. నాయనలారా! చెప్పవలసిన యంశములు ముం దుపన్యాసమునఁ జెప్పెదను.

45. మూఁడు

చాలా చిన్న అంకెగా కనిపించే ఈ 'మూడు'తో మతంతో, ప్రకృతితో, మనోవాక్కాయ కర్మలతో వున్న సంబంధం ఏమో జంఘాల శాస్త్రి ఈ ఉపన్యాసంలో వివరిస్తున్నాడు.

హిందూ, క్రైస్తవ, బౌద్ధ మతాలతో 'మూడు' తత్త్వాల బంధాన్ని విస్తరిస్తున్నాడు. దాదాపు అన్ని నాగరక భాషల్లోనూ 'మూడు' ఏక రూపంతోనే (అంకె) వుంటుంది. సున్న నిర్గుణ పరబ్రహ్మని తెలిపితే 'మూడు' సగుణ సృష్టిని తెలియజేస్తుందంటున్నాడు.

సృష్టిలో ప్రతి వస్తువు కూడా స్థూల దృష్టిని ప్రకృతి చేత మూడు విభాగాలుగా విభజించబడినట్లు కనిపిస్తుందంటాడు. ఇలా చెప్పుకుంటూ పోయేదంతా ఎక్కువ భాగం భౌతిక సంబంధంగానే చెప్పాడు. మనో విద్య గురించి, ఆత్మ విద్య గురించి కూడా చెప్పాలనే కోరిక వ్యక్తం చేసి– జంఘాల శాస్త్రి ముగించాడు.

జంఘాలశాస్త్రి ఇట్లు పలికెను.

నాయనలారా! నా కిదినమున గొంపభారము హెచ్చుగా నున్నది. గొంతు స్వాధీనము కాకుండనున్నది. చెప్పదలచినవిషయము మతవిద్య. మీలో ననేకుల కది రోతపుట్టించుమనినే నెరుఁగుదును. అయినను, గార్యక్రమమును వ్యతిరేకింప వీలులేదు. అందుచే జెప్పుచున్నాను. నే నెప్పుడు పైనిచెప్పజాలనో యప్పుడు మానివేయుదును. అందులకు నన్ను క్షమింపవలయును.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులను మూర్తులు ముగ్గురు. స్వర్గ మర్త్యపాతాళములను లోకములు మూఁడు. సత్వరజ స్తమస్సులను గుణములు మూఁడు. లోహములు నుద్భిజ్జ ములు ప్రాణములను ప్రపంచ వస్తుస్థూలవిభాగములు మూఁడు. కఠినములు ద్రవములు వాయువులన పదార్థస్థితులు మూఁడు. వేదములు మూఁడు. గాయత్రికిఁ బ్రచురములగు పాదములు మూఁడు. మూఁడను సంఖ్యతోడనే సర్వ ప్రపంచసృష్టి యారంభము. ప్రపంచ మంతయును మూఁటిమయము. ఈ సంఖ్యాసంబంధమగు నాధిక్యమును సర్వదేశముల నుండు సర్వజాతుల వారు సమగ్రముగానో యసంపూర్తిగానో గ్రహించిరని చెప్పవచ్చును. క్రైస్తవమతము వ్యాపించిన పశ్చిమదేశములం దంతటను నీసంఖ్యా మాహాత్మ్యము తన్మతము

నకు మూలాధారమై యున్నది. God the Father, God the Son, God the Holy Ghost. అనునది క్రైస్తవ మతమునకు బీజమేకాక యామతవిభాగములం దంతటను ముత్తెముల లోని గుణమువలె వ్యాపించి ప్రకాశించుచున్నది. ప్రపంచము నందలి యైదుగురుజనులలో నిద్దఱవఁటకు నవ్యాహతముగా వ్యాపించిన బుద్ధమతమందు–వేదప్రమాణము తృణప్రాయముగా నిరసించిన బుద్ధ మతమందు–కేవలనాస్తికమును నిర్ణయింపనప్పటికి భగవత్తత్త్వమును గూర్చి సందేహము మూకీభావము నిర్లక్ష్యము వహించిన బుద్ధమతమందు–గూడఁ ద్రిపీఠక నంజ్ఞచే నేతత్సంఖ్యాప్రభావము సమంజసముగా నంగీకరింపఁబడినది. ప్రపంచముననుండు నన్నిదేశములలో వేలపుఁబాటలలో మూఁడవసారికంటెఁ బైసారిలేదు. పరమార్థమును నిర్ణయించుటలో–సంపూర్ణ నిశ్చితాంశమును వెల్లడించుటలోఁ–బరమసిద్ధాంత ప్రకటనములో 'నిది మమ్మాటికి నత్య' మని జను లందురు. అన్నిటికంటె వింత యేమనఁగా దాదాపుగా నన్ని నాగరకభాషలలోఁగూడ మూఁడనుసంఖ్య కొక్కటియే రూపము. అన్ని భాషలలోఁగూడ నున్న యేకాకారమున నున్నట్లే ఈ సంఖ్య కూడ నేకరూపమై యున్నది. నున్న నిర్గుణపరబ్రహ్మమును దెలుపును. మూఁడు నగుణసృష్టిని దెలుపును. శివాలయమునఁ ద్రిశూలము. వైదికునిమొగమునఁ ద్రిపుండ్రము. వైష్ణవుని మొగమున మూఁడు పట్టినామములు. త్రిదినోపనయన వ్రతదీక్ష. త్రిరాత్రగర్భాధానదీక్ష–ఇటు లెన్ని చెప్పఁగలను? ఇవియన్నియు తృతీయసంఖ్యా ముఖ్యబోధనార్థకములైయున్నవి. కాళిదాసుఁడీసంఖ్యాగౌరవార్థమే మూఁడు కావ్యములు మూఁడునాటకములు రచియించియుండును.

ఇఁక సృష్టిలోఁ బ్రతివస్తువుకూడ స్థూలదృష్టిని మూఁడు విభాగములుగాఁ బ్రకృతిచే తనే విభజింపఁబడియున్నట్లున్నది. భూమిలో నున్న మూలము–దానిపైనున్న స్కంధము –దానిమీఁదనున్న శాఖాపత్రసంఘము–నివి మూఁడు వృక్షవిభాగములు. పైత్వక్కు–దానిలోని గుంజు–దానిలోపలనున్న బీజము–ఈమూఁడును ఫలవిభాగములు. పైనున్న పత్రసంపుటము, దానినడుమనుండు గిన్నె, దానిలోనున్న కేసరపరాగ పాంసులమగు తేనె–ఈమూఁడును బుష్పవిభాగములు. తేజోభాగము, మధ్యభాగము, నిస్తేజస్కము –ఈమూఁడు నగ్నిజ్వాలలోని విభాగములు. జంతువుకూడ విభాగత్రయవిభాజ్యమైయున్నట్లు స్పష్టముగఁ దెలియుచున్నది. తల, మొండెము–అధోభాగము Extremities ఈ మూఁడును జంతువిభాగములు. జంతుజాలమున మరియొక విచిత్రభాగమున్నది. స్థూలశరీరము సూక్ష్మశరీరము–కారణశరీర–మని పరిజ్ఞాతలు వానికి నామకరణ మొనర్చియున్నారు. స్థూలశరీర మనఁగా కరపాదాద్యవయవభాసురమగు పై శరీరము. సూక్ష్మశరీర మనఁగా మనస్సు, తత్సంబంధ సన్నిపాతమంతయు,–కారణశరీరమనఁగా జీవాత్మ.

వెలుతురు గాలి తగులనిచెట్టు శీఘ్రముగా నెండిపోవును. త్రిప్పకున్నయెడల గడియారము పాడగును. కాలికొఁది దిరుగని యావుపాలు క్రమముగా క్షీణించుటయేకాక యార్గ్యప్రదమై యుండవు. కఠినపదార్థములునమలకుండ భద్రముగాఁ గాపాడుకొనిన దంతములు శీఘ్రముగా నూడిపోవును. కదలకుండ మెదలకుండ నిశ్శ్రమముగ జీవించునరుఁడు దుర్బలుఁడై పోవును. తఱుచుగ నూపిరి పోయని తిత్తి బాగుగ సాగక ముడుచుకొని వేగ శిథిలమగును. దినదినమును పరామర్శింపని కేశపాశము త్వరలోఁ బలుచఁబడును. ఒకవిధమగు కదలిక–వస్తుపరమాణువులలో నొకవిధమగు సంఘర్షణము, వస్తుపుష్టికిఁ దేజమునకు చిరస్థాయిత్వమునకు గారణము. దున్నినఁగాని భూమి ఫలింపదు. గాలిలోని యాందోళన

మువలనఁగాని రోగకారకసూక్ష్మజంతు వినాశము కానేరదు. నిత్యసంచలనమువలననే గ్రహము లింతకాలము వఱకు నిల్చియున్నవని చెప్పవచ్చును.

అభ్యాయామములేని దేహ మభివృద్ధి నొందనేరదు. అధిక బలాన్వితమై యుండనేరదు. ఆయుస్సమన్వితమై నిలువయుండనేరదు. ఇంటిలోఁ బ్రాఁచిపని మొదలగునవి చేసికొనవలసిన యాఁడుదాని మృదులములగు నఱచేతులు సాధనమునఁ గఠినములై బలాన్వితములై గృహకార్యరచనాక్షములై యుండును. సుత్తెతోఁ బనిచేయు కంసాలివాని కుడిచేయి యెడమచేయికంటె దృఢతరముగా నుండును. నమ్మోటను గొట్టు కమ్మరవారి రెండుచేతులు కాళులకంటె బలిష్ఠములై యుండును. సైకిలు ద్రొక్కువారి కాళులు కుట్టుయంత్రమును ద్రొక్కువాని కాళులు చేతులకంటె శక్తియుక్తములై యుండును. ప్రత్యేకావయవసాధనము తదవయవమాత్ర బలిష్ఠముతోడనే పరిసమాప్తిఁ జెందును. అది సంపూర్ణదృఢిమ కానేరదు. అత్తరువుచేయు వృత్తిగల వాని నాసిక ఘ్రాణశక్త్యధికతానమన్వితమై యుండును. గడియారములు బాగుచేయువాని శ్రవణేంద్రియము పటిష్ఠమై యుండును. చిత్రకారుని నయనేంద్రియ మత్యంతనిశితమై యుండును. భోజనప్రియుని నాలుక తత్సంబంధములగు నరముల బింకముచేత రుచిగ్రహణపారీణమై యుండును. మహావక్త కంఠనాళము సంతత సాధన సంపత్తిచే సమంచితశక్తి సమన్వితమై యుండును.

ఈసాధనము సాధనము కాదు. ఈశక్తి శక్తి కాదు. ఈవృద్ధి వృద్ధికాదు. ఇది యసంపూర్ణ తాదోషభూయిష్ఠమగుటచే నసందర్భము, అనర్థము. బోదకాళ్లు బలహేతుకములా? జలోదరము బలిష్ఠతాంకమా? కంతి బలుపా? కరచరణాద్యవయవము లన్నిటికి సమానమైన, సంపూర్ణమైన, సమంజసమైన సాధన ముండవలయును. అప్పుడు గాత్రము ఘనశక్తిమంతమని చెప్పవచ్చును. దేహసాధనమును గూర్చి యనేకపద్ధతులు బుద్ధిమంతులు ప్రాసియున్నారు కాని దాదాపుగా నవియన్నియు నస్వభావములు. అందుచే ప్రాయికముగ నపాయకరములు. ఈతవంటి సాధనము పరుగువంటి సాధనము–సర్వావయవశక్తి సంపాదనమునకు మూఁడవది కానిపింపదు. కరచరణాదులకేకాక ఆంతరకోశములకుఁగూడ సమర్థమైన శక్తి నమకూర్చును.

ఆంతరకోశములు బాహ్యావయవములకంటె మృదులతరములు. కోశము మృదులతర మగుకొలఁది నెక్కువశ్రమము సహించును. చేయి సహింపలేని యుష్ణతీర్థమును జిహ్వ సులభముగా సహింపఁగలదు. చేతులు కొంకులుదేరు మంచుగడ్డకు నోరు జంకదు. వెల్లుల్లిపాయలు నావాలు కలిపి వేసినముద్దను పైకి రాయ నొడలు పొక్కి పుండగను. అదియే కడుపులోనికిఁ బోయినయెడల గప్‌చిప్. ముక్కులోఁ బరాగపరమాణు వొకటి ప్రవేశించిన యెడలఁ దుమ్ము లధికమగును. ముక్కుఱము లెర్రబడి వాచును. కాని లోన నెడుగుచున్న రాలను బ్రేగులు నిశ్శబ్దముగా సహించుకొనును. బాహ్యావయవయములకున్న సహనశక్తి కంటె నాంతరకోశముల కెక్కువయున్న ట్లగపడుచున్నది. అందుచే నాంతరకోశము లెక్కువకాలము నిల్చును. కన్నులు పూర్తిగఁ దమపనిని వార్థకమున మానుకొనవు. కాని కన్బుబుస్సులను వాయుకోశము లట్లు మానుకొనవు. చెవులలోనుండు పొర లదరక నిల్చిపోవచ్చును. కాని హృదయభాగముల నడుమనుండు ద్వారములు క్రిందిపైపునకుఁ దెఱవక యాగవు. పక్షవాతముచేఁ గాళ్లు సేతులు గదలవు. కాని కడుపులోఁ బ్రేగులు కదలక మానవు. ఇంకను మనోవిద్యనుగూర్చి యాత్మవిద్యనుగూర్చి చెప్ప నుద్దేశించితిని. కాని తల నొచ్చుచున్నది. నే నింకఁ జెప్పఁజాలను క్షమింపుఁడు.

46. తృష్ణ

జంఘాల శాస్త్రి ఇవాళ తన ఉపన్యాసానికి ఎంచుకున్న ఇతివృత్తం 'తృష్ణ'. తెలుగులో చెప్పాలంటే 'దాహం'. ఈ మాటకి భౌతికమైన అర్థంలో కాకుండా ఆధ్యాత్మికమైన అర్థంలో వ్యాఖ్యానించాలంటే ''తృప్తి లేకపోవడం'' అని చెప్పాలి. ఈ లక్షణం ఏ చిన్న దశనుంచి మొగ్గ వెయ్యడం ప్రారంభించి, ఏ దశకు చేరి ఏ ఫలాలనిస్తుందో, శాస్త్రి ఈ ప్రసంగంలో వివరంగా చెప్పాడు. గంజి త్రాగేవాడు సజ్జ కూడుకి, అది దక్కినవాడు వరి అన్నానికి, అదీ దక్కినవాడు మరింత సున్నితమైన సన్నాల అన్నానికి, వాంఛిస్తాడు. రకరకాల భక్ష్య, చోష్య, లేహ్యాలను కోరతాడు. ఆమీద అడ్డాకు విస్తరి అసంతృప్తి కలిగించి వెండి ఆకు, వెండి గిన్నె మీదకు మనస్సు పోతుంది.

బ్రహ్మచారి బ్రహ్మచారిగా బ్రతకవచ్చు గదా! బ్రహ్మచర్యవ్రతం గొప్పది గదా! అహా, పెళ్ళికావాలి. ఆపైన పిల్లలు కావాలి, వ్యసనాలు కావాలి. ఆ పిల్లలకి పిల్లల కోసం బాల్య వివాహాలు చెయ్యాలి – ఇలా ఈ 'తృష్ణ' అనేది ప్రపంచం అంతా పలురీతులలో వ్యాపించి వుంది. దీనిని నిర్మూలించ నిదే సుఖం లేదు. తృష్ణని నిర్మూలించాలనే తపన అన్ని దేశాలలో, అన్ని జాతుల్లో మత గ్రంథాలూ ఘోషిస్తూనే వున్నాయి.

మనకు నిర్దిష్టమైన నైతిక కర్మలన్నీ ఈ తృష్ణా సంహారం కోసమే. గయలో విడువవలసిన తృష్ణ కాని, కూరగాయలు కావు.

సారాంశం ఏమంటే – గయకు పోయి, అది విడిచాం, ఇది విడిచాం అని డంబాలు పలికేవారిని సూటి ప్రశ్నగా 'తృష్ణను విడిచావా?' అని జంఘాల శాస్త్రి అడుగుతున్నాడు.

నేను సభాభవనమునకుఁ బోవునరికి జంఘాలశాస్త్రి యుపన్యాస మారంభించినాఁడు. అదివఱ కొక్క పావుగంటనుండి యేదియో చెప్పుచున్నాఁడు. నేను సభఁ జేరినదిమొద లాతఁ డిట్లు చెప్పఁ దొడఁగెను:–

''అది చాలదేమి? ఉహుఁ. సందెబిచ్చ మెత్తి సంపాదించుకొనిన గంజితోఁ గడుపు గిర్రున నిండి బేరని త్రేపువచ్చి క్షుద్బాధ తీరి సుఖము చేకూరుచుండఁగా నేకాకియైన భిక్షుకున కది పనికిరాదేమి? దానితో నాతఁడు సంతుష్టినొందియుండరాదేమి? ఇతర

బాధలేవియు లేవు. సంతానము లేదు. సంసారము లేదు. పోఁదగినవస్తువు గంజికుండయుఁ గౌపీనము దప్ప తనయొద్ద యరేదియును లేదే–అట్టిస్థితిలో నే చింతయును బెట్టుకొనక యేయాసకును లోనుగాక హరినామస్మరణ మొనర్చుకొనుచుఁ దాను సుఖముగ నుండ రాదా? ఉహుఉ. ఏదీ! మనుజున కామాత్రపు మనశ్శాంతి యేదీ? 'గంజిబదులు పట్టెడు సజ్జకూడు దొరకినయెడల మహాదృష్టవంతుఁడ నగుదును గదా! సజ్జయన్నము దినుచున్న మహానుభావులెంత యదృష్టవంతులో! అంతభాగ్యము నాకు లేకపోయెనుగదా!' అని లోలోన నుడుకుచు నేడ్చుచు నక్కఱఁ దీర్చుచు గాపాడుచున్న నిక్షేపమువంటి గంజిపై నసహ్యత కలిగి తనకు సిద్ధింపని సజ్జమెతుకులపై సకల బాధ లాతఁడు పడునుగదా? గంజికంటె నన్నము బలకరమని దానిని వదలి దీని నపేక్షించుచున్నాడా–కాదు–గంజి తన కున్నదనుట చేత దానియందసహ్యత–సజ్జయన్నము తనకు లేకపోవుటచేత దానియందు వాంఛ–ఇంతే –సరే. కష్టపడి సజ్జయన్నము దాను తెచ్చుకొన్న పిమ్మట నంతటితోఁ దృష్ణశాంతించునా? –శాంతింపదు. ''ఆహాహా! వరియన్నమున కున్న సొగసు, మృదుత్వము, రుచి సజ్జయన్న మున కెట్లు వచ్చును? ఆయన్న మెంత భాగ్యవంతులకో కాని లభించునా? ఇతరు లాయన్నము దినుచుండ నేను మాత్ర మీయన్నముఁ దిననేల? వరి యన్నముదొరకనియెడలఁ బస్తైననుందునుగాని, ఆనిర్భాగ్యపుసజ్జ కూఁడుఁ దిన నని నిర్ణయ మొనర్చుకొని, యున్నదానిని విడిచి, లేనిదానికై యెంత బాధలైనఁ బడునుగదా –కష్టపడిపడి, దైన్యపడిపడి తుదకు వరి యన్నమును సంపాదించుకొని, యొక్కపూట తిని, రెండవపూటనుండియే ''పెద్దవరి–మోటజాతిది–పాదుషాభోగములకున్న పసందు వీని కెట్లు వచ్చును? విస్తరిలోఁ బెట్టుసరికి–అన్నము మిలమిలలాడుచు, జిలజిల లాడుచుండని యెడల నింక సొగసేమున్నది? కంటి కానినప్పుడుకదా కడుపునకు నిండు–ఏమో–విధిలేక తినుటకాని మరి యేమున్నది? పిషాణములు దొఱుకకపోయిన పిమ్మట పాషాణప్రయోగము లచే బ్రదుకంతము నొందించినఁ గొంత మంచిదని, పడరాని బాధలు, పలుకరాని బాధలు పడునుగదా–అన్నము, విస్తరిలో మిలమిలలాడుట తనకుఁ గావలసినదా కడుపునిండుట కావలసినదా? గంజి త్రాగినప్పుడు కడుపు నిండినది. సజ్జయన్నముతోడను నిండినది. వరియన్నముతోడను నిండినది. కాని యాతని తృష్ణమాత్రము నిండలేదు. అందుచే దాని పైదానికొఱకు దేవులాడక తప్పదు–సన్నయన్నముకూడ లభించినది–అంతటితోఁ దాను సంతుష్టినొందునా?–ఉహు, దానిలోనికి మర్రి యూడలవంటి యావుపాలు మిసిమిగల మీఁగడ, బూరసు పంచదార కావలసివచ్చును. అవియును జేకూరినయెడల తృష్ణయెప్పటి కైన శాంతింప వచ్చునా? అబ్బే!' అడ్డాకువిస్తరిలో దిను దరిద్రత వదలలేదే–వెండియాకు వెండిగిన్నెలు లేకున్న యెడల నిఁక భోజనమేమి?' అని వెండికొఱకేడ్చును–వెండియే యేడ్చి యేడ్చి యది లభించినపిమ్మట బంగారపు టేడ్పునకై తిరుగ గొంతుబొంగు సవరించుకొనును.

''మానిసికి నున్న దేదైన లేనిదగును
లేనిదే యుండఁదగినది, లేనిదాని
కేడ్వఁదగినది యుండి లే కేడ్పు, లేక
లేక యేడుపె బ్రతుకగు లోకమందు.''

దృఢశరీరియై, బ్రహ్మతేజస్సంపన్నుఁడై, సర్వస్వాతంత్ర్య సంయుక్తుఁడై, సంసారవ్యథాదూరుఁడై, సత్యప్రవర్తన సహితుఁడై సౌఖ్యపడవలసిన బ్రహ్మచారి 'పరిణయమో– పరిణయమో' యని పలవించి, పలవించి బాధపడునుగదా. ఉన్న మాన్యము లూడిననరే– చదువుచున్న విద్య నమసిన నరే, స్వాతంత్ర్యమంతయుఁ జచ్చిననరే, ఋణదాతల కత్తులు కంఠమునఁ బడుచున్ననరే మరి యింక నేమి సంభవింపనున్న నరేకాని, యీ రెండుముళ్లుమాత్రము పడితీరవలయును. ఒకయింటి యాఁడు దాను గావలయును. అంతవఱ కొక్కఁటే తహతహ, పెండ్లి యైనవా రెందులకుఁ బెండ్లియాడితిమా యని యీలెంప యీలెంపఁ గొట్టికొనుచు నేడ్చుచుండ నీఁడు పెండ్లియైనఁగాని బ్రదుకెందుల కని పరితపించును. గృహస్థాశ్రమబాధ లన్నియు నాఁడు కన్నులారఁ జూచు చుండియుఁ దానుమాత్ర మట్టిబాధలకు లోనుగాకుండ గృహస్థాశ్రమమున వర్తింపఁగలనని నమ్మియుండును. చేతికరదండములు బుద్ధిపూర్వకముగ వైచుకొనువాఁ డుండునా? సౌఖ్యము నపేక్షించి కాళులు బొండలో దూర్చుకొనువాఁ డుండునా? జ్ఞానముచేఁ, దపస్సుచే, నింద్రియ నిగ్రహముచే, భక్తిబోధనాదులచే, చిత్తగాత్రశక్తులచే ప్రపంచమునుద్ధరించినవారు తఱుచుగా బ్రహ్మచారులేకదా! లోకోద్ధరణమున కిట్టియవకాశమున్న బ్రహ్మచారి, మూఢుఁడై లొడిలెడు సంసారములో గుడుగుడుగుంచములాడఁ బ్రయత్నింపవచ్చునా? జంఝూటపు తగ్గినకొలఁది, సౌఖ్యము హెచ్చనియెఱిఁగియుండియుఁ గన్నులు డెఱచి కష్టపరంపర కూపమునఁ బడనేల? ఉన్న బ్రహ్మచర్యాశ్రమములోని సుఖములు మన్ననలె నగపడుటచేత– లేని గృహస్థాశ్రములోని సుఖములు మణులవలె దూరములనుండి కానఁబడుటచేత,–ఉన్నదేదో అది యెంత మంచిదైన నరే పనికిరాదు. లేనిదేదో అదియే కావలయును. సరే–పెద్ద లార్జించిన యీనామును రెండు జనపనారసంచులలోఁ బోసి, మూఁటులకు ద్రాళ్లు బిగించినాఁడు. ఒక్కసంచి మామగారి యెడలోఁ బెట్టినాడు– వేరొక్క సంచిని గోమటి గల్లాపెట్టెలోఁ గొంత, వేశ్యలపైటకొంగులలోఁ గొంత, మంగళ్లడోళ్లగవిసెనలలోఁ గొంత, బంధువుల కడుపులలోఁ గొంత, మింటివెన్నముద్దలలోఁ గొంత, కుక్కలనోళ్లలోఁ గొంత ద్రిమ్మరించి, బ్రహ్మచర్యాశ్రమమునకుఁ బరశురామప్రీతి యొనర్చి, కన్యాకంఠమున మంగళసూత్రమును ముడివైచును. ఈముడి తనగొంతునకు– తనచేతులకు– తనకాళులకు–తనచిత్తమునకు– సరే –వివాహమైనది సంతోషమే. ఆలాగున నిద్దఱు గువ్వపిట్టలలాగున గులుకుచు సుఖమున నుండరాదా? సతియో– సతియో యని నెత్తినోరుకొట్టికొనినాఁడు. ఇక్కడికి సతి వచ్చినది. ఇఁక గావలసినదేదియు నగపడదే–అగపడకేమి? పిల్లలో? మాన్యములను విడుదలచేసికొని పెండ్లి చేసికోవచ్చును. కాని దేనిని విడుదలచేసికొని పిల్లలఁ గనవచ్చును? మదనకామేశ్వరమును ప్రింగుచున్నాఁడు. మర్దనములు చేయుచున్నాఁడు. వేంకటేశ్వరులకు మ్రొక్కుచున్నాఁడు. భార్యచే నాంజనేయప్రదక్షిణములు చేయించుచున్నాఁడు. ఎఱుకమ్మో యనిపచ్చి దొంగ చెవిటిముండల మీఁదను పరమపదించిన తల్లిగారి ప్రాఁతకోకలను గప్పుచున్నాఁడు. నూనెగుడ్డలవానిని శకునము లడిగించుచున్నాఁడు. నాగులపంచెను దాను గట్టుకొనుచున్నాఁడు. కూనలమ్మ కోకను భార్యచేఁ గట్టించుచున్నాఁడు. ఆసుపత్రులలో Adjustment కొఱ కామెనుంచి ఋణపత్రములు వ్రాసి దొరసానులకు నైవేద్యములను బెట్టుచున్నాఁడు. నెలదాటి మూఁడుదినము లగుసరి కుప్పొంగిపోవుచున్నాఁడు. తిరుగ మామూలుదారియే యగునెడల తల నేలఁ గొట్టుకొనుచున్నాఁడు. చాల పిల్లలగనిన

మునలిముత్తైదువలసేవ. నిల్లాలిచేఁ జేయించుచున్నాఁడు–సుందరకాండ నప్తసర్గదీక్షతో
జదువుచున్నాఁడు. ఋతుస్నాత యైనవెంటనే, పరగడుపున పొరుగింటి చంటిపిల్లన
జూడుమని భార్యను ప్రోత్సహించుచున్నాఁడు. ఇంక నేమేమో చేయుచున్నాఁడు– చేయు
చుచున్నాఁడు. పిల్లలు పుట్టి చచ్చుటచే పిల్లలరోగములచే దుర్గుణములచే నప్రయోజకతలచే
నెందరో తల్లిదండ్రు లేడ్చుచుండ నీతఁ డిట్లేడ్చుచున్నాఁడు–తుదకు యోగియిచ్చిన
రాగిమురుగుచేతనో, యెఱకత భార్యకాలికిఁ గట్టిన ముళ్లదారము చేతనో, పరమహంసగాఁ
చేతి చలువచేతనో, ఆతంకనిగ్రహమాత్రముల మూలముననో అమ్మగారికి నెలదప్పినది
కొడుకు కలిగినాఁడు. అంతటితో సంతుష్టినందవచ్చునా–ఉహు. శీఘ్రముగా మనుమలెత్తెడ
తొందరచే పదునాలుగేండ్ల కొడుకునకు పండ్రెండేండ్ల కన్యక నంటఁగట్టి పడరానిపాటులఁ
పడును. ఆత్మసుఖముకొఱకైన తృష్ణయే యిట్టివింతచర్యకు ముఖ్యకారణముగాఁ గనఁబడ
చున్నది. తృష్ణయే జగద్వ్యాప్తమై యందఱను బాధించుచున్నదికదా!

గీ. ఉర్వీపతికత్తిఁ దృష్ణ–ఉద్యోగి కనుపఁ
బుడకఁదృష్ణ, నైశ్యుని త్రాసుముంటఁ దృష్ణ
కాంతయొడిఁ దృష్ణ–మేడితోకకొనఁ దృష్ణ
బ్రాహ్మణుని రోమరోమకూపములఁ దృష్ణ

ఈతృష్ణయే సర్వవ్యధాజాలమున కాదికారణమైయున్నది. దీనిని
నిర్మూలనమొనర్చినఁగాని సుఖము లేదు. తాత్కాలికముగా శాంతి పఱచినకొలఁది నిది
యభివృద్ధి నొందునుగాని యడఁగిపోదు.

గీ. ఇచ్చుకొలఁది భిక్షుకునేడ్పు హెచ్చిపోవు
మెత్తబఱచుకొలఁది మొండినెత్తికెక్కు
నోట నార్పుకొలఁది మంట మేటి యగును
గుగ్గిలపుజిడ్డు కడగినకొలఁది సాగు
ముడుచుకొనుకొలఁదిని జలి పొడువుగాంచు
విసరుకొలఁదిని గ్రీష్మము కనమసంగు
నుడుకునీళ్లు వోయుకొలఁది జిడుము విరియు
గొరుగుకొలఁదిని వెండ్రుకల్ గరుసుదేరు
నొత్తుకొలఁది, గాళులతీఁపు లురవుగాంచుఁ
ద్రాగుకొలఁదిని జ్వరభవతాప మెదుగు
గడలు ద్రొక్కుకొలఁది గప్ప గంతు లెగయు
నడచినకొలంది మిటమిటలాడు తృష్ణ

ఈతృష్ణనే నిర్మూలింపవలసినదని అన్ని దేశములలోని అన్ని జాతులలోని అన్ని
మతములలోని యుద్గ్రంథములు ఘోషించుచున్నవి. మనవారు తృష్ణానిర్మూలనమునకు
యోగాభ్యాసాదిసాధనము లనేకములు బోధించియున్నారు. తెల్లవాఱకుండ నిద్రలేచినది
మొదలు రాత్రి తిరుగ నిద్రించువఱకుఁ జేయఁదగిన వైదికకర్మము లన్నియు తృష్ణా
సంహారమున కేర్పడినవే. స్నానము సంధ్యావందనము పితృదేవారాధనము అతిథిపూజ,
యోగాభ్యానము, పురాణశ్రవణము, సగుణ నిర్గుణ ధ్యానమును మాని గయఁబోయి

కాకరకాయ విడిచినందువలనఁ దరించితి ననుచున్నావా? గయలో విడువవలసినది తృష్ణకాని కాకరకాయ కాదు. కర్మఫలాభినంధి కాని కామంచిపండు కాదు.

గయలోనే యేల విడువవలయు నని యందురేమో? పవిత్ర గయాక్షేత్రములోనే విడువలేనివాఁడవు పడుకగదిలో విడువఁగలవు కాఁబోలు నేమి? ఎక్కఁడ విడిచినను మంచిదే. సంసారములో సంచరించుచు నింటిలో నున్నంతకాలము మనస్సునకు శాంతి కుదురదు. కన్నపిల్లవాని జ్వరపుమూలుగు చెవినిపడుచుండగా ముక్కు మూసికొని సంధ్యావందనమైన నాచరింపఁగలవా? గాయత్రీమంత్రజప మొనర్చుచుండగా కాకి నేతిగరిటె నెత్తుకపోవున ప్పుడు 'భర్గోదేవస్యధీమహి' యన్న తరువాత 'హోష్' అనకుండ నుండఁగలవా? నేతి నేతివాక్యములు స్మరించు కొనుచు కన్నులు మూసికొనఁగలవు కాని యింటిలో లేదు లేదని పలుకు భార్యపలుకులకుఁ జెవు లెట్లు మూసికొనఁగలవు? సంధ్యావందనాంతమున సవిత్రనామక సూర్యాంతర్గత శ్రీలక్ష్మీనారాయణ ప్రీతిగఁ గర్మమాచరించితి నని స్వనామోచ్చారణదోషము రాకుండఁ జెవులు మూసికొని చెప్పఁగలవు కాని యుల్లిపాయలపులుసులోని పొగపు గమగమ ముక్కుపుటముల జేరకుండ నేమిచేయఁగలవు? అదిగాక, తృష్ణావిసర్జనము ప్రమాణపూర్వకముగాఁజేయఁదగినది. ప్రమాణరచనకు బవిత్రస్థలమే కాని పనికిరాదు. మహావతార సంచార సంబంధముచే, మహానదీప్రవాహ సంబంధముచేఁ బవిత్రమగు పుణ్యక్షేత్రమే ప్రమాణక్రియకుఁ దగినస్థలము. పవిత్రస్థలములలో మతముతోఁ జేరిన పవిత్ర కార్యములే జరుగవలెను. సామాన్యస్థలములలో సామాన్యకృత్యములే చేయవలెను. ఆపవిత్రస్థలములలో నట్టిపనులే చేయవలెను. అలవాటుచొప్పున నీ వాయూపను లాయాస్థలములందేకాని చేయఁ జాలవు కూడను. వంటప్రాయ్యిలో మూత్రవిసర్జనమును చేయఁగలవా? కాంతను గౌగలించుకొని గాయత్రీజప మొనర్పఁగలవా? పవిత్రస్థలమునందే కాక పవిత్రమగు వస్తువును స్పృశించికూడ ప్రమాణ మొనర్పవలెను. మహమ్మదీయులు ఖొరానునంటి ప్రమాణ మొనర్తురు. క్రైస్తవులు బైబిలుతోఁ బ్రమాణమొనర్తురు. భగవద్గీతతోఁగాని శ్రీమద్రామాయణముతోఁగాని మనము ప్రమాణ మొనర్తుము. ప్రమాణమునకుఁ బవిత్రవస్తువులేగాని పనికిరావు. తిరుత్తుళ్లాయితోఁ బ్రమాణ మొనర్పవచ్చును గాని తోలు సంచితోఁ బ్రమాణ మొనర్పఁదగునా? శ్రీమూర్తితోఁ బ్రమాణము సేయందగును గాని 'సిగరెట్టు'తోఁ జేయవచ్చునా? అపవిత్రపువస్తువు అపవిత్రపుటూహలనే రేపును. పవిత్రవస్తువు పవిత్రపుటూహలనే గలుగఁజేయును. భస్మావలేపనము, రుద్రాక్షమాలాధారణము, చిత్తశాంతిని శివపూజను బురికొల్పును. బ్రాంది బుడ్డి చెడ్రాగుటలు, వీథిలో జోగుటలు, విర్రవీగుటలు, గుడిసెవ్రేటులపైఁటలు లాగుటలు స్మృతికిఁ దెచ్చును. ఎర్రపంచెలవలనఁ దామసము, నీలిపంచెలవలనఁ గ్రౌర్యము, కాషాయ వస్త్రములవలన విరాగము వృద్ధియగుననుట సత్యమున కెంతమాత్రము దూరము కాదు. తెల్లనివస్త్రము సత్వగుణమును వృద్ధిచేయును. తెల్లనిగుర్రముమాత్రము యిదివఱకు పందెములు గెలిచి యుండలేదు. మల్లెపూవులదండ వేశ్యావీథికి దారిచూపును. తులసిపూసలపేరు వైష్ణవాలయములకు దారిచూపును. అందుచేఁ బ్రమాణ విరచనయందుఁ బవిత్రవస్తువు లావశ్యకములు.

ఇక గయలో విష్ణుపాదమున్నది. ఆర్యావర్తమున సన్యానులై, భక్తులై, జ్ఞానులై, మౌనులై, సత్యబోధులై, మతభాష్యకర్తలైన వారందరు మొదట నావిష్ణుపాదదర్శనమువలన

సంగపరిత్యాగులైనవారే! శంకర, రామానుజ, మాధ్వ, గౌరాంగ, దయానందాదులంద రిట్లయినవారే! ఆమహాక్షేత్రమున మహామహిమనంపన్నమైన విష్ణుపాదమును చేతితో నంటి తృష్ణానిర్మూలన ప్రమాణము చేయఁదగినది. తమవంశమునుండి లోకోత్తర ప్రతిభాశాలి యెవ్వఁడైన బయలుదేరునా యని నిశ్శరీరాత్మలతోఁ జూచుచున్న పితృదేవతల ప్రీతికొఱకు విష్ణుపాదముపై విడుచుచున్న పిండములుచేతితోఁబట్టుకొని పితృదేతార్థమైన యాయన్నముతోఁగూడఁ బ్రమాణము చేయఁ దగినది. కాయాభిమానమును విడువవలసి నది కాని కాయను విడువనక్కఱలేదు. ఫలాభిసంధిని విడువవలయును గాని ఫలమును విడువనక్కఱలేదు. ఈరెండును నీ వెప్పుడు త్రికరణశుద్ధిగా విడిచితివో నీవే యార్యుఁడవు. నీవే మనుజుఁడవు. నీవే జీవన్ముక్తుఁడవు. అంతేకాని యేదో కాయయు నేదోపండును విడిచి గయాదర్శనఫలము దక్కినది. తరించితినని సంతసించుట తప్పు. అదికాక మరియొక్క మాట–ఆరుదొండకాయ, లింగపొట్లకాయ, చేదుబీరకాయవంటి దిక్కుమాలిన కాయలు విడిచినవారే కనఁబడుదురు గాని పనసకాయ, అరటికాయలవంటి కాయలను విడిచినవారు తఱచు గానరారు. అత్తిపండు, గొలుగుపండు, నక్కెఱుపండు, కాటిరేగుపండు మొదలగు పండ్లను వదలినవారేకాని, మామిడిపండు, బత్తాయిపండును విడిచినవారు కానరారుగదా! తృష్ణ విడువలేదు. నరేకాని, దానికిఁ బ్రతినిధిగ నేదో కాయయుఁ బండును విడువఁదలఁచి, దానిలోఁగూడ నధమమైనపని జేయుటా! ఈపని మనకొఱకా? లోకమును మోసపుచ్చు టకా? ఎందున కీకక్కుర్తి? చేయుచున్న యవకతవకపనులు చేయుచున్నట్లే యుండవలెను. పట్టిన మంచినియమములు పట్టినట్లే యుండవలయునా? క్రొత్తకుండ ప్రాఁత తెడ్డునా? పట్టుబట్టకట్టుకొని కాని బ్రాంది త్రావఁ గూడదా? కాయను బండును వదిలితివా? పొగము ట్టను విడువలేవు. కాని పొట్టి కాకరను వదలితివా? వదలి మహాపూతుఁడ నైతినని సంతసించు చున్నావా? చింతకాయ, మిరెప్పుఁబండు వదలిన తొట్టెవైద్యపురోగి కంటె నీవెట్టిఘనుఁడవు? వాని కెంతయుక్తి యేడ్చినదో నకు నంతే. వానికి రోగమైన గుదురునేమో కాని, నీ కదియులేదు. గయకుఁ బోవుట వలన ధనవ్యయము వానికిలేదు. నీకదికూడ సిద్ధించినది. ఆలస్యమైనది క్షమింపవలెను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

47. కాయగూరలను కాశిలోవదలుట

ఈ ప్రసంగం కూడా తృష్ణా నిర్మూలనానికి సంబంధించినదే. అయితే ఈ ప్రసంగం చేసే తీరులో తేడా వుంది.

మన మహారాజు గారికి – ప్రస్తుతం వున్న ఆస్థానం కాక – మరి రెండు ఆస్థానాలు కలిసే అవకాశం వచ్చింది. ఆస్థాన ప్రజలందరూ మహావైభవంగా వేడుకలు చేసుకుంటున్నారు – అనే ఒక వార్తను, నన్నివేశాన్ని ఆధారం చేసుకుని ఇవాళ జంఘాల శాస్త్రి మాట్లాడుతున్నాడు. భాషోపకారికి, దేశోపకారికి, వైభవాలు అభివృద్ధి కావాలని ఏ ప్రజలు కోరుకోరు? అని ప్రశ్నించి – అసలు విషయంలోకి వస్తున్నాడు.

జంఘాల శాస్త్రి ఒక బ్రాహ్మణ మహా సంతర్పణకు వెళ్ళి పంక్తిలో భోజనానికి కూర్చున్నాడు. తన సహజ లక్షణంగా, అక్కడ జేరిన వారి మాటలనీ, చేష్టలనీ పరికించి మనకి వివరిస్తున్నాడు.

ఇక్కడ భోజనం చేస్తూ, ఎక్కడో వున్న ప్రియురాలి జిహ్వా ప్రీతికి అవకాశం కలగలేదని విచారించే వాడొకడు, పదార్థాలను ప్రశంసిస్తూ లొట్టలు వేసేవారు కొందరు, శబ్ద నిర్వచనాలు కోరేవాడొకడు,.... ఇలా రకరకాల వాళ్ళ దర్శనమైంది.

ఈ సంతర్పణలో ఒక గొడవ రేగింది. వడ్డన చేసే మనిషి ఒక మురికినాటి వటుని విస్తట్లో పులుసు వడ్డించాడు. దానిని చూస్తూనే ఆ వటుడు, కోపంతో వీరంగం వేశాడు. మిగిలిన బ్రాహ్మణ్యం అతనికి వత్తాసు పలికి, అతను విస్తరి వదలి లేచిపోతే, తామూ లేచి పోతామన్నారు. ఇంతకీ ఈ రగడ కంతకీ కారణం, ఆ పులుసులో బెండకాయ! బెండకాయను ఆ బ్రాహ్మడు గయలో వదిలేశాడు. ముట్టుకోడు. ఈ మాట ఆధారం చేసుకుని, జంఘాల శాస్త్రి అటువంటి మనుషుల మనస్తత్వాన్ని కడిగి ఎండగట్టాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

మన మహారాజుగారికి మఱియొక యస్థానము మఱి యింక నొక యాస్థానము లభింపఁదగిన యవకాశము సిద్ధించినది. ఆస్థానప్రజలందలు మహావైభవముతో నుత్సవములు చేయుచున్నారు. జయజయధ్వానములు వీథులవెంటఁ, బల్లెలవెంటఁ, బట్టణములవెంట,

వాస్థానమునందంతటనే కాక యాయన నెఱిఁగియున్నంతవఱ కన్నిచోటుల, దేశమునందం తట నాప్రభుని పవిత్రనామముతోఁ బ్రబలుచున్నవి. భాషోపకారికి, దేశోపకారికి నైభవాభివృద్ధి కావలయునని భక్తియుక్తులగు ప్రజలు కోరుకొనరా? అట్టిది సిద్ధించినయెడల మహానంద మొందరా? మహోత్సవములు చేయరా? ధనము గడించి కూడఁబెట్టి యొకరికిఁబెట్టక, తాను తినక, కుక్కవలె దానిని గాచికొని వ్యయమనుమాట మననునందేకాక, నోటియందే కాక, చెవియందుఁగూడఁ బడకుండఁ గాలక్షేపము చేయుచు వట్టి చీపురుకట్టవలె నూడ్చి యూడ్చిప్రోగు చేసి చేసి తుదకుఁ దన్ను దులిపించుకొనిన కృపణాధమునకున్న ధనమం తయు నొక్కసారిపోయినయెడల నంతసింతురేమోకాని వడ్డికి వైవడ్డి కట్టి తప్పులెక్కలు వ్రాసి న్వపరకార్య నిరువయుక్తముగాఁ బొందిన ధనవృద్ధి కెవ్వఁడైన దలఁ గదలించునా! అట్టి యైశ్వర్యవృద్ధి కెవ్వఁడైన నానందించునా? లక్షలకొలఁది వైకము నత్కార్యములకై వినియోగపఱచి, పరకష్ట లేశవార్తనైన వినఁజాలక తదార్తినివారణకై శక్తివంచన లేకుండ నహస్రవిధముల పాటుపడి నత్యదీక్షాదక్షుఁడగు మహీపతి కేమాత్రము లాభము కలిగిననైనను మతిగలిగిన ప్రజలందఱు నంతసింపరా? ఆతని నత్యమే యాతని నంరక్షించుమన్న దని యానందపరవశులై యాతని నెఱిఁగినవారు నెఱుఁగనివారుకూడ నఖిలోత్సవాచరణవిచక్ష ణులై ప్రకాశింపరా? ఓ–ఏమి యూరేగింపులు! ఏమి కోలాహలములు! ఏమి మంగళశాన ములు! ఎన్ని నహస్రరూప్య విక్షేపములు! ఏమి దేవతారాధనలు! ఏమి మంగళగానములు! ఏమి హరికథాకాలక్షేపములు! ఎన్ని నాటకప్రదర్శనములు! అష్టాదశవర్ణముల కెట్టి నంతర్పణ ములు! భక్తిగలిగిన ప్రజలు పరమోత్తముఁడగు ప్రభుని కంతకంటెఁ జేయవలసిన దేమున్నది? అంతకంటె నేమి చేయఁగలరు?

నే నీదినమున నొక బ్రాహ్మణమహానంతర్పణమునకుఁ బోయితిని. నాప్రక్క నొక ముఱికినాటి వైదికబ్రహ్మచారి కూరుచుండి తానుంచుకొనిన దూదేకులది పరమయోగ్యురా లనియు నిప్పుడు శ్రీపార్వతీ పరమేశ్వరులవారి కటాక్షమున గర్భవతిగా నున్నదనియు, వేవిళ్లెక్కువగా నుండుటచేతఁ బుల్లనివస్తువునం దధికప్రీతి కలిగియున్నదనియు నావడలు నానవైచిన పుల్లనిపెరుగు తనవిస్తరిలో తనప్రియురాలి జిహ్వకుఁ దగిలినయెడల నామెకుఁ దనకుఁ బ్రాణ మెంత లేచివచ్చునో యనియు నడుమనడుము విరహదశావశుఁడై గ్రుడ్ల నీరు గ్రుక్కుకొనుచు, నాతో మాటలాడుచుఁ బ్రియకాంతాస్మరణ మొనర్చుకొనుచు భుజించు చుండెను. ఇంతలోఁ 'బులును పులును' అని కేకలు వైచుచు వడ్డించువారు పంక్తులవెంట వడ్డించుచుండిరి. అన్నములోఁ బులును కలుపుకొని 'ఇది ధప్పళము కాదండీ! అమృత మండీ!' యను లొట్టలధ్వనులు సీమటపాకాయలపెట్టె కాల్చి కుండలోఁ బడనైచినట్లు, వడ్డన శాలలందు గట్టి, గుల్ల, తున్న పరిపాకములతో విజృంభించినవి. ఆపంక్తిని గూరుచుం డినవారిలో నేనే పండితుఁడ నగుటచేత, 'ధప్పళ శబ్దమునకు వ్యుత్పత్తి యెట్లయ్యా?' యని నాకెదురుగఁ గూరుచుండి భుజించుచున్న యొక యుపాధ్యాయుఁడు లోకాతీతమైన లొట్ట నొక్కదానిని విడిచి నన్నడిగెను. ధప్పళశబ్ద మపశబ్దమనియు, దప్పుళము నుశబ్దమనియు, 'చప్పళింపఁదగినది' కావున దప్పుళమని దానికి పేరు వచ్చినదనియు, నర్వాశబ్దములకు ధాతువులే మూలములనియు శబ్దశాస్త్రసాహితీ ప్రకటనపటిష్ఠుఁడనై వ్యుత్పత్తినిర్వచన మొనర్చితిని.

ఇంతలో మురికినాటివటుని విస్తరిలోఁ గూడ నమృతరసనీకా శాష్కురనమ్ణ్మాయపా

త్రగ్రాహియగు నొక్కఁడు వచ్చి కొంత ద్రిమ్మరించిపోయెను. 'ఆ! ఆ!! ఆ!!!ఎంతపనిఁ జేసితివయ్యా! ఏమి పెద్ద మనుష్యుఁడవయ్యా! నీకు వచ్చినయేం ద్లైవనికి వచ్చెనయ్యా! నే నెవఁడనో రవంత చూచి వడ్డింపనక్కఱలేదా? ఇంత యొడలు తెలియని తనమా!' యని యాశుద్ధబ్రహ్మచారి గావుకేకలు వైచెను. వడ్డించిన యాభీమావతారము, దర్వీగదాకలిత హస్తుఁడై మహారౌద్రమూర్తియై రణోత్సాహమున నుప్పొంగుటచేఁ గాబోలు కటినలంకరించిన కొల్లాయ కౌపీనము కానంత జారిపోవుచుండ ముఖికినాటివానిపై నేత్రాగ్ని జ్వాలలు పఱపుచు ''ఏమంటివి! ఏమంటివి! నాతప్పేమి?'' యని వీరావేశమున వెఱ్ఱికేకలు వైచుచుఁ దిరుగఁబడెను. ''ఏమంటినా? నావల్లకాదు, నల్లమడుగు.'' అని వినుగుకొనుచు భుక్తిని మాని యుత్తరాపోశనమున కాబ్రహ్మచారి ప్రయత్నించెను. ''పంక్తిలోనుండి మీరు లేవఁగూడదు లేచినయెడల మేము కూడ లేచిపోవుదు'' మని భుజించుచున్న బ్రాహ్మణులంద ఱుద్ఘోషించిరి. నీవు లేవవలసినంతతొందర యేమి కలిగినదని నే నడుగ, పులుసులో నేమి ముక్కలున్నవో చూచి మఱీమాటాడు మని యావటూత్తంసము నన్ను మందలించెను. గుమ్మడికాయ, ములగకాడ, బెండకాయముక్క లున్నవని నే నంటిని. అదిగో! ఆబెండకా యనే, ఆబెండకాయనే, నేను గయలో విడిచిపెట్టితి వని సర్వసంగపరిత్యాగియగు నాపద్బ్ర హ్మచారి గాఢకోపోద్దీపితుఁడై గర్జించెను. 'నీవు బెండకాయ వదలిపెట్టితివో బీరకాయ వదలిపెట్టితివో నాకెట్లు తెలియు' నని మహానసోద్యోగిశిఖామణి కోపమున ఘుర్ఘురించెను. నిజమే, గయలోఁదా నొనర్చిన ఫలశాఖాపరిత్యాగము ప్రపంచమునకుఁ దెలియుటెట్లు? ఇదేమి దేవాలయప్రతిష్ఠయా? వైద్యశాలానిర్మాణమా? దీనశరణాయతన నంస్థాపనమా? మహాగ్రంథరచనమా? కాల్చి కాల్చి పరిత్యజించిన ధూమచ్ఛదకణికా దురభ్యానము సర్వదేశ వ్యాప్తి నొందవలసినదా? నమస్తజనకర్ణకుహరప్రవేశమొనర్ప్రదగినదా? అబ్బ! అబ్బ! బెండకా యను గయలో వదలినాఁడట! ఎంత మహోన్నత పరిత్యాగ మొనర్చినాఁడు! ఎంత యహంభావ నిరాకరణ మొనర్చినాఁడు! ఎంత పరోపకార పారీణుఁడై వెల్గుచున్నాఁడు! ఈమహాకార్యము – ఈదేశోపకారకకృత్యము–ఈమహావైరాగ్య నంపన్నత –ఈనంసారనముద్ర తరణ ప్రభావము–ప్రపంచమున కింకఁ దెలియలేదని, ప్రపంచము గ్రహణశక్తిరహితమనియుఁ గృతఘ్నతాసహితమనియు నిందించు చున్నాఁడా! సెబాస్! బెండకాయ వదలిపెట్టి యెంత గండ డైనాఁడు! ముక్తికాంతాశిరోమణి కెంత మిండఁడైనాఁడు! బెండను వదలిపెట్టఁదగునుగాని ముండను వదలిపెట్టఁదగదు కాఁబోలు! బెండకాయపు లును చేతనంటదగదుగాని పింజారి దాని మోవి నంటఁదగునుగాఁబోలు! వహవ్వా! కాయశుద్ధి, చిత్తశుద్ధి, ఆత్మశుద్ధి నిచ్చునది శాకాపరిత్యాగమే కాని వ్యభిచారపరిత్యాగము కాదుకాఁబోలు! మతమెంత తలక్రిందైనది! అనావశ్యకములగు నాచారముల కెంత యాధిక్యము కలిగినది! ఆవశ్యకములగు మోక్షసాధనముల కెంత యధమత్వము సిద్ధించినది! అనత్యలోలుఁడవై నీ వున్నంతకాల మాబెండకాయ పరిత్యజించిన ఫల మేమున్నది? కాకరకాయను నిస్తరి యొద్దకు రానీదగదుకాని కల్లుపాకలోనే నిత్యనివాసము సేయఁదగును గాఁబోలు! నాయనలారా! నేను బలుకుమాటలు మీకు వినఁబడకుండ వీథిలో నేనుఁగుటం బారి యుత్సవము జరుగుచున్నది. చెప్పవలసిన దింకఁ జాలనున్నది. కాయగూరలను విడిచిపెట్టుటనుగూర్చి ముందుఁ దిరుగఁ జెప్పెదను. క్షమింపుఁడు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

48. క్షురకర్మము

ఇది చిత్రమైన ఉపన్యాసం. విషయం చాలా చిన్నదిగా, కొంత అనవసర ప్రసంగంగా పైకి కనిపించవచ్చును గాని నిజానికి, ఈ చిన్న విషయం వెనక ఇంత కథ వుందా! అని మనం ఆశ్చర్యపోతాం.

క్షురకర్మ అంటే క్షవరం చేయించుకోవడం. దీని గురించి జంఘాల శాస్త్రి ఎందుకు ప్రసంగించవలసి వచ్చిందంటే, సాక్షి సంఘానికి ఒక పాఠకుడొక ఉత్తరం రాశాడు. తిథి, వార, నక్షత్రాలు కుదిరితే క్షవరం చేయించుకోవడం వల్ల ఏమి లాభం? నిజంగా ఆయుష్షు పెరుగుతుందా? జుత్తు పెంచుకుంటే దేశ, కాల, పాత్రానుసారంగా ఏమిటి బాధ? దీన్ని గురించి శాస్త్రం ఏదైనా వుందా?'' – అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్న ఆధారంగా జంఘాల శాస్త్రి ప్రమాణాలలోకి వెళ్లాడు. మొదటి ప్రమాణం దేనికైనా శ్రుతి అన్నాడు. తరవాతవి స్మృతులు, ఆతర వాత శ్రుతి స్మృతులనే ఆధారంగా వెలువడినవి ధర్మశాస్త్రాలు. ఆ తరవాతవి ప్రమాణ గ్రంథాలు. ప్రమాణ గ్రంథమేదీ శ్రుతికి విరుద్ధంగా ఎంత మాత్రం వుండదని చెప్పి– ఈ 'క్షవరం' అనే విషయం గురించి కాలామృత గ్రంథంలో ముహూర్త ముహూర్తాండంలో, ధర్మసింధువులో, నిర్ణయ సింధువులో ఏయే విధి నిషేధాలున్నాయో, మూలంలో ప్రమాణ వాక్యాలు ఉదాహరించి – వివరించాడు. అనలు క్షనరం చేయించుకోవలసిన క్రమాన్ని వరాయతం నుంచి ఉదాహరించాడు. వైద్య శాస్త్రంతో ఈ క్షుర కర్మ విధానానికి ఉన్న సంబంధాన్ని పూర్వులు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించ వద్దన్నాడు శాస్త్రి. వారు శాసకులు (ధర్మ విషయంలో). వింటే విధేయంగా వినండి. లేదా, సొంతంగా ఈ విషయం కూడా పరిశోధించి విధేయులై ఉండండి అని స్పష్టం చేశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! సాక్ష్యుపన్యాసపత్రకులలో నొకరియొద్దనుండి సాక్షికి వచ్చినలేఖ యిదిగో చదివెదను. ఇది యేయూరనుండి వచ్చినదో దాని నెవరు వ్రాసి పంపిరో మేము వెల్లడింపవలసిన యావశ్యకత లేదు. మీకుఁ దెలియవలసిన యావశ్యకత యంతకంటె లేదు.

సాక్షి కార్యస్థానమున కిదివఱకు వచ్చిన లేఖలలోఁ బ్రత్యుత్తరము లర్హములనిమాకుఁ దోఁచినవా నికి సాక్ష్యుపన్యాసములందే ప్రత్యుత్తరము లీయఁబడియుండెను. కావున దీనికిఁ గూడఁ బ్రత్యుత్తర మీయుపన్యాసమునందే యీయఁదలఁచితిని. ముందు లేఖను జదివెదను.

''అయ్యా! నేను మీరు వ్రాసిన సాక్షి యన్నగ్రంథమును పూర్తిగ చదివితిని. చాల సంతోషకరముగ నుండెను. మీసారస్వతానుబంధము మాకు ప్రతిసోమవారము వచ్చుచుం డును. దానినిగూడ చదువుచున్నాము. మీరు కర్మకాండవిషయమై వ్రాయుచు ఆయుష్కర్మ విషయమై తగుమాత్రమువ్రాసితిరి. తిథివారనక్షత్రములు కుదిరినయెడల క్షవరము చేయిం చుకొన్న నేమి లాభము? నిజముగా నాయుర్దాయమును వృద్ధిచేయునా? ఆయుర్దాయము వృద్ధియగునని తోఁచినను దోఁచకపోయినను జుత్తు పెంచుకొన్నందువలన దేశకాలపాత్రాను సారముగా ఏబాధలు కలుగును? దీనినిగురించి శాస్త్ర మేదైననున్నదా? ఉండినదానిని తెలియపఱచుచు అది మన కార్మకాండలో నెందెందు సరిపోవుచున్నదో కర్మకాండను వివరముగా తెలుపుగ్రంథమేదో ఎక్కడకువ్రాసిన మనకు దొరకగలదో దయచేసి మాకు సెలవిచ్చినచో మీసెలవుప్రకారము ఆగ్రంథములను తెప్పించికొని చదివి పూర్వాచారములు మంచివికావని వాదించువారికి చూపించి వారిని ఒప్పింప యత్నించెదను. ఆయుష్కర్మకాండ మేశ్రుతిస్మృతులలో నున్నదో ఉన్నయెడల వైద్యశాస్త్రమునకు దానికి సంబంధము కలదో లేదో తెలుపప్రార్థించుచున్నాను. ఇట్టి శంకలు తమరు నివారణచేసెద రను దృఢనమ్మిక ముతో మీ కీయుత్తరము వ్రాయుటకు చనువుదీసికొన్నందుకు క్షమించకోరుచున్నాను. మాస్నేహితులు కొందఱు మీ సారస్వతానుబంధములో కొన్ని వ్యాసములు వ్రాయుటకు నిశ్చయించి–నాయనలారా! తరువాత నేవియో నాలుగక్షరములున్నవి. విస్పష్టముగాఁ దెలి యకుండ నున్నవి. అటుపైని–తెలుపగోరుచున్నాను. చిత్తగించవలెను.''

ఈలేఖను వింటిరా? ఇది యొక పూర్వాచారాభిమాని వ్రాసినట్లు తోఁచుచున్నది. నే నిందుపైఁ జెప్పవలసిన దేదో సాధ్యమగునంతవఱకు సంగ్రహముగాఁ జెప్పఁ బ్రయత్నించె దను. శ్రద్ధతో మాత్రము వినఁగోరెదరు. విసుఁగు పుట్టించు విషయమగుటచే నట్లు చెప్పవలసివచ్చినది. ఉపన్యాసమునకు శాంతిఁ జెప్పువఱకును శ్రమాకరమైనను దయయుంచి వినఁగోరుచున్నాను. నే నిప్పుడు చదివిన లేఖలో మొదటిప్రశ్నమేమనగా:–తిథి వార నక్షత్రములు కుదిరినయెడల క్షవరము చేయించుకొన్న నేమి లాభము? – ఇందునుగూర్చి పూర్వు లేమి సెలవిచ్చిరో మనవిచేసెదను. మనకు శ్రుతులు పరమప్రమాణములు. వానితరువాత వానియర్థమునే బోధించు స్మృతులు ప్రమాణములు, శ్రుతిలోనియెట్టి స్వల్పాంశమునకైనను వ్యతిరేకముగాఁ జెప్పినస్మృతి ప్రమాణము కాదు. శ్రుతి స్మృతులయర్థ మునే యుపపాదించు ధర్మశాస్త్రములు తరువాత ప్రమాణములు ప్రమాణగ్రంథ మేదియై నను శ్రుతివిరోధముగ నెంతమాత్ర ముండఁదగదు. కావునఁ గొన్నిప్రమాణ గ్రంథముల నుండి వాక్యములను జూపుచున్నాను. మొదట జ్యోతిష శాస్త్రమునుండి చూపెదను. తరువాత ధర్మశాస్త్రములనుండి చూపెదను. అటుపైని లభించునెడల శ్రుతిప్రమాణము లను జెప్పెదను.

కాలామృతగ్రంథములో నిట్లున్నది:–శ్లో॥ నందా పర్వనురిక్త పైత్యకనిశా నంధ్యాష్టమీ షువ్రతే! భుక్వామిత్ర ముఖోత్తరాగ్ని దనుజప్రాజేశ జన్మోదుషు! పాతేకర్కట కన్యకాఘటధ

నుర్మా సేషు మృత్యుప్రదం క్షౌరం భానుజభౌమభానుదివసే పత్నీ యదా గర్భిణీ। నందతిథు లందు (పాడ్యమి షష్టి ఏకాదశి) పర్వములందు రిక్తతిథులందు (చవితి నవమి చతుర్దశి) పైత్కకదినములందు రాత్రులందు నుదయ సాయంసంధ్యలందు నక్షమితిథియందు వ్రతదిన ములందు భోజనానంతరమందును క్షురకర్మము చేయించుకొనరాదు. అనూరాధ మఖఉత్తర ఉత్తరాషాడ ఉత్తరాభాద్ర కృత్తిక మూల రోహిణి జన్మనక్షత్రము వీనియందును వ్యతిపాత మహాపాతములందును, శని కుజ భానువారములందు, భార్య గర్భవతిగా నున్నప్పుడును క్షురకర్మము చేయించుకొనరాదు. చేయించుకొన్నయెడల మృత్యువు సిద్ధించును అని యీశ్లోకమున కభిప్రాయము. ఇక క్షురకర్మమునకుఁ దగిన తిథ్యాదులఁగూర్చి కాలామృత మందే యిట్లు చెప్పఁబడియున్నది. శ్లో॥ శస్తాహస్త చతుష్టయాదితిగురు శ్రీశత్రయార్యేం దవో, జ్యేష్ఠాంత్యోడుచ మధ్యమంచ శుభకృచ్చంద్రజ్ఞ వారాన్వితే, రోగాంతే మృతకర్మను క్రతువిధౌ పుణ్యాక్షలేశోభనే, కారాగారవిమోచనేశుభకరం క్షౌరంతు వర్జ్యాన్వపీ॥ హస్తచిత్త స్వాతి విశాఖ పునర్వసు పుష్యమి శ్రవణము ధనిష్ఠ శతభిషము అశ్విని మృగశిర ఈనక్షత్ర ములు క్షురకర్మమున కుత్తమములు. జ్యేష్ఠ రేవతి యీనక్షత్రములు మధ్యమములు. రోగాంతమందు ననఁగా నారోగ్యస్నానదినమందును, మృతకర్మమందును, యజ్ఞవిధియం దును, గాశ్యాదిక్షేత్రములందును, శుభకార్యాత్పూర్వ దినమందును, కారయందుండి విడు దలయగు దినమందును క్షౌర మవశ్యము చేయించుకొనవలయును. విధినిషేధవిచికిత్స యెంతమాత్రమును దగదు. అట్లొనర్చుట శుభకరమని శ్లోకమున కభిప్రాయము. ముహూర్త మార్తాండమునం ది ట్లున్నది.–శ్లో॥ భుక్తాభ్యక్తోప వాసీశ్వర జనయువతీ ప్రాగ్వయస్కాశ్చ యోగీ, యాత్రాయుద్ధోన్ముఖాయై కృతదినవిధియో స్త్యంబకా స్తేనముండ్యాః సీమంతోర్ధ్వం నపత్యుర్నఖ కచలవనం దూరదేశప్రయాణం, వృషచ్ఛేదం సముద్రాప్లుతిమృతి హరణేస్యాద్రు తేవన్యకార్యాత్॥ భుజించినవాఁడు, నభ్యంగనమొనర్చినవాఁడు, నుపవసించినవాఁడు, రాజ సేవకుఁడు, కాంత, పూర్వవయస్కుఁడును, యోగియు, యాత్రాయుద్ధములకుఁ బోనున్నవాఁడును, నాహ్నికవిధులను నెఱవేర్చుకొనినవాఁడును, దండ్రి జీవించియున్నవాఁ డును నైమిత్తికాదిక్షురకర్మమునకుఁదప్ప సామాన్యక్షురకర్మమున కర్హులుగారు. ఇది కాక సీమంత మాచరించినపిమ్మట గర్భిణీపతి దూరదేశప్రయాణము, వృషచ్ఛేదనము, సముద్ర ప్లుతి, శవదహనము, నఖశ్మశ్రులోమచ్ఛేదనము నొనర్పఁగూడదు. గర్భిణీపతియైనను మృతకర్మాది నైమిత్తికములందు విధింపఁబడిన క్షురకర్మము చేయించుకొనకతప్పదు. అని యీశ్లోకమున కర్థము. ఇదిగాక గార్గ్యవచన మి ట్లున్నది. శ్లో॥ షష్ట్యమావాపూర్ణిమాపాత చతుర్దశ్యాష్టమీతథా ఆశువన్నిహితంపాపమ్ తైలేషు స్త్రీభగేషురే, షష్ఠియందు నమావాస్యయందుఁ బూర్ణిమయందు మహాపాతవ్యతీపాతములందుఁ జతుర్దశియందు నవ మియందుఁ తైలాభ్యంజనముగాని స్త్రీసంసర్గముగాని క్షురకర్మముగాని యాచరించినయెడలఁ బాపము సిద్ధించునని యీశ్లోకమున కర్థము. వృద్ధగార్గ్యుఁ డిట్లు వచిం చుచున్నాఁడు. శ్లో॥ రవ్యారసౌరవారేషు రాత్రే పాతేవ్రతే హని, శ్రాద్ధాః ప్రతిపద్రిక్తా భద్రా క్షౌరేషు వర్జయేత్॥ ఆదివారము మంగళవారము శనివారము రాత్రిభాగము వ్యతీపాత మహాపాతయోగములు, వ్రతదినములు శ్రాద్ధాహన్సులు పాడ్యమి రిక్తతిథులు భద్రతిథులు క్షౌరమునకుఁ దగవని దీనియర్థము. శ్లో॥ మాతుశ్చతుర్థీ, భగినీ, చతుర్దశీ, భ్రాతుశ్చ షష్ఠీ, పితురేవపర్వసు। ఆదౌ నవమ్యాం ధనధాన్యహానిః కుటుంబహానిః క్షౌరాష్టమీషు॥ అని

మఱియొకొప్రమాణ మున్నది. చవితినాఁటి క్షౌరము తల్లికిఁ గీడు. చతుర్దశినాటి క్షౌరము తోఁబుట్టినదానికిఁ గీడు. షష్ఠినాఁటి క్షౌరము సోదరునికిఁ గీడు. పర్వక్షౌరము తండ్రికిఁ గీడుఁదెచ్చును. పాడ్యమినాఁడు నవమినాఁడు క్షురకర్మ మొనరించుకొన్నయెడల ధనధాన్య హాని కలుగును. అష్టమీ క్షౌరము కుటుంబహానిని సేయుననియు దీనియర్థము. ఇట్లు చెప్పునెడల నెన్నిశ్లోకములయినఁ జెప్పవలసివచ్చును. ఇవి చాలునా? ఇంకను జెప్పనా? (చాలుఁజాలు నని నభలోఁ గేకలు) అట్లయిన నింకముందు జెప్పెదను. నాయనలారా! ఇదివరకుఁ జెప్పిన శ్లోకములలోని యభిప్రాయసారమును వీలగునంతవఱకు జ్ఞప్తిలో నుంచుకొనుఁడు. (అది మావలనఁగాదను కేకలు) ఇఁక ధర్మశాస్త్రప్రమాణములఁ జెప్పెదను.

ధర్మసింధువులో నిటు లున్నది.–శ్లో॥ క్షౌరం చాంలోక్తనక్షత్రవారాదిషు శుభం జగుఃఁ పంచమే పంచమేరాజ్ఞాం। దినాన్యేషాన్య దృచ్ఛయా॥ శ్మశ్రుకర్మ భవేన్నైవ నవమే దివసేక్వచిత్। క్షౌరం భూతేరతం దర్శేఃు వర్జయేచ్చ జిజీవిషుఃు క్షౌరం న కుర్యురభ్యక్త భుక్తస్నాత విభూషితాఃు ప్రయాణసమరారంభే। న రాత్రౌ నచ సంధ్యయోఃు శ్రాద్ధాహే ప్రతిపద్రిక్తా వ్రతాహ్నిచ న వైధృతౌ। ప్రశస్తం జన్మనక్షత్రం సర్వకర్మను కీర్తితమ్ క్షౌరప్రయాణ భైషజ్య వివాదేషు నశోభనమ్॥ చౌలమునకుఁ జెప్పఁబడిన యన్నివారములును తిథులును –నక్షత్రములుగూడ క్షౌరమునకుఁ బ్రశస్తములు, శుభకరములు. రాజు క్షురకర్మ మైదుదిన ముల కొక్కసారి చేయించుకొనవలయును. మిగిలిన వారి కట్టి దిననియమ ముక్కఅలేదు. చతుర్దశినాఁడు నవమినాఁడు దర్శయందును బ్రదుకఁదలఁచినవారు క్షురకర్మ మొనరించుకొనఁగూడదు. అభ్యంజన మొనర్చుకొనినవారు, భుజియించినవారు స్నాతకర్మ మొనర్చినవారు, విభూషితశరీరులు క్షురకర్మ మొనర్చుకొనఁగూడదు. యాత్రాయుద్ధారం భములందును వైధృతయోగమందును క్షౌర మొనరించుకొనఁగూడదు. జన్మనక్షత్రము సర్వకర్మములకు శుభదమయ్యెను బ్రయాణమునకు వైద్యమునకు క్షౌరమునకును బనికిరా దని యభిప్రాయము. ఇదిగాక బృహస్పతిస్మృతియం దిట్లున్నది.–శ్లో॥ రాజకార్య నియుక్తా నామ్ నరాణాం భూపజీవినామ్, శ్మశ్రులోమ నఖచ్ఛేదేనాస్తి కాలవిశోధనమ్। క్షౌరం నైమిత్తికం కార్యమ్ నిషేధే సత్యపి ధ్రువం యజ్ఞే మృతే బంధమోక్షే నృపవిప్రాజ్ఞయాపిచ ప్రాగ్వయస్కస్య పిత్ర్యకైర్న కార్యం ముండనం సదా, ముండనస్య నిషేధే పి కర్తనం తు విధీయతే। ఉదఙ్ముఖం ప్రాఙ్ముఖోవా వపనం కారయేత్సుధీఃు కేశ శ్మశ్రులోమనఖా నుదక్సంస్థా న వాపయేత్॥ ఆనర్తోహిచ్ఛత్రఃు పాటలిపుత్రో దితిర్దితిఃు శ్రీశం క్షౌరేస్మరణాదేషాం। దోష నశ్యంతి నిశ్శేషాఃు॥ రాజువలన జీవనమును బొందుచు రాజకార్యమునందు నియుక్తులగున రులు క్షురకర్మమునకుఁ గాలశోధనము చేయనక్కఅలేదు. ముందెప్పుడో జీవనక్షయమగు నను సందేహముచేత నిప్పుడే జీవనక్షయ మొనరించుకొనఁగూడదని తాత్పర్యము. అంతే కాని రాజువలనఁ బోషింపఁబడుచున్న వారెల్ల రట్లు చేయవలయునని దీని యభిప్రాయము కాదు. ఒక రాజకార్యమందు నియుక్తుఁడై యుండువాడు, తత్కార్య నిర్వహణమునకుఁ బూర్వమందు క్షురకర్మము చేయించుకొనకుండిన యెడలఁ దనకుఁగాని రాజకార్యమునకుఁ గాని కొంత భంగము కలుగునని భయము కలిగినప్పుడు రాజాజ్ఞను బొంది క్షౌరము జేయించుకొన వలయునని దీనియభిప్రాయము గాని మఱియొకటి గాదు. పెండ్లివారింటికిఁ దనపక్షమునఁ బోయి కట్నమిచ్చి రమ్మని రాజాజ్ఞ యగునెడల, రాజకార్యనియుక్తుఁడను

గదా యని కార్యదర్శి తల గొఱిగించుకొనియే ద్వారము దాఁటనక్కఱలేదు–ఇదికాక, యజ్ఞమందును, మృతియందును, బంధమోక్షమందును, రాజాజ్ఞయు విప్రాజ్ఞయు నై నప్పుడును క్షురకర్మము చేయించుకొనవచ్చును. పూర్వవయస్కులగలవారికిఁ దండ్రి జీవించి యున్నవారికి క్షురకర్మము తగదు. క్షురకర్మము నిషేధింపఁబడుటచేతఁ గత్తిరింపు విధింపఁ బడెనని తెలియఁదగినది. ఇప్పుడు కొందఱుతల కత్తిరించుకొనుచున్నను శ్మశ్రునఖచ్ఛేదన ముకూడ నొనర్చుకొను చున్నారుగదా! ఉత్తరదిక్కుగాఁగాని తూర్పుదిక్కుగాఁగాని మొగ ముంచి క్షౌరము చేయించుకొనవలయును. కేశములు శ్మశ్రువులు దక్షిణభాగమునుండి యుత్తరభాగమునకు ఖండింపఁబడ వలయును. కుడి చెవి యొద్ద మొదట శిరోముండన మారంభింపవలయును. ఆనర్తుఁడు, అహిచ్ఛత్రుఁడు, పాటలిపుత్రుఁడు, నదితి, దితి శ్రీశుఁడు వీరిని క్షౌరకాలమున స్మరించినయెడల దోషములు నశించునని దీనితాత్పర్యము.

నిర్ణయసింధువునం దిట్లు చెప్పఁబడియున్నది:–శ్లో. సుస్నాత భుక్తోత్కట భూషితా నామభ్యక్తయాత్రానమరోన్ముఖానామ్। క్షౌరంవిదధ్యాన్నిశి నంధ్యయోర్వా। జిజీవిషూణాం నవమేనవాహ్ని॥ స్నానమొనర్చికాని, ప్రయాణసమరోన్ముఖుఁడై కాని, రాత్రియందుఁగాని, నంధ్యలందుగాని, నవమినాఁడుగాని బ్రదుకఁదలచినవా రెవ్వరును క్షౌరవము చేయించుకొనఁ గూడదు.

నాయనలారా! ఇఁకజాలునా? ఇంకను ధర్మశాస్త్రప్రమాణములఁ గనఁబఱుపవల యునా? (చాలు–చాలు అను కేకలు) ఇవియున్నియు వింటిరా? ఇవియన్నియు శ్రుతు లమీఁద నాధారపడినవే. వీనికిఁ బ్రమాణశక్తి శ్రుతినుండి వచ్చినదే. అయినను క్షురకర్మ మెట్లు చేయించుకొనవలయునో పరాయతమునుండి యుదాహరించుచున్నాను.

దేవానైయద్యజ్ఞే కుర్వత–తదుసురా అకుర్వత–తేసురా – ఊర్ధ్వం పృష్ఠేభ్యోనావశ్యన్ తేకేశానగ్రేవపంత–అథశ్మశ్రూణి – అథోపపక్షౌ – తతస్తే పరాభవన్–యస్యేవం వపంతి–అవాజతి–అథదేవా ఊర్ధ్వం పృష్ఠేభ్యోపశ్యన్ తావుపపక్షా వగ్రేవపంత–అథశ్మశ్రూణి –అథకేశాన్ తతస్తేభవన్ – స్వర్గలోకమాయన్–యస్యేవం వపంతి–అథస్వర్గంలోకమేతి – అథైవన్మనుర్వ్రశ్చే మిథునమవశ్యత్, సశ్మశ్రూణ్యగ్రేవపంత–అథోపపక్షౌ– అథకేశాన్–తతో వైప్రాజాయత ప్రజయాపశుభిఃయస్యేవం వపంతి ప్రప్రజయా పశుభి ర్మిథునైర్జాయతే– క్షురకర్మము నందు మొదటఁ దలయును దరువాత శ్మశ్రువులును దరువాత కక్షములను దీయించుకొనుటచేత రాక్షసులు పరాభూతములైరనియు నట్లొనర్చువారంద ఱట్లే పరా భూతు లగుదురనియు, మొదటఁ గక్షములను దరువాత శ్మశ్రువులను దరువాత శిరోజము లను వపన మొనరించుకొనుటచేత దేవతలు స్వర్గలోకము ననుభవించుచున్నారనియు నట్లుచేయువారట్లే సుఖసమృద్ధి నొందుదురనియు మనుజులు మొదట శ్మశ్రువులను దరువాత గక్షములను తరువాత శిరోజములను వపన మొనరించుకొని ప్రజాసమృద్ధి పశుసమృద్ధి గలవారైరనియు, నట్లొనర్చువారందఱు నట్లే పశుసమృద్ధియుఁ గుటుంబస మృద్ధియుఁ గలిగియుందురనియు దీని తాత్పర్యము. క్షౌరము చేయించుకొను క్రమములోనే యటునుండి యిటువచ్చిన భేదమునకే ఇంతఫలవ్యత్యయము గలుగుచుండఁగా– దుష్టతిథి వారనక్షత్రముల ఫల మింత యని చెప్పవచ్చునా? ఇవియన్నియు నర్థవాదములని నమర్థించి నను బరమార్థము ప్రాతిపదికముగా లేని యర్థవాద మెచ్చటనైన నుండునా? ఇఁక

బూర్వశ్లోకాదులనుగాని ధర్మశాస్త్రవచనములను గాని శ్రుతులనుగాని యుదాహరింపను. ఇవి చాలునని నే నుకొందును. ఇవి చాలనివారి కింక నూఱు చెప్పినను జాలవు.

అనర్హతిథివారనక్షత్రములం దాయుష్కర్మ మొనర్చుకొనిన యెడల నాయుష్యకర మని యందఱు ఋషులు శాస్త్రజ్ఞు లైకకంఠ్యముగ నంగీకరించినమాట కాని మఱియొకటి కాదు. ఈనర్హసామాన్యాజ్ఞకుఁ గొన్ని యపవాదము లున్నవి. (1) నైమిత్తికాదులు. (2) రాజకార్యనియుక్తుల కది దోషముకాదు. ముఖ్యముగా నీరెండే వ్యతిరేక వచనములు. నిత్యకర్మవిఘ్నభయముచే నైమిత్తికాదు లపవాదములలోఁ జేర్పఁబడినవి. ప్రస్తుతజీవనహానిభ యముచేత రెండవది చేర్పఁబడినది. రాజు ప్రజలక్షేమ మరయఁదగినవాఁడగుటచేత నాతని యాజ్ఞయయినప్పుడు దోషము లేదు. విప్రుడు నిత్యకర్మ నిర్వహణాధికారియగుడచేత నతనియాజ్ఞయయినప్పుడు దోషములేదు. క్షురకర్మమాయువుతోఁ జేరినదగుటచేతనే దాని కాయుష్కర్మమని పేరువచ్చినట్లు యోజింప వలసియున్నది. ఆయువుతోఁ జేరినదానికి వైద్యశాస్త్రముతో నబంధములేదని యెవరైనఁ జెప్పగలరా? అట్టినంబంధమున్నచా లేదా యని యిప్పు డీప్రశ్నయేల? పూర్వర్షులు బుద్ధిహీనులైయున్మత్తులైనోటికి వచ్చిన ట్లొదియో మనుష్యులను బాధించుటకుఁ బ్రేలియుండి రేమోయను సందేహము వారి నిర్భాగ్యతవలనను మీనిర్భాగ్యతవలనను దేశనిర్భాగత్యవలనను మీకుఁ గలుగుటచేతనే కదా యిట్టి ప్రశ్న మిప్పుడుద్భవించినది! వైద్యశాస్త్రముతోనున్న సంబంధము పూర్వు లేల చెప్పలేదని యందురేమో? ఏల చెప్పవలయునని నే నడిగిన మీరెమందురో? వారికిఁ జెప్పవలసినయావ శ్యకత లేదు. వారు శాసకులు. శాసనములకుఁ గారణములు చెప్పినదాక వారికేమి? మీకుఁ బ్రతిభయున్న యెడ నట్టి కారణము లేవో కనుఁగొని వారిశాసనములకు విధేయులై యుండుఁడు. అంత ప్రతిభ లేదా? బ్రహ్మజ్ఞుల యెడల భక్తిగలిగి వారియాజ్ఞలను శిరమున ధరింపుఁడు. ప్రతిభలేక భక్తియులేక యి ట్లుభయభ్రష్టత నొందుట తగునా?

పూర్వాచారములు మంచివికావని కొందఱనుచున్నారని యీ యుత్తరమున నున్నది. దాని కెవరేమి చేయఁగలరు? మీదేహతత్త్వములు–మీమనస్తత్త్వము – లెంతయో చెడిపోయి యుండుటచేత మీకుఁ బూర్వాచారములు దుష్టములుగాఁ గనఁబడుచున్నవి. మీకుఁ జుట్టుఁ గాల్చినఁగాని మలబద్ధకత వదలదు. ఉల్లిపాయఁ దినినఁగాని మూత్రబద్ధత వదలదు. అందుచే ధూమచ్ఛదపాన మొనర్పఁగూడదనియుఁ బలాండువు భక్షింపఁదగదనియుఁ జేసిన ప్రాచీ నుల శాసనములు పరిత్యాజ్యములుగాఁ గానిపించుచున్నవి. కాకులు కావుకావు మనకుండ "కాఫి" త్రాగినఁగాని కాళ్లు ధడదడలాడు మీకు శివరాత్ర్యుపవాసము చెప్పినవాఁడు 'సెన్ సైన్ బ్రూట్' గా గానిపించుట యాశ్చర్యమేమి? మీమనస్సులు మీదేహములకంటె దుర్బలములై పోయినవి. మీరు బుద్ధిపూర్వకముగా భ్రష్టత నొందినారు. బహిరంగసాధనము లకు మీదేహములు పనికిరావు. అంతరంగసాధనములకంతకంటెఁ బనికిరావు. నైదికకర్మవిష యమై మీ కారెండును లేనట్లే నోరు మిగిలియున్నది. కావునఁ బూర్వులను నోరు మిగులుచున్నారు. ఇట్టి విషయములఁగూర్చి నే ననేకపర్యాయము లుపన్యసించియుంటిని. కావున నింకఁ జెప్పఁదలఁచుకొనలేదు. "మామిత్రులలోఁ గొందఱు మీసాధస్వతానుబంధ ములో వ్యానములు వ్రాయుటకు నిశ్చయించి యేదో తెలుపఁగోరుచున్నా" రని యీయుత్తర మున నున్నది. ఆనంగతి సాక్షి కేల తెలియఁజేయవలయునో బోధపడలేదు. సారస్వతానుబం

ధము సాక్షిదా యేమి? ఆంధ్రపత్రికాధిపతితో ననవలసినిమాట యాతనితో నేల? సరస్వ
నాదరించుటకా? సాక్షిని బెదరించుటకా? ఇన్ని సాక్షులను జూచినను సాక్షిస్వభావమింకన
వారికిఁ దెలియనేలేదా? అటులైనఁ జెప్పెదను. సాక్షి జనవిధేయుఁడు. గర్వి యెంతమాత్ర
మును గాఁడు. ఏమియుఁ దెలియలేదని విచారించువాఁడు కాని తెలిసినదానితో సంతృ
నొందువాఁడు కాఁడు. తనకుఁ దెలియని యంశములను శ్రద్ధతో నెవరియొద్దనై
నేర్చుకొనువాఁడేకాని తెలిసినవారిని నిందించువాఁడు కాఁడు. వయసునఁ బెద్దవాఁడేకా
నేర్చుకొనుశక్తిలో నింక బాలుఁడు. మీరెన్ని యుపన్యాసములు వ్రాసినను జదివి తెలియ
యంశములను దెలిసికొని యానందించి మీకుఁ గృతజ్ఞుఁడై యుండువాఁడు కాని మీవ్యానమ
లవలనఁ దనకేమి యగునో యని సందేహము నొందువాఁడు కాఁడు.

ఈయుత్తరమును మిగుల నాదరపూర్వకముగా వ్రాసిపంపిన మాసోదరుని యభిమ
మును దీర్పకుండుట యనుచితమని యెంచి వెనుకఁజెప్పిన సంగతులే కొన్ని ప్రమాణవాక్
ములతో నిప్పుడు చెప్పితిని–ఇకముందుగూడ నిట్లు చెప్పినదే చెప్పునెడలఁ బాఠకుఁ
కసంతుష్టిగా నుండునని జడియుచున్నాను. ప్రత్యుపన్యాసమందును నేదియో సంశయము
దును. ఏదియో దానిపైఁ బ్రశ్నము బయలుదేఱునప్పు డేదియో ప్రత్యుత్తరమీయవలసియు
దును. ఈగుడుగుడుగుంచము లింక వదలవు. విసుఁగు లేకుండనో, యుండి కనఁబఱుప
కుండనో, యింతసేపు వినినందులకు సంతసించుచున్నాను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

49. రెనెడీగ్రంథాలయము

జంఘూల శాస్త్రి తనకు కలిగిన అనారోగ్యం కారణంగా దక్షిణ దేశాటనం మానుకుని మద్రాసు చేరుకున్న నాటి మాట –

మద్రాసులో, సముద్ర తీరంలో విహరించే అలవాటు అక్కడి ప్రజలకు ఎంతగా వుందో వివరిస్తూ–ఒకనాడు జరిగిన సంఘటన ప్రేరణగా – శాస్త్రి సాక్షికి వ్రాసిన ఉత్తరమే ఈ ఉపన్యాసం.

సముద్ర ఒడ్డున సభ జరుగుతోంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ స్మారక మందిర నిర్మాణం కోసం చందాలు వసూలు చేయడానికి ఏర్పాటైన దాసభ. సభలో చివరి ప్రసంగం చేసిన మనిషి చెప్పిన ప్రకారం అప్పటికి ముప్పై ఏడువేల రూపాయలు వసూలయ్యాయి. ఇంకా రెండు లక్షల అరవై మూడు వేల రూపాయలు వసూలు కావాలి. ఆ వక్త మూడునేల రూపాయలు చదివించాడు. ఇంకా ఎవరైనా వస్తారా? అని అడిగాడు మట్టూ చేరిన శ్రోతల్ని.

జంఘూల శాస్త్రి ఈ అవకాశం అందిపుచ్చుకుని చందా ఇవ్వలేదు గాని ఉపన్యాసం ఇచ్చి ఒక దులుపు దులిపాడు. తిలక్ గారి పేరిట మందిర నిర్మాణం చేసే సంకల్పాన్ని అభినందించాడు మొదట. ఆయన ఆశయాల్ని ఆచరణలో నెరవేర్చడం అంతకంటె సర్వోత్తమం అని – ఆయన వ్రాసిన భగవద్గీతా వ్యాఖ్యానం, మీలో ఎవరైనా చదివారా? అని అడిగాడు. ఎవరూ లేదన్నారు. దానిని సవిమర్శంగా చదవడం నిజంగా మనం ఆయనకు చేసే గౌరవం – అని చెప్పాడు. విగ్రహాలు, మందిరాలు నిర్మించడంలో వున్న శ్రద్ధ, ఉద్రేకం, వాటిని జాగ్రత్తగా కాపాడి నిర్వహించడంలో చూపించడం లేదని మైలాపూరులో దయనీయ స్థితిలో వున్న రెనెడీ గ్రంథాలయాన్ని ఉదాహరించాడు. కర్తవ్యం బోధించాడు.

జంఘూలశాస్త్రి వ్రాసినలేఖను జదివెదను.

సాక్షికి జంఘూలుఁడు నమస్కారములు–

నేను దక్షిణదేశాటనము ప్రస్తుతమున నాకుఁ గలిగిన యనారోగ్యస్థితినిబట్టి మాను కొని తిరిగి మదరాసుకు వచ్చితిని. ఈపట్టణమున నుస్సనా రనేకులు ప్రతిదినమునను

సాయంకాలమందు సముద్రతీరమునకుఁ బోవుదురు. అట్లు పోయి, యచ్చటఁ జూడవలసిన సముద్రము వంకఁగాని, సూర్యాస్తమయమువంకఁ గాని, సముద్రమునఁ బోవుచుఁ గ్రమక్రమముగ నదృశ్యములగుచున్న పొగయోడలవంకఁగానిచూడక చూచిచూచి ప్రాణమువిసిగిన మొగములనే చూచుచు, మొర్రో యని కూఁతలిడుచున్న మోటర్లవంకఁ జూచుచుఁ, గ్రొత్తయాఁడు దెవతయైనఁ గంటఁబడునెడల–నది యెవతయో, యెక్కడ నుండునో, యెట్టిదియో; దానిబందుగు లెవ్వరో తెలిసినదాక దానిప్రక్కప్రక్కలనే తిరుగుచు, నడిగినట్లు కాకుండ దాని చరిత్రమును దెలిసికొనుచు, నినుకలో గోఁతులను దీయుచుఁ దరంగములలోఁ గాళులు తడుపు కొనుచుఁ దీరమునందలి చిప్పలు, గుల్లలునేరుచుఁ బనికిమాలిన వార్తలు చెప్పుకొనుచు, నత్యంతావశ్యకమగు పనియున్న ట్లటులిటు లాసులోఁ గండెలవలెఁ దిరుగుచు, నేమి పనిచేయుట కక్కడికిఁ బోయిరోతెలియని హేతువుచే నెప్పుడింటికిఁ బోవలయునో తెలియక కొంతసేపు కాలక్షేపము చేయుచుందురు. నేను మాత్రమట్లు సముద్ర తీరమునకేల పోకుండవలయును? బండికై ప్రయత్నించితినిగాని బండి దొరకకపోవుట వలన నడిచియే పోతిని.

ఆదినమున సాయంసమయమున వార్ధితీరమున బహిరంగసభ జరుగునని నాకింతకు ముందు తెలియదు. దారిలో నాసభనుగూర్చి యెవ్వరో చెప్పుకొనుచుండగాఁ ద్వరగ నడచి సభాప్రదేశమును జేరితిని. అయ్యరవర్గళులు, శాస్త్రులవారు, అయ్యంగారులు, పంతులుగారు, మహమ్మదీయులు, పిళ్లగార్లు, మొదలారులు, నాయఁడుగార్లు, సెట్లు, బలిజీలు, బెస్తాలు, మాలమాదిగ లచ్చట గుంపులుగుంపులుగాఁ జేరి యున్నారు. అచ్చటచ్చట స్త్రీలు గూడ నున్నారు. నే నాసంఘములో నుండి కష్టపడి, దారిచేసికొని, యుపన్యాసరంగమునొద్దకుఁ బోఁబోవుచుఁ దొందరలోఁ జూడక, యొక యంగనకాలిపై ద్రొక్కితిని. ఆమె నన్నుఁ దిట్టినతిట్టులిన్ని యన్ని కావు. ప్రజల తిట్లకు లక్ష్యపెట్టినయెడలఁ బ్రపంచమున బ్రతుకఁగలమా? తిట్టఁదలఁచినవారు తిట్టుచునేయుందురు. కాలిమీదఁ ద్రొక్కిన మానరు. గొంతుమీఁదఁ ద్రొక్కిన మానరు. పుట్టినపుట్టుక తిట్లు తినుటకుఁ గాక మరెందులకు? పరబ్రహ్మము మొదలు పాకివానివఱకుఁ బ్రజలచేఁ దిట్లు బడనివారెవ్వరును నాకుఁ గనఁ బడలేదు. ప్రజల కుపకారముచేయు స్వభావముగలవారికిఁ దిట్లు మరింత యెక్కువ. ఇట్లు లోలోన నే ననుకొనుచు నధ్యక్షపీఠము నొద్దకుఁ బోయితిని. కుస్తీ జరగుచున్న స్థలమునకు వస్తాదు పోవకుండ నుండ గలఁడా? సాని మేళమాడుచున్న చోటికి బాబాకరపు బ్రహ్మచారిపోయి పాదరక్షలయొద్దనైనఁ గూలఁబడి చూడకుండఁ గలఁడా? గానసభ జరుగుచోటికిఁ గూనురాగపుటయ్యవారికిఁ బరుగెత్తినదాఁక మతియుండునా? వీరణముమీఁద డుబ్బు చెవిని బడుటయేమి–తోరణము క్రింద డబ్బుకై బ్రాహ్మణుఁడు నిలువఁబడుటయేమి–సభ జరుగుట యేమి–వక్తయగువాఁడు ముందువరుస పీఠముపై సిద్ధపడకపోవుట యేమి? నేను కూరుచుండగనే యొక్క యాంధ్రుఁ డుపన్యాసపీఠమెక్కెను. అధ్యక్షపీఠమున నొక్క యయ్యరుగా రుండిరి. ఆ యాంధ్రుఁడి ట్లుపన్యసించెను.

లోకమాన్య బాలగంగాధర తిలకుగారినిగూర్చి యిదివఱ కుపన్యసించినవా రందరు పరిపూర్ణముగఁ జెప్పనే చెప్పినారు. నాకు చెప్పుటకు వారేమియు మిగుల్పలేదు. (అటులైన నూరకుండక పీఠమెందు కెక్కితివి? దిగు దిగు అను కేకలు) ఆమహాశయుని గుణవర్ణన

మొనర్చుటకు నేను సమర్థుఁడదు గాను. నాయొద్దవిద్య కాని బుద్ధి కాని లేదు. (ఆనంగతి యుపన్యానధోరణివలననే తెలియుచున్నది. యను కేకలు) నాయొద్ద స్వల్పముగా ధనము న్నది. కట్టించుట కేర్పాటు చేసికొనిన తిలకు మిమోరియలు హాలుకొఱకు నేను మూఁడువేల రూపాయల నిచ్చుచున్నాను. (హుర్రే-హుర్రే-ఆంధ్రాపేట్రియటు అను కేకలు) అని యాంధ్రుఁడు పీఠము దిగిపోయెను. అప్పుడధ్యక్షుఁడు లేచి ''వెరిగుడు-వెరిగుడు-మూఁడువేలు-దటియిజు వెరిగుడు-సబుస్క్రిప్షను లిష్టులో నీటోపీలు యాంధ్రాపేట్రియటును చేర్చి అయింది. ఇంతమేరకు అయినవి 37 వేలు. వెరిగుడు. ఇంకను భక్తదేశులగు పెద్దవారెల్ల (భక్తదేశులు కాదు. దేశభక్తులని చెప్పవలయును.) దేశభక్తులు-వెరిగుడు. దేశభక్తులగు పెద్దవారెల్ల వారివారి మేరకు చందా వేయవలయునని నేను మందలించుచున్నాను. ఇంక నెవ్వరును చందా వేయువారులేరా? లేనట్లు కనఁబడుచున్నది. వెరిగుడు. చందాను కలెక్టుచేయుట కొక్క సబుకమిటి యిదివఱ కేర్పాటుచేసి అయింది. ఇంకను రెండులక్షల అరునదిమూఁడు వేలరూపాయలు వసూలుకావలసి యున్నది. బాలగంగాధరతిలక్ శయామహాని (మహాశయుని అను కేకలు) వెరిగుడు-మహాశయుని హృదయప్రసంచమునమున్న శ్రీకృష్ణ భగవానుఁడే మనకు సాయపడును. అయినను నెవ్వరైన వత్తురేమో కొంచెముసేపు కనిపెట్టుకొని యుందును'' అని పలికి కూరుచుండెను.

తిన్నదాఁకఁ గడుపూరకుండదు. తిరిగినదాఁకఁ గాలూరకుండదు. నాగినదాఁక నోరూరకుండదు. రమ్మనినా రంతియే చాలునని యుపన్యాస రంగమున నిలిచితిని..... (వెరిగుడు అనదరు ఆంధ్రాపేట్రియటు! అనదరు 3 థౌజండు అని సభలో కేకలు).

''నాయనలారా! మూఁడువేలరూపాయలు కావుకదా! మూఁడు కాసులైన నిచ్చుటకు నాయొద్ద శక్తిలేదు. (గెటుడౌను-గెటుడౌనువుయి డోంట్టుహాంటు బెగ్గర్సు హియరు అను కేకలు) నాయనలారా! ఆమాట నిజమే! ఉన్నవారందరు వారే కారా? చేయుచున్నపని యదియే కదా? ఇక (హాంటు) యెందులకు? ప్రపంచములో భిక్షుకుఁడు కానివాఁ డెవ్వఁడు? అందఱికంటె నెక్కువ గలవాఁడు మరింత భిక్షుకుఁడు. అష్టైశ్వర్యసంపన్నుఁడైన యుధిష్ఠిరుఁడు భిక్షుకాగ్రగణ్యుఁడు. మహాలక్ష్మీసంపన్నుఁడైన వామనుఁడు బలిచక్రవర్తి యెదుట ''భవతి భిక్షాం దేహి'' యని యడగలేదా? జగద్రక్షకుఁడగు నర్భకుని సంరక్షింపు కొనుటకైపసుదేవుఁడు గాడిదె కాళులైనబడి యాచింపలేదా? ఎంత వానికైనసరే బ్రదికియుండునంతవఱకుఁ బరసాహాయ్యమునకై యాచింపక తప్పదు. పచ్చిన తరువాతఁగూడఁ బరసాహాయ్య మావశ్యకమే! మేము స్వతంత్రజీవుల మని విర్రవీఁగువారికంటె వెర్రివారు లేరు. స్వోదరపూరణాభిలాషచే యాచించుట యధమము-పరశ్రేయోభిలాషచే యాచించుట మధ్యమము. దేశక్షేమాభినంధిచే యాచించుట యుత్తమము. అందుచే మీప్రయత్నము సర్వదా శ్లాఘ్యమైనదియు నగును. ముష్టివాండ్రలో మీరు మొదటివారును నగుదురు.

''ఏమహానుభావుఁడు దేశభక్తాగ్రగణ్యులలో నొక్కఁడో, ఏమహానీయుఁ డనేక విద్యా పారంగతుఁడో, ఏమహాశయుఁడు స్వదేశీయ భాషాసర్వోత్తమగ్రంథ సంధాన ధౌరేయుఁడో, ఏమహాత్ముఁడు భారతీయ విద్యాచరణ పాండితీమండితుఁడో, ఏమహాధీరుఁడు సత్యసౌజన్య స్థైర్యాది గుణగణనీయుఁడో, అట్టి లోకమాన్య బాలగంగాధరతిలకుగారి జ్ఞాపకచిహ్నముగా నొక్కమందిరము నిచ్చట గట్టించుటకు మీరు తీర్మానించుకొనుట మీదేశభక్తి, మీదేశీయ

భాషాభక్తిని, మీయుపకారస్మృతిని, మీయున్నత మనస్కతను వేయివిధముల వెల్లడి చేయుచున్నది. మహాసంతోషముగా నున్నది. ఆమహానుభావుని జ్ఞాపకార్థముగా నిచ్చటనే యున్నమాటయేమి? ఎచ్చటెచ్చట నెన్నెన్ని మందిరములైనఁ గట్టింపవలసినదే. వారి కంతకంటె మీరు చేయఁగల సేవ యేమున్నది? వారి సుగుణపరంపర ననుకరించుట మొదటి విధి. వారిపేరిటి మందిరములో వారివిగ్రహమును నిలిపి, స్వదేశీయ వీరపూజ లొనర్చుట రెండవ విధి. మరణించినవారి జన్మదివసములను, మృతదివసములను బవిత్రములుగా భావించి, వారిని స్మరించుచు, భూతసంతర్పణ మాచరించుచుఁ, బరమపూతకథాకాలక్షేపము లొనర్చుచు, వారియాత్మశాంతికై భగవదారాధనము లాచరించుచు నాదినములను గడపుట–మనయొక్క దేశమునందే కాదు–మనయొక్క జాతియందే కాదు–సర్వప్రపంచమందలి సమస్తజాతులందుఁ గూడ నున్నది. భగవంతునియందు భక్తిలేనివారికి సయితము, భగవంతుని యాస్తిక్యమును విశ్వసింపనివారికి సయితము స్వదేశీయ వీరపూజ పూర్తిగా నున్నది. నాయనలారా! కత్తిబట్టినవాఁడే వీరుఁడుకాఁడు. కలముపట్టిన వాఁడు కూఁడ వీరుఁడే. కనఁబడిన స్థూలశత్రువులను ఖండించునది కత్తి. కనఁబడని సూక్ష్మశత్రువులను ఖండించునది కలము. దేశోద్ధరణార్థమై పాటుపడినవాఁ డెవఁడైన వీరుఁడే! దేశోద్ధారకులు సంతతస్మరణీయులు. భగవంతునిగూర్చి మూకీభావమును వహించిన బుద్ధుఁడుకూడ మృతవీరస్మృతిని నొక్కి వక్కాణించినాఁడు. అందువలననే యాతనిని దేవుఁడని బుద్ధమతావలంబకులు పూజించుచున్నారు. ఇది సర్వోత్కృష్టమగునాచారము. సర్వప్రపంచవ్యాప్తమగు నాచారము. ఈయాచారమువలనఁ బుట్టినవే యిప్పటి వర్ధంతులు–జయంతులు–తిర్వధ్యయనములు తద్దినములు–పుణ్యదినములు– మొదలగునవి. అట్టి మాటలేల? ప్రపంచముననున్న జాతులలో యన్నిపండుగలు–దాదాపుగా నీపవిత్రాచారమువలనఁ గలిగినవే–పూర్వుల పుణ్యమాయని మన మిప్పు డాదినములలో నెలవుల ననుభవించుచున్నాము–భక్ష్యముల నాహరించుచున్నాము–భాగవతసేవల ననుష్ఠించుచున్నాము–పవిత్రకృత్యములను జేయుచున్నాము పూర్వుల మహత్వమువలననే యిప్పటికైన సద్గుణలేశములను గలిగి ప్రవర్తించుచున్నాము. ఇప్పటికైన దయయని–ధర్మమని–సత్యమని–శౌచమని–శమమని–దమమని–కర్మమని– భక్తియని–జ్ఞానమని–మోక్షమని–సార్థకముగనో నిరర్థకముగనో కొన్నిమాటలాడుచు వెనుకది ముందుకో, ముందుది వెనుకకో, క్రిందిది మీఁదికో, మీదిది క్రిందికో పెట్టి గుఠికి నాలుగుబారల దూరమునఁ గొట్టినట్లయిన,, సనాతనపథమునకు విశేష దూరముగఁ బోకుండఁ జాతీయసంప్రదాయస్మృతి పూర్తిగ లేకుండఁ బ్రవర్తించుచున్నాము. ఎందువలన? మనపూర్వుల మాహాత్మ్యమువలన. అందువలననే వారి యాశీర్వాదపుఁ జలువచేతనే, యిప్పటికైన నీలాగుననైన నిలువఁగలిగితి మని సంతోషింపవలయును.

ఆపుణ్యాత్ముని గౌరవార్థముగా నొక్క నూతన మందిరనిర్మాణ మొనర్చుట మహాకార్యము. అట్టి మీప్రయత్నమునకు మిమ్ముఁ బదేపదే యభినందించుచున్నాను. కాని, యీమహనీయునియెడల మన విశ్వాసమును గనఁబఱచుట కామాత్రపుఁబని చాలదు. మందిరనిర్మాణమునఁ బాషాణముల నుపయోగపఱతురు. సున్న ముపయోగపఱతురు. ఇనుపదూలముల నుపయోగపఱతురు. అంతకంటె గట్టివస్తువులతో మీరు కట్టింపలేరుకదా! రాలకంటె –సున్నముకంటె–నినుముకంటె–శాశ్వతములగు పనుల నాతఁడు జేసినాఁడు. ఆయన చేసిన శాశ్వతకార్యములకు మనము నశ్వరమైన ప్రతిఫల మీయన కర్పించుచున్నాము.

ఆయన రచించిన గ్రంథములలో భగవద్గీతా వ్యాఖ్యానము సర్వోత్కృష్టము. ఇందఱు మహాజను లిచ్చట జేరినారుకదా! మీ యందఱలో నాగ్రంథము నామూలాగ్రముగఁ బఠించినవా రెవ్వరైన నున్నారా! నాలుగువేల జనులలోను నల్వురున్నఁ జాలును. నాయనా! మీరు–నాయనా! మీరు–నాయనా! మీరు–పఠించితిరా? ఎవ్వరును మాటలాడరే! ఒకఁడైన జేయి యెత్తరాదా? సందిగ్ధాంశములని నాకుఁ దోఁచిన నొకటిరెండు ప్రశ్నముల నడిగెదను. ఎవ్వరును మాటలాడరా? పోనిండు. నాయనలారా! బుద్ధిమంతులు. దేశీయగ్రంథకర్తలయం దాదరముకలవారలు. (మేము మూలమే చూడలేదు. వ్యాఖ్యాన మెవఁడు చూచినాఁడు. అను కేకలు) సెబాస్ సెబాస్! బ్రహ్మదేవుని రాణియగు భారతీదేవి యిదిగో పురుష స్వరూపమునఁ బలుకుచున్నది. నాయనా! బుద్ధిమంతుఁడవు. సత్యము పలికినావు. దేశమున కలంకారముగఁ జిరకాలము వర్ధిల్లుము. నాయనా! నాదే తప్పు. భగవానుఁడగు శ్రీకృష్ణమూర్తియందు లేని భక్తివిశ్వాసములు బాలగంగాధర తిలకుగారియం దగపరుపు మని నేను జెప్పుట నాదే తప్పు. తండ్రిని దన్నిన తనయుఁడన్నగారి యడుగులకు మడుఁగు లిడునా? నాయనా! నీవు మూలము చదువవలదు. వ్యాఖ్యానము చదువవలదు. కాని యాగ్రంథమును విమర్శముగాఁ బఠించుటయే యాయనకు సరోపచారము లాచరించుట–అయనను సర్వదాజ్ఞప్తిలో నుంచుకొనుట –ఆయనయందు మీకుఁ గల భక్తిని గనఁబఱచుట. అట్లు మీ రాచరించు నెడల నాయన యాత్మ సంతసించును. ఉద్గ్రంథమును జదువుటకు బుద్ధి కావలయును. ఎవని నెత్తిఁగొట్టియో, యెవని కాలుపట్టియో, యేమాట యాడియో, యేపాటబాడియో, యేయసత్కర్మమాచరించియో, యేసత్కర్మమాచరించియో సంపాదించిన ధనము కావున, నంతయో యింతయో చందాల మూలముగా వ్యయపఱచుచున్నారు. కాని యిపుడు భగవద్గీతా భాష్యపఠనమునకై బుద్ధిని వ్యయపరుపగలరా? వ్యయపఱచుట కది విశేషముగా నున్నదో లేదో, కాక మిద్దెగది యద్దెకో యెట్లు తెలియవచ్చును? మరియొక్కయంశమును జెప్పెదను.

ఆయన షష్టిపూర్తికో మరి యెప్పుడో కాని, యాయనయందు విశ్వాసముగలవారు కొందరు చేరి లక్షరూపాయ లాయన కిచ్చిరి. వెంటనే యాయన యాసొమ్మ్ము నొక్కమినిటులో దేశోపకారమునకై వినియోగపఱచిరి. ఆయన ధనికుఁడు కాఁడు. ధనమునకుఁ ద్యాగమున కంత సంబంధమేమున్నది? త్రిలోకాధిపతి యాచింపఁ గుండలములతోఁబాటు కర్ణముల నిచ్చిన యాతఁడు మహాదాత. అర్థికాలికిఁ దలనిచ్చినవాఁడు మహాదాత. మాంసమును గోసి యాచకుని కిచ్చినవాఁడు మహాదాత. సీతాసంరక్షణకార్యమున నారామచంద్రమూర్తికై ప్రాణము లర్పించిన గ్రద్దకంటెఁ బరమదాత ప్రపంచమున నెవ్వఁడు? త్యాగ విషయమున ధనముమాట మన పూర్వులు చెప్పియుండనే లేదు. ధన త్యాగము మధ్యమపక్షమో యింక నధమపక్షమో? అఁధులోనైన మీ రధికు లనిపించుకొనుచున్నారా? లక్షరూపాయ లెడమచేతితో స్పృశించకుండనైన –దేశక్షేమమునకై యర్పణ మొనర్చిన వైరాగ్య సంపన్నుని–యథార్థత్యాగశీలుని–గౌరవార్థమై యిందరు న్యాయవాదు, లిందరు వర్తకు, లిందరు కర్మాగారాధిపతు, లిందరు పత్రికాధిపతులు చేరి–నూఁడుమూసములనుండి గింజుకొనఁగా ముప్పది యేడువేలరూపాయలు చేరుసరికి మింటఁజుక్కలు కంటఁ జుక్కలు కూడ నూడిపడినవి. ఈమాత్రమునకే

వెరిగుడు వెరిగుడు అని అధ్యక్షు లామోదించుచున్నారు. ఎందుల కీచందాలు? మీరేమియు నీయవలదు. ఆయనయందు భక్తిగలవా రగునెడల నాయనకున్న స్వార్థపరిత్యాగ బుద్ధిని దలపై బెట్టుకొని మన్నించి, పూజించి చేత నైనంతవఱ కవలంబింపుఁడు. దేశీయులు మెత్తురు. దేశాధిష్ఠానదేవత మెచ్చును. దేవుఁడు మెచ్చును. అట్లవలంబించుట కెంత యుత్తమత్వము కావలయును? ఎంత హృదయపరిపాకము కావలయును? ఎంత మహోదారత కావలయును? ఎంత వైరాగ్యము కావలయును? ఎంత పరాహం విభేదనరాహిత్యము కావలయును? ఎంత వేదాంతానుభవజ్ఞాన ముండవలయును? ఎంత యాచరణదీక్ష యుండవలయును? సివిల్ క్రిమినల్ శాసన సాహిత్యముతో సర్వతోము ఖముగాఁ జవుకగా సంపాదించిన సంచులు గనుకనా రెండో మూఁడో వానిలోనివి పాఱవేయుటకు? అందులో నైన మీఘనత యంతగా లేదే! మీ కుత్సాహమున్నది. ఉద్రేకమున్నది. ఉపన్యానమహిమ మున్నది. ఉండవలసినదేదియో యదిమాత్రము లేదు. త్యాగమహిమ? అదియే లేదు. ఎవ్వరో యొక్క ఘనులు మరణింపక మానరు. తోడనే మీరు నడుములు కట్టుకొని యటుతిరిగి యిటుతిరిగి యూరంత తలక్రిందుచేసి వార్తాపత్రికలలో వ్రాసి సభలుచేసి పురమందిరనిర్మాణమని, పాషాణసాలభంజికానిర్మాణమని యువన్యాసపీఠములందెక్క యురిమి యురిమి–అంతే. వర్షపుజల్లు లేదు-డొక్కుడొక్కు లెక్క చుక్కలు–పదిపదునైదుదినము లగునరికి గప్‌చిప్-ఎవరిదారి వారిదే వసూలయి నకొఁది మొత్తము సేవింగ్సుబాంకులోను–వసూలుకానిది కాగితములోను–అంతే. పట్టణ గృహములు లేవు. పాషాణవిగ్రహములు లేవు. ఇటులెన్ని యైనవో! ఏనైనఁ గొన్ని గొప్పమందిరము లీపట్టణమున నిర్మింపఁబడి యుండిన యెడల వానికి వ్యయమైన సొమ్ములో రూపాయ కొండుం గాలణామట్టునకే మీఁది. పదునాలుగణాల తొమ్మిదిపైన లుపై రాజధానులలో వారిది. ఇది మీ వితరణవిశేషము. నిన్నటి యుత్సాహ మీదినమున లేదు. ఈదినమున నున్నది రేపటికుండదు. తాటాకుమంట. అదిగో పసుపు ఇదిగో ముసుఁగు. ఇది కూడ నట్లు చేయక (షేము షేము అను కేకలు) నాయనా! నాకా నీకా? తల్లిపుట్టినిల్లు మేనమామ యొద్ద దాపటీకమా? నే నెక్కడివాఁడను నాయనా! ఈపట్టణమున నెంతకాల ముంటిని. చేటుచప్పుడేదో మద్దెలధ్వని యేదో యెఱుఁగనా? అంత కోపముచే షేము షేము అని యదిలేకయే కదా యనవలసివచ్చినది. అందైన మీదేశాభిమాన మెంత్తో మీదేశభక్తిగౌరవ మెంతయో యొక్క యుదాహరణమునఁ జెప్పుచున్నాను. వినుఁడు.

"నాయనలారా! మీరంద రొక్కసారి నాప్రార్థనలను విసి మైలాపురమువంకఁ జూడుఁడు. అట్లు మొగములు త్రిప్పుటకాదు. మనస్సులు త్రిప్పుడు. పైకన్నులతోఁ గాదు, లోనికన్నులతోఁ జూడుఁడు. (లజుచర్చిరోడ్డు) కడ్డముగా (బ్రాడిసురోడ్డు) కాఁబోలు నున్నది. ఆరోడ్డుపై దక్షిణపార్శ్వమున నొక్క భవనమున్నది. అది పైకి బాగుగానే కనఁబడుచున్నది. దానిగుమ్మమునొద్ద నొక్కమునలియామె నరఁటి పండ్లదు కాణ మున్నది. ఆయావరణమం దొక సోడాదుకాణము గూడ నున్నది. ఇంకను జ్ఞప్తికి రాలేదా? (రనెడీ మెమోరియలుహాలు అని నిమ్నళముగ ధ్వనులు) అదే–అదే –ముమ్మాటికి నదే–నాయనలారా! ఆభవనమువంక నొక్కసారి చూడుఁడు. చూచితిరా? కన్నులవెంట నీటిచుక్కలు లేవేమి? రక్తపుఁ జుక్కలు జాఱవలసిన మహాదుస్థితిలో

నది యున్నదే! ఆహా! (రనెడీ) గారి మెమోరియల్ హాల్–ఏది? బొంబాయిలో నివసించినది (హానరబిలు జస్టిసు మహాదేవగోవిందరనెడీ) గారిదే? ఆలాగుననే యున్నది. అదిగో వారి ప్రతిమ. పై లాజుపై నున్నది. ఇంకను సందేసమా? వారిదే యావిగ్రహము. విశాలమై యెత్తైన నుదురు; నుదిటియెత్తుచే బాగుగ ముందునకు దిగని స్వదేశీయపు కెంపురపగిడీకట్టు, సోగ తక్కువ, వెడలుపెక్కువగల విశాలములగు మెఱిక కన్నులు, పట్టిడేసి మీసములు, బొంరమక్కు, పెద్ద పెదవులు, నిండు బుగ్గలు, కొంచెము వెనుకకాడిన జవునుగడ్డముగలిగి, పులి మొగముతోనున్నయాయన (రనెడీ) గారు గాక మరెవ్వరు? ఎదుటినుండి చూచినయెడల గుడివైపుననున్న స్తంభముమీద నేమున్నది?

The Ranade Library founded by Dewan Bahadur R. Raghunadha Rao, Mr. V. Krishnaswamy Iyer, Mr. P.R. Sundara Iyer and others Foundation Stone laid by the Hon. G.K. Gokhale. C.I.E. Sunday 24th July 1904.

(రనెడీ) గ్రంథాగారము; దివాన్ బహద్దరు ఆర్. రఘునాథరావు, వి. కృష్ణస్వామిఅయ్యరు, పి.ఆర్. సుందరయ్యరుగార్లు మొదలగు వారిచే స్థాపింపఁబడినది. గౌరవ్యులగు జీ.కే. గోఖలే, సి.ఐ.యి గారిచే శంకుస్థాపనము చేయఁబడినది. (24 జూలై 1904 సం॥రము) అని యున్నది. ఆహాహా! ఎంతెంతవారు దానిని స్థాపించిరో, ఎంతవారు శంకుస్థాపన చేసిరో, దిగ్దంతులవంటివారు ధీదార్ఢ్యసంపన్నులు–దేశీయనాయక ప్రముఖు లీ భవనమును స్థాపించిరే! వారి సంకల్పమైనను దీనిని సంరక్షింపలేకపోయినదే! ఇంతకును నిలిచిన దెంతకాలము? 1904లో శంకుస్థాపనము. 1905లో గృహప్రవేశము. 1916లో నాశనము. బాలారిష్టదోషము కొట్టినట్లయినదే. ఆహా! పండ్రెండుసంవత్సరములు మాత్రమే యది బ్రదికినదా! దానిని బోషించిన ఫ్లీడర్ల మహిమచే గాఁబోలు 12 సంవత్సరములకే కాలదోషమునకు లోనైనది. ఎడమచేతి వైపుననున్న స్తంభముమీఁద నేమున్నది?

"The Ranade Library in memory of the Hon. Mr. Justice Mahadev Govind Ranade of Bombay opened by the Hon. S. Subrahmanya Iyer K.C.I.E, officiating Chief Justice, Madras.

అని యున్నది. (బొంబాయిలో నుండిన గౌరవ్యులును హైకోర్టు జడ్జి యగు మహాదేవ గోవింద రానడేగారి జ్ఞాపకార్థమైన రనెడీ గ్రంథాగారము; దీనిని మదరాసు హైకోర్టులో ఛీపు జస్టిసు పనిని తాత్కాలికముగాఁ జూచుచున్న గౌరవ్యులగు సర్.యస్. సుబ్రహ్మణ్య అయ్యరు కె.సి.ఐ.ఇ. గారివలన ప్రజల కర్పింపఁబడినది.) ఎట్లు? బొంబాయి హైకోర్టు జస్టిసుగారి జ్ఞాపక చిహ్నమగు భవనమా? మదరాసు హైకోర్టు ఛీపుజస్టిసుపదవి నలంకరించిన వారిచేఁ దెరువఁబడినభవనమా? మీఁదు మిక్కిలి గ్రంథాగారమగుటచే భారతీ భవనమా! అట్టిదానికే యిట్టి దురవస్థయా? ఇప్పు డా భవనద్వారమున బండ్లాఁగుచున్నవా? మోటారు లాఁగుచున్నవా? భవనమా? భవనమంతయుఁ బాడుపడినదే! భవనద్వారామా? ద్వారము కూడ నున్నదా? చుట్టు గోడయైనలేదే! ప్రజ లిప్పు డా యావరణములోనికిఁ బోవుటలేదా? పోకేమి? పోవుచునే యున్నారు. ఎందులకు? మూత్రవిసర్జనమునకు, బహిర్దేశమునకు. హరి హరి! పవిత్రభారతీభవనమునకు వచ్చినపా

టులా యివి? కాకేమి? దానిని గాపాడుకొనుటకుఁ దగిన దీక్ష దక్షత శ్రద్ధ మనయొద్ద లేనప్పు డేమికాకుండును? అయ్యయ్యో! చిలుకతాటాకు తుప్పలు, యెలుకచెవిరుప్పలు, బళ్లేరుటల్లికలు, బ్రహ్మదండిమొక్కలు, బుడ్డమేడి చెట్టులు, బొమ్మజెముడుకంపలు, ఆహా! ఇవియేనా! రెనెడీగారి భవనముచుట్టును నున్న గులాబులు! గుల్‌షబులు! మల్లెలు! మందారములు! క్రోటనులు! నైటుక్వీనులు! సపోటాలు! జంబూమలకాలు! అయ్యయ్యో! లోన నడుగుపెట్టుటకైన వీలులేకున్నదే! ముండ్లు, గాజుపెంకులు, పెంటకుప్పలు, రాలు, వెంపటికంపలు, జిల్లేడులు, ఉమ్మెత్తలు, పెద్దనేపాళములు, తుత్తురుబెండలు, బలురక్కసులు, బర్రింకలు. అదేమి గన్నేరుచెట్టా! దానిక్రింద నదియేమి! పురుగులతో నిండిన బురదగుంటయే! మంతులాడుకొని పరిపాలన శాసనపండితులగు బారిస్టర్లు వకీళ్లు మొదలగువారుచేరి టీత్రాగవలసిన యాచెట్టు క్రింద బందులు గుంటలోఁ బొరలాడుచున్నవా? ఆహాహా? దేశభక్తి గీతములఁ బాడుచు సరస్వతి తాండవింపవలసిన స్థలములోఁ బందుల ఘుర్ఘురింపులా? జీలుగలమూలుగులా? కీచురాల కూఁతలా? కుక్కల యేడుపులా? హరి హరీ! కాని యదియేమి? వేఁపచెట్టా! కాని దాని క్రిందిస్థలము కొంచెమూడ్చినట్లు కనఁబడుచున్నదేమి? నాయనలారా! కాదు. అది గాడిదలు దొరలినచోటగుటచే నట్లున్నది. శాంతమ్ పాపమ్. గొనుదారులు గౌరవ్యులు పియానో ముందో పేకయాఁట ముందో కూరుచుండి కిలకిలలాఁడుచుఁ గెవ్వుమనుచుఁ బరమానంద భరితులై యుండవలసినచోట ఖరము లోండ్ర పెట్టుచున్నవా? బొలబొలలాడుచు మూత్రించుచున్నవా? ధూళిరేఁగ దొరలుచున్నవా? పందిపెంటలు, గాడిదెలద్దెలు, పక్షులయాఁకెలు, చచ్చినకుక్కలు, పగిలినకుండలు, పాకిపెరళ్లు–రామరామరామ! వీని నడుమ రెనేడీ గారా!

భవనపుగోడలు పగిలినవా? పగుళ్లలోఁ జెట్లు మొలిచినవా? డాబామెట్లు విఱిగినవా? లాజులు కూలినవా? కానిండు. తరువాత మృత్తికాస్నానము లాచరించి ప్రాయశ్చిత్తము చేయించుకొనవచ్చును. లోని కిప్పుడు రండు. ద్వారమంతయు ధ్వస్తమైనదా! అయ్యయో? ఆ గుబగుబలేమి? ఆ రెపరెపలేమి? ఆకేఁచులేమి? ఆతడతడలేమి? అయ్యయ్యో! గబ్బిలములు వేలు. లక్షలు. మఱేమియు భయము లేదు. ఱాగుఁడు ఒక్కనిమునుము. సర్వభయనాశకుఁడై సమీపముననున్న కపాలేశ్వరుని స్మరించుకొనుచు నిలువఁబడుఁడు. పైకప్పులో సగమువఱకు కూలినట్లున్నదా! ఆహా! ఎంత విశాలమైన శాల! సుమారు 16 గజముల పొడవు 12 గజముల వెడల్పున్నట్లున్నది. కాని బల్ల లేవి? కుర్చీలేవి? పుస్తకములేవి? పాడైనవి. భగ్నమైనవి. ముక్కలైనవి. పురుగుగొట్టినవి.. బూడిదయైనవి. బుగ్గియైనవి. అట్లుకాక మిగిలియున్న వానిని దీసి యాగుడిసెలోఁ బాఱవైచినారు. సాయంతమైనది. భయంకరమగు బండిపులుఁ గా వేఁపచెట్టుపైఁ జేరినది. ఇఁక జీమలో, జెర్రులో, తేళ్లో, పాములో, తగినతావు దొరకని విటులో, విటకత్తెలో! కావున వెనుకకు మఱలుఁడు. ఇఁక నీరోఁత చాలును. మీకుఁ జాలును. నాకుఁ జాలును. ముందుఁ బుట్టఁదలఁచినవారికిఁ జాలును. దేశమునకుఁ జాలును.

నాయనలారా! చెప్పితినా? షేము యెవరికో యిప్పుడు గ్రహించు కొందురా? మరణించిన మహాపురుషుల మన్నించుమార్గ మిదియేనా? దేశక్షేమలాభమునకై తమవిద్య

బుద్ధి మెఱదు రక్తము వయసు తమ సర్వస్వమును సమస్తశ్రమములకోర్చి ధారవోసి తనువు త్యజించిన స్వార్థ పరిత్యాగులను సత్క్రియాశూరులను సన్మానించు సరణి యిదియేనా? మీయశ్రద్ధవలన, ననాదరణమువలన, నలక్ష్యమువలన, నజాగ్రత్తవల్లనే యీభవనమున కీదుస్థితి ప్రాప్తించినయెడల నది మహాపచారము కాదా? కృతజ్ఞతాభావము కాదా? నాకుఁ దెలియక యడుగుచున్నాను. పిడుగు పడుటచే నది చెడిపోయినదా యేమి? పదునాల్గుపిడుగులు పడినను బాగుచేయుభారము మీమీఁదనే యున్నది కదా? ఆభవనమును దిరుగ స్థాపింపుఁడు. నేను దేవులాడుచున్నానని మీ రనుకొనవలదు. తిరుగ గ్రంథాలయము నిలువఁబెట్టుఁడని మిమ్ము ప్రార్థింపను. చుట్టు మట్టిగోడనైనఁ బెట్టించినయెడల లెట్రీనుగా నది యుపయోగింపఁబడకుండునే? అదిగో! కల్పవృక్షముల నీడక్రింద దివ్యమూర్తులై వేంచేసియున్న భారతీయవీరవరుల ముక్కులవఱ కీదుర్గంధము వ్యాపింపకుండఁ జేసినఁజాలునే, అట్టులైనఁ జేయరా? మీ మనస్సులకు గాటమైన 'కీ'యిచ్చి గట్టిగా ద్రిప్పి మీభావనాశక్తిని బలతమమొనర్చి స్వర్గలోకమును మీకగపఱచి దానియందుఁ దత్త్వజ్ఞాన తేజస్సంపన్నులై ప్రకాశించుచున్న గోఖలే గారిని రనెడీగారిని మీ కగపరుపఁగలను. అట్లగపఱచుటయే కాక వా రొండొరులతో మిమ్ముఁగూర్చి యిప్పు డేమనుకొనుచున్నారో వినిపింపఁ గలను. ఆసంభాషణము మీరు వినఁదగినదే కాని నే నంతవఱకుఁ జెప్పఁ జాలను. ఇదివఱకే చాలఁ జెప్పితిని. చీఁకటి యైనది. ఇఁక జాలు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

50. వాణీదాసకవి స్వీయచరిత్రము

ఆ రోజు సాక్షి సంఘ భవనంలో, సాక్షి సంఘ సభ్యుడు, కవి, వాణీదాసు స్వీయ చరిత్రలోని పద్యాల్ని పెద్ద గొంతుతో, అక్కడకు చేరిన శ్రోతలకు వినిపిస్తున్నాడు. సభాజనులు చప్పట్లలో ఎగతాళి ధ్వనిస్తోంది తప్ప, వాళ్ల ముఖాలలో అభినందనం కనబడక నిరుత్సాహపడ్డాడు.

దీనికి తోడు జంఘాల శాస్త్రి, అప్పుడా గదిలో జేరిన గబ్బిలాలను బయటకు తోలేస్తూ, కవికి గుండె మండిపోయేలాగ నిరుత్సాహకరమైన, హేళన నిండిన మాటలతో క్రుంగదీశాడు. స్వీయ చరిత్ర ఎవరికి తగును? ఎవరికి తగదు? అనేది వివరించాడు. వచనంలో చెప్పదగిన స్వీయ చరిత్రకు పద్యంలో చెప్పడమెందుకు? అని అడిగాడు.

వాణీదాసు, తాను వినిపిస్తున్న గ్రంథాన్ని కోపంగా నేలకు వేసి కొట్టి జంఘాల శాస్త్రికేసి కొరకొర కోపంగా చూస్తూ బయటకు వెళ్లిపోబోతూంటే, కాలాచార్యులు అడ్డుకొని ఆపి కూర్చోబెట్టాడు. క్రిందపడిన గ్రంథాన్ని చేతికందించి, చదవడం కొనసాగించమని బతిమాలేడు. వాణీదాసు కాసేపు శాస్త్రిమీద వినుర్లు విసిరి అందుకోబోయాడు. జంఘాల శాస్త్రి మళ్లీ ఏదో అనగా, ఈసారి సాక్షి అతన్ని మందలించాడు.

వాణీదాసు ఉత్సాహంగా స్వీయచరిత్ర పద్యాలు వినిపించడం మళ్లీ మొదలు పెట్టాడు. మద్రాసు పురవర్ణన జరుగుతూండగా, జంఘాల శాస్త్రి ఝుం ఝూ మారుతం లాగ విరుచుకు పడ్డాడు. మళ్లీ వాణీదాసుని కవిత్వశక్తిని విమర్శించాడు. మొత్తంమీద, "నువ్వు అధమ కవివి" అని తేల్చాడు. వాణీదాసు ఉగ్రుడయ్యాడు. మళ్లీ ఘర్షణ, మళ్లీ పతనం మొదలు. ఈ గలాటలతో శ్రోతలు, పుస్తకంలో రుచి చచ్చి వెళ్లిపోయారు. జంఘాల శాస్త్రి వాళ్లు వెళ్లిపోవడం సహజమని సమర్థించాడు.

మాసభాభవనము క్రొత్తగావేసిన వెల్లచేఁ దళతళలాడుచున్నది. ఏడుసంవత్సర ములకుఁ బెట్టినదీపముచే జిలజిలలాడుచున్నది. దట్టముగ మూఁగినజనసంఘముచేఁ గలకల లాడుచున్నది. వాణీదానుఁడు స్వీయచరిత్రములోని పద్యముల నుచ్చైస్వరమునఁ జదువుచున్నాఁడు. ఒక్కొక్కపాదమును జదివి సభాసదుల మొగములవంకఁ జూచు

చున్నాఁడు. నిరుత్సాహియై పద్యములలోని తరువాతిభాగమును జదువఁబోయి తొంద రతో, గొంతుకపట్టుతో, నొడలికంపముతో, బాగుగ నాడని యూపిరితో, మఱియొక పద్యపాదమును జదువుచున్నాఁడు. సభాజనుల కరతాళధ్వనులు హేళనమున నెగయుచున్నవి. గది నాశ్రయించిన గబ్బిలములు భయమున నెగురుచున్నవి. కండూతిఖండనోద్దండమగు బొఱ్ఱయ్యనెట్టి యిత్తడిచేతిని బైకెత్తి జంఘాలశాస్త్రులు లేచి గబ్బిలములను గదినుండి పాఱఁదోలుచు నిట్లు పలికెను.

''వాణీదానకవీ! గానమునకుఁ బాములు చేరుట కలదు. మకరందమున కీఁగలు మూఁగుట కలదు. దీపకాంతికి రోకటిబండలు చేరుటకలదు. అదృష్టశాలికి స్తుతిపాఠకులగు నాశ్రితులు చేరుట కలదు. కాని కవిత్వమునకు గబ్బిలములు చేరుట కనలేదు. వినలేదు. అయినను గద్యమున కర్హమైన చరిత్రము పద్యముతో వ్రాయనేల? కల్పనాచమత్కృతి, యలంకారసమృద్ధి, వివిధరసవిజృంభణము, వ్యంగ్యభావాది సంధానచాకచక్యము కావలసిన యితివృత్తమునకుఁ బద్యము తఱుచుగా నావశ్యకముకాని, లోకసాధారణచర్యాకథనసాధన మగు చరిత్రమునకుఁబద్యరచన యేమంత యావశ్యకము? సర్వహృదయాకర్షణచణులైన కాంతాశిరోమణుల కలంకారసౌభాగ్యము రసోద్దీపనసమర్థమగు నంబర విలాసముకాని, సాత్వికసంచారిభావాభావపవిత్రయగు పూర్వానువాసినికి బొత్తాములఱవిక యేల? బంగారుజలతారుచీరొసఁటపై వజ్రపునూదియేల? తలపైఁ బూలతురాయియేల? ముద్దులొలుకు భావములు వెల్లడింపఁగల జావళికి రాగతాళములుకాని చాఁకిరేవుపద్దునకుఁ జంపకమాల యెందులకు! కృష్ణభగవానునిలీలలను భక్తహృదయముల నెక్కఁజేయుటకుఁ బ్రబంధరచన తగునుగాని కోమటి 'చిత్థ' కది తగునా? నీవేమి మహాభక్తుఁడవా? అవతారపురుషుఁడవా? మహాజ్ఞానివా? మహారాజవా? మదరాసులోని యచ్చుశాలలో నక్షరసంధాన మెనర్చిన నీబ్రదుకునకు మొదలు చరిత్రమెందులకు? తనచరిత్ర మితరులు వ్రాయఁదగిన వానికిఁగదా స్వీయచరిత్రరచనావశ్యకత? పోనీ! ఏదియో వ్రాసితివి. అది జాత్యుపజాతివృత్తభేదములతోఁ దలఁగొట్టు కొని వ్రాయనేల? విష్ణుసహస్ర నామసందోహనంధానమునకు హృద్యపద్య విరచనమర్హముకాని కాకినాడ తాలూకాబోర్డు ''వోటర్లు'' జాబితాకది తగునా? పద్యముల కర్హములగు నంశములు కూడ ననేకవిధ గమనచాతురీనమేతమైన యశ్వరాజపుధాటిగల గద్యముతో వ్రాయవచ్చును గాని, గద్య మావశ్యకమైన కథను బద్యములతో నెన్నఁడైన వ్రాయతగునా? ఆహారనిద్రాది నిత్యదినచర్యానమయమున మహారాజునకైన మకుటాంగదమౌక్తికమాలాధారణము నమంజసమగునా?–భార్యప్రక్కలో ''చోపుదారు'' కట్టులతోఁ బండుకొన్నప్రభుఁ డుండెనని వింటివా?''

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించుచు నుండఁగా వాణీదానకవి మహాకోపమున స్వీయచరిత్రకోశమును నేలనుగొట్టి లేచి, శాస్త్రివంకఁ గొఱకొఱఁ జూచి సభను విడిచిపోవ నుద్యక్తుఁడయ్యెను. అంతఁ గాలాచార్యు లడ్డుతగిలి, కవిని బట్టుకొని మఱలఁ గూరుచుండఁ బెట్టి, క్రిందఁబడిన గ్రంథమును దీసి యాతనిచేతఁ బెట్టి ''జంఘాలశాస్త్రిమాటలతో నేమి? అవి యేమి సిద్ధాంత వాక్యములా? అభిప్రాయభేదము లుండవచ్చును. గ్రంథమును కాని''మ్మని బతిమాలుకొనెను. వాణీదానుఁడు శాస్త్రివంకఁ జూచి పండ్లుకొఱుకుచు ''షండునియొద్ద స్త్రీవిలాసమా? ముక్కిడిముందు పొగడపూలదండయా? పాషండునియొద్ద బ్రహ్మసూ

సూత్రమా?పోపో!నీయొద్దఁ గవితానివేదనమా? అట్లుకట్టుకుఁ బెసరటరుచి తెలిసినప్పుడు –ఆనపకాయకు వీణాగానమాధురి తెలిసినప్పుడు–నంపుటమునకు సాలగ్రామమాహాత్మ్యము తెలిసినప్పుడు–అడ్డబాన కధరసుధచవి తెలిసినప్పుడు నాకవితావిశేషము నీకు తెలియును'' అనెను. ''ఒక్కనాకే కాదయ్యా! లోకమున కని సెలవీయఁదగు'' నని జంఘాలశాస్త్రి యింకేమో చెప్పఁబోవుటకు లేచుండఁగా సాక్షినగు నేను శాస్త్రిని మందలించి కవిని గ్రంథపఠనమునకుఁ బురికొల్పితిని. ''స్వీయచరిత్ర చదువక తప్పదు. మేము దానిని వినఁదలఁచితి'' మని సభాజనములు కొంద ఱనునరికిఁ గని యుత్సాహపూరితుఁడై జదువ నమకొల్పిను. ''పాపము! కవియగువాని కేమికావలయును? ధనమా? ఆవ్రాత బ్రహ్మ యాతని నెత్తిపై వ్రాయనే లేదు! రాజ్యమా? ఏరాజున కంత రాజసమున్నది? అంత సింహాసన మున్నది? అంత ప్రజానమ్మిడి యున్నది? అంత రాజ్య మున్నది? అంత వాడిగల ఖడ్గమున్నది? ఆతనికి జ్వరితునికివలె భోజన మక్కఱలేదు. పిచ్చివానికివలె, పిపీలికకువలె నిద్రయైన నక్కఱలేదు. ఆతనికిఁ గావలసిన దొక్కటియే యున్నది. న్యగ్రంథస్తుతి తప్ప మఱేదియు నాతని కక్కఱలేదు. దానితోపాటు పరగ్రంథనిందకూడ నున్నయెడల నింకఁ గావలసినదేమి? వహవ్వా! ఆవడలలోఁ గొత్తినిఱెపు గమగమ యున్నట్లు పానకములో మిఱెప్పుఁబొడి చురుకున్నట్లు ఆగాలి యున్నంతసే పాతని కాకాశగమనము–అదిలేనియెడల నధఃపతనము–ఆతఁడు వట్టిగాలితిత్తి'' అని నాలో నే నేదియో కప్పదాటులుగా ననుకొను చుండ నంతలో మదరాసు పట్టణవర్ణనముతోఁ జేరిన పద్యముల నాతఁడు చదువనారంభిం చెను.

''గీ. మైలపురకపాలేశు మా రేడుదళము
ప్రీతిఁ దలనుంచి సావుకా ర్పేటఁ విడిచి
పోయి యే కామ్రవిభుని విభూతి నొసట
ననిచి యటఁ గందనాథునందిని స్పృశించి
తిరువళిక్కేణి తేరువీథిని వసించు
పార్థసారథిదోసె గర్భమునఁ బెట్టి
యంతికపు మాధ్వమఠమునరుగుమీఁద
నొడలు సేరిచి కాలంబు గడపుచుంటి.''

ఈపద్యములు చదిసి ప్రజాశిరఃకంపనములకై సభవంక నాతఁడు చూచినాఁడు. కొందఱు తమలోఁ దాము వర్షములు వెనుకపట్టుటను గూర్చియు, గేదెపాల చిక్కఁదనము గూర్చియు, చేబ్రోలు పొగాకు గాటునుగూర్చియు, గోదావరి పుష్కరముఁగూర్చియు, నెల్లూరు నెఱజాణలనుగూర్చియు, సేనపల్లి లంకచెప్పుజోళ్లఁగూర్చియు నింక నేమేమో చెప్పుకొనుచుండిరి. మఱికొందఱుమాత్రము వారిధర్మమా యని శిరఃకంపనములు చేయు చునేయున్నారు. కాని కవితాభిరుచివలనఁగాదు–గోడకునికిపొట్లవలన; మఱికొందఱు కప్పున కంటిపట్టుకొన్న గబ్బిలములను లెక్కపెట్టుచుండిరి. వీ రిట్టికవితా నైరాగ్యస్థితినుండఁ జూచి కవి నిరుత్సాహి యయ్యెనుగాని సభలోనుంచి యొకరు ''కవివర్యా! మీరివ్వుడు చదివిన వద్యములు బాగుగనే యున్నవి కాని, వానిలో రాజధానీ ప్రధానపట్టణవ ర్ణన మంతగ లేదే!'' యవి వలుక వంతలో పాపము కవివర్యా యను పేరు విని చేటయంతమొ

గము చేసికొని వాణీదాసుఁడు పునరుత్సాహపూరితుఁడై ''నాయనలారా! ఉండుఁడు. తొందరపడకుండుఁడు. చదువుచున్నాను'' అని బిగ్గరగ వచించి, ''ఆలాగున తీయనీటికిఁ జేప యెక్కిన ట్లెక్కువలయు'' నని జంఘాలశాస్త్రి వినునట్లుగాఁ దనలోఁదాను గొణుగుకొనుచు నిట్లు చదువఁదొడఁగెను.

''సీ. కూమమహానది క్రుళ్లులోఁ గ్రుళ్లు-ము
క్కిచ్చిన యజుని ది ట్టించుచుండ
దోమలు చెనిఁ జేరి యాముదంబును ద్రాగు
మని వింతయష్టాక్షరిని వచింప
పూటకూటిండ్లలో మొదలును దుదయైన
సొంబారుచే శక్తి చచ్చుచుండ
బోదకాళులతోడి బీదయాచకులఁ గాం
చినలోనె గుండెలు చెదరుచుండఁ
గీ. బలుకఁగూడని రోఁతల వలన మనసు
గగుఱుదేఱఁగ మదరాసు కాపురంబు
సత్యపురసాక్షిసంఘసం స్తంభనమునఁ
జలుపనయ్యెఁ బ్రమాదివత్సరమునుండి.''

అంతలో జంఘాలశాస్త్రులు నగిలించుచు గొంతు సవరించుకొనుచు నాంగ్లేయదేవాల యగోపురఘంటాకారమున ఝంకరించెను. ''వర్ణనము మదరాసువర్ణనము! ఎంత శ్రార్ధయోగ్యముగనో యున్నది. మహానుభావుఁడవు. మహాకవుల నందఱఁ జంపి పుట్టినవాఁడవు. సరస్వతి–నిర్భాగ్యసరస్వతి–ఏగురుచండాల యోగముననో, ఏకాలసర్ప యోగముననో, ఏయేలి నాటిశనిమాహాత్మ్యమునననో నీనోటఁ బడినది. సాగఁదీసి నీసపద్యమును జెప్పినంతమాత్రమున వస్తువర్ణనము పూర్తియైనదని నీయభిప్రాయము కాఁబోలు! మాటలచే వర్ణ్యవస్తువు నెదుటఁ బెట్టవలయును. జుట్టు మెలికవేసి యీడ్చి తెచ్చి యావస్తువును దృగ్గోచరమగునట్లు చేయవలయును. జిలజిలలాడుచు మిలమిలలాడుచు స్వస్వరూప స్వభావములతో దానిని బ్రత్యక్షమగునట్లు చేయవలయును. చిత్రకారుని పని రంగులతోడనే సరిపోవును. రంగులలోని లేత ముదురుపాకములు–కొన్నికొన్నిరంగులు కొన్నికొన్నిభాగములతో మేళవించిన సొబగులు–మఱికొన్నిరంగులు-సమీపస్థములగు మఱికొన్ని రంగులలోఁ బ్రతిఫలించి ప్రకాశించు నైఖరులు–అన్నిరంగు లన్యోన్య సమావేశమున సంభవింపఁజేయు సంక్షిభూతమైన వ్యక్తివైచిత్ర్యములు–మొదలగునవి చిత్రకారుని యొంటివెం ద్రుకకుచ్చిన కధీసములు. పాషాణ పాంచాలికాకారునిప్రజ్ఞ కేవలము స్వరూపముతోడ మాత్రమే పర్యవసాన మొందును. స్వరూపములోని ముడుతలు, సొపులు, పల్లములు, నెత్తులు, కండలపుష్టులు, నరములయుబుకులు, దిబుకులు, శిల్పకారుని యులికి నుత్తెకు నధీనములు. కాని కవిచేతిలోని బాతుటీకెకు నర్థము రూపము ప్రాణము స్వభావముకూడ కొంతవఱకైన విధేయములు. X'rays కంటెఁ గవికలము తీక్ష్ణతరమైనది. లోనున్న మజ్జా మాంసములు అస్థిమూలుగుగూడ దూసిపోయి ఇంకను లోపలనున్న మనస్సును–గవికలము బైటఁ బెట్టును. పోనీ! అంతదూరపుమాట లెందులకు? మదరాసుస్వరూపమునైన నీవు

తిన్నగ వర్ణింపఁగలిగితివా? కూమునదియని దోమలని రోఁతలను మాత్రమే చెప్పితివి. దోషములనుమాత్రమే యుగ్గడించితివి. గుణదోషములను రెంటిని జెప్పకుండినయెడల నది వస్తువు నెల్లు స్మరింపఁజేయఁగలదు? కేవల దోషయుక్తమైనవస్తువునుగాని, కేవలగుణయుక్తమైన వస్తువునుగాని నీ వెటరైనఁ జూచితవా? ఇదియేనా నీ ప్రకృతిజ్ఞానము? వెలుతురు నీడయుఁ గలిసినఁగాని వస్తుస్వరూపసిద్ధియే లేదని గ్రహింపలేని ని న్నేమనఁదగును? నీయెంటికంటి బొమ్మలు నీపక్షపాతప్రతిమలు యథార్థవస్తుప్రతిబింబములే యనుకొనుచుంటివా? నాకే కవితాశక్తియున్నయెడల మదరాసును నేను నీవలెనే వర్ణింతునా? సముద్రపుహోరుతో–త్రిభుజ చతుర్భుజ షడ్భుజాష్టభుజవర్తుల గోపురములతో–కర్మశాలలయందలి పొగనుగ్రక్కుపొడుగు గొట్టములతో–నడుమ నడుమను జెట్టిపోతులవలెఁ బరుగులీడు ధూమశకటములతో–నంతరిక్షమందలి విద్యుత్తంత్రులతో–క్షోణీకుక్షినిక్షిప్తములగు జలనాళములతో కాఫీదుకాణములలోని పదార్థముల గమగమలతో–పూలయంగడులలోని గుమగుమలతో విపణులలోని రత్నముల మిలమిలలతో–కాసులడాలర్ల గలగలతో–విద్యుద్దీపముల మెఱుపులతో–వేఱువేఱురంగుల జెండాల యెఱుపులతో–మటికొన్నిటితో–మటిమటి కొన్నిటితో, ఇండ్లలోని, వీధులలోని, యాఱులక్షల జనసంఘ సంబంధములగు నవ్వులతో, నేడ్పులతో, జననములతో, –పెండ్లిండ్లతో–బ్రేతకర్మములతో–శృంగారచేష్టలతో వైరాగ్యవృత్తులతో–జాత్యంతర్జాతి మహాజన సభలతో–నూతనమర్యాదలతో–దొంగ నైచ్యములతో –మొలిచినట్లు కన్నులుపొడిచినట్లు తేజస్వంతములగు మాటలతో మదరాసు పటమును పక్షిచూపునఁ జూచి గీఁచి నీయెదుటవైచి మదరాసునే నీవు చూచునట్లు వినునట్లు మూర్కొనునట్లు దానిలోఁ దిరిగినట్లు చేయలేక పోవుదునా! సత్యపురమునుండి రైలు కర్చక్కఁజేయకుండ మనవారి నందఱను మదరాసు చేర్చకుందునా! నాశక్తి లేదుకాని యిప్పుడైన నీవలె నధమమైన కవిత్వమును–'' జంఘాలశాస్త్రి యింక నేమేమో చెప్పబోవుచుండఁగ వాణీదాసుఁడు గ్రక్కోపుఁడై యిట్లు పలికెను. ''శాస్త్రీ! ఇంకఁ బ్రేలకుము. నోరు గట్టిగ మూసికొనుము. నీ విమర్శన శక్తినిగూర్చియు, నా కవితాశక్తినిగూర్చియు నెఱుఁగనివారు లేరు. నేనట్టి నోరు చేసికొనక యూరకుంటినని మీఁదిమీఁదికి వచ్చుచున్నావు. సాక్షిని జూచి యూరకుంటిని. వెనుక నిళ్లే మన మిద్దఱము రెండుసారులు కలహ మాడఁగ సాక్షి నిన్ను నన్నుఁగూడ మందలించినాఁడు. నీలెక్క నాకేమియు లేదు. నేను నీకొఱకుఁ జదువుచుండుట లేదు. గొడిదెచెవికై గానము చేయువాఁడనుగాను. పందిముట్టికు ముత్తెముల నందిచ్చువాఁడును గాను. కోఁతిమెడను గుసుమమాలఁ బెట్టువాఁడను గాను. ఈసభలో సాక్షి మొదలగు సరసులుంటచేఁ జదువుచున్నాను. గ్రుడ్లగూబ సూర్యకాంతిని నిందించినయెడల సూర్యునికెంత లోపమో, నీవు నాకవితను దూషించినయెడల నా కంతలోపము.'' అని యాతఁడనుసరికి ''అయ్యా! వృథాకాలక్షేప మేల? చదువ రాదా?'' యని యాసభలో నెవ్వఁడో యనఁగ, ''ఈగడ్డి శాస్త్రినోటఁ బెట్టు'' మని కొంత యస్పష్టముగా సణగుకొనుచు వాణీదాసుఁడు కొంత యుత్సాహముతో నిట్లు చదువనారంభించెను. ఇంకను మదరాసువర్ణన ఘట్టములోనే యున్నాఁడు.

''గీ. ఎట్టియిటుకలభవనంబు లెన్నొ, యేక
శూలపుఁదురకబోడిగు మ్రిల నెన్నొ

కాకిరెట్టల కలుకని కంచు నరుల–
నెందఱనో కాంచి యానంద మందినాఁడ.
పశ్చిమార్కుని కాంతిచే వార్ధినురుగు
బంగ రగుచుండ, నడుమను బ్రజ్వలించు
కెంపురా సొంపుగలమేడ లింపునింపు
నదె! త్రికాలజ్ఞులైన వే దాంతులట్లు.

''సీ. కన్నడి 'తై' ర్వాని మిన్నుముట్టిన కీచు
''మోటార్లు' మొఱకుఁ బై పాటుఁ బాడ
మనుజునిపన యింతె యని 'జెట్కా' గుఱ్ఱంబు
'రిక్ష' వానిని వెక్కిరించుచుండ
ఎంగిలాకుల నారగించి గోవులు కుంభ
వృష్టి 'కొళ్లా' తీర్థ మిచ్చుచుండ
వాడ కేఁబదుగురు వైద్యావతారముల్
కృప జనాభాను త గ్గించుచుండ

గీ. పెండ్లిపల్లకి నూరేగు ప్రేతతతికి
ముందుగలగంట 'ట్రాం' బండ్ల ముందుగంట
నపహసించుచు నుండఁగ నతిశయిల్లు
నవ్యసౌభాగ్యభరము చె న్నప్పపురము.''

'వన్సమోర్ వన్సమోర్' అని సభలో నిద్దఱు ముగ్గురు చప్పటలు చఱచి కేకలునైచిరి. ఇందువలన నిద్రాభంగ మొందిన సభాస్తారులు ఉలికిపడి ''ఎందులకయ్యా! ఒక్కటేగోల చేసెదరు? సుఖముగాఁ గిక్కురు మనకుండ వినరాదా?'' యని విసుగుకొనుచుఁ జీకొట్టుచులేచి నిలువఁబడి యొడలు విఱుచుకొనుచు తిమ్మిరియెక్కిన కాళ్లు నేలనడచుచుఁ బాదరక్షలకొఱకుఁ జేతికఱ్ఱలకొఱకు వెదకుకొనుచు 'ఏమోయనుకొని వచ్చితిమి. ఇంతయేనాపన?' యని నణగుకొనుచు దాదాపుగా నందఱు సభాభవనమును విడిచిపోయిరి. వాణీదాసుఁడు బిక్క మొగము నైచుకొని తలవంచుకొని కవితాకర్ణపుష్ప మని పేరిడిన స్వీయచరిత్రము కంసాలిగొట్టమంత సన్నముగాఁ జుట్టి యెడమచేతఁ బట్టుకొని నిట్టూర్పు విడుచుచు, క్రీగంట జంఘాలశాస్త్రివంకఁ జూచుచుండఁ దడాలున శాస్త్రి లేచి యుపన్యానపీఠమెక్కి యిట్లు పలికెను.

''వెడలిపోరా? ఏల వచ్చితి మని లెంపలుపైచుకొని వెడలిపోవరా? ఏడు సంవత్సరము లకు 'సాక్షి' సంఘము తిరుగ స్థాపించినప్పుడు మొదటియుపన్యాస మెంత సుందరమైన దుండవలయును? ఎంత జనాకర్షణసమర్థమైన దుండవలయును? ఎట్టి మనోహరవిషయ మును గూర్చిన దుండవలెను? స్వీయచరిత్రమా మనకు దొరికిన విషయము? నే నీనడు మను జేసిన గోనెనంచుల వ్యాపారముగూర్చి చెప్పినయెడల నింతకంటె సొగసుగ నుండునే! సాక్షిసంఘసభ్యుల సంసారపుగొడవ లాంధ్రదేశమునకుఁ గావలయునా? ఎవరి సొంతగొడవ వారికే తలమున్కలైయుండ మన సొంతగొడవ లెవఁడు వినును? భాషాభక్తుఁడగు శ్రీనువర్మ

లేఖాధిపతి పుణ్యమా యని యెన్ని సాక్షులో మొదట్ర బ్రకటించితిమి. కాని యెన్నఁడైన నిట్టిదానిని బ్రకటించితిమా? అట్టి సాక్ష్యభిరుచి జననంఘమందు నిలువఁబెట్టవలయును. క్రమక్రమముగా వృద్ధిఁబొందింపవలెను. సాక్ష్యుపన్యాస మెప్పుడు వచ్చునాయని మనసోద రులు మహోత్కంఠచే నుండునట్లు చేయఁ ద్రికరణశుద్ధిగాఁ బ్రయత్నింపవలయును. మా కిష్టమూర్తియగు సూర్యభగవానుని స్మరించి పైసారినుండి యుపన్యాసకార్యదీక్షను నెఱపెదము. పరమేశ్వరుఁడు మాకుఁదోడ్పడుఁ గాక!

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

51. స్వీయచరిత్రావశ్యకత

సాక్షి సంఘంలో, ఒక్క సాక్షి తప్ప, మిగిలిన ముగ్గురూ 'ఇన్‌ఫ్లుయెంజా'ను పోలిన ఏదో విచిత్ర జ్వరానికి గురయ్యారు. వారూ వీరూ అని లేకుండా అందరినీ చుట్టబెడుతోంది.

కాలాచారి అంటుకొన్న పెంకుటిల్లులాగ తపిస్తున్నాడు. వాణీదానుకి 104° వరకూ జ్వరం ప్రాకింది. దానికి తోడు వెర్రులలో కెల్లా వెర్రి, స్వకవితాభిమానం ముదిరింది. వైద్యుణ్ణి కొట్టాడు కూడా. జంఘాల శాస్త్రి జ్వర తీవ్రత వల్ల సన్నిపాత తీవ్రత తగిలి రాట్నపు గీతాలు పాడుతున్నాడు.

అంతా ఈ అవస్థల్లో వుండగా సాక్షి ఈ పరిస్థితి తన శ్రోతలకు విన్నవించిన అనంతరం వాణీదాసు తాను రోగం నుంచి బయటపడినందుకు సంతోషించుకుంటూ, స్వీయచరిత్రల గొప్పతనం గురించి, వాటి అవసరం గురించి ఒక ప్రసంగం చేశాడు. ప్రాచీన కవుల ఇష్టానిష్టాలు, వేషభాషల సంగతి మనకి తెలియక పోవడం సంగతి అలా వుంచితే– ఈ శతాబ్దికి చెందిన, గౌరవింపదగిన మహనీయులైన తెలుగు వారి గురించి ఎంత మందికి తెలుసునని ప్రశ్నించాడు. పోనీ, ఆయా వ్యక్తుల చరిత్రలు వ్రాయడానికి సామగ్రి సేకరించడం కష్టమంటే, ఇన్ని గ్రంథాలయాలలో, పాఠశాలల్లో, తాళపత్ర గ్రంథాలయాల్లో వారి వారి చిత్రపటాలైనా లేవే! జమీందారుల సందర్శన శాలల్లో పరదేశీయుల చిత్ర పటాలుంచడంపై చూపే శ్రద్ధ, స్వదేశస్థుల్ని మన్నించడం పట్ల, కనపడదే! అని వాపోయాడు. అతని ప్రసంగం ఆగడంతో, సాక్షి కలగ జేసుకొని ఒక వంద సంవత్సరాలలో ఆంధ్ర దేశాన్ని అలంకరించిన కవుల చరిత్ర ప్రకటించడానికి చెలికాని లచ్చారావు గారి ప్రయత్నం గురించి వివరించాడు.

దాదాపుగా నొక్క మానము దినములనుండి సాక్షిసంఘమున నాకుఁ దక్క నందఱకు శరీరముల స్వాస్థ్యము లేకుండ నున్నది. రివాల్వరు పిస్తోళ్లలో నాఱుప్రేత లుండుసరికి మిగుల గొప్ప, కాని సంఘపువారి జోడునాళపు ముక్క లొక్కవరునగా నొక్కొక్కప్పుడు పదిపండ్రెండు ప్రేతలవఱకు వేయుచున్నవి. శ్వాసకోశకుహరాంతరము లనుండి కణేల్కణేల్మను పొడిదగ్గులు గాఁబోలు తుపాకిప్రేతల ప్రతిధ్వనులుగాఁ బరిణమిం చుచున్నవి.. ఎంత దడబిడలు గడబిడలు, నెంత షాన్‌షాకులేకుండ జ్వరదేవత దండయాత్ర

వెడలునా! అందులో వేనవికాలమందలి శీతజ్వరదేవతామాహాత్మ్య మదుగవలయునా? చలిచే గడగడ–తాపముచే దడదడ–కన్నీరు జొటజొట–ముక్కు–చివర పెడీ–నాలుక చివర నోకు గొంతుకలో నమ్మెటదెబ్బ–నడుములో విలవిల–కాళ్లలో జిలజిల–కడుపులో భగభగ– ఈజ్వ రములకు ఇన్‌ఫ్లుయెంజా లక్షణము లనేకములు గలవు. నడుమునొప్పి, కాళ్లనొప్పి, రొంప, దగ్గు, తుమ్ములు శిరోవ్యధ మిగుల నీరసత మొదలగు లక్షణములచే నిది ఇన్‌ఫ్లుయెంజా యేమో యని సందేహము కలుగుచున్నది. ఇంటిలో నొక్కనని స్పృశించి యూరకుండక ఇది నిష్పక్షపాతకముగా నందఱను జుట్టుబెట్టుచున్నది. ప్రాణాపాయములుమాత్రము తఱ చుగాలేవు. జ్వరమారంభించినప్పడినుండి జ్వరవిమోచనమువఱకు లంఘనములుండు టయే దీనికి మొట్టమొదటిచికిత్స–మూడు శుష్కోపవాసములతో జ్వరము నివర్తించును. దగ్గుమాత్ర మొక పదిదినములవఱకు బాధించును. ఆదినములలోని శక్తిహీనతయు సాధారణ ముగా నుండును. మందు సేవించిననరే సేవింపకపోయిననరే–కాని లంఘనముగాని బాలవృ ద్ధుల విషయమై లఘ్వాహార ప్రశనముకాని తప్పదు. ఇది దాదాపుగా నందఱయిండ్లలో నున్నది. ఈచుట్టుపట్టుల దాదాపుగానున్న గ్రామములలోఁ గూడ నున్నది.

మొదలే బొజ్జముక్కు అందుపై ననంతమైన యనుపమానమైన యనాఘాటమయిన నస్యసేవాదీక్ష – దానిపై రొంపభారము–అందుపై జ్వరమునుగల కాలాచారి యంటుకొన్న పెంకుటింటవలెఁ దపించుచున్నాఁడు. కణుపుకణుపునకు గభీ యనుచున్నాఁడు. మేకుమేకు నకు ఢామ్మనుచున్నాఁడు. ఆతనియొద్ద నిలుచుట కెవ్వరికిని శక్యముకాకుండ నున్నది. వాణీదాసుఁడు జ్వరపీడితుఁడై యిప్పటికిఁ దేలినాఁడు. ఆతనికి 104 డిగ్రీలవఱకు జ్వర మెగఁబ్రాఁకినది. ఆతని కాంగ్లేయ వైద్యమందు నమ్మక మెక్కువ. ఆంగ్లేయవైద్యపద్ధతి బాగుగా నెఱిఁగి యుండుటచేత నాతని కట్టి నమ్మకము కలిగియుండలేదు. జంఘాలశాస్త్రి కావైద్యమునం దభిమానము లేకపోవుటచేత నాతనికి దానియం దట్టి విశ్వాసము కలిగినదని యెంచవలసియున్నది. అత్తగారికిఁ జల్లపులు సిష్టము కాకపోవుటచేతనే కోడలి కది ప్రాణము. సాధారణముగా మనుష్యుల యిష్టానిష్టములకుఁ గారణము లగపడవు. అందులోఁ గవ్వ యిష్టానిష్టములకుఁ గారణములఁగూర్చి యెవఁడు చెప్పఁగలడు? మేవిళ్ల యిల్లాలికి వేపగింజ బెల్లపుముక్క–చింతపండు జీలుగుబెండు–తాత్కాలికరుచి వ్యత్యయతగల చూలాలియెడలనే యింత విరుద్ధత కానఁబడునప్పుడు శాశ్వతముగా మనస్సు వ్యత్యస్తమైన కవియెడల నది యెంత విరుద్ధమో చెప్పవచ్చునా? ఆతనిఁ జూచుట కాంగ్లేయవైద్యుఁ డొకఁడు వచ్చి యాతనిప్రక్కనై గూర్చుండి ప్రేళ్లతో హృదయముచూచి, చెవులతో గుండెలుచూచి, కంటితో నాలుకచూచి నేను చెప్పిన యంశములన్నియు విని 'కటికలంఘనము' బాగుగా నున్నది కాదని నావంకనుజూచి యాయుర్వేదవైద్యపద్ధతిని గొంత నిరసించెను. ''గాడిదె కొడుకా! కంకిణబంధము బాగుగా నున్నదికాదా''యని వాణీదాసుఁడొక్క లెంపకాయనా వైద్యు నీడ్చికొట్టెను. స్వకవితాభిమానముగూర్చిన వెట్టి యన్ని వెట్టులలోను వెట్టియగు నది. శుద్ధకృపణునకు సంతానాదినష్టివలనఁ గార్పణ్యము వదలవచ్చును. పరమపాపాత్మునకైనఁ బ్రాణోత్క్రమణ సమయమునఁ దనువుపై నభిమానము–ధనముపై వాంఛ–తరుణిపై మక్కువ–పాపకార్యమునం దాసక్తి వదలిపోవచ్చును. కాని చచ్చిన తరువా తనైనఁ గవికిఁ బరకవితానిందాసహితమగు స్వకవితాభిమానముపోదు.

జంఘాలశాస్త్రి జ్వరశయ్యపై బండుకొని సన్నిపాత తీవ్రతచే రాట్నములపై గీతములఁ బాడుచున్నాఁడు. వట్టిచేతులతోఁ బట్టుసాలునూ లొడుకుచున్నాఁడు. ఆతనిని జూచుట కొక యాయుర్వేద భిషజ్మణి వచ్చినాఁడు. ఆతఁడు 'శాత్తను' జాతిలోనివాఁడు. నూతనముగా నాయుష్కర్మ మొనర్చుకొని వచ్చి యాతనిప్రక్కపై గూరుచుండి తలపై నున్న పాగఁ దీసి యటఁబెట్టి యాతని నాడి పరీక్షించుచున్నాఁడు. అంతలో జంఘాలశాస్త్రి యులికిపడి మబ్బుకన్నుల నావైద్యుని జూచి ''ఓనారీ శిరోమణీ! నీ వందలు కాంతలకంటఁ గృతార్థురాలవు. దేశభక్తి పురస్సరముగా నీతోడిపూఁబోడులు కాసులపేరులు, దుద్దులు, కంకణములు, నాగరములు త్యాగమొనర్చియుండగా నీవు–సెబాస్-శీతాంశుముఖీ! నిలువు దోపుగఁ దలనంతయు నర్పించినావు. మహారాజునెత్తిపై గిరీటముకంటె దేశభక్తునిచేతిలో రాట్నముకంటె నీతలపై నవతరించిన బోడితనము నీకు మహాలంకారముగా నుండుటయే కాక దేశమున కంతకును బోడితన మబ్బఁజేయునట్లున్నది.'' అని యావైద్యునితోఁ బలికెను. నాయనలారా! సంఘస్థితి యిట్లున్నది. ఏమని చెప్పుదును?

ఇట్లు పలికి నే నూరకుండగ వాణీదాసుఁడు దగ్గుచు లేచి యిట్లు పలికెను.

''ఆర్యులారా! నేను దైవకటాక్షమున రోగవిముక్తినొందితిని. నేను మరణించిన లోకమున కంత నష్టి లేదు. (సత్యము సత్యమని సభలోఁ గేకలు) నాజీవచరిత్రమును నేను వ్రాసికొనియుండుటచేత నేను లేకున్నను దానినిగాంచి నన్నుఁ జూచినట్లే ప్రజ లానందింపఁ గలరు. కాళిదాసెట్టివాఁడో మన కేమైనఁ దెలియునా? ఆతఁ డే యాకృతికలవాఁడో యేరంగుకలవాఁడో, యేకంఠరవముకలవాఁడో, యేరుచులుకలవాఁడో, యేయనిష్టతలు కలవాఁడో, యేకొనవెట్టిగలవాఁడో యేమైన మనకుఁ దెలియునా? వానిగ్రంథములవలన నవి యన్నియుఁ దెలిసికొనుట కేమైన నవకాశ మున్నదా? మన మొక గ్రంథమును జదువనారం భింపగనే యాకవి గుండ్రమొగమువాఁడో, కోల మొగమువాఁడో, తొట్టవేయువాఁడో తెలిసికొనుటకు మన మనస్సుమిగుల నువ్విళ్ళూఱును. ఇప్పటి ఛాయాపటము లాలోప మును గొంత నివారణచేసియుండవచ్చును గాని స్వీయచరిత్రమునలెఁ బిత్ర విత్రములగు సంగతులు చెప్పఁగలవా? పొట్లకాయకూడ కవి కిష్టమని పుస్తకము చెప్పఁగలము కాని ఫోటోగ్రాపు చెప్పఁగలదా? కారప్పుగిల్లీ కవి కిష్టమని స్వీయచరిత్ర చెప్పఁగలదు కాని ఛాయాపటము చెప్పఁగలదా? లేనప్పు డుడఁదలఁచినవాఁడు, చచ్చినతరువాత బ్రదుకఁదలఁ చినవాడు స్వీయచరిత్రము వ్రాసికొనక తప్పదు. స్వీయచరిత్ర మనుసది పద్యములతో నుండఁదగును గాని వచనమున నుండఁదగదు. కవి యగువాఁడు గద్యరచనకుఁ బూనుకొనఁ గూడదు.

అల్లసానిపెద్దన నార్యుల స్వరూపస్వభావాదులు మనకుఁ దెలియకపోవుట యింతయేమి? ఈనడుమ గతించిన కవులగూర్చియైనను సమగ్రములైన యంశములు మనకుఁ దెలియునా? కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు కీర్తిశేషులైరి. అయి యెంతోకాల మైనదా? లేదు. పదునైదేండ్లకుఁ దక్కువయై యుండునేమో? మనలో ననేకు లాయనను జూచికూడ నున్నారు. ఆయన యెప్పుడు పుట్టిరో, యేయూరఁ బుట్టిరో, యాయన జన్మపత్ర మెట్లుండెనో, యేగురువునొద్ద నాయన విద్యనభ్యసించిరో, యెప్పుడాయన మతమును మార్చుకొనిరో, యేగ్రంథము నాయన మొదట వ్రాసిరో తరువాతిగ్రంథము లేయేకారణ

ముల నెప్పుడెప్పుడు వ్రాసిరో మీలో నొక్కనికైనఁ దెలియునా? ఆయన వఱకుఁగూడ నెందులకు? ఈనడుమ ననగ నాలుగైదుసంవత్సరముల లోపలఁ గైలాసగతులయిన ఆకొండి వ్యానమూర్తిశాస్త్రులవా రెప్పుడు కవిత్వ మారంభించిరో, భారతాంధ్రీకరణమున కేల బూను కొనిరో, వ్యాకరణశాస్త్ర మెంతవఱ కెవరియొద్ద నభ్యసించిరో, యీయనతండ్రిపేరెవరో మీలోనొక్కనికైనఁ దెలియునా? మీకొఱకు నమస్తశ్రమలకు లోనై మిమ్ము సుఖపెట్టుచున్న కవులు–లోకమునకుఁ దన భావపరిమళమును వెదఁజల్లి తాను పచ్చకప్రమువలె నిగిరిపోయిన కవులను, తాము కడుపులు మాడ్చుకొని మీమనస్సులకు విలువ లేనివిందొనర్చిన కవులను –అట్టికవుల నాదరించుక్రమ మిదియేనా? నూఱు సంవత్సరములలోపలె నెందఱు కవులు పరమపదించిరో యెఱుఁగుదురా? ఇప్పటివారినే మీరిట్లు మఱచుట తగునా? మీరు శ్రమచేసి వారిచరిత్ర లేఖనమునకుఁ దగినసామగ్రిని సంపాదించుట కష్టము. సంపాదించినను సందర్భశుద్ధిగ వ్రాయుట కష్టము. అందువలన వర్తమానశతాబ్దికవుల చరిత్రములు లేవనుకొందము. ఇన్ని పుస్తకభండారము లున్నవికదా! ఇన్ని పాఠశాల లున్నవికదా? ఇన్ని తాళపత్రగ్రంథనిలయము లున్నవికదా! వావిళ్ల వాసుదేవశాస్త్రులవారి పటము దేనిలోనయిన నున్నదా? బెల్లపుకొండ హనుమంతరావుగారి విగ్రహ మే మూలనైన వ్రేలాడుచున్నదా? మండపాక పార్వతీశ్వరశాస్త్రుల వారేగోడవీఁదనుండియైన దుమ్ముతో, దుష్కరప్రాససంధానబంధుర ధోరణితో విరాజిల్లుచున్నారా? ఎందఱు పేళ్లిట్లు చెప్పఁగ్గున్ను? ఇక జమీందారుల నందర్శనశాలలో (కారలైలు) కనఁబడును గాని కందుకూరి వీరేశలింగముగారు కనఁబడరే! (బెన్‌జాన్సను) కనఁబడును గాని భద్రాద్రిరామశాస్త్రులుగారు కనఁబడరే! (టెన్నిసను) కనఁబడును గాని దేవులపల్లివా రగపడరే! (సర్ వాల్టరుస్కాటు) కనఁబడునుగాని శిష్ట్లు కృష్ణమూర్తిశాస్త్రులుగా రగపడరే! ఆంధ్రులమై పుట్టిన మనమాంధ్రకవులఁ గూర్చియే యింత యనాదరణముతో నుంటిమే! అరవకవులనుఁ గర్ణాటకవులను, మహారాష్ట్రకవులను, హిందీకవులను మనమాయింక నాదరించుట! తండ్రిశ్రాద్ధము పెట్టనివాఁడు పినతండ్రి తద్దినము పెట్టునా? ఇంకను దేశభక్తి దేశభక్తి యని తెయితక్కలాడుట యెందులకు? గావు కేకలు నైటుటెందులకు? వీరావేశములెత్తి విహరించు టెందులకు?''

వాణీదానున కంతలో దగ్గు తెమలకుండ వచ్చుటచేత నూరకుండెను. అంత నే నిట్లంటిని.

నూఱుసంవత్సరములలోపల నాంధ్రదేశము నలంకరించినకవుల యందఱ చరిత్రములను బ్రకటించుటకుఁ గావ్యనిధి శ్రీ చెలికాని లచ్చారావుగారు పూనుకొనియున్నట్లు నేను వింటిని. కావునఁ గవులెల్లరు తమచరిత్రములలోని ముఖ్యాంశములను వ్రాసి యీయనకుఁ బంపవలయును. వాణీదానుని యుపన్యాసముపై నాలుగు విమర్శనవాక్యములు చెప్పి సభ చాలింతును.

ఇంతలోఁ గ్లాచారికి మిక్కిలి జబ్బుగా నున్నదని యెవ్వరో వచ్చుటచేత సభ చెదఱినది. నాగుండె చెదఱినది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

52. కాలాచార్యుని వివాహ ప్రయత్నము

1913 కాలంలో– సాక్షి సంఘం కార్యకలాపాలు వెనుకి పట్టిన ఒకానొక రోజుల్లో–బొక్కయ్య శెట్టి మరణానికి ముందటి రోజుల్లో –

సత్యపురం రాజావారి తండ్రిగారి ఆబ్దికానికి, కాలాచార్యుడికి కన్యా దానం క్రింద అయిదు వందల రూపాయ లిచ్చారు.

డబ్బు కళ్లబడగానే కాలాచార్యులు కట్టు తప్పి ఆలోచించడం మొదలు పెట్టే స్థితి వచ్చింది–అనగా– వివాహ వాంఛ బలీయమైంది. ఆ సొమ్ము ఏమి చెయ్యాలా అనే చర్చ సాక్షి సంఘ స్వకీయనమావేశంలో వచ్చింది. జంఘాల శాస్త్రి సొమ్మును సాక్షి సంఘానికి మూల ధనంగా ఇమ్మన్నాడు. వాణీదాను, శ్లేష కావ్యం చెప్పిన కవికిమ్మన్నాడు. సాక్షి ఏమీ మాట్లాడలేదు. బొక్కయ్య శెట్టి, పాటి పాగాకుతో పొడుము దుకాణం పెట్టడం మంచిదన్నాడు (లేఖ ద్వారా).

కాలాచార్యుల వివాహ సంకల్పం బలీయం కావడంతో ఈ సూచన లన్నీ వెనక్కి పోయి, జంఘాలశాస్త్రితో కాలుడి రహస్య చర్చలు ముందుకొ చ్చాయి. పదిహేను రోజులు గడిచేసరికి కాలాచార్యుల్ని తీసుకుని, దక్షిణ దేశం వెడుతున్నట్టు, అతనికి వివాహ ప్రయత్నం అక్కడ ద్రావిడ కుటుంబా లలో చేయదలిచినట్టు జంఘాల శాస్త్రి సాక్షికి ఉత్తరం రాశాడు. మరో నాలుగు నెలలు గడిచాక, 'మేం చిక్కుల్లో వున్నాం రమ్మ'ని సాక్షికి ఉత్తరం వచ్చింది. అది కంచి నుంచి వచ్చింది. సాక్షి వెళ్ళి సంగతులు విచారించగా జంఘాల శాస్త్రి కాలాచార్యుల వివాహ బంధం గురించీ, అతను మామగారనబడే వాడిని కొట్టిన కారణాన జైలుపాలైనమైనం గురించీ, చెప్పి–ఆ వివాహ చరిత్రని విశదం చేశాడు.

మర్నాడు కాలాచార్యులికి, ఆ దుష్ట వివాహ విచ్ఛేద దోష పరిహారార్థం ప్రాయశ్చిత్తాదులు చేయించాడు సాక్షి. జంఘాల శాస్త్రి చెప్పగా వచ్చిన ఉపన్యాసం డబ్బుతో అంతా చెన్నపట్నం దాకా రాగా సాక్షి, ఒక్కడూ సత్యపురం వెళ్లాడు.

దాదాపుగా నయిదు మానములనుండి మా సత్యపురసంఘ వ్యాపారములు చల్లబడినవి. సభాశాలతలుపులపై గొండ్లెము పడినది. జంఘాలశాస్త్రినోటికి దాళము

పడినది. కాలాచార్యులముక్కునకు దిబ్బడి పడినది. వాణీదానుని కవితావనితాగండస్థలమకరి కాపత్రలేఖన సాధనమతల్లియగు 'జేపాళీ' మూలఁబడినది. బొఱ్ఱయ్యసెట్టి తామర–కుష్మలోఁ బడినది. కొట్టునకు మే మీయఁదలఁచిన యద్దెకై యూరిముననబునొద్ద చిన్న వ్యాజ్యెము పడినది. అందఱు యదృష్టమిట్లు పిట్టతలలు పడినది.

బొఱ్ఱయ్యసెట్టియే యీసభ కంతయు లక్ష్మీదేవిపఱిక–అతనికిఁ దామర పెచ్చిన కొలఁది మా సిరి తగ్గిపోయెను. చెన్నపురివైద్యము నిష్ప్రయోజన మగుటఁ గాలాచార్యులు బొఱ్ఱయ్యసెట్టిని దీసికొని యింటికిఁ జేరెను. కండూతినివారణార్థమైన యాతని యిత్తడిచేతులు చెలరేఁగినకొలఁది దురాచార నిరాసన పరాయణమగు జంఘూల శాస్త్రి కంచుగొంతు బీఁటరేఁగ మొదలుపెట్టినది. సెట్టి యీనడుమ మాకేమియు ధనసాహాయ్యము చేయుకుంటచే సభావ్యాపారములు జరుగుటకు బహుశ్రమముగ నున్నది. ఎటులయినఁ గష్టపడి సభలు చేయుదమని యెంతప్రయత్నించినను సాగినది కాదు. కాలాచార్యులు గ్రామాంతరము వెళ్లవలసివచ్చెను. అతనికి సహాయుఁడుగ జంఘూల శాస్త్రి వెళ్లవలసివచ్చెను. వారిరువురు పోయిన కొలఁదిదినములకు నేను వారికై పోవలసివచ్చెను. ఈతొందరలో మే ముంటచేత సభ కట్టువడినది.

మాయూరి రాజుగారి తండ్రిగారి యాబ్దికమునకుఁ గాలాచార్యునకుఁ గన్యాదానము క్రింద నయిదువందల రూపాయ లీయఁబడెను. ఈతఁ డస్ఖలితబ్రహ్మచారి యనియు, సదాచారసంపన్నుఁ డనియు, వేదాంత విద్యాపారంగతుఁ డనియు, నీతని కీదానము మా ప్రభువు గారిచే నొసంగఁబడినది. ఆరూపాయలు తీసికొని యాతఁడమితానందమొందెను. రొంటఁ బొడుముపాత్తికలవైనవానికిఁ బ్రక్కలోఁ బడుచుపాలఁతి సందర్భమగు సన్నివేశము సంభనించెను. ఈనడుమఁ గొంత కాలమునుండి వివాహోద్దేశము మానిన యీయయ్యవార లరసంచి రూపాయలు కనులఁ బడఁగానే నీరును జూచిన యేనుఁగువలె సంభోగ గంభీర వాంఛా సమారంభ విజృంభణాడంబరుఁడై ప్రకాశించెను. శీతకాలము గేదెలకు, వేసవికాలము గోవులకుఁ, జిత్తకార్తె కుక్కలకు ఋతుకాల. మగునుకాని–నరునకుఁ గరమునఁ గాలు రూపాయ కెక్కువగ నెప్పు డుండునో అప్పుడే ఋతువు. అట్లు జనసామాన్యమునకుఁ గాఁగా నంగనాసంగమము కలలయందు, గ్రంథములయందుఁ దప్ప నెఱుఁగని యీయాచార్యశిఖామణి కయిదువందల రూపాయల మూట యసాధారణానంగసముద్దీపకము కాదా! ఈరూపాయ లేమి చేయవలసిన? దని యానాఁడు రాత్రి సభలో విచారించితిమి. సభకు మూలధనముగ నిమ్మని జంఘూలశాస్త్రులు చెప్పెను. శ్లేషకావ్యము చెప్పిన కవి కిమ్మని వాణీదాసుఁడు పలికెను. నే నేమియుఁ బలుక కూరకుంటిని. బొఱ్ఱయ్యసెట్టి యభిప్రాయ మిందునుగూర్చి యడుగఁగ దేవరపల్లి తేనెబారు పాటిపాగాకుఁ దెప్పించి పాదుము దుకాణము పెట్టిన మంచి దని యాతఁడు లేఖఁ బంపెను. బొఱ్ఱయ్యసెట్టి యభిప్రాయము కాలాచార్యునకు గొంత రుచించెనుగాని ముక్కు బాధకంటె ముదితబాధ యెక్కువగుటచేఁ దుదకు నాతఁడు నిరాకరించెను. ''పెండ్లియే యగునెడలఁ బెండ్లియే యగునెడల'' నని రెండుసార్లు పట్టుదలతోఁ బలిక బల్లపై నాచార్యులోకగ్రుద్దు గ్రుద్దెను. అప్పుడాతని నైఖరి చూడఁగ మా కందఱకుఁ గొంత భయము కలిగెను. ఆతఁడేదో దారుణోద్దేశము లోనఁ గలిగినవాఁడువలె మాకుఁ దోఁచెను. ఆమఱునాటినుండి జంఘూలశాస్త్రియు, నాచారియు

సభకు వచ్చుట మానినారు. కారణము తెలియలేదు. వారు తఱచుగ రహస్యముగ మాటలాడుకొనుచుండి రని నాకుఁ దెలిసినది. అట్లు పదునైదు దినములు గడచినపిమ్మట నొకయుత్తరము నాపేరవచ్చినది. అది జంఘాలశాస్త్రి వ్రాసినది. ''కాలాచార్యులకుఁ బెండ్లి తహతహ్దీ యెక్కువగా నున్నది. మనదేశములో నెక్కడను బిల్లలు దొరకలేదు. దక్షిణదేశమున ద్రావిడకుటుంబములలోఁ బిల్లలు సులభముగఁ జిక్కుదురు కావున నచ్చటకు మే మిద్దఱ మిప్పుడే పోవుచున్నాము. క్షమింపవలయును'' అని యాతఁడు వ్రాసినాఁడు. జంఘాలశాస్త్రి దేశముల ద్రిమ్మరి కావున నాతఁడెక్కడెక్కడ కక్కుర్తి పెండ్లికొడుకులకు రొక్కపుఁ బెండ్లికూఁతులు దొరుకుదురో బాగుగ నెఱింగినవాఁడగుటచే నాతఁడీతని నిట్లు కన్యాఖేట మునందుఁద్రిప్పసాహసించెను. ఈయుత్తరము వచ్చినపిదప నాల్గుమానములు గడచినవి. శాస్త్రి వార్తయేలేదు. ఆచార్యులజాడయేలేదు. నే నేమియు దోఁచక నస్తిమితతగ నుంటిని వాణీదానునితో నాలోచింత మన్న నాతఁడు మశూచికపు గంగ వెట్టులలో మనువసు చరిత్రలు తలక్రిందుగఁ జదువుచున్నాడు.

ఇట్లుండఁగ నొకదినమున నొకతంత్రీవార్త వచ్చినది. ''మేము చిక్కులలో నున్నాము. ఎంటనే రావలయును'' అని యాశోణపత్రమున నున్నది. అది కాంచీపురమునుండి వచ్చినది. జంఘాలశాస్త్రిపేరు దాని క్రిందనున్నది. ఆరాత్రియే బయలుదేఱి కాంచీపట్టణ మునకుఁ బోయితిని. రైలుస్టేషనునొద్ద నాకొఱకు వేచియున్న జంఘాలశాస్త్రిని జూచి ''కాలాచార్యు లేఁ? డని యడుగఁ గారాగృహమున నున్నాఁడని గద్గదికతో నాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ''ఎందుచేత?'' నని దిరుగ నే నడుగ ''మామగారిని మేదరమంచముగ మోదినాఁ'' డని యాతఁడు మాఱుపలికెను. ''పెండ్లియైనదా?'' యని నే నాశ్చర్యమున నడుగ ''శ్రాద్ధయోగ్యముగ'' నని యాతఁడు జవాబు చెప్పెను. ఇట్లు మాటలాడుచుఁ గారాగృహమునొద్దకు మేము పోవఁగఁ గాలాచార్యులు దానిలో దీనవదనుఁడై కూరుచుండెను. ననున్నుఁ జూచి బోరున నేడ్వసాగెను. అంతట నాతని నోదార్చి యేమి జరిగిన? దని యడిగితిని. అందున కాతఁడు మాఱుపలుకక యెక్కడకయినఁ బోయి యొకచిటికెఁడు పొడుము తెచ్చిపెట్టుమని ననున్నుఁ గోరఁగ నే నట్లు తెచ్చి యాతనికి రహస్యముగ నిచ్చితిని. ''మామగా రేరి? పెండ్లికూఁతు రేది? కారాగృహ మేల?'' యని యాతని నే నడుగ ''శాస్త్రీ! నీవు చెప్పుమని యాతఁడు జంఘాలశాస్త్రిని బ్రోత్సహించెను. మాపరిషత్ప్రధాన వావదూకుఁడైన జంఘాలుఁ డిట్లు చెప్పసాగెను.

ఈయూరు చేరకముందు పెరుంబుదూరు మొదలగు దివ్యదేశములకుఁ బెరుమాళ్లను జూచుటకొఱకుఁ గాక, పిల్లలను జూచుటకై పోయితిమి. ఉచితవయసుగల కన్య యెచ్చటను దొరకలేదు. పెద్దపిల్ల దానిని జేసికొనుటకుఁ గాలాచార్యుని యూహమైయు న్నది. అటుపైని నిచ్చటకు వచ్చితిమి. ఈగ్రామముననే పిల్లలకై రెండుమూఁడు మాసములు తిరుమాళిగ లన్నియు సేవించితిమి. పిల్ల లెచ్చటను దొరకలేదు. తుదకుఁ బ్రాణము విసిగి సత్యపురము పోవలయు ననిసంకల్పించు కొంటిమి. రైలుస్టేషనుకుఁ బోఁదలఁచియుండఁగా మేము బసచేసిన సత్రములోని కొకవైష్ణవుఁడు వైష్ణవియు వచ్చిరి. ఆవైష్ణవి కాలాచార్యునిఁ జూచి కొంచెము జాఱిన మేలుముసుఁగు నిమ్మళముగ వైచుకొనఁగ నీతఁడు గట్టిగ లొట్టువైచెను. అది కాలాచార్యునకుఁ గంతుప్రకోపనచిహ్నము. కాఁబోలు! ఆవైష్ణవిని దాను

వివాహము చేసికొందునని యాతఁడు నాతో రహస్యముగ నప్పుడే చెప్పెను. ఆమె యావైష్ణవుఁడు మావంకకుఁ దిరిగి దాసోహమ్మని యాతనికి నమస్కరించి నన్నుఁ జూచి కొంత కొఱకొఱలాడెను. కాలాచార్యులు దాసానుదాసోహమ్మని యాతని సేవించి స్వకళ్యాణనాటక మునకు సూత్రధార పుష్పాంజలిగ నస్యభిక్షుతోఁ బ్రస్తావన మారంభించెను. ఆపిల్లది యాతనికూఁతు రనియుఁ, దల్లి లేనిపిల్ల యనియు మాకుఁ దెలిసెను. ఆపిల్లకుఁ బదునాల్గు వత్సరములు దాఁటియుండవచ్చునని నాకుఁ దోఁచినది. కాని గోవగ నెదిగినపిల్ల యని కాలాచార్యులు సమర్థించెను. పిల్ల నింతకాల మవివాహితగ నట్టిపెట్టి యుంచినారే? మని నే నడుగ దీనితల్లివంకనేమి, తండ్రివంకనేమి పదునేడు సంవత్సరములు వచ్చువఱకు నాఁవా రీడేరునాచారము లే దని యాతఁడు చెప్పఁగఁ గాలాచార్యులు కొంతవిసుగుకొని నన్నుఁ జూచెను. అది యెఱిఁగి యావైష్ణవుఁడు మాయింట నిషేకమే యనూచానాచార మని తిరుగ సాయింపఁగ నీమాఱు కాలాచార్యులు లోకాతీతమైన యొకలొట్టను గటూక్షించెను. నేను సాయంకాలవచన సామగ్రికై సంతలోనికిఁ బోయితి. నేను వచ్చులోపునఁ గాలాచార్యులు నావైష్ణవుఁ డేమిమాటాడుకొనిరో కాని యాతనియొద్ద దారిఖర్చులు పోఁగ మిగిలియున్న నాల్గువందలరూపాయలు నావైష్ణవునిచేతి కీతఁడిచ్చెను. ఆ రాత్రి రెండుయామములకు స్వామిసన్నిధిలోఁ బెండ్లి స్థిరపడెను. నే నింటికి సంతనుండి వచ్చుసరికిఁ గాలాచార్యులు మహానందభరితుఁడై యుండెను. రాత్రి వివాహము జరిగినది. కాని యావైష్ణవుఁ డామఱునాఁ టియుదయముననే ప్రయాణ మని చెప్పెను. పెండ్లికూఁతును భర్తతో విడుచుటకే యేర్పాటు జరిగెను. ఉదయమున లేచి ప్రయాణమై పోవుచున్న కాలాచార్యుని మామను సాగనంపుటకయి మేము కొన్ని యడుగు లాతనితోఁగూడఁ బోయితిమి. అంత నొక వడహల వైష్ణవుఁ డెదురుగ వచ్చి కాలాచార్యుని మామను 'ఏమండోయి బావగారూ! యని పిలిచి ''నీగొంతుకఁ గోయ! తెంగలికాపు చేసితి వే?'' మని యడిగెను. అంత నాతనిమాట వినిపించుకొనకుండఁ గాలాచార్యుని మామ పోవుచుండఁగ నే నాతనిచేయి పట్టుకొని ''మీరు తెంగలివారు కారా?'' యని నే నడుగ ''కా''మని చెప్పెను. అంతట నెత్తి–నోరు–గొట్టుకొని కాలాచార్యు లేడ్వసాగెను. మాయింట–నొంట–లేనిదే యేకాదశీశ్రాద్ధము, విధవాశిరోముండ నము సిద్ధించినదా? యని యఱవసాగెను. అంతటఁ గొంద ఱచ్చట మూఁగిరి. ఇచ్చట ''నీయిరుతెగలవారికి సంబంధములు బాహాటముగ జరుగుచున్న వనియు, తప్పు లేదనియు వారు కాలాచార్యుని మందలించిరి. ''శిరోముండనముమాట యేమి?''టని కాలాచార్యులు గట్టిపట్టుదలతో నడుగ నదియు నాలోచింపవలసిన సంగతి కాదనియు, నప్పటికి వీలువెంబ డిని యథోచితముగ జరిగింపఁబడు ననియు వారిలోఁ గొందఱు పలికిరి. వీథిలో నల్లరిగ నున్న దని భయపడి నేను వచ్చిన వడహల వైష్ణవుని సత్రములోనికిఁ దీసికొనివచ్చితిని. ఈక్రొత్త వైష్ణవునకు మిగులఁ జెవుడు. అతఁ డీయల్ల రేదో యిదివఱకు గ్రహింపనే లేదు. ఆతనిపేరు కృష్ణమాచార్యులు! అతఁడు లోనికి వచ్చి దూరముగఁ గూర్చుండు పెండ్లికూఁ తును జూచి ''ఏమే కన్నీ! దూరముగఁ గూర్చుంటివి? వెలుపల నుంటివా?'' యని యడిగెను. అంత మొగము తెల్లవోవఁగఁ గాలాచార్యునిమామ పరుగెత్తుట కుద్యుక్తుఁడ య్యెను. అంత నాతని గట్టిగఁ బట్టుకొంటిమి. కృష్ణమాచార్యులు పెండ్లికూఁతు నడిగిన ప్రశ్నమున కిప్పటి కర్థము తెలిసికాఁబోలుఁ గాలాచార్యులు తీవ్రతతోఁ ''బెండ్లికూఁతు రిదివఱకు రజస్వల యయినదేనా? యని యొడలు తెలియని కోపముతో మామను

సమీపింపఁగ నే నాతని నడ్డుదగిలితిని. ఈ గందరగోళ మంతయును వెల్లడిమొగము వైచుకొని కృష్ణమాచార్యులు చూచుచుండెను. ఈయల్లరి యంతయుఁ దన కెట్లర్థమయ్యెనోగాని యాతఁడు ''బావా! కన్నెఱికముకొఱ కీకుట్టముండ నింతదూర మెందులకుఁ దీసికొనివచ్చితివి? మీయూరు సివారులో నున్న దేంద్ర వాఁడందులకు సిద్ధపడఁగ నావాలాయత నచ్చటఁ దీర్పింపలేకపోయితివా? కడుపు మమకారముచేత దేవులాడుదువుగాని యిందులకుఁగూడ శ్రీవైష్ణవుఁడే కాఁడా కన్నె చెఱఁ బాపినది?'' యనెను. ఆమాటలు విని కాలాచార్యులు రౌద్రమూర్తియై భార్యపైఁ బడి, పుస్తెలు ద్రెంపి, మామను మెదలనీయకుండ మాదిగమంచ మువలెఁ బడఁగొట్టను. పెండ్లికూఁతు రేడ్చెను. కృష్ణమాచార్యుల కిప్పటికైన నేమైనఁ దెలిసెనో లేదో తెలియదుగాని యాతఁ డల్లుఁడు మామలను వేఱుచేసెను. కాలాచార్యులిచ్చిన సొమ్మేమయ్యెనో గాని యాతనిమామయొద్ద లేదు. అంత నాతఁడును గృష్ణమాచార్యులును గలసి పెండ్లికూఁతును వెంటఁ బెట్టుకొనిపోయిరి. సాయంకాల మగుసరికిఁ గాలాచార్యునికొఱకు రక్షకభటులు వచ్చి యాతనిఁ దీసికొనిపోయి యిట నుంచిరి. ఆతనిమామ రక్షకభటాధికారికాళ్లపైఁ బడి యాతని ప్రక్కలోఁ గాలాచార్యునిపెండ్లికూఁతును బడవైచి యింత పనిచేసినాఁడని కొంతపుకారుగా నున్నది. తరువాత సబుమేజస్ట్రీటుగారేబదిరూపాయలను మామగారియొద్ద దీసికొని యల్లునిఁ గారాగృహమున నుంచినాఁడు. మూఁడుదినములు గారాగృహనివాసము గాని, ముప్పదిరూపాయలు 'జరిమానా' గాని మామను గొట్టినందులకై దండనముఁ గాలాచార్యునకు విధింపబడినది. రూపాయ లేమియు నొద్ద లేకుంటచే నయ్యవారులగా రచ్చట వేంచేసియుండుటకే యంగీకరించినారు. ఱేపు విడుదల యని జంఘాలశాస్త్రి చెప్పి యూరకుండెను.

మఱునాఁ డుదయమునఁ గాలాచార్యునకుఁ బ్రాయశ్చిత్తాదుల జరిగించితిని. ఊరికిఁ బోవుటకుఁ జేతిలోఁ గ్రొత్తకాను లేదు. అప్పుడు జంఘాలశాస్త్రి యరణా చొ॥ టిక్కట్లుపెట్టి యొకయుపన్యాస మిచ్చినాఁడు. సమకూడినసొమ్ము స్వల్ప మగుటచే నందఱము చెన్నపట్టణము వచ్చితిమి. ఇచ్చటినుండి నేనుమాత్రము సత్యపురమునకుఁ బోవుచున్నాను. కాలాచార్యులు ''ఆంధ్రద్రావిడీ వివాహనిషేధ'' మను నొక గ్రంథమును వ్రాసెనని చెప్పినాఁడు. పేరు బాగుగ లే దని జంఘాలుఁడు చెప్పఁగ ''విశాఖా విపరీతవివాహ విపద్విరోచన'' మని దానికి సరసముగఁ దిరుగ నామకరణ మొనర్చెను. ఆగ్రంథ మెప్పుడు బయలుదేరునో చెప్పలేము.

53. కాలాచార్యుని వివాహ ప్రయత్నము

సాక్షి సత్యపురం వెళ్లిపోగా–చెన్నపట్టణం లోనే నిలవగా నిలిచిపో యిన కాలాచార్యులు, జంఘాల శాస్త్రి మాత్రం వధువును అన్వేషించడం మానలేదు. పార్థసారధి స్వామి కోవెల ప్రక్క– కోమటి బంగళాలో బస చేశారు.

ఒకనాడు కాలాచార్యులక్కడ ఒక వైష్ణవితో తగాదా పడ్డాడు. కారణం, కల్యాణ ఉన్మాదం. కాలాచార్యుడిప్పుడెలా తయారయ్యాడంటే, సాలు త్రాగే పావు మొదలు, పదమూడేళ్ల పిల్లవరకూ, ప్రతి పిల్లనీ తనకు పెళ్ళికూతురుగా భావించే దశకు వచ్చేశాడు.

జంఘాల శాస్త్రి, కాలాచార్యులు, ఆ వైష్ణవి గురించి ముచ్చటించు కొంటూ వుండగా – ఒక రక్షక భటాధికారి ఇద్దరు రక్షక భటులతో అక్కడకు వచ్చి, 'చూడమ్మ' అనే ఆ వైష్ణవిని 'అరెస్టు' చేసి తీసుకు పోతూ వుండగా – ఆమె ఏడుస్తూ కాలాచార్యుల కేసి చూస్తూ – 'ఈ కాకి ముండా కొడుకు నా కొంప దీశా, డంటూ వెళ్లింది. దాంతో రక్షక భటాధికారికి అనుమానం తోచి కాలాచార్యుల్ని కూడా తీసుకు రమ్మని పక్క–నున్న భటుల్ని ఆజ్ఞాపించాడు. కాలాచార్యులు కదలక తప్పలేదు. జంఘాలశాస్త్రి కూడా అతనితో, తోడపెళ్లి కొడుకులా వెళ్లకనూ తప్పలేదు.

కాలాచార్యుల్ని నగర రక్షకభటాలయం అరుగుమీద సగౌరవంగా కూర్చోబెట్టి, చూడమ్మను మాత్రం 'కొట్లో' వేశారు.

అరగంట తరవాత, రక్షక భటాధికారి వచ్చి, క్షమార్పణ చెప్పుకొని, చూడమ్మ చరిత్ర చెప్పి ఆమె వ్యభిచార వృత్తి గురించి వివరించాడు. కులం మాత్రం వదులుకోలేదని చెప్పాడు. ఆమె అక్రమ సంతాన పరిత్యాగ కార ణంగా అమాకీ తెలిసి, ఆమెని 'అరెస్టు చేసినట్టూ, ఆమె కాలాచార్యుల్ని తిట్టిన తిట్టును ఆధారంగా అతనికి ఆమెతో సంబంధాన్ని అనుమానించి నట్టూ విశదంచేశాడు. అనుమానం ఆమె ద్వారానే తీరిందని చెప్పి – విడిచిపెట్టాడు. బ్రతుకు జీవుడా అనుకుని, జంఘాలుడు, కాళ్ళుడు, తిరిగి బంగళాకు వెళ్లారు.

జంఘాలశాస్త్రి యి ట్లుపన్యసించెను.

కాలాచార్యుని యకాలవివాహ శ్రాద్ధతంత్రమును నిర్వహించుటకై నిమంత్రింపఁబడిన

భోక్తనగు నేనును, స్వతంత్ర కర్మకర్త యగు కాలాచార్యులును గలిసి యనంతరకర్మపరిపూర్తికై చెన్నపట్టణమున బసచేసితిమి. అక్కడఁగూడ వితరస్థలములయందువలెనే వధ్వన్వేషణాభిలాషచే గొన్నిదినము లుంటిమి. పార్థసారథిస్వామికోవెలప్రక్కనున్న కోమటిబంగాళాలో బసచేసితిమి. మామూటలను జిన్నమేడమీఁద యొకగదిలో నే నింకఁ బెట్టుచుండగనే కాలాచార్యులు మేడ క్రిందకుఁ బోయి నీటిగొట్టమునొద్ద నిలువఁబడి యప్పుడే వధ్వన్వేషణ కార్య మారంభించినాఁడు. ఉదకయంత్రమునొద్ద బట్టలు జాడించుచున్న యొకవైష్ణవిని జూచి ''నీకుఁ బిల్ల లున్నారా?'' యని యురవమున నడిగెను. ఆచారిమాటల నామె లక్ష్యపెట్టక నిరుత్తరయై యుండెను. ఱేడు పిల్లలు దనయొద్ద నుండుటచేఁ జెప్పుట కావైష్ణవి కొంత బెట్టుచేయు చున్నట్లు గ్రహించి ''పిల్లలున్నారా?'' యని తిరుగఁ బ్రత్యుత్తరస్వీకరణ బద్ధదీక్షాపటిష్ఠతావరిపాకుఁడై యాతఁడడిగెను. ఆమె యాతనివంకఁ గన్ను లెఱ్ఱచేసి చూచి యట్టెధుమధుమలాడుచునట్టి రొనరొనలాడుచుఁ దల నడ్డముగ నూఁపెను. అంతట నాచారి 'పిల్లలు లేకేమి?' అని యామె నెగదిగఁ జూచి 'ఉండఁగా లే రనుట న్యాయమా?' యని 'నాలుక తప్పాడిన నొడలు తప్పాడునా' యని తనశారీరశాస్త్రసాహితీ సమగ్రతను సంకోచశూన్యముగ సంక్షేపముగ వెల్లడించెను. అంత నావైష్ణవి రోషకషాయితలోచనయై ''నీతల పగుల; నీ వాఁడుతోడునఁ బుట్టలేదా? నీ రూపు కాలిపోను'' అని యింకేమో నోట వచియింపరానితిట్టులు తిట్టుచు లోనికిఁ బోయెను. ఈకోపాటోపోద్దీపిత రూపవతీ శాపాలాపకలాపము నాకర్ణములను బడఁగనే నేను మేడనుండి దిగి క్రిందకుఁ బరుగెత్తుకొని వచ్చితిని. కాలాచార్యులు మొఱఁడువలె నిలువఁబడి యున్నాఁడు. మొగము సంకుచితమైయున్నను నోరుమాత్రము తెఱచి యున్నది. ముక్కఱమలగుండ శ్వాస మాడకుండుటచే నోరే నాసికాకర్మకర్తృత్వమును మీఁద వైచుకొని సన్నిహితసామగ్రీ సానుభూతిచేఁ బ్రకాశించుచున్నది. ''ఇప్పుడు నిన్నుఁ దిట్టినవారెవ్వరు?'' అని నే నాచారిని గంతోక్తిగ నడుగ నాతఁడు నామాట వినుపించుకొనక ''సంతానవతి యెవతెయో, కానిదెవతెయో దేహశోధననుబట్టి నుళువుగఁ జెప్పలేమా?'' యని నన్నడిగెను. ఆప్రశ్నమును నేను వినిపించుకొనక ''నిన్నుఁ దిట్టిన యాఁడు దెవ్వతె?'' యని నేనడుగ నాతఁడు నామాటను పాటింపక ''కొంచెము నన్యము తెచ్చిపెట్టుఁగలవా?'' యని నన్నుఁ గోరెను. అంతట నే నతనికిఁ గొంచెము పొడుము తెచ్చియిచ్చితిని. దాని నత్యాతురతతో గ్రహించి యుపదేశముద్రను వహించి శ్యామాశావసంవిధానోపాఖ్యానమును సమగ్రముగ సాయించెను. వివాహితయై సంతానవతియగు ప్రతివైష్ణవియుఁ దనకత్తగారుగను, పాలుద్రాగుచున్న బాలిక మొదలు బదుమూఁడేండ్లవయనుగల పిల్లవఱకుఁ బ్రతికన్యను దనకుఁ బెండ్లికూఁతుగను భావించుచున్న కాలాచార్యుఁడు వివాహైక దృష్టిచే నిశ్చలుఁడై యున్నాఁడు. మదపుఁబిచ్చివంటి మనువుపిచ్చి యాతని నావేశించినట్లు కనఁబడుచున్నది. ఒక్కొకపుడు కదుపులో నున్నపిల్లలఁగూర్చి పెండ్లిమాటలాడ మొదలుపెట్టును. ఈకల్యాణోన్మాదముచే నతనివ్యక్తిత్వము కొంతనశించినట్లు స్పష్టముగఁ గనఁబడుచున్నది. పెరుమాళ్లదివ్యమంగళవిగ్రహమునుగూర్చిన చింతపోయి పెండ్లికూఁతు చామనచాయరూపుచింతలోఁ బడివది. వన్నిద్దరాళ్వారుల ప్రభావమును గూర్చిన శిరఃకంపము వండ్రెండేండ్లపిల్లల యొడలి పొంకములఁగూర్చి విట్టూర్పులోనికి జాఱివది. ఒకటియా రెండాయను వేదాంతవిచారణము నాలుగా యయిదా యను పెండ్లికట్నపు రూప్యశతములను గూర్చిన మీమాంసలోనికి

జాఱినది. శంకరసూత్రార్థ ఖండనచింత మంగళసూత్రాంక బంధనములోనికి భేదించినది. ఇట్టిపిచ్చి నేను గనిపెట్టి దీనిని వదలుకొను మని యాతని కెన్నిమాఱులు చెప్పినను, ''పెండ్లితో నన్ని వెఱ్ఱులు వదలు''నని యాతఁడు ననో్నదార్చుచుండెను. మే మావైష్ణవుని గూర్చియే యట మాటాడుకొనుచు దంతధావనము చేసికొనుచుండఁగా నింతలో నిద్దఱు రక్షకభటులు, నొకరక్షక భటాధికారియు మే మున్నకడకు వచ్చి నిలువఁబడి మీరెవ్వ? రని మమ్మడిగిరి. మేము పరదేశవాసుల మని చెప్పి యూరకుంటిమి. ''చూడమ్మ''గా రీప్రక్కకొట్టులో నున్నారా? యని రక్షకభటాధికారి కాలచారి నడుగ ''నాకేమి తెలియును? నీవే చూడమ్మా'' యని కొంతచచ్చు శ్లేషతో జవాబు చెప్పెను. అంత రక్షకభటాధికారి యా గదితలుపునొద్దకుఁ బోయి ''చూడమ్మా'' యని తట్టుచుఁ బిలిచెను. ఎవరు మీరు? ఇక్కడ మగవారెవ్వరు లేరు'' అని లోనుండి యొకయాఁడుదానికంఠరవము వినఁబడెను. ''మీకొఱకే వచ్చినాము. తలుపు తెఱువుఁ'' డని యారక్షకభటాధికారి తిరుగ ననఁగ ''ఆఁడుదాన, నొక్కతె నున్నాను. తలుపు తెఱువవీలు లేదు.'' అని లోనుండి తిరుగ ధ్వని వినవచ్చెను. ''తలుపు పగులఁగొట్టి లోనఁ బ్రవేశింతు'' మని యారక్షకభటాధికారి యాధికారికారవమైఖరిని బెదరింపఁగ నేడ్చుచు నొకవనిత తలుపు తెఱచెను. ఆమెను వెలుపలకు రమ్మని యధికారి కోరెను. కాని యామె రాకపోవుటచే నాతఁ డామెను వెలుపలకీడ్చి చేతుల కరదండలు దగిలించెను. అంత నావైష్ణవి చూడమ్మనామక కామినీచూడామణి హోరుహోరున నేడ్చుచు 'నీకాకిముండ కొడుకు నాకొంప దీసినాఁ'డని బిగ్గఱగ నఱచుచుఁ గాలాచార్యునిఁ జూపుచు వారివెంటఁ బోవుచుండెను. ''కాకి'' శబ్దము కాలార్థబోధక మగుటచేఁ గాఁబోలు నట్లేమె మనయాచార్యపురుషు నభివర్ణించెను. ఆ మాటలు వినుటతోడనే రక్షకభటాధికారి యినుమంత యాగి కొంత యాలోచించి కాలాచార్యుని బట్టుకొని తీసికొనిరం డని తనతోడ నున్న రక్షకభటుల కాజ్ఞాపింపఁగ వారు గౌరవపూర్వ కముగఁ గాలాచార్యుని ముందు నడిపించుచుఁ దాము వెనుక నేఁగ మొదలిడిరి. రెండవ యరదండలజోడు లేకుంటచేఁ గాఁబోలుఁ గాలాచార్యులు రిక్తహస్తుఁడై పోవుచుండెను. ''ఇదియేమి? ఎందులకు?'' అని కాలాచార్యు లెంత యఱచినను వా రెవ్వరు మాటలాడకుం టచే నేను దిరుగ నిరుపయోగప్రచ్ఛలను జేయక చప్పున మేడమీఁదికిఁ బరుగెత్తి నూతన గృహప్రవేశముహూర్తఫలము మంచిదే యనుకొనుచు మాక్రొత్తగదికిఁ దాళము వైచి దిగివచ్చి కాలాచార్యుని వెంబడించితిని. ఇట్లు మేము నగరరక్షకభటాలయమునొద్దకుఁ దీసికొనిపోఁబ డితిమి. చూడుకుడు తమ్మివా రొకకొట్టులో నుంచఁబడిరి. కాలాచార్యులు నగౌరవముగ నరుఁగుచైఁ గూర్చుండఁ బెట్టఁబడెను. తోడుపెండ్లికొడుక నగు నేను గొలఁదిదూరమున నాయంత నేనే నిలువఁబడియుంటిని. ఇట్లొక యరగంట జరిగినపిదప నారక్షకభటాధికారి కాలాచార్యునియొద్దకు వచ్చి యాతనితో నిట్లనియెను. నేనుగూడ నటకు రావచ్చు నని యధికారి యనుజ్ఞ యగుటచేఁ బోయితిని. ''అయ్యా! ఆచార్యులుగారూ! నన్ను క్షమించుఁడు. మీకు వృథగ శ్రమ నిచ్చితిని. ఈవైష్ణవి తిరుచూర్ణధారిణి యయ్యును, కర వద కటకాభిరామయయ్యును, గళభూషాకలితయయ్యును వితంతువు. అందులో బాలవితం తువు. ఈమెభర్త తలఁబ్రాలనమయమునవే మరణించె నని ప్రతీతి. ఆతఁ డీమెకుఁ దలఁబ్రాలఁ బోయుచుండఁగ నీమెజడచుట్టు నున్న మొగలిపువ్వుమీఁదఁ బ్రామాదికముగఁ జైనుండి పడిన యొంటివూనతే లాతని నంటఁ బొడుచుటచే స్థాలీపాకపువేళకే కాష్ఠపుటపాక

దశ నొందెనఁట. వివాహపరిపూర్తి కాకుంటచేఁ దిరుగ వివాహము చేసికొనవచ్చు నని పండితులు నిశ్చయించిరి. కాని ప్రాణమందలితీపిచే నెవ్వ రందులకు సాహసింపలేదు. ఇది యెంతసత్యమో మనకుఁ దెలియదు. కొన్నిగడియలు పెచ్చుతగ్గు మాటయే కాని ''యామె కులదేవతారాధనానాథ'' యనుటకుఁ దగియున్నది. ఆమె తిరువళ్ళూరు వాస్తవిని. అక్కడ నామెమోక్షసాధనమగు నాచార్యాభిమానమును బరిత్యజించి, వ్యభిచారాభిమానమును స్వీక రించెను. ఆమె కులముమాత్రము వదలుకొని బహిరంగముగ దుష్టవృత్తిఁ జేయలేదు. ఇట్లు కొంతకాలము జరుగ నక్కడ గర్భవతి యయ్యెను. అంతట నామె యీయూరికి వచ్చి మైలాపురములో నొకస్థలమున నివసించి పుణ్యస్త్రీవలెనే ధారాళముగఁ బిల్లను గని దానివి జంపఁ జేతులు రాక యాస్వామికుంటయొద్దఁ బడవైచి యటనుండి పాఱిపోయి తిరువలిక్కే ణిలో నున్న కోమటిబంగాళాలో బనచేసెను. ఈయంశము లన్నియు మాకిప్పుడు తెలిసి నవి. మైలాపురము మంత్రసాని మూలముగఁ గొన్ని జాడలు కనిపెట్టి తుదకిక్కడ నామెను బట్టుకొంటిమి. ఈకాకిముండకొడుకే నాకొంపఁ దీసినాఁడని యామె మిమ్మఁ జూచి యఱచుటచేత నామెకుఁ బుట్టినయాఁడుపిల్లకు మాఱుతండ్రి యగుదురేమో యని భ్రమపడి మిమ్మిటకుఁ దెచ్చితిమి. ఆమె మిమ్మిట్లు తిట్టుటకుఁ గారణ మేదియో యామెవలననే వింటిని. కాన క్షమింపవలెను'' అని తటాలున లేచిపోయెను. అంతట 'బ్రతికితిమిరా' యని యనుకొనుచు నింటికి మఱలి వచ్చుచుండఁగఁ దేరువీధికి సమీపమున నున్న వీథిలో నొక గొప్పసభ జరుగుచుండఁగఁ దానిలోనికిఁ బోయితిమి. అక్కడఁ జీనాదేశమున నెక్కడనో భూకంపమువలనఁ గలిగిన జనోపద్రవమును గూర్చి యొకయుపన్యాసకర్త మాటలాడుచుం డెను. ఆయుపన్యాసము దీర్ఘమైనది. దానికిఁ బ్రత్యుత్తరము నేనుగూడ నాసభలోఁ జెప్పవలసి వచ్చెను. కావున నవి రెండును పైరాత్రిని జెప్పెదను. ఇద్దఱి ముపన్యాసానంతరము బంగాళాలోనికి వచ్చితిమి. ఆతఁడు తళిహ యారంభించెను. నేను వంటపూటింటికిఁ బోయితిని.

54. దాక్షిణాత్యోపన్యాసము

చూడమ్మ అనే వైష్ణవికి సంబంధించిన అక్రమసంతానం కేసులో ఇరుక్కోవలసిన కాలాచార్యులు, ఆమె 'స్టేట్‌మెంట్' ధర్మమా అని – రక్షకభటాధికారి చేతుల్లోంచి క్షమాపూర్వకంగా బయటపడ్డాడు. అతనికి ఉపగ్రహంగా వున్న జంఘాల శాస్త్రి కూడా అతన్ని తీసుకుని బయటపడి వస్తూంటే తేరు వీధికి దగ్గరలో ఒక సభ జరుగుతోందని తెలిసింది. అక్కడకు ఇద్దరూ వెళ్లారు.

అక్కడ కళ్లపిరాంపిళ్ల అనే దాక్షిణాత్యుడొకాయన తెలుగులో మాట్లాడుతున్నాడు. విషయం, ఫైనా భూకంప బాధితులకు సహాయం అందజెయ్యడం. 'అందుకోసం మీ శక్తి కొద్దీ ఆర్థిక సహాయం చెయ్యమం''టూ అరవ తెలుగులో ఘోరమైన ఉపన్యాసం పూర్తి చేశాడు.

అనంతరం సభాధ్యక్షుడు లేచి (ఆయన మహమ్మదీయుడు) ఇంకా ఎవరైనా మాట్లాడితే మాట్లాడవచ్చునని అందరికీ ఒక విన్నపాన్ని ఇంగ్లీషులో చేశాడు. ''తెలుగులో మాట్లాడకూడదా?'' అని జంఘాల శాస్త్రి అడిగాడు. ''ఇంగ్లీషు వచ్చిన వారు గాని ఈ విషయముల యొక్క ఆత్మలో దూరలేర'' వాక్రుచ్చారు. సభాధ్యక్షుడు ''నీపేరెవర''ని అడగగా, జంఘాల శాస్త్రి చెప్పాడు. అతని పేరు వినగానే సభలో వాళ్లంతా ''అతన్ని ఎవరూ అడ్డుపెట్టరాద''ని, ''అతను మాట్లాడాలని'' అన్నారు.

వాళ్ల ప్రోత్సాహంతో జంఘాల శాస్త్రి ఉపన్యాసానికి ఉపక్రమించాడు. ఆ వివరాలు కూడా ఈ పక్క పేజీలోనే వుంటాయి –

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

కాన్యాన్వేషణపుఁదొందరచేఁ దిరుగఁ గారాగృహమునకు వేంచేయవలసినకాలాచార్యులు–నాతని యుపగ్రహమునైన నేను–దేరువీథిని జరుగుచున్న సభలోనికిఁ బోయితిమి. అచ్చటి సభ్యులు మమ్మఁజూచి కొంచెము వెగటుపడినట్లు నానమ్మకము. నిష్కించుకుఁడై పోఁతవిగ్రహమువలెనున్న యాచార్యస్వామిని జూచి ''నాన్సెన్సు, గెటవె'' యని వారిలోఁ గొందఱనినట్లు నాకు స్వల్పముగ వినఁబడెను. నన్నుఁ జూచి ''లాంగ్ ష్యాంక్సు'' అని ''క్యామెలు'' అని యేమేమో యనిరి. కాని నాకప్పటికి వానికర్థము తెలియలేదు.

ప్రపంచములోఁ దిట్లు దిననివాఁ డెవ్వఁడు? భగవంతుని మొదలు పాకివానివఱకుఁ బ్రజచే మాటఁబడనివాఁ డెవ్వడు? జనులు కొందఱు ప్రత్యక్షమున ద్రావిడీస్తనగతిఁ దిట్టుదురు. కొందఱు గోడచాటున ''ఘూర్జరీకుచయుగక్రియ'' గూఢముగాఁ దిట్టుదురు. కొంద ''ఆంధ్రవధూటిచొక్కపుంజనుంగవఁబలె'' నరచాటుగఁ దిట్టుదురు. ఎటులయిన –నెవ్వరికయిన–నూపిరి ముక్కునఁ బట్టియున్ననిన్నినాళ్లు తిట్లు తప్పవు. కాని ముసుగులోని తిట్లకంటెను, దోఁబుచ్చితిట్లకంటెను బ్రత్యక్షపుఁ దిట్టులే యుభయతారకము లని నాము తము. తిట్టవలసినవాని నెదుట నిర్భీతిగఁ దిట్టినితిగదా యని సంతుష్టియు, నాంతరాగ్రహ భార మోచనము నొందుటచే హృదయబాధోపశమనమును దిట్టినయతఁడు పొందును. తిట్టఁబడిన యాతనికి స్వల్పోపజ్ఞానము, కోపనిరాసనము, శాంతివృద్ధియుఁ గలుగును. కావున నీనభాజనశాపాలాపములు మనకు నదుపయోగములే యని నాలో నేను సంభావించుకొనుచు నమీపమున నున్న బల్లపైఁ గూరు చుంటిని. కాలాచార్యులు నిలుచుండియే యెడమయర చేయి విప్పి దక్షిణహస్తతర్జన్యగ్రమున మూఁడుమాఱులు పొడిచి భీకరభేకాభినాసికో ద్రేకుఁడగు నొక్క విశ్వబ్రాహ్మణున కీసవ్యాపసవ్య కరసమావేశ సన్నివేశమును గనఁబఱి చెను. అంత నాతఁడానంజ్ఞకర్థము తెలియక కుడిచేతి ముష్టిని దనచెవియొద్దఁ బెట్టుకొని దానిని ముందునకు వెనుకకు నూఁపెను. కాలాచార్యులసంజ్ఞను గాంచి యాతఁడు మూఁగవాఁ డనుకొని యీవిశ్వబ్రహ్మ తిరుగ సంజ్ఞచేసె ననినే ననుకొంటిని. అంతట ''నస్య మయ్యా'' యని కాలాచార్యులు గట్టిగ నఱచెను. మారేడుకాయ యలవాటులేని యాదేశమునఁ గాలాచార్యుని హస్తాభినయము దురవగాహమైయుండదా? ఆకేక విని సభ యంతయు వెనుకకుఁ దిరిగి కాలాచార్యుని జూచెను. ''సైలెన్సు'' అని కొందఱు ''నార్తరన్ పూల్సు'' అని కొందఱు మహదాశీర్వచనపుఁ బనసతో నక్షతలను గాఁదలఁచిన పెండ్లికొ డుకుపైఁ జల్లిరి. కూరుచుండు మనకుండఁ గాలాచార్యుని గట్టిగ లాగి కూర్చుండఁ బెట్టితిని. అంతకుఁ బూర్వ మచ్చటి యుపన్యాస కర్త యేమి చెప్పుచుండెనో కాని మేము కూర్చున్నపి మ్మట ఇట్లు చెప్పసాగెను. ఆతఁ డొకపిళ్ల–''కళ్లెపిరాంపిళ్ల'' యాతనిపేరని తరువాతఁ దెలిసెను. ఆతఁడు కొంతకాలము రాజకీయశాసనసభలో సభ్యుఁడుగా నుండెను. ఆంధ్రదేశ మునందు రాజకీయోద్యోగములఁ జేసి గౌరవవేతనమును దీసికొనుచున్నాఁడు. ఆంధ్రభాషా భిమానము పూర్ణముగఁ గలవాఁడు. ఆంధ్రులఁ గూర్చి యేసభ జరిగిన నీతఁడే సభాద్వారక వాట మోచకునికంటె ముందు వచ్చును. తోఁచిన దేదో లగ్గుబిడియము వదలి మాటలా డును. ఆతఁడిట్లు చెప్పసాగెను.

''చీనావా రేమి? మన మేమి? అంతా వకటే. భ్రాతృత్వము మన దేశములో నవతారంచే సిన బుద్ధుఁడే అంగె పూడ్చినాఁడు. (నో నోయని సభలోఁ గొందఱకేకలు) హుర్రా! ఏమి బుద్ధుడు! అందఱ సోదరత్వమును ప్రపంచముకు విడమరచినాఁడు. అతని మోహమతమను తణ్మే యార్యవర్తపు గుండెకాయలోఁబుట్టి బుస్సుమని పైదిక్కువారిని చీనావఱ కేమి? జపానువఱ కేమి? పూడ్చి జనుల మనస్సులను తనత్వమునుండి (selfishness) యూడ్చి వేసెను! (హియర్ హియర్) (తనత్వము కాదు, తెలుఁగుభాషా గుడ్డిత్వ మని నాయొద్ద గూరుచుండిన కృష్ణాజిల్లా బాలకుఁ డొక్కఁ డఱచెను) అతని మతపంచదార పానకము ప్రపంచమంత వ్యాపించి ఎల్లపేర్ హృదయములలో ఒక్కకుటుంబత్వకండచక్కెరగింజలను కిందికి డిస్టిలు చేసెను. (స్టైండిడు). మంచుకొండల గొలుసుయ్యాలలో పండుకొన్న

చీనాబిడ్డపావఁడు మనచేతికై చూచుచున్నది. హిందూదేశ మొక్కపీకెతో తనధ్వనియొక్క పెద్దమేర కిట్లఱవవలసి యున్నది. (నీవు నోరు మూయకున్న నీగొంతు గోయవలసినది యని యెవ్వఁడో పిల్లవాఁడు నిమ్మళముగ ననెను). ఓసోదరచీనా! నీహృదయము నల్లలాడించి వేసిన భూకంపము మాతలలకు తాకుడిచ్చుచున్నది. అందులో శత్తుపూడ్చిన నీమహాబిడ్డల శక్తముతో ప్రపంచపుగాలియంత పీల్చఁబడి (Saturate) అయినది. నీచిత్తులనుండి పైకిఁ దొరుగురుచున్న వేడిగాళ్లు కొండరాజములమంచుగడ్డలను నీరుచేయయోగ్యమై యుండుచున్నది. భూకంపించునట్టి (Crisis) లో నీవిచ్చిన మూలుగు నాచెవిని నాతమ్ములచెవిని బడిన్నులగుండగా కారిపోయినది. ప్రపంచమొగముమీఁద ప్రక్కవేసిన నీసోదరుల కందఱకు వారి వారి హృదయానుభవిత నొప్పులను నీకు విప్పిచూపింప విధియైయుండి యయినది. శోకన్నీళ్లు నీపుండ్లను గడిగి మాఱురకొట్టిమాటలు నీకు మెత్తనిమలామావట్టుమాటవలసినది. ఓనాగరిక చీనాతమ్ముఁడా! నేనిక్కడేడ్చు నర్వజనయేడుపులను నీవు స్వీకారంబు చేయవలెను అని మొదలైన మాటలతో యీమనతల్లి నేల యేడ్వవలెను.

''ఓనభాపతీ! ఓనభ్యతమ్ములారా! మీచెవులకు విప్పవలసిన కొన్ని మాటలు నానాలుకకు కలిగియున్నది. ఏడ్చుటకు మీకిదికంటె దొడ్డ అదనులేదు. (సత్యము సత్యము అని యొకయుత్తరదేశ బాలకుఁ దఱిచెను.) ఉపద్రవమునకు మీకన్నుల దెఱచి ఉపాదానమునకు మీసంచులు దెఱువవలెను. మీచేతులను బొడుగుగా చాపి పిల్లరహితగతికై యేడ్చుచున్న మీపినతల్లి గాగరయొడిలో మీశక్తికొలఁది వెండి, బంగారములను కురిపించవలసిన వేళ యిది. జాతీయసాయముచేగాని యెత్తువడిన చీనా లేవదు. అది లేచినగాని శక్తి తులాచిప్పలు నరిగ వల్లాడవు. మన మిచ్చట తలలను మనసులను జేబునంచులను గలపి ఉత్తరక్రియలు మొదలుపెట్టవలె. తల్లినేల యంతయు గంభీర గొంతుకతో నాగుండా సాయముచేయ మని యరచుచున్నది. మనిషి ప్రకృతి నాలోనుండి సహస్రనాలుకలతో సాయము చేయమనుచున్నది. దేశభ్రాతృత్వముగా జాతీయభ్రాతృత్వము నాద్వారముగా సాయము చేయమని మొఱపెట్టుచున్నది. ఇదిగో చందాపట్టి. శక్తి యంగీకరించు మేరకు సాయముచేయవలెను'' అని చెప్పి యాతఁడు కూరుచుండు సరికిఁ గరతాళధ్వను లెగసెను. అంతట సభాధ్యక్షుఁడు లేచెను. అతఁడు మహమ్మదీయుఁడు. ఆతఁడిట్లు చెప్ప నారంభించెను. **Is there any other man coming forward to speak on the Subject?** యని యడుగ నేను లేచితివి. ''నీ కింగ్లీషు వచ్చునా?'' యని కళ్లెపిరాం పిళ్లగారు నన్నడుగ ''వింగ్లీషు వచ్చినఁగావి తెలుఁగు మాటలాడ వీలులేదా?'' యని వేనడిగితిని. ఇంగ్లీషువచ్చినవారుగాని యీవిషయము ల యొక్క యాత్మలో దూరలేదు. గనుక యిట్లు పలికితిని'' అని కళ్లెపిరాంపిళ్లగారు తిరుగఁ బలికిరి. నీపే రెవ? రని సభాధ్యక్షుఁడగు మహమ్మదీయుఁడు నన్నడుగ ''జంఘాల శాస్త్రి''యని చెప్పితిని. అప్పుడు సభాధ్యక్షుఁడు నవ్వుచు ''జంగల్ శాస్త్రి కోన్‌రే'' అని తనయొద్దఁ గూరుచుండిన పిల్లిగడ్డపువాని నడిగెను. నాపేరు వినునరికిఁ గొందఱు నావంకఁ జూచి చిరకాలమిత్రుని జూచినట్లు సంతోషపడి ''జంఘాలశాస్త్రి ముఖ్యముగ మాటలాడవలయును. అతని నెవ్వరు నడ్డుపెట్టఁగూడదు. జంఘాలశాస్త్రిగారూ! ఉపన్యాసపీఠమునకు దయచేయుఁడు'' అని సభలోఁ గొంచెము పైచ్చుతగ్గుగ నందఱు పలికిరి. నే నట్లు ప్రోత్సహింపఁబడి పీఠ మెక్కితిని. నాయుపన్యాస మిప్పుడు చెప్ప మిగుల నాలస్య మగును గాన మఱియొకసారి చెప్పెదను.

55. జంఘాలశాస్త్రి యుపన్యాసము

కళ్లపిరాంపిళ్ల గారి ''చీనా భూకంప బాధితుల సహాయార్థ''మైన ఉపన్యాసానంతరం జంఘాలశాస్త్రి వేదిక మీదికి వెళ్లాడు.

ముందుగా – కళ్లపిరాంపిళ్ల గారి వంటి దాక్షిణాత్యుల చేతులలో ఖూసీ అవుతున్న తెలుగు భాష దురదృష్టాన్ని స్మరించి బాధ వెళ్లగక్కాడు. శ్రోతలా బాధను అర్థం చేసుకున్నారో లేదో గాని ''విషయంలోకి రమ్మ''ని కేకలు వెయ్యడంతో ''చీనా భూకంప బాధితులకు సహాయం'' అనే విషయం ఎత్తుకున్నాడు.

మన దేశం, ఇతర దేశాలకు సహాయం చేయగల సంపదను ఎప్పుడు పొందింది? అని ఆశ్చర్యం ప్రకటించాడు. దేశం ఆర్థికంగా ఎంత హీన స్థితిలో వుందో వ్యంగ్యంగా వెక్కిరించాడు. ఇంగ్లండుతో పోలిస్తే తలసరి ఆదాయం మనదేశంలో ఎంత భ్రష్టంగా వుందో నివేదం చేశాడు.

మన దేశంలో దరిద్రులు, ఋణగ్రస్తులు, విద్యాకుశ్యులు, దురాచారాల బురదలో పొర్లాడేవారు, వరకుల్కమనే దుర్మార్గంలో చరించేవారు, ఇన్ని సంక్షోభాలు మనకే వుండగా – చీనా భూకంప బాధితులకు మనం చెయ్యగలిగే సాయం ఏమి? అని శాస్త్రి ప్రశ్నించాడు. భూకంపాల కంటె, తుపానుల కంటె భయంకరమైన బాధల్లో మనమే వున్నాం. మనల్ని మనం ఉద్ధరించుకున్న తరవాత ఇతరుల్ని ఉద్ధరించవచ్చును అని జంఘాలశాస్త్రి ఖండితంగా ప్రసంగించాడు.

శాస్త్రి ఉపన్యాసం అధ్యక్షుడికి నచ్చింది. 'చందాపట్టీ ఫోడ్ డాలో' అనేశాడు. సభలో తన్నట్లు మిన్నుముట్టాయి.

అగ్రాసనాధిపతీ! దాక్షిణాత్యసోదరులారా! ఇంతకుముం దుపన్యసించిన యీ నాయుడుగారి (కాదు--కాదు--పిళ్లగారు--కళ్లెపిరాంపిళ్లగా రని సభలోఁ గేకలు) నాయనలారా! కళ్లెపిరాంపిళ్లగారి యుపన్యాసమును సావకాశముగ వింటిని. తదర్థభేదసమునకై తల జింపు కొంటిని! ఊహూఁ! అంశయు నిడలేదు. కొన్నికొన్ని వ్యాసఘట్టములు దురవగాహదుర్భేద్య దుర్గ్రహదురవస్థాదురంధరములై యున్నవి. మన కందఱికిఁ దెలియుటకొఱకే మాటలాడి నారుకద! వా రుపన్యసించిన దాంధ్రభాషయేకద? అంతవఱకు మీ కెవ్వరికిని సందేహము

లేదుగదా? మీ కందఱకు లేనప్పుడు పైయూరనుండి యొకటి రెండురోజులు మాత్రమే యిట నుండఁదలఁచిన నా కేల యుండవలయును? గేదెదూడలను బెంచుట బహుకష్టము. వానికిఁ బా లెక్కువ విడిచినఁ—గష్టమే. తక్కువ విడిచినఁ—గష్టమే. అది చావఁగ దానిస్థారమలంకరించుటకుఁ జేతపెయ్య నొకదానిని జేయుట యాచార మని మీ రంద రెఱుఁగకపోరు. ''చెఱుపుటకుఁ జేతపెయ్య చాలదా?'' యను లోకోక్తియున్నది. కాని యథార్థలోకోక్తియది కాదు. ''చేపుటకుఁ జేతపెయ్య చాలదా?'' యనునది నిజమైన సామెత. ఎటులయినను జేతపెయ్య యనఁగనేమో మీ రెరుఁగుదురు. ఈనడుమను మాతూర్పుసోదరులు కొంత రాంధ్ర భాష చచ్చిపోయిన దని సెలవిచ్చియున్నారు. దానిని మాదాక్షిణాత్య సోదరులు సరస్వతీస్తన్యగ్రహణార్థమై చేతపెయ్యగఁ జేసి వాడుచున్నారేమో యను సందేహము మనపిళ్లగారి విచిత్రవిపరీతాంధ్రభాషోపన్యాసాకర్ణనమున నాకుఁ గలిగినమాట సత్యము. నేను బుద్ధిహీనుఁడనైనఁ గావచ్చును. కాని గడ్డిదూడను జూచి కారుమలపగేదె చేసిన ట్లీకృత్రిమాంధ్రభాషను జూచి వాణీమహాదేవి మోసపోయి భ్రమపడి సారస్వత రసమును జేఁపునంతటి బుద్ధిహీనురాలా! (Well go on, Enter into the Subject) అని కేకలు (Do not hurry him please) అను మారుకేకలు.

నాయనలారా! నామాటలు వినుట మీ కంతకష్టముగా నున్నదా? మా యాంధ్రభాషను మీ రిట్లు మాదిగమంచముగఁ జేయుట నాకుఁ గష్టము కాదా? శిరీషకుసుమపేశలమై, పుట్టతేనెరుచు లుట్టిపడుచు, స్వచ్ఛమయి, సరళమై, సకల ఫలచంపకమువలె సర్వ సౌగంధ్య సన్ని పాత సముద్గారిణియై, యశేషజనశిరఃకంపన కారణ ధోరణి విరాజమానయైన మాయాంధ్రభాషను—మాతేట తెనుఁగుబాసను—మీ రేమి చేయుచున్నారు? ఆహా! మీ రేమి చేయుటకు సాహసించినారు? దానిని ధ్వంసముచేసినారా! దానిని గురూపను జేసినారా! దాని హంసయానమును ధ్వంసపఱచి కప్పదాఁటుక్రింద రొప్పుచున్నారా ఆంగ్లేషభాషావాక్యముల బందుకట్టుతో దానిని బిగఁగట్టి చెడఁగొట్టు చున్నారా? ఆంగ్లేయభాష యెక్కడ? ఆంధ్రభాష యెక్కడ? దానికి దీనికి మంజులతలో, మధురతలో, మార్దవములో నెంతవ్యత్యాస మున్నది! ఆంగ్లేయులే యాంధ్రభాషవంటి మృదులమగు భాష లేదని వేనోళ్ల దానిని స్తుతించుచుండఁగా మీరు దాని ఝళంఝళారవ నూపురాలం కృతము లగు పాదములఁ గర్ణజ్వరకారకములగు పాశ్చాత్యచర్మపాద రక్షలను దగిలించితిరా! మొలనూలుగంటలచే విలసిల్లు దానిసదసన్మధ్యావస్థాస్థానమగు మధ్యమునకు ''మొరాకో'' తోలుతో మోటుపట్టిని బిగించితిరా? (Kindly get into the subject అను కేకలు) అనిన మీకుఁ గోపముకాని "Oh sons of the soil" అనఁగ నోమట్టికొడుకులారా! యని యాంధ్రమునఁ బలుకుచున్నారా! (Never mind please అను కేకలు) ఇంతకంటెఁ జెప్పనీయరా? పోనిండు! మీ యిష్టమువచ్చినట్లే కానిండు! మీదేశము మీదేశస్థులు—మీసభ—మీయాలోచనము!

సరే—చీనాదేశమున నెచ్చటనో భూకంప మొకటి కలిగిన దనియు, నందువలన ననేకకుటుంబములు నశించిన వనియు, మరికొన్ని కుటుంబము లన్న శూన్యములై యగతికములై యసాధారణబాధావళి విధేయములై యున్న వనియును, మన మందఱ మిచ్చటనుండి కొంతధనము ప్రోగుఁ జేసి చీనాదేశమున కంపి వారి దురవస్థఁ దొలఁగింపవలయు వనియుఁ బిళ్లగారియుపన్యాసమునకు సారాంశ మని నే ననుకొంటిని. అదియే

యగునా? కాదా? అదే యగునెడల ముందుఁ జెప్పవలసినది చెప్పెదను. కానియెడల నది యేదో సెలవిచ్చితిరేని ముందుఁ జెప్పవలసినది మార్చుకొని చెప్పెదను. (అదే అదే అని సభలోఁ గేకలు)

మంచిది. ఆహా! నేఁడుగదా మహానుదినము! ఇట్టి మహాపర్వదినమును జూచుటచే మనము మనపూర్వులికంటె మహాదృష్టవంతులము గదా! ఆర్యావర్తదేశ మధికభాగ్యవంత మైన దేశ మను నమీచీనాభిప్రాయము–మీ చీనా విషయకోపన్యానమువలనఁ దేలుచున్నది. ఆహా! హిందూదేశము కృతార్థ మైనదిగదా! ఆహా! తనబాధలను దాను స్వశక్తిచే నివర్తింపఁ జేసికొని ప్రపంచమున నున్న యితరదేశముల బాధలను దనచేతనైనంతలో నెగురఁగొట్టఁ జాలియున్నది! స్వపోష్య పరపోషణప్రజ్ఞా సాధారణమైయున్నదే! మేలు. అంత మహాశక్తినంప న్నమైన దెప్పు డైనది? ఇంత యాకస్మికముగ నంతభాగ్యవతి యైన దగుటకు హిమాలయప ర్వతపంక్తి యొకసారి హేమాలయపర్వతపంక్తి యయినదా? కస్తూరివార్తాకరజతపర్వతము గడచినరాత్రి పరమార్థ రజతపర్వత మైనదా? గోదావరీతీరమునఁ గోహినూరునూరులు బయలు దేరినవా! ఊఁహుఁ! ఏమియు లేదే! కొండలలో మంచుగడ్డలకు సమృద్ధి! నదులలో బొమ్మరాలకు సమృద్ధి! మన్నెములలో శీతజ్వరసమృద్ధి! శీతల ప్రదేశములలో మహామారికాప మృద్ధి! మహోష్ణప్రదేశములలో మశూచివ్యాధి! మధ్యకాలములో మరిడమ్మ! సర్వఁఋ నర్వకాల నర్వావస్థలయందును క్షామసమృద్ధి! కాని సభలలో మహోపన్యాన పీఠములపై స్వప్నభాగ్యసమృద్ధి! హే! హే! పూర్వపు పూలవరాల నంచులు, రామమాడల గోతము లిప్పుడామెకుఁ బక్కయెత్తుల క్రిందఁ దలయెత్తులక్రింద నుపయోగపడుచున్నవి. పురాత నపు రత్నహిరణ్య నిక్షేపము లిప్పుడు పాఁతఱి గోతులక్రింద, నొరలనూతులక్రింద నపయోగపడుచున్నవి. పూర్వపుగోగజ కంఖాణలక్ష్మీసమృద్ధి యిప్పుడు పాలగొట్టములక్రిం దను, బొగ్గుగాలిబండ్లక్రిందను బూర్వపక్షమయినది. రూప్యమున కరణావంతున వడ్డితోఁ దెచ్చిన ఋణముతోఁ గట్టిన యగ్గిపుల్లల శాలలోని–వ్రాఁతపుల్లల శాలలోని–నబ్బుబిళ్లల శాలలోని కట్టుకంప నరకు–లింటిచలిమంటలక్రింద, వీధిగోఁతిపెంటలక్రింద నుపయోగపడు చున్నవి.

దేశభాగ్యసౌష్ఠవ మిటు లున్నది. అదృష్టదినములు గడచిపోయినవి–బహుదరిద్రస్థితి నది యనుభవించుచున్నది.

ఇంగ్లాండు దేశములోని జనసంఖ్యలోఁ దలకొకటి మొత్తముమీఁద దినమున కాదాయ మేదో కొన్ని పెన్సులయిన నుండునుగాని యట్టి దార్యావర్తదేశమునఁ బైనలోఁ బదిలక్షలవం తయిన నుండ దని యనుకొందును. **The balance is even minus** అని (నభలోఁ గేకలు) ఎడమచేతిలో రాగిముష్టిచెంబు–! కుడిచేతిలో నమనవాన్న నత్రశంకు స్థాపనోపయోగ మగు వెండితాపియునా? కట్టుబట్టకై యొకచేతఁ జందాపట్టియు–నొకచేత భూహిరణ్యదాన శాసనపత్రమునా? కాలుకుంటి!–ఆకాశగమనోపదేశమా?

తాను దరించినతరువాతఁగదా! యొకనివి దరింపఁజేయుట? తనకుఁ బుట్టగోఁచి యైన నున్నతరువాతఁగదా! యొకని కొక్కనూలుపోఁగయిన నిచ్చుట! తనకుఁ దనవారి కొక్కపూఁటయైన నరటుత్తయినఁ దీఱుట కన్నమున్న పిదపఁగదా! యన్యదేశమున కన్నప్రదాన మొనర్చుట? మనకున్న కానంతసొమ్ము–మనకొఱతలఁ దీర్చుటకు

–మనబాధలఁ బాపుటకు–మనకడుపుమంటలఁ జల్లార్చుటకుఁ–గొంచెమైనఁ జాలియున్నదా? మనలోఁ గోటీశ్వరులు లేనేలేరు–లక్షలకొలఁది రాబడి వచ్చువారు మిగులఁ గొలఁదిగ సున్నారు–వారిలోఁ గొందఱు ఋణాక్రాంతులై యున్నారు–మిగిలినవారు సామాన్య మధ్య మధ్యమ ధ్యాధమాత్య ధమావస్థలో నున్నారు. అద్యాశనశూన్య లగువా రనేకు లున్నారు. అవయవగోపనసాధనము లేనివార లనేకు లున్నారు. అట్టి వీ రందఱకు సాహాయ్య మొనరింపవలసినవారు మనలోని ధనవంతులే కారా? అట్లు సాహాయ్యమును జేయుచున్నారా? లేదా? యని విచారింపనక్కఱలేదు. చేయవలసినవారు వారు –చేయఁదగినవారు వారు–పొందఁదగినవారు దేశస్థులలో మహారిక్తులు. అట్టిసాహాయ్యము లేకుండు నెడలఁ జచ్చుట తప్ప గత్యంతరము లేనివారు మనదేశస్థులలోని మహాపన్నులు! ఎటులయిన నన్నదానమున మనయార్యావర్తమే యన్యదేశములకంటె నధిక మనుటకుఁ దగియున్నది. ఎచ్చటనో కాశీక్షేత్రమున నత్రము లున్నను, రామేశ్వరమున నన్నదానశాల లున్నను, బ్రజకు విశేష ప్రయోజన మేమి? అక్కడకు క్షుధార్తులు ప్రయాణ మగునరికి వారి దేహములనుండి ప్రాణములు ప్రయాణ మగునుకదా! కావునఁ గొంత సొమ్ము చందాలు వేసికొని యట్టి యన్నశాల లచ్చటచ్చట దట్టముగ నుండునట్లు చేయుట కొంత యావశ్యక మైయున్నది.

మనలో నక్షరాస్యులు నూటికిఁ బదుగురైన నరిగలేరు. శేషించిన యశేషజనులు వట్టిశుంఠ లని వేరే చెప్పవలయునా? విద్యాగంధ శూన్యులయి, సదసద్విజ్ఞానశూన్యులై, కల్లుపాకలలోనో, కాంతాపరీరంభములలోనో, కలహములలోనో కాలక్షేపము చేయుచున్నారు. వీరికి విద్యఁ గఱపినయెడల వీరిలో నెందఱు మంత్రియుగంధరు లుందురో! యెందరు రామమోహనరాయ లుందురో! యెవరు చెప్పఁగలరు? దేశ క్షేమమునకై పాటుపడు ధీశాలు లెంద రుందురో! అట్టివా రజ్ఞానమున నడఁగియుండుట దేశమున కెంతయరిష్టమో చెప్పవలయునా? అట్టి వారిని విద్యాన్వింతులఁ జేసి వారిమూలమునఁగూడ దేశోద్ధరణముఁ జేయించుట మనదేశమందలి ధనవంతులు చేయఁదగినకృత్యము కాదా! మన పరిపాలకులగువా రిందుపిషయమై యెన్ని పాఠశాల లుంచినను వారు ప్రత్యేకముగ నేమి చేయఁగలరు? సర్కారువా రిట్లు చేయుచున్న పనికి మన ధనయుక్తులు తగువిధములఁ దోడ్పడి యాపనిని విపులతమముగఁ జేయవలసియున్నది.

ఇక నెన్నెన్నో దురాచారములను మాన్పుటకుఁ బ్రయత్నింప వలసియున్నది. ఒక్కటిమాత్రమే సంకుచితముగఁ జెప్పెదను. ఈనడుమ వంగదేశమున 'స్నేహలత' యేల మరణించెనో మీ రంద రెరింగియె యుందురు. విషూచికంటె, మహామారికంటె భయంకర స్వరూపిణి యగు వరశుల్క మహాశక్తి కగ్ని ముఖముగ నీయఁబడిన యాకన్య బలివార్త ఫిరంగిగుండు వ్రేటుకంటెఁ–బిడుగుపాటుకంటె– మహాదారుణముగఁ బడఁగ దేశస్థుల హృదయసీమలఁ గలిగిన భూకంపముకంటెఁ జీనాదేశమనఁ గలిగిన భూకంపము మనకు దుస్సహతరమా?

ఇట్లు మనదేశములోని దురాచార మహాభూత సంక్షోభము వలనఁ గలిగిన తుపానులు–క్షోణీకంపములు–ఆగ్నేయపర్వతజ్వాలా మాలికావిజృంభణములు– సంఘమరణములు–మొదలగు మహోత్పాతములకంటె నాయనలారా! చీనాదేశపు భూకంపము మన కెక్కువది

కాదు. తరుగని–తలమునిఁగిన– మహాచింతలు మన కుండ మనదేవులాట యేదో మనము చూచుకొనక యితరుల చింతాలేశములకై కూనురాగములతోఁగూడిన పరామర్శలు పనికి రావు. మనకొంపలు నాల్గుచూరు లంటుకొని కాలిపోవుచుండఁగ వాని నార్పుట మాని పొరుగూర నున్న మరియొకని వరికుప్ప నార్పుటకై నీటిమోఁత తగునా? భూమిగల యంతవట్టు కంపములు సిద్ధించుచునే యుండును. సముద్ర మున్నంతపట్టు తుపానులు గలుగుచునేయుండును. మహాపాపము పండినప్పు డెల్ల నిట్టి మహోపద్రవము లేవో సిద్ధించు చునే యుండును. ప్రాపంచి కావస్థలో సమత్వమును స్థాపించుటకొఱ కవి ప్రకృతిచే నుద్దేశింపఁబడిన సాధనములు. వారికొఱకు మన మిచ్చట సభచేసి వచ్చియురాని తెనుఁగుతో క్షోభింప నక్కఱలేదు. పిళ్లగారు చెప్పినట్లు 'తలలను జేబునంచులను' మైదాపిండిగ లట్టించనక్కఱలేదు--ఐహిక మహోన్నతదశామగ్నతను బొంది దానితో నత్యంత పాప పరిపక్వతనొంది "Babylon, Ninevao" (బాబిలాన్, నినెవో) మొదలగునవి నామావశిష్ట ముగ నశించినవి–కాని యప్పటి మనదేశస్థులు వానిని దిరుగఁ గట్టుటకుఁగాను మట్టితట్టల నిక్కడి నుండి పంపియుండలేదు.

చీనా కేమి? అది స్వతంత్రదేశము! ఏదయిన నట్టి యుపద్రవము దానిలోఁ గొన్ని పట్టణములకు సిద్ధించినయెడల నందువలనఁ గలిగిననష్టమును దానే కూడఁదీసికొనఁగలదు. అధికధనము కావలసినయెడల నదియే యనేక సాధనము లందుకొఱ కాలోచించుకొని వాని నాచరింపఁ గలదు. దానికి మనసాహాయ్య మనావశ్యకము. పరదేశమున కిట్టి యాపదలలో సాహాయ్యము చేయఁగూడ దని చెప్పువాఁడనుగాను. ముఖ్యముగ మనము సాహాయ్యము చేయవలసినదే. ఎప్పుడు? మనకు మనము సాహాయ్యము చేసికొన్న తరువాత –మనచిక్కులను మన మూడఁదీసికొన్న తరువాత–మనపిశాచములను మనము వదలుచుకొ న్నతరువాత–మనయేడుపు లేవో చల్లారినతరువాత. అంతే కాని మనయాఁడువారు, నంత కంటె నేడాకులు తక్కువయగు మనవారిలో గొందఱు ప్రబలతమాజ్ఞానసముద్రమున మునిఁగి కెక్కు కెక్కు మనుచుఁ గొట్టుకొని పోవుచుండఁగఁ జీనాలోని వానల లేమికై మన కిచ్చట వారుణపూజలు–నహస్రఘటాభిషేకము లెందులకు? మన దేశ ప్రజలు కడుపులు కాలి–కొంపలు కాలి–మదులు కాలి యేడ్చుచుండఁగ మనము చీనావారితేయాకుపంట నష్టములకో, రైలుప్రమాదములకో బావు రని విలపించి చేతులతోఁ జెంబు లమ్మికొని చందాపట్టీలను జూపించు టెందులకు? ''స్వయం తీర్ణాః పరాం స్తారయే'' త్తను లోకోక్తి వినియుండరా! పరులఁ దరింపఁజేయకుఁ డని నేను జెప్పుటలేదు–ముందు మనము తరించి యాపనిఁ జేయుద మని చెప్పుచున్నాను–

అని యూరకుంటిని. అంతట నగ్రాసనాధిపతి లేచి ''జంగల్ శాస్త్రీజీ ఫర్మాయించి నది బలేగా వుంది–చందాపట్టిషోడ్ డాలో–నచ్చీమాట శాస్త్రిజీ శల్వించ్చాడు. మాకీ లేనప్పుడు బన్–చీనాజాన్తా నహి–జపాన్కీ జన్తా నహి'' యని గంభీరకరతాళధ్వనుల నడుమఁ గూర్చుం డెను–

ఏవయిన–దురాచారములఁగూర్చి నన్ను మరిరెండుపన్యాసము లిమ్మని సభవా రందరు కోరఁగ నటులే యని యంటిని.

56. సముద్రతీరపర్యటనము

కాళయుక్తి నంవత్సరం –

కార్తిక శుద్ధ పూర్ణిమా సాయంకాలం.

మైలాపుర తిరువల్లిక్కేణి మధ్య సముద్ర సౌభాగ్యాన్ని చూస్తూ జంఘాల శాస్త్రి తాను పొందిన ఆధ్యాత్మిక భావ పరంపరనీ, ఆ తీరం వెంట నడుస్తూ చూసిన నన్నివేశాలనీ, వాటి ప్రసంగాలలో నంకుచితత్వాన్నీ, తరువాత సాక్షి నంఘ శ్రోతలకు వినిపించడం, ఈ ప్రసంగ సారాంశం.

శాస్త్రికి కొంతనేపు, ఈ సృష్టిలో అధికత్వ, న్యూనత్వాలను ఎంచడంలో మనుషుల అజ్ఞానం తలపుల్లోకి వచ్చింది. దీనికి ప్రేరణ ఆ సాయం కాలం సముద్ర తీరంలో కనిపించిన ప్రకృతి, పరిసరాలు. ఆలోచనలు అలా సాగి సాగి – 'సృష్టిలో అన్ని వస్తువులు ఒక్కటే – వైకీ ఒక్కటే పరమార్థంలోనూ ఒక్కటే, వస్తుతత్వంలోనూ ఒకటే, శక్తియుక్తిలోనూ ఒకటే అనిపించింది. ఒక్క క్షణం అలా నిలిచిందంటే మళ్లీ మనస్సు చంచలించింది. ఇది గ్రహించి శాస్త్రి కానేవు మనస్సు మూలతత్వాన్ని విశ్లేషించాడు.

అలా సముద్రపు ఒడ్డున నడుస్తూ ఒకచోట 'నన్నయ నియోగి' అని నిర్ధారించినట్లు ప్రకటించే ప్రబుద్ధుణ్ణి చూశాడు. పోతన్న ఒంటి మిట్టవాడా? ఓరుగల్లు వాడా? అని కొట్టుకొనే విద్యార్థుల్ని చూశాడు. ఇంకొక చోట వీధి పేరుల్లో దాగివున్న వంశ చరిత్ర బయటకు లాగడానికి విజ్ఞాన నర్వస్వం వంటి దాన్ని ప్రకటించాలని నిర్ణయించే నభను చూశాడు. జంఘాల శాస్త్రి ఇంక ఆగలేక ఇక్కడ ప్రసంగించాడు. ఇటువంటి ఆలోచనలు ఎంత బుద్ధిహీనమైనవో నృష్టం చేశాడు. విమర్శ వెర్రి పోకడలు పోకూడదని ఖండితంగా చెప్పాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

"ఓ! అంతరిక్షమున నల్లనిపొగ ధూమనౌకలనుండి లేచుచున్నది. తీరమందుఁ దరంగములనుండి తెల్లనినురు గెగురుచున్నది. పశ్చిమదిశను భానుఁడు దిగజారుచున్నాఁడు. ప్రాగ్దిశను చంద్రుఁ డెగఁ బ్రాకుచున్నాఁడు. అహా! నీరనమై, మలీమనమైనపొగ

కుచ్చదశయేమి? లోకచక్షువును, సర్వరోగహరుఁడును, సమస్తజీవసౌఖ్యప్రదాతయు, గ్రహ సార్వభౌముఁడు నగు నహస్రార్చి కధోగతియేమి? స్వభావమునఁ గాంతిశూన్యుఁడై ఉన్నతళుకేదో తేరసింగారమగుటచేత నర్కున కధమర్ణుఁడై క్షయవృద్ధిబాధావిధేయుఁడైన నిశాకరుఁడు నిండు రూపమున నింగిపై కెక్కి యెట్టయెదుటఁ గ్రుంకుచున్న యాత్మీయ తేజఃప్రదాత యగు సవితను గాంచి యెగురుచున్నాఁడు. ప్రభునియెడల నింతవిశ్వాసియై ప్రకాశించుచున్న పుత్రకుని గాంచి సముద్రమెగసి యెగసి యుప్పొంగుచున్నది. 'చూచితివా ప్రపంచవైఖరి యెట్లున్నదో' యని కనఁబడికనఁబడని యొకనక్షత్రము తనయట్టి మరియొ క్కనక్షత్రమునకుఁ గన్నుఁ గీటుచున్నది. ఆహా! చూడఁదగినదే–యోజింపఁ దగినదే. ఆహాహా! ప్రపంచమున గొప్పవాఁ డెవ్వఁడు? కొలఁదివాఁ డెవ్వఁడు? లఘుపదార్థమేమి? గురుపదార్థమేమి? గుణమేది? యవగుణమేది? గాలివిసరుచే నేలపై నెండుటాకు పైకి సునాయాసముగా నెగసిపోవుచుండఁగా, నాగాలి విసరుచేతనే కొండమీఁదిచెట్టు వ్రేళ్లతోఁ బెల్లగిల్లి క్రిందఁబడుచున్నది. గులకరాయి తక్కువలేదు. కొండ యెక్కువలేదు. చవుటి గుంట తక్కువలేదు. సముద్ర మెక్కువ లేదు. మసిబొగ్గుకంటె మాణిక్యము హెచ్చుకాదు. పరమాణువుకంటె భానుఁ డధికుఁడుకాఁడు. పురుగుకంటె నరుఁ డుత్కృష్టుఁడుకాఁడు. సృష్టిలోని యన్నివస్తువులు నొక్కటే. పైకి నొక్కటే–పరమార్థమున నొక్కటే– వస్తుతత్వ మున నొక్కటే–శక్తి యుక్తి నొక్కటే.

పన్నువసూలున రెవెన్యూఇన్స్పెక్టరు రెపరెపలాడుచు నవని కంత తానే యధికారినను కొనును. అట్టి గ్రామకరగ్రాహి, అమలుదారు ముందు వట్టినిర్జీవప్రతిమ. వారిద్దరు జిల్లా కలెక్టరునొద్ద గానునట్టి మారరు. ఆరెవెన్యూఇన్స్పెక్టరునకుఁ దహశీల్దారునకుఁ గలెక్ట రునకుఁగల యధికారతారతమ్యము గవర్నరుగారియెదుట భగ్నమై భస్మమైపోవును. అఖిలా ధికారుల యధికారాధిక్యాధమతలు చక్రవర్తిగారి సన్నిధానమునఁ జచ్చి నర్వాంగముగ నంతరించును. అట్టి చక్రవర్తి శిఖామణులంద రాపరమాత్మునిదృష్టిని బంట్లు–బానిసలు. ఇఁక నధికారి యెవ్వఁడు? అధముఁ డెవ్వఁడు? గాజురాతిని గాంచి వైక్రాంతము ప్రభావిశేషా డంబరమునఁ బరిహసించును. ఆరెండును బ్రహ్మజాతివజ్రముముందు వట్టితుక్కు. తేజ స్వంతములగు నన్నిపదార్థములుగూడ నఖండదీప్తిరాసియగు సర్కునిముందట నిస్సార ములు. నిస్తేజస్కములు. అట్టి ప్రబలప్రభామానుఁ డగుభానుఁడు నమస్తనక్షత్ర మండల ముతో చంద్రమండలముతో మనకుఁ గనఁబడని యింక ననేక సహస్రభానుమండలములతోఁ గూడ నవాఙ్మనసగోచరమగు నాపరమాత్ముని తేజోలేశముముందు వట్టిమసిబొగ్గుకంటె నధమాధముఁడు. ఇఁకఁ బ్రపంచమునఁ దేజశ్శాలి యెవ్వఁడు? తేజశ్శూన్యుఁ డెవ్వఁడు? అవర్ణ్యమైన యలౌకికమైన యేతేజముముం దన్ని తేజము లంధకారములో యాతేజమే తేజము. పెద్దన్న కంటెఁ దిక్కన్న ఘనుఁడు. పెద్దన్న తిక్కన్నల కవితాతారతమ్యము కాళిదానునిముందుఁ గానఁ బడదు. వారిమువ్వురిలోని న్యూనతాధికతలు వ్యాసతేజము ముందు పంచబంగాళమగును. అట్టి వ్యాసభగవానుఁడు రచియించిన పదునెనిమిది పురాణ ములు, భారతము బ్రహ్మసూత్రములు–లోకముననుండు నందరు వ్యాసులు రచించిన గ్రంథజాలమంతయుఁ బ్రపంచ గ్రంథములో నొక్కపత్రములోని యొక్కపంక్తిలోనున్న యొక్క వర్ణములోని వంకను బరిపూర్తిగఁ జెప్పఁజాలినవికావు. ఇఁక బుద్ధిమంతుఁ డెవ్వఁడు? బుద్ధిహీనుఁ డెవ్వఁడు? తెలియఁదగిన వస్తువును గ్రహించుట కక్కఱకురాని తెలివి తెలివి

యెట్లగును? అజ్ఞానములో–పరిశుద్ధమైన యజ్ఞానములో–స్వయంభవమైన యజ్ఞానములో–వాఁ డత్యధికుఁడని, వీఁ డదికుఁడని, వాఁడు మధ్యముఁడని, వీఁ డధముఁ డని, వాఁ డధమాధముఁడని, ''డిగ్రీ''ల చొప్పున భేదముతీయుట యెందులకు? అన్నియుఁ గంబళిలోని వెండ్రుక లయినప్పుడు తూర్పుకోణమున నున్న వెండ్రుక పశ్చిమ కోణముననున్న వెండ్రుకకంటె నెక్కువ నైల్యము కలదనియు, ఉత్తరపు మూలననున్న రోమము పశ్చిమోత్తరమూలస్థరోమముకంటె నెక్కువ వంకలు గలిగియుండుటచే మిగుల సుందరమైనదనియుఁ జెప్పినందువలన విశేషమేమి? చెంపమీఁదఁ దగిలినది చెప్పుదెబ్బయైన ప్పుడు–అంబాజీపేట మీసాలజోడా? ఆకుచెప్పుజోడా? యని పాదరక్షపరీక్ష పాండిత్యముతోఁ బనియేమి? అని నేనేమో–వెర్రిమొర్రిగ–మొదలు తుద నెరుఁగక–మైలాపుర తిరువల్లిక్కేణి మధ్యసముద్రతీర సౌభాగ్యమును గాళయుక్తి నంవత్సర కార్తిక శుద్ధ పూర్ణిమా సాయం సమయమున నవలోకించుచు, ననుభవించుచు దైవభావనాలగ్న భావుఁడనై యొక్క త్రుటికాల ముంటినికాఁబోలు. అట్లు మరికొంతసే పుండరాదా? ఉండిన నింకేమి కావల యును? అదియే భూలోకస్వర్గము. కుక్క తనతోఁకను వంగకుండ నూటిగ నొక్కనిమున ముంపఁగలదా? ఏనుఁగు తనతుండము నొక్క రెప్పపాటైనఁ గదలనీకుండఁ బట్టఁగలదా? 'సైకిలు' నెక్కినవాఁడు బండి నొక విఘటికా చతుర్థభాగమైనఁ జలింపకుండ నాఁపగలఁడా? నుఅకర్రలమానిసి విరామము లేకుండ వెనుకకు ముందునకు దేవులాడుచుండవలయునేకాని చిటుకవ్రేటుకాల మయినఁ జలింపకుండ నిలువఁగలఁడా? మనసును దైవలగ్న మొనర్చి స్తంభింపఁ జేయువానికంటె మహాత్ముఁ డెవ్వఁడు? పై యాటలమారి భార్యను బ్రక్కలో నుండి బెనగకుండ బిగింపవచ్చును. వదరుబోతు నాలుకను జెదరకుండ బంధింపవచ్చును. కాని నంతతచంచలత్వనమంచితమగు చిత్తమును కట్టిపెట్టినవాఁ డెక్కడ నున్నాఁడు? వాయుకోశముల గన్నుబున్నులకుఁ గొలఁదికాలము బిరడవేయఁగలవాఁ డుండునుగాని కప్పదాటులమనన్నునకుఁ గాలిబంధము వేయఁగలవాఁ డుండునా? హృదయకోశసంబంధ ములగు 'లబ్ డబ్' ధ్వనులకైనను గానంతసేపు శాంతి చెప్పినవాఁడు లక్ష కొకఁడైన నుండవచ్చునేమో కాని మనస్తత్వ నంబంధములగు పరుగులాటలను నెగురులాటలను నిలుపఁగలవాఁడు కోటి కొక్కఁడైననుండునా? అట్లు చిత్తస్తంభనమొనర్చువానికి మన స్తంభన మేయగును. భూమి కదలదు. చంద్రుఁడు కదలఁడు. ఇతరగోళము లేవియుఁ గదలవు. కాలము కదలకుండ నిలిచిపోవును. భిన్నభిన్న న్వరూపధారణమొర్చిన వ్యక్తులు స్థూలత్వ మును బాసి సూక్ష్మత్వమును పొంది మనస్తత్త్వముతో మనోరూపముగ నైక్యమందును. అట్టిస్థితి యెంత వానికిఁ గలుగును! పరమార్థమున వస్తువిభేదము మిథ్య–ఆత్మ సత్యము –ఈసత్య మనుభవమున లేకున్నను దెలిసియైన యుండుట కొంత మంచిది. దానినిబట్టి రాగద్వేషములను వీలగునంతవఱకు హద్దులో నుంచుట యంతకంటె మంచిది.

''నాకట్లొక త్రుటికాలము కలిగిన చిత్తబంధ మట్టి విడిపోయెను. సంస్తంభనావస్థలో వినరాని సముద్రపు హోరు చుట్టున శ్రవణపుటగత మయ్యెను. అప్పటికిఁ గన్నులు తెఱవక మనసును దిరుగ స్తంభింపఁ జేయనెంచి దీర్ఘనిశ్శ్వాసమును లోనికిఁ బఱపితిని. ఒడలి బిగింపునకు నరముల యెక్కిట్టిదో చిత్తస్తంభనమునకుఁ బ్రాణాయామపుఁ బట్టట్టిది. ఊహూ–మనసు బిగిసినట్లు లేదు. మఱలఁ బ్రయత్నించుచుండ–నింతలో నుప్పుఁ జేవలి కంపు ముక్కుపుటములందు గప్పునఁగొట్టెను. మనస్సునకుఁ జెవి దారి యిచ్చినందులకో

విచారించుచుండ ముక్కుఁ గూడఁ జెవితోఁ జేరినది. ఇంతలో ''నమాడి-శత్తుపూఁటే'' అను నార్తరవ మాఁదుకంతము నుండి వినఁబడెను. అదరిపడి యలజడిపడునంతలో ''కృష్ణా'' యను ధ్వని వినఁబడెను. దుశ్శాసనుఁడు వస్త్రాపహరణ మొనర్చుచుండఁ గృష్ణనామస్మరణ మొనర్చినద్రౌపది మనస్సునందు బారు మెఱుపవలెఁ దళుక్కు మనెను. ఇంకను జిత్తబంధ మేల యని చిత్తమునకు సింహద్వారమైన చక్షురింద్రియమును దెఱచి చూచునరికి –పంచపాండవగృహిణి లేదు. కాని-వస్త్రాపహరణముమాత్రము గాసంత కలిగియుండవ చ్చును. కృష్ణాయని యఱచినది కాంత కాదు. గరుడపక్షి. ఆర్తరవముమాత్ర మాఁదు బిడ్డదే-ఒక మొదలారియో పిళ్లయో ''ఏన్నఏన్న'' యనుచు సముద్రపుటలలతాకునఁ గ్రిందఁబడిపోయిన భార్యనుగాఁబోలు పరామర్శించు చున్నాఁడు. ఆమె మిగుల స్థూలశరీరిణి యగుటచే లేవలేకపోయెను. భర్త సూక్ష్మశరీరుఁడగుటచే లేవనెత్తలేకపోయెను. అచ్చట మరెవ్వరు లేకుంటచే ఈనందర్భములో నేను సాహాయ్యపడి యామెను లేవనెత్తిన నొకతప్పు. ఎత్తకుండ నిలువఁబడిన మఱియొక తప్పు. ఈగొడవ నాకెందులకని మరియొకచోటికిఁ బోయితిని.

అక్కడ దాదాపుగా నూర్వురు జనులున్నారు. నడుమ నొక హ్రస్వరూపుఁడు బుగ్గమీసములను పరామర్శింపుచు నుపన్యసించు చున్నాఁడు. నేను వినినది మొద లాయుప న్యాస మిట్లుండెను. 'పండినది-దోరగఁబండినది-పరిపూర్ణముగాఁ బండినది-ఏది? ఆంధ్ర దేశ భాగ్యము-ఎందుచేత? ఇంతకాలమునకు నన్నయభట్టు నియోగి యను నాధారము దొరకినది. (వినుఁడు వినుఁ డని సభలోఁ గేకలు) ప్రబలనిదర్శనము లింక దొరకఁగలవు (హుర్రేహుర్రే యను కేకలు) ఆదికని వైదికుఁ డని యిదివఱకు జనులలోఁగలిగిన తప్పు టభిప్రాయమును జను లందరు దిద్దుకొందురుగాక. ఆతఁడు నియోగికవి! (సెబాస్ సెబాస్ అను ధ్వనులు) ఆతనియింటిపే రేదోతెలియునా? గోపాలునివారు గోపాలునివారు. (హుర్రే హుర్రే యను కేకలు) ఈవార్త మామిత్రులగు వైదికులకు విశేషసంతోషకరముగా నుండకపోవ చ్చును. (పావ! అందులకు మన మేమిచేయఁగలము? అను కేకలు) ఇచ్చటికిఁ గవిత్రయము నియోగిమూర్తిమయ మని ఘంటావథముగాఁ జెప్పవచ్చును. (జయ అమాత్యవరులకు జయా యను కేకలు)' ఆకేకలతో నభ ముగిసెను. నాకు మాటలాడవలయునని సంపూర్ణో త్సాహము కలిగెను. కాని నభికులు లేకుండ నెట్లు మాటలాడవచ్చును? అయ్యయ్యో! ఇది యేమి? వీరిట్లుమాటలాడిరే-ఇంత వట్టుదలతో మాటలాడిరే. భారతపుసాగను కవిశాఖాభేద మున మారెనా? ఆమహానుభావుఁ డెవ్వఁడైన నేమి? మట్టిబట్టితోఁ దీసినదనుకొనిన యత్తరువు లోహపుబట్టితోఁ దీసినదని తరువాత నిదర్శనములు లభించినను నత్తరు వత్తరువేకాదా? దానిపరిమళము మనకు ముక్కులున్నంతకాలము.మహామోదప్రదమే కాదా! నాయనలారా! ఆత్మకు లింగజావిభేదము లేదని యనుభవమున నార్యావర్తదేశమునసే తెలిసికొనలేనప్పు డింక నితర ప్రపంచమునఁ దెలిసికొను వారెవ్వరు? వ్రాసినది పంచమ వేదమైనప్పుడు సాధనము బాతుటోకెయైన నేమి? నెమలియీకయైన నేమి? ఆంతరశాఖ లలో శరారి మయూరీ మాత్రభేదమైనలేదే. అట్టిచో వారిట్టులేల మాటలాడవలయును? నాయనా! నీ వానన్థలమే దని యడుగ వట్టిగుడిపాలె మనుటకంటె భరత ఖండమనువాఁడు పరమధన్యుఁడు కాఁడా? ప్రపంచమే యనువాఁ డంత కంటె ధన్యుడు కాఁడా? నాయనా! నీవెవఁడ వని యడుగ నారామద్రావిడుఁడ ననుటకంటె నార్యుఁడ ననువాఁ డంతరంగవిశాల

తకలవాఁడు కాఁడా? నేను పరమేశ్వరదానుఁడ ననువాఁడు సర్వజగద్వ్యాపనసమర్థ హృదయ విశాలత కలవాఁడు కాఁడా? నాయనా! నీకెందరు పిల్లలని యడుగ నాఱవఫారము (Sixth form) లోఁ గ్రొత్తగాఁజేరినవారితో 935 గురని పలుకఁదగినయుపాధ్యాయుఁడుత్తముడు కాఁడా? లోకలాభ మొనర్చువాఁడు నీవాఁడుమాత్రమే యెట్లగును? నీజాతివాఁడుమాత్రమే యెట్లు? ఎట్లయినను పరమార్థ మెంతయో విమర్శించి వెల్లడింపనక్కఱ లేదా యని యందురేమో? అక్కఱలేదని కూడఁ జెప్పవచ్చును. ఆకవి కాలములో నట్టిభేదమున్నట్లు వినలేదు. అది తరువాత గలిగిన భేదమని చెప్పుటకుఁగూడఁ గొన్ని విదర్శనము లున్నవి. అట్టిచో నాతనిశాఖ యిప్పుడెట్లు నిర్ణయింపవచ్చును? అతనిగూర్చి మన మిట్లు వాదులా డుకొనఁగ నాతని యాత్మశాంతి కెంత భంగముగానున్నదో యెవరు చెప్పఁగలరు? ఆతఁడు నరుఁడు. లోలోపలి తక్కువకట్టుబాటులనన్నిటిని మించి వర్తించినవాఁడు. మనకంతయే చాలును. తనజ్ఞానుచే నాతఁ డెట్లు లోకోపకార మొనర్చెనో యట్లే మన న్వల్పజ్ఞానముచే మనము చేతనైనట్లు లోక లాభముకొఱకు పాటుపడి నరుల మనిపించుకొనుట మంచిది. నావంశ మూలపురుషుఁడు బాల్యమున నావలెనే చుట్టఁగాల్చినవాఁని చంకలు గొట్టుకనుట కంటె నే నాతనివలె, నరిషడ్వర్గమును గాల్పలేకుంటినని లెంపలు కొట్టుకొనుట మంచిదని నాలో నే ననుకొనుచు ముందునకుఁ దీరము వెంటనే తిరువల్లిక్కే-ణివైపునకుఁ బోయితిని.

అచ్చట విద్యార్థులు కొందరు గుమిగూడియున్నారు. కొందరు పెద్దలుకూడ వారిలో నున్నట్లున్నది. వారు ఘర్షణపడుచున్నారు. ముష్టులచే నొకరి నొకరు బెదరించుకొనుచు న్నారు. చొక్కాలచేతులను బై కెగఁద్రోచికొనుచున్నారు. రండు రండని అంకెలు వైచుచు న్నారు. చేతికర్రల ఝళిపించుచున్నారు. ఛీ ఛీ యను ధ్వనులు మిన్ను ముట్టుచున్నవి. కలియఁబడి కొట్టుకొనుటకు నన్నద్ధులై యున్నట్లు నే నూహించి భయపడి "యిదియేమి యిదియే" మని నే నెందరినో యడిగితిని. తుద కొక్కఁడు "ఇదియేనా? ఇదియే పనికిమాలినపట్టుదల–మూర్ఖత" యని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. నన్నుఁగూడఁ దిట్టుచున్నాఁడు కాఁబోలునని నే ననుకొనునంతలో 'మూర్ఖతయని మరియొకసారి యనుము, మూతిపై గొట్టెదనో లేదో' యని మరియొకఁడు తీండ్రించి పలికెను. 'చూచెదవేమిరా?' యని వెనుకనుంచి యొకఁడు హెచ్చరించెను. 'చూచుటకే వచ్చితిమి కాదా? కానిండు ర్రండు' అని కొందరు కేకలు వైచిరి. ఎందులకు మీకీవైర మని నేను గేకలఁ బెట్టితిని. ఓరుగంటివారికి జయా యని కొంద రుద్ఘోషులై యఱచిరి. సరి–సరి. ఇది యేదో పురపౌరిశుద్ధ్యసంఘములోని సభ్యత్వమును గూర్చిన వాదులాటయనియు –నోరుగంటియాయన యెవ్వరో సభ్యత్వము నపేక్షించి యుండిరనియు నే ననుకొని యావలికిబోవ యత్నించు చుండఁగ నింతలోఁ బ్రతిపక్షమునుండి 'ఓరుగల్లా? ఇంకను నోరుగల్లేనా? నోరు సంబాలించుకొని మరి మాటలాడుము. ఒంటిమెట్ట–ఒంటిమెట్ట యని యందురా లేదా?' యని కొంత యిసుకను గుప్పెళ్లతోఁ దీసికొని కొందరు తమ ప్రబలవిరోధుల తలలపైఁ ద్రిమ్మరించిరి. ఆహాహా! కోదండరామపాదారవిందభక్తుఁడై, పరమ పావన జన్ముఁడై, ధనకాంక్షాశూన్యుఁడై, కవితావిక్రయపరాఙ్ముఖచేతస్కుఁడై, జరుగుచున్న పూట కన్నములేనివాఁడయ్యును భగవంతు డిచ్చిన నిచ్చఁగాక, లేకున్న లేక పోవుఁగాక యని–వైరాగ్యముతో, నిశ్చలమనశ్శాంతితోఁ గాలక్షేపమును జేసినవాఁడై, యేడుదినములలో మృతినొందక తప్పని పరీక్షితునకే కాక, ప్రపంచజనుల కందఱకు నాపదలలో సహనము,

శాంతి, సర్వభూతసమత్వము, వైరాగ్యము, జగదీశ్వర పాదారవిందభక్తియుఁ గలఁపుట కుద్దేశింపఁబడిన భాగవతనిక్షేపమును మన కాంధ్రభషను బ్రసాదించి తాను సంతోషముతో సంతత శాంతితో, పస్తులవడిన భక్తశిఖామణి జననస్థలమునుగూర్చియేనా యీ జబర్‌దస్తీ వృత్తి! అత్యంతకోమల కవితారసమున నమృతవర్షమును గురిపించిన యీమహానీయునిఁగూర్చియేనా తలలపై నీయినుకను దిట్టను ద్రిమ్మరించుకొనుట. ఆమహాత్ముని భాగవతమువ లన మనకు వృద్ధియయినది శాంతికాదా–క్రోధమా? 'తనయందు నిఖిలభూతములందు నొక భంగి సమహితత్వంబున జరుగువాఁడు' అని వ్రాయుటయే కాక యట్లు నడుచుకొనిన మహాత్ముని గ్రంథమువలన మనకు వృద్ధియైనది భూతదయకాదా? బూతులాటతోఁగూడిన పోటలాటయా? ఆహా! ఇందునుగూర్చి యెంతవఱకు వ్రాతలు జరిగినవి. ఎన్ని కఠినాలాపములు వినఁబడినవి. 'శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్' అని నేను మరియొకచోటికిఁ బోవుచు విద్యార్థులు బాల్యమువలనఁ గలిగిన రక్తపటిమచే వృద్ధినొందిన యుత్సాహముతోఁ బట్టుదలతో నిట్లొనర్చిరేకాని మరియొక్కటియై యుండదని నిశ్చయపఱచుకొని మరికొన్ని యడుగులు ముందునకు వైచితిని.

అక్కడ నొక్కసభ జరుగుచున్నది. అందఱు పడుచువాండ్రవలెఁ గానఁబడినారు. ఆంగ్లేయభాషాపరిశ్రమ మున్నవారని వారివేషములే చెప్పుచున్నవి. ఆసభలో నొక్కయాంధ్రుఁ డుపన్యసించు చున్నాఁడు. అధ్యక్షుఁ డొక్కదాక్షిణాత్యుఁడు. అదివఱ కావక్త యేమి చెప్పుచుండెనో కాని నే నటకుఁ బోయినతరువాత నిట్లు చెప్పసాగెను. 'నిశ్చయముగాఁ గానేకాదు. ఉపజ్ఞాసహితములగు గ్రంథముల కిది కాలము కానేకాదు. ఇది విమర్శనయుగము. విమర్శనవృద్ధికొఱకే ఈసంఘమేర్పడినది. క్రమమైన దారులలో విమర్శనము పరుగులిడవలసియున్నది. అందుకొఱ కాంధ్రులలో విద్వాంసులు కొందఱు ద్రావిడులలో విద్వాంసులు కొందరు కలసి యీసంఘమును స్థాపించినారు. సంఘ సభ్యుల పేళ్ళ చదివెదను. మురుగేశం మొదల్యారు సభాధ్యక్షుడు. కే. రంగనాథశాస్త్రి ఉపసభాధ్యక్షుఁడు. ఆరుమొగమయ్యరు కార్యదర్శి. (మిగిలినవారిపేళ్లు చదువనక్కఱలేదని సభలోఁ గేకలు) సరే ఈసభోద్దేవమేదియో చెప్పితిని. ప్రస్తుత మీసభవారు పూనుకొనిన మహావిమర్శన కార్య మేది యనఁగా (వినుఁడు వినుఁడు అను కేకలు) మద్రాసులో నున్న యన్నివీథులకు నన్నినందులకు నేవేవో పేళ్లున్నవి. వాని కాపేళ్లెట్లు వచ్చినవో తెలిసికొనవలసియున్నది. ఆపేళ్లనుగూర్చి సంపూర్ణచరిత్రము లోక మపేక్షించుచున్నది. శాస్త్రీయవిమర్శన మిప్పుడు వేయవలసిన ముందడు గిదియే. ఇది మహాకార్యము. అనేక జనసాహాయ్య మిందుకుఁ గావలయును. లక్షల. ఁది వంశవృక్షములఁ బరీక్షింపవలయును. అనేక కుటుంబసహస్ర ముల గృహరహస్యములు వెల్లడియగుపని. కావున నిందుఁ బనిచేయువారందరు సత్యప్రవర్తనులై రహస్య గోపనసమర్థులై యుండవలయును. ఇట్టి లోకోపకారమగు పుస్తకము నచ్చువేయించుట కధికధనము కావలసియున్నది. రాజధానిలోనున్న రాజులందరు భాషాభిమానముచే దేశాభిమానముచేఁ దోడ్పడవలసియున్నది. వారిని సమీపించి సంఘార్థమై యాచించుట కొక Select Committee నియమింపవలసియున్నది. దైవకటాక్షమున The scientific and critical history of the metropolitan, toponamy' అను పేరుగల విమర్శనగ్రంథము శీఘ్రమున బయలు వెడలును గాక! ఓమ్ శాంతి శ్శాంతిః'' అని యాతఁడు కూరుచుండెను. కొంతసేపు సభ నిశ్శబ్దముగా నుండెను. అప్పుడు నేను లేచి ''సభాధ్యక్షా!

ఆయింగ్లీషుమాటల కర్థము లేకయో నాకు బుద్ధి లేకయో కాని, సభవా రిప్పుడు చేయఁబూను కొనిన కార్యమేదో స్పష్టముగాఁ దెలియలేదు'' అని యంటిని. అంత సభాధ్యక్షుఁడు లేచి ''విడమరచిచెప్పుటకే నేను లేచుట. వెనుకటి Speakerగారు generalగా చెప్పుట కారణము చేత మీతలలో నది ప్రవేశింపలేదు. ఈవిషయము ఇప్పుడు నేను Particularise చేయుటకు పూనుకొనియుండుచున్నాను. ఇప్పుడు నల్లతంబి అనే lane ఉండింది. నల్లతంబి యారో యే కాల పవరో అవర్ చరిత్రమేదో దానికి దేశచరిత్ర కెట్టి సంభోగమున్నదో ఇది, Etcetera సంగతులన్నియు మనము Encyclopaedia మాదిరిని Publish చేయ వేండుం. Another instance—తిరువల్లిక్కేణిలో 'Sunnadi' (సున్నాడి) అనే తెరువున్నది. ఈశబ్దమేమి? దీని Etymology యెప్పిడి? అని మన మిప్పుడు పై మొగముగా (Superficial) నాలోచించుతూ వుండుదాము. Well, (సున్నాడి) 'Sunnadi' అను పదము మహమ్మదీయ భాషాపదముగా నాహృదయమునకుఁ దాకుచున్నది. అందుచే నావీథిలో మొదట నొకజాతి మహమ్మదీయు లుండవచ్చునని Guess చేయవచ్చును. ఇదియే వీథిచరిత్రకు దేశచరిత్రకు సాంగత్యమునకు బీజము'' అని యాతఁ డుపన్యసించి సభాకరతాళధ్వనులను నిరీక్షించుచుండఁగా నేను సభాపీఠ మెక్కి యిట్లు పలికితిని. ''సభాధ్యక్షా! సున్నాడి యను పదమునకుఁ జిత్రముగా రూపనిష్పత్తి చేసినారు. మీవిమర్శన పాండిత్యమందు నేను గౌరవము లేని వాఁడను గాను కాని మీరు చెప్పిన వీథిపేరు సున్నాడి కాదు. అది సన్నిధి వీథి. పార్థసారథి కోవెల సమీపమున నుండుటచే దానికి సన్నిధి వీథి యనుపేరు వచ్చినది. (Nonsense, Nonsense అను కేకలు) నే ననవలసినమాటలు మీ రనుచున్నా రేల? మీరు సన్నుఁ దిట్టినను నేను జెప్పఁదలఁచిన దేదోమాననను. ఇట్టి యవకతవకసంఘము తూర్పున నొక గ్రామమున నానడుమను స్థాపింపఁబడినది. ఆసంఘమువారు విమర్శన కార్యసంచారమున నొకగ్రామము నకు వచ్చిరి. Gade (గేడ్) Street అను నొకవీథి యాగ్రామున నున్నది. Gade అనగా నెవ్వరు? ఆయన హిందువుఁడా–ఆంగ్లేయుఁడా? అను మీమాంసలకుం జొచ్చిరి. ఆపేరు హిందువుని పేరువలెఁ గానఁబడకుంటచే Gade అను దొరగా రచ్చట నివసించుటచే దాని కాపేరు వచ్చినదని వారు స్థిరపఱచిరి. ఇతఁడు East India Company లోనివాఁడని నిర్ణయించి దేశ చరిత్రతో సంబంధమును గలిపిరి. యథార్థ మేదనగా అది గాదెవారి వీథి. మరియొకయూర నింకొక యసందర్భము జరిగినది. ఆయూర ''నల్ల పెత్తల్లి'' యను పేరుగల వీథియున్నది. నల్ల పెత్తల్లి వీథియున్నప్పుడు 'ఎర్రపినతల్లి' వీథి యుండక తప్పదని వా రాగ్రామమంతయు చుట్టుపట్ల గ్రామములన్నియు నావీథికొఱకు వెదకిరి. అది యెక్కడను గనఁబడలేదు. నల్లపెత్తల్లి యను పేరుగల యామె మీపూర్వులలో నెవ్వరైన నున్నారా? యని ప్రతిగృహమునకుఁ బోయి యడుగసాగిరి. తుట్టతుద కొక వేశ్యయింటిలోఁ జరిత్ర మున కక్కరవచ్చి ముఖ్యాంశ మొకటి లభించినది. నాతల్లితండ్రిపేరు నల్లప్ప యని యావేశ్య చెప్పెను. 'నల్లపెత్తల్లి' శబ్ద మపశబ్ద మనియు 'నల్లప్పతల్లి' యను శబ్దము సుశబ్దమనియు నానభవారు నిశ్చయపఱచి నల్లప్పనుగూర్చి చరిత్రములో ప్రాసికొనిపోయిరి. నల్ల లేదు. పెత్తల్లి లేదు–నల్లప్ప లేదు. తల్లి లేదు. అది Nanna Futtee Ali (నన్నా ఫత్తీ ఆలి) యను నొక్క మహమ్మదీయుని పేరు. ఆపే రిట్లయినది. (నభలో నవ్వు చున్నారు). నాయనలారా! మీరు బాధపడక, ఇతరులను బాధింపక యీ పనికిమాలినసంఘమును వెంటనే పరమపదింపఁజేయుఁడు. ఇందువలన నెన్ని ప్రమాదములయిన నున్నవి. అని చెప్పి నేను

దిగిపోవుచుండఁగా ''నీపేరేది?'' అని వా రడుగ ''నేను జంఘాలశాస్త్రి''నని చెప్పితిని. సాక్షినంఘువుఁడు కాఁబోలు నని యొకరితో నొక్కరను కొనిరి. జంఘాలశాస్త్రి చెప్పినవిష యము యోజింపఁదగినదే యనివారను కొనుచు నిండ్లకుఁ బోయిరి. నేను నాబసకుఁ బోతిని.

నాయనలారా! విమర్శనము బాహ్యమగు మార్గమునుదప్పి మిగుల వెర్రిపోకలఁ బోవుచున్నది. ఁానిని మంచిమార్గమునకుఁ ద్రిప్పుట యావశ్యకమైయున్నది. బుద్ధిమం తులు తత్ప్రయత్నమున నుందురుగాక. ఓమ్ శాంతి శ్శాంతిః.

57. నిష్క్రమణనింద

సాక్షి సంఘానికి వచ్చిన కొన్ని ఉత్తరాలను జంఘాల శాస్త్రి పరామర్శిస్తున్నాడు. ఈసారి ఎంచుకున్న ఉత్తరాలు, సాక్షి ఉపన్యాసాలకు సంబంధించిన కొన్ని ఆక్షేపాలు.

వర్షాభావాన్ని గురించి, కొద్దిగా ఆర్థిక పరిస్థితుల్ని గురించి చెప్పిన ఉపన్యాసంలో, తాను ఈ నాము అమ్మి మోటారు కొన్నట్లుగా ఎందుకాక్షేపించాలి? అదీ, మోటార్లు కొని వాడుతున్న ఇతరులైన పనికిమాలిన వాళ్లు, కుహనా సంపద పౌరుషం, గర్వం ప్రదర్శించే వాళ్లూ ఉండగా వాళ్లని ఏమీ అనకుండా తన్నే ఎందుకు అల్లరి పెట్టాలనీ, మొదటి ఉత్తరం సారాంశం.

రెండోది – ఒక సాక్షి ఉపన్యాసంలో ఉదాహరించిన 'అధునాతన కవి నిరసన' అనే పద్యంలో చివరి పాదం 'విధవాయా క్రొర్ర కూంటి వేంకట రాయా' అనే నింద గురించి తన వ్యవసాయమేదో, తన స్వల్పమైన సంచికట్టు వైద్యమేదో, పశువుల సంతలో తన పాసుగుడు వ్యాపారమేదో తను చూసుకుంటూ, కవిత్వం జోలికే పోని తనని పత్రికా ముఖంగా పేరు పెట్టి తిట్టనేల? – అని.

దీనికి జంఘాల శాస్త్రి కేవలం ప్రమాద విషయమని, ఏదో ఒక పేరు కావాలి గనక మారు మూల పేరు గదా అని వాడామనీ, అది ఇలా తగిలినందుకు క్షమించమనీ కోరాడు.

ఇక మొదటి ఉత్తరానికి మాత్రం ఘాటుగా జవాబు చెప్పాడు. తమకు మనుష్యులతో పనిలేదనీ, దోషాలనే విమర్శిస్తామనీ – ఆ దోషాల విమర్శ ఎవరికైనా తగిలితే,. చేతనైతే ఆ దోషాలు సరి దిద్దుకోవాలనీ, లేకపోతే ఊరుకోవాలనీ, తిరిగి తమని విమర్శించడం గాని, అట్టివారు వారి సమర్థనలకు పోవడం గాని తగదని శాస్త్రి మందలించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! ఇదివఱకు సాక్షి కార్యస్థానమునకుఁ బంపఁబడిన లేఖలఁ గొన్నిటిని జదివి యవకాశమున్నయెడల నుచితరీతిని విమర్శింతును.

''సాక్షికి–నమస్కారములు. మీ జంఘాలశాస్త్రి వర్షాభావమును గూర్చియుఁ గొలఁదిగా నార్థికస్థితులఁగూర్చియుఁ జెప్పిన సాక్షిలో నున్న మీ రధిక్షేపింప నేల? నా యిష్టము. నేను బెద్దల యానామునమ్మి మోటారుకొనిన మీకేమి? మి మ్మేమైనఁ బెట్టుమంటినా? పోయుమంటినా? బదులయిన నిమ్మంటినా? ఏదియు లేదే! అట్టిచో నా జోలిమీకేల? నాసొమ్ము నేను వృద్ధిఁజేసికొన్న మీకేమి? పాడుచేసికొన్న మీకేమి? నే నేమి తప్పుఁ జేసితిని? నేను మోటారుబండి నెక్కుట కనర్హుఁడనని మీయభిప్రాయమా? ఎక్కిన యితరులంద ఱర్హులే యనుకొనుచున్నారా? వారందఱు సీనాములు నమ్మికొనినవారనియే మీ యభిప్రాయమా? వట్టికల్ల–అయ్యయ్యో! వారిలో నూటికిఁ దొంబదుగురవలకు వట్టిబికారులు. చెవినున్న జోళ్లనుబట్టియుఁ జేతనున్న యుంగరాలబట్టియు మెడనున్న హారములబట్టియు మోసపోవుచున్నారు కాఁబోలు. వానిలోనివి కృత్రిమహారములు కల్లకెంపులు–గుల్లముత్తెములు బదుల్నిచ్చువారల నాకర్షించుటకై వారు పూసికొనిన చెవిమెఱుఁగులు–చేతిమెఱుఁగులు మెడమెఱుఁగులు. పైన గడబిడ–లోన లొడలొడ–పైని పుష్టి–లోన నష్టి–గుమ్మములోనున్న యినుపపెట్టెకు సిపాయీల హవాలా–కొట్టులోనున్న చిత్తాలోదివాలా–వీరు ప్రజల కొంపల మాపువారిలో నగ్రగణ్యులు–ఇకఁగొందఱు జమీందారులనుగూర్చి చెప్పెదను. ఎస్టేట్లరాఁ బడి యేఁబదివేలో అంతకంటెఁ దక్కువయో–ఆస్థానములు దివానులపాలుచేసి పైయూళ్లలోఁ బనిలేనిదే వీరు మోటార్లషికారులు–వేశ్యల రాయబారపు కాగితములనే కాని రాజకార్యసంబంధము లగు కాగితములు చూడరు. సొమ్ము పంపు సొమ్ము పంపు మని దివానులకు హుటాహుటి సందేశములు అణాబిళ్లలమీఁద దెఱపిలేకుండ సంతకములు. ఒక చేతిలో గ్లాసు–ఒకచేతిలో విస్కీబుడ్డి–ఒడిలో వేశ్య–ఎదుటడింకికోడి–నోటిలోసిగరెట్టు నెత్తి మీద నేడులక్షల యేఁబదివేల ఋణపత్రము–సముద్రపుటొడ్డున మోటార్ల జగ్‌జగలు సానులు చెవుల దుద్దుల ధగధగలు–చుట్టుప్రక్కల గాజీపురగులాబీయత్తరువుల గమగమలు–పైజిల్లాలో కలక్టరాఫీసులో యెస్టేటు టమటమాలు–

రాజకీయోద్యోగులు బాగుపడుచున్నారు. రైతులు దరిద్రులగుచున్నారు. ఎస్టేట్లివ రివో యని కొందఱు ప్రభువులు ప్రవర్తించుచున్నారు. ప్రభుఁడున్నాఁడా యని ప్రధానుఁడు ప్రవర్తించుచున్నాఁడు–పైని నైనఁ బరిపాలకుఁడున్నాఁడా యని రైతు లేడ్చుచున్నారు. వీరి నెవ్వరిని మీ రధిక్షేపింపక పుట్టిడీనాము నమ్మికొని మోటారుకొన్న ననే్న యధిక్షేపింపవల యునా? ఈవర్తకులు నిట్టిప్రభువులవలె నే నెవ్వరిని బాడుచేయలేదే–నాకొఱ కెవ్వరు నేడువ వక్కఱలేదు–నే నెవ్వరిని బాధింపలేదే. నాదారిని నేను బ్రదుకుచున్నాను. మీరు నన్నింత యల్లరి బెట్టుదురా? ఇకఁ జాలును, మీరింతటినుండియైనఁ గొంత పరిశీలించి మాట లాడుఁడు. ఇట్లు విన్నవించు–''

నాయనలారా! ఏదియో పేరున్నది–అది మీకందఱకుఁ దెలియవలసిన యావశ్యకము లేదు. ఇదిగో! మఱియొక లేఖను జదివెదను.

''సాక్షికి–నమస్కారములు. అయ్యా! అక్టోబరు 6-వ తేదిని మీ రుపన్యసించిన సాక్షిలో నీవద్య మున్నది.

కం. అధునాతన కవినిరనన
వృథగాఁ జేయుటనె నీకుఁ బృథులవ్యాధి
వ్యధ సిద్ధించెనురా–
విధవాయా! కొఱ్ఱికూటి వెంకటరాయా.

ఏమి యింత దుర్నయము–ఇంత దుర్మార్గత–ఇంత యసందర్భ ప్రలాపము. నన్ను మీ రిట్లు తిట్టిదరా? నేను మీకేమి యపకారమొనర్చితిని. నాయందు మీకేమి ద్వేషమున్నది? అధునాతనకవు లెవరో సనాతనకవు లెవరో నే నెఱుఁగనైన నెఱుఁగుదునా? నా కుబ్బు జబ్బు కలిగినదా? న న్నిట్లు దుర్భాషలాడుట మీకుఁ దగునా? ఇది మీవంటివారు చేయవలసిన పనియేనా? ఇందులకు మీరేమి ప్రత్యుత్తర మిచ్చెదరో వినఁగోరియుంటిని. నావ్యవసాయమేమో పశువుల నంతలోన పొసఁగుడేమో–స్వల్పమైన నంచికట్టు వైద్యమేమో –చూచుకొనుచు నేను గాల క్షేపమును జేయుచుంటిని గాని మీపేరెత్తితినా? అట్టి నన్ను నడువీథి కెక్కిఁంతురా? వార్తాపత్రికలలో నాపేరెత్తిననున్నఁ దిట్టుదురా? మీపైన మానహానికై నే నేల యభియోగము తేఁగూడదో వ్రాయుదురా లేదా? మీలేఖకైయెదురుచూచుచున్నాను. ఏదో సంఘమనియు నెవరో యుపన్యాసము లిచ్చెదరనియు నీతిని బోధింతురనియు, దుర్నీతిని సాధింతురనియు ననుకొంటిని గాని యింత ద్రోహముండునని యెంచలేదు. నాసంచికట్టుమాత్రలచే నాయువులేక మరణించినవారి బంధుగులైన నన్నిట్టితిట్టు లెన్నడును దిట్టలేదే? వారి నిర్భాగ్యత యనివారు లోలోన నేడ్చుచున్నారు. కాని న న్నేమియు ననుచుండుటలేదే. అట్టిచో మీరెవరు? నేపాళశుద్ధి తిన్నగఁగాని భేదీజ్వరాంకుశపుమాత్రనైన మీకు నే నిచ్చియుంటినా? బ్రాహ్మణులగు మీరబ్రాహ్మణుఁడనైన నన్ను వైరముచేఁ దిట్టియుందురా? తిరుగఁబడి నేను మిమ్ము దిట్టినయెడల మీకెట్టులుండునో యోచించుకొన నక్కఱలేదా? మీప్రత్యుత్తరముకయి నిరీక్షించుచున్నాను. కొఱ వెఱ''

నాయనలారా! ఇది కేవలము ప్రమాదము. ఏదియో యొక్కపేరు మాకుఁ గావలసిన చ్చినప్పుడు సాధ్యమైనంతవఱకు జనసామాన్యమున కుండని పేరే చూచుచుందుము కాని ఘణాక్షరన్యాయముగా మేము చూచిన పేరుగలవా రొక్కరుండుట సిద్ధించినది. ఇందులకు మాకు మిగుల విచారకరముగా నున్నది. ఆయన మమ్ము క్షమింతురుగాక! ఎవ్వరి మనస్సుగాని నొప్పించుట మాపనికాదు.–కాదు–నాయనలారా! సోదరులారా! సాక్ష్యుపన్యాస పాఠకులారా! మీకందఱికొక్క మనవి – మాసంఘము సత్యపురమున స్థాపింపఁబడినప్పటి నుండియు నిష్పక్షపాతబుద్ధితో మృదులముగ నొకప్పుడు, తీవ్రముగా నొకప్పుడు, పుష్పపు వ్రేటుగా నొకప్పుడు, పిడుగుపాటుగా నొకప్పుడు, జారుజారుగా నొకప్పుడు, నెదురెత్తు మారువడిగా నొకప్పుడు, హాస్యరస సేచనముతో నొకప్పుడు, వీరరసమేళనముతో నొక ప్పుడు ననేకోపన్యాసము లిచ్చియుంటిమి. సంఘములోని దోషములను మతసంబంధము లగువానిని ఆచారసంబంధములగువానిని వాణిజ్యసంబంధములగువానిని సంస్కార సంబంధ ములగువానిని నింకను సంఘముతో సంబంధమున్న మఱికొన్నిటిని మీకన్నులకు బాగుగా న్వస్వరూపములతోఁ జక్కఁ గానఁబడునట్లు వర్ణించి వానిలోని యనహ్యతలను బట్టబయలుచేసి వానివలన లోకమునకుఁగలుగునష్టములను వెల్లడించి, వానినివదలుకొనినందువలన సంఘ మునకుఁ గలుగులాభములను స్పష్టీకరించి, దోషములందు మీకు రోఁత పుట్టఁజేయుటకై శక్తివంచనము లేకుండ మేము పాటుపడుచున్నాము. సంఘదోషములతోడనే మాకుఁ బనికాని దోషముల నొనర్చుచున్న మనుజులతో మాకెంతమాత్రమును బనిలేదు. దోషములనే నిందింతుము. కాని దోషులను మేమేమియు నిందింపము. దోషు లెవ్వరో నిర్దోషులెవ్వరో యను చింతయే మాకులేదు. అక్కఱలేదు. దోషములను నిందింపవలయునుగాని దోషయు తులను దూషింపఁగూడదని మేము సంఘనిర్మాణ కాలమునఁ జేసికొనిన శపథమున్నది.

అట్టిశాసనముకూడ మానంఘశాసను ననుసరించి మేము ప్రవర్తించుచున్నాము. ఇదివఱకు మిమ్మందులఁగూర్చి యెవ్వరును నిందించియుండలేదు. దోషములఁగూర్చి వెల్లడించున ప్పుడు తద్దోషములు గలవారి కామాటలు కొంచెముగానో, మట్టనముగానో, హెచ్చుగానో తగిలిన ట్లగపడును. అది స్వభావము, అందులకు మేమేమి చేయఁగలము? వారి నధిక్షేపించు నుద్దేశము మాకుఁ ద్రికరణశుద్ధిగా లేదు. ఇందువలన మిమ్ము మీరు దిద్దుకొనవలయునుగాని మాపైఁ దీవరించుట తగునా? నంధ్యావందనమును మానినందువలనఁ గలుగు ప్రత్యవాయ ములు నే నుపన్యసింపగా నిష్టముకలిగినవారు సంధ్యావందనమును దిరుగ యాథావిధిగా నాచరింపఁ బ్రయత్నింపవచ్చును. లేనివారు మాటలాడకూరకుండవచ్చును. అంతేకాని ''నేను మానివైచితని, నన్నధిక్షేపింపనేల? నాయిష్టము నాది. వాకు సుగతివలనఁ గలుగునుఖ ముకాని, దుర్గతి వలనఁగలుగు కష్టముకాని నాది. నాకష్టసుఖములతో మీకేమిసంబంధము? నాయిష్టానుసారముగా నేను నరకమునకుఁ బోవునప్పుడు న న్నాపుటకు నీవెవ్వఁడవు? నీవు నన్నాపినయెడల నేనాఁగుదు ననుకొంటివా'' యని తిరుగఁబడి మమ్మధిక్షేపింపఁబూనిన మానసికి నోటిలో కేశవా, నారాయణా, మాధవా యని యుద్ధరిణితోఁ దీర్థమును బోయు టకంటెఁ బడదీసిముక్కులో నస్యమును బెట్టి యెగఁ బీల్పించుట మంచిదికాదా? తలలు బోడులైనఁ దలపులు బోడులా యని పలికిన వేమనయోగిని జెడఁదిట్టుచు వీథులవెంట బయలుదేఱిన యీవైఖరిగల వితంతువు నేమనఁదగును? ఇంత స్వల్పాంశమునుగూర్చి యింతవఱకుఁ జెప్పవలసివచ్చినందులకు విచారించుచున్నాను.

గయలో శాకములను ఫలములను బరిత్యజించుటనుగూర్చి చెప్పిన సాక్ష్యుపన్యాస మును విని ''ఔను బెండకాయను నేను వదలిపెట్టినాను. అది నాకిష్టముగు శాకము. నీకదియిష్టము కాకపోయినఁ గాకపోవచ్చును. గయలో బెండను వదలఁగలవు గాని గదిలోని ముండను వదలఁగలవాయని మోటుతనముగా నీవు నన్నధిక్షేపింపనేల? నాబాధ నీకేమి తెలియును? నాభార్య కాలముచేసినది తిరుగ వివాహము చేసికొనుటకు వయస్సు దాఁటిపో యినది. పిల్లనిచ్చుట కెవ్వరు నంగీకరింపలేదు. ఆసంధ్యవఱకలో నుభయతారకముగ నేను సాని నుంచుకొనుటకంటెఁ జేయఁదగినదేది? అఱువదియేండ్లున్ననేమి? నాదేహశక్తి నాది, నాధనము నాది, నాకీర్తినాది, నాయుత్తరగతి నాది, అంతేకాని వానితో మీకేమి సంబంధము? సాని నుంచుకొన్న వారందఱు నరకలోకమునకుఁ బోవుదురనియు నుంచుకొననివారందఱు స్వర్గమునకుఁ బోవుదురనియు నీయభిప్రాయముకాఁబోలు. ఉత్తరలోక సుగతిదుర్గతులు మన మనస్సులఁబట్టి యుండునుగాని చర్యలనుబట్టి యుండవు. భక్తి హృదయమునఁ గలవాఁడు పదునార్గురువేశ్యల నుంచుకొనిన నైనను బరమపదమే చేరఁగలఁడు. విప్రనారా యణునినంగతి యెఱిఁగియుండియు మీ కీవెఱ్ఱి యేల? నీకు నే నుంచుకొనిన వేశ్యయే కనఁబడినదిగాని నాహృదయమందలి భక్తి నీకుఁకనఁబడదే! నేను జేయుచున్న సత్కార్యము లను నీవు చూడవే! నేను వెనుక నెంత పరస్త్రీదూరుఁడనుగాఁ బ్రవర్తించితినో యది నీవు గణింపకున్నావే? అదికాక వాసాని యెంత యోగ్యురాలో నీవు తెలియకుండ మాటలాడుచు న్నావు. సానులలోఁ గాదుకదా సంసారిణులలో నైన నట్టియోగ్యురాలు లేదు. ఆమె నాచే నెందఱు కెన్నియుపకారములు చేయించుచున్నదో నీవెఱుఁగుదువా'' యని యెట్టి శుంఠ యైన మాతో నెదుర్కొని వాదించునా? నాయనలారా! ఇంత స్పష్టమైన యంశమును గూర్చి యింతసేపు చెప్పవలసివచ్చినందులకుఁ జింతిల్లుచున్నాను.

58. ఎన్నికట్టు

జంఘాల శాస్త్రి దక్షిణాది యాత్రల పుట్టి ముచ్చట ఇది. మద్రాసు నుంచి వేరే వని వడి మరో పట్టణానికి వెళ్లి అక్కడ ఎన్నికల సంరంభం గురించి శాస్త్రి సాక్షికి ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో విషయాలేమిటంటే

ఆ వూళ్లో ఎక్కడ పడితే అక్కడ రికరకాల వాహనాల రణగొణ ధ్వనులతో, ప్రజలను తమవైపు ఆకర్షించాలనే బహు ప్రయత్నాలతో, సందడిగా వుంది. 'సభ్యుల ఎన్నిక' రాబోయే 30వ తేదీన జరుగుతుందట. గొప్ప ఉత్సాహంతో అరుస్తున్నారు. మహోరోషంతో ఇతరుల్ని తిడుతున్నారు. సభలు చేస్తున్నారు. ఉపన్యాసాలిస్తున్నారు. శాంతిలో భూకంపం, సహనంలో అగ్నిపర్వతాల విస్ఫోటనం, జరిగిపోతున్నాయి. రికరకాల జెండాలు ఎగురుతున్నాయి. అందరూ మొత్తం మీద దేశోపకార దీక్ష అనే మహా–పూనకం మీద వున్నారు.

ఈ సందడిలో సందడి ఒక అయ్యంగారి 'ఇలాకా' ఆడమనిషికి పిశాచం సోకి క్షోభ పడిపోతూందనీ, పగలెలాగో గడిచినా రాత్రి గడవడం కష్టమై పోతోందనీ అంతా చెప్పుకోవడం విని జంఘాల శాస్త్రి ఆమెను చూడడానికి వెళ్లాడు. మొదట ఆ దక్షిణాది వైష్ణవుడు ఈ ఉత్తరాది స్మార్తుణ్ణి గౌరవించలేదు. కాని, శాస్త్రి ఆ ఇంట్లో ఆడమనిషి అనారోగ్యం గురించి అడగగానే, చాలా గౌరవం చూపించాడు. ఆహా న్యాయోజనం అంతటిది గదా! అనుకున్నాడు. మొత్తం మీద, ఆవిడ బాధ కనుక్కుని, ఆ బాధకు కారణమైన ఒక బొమ్మను జంఘాల శాస్త్రి చూపించగా, పోల్చుకుంది. అది పిశాచం బొమ్మ కాదు. ఒక మహానాయకుడి బొమ్మ. ఆమెకు తత్త్వం పట్టుబడి, రోగం శాంతించింది.

ఆ ఎన్నికల సందర్భంగా బ్రాహ్మణ, అబ్రాహ్మణ వైరాలు ఎంత నీచంగా బయట పడుతున్నాయో శాస్త్రి గమనించాడు. ఎన్నికల రంగం ఎలా ఉపన్యాసాల రణరంగంగా వుందో ఉద్వేగంతో గమనించాడు. వివరించాడు.

జంఘాలశాస్త్రి వ్రాసిన లేఖను జదివెదను.

'సాక్షికి–జంఘాలుఁ డనేక నమస్కారములు– నేను మదరానునుండి కొన్నిదినముల

క్రిందటఁ గార్యాంతమున మఱియొక్క పట్టణమునకు వచ్చితిని- కొన్నిమాసములనుం డియు యిక్కడి జనులు తెఱపిలేని కదలికను గలిగియున్నారు. చెంబులో గ్రచ్చకాయలవలె- నానులోనికండెలవలె- యంత్రములలోని చక్రములవలె- గాలిలోని పరమాణువులవలెఁ - గలగుండుపడిన నీటిలోని చేఁపలవలె - నాపైపున కీపైపునకుఁ బైకిఁ గ్రిందికి నన్నివంకలకు న్వప్రదక్షిణముగాఁ బరప్రదక్షిణముగా న్వప్రదక్షిణ పరప్రదక్షిణముగా ననేకవిధ గమనము లతో, వేగములతో, దాటులతో, మహాహంకారములతో, భీకర ఝూంకారములతోఁ, బ్రబల హుంకారములతోఁ దిరుగుచున్నారు- పరుగెత్తుచున్నారు- దుముకుచున్నారు- ఎగురుచు న్నారు- ఎక్కడఁ జూచిన దందడి- సందడి- ఇగిలింపులు - నకిలింపులు- కోపము- తాపము- అఱపులు చఱపులు- అదరింపులు బెదరింపులు- కఱకుచూపులు మొఱకుత్రో పులు-తిట్లు రట్లు- ఛీఛీలు ధూధూలు- ఎక్కడ వినినను జట్కాబండ్లకిరకిరలు- మోటారు బండ్ల మొర మొరలు- సైకిలు బండ్ల దణదణలు- విద్యుచ్ఛకటముల గణగణలు- ప్రబలాటీక నధాటి మంతములగు శకటముల యన్యోన్యసంఘర్షణములు- ప్రాయికముగ బలాత్కార పరలోకాకర్షణములు. ముప్పదియవ తేదిని జరుగఁబోవు సభ్యుల యెన్నికల విషయమై జనులు మహాప్రయత్నములు చేయుచున్నారు. మహోత్కంఠములతో నఱచుచున్నారు. మహారోషముతోఁ బరనిందల నొనర్చుచున్నారు. మహోత్సాహమున నుప్పొంగుచున్నారు -పాఠశాలాభవనముల- బహిరంగ స్థలముల- వార్థితీరముల- సభలు లెక్కలేకుండజరుగుచు న్నవి- కరతాళధ్వనులు, గర్జారవములు, శాపాలాప వర్షములు ప్రబలుచున్నవి. సంఘములో తుపానురేగుచున్నది. శాంతిలో భూకంప ముదయించుచున్నది- క్షమలో నగ్నిపర్వతము లుపగులుచున్నవి- ఈసంక్షోభములు- సజీవపదార్థములనుండి నిర్జీవ పదార్థములకుఁ గూడ వ్యాపించుచున్నవి- భవనకుడ్యములు, కవాటదారుఖండములు శకటాచ్ఛాదకములు- పర్ణశా లాధూపద్వారములు లోహపాషాణ పాంచాలికావేదికలు వివిధవర్ణ కేతుపట పటలములు- విటపస్కంధములు సజీవములై, నకలాకలాపములై, సాహంకారములై- సమున్నతహస్తము లతో సహస్రజిహ్వలతో బ్రాహ్మణ నిందయు నబ్రాహ్మణ బహుమానమును నబ్రాహ్మణనిం దయు, బ్రాహ్మణబహుమానమును నవ్యాపనవ్యధోరణులతో- నముద్రఘోషములతోఁ- బ్రచురించుచున్నవి. సభ్యత్వము నపేక్షించిన మహాపురుషులు కొందఱు పూటకూటింట్ల వీధిగోడల నానుకొని, 'నే నుండగా దేశమున కేమికొఱత' యని గర్వాటోపావన లోకములలోఁ గనుపెప్ప వేయకుండఁ జూచుచున్నారు- కొందఱు మోటార్ల పార్శ్వభాగ ముల నంటిబట్టుకొని, చక్రముల ధూళి కన్నులలో ముక్కులలోఁ బ్రవేశింప సహించుచు 'మావంక జూడరేమి? మావంకఁ జూడరేమి?' యని కప్పకూఁతలతోఁ గోడియఱపులతోఁ బరుగులిడుచున్నారు-కొందఱు క్రోతులవలెఁ గొండమ్రుచ్చులవలెఁ జెట్టుకొమ్మలనెక్కి యిగిలించుచు దేశోపకారమహా దీక్షాపరవశత్వమునఁ గాబోలు తమమీఁద బఱ్ఱులు పైచినరెట్ట లనైన నెఱుఁగక, 'మాకు మీవోటీయకుండినయెడల మే మిటనుండి క్రిందికి దుమికి చచ్చెద' మని బెదరించుచున్నారు.

కాని, నాల్గుదినములక్రిందట నొకచిత్రము జరిగినది. నేను నివసించుచున్న యింటికిఁ గొంత సమీపమున నొక యయ్యంగారు నివసించుచున్నారు- ఆయన యింటిలో నున్న స్త్రీలిద్దఱు- ఒక్కతెపుణ్యస్త్రీ- మఱియొక్కతె పూర్వసువాసిని- పుణ్యస్త్రీ మట్టున కాయన భార్యయే- అందుకు నందేహము లేదు. అందుకు భిన్నముగాఁజెప్పదగదు- కాని

యీవితంతువ్యక్తిని గూర్చియే 'మహాబుషీనామ్ మతయశ్చభిన్నాః' అను న్యాయము ననుసరించి పలువిధములైన ప్రజాభిప్రాయములున్నవి. ఆమె యీతని యన్నభార్య యని కొందఱు, భార్య కక్కఱయని కొందఱు, మేనమామకూతురని కొందఱు, నామెయే యీతని ధనమునకు నుద్యోగమునకు నంసారమునకు మూలహేతువని కొందఱు, నామెను వదలినఁ గాని యీతని నంసారము బాగుపడదని కొందఱు, తలకొక్కరీతిగాఁ దలఁచుచున్నారు.– బుద్ధి కొక్కరీతిగా నిశ్చయపఱచుచున్నారు. జిహ్వ కొక్కరీతిగాఁ బలుకుచున్నారు– మాయీతత్వమును గూర్చి వేదాంతులలోనైన నింత యభిప్రాయవైవిధ్యములేదు– ఇంత యనుమానవైచిత్ర్యము లేదు– ఇంత నిర్ణయాసాధ్యత్వము లేదు– ఆమె యొక్కొక్కప్పుడు శుద్ధపుణ్యస్త్రీవలెఁ గనఁబడును. అది యేమి విచిత్రమో కాని, యీమె పుణ్యస్త్రీవలె నుండునప్పుడు మాత్ర మీయయ్యంగారిభార్య న్వచ్ఛవితంతువువలెఁ గనఁబడును. ఆమె వింతతుత్వము భార్యయందే నక్రమించునో భార్య పుణ్యస్త్రీత్వ మామెయందే యావహించునో యీపరమాత్మనికే యెఱుక– ఆ అయ్యంగారికే యెఱుక– కాని యీమె న్వరూప న్వభావనిర్ణయ పూర్వపక్షరాద్ధాంతములు మన కిప్పు డక్కఱ లేదు. మాటవచ్చినది కావునఁ జెప్పితిని. కాని చెప్పఁదలఁచిన దేమనఁగాఁ బదునైదుదినములనుండి యీమె మహాబాధకు లోనైయున్నది. అది Hysteria అని కొందఱు, Amatory-Paranoia అని కొందఱు, Monomania అని కొందఱు, Temporary Insanity అని కొందఱు ఆమె వ్యాధిని తత్త్వము నువలె బహువిధములుగా వైద్యులు చెప్పుచున్నారు. ఆమె కన్నుమూయునరి కెవ్వడో కంటఁ గనఁబడును. ఆవిగ్రహమును గాంచి యీమె మొఱ్ఱో యని యేడ్చును. కన్ను తెఱచినతరు వాత, రెండుమూఁడునిమునములవఱ కాభ్రమము పోకుండుటచే నది పోవువఱ కేడ్చుచువే యుండును. పగ లెట్లో కాలక్షేపమగుచున్నది. రాత్రి కాళరాత్రివలె నున్నది. తుట్టతుదకుఁ బిశాచమని నిశ్చయపఱచుకొని యీమె కందులకుఁ దగినచికిత్సలు చేయించుచున్నారని నాకీసంగతి తెలిసి యీమెయింటికిఁ బోయితిని. నే నుత్తర దేశవాసినగుటచే నాదాక్షిణాత్య వైష్ణవుఁడు, మొదట నన్ను గౌరవింపనేలేదు. ఆహా! చూచితిరా! పూర్వ గౌరవశాసన మెట్లు గాడిదె వాలకమైనదో! ఎవ్వఁడైన, నెంతక్రొత్తవాఁడైన, నేదిక్కునుండియైన, నేదేశమునుండి యైన నింటికి రాఁగనే– యీతని కెదురుగావచ్చి– కుశలప్రశ్న మడిగి– పాదప్రక్షాళనమునకు నీరిచ్చి– రుచ్యములగు ఫలములనిచ్చి– యంతకన్న రుచ్యములగు నాదరాలాపములిచ్చి– యాతిథ్యమిచ్చి– యానందింపఁజేసి, నదాచారనంపత్తితోఁ బ్రవర్తింపవలసిన గృహమేధి, వీ డొత్తరుఁడా– పాశ్చాత్యుఁడా? దాక్షిణాత్యుఁడా? ప్రాచీదిశానివాసియా? యని పనికిమాలిన విభాగమొనర్చి– భ్రాతృత్వమును బరశురామప్రీతి యొనర్చి– మానుష ధర్మమును మట్టిలోఁ గలిపి– జాతీయతానంహారకమగు శాత్రవమునుబూని– కుక్క పిల్లిని జూచినట్లు, పిల్లి యెలుకను జూచినట్లు చూచి– పశువులకంటెఁ బరమనీచముగాఁ బ్రవర్తించుచున్నాఁడు కదా! ఎంత పనికిమాలిన దినములు వచ్చినవి! జాతీయతత్త్వము కణుపుకణుపునకు విఱిగిపోయినదే యని నాలో నే ననుకొనుచు "నయ్యా! మీయింటిలో నెవ్వరో యస్వస్థతగా వన్నారని తెలిసి, యారోగ్యనంధానమునకై వచ్చితి" నని యుచ్చైస్స్వరమునఁ బలికితిని. "అయ్యారే! వాంగో– వాంగో– ఉకారుంగో– ఉకారుంగో" యని యీయయ్యంగారు పలుకుచు, వొక్క రత్నకంబళమును క్రిందపఱచెను. ఆహా! చూచితిరా! స్వప్రయోజనాభిలాషముందు నర్వది గ్భేదములు నమసిపోయినవి. అడ్డుఁ బుట్టు నిల్వుబొట్టుభేద మంతరించినది. సోదరత్వ

మంకురించినది–జాతీయత తలచూపినది– ఆత్మలాభాపేక్షచేతనే యొకని నొకఁడు చూచుచున్నాఁడు. ఒకనితో నొకఁడు మాటాడుచున్నాఁడు. ఒకని నొకఁడు సేవించుచున్నాఁడు. ఒకని క్షేమమునకై యొకఁడు యత్నించుచున్నాఁడు. అదియే లేనియెడల జాతీయుఁడు లేఁడు. దేశీయుఁడు లేఁడు. కులస్థుఁడు లేఁడు. మిత్రుఁడు లేఁడు. సోదరుఁడు లేఁడు. తల్లిలేదు. తండ్రిలేఁడు. కొడుకులేఁడు. ఏమియులేదు. ఒకని నొకఁడు పొడుచుకొని, కఱచుకొని, తన్నుకొని, పీకుకొని, కాల్చుకొని ప్రపంచమునంతకు నొక్కపూటలోఁ బ్రజలందఱ ప్రళయావస్థనాపాదించుటకేమైన సందేహమా! యని నాలో నేను దాత్కాలిక సన్నివేశమునుబట్టి వెఱ్ఱిగాననుకొనుచుండఁగా ''శాస్త్రియవరు వందార్– అమ్మణ్ణీ! అమ్మణ్ణీ! ఇప్పిడివా– ఇప్పిడివా'' యని యాయయ్యంగారు పలుకునరికి దివ్యమంగళవిగ్రహయగు నొక్కకాంత నాకెదుట నిలువఁబడెను. ఆమె కొంచెము చిక్కియున్నది. చిక్కుటయే చక్కఁదనమునకుఁ జక్కఁదనమిచ్చినదని నేను తలంచుచుండఁగా– నామె వ్యాధిచరిత్రమంతయు నాతఁ డరవతెలుఁగు కలగూరగంపగా నుపన్యసించెను. ''అమ్మా! కనులు మూసికొన్నప్పుడు నీకుఁ గనఁబడు పిశాచ మెట్లున్నదో నరిగాఁ జెప్పు'' మని నే నామె నడిగితిని. ఎఱ్ఱవాఁడు– లావుపాటివాఁడు– బొల్లిపెదవులవాఁడు-బూరె బుగ్గలవాఁడు– గుండ్రని మొగమువాఁడు– గొఱుగుడుమీసాలవాఁడు– బోదకాలివాఁడు– పాణక కడుపువాఁడు– అట్టి బ్రహ్మరాక్షసుఁడు నాకు 15 దినములక్రిందట రాత్రివేళ దేవాలయ సమీపమున నున్నసందులోఁ గానఁబడి నన్నుఁ బట్టుకొని పెంపొందించుచున్నాఁడని యర్థమిచ్చు మాటల నామె చెప్పెను. ఆసందులోని కారాత్రివేళ నామె వెళ్లుటకుఁగారణము నే నడుగ లేదు. ఆమె చెప్పలేదు. ఆమాటలను విని 'నీకు నేను వ్యాధి కుదిర్చెద' నంటిని. ఎప్పా– ఎప్పా– అని అయ్యంగారు సంభ్రమించిరి. ''ఎప్పుడోనా? ఇప్పుడే!'' యని యాయనతోఁ జెప్పి ''యీమెను నాతో నిప్పుడే కోవెలసందులోనికిఁ బంపవలయును. మీరెవ్వరును మాతోఁగూడ రాఁగూడదు'' అని నేనంటిని. అయన కొంత తటపటాయించుచు మీరెవ్వరని నన్నడిగెను. నేను జంఘాలశాస్త్రి నని చెప్పితిని. ''క్లబ్బు'' లోని యాంధ్రులవలన నీపేరు తఱచుగా వినియుంటిని. నీతో నీమెను బంపుటకు నాకభ్యంతరము లేదని యాతఁడు సమ్మతింపఁగ నే నామెను దీసికొని యాకోవెల సందునొద్దకుఁబోయి ''అమ్మా! నీ కేమియు భయము లేదు. నేను నీకుఁ గనఁబఱచు ప్రతిమను నీవు బాగుగాఁ జూడు'' మని పలికి యటకుఁ గొంతసమీపమున దేవాలయాధికారులతోడి వైరమువలన మ్యునిసిపల్ వారిచేఁ గట్టఁబడిన Public Latrine గోడమీఁద నంటింపఁబడిన పెద్దకాగితము మీది నిలువువిగ్రహము నామెకుఁ గనఁబఱచితిని. ఆమె తెల్లఁబోయి– ''జంఘాలశాస్త్రీ! వీఁడే– వీఁడే. వీనిని జూచియే జడిసికొంటిని'' అని గట్టిగాఁ బలికెను. ''అమ్మా! వీఁడని యనరాదు. ఈతఁడు మనరాజధానిలోని మహాజనులలో నొక్కఁడు. ఈతఁ డేదో సభ్యత్వము నపేక్షించినవారిలో నొక్కఁడు. జనసామాన్యమునకుఁ బ్రతిదినము నావశ్యకమగు స్థలమగుటచేఁగాఁబోలు దీనిగోడమీఁద నామహానుభావుఁ డవతరించి సమస్తబాధలకు సహియించి నిలువఁబడినాఁడు. మహామహుఁడు. దేశభక్తు''డని నే ననుసరి కామె వెకవెకలాడుచు 'నాయనా! నన్ను బ్రదికించితి' వని యామె యింటి కామె పోయెను. నేను నాబసకుఁ బోయితిని!

ఈస్థల మాస్థలమను భేదములేకుండ నన్నిస్థలములందును సభ్యత్వము నపేక్షించిన

మహానుభావులందఱు విగ్రహరూపములతో వేంచేసి యున్నారు. వానకుఁ దడియుచున్నారు. శత్రువులు తమ యవయవము లూడలాగినను– సహించుచున్నారు. దేశక్షేమలాభముల ముందుఁదమ కష్టమెంత– నష్టమెంత యని మనఃపూర్వకముగా నమ్మిన మహానీయుల కేమికొఱఁత? ఈదివ్యవిగ్రహములే దేశీయభావిరక్షకదేవతలు. ఎప్పుడు వచ్చునా– యెప్పుడు వచ్చునా యని యెదు రెదురు చూచిన నవంబరు 30వ తేది వచ్చినది. ఇది సుదినమో దుర్దినమో యెవ్వరు చెప్పఁగలరు? చెప్పలేకపోవుటయేమి? తెఱపిలేని వర్షము యాసందేహము నిప్పటికిఁ గడిగివైచుచున్నవి కాదా? Polling Station కుఁజిత్రము చూడనే నుదయ మాఱుగంటలకే పోయితిని. అది పెద్దస్టేషనులలో నొక్కటి– దానిచుట్టు గొప్పదొడ్డి యున్నది. వెలుపలఁ గూడ బహిరంగస్థలము విశేషముగా నున్నది. ఆయావరణమున కనేకద్వారము లున్నవి. ప్రతిద్వారమునొద్దను రక్షకభటులు నిలువఁబడి యున్నారు. ఆయావరణముచుట్టును వందలకొలఁది మోటారుబండ్లు– గుఱ్ఱపుబండ్లు– రిక్షాలు– నెద్దుబండ్లు గూడ నున్నవి. ఆవరణములో ననేకజనులు గుంపులు గుంపులుగాఁ గొంతకొంత దూరములో వెదచల్లఁబడియున్నారు. నేను గూడ యావరణములోనికిఁ బోయి, యొక్కొక్క గుంపునొద్ద నేమేమి జరుగుచున్నదో కనిపట్టుచుంటిని.

రెండు నిల్వుగడల కడ్డముగాఁ గట్టిన యెఱ్ఱని పెద్దగుడ్డమీఁద ''బ్రాహ్మణులకు వోటీయఁగూడ'' దని తెల్లనియక్షరములు ద్వాదశారుకులవలెఁ బ్రకాశించుచున్నవి. అచ్చట నొక్క పెద్దగుంపున్నది. అటకుఁ బోయి వింటిని. ఒక మూఁడుజుట్ల నాయడుగారో బలిజసెట్టిగారో తెల్లని మీసాలయాయన యిట్లు మాటలాడుచున్నాఁడు. ''కారణము లడుగువలదు. అవి యిదివఱకు సహస్రపర్యాయములైనఁ జెప్పఁబడినవి. అవి యంద ఱెఱిఁగినవే. ఈయవలదు. బ్రాహ్మణులకు వోటీయవలదు. బ్రాహ్మణులను బైకి రానీయకుఁడు. అడఁగద్రొక్కుఁడు. వారి నడఁగఁద్రొక్కుట కింతకంటె మంచిసమయము లేదు. వారు మన కొనర్చిన ద్రోహమును ముద్దచేసినయెడల, నాముద్ద యీభూమి కంటెఁ బెద్దదగును. (Splendid, Splendid అను కేలు) వారు మనకు జన్మవిరోధులు, స్వభావవైరులు, సహజశత్రువులు, బహిరంగపరిపంథులు(Very good, Very goo. That పంథులు, is simply beautiful, Repetition reiteration, double, treble and quadruple, is the time-honoured unquestionable generator of immensity of musket-shot vehemence and momentum యని యుబ్బుసంకటపుధోరణితోఁ గొందఱు కేకలు) పిల్లిగొంతులోఁ జిలుక మెడఁబెట్టునా? (Hear, Hear అను కేకలు) పామువుట్టలోఁగప్ప వ్రేలు పెట్టునా? (Metaphor pure, simple and distilled) అందుచే – ఈయకుఁడు– ఈయకుఁడు– ఈయకుఁడు'' Marvelously ముక్తాయిfide అని కేకలు చప్పటలు) ఇక్కడికి నుపన్యాసమైనది. మఱియొక్కచోట నింతకంటె రణగుణధ్వని జరుగుచున్నదని యక్కడికిఁబోవ యత్నించుచుండగా నింతలో నొక్కపిల్లగారు నేను బ్రాహ్మణుఁడనని గ్రహించి ''Brahmin block head' అని నన్నొక్క త్రోపు త్రోసెను. ఆ త్రోపుతో మఱింత వేగముగా మఱియొక్కచోటికిఁ బోయితిని.

అక్కడ నొక్క ముసలిబ్రాహ్మణుఁ డిట్లుపన్యసించుచున్నాఁడు. ''మనకు వోటీయఁ గూడదని యబ్రాహ్మణులు పట్టుదలతోఁ జెప్పుచున్నారు. అంత పట్టుదలతోఁ జెప్పుటయే

మన అర్హతకు నాధిక్యమునకుఁ బ్రబలనిదర్శనము. (Hear, hear అను కేకలు) వ్యక్తిలో నేమి, జాతిలో నేమి, యసూయ యధికాపాయకరము. మనయందలి యసూయచే, పరిపాల కాదరణాభివృద్ధిభ్రాంతిచే–వారు మనతోఁ గలిగించుకొనిన వైరమువలని నష్టము వారికేకాని, మనకుఁ గాదు. (Hear, hear అను కేకలు) వారు మనలను గోపమున విడిచినను వారుమనకుఁ బ్రియసోదరులు (ఆహా! సవతితల్లిప్రేమ చలిగుడ్డల గొంతుకోఁతదనము యని యొక్క యబ్రాహ్మణుని కేకలు) వారికి విద్యాబుద్ధులను గఱపి యింతకాలము వారికై యనేకశ్రమలుపడి వారికిఁ గొంత యర్హతను సమకూర్చి వారి నింతవారినిజేసిన యభిమాన ముచే, ననురాగముచేఁ బామరత్వముచే నే నింతగాఁ బ్రాకులాడుచున్నాను. (నోటికిఁ జిక్కిన జంతువును గొఱకునప్పుడు మొసలియైన నింత విచారింపదు అను కేకలు) విద్యలో, వినయములో, వ్యవహారదక్షతలో, మనశ్శక్తిలో, నాత్మశక్తిలో వారు మనకంటె మిగులఁ జిన్నవారు. అందుచే మన ముద్దుల తమ్ములు. వారికే మీరు వోటులీయవలెను. వారి కర్హత యున్నదా లేదా యను విచారము మీకక్కఱలేదు. అర్హతలేదనుట సత్యమున కెంతమాత్ర మును దూరముకాదు. (ఛీఛీ యను కేకలు) అర్హతలేదు కావుననేయెటులయిన నిమ్మని ప్రార్థించుచున్నాను. అర్హతయున్నవారిని గూర్చి యొకఁడు చెప్పనేల? ఇంటిలోనున్న చిన్నపిల్లవాని కందఱుతలకొక్క మితాయియుండ నిచ్చెదరు. అవియన్నియుఁ దినుట కాతని కర్హతయున్నదనియే యిచ్చుచున్నారా? అక్కడ ననురాగమే ప్రధానము కాని యర్హత కాదు. పాపము– ఇప్పుడిప్పుడే కన్నులు తెరచుచున్నారు'' అను సరి కొక్కటాయి యెక్కడనుండిపడెనో కాని యీ ముసలిబ్రాహ్మణుని భుజమునకుఁ దగుల నాతఁడు క్రిందఁబడెను. బ్రాహ్మణులందఱు గొల్లుమనిరి. ఆహా! ఈ యుపన్యాసకర్త యెంత క్రోధము నెంత శాంతితోఁ గప్పిపుచ్చినాఁడు! ఎంతగర్వము నెంత నైచ్యముతో మాటుచేసినాఁడు! ఎంత మనఃకాఠిన్యము, నెంత మృదులవాక్యములతో మలామాచేసినాఁడు. ఆహాహా! వోటు లిమ్మనుటయే యీయవలదని చెప్పుటకంటె నెక్కువ నిషేధశక్తి గలదై యున్నదే! 'ఊఁ' యే 'ఉహుహ్హూ' కంటె యెక్కువ 'ఉహుహ్హా' యినదే. మనస్సు కఠినమైనప్పుడు– శబ్దములు మృదుఃవులయినను గఠినములే– మనస్సు మృదులమైనప్పుడు శబ్దమును కఠినములైనను మృదులములే– ప్రధానమగునది మనస్సు కాని వాక్కు కాదు.

''ఆహాహా! వీరి వైరములు దేశమున కత్యంతారిష్టపదములై యున్నవికదా! వీరు బ్రాహ్మణులు కారు. వారబ్రాహ్మణులు కానట్లున్నారే– ఏమో విచిత్రస్వభావములు వీరి నావహించునట్లు కనఁబడుచున్నదే! ఇందువలన నింక నేమి పుట్టిమునకయున్నదో, యేది యేవిధముగా నెప్పటికిని బనికిరాకుండ ధ్వస్తము గాఁదలఁచియున్నదో, యింక నెంత నగుబాటులు నష్టము లొందవలసియున్నదో! భగవంతుఁడా! యీయాపదలనుండి దేశము నుద్ధరింపవా'' యని దైవనామస్మరణ మొనర్చుకొనుచు 'శాంతమ్ పాపమ్– శాంతమ్ పాపమ్మ'ని లెంపలు వైచికొనుచు మఱియొకచోటికిఁ బోవుచుండ నింతలో 'బాపనచుట్టలు– బాపనచుట్టలో' యని యొకఁడు చుట్టలతట్ట నెత్తిపైఁ బెట్టుకొని యమ్ముచున్నాఁడు. బాపనచుట్టలేమి యని తెల్లబోయితిని. మడికట్టుకొని కాల్చుకొనఁదగినవనియా? దేవతా ర్చనపుఁ బెట్టెలో దాఁచఁగదినవనియా? దానికర్థ మే మని వితర్కించుకొంటిని. బాపన పిత్రీలని, బాపనమామిళ్లని, బాపనకూరలని వినియుంటిమి. బాపన పిత్రీలకే కోమటిపిత్రీ లనికూడఁ బేరు. సురసురలాడుచుఁ దుష్టుమని యేమూలకో పాఱిపోవు స్వభావముగలవగు

టచే వాని కాపేరు వచ్చియుండునేమో! బ్రాహ్మణులకు మామిపండ్లీయకుండ ప్రభువులు తాముదినుట కిష్టపడక, ప్రశస్తములైన పండ్లిచ్చుట కంతకంటె నిష్టపడక, యేదో వాలాయ తలు దీర్చుకొనుటకుఁగాను, ఇచ్చి యీయనట్లుండుటకుఁగాను, నోటితో లేదనునది చేతితో లేదనునట్లుగా గ్రచ్చకాయలమామిడి యని, మేకపెంటిక మామిడి యని జొన్నల రాసి మామిడియని, చత్వారపుజోటికిఁ గాని యానని, తడిమినఁ గాని చేతికి దగులని కాయలుగల చిత్రవిచిత్రపు మామిడిచెట్లరకములు త్యాగశీలురగు మహారాజులు కొందఱు –బ్రాహ్మణుల మొగములఁ గొట్టుటకుఁ బ్రత్యానక్తిగాఁ దమతోఁటలో నాఁటి పెంచుట యాచారమని నేను వింటిని. కాని బాపనచుట్టలేమి? అని నేను శంకించుకొనుచుండఁగా నింతలో ''అబ్రాహ్మణచుట్టలు– అబ్రాహ్మణచుట్టలో'' యని మజీయొక్క కేక వినఁబడెను. నరి, నరి, ఇదియా! బ్రాహ్మణాబ్రాహ్మణ భేదము చుట్టలలోఁగూడ గలిగినదా? దేశమున కెంత దురవస్థ సిద్ధించినది! జాతీయత కెంత ఘోరావసానదశ సంభవించినది!'' అని నాలో నే ననుకొనుచు మజీయొకప్రక్కను జూడఁగా N. C. అను పెద్దయక్షరములుగల జెండా యొక్కటి యగపడెను. N. C. అనఁగా Numberless Castes కాఁబోలు. కాదేని New Cigrettes కాఁబోలు నని యనుకొనుచు నక్కడి గుంపును సమీపింపఁగా నాగుంపులో నొక్కఁడి ట్లుపన్యసించుచున్నాఁడు. ''మనకు బ్రాహ్మణాబ్రాహ్మణభేదము లేదు. సమస్తశా ఖాభేదములు– సమస్తవర్ణభేదములు– సమస్తశత్రుభావము లీ 'Non–Co–operation' రంగ మందు నాశమొందుచున్నవి. మనకు దేహములే భేదములుగాని గమ్యస్థాన మొక్కటియే, ప్రయత్నమొక్కటియే, ఫల మొక్కటియే, మనస్తత్వ మొక్కటియే. మనకున్నసంఖ్య యొక్కటియే! కాని రెండవసంఖ్య మనకు లేనేలేదు. స్వరాజ్య మొక్కటియే మన నిశ్చలాభిసంధి. శతఘ్ని దెబ్బచేఁ జంద్రుఁడూడిపడవచ్చును. ప్రభంజనాటోపముచే హిమా లయము కదలవచ్చును. సముద్రము పొంగి సూర్యగోళములోని యగ్ని నార్పవచ్చును. కాని, రాజకీయప్రపంచమందలి యేసంక్షోభమైన, నేమహాందోళనమైన, నేయవాంతరప్రళయ మైన, మనస్థిరమైన, నిశ్చలమైన, శాశ్వతమైన ప్రయత్నము నణుమాత్రమైన నూఁపఁజాలదు. కదల్పఁజాలదు. న్ప్రుశింపనైనఁ జాలదు. (సత్యము సత్యము అను కేకలు) గుండెలమీఁదఁ జఱుచుకొని– మేమే మాదేశమునకుఁ బరిపాలకులము. స్వతంత్ర పరిపాలకులము మేమే యని సత్యబుద్ధితో, సత్యాగ్రహముతో, నంతరంగశుద్ధితో, నాత్మ నిశ్చలత్వముతో ననుకొనుఁడు. అనుకొనుఁడు. అనుకొనుఁడు. మీర ట్లగుదురు. అగుదురు. కానియెడల నిఁకఁ బరమార్థమేలేదు. ప్రపంచమే లేదు. ఆత్మయే లేదు. కాయబలము బలము కాదు. ఖడ్గాదిసాధనబలము బలము కాదు. కాల్బలము బలము కాదు. కంఖాణ సేనాబలము బలము కాదు. గజయూథబలము బలము కాదు. ఆత్మ బలము బలము. అది మన కున్నది. ఎవ్వరికిని లేని దదియే! మన కున్నది. ఇప్పటినుండియా? న్ప్రాగ్దినుండి యున్నది. కాని యిప్పుడది ప్రచ్ఛన్నమైయున్న హేతువునఁ బిడికిటిలోఁ బట్టవలసిన జాతికి బానిసలమై యుండవలసివ చ్చినవి. ఇప్పుడయిన మీరు సర్వశక్తిమంతములయిన జగద్వ్యాప్తములైన యాత్మలమని గ్రహించుకొనుఁడు. అనుభవమునకుఁ దెచ్చుకొనుఁడు. అట్లాచరింపుఁడు. మనకు స్వరాజ్య మేలరాదో చూచెదము. మన కొకరితోడి నైరమువలదు. పిడుగులు మీదఁబడిననరే తలయొగ్గె దము. ఎవ్వరును శాసనాదినభలో సభ్యత్వము నపేక్షింపవలదు. ఎవ్వరైన వట్లుపేక్షించినను మీరు వోటు లీయవలదు. ఈయవలదు. ఈయవల'' దని యాతఁడు చెప్పునరికి ''ఈయవ లదేమి? ఈయవలదేమి? ఈయకుండినయెడల సర్కారునకు నష్టము కాఁబోలునేమి? ఇచ్చినదేదో పుచ్చుకొని, దానిపైదాని నడుగవలయును. కాని, వలదు వలదన్నయెడ–

(అడుగుటో డుముష్టియెత్తుకొనుటా? మన కంత ప్రారబ్ధమేమి? అడుగుటయేల? మన వస్తువును మన మడుగుట యేల? తీసికొందము. మనదేశమును మనము తీసికొందము అను కేకలు) అట్లు తీసికొనుటకేకాదా యీవోట్లప్రయత్నము? వేర్పులేక, యోరిమిలేక, దూరదృష్టి లేక, స్వలాభజ్ఞానమే లేక, ప్రపంచమైకరియే యెఱుఁగకవోటు లీయవలదని బోధింతురా? మనవారు శాసనసభలలోఁ గూరుచుండినఁగాని సర్కారువారు మనదేశమును బరిపాలింపలేరు కాఁబోలు! ఇరువది సంవత్సరముల క్రిందట మనవా రెవ్వరైనను శాసనసభ లలో నుండిరా? అప్పు డెట్లు పరిపాలించిరో మీరు వోటు లీయకుండినయెడల నిఁకముం దట్లే పరిపాలింతురు. ప్రయోజకత్వములున్నయెడలఁ బ్రతిజ్ఞలున్నయెడలఁ బ్రతిభలున్న యెడలఁ బ్రాఙ్ఞవార్హతలున్న యెడల శాసనసభలలోఁ జొరఁబడవలయును. మన హక్కులను గూర్చి హోరాహోరిని శాసనసభలలోఁ బోరాడవలయును. అంతేకావి కాళులు చాచుకొని చేతులు వెలికిలైచి మూఁతి బిగించుకొని యూరకుండనేల? మీదృష్టిమంతపు బోధనమువ లన నెందఱు మహాబుద్ధిశాలు రర్థించిననభ్యత్వమును వర్జించినారో మీరెఱుఁగుదురా? ఆనష్టము దేశమునకుఁజాలదా? ఇంకను వలదని బోధించుచున్నారా? ఏమట్టలవర్తకులో, యే పశువుల పాసఁగుడులవారో, యేబండ్లకంట్రాక్టుదారులో, యేనడమంతరపుసిరిగల వారో, యేనిరక్షరకుక్షులో, యేయవకతవకనడవడులవారో ఱేపు శాసనసభాపీఠముల నలంక రించునెడల మన గొంతుకలను మనము బుద్ధిపూర్వకముగా మనచేతులతోఁ గోసికొన్నవా రము కామా రండు. వోటులిండు. ఎవ రడ్డురాఁగలరో చూతము. తిరుగ Settlement శీఘ్రముగా రానైయున్నది. పన్నులెంతపెచ్చినో– తరువాతఁ బడ్డిగిలించిన లాభములేదు. రండు. ఎవ రడ్డుకాఁగలరో చూతము'' అని గంభీరస్వరమునఁ గేకలువైచుచుఁ గొందఱు వోటర్లను దీసికొని యొకవైష్ణవుఁడు ముందునకుఁ బోవుచున్నారు. ఎక్కడఁజూచిన దొమ్మి– ఎక్కడఁజూచిన ద్రోవుఁడు. ఈనందడిలో నబ్రాహ్మణులు కొందఱు బ్రాహ్మణులపాఁగ లెగురఁగొట్టినారు. నభ్యత్వ మపేక్షించిన వారందఱు వారివారి వోటర్లయొద్దకువచ్చి యేమేమో బోధించుచున్నారు. ఈబోధనలు ప్రతిబోధనలవలన బుగ్గియుగుచున్నవి– కాండ్రజింపు లెక్కువయైనవి– నకిలింపు లధికములైనవి– కళ్ళలు పైకిలేచుచున్నవి. కాళ్లు కాళ్లుక్రిందఁబడి నలుగుచున్నవి. మోచేతిపోట్లు శల్యములను బిండిచేయుచున్నవి. నెత్తిపై మొట్లు బ్రహ్మరంధ్రభేదన మొనర్చుచున్నవి. గ్రుడ్లనీరు దిరుగుచున్నది. క్రింద పడినవారు లేవకుండ నున్నారు. సంఘమున నింత తొందరకలిగినను శాంతమూర్తులగు కొందఱు రక్షకభటులు ధూరమునఁగూరుచుండి యెట్టిపాగను నేలపైఁబెట్టి యాకుచుట్టలను నోటిలోఁబెట్టి Emden కొట్టిన దెబ్బను గూర్చియు– దంభాచార్యులకు బాలామణి దిగంబ రయై నాటకములోఁ దనయంటుటను గూర్చియుఁ జెప్పుకొనుచున్నారు. ఇంతలో నమ్మర్దము కొంత శాఁతించినది. Candidates కొందఱు తమ తమ Voters కొఱ కెదురుచూచుచున్నారు. ఎందఱో రాలేదు. ఇంతలో నొక్క మిగులనంవన్నుఁడు, విశేషజన వశీకరణ పటిష్ఠుఁడగు నొక్క Voter కొక టెలిగ్రాము వచ్చినది. అది విప్పిచూచుకొని యాతఁడు గోలుగోలున నేడ్చుచున్నాఁడు. ఏమి యని నమీపస్థు లడుగుచున్నారు. భార్య బెంగుళూరులో Cholera చే మరణించినదని తెలిసినది. ''రైలిప్పుడు లేదుగదా. Vote యిచ్చియే వెళ్లవచ్చు'' నని తత్సంబంధి యగు Candidate నిర్దాక్షిణ్యముగ, నిర్లజ్జాకరముగ, నిర్దయముగా, మనుష్యప్రకృతికి వ్యతిరేకముగా నా Voter తో ననెను. అతం డేడ్చుచుఁ బోయెను. ఆయనతో నెందఱో పోయిరి. మరియొక్క Candidate మాఱుపేరితో నిప్పించిన దొంగటెలిగ్రామని గునగున లంతలో బయలువెడలినవి. అందుకు దగినప్రాయశ్చిత్తము

నాశత్రవునకుఁ జేసితి నని మొదటి Candidate రెండవ Candidate గూర్చి రోషముతోన వెను. రెండవ Candidate సంబంధులగు వోటర్లు చాలమంది యింకను రాలేదు. ఎందుచేత లోనోయని యాతఁడు పరితపించుచుండ తమ Voters అందఱు క్రొత్తగా బెట్టిన Coffee Hotel లోఁ బడిపోయియున్నారనియు లేపిన లేవకుండ నున్నారనియు, నెవ్వఁడో వచ్చి యారెండవ Candidate తోఁ జెప్ప, నాతఁడు గద్గదికతో "ఆఁ ఆఁ" యని యనెను. మొదటి Candidate సంతోషముతో సకిలించెను. Coffee లో మధద్రవ్యమేదైనఁ బ్రమాదమునఁ గలిపినదేమో కాక వారి ప్రకృతు లట్టివో యెవ్వరు చెప్పఁగలరు? Coffee త్రాగిననాఁడు మామిత్రుని కొకనికిఁగన్నులు కనఁబడకపోవుట నే నెఱుఁగుదును. ధృతరాష్ట్రున కంధత్వమాతనితండ్రి కాఫీ త్రాగుటచేతనే కలిగినదని మామిత్రుని నమ్మకము. అంతట రెండవ Candidate, (police, police) అని కేకలు వైచెను. వారెవ్వరును రాలేదు మాటలాడలేదు. వినిపించుకొననైనను లేదు. ఇంతలో మఱియొక్కచోట నొక్క Candidate తన Voters లోఁ బ్రముఖులైన నల్వు రింక రాలేదని యావఁదిన్న పసరమువలెఁ దహతహలాడుచున్నాఁడు. Side Car ను బంపినాఁడు.

Motor ను బంపించుటకు యత్నించుచున్నాఁడు. ఆ Candidate కు శత్రు వీతని తొందరఁ జూచి మిగుల సంతసించుచున్నాఁడు. Motor కు Accident కలిగినదనియును, నల్వురు Voters కుఁ గూడఁ గొలఁధిగా దెబ్బలు తగిలినవనియు, వా రానుపత్రిలో నున్నారనియుఁ గాని వారికి ప్రాణభయము మాత్రము లేదనియు, నెవ్వఁడో వచ్చి యానల్వురు వోటర్లు రాలేదని గింజుగొనుచున్న Candidate తోఁ జెప్పెను. ఆవార్త దావానలమువలె సంఘమంతయు వ్యాపించెను. Motor Driver లంచము తీసికొని యీపని బుద్ధిపూర్వకముగాఁ జేసినాఁడను ప్రతీతి ప్రబలెను. ఇంతలో 'Non-Co-operation అగ్గిపెట్టలో' యని యొక్క వర్తకుఁ డఱచెను. 'నీయగ్గిపెట్టెలు కాలిపోను' అని యొక్కఁడు వినుఁగు కొనుచుఁ దిట్టెను. మీరు శపించినను నవి కాలునవి కావు. అందుకొఱకే వానికి నాన్-కో-ఆపరేషను నామధేయ మీయఁబడినదని యొకఁడు పరిహసించెను. Motor accident కు సంతోషించి సకిలించిన Candidate సంబంధులగు Voters లో ముగ్గురు మిక్కిలి ముఖ్యమైనవారు polling station లోనికి వచ్చియు నెందులకో వెలుపలికిఁ బోయి వారు తిరుగ నింక రాలేదు. ఎక్కడ వెదకినను గానరారు. తనశత్రువేదో మోసముచేసినాఁడని యాతఁడు పరవళ్లు ద్రొక్కెను. అతనిశత్రువతనిని మోసముచేసినమాట సత్యమే. గోలకొండనుండి ముగ్గుఱు మేలైన సానులను బిలిపించి యామువ్వురకు నాతఁ డీసమయమున వారి నంటఁగట్టించినాఁడు. గోలకొండ సాను లుండగా Polling Officer మొగ మెవఁడు చూచును? ముద్దులతొందరలో Voters యెవనికి జ్ఞప్తియుండును? కాని యీమోసకాఁడుమాత్రము బహురసజ్ఞుఁడు. ప్రపంచపుఁగిటు కెఱిఁగినవాఁడు. ఏయంత్రము మహాధికా కర్షణశక్తి సముచితమో యది యెఱిఁగినవాఁడు. ముగ్గురుసానులకు మూఁడైదులు పదునైదు రూపాయలుమాత్ర మిచ్చి పరపక్ష పరుశురామ ప్రీతి యొనర్చినాఁడు. తనకా చవుకబేరము. వోటర్లకా సుఖము. సానులకా సంతకర్చు. విన్నవారికా విచిత్రత. కార్యమా నిర్బాధకము. ఆక్షేపణమునకా అవకాశము లేదు. ఇంతకంటెఁ గావలసినదేమి? కావలసిన దిఁకముం దుండనేయున్నది. ఇదియంతము నావరణములోని గత్తరయే. Station లో నేమిజరిగినదో మీరు నినఁదలఁచితిరేని ముందు వ్రాయుదును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

59. ఉన్మత్తుని యుపన్యాసము

జంఘాల శాస్త్రి దక్షిణ దేశ పర్యటన సందర్భంనాటిదే ఈ ముచ్చట కూడా. దక్షిణ దేశంలో ఒక దివ్యక్షేత్రంలో వీధుల్లో ఒక ఆంధ్రుడెవరో పిచ్చెత్తి తిరుగుతున్నాడని విని, అతన్ని చూడడానికి జంఘాల శాస్త్రి ఆ వూరు వెళ్లి ఆ ఉదంతం పరిశీలించి, సాక్షికి ఉత్తరం రాశాడు.

శాస్త్రి ఆ పిచ్చివాణ్ణే చూశాడు. కలిశాడు. మాట్లాడాడు. తనెవరో కూడా చెప్పాడు. అన్నీ విని, అడిగి తెలుసుకుని పిచ్చివాడు శాస్త్రి 'ఉపన్యాసకు'డని తెలిసి వికటాట్టహాసం చేశాడు. ఇంక తను ఉపన్యసించడం మొదలు పెట్టాడు. ఎవరికి, ఎందుకు నీ ఉపన్యాసాలన్నాడు. ఎరిగినవాడికి కావలసినది సన్న్యాసం గాని, ఉపన్యాసం కాదన్నాడు. నిజానికి చావే బ్రతుకు, బ్రతుకే వధ్నాలుగు చావులు.

పిచ్చివాడు, ధారాపాతంగా ఈ ప్రపంచంలో రకరకాల మనుషులు పడుతున్న వివిధ దుఃఖాల తీవ్రతను వివరించాడు. ఊపిరి తీసుకునే గాలిలో వున్న పరమాణువుల కంటె నిన్నావరించిన కష్టాల సంఖ్యే ఎక్కువ కదా! అన్నాడు. మృత్యువు ఎక్కడ పడితే అక్కడ నిన్ను వెన్నంటి వుందని హెచ్చరించాడు. చావు భయంతో ఎన్ని కష్టాలైనా సహిస్తున్నావా? అని ఎగతాళి చేశాడు. ఈ లోకంలో 'ఆశ' బలవత్తర మైనదని ఎన్ని చచ్చినా, ఎందరు చచ్చినా, అది చావదనీ తేల్చాడు. ప్రకృతి భగ్నమైతే తప్ప ఆశ, అసూయ అనేవి పోవన్నాడు.

సారాంశం ఏమంటే, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలోనూ, దేనికి అర్థం చెప్పే ప్రయత్నంలోనూ, మహానుభావులు కూడా పీటముడులే వేశారు తప్ప, విడగొట్ట లేకపోయారని తేల్చాడు. పరమాత్మ కాళ్లు గట్టిగా వట్టుకుని – ఈ జన్మ హేతువునీ, కష్ట హేతువుల్నీ, నిలదీసి అడగమన్నాడు. మాట్లాడి మాట్లాడి, టప్పున ఆ పిచ్చివాడు మరణించాడు. శాస్త్రి అతనికి ఉత్తర క్రియలు చేశాడు.

జంఘాలశాస్త్రి వ్రాసిన లేఖను జదివెదను.

సాక్షికి– జంఘాలుఁడు నమస్కారములు. దక్షిణదేశమున నొక దివ్యక్షేత్రమున వీథులందొక యాంధ్రుఁ డెవఁడో యున్మత్తుఁడు తిరుగుచున్నాఁడని విని యాగ్రామమునకుఁ

బోయితిని. అతని దర్శించితిని. ఆతఁ డాజానుబాహుఁడు- విశాలఫాలుఁడు- దీర్ఘ నేత్రుఁడు- కాంచన వర్ణదేహుఁడు- పలితకేశుఁడు- వయోవృద్ధుఁడు- కౌపీన మాత్రధారి- క్షాత్రవ్యక్తివలెఁ గానఁబడినాఁడు. ఆతఁడు నన్నవలోకించిన వెంటనే నేనాంధ్రుఁడనని గ్రహించికాబోలు నేత్రసంజ్ఞచే నన్నుఁ బిలిచెను. నేను సమీపించి యాతనికి నమస్కరించితిని. నా నమస్కారము నందుకొనకయే యాతఁడు నీ వెవఁడవని నన్నడిగెను. నేనాంధ్రుఁడనని పలికితిని. ''అది నీమొగమే చెప్పుచున్నది. కాని నీవిటకేల వచ్చితి''వని యాతఁడు పలుక ''సత్యపుర సాక్షిసంఘోపన్యాససామగ్రీ సంపాదనమునకై- సర్వదాక్షిణాత్య దేవస్థాన దర్శనకార్యమునఁ దిరుగు చున్నాను'' అని నేనంటిని. ''సత్యపుర మేమి? సాక్షి సంఘమేమి? ఉపన్యాససామగ్రి నుపార్జించుట యేమి? నీకు మతి యున్నదా లేదా? ఉపన్యాస మిచ్చువాఁడెవఁడు?'' అని- కొంత తీవ్రతతో నాతఁడు ప్రశ్నింప 'నేనే' యని యంటిని. ఆమాట విని యాతఁడు వికటముగ నట్టహాస మొనర్చి, యిట్లు గంభీరస్వరమునఁ బలికెను:-

''ఉపన్యాస మిచ్చువాఁడవు నీవే? ఎందుల కుపన్యసించుచుంటివి? వేనినిగూర్చి యుపన్యసించుచుంటివి? ఎవరి కుపన్యసించుచుంటివి? ఎంతకాలమునుండి యుపన్యసించుచుంటివి? మాటలాడవేమి? ప్రపంచతత్త్వమును నీ వెఱిఁగియుండియే యుపన్యసించుచుంటివా? ఎఱిఁగియున్నవానికి సన్యాసమే కాని యుపన్యాస మెందులకు? ఏ మొగము పెట్టుకొని యుపన్యసించుచుంటివి? ఉపన్యసించుట కేమియున్నదని యుపన్యసించుచుంటివి? నీ యుపన్యాసమువలన నేమి చక్కఁబడునని యుపన్యసించుచుంటివి? వెఱ్ఱివెఱ్ఱి యుపన్యాసముల కిఁక శాంతి చెప్పి నోరుమూసుకొని బ్రహ్మరంధ్రమును దెఱచి ప్రాణములు విడువుము. అప్పుడు కష్టములనుండి విముక్తి నొందుదువు. అంతవఱకుఁ బ్రకృతికష్టపరంపర నీకుఁ దప్పదు. నిజముగాఁ జావే బ్రదుకు. బ్రదుకే పదునాల్గుచావులు. ఆహా! దిక్కుమాలిన జగతి- నిర్భాగ్యపు జగతి- ఎక్కడ వినినఁ గష్టము. ఎక్కడ దాఁకినఁ గష్టము. ఎక్కడ మూర్కొనినఁ గష్టము. ఉన్నదొక్క కష్టమే! అంతకన్న వేఱులేదు. చూడు- అటుచూడు! ప్రపంచజనులందఱు నీకు గాలిలోఁ గనఁబడుచున్నారా? వారిలో నెందఱు వికలాంగులున్నారో! అయ్యయ్యో! ఏమి మహాదురవస్థ! ఏమి మహాదురవస్థ! అన్నము తినుటకుఁ జేతులు లేక నోటితోఁ గుక్కలవలె నెందఱు తినుచున్నారో! చూచితివా? అదిగో ఆప్రక్కను జూడుము. కన్నసంతానమంతయుఁ గాటిపాలుగాగ నెందఱు వృద్ధదంపతులు గుండెలు బాదుకొని యేడ్చి యేడ్చి సొమ్మసిల్లుచున్నారో! ఆహా! అదిగో! ఆవైపునఁ జూడుము. లొడితెడు బుడుతలను ద్వితీయ తృతీయ చతుర్థవివాహములఁ జేసికొని వారు కడఁద్రొక్కకుండ వారిపై దాసిని గాపుంచి, యాదాసియందు నమ్మకము లేక దానిపై నొక్కబంటును కాపుంచి, యాబంటుపైఁ గాపుగాఁ దన్ను నియమించుకొని, గదిలో భార్యగాజులు గలగలలాడ, దనగుండెలు దడదడలాడ, భార్య చిఱునగవు నవ్వఁ దాను పెద్దపెట్టున నేడ్చుచు సతిని గుమ్మముదాఁటి లోనికి రానీయక, ఎంతసేపును భార్యచుట్టు చుట్టుఁ గఱ్ఱచేతఁ బుచ్చుకొని ప్రదక్షిణములు చేయుచు నామెకు వైరాగ్యమును నేర్పుచు తాను శృంగారము నభివృద్ధిపఱచుకొనుచు, నామె దేహమును శుష్కింపఁజేయుచుఁదాను వీర్యవృద్ధికి లేహ్యముల సేవించుచుఁ, దాను బంచబాణవిలాసముఁ జదువుచు నామెకుఁ బతివ్రతాధర్మములఁ జెప్పుచు, నామెను లొంగదీయలేక యేడ్చుచుఁ, దవయింటినుండి పొరుగింటి కెక్కడికిఁ బోవునోయని పగలెల్ల ఏడ్చుచుఁ, మఱిమఱి యేడ్చుచు, నేడ్చుటకింక నేమికారణములు గలుగునో యని

ముందటి యేడుపునిప్పుడే యేడ్చుచు, నెట్లు వివాహశ్రాద్ధపుల మనుభవించుచున్నారో చూడు! అదిగో అటు చూడుము. ఎందఱు వితంతువులు భర్తృ విరహవేదనావివశలై దుఃఖమాత్రద్వితీయలై, కర్కశవస్త్రధారిణులై, నంతతోపవానదీక్షలై, నవసి నవసి శల్యపంజరములై గట్టిగ నేడ్చుటకైన శక్తిలేక పడియున్నారో! చూడు! అదిగో దరిద్రులు! క్షామదేవిపుత్రులు పొట్టలు పెరుగఁ– గాలు సేతులు సన్నవడఁ– గన్నులు గుంటలుపడ– దౌడలు దగ్గఱఁబడ– మొగమునఁ బ్రేతకళ పడఁ– దినుటకు గడ్డియైన లేక, యొకరి నొకరు పీకుకొని యెట్లు తినుచున్నారో! ఆహా! రోఁత– రోఁత! ఒడలు కంపమెత్తుచున్నది. మనస్సు రక్తాశ్రువులను విడుచున్నది. ధనికులు సుఖపడుచున్నారని యనుకొనుచున్నావు కాఁబోలు! అదిగో– రాజులు రాజాధిరాజులు. చూచితివా? రాజభటుఁ డొక్కరాజునకే భటుఁడుకాని రాజు ప్రజలకందఱికు భటుఁడు "చేతఁ బంగలకట్టఁ బుచ్చుకొని గొఱ్ఱెలమందను గాచుకొనువాఁడు రాజ్యదండధరులమగు మాకంటె సహస్ర గుణములు సుఖసంపన్నుఁడై యుండ నెత్తిపై మట్టితట్టను బెట్టుకొని జీవించువాఁడు కిరీటధారులమగు మాకంటె సహస్రగుణములు సుఖ సంపన్నుఁడై యుండ– మాకింత నిర్భాగ్యాధమాధమమైన బ్రతుకిచ్చి తివేమిరా భగవంతుడా" యని వారు లోలోనఁ గుమిలి కుమిలి యేడ్చుచున్నారు. సైకి సుఖులనుని యనిపించుకొనుటకొఱకు తేర తేర వెఱ్ఱివెఱ్ఱి నవ్వులు నవ్వుచున్నారు. దుఃఖముచేఁ దల గట్టిగఁ గొట్టుకొనవలసిన వారు– డాబుకొఱకు మీసాలు మెలిపెట్టుకొనుచున్నారు. ఇది మఱింత క్షోభము. బారున నేడ్చినయెడలఁ గొంతగుండెబరువయినఁ దగ్గునేమో? ధనవంతులు సుఖులని దరిద్రులనుకొనుచున్నారు. దరిద్రులు సుఖులని ధనవంతులనుకొనుచున్నారు. "అక్షయపాత్రాధిపతియైనఁ గావలయును. అస్థానాధిపతియైనఁ గావలయును. అంతేకాని యటునిటు కాకుండ నడుమనున్నవారికిఁ జచ్చినఁగాని సుఖములేదురా భగవంతుడా" యని సామాన్య లేడ్చుచున్నారు. బ్రతికియున్నవారి కెవ్వరికిని సుఖము లేదు. సుఖ మనుకొనునది సుఖాభానము కాని సుఖము కాదు. తాత్కాలికముగా శమించిన కష్టమును సుఖమని మందులగు మనుజులు భ్రమించుచున్నారు. ఈకష్టములతో సరియా? కాదు. ఆమహాపట్టణములోని పెద్దయాసుపత్రిలోఁ జూడుము. శిలామేహముచే మూత్రముపడక యారోగి యెట్లు గోండ్రించుచున్నాఁడో? కంటిలోఁ జేరిన పురుగుచే నారోగి యెట్లోండ్రపెట్టుచున్నాఁడో? అటు– అటు– విషమజ్వరముచే నాతఁ డెట్లు బొబ్బరించుచున్నాఁడో? ఛీ– ఛీ– ! ఇంకను బ్రదుకవలసినదేనా? అదిగో! మహామారి! కనఁబడుచున్నదా? రక్తమును వర్షించుచున్న కోరలతో, నిప్పునొలుకు కన్నులతో, గోటి కపాలమాలికలతో మృత మూషికకళేబర పర్వతరంగమున జగద్విలయగాన మొనర్చుచు భూమి కంపింపనెట్లు తాండవించుచున్నదో! అదిగో ఆతల్లి– మరిడిమహాలక్ష్మి– గోట్టాలమ్మ తల్లి! అటుచూడు! పేఁడగుట్టలపై జెంగున ధాటుచుఁ బంది పెంటల కోడిరెట్టల గమగమల నాస్వాదించుచు, ముఱికికుండ్ల కాలువలగట్టుల వాయుభక్షణమునకై విలాసార్థకముగా విహరించుచు జగత్తంతయుఁ దుడిచిపెట్టగల తోఁకచుక్క– యంత చీపురుకట్టను జేతధరించి యంతే యంతే యని చిటుకలు వైచుచు మహారౌద్రరూపిణియై ప్రజ్వరిల్లుచున్నది! అదిగో వేపమండల స్పోటకపు దేవత– గుగ్గిలపుబొగలనడుమ నల్లత్రాఁచువంటితలవెండ్రుకల విఱియఁ బోసికొని, నోరు తెఱచి హా! హా! మ్రింగెదను మ్రింగెదనని యెట్లు గంతులు వైచుచున్నదో! అదిగో! దోమ తెట్టుల శీతజ్వరదేవత– ఇంతేనా మన కష్టములు! యుద్ధములో

భూకంపములో– తుపానులో– యగ్నిపర్వతవిక్షేపణములో– మతవిద్వేషములో....

ఈసంత కష్టములతో– నీ నిత్యాపాయములతో– నీ నిరంతరాపదలతో– నీ నితాంత చింతలతో– నీ యనంతభయములతో నింక బ్రదుకేమి? ఊపిరితీసుకొను గాలిలోనున్న పరమాణువులకంటె, నిన్నావరించిన కష్టము లెక్కవసంఖ్యగలవై యున్నవే! ఉన్న బాధలే వియో యుండఁగా నిఁక నేదివచ్చునో? యని మఱింత యేడుపయ్యెనే! భగవంతుని సృష్టియేనా యిది! కరుణాళుఁడు దీనరక్షకుఁడు భయనాశకుఁడగు పరమేశ్వరుఁ డొనర్చిన జగతియేనా యిది! దీని నేల సృష్టింపవలయును? ఇంతకంటె మంచిది చేయుట చేతఁగాక యిది సృష్టించెనా? సృష్టించినాడు. మనల దీనిలో నేల యుంపవలయును? మనల నిక్లేశ బాధింపవలయును? ఆ మహాత్ముని కిది ఖేలనమా? విలాసమా? మనరోదన మామహాత్మునికి గానమా? మన చా వాతని సంతోషమా? కాళ్లకుఁ జేతులకు, వెనుక ముందు, కుడిప్రక్క నెడమప్రక్కను, బైనిక్రింద, వెలుపల లోపల నావరించిన కష్టముల నెటులో పడుచుఁ బడుచు, నేడ్చుచు నేడ్చుచు రాఁదలచినకష్టములఁ దప్పించుకొనఁ బ్రయత్నించుటతోడనే బ్రదుకంతయుఁ బరిసమాప్తి జెందుచున్నదే! ఎందుల కీకష్టములన్నియుఁ బడవలయును? చచ్చినయెడల నన్నికష్టములు తీరునే! మరణింపరాదా? ఊహూ– అది పనికిరాదు. ఆత్మా టయైనఁ జెప్పవలనుగాదు. సిగ్గుబిడియములేని బ్రదుకులు– మొండి బ్రదుకులు– తుచ్ఛజీవ నములు ఛీ! – ఛీ! సర్వకష్ట వినాశమునకు బాహాటమైన ద్వారము సహస్రముఖములుగా మృత్యురూపమునఁ గనబడుచుండఁగా నాదారిని బోయి కష్టనివృత్తి చేసికొనక, కుళ్లునీటి గుంటలోని పురుగులవలెఁ గఱచుకొని, పీకుకొని, చుట్టలు చుట్టుకొని, కట్టలు కట్టుకొని, సమస్తహేయతల ననుభవించుచు, నధమాధమముగా బ్రదుకుట యెందులకు? మృత్యు వెచ్చటనో యున్నదని సంకోచించుచుంటివా! ఎచటనో లేదు. నీ వెనుకనే యున్నది. నీ బుజముమీఁదినుండి తొంగి చూచుచున్నది. అదిగో! అదిగో! ఎంత వికటముగా– విరుద్ధముగా– భీకరముగా– వెక్కిరించుచున్నదో! అది యెచ్చటనో యున్నదనుకొనుచున్నావా? నీవు త్రాగునీటిలో నున్నది. నీవు తిను నన్నములో నున్నది. నీవు పీల్చు గాలిలో నున్నది. నీవు త్రొక్కు నేలపై నున్నది. అనుక్షణమును నిన్ను గనిపెట్టియున్నది. అట్టి మృత్యువు నీకంత సుముఖమై యుండ, నంత సన్నిధిలో నుండ, నంత స్వాధీనమైయుండ, నంత నిన్ను వరించియుండ, నీకు సర్వకష్టవిముక్తి నొసఁగుటకుఁ గంకణము కట్టుకొని నిన్ను సర్వదా సేవించుచుండ, మూఢుఁడవై దానిఁ దప్పించుకొనుట కంత దేవులాడెదవేల? అంత కొట్టుకొనెదవేల? అంత గింజుకొనెదవేల? నీకష్టములే నీకిష్టములయ్యెనా? అవి యంత యిష్టము లైనప్పుడు– కష్టములో కష్టములో యని పగులఁగొట్టుకొని గుండెలు పగులఁగొట్టుకొని యింత యేడ్చెదవేల! నీచర్య కేమైన నర్థమున్నదా? నీవు మతి యున్నట్లు ప్రవర్తించుచుంటివా? చావనఁగ భయముచే నెన్నికష్టముల నైనను సహించుచుంటివా? మృతి యనఁగ భయమే లేనియెడల నిన్ని కష్టముల నెట్టి మూఢుఁడైనఁ బడునా యనుచున్నావా? చావనఁగ భయమేల? బ్రదికిచేయు ప్రయోజకత్వ మేమున్నది? పడుసుఖ మేమున్నది? పడనికష్ట మేమున్నది? మగనితో రవంత మాటపట్టింపు వచ్చిన మగువ మరణమును మహానందమునఁ గలిసికొనుచున్నదే! పరీక్షలోఁ గృతార్థుఁడుకాని బాలుఁడు దాని నొట్టి చేరుచున్నాఁడే! నీ కీభయమేల? ఎన్నటికైనను సుఖము చేకూరునేమో! ఏల మృతినొంద వలయునని యాసపెట్టుకొని యిన్ని తన్ను లిన్ని చెప్పు దెబ్బలు, నిన్ని కోతలిన్ని వాతలు సహించుచున్నావా?

నీమతి మండిపోను? నీయాన యడుగంటిపోను! ఇంకను సుఖమా?

పోనీ! ఇంతకాలము నీవు బ్రదికితివి గదా! ఒక్కసుఖము నే ననుభవించినానని వ్రేలుమడచి యొక్కటి చెప్పుము. అట్లు పండ్లిగిలించెదవేల? పోనీ! నీవెఱిఁగినవాఁ డెవఁడైన ననుభవించెనేమో చెప్పఁగలవా? తలగడియారపుబిళ్లలాగున నడ్డముగా నూఁపెదవా? సుఖ మనుభవించుశక్తియే నీలోలేదు. సుఖమనుభవించుతత్వమే నీకు భగవంతుఁ డీయలేదు. అట్లు తెల్లపోయి చూడకుము. నీవు తలనొప్పినేకాని తలనొప్పిలేనిస్థితి నెన్నఁడైన ననుభవించి తివా? కడుపులో గుట్లుగుట్లుమని గట్టిగాఁ బ్రేగు లఱిచి నొక్కగ నప్పటి యనారోగ్యస్థితినే యనుభవించితివి. కాని యాయనారోగ్యములేని స్థితి నెన్నఁడైన ననుభవించితివా? అప్పుల వారు వచ్చి యవమానింతు రను భయమునే యనుభవించితివి కాని వారు రాని యప్పటి నిర్భయత్వ మెన్నఁడైన ననుభవించితివా? యథార్థమేమనఁగ నెప్పు డనుభవించినను నీ వనుభవించినది బాధనేకాని సుఖమును గాదు. సుఖమని నీ వనుకొనినది సుఖము కాదు. తాత్కాలిక కష్టశాంతి. ఒక మంట చల్లాఱినది. దానిని తలఁదన్నినమంట మఱియొకటి లేచుచున్నది. ఆనడిమిస్థితినే నీవు సుఖమని భ్రాంతిపడుచున్నావు. ఈయనుభవ మెవ్వరికినిఁ గ్రొత్తకాదు. అందఱెఱుఁగనే యెఱుఁగుదురు.

అందఱు (బందుగులును) జచ్చినవాఁడైన నున్నాఁడు. అవయవములన్నియుఁ దెగినవాఁడైన నున్నాఁడు. కాని యాశ చచ్చినవాఁడెవ్వఁడైన నున్నాఁడా? లేఁడు. లేఁడు. ఆశ నిన్నేల వదలలేదు? ఆశ యెందుల కింకఁ బెట్టుకొనవలసివచ్చెను? నీవర్తమానస్థితితో నీకు సంతుష్టి లేకపోవుటచేతనేకదా? నీవిద్యమానస్థితి నీకుఁ గష్టమగుట చేతనే కదా— బ్రదికియుండుననన్నినాళ్లు నాశ వదలదని నీ వెఱుఁగుదువు కదా! చచ్చినందాఁక నెప్పటికప్పుడే నీయప్పటిస్థితి కష్టమే యని నీకుఁ దోఁచుటలేదా? పోనీ! అనేకకోటుల కధిపతి యున్నాఁడు. అర్థ ప్రపంచమున కధీశుఁడైన రాజాధిరా జుండవచ్చును. వాని కాశ తీఱియేడ్చి నదా? వాఁడింక నాశపెట్టుకొని యేల మిడుకవలయును? మిగిలిన యర్థప్రపంచము కూడ నాతని స్వాధీనమైనయెడల నాతని యాశ తీఱునా? తీఱదు. ఉన్నదేదో యంతయుఁ దనదే యైనప్పుడు— నింకఁ గోఁదగిన ప్రపంచమే లేనప్పుడు— దేనికై యాశపడవలసినది? ఆతఁడేమి మూఢుఁడా? మూఢుఁడు కాఁడు. ఉన్మత్తుఁడు కాఁడు. అతనిలోనున్న మనుష్య తత్వమ ట్లాతనిఁ జేయించుచున్నది. జీవతత్వమట్టిది. జగత్తత్వమట్టిది. సృష్టివైఖరియే యట్టిది. నీప్రకృతస్థితి యెట్టిదైనను నీకు సంతుష్టి నీయఁజాలదు. నీకది కష్టమే! దానిలో నేదైన మంచిదని నీ వనుకొనిన మార్పు గలుగువఱకు నీకు మతి యుండదు. అంతవఱ కేడ్వవలసినదే. అది తీఱినతరువాత దానిపై యేడుపు. పోనీ? మఱియొకసంగతి. అసూయ నీ కున్నదా? నరే నీకొక్కనికేనా? కాదు. పందిమొదలు పరమహంసవఱ కున్నది. పకీరు మొదలు పాదుషావఱ కున్నది. అసూయ యనఁగ నేమి? పరుఁడు సుఖపడుచున్నాఁడను చింతయేకదా! నేను కష్టపడుచుండఁగా బరుఁడు సుఖపడుట యేల యని నీవు విచారించుచుండఁగాఁ, నీకుఁ గష్టమే కాని సుఖము లేదన్న మాట నీకు స్పష్టమేకద. నీమట్టునకు నిజమైనది లోకమున కంతకును నిజ మేలకాకపోవును? ప్రకృతిచేత నీకంటె భిన్నుఁడెవ్వఁడు? ఇక్కడ కేమి తేలినది? మాధుకరపు జోలిలోను సుఖము లేదు. మణులనంచిలోను లేదు. గుడిసెలోను లేదు. సుఖము కోటలోను లేదు. జాఱుపైటలోను

లేదు. సుఖము శాటిలోను లేదు. అటులైన సుఖమనునది యెప్పుడు రాఁగలదు? అ
పోయినప్పుడు అనూయ పోయినప్పుడు. అవి యెప్పుడు పోవును? ప్రకృతి భగ్నమైన
ప్పుడు. సృష్టిసున్నయై నప్పుడు. ఇంత పనికిమాలిన జగతి యింకను బోక యే
నిలిచియుండ వలయును? సుఖమే! ప్రపంచమందే! అబ్బా! మతియున్నంతవఱకు సుఖమ
న్నదా? ప్రాణమున్నంతవఱకు సుఖమున్నదా!

జగతి సుఖరహితమైనదియు సుభోజ్యమైనదియు నైనయెడల, వేదర్షులు– వ్యాసాది
సూత్రకారకులు– శంకరాది భాష్యకర్తలు– ప్రపంచమందలి యన్నిదేశములందలి యన్నిజా
తులయందలి శాస్త్రజ్ఞులు– నీజగత్తును గూర్చి యిన్ని పూర్వపక్షరాద్ధాంతము లే
చేయవలయును? జగతి మంచిదే యగునెడలఁ గిక్కుఱుమనకుండ, మహానందము ననుభ
వించును. మైమఱచి, మహావేదాంతులు మహాపండితులంద ఱుండనే యుందురు. అట్లుండ
మని మనకుఁ గూడ బోధింపనే బోధింతురు. వారు బోధింపనేల! మనమే యట్లుందుము
పిల్లికిఁ బాలు ద్రాగుమని యెవఁడు చెప్పవలయును? కప్పకు గంతువేయమని యెవఁడ
చెప్పనాఁడదు? అట్లుకాక, ఇంతవిచిత్రత, ఇంత విపరీతత, ఇంతకష్టము, నింతసందేహము
నింతభ్రాంతి, ఇంతప్రీతి, ఇంతరోఁత మటీయింత నేమేమో జగతిని గూర్చి మనకున్నవి
కాపునవే, దీని స్వరూపమేమి? స్వభావమేమి? ఇది విశ్వసనీయమా కాదా? ఇది త్యాజ్యమా
భోగ్యమా యని యిన్ని సందేహములు– నిన్ని యాలోచనములు– నిన్ని ఖండములు– నిన్ని
యనుమానులు – నిన్ని కాదులు – నిన్ని యస్తులు – నిన్ని నాస్తులు – కలుగవలసి వచ్చినది
పలకదొండకాయలోఁ బురుగుండుటచేతనే పరీక్షింపవలసి వచ్చినది. మణిలో దోషముండ
టచేతనే పరీక్షింపవలసి వచ్చినది. లేనియెడల మాటలాడకుండ– నాలోచనయైన లేకుండ–
నది నోటిలోను నిది చెనిలోను బెట్టుకొనవలసినదే కాదా! మహర్షులందఱు మతకర్తలందఱు–
మనుష్యులను తరింపఁ జేయుట కేదో మంచిదారి త్రొక్కిరా? త్రొక్కిరి. కాని దానివలన
నుపయోగము లేదు. ఒకటియనియో, పైకి రెండు లోన నొక్కటియనియో, యొకటికంటె
నెక్కువనియో, మొట్టమొదటనే మనసునందుంచుకొని యాయభిప్రాయము ననుసరించి
వేదవాక్యముల కర్థమును లాగిరి. పరాభిప్రాయ నిరాకరణబుద్ధిచే స్వాభిప్రాయ మండనాభిసం
ధిచే, స్పష్టమైన వాక్య ములకు పాండిత్యప్రకర్షమువలన బహువిపరీతార్థములు చెప్పియు
సందేహ మొక్కటి విడఁగొట్టలేక, యున్నదానినిఁ బదునాలుగుచేసి పూర్వము రవంత
కనఁబడుచున్నదాని నిప్పుడు బొత్తిగాఁ గనఁబడ కుండఁజేసి, తడుముకొని పోయినను
రవంతదారి కనుబడుచోటుల ముండ్లకంపలు వైచి, పల్లము మెఱకగాను మెఱక పల్లముగాను
గనఁబడునట్లు చేసి ఒకకంటిలోఁ బొడిచి, రెండవ కంటిలో నినుకఁ జల్లి, యెంతగత్తర
యెంతగందరగోలము, యెంతకంగారు చేయవలయునో యంతయుఁ బూర్తిగాఁ జేసినారు
తప్పుతప్పని ముక్కుమీఁద వ్రేలు వైచికొందువేల? మఱేమియుఁ దప్పులేదు. ప్రపంచకష్టము
లన్నియు జీవులలో, నెవని పూర్వకర్మమున వాఁడు తెచ్చుకొన్నవే గాని భగవంతుఁడు
తెచ్చిపెట్టినవి కావని కొందఱు మహాబుద్ధిమంతులు పలికినారు. ఈకష్టము లేమియో
యెందులకు వచ్చెనో యని యేడ్చుచుండగా– వానిని మనమే తెచ్చుకొంటిమని మనమీఁద
నింద యొకటియా? కష్టాలకే యేడ్చుచుండగా నీనిందకూడ భరింపవలసినదేనా? పూర్వజ
న్మమని తెలియనినంగతి మఱియొకటిప్పుడు బయలుదేఱినదా. ఒకటి తెలియక యడిగినం
దులకుఁ దెలియనివి రెండైనవా? నరే– మన పుట్టుకకు బ్రదుకునకు సర్వస్వతంత్రులము

మనమే యైనప్పుడిందులోఁ బెద్దబావగారిలాగున పరమేశ్వరుఁ డెందులకో! భగవంతుఁ డెంతకాలపు వాఁడో యీజీవులుకూడ నంతకాలపువారే యయినప్పుడింక భగవంతుని యాధిక్యము ననాదిత్వ మెక్కడనో బోధపడదు. కష్టము లెందుకు రావలెనో కనుగొనఁ దలఁచి యీగత్తరలోఁ బడినాము. సరే– వారన్నట్లే మన యిప్పటికష్టములు పూర్వజన్మకర్మ జనితములని మాట వరుస కేడ్చుచునైన నొప్పుకొందము. మనము పూర్వజన్మమున నేదోషములు చేయుటచేత నీకష్టములు వచ్చినవో మనకు లేశమైనఁ దెలియునా? తెలియుట కేమైన సాధ్యమగునా? అట్టిచో నేమి వినియోగము? కర్మవిపాకాది గ్రంథములు చూచినయెడలఁ దెలియునని యందువా? హుఁ కర్మవిపాకమా? అవధూత లంబలీ త్రాఁగుచుండ శిష్యులకుఁ జీనామితాయియా? మౌల్వీలు మాధుకర మెత్తుచుండ చేలాలకుఁ గోడిపలావులా? మహావేదాంత గ్రంథజాల మంతయు సర్వధా యసందర్భతా పరిపూర్ణ మైయుండఁ గర్మవిపాకము కడతేర్చునని నమ్మికొందువా? జగత్తింత కష్టసంకులమై యుండ నేల యను ప్రశ్నమునకుఁ దగిన ప్రత్యుత్తరము చెప్పలేక, జగత్తులేదు కష్టములేదని శంకరాచార్యులు సమస్తము దుడిచివైచినారు. ముక్కు లేదని భావించినను బడిసెము తప్పునా? అదిగాక పరబ్రహ్మమునకే యజ్ఞానము నాపాదించినారు. ఇదియేమి? అడిగిన ప్రశ్నయేమి? ఉత్తరమేమి? ఇందునుగూర్చి యెవ్వరు నేమియు నెఱుఁగురు. అందఱు వట్టిమూఢులు– ఉన్మత్తులు. నేను దక్క– తెలిసినదా? నవ్వెదవేల? నవ్వెదవా? సిగ్గు బిడియములు విడిచినతరువాతఁ జేయవలసిన దంతకంటె నేమున్నది? నవ్వు చుంటివా? అయ్యో! నీకుఁ గడుపులో బెంగలేదా? హృదయములో మంటలేదా? ఈకష్టములను దలఁచుకొనగ నొడలు చీలి చీలి చిద్రుపలై పోకున్నదా? అయ్యయ్యో! ఈకష్టములకు నివృత్తిమార్గ మేమున్నది? యేమియు లేదు. అనుభవింపవలసినదే? అనుభవింపవలసినదే? పోనీ! ఎట్లో కొన్ని బాధలను బడుచుఁ గొన్ని బాధలను దప్పించుకొనఁ బ్రయత్నించుచు– నడుగడుగునకు మృతినోటిలోఁ బడకుండ నేసందుగొందు మార్గములందో ప్రవర్తించి– తనువు కడతేర్చుకొన్నపిదప– నీగతి యేదో యెఱుఁగుదువా? "నీవాతప్పు చేయనేల? యీతప్పు చేయనేల– యేల నిన్ను శిక్షింపఁగూడదు? అని నిన్నుఁ బ్రశ్నించి యాపరమాత్మఁడు నిన్ను శిక్షించునఁట! అప్పుడు తెగిపడి నీవొక్క పని చేసెదవా? తలయూఁపుచున్నావు– గట్టివాఁడవగుదువు; అట్లు నిన్నాతఁడు శిక్షింపవచ్చినప్పుడు "నా కీజన్మము నీవీయనేల? ఇమ్మని నేనేడ్చితినా? ఎందుల కిచ్చితిని? ఏమియు లేకుండగా నన్నామున్డ్లకంపలో నేల పడవేయవలయును? నన్నా సాములపుట్టలో నేల పాఱ వేయవల యును? ముల్లూడఁడదీసికొంటివేల యని యిప్పుడు నన్ను శిక్షింప వచ్చితివా? ఇది యేటిన్యాయము? నీయిష్టానుసారము నీవు నన్ను భూమిలోఁ బాఱవైచితివి. నాయిష్టానుసా రము నేను బ్రవర్తించితిని. నీయిష్ట ప్రవర్తనమునకు శిక్షలేదు కాని నాయిష్టప్రవర్తనమునకు నాకు శిక్షయా? ఇఁక జాలించు. నన్ను నీవు శిక్షింపఁగ, నన్ను సృష్టించి యిన్ని కష్టములఁ బెట్టిన నిన్నెవఁడు శిక్షించును?" అని గట్టిగఁ బలుకవలయును. తెలిసినదా? సత్యపురసాక్షి సంఘమున జల్లిబొల్లి యుపన్యాసము లిచ్చుట కాదు. తెలిసినదా? గట్టిగ నాతని రెండుకాళ్లు పట్టుకో– కదలనీయకు– ప్రళయఘంటాఘోషముగా నీనాల్గుమాటలు మొగముమీఁద జాడించి యడుగఁగలవా? అడుగుము. నీకేమియు భయములేదు. ఏమని చెప్పునో చూతము. పెద్దవాఁడైన నగుఁగాక.

అయ్యయ్యో! నాయనా! తలలో నగ్నిపర్వతము పగులు చున్నది. నే నింక మాటలాడ లేదు. నీవే యిచ్చట నుండుము. నేనే పోయెదను. నీ విచ్చట నిలిచి ''భూమిలోఁ బుట్టుటకంటెఁ గష్టము లేదు. చావుకంటె సౌఖ్యము లేదు'' అని యందఱితోఁ జెప్పుము. తెలిసినదా? నేను బోయెదను– అడిగెదను. ఆపరమాత్మని– నిలువఁబెట్టి– సృష్టిమానుదువా లేదా యని సాగదీసి– ''

అంతలో టప్పుమని యొక్క ధ్వనియైనది. బ్రహ్మరంధ్రము పగిలినది. గప్పుమని పైకొక్కజ్యోతి పోయినది. అతఁడు దబుక్కునఁ గ్రిందఁబడినాడు.

అతనికుత్తరక్రియ లాచరించితిని. అందువలననే మీకుఁ గ్రిందటి వారము లేఖ వ్రాయఁలేదు. ఆతఁ డెవఁడో యిదివఱకుఁ దెలియ లేదు. ముందెప్పుడైనఁ దెలిసినయెడల నాతని చరిత్రములు వ్రాయుదును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

60. ఇన్‌ఫ్లూయన్జాజ్వరము

మద్రాసులో వుండగా – జంఘాల శాస్త్రికి ఒకసారి తీవ్ర జ్వరం వచ్చి, తొందరలోనే నిమ్మళించింది. డాక్టరు పింజారీ రావు తన మందు గుణమిచ్చిందని జంఘాల శాస్త్రికి చెప్పి – ఊరుకోకుండా నిమ్మళించిన తరువాత ఉత్సాహవంతంగా ఒకనాడు శాస్త్రికి ఉపన్యాస ధోరణిలో ఇన్‌ఫ్లు యంజా జ్వరం గురించి వివరించాడు.

ఇన్‌ఫ్లుయంజా జ్వరం *1889* తరవాత మాత్రమే దాదాపు ప్రతి యేడూ యూరపు ఖండంలోను, మన ఖండంలోను, కొన్ని దేశాల్లో కనిపించి జననాశనం చేయసాగింది. *1403* సంవత్సరంలోనూ, *1587* సంవత్సరం లోనూ ప్యారిస్‌లో ఈ వ్యాధి ప్రబలంగా కనిపించింది.

దగ్గు, తుమ్ములు, ఈ జ్వరం ప్రాథమిక లక్షణాలు. ఈ వ్యాధికి కారణం చిన్నపురుగు. ఎండలు బాగా కాసిన తరవాత కురిసిన వర్షానికి గోతుల్లోనూ, భూమి బీటల్లోనూ, పల్లపు ప్రాంతాలలోనూ చేరిన నీరు, శీతాకాలం వరకు నిలవ వుండి కుళ్ళిపోయి విషంలాగయి పోతుంది. ఆ విషం వల్ల గాలిలో ఒక నిధమైన పురుగు పుడుతుంది. ఇలాంటి పురుగులు జంటలుగా గాని, గుంపులుగా గాని వుంటాయి. ఇవి మనిషి రక్తంలో ప్రవేశించి ఇన్‌ఫ్లుయంజా జ్వర వ్యాప్తికి కారణ మవుతున్నాయి. గ్రహాల దృష్టి శక్తి వల్ల ఈ వ్యాధి కలుగుతుందని అభిప్రాయపడడం వల్ల ఇటలీ దేశం వాళ్లు ఈ వ్యాధికి ఇన్‌ఫ్లుయంజా అని పేరు పెట్టారు.

డాక్టర్ పింజారీరావు, వ్యాధి లక్షణాలు చెప్పాక దీని తీవ్రత, తీసుకోదగిన జాగ్రత్తలు కూడా శాస్త్రికి వివరించాడు. అయితే జంఘాల శాస్త్రి తనకు వచ్చిన జ్వరం, వైద్య పరీక్షలు, సూచనలు విడమరిచి తన జ్వర కారణాన్ని వేరే భావించాడు. ఆంగ్లేయ వైద్య విధానం పట్ల తన అసమ్మతి ప్రకటించాడు.

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను.

''నాయనలారా! నాకు మదరాసులో జ్వరము వచ్చియుండునని సాక్షి మొదలగువారు జడిసినట్లే జరిగినది. నాకు వచ్చినజ్వరము తీవ్రస్వభావము కలదియే కాని యది నన్ను శీఘ్రముగా విడిచినది. వక్తనగుటచే నాకు శ్వాసకోశదార్ఢ్య మధికమనియు నందువలననే

''న్యూమోనియా'' రాలేదనియు నామిత్రులలోఁ గొందఱు వైద్యులు సెలవిచ్చిరి. ''న్యూమోనియా'' రాకుండునట్లు తగినమందుచే, ముందు కాపుచేయుటచేత నది వచ్చుట కవకాశము కలుగలేదని డాక్టరు పింజారీ రావు చెప్పినాఁడు. ఈమాటమాత్రము కొంచెము యోజింపఁదగినదే యగును. ఆయన యిచ్చినమందులలో నట్టిప్రభావ మున్నదనికాని లేదనికాని నేను జెప్పలేను. నీకు గుణ మగపడినప్పు డేల చెప్పలేవని యందురేమో? మందు పుచ్చుకొనక పోవుటచేతఁ జెప్పఁజాలను. పుచ్చుకొనినవాఁడ వేల మందు తెప్పించితి. వందురేమో? నే నడుగకుండనే డాక్టరు పంపినప్పుడు నే నేమి చేయఁగలను? అతఁడు దినదినము ననున్నఁ జూచుటకువచ్చి తనమందు గుణ మెత్తిన దనుచుండెడివాఁడు. నాకుఁ గొంత నిమ్మళించినపిమ్మట నుత్సాహముతో నాతఁ డిట్లొక్కదినమున నుపన్యాసధోరణితోఁ బలుక నెంచి యిట్లు పలికెను.

''జంఘాలశాస్త్రీ! నీవందఱు కుపన్యసింపగ నీకు నే నుపన్యసించెదను. నీకుఁ దెలిసిన యంశములఁగూర్చి నీ వుపన్యసింపగ నాకుఁ దెలిసిన యంశయములఁ గూర్చి నేనుపన్యసింతును. ఇన్‌ఫ్లూయెంజా జ్వరమునుగూర్చి నాకుఁ దెలిసినయంశములు నీకుఁ జెప్పెదను. తెలియని వారికి బోధించుట నాకు మిగుల నుత్సాహము. ఇన్‌ఫ్లూయెంజా యను నది యొక్క విచిత్రమైన వ్యాధి. 1889వ సంవత్సరము తరువాత మాత్రమిది దాదాపుగాఁ బ్రతిసంవత్సరముకూడ యూరపుఖండమునందును మన ఖండమునందును గొన్నికొన్ని దేశములందుఁ గానిపించి జననాశనమును జేయుచున్నది. 1403వ సం.ములోను 1587వ సంవత్సరములోను పారిసు పట్టణమునం దీవ్యాధి బహుప్రబలముగ వ్యాపించెను. ఆపట్టణములోని గొప్పగొప్ప న్యాయస్థానములన్నియుఁ గట్టివేయఁ బడినవి. జడ్జీలకు న్యాయవాదులకుఁ గక్షిదారులకుఁ గూడ దగ్గులు, తుమ్ములు ప్రబలము లైనపు డింక వ్యవహారము లెట్లు జరుగును? మఱియొకపుడు మతమందిరములలో గురువులకు దగ్గే! వినువారికి దగ్గే! ఒకరిని విడిచి యొకరో యంద ఱొక్కసారియో తుమ్ముచు దగ్గుచున్నపుడు మతగురు వెట్లుపన్యసింపఁగలఁడు? ఇఁక బ్రార్థన యేమున్నది? మతగ్రంథపఠన మేమున్నది? మతగీతగాన మేమున్నది? కాని యీకాలములో నిది ప్రతిసంవత్సరము బాధింపక యప్పుడప్పుడు మాత్రమే జనపీడ చేయుచుండెడిది కాని 1889వ సంవత్సరము తరువాత మాత్రము దాదాపుగాఁ బ్రతి సంవత్సరమును బ్రాక్పశ్చిమఖండములలోని కొన్ని దేశముల నైన నది క్షోభింపఁజేయుచున్నది.

ఈ వ్యాధికి గారణమైనది చిన్నపురుగు. ఎండలు ప్రబలముగాఁ గాచినపిమ్మటఁ గురిసినవర్షమునకు గోఁతులలోను భూమిబీఁటలలోను మిగిలిన పల్లపుస్థలములలోను జేరిన నీరు శీతకాలమువఱ కచ్చటనేనిలిచి క్రుళ్లి విషతుల్యమగును. ఆ విషమువలన గాలిలో నొకవిధమగు పురుగు పుట్టును. అది పొడవుతో I U కంటెఁ గొంచెము తక్కువగా నుండును. 05 U కంటెఁ దక్కువ దళసరిగా నుండును. ఆ పురుగునకీచివర నా చివర కొంచెము నల్లగా నుండును. నడుమనున్న భాగము స్వచ్ఛముగ నుండును. ఈ విషయమున మాత్రమిది ప్లేగు పురుగును బోలియుండును. ఈ పురుగులు జంటలు జంటలుగాఁ గాని గుంపులుగాఁ గాని కూడియుండును. ఈ పురుగు క్రమముగా మనుజుని రక్తములోఁ బ్రవేశించును. ఈ పురుగొక్క యిన్‌ఫ్లూయెంజానుమా(మే కలుగ జేయును. ఆ జ్వరము గలవాని వాయునాళ

ములనుండి పడిన శ్లేష్మమందీ పురుగు ఘనసంఖ్యాకములుగా నుండును. ఈపురుగెంత చిన్నదో! ఇది చేయు జననాశన మెంతయో చూడుము! ఈపురుగే రెండుమూఁడు సంవత్సరముల క్రిందట దాదాపుగాఁ బ్రపంచమునంతట వ్యాపించి యెన్నికోటుల జీవులనో నాశన మొనర్చినది. కంటికిఁ గనఁబడని యీ జంతువు ఫిరంగిగుండ్లకంటెను బాంబులకం టెను బ్రాణినాశన పటుతరమై పరిఢవిల్లుచున్నది. చూచితినా ఈశ్వరమహిమము! మనుజుఁడే ప్రపంచమునకెల్లఁ బ్రభుఁ డన్నమాట యెంత నిజమో యోజించుకొనుము. జంఘాలశాస్త్రీ! నేను బాగుగాఁ జెప్పుచుంటినా? ఉపన్యాసమునకు ధోరణి యిదియేనా? ఇట్లు కొంతకాలము చెప్పుసరికి నేనుగూడఁ గొప్ప వక్తలలోఁ జేరకపోదునా? సరే యీమా టుల కేమి?

గ్రహముల దృష్టిశక్తివలన నీవ్యాధి కలుగునని ఇటలీ దేశపువారభిప్రాయపడి దీనికి ఇన్ఫ్లుయెంజా అని పేరిడిరి. కాని దీనికి సాధారణముగా రషియన్ ఇన్ఫ్లుయెంజా యని పేరు. ఇది రషియాదేశమున మిగులఁ దఱచుగను మిగులఁ బ్రబలముగను వ్యాపించిన హేతువు చేత దీనికట్టిపేరు వచ్చెను. ఇది చీనాదేశమున మొదట నారంభమయ్యెనందురు. కాని యందుకుఁ దగిన నిదర్శనములు లేవు. ఇది యెక్కడఁ బుట్టిసను, మనుష్యసంబంధము చేతనే ఇది వృద్ధియయ్యెననియు నగుచున్నదనియు డాక్టరు పార్సన్సు అభిప్రాయపడినాఁడు. అతఁడేమనెననఁగా:—

కాలముతోఁ గాని గాలితోఁగాని భూసారముతోఁ గాని నీవ్యాధి కెంతమాత్రమును సంబంధము లేదు. ఏకాలముననైన రావచ్చును. ఎట్టి భూస్థితిగల దేశమందైనను రావచ్చును. వాయుపరిస్థితిలో దీనికెంతమాత్రము సంబంధము లేదు. ఇదిగాక యీవ్యాధి గాలి ప్రవాహ మున కెదురుగా నెక్కి వ్యాపింపగలదు. అట్లు వ్యాపించియున్నది. ఇది మనుష్య లేదారిబోవు దురో యాదారి ననుసరించి పోవును. మనుష్య లెంత వేగముగాఁ బోవుదురో యంత వేగముగానే వ్యాపించును. ధూమశకటాదులులేని పూర్వకాలమునందిది తక్కువ వేగముతో వ్యాపించెను. ఇప్పుడాసాధనములచే మనుష్యులు శీఘ్రముగా నొక చోటినుండి మఱియొక చోటికిఁ బోఁగలరు. కావున నిప్పుడది శీఘ్రముగా వ్యాపించుచున్నది. ఇది ముఖ్యముగా మొట్టమొదట బహుజనసంకులములగు పెద్దపట్టణములందు, సముద్రతీరపట్టణములందు గానిపించును. తరువాత నిమ్మళముగాఁ బల్లెలలోనికిఁ బోవును. ఇది మొదట పెద్దపట్టణ ములలోఁ బ్రవేశించుటతోడనే యొక్కసారియే యిది యనేకజనులకుఁ గానిపించదు. అచ్చటచ్చటఁ గొలఁదిగా గొన్ని దినములు కానిపించి తరువాత నంటురోగలక్షణములతోఁ బ్రబలముగ వ్యాపించును. మనుష్య లీవ్యాధి నొకపట్టణమునుండి తీసికొనిపోయి మఱియొక పట్టణమునందు వ్యాపింపఁజేసినందుల కనేక నిదర్శనము లున్నవి. ఇదిగాక జననమూహమునఁ దఱచుగా నున్నవారికిది మొదట వచ్చును. కావున నిది మంచిచెడ్డ గాలిపాటులతో సంబంధించినదికాక మనుష్యుల కాలిపాటులతో సంబంధించినదే యని యాతఁడనినాఁడు.

కాని యిదియంతయు సత్యమని చెప్పఁజాలము. మనుష్యులతో నిది ప్రయాణము చేయుచున్నదని యొప్పుకొనవచ్చునుగాని గాలితో దీనికి సంబంధము లేదని చెప్ప వీలు లేదు. ఇది యుడఁగిపోవునప్పుడు దాదాపుగా నన్ని చోటుల నొక్కసారియే యుడఁగిపోవును.

వచ్చు మనుష్యులు వచ్చుచునేయుండగాఁ బోవు మనుష్యులు పోవుచునే యుండగా నేల యంతలో నది యడఁగిపోవలయును?

కాని వాయుస్థితులతో దీని కెంతమాత్రమును సంబంధము లేదనియే యిప్పటివైద్యుల సిద్ధాంతమై యున్నది. వారిలో ముఖ్యులగు కొందఱీట్లభిప్రాయపడుచున్నారు.

ఇది యన్నికాలములందును గనఁబడుచున్నది. అన్ని కాలములందును దగ్గుచున్నది. ఇది మనుష్యులతో వచ్చినట్లనేక దృష్టాంతములున్నవి. కాని యిది యూరపుదేశమందు వేసవికాలమందుకంటె శీతకాలమం దెక్కువతఱచుగా వ్యాపించుచున్నది. శీతకాలములో జనసామాన్యమునకుఁ దగినంత పుష్టికరమగు నాహారము లేకుండుటను బట్టియు శీతకాలమందే జనులు తఱచుగా గుంపుగుంపులుగా గూడి కమ్మటింట్లలో దూరి పరిశుద్ధ పవనపారణమును బొందని హేతువు వలనను నిది యిచ్చట శీతకాలమందే యెక్కువ తఱచుగాఁ గనఁబడుచున్నది. కాని దీని ప్రవేశనిష్క్రమణములకుఁ గాలముమాత్రము కారణము కాదు. ఒక జనునినుండి మఱియొకజనున కీవ్యాధివ్యాపింపకుండఁజేయుట కీవ్యాధిలోఁ గొన్ని పెద్దచిక్కులున్నవి. పురుగు శ్వాసకోశమునఁ బ్రవేశించినతరువాత నతిశీఘ్రముగా జ్వరమువచ్చును. వ్యవధి యొక్కదినము మొదలుకొని నాలుగుదినములవఱకే. మొదటి దినముననే జ్వరము రావచ్చును. అదికాక యీవ్యాధిసంబంధములగు నంటులక్షణములు జ్వరారంభదశలోనే ప్రబలముగా నుండును. అదిగాక యిది ఇన్ఫ్లుయెంజా యని కనిపట్టుట దుస్తరము. రొంపభారపు జ్వరముగాఁ గాని మఱియితర సామాన్యజ్వరముగాఁ గాని యిది కనఁబడవచ్చును. ఇది టైఫాయిడ్ జ్వరము అని యనుకొన్నవారనేకులు గలరు. మఱియొక్క పెద్ద చిక్కేమనగా నీవ్యాధి మిక్కిలి తేలికగా వచ్చినప్పుడిది యెంత యంటురోగమో విశేష తీవ్రముగా వచ్చినప్పుడు కూడ నంత యంటురోగమే. జ్వరము బహుస్వల్పముగా వచ్చినది కదా యిఁక నిది యితరులకు వ్యాపింపదుకదా యనియనుకొనుట కెంత మాత్రమును వీలులేదు. ఈ కారణములచే దీనివ్యాప్తిని నిరోధించుట బహుకష్టము. జలానిలాదులను బరిశుద్ధపఱచుచున్నట్టి యెన్ని యారోగ్య సంధానప్రయత్నము లొనర్చినను నరే యిది తగ్గునది కాదు. జనసమ్మర్దమును దప్పించుకొనుటయే ఈవ్యాధికి నాశనహేతువు. ఇది మనుష్యులకుఁ గలుగు వ్యాధియేకాని మనుష్యులను బట్టి వారు పెంచు పశ్వాదులకు వ్యాపించునది మాత్రము కాదు.

ఇక నీవ్యాధిలక్షణములఁ గొన్ని చెప్పెదను. ఇది హఠాత్తుగా వచ్చు స్వభావము కలది. ఎప్పుడీవ్యాధి ప్రారంభమయ్యెనో రోగులు సామాన్యముగాఁ జెప్పఁగలరు. వ్రాసికొనుచుండగనో, నడచుచుండగనో, భుజించుచుండగనో మఱి యెప్పుడో యొక్కసారిగా నుల్కాపాతమువలె వీఁపులోను గజ్జలలోను విశేషముగ నొప్పి యారంభమగును. వ్రాయుచున్నవాఁ డింకఁ గలము కదలుపలేఁడు. నడచుచున్నవాఁడొక యడు గింక ముందునకుఁ బెట్టలేఁడు. భుజించుచున్న వాఁడు పీఁటమీఁద గుదురుగా నింకఁ గూరుచుండి కబళమును నోటికెత్తుకొనలేఁడు. ఇంత డబ్బాటుగా నిది వచ్చును. కడుపులో వికారము తలత్రిప్పు కూడ వెంటనే కలుగవచ్చును. ఒక్కొక్కప్పుడు వెంటనే రోగి పసుపుపచ్చని పసరు గ్రక్కుకొనును. దేహమందంతటను నొప్పిగా నుండును. కీళ్ళు కూడ నొప్పులుగా నుండును. మాంసపుకండరములుగల భాగములందే బాధ యెక్కువకాదు. శల్యములోని

మూలుగులలోఁ గూడ బాధ విశేషముగా నుండును. ఇంక నుదుటినొప్పికి హద్దులేదు. కంటిగ్రుడ్లు నొప్పులుగానుండును. కదలినయెడల గ్రుడ్లూడునంత బాధగానుండును. వెన్నువెంటఁ జలిగానుండును. ఇఁకను నీరసత, తోఁచకపోవుట, మనస్సునకుఁ గల దిగులు నింతంతకావు. ఎట్లు పండుకొన్నను దోఁపక రోగి యటునిటు దొరలుచుండును. రాత్రినిద్ర రాదు. జ్వరము హెచ్చుగా నుండునెడలఁ దప్పుమాటలు వచ్చును. జ్వరము 105 డిగ్రీలవఱకు వచ్చును. కొందఱకు ముక్కు వెంటఁ గన్నులవెంట విశేషముగా నీరు కాఱును. బలువైన రొంపలక్షణములు గనఁబడును. కన్నులెఱ్ఱఁబడును. గొంతుబొంగుతు మ్ములు గలుగును. ముక్కుబెదరినట్లొకప్పుడు రక్తముకారును. అంకిళ్ళు (టాన్సిల్స్) వాచును. గాఢమైన పొడిదగ్గు వచ్చును. గొంతునుండి రక్తముపడుఁను. కడుపున కెడమనైపు 'స్ప్లీను' ఉన్నభాగమున నొక్కినయెడలఁ జాల నొప్పిగా నుండును. ఆ యవయవము వాచియుండును. కొందఱి కీవ్యాధిలో భేదులగును. మఱికొందఱి కెట్టని దద్రువు దేహమున బయలుదేఱును. రొంపలక్షణములనఁగా శ్వాసకాసాదులు ఇన్‌ఫ్లుయెంజాకు ముఖ్యలక్షణము లని కొందఱభిప్రాయపడుదురు. కాని యది యసత్యము. ఈలక్షణములేమియు లేకుండనే ఇన్‌ఫ్లుయెంజావలన బాధపడినవా రనేకులున్నారు. ఈలక్షణము గూడఁ గొందఱకుఁ గానఁబడును. కాని యిది తత్త్వభేదాదులవలనఁ గలిగినతరువాతి దుర్గుణములుగాని వ్యాధికిఁ బ్రధానలక్షణములు కావు.

ఈ వ్యాధిని కొందఱు వైద్యులు మూఁడు ప్రధానభాగములుగ విభజించియున్నారు. (1) నరములతో సంబంధించినది. (2) కడుపుతిత్తితోను బ్రేవులతోను సంబంధించినది. (3) ఊపిరితిత్తులతో సంబంధించినది. ఈవ్యాధి యనేకరీతులుగా నుండుటచేత దీనిని గుర్తించుటయే మొదట గష్టము. హృదయకోశముతో సంబంధించిన ఇన్‌ఫ్లుయెంజా కూడ సామాన్యముగా వచ్చును. హృదయకోశములో నిదివఱ కేమైన నున్న జబ్బుచేత నీజ్వరము వచ్చియుండునని యెంచఁదగదు. ఈజ్వర సంబంధమగు సూక్ష్మక్రిమివలన హృదయము లోని మాంసపుఁగండ విషపూర్ణమగుటచేత నీవ్యాధి సిద్ధించునని యెంచవలయును. ఊపిరితి త్తులతో సంబంధించిన ఇన్‌ఫ్లుయెంజాలో దగ్గు రొంప మొదలగునవి యుండును. న్యూమోనియాకూడఁ గలుగ వచ్చును. కడుపుతోను బ్రేవులతోను సంబంధించినదానిలోఁ బనరువాంతులు భేదులు కడుపులో వికారము మొఁలగు గుణములుండును. నరములతోఁ జేరిన దానిలోఁ దలత్రిప్పు సర్వావయవములు స్వాధీనత తప్పినట్లుండుట మొదలగు గుణములుం డును. కాని యావిభజన సరియైనది సిసలైనదియుఁ గాదని మఱియొకవైద్యుని యభిప్రా యము. బ్రేవులతోఁ జేరిన ఇన్‌ఫ్లుయెంజాలో గూడ న్యూమోనియా రావచ్చును. ఊపిరితి త్తులతోఁ జేరిన ఇన్‌ఫ్లుయెంజాలోఁ గూడఁ బనరువమనములు మొదలగు గుణము లుండవ చ్చును. అవయవములు బొత్తిగా స్వాధీనతలేని యవస్థ యన్నివిధములగు ఇన్‌ఫ్లుయెంజాలోఁ గూడ నుండవచ్చును. ఈ నీరసతయే వ్యాధి కుదిరిన తరువాత వృద్ధియై యెన్నాళ్లకైన వదలకుండ బాధించుచుండును. ఇన్‌ఫ్లుయెంజారోగు లీనీరసతఁ గూర్చియే మిగుల భయప డుచుందురు. దుర్బలత్వమింత యంతకాదు. నరములు త్రెంపి పోసినట్లుండును. సర్వశ క్తులు లోయేటఁ బడిపోవును. మనసు కూలిపోయినట్లుండును. మరణమంతకంటె మంచిద నిపించునట్లుండును. ఇట్టి భయంకరావస్థను సహింపలేక యాత్మహత్యను గొందఱు చేసికొని నారు. మఱికొందఱు వెఱ్ఱివాలకము గలవారైపోయినారు. పార్శ్వపునొప్పి నిద్రాశూన్యత

మొదలగు నరములతో సంబంధించిన బాధలు నజీర్తికడుపులోఁ బోట్లు మొదలగు నుదరాం త్రసంబంధములగు బాధలు గొంతునొప్పి మొదలగు శ్వాసకోశ సంబంధములగు బాధలు కూడ జ్వరాత్సరమగు నీ నీరసతలోఁ గలుగవచ్చును. ఇదిగాక యీస్థితిలోఁ గొన్ని యింద్రియములు పూర్తిగాఁ జెడిపోవుటగూడఁ గలదు. ఘ్రాణశక్తి ముఖ్యముగాఁ గొందఅకుఁ బోవును. రుచిగ్రహణశక్తి కొందఅకుఁ బోవును. ఈశక్తులింకఁ దిరుగరావు. జ్వరము వదలినదన్న సంతోషములేకుండ నీపశ్చాద్గుణములబాధ దుర్భరమైయుండును. ఈజ్వరసంబంధమగుపురుగు దేహములోని ప్రతి కోశమునందును ఁనవిషమును వ్యాపింపఁ జేయుటచేత నేకోశముకూడ సరియైనపనిని జేయఁజాలదు. అందుచే నెంతబాధగానైన నుండును. పుష్టి కరములగు మందులను దీసికొనఁగాఁ గొన్ని నెలలకు రోగి బాగుపడును. తేలికపాటు వారు కొలఁది దినములలోనే చక్కఁబడుదురు. కాని వారైన నీ నరకానుభవము నాలుగుపూటలైనఁ బొందకుండ నరులలోఁ బడలేదు.

ఇన్‌ఫ్లుయెంజా గ్రామములో నున్నదినములలో నొకధాన్యపు గింజయెత్తుక్వినీనుమా త్రల నుదయ మొక్కటి సాయంకాల మొక్కటి జ్వరనిరోధకముగాఁ దీసికొనవచ్చును. అట్లుపయోగించిన స్థలములలో జ్వర మంతఅఅుగా వచ్చినట్లు వినియుండలేదు. కొన్ని కొన్ని పిత్తతత్త్వముల కిట్లనావశ్యకముగాఁ దీసికొన్న క్వినీను పడకపోవుటవలన మలబద్ధత పార్శ్వపునొప్పి వమనము మొదలగుబాధలు కలుగును. జ్వరశాంతికి క్వినీను నీయకత ప్పదు. మిగిలిన గుణములను శాంతిపఅుటకు వాని కర్వమైన చికిత్స చేయవలయును.. ఈవ్యాధియొక్క వ్యాప్తిని దగ్గించుట కౌషధసేవకంటె ముఖ్యముగా గమనింపఁదగినవి కొన్ని యంశములు కలవు. అవి యేమనఁగా:–

రోగులను వేఱుగా నుంచవలయును. రోగ మారంభింపఁగనే వేఱుచేయుట యావశ్య కము. రోగుల గొంతులలోనుండి వచ్చిన శ్లేష్మాదుల నుడుకునీటిమూఁకుళ్లలోగాని విషక్రిమి హరణసమర్థములగు మందులు కలిపిన నీటిలోఁగాని పడునట్లు చేయవలయును. రోజుల గదులను దఅుచుగా నిర్విషక్రిమిజాలమగునట్లు పరిశుద్ధపఅుపవలయును. ఈవ్యాధులు గ్రామములో నున్నప్పుడు జనసమూహమున్న స్థలముల లోనికి వెళ్లరాదు. నాటకములు సంతలు ప్రదర్శనములు నుపన్యాసములు తీర్థయాత్రలు మొదలగునవి కట్టిపెట్టనలయును.

వ్యాధి రాఁగానే కదలకుండఁ బండుకొనుటయే యన్నిటికంటె మంచిమందు. తేలికగా వచ్చిన జ్వరములో నైనను వెంటనే మందు తీసికొనక తప్పదు. జ్వరము వదలిన పిమ్మట నాలుగుదినములవఅ కన్నము తినరాదు. ఏదైన లఘ్వాహారమును దీసికొనవ చ్చును. జ్వరము పూర్తిగాఁ గుదిరినదికదా యిఁక నేమి యని ధైర్యపడిమాత్రము రోగి ప్రక్కనుండిలేచి యటునిటు తిరుగాడఁ దగదు. ఏమాత్రపుఁ జలి తగిలినను నేమాత్రపు బడలిక గలిగినను వ్యాధి భయంకరముగాఁ దిరుగఁ బెట్టును. అప్పుడు కుదురుట కష్టము. అనేకు లీనంగతి తెలియక కాని, తెలిసి లక్ష్యపెట్టకకాని మోసపోయినారు. జ్వరము వదలిన తరువాతఁ బదిదినము లయినను ప్రక్కను వదలిపెట్టకుండుట మంచిది. కావున జంఘాల శాస్త్రీ! నేను గష్టపడి నీ కిచ్చిన యారోగ్యదశను జెడఁగొట్టు కొనకుండ భద్రముగాఁ బ్రవర్తింపవలయును. అట్లు చేయనియెడలఁ జనిపోవుదువు'' అట్లుపన్యసించి యా డాక్టరు గారు బహుజనపోషకుఁ డగు ప్రభువు తనభటునియెడల దయార్ద్రదృష్టితోడను నాత్మీయాధి

కశక్తి జ్ఞానసంపత్తితోడను జూచునట్లు నావంక జూచి తలపంకించి మందహాస మొనర్చి వెడలిపోయెను.

నాయనలారా! ఇక్కడికి బింజారిరావుగారి యుపన్యాసమైనది. దీనిలో నాకు దెలియని యంశము లాయన క్రొత్తగా జెప్పినవేవియు లేవు కాని నావ్యాధిని గూర్చి నేను జెప్పెదను. నాకు జ్వరము వచ్చినది. రాగానే సాహిత్యపన్యాస పరకులగు మిత్రులెందఱో నన్ను జూడవచ్చిరి. వారిలో గొందఱు వైద్యులు నాశ్వాసకోశములు బరీక్షించి చూచి వానిలో గురక (Wheezing) ఆరంభమైనదని చెప్పిరి. బ్రదికి యుండునంతకాలమును శ్వాసకోశములలో గొలదిగనో రవంత యెక్కువగనో గుట్టుగుట్టు మనుచునే యుండును. ఇప్పుడు విశేషమేమియని నే నడిగితిని. ''అట్లు కాదయ్యా! కొంత బ్రాంఖియోన్యూమోనిక్ టచ్ కనబడుచున్నదయ్యా'' యని యాతడు నన్ను మందలించెను. మఱియొకడు రక్తమును బరీక్షించి ''దానిలో ఇన్‌ఫ్లుయెంజా బాక్సిల్లి కనబడుచున్నదయ్యా'' యని స్పష్టముగా జెప్పెను. శ్లేష్మముకూడ బరీక్షింపవలయునని మఱియొకవైద్యుడనెను. నాకు దగ్గురానిదే యెట్లు దగ్గు గల నని నే ననగ ''ఆ! అది యేమిమాట. దగ్గినయెడల దగ్గురాకుండునా? ఊఁ దగ్గు'' మని యొక యమకింకరునివంటి యమ్. బి. సీ. యమ్. గారు నన్ను జీవాట్లు పెట్టిరి. ''శ్లేష్మములోగూడ germ ఉన్నది.'' అని యాతడనెను. ''నాకే! ఉండనిండు. మీరు నన్ను వదలిపెట్టి దయచేయుడు'' అని నేను ప్రార్థించితిని.–జ్వరము 102° ఉన్నదని మఱియొక వైద్యుడు చెప్పెను. ఇంకొక వైద్యుడు తలయూడించెను. మఱి యొక వైద్యుడు పెదవి విఱిచెను. ఇందఱు వైద్యులు చేరి ఇది సిసలైన Influenza జ్వరమని శిలాక్షరములుగా స్థిరపఱచిరి. అందఱు డాక్టర్లట్లనుచుండనేనెట్లు కాదనగలను? అక్కడికి జొరవ తెచ్చుకొని ''అయిన నగుగాక! నాకేమియు భయము లేదు. మీరు దయచేయుఁ'' డని వారితో జెప్పితిని. ''ఏమాత్రమైన గదలకుండ సంపూర్ణవిశ్రాంతితో నుండవలయు'' నని యొక వైద్యుడు నొక్కి చెప్పెను. ''అంత ప్రారబ్ధము పరమపదించిన దాకరాదయ్యా'' యని నేనంటిని. నామాట వినిపించుకొనక ఆరోరూట్ గంజి త్రాగవలయును. నేను మందు పంపించెదని యతడని వెడలిపోయెను. వెంటనే మిగిలినవారు పోయిరి.

నేను కట్టి చేత బుచ్చుకొని నడువలేక నడువలేక కష్టముతో పూటకూటింటికి బోయి భోజన మొనర్చి వచ్చి నిద్రబోయితిని. ఇన్‌ఫ్లుజెంజాతో బాధపడువాడ విశ్లేల చేసితివని నన్ను మీ రడుగకపోరు. జ్వరము వచ్చినమాట మాత్రము సత్యము. ఎందువలన జ్వరము వచ్చెనో చెప్పనా? తుంటిమీద గరుపు వేయుటచేత వచ్చినది. సలుపు సంబంధ మగు జ్వరము. ఈజ్వరమే యిందఱు డాక్టర్లకు రజ్జు సర్పభ్రాంతిని కలిగించినది. ఇన్‌ఫ్లు యెంజా భయము నాకంత లేదు. కాని వీరి జుంజురు వెంద్రుకలు– కంటియుద్ధములు– చేతిదుడ్డు– శ్వాసకోశ పరీక్షాపాశబంధములు– నల్లకోట్లు చూ నాకొడలు కంపించినమాట సత్యము కాని ఆయువున్నంతకాలము ఐ. యమ్. ఎన్. ఔషధమిచ్చినప్పటికి నపాయము లేదను మొండిధైర్యము మాత్రము నన్ను విడువలేదు. నాయనలారా! ప్రాణమనగా నెంత? పందుమాబారువా? ఉష్షా మనుసరికి టప్. కొనపన్ను లాగబోయి కొండనాలుక లాగివేయు సరికి బైసలు. చిరకాలము బ్రదుకుదు మని స్వాభావికమగు వెఱ్ఱిచే ననుకొందుము కాని, వట్టికల్ల. రోగనిదాన మెఱుగని యొక్కవైద్యునివైద్యము పది జర్మనీయుద్ధములపెట్టు.

వానిచేతిలోనివి మాత్రలు కావు. నాయనలారా! బాంబులు. వానియొద్ద కంపౌండరే కైజరంతవాఁడైనప్పుడు వాఁడెంతవాఁడో చెప్పవలయునా? పరమేశ్వరా! కరుణానిధీ! జగద్రక్షకా! ఇట్టివారి బారిఁ బడకుండ మాత్రము మమ్మునీపాదసన్నిధికిఁ దీసికొనిపొమ్ము! మాతండ్రీ! తండ్రీ! శ్రీరామరక్ష- శ్రీరామరక్ష-

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

61. ప్రమాణవాక్యములు

సాక్షి సంఘం. ఉపన్యాసాలు చదివిన పాఠకులలో ఒకరు వ్రాసిన ఉత్తరాన్ని జంఘాల శాస్త్రి చదివి వినిపిస్తున్నాడు. ఈ ఉత్తరం సారాంశమేమంటే, – సాక్షి ఉపన్యాసాలలో యుక్తి, ప్రపంచజ్ఞానం, ఉన్నాయి. నిజమే కాని - పాండిత్యం, భాష, లేవు. రకరకాల పూర్వ గ్రంథాలనుంచి, తాము చెప్పే విషయాలకు బలంగా, ప్రమాణ వాక్యాల్ని ఉదాహరించక పోవడం లోపం, - అని.

ఈ ఉత్తరం ముగించి, జంఘాల శాస్త్రి వ్యాఖ్యానానికి, వివరణకీ, సిద్ధమయ్యాడు. 'సత్యం చెప్పాలి. అబద్ధం చెప్పకూడదు' అనే సంగతి చెప్పడానికీ;- సూర్యోదయానికి అయిదు గడియలు ముందుగా నదీ స్నానం గాని, చెరువులో స్నానంగాని చేస్తే ఆరోగ్యానికి మంచిది అని చెప్పడానికీ; - ప్రమాణ వాక్యాల అవసరం, శ్లోక పాదాలను ఉదాహరించడం ఎందుకు? అని, సూటిగా ప్రశ్నించాడు.

దీనికి - ఈ విధమైన ప్రమాణ వాక్యాలు కోరడానికి కారణం, మనకు స్వతంత్ర బుద్ధి తక్కువ కావడమేనన్నాడు. ఎవరో శాసకులు శాసించాలి. మనది అనుచర బుద్ధి. ఇటువంటి స్థితినిమాని, ఆత్మ స్వరూపులైన మీరు నిర్భయంగా స్వబుద్ధి ఉపయోగించండి. నచ్చితేనే ఒక పని చెయ్యండి. పెద్దవాళ్ల వాక్యాన్ని నేను నిరసిస్తున్నాననుకోవద్దు. పెద్దవాళ్లు పెద్దవాళ్లు గనుక వాళ్ల వాక్యాలు గొప్పవి కాలేదు. గొప్ప వాక్యాలు చెప్పడంవల్ల పెద్దవాళ్లు గౌరవవంతు లయ్యారు. వాక్యాలకే మన్నన.

కావాలనుకుంటే, ఎన్నయినా ప్రమాణ వాక్యాలు ఇవ్వగలను. ఎన్నో మతాలు, జాతులు, ప్రమాణాలు ఉన్నాయి. సాక్షి ప్రసంగాలు అన్ని రకాల వారూ చదువుతున్నారు. అందరికీ సమానమైన ప్రకృతి సూత్రాలను అనుసరించి పోవడం మంచిదని, అది సమంజసమని, జంఘాలశాస్త్రి వివరణ ఇచ్చాడు.

జంఘాలశాస్త్రి ఇట్లు పలికెను:–

ఆర్యులారా! సాక్ష్యుపన్యాసములను గొందఱయిననుసవిమర్శముగాఁ జదువుచున్నట్లుతోఁచుచున్నది. ఎన్నియోలేఖలు వచ్చుచున్నవి. ఇదిగో! ఒకపాఠకుఁడిట్లు వ్రాయుచున్నాఁడు. ఈలేఖను చదివెదను.

''సాక్షికి నమస్కారపూర్వక విజ్ఞప్తి, మీసాక్షులను శ్రద్ధతోఁ జదువుచున్నాను. నంతోషించుచున్నాను. వానిలో యుక్తియెంతయైన నున్నది. ప్రపంచజ్ఞానప్రకటన యెంత యైన యున్నఁది. వానిలో భాషలేదు. అనఁగా పూర్వగ్రంథకర్తలు రచించిన గ్రంథములను జదివినందువలనఁ గలిగిన పాండిత్య మేమియు వానియందుఁ గనఁబడదు. ఉపన్యాసములకుఁ బురాణములం దుండియు, నితరగ్రంథములం దుండియుఁ బ్రమాణవాక్యము లాధారములై యుండవలయును. నడుమ నడుమ నంస్కృత శ్లోకములు మీయభిప్రాయములకు బలసిద్ధి కొఱకుఁ బ్రవచింపుచుండవలయును. అట్టి పాండిత్యప్రకటనము మీయుపన్యాసములలో లేకుండుటవలన నెంత యుక్తిమంతములయ్యును, నెంత లోకజ్ఞాన సమృద్ధములయ్యును సమంజసముగ లేవు. విన్నవించు సుజనవిధేయుఁడు.

నాయనలారా? ఉత్తరమును వింటిరా? అసత్య మాడఁడగూడదని మీకు నేను జెప్పినంతమాత్రమునఁజాలదా? అసత్యకథనమువలని నష్టములను జెప్పినంతమాత్రమున నరిపోదా? సత్యమువలనఁ గలుగు నైహికాముష్మికలాభముల నుగ్గడించినంతమాత్రమున మీమనస్సుల కెక్కదా? 'నానృతమ్ వదేత్త' న్న వేదవాక్యమును నేను వంచినఁగాని మీ కసత్యమం దనాదరణము కలుగనేకలుగదా? ఆశ్రుతివాక్యము నే ననినఁగాని, మీరు వినినఁ గాని మీకు సత్యమందు దీక్ష కలుగనే కలుగదా! వేదములో నట్లు చెప్పఁబడినదనియే మీ రసత్యకథనపరాఙ్ముఖులై ప్రవర్తించుచున్నారా? వేదమం దట్లేల చెప్పఁబడినదో యోచింపన క్కఱ లేదా? ఏనైన గారణము లుండుటచేతనే వేదర్షు లట్లు చెప్పియుండిరందురా? కాక నిష్కారణముగా నట్లు వారు శాసించిరని మీయభిప్రాయమా? సామాన్యబుద్ధియుక్తులగు నాధునికులు చేసికొనిన శాసనములకే ప్రబలకారణము లుండఁగా బ్రహ్మతుల్యులగు ప్రాచీన ర్షులు చేసిన విధులకుఁ గారణము లుండవని మీ రనఁగలరా? కారణము లుండి తీరవల యును. ఆకారణముల మంచిచెడ్డలు బలాబలములు పూర్వకాల సన్నివేశములఁ బట్టియుఁ బ్రస్తుతకాల సన్నివేశములఁ బట్టియు శక్తివంచన లేకుండ నే నుపన్యసించుచుండఁగా నన్ను మీరధిక్షేపింతు రేల? నావాక్యములలో యుక్తి యున్నందులకు మీ కొప్పుదలయేనా? ప్రపంచజ్ఞాన మున్నందులకు మీ కంగీకారమేనా? ఎటువచ్చినను సంస్కృతవాక్యమును నేను బ్రమాణముగా బ్రవచింపలేదని మీరు నన్ను నిందించుచున్నారా? అందువలన నుపన్యాసము లనమంజనములని యనుటకు సాహసించుచున్నారా? ఇది యేటిన్యాయము! సంస్కృత వాక్య మేల చెప్పవలయును? చెప్పకుండినయెడల గలిగిననష్ట మేమి? కార్యకారణశృంఖల యేమైనను దెగిపోయెనా? ఫలసిద్ధి కేదైన బాధకలిగెనా?

ఉషఃకాలమునందు–సూర్యుఁ డింక దాదాపుగ నైదుగడియల కుదయించు ననఁగ నదిలోఁగాని, పరిశుద్ధమగు తటాకమునందుఁగాని స్నాన మాచరింపవలయునని మనకు విధ యున్నది. శీతోదకస్నానము నరములకు బింకము, వెదడునకుఁ జలువ, హృదయకోశ మునకుఁ బుష్టి, గర్భకోశమునకు జఠరదీప్తియు గలుగఁజేయగలదని నేను జెప్పినంత మాత్రమున బనికిరాదా? మనస్సులోని తూగులాట, తొట్రుపాటు, పాపచింత, ఇంద్రియాన మ్మార్ద్రమును హరింపఁజేసి, శాంతిశుద్ధి యసచ్చింతా నైముఖ్యము శీతోదకస్నానము తాత్కాలి కముగనైన మనకుఁ గలిగించు నని నేను చెప్పినంతమాత్రమున మీకు నరిపోలేదేమి? శీతోదకశుద్ధికిఁ జిత్తపుష్టికిఁ జిత్తదీప్తికిఁగూడ నిడివిమీఁదఁ బ్రబలసాధన మని నేను మీకు

శారీరమానసిక శాస్త్రమర్యాదానుసారముగా నుపన్యసించిన మాత్రమున మీకు సంతుష్టి కలుగనేకలుగదా? 'పంచపంచఉషఃకాలే' అని నేను సంస్కృతప్రమాణమున బలికినఁగాని చెప్పినదంతయు వృథయేనా? పోనిండు. మీయిష్టము. ఉషఃకాలస్నానమునకే యట్టిశక్తి కలదు. మాధ్యాహ్నికశీతోదకస్నానమున శక్తిలేదు. జలాశయములందుండు సూక్ష్మక్రిమి జాల మంతయు నుషఃకాలము జలమందుండక తీరమునకువచ్చునని యందురు. అప్పుడు జలము బహునిర్మళమై పరమపూతమై బహుతేజఃప్రదమై పాపసంహరణచణమై యుండును. ఆయుదకమందు ఆకాలమందు స్నానమొనరించినవారి కెంతయైన ఫలమున్నది. నిలువనీళ్ల గుంటలో స్నానము చేయునప్పుడైనను, 'గంగే మంగళతరంగే' యని స్నానము చేయుదుము. అట్లొనర్చుట కేవలము హాస్యాస్పదము కాని యావిలువ నీళ్లకుంటయే యుషఃకాల మందు జలపరిశుద్ధిని హరించు సూక్ష్మక్రిమిజాల మంతయు గుంటతీరమునకు వచ్చినప్పుడు గంగానదీతుల్యమని రవంత చెప్పవచ్చును. కాశికాక్షేత్రము నొద్దనున్న గంగను నిష్పవనపాత్రములందుఁ జేర్చి భద్రపఱచినయెడల నెన్నఁటికిని జెడిపోదు. అది యుషఃకాలమునందే కాక సర్వకాలములందుఁ గూడ జలపరిశుద్ధిసంహారక మహాసూక్ష్మక్రిమిసంజాతాభావప్రపూతమై యుండును. వారణాశీక్షేత్రమున నున్నగంగానదిమాహాత్మ్య మిదియే! అందుచేతనే, గంగాస్నాన మొనరింపవలయునని నేను జెప్పినంతమాత్రమున మీ మనస్సుల కెక్కదా? ''గంగాస్నానమ్ తుంగాపానం'' అని యొక్క సంస్కృతశ్లోకభాగమును జదివినయెడల మీకు సర్వవిధముల సమంజసముగా నుండునుగాఁబోలు! నాయనలారా! 'గంగాస్నానం తుంగాపానం' అని యెవ్వఁడో చెప్పినాఁడనియే మీరు గంగాస్నానమును చేయుచున్నారా? గంగానదీ మహామహిమమును విని చేయుచున్నారా? గంగానదీమాహాత్మ్యను నెఱిఁగియుండియే కవి యాశ్లోకమును బ్రాసినాఁడు. కావునఁ బ్రధాన మగునది కవివాక్యజ్ఞానమా? గంగానదీమాహాత్మ్యజ్ఞానమా?

నాయనలారా! యథార్థ మేమనఁగ మనకు స్వతంత్రబుద్ధులు తక్కువ. ఎవఁడైన నొక్కఁడు శాసించినట్లు తెలిసినఁగాని మనము ప్రపంచ వ్యాపారమున ప్రవర్తింపనేలేము. శాసనవాక్యములకు, శాసకులకు బద్ధంమై బానిసలమై నూరుకొలది తరములనుండి ప్రవర్తించి. యుంటిమి. ఎవ్వఁడో యొక్కఁ డాజ్ఞాపించవలసినది. ఆదారిన మనము పోవలసినది. ఇంతే మనబ్రతుకు. పూర్వమంతే. ఇప్పుడుకూడ నంతే. అట్టి యనుచరవృత్తికిఁ జిరకాలమునుండి యలవాటుపడియుంటిమి. మనస్సునకు నరముల బిగింపేది? కండలపుష్టి యేది? కాలూదిన నిలుకటయేది? స్వతంత్రచలనమేది? ఏదియు లేదు. ముందు లాగువాఁడో వెనుకఁ ద్రోయువాఁడో యున్నఁగాని చలన మెక్కడిది? గొల్లవాఁడు ముందు నడుచుచున్నంతసేపు మంద యాతని వెంబడించును. ఆతఁ డాగినయెడల నాఁగును. నిజముగా మనమంత బుద్ధిహీనులమేనా? ఏమో! ఆలాగునఁ గనఁబడుచున్నది. ఈలాగునఁ గనఁబడుచున్నది. మనలో ననేకాంగ్లేయపరీక్షలలో దిగ్విజయపత్రికల సంపాదించినవా రున్నారు. ఉపన్యాసపీఠముల నిర్భీతిగా నిలువఁబడి శార్దూలగర్జనమున జాములకొలఁది నెట్టి యెట్టికఠినాంశములపైనైన రాద్ధాంతపూర్వపక్షము లొనర్పఁగలవా రున్నారు. ఉపాధ్యాయపీఠముల నలంకరించి లొడితెడు బుడుతలను లోకోపకారక విద్యాపారీణతాసమన్వితుల చేయఁజాలిన మహాధీశాలులున్నారు. న్యాయసభలఁ గాలాంబరకనచధారులై కాకిని గ్రద్దను, గ్రద్దను గాకిని జేయఁజాలిన కర్కశతర్కవాగ్వాహినీ మహామంత్రకలాపకలాగరిష్ఠులున్నారు. మహారణ్యమును భేదించి

మార్గమును దీసినట్లు పరస్పరా సందర్భవివిధసాక్షివచనరచనాప్రచయమునఁ బరమార్థ మును దీయఁజాలిన ప్రాథమికన్యాయస్థానాననాధిష్ఠాత లున్నారు. కోటులకొలఁది రాబడి కలుగు గొప్పగొప్ప యాస్థానములందుఁ బరిపూర్ణరాజ్యతంత్రనిర్వహణ ప్రబలపాండితీ పటిష్ఠులగు ప్రధాను లున్నారు. ఆంగ్లేయదినపత్రికారాజములఁ జెరగి చెరగి చెలరేఁగి చిత్రచిత్రవ్యాసానువ్యాసములఁ జిత్తజల్లుగ వర్షింపఁజాలిన ధారాధరలేఖినీచాలనధురంధరు లున్నారు. అయిననేమి? స్వప్రవర్తనమునమాత్రము వీరిలోఁ జాలమంది వివేచన విభవాభా వులై యుండుట వింతలలో వింత.

ఎవ్వఁడో యెక్కడనుండియో వచ్చి యుపన్యాసపీఠ మెక్కి సవ్యాపసవ్యముగఁ గరహస్తాక్షి చాలనలీలాకలాపముతో నుత్కంఠముతో ముష్టిప్రహారములతోఁ జకచకలాడుచు ఝూంకరించినయెడల మన మెంత విద్వాంసులమయ్యును వెకవెకలాడుచు వెర్రిమొగ ములు వైచుకొని వాని ననుసరింతుము. ఆయుపన్యాసప్రదాత యిష్టానుసారముగా ఆయుప న్యానవాయుధాటి ననుసరించి మన మీనములు పెరుగును. జుట్టుపిలక లెగురును. జన్నిద ములు చిలకకొయ్యల కెక్కును. మెడపలుపులు కంఠమునఁ జిక్కును. సంధ్యావందనము చచ్చును. అర్చా విగ్రహనింద హెచ్చును. కట్టుబట్టలపై (Calicut) చెక్కు (Trousers) ఆదేశమగును. కన్నుల గాజులతో, నోటి సిగరెట్లతోఁ దలల సీమంతములతోఁ గాలి జోళ్లతోఁ జర్మావలగ్న బంధములతో, తిలకశూన్యాళికములతోఁ జేతికర్రలతో సెంట్లు వాసన లతో మీరు వీథులలో నేమి? సముద్రతీరమునందేమి, భోజనశాలలందేమి, పడుకగదులం దేమి నిరంకుశముగ, నిశ్శంకముగ నిర్గతప్రాచీనాచారులై ప్రవర్తింపలేదా? ఈవెర్రివేసములతో, నీపీరావేశములతో దేవతార్చనపుగదికి లెట్రిన్ (Latrine) కొట్టునకు భేదమైనఁ దెలియకుండఁ బరవళ్లు త్రొక్కిత్రొక్కి దేశమంతయుఁ బూర్వాచారఖండనోపన్యాసములతో విదేశాచారమండన సిద్ధాంతములతో స్వదేశీయగ్రంథనందోహ నిందాఘోషములతోఁ దదీత రగ్రంథనంతతి స్తుతిపాఠములతో గగ్గోలు గావించి యల్లాడించిన పీదప–మరియొక్క మహావీరుఁ డుపన్యాసపీఠ మెక్కుచున్నాఁడు. పూర్వాచారప్రాశస్త్యమును బోధించు చున్నాఁడు. ఆర్యమతనాగరకతా మాహాత్మ్యమును వెల్లడించుచున్నాఁడు. శ్రుతిస్మృతిపురా ణాది పవిత్ర సారస్వతసమీచీనతను ప్రకటించుచున్నాఁడు! ఓ! మెడపలుపులు నేలఁబడుచు న్నవి. యజ్ఞోపవీతములు భుజముల కెక్కుచున్నవి. నోటఁ బడవలసిన కోడిగ్రుడ్లు పెంటపైఁ బడుచున్నవి. మూలఁబడిన నర్మదబొణములు కన్నులనంటుచున్నవి. తోలుప టకాలు నడుముల నుండి జారుచున్నవి. రుద్రాక్షమాలలు మెడలచుట్టుఁ జేరుచున్నవి. పెరుగుడు మీనములు గొరుగుడు మీనములుగా నదృశ్యము లగుచున్నవి. (Crop) గత్తరలో మాయమైన జుట్టుపిలక మఱల నంకురించుచున్నది. (Hazeline cream) బుడ్లు నేల పగులుచున్నవి. విభూతిపండ్లు దేహమందంతట నరుగుచున్నవి. కన్నులపై గాజు లూడుచు న్నవి. ఫాలములపై బొట్లు ప్రబలుచున్నవి. పంట్లాముల పటాటోపములు పటాపంచ లగుచున్నవి. పెద్దరుద్రాక్షయంచుపంచెల బిళ్లకచ్చలు వృద్ధియగుచున్నవి. పాదాదిశిరఃపర్యం తము నొక్కటే మార్పు మీలోఁ గలుగుచున్నది. అద్దములైన మిమ్ము గుర్తింపలేకున్నవి. ఆ గాలిపా టట్లుండెను. ఈగాలిపా టిట్లున్నది. ముందరిగాలిపా టెట్లుండునో? ఋతుభేద మైనను ప్రపంచమున కింత సర్వాంగకమగు మార్పు నింత యాకస్మికముగాఁ దీసికొని రాఁజాలదు. మీమనస్సులలో నింతకంటె గందరగోళము జరుగుచున్నది. వానిలో నేమో

యక్షరముల వలెనో యంకెలవలెనో యేవియో గుర్తులు పడుచున్నవి. వెంటనే చెఱిగిపోవుచున్నది. ఏవో కొన్ని బుద్బుదములు–వింతవింతరంగులుకలవి లేచుచున్నవి. తల చూపినవెంటనే ధ్వస్తములగుచున్నవి. తళుకుతళుకు మనునవి ఏవో–శంపాలతలవంటివి–జఱిజఱి పరుగువారుచున్నవి. వెంటనే ద్విగుణీకృత గాఢాంధకారభీకర మగుచున్నది. అచీఁకటిలో నేదియో ముక్కుమూలములేనిహోరు వినఁబడుచున్నది. ఇక బుద్ధి పదార్థ మెట్లున్నదా? వట్టి తవతవ, లవలవ కలిగియున్నది. నిలువఁ ద్రొక్కుకొనఁగల పటిమ యెక్కడను గలిగియున్న ట్లగపడదు. నాయనలారా! మనదేహ మనస్తత్త్వము లిట్లున్నవి. ఇట్లంటినని మీకుఁ గోపమా! మీలోఁ గొందరు స్వతంత్రబుద్ధియువకులున్నారు. అది లేని వారినిగూర్చియే చెప్పుచున్నాను. కోపముగలిగి నన్ను మీరు బాధించుటకుఁ జేయుప్రయత్నము మీవంకకే త్రిప్పుకొని మీకు మీరు మేలొనర్చుకొనునెడల మీపెద్దలు సంతోషింతురు. మీకులదేవతలు సంతోషింతురు. ఇంతటినుండియైన గాలిచే నాకర్షింపఁబడిన గడ్డిపోచలవలెఁ బరుగెత్తక, నీటిప్రవాహముచే నీడ్వఁబడిన నురుగువలెఁ గొట్టుకొనిపోక కాలూఁదుకొని నిలువఁబడుఁడు. మీబుద్ధులను మీరు స్వేచ్ఛగా నుపయోగించుకొనుఁడు. సంఘసన్నివేశములందు తుపాను పట్టినసరే–మతప్రపంచమున భూకంపముగలిగిననుసరే –భయపడకుఁడు. ఈయుప్పెనలు, ఈయవాంతరప్రళయములు మిమ్మెఁ ద్రోచివేయఁజాలవు. మీ రాత్మస్వరూపులు. ఆవిశ్వాసముతో నిలువబడుఁడు. ఈశ్వరప్రసాదితములగు మీబుద్ధుల నింతటినుండియైన మీ రుపయోగించుకొనుఁడు. మీకు సర్వవిధముల నచ్చినయెడలనే ముందున కడుగిడుఁడు. అంతేకాని కిచకిచలాడుచు గద్దరిగాని నాశ్రయించి వెన్నాఁడు కపిగోలాంగూలజాలమువలెఁ బ్రవర్తింపకుఁడు. నరులవలెఁ బ్రవర్తింపుఁడు. అందుపై నార్యులవలెఁ బ్రవర్తింపుడు. గౌరవ్యుల వాక్యములందు నిరసనబుద్ధిని గలిగియుండుఁడని నేను జెప్పుచుంటి ననుకొందురేమో, అదికాదు కాదు కాదు. వారు గౌరవ్యులగుటవలన వారివాక్యములు గౌరవార్థములు కాలేదు. వారివాక్యములు గౌరవార్థము లగుటచే వారు గౌరవ్యులైరి అందుచే వారివాక్యములే మనకుఁ బరిపూర్ణపరీక్షార్థములు. అవి మనకు బాగుగా నచ్చినఁగాని యడుగు ముందునకుఁ బెట్టఁదగదు. మీబుద్ధులను మీ రుపయోగపఱుచుకొనుఁడని చెప్పుచున్నాను గాని మరియొకటికాదు. యథార్థవిమర్శనమునకే కాని Authority కివి దినములు కావు.

అట్టిచో సంస్కృతశ్లోకములు తెలుగుపద్యములు Quote చేయలేదని మీరు నన్నధిక్షేపింతు రేల? 'విష్ణుర్యోనిఁ కల్పయత్' అని శ్రుతిలో నుండుటచేతనే భార్యకు గర్భాధానము చేయవలసివచ్చినదని చెప్పువాఁడైన నున్నాఁడా? మీకిష్టమైనచో నెన్నిశ్లోకములైనఁ బ్రమాణములుగా వచింపవలసినదే. ఆర్యావర్తదేశమంతయు నామూలాగ్రముగ సంచరించినవాఁడను. మీకు శ్రుతులు ప్రమాణములు కావలసినయెడల వేదవేదాంగజ్ఞాననిక్షేపమైన కాలాచార్యుని సాహాయ్యమున నదికూడ నమకూడుట కవకాశమున్నది. కాని యొక్కమనవి. సాక్ష్యులపన్యానములు త్రిమతస్థులు చదువుచున్నారు. వేదమందుఁ బ్రమాణబుద్ధిలేని బ్రహ్మోపాసకులు చదువుచున్నారు. మన మహమ్మదీయసోదరులు క్రైస్తవసోదరులుకూడఁ జదువుచున్నారు. వీరిలో నెవరి ప్రమాణకవులు వారికున్నారు. ఎవరి ప్రమాణ గ్రంథములు వారికున్నవి. ఎవరి వేదములు వారికున్నవి. 'సాదీ' మనకుఁ బ్రమాణము కాకపోవచ్చును. భవభూతి మహమ్మదీయులకుఁ బ్రమాణము కాకపోవచ్చును. కోవాకము మనకు బాగు.

ళొరాను వారికి బాగు. ఆళ్వారులు మన కెక్కువ. Apostles క్రైస్తవుల కెక్కువ. ఁ ద్దుఁడ
మనకెక్కువ. Moses వారికెక్కువ. కృష్ణుఁడు మనకెక్కువ. క్రీస్తు వారికెక్కువ. అన్ని
దేశములనుండు నన్నిజాతులవారికిని సమానములగు ప్రకృతినూత్రముల ననునరించి పోయ
నయెడల నమంజసము కాదా? నాయనలారా! ఏదో. తప్పుపట్టినఁగాని పాండిత్యమునక
విమర్శనశక్తికి లోపమని యెంచి దోషములను వెదకకుఁడు. ఆలస్యమైనది. క్షమింపవలెను

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

62. శ్రీకృష్ణలీల

ఈసారి జంఘాల శాస్త్రి నుంచి రాదగిన ఉత్తరం సాక్షికి రాలేదు. మద్రాసులో ఇన్‌ఫ్లుయెంజా జ్వరం వాత వడ్డాడేమో! అని సాక్షి అనుమానించాడు.

వారి సభాభవనానికి ఉపన్యాసం వినడానికి వచ్చిన శ్రోతలు క్రితంసారే అనంతప్తి వడ్డారు, ఉపన్యాసం లేదని– ఈసారి ఏదో ఒక విషయం గురించి ఉపన్యాసం విననిదే వెళ్లమని భీష్మించారు. సాక్షి, ఉపన్యాసం ఇవ్వక తప్పలేదు.

సాక్షి, తను ఒకసారి హంపీవిజయనగర శిథిలాలను చూడడానికి వెళ్లినప్పటికి ఒక అనుభవం చెప్పడం ప్రారంభించాడు.

సాక్షి, శ్రీ విరూపాక్షాలయ విచిత్ర గోపుర ద్వారం దగ్గర వడుకున్నాడు. అక్కడ చల్లగాలికి, తుంగభద్రానదీ తరంగ సంగీతానికీ, ప్రాణం ఎటో కొట్టుకొని పోయినట్టయి, ఒక కల వచ్చింది. ఆ కలలో సాక్షికి మెలకువ కూడా వచ్చింది. ఆ మెలకువ మామూలు భౌతికమైన మెలకువ కాదు. స్వప్నంలో ఒక అద్భుతమైన వల్లెకు అతన్ని నడిపించిన మెలకువ. అది వ్రేపల్లె అని తోచింది. వాతావరణం అలాగ వుంది మరి. ఎక్కడ చూసినా, విన్నా, శ్రీకృష్ణ భగవానుడి నామం ఏదో రీతిగా ఎదురవుతూంది.

చల్లి చేసేవారు, రోటిలో ఏదో దంచేళాళ్ళు, కృష్ణగీతాలు ఆలాపిస్తున్నారు. వేణుగానం, కృష్ణధ్యానం, అక్కడందరినీ ఒక మైకంలో వడేస్తున్నాయి. సాక్షి కూడా ఆ వ్రేపల్లె వీధుల్లో ఒకడైపోయాడు. అక్కడందరిలాగే పరవశుడూ అయిపోయాడు.

కృష్ణ గాధా సంబంధమైన అనుభవాల పరంపరని – ఇతరులవి కూడా తనవిగా చేసుకుని–సాక్షి తన శ్రోతలకు చెప్పాడు. చివరిగా అన్నాడూ, స్త్రీయే పురుషుణ్ణి ఉద్ధరించదగిన ధన్యమూర్తి అని. ఆ పని చేయమని విన్నవించాడు కూడా.

ఈదినమున జంఘాలశాస్త్రి యొద్దనుండి రాఁదగినలేఖ రాలేదు. ఏమియు దోఁపకుండ నున్నది. మదరాసులో ఇన్‌ఫ్లూయెంజాజ్వరము లున్నవనియు, దానివలనఁ గొందఱు గతించుచున్నారనియుఁ దెలియుచున్నది. ఆతఁడు జ్వరపీడితుఁడై యుండె

నేమో? అందువలననే లేఖ యేదియు రాలేదేమో? ఎట్లు చెప్పవచ్చును. క్రిందటిసారి యుపన్యాసము లేదనియే వినవచ్చినవారెల్లరును విసుగుచెంది నిరుత్సాహులై వెడలిపోయిరి. ఈసారికూడ నుపన్యాసము లేకుండునెడల బ్రజలూరకొందురా? ఈసారి యుపన్యాస మేదియైన వినకుండ బోమని సభ్యులు కంకణోక్తిగా జెప్పుచున్నారు. ఇది వింతగానే యున్నది. సంగీతము పాడకుండునెడల జావగొట్టుదుననన్న ట్లున్నది. ముద్దీయకుండునెడల ముక్కుచే గోసెదననన్నట్లున్నది. ఉద్రేకముతో మే ముపన్యాసింప వలయును. ఉత్సాహముతోడ బ్రజలు వినవలయును. అంతేకాని యుపన్యసింపనియెడల జన్నిదములు ద్రెంపెదమని సభ్యులు పలుకుట సమీచీనముగ నున్నదా యని యేమేమో లోన ననుకొనుచు సభాసదులవంక జూచి యిట్లు పలికితిని.

''నాయనలారా! ఉపన్యాసమును వినకుండ నిండ్లకుబోమని సెలవిచ్చుచున్నారు. (బాను అనమా? టీకంటె, కాఫీకంటె, నల్లమందుకంటె మాకు సాక్ష్యుపన్యాస మెక్కువ యభ్యాసమయినది. శనివారమెప్పుడు వచ్చునా యని యంతకు నాలుగుదినములు పూర్వమునుండియే కనిపెట్టుకొని యుండియుండి యిప్పు డూరకే పోవుదుమా? మీకుం దోచినదేదో చెప్పుడు. జంఘాలశాస్త్రియే యెల్లకాలము చెప్పవలయుననన్నమాట యేమి? అని సభలోఁ గేకలు.) నాయనలారా! టీ త్రాగుట కాఫీ త్రాగుట నల్లమందు వేయుట దురభ్యాసములు కావా? సాక్ష్యుపన్యాసా కర్ణనమును వానితోపాటు చేర్చినారా? (సాక్ష్యుపన్యాసము లేకున్న యెడల మాకట్టిబాధ యని మాయభిప్రాయము. మేము తిన్నగఁ జెప్పలేకుండియనయెడల క్షమింపుము. అని సభలోఁ గేకలు).

''నాయనలారా! సావధానచిత్తులరై వినుడు. నే నొకసారి యాంధ్రకర్ణాటరాజ్య రాజధానీమతల్లియగు విద్యానగరములోని శిథిలీ భూతములగు ప్రదేశములను జూడఁబోయితిని. ఆయాస్థలముల విశేషములు నేనిప్పుడు చెప్పఁదలఁచుకొనలేదు. దర్శనీయములగు ప్రదేశములన్నియుఁ జూచి విరూపాక్షాలయ విచిత్రగోపురద్వారము నొద్దఁ బండుకొంటిని. ''ఈమహాపట్టణ మిప్పుడే యిట్లున్నది. కృష్ణదేవరాయల వా రీరాజ్యమును బరిపాలించుచున్నప్పుడిది యెట్లుండినదో?'' యని లోన ననుకొనుచు భావనాశక్తిని బలాత్కరించి భావించుచుఁ బండుకొంటిని. ఋష్యమూకపర్వతమున కిరుప్రక్కల నెగుడుదిగుడు లాలపైఁ బ్రవహించు తుంగభద్రానది గలగలలు పిల్లవానినినిద్రపుచ్చుటకైతల్లిపాడుజోలపాట ''ఉలలల''ల వలె నున్నది. హంపి కోదండరామ స్వామికి నివేదించిన కృష్ణాగరుధూపధూపముల గుమగుమలతో గుబుల్కొనుచున్న చల్లని మందమారుతములు ప్రాణముల నెటుకొట్టుకొనిపోఁజేయుచున్నవి. ఏమోకాని–తను వట్టి లఘువైగాలి గుమ్మటమువలె నంతరిక్షమున నెగురుచున్నట్లుండెను. అట్లుత్తరదిశగా గాలిలోఁ దేలియాడి పోయిపోయి యొక్కచోటఁ బదిలముగ, నిమ్మళముగఁ, గ్రమక్రమముగ భూమినిజేరి, యెందువలననో యులికిపడి లేచితిని. నాయనలారా! ఇది యంతయు స్వప్నమే. నిద్ర మేల్కాంచుట కూడ స్వప్నమందే. నిద్రలేచి కలలోనే యటునిటు చూచితిని. హంపి లేదు. ఋష్యమూకము లేదు. నరసింహాలయము లేదు. కోదండరామ స్వామిగుడి లేదు. విరూపాక్ష గోపురము లేదు. నేను మాత్ర మున్నాను. కాని నదియొక్కటిమాత్రము నల్లత్రాచువలెఁ బరుగెత్తుచున్నది. అది తుంగభద్రానది మాత్రముకాదు. అల్లోనేరేడువంటిరంగుగల యానది యేదియో

-నే నెక్కడ నున్నానో–ఇక్కడి కెట్లుల వచ్చితినో–యని ప్రశ్నించుకొని యటు నిటు తిరుగాడితిని. సూర్యుఁడు కరకర నుదయించుచున్నాఁడు. ఎక్కడఁ జూచినఁ దులసీవృక్ష ములు–పొన్నచెట్లు–పొగడచెట్లు–గోరంటచెట్లున్నవి. .చెట్ల నడమనుండి పోవఁగ నొక్కపల్లె కానఁబడినది. ఆ పల్లెలోని వన్నియుఁ జిన్నచిన్నయిండ్లు. ఒక యింటిముందునకుఁ బోయిచూడఁగ ముంగిటిలో 'నందనందనా' యను మ్రుగ్గున్నది. మఱియొక యింటి ముందు ''యశోదాకిశోరా'' యనుమ్రుగ్గున్నది. మఱియొక యింటిముందఱ ''నవనీత చోరా'' యను మ్రుగ్గున్నది. మఱియొకచోట ''గోపాలబాలా'' యను మ్రుగ్గున్నది. ఇట్లెన్ని యిండ్లు చూచినను వానివాని ముంగిళ్ళ శ్రీకృష్ణభగవానుని నామ మేదియో యొక్కటి రంగవల్లిని జిత్రింపఁబడి యున్నది. ఆహా! ఇక్కడి కృష్ణభక్తి శిఖామణు లెవ్వరో తెలిసికొనవల యునని యొక యింటిలోనికిఁ బోయితిని. అచ్చట నొకపదునాఱేండ్ల పడుచు కనఁబడెను. ఆమె నల్లనల్లగ నున్నది. మెడలో బండిగురివెందపూలపేరున్నది. చెవిలోఁ జెంగల్వపూవు లున్నవి. ముచ్చట ముడిలోనెమిలికన్నుల కుచ్చున్నది. చేతులలో సవ్యాపసవ్యముగఁ దిరుగుచున్న కవ్వపుఁ ద్రాడున్నది. నోటఁ గృష్ణగీత మున్నది.

''రారారారా నందకుమారా–రారారారా నవనీతచోరా
రారారారా కాళియహరణా–రారారారా బృందాభరణా''

అని యామె గొంతెత్తి పాడుచు–నందెకడెముల గలగలలు, లయగతులు చూపు జై జై యను ధ్వనులతో మజ్జిగఁ జేయుచుండెను. ఆమెను నేను జూచితిని గాని సన్నామె చూడలేదు. అమ్మా! మీరెవ్వరని నే నడిగితిని. ఆమె పలుక లేదు. విన్నట్లుకూడ లేదు. కృష్ణభక్తురాలా! జన్మమనఁగ నీదే జన్మమనీ లోన భావించుకొనుచు మఱియొకయింటికిఁ బోయితిని. అచ్చట నొక్కకాంత యూర్ధ్వపుండ్రధారిణియై తులసీమాలవక్షస్కయై శిరీషకు సుమభాసురకర్ణాగ్రయై ఓటనేదియో దంపుచూ–

''ఏలా! గోపాల–బాలా! యింతజాలమేల–ఏలా?
పాలు వెన్న మీఁ గడలు–పంచదార పుట్టతేనె
చాలఁగఁ బెట్టినను సారసాక్ష యూరగింప–వేలా?–''

యని కర్ణములు పవిత్రము లగునట్లు పాడుచున్నది. ఆహా! ఈయింట మఱింత చిత్రముగా నున్నదే! అమ్మా! అమ్మా! మీరెవరో చెప్పరా? యని బిగ్గఱగా నఱచితిని. ఆమె వినిపించుకొన లేదు. ఆహా! సాంసారికములగు నిత్యకృత్యము లన్నియుఁ గృష్ణరామస్మ రణముతోఁ దీర్చుకొనుచు నవియెల్లఁ గృష్ణార్పణముఁజేయుచుఁ గృతార్థలగుచున్న యీ కాంతాశిరోమణులకంటెఁ బవిత్రజన్మ లెవ్వరిని యనుకొనుచు మఱియొక యింటికిఁ బోయితిని. అచ్చట మఱియొక చిత్రము జరుగుచున్నది. ఒక ముసలికాంత యెత్తుబల్లపైఁ గూరుచుండియున్నది. ఆమెచేతిలోఁ గొబ్బెరయాకుటీనె యున్నది. ఆమెయెదుట నొక్క దోరజామిపండువంటి ప్రాయపు మినమినగల జవరాలున్నది. ఆమెయొక్క మగవాని చేయి పట్టుకొని యామునలియామెకుఁ బట్టుదుండగీఁడో చూచితివా? నన్నేల ముద్దిడుకొ నినాఁడో? అడుగు అడుగు, ఇంత యాగడమా?'' అనియెను. అంత వృద్ధాంగన ''నాయనా! రామానుజా! ఇట్టి యల్లరియా? నీవామె నెందులకు ముద్దుఁబెట్టుకొంటివి? ఎప్పు డింక నిట్టిపని చేయకుమా? చేసినయెడల నిదిగో బెత్త''మని కొబ్బెరియాకుటీనెను గానఁబట్టి

జళిపించెను. అంతట నామగచిన్నవాఁడు–అయ్యో! కాదు–ఆమెకూడ నాఁడుదియే–కృష్ణవేష మభినయించుచున్నది. ఆకృష్ణపాత్ర మప్పుడిట్లనియెను. ''అమ్మా! నేను చేసినపని మంచిదైనఁ గావలయును. చెడ్డదైనఁ గావలయును. మంచిదే యగునెడల నంతకంటెఁ గావలసినది లేదు. చెడ్డదేయైన యెడల నెవ్వరితోడను జెప్పుకొనవలసినది కాదు. అమ్మా! యథార్థమును జెప్పెదను వినుము. తన్ను ముద్దుఁబెట్టుకొనుమని యీమె కోరగ నట్లొనర్చి తిని. ఇంకొక్కటి–ఇంకొక్కటి–యని నన్నుఁ బ్రార్థించినది. నావలనఁ గాదంటిని. మఱి యొక ముద్దు పెట్టుకొందువా? మీయమ్మతోఁ జెప్పనా? యని నన్ను బెదరించి కోపముతో నిటకు లాగుకొనివచ్చి చిట్లు చాడి చెప్పినది'' అని తల్లియెదుట మాటలాడవలసి నట్లుగాఁ గా యేదో కొంత యసందర్భముగా నీకృష్ణపాత్రము మాటలాడినపిమ్మట నావృద్ధకాంత ''చాలులే–చాలులే–నడునడు– తప్పు నీయెడలఁ బెట్టుకొని–యభము శుభ మెఱుగఁని యర్భకు నాఱుపడిపఱుపవచ్చివా? పదపద'' యని తానే యావలికిఁ బోయెను. ''నీ వీమాయకాని శిక్షింపకున్నయెడల నేనే శిక్షింతు''నని పలికి పననపిక్కవలెనున్న యాపడుచు పైదలి యాకృష్ణపాత్రము నూఁపిరి నలుపకుండునట్లు ముద్దిడుకొనెను. ఇక్కడికిఁ గసియుఁ దీఱినది. కాలక్షేపముఁ దీఱినది. 'ఆహా! ఉక్తిసందర్భత లేకపోయినను భాత్రౌచిత్య మంత కంటె లేకపోయినను నీ కృష్ణనాటకము నామట్టునకెంత హృదయంగమముగానో యున్నది' అని లోలోన భావించుకొనుచు మఱియొక్కయింటికిఁ బోయితిని. అచ్చట నొక్కయంగన నేలపై బ్రాఁకుచున్నది. నడివయను గల పిండిగంట ప్రాఁకుట యేలచెప్పుమా? పాపము కాళులుపయోగింపకున్నవి కాఁబోలునని తలఁచితిని. కాని యదియేమి! నడుమనకుఁ ద్రాడేమి? ఆత్రాటికొనను జోలేమి? ఆహాహా! ఉపనిషత్సార మొనర్చిన యులూఖలచాలన మభినయించు చున్నది కాఁబోలు! ఏమి వింత! తానే కృష్ణుఁడ నని భావించుకొనుచు జోలీడ్చుకొనుచు నిల్లెల్లఁ బ్రాకుచున్నది! నన్నుఁ జూచి సిగ్గుపడునేమో యనుకొంటిని. చూపు లేదు–సిగ్గు లేదు. తానేమో తనగొడవయేమో! తక్కినప్రపంచ మాపుణ్యాత్మురాలి కున్నదా? ఆహా! ఏమి కృష్ణానురాగము! ఏమి కృష్ణపాదపద్మలగ్నమనస్కత! ఏమి కృష్ణ నామస్మరణము! ఏమి కృష్ణచర్యానుకరణము! ఆహా! ఇది బృందావన సమీపమందలి వ్రేపల్లె కాఁబోలు! ఆ నది కాళింది కాఁబోలు! వీరందఱు శ్రీకృష్ణభగవానుని దర్శనమున –స్పర్శనమున–భావనమున–సేవనమున– గానమున–ధ్యానమున– నంసారనముద్రతరణ మొనర్చిన పవిత్రగోపికాంగనలు కాఁబోలు! అహా! వీరిదర్శనమైనట్లే వీరికి దర్శనీయుఁడైన శ్రీకృష్ణభగవానుని దర్శనముకూడ నాకగునా? అగునా? కృష్ణా! గోపికావస్త్రాపహరణా! కంసప్రాణహరణా! ద్రౌపదీమాన సంరక్షణా! దావానలభక్షణా! నందనందనా! కందర్పకోటి సుందరా! కృష్ణా! కృష్ణా! యని గట్టిగా నఱచితిని. అంతరిక్షమునఁ గృష్ణా! కృష్ణా! యని పదేపదే ధ్వనులగుచున్నవి. తలయెత్తి పైకిఁ జూచితిని. గరుడపక్షి యఱచుచుఁ జక్రాకారము లగు పిలిటీలు కొట్టుచున్నది. కృష్ణా! కృష్ణా! యని నేనుగూడ నఱచుచు వ్రేపల్లెవీథులోఁ దిరుగుచుంటిని.

అదేమి! అఁ! అఁ! అదేమి? ఏదియో సుధామధురధ్వని యగుచున్నదే? మందమారు తపువినరువలెఁ బన్నీటిసోనవలె నాధ్వని ప్రవాహమేమి? ఆప్రవాహ మవ్యక్తమధురముగ నున్నదే! ఆమాధుర్యములోఁ గోటులకొలది గులాబివ్వావులు పరిమళించుచున్నవే? ఆగులా బుల గుమగుమలో హిమాలయశీతలత్వ మెల్లెడ వ్యాపించుచున్నదే! ఆమధురిమలో

–నాసౌరభములో– నాశైత్యములో–నేమో మహాప్రసన్నత–ఏమోజలజల– ఏమోజీవకళ –అనిర్వచనీయమగు నేమో చైతన్యపుమహిమ–సర్వత్ర వ్యాపించియున్నదే. ఓ! అంతరిక్ష మున నేమో యున్నట్లున్నదే. అదేమి? సప్తస్వరముల తీఁగయల్లికలు సాంద్రముగాఁ బ్రాఁకి ప్రాఁకి పందిరిగట్టి పల్లవించి పుష్పించి పరిమళించుచున్నవే! ఆహా! ఈనాదబ్రహ్మవ్యాప్తివలన సంతుష్టి–కంటికో తెలియదు–చెవికో తెలియదు–నోటికో తెలియదు–వడలికో తెలియదు –ఆత్మకో తెలియదు. కృష్ణా! దేవకీనందనా! ఆభీరకామినీ మానచోరా! పూతనాస్తనంధయా! నీలమేఘశ్యామా! శిఖిపించ శిరోభూషణా! వేణుగానలోలా! లీలామానుషవిగ్రహా! మురళి ఇదిగో వచ్చుచున్నానని ప్రతిగృహమునుండి మురళీ గానామృతాస్వాదన మత్తులై గోపికలెల్ల బయలువెడలుచున్నారు–ఓ! గంతులిడుచున్నారు– పరుగులిడుచున్నారు –జోగుచున్నారు- పడుచున్నారు- లేచుచున్నారు–ఎగురుచున్నారు. అంద ఆధ్వని యేజా డనుండివచ్చు చున్నదో యాజాడకుఁ బోవుచున్నారు. వహవ్వా! ఏమి సొగసుగనున్నది. ఒక చేతికిమాత్రమే అవిక దొడుగుకొని యిఁకఁ దొడుగుకొనుట కవకాశములేక, తొడుగుకొ నవలయు నను స్మృతియేలేక యొక్కతె పరుగెత్తుచున్నది. కవ్వపుఁద్రాడు చేతిలోనుంచకొ నియే యొక్కతె పోవుచున్నది. తొందరలో నొక్కతె ధావన మొనర్చుచున్నది. ఇదివరకుఁ గృష్ణవేష మభినయించిన గోపిక యావేనముతోడనే పోవుచున్నది. చంటిపిల్లకుఁ బాలిచ్చు చున్న తల్లి తనపిల్ల నట్టె ద్రోచివైచి యెగుడు దిగుడు అవికకప్పులను నవరించుకొనకయే పోవుచున్నది. అర్ధమునఁదిలకము దిద్దుకొనుచున్న యువతి యెడమచేతి నర్ధముతోఁ గుడిచేత సిందూరశలాకతోఁ బరుగులిడుచున్నది. తీసినవెన్న–కుండలోనైనఁ బెట్టకుండ –చేతనున్న వెన్నముద్దతోడనే–యొక ముద్దియ పోవుచున్నది. దంపుటచేఁ బైటజాఱఁ గొప్పుముడి విడిపోవ, మోమంతయుఁ గందిచెమ్మటలు క్రమ్మ, ఓలు రోఁకటిని వదలి యొక్కయెగురున వీథినిబడి పోవుచుఁ, దలకట్టుచే మొగము చెమ్మటలఁ దుడిచికొనుచు, నొక్కయెయ్యారి పరుగువాఱుచున్నది. వారంద ఱిట్లు మతిలేక–యెడలి స్మృతిలేక –భక్త్యావేశముచేఁ బరుగుడిడుట యేమి? నే నిట్లు మొద్దులాగున నిలువఁబడుట యేమి? వారికొంటికంటికిఁ గాటుకయని-వీరి మెడలో నొడ్డాణమని–వారిముక్కునఁ గర్ణపుష్టమని –వీరికి జాఱుచున్న యద్దుకట్టని–యీదిక్కుమాలిన పనికిమాలిన యనందర్భ చర్యలను గనిపట్టుటకు నాకీవంకరటింకరజ్ఞాన మెందులకోయి నాతండ్రీ! దేవకీనందనా! నాకుఁ గూడ మతిపోఁగొట్టరాదా? నాకుఁ గూడ దేహస్మృతి తీసివేయరాదా? నాకుఁ గూడ నీవిషయక మగు నార్తియావేశము ప్రసాదింపరాదా? దీనబంధూ! జగత్త్రాణపరాయణా! కృష్ణా! వాసు దేవా! యని బిగ్గఱగ నఱచి యఱచి వలవల నేడ్చితిని. ఒక్క తొప్పాటులో నంగనలందఱు పోయిరి. ఒక్క పుణ్యాత్మురాలైన లేదు.

పలుచపలుచగ మబ్బు లంతరిక్షమునఁ గ్రమ్మినవి. కోట్లకొలది యింద్రధనుస్సులు రోదసీకుహరమందంతటను నిండియున్నవి. వానిలోనుండి మురళీనాదము వర్షధారలవలెఁ గురియుచున్నది. బ్రహ్మాండమంతయు వేణునాదమయమే యైనట్లుండును. ఎక్కడికని పోవగలను? దారిమాపువారేరి? ఏమియుఁ దోఁపక నిశ్చేష్టుఁడైన నిలువఁబడితిని. ఆహా! ఇంత వ్రేపల్లెలో నొక్కమగవాఁడైనఁ గానఁబడడేమి చెప్పుమా? మగవారెల్ల మందలోనికిఁ బోయిరికాఁబోలు! అని నే ననుకొనుచుండగ నింతలోఁ దొగరుబొందు మెలిసిగ చుట్టు వారు, వంకర పంగనామములవారు, చేతికట్టులవారు, భుజములపైఁ గంబళ్లవారు–తుంట్లకెక్కి

మోకాళ్లు దిగని నడికట్టువారు నగు గోపాలుర క్షీరకుంభములతో వచ్చిరి. వచ్చి యిండ్లలోనికిఁ బోయి వెంటనే లబలబ లాడుచు నెత్తినోరు గొట్టుకొనుచు నందఱు వీథిలోనికి వచ్చిరి. భార్యలులేక యిండ్లు పాడుపడియున్నవి. తల్లులులేక పిల్ల లేడ్చుచున్నారు. వెన్నకుండలు కుక్క లెత్తుకొనిపోయినవి. దొడ్డిలోఁ గట్టిన కోళ్లు పడకటింటి పందిరి మంచములపై రెట్టలు వైచినవి. పిల్లల నెత్తుకొని గొల్లవారోదార్చుచున్నారు. ఎత్తుకొనఁగలరు కాని పాలీయఁగలరా? పిల్లలను గనఁగలరుగాని పెంపఁగలరా? భార్యపై నధికారములు చేయఁగలరు కాని భార్య యొక్కపూట లేకుండినయెడల నిల్లు సవరించుకొనఁగలరా? ఇంటికిఁ సంరక్షకదేవత యిల్లాలుగాని తిండిపోతు మగవారా? అని యిట్లు దిక్కుమాలిన వట్టిగడ్డిపెంటమాట లేవియో యనుకొనుచు–పెంటమాటలు కాక–యివి నా కిప్పుడెందులకు? శ్రీకృష్ణభగవానుఁడు పిడుకలదాలి నుడువులెందులకు? ఓయి భగవానుఁడా? ఆపదుద్ధారకా! నాయనా! రక్షింపవా! రక్షింపవా యని యాచెంప నీచెంప వాయించుకొనుచు నిలువఁబడితిని. "నాభార్య నిన్నగాక మొన్న వచ్చినది. గదలుపకుండఁ దిన్నగ నుండనిచ్చినంతకాలము నాభార్య పైకిఁ బోనేపోదురా యని యొకఁడు–ఈమాయకాఁడు, కృష్ణమూర్తిగాఁడు పుట్టినతరువాత మనము సుఖమెఱుఁగమురా బాబూ యనువాఁడొకఁడు –సాపాటునకే మనభార్యలు కాని ప్రక్కపాటునకు మనభార్యలు కారురా యనువాఁ డొకఁడు –అమ్మ! అమ్మా! యని యేడ్చుపిల్లలను జీకొట్టి "అమ్మ! అమ్మ! పెద్దమ్మ–బోడమ్మ–అమ్మ యిక్కడ నున్న దనుకొంటివా? లోకానికంతకు నొక్క డేమగయ్య బయలుదేఱినాఁ–వాఁడు మాకొంపలు దిబ్బచేయుట కిక్కడ దాఁపురించినాఁడు–అందుండగీనియొద్ద మీయమ్మ కులుకులాడుచున్నదని యొక్కఁడునునై యిల్లిల్లరు పరిపరివిధములఁ బ్రాకృతులై, ప్రజ్ఞా శూన్యులై, భక్తిరహితులై ప్రలాపించుచున్నారు. కోతులలో గర్దభీగాఁడు లేకుండునా? మందలోఁ జింబోతు లేకుండునా? అట్లే గొల్లలలోమాత్ర మొకగండ్రఁడు లేకుండునా? వాఁడు మిగిలిన గొల్లలతో నిట్లనుచున్నాఁడు. "ఆఁడుదాని కొకతెకు, గోఁతి కొకఁతానికిఁ గొరడాతక్క వేఱుదారిలేదు. వెనుకముందుచూడక యెవరిభార్యను వారిప్పుడే బడితతోఁ బడఁగొట్టి యింటికిఁ దీసికొని రావలయును. ఇంటికిఁదెచ్చి పలుత్రాటితో రాటకుఁగట్టిపెట్టి ప్రక్కటెముకలలోఁ బొడిచి చిట్టుతట్ట ముందుఁబెట్టి యెడుపుచూచి–బంధమునైచి–" అని యింకనేమో చెప్పఁబోవుచుండఁగా "నడునడు–దొర మంచి సులువైనదారి చూపినాఁడురా" యని యందఱు గొల్లుమనుచుఁ బోఁబోవుచుండఁగా, నిల్లాండ్లను బట్టి కొట్టి పోవుదురేమో యను భయముచే, నేను వారికంటె ముందుఁ బరుగెత్తినయెడల వారితోఁ జెప్పవచ్చు నని, పరుగెత్తితిని–పరుగెత్తినకొలఁది దారి తనయంత తానే కనఁబడెను.

ఆహా! ఆహా! కన్నుల వైకుంఠము! దివ్యతమ తేజఃపుంజమాపొన్నచెట్లు క్రింద వెలుఁగుచున్నది. ఇది ముక్క నిదిచేయి యిది కాలు ననినాకు మొదట నేమోకాని కానఁబడ లేదు. ఒక్కనిమునము కన్నులు చెదరి చీఁకటులు పడిన ట్లయ్యెను. అదిగో! మాతండ్రి దివ్యమంగళ విగ్రహము! శతకోటి మన్మథసుందరమూర్తి! అదిగో! మానాయన వేరముడి! అదిగో! జగన్మోహన ధురీణారావప్రవాహతండమగు వేణుదండము. అదిగో! గాలికిఁ గదలు తమాలవల్లులవలెఁ బ్రకాశించుగోపాల బాలకుని తరళాంగుళులు.

సీ. మెఱుఁగుకుండలముల మినమినల్ గండభా
గములపై నట్టిట్టు గంతు లిడఁగ
రంగాఱుగట్టిన బంగారుపుట్టంబు
చిఱుబొజ్జనుండి కొంచెముగ జాఱఁ
బవనపూరణమున జవుజవ్వు మని లేత
బుగ్గలు బూరలై వూరటిల్లు
నిగనిగల్ గలగుజ్జు సిగనున్న శిఖిపించ
మొయ్యారమునఁ దలయూఁపుచుండ

నుత్తమోత్తమజన్మమై యొప్పు మురళి
నధరమునఁ బూని జగతి జల్లనుచుఁ గరఁగ
గాన మొనరించు నీలాలకాంతిరాశి
గొల్లభామల బంగారు కొంగుమూఁట.

ఆహా! ఏమి గానము! మోళ్లు చిగుర్చుచున్నవి. ఆలు కరఁగచున్నవి. పశువులు మోరలెత్తి చెవులు వెనుకకుఁబెట్టి తోఁకలెత్తి వినుచున్నవి. పక్షులు కదలక మెదలక వినుచున్నవి. గాలి స్తంభించి యాకర్ణించుచున్నది. గాలిలేకుండనే చెట్లు జలజల పూలు రాల్చుచున్నవి. అవిగో విద్యుల్లతలు! కోట్లు అర్బుదములు! శంఖానుశంఖములు! పడుగుగాఁ బేకగా–జిగిబిగియల్లికలై–దట్టములగు దట్టింపులై– యాకాశమున్నకు మేలుకట్టులై –విలసిల్లుచున్నవి. ఆహా! నింగియెల్లడల బంగారునీరై యున్నదే! సూర్యుఁ డేమయ్యెనో తెలియదు. ఎక్కడ స్తంభించి కృష్ణగానమును వినుచున్నాఁడో! గోపిక లొడలు తెలియక తాండవించుచున్నారు. కృష్ణా కృష్ణా యని చేతులెత్తి తాండవించుచున్నారు. కృష్ణా కృష్ణాయని గానమొనర్చుచున్నాఁడు. (కృష్ణా కృష్ణా యని సభలోఁ గేకలు) దేవతలు యక్షులు గంధర్వులు మొదలగువారు జయజయధ్వానము లిచ్చుచుఁ బుష్పవృష్టులను గురిపించుచున్నారు. కంటికాంతులతో గోపికాంగనలు గోపాలకృష్ణునకు మంగళపుటారతులిచ్చుచున్నారు.

ఇంతలో భార్యలను గొట్టుటకై బడితెలెత్తి పెద్దగోలచేయుచు గోపాలురు వచ్చుచున్నారు. ఒక్కటే సందడి. ఒక్కటే గోల. ఇట్టివచ్చినారు. అట్టి చూచినారు. బడితెలు పాఱవైచినారు. నోళ్లతోఁగృష్ణా యని కేకలిడుచున్నారు. చేతులతోఁ దాళము వైచుచున్నారు. కాళ్లతోఁ జిందలు త్రొక్కుచున్నారు. నడుమనడుమ జెంపలు కొట్టుకొనుచున్నారు. దాసోస్మి దాసోస్మి యనుచు సాష్టాంగపడుచున్నారు. అపరాధుల మపరాధుల మని నెత్తిపై మొట్టుకొనుచున్నారు. భార్యలు లేరు–భర్తలు లేరు–బడితెలు లేవు–పడఁగొట్టుటలు లేవు –అచ్చట స్త్రీపురుషవిభేదమే లేదు. కొట్టవచ్చిన గొల్లవారందఱు స్త్రీలైరి. నేను స్త్రీ నైతిని. అందఱుకూడఁ బ్రాణనాథా! లోకభర్తా! జగదేకవల్లభా!–యని యఱచుచున్నారు –ఏడ్చుచున్నారు– అలయుచున్నారు–సొమ్మసిల్లుచున్నారు–తూఁచున్నారు–చావచుట్టగ బడిపోవుచున్నారు– భక్తిసముద్రమున మునిఁగియున్నారు. నేనుగూడఁ దాండవించి తాండవించి పడిపోయితిని. గొంత బిగిసినట్లయ్యెను. కృష్ణా! కృష్ణా! అని బిగ్గఱగా నఱచి మేల్కాంచితిని. ఇక్కడికి స్వప్నము సరి.

పిట్టలు పీచుపీచు మనుచున్నవి. తుంగభద్ర గలగల లాడుచున్నది. తూర్పు తెలతెల వాఱుచున్నది. నే నేమో లేచియున్నను దడదడ లాడుచున్నాను. కొంతసేపటికి శాంతిపడితిని. నాయనలారా! మన జన్మములు కేవల వ్యర్థజన్మములు. ఱాడుదాని సాహాయ్యము లేకుండ నిహమునకుఁ బరమునకుఁ గూడఁ బనికిరాము. ఇచ్చటకు విచ్చేసి సాక్షినభకు సారన్యము, సౌజన్యము, సౌరభము, సౌందర్యమును సమకూర్చిన యోసరసిజాక్షులారా! సాక్షి మనవి నాలకింపుఁడు.

గీ. ఉండఁదగునంచు, లేదంచు, నుండిలేద
టంచు, లేని దున్నదటంచు, నన్నివెఱ్ఱి
పోకలను బోవు తలతిక్కబుద్ధి పురుష
లోకమున కున్న దేకాని మీకులేదు.

గీ. అమృతకలశాభములు హృదయములు మీక
గాథగాఢానురాగసంక్రాంతములును
రాగపరిణామమే భక్తి రమణులారా!
భక్తి మీజన్మవశమునఁ బైఁటమూఁట.

గీ. ప్రేమరసపూర్ణులార! మీవెంట మీదు
పతులఁ దరియింపఁ జేయుఁడీ భక్తినొనఁగి,
కాగిదపుబుట్ట నూర్ధ్వమార్గంబునకును
దీసికొనిపోవు లోపలి దీపమట్లు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

రేడ

రెండవ సంపుటం

కవిశేఖర
పానుగంటి
లక్ష్మీనరసింహారావు

విషయసూచిక

	పుట.
1. అంతఃపురోపన్యాసము	1
2. అంతఃపురోపన్యాసము	5
3. నిష్కామ్యకర్మము	9
4. మండలమానినీ జనమణీమహాసభ	14
5. వైరాగ్యము	21
6. పాచకమహాజనసభ	28
7. స్వభాష	36
8. కాలస్వరూపుడు	44
9. దరఖాస్తు	54
10. సౌందర్యము	61
11. (నిజమైన) సౌందర్యము	69
12. స్వదేశీయ వస్త్రధారణము	74
13. సాక్షిసంఘ ప్రథమవార్షికోత్సవము	78
14. కుంభకర్ణుడు	86
15. ప్రాణము	95
16. జన్మపరంపర	104
17. లక్ష్మీకటాక్షము	110
18. మతబోధలపటము	117
19. గర్భవతులు-గ్రహణములు	12?

20. సాక్షి లేఖ	129
21. సాక్షిదేహారోగ్యము	131
22. అభినందనము	134
23. స్వారాజ్యము	141
24. పండితుని యుపన్యాసము	150
25. గ్రంథాలయ వార్షికోత్సవము	159
26. స్వర్గస్థులగు శ్రీ కోపెల్ల హనుమంతరావుపంతులుగారు	169
27. మహాశివరాత్రి	177
28. ధనుర్దాసుని స్వార్థపరిత్యాగము	184
29. తాండవకృష్ణుడు–తాండవ శంకరుడు	193
30. శ్రీయజ్ఞవల్క్య నాటకము	201
31. సభాస్వకీయవ్యాపారములు	209
32. శ్రీరామనవమి	213
33. శ్రీరామనవమి–విచిత్రస్వప్నము	218
34. రైలుప్రమాదము హిమవన్నగరప్రాంత ప్రదేశప్రభావము	224
35. జెంటిలుమాన్	234
36. హరిభక్తురాలివైభవము	240
37. ఉన్మత్తుని యుపన్యాసము స్త్రీపురుష సౌందర్యము	250
38. ఉన్మత్తుని యుపన్యాసము దశావతారములు	258
39. ఆరోగ్యము	270
40. వైద్యునిలేఖ–ఆరోగ్యము	279
41. అఖిల భారతయాయుర్వేద పరిషత్తు	288

42. అఖిలాంధ్ర దేశమశకమత్కృణమూషిక మహాసభ 295

43. ప్రేరణసభ 306

44. దేశకాల పాత్రములు 318

45. వాణీదాసుని విడుదల 327

46. కర్నూలులోనినాటకము 332

47. పితృదేవతాగౌరవము 337

48. మహారాజవిరడుము 342

49. కాలావార్యుని యువన్యాసము–బ్రాహ్మణత్వము 352

50. గ్రంథపరిష్కారము 362

51. ఉపసంహారం 368

1. అంతఃపురోపన్యాసము

ఒక కవి తమ సంఘానికి ఈ ఉపన్యాసం పంపించాడంటూ సాక్షి చదివి నినిపించాడు. భార్య సాధింపుగా మాట్లాడే మాటల్ని 'కర్టైన్ లెక్చర్' అని ఇంగ్లీషులో అంటారు. సంస్కృతంలో 'భాణం' అనే రూపక భేదానికిది స్వరూపంలో దగ్గరగా వుంది.

ఈ అంతఃపురోపన్యాసంలో ఒక ఇంటావిడ తన భర్తను స్లీడర్ వృత్తి విడిచిపెట్టి ప్రజాసేన చేయమని ప్రోత్సహించడం సారాంశం.

నిజానికి స్లీడరుగారు సంస్కర్తే. బ్రహ్మసామాజికుడు. పెళ్లికూడా బ్రాహ్మ వివాహపద్ధతిలో చేసుకున్నాడు.

ఇంటావిడ అనేదేమిటంటే–''సంపాదించిన సంపాదన చాలు. స్లీడర్ వృత్తి ద్వారా న్యాయాన్ని కాపాడుతున్నారా! చంపుతున్నారా? పార్టీలకు అబద్ధపు సాక్ష్యాలు చిలకపలుకుల్లా చెప్పడం తప్ప, వేరే ఏముంది? వాళ్ల జుట్టు వీళ్లకీ, వీళ్ల జుట్లు వాళ్లకీ ముడిపెట్టడం చాలించి దేశ క్షేమానికేమైనా పనిచేయమంది. హరిజనుల్ని మంచి మార్గంలో పెట్టవచ్చు. రాత్రి పాఠశాలలు నడపవచ్చు. రాట్నం మీద నూలు వడికి స్వదేశీ దుస్తులు తయారుచేయవచ్చు. ఆరోగ్య సూత్రాలు జనసామాన్యానికి కరపత్రాల ద్వారా తెలియజేయవచ్చు. గ్రామాలలో పంచాయితీ కోర్టులు నెలకొల్పవచ్చు. మనకు పిల్లలు లేరని లోటు పడనక్కర్లేదు. నేనూ సహకరిస్తాను'' అంది. దేశోపకారం కంటె చేయదగినదేమీ లేదని ఘంటాపథంగా చెప్పింది.

నిజానికి మగవారి ప్రతి విజయానికి అండగా స్త్రీ ఉండక తీరదని ఉదాహరణలు కూడా ఇచ్చింది. ఆచరణతో కూడిన సంస్కారమే దేశాభివృద్ధికి కావాలి కదా!–అంది.

ఈ సంఘమునకు మఱియొక కవి తాను రచించిన యంతఃపురోపన్యాసము నంపినాడు. అది చదివెదను.

ఇదిగో! మాటలాడరేమి? ఏ మాలోచించినారు? నేటికిఁ బదునైదుదినములనుండి మరిమరి యదేపనిగాఁ జెప్పుచున్నాను. బెల్లము కొట్టినరాయివలె నిశ్శబ్దముగ నున్నారేమి?

అయ్యో! ఆలాగున నవ్వేద రెందులకు? ఇదివఱకు సంపాదించినది చాలదా? ఎవరు తినను? అదిగాక యెల్లకాలమును సంపాదనయే యగునెడల నేలాగు? పుణ్యము పురుషార్థము నక్క-అలేదా? ''మనల నే దేవాలయములోనికి రానిచ్చెదరు? మనయింట నే పదిమంది బ్రాహ్మణులు భోజన మొనర్చెదరు!'' అని యనుచున్నారా? ఏమీ! ఈ క్రొత్తమాటలు! బ్రహ్మోపాసకులు నెందఱను మన మాదరించుట లేదు? ఆ సంబంధముల కార్యములకు మన మోపినకొలఁది యిచ్చుటలేదా? ఇప్పుడు పూర్వ మతము నాచారము మాట యెందులకు? సాహసముచే, నుదార స్వభావముచే నట్టివానిని ద్రోసిరాజని, బంధువుల నందఱను గూడ విడనాడి, పూర్వాచారపరాయణులమాట లెంతమాత్రమును గణింపక, నన్ను బ్రాహ్మవిధిచేతఁ జెట్టఁబట్టినారు కదా! నాయందు మీ కట్టి యభిమాన మున్నప్పుడు నాకోర్కెను నెఱవేర్పఁదగదా? ప్రతిదినమును జెవి నిల్లుకట్టుకొని పోరుచుంటినే? ఏ దది యని యనుచున్నారా? ఇదేమి చోద్యమమ్మా! ఇంతలోనే మఱపా? మరియొకమాట చెప్పుచున్నాను వినుఁడు. మీ ప్లీడరీ మాటనుగూర్చి; అది యెట్లు జరుగు నని యనుచున్నారా? మన భూములమీఁద సంవత్సరమునకు వచ్చు పండ్రెండువేల రూపాయల యాదాయము చాలదా? ఇండ్ల యద్దెలవలన వచ్చు వేయిరూపాయల రాఁబడి చాలదా? మూని యేమిచేయు మనెదవని యనుచున్నారా? చేయుటకుఁ బనులే లేవా? మీతండ్రిగారు ప్లీడరీ చేసిరా? ఆ వృత్తికంటె వేరువృత్తి లేనేలేదా? ఏమియు కనఁబడ దనుచున్నారా? అయ్యయ్యో? చేయుట కుచితములగు పనులు లేకపోవుట యేమి? సాక్షులకు వింతవింత పాఠములు చెప్పుటయే పనియా? ఈనాముదారులకు రయితులకుఁ దగవులు కల్పించుటయే పనియా? అన్నదమ్ములకు విపరీతపుటాలోచనలు చెప్పుటయే పనియా? తండ్రి కొడుకులకు భేదపుభ్రాతలు పుట్టించుయే పనియా? జమీందారులకు వింతయాలోచనలు చెప్పుటయే పనియా? తండ్రులను బీల్చి పిప్పిచేసి-కొడుకులకు ముష్టిచిప్ప చేతి కిచ్చుటయే పనియా? వారసత్వములు వెదకుటయే పనియా? జమీందారీలు పంచుకొని ప్రభువు లనిపించుకొనుట కే తలమాసినవానినో వెదకి సింగారించి వానికిఁ బెట్టుబడి పెట్టి యాడించుటయే పనియా? ఇట్టి పను లధర్మము లని మన శ్రుతులలోఁ గాని స్మృతులలోఁ గాని యున్న దని యెవరైనఁ జెప్పుదురా?

ఎంతదూరము చదువుచున్నావు అని యనుచున్నారా? అట్టి పను లింకఁ జేయవ లదు. ఏమియుఁ జేయనియెడల నిన్ని నగ లేలాగున వచ్చునని యనుచున్నారా? ఈ నగలకొఱకు నే నేమియు దేవులాడలేదు. ఇవి లేకున్నను నేను విచారించుదానను గాను. ఇవి నగలా? ఎన్ని సంసారశల్యములో? ఆఁ? చేయుటకుఁ బనులే కనఁబడకున్నవా? కన్నులు పెట్టుకొని జూచినయెడలఁ గనఁబడకపోవునా? అబ్బ! అట్టి వాఁగక ఏమిచేయుమంటివో నీవే చెప్పరాదా అని యనుచున్నారా? ఏమీ! నాది వాఁగుడుక్రిందఁ దిగినదా? రిప్రెసెంటు రూములోపల మీ త్రాగు డనుకొన్నారేమి? నన్ననఁగ నే ననక యూరకుందునా? పోనిమ్మా. ఆగొడవ యెందుల కనుచున్నారా? నే నేగొడవయుఁ జేయను. మీరు నేఁ జెప్పినట్లుమాత్రము నాయందు దయయుంచి చేయవలయును. ఇన్నాళ్లఁబట్టి యీపని చేసియున్నాను. ఇప్పుడు క్రొత్తపని యేమి చేయుటకుఁ దగుదు ననుచున్నారా? తమ కేమి? ఎంతసేపు మన పొట్ట సంగతియే మనము చూచుకొనవలయునా? దేశ క్షేమ మింత యేమాత్రమైన నక్క-అలేదా? చేయుట కెన్నిపనులు లేవు? యామినీ పాఠశాలలుంచి చదువురానివారలకుఁ

జదువు చెప్పరాదా? అంత్యజాతుల వారికి సదుపదేశము లొనరించి నుంచిపద్ధతులలోనికి వారిని దింపఁగూడదా? ప్రతి గ్రామమునను బీదవారల కనువగు బడుల నేర్పాటు చేయ రాదా? ఇంటి కొకరూపాయచొప్పున వసూలుచేసి ప్రతిగ్రామమునఁ జిన్న పరిశ్రమల నెలకొల్పరాదా? మేదరవాండ్రను దేవాంగులను గమ్మరిపని చేయువారలను ఇట్టిచేతిపనులఁ జేయువారల నందఱను బనిని బట్టి యొక్క సంఘముగా నేర్పాటు గావించి వారలలోఁ బరపతి సంఘముల స్థాపించి వా రభివృద్ధిఁ జెందుమార్గములను జూపి వారిలో శుచి సత్యము పొదుపు నెదుగఁజేయరాదా? ఆరోగ్యమునుగూర్చి చిన్నకరపత్రము లిచ్చి మన సమీపమున నున్న మాలపల్లెలను నారోగ్యవంతము లగునట్లు చేయరాదా? ప్రతిగ్రహమందును రాట్నముల నుంపించి యందఱను మనగ్రామములందుఁ జేయఁబడిన నూలుతో నొడికిన బట్టలనే ధరింపవలయు నని–నట్టి యుపన్యాసము లొనఁగుట కాదు–కరపత్రములు ప్రచురించుటకాదు–ఆచరణమునకు వీలగుమార్గముల నవలంబించి పనిచేయరాదా? ప్రతివీథిని రాత్రులందుఁ బురాణములు చదివించి మనపురాణపురుషుల–వీరపురుషుల–దేశహితైకపరుల –జీవితములను సత్కార్యములను బోధింపరాదా? ఈప్లీడరీ, స్వర్గమునకు సోపానమా? దేశాభివృద్ధికి బలకరౌషధమా? మీవృత్తి చేయువారి సంఖ్య వృద్ధియగుకొలఁది పేచీ లభివృద్ధి యగుచుండుటలేదా? మీరు తగవులను జంపుచున్నారో పెంచుచున్నారో యోజించితిరా? మీరు న్యాయశాస్త్రమును నీతిశాస్త్రమును గమనించుచున్నారో తృణీకరించు చున్నారో యోజించితిరా? ఒక్క నిమిసముసేపు కనులుమూసికొని పరిశుద్ధమగు హృదయముతో –నిశ్చలమగు మానసముతో–దైవాధీనమగు బుద్ధితో–మన మెందులకు సృజింపఁబడినా రము? దీనులు, విద్యావిహీనులు, కాపట్యరహితులు, ప్రపంచజ్ఞానాభావులు నగు మన సోదరులకు మీ రెట్టిసేవ చేసినారో యోజించుకొనుఁడు. భాషా సేవకై-దేశసేవకై-మీతనువు లెట్లు వినియోగపడునో యోజించు కొనుఁడు. ప్రతిదిన మున్న కేసులజాబితావలె మీగుమా స్తాలు–మిమ్మలను గీలుబొమ్మలవలె నాడించు గుమాస్తాలు–మీగుణగణములను పార్టీల యెదుటఁ గొండంతలుగఁ జేయు గుమాస్తాలు–మీయవకతవకలను మీలోటుపాటును హిమా చలమంటఁగఁజేయు మీగుమాస్తాలు–చెప్పనక్కఱలేదే? నేను చెప్పిన జమ కర్చు మీరే చూచుకొనుఁడు. మీకు మిగులునది జమయో కర్చో! ఎప్పు డిట్లు కోసికొని తినుచున్నది. రెండవ పెండ్లి మెప్పు డిట్లు కోసికొనియే తినును. అందులో మాది–మఱింత యని మీ రనుకొన నక్కఱలేదు. కొంచెము కన్ను తెఱచి చుట్టుపట్టుల నవలోకింపుడు. దేశ మెట్టి దీనస్థితిలో నున్నదో? దేశమున కెట్టిసేవ యావశ్యకమో? కొంతవఱకు సంపాదించిన మీవంటి వారే యిట్టిసేవ చేయనియెడల నింక నెవరు చేసెదరు? నేను రేపటి నుండి రాట్నమునొద్దకూర్చుండి నూలువడుక నేర్చుకొనెదను. నే నాఁడువారి కుచితముగఁ జదువు చెప్పెదను. మీరు మగవారికి రాత్రులందుఁ జదువు చెప్పుఁడు. మాలపల్లెలకుఁ బోయి యచ్చట నున్న మన సోదర సోదరీమణులకు జ్ఞానప్రదానముఁ జేయుదము. ఇదివఱ కిరువది సంవత్సరములనుండి న్యాయవాదిగఁ బనిచేయుచున్నారు. వారిలో యశస్వంతులై వెలయు చున్నారు. సమీపమున నున్న గ్రామములకుఁ జని యచ్చట పంచాయితీకోర్టులను నెలకొ ల్పునట్లు చేయుఁడు. బీదవారలకు విద్యాప్రదానము గావింపుఁడు. ఔషధముల నొసఁగుఁడు. విద్యాధికులగు మీర లింకఁ జేయవలసిన పనులందు నన్ను నియోగింపుఁడు. మిమ్మే దైవముగ నమ్మెదను, మీవెంట నీడవలె నడుచుచు–మీకు ధర్మపత్నినైన నేను–మీ కీవిషయముల

సహచారిణినిగా నుండెదను. మగవారు మగవా రనియందురు కాని యేకార్యముగూడ
నాఁడుది తలపెట్టినఁగాని కాదు. మీకుఁ గోపమువచ్చిన సరేకాని, మా కున్న యంతఃకరణ
పారిశుధ్యము–మాకున్న వాత్సల్యము మీకు లేవు. మగవా రెప్పుడు మాటలబండారమే.
ఆఁడుది నోరుచేసికోవలెను. పట్టుమని పనిలోనికి దిగవలెను. అప్పుడు మహాకార్యములు
జరుగవలయును. భక్తి ప్రాశస్త్యమును దలఁచుచు భక్తియోగము నవలంబింప నెంచుచుఁ
దన్మహిమనుగూర్చి చిన్నపలుకు లుగ్గుపాలనాఁటినుండియుఁ జెప్పుచు నంత మహనీయు
నిగ, నంత పవిత్రజీవునిగ, నంత దేశోద్ధరణపటిష్ఠునిగఁ బ్రహ్లాదుని జేసినది మాలీలావతియే
కదా? వేవిళ్లలో వీరపురుషుల చర్యఁ గొనియాడుచు యుద్ధవిద్యావిధానములను వినుచుఁ
దరువాత నతనికి బోధచేయుచు–నంత ప్రబలరణకోవిదునిగ–నంతభారతబాల వీరునిగ
–నభిమన్యకుమారునిఁ జేసినది మాసుభద్రయే కాదా? నావెర్రి కాని నేను మీకుఁ జెప్పవలసిన
దేమున్నది? మీ రీవృత్తిని మానుఁడు. మాను మని మీస్నేహితులను బ్రోత్సహింపుడు.
మీకాలము–మీజీవనము–మీయాత్మ–దేశసేవకై వినియోగింపుడు. ఇంతకంటెఁ దారక
మార్గము లేదు. మనకు పిల్లలు లేనిలోటు లేదు. మన కింతకంటెఁ జేయఁ దగిన
పుణ్యకార్యములు లేవు. ఇదిగో చూడుఁడు. ఏ మనుచున్నారు? కొండవీటి చేదత్రాడువలె
నీయుపన్యాసమునకుఁ గొనయే గోచరింపదే యనుచున్నారా? అబ్బే–ఇట్టి సమయమునఁ
బరిహాసము లాడవలదు. ఆచరణములేని మీయుపన్యాసములు–మీవ్రాతలు–ఏమిఫలము?
ఆచరణముతోఁ గూడిన సంస్కరణము–నిష్కాపట్యముతోఁ గూడినమనస్సు
–ప్రతిఫలవాంఛారహితమగు ప్రేమము–ఇవి కదా మనదేశాభివృద్ధికిఁ గావలసినవి? నాముద్ద
చెల్లింపరా? నామనవిని వినరా? స్లీడరీ మానరా?

2. అంతఃపురోపన్యాసము

ఒక కవి సాహితీసంఘానికి పంపిన ఉపన్యాసం విశేషాలివి. ఇందులో –ఇంటి ఖర్చులు పట్టించుకోకుండా తన సొంత సౌఖ్యాలు, విలాసాలు చూసుకునే ఒక న్యాయవాదిని అతని భార్య నిగ్గదీసి అడుగుతోంది. పిల్లల పెళ్లిళ్ల సంబంధాలు చూడమంటే అశ్రద్ధచేస్తారేమిటి? అని. ఆ న్యాయవాదికి డబ్బు లేదా! అంటే, పెద్దపెద్ద వ్యాజ్యాలలో వేలకు వేలు సంపాదిస్తున్నవాడే! ఎలాగొచ్చే ఆ సొమ్ము ఇంట్లో అందరి సౌఖ్యాల కోసం, సౌకర్యాల కోసం ఉపయోగపడడం లేదు.

ఆ ఇల్లాలి మాటల్లో ఆవేదన వుంది. మందలింపు వుంది. 'లేని దర్జాలు' పోవద్దనే హెచ్చరిక వుంది. ఆమె తన తండ్రి పాటించిన జీవన సూత్రాల గురించి చెప్పింది. ఇరవై ఎకరాల భూమిని నమ్ముకున్న తన తండ్రి ఇంట్లో ఏనాడూ లోటు వేయలేదని చెప్పింది. ముందుగా పిల్లల సౌఖ్యం చూసుకొన్నాకనే మన సంగతులు చూసుకోవాలనంది.

తమ సంసారంలో ఈనాడు పెరిగిన రాబడికీ, భర్త ఒక్కడి ఖర్చులకీ బేరీజువేస్తే పొంతన లేదని నిష్కర్షగా చెప్పింది. ఏని మొదట గణింపదగిన ఖర్చులో ఏని మానివేసినా ఇబ్బందిలేని ఖర్చులో, తేల్చుకొని వ్యసనహరించే జ్ఞానం లేదేమా? అని మెత్తమెత్తగా భర్తకు చివాట్లు పెట్టింది.

సంసార బాధ్యత, పొదుపరితనం, దూరదృష్టి, అభిమానం మగవాడన్న వాడికి అవసరమని స్పష్టం చేసింది.

ఇంతకీ–'మీ వంటి మనిషికి పెళ్లాం, పిల్లలు, ఇల్లు, వాకిలి పనికిరావు', 'ఒంటరిగా పడివ్వుంటే అన్ని ముచ్చట్లూ తీర్చుకొనే వీలుండేది' అని విసుక్కుంది. అయితే ఆ భర్త అనే ప్రబుద్ధుడు గుట్టుపట్టి నిద్రపోతున్నాడు అప్పటికే.

ఒక కవి మా సభామందిరమున కీ యంతఃపురోపన్యాస మంపినాఁడు చదివెదను.

''ఏమండి? ఉత్తరము వచ్చినదా? ఏమీ యింకను రాలేదాయేమి? ఏమనుచున్నారు? ''ఎప్పుడు నదియే యేవయా'' యనుచున్నారా? ఏవకాదా మరి–ఆఁడుపిల్ల లిద్దఱుకుఁగూడఁ

బెండ్లి యీడు వచ్చినది. సంబంధాలు చూడండి–సంబంధాలు చూడండి యని యీరుమూస ములనుండి చెవి నిల్లుకట్టుకొని సోరుమన్నాను గదా! మీకుఁ జీమకుట్టిన ట్లయిన లేదయ్యెను. ఎందులకువచ్చిన యశ్రద్ధయో తెలియదు. ఆఁడుదానను నే నెంతవఱకు దేవులాడను? అదేమికర్మమో కాని యాసంగతియే చెవిని బెట్టరయ్యెను. ఏమి చేయుమనెద వందురా? ఏమిచేయుమనెదనా? ఏవో తగినసంబంధములు కుదిర్చి యీఁడుపిల్ల లిద్దఱకుఁ బెండ్లిచేసి మనము స్రజలలోఁ బడుద మనెదను. ఏ మనెదరు? కట్టము లెక్కువగా నడుగుచున్నారా? అంతపెద్దకట్టములు మన మీయఁగలమా యని యనుచున్నారు. తగినసంబంధములు కుదిరినప్పు డీయవలదా మఱి? ఒక్క మనమే యిచ్చుచున్నామా? 'లోకముతోఁబాటు కట్టము లిచ్చుటకు మనయొద్ద ధన ముండవలదా' యని యనుచున్నారా? పుట్టినన్నాళ్లకుఁ బురుషుఁడు పుట్టినప్పుడు డన్నట్లు మనము కాఁపురము మొదలు పెట్టిన యిరువదేండ్లకుఁ బట్టాంద్ర కార్యములు చేయవలసినప్పుడు సొమ్ముకొఱకుఁ దడవుకొను సంత మిగిలి పెట్టలేదుగా? నెలకు వందలకు వందలు సంపాదించుచున్నా రని చెప్పుకొను మన్నారే. జీతంవారకేమంత్రి నేలకునేలు పుచ్చుకొనుచున్నా రని పేరు మ్రోఁగిపోవుచు న్నదే. సంపాదితమంతయు నేమిచేయుచున్నారు? ఇంతవఱ కున్నదా యను మన్నారా? ఉండదు యేమైనది? ఇంటిలో వెండియన్నము బంగారుపప్పు దినుచుండుటలేదే! కుట్టి వాండ్రకుఁ బట్టుమని వాసుసోఁచయైనను మెడలో లేదే. ఇఁక నామాట నడుగ నక్కఱయే లేదు. మెడలోఁ బసుపుబొందుతప్ప వేఱొదైనను లేదే. పోనిండు నామాట కేమి? మీరు పిల్లలు చల్లగా నుండుటయే నాకుఁ బదివేలు. పట్టణములోఁ బదియేండ్లబట్టి కాఁపురము చేయుచుం బిమిడితివా? అప్పెక్కెంసయే కాని స్వతంత్రముగా సొంతయిల్లను మాటయే లేదు కదా! మాన్యప్రఁ గొండ్రలైన సంపాదించినారేమో యనుకొన్న నిదివఱ కట్టిది లేదుగదా! సంపాదించు కొన నక్కఱలేదు పోనిండు. ప్రాఁతవి యైన నిలువఁబెట్టుకొన బ్రయత్నించుచున్నారా? మీ పూర్వార్జిత సుగు మాన్యముమీఁది తనఖాను విడిపించితిరా? పోనిండు వడ్డియైన నేసంవత్సరమున కాసంవత్సర మిచ్చుచున్నారా? మాటలాడరేమి? ఆవడ్డియైనను బాఱవై చుటలేదా యేమి? ఇఁక నెందులకువచ్చిన సంపాదనలండి? ఎక్కడి సంపాదనలు ''కింగు అండు కో'' బిల్లులకే చాలవయ్యెను. ఎంతరాబడియైనను సుగుణవిలాస సభలోని నాటకము లకు, ''మన్సంటుర్ోడ్డు''లోని సినీమాలకే చాలదయ్యెను. పైగ నెలవు దినములలో డబ్బు పెట్టి బీట్లూటలా? వేసంగికాలముతో నీలగిరికొండలపై నివాసములా? ఇదికాక ''పార్కు ఫేట్ లా''? ''స్లైవ్ షోలా?'' నాపిండకూడా బల్లపుడుగా? ఇంటిలో వెంగలిలంఘనములు న్నను ''డిలాంజెలిస్తో డిన్నరులా?'' ''ఇన్ష్యూరెన్సు పాలిసి'' చెల్లింపకపోయినను ''బిల్ లియర్డ్ స్ బిల్లులు'' తప్పవుకద! సంసారమునకు సాలుసరిగింజలైనను సమకూర్చు కొనుటలేదు కాని సంగీతపు గచ్చేరీలలో సంతర్పణములా? ఇంటిలో నున్నదేదియో లేనిదేదియో చూచుకొనుట లేదయ్యెను. పిల్లలందఱకుఁ బండుకొనుటకు మంచములు, కప్పుకొనుటకు మంచిదుప్పటములే లేనప్పుడు మీకు బోలెడువిలువపెట్టి ''వార్డురోబు'' లెందులకు? నామాట నేను జెప్పుకొననుగాని పిల్లలకుఁ గట్టుకొనుటకు మంచిగుడ్డలే లేనప్పుడు మీకు 'సిల్క్ శాసులు'–'వర్జీలు'–'స్మాల్ ఫ్రాక్కు' లెందులకు? మన మేమి రాజు లమా మహారాజులమా కక్షిదారుఁడు గడప త్రొక్కినఁగాని కడవ ప్రాయ్యమీఁది కెక్కదే! అనిన మీకుఁ గోపముగాని మీతండ్రిగా రీలాగున వెచ్చించిసయెడల నంత యాస్తి సంపాదించి

మిమ్ములను మీతమ్ములను యమ్.యే.బి.యల్. వఱకుఁ జదివింపఁగలరా? అంతవఱ కెందులకు? మాతండ్రిగారు–చూడుఁడు. అదిగో మొగము చిట్లించుచున్నారు. ఆయన మాట నెప్పుడు చెప్పినను మీకుఁ గోపమే. తొందరపడకుఁడు. మీకుఁ గూడ నల్లుఁడు రానిండు. అప్పుడు గాని మీకుఁ దెలియదు. అల్లుఁడు కూడ మామ కాని వేళ యయినదా? మాతండ్రి యయిదుగురు కూఁతులకు గోలాహలముగాఁ బెండ్లి చేసినాఁడే. అడిగిన కట్నము లిచ్చినాఁడే. జ్ఞప్తి లేదు కాఁబోలు! పెండ్లి నాఁటికట్నముకాక 'లా లైబ్రెరీకి' వేయిరూపాయ లిచ్చినఁ గాని ముహూర్తమునకు రా నని మూఁతి బిగించుకొని కూరుచుంటిరే. ఇప్పు డల్లునకుఁ గట్నము లిచ్చుటకు ముందు వెనుక లాలోచించుచున్నారా? మీనమేషములు లెక్కఁ పెట్టుచున్నారా? జమఖర్చులు చూచుకొనుచున్నారా?

ఏమనుచున్నారు? మీతండ్రి భాగ్యవంతుఁడు కావున నడిగిన కట్నము లిచ్చినాఁ డని యనుచున్నారా? మాతండ్రికి భాగ్య మెక్కడ నుండి వచ్చినది? మీలాగున దోసిళ్లకొలఁది సంపాదింపలేదే–జమీందారీ వ్యాజ్యెములలోఁ బ్రభువుల కనుఁబ్రామి పైకము గడింపలేదే. హస్తలాఘవముచే నర్థ మార్జింపలేదే. ఆయన కున్నదెల్ల నిరువది యెకరముల పొలము. పది యెకరముల పల్లము–పది యెకరముల మెరక–ఏమో! సద్బ్రాహ్మణుఁడు. భూదేవిని నమ్మినాఁడు. ఒకరికిద్రోహము చేయలేదు. ఇప్పటికా రత్నగర్భయే యాయనను గనిపెట్టుచు న్నది. ఇప్పటిలానుననే పెద్దపెద్దభోగము లెరుఁగము కాని కడుపునిండఁ దినుటకు సన్న యప్పసునకు లోటులేకుండ నుండెను. ఇప్పటి 'సిల్కు గౌనులు' 'జాలు జాకట్లు' మే మెఱుఁగము కాని ముతక మేలు కమ్మిచీరలు మాకు సమృద్ధిగా నుండెను. ప్రతిసంవత్సర మును బొలములోఁ బండిన ప్రత్తిని జాగ్రత్తపఱచి, పట్టించి నూలుక్రింద నొడికించి మాకును మాయమ్మకును దనకును మాతండ్రి బట్టలు నేయించెడివాఁడు. సంసారపక్షమునఁ గాలక్షే పము చేయఁదగిన నాపంటి యాఁడుదాని కంతకంటెఁ గావలసిన దేమి? నేను బెంగుళూ రాకుసచ్చీర గాని జపాన్ బుటేదారీ యుల్లాశీదా తాపితా గాని కొన్నయెడలఁ బిల్లల గుడ్డలమాట సున్నయేకదా! మీరొకసారి 'మోసెస్' కంపెనీకి వెళ్లిన యెడల మాయందఱి మాట పట్టిదే కదా. ఎందులకు వచ్చిన వీ బనారసు కోకలు, నీ చీనాసిల్కులు, నీ సేలముచీరలు, నీ పుల్లంపేటబట్టలు? పట్టుమని ప్రతిదినమును వాడుక చేయుట కక్కఱకు రావుకదా–దానికిఁ బెట్టిన సొమ్ముతో నిల్లు గుల్ల కదా–నాల్గు కర్ణాటకపుఁ జీరలు కొనుట మెఱుఁగా–నాల్గువందలుపెట్టి కట్టువంకీలు కొనుట మెఱుఁగా? ఒడలి మీఁద బంగార మరిగినట్లు బట్ట యరుగునా?

అదిగాక మాకాలములో 'ఐస్క్రీము'లని 'ఫ్రూట్‌సాల్టు'లని 'ఛోకొలేట్లని' –పెసరట్లుపలావు లని–గత్తర లని–గపుచిపు లని–మే మెఱుఁగము. పొలములోఁగాని దొడ్డిలోఁ గాని యేకూర కాయునో దానితోనే భోజనము, డబ్బుపెట్టి మాతండ్రి కూర కొని యెఱుఁగఁడు.

ఇప్పటి సంపాదనలే వేఱు, కర్చులే వేఱ నుచున్నారా? అప్పటివారి సంపాదనకంటె మీ రిప్పు డెక్కువగానే సంపాదింప వచ్చును. ఎంత వచ్చుచున్నదో యేమి కర్చగుచున్నదో చూచుచున్నారా–ఏకల్పు చేయవలసినదో, యేది మానవలసినదో చూచుచున్నారా– ఇంత సంపాదించుచున్నందులకు– ఇంత పే రున్నందులకు–ఇంత హోరుగా బ్రదుకుచున్నం

దులకుఁ బిల్లల పెండ్లికడకుఁ బట్టుమని పదివేలు కావలయు ననిన లేవయ్యెను. క్రిందుమీఁదు చూడవలసివచ్చెను.

"మీఁగ, రేయింబవళ్లు కష్టపడి సంపాదించి చీము నెత్తురు కూడఁ బెట్టినట్లు కూడఁబెట్టి పిల్లల కేమి లోటు గలుగునో యని పరితపించి, పిల్లసుఖము తరువాతఁ దమసుఖము చూచుకొని యెంతటి వడిదుడుకులు కలిగినను ద్రొక్కుకొని నిలువఁబడి కార్యములందు ధైన్యము పడకుండ నొకరియొద్ద చేయి చాఁపకుండఁ గాలక్షేపముచేసి యిల్లువాఁకిలి మడిమాన్యము గుల్లగుట్ర సంపాదించిన పెద్దవాండ్రపాడయే కిట్టదయ్యెను. వారిమాట వినినఁ దలనొప్పియయ్యెను. వారి నాక్షేపించుట లయ్యెను. అదిగాక హృదయములు లేని జాతివిగ్రహము లని మీరు వారిని తిట్టుచుఁగూడ నున్నప్పు డింకఁ జేయవలసినదేమి? నిజము సూలోచింపఁగా హృదయము లేకపోవుట వారికా మీకా? పిల్లలయందు మీ కనురాగ మున్నదా? నిజముగాఁ జెప్పుఁడు. అట్లే యుండునెడల మీ రానందభవనములో దినమునకు నాలుగురూపాయలు కర్చు చేయఁగలరా? అది పిల్లలతో నారగించిన ఫలహారమా? పిల్లలమాటయే మనస్సులో నున్నయెడల 'మహారాజా రెస్టారెంటు' మర్యాదలు మీ రనుదినమును స్నేహితులతోఁ బొందఁగలరా? పిల్లలకడుపు నిండినతరువాతఁగదా మనమాట చూచుకొనవలసినది? వారు సుఖముగా నున్నతరువాతఁగదా మనకు సుఖము. మనకు సుఖము లేకపోయిన సరే వాండ్రు సుఖముగా నున్నఁ జాలు. అట్లు మీరు ప్రవర్తించుచున్నారా? ఎప్పుడు మనసుఖము, మనవిందులు, మనవిహారములు, మనవేషనులు, మనవిలాసములు, మనపోకులే కాని మరియేమైన నున్నదా? పిల్లలమాట యేమియు మనస్సున లేదయ్యెను. ఆచింతయే లేకపోయెను. అల్లారుముద్దుగాఁ గనులపండువుగాఁ బెరుఁగుచున్నారు కదా? "ఎదుగుచున్న పిల్లలఁగూర్చి చింతయెందులకు? ఏజమీందారునొద్దనో నాల్గువేలు తేలేకపోవుదునా? పెండ్లి చేయలేకపోవుదునా?" అని యనుచున్నారా? నాలుగువేలు కట్టములకే సరిపోదే? అయినను నాల్గువేలు చేతఁబడుసరికిఁ జేతిలోనివి చేతిలోనే యెగిరిపోవును గాని యింటి పఱకు వచ్చునా? అమాత్రపు సంసారబాధ్యత–పాదుపజీతనము దూరదృష్టి యభిమానము నున్నయెడల నింత కర్మమేమి? మీ స్వభావముకల మనుజుఁడు పెండ్లి చేసికొనఁగూడదు. మీరు బ్రహ్మచారిగనో పరమహంసగానో యుండినయెడల బహుశ్రేష్ఠముగా నుండును. అన్ని ముచ్చటలు తీర్చుకొనుచుందురు. అంటి ముట్టని ట్లుందురు. జన్నిదమున వటుఁడు, సంశ్లేషమున విటుఁడు, పద్మాసనమున యోగి, పట్టెమంచమున భోగి, ఎప్పటికప్పుడే సాగుడు, ఎక్కడి కక్కడికే విఱుఁగుడు–మీకుఁ బెండ్లా మని పిల్లలని యిల్లని వాఁకిలి యని పనికిరావు. అదేమి? అప్పుడే గుఱ్ఱో? నరిసరి!"

3. నిష్కామ్యకర్మము

జంఘాలశాస్త్రి చాలా తీవ్రమైన బాధాసహితమైన వదజాలంతో, తన యీ ఉపన్యాసంలో మనిషికి అతని కర్తవ్యాన్ని విశదం చేస్తున్నాడు. భగవద్గీతలో కృష్ణభగవానుడు చెప్పిన నిష్కామకర్మ అసలు లక్ష్యమేమిటో, దానిని ఎలా ఆచరించాలో చెపుతున్నాడు. లౌకిక వ్యవహారాలలోనే కాక, దేవుడితో కూడా ఇచ్చిపుచ్చుకునే బేరాల ధోరణిలో ఫలితం కోసం- తాను ఆశించిన అనుకూల ఫలితం కోసం- మానసికంగా అనుసరించే హీనత్వాలను విడిచిపెట్ట మంటున్నాడు.

తగినంత ప్రయత్నం జరగకపోవడం వల్లనే నూరు కార్యాలలో, తొంభై నిష్ఫల కార్యాలవుతున్నాయి. అన్నివిధాల పనులకూ, కర్మఠులకు దేవులాడుతున్నా వంటే, ఫలితం మీద నీకున్న అత్యాసక్తే కారణం. నిజమైన ఔనత్యస్థైర్యం వుంటేతప్ప ప్రపంచంలో మనిషి బతకలేడు. చిత్తబలం వున్నవాడే జీవించడానికి అర్హుడు. నీపని జరగకపోతే ఇతరుల్ని తిట్టడం, దైవాన్ని నిందించడం అర్థరహితం. నిన్ను నువ్వు తిట్టుకోవాలి. ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. నీకు బుద్ధి లేకపోవడం వల్ల నువ్వే మంచిచెడ్డల్ని దానికి ఆపాదిస్తున్నావు.

ప్రపంచంలో జరిగే ప్రతిపనీ కూడా కోమటి దుకాణంలో ఇచ్చిపుచ్చుకోవడం బాపతుగా వుంది. ఈ పద్ధతి కట్టిపెట్టి, ఫలితం మీద దృష్టి మాని, త్రికరణశుద్ధిగా పనిచెయ్యి. సృష్టిలో జీవులన్నీ నీ సోదరులు. వారివల్ల ఏ ఫలం కోరకు. ప్రయత్న లోపం చెయ్యకు. మనిషిలా ప్రవర్తించు. అంతేకాదు, భగవంతుడి తేజోలేశం నీలో ఉన్నట్టు ప్రవర్తించు–ఇదంతా కర్మ రహస్యం గురించి మన పూర్వులు చెప్పారు–అని జంఘాలశాస్త్రి ముగించాడు.

నేను సభాభవనమున కేగునరికి జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించు చున్నాఁడు –అదివఱ కేమిచెప్పినో కాని నేను సభాప్రవేశ మొనర్చిన పిమ్మట నిట్లు చెప్పెను:–

అదియే మన విధి. అంతవఱకే మన స్వాతంత్ర్యము. బ్రదికియుండినంత కాల మేదియో సత్కర్మ మొనర్చుట మన పని. కర్మఫలమునకై నీ వెప్పుడు దేవులాడఁదగదు. ఆఫలమునకు సాధనమగు కర్మమును నిష్కల్మషముగా, నిర్విశేషముగా, నిర్నిద్రముగా

మాత్రమునీవు చేయవలయును. నీవు ప్రయత్నమం దప్రమత్తుఁడవై యుండినయెడల సంతయే చాలును. ఫలమునుగూర్చి నీ కంత ప్రాఁకులాట యేల? ఫలసంపాదనసాధక మగు కర్మమును నీవు పరిపూర్తిగా నాచరించినప్పుడు ఫల మేల రాకపోవును? నీవు ప్రయత్న బలముచేఁ బ్రకాశించినప్పుడు నీకు ఫలసిద్ధియగుట కేమి వింత? కాని ఫలమునందే సదా దృష్టి నుంచుకొనవలదు. దానిని బొందుట కనావశ్యకమగు నాతురతపడవలదు. ఫలసంపాదనమున నీవు తొందరపడినకొలఁదిని ఫలసాధకమగు కర్మము దుర్బలమగును. అందువలన నీకు ఫలము సిద్ధింపక పోవచ్చును. ఎదుట దివ్యతేజముతో నొక్కదీపిక వెలుగుచున్నది. దానిని జూచుసరికిఁ గన్నులు మిఱుమిట్లు కలుగుచున్నవి. ఆదీపికను జేరుటకు నీవు తొందరగాఁ బోవలదు. పోయినయెడల బోరగిలఁ బడుదువు. ఎదుటిదీపముచే నడిమిమార్గ మంధకారబంధురమయి యున్నది. ప్రతిపదమును నీవు జాగరూకతతో ముందునకు వైచి నిరంతరదీక్షతో నీవు నిమ్మళముగా ముందునకుఁ బోవునెడల దీపిక నేల చేరకపోవుదువు? ఫల మేదో మనస్సున నక్కఱయే లేదు. తత్సాధకమగు కర్మమాత్రమే నీవాచరింపఁదగినది. బ్రదికియున్నంతకాలము ప్రయత్నము తప్పదు. ప్రయత్నములన్నియు ఫలించు నని చెప్ప వీలులేదు. అట్లే యగునెడల నిఁక నేమి? భూమియే స్వర్గముకాదా? నీ వొక కార్యమును జేయఁ దలఁతువు. అందునుగూర్చి ప్రయత్నింతువు. నీకార్యము కొనసాగలేదు. ఎందులకు కొనసాగలేదో పరిశీలించితివా? అట్లు పరిశీలించినయెడల నీవు ఫలసిద్ధికై తగిన ప్రయత్న మూహించనట్లు స్పష్టపడక తప్పదు. నూఱు నిష్ఫలకార్యములలోఁ దొంబదివఱకు పూర్ణప్ర యత్నాభావమునఁ జెడినవే. అందుచే నీకుఁ బ్రయత్నమే ప్రధానముకాని ఫలముకాదు –ఫలమందలి పరిపూర్ణ వాంఛచే నీవు ప్రయత్నమున లోప మెనర్చుచున్నావు. అందుచే ఫలసిద్ధి లేకుండనున్నావు. అందువలన ధైర్యవిహీనుఁడ వగుచున్నావు. తలకొట్టుకొని యేడ్చుచున్నావు. ఏడ్చియేడ్చి యా ప్రయత్నమునైన నీవు మానుకొనఁగలవా? ఉహుఁ తిరుగఁ బ్రయత్నించుచున్నావు. ఈసారియైనఁ ద్రికరణశుద్ధిగా నీవు ప్రయత్నించుచు న్నావా? ఫలాతురుఁడవై ప్రయత్నమునఁ దొందరపడుచున్నావు. తిరుగ నిష్ఫలుఁడ వై గుండెలు మోఁదుకొనుచున్నావు. సుఖ మనుభవింప వాంఛించుచున్నావు. దుఃఖసిద్ధిచే గుండెలుపగిల నేడ్చుచున్నావు. ధనమునకై ప్రాఁకులాడుచున్నావు. దరిద్రాధముఁడవై తనువును విడుచుచున్నావు. సర్వజనవశీకరణమునకై దేవులాడుచున్నావు. సమస్తజన దాసుఁడవై మొత్తుకొనుచున్నావు. ఇతరులకు బోధింప నూ రెగిరిపోషఁ గేకలిడుచున్నావు. ఇతరుల చెప్పుదెబ్బలచే నోరు మూసికొనుచున్నావు. ప్రపంచమును బరిపాలించుటకు వాంఛించుచున్నావు. పరులపాదములను బట్టుకొని ప్రాఁకులాడుచున్నావు. భగవంతుని స్వాధీనపఱచుకొందు నని రజ్జులుక్కొట్టుచున్నావు. ఇంటిలోని దాసిదానిచే మొట్లు తినుచు న్నావు. ఇట్లున్నది నీబ్రదుకు. ఇందులకుఁ గారణమేదియో యోజించితివా? ఫలమందు నీకుఁ గల యత్యాసక్తియే యందులకుఁ గారణము. ఫలమును గూర్చి నీ వెన్నఁ డాత్రపడవ లదు. ప్రయత్నము మట్టునకే నీపని; నీవు చేయవలసినదంతయే. అది పరిపూర్ణముగాఁ జేయుటయే నీవిధి. ఫలము దైవాధీనము. అది వచ్చినసరే రాకున్న సరే! అట్టి యథార్థమైన మనస్థైర్య మున్నవాఁడు కాని ప్రపంచమున దక్కలేఁడు. అట్టి పరిపూర్ణమైన చిత్తబలమున్నవాఁడు కాని జీవించుట కర్హుఁడు కాఁడు. దుర్బలుఁ డీ ప్రపంచమునఁ బనికిరాఁడు. చిత్తచాంచల్య మున్నవాఁడిచ్చట నుండఁ దగదు. త్రికరణశుద్ధిలేనివాఁడు

దేహయాత్రకర్హుఁడు కాఁడు. ప్రయత్నమందు నీకెంత యాసక్తియున్నదో ఫలపరిత్యాగ మందు నీ కంతపట్టుదల యుండవలయును. ప్రతికర్మఫలమునుగూడ మనవారు శ్రీకృష్ణార్పణ మొనర్పు మని చెప్పినారు. శ్రీకృష్ణార్పణ మని చిలుకపలుకులవలె ననుట కాదు. త్రికరణశుద్ధిగా దేవార్పణమును సే సెప్పు డాచరింతువో యప్పుడే నీవు కర్మ మాచరించినవాఁడ వగుదువు. నిష్ఫలాభిసంధిగాఁ గార్యమాచరింపవలయునన్న గీతావాక్య మున కభిప్రాయ మిదియే. అట్లాచరించితివేని నీకు దుఃఖ మెక్కడిది? నీకు నిరుత్సాహ మెక్కడిది? నీకు ధైర్యశూన్యత యెక్కడిది? ఇక నీకుఁ జా వెక్కడిది? ఇట్లాచరింపక నీ వన్యథా యాచరించుచున్నావు. అట్లాచరించి ప్రపంచపుటూఁగులాటలలోఁబడి హోరని యేడ్చుచున్నావు. నీకార్యముల నితరులు చెడఁగొట్టిరని యితరులను జెడమడఁ దిట్టుచున్నావు. ప్రపంచము నుంచిదికా దని ప్రపంచమును దూషించుచున్నావు. దుష్కాలమువచ్చిన దని కాలమును దూఱుచున్నావు. నిన్ను నీవు తిట్టుకో. నిన్ను నీవు తన్నుకో నిన్ను నీవు కోసికో. అంతేకాని యెరులను నిందింపనేల? ప్రయత్నము చేసినవాఁడవు నీవై యుండఁగా నొరులు నీ కేమి చేసినారు? ప్రపంచము మంచిది కాదేమి? అట్టి ప్రపంచమున నీ వేల యుంటివి? ప్రపంచములోని వారు దుష్టు లైనప్పుడు నీ వెవ్వఁడవు? కాలము చెడ్డది యైనప్పుడు బ్రదికియున్న నీ వెవఁడవు? నీవు దక్క నితర ప్రపంచమంతయుఁ జెడ్డదా? అందఱు నీవలెనే యనునప్పుడు నీ వెవ్వఁడవు? ప్రపంచము మంచిదికాదు. చెడ్డదికాదు. బుద్ధిహీనతచే నీవు దానికి మంచిచెడ్డల నారోపించుచున్నావు. అదిగాక నీ కెంతఫలమున కర్హత యున్నదో యంతఫలమే నీకు గలుగునుగాని హెచ్చుగారమ్మన నేలవచ్చును? నీకధికఫలమున కర్హతయేయుండు నెడల నధికఫలమే వచ్చియుండును. అట్లురాకపోవుట నీలోపమా? ప్రపంచ లోపమా? నీవు ఫలకారణమగుకర్మమును బరిపూర్తిగా నొనర్చినయెడల నీకుఁ బూర్ణఫలమే సిద్ధించియుండును. అట్లు జరుగకపోవుట నీలోపమా కాలలోపమా? ఇదికాక మఱియొకటి: నీకు యథార్థమైన యనురాగము లేదు; యథార్థమైన త్యాగము లేదు; యథార్థమైన భక్తిలేదు. నీవు నీభార్యను ముద్దిడుకొందువు. తిరుగ నీభార్య నిన్ను ముద్దిడుకొనకున్న యెడల మూఁతి ముడుచుకొని ముక్కుముక్కు మూర్గిమూర్గి ముక్కలగుదువు. ఇంతలో నేమి పుట్టిమునిఁగినది. ముద్దుపెట్టుకొన్నయెడల నీకుఁ గలిగిన సౌఖ్యమత్వ మేమి? అంతమాత్రమునకే నీయనురాగము జంకునెడల నీయనురాగము యథార్థమైన దని చెప్పనచ్చునా? నీవు నీ కుమారుని ప్రేమింతువు. అంతకంటె హితపదార్థము నీకు మరియొక్కటి యున్నదా? అట్టిపుత్రుఁడు నీయెడలఁ దటస్థుఁడుగా నున్నయెడల నీవు గుడ్లూఁదీసికొందువు. నాలుక బీఁకుకొందువు. పై కనలేకపోయినను బుత్రుని మనస్సులో శపింతువు. నీకొడుకు నిన్నుఁ ప్రేమింపకపోయిన నీ కేమి? నీయనురాగమునకు లోపమేమి? తండ్రి కొడుకును ప్రేమించినంత గాఢముగాఁ గొడుకు తండ్రిని ప్రేమించునా? లోకమున నెందరు తండ్రులు నీవలె నేడ్చుచున్నారో? నీవొకనిఁ గష్టకాలమున రక్షింతువు. ధన మిచ్చి యాతని నాపదల నుండి విముక్తునిఁ జేయుదువు. అతఁడు నీయెడల గృతజ్ఞుఁడుగా నుండకపోయినయెడల నాతనిఁ దిట్టుదువు. అతని సాధింపనెంతువు. నీవు మనస్ఫూర్తిగా నాతనికిఁ ద్యాగ మొనర్చి రక్షించితివి. నీ కాతని కృతజ్ఞతతోఁ బని యేమున్నది? అతఁడు నీమేలు మఱచు నెడల నీవు నీ సత్స్వభావము నేల మఱువవలయును? యథార్థమే మనఁగా ఱబపంచమున నీ వొనర్చు ప్రతికార్యముకూడఁ బ్రతిఫలాపేక్షచే జేయఁబడుచున్నది. నీకొ

అకే నీవొకనిని బ్రేమించుచున్నావు. నీకొఅకే నీవొకనిని రక్షించుచున్నావు. నీకొఅకే నీవొకనికిఁ ద్యాగ మొనర్చుచున్నావు. అంతేకాని యథార్థప్రేమము గాని త్యాగము గాని లేదు. నీప్రేమము నీత్యాగముగూడ నాత్మలాభాపేక్షామలీమసములై యున్నవి. ప్రపంచ మందు జరుగుచున్న మహాకార్యములలో నూటికిఁ దొంబది వఱకుఁ గోమటి దుకాణపు టిచ్చిపుచ్చుకొనుటలు కాని వేరుకావు. ఎంతసేపు ఇదిగో పుచ్చుకో–అదిగోతే –భక్తిలోఁగూడ నీప్రపంచపు బ్రదుకీప్రకారముగనే యేడ్చుచున్నది. నీ భక్తికూడ యథార్థమైనది కాదు. ఇల్లాలికి సుఖమైనకానుపు–ఏడుకొండల వెంకన్నకు నిలువుదోపు–ఇంతకంటె నేమైననున్నదా? నీదాసి దానికూఁతునకుఁ బ్రభుఁ డెవ్వఁ డైనఁ గన్నెఱిక మొనర్చినయెడలఁ గుమారముఖలింగేశ్వరునికి రథమిచ్చెద నని నీవు మ్రొక్కుకొందువు. నీకోరికయే నెఱవేరు నెడల నా కుమారముఖ లింగేశ్వరునిఁ గూఁకటివ్రేళ్లతో నూడఁబెరికి యుప్పాడసముద్రములోఁ బాఱవైచిన నైనఁ బాపమున్నదా? నీభక్తిసౌభాగ్య మీరీతిగ నున్నది. ఎంతసేపును దలకుమించిన కోరికలు–అనాయాసముగా నప్రయత్నముగా నతిశీఘ్రముగాఁ గోరికలు ఫలింపవలయు నని యాతురతలు–ఫలింపలే దని యేడుపులు–ఇతరు లద్దుదగిలిరని పైవారికిఁదిట్టు–దిక్కుమాలిన ప్రపంచములే, యని దేవునికి నిందలు–బ్రదుకనఁగ నంతేకాని యంతకంటె నేమైన నున్నట్లగపడుచున్నదా? ఇన్ని రోదన కలాపములకు నిన్ని శాపాలాపములకుఁ గారణ మేమి? చేసిన కర్మమునకుఁ బ్రతిఫల మపేక్షించుట. అది లేకున్నయెడల నేబాధయు లేదు. అన్ని తిట్టులు గూడ నడఁగును. అన్నియేడ్పులుగూడఁ జల్లాఱును. సృష్టిలోని జీవులెల్లరు నీ సోదరులు. వారిని నీవు త్రికరణశుద్ధిగాఁ బ్రేమింపుము. వారివలనఁ దిరుగ నేఫలమును గోరకుము. అట్లు ప్రతిఫలమును గోరుట నింద్యము. నీచము. అది ముష్టివానికిఁ దగినది. ఏదియో కావలయునని యెవ్వరినిగూడ డేబరింపకుము. చావనైనఁ జావుము. కాని దేహి యని చేయి చాపకుము. రావలసిన దేదైన నున్నయెడల నది యరణ్య మధ్యమున నుండియైన వచ్చును. అంబుధినడుమ నుండియైన వచ్చును. ఆకాశము నుండియైన నూఁడిపడును. నీ కానిశ్చిత మున్నదా? ఉన్న యెడల నీ బ్రదు కింత భగ్నమగుట యేల? మదిలోఁ గోరికలన్నియు మంటఁ గలసిననైన నింకను నోరు తెఱచుకొని యుట్టి వంకనే చూచుచుంటివా? అట్లు చూచుచుంటి వేల యని నీటిమీఁద ఫలదేవత యూఁచిపుచ్చుకొని పండ్లురాలఁగొట్టిననైన నింక సిగ్గులేక చేయి చాఁచుచుంటివా? ఇంత సిగ్గుబిడియములు లేనివాఁడవేల? మనుజునెవ్వనినైన సరే యాచింపకుము. దైవము నఁతకంటె యాచింపకుము. సత్కార్యము చేతనైనంతవఱ్ఱున కాచరింపుము. ఫలమును గూర్చి లేశమైన విచారింపకుము. పుష్పములు వికసించి పరిమళమును వాయువు నందంత వెదచల్లి రాలిపోయినట్లు ఫలాపేక్షాశూన్యుఁడవై ప్రజాక్షేమ కార్యము లాచరించి ప్రాణములఁ బాయుము. కుంభవృష్టిగ ద్రోణవృష్టిగ వర్షించి ధరాదేవిని సస్యఫలాఢ్యనుజేసి మేఘము లంతరించిపోవునట్లు నీవు చేతనైనంతవఱ కనుతాగమును బ్రజలపైఁ బఱపి ప్రతిఫల వాంఛారహితుఁడవైపరమపదమును జేరుము. ఖ్యాతి నపేక్షించుట కూడఁ దప్పు. స్వవినాశక రమైన సత్కార్యముకూడ నిర్భీతిగా నాచరింపుము. గోపుర మెక్కి సర్వజనమోక్షోపాయ మగు మంత్ర రాజమును గురుతిరస్కారపాపమున కొడిగట్టి బోధించిన రామానుజుఁడు మనుష్యుఁడా? నీవు మనుష్యుఁడవా? తన్ను ఖండించి కబళింపవచ్చిన దుర్మార్గులను సన్మార్గులఁ జేసిన బుద్ధుఁడు మనుష్యుఁడా? నీవు మనుష్యుఁడవా? ఒక్క చెంపను గొట్ట

వేఱొక్క చెంపను శత్రువునకుఁ జూపిన యేసుక్రీస్తు మనుష్యుఁడా? నీవు మనుష్యుఁడవా? ఒత్తిగిల్లి పండుకొన్న తన యాభరణముల నొక్క వైపుననే దొంగలు దోఁచుకొనఁగ రెండవ వైపు నగలుకూడఁ దీసికొండని చెప్పక చెప్పినట్లు రెండవ వైపున కొత్తిగిల్లిన యా యిల్లాలి బ్రదుకు బ్రదుకా? నీ బ్రదుకు బ్రదుకా? చీ, సిగ్గులేక యేమొగము పెట్టుకొని మనుజుఁడ నని తిరుగుచున్నావు? దమ్మిడి యిచ్చి క్రొత్తడబ్బు లాగఁ జూచెదవా? గోఁచి యిచ్చి గొంగళిని గ్రహింపఁ దలఁచెదవా? ఈ బేరము భగవంతుని విషయమునఁగూడ వర్తింపఁజేసెదవా? థూ, ఈతుచ్ఛవ్యాపారముల నింకఁ గట్టిపెట్టుము. ఈ కుండమార్పుల కింక శాంతిచెప్పుము. సత్కర్మము లాచరింపుము. ఫలమును గూర్చి పరితపింపకుము. ప్రయత్నములో నెంతమాత్రమును లోప మెనర్పకుము. మనుజునివలె వర్తింపుము. అంతేకాక భగవంతుని తేజోలేశము నీయందున్నట్లు ప్రవర్తింపుము. ఇట్లు కర్మ రహస్యమును గూర్చి మనపూర్వులు పలికియున్నారు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

4. మండలమానినీజనమణీమహాసభ

జంఘాలశాస్త్రి తనకు వచ్చిన ఒక కల గురించి చెప్తున్నాడు. ఆ కలలో ఒక ఊరు. ఆ ఊరిలో ఒక సభ. ఆ సభ పూర్తిగా స్త్రీలకు మాత్రమే సంబంధించినది. వారే పాల్గొనాలి. జిల్లాలో వున్న స్త్రీలంతా ఆ సభకు రావాలని బాగా ప్రచారం జరిగి–స్త్రీలు బాగా వచ్చారు. గులాబితోట కంటె వెయ్యిరెట్లు సౌందర్యంతో సభాప్రాంగణం కలకలలాడిపోతోంది.

ఆ కలలో జంఘాలశాస్త్రి (పురుషులకు ఆ సభలోకి ప్రవేశం లేదు గనుక) సభా ద్వారానికి దగ్గరలో వుండి, ఆ సభ విశేషాలు తెలుసుకోవడం తప్పులేదు కదా! అని, ఒక పక్కగా నిలబడి వున్నాడు.

సభ ప్రారంభమైంది. ఒక షష్టిపూర్తి కాలం గడిచిన మహిళ లేచి –తిరువేంగడమ్మగారిని సభాధ్యక్షురాలిగా ప్రతిపాదించింది. మరొక వనిత దానిని సమర్థించింది.

తిరువేంగడమ్మగారు తన ప్రసంగంలో స్త్రీలకు జీవన్మరణ సమస్య అయిన 'సంతాన' బాధ గురించీ–సంతానం అదుపుచేసుకోవలసిన అత్యవసర స్థితి గురించీ ఎత్తుకుంది. స్త్రీ పిల్లల్ని కనే మనస్సులేని యంత్రం కాదంది. ఏ స్త్రీ అయినా మరో స్త్రీని కలిసినప్పుడు నీకెంతమంది పిల్లలు అని అడగడం సాధారణమనీ, అడగదగిన మరింక ఏ విషయాలూ లేనట్లు, మనం యంత్రాలమైనట్లు మనకే అభిప్రాయం ఉండగా, ఇతరులు మనపట్ల నీచాభిప్రాయంతో వున్నారని విచారం ఎందుకు? అని సూటిగా అడిగింది.

అధిక సంతానం వల్ల స్త్రీ ఎలా కుటుంబ భారంతో నలిగిపోతుందో సవిస్తరంగా చెప్పింది. కనుక–సంతాన నిరోధానికి ఉద్యమించడం ఒకటే మార్గమని వక్కాణించింది. ఈ ఉపన్యాసం విని ఒక ముసలావిడ అభ్యంతరం చెప్పబోయింది. కాని ఎవరూ వినిపించుకోలేదు. అభిప్రాయభేదం వున్న –సంతాన నిరోధప్రేరక గ్రంథాన్ని చదివి–సాక్షిసంఘానికి రిపోర్టు పంపడానికి ఒక 'సెలెక్టు కమిటీ' ఏర్పడింది.

జంఘాలశాస్త్రి యి ట్లుపన్యసించెను.

నాకొక వింతస్వప్నము వచ్చినది. దానిని జెప్పెదను వినుఁడు. నాయసలారా! అది యొకయూరు; ఏయూరో చెప్పఁజాలను. ఆయూర నముద్రతీరమున నొక్క పెద్ద భవన

మున్నది. ఆభవనములో స్త్రీలసభ జరుగునని యూరంతయుఁ జాటించినారు. కరపత్రము లను బంచిపెట్టినారు. జెట్కాబండ్లకు ట్రాంబండ్లకు మోటారుబండ్లకుఁగూడ కాంతాసభా సంబంధము లగు నాహ్వానపత్రిక లంటించినారు. అది మండల మానినీజనమణీమహాసభ యఁట. ఆజిల్లాలో నున్న స్త్రీలంద ఱాసభకు రావలయునఁట. ఏవియో ముఖ్యాంశము లాలోచింపఁబడునఁట. గ్రామమంతయు గగ్గోలుగా నున్నది. అనేక గ్రామములనుండి కాంతలు లెక్కలేకుండ వచ్చినారు. పురుషు లాహ్వానింపఁబడలేదు. సభాద్వారసమీపమున నుండి సభావ్యాపారములఁ గనిపెట్టిన బాధలే దని నేను సభామందిర ప్రధానద్వారాంతికమున నిలువఁబడి చూచుచుంటిని. ఆహాహా! ఆసభ యెంతసొగసుగ నున్న దని చెప్పను! బిగిమొగ్గలు కొన్ని–రవంత వికసించిన మొగ్గలుకొన్ని–సంపూర్ణముగ వికసించినవికొన్ని –రాలిపోయిన రేకులుగలవి కొన్ని గల గులాబితోఁటకంటె నాసభ సహస్రగుణాధిక సౌందర్య సమన్వితమై యున్నది. చెంప కొప్పులవారు, ముచ్చటముళ్లవారు, జడచుట్టలవారు, కత్తిరింపుముంగులవారు, కాగితపుఁబూలవారు, కత్తిరింపుబుట్టలవారు, వాలుకన్నుల వన్నె లాడులు, గుండ్రకన్నుల కోమలాంగులు, నడుసుకనులయబలాశిరోమణులు, చింపిరి కనుల శీతాంశుముఖులు, మెల్లకన్నుల పల్లవపాణులు, నొంటికంటి యువిదలు–ఓ–కర్ణాటకపుఁ జీరలతో–బుటేదారి కోకలతో–కలంకారి లంగాలతో–పామువీసపుజనానాకండువాలతో –స్వదేశీయపు సెల్లాలతో–మిలమిలలతో–జిలజిలలతో–కలకలలతో–గణగణలతో –పెటపెటలతో–లొడలొడలతో వహవ్వా! సర్వజననయ నానంద సంధానధురీణలై ప్రకాశిం చుచున్నారు. సెంట్లువాసనలు–పూవులవాసనలు–నగరునూనె వాసనలు–కాంతామణుల ముఖపద్మ సౌరభములతోఁ గలసియుండ, నచటి వాయు వంతయును మత్తెక్కినట్లున్నది. ''ఆఁడుది యున్నచోటనే యన్ని సౌరభములు! మగవాఁ డున్నచోట నే మున్నది? పొడుమువాసన చుట్టకంపుసిగరెట్టుగొట్రు కంటె నే మున్నది? ఆహాహా! పురంధ్రీమణులచే తను బుష్పములచేతనే కదా భూమి కలంకారము'' అని నే ననుకొనుచుండఁగా నొక్క మహిళామతల్లి లేచి నిలువఁబడెను. ఆమెవంక నంద ఱొక్కసారి చూచిరి. ఆమె నాయీడు గలది. రాఁబోవు రక్తాక్షిసంవత్సరములో షష్టిపూర్తి నలుపుకొనఁదగిన సతీతిలకము. ఈమె లేచి రవంత దగ్గి గొంతు కాసంత సవరించుకొని, యూడిపోయిన ముందుపండ్లు కనఁబడకుం డునట్లుగా మూఁతిబిగించి యిసుమంత మందహాస మొనర్చి సభాసరోజాక్షులతో నిట్లనియె.

''సోదరీమణులారా! ఈమందయానామణీ మహాపరిషత్తునకుఁ దగిన యగ్రాసనాధిప త్వ్నిని మీపక్షమున నెన్నుకొనుటకై నే నిప్పుడు లేచితిని. ఏకాంతాలలామ యనేకగ్రంథ సందోహ రచనావిచక్షణయై ప్రకాశించుచున్నదో, యేమగువ పాండిత్యసంపద మగవారి మొగములను దిగువపరుపఁజాలి యున్నదో, యేబుద్ధిమతి కవితాప్రవాహము గంగాఝరీనం కాశమో, యేయబలామతల్లి కేవల పూర్వాచారపరాయణయే కాక సంఘసంస్కరణ వాంఛాస మన్వితయో యట్టి రాఘవాచార్య ధర్మపత్ని (భర్తపే రెత్తఁగూడదు. అతనికి సభతో నేమి సంబంధమని కేకలు) అట్టి తిరువేంగడమ్మగారి నీసభ కధ్యక్షురాలిగ నెన్నుకొనుచున్నాను. నాయుపపాదన మెవ్వరైన నామోదింతురుగాక'' యని కరతాళధ్వనులవర్షమున నామె గూరుచుండెను. అంత నొక్క వైశ్యవనితారత్నము కుర్చీనుండి లేచి వెంటనే కూరుచుం డెను. మీరు సెకండు చేయుటకు లేచి యూరకుంటిరేల యని యామెను సభలో గొంద అడుగఁగా ''నా కాగొడవ యేదో తెలియదు. నల్లికుట్టుటచే లేచితి'' నని యామె

ప్రత్యుత్తరము చెప్పెను. ఒక నిముసములో నొక్క నియోగి బ్రాహ్మణి లేచెను. ఈమెకు నత్త. ''సనసభాసదులారా! మొమొమొదట చెచెచెప్పిన యామెతో నేనేనేనేనేను సెకండు చేయుచున్నా''నని చెప్పి ముచ్చెమటలు పోసిన తన మొగమును దాను దుడుచుకొని తననోటి తుంపరలచే జుట్టుపట్టులనున్న యిల్లాండ్రు తమతమ మొగములఁ దుడుచుకొనుచుండఁగాఁ గూరుచుండెను. అంత తిరువేంగడమ్మగారు లేచి యుత్సాహపూరితయై చెంగున నుపన్యానరంగముపై నిలువఁబడి యిట్లనియెను:–

''సోదరీరత్నములారా! ఏయంశమునుగూర్చి నే నిప్పుడు చెప్పఁ దలఁచితినో యాయంశముకంటె ముఖ్యమైన దీప్రపంచమున లేదు. ఇకముం దుండఁబోదు. అది సంసారసౌఖ్యముతో సంబంధించినది. మన యారోగ్యముతో సంబంధించినది. మన యాయువుతో సంబంధించినది. ప్రపంచముననుండు వందఱు బ్రదుకులతో సంబంధించినది. అట్టి మహాంశము నింతకాలమువఱకు మన మాలోచింపక కాలము వృధచేసినందులకై లెంపలు కొట్టుకొనవలసియున్నది. మనలో నొక్క దురాచారమున్నది. ఒకయాఁడుది మరియొక యాఁడుదానిని జూచునెడ:–''అక్కా! నీ కెందఱు పిల్లలమ్మా'' యని యడుగును. నీ వేమి చదువుకొంటి వని యడుగదు. నీ వేగ్రంథమును వ్రాసితి వని యడుగదు. నీవు దేశభక్తి నెట్లుచూపితివని యడుగదు. నీవు నీ సోదరీమణుల కేవిధముగాఁ దోడుపడుచుంటివని యడుగదు. ఎందరు పిల్ల లనిమాత్రమే మొట్టమొదట నడుగును. పిల్లలకొఱకే మనము పుట్టితి మనియు నెందఱు పిల్లలను గన్న మన మంత యెక్కువ ప్రయోజకత్వము కలవార మనియు మనము పిల్లలను నిర్మించునట్టి వట్టి యమనస్క యంత్రములనియు మనలో మనకే మనయెడల నిట్టి నీచాభిప్రాయమున్నప్పుడు మనలఁ బరులు గౌరవింపలే దని విచారింప నేల? నిజమే. కనుచున్నాము. పిల్లలఁ గనుచున్నాము. నేను బదునార్గురను గంటి నని నా సోదరీమణి చెప్పినది. అది నా సుగుణముగా–యోగ్యతగా–నదృష్టముగా–భావించి యామె చెప్పినది. నేను గేవల మన్యధా యెంచుచున్నాను. అది నా లోపము. నాతప్పు. నా యభాగ్య మని నేను నిశ్చయముగాఁ జెప్పఁ గలను. మనలో నిరువదుగురు బిడ్డలవఱకుఁ గన్నవా రున్నారు. అది వారి ప్రారబ్ధము. అందరు పిల్లలను గను మని యెవరు చెప్పినారు? మనకు బుద్ధిలేక మన మట్లు కంటిమి. మనకుఁ బ్రకృతినైద్యాదిశాస్త్రీయజ్ఞానము లేక మన మట్లు కంటిమి. నాగరకత యిప్పు డెంత వృద్ధియైనదో తెలిసి కొంటిరా? ప్రకృతి మనకు దాసియైనది. సృష్టితంత్రము మనకుఁ గరతలామలక మైనది. మనకు బిల్ల లక్కఱలే దని మనము చేయవలసినవిధులాచరించినచోఁ బిల్లలు పుట్టనేపుట్టరు. ఒక్కబిడ్డయే కావలయు నని యత్నించినచో నొకఁడే పుట్టును. మరి మాలాడఁగూడదు. అంతే ఒక్క మగవాఁడు నొక్క యాఁడుదియు గావలయు నని నెన్నినంవత్సరములు నిరంతర నంసారమొనర్చిననరే నెల తప్పుటయే కల్ల. ఇందులో మఱియొక్క విశేషము. ఇన్ని సంవత్సరములు చూలు లేదుగదా యింకముందు పిల్లలు గలుగరేమో యనుచింత యక్కఱలేదు. సంతానము నపేక్షించి యెప్పు డావిధులను మానినైచిన నప్పుడే బిడ్డ ప్రత్యక్షము. నాకుఁ బ్రథమసంతాన మెప్పుడు కలిగినదో చెప్పనా? గర్భాధానకృత్యమైన తొమ్మిదిమానములకుఁ గలిగెను.....నం సారసౌఖ్యము సంతుష్టిగా నెనిమిదివత్సరములైన ననుభవించినదేదీ? అప్పుడే గర్భాతంకవిధు లేవో మనకుఁ దెలిసియుండినయెడల మనబ్రతుకు లింతభగ్నములై యుండునా? మనము చెడిపోయితిమి. తెలియక మోసపోయితిమి. ఇప్పు డట్టి విధులు కనిపెట్టఁబడినవి. ఈవిధులు

రామబాణములు. వానికిఁ దిరుగులేదు. నిమ్మకాయతో వాంతులు కట్టుకపోవచ్చును. నల్లమందుతో భేదులు కట్టుకపోవచ్చును. కాని యావిధులతో గర్భధారణము టుక్కునఁ గట్టువలసినదే. అంత పరమహంసక్రియ–అంత భైరాగిచిటుక–అంత యమూల్య సాధనము సిద్ధించినప్పు డశ్రద్ధచేసిన దాఁడుదికాదు. నిజముగా నిందఱు సోదరీమణులతో నీయింటి క్రింద నుండి చెప్పుచున్నాను. గర్భధారణ మనునది యొక్కరోగము గాని మరియొకటి కాదు. రోగమునకు మందు పుచ్చుకొనుట తప్పా? కొందఱకుఁ బదేపదే లెక్క లేకుండఁ దుమ్ములు వచ్చును. దానికి శిరోవాత మనిపేరు. అటులే సంతానబాహుళ్య మనునది గర్భపాతము. శిరోవాతమునకుఁ జికిత్స చేసికొనవచ్చును. గాని గర్భపాతమునకుఁ జేసికొనఁగూడదా? అది తప్పు లేదు. కాని యిది తప్పా? ఇది యెవరు చెప్పిన నీతి? మన మీనీతిని బరిగణింపనక్కఱలేదు. సంతానబంధన సాధనములవలన మనచరిత్రములో నొక్క క్రొత్తపత్రము వచ్చినది. లోకమున నొక్క క్రొత్తశక ముదయించినది. కాలమున కొక్క వింతగమనము కలిగినది. ఇంతటినుండి నీకొడుకు నీకడుపులో లేఁడు. నీ తలలో నున్నాఁడు. నీ కెప్పుడు కావలయునో యప్పుడే నీవు కనవచ్చును. నాల్గుగంటల పదినిమిషములకు ''అలారము'' కొట్టువలయు నని యెంచి గడియారమును దిద్దుకొనుచున్నామా లేదా? అట్లె గర్భాధానానంతరము తొమ్మిది సంవత్సరములకు గొడుకుఁ గావలయునని కోరుకొని చేయవలసిన యేర్పాటు లాచరించినయెడలఁ దొమ్మిదినంవత్సరములు బందు జేయఁదలఁచినయెడల టుక్కున నాఁగిపోవలసినదే. ఇది యంతయు వింతగాఁ గనఁబడవచ్చును. కాని సత్యము, సత్యమునే వంచించుచున్నాను. అట్టివిధు లమోఘవిధులు. లోకహితార్థమై కనిపెట్టఁబడినవి. ఇది భూలోకమునకుఁ బరమశుభవార్త. ఇంతటినుండి సుందరీమణియే సృష్టి కధికారిణి. ఈయమ్మకుఁ దొమ్మండ్రు సంతాన మనియు–నాయమ్మకుఁ బదునేడ్గురు సంతాన మనియు–బ్రహ్మ కాంతలనుదుటిపై వ్రాసిన వ్రాతలు తుడిచిపెట్టుకొని పోవును. అట్టి విధులు సృష్టింపఁబడినవి. ప్రపంచము వారిలోఁ గొంద ఱాచరించుచున్నారు. ధంకామీఁద దెబ్బకొట్టి దిగ్విజయములు గాంచుచున్నారు. వట్టి వట్టి మాటలా? ఓ –నిదర్శనములున్న సత్యవాక్యములు. చరిత్రాంశములు. శిలాశాసనములు.

సోదరీమణులారా! అట్టి సద్విధుల నిప్పుడైన మీ రవలంబింతురా? (అభ్యంతర మేమి? అభ్యంతర మేమి యని సభలో నందఱు కేకలు) సంతానవతులారా! సంతాన బహుళతవలనను, వకాలసంతానము వలనను, ప్రపంచమునకుఁ గలుగునష్టము లేవియో మీకు నేను జెప్పవలయునా? వేవిళ్లబాధయు, గర్భభారధారణబాధయుఁ, ప్రసవకాల యమబాధయు, నప్పుడప్పుడు గలుగు కత్తికోఁత బాధయు, బలాత్కార శీఘ్రాకర్షణబాధయు, మానభంగ బాధయు, నూతికావాతబాధయు, నకాలభయంకర ప్రాణనిర్యాణబాధయు మొదలగునవి నేను జెప్పఁదలఁచుకొనలేనే లేదు. అదిగాకయే, వానిపైఁ గుప్పతిప్పలుగ మనము బడుచున్న బాధలచే నేను సంక్షేపముగఁ జెప్పఁదలఁచుకొంటిని. మగవాఁడు మనకంటె నన్నివిధముల సుఖవంతుఁడు. పిల్లలను గడుపులోఁ బదిమాసములుమోసి కనిపెంచి సర్వవిధముల వారితో రేయింబవళ్లు సమస్తయాతన లొందు నాఁడుది కష్టజీవినిగాని యేప్రూచిని వహింపక.....ప్రవర్తించు మగవానికి మనము పిల్లలతోఁబడు అంపపుఁ గోత తెలియునా? ఆతని ప్రోద్బలముచే మనకుఁ గల దాక్షిణ్యముచే నేదియో కక్కుర్తి పడుదుము. అంతతో మనకొంప మునుఁగును. అక్కడనుండి మన మేడ్చునేడ్పు లింతంతయా?

ఇంత ఘనకార్యమొనర్చి మనలఁ గష్టసముద్రమునఁ బడఁద్రోచి తాను సీతాకోకచిలుకవలె నెగురును.....ఇట్టి గృహచ్ఛిద్రములఁగూర్చి పురుషజాతి నిర్దాక్షిణ్యమును గూర్చి నే నీనాల్గుమాటలయినను జెప్పఁదలచుకొనలేదు. ఎత్తవలసిన పనిలేనివారిమాట యేదో ప్రస్తావ వశమున వచ్చినది కాన యీమాత్రమైన బలుకవలసివచ్చినది. ఈసంతానబాహుళ్యమువలన దేహశక్తి-మనశ్శక్తి-యాత్మశక్తి యెన్నెన్ని విధములుగా నెంత యెంత భగ్నమగుచున్నదో యోజించితిరా? ఏటేటను బిల్ల లొడిలోఁ జేరి రక్తమాంసములు పిల్వఁ బిండిబొమ్మలమై, సుద్దముక్కలమై, జీల్గు బెండ్లమై, యెందున కక్కఱకు రాకుండఁ బోయితిమిగదా? గ్రంథము వ్రాసికొంద మని కలము చేతఁ బట్ట ''క్యారునఁ'' బిల్లవాఁ డేడ్చుచుండ నిఁక నేమి చేయవలసినది? దేశోపకారక వ్యాపారము లన్నియుఁ గట్టిపెట్టుకొని యెంతకాలము మన మిట్లు క్షోభపడుట? దీనికి హద్దును పద్దును లేదా? విధి విరామము లేదా? ప్రారబ్ధములోఁ గవలలుగూడనా? ఈ ప్రక్కను బిల్ల-యాప్రక్కను బిల్ల. ఈచేత నొకపిల్ల, యాచేత నొక పిల్ల-ఒడిలో నొక్క పిల్ల-కడుపులో నొకపిల్ల. ఇట్లు మనము బాధ పడుచుండఁగా పనికిమాలిన భర్త...ఛీ మన మొగమోటమియే మన పుట్టి ముంచినది.

సోదరీమణులారా! నవ్వకుఁడు. మహాపత్తునఁ బడియున్నాము. పరిహాసమున కిది సమయము కాదు. ఈ క్షోభము తప్పించుకొనుట కెంత ప్రయత్నమైనఁ జేయవలయును. ఇఁకను బిల్లల కెంతసేపు రోగములు గదా! వారితో నిద్రాహారములు లేకుండ రేయింబవళ్లు కుందికుంది యేడ్చుటగదా! ఓ భగవంతుఁడా! ఈ పిల్లలను నా కేల యిచ్చితివోయి నాయనా! నే నీబాధ పడలేనోయి తండ్రీ! పిల్లలు లేనివాండ్ర బ్రతుకుకంటె సుఖతరమైన బ్రతుకు లేదుగదా! ఈ పిల్లలతో నన్నెందులకు శిక్షించుచున్నావు? పరాత్పరుఁడా! నే నేమి ఘోరపాప మొనర్చితి నని నన్నిట్లు క్షోభ పెట్టుచున్నా వని హోరని యేడువని దినమున్నదా?..... అనావశ్యక సంతానాంతసాధనములు మన ముపయోగించునెడల యేల యీ తొందర తొందరకానుపు లాఁగియుండవు? అతిసంతాన మగుటచేత నొక్కఁ డైన నారోగ్యవంతుఁ డుండుట కవకాశ ముండదు గదా? ఇట్టి యేలుకపిల్లలను-నిట్టి తొండపిల్లలను-నిట్టి డబ్బెత్తుగాండ్రను గని మన మేమి సుఖపడవలయును? మనచే జన్మ మొందిన యీ నిర్భాగ్యపుఁ బిల్ల లేమి సుఖపడవలయును? అట్టి యిసుళ్ల తెఱవలె-మిడుతల దండువలె-నా సోదరీమణులు బడే బడే కాంచిన సంతానమున-కంగశక్తిమాట యటుంచుము-అంగ పూర్ణతయైన నున్నదా? అబ్బే! ఎక్కడిది? ఎందఱు గ్రుడ్డివాండ్రు! ఎందఱు చెవిటివారు! ఎందఱు మూఁగవారు! ఎందఱు కుంటివారు!.....అబ్బబ్బ! ఇ ట్లెన్ని చెప్పవచ్చును? సంతానసమృద్ధిని బట్టియే రోగసమృద్ధి కూడ నుండును. ఎచ్చట శిశుజననసంఖ్య హెచ్చుగా నుండునో యచ్చట శిశుమరణసంఖ్య మిక్కిలి హెచ్చుగా నుండు నన్న యంశ మిదివఱకు స్థిరపడిన యంశమే! అది సిద్ధాంతమే కావున నా లెక్కలలోనికి మనము పోనక్కఱలేదు. ఇన్ని చావు లెవరి మూలమున సిద్ధించుచున్నవి? మన మూలముననే. మన మింత మహాఘోరపాపము చేయుచుంటి మని యిప్పుడైనఁ దెలిసికొందురా? ''ఏదో యుత్సాహ ముతో భర్తలతోఁ గాఁపురము చేయుచున్నాము. పిల్లలను గనుచున్నాము. ప్రాప్తియున్నవారు దక్కుచున్నారు. లేనివారు లేదు.'' అని యేమో హాషామాషిగఁ బ్రపంచధర్మము ననుసరించి యశ్రద్ధగా ననుకొనుచున్నాము కాని యీ సంతాన సంఘమరణ మహా సమస్యా ప్రాముఖ్య మును లేశమైనను గుర్తింపలేకపోయితిమి. ఈమహాసంఘ మరణమును దప్పించుకొని

ప్రాణములు నిలుపుకొన్న బాలు రెవరైన నున్న యెడల వారిలో ననేకు లెట్టి మహాదురవస్థలో నున్నారో తెలిసికొందురా? చచ్చిపోవుట యంతకంటె మంచి దనుకొనఁదగిన దుష్టస్థితిలో నున్నారు. తెలివియా తేటయా? చుఱుకా కఱుకా? కళయా కాంతియా? ఏమియు లేదు. మందమతులు–పేడబొమ్మలు–కొనవెట్టులు–బుద్ధిహీనులు–అంతేనా? వారిలో మెదడే లేని వారెందఱో యున్నారు. పిచ్చివా రెందఱో యున్నారు. పోనీ, ఇట్టివారు ప్రపంచమున కన్నివిధములుగా నిరుపయోగు లయినను సరే విచారింప బనిలేదు. వీరికిఁ దినుటకయిన నున్నదా? అది యెక్కడిది? ఎందరెన్నెన్ని విధములుగాఁ జచ్చుచున్నను నింకఁ బ్రపంచము జననముచే మిగులఁ గ్రిక్కిఱిసి యున్నది. భూమి వలనఁ గలుగు పంట యిప్పటికే యున్నవారిలో రూపాయకుఁ బదణాలవంతునకైనఁ జాలకుండనున్నది. అట్టిచో నూరకే పుంఖానుపుంఖముగా నెడతెఱపి లేకుండా మనము పిల్లలను గని భూమిపయిఁ బడవైచుట యెందులకు? నే నెరుఁగుదును. మన కీపిల్లల పాతరలు తప్పవు. తినుట కొక్కకబళమైన లేకున్న సరియే, కట్టుకొనుట కొక్కకోకయైన లేకున్ననరియే, పండుకొనుట కొక్క యాఁతాకుల చాపయైనలేకున్న నరే, మన కీపిల్లల పటాలముమాత్రమే తప్పదు. తప్పదు. (వినుఁడు వినుఁడు అని నభలోఁ గేకలు) పిల్లల నేమి ముద్దుముద్దుగఁ బెంపనా, పెద్దవారినిఁ జేయనా? సుఖపెట్టనా? ఏమున్నది? కనుట, చంపుట. ఇంతే కావా? కడుపునుండి పైకి వచ్చినపిమ్మట నిట్లు చంపుటకంటె కడుపులోఁ బుట్టకుండనే చేసికొనుట మహాపుణ్యక ర్మము కాదని యెవ్వరైనఁ జెప్పఁగలరా? బ్రతికియున్న నిర్భాగ్యులలోఁ గొందఱు తిండిలేక –కట్ట గుడ్డలేక–మల మల మాడి యేకూలియైన నాలియైనఁ జేసికొనుటకు దేహదార్ఢ్యములేక వలవల నేడ్చుచు ముచ్చులై, దొంగలై, ముండల తార్పుడుగాండ్రై, త్రాగుఁబోతులై, యాడంగిపందలై తు కాత్మహత్యచే నంతమొందుచున్నారు. ఇంత దురవస్థాగ్రగణ్యము ప్రపంచమున మనవలనఁ గలుగుచున్నది. ఇంత లోకాపత్పరంపర నాఁపుటకుఁ దగిన నదుపాయములు కనిపెట్టఁబడినవి కాని యవియేవో బర్తు కంట్రోలు–లేక–లిమిటేషన్–ఆఫ్ ఆఫ్స్ప్రింగ్ (Birth control or limitation of offspring) అను నీపుస్తకమునఁ జెప్పఁబడి యుండలేదు. కారణ మేమియో యెఱుఁగుదురా? అవి వెల్లడించువారిని సర్కారువారు శిక్షింతురఁట. ఏల శిక్షింపవలయును? ఇది యేటి న్యాయము! అర్భకాధిక మరణసంఖ్య నాఁపుట సర్కారువారికిఁ దప్పుగాఁ దోఁచెనా? స్త్రీప్రపంచము న్యాయమైన సుఖమొంద నపేక్షించుట వారికిఁ దప్పుగా దోఁచెనా? సంపూర్ణ నాగరకతాదశ నొందిన పరిపాలకులే –ప్రజాసౌఖ్య ప్రధానబద్ధకంకణులగు పరిపాలకులే–న్యాయన్యాయపరిశీలనసమర్థు లగు పరిపా లకులే–అట్టివారే యిట్లాచరించుట తగునా? ఇంతకంటె లాభము లోకమున మరియొక్కటి యున్నదా?.....ఇట్టి సంక్షోభమును నివారించుటకై కాంతాలోకమంతయు సంతకములు చేసి యొక్క దరఖాస్తు సర్కారువారి కంపుకొనవలసియున్నది. పరిపాలనతంత్రమున స్త్రీకే ముఖ్యాధికార ముండినయెడల నిట్టిదురవస్థ యిదివరకే యంతమై యుండునే! కానిండు –ఇప్పుడైన నేమియుఁ దొందరలేదు. సోదరీమణులారా! మీరందఱు మీదురవస్థను లోకదుర వస్థనుగూడ నాఁపుటకు శ్రద్ధాసమన్వితలై బద్ధదీక్షలై ప్రవర్తింపవలయును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

అంత నొక్క మునలియామె లేచి యిట్లనియెను.

''ఓయమ్మా! ఇదెక్కడి చోద్యమమ్మా! మీకందఱి కిదేమి పోఁగాలమమ్మా!.....మగలు కావలయును గాని పిల్లలు వలదేమి? ఆ! ఎంత నంగనాచులమ్మా! పిల్లలులేని మాబోటి వారు పిల్లలు లేరని యేడ్చుచుండఁగా నిక్షేపములాగునఁదంగేటిపూఁతలాగున దోసతోఁటలాగున పిల్లలున్న మీరు పిల్లలున్నా రని యేడ్చుచున్నారా? పిల్లలకు ధనమునకు నెక్కువయేమి? పిల్ల లక్కఱలేకున్న యెడల నిక మగముండకొడుకు లెందులకు? మాలాగున ముసుగువైచుకొని వత్తులు చేసికొనుచు మీరుకూడ గూరుచుండుఁడు. ఆపుస్తకముఁ ప్రాసిన బుద్ధిమంతుఁడెవఁడో.....కూడ ప్రాసినాఁడా? (దిగుదిగు యిఁక మాటలాడ కని సభలోఁ గేకలు) మంచిగా నున్నసంఘము మాదిగ మంచము చేయఁదలఁచినారా? మీ కేమి మతులు లేవా? ప్రాచిపని వంట చేసికొనక మీ కీదిక్కుమాలిన సభ యెందులకు? మీకింత పనికి మాలినబుద్ధులు పుట్టుచున్నవేమి? పొండు, ఇంటికిఁ బొండు'' అని యుపన్యాసరంగమునుండి దిగెను.

మఱియొకతె లేచి యిట్లు పలికెను.

''ఇది యభిప్రాయభేదముతో నున్న గొప్పయంశము అధ్యక్షురాలితోఁ బదునార్గురు శ్రీమతు లొక 'సబుకమిటీ' గాఁ జేరి వారా గ్రంథమును బూర్ణముగా విమర్శించి వారి రిపోర్టును సాక్షిసంఘమునకుఁ బంపినయెడల మంచిదని నా యభిప్రాయము.'' అందఱు కూడ నందుల కంగీకరించి యట్లు పదునార్గుర నెన్నుకొనిరి. అందఱు కలిసి దేశమాతృగీతము బాడిరి. మాయింటి యెదుట రెండుమాసములనుండి రోగముతోఁ దీసికొనుచున్న కోమటి చచ్చిపోవుటచే నింటిలో వారేడ్చుచున్నారు. కాఁబోలు నని యులికిపడి లేచితిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

5. వైరాగ్యము

ఒకసారి ఒకయోగి సత్యపురం వచ్చి, సాక్షినఘుంలో ఉపన్యాసం చేశాడు. ఈయోగి పాశ్చాత్య దేశాలు కూడా చూసినవాడు. అక్కడ మానవ దుఃఖనైవిధ్యాన్ని కూడా చూసినవాడు.

దుఃఖాన్ని ఎలా జయించాలి?–అనే విషయం గురించి ఆయోగి ప్రసంగం చేశాడు. ముందు దుఃఖానికి కారణాలు చెప్పాడు. ప్రసంగం మొదట్లో బుద్ధుడు దుఃఖాన్ని నిర్వచించిన వాక్యం ఉదాహరించాడు.

మనిషైనవాడు కడుపులో చిచ్చు చల్లబడడం కోసం గుండెకు నిప్పం టించుకుంటున్నాడని వాసోయాడు. ఒక దుఃఖం నుంచి బయటపడటం కోసం మరి పది దుఃఖాలలో పడుతున్నా డన్నాడు. నాగరకత పెరిగేకొద్దీ దుఃఖాల సంఖ్య కూడా పెరుగుతోందనీ, వాటి నుంచి విముక్తం కావడం ముఖ్యమనీ సూచించాడు.

కొద్దిగా దుఃఖకారణాలు తెరిపిస్తేచాలు ఆ యెడంలో మనుషులు సంతోషపడిపోతున్నారు. తమంత వాళ్లు లేరనుకుంటున్నారు అని–యోగి జాలిపడ్డాడు.

ఇంక–దుఃఖం నుంచి బయటపడడానికి మార్గాలున్నాయని చెప్తూ –దేశాలలో భేదం వుంది. కాలాల్లో భేదం వుంది. జాతిలో భేదం వుంది. కాని పరమార్థం గ్రహించడంలో మాత్రం భేదం లేదని– అన్ని మతాల కర్తలూ చెప్పారన్నాడు. సంసారం విడిచిపెట్టడం కంటె సరైన మార్గం లేదని ఆ కర్తలందరి బోధల సారాంశం. సాంసారం విడిచిపెట్టడమంటే, ఆలుబిడ్డల్ని ఇల్లు వాకిళ్లనీ విదిలేసి అడవులూ, గుహలూ పట్టి పోవడం కాదని వివరణ ఇచ్చాడు. ఈ ప్రపంచంలో అన్ని పనులూ చేస్తూ బాధ్యతలు నెరవేరుస్తూనే మమకారాలు పెంచుకోకుండా తటస్థంగా వుండడమని వ్యాఖ్యానించాడు. సంఘసేవ చెయ్యమన్నాడు.

ఇంతలో శ్రోతల్లోంచి ఒక మహిళలేచి, ఈయోగి తన భర్త అనీ, ఇరవై ఏళ్లక్రిందట విడిచివెళ్లి పోయాడనీ చెప్పి–అతని మాటల ప్రకారమే–ఆ జనసమక్షంలోనే–ఆ నిరాగియోగిని, తనతో కాపరానికి తీసుకువెళ్లిపోయింది.

ఒకయోగి మా సభాభవనమున నిట్లుపన్యసించినాఁడు:–

నాయనలారా! సాక్షినంఘోపన్యాసములను గొన్ని మానముల నుండి యాంధ్రప్రతికా

సారస్వతానుబంధమునఁ జూచుచుంటిని. పరమానందభరితుండ నగుచుంటిని. ఎప్పుడైనను మీగ్రామమునకు వచ్చి మీ సంఘమున నుపన్యాస మీయవలయు ననియునుకొంటిని. శ్రీజగన్నాథ క్షేత్రమునకుఁ బోవుచు మీగ్రామమున నందుకొఱకే బసచేసితిని. కావున నేను జెప్పఁబోవుమాటలను సావధానములగై దయాపూర్వకముగ వినవలయును. నేను జెప్పఁబోవు మాటలు మీ రిదివఱకుఁ బెద్దల వలన వినని మాటలు కావు. జంఘాలశాస్త్రియు మీకట్టిమాట లిదివఱకుఁ జెప్పియే యున్నాఁడు. మంచిమాట లెవరు చెప్పినను వినవలసి నదే. వీణ మీఁద సరిగమలు పింటిమికదా.. చిత్తారుమీఁద నవియే యేల తిరుగ వినవలయు. నని నిరాకరింపఁదగునా? ఎవ్వఁడు గానమొనర్చినను నప్తస్వరములతోడనే. అవి మీసొత్తు కాదు నాసొత్తుకాదు. కాని యీమాటల కేమి?

''సర్వమ్ దుఃఖమ్ దుఃఖ''మ్మని బుద్ధుఁడు చెప్పినమాట పరమార్థమైనది. దుఃఖ మును నివారణచేసికొనుటకే ప్రతిజీవముకూడఁ బ్రయత్నించుచున్నది. ఒక దుఃఖమును దప్పించుకొనఁదలఁచి మరి పది దుఃఖములలోఁ బడుచున్నది. బ్రహ్మచర్యబాధను బాపుకొనఁదలఁచి భార్య బాధ, పిల్లలబాధ, మనుమలబాధ, దారిద్ర్యబాధ, సంతతవైద్య బాధ, శ్రాద్ధబాధలను మనుజుఁ డొందుచున్నాఁడు. లేమిబాధను సహింపలేక తన రక్తమును మాంసమును బుద్ధిని వేరొక్కనికి విక్రయించుకొనుచున్నాఁడు. పట్టెడన్నమునకై పరునికి బానిస యగుచున్నాఁడు. కడుపులోఁ జల్లఁబడుటకై గుండెలకు నిప్పంటించుకొను చున్నాఁడు. నోటిలో నొక్క కబళమునకై మూఁతిపైఁ బది చెప్పుదెబ్బలను దినుచున్నాఁడు. ఒక్కదుఃఖమునుండి నివృత్తికాఁదలఁచి మనుజుఁడు మరి పది దుఃఖములలోఁ బడు చున్నాఁడు. నడకబాధను బాపుకొనఁదనలఁచి బండికై ప్రయత్నించుచున్నాఁడు. దానికొఱ కీడిగలఁబడి కనిపెట్టుకొనుచున్నాఁడు. భోజనమును మానుకొనుచున్నాఁడు. బండి నిమ్మళముగాఁ బోయినయెడల విసుఁగుకొనుచుఁ బరులను దిట్టుచున్నాఁడు. వేగముగాఁ బోయినయెడలఁ బ్రాణము లఱచేతఁబెట్టుకొని యేడ్చుచున్నాఁడు. బండి తిరుగఁబడినయె డల నలిగిచచ్చుచున్నాఁడు. కౌపీన మెలుక కొరికిన దని యెలుకబాధను బాపుకొననెంచి యొక సన్యాసి పిల్లిని బెంచినాఁడు. పిల్లి పాలకై యావును సంపాదించినాఁడు. ఆవు మేతకై పొలమును కొలునకుఁ దీసికొనినాఁడు. పొలముకృషికై రెండెనుపోతులనుసంపాదించినాఁడు. నల్వురు పాలికాపులను జేరఁదీసినాఁడు. పండినపైరా పాలికాపులు హరించుటచే వారినిఁ జెడమడఁ దిట్టినాఁడు. వారు క్రోధోద్రేకమునఁ గొట్టిన దెబ్బలను బడినాఁడు. శిస్తిమ్మని బాధించిన కరగ్రాహితో నిచ్చితి నని యసత్యమాడినాఁడు. నిదర్శన మేదని యాతఁ డడుగ దివానుసంతకముతో రసీదును సృష్టించినాఁడు. జిల్లాజడ్జిచేతఁ బదునాలుగు సంవత్సరములు కఠినకారాగృహముననే ప్రాణములు గోలుపోయి పంచములచే నీడ్చి వేయఁబడినాఁడు. ''పోగొట్టుకొనఁదలఁచిన నొక్కదుఃఖముపైన బుద్ధిపూర్వకముగఁ బడవైచికొనినవి పదునా ల్గిదుఃఖములు. నాగరకత వృద్ధియైనకొలఁదిఁ బ్రపంచమున దుఃఖములు వృద్ధియగుచున్నవి. మనకిప్పు డున్న నాగరకత నెరుఁగని మన పూర్వులొందిన దుఃఖములకంటె మన మిప్పుడు సహస్రగుణము లధికములగు దుఃఖము లొందుచున్నాము. పూర్వమున బాలుర కీ దుర్బల త్వము లేవి? ఈదురభ్యానము లేవి? బాలికల కిప్పటి పదియేండ్ల సమర్థలేవి? మనుజుల కీ యకాలమరణము లేవి? ఇన్ని కోర్టు లేవి? ఇందఱు న్యాయవాదు లేరి? ఇన్ని యసత్యము లేవి? ఇన్ని కారాగృహము లేవి? ఇన్ని రోగము లేవి? ఇందఱు వైద్యు లేరి? ఇన్ని మరణము

లేవి? ఇన్ని పాఠశాల లేవి? ఇంద ఱుపాధ్యాయు లేరి? ఇందఱు శుంఠ, లిందఱు మూఢులు, నింద ఱవిధేయు లేరి? శకటాది సదుపాయములును లేవు. ఇన్ని యుపద్రవములును లేవు. ఇన్ని నౌకాప్రయాణములు లేవు. ఇన్ని జలమరణములును లేవు. ఇంత ప్రకృతిశాస్త్రాభివృద్ధియు లేదు. ఇంత ప్రాణాపహరణము లేదు. పాశ్చాత్య దేశములోఁ గొన్ని మహాపట్టణములను నేను జూచితిని. హర హరా! ఏమని చెప్పను? తిండిలేక మలమలమాడుచున్న దిక్కుమాలిన పిల్లల రోదనధ్వనులు పర్వతములను బగులఁజేయఁ జాలియున్నవి. పరిణయ ప్రమాణములు బహుభంగుల నాచరించిన విటాధములకుఁ జిక్కి వివాహపూర్వరంగమందే వేవిళ్ల బాధలు పడవలసివచ్చిన కామినుల కన్నీళ్లు సెలయేళ్లవలెఁ బ్రవహించుచున్న వనుమాట యతిశయోక్తి కాదు! అనవరతము కాలిపోవుచున్న యనాథలగు నబలల హృదయముల నుండియు, నభాగ్యులగు బ్రహ్మచారుల హృదయముల నుండియు వెలువడుచున్న ధూమపటలముచే గ్రహము లాచ్ఛాదితము లగు చున్నవి. వట్టి ముష్టి చిప్పతో–చింకిపేలికలతో –శల్యసంజరసన్నిభస్వరూపముతో–విచ్ఛిత్తైన గర్భముతో, నశ్రుప్రవాహమున డాగులుపడిన దౌడలతో–వికలాంగములతో–వ్రణబాధలతో–నభాగ్యదేవత నెత్తిపైఁ జేతు లుంచుకొని మోకాళ్లపైఁ దల వ్రాల్చి భూకంపము గలుగునట్లు రోదనము చేయుచున్నది. పాపము పండి బ్రద్దలై కుళ్లి మురుగుడెత్తి ప్రపంచమంతయు దుర్గంధభూయిష్ఠముగా నొనర్చుచున్నది.

ఈ దుఃఖములన్ని ప్రజలు హోరని యేడ్చుచు ననుభవించు చున్నారు. దానిని దప్పించుకొనుటకై భూమ్యాకాశములను గలుపు నంతటి ప్రయత్నము లొనర్చుచున్నారు. ఆప్రయత్నములతో దుఃఖములు శమించుట లేదు. సరికదా శతసహస్రగుణాధికము లగుచున్నవి. ఎక్కడఁ జూచిన నేడుపు–ఎక్కడఁ జూచిన బాధ–ఎక్కడఁ జూచిన దుర్మృతి –ఎక్కడఁజూచిన రోఁత–ఎక్కడఁజూచిన మహాపాపము–తుపానుగాలియైనను నడుమనడుమఁ గొంతశమించునట్లు దానానలమైనను నడుమనడుమఁ గొంత యడఁగినట్లు దుఃఖజాలముకూడ స్వభావము ననుసరించి కొంత శాంతించినపుడు మనుజులు మహోత్సాహమున నుప్పొంగుచున్నారు. కెవ్వున నార్చుచున్నారు. తమవంటి ప్రయోజకులు లేరని గర్వాతిరేకమున గంతులిడుచున్నారు. ప్రపంచమునకు మేమే ప్రభువుల మని ప్రగల్భము లాడుచున్నారు. సృష్టితంత్రమంతయు మాకుఁ గరతలామలకమని యాత్మీయస్తోత్రకథాకలాపములతో విఱ్ఱవీఁగు చున్నారు. ఉపశమిల్లినట్లు కాసంత కనఁబడిన దుఃఖములు తమ స్వభావము ననుసరించియే తిరుగ విజృంభించినవి. మఱల ఱాలవర్షము తలలపైఁ గురియుచున్నది. మఱల నగ్నిపర్వతములు హృదయములఁ బగుల్చుచున్నవి. మఱల దారకమునకుఁ దారకమునం దేడ్పులారంభములైనవి. ఆఱవకాలమున కాఱవకాలములోని రోదనతాళములు రోదసీకుహర మదర మ్రోఁగుచున్నవి. ఉత్సాహము లుపశమిల్లినవి. ఆత్మశక్తినిశ్వాసము లంతరించినవి. గర్వాతిరేకములు గంగపాలైనవి. ప్రపంచ ప్రభుత్వము భగ్నమైనది. తమ కాలిక్రిందఁ జీమకుఁ దమకు వస్తుతత్వముచేత శక్తి విభజనముచేతఁ బ్రకృతిపరిపాటిచేత భేదము లేశమైనను లేదని కాసంతజ్ఞానస్ఫులింగము మెదటిలో నుదయించినది. సృష్టికిఁ బరమార్థప్రభుఁడు భగవంతుఁ డని యిప్పుడు రవంత గోచరించినది. అట్టి మనస్థితితోఁ దలలు వంచుకొనుచున్నారు. చేతులుజోడించు చున్నారు. చెవులలో వ్రేళ్లు క్రుక్కుకొనుచున్నారు. తలల కొట్టుకొని దైవస్మరణ మొనర్చుచున్నారు. వేంకటేశ్వ

రునకు వెండ్రుకలు మొదలు వేయూరు లిచ్చెద మనుచున్నారు. తమ్ములు లాగికొనుచు న్నారు. ముడుపులు కట్టుచున్నారు. మ్రొక్కులిడుచున్నారు. నెత్తిపై మొత్తుకొనుచున్నారు. ప్రమాణములను జేయుచున్నారు. భగవంతుఁడా యని పరపరివిధములఁ బలవించుచు న్నారు. స్వభావమునననుసరించితిరుగ దుఃఖములు కొంత శాంతించినవి. తోఁకతీసిన పేకజువ్వవలెఁ దిరుగ నెంతయల్లరియైనఁ జేయుచున్నారు. వెట్టు లెత్తి వీరావేశములచే విజృంభించుచున్నారు. బొంబుల వలెఁ బ్రేలి పడుచున్నారు. పరిపూర్ణజగత్పట్టాభిషేకమునకుఁ దిరుగఁ బ్రయత్నించుచున్నారు. మ్రొక్కులు లేవు. ముడుపులు లేవు. ప్రార్థనలు లేవు. భగవంతుఁడు లేఁడు. నిజమైన భక్తియా వల్లకాడా? కాలిలో ముల్లుగ్రుచ్చుకొన్నప్పు డబుద్ధిపూర్వకముగ నమ్మా యని యఱచినట్లు గుండెలలోఁ బోటు తగులగానో గొరవంకపలుకువలె గోవిందనామస్మరణము. అది దాఁటిన వెంటనే యెప్పటిమాటయే! అంతకంటె నేమియు లేదు. మనుజుల సిగ్గుమాలిన బ్రదుకిట్లున్నది. నీతిమాలిన ప్రవర్తన మిట్లున్నది. జ్ఞానశూన్యమైన యవస్థ యిట్లున్నది. ఏమని చెప్పనచ్చును. చీ. చీ. ఇంత దిక్కుమాలినగతి మఱి యెచ్చటనైననున్నదా? ''ఈదుఃఖము లన్నియుఁ బడుచు దలఁ గొట్టుకొనుచు నేడ్చుచు నుండవలసినదేనా? మఱియేమైనఁ దారకపూర్గమున్నదా? లేవేమి? లేకున్నయెడల మత మెందులకు? భగవంతుఁ డెందులకు? ప్రపంచము మహాదుఃఖ భూయిష్ఠమని యెఱిఁగియుండియే. దుఃఖశాంతి నాచరించినకొలఁది దుఃఖన్వృద్ధి యగునని యెఱిఁగియుండియే, ఇహలోకజీవనము జీవనముకా దని యెఱిఁగి యుండియే, శాశ్వతమైన పరలోకజీవన మున్నదని యెఱిఁగియుండియే, ప్రపంచమునన్నున్న సర్వమతకర్తలుకూడ సంసారత్యాగముకంటె సమ్యక్సాధనము లేదని సముద్ఘోషమున బోధించిరి. కాన్స్టాసియను బోధయే గౌతమబుద్ధుని ప్రతిధ్వని–విషపాత్రతో సోక్రటీసు పాడిన సంసారపరిత్యాగగీతమునకే కొరతమేకులతో నేసుక్రీస్తు పాఠాంతరము పాడినాఁడు. దేశములో భేద మున్నది. కాలములో భేద మున్నది. జాతిలో భేద మున్నది. కాని పరమార్థగ్రహణమున మాత్రము వారికి భేదము లేదు.

''సంసార పరిత్యాగ మన నేమియో సంపూర్ణముగఁ దెలియక సతిని విడిచి –సంతానము విడిచి జోగులై–పరమహంసలై–బైరాగులై–పర్వతగుహాంతరములకు వనప్రదేశ ములకుఁ గొందఱు పోయిరి. ఎండ కెండి, వాన[illegible]ఁ దడిసి, పంచాగ్నుల నడుమఁ బరితపించి, గబ్బిలముల వలెఁ గాళ్లపై వ్రేలాడి, యూర్ధ్వబాహులై కొంత చచ్చి యొంటి కాలిపై నిలువఁబడి మొఱఁగై, పద్మాసనమునఁ బ్రాణాయామదీక్షచే స్తంభించి, మఱింత బాధలకు లోనైరి. దేహ మెండినది కాని యాశయెండినదా? తలవెండ్రుకలు పండినవికాని తత్త్వము పండినదా? జంట లంకురించినవి. కాని జ్ఞాన మంకురించినదా? అంగశక్తి తగ్గినది కాది యరి షడ్వర్గబాధ తగ్గినదా? బలాత్కారమునఁ బ్రతిరోధించుటచే మఱింత హెచ్చినవేమో? అనుభవించినవాఁడను నేను జెప్పుచుండఁగా హెచ్చలే దని మీరు చెప్పఁగలరా? కదలకుండు టకై కంఠమువఱకుఁ బూడ్పించు కొన్న యోగికిఁ జిత్తము మునుపటికంటెఁ జంచలమైపోవు చున్నది. ఉపవాసమొనర్చి ధ్యానించుచున్న బైరాగికి సర్వదా యెదుట నిలువఁబడునది పరమాత్మ కాదు. పప్పుకుండ. కచ్చగట్టిన జోగికి గన్నుమూసినఁ గాంత, కన్నుఁ దెఱచినఁ గాంత, కలలోఁ గాంత–వీరే సంసారములలో నుండినయెడల వీరి కింతబాధ యుండదు. ఇంత సంతతదుఃఖ ముండదు. ఇంత తదేకదృష్టి యుండదు. ఇంత వెఱ్ఱిదేవులాట యుండదు.

ఇంత దయ్యపుటూఁకలి యుండదు. ఇంత రాక్షసకామ ముండదు. ప్రపంచ పరిత్యాగ మనఁగా నడవిలోఁ బడి యింటికొఱ కేడ్చుట కాదు. ముక్కు గట్టిగమూసి తిండికై పోరు తెఱచుకొనుటకాదు. పంచాగ్ని మధ్యమున నిల్చి పచ్చిమంచపు టానందము నపేక్షించుట కాదు. లంగోటి బిగించి జాఱుపైటకై యుల్లూతలూరుటకాదు. యోగినులకు వేవిళ్లబాధ నిచ్చి సన్యాసులు సుఖవ్యాధిబాధ నొందుట కాదు. నీవు భవపరిత్యాగము చేయ నక్కఱలేదు. పర్వతగుహాంతరసీమలోఁ బస్తుండ నక్కఱ లేదు. శరీరవ్యధ లేమియుఁ బొందనక్కఱ లేదు. అంతరంగనిరోధ మేమియు నాచరింప నక్కఱలేదు. హృద్రసముల నెండఁ జేసికొన నక్కఱలేదు. ఆశాపాశములఁ ద్రెంపుకొన నక్కఱలేదు. నీ యిష్టానుసారముగా నింటిలో నుండవచ్చును. సతితోఁ గాఁపురము చేయవచ్చును. సంతానమును గనవచ్చును. ధనాదినం పాదన మొనర్పవచ్చును. (అటులైన సంసారదుఃఖము లెట్లు పోవును? మాకుఁ దెలియకుండ నున్నది అను కేకలు) భవదుఃఖము లెట్లు పోవునా? భవపరిత్యాగమువలన –భవపరిత్యాగమువలన. (భవపరిత్యాగము చేయుటయేమి? సంసారమును వదలకుండ నుండుటయేమి; అసందర్భముగా నున్నది యను కేకలు) అసందర్భ మేమియు లేదు. అసందర్భ మని నీకుఁ దోఁచునది యసందర్భము కాదు. భవములో నుండియే భవపరిత్యాగ మొనర్పవచ్చును. ప్రపంచములో నుండియే ప్రపంచవిసర్జన మొనర్పవచ్చును. అది యెట్లో చెప్పెదను. యథార్థ ప్రపంచమును నీవు చూచుట లేదు. నీవు చూచునదేదో మిథ్యాప్రపం చము. నీయింద్రియములకుమాత్రమే గోచరమగునది, నీవు ప్రపంచమని భ్రాంతిపడుచు న్నావు. నీ యజ్ఞానముచే నీ కంతకంటెఁ దెలియకుండ నున్నది. మాయాతిరోహితుఁడనై నీవు దుర్భ్రమ మొందుచున్నావు. ఇది చెట్టని–యది పుట్టయని–అది పశువని వాఁడు మనుజుఁడని–ఇది యాఁడుదని–వాఁడు మగవాఁడని–యది యంబువని–యిది యగ్నియని –వ్యక్తి వ్యక్తికి–వస్తువస్తువునకు భేదములు కల్పించుకొనుచున్నావు. భేదము మిథ్య. భేదశూ న్యతయే పరమార్థము. అదియే పరమాత్మతత్త్వము. అది నీ యింద్రియముల కగపడు నన్నినస్తువులందును వ్యాపించియున్నది. కన్నులు తెఱువుము. మనస్సును దెఱువుము. మాయాయవనికఁ ద్రోచివేయుము. నీకా పరతత్త్వము–ఆ పరంజ్యోతి–ఆ పరబ్రహ్మము –అగపడును. అగపడి తీరును. ప్రపంచమంతయు భగవన్మయమై యున్నది. ఆ సంగతి నీవు తెలిసికొన వలయును. అట్లు చూచుటకు నేర్చుకొనవలయును. శ్రమపడి యాయవలో కము నభ్యసింపవలయును. నీలో భగవంతుఁడు, నీ పిల్లలలో భగవంతుఁడు, నీ మిత్రులలో భగవంతుఁడు, నీ వైరిలో భగవంతుఁడు, పర్వతములో భగవంతుఁడు, పరమాణువులో భగవంతుఁడు–ఎల్లయెడల భగవంతుఁడు ఇంక నీకు దుఃఖము. మిత్రుఁడు వైరి యను భేదబుద్ధి నీ కుదయించినప్పుడుకదా నీకు దుఃఖము. హెచ్చుతగ్గులను వ్యత్యస్తబుద్ధి నీకుఁ గలిగినప్పుడుకదా నీకు దుఃఖము. నీవస్తు వేదియో పోయినప్పుడు కదా నీకు దుఃఖము. ఉన్న దొక్క భగవంతుఁడే యైనప్పుడు నే నెక్కడ? నీ వెక్కడ? నాకేమి నీకేమి? మిత్రమేమి వైరియేమి? హెచ్చేమితగ్గేమి? మంచియేమి చెడ్డయేమి? ఉండుటయేమి పోవుటయేమి? పుట్టుకయేమి చావేమి? ఏమియులేదు. ప్రపంచదుఃఖము లేదు. ప్రపంచము లేదు. ప్రపంచపరి త్యాగ మనఁగా నిదికాని యడవికిఁబోయి యాకలములఁ దినుట కాదు. భార్యాపుత్రుల నింట నేడ్పించి వారికంటె నెక్కువగాఁ దా నడవిలో నేడ్చుటకాదు.

కాని యట్టియుత్తమస్థితి యుసన్యాసములకే కాని యాచరణమున నక్కఱకు రాదని

యందురేమో–అక్క–అకు రాకపోవుటకాదు అక్క–అకువచ్చును. ఇట్లు సంపూర్ణప్రయత్నము చేత–సంతతసాధనము చేత–సత్త్వగుణసంపత్తిచేత–తలఁపులో–మాటలో–జర్యలో–సదా భగవంతుని నిలుపుము. భగవంతునిపై దృష్టిలేకుండ నొక్కతలఁ పైనఁ దలఁపకుము. ఒకమాటయైన నాడకుము. ఒక్కపనియైనఁ జేయకుము. నీభార్యాపుత్రులను నీయొద్ద గొంతకాల ముంచు మని నీకు భగవంతుఁ డప్పఁజెప్పినవా రని మనఃపూర్వకముగా నెంచుకొనవలయును. వారు నీయొద్ద నుంపఁబడినవారే కాని నీవారుకా రని నిశ్చయముగా నమ్మవలయును. వారు భగవంతునిసొత్తని నమ్మవలయును. నీకున్న ధనమునకు నీవు స్వామి వని యెంచవలదు. నీయాస్తియంతయు భగవంతునిదే. అది భగవదిచ్ఛచే నేమియైన నగుఁగాక. ఎట్లుపోయినఁ బోవుఁగాక. పరక్షేమమునకే నీ వెప్పుడు ప్రయత్నించుచుండవల యును. సోమరివై యుండక సర్వదా పరశ్రేయమునకే పనిచేయుచుండవలయును. సంఘసేవ కంటె సత్కార్యములేదు. క్రమక్రమముగా నీకు స్వార్థపరత్వము వదలును. నీచిత్తము నీలోపలనే గుడుగుడుగుంచము లాడుట మానివైచి వెలుపలికి విజృంభించును. నాఁడుదాఁటి దేశము, దేశముదాఁటి ఖండము, ఖండముదాఁటి గోళము. తుదకు జగత్తంతయు నీహృద యము వ్యాపించును. ఇట్లు కొంతకాలము నీ వభ్యసింపపలయును. మొట్టమొదట నీతల్లిగా రిని పరబ్రహ్మస్వరూపముగా భావింపుము. ఆమెను గౌరవించి, మన్నించి, స్మరించి' సేవించి, యారాధించి యామెకొఱకే బ్రదుకని యెంచి యామె సెలవునకు బద్ధుఁడవై సదా యామె పరిచర్యయందే బద్ధదీక్షుఁడవై యుండుము. ఇట్లు కొంతకాలము గడచినపిమ్మట నామెలో భగవంతుని నీవు గాంచెదవు. తరువాత నీతండ్రి గారియెడల నట్లే ప్రవర్తింపుము. ఈసారి నీవు శీఘ్రకాలములోనే కృతార్థుఁడ వగుదువు. తరువాత నీగురువునెడల నట్లే ప్రవర్తింపుము. నీవు మరింతత్వరలోఁ గృతకృత్యుఁడ వగుదువు. తరువాత నీపిల్లలలో భగవంతుని జూతువు. నీభార్యలోఁ జూతువు. తుదకు జగత్తులో నన్నివస్తువులందును నీవు భగవంతునిజూతువు. ఇఁక నీవు సతితో నున్ననేమి? సంతానవంతుఁడ వైననేమి?''

ఈమాట లాయోగి పలుకుచుండఁగా సభాసదులలోనుండి యొక కాంత గడగడ లాడుచుఁ గన్నీరు పెట్టుకొనుచు మేలిముసుఁగుచే ముఖకాంతి నడ్డుపఱచుకొనుచు నుపన్యా సరంగమునకువచ్చి గద్గదస్వరముతో నిట్లు పలికెను:–

''సోదరులారా! ఈగ్రామములోనికి మాయక్కగారిని జూచుటకు వచ్చియుంటిని. నాది మఱియొక యూరు. ఆయూర మాతండ్రి గారియొద్ద నుంటిని. నీభర్త యెవరని యడిగెదరేమో? ఈయోగియే నాభర్త. ఈతఁడు నన్నిరువది యేండ్లక్రింద విడిచి యోగులలోఁ గలిసి పోయినాఁడు. నే నతనితో మూఁడేండ్లు కాపుర మొనర్చితిని. నాకుఁ బదునాఱవయేట నీతఁడు నన్ను విడిచిపోయినాఁడు. ఈతని కప్పటికి 19 సంవత్సరములు. ఈతనిమాటలవలన నీతఁడు ప్రపంచవస్తువు లన్నిటి యందుఁగూడ భగవంతుని జూడఁగలి గినవాఁ డని తోఁచుచున్నది. అట్టి వాఁడు సతితో నున్ననేమి? సంతానవంతుఁ డైన నేమి? యని యిప్పుడే సెలవిచ్చియున్నాఁడు. నే నాతని నతిని. అందువలన నాతనితో సంసార మొనర్చుట కర్హురాలను. ఈతఁ డట్టి జగద్బ్రహ్మదర్శన సమర్థుఁడు నాతో నింక సంసారమొ నర్చుటకు మీరందరు దయతో ననుజ్ఞ నీయవలయును. సాక్షిసంఘసభ్యుల కితని యుపన్యా సమువలన భగవద్దర్శనమైనదో లేదో కాని నాకు భర్తృదర్శన మైనది. నేను నాభర్తలో

భగవంతునొజ్ఞాచుచున్నాను. ఈతఁడు నన్ను విడిచి వెడలిపోయినప్పటి నుండియు నీతని ఛాయావిగ్రహమును బైటచాటున దాఁచుకొని యాతనిని స్మరించుచు నధశ్శయన బ్రహ్మచర్యవ్రతము లాచరించుచుఁ గాలక్షేపమును జేయుచున్నాను. ఇదిగో యాతని పటము.'' అని సభాసదులవంక దానిని విసరివైచి భర్తను జేయిపట్టుకొని యింటికిఁ దీసుకొని పోయెను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

6. పాచకమహాజనసభ

రాజమండ్రిలో, గోదావరి మండలంలో ఉండే వంటవాళ్ళ పంచమవార్షికోత్సవం ఇటీవల జరిగిందంటూ, ఆ సభా విశేషాలు ఒక ప్రేక్షకుడు సాహిత్య సంఘానికి వ్రాశాడు.

సభకు సుమారు ఎనిమిది వందలమంది ప్రతినిధులు– నీళ్లుమోసే వారు, వంటలు చేసేవారు కలిసి– వితంతువులు, పురుషులు కలిసి– హాజరయ్యారు. సభ గోదావరీ తీరాన కంభంవారి సత్రంలో జరిగింది. ఈసారి విశేషం ఎక్కువ సంఖ్యలో 'వితంతు' వంటవారు రావడం.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు సభకు స్వాగతం చెప్పి–దైవ ప్రార్థన చేయించి –కొంతకాలం కవిత్వ రచనలో కృషిచేసి, దలీమిలా మానేసి, వంటవాడి వృత్తిని చేపట్టిన దివ్వి కామకవి గారిని సభాధ్యక్ష పదవిని అలంకరించమని ఆహ్వానించాడు.

దివ్వి కామకవిగారు ఉపన్యాసం అందుకున్నారు. అసలు వంటవాళ్ల విశిష్టత వివరించబోతూ–లలితకళలతో పోలికలు చెప్పి శిల్ప, చిత్రకళలు బలాదూరు అన్నారు. రస దృష్టితో చూస్తే కవిత్వ కళ కూడా ఈ వంటల కళ ముందు దిగదుడుపేనని వక్కాణించి ఉదాహరణలతో నిరూపించాడు. కవి ముదిరి కాని, వంటవాడు కాలేడని సిద్ధాంతం చేశాడు. కవులంతా వంటవాళ్లైతే స్వరాజ్యం సిద్ధిస్తుందని–వంటవాళ్లే స్వరాజ్యం సాధించుకున్న నల, భీములిన్ని ఉదాహరించాడు. కడకు సభకు ప్రధానం ఉపన్యాసాలు కావనీ, కట్టుదిట్టమైన తీర్మానాలని చెప్పి–ఏడు తీర్మానాలు ప్రవేశపెట్టి–ఆరింటిని ఆమోదింపజేశాడు. వాటిలో ముఖ్యమైనది వంటవాళ్ల పాండిత్యాన్నిబట్టి వివిధ బిరుదాలివ్వాలనేది.

ఈ తీర్మానాల తతంగం ఒక కొలిక్కి వస్తూండగా, ఒక వితంతువు కంఠంలోని బంగారు పలకసరులు ఎవరో తెంచుకుపోతారనే గడబిడ కారణంగా, అంతా సభ నుంచి వెళ్లిపోయారు.

ఒక ప్రేక్షకుడి ట్లు వ్రాయుచున్నాడు.

గోదావరీమండల పాచకమహాజనసంఘమువారి పంచమవార్షికోత్సవపరిషత్తు రాజమహేంద్రవరమున గోదావరీనదీతీరస్థమగు కంబము వారిసత్రమున నీ నెల 1వ తేదీని మిగుల

జయప్రదముగా జరిగినది. సుమా రెనిమిదివందల ప్రతినిధులు మండలములోని యనేక గ్రామముల నుండి విచ్చేసి సభ నలంకరించుటచే సభ మిక్కిలి క్రిక్కిరిసి యున్నది. ఇదికాక వంటలు వండియో నీళ్లుమోచి పై పనులు చేసియో జీవించుచున్న వితంతువు లెందరో యీసారి తమ యడ్డుకట్టులతో ప్రేలు పైటలతో వింతముసుగులతో బాచకజనమహాస భకు దయచేసి పరిపూర్ణ ప్రభావటలమును బ్రసాదించిరి. క్రిందటి సభనుండి యిప్పటి వరకు గాల మొక్క సంవత్సరమే ముందునకు నడిచినదికాని, పాచక వితంతువుల పరిషత్ప్రవేశమున నాగరకతమాత్రము నలుబదిసంవత్సరములు ముందునకు నడచిన దని చెప్పక తప్పదు. ఇది దేశాభివృద్ధికి నిశ్చయ నిదర్శనము. ఇందలు సోదరీమణు లక్కడ నవతరింతు రని యెరుగక వారికి సభలో గూరుచుండుటకు బ్రత్యేకస్థల మేర్పాటు కావించియుండలేదు. తాత్కాలికముగా బ్రత్యేకప్రదేశ మేర్పాటు చేయుట కవకాశము లేకపోవుటవలన వంటవారు వంటలక్కలు కలసియే కూరుచుండిరి. ఈవైపున వంటవాడు –ఆవైపునవంటవాడు–నడుమ వంటకత్తె–ఈవిధమున దాదాపుగా నందలు సర్దుకొనిరి. వహ్వా! సభ యెంత సౌందర్యముగా నున్నదో చెప్పదరమా? ఈరంగమే యింత యానందరసప్రవర్షణ ప్రవీణమై యున్నదే! ఆహాహా! శ్రీకృష్ణ గోపికారాసక్రీడారంగ మెట్లు వెలిగిపోయినదో యెవడు చెప్ప గలడు? వంటవాండ్రు కుచ్చెపాగలను సర్దుకొనుచు న్నారు. వంటలక్కలు తలకొప్పులను సవరించుకొనుచున్నారు. పురుషుల క్రీగంటి చూపులు సవ్యసాచి బాణములవలె గుడియెడమలకు గోలాహలముగా వ్యాపించి ప్రక్కల నున్న పూర్వసువాసినుల మెడలలో బూలదండలగు చున్నవి. చూచి చూడనట్టి చూపులు గల సుదతీమణుల చూపులు ముసిముసి నవ్వుల కాంతులతో గడలద్రొక్కి వంటవాండ్ర చెవులకు గుండలము లగుచున్నవి. పురుషులు పనిలేనిదే గొంతుకలు సవరించుకొనుచు న్నారు. మగల నెడబాసిన మగువలమిన్నలు నిర్హేతుక దీర్ఘనిశ్వాసములచే నుబికి చల్లారుచు న్నారు. పూర్వాభ్యాసములచే బురుషలిట్టియిట్టి కాళులు కంపించుటచే గాబోలు వితంతుల పైటలు రవంత చలించుచున్నవి. ఇంతలో మేళతాళములతో దిరువీథులు వేంచేసి సభలోనికి దయచేసిన యధ్యక్షాహ్వానసంఘాధ్యక్షుడు ఉపన్యాసరంగమున నిలువబడి ''సోదరసోదరీమణులార! సభాప్రారంభమునకు బూర్వము కొలదిగా దైవప్రార్థన మొనర్ప వలసియున్నది. కావున మీరందరు లేవవలయును'' అని చెప్పెను. ఒక వితంతువు లేవబోయి లేచుట కేదియో యభ్యంతర ముండికాబోలు లేవలేక కిసుక్కున నవ్వెను పరిశీలింపగా విశేషాభ్యంతర మేమియు లేదు. ఆమె వాలు పైట చెలగుమీద స్థవిష్ణుడగు నొకవంటవాడు కూరుచుండెను. అతడు వేక లేవలేకపోవుటవలన నీమె లేవగలిగియు లేవలేకపోయెను. ఒకవంటవాడు తలతిరుగుడు రోగముగలవాడగుటచే గాబోలు లేచి తూలిపోబోవుచు ప్రక్కనున్న వితంతువుభుజముమీద జెయివైచి యూపుకొనెను. సన్ని హితదైవప్రార్థనాసమాయత్తచిత్త యగుటచే గాబోలు నామె దానిని బరిగణింపనే లేదు. అంత నాహ్వానసంఘాధ్యక్షుడు మధ్వశాస్త్ర సంపన్నులగు ఆ నరసింహాచార్యులుగారిని దైవప్రార్థన మొనర్ప డని హెచ్చరించిరి. అంత నాతడు ''అంగనామంగనా మంతరా మాధవమ్.'' అను కర్ణామృతశ్లోకములను జదివెను. ఆ శ్లోకమును నాతడు చదువుచుండగా స్త్రీ పురుష నయనములు హస్తములు ముకుళిభావము నొందినవి. అందరు తిరుగ గూరుచుండిరి. అప్పుడు మాత్రము సభవారికి రవంత యిబ్బంది కాసంత నలుగుడు

కొంచె మొత్తుడు నిసుమంత తొట్రుపాటును గలిగినట్లు కానఁబడినది. కాని సభ రెప్పపాటు కాలములో నిశ్శబ్దముగా నుండెను. దేశాభివృద్ధికై జాత్యైకమత్యాభివృద్ధికై చేరిన పురుష పూర్వసువాసినీ పాచకమహా జనసంఘములోఁ గాలిత్రొక్కుఁలు గణింపఁదగినవా? ప్రక్క పోట్లు లెక్కింపఁదగినవా? వస్త్రాకర్షణబాధలు శోధింపవలసినవా? తొందరలోని త్రోఁపులా టలు పాటింపఁదగినవా? ప్రతిమహాజనసంఘమున కామాత్రపు టవ్యవస్థ సహజమే. అంత గొంతుబొంగు దగ్గుచేఁ దగ్గించుకొనఁ బ్రయత్నించి యాహ్వానసంఘాధ్యక్షుఁడు రొంట నున్న పొడుముకాయ నెడమచేతిలో దులిపి పెద్ద యుపదేశముద్రను బట్టి దానిని బ్రహ్మరంధ్ర మున కెగఁ బ్రాకనిచ్చి యిట్లుపన్యసించెను:-

''సోదరీమణులారా! ముందుగా మీకే నుస్వాగత మిచ్చుచున్నాను. దీపికలచే గృహము, పుష్పలతలచే నారామము, చుక్కలచే నాకసము వెలిఁగిపోయినట్లు మీచే నీసభ యసాధారణశోభాధురీణమై యొప్పుచున్నది. మీరే భావికాలదేశభాగ్యదేవతలు. మీయార్థికా భివృద్ధివలనఁ గాని దేశాభివృద్ధిలేదు. మీవిద్యాభివృద్ధివలనఁ గాని భాషాభివృద్ధిలేదు. మీస్వాతం త్ర్యాభివృద్ధివలనఁ గాని జాతీయతత్త్వాభివృద్ధిలేదు. మీ రీనభలో నిట్లు సమావేశమగుట మహానందదాయకముగా నున్నది. భారతీయపురోభివృద్ధికిఁ బ్రబలనిదర్శనముగా నున్నది. పరలోకమును జేరవలసివచ్చిన మీభర్తలేకాక యార్యావర్తపితృదేవత లందరుకూడ. మీబుద్ధిపి భవమునకు, మీ నాగరకతాధికతకు, సౌశీల్యమునకు మీ స్వాతంత్ర్యమునకు మహానందభరి తులై యున్నారని నేను జెప్పఁగలను. ఆర్యావర్తమునకెల్ల రెండే యద్భుతములగు నభిజ్ఞా నములు. మొదటిది దేవాలయములు, రెండవది వితంతువులు. భారతీయులకెల్ల నీరెండే పవిత్రవస్తువులు. అట్టి మీదర్శనము సాక్షాద్దేవతాదర్శనము కంటె వేరుకాదు. మీకుఁ బ్రత్యేకస్థలము నిర్దేశింపఁబడలే దని నేను మొదట విచారించితినిగాని మీరిట్లు నీరక్షీరన్యా యముగాఁ గలసి కూరుచుండుటచే నే నిప్పు డత్యంతానంద మొందుచున్నాను. (ఔను మేము మీకంటె నెక్కువ సంతసించుచున్నా మని పురుషులు కేకలు) స్త్రీపురుషులు సమాన వ్యక్తికలనారని, సమానశక్తికలవారని, సమానబుద్ధికలవా రని, సమానాధికారముల కర్హతకలవా రని మీరు లోకమునకుఁ దెలియఁబఱచినారు. స్వచారిత్రమునఁ జూపించినారు. ఇదియే జాతీయతకుఁ గట్టిపట్టు. ఇదియే స్వతంత్ర పరిపాలనకు మొదటిమెట్టు. సోదరసోదరీమణు లారా! ఏది రాజరాజనరేంద్రుని యాస్థాననగరమో, యెచ్చట నాచన సోముఁడు-భార (కాదు నన్నయ్యభట్టని చెప్పుటతగును. అని కేకలు) నన్నయ్యభట్టు భారతమును రచియించెనో యట్టిపురాతననగరమగు రాజమహేంద్రవరపట్టణమున కఖిలాంధ్రపాచకమహాజనసంఘపక్ష మున నేను మీకు స్వాగత మిచ్చుచున్నాను. మన మింకఁ గాలవిలంబన మొనర్పక, యధ్యక్షుని నెన్నుకొనవలయును. ఏమహానుభావుని కవిత్వము తనకును లోకులకుఁ గూడఁగిట్టకపోవుటచేఁ గవిత్వమునకుఁ బరమకైంకర్య మొసర్చి యంతకంటె రసవత్తరజీవన మగు గంగాధరత్వము నవలంబించి యాంధ్రుల యత్యాదరణ కాలంబమయ్యెనో యట్టి బ్రహ్మశ్రీ వేదమూర్తులను నాకు సాహిత్యగురువులు నగు ద్వి॥ కామకవిగా రధ్యక్షులుగా నుండుట కర్హులని నా యభిప్రాయము. అంత బ్రి॥ వే॥ పా॥ లచ్చన్నగారు లేచి ''నేను వారి యుపపాదనమును బలపఱచుచున్నా'' నని పలికెను. ద్వి॥ కామకవిగా రధ్యక్షపీఠ మధివసించి యిట్లుపన్యసించిరి.

సోదరసోదరీమణులారా! ''భోజనం దేహి రాజేంద్ర ఘృతసూపసమన్వితమ్, మాహిషంచ శరచ్చంద్ర చంద్రి కాధవళం దధి''యని యొక దేశీయకవి పలికినాఁడు. జీవుల కెల్లరకు ముఖ్యతమముగాఁ గావలసినది భోజనము. అట్టి భోజన మెవరివలన సమకూరుచున్నది? మన వలన–మనవలన. కావున మనవృత్తియే ప్రప్రధానమైనది. ''గీ. వృత్తులన్నిటిలో వంటవృత్తి మొదలు'' అని మహాకవి గంగాదాసుగారి సూత్రమున్నది. ఈవృత్తి కళయా శాస్త్రమా యని కృతయుగమునుండియుఁ బూర్వపక్ష రాద్ధాంతము లగుచునే యున్నది. బుద్ధదేవుని యభిప్రాయమిది కళ యనియే. కాని యశోకాదుల మహాసభలలో నిది శాస్త్రమని నిర్ణయింపఁబడిన దని తాళపత్ర గ్రంథములలో నున్నట్లు తెలియుచున్నది. ఇది కళ యనియే నా నమ్మకము. గానము, శిల్పము, చిత్రలేఖనము, కవిత్వము నను కళలు దీని కాలిక్రింద దిగఁదుడుపు. అవి లేకున్నఁ బ్రపంచమునకు నష్టి లేదు. నిత్యప్రపంచయాత్ర దీనితో జరుగవలసినది కాని వానితోఁ గాదు. గాన ప్రపంచమున భైరవిరాగము లేకపోయినయెడలఁ బ్రాణోపద్రవ యేమియు లేదు. కాని మహానస ప్రపంచమునఁ బప్పు లేకపోయినయెడల నెంత ప్రాణసంకటమో యోజింపుఁడు. పేరొందిన ''టూజ్ మహల్'' పెసరట్లపలావుకంటె నెక్కువది కాదు. కన్నుల నిండుకంటెఁ గడుపునిండే ఘన మని పాశ్చాత్యపండితులందరు బ్రహ్మసూత్ర నిర్మాణ మొనర్చియున్నారు. తిరుపతి దేవస్థానము దేశమున కొనర్చిన మేలుకంటె నొక నీరుల్లిపాయ ప్రపంచమున కొనర్చుచున్న యుపకారము శతసహస్రగుణాధికమై విరాజిల్లుచున్నది. క్రొత్తచింతకాయ పచ్చడికున్న 'మజా' గుహాంతర్దేవాలయముల కెక్కడిది? సోమనాథేశ్వరుని యాలయమును గజినీమామూదు కూలఁద్రోచినాఁడు. భారత మాత కొక్కతలవెండ్రుక యూఁడినట్లయిన లేదు. కాని యీదినమునఁ బనసకాయను బచనకళాప్రపంచమునుండి బహిష్కరింపుఁడు. ఆర్యావర్తమల్లలాడి యల్లలాడి యంబుధిలోఁ బడిపోవదా? (వినుఁడు వినుఁడు అని సభలోఁ గేకలు) చెవులు గోసిన గెట్టెల వలె బేరు మని పితృదేవతలు నెత్తి నోరు కొట్టుకొని యేడువరా? ఉద్గతు లూడి భ్రష్టులై పోవరా? పచనకళముందు శిల్పమే యిట్లు మాఱునప్పుడింకఁ జిత్రలేఖనమా? మిళ్లిగరిటె యెక్కడ? ఒంటె వెండ్రుకకుచ్చెక్కడ? పులునుగూనలముందు రంగుచిప్ప లాగునా? రవివర్మ రాయ బారపు సభాపటమంతయు మా కామిగాఁడు చేసిన కందబచ్చల కాడ కూర కాలిగోటికి సాటి యగునా? కొత్తిమిరెపుఁగారమున్నకుఁ గోటి మోహనుల తమాషా (సెబాస్ సెబాస్ అను కేకలు) అంతే! మనము బుద్ధిహీనులమై యీవృత్తి నాశ్రయింప లేదు. హె హె హె–మన కళ ముందుఁ గవిత్వ మేపాటిపనకలదియో యింక విమర్శింతురు మనకళ కాఱు రసములు కవితకుఁ దొమ్మిది రసములు. ఆరైనను మనవి ప్రత్యక్ష రసములు. తొమ్మిది యైన నవి పరోక్షరసములు. మన రసము లాఱును గూడ మనకళకుఁ బ్రాణములు; తొమ్మిదిరసము లుకూడఁ గవిత్వమునకుఁ బ్రాణము లని చెప్పే వీలులేదు. శృంగార వీర కరుణము లను మూఁడు రసములే, కవిత్వమునకుఁ బ్రధానరసములు. మిగిలిన యాఱు రసములు కవితాప్రపంచమునుండి తీసివైచినను గవిత్వమున కంత నష్టి లేదు. ఏది? ఏది? మన యాఱురసములలో నొక్కదానిని దీసివేయుఁడు చూతము. తీసివైచుటవఱి కెందులకు? రవంత తగ్గింపుఁడు. ఎంతలోపముగా నుండునో? ఆపదార్థము పెంట కర్షమగునుగాని యనుభవమున కర్షము కాదే? హెచ్చుతగ్గులుగాఁ గాక సమానముగ నుప్పుపడిన గంజియైనఁ ద్రావవచ్చునుగాని పంచదార తక్కువయైన పరమాన్నము పశువుల గోలెములకే కాని

పనికిరాదే? ఏ రసముకూడ నేమాత్రము హెచ్చుకాఁగూడదు. తక్కువ కాఁగూడదు. సమానముగా నుండవలయును. కొలిచివేసిన ట్లుండవలయును–తూఁచినైచిన ట్లుండవల యును–ఆ రసమా పదార్థమునుండి మొలిచివచ్చిన ట్లుండవలయును. మహాపండిత సాధ్యమై నపని–మహామహోపాధ్యాయ సాధ్యమైనపని. అసిధారావ్రతశిక్ష తాటిబద్దపై నేటి తరణము! శాకుంతలములోఁ గొంత శృంగారరసము తగ్గినను 'చలామణి' యగును గాని చిత్రాన్నములోఁ జేరె డుప్పెక్కువకానీ, కుక్కయైనను మూర్ఖునేమో? ఇదికాక కవితారసములలో రసముల అన్యోన్యవిరుద్ధభావ మున్నది. మనకళలో నట్టిది లేదుకదా. అన్యోన్యసామరస్యముకూడనున్నది. వీరరసమునకు శృంగారరసము చుక్క యెదురు. వీరరసప్రధానమగు వేణీసంహారములో భానుమతీ దుర్యోధనాంకము బహిష్కారయోగ్య మగునా కాదా? దుష్యంతునిచే శకుంతలము నిరాకరింపఁజేసి కాళిదాసుఁడు కరుణరసముద్బోధన మొనర్చిన తరువాతఁ దోషించిన విప్రలంభశృంగార మున్నదే యది మాకు రుచింపలేదు. అడుగంటిన ట్లున్నది. మన రసములలో నింత పాడ పొందు గిట్టనితనమున్నదా? ఇంత గందరగోళము న్నదా? ఇంతగాడిదెగత్తరయున్నదా? ఇంత వ్యత్యస్తభావ మున్నదా? మన రసములు! ఓ! అచ్చరసములు! ప్రత్యక్షరసములు! అన్యోన్యసమాగమ సమర్థములు! విశేష మైత్రీవిరాజిత ములు! వంకాయ పచ్చడిలో నుప్పు పులుసు కారము మూఁడు రసము లున్నవి. కాకరకాయ పచ్చడిలో నుప్పు పులుసు కారము తీఁపి చేఁదు అయిదు రసము లున్నవి. ఆరురసములను గూడ నొక్కచో నవ్యాహతముగ ననుసంధింపవచ్చును. ఆ వస్తు వేదియో యెఱుఁగుదురా? ఆవకాయ యని యానందవాచకపుస్తకములోఁ జెప్పఁబడియున్నది. (బెల్లపుటావకాయ కాఁబోలు ఏడ్చినట్లే యున్న దని యొక వితంతువు నణగు కొనుచున్నది) గరిటె ననుసరించియే సదా గంటము నడచుచున్నది. 'మధుర మైనముద్దు' అని కవి చెప్పును. ఈ మాధుర్యము తన సొమ్మా! తన యబ్బ సొమ్మా! మనది, మన సొంతము. మన పితృపైతామహద్రవ్యము. మన 'ఖాన్' రసము. పొగచుట్ట మిరెప్పుఁగాయయయ్యా యని కవి చెప్పును. ఆ మిరెప్పుఁగాయ మన పొగపుల పెట్టెలోనిదా? తన పుస్తక భండారము లోనిదా? కవిత్వము వంటయింటి నాశ్రయించి యుండక తప్పదు. కలముపై నట్లకట్టయే యధికారి. నమస్తకళలుగూడఁ బచన కళకుఁ గ్రిందివే. మహాభాగ్యములన్నియు మహానసాగ్యములచుట్టు బలాదూర్. ఆంధ్రభోజాస్థాననగరమగు పీఠపురమునకు సమీపగ్రామమున నొక్క మహాకవి యుండెను. ప్రాక్సముద్రమునుండి పశ్చిమసముద్రమువఱకు, నుత్కళదేశ మునుండి మళయాళ దేశమువరకు వ్యాపించిన విద్యానగ రాస్థానమునంతను–అనేకకోటి గజాశ్వరథపదాతిసైన్యములతోఁ గవి పండిత నట విట గాయక సహస్రసంఘాతములతోఁ గుబేర సన్నిభభాగ్యములతో, నష్టదిగ్గజములతో, నప్పాజితో, శ్రీమహావిష్ణువు పదునొకండవ యవతార మని చెప్పఁదగిన కృష్ణదేవరాయలతో వింటిరా? సోదరులారా! వింటిరా? ఇన్నివైభవములతో నున్న విద్యానగరాస్థానము నంతను–ఒక్క విస్తరిగా–పంచభక్ష్య పరమా న్ననసిత మగు విస్తరిగా నా కవి వర్ణించి గిఱగిఱఁద్రిప్పి పెంటపై బాఱవైచినాఁడు. ఆ పద్యమును జదివెదను వినుఁడు.

సీ. అధిపాన్న రాయలే ఆస్థానపండితుల్
ఘనుఁడగు పెద్దన్న కందిపప్పు
అష్టదిగ్గజములే అష్టావకాయలు

ఆరామలింగంబు చారుపులుసు
అప్పడాల్ వడియాలు ఆచోపుదారులు
రమ్యపచ్చళ్లు పారాజవాన్లు
పరమాన్న పాత్రంబు భట్టుమూరితికవి
ఆతిమ్మకవిరాజు నేతిదొన్నె

గీ. పప్పు కూరలు సంగీతపాటగాళ్లు
మెంతిపెరుగులు బోగము మేళములును
ఊరుబిండులు చిల్లరివారలెల్ల
మేలు అప్పాజి ఊరిన మిరపకాయ.

ఈతఁడే కవి–జాతీయకవి–ప్రపంచకవి. మహానసమర్యాద నెఱిఁగిన కవి యీతఁ డొక్కఁడే. పచనకళాప్రాముఖ్య మెఱిఁగిన కవి యీతఁ డొక్కఁడే. ఇతనిని గవి యనుటకంటెఁ బాచకుఁ డని యనుట యర్థతరముగ నుండును. కవి ముదిరి కాని వంటవాఁడు కానేరఁడు. నే నట్లయినవాఁడనే. ఉభయకళామిత్రుఁడనైన నామాట మీరు పాటిసేయక తప్పదు.

మనవృత్తి మొదటినుండియు నంత ఘనమైనది. పెద్దాపుర జగపతి మహాస్థానమున కీరాజమంత్రి నుండియే వంటవారు వెళ్లెడువారు. అట్టి యీ పట్టణములో టొక్కుటొక్కు మని లెక్కకుఁ బదిమంది వంటవాండ్రకంటె నెక్కువ లేరే. ఇది కడు శోచనీయము కాదా? మన సంఖ్యాభివృద్ధికి దేశమోక్షమునకు సంబంధ మున్నది. రుచిగ్రహణ సమర్థతచేఁ, బాకరచనాపరిపాటిచేతఁ గవులు మన కత్యాసన్న బంధువులు. ఇప్పు డాంధ్ర దేశమున నున్న కవులందరు వంటవాండ్రగునెడల భారతమాత పరమానందమునఁ దాండవించును. కవుల లెక్క యేమి? నలుఁడు వంటవాఁడై స్వరాజ్యమును సంపాదించుకొన్నాఁడు. భీముఁడు వంటవాఁడై స్వరాజ్యమును సంపాదించుకొనెను. అటులే కవులెల్లరు పాచకు లగునెడల స్వరాజ్యము మన కవలీల రాఁగలదు. కలములు గరిటెలు–కవులు వంటవారు –పుస్తకాలయములు పూటకూటిండ్లు కావలయును–అయి తీరవలయును. అప్పుడు సర్వబా ధామోక్షను. సోదరసోదరీమణులారా! ఈరీతిగాఁ జెప్పునెడల నెంతసేపైనను జెప్పఁ గలను. యథార్థముగా సభకుఁ గావలసినవి సరసము లైన యుపన్యాసములు కావు. కట్టుదిట్టము లైన తీరుమానములు. అట్టి తీరుమానములను మన మేర్పాటు చేసికొని వాని నాచరణము లోనికిఁ దేవలయును. నేను గొన్ని తీరుమానముల నుపపాదించెదను. మీరు సావధాన మనస్కులరై వానిలోని గుణాగుణములను బరిశీలింపవలయును:–

(1) ఎవని జన్మమున నారామద్రావిడశాఖ పవిత్రమయ్యెనో యెవని చేతిమీఁదుగా వేయి పెండ్లిండ్లు రెండువేల గర్భాధానములైన జరిగినవో యెవఁడు సమీపించినయెడల గాడిప్రొయ్యిలోని యగ్ని దేవుఁడు గడగడలాడునో యెవని గరిటె యింద్రుని వజ్రాయుధ మును గూడ మించినదో యట్టి పాకకళావ్యకోవిదుఁడగు బ్రా॥ శ్రీ వేదమూర్తులైన పా॥ సూరయ్యగారి యకాల కైలాసగమనమునకై యాసేతుహిమాచలపర్యంత మంద అత్యంతదుఃఖాక్రాంతు లగుట వింతగాదు. భరతఖండమునకుఁ బ్రఖ్యాతితెచ్చిన యలౌకిక తేజోరాశి యస్తమించినది. ఆయన యాత్మశాంతికై మనము పార్వతీపరమేశ్వరులను బ్రార్థింపవల

యును (అందరు లేచి కన్నులు మూసికొని ప్రార్థింతురు.) ఇది కాక మన సానుభూతిని దెలుపుము నామహనీయుని కుటుంబమున కొక్క లేఖ పరిషత్పక్షమునఁ బంపవలయును. (మే మందఱు మీ తీరుమానము నంగీకరించితి మని కేకలు. ఇంతలో నొక్కఁడు లేచి 'ఆయనకు కుటుంబము లేదుకదా! లేఖ యెవరి కంపుదు' రని ప్రశ్నించెను.) కుటుంబములే కేమి? కులకాంత కంటెఁ గోటి గుణములు హెచ్చగు కుమ్మరి వీరమ్మగారాయన కుటుం బము కదా! మనకందఱకు మాత్రము కుటుంబము లున్నవా? ధర్మమార్గానుసారముగా మనము తగిన వారి నుంచుకొని కాలక్షేపము చేయుచుండుట లేదా? (అయ్యా! మన మని వచించి సభ నంతయుఁ గట్టకట్టుట న్యాయము కాదు–ఇచ్చట బవిత్రలు గంగాభాగీరథీ సమానలగు విధ్వస్తలున్నారు.) సోదరీమణులారా! క్షమింపుడు. నేను మీ యోగ్యతావిశేష మెఱుఁగనిది కాదు. మీ బ్రహ్మచర్యవ్రత దీక్ష యెఱుఁగనిదికాదు. నామాట పురుషులకు మాత్రమే వర్తించుట కుద్దేశింపఁబడినది. మరియొకసారి క్షమింపుఁడు, వేఁడుచున్నాను.

(2) ఈ మన యాంధ్ర పాచకమహాజనసభను–అఖిలభారతీయ పాచకమహాజనోద్ధరణ సంఘముగా (ది ఆల్ యిండియా క్యూలినరీ ఫెడరేషను) నభివృద్ధిపఱచి దేశికార్థిక పరిస్థితులను విపులీకరణ మొనర్చి జాతీయ సామరస్య సంస్థాపన సంవర్ధన మాచరించి భరతఖండవిముక్తికై పాటుపడవలయును. (ఈ తీరుమాన మంద ఱొకకంఠ్యముగా నంగీకరించిరి.)

(3) మనము సంసారములలోఁ గాని సత్రములలోఁ గాని మరి యెక్కడనైనఁ గాని పనిచేయుచున్నప్పుడు మన ముంచుకొన్న వారికి, వారిపిల్లలకుఁ గావలసినంత సదార్థసమూ హమును మాత్రమే మనము రెండవకంటివాఁడు కనకుండ, రెండవ చెవివాఁడు వినకుండ, గుప్పుచప్పున, సంసారపుగుట్టు చెడకుండ, సంగ్రహింపవలసినది కాని యంతకంటె నెక్కువ మాత్రము గ్రహింపఁ దగదు. (ఈ సూత్రము జమీందారుల వంటివాండ్రకు వర్తింపఁ దగదు. వా రీ చచ్చునియమమును బాటించియుండ నక్కఱలేదు అను కేకలు.) ఎక్కువగా నేల గ్రహింపరా దని చెప్పితి ననఁగా–చేరఁదీసినవారి కెక్కువగాఁ బెట్టినయెడల వారు తాడుబారి కాలు నిలువఁ ద్రొక్కుకొని, జుట్టుపై దిరుగ–గ్రుడ్లు నెత్తిమీఁదికి రాఁగ మనల నిరాకరించి త్రోచిరాజనవచ్చును. (ఈ తీరుమానము నంద ఱంగీకరించిరి.)

(4) ప్రపంచమున నేవృత్తిలో నైన ఘనత నొందిననారికి బ్రభువులవలన నాదరణము న్నది–ప్రజలవలన బహుమానమున్నది. కవిత్వములో ఘనత కాంచినవారికిఁ గవికంఠీరవుఁ డని, కవిచక్రవర్తి యని, మహాకవి యని బిరుదములు ప్రభువులు ప్రజలు కూడ నిచ్చుచు న్నారు. శాస్త్రజ్ఞాననిక్షేపులకుఁ దర్కసింహ లని, వ్యాకరణతీర్థు లని, వేదాంతమణు లని, మహామహోధ్యాయు లని బిరుదముల నిచ్చుచున్నారు. రాజకీయతంత్ర నిపుణులకు దేశభక్తు లని, దేశబాంధవు లని, లోకమాన్యులని, మహాత్మ లని బిరుదము లిచ్చుచున్నారు. వీ రందఱకంటెఁ బదియాకు లెక్కువ చదివిన మనకుఁ, బ్రజ్ఞలోఁ, బాండిత్యములోఁ, బ్రపంచో ద్ధరణ పటిష్ఠతలో వీరి శిరములపై దాఁటిపోయిన మనకు–ఒక్కబిరుదమైన నిచ్చినవాఁ డేఁడి? వేనుకటి చరిత్రములను దీయించుఁడు. పురాణము లన్నియుఁ బరిశీలింపుడు. షట్చక్రవ ర్తులు కాని, షోడశమహారాజులు కాని, వారి తరువాతివారు కాని యెవ్వరైన నొక్క బిరుదమును మన పూర్వులకుఁ బ్రసాదించిన ట్లున్నదేమో? ఇంత లోకవిరుద్ధత యెచ్చట

నైన నుండునా? ఛూ? ఛూ! ఒక రిచ్చుట మనము తీసికొనుటయా? మన కర్మ మంత కాలిపోలేదు. మనమే యింతటినుండి మనలోని పండితశిఖామణులకు బిరుదము లీయవల యును. ఏఁబదియేండ్లు దాఁటినవారందరొక్క సబుకమిటీగాఁ జేరవలయును. వారు గుణాధిక్యమును బరిశీలించి యర్హులగు విద్వాంసులకుఁ బచనకళామార్తాండుఁ డని, మహానస మహా మహోపాధ్యాయుఁ డని, రంధన కంధిమారుతి యని, ధనుష్కళాధనంజయుఁ డని, కలియుగనలుఁ డని యట్లే యేవో కొన్ని బిరుదము లీయవలయును. (ఈతీరుమానము నంద అంగీకరించిరి.)

(5) ఒకరు చేరఁదీసిన యిల్లాలిజోలికి వేఱొకరు పోఁగూడదు. ఈ మాత్రపు కట్టుపాటు మనలో నుండకతప్పదు–ఆకట్టుపాటు లేకున్న యెడల వ్యక్తిసమష్టిత్వమునకు వ్యష్టిత్వము కలుగును. (అర్థము తెలియుట లేదయ్యా యను కేకలు) జాత్యైకతకు స్వకల్పితావరోధము సంభవించును. స్వతంత్రపరిపాలనకు సైంధవు లడ్డు సంప్రాప్తమగును. (ఈతీరుమానమును గొందఱు ముక్కుచు మూల్గుచు నంగీకరించిరి.)

(6) ఆంధ్రపత్రికా సారస్వతానుబంధములోఁ బడుచున్న సాక్షిని–గరిటెఁ జేతఁబట్టి నవా రెల్ల–కావడి బుజమున వైచిన వారెల్ల–గాడిప్రొయ్యియొద్దఁ గాలుపెట్టినవారెల్ల –అన్నసత్రము లుంచిన యమ్మవారులెల్ల–కొని చదువవలయును–చదివితీఱవలయును. దానివలన వచోధారాళత కలుగును–ఈతీరుమాన మంద అంగీకరించిరి. కాని యొక్క వంటవాఁడు సాక్షిని జదువరాదు. దానిలో నసభ్యము లనేకములున్నవి–దాని నాంధ్రపత్రిక నుండి తీసివైచుట మంచి దనెను. (ఛీ! ఛీ! నోరుమూసికో–సిగ్గు–సిగ్గు–నిన్నాంధ్ర దేశము నుండి బహిష్కరింపవలయును. అను కేకలు) ఆయన నేమియు ననఁదగదు. అభిప్రాయభే దము లుండవచ్చును.

(7) మన మొక చిన్న వారపత్రికయో మాసపత్రికయో స్థాపింప నలయును (దీనిని గూర్చి గట్టితగవులాట జరిగినది. ఈతీరుమాన మంగీకరింపఁబడలేదు.)

ఇంతలో నీ గొంతు గోయ, నీ మొగము మండ యను క్రోధోద్రేక సూచక వితంతునారీవిరావము సభనుండి బయలుదేరి సభవారి హృదయములను జాడించి దులిపివై చెను. ఏవనితాశిరోమణి యేవంట వానిని దిట్టుచున్నదో–ఆగడబిడ సర్దుకొనకుండనే మరియొక వితంతువు లేచి నామెడలోని పలకసరు లెవ్వరో త్రెంపుకొన్నా రని కేకలుపెట్టి యేడువ సాగెను. శాంతమ్ పాపమ్, శాంతమ్ పాపమ్, దేశభక్తు లగు నిందరు పుణ్యస్వభావు లిచ్చటఁ జేరుట యేమి? ఈవైపరీత్యమేమి? మృతినొందిన పా॥ సూరయ్యగారి యాత్మశాం తికై యందఱులేచి కనులుమూసికొని ధ్యానించునప్పు డీతిరకాసు–ఈపొరపాటు –సంభవించియుండు నేమో? పట్టుకో దొంగను బట్టుకో యని కొందరు కేకలువైచిరి. అందరు సభనుండి వెడలిపోయిరి.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

7. స్వభాష

ఒక తెలుగువాడే–కృష్ణాతీరంలో పుట్టినవాడే ఒక ఆంధ్ర బాలకసంఘంలో అధ్యక్షోపన్యాసం చేయమంటే, ఒప్పుకుని–సభకు వచ్చి–తనకు తెలుగు మాట్లాడడం రాదుగనుక ఇంగ్లీషులో మాట్లాడాడు. కొసలో ఊరుకోక 'విల్ ఎనీ జంటిల్మన్ కంఫార్వర్డ్ టు స్పీక్?' అని అన్నాడు. అప్పటికే పిల్లలు ఉత్సాహ భంగంతో ఉన్నారని గ్రహించిన జంఘాలశాస్త్రి అదే సభలో శ్రోతల్లోంచి లేచి–తానున్నానన్నాడు. అతన్ని అక్కడివారు సాదరంగా ఆహ్వానించారు. గర్తుపట్టి గౌరవించారు. ఆసభలో తాను ఏం మాట్లాడినదీ, జంఘాలశాస్త్రి సాక్షినంఘ శ్రోతలకు వివరంగా చెపుతున్నాడు.

తెలుగువాడై, ఈ గడ్డన పుట్టి, ఈ నీళ్లుత్రాగిన మనిషి,–తెలుగువారైన తల్లిదండ్రులకు పుట్టిన మనిషి–ఇంగ్లీషు భాషలో పాతికేళ్లు కృషిచేస్తే ఏంగాక–పెద్ద న్యాయవాది అయితే యేంగాక–తెలుగు రాదంటాడా? అని శాస్త్రి రెచ్చిపోయాడు. ఆ మాట అన్నందుకు, ఎంత ఎగతాళిగా మాట్లాడాలో, ఎంత వ్యంగ్యంగా మాట్లాడాలో అంతగానూ మాట్లాడాడు.

నువ్వు ఎంత, పరభాషలో కృషిచేసి, గ్రంథ రచన చేసినా,–గ్రంథజ్ఞాన శూన్యుడైన 'పుట్టు ఆంగ్లేయుడి' పలుకులో వుండే జాతీయత చచ్చినా సాధించలేదని యీసడించాడు. ఇందుకు ఉదాహరణలుగా లాటిన్ విషయంలో మిల్టన్‌నీ, తెలుగు విషయంలో బ్రౌన్ దొరనీ పేర్కొన్నాడు. ఇంగ్లీషులోవున్న చట్టాలను తలలో పెట్టుకునే తెలివిలో కొంత తెలుగుభాష సొగసులు తెలుసుకోవడానికి ఖర్చుచెయ్యమని–పరోక్షంగా ఆంగ్లభాషా మానస పుత్రులందరికీ–సూచించాడు. కనీసం (ఆనాటి) ఆంధ్రపత్రికను కుటుంబ సభ్యులతో కలిసి చదవమన్నాడు. స్వభాషాభిమానం ప్రకటించడానికి జంఘాలశాస్త్రి సూచనలు కూడా చేశాడు.

నేను సభాభవనమున కేగునరికి జంఘాలశాస్త్రి దేనినిగూర్చియో కాని యుపన్యసించుచున్నాఁడు. అదివఱ కేమాటలు చెప్పియుండెనో నే నెఱుఁగనుగాని నేను సభాప్రవేశమొనర్చినపిమ్మట నిట్లు చెప్పెను.

''మీ కసత్యముగాఁ దోఁపవచ్చును–నాయనలారా! అసత్యము కాదు. ఆయన యాంధ్రుఁడు–కృష్ణాతీరమునఁ బుట్టినవాఁడు. శుద్ధ శ్రోత్రియకుటుంబములోనివాఁడు. ఎం.ఏ., బి.ఎల్., పరీక్షలలో నుత్తీర్ణుఁ డైనవాఁడు. న్యాయవాదివృత్తిని నిరాఘాటముగా నిరంకుశముగా నిర్వర్తించుచున్నవాఁడు. అట్టివాని నాహ్వానించి యాదరించి యాంధ్ర బాలకసంబంధ మగు నొక్కసభలో నధ్యక్షుఁడుగా నుండుఁ డని పాఠశాలాబాలకులు ప్రార్థింపఁగా నుండెద నని యొప్పుకొని తుదకుఁ జేసినపని యిది! ''నా కాంధ్రభాష రాదు. నే నాంధ్రమున మాటలాడలేను. మీ యిష్టమగునెడల నాంగ్లేయభాషలో మాటలాడుదును.'' అని యర్థమిచ్చుమాటల నాతఁ డాంగ్లేయభాషలోఁ బలికెను. తెల్లబోయి తెలివి తప్పి నిల్వ్రగ్రుడ్లు వైచికొనిన పసిబాలు రప్పు డేమి చేయఁగలరు? కొంతసేపు మాటలాడలేక నిరుత్సాహులై దీర్ఘనిశ్వాసము లిచ్చి ''మీ యిష్టమెటులో యటులే'' యని యనిష్టతతోఁ బలికిరి. అప్పు డాయధ్యక్షుఁ డొక్క పావుగంటకాల యాంగ్లేయభాషలో దేహసాదన విషయమును గూర్చి యుపన్యసించి తన యుపన్యాసమున కుపసంహారమును జెప్పి ''పిల్ ఎని జంటిల్మెన్ కం ఫార్వర్డు టు స్పీక్'' అని సభ వారిని బ్రశ్నించెను. బాలకులు భగ్నోత్సాహులై యుండుటవలనఁ బ్రత్యుత్తర మీఁగుక యూరకుండిరి. అయ్యా నేను మాటలాడెద నని లేచితిని. ''మనము చూడనేలేదయ్యా! మన జంఘాలశాస్త్రియే యయ్యా'' యని వారిలో వా రనుకొనుచు ''ఎప్పుడు వచ్చినారు? ఎక్కడినుండి వచ్చినారు? ఈనడుమ రెండు పర్యాయములు కాబోలు సాక్షి రాలే దేమి? మీరు సభకు వచ్చిన తరువాతనై నను మాకుఁ దెలియఁజేయ నక్కఱ లేదా? ఏమి న్యాయమయ్యా.'' యని యేవేవో యగ్రము నంతయు లేని యనురాగసూచకము లగు నసంబద్ధాలాపములాడి న స్వప్నవ్యాస రంగము నొద్దకుఁ దీసికొని పోయిరి. నే నిట్లుపన్యసించితిని.

హరహరా! మహాదేవశంభూ! మహాదేవశంభూ! ఎంతమాట వినఁబడెను. ఎంతమాట వినఁబడెను. నాయనలారా! మిరుకూడ వింటిరి కాదా? నే నొక్కఁడనే వింటినా? ఏదో విని మఱియేదో యని భ్రమ పడితినా? నాయనలారా! అల్లే యగునెడల నదృష్టవంతుఁడను గదా! నే నొకఁడను మాత్రమే యదృష్టవంతుఁడనా? ఆంధ్రులంద ఱదృష్టవంతులే కదా? ఆంధ్ర దేశమంతయు నదృష్టవంత మైనదేకదా? ఆంధ్ర దేశమునఁ బుట్టి, యాంధ్ర మాతాపితల కుద్భవించి, యాంధ్రసంప్రదాయము లభ్యసించి, యాంధ్రజాతీయతత్త్వ సంపత్తిచే నభివృద్ధినొంది, యాంధ్రభాషలోఁ బండితులై యాంధ్రగ్రంథముల రచించి యాంధ్ర భాషాదేవి కమూల్యాలంకారములుగా నర్పించి, యాంధ్ర దేశసేవ నాచరించి తమ యుంగములు నసువులు నాత్మలు పవిత్రములుగఁ జేసికొని, ప్రాణములను బాసి పరమపదమునుఁ జేరిన ప్రాచీనాంధ్రులందఱు కూడ నదృష్టవంతులు కదా? అయ్యయ్యో! అంతయదృష్టమును పట్టునా? పట్టదు. వింటిని–నిజముగా వింటిని–నాది భ్రమము కాదు. తాత్కాలికోన్మాదము కాదు. మీరు గూడ నాతోపాటు వింటిరి. వినక యేమి చెవులు చిల్లులుపడినవా? మతి మందగించినదా! వినక పోవుట కూడనా? గుండెలు పగిలిపోవ వింటిమి–మనస్సు మండిపోవ వింటిమి–సిగ్గు చిమిడిపోవ వింటిమి–ప్రాణములు పైకెగిరిపోవ వింటిమి–నాయనలారా! ''బ్రతికియుండిన సుఖములు పడయవచ్చు'' నని కవి చెప్పినాఁడే–ఇంకను జీవించియున్నందుల కిదియా ఫలము–ఇదియా సుఖము. ఆహాహా! ఇంతవఱకు జీవింపకుండ నిదివఱకే దేహములు చాలించుకొనిపోయిన దేశీయులు దివ్యభాగ్యాన్వితులు కారా? వా రిట్టి మాటలను వినియుండ

కపోవుట వలన వారిభాగ్య మింతంత యనవచ్చునా? మాటయన్న మాటయా? మాణిక్య ముల మూఁటఁ-మౌక్తికముల వేటఁ-మకరందప్రవాహపుఁ బేటఁ-పరబ్రహ్మమునుండి ప్రణవము బయలుదేరినట్లు బయలుదేరినదే. ఆహాహా; ఏ మని? ఏ మని? మన యధ్యక్షభగవానుని యాలాపకలాప మేది? వారు సాయించిన శ్రీసూక్తి యేది? వారి యాన్యగహ్వ్యర్థము నుండి యవతరించిన యాగమ సూత్రమేది? చెప్పనా ఆంధ్రుఁడు వచింపఁదగినదికాదే? చెప్పనా? చెప్పక తప్పునా? మన యగ్రాసనాధిపతి దేవుని కాంధ్రభాష రాదఁట-ఆయన యాంధ్రమున మాటలాడనే లేరఁట. అయ్యయ్యో? ఆంధ్రమున మాటలాడలేకపోవుట యేమి? మూఁగవారు కారే-నంగినంగి మాటలవారు కారే-మెమ్మె పెప్పె యనువారుకారే -ఆంగ్లేయ భాషాపండితాగ్రగణ్యులే-బర్కు సిసిరో డెమాస్థెనీసు గ్లాడ్టునిత్యాది మహావక్తృవాదూకతావైభవమును గీబళించి, నమలి, చప్పళించి, మ్రింగి, జీర్ణించుకొని రక్తమాంసములఁ గలుపుకొనినవారే. ఇదిగాక బి.ఎల్. పరీక్షలోఁ గడతేరి, కాలాంబర కవచధారియై న్యాయమూర్తుల యెదుటఁ గాకిని గ్రద్దను, గ్రద్దను గాకిని జేయఁజాలిన కర్కశతర్క వాగ్వైభవ మోహినీకరణ దక్షులే. అట్టి వాగ్ధోరణీధీరులగు వీర లాంధ్రమున మాటలాడ లేకపోవుటయేమి? లేకపోవుట యనఁగా నాకేమో బోధపడలేదు. మ్యావు మని కూయలేని పిల్లి యెచ్చటనైన నుందునా? కిచకిచలాడలేని కోఁతిని మీ రెచ్చట్టనైనఁ జూచితిరా? ఈఁకలేని కప్ప యేదేశమందైన నుందునా? పుట్టగానే క్యారుమన లేనిబడ్డ చచ్చిన దనుట కేమైన సందేహమా? ఆంధ్రదేశమునఁ బుట్టిన పశు లైన ననవరత శ్రవణమున నాంధ్రమున మాటలాడుచుండఁగా-అయ్యయ్యో! మనుజుఁడే-అంత మనుజుఁడే-ఆంధ్ర మాతాపితలకుఁ బుట్టినవాఁడే-ఆంధ్ర దేశీయవాయు నీరాహారపారణ మొనర్చినవాఁడే-అధమాధమ మారు సంవత్సరముల యీడువఱకైన నాంధ్రమున మాటలాడిన వాఁడే-అట్టివాఁ డాంగ్లేయభాష నభ్యసించినంత మాత్రమున నిప్పుడాంధ్రమున మాటలాడ లేకుండునా? ఆశ్చర్యము. అవిశ్వసనీయము. అసత్యము. ఆంధ్రమున నాతనిని మాటలాడకుండఁ జేసినది అశక్తికాదు. అనిష్టత-అసహ్యత-అది శిలాక్షర మైనమాట. మాటలాడుట కిష్టమేల లేకపోవలయును? తెలుఁగు బానయంత దిక్కుమాలినబాస లేదనియే యీయాంగ్లేయ దేజస్సు నమ్మకము. తెలుఁగు మాటలాడినవాఁడు, విధముచెడినవాఁడు, విద్యరానివాఁడు, గౌరవములేనివాఁడు, గతిలేనివాఁడు, తెలివిమాలినవాఁడు, దిక్కుమాలినవాఁడు! ఆ. ఆ. ఆయన కట్టి యభిప్రాయమున్నది. అట్లె కాకున్న యెడల మాటలాడకపోవుటయేమి? అయ్యయ్యో! తెలుఁగులో మాటలాడుట సిగ్గుసిగ్గు! అంతసిగ్గున కిదియే మంత యకార్యకరణము. రిప్రెషెన్టురూములో గొడ్డుమాంసము తినుటయా? విస్కీ త్రాగుటయా? సభలోఁ దూలి పడిపోవుటయా? అయ్యయో! ఇవ్వు డివి యకారణములే కావు. ఇవియే యిప్పుడు తఱచుగా నిత్యవిధు లగుచున్నవి. పట్టణములలో నేమి పల్లెటూళ్లలో నేమి నానివైభవమును దఱచుగా వీక్షించుచున్నాము. వీని యన్నిటికంటె నాంధ్రమున మాటలాడుట సిగ్గుసిగ్గు-తప్పు -నీచత-అధమత కులహీనత-స్పష్టముగా-చెప్పితినా? అట్టి యభిప్రాయము షేన యధ్యక్ష శార్దూలమునకు దేశీయుల దౌర్భాగ్యమున దాపురించినది. అందుచేతనే వా రాంధ్రమున మాటలాడలేదు. మాటలాడినయెడల మైలపడుదుమేమో, నచేలస్నాన మాచరింపవలయునేమో, యజ్ఞోపవీత విసర్జన మొనర్పవలయునేమో, జీవప్రాయశ్చిత్తము చేయించుకోవలయునేమో యని యాయనకు భయము కాఁబోలు. నా వెర్రియేకాని, భాష పరమానహ్యమైన

వానికిఁ బ్రాయశ్చిత్తకాండమందు భక్తియుండునా? అదియు లేదు. ఱదియు లేదు. పుట్టుకనొసఁగిన మాతృదేవతను బూజింపనివాని కగ్రజునాజ్ఞయం దాదరమా? తండ్రినిద న్నిన తనయుఁడు మామగారి మొగమునకు మంగళపు టారతి యిచ్చునా? కంఠాభరణ మనునాటకములోని నబాబుగారు 'తెలుగుబాస వట్టి గడ్డి బాస–ఉస్ మే రస్ నహిఁ జీవ్ నహిఁ' యని యాంధ్రభాష నధిక్షేపించినారు. మాతృభాషాభిమానముచే మహమ్మదీయుఁ డట్లనిననుఁగాక–మనవారే యట్టియభిప్రాయులై యుండుట మాతృద్రో హము కాదా? అయ్యయ్యో! ఇట్టి మహాదురవస్థాగ్రగణ్యము–ఇట్టిమహా ఘోరపాపము –మహీస్థలి నెచ్చట నైనఁగలదా? అయ్యయ్యో! మనభాషయే–మహానందకందళసందో హ సంధాన తుందిల మగు మాతృభాషయే–కమ్రతకుఁ గమ్రత, కఠినతకుఁ గఠినత–వదలునకు వదలు, బిగికి బిగి–జోరునకు జోరు, నెదురెక్కున కెదురెక్కు–మందతకు మందత–ధాటికి ధాటియు–నన్నివన్నెలు, నన్ని చిన్నెలు–నన్నివగలు, నన్నివద్దికలు–నన్నితళుకులు, నన్ని బెళుకులు–నన్నిహొయలు, నన్నియొయ్యారములు–గలిగిన మన మాతృభాషయే –వ్యాసమునకు నుపన్యాసమునకుఁ–గవిత్వమునకు గానమునకు సంపూర్ణార్హతగల భాషయే –పైవారే యీభాషను బట్టుదలతోఁ బ్రయత్నమున నభ్యసింపవలసియుండఁగా–మనవారే దానినంత యధమాధమముగాఁ జూచుట తగునా? సరే. మీ రిట్టిభాషను బరిత్యజించి పైభాషను బఠించినారు–ఇన్నిమాన్యము లమ్మికొని, యింతసొమ్ము వ్యయపఱచి, యిందఱ నాశ్రయించి, యింత చిత్తక్లేశమంది సంపాదించిన మీ యాంగ్లేయభాషాపాండిత్య మేమాత్రమో కనిపెట్టెదము. ఆంగ్లేయగ్రంథము లెన్నియో వ్రాయుచున్నారు. ఆంగ్లేయోపన్యాసము లెన్నియో యిచ్చుచున్నారు. మీ కేమాత్రము భాషాసౌకర్యము కలిగినది? ఏమాత్రపు భాషాసౌలభ్యము సిద్ధించినది? గ్రంథజ్ఞానశూన్యుఁడగు జన్మమాత్రాంగ్లేయునికి 'ఇంగ్లీషు యిడియం'లో నున్న స్థాలభ్యములో సాఁబాలైన నర్ధశతాబ్ద మాంగ్లేయభాష నభ్యసించిన మీ కలవడినదా? సంపూర్ణమైన భాషోచ్చారణ సౌష్ఠవమైనఁ బట్టు పడినదా? ఏల పట్టుపడును? పైభాష యెన్నఁటికిఁ బరభాషయే. మీ రేవో యాంగ్లేయ గ్రంథములను వ్రాయుచున్నారని యాంగ్లేయోపన్యాసము లిచ్చుచున్నారని విశేషజ్ఞుల మని యనుకొనుచున్నారు కాఁబోలు. అవి యేమో యుపజ్ఞాసహితములగు వ్రాఁత లని వాగ్ధోరణు లని యనుకొనుచున్నారు కాఁబోలు. అవి పట్టి తలవిఱుపులు–చిలుకపలుకులు–కల్ల కెంపులు–గాజుపూసలు. అవియన్నియుఁ బ్రతిఫలనములు పాఠాంతరములు. అవియన్నియు మక్కికి మక్కలు వెక్కిరింపులు. వానికి స్వతంత్రశక్తి లేదు. వెన్నెముకబలము లేదు. వానిలో 'ఒరిజినాలిటి' అనునది లేదు. మీ లెక్క యేమి? మీ తలలపై దాఁటిపోయిన ధీమంతులకే లెక్క లేదు. 'పారడైజు లాస్టు' వ్రాసి యాంగ్లేయవ్యాసపీఠాధి పత్యమున కక్షఁ డనిపించుకొనిన మిల్టన్ వ్రాసిన లాటిను పద్యములు లాటిన్ భాషయే స్వభాషగాఁగల దేశీయకవులలో నధములగు వారు వ్రాసిన్న పద్యములకుఁ దీసిపోవుచున్న వని వారి పరిశోధకులే వ్రాసినారు. మిల్టన్ లాటిన్ వ్రాఁతలకంటె మీ యింగ్లీషు వ్రాతలు ఘనములా? తల్లి స్తన్యముతోఁ గూడ నే భాష మనము త్రావుదుమో యా భాషలోనే మన మెన్నఁటికైనఁ గఠినప్రయత్న మొనర్చినయె డల నుపజ్ఞాసహితమగు నుత్తమ గ్రంథమును వ్రాయఁగలము. కాని పరభాషలో నెన్నఁడును వ్రాయలేము. పరభాషలో నెన్నఁడును దద్భాషావేత్తలు మెచ్చినట్లు మాటలాడలేము. మన రాజధానిలో నున్న యొక్క కాలేజిలో–'వర్నాక్యులర్ సూపరింటెండెంటు' గా సంస్కృతభా

షాపండితుఁడగు నొక్క యాంగ్లేయుఁడు వచ్చియుండెను. ఆతఁడు 'యంబ్రహ్మ వేదాంత' మున్నగు శ్లోకములను 'అయాంబికుమీటరు' లోఁ జదువుట నే నెరుఁగుదును. 'ది వెల్నోను తెలుగు స్కాలర్' అని ప్రఖ్యాతి నొందిన బ్రౌనుదొరగా రాంధ్రమున నేమాత్రపుఁ బండితులో మన మెఱుఁగక పోవచ్చును గాని యప్పటివా రెఱుఁగరా? ఆంగ్లేయుఁడు పదునెనిమిది సంవత్సరములు సంస్కృతభాషను సంతత దీక్షతో నభ్యసింపనీ–అభ్యసించినంతకాల మనవ రత మననమున జూపిడి పెట్టనీ–''హగుంసశ్యుచిష'' న్మంత్రమును బొడుగు పొట్టి పలుకు బడి పరిపాటిని మాని–సిస లైన యుచ్చారణతోఁ జదువఁగలఁడేమో పరిశీలింపుఁడు. ఇఁక మీరు 24 సంవత్సరము లింగ్లీషుభాష నభ్యసింపుఁడు. ''ఇన్మెమోరియం''లో నున్న దని చెప్పఁబడిన 'మ్యూజిక్' మీరు కనిపట్టఁగలరేమో? అది వానివలనఁ గాదు. ఇది మీవలనఁ గాదు. దానినోటి కది చిక్కదు–మీ చెవి కిది యెక్కదు. పరభాషా పదముల కర్థము తెలిసినంతమాత్రమునఁ బరభాషాపాండిత్యము లభించిన దని భ్రమపడకుఁడు. భాషలోని కళను బ్రాణమును తత్త్వము నాత్మను గనిపట్టవలయును. అది మీ కసాధ్యము. తుద కిన్ని యీనాముల నమ్మి–యమ్మపెడలోని పుస్తెపూసలమ్మి– వంటయింటి పాత్రల నమ్మి–ధైర్యపడి–వారములు చేసికొని–ముష్టియెత్తి సంపాదించిన–యాంగ్లేయభాషలోని పాండిత్యపుఁబస యీరంగులోనికి దిగినది. ఈవిధముగా బద్ధులైనది. స్వభాష యిదివఱకు మీచేతఁ జావనే చచ్చినది. మీగతి యెంత యుభయభ్రష్ట మైనదో చూచుకొంటిరా? మీరు వెచ్చించిన ధనములోఁ బడినశ్రమములో వినియోగపఱచిన కాలములోఁ, బొందిన ధైర్య ములో, నేడ్చిన యేడ్పులలోఁ, బదునాఱవ వంతైన నక్క–ఱలేకుండ మీరు దేశభాషాపండి తులై యుందురు. స్వభాషను మీరు నేర్చుకొనుట కేమంత శ్రమ మున్నది? అక్షరాభ్యాస దినమునుండియె మీరు స్వభాష నభ్యసించుచున్నా రని యనుకొనవలదు. మీ తల్లికడుపులో నున్నప్పుడే నేర్చుకొనుట మొదలు పెట్టినారు. ఆమె భుజించిన పదార్థముల రసమును నాభీనాళద్వారమున మీలోఁ బ్రవేశపెట్టుచున్నప్పుడే యాంధ్రభాషా జ్ఞానమును గూడ దానితో జోడించినది. తరతరములనుండి వంశానుక్రమముగా మీరక్తములో జీర్ణమై, మీ మాంసమునకు మాంసమై, శల్యమునకు శల్యమై, మెదటికి మెదడై, మీ తత్త్వముతో నైక్యమొందిన యాంధ్రభాషను, మీ రిప్పుడు క్రొత్తగ నేర్చుకొనుటయేమి? ఉపాధ్యాయుఁ డైన నక్క–ఱలేకుండ గ్రంథము లూరక చదువుకొనుచుఁబోయిన యెడల భాషాజ్ఞానసంపా దన మీ కెంతసేపు? నా కాంధ్రభాష రాదని మన యధ్యక్షుఁడు కంఠోక్తిగాఁ బలికినాఁడు. మా భాష మాకు రాదను ననర్హాక్య మాంధ్రుని నోటనుండి వెడలఁదగదు. ఏజాతి వారినోటినుండియు నంతే–ఆంధ్రదేశమునపుట్టి యెంతకాలమైనదో, ఆంధ్రజాతి పుట్టి యెంతకాలమయినదో, ఇట్టి యనుచితవాక్యము నేఁడు బయలు వెడలినది. అనుచిత మను మాట నిస్సందేహము. పోనిండు దీనికేమి? అనుచితతకు–నసందర్భతకు–నవకతవకకు –ననేక సంవత్సరములనుండి యలవాటు పడియేయున్నాము. భాష మీకు రాదేమి? అబ్బా! మీరేప్రయత్నము చేసినా రని రాదనుచున్నారు? భాష తనంతతాను మీకు వచ్చుననియే యనుకొనుచున్నారా? మహమ్మదుగారియొద్దకుఁ గొండ రాకపోయినప్పుడు మహమ్మదు గారు కొండయొద్దకు వెళ్లినారా లేదా? మీకు భాష రాకపోవుట భాషలోపమా? మీలోపమా? భాషను గొంచెము దీక్షతోఁ బఠించిన యెడల నది రానివాఁడుండునా? పఠింపకుండ భాష రావలయునన్న నది యంత పైపైన నున్నదా? భాషయందు మీకు నిర్లక్ష్యత యైనప్పుడు

భాషకు మీయం దభిమానముండునా? భాషాగ్రంథము మీకుఁ దలక్రింద నెత్తునకైనఁబనికిరాన ప్పుడు భాషాజ్ఞానము మీతలలో నెట్లు దూరును? చదివినను భాషరానివాఁ డెవ్వఁడు? ఎవ్వఁడో, వ్రేలు మడఁచి యొక్కనిపేరెత్తి చెప్పుఁడు. భాషలోఁ బుట్టి భాష నేర్చుకొని భాషరాక భ్రష్టుఁడైన ప్రపంచాతీతపురుషుఁ డెవ్వఁడో చూతము. చూచి యథార్థముగ స్వభాషాజ్ఞానమున కర్హుఁడు కాని యద్భుతాజ్ఞానతత్త్వమే యగునెడ–నన్నయభట్టు కాలము నుండి యిప్పటివఱకున్న భాషాగ్రంథములన్నియుఁ గట్టకట్టి బంగాళాఖాతములోఁ బాఱవే యుదము. మనకు రానిభాషతో మనకేమి పని? అయ్యయ్యో? రవంతకష్టమైనఁ బడనక్కఱ లేదా? నోరు మెదలుపనైన నక్కఱలేదా? 'క్రిమినల్ ప్రొసీజర్కోడ్' చేతఁ బట్టకుండనే మన యధ్యక్షశిరోమణికి శిక్షాశాస్త్రసిద్ధి యయినదా? 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' ఆక్టు తలఁగొట్టుకొని వల్లెవేసిన వారే–తారాశశాంకవిజయము రవంత చదువలేరా? సరదా తీరును. శబ్దజ్ఞానము వచ్చునే–ఊరకే రమ్మన్న నేదైన వచ్చునా? అట్లెవ్వనికైన వచ్చినదా? కడుపు నిండుటకు నోటిలోఁ బడినదానిని మ్రింగనైన వలదా? ఆమాత్రపుశ్రమమైనఁ బడనక్కఱ లేదా? 'మెయిన్సు పీనల్కోడ్' మడతవేయుటలో మెదడు చింపుకొన్న వాఁడవే –మనుచ్చరిత్రమున నొక్క యాశ్వాసమును విలాసముకొఱకైనను జదువుటకు నీ కోపిక లేకపోయెనా? తీరిక లేకపోయెనా? శక్తి లేకపోయెనా? బుద్ధిలేకపోయెనా? చంద్రబుల్లి నామూలాగ్రముగ నెఱుఁగుదువుకాని చంద్రమతిపేరైన నెఱుఁగవే! 'కన్హింగ్హామ్సు ఏవిడెన్సు' ఆక్టు వలన నీకడుపే నిండునుగాని కంకంటివారి రామాయణమువలన నీ మనస్సు నిండునే! 'జస్టిసు పోలోవే' గారి జడ్జిమెంటు నొప్పఁజెప్పఁగలవు కాని జనకచక్రవర్తి ప్రపంచమునకు బోధించిననీతి నెఱుఁగవే? 'సివిల్ ప్రొసీజర్కోడు లేటెస్టు ఎడిషన్'కుఁ గర్త యెవ్వఁడో యెఱుఁగుదువుకాని సీతారామాంజనేయకవి యెవఁడో యెఱుఁగవే? భారత భాగవతములను బఠింపని నీవు బారిస్టరు వైననేమి–ప్రభూత్తముఁడ వైననేమి? ఆంధ్రుడవై యేల పుట్టితివోయి నాయనా! నీ వాంధ్ర దేశమున కెందులకోయి నాయనా! నాకు బోధపడక యడుగుచున్నాను. క్షమింపుము. నీ వే పుస్తకములను జదువనక్కఱలేదు. దినమున కొక్కసారి పావుగంట తెఱపిచేసికొని రాత్రి భోజన మైనతరువాత నిల్లాలిని బిల్లలను నీచుట్టు కూరుచుండఁ బెట్టుకొని తాంబూలచర్వణ మాచరించుచు నడుమ నడుమ నాన్కో ఆపరేషను ముచ్చటలఁ జెప్పుకొనుచు నాంధ్రపత్రికను జదువరాదా? నాలుగు మాసములట్లు చదువుము. నాకాంధ్ర భాషాజ్ఞాన మెంత వృద్ధియగునో తెలుఁగుబాసలో నేదైనపస యున్నదని నీ కప్పటికిఁ దెలిసినయెడల భాషాగ్రంథములను జదువవచ్చును. అందఱు తెలుఁగు మాటలాడవలసిన యిందఱలో నీ వొక్కఁడ వింగ్లీషుతో మాటలాడితివి! కావుకావు మని యనవలసిన కాకు లన్నిటిలో నొక్క కాకి కొక్కొరొకో యని యఱచినయెడల మిగిలిన కాకులు దానిని ముక్కుతోఁ బొడిచివేయక మానునా? మేము నీవంటి యనేక ప్రకృతుల కలవాటు పడినవారము కావున సరిపోయినది. కాని లేకున్న నేమి కాఁదగినది? ఆంగ్లేయభాష యేల చదువుకొంటి వని నే నధిక్షేపింపను. ఇంతకన్న నధికజ్ఞానమును గూడ నీ వాభాషలో సంపాదింపుము. నాకు మరింత యిష్టము కాని నీయాంగ్లేయభాషాజ్ఞాన మెందులకో నీ వెఱుఁగుదువా? ఆంగ్లేయభాషయే కాదు, ఇంక ననేకభాషలు కూడ నేర్చుకొనుము. నీవు సంపాదించిన పరభాషాజ్ఞాన మంతయు నీ భాష నభివృద్ధిపఱచుటకే. నీ భాషను భాగ్యవత్తర మును జేయుటకే–నీభాషను బరభాషాగ్రంథ ప్రశస్తాభిప్రాయములతో వన్నెపెట్టుటకే

-అంతకంటే వేరు కాదే. ఆంధ్రభాషలో అ ఆలకంటె నవతలి యక్కఱము లెరుఁగని వాఁడవుకదా! ఆంధ్రుఁడనై యుండియు నాంధ్రభాషలో 'ఆ' యని నోరు మెదలుపలేనివాఁడవు కదా! నీ యాంగ్లేయ భాషాజ్ఞానమును దేశమున కెట్లుపచరింపఁ దలఁచితివో చెప్పుము. నాయనా! నిన్ను గ్రంథములు వ్రాయు మని కోరుచున్నా ననుకొంటివేమో? నీవు వ్రాయున దేమి? పార్టీలనెత్తిని పేఁడ–ఏగ్రంథమును నీవు వ్రాయవలదు–ఏగ్రంథమును జదువవలదు. రేపటినుండియే యాంధ్రపత్రిక నామూలాగ్రముగఁ జదువుచుండుము. తెఱపిలే దని నందే హించుచుంటివా? క్లబ్బులో గంటన్నర చిట్లాటకుఁ దెఱపియుండఁగా, టెన్నిసుకోర్టులో రెండుగంటలు లోకాభిరామాయణమునకుఁ దెఱపియుండఁగా, దేశభాషాపత్రికారాజమును జూచుట కొక్క యరగంట తెఱపి లేకుండునా? తెఱపి లేకపోయినయెడలఁ జేసికో.

నాయనలారా! మన కింగ్లీషుమాటలతోఁ జెప్పినఁ గాని యే యంశము కూడ మనస్సున కెక్కదు. అట్టి యభ్యానము చిరకాలమునుండి యస్థిగతరోగమై యున్నది. ఆయుర్వేదవైద్యుఁడు వచ్చి ''అయ్యా! కరివేపాకుపొడుముతోఁ బథ్యము పుచ్చుకొనుమని నీతోఁజెప్పఁగ నీ కామాట నచ్చదు. నాన్సెన్సు. కరివేపాకుపొడు మెందులకయ్యా యని నీ వా యాయుర్వేదవైద్యు నధిక్షేపింతువు. ధనియాలు 'డైజెషన్‌కు' మంచివి. మిరియాలు 'లివర్' మీద 'ఆక్టు' చేయును. కరివేపాకు 'గాల్ బ్లాడర్'కు సత్తువ నిచ్చునని యెవఁడో ఎల్.ఎం.పి. మనవాఁడే చెప్పిన యెడల నీ కది శ్రుతిప్రమాణము. నాయనలారా! మన మెంత లక్షాధిపతులమైనను గోటీశ్వరులమైనను మన బ్రదుకులు ముష్టిబ్రదుకులు కాని మనజీయె కటి కాదు. ఈముష్టిదేవులాటలో నింగ్లీషుమాటలుకూడ నెందులకు? ఆయేడుపేదో మాతృభాషతోడనే యేడ్చిన మంచిది కాదా? మన యేడుపు సహజముగాను సాపుగాను స్వంతత్రముగా నుండునే. ఏడుపులోఁ గూడ మన కన్యతంత్రత యేమి కర్మము? అందుకు సర్వస్వతంత్రులము సంపూర్ణాధికారులమే కదా? ముష్టిబ్రాహ్మణుఁడు నీ యింటికి వచ్చి యాయావరపుబ్రాహ్మణుఁడి నయ్యాయని యఱవక ''బాయ్ రూములోనున్న పాట్‌లో రైస్ యేమైన నున్నదేమో, కైన్‌డ్లీగెటిట్ హియర్; థాంకు యూ ఇన్ ఆంటిసిపేషన్'' అని నీతో సంభాషింపఁగ, వాతనికి ముష్టి వేయుదువా? మూఁతిమీఁద నీడ్చి యొక్కటి వేయుదువా? ఆలాగే మన ముష్టిలోని యీ యింగ్లీషుమాటలు కూడ నంత గౌరవప్రదములే యని నిశ్చయముగా నమ్మఁడు–నమ్మఁడు.

నాయనలారా! మీసభాకార్యక్రమము సంతయుఁ జెడఁగొట్టితిని. న్నన్ను మీరు క్షమింపవలయును. మఱి యెప్పుడైన నీసభ తిరుగఁ జేసికొనుఁడు. (అప్పుడు మీ రధ్యక్షులుగా రావలయు నను కేకలు) నాయనలారా! అటులే–మీ రంత యాంధ్రభాషాభిమా నముతోఁ బ్రవర్తించుచున్నప్పుడు నాచేతనైనసేవను నేను జేయనా? ఇక నాల్గుమాటలు మాత్రము చెప్పుదును. ఆంధ్రభాష బొత్తిగ రానివానితోడనే కాని మీ రాంగ్లేయమ్మున నెన్నఁడు మాటాడవలదు. మీరు మీ మిత్రుల కుత్తరము వ్రాయునప్పుడు 'డియర్ ఫ్రెండ్'తో నారంభించి 'యువర్స్ ట్రూలీ'తోఁ బూర్తిచేయక 'బ్రహ్మశ్రీ' తోడనో 'మహారాజశ్రీ' తోడనో యారంభించి, 'చిత్తగింపవలయును'తో బూర్తిచేయవలయును. ఆంధ్రభాష వచ్చిన వాని కాంగ్లేయభాషతో నుత్తరమెన్నఁడును వ్రాయకుఁడు వ్రాయకుఁడు. ఈనీయమములను మీరు చేసికోఁగలరా? (అభ్యంతరమేమి యను కేకలు) నూతనముగా నచ్చపడుచున్న

యాంధ్రగ్రంథము లెల్లను విమర్శనబుద్ధితోఁ జదువుఁడు. తొందరపడి యధిక్షేపింపకుఁడు. శనివారాదివారములందు రాత్రి తప్పకుండ రెండుగంటలు పురాణపఠనమునఁ గాలక్షేపముచేయుఁడు. స్వభాషాపత్రికలను జూడకుండ నావలఁ బాఱవేయకుఁడు. ఆంగ్లేయ భాషాగ్రంథములు మీరు చదువుచున్నప్పుడు వానిలో 'మన భాష కక్కఱకు వచ్చునంశము లేమియా' యని తదేకదృష్టితోఁజూచుచు వానిని మెదటిలోఁ బదిలపఱుపుఁడు.

మీ రీ నియమము లొనర్చుకొని పట్టుదలతోఁ బాటించి పుట్టుక చేతనేకాక, బుద్ధిచేత, స్వభావముచేత, యోగ్యతచేత, నాంధ్రు లని యనిపించుకొనుఁడు.''

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

8. కాలస్వరూపుడు

జంఘాలశాస్త్రి తాను ఒకప్పుడు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లకుపోయి, స్టెరియస్కోపులో 'కాశి' బొమ్మలు చూశాడు. అది కూడా ఆ బొమ్మలు చూపించేవాడి బలవంతపు ఆహ్వానం మీద కొత్తడబ్బు ఇచ్చి చూశాడు. ఆ సమీపంలోనే ఒక అరుగుమీద పడుకోగా నిద్రపట్టింది. ఆ నిద్రలో ఒక కల వచ్చింది.

తాటిచెట్టును మించిన పరిమాణంలో ఉన్న మహాకాల పురుషుడు కనిపించి, జంఘాలుణ్ణి తన ఎడమ అరచేతిలో కూర్చోబెట్టుకున్నాడు. సీసా బిరడాతిప్పినట్టు అతని తలని వెనక్కి (గతంలోకి) తిప్పి, చూడమన్నాడు. ముందు ఏమీ కనబడలేదు. అలికేసినట్టు వుంది. అంతలో ఆకాశం కాగితం గొట్టం లాగ చుట్టుకుని క్రిందకు దిగింది. కాలపురుషుడు తన ఎడమచేతి వ్రేలితో జంఘాలుడి ముఖాన్ని ఆ ఆకాశపు గొట్టంలోకి తోశాడు. జంఘాల శాస్త్రి కీఅనుభవం మహాసంతోషంగా వుంది. ఇంతలో కాలపురుషుడు అతన్ని అరచేతిలో కూర్చోపెట్టుకుని-మన దేశంలో ఒక మతం వెంట ఇంకొక మతం-ఒక దాని మీద ఇంకొకటి సంస్కరణలు చేసుకుంటూ ఎలాపుట్టుకుపచ్చాయో, చూపిస్తూ కారణాలు చెప్పాడు.

కాలపురుషుడు బౌద్ధమతం వ్యాప్తిచెందడానికి గలకారణాలతో ప్రారంభించి-శంకర, రామానుజ, మధ్వాచార్యులు ఏయే ఉద్దేశాలతో తమ తమ మతాల బోధలు సాగించారో, ఒక్కొక్క దశలో, ఆయా మతావలంబకులు వాటి నెలా భ్రష్టుపట్టించారో వ్యాఖ్యానించాడు-ఇంతా చెప్పి కలలోని ఆ విరాట్ పురుషుడు జంఘాలుణ్ణి ఇంచుక క్రిందికి వదిలాడు. ఇహంలోపడ్డ అతనికి కల చెదిరింది.

నేను సభకుఁ బోవుసరికి జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించుచున్నాఁడు:--

'ఒక్కఁడే తరువాయి-రావయ్యా! కానికిఁ గాశిఁ జూపింతునో యబ్బ! రావయ్యా' యని యంతర్వేది నరసింహస్వామివారి తిరునాళ్లలో నాలయముకడనుండి యీవలకు వచ్చుచుండఁగా ననున్నొక్కఁడు పిలిచెను. 'నేను గాశి నిదివఱకుఁ జూచితిని. చూడనినారి కెవ్వరికైనఁజూపింపు' మని నేను బ్రత్యుత్తరమిచ్చి పోవుచుండఁగా 'నెనుకటి కాశికాదయ్యా!

ఇప్పుడు క్రొత్తబొమ్మలు వచ్చినవి రావయ్యా' అని యతఁడు నన్ను మందలించెను. ప్రతిమ క్రొత్తదగుటచేఁ గాశికూడఁ గ్రొత్తదని యాతని నమ్మకమైనట్లు కనఁబడుచున్నది. ఆహా! క్రొత్తయందు మనుజుల కెంత వింత–ఎంత వేడుక–ఎంత విశ్వాసము! అనవరతాభ్యాసముచేఁ బ్రాఁత రోఁత కదా! ఆషాఢారంభమున నంబర మలంకరించిన యంబుద మక్షిపర్వమనుట కేమైన సందేహమా? క్రొత్తకోయిల కుహూకారమును–గాలియైన స్తంభించి–యాకర్ణించున గదా! క్రొత్తయావకాయరుచిని వర్ణింపఁజాలిన కవి యిదివఱకుఁ బుట్ట లేదు–ఇకముందుఁ బుట్టఁబోఁడు. క్రొత్తపెండ్లికూఁతురి బెళుకు–వహ్వా కోటి కోహినూరుల తళుకు. ప్రకృతి యెంత ప్రాఁతదైనను నెప్పటి కప్పుడు క్రొత్తగాఁ గానఁబడుట చేతనేకదా–దానియం దంత ప్రేమము–అంత పామరత్వము–అంత పరవశత్వము నని నాలో నే నేదో వెఱ్ఱిమొఱ్ఱిగ నూహించుకొనుచుండఁగా–''ఓయబ్బ! క్రొత్తడబ్బే కాదఁటయ్యా! రావయ్యా!'' యని తిరుగ నాతఁడు నన్నుఁ దొందరపెట్టెను–వెళ్లుట కిష్టము లేనివాఁడనయ్యును, నాతనియొద్దకు వెళ్లితిని–అయ్యయ్యో! అతఁ డెవఁడు? నే నెవఁడను? ఆతఁడు పిలుచుట యేమి? అనిష్టమయ్యు నాతనియొద్దకుఁ బోవుట యేమి? చూచితిరా! నాయనలారా! ఎంత వింతగ నున్నదో? ఇటులే మన మనేక కార్యములు–పరప్రేరితులమై యాచరించుచున్నాము. ఎవ్వఁడో యొక్కఁ డదేపనిగఁ బట్టుపట్టి మనల నే పనికైనఁ బురికొల్పునీ! మన మన స్వాతనికి వశము కాకపోయినను–మన నరము లాతని సంతతసంప్రేరణముచే బింకము తగ్గినవై –యాతనికి విధేయములై–యాతని యిష్టము ననుసరించును. ''కొనుఁడు. వెంటనే కొనుఁడు. త్వరపడుఁడు. ఒక్క నిమునమైన నాలస్యము చేయకుఁడు.'' అను పండ్లపొడిసి గూర్చి పత్రికాప్రకటనము చూడఁగనే, యావస్తువు మన కక్కఱలేకపోయినసరే–యది కొనుట కిష్టములేకపోయినను సరే–యామాటలకు దాసులమై–తెల్లవారువఱకుఁ బండ్లుం డునో లేదో యని సందేహము నొందువానివలె–నాలస్యమగునెడల మఱి యే యభ్యంతరము కలుగునో యను నాందోళనముతో–నప్పుడే దానికొఱకు ప్రాయుదుము. ఈమెత్తదనము మనుష్యప్రకృతిలోనే యున్నది. హెచ్చుతగ్గులు వ్యక్తిభేదములఁబట్టి యుండును. అందుచే తనే ప్రభువులుగాని వనితలుకాని పరులతో విశేషించి సంభాషింపరా దని ప్రాచీనులు ప్రవచించియుందురు. ప్రభుదర్శనమున కెన్ని ప్రతిబంధము లున్న నంతప్రభుశ్రేయము. అబలాసంభాషణమున కెన్ని యవరోధము లున్న నంతయుభయపక్షములకుఁ గూడ నుత్తమము. ఆహా! మాటకు వశుఁడు గానిమనుజుఁ డేఁడీ! మాటకున్నశక్తి మనుజుని కెక్కడిది? మాటకున్న వేగము గాలి కెక్కడిది? మాటకున్న మైకము కల్లున కెక్కడిది? మాటకున్న యాకర్షణశక్తి భూమి కెక్కడిది? ఆలయములో నిష్టస్తంభన మొందిన ప్రతిమ యెదుటఁ గూరుచుండి–దిగుదిగు మని యాప్రతిమ నుద్దేశించి–నిశ్చలమనస్కతతో, నిర్నిద్ర దీక్షతో, నిరుపద్రవబుద్ధితో, నీరంధ్రదృష్టితోఁ బలికినయెడలఁ బ్రతిమ దిగుట కేమైన సందేహమా? శబ్దమున కంతశక్తి యున్నది. కావున దానిని బ్రహ్మమందురు. అట్టి శబ్దమున కధీనుఁడనై నే నొక్కగుంపులోనికిఁ బోయితిని. అక్కడ నొక్క కొండవీటిసీమవాఁడు కాఁబోలు–గోపురమువలె నిలువఁబడియున్నాఁడు. నల్లనివాఁడు, నెత్తినిఁదెల్లని తట్టపాగవాఁడు, తొగరుబొందు మొలత్రాటివాఁనెడమకాలి వెండికడియమువాఁడు, నాఱడుగుల నఱ పొడువువాఁడు, తనయంతపొడువు చేతికఱ్ఱను–మోచేతివంపున వ్రాల్చినవాఁడు, మోకళ్లు దిగియు దిగని బట్టై యంచు బట్టకట్టువాఁడు, చెవిసందున పాటియాకు

చుట్టవాఁడు, నట్టివాఁడు–స్టైరియస్కోపులో బొమ్మలను జూచుటకై నిలువఁబడినాఁడు. ఆర్గురుజను లొక్కసారి చూడవచ్చును. అయిదుగురు దొరకినారు. ఆఅవమాఁడను నేను–నన్నుఁజూచి ''డబ్బీడఁ బాఅనైచి యాడఁబోయి చూడవయ్యా'' యని నాకాతఁ డాజ్ఞాపించెను. కిక్కురుమనకుండ డబ్బిచ్చి నాప్రక్కవారివలె నే వంగి రెండద్దపుముక్కలలో నుండి లోనికిఁ జూచితిని. నాకు నిజముగాఁ జూడవలయు ననిలేదు. అంతకన్న అంకుల రాట్న మెక్కిన యెడలఁ బనందుగా నుండునేమో యని యూహించితిని. కాని నాయూహముతోఁ బనియేమున్నది? ఆతఁడు కుడిచేత నున్నపుల్లతో నీమయినుపరేకు మీఁదఁ గొట్టుచు నిట్లారంభించెను.

పాట

కాశీపురపుతమాషా–కన్నులవండువు–చూడండి ॥కా॥
మిన్ననంటినమేడలు–మేలుమేలు చూడండి
నన్ననన్నసందులు–చాలఁగఁగలవు చూడండి ॥కా॥
మీఁగడపాల మినమినలు–మిక్కిలి మిక్కిలి చూడండి
బోగపుసానులయాటలు–పులుకుపులుకు చూడండి ॥కా॥
గంగతల్లి కలకలలు–కన్నులునిండఁ జూడండి
రంగుంగుపడవలు–రహినిరహిని చూడండి ॥కా॥
స్నానమాడుపురుషుల–చల్ల చల్లగఁ జూడండి
స్నానమాడుచెలులను–నందునందునఁ జూడండి ॥కా॥
గుడిలో శంభునిలింగము–కోరికోరి చూడండి
మదిలోనున్న యాసలు–మఱియు మఱియు వీడండి ॥కా॥
అదిగో అదిగో ఆపైన–వ్యాసకాశిఁ జూడండి
అదిగో అదిగో చూడండి–అదిగో అదిగో చూడండి ॥కా॥

ఇట్లాతఁ డింకేమో తాళసహితముగాఁ బాడుచుండఁగా, నేను గొంతచూచి, సందడికి దూరముగా నున్న యొక్కయరుగు మీఁదికిఁ బోయి పండుకొంటిని. నిర్బంధదృష్టిచేఁ గన్నులు నొప్పులుగా నున్నవి. కాశీచిత్రములనే తలఁచుకొని పండుకొంటిని. ఒక్క న్వప్నము వచ్చినది. 'తాటిచెట్టుకంటె నెన్ని రెట్లో పొడవుగల యొక్కఁ డగపడినాఁడు. అతని తల యాకనము నంటియున్నది. ఒడలు రోదనీకుహరమంతయు నిండినట్లున్నది. గడగడవడఁకుచుఁ గన్నులుమూసికొని హరహరా యని యనఁబోయి అ–అ–అ యని యూరకుంటిని. అతఁడు కాలిగోటితో నన్నుఁ బై కెగమీఁటి తన యెడమయరచేతిలోఁ గూరుచుండఁ బెట్టుకొనినాఁడు. ''వెనుకకుఁ జూడఁగలవా'' యని నన్నాతఁ డడిగెను. మాటలాడలేక యూరకుంటిని. అంత నీసాలోని బిరడానుద్రిప్పినట్లు రెండు వ్రేళ్లతో నాతలను బట్టుకొని తలనుమాత్రమే వెనుక ద్రిప్పినాఁడు. అయ్యయ్యో! వీఁ పేవైపున నున్నదో మొగ మావైపున నున్నది. ఏమిచేయఁగలను? ఏవైపున నున్ననేమి తల యిప్పటి కిట్లు నిలిచియున్నది కదా యని సంతసించితిని. ఆహా! ఎంత సహింపరాని యాపదలోఁ గూడ నేదియో యొక సంతుష్టికదా! వెనుకవైపుననే చూచుచుంటిని. అదియే యప్పటికి ముందుచూ పయ్యెను. దట్టమైనమంచు కురియుచున్నట్లున్నది. మంచుమాత్రము కాదు.

ఏదియో తెలియదు. ఏమియు స్పష్టముగాఁ గనఁబడుటలేదు. అలికివైచినట్లున్నది. నన్నని బట్ట తెరవైచి నట్లున్నది. కాని నడుమనడుమను విస్ఫులింగములవలె, నుల్క-లవలె, జిగజిగ మని, బగ్గుమని, యేవియోకాని జఱజఱ పోవుచున్నవి-ఇంతలోఁ గొంచెము వెలుతు రెటనుండియోకాని వచ్చినట్లున్నది. పైనున్న మిన్ను మఱియొక్క క్షణములోఁ గ్రిందికి దిగినట్లు కానఁబడినది. అట్లుదిగి యొక్క త్రుటికాలములో గిఱగిఱ చుట్టుకొని పెద్ద కాగితపు గొట్టమువలె నా మొగము కెదురుగ నిలిచెను. నన్నుఁ జేతిపై గూరుచుండఁ బెట్టుకొని యతఁడు తన యెడమచేతివ్రేలితో నా మొగము నా మింటిగొట్టములోనికిఁ ద్రోచెను. ఆహాహా! నూఱు విద్యుద్దీపములు వెలిఁగినంత కాంతి యా గొట్టములో నున్నది. అంతకాంతి యున్నను నాకుఁ గన్ను లేమాత్రమును జెదరలేదు. అట్లు నేను మహాహ్లాదమున శూన్యప్రదేశమును జూచుచుండఁగా నన్నరచేతఁ గూరుచుండఁ బెట్టుకొనిన కాలస్వరూపుఁ డిట్లనియెను.

''జంఘాలుఁడా! నిశ్చలముగఁ జూడుము. అదిగో బుద్ధుఁడు. మఱిచెట్టుక్రిందఁ బద్మాసనాసీనుఁడై యున్నాఁడు. ఆతఁడు నీకు బాగుగఁ గనఁబడుచున్నాఁడా? (అ యని నే నంటిని.) ఈతఁడు వేదప్రమాణము నంగీకరింపకపోవుటచే నీతని మత మవైదికమతము. ఈతఁడు దైవతత్త్వమునుగూర్చి సాధ్యమైనంతవఱకు మూకీ భావమును వహించెను. అందుచేఁ గొంతవఱకు నాస్తికమతము కూడను. సృష్టిస్థితిలయకారణుఁడును, సర్వజగన్నియామకుఁడును, సాధురక్షకుఁడును, క్రూరశిక్షకుఁడును, సర్వస్వతంత్ర శక్తి సంపన్నుఁడును, సచ్చిదానందమయ స్వరూపుఁడును, స్వేచ్ఛానుసార వర్తనుఁడును, కారణబంధశూన్యుఁడును, సర్వవ్యాపకుఁడును, సర్వజీవాంతర సాక్షిభూతుఁడును, పాప నాశనావసరానుసారవిరచిత భూలోకావతారుఁడును, స్తోత్రప్రియుఁడును, బ్రాహ్మణ ప్రియుఁడును, వైదికకర్మవందితుఁడును, సర్వమంగళ గుణసమంజసుఁడును' నగు భగవంతుఁ డెక్కడనో యున్నాఁ డనుసరికి-నతనికి నాడైనిష్ఠమని యొక్కఁడు, నావైగోప మని మఱియొకడు-నాడైదటస్థుఁ డని మఱియొకఁడు నావైదికకర్మములచేతఁ జెవులు నులిమి యాతని స్వాధీనపఱచుకొందు నని మఱియొకఁడు, నూ రెగిరిపోవునట్లు ప్రార్థించి వరము లిచ్చువఱకు దొరకఁ బుచ్చుకొనిన కాళులు విడువ నని మరియొకఁడు, ప్రార్థనము లకు లొంగక పోయినయెడల ధనమునకు గిఱగిఱఁ దిరిగి లొంగు నని మఱియొకఁడు, దైవమునకుఁ గడుపునిండఁ గల్లుపోసినయెడలఁ దెలికపిండి తిన్న కుక్కవలె నా గుమ్మములోఁ గాపు పడియుండునని మఱియొకఁడు, తన మెడలోని వైజయంతిమాలను జెఱిపించి నా ముండనెత్తిపై రాగిడి చేయించినాఁ డని మఱియొకఁడు, నాకిది చేసినాఁడు మంచివాఁడే యని యొకఁడు, నది చేయలేదు కావునఁ గనఁబడిన యెడల మూఁడు ముక్కలక్రింద నఱకుదు నని మఱియొకఁడునై-జనులెల్లరు కొనవెట్టులెత్తి, ఛాందసులై, మతులుపోయి, వీరావేశములెత్తి, బూడిద బుస్సన్నలై, త్రాఁగుబోతులై, మాంసభక్షకులై, భ్రష్టులై, పాపులై, భగవంతునకుఁ దార్పుడుకాండ్రై, కవులై, కాకులై, గాడిదలై, సర్వవిధములఁ బాడై, దేశమునం తయు దేవునిపేర, సర్వవిధముల ధ్వస్తము చేసిరికాదా? చూడు! ఒక్కసారి పంజాబు దేశమునుండి బ్రహ్మదేశమువఱకుఁ గన్యాకుమారి మొదలు కైలాసము వఱి కొక్క చూపునఁ జూడుము. దేవునిపేరిట, దేవునిశక్తులపేరిట, నెన్నికోట్ల గొట్టెల తల లెగురుచున్నవో-ఎన్ని కోట్ల దున్నపోతులు హింసింపఁ బడుచున్నవో-ఎన్ని లక్షల నరహత్యలు జరుగుచున్నవో

–భూమిపై నెత్తుటి వాసన, కల్లు వాసనఁ దప్ప మఱేదియు లేదే. దేవుఁ డెక్కడనో యున్నాఁడనఁగ నెక్కడ నున్నాఁడు? అక్కడ నాతఁడు గూరుచుండునా? నిలువఁబడి యుండునా? కూరుచుండినయెడల నడుమీడ్చుకొని పోవదా? నిలువఁబడినయెడలఁ గాళ్ళు తీసికొనిపోవా? కావునఁ బండుకొని యుండవలసినదే? ఎక్కడ? భూమిపైఁ బండుకొనిన యెడల నొడలొత్తుకొనిపోవును. ఉప్పుసముద్రమునఁ బండుకొనిన యెడల నొడలు మండును. కానఁ బాలసముద్రము మంచిది. కాని యిట్లు చేసినయెడల నొడలు జిడ్డగును గాన దానిపై నేదియో యుండవలయును. మంచము పైచినయెడల దించుకొనిపోవును గావునఁ బత్రమో పామో యేదో యొకటి కావలసియున్నది. సరే యిక్కడికి భగవంతుఁడు పండుకొన్నాఁడు. పాపము దిక్కుమాలినవాఁ డొక్కఁడు–పుట్టించుకొడుకులను –ఎక్కడనుండి? బొడ్డునుండి–కాని ఎందఱు మీసాలరాయలున్న నొక్క గాజులచేయి సుఖమిచ్చునా? లక్ష్మీదేవి యిక్కడికిఁ బ్రక్కలోనికి దొరకినది. అంతటితో సరిపోయెనా? ఈమెకుఁ జెలికత్తెలు–ఆయనకు వేడుకచెలికాండ్రు–ఆయనకు నీమెకు నడుమ సంధానకర్తలు. ఆమెకుఁ గోపములు–ఈయన బతిమాలుటలు–పైవారి మాధ్యస్థములు వచ్చువారు –పోవువారు–భూలోకవార్తలు నివేదించువారు–చారులు–సేనాధిపతులు–పాడికిఁ గామధేనువులు–మీఁద నెక్కుటకు గుఱ్ఱములు, వేదండములు, రథములు, పక్షులు–ఇది గాక కట్టుకొనుటకుఁ బచ్చపట్టుబట్టలు–ఈయనకు బిళ్లగోచులు–ఆమెకుఁ బైఁటలు–తలలోఁ బూవులు–కాలికిఁ బాదుకలు–చెవులకుఁ గుండలాలు–నడుములకు బంధములు. ఒక్కఁడైన దేవునకెంత సంసారవృద్ధియైనదో–నేను జెప్పుచున్న మాటలన్నియుఁ బ్రత్యక్షముగా నెప్పటికప్పుడు బొమ్మవలె నీకుఁ గనిపించుచున్నవా? (కనిపించుచునే యున్న వని నే నంటిని.) జను లంతటితో నూరకుండక, యొక్క దేవుఁడు బాగుగా నున్నదిగాదు. ముప్పదికోట్లు –చాలవు. పైన మూఁడు సరి. ఈసారి మంచిది–వీరంద ఱొక్కఁడనో యుండనేల? భూలోకమునకు దింపిన మంచిది కాదా? పాపము వచ్చినారు. రా కేమి సేయుదురు? గర్భాలయములో వేదఘోషములతోఁ బూజలు–మండపములలో మంత్రయుక్తములుగ వివాహములు –పల్యంకికలపై నూరేగింపులు–పగలు పదేపదే పరమాన్నములు, చిత్రాన్నములు –సాయంకాలమున ఫలాహారములు, క్షీరపానములు, చిట్టిగారెలు, తాంబూల చర్వణములు, తరువాత గర్భాధానములు! అంతటితో నైన సరిపోయినదా? ఎక్కడనో గుళ్లలోనే భగవంతుఁడుండ నేల? మావంట యింటిలో నేల యుండఁగూడదు. ఈదేవునికై పూజారికొఱకు నిరీక్షించి యుందునా? అని తలఁచునరికి నింటింట దేవులు నర్మదబాణములు, రామబాణములు, మదనగోపాలమూర్తులు, హయగ్రీవమూర్తులు, ఉగ్రనరసింహమూర్తులు. గృహాధిపతి కొక్కదేవుఁడు. ఆమె సవతి యత్త కొక్కదేవుఁడు–బంగారు సంపుటములోఁ బదునాల్గురు దేవులు. నా దేవుఁడు స్వయంభువు. నీ దేవుఁడు బేతాళము–నా దేవుఁడు శాకాప్రియుఁడు–నీ దేవుఁడు మాంసభక్షకుఁడు. నా దేవుఁడుఁ ఘనుఁడు–నీ దేవుఁడు నీచుఁడు. నీ దేవుఁడు నా దేవుని కాళు లొత్తుటకైనఁ బనికిరాఁడు. నా దేవుఁడు నీ దేవుని జూచుటతోడనే ప్రాయశ్చిత్తము చేయించుకొనవలయునని జను లీరీతిగా నసూయపిశాచావిష్టులై –యాగ్రహాతిరేకులై–దైవముపేరు పెట్టుకొని–యెన్నెన్ని విధముల పాడైరో చూచుచున్నావా? దేవుని పేరిట, నమ్మవారలపేరిట, నెన్ని లక్షలమనుజుల కుత్తక లెగిరినవో –యెన్నికోట్ల నోరులేని జంతువులు తెగనఱుకఁబడుచున్నవో–ఈదేశమున దినమున

కెన్నికోట్ల గూనలకల్లు జనులు దైవప్రీతికొఱకు త్రాగుచున్నారో–యందుపలన నెన్ని సంసారములు మాసిపోవుచున్నవో–యెన్ని మహాదుష్కృతములు జరుగుచున్నవో –చూచితివా? దైవమూలముగా నిట్లు పెరిగిన యజ్ఞాన దుష్కృతరాశిముందు–హిమపర్వత మెంత? జీవహింస వలనఁ దొఱఁగిన రక్తప్రవాహముల ముందు–సింధు గంగా బ్రహ్మపుత్రల వఱద లెంత?

అందువలన నహింసాప్రధానమైనదియు–సర్వభూతదయామృత బోధక మైనదియు నగు మతము నీతఁడు–సర్వజనోద్ధరణార్థమై బోధించినాఁడు. దేవునిపే రెత్తనైనఁ దగదు. వేదములను ద్రోచివైచినాఁడు. భక్తిని బహిష్కరించినాఁడు. ఇంకఁ గావలసిన దేమి? జనుల కెంతబరువు తగ్గినది! సర్వవర్ణము లొక్కటే యనఁగ–బ్రాహ్మణాధిక్యమున కసూయ జెందియున్న యితరమతములు–కెవ్వునఁ గేకవైచి–యెగిరి గంతిడి–సంతసమున మిన్నుము ట్టినది. చూడు చూడు–ఎన్నికోటుల జనులు బుద్ధమతమునఁ జేరుచున్నారో! కనఁబడుచు న్నదా! (బాగుగనే కనఁబడుచున్నది–బుద్ధ సన్యాసులుకూడ నెందఱో యున్నా రని నే నంటిని.) సన్యాసులా? సన్యాసినులో! రవంత పైకిఁ జూడుము. చీనాదేశమున నెందఱు బుద్ధమతమును స్వీకరించుచున్నారో–ప్రక్కనున్న జపానులోఁ గూడఁ జూడుము. మత మిట్లు వ్యాపింపఁజేసి బుద్ధుఁ డస్తమించినాఁడు.

తిరుగ భరతఖండమునఁ జూడుము. జనులు నీతిని మఱచిపోయినారు–అహింసను మఱచిపోయినారు–సర్వజనప్రేమమును మఱచిపోయినారు–దేవుఁడు లేఁడని, వేదములు పెంటపైఁ బాఱవేయఁదగినవని మాత్రమే జ్ఞప్తియం దుంచుకొని–జనులు సత్కర్మదూరులై, యన్యోన్యహింసాపరులై, నీతిబాహ్యులై, క్రూరవర్తనులై, యాగమ నిందాపరులై, నాస్తికులై, పతితులై, భ్రష్టులైరి. ఈదుస్థితి క్రమక్రమముగా వృద్ధియై, యార్యావర్తదేశమంతయు వ్యాపించినది. దైవాస్తిక బుద్ధితోఁ జేసిన పాపములదారి వేఱు–నాస్తికత్వబుద్ధితోఁ జేసిన పాపములదారి వేఱు–ఇవి వానికంటె బహుభంగులఁ బ్రబలతరములై, భైరవతరములై యుండును. బుద్ధుఁ డుదయింపకముందున్న దురవస్థకంటె, నిప్పుడు రౌద్రతరమగు దురవస్థ సిద్ధించినది. ఇప్పు డేమి కనఁబడుచున్నది. (ఇప్పు డేమియుఁ గనఁబడుటలేదు. దట్టమైన మంచావరించినట్లున్నది యని నే నంటిని.)

ఈ భయంకరావస్థను బాపుటకై దక్షిణదేశమునుండి శంకరాచార్యుఁడు పచ్చుచున్నాఁడు. నీ కాతఁడు కనఁబడుచున్నాఁడా? (ఆ యని యంటిని) ఎట్లున్నాఁడో చెప్పుము. (ఆయన పొడవుగా లేఁడు–పచ్చగాలేఁడు–సన్నముగా నున్నాఁడు. దేహమున కంతయు నొక్కతలయే ప్రధానముగాఁ గనఁబడుచున్నది. తలకంతకు నొక్క నుదురే ప్రధానముగాఁ గనఁబడుచున్నది. మొగము వర్తులముగఁ బల్లెరము వలె నున్నది. ఆతని కన్నులుగూడ గుండ్రముగా నున్నవి. ముక్కు రవంత మొనదేరియున్నది. కాని యా చుబుకము నాతని పెదవులు మాత్రము ప్రపంచాతీతమైన పట్టుదలను సూచించుచున్నవి. మొత్తము మీఁద మొగము భయంకరముగా నున్నది కాని ప్రసన్నముగా లేదు–అని నే నంటిని.) ఆతఁ డాకాలపు మతములను ఖండించుటలో బౌద్ధమతమును గూడ ఖండిం చినాఁడు. బుద్ధమతము వేదబాహ్యమత మనియు, నది నాస్తికమత మనియు, దాని నెటులైన భారతవర్షము నుండి బహిష్కరింపవలయు నని యాతఁ డెన్ని పాటులైనఁ బడినాఁడు.

బౌద్ధులతో భయంకరములగు వాదము లొనర్చినాఁడు. బౌద్ధమతమును వజ్రసన్నిభములగు వ్రాఁతలలో ఖండించినాఁడు. ఆకాలపు మహారాజులలోఁ గొందఱ నాశ్రయించి వారిచే బౌద్ధుల నినుపగానుఁగల నాడించినాఁడు. కనఁబడుచున్నదా? (అయ్యయ్యో! కనఁబడుచున్నది. బహుఘోరముగ నున్నది యని కేక వైచితిని.) అదిగో యెడమచేతివైపునఁ జూడుము. ఆ పెద్దమంట యేదియో తెలిసినదా? బౌద్ధగ్రంథము లన్నియు బండ్లపైఁ దెచ్చి యచ్చట బరశురామప్రీతిని జేయించుచున్నాఁడు. బౌద్ధమతనాశము కొఱ కాతఁడు చేయని ప్రయత్నము లేదు. పడనిబాధ లేదు.

యోగాచార్యులు, సౌత్రాఁ ,కుఁడు, వైభాషికుఁడు, మాధ్యమికుఁడు నని బుద్ధునకు నల్వురు శిష్యులు. బుద్ధునిబోధన లీ నల్వురకు నాలుగు విధములుగా నర్థమైనవి. వారు వారి శిష్యులకు బోధించుటలో మఱియెన్నో యసందర్భాభిప్రాయములు బుద్ధమతములోఁ జేరినవి. అనేకాసందర్భాభిప్రాయసమన్వితమైన యప్పటికాలపు బుద్ధమతమునే శంకరాచార్యుఁడు ఖండించినాఁడు. ఆతఁడు మాత్ర మేమి చేయఁగలడు? అప్పటి కాతనికి ఖండనార్థమై లభించిన దదియే. బుద్ధుని యథార్థబోధ మేదో యాయనకుఁ దెలియుట కవకాశము లేకపోయెను. ఖండించిన యంశము లేవో బుద్ధుని మతమునకుఁ బ్రప్రధానము లైనవికావు. ప్రధానాంశము లన్నియు శంకరాచార్యుఁ డంగీకరించి తన మతమునఁ జేర్చుకొనినాఁడు. బుద్ధుని పునర్జన్మమును శంకరాచార్యుఁగ్రహించినాఁడు. బుద్ధుని జీవాత్మ మిథ్యాత్వమును శంకరాచార్యుఁడు పరిగ్రహించెను. బుద్ధుఁడు భక్తిని సమూలముగఁ ద్రోఁచి వైచినాఁడు. శంకరుఁడు దానికిఁ బ్రాముఖ్య మీయలేదు. బుద్ధుఁడు జ్ఞానమే ముక్తిసాధనమని చెప్పినాఁడు. శంకరుడు దానినే తీసికొనెను. ప్రపంచము మిథ్య యని శంకరుడు చెప్పినాఁడు. బుద్ధశిష్యుఁడగు మాధ్యమికుఁ డామాట నిదివఱకే చెప్పినాఁడు. తుదకు బౌద్ధమతమునే –యాశ్వరావలంబన మిచ్చి–వేదములపై నిలువఁ బెట్టి–శంకరాచార్యుఁ డద్వైతముగా మార్చినాఁడు. అందువలననే యద్వైతమునకుఁ బ్రచ్ఛన్నబౌద్ధమతమనుపేరు వచ్చినది. శంకరుఁ డవతార సమాప్తి నొందినాఁడు.

ఎక్కడఁ జూచిన జ్ఞానులే–ఎక్కడఁ జూచిన జగన్మిథ్యావాదులే–ఎక్కడఁ జూచిన వేదాంతులే–అందఱు బ్రహ్మములే–ఈబ్రహ్మములు–బ్రహ్మవాదినులుగూడ మతములలోఁ జేరి జ్ఞానదార్ఢ్యమునకై గంజాయిత్రాగుట–త్వమేవాహమనుశ్రుతిని సాచరణముగా ననుభవములోనికిఁ దెచ్చుటకై శరీరైక్య మొందుటయు–జరుగనారంభించినవి. ఏమని మతములో నడుగువాఁడు లేఁడు. అడుగువాఁడు లేఁడు–అడుగఁబడునాఁడులేఁడు–అడుగునట్టిదియు లేదు. కర్తలేదు–కర్మము లేదు–కార్యములేదు. కాని సన్యాసులకు గంజాయిచే దగ్గులు –యోగినులకు గర్భముచేఁ గక్కులు–వేదాంతులకు స్వపరద్రవ్యభేదశూన్యతచే సంకెళ్లు –బ్రహ్మవాదినులకు శిశుహత్యలచేఁ బ్రాణపుపోకడలు. ఇట్లు శంకరమతావలంబు లెందఱో –కపటవేషధారులై జ్ఞానశూన్యులై, వ్యభిచారపరాయణులై, దొంగలై, నరహంతలై భ్రష్టులైపోయిరి. జడలు నెత్తి కంటించుకొనఁగలరు కాని–జ్ఞానము మది కంటించుకొనఁగలరా? ఒడలికి విభూతిఁ బూసికొనఁగలరు కాని–చిత్తమునకు విరాగమును గలిగింపఁగలరా? యజ్ఞసూత్ర మట్టి యూడఁదీయఁగలరు కాని–యాశాపాశ ములు లాగివేయఁగలరా? 'అహం బ్రహ్మ' యని నోట ననవచ్చును గాని–యట్లనుసంధింపవచ్చునా? మంచిమార్గ మెవఁడైనఁ గనిపట్ట

దానిలోని యుత్తమావస్థను జేరితిమని–కల్లరులు, కపటులు, నటించి నటించి –తుదకామార్గమునకుఁ గూడ నపయశస్సును జేకూర్తురు. జనులు తెలియక కపటిని గౌరవించుటతోడనే–ఓ–అన్నియు వేసములే–అన్నియునటనములే–అన్నియు మర్మములే –అన్నియు మాయలే–అన్నియు కనుకట్టులే–అన్నియు గారడులే–తిరుగఁ బ్రజలు మహోదు రవస్థలో నున్నారు. ఎవ్వఁ డైన వచ్చి యుద్ధరించినఁగాని బాగుపడునట్లు లేదు. ఇప్పుడు నీ కేమైనఁ గనఁబడుచున్నదా? (ఏమియు లేదు. దట్టమైన మంచు కురియుచున్న ట్లున్నది. అని నే నంటిని.)

ఇదిగో! ఈసారి చూడుము. చూచుచుంటివా? ఆతఁడే రామానుజాచార్యుఁడు. (ఆలాగా! ఆలాగా! ఆహా! పండు తములపాకువలె నున్నాఁడు. చంద్రకిరణములకంటె నాతనిమాపులు చల్లగా నున్నట్లున్నవి. ఆతని మొగము పాలుద్రాగు పసిపాపని మొగమువలె నమాయకమై, యకల్మషమై, యచ్ఛమై, యమృతమయమై యున్నది. (ఆహా! ఈతఁడేనా –యాత్మ మహోదుర్గతి కామోదయుక్తముగ నంగీకరించి–ప్రజలను దరింపఁజేయుటకై –భవబంధతారకమంత్రమును మండపము నెక్కి యుపదేశించినవాఁడు? అని నే నంటిని) మండపము, కాదు–మాధవస్వామి గోపురము అదిగో ఆతఁ డాగోపుర మెక్కుచున్నాఁడు. కనఁబడుచున్నదా? సార్వజనీనానురాగసంయుక్తుఁ డగు నాతని హృదయమున కద్వైత మెక్కినది కాదు. జగన్మిథ్యాత్వతర్కము మెదటికి సాధనము కాని హృదయమునకు బోధనము కాదని యాతని నమ్మకము. అదిగాక పరబ్రహ్మమున కజ్ఞానాచ్ఛాదన మను నద్వైతబోధన మాతనికి మహాభయంకరముగను మహాపరాధముగాను గానఁబడెను. అహం బ్రహ్మానుసంధాన మట్టిదే యని యాతని నమ్మకము. ముక్తికిఁ దలకంటెఁ హృదయ మెక్కువ తోడుపడు నని యాతని విశ్వాసము. అందువలననే ముక్తిసాధ మని శంకరుఁ డానతిచ్చిన జ్ఞానమును, భక్తికంగముగాఁ జేసి–ముక్తికి భక్తియే ప్రధాన మని యాతఁడు సాధించినాఁడు. ఆయనతో మరియొక్కఁ డెవ్వఁడైన నక్కడఁ గనఁబడుచున్నాఁడా? (ఉన్నాఁడు. నల్లగ, లావుగఁ, బొట్టిగ, బొజ్జముక్కుతో, పొడుగుజటలతో, గజనుగడ్డముతో, నొడలినిండ రోమములతోఁ జేరెడేసి కన్నులతో, జేనెడు నుదుటితోఁ, జెమ్మకాయలంత పళ్ళెడునామము లతో నున్నాఁడు అని నే నంటిని.) ఆతఁడే కూరనాథాచార్యుఁడు. ఆతఁడు రామానుజుఁడు కలిసి చీనాదేశమునకుఁ బోయి బోధాయన సూత్రమును జూచి వచ్చినారు. ఏకసంధాగ్రహణ శక్తిచే గూరనాథుఁడు దానిని గంఠస్థముచేసెను. దానినిఁబట్టి రామానుజుఁడు సూత్రభాష్య మొనర్చెను. క్రిమికంఠుఁ డను రాజు రామానుజుని జంపఁగోరి–యాతనిఁ బట్టి తెండని భటుల నంపెను. (ఔను కనఁబడుచున్నారు. వారు భటులే–కాని వారు కూరనాథునిఁ గానిపోవుచున్నా రేల? అని నే నంటిని) రామానుజప్రాణ సంరక్షణార్థమై–తానే రామా నుజుఁడ నని చెప్పి–కూరనాథుఁడు భటులవెంటఁ బోవుచున్నాఁడు–అదిగో! క్రిమికంఠుఁడు చూచితివా? కూరనాథుని కన్ను లూడఁదీయుఁ డని భటుల కాజ్ఞాపించుచున్నాఁడు. నేనే యూడఁదీనుకొందు నని తీవ్రములగు తనగోళ్లతోఁ గన్నులఁ నూడఁబెరికికొనెను. (ఆహా! కనఁబడినది. భయంకరముగా నున్నది! ఏమి కూరనాథాచార్యులవారయ్యా! లోకోత్తరులని నే నంటిని) భక్తియే ముక్తిసాధన మని–భరతఖండమున నాల్గుమూలలు మాఱుమ్రోఁగునట్లు –రామానుజాచార్యుఁడు బోధించి–పరమపదమును జెందెను.

ఇక దరువాతివా రీతని బోధములనే లాగిలాగి, సాగదీసి సాగదీసి, భ్రష్టమొనర్చిరి మతమంతయు ధ్వస్తపఱచిరి. అందరు ద్వాదశోర్ధ్వపుండ్ర ధారులే–అందరు తులసీమాలాభూషలే–అందరు భాగవతోత్తములే–తురకవాండ్రు–దూదేకులవాండ్రు–మాలమాదిగ చచ్చటవాండ్రు–మొదలగు జాతులలో రామానుజమతమును బవిత్రము చేయనివారెవ్వరు? వారితో గలసితి ననినివా రెవ్వరు? వారితో నంబంధము లాచరించి వారివంశములనానాసాంకర్యమామ్నాయములుగ జేసికొననివా రెవ్వరు? మాలబాపనయ్యలు –మహమ్మదీయ భాగవతోత్తములు–చచ్చట వైష్ణవులు–దాసరాచార్యపురుషులు –మాదిగాళ్వారులు. ఓహో నిరంకుశమతము–సర్వచండాలసమ్మతము. బ్రహ్మఘ్నుడైనే సరే–గోఘ్నుడైన సరే–గురుతల్పగమనుడైన సరే–విష్ణుభక్తియుక్తుడైనయెడల–నాతడే బ్రాహ్మణుడు–ఆతడే శ్రీవైష్ణవుడు–ఆతడే పరమభాగవతోత్తముడని వారు సాయింపగనే–మేదరిగూడెములు, మంగలివాడలు, పల్లెపాలెములు, బెస్తవీధులు, తురకపేటలు మాలమాదిగపల్లె లొక్కమాఱు–నుద్ధబద్ధెలతో, బట్టాజోగురుడాగులతో దులసిపూసలపేరుతో గరాగ్రత శంఖచక్ర చిహ్నములతో–వైష్ణవాగ్రహారములపై, విశిష్టాద్వైత దేవాలయములపై, నాచార్యకూటాగారములపై, విష్ణుభజనమందిరములపై, భక్తిబోధనశాలలపై విరుచుకొనిపడినవి. హృదయమున నున్న విష్ణుభక్తి పరీక్షార్థము కాదయ్యెను బాహ్యవైష్ణవలక్షణములు కదుపుబ్రద్దలు చేయుజాలియుండెను. ఇకు జేయుదగిన దేది? అందఱు భక్తులే–అందఱు శ్రీవైష్ణవులే–అందఱు పరమభాగవతులే–భక్తియే ప్రధానము వర్ణవృత్తిలింగము లనావశ్యకములు. కర్మజ్ఞానములతో బనిలేదు. ఈభక్తి మఱీం ముదిరి పరిపక్వదశనొంది ప్రపత్తియయినది. దీనితో వైదికకర్మము చచ్చినది. స్నానము లేదు. సంధ్యావందనము లేదు. ఆచమనము లేదు. పాదప్రక్షాళనమైన లేదు. సర్వకర్మపరిత్యాగము సిద్ధించినది. ప్రపన్నులకు నియమములు లేవు. వారు నిరంకుశులు స్వేచ్ఛావిహారులు భగవత్ప్రత్యక్షతకొఱకు బదిపాయలు ద్రాగినను ప్రపన్నులకు దప్పులేదు. తుదకు రామానుజమత మనగ ద్రాగుడుమత మని యర్థమిచ్చునంతటి యవకతవకకు దిగిపోయినది. ప్రజలు తిరుగ దురవస్థలో నున్నారు. ఇప్పుడు నీకేమైన గనబడుచున్నదా? (అని యంటిని.)

ఈసారి చూడుము. ఆతడే మధ్వాచార్యుడు. ఆతడెంత బలాఢ్యుడో చూచితివా! కలియుగ భీముడు. ఆతడు చంటిపిల్లవాడై యుండగాు జంకనెత్తుకొని యాతని తల్లి కొండమె క్కెక్కుచుండెను. పిల్లవాడు జాఱి మెట్టుపైబడెను. (అయ్యయ్యో! తల పగిలినది కాబోలు నని నే నంటిని) తల కాదు మెట్టు–అప్పటి రామానుజమతము రీతిని–ధ్వస్తమైన కర్మమును దిరుగ స్థాపించుట కీతడు దుద్భవించినాడు. యోగాభ్యాసాది కర్మములను–వైదికకర్మములను–విధ్యుక్తముగ నాచరించుటకు బ్రప్రధానమైనది –శరీరదార్ఢ్యము! దానిని బోధించుటకే యీతడు డిట్టి యినుపనరములతో–నుక్కుకండలతో –వజ్రశరీరముతో బుట్టినాడు. సురాపాన–సుందరీలోలత్వాది–దురభ్యాసములచే నప్పటి జనులు–కజ్జరపుగాయలవలె–నాఱిపోవుచున్నారు. వడియములవలె నెండిపోవుచున్నారు. మొదట వేదవిహితకర్మముల నాచరింపవలయును. అటుపైన జ్ఞానభక్తు లంకురించును. సాత్వికాహారముచే దుర్వ్యసనదూరతచే ప్రాణాయామాది సాధనసంపత్తిచే –శరీరపాటవమును నంపాదించుకొని–ధావివి నత్కర్మములం దుపయోగపఱచి–మీరు తరిం

చి-దేశమును దరింపఁ జేయుఁడని యీతఁడు బోధించినాఁడు. ఈతని బోధనములుకూడఁ దరువాతివా రెంతవఱకు ధ్వస్తము చేయుట కవకాశ ముండెనో, యంతవఱకు ధ్వస్తము చేసినారు. పరిశుద్ధస్నాన మాచరించుట, సంది గుంటలోఁ బడుట-తప్పు దిద్దుకొనుట, తిరుగఁ దప్పులోఁ బడుట-పై కెగురుట, పండ్లు విఱుగఁబడుట-ప్రకృతి మర్యాదయై యున్నది. నీవు నాచేతిమీఁది కెగిరితివి-ఇఁకఁ గ్రిందఁ బడనున్నావు-కాచికో-యని నన్ను తన యరచేతిలోఁ గూర్చుండఁ బెట్టికొనిన విరాట్పురుషుఁడు తన యరచేతిని దప్పించి నన్ను వదలి వైచెను. అమ్మయ్యా యని యులికిపడి మేల్కాంచితిని. లేచి చూడఁగ నరుగుమీఁదఁ బండుకొన్నవాఁడను గ్రింద నుంటిని. తలనుండి రక్తము కారుచున్నది. లక్ష్మీన రసింహా! లక్ష్మీనరసింహా! యని స్మరించుకొనుచుఁ దిరుగ నాలయములోనికిఁ బోయితిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

9. దరఖాస్తు

ఆసారి ఉపన్యాసం ఏమీ పెట్టుకోకుండా కేవలం సాక్షిసంఘ సభ్యులి సాంత సమావేశమే పెట్టుకున్నారు. ఈ సమావేశంలో సాక్షికి కాలాచార్యులు ఒక దరఖాస్తు అందజేయగా దానిని అతను చదివాడు.

ఈలోకంలో ఏమి లేకపోయినా బ్రతకవచ్చును గాని, ముక్కుపొడుం లేకుండా బ్రతకడం అసాధ్యంగా కనబడుతోంది–అని, కనుక ఎలాగైనా సరే, సాక్షిసంఘంవారు తనకి ఏడాదికి సరిపడ ముక్కుపొడి ముట్టజెప్పాలని ఆ దరఖాస్తు సారాంశం.

దీనిని సాక్షి చర్చకు పెట్టాడు. వాణీదాసు దీనికి ఒప్పుకోలేదు. వ్యసనాలను ప్రోత్సహించడం తప్పు గనక జంఘాలశాస్త్రి ఒప్పుకోలేదు. దానిమీదట శాస్త్రికి, వాణీదాసుకీ చిన్న ఘర్షణ అంటుకోబోతే సాక్షి ఆపాడు.

కాలాచార్యులకున్న ముక్కుపొడి వ్యసనం, 'వ్యసనం' స్థాయిని కూడా దాటిపోయి, జబ్బుగా పరిణమించిందన్న అభిప్రాయం వ్యక్తం చేసి, అందుకు వైద్యమే శరణ్యమని జంఘాలశాస్త్రి సూచించాడు. అందుమీద వాణీదాసు, మద్రాసులో వేంచేసి వున్న, సుబ్రహ్మణ్యస్వామి భక్తుడున్నూ, ఆస్వామి ఎవరికి మందిమ్మంటే వారికి మాత్రమే మందిచ్చే నియమం వున్నవాడున్నూ అయిన ఒక అయ్యంగారి ప్రస్తావన చేశాడు. దాంతో చర్చ, ఆ వైష్ణవ వైద్యుడి మీదకు తిరిగింది. ఔషధైవం సుబ్రహ్మణ్యేశ్వరుడేమి? వైష్ణవుడికి ఆరాధనీయుడేమి? అనే ప్రశ్న వచ్చింది–దాంతో, తాను మద్రాసు వెళ్లి, అయిదు రూపాయలిచ్చి అయ్యంగారిని దర్శించి, వారి మహిమ గ్రహించి సాక్షిసంఘానికి ఉపన్యాసమిస్తానని జంఘాలశాస్త్రి మాట ఇచ్చాడు. ఆ తరువాతనే కాలాచార్యుల్ని వైద్యానికి పంపుతానన్నాడు. ఇతరుల దరఖాస్తుల్ని చదవడం వాయిదావేసి, నాటికి సమావేశం చాలించారు.

ఆదినమున సాక్ష్యుపన్యాస మేమియు లేదు. సభా వ్యాపారములను జూచుకొనుట యున్నది. సాక్షిసంఘము తిరుగ స్థాపింపబడి దాదాపుగా నొక సంవత్సరము కావచ్చినది. సభావ్యాపారములను మూడు సారులకంటె నెక్కువగా జూచుకొని యుండలేదు. ఇదిగో కాలాచార్యులు సాక్షిసంఘమున కిచ్చినది దరఖాస్తు.

శ్రీమతేరామానుజాయనమఃఁ సాక్షినంఘమువారికి –(నేనుగాక) సత్యపురవాసి, సాక్షినంఘసభ్యుఁడు, తెంగలిపైష్ణవుఁడు, కాంll రఘునాథాచార్యులుగారి తృతీయపుత్రుఁడు, నలుబదియైదు సంవత్సరములుగల బ్రహ్మచారి, కాలాచార్యులు–దుర్మతినామసంవత్స రాషాఢ బహుళదశమీ శుక్రవాసరమున, నిష్టదేవతాపురస్సరముగ, గురు నమస్కారపూర్వక ముగ, స్వహస్తముతో వ్రాసికొని, స్వయముగ నమర్పించుకొనిన దరఖాస్తు విన్నపములు–

ఆర్యులారా! అన్నములేనివానిబాధ బాధకాదు–భార్యలేని వానిబాధ బాధకాదు –భర్తలేనిదానిబాధ బాధకాదు–కొడుకులేనిబాధ బాధకాదు–పాడుములేనివానిబాధ నుమ్మా టికి బాధ. ముక్కుచివర నొకవిధమైన చమత్కారమైన దురద–స్వల్పమైన తామరమీఁది జలజలవలె మొదటఁ బొడచూపి, కుమ్మరిపురువు దొలుపువలె నొక్క రెప్పపాటులో ఘనీభవించి, గొంగళిపురుగులు ముక్కుఅములఁ బ్రాఁకిన ట్లుండును మరియొక్క నిముష మునకు నాసికా రంధ్రములందు–బొమ్మచెముడుకంప కొట్టినట్లుండును. లోన నార్పుడు తెక తెక, పాకపాక యుద్భవించి, యీ వేఁడిమి పేకజువ్వవలె బ్రహ్మ రంధ్రమువఱకుఁ బై కెగసి యచ్చట నగ్నిపర్వతము పగిలిన ట్లుండును. ఇంతలోఁ గొండనాలుకయొద్దనుండి 'బాం' బొకటి బయలుదేరి, యంగిటిలోనుండి ముక్క చివరకు శక్రచాపాకారమున వచ్చి, యచ్చటి నుండి పైకిఁ బోవుటకు ముక్కుఅములలో లిద్దెలు కొట్టఁబడిన కారణమున దారిలేక, ప్రతిరోధ సంకర్షణ సముజ్జృంభ నాడంబరమున 'ఢా' మ్మని పగిలి, యీ తేజస్సు రోమరోమకూపములం దాక్రమించి, ముంచివేయును. దయ్యము పట్టినవానికివలెఁ దెరలు తెరలుగా నేడుపుపై కుబుకుచుండును. ప్రపంచమునకుఁ బ్రళయావస్థ సిద్ధింప నున్నది కదా యను భయము–నఖశిఖాపర్యంతమున్న నరముల కూడికలను జిక్కుపఱచి, చీకాకుపఱచి, ఛిద్రపఱచి, కలగాపులగముచేసి, గందరగోళముచేసి, కాసరకూసర చేయును. సత్యపుర మెందులకు–సాక్షినంఘ మెందులకు–నన్యసించి యెక్కడకైనఁ బోవుద మను విరాగముద యించును. ప్రపంచమేమో చిన్నఁబోయినట్లు–సృష్టిలోని జీవకళ యేదో యెగిరిపోయినట్లు కనఁబడును. కనఁబడినకాంత నెవతెనైన సరే–ఘోటక బ్రహ్మచారి–వయోరూప జాత్యాదిభేద ములు లేకుండ నెగాదిగఁ జూచునట్లు–తారసించినవారి నెవరినైనసరే–ముక్కు మొదలు పృష్ఠమువఱకుఁ బరీక్షించువఱకుఁ దహతహగా నుండును. నే నొక్కసారి పాడుములేక యమబాధఁ బడుచు–నన్యసేవారతులగు నరసత్తము లెవరైనఁ గంటఁ బడుదురేమో యని –వీధి యరుగుమీఁద నొడుపునైచి–ప్రాంతఃకాలమునఁ గూరుచుంటిని. ఇంతలో నొక్కవి తంతు వాదారిని బోవుచుండెను. 'లభించినదిరా లక్ష్మీ కటాక్షము, బ్రతికితినిరా బాబూ' యని కేకవైచి, ముక్కును నవ్యాపనవ్యముగ ముమ్మారు డొకాయించి, యొక్కదుముకు దుముకి, ఆమె యెదుటఁబడి, ''నా తల్లీ! నాసికాచూర్ణపియా! అబలాశిరోమణీ! ఆప ద్బంధూ! రక్షింపుము. పంగుని పజ్జకు భాగీరథి వేంచేసినది.'' అని యెడమచెతి నిసుపదు క్కవలెఁ జాచితిని. నే నున్మత్తుఁడఁడ ననుకొని కొఁబోలు నామె, నామాటలను గణింపక నన్నుఁ దొందరతోఁ దప్పించుకొని, ప్రక్కనుండి పోవ నారంభించెను. ''అమ్మా! రవంతపా డుము కటాక్షింపుమమ్మా! కాశిలోఁ గోటికన్యాదానము లొనర్చిన పుణ్యమమ్మా'' యని యఱచితిని–''నాయనా! నే నాఁడుదాననుఁ–నా యొద్దఁ బొడుముండునా'' యని యామె తలవంచుకొనుచుఁ బోవుచుండఁగా ''అమ్మా! అట్లనుట న్యాయమా? తల్లీ మీలోఁ గొందరు నన్యసేవ నారంభించినతరువాతనేకదా మా కీకఱవు సిద్ధించినది. ఆఁడువారేమి–మగవారేమి

–నలువ యొనర్చిన లింగభేదము, నవనాగరకతామాహాత్మ్యమున నశించినదికదా! పురుష లొనర్చుపనులలో–మీలోఁ గొందరు మానినవే మున్నవి? కాఫీ మానినారా? కాగిదాలయాటఁ మానినారా? షికార్లు మానినారా? సిగరెట్లు మానినారా? మీటింగులు మానినారా? వోటిం గులు మానినారా? జాకెట్లుదొడుగుట మానినారా? సైకిలెక్కుట మానినారా? తల్లీ! ముంగురులకత్తిరింపు మానినారా? ముక్కుపొడి మానినారా? అదిగాక రొంటను మారేడు కాయ యుంచుకొని, నే నాఁడుదాన నని, నస్యార్థిని నిర్దాక్షిణ్యముగ నిరాకరించుట –న్యాయమాతల్లీ!'' యని యంటిని. అంత నామె చిరునవ్వు నవ్వి, 'నాయనా! నాపుత్రునికి జబ్బుగా నుండుట సోదెకుఁ బోయితిని. సోదెవాఁడు నాపుత్రునిపై దయ్యము వ్రాలిన దనియు, దీని నాతనియొడలి కనుదినమును రాచుచుండు మనియు, మంత్రించి యిచ్చినాఁ డని రొంటనున్న చిన్న విభూతిపండును జూపెను.

సాక్షినంఘ నభ్యులారా! (నేనుగాక) నాప్రార్థన మే మనఁగా, నాకు సంవత్సరమునక నరిపడిన నస్యమును మీరు కటాక్షించుచుండ వలయును, నా కీమహోపకర మొనర్చి దేశోద్ధరణ మొనర్చి, ప్రజల విశ్వాసమునకు భగవంతునికటాక్షమునకుఁ బాత్రులరై ప్రవర్తింతురు గాక! విధేయుఁడు కాలాచార్యులు.

సభ్యులారా! కాలాచార్యుఁ డిట్లు వ్రాసెను. మీ మీయభిప్రాయములను దెలుపవ యును.

వాణీదాసుఁడు–సభ్యులారా! ఈదరఖాస్తు మన్నింపఁదగదు. ఇందున దేశోద్ధరణ మేమియు నా బుద్ధిచే నగపడదు. దేశ మనఁగా ముక్కని యే నిఘంటువులోనైన నర్థమున్న దేమో నే నెఱుఁగను.

జంఘా–పొడు మనునది వ్యసనముకాని మరియొకటి కాదు. వ్యసనములకుఁ బ్రోత్సా హము కలుగఁజేయుట తప్పు. అదిగాక, ఈ దినమునఁ గాలాచార్యునకుఁ బొడుమిచ్చిన కంగీకరించినయెడల, రేపు వాణీదానునకుఁ బొగచుట్ట లీయవలసియుండును.

వాణీ–నీగంజాయిమాట చెప్పఁగూడదు కాఁబోలు!

జంఘా–నిన్ను మూతిపై నీడ్చి కొట్టఁగూడదు కాఁబోలు. (లేచును.)

సాక్షి–నాయనలారా! మీరు తగవులు పడవలదు. జంఘాలశాస్త్రి! నీవు కూరుచుం డుము. కాలాచారీ! నీ దరఖాస్తును నిరాకరింప వలసివచ్చినందులకు విచారించుచున్నాను.

అంతఁ గాలాచార్యులు తల్లిచావు పిల్లనివలె బారున నేడ్చెను.

కాలా–సాక్షి! నాకిల్లు లేదు–వాకిలి లేదు–భార్య లేదు–అన్నియు నీవే యని నిన్నుఁజ చుకొని నేను దినము లీడ్చుకొనుచుండఁగా–నీవే యిట్లు నానాసికాచ్ఛేదన మొనర్చుట న్యాయమా? రక్షింపుము–ఈముక్కులు నీవికాని నావికావు. సంఘపక్షమున నీవు వాని దాఖలుచేసికో–నా కీబాధ తొలఁగించి రక్షింపుము.

సాక్షి–ఈసంగతిపై సభలో నాలోచింపవచ్చును.

జంఘా–కాలాచార్యునకు నన్య మెవరైన నిచ్చుట కంగీకరించి, యాతని కందుఁ

స్వేచ్ఛావృత్తినే యిచ్చినయెడల, నొకగ్రామమున కొక్కవారమునకు సరిపోయినపొడుము నీతఁ డొక్కదినములోఁ బీల్చఁ గలఁడు. ఇది యితనికిఁ గేవల వ్యసనముకా దని నాకు దోఁచుచున్నది. వ్యాధి యని నాకు నమ్మకము. దానికిఁ దగిన వైద్యునిచేఁ జికిత్స చేయించుకొనిన మంచిది కాదా!

వాణీ–వినలేదా యేమి? తగినవైద్యుఁ డిప్పుడు మదరాసుకు వచ్చియున్నాఁడు –ఆయన వైద్యము మతముతోఁ జేరినదఁట–భక్తితోఁజేరినదఁట–దివ్యదృష్టితోఁ జేరినదఁట –దేశమున కదృష్టము, మదరాసునకు మరింత భాగ్యము, నేఁడు కలిగినవని పత్రికలు ఘోషించు చున్నవే!

జంఘా–పత్రికల ఘోషముల కేమిలే–

వాణీ–నీ యధిక్షేపణముల కేమిలే! ఆమహానుభావుని యొద్ద మందుపుచ్చుకొని వ్యాధిని బోఁగొట్టుకొనినవా రనేకులు పత్రికలకు వ్రాయుచున్నారు.

జంఘా–రోగి కాయువున్నప్పు డందఱువైద్య లశ్వినీదేవతలే–నే నిట్టివైద్యుల ననేకు లను జూచియుంటిని. నాతోఁ జెప్పనేల?

వాణీ–నీతోఁ జెప్పలేదు. కాలాచారీ! నీది రోగమే యగునెడల నీ వాయనయొద్దకుఁ బోయి–

జంఘా–దమ్మిడి పాడుమునకు గతిలేక–ధర్మార్థమై తన ముక్కును దేశమున కర్పిం చిన మహానుభావుఁడు! అట్టి యాతఁడు–పదిరూపాయలు వ్యయ మొనర్చి వైద్యునియొద్దకుఁ బోవునెట్లు? ఆయన కైదురూపాయలు ప్రవేశపురుసు మిచ్చుట యెట్లు? ఈరెండుపను లైనతరువాతకదా చికిత్స–అంతేకాక, ఆయన, సుబ్రహ్మణ్యేశ్వరు నీతనికి మందీయవచ్చునా లేదా యని యడిగెదరు. ఆస్వామి యాయనకుఁ బ్రత్యక్షదైవమువలెఁ గానఁబడుచున్నాఁడు. అప్పు డాయనకుఁ గందస్వామికి జరుగు 'కాన్వర్సేషనులో' నేలాగునఁ దేలునో యాలాగున జరుగును.

కాలా–అనఁగ నాకుఁ దెలియలేదు.

జంఘా–ఈరోగికి మం దీయవచ్చునని స్వామి నెలవగునెడల నిచ్చును. ఈయఁగూడ దని స్వామియాజ్ఞ యగునెడల నీయఁడు. ఇన్ని కర్చులు పెట్టుకొని వెళ్లినపిమ్మటఁ గాలాచార్యుల కాతఁడు మందిచ్చు నని యేమి నమ్మకము?

కలా–ఆయన యెవరయ్యా?

వాణీ–పండిత స్వామి శ్రీనివాసయ్యంగారు.

కాలా–అయ్యయో! అయ్యంగారికేమి–సుబ్రహ్మణేశ్వరుఁడు ప్రత్యక్షదైవమేమి? మే మీశ్వరుని నామమే యుచ్చరింపము కదా! ఆ అయ్యంగారి కీశ్వరభక్తి యేమి? ఈశ్వరసంభాషణ మేమి? ఈశ్వరాజ్ఞాబద్ధత యేమి? నాకేమియు బోధపడకున్నది. ఆయన అయ్యంగారైనఁ గాకుండ నుండవలెను. స్వామి సుబ్రహ్మణ్యేశ్వరుఁ డైనఁ గాకుండ నుండవలెను.

వాణీ–ఆయన అయ్యంగారె. స్వామి సుబ్రహ్మణ్యేశ్వరుఁడు.

కాలా–అది వట్టి యసంభవము. తేజస్తిమిర–న్యాయము. మాధ్వుఁడు మక్కాకుఁ బోవుటవఱ కెందులకు–ఏకాదశీశ్రాద్ధమైనఁ జేయునా? మహమ్మదీయుఁడు మాధవస్వామికి పొంగలిభోగముఁ చేయించుటవఱ కెందులకు–సుద్ధబొత్తైన దిద్దుకొనునా? క్రైస్తవ మతస్థుఁడు కార్తికసోమవార ముండునా? అయ్యయ్యో! మా వడహలివారికి మాకుఁ బొత్తులేదే –మాలోనైన మాకు దృష్టిభేదము లేడ్చినవే–అట్టిచో నీశ్వరుఁ డేమి? అయ్యంగారికిఁ బ్రత్యక్షమగుట యేమి? మాటలాడుట యేమి? ఱకుఁ దిరుమణి యెందులకు? తిరుచూర్ణ మెందులకు? తులసి పూసలపేరు లెందులకు–శంఖచక్రచిహ్నము లెందులకు? తిరుప్పావెం దులకు? అయ్యయ్యో! తిరుమణి పెట్టెలో విభూతిపండా? శృంగ నాదముబదులు తాషామ రపా? ఏడ్చినట్లే యున్నది. ఎక్కడనో తిరకాసుమాత్ర మున్నది. బాగుగాఁ గనిపెట్టవలసి యున్నదేమో యోజింపవలసియున్నది.

జంఘాల–ఆతఁడు శివకేశవులందు సమానదృష్టిఁ గలవాఁడేమో? అదిగాక దాక్షిణా త్యులలో నంతపట్టు కొందఱకు లేకపోవచ్చును. పోనిమ్మె–ఆ వైద్యు నధిక్షేపించుటకు మన కేమి యధికారమున్నది? కాని యీ సుబ్రహ్మణ్యేశ్వరున కీ పాటికమేమి? ఈ దుర్బుద్ధియేమి? ఈపోఁగాలమేమి? తెలివిలేమిచే నయ్యంగా రడిగిన నడుగుఁ గాక! తా నీశ్వరుఁడే, బుద్ధిలేనివాఁడుకాఁడే, తన కింత వ్యత్యస్తచింత యేల? తన కింత ధర్మబాహ్యప్రవ ర్తన మేల? కొందఱకు మందిమ్మనునఁట–కొందఱకు వలదనునఁట. వారు మిత్రులా–వీరు శత్రులా! వారు మేనత్తకొడుకులా–వీరు కాకపోయిరా? వారు నెత్తిమీఁదివారా–వీరు కాలిక్రింది వారా? తన కిది మంచిపనియనియే తోఁచినదా? నర్వనముఁడైనఁ దన కీ విపరీతవృత్తియేల? అయ్యంగారి రాఁబడిలోఁ దనకుఁ గొంతవాటా యున్న దని పత్రికలు ప్రచురించుచున్నవి కదా! తన కీ కమీషనుకర్మ మేమి? లోకేశుఁగు తన 'కీ బ్రోకరీ' ప్రారబ్ధమెందులకు? అయ్యయ్యో–పశువులనంతలోవలెఁబొనంగు డారంభించినాఁడే–తన దేవత్వ మిట్లు పిట్టతల లుపైచి దిగనాడుచున్న దేమి? తానయ్యంగారి చాటునఁ జేరి వారికి మం దిమ్మనుట యెందులకు? వీరికి మానుమనుట యెందులకు? వారి రాఁబడిలోఁ దనకుఁ బాలెందులకు? అయ్యంగారు నంసారికావున ధనాకర్షణ మాతని తలరాఁతకాని తన కర్మమేమి? అదిగాక నన్న్యాసియే–బూడిదబుస్సనయే–దిగంబరుఁడే–తనకు వచ్చినధన మేమి చేయుఁదలఁచెనో –ఎందుకొఱకుఁ దనకీతార్పుఁడు నంపాదనమో? త్రిమూర్తులలో నొకఁడ నని తలత్రిప్పు కొని తిరుగుచున్నాఁడే–ఈదెబ్బతో నతని కధఃపతనముకాక మరియేమున్నది? తన యీశ్వరత్వ మిఁకనైనఁ గాపాడుకొనఁదగదా! తన దేవత్వ మిపుడైన రక్షించుకొనఁదగదా? అనర్థములైన వ్యాపారములలో దిగక యింతటి నుండియైన భద్రముగ నుండఁదగదా?

వాణీ–జంఘాలశాస్త్రి! పురాణములే యెఱుఁగనట్లు మాటలాడుచున్నావేమి? –సుబ్రహ్మణ్యేశ్వరుఁ డనఁగాఁ గుమారస్వామి. ఆయన త్రిమూర్తులలోనివాఁడా? –సన్న్యాసియు దిగంబరుఁడుశ్మశాన వాసియునా?

జంఘా–అదేమిమాట–ఇద్దరుకూడ నీశ్వరులే–ఇద్దరు త్రిశూలధారులే–ఇద్దరు లింగా కారమునఁ బూజింపఁబడువారే–పోనీ! వాణీదాసా! నీవు చెప్పినట్లు భేద మున్నదనియె యెంచుము. అష్టైశ్వర్యప్రదాత యగు నామహేశ్వరుని యాత్మజుఁడైన యాతనికి

–అమరసేనాధిపత్య పట్టభద్రుఁ డైన యాతనికి–అయ్యంగారి మందుల సంచి నాశ్రయించు నపాత్రబుద్ధి యేల కలిగెను? అండవాతమో–బోదకాలో–గ్రుడ్డితనమో–కుష్ఠరోగమో –బాగుచేసి యయ్యంగారు తెచ్చుకొనిన ధనములోఁ దనకు 'పన్కీ' యెందులకు?

వాణీ–భక్తిగలవారందఱు సుబ్రహ్మణ్యేశ్వరునికిఁ బుష్పములు, ఫలములు, కానుకలు, కాసులు నర్పించుచునే యున్నారు. అది యొక తప్పుగా నీవధిక్షేపింపనక్క–అలేదు. ఆయనకు గతిలేక మనయొద్ద నీసొమ్ము తీసికొనుచున్నాఁడనుట తప్పు. అట్లధిక్షేపించుట తగదు. కాని తప్పెక్కడఁ గనఁబడుచున్న దనఁగా సుబ్రహ్మణ్యేశ్వరుఁడు వానికి మం దిచ్చి బాగుచేయు మనుట–వీనికి మం దీయక నిరాకరింపు మనుట–ఇది మాత్రము తప్పుగాఁ గనఁబడుచున్నది.

జంఘా–ఆమాటనుబట్టియె యింత చెప్పవలసివచ్చినది. మదరానునకుఁబోయి, అయిదురూపాయలిచ్చి, యయ్యంగారిని దర్శించి, వారిని సేవించి, వారి స్వరూపస్వభావము లెఱిఁగివచ్చి, వారి మహిమను సాక్షి సంఘమువారి కుపన్యసింతును. అటుపైనఁ గాలాచార్యు నచ్చటికిఁ జికిత్సార్థమై సాధన మిచ్చిపంపుదును. మహానుభావుఁడు లభించిన ప్పుడే మన బాధలు నివారణకాకపోయినయెడల మఱెప్పుడు?

కాలా–జంఘాలుఁడా! నీ కింత వ్యయమెందులకు? ఆ సొమ్ములో నగము నా కిప్పు డిచ్చినయెడల–దానివడ్డితో బ్రతికినన్నాళ్లు–నమ్బుద్ధిగా, సంతుష్టిగా, నర్వాంతర్యామినంప్రీతిగా సంతత మదేపనిగ బొడుము పీల్చుకొనుచుందును.

వాణీ–నన్యప్రియులకు సాహాయ్యము చేయవల దని బుద్ధుఁడు చెప్పిన శ్లోక మవి పలికినాఁడు.

సీ. మడతలో రొంటను మారేడు కాయయుఁ
నెడమదౌ నఱచేయి నదుమ డాగు
నపనవ్యకరమున నుపదేశముద్రయు
బడఁబీల్చు పూన్కి లోపలను బుట్టు
నాసికాక్షేత్రంబునను నెట్టివరదయుఁ
బ్రక్కమానిసి నెత్తిపైన డట్టు
కొండనాల్కను గాటుకొట్టును, దలచుట్టు
మడఁపు గావంచలో మరుగుదొడ్డి

యగు మహాసహ్యరూపంబు నందునట్లు
నన్యమును బీల్పకయ్య యేనరునిచేత
నైనఁ బీల్పింపకయ్య నన్యప్రియులకు
నెపుడు గౌరవ ముత్సాహ మీయకయ్య.

కాలా–బుద్ధుఁడు కూడ దనిన వనేకము లున్నవి. నిన్నుఁ జుట్టుఁ గాల్పుమనినాఁడా యేమి? నీ కెంతగౌరవ మీయఁదగునో యాకవియే పలికినాఁడు.

సీ. ముంబండ్లనందునఁ బొగపీఁ కెక్కొప్పును

ముక్కుముందట నుసి యెక్కునిప్పు
నోటిమూలల ధూమధాటుల గుప్పును
గ్రుళ్లునోట ముఖికికుండుగప్పు
బొక్కిచచ్చిన యోష్ఠములపైని కప్పును
సాగినదౌడలఁ జిప్పి మొప్పు
నంగిటిలోనఁ బొగాకు విసపుముప్పు
గుండె వేగము కొట్టుకొనెడుచొప్పు

గలుగు నగముకాలిన కొఱకచ్చకాటి
కర్ణుఁడేకాని, సభకుఁ గా–డందువలనఁ
జుట్టుగాల్పకు–కాల్పంప–కట్టివారిఁ
గూడకుము కూడువారిని గూడకయ్య.

వాణీ–ఆచారీ! నీ కీ పద్యము వచ్చునఁటయ్యా–రా దని యనుకొంటిని.

సాక్షి–కాలాచార్యుని దరఖాస్తు చదివితినిగదా–ఇతరు లిచ్చుకొనినవి మరి రెండున్నవి. వానిని గూడఁ జదివెదను.

జంఘా–అని మరెప్పుడైనఁ జదువవచ్చును. సాయంకాలము కావచ్చినది. సంధ్యావం దన సమయమైనది–ఇఁకఁ బోవుదము.

సాక్షి-సరే మంచిది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

10. సౌందర్యము

జంఘాలశాస్త్రి 'సౌందర్యం' అనే విషయం గురించి సాక్షిసంఘంలో ఉపన్యసిస్తున్నాడు. అతని దృష్టిలో ఈ సౌందర్యం అనే దానికి ఖచ్చితమైన నిర్వచనం ఇవ్వగల సూత్రం ఇంతవరకూ పుట్టలేదు. ఒక్కొక్క అభిరుచి ఒక్కొక్క నిర్వచనం. మనిషికొక తీరున, దేశానికి కొక తీరున చలామణీలో వుంది.

మగవారి సౌందర్య లక్షణాలలో చేరని వెర్రి వికారాలు లేవు. ఎవడి మతిలేనితనం వాడికి సౌందర్యం. ఇక ఆడవాళ్ల విషయానికి వస్తే తలకట్లలోనే సవాలక్ష. నిజానికి సౌందర్యానికి వంటిరంగును మించి ముఖ్యమైనదేదీ లేదు. ఈశరీర వర్ణాలు కూడా జీడిగింజ చాయమొదలు సీమసున్నం చాయ వరకు తేడాలు కలిగి వున్నాయి: ఈరంగులు మళ్లీ జాతి జాతికీ అభిరుచి ప్రకారం నచ్చడం, నచ్చకపోవడం వుంది.

సహజమైన ఈరంగుల తేడాలు చాలక, చెంపలకూ, ముఖానికీ, గోళ్లకీ, పాదాలకీ, పెదవులకీ రకరకాల రంగులు వాడడం ఒకటి!—ఇదిలా వుండగా దేశ, దేశాలలోనూ పచ్చబొట్టు ఒంటి మీద పొడిపించుకునే లక్షణం, సౌందర్య లక్షణాల్లో ఒకటి. ఈ పచ్చబొట్లలో తీగలు, లతలు, జంతువుల బొమ్మలే కాదు, ఇతిహాస పాత్రలు, కథా ఘట్టాల వరకూ వున్నాయి. ఈదేహ సౌందర్య సాధనం అరేబియా నుంచి మిగతా చోట్లకు ప్రాకిందట.

ఇదిలావుండగా పెదవుల అందంలో జాతికొక అభిరుచి. కళ్లు, పాదాల విషయమూ అంతే. జంఘాలశాస్త్రి చీనా వనితల చిన్న పాదాల సౌందర్యం వెనక దాగిన మూడు కథలు చెప్పాడు. ఫ్రాన్సు దేశస్థుడెవరో సౌందర్య నిర్ధారక సాధనంగా మనిషి శరీరంలో ముఖాన్ని ఎంచాడట. ఆ ముఖం కొలతలు సమానంగా ఉండాలట. శాస్త్రి, శరీరంలో మొత్తం మీదనే పరిమాణాల తేడాలను వివరించి నిజమైన సౌందర్యం శరీర సౌందర్యం కాదని —ముగించాడు.

నేను సభాభవనమునకుఁ జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించుచున్నాఁడు:—

"ఒక పద్ధతియా? ఒక వరుసయా? ఒక తెన్నా? ఒక తీరా? ఒక క్రమమా? ఒక సూత్రమా? ఏమియు లేదు. చక్కఁదన మనఁగా నేమో సర్వజాతులకు సంబంధించిన

సామాన్యసూత్రము లొనర్చుట బ్రహ్మతరమా? దేహములో నున్న నరములకు నాళములకు గోళములకు మరికొన్నిటికి సామాన్యముగా నరిపోవు నిబంధనలతో నొక శాస్త్రము రచియించియున్నారు. సంకల్ప వికల్పాత్మకమైన సంతతోర్మికాసమన్వితసాగరముకంటె సకలవిధములఁ జంచలతరమై, తలవెండ్రుకల చిక్కుకంటె నెక్కువ చిక్కుకలదైన మనస్సున కు–సర్వసాధారణముగా సమన్వయించు కట్టుపాములను గల్పించి యొక శాస్త్రమును రచియించి యున్నారు. నక్షత్ర తారాగ్రహాదుల రాకడలు, పోకడలు, దూరములు, దాపులు, క్షౌరములు, గమనములు, విలోకనములు, వేగములు మొదలగునవి స్పష్టీకరించుచు నొక శాస్త్రమును రచియించియున్నారు. సంస్కృత శబ్దప్రపంచము నంతను బదియధ్యాయములలోఁ బడఁదీసి బిగించినారు. కాని చక్కఁదనమున కే సూత్రములు పుట్టలేదు. వేదాంతవిషయమున సూత్రము లున్నవి. జ్యోతిషవిషయమున సూత్రము లున్నవి. కాని సర్వజగద్బహిరంతర్వ్యాప్తమైన సౌందర్యమునకు శాస్త్రమేదియు లేదు. నీశాస్త్రము నీది, నా శాస్త్రము నాది, వాని శాస్త్రము వానిది. ఈయూరికొకశాస్త్రము, పైయూరి కొక శాస్త్రము, పైదేశమున కొక శాస్త్రము, పైఖండమున కొక శాస్త్రము, చిరకాలము క్రింద నొక శాస్త్రము, కొంతకాలము క్రింద నొకశాస్త్రము, మొన్న మొన్న నొకశాస్త్రము, నేఁ డొక శాస్త్రము, ఱేపొక శాస్త్రము. పైదేశముది మనకు నచ్చదు–మనది పై దేశమునకు నచ్చదు. పై ఖండముది మనకు నచ్చదు–మనది పైఖండమునకు నచ్చదు. పై యూరిది మనకు నచ్చదు–మనది పైయూరికి నచ్చదు. నీది నాకు నచ్చదు–నాది నీకు నచ్చదు–నీదియు నాదియు మఱియొక్కనికి నచ్చదు–మరియొకని దింకొకనికి నచ్చదు. అందఱు పండితులు–అందఱు మహామహోపాధ్యాయులు–అందఱు శాస్త్రజ్ఞులు–అందరు సర్వజ్ఞులు–ఎవని యింటికి వాఁడే యధికారి–ఎవని మగ్గమునకు వాఁడే సేనాపతి–ఎవరి సూత్రమునకు వాఁడేవ్యాసుఁడు.–ఎవని మతమునకు వాఁడే బుద్ధుఁడు–ఎవని వేదమునకు వాఁడే బ్రహ్మ. ఇట్టులొక యూర గాదు, సమస్తసృష్టిలోఁ గూడ నటులే యున్నది.

తేలుకొండిమీసా లొకనికి నీటు–డేరామేకుజెడచుట్టొకతెకు నీటు. తలనుండి వ్రేలాడు కుచ్చొకని కందము–నేలపై జీరాడు కుచ్చిళ్ళొకతె కందము. పేడిమూఁతి యొకని కందము–బోడిముక్కొకతె కందము. మూఁతిబిగిం పొకనిసొగసు–ముక్కువిఱుపొకతెకు సొగసు. అడుగుచూ పొకనికి సొగసు–అరగ న్నొకతెకు సొగసు. నుదుటిమీఁది చేయి యొకనికి గోటు–బుగ్గమీఁది వ్రేలొకతెకు గోటు. నాయనలారా? ఇటు లెన్ని యని చెప్పవచ్చును? తుదకు నోటిలోఁ బొగచుట్ట యొకని కందము–కణతపై గందపుఁబొట్టొకతె కందము. సౌందర్య లక్షణములలోఁ జేరని వెఱ్ఱి వికారము లేవియు లేవు. ఎవని మతిమాలిత నము వానికి సౌందర్యము.

నిగనగలాడుచుఁ బట్టుకుచ్చువలె మెత్తనై భ్రమర పంక్తులవలెఁ గటికిచీఁకటులు గ్రమ్మచేయు తలక ట్టొకజాతి కందము–జనపనార తలకట్టొకజాతి కందము. మొక్కజొన్నపీచు తలకట్టు మఱియొకజాతి కందము–సీతమ్మ నూలుపోఁగులతలక ట్టింకొకజాతి కందము–చెంగావి తలకట్టు వేఱొక్క జాతి కందము–గొఱ్ఱె బొచ్చు గరుసు తలకట్టు వేఱొకజాతి కందము. ఈతలకట్టులలో విరియఁబోసికొన నొక సొగసు –అరవియఁబోసికొన నొక యందము–వైష్ణవపుముడి యొక సొగసు–జారుముడి యొకసొగ

ము–ముందుకొప్పాక సొగసు–నడిమికొప్పాక సొగసు–ప్రక్కకొప్పాక సొగసు–జాఱుకొప్పాక సొగసు. సహస్ర భేదములుగల జడచుట్టల యొడుపులలో నొక్కొక్కటి యొక్కొక్క సొగసు–ముందుకత్తిరింపొక సొగసు–వెనుకకత్తిరిం పొక సొగసు–తంటసమున లాగిన నొక సొగసు–నగము గొరిగిన నొక్క సొగసు–సంపూర్ణముగా గొరిగిన నొక్క సొగసు. సౌందర్య మునకుఁ దనుచ్ఛాయకంటెఁ బ్రధానమైన దేదియు లేదు. ఎంత యింద్రజాలమైన నెంత మహామోహనశక్తియైన దాని కున్నది. జీడిగింజచాయ మొదలు–సీమ సున్నపుఁజాయవఱకు నన్ని చాయలున్నవి. మాలకాకిరంగు, మాదీఫలపురంగు, పటికబెల్లపురంగు, బాదముపప్పు రంగు–పాలమీఁగడలరంగు, బంగారు రంగు–కందగడ్డ రంగు–కడముంత రంగు –చిలుకముక్కు రంగు–సీమసున్నపు రంగు. మనలోని కాకముఖుల కంటికి–నీగ్రో సుంద రులు గొంగళిపురుగులు–మన నల్లరంభలు, తెల్లవారికి రాక్షసులు. తెల్లవారి దేవకన్యలు మనకు బొల్లిబొమ్మలు–పార్సీవారిమీఁగడ రంగుమేనకలకు–మనబంగారుబొమ్మలు పసుపుపాత్తిపిట్ట లు–బంగాళావారి పటికబెల్లపు టూర్పనులు, కాబూలువారి కందగడ్డ సుందరులకుఁ బిండి బొమ్మలు–నర్వేషియావారి స్వర్వనితలముందు, జపానువారి వరూధినులు పగటివేసములు.

ఈరంగుల భేదములు చాలక ప్రపంచజను లందఱు కూడ నీ రంగులమీఁద మఱికొన్ని రంగులు కల్పించికొనినారు. కపోలములకు మకరికాపత్రములు–మెడకు గంధము –పండ్లకుఁ గప్పు–పెదవికి దాంబూలము–కాలికి లత్తుక–ఒడలికిఁ బసపు–గోళ్లకుఁ గావి –నుదుటికి బొట్టు. మహమ్మదీయ మన్మథుఁడు తన గొంగళిపీఁచు గడ్డములకు గోరం టాకు. పోనిండు. ఈ తేరరంగుల కేమి; కడిగినైచినఁ బోవును. లేకున్నఁ గ్రమముగా నవియే కొంత కాలమునకైన మాసిపోవును. ప్రాణములు పోయినను బోని రంగులమాట యేమి? ప్రపంచమున బొమ్మజెముడు వ్యాప్తికంటెఁ బచ్చబొట్టువ్యాప్తి హెచ్చు. దుష్టపుఁదీఁగలు –వెంపటికంపలు–వెదురుబీడెములు–ఈఁతచెట్లు– చిట్టడవులు– గండభేరుండములు– కాల సర్పములు– గోపురములు– గోపికావస్త్రాపహరణములు–ఓ– కోలహలముగా నబలాపురు షుల యంగములనెల్ల బూర్వమున నాశ్రయించి యుండెడివి. ఒక్కజాతిలోనే గాదు. దాదాపుగా నన్నిజాతులందుఁగూడ నిటులే–బుగ్గమీఁదఁ జంద్రుఁడు మొదలుకొని పురాణపు రుషులంద ఱంగనాగాత్రఫలకముల నవతరించి యుండిరి. వీఁపుమీఁద దశావతారములు –కుడిబుజముమీఁద గుంభకర్ణయుద్ధము. ఎడమబుజమున వసుదేవగార్భభలాలనము –కుడిప్రక్కను సైంధవవధ–ఎడమప్రక్కను రావణరంభాబలాత్కారము–పైఁట చాటున సముద్రమథనము–ఓ! చెప్పవలసిన దే మున్నది? అష్టాదశ పురాణగాథలన్నియు నబలావయ వములందు దృశ్యప్రబంధములే.

పాశ్చాత్యులలో నిట్టి యాచారము లేదేమో యని సందేహించుచున్నారు కాఁబోలు. ఇంగ్లాండులోను ఫ్రాన్సులోను యూరపులోని తదితరదేశములందునుగూడ నిట్టి యాచార ముండెనని వారు వ్రాసిన గ్రంథములలోనే యున్నది. ఒకఁ డిట్లు వ్రాయుచున్నాఁడు. 'ఈయాచార మరేబియాదేశమునుండి వచ్చియుండవచ్చును. ఫ్రాన్సులోను, బ్రిటనుదేశము నందున్న స్త్రీలకు దీనియందుఁగల యాదరము ననురాగము నద్వితీయములు. పెద్దలు, చిన్నలు, పదునాఱేండ్లబాలిక మొదలు ముగ్గుబుట్టతల ముదుసలివఱకందరు, తమ మొగముమీఁద నల్లని రంగుతోఁ జిత్రములగువస్తువులను జిత్రించుకొనుచుందురు.

సూర్యుఁడు నర్ధచంద్రులు-షట్కోణబంధములు-క్రాసులు-హృదయములు-మొదలగు ననేక వస్తువులు వారిమొగములకు వింతశోభ తెచ్చుచున్నవి. మరింత కల్పనాచమత్కృతికల వారు గుళ్ళపుబంధ్లు-కోడిపుంజు యుద్ధములు-మొదలగు వానిఁగూర్చిఁ జిత్రించుకొనుచున్నారు.

అధర మెంత మృదువుగ నెంత నాజూకుగా నున్న నంత సౌందర్యమని మన మెంచుచుండఁగా-నెంత మోటుగానున్న నంత సౌందర్య మని నీగ్రోల యభిప్రాయము. నీగ్రోలు మన బింబాధరలను మకరిక లని యధిక్షేపింతురు. చిన్న పెదవుల చెలువ జ్యేష్ఠా స్వరూపిణి-పళ్ళిడేసిపెదవుల మందగమన మహాలక్ష్మిస్వరూపిణి-అధరమున మోటుగనుండుటయే కాదు-గట్టిగా నుండుటయే కాదు-అది యెంత క్రిందికి వ్రేలాడిన నంత సౌందర్యమనువారు మఱియొకజాతి వారున్నారు. అధరమునకుఁ జిరుతలఁ దగిల్చి వానికిఁ దగుమాత్ర మైన బరువును వ్రేలాడఁగట్టి దాని నెంత క్రిందివఱకు దింపఁదగునో యంతవఱకు దింపెదరు. పెండ్లికూఁతునకు ముందుగాఁ జూడవలసిన లక్షణ మిది, నవ్వినప్పుడు దంతములపై నున్న చిగుళ్లన్నియు గనఁబడుట మహాసౌందర్యలక్షణ మని మఱియొక జాతివారి యభిప్రాయము. అది యభాగ్య లక్షణము-అశ్వలక్షణము-నని మఱియొకజాతి యభిప్రాయము. నుందరతకు సొట్టముక్కు ప్రధానలక్షణ మని నీగ్రోవారి సౌందర్యశాస్త్ర సూత్రము. ఎత్తుముక్కు-పొడుగుముక్కు-గల యితరనుందరులను వారేనుఁగు లని యధిక్షేపింతురు. గుంటకన్నులనుందరి విటప్రపంచమును విరహావేదనచే విలవిల లాడఁజేయును. కనుబొమ్మలు సౌందర్య లక్షణ మెంతమాత్రమును గా దని వానిని మొదలంట నూడఁబెరికిం చిన మహానాగరకు లెక్కడనో కాదు మన చేరువనే యున్నారు.

వీని కన్నిటి కేమికాని చీనావారి పాదసౌందర్యమే చిత్రమైనది. చిన్న పాదములు మహాసౌందర్యలక్షణము. కావునఁ బాదము లెదుగ నీయక డబ్బిచిప్పలనడుమను వానిని బిగించి బంధింతురు. ఇట్లు పదబంధ మొందిన పడఁతులు పడుబాధ-హరిహరీ-పగవారికైన వలదని పైవారి కనిపించును. సౌందర్యసంపాదనకై చచ్చుటకైన సిద్ధపడవలసి యుండఁగ -శ్రమ లెక్కయేమి? అడ్డబానయందమునకైమనవారు ముక్కుదూలమును-బొడిపించినారా లేదా? గూబబావిలీలకొఱకు జింతపిక్కయంతటి గూబకుఁ జల్లి పొడిపించిరా లేదా? పావు తులము బంగారముతోను-బది దినము లేడ్పుతోను-మన తరుణులు తాలూకాలను సంపాదించిరా లేదా? రెండు చెవుల కధమము ముప్పదికుట్లుతో 'హౌరీను' అయిపోయి మహమ్మదీయవనితలమాట నేమి చెప్పినారు? చావు తప్పినంతపని జరిగినఁగాని -సౌందర్యమునంభవింపదు. బ్రదికియున్నన్నినాళ్లు బాధతప్పదు. చీనావా రీవిషయమున మనకంటె నాలుగాకులెక్కువ చదివినారు. అదియె భేదముగాని యంతకన్న నేమియు లేదు. ఆ-కాలెదుగరాదు-మన వనితలకు నర్వసాధారణముగానున్న పాదములో నగముకంటె నెక్కువకా నుండఁగూడదు. దట్టించుటవలన బిగించి-కట్టుటవలనఁ గుములుపోట్లవలన -నచ్చటి రక్తప్రవాహము బాగుగాలేక-యెముకలు విఱిగి-స్థానచలమమొంది -మాంసనంబంధములు కృశించి-నరములు శిథిలములై-చర్మము నల్లపడి-చచ్చియుండును. అభిజాత్యమున కేమి-యంగసౌందర్యమున కేమి-యట్టి పాదమే యభిజ్ఞానము. ఏదోమాట వచ్చినదికావున నీ యాచార మెట్లు కలిగినదో నాకుఁ దెలిసినంతవఱకుఁ జెప్పెదను.

ఇందునుగూర్చి వేఱు వేఱుకథ లున్నవి.

చీనాదేశ చక్రవర్తులలో నొకనికి సౌందర్యవతియైన భార్య యుండెను. కాని, పాప మామెయందు భర్తకు సందేహము. తాను రాజకార్యమగ్నుఁడై యున్నప్పుడీమె యెటకో పోవుచున్నదని యాతనికి సంశయము. భార్య పరాధీనయైనప్పుడు రాజ్యము స్వాధీనమైన నేమి లాభము? ఆమెను రేయింబవళ్లు కనిపెట్టుకొని యుండునెడల రాజ కార్యములు చెడును. రాజవ్యవహారములకై పోయినయెడల మొదటికే మోసమువచ్చు నని భయము. అట్టిసంధిలో–ఆతఁడుమహాబుద్ధిమంతుఁడగుటచేఁగాఁబోలు–నుభయతారకమగునట్లుగా –నామెకాళ్లనినుపతిరుగుళ్లలోఁబెట్టి నొక్కించెను. భార్యకాళ్లు మండిపోయినను–భర్తమనస్సు చల్లఁబడినది. భార్యకాళ్లవెంట రక్తము కారుచున్నను–భర్తకనులవెంట నీరుకట్టినది. అద్దీ! సతులయోగ్యతలను గాపాడుటకై–చక్రవర్తిగారు బహుప్రశస్తమైన పరమహంసక్రియ కనిపట్టినా రని–వారి యుద్యోగు లీ చికిత్స నారంభింపఁగా–నోదో కొంతగుణ మిచ్చిన దని కాఁబోలు–వారినిబట్టివారు–వారినిబట్టివారు–నీ యసాధారణ్యవైద్యమును వ్యాప్తిచేసిరి. వ్యాధి తీఱవచ్చిన తరువాతనే వైద్యము చేయించుటకంటె–వ్యాధి నిరోధకముగానే వైద్యముచే యుట శ్రేయస్కరమని–కొందరు దూరదృష్టిగలవారు–తాత్కాలికావశ్యకత యేమియు లేకపోయినను–ముందు కాఁపుకాఁచి యుండుటయే యెందుకైన మంచిదని యెంచికాఁబోలు –నామార్గమునే ప్రవర్తింపగా నింక నే మున్నది? అంద ఱూ దారినే యవలంబించిరి. ప్రపంచవైఖరి యదియే కదా?

గీ. తోఁచ కొకమేఁక గుహలోనఁ దూర దాని
తోఁక వెంబడి గుహఁదూరు మేఁకలన్ని
కాక మొక్కటి నీట మున్గంగ దాని
గాంచి వేనవేల్ స్నానదీక్షలను నెఱపు.

ఒక కథ చెప్పితిని. మరియొక కథను జెప్పెదము. క్రీస్తుపుట్టుటకు 1100 సంవత్సర ములకుఁ బూర్వమునం దొక చక్రవర్తి–చీనాదేశమును బరిపాలించుచుండెను. ఆయనభార్య 'టూంకి' యను నామె యెండి వంగి యూరిపోయినపాదములతోఁ బుట్టెను. చక్రవర్తి కామెయందు మహానురాగముండెను. చక్రవర్తినిగారి కెట్టి పాదములున్నవో యట్టి పాదములే సౌందర్యలక్షణము లనియు–రాష్ట్రములోనున్న యందఱు స్త్రీలపాదములట్లే యుండవ లయు ననియుఁ జక్రవర్తిగారు చక్రవర్తినిగారి ప్రోత్సాహమున శాసన మొనర్చిరి. చక్రవర్తిగారు తలఁచుకొన్నప్పుడు శాసనముల మంచిచెడ్డ లెవనికిఁ గావలయును. అంతటినుండియుఁ బిల్లల పాదముల బంధముల కధీనమయ్యెను. క్రమక్రమముగా నదియే యాచారమయ్యెను.

మఱియొక కథ యున్నది. కీస్తుశకము 961 సంవత్సరమునందుఁ జీనాదేశపుఁ జక్రవర్తిగా రగు "లీయా" గారు–సంసారసులభతరణ సదుపాయముగా సంపాదించి –జాగ్రత్తపెట్టిన వేశ్యతో సరససల్లాపములఁ గాలక్షేపము చేయుచుండఁగా–నామె పాదములు ధనురాకారమున వంచికట్టినయెడలఁ బాదసౌందర్యము వృద్ధియగు నని మూహము సౌందర్య రసగ్రహణప్రవీణుఁ డగు నాసార్వభౌముని మనస్సునఁ దళుకున మెఱసెను. రాజవాంఛలు సద్యస్క్రియారూపము లొందవలసినవి. కావున నావెలయాలిపుణ్యమున–నామెకుఁ బదబం ధము తొప్పపాటులోఁ గలిగెను. చీనాదేశమువంటి దేశమునకు సార్వభౌముఁ డగు

మహామహుఁడు తలఁచుకొన్నప్పుడు–దబ్బిచిప్పలి కేమి లోపము–త్రాళ్ల కేమి లోపము? ఆమె పాదాధోభాగము–పాద్యమీచంద్రుని వలె బహుసౌందర్యసమన్వితమైయున్నదని –రాజోద్యోగులు కొనియాడిరి. కవీశ్వరులు బోగముదాని కాళ్లపై గ్రంథము లొనర్చిరి. బాధచే నాహారకాంత బారున నేడ్చుచునేయున్నది. అదియే సౌందర్యలక్షణమసి చక్రవర్తిగారు శాసించిన తరువాత–నో రెత్తుట కెవని కధికారమున్నది? రాజుగారి దయఁగోరి –యంతకంటె రాజుగారి గుడిసెవ్రేటు దానిదయఁగోరి–యనేకులు తమ కుటుంబములో నీయాచారమును బ్రవర్తింపఁజేసిరి. తరువాత నదియే క్రమముగా దేశాచారమైనది. ఇటులే యిఁక రెండుకథలు కాఁబోలు కలవు. కాని యిప్పటి కివి చాలును. బద్ధపాములకు బంగారుకలువ లని పేరు. 'కాంటన్' అను నూరిలో నొక్క ముసలివానిని ''నీ కూఁతున కేల కాలు కట్టించితివయ్యా'' యని యడుగఁ ''గట్టింపకున్న యెడలఁ బెండ్లియగుమార్గము లేదయ్యా'' అని చెప్పెనఁట.

నాయనలారా! సౌందర్యమునుకూర్చిన యభిప్రాయము లిట్లున్నవి. ఆకసముమీఁది చుక్కలకైన లెక్కగలదు కాని–దీనినిగూర్చిన సూత్రములకు లెక్కలేదు. ఒక్కొక్క మెదటి కొక్కొక్క యభిప్రాయమైనయెడల – నదిఁగూ గొంతవాసియే – అట్లుకాదు. నిన్నటి యభిప్రాయమునేఁడు లేదు–నేఁటి యభిప్రాయము తోపుండదు. బుద్ధినిబట్టి, వయసును బట్టి, కాలమునుబట్టి, యావశ్యకతఁబట్టి, మఱి యిఁక నెన్నిటినోబట్టి యభిప్రాయములు మాఱుచుండును. స్వరూపమేదో తెలియని చేతికిఁజిక్కిన, చిత్తమునకు దొరకని, స్థిరముగా రవంతసేపైన నాఁగక సర్వదా చలించుచున్న, సౌందర్యతత్త్వము నొక్క ఫ్రాన్సుదేశస్థుఁడు కాఁబోలు గట్టిగఁ బట్టుకొనినాఁడు–మెదలకుండ గ్రహించినాఁడు–బెసఁగనీకుండ బంధించినాఁడు. ఆ–అంతపనికంటె నెక్కువపనియే చేసినాఁడు–ఏమియు లేదు. మహాసూక్ష్మము అతిసులభమునైన ప్రక్రియ కనిపెట్టినాఁడు. రెండు వెదురుపుల్లలనడుమ సౌందర్యప్రపంచమును జూఁగొట్టి బంధించినాఁడు. పంచేంద్రియములలో నాలుగువఱకు మొగము మీఁదనే యున్నవి. కావున నాస్యమే సమస్తసౌందర్యస్థాన మని యాతని విశ్వాసము–అయిన నగుఁ గాక–కాని దానిని మూఁడు విభాగములుగాఁ జేసినాఁడు. నుదుటిపై వెండ్రుక లెచ్చట నారంభమగునో యచ్చటనుండి కనుబొమ్మల నడుమవఱ కొక్కభాగము–అచ్చటినుండి ముక్కుక్రిందివఱకు మరొక్కభాగము–మిగిలినది మూఁడవభాగము. ఈ మూఁడు భాగములు కూడ సరియైన కొలత గలవియైన యెడల నా మొగము సౌందర్యవంత మని నిశ్చయముగాఁ జెప్పవచ్చు నని–యాతని శిలాశాసనమైన సిద్ధాంతము. ప్రాచ్యపాశ్చాత్యప్రాచీనపండితుల మహానిశితములగు బుద్ధుల కందక పాఱిపోయిన సౌందర్యతత్త్వమును ఫరంగిపండితుఁడు కంపస్సు కాలిక్రిందికిలాగి త్రొక్కిపట్టినాఁడు. ఇఁక సౌందర్యమును బరిశీలించుటకుఁ బగ లక్కఱ లేదు–రాత్రి దీపమైన నక్కఱలేదు. కన్నుండవలసిన యావశ్యకత యంతకంటె లేదు. రసగ్రహణ సమర్థనబుద్ధి యుండవలసిన యావశ్యకత మొదలే లేదు. రవంత దారపుఁబోచతో–గాఢాంధకారమునన్నైన నరే–రంభయేదో రాకాసి యేదో–వట్టి శుంఠయైనఁ జెప్పవచ్చును. అవయవమునకు నవయవమునకున్న దగ్గఱదూరములేకాక –సౌందర్యకళకు సాహాయ్యపడునట్టివి సహస్రాధికము లున్నను–యా సౌందర్యసిద్ధాంత గ్రహించినట్లగపడదు. గ్రహించినను లక్ష్యము చేసిన ట్లగపడదు. పోనిండు–ఆతని మాటనే పాటింతము. సృష్టిలోని జనుల యవయవములలో సమానపుఁ గొలత లెచ్చటనైన నున్నవా?

కుడిచేయి యెక్కువ లావుగాను–నెడమచేయి తక్కువ లావుగానుండును. కుడిచేతిలోఁ బురుషుఁడెక్కువపాటు పడును గావున నాచేయి యెక్కువ లావుగా నున్న దని యనుకొంద మన్న–నెడమచేయి, యెడమకాలు, కుడిచేయి, కుడికాలికంటె నెక్కువ పొడవుగా నేల యుండవలయును? ఆఁడుదికూడఁ దఱుచుగాఁ గుడిచేతితోడనే పనిచేసికొనునుగదా –యామె యెడమచేయి యేల కుడిదానికంటె లావుగా నుండవలయును? నరే ఎటులో యున్నది. ఆమె కుడికాలు కుడిచేయియు నేల యెడమవానికంటెఁ బొడుగుగా నుండవల యును? కాలుసేతులు సమానపుఁ గొలత లున్నవారు స్త్రీపురుషులలో నెవ్వరు లేరు. ప్రప్రధానమైన తలనుగూర్చి యాలోచింతము. శిరము రెండర్ధగోళములుగా విభాగింపఁబడి యున్నది. ఈ రెండును సమానములైనవా రిదివఱకుఁ బుట్టినవారిలో లేరు. ఒకటి పెద్దది–ఒక్కటి చిన్నది. అట్టి క్రేఁగంటిచూపులతో నాకనమంతయు నీలాల తోరణాలు కల్పింపఁగల భూలోకరంభల కొక కన్ను పొడుగు–ఒక కన్ను పొట్టి. ముద్దుల మూఁటగట్టు ముక్కున్నదే–ఆ ముక్కు–వంకరగా నుండక–సరిగా నూటియైనది కలవాఁడు ముందుస్పష్టి లోనివాఁ డగునేమో కాని యిప్పటివాఁడు కాఁడు. మొడటనో, నడుమనో, చివరనో వంకయుండితీరును. ముక్కున కీ పార్శ్వమున కాపార్శ్వమున కెంతయైన భేదమున్నది. కుడిచేయి వాటము గలవాని ముక్కుకొన యెడమ వైపున కొరగియుండును. చెవులమాటఁ జెప్పనే యక్కఱ లేదు. రెండు నెప్పుడు సమానముగా నుండవు. సరేకదా ఒక్క యాకారమునఁ గూడ నుండవు మన మే ప్రక్కను దఱుచుగ శయనింతుమో యావైపున నున్నచెవి రెండవదానికంటె భేదముగా నుండక తప్పదు. ఇఁక బెదవినిగూర్చి చెప్పెదను. మాటలాడునప్పుడు కాని, నవ్వినప్పుడుకాని పైపెదవి పెచ్చుతగ్గులేక సమానముగా నెవ్వరికిని లేదు. ఒకవైపున గొంచెము తక్కువగ నొకవైపునఁ గొంచెమెక్కువగ లేచును. ఇఁక బండ్ల సౌభాగ్యముగూర్చి పలుకవలసినపనియే లేదు. పంటిపైపన్ను–రెండవ వరుసప న్ను–మిట్టపన్ను–ఎగుడు దిగుడుపన్ను– గొగ్గిపన్ను–పీటపాలు పన్ను–ఖడ్గమృగపుఁబన్ను –గాడిదకాలి పన్ను–ఇటు లెన్ని చెప్పవచ్చును. ఎన్ని యపస్మారము లెన్ని యవకతపక లుండవలయునో యన్నియు వానిలో నున్నవి. ఇవి చాలవా? ఇఁక నెన్ని చెప్పవలయును? కావున సమానపుఁ గొలతలసంగతి స్వప్నవార్త–సృష్టిలోనది లేనేలేదు. సౌందర్యతత్త్వము కొలవఁదగినది కాదు. కొలచుట కిది యేమి కోమటి వ్యాపారములోనిదా? చదరపుటంగుళ ములనుబట్టి సౌందర్యమును నిర్ణయించుట యెచ్చటనైన నున్నదా? కంఠపుఁగొలతబట్టి గాయకుని గానమహిమను జెప్పవచ్చునా?

నాయనలారా! సౌందర్యప్రకృతి యిటు లున్నది. అది అందఱికిను దెలియదు –అందఱికిను దెలియును. మరియొక విశేష మే మనఁగా నందఱు సౌందర్యవంతుల మనుకొనువారే. నిజముగాఁ బలుక నెవ్వరును సుందరులు కారు–నాయనలారా! ఇట్లంటినని మీరు కోపపడకుఁడు. మాసోదరీమణులకు మఱీంత కోపము వచ్చునేమో యని జడియుచు న్నాను. అయ్యో! వారు నాపై గోపపడునట్లు నేను మాట లాడుదునా? అందఱు పురుషులు స్త్రీలుకూడ సౌందర్యముకలవారే–ఈమాట మఱీంత కోపకారణమగునేమో? మణికుంభ మునకు మట్టికుండకు భేదములేదా అని నన్నధిక్షేపింతురేమో? భేదములేదని నేను జెప్ప లేదు. భేదమున్నది. కాని అదియొక భేదమా? శిరోజములలో మరియొక జేనెడు పొడువుతో డను–గన్నులలోఁ జింతాకంత యెక్కువ వెడల్పుతోడను–గాత్రచ్ఛాయలోఁ గానంత

గవ్వమెరుఁగుతోడను–నేమంత భేదము సిద్ధింపఁగలదు. ఇది సత్యమైన సౌందర్యము కాదు –పరమార్థమైన సౌందర్య మొకటి యున్నది. అది పైసారి చెప్పెదను. ఇప్పటి కిదియె చాలును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

11. (నిజమైన) సౌందర్యము

జంఘాలశాస్త్రి శరీరం గురించిన అభిప్రాయాలు క్రోడీకరించి ఇదివరకు చెప్పాడు. ఇప్పుడు అంతకు మించిన సౌందర్యం వేరే ఉందని చెప్పబోతున్నాడు.

శరీర సౌందర్యమే నిజమైన సౌందర్యమైతే, దేహ సౌందర్యంలో మనం ఇతర జంతువులకి తీసిపోతాం. తీసిపోకపోతే, సరి సమానంగా వుంటాం. అంతేకాని వాటిని మించజాలం. శరీర సౌందర్యం సర్వజంతు సామాన్యం.

వాటికంటె మనిషి భిన్నంగా కనిపించడానికి కారణం, ఘనులమనుకోవడానికి కారణం జ్ఞానం. ఈజ్ఞానమే సౌందర్యమా? అని ప్రశ్నించి, శాస్త్రి విశ్లేషిస్తున్నాడు.

ఈ విద్యలు మళ్ళీ-రెండు. ఐహిక విద్య, ఆముష్మిక విద్య.

ఐహిక విద్యలు రకరకాలు. ఈ ప్రపంచంలో మనషి బతకడానికి పడనికొచ్చే శాస్త్రాలు, కళలు, ఇతర వృత్తివిద్యలు అన్నీ ఇందులోకే వస్తాయి. పరమార్థ దృష్టితో చూస్తే ఈ ఐహిక విద్యల్లో ఏ మత భేదం లేదు. అన్నీ ముష్టివిద్యలే. అన్నీ పొట్టకూటి విద్యలే. అందువల్ల ఐహిక విద్యకి సౌందర్యశక్తి లేదు.

ఇంక మిగిలింది ఆముష్మిక విద్య. దీన్నే బ్రహ్మవిద్య అని కూడా అంటారు. ఇది అనుభవాని కెంత మాత్రం రాని విద్య. అసాధారణ మైనది. అందువల్ల దానికి సంబంధించిన కొన్ని మాటలు మాత్రం మనకి వచ్చు. కనక, ప్రత్యేకం బ్రహ్మజ్ఞానం కూడా సౌందర్య మనివెప్పే వీలులేదు.

స్వార్థత్యాగం, పరోపకార శీలత, ఎవడిలో క్రియారూపంలో ఉంటాయో వాడే విద్వాంసుడు. వాడే సుందరుడు. సారాంశం ఏమంటే నడవడికంటె సుందరమైనది ఈ ప్రపంచంలో లేదు.-అని జంఘాలశాస్త్రి తేల్చి-మంచినడవడి అంటే ఏమిటో తరువాత చెప్తానని ముగించాడు.

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను:-

నాయనలారా! శరీరసౌందర్యము సౌందర్యముకాదని యీనడుమను జెప్పియుంటిని. శరీర సౌందర్యమే సౌందర్యముగఁ బరిగణించిన యెడల మన శరీరములకంటె సహస్రగుణా

ధిక సౌందర్యసంపన్నములైన శరీరము లెన్ని కోటులజంతువులకో యున్నవి. మయూరపిం
ఛసౌందర్యము మన సీమంతసీమణుల శిరోజబంధముల కున్నదా? కపోత కంఠమునకున్న
నైగనిగ్యము మన కాంతాశరీరముల కున్నదా? చిలుక ముక్కునకున్న రక్తిమ మన చెలువల
యధరమున కున్నదా? లేడి కన్నులకున్న విశాలత, విలోలత, విలక్షణత మనపూఁబోడుల
కన్నుల కున్నదా? ఉన్నయెడల నేదో పెద్దవిశేషముగ నేగో మహాబిరుదముగ మన
లోలాక్షులను మృగాక్షులని సారంగనేత్రలని పిలిచి వారి నేల మనము బహుమానింపవల
యును? ఆజంతువులు మనకంటె జ్ఞానమున దక్కువకాని హెచ్చుకావే? అట్టిచో వానిలో
నేదో యాధిక్యమున్నదని యెంచియే కాదా మనము వానితోఁ బోల్చుకొని వానిపేరు
చెప్పుకొని ఘనత నొందుచుండవలసివచ్చినది. అవియే కొన్ని మన సౌందర్యమున
వృద్ధిపఱచుటలేదా? జడలబట్టె మన వనితల శిరోజసౌందర్యమును వృద్ధిచేయుచున్నది.
పట్టుపురుగు మన యంగసౌందర్యము వృద్ధిచేయుచున్నది. ఇటు లెన్ని చెప్పవచ్చును?
మొత్యముమీఁద దేహసౌందర్యమున మన మితర జంతువులకుఁ దీసిపోవుదుము. తీసిపోకుం
వునెడల వానితోఁ దులతూగుదుము. అంతియేకాని మనము వానిని మించఁజాలము
—శరీరసౌందర్యము సర్వజంతుసామాన్యమైనది. అది కాకి కున్నది—గాడిదకున్నది. చిఱుతపు
లికున్నది—సింహమునుకున్నది. క్రోఁతి కున్నది—గొంగళిపుఱుగునకున్నది. ప్రపంచమున
సౌందర్యవంతము కాని శరీరమేది? అన్నియు నట్టివే. దానిలో మన ఘనత యేమున్నది?
అదియే సౌందర్య మని తలఁచుట తప్పు. పరమార్థమైన సౌందర్యము మరియొకటి యున్నది
ఉండితీఱవలయును. అది యేది? ఇతర జంతువులకంటె జ్ఞానాధిక్యమున మనము ఘనులం
మని యెప్పుకొనకతీఱదు. వానికి జ్ఞానము లేదనుట తప్పు. అదియే అధిక తేజస్సుతో
విలక్షణశక్తితో మనలోఁ బ్రకాశించుచున్నది. ఈజ్ఞానసౌందర్యమే సౌందర్యమేమో రవంత
పరిశీలింతము.

జ్ఞాన మనఁగా విద్య. విద్యాధికుఁడే సౌందర్యాధికుఁడు కావలసి యున్నది. విద్య
లెన్ని యున్నను వానిని రెండే స్థూలవిభాగములుగఁ జేయవచ్చును. ఐహికవిద్య యొక్కటి
ఆముష్మికవిద్య యొక్కటి. మొదట నైహికవిద్యనుగూర్చి యోజింతము. ఐహికమున
నన్నియు విద్యలే. విద్య కానిదేదియుఁ గనఁబడదు—రాజవశ్య శాస్త్రమున విద్వాంసు
లున్నారు. రమణీవశ్యశాస్త్రమున వారికంటె గొప్పవిద్వాంసులున్నారు. సర్వప్రజావశ్యశా
స్త్రమున సంపూర్ణవిద్వాంసు లున్నారు. ఉపన్యాసధోరణిలో నొక్కఁడు ఘనుఁడు. గానకళా
వైదగ్ధ్యమున నొక్కఁడు ఘనుఁడు—వీణావాదనమున నొక్కఁడు ఘనుఁడు. చిత్రలేఖనమున
నొక్కఁడు ఘనుడు—పాషాణపాంచాలికారచనయం దొక్కఁడు ఘనుఁడు. కావ్యనిర్మాణమున
నొక్కఁడు ఘనుఁడు—నాట్యవిద్యా కౌశలమున నొక్కఁడు ఘనుఁడు. ఇటు లెన్ని చెప్పఁ
చ్చును? వీరిలో నెవఁడు సుందరుఁడో యెట్లు చెప్పవచ్చును? ఏదో యొకవిద్య యందఱకు
గూడ నున్నది. ఒకవిద్యలో నొక్కఁడు ఘనుఁడు. మఱియొకవిద్యలో మఱియొక్కఁడు
ఘనుఁడు. ఈవిద్య యావిద్యకంటె హెచ్చనికాని, తగ్గనికాని చెప్పుట మన తరమగునా?
గోడమీఁదఁ జిలుకను గీయువాఁడెట్టివాఁడో కొబ్బరియాకుతోఁ జిలుకను గట్టువాఁ డ
ట్టివాఁడే. హస్త నైపుణ్యమంతయు నొక్కటే. బుద్ధినైపుణ్యమంతయు నొక్కటే. వాని
యెక్కువయేమి? వీని తక్కువయేమి? ఆకాశగంగాధారానుకారివచో ధోరణితో నభికహ్వద
యముల నుట్టూట లూరఁజేసి సైన పొత్తు మందుఁజల్లినట్లు విషయేతర చింతాశూన్యములఁ

లగునట్లుచేయఁగల వక్త ఘనుఁడా? గానకళావిశేషమున శ్రోతల హృదయములు చిగిరించు నట్లు చేయఁగల గాయకుఁడు ఘనుడా? ఎవని విద్య వానిది. ఏవిద్య యధికత దానిది. అంతేకాని వాఁడెక్కువవాఁ డని వీఁడు తక్కువవాఁ డని నిర్ణయించుటకు మన కేమి యధికార మున్నది? చిత్రవిచిత్రనైపుణితో నొడలు పులకరించునట్లు, హృదయము జలదరించునట్లు, కంటియెదుట మొలచినట్లు, వెనుకజరిగినవి ప్రత్యక్షముగ నిప్పుడు జరుగుచున్నట్లు, కథలు చెప్పఁగలవాఁడు ఘనుఁడా? కాకి కూతకూసి లక్ష కాకుల నొక్కచోటి కాకర్షించి కదలకుండ నిలువఁగలవాఁడు ఘనుఁడా? వా డందున ఘనుఁడు, వీఁ డిందున ఘనుఁడు. అంతకంటె మన మేమి చెప్పఁ గలము? గద చేతఁ బుచ్చుకొని నూర్గుర నవలీలఁ జంపఁగలవాఁడు ఘనుఁడా? ఒంటె వెంట్రుకకుచ్చు చేతఁబట్టుకొని గతించిన నూర్గురకుఁ బ్రాణప్రతిష్ఠచేసి మీయెదుట నిలుపఁగలవాఁడు ఘనుఁడా? ఎట్లు చెప్పవచ్చును? నాటకరచనయందు నీవు ఘనుఁడవైన నవలను వ్రాయుట యందు నేను ఘనుఁడను–భావగీతముల వ్రాయుటయందు మఱి యొకఁడు ఘనుఁడు–భాషాంతరీకరణమం దింకొక్కఁడు గట్టివాఁడు –వచనరచనయందు వేరొక్కఁడు నేర్పరి–వీరిలో నెవఁడు రెండవవానికిఁ దీసిపోవునో చెప్పుట కవకాశమున్నదా? 'పారడైజులాస్టు' వ్రాసిన 'మిల్టను' ఘనుఁడా–ఖగోళసంబంధ మగు గణితశాస్త్రమును వ్రాసిన 'న్యూటను' ఘనుఁడా? వాని ఘనత వానిది. వీని ఘనత వీనిది. 'హామ్లెటు' వ్రాసిన 'షేక్సుపియరు' గొప్పవాఁడా?–అర్థశాస్త్రమును వ్రాసిన చాణక్యుఁడు గొప్పవాఁడా? ఎవని ప్రజ్ఞ వానిది. అంతకంటె నేమైనఁ జెప్పఁగలమా? ప్రపంచ మున విద్యలేనివాఁ డెవ్వఁడు? మనుజుఁ డెట్టివాఁడైన నరే నేదియో యొక విద్యయందు గట్టివాఁడై యుండకపోఁడు. ఏదో విలక్షణమైన ప్రజ్ఞ లేనిదే మనుజ జన్మము రాదు. ఎవ్వనినైన నరే నెందునకుఁ బనికిరాని వట్టిశుంఠ యని యెన్నఁడు ననరాదు. ఆతఁడు వంటిపూటివాఁడే కానిఁడు–శవవహనప్రియుఁడే కానిఁడు–శ్రాద్ధభోజనాభిలాషియే కానిండు–వట్టి మొద్దై యయినవాఁడు కానిండు. వానికిఁ జతురంగఖేలనమున నసాధారణప్రజ్ఞ యుండవచ్చును. ఈఁతలో నింతిం తనరాని మహాశక్తి యుండవచ్చును. విద్య కెక్కడికి? నిరూపమానముగ నస్యమును రచియించి శాశ్వతజీవు లైనవారున్నారు. విచిత్రముగా విసనకఱ్ఱలు కట్టి స్థిరజీవులైనవా రున్నారు. బందరులో పకోడీలు చేయుటలోఁ బండితోత్తముఁడైన ప్రజ్ఞాశాలి ప్రాణములఁ బాసి యెన్ని సంవత్సరము లైనదో యిప్పటివఱకు జనుల జిహ్వాగ్రహమునఁ దాండవ మాడుచున్నాఁడు. పకోడి ఘనమో పద్యమే ఘనమో చెప్పవచ్చునా? నలచక్రవర్తికి చక్రవర్తిగా నెంత ఖ్యాతి యున్నదో వంట వాఁడుగ నంత ఖ్యాతియె యున్నది. భీమునకు గద త్రిప్పుటయం దెంత ఖ్యాతి యున్నదో కంద బచ్చల కాడకూరయం దంత ఖ్యాతి యున్నది. కావున నొక విద్య ఘన మొక్కటి నీచ మని యెన్నఁడు ననఁదగదు. కాళిదాను కీర్తిముం దెఱ్ఱ రామదానుగారి కీర్తి జంకదు నరిగదా. పైనాడుచున్న దని కూడఁ జెప్పవ చ్చును. పాణినీయశాస్త్ర పాండితీవిశేషమునఁ జెవులకుఁ గుండలాలు దగిల్చికొని శిష్యులను గూడ ద్రిప్పుకొను పండితవర్యుఁ డెంతవాఁడో శృంగార చేష్టాప్రకటన పాండితీమండితయై మెడచుట్టు మెడల్సు దగిలించుకొని విటులను గుక్కలనలెఁ గూడఁ ద్రిప్పుకొను వారవనితా శిరోమణి యంతకంటెఁ దక్కువది కాదె. కవిత్వమునఁ దనయంతనాఁడు లేఁ డని విఱ్ఱవీఁగి యెగిరి ప్రేలిపడు కవియొద్దకు గవుండ్లనాఁడు పోయి "నీకవిత నాకళ్లు గీతకంటె నెఱ్ఱిక్కువ? నీగీతపుసాగను నాగీతసాగనుకంటె నెందున నెక్కువ? రమ్మి నావెంటరమ్మి. జీలుగుచెట్టు

నెంతచిత్రముగా గీయుదునో'' యని యాతని నెదుర్కొని ధిక్కరించి పలికినయెడల గవి యేమి ప్రత్యుత్తరముఁ జెప్పఁగలవాఁడో తెలియకున్నది. విద్యలలో విశేషములి ల్లున్నది. అన్నియు విద్యలే–అన్నియు సమానప్రపత్తిసంయుతములే–పరమార్థదృష్టిచేఁ జూడ నైహిక విద్యలలో నేమంత భేదమున్నది? అన్నియు ముష్టివిద్యలే. అన్నియుఁ బొట్టకూటి తంత్ర ములే. కావున నైహికవిద్యలో సౌందర్యశక్తిలేదు–లేదు. ఇంక నాముష్మిక విద్యనుగూర్చి రవంత యోజింతము. దీనినే బ్రహ్మవిద్య యని యందురు. ప్రపంచమున నిదివరకుఁ బుట్టిన ప్రజ్ఞాధికులంద రీవిషయమును గొలఁదిగనో గొప్పగనో చెప్పిరి గాని యెవనికిఁ గలిగిన కల్పన వానిది. ఎవనికిఁ దోఁచినత్రోవ వానిది. ఎవని నమ్మిక వానిది. ముందుది వెనుకదానినిఁ బట్టి కొంతకలిగినను వెనుకదానికి ఖండనమైయున్నది. ఒక్కొక్కపు డొకదానికి మరియొక దానికి సంబంధము లేశమైనలేదు. తెలియఁదగనియంశమును గూర్చి చెప్పినప్పు డీవైపరీత్య మున కాశ్చర్యమేమున్నది? తెలియఁదగని యంశమనుట కేమియు సందేహము లేదు. తెలిసికొనుటకు సాధనము మనకు లెదు. ఉన్న సాధన మేదో యది యత్యల్పము. పర్వతముముందుఁ బరమాణు వంతయైన గాదు. అంబుధిలో నొక్కయంబుబిందు వంత యేని కాదు. మహాదావానలములో నొక్క విస్ఫులింగమంత యైనఁ గాదు. కుంచము నరగిద్దలో బిగించినపుడు–ఎలుక కుత్తకలో నేనుఁ గును సమూలముగా నిటికించినప్పుడు –మన బుద్ధికి–బ్రహ్మము జ్ఞేయమగును. ఒకఁడు జగత్తనిలమునుండి పుట్టెననెను. మఱియొక్కఁ డంకెలో నుండి పుట్టె ననియెను. ఒకఁడు జగత్తే లేదనియెను. ఒకఁడు జగత్తే బ్రహ్మ మనియెను. జగత్తును మాయ సృష్టించెను. గాని బ్రహ్మ సృష్టింపలే దని మరియొక్కఁ డనియెను. ఒకఁడు ప్రకృతియేకాని పరబ్రహ్మము లే దనెను. పరబ్రహ్మమున కజ్ఞానాచ్ఛాద నము మఱియొకఁడు చెప్పెను. ఎంతకాల మీవిద్య చదివిననైనను చదువునప్పు డెంత తెలియునో చదువు పూర్తియైనతరునాత నంతయే తెలియును. మరికొందఱకుఁ జదివిన కొలఁది సందేహము లెక్కువ యగును. మరికొందఱకుఁ జదివిన కొలఁది బూర్వపుఁ దెలివికూడ నశించును. అగమ్యమైనది, యనంతమైనది, యవాఙ్మనసగోచరమైనది, యద్వి తీయమైనది, యట్టిదానిని మన చచ్చుబుద్ధులతో గ్రహించుట కెట్లు సాధ్యమగును? ఒక్క గడ్డిపఱక మహిమను దెలిసికొనుటకు మన యాయువు చాలదే. మనకుఁ బ్రత్యక్షానుభవ ములో నున్న విద్యలలో మనము మహాధీమంతులైనఁ జిరకాలదీక్షచే సంపాదించినది కలత కొట్టు పాండిత్యముకంటె నెక్కువ లేదు. అట్టిచోఁ బరబ్రహ్మమును గూర్చి మనమా తెలిసికొనుట! అంతము గలది యనంతమగు నప్పుడు, పరిమితికలది యపరిమిత మగునప్పుడు, నశ్వర మగునది యనశ్వరమగునప్పుడు, మనబుద్ధి బ్రహ్మమును గనుఁగొ నును. అది కనుఁగొనఁదగినది కాదు. కనుఁగొంటి మని చెప్పినవారందరు వారివారి మేయమైనబుద్ధికిఁ దోఁచినట్లు వ్రాసినవారేకాని వేరుకాదు. అందుచే దాదాపుగా బుద్ధి కొక్క బ్రహ్మవిద్యయే యని యన్నను నతిశయోక్తికాదు. అందుచే నెవని బ్రహ్మవిద్య యధ్యేతవ్య మని చెప్పవచ్చును? ఎవని బ్రహ్మవిద్య యథార్థమని చెప్పవచ్చును? తెలియఁదగనిది తెలియఁదగని దని స్పష్టముగాఁ జెప్పఁదము నింకఁ దెలియు టెట్లు? అనుభవమున కెంతమా త్రము రాని యసాధారణవిద్య కావున నందునుగూర్చి మనకుఁ గొన్ని మాటలు మాత్రమే వచ్చును. శమాదిషట్కమని, ముముక్షుతాలక్షణమని, యంతరంగబహిరంగ సాధనములని, బ్రహ్మప్రాప్తిరూపమోక్షసాధనమని, అధ్యాససామగ్రి యని, జిజ్ఞాసులక్షణ మని, సాక్షి బ్రహ్మై

క్యసిద్ధి యని, జీవన్ముక్తియని, రజ్జుసర్పభ్రాంతి యని, శుక్తిరజతభ్రాంతి యని, ఘటాకాశ పటాకాశము లని, కూటస్థరూప మని, అహంబ్రహ్మజ్ఞాన మని, తన్మాత్ర లని, కర్మఫలపంచక మని, మఱి యేమో యని, మఱి యింక నేమోయని కొన్ని మాటలు మాత్రము మన జిహ్వాగ్రములందు వ్యక్తము లగుచుండును. కాని యవి యక్కడమాత్రమే యుండఁదగినవి. అనుభవమునకు రావు. మాటల కర్థము తెలిసినంతమాత్రమున లాభ మే మున్నది? అనుభవమేది? ఎంతమాత్రమును లేదు. ఉండుట కవకాశమును లేదు. ఈబ్రహ్మవిద్యలో ఘనుఁ డెవ్వఁడు? సామాన్యుఁ డెవ్వఁడు? అధముఁ డెవఁడు? అనలు తత్త్వమే సినలు కానప్పు డందులో ఘనత యేమి? సామాన్యత యేమి? అధమత యేమి? కావునఁ బ్రత్యేక బ్రహ్మజ్ఞా నము కూడ సౌందర్య మని చెప్ప వీలు లేదు.

ఇకఁ బరమార్థమైన సౌందర్య మేది? శరీరసౌందర్యము సౌందర్యము కాదని యిదివ అకు చెప్పితిని విద్య సౌందర్యము సౌందర్యము కాదని యిప్పుడు చెప్పితిని. ఇక యథార్థసౌం దర్య మేది? ఈఉతపాఠము తలక్రిందుగా నప్పఁజెప్పిన లాభమేమి? నీటిలోఁబడి యీఁది యావలి గట్టు చేరినవాఁడే కృతార్థుఁ డనిపించుకొనును. 'ఆత్మవత్సర్వభూతాని' యని తెలిసినంతమాత్రముననే యేమి లాభము? అట్లాచరించువాఁడు ఘనుఁడు –పరోపకార మెనర్పవలయు నని తెలిసినంతమాత్రమున వినియోగమేమి? కష్టపడి పరుల కుపకరించినవాఁడు ధన్యాత్ముఁడు. ఎచ్చటఁ జూచినను గేవల జ్ఞానమున నేమియు నుపయోగ మగపడదు. ఆచరణమే ప్రధాన మైయున్నది. ఆచరణము లేనప్పుడేమి యున్నను వృథ కాని వేరు కాదు. జ్ఞానము వేఱు–ఆచరణము నేఱు. జ్ఞానము 'ఇంటలెక్చ్'తోఁ జేరినది. ఆచరణము 'విల్లు'తోఁ జేరినది. మహావిద్వాంసుఁ డగునంతమాత్రమున గౌరవపాత్రుఁడు కానేరఁడు. మంచినడువడిగల వాఁడై యుండవలయును. స్వార్థత్యాగము, పరోపకారశీలత, యెవని యందుఁ గ్రియారూపమునఁ బరిణమించునో వానికంటె ఘనుఁడు లేఁడు–వాఁడే విద్వాంసుఁడు–వాఁడే సుందరుడు. నడువడికంటె సుందరమైనది ప్రపంచమున వేఱొకటి లేదు. మంచినడువడి యన నేమో మఱియొకసారి చెప్పెదను. నాకు శరీరములో నన్యూనతగా నున్నది. ఇప్పటివఱ కింతయే చాలును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

12. స్వదేశీయ వస్త్రధారణము

ఒకసారి సహాయ నిరాకరణ సభనొక దాన్ని చూడడానికి వెళ్లిన జంఘాలశాస్త్రి ఆ సభలో పెద్దలు మాట్లాడిన విషయాలు–విదేశీయ వస్త్ర బహిష్కారం గురించి, స్వదేశ పరిపాలనా సౌకర్యం గురించి–విదేశీయ పరిపాలనా కష్టాల గురించీ–విన్నాడు.

ఆసభలో దాదాపు అందరూ స్వదేశీయ వస్త్రాలనే ధరించారు. ఒకరి నొకరు పలకరించుకోవడం కూడా 'మీ బట్ట లెక్కడి' వంటే, 'మీవి ఎక్కడివ'ని వివరాలు సంబరంగా చెప్పుకోవడం విన్నాడు. వారి వారి గాంధీ టోపీలను సందర్శించాడు. సభ ఇంక ముగించబోతుండగా–'అయ్యా! నేనే మైనా మాట్లాడవచ్చునా?' అని సభాధ్యక్షుణ్ణి అడిగాడు శాస్త్రి. అనుమతించారు.

అప్పుడు–జంఘాలశాస్త్రి వారి స్వదేశీయ వేషధారణంలో లోపాలను ఒకటొక్కటిగా విమర్శించడం మొదలు పెట్టాడు. బట్ట లొక్కటే స్వదేశీ యాలైతే చాలదన్నాడు. వాటిని కుట్టే విధానం, అందులో అనుసరించే విదేశీ విధానం పోవాలన్నాడు. తలకట్లు మారాలన్నాడు. పాదరక్షలు, కళ్లజోళ్లు, రిస్టువాచీలు కూడా మారిపోవాలన్నాడు. కాఫీల అలవాటు పోవాలన్నాడు.

నడుముచుట్టు జన్మనీ–నెత్తిమీద హాలెండు–ముక్కుమీద జపాను –చేతికి స్విట్జర్లాండ్ –చెవి తమ్మలకి ఇంగ్లాండు–ఎందుకీ నానా దేశ సంకీర్ణస మామ్నాయాలు? అని ఘాటుగా ప్రశ్నించాడు.

ఇంతలో సభాపతి ఇంగ్లీషులో–''స్వదేశీయ వస్త్రాల సమస్యకు సంబంధించిన ఆర్థికపు విలువని నువ్వు అర్థం చేసుకోలేదు''–అని శాస్త్రిని మందలించగా, జంఘాలుడు రెచ్చిపోయి–ఇంగ్లీషులో మాట్లాడి, తెలుగును విడిచిన నీది ఏపాటి స్వదేశీయ అభిమానమయ్యా! అని దులిపాడు. ఇచ్చిన వ్యవధి అయిపోయిందని సభాపతి హెచ్చరించడంతో శాస్త్రి ముగించాడు.

జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను.

ఆగస్టు మొదటి తేదిని జరిగిన యొక సహాయ్యనిరాకరణసభకు నేనుగూడఁ బోయితిని. ఆసభయందు స్వదేశీయవస్త్రధారణమును గూర్చియు విదేశీయ వస్త్రబహిష్కారమునుగూర్చియు–స్వదేశ పరిపాలనా సౌకర్యమునుగూర్చియు–విదేశీయపరిపాలనా కష్టములఁ

గూర్చియు ననేకులు వారివారికిఁ దోఁచినట్లు ముచ్చటించిరి. ఆ యుపన్యాసములతో మన కిప్పుడు పనిలేదు.

ఆసభలో దాదాపుగా నందఱు స్వదేశీయాంబరాలంకృతులై కనుపట్టిరి. నభాస్తారులె ల్లరు ''మీబట్ట లెక్క-డివయ్యా మీబట్టలెక్క-డివయ్యా?'' యని యన్యోన్యనంప్రశ్నాలాపకలా పులై ప్రకాశించిరి. మావి పొందూరువయ్యా యవి యొకరు, మావి నరసన్నపేటవయ్యా యని యొకరు, మావి పీఠికాపునంతలోనివేయయ్యా యని యొకరు, మావి తాటిపాకనీమ వయ్యా యని యొకరు, మావి బహర్ జల్లీపాటివయ్యా యని యొకరు, మావి మాసాంతమగ్గ ములోనివే యయ్యాయని యొకరు, నిట్లన్యోన్యోత్తరప్రధానప్రవీణులై భాసిల్లుచుండిరి. వీరి బట్టలను వారు నాడెముచూచిరి. వారిబట్టలను వీరు నాడెముచూచిరి. వీరు తలలు నిలువున నూఁపిరి–వారి యుత్తరీయములబరువు వీరు మోపిరి. వీరు తలలు పంకించిరి–వారు తల లెగురవైచిరి. వీరి గాంధీటోపీలను వారు నెత్తివైఁ బెట్టుకొనిరి. వారి గాంధీటోపీలను వీరు నెత్తివైఁ బెట్టుకొనిరి. వీరు కనుబొమ్మలు పైకెత్తిరి–వారు మూఁతిమూలలు దిగువకు వంచిరి. ఇఁక సభవారందరు సభావ్యాపార పరినమాప్తి యొనర్చుకొని లేచిపోవుదు రనఁగా నేను లేచి (నాకంత కంటె నమయము దొరకలేదు) ''అయ్యా! నే నేమైన మాటలాడ వచ్చునా?'' యని యధ్యక్షు నడిగితిని. అందరు నావంకఁ జూచిరి. నాకు నూతనవస్త్రము లేమియులేవు. ఆదినమున స్వదేశీయవస్త్రధారణము తప్పక చేయవలయు ననన్న నియమ మున్నట్లుకూడ నే నెఱుఁగను. సభాధ్యక్షుఁడు మదీయోపన్యాసమున కనుజ్ఞను బ్రసాదించినతోడనే నే నుపన్యానరంగమునకుఁ బోయి నిలువఁబడితిని. నాకుఁ గరతాళము లీయవచ్చునా కూడదా యని కొందఱు గునగునలాడిరి. కొందఱు గుబ్బెటలు వడిరి. కొందఱు రెండుచేతులు చప్పుడు కాకుండఁ జేర్చిరి. కొందఱు చప్పటలిచ్చుటకెత్తివేఱుచేసినచేతులలో నొకదానినిఁ జప్పున జేబులోను వేఱొకదానిని నుదుమీఁదను బెట్టుకొనిరి. మొత్తముమీఁద చింకిచేట కొట్టుచవుటి లేఁబాకపు గుల్లబారు కరతాళములు, రెండో రెండున్నరయో నా చెవిని బడినట్లు నాకు జ్ఞప్తిలేదని మాత్రము చెప్పఁజాలను. నే నిట్లుపన్యసించితిని.

''నాయనలారా! ఆహా! ఏమి దివ్యదర్శన మిచ్చుచున్నారు! స్వదేశీయ వేషములతో మీరెంత తేజస్వంతులై వెలిఁగిపోవుచున్నారు. మీ రింగ్లీషు ష్లానలు పంట్లములు తొడుగుకొని నప్పుడు, ఫ్రెంచి ట్వీడుల ప్రాకు లుపయోగించినప్పుడు, మీరింత శోభానమన్వితులుగ నుండలేదు. మీ రీముదుకగుడ్డలే తగియున్నవి. మీ రీముదుకగుడ్డలకే తగియున్నారు. ఏలయన, నవి మీదేశమున బుట్టినవస్తువులు. మీ చేతులతోఁ జేయఁ బడిన వస్తువులు మీ సొంతవస్తువులు. మీ వస్తువులే మీకుఁ దగును. మీరే మీ వస్తువులకుఁ దగుదురు కాని యింకను స్వదేశీయ వేషధారణమందు సంపూర్ణత సిద్ధింపలేదు. ఇంతమాత్రమునకే స్వదేశీయవేష నమగ్రత సిద్ధించిన దని సంతోషింపకుఁడు. కొన్ని లోపము లున్నవి. అవి సంక్షేపముగాఁ జెప్పెదను. (తీర సభ చాలింపఁ బోవునరి కారంభించితిరి. అయిదు నిమునములకంటె నెక్కువ మాటలాడ వీలులేదని యధ్యక్షుఁ డనెను.) చిత్తము, చిత్తమని నేనిట్లు చెప్పితిని.

నాయనలారా! దాదాపుగా మీయందఱి యొడళ్లమీఁది యజ్ఞోపవీతములు విదేశీయ నూలుతో వడుకఁబడినవి. కాని మరియొకటి కాదు. అట్టి జన్నిదము లీ దినమునన్నే త్యజించి–స్వదేశీయపుఁ బ్రత్తితో, స్వదేశీయపుఁ గదురుతో, విభూతితో, వేదఘోషముతో,

నొడుకఁబడిన స్వదేశీయ యజ్ఞసూత్రములనే ధరింపవలయును. ఇది యత్యంత ముఖ్యాంశము. ఆ పట్టుదలను బూర్తిగ వహింపవలసినది. లోనఁ జిలుము నట్టిపెట్టి పాత్రను బైకెంత తోమిననైన నేమి వినియోగము? అదిగాక మీరు ధరించిన మోటదుప్పటములలో, మొండి బొంతలలోఁ, దెరచాఁపగుడ్డతానులలో, డేరాగుడ్డలలో నన్నియు సంపూర్ణముగా స్వదేశీయములే యని నమ్మవలదు. విదేశీయపు నూలు పడుగులతో స్వదేశీయపునూలు పేకతో సర్వసాధారణముగా నేత జరుగుచున్నది. క్రొత్తకుండ మేమి ప్రాఁత తెడ్డేమి? నిలువు విదేశీయత, అడ్డము స్వదేశీయతయునా? ఈ సాంకర్యము తగదు. మటియొక్క లోప మగపడుచున్నది. మీ స్వదేశీయపు దుస్తులింకను విదేశీయపుఁ బద్ధతిగాఁ గుట్టించుచున్నారు. అది తప్పు. స్వదేశీయపు గుడ్డతోఁ బంట్లములు కుట్టించి మీలో ననేకులు తొడుగుకొనియున్నారు. స్వదేశీయపు గుడ్డవఱకు సంతోషమే. పంట్లమును ధరించుట స్వదేశీయ పద్ధతియా? కాదే! పనికిమాలిన ఈ పంట్లముల పద్ధతిని వదలి పంచెకట్టు బిళ్లకచ్ఛలలో వేయవలయును. అదిగాక టర్కు కాలరులతో వాచిపాకెటులతో, టిక్కట్టు పాకెట్లతో, వెనుక ఫాపులతో, ముందు మూఁడుతవ్వల యటుకులు పట్టఁదగిన ఫ్రంటు పాకెట్లతో, మీకీ కోటు లెందులకు? గుడ్డ మనదేకాని కుట్టునైఖరి మనదా? కావున నా పద్ధతిని బూర్తిగా వర్జింపవలసినది. అయ్యయ్యో! ఆ పర్టు లెట్లున్నవో చూచుకొంటిరా–ఆ కాలరు లేమి–ఆ 'బ్రేష్టు' లేమి–ఆ కుక్క చెవులలోనే యల్లికనైను దమ్మఁటులేమి! వెనుకఁ గుచ్చులేమి! ముందు 'స్లేటు' లేమి! చేతులకు 'కప్పు' లేమి! ఎంతమాత్రమును నరిగాలేదు. ఈ పద్ధతు లన్నియు బహిష్కరింపఁదగినవే–మన పూర్వకాలపుఁ గుడితినీలు –మహమ్మదీయకాలపు టంగరఖాలు–ప్రక్క బొందులతో నెదుటిబొందులతో నింక దేశమందవతరింపవలసినదే–ఇదిగాక తలలపైఁ గొందఱకు విదేశీయపు టోపీలు కనఁబడుచున్నవి. అవి తీసి పాఱవైచి, అంగవస్త్రము చుట్టకుదురువాటముగా నైనఁ జుట్టుకొనవలసినది. కాలి కాజోళ్లేమి? ఇంకను స్లిప్పరు లెందులకు? ఇంకను బూట్లెందులకు! తోలు స్వదేశీయపుదే కానిండు, విదేశీయపుదే కానిండు–పనివాండ్రు స్వదేశీయులే కానిండు–విదేశీయులే కానిండు –ఆ పద్ధతియే నిరాకరణీయము. ఆకుచెప్పులజోడో మీసాల చెప్పులజోడో తొడిగికొనవలసినదే కాని యివి పనికిరావు. ఎంత స్వదేశీయనైఖరియైన నేమి? అయ్యయ్యో! చేతిలో నమెరికావారి పెన్సి లయ్యెను–ముక్కున జర్మనీవారి అద్దమయ్యెను–జేబులో జపానువారి పొదుముడబ్బి యయ్యెను–చేతికి స్విసు సంబంధమైన రిస్టువాచి యయ్యెను. ఇంతకంటె సమగ్రు మెప్పుడు? ఓ! ఇంతకంటె మహాపుణ్యకాల మే మున్నది! ఇవి యన్నియుఁ గూడఁ గట్టకట్టి కూపము నదిలోఁ బారవేయఁ గూడదా? నడుముచుట్టు జర్మనీ–నెత్తిమీఁద హాలండు–ముక్కుమీఁద జపాను–చేతికి స్విట్జర్లాండు–చెవితమ్మల నింగ్లాండు–ఎందులకీ నానాదేశ సాంకర్యసమామ్నాయము? సర్వము సముద్రగామి కావలసినదే. స్వదేశీయపు వస్త్రములను ధరించితి మనుచున్నారు. కుట్టిన యంత్రములు విదేశీయ యంత్రములు. దారము విదేశీయపుదారము. (ఇది నేను చేతితో కుట్టినదయ్యా–ఇది మాయాఁడువారు కుట్టినదయ్యా అని సభలో కేకలు.) సరే నాయనలారా–సంతోషమే. సాహాయ్యనిరాకరణ మనియు స్వదేశీయపాలన మనియు నింకేమేమో యనియు నాతలయంత యక్షరములతోఁ బత్రికలపైఁ ముద్రించుచున్నారుకదా–ఈముద్రాయంత్రములెటనుండి వచ్చినవయ్యా –(అయ్యా–అంతవఱకిప్పు డెందులకు–స్వాధీనములైన సులభకార్యములేవో–అవిముందు

చేసికొనవలయును–అని సభలోc గేకలు.) నాయనలారా–ఆలాగా–సంతోషమే. సులభసాధ్యములైన పనులను ముందుగాcజేసికొమ్మని చెప్పినారు సంతోషమే. అటులైన నర్ధణా డబ్బులతో, నయిదునిమునములలో, రవంతపిలక యట్టెపెట్టి, కొయ్యపిడిచేకత్తితో, గొరిగించుకొనవచ్చునుకదా–మీలో ననేకుల కీ క్రాపు లెందులకు? ఈక్రాపులు మీ తాతలనాడు ముత్తాతల నాడు నెఱుcగుదురా? అవేమి అందమా–చందమా? మూcతిగొరుగుడేమి? తల పెరుcగుడేమి? మీరీ క్రాపుల నిర్మూలన మొనర్చినcగాని మీకు స్వదేశీయ మొగమే యమరదు –ప్రథమమందుc దలలోనే స్వదేశీయపుటాకృతి లేనప్పుడు దేహమందు తాటిపాక తెరచాcప గుడ్డ యున్నచైన నేమి? ఈనడుమ మా మిత్రుc డొక్కcడు తూర్పున నేసిన మంచపునవారు పట్టెడను గొని తలకుc జుట్టుకొనినాcడు సంతోషమే–తలపై నున్న గుడ్డయే కాదు. తలమీcద జుట్టుకూడ స్వదేశీయపుదై యుండవలెను. తలలోని మెదడు కూడ స్వదేశీయపుదై యుండుట యంతకంటె ముఖ్యము. కాఫీ త్రాగుట స్వదేశీయపు పద్ధతి కాcబోలునేమి! ఆబుద్ధి మీకేల? ''వాటీజ్ ఆల్ దిస్? వాటీజ్ ఆల్ దిస్? యు, డూనాటు సీం, టు అండరుస్టాండు, ది ఎకనామికలు వాల్యూ, ఆఫ్ ది స్వదేశీ క్లాతు ప్రోబ్లెము!'' అని సభాపతి నన్ను మందలించెను. సెబాస్–అది యొకటియా నాయనా మీస్వదేశీయ వేషము లింతటితోనే సంపూర్తియైన వని సంతోషింపవలదనియు–బాహ్యముగా నాంతరంగికముగా నింక నెంతయో యభివృద్ధి కవకాశమున్నదనియును–అట్టి యభివృద్ధి రాcదగిన సుదినములకై యుత్సాహపూర్ణులై నిరీక్షించుచుండుc డనియు–నేను జెప్పcబోవcగ–నీమాత్రమైనc దెలిసికొనకపోవుట యటులుండcగ మీcదుమిక్కిలి నాకేదో తెలియ దని నీ వధిక్షేపించుట ఆహా–ఎంత సొగసుగ నున్నదయ్యా! సాక్షిసంఘమునకు రాజకీయవ్యాజమునకు సంబంధము లేదు కావున నీ వనినదేదో నాకుc దెలియకపోవచ్చును గాని–ఓ–అరతాను స్వదేశీయపు దుప్పటి రేకుcగట్టితివే–పాటినూలు జవునుపచ్చడపుబొంత తలపైc బెట్టితివే–ఇంత స్వదేశీయ వస్త్రభారమును సహింపుచుంటివే–నీ విప్పు డాంగ్లేయ భాషతోc బలికిన నాల్గుమాటలు నాంధ్రభాషలో ననవలయును నను జ్ఞానము నీకేల లేకపోయెను? ఎంత స్వదేశీయాభిమానివయ్యా–(నీ కిచ్చిన యైదు నిముసములు దాటిపోయినవి–ఇకమాటాడకుము–అని సభాపతి పలికెను.)

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

13. సాక్షిసంఘప్రథమవార్షికోత్సవము

నిజానికి–సాక్షిసంఘానికి ఏవిధమైన వార్షికోత్సవమూ చెయ్యవద్దని చెప్పి సాక్షి ఊరు వెళ్లినా, మిగిలిన సభ్యులు ఉత్సాహంగా వార్షికోత్సవం చెయ్యడానికే నిశ్చయించారు.

అయితే ఉత్సాహం లోపల ఉన్నా, డబ్బు రావలసింది పైనుంచే కదా! అందుకని, ఊళ్లో చందాలు వసూలు చేయడానికి వాణీదాను, కాలాచార్యులు వెళ్లారు. ఎవరూ చందాలివ్వలేదు. ప్రత్యవాయం వస్తుందని భయపడడాని కిదేం వైదికకర్మ కాదుగదా! అని ఉదాశీన వైఖరి అవలంబించారు.

సరే–పై ఊళ్లకైనా వెళ్లి ప్రయత్నిద్దామని చూడగా–ఎక్కడికివెళ్లినా సాక్షి ప్రసంగాలలో మమ్మల్ని ఇలా విమర్శించాడు, అలా విమర్శించాడు అని ముఖం మాడ్చుకున్న వారేగాని ఎవరూ ఎట్టని పీగాణీ విదల్చలేదు.

పోతేపోనీ–మనమే చేసుకుందాం అని నిర్ణయించి, సభాధ్యక్షుడి కోసం ప్రయత్నిస్తే ఎవరిని కోరినా వారు ఏవో కారణాలుచెప్పి తప్పించుకున్నారు.

అయినాసరే, కృష్ణ విగ్రహాన్ని అధ్యక్ష స్థానంలో వుంచి–భాగవతుడైన చిట్టి శాస్త్రులుచేత దైవ ప్రార్థన చేయించి, సభను ప్రారంభించారు. అయితే డబ్బు అడుగుతారనే భయంతో ఆరోజు శ్రోతలు కూడా ఎక్కువమంది రాలేదు.

సభా కార్యక్రమం ఏ డంశాలతో ఉండడం బాగాలేదని సభలో కేకలు వినపడడం వల్ల, ఏడంకె విశిష్టత ఎలాంటిదో దేశ, నిదేశాలకు సబంధించిన ఉదాహరణ లిచ్చారు. ఇక–సంఘ వ్యవహారాలకు సంబంధించిన నివేదికగా, సాక్షిసంఘ చరిత్ర, సాగించిన ఉపన్యాసాల సంఖ్య క్లుప్తంగా వివరించారు.

ఈ సందర్భంగా సాక్షి చిత్రపటం వ్రానీ సభలో ఉంచాలని వాణీదాసు ప్రతిపాదించగా–అది ఎందుకు సాధ్యం కాదో ఇచ్చిన వివరణంతో, మంగళంతో సభ ముగిసింది.

సాక్షిసంఘము పునరుద్ధారణ మొనర్చి యీనెల మొదటి తేదికి సరిగా నొక సంవత్సరమైనది కావున నీ సంఘమునకు వార్షికమహోత్సవము చేయవలయు నని సంఘస

భ్యుల మగు మేము మహోత్సాహమున నుంటిమి. ఉత్సాహము లోననుండి వచ్చినది కాని ధనము సైనుండి రాబలసినదే కాదా. సాంవత్సరికోత్సవవిరచనకై మాకుఁజందా లేమైన నిప్పింపుఁడని గ్రామస్థులను గోరుచుఁ గొన్ని కరపత్రములను గ్రిందటి సభలోనే పంచిపెట్టితిమి. ఒక్క సైనయైన నెవ్వఁడును జందా పంపియుండలేదు. అంతతో నిరాశచెందక యింటింటికి ధనసంపాదననిమిత్తమై కాలాచార్యుని వాణీదానుని గూడఁ బంపితిమి. సాక్షినం ఘమున కిప్పుడు వార్షికోత్సవము చేయకపోయినయెడల నేమి మునిఁగె ననియు ననాథప్రేత సంస్కారమువలె భిక్షాధనసాహాయ్యమున నేల చేయవలయు ననియు, నైదకమైన శ్రాద్ధకర్మము కాదుకదా? చేయకపోయినయెడల మతప్రత్యవాయమేమియు లేదు కావున మానుకొనఁ గూడదా యనియు నెవరికి దోఁచినట్లు వారు యాయావనవిహారధీరు లగు కవిశిఖామణిని, బ్రతివాదిమత్తేభకంఠీరవుని దలవాఁచునట్లు చీవాట్లు పెట్టిరి. పోయినసిగ్గు పోనేపోయినదికదా యిఁక మనకుఁబోవునదేదియని పొరుగూరిలోఁగూడ మనవారు 'భవతి భిక్షాం దేహి' యనుచుఁ దిరువీథులు వేంచేసిరి. మా మేనత్తకూఁతురు కాశీలోఁ గాకరకాయ విడిచిన దని మీసాక్షి యధిక్షేపింపలేదా యనియొకఁడు–నేను ముఖక్షౌరము జేసికొందు నని మీసాక్షి నన్ననరాని మాటలాడ లేదా యని యొకఁడు–పాచకమహాజనసభోపన్యాసమున మాతండ్రిగా రెవతెనో చేరఁదీసినాఁ డని మీసాక్షి యెత్తిపొడువలేదా యని యొకఁడు–నేను దూరపున వారుపట్టెడయే తలకుఁ జుట్టుకొందునో గరిగమ్మలగుదియే శిరమునఁ దగిలించు కొందునో సాక్షికి నాజోలియేల యని యొకఁడు–న్యాయవాదివృత్తిని మీసాక్షి తఱచుగ నిరసించుచున్నాఁడు. భద్రముగా నుండుమని చెప్పుఁ డని యొకఁడు–కోడిపందెములతో మాదొర పకీరయ్యే నని మీసాక్షి క్రిందుమీఁదు లెఱుఁగక యధిక్షేపింపలేదా యని యొకఁడు నునై యెవరి హృదయములలో నున్న నిష్కారణ క్రోధములను వారివారి దోషములతో వెల్లడించిరి. చూచితిరా నాయనలారా! ఎట్లున్నదో–సాంఘికనైతిక దురాచారవిమర్శకుఁ డగు సాక్షి కిట్టి యపవాదము రాఁదగినదే. ఇది భూషణముకాని దూషణము కాదు. ప్రకృతి ననునరించిన వాక్కుల కట్టి యపనింద లన్ని దేశములం దన్ని జాతులం దన్ని కాలములం దన్ని స్వభావము లందుఁగూడ నున్నది. దురాచారములఁగూర్చియే మేము సంభాషిం తుము. దురాచారములనే వెల్లడింతుము. వాని స్వభావములనే విశదపఱతుము. వానివలన సంఘమునకుఁ గలుగు హానిని స్పష్టపఱతుము. వానియందు జనుల కసహ్యత గలుగునట్లు చేయుటకై ప్రయత్నింతుము. వానినే మేము నిందింతుముకాని వాని కధీను లయిన జనులను మేము నిందింపము. వారిని దలపెట్టనైనఁ దలపెట్టము. వారితో లేశమును మాకుఁ బ్రనక్తియే లేదని మేమనేక పర్యాయములు సభాముఖమున వెల్లడించియుంటిమి. సత్యబద్ధులమై సమయ మును సంరక్షించుకొనుచుంటిమి. అట్లువచ్చుచున్నను నింక నన్నే తిట్టినాఁడు నన్నే తిట్టినాఁ డని మీ రనుట న్యాయమా? అది తిట్టేయగునెడలనా తిట్టునకు నీవర్ష్ణుఁడవను సంగతి నీకంటె బాగుగా నెవరికిఁ దెలియును? నీ వానంగతి చెప్పకున్న యెడల మాకు నీదోషము తెలియనే తెలియదే. అట్టిచోఁ గిక్కిరు మనకుండ నీ తప్పెదో దిద్దుకొని బాగుపడి సాక్షిని నన్మానించుటకు బదులుగా నిందించుట తగునా? ఏమైన నీగొడవ యింక మన కెందులకు? ఇట్టి యుడుకుఁబోతు టులికిపాటు ప్రకృతులఁ గూర్చి యెప్పుడైన నవిస్తరముగాఁ జెప్పె దను. ఇప్పు డవకాశము లేదు. ఇట్లు లేనిపోని నిందా వాక్యములు సాక్షిపై నైచి తుద కెవ్వరు నొక్క గవ్వయైన మావార్షికోత్సవమున కీయలేదు. ఈయకపోయినందువలన మాకు

నిరుత్సాహము లేదు. ఎట్టులో యొకటు లీ వార్షికోత్సవమును నిర్వహించుకొనఁదలఁచి తిమి. ఈసభ కధ్యక్షు నెవ్వరిని బిలువవలయునా యని రెండుదినములు యోజించితిమి. వీరికిఁ దెలియకుండ వారికి, వారికిఁ దెలియకుండ వీరికిఁ గొందఱ కుత్తరముల వ్రాసితిమి. కొందఱకు వార్త నంపితిమి. ఆదినమున మాయమ్మగారి శ్రాద్ధమగుటచే రావీలు లేదని యొకఁడు, నాకు దేహ మనారోగ్యముగ నుండుటచే రాలేకపోయినందులకు విచారించుచున్నాఁడ నని యొకఁడు, ననివార్యములగు కొన్ని తొందరపనులచే నా కట్టి భాగ్యము కలిగినది కాదని యొకఁడు నిటులేదో యొక్క వైఖరిని వారియొద్దనుండి ప్రత్యుత్తరములు వచ్చినవి. సభ కధ్యక్షుఁడే కుదురలేదే. ఋత్విజుఁడు లేని యజ్ఞమా? పురోహితుఁడు లేని పెండ్లియా? సంధానకర్తలేని సరసమా? మంత్రములేని తద్దినమా? ప్రాసఁగుడువాఁడులేని సంతయా? దూతలేని రాజకార్యమా? గురుఁడు లేని పల్లెకూట మియా? వైద్యుఁడు లేని మరణమా? అయ్యో! అధ్యక్షుఁడు లేని సభయా? లభింపనిదే యేమి చేయవచ్చును? ధనము లేకున్న నేటులో మాలో మేము గుడుగుడుగుంచము లాడుకొని వేడుకతీర్చుకొనఁగలము కాని ప్రధానుఁ డగు నధ్యక్షుఁడే లేకుండిన నెట్లు? గొల్లఁడు లేని మందయా? న్యాయమూర్తి లేని న్యాయస్థానమా? నాయికలేని మేజువాణియా? న్యాయవాది లేని స్థలభాండవిసర్జనమా? కావున నగ్రాసనమున నెవ్వరో యొక రుండకతప్ప దని యెంచి శ్రీకృష్ణభగవానుని విగ్రహ మగ్రస్థానమున నిలిపితిమి. గోపికావస్త్రగృహీతయుఁ బాండుసుత ప్రావస్త్రప్రదాతయు, బకతృణావర్తాది రాక్షస నిగ్రహుఁడును, లీలామానుష విగ్రహుఁడును, గౌరవసభా దూతయు, జగన్నేతయు నగు శ్రీరుక్మిణీవల్లభుఁడే మా సభ కగ్రాసనాధిపతి–కురుక్షేత్రరంగమునఁ బార్థునకు భగవద్గీతామృతమును బ్రసాదించిన యా వసుదేవనందనునికంటె నగ్రస్థానాధిష్ఠిత మరి యెవ్వఁడు? కావునఁ గంసద్వేషికి జయా! కాళియగర్వభంజనునకు జయా! పద్మవిలోచనునకు జయా! పాపవిమోచనునకు జయా!

ఈ యుత్సవకార్యక్రమ మచ్చువేయించుటకు మాకు శక్తిలేని హేతువుచే నిదిగో వ్రాసియుంచితిని. మొదటిది దైవప్రార్థనము–రెండవది యధ్యక్షోపన్యాసము–మూఁడవది గానకాలక్షేపము–నాల్గవది సంఘవ్యవహారనివేదనము–అయిదవది సభాసదుల యుపన్యాసము లు–ఆఱవది యధ్యక్షుని యుపసంహారోపన్యాసము–ఏడవది మంగళము. (ఏడు సూత్రము బాగుగా నున్నదికా దని సభలోఁ గేకలు) అదేమి మాట? ఏడు బహుసవిత్ర మగు సంఖ్య. మన కేడ్గురు ఋషులు– ఏడు ద్వీపములు– ఏడుసముద్రములు– ఏడుస్వరములు– ఏడు తాళములు– ఇంద్రధనుస్సులో నేడు రంగులు–ఏడు సంవత్సరముల కొక్కసారి సర్వజీవద్ర వ్యములలోని పరమాణువులు పూర్తిగా మార్పుచెందును–వారమున కేడు దినములు –శ్రీరాముని యరణ్యవాసము 2x7 సంవత్సరములు–మనకు గురుఁడు తల్లి తండ్రి ప్రభుఁడు విద్య దైవము దాతయు సప్తరక్షకములు–వీనికే యేడుగడ యనిపేరు. మనుజులను బాధించు వ్యసనము లేదు–మనుజుల మొగముమీఁదనున్న రంధ్రము లేదు–ఏడవ సంవత్సర మున నుపనయనాధికారము వేదాధ్యయనాధికారము కలుగును–జంతుదేహములలో సప్తధా తువులు–సంతానము లేదు–శ్లేష్మము వాతము పైత్యము శ్లేష్మవాతము శ్లేష్మపైత్యము వాతపై త్యము త్రిదోషయుతము లని రోగములెల్ల నేడే. గుండె, కడుపు, రెండుకాళ్లు, రెండుచేతులు, తలయు నని శరీరమున కేడే స్థూలవిభాగములు–హృదయకోశము శ్వాసకోశములు కార్జము స్ప్లీను పాంక్రియాస్ జఠరకోశ మని శరీరమున నేడే కోశములు–''గంగేచయమునే చైవ

గోదావరి సరస్వతీ నర్మదా సింధు కావేరీ జలేస్మిన్సన్నిధింకురు'' అను కలశపూజారంభ శ్లోకమున నేడు నదులే పేర్కొనఁబడినవి–తల్లి కడుపునుండి శిశువు జీవముతో వెడలి బ్రదుకుట కేడవ మానమే ప్రారంభమితి–బాలెంతరాలి కేడవదినము దాఁటిన యెడల నిఁక బాధలేదు–అసాధ్యదుస్సాధ్యజ్వరములు తక్క నన్ని సామాన్య జ్వరములుకూడ నెంత తీవ్రమైన మైనరే యేడవనాఁడు శాంతింపక తప్పదు. ఇట్లు చెప్పునెడల నూరులకొలఁది యుదాహరణములు చెప్పవలసియుండును. సర్వప్రపంచ బహిరంతస్తత్వములు ''ఏడు''తో నిండి యున్నవి. సప్తసంఖ్యాప్రభావమును గనిపట్టుట మనయొక్క దేశమందే కాదు, ఒక్క జాతియందే కాదు, ప్రపంచమున నున్న యన్ని దేశముల వారుకూడ వాని విలువను గుర్తెరిఁగియున్నారు. విదేశీయుల యభిప్రాయములు కొన్ని చెప్పుదును.

ఆఱుదినములలో సృష్టి పూర్తిచేసి యేడవనాఁడు భగవంతుఁడు విశ్రాంతి చెందెను. ప్రతి సప్తమసంవత్సరముకూడ భూమిని దున్నకుండ బీడు విడువవలయును. బాకి తీర్పలేనివాని కేడవ సంవత్సరముతో ఋణవిముక్తి కారాగృహ విముక్తియుఁ గూడఁ గాక తప్పదు. జనుల కేడేసి సంవత్సరముల కొక పర్యాయము రాజశాసనములు చదివించి వినిపింపవలయును. జలప్రళయ మిక నేడు దినములకు వచ్చు ననఁగా నోవా అను వానికి దానినిగూర్చి తెలిసెను. నెబుషాడ్ నెజ్జారను నాతఁ డేడు సంవత్సరములు మృగప్రాయుఁడై యుండెను. సొలొమన్ అను నాతఁ డేడు సంవత్సరములలో భగవదాలయమును గట్టించెను. ఆ యాలయములో నేడే దీపములు. బైబిలులో నేడు రినరెక్షను లున్నవి. ఏసుక్రీస్తు క్రాసు మీఁద నేడుసారులు మాటలాడెను. దానిమీఁద నాతఁ డేడుగంటలుండెను. అతఁ డేడే సారుల్ కనఁబడెను. 7x7 దినములలో హోలీగోష్టును బంపెను. ఇదికాక స్వర్గములేదు, గ్రహము లేదు, నక్షత్రములేదు, ధీమంతు లేర్పుఱు. నామాన్ అను నాతఁడు జార్డను నదిలో నేడు పర్యాయములు స్నానముచేసి కుష్ఠరోగవిముక్తినొందెను. ఏడను నంకెలో విశేషమహిమ యున్నదనియు నందువలన సమస్తరోగములు హరించుననియు నాయుస్సు వృద్ధియగు ననియు హిపోక్రిటీస్ అను మహాధీశాలి చెప్పియున్నాఁడు. షేక్స్పియరు మనుజ జీవనము నేడు దశలుగా విభజించియున్నాఁడు. చంద్రుఁ డేడుదినముల కొకపర్యాయము తన కళాదశను మార్పుచేయును గావున నే డను సంఖ్య ప్రపంచవస్తువులందు జరుగుచున్న యన్ని మార్పులకు మూలకారణమై యున్నది; పిల్లలకు దంతము లేడవనెలలో వచ్చును. ఏడవ సంవత్సరములో నూడి తిరుగ వచ్చును. ఏడు సంవత్సరములు దాఁటనివాఁ డెట్టి నేరమును జేసిననైన శిక్షార్హుఁడు కాఁడు. 2x7 సంవత్సరములకు స్త్రీకి యుక్తవయస్సు వచ్చును. 2x7 సంవత్సరములకు బురుషునకు యౌవన మారంభించును. 4x7 సంవత్సరము లకు మనుజుఁడు పరిపూర్ణబలాన్వితుఁడై యుండును. 5x7 సంవత్సరములకు మనుజుఁడు ప్రపంచ వ్యవహారముల నన్నిటిని నిర్వహించుకొనుటకుఁ దగిన దేహమనస్సమర్థతలఁ గలిగియుండును. 6x7 సంవత్సరముల కతఁడు గ్రామ్యభోగాదిసౌఖ్యవిరాగియై కొంత పరిజ్ఞాతయై యుండును. అప్పటి కింక వంకరచూపు చూచినవాని కింక వల్ల కాటికిఁ బోవువఱ కంతే. 7x7 సంవత్సరముల కతఁడు దిగనారుట కారంభించును. 8x7 సంవత్సర ముల కతఁడు బుద్ధితోఁజేరిన మహాకార్యముల కనర్హుఁడై యుండును. 9x7 సంవత్సరముల కతఁ డపాయదశలో నుండును. కొడుకులలో నేడవవాఁడు మహాబుద్ధిశాలి యగును. ఏడవ పుత్రుని యేడవ పుత్రుడు సమస్తవ్యాధులను స్పర్శమాత్రమునఁ గుదుర్చఁగల శక్తిగలిగియుం

డును. ఇట్లు పాశ్చాత్యులు వ్రాసియున్నారు.

ఇదిగాక యేడ్గురు భర్తల ప్రాణముల హరించిన పడఁతి ప్రపంచము నేకచ్ఛత్రముగఁ బరిపాలించు నను నర్థముగల మోటసామెత యొకటి యున్నట్లు జ్ఞప్తి యున్నది. మృత్యువ కేడుకట్ల సవారి యందరెరిఁగినదే. (ఏడునుగూర్చి) యెంతసేపటినుండి గింజుకొను 'చున్నాఁడో యని సభలోఁ గుసగుసలు) నాయనలారా! ఏదియో స్పష్టముగ వినరా కున్నది. ఏడను సంఖ్య మంచిదికా దని మీ రధిక్షేపించుటచేత, నింత చెప్పవలసివచ్చినది. క్షమింపుడు.

సరే. ఈగొడవ యెందులకు కార్యక్రమములలో నేడు పద్ధతులున్నవి. మొదటిది దైవప్రార్థనము. నాయనలారా! సభాస్తారు లీదినమున మిగులఁ గొలఁదిగ వచ్చినారు. ఏమైన నిండని యడిగిపోవుదుమేమో యను భయముచే మొగముచాటు వైచినట్లున్నది. దైవప్రార్థన మొనర్చుటకు ఈశాస్త్రులవారు దయాపూర్వకముగ నంగీకరించినారు. ఈయన పేరు–ఉ –ఉ ఏదో మంచిపే–(చిట్టిశాస్త్రి అని సభలోఁ గేకలు) ఔను చిట్టిశాస్త్రులుగారు స్వగ్రామమునఁ గొంతకాలమున వీధిభాగవత యక్షగానములో రాత్రి కొక్కరూపాయచొప్పున సంభావనఁ బరిగ్రహించి కృష్ణవేషము వేసిన భాగవతోత్తములు. ఈయన పాత్రౌచిత్యము, ముఖ విలక్ష ణత, యభినయచాతుర్యము, నాట్యనైపుణ్యము, కంఠమాధుర్యము, స్వభావప్రకటనమును గాంచి, వీధిభాగవతములోని వట్టి పనికిమాలిన కృష్ణపాత్రమునకు–తాటియాకు చాఁపమీఁద గూలఁబడి కునికిపాటులు పడుటకంటె వేరు పనిలేని కృష్ణపాత్రమునకు–ఇంత ప్రజ్ఞావిశేషము లనాశ్యకము లనియా మేళనాయకుఁ డైన శాత్తనుఁ డాలోచించి యీతనిని టెంపారరీ యెష్టాబ్లిషుమెంటులో నుంచి తప్పించి విదూషకునిగా నియమించి పర్మెనెంటు డ్యూటీలోఁ బడవైచి దేశోపకార మొనర్చినాఁడు. ఆయుద్యోగమున నీయన చిరకాలము జయప్రదముగాఁ బనిచేసి సర్వజనశ్లాఘాపాత్రులైనారు–మునసబుగా రీతినికిఁ బెండ్లిచేయించినారు. కరణము గారు పాత్రసామగ్రి కొనిపెట్టినారు–పెత్తనదారుగారు సంవత్సరమున కొక్కపంచెలచాపు బరాతముగా దయచేయించినారు. ఈదినమునకు సభకు దయచేసినవారిలో వీరే ప్రతిభలోఁ బాండిత్యములోఁ బ్రథములని నాకు దోఁచినకారణమున నీయనను దైవప్రార్థన మొనర్చు మని కోరినాను. ఈయన దైవప్రార్థనమున కుపక్రమింతురు. మీరు లేచి కృష్ణా కృష్ణా యని స్మరింపనలయును.

చిట్టిశాస్త్రుల యుపోద్ఘాతపూర్వక దైవప్రార్థనక్రమము.

కీర్తన

అమ్మలారా! అయ్యలారా అందఱికి సమ్మతేనాII అమ్మ
కొమ్మలారా కొయ్యలారా–గొప్పచేసినారు నన్ను–
కమ్మలారా–కాపులారా–కాలుకుంటి చిట్టిశాస్త్రి
బొమ్మలారా–పోతులారా–మ్రొక్కువాఁడు మీకునేఁడుII అమ్మ
ధాధాకిటతకధామ్ ధాధాకిటతకధామ్ తధిగిణతోమ్
తధిగిణతోమ్II తధిగిణతోమ్II అమ్మ II

(అదేమి అదేమి? తెయితక్కలాడుచున్నాడే–అయ్యయ్యో! ఎడమచేయి యెడమచె వైపై నడఁచిపెట్టి యిలకోడివలె నఱచుచున్నాఁడే యని సభలోఁ గేకలు.)

భోజనములోనికిఁ బప్పెట్లో–చదువులో నోన్నమశ్శివాయ యెట్లో –సంధ్యావందనములోనఁ గేశవనామావళి యెట్లో–స్త్రీ ప్రసక్తిలో ముద్దెట్లో –సర్వప్రార్థనములలోను వినాయకప్రార్థన మట్లుమొదలని–భాగవతోత్తము లైన చిట్టిరామన్న పంతులుగారు సెలవిచ్చినట్లుగా–వినాయకప్రార్థన కుపక్రమ మెట్లంటేని–

తుండము నేకదంతమును దోరపుబొజ్జయు వామహస్తమున్
మెండుగమ్రోయుగజ్జెలును మెల్లనిచూపులు మందహాసమున్
గొండొక గుజ్జురూపమునఁ గోరినకోర్కెలకెల్ల నొజ్జవై
యుండెడు ద్రౌపదీ తనయ యోరిగణాధిప నీకు మ్రొక్కెదన్.

వినాయక స్తవమైన తరువాత యెట్లుగా శారదాప్రార్థన మాచరింపవలె నంటేని–

కీర్తన.

అంబాపరాక–దేవీపరాక–అంబా చక్కని శారదాంబాపరాకా అద్ధీII
అంబాపరాక దేవీపరాక! మమ్మేలిన శారదాంబాపరాకా.

(మేలుమేలు బళాబళి యని సభలోఁ గేకలు.)

ఇఁక నాపని యయినది. ఏదీ నా కీయవలసిన రూపాయ యీవలఁ బాఱవేయవయ్య.

నాయనలారా! ఇక్కఁడికి చిట్టిశాస్త్రులుగారి దైవప్రార్థనమైనది. కాని యీ విషయమున నొక్క పెరపాటు జరిగినది. ధనవాంఛా శూన్యులై దైవప్రార్థన మొనర్పక పోవుదురా యని యీయనను బిలిచితిని. ఏమైన నిమ్మని యడుగుదు రని నా కప్పుడు తెలిసినయెడల–(వెట్టికి దైవప్రార్థన చేయుదు ననుకొంటివఁటయ్యా–దేవుని పేరెత్తిన దాఁక నాకర్మ మేమి కాలిన దయ్యా. ఎవనిగతి తిన్నగ లేకపోయినవాఁడు దేవుఁడా యని దేవులాడవలసినదిగాని, నా కీచేతిదండుగ కీర్తన యెందులకయ్యా యని సభలోఁ జిట్టిశాస్త్రులు కేకలు) (తొందరపడ కయ్యా ఈ రూపాయతోడనే పెద్దకాఁపురము చేయుదువటయ్యా, ఇదిగో నే నిచ్చెదను తీసికోవయ్యా, యని సభలో నొక ధర్మాత్ముని కేక.)

నాయనలారా! కార్యక్రమమున దైవప్రార్థనానంతరమున నధ్యక్షోపన్యాస మున్నది. అధ్యక్షుఁడు స్థాణువగుటచే నాతని యుపన్యాసము జరిగినట్లుగానే భావింపవలయు నని ప్రార్థించుచున్నాను. (మేము వినినట్లుగానే సంతోషించుచున్నామని మనవి చేయుచున్నా మని సభలోఁ గేకలు.) మూఁడవవేడుక గానకాలక్షేపము. ఈ విషయమునఁ గూడ నొక యనివార్యమైన యుపరోధము సంభవించిన దని చెప్పుటకు విచారించుచున్నాను. (అంత విచారించుచు నీ యాబ్దికశ్రాద్ధ మాచరింపనేల యని కొఁబోలు సభలోఁ గుసగుసలు.) నాయనలారా! ఏమనుచున్నారో తిన్నగ వినఁబడుటలేదు గాన–కాలక్షేపము జరుగఁదగినదే. గాయకుఁడు రాలేదు. వచ్చినను నాశయుఁగూడ లేదు. (చచ్చినాఁడా యేమి యని యొక నోటియొట్టపువాఁడు కేకలు.) నాయనలారా! చావలేదు. కాని మరణించుటయే యంతకంటె మంచి దని యనుకొనుచున్నాఁడని తెలియవచ్చినది. ఆతఁడు భవబంధతారకోపాయముగ భద్రపఱచి తనయింటిలోఁ బెట్టుకొని యాదరించుచున్న పట్టుసాలి దొక పల్లెవానిని దీసికొని పోయిన దని కింవదంతి ప్రబలియున్నది. (కవియైన వాణీదానుఁడే దానిని లేవఁదీసికొనివచ్చి

యుండునెడల నా గాయకుఁడు మీయొద్దనే పడియుండు నని కాఁబోలు సభలో గుసగు సలు.) నాయనలారా! మీ రహస్యాధిక్షేపణవాక్యములు నాకుఁ బూర్తిగ వినఁబడకున్నను మీ కన్నుగీటులకు మీ తలపంకింపులకు మీ గుజగుజలకు నర్థము తెలియనివాఁడను గాను. ఈ సంఘమునకు వార్షికోత్సవము చేయవల దని సాక్షి యనేక పర్యాయములు చెప్పియే గ్రామాంతరమునకుఁ బోయినాఁడు. అతఁ డూరలేఁడుకదా యీయుత్సవ మెటులైనఁ జేసికొనవలయు నని మే ముత్సాహపడి తుద కిట్లాచరించితిమి. ఆతని యిష్టమునకు వ్యతిరేకముగఁ జేయుట చేతనే దీని కిన్నిపాటులు వచ్చినవి. మీ యధిక్షేపణములకు మే మింత లోనుగావలసివచ్చినది. అయినను బోనిండు చేసినది తప్పుకాదుకదా. (కార్యక్రమమునఁ దరువాతిప ద్దెది యని సభలోఁ గేక) నాల్గవది సంఘవ్యవహారనివేదనము. నాల్గు మాటలలోఁ గడతేర్తును. వెనుక 1912 సంవత్సరమున నీసంఘము స్థాపింపఁబడెను. అప్పు డిది యాఁతేడుమానములు పనిచేసి యంతరించినది. తిరుగఁ గ్రిందటి సెప్టెంబరు మొదటితేదిని దీనిని స్థాపించితిమి. ఇప్పటికి 12 మానములనుండి పనిచేయుచున్నది. మాపనిలోని మంచిచెడ్డ లాంధ్రలోకమునకే యెరుక. నేను జెప్ప నక్కఱలేదు. ఇదివఱకు దాదాపుగా నేఁబది యుపన్యాసము లిచ్చియుంటిమి. అది యచ్చొత్తించినయెడల వెనుకటి సాక్షినంపుట మంతటి రెండు పెద్దగ్రంథము లగును. జరుగఁ దలఁచిన యీసంవత్సరము కూడ నిరుపద్రవప్రయత్నముతో నిశ్చల దీక్షతో మా పనిని మేము మా యిష్టమూర్తి యగు శ్రీ సూర్యభగవానుని కృపచే నిర్వహింపఁగల మని ధైర్యముతో నున్నాము. దైవకటాక్ష ముండినయెడల మాకోరిక ఫలింపఁగలదు. నాయనలారా! ఈయంశమునుగూర్చి యింతయే చాలును. అయిదవది సభానదుల యుపన్యాసములు పద్యములు. ఎవ్వరు వచ్చువారు లేరా? (లేరు లేరు అని సభలోఁ గేకలు) ఇదిగో వాణీదాసుఁ డీ కాగితమును నామీఁదఁ బాఱవైచినాఁడు. దీనిని జదువుదును. ''సాక్షి చిత్రపట మీసభలో నుండఁదగినది. అందుకొఱకుఁ గొంత ధనము చేర్చుట యావశ్యకము. ఆంధ్రలోకమందలి ప్రభువులఁ గొందఱ దర్శించి ధనము సేకరించి యాతని ప్రతిమను జిత్రింపఁజేసి యీభవనమున నుంపవలయును.'' నాయనలారా! వింటిరా వాణీదానుని యుపపాదనము? (నేను దానిని బలపఱచుచున్నా నని కాలాచార్యుల కేక) నరే నంతోషమే కాని యీపని జరుగదగినదికాదు. జరుగుటకు సాధ్యమైనదియుఁ గాదు. సాక్షిస్వరూపము నే నిదివఱకును బాగుగా నెఱుఁగను. ఆతని కొక్కస్వరూప మున్నట్లు కూడఁ జెప్పఁజాలను. నవనాగరకతాసంప న్నుల కాతఁడు కత్తిరింపుతలతో నోటిసిగరెట్టుతోఁ గానఁబడును. సంఘసంస్కర్తల కతఁడు సన్యస్త యజ్ఞసూత్రుఁడై కనఁబడును. సన్యాసులకు దండకమండలసహితుఁ డై యగపడును. ఛాందసులకు వైదిక నిష్ఠాగరిష్ఠుఁడై యున్నట్లు కానఁబడును. విష్ణుభక్తులకు శంఖచక్రచిహ్న తభుజుఁడై తులసీమాలావక్షస్కుఁడై కానఁబడును. శివభక్తులకు భస్మ రేఖానముజ్జ్వలుఁడై రుద్రాక్షమాలాధారియై కానఁబడును. మహమ్మదీయులకు బోడితలతో పొడుగుగడ్డముతోఁ గనఁబడును. ఆతని యే స్వరూపమును జిత్రింపవలయునో యెవ్వరి కెఱుక! బాహ్యస్వరూ పములోన యింత వైవిధ్య మున్నది. అంతరస్వరూపముమాట చెప్పనే యక్కఱలేదు. ఇంతకు నాతని బాహ్యపటము మన కేల? ఆతఁడు మన మనస్సులలో నున్నాఁడు. ఇంక ముందుండును. ఆతనికి గోనెగుడ్డ కూరుపుకాని, గోడచేరుపుకాని యావశ్యకము కాదు. అందుచే నట్టిప్రయత్నమును బూర్తిగా వదులుకొనవలసినది (నరే–నరే యనుకేకలు) ఇక

నాఱవది యధ్యక్షుని యుపసంహారోపన్యాసము. ఉపక్రమణమునం దీ కృష్ణభగవానుఁ డెంత మాటలాడెనో యిప్పుడుకూడ నంతయే మాటలాడును. కావున నదియును వదలుకొనఁ దగినదే. ఇఁక నేఁడవది మంగళము–

కీర్తన.

మానరసింహునకు–మంగళమ్–జయామంగళమ్.
మానరసింహునకు–మంగళమ్–జయామంగళమ్.

(అని సభలో పాటలు)

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

14. కుంభకర్ణుఁడు

శ్రీమద్రామాయణము–కుంభకర్ణుఁడు.

కరణంగారింట్లో శ్రీమద్రామాయణ పురాణ కాలక్షేపానికి జంఘాల శాస్త్రి వెళ్లాడు. కుంభకర్ణుణ్ణి, రావణాజ్ఞతో రాక్షస వీరులు నిద్రలేపడానికి ప్రయత్నించే ఘట్టం. పళ్లశాస్త్రి అని ప్రసిద్ధిపొందిన, నూకిసానిగారి నాటకపు కంపెనీలో ముఖ్యనటుడు ఆ పౌరాణికుడు. జంఘాలశాస్త్రి అతని నాటకాల బాణీ గాన విధానం మీద వికారం వల్ల, పళ్లశాస్త్రి చరిత్ర కొంత తన ఉపన్యాసంలో వివరించి–ఇంక అసలు కథకి వచ్చాడు.

పురాణం వినడం పూర్తయి బయటికి వస్తూంటే ఒక యువకుడు తగిలాడు. అతను ఆంగ్ల భాషాధ్యయన పరుడు. వెలుపల, లోపల గూడ ఆధునిక సంస్కారంతో పెరుగుతున్నవాడు. అతను జంఘాలశాస్త్రితో కూడా నడుస్తూ–కుంభకర్ణుడి నిద్రా ఘట్టం వర్ణించడం బట్టి చూస్తే, వాల్మీకి వట్టి పూల్ లాగున్నాడన్నాడు. ప్రకృతి జ్ఞానశూన్యుడన్నాడు.

జంఘాలశాస్త్రికి ఒళ్లు మండిపోయింది. నీ వంటి అజ్ఞానే యీ ప్రకృతిలో ఉండగా లేనిది, కుంభకర్ణుడు ఉండడంలో ఆశ్చర్యం ఏముంది? –అని ప్రారంభించి–గాఢనిద్రా వివశులస్థితి ఎలా వుంటుందో 'ఎలిజబెత్ ఆల్టన్' అనే ఒక అమ్మాయి ఉదంతాన్ని–బ్రీడీ దొరగారు వ్రాసిన దానిని –1738వ సంవత్సరపు ప్రాంతంలో జరిగిన దానిని–ఉదాహరణ పూర్వకంగా చెప్పాడు.

ఆ తరువాత ఇంటికి జేరి, అనవసరంగా ఇతనితో తగవులాడ వలసివచ్చిందే! అనుకుంటూ పడుకున్నాడు. నిద్రమత్తు ఆవరిస్తూండగా, చెవి దగ్గర ఒక దోమ జేరి మనిషి గొంతుతో మాట్లాడింది. దాని సారాంశం –మిల్టన్ ప్యారడైజ్ లాస్ట్‌లోని సైతాను వర్ణనకీ, స్వభావానికీ–వాల్మీకి రామాయణంలోని కుంభకర్ణుని వర్ణనకీ, స్వభావానికీ వున్న తారతమ్య పరిశీలనం.

సైతాను దర్శనం, కుంభకర్ణ దర్శనం కూడా ఆ కలవంటి స్థితిలో శాస్త్రికి అయ్యాయి. అతనికి సైతాను కంటె కుంభకర్ణుడే ప్రకృతి సహజమైన పాత్రగా భాసించాడు.

నాయనలారా! నిన్నరాత్రి కరణముగారియింటికిఁ బురాణము వినుటకుఁ బోయితిని. సబుకోర్టులోఁ దాను దాయాదులపైఁ దెచ్చిన వ్యాజ్యెము తనపక్షము కావలయునను

కోరికతోఁ గరణముగారు కొన్ని మాసములనుండి రామాయణపురాణ కాలక్షేపమును దనయింట దీక్షతో జరిగించుచున్నాఁడు. వ్యాజ్యెము తనపక్షము కావలసినయెడలఁ దగిన వకీలును జూచుకొనవలయునుగాని వాల్మీకి నాశ్రయించుట యెందులకు? వ్యాజ్యెము గెలిపించునది పూర్వపత్రసమితియా పురాణగోష్ఠియా కోర్టువ్యవహారములలో సివిల్ ప్రొసీజరు కోడ్డుకున్నసత్తువ శ్రీమద్రామాయణమున కెక్కడిది? తీర్పిచ్చువాఁడు జడ్జియా జానకీపతియా? కడుపులోని పాములను 'సాంటొనైను' హరింపఁగలదు. కాని సర్పయాగ మొనర్చిన జనమేజయుఁ డందుల కక్కఱకువచ్చునా? వెల్లికొఱకుఁ జేయఁదగినది నస్యమా విష్ణ్వౌషధమా? సంపదలలోని మఱపులు నాపదలలోని యఱపులుగల ప్రకృతులు ప్రపంచమున రూపాయకుఁ బదునేనణాల పదకొండుపైసలవఱి కున్నవి. ఈప్రకృతులఁగూర్చి మఱియొకసారి విపులముగాఁ జెప్పెదను. ఇప్పు డుపపాదింప నెంచిన యంశము వేఱొకటి కావున దానిని గూర్చియే చెప్పెదను.

కరణముగారి యింటిలోని పౌరాణికుఁడు కొంత వ్యుత్పన్నుఁడే కాని కేవలము శుంఠకాఁడు కాని పండ్లశాస్త్రి పద్యపఠనధోరణి మాత్రము పరమాసహ్యముగా నుండెను. ఈతఁడు చాలకాలముగా నాటకములలో వేషములు వేసినాఁడు. నూకిసానిగారి నాటకపుకంపెనీలోని యన్ని నాటకములోఁగూడఁ బ్రధానపాత్ర మీతఁడే–నరకాసురుఁడైనారాయణోరు సంభవ యగు నూర్వసి నుల్లూట లూరించి యూటాడించి యువ్వెత్తుగ నెగమీఁటిన విటచక్రవర్తి యీతఁడే–రత్నాంగికి బుత్రుఁడై శయ్యాగృహమందు నిలువుటద్దములనడుమఁ బ్రవాళడోలి కలనడుమఁ బుట్టదోమతెరలనడుమ ఫలాహారపుఁ బళ్ళెరములనడుమఁ, బ్రసవతో రణములనడుమ, భర్మపాంచాలికాహస్తగతాంచచ్చంచలచామరస్తోమములనడుమఁ, బద్మరాగ దీపికాగణములనడుమఁ బన్నీరుతుషార పరంపరలనడుమను జిత్రాంగితో, మైసూరి పంజాబీ పదవిన్యాసపుగమనికలతో, పట్టువిడుపుల జొకాయింపుల పరిపాకములతో, గొల్లెపోట్లులు కోరచూపు తలవంపు ధమ్కాయింపులసొంపులతో, నవ్యాపనవ్య నమావేశ సంత్యజన సంచలన లాఘవసంపత్తితో, నటుకులదంపు లొంటి కాలిభరతములు–కారువా తీఱికలు –కుప్పనూర్పులు–గుడుగుడు గుంచములు–చెగుడులు–చరణములందు నవాలు జవాబుల సంపుటి గల పాటలతో; ఖరహరప్రియ రాగమును గంచెరగాడిదె వాలక మొనర్చి ఖండజాతి త్రిపుటను గానరకూనరచేసి–సభవారియెదుట నరనముగాఁ బ్రదర్శించి ప్రఖ్యాతినొందిన యాతఁ డీ పండ్లశాస్త్రులే. నటక ప్రపంచమున నింతవాఁడు లేఁడు. వహావ్వా! అందులో నూకిసానిగారే నాటకమున నాతని నాయిక యైనప్పుడు కన్నులనైకుంఠ మనక తప్పదు. ఆబిగింపు లామెత్తఁబడుటలు, ఆముద్దు లామురిపెముల, ఆచెవిగునగున లాచేచాటుర్రొనరొనలు, ఆదొంగగిలిగింత, లాదొంగన్నర యిగిలింతలు–ఆహాహా! శృంగారరస మట్టె యంకురించినట్లు–అట్టె విజృంభించినట్లు–అట్టె తీఁగ ప్రాకినట్లు–అట్టె పుష్పించినట్లు–అట్టె దానిప రిమళ మాకాశమంతయు వ్యాపించినట్లు–ద్రష్టలకన్నులు స్తంభించునట్లు గుండెలు చెదరునట్లు–మనసు నీ రగునట్లు–ఆహాహా! వారి యభినయచాతుర్యము, ననుభవసౌష్ఠవము, నఖిలరసోజ్జీవనచాకచక్యము, నమానుషిక చర్యయంతయుఁ జూచితీఱవలసినదే (ఆతనికిఁ బండ్లశాస్త్రులని పేరుగలుగుటకు హేతు వేమి యని సభలోఁ గేకలు) నాయనలారా! దానికొక్కచిన్ని యితిహాస మున్నది. ఒకసారి నలచరిత్రనాటకములో నతఁడు నిషధరాజేంద్రుని పాత్రమును ధరించెను. చెప్పవలసిన దేమున్నది. నూకిసాని దమయంతి వేషము నైచినది.

వేయకతప్పునా? అట్టి సన్నివేశము వారికి సహజమై పోయినది. శనివారప్రాతఃకాలమునకు –దుర్ముహూర్తమునకు–బట్టెకట్టుకొయ్యకు–బాడికి, నుప్పుచేపకు నా సాపుటరోమదహన సమర్థ మగు దుర్వాసనకు–యాచనకు దైన్యమునకు నెట్లనినాభావసంబంధమో –పండ్లశాస్త్రులకు నూకిసాని కట్టి యభేదాధ్యవసాయ మని యంద ఱెఱుఁగుదురు. గాడిదెకు జోరీగ యెట్టిదో–గుక్కకుఁగొణు జెట్టిదో–ములగచెట్టునకు గొంగళిపురుగెట్టిదోఁ బండ్లశాస్త్రికి నూకిసాని యంతకంటె సహస్రగుణము లెక్కువ. రెడ్డి తల్లిగారి సాంవత్సరికోత్సవములకుఁ బ్రదర్శింపఁబడిన నలనాటకములో మనశాస్త్రి నలచక్రవర్తియై, ముఖార్యసావేరీసాంకర్యనర్వజనానహ్య స్వరశ్రాద్ధనన్నిపాతముతో–నీసపద్యములో జెప్పినట్టి పెద్దపాదముల ముద్దులు నాలుగు–నెత్తుగీతల చిన్నముద్దులు నాలుగు–వెరసి యెనిమిది ముద్దులను, బాధసాన్నిధ్యమున శయనించిన దమయంతీ వేషధారిణియగు నూకిసాని దొడ్డపై జంకకుండ, బింకము తగ్గకుండ స్వభావమును మీఱకుండ, వెర్రిచప్పుడు కానీకుండఁ బెట్టుకొనఁబోవునప్పు డొక చిన్న తిరకాను దైవవశమున సంభవించెను. మూఁడు ముద్దులవఱకు నంతయు బాగుగానే జరిగినది. ఎదురెత్తుగాని–వెనుకపాటుగాని –యదలింపుగాని–విదళింపుగాని యేమియులేకుండఁ జల్లగ సౌమ్యముగ సాపుగ వెడలిపోయినది. ఆనాల్గవముద్దున్నదే–అక్కడనే కొంతమెలి–కొంత తిరుగుడు సంభవించెను. ఆముద్దు పెద్దపాదములలోని కడపటిముద్దగుటచే మిక్కిలి బింకముగా నాముద్దు పెట్టుకొనఁదలఁచి, యానలమహారాజుగా రామె బుగ్గలు గట్టిగానొక్కి ముద్దుఁగొననెంచుచు, నింకనేమో పాడుచుండగా ఆమెకట్టుడు పండ్లవరున చటుక్కునఁ బట్టుతప్పిపోవుటచే, లటుక్కున నూడి యాతని నోటిలోఁ బడెను. బుగ్గలు నొక్కునప్పు డట్టి ప్రమాదముకలుగునేమో యనుభీతిచే తనేకాఁబోలు నా నూకిసాని, వలదు వలదనునట్లుగా, నుహూహు ఉహూహ్వాని, మగనిని మహానిద్రావస్థలో నుండియు మందలించుచునే యున్నది. మగఁ డొడలు తెలియఁదగిన స్థితిలో నున్నాఁడా? ఫిరంగిప్రేల్చిననైన వినఁదగిన స్థితిలో నున్నాఁడా? 'చీ' లెక్కయేమి! ఒడలు చీల్చిననైనన్మృతి రాఁదగినస్థితిలో నున్నాఁడా? విస్మృతుఁడై తన్మయుఁడై కరుణర సపు 'కోమా'లో నున్నాఁడు. భీమరాజనందననోటిలో నున్న పెట్టుడుపండ్లవరున తననోటఁ బడెనని యాతఁ డెఱుఁగునా? ఈవిక్రతిఁ గాంచి యాతని నప్పటినుండియుఁ బండ్లశాస్త్రి యని పిలుతురు. ఆపండ్లశాస్త్రియే కగ్గఁడుగారింటిలోని పౌరాణికుఁడు. ఇతఁడు నాటకరాగధోరణితో రామాయణమును జదివెను. అది ప్రత్యక్షశయ్యకాదు –బాహాటశయ్యకాదు–పాంచాలశయ్య కాదు. ఇదియొక శయ్య–పనికిమాలిన శయ్య–బండ శయ్య–పాడుశయ్య–మంద్ర మధ్యమతారకసోపానములను గ్రమముగ నెక్కుటయా? దిగుటయా? నడుమను 'జాగా' చేసికొని పలిటీలు కొట్టికొట్టి తిరిగి తిరిగి దానియొద్దకుఁ జేరుటా? ఏమైన నున్నదా? మొదలు సిసలుపడి స్థిరపడిన నుతియైన నొక్కటి యేడ్చినదా? కైమని గ్రుడ్లుడిపడు పైస్థాయిలో నొక్కటే చావుగోల–నక్కలు చలిచేఁ గూసినట్లు –పిశాచములచేఁ గుక్కలు మోరలెత్తి యేడ్చినట్లు–రాట్నపుఁగీచులాగున–దూడ చచ్చిన గేదెయఱపులాగున నొక్కటే యేకస్వరపు గట్టుపడి యేడుపుతక్క మఱేదియు లేదు. అదిక్రమాలిన ధోరణితోడనే యాతఁడిట్లు రామాయణమునుండి చదివెను: అది కుంభకర్ణ నిద్రోద్బోధనఘట్టము.

శ్లో. భేరీశంఖ మృదంగాశ్చ సర్వప్రాణైరుదాదయన్

నిజఘ్ను శ్చాన్యగాత్రాణి మహాకాష్ఠకటంకరైః
ముద్గరైర్ముసలై శ్చైవ, సర్వప్రాణ సముద్యతైః
తేన శబ్దేన మహతా లంకా సమభిపూరితా..

సపర్వతవనాన్సర్వా స్సోపి నైవ ప్రబుధ్యతే
తత స్సహస్రం భేరీణాం యుగపత్సమహన్యత.

* * * * *

కేశానన్యేప్రలులుపుః కర్ణావన్యే దశన్తిచ
ఉదకుంభశతాన్యన్యే సమసించంత కర్ణయోః.
న కుంభకర్ణ పస్పందే మహానిద్రావశం గతః
అన్యేచ బలినస్తస్య కూటముద్గరపాణయః.
మూర్ధ్నివక్షసి గాత్రేషు పాతయన్ కూటముద్గరాన్
రజ్జుబంధన బద్ధ్నాభిశ్శతఘ్నీభిశ్చ సర్వతః
వధ్యమానో మహాకాయో నప్రాబుధ్యత రాక్షసః
వారణానాం సహస్రం చ శరీరేస్య ప్రధావితమ్.

* * * * *

రామాయణకవిత్వ మంత సుందరమైనకవిత్వ మిక సృష్టిలోఁ గలుగవలయునేమో? రాసభకంఠమునఁ జదివినను రామాయణ కవితారక్తి చెడదు. క్షీరము లుప్పులో విరుగును. తేనె నీటిలో విరుగును. శరీరబలము నూనెలో విరుగును. మనసు తిట్టుతో విరుగను. వట్టివెటతి యపన్వరపుఁ బనికిమాలిన దిక్కుమాలిన కప్పకూఁత కంపపుఁ గంతమున నైన నరే వాల్మీకి కవితాసౌందర్యము విరుగదు తిరుగదు చెరుగదు.

నిద్రపోనున్నవాఁడు కుక్క మొఱుఁగును విని యెంత యనహ్యపడి విసుగు చెందునో యా పురాణసభలోఁ గూరుచుండినయొక్కఁ డీ శ్లోకములను విని యంత వెగటుపడి ధూధూయని యుమిసెను. ఆతఁ డాంగ్లేయ విద్యాపరిచితిని కలవాఁడు –నవనాగరకతాసంపత్తి సైన లోపలఁ గూడఁ గలవాఁడు. పురాణము పూర్తియైనపిమ్మట నాతఁడు నావెంటనే మాయింటి దారిని వచ్చుచు దారిలో నిట్లనియెను:–''వాల్మీకి వట్టి పూలు వలె నున్నాఁడు: కుంభకర్ణుని నిద్రనుండి లేపు భాగమున నెంత యస్వాభావికముగ వ్రాసినాఁడో చీ! చీ! నాకుఁ బరమానహ్యమగ నున్నది. ఫిరంగిగుండ్లతోఁ గొట్టినను నిద్ర లేవనివాఁ డెవఁడైన నుండునా? అందుకు 'నయన్సు' ఒప్పుకొనదు. 'నేచరు' ఒప్పుకొనదు. వేయి యేనుఁగులచేఁ ద్రొక్కించిరఁట–నాన్సెన్సు–మీనింగ్లెన్సు–ప్రిపాస్టరన్–రబ్బిష్.'' ఆతఁ డీమాటలాడఁగ నేను గొంత యదరిపడి ''నాయనా! నీవెప్పుడైన నిదివఱకు రామాయణ మును వింటివా'' యని యడిగితిని. ''లేదు ఈదినమే మొదటిసారి. ఇదియే కడపటిసారి యనికూడ నానమ్మక'' మని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ''నాయనా! నీకు ముప్పది యేండ్లు దాఁటియుండును గాఁబోలు. ఆర్యావర్తనమునఁ బుట్టి శ్రీరామచంద్ర పాదస్పర్శముచేఁ బవిత్రమైన యీ నేలను ద్రొక్కుచు, శ్రీరామ సేనయగు క్రోఁతులను గొండముచ్చులను జూచుచు, సీతారామాభ్యాన్నమ యను భిక్షుక బ్రాహ్మణు నఱపు వినుచు, వీధివీధి

కొక్క రామభజన మందిరమును గాంచును, నింతకాలము రామాయణము వినకుండనున్న నీవే యీ ప్రకృతిలో నుండఁగాఁ గుంభకర్ణుఁ డేల యుండరాదు? కుంభకర్ణునినిద్ర నీనిద్రకంటె నెక్కువదా?'' యని నేను యాథాలాభముగాఁ బ్రత్యుత్తర మిచ్చితిని. అందుపై నాతఁ డుగ్రుఁడై ''ప్రకృతిలోఁ గుంభకర్ణునివంటివాఁడు లేఁడు. వాల్మీకి వ్రాసినబొమ్మ తప్పు. కుంభకర్ణుని వంటివాఁ డీ సృష్టిలో సుందునెడల నేను బండ్లూడఁ గొట్టించుకొందును. వాల్మీకి వట్టి బుద్ధిహీనుఁడు. 'నేచరు'ను బాగుగా 'స్టడీ' చేసినవాఁడు కాఁడు. అంతవఱకు నే నాంధ్రలోకమును 'కన్వీన్స్' చేయఁగల'' నని యేమేమో నోటికి వచ్చినట్లుల్ల నాతఁడు వదరినాఁడు. ''ఓ పరాత్పరుఁడా! ఓ కరుణానిధీ! తాము మహాదరిద్రులై యష్టకష్టములఁబడి, యొక్క పూటయైన నింత నివ్వరిగంజి త్రాగియో త్రాగకయో, దైవధ్యాన మొనర్చుకొనుచు శాంతమూర్తులై, ప్రపంచపుఁ ద్రొక్కులాటలలోఁ బడక, లోకోద్ధరణార్థమై, తమ మెదటిరక్తముతో గ్రంథములను, దేజోమయాక్షరసహితము లగునట్లు వ్రాసి, వానిని లోకమున విడిచి, యెన్నివేల సంవత్సరముల క్రిందనో పరమపదించిన పవిత్రజీవను లగు మహాకవులకుఁ గూడ నీ కాలపు నిరక్షరకుక్షి నిర్భాగ్యపుఁ జేత వాఁతగాని చచ్చుపెద్దమ్మ నోటియొట్టపు ముండకొడకులచేతఁ దిట్టులా? ఇంత మహాపాపమును జూచి యేట్లు సహించుచుంటివోయి తండ్రీ.'' యని యొక్క రెప్పపాటుకాలము మనస్సులో ననుకొని యావిదేశీయవిద్యా పాండితీ విశేషునితో, స్వదేశీయ మహాగ్రంథ నిందాపాపభూయిష్ఠనితో నిటు లంటిని. ''ప్రకృతి ప్రకృతి యని పండిత సాధ్యము లగు పలుకులు పలుకుచున్నావు. ప్రకృతి యన నేమో మొదలు తుద నీకుఁ దెలియునా? వెండ్రుక మొదలేదో తుదయేదో యెఱుఁగవే. ప్రకృతిలో నెంత పెద్ద జంతు వుండవలయునో యెంతజంతు వుండఁగూడదో నీ వెఱుఁగుదువా? నీ యింద్రియములకు గోచరించినదిమాత్రమే ప్రకృతి యని నీ వనుకొనుచుంటివా? నీ కింక సహస్రేంద్రియములు భగవంతుఁ డిచ్చియుండునెడల నిప్పుడు నీవు గ్రహించిన ప్రకృతికంటె సహస్రగుణాధికమైన ప్రకృతిని నీవు గ్రహించుటకేమైన సందేహమా? ప్రకృతికి నీ కన్నే గజములబద్ధ యనుకొంటివా! మూఢా! నీ మనస్సా-విదేశీయ విద్యాపరిచితిచే విపరీతమై, వంకటింకరయై, యెండి మెలికలుపడి చచ్చిన నీ మనస్సా-ప్రకృతికిఁ గొలపాత్ర మనుకొనుచుంటివా? నామమాత్రావశిష్టముగ నామశూన్యముగఁగూడ నెన్ని జీవము లీదివఱకు గతించినవో నీ వెఱుఁగుదువా? అవి యెట్టిప్రకృతులు గలవో నీకుఁ దెలియునా?

ఇంగ్లాండు దేశమున కుత్తరమున కార్ బ్రిడ్జి అను గ్రామమున్నది. ఆగ్రామమున పదునాఱువందల సంవత్సరములకు సమీపమున నొక్క యస్థిపంజరము దొరకినది. అది మనుష్యుని దని యప్పటి బుద్ధిశాలులు స్థిరపఱచినారు. దానిలోని తొడయెముకయే యాఱడుగుల పొడుగుండెను. ఆపరిమాణమునకు దగినపుఱ్ఱెపుండ్లు కాలుసేతులు మొదలగునవి యా యస్థిపంజరాధికారి యిరువదియొక్క యడుగుల పొడుగువాఁడై యుండునని యప్పటి శారీరశాస్త్రజ్ఞులు గణించుకొనిరి అయ్యా! దీనికేమి చెప్పెదవు? ఇది పొడుపుకథ కాదు పుస్తకపువ్రాత. ఇట్టి మనుజుఁ డుండఁగా గుంభకర్ణుఁ డేల లేకుండును? ఎటువచ్చినను గుంభకర్ణునివంటి యసాధారణగాఢనిద్రాసక్తుఁ డెట్టివాఁడైనను బ్రపంచమున నుండఁడనియా? ఏదైన నిందునుగూర్చి పాశ్చాత్యులవ్రాత కనుఁబఱచినయెడల నీకు విశ్వాసమేకదా? వాల్మీకి పూల్, వాల్ కైర్ పండితుఁడైన నీకు-భారతము చెత్త, ఫేరీక్వీన్ చేవయైన

నీకు-విశ్వాసము కలుగుట కంతకంటెఁ జేయవలసిన దేమి? మనవ్రాఁతలు మసిబొగ్గులా? పైవ్రాఁతలు మాణిక్యములా? నీవు పరమనిర్భాగ్యుఁడ వైనప్పుడే-శుంఠలలో నగ్రగణ్యుఁడ వైనప్పుడే-దేశాభిమానశూన్యులలో బ్రథమపీఠాధిపతి వైనప్పుడే నర్పదష్టుని జిహ్వాకువలె నీమనస్సునకు వ్యత్యస్తరుచికలిగినప్పుడే-నీ కిట్టియభిప్రాయము కలుగఁదగినది. నీదురద్భ ష్టముచేతను నిన్నుఁబట్టి దేశీయుల దురదృష్టముచేతను నీ కట్టి యభిప్రాయము కలిగినది. కుంభకర్ణుని నిద్రవంటి నిద్రగలవాఁ డెవ్వఁ డైన నెప్పుడైన నేదేశమందైనఁ బుట్టి బ్రదికి చచ్చెనని పాశ్చాత్యలేఖరులు చరిత్రమున వ్రాసినయెడల నీ వొప్పుకొందువా? అటులైన వినుము. ''ఎలిజబెత్ ఆల్టను'' అనుపేరుగల యొకస్త్రీ-''సెంటుగ్యూలేయిన్'' అనువాని సేవకురాలు. ఈమె ''మోన్సు'' అను పట్టణమునకు సమీపమున నున్న యొకపల్లెలోఁ బుట్టెను. ఆమె 1738 సంవత్సరమందు ముప్పదియేండ్లవయస్సు కలిగియుండెను. ఆమె పరిపూర్ణారోగ్యవంతురాలు. ఆమె యొక్కదినమున నిద్ర నారంభించి నాల్గుదినములవఱ కొక్కటే నిద్రపోయెను. ఎంద ఱేన్నివిధముల లేపినను లేవలేదు. తుదకు దనయంతతానే మేల్కాంచెను. తరువాతఁ గొన్ని కొన్ని సారులామె మూఁడేసి నాలుగేసిసారము లవిచ్ఛిన్న ముగా నిద్రించెను. ఒక దినమున సాయంకాల మైదుగంటలవేళ నామె నిద్రించుచుండఁగా నొక్క వైద్యుఁడు వచ్చి యామెనాడిని జూచెను. అది నరిగాఁ గొట్టుకొనుచునే యున్నది. కాని యామె కాలుసేతులు వంచుటకైన శక్యము కాకుండ బిళ్ళబిగిసిపోయినవి. అప్పు డామెతల నెత్తుటకుఁ బ్రయత్నించిరి.. బహుప్రయత్నముమీఁదఁ గొంచెము పైకిలేచి తిరుగ వెనుకకుఁ బడిపోయినది. అప్పు డావైద్యుఁ డామెచెవిలో నెంతగట్టిగ నఱవఁగలఁడో యంతగ ట్టిగ నఱచెను. ఆమె లేవలేదు. అప్పుడొక్క దబ్బలము చేతఁ బుచ్చుకొని లోనియెముక దుస్సిపోవున ట్లామెతొడలో గ్రుచ్చెను లేవ లేదు. అప్పుడు కెరోసిన్ వంటి చమురులో గుడ్డపేలిక తడిపి యామె ముక్కఱంధ్రములలోఁ బెట్టి దానికి నిప్పంటించిరి. ఉహు-లేవలేదు. అటుతరువాతఁ గొరడా చేతఁబుచ్చుకొని రక్తము కాలువలుగట్టునట్లామెను గొట్టిరి. ఉహు-లేవలేదు. వీపునకుఁ దేనెరాచి తేనెటీఁగల నామధుసిక్తప్రదేశమందు వదలిపెట్టిరి. ఉహు-గోళ్లక్రింద మేకులను గొట్టిరి. ఉహు-ఆమె లేవలేదు. ''లొర్రేను'' దేశమునకుఁ బ్రభువగు 'ప్రిన్సు ఛార్లెసు' అనువాని దర్బారువైద్యుఁ డగు బ్రీడీదొరగా రిట్లు వ్రాసిరి. ఈసారి నీకు వ్యాసప్రోక్తమైనదా? ఈసారి సాలగ్రామతీర్థమైనదా? ఈసారి శ్రీజగన్నాథప్రసా దమైనదా! వాల్మీకివ్రాఁత పృష్ఠమునఁ దుడిచినైచి బ్రీడీగారివ్రాఁత కన్నుల కద్దుకొందువా? ఈసారి నోరుకట్టుపడినదా? కుంభకర్ణుఁ డీమెకంటెఁ గొన్ని గుణములు హెచ్చుగాని వేరుకాదే, మూఁడువందలయేండ్లక్రిందనే యిట్టి ప్రకృతి ప్రపంచమున నున్నప్పుడు త్రేతా యుగములోఁ గుంభకర్ణునివంటి ప్రకృతి యుండ దని యే మొగముపెట్టుకొని చెప్పఁగలవు? వాల్మీకి వట్టి శుంఠ యసుట న్యాయమా? అతఁడు ప్రకృతిజ్ఞానశూన్యుఁ డనుట పాడియా? ప్రకృతి ఏమాత్రమైన నాయనకుఁ దెలియకపోయెనా? యథార్థ ప్రకృతి ప్రతిబింబమే కానియె డల రామాయణ మింతకాల మేల నిల్చియుండును? మహీకంపాగ్ని పర్వతాద్యవాంతర ప్రళయములచేఁ బ్రాలేయాచలము పాతాళములోనికిఁ గ్రుంకిపోవచ్చును. సింధుగంగా బ్రహ్మ పుత్రానదులు శుష్కములై నామమాత్రవశిష్టములై నశించి పోవచ్చును. సముద్రము పొంగి యొక్క రాత్రిలో వింధ్యపర్వతము వఱకు దేశమును ముంచివేయవచ్చును. కాలము జరజర పదివేల సంవత్సరములు వెనుకకు బోయి యార్యావర్తదేశమున నందఱునుగూడ నగ్నులుగ

నవనాగరకులుగ రొట్టకట్టులుగఁ బశుప్రాయులుగ మనుష్యాశనులుగ మార్పవచ్చును గాని ప్రకృతిలో నెట్టిమారుపైన, రామాయణ ప్రాచుర్యమును దగ్గింపలేదు. రామాయణ ఖ్యాతిని మాపలేదు. రామాయణమున నొక యక్షరమైనఁ జెఱుపలేదు. రవిమండలతేజమైన క్షయించునుగాని రామాయణ రామణీయకత తగ్గదు. రామాయణసారమును దిర్యగ్జంతువు లెఱుఁగును. గాలిలోని పరమాణువులు రామాయణ మాహాత్మ్య మెఱుఁగియే తాండవించుచున్నవి. రామాయణమును దూషించినవాఁడవు నీ వొక్కఁడవు కనఁబడినావు. ఇప్పటి దేశీయప్రభువులు స్వతంత్రాధికార్యశూన్య లగుటచే నిన్నేమియుఁ జేయఁజాలక యూరకుండిరి. కాని నీవు మన పూర్వరాజులకాలమందే యుండిన యెడల నిన్ను వారు చిత్రవధ మొనర్పకుందురా!''

ఈమాటలు మాటలాడుచుండఁగా నేను మా యిల్లు చేరితిని. ఆతఁడు తనయింటికిఁ గాఁబోలు పోయినాఁడు. నిష్కారణ మీతనితోఁ దగవులాడవలసి వచ్చినదికదా యని విచారించుచుఁ బండుకొంటిని. రెప్పలు దళమెక్కినవి. కన్నులు బరువెక్కినవి. తల తేలిక యైనట్లున్నది. మనస్సునకు హేతుబంధము సడలుటచే నది కప్పదాఁటులు వైచుచున్నట్లున్నది. గాలిలో లఘువుగా నీఁదులాడుచున్న ట్లున్నది. స్మృతి పూర్తిగాఁ దప్పిన దని చెప్పఁజాలము. అప్పు డొక్కఁడోమ చెవియొద్దకువచ్చి గుంయి మని సంగీత మారంభించినది. చేతితో దానిని దోలివైచుటకుఁ దగినంతయోపిక లేదు. చేయియెత్తుటకు శక్తి లేనట్లున్నది. తల మాత్రము కొంచె మల్లలాడించితినేమో తెలియదు. దోమమాత్రము కర్ణరంధ్రమునొద్ద గానసేవ మానలేదు. గాఢనిద్ర కీగానసేవ ప్రతిబంధకముగానున్న ట్లున్నది. ఆలాగుననే కొంతసేపుంటిని గాఁబోలు అంతట మనుష్య వాక్యముల నాదోమ యిట్లనియె.

''జంఘాలుఁడా! రామాయణమునందు నీకుఁ గలభక్తికి సంతసించితిని. రామాయణ మువంటి గ్రంథమే లేదు. ప్రపంచమున నెన్ని గ్రంథములో యున్నవికాని యితరగ్రంథములలోఁ గొంత మంచి గొంత చెడ్డ-కొంత ఘనత కొంత నీచత-కొంత యెప్పు కొంత తప్పు-కొంత సురూపత కొంత కురూపత-కొంత సొంతము కొంత చౌర్యము-కొంతరుచి కొంత యరుచియున్నవి. ఆణిముత్యములన్నియు నొక్కచోఁ గూర్చినరీతి, సమృతమంతయు నొకచోఁ జేర్చినట్లు, తేజస్సంతయు నొకచోఁ జేరిచినట్లు రామాయణ మతివిలక్షణప్రభావములచేఁ బ్రపంచ సారస్వతప్రపంచమునఁ బ్రకాశించుచున్నది. రామాయణపాత్రము లన్నియు నాదర్శములే-అత్యంతాదర్శములే. రామునివంటి లోకపాలుఁడు లేఁడు-భరతసౌమిత్రులవంటి సోదరులు లేరు. సీతాదేవివంటి మహాపతివ్రత లేదు. సుగ్రీవునివంటి సఖుఁడు లేఁడు. ఆంజనేయునివంటి రాజకార్యధురంధరుఁడు లేఁడు-విభీషణునివంటి ప్రపన్నుఁడు లేఁడు-రావణునివంటి దుర్మార్గుఁడు లేఁడు -కుంభకర్ణునివంటి కేవల శరీరశక్త్యవతారము లేదు. ఈకుంభకర్ణునిగూర్చియు పురాణకాలక్షేపమున నీ కొకనితో వాదులాట కలిగెను గావున వీనినిగూర్చియే మఱికొన్ని మాటలు చెప్పెదను. అసాధారణమై యమితమై యసంతమై యవర్ణ్యమై యవాఙ్మనసగోచరమైన యంగద్రాఘిష్ఠతకు నంగదార్ఢ్యమునకు నంగస్థౌల్యమునకు నంగనిర్మాంభణతకు నద్వితీయ మగు నుదాహరణముగా వాల్మీకి కుంభకర్ణుని జిత్రించెను. ఇట్టి చిత్రలేఖనమే యూంగ్లేయసారస్వతమునకు నొక్కటి యున్నది. ఆ చిత్రపటము (సైతాను); దానిని మిల్టను అను కవి

'పారడైజ్ లాస్టు'లోఁ జిత్రించెను. ప్రపంచమునఁ బ్రఖ్యాతినొందిన సారస్వతములలో నీరెండు విగ్రహములే 'సబ్‌లైమ్' అను చిత్తావస్థను బరిమితిశూన్యముగాఁ బాఠకహృదయ ములందుఁ గలిగించుటలోఁ బ్రబల తమ శక్తిసంపన్నములు. ఈ రెంటి తారతమ్యము సంక్షేపముగాఁ బరిశీలింతము.

సైతాను పెద్దగోపురమువలె నిలువఁబడినాఁడని కవి వ్రాసినాఁడు. అదిగాక మరియొక చోట 'టెనెరిఫ్' వలె నుండు సని యాతనిని గవి వర్ణించెను. ఎంత దీర్ఘకాయుఁడో యెంత స్థూలకాయుఁడో యీమాట వలననే మనము యోజించుకొనవలయును. ఆగ్నేయసరస్సున నాతఁడు పడియుండునప్పు డెన్ని 'రూడు'ల స్థలమోద్రాఘిష్ఠతచే స్థూలత్వముచే నాక్రమిం చుకొనియుండె నని కవి వ్రాసెను. అతఁ డాకాశయానమునఁ బోవునప్పుడు సముద్రములోని పెద్దయోడవలె నున్నాఁ డని కవి వ్రాసెను. అదిగాక యతఁ డాకాశమున ధూమకేతువువలె నున్నాఁడని కూడ వ్రాసెను. ఎంతసేపు వర్ణించినను నాతని వర్ణనాక్రమమునుబట్టి మన మూహించుకొనఁదగినదేకాని మరియొకటి లేదు. అదిగాక యా సైతానుని మహాధిక కాయదైర్ఘ్యమును వర్ణించుటలోఁ గవి యొక్క చమత్కారమైన రచన చేసెను. మూడుకొ య్యల గొప్పసముద్రపుటొడలనడిమి తెరచాపకొయ్య యా సైతానునిచేతిలో విలాసార్థముగ వహించిన చిన్న బెత్తమైయుండు నని కవి వర్ణించెను. కొంచెము హెచ్చుతగ్గుగ నీవర్ణన లన్నియుఁ గుంభకర్ణునిగూర్చి వాల్మీకియుఁ జేసెను. అవికాక యంత మహోత్తుంగ కాయమునకుఁ దగినంత ప్రళయకాలానలసన్నిభమైన, క్షుత్తు, దానికిఁ దగిన యనేకశతసహ స్రశకటాహారాశనపటిష్ఠత, యందుకుఁ దగిన మదోన్మత్తత, దానికిఁ దగిన యసాధారణ నిద్ర, దానికిఁ దగిన బుద్ధిమాంద్యము, దానికిఁ దగిన వచోనైపుణ్యశూన్యతయు, దానికిఁ దగిన యమాయకతయు, మఱియేమో మఱియింక నేమేమో వాల్మీకికుంభకర్ణనిర్మాణమునఁ బైగఁ జేర్చినాఁడు. ఇక్కడికి మహాధికాత్మంతాద్భుత గాత్రవిపరీతత నాశ్రయించియుండవల సిన గుణలక్షణసముదాయమంతయు వాల్మీకి చెప్పియున్నాఁడు.

ఈరాక్షసుఁడు-పర్వతసన్నిభులైన కపిగోలాంగూల యోధుల ననేకకోటులను బచ్చి మిఱపుఁగాయ కొఱికినట్లు కటుక్కునఁ గొఱికి చంపినాఁడు. అందువలన నీతఁ డెంత మహాకాయుఁడో నీ వాలోచించు కొనఁదగినదే. ఈతఁడు నిద్రపోవుచు గుట్టుతీయు చుండఁగా ననేకవేల రాక్షసులు పణవభేరీఢంకామృదంగాదివాద్యములతో నాతని ముక్కుల లోనికిఁ గొట్టుకొనిపోయి రని చెప్పఁబడినది. అందువలన నాతఁ డెంత మహాకాయుఁడో నీవు యోజించుకొనఁదగినదే. శ్రీరామచంద్రమూర్తి యాతని బాహువు నరికినప్పు డది రణస్థలమునఁబడి యెన్నివేల జీవులనో పిండిచేసిన దని వాల్మీకి వ్రాసినాఁడు. ఆతఁడు కాలుసేతులు తెగుటచే మొండియై నన్నెకంటిమీఁద బొత్రమువలె రణరంగమున దొరలి నప్పు డెన్ని లక్షలసేనయో పచ్చడియైన దనియు, నాతని మొండెము నోరు తెఱచుకొని యెగిరివచ్చి శ్రీరామచంద్రమూర్తిని మ్రింగఁబోవునప్పు డది రాహువంత యుండె ననియు వాల్మీకి వ్రాసెను. ఇందువలన నాతని యసాధారణమైన, యనుపమానమైన, యత్యద్భుత మైన యవర్ణ్యమైన యంగమహామహిమను మనము యోజించుకొన వలసినదే. సైతానుఁడు దైవదూషకుఁడు–కుంభకర్ణుఁడు దైవభక్తుఁడు, సైతాను బహుమాయావి, కుంభకర్ణుఁడు వట్టియమాయకుఁడు. సామువోఁ బ్రవేశించి యాదాముభార్యను సమీపించి యామెను

మోసముచేసి, యామె మూలమున భర్తను భ్రష్టపఱచి సైతాను భగవంతునిపైఁ బగ సాధించెను. ఈపనులలో దేనికిని కుంభకర్ణుఁడు ప్రకృతిచేఁ బనికిరాఁడు. సాధారణముగా నసాధారణ దేహదార్ఢ్యమెచ్చట నున్నదో యచ్చట విశేషమైన యమాయకత యుండును. ఆ సంగతి వాల్మీకి కనిపట్టినాఁడు. అత్యద్భుతధైర్య మున్నచోట బుద్ధివైశద్యము నర్వసాధారణముగా నుండదు. ఈయంశమును వాల్మీకి గ్రహించినాడు. కాని సైతాను కుంభకర్ణునికంటె సహస్రగుణాధికశేముషీ సనాథుఁడు. ప్రత్యేకము శరీరబలాధికతయే శరీరమహామహిమమే చిత్రింపవలసివచ్చినప్పుడు ప్రతిభావైభవమును 'బాకుగ్రౌండు'లోఁ బాఱవేయవలయును గాని దానికిఁ బ్రాముఖ్య మీయఁదగదు. ఈసంగతి వాల్మీకి పరిగణించినాఁడు. ఇదికాక మహారణావేశమున మదోన్మత్తుఁడై కపులనక రాక్షసు లనక కనఁబడిన వారిని గనఁబడనివారిని గూడఁ గుంభకర్ణుఁడు మ్రింగినాఁ డని వాల్మీకి వ్రాసినాఁడు. ఇది శిరఃకంపనార్హమైన మాట. ఒడలిమత్తు–బుద్ధి నాచ్ఛాదించినప్పుడే యది నిజమైన మత్తు. శరీరము విజృంభించి విజృంభించి, వ్యాపించి, బుద్ధిని హరింపఁ జేయకుండినయెడల నది శరీరాధికత కాదు. కొబ్బెరకాయ యెదిగి యెదిగి లోపలి కొబ్బెరను నీటిలో హరించునట్లు చేయకుండినయెడల నది దయ్యపుఁగొబ్బెరకాయ యగునా? భగవంతునితోఁ బ్రబలాహవ మొనర్చినప్పటి భండనావేశముచేనైనను సైతానునకు మతి రవంతయైన దిగనాఁబలేదు. కుంభకర్ణుఁడు సైతానుగూడ సమానధైర్యముగల వారే–ఇద్దఱు కూడఁ బ్రబలతమ శరీరపాటవమునకుఁ బరిపూర్ణార్హము లగు నుదాహరణములే. కాని సైతానులో బుద్ధిమాయాబలమేళనమునఁ గొంత సాంకర్యము కలిగినది. కావున నిర్మలమైన నిర్దోషమైన సరిపూర్ణమైన ప్రత్యక్షబాహుబలప్రాబల్యమునకుఁ గుంభకర్ణుఁడే కనిష్ఠి కాదిష్ఠాత యని చెప్పవచ్చును. కావున ''సబ్లైముకుఁ'' బ్రపంచమున నున్న ప్రథమోదాహరణము కుంభకర్ణుఁడే.

అదిగో చూచితివా సైతాను! ఎంత దీర్ఘకాయుఁడో! నీకుఁ గుంభకర్ణునిఁగూడ నిప్పుడే కనఁబఱతును. అదిగో చూడు! కంటిలోఁ బ్రమాదమునఁ బడిన కోతులను, గొండముచ్చులను నలకలవలె గొనకరించి యెడమచేతి చిటికెనవ్రేలి గోటికొనను బైకిఁదీసి పృష్ఠమున రాయుచున్నాఁడు. ఆహా! ఆహా! ఎంతవాఁడో–నీ యెదుట నున్న యాకాశమును విశేషభాగ మీతఁడే యావరించియుండుటచేఁ బక్కనున్న సైతాను కొంత యఱకట పడుచున్నాఁడు. చూచితివా! సైతానుని దక్షిణహస్తమునం దొక బెత్తమున్నది. చూచితివా! అత్యద్భుతము! ఆ సైతాను చేతిలో నున్న బెత్తమును మైత్రీభావమునఁ గుంభకర్ణుఁడు తీసికొని పల్లు కుట్టుకొనుచున్నాఁడు. పండ్లనందున నిరికికొన్న మహాకపియోధులను వెలికిఁ దీసి విదల్చుచున్నాఁడు. ఎవరు హెచ్చువారో నీ కన్నే నీకుఁ బ్రమాణము–నేఁ జెప్ప నేల?

ఇట్లాతఁడు మాటలాడి శాంతించె ననుకొనుచుండఁగా గూబలో గ్రుచ్చినట్లు పోటును హోరు మని ధ్వనియును గలిగినట్లుంటచే నులికిపడి లేచితిని. దోమ గూబలో దూరిన దని యెంచి చెవిలో వ్రేలు పెట్టి యల్లల నాడించితిని. ఒక్క రెప్పపాటులో నాబాధ తగ్గినది. ఎంతసేపు నిద్రపోయితినో యని గడియారమువంకఁ జూచితి. కన్నుమూసి యొక్క పావుగంటయైనఁ గాలేదుకాని నాయనలారా! గంటసేపటికంటె నెక్కువగాఁ జెప్పితిని గాఁబోలు క్షమింపవలెను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

15. ప్రాణము

జంఘాలశాస్త్రి చాలా క్లిష్టతరమైన విషయాన్ని ఈ ఉపన్యాసంలో ఎత్తుకున్నాడు. ప్రాణం అంటే ఏమిటని ప్రశ్న:–

ఒకాయనికి పిల్లలు కలగకుండానే భార్య చనిపోయింది. ఒక లేడి పిల్లను సొంత బిడ్డలాగ సాకి పెంచాడు. సంరక్షణ చేశాడు. ముద్దు ముచ్చట్లు చేశాడు. అది కూడా హఠాత్తుగా ఒకనాడు చనిపోయింది. పెంపుడు తండ్రి గుండెలు బాదుకుని విలపించాడు.

ఈ సన్నివేశం ఆధారంగా జంఘాలశాస్త్రి రెండు విషయాలు తన ఉపన్యాసంలో వివరించాడు. ఒకటి: మనుషుల మమకారాల బలీయత, రెండోది: ప్రాణం అంటే ఏమిటనే విచికిత్స.

లేడిపిల్ల ఎందుకు చనిపోయిందంటే, 'రప్చరు ఆఫ్ ది అయోరా' (హృ)దయంలో ప్రధాన రక్తనాళం చిట్లడం) అని ఐ.ఎమ్.ఎస్ పట్టభద్రుడైన ఆంగ్లేయ వైద్యుడు నిర్ధారించాడు.

బలవత్తరమైన శక్తిగల ప్రాణం బయటకు పోవడానికి చించుకోవడం వల్ల రక్తనాళం చిట్లిందా? రక్తనాళం చిట్లడం వల్ల ప్రాణం పోయిందా?–అనే తార్కిక ప్రశ్న వేసి–అసలు 'ప్రాణం' అంటే ఏమిటనే సమాధానం కోసం వెదకడం ప్రారంభించాడు శాస్త్రి. పాశ్చాత్య ప్రకృతి శాస్త్రవేత్తల పరిశోధనలను ఉటంకిస్తూ, వాటిలో సత్యా సత్యాల్ని సమీక్షిస్తూ వివరాల్లోకి వెళ్లాడు. క్రీస్తు పుట్టడానికి రెండువేల సంవత్సరాల క్రితం నుంచి- పుట్టిన తరవాత దాదాపు రెండువేల సంవత్సరాల వరకూ మహా ధీమంతులైన ప్రకృతి శాస్త్రజ్ఞులు 'ప్రాణం' ఏమిటో కనిపెట్టడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. 'సైన్స్' తుదకు చావు బ్రతుకులను ఎరుగని శాస్త్రజ్ఞాన సన్నివేశమైందనీ, జగత్ సౌభాగ్యాన్ని చంపినవాడు ప్రకృతి శాస్త్రజ్ఞుడనీ, ప్రాపంచిక కవితను భగ్నపరిచినవాడు ప్రకృతి శాస్త్రజ్ఞుడనీ వాపోయాడు. ప్రాణ నిర్వచనం మన వేదాంతులెలా చేశారో మరోసారి చెప్తానని శాస్త్రి ముగించాడు.

నేను సభా భవనమునకుఁ బోవు సరికి జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను.

''కాదు–అసత్యము కాదు నాయనలారా! సత్యమే వచియించు చున్నాను. పిల్లలు లేకపోవుటచే నాతని మనస్థితి యటు లుండెను గాఁబోలు. భార్యయందు భర్త కెంత

యనురాగ మున్నను, భార్యయందు భర్తకు బంచప్రాణము లయ్యును, భార్యతోడిదే ప్రపంచముగాని యామె లేనిదే ప్రపంచమే లేదని యున్నను, సంతానము లేకున్న యెడల నేదియో వెలితిగ నేదియో మహాలోపముగ నేదో భరింపరాని మహాకష్టముగ నేదియో తరింపరాని మహాపదగ నేదో నిరుపయోగమైన బ్రదుకుగ నాతనికి సంసార మగపడకమానదు. వారికేమి సుఖముగ భార్యాభర్త లిరువురు చిలుకదంపతులవలె బారావత మిథునమువలె గులుకుచు గుబాళించుచు–సంతానపు సంతపిల్లల జంజాట మేమియు లేక, కాలికి సంకెల చేతికి సంకెల లేక, యథేష్టముగ బరమానందమున బ్రదుకుచున్నా రని పైవారు–పిల్లలకోళ్లు –సంతానగోపాలమూర్తులు ననుకొందురు–కాని వారిమట్టునకు వారికి గడుపు ఫలింపక పోవుటకంటె గష్టము వేరొకటి లే దని తోచక మానదు. అందులో నపుత్రకున కధోగతియే యను నమ్మకమున్న మనవారిలో నీయేడుపునకు దారకమందే సుతి యనుట కేమైన సందేహమా? మరియు నందులో మగవానికంటె మగువకే యాక్షోభము మరింత యని వేఱె చెప్పవలయునా? నవమానములు మోసి కనుట, ప్రక్కలోఁ బండుకొనఁ బెట్టుకొని పాలిచ్చుట, బిడ్డను బరిశీలించి తలవెండ్రుకలయుంగరాలు తనవి–ముక్కు మొన తండ్రిది–మీఁగాళ్లవంపు మేనమామ దని–హృదయము పట్టరానంత యానందమున నుబికి యుబికి యుప్పొంగిపోవుట, యీ బిడ్డను మాకు దేవుఁ డిచ్చినాఁడు. ఇది మాకు దైవప్రసాద మని దానిని కన్నులపై గడుపుపై మూర్ధముపైఁ బెట్టుకొని సకలోపచారములు చేసి సంరక్షించుట మొదలగు వేడుకలన్నియు ముచ్చటలన్నియు నాఁడుదానికే కావున, కని పెంచవలసిన కాంత కట్టి మహానందము పూర్ణానుస్వారమై నప్పు డామె మనస్సున కెంత కష్టమో యెవరు చెప్పఁగలరు? గొప్పగొప్ప కాంతలను బోయిచూచుట కామెకు సిగ్గుగదా. పేరంటమునకుఁ బోవుట బిడియముకదా! నీ కింకను బిల్లలు లేరా? యని యెవ్వరైన నడిగిపోవుదు రేమో యను భయముకదా? లేదని చెప్పుటకంటె నామెకు శిరశ్ఛేదనము వేరొకటి లేదుకదా?

అట్లు లేడ్చి యేడ్చి యాతని భార్య మృతినొందినది. అతని బ్రదుకిఁక నడుగవల యునా? చిన్న లేడిపిల్లను భార్య యాత్మశాంతికొఱకుఁ బెంచుకొనుచు నదియే పిల్లగ భావించుకొనుచు నాతఁడు జీవయాత్ర జేయుచుండెను. ఆపిల్ల నొడిలో బండుకొనఁబెట్టు కొని పాలుపోయుచు, నీళ్లు పోసి కడుగుచుఁ గన్నులకుఁ గాటుకఁబెట్టుచుఁ, నమ్మా నాన్నా యనుమాటలను జెప్పుచు, లేతగరికచిగుళ్లను నోటి కందించుచుఁ దనప్రక్క యొద్దరత్న కంబళముపైఁ బండుకొనఁ బెట్టుకొనుచు, నిద్రపుచ్చుటకై జోలలు పాడుచు నిట్లనేకోపచార ములు చేయుచు, దానిని సంరక్షించు కొనుచుండెను. పురుషుఁడేమి యిట్లు చేయుటయేమి యని యెంచి యనత్య మనత్యమని మీరు కేకలు వైచుట చేతనే యీగొడవయంతయుఁజెప్ప వలసి వచ్చినది. ఇట్లుండఁగా నొకదినమున గిరగిరదిరిగి–గిజగిజకొట్టుకొని–గీ పెట్టి –యాలేడిపిల్ల రెప్పపాటులోఁ బ్రాణములఁ బాసెను. లేని బిడ్డ లేనేలేఁడుకదా లేడిపిల్లయైన లేకపోవలయునా? ఎవని కేవస్తువు పరమప్రేమాస్పదమో యాతని కావస్తువు దక్కి యేడ్చునా? సృష్టివైఖరి మన కొకటియు మఱియొకరి కొకటియునా? ఈదేశమున కొకటి యింగ్లాండు దేశమున కొక్కటియునా? కలియుగమున కొకటి కృతయుగమున కొక్కటి యునా? నరులలో నొకటి పశువులలో నొక్కటియునా? పరమాప్తమైన వస్తువు తఱుచుగా దక్కకపోవుటకుఁ బ్రధాన కారణమొక్కటి యున్నది.

అత్యాచారసంపన్నుఁ డెపుడు మైలపడుదునో యెపుడు మైలపడుదునో యను సంతతభయముచే–నెగిరి యెగిరి తుదకుఁ బుల్లెవిన్తరి గుంటలోనే–గురిచూచినట్లు పడును. పరమలోభి ధన మెక్కడ వ్యయమగునో వ్యయమగునో యను నిత్యబీతిచేఁ దీసికొను మహాజాగరూకత ప్రయత్నమువలననే–ధనమును బోఁగొట్టుకొనును. కీర్తికాముఁడు పరులు తన్నుఁగూర్చి మంచిగా ననుకొనరేమో యనుకొనరేమో యను నితాంతచింతచేతఁ జేయుప్రయత్నములవలననే–యపకీర్తిభాజనుఁ డగును. నత్తివాఁడు పెద్దలతో మాటలాడున ప్పుడు నత్తి యెక్కడ వచ్చునో యను ననవరతాందోళనముచే నదిరాకుండఁ జేసికొనునట్టి ప్రానికచేతనే–దానిని మరింత తెచ్చుకొనును. రెండవపెండ్లి మూఁడవ పెండ్లి చేసికొను ముసలివారు తమపడుచు భార్యలయనురాగమున కెక్కడఁ బాత్రులము కాకపోవుదుమో కాకపోవుదుమో యను గుండెదడచేత వారికాళ్లపైఁ బ్రాఁకులాడిన ప్రాఁకులాటయే కాఁచినకాఁపే చూచిన చూపే యేడిచినయేడుపే–యెడమొగము పెడమొగమునకుఁ గారణ ములగును. ఆలాగుననే యింతప్రియమైనవస్తు వెట్లు దక్కించుకొందునో యను దేవులాట చేత దానిని రక్షించుటకై చేయు నపూర్వానవసర క్రియలచేతనే–యది చేయిజారి పోవును. అందఱి యనుభవములో నున్న యొక చిన్నమాట చెప్పుచున్నాను వినుఁడు. నీ కత్యంతాప్తమైన వస్తువునకు నీ వనుక్షణమును సందేహించు కీడు, నాపాదించు నపాయము, నీమహాశత్రుఁడైన సందేహింపఁడు, ఆపాదింపఁడు. నీభార్యకు జబ్బుగా నున్న దని యొక దూరస్థపట్టణమునుండి నీకుఁ దంత్రీవార్తవచ్చిన దనుకొనుము. ఆమెకుఁ గుదురు నని యామె బాగుపడి తిరుగ నీతో సుఖ సుఖముగానుండు నని మంచితలంపు నీమనస్సులోఁ బ్రయత్నముననైనఁ గలుగునా? అట్లెప్పుడైన మీలో నెవ్వనికైనఁ గలిగినదా? కలుగదు. డాక్టర్లు వచ్చినట్లు, నిరాశ చేసికొనిపోయినట్లు కావలసివారంద ఱేడ్చుచున్నట్లు, తరువాతి కృత్యములేవో జరుగుచున్నట్లు, నీకంటియెదుటఁ గనబడినట్లుండునా లేదా? మాటమా టకు మాటిమాటికి, నీప్రియవస్తువును గూర్చి నీ వంతుకీడు–బుద్ధిపూర్వకముగాఁ దలఁచు కొన్నప్పుడు, నిశ్చయించుకొనునప్పు డావస్తువు నీకుఁ దక్కకపోవుటలో వింతయేము న్నది? నీయర్ధశరీరిణి యగు ధర్మపత్నికిఁ గాలునొప్పి వచ్చినను గడుపునొప్పి వచ్చినను నీ వట్లు నిర్దాక్షిణ్యముగ నామెను శపించుచున్నప్పు డాదుష్ట చింతాఫలము నీ వనుభవించు టలో నాశ్చర్యమే మున్నది? మంచి తలఁపులు మంచి కలుగఁజేయును. చెడ్డతలఁపులు చెడ్డగలుగఁజేయును.

ఎట్లయిననేమి తుదకు లేడిపిల్ల చచ్చినది. కొంతసే పేడ్చినాఁడు. మొత్తుకొనినాఁడు. తన సేవకుఁడు దానికి విసము పెట్టి నేమో యను సందేహముచే మరణకారణ మేదియో కనుఁగొనుటకు దానిని మహావైద్యస్థానమునకుఁ బంపెను. ''రప్చరు ఆఫ్ ది అయోర్టా'' చావునకు హేతువని మహావైద్యశిఖామణి ఐ.ఎమ్.ఎన్. గారు వెల్లడించిన యభిప్రాయమును రవంత విమర్శింతము.

ఏ మని చెప్పినారు–అయోర్టా యను హృదయప్రధానరక్తనాళము వగులుటచేతఁ బ్రాణము పోయిన దనియా? ప్రాణము దేహము నుండి యీద్వారముననే వెడలిపోయిన దని యెంత సూక్ష్మముగాఁ జెప్పినాఁడో–ఎట్టి మహావిద్వాంసుఁడో! ఇంటిలోఁ జొరఁబడిన కుక్క కంటితోఁ జూచుచుండఁగనే యే కన్నము వెంటఁ బాఱిపోయినదో నిశ్చయముగాఁ

జెప్పఁజాలముకదా? అట్టిచో నీతఁ డింత మహాకావ్య మెట్లాన తీయఁగలిగెనో కంటికిఁ గనఁబడని ప్రాణము–నీరూపమైన ప్రాణము–తాను జూచుచుండఁగాఁ దనతో మనవిచేసి తన సెలవుతీసుకొని తరలిపోయిన ట్లీ తత్త్వజ్ఞానసంపన్నుఁడు–ఢంకా మీఁద దెబ్బకొట్టిచెప్పుట యేగాక–యా శ్రీసూక్తిని వ్రాసికూడ నిచ్చినాఁడే.

నాయనలారా! ఒక్కనంగతి యాలోచింపుఁడు. కట్టుదిట్టమైన చుట్టుగుడిసెనుండి కుక్క కష్టపడి దడిచిరేపుకొని యీవలకుఁ బాఱిపోయి వచ్చినది. కుక్క దడిలో దారిచేయుట చేతనే దారియైనది కాదా? అంతకుఁ బూర్వమున దారి లేదే? కావున దారికిఁ గుక్క కారణమా దారి కుక్కకుఁ గారణమా? ప్రాణోత్క్రమణప్రాబల్యమున రక్తనాళము భగ్నమైనది. ప్రాణము పోవుటచేత రక్తము వెడలినది కాని రక్తము వెడలుటచేతఁ బ్రాణముపోలేదే! కాని డాక్టరుగారు మహమ్మదీయ ముఖప్రక్షాళనమువలె క్రిందనుండి పైకిఁబోయినారేమి? దానిమ్మపండు పగిలినది. లోనికెంపు లీవలఁబడినవి. పండులోపలి గింజలసమూహముబికి స్థలముచాలక ఫలముపై నున్న చర్మమును బగులఁజేసినదా? అదివఱకే పండు పగిలియుండుటచేత గింజ లీవలకు వచ్చినవా? నీటిలో నుండి గప్ప గట్టుమీఁదికి దుమికినది. కప్ప యీవలకు వచ్చుటచేత నీరు దారియిచ్చినదా? ముందుగా నీరు దారియిచ్చిన హేతువచేతఁ గప్పయీవ లకు వచ్చినదా? మన డాక్టరుగారు మూఁతి వెనుక–తోఁక ముందని చెప్పినారేల? గునప ముతో గోయిపడినదా? గోయి యంతకు ముందే పడియుండుటచేత గునపము దిగినదా? తండ్రి పుత్రునికిఁ గారణమా? పుత్రుఁడు తండ్రికిఁ గారణమా? అయ్యయ్యో! అంత విరుద్ధమా? అన్నము తినుటకు నోరు తెఱచుచున్నామా? నో రదివఱకు తెఱచియున్నది కావున నన్నము నోటిలోనికిఁ బోయినదా? రక్తనాళములోను బ్రాణములోను బలవత్తరమైన దేది? ప్రాణమే యని చెప్పక తప్పదుకదా? ప్రాణము శక్తి–నాళము పదార్థము దీనికంటె నది శక్తిమత్తరమని వేఱే చెప్పవలయునా? బలవత్తరమైన ప్రాణము రక్తనాళమును జింపుకొని వెలుపలికిఁ బోయిన దని చెప్పవలయునా? రక్తనాళము నిమ్మళముగా మర్యాదగా నన్ననన్న ముగా దారియిచ్చి ప్రాణమును సాగనంపిన దని చెప్పవలయునా? బలాఢ్యుఁడు బలహీనునిదౌ డ్పై బజాయించి యింటిలోఁ దూఱినాఁడని చెప్పవలయుఁగదా? బలహీనుఁడు యోగ్యుఁడై వైరాగ్యసంపన్నుఁడై యభ్యాగతపూజాపరాయణుఁడై దయచేసి గృహపావనత ప్రసాదింపుఁ డని బలాఢ్యుని లోనికిఁ దెచ్చెనని చెప్పవలయునా? పోనిండు నాయనలారా! ఈగొడవయం తయు నీతర్జన భర్జనమంతయు నీపూర్వపక్షరాద్ధాంతపద్ధతియంతయు నీయౌను కాదను మీమాంసయంతయు నెందులకు? ఆకలియుగధన్వంతరి చెప్పినట్లు రక్తనాళవిభేదనము ప్రాణోత్క్రమణమునకుఁ గారణ మని యొప్పుకొందము. ఆయనతో నీ వెనుకముందు విచారమేల? ఈతలతోఁక తగాదా యేల? ఈకార్యకారణపుఁ గొటులాటయేల? ఆయన వాక్యరత్నమునే శిరమున వహింతము. కాని రక్తనాళవిభేదనము ప్రాణాపాయదశను గలిగింపని యుదాహరణము లెన్నియోయున్నవి. పోనిండు. అవి లేనట్లుగనే యెంతము.

ప్రాణము రక్తనాళద్వారమునఁ బోయిన దవి మన యాంగ్లేయపు ఎస్కూ్యలేపియన్ గారు చెప్పినారుకదా? మొదటఁ బ్రాణము రక్తనాళములోనికిఁ గాని శరీరమున మఱియెక్క డికైనఁ గాని యెట్లు వచ్చినదో యాయన రవంత మనకుఁ జెప్పఁగలరా? మొట్టమొదట నది లోనికి వచ్చుటకుఁ గారణ మేదో సంక్షేపముగా వారు సాయింపఁగలరా? అది

పోయినదారి తెలిసినప్పుడు వచ్చినదారి మాత్ర మేల తెలియకుండవలయును? పోనిండు. తెలియకపోయినఁ బోవునుగాక–తెలియవలయు ననువిధి లేకపోవచ్చును. అది వచ్చినప్పుడే యవయవమును జింపుకొని లోనఁ బ్రవేశించినదో చెప్పఁగలరా? ఏదో కొంత స్థూలావయవి చ్చేదనమొనర్చిగాని యది పైకిఁబోవుటగాని లోనికివచ్చుటగాని సిద్ధింపదని యాయన విశ్వాసమైనట్లు కనఁబడుచున్నదికదా! ఎట్లు ప్రాణము లోన ప్రవేశించినదో వారు చెప్పఁగ లరా! (అబ్బో)! ఆసంగతి వారి కెట్లు తెలియునయ్యా–వారిలో ననేకులకుఁ దెలిసినదెల్ల –వారిజేబులో ధనము, మన గొంతుకలో ద్రావకము–వారికిఁ బెసరట్లపలావు, మనకు బేలపుగంజి–వారికిఁ బట్టరాని తెగనీలుగు, మనకు భరింపరాని దీనత్వము–వారికి నవ్వు మన కేడ్పు)–వారికినరయోగము, మనకుమరణయోగము–వారిలో ననేకులకుఁ దెలిసినవిమూఁడే –(పిల్లు–బిల్లు–కిల్లు అని సభలో ననేకులు కేకలు) పోనిండు నాయనలారా! వారిలో గొందఱనై ననసుట యెందులకు? ఆయువుండగా ఐ.ఎమ్.ఎస్. గారైన మన త్రాడు త్రెంపలేరుకదా! మన యాకు చింపలేరుకదా! 'దేవతా మండలాఖండమండను'ని సెలవులేకుండ డిస్ట్రిక్టు మెడికల్ అండ్ సానిటరీ ఆఫీసరుగారైన మనయెడల మారకాధిపత్యము వహింపలేఁడు కదా! ఆప్రశంస యిఁక నెందులకు? తెలియనివారు తెలియన ట్లుండక యీదీమనపు సిద్ధాంతము లేమి? ఈతెగనీలుగు వ్రాఁతలేమి? ప్రాణము లోనికిరాను వలదు. పైకిఁ బోనువలదు. ఈవిచారణయే మనకు వలదు–మొదటఁ బ్రాణ మనఁగ నేమో వారి కేమాత్రము తెలియునో –నాయనలారా! ఈయంశమునుగూర్చి పాశ్చాత్యవైద్యవిద్వాంసులకుఁ బ్రకృతిశాస్త్రజ్ఞా ననిక్షేపులకు నేమాత్ర మిదివఱకుఁ దెలిసినదో రవంత పరిశీలింతము. ఇది కొందఱకుమా త్రమే రుచిమంతమైన విషయమగుటచేతఁ జాలమందికి విసుగుగా నుండునేమో–కొంచెము దయయుంచి శ్రద్ధతో వినఁబ్రార్థించుచున్నాను.

సరిగాఁ బ్రకృతిశాస్త్రము ననుసరించి చెప్పవలసియుండు నెడలఁ బ్రాణము పదార్థ ముతో సంబంధించియుండున దనియు నది ప్రాణము గల యన్నిజంతువులచేతను బ్రదర్శింపఁబడునది యనియుఁ బ్రాణనహిత పదార్థములనుండి ప్రాణరహితపదార్థములను కేటాయింపఁజేయునది యదియే యనియుఁ బ్రాణమునుగూర్చి వారి శాస్త్రజ్ఞులు నిర్వ చించి యున్నారు. నాయనలారా! ఏమైనఁ దెలిసినదా? ఈకౌముదిచే నంధకారము మఱింత గాఢమైనట్లగపడుచున్నదేమి? ప్రాణముగల యన్నిజంతువుల చేతను బ్రదర్శింపఁబడినది ప్రాణమఁట–నీ రనఁగా నేమి యని యడుగ నీరని చెప్పఁదగినదెల్ల నీరని చెప్పిన ట్లున్నది. కామరాజుగా రెవ రని యడుగ కామరా జనుపేరు వహించినవారే కామరాజుగా రని చెప్పినట్లున్నది. కాని హెర్బర్టుస్పెన్సరుగారు ప్రాణ మనఁగా నేమియో యింతకంటె విస్పష్టముగాఁ జెప్పినారు. బాహ్యపరిస్థితులనుబట్టి యాంతరపరిస్థితులను సర్దుకొనుశక్తియే ప్రాణ మని యావిద్వాంసులు చెప్పినారు. ఇట్టి నన్నివేశము జీవనిర్జీవప్రపంచముల రెంటియందుఁగూడ నవ్యాహతముగ నశ్రాంతముగా జరుగుచున్నది. అందుచే జీవనిర్జీవభేద మీ నిర్వచనమువలన నశించినట్లు కనఁబడుచున్నది. నిర్జీవపదార్థసముదాయములోఁగూడ నదియే జరుగుచున్నది. కావున నాపని జరుగుటకు జీవమే కావలయునన్న నియమము లేదు. అందుచే నది ప్రాణలక్షణము కాదు. అతివ్యాప్తిదోషహిత మగుటచే హెర్బర్టుస్పెన్సరు గారి నిర్వచనము నిరాకరింపవలసియున్న ట్లగపడుచున్నది.

ప్రోటోప్లాజముయొక్క కదలికనే ప్రాణముగా భావింపవచ్చునని మరికొందఱు విద్వాంసులు చెప్పియున్నారు. ప్రోటోప్లాజ మనఁగా నతిసూక్ష్మమైన ప్రాణి–అంతకంటె సూక్ష్మతరప్రాణి యుండ దని కొందఱ యభిప్రాయము. కాని యీమాట సత్యము కాదని మరికొందఱ యభిప్రాయము. ప్రోటోప్లాజమున కెంతయో పూర్వచరిత్ర మున్నదనియు, దానికిఁ బితామహప్రపితామహాద్యనేకపూర్వ్ లుండి రనియు, వారు దానికంటె సూక్ష్మతర జీవు లనియు, దాని వంశవృక్షమును మరింత ప్రజ్ఞాకౌశలమునఁ బరీక్షించినవారు పలుకుచున్నారు. ఈశిరోజసహస్రధా విభేదనముతో మన కంత యావశ్యకత లేదు. ప్రోటోప్లాజమే ప్రాణిప్రాతిపదికముగా మనము పరిగణింపవచ్చును. దీనిలో ప్రోటీడ్డను పదార్థమున్నది. ప్రోటీ డ్డను పదార్థమున కార్బను హైడ్రొజను నైట్రోజను ఆక్సిజను నల్పరు అను పదార్థము లున్నవి. ఆ పదార్థములు చిత్రవిచిత్రాతి విచిత్ర మహావిచిత్ర మేళనమునఁ గలసియున్నవి. ఈ వస్తువు లన్నియు సామాన్యవస్తువులేకాని వాని మేళనవైచిత్ర్యమే దుర్జ్ఞేయముగ నున్నది. ఈ విలక్షణమైన విచిత్రమైన విశోధనాసాధ్యమైన మేళన పద్ధతివలననే ప్రాణ మనునది పుట్టుచున్న దని యనఁ దగును. కాని ప్రాణము–పైని చెప్పినవస్తువుల సాముదాయకగుణ మనిమాత్ర మెన్నఁదగదు. నీటిలోని గుణము ఆక్సిజను హైడ్రొజను వాయువులలోని సాముదాయక గుణమని చెప్పవచ్చునా? ప్రాణ మట్టి సాముదాయకగుణము కాకపోయినను నమ్మేళన వైచిత్రీ సంజాతగుణ మని చెప్పక తప్పదు. ఈ ప్రాతిపదిక ప్రాణులెన్నో కలిసియుండును. ఏ ప్రాతిపదిక కా ప్రాతిపదికమే ప్రాణము గలది. అన్యోన్యసహాయశూన్య ముగ నవి జీవింపఁ గలవు. లోనుండి కాని పైనుండి కాని కలిగిన ప్రమాదమువలన నవి నశింపవచ్చును. ప్రాణ మన నేమో తెలియుటకు ప్రోటోప్లాజములోని ప్రోటీ డ్డేమో పూర్తిగాఁ దెలియవలయును. ప్రోటీడ్డులోనున్న వస్తువులే తెలియునుగాని యావస్తుసమ్మేళన విభాగవిధానాదులు బొత్తిగాఁ దెలియవు. అవి తెలియనంతవఱకు ప్రాణ మన నేమో చెప్పుటకు వీలులేదు. నాయనలారా! ఇవియన్నియు నాయభిప్రాయము లనుకొనుచున్నారేమో పాశ్చాత్య పండితుల వ్రాఁతలలోని యభిప్రాయములను నా కవగాహమైనంతవఱకుఁ దెలియఁ బఱచుచున్నాను. క్రీస్తు పుట్టుటకు రెండువేల సంవత్సరముల ముందునుండి పుట్టిన తరువాత దాదాపుగా రెండువేల సంవత్సరముల వఱకు మహాధీశాలులందరు మహాశాస్త్రజ్ఞు లందరు ప్రాణ మేదియో కనుఁగొనుటకుఁ బడవలసినపాటులన్నియుఁ బడినా రని చెప్పవచ్చును. ఇప్పటికిఁ బ్రాణ మేదో తెలియలే దని సిద్ధాంత పఱచుకొనిరి. కాని పాప మా శాస్త్రజ్ఞుల కాశమాత్ర మింకను వదలలేదు. ప్రోటీడ్డును గూర్చి పూర్తిగా వారికిఁ దెలిసినప్పుడు ప్రాణమేదో తెలియఁగల దని వారింక నాశపడుచున్నారు. ఇది కేవల మేషాండభ్రమము. ప్రోటీడ్డునుగూర్చి పూర్తిగాఁ దెలిసినప్పుడు ప్రాణమునుగూర్చి తెలియు ననఁగా ప్రాణమును గూర్చి పూర్తిగాఁ దెలిసినప్పుడు ప్రాణ మనఁగ నేమో తెలియునన్న మాట –అంతకంటె లేశమును భిన్నము కాదు. తత్త్వమెరిఁగినవానికి బ్రహ్మజ్ఞానము కలుగు ననఁగా బ్రహ్మజ్ఞాన మున్నవానికి బ్రహ్మజ్ఞానము కలుగు నన్నమాట కాదా–ప్రాణముఁ బాసినవాఁడెవ్వఁడైనఁ దిరుగ బ్రదికివచ్చినయెడల మన కతనిమూలమున మరణానంతరావస్థ తెలియుననఁగా నదియులేదు–ఇదియు లేదన్న మాటయేనా? గణపతికి గంపెఁడుండ్రా లుళక్కియైనప్పుడు నీ కాంతకడుపుగూడ నేల యుళక్కి కాదు? కావున నిందునుగూర్చి యజ్ఞానమే సిద్ధాంతము. శిలాశాసనము.

ప్రాణులు కనఁబఱచు బహిర్లక్షణములవలనఁ బ్రాణ మన నేమో తెలిసికొనవచ్చు నని కొందఱు ప్రకృతి శాస్త్రప్రవీణులు ప్రయత్నించిరి. ప్రాణికిఁ బ్రథమ లక్షణము కదలిక. ఇది ప్రాణి లక్షణమే కాని దీనివలననే ప్రాణిని నిరూపించునెడలఁ బ్రమాదములు దినమునకుఁ బదికోటు లైన సంభవించును. ప్రాణశూన్యము లైన యనేకపదార్థములకుఁ గూడ నసాధారణ మైన చలన మున్నదనక తప్పదు. రాజు చిక్కుఁడు గింజలో బ్రాణము లేదా? కట్టిన పొట్లములోనే యది చచ్చినట్లు పడియున్నదా లేక ప్రాణ మున్నదికదా యని పాదులోనికి దనంత తాను దుమికినదా? అందుచే నీ లక్షణమువలనఁ బ్రాణ మేదో తెలియఁ దగదు. రెండవలక్షణమునుగూర్చి చెప్పెదను. మూఁతి కేదైన దగిలిన యెడల రోఁకలిబండ ముడుచుకొని చుట్టచుట్టుకొనిపోవును. సూర్యుఁడే పైపునకు దిరుగునో సూర్యకాంతపుష్ప మా పైపనకుఁ దిరుగును. మెకపుగబ్బు పావుకోనుదూరమునననే కనిపట్టి మేఁక బారున నార్చి కాళ్లు లటలట లాడిపోవఁ గూలఁ బడును. గండుపిల్లి మంగళపుటూరితి వినఁగనే యెలుకలు మతులుపోయి, పారిపోఁబోయి తొట్రులలో డొఁగఁబోయి తుట్టతుదకు భయావేశముచేఁ, బ్రబలాందోళనముచే, దానినోటిలోనే తప్పకుండఁ బడును. నిదురఁబోవుచున్న మానిసి కాలిపై నూదిలోఁ బొడువఁగ నాతఁ డెఱుఁగకపోయినను గాలముడుచు కొనకపోడు. ఇట్టివిచిత్రావస్థకే 'ఇఱ్ఱిటేబిలిటీ' అని యందురు. నరములకుఁ బైనినుండి కాని లోపలినుండి కాని యేదో యొక సంఘర్షణము కలుగఁగ నవి వదులయికాని బిగిసికాని మాంసఖండములకుఁ జలనము కలిగించును. ఇది నర్వప్రాణులకు సామాన్యమైన లక్షణమే. సామాన్యమైనదే కాని ముఖ్యమైనది మాత్రము కాదు. నిష్ప్రాణములగు వస్తువులలోఁ గూడ నిట్టి లక్షణము వ్యక్తపడుచున్నది. సూర్యకాంతపుఱాయి సూర్యకిరణముచే మందుచున్నది. చంద్రకాంత పుఱాయి చంద్రకిరణముచే స్రవించు చున్నది. అయస్కాంతము నూది నాకర్షించుచున్నది. గడ్డిపోఁచ సీలమున కంటుకొనుచున్నది. కావున ఇర్రిటేబిలిటివలనమాత్రము ప్రాణమేదో కనుగొనఁజాలము. ప్రాణముయొక్క మూఁడవ లక్షణమేదో చెప్పుచున్నాను. ఇది స్వజాతి వర్ధనశక్తి. ఈశక్తి ప్రాణులకు సాధారణమైనదే కాని ముఖ్యమైనది కాదు. ఏలయన ననేకప్రాణుల కీశక్తిలేదు. ఇది సిద్ధాంతీకరించినయంశము. కావున దీనినిగూర్చి తగ వక్కాణలేదు. ఇది కాక బహుసూక్ష్మ జంతువులలో నొక విచిత్రమైనవృద్ధి కానఁబడుచున్నది. ఒక్క యతిసూక్ష్మప్రాణి ఱెప్పపాటులో రెండగును. అవి మఱియొక ఱెప్పపాటులో నాలుగగును. ఇదియుఁగూడఁ బ్రాణమును గూర్చి నిశ్చయజ్ఞాన మీయఁజాలదు.

ఇదికాక ప్రతిప్రాణియుఁ బ్రాణినుండి పుట్టినదై యుండకతప్పదు. ఇది ప్రాణి ముఖ్యలక్షణమేమో యోజింతము. కాకి గ్రుడ్డునుండి కాకి పుట్టుచున్నది. కాఁకరగింజనుండి కాఁకరతీఁగ పుట్టుచున్నది. పగిలి పాడైన గ్రుడ్డునుండి పక్షి పుట్టుట లేదు. ముక్కిపోయిన గింజలనుండి మొక్క పుట్టుట లేదు. ఇంతవఱకు బాగుగనే యున్నది. కాని ప్రాణరహితము లయిన బండలనుండి పచ్చనియాకులుగల తీఁగలు పుట్టుచున్నవి. బదనికలకు మూలము లేదు. ఇవి యెట్లు సంసర్గింపవచ్చును. కావున బ్రాణినుండియేకాని ప్రాణి పుట్టదని చెప్పుట కవకాశము కనఁబడకున్నది. అందుచే నిదియుఁ గుదరలేదు. ప్రాణి ప్రధానలక్షణపరీక్ష మొదలిడిన తరువాతఁ బ్రాణవిషయక మగు మన జ్ఞానము మరింత మూదిగ మంచమైనట్లు కనఁబడుచున్నది. అందుచే నన్నియు వదలుకొనఁబడగినవే. వదలుకొనకుండ బ్రాకులాడిన ఫల మే మున్నది? పరిమికంపలలోనికి బొమ్మజెముడు డొంకలలోని కీడ్చుకొనిపోవుచున్న

దారివెంట నింక దలవంచుకొనిపోవుట యెందులకు? మందు పనిచేయకపోయినప్పుడ
కూడ మ్రింగుట యెందులకు? కలము ప్రాయనప్పుడుకూడ గర్భాగ్రమున దానిని ధరించ
లెందులకు? మఱియొకపద్ధతిని యోజింపవలయు నని మరికొందరు ప్రకృతిశాస్త్రపం
తులు వేఱొకమార్గమున విచారణ మారంభించిరి. ప్రాణ మన నేమి యని కదా ప్రస్తు
ప్రశ్నము? ప్రాణాభావము కంటె భిన్న మైనది ప్రాణమని ఒప్పుకొనక తప్పదు కదా! అందు
మృతి యనున దేదియో తెలిసికొన్నయెడల బ్రాణ మనునదేదియో తెలియవచ్చును
ఉష్ణరక్తసహిత ప్రాణులలో ''వారం బ్లడెడు అనిమల్స్'' మరణదశను సూక్ష్మముగా
గనిపట్టవచ్చును. ప్రాణప్రధానసంజ్ఞ యేదో యది కానఁబడకుండినయెడల వానిలోఁ జా
సిద్ధించిన దని చెప్పఁగలము. హృదయకోశ సంబంధము లగు లబ్బు డబ్బు లా
పోయినప్పుడు కాని, యూఁపిరితిత్తుల కస్సుబుస్సులు నిలిచిపోయినప్పుడు కాని, ప్రాణమ
పలాయన మొందిన దని పలుకవచ్చును. హృదయమాఁగిపోయినపిమ్మట నైనను మిగిలి
యనేక కోశములు ప్రాణసహితములై చాలసేపటివఱ కుండవచ్చును. శీతరక్తసహితజంతు
ల్లలో—నత్తగుల్ల పాము కప్ప మొదలగు జంతువులలో—మృతిని గనిపట్టుట మిగుల దుర్లభము
ఈ కష్ట మిట్లుండఁగా జావుబ్రదులకు భేదములను గ్రహించుట మఱికొన్ని కారణములఁ
మఱింత కష్టమైనది. హిందూ దేశమందుఁ గొందఱు పక్షీరులు సమాధ్యవస్థలో ననేకమాసమ
లవఱకు స్థాణువులవలె నుందు రని వినుచున్నాము. ఈ యంశము సత్యమే యగునెడ
నిది మనకుఁ బ్రాణనిర్వచనవిషయమున ప్రతిబంధ మనుటకేమైన సందేహమా? ఇదిగా
యాకస్మిక మగు కొన్ని మూర్ఛలు సర్వవిధములఁ జావు ననుకరించును. ఒడల వేఁడిమి
లేదు, చేత నాడీ లేదు. ముక్కున నూఁపిరి లేదు. చావునక్కుమాత్ర మింతకన్న కొము
లున్నవా గొరిజ లున్నవా? తొండమున్నదా తోఁకయున్నదా? కాని యది మూర్ఛ కా
మృతి యని చెప్పవచ్చునా? ఇది ప్రాణ నిర్వచనమునకు మఱింత ప్రతిబంధము కాదా
ఇది కాక కొన్ని యధమజాతిప్రాణులు శిరశ్ఛేదన మొందినపిమ్మటఁ జిరకాలమునకైన
నీరాభిషేచనమువలనఁ బునఃప్రాణ సమన్వితము లగును. ఇట్టి యధమజాతిజంతువులలో
సమస్తకోశములు నిల్చిపోయినతరువాత నెంతకాలమునకైన సరే తిరుగ నవి ప్రాణవంతము
గుట కెంతమాత్రమును సందేహములే దని డబ్యు కాక్స్ అను మహాధీమంతుఁడ
చెప్పియున్నాఁడు. చావునకు బ్రదుకునకు నేభేద మున్నదో యిప్పటికివఱకుఁ దెలియఁద
నంతమట్టునకుఁ దెలియలే దని వానిధర్మమా యని మనప్రాణము లింక దీయకుండ నాత
డొప్పుకొనినాఁడు. 'సయన్స్' తుదకుఁ జావుబ్రదుకు లెరుఁగని శాస్త్రజ్ఞానసన్నివే
మైనది.

మఱియొకఁడు కేనోజనుగాని, ప్రోటోప్లాజము ప్రాణిప్రాతిపదికము కాద
చెప్పియున్నాఁడు. మరియొకఁడు నక్షత్రములనుండి గ్రహములనుండి పరాగరూపమున
బ్రాణ మీ భూలోకమునఁ బడిన దని పడుచుండగాఁ దాను చూచినట్లు చెప్పినాఁడు
—ఈవిద్వాంసు నేమనవలయునో తెలియకున్నది. ప్రకృతిశాస్త్రజ్ఞానము కలిగినకొలఁది
మనసులోని రసమంతయుఁ జచ్చి యది యెండుజిల్లెడుకాయవలె మెలికలుపడి కఱకుగా
నుండును. మనస్సును బోదకాలువలెఁ గ్రిందికి దిగలాగుటలోఁ బ్రకృతిశాస్త్రజ్ఞానమం దది
లేదు. జగత్తంతయు నొక్క యుఁపున వ్యాపించి నృష్టిగానామృతమును గ్రోలవలసిన
మనస్సు—కుక్కగొడుగు క్రిందికిదూఱి దానిలోని రసమును జవిచూచును. శారీర రసాయ

నాదిశాస్త్రములు వేదాంతశాస్త్రమునకు సాహాయ్యపడి నప్పటినుండియు వేదాంతశాస్త్రము వెలవెలబోదుచు వెల్తోమొగము వైచుకొని యున్నది. దానివదనమునఁ బ్రాచీనవిద్యాంసులు కాంచిన బ్రహ్మవర్చసము పటాపంచ లైనది.

ఏపైది తెలిసికొన్నయెడలఁ గ్రిందివన్నియు సుజ్ఞేయము లగునోయాపై చదువే చదువుకదా! క్రిందివస్తువును బరీక్షించుట కింకను గ్రిందికిఁబోయి మఱియింకను గ్రిందకిబోవునెడల నధోగతియే కాని యంతరంగవ్యాప్తి యేమైన సున్నదా? పాతాళముకంటెఁ గ్రిందికిఁ బోయినను బరమార్థము గోచరించునా? ప్రాణ మనఁగనేమో యిప్పటికిఁ దెలియ గలిగిరా? అదికాక మరియొక్క చిన్నమాట. చిరకాలము తన్ను వదలి దూరదేశమునకుఁ బోయిన కొడుకు తల్లికిఁ గానఁబడినాఁడు. కప్పురపుఁ బూసలంతటి కన్నీటిబిందువులు చిత్తజల్లుగ నామె చెక్కులనుండి రాలినవి. ఒక్కొక్క బొట్టొక్క పూర్వపుజర్మనీ రాజ్యమంత విలువగలది యని చెప్పుట యతిశయోక్తికాదే. కన్నీటివిలువ కవితక్క మరియెవ్వఁ డెరుఁగును? అశ్రుబిందువునకు నఖిలాంతరప్రపంచము నవలోకించి యనుభవింపఁగలవాఁ డొక్క కవి యేనా? మరియెవ్వఁ డైన నున్నాఁడా? అయశ్రుబిందువు నద్దముక్రిందఁబెట్టి అనలైజుచేసి ప్రకృతిశాస్త్రజ్ఞుఁడు దీనిలో రెండుపాళ్లు సున్నము, మూఁడుపాళ్లు లాక్రిమల్ తిత్తిరసము 1/4 భాగ ముప్పు, 7 భాగము లాక్వా (నీరు) నున్న వని చెప్పి ధూధూ యంతకంటె దీనిలో విశేషమహిమ యేమియులేదని కవి నధిక్షేపించును. కొజ్జావానికిఁ గులుకులాడి కోరచూపులో నున్న శృంగారరసప్రపంచమేమి తెలియును? జగత్సౌభాగ్యమును జంపినవాఁడు ప్రకృతిశాస్త్రజ్ఞుఁడు. ప్రాపంచికకవితను భగ్నపఱచినవాఁడు ప్రకృతిశాస్త్రజ్ఞుఁడు. పోనిండు. ఈ గొడవ యెందులకు?

కాని, నాల్గువేల సంవత్సరములనుండి ప్రకృతిశాస్త్రజ్ఞుడు ప్రాణమనఁగ నేమో తెలియలేదని మొఱపెట్టుచుండఁగా, నామొఱ్ఱ భూలోకమునందంత మాఱుమ్రోయుచుండఁగా, మన ఐ.ఎమ్.ఎస్., గారు ప్రాణ ''మయోర్థా'' నుండి పోయిన దని రెండు నిముసములలోఁ జెప్పినారే–వీని సాహసము సంతకుఁబోవను; ప్రాణము పోయినతరువాత శరీరకోశాదులలో నెన్ని వంద లెన్ని నేల మార్పులు కలుగునో యను నంశము తానెఱుఁగనిది కాదే. రక్తనాళభంగముకూడ మరణానంతరపు మార్పులోని దేలకాకూడదో చెప్పఁగలఁడా?

నాయనలారా! ఐ.ఎమ్.ఎస్. గారి యభిప్రాయమే యింత యవకతవకగా నున్నపుడు వారి యౌషధపద్ధతి యెట్లుండునో! శ్రీరామరక్ష శ్రీరామరక్ష–సర్వేజనాస్సుఖినోభవంతు. వారే యింతవారైనప్పుడు వారిక్రిందిసర్జనులలో ననేకు లెంతవారో? మౌర్వీలు మాధుకరమెత్తుకొనుచుండ ఛేలాలకు జీనా మిఠాయియా? నాయనలారా! ఎవరెట్టివారైన మన కేమి చింత? మన తల్లులకడుపు వల్లగా నున్నంతసేపు మన కేమియు భయము లేదు. సప్తమాధిపతి లాభాధిపతి మారకదశ లెందఱకు దాఁటిపోలేదు. ప్రపంచమునఁ బుట్టినపిమ్మట నవతారపు రుషులకే యాపదలు మాననప్పుడు మన లెక్క యేమి? ఇంతకును గర్మసూత్రమును నమ్మినవారముకాని క్వయినామాత్రను నమ్మినవారము కాదుకదా? నాయనలారా! ఎంత సంక్షేపముగాఁ జెప్పదలఁచినను జాలనైనది. క్షమింపుఁడు. ప్రాణనిర్వచనము మన వేదాంతులెట్లుచేసిరో మఱి యొకసారి చెప్పెదను. ఇప్పటి కిదియే యెక్కువయైనది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

16. జన్మపరంపర

పునర్జన్మలు, పూర్వజన్మలు ఉన్నాయా?–అనే విషయం గురించి జంఘాలశాస్త్రి తన ఉపన్యాసం ప్రారంభించాడు. దానికి ప్రేరణ ఒక క్షత్రియ యోగి. ఇప్పుడు వినిపించే ఉపన్యాసమంతా 'క్షత్రియ యోగిది'గా శాస్త్రి చెపుతున్నాడు.

మృత్యువు తరవాత ఏం జరుగుతుంది? అనేది ఆసక్తికరమైన ప్రశ్న. శవాల్ని తగలబెట్టకుండా పూడ్చిపెట్టే ఆచారంలో వివిధ జాతులవారి ఉద్దేశాల్ని ఆ యోగి వివరించాడు. శరీరం కంటె వేరైన ఆత్మ ఒకటి వుందనీ, అది నాశనం లేనిదనీ, అది పరమాత్మ తేజస్సుకు సంబంధించిన చిన్న 'నెరుసు' అనీ కొద్దికొద్ది భేదాలతో అనేక మతాలవారు అంగీకరించారు. ఆత్మని అంగీకరించని బుద్ధుడు కూడా పునర్జన్మను ఒప్పుకున్నాడు.

పర్షియా, గ్రీసు, పెూర్బూ, ఈజిప్టు, ఛార్జీను జాతులవారి 'ఆత్మ' విశ్వాసాలను ఆ యోగి వివరించి–క్రైస్తవ, మహమ్మదీయ మత విశ్వాసాల్ని పరామర్శించాడు. వారి వారి దృష్టిలో దేహం ప్రధానం. ఆత్మ ఆనుషంగికం. దాదాపుగా ఆర్యేతర జాతులన్నిటా ఈ విశ్వాసం ఇలాగే వుంది.

ఆర్యులకు మొదటి నుంచీ 'ఆత్మ' శాశ్వతమైనదనే విశ్వాసం వుండడం వల్ల శరీరాన్ని అప్రధానంగా యెంచి శవాన్ని దహనం చేసే ఆచారాన్ని పాటించారు.

క్షత్రియయోగి ఒక ఉదాహరణ చెపుతూ, తను ప్రేమగా ఎంచి, పెంచిన కోడి ప్రమాదవశాత్తు తనకే ఆహారమై, ఆ తరవాత కలలోకి వచ్చి, దాని జన్మ పరంపరను కథనం చేసిన విధం చెప్పాడు. కోడి చెప్పిన ప్రకారం అది యీ క్షత్రయుడికి పూర్వజన్మలో తండ్రి.

జంఘాలశాస్త్రి ఆ యోగికారి ఉపన్యాస విషయాన్ని ఖండిద్దామని లేచాడు. కాని ఆ సభవారు ఒప్పుకోకపోవడంతో ''నేను మా సభలోనే దీనికి జవాబు చెపుతా''నని ప్రకటించి బయట పడ్డాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నే నొక్కసారి కొన్ని సంవత్సరములక్రిందట నొక్క సభలోనికిఁ బోయితిని. అచ్చట నొక్కఁ డుపన్యసించుచున్నాఁడు. ఆతఁడు క్షత్రియునివలె నున్నాఁడు. కాని క్షత్రియోచిత

మగు మాంసాహారము నాతఁడు విసర్జించినాఁడఁట.' ఆతఁడు జటాధారియై యోగివలె నున్నాఁడు. ఆతఁడి ట్లుపన్యసించెను.

''నాయనలారా! ప్రపంచమున నున్న యన్నిదేశములలో నొక్క యార్యావర్తదేశ మందే మృతులకు దహనసంస్కార మాచరించు నాచారమున్నది. కాని మిగిలిన యన్ని దేశములందును ఖనన సంస్కారమే యాచారము. ఇట్టి యాచారభేదమున కేమికారణమో కాసంతయోజింతము. సోదరులారా! ఇట్టె మొగ్గపుట్టుచున్నది. అట్టె వికసించుచున్నది. ఇట్టె వాడుచున్నది అట్టె రాలిపోవుచున్నది. ప్రపంచమున నెక్కఁడఁ జూచినను బుట్టుక, పెరుఁగుదల, చావు కనపడుచున్నవి. ఈయంశమున మట్టునకుఁ జీమకు సింహమునకు భేదము లేదు–దొంగకు దొరకు భేదము లేదు–భోగికి జోగికి భేదము లేదు. ఇంతేనా యింతకంటె నేమైన నున్నదా యని బుద్ధిమంతు లాత్మతత్త్వమును గూర్చి యాలోచించిరి. ఇట్టి యోచనాభేదములే మతభేదము లయినవి. కాని శరీరము కంటె భిన్నమై యాత్మయె కటి యున్న దనియు నది యనశ్వర మనియు నది పరమాత్మ తేజోవిస్ఫులింగ మనియు నీషద్భేదములతో ననేకమతములవా రంగీకరించిరి. ఆయాత్మకే జన్మపరంపరయున్న దనియు జన్మరాహిత్యమే మోక్ష మనియుఁ గొన్ని మతములవా రంగీకరించిరి. శాశ్వతమైన యాత్మనే యంగీకరింపని బుద్ధుఁ డైనను జన్మాంతర మంగీకరించినాఁడు.

మనుజునకుఁ దెలిసిన జన్మములు మూఁడు వెనుకటిది, యిప్పటిది, ముందిది. ఇప్పటి స్థితిగతులనుబట్టి పూర్వజన్మ మెట్టిదో యూహింప వచ్చును. ఇప్పటిజన్మములోని మన కర్మములనుబట్టియుత్తరజన్మమూహింప వచ్చును. ఇప్పటి జన్మము మనకుఁ బ్రత్యక్షమే కావున ననుభవమే కాని యనుమాన మక్కఱలేదు. పర్షియాదేశస్థులు పునర్జన్మ మున్న దని యూహించినారు. గ్రీసుదేశస్థులు పునర్జన్మ మున్నదని యొప్పుకొనిరి. హెబ్రూ జాతిలోఁ గొందఱు పునర్జన్మమునందు విశ్వాసము గలిగియుండిరి. మహమ్మదీయులలోఁ గొందఱు పూర్వజన్మ మంగీకరించిరి. ఇట్లనేక మత సంప్రదాయజ్ఞులు ప్రాసియున్నారు.

మహ్మదీయులు ప్రపంచజనులను మహమ్మదీయులుగ–కాఫరులుగ విభజించినట్లు క్రీస్తుమతస్థులు జనలోకమును క్రైస్తవులుగ–హీతెనులుగ విభాగించినట్లు మన యార్యులు మనుజుల నార్యులుగ–ననార్యులుగ విభజించియున్నారు. ఆర్యులలో దాదాపుగా నందఱు మృతకళేబరమున కగ్నిసంస్కారవిధుల నంగీకరించినారు. అనార్యులగు నితర దేశీయు లందఱు ఖననసంస్కారమే యంగీకరించినారు.

ఆత్మను గూర్చి పునర్జన్మమునుగూర్చియుఁ బూర్వపు టీజిప్టుదేశపు వారి యభిప్రాయమును నేను బెద్దలవలన వినినంతవఱకుఁ జెప్పుదును. ఆత్మకు స్వతంత్రస్థితి లేదు. ఆత్మకంటె దేహమే ప్రబలతరమయినది. దేహమే యాత్మను విడుచునుగాని యాత్మ దేహమును విడుచునది కాదు. విడుచుటకు శక్తిగలదియుఁ గాదు. అది దేహమున్నంతకాల మిష్టమున్నను లేకున్నను దేహమున నివసింపకతప్పదు. దేహ మెప్పుడు దానికి సెలవిచ్చునో యప్పుడు పోవలసినదే. అది శరీరమునకు నీడ వంటిది. అది సరిగా శరీరాకృతినే యుండును. పాము కుబుసమునకుఁ బామున కెట్టి సన్నిహితత్వమో–యాత్మకు దేహమునకుఁ గొంచెము హెచ్చుతగ్గుగ నట్టిదే. ఇదికాక, యది దేహము చెడిపోకుండ నున్నంత కాలమే నిలుచును. దేహ మేకారణమున నైనఁ జెడిపోవునెడల నాత్మకు నాశనమే

కాని వేఱొకటి లేదు. అది శరీరమునుండి విడిచిపోయిన తరువాత బ్రపంచమం దంతటను మహాక్షోభము నొందుచుఁ దిరుగును పాపము దానికి శరీరధర్మము లన్నియు నున్నవి. శరీరవ్యసనము లన్నియు నున్నవి. కాని తీర్చుకొను సాధనములు లేవు. అఁకలిచే నది తపించిపోవును. ఏది! అన్నము తినుటకు దేహమున్నఁగాని వీలులేదు. దప్పిచే నది యెంత క్షోభమునైనఁ బడును. ఏదీ! దేహము లేకపోవుటచేత దప్పి యెట్లు తీరును? ఇట్లనేక బాధలఁ బడుచు నాకాశమనఁ దిరుగుచుఁ వన దేహ మెక్కడఁ బూడ్చి పెట్టఁబడియున్నదో రాత్రిభాగమునం దక్కడికి వచ్చి తెల్లవారువఱ కక్కడనే కనిపెట్టుకొని యేడ్చుచుండును. ఖననము చేయఁబడిన శరీరములోనే భాగమయినఁ గ్రుళ్ళిన యెడల నాత్మలో సరిగా నాభాగమే నశించును. కావున దేహముచెడకుండ నున్నంతకాలమే యాత్మకు బ్రదుకు. ఇట్లు కొంతకాలము నిశ్శరీరాత్మ ప్రపంచమంతయుఁ దిరిగితిరిగి బాధపడిపడి పిమ్మటఁ బూర్వపాప పుణ్యముల ననుసరించి మఱియొక దేహమునఁ బ్రవేశించును. ఆలోపల మాత్రము పూర్వశరీరము నశింపఁగూడదు. అట్లు నశించునెడల నాత్మకధోగతియే కాని వేఱొకటి లేదు. కావున దేహము నశించిపోకుండ నిల్చినట్లుగా దానిని భద్రముగా సంరక్షింపవలయును. ఇసుక యెడారులు గల ప్రదేశములందు మృతదేహములను నిక్షేప మొనర్చినయెడలఁ జిలకాల మవి నిలువయుండఁగలవు. ఈజిప్టు దేశపువారి యభిప్రాయమిది.

ఆత్మసద్గతి నపేక్షించియే వారు మృతదేహములను జిరకాలము రక్షించుట కెన్ని యోజనలో చేసినారు. తుదకు ''మమ్మీ'' లను జేయుమార్గములను గనిపట్టి కృతార్థులైరి. మఱియొకజాతివారి యభిప్రాయమును మనవిచేసెదను. 'ఛాల్డీనుల' లోఁ గూడఁ గొంచెము హెచ్చుతగ్గుగ నిట్టి యభిప్రాయమే యుండెను. దేహ మెచ్చట ఖననముచేయఁ బడెనో యచ్చటనే యాత్మ నిలిచియుండు నని వారి నమ్మకము. ప్రాతిపెట్టఁబడిన శరీరము కొంతకాలమునకు లేచుననియు నప్పుడు దానిలోఁ దాను ప్రవేశింపవచ్చుననియు నాశతో నమాధిస్థానమునన్నే యది కనిపెట్టుకొనియుండును. ఇట్టి పునర్జీవనవిశ్వాసము క్రిస్టియనులం దఱలోను సామాన్యముగానున్నది–దీనికే 'రినరెక్షను' అని పేరు. ఆంగ్లేయులలోఁ గూడఁ బూర్వుల కిట్టి యభిప్రాయమే యుండెను. 'టు గివపు ది ఘోస్టు' అనఁగా మృతినొందుట యని వారిభాషలో నర్థము–దేహమే యాత్మను విడుచు నని వారి నమ్మకము–దేహము ప్రధానమైనది. ఆత్మ యప్రధానమైన దని వారి విశ్వాసము.

దాదాపుగ నన్యార్యజాతు లన్నిటిలోఁగూడ దేహము కాపాడఁబడి యున్నంతకాలమే యాత్మకు సద్గతి యని నమ్మిక–అందువలననే విగతప్రాణుల శరీరములను నిలువయుంపఁ గల పదార్థములతోఁ జేరిచి ఖననమొనర్చి మఱింత జాగరూకతకొఱకుఁ బైన భవనములను గట్టించు నాచారము వారిలో నేర్పడినది–తరువాత–నా జాతులలో ననేక తత్త్వజ్ఞులు బయలుదేరి యాత్మశాశ్వతత్త్వముకు స్థిరపఱచినను జిరకాలము నుండి వచ్చుచున్న ఖననాచారమే పురాతనతఁబట్టి గౌరవింపఁ బడుచు వచ్చెను–దేహమును సరంక్షింప నక్కఱ యింక లేదుగదా దాని నింక నేల ప్రాతిపెట్టి భద్రపఱుపవలయు నని యెంచి వారు ఖననాచారమును వదలుకొనలేకపోయిరి.

ఆర్యులు మొదటినుండియు నాత్మశాశ్వతత్త్వము గుర్తెరిఁగినవారు కావున వారిలో శరీరదహనాచారమే మొదటినుండియు నున్నది. ఆత్మకు జన్మపరంపర లున్న వని యార్య

లకు నన్యోరులలో ననేకులకుఁ గూడ దృఢవిశ్వాస మున్నది.

నేను నా యనుభవములో నున్న యొక్క చిన్నయింశమును జెప్పెదను. కోడిమూంస ముతో జేసిన పలావనగ నాకు మిగుల నిష్టము–తఱుచుగా దానిని జేయించి యాహరించువాఁడను. మంచిమంచి కోళ్లను నేను బెంచుచుండవాఁడను–ఒకసారి యొక దూరదేశమునుండి –(పారసీకదేశము కాఁబోలు) యొక్కఁ డొక కోడిని దెచ్చి నాకుఁ జూపెను. అది యెంత సుందరముగా నైన నున్నది. దాని స్వరూపలావణ్య నపేక్షించి దానిని గొంటిని–ధాని సొగసును జూచి దాని నత్యంతానురాగమునఁ జూచుచుంటిని. దానిని జంపి తినవలయుననను కోరిక నా కెన్నఁడు లేదు. కాని యెన్నఁడును దానిని వధించి వండవలసినదని నావంటవానితోఁ జెప్పి యుండలేదు. నా యభిప్రాయము నాతఁ డెఱిఁగి యుండనికారణ మున నాతఁ డొక్క రాత్రి దానిని వధించి నాకుఁ బలావుచేసి పెట్టెను. ఎఱుఁగక నేను తిని పండుకొంటిని. నా కొక్క స్వప్నము వచ్చినది. దానిని జెప్పెదను వినుఁడు.

నే నే కోడిని రూపసౌందర్యము నపేక్షించి కొంటినో, దేని నత్యంతానురాగమునఁ బెంచితినో, దేనిని బ్రమాదమున భక్షించితినో, యా కోడియే స్వప్నమున నాకుఁ గానఁబడెను. కన్నులవెంట బాష్పములుపదేపదే యుద్గమించుచుండ నది మనుష్యకంఠమున రోదన మొనర్చుచు మనుష్య భాషణముల నిట్లనియెను.

''నాచరిత్రమును గొంచెముగాఁ జెప్పెదను వినుము. జ్ఞప్తియున్నంతవఱకు నాపూ ర్వజన్మ పరంపరవిశేషములను జెప్పెదను. నేను జిరకాలముక్రింద నల్లినై పుట్టితిని. అట్లు పుట్టకపూర్వమున నే ట్లుంటినో నాకు జ్ఞప్తిలేదు. నల్లినై నబాబుగారిభార్య పట్టుపఱుపునఁ జేరి పరమానందమున బ్రదుకుచుంటిని. ఒక్క రాత్రి నామె యున్నగదికిఁ దొంగలు కన్నమునైచి లోనఁ బ్రవేశించిరి. ఆమె యాభరణములను దీసికొందమని కొందఱు, నాభరణములను దీసికొనుచుండ నామెకు మెలఁకువ వచ్చినయెడల మహాప్రమాదము కావున మొదట గట్టిగ గొంతునులిమి యామెను జంపి పిదప నాభరణములను సావకాశముగాఁ దీసికొంద మని కొందఱు, ప్రాణములు దీసికొను పాపము మన కెందులకు? నోటిలో గుడ్డలుక్రుక్కి దూరమునకుఁ దీసికొనిపోయి యక్కడ నగలొలుచుకొని వదలిపెట్టుద మని కొందఱు, తమలోఁ దాము వితర్కించుకొనుచుఁ గాఁబోలుఁ గొంతదూరమునఁ జోరులు నిలువఁబడిరి. అంతట నేను బట్టుతలాడకున్న జలతారు కుచ్చులలోనుండి జఱజఱ ప్రాకివచ్చి మొకమాలుకంటె మెత్తనైనయామెబుగ్గపై గట్టిగఁ గుట్టితిని. అమ్మయ్యో యని యామె లేచెను. చు పట్టులఁ బండుకొన్నదాసు లులికిపడి యేమమ్మా యేమమ్మా యని యఱచుచు లేచిరి. అప్పివఱకే తఱచి సిద్ధముగా నుంచిన ద్వారమున దొంగలు పారిపోయిరి. దొంగలు వచ్చినా రనియు వారిబారిని బడకుండ నామె ప్రాణమును రక్షింప వలయు ననుసదుద్దేశముతో నామెను గుట్టలేదు. కడుపుకక్కురితిచేతఁ గుట్టితిని. అబుద్ధిపూర్వకముగ నైన నావలన నబాబుగారిభార్యకు జరిగిన యుపకారమునకై నేను గొంతకాలమునకు నొక్క రాజకాంతకు దాసినై పుట్టితిని. నేను సుందరస్వరూపిణి నై యుంటిని. మారాణిగారి కొక్క కుమారుఁడు. పరమసుందరుఁడు. ఆయనను బెండ్లిచేసికొనవలయు నని నాకు మహావాంఛగ నుండెను. నా కోరిక తీఱుదగినది కా దని నే నెఱుఁగుదును. అయ్యో! దాసివంశమునఁ బుట్టితిని గాని రాజవంశముననే పుట్టినయెడల నారాజార్భకుని బెండ్లిచేసికొనఁగలిగియుందు

నుగదా యని లోలోనఁ గ్రుళ్లిక్రుళ్లి యేడ్చి యన్నము తిన్నగఁ దినక, నీరైనఁ దఱచుగఁ ద్రావక, నిద్ర యనునది యెఱుఁగనే యెఱుఁగక, నా కోరిక యెవ్వరికిఁ గూడ దెలియనీయ కుండ బెంగచే గుండెపగిలి శీఘ్రకాలములో మరణించి మరికొంతకాలమన కొక్క మహారాజు భార్యనై పుట్టితిని. నాభర్త నాకుఁ బరమవిధేయుఁడు–నామాట యాతనికి వేదవాక్యము. నాభర్తను నాతని ప్రజలనుగూడ నేనే పరిపాలించితిని. రాణిగారి యాజ్ఞయేకాని రాజాజ్ఞ యనునది నారాష్ట్రమున లేకుండఁజేసితిని. రాజకీయవ్యవహారపత్రము లన్నియు నానంతక ములతోడనే వెడలు చుండెడివి. నాభర్తకదియెంత ప్రేమయోకాని నేను జెప్పఁజాలను. నీయిష్టమెటులో యటులేయనుమాటతప్ప మరియొక్క మాట నాతఁ డెఱుఁగనే యెఱుఁగఁడు. ఇట్లు కొంతకాలము భర్తను మూలఁ గూరుచుండఁబెట్టి నర్వస్వాతంత్ర్య ములతోఁ బ్రజాపాలన మొనర్చి ప్రాణములఁ బాసితిని–అటుపిమ్మటఁ గొంతకాలమునకు నే నొక మహారాజునింటఁ బుట్టితిని. నే నామహారాజునకు రెండవపుత్రుఁడను. మాతండ్రిగారు మృతినొందిన పిమ్మట మాయన్నగారు రాజ్యము చేయుచుండిరి. ఆయన కొక్క కుమారుఁ డు–ఆ చిన్నవాఁడు పుట్టిన నెలదినములకే మాయన్నగారు మరణించిరి. –ప్రాణోత్క్రమణసమయమున నాయన 'తమ్ముఁడా! నాకు దేవుని పిలవైనది. నా కుమారుఁ డింకఁ బురిటిగ్రుడ్డ్డియున్నాఁడు. వాఁడు పెద్దవాఁ డగువఱకు వాని పక్షమున నీ వీ రాజ్యమును బరిపాలించి యాతనికి యుక్తవయస్సు పచ్చినపిమ్మట నారాజ్య మాతని కీయవలయును' అని చెప్పెను. నే నంగీకరించి మాయన్నగారి కుమారుని బెంచుచుంటిని. అతనిపక్షమున రాజ్యమును బరిపాలించుచుంటిని–ఇంతలో నాభార్య గర్భవతియైనది. పుత్రుఁడు కలుగు నని కార్తాంతికులందరు చెప్పిరి–అటులే పుత్రుఁ డుదయించినాఁడు. నాపు త్రునియందలి మమకారమున నాతనికే రాజ్యము చేర్పవలయు నని పాపచింతచే నాయన్న పుత్రుని గొంతుగోయించి చంపించితిని. నేనే యీద్రోహ మొనర్చినవాఁడ నని సమీపభూపా లురు కొంద రెఱిఁగి నాపై దండెత్తి నన్ను రాజ్యభ్రష్టుని జేసిరి. కన్నకొడుకును భార్యను దీసికొని నట్టడవులపాలై తిరిగితిరిగి తుద కొక్కపల్లెఁ జేరి, యచట నర్పదష్టుఁడనై చచ్చితిని. అటుపిమ్మట నతిశీఘ్రకాలములోఁ గోడినై పుట్టితిని. నీ యిల్లు చేరితినని మహానంద మొందితిని. తుదకు–నీవె నన్నుఁ బలావుచేయించి పారణ మొనర్చితివి. నాయన! నీ వింత చేయుదు వని నే ననుకొనలేదురా! క్రిందటి రాజజన్మమున నాకుఁ బుట్టిన పుత్రుఁడవు నీవేరా! నిన్నుఁ గన్నతండ్రిని నేనేరా.''

''ఇటు లాకోడి పెద్దపెట్టున నేడువగా గుండెలవిసి పోవమేల్కాంచితిని. వంటవానిఁ బిలిచి నాకోడి యేదని యడిగితిని. పలావుచేసితి నని యాతఁడు పలికెను. అయ్యయ్యో! నాతండ్రిని జంపి నాకు బెట్టితివఁటరా యని బిగ్గరగ నేడ్చితిని. నాకు దయ్యము పట్టినదనియో మతిపోయినదనియో యెంచి మాంత్రికులు వైద్యులు వచ్చిరి. నేను వారి చికిత్సల నంగీకరిం పక యాగ్రామమును విడిచి యప్పటినుండియు దేశ సంచారినై విరాగినై యుంటిని. మాంసాశనమును వర్జించితిని. పాలు మాత్రమే త్రావుదును.''

ఇట్లాక్షత్రియుఁడు పలికి యూరకుండఁగ నేను ''అయ్యా! క్షత్రియయోగిగారి యుపన్యాసములోని యభిప్రాయములను నేను విమర్శింపవలసియున్నది. కావున నాకుఁ గొంత యవకాశమీయవలయు'' నని సభ వారిని ప్రార్థించితిని. ''ఆయనమాట కెదురాడఁ

గూడదు. పోపో.'' యని వారిలోఁ గొందఱు నన్ను మందలించిరి. అప్పుడు నేను ''మీసభ వంటి సభ మాకుఁగూడ నున్నది. మీసభలో నుపన్యసించుటకు వీలులేని యెడల మాసభలో దీనికిఁ బ్రత్యుపన్యాస మిచ్చెదను. ఒక్క బీద బ్రాహ్మణుఁ డొక్క నంపన్నుని యింటికి యాచనకై పోయినాఁడఁట–ఆగృహస్థుని యింటిగుమ్మమునొద్ద కావలియున్న సేవకు లిది శిరస్దారుగారి యిల్లు పోపో యని యాతని నదలించిరి. మీ ప్రభువు మాత్రమే శిరస్దారుకాఁడు. నేనుగూడ శిరస్దారునే. ఇదగో శిరస్సు. ఇదిగో దారి. ఈ దారిని బోయెద నని చెప్పి పోయినాఁడఁట. అటులే నేనును బోవుచున్నాఁడ నని వెడలివచ్చితిని. ఈ యుపన్యాసమునకు ఖండనము మఱి యొకప్పు డెప్పుడైనఁ జెప్పెదను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

17. లక్ష్మీ కటాక్షము

ఒక గ్రంథకర్తగారు వ్రాసిన ఉత్తరాన్ని జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నాడు.

ప్రభువులకు ఎప్పుడు అనుగ్రహం కలుగుతుందో, ఎప్పుడు ఆగ్రహం కలుగుతుందో చెప్పడం కష్టం అనే అర్థం వచ్చే మాట, పారసీక మహాకవి 'సాదీ' అన్నాడంటూ ఆ ఉత్తరం ప్రారంభమైంది. ఆ గ్రంథకర్త గారు ఇందుకు ఒక కథను ఉదాహరణగా చెప్పారు.

అనగనగా ఒక పురుషోత్తమ భట్టు. ఎవరూలేని ఒంటిగాడు. పరమ దరిద్రుడు. గుడి ప్రసాదాలమీద బ్రతుకుతూ, భగవన్నామం చేసుకుంటూ రోజులు వెళ్ళదీసే నిర్లిప్తుడు- కాని, ఉక్కు-తునక వంటి శరీరం గలవాడు.

ఒకసారి లక్ష్మీదేవి అతనికి కలలో కనిసించి 'నేనింక నీయింట బంగారు గజ్జెలతో తాండవిస్తాను' అంది. దానికాబ్రాహ్మణుడు, తల్లీ నీదయకు సంతోషమేగాని, ఏ బాధలూ లేకుండా బ్రతుకుతున్నాను. ఇలా వుండనీ చాలన్నాడు. దానికి లక్ష్మీదేవి, నీ యిష్టమేంలేదు. నీ సత్కర్మాలపూర్వకర్మ ఫలానుసారం నేను నీ యింట ఉండక తీరదంది. బ్రాహ్మణుడు అలాగేనని తలవంచి నమస్కరించి, ఒక్కకోరిక మాత్రం కోరాడు. వెళ్లిపోబోయే ముందు మాత్రం కొంచెం సూచన చెయ్యమన్నాడు. లక్ష్మీదేవి, ఆ సూచన ఎలా వుంటుందో అప్పుడే చెప్పింది.

సరే-బ్రాహ్మణుడికి సిరులెత్తుకున్నాయి. రాజాదరణ 'వరద'లాగ లభించింది. తన మాట శాసనంలాగ చెల్లింది. అఖండ సంపద, భార్య, పిల్లలు కుదిరారు.

లక్ష్మీదేవి సూచించిన సూచన బ్రాహ్మణుడు గుర్తించాడు. భార్యను పిలిచి కావలసినంత డబ్బు తీసుకుని పిల్లలతో పుట్టింటికి వెళ్లిపొమ్మని పంపించేశాడు.

అడవిలో, అతను రాజును చంపబోయాడనే అభియోగం వచ్చింది. బ్రాహ్మణున్ని ఖైదులోపారేశారు. న్యాయవిచారణ సమయంలో, బ్రహ్మణుడి అసలు ఆస్తి బయటపడింది. దానికి తను వివరణ చెప్పాడు. ప్రారబ్ధకర్మం బలవత్తరమైందనీ, దానికెవర్నీ నిందించ పనిలేదనీ, శాస్త్రి చివరికి తేల్చాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:-

''నాయనలారా! నాకీయుత్తరము వచ్చినది. ఇది యొక్క గ్రంథకర్త వ్రాసినాడు.

మన సభలో దీనిని జదువుమని నాయొద్ద కాతఁ డంపినాఁడు చదివెదను.

'వంగి నలాముచేసిన భటుని కొకప్పుడు సాదుషా 'దెవిడిమనా' చెప్పుననియుఁ దన్నుఁ జెడమడఁ దిట్టిన దాసుని కొకప్పుడాతఁడు విలువలేని బహుమానములు ప్రసాదించు ననియు 'సాది' యను పారసీక మహాకవి వ్రాసినాఁడు. ప్రభువుల హృదయములు చూలింత రాండ్ర రుచులవలె సర్వదా చంచలము లనియు వారి కందువలనఁ బ్రజలందట్టి యనురా గము కలుగుననియు నట్టివైరము కలుగుననియు ననురాగము కలుగుటకుఁగాని యాగ్ర హము కలుగుటకుఁగాని ప్రత్యక్షహేతువు లేవియు నుండవనియు సాదీగా రాసందర్భమున నభిప్రాయపడినట్లు కనఁబడుచున్నది. అంతేకాక యొకప్పుడు ప్రజల నమస్కారమే సాదుషా పెట్టునకుఁ గారణ మగుననియుఁగూడ నా కవిశిఖామణి సెలవిచ్చి యున్నాఁడు. మన శ్చాంచల్యముచేఁ బ్రభువులు ప్రజలయెడల బహువిపరీతముగాఁ బ్రవర్తింతు రని యాయన లేఖనవైఖరినిబట్టి మన మెంచుకొన వలసినట్లు కానఁబడుచున్నది. సత్యమై యుండవచ్చు నేమో అయినను నాకుఁ దెలిసిన యొక చిన్నకథను జెప్పెదను.

'అనఁగననఁగ నొక యూర నొక బ్రాహ్మణుఁడు. ఆతఁడు చింత దుక్క –ఉక్కు–తునక–మంచి నడికాలములో నున్నాఁడు. ఆతనికి 'నా' యనఁదగినవా రెవ్వరులేరు. తల్లిలేదు. తండ్రి లేఁడు. సోదరులు లేరు. ఇల్లు లేదు వాకిలి లేదు. ప్రక్క–లో భార్య లేదు. చేతఁ బైస లేదు. ఒడలు కప్పిన పుట్టము లేదు. కడుపునిండిన యన్నములేదు. వట్టిరిక్తుఁడు. పరమదరిద్రుఁడు. దరిద్రుఁడు కదా యని దురన్నదుర్దానములకుఁ బ్రోవు వాఁడు కాఁడు. ఆ యూరనున్న వైష్ణవాలయమును గనిపెట్టుకొని చిత్రాన్న దధ్యోదనాది భక్షణమునఁ బుట్టిలో నేఁదుము మట్టున కుదరమును యథోచితముగాఁ గాలానుగుణముగాఁ బరామర్శిం చుచున్నాఁడు. గుడిలోపల మూలవిరాట్టు–గుడియరుఁగుమీఁద బురుషోత్తమభట్టు –నొక్క–టే పాడుగు నొక్క–టే లావు నొక్క–టే నలుపు నొక్క–టే గట్టి కాని యాతనికిఁ బరిపూర్ణమైన పస్తు. ఈతనికిఁ బస్తువంటి యెంగిలి లంఘనములు–కొంద ఱెంతతిన్నను నెన్నిసారులు తిన్నను నెండు నక్క–లవలె నుందురు. అల్పాహారముతోనైన మన యయ్యవా రాయన విగ్రహమువలె నున్నాఁడు. జవునెముకమనుజుఁడు, సంపూర్ణ బలాఢ్యుఁడు, పడమటివాఁడగుటచేఁ బ్రబలమైన, గాత్రధర్మము కలవాఁడు, పెద్దవరునలలోని మనుష్యుఁడు. కాని యెంత శరీరపాటవము కలవాఁడో యంత శాంత గుణసమంజసుఁడు. ఎంత భోజనప్రియుఁడో యంత వినమ్రుఁడు. ఎంత వయఃప్రాదుర్భావము కలవాఁడో యంత జ్ఞానోదయము కలవాఁడు. తఱచుగా నాతఁ డిష్టదేవతను గూర్చి జప మొనర్చుచుండును. నిశ్చల దైవభక్తి కలవాఁడు.

ఒకనాఁడు శ్రీమహాలక్ష్మి–స్వప్నమునఁ గాఁబోలు నాతనికి సాక్షాత్కరించి "నాయనా! నీ యోగ్యతకు మెచ్చితి. నీభక్తికి సంతసించితిని. నీకు వరమిచ్చుటకై వచ్చితి. నేను నీయింట నింతటినుండి నివసించి బంగరుగజ్జెలతోఁ దాండవింతును. నీయింట నింక నిత్యకళ్యాణము పచ్చతోరణము. నీవు పట్టినదెల్ల బంగారమగును. ముట్టినదెల్ల ముత్యము గును. నీవు విశేషైశ్వర్యమున నింక నోలలాడుదువు." అని చెప్పను. అప్పు డాబీద బ్రాహ్మణుఁ డదరివడి, "తల్లీ! నీకు నమస్కారము–నీవు నాభక్తికి సంతసించినట్లే నేను నీ యనురాగమునకు సంతసించితిని. నీకటాక్షమునాకు రాకుండుటచేతనే నేనింక సుఖముగ

నున్నాను. ఏది యేమైపోయినను నాకిప్పుడు బెంగయేమియు లేదు. మనస్సు నిర్వికారము నిశ్చింతగ నున్నది. ప్రసాదప్రదానావసరమున దేవాలయమునకుఁ బోయి పూజారి పుణ్యమా యని యాతఁ డేమైనఁ బెట్టినయెడలఁ దిందును. తిని యెచ్చటనో ముక్కుమూసికొని కూరుచుందును. నేను దేవులాడఁదగినవారు నా కెవరు లేరు. ఒకరు నన్ను గూర్చి దేవులాడ నక్కఱ లేదు. నేను లోకమునకుఁ గాదుకదా నామట్టునకే నేను లేనట్లు ప్రవర్తించుచున్నాను –ఉత్తరక్షణమున దేవుని సెలవగునెడల తొక్కలు కట్టుకొని వెనుకచూపు లేకుండ నెగిరిపోవు దును. తల్లీ! నీ యాజ్ఞను నిరాకరించితి నని నీవు కోపపడకుము. నీవు నాయింటఁ జేరవలదు. నీవు నాకక్కఱలేదు. ఇదిగో సహస్రసాష్టాంగనమస్కారము.'' లని యాబ్రాహ్మణుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ''వెఱ్ఱివాఁడా! సుఖదుఃఖములు వలదన్నఁ బోవునటనుకొంటివా? నీపూర్వకర్మము ననుసరించి యిపుడు నీకు మహాభాగ్యము లభింపనైయున్నది. నీ లెక్క యేమి? బ్రహ్మాదిదేవతలే ప్రారబ్ధకర్మబద్ధు లని యెఱుఁగవా? మాటలాడకుండ మహైశ్వర్య మనుభవింపుము. నీవు చేసికొన్న కార్యమువలనఁ గలిగిన ఫలము నీ వనుభవింపక నిరాకరించి నయెడల మఱియెవ్వఁ డనుభవించు ననుకొంటివి? నీవు నిత్యము తినుచున్న చిట్టిగారెలవ లన శక్తియు? జిడ్డుము నీకే కలుగుచున్నవా? నీ యూరికరణమునకుఁ గలుగుచున్నవాఁ వెఱ్ఱిమాట లాడకుము. నీవు పొమ్మన్నఁ బోవుదానను గాను. ఇఁక నిన్ను నేనావహింతు''నని గంభీరభాషణముల నాకమలాదేవి యానతిచ్చెను. అప్పు డాభగవతుఁడు ''అమ్మా! నీ యిష్టమెటులో యటులే–నీవు నన్నావహించెదనంటిని–నేనడ్డుపెట్టఁజాలను –కానినాదొక్క-ప్రార్థనమున్నది. నీవు నన్ను విడిచిపెట్టిపోవునెడలమాత్ర మిదిగో పోవుచున్నా నని రవంత ముందుగఁ జెప్పి మఱిపొమ్ము.'' అని మహాలక్ష్మిదేవితో మనవి చేసికొనెను. అప్పుడామె ''నాయనా! నీతో నేను ముందుగాఁ జెప్పి మఱిపోదును. అది యెట్లో యిప్పుడే చెప్పెదను వినుము. ఒక లక్ష్మివారమున సాయంసమయమున నీభార్య రత్నాభరణముల జిలజిలలతో బంగారుటందెలగలగలలతో మేడమెట్లు దాసిదానిచేయూతఁగొని దిగుచు ''భటులు లేరు – బానిసలు లేరు. దీపములు లేవు ధూపములు లేవు–ప్రక్కలు లేవు బండలు లేవు. అందఱుకూడ నెక్కడ నంతరించిరిరా?'' యని పలుకును. అప్పుడే నేను నీ యిల్లు వదలిపోవుచున్నానని నీవు గ్రహించుకొనవలయును'' అని యాతనితో సెలవిచ్చెను. సరే యని యాతఁడు నమ్మతించెను. అంబామతల్లి యంతర్ధాన మొందెను.

ఆనాఁడే యెవ్వఁడో నంపన్నుఁడు దేవాలయములో వసంతోత్సవ మొనర్చెను–మన పురుషోత్తమాచార్యులుగారి నాదినమున నందఱును గౌరవించిరి. భాగ్యోదయవిషయమై మానిసికున్న పసి వేఁట కుక్క (బ్లడ్ హౌండు) కేది? అదృష్టమున కున్న యాకర్షణశక్తి యవనికేది? ఓ! అంద ఱాతనికి గందము పూయువారే, మెడలో మెల్లదండలు వేయువారే, శ్రీపాద రేణువును జేతి కందిచ్చువారే, అయ్యవారులా దినమున నారగించిన మామిడిపండ్లకుఁ బననతొనలకు మింటిపై జుక్కలవలె లెక్కలేదు! ముప్పదియేండ్ల కా దినమునందే కడుపునిండినది. ఇట్లాహరించి జాఱుముడితో ద్వాదశోర్ధ్వపుండ్రములతోఁ జందన లిప్తగాత్రముతోఁ బచ్చకప్రపుజిగజిగలతోఁ గస్తూరిగమగమలతోఁ దిన్నగ నాతఁడు కోటలోనికిఁ బోయెను. ఆజానుబాహుఁడు నాచార్య పురుషుఁడు శంఖచక్ర చిహ్నిత భుజుఁడు నగు నాతనిని పహరా వారెవ్వరు నడ్డగించలేదు. 'రాజుగారి గురువుగారురా' యని యెవరిమట్టునకు వారే యోసరిల్లి దారియిచ్చిరి. ఆతఁడు నిరభ్యంతరముగ నేడు

పహరాలు దాటి, తుదకు రాణిగారి శయ్యాగృహములోనికిఁ బోయెను. ఆమె నిద్రించుచున్నది. అంత నీతని కేమి బుద్ధిపుట్టినో యేమి తోఁచెనో పరమాత్మునికే యెఱుక. శయనించుచున్న రాణిగారిని బాహువుల నందున గట్టిగ నిఱికించుకొని లేవనెత్తి మఱి యొక్క ప్రక్కమీఁదికి వివరివైచెను. అంతఁ దీవ్రకోపి యై రూక్షేక్షణయై నిలువుటద్దము మొదటఁ బెట్టిన బాకును దీసికొని శక్తిస్వరూపిణియై యార్చుచు నాతనిని రాణిగారు బొడువఁబోవునంతలో రాజుగా రా సందడిని విని గదిలోనికి వచ్చిరి. ఆయన లోని కడుగు వెట్టుట యేమి? రాజుగారి బంగారుపూఁత పట్టెమంచపుఁ బందిరిపై నుండి బారెఁడు త్రాఁచుపాము పట్టుపఱుపుపైఁ బడుట యేమి? అట్టి యత్యద్భుతసన్నివేశ మవలోకించి యంతకుఁ బూర్వమున జరిగిన సంగతులను విని రాజుగారు బట్ట మెడకుఁజుట్టుకొని ''స్వామీ మీరు భగవంతునిచే నాభార్యను బాముబారినుండి రక్షించుటకై యిటకుఁ బంపఁబడినవారుకాని వేఱుకాదు. నేను మీ భృత్యుఁడను. మీరు నాచే సేవచేయించుకొనుచు నాప్రాభవమంతయు ననుభవించుచు నిటనే యుండు'' డని ప్రార్థించెను–లక్ష్మీకటాక్ష మహిమయేకదా యని యాభాగవతుఁడు నిశ్చయపఱచుకొని కోట వెలుపల నొక్క భవనమున నుండుట కంగీకరించెను. రాజుగారి భండారమున కంతయునీతఁడే యధికారి –రాజుగారికి వచ్చు రాఁబడియంతయు నీతని మేడలలోనే భద్రపఱుపఁబడుచున్నది. 'ఈసొమ్ము నీవేమిచేసి కొన్నసరియే. ఇదియంతయు నీదేకాని నాది యెంతమాత్రముకా.' దని యారాజుగారు మనవిచేసికొన్నప్పు డిఁక నభ్యంతర మేమి? ఈయన క్రిందఁ బ్రధానులు కార్యదర్శులు సేనాధిపతులు–ఓ–వారేమి వీరేమి? రాజుగారే వారి కధీనుఁడైనప్పుడు రాష్ట్రప్రజల లెక్కయేమి? రాజకీయ వ్యవహారప్రపంచమున నిట్లు జరుగుచుండఁగాఁ గుటుంబప్రపంచ వ్యవహారమున నింతకంటెఁ జిత్రము జరుగుచున్నది. అప్సరసవంటి యాలిని బెండ్లిచేసికొన్నాఁడు. ఆఱుమాసములకే యామె చూలింతరాలైనది. పందెపుగుఱ్ఱమున కడ్డున్నది. ప్రభంజనుని కడ్డున్నది. బాంబున కడ్డున్నది. కాని భాగ్యఫలమున కడ్డున్నదా? ఆమె వేవిళ్లకు రాణిగారు వింతవింతసూడిద లంపినారు–రాజుగారికి మతిలేక పదేపదే క్షేమప్రశ్నము లంపినారు. కదలినయెడలఁ గడుపు చెదఱిపోవు నని కడుపుకాలు పూర్వజన్మ మునుండియు నెఱుఁగని దొరసానులు హెచ్చరిక లంపినారు. ప్రజలంద ఱామెకు సుపుత్రలాభము కలుగవలయు నని యిష్టదేవతలకుఁ బ్రార్థన లంపినారు. నిర్భాగ్యకవులు నవరత్నమాలిక లంపినారు. పురిటికి నేపాళమునుండి కస్తూరి వచ్చినది. కాబూలునుండి యింగువ వచ్చినది. కాశినుండి యాపులు వచ్చినవి. హైదరాబాదు నుండి పండ్లకప్పు వచ్చినది. బెంగుళూరునుండి పండ్లు వచ్చినవి. తుదకామెకు నొప్పులు వచ్చినవి. కొడుకుపుట్టక కూఁతురు పుట్టుటచేతఁ గన్నీళ్లు వచ్చినవి. కొడుకు పుట్టునని చెప్పిన దైవజ్ఞుల నెత్తికిఁ జేతులు వచ్చినవి. తఱువాత మఱియొక్క బిడ్డ నామెకనెను. అటుపిమ్మట మఱియొక బిడ్డను గాంచెను–ఇట్లు పైస్థాయిలో భాగ్యదేవత పదినంవత్సరములు కాఁబోలుఁ బరమాద్భుతముగ బాడినది. ఆపాటలలోఁ జెప్పవలసిన దేమున్నది? ఓ! కృతులు కావు. కీర్తనలు కావు. పదములు కావు. పల్లవులు కావు. తత్త్వములు కావు. తందానపదములు కావు. 'గజళ్లు' గావు. కందార్థములు కావు. స్వరజతులు కావు. జావళీలు కావు. గాన సారస్వతమంతయుఁ గడతేఱినట్లు పాడినది. నుతి మార్చలేదు. ఊపిరి తీసికొనలేదు. గొంతు సవరించుకొనలేదు.

ఒక లక్ష్మీవారమున సాయంసమయమున నాతని భార్య దాసికా భుజవినిక్షిప్తహస్తప
ద్మయై మేడమెట్లు దిగుచు 'భటులు లేరు బానిసలు లేరు–దీపములు లేవు ధూపములు
లేవు–ప్రక్కలు లేవు బండలు లేవు. అందఱుఁగూడ నెక్కడ నంతరించిపోయిరిరా?'' యని
కోపతీవ్రతతో నఱచెను. ఆమాటలు వినియెడ లాపాదమస్తకము జల్లున నీరు విడువఁగ
మన భాగవతోత్తముఁడు బిగ్గఱగ రెండుచేతులు జోడించుకొని ''తల్లీ! తల్లీ! పోవుచుం
టినా?'' యని మహానందమున నఱచి యొక గంతు వైచి భార్యను సమీపించి 'నీవు నన్నుఁ
గారణమేమియు నడుగవలదు. ఈధనములో నీకుఁ గావలసినంత ధనమును దరలించుకొని
యీరాత్రి నీవు పిల్లలతోఁ బుట్టినింటికిఁ బో'మ్మని చెప్పి యేనుఁగులు బేగిరావులు బండ్లు
పల్లకులు గొంతసేనయుఁ దోడిచ్చియామెను బుట్టినింటికిఁ బుత్రికా సహితముగాఁ బంపినై
చెను. ఇట్లీల చేసితివని రాజుగా రాతనినడుగ లేదు. అడుగుటకు సమర్థత యెక్కడిది?
వెనుకనుండిన సమర్థత యేమైనది? అంతయు నయ్యవారి యదృష్టదార్ఢ్యమున నాచ్ఛాదితమై
నది. అనుస్వారమైనది. అంతరించినది.

మఱునాఁటి యుదయమున రాజుగారు వేఁటకు బోవుచు మన పురుషోత్తమాచార్యు
లుగారిని యథాపూర్వకముగఁ గూడఁ దీసికొని పోయిరి. అది మహారణ్యము. ఆకాశమున
నొంటెమూఁపుర మంత మబ్బుపట్టి యట్టి తెప్పపాటులో నాకాశమంతయు నావరించినది.
ఝుంఝూమారుతముచేఁ జెట్లు పెళపెళ విరుగుచున్నవి–ఉసిరిగకాయ లంత చినుకు
లారంభమైనవి. కూడ వచ్చిన హరిజనమంతయుఁ జెల్లచెదఱైనది–పురుషోత్తమాచార్యులు
మాత్రము బహుబలాఢ్యుఁడు కావున రాజుగారిప్రక్క వదలకుండ గట్టిగఁ బట్టుకొని,
మహావర్షమునఁ దడియుచు గాలిచేఁ దూలుచు ధూళిచేఁ గెక్కుఱిగెక్కుఱి మనుచు నరణ్యమున
బోవుచుండెను. రాజు కొంతసేపు మాత్రమే యాశ్రమకోర్చుకొనఁగలిగెను. అటుపైన
సొమ్మసిల్లి పడిపోయెను పడిపోయిన రాజు నెత్తుకొని యొక్క చెట్టుక్రిందఁ జేరి యాయన
శిరమును తనతొడపైఁ జేర్చుకొని, తడిసిన దేహమునకు వేఁడిమిగలుగునట్లు నిమురుచు
నాభాగవతుఁడు హరినామస్మరణ మొనర్చుకొనుచు రాజోపచారము చేయుచుండెను.
ఇంతలో వర్షము వెలిసినది. గాలి తగ్గినది. కాకి యొక్కటి చెట్టుపైనుండి రాజుగారి
కంఠపుముడిపై రెట్టవైచెను. అది చూచి బ్రాహ్మణుడు 'ఎంత మహారాజున కెట్టిగతి సిద్ధించె'
నని మహావిషణ్ణుఁడై కాకిరెట్టను గంఠమునుండి తొలగించుటకై యోజించెను–చేతితో దానిని
దీసివైచుట కూహించెనుగాని మహాసహ్యమగు కృత్యమగుటచే మన స్సందునకు సాహసింప
లేదు–నర్వపక్షులలోఁ గాకియే చండాలమని చెప్పినప్పుడు దాని రెట్టమాట చెప్పవలయునా?
ఆకైనఁ బుల్లయైన మఱియేదైనఁ దెచ్చి దానిని దీసివైచెద నన్నుఁ గదలినయెడలఁ దొడపై
శయనించుచున్న రాజెక్కడ మేల్కాంచునో యని జడిసి రాజుగారి మొలలోనున్న కైజారు
నొరనుండి నిమ్మళముగఁ దీసి దాని యంచుతో నారెట్టను దీసి పాఱవైచుచుండ నింతలో
రాజు మేల్కాంచి యదరిపడి ''పాపీ! ద్రోహీ! ఎంతపని చేయుచుంటివిరా? నామొలలోని
కైజారుతో నాగొంతుకను గోయ యత్నించుచుంటివా? నేను నీకేమి యపకృతి యొనర్చి
తిని? నారాజ్యమంతయు నీచేతిలోఁ బెట్టితినే. నేను నీకు దాసుఁడనైతినే. రాజవు నీవేగాని
నేను గానట్లు ప్రవర్తించితినే! ఇంతకంటె నెక్కువగా నేను నీకేమి చేయఁగలను? నన్నుఁ
జంపి నీవింతకంటె నేమి మూటకట్టుకొనఁ దలఁచితివి.'' అని కోపతీవ్రతతో నఱచెను.
ఇప్పటికి రాజుగారి కెట్టి మాటలాడుటకైన సమర్థత వచ్చినది. రాదా మఱి? అతని భాగ్య

మెప్పుడు దిగనాఱినదో యాతనిశక్తి యప్పుడే యెగఁబ్రాకినది. రోగిగొంతులో గొఱ్ఱగంజి యైనంతకాలమేకదా వైద్యునినోటిలోఁ గోడిమాంసపు కబాబులు కైమా కజ్జికాయలు. వైద్యుఁడు సంచికట్టుకొన్న తరువాతఁ గూడ రోగి నోరుకట్టుకొనునా? కాని కావలసినంత కారణ ముండినను బ్రాహ్మణుఁ డేమియు రాజు గారికిఁ బ్రత్యుత్తర మీయలేదు. కమలాకటాక్షము కడతేఱినవాని కారణములు వినునంతటి నిర్భాగ్యుఁ డెవఁ డున్నాఁడు? ఇంతలో రాజుగారిన పరిజనమంతయు నట మూఁగినది. రాజుగారి సెలవుపైన భటులా బ్రాహ్మణునకుఁ గాలుసేతులుకట్టిపెట్టిలొట్టియపై బడవైచి యాస్థాన నగరమునకుఁ దీసికొని పోయి యటుఁ గారాగృహమం దుంచిరి. ఆహా! అదృష్టదేవతా! ఎంత శక్తిగలదానవు! ఒక్కనాఁడు రాజునెదుటకు విచారణకొఱకు భటులు బ్రాహ్మణునిఁ దెచ్చిరి. ఇప్పుడంద ఱాతనిని నిర్భయముగఁ దిట్టువారే. వెనుకఁ గాళ్లుగడిగినదానులిప్పుడాతని మొగముపైఁ బేఁడనీళ్లను జల్లుటకు సిద్ధపడిరి. వట్టి దొంగ మొగమయ్యా! స్పష్టముగాఁ గనఁబడుచునే యున్నదయ్యా! యని పెద్దభటుఁడు తన తరువాతివాని కుపన్యసించెను. నీవుచేసిన ద్రోహమున కేమికారణము చెప్పెదవని రాజుగా రడిగిన ప్రశ్నమునకు బ్రాహ్మణుఁడు "రాజేంద్ర! నే నేమియుఁ జెప్పదలఁచుకొనలేదు. నీయిష్టము వచ్చినట్లు నన్ను శిక్షింపు." మని వినయముగఁ బలికెను. ఆ బ్రాహ్మణుని యేడంతరువుల మేడను రాజుగారు పరిశోధిం పించిరి. కోశాగారములన్నియు వట్టివైనవి. కాని యొక్కగదిలో నొక్కమందసమున్నది. దానిలో నొక పెద్ద పెట్టెయున్నది. దానిలో నొక్క చిన్నపెట్టె యున్నది. ఇట్లు లోనికిఁ బోవఁగఁ బోవఁగ బదునాలుగవపెట్టిలో–బమ్మకమ్మికుట్టుగల యంగవస్త్ర మొకటియు నినిమిదిచోట్ల మైనపుమాసికలుగల మెడవిరిగిన దోసకాయ చెంబొకటియు నున్నవి. ఇవి యేమని బ్రాహ్మణుని రాజుగా రడిగిరి. "రాజేంద్రా! అదియే నా సొంతధనము. లక్ష్మీకటాక్షము నాపైరాక ముందు నాకున్న యావద్ధన మదియే. నీవిచ్చిన యశ్వైర్యము నాకు దక్కదని యెఱిఁగియుండియే, నాకింతవఱకు రాకమానదని యెఱిఁగి యుండియే, బ్రహ్మదేవుఁడు నానుదుట శాశ్వతముగా వ్రాసిన యాసొత్తునింత భద్రముగాదాఁచికొంటిని. ఇదివఱకు నీదయవలన మనుష్యుఁడను మిగిలితిని. నాగావంచయు ముంతయు నాకుఁ బాఱనైచినయెడల శేషకాలము మఱియొక దేవస్థానము నాశ్రయించి సుఖముగా బ్రదుకుదును. మీదయవలన నాకష్టదినములు మొన్నటితో వదలినవి." అని బ్రాహ్మణుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ఇట్లు పలికిన బ్రాహ్మణునిమాట లాశ్చర్యరసమగ్నుఁడై విని రాజుగా రతనిని వదలిపెట్టిరి. ఇక్కడికిఁ గథ కంచికి బోయినది. మనమింటికి వచ్చితిమి.

మన ప్రారబ్ధమువలనఁ గలుగు సుఖదుఃఖములకు రాజుల నుత్తరవాదులుగా నెన్నఁడును జేయఁగూడదను గొప్పనీతి నీచిన్నకథ బోధించుచున్నది. రాజువలన ధనాగమ మైనప్పుడు రాజును భూషింపకపోయినను రాజువలన ధనలాభము కలుగనప్పుడు రాజు నందఱును దిట్టువారే. ధనాగమ మైనప్పుడుకూడ నంతకంటె నెక్కువధన మిచ్చినాఁడు కాఁడని రాజు నందఱు దిట్టువారే. ఇది మహాదోష మని యెన్నవలయును.

నాయనలారా! ఇంకను లేఖలోఁ దరువాత నేమియో యున్నది. ఇచ్చటి యుత్తరపుఁ గాగితము చినిఁగిపోయినది. పెద్దపులివేసపుఁదోఁక బుట్టపైఁ గాగిత మూఁడిరాకుండిన ట్లంటించినరీతిగా నీయుత్తర మంటింపఁ బడియుండుటచేత దీనిని జింపుటలోఁ గొంత

కాగితము చినిఁగిపోయినది. అయినను దీని యభిప్రాయ మేదో మీకుఁ బూర్తిగాఁ దెలిసినది ఇట్టి యర్థమునే యొకఁడిట్లు వెల్లడించినాఁడు.

గీ. మనకుఁ గష్టము రాజిచ్చుననుటెకాని
యద్ది రాజరాజిచ్చినాఁ డనుట తగును
మనకు సౌఖ్యము రాజిచ్చె ననుటెకాని
యద్ది రాజరాజిచ్చినాఁ డనుట తగును.

గీ. అశని మేఘుఁడు పడవైచె ననుటెకాని
వాని పైవాఁడు పడవైచె దాని నిలను
వర్షమును మేఘుఁ డొనఁగు పలుకెకాని
వానిపై వాఁ డొసంగును దాని మనకు.

గీ. మనకు సుఖమును రాజిచ్చుమాటయైన
నతఁడు సుఖమునకై చెడదేవులాడు టేల?
మనకుఁ గష్టము రాజిచ్చుమాటయైనఁ
బ్రభుఁడు మనకంటెఁ గష్టముల్ పడయనేల?

గీ. ప్రాకృతియె సౌఖ్యదుఃఖకారణము వినుమి
ఈశ్వరుఁడు తత్ఫలము పంచియిచ్చివాఁడు
కాని యీశ్వరు నిందింపఁ గలుషమగును
మనదు కొలపాత్రతోడనే మన కొసంగు.

గీ. మనుజవతిని దిట్ట మఱియింతదోషంబు
మోఁతకూలి యతఁడు దాతకాఁడు
వెట్టిపనికి నతనిఁ దిట్టుటకూడ నా
ప్రభుని నిందకంటెఁ బాప మేది?

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

18. మతబోధ్దల పటము

సాక్షి, తమ సంఘం వ్యవహారాలకు దూరంగా వేరేగ్రామంవెళ్లి నెలదాటింది. సాక్షిసంఘం వర్దంతి చేసినందుకు చీవాట్లు పెడుతూ అతను వ్రాసిన ఒక్క ఉత్తరం తప్ప, మరి ఉత్తరాలు కూడా లేవు.

ఒకనాడు వాణీదాసు, కాలాచార్యులు, జంఘాలశాస్త్రి తమ సంఘపు కొత్తబసలో కూర్చుని మాట్లాడుకొంటున్నారు. కొత్తబస ఎలా వచ్చిం చంటే, పాత బసకు అద్దెకట్టలేకపోవడం వల్ల మారవలసివచ్చింది. ఈఘాదు శ్రోతలకు తెలియక పోవడంవల్ల ఉపన్యాసానికి ఆనాడు ఎవరూ రాలేదు. వీరు ముగ్గురే తమలో తాము మాట్లాడుకోవడంలో-జంఘాలశాస్త్రి ఒక చిత్రపటం ప్రస్తావన తెచ్చాడు.

అది ఇరవై అంగుళాల పొడుగు, పదిహేను అంగుళాల వెడల్పు వున్న పటం. అందులో ముప్పైమంది మత ప్రవక్తల చిత్రాలు మూడు వరసల్లో ముద్రించారు. చిత్రపటం కాగితంతో చేసినది. దానిని హారాలో ముగ్గిం చారు. అందులో, గోస్వామి మొదలు సాధక బ్రహ్మచారి అనే ఒక అనామకుడి వరకు బొమ్మలున్నాయి.

ఈచిత్రపటం గురించి జంఘాలశాస్త్రి కొన్ని అభ్యంతరాలు బయట పెట్టాడు. అటువంటి మహానుభావులను చిత్రించేటప్పుడు వారున్న వరసే, వారు ఆక్రమించిన స్థలమే, వారి బొమ్మవైఖరే వారి చరిత్రను సమర్థంగా చెప్పగలగాలి అన్నాడు. కాలక్రమాన్ని అనుసరించకపోతే మతక్రమ పరిణామ చరిత్ర తెలిసే అవకాశం లేదు. మత సంప్రదాయాన్ని బట్టి అయినా బొమ్మలకు సన్నిహితత్వం ఉండాలి; కాలక్రమాన్ని బట్టి అయినా సన్నిహి తత్వం ఉండాలి. అది ఆపటంలో పాటింపబడలేదు.

మరొకలోపం-మతాచార్యులలో ప్రధానులైన మధ్వాచార్యుల బొమ్మ లేదు. దీనిగురించి సాక్షి సంఘసభ్యుల మధ్య కొంత వేపు వర్ప జరిగింది. ఈలోపం తెలియజేస్తూ జంఘాలశాస్త్రి, ఆపటం ముద్రించిన వారికి ఉత్తరం రాయగా, ఎరినుంచి వచ్చిన జాబు మిగిలిన ఇద్దరికీ వినిపించాడు. అబద్ధం తప్పించుకోవడానికి వ్రాసినట్లుంది. వారికి మధ్వాచార్యుల గురించి తెలిసినట్లులేదు.

సాక్షి సంఘసభ్యులు తమలోఁ దామిట్లు మాటలాడుకొనిరి.

జంఘా-మన సభాకార్యాలయ మనివార్యములగు కొన్ని కారణములచే మార్పవలసివ

చ్చినందువలన నీక్రొత్తబస యెఱుఁగక పోవుటచేత నీ దినమున శ్రోత లెవ్వరును రాలేదు. అందుచే సాక్ష్యుపన్యాస మేమియు నీదినమున లేదు.

కాలాచారి–అనివార్యములగు కారణములని–సభాకార్యాలయ మని–పూర్వవలెనని –నీవు పెద్దమాటలు చెప్పుచున్నావు–అద్దె మనము సరిగా నీయకుండనున్నా మని గృహ స్వామి మనలను వెడలఁగొట్టుటచేత నని స్పష్టముగఁ జెప్పరాదా? ఇచ్చట మనము తప్ప నెవరున్నారు?

వాణీదాసు–సాక్షి యిచ్చట నుండినయెడల నెక్కడనైనఁ గొంతసొమ్ము బదులుతెచ్చి యద్దె నిచ్చియుండును. ఆతఁ డూర లేకుంటచే నీ చిక్కు వచ్చినది.

జంఘా–ఆయన గ్రామాంతరమునకుఁ బోయి నెలదినములు దాఁటిసది. ఆయన నెడలిన పిమ్మట నొక్క లేఖమాత్రమే సాక్షి సంఘమునకు వ్రాసినాఁడు. సాక్షిసంఘమున కాయన యిష్టతకు వ్యతిరేకము వర్ధంతి జరిగించినందులకుఁ జీవాట్లు పెట్టుచు వ్రాసిన యాలేఖతప్ప తరువాత నేదియు వ్రాయనేలేదు. కారణమేమో తెలియకపోవుటవలనఁ దోఁచకుండ నున్నది.

కాలా–ఆతఁ డెచ్చటెచ్చటఁ దిరుగుచున్నాఁడో, ఏమేమి వింతలు చూను చున్నాఁడో, ఎవరెవరితో మాట లాడుచున్నాఁడో, యేయే విషయములను గ్రహించు చున్నాఁడో, యేతొందరపనిమీఁద నున్నాఁడో యెట్లు తెలియవచ్చును? మనము తొందరప డినంతమాత్రముచే నాయన వచ్చునా? ఆయన సుఖముగాఁ గొలఁదిదినములలో వచ్చి మనల సంతోషపెట్టునని నా విశ్వాసము.

వాణీ–ఆయన రారని జంఘాలశాస్త్రియుఁ జెప్పియుండలేదు. కాని యెచ్చట నున్నను రవంత లేఖయైన నేల వ్రాయలేదో యని యాందోళన పడుట సహజమే కాదా?

కాలా–అన్నియు సహజములే. సహజములైన పనులన్నియు దప్పకుండఁ జేయవల యునా యేమి? సహజము లైన పనులన్నియు విసర్జింపు మనియే కాదా వేదాంతము బోధించుచున్నది. ప్రకృతిలో గుడుగుడగుంచము లాడువాఁడు పామరుఁడు కాక పండితుఁడా? ప్రకృతిని మీఱినవాఁడే ప్రాజ్ఞుఁడు.

వాణీ–కాలాచారీ! సంగతిసందర్భము లెఱుఁగకుండ, నేసంగతి చెప్పినను నీవు మతములోని కీడ్చుచుందువేల?

జంఘా–మతమనగా జ్ఞప్తికి వచ్చినది. ఈనడుమ నామిత్రుని యొద్ద నొక్కపటము చూచితిని. అది యిరువదియంగుళముల పొడుగు పదునేనంగుళముల వెడల్పుగల కాగితముపైఁ జిత్రింపఁబడియున్నది. అది హౌరాలో ముద్రింపఁబడి ప్రచురింపఁబడినది. దానిలో మత బోధలవిగ్రహములు ముప్పది యున్నవి. గోస్వామి మొదలు సాధకబ్రహ్మచారి యనునొక యనామకునివఱకు మూఁడు వరుసలలోఁ గాఁబోలు ముప్పది విగ్రహములు చిత్రింపఁబడియున్నవి. ఆవిగ్రహములన్నియు వెనుకవి ముందు, ముందువి వెనుకఁ, బైవి క్రిందఁ, గ్రిందివి పైనఁ గలగ పులగముగ గందరగోలముగఁ గలుపఁబడియున్నవి. కాలక్రమ మెంత మాత్రమును గణింపఁబడియ న్నట్లు కానఁబడదు. మతక్రమమైన గణింపఁబడిన

ట్లంతకంటెఁ గానఁబడకుండ నున్నది. అట్టి మహానుభావులను జిత్రించునప్పుడు, వారున్న వరుసయే, వారాక్రమించిన స్థలమే, వారి ప్రతిమావైఖరియే, వారిచరిత్రమును సంక్షేపముగాఁ జెప్పఁదగినంత సమర్థములై యుండవలయును. వారి బడితలలు రుద్రాక్షనరములు పట్టినా మములు వట్టిమొగములు చూచిన సంతోషించువారెవ్వరు? మనకుఁ గావలసినది వారు మతప్రపంచమునఁ జేసిన మహోపకారము, వారు బోధించిన ముక్తిసాధనము, వారుచేసిన సంస్కరణము. ఈజ్ఞానమును మనకుఁ గలుగఁజేయలేని పటముతో మనకేమి లాభము. ఒక్కొక్క విగ్రహము మతపూర్వచరిత్రమునకుఁ దరువాతి యధ్యాయమై యుండవల యును. పశ్చాచ్చరిత్రమునకుఁ బూర్వాధ్యాయమై యుండవలయును. రామమోహనరా యల విగ్రహమున కయిదాఱువిగ్రహముల తరువాత రామానుజాచార్యుల విగ్రహమును జిత్రించినప్పు డర్థమేమి? రామమోహనరాయల మతమెట్టిది? రామానుజమత మెట్టిది? గోస్వామి గారికి మూఁడు వెనుకల శంకరాచార్యుల వారిని జిత్రించినప్పుడు భావమేమి? మతసంప్రదాయమును బట్టియైన సన్నిహితత్వ ముండవలయును. కాలక్రమముబట్టియైన నుండవలయును. అదియు నిదియులేని యీబొమ్మలప్రోవుతోఁ బనియేమి? మత బోధకు లీయాస్వరూపములు గలవారని మనకుఁ దెలియుటకై వారట్లు చిత్రింపఁబడి రని యూహిం చునెడల నావిగ్రహములలోఁ బ్రధానుల విగ్రహములన్నియుఁ గల్పితములే–కృత్రిమములే. శంకరాచార్యుల వారు లావుగనుండునో సన్నముగ నుండునో యెవ్వఁ డెఱుంగును. బుద్ధ దేవునిది కోలమోగమో గుండ్ర మొగమో చూచినవారెవ్వరు? యథార్థములైన ఛాయాపటము లున్న మతప్రచారకుల విగ్రహము లీకల్పిత విగ్రహములతో గుదిగ్రుచ్చుట కేదైన చారిత్రాత్మ కమైన యభిప్రాయ ముండవలయునుగాదా? గుదిగ్రుచ్చినవారు కుడియేదో యెడమయేదో యెఱుఁగకుండ గుదిగ్రుచ్చనేల? గుల్‌షబుపూవేదో గులాబిపూవేదో తెలియకుండ గుదిగ్రు వ్వనేల? సంఘవిగ్రహపటము చరిత్ర బోధకమే కానియెడల నింక దానిలో సారస్యమేము న్నది? హైందవ జాతీయ మహాసంఘనాయక సంఘపట మున్నది. అది జాతీయచరిత్ర నెన్నినోళ్లను వెల్లడించుచున్నదో చెప్పవలయునా? ఆర్యావర్తదేశ స్వతంత్ర రాజసంఘపట మున్నది. ఆరాజులయొక్కయు వారి యాస్థానములయొక్కయు న్యూనతాధికతలను సోపాన పంక్తిగ నాసంఘపటము చూపుటలేదా? విగ్రహముయొక్క మొగముసారు ముక్కుతీరు చూచి యెవఁడు సంతోషించును? దానిమొగమున భాగ్యనక్షత్రమే యుదయించుచున్నదో, యాధికారికతేజమే మండుచున్నదో, సార్వజనీనానురాగమే వెన్నెలగాయుచున్నదో, ప్రాపం చిక పరాజ్మాఖతయే దుమదుమలాడుచున్నదో, అదియే మనకుఁ గావలసినది. అది యేమియు లేకపోయినను బోనిమ్మ్ము. దానినిగూర్చి నేనంత విచారింపనుగాని ప్రధానమైన కాలక్రమమే వర్జింపఁబడినప్పు డింకఁ జెప్పవలసిన దేమున్నది?

వాణి–అయినను మనకుఁ బూర్వుల కాలక్రమముగూడఁ బాగుగఁ దెలియదులే.

కామా ఆమాటకూడఁ గొంత సత్యము కాకపోలేదు.

జంఘా–అదేమిమాట? శంకరాచార్యులవా రేనంవత్సరమునఁ బుట్టిరో నీకు నరిగాఁ దెలియకపోవచ్చును. బుద్ధాచార్యులవా రేతిథిని బుట్టిరో నీకుఁ దెలియకపోవచ్చును గాని బుద్ధుఁడు ముందో శంకరుఁడు ముందో నీకుఁ దెలియదా? నిత్యానందుఁడు ముందో రామానుజుఁడు ముందో తెలియదా?

వాణీ–నిజమే నిజమేకాని కాలక్రమము లేకపోవుటయె గొప్ప లోపమని యధిక్షేపింపఁద గదేమో. చరిత్రము తెలిపినంతవఱ కందఱకుఁ దెలియను. పటము వేఱేచరిత్రను జెప్పనక్క ఱలేదు. మొదటిది తెలియని వారికి రెండవది తెలియనే తెలియదు. మొదటిది తెలిసినవానికి రెండవది తెలియనక్క ఱలేదు.

జంఘా–పోని! అది గొప్పలోపము కాదు సరే. నీమాటయేల కాదనవలయును? మధ్వాచార్యులవారి విగ్రహమాముప్పది విగ్రహములలోఁ గానఁబడనియెడల నది గొప్పలోప మని చెప్పవచ్చునా?

వాణీ–అటు లేల కానఁ బడదు?

జంఘా–ఏలయో నాకెట్లు తెలియును? కానఁబడలేదు.

కాలా–నిజముగానే–నిజముగానే.

జంఘా–అసత్య మేల యాడెదను? నాకుఁ గనఁబడలేదు. ప్రతి విగ్రహమునకును నామమున్నది. మధ్వాచార్యులవారిపేరాపటములో లేదు. అందువలన నాయన పటమందు లేనట్లించవలసివచ్చినది.

కాలా–అయ్యో! మతత్రయగురువులలో మధ్వాచార్యుల వారేయందు లేరా? ఎందుచేతఁ జెప్పుమా? ఆయనను మఱచిపోవుట సాధ్యము కాదే–కర్మభక్తిజ్ఞానములు మూఁటికి మువ్వు రేర్పాటుగాఁ బ్రపంచమతచరిత్రలో స్థాపింపఁబడియున్నారే. అట్లు శాశ్వతప్రతిష్ఠ నొందిన స్వాములవారిని సంఘపటమునుండి సాగనంపుట సామాన్య సాహ సమా? అయ్యో! ఉపనిషత్తులకు మతత్రయభాష్యమున్నదే. బ్రహ్మసూత్రములకు మతత్రయ భాష్య మున్నదే. భగవద్గీతకు మతత్రయభాష్యమున్నదే. రామాయణమునకు భాగవతము నకు మతత్రయ వ్యాఖ్యానము లున్నవే. సర్వశుభములకు మతత్రయతాంబూలము లున్నవే. అయ్యోముక్కాలిపీఁట కొక్కకాలూఁడఁదీసినాఁడే! ద్వైత మతములేనిదే యద్వైతమున కర్థమేమి? అద్వైతమునకే యర్థములేనప్పుడింక విశిష్టాద్వైతము మాట చెప్పనేల? పటములో మధ్వాచార్యులవారు లేకున్న తరువాత శంకరాచార్యులవారు రామానుజాచార్యులవా రెందు లకు? వారినిగూడఁ దీసిపాఱవేయలేకపోయినాఁడా? ఉండినయెడల వారి యక్క ఱమాత్రమే మున్నది? పాగాకు సున్నము నేయి కలసికదా నన్యమైనది? వీనిలో నేదైన నొక్కటి తీసి వైచినయెడల నన్యసిద్ధి యుండునా? అటులే

వాణీ–కాలాచారీ! వెఱ్ఱిచదువు చదువకు–జంఘాలశాస్త్రి చెప్పినమాట నిజమనుకొను చున్నావు కాఁబోలు! మధ్వాచార్యవిగ్రహమేమి? అందుల లేకపోవుటయేమి?

జంఘా–మధ్వాచార్యనామమును నేనాపటమునఁ జూడలేదు.

కాలా–అంతమాత్రమున కధిక్షేపణము లేదులే. పూర్ణప్రజ్ఞాచార్యులవా రని యున్న దేమో ఆనందతీర్థులవారని యున్నదేమో?

జంఘా–ఆరెండు పేరులుకూడా నాపటమున లేవు–ఈమూఁడు నామములుకాక మఱియొక నామ మాయన కేదైన నున్నదా?

కాలా–ఉన్నట్లునే నెఱుఁగను కాని మఱియేదో యింకొక పేర నాతఁ డుత్తరదేశమున వాడఁబడుచుండు ననినా నమ్మకము.

వాణీ–దీనికింత యోజన యెందులకు? ఆపటమును జిత్రించిన వారికి వ్రాయలేకపో యితివా?

జంఘా–వ్రాయలేదని యెట్లు చెప్పఁగలవు?

కాలా–వ్రాసితివా? ఆలాగునఁ జెప్పుము. ఉండు ఒక్క నిమునముండు. మాటలనం దున మఱచిపోయితిని. తీవ్రముగా దిమ్మదిరుగునట్లొక్క పొడుముపట్టు వేసికోని!

వాణీ–జంఘాలశాస్త్రీ! చిత్రకారుని కేమని లేఖ వ్రాసితివి.

జంఘా–మీపటమును జూచితి ననియు, దానిలో ద్వైతమతాచార్యులగు మధ్వస్వాము లవారి విగ్రహము కానిపింపలే దనియుఁ బటములో నాయనవిగ్రహమును బుద్ధిపూర్వకముగా వదలుట కార్యులగు మీరు సాహసింపఁజాల రనియు, నాయన కిచ్చట మధ్వాచార్యులని –పూర్ణప్రజ్ఞులని–యానందతీర్థులని–మూఁడే ప్రఖ్యాతములగు నామము లున్నవనియు, నీనామములలో నేదియుఁగూడ మీపటమున దృష్టిగోచరము కాలేదనియుఁ గావున మఱి యొక్క పేరేదైన మీపైపున వాడుకలో నుండవచ్చు ననియు నట్టిపేరేదో తెలియఁబఱచినయె డల సంతోషింతు ననియు వ్రాసితిని.

కాలా–సరే ఇఁకనేమి? మృదులముగనే వ్రాసితిని. గొడ్డలి పెట్టుగ వ్రాసితివేమో యని యనుకొంటిని. ఇంకను నీ యుత్తరమునకు జవాబు రాలేదు. రావేగమే యీసందేహము విడిపోవును సరే. ఇక నేమి?

జంఘా–జాబురాలే దని యెవరు చెప్పినారు?

కాలా–అదొకటా? ఇకనేమి? ఏమని వచ్చినది.

జంఘా–ఇదిగో ఉత్తరము. దీనియర్థము తెనుఁగునఁ జెప్పెదను. భారతచిత్రమందిర మునుండి 142, గ్రాండుట్రంకురోడ్డు హౌరా, 3-10-21.

''బాబు జంఘాలశాస్త్రికి–అయ్యా! మీరు క్రిందటినెల 28వ తేదిని వ్రాసినయుత్తరము మాకు నకాలమునఁ జేరినది. మీయుత్తరములోఁ బ్రథమభాగమున వ్రాసినయంశమునకు నేను జవాబు చెప్పఁ జాలనందులకు క్షమింతు రని నమ్మచున్నాను. ఆమతబోధకుల నామము లేవో కనుఁగొనుటకుఁ బ్రయత్నించుచున్నాను. ఆనంఘపటము మేము కల్పించినై చినది కాదు. ఏదియో పూర్వపటమునకు నకలు తీసినాము. ఆపూర్వపటము మాకెట్లు వచ్చెనో యెక్కడనుండి వచ్చెనో తెలియదు.'' కాలాచారీ? వింటివా? ఎటులున్నది?

కాలా–మీరు వ్రాసిన లేఖలోని యంశమేదో యాతఁ డెఱుగకుండఁ బ్రత్యుత్తరమిచ్చిన ట్లగపడుచున్నదేల! ఆమతబోధకులనామము లేవో కనుఁగొనుటకుఁ బ్రయత్నించెదనని వ్రాసినాఁ డేమి? మీరొక్క మధ్వాచార్యులుగారి కక్కడ వాడఁబడుచున్న నామము లేవో యడుగగా మతబోధకులని వ్రాసెనేమి?

వాణీ–గౌరవార్థమైన బహువచనప్రయోగమై యుండును.

జంఘా–అట్లుకాదు. తెలుఁగున నట్లు నమర్థించుకొనవచ్చును. గాని–యుత్తర మింగ్లీషున నున్నది. 'ది నేమ్స్ ఆఫ్ దోజ్ ప్రీచర్స్' అని వ్రాసినాఁడు.

వాణీ–ఆవిగ్రహము పూర్వపటమునకు నక లనియు నది యెచ్చటినుండి వచ్చెనో మాకుఁ దెలియదనియుఁ జెప్పుటవలనఁ దమమీఁద నున్న పూచినంతయుఁ దొలఁగించుకొన్నట్లు కనఁబడుచున్నది.

కాలా–ఏవో పేళ్లను గనుఁగొనుట కాయన ప్రయత్నించుచున్నానని వ్రాసెనుగదా! ఏమి తెలియునో చూతము–

వాణీ–నీ కేమివెఱ్ఱిం! ఉన్నప్రతులేవో విక్రయించుకొనుటయే పరమప్రయోజనముగాఁ గలవారి కీపనికిమాలిన గొడవయంతయు నేల? కనుఁగొనువాఁడైన యెడల నింత ప్రఖ్యాతాంశ మెంతసేపు కనుఁగొనవలయును?

కాలా–అట్లు కాదులే–మనకున్న యాతురత వారికేల యుండును. సావకాశముగాఁ గనుఁగొని తెలియఁజేయుదురేమో?

జంఘా–ఆనంగతి నిశ్చితముగాఁ దెలిసినయెడల నీ దినమున నుపన్యసించియుందును.

వాణీ–మన యుపన్యాసముల కేమి? మఱియొకప్పుడు చూచుకొనవచ్చును. లెండు పోదము–

జంఘా–ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

19. గర్భవతులు–గ్రహణములు

ఒక ఆయుర్వేద వైద్యరత్నంగారు, గ్రహణ సమయాలలో గర్భవతులు ఎంచుకు జాగ్రత్తగా ఉండాలో వివరిస్తూ– 'రాబోయే చంద్రగ్రహణం జాగ్రత్త' అని హెచ్చరిస్తూ–సాక్షిసంఘం సభలో నివేదించడానికి పంపిన ఉత్తరాన్ని జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నాడు. అంటే, ఈ అభిప్రాయాలు ఆ వైద్యరత్నం గారి వన్నమాట.

స్త్రీల విశిష్టత గురించి–సృష్టి విషయంలో ఆమె నిర్వహించే విశిష్ట పాత్ర గురించి,–ఆమె క్షమాగుణం గురించీ ముందుగా ప్రశంసవుంది. ఆపైన–పాత ఆచారాలను అనుసరించడం ఎందుకనే ప్రశ్నకు సమాధానం చెపుతూ, ఈ ప్రాచీనాచారాలు రెండురకాలుగా వుంటాయనీ–కొన్ని కాలికములై. తరువాత విలువ కోల్పోయేవి. కొన్ని ఎప్పటికీ విలువ ఉండేవి–అనీ, తాత్కాలిక ప్రయోజనం కలిగినా అవి నేటికి అనవసరమైనా, ప్రాత వస్తువుల మీద, వాటిని వాడిన మనుషుల్ని బట్టి గౌరవం చూపించినట్లే చూపించాలనీ, –ఇప్పటికీ విలువ తరగని ఆచారాలను పాటించే తీరాలనీ భిషగ్రత్నం గారు అభిప్రాయపడ్డారు.

గర్భవతి గ్రహణాన్ని చూడకూడదనే ఆచారం నిరుపయోగమైంది కాదు, ఎక్కువ ఉపయోగం వున్నది. ఎందుకంటే, –ప్రబలమైన మనోరసాలన్నీ గర్భవిచ్ఛిత్తికి కారణాలవుతాయి. సూర్య, చంద్ర గ్రహణాలు వికృతంగా వుంటాయి.

శాస్త్రీయంగా చెప్పాలంటే, చంద్రుడి నడకను అనుసరించే స్త్రీలలో రజప్రక్రియ జరుగుతుంది. ఇది 28 రోజుల ఆవృత్తితో వుంటుంది. అర్భక అంగసృష్టికి గాని, పుష్టికిగాని గర్భవతి మనస్సే ప్రధానం–అని–కొన్ని చెబ్బతిన్న సందర్భాలు ఉదాహరించాడు. ఆమె మనస్సుకి ఎలాంటి ఉద్రేకమూ కలగకూడదు, ఎప్పుడు? చూలునిలిచినది మొదలు 28, 56 84 సంఖ్యల రోజుల్లో ఋతు దర్శనానికి నియమిత కాలంలో మాత్రం కలగకూడదు. కాని–చూలెప్పుడు నిలిచిందో గర్భవతికైనా సరిగ్గా తెలియని కారణంవల్ల –ఎందుకైనా మంచిదనే ముందు జాగ్రత్త కోసం, అందరికీ ఆ నియమం పెట్టారు. దీనిని గౌరవించండి–అని భిషగ్రత్నంగారు విన్నవించారు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

ఒక యాయుర్వేదవైద్యరత్నము మాకీలేఖ పంపినాడు. దీనిలోని యంశములు కొన్ని

గర్భవతుల కుపయోగపడు నని యాతని యభిప్రాయమైనట్లు కనఁబడుచున్నది. ఉపయోగప డినను బడకపోయినను వైద్యరత్న మను బిరుదమును సంపాదించిన భేషజుఁడు మంచి యుద్దేశముతో ప్రాసిపంపినలేఖ నేల చదువఁగూడదు? ఆయన సమర్థుఁడైనను గాకున్నను నాయనచేఁ బంపబడిన లేఖను జదువక నిరాకరించినచో నాతఁ డభ్యసించిన శాస్త్రమును నిరసించినవాఁ డగుదు మను భయము చేతను నాయన సంపాదించిన బిరుదమును తృణీకరించినవాఁ డగుదుమను భయముచేతను జదువఁ బూనుకొనియున్నాను. శాస్త్రజ్ఞా నమున కెక్కుడికిఁగాని బిరుదములుమాత్ర మిప్పుడు సర్వతోముఖముగ వ్యాపించి యున్నవి –శాస్త్రీయసాహితి నమర్థతలు సర్వంకషముగా నున్న సనాతనదినములలో బిరుదముల చింత యెవ్వరినికిని లేనేలేదు–అది కలఁతకొట్టగుటచేతనేకాఁబోలు నివి పెచ్చుపెరుఁగుచు న్నవి. అల్పజ్ఞుఁ డెప్పుడు నాడంబరమునకై యాశించునుగదా! పంచకావ్యములలో రూపాయ కయిదణాల ప్రాఁతడబ్బు పాండిత్యము సంపాదించిన పండితునకు నడుమునకొక్కసాలువు –నెత్తికొక్కసాలువు–భుజమున కొకసాలువు హృదయమున భక్తి లేశమైనఁ జేరనీయక –గొంతు ముడివఱకుఁ జిట్టిగారెలు సేవించిన భాగవతోత్తమునకు, గోడసరదాలంత పట్టినా మములు–గాడిదెమోఁతయంత తులసిపేరులు. కాని యిప్పుడీ ప్రకృతిపరీక్ష మన కేల? ప్రాసంగికవశమున నీనాల్గుమాటలయినఁ జెప్పవలసివచ్చినది–దాని యవసరము కలిగినప్పు డందును గూర్చి పూర్ణముగ ముచ్చటింపవచ్చును.

ఇదిగో వైద్యుని శ్రీముఖము–చదివెదను. సాక్షికి–నమస్కారములు. సారసలోచన లనేకులు సాక్షినంఘమును సభాదినమున నమలంకరింతు రని యానందరసనిమగ్నుఁడనై –యాకర్ణించుచున్నాను. వారిలోఁ గొందఱు గర్భపతు లుండకపోరు–మగవారు కావ్యన్నిద్ధికి బడుగులుకాని గర్భవృద్ధికిఁ బిడుగులేకారా? ప్రత్యేకముగ గర్భవతుల కొఱకే యీలేఖ యుద్దేశింపఁబడినది. గర్భవతులగు నో సోదరీమణులారా! పరమేశ్వరుని చేతిలోనున్న ప్రాణిసృష్టి విధానము మీగర్భములందిప్పుడు జరుగుచున్న హేతువుచే మీ రాజగన్నాథునితో సమానులని చెప్పవచ్చును. మీగర్భము లాపరమాత్మనికటాక్షముచేఁ గ్రమముగ పరిణతి సకాలమున ఫలించి సమగ్రసంతోషమును మీకు సమకూర్చునుగాక! విడువకుండ నాఱుగం టలైన జీలుగుబెండు బుట్టను దలపై ధరింపలేని మగవాఁ డెక్కుడ? అహోరాత్రములు –నిరంతరముగ దొమ్మిదిమాసముల పదినములు–నిర్నిద్రవ్యాపారముతో, నిరుపద్రపదీ క్షతో, బ్రబలజాగరూకతతోఁ, బరిపూర్ణశాంతితో, సంపూర్ణ శ్రద్ధతో, స్వార్థపరిత్యాగశీల ముతో శిశుభారమును సహించుచున్న మీరెక్కుడ? మీకున్న యోపికలో, నోరిమితో, శ్రద్ధలో, జాగ్రత్తలో, నడఁకువలో, నసురాగముతో, నాపత్సహనములో, నాంతరంగికశుద్ధిలో శతాంశమైన సహస్రాంశమైన మగవారి కున్నదా? వారి కెంతసేపు చిట్టు బుస్సు–అట్టె వెకవెక యిట్టె దుమదుమ–కడుపు నిండకపోయి నప్పుడేడుపు, నిండిన తరువాత నీడుపు–కాలితో ముల్లుగ్రుచ్చుకొన్న యెడల గావుకేకలునైవి గ్రామమంతయుఁ జాటించుకొనిన మగవాఁడు సహనశీలుఁడా? కాకచేయుటచేతనో కారణాంతరముననో కడుపు బిగఁబట్టి గర్భస్థశిశువు చలింపక, యూఁపిరి యాడకుండునప్పుడైనఁ గూడఁబెరిఁగిన సోదరితోనైనఁ గడుపునగస్సి తల్లితోనైనఁ గాసంత చెప్పకుండఁ, కన్నీరొలుకకుండ, మొగమున ధైర్యము మొలవనీకుండ, శ్రీరామచంద్రమూర్తిని జిత్తమున ధ్యానించుచు, నంత మహోబాధను గాసంతతో త్రుపొనైన లేకుండ నిశ్శబ్దముగ సహించుచున్న మీరు సహనశీలలా! శాంతగుణనర్తనలా! క్షమాగుణవ

హనీయలా! నర్వకష్టనహనావతారములగు నో నతీతిలకములారా! మీకు వినయపూర్వకముగ నొక విజ్ఞప్తి చేసికొనుచున్నాను. అవధానచిత్తులై యాకర్ణింపుఁడు.

ఱేపురాత్రి చంద్రోపరాగమని చెప్పుకొనుచున్నారు. చంద్రగ్రహణమునుగాని నూర్య గ్రహణమునుగాని గర్భవతులు చూడఁగూడదను పూజ్యమగు పురాతనాచారము మనకు న్నది. అది ఱేపు మీవలన గౌరవింపఁబడుఁగాక! మీలోఁ గొందఱు నవనాగరకతాప్రాబల్య మున, స్వదేశీయగ్రంథపఠనాపరాఙ్ముఖత్వమువలన, విదేశీయవిద్యాధికాదరమువలనఁ బ్రాచీ నాచారనిందాభూయిష్ఠులై యున్నారని చెప్పుటకు విచారించుచున్నాను. పురాతనాచారనింద పురుషులలోనే స్త్రీలలోకంటె నెక్కువ కలిగియుండ, మగవారు తమకొఱకు దా మేదువక మాకొఱకుఁగూడ నేదువనేల యని, మీరు మమ్మధిక్షేపింపవచ్చును. మగవారిలో ననేకు లట్లు కప్పగంతులు వైచినవారే. కడఁ ద్రొక్కినవారే. వారింతకంటె ధ్వస్తులైనను బాధలేదు. భయలు లేదు. కాని సంసారపరిశుద్ధిరక్షణమున కేమి సౌశీల్యమాహాత్మ్యసంపోషణ కేమి, జాతీయ ప్రధానతత్త్వావనమున కేమి, మీరే, ప్రత్యక్షనృష్టిదేవతలగు మీరే-సర్వసద్గుణ సమాజస్థానములగు మీరే ప్రధానలు ప్రప్రధానలు. మీరు ప్రాచీనాచారపరాయణత వదలకుండ నున్నంతకాల మార్యావర్తమున కాపదలేదు. మగవాని లెక్కయేమి-సృష్టి కాఁదుదియే ప్రభ్వి. చిరకాలాను గతాచారసంరక్షణము స్త్రీ యందే నిలిచియున్నది.

సోదరీమణులారా! గర్భవతులు గ్రహణదర్శన మొనరుపఁగూడ దను నాచారము నిరసింపఁదగినది కాదు-నిర్హేతుకమైనది కాదు. నిందింపఁ దగినది కాదు. హేతువులేని యాచార మేల యుద్భవించును? కాలానుగుణముగఁ దాత్కాలికోపయోగముగఁ గొన్ని యాచారము లుద్భవించును. కాలభేదమువలన బహిరంతఃపరిస్థితిభేదమువలనఁ బ్రకృతి శాస్త్రాదిజ్ఞానభేదమువలనఁ గొన్ని పురాతనాచారము లిప్పుడు నిరుపయోగములుగాఁ గానిపిం పవచ్చును. కానిపింపవచ్చు నేల? నిరుపయోగములే యని యెప్పుకొనవచ్చును. ఇంకను వచ్చు నేల? ఒప్పుకొందుము. అంతమాత్రమునకై యట్టి యాచారముల నవమానింపవ చ్చునా? ఇంటి పనియంతయుఁ జేసినంతకాలమే యిల్లాలికి దుస్తా-అటుపైనఁ బస్తా? అట్టియాచారముల నప్పటి దేశకాలపాత్రాదినన్నివేశముల ననునరించి స్థాపించినవారిని బుద్ధి హీనులని, ప్రకృతిజ్ఞానశూన్యు లని, కార్యకారణ జ్ఞానవిమర్శనదూరులని, మూఢవిశ్వాస భావు లని, బూతులు తిట్టుట న్యాయమా? గడించినంతకాలమే తండ్రి దైవమా-తరువాత దయ్యమా? మీపూర్వులు బుద్ధిహీను లయినప్పుడు మీరెవ్వరు? గాడిదె కడుపునఁ గంఖాణ ముద్భవించునా? వెనుకటి యాచారములు కొన్నియిప్పుడు వ్యర్థములయ్యును బూర్వమున నవిలోకమున కెంతయో మేలు చేసెనందురా లేదా? అవి పూర్వమునఁజేసిన జాత్యుపకార మున కైన నిప్పుడు వాని నేల గౌరవింపరాదు? బుద్ధునిదంతము పోతుమానికపునంపుటమున బంగారుపూలచేఁ బూజింపఁబడుచున్నదా లేదా మహమ్మదుగారి గడ్డపువెండ్రుక నర్వగౌరవ ములను నర్వోపచారములను నమస్తమర్యాదల నిప్పటి కందుచు నిలిచియున్నదా లేదా? కోటికోహినూరు లిచ్చిననైన ఆవెండ్రుకలో నొక్క యంగుళమైన మహమ్మదీయ భక్తులిత రుల కిచ్చెదరా? పూర్వవస్తువులుగదా యను గౌరవముచేతనే యవి పూజింపఁబడుచు న్నవా? వానియుపయోగ మిపుడు లోకమున కేమైన నున్నదా? శ్రీకృష్ణభగవానువి శల్యశకలమే కాదా జగన్నాథమున నిప్పు డర్చింపఁబడుచున్నది? ఏచక్రవర్తి కన్ని భోగములు

నన్ని వైభవములు నన్ని మర్యాదలు నన్ని గౌరవములు పూజలు నన్ని దాస్యములు జరుగుచున్నవి? లీలామానుషవిగ్రహుఁడు. నలౌకికప్రజ్ఞా ప్రభావుఁడు, ననేకాసురమా రకుఁడు, భగవద్గీతావేద్యుఁడు నగు లోక మహోపకారి సంబంధ మగు ప్రాచీనవస్తువనియేకదా దానియందు లోకులకంత యాదరణము. అంత భక్తి. అంత ప్రపత్తి. అంత వలకెందులకు? ఇది మాయమ్మగారు ధరించిన యుద్ధములఱవికె యని దానినెంతో భద్రముగా దాఁచి మన్నించి గౌరవింతువే! ఇవి మా యమ్మగా రిచ్చిన సూర్యుఁడు చంద్రుఁడు ననియాయాభరణముల నతిజాగరూకతోఁ గాపాడుచు దాఁచికొనుచుందువుకదా! మీకు వానిపై నంత గౌరవవిశ్వాసము లేల? అవి మీయమ్మగారిచే వాడఁబడినవగుటచేతనేనా అంతకన్న మఱేదైనకారణ మందుల కున్నదా? దర్పణకంచుకమును ధరణిచంద్రులను ధరించి యూరిలో వారి నేత్రములన్నియు మీతలలపైఁ బ్రకాశింప నూరువారి మొగము లన్నియు మీఱవికపయిఁ బ్రతిఫలింప దేవతలు పుష్పవృష్టి గురియునట్లు మీరు తిరువీథులు వేంచేయఁ దలఁచుకొనినవారు కారుకదా! ఆయాభరణములు మీకిప్పుడు నిరుపయోగములయినను మీరు వానినిట్లు గౌరవించుచున్నారు కదా? అట్లే పూర్వాచారములు–పూర్వులు నానియందు గౌరవముంచిన హేతువుచే పూర్వులచే వాడఁబడిన హేతువుచే–పూర్వులు వాని వలన మేలుపొందిన హేతువులచే మీకు గ్రాహ్యములు, గౌరవ్యములు పూతములు, పూజ్యములు నేల కాకపోవును? నిరుపయోగము లయ్యును ప్రాచీనత్వకారణముననే యమూచానాచారము లాదరణీయ ములైయుండఁ బ్రస్తుతోపయోగప్రదము లగు ప్రాచీనాచారము లెంత యవలంబనీయములో యెంత యర్హ్యములోఁ జెప్పవలయునా?

సోదరీమణులారా! గర్భవతీగ్రహణదర్శన నిషేధాచార మట్లు నిరుపయోగమయినది కాదు సరికదా! అధికోపకారి యగుటచే నాధునిక గర్భవతులచే నవశ్య మాచరింపఁదగినదై యున్నది. ఎందుచేతనో చెప్పెదను. చూలు నిలిచినతోడనే రజోదోష మూఁగిపోవుట యందఱు బాహాటముగా నెఱిఁగియున్నయంశమే. అయినను గొన్నిప్రకృతులలో నట్టి రజస్స్రంభన జరుగదు. ఈవ్యతిరేకప్రక్రియ సామాన్యాచారమునకు బలముకాని బలహీనత కాదు–పిండోత్పత్తికి మానకర్మవిధాన మూఁగిపోవుటయే ప్రధానాభిజ్ఞానముగఁ బరిగణింపఁబడుచున్నది.

సర్వసాధారణముగా స్త్రీలకుఁ బుష్పోద్గమనము సరిగా నిరువది యెనిమిదినముల కొకసారి జరుగవలసినది. ఈనియమితకాలము హెచ్చుటకాని తగ్గుటకాని కొందఱకుఁ గలదు. అట్టివైపరీత్యము గర్భాశయదోషమువలన నని గ్రహింపవలసినది. చంద్రుఁడిరువది యెనిమిది దినములలో నొక్కసారి భూప్రదక్షిణము చేయును. చంద్రగతి ననుసరించియే యీరజఃప్రక్రియ జరుగునని మన పెద్దల యభిప్రాయము. చూలునిల్చినతరువాతఁగూడ సరిగానిరువది యెనిమిది దినములకుఁ బ్రకృతి ననుసరించి రజస్సు పిండమును వెలుపలికిఁ ద్రోచివైచి బహిర్గతమగుట కెంతయైనఁ బ్రయత్నించును. పిండశక్తి యల్పమై రజశ్శక్తి యధికమగు నెడల గర్భము జాఱిపోవును. ఆభయ మిరువదియెనిమిది దినముల కొక్కసారి తప్పకుండ గర్భమునకుఁ గలుగనై యున్నది. ఆదినములలో భయముకాని జుగుప్సకాని గర్భవతి మనస్సునకు గాఢముగాఁ గలిగినయెడల గర్భము తప్పకుండ నపాయదశ నొందును. చూలు లేఁత దైనయెడలఁ బిండ మధఃపతన మొందును. ముదురుదైనయెడల

వికృత రూపము గలది యగును. ప్రబలము లగు మనోరసము లన్నియుఁగూడ గర్భవిచ్ఛిత్తికిఁ గారణము లగును. వానిలో భయము మఱింత యపాయకరము. భయమువ లన నరముల పట్టులన్నియు నొక్కసారి జాఱిపోవును. కావున గర్భవతి యెల్లపుడు నవ్వులనడుమ, పువ్వులనడుమ, పండ్లనడుమ, చెండ్లనడుమ, నత్తరువులనడుమఁ, జిత్తరువు లనడుమ, పాటల నడుమ, నాటలనడుమఁ గాలక్షేపము చేయవలయునే కాని భయంకరము లగు వస్తువులను జూడరాదు-కష్టాంతరములగు నాటకములను గాంచరాదు -ఉద్రేకపూరితములగు నవలను జదువరాదు-చీఁకటిలో నెప్పుడు సంచరింపరాదు -వికృతము లగు వస్తువుల నెన్నఁడు విలోకింపరాదు. చంద్రసూర్యోపరాగములు వికృతదర్శ నములు. ఆబింబములలోని మొఱ్ఱిని గర్భవతి కాంచినయెడలఁ దప్పకుండ గర్భస్థశిశువున కామొఱ్ఱికలుగునని మనవారి యభిప్రాయము. అట్లు కలుగుట యెన్నఁడింపనియెడల నట్టి మొఱ్ఱికి గ్రహణపుమొఱ్ఱి యని యేల పేరువచ్చి యుండును? ఈనమ్మకము మనలోనే కాదు. పాశ్చాత్యజాతులలో ననేకులందున్నది.

ఒక యూరనొక స్త్రీ యుండెను. ఆమె గర్భవతి-ఆమె యైదవ మాసమునఁ బంచపాళిలో గాలికై నిమ్మళముగఁ దిరుగుచుండగఁ బైకప్పునుండి యొక తొండ యామె బుజమునైఁ బడెను. ఆమె భయముచేఁ గెవ్వునఁ గేకనైచెను. తరువాతఁ గొంతకాలమున కామె సుఖప్రసవమయ్యెను. కాని శిశువు భుజమునఁ దొండ యుండెను. గర్భవతిగా నున్నప్పుఁ డామె బుజమున నెట్లుపడెనో యటులే యుండెను. గర్భవతిగా నున్నప్పుఁ డామె బుజమున నెట్లుపడెనో యటులే యుండెను. అంత యాకారముతోడనే యుండెను. ఈసంగతి యొక పాశ్చాత్యవైద్యుఁడు వ్రాసెను. మఱియొక యూర నింకొక గర్భవతి కిట్లు కలిగిన ప్రమాదము వేరొఁడు వ్రాసినాఁడు-ఒక భిక్షుకుఁడు తెచ్చిన భల్లుకమును జూచి యామె భయమందెను. ఆమెకుఁ బుట్టిన శిశువు సరిగ నెలుగుఁబంటి మొగముతో నుండెను. అర్భకాంగ సృష్టికిఁగాని నష్టికిఁగాని గర్భవతి మనస్సే ప్రధానమైనది. మనోమహాశక్తులఁ గూర్చి యిప్పుడు వ్రాయుట కవకాశము లేదు. వికృతస్వరూపమైన గ్రహణములోని మొఱ్ఱి కడుపులో నున్న శిశువునైఁ బడుట యేమియు వింత కాదు. ఒక గర్భవతి గదిలో నొక్కతెయే పండుకొనెను. ఆమె నిద్రించుచుండగా దీప మారిపోయినది. గర్భవతి మేల్కని మహాభయ మొందెను. దిగ్భ్రమచే దలుపెక్కడనో తెలియక కొంతసేపటునిటు దేవులాడెను. తరు వాత నామెకుఁ గలిగిన శిశువు జాత్యంధుఁడు-ఇట్లనేకోదాహరణములు చెప్పవచ్చును. గర్భవతి మనస్సున కెట్టి యుద్రేకముకూడఁ గలుగరాదు. ఎప్పుడు కలుగరాదు? చూలె ప్పుడు నిలిచెనో యాదినము మొదలు సరిగా నిరువది యెనిమిది దినములకు, నేబదియాఱు దినములకు, నెనుబదినాలుగు దినములకు నిట్లే ఋతుదర్శనమున కేర్పడిన నియమిత కాలములో మాత్రము గలుగరాదు-ఆకాలమున భయజుగుప్సాదులు పరమాపాయకరములు. ఆకాలము ప్రత్యేక ఋతుశక్తిచేతనే గర్భపతనము కావలసిన కాలము. అట్టి యుపాయావసర మందే యిట్టి మనోవికృతులు కలిగినయెడల, గర్భవతి మనస్సంతయు గర్భముమీఁదనే యుండు హేతువున, నామె మనోవికృతులు గర్భస్థశిశువునైఁ గానిపింపకమానవు. ఆదినము లందే గర్భవతి యెంత జాగరూకతతో నైన నుండవలయును-తప్పక యుండవలయును -కాని చూలెప్పుడు సిద్ధించెనో గర్భవతికైన నరిగాఁ దెలియని కారణముచే నెంత జాగరూక తతో నున్న నంతమంచిదని మనవారు గర్భవతులంద ఱీ నియమమును బ్రసవమగువఱకుఁ

బాటింపవలయు నని సర్వసాధారణముగాఁ జెప్పినారు కొంతబాధయున్నమాట సత్యమ
గును. కావున సోదరీమణులారా! ఈయాచారమున కర్థమున్నదికాని లేకపోలేదు. ఇది నిరర్థక
మని మీరు దీనిని నిందింపకుఁడు. ఱేపటి చంద్రగ్రహణకాలమందు దీనిని గౌరవింపుఁడు
—మీశేషముకొఱకే మీపూర్వు లేర్పరచిన యీయాచారమును మీఱవలదు—మీఱి రాకాసి
పుట్టువుల గనక నిండుగ రెండువందల యెనుబది దినములు మోచి రత్నములవంటి బిడ్డలఁ
గని సుఖింతురుగాక—

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

20. సాక్షిలేఖ

సాక్షి ఉత్తరం వ్రాయలేదే! అని దిగులుపడుతున్న సంఘ సభ్యులకు సంతోషం కలిగేలాగ సాక్షినుంచి ఉత్తరం వచ్చింది - ఉత్తరంలో విషయాలు మాత్రం సంతోషకరంగా లేవు.

సాక్షి పూరీ జగన్నాధం, కలకత్తా వెళ్ళి కాశీచేరి అక్కణ్ణుంచి ఉత్తరం రాశాడు. అక్కడకు చేరి ఇరవై అయిదు రోజులైందట. ఇంకా నలభై రోజులు ఉండాలనుకుంటున్నాడు.

తోచినప్పుడు సత్రంలో రొట్టె తినడం, కడుపారా గంగనీళ్లు త్రాగడం, విశ్వేశ్వరాలయంలో కూర్చోవడం, రెండు పూట్లా గంగాస్నానం చేయడం - ఇవేనట అతను చేస్తున్న పనులు -

అయితే - తనకు ఆరోగ్యం సరిగా లేదనీ, సాక్షి సభను కొంతకాలం మూతపెట్టి తనకు వేదోడుగా వుండడానికి జంఘాలశాస్త్రిని కాశీకిరమ్మనీ, సాక్షి వ్రాశాడు.

ఈ ఉత్తరం చూసేసరికి శాస్త్రికి గుండె చెదిరింది. తను కాశీ వెళ్లి ముప్పై రోజుల్లోనే సాక్షిని వెంటపెట్టుకు వచ్చేస్తానని - తన మిత్రులిద్దరినీ - అన్నాళ్లు సాక్షి సంఘ ఉపన్యాసాలు ఉండవని చెప్పక చెప్పి, సాక్షి ఆరోగ్యం కోరుతూ వెళ్లేతనకి అనుజ్ఞ ఇమ్మని ప్రోత్సల్నీ, పాఠకుల్నీ కోరాడు జంఘాల శాస్త్రి.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! సాక్షియొద్దనుండి లేఖ రాలే దెందువలననో యని మిగుల బరితపించితి ని–ఇదిగో ఈ లేఖ నేడు వచ్చినది–దీనిని జదివెదను–"జంఘాలశాస్త్రికి–నేను శ్రీ జగన్నా థమున గొన్ని దినములు నటుపైని గాళీఘట్టమున గొన్నిదినము లుండి యామీదట వారణాసీక్షేత్రమును జేరితిని–ఇప్పుడు శ్రీకాశికాపురమునందే నివసించుచున్నాను. విశ్వేశ్వ రాలయ సమీపముననున్న సత్రములో నా బస–బస యనగ నేమున్నది? నాకొఱకు బ్రత్యేక మొక్క గదియా? గదిలో సామగ్రియా? గదికి దాళమా? పగట నందున వంటయా? రాత్రి దానిలోన బడకయా? ఏమియు లేదు. భోజనసమయమునకు నా కాకలి యగునెడల

నీ సత్రములో రొట్టె తినుచున్నాను. ఈబసకు నాకు నున్నసంబంధ మింతయే –గంగాస్నానమొనర్చుట, విశ్వేశ్వరాలయమునఁ గూరుచుండుట–ఈరెండే నేను ప్రధానముగఁ జేయుపనులు–ఈ పట్టణరాజమును బ్రవేశించి సుమా రిరువదియయిదుదినముల యినది–ఇక్కడికి వచ్చినప్పటికే నాకు జ్వరము వచ్చుచుండెను. అదియే తగ్గునని మందేమియుఁ దీసికొనక యుపేక్షించితిని. దేహశక్తి తగ్గుచున్నదికాని జ్వరము తగ్గుచున్నట్లు లేదు–అయినను వారణాసి చేరిన వానికి వేఱే వైద్య మెందులకు? ''ఔషధమ్ జాహ్నవీతోయమ్ వైద్యోనారాయణో హరిః' అని కదా మనపూర్వులు చెప్పియుండిరి–ప్రతిదినమున నుదయసాయంసంధ్యలందు గంగాస్నాన మాచరించుచున్నాను. కావలసినప్పుడెల్ల గంగాతీర్థమే కడుపాటఁ గ్రోలుచున్నాను. ఈ దినమున లేచి గంగాస్నానమునకుఁ బోవుచుండఁగాఁ దల తిరిగినది–కొంతసేపు సొమ్మసిల్లితిని గాఁబోలు–స్మృతి రాఁగనే నిమ్మళముగ లేచి స్నానమొనర్చి విశ్వేశ్వరాలయమునఁ బండుకొంటిని–ఇంతటినుండి మఱియొకని సాయము లేకుండ నాయంత నేను గంగకుఁ బోయి స్నానమొనర్చఁ జాలనేమో యని భయపడుచున్నాను. నీ వీ కృత్యమున నాకుఁ దోడుపడఁ గల వని నేను వ్రాసితిని. ఇఁక నలువదిదినము లిచ్చట నుండఁదలఁచితిని. సాక్షిసంప్రోపన్యాసము లీ నలువదిదినములు మాత్రము కట్టిపెట్టవలయును. నీవాంధ్రపత్రికాధిపతిపేర వ్రాసి యాయన యంగీకృతిని బొందుము. ఆయన దేశబాంధవుడు–దైవ భక్తుఁడు–సాక్షి కుపచారము చేయుటకై పోవలసి యున్నది కావున నలువది దినములవఱకు సాక్షి సభ లింతటినుండి జరుగుట కవకాశము లేదని యాయనపేర నీవు వ్రాయుము. ఆయన యంగీకారమును బొంది నభను గట్టి పెట్టుము. నీవు సభను మాని యిక్కడికి వచ్చినను నీకుఁ గాశీనాథుని సంబంధము తప్పదు కదా! కార్తికశుద్ధ పాడ్యమికే యిటకురమ్మ్ర–కార్తికమాసము శివప్రీతకరమగు మాసము. వాణీదాస కాలాచార్యుల క్షేమమును వ్రాయుము.

నాయనలారా! సాక్షి వ్రాసిన యీ లేఖతో గుండె చెదరినది. ఒడలు దడదడలాడుచున్నది. నేను ద్వరగనే యాతని సేవింపఁబోవుదును. కాశిలో నలువదిదినములుందునని సాక్షి వ్రాసినాఁడు. కాని యంతవఱ కక్కఱలేదు. తొందరపెట్టి యొక్క నెలదినములలోనే యాతని నిక్కడకుఁ దీసికొనివచ్చెదను. సోదరీమణులారా! సోదరులారా! సాక్షి కారోగ్యము నపేక్షించి పోవుచున్న నాకు మీరందఱు సంతోషపూర్వకముగ ననుజ్ఞ నీయవలెను. భగవంతుఁడు మీకు సర్వ శుభములు సమకూర్చుఁగాక–

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

21. సాక్షిదేహారోగ్యము

సుమారు అరవయ్యేళ్లు వయస్సున్న సాక్షికి దేహారోగ్యం కొన్నకు దుట పడింది. వాణీదానుకి గాంధీ టోపీ ధరించాడని ఖైదు శిక్ష పడింది. కాలాచార్యులికి ముక్కుపొడి కరువువల్ల తగరపు దర్బముడి ఉంగరం తాకట్టు పడింది. దాదాపు రెండు నెలల పదిహేను రోజులపాటు సాక్షి సంఘం మూతపడింది. మళ్లీ పుష్య బహుళనవమికి తెరువబడింది. జంఘాలశాస్త్రికి ఉపన్యానం ఇచ్చే అవకాశం కలిగింది.

తక్కువ శ్రోతలు ఉండడంవల్ల ఏదైనా ముఖ్యాంశం చెపుదామని వచ్చిన జంఘాలశాస్త్రి కొంత నిరుత్సాహపడినా, కొన్ని మాటలైనా చెప్పాలను కున్నాడు. అలవాటు అనేది ఎంత బలీయమైనదో ఎత్తుకుని తన ఉపన్యాన లక్షణం, శ్రోతల వినే లక్షణం, వక్షితీర్థంలో గరుడవక్షి వాలే లక్షణం, స్త్రీపురుషులు సాయంకాలం అయేసరికి సినిమాకి పోయే లక్షణం ఇవన్నీ అలవాటు జాబితాలోనివేనన్నాడు.

గడియారాన్ని మరమ్మతు చేసేవాడి చేతిలో పెట్టనేకూడదు. పెట్టాక, అది తరుచు రిపేర్లు కోరినట్లు-మనిషి డాక్టరు చేతిలోకి వెళ్లనేకూడదు, వెళ్లాక తరుచు ఏదో అనారోగ్యం తప్పదని పోలిక చెప్పి - వయస్సుమీరిన సాక్షి మాట వేరే చెప్పాలా? అన్నాడు. అందువల్ల మధ్యమధ్య కలిగే లోపాల్ని మన్నించమని జంఘాలశాస్త్రి ముగించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను–

నాయనలారా! నుమారు రెండుమాసములు పదునైదుదినముల నుండి సాక్ష్యుపన్యాన మేదియు లేదు. నభాద్వారమునకు గొండ్లెము పడినది. గాంధి టోపీధరించుటచే వాణీదానక వికి ఖైదుపడినది. నస్యాభావముచే గాలాచార్యుని తగరపుదర్బముడి తాకట్టుపడినది. మన్నెపు జ్వరముచే సాక్షి కొడలు వెచ్చబడినది. జంఘాలశాస్త్రినోటికిం దాళము పడినది. సాక్షి యను వర్ణద్వయము సారన్వతానుబంధముఖమునుండి తుడువబడినది. ప్రజాహ్లాద యము పునస్సాక్ష్యుపన్యానశ్రవణమునకుం దొందరపడినది. దైవకటాక్షముచే సాక్షికి దేహ స్థితి కొంచెము కుదుటుం పడినది. సంఘనభ్యులమనన్ను చల్లబడినది. ఈపుష్యబహుళనవమీ తిథిని సభాద్వారము తెఱవబడినది. జంఘాలశాస్త్రి కుపన్యానరంగమునం దిరుగ నడుగు పడినది.

ఈదినమున నేదైన ముఖ్యాంశమునుగూర్చి చెప్పవలయు నని కొండంతయాశతో వచ్చితిని. కాని మీరత్యల్పసంఖ్యాకులై యుండుట వలన నాశాభంగము నొందవలసివచ్చినది. శ్రోతలసంఖ్యనుబట్టి వక్త యుత్సాహముండు నని వేఱె చెప్పవలయునా? అయినను నేనో కొన్ని మాటలను జెప్పెదను.

సాక్ష్యుపన్యాసము లారంభమైన వని యానోట నానోట నిఁకఁ దెలియును. కావున పైవారమునుండి యనేకులు మా యుపన్యాసములను వినుట కీ సభాశాలకు దయచేయుదు రని నమ్మచున్నాను. దయచేసి మేముపన్యసించినదేదో శ్రద్ధాళువులై విని మమ్మ గౌరవింతు రని విశ్వసించుచున్నాను.

చెవిగొఱకు నలవాటుగలవాఁడు–తండ్రిని గూర్చియైనఁ దప్పుమాట ననకుండ నూర కుండలేఁడు. రహస్యములు వెల్లడించు స్వభావము గలవాఁడు– పరమహంసగారి పంచబాణరసౌషధసేవనుగూర్చి– పందిటి గుంజతోనైన గునగునలాడక మానఁడు. గానకళా ప్రవీణుఁ డగువాఁడు కంచమునొద్ద కూరుచుండునప్పుడైనఁ గానంత కుయ్యికుయ్యిలాడక యుండలేఁడు. అటులే వక్తయగువాఁడు వట్టి బల్లలయెదుటనైనఁ గాలానుసారముగా గానంత గడబడచేయకుండ నుండలేఁడు. ఓ యునలారా! పదునాల్గుమాసములనుండి సాక్ష్యు పన్యాసములు మీకును మాకునుగూడ కొంచెము హెచ్చుతగ్గుగ నల్లమందువలె నలవాటై యున్నవి. మే ముపన్యసింపకుండ నుండలేము. మీరు వినకుండ నుండలేరు. వంట యవశిష్ట మెట్టులో కచ్చాపచ్చిగఁ గడతేర్చి–చంటిపిల్లలకుఁ దొందరతొందరగఁ బాలిచ్చి–చప్పున సింగారించుకొని సినీమాలకు ప్రతి సాయంకాలమందుఁ బరుగిడిపోవుస్త్రీలు - వారికంటెఁ బదునాలుగు డిగ్రీ లుత్సాహమున నుప్పొంగి యువ్విళూరి యురుకులాడు పురుషులు –సినీమాలలోని కథాచమత్కృతుల ననుభవించి యానందించుటకే పోవుచున్నారా? నాయనలారా! వట్టిమాట. ఆవేళకు వారింటియొద్దనుండలేక పోవుచున్నారు. ప్రబలబలాన్వితమైన యభ్యాసము వారి నింటియొద్ద నుండనీయదు. యుద్ధనావలు సముద్రమున మునిఁగినట్లో పట్టణములు కాలినట్లో–యాఁడుది మగవారిని మూతిపండ్లు విఱుగఁదన్నినట్లో –కంటఁబడినగాని వారికి మతియుండదు. అభ్యాసమునకున్న శక్తి యసాధారణము. అద్వితీయము. పక్షితీర్థమునకుఁ బండ్రెండుగంటలకు పైనుండి దిగు గరుడపక్షి–దేనిబలమున దిగుచున్నదో యెఱుఁగరా?

సాక్షికి దైవకటాక్షమునఁ గానంత యారోగ్యముగ నున్నదని మనవిచేసి యుంటిని. సాక్షికి దాదాపుగా నఱువదిసంవత్సరము లున్నవి. మొదటినుండియు నాతఁడు దుర్బలదేహుఁడు. బలిష్ఠులకుమాత్రమనారోగ్యస్థితులు సిద్ధింపకుందునా? ఒక్కటేమాట. ఎంత మంచిగడియారమైననుసరే 'క్లీనింగు' కొఱకైనను మరమ్మతు చేయువానిచేతిలో నొక్కసారి పెట్టియెడల నిఁక నాగడియారపు బ్రతు కంతే! ముండ్లు తగులుకొనుటవలననో హుక్కు జారిపోవుటచేతనో మరెందుచేతనో మఱొక నెందుచేతనో యది సంవత్సరమునకు నాల్గుపర్యాయములైన మరమ్మతును గోరకతప్పదు. నాడిమూడు మని పరిహాసమునకైన నొక్క సారి మీచేతిని వైద్యునిచేతిలో నెప్పుడు పెట్టితిరో యాక్షణమందే మీయారోగ్యదశకు నాశ్వాసాంతమైనదని నమ్మవలయును. అంతటినుండి నెలకు రెండు మూఁడు పర్యాయములు మందాగ్నికో–మలబద్ధతకో–మఱేదేనికో–మఱేదేనికో వైద్యుల నాశ్రయించి యుండవ

లసినదే. బలిష్ఠులగు పడుచువాండ్రస్థితులే యిట్లుండ వయస్సుమీఱిన సాక్షి మాట వేఱ చెప్పవలయునా? అందువలన నడుమనడుమ ననివార్యముగ తటస్థించు లోపముల మన్నింప వేఁడుచున్నాను. నర్వేశ్వరుఁడు మీకు సమస్తశ్రేయములను సమకూర్చుగాక!

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

22. అభినందనము

సాక్షిపేరిట మద్రాసునుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో సారాంశమేమంటే, కొంతకాలం మూతపడినా మళ్లీ సాక్షినంఘం మేలుకొన్నందుకు అభినందనం. శిష్టు జంఘాలశాస్త్రి మళ్లీ ఉపన్యాసాలు ప్రారంభించినందుకు సంతోష ప్రకటనం.

ఈ ప్రకటనంలో, జంఘాలశాస్త్రి పాండిత్యం, వాక్యధోరణినీ ఆ లేఖాకర్త అభిమానించాడు. అభినందించాడు. అన లాఉత్తరం మొత్తమే జంఘాలశాస్త్రిని అభినందించడం కోసం వ్రాసినది. ఎక్కడో నత్యపురంవంటి గ్రామంలోకంటె - వాతావరణంలో గాని, శ్రోతల సంఖ్యలోగాని మద్రాసు బాగుంటుందనీ, అక్షరాలలో జంఘాలశాస్త్రి ఉపన్యాసాలు చదవడంకంటె, వేదికమీద ప్రత్యక్షంగా మాట్లాడుతూంటే వినాలనివుందనీ, రమ్మని ఆహ్వానించాడు.

ఈ ఉత్తరం చదవడం పూర్తిచేసి, జంఘాలశాస్త్రి తనకు ప్రశంసలా? అని అబ్బురపడ్డాడు. విమర్శకుడికి ప్రశంసలు ఉండవని నమ్మాడు. తనను ప్రశంసించవద్దనీ, నిజంగా ప్రశంసాపాత్రులు ఎందరో వున్నారనీ, సాక్షి సాహచర్యంవల్ల తానీమాత్రం మాట్లాడగలుగుతున్నానని అన్నాడు. తన వాక్ ధోరణిని ప్రశంసించనవసరం లేదనీ, అది నిరంతర సాధనవల్ల ఎవరికైనా వస్తుందనీ, తన ప్రత్యేకత ఏమీలేదనీ వివరించాడు. 'నీ తప్పులునువ్వు దిద్దుకున్నావా?' అని తనను అడగవద్దనీ, తానొక మార్గనూచిని మోసే స్తంభం బావతువాణ్ణి అన్నాడు. నిజానికి వాగ్ధోరణి గురించి చెప్పవలసి వస్తే స్త్రీల ముందు పురుషులు దిగదుడుపే అన్నాడు. మాటల కూరుణ్ణికాదు, చేతల కూరుణ్ణి ప్రశంసించమన్నాడు. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేస్తూ జైళ్లకు పోయే మహనీయుల్ని విధిగా ప్రశంసించమని జంఘాల శాస్త్రి నూచించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! మదరాసునుండి సాక్షికి లేఖ వచ్చినది. దీనిని జదువుట కనుజ్ఞనీయవలయును. దీనిలో నన్నుఁగూర్చి విశేషస్తోత్రపాఠమున్నది. దీనిని ఖండించెదను. అంతవఱకు వెగటుపడకుండ సావధానచిత్తులై యాకర్ణింపవలెను. సాక్షికి నమస్కారములు– మీరు

హారణాసిక్షేత్రమునుండి తిరుగ సత్యపురమునకు చయచేసి శరీరారోగ్యమును గొంత లభించి సౌఖ్యవంతులై యున్నారనియు, మీసంఘ ప్రధానవావదూకుఁడగు బ్రహ్మశ్రీ శిష్ట్ల జంఘూల శాస్త్రిగారు తిరుగ నుపన్యాసము లారంభించినా రనియుఁ దెలిసికొని మహానందపరవశుఁడనై తిని. మీజంఘూలశాస్త్రిని మేమెవ్వరము చూడకపోయినను, నాతని పూర్వచరిత్రయేమియు మాకుఁ దెలియకపోయినను, మీసంఘ స్థాపనకుఁ బూర్వ మాతనిపేరు మేనెన్నఁడు వినకపో యినను, మాకాతఁ డిప్పుడు చిరకాలపరిచితుఁ డయినాఁడు. పరమబంధుఁడైనాఁడు. ప్రాణమిత్రుఁడైనాఁడు. ఆహాహా! అతని మొగమైన నెన్నఁడు చూచియుండలేదే! అయినను నాఅడుగుల పొడువగు విగ్రహముతో-జేనెడు వెడల్పు నుదుటితో-లొడితెడు ముక్కుతో -గ్రద్దకన్నుల కంటె దీక్ష్ణములగు సోగకన్నులతోఁ-బట్టెడు త్రిపుండ్రముతోఁ-గంఠమున నంటియున్న యుసిరిక కాయలంతటి రుద్రాక్షలపేరులతోఁ-జొన్నగ్రాఁకువలె-నూటిగ నిలువఁబడి, కొంచెము పైకుబికిన నరములు గల దీర్ఘమగు దక్షిణహస్తమును మార్గదర్శివలెఁ జూచి-మందర స్వరమున నుద్రేకము పెచ్చినకొలఁది-మధ్యమస్వరమున-నుత్సాహ ముప్పొంగినప్పుడు ''రైయి''మని తారకస్వరమునఁ జిత్రవిచిత్ర శబ్దజాలప్రయోగనైపుణ్యమున - నట్టి తగ్గుచు -నిట్టి పెచ్చుచు నంతలో గిరగిరఁదిరుగుచు-మఱల నాఁగుచు నుత్తరక్షణ మున గప్పున మండుచు-నంతలోఁ జల్లారి వెన్నెలగాయుచు-నవ్వులు పువ్వులు, గిలిగింతలు నగిలింతలు, నూకొట్టుటలు చీకొట్టుటలు, పన్నీరు కన్నీరు చిత్తజల్లుగ వర్షించుచు -నాతఁడు నిత్యము మాకన్నుల కెదుటఁ గనఁబడుచున్న ట్లుండునే. ఆహా! ఒకప్పుడు పిల్లలతో గోటిబిళ్లలో, గోలికాయలో యాడుకొనుచు, నొకప్పుడు పుణ్యస్త్రీలయొద్ద జేరి సాటలఁబాడుచు-నలంకారరచననుగూర్చియు, నాహారపచనమును గూర్చియుఁ బత్యాకర్ష ణమునుగూర్చియు, శిశుపోషణనుగూర్చియు నాఁడంగిమాటలతో ముచ్చటించుచు -నొకప్పుడు విద్వాధికులయొద్ద జేరి యడ్డుదిడ్డముగా నాగ్రహమున శాస్త్రీయాంశములఁ గూర్చి వాదోపవాదము లొనర్చుచు-నొకప్పుడు వృద్ధవితంతువలయొద్ద నంటుసొంటు, నలుకు మ్రుగ్గు, ప్రతిపత్తిపలుకులాడుచు, గోవిందా రామ పాటలఁ బాడుచు-వారితోఁ గూడ మినుపరొట్టినాహరించుచు-మీ జంఘూలశాస్త్రి-ప్రతి గ్రామమునఁ బ్రతిపట్టణమునఁ బ్రతినగ రమున-నాంధ్రదేశముననే కాదు-కర్ణాటాది దేశములందుఁ గూడ-దాదాపుగాఁ బత్యాంధ్రు నిగృహమునందుఁ గూడ-నాతఁడు పిల్లలలోఁ బిల్లఁడై-పెద్దలలోఁ బెద్దయై-కాంతలలోఁ గాంతయై-తిరుగుచునే యున్నట్లు-వినుచున్నాను. అట్టి యాతఁడు రెండుమాసముల నుండి యుపన్యాసముల కుపసంహారము చెప్పి యూరకుండుట మా కందఱకు విచారకర ముగా నుండదా? ఉపన్యాసములు నిలువఁబడిన సని యెఱిఁగినవాఁడనై నను శనివారమువ చ్చుసరికి జంఘూలశాస్త్రిధోరణివలెఁ జెవిలో నేదియో ఝుంకారము మిడుతలదండు రొదవలె దూరమున జరుగుచున్న సంతలోని కలకలమువలె-సముద్రపుహోరువలె బయలువెడలి భ్రమపెట్టుచుండును గదా! నాయనా! జంఘూలశాస్త్రీ! నీవు మూఁగవై కాశీక్షేత్రమున సాక్షిసేవాతత్పరుఁడవై యున్ననుు నీకంఠరవము మాకర్ణపుటముల వ్యాపించి మమ్మెఁ గొంతవఱకైన సంతసింపఁ జేయుచున్నది. కాని మమ్మెఁ గేవలము విడనాడియుండలేదు సుమా! సత్యపుర మొకచిన్న గ్రామము కాఁబోలు. అక్కడ మీకు శ్రోతలెందఱో సమకూడె దరా? మీరు నాప్రార్థన విని-మదరానునకు దయచేయరాదా? మీసంఘ మిటనే కొంతకాలము స్థాపింపరాదా? సముద్ర తీరవాయువుచే సాక్షికి సంపూర్ణశరీరారోగ్యము సత్వరముగ సంభవిం

చునేమో? పశ్చిమార్కుని కాంతిచే బంగాళాఖాతములోని తరంగముల నురుగు బంగరై ప్రజ్వరిల్లుచుండ, సముద్రతీరమునందలి యెఱ్ఱ యిటుకల మహాభవనములు, మహమ్మదీయ శిల్పానుసారముగ నిర్మింపఁ బడిన గుమ్మ్చిలు, పశ్చాద్భాగమున నస్తమించుచున్న ప్రభాకర కాంతిచేతను, బురోభాగమున భోరున విజృంభించి మిన్నుముట్టి ప్రకాశించుచున్న వార్ధి తేజస్సుచేతను-స్వకీయము లగు నరుణకాంతుల చేతను త్రికాలజ్ఞానసంపన్నులగు మహా యోగులవలె స్తంభీభావమున నిలువఁబడియుండ నాహాహా! ఆహా! అనిర్వర్ణ్యమగు నీప్రకృతి సౌభాగ్యమును గాంచి మహాన్యాయస్థాన ప్రధానగోపురదీపము-పరమపురుషునకు మంగళపు టారతు లిచ్చుచుండ నట్టి సర్వజన సమ్మోహినీకరణ సమయమున -సహస్రజనసంఘపక్షమున మోటారుబండ్లు మొట్ట లాఁగి వినుచుండ-శకటాశ్వములు చెవుల నిక్కఁబెట్టి యాలించుచుండ-సముద్రఘోషముతో సాక్ష్యుపన్యాసము లీయరాదా? సర్వజనులు సంతోషసముద్రమున నోలలాడుదురే! అదిగాక మిమ్మఁ బ్రత్యక్షముగ నుపన్యా సరంగమునఁ గరశిరశ్చాలన మొనర్చుచుండ-గ్రద్దకన్నులతో శ్రోతల హృదయములు గ్రుచ్చుచుండ-వ్యంగ్యాది చమత్కారసంపత్తిచేఁ బ్రేక్షకులను గిలిగింతపెట్టుచుండ -నడుమనడుమ నాఁగియాఁగి వంకరచూపుచేతనో చిఱునవ్వు చేతనో-శబ్దజాలమునకుఁ గూడ నందని గంభీరతమభావమును గరతలామలకమువలెఁ బ్రకటింపఁ జేయుచుండఁ బ్రత్యక్షముగ నవలోకించి పరమానంద మొందుదురే! నడుమ నడుమ నుబ్బెత్తుగ నెగిరిపడు మీ 'ఓ'లు మీ ఆహాహాలు, మీ ఊహూహూలు, నట్టి పైకి వెడలుచుండగ, నచ్చులోఁబడి చల్లాఱకుండ నింక వెచ్చవెచ్చగ నుండఁగనే యాస్వాదించి యనుభవింతురే? అక్షరములో నేమున్నది? రసమా? శక్తియా? ప్రాణమా? ఏమియులేదు. ఏమున్నను శబ్దములో నున్నది. శబ్దములో బ్రహ్మమే యున్నప్పుడింక వేఱ చెప్పనేల? మీ సాక్ష్యుపన్యాసము లెందఱో కంఠస్థములు చేయుచున్నా రనునంగతి మీ రెఱుఁగుదురా? మహాజనసభలలో వినోదార్థము నీతిబోధ నార్థము-కంఠస్థము లొనర్చువారు మీరుపన్యసించు ధోరణితోడనే యుపన్యాసిం చుచున్నారు. ఇప్పుడు సాధారణముగాఁ బల్లెటూరిలోని గ్రామదేవతాదితీర్థములలో నయి నను జోడెలదుకాణముతోఁ బాటుగాశీపటపువాని రంగులలాంతరుతోఁబాటు - అంకులరా ట్నముతోఁబాటు-సాక్ష్యుపన్యాసకపీఠ మొక్కటి యుండకపోవుట లేదు. కిట్టకపోవుటచే నీవృత్తి వృద్ధిలోనికి రాకుండ నున్నది. శాస్త్రిగారూ! మీయెడల నాకున్న యనురాగమును, గౌరవమును నేనిట్లు వెల్లడించి మీకు వ్రాయుటచే నామనస్సు తేలికపడినది. మెచ్చుకొనఁదగి నవానిని జేత నయినట్లు మెచ్చుకొని మనుష్యవిధిని నిర్వహింపఁగలిగితినని యానందించుచు న్నాను. సాధారణముగా జనులలో నసూయాపిశాచానిష్టులనేకులు. ప్రపంచజ్ఞాననిక్షేపులగు మీకు నేనిట్లు చెప్పుట త్యాగరాజుగారికిఁ దాళప్రస్తారము చెప్పుటకంటె వేఱుగాదు. ఒక రధికులని యెప్పుకొన్న యెడలఁ దాము నీచులమని యంగీకరించినట్లు వారి యభిప్రా యము. కలకండ తీయగా నున్నదని వారొప్పుకొన్నయెడల వారు విషముష్టిగింజ లగుదురని వారి యభిప్రాయము. గొప్పవారి గొప్పతనము తా మొప్పుకొనరు నరికదా పరుల నొప్పుకొననీయరు. ఇట్టి పరమ దౌర్భాగ్యశిరోమణులయెదుట సముద్రము లోఁ తటుకు పీలులేదు. ఆకాశ మెత్తనుట కంతకంటె పీలులేదు. ప్రపంచములోఁ దత్రాపి మన దేశమందిట్టి యధమాధములు-మూటి కేబదికంటెఁ బైగ నున్నారు. వీరిలో రెండు తెగలు. ఎవ్వరి యాధిక్యము కూడ నొప్పుకొననివా రొక్కతెగవారు. దొమ్మఱిది గడనెక్కి బహు విచిత్రలా

ఘవముతో నోడినదని యీశుంతాగ్రగణ్యులతో నెవ్వరైనఁ జెప్పునెడలఁ దల నేలఁ గొట్టు కొని చచ్చుటకు సిద్ధపడుదురు. మాదిగవాఁడు చెప్పులజోడు బాగుగాఁ గుట్టినాఁడని యీ పనికిమాలిన పందలతో నెవఁడైనఁ జెప్పునెడలఁ జెప్పినవానిని జెప్పుతీసికొని కొట్టుటకు సిద్ధపడుదురు. ''మనముకూడ నట్లులవాటు చేసికొన్నయెడల నట్లుకుట్టలేకుందుమా? వాని గొప్పతన మెక్కడ నేడ్చిన.''దని యీబుద్ధిహీనుల యాశయము. తా మొనర్చువృత్తిలో మాత్ర మెవ్వరి యాధిక్యమునుగూడ నొప్పుకొననివారు రెండవ తెగవారు. తమవృత్తిలోఁ దానే ఘనుఁడు. రెండవవాఁడెవ్వఁడైననరే తనకంటెఁ దక్కువవాఁడు. అది సిద్ధాంతము. శిలాక్షరము. తనవంటివాఁడే రెండవవాఁడై యున్నప్పుడు వానికిఁ గూడ నదియే యభిప్రాయ ముండకపోవునా? ఆమాత్రపుజ్ఞానము తనకేల యుండరాదు? కవులలో నీనైరము గాఢమై యున్నది. కార్కొని యున్నది. ఘనీభవించియున్నది. కవుల యుద్ధములందు రస్సోజ పానీను రణము రణము కాదు. కత్తులకంటెఁ –గటారులకంటెఁ దుపాకులకంటె –ఫిరంగులకంటె–బాంబులకంటెఁ–గవుల కలములు గాఢతరములు. క్రౌర్యసహితములు. ఖరతరములు. కాయప్రాణమాన విచ్ఛేదకములు. ఈయంశమునుగూర్చి మీ రనేక పర్యాయ ములు విపులముగ ముచ్చటించియుంటిరి నేనిఁక జెప్పఁదగదు. ఉపజ్ఞాసహితమగు బుద్ధిమంతుఁ డే దేశమున బయలువెడలినను నరే వాని కందఱు శిరము లొగ్గి చేతులు జోడింపవలసినదే. జాతి లింగ వయోభేదము లేకుండ నట్టి వ్యక్తిని హృదయములఁ బెట్టుకొనఁదగినదే. కన్నుల కద్దుకొనఁ దగినదే. యథార్థజ్ఞానదర్శన మైనప్పుడు మనవాఁ డేమి? పైవాడేమి? మగవాఁడేమి? ఆఁడుది యేమి?

జంఘాలశాస్త్రిగారూ! నాదీర్ఘలేఖను జదువుకొనునట్టి శ్రమను మీకీయ సాహసించినం దులకు నన్ను క్షమింపవలయును. పైవారమున మఱియొలేఖ వ్రాసికొందును. దానినిగూడ మీ సంఘుభ్యులకు వినుపింప వేఁడుచున్నాను.''

చిత్తగింపవలయును.

కా. కే.

నాయనలారా! లేఖను వింటిరా? వహవ్వా? జంఘాలశాస్త్రికి నేటికి స్తుతులా! సెబాస్! జంఘాలశాస్త్రి యెంతవాఁడయ్యెను! ఎప్పుడీ సంగతి యనుకొనలేదే! నిరాఘాటముగ –నిశ్శంకముగ–నిరంకుశము–నెందఱెందర దోషములనో–యెట్టియెట్టివారి దోషములనో నిష్పక్షపాతముగ విమర్శించిన నాకిప్పుడు ప్రజల స్తోత్రపాఠములే? సార్వభౌముని మొదలు చచ్చుబానినక్రింది బానిసవఱకు నెవ్వరినిగూడ దాక్షిణ్యమున మిగుల్పలేదే! సంఘదోషము లలో ననేకములను జనుల పేరెత్తకుండ శరళముగ నొకప్పుడు–సాగుడు సాగుడుగ నొకప్పు డు–చండముగ నొకప్పుడు విమర్శించితినే. మనుజుల పేరెత్తుట మాకేమి పని? పేరెత్తుటకు మే మెవ్వరి నెఱుఁగుదుము? మాకొక్క రిష్టులు నొక్క రనిష్టులు నున్నారా? కాని యందఱకు నేననిష్టుఁడను గావలసి వచ్చినదని యనుకొనుచుండఁగాఁ జెవుల కీమకరకుండ లము లేమి? చేతుల కీ సింగపుఁదలాటపు మురుగులేమి? నాయనలారా! ఏదేశమునైన –నేకాలమునైన–నేజాతియందైన విమర్శకుని గొంతుచుట్టు పలుపేకాని ప్రసవమాల యని వింటిరా? కాలికి బొండయేకాని గండపెండేరమని వినియుంటిరా? మంచిని చెప్పువాఁడు మంచివాఁడు చెడ్డను చెప్పువాఁడు చెడ్డవాఁడు. ఇదియే ప్రపంచస్వభావము. నాలుకమీఁద

మధువు కలవాని బుజములపై సాలువులజోడుకాని ముల్లుగలవాని హస్తముల కఱదండముల జోడే కాదా? ''అప్రియస్య చపథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభ'' యన్నట్లు కఠినమైన యీపనికి–జనకంటక మైన యీ పనికిఁ – బూనుకొనువారు మిగులఁదక్కువ. అట్టి తక్కువపారిలో నేను మిగులఁ దక్కువవాఁడను. అనేకశక్తులున్న సాక్షి/ కటాక్షమున నీ విమర్శనశక్తి స్వల్పముగా నాకు లభించినది. కవితాశక్తి నాకు లేదు. అక్కఱయు లేదు. నాకుఁ గలిగిన స్వల్ప విమర్శనశక్తిని సంఘోపయోగమునకై దైవముఖము/చూచి వినియోపఱ చుచున్నానని నేననుకొనుచున్నాను. మీ తప్పులు మీరు దిద్దుకొని బాగుపడినఁ జాలు. అదియే నాకు లక్షస్తుతులు. కోటిబహూకృతులు. నీ తప్పులు నీవు దిద్దుకొంటివాయని నన్నధిక్షేపింతురేమో? హంపిగ్రామమున కిది దారి, ఆనెగొందికది దారి, యని రెండుచేతు లతో రెండు వేఱువేఱుమార్గములను గనఁబఱచు కట్టస్తంభముతో నీ వానెగొందికిఁ బోయితివా? నీవు హంపికిఁ బోయితివా? యని దెబ్బలాడువాఁ డెవ్వఁడైన నుండునా? అట్టివాఁ డెవ్వఁడైన నున్నాఁడని మీకుఁ దోఁచినయెడల వానిని మద్రాసు పిచ్చియాసుపత్రిలోఁ బాఱవేయుఁడు. అంతవఱకు మీ కోపికలేనియెడల సమీపములోనున్న బంగాళాఖాతములోఁ బాఱవేయుఁడు. ఈవైపునకు రాకుండ నావైపునకుఁ బొండని తేజస్వంతమైన ఘోషముతో నుపన్యసించు ''ఎడ్డిస్టోన్ లైట్ హౌస్''తోనే నావికుఁడైన ''నొడ్డునఁ గూరుచుండి తెగనీల్గెద వేమి? నీవెప్పుడైన సముద్రము దాఁటితివా' యని వాదులాడి యాదీపస్తంభమును దూషించిన యెడల, వాఁడు రెండుకాళులవాఁడు కాఁడని మీరొప్పుకొందురా? ఎవని మాటలైన నేమి? ఎవనిబోధన లైననేమి? మీ దురాచారములను మానుకొనుటకు మీకుఁ గలిగిన ప్రత్యవాయ మేమున్నది? నేలవేము కషాయము త్రాగినయెడల జ్వరము తగ్గు నని చెప్పిన వైద్యునితో ''నీవెప్పుడైనఁ ద్రాగితివేమో అసంగతి నాకు ముందుగాఁ జెప్పు'' మని పలికిన రోగి దర్భశయ్య నెక్కవలసినవాఁడనుట కేమైన సందేహమా? నాయనలారా! వెట్టివెట్టిప్రశ్నములు మనసులోనైన వలదు. నావిధి యేదో నేను నిర్వర్తింతును. మీకుఁ దోఁచినట్లు మీ రాచరింపవచ్చును. మనుష్యవిధిని నేను/శక్త్యనుసారముగ నిర్వహించుచున్నాను. విధి యొనర్చినందులకు స్తుతులక్కఱలేదు.

ఇక నావాగ్ధోరణినిగూర్చియా యీలేఖరికొనియాడుటా? వాగ్ధోరణియా! ధూ, అది యొక్క ప్రజ్ఞయా ప్రతిభయా? వట్టిది. నాయనలారా! వట్టిది. అదియొక్క స్తుత్యర్హమైనశక్తి యని భ్రమింపకుఁడు. వాగ్ధారాళత పురుషులకంటె స్త్రీలకు మిగుల హెచ్చుగా నుండును. ఆఁడుదాని ధోరణిముందు మగవాని ధోరణి దిగఁదుడుపునకైనఁ బనికిరాదు. దూర్పునఁ బంటలు లేకపోవుటచే జామినుండియో బిటివాడనుండియో పొట్టలు చేతఁ బుచ్చుకొని యిక్కడకువచ్చి కూలినాలిఁజేసికొని జీవించు స్త్రీలలో నొక్కతె పాలిపంపుల తగవులలోఁ గాని భర్తపంపుల తగవులలోఁగాని ప్రతికక్షిబుగ్గలు బల్లెపుఁబోటులవలెఁ బొడువబోవుచుఁదన తుంట్లు టపాకాయల దెబ్బలట్లు చఱుచుచుఁ, జేతులెత్తి దుమ్మెత్తి తిట్టుచు నూపిరి మలచుకొనకుండ నుపన్యసించినప్పు డపర శారదయని యనిపించుకొనిన –ఆనిబీసెంటమ్మవారు 'హైసరెమఝూ' యని యవతలి ప్రపంచార్థమునకు హాహాకార మొనర్చు లజ్జపడి పరుగిడవలసినదే కదా! ఆకాశగంగ జంకి జంకి పాతాళమున దాఁగవలసి నదేకదా! తల కొంచెము ''ఖాలీ'' యయినప్పుడే జిహ్వాకు ''జో'' రెక్కువ. లోఁతులేనినీ టికే తరంగముల ''తహద్దీ'' మెండుకాదా! హృదయము రవంత యోటిదైనప్పుడే నోటి

కెక్కువగట్టి. పెండ్యులపుభారములేని గడియారపుఁగాడ చేయు గడబిడకు హద్దున్నదా! తోఁకలేని గాలిపడగ కాకాశపుఁ 'బలిటీ' లధికముగాదా! కావున వక్తృత్వ మొక్క స్తుతిపాత్రమై నశక్తి యనుకొనఁదగదు. ఇప్పటి యసహాయవాదుల ప్రచారమహిమచేఁ బల్లెపాలెములో నిద్దఱుఫాక్సులు–తెనాలిలోనల్వురుడెమాక్టైనీసులు–సీతానగరములోనెనమండ్రుసిసిరోలు –గ్రామగ్రామమునకు గ్లాడ్స్టనులే! వీరందఱిట్టి వక్తలెట్లయిరి? అభ్యాసమువలన –అనవరతాభ్యాసమువలన–ఏదియో యొకవిషయమునుగూర్చి–పదేపదే మాటలాడఁగ బదిమాసములు గాకుండ 'బర్క్'ను వెక్కిరింపవచ్చును. ఆరంభములో విడువలసినది సిగ్గు. ఆరంభములో నర్థమునుగూర్చికూడ నంతపట్టుదల యక్కఱలేదు. ఒక రేమనుకొందురో యనుసందేహమునుమాసి, యుపక్రమోపసంహారములను గణింపక, మొండిత్రోపుగ –బడితెబాజాపద్ధతిగ-ముందువెనుక చూడక–దొడ్డిసంభావన దొమ్మిలోఁ బడిన ట్లారంభింప వలయును. వెనుకత్రోపులు–ముందుసాటలు–మోచేతిపోటులు-తలవ్రేటులు-గణింపక కొంతకాలమిట్లు సాధన మొనర్చినయెడల వాచాలత లభింపక పోదు. నాయనలారా! వాగ్ధోరణియొక ప్రశంసార్హమయిన ప్రజ్ఞయని యెన్నఁడు భ్రాంతిపడకుఁడు. మాటలాడు టయే మనుష్యుని స్వభావము. అందుకై యొకని కర్థపాద్యము లియ్యనక్కఱలేదు. అగ్రతాంబూల మియ్యనక్కఱలేదు. తెల్లవాఱినదాఁకనొక కప్ప బెకబెకలాడఁగ మిగులు కప్పలు దానికి బ్రహ్మరథము పట్టుచున్నవా? పశులుసహితము ప్రబల మగు నభ్యాసమువలన మనుష్యభాషణముల మాటలాడుచుండ, వేఱేమి చెప్పనలయును? నాసికాక్షేత్రప్రాంతమున నున్న యొక మన్నెపుగొరువంక నంధ్యానందనము సమగ్రముగఁ జదువఁగలిగి యుండెను. భగవద్గీతా ప్రథమాధ్యాయ మొక్క పనపుఁబచ్చని చిలుక బదరీనారాయణములోఁ బారాయణము చేయుచుండఁగా నేను వింటిని. మనుష్యేతరులకే సాధారణమైనది, మనుష్యులకు విశేషమెట్లు? గోకఁగ గోకఁగఁ గురుపు-వ్రాయఁగ వ్రాయఁగ వ్రాఁత-పాడఁగఁ బాడఁగఁ బదము - వాగఁగ వాగఁగ వక్తృత్వము. కాని దూరదర్శనశక్తి వ్యావహారికతంత్రనైపుణి –పళమార్థనిర్ధారణపటిష్ఠత–ప్రపంచజ్ఞాన సమృద్ధి సద్యస్స్ఫూర్తియుక్తినైభవము -హేతుకల్పనాసామర్థ్యము-సర్వజన సమ్మోహనశారదానిశారత– సమయానుగుణారోహణా వరోహణాది చమత్కారసంపత్తి మొదలగునవి పరమేశ్వర ప్రసాదితములు. అభ్యాసమువలన లభించునవి కావు. కేవలావధూతకమాత్రము సంతతాభ్యాసమున సర్వజనసాధ్యము. అదిగాక చిటపటలాడు నగ్ని మండదు. బడబడలాడు మబ్బు కురియదు. ఉపన్యాసరంగము నుండి హరివాసరోపవాసమును ఘోషించు వక్తకుఁ–బ్రక్కమీఁదనుండి లేవకుండఁగనే పదలమిడ్డినలు, పడిన్నర కాఫీ, సర్వసంగపరిత్యాగ ముపదేశించు వక్తకు నెలకు రూపాయకు రెండణాలధర్మవృద్ధిత ముద్దుపత్రములు. మాటలో వైరాగ్యము, చేష్టలలోఁ బామరత్వము, నోట భక్తి, హృదయమున శక్తి-ఇట్టి యసందర్భతనుగూర్చి నేనెన్ని పర్యాయములో చెప్పియుంటిని. ఇఁక నక్కఱలేదు.

నాయనలారా! మాటలతోఁ బని యేమున్నది? ఆలాపశూరుఁడు శూరుఁడుకాఁడు. ఆచరణశూరుఁడు శూరుఁడు. ఏమియు మాట లాడకుండ, నాడంబర లేశమైన లేకుండ, వాగ్దానమైన నొనరింపకుండ నెందఱు రాజులు ఎందఱు రాజాధిరాజు లెన్నెన్ని దేశోపకారకృత్యము లొనర్చుచున్నారో చూచియుండరా? వినియుండరా? అట్టి మహాత్ముల మూలమున నెన్ని ధర్మసత్రములు–నెన్ని దీనజనాలయములు–నెన్ని పుస్తకశాలలు–నెన్ని విశ్రాంతిమంది

రములు–నెన్ని పాఠశాలలు-నెన్ని దేవతానిలయములు స్థాపింప బడినవో, పడుచున్నవో యెఱుఁగరా? కోట్లకొలఁది ధనము లోష్టప్రాయముగ వెచ్చించి దేశోపకార మొనర్చు నీమహాత్ములు స్తుతుర్హులా? కాని ఖర్చులేకుండ గంటన్నఅనేపు జమీందారుల కోడిపందె ముల పిచ్చినిగూర్చియో–రాజయోగిగారి మదవుఁబిచ్చినిగూర్చియో–కాంతల జడచుట్టల పిచ్చినిగూర్చియో–పనిలేక యువన్యసించు వేను స్తుతి కర్హుఁడనా? తప్పు తప్పు. నన్ను స్తుతింపవలదు.

ఇదిగాక నాయనలారా! మఱియొకటి, బుద్ధుఁడు నర్వభూతానుకాగమతము బోధిం చినప్పుడు తొంబతొంబలుగ, గుంపుగుంపులుగ, దండుదండులుగ జనులు బౌద్ధనన్యాసాశ్ర మస్వీకరణ మొనర్చినట్లివ్వుడు దేశబంధమోక్షణము నపేక్షించి యందఱెందలు శ్రీకృష్ణ జన్మస్థానమునకై పోవుచున్నారో? ఆహాహా! పెండ్లికిఁ బోవుచున్నట్లు పోవుచున్నారే! మోటా రుబండ్లెక్కి తిరుగుటకంటె మట్టిబండ్ల లాగుటయే ఘనత యని నిశ్చయవఱచుకొనుచు న్నారే! కాశ్మీరపుసాలువులు ధరించుటకంటె ఖద్దరుకౌపీనమును ధరించుటయే గౌరవాధిక్య మనుకొనుచున్నారే! రజతపాత్రములందుఁ బరమాన్నమును భుజించుటకంటె మట్టి మూఁకుటిలోని నజ్జకంకటి త్రాగలేక రోసి యుపవసించి చచ్చుటయే జన్మమునకు సార్థకత యనుకొనుచున్నారే. వహవ్వా వహవ్వా! యెట్టి కాలము తటస్థించినది! ఇట్లాచరించునది యొక్క పురుషులేనా? కాదే?– అబలలు–అతినుకుమార లగు నబలలు – ఆగర్భశ్రీమతు లయిన యబలలు – మార్దవమును విడిచి మందాక్షమును మన్నుచేసి తెగివడి యూరఁబడి యూరుదాఁటి దేశమునఁబడి–ఓ–మహోత్సాహమున నొడలు తెలియని దేశభక్త్యావేశముచే నుప్పొంగుచు నుపన్యసించి యుపన్యసించి కారాగృహములలోనికి మొక్కజొన్నపిండి వినరు టకో–కొబ్బెరపీచు త్రాళ్లు పేనుటకో, యెగిరి యెగిరి పోవుచున్నారు గదా. అంతేనా, ఒక్కస్త్రీలేనా? ఆహాహా! కాదే! కాదే! కుండబంతి లాడుకొనవలసిన పిల్లలో – ఇఁక నేమి చెప్పవచ్చును? నాయనలారా! మీకు స్తుతులు చేయుటకు–శక్తి యున్నయెడల–స్తుతు లొనర్చుటకు నోరున్న యెడల - హృదయ మున్నయెడల–మీ సోదర సోదరీమణులతో సానుభూతి యున్నయెడల–దేశభక్తి యున్న యెడల–మీనాళములలోని రక్తమున కార్యవంశ రక్తసంస్కారమున్న యెడల–ఓ–అడ్డులేకుండ–హద్దులేకుండ–వీరిని స్తుతు లొనర్పుఁడు. పుంఖానుపుంఖములుగ స్తుతులొనర్పుఁడు పుష్కలావర్తమేఘములు తెగివడి గ్రిమ్మరించి నట్లు స్తుతు లొనర్పుఁడు. ''వీరిలో నందఱు గేవల స్వార్థపరిత్యాగులేనా? దొంగలు లేరా?'' యని యడుగుచున్నారా? ఆహా! యెంత నందేహ మడిగితిరి! ఉండనిండు. రూపాయకు మూఁడుపావులాల రెండుపాఁత డబ్బులవఱకు దొంగలే యుండనిండు. దొంగ లుండుటచే తనే దొరలకు ఘనత. దొంగ లెచ్చట లేరు? ఎందున లేరు? వేదములో దొంగలు. వేదాంతములో దొంగలు. శాస్త్రములో దొంగలు. సన్యానములో దొంగలు. ఇంట దొంగలు. వాఁకిట దొంగలు. గాలిలో దొంగలు. నీటిలో దొంగలు. ఎక్కడఁ జూచిన దొంగలు. ప్రపంచమే దొంగప్రపంచము. దైవమునకుఁ దస్కరాణాంపతి యను బిరుదముకూడ నున్నది. నాయనలారా! ఇప్పటికిది చాలును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

23. స్వారాజ్యము

జంఘాలశాస్త్రి మద్రాసునుంచి వచ్చిన ఒక ఉత్తరం చదివి విని పిస్తున్నాడు. అది ఎవరు రాశారో మాత్రం తెలియదు. ఆ ఉత్తరం వ్రాసిన వ్యక్తి ఒక బైరాగిని ఆ నగరంలో ఒక నందులో కలుసుకుని – ఆతని ద్వారా ఉపన్యాస రూపంలోవున్న బోధను సాక్షి సంఘానికి తెలియజేశాడు.

ఆ బైరాగి చాలా నిర్లిప్తుడు లాగవున్నాడు. మాటల ధోరణిని బట్టి మతిస్థిమితం కూడా లేనట్టున్నాడు. ఈ లేఖ వ్రాసిన వ్యక్తి ఆ బైరాగి స్వతంత్రతకు, తటస్థతకు, నిర్లిప్తతకు ఆకర్షణ పొందాడు. అందుకే డయాగొనీసు సన్నిధికి వేంచేసిన ఒక చక్రవర్తిగారి ఉదంతమూ, పన్నిద్దరాళ్వారులలో ఒక నిర్లిప్తుడి దగ్గరకు పార్వతీపరమేశ్వరులు వచ్చిన ఉదంతమూ చెప్పి, నిర్లిప్తుడంతటి జ్ఞాని మరి ఉండడని చెప్పి రాశాడు.

ఆ లేఖలో వ్యక్తి బైరాగిని ఆశ్రయించి ఏదైనా ఉపదేశం చెయ్యమని కోరాడు. అతను వింతవింతగ మాట్లాడుతూ ముందు స్వరాజ్యోద్యమం, గాంధీ గీతాలూ, అసహాయవాదుల హర్తాళ్, ఖద్దరుధారణంలో స్త్రీలవట్టు దల వంటి విషయాలగురించి మాట్లాడాడు.

మనస్సుచేత - వాక్కుచేత - శరీరం చేత - ఎవరికీ అపకార చ్ఛాయకూడా తలపెట్టవద్దు. అహింసే పరమధర్మం. స్వార్థత్యాగం, కష్టాలను సహించడం, సత్యవర్తనం, సర్వసమానత్వం మించి, సంపాదించదగినవి, ఈ జన్మకు లేవు. రాదగినది స్వా(స్వర్గ) రాజ్యం. దానిని కోరాలి. శాంతి ధ్వజం చేతపుచ్చుకొని ఊరూర తిరుగు అని – బైరాగి ఆ వ్యక్తిని పో పొమ్మన్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! మదరాసునుండి వచ్చునని యూహపడిన లేఖ యిదిగో! దీనిని జదువుట కనుజ్ఞనీయవలయును.

సాక్షికి–నమస్కారములు. నేనీ పట్టణమున దోచక యిటునటు తిరుగుచు–నొక నందులోనికి బోయితిని. ఆ నందులో నొకయింటి యరుగున కానుకొని యొక మునలియాతడు కూరుచుండియున్నాడు. ఆతడడుగువది యేండ్లవాడువలె గానబడి

నాఁడు. మొగము తేజస్వంతముగ నున్నది. తెల్లఁబడినగడ్డము పొడుగగుటచేఁ గాఁబోలు నడుమును ముడినైచినాఁడు. ముడివేయగా మిగిలిన రవంతకొనకు రెండుగన్నేరు పువ్వులు నన్నని గుడ్డపేలికతోఁ గట్టినాఁడు. కుడిచెవినందులో నగము గాల్చినపొగచుట్టను బెట్టినాఁడు. ఎడమచెవినందున మారేడుపత్రిని బెట్టినాఁడు. నఱసి–గఱునుదేఱి దుమ్ముపా ఱి–పొగాకుపొగ యెల్లప్పుడావరించియుండుటచేఁ బొగచూఱి–రవంతపచ్చవడి– చిక్కువడి యల్లికపడి–యాతని తలపై వెండ్రుకలు మిక్కిలి చికిబికిగాఁ, బిచ్చుకగూఁడువలె– నీఁతఱు ప్పవలె నున్నవి. వానిలోఁ జీఁపురుముళ్లు–నన్నకంకఱఱాలు–వట్టిగడ్డిపఱకలు పేఁడబెత్తిక లు–నక్కడక్కడనిమిడి యున్నవి. ఎడమచేయి పూర్తిగాఁ బోయినట్టియుఁ గుడిచేయి మోచేతి వఱకే నిలిచియున్నట్టియుఁ దిలఘాతుకుని యంగవస్త్రమంత తెల్లనిదై జల్లెడవలె నహస్రాఛ్రమైన – చొక్కా యొకటి యెదుటివైపు వెనకను, వెనుకవై పెదుటకు గలుగునట్లు ధరించియున్నాఁడు. గుడ్డతిఱోపెట్టిన విభూతికడముంతమూఁతిపై నడ్డముగఁ జిలుము గొట్ట మున్నది. ఆతఁడు వట్టినేలను గూరుచుండి పూర్వపు వృద్ధవితంతువులు ప్రత్తితీసిన ట్లు–ప్రస్తుతదేశభక్తులేకులు లాగినట్లు–గంజాయిజడల గింజలను దీయుచున్నాఁడు. నే నాతనికి రెండుబారలదూరములో నిలువఁబడి ''నాయనా! చెవి నున్న చిలుకకొట్టుతోడనే సంతుష్టికాని నీకు 'త్రికాసిల్ను సిగరె'ట్లక్కఱలేదుగదా! కూరుచుండుటకు గులకఱాలపీ ఠమే కాని మొకమాలుసోఫా లక్కఱలేదుకదా! నీకడముంత నీకుఁ జల్లగా నున్నంతవఱకు హిందూదేశము జపానువా రేలినను, నింగ్లాండు దేశ మమెరికావారేలినను నీకు లెక్కలేదు కదా! వాంఛలు చాలభాగము సంకుచించుకొనిన నీమననునఁ జంద్రోదయమేకాని కంటికిఁ జిత్తజల్లు లేదుగదా! అడ్వొకేటుజనరలు నెత్తిపై నరమైలెత్తుననాడఁ దగిన న్యాయవాదిశిఖా మణియైన నిన్నింతకంటె దిబ్బమీఁదఁ గూరుచుండఁబెట్టలేఁడుగదా! శస్త్రశారీరశాస్త్రాది సాహితీసంపన్నతలో సర్జనుజనరలుగారి పితామహప్రపితామహుఁడైన నీప్రాణమును దీయలేఁ డుకదా! చలిచేత న్యూమోనియా వచ్చుననుశాస్త్రము నీయెదుటఁ దగులఁడినదికదా! చలిచేత న్యూమోనియా వచ్చుననుశాస్త్రము నీయెదుటఁ దగులఁబడినది కదా! దోమలవ లన శీతజ్వరము వచ్చునన్న నవనవసిద్ధాంతమును నల్లినిఁ గాలిక్రింద నలిపినట్లు నలిపితివి కదా! ముఱికినీటికాలువలనడుమను గూరుచుండి–యఱువదేండ్లు–పననపిక్కవలె చెక్కుచె దరకుండ దినము లీడ్చిన నీముందారోగ్యశాస్త్రమంతయు ధ్వాన్నము నల్లమడు గయినది కదా! నికోటినువిషము నీపిక్కమీఁది వెండ్రుకనైనను గదలుప లేకపోయినదికదా! ఆహా! నీ వెంత యదృష్టవంతుఁడవు! నీకున్న శాంతిలో సంతుష్టిలో–నహస్రాంశమైన–నీరాజులకు –రాజాధి రాజులకుఁ–జక్రవర్తులకు–సార్వభౌము లకు–నున్నయెడలఁ బ్రపంచములో నీయే పుడు లుండునా? ఈ క్షామము లుండునా? ఈయుద్ధములుండునా? ఈ జననాశన ముండునా? ప్రపంచ మింత పాడైయుండునా? సంకల్పసంకోచమే సర్వసౌఖ్యజనకముకదా? అని నాలో నేనేమో పడుగుపేకగ ననుకొనుచుంటిని. గంజాయి జడలు విప్పుచుఁ దలవంచు కొనియే యాతఁడు కూరుచుండెను గాని నావంకఁ జూడనే లేదు. చూచుట కతనికి నాతోనేమిపని? నాలెక్కయేమి? మూర్ధాభిషిక్తులతోనైన నాతనికేమి పని యున్నది? కటిస్నా నము చేయఁబోవు కొనేయ విద్యార్థివలెఁ దొట్టిలోఁ గూరుచుండిన డయాగొనీసుసన్నిధికి చక్రవర్తి యొకఁడుపోయి నిలువఁబడగ, నా మహావేదాంతి యీ మహాసంపన్నుని గ్రీఁగంటనైన నవలోకించినాఁడా? అయ్యా! నేను మహాసార్వభౌముఁడను. నీకేమైన నుపకృతిఁ జేయుటకు

వచ్చితిని. ఏదైన సేవ నావలనఁ గైకొని వమ్ముఁ గృతార్థునిఁ జేయు మని యీ విశ్వంభరాపరి పాలకుఁ డీవిరాగిశిఖామణినిఁ బ్రార్థింపఁగఁ ''నీ వీట నిలువఁబడఁగా నాతొట్టిలోనికెండ రాకున్నది. నీ వావలికిఁ బొమ్ము. నీవు నాకుఁజేయు నుపకారమిదియే.'' యని యీ పరమహంసవతంసము ప్రభుశిఖావతంసముతోఁ బ్రత్యుత్తరమీయలేదా? ఇది యెంత నంగతి? ఇది యెంత వింత? ఇది యెంత వైరాగ్యము? ఇంతకంటె విశేషమొకటి చెప్పెదను. డయాగొనీసు మనుజుఁడు. చక్రవర్తికూడ మనుజుఁడు. మనుజునకు మనుజుఁడు చేయఁగల యుపకార మెంత? ఎంత మహోపకారమైన నైహికమైనదే చేయఁగలఁడు. కాని యీముష్మికమై నది చేయుట కతనికి సాధ్యమగునా? ఱాకలినిఁ ద్రోచిపుచ్చిన డయాగోనీనుకుఁ గోడిగ్రుడ్లు యట్టు కావలయునా? పీఁతలపులుసుకూర కావలయునా? దిగంబరుఁ డైన డయాగొనీసుకు స్నానలు పంట్లాము కావలయునా? ట్వీడ్డు ఫ్రాక్కు కావలయునా? ప్రపంచవిశాలతను జూచి రోసి–గుహలో దూరి–తొట్టిలోఁ గూరుచుండి–యా తొట్టియే మిగుల విశాలమైయుండెనని యేడ్చుచున్న డయాగొనీసుకు పశువుల ఫారములు కావలయునా? నర్కారువారి యగ్రహారములు కావలయునా? స్వతంత్రపుటాస్థానములు కావలయునా? ఏవియు నక్కఱలేదే! తన యెదుట నిలువఁబడిన చక్రవర్తి–వీనికంటె నెక్కువ నేమియు? ఇవి యిదివఱకే విసర్జింపఁబడిన పదార్థములు కావున డయాగొనీసు చక్రవర్తిగారిని నిరాకరించె ననుటకుఁ గొంత యుపపన్నత గలదు. మోక్షమీయఁగల మహాదేవదూత యెవ్వఁడైన డయాగొనీసు కెదుట నిలువఁబడి చక్రవర్తి యాతని నడిగినట్లు యడిగియుండినయెడల డయాగొనీసు ఆమహాదూతకు మ్రొక్కి మోక్షమిమ్మని యపేక్షించునేమో? ఏమో? ఆయంశముమట్టున కీకథలో నింక సందిగ్ధముగ నున్నది. ఆసంశయమేదో మన మతచరిత్రములో తీఱిపోయినది. పన్నిద్దరాళ్వారులలో నొకరు బొంతకుట్టుకొనుచు కూరుచుండిరి. ఆయన మహావిరాగి. మహాభక్తుఁడు. మహాజ్ఞాని. పార్వతీపరమేశ్వరు లంతరిక్షమున విమానారూఢులై పోవుచు నీ మహాతపశ్శాలినిఁ గాంచిరి. ఆ మహానుభావుఁ డెవ్వఁడని పార్వతి పరమేశ్వరు నడిగెను. ఆయన యొక గొప్ప భక్తుఁడని శంకరుఁడు శాంకరికిఁ బ్రత్యుత్తరమిచ్చెను. ఒకసారి యాతనియొద్దకుఁ బోవుదమని పార్వతి భర్తతో ననెను. ''ఎందులకుఁ బోని'' మ్మని భర్త యుపేక్షాభావమునఁ బలికెను. భర్తయుపేక్ష హెచ్చినకొలఁది భార్యయపేక్ష యెక్కువ యయ్యెను. భర్తవలదన్న కొలఁది భార్య పట్టుదల యెక్కు వయ్యెను. భార్య యేదైనఁ గోర్కె కోరినయెడల వెంటనే ''ఊ'' అన్నమగఁడు. బ్రతికి బాగుపడునుగాని ఊహూఁ అన్నవాఁడుమాత్ర మెన్నఁడు దక్కలేదు. ఇది మన లోకములోనే సిద్ధాంతమనుకొని యేడ్చుచుండఁగాఁ బైలోకమువారు మనకంటె నెక్కువ యేడ్చుచున్న ట్లగపడుచున్నది. ఉడుకుపెట్టినకొలఁది కోడిగ్రుడ్డు కఠినాహార మగును. తడిపినకొలఁది నొడుకునూలు గణుపెక్కును. దట్టించినకొలఁది తుపాకిదెబ్బ తీవ్రమగును. వలదన్నకొలఁది వనితవాంఛ పురియెక్కును. పాపము! శంకరుఁడేమి చేయఁగలఁడు. ఆతని యొద్దకేల? మనదారిని మనము పోవుద'మని శంకరుడు కడపటి మాటలుగా భార్యకుఁ జెప్పెను. 'ఆతఁడు లక్ష్యము చేయకున్నయెడల మనకు గలిగిన లోప మేమి? పోక తప్ప''దని పార్వతి పరమేశ్వరుని బలాత్కారమున నొప్పించెను. ప్రపంచమున జరుగు శుభాశుభకార్యము లన్నిటిలోను రూపాయకుఁ బదునాలుగణాలవంతువఱకు భార్యాబలాత్కారమున చేయఁబడినవే. శుభములు జరిగినప్పుడు మన ప్రయోజకత్వముగనే పటిసి పాటిపోవును. అశుభములు తటసించి

నప్పుడుమాత్ర మాఁడుదానినోరు బైటఁబడును. క్రైకేయి భర్తను బలాత్కరించుటచే రామవన వాసము జరిగెనని క్రైకేయిని నిందించుచున్నారు. మాయలేఁడినిఁ దెమ్మని సీత రాముని బలాత్కరించుటచేత సీతకు లంకానివాసము–రాముని కరణ్యరోదనము–సిద్ధించెనని యమ్మ వారినే నిందించుచున్నారు. పాంచాలి నవ్వుతోడనే కాదా యొక్క దెబ్బతో పాండవకౌరవవం శమంతయు బరశురామప్రీతి యయినది? పై నృష్టిలో భవిష్యద్బ్రహ్మయెట్లు మార్చునో తెలియదు. కాని యీనృష్టిలోమట్టునకు సమస్తవృద్ధినాశనముల కాఁడుదియే మూల కారణము యినట్లున్నది. ఇక్కడకు శంకరుఁడు శర్వాణితో దిగి వైష్ణవ భాగవతోత్తమునియెదుటఁ బడినాఁడు. ఆళ్వారున కాతని లెక్కయేమి? బొంతఁ గుట్టుకొనుచుఁ దలవంచుకొనియే యాతఁడు కూరుచుండెను. ''అయ్యా! నేను శివుఁడను. ఈమె పార్వతి. మీ కేమైనవరము లీయవచ్చితిని వేఁడు''మని శంకరుఁడా భక్తవర్యునితోఁ బలికెను. ఆతఁడు మాటలాడలేదు. కన్నయిన నెత్తలేదు. అప్పుడు పార్వతి రోషయుక్తయై ''అయ్యా, వరములిచ్చెదనని సాక్షాత్కరించిన మహాదేవుని నిరాకరింపఁ బాడికాదు. ఈ మహానుభావుఁ డష్టైశ్వర్యప్ర దాత. మోక్షముకంటె నీకుఁ గావలసిన దేమి? అదియైన నిచ్చటకు సంసిద్ధుఁడై యున్నాఁడు. కావున మమ్మలక్ష్యము చేయకుండ మా మాటను విని వాంఛింపుము. నీకోర్కె వినకుండ మే మిటనుండి పోవువారముకా.'' మని భక్తవర్యుని హెచ్చరించెను. ఆతఁడు తలవంచుకొనియే 'నేనేదైనఁ గోరుకొనకుండ మీరిటనుండి పోవుట జరుగదని యనుచు న్నారు. కావున నొక్కకోర్కె కోరెదను. నేను గుట్టుకొనుచున్న నూదితో గూడ దారమువ చ్చినట్లు వరము దయచేయవలసిన.'దని యాభక్తుఁడు కోరెను. భార్యాభర్తలు సిగ్గుపడి యంతర్ధానము నొందిరి. ఈ కథలో నెంత ప్రశస్తమైననీతి యున్నదో, ఎట్టి మహోత్కృష్టాం శము నీ యాఖ్యాయిక బోధించుచున్నదో మీకు సంపూర్ణముగాఁ దెలియను, గావున నే నింతకంటె విస్తరింప నక్కఱలేదు. ప్రధానాంశము వేఱొకటి యున్నది. ఈయన వసరాంశ ములతోనే నాలసింపఁదగదు.

నేనిట్లు నందులోని బావాజీయెదుటఁ గొంతసేపు నిలువఁబడి యాతనిదృష్టి నావంకఁ ద్రిప్పుటకై నేనొక దగ్గు దగ్గితిని. ఆతఁడు ననున్నుఁ జూచి ''బైఠో బాబ్ జీ'' యని పలికెను. ఈతఁడు పైవారివంటి విరాగియుఁ గాఁడు. నేను పైవారివంటి గొప్పవాఁడను గాకపోవుటచేఁ గాఁబోలు నీతఁడు ననున్నింత యాదరోక్తితో గౌరవించినాఁడని యనుకొనుచు నాతనియొద్ద క్రిందనే కూరుచుంటిని. అంత నాతఁడు గంజాయిపత్రమును జిలుములోఁ గ్రుక్కి చెకుము కిచే నగ్నినృష్టిచేసి కడముంతలోని బొగ్గొక్కటిఁ దీసి దానిని నంటించి చిలుముగొట్టములోఁ బెట్టి పీల్చుమొదలిడెను. రెండు నిముసములు పీల్చి ''బాబ్జిలేవ్'' అని యా చిలుముగొట్టము నాచేఁ బెట్టఁబోయెను. అంత నేను వలదని చేయి యడ్డమునూఁపి ''స్వామీ! నేను నంసారలంపటుఁడను. మీరు నంగపరిత్యాగులు. నాకేమైన బోధింతురా'' యని యాంధ్రభా షలో నడుగ ''నుర్దూసేబోలో'' అని యాతఁడు ననున్ను మందలించెను. ఉర్దూబాన నభ్యసించినవాఁడ నగుటచే నేను నాకోరికను దెలిపితిని. అప్పుడాతఁ డుర్దూభాషలో నుపన్యసించెను. ఆతని మాటలనుబట్టి యాతఁడు నరియైన మతిగలవాఁడని నేననుకొన లేదు. అక్కడక్కడ నొక్కయంశము నందర్భముగనే కనఁబడుచున్నది. తరువాతిధోరణి వెల్లడివానిదివలె నున్నది. నే నెట్లును నిర్ధారింపలేకున్నాను. మీరు బుద్ధిమంతులు కావున మీరు యోజించి మీ నంఘ నభ్యులకు జదివి వినిపించవలయును. ఏమో! తెలిసినంతవఱకుఁ

దెలియును. ఆతఁ డొనఁగిన యుర్దూభాషలోని యుపన్యాసమును నేనాంధ్రములోనికి వీలగునంతవఱకుఁ బరివర్తనమొనర్చి యీక్రిందవ్రాసితిని.

ఉపన్యాసము

బాబూ! క్రిందను మీఁదను నొక్కఁటే పొగవళనఁగాని జ్ఞానమెన్నఁడురాదు. క్రిందజ్ఞాన మునకును మీఁదిజ్ఞానమునకునుగూడనొక్కఁటే సూత్రము. అమెరికావారు నింగ్లీషువారు మొదలగువారు పొగవలననే క్రిందిజ్ఞానములోఁ బైవారనిపించుకొనినారు. మన మీపొగవలననే (గంజాయిపొగ) పైజ్ఞానమును సంపాదించి క్రిందివారికంటెఁ బైవారని పించుకొనినాము. పొగ తేలికయగుటచే నాకిప్పుడు ఱెక్కలు వచ్చినవి. నేనిప్పుడు పక్షివలెఁ బైకెగురుచున్నాను. నీవిక్కడనే కూరుచుండుము. పైనుండియే మాటలాడెదను. ఈప్రపంచమంతయు నిప్పుడు క్రొత్త ప్రపంచములాగున గన్పట్టుచున్నది. మన బుద్ధిలోనే ప్రపంచసృష్టి యగుచున్నది. కావున బుద్ధిమారినయప్పుడెల్లఁ బ్రపంచము మారక తప్పదు. అదిగో! గుఱ్ఱములతోఁకనైపున మొగము లుంచి సవారి చేయుచున్న సవారులు. అదిగో! చూడు గుఱ్ఱములు తోఁకవంకఁ బరుగెత్తుచున్నవా? మొగమునంకఁ బరుగెత్తుచున్నవా? యను శంక అక్కఱలేదు. అడ్డముగాఁ బరుగెత్తుచున్నవి. అదిగో మన్రోదొరగారు గుఱ్ఱము మీఁదినుండి కన్ను గీఁటుచున్నారు. ఆకన్నుగీఁటు చూచి 'నీల్' దొరగారు నవ్వుచున్నారు. ఆనవ్వు–తన సొగసును జూచినవ్వినాఁ డేమో–యని యమృతాంజనప్రకటనము పైనున్న కులుకుచూపుల –గుబ్బలాడి కర్ణాటకపుఁ బట్టుచీరపైటను–సర్దుకొనఁబోవుచుఁ–గినుక్కు మనుచున్నది. ఆఁడుది యనగా నాకుఁ బ్రాణము బాబ్‌జీ. మాయూరిలో నొకకాంత ప్రపంచలంపటతను రోసి–సంసారవిముఖయై–భనతారకసాధన మపేక్షించి భర్తను వదలివైచెను. మనము సంసార మును త్యజించినవారమే. ఆమెయు నంసారమును ద్యజించినదే!

'హమ్‌జిన్స్‌హమ్ జిన్స్‌బుకునద్ పర్వాజ్
కబూతర్ బాకబూతర్ బాజ్‌బాబాజ్'

(ఒక వస్తువు సమానజాతివస్తువుతోఁ గూడును. కపోతము కపోతముతోఁ గలియును. బైరవపక్షి బైరవిపక్షితోఁ గలియును) అనున్యాయముచేతను మనకు నామెకు మార్కండేయా లయములో ''మొలాఖాత్'' అయ్యెను. దైవప్రేరణమే యీ సమావేశమునకు ప్రధానకారణమ ని–నమ్మి–మనమామెను శిష్యురాలిగఁ జేకొని–యోగాభ్యాసాదులను నేర్పి యష్టశుద్ధులుచే సిన పాదరసమువలెఁ బ్రశస్తముగఁ దయారుచేసితిమి. అట్టి పట్టుకొనునప్పటికి బంగార మగులాగునఁ బరిపక్వత నొందించితిమి. దేశయాత్రవలన కాయశుద్ధియగునని యె,చి యామెను మదరానునకుఁ దెచ్చితిని. ఆమె యొడలిమీఁది వస్తువులు దానాపానీక్రింద ఠసవాదప్రక్రియలక్రిందను బోవుటచేతఁ బైనకుఁ గొంత ''డోమాడోలీ'' గలిగి యామెచే భర్తపై మనోవృత్తికి వ్యాజ్యెము తెప్పించిరి. మన కొక్క యయ్యంగారు న్యాయవాది. ఆయన మొదటినుండియు యోగాభ్యాసాదిసాధనములయం దభిరుచి కలవాఁడగుటచే నాకు శిష్యుఁడయి కోర్టు ఖర్చులన్నియుఁ దానే భరించి వ్యాజ్యెము నడపెను. ఆన్యాయవాది యామెను దన బండిలోనే కూరుచుండఁబెట్టుకొని న్యాయస్థానమునకుఁ దీసికొనిబోవుచుం డెడివాఁడు. ఇద్దఱు తఱచుగా రాత్రి సముద్రతీరమున విజనస్థలమున బాతంజల్యాది పద్ధతులన్నియుఁ బట్టుదలతో ననుసంధించి పనిచేయుచుండెడివారు. కైవల్యసాధనమున

కొకరాత్రి యథాప్రకారముగఁబోయి తిరుగ వారు నా బసకు రాలేదు. ఆఱుసంవత్సరము లైనది. అప్పటినుండి ఇప్పటివఱకగపడలేదు. శిష్యురా లిట్లుపోవుటచే బుద్ధిగొప్ప 'తోక్రా' తిన్నది. అప్పటినుండియు మనస్సునకుఁ గుదురులేదు. అన్ని గరిడీలు నేర్చిన దగుటచే –గుక్కపీఁకినట్లు–ప్రాణము పీఁకుచున్నది. మొదలే అయ్యంగారు. అందులో న్యాయవాది. దానిపై యోగశాస్త్రశిష్యుఁడు. గురూజీ గొంతుకోసినాఁడు! బాబాజీ! ఆడుది సంసారము లోకంటె యోగములో నెక్కువ యావశ్యకముసుమీ! ఇది నీకు నేను జెప్పు ప్రథమపాఠము. ఈ యంశ మెందులకుఁ బోనిమ్ము. బ్రహ్మసృష్టియంతయు ఫిరాయించినదని సెలవిచ్చితిని గదా! అదిగో శిష్యులు గురువుగారిని బల్లపై నెక్కించుచున్నారు. చెవులుపట్టుకొని జుకాయించుచున్నారు. పేఁప బెత్తములతోఁ దట్టులు తేఱఁ గొట్టుచున్నారు. నీకు వచ్చిన చదువు మఱచి పోయెదవా, మూతిపండ్లూడఁ గొట్టమా, యని బెదరించుచున్నారు. వహ్వా నెత్తికిచెడావు–కాలికిగడ్డము పృష్ఠముక్రిందఁ బుస్తకము–చేతిలో గోనెగుడ్డ. అదిగో! విను విను. రాట్నముల చప్పుడు రైలు కూఁతలకంటె–మోటారుబండ్ల మొట్టలకంటె–బట్టుబట్టుమని యెంత ధ్వని యగుచున్నదో! అదిగో-అదిగో! రాట్నముల ధ్వనియే యుపాంగమైనది. నముద్రమే పెద్దమద్దెల యయినది. కర్మాగారము లన్నిటిలో గుప్పుగుప్పు మను పొగగొట్ట ములన్నియు బోగమువాంద్రు–సెబాస్ ఏమి పసందుగా నాడుచున్నారు. బాబ్జీమూడు. కాని యీఖద్దరు చీరలచే నీవేశ్యలకుఁ బూర్వపు నాజూకులేదని మునుపటి షాన్‌షోకులేదు. పాలముంజెలు మినుపరొట్టెలయిపోయినది తేనెపట్టు తెలికపిండియైపోయినవి. థూ థూ! వారు పాడుచున్నకీర్తన వినఁబడుచున్నదా? బాబ్‌జీ విను.

కాంభోజి–ఆది.

నిన్నుకోరితిగాంధీ–నీవేనా ప్రభుఁడవు–నీకంటె నన్యుని నేనొల్లనో స్వామి! భరతకాంతను నేను పడరానిపాటులు బహుబహుభంగులఁ బడితినే నక్కట! త్వరగ నన్ జేపట్టి దరిఁజేర్చుకున్నను తహతహచేతను దాళగలేనురా! నిన్ను

ఒడుకునూ లిదిగో నాయొడిలోన నున్నది. గడుసుకద్దరుకోకఁ గట్టిగా గట్టితి. బడిబడి మనసును భద్రముచేసితి వడివడిరావయ్యా వైభవదేవేంద్ర నిన్ను

అరెరే! ఇదియేమి? ఇదియేమి? మువ్వగోపాలుఁడు మూలఁబడినాఁడే! వానికర్మము! అరేరే! అదియేమి? ఆబోగమువాంద్ర చీరలపై పెద్ద అక్షరములతో 'గాంధి భోగమువాంద్ర'ని వ్రాయఁబడియున్నదే. థూ థూ! ఇది మహాదోషము కాదా? గాంధి సిగరెట్లని గాంధిచుట్టలని యున్నందులకే యిదివఱకు మనసున కెంతయో వెగటుగా నుండఁగా నిదికూడనా? చీ చీ! తప్పు తప్పు "శంకరసారాకొట్టు" అనునెడల నెట్టిదోషమో గాంధిసెగరెట్లనఁగ నంత దోషము? థూ థూ ప్రజలెంత బుద్ధిహీనులు! ఇఁక నేను బ్రజలలో నుండఁదలఁచుకొనలేదు. నాకు ప్రపంచమంతయు నొక్కసారి ఱఁగిపోయినది. సెంట్రల్ స్టేషను గోపురముమీఁది గడియారపుముల్లును గట్టిగాఁ బట్టుకొంటిని. కాలచక్ర మాఁగిపోయినది. వహ్వా ఏమియు లేదు. వెనుకకుఁ బోదు. ముందునకు రాదు. ఎక్కడిదక్కడే. ఆహా! ఇది యనహాయవాదులు క్రిందటినెలఁబదుమూఁడవతేది నొనర్చినహారతాళముకాఁబోలు, సెబాస్! మంచి 'పక డు'గా జరుగుచున్నది! ఏధోయొకటి రెండు వీథులలో మాత్రము రవంత సందడియున్నది. ఇన్నివేల జెటకాబండ్లే మూలల దాఁగినవో! మూటలు మోయుటకుఁ గూలివాంద్రకు విరాగ

సుదయించినదే. నిమిసమున కెన్నిలక్షలమైళ్లోపరుగిడు విద్యుచ్ఛక్తియే ట్రాంబండ్లలో స్తంభీభావమొందినదే! వేలకొలఁది బిచ్చగాండ్రంద ఱొక్కసారి ధనికులైరాయేమి? ఎవ్వరు కనఁబడరేమి? అన్ని కొట్లుటకు బైట బీగములున్నవే! వర్తకులంద ఱేదేశమునకుఁ బోయిరి? కాల్పవలెనన్న బీడిదొరకదు. త్రాగవలయునన్న సోడాదొరకదు. తినవలయునన్న నరటీ పండు దొరకదు. అదిగో బాబ్ జీ! యొకఁడు మంచినీరు త్రాగవలయు నని కొళ్లాయియొద్దకుఁ బోయి మర సరిగఁ ద్రిప్పలేకపోవుటచే నీరు రాకపోవుటఁ జూచి మంచి నీటికిగూడ నీ మంకుతనమా యని నెత్తినోరు కొట్టుకొనుచున్నాఁడు! పెద్దవీథిలోనున్న సోపానపంక్తులపై మిఠాయి తినవలసిన పిల్లలులేరు సరికదా రెట్టలువేయు కాకులైన లేవెందు చేత? అక్కడక్కడ నేదోకొంత యల్లరి జరుగుచున్నట్లున్నదే. ఎవరాయల్లరికి గారణభూ తులో యెవ్వరెఱుఁగరు. ఎవరిమట్టునకు వారేమే మెఱుఁగ మనుచున్నారే. ఆఁ! ఆఁ! మే మహింసావ్రతము కలవారము. మే మాపని చేయుదుమా యని యొక రనుచున్నారు. ఆఁ! ఆఁ! మాయం దభిమానముకలవారు మమ్మేపరాభవింతురా? యని యొక రనుచున్నారు. తుద కెవరు చేసినట్లు! ఏమో నేను సమస్తవాంఛలను వదలుకొని సన్యాసినై యుండఁగా చీ! చీ! నేనట్టిపని చేయుదునా! యని యొకఁ డనుచున్నాఁడు. నేను యోగాభ్యాసముచేత పుంస్త్వమే నాశనము చేసికొంటినిగదా! నా వలన నగునదే మని యొకఁ డనుచున్నాఁడు. కాని–యేమికర్మమో కాని–యిద్ధఱినడుమ నున్న భక్తురాలికి పందువంటికొడుకు బారసాల పీఁటపై గూరుచుండుటకువాఁడు ఊహాహ్హా–వీఁడును హుహ్హా థూథూ నాకు వీరితోఁ బనియేమి? ఎందరు సన్యాసినులు కొడుకులు గన్నను వారందఱ కనాథనాథుఁడనైన నేనే తండ్రిని. మనకాపటిత్వము లేకపోలేదు. ఆపరాభిమానము లేకపోలేదు. ఎటువచ్చినను న్యాయవాది నాగొంతుఁ గోసినాఁడురా బాబా! మొదలే యయ్యంగారు. అందుపై న్యాయ వాది. దానిమీఁది యోగాభ్యాసి. నాకొంప నట్టేఁట గట్టినాఁడురా బాబా! లంకపాగాకులో శబరిలంకదే గాటు. పాటిపాగాకులో చేబ్రోలుపాటిదే గాటు. ఆఁడుజాతిలో యోగినితత్వమే గాటు. మనజాతిలో ప్లీడరుతత్వమే గాటురా బాబా! ఆఁడుదాననైనను నేనే. మగవాఁడ నైనను నేనే. ఇంక నాతత్వపుఁ దమాషా చూచుకో బాబ్జీ! రే, రే, రే, అదేమి అర్ధశరీరిణియే –ధర్మపత్నియే–భర్తను మెడవైఁ జేయివైచి యింటిలోనుండి గెంటి వేయుచన్నదే! అయ్యయ్యో! భర్త పరస్త్రీలోలుఁ డయ్యెనా యేమి? ఆయననేమి యింటినుండి గెంటివే యునా? బాబా! ఆకాంతాశిరోమణి యే మనుచున్నదో విను. "పో! యావలకుఁ బో. నీవు ఖద్దరుగుడ్డ ధరించినఁ గాని నీకు నాయింటిలో నన్నము పెట్టను. పూఁటకూటింటఁ దిందువో, పస్తుందువో పో! మాకు మెడలో మంగళసూత్రము గట్టి నంతమాత్రముచే మగఁడు కాఁడు. ఖద్దరువస్త్రమును ధరించినవాఁడే! గాంధిటోపి పెట్టినవాఁడే; దేశభక్తిగల మేము గర్వముచే మగఁ డని విలువఁదగినవాఁడు." సెబాస్–మిగిలినస్త్రీ లావీరకాంతకు మంగళపు టారతులిచ్చుచున్నారు. పైకిఁ జూడరా బాబా. అదిగో అరుంధతి! అదిగో జానకమ్మ! అదిగో సావిత్రి! అయ్యయ్యో! పైనున్న స్వర్గము క్రిందికి దిగుచున్నది! బాబా కన్నులు తిరుగుచున్నవి. నాయనా! ఒక్క నిమిసమాఁ గెదను. అదిగో బాబా విసుబుద్ధదేవుఁ డుపన్యసించుచున్నాఁడు.

గీ. తిట్లు దీవనలనుగాని తిట్లఁ బోవు
వ్రేట్లు ముద్దుల నడగును వ్రేట్లఁ బోవు

కత్తి కౌఁగిలిచేఁ దెగు కత్తిఁ దెగదు
రుష కరుణచేతఁ బోవును రుషను బోదు.

గీ. మాయ ధారాళతను బోవు మాయఁ బోదు
శాత్రవత శాత్రవతఁ బోదు మైత్రిఁ బోవు
మిథ్య సత్యంబుచేఁ బోవును జెట్టఁబోదు.

మనసుచేత-వాక్కు చేతఁ-గాయముచేతఁ-గర్మముచేతను నపకారచ్ఛాయయైన నెవ
రికి నొనర్పకుము. పరులు నీకెంత కీడు చేసినను సరియే. ప్రతిక్రియమాత్ర మెన్నఁడున
జేయకుము. ప్రతి క్రియావాంఛనుగూడఁ దగులఁబెట్టుము 'ఏసుక్రీ' స్తేమి చేసినాఁడు
ఒక చెంపను గొట్టఁగా వేరొక్క చెంపఁగూడ నిచ్చినాఁడు. ఏసుక్రీస్తెంత గొప్పవాఁడైనఁగా
యాతనిలోను గొంత తప్పున్నది. ఒక చెంపను గొట్టినవాఁడు వేఱొకచెంపనుగూడఁ దా
కొట్టునేమో? వేఱఒ చెంపను గొట్టుమని యొకనిని గోరుటకు నీవెవఁడవు? నీకతని
నేమిహక్కున్నది? ఏమి యధికారమున్నది? నీవు కొట్టుమన్నపుడేకాని యాతఁడ
నిన్నుఁగొట్టఁగూడదేమి? నీకంత గర్వమున్నదేమి? అట్లయిన మొదటి చెంపకాయ నెవఁడ
కొట్టుమనఁగ నతఁడు గొట్టినాఁడయ్యా? నిన్నొక్కఁడు చెంపపైఁ గొట్టినాఁడు. ఏసుక్రీస్తువ
నీవు రెండవచెంప యాతనికిఁ జూపింపకు. నీరెండుచేతులు జోడించుకొని ''హరిప్రసాదమ్
హరిప్రసాదమ్, హరిప్రసాద''మని గాఢముగ ననుసంధింపుము. గట్టిగ నఱువుము. అవత
వాని యిష్టము తరువాతి దెబ్బ చెంపమీఁద గొట్టునో బ్రహ్మరంధ్రముపైఁ గొట్టునో! నీక
సహనము-సహనము-సర్వసహనము తక్క వేఱేమియు నుండఁగూడదు. ఆలిపోయినసరే
యాస్తి పోయినసరే! యాత్మజులు పోయినసరే! యసువు పోయినసరే! యదిమాత్రము
పోఁగూడదు. తిరుగ బుద్ధదేవుఁడు పలుకుచున్నాఁడు బాబా విను.

గీ. తీగపైఁ గ్రాలు పువ్వులఁ ద్రెంపుకంటె
తనదుకను లూఁడఁ దీసికోఁ దగును జుమ్ము
ధరణిలో నుండు మూలముల్ త్రవ్వుకంటె
తనదు నెముకలు వెఱికికో దగును జుమ్ము

ఆహా! ఆ మహాత్ముని హృదయమునఁ గరుణ యెంతదూరము వ్యాపించినదో! ఆ
వ్యాప్తికి జగతిలో నున్న యవకాశమే చాలనట్లున్నదే. బాబా మావంటియతుల కెవ్వరికో
తప్ప యానియమము జనబాహుళ్యమునకు దుస్సాధ్యము. ఇది మీకక్కఱలేదు. జంగమ
ప్రాణి లోకమునందే మీక్షమకు వ్యాప్తి. సర్వజంతుజాల ససురాగము మీ హృదయమున
సహప్రార్కసందీప్తితోఁ బ్రజ్వలింపవలె. అహింసయే పరమార్థధర్మము. స్వార్థపరిత్యాగము
సర్వకష్టసంతుష్టుత సత్య ప్రవర్తనము సర్వసమత్వము సంపాదించుటకంటె జన్మమునకు
సార్థకత వేఱేదియు లేదు. ఇది యుత్తమజన్మము. ఇదివఱకే యాలస్యమైనది. వేగం
దరించుఁడు. వాక్కులవలన ధరింపలేరు. వస్త్రములవలనఁ దరింపలేరు. ఇంద్రియ నిగ్రహ
మువలన ధరింతురు. వైరాగ్యమువలన ధరింతురు. సంపూర్ణసహనతచేఁ దరింతురు.
శాంతిచేఁ దరింతురు. జగదాధారుని పాదభక్తిచేఁ దరింతురు. వీనిలో-మాయకాని
-మర్మముకాని-హస్తలాఘవముకాని-కనుకట్టుకాని పనికిరావు. అవి నీకెంతవఱకు వదలకుం
డునో యంతవఱకు నీకధోగతి తప్పదు. ప్రపంచవాంఛల నన్నిటిని భస్మ మొనర్చును.

ఆత్మశక్తి సంపాదింపుము. దానిచే నద్వయానంద మొందుము. ఆత్మశక్తిచే నైహికవస్తుసంపాదనమున కెన్నఁడు ప్రయత్నింపకుము. బ్రహ్మాస్త్రము సంపాదించి ప్రాణిహింసకుఁ దలపెట్టకుము. యోగాభ్యాస మొనర్చి దొమ్మరియాట నాడకుము. వేదవేదాంగవేత్తవై బంగారమును జేయుటకై ప్రయత్నింపకుము. ఆత్మనిగ్రహ మొనర్చి పతినిగ్రహముకై ప్రాకులాడకుము. వీనివలన మీకు స్వరాజ్యము రావచ్చును. కాని బాబా రాఁదగినది స్వారాజ్యము. దానినే యపేక్షింపుము. సర్వదా దృష్టి దానియందేయుంచుము. బాబా దూరపుగుఱిఁ గొట్టువలసినవాఁడేమి చేయునో యెఱుఁగుదువా? గుఱికిఁ గొంతపైగ లక్ష్యముంచి కొట్టినఁ గాని గుఱికి దెబ్బ తగులదులు. మీ రందఱు స్వార్థత్యాగపరులు, శాంతచిత్తులు, సహనశీలురై తరించువఱకు నేనొక్కటే శపథ మొనర్చుచున్నాను. వినుఁ బాబా వినుఁ. ఇదిగో యీ గడ్డపుముడిగూడ దీయుచున్నాను. ఎంత పొడుగుగడ్డమో చూచితివా? మీరందఱు తరించువఱకు నేనీగడ్డమును దిరుగ ముడివేయను. శత్రువిజయ మొనర్చి భీముఁడు ద్రౌపదికి వేణీసంహార మొనర్చినట్లు మీరు వేదాంతు లయినపిమ్మట నేను దాఢీసంహార మొనర్తును. అదిగో! అంతరిక్షమునఁ గుక్క మొఱుఁగుచున్నది. పో, ఇఁక నీవు పో. నీవు తరించితివి. మీ వితరులను తరింపఁజేయుము. శాంతిధ్వజము చేతఁ బుచ్చుకొని యూరూరఁ దిరుగుము. 'ఆత్మవత్సర్వ భూతాని' యనునది యాచరణలో నుంచుము. పో పో.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతి

24. పండితుని యుపన్యాసము

ఒకసారి ఒక పండితుడు సత్యపురంలోగా, జంఘాలశాస్త్రి సాక్షి సంఘం సభలో అతని ఉపన్యాసం ఏర్పాటు చేశాడు.

ఆ పండితుడు 'పండిత' పదంమీదనే అవహేళన కనబరిచి, అందుకు ఉదాహరణగా వ్యాసమహర్షి సన్నిధిని ఉండే ఒక పండితుడి కథను చెప్పాడు. ఎంత పండితుణ్ణైనా ఇంద్రియాలు లొంగదీసేస్తాయి అని ఆకథ సారాంశం.

దీనికి ప్రతిగా మరొక పాశ్చాత్యకథను కూడా ఆయన చెప్పాడు. అది పౌరాణిక పండితుడైన ''ఆరన్స్''నుకి సంబంధించినది. అతను పాంథియా అనే ఒక సుందరి విషయంలో ప్రవర్తించిన దానికి సమర్థించుకొనేందుకు 'ఆత్మలు రెండు' అని సిద్ధాంతీకరించాడు.

ఈ రెండు కథల్నీ సమీక్షించి - ప్రపంచంలో పూర్తి దుర్మార్గుడు పూర్తి సన్మార్గుడు అంటూ ఉండరనీ, కొంత అటు, కొంత ఇటుగా ఉంటారనీ, తీర్మానించాడు ఆ పండితుడు. ఇందుకు ఉదాహరణలుగా ధర్మరాజునీ, తిరుమంగై ఆళ్వారునీ, రావణుణ్ణీ, రాముణ్ణీ చెప్పాడు. ఒక కాలానికి సదాచారంగా చెలామణీ అయింది మరో కాలానికి కాక పోవచ్చును. అలాగే ఒకజాతికి, ఒక మతానికీ సదాచారం అలుంది మరొకచోటకాకపోవచ్చును. పాపపుణ్యాలు, సదాచార దురాచారాలనేవి దేశ, కాలాలనుబట్టే మారుతూ ఉంటాయి.

పాపపుణ్యవివేచనం పాశ్చాత్యులనుంచి నేర్చుకోవడం సాధ్యంకాదనీ, వారినుంచి ఐహిక సౌఖ్యసాధనాలునేర్చుకోదగినవని పండితుడు వివరించాడు. ప్రపంచంలో ఎక్కడైనా నరే యోగ్యత, అయోగ్యత అనేవి స్థిరంగా వుండజాలవని చెప్పాడు. మార్పే ప్రపంచానికి స్వభావమని తేల్చి-నిర్వికారమైనది పరబ్రహ్మం ఒక్కటేనని చెప్పాము.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! సాహిత్యోపన్యాసరంగమున నాప్రక్కను గూరుచుండిన యీ పండితులు మనకుఁ గ్రొత్తవారు. మనకు వారు గ్రొత్తవారయ్యును వారికిమాత్రము మనము క్రొత్తగాదు.

సాక్షి సంఘాభిమానులలో వీరొకరు. సాక్షినందర్శన కుతూహలాయత్తచిత్తులై నిన్న సాయం కాలమందీ గ్రామమునకు వచ్చిరి. ఈయనను నేటి మన సభ కాహ్వానించితిని. పనసకాయ లభించినప్పుడు తద్దినము పెట్టలసిన దని పెద్దలవాక్య మున్నప్పుడు, తద్దినమునాఁడే పనసకాయ లభించినప్పుడింకఁ జెప్పవలసిన దేమున్నది? పండితులు దయచేసినప్పుడే సభచేసి వారి యభిప్రాయములను వినవలసిన విధి మన కుండఁగాఁ బండితుల రాక సభనాఁడే సంభవించినప్పుడింక నడ్డేమి? కావున సాక్షిసభలో నొక యుపన్యాస మిమ్మని మీ యందఱుప క్షమున వీరిని నేను బ్రార్థింతును. ఎల్లకాల మొక్కని యుపన్యానమే వినుచుండిన వినుఁగుగా నుండుట వింతయా! జిహ్వవలెఁ జిత్తముకూడఁ జిత్రవిచిత్రము లగు భిన్న భిన్న రుచుల నపేక్షించును గదా? కానిండు. నాయనలారా! ఈపండితవర్యుని యుపన్యాసము వినుఁడు. శ్రద్ధాళువులై వినుఁడు. విని యానందింపుఁడు. ఇంతకంటె నేను జెప్పవలసని దేమున్నది? ఉపోద్ఘాతము పొడుగచేసిన యెడల నుపన్యాసము పొట్టిదిగా నుండవలసివచ్చును. అయ్యా! మీరింక నుపన్యసింపవచ్చును.

ఉపన్యాసము

ఆర్యులారా!

సాక్ష్యుపన్యాసరంగమున నిలువఁబడు భాగ్యము లభించినది. అంతవఱకేనాభాగ్యము. అటుపైన నాయభాగ్యము, మీ యభాగ్యము కూడను. అసందర్భాలాపము లాడుట నాయభాగ్యము. అంతరంగమున బాధపడుచు నెవె యన్నియు నాలకించుట మీ యభా గ్యము. తప్పదు. నాయనలారా! ఒకనివలన నుండి మఱియొకరి కోపదలు! సహించి యూరకుండుటకంటెఁ జేయఁదగిన దేదియు నగపడదు. రాజసభలో రాభణాసురుఁడని నిశ్శంకముగఁ బలికిన కాళిదాసగురుని వాగ్రత్నమును గాళిదాసుఁ డెట్లు సమన్వయించుకొని –సందర్భించుకొని–సమర్థించుకొనెనో–యట్లే నా యుపన్యాసములోని–యవకతవకల నన్నిటి సాక్షిసంఘ ప్రధానవక్తయగు జంఘాలశాస్త్రి–సమర్థించుకొనవలసి యున్నది. ఆ ధైర్యముతోడనే నిలువఁ బడి మాటలాడుటకుఁ బూనుకొంటిని. నేను బండితుఁడనని జంఘాలశాస్త్రి నాకు బిరుద మొసఁగినాఁడు. ఎవఁడా పండితుఁడు? ఎక్కడ నా పాండిత్యము? పండితులు! పండితులు! అందఱు పండితులే! పండితు లెంత చవుకయయిపోయినారు! వ్యాసమహర్షియొద్ద ననేక పండితవర్యులుండిరి. వారందఱలో మహాకూలంకషప్రజ్ఞాశాలి యగు నొక పండితోత్తముఁ డుండెను. ఆతని సాహితీగభీరతయందు –సర్వశాస్త్రసమగ్రజ్ఞానవిశాలతయందుఁ బరిపూర్ణ ప్రపంచ పరిజ్ఞానపటిష్ఠతయందు –నిష్పక్షపాత విమర్శన విచక్షణతయందు–నంతరింద్రియనిగ్రహ దీక్షాదక్షతయందుఁ–బారా శర మహర్షిశే రునకే పరిపూర్ణవిశ్వాసముండెనని చెప్పునప్పుడితరులమాట వేఱెచెప్పనేల? మహర్షిపుంగవుఁ డేమి వ్రాసినను నీవిద్వన్మణికిఁ జూపించు నాచారము గలదు. ఒక్కనాఁడు మహర్షినత్తముఁడు తాను రచించిన దేదో చదువుచున్నాఁడు. ఈపండితుఁడు సావధాన చితుఁడై వినుచున్నాఁడు.

'బలవానింద్రియగ్రామో–విద్వాంసమపికర్షతి' యను శ్లోకార్ధమును బాదరా యణుఁడు పఠింపగాఁ–బండితోత్తముఁడు విని వికటముగ నవ్వెను. నిస్సంశయాధిక్షేపణసూ చక మగు నీ నవ్వు నాలించి ద్వైపాయన మహర్షికనులపై వ్రాలిపోయిన తెల్లని జుంజుఱుకనుబొ

మ్మిలను బ్రయత్నమునఁ బైకెత్తి-యాపండితవరు నవలోకించి-రవంతసేపు మిన్నకుండి తిరుగఁ గన్నులల్రాల్చి 'నాయనా నీయధిక్షేపణ మే' మని యడిగెను. 'స్వామీ! పండితుఁడేమి? జితేంద్రియుఁడేమి? వనితా కటాక్షశ్ళంఖలలఁ దగిలి బద్ధుఁడై-భ్రష్టుఁడై-పతితుఁడగుటయేమి? గురూత్తమా! విరుద్ధముగ లేదా' యని యాపండితుఁడు పలికెను. ఈ మాటలను వ్యానమహర్షి రవంత యోజించి-'నాయనా! ఆపాదమును నవరింపు మనియే నీ యభిప్రాయమా?' యని పండితుని బ్రశ్నించెను. 'స్వామీ! నిన్నందేహముగ నవరింపుఁడనియే నావినయ పురస్సరాభిప్రాయ' మని పండితుఁడు పలికెను. అటులైన నెట్లు నవరింపవలయునో నీవే నవరింపు మని మహర్షి యాప్రతిభాశాలితోఁ బలుకనాతఁడు ''బలవా నింద్రియగ్రామో విద్వాంసం నావకర్షతి'' యని నవరింపఁదగు నని పండితుఁడు మనవిచేసెను. ''ఇదిగో! నాయనా! ఈగంటమును దీసికొని నీవే నవరింపుము. నేను వండుకొనఁబోయెదను.'' అని మహర్షివతంనము విద్వద్వ్రతంనమున కానతిచ్చి పోయెను. పండితుఁడిట్లు పారాశరీయవంక్తిలోని ప్రమాదమును దిద్దుబాటొనర్చి కొంతసేపు ధైవధ్యాన మొనర్చుకొని పరమపవిత్రమైన ఋష్యాశ్రమమునఁ దన కేర్పాటుగనున్న స్థలమున కేఁగి వ్యాఘ్రాజినముపైఁ బండుకొని కన్నులు మూసుకొని-హరినామస్మరణ మొనర్చుకొనుచు నిమ్మళముగఁ బ్రక్కనున్న జపమాలను ద్రిప్పుకొనుచు రవంతసేపటిలో నిద్రావస్థను బొందెను. నట్టనడురేయి యగునరికి రవంత చీను కారంభించెను. గాలి ప్రబలముగ వీవఁదొడఁగెను. ఆయలజడికి పండితుఁడు మేల్కాంచి తిరుగ హరినామస్మరణ మొనర్చుకొనుచుండఁగా నొకయార్తరవ మాతనికర్ణములఁ బడెను. హరిహరీ! యది యేమని యావిద్వాంసుఁడులికిపడి లేచి కూరుచుండెను. ''ఆశ్రమవాసులగు నోమునిసత్తములారా! నేనబలను; అరణ్యమునఁ ద్రోవతప్పితిని. గాఢాంధకారమునఁ బడియుంటిని. నాల్గుగడియలుమాత్రము మీయాశ్రమమున నుందును. ఆపన్నాయగు నబలకు రవంత తావిచ్చి పుణ్యముకట్టుకొందురా?'' యని యొకకాంత యాశ్రమద్వారమునొద్ద నఱచినట్లయ్యెను. 'అమ్మా! వచ్చుచున్నా'నని యాపండితుఁడెగిరిపడి-తలుపుదెఱచి-యామెను లోనికి రానిచ్చెను. ''నాయనా! చీఁకటిగానున్నదికదా''యని యాకాంత పలుకగ నెందుపుడకలు జేర్చి యాతఁడు మంటనైచెను. ఆమంటకాంతిచేఁ జూడఁగా మంటకంటె సహస్రగుణాధికతేజస్సుతోఁ బ్రకాశించుచున్న యొక దివ్యనారీశిరోమణి నాతఁడు కాంచెను. ''అమ్మా! మంటయొద్దఁ గూరుచుండి దేహముకాఁచికొని మఱి వండుకొను'' మని యా పండితుఁడు పలుక 'నాయనా! వీమియు నక్కఱలేదు. నేనెక్కడఁ బండుకొనవలయునో చెప్పు' మని యావనితామతల్లి యడుగ ''నదిగో ఆగదిలోఁ బండుకొనుము. అక్కడఁగూడ నగ్ని ప్రజ్వరిల్లఁజేసెద'' నని చెప్పి యట్లొనర్చెను. ఆమె యాగదిలోనికిఁ బోయి లోనఁ దలుపునైచి కొని నిద్రించెను. పండితుఁడు నెత్తిపైఁ జేతులు పెట్టుకొని మేలుకొని యుండెను. ఆమె యెవతె? ఎందు కిక్కడి కింత యర్ధరాత్రమున రావలయును? అరణ్యమున దారితప్పుట సత్యమగునా కాదా? ఇంత సౌందర్యవతి యెక్కడనుండి వచ్చుచుండెను? అను ప్రశ్నములు కలఁగిన నీటిలోని చిన్నచేపలవలె నటులిటులు తళుకుమని తళుకుమని యెగిరి మనస్సున మఱింత కలఁచుచుండెను. సహస్ర సహస్ర పత్రవత్ర గంధమును మించిన యాపద్మినీజాతికాంత దేహపరిమళము ముక్కు రంధ్రములనిండి యుక్కిరిబిక్కిరి చేయుచుండెను. అగ్నికీల నతిశయించిన యామె యంగలీల కన్నులను బూర్తిగ నావరించి మిఱుమిట్లు కలుగఁజేసెను. కలకంఠకలరవ

ముకంటె గన్నుమైన–వీణాగానముకంటె విస్పష్టమైన–యామెకంఠరవము కర్ణములం దావ రించి గింగురుమనునట్లు చేసెను. అదియేమోకాని నవనవోన్మేషమైనది–మునుపెఱుఁగనిది యెప్పుడు వచ్చునని యనుకొననిది–బ్రహ్మపదార్థమువలె నిదమిత్థమని నిశ్చయింపఁదగనిది యనుభవైకవేద్యమైనది–యట్టిదేదో–యొకవికృతియో ప్రకృతియో–మననునఁబుట్టి యాపా దమస్తకము వ్యాపించి–రోమరోమకూపములఁబ్రాఁకి–లోపలనుండుటకుఁ దావుచాలక తెక తెక మను నుష్ణముతోఁ బైకివచ్చి–గదియంతయు వ్యాపించిన ట్లయ్యెను. ఛీ! ఛీ! ఇదియే మని యొడలు దులుపుకొని–మనసు భద్రపఱచుకొని–పండితుఁడు వ్యాఘ్రాజినముపై బండుకొని హరినామస్మరణమున కుపక్రమించెను. 'హ' యన్న తరువాత 'రి' యనునదింక నుచ్చరింపకుండనే హరిమధ్యాన్వరూపము శతసహస్ర వ్యాసఘట్టముల పటిష్ఠతతో– శతస హస్రచంద్రమండలముల ప్రసన్నతతో–నడ్డుపడుచుండఁగ నాతఁ డేమిచేయఁగలఁడు? అయ్యయ్యో! ఇంతలో నానుందరి నిద్రలో నటులిటు లొత్తిగిల్లెనో యేమోకాని యందెలు కడియములు గలసిన ఘల్ఘలారవము గదిలోనుండి యొక్కసారి కోటిపొక్కిలు కట్టుకొని –కోటిపద్మముల సౌరభముతోఁ గోటి సూర్యుల తేజముతోఁ గోటి రామబాణముల యమోఘత్వముతో–బయలువెడలి యాతనిచెవులఁబడి–తలకెక్కి–మననునఁగ్రమ్మి ప్రాణ ములు తహతహపఱచి యాత్మ నేమిచేసెనో యేమోకాని యాతఁడు లేచి యటునిటుతిరిగి –తూలిపడి–తిరుగఁ గష్టమున లేచి–జపమాల మూలఁ బాఱవైచి–యానుందరీరత్నము పండుకొనియున్న తలుపుఁ గొట్టి ప్రత్యుత్తరము కానక, యేమిచేయుటకుఁ దోఁపక, యాకాంత నెటులైనఁ జూడవలయు ననుమహోన్మాదముతో–తలుపుగ్రంధిపైఁ గాలిడి –గోడపై కెక్కిబోయి–కాలుజాఱిపడి–తిరుగఁ బ్రయత్నించి–గోడమీఁది కెక్కి–గుబాలున గదిలోనికి దుమికెను. ఆకాంత చిఱుతపులిచర్మముపైఁ బండుకొనియుండెను. ఆచర్మముపై నున్న నల్లని మచ్చలన్నియు నామె శరీరకాంతిచే బంగారు కానులవలెఁ బ్రజ్వరిల్లు చుండెను. మడచిన కుడిచేతిపైఁ దలనుంచుకొని–యెడమచేతిని బ్రక్కపైమోఁపి–యామెరవంత వంకగఁబండుకొని గాఢనిద్రావస్థలో నుండెను. నల్లత్రాచుపామువలె–నీలముల నీనుచున్న నీనుచున్న తెగబాఱెడు జడ–వెనుకవైపునఁ బిక్కలవఱకు దిగి–మిలమిలలాడుచు–జిలజిల లాడుచుండ–ననజ్యమయిన యంగజధనువువలె నామె యలౌకికాఖండ లావణ్యమునఁ బ్రకాశించుచుండెను. అహాహా! ఏమి దివ్యదర్శన మిచ్చుచున్నది! సాక్షాత్కరించిన యాసౌంద ర్యదేవతను గాంచి–తెల్లఁ బోయి–డిల్లపడి–కొయ్యపై–కొంతసేపుండి–రవంత స్మృతితెచ్చు కొని–యామె యవయవసౌందర్యమును–మిత్రుని కవితను మిత్రుఁడు విమర్శించినట్లు క్షుధార్తుఁడు పరమాన్నకుండిక నవలోకించినట్లు–పరీక్షించి–పరమానంద మొంది– మన్మథుఁడు మనస్సులోఁ గెవ్వున నార్చినట్లు చెవులఁబడఁగఁ–బులకితతనుఁడై ''కాంతశిరో మణీ! నన్ను రక్షింపు'' మని యామె రెండుకాళులు పట్టుకొనెను. ఆమె యులికిపడి లేచిరోషకషాయితాక్షియై నిలువఁబడఁగ–డబ్బాటున లేచియామెను గౌఁగిలించుకొని పారవ శ్యమునఁ గన్నులు మూసికొని తృటికాలమునఁ దిరుగఁ దెఱచి చూచునరికిఁ–దన కౌఁగిటి లోనున్న వారెవరు? మానినీ శిరోమణియా? కాదు. మహర్షి శిరోమణి! శతకోటిచారుశారద పూర్ణిమాచంద్రవద యేదీ? బాఱెడుజడగల పదునాఱేండ్లపడు చేదీ? ఏమో! వనితాశిరో మణినిఁ గౌఁగిలించిన పండితుఁ డెవరిని గౌఁగిలించెను?

''ప్రాంశుఁ బయోదనీలతనుభాసితు నుజ్జ్వలదండధారు బిం
గాంశు జటూచ్చటాభరణు నాగమపుంజపదార్థతత్వని
స్సంశయకారుఁ గృష్ణమృగచర్మకృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనుం ద్రిదశవందితు సాత్యవతేయు వ్యాసునిన్.''

కోఁగిలించెను. పండితునకుఁ బ్రాణములు నిల్వన నెగిరిపోయెను. తనువు నీఱయ్యెను. మనసు చచ్చియేపోయెను. వ్యాసమహర్షి యాతని ననుసరించి శాంతపఱచి ''నాయనా! ఇది నీదోషము గాదు. బలసంపన్నమైన యింద్రియసంఘాతదోషము. ''బలవానింద్రియగ్రామో విద్వాంస మపికర్షతి'' యని నేను వ్రాసిన శ్లోకార్థమున కిపుడైన నొప్పుకొందువా? యని యాతని నడిగెను! పండితుఁడు లెంపలు వైచుకొని–బట్ట మెడకుఁ జుట్టుకొని –గురుదేవునకు సాష్టాంగపడి–''స్వామీ! అపరాధిని క్షమింపవలయును. మీశ్లోకపాదమును ''విద్వాంసం నాపకర్షతి'' యని నేను దిద్దితిని. నాకు బుద్ధి వచ్చినది. ''బలవానింద్రియ గ్రామో విద్వాంస మపికర్షతి–కర్షతి–కర్షతి–కర్షత్యేవ'' యని నే నంగీకరించితి నని బాధరాయణునితో మనవి చేసికొనెను.

ఇట్టికథయే పాశ్చాత్యచరిత్రములో నున్నది. మనుష్యస్వభావ మాసియాలో నొక్కటే. ఐరోపాలో నొకటియే ఆఫ్రికాలో నొకటే! అమెరికాలో నొకటే! ఆస్ట్రేలియాలో నొకటే! ఆకథ మిగుల సంక్షేపముగాఁ జెప్పెదను. ''అబ్రెడేటస్'' అనువాని భార్యపేరు పాంథియా–ఆమెను సైరస్ అను చక్రవర్తి బానిసగాఁ బట్టుకొని 'ఆరస్సను' అను నొక్క పారసీక పండితప్రభుని యధీనతలో నుంచెను. ఈపండితప్రభుఁడు తన యింద్రియనిగ్రహశక్తియం దధికవిశ్వాసము కలవాఁడు. అట్టి యా పండితుఁడావనితను గామించి యామె యంగీకరింపకున్న కారణముచే బలాత్కరింపఁబోయె నని చక్రవర్తికిఁ దెలిసి–యాతనిని బిలిపించి యేల యిట్లాచరించితి వని యడుగ నాతఁడు మిగుల సిగ్గుపడి ఖిన్నుఁడై యిట్లనియెను. ''ప్రభూత్తమా! ఈనూత్నశృంగారకథ ననుసరించి వేదాంతరహస్య మొక్కటి గ్రహించితిని. మనుష్యుని కాత్మలు రెండుకాని యొక్కటి కాదు. నాకొక్కటే యాత్మ యయి యుండినయెడల పుణ్యస్వభావము గలది యదియే పాపస్వభావము గలది యదియే యని చెప్పుటకు వీలగునా? సత్కార్యమును జేయున దదియే దుష్కార్యమును జేయున దదియే యని చెప్పుటకు వీలగునా? అట్లనుట తేజస్తిమిర న్యాయమువంటిది కాదా? అందుచే మనకు రెండాత్మలని యొప్పుకొనక తప్పదు. ఉత్తమాత్మ బలిష్ఠమైనప్పుడుత్తమ కార్యము లొనర్తుము. దుష్టాత్మ బలిష్ఠమైనప్పుడు దుష్కార్యము లొనర్తుము. వనితాసన్నిధిని నాదుష్టాత్మ ప్రబలుటచే నట్లొనర్చితిని. ప్రభుసన్నిధిని నాయుత్తమాత్మ ప్రబలుటచేఁ దిరుగఁ దప్పుఁ దెలిసికొని పశ్చాత్తాపపడి బాగుపడితిని.'' నాయనలారా! ఇట్లాతఁడు పలికెను. చూచితిరా! మనదేశపుఁ బండితునకుఁ బారసీకదేశపుఁ బండితునకుఁ గల భేదము! మన పండితుఁడు తప్పానర్చి తప్పొప్పుకొని లెంపలువైచుకొనెను. పారసీక పండితుఁడు కొనవెళ్ళి పాండిత్యముతోఁ దలదిక్క వేదాంతముతో రెండాత్మ లున్నవని క్రొత్తసిద్ధాంత మొనర్చినాఁడు. నాస్తికులాత్మ నంగీకరింపలేనేలేదు. బుద్ధుఁడుకూడ దానిని ద్రోచివైచినాఁడు. శంకరుఁడు జీవాత్మ భ్రాంతి కాని మఱియొకటి కాదని చెప్పినాఁడు. ఎటువచ్చినను విభేదవాదులు మాత్ర మొక్కదానితోడనే దినము లీడ్చుకొని వచ్చుచుండఁగా బారసీకపండి

తునకు రెండాత్మలు కావలసి వచ్చినది! ఎందులకు? తన యవకతవకను గ్రమ్మి కొనుటకు! తన కక్కు-తీతికిఁ గారణ మగపఱచుటకు! రెండెందులకో? ఒక్కదానితో సమన్వయము కుదిరినదికాదు కాఁబోలు! పుణ్యకార్యముల కొకటి పాపకార్యముల కొకటి కావలసి వచ్చిన ప్పుడు పుణ్యపాప సంబంధము లేని తటస్థకార్యములకు మూఁడవది యక్కఱలేదా! కావున నాసిద్ధాంతము ప్రకారము మూఁడాత్మలు! ఈపిచ్చి కేమైన హద్దున్నదా? పుణ్యపాప కార్య ముల కాత్మదాఁక సంబంధ మేనియున్న దనుజ్ఞాన మక్కఱలేదా? పోనిండు. ఉన్నది. మనము శర్కరపొంగలి తినుచున్నాము. చిత్రాన్నము తినుచున్నాము. శర్కరపొంగలిలో నున్న మాధుర్యమును గ్రహించున దొకనాలుక. చిత్రాన్నములోని పులుసును గ్రహించునది వేఱొక నాలుక. దానికి దీనికి భేదముండక తప్పదని వాదించిన పండితుని తలగొఱిగి కత్తివాట్లను బెట్టినిమ్మకాయ పులుసుచే గుద్ది-విశాఖపట్టణమునకుఁ బంపించుటకంటె వేఱు మార్గ మేదైన నున్నదా? బుద్ధిమంతు లగు మీరాలోచింపవచ్చును. స్వకాంతను ముద్దుపెట్టు కొనుట కొక మూఁతియుఁబరకాంతను ముద్దుపెట్టుకొనుట కింకొక మూఁతియు మనకు న్నదా? ఒక్కమూతినే యొద్దుపెట్టుకొని యెటులో కాలక్షేపము చేయుచున్నారా లేదా? నీవు పరకాంత నేల ముద్దిడుకొంటి వని న్యాయమూర్తి నేరగాని నడుగ 'అది వేఱయ్యా! అది దుష్టమైన మూతియయ్యా' యని నేరగాఁడు వాదించినయెడల ముచ్చెఁదీసికొని యాతని మూతిపైఁ గొట్టవలసినదా మానవలసినదా? నాయనలారా! మనసులో సచ్చింత లున్నవి. అసచ్చింతలు కూడ నున్నవి. అవి ప్రబలము లగునప్పుడు సత్కార్యము లగును. ఇవి ప్రబలము లగునప్పు డసత్కార్యమ లగును. ప్రతిమనస్సున కిది సహజము. ప్రపంచమునఁ బరిపూర్ణముగా సన్మార్గుఁ డెవ్వఁడును లేఁడు. పరిపూర్ణముగా దుర్మార్గుఁడెవ్వఁడును లేఁడు. అందఱుకూడ కొంత వఱకు సన్మార్గులు. కొంతవఱకు దుర్మార్గులు. సదభిప్రాయ ములు మిక్కిలి యెక్కువగాఁ గలవాఁడు మిగుల సన్మార్గుఁడు. దురభిప్రాయములు మిక్కిలి యెక్కువగాఁ గలవాఁడు మిగుల దుర్మార్గుఁడు. సత్తునసత్తుకూడ వేఱుతీయుటకు వీలులే నంత బింకముతో నెల్లమనస్సులందుఁ దార్కొనియున్నవి. తేనెలో విషమున్నది. విషములోఁ దేనె యున్నది. గరళములో బ్రదుకు చావుకూడ నున్నవి. అన్నములో నారోగ్యమున్నది. అనారోగ్య మున్నది. బ్రదుకులోఁ జావున్నది. చావులో బ్రదుకున్నది. ప్రపంచమున నెక్కడఁజూచినను రెండు పేటల బొంగరపుజాలివలె సత్తును నసత్తును పెనవైచికొని యున్నవి. ప్రపంచము లెక్కయేమి? బ్రహ్మమునకు మాయావరణము లేదా? ఇకఁ జెప్పవలసిన దేమున్నది? మిగుల మంచివాఁడని నీవెంచుకొన్నవాఁడు మఱియొకరీతిని బరమదుర్మార్గుఁడు. యోగ్యతకుఁ బ్రసిద్ధికెక్కరని చెప్పఁబడినవారంద ఱిట్టివారే? పర మయోగ్యుఁ డని చెప్పఁ డిన వాని నెవ్వనినైనసరే నీవు పోయి ప్రత్యక్షముగఁ బరిశీలింపుము. ఆతని స్వభావమును బరిపూర్ణముగా విమర్శింపుము. ఆపని నీకుఁ గొంత కాలము పట్టును. పట్టనీ కాలమును నీవు పట్టుకొనినయెడల నాఁగునా? ఆతని మనసులో నీవు దూరి బాగుగాఁ బరిశీలించినచో సదభిప్రాయముల సౌరభమును గూడఁ గ్రమ్మివేయునట్టి దుష్టాభిప్రాయము లక్రుళ్లుండితీరును. ప్రబలమైన కాఠిన్యమో నిర్దాక్షిణ్యమో యాతని మనస్సున నీవమోఘముగాఁ గనిపట్టఁగలవు. ఇంతవఱ కెందులకు? ఈకాలమున సన్మార్గు లెందఱు? పూర్వకాలపు రాజులను బురాణములనుండి పైకిఁదీయుము. ధర్మరాజంత ధర్మరా జున్నాఁడా యని లోకప్రతీతికదా! భారతము శ్రీరాములు మొదలు చిత్తగింపవలయును

వఱకుఁ బరిశీలింపుము. ఎన్నిధర్మము లా మహాత్ముఁడు నేర్చినాఁడు. ఎన్నిధర్మము లాచరించినాఁడు. ఎంత దైవభక్తుఁడు, ఎంత కర్మనిష్ఠుఁడు, ఎంత జ్ఞాని అయిననేమి? ఎంత రాజ్యకాంక్ష? ఎన్ని దొంగ యూహములు? ఎన్ని యళీకరోదనములు! ఎన్ని కృత్రిమప్రేమలు! ఎంత కార్పణ్యము! ఎంత క్రౌర్యము! ఆతని మనసులో దుష్టభాగమును బరిశీలించినచో దుర్యోధనుఁ డాతని యంత దుష్టుఁడు కాఁడే! దుశ్శాసనుఁ డాతనియంత దుష్టుఁడు కాఁడే! ధర్మరాజు నడువడియే మిశ్రపు నడువడి యని బుట్టదాఖలుచేయుటకు నీవు సిద్ధపడుచుండఁగా నీకాలపు నన్నార్గుల లెక్క-యేమి? దారులుగొట్టి-ప్రత్యక్షపు బందిపోటు లొనర్చి-ధనము సేకరించి-శ్రీరంగదేవాలయమునకుఁ బ్రాకారములు కట్టించిన మంగయా చార్యులు-తిరుమంగయాళ్వారులు కాలేదా? పరధనాపహర్త దుష్టుఁడా శిష్టుఁడా? దుష్టుఁడగునెడల నాళ్వా రెట్లయ్యెను? ప్రతి దివ్యస్థలములో నిప్పటికి వేంచేసి పూజనందు చున్నాఁడే? నాయనలారా! చోరులలోఁ గూడ నుత్తమోత్తముఁ డున్నాఁడందురా? లేఁడందురా? చోరుల లెక్క-యేమి? నరహంతకులలోనో? మనుజులను జంపి వండుకొని తిను పూర్వపు వన్యజాతులలోఁ గూడ నుత్తముఁ డనఁదగినవాఁ డుండితీఱినాఁడు. తెల్లవారుసరికి సహస్ర శంకరాభిషేకములు చేసి-వేదవేదాంగవేత్తయై-నిత్యాగ్ని హోత్రియైన రావణాసురుఁ డిందువలన సన్మార్గుఁడని యందురా? సీతాపహరణపాపమునఁ దప్పకుండ దుష్టుఁడే యందురా? రావణకుంభకర్ణులెవరు? జయవిజయములు కారా? వైష్ణవప్రసన్న శేఖరులు దుష్టులగుదురా? నాయనలారా! పరమార్థసన్మార్గుఁడు లేఁడు. పరమార్థ దుర్మార్గుఁడు లేఁడు. కొంతయటు కొంతయిటు. అందఱు సన్మార్గత, కలఁత కొట్టు సన్మార్గతయే. అందఱ దుర్మార్గత కలఁతకొట్టు దుర్మార్గతయే. మనసులోఁ జెట్టయున్నఁ గానిమంచియుండుటకుఁ దావే లేదు. మనసులో మంచియున్నఁగాని చెట్టయుండుట కంతకంటెఁ దావు లేదు.

అదిగాక, నీ యోగ్యత నాయయోగ్యత. నీసన్మార్గము నాయసన్మార్గము-నీకుఁ బుణ్యము నాకుఁ బాపము. శాక్తేయులకుఁ బ్రధానమగు సురాపానము తదితరులకు నరక హేతువు. పుణ్యసాధనమగు నద్వైతుల యజ్ఞపశుమారణము, ద్వైతులకుఁ బాపహేతువు. వీరికిఁ బ్రశస్తమగు పిష్టపశువు, వారికి నింద్యము. వడహలవారి యేకాదశీశ్రాద్ధము, తెంగలివారికిఁ బాపము. బ్రహ్మసమాజమువారికి విగ్రహపూజ యసత్కార్యము. అది మీకు సత్కార్యము. మాధవస్వామియాలయమును మసీదుగాఁ జేయుట మహమ్మదీయునకు మఁచికార్యము. మహమ్మదీయుఁడు చూచుచుండఁగాఁ బ్రాణాహుతులు పుచ్చుకొనుట బ్రాహ్మణునకుఁ బాతిత్యము. ఇదిగాక మఱియొక పెద్ద చిక్కు. యోగ్యతాయోగ్యతలు సదసత్కార్యములు- మంచి చెడ్డలు - పుణ్యపాపములు- సదాచారదురాచారములు -దేశమునుబట్టి కాలమునుబట్టి భేదించును. సత్యావసమునకై సతిని సంతలోఁబెట్టి హరిశ్చంద్రుఁడమ్మట మహాదూష్యమైన-శిక్షాపాత్రమైన-దాసీ విక్రయముగా నిప్పుడు పరిగణింపఁబడుచున్నది. వల్లభాచారికాలమున మోక్షార్హమని భావింపఁబడిన పని యిప్పుడు గుడిసెవ్రేటుతనముకంటె భిన్నముకాదు. మహాసాధ్వి యని యెఱిఁగియుండియు నాసన్న ప్రసవసమయయగు జానకీదేవి నరణ్యమునఁద్యజింపుమని పంపిన భగవదవతారమగు శ్రీరామచంద్రుఁడు శిక్షార్హుఁడని యిప్పు డెంచుచున్నారు. భార్యనే యొకనికి దానమిచ్చిన మహాత్యాగి యగు రఘుమహారాజీకాలమునఁ దార్ప్రఁడుకాఁడైనాఁడు. డాఫర్ అయినాఁడు.

పూర్వకాలపు యోగ్యతాశాసనమంతయు నితిశ్రీవఱకు నెగిరిపోయినది. సత్తనుతత్వము స్థిరమే యగునెడఁ బూర్వకాలమున నది పుణ్యమేమి? ఈకాలమున నదియే పాపమేమి? అందువలన నాయనలారా! మంచియేదో చెడ్డయేదో, పుణ్యమేదో పాపమేదో యింకఁ దేలనే లేదు. తేలకపోవుట యేమి? ''పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్'' అని యున్నది కాదా? ఉన్నది. దీనినెత్తిపై నెగిరిపోయిన సిద్ధాంతములు గూడ నున్నవి. అన్నదాన మొనర్చుట మహాపుణ్యముకదా! అందులో నాఁకలియో యని యేడ్చువాని కన్నమిడుట యంత యింత పుణ్యమని చెప్పవచ్చునా! కడుపులోని మంటచేనాఁకలియో, యాఁకలియో యని యేడ్చు సన్నిపాతరోగి కన్నము పెట్టినయెడల నది పుణ్యమా పాపమా? కన్యాప్రదాన మొనర్చుట పరోపకార మగుటచే మహాపుణ్యముకదా! వృద్ధునకుఁ గన్యనిచ్చుట పుణ్యమా పాపమా? ఈవిమర్శన మెందులకు? పరోపకారము పుణ్యము పరపీడనము పాప మను వచనమునకు నా నెత్తిపై నున్న వెంట్రుకలన్ని యాక్షేపణము లున్నవి. ఇప్పుడన్నియు గణింపనేల? ఇదివఱకే యాలస్యమైనది. పాపమేదో పుణ్యమేదో యిప్పటి కింకఁ దేలలేదను సంశము కొంచెము హెచ్చుతగ్గుగ సిద్ధాంతము. పరదేశీయ ప్రాచీనవేదాంతు లగు సాక్రటీస్ ప్లేటో అరిస్టాటిల్ మొదలగువారీ యంశమును దర్కించి తర్కించి–కొసకుఁ జేరలేక ప్రాణమువిసిగి–పరిత్యజించినదే. మహానాఁటకులు–మహా బుద్ధిశాలులు–సమస్తశాస్త్రజ్ఞాన నిక్షేపులు–నగు ప్రస్తుతకాల పాశ్చాత్యజాతులవారీ యంశమునెట్లు తీర్మానించిరో! ఎట్లు తీరుమానించిరా? మొన్న మొన్న జరిగిన జర్మనీయుద్ధము సహస్రకోటిజిహ్వాలతో రవి చంద్ర తారామండలముల దాఁటి యాపైనఁగూడ వినఁబడునట్లు ఘోషించుచుండుట లేదా? ప్రళయకాల మహాఘంటాఘోషముతో ముందు సృష్టికిఁ గూడ నందునట్లు ఘోషించుచుండుట లేదా? మంచిచెడ్డ లేవో పుణ్యపాపము లేవో పాశ్చాత్యులవలన నేర్చుకొనుట మాత్రము స్వప్నవార్త. గగనపుష్పము. నాయనలారా! అయాశ మాత్రమెన్నఁడును బెట్టు, కొనకుఁడు. వారివలన నేర్చుకొనఁదగిన వనేకములగు నితరాంశము లున్నవి. ఐహిక సౌఖ్యసాధనములు దాదాపుగా నన్నియు వారివలన నేర్చుకొనఁదగినవే. ధూమప్రభావము –విద్యుచ్ఛక్తివైభవము–శస్త్రచికిత్సా వైదగ్ధ్యము మొలగున వెన్నియో వారివలన నేర్చుకొనఁ దగినవే–ఉష్ణా మని యొక్క విషనాయువు నూఁదునరి కూరందఱు యమపురమును జేరు సాధనము వారియొద్ద నేర్చుకొనఁదగినదే! పువ్వులాగున దేశముమీఁదఁబడి, యగ్నిపర్వ తము లాగువ దేశమంతయు బుగ్గిచేయఁగల సాధనము వారియొద్ద నేర్చుకొనఁ దగినదే. ఱెక్కలు లేకుండ నాకాశమున నెగురుశక్తి వారివలన నేర్చుకొనఁదగినదే. నాయనలారా! ఇటు లెన్ని చెప్పఁగలను. మీజంఘాల శాస్త్రి 'ఆధ్యాత్మిక విద్యావశ్యకత' యను సాఱిలో నీసంగతులన్నియు సమగ్రముగఁ జెప్పినాఁడు. ప్రధానముగఁ గావలసిన దాముష్మికసుఖము గాని యైహికసుఖము కాదు. వారికి మనకు దృక్పథములే వేఱైనపుడేమి వినియోగము? పర్యవసానమునఁ జెప్పిన దేమనఁగా పుణ్యమేదో పాప మేదో వారివలన మనకుఁ దెలియదు. మనకుఁ దెలిసినంత వఱకుఁ దెలియును. ఆ జ్ఞానముతోడనే వీఁడు పుణ్యాత్ముఁడని వాఁడు పాపాత్ముడని–యీకార్యము సత్కార్యమని యీకార్యమసత్కార్యమని–గుఱికి బారెఁడు హెచ్చుతగ్గుగా నిర్ణయించుచున్నాము. సంపూర్ణముగా యోగ్యుఁడు లేఁడు. సంపూర్ణముగా నయోగ్యుఁడు లేఁడు. ఆకలతకొట్టు యోగ్యతలోనే యోగ్యుఁడు చచ్చువఱకు యోగ్యుఁడు గానే యుండునని చెప్పవీలులేదు. మనుజునకు స్థిరమైన నడవడిలేదని చెప్పక తప్పదు.

ఆఁ ఆఁ అంత పనికిమాలినమాట నాడుదువాయని నన్నధిక్షేపింపకుఁడు. పనికిమాలినదైనను బరమార్థమదియే! స్థిరమైన నడవడియే యుండునెడల లీలాశుకుఁడు యోగి యెట్లయ్యెను! భక్తపాద రేణువు భ్రష్టుఁ డెట్లయ్యెను. ఋశ్యశృంగుఁడు సంసారి యెట్లయ్యెను. స్వప్న సిద్ధులకు హఠాత్సిద్ధులకు మీరేమి గతి కల్పించెదరు? బాహ్యపరిస్థితుల వలన 'కారెక్టరు' ఎట్లు మాఱునో యను నంశముకంటె మఱేదియున్నది? నడవడి పాషాణమువలె స్థిరమే యైయుండునెడల నీగ్రంథజాలమంతయు నెందులకు? పాషాణమునకుమాత్ర మేమి స్థైర్య మున్నది? మాఱుపే ప్రపంచమునకు స్వభావము. నిర్వికారమైన దొక్క పరబ్రహ్మతక్క వేఱేదియు లేదు.

నాయనలారా! మీకుఁ జాలశ్రమ మిచ్చినందులకు విచారించుచున్నాను. ఈయుపన్యా సమునే జంఘాలశాస్త్రి చెప్పునెడలఁ జిలువలకుఁ బలవలుఁ-వలవలకుఁ బత్రములు చేర్చి మనోరంజకముగాఁ జెప్పఁ గలిగి యుండును. నేనాదర్శముగా నుంచుకొనిన జంఘాలశాస్త్రి గారి వాగ్ధోరణి ననుకరించియే సాధ్యమైనంతవఱకుఁ జెప్పితిని. ఉఱుముఱిమినచోట చేఁటదెబ్బలు కొట్టిన నా సాహసమును మన్నింప వలయును.

జంఘాలశాస్త్రి లేచి యిట్లు పలికెను.

వీరి యుపన్యాసము నానందమున వింటిమి. వీరు మన యాహ్వానమును మన్నించి యుపన్యసించినందులకు వారికి మన మెంతయుఁ గృతజ్ఞులము. కాని వీరితో మనకుఁ గొన్ని విషయములలో భేదాభిప్రాయము లుండవచ్చును. ఆయంశము లెప్పుడైన నేను వెల్లడిం తును. ఇదివఱకే మిగుల నాలస్యమైనది. క్షమింపవలయును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

25. గ్రంథాలయ వార్షికోత్సవము

ఒక గ్రామంలో జరిగిన గ్రంథాలయ వార్షికోత్సవం గురించి, ఆవూళ్లోనేవుండే సాక్షి సంఘ మిత్రుడొకడు ఉత్తరం వ్రాయగా–దానిని జంఘాల శాస్త్రి చదివాడు.

గ్రంథాలయంపేరు ఆవూరి గ్రామదేవత మరిడీమహాలక్ష్మి పేరే. దానికి వార్షికోత్సవం చేయదలిచి, కరణం, మునసబువంటి పెద్దలు ఖర్చుకలిసివ స్తుందని అమ్మవారి జాతరలో కలిపి పెట్టారు.

సభకు అగ్రగనాధిపతిగా ఒక కోమటి కవిగారు అంగీకరించారు.

ఉత్సవం రోజున ఆయనను రైలు స్టేషనులో కలిసి ఊరేగింపుగా బసకు తీసుకురావడానికి నూకిసాని మేళంతో, పదహారు డప్పులతో, మూడు అమ్మవారి ఘటాలతో, చల్లకుండతో–ఏర్పాట్లు జరిగాయి.

ఈ మహా ధ్వనుల మధ్య మతిపోయి బసకు చేరిన అగ్రాసనాధిపతి గారికి ముందు పుస్తక భాండాగారాన్ని కరణంగారు నూపించారు. ఆ గ్రంథాలయం ఎడిచే నైఖరిని ఆయన గ్రహించాడు.

గ్రామదేవత మరిడమ్మవారి గుడిలోనే సభ జరిగింది.

అగ్రాసనాధిపతి ప్రసంగిస్తూ-ఆ గ్రంథాలయం దుస్థితిని సూచించి, ఇలాగ గ్రామదేవతల జాతరల్లో ఒక భాగంగా వార్షికోత్సవాలు చెయ్యవద్దని సలహాఇచ్చాడు. గ్రామంలో అంతమంది జనాభా వుండగా, పుస్తకాలను వాడుకొనినవారు కనబడరని వాపోయాడు. వివిధ గ్రంథాలు చదివి విమర్శలు చేసుకోమనీ, పురాణ కాలక్షేపాలు ఏర్పాటు చేసుకోమనీ, గ్రంథాలయం గోడలమీద కవి పండితుల చిత్రాలుంచమనీ, గ్రంథాలయాలంటే రాబోయే సారస్వత అభివృద్ధికి ముఖ్యపాత్ర వహిస్తాయని చెప్పాడు. తద్దినాలలాగ వార్షికోత్సవాలు చెయ్యవద్దని హెచ్చరించి ఆయన వెళ్లి పోయాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! ఏదోయొక చిన్న యూరనొక గ్రంథాగారవార్షికోత్సవము జరిగిన దంట. అది యెట్లు జరిగినదో కొంత సవిస్తరముగా నాయూరనున్న మన సంఘమిత్రుడొకడు వ్రాసినాడు. దానిని జదివెదను.

''సాక్షికి నమస్కారములు. అయ్యా! మాయూరనొక గ్రంథాగార మున్నది. దానిపేరు శ్రీ మరిడీమహాలక్ష్మిపుస్తకభాండాగారము. ఈభాండాగారశబ్దమున కర్థమేదియో నాకుఁ దెలి యలేదు. పెద్దలకు మీకుఁ దెలియునేమో! మాయూరి రెడ్డియే మాపుస్తకాగారమున కధ్యక్షుఁడు. కరణము కార్యదర్శి. గ్రంథాగారమునకు గ్రామదేవత పేరగుటచేతను, గ్రామా ధికారులిద్దఱు గ్రంథాగారప్రధానకార్యనిర్వాహకులగుటచేతను, గ్రామస్థులలో ననేకులు గ్రంథాగారాభిమానులై యున్నారు. మరిడమ్మవారిగుడి కెదురుగనుండుటచేతనే మాగ్రంథా గారమున కాపేరు వచ్చినది. అదిగాక మరిడమ్మయే యాగ్రంథగారమునకుఁ బ్రధానపోషకదే వత యని చెప్పక తప్పదు. ఆమెకున్న వచ్చుబళ్లలోఁ గొంతసొమ్ము మాగ్రంథాలయమునకై వినియోగపడుచున్నది. గ్రామదేవత నాశ్రయించిన గ్రంథనిలయమునకు లోపమేమి? దేవతా శక్తి ముందు మనుష్యశక్తి యెంత? ఈవత్సర మమ్మవారికిఁ గూడ రాఁదగిన వచ్చుబళ్లు నాన్కోఆపరేషన్ మహిమచేఁ గాఁబోలు బూర్తిగా రాకపోవుటచే వ్యయము కొంత కలసివచ్చు నని గ్రామాధికారులు గ్రంథాలయ వార్షికోత్సవమమ్మవారి యుత్సవములోనే జరుపుటకు నిశ్చయపరచిరి. గ్రామాధికారుల తీరుమానమున కడ్డేది? పూర్వకాలమునందొక వైణికుఁ డొక రాజును సందర్శింప నాతని యాస్థాననగరమునకు వచ్చెనఁట. పరసగరవాసులకుఁ బ్రభుదర్శనసిద్ధి కొంతకష్టముకాదా! ఈవైణికుఁ డాయాస్థానప్రధానుఁడు మొదలగు రాజో ద్యోగుల నాశ్రయించి రాజసందర్శనము చేయింపుఁడని వేఁడుకొనెను. కొంతకాల మాతఁడిట్టు లాశ్రయింపఁగఁ దుదకుఁ బ్రధానుఁడు రాజుగారితో వైణికా గమనమును గూర్చియు నాతని ప్రభుసందర్శనాపేక్షను గూర్చియు ముచ్చటించెను. అప్పుడు రాజు గారు గానకళాభిజ్ఞుఁడగుటచేఁ గొంతయోజించి ''సరే వైణికునకుఁ బ్రత్యేక మొక్కసభ చేయుట యానావశ్యకము. ఇక నాల్గుదినముల కూడుగులమ్మవారి జాతర వచ్చును గదా? అప్పుడు మన మందఱ మమ్మవారితోఁగూడ నూరువెంటఁ దిరుగుదుము కదా! వీణతెచ్చి యాయూరేగింపులో వాయింపవలసినదని వైణికునితోఁ జెప్పు''మని ప్రధానునితో రాజుగారు ప్రత్యుత్తర మిచ్చిరి. ''వీణ యనఁగా వీరణము కాదయ్యా! అది దప్పుల సందడిని వాయింపఁదగినది కాదయ్యా! అందువలనఁ బ్రత్యేకసభయొకటి వైణికునకు దివాణములోఁ జేయవలసియుండునయ్యా.'' యని ప్రధానుఁడు రాజుగారితోఁ జెప్పవచ్చునా? రాజాజ్ఞ యైనప్పుడు తప్పదని యాతఁడూరకుండెను. అటులే గ్రామాధికారులు గ్రంథాగారవార్షికో త్సవము మరిడమ్మవారి తీర్థపు దిరునాళ్లలో జరిగింపవచ్చు నని చెప్పినప్పుడు పరిణయోత్స వమునకుఁ బ్రత్యాబ్దిక శ్రాద్ధమునకు సరిపడదని యాహ్వానసంఘసభ్యులు చెప్పవచ్చునా? అట్లు చెప్పక మిన్నకుండిరి. అదిగాక చందాలు వసూలు చేయువారు–సమయానుసారముగఁ గర్చుపెట్టువారు–గ్రామాధికారులయినప ''ము–సమాహ్వాన సంఘసభ్యుల వచ్చుమాట లెవఁడు గణించును? వైద్యుఁడు లేకుండ వ్యాధిని దాఁటింపవచ్చును. పౌరోహితుఁడు లేకుండ బెండ్లి నీడువవచ్చును. పాసఁగుఁడువాఁడు లేకుండ సంతసాగింపవచ్చును. భోక్తలే కుండ తద్దినము కడతేర్పవచ్చును. కాని వార్షికోత్సవము మాత్ర మగ్రాసనాధిపతి లేకుండఁ దెప్పదాటించుటకు వీలులేకపోవుట చేత మా మునసబు కరణము లెందఱుపండితులకో యధ్యక్షపదవి నంగీకరింపుఁడని లేఖలు వ్రాసిరి. మేము రాఁజాలమని యెందఱో ప్రత్యుత్త రము లీయఁగాఁదుదకొక్క రంగీకరించి వ్రాసిరి. ఆయన యొక కోమటి. మీ సాక్షిసంఘమునఁ గొంతకాలము లక్ష్మీదేవివఱకయ్యె యుండి రెండు తామరకోరములతోఁ బని

చేసి లోకవిఖ్యాతినొంది తుదకుఁ గైలాసము చేరిన సుబ్బిసెట్టిగారి పితామహుని ప్రపౌత్రపుత్రుఁడఁట బి.యే.,లో నొక శాఖయందుఁ గృతార్థుఁ డైనాఁడు. యఫ్.యే., దాఁటి బి.యే., కాకుండఁ జిరకాలమునుండి నడుమఁ ద్రిశంకు స్వర్గమునఁ బెనఁగులాడు చున్నాఁడు. అర్ధనారీస్వరూపము. ఈయన యాంధ్రభాషలో ననేకగ్రంథములు చదివి నవాఁడు. పలుచపలుచని పాండిత్యము కలవాఁడు. కలఁతకొట్టు కవిత్వము కలవాఁడు. తలతిక్కతత్వము కలవాఁడు. కాని గణితశాస్త్రమందు గట్టివాఁడు. రైలుస్టేషనులలో దిగుసరికీయన నెట్లు గౌరవించి గ్రామములోనికిఁ దీసికొని రావలయునో యని మునసబుకర ణము లాహ్వానసంఘసభ్యులతో యోజించిరి. అమ్మవారి యుత్సవములలో నొకరాత్రి భాగవతము కట్టుటకు వచ్చి యచ్చట వేంచేసియున్న చిన్న నూకిసానిమేళముతోఁ బదునాఱు డప్పులతో–మూఁడమ్మవారి ఘటములతోఁ–జల్లకుండతో–నధ్యక్షు నెదుర్కొని గ్రామమంతయు నూరేగించి బసలోనికిఁ దీసికొని రావలసిన దని కొంత చర్చపై నందఱు తీర్మానించుకొనిరి. ఎప్పుడు వచ్చునా యని యెంతయో వేడుకతో నెదురు చూచిన దినము వచ్చినది. రాదా మఱి? కాలమునకు దాక్షిణ్యమున్నదా? రైలుస్టేషను రోడ్డుమీఁద నక్కడక్కడఁ దోరణములు కట్టినారు. కాని యమ్మవారి యుత్సవ మగుటచే వేపాకు తోరణములేకాని మామిడాకు తోరణములు కట్ట వీలులేకపోయెను. వేపాకునకున్న యందము నారోగ్యము సౌరభము మామిడాకునకు లేవని మాకరణముగారి కొడుకు యూనియను గుమాస్తాపని పరీక్షకుఁ జదువుచుండి తప్పిపోయిన తత్త్వజ్ఞాననిధి చెప్పినాఁడు. రైలుస్టేషనునకు గ్రామస్థులనేకులు పోయి వేఁచి యుండిరి. రైలాదినమున నొక గంట యాలస్యముగ వచ్చునని తెలిసినది. అధ్యక్షుఁడుగా రేలాగున నుందురని యొకరినొకరు ప్రశ్నించుకొనిరి. ఎవ్వరికిని దెలియదు. హైస్కూఁడు కావునఁ బ్రాయశఃనల్లగనుండునని నిర్ధారణపఱచుకొనిరి. రైలు వచ్చినది. అనేక జనులు దిగిరి. వారిలో నధ్యక్షుఁ డెవ్వఁడో తెలిసికొన నెవరి తరము? మునసబు కరణము లేదో పేర నఱచుచుఁ గొంతసేపటునిటు పరుగెత్తిరి. ఇంతలో నెవ్వరో నల్లగాఁ బొడుగుగ మన్నవారు జరీతలపాగ తలకుఁజుట్టినవారు వ్రేళ్ల కుంగరములు సింగారించినవారు–కరణముగారిని జూచి రవంత నవ్వినవారు–అట్టి యొక పురుషునియొద్దకుఁ బోయి మునసబుగారు గన్నేరుపూవులమాల నాయన మెడలోఁ బడవైచిరి. ''బావగారి దయకు మిక్కిలి సంతసించితిని. నేను బసకురానా? మీ రేల స్టేషనునకు దయచేయవలెను?'' అని, యా పుష్పమాలాధారి మునసబుగారితో ననెను. రెడ్డికిఁ గోమటికినీ మేనఱికపుఁ జుట్టఱిక మేమో మా కెవ్వరికిని దెలియలేదు. మునసబు గారి కంతకంటెఁ డెలియలే దని వారి మొగమే చెప్పినది. ''అయ్యయ్యో! ఆతని మెడలో దండ వైచితివేమి? అతఁడు మన వీరాస్వామినాయుఁడుగారితో వియ్యపు మాటలాడుకొను టకు వచ్చినవాఁడు. నేనాతని నెఱిఁగియుండుటచే నన్నుఁజూచి నవ్వినాఁడు. మీరు భ్రమపడి యాతని మెడలో మాలవైచితిరి తీసివేయుఁ.'' డని మునసబుగారితోఁ గరణము నిర్దాక్షిణ్యముగఁ బలుకుసరికి మునసబు తప్పుపనిచేసితినిగదా యని కొంచె ముడుకుఁబోఁతు దనమునఁ గలిగిన కోపముతో నాతని మెడలోని దండ నూడలాగి ''ఇతఁడు వీరాస్వామి గారి వీరకాఁ డయినయెడల మన పెద్దమ్మవా రెక్కడ మిడుకుచున్న'' ట్లని విసుగుఁదలతోఁ బలికెను. 'అయ్యా వచ్చుచున్నాను. క్షమింపుఁ' డని పచ్చని శరీరకాంతిగల యొకరప్పుడే రైలుదిగి గుంపులోనికి వచ్చిరి. మీరేనా మాకు ప్రెసిడెంటని మునసబుగా రడిగిరి. ఔనని

యాయన చెప్పినను నల్లగ నుండునని నిశ్చయపఱచుకొనిన ప్రెసిడెంటు పచ్చగ నేల యున్నాఁడని కాఁబోలు తెల్లబోయి, తిరుగ నడిగి, 'ఔ' నని రెండవమారు నిశ్చయపఱచుకొ నిన మీఁదట మునసబుగారతని మెడలోఁ బువ్వులదండను వేసిరి. అచ్చటి జనులందఱు కరతాళధ్వను లిచ్చిరి. జనసమ్మర్దము పూలదండలు చప్పటలు చూచి యాయన క్రొత్తగాఁ గారాగృహమునకుఁ బోవుచున్న నిరాకరణవాదికాఁబోలు నని యెంచి రైలులోని జనులు 'గాంధిమహాత్మునికి జయ' యని కేకలిడిరి. అంతలో స్టేషనులో నున్న రక్షకభటులు మాయధ్యక్షునిఁ జూచి కొఱకొఱలాడిరి, 'నాకాసంబంధము లేదయ్యా' యని యధ్యక్షుఁడు వారిని శాంతపఱచి తన కీడు బాపుకొనెను. ఇంతలో బండి పోయెను. ''బండి యాఁగిన వెంటనే క్రిందికి దిగక యింతసేపు బండిలో నేమి సేయుచున్నారయ్యా'' యని కొంచెము తీవ్రముగా మునసబుగారు మా యధ్యక్షు నడుగగా ''దోసకాయచెంబు పోయినదయ్యా! యెక్కడ వెదకినను గానఁబడలే'' దని యాతఁడు చెప్పెను. కొందఱు నవ్విరి. కొందఱు విచారించిరి. చూచితిరా మనుష్యప్రకృతి! ఒక్కయంశమే కొందఱను బ్రక్కన గిలిగింతఁ బెట్టును. మఱికొందఱను గంటిలోఁ బొడుచును. చంద్రుఁ డస్తమించుసరికి బాటసారులు విచారింతురు. దారులు గొట్టువారు సంతసింతురు. మనుష్య ప్రకృతి యెల్లయెడల నొక్కటే యని కవులు వేదాంతు లేమో చెప్పెదరు కాని నాకు నమ్మకము లేదు. దోసకాయచెంబు పోయినదని యధ్యక్షుఁడనఁగఁ గొందఱు 'చొచొ'' యని చప్పలింప నేల? కొందఱు కిసుక్కున నిగిలింప నేల? అయినను బ్రకృతిపరీక్ష నాకెందులకు? ''స్వంచి మీరే పట్టుకొని యుంటిరేల? నాచేతి కిండు. నేను బట్టుకొందు''నని యాహ్వాన సభ్యుఁ డొకఁడు పలుక ''నాయనా! అక్కఱలేదు. నేనే పట్టుకొందు'' నని యధ్యక్షుఁడు పలికెను. ఎంత నిర్గర్వుఁడు, ఎంత నిర్గర్వుఁడని కొందఱు తలలను బ్రశంసాసూచకముగఁ బంకించిరి. ''నైచ్యము కాదు. నా పిండకూడు కాదు. దోసకాయచెంబు పోయినట్లే తోలుసంచి కూడఁ బోవునేమో యను భయముచే నీయకుండ నున్నాఁ'' డని పరిహాస సూచకముగా మోచేతి పోట్లను కొందఱు పొడుచుకొనిరి. ఆహాహా! పనికిమాలిన ప్రపంచము. 'ఊ' యనఁగ నొక తప్పు. ఉహూహు యనఁగ వేఱొక తప్పు. మాటలాడకున్న యెడల మఱియొక తప్పు. తన కొఱకుఁ దేవలసిన రెండు గుఱ్ఱములబండి యెచ్చట నున్నదో యని యధ్యక్షుఁడు విమర్శముగ సీప్రక్క నాప్రక్కఁ జూచుచుండుటచేత నచ్చటి గుంపులో నిట్టి రసభేదవ్యాప్తి కలిగిన ట్లాతఁడు గ్రహించుట కవకాశము లేకపోయెను. ఇంతలోఁ జిన్న నూకిసాని పెద్దయేనుఁగు వలె మందయానమున ముందునకు వచ్చి చేతు లెడమప్రక్కను జోడించి దండమిడెను. అంత నధ్యక్షుఁడు తెల్లఁబోయి 'యిదెందులకండోయి' యని మునసబుగారి నడిగెను. ''ఇది యిది యని మీరనుట న్యాయము కాదయ్యా! గౌరవముకొఱకు బ్రదుకు చున్న వారము కాని మఱియొకటికాదు. అల్లరిచిల్లరవారి నని నట్లనుట తగదయ్యా'' యని యాసాని యధ్యక్షుని మందలించెను. ''ఈసారి బహుగౌరవమైన కుటుంబములోనిదయ్యా! బహు మర్యాదగల కోవలోనిది. సమీపమున నున్న 'ప్రొవిన్సయిటరు' గారే యీమెకుఁ గన్నె చెఱఁ బాపినారు. హాషామాషిది గాదు. హేమాహేమీల యెరుగులు దిద్దఁగల పండితురా'' లని మునసబుగా రధ్యక్షునికి సాని స్వరూపస్వభావాభిజాత్య గౌరవ ప్రభావాధిక్యములను బ్రకటించెను. ''ఇట్టి యుత్తమోత్తమవంశోద్భవ మహాగౌరవ ప్రసన్న శేఖరులగు విద్వద్వేశ్యా శిఖామణు లిప్పుడుండుట దేశమునకు మంచిదేకాని యీమెను నేను నిందింపలేదు.

ఇపుడీమేళ మెందులకని నేనడిగితి.'' నని యధ్యక్షుఁడుగారు మునసబు గారితో చెప్పిరి. ''అయ్యా! అగ్రాసనాధిపతిగారూ! మీరేమియు నడుగవలదు. మావేడుకకొలఁదియు –మాయుద్రేకముకొలఁదియు–మా యిష్టమైన వైభవములు చేసికొందుము. మీరడ్డు పెట్టుటకు వీలులేదు. మాగ్రామములో రైలు దిగునంతవఱకే మీ యిష్టము. మిమ్మఁ బూవులలోఁ బెట్టికొని గౌరవించి తిరిగి రేపు సాయంకారము మిమ్ము రైలులోఁ గూరుచుండఁ బెట్టువఱకు మీ రేమియు నెందులకు నభ్యంతరముఁ జెప్పఁదగదు. కానిండురా! చూచెద రేమి.'' యని మునసబు గారు పాషాణపాకమునఁ బలుకునరికిఁ బదునాఱు డప్పులు–తొమ్మిది తుడుములు–నాలుగు బాఱబాకాలు–మూఁడు తాషామరపాలు–సముద్రమథన మంత కోలాహలముతో మ్రోఁగినవి. ఊరేగింపు ప్రారంభమైనది, అయిదారువందలజన మూరేగింపుతో నున్నది. అధ్యక్షుఁ డుగా రొకచేత గొడుగుతో, నొకచేతఁ దోలుసంచితో–మెడలో యెఱ్ఱగన్నేరుపువ్వులదండతో–గంటికిజోటితో–జనసంఘమధ్యమున, ''నెందులకు వచ్చితినిరా భగవంతుఁడా'' యని లోలోన నేడ్చుచుఁబైకి వెఱ్ఱినవ్వు నవ్వుచు నడచుచున్నాఁడు. పసపుకుంకుమను బూసిన చల్లకుండ నెత్తినిబెట్టుకొనిన చాఁకలి కెదుటఁ జిత్రవిచిత్రము లగు గమనికలతో–నొడుపులతో–మోకాళ్లపైఁ దగ్గుచు లేచుచు గొట్టెపొట్టేళ్లవలెఁ దలలువంచి –టొకాయించుటకు సిద్ధపడుచు మాదిగ వాండ్రు వింత వింత వరుసలతో దిగ్గజకర్ణవిదారణ దారుణ ధ్వానములతో డప్పులు వాయించుచున్నారు. తక్రఘటధారి యగు రజకశిఖామణి వెనుక మరిడమ్మవారి ఘటములను నెత్తిపైఁ బెట్టుకొని ముగ్గురు చాఁకలి వాండ్రు బంగాలు కట్టుకొని తెఱపి తెంపు లేకుండఁ 'దెయ్యి' మని యాడుచున్నారు. ఎగురుచున్నారు. వెనుకకు నడచుచున్నారు. గిరగిర దిరుగుచున్నారు ఒంటికాలిభరత మాడుచున్నారు. డప్పుల వాండ్రలోఁ దప్పుదెబ్బలు పడినప్పుడింత నీరావేశములో నైనను ఛీ! గాడిద కొడుకులారా! యని గట్టిగ నఱచుచుఁ జేయిచాఁచి పైకెత్తి దింపి తాళసౌష్ఠవము నగపఱచుచున్నారు. అంత డప్పులవాండ్రు–సొగుడుగఁ–జొకముగఁ–బ్రబ్రథమకాలములోఁ దిరుగడప్పులను గలిసి వాయించుచున్నారు. ఇంతలో ''నేను మరిడమ్మనురోయి! మీకొంపలు నట్టేటఁ గట్టి తీఱెదనురోయి! కనకస–కటకట–నమలి మ్రింగెదనురోయి! చలువ! చలువ. చల్ల కుండ! తరవాణిరోయి!'' యని యొక్క శివశక్తి ముసలిగొల్లది వేఁపబెత్తము నీకొన నొకచేతితో నాకొన నొకచేతితోఁ బట్టుకొని చేతులెత్తి ధనురాకారముగ బెత్తమును వంచి యెగిరి యెగిరి పడుచున్నది. అంత మునసబుగారు ''ఆగండి, గాడిదకొడుకులారా!'' యని తుడుము మొదలు దేవతార్చన వఱకందఱ నొక్కగుదిగ్రుచ్చి–యొక్కటే తిట్టుతిట్టి –ప్రక్కనున్న యింటిలోనుండి నాల్గుకడవలనీరు తెప్పించి మూఁడుకడనలు ఘటముల వారి కాళులపై బోయించి యొక కడవ శివశక్తినెత్తిపైఁ బోయించి యావేశపుతహద్దీ కొంత శాంతింపఁజేసెను. ఇంతలోఁ దాటియాకంటించి మాదిగవాండ్రు డప్పులు కాచికొనుచుండిరి. 'కుయ్యి' మను నుపాంగముతో ధణధణ మను మృదంగధ్వానముతో–గలగల మను గజ్జెల చప్పుడుతో–మేజువాణి యారంభ మయ్యెను. మేళనాయకురాలగు చిన్ననూకిసానియే గజ్జెగట్టెను.

''చినదానరా! నే చినదానరా'' యని నాడుచు నభినయముఁ బట్టెను. అన్ని పండ్లూడినబోసి–అరువది యేండ్లతొక్క–అడనిదున్న పోతంత బొద్దినసాని–హరహరా! 'చినదానరా' యని పాడుచున్న దేమిరా యని యనుకొని కాఁబోలు మా యధ్యక్షుఁడుగారు

మందహాస మొనర్చినారు. ఈమందహాసములోఁ గొంత శృంగారరసమేళన ముండ
తప్పదని నిశ్చయపఱచుకొని కాఁబోలు మా యధ్యక్షుఁడుగారు మందహాస మొనర్చినారు
ఈమందహాసములోఁ గొంత శృంగారరసమేళన ముండక తప్పదని నిశ్చయపఱచుకొ
కాఁబోలు నప్పటికి శ్రీమతి చిననూకిసానిగారి యాశ్రయమున నున్న భిక్షుకుఁడగ
శాత్తనుఁడు మాయధ్యక్షుఁడుగారిని గోరచూపునఁజూచి గుట్టుమనెను. ''చినదానరాగాదు.
యిల్లువల్లకాడుగాను 'చచ్చినదానరా' యని'' పాడినయెడల సందర్భముగా నుండున
గుంపులోనుండి కానఁబడకుండ నొకఁడు కేకవైచెను. మునసబు ''జాగ్రత్త! నోరుకట్టి
ట్టుకో'' యని కేకవైచి యూరేగింపు సాగించెను. నెత్తిమండఁ గడుపుమాడఁ గాళ్లుమా
మనసుమాడనొంటిగంట యగుసరి కధ్యక్షుఁడు తన కేర్పాటైనబసలోఁ జేరెను. భోజనమై
పిమ్మట నాతఁడు పుస్తకాగారమును జూచుటకై వచ్చెను. ఇది యెల్లప్రెగడగారి ప్రభావతీ
ద్యుమ్న మని యిదికంకంటివారి యుత్తర రామాయణమని కరణముగా రధ్యక్షునకగపఱ
చెను. ఇది వ్యాసమూర్తి శాస్త్రులవారి శ్రీకుమారాభ్యుదయ మని వేంకటరత్నముపంతులు
గారి శంకరవిజయధ్వజమును బైకెత్తెను. మీరు పుస్తకములను జూడకుండఁ జెప్పుచున్నారు
నేను జూచుకొందును మీకు శ్రమ మక్కఱలేదని యధ్యక్షుఁడు కరణముతోఁ బలుకుచు
కాతఁడు రొసరొసలాడెను. ఒక్క నిమిషములో నాతఁడన్ని బీరువాలలో నున్న పుస్తకము
లను లెక్కపెట్టి యెన్ని పుస్తకములున్నవని యడిగెను. అయిదువేల మూఁడువందలపదును
అని అచ్చట నుండు నొక పిల్లవాఁడు పలికెను. ఏడువందలయేఁబది మూఁటికంటె నెక్కు
లేవేయని యాతఁడు పలికి చిత్థాలను జూచెను. కొన్నికొన్ని యంకెలకూడికలలోఁ దప్పున
ట్లాతఁడు కానఁబఱచెను. ఆగోడమీఁద నున్న విగ్రహ మెవరిదని యాతఁడడుగ మాప్రె
డెంటు గారి పెంపుడుతండ్రిగారిదని యొకఁడు పలికెను. అంత నధ్యక్షుఁడు ప్రక్కనున్న
పంచపాళీలోని కేఁగి యిచ్చట రోలు, రోఁకలి, ప్రాయ్యి మొదలగునవి యున్న వేల య
యడిగెను. అచ్చటి వారంద ఱొకరి మొగము లొకరు చూచుకొని యూరకుండిరి
అంతనొక బాలుఁడు–పాపము! తెలియక కాఁబోలును–నిజముచెప్పనియెడల నధ్యక్షుఁడ
గారి కేమి కోపమువచ్చునో యను భయముచేఁగాఁబోలుఁ–బెద్దవారి వలెఁ దానుగూడ
నధ్యక్షునితో మాటలాడునెడల గౌరవమని యెంచుటచేఁ గాఁబోలు నేమి యూహించుకొ
నెనో కాని ''అయ్యా! మాకరణముగా రుంచుకొనిన తూరుపుబంగారి కాపుర మిచ్చటనే'
యని పలికినాఁడు. అక్కడి వారందఱు నిశ్చేష్టులైరి. ఇంతలో నాబాలు నెవరయిన గిల్లిరో
–కాలిపై ద్రొక్కిరో–మోచేతితోఁ బొడిచిరోయేమో తెలియదు. కాని వెక్కివెక్కి యేడ్చుచ
మాయమ్మతోఁ జెప్పెద నని పోయెను. ''అచ్యుతరాముఁడూ! కుట్టకుంకకు మతిస్థిరత
తక్కువ యని నీవు చెప్పినప్పుడేమో యనుకొంటిని. అయ్యో! మతిలేనేలేదే!'' యని
కరణముగారు ప్రగల్భముగఁబలుకుచుఁబిల్లవానిమాటవలన దాను మనస్సులో నెంతమ
త్రము చెక్కుచెదరఁజేయుటకుఁ గాఁబోలు ''వెంకటప్పయ్యా? తోలుబొమ్మ
లున్నపుస్తకమేదిరా! అదిరా! ఏదిరా! లావుగానుండును. ఎఱ్ఱయట్టిది. మీమేనత్త బాలెంతరా
లుగా నున్నప్పుడు పథ్యముపుచ్చుకొన్న తరువాత నిద్రరాకుండఁజేయుటకుఁ జదువువా
డవు. అయ్యో! మొఱఁదులాగున మాటలాడవేమిరా? నప్లిమెంటల్ ప్రతివాది–కాదురా! ఇదిగో
చిత్రమైన పేరురా! సాక్షిరా! అదిగో అది! పాలంకి బ్రహ్మయ్యగారేగాదూ! ఆయన చేసిన
సాక్షిరా! ఒకటవ సంపుటము. అది అధ్యక్షుఁడుగారికిఁ గనఁబఱచితి వఁటరా?'' యని

పలికెను. ఇంతలో మునసబుగారు వచ్చిరి. సభకుఁ బోవుదము రండని యాజ్ఞాపించిరి. కరణముగా రంతట 'మొండి' ముండకొడుకా! ఊరకేచూచుచు నిలువఁబడెదవేమి? అధ్యక్షుఁడు బాబుగారి టోపీమీఁద గబ్బిలము రెట్టనైచినది. తుడువవేమిరా' యని చాఁకలి పీరిగానిపైఁ గేకలువైచెను. వాఁడగ్రాసనాధిపతి టోపీని బాగుచేసి యిచ్చెను. అందఱు సభకుఁ బోయిరి. మరిడమ్మగుడిలోనే సభ. అమ్మవారి గుడి యావరణములో తగుపాటి స్థల మున్నది. అమ్మవారిగుడిలో మరియొకదైవమును ప్రార్థింపఁదగదు. కావున దైవప్రార్థనమును జేయక మరిడిమహాలక్ష్మి జియ యను హెచ్చరికలతో సభ యారంభమొనర్చిరి. అధ్యక్షుని గుణగణమును వర్ణించుచు నొక్కఁడు పావుగంటసే వుపన్యసించి యాయన నగ్రాసనాధిపత్య మును స్వీకరింపుఁడని సభవారిపక్షమునఁ గోరెను. కరతాళ ధ్వనులవలనఁ బ్రక్కనున్న బలిమేకలు బేయని యఱచుచుండఁ గుంభనైవేద్య శేషము నాశ్రయించిన కాకులఱచుచు, నెగురఁబోవుచుండ నగ్రాసనాధిపతి యధ్యక్షపీఠమలంకరించెను. అంత కార్యదర్శి సాంవత్స రిక చర్యాక్రమమును జదివెను. అటుపైన నధ్యక్షుఁడిట్లు మాటలాడెను.

అధ్యక్షోపన్యాసము

సోదరులారా!

అధ్యక్షపదవి కర్హతలగునా రెందఱో యుండ మీరు నాకీ గౌరవ మొసఁగినందులకు నేను మిగులఁ గృతజ్ఞుఁడను. కర్ఱ కలసి వచ్చుటకుఁగాను చిన్నకూఁతు వివాహములోఁ బెద్దపిల్లగర్భాధానమును జరిగించుట యచ్చటచ్చట నున్నది. పిల్లనాని యుపనయనములో మునలి వితంతువు లక్షవత్తులనోము జరిగించుకొనుట యచ్చటచ్చట నున్నది. కాని గ్రామదేవత జాతరలో గ్రంథాలయోత్సవము జరిగించుటమాత్రమెచ్చట నిదివఱకుఁ జూచి యుండలేదు. ఇట్టి విచిత్ర సంఘటనమునకు మీ గ్రామాధికారులే మూలపురుషులు. ఈ నూతన మర్యాదకు నేనే మొదటి బలి నగుటచే ధన్యుఁడను. పిడుగునకు బియ్యమున నొక్కటే మంత్రమను సామెత యొకటి యున్నది. గ్రామదేవత జాతరకు గ్రంథాగారోత్సవ మున కొక్కటే తంత్రమని మీరు క్రొత్తసామెత కల్పించి ప్రపంచమున కిచ్చిన విచిత్రస్వభా వులు. సోదరులారా! పదునొకండు గంటలు మొదలొంటిగంటవఱకు నాయందలి యనుగ్ర హముచే మీరు సన్నెండలో నూరేగించుటచేత నాకిప్పుడొడలు సలసలలాడుచున్నది. పదునాఱు డప్పులనడుమ నెండుగంట లుండుటచేతఁ దల ప్రేలిపోవుచున్నది. ఆ వీరణపుబ రుకు లిన్నిటి కొడలు జలదరింపఁ జేయుచున్నవి. వేపమండల శివశక్తి కేకలు గుగ్గిలపు ధూపములు తలఁచుకొనఁగా గుండెలు దడదడలాడుచున్నవి. నేను విశేషముగా మాటలాడఁ జాలను. మాటలాడకుండ నుండవలయుననియే యెంచితిని గాని యట్లూరకుండుట యనుచిత మని యోజించి నాల్గుమాటలుమాత్రమే చెప్పెదను. 'సోదరులారా! మీగ్రంథాలయ మును, నరన్యతీ నన్నిధానమునఁ బవిత్రమగు మీ గ్రంథాలయమును, విద్యావిషయక ప్రయోజనములందే వినియోగింపవలయునుగాని-(''తరువాతిసంగతి తెలిసినది లెండు. అట్లే నన్నిష్టపఱుచుట యెందులకు? ఆంధ్రపత్రికలో నీనంగతిగూడ యెక్కవలయునా యేమి?'' యని కరణముగారు కేక వైచిరి). ఆంధ్రదేశమున నెందఱో నత్కవులున్నారు. కవిత్వమునకు దారిద్ర్యమున కవినాభావసంబంధ మని మీ రెఱుఁగకపోరు. ఋణముల పాలైనము-నంపారయాత్ర జరుగుట యెంత దుర్లభముగా నున్నాను-శ్రమకోర్చి లేని

యుత్సాహమును గలుగఁజేసికొని గ్రంథములను రచియించి-సరస్వతీసేవ చేయుచున్న కవులెంత మహనీయులో! రాజపోషణములనున్న కవులసంఖ్య తక్కువ. మిగిలిన కవుల నందఱను బ్రజలే యాదరింపవలసియున్నది. కాగితపుఁ గఱవు సిద్ధించిన యీదినములలోఁ గవులు పడు క్షోభ మింతంతయా; ఎవరినో యాశ్రయించియో-ఋణము తెచ్చియో-వేయి ప్రతులచ్చు వేయించుకొన్న కవి యాంధ్రదేశములోనున్న వేయిగ్రంథాగారములకుఁ దలకొక్కప్రతి యుచితముగా నిచ్చునెడల యాతఁడేమి తినునో యోజించుకొనుఁడు. మీగ్రంథాగారమున కొక్క పుస్తకమును మీరు సంపాదించినయెడల మీయూరనెవ్వరికిఁగూడ నాపుస్తకమక్కఱలేదు గదా. అందువలన నాగ్రంథము రచించినవాని కెంత కష్టమో విచారింపుఁడు. కవియొద్దనుండి యాతని గ్రంథమును రచించినవాని కెంత కష్టమో విచారింపుఁడు. కవియొద్దనుండి యాతని గ్రంథమును మూల్యమీయకుండ మీరు తీసికొనవలదు. అట్టినిశ్చితమొనర్చుకొనవలయును. ప్రతి గ్రంథాలయము తన పుస్తక మొక్కటి వెలకు తీసికొనుటకదా యను ధైర్యము కవి కుండును. అందువలనఁ గవికి కొంత లబ్ధియు నుండును. మీరీవిధముగాఁ గవులకు సాయపడవలయును. (మాకు లేక యింటింటికీ బుట్టలు కట్టుకొని మేమేడ్చుచుండగాఁ గవులకు మేమెట్లు సాయపడఁ గలమని సభలో నొక్కఁ డనెను.) అటులైన గ్రంథాగార మెందులకు? ఇంతశ్రమ మొనర్చి యీపనిఁజేయుట యెందులకు? గ్రంథాగారమును దీసివైచికొనవచ్చును. అదిగాక యిది యింతకాల ముంచినందులకు మీరు పొందిన లాభమేది? మీరితరులకుఁ జేయవలసిన విధి నెంతవఱకు నిర్వహించినారు? మీలో నెవ్వరోకాని పుస్తకములు తీసికొని చదివినట్లే యగపడదు. పదిపండ్రెండువేల జనమున్న యీగ్రామమునందు దేశభాషలో నున్న గ్రంథములు గదా! నాలుగు వందలజనులైనఁ జదివిరా? తుదకు నూర్గురైనఁ జదివిరా? మీపుస్తకపుజాబితాలలో మూడునాల్గుసంతకముల కంటె నెక్కువ యగపడవే. మీకుపయోగింపనప్పుడన్ని పుస్తకము లీకొట్టులో నేల మూసిపెట్టి యుంపవలయును. చదువుకొనువారి కెవ్వరికైన నిచ్చినయెడల బాగుగానుండదా? యిద్దఱుమువ్వురు కలసి యొక్కొక్క గ్రంథమును సవిమర్శముగఁ జదివి-యొక్కకవికి రెండవకవి కెట్టిభేదము-ఏజాతిభేదమున్నదో యుపన్యాసముల మూలముగఁగాని -వ్యాసముల మూలముఁగగాని-మీ సోదరులకుఁ దెల్పనక్కఱలేదా? గ్రంథపఠకుల కది యాచరణీయమైన విధిగాదా? మీరట్లొనర్చుచున్నారా? మొదటఁ జదువకుండ నేమిచేయఁగలరు? అయ్యయ్యో! మీగ్రంథాలయ కార్యదర్శియగు కరణముగారే యెట్టిప్రైగడ రచియించిన ప్రభావతీ ప్రద్యుమ్నమని చెప్పి విచారసాగరమునుగాఁబోలు నగపరచినాఁడు. నిజముగ నది విచారసాగరమగు మాటయేకాదా? ఇట్టి సాహిత్యసంపదతోఁ బ్రకాశించుచున్న మిమ్మొహరివంశకర్తయగు నెట్టిప్రైగడమనసెట్టిదో ఉత్తరహరివంశకర్త యగు నాచనసోముని మనసెట్టిదో మీరేవ్యాసము నైనను వెల్లడించితిరా యని నేనేమొగము పెట్టుకుని యడుగను?

నాయనలారా! నేనిట్లనవలసివచ్చినందులకు మిగుల విచారించుచున్నాను. ఇప్పుడైన శ్రద్ధచేసి దీక్షనహించి గ్రంథముల నన్నియు విమర్శనబుద్ధితోఁ జదువుఁడు. చదివి యూరకుండక-యొక్కొక్క గ్రంథములో నుండు గుణములను-లోపములను -జర్చించుకొనుఁడు. చర్చించి మీయభిప్రాయముల నొకపుస్తకమునఁ జేర్చుఁడు. మీగ్రామమునకు దయచేయు పండితుల కాయభిప్రాయముల నగపఱచి నహేతుకములగు సవరణలను జేసికొనుఁడు. భావివిమర్శకసంఘమ , మీగ్రంథాలయపుగదులనుండి యుదయింపవలసి

నదే. భవిష్యత్సారస్వతాభివృద్ధి నాటకములో మీగ్రంథాలయము లెంత ప్రధానపాత్రములో మీరు గ్రహింపలేకుండ నున్నారు. వానిపై నెంత పవిత్రమయిన పూచీ పడియున్నదో వానినెట్లు నిర్వహించుకొనవలయునో మీరు తెలియకుండ నున్నారు. గ్రంథములను జిమ్మెటలపాలు చెదలపాలు చేయకుఁడు. ఇప్పుడైనఁ గని నిలయమునుండి గబ్బిలముల నెగురఁగొట్టుఁడు. కాంతల నచ్చటఁ గాపురముంపకుఁడు. (అదిగో తిరిగి అదేమాట! తలతిక్కమనుష్యుఁడులాగున నున్నాఁడని కరణము నిమ్మళముగ విసుఁగుకొనెను.) ఇది గాక మీగ్రామములోని జనబాహుళ్యమునకు గ్రంథాభిమానమును మీరు గలుగఁజేయవలసి యున్నది. అది పురాణపఠనమువలనఁగాని లభింపదు. ప్రతిసాయంకాలమునందును భోజనా త్సరమునఁ బదునొకండు గంటలవఱ కిక్కడ మీలో నెవ్వరైన నేదో పురాణమును చదువవలయును. మఱియొకఁడు దాని కర్థము చెప్పవలయును. జనులందఱు వినుటకుఁ సంతోషమున వత్తురు. పరమపూతమైన పురాణపఠనాచారమిప్పుడు పోయినందులకు మన మెంతయైన విచారింపవలసియున్నది. అట్టి సదాచారమును దిరుగ గ్రంథాలయములే స్థాపించి పుణ్యము కట్టుకొనవలసియున్నది. పురాణపఠనావశ్యకతనుగూర్చి నేనిప్పుడు చెప్పుట కవకాశము లేదు. మఱియొకసంగతి. మీగ్రంథాలయపు గోడలపై గ్రంథకర్తల విగ్రహములను దొరకినంతమట్టునకు సంపాదించి కట్టవలయును. పూర్వమహాకవుల జయంతులు శక్తివంచ నము లేకుండ జరుపవలయును. వార్షికోత్సవములు సుఖముగా–విందులతో–నాటకములతో –సలాపారములతో–మేజువాణులతోఁ–గాలక్షేపమును జేసికొనునట్టి వేడుక దినము లని- –యెన్నఁడును భావింపవలదు. క్రిందటి సంవత్సరముకంటె నీసంవత్సరము సారస్వతమా ర్గమునందు మనమేమి యభివృద్ధిపొందితిమో విమర్శనపథమున మునుపటికంటె నిప్పుడెన్ని యడుగులు ముందునకుఁ బోయితిమో–యొకరినొకరు కనుఁగొని–వితర్కించుకొని –స్థిరపఱచుకొనవలసిన కఠినపరీక్షాదినములుగాని క్రమఫలాహారదినములుగావు. కాఫీ కడవ లకొలఁది త్రావు దినములు గావు. ప్రధానమైన దేదో పరిత్యజించి యప్రధానకృత్యమును కధిక ప్రాముఖ్యమిచ్చుచున్నారు. అది తప్పు, మఱియొకసారి తప్పు. క్రిందటి సంవత్సరము కంటె నీసంవత్సర మిట్టి యభివృద్ధి గనఁబఱచుట కవకాశము లేదని మీకుఁ దోఁచినయెడల వార్షికోత్సవము మానుఁడు. ప్రత్యవాయ మేమియు లేదు. తప్పకుండ జరిగింపవలసినదనుట కిదియేమి తద్ధినమా? ఇదిగాక యధ్యక్షుఁ నెన్నఁడును మేళతాళములతో నూరేగింపకుఁడు. తీఱవచ్చితిని గాన వెనుకకుఁ బోలేక–వెనుకకుఁ బోవుటకు రైలులేక–మీతోఁ జెప్పినను మీరు వినరని యెఱిఁగి యుండుట చేత–నేను శాంతుఁడనై నోరు మూసికొంటిని. ఇంత యల్లరి మఱియొకఁడు సహింపియుండఁడు. ఇక మీకు చెప్పవలసినదింతకన్న లేదు. ఇక విరమించెదను.''

అప్పుడు మునసబుగారు లేచి యిట్లు పలికిరి. ''అధ్యక్షుఁడుగారు మనవిచేసినదం తయు నందఱకు గోచరమే గాని మఱియొకటి యేమియు లేదు. ఎటువచ్చినను మాపెంపు డుతండ్రిగారిని గొంచె మెత్తిపొడిచినట్లు నాచిత్తానికి గ్రాహ్యమైనదన్నమాట. ఈ కవీశ్వరులు లక్షమందియైనను సరియే నాకు నా పెంపుడుతండ్రికంటె నెక్కువవారు కారు. ముప్పదిపుల్ల యీనాము నాతండ్రి నిర్వాహకత్వముఁజేసి నన్ను నిలిపినాఁడు. కవీశ్వరులు నాకుఁ జేసిన దేమున్నది? టప్పు టప్పు కబురులుచెప్పి మనదగ్గఱదేదైన లాగుటకుఁగాని కవీశ్వరులు మఱెందులకు? ఆయన విగ్రహము గ్రంథాలయమునుండి నాప్రాణముండగాఁ దీసివేయు

టకు వీలులేదు. ఆయన విగ్రహము తీసివైచి–కోడిపందెపుఁబాటయో–గోదావరితగీతమో వ్రాసినాఁడని మొన్న మొన్న కన్నుఁదెఱచిన కూటికఱవుగొట్టికాయ కొంకనక్కకవిగాని విగ్రహ మిక్కడ సింగారింపఁ దలఁచితిరా? అదిగాక గ్రంథాలయ మెప్పుడు పుట్టినది? మాపెంపుడు తండ్రి యెప్పుడు పుట్టినాఁడు? ఆమాత్రపు వెనుకముందు చింతయక్కఱ లేదా! ఇంతకంటె నేను జెప్పఁదగిన దేదియులేదు.'' అంత మఱియొక రిట్లు పలికిరి. 'మన యాహ్వానమును మన్నించి యిచ్చటికి వచ్చి విశేషశ్రమకోర్చి యింతసేపున్యసించిన యధ్యక్షుఁడుగారికనేకవందనములు సభవారిపక్షమున నేనర్పించుచున్నాను. మఱియొక చిన్నమనవి. మనమూలమున నధ్యక్షుఁడుగాను దోసకాయచెంబును బోఁగొట్టు కొనినారు. (మనమూలమున ననుమాట యసభ్య మని సభలోఁ గేకలు) పోనిండు–మనమూలమునఁ గాకపోయినను–మనకొఱకు వచ్చునప్పుడు పోఁగొట్టుకొనినారుగదా! అది వారికి భర్తీ పఱచుట మన బాధ్యతయై యున్నది. తరువాత సభవారి యిష్టము. ఇంతటితో నేను విరమింతును.''

''దోసకాయచెంబు పోయినను దోలుసంచితో నైన నింటికి వెళ్లుచున్నానని సంతసించుచున్నా'' నని పలికి యధ్యక్షుఁడు పోయెను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

26. స్వర్గస్థులగు

శ్రీ కోపల్లె హనుమంతరావు పంతులుగారు

బందరు జాతీయ కళాశాలను స్థాపించిన మహోదర్శమూర్తి పంతులు గారు. ఆయన మరణించిన తరువాత ఆయన పేరిట సభలు, తీర్మానాలు చేయడమేకాక, ఆయన ఆదర్శం నెరవేర్చడంకోసం పెద్దలు ఆర్థికంగా కూడా సహాయం చేయడానికి పూనుకుంటున్నారని విని - జంఘాలశాస్త్రి ఆయన్ని స్మరిస్తూ ఈ ఉపన్యాసం, కొనసాగించాడు. ఈ దీక్షితులలో ఇప్పుడున్న శ్రద్ధ ఆయన బ్రతికి ఉన్నప్పుడుంటే ఎంత బాగుండేది! అని జంఘాలశాస్త్రి వేదన.

పంతులుగారి వ్యక్తిత్వంలో విశిష్ట లక్షణం, 'వయస్సుమీరాక వైరాగ్యం' అనే బాపతుమనిషికారు. చిన్నతనంనుంచి స్వార్థ త్యాగం, సమాజ సేవ ఆయనలో మూర్తీభవించాయి.

పంతులుగారి మృతి, జంఘాలశాస్త్రిలో అనేక ఆలోచనల్ని రేపింది. తెలుగువారి ఔదార్యాన్ని, పెదవులపై దాక్షిణ్యాన్ని, ఆవహేళన చేసేలాగ చేసింది. సహాయనిరాకరణోద్యమంలో 'సహాయనిరాకరణం'లో లొసుగుల్ని ఎండగట్టేలాగ జేసింది.

మనిషి జన్మ నెత్తడం మనుష్య సేవని మనఃపూర్వకంగా చేయడానికేనని పంతులుగారు త్రికరణశుద్ధిగా నమ్మారు. బాల్యంనుంచి ప్రాణం పోయేవరకు స్వార్థరాహిత్యం అనేది ఆయనలో ఒక్కలాగే నిలిచింది.

పంతులుగారి మనస్సులో నిలిచిన ఒకే ఒక లక్ష్యం జాతీయ కళాశాల. దానికోసం మూలనిధి లక్ష రూపాయలు వసూలుకోసం కృషి ప్రారంభమైంది. సాక్షి ఉపన్యాసాల పాఠకులు స్త్రీ పురుషులు ఏభైవేలవరకు ఉన్నారు. వారంతా తలొక రూపాయి ఇచ్చినా, నగం నిధి సమకూరుతుందని జంఘాలశాస్త్రి ప్రోత్సహిస్తూ పంతులుగారికి నివాళులర్పించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! శ్రీయుత కోపల్లె హనుమంతరావు పంతులుగారి ప్రపంచయాత్రా పరిసమాప్తి యాంధ్రప్రపంచమునకు విశేష సంతాప దాయకమనుట కెంత మాత్రమును

సందేహము లేదు. అనామకులగువారి సంతాపము వెల్లడి కాదు. సంతోషమును వెల్లడి కాదు. అదియు నిరుపయోగమే. ఇదియు నిరుపయోగమే. పెద్దవారు-అనఁగా వయసులోఁ బెద్దవారు పేరులోఁ-బెద్దవారు- ఆశలోఁ బెద్దవారు-రాఁబడిలోఁ బెద్దవారు-కృపణతలోఁ బెద్దవారు పూచీన దప్పించుకొనుటలో బెద్దవారు-అట్టి పెద్దవారు కొందఱొప్పుడు ఇప్పుడిప్పుడు హనుమంతరావుపంతులుగారు అపవర్గవైభవమనుభవించిన యారవనాఁటి నుండి యీజాతీయపాఠశాలాస్థాపకుని గుణగణవర్ణనక్రై తెఱపిలేకుండ సభలు చేయించుచున్నారు. గ్రుక్కతిప్పుకొనకుండ నుపన్యాసము లిచ్చుచున్నారు. దేశసేవాపరాయణులై వెలిగిపోవుచున్నారు. చందాపట్టీలను త్రిప్పుచున్నారు. ఇంపీరియల్ బ్యాంకులలో ఇండియన్ బ్యాంకులలో యింటిలోని యినుపపెట్టెలలో తనఖాదస్తావేజులలో నేలగోతులలో దాచిపెట్టిన సంచులమూఁతు-లిప్పుడు- నిమ్మళముగా-విప్పుచున్నారు. జాతీయకళాశాలపోషణనిధికై-టొక్కుటొక్కుమని-లెక్కలిడుచున్నారు. సంతోషమే-వెనుకటివలె- నిప్పుడుకూడఁ-బిడికిటిని గట్టిగ మూసికొనకుండఁ గన్నులు తెఱచినందులకు సంతోషమే. గోతముల మూఁతులను దెఱచినందులకు సంతోషమే. బ్రహ్మపురము మొదలు బళ్లారిచివరవఱకు నొక్కటేనోరు తెఱచినందులకు సంతోషమే. ఈసత్కార్యాభిలాషము ఈస్వార్థపరిత్యాగబుద్ధి-యీపుణ్యకార్యసమాచరణదీక్ష-యీవితరణ విభవాధిక్యము-రెండు సంవత్సరముల క్రిందట-పోనీ-ఆఱుమాసములక్రిందట-అంతకంటెఁ బోనీ-రెండుమాసములక్రిందట-నీ ధనాధికులకుఁ గలిగి యుండకపోవునే! ఇండ్లకుఁ గట్టినబుట్టలలోని బియ్యపుగింజలను బ్రోఁగుచేసికొని-సీమ యినుపరేకుడబ్బాలలో-సామాన్యసంసారులు పడవైచినసైసలను మూటఁ గట్టుకొని-దేశదేశములు తిరిగి-దేహిదేహి యని-యాచింపరాని వారిని యాచించి జాతీయవిద్యాసేవచేసిన యాదేశభక్తుఁ డిట్లు నవసి నవసి-యరగి యరగి-కృశించి కృశించి కళాశాల యెట్లు పోషింపఁ బడునా యను సంతతచింతచే గుండెపగిలి మరణించి యుండక పోవునే-ఆహాహా! ధనాధికుల కిప్పుడా త్యాగబుద్ధి కలిగినది!

ఒక కోమటియు నాతని పుత్రుఁడును గోరుకొండతీర్థములోఁ గొబ్బెరకాయలనమ్మి కొనుటకు బయలు దేరినారట. బండినెక్కి పోవునెడల లాభాలు గూఁబలులోనికి వచ్చునని నడచియే పోయిరి. మండు వేసవి--ఈచెనిగాడు పాచెవికిఁ గొట్టుచున్నది. ముక్కురంధ్రముల నుండి సెగలు పొగలు వచ్చుచున్నవి. ఒడ లాఱుకొనిపోవుచున్నది. జిహ్వ యెండు కొనిపోవుచున్నది. వైశ్యరాజపుత్రుఁడు దాహమో దాహమో యని యేడ్చుచున్నాఁడు. కొబ్బెరకాయల వంక నాశాసహితుఁడై చూచుచున్నాఁడు. అసువులు నిల్చునో లేవోయని యాందోళనపడుచున్నాఁడు. అడుగలేక యడుగలేక ''అయ్యా! ఒక్క కొబ్బెరకాయలోని నీరు త్రావుదునా?'' యని యడిగినాఁడు. ''అబ్బే! వెఱ్ఱిమొగమా! కొబ్బెరకాయ నీటితో దాహము తీరుననుకొంటివా? అదేదో పెద్దవారికిఁ గులాసా కొఱకుఁగాని మన కెందుకురా! అదిగాక యానీటిలో జలుబుగుణము కూడ నున్నదని యుమ్మిడిసెట్టివారు చెప్పినాదురా! ఇఁక నాలుగడుగులు వేసినయెడల పందిరి మహాదేవుఁడుగారి చలిపందిరి యున్నదిరా! నీ యిష్టమువచ్చినంత నీరు మజ్జిగ త్రావవచ్చును. ఊరవేసిన యుసరిగకాయ కూడ నంజుకోవచ్చును. అంతేకాని యబ్బే కొబ్బరికాయ యెందులకురా.'' యని యాతనితండ్రి దాహపీడితుఁడైన తనయుని మందలించెను. కొడు కేమిచేయఁగలఁడు? ఇఁక నాల్గడుగులు -నడువలేక నడునలేక-నడచినాఁడు. ముందటియడుగు వేయఁబోయి కన్నులు తిరుగఁ

జెవులు గడియలుపడఁగాళ్లులటలటలాడఁగ్రుంగి–కూలఁబడి–ప్రాణములు విడిచినాఁడు. కొబ్బెరకాయ కర్చుపెట్టలేక కొడుకును జంపుకొనిన వర్తకుఁడు–కొడుకుపోయిన పిమ్మట –''అన్ని కొబ్బెరకాయల నీరు నీకేరా అయ్యల్లో'' యని యేడ్చినాఁడట! కాళు లరిగిపోవఁ దిరిగితిరిగి–నోరరిగిపోవ–యాచించి యాచించి–తుదకుఁ బ్రాణములను బాసిన మన పరమార్థదేభనక్తునిపై–మనవారి యనురాగము–నాదరము–నళ్లి యున్నవని చెప్పవలసివచ్చినందులకు మిగుల విచారించుచున్నాను. లక్షరూపాయల సామాన్యనిధి ననేకలక్షల కదికారుల లగువీరు చందాపట్టితో భిక్షాటన మెందులకు? ఒక న్యాయవాది యలహాబాదు పదునొకండుతోడనో పదునెనిమిదితోడనో యొక్క వ్యాజ్యేమున సంపాదించిన మూల్యముతో–బందరు జాతీయ కళాశాలవంటివి మూఁడు పోషింపఁబడునే! పోనీ అంత మహాత్యాగబుద్ధి లేదు. అందులకు విచారింపను. కాని యీచందాలలో నీలక్షరూపాయలైన జమయగునా? ఈయుద్రేకము–ఈపూనిక–ఈవిద్యాభిమానము–యీ దేశభక్తిలక్షరూపాయలు సేకరింపఁబడువఱకు నిలువఁబడునని యేమి నమ్మకము? నాయనలారా! యిట్టిచర్య మనకుఁ గ్రొత్తయా! ఇదివఱకెందఱు దేశభక్తులు మరణింపలేదు. ఎందఱి గుణగణమును వీరు కాహళకంఠము లతో వర్ణించియుండలేదు. ఎంత దేశ భక్త్యుద్రేకోత్సాహములతో–వీరు–నిధులను బ్రోగుచేయుఁ బ్రయత్నింపలెదు? ఎందఱికుఁ జిత్రపటములు–ఎందఱికుఁ బాషాణప్రతిమలు –ఎందఱికు గ్రంథాలయములు–ఎందఱికు శారదానికేతనములు–వీరాకాశగంగా ఝరీధోరణితో–నానపెట్టి యుండలేదు? ఇవియన్నియుఁ బూర్తియైనవా? కొన్ని చందాపట్టీలలోనే సందుకొట్టినవి. కొన్ని విదేశోత్తర ప్రత్యుత్తరములతోడనే–పరమపదించినవి. ఆరంభించిన పనులు–కొన్ని పునాదుల గోఁతులతోడనే పూర్తియైనవి. కొన్ని కట్టడములు నగములేచి చచ్చినవి. కొన్ని ఆర్భటునటువారి యగస్త్యోపోశనముతో నంతరించినవి.

పూర్తియైన వొకటి రెండున్నచొనవి మూసిపెట్టఁబడినవి. పాడు పెట్టఁబడినవి. మన దేశభక్త్యుద్రేకములంతే! చెకుముకిద్రేటు! తాఁటాకు మంట! కొఱవిదయ్యపు వెలుతురు! నిలువఁబడుట యేదీ? పట్టుదల యేదీ? నిశ్చలదీక్ష యేదీ? తిరిగికొంతకాలమువఱకు దేశభక్తి లేదు–విద్యాభక్తి లేదు–త్యాగబుద్ధిలేదు. స్వచింతతప్ప పరచింతయే లేదు. ఈలోపల నెవ్వఁడో పరమదరిద్రుఁడు స్వార్థపరిత్యాగి సత్కార్యాచరణదీక్షాదక్షుఁడు –పుణ్యస్వభావుఁడు–పరమార్థదేశభక్తుఁడు త్రికరణశుద్ధిగా–నేదో దేశక్షేమమునకై పాటుపడుచుఁ బ్రజాసాహాయ్యమో ప్రజాసాహాయ్యమో యని ప్రపంచమంతయు మాఱు మ్రోఁగునట్లు గోల పెట్టుచున్నాఁడు. అతనిగోలను మనవారెవ్వరైన వినినారా? లక్ష్యపెట్ట లేదు. కాని నినకేమి ''వానిపాటులేవో వాఁడు పడ్డుచున్నాఁడు. మనకెందుల'' కని యెవరిమట్టునకు వారే మూటాడిసయెడల నేమి ముసుఁగునో యని బెల్లముకొట్టిఁతాలవలె నూరకుందురు. దేశ సేవావేశముచేఁ –గ్రాకిక్రాగి–మండిమండి–తుదకుఁ గర్పూరమువలె నాదేశభక్తుడు కడతేఱును. ''అరెరె! దేశభక్తుఁ డంతరించినాఁడు. ఆహ్వానము లంపుఁడు. సభలు చేయుఁడు. ఉపన్యాసము లారంభింపుఁడు. నడుములు కట్టుఁడు'' అని మనవారు మహోద్రేకమున నెంత గందరదోళమైన–నెంత కోలాహలమైన–నెంతహంగామానైనఁ జేయుదురు. నల్గురైదుగురు చందాలు వేసినారు. అయినది. ఇఁక నక్కడికంతే. మనలో మన కీచిత్రవిచిత్రచర్య చిరకాలాభ్యస్తమైనది. కావున దీని వైపరీత్యమును– వ్యత్యస్తతను –గ్రహింపలేకున్నాము. కాని దేవతలో– యుక్తులో–నైదికర్షులో– మన యీమహాద్భుతచ

బైనుండి యవలోకించినయెడల నీయాంధ్ర దేశమందెవరో ముప్పదినలు వదిమంది తక్క మిగిలినవారందరు పిచ్చియాసుపత్రి కర్హులే యని వారికి దోచునేమో! అట్లు వారికిఁ దోచునట్లు మనము ప్రవర్తించుచున్నప్పుడు–వారి ననవలసినపని యేమున్నది? అయ్యయ్యో! ఆహికజ్వరము వలె–దేశభక్తికిఁ బట్టువిడుపు వచ్చినతరువాత నిఁక నెక్కడి ప్రారబ్ధము! కవియగువాని–నెప్పుడైన–వీ రాదరించిరా? కవి సోమరి. పైగఁ బ్రపంచజ్ఞానశూన్యుఁడు. దూరదృష్టిరహితుఁడు. కొనవెళ్ళుస్వభావముగలవాఁడని యాతనిని వీరనేకవిధముల నిందింతురు. కట్టుకొనుటకు జినుగలగుడ్డకైన గతిలేక, తినుటకొఱకు పూటకంటె గతిలేక–వ్రాసికొనుట కీకాలమునఁ గాగితమైనలేక–వ్రాసినదేదో యచ్చువేసి కొనుటకు మొదలే దిక్కులేక–ఋణప్రదాతలచే బాధనొంది యొంది యవమానమును బడిపడి–క్రుళ్ళిక్రుళ్ళి–చావవలసినదేకాని ప్రజలలో నొక్క ధనాధికుఁడైనఁగాని యాదరిం చువాఁడున్నాఁడా? ఆదరణ గొనినయెడలఁగవి కడుపునిండునే. అచ్చోనఁ జేయుదురా? ఉహూహూ–తుదకుఁ గవి చచ్చినాఁడు–ఎంగిలిలంఘనములవాఁ డైన్నాళ్లు బ్రతుకఁ గలఁడు? శ్మశానములో నింక నెత్తిపోఁతలైన గాకుండనే, మన వారు టౌనుహాలులో నుపన్యాసములే? హా! హా! హా! ధనాధికుల వలనఁ దమగతికూడ–నింతటిదేయని యెఱిఁగియుండి బుద్ధితెచ్చు కొనవలసిన తోడికవులు కాఫీతో ఖరహారప్రియతో–గవిస్మ్రతిగీతాగానములే! సీసపుబొగ్గుప టమా? చిత్రలేఖనమా? యని సభలో మీమాంసలే! పావులాడబ్బులు మొదలుకొని వసూళ్లే. చందాపట్టీ తరువాత గైరువిలియా యయిపోవుటే! వసూలైనంతమట్టునకు –జవానుబత్తెములక్రింద–అరణా బిళ్లలక్రింద–నంతరించిపోవుటే! అతికష్టముమీఁద –నతిజాగరూకతమీఁద–మిగిలిన దేదైన నున్నయెడల–నేదాక్షిణాత్యచిత్రలేఖరిపిళ్లయో –మొదలారియో–కొళంబులో వేయుటే! అంతే. ఎవరి విధిని వారు నిర్వర్తించుకొన్నారు. సరి. ఇఁక సరి. ఇదికాక కవిగారి సమీసుతులకు సభవారు సానుభూతి పంపించుట మఱియొక ఘనకార్యము కడుపుమాడిన కవిగొంతులోఁ గానంతగంజిపోయని మహానుభావులు–కవి చచ్చినతరువాత–నాతనిపతికి సానుభూతి లేఖలా? శ్రాద్ధపుఁగర్చులకుఁ బదిరూపాయలు పనికివచ్చునుగాని–సానుభూతి లేఖలు సహస్రమైన నెందులకు?

ఇదిగో! మనవారిలో–ననేకుల–దేశభక్తి యిట్టిది. భాషాభిమాన మిట్టిది. దేశసేవకాను రాగ మిట్టిది. వితరణ విభూతి యిట్టిది. ఉద్రేక మిట్టిది. దీక్ష యిట్టిది! ఆకోపల్లె హనుమంతరావు పంతులుగారీ స్వభావములోనివారు కారు. ఈప్రక్రియలోనివారు కారు. ఆరూఢ మహాధీశాలి. అప్పటి విద్యాన్వైఖరి యాంధ్రుల శారీరక మానసికాధ్యాత్మిక ప్రబోధ మున కెంతమాత్రము నుపచరించునది కాదని–చిరకాలము క్రిందనే–కనిపెట్టెను. జాతీయవి ద్యావ్యాప్తివలననే యిట్టి భాగ్యము దేశీయులకుఁ బ్రాపించునను పూర్ణవిశ్వాసముతో –బందరులో నీకళాశాలను స్థాపించెను. ఆరంభించిన దినమున నాయన కీమహాకార్యమునం దెంత దీక్ష యుండెనో–హరి యని ప్రాణము విడుచువఱ కాయనకంత దీక్షయే యుండెను. హెచ్చులేదు తగ్గులేదు. ఎంత నిశ్చల ప్రకృతియో యోజించుకొనుఁడు. ఆకాశగమనము లేదు. అధఃపతనము లేదు.. భగ్గున మండుట లేదు. చప్పున చల్లాఱుట లేదు. అట్టే వికసనము లేదు. ఇట్టె సంకోచము లేదు. వింధ్యపర్వతమువంటి మనస్థైర్యము కలవాఁడు. స్వసుఖమువందు వాంఛలేదు. దనార్జనమందు మనస్సు లేదు. యశస్సునందుఁ దృష్ణలేదు. అధికారమునం దభిసంధి లేదు. ఏమియు లేదు. ఉన్న దొక్కటే! దేశీయులకు జాతీయకతా

ప్రజ్ఞాప్రబోధన మొక్కటియే! ఆదృష్టితోడనే యవసాన మొందినారు. ఆతఁడు మఱెందుల కక్కఱకు రాకపోవుటచే నీబడి పెట్టుకొని కాలక్షేపము చేసి యుండలేదు. దేశక్షేమమున కితర కార్యమేదియు నింత ప్రధానసాధకము కాదని దీనిలోఁ బ్రవర్తించినాఁడు. అతని కట్టి దేశక్షేమాభిలాష–లేకుండునెడల స్వోదర పోషణాభిలాషయే యుండునెడల–నీసరికి ప్రథమ తరగతి డిప్యూటి కలక్టరుగానో–ప్రెసిడెన్సీ మెజిస్ట్రేటుగానో–పనిచేయుచు–దేశీయ సోదరులచేఁ–గంబళ్ల నేత నేయించుచునో, బండ్లు లాగించుచునో యుండును. కాక మహారాజుల మరణశాసనలేఖనమందే పదునాల్గు వ్యాజ్యేముల కవకాశములు గ్రమ్మదలగాఁ గల్పించి –వానిలో నొన్నిఁటిలో తానే వకాల్తీ దీసుకొని–కక్షిదారులకు సఖ్యము గుదురనీయక లక్షల గడించిన–కొందఱు న్యాయవాదులవలెఁ దానుగూడ–నేడంతరవుల మహాలక్ష్మీవిలాసములో వెండిగొలుసుల తూగుటయ్యలలోని విదేశస్త్రీ సల్లాపములతో–వినోదించుచునే యుండును. ఈధనము ధనము కాదు. ఈసుఖము సుఖము కాదు. ఈ కీర్తి కీర్తికాదని యాయన నిశ్చయపఱచుకొని యాత్రోవఁ ద్రొక్కటయే మానుకొనెను. ఆహా! అంత చిన్నతనంలో–నట్టిస్వార్థ పరిత్యాగబుద్ధి–యట్టి దేశక్షేమాభిలాష–యట్టి కష్టసహనశీలము –నట్టి నిశ్చలధైర్యము–నట్టి నిరుపద్రవదీక్ష–యెట్లాయన కలవడెనో–వార్ధకమున నందఱు విరాగులే. పదుచుఁదనమున విరాగి యగువాఁడే ప్రతిభాశాలికాఁడా? పదుచుభార్య పైఁట వదలకుండ–గూడఁగూడఁ–దిరుగవలసిన పదుచువాఁడు–పైఁటను వదలివైచి –బ్రహ్మసూత్రభాష్యమును గ్రహించినయెడల నాతనిని బళీ యనఁదగినది కాదా? ధనము సంపాదించి–సుఖపడుటకు–సంపూర్ణసాధనములు తనయొద్దనుండ దానిని లోష్టప్రాయముగ వర్జించి తాను బ్రాణాహుతులతోడ–తనువు నిల్పుకొనుచుఁ బడరాని కష్టములను బుద్ధిపూర్వకముగ వరించిపడుచుఁ–బరులకుఁ బ్రజ్ఞాప్రదాన మొనర్చువాఁ డాహాహా! యెంత మహనీయుఁడో చెప్పవలయునా! భార్యను వదలుకొనవచ్చును. బిడ్డలను వదలుకొనవచ్చును. గృహమును వదలుకొనవచ్చును. ఆశ్రమమును వదలుకొనవచ్చును గాని స్వసుఖమును వదలుకొన సాధ్యమగునా? అట్టి యాతఁ డేఁడీ! ముందేదో మహాసంతోషము మీఁద విఱుచుకొని పడునని–ఆయన యిట్టి కష్టమును బడినాఁడా? కాదు. మోక్షలక్ష్మీవైభవము తనకు ముందు సంభవించునని యింత పరోపకారశీలుఁ డయ్యెనా? నదియుఁ గాదు. మనుష్యజన్మ మెత్తుట–మనుష్యసేవను మనఃపూర్వకముగఁ జేయుటకే యని యాయన త్రికరణశుద్ధిగ నమ్మి యట్లాచరించినాఁడు. అందులోఁ బ్రజ్ఞాదానమువంటి దానము లేదని యాతఁడట్లొనర్చినాఁడు. అంతే–ఆయనవిధి యేదో యాయన నిర్వర్తించినాఁడుఁ స్వార్థ పరిత్యాగమువంటి సద్గుణము లేదు. తత్రాపి బాల్యమునుండి ప్రాణాసానమువఱకు స్వార్థపరిత్యాగమహిమ యొక్కరీతిగనే నిలువఁబడి యుండుట మహాద్భుతము. సౌఖ్యపరంపరానుభవమైనపిమ్మట మనస్సునకు సౌఖ్యమునం దొకవిధమగు నేవ జనించుటవలన సౌఖ్యపరాఙ్ముఖత్వము నందుఁ గొన్ని ప్రకృతులకుఁ దీవ్రేచ్ఛ యుదయించును. పాలకోవా పరిమితి లేకుండఁ దిన్నజిహ్వకుఁ బచ్చిమిరెపుఁగాయయందు వాంఛ జనించును. తత్వమును జిహ్వయుఁ జిత్తము నొక్కటేగాని వేరుకాదు. రెండుసంవత్సరములనుండి యార్యావర్తమున స్వార్థపరిత్యాగశక ముదయించిన ట్లగపడుచున్నది. రెండుసంవత్సరములకు రెండుబాఱల ప్రొద్దెక్కినట్లు గోచరించుచున్నది. ఇంతలో నచ్చటచ్చట మేఘావరణముకూడ సంభవించుచున్నది. ప్రొద్దులోఁగూడ నచ్చటచ్చట మచ్చలు మఱకలు పొడకట్టుచున్నవి. స్వార్థపరిత్యా

గుల యుఱుములు వినఁబడుచున్నవి. మగువలమ్రోఁదీఁగెలనుండి బంగారుపూలవాన కురి యుచున్నది. ఎదుటి నుండి నుడిగాలితో ధూళి రేఁగి నూతన ప్రబోధబింబమును గ్రమ్మచున్నది. తేజస్సుతో నది వెలుపలఁబడి వెలుఁగుచున్నది. కాని యీ నూతనప్రబోధ మున–నేమోకాని కొంత మాయతళుకు గనఁబడుచున్నది. కొంత ముచ్చుబంగారపు మెఱుఁ గగపడుచున్నది. కొంతకల్లకాంతి కానఁబడుచున్నది. వయసున బదియైదులు దాఁటి యార్జనమునఁ బదిలక్షలుదాఁటిన న్యాయవాదులు తమ పట్టాలను వదలుకొనుచున్నారు. పట్టాలు వదలుకొన్న విశేషమేమి? పదిలక్షల నర్థాఁరు పత్రముల–నైదులక్షల విలువగల పత్రములు–పోనీ–లక్షవిలువగల యొక్కపత్రము వదలరాదా? ఉహుఁ బిరుదములు కొందఱు వదలుకొనుచున్నారు. ఆహాహా! ఎంత సాహసకృత్యమో! ఆర్యావర్తదేశమునఁ బుట్టి –పరబ్రహ్మవేశముచేఁ బరిపూర్ణజ్ఞానవిధులై–ఒక్క యార్యాపర్తమునకే కాదు. అఖిల ప్రపంచ మునకుఁ గూడ నవిలంఘ్యశాసనములగు వేదములు చర్చించిన పరమర్షుల రక్తము శరీరనాళ ములందు ప్రవహించుచున్న మీరు–తెల్లవారుసరికి సేతుహిమాచలమధ్యస్థల శతకోటి దేవా లయ ఘంటౌంకార నినాద పరమపూరితమైన వాయువును బీల్చుచున్న మీరు–ఏమి వదలుచున్నారు? ఎం.బి.సీ. లనా వదలుచున్నారు? వహవ్వా! వీనిని గ్రహింపుఁ డని మొదట మీకెవరు చెప్పినారు? కాశికిఁ బోయి నీరుల్లిపాయను విడిచితి నని గర్వపడుచుంటిరి కాఁబోలు. మొదట మిమ్ము నీరుల్లిని తినుమన్నవా రెవ్వరు? నాయనలారా! విడువవలసినవి ఐ.జె.కే.ఎల్.ఎమ్.ఎన్. కాదు. అరిషడ్వర్గము. దానిని వదలుమని మనకిప్పుడు క్రొత్తగా నెవరైన బోధింపవలయునా? రెండు మూఁడువేల సంవత్సరముల క్రిందట –సింధునదీసైకతములందు–జ్ఞానయోగపట్టభద్రులగు ఋషిసింహములు నైచినఱంకెలు బ్రహ్మపుత్రగుహానికేతనముల మ్రోఁగి–యద్దునుడిగా మఱలి–హిమాలయపంక్తిని పునాదుల దఱునట్లు ఢీకొని రైమని దక్షిణాపథముగా వింధ్యపంక్తి నొక్క చెంపపెట్టుపెట్టి–మలయాద్రి నొక్కతన్నుదన్ని రప్పుమని పైకెగిరి మోచేతివాటమున–జర్మనీమీఁదుగా –బశ్చిమార్ధగోళమున మ్రోఁగుచుండఁగా–పునస్సృష్టివఱకు మ్రోఁగవలసియుండఁగా –నాయనలారా! మీకాసింహగర్జనములే వినఁబడుట లేదా? మిమ్మనసేల? పోనిండు. ఎక్కడిక క్కడికే సంతోషము. ఈమాత్రమైన–స్వార్థపరిత్యాగ మగపఱచుచున్నారు. కాని యిందు లోనైనఁ దిరుగఁ గలఁతకొట్టు రానీకుఁడు. మాయూర నొకఁడు చెడఁద్రాగి తూలిపడుచుఁ గట్టుదీసికొని మఱియొక కల్లుదుకాణమునొద్దకుఁ బోయియక్కడఁ ద్రాగుచున్న వారినిఁ జూచి ''గాడిదకొడుకులారా! త్రాగుచున్నారా! కల్లుచుక్క గొంతుముడి దిగినయెడలఁ దలఁ బగులఁగొట్టుదను. మహాత్మఁడు బాబు చెప్పినమాట లేమిరా? మీరు చేయు చేష్టలేమిటిరా? కట్టుదెబ్బచేఁ జచ్చెదరా? కల్లుపాయ లావలఁ బాఱవైచెదరా?'' యని యెంత యుల్లరియైనఁ జేసినాఁడు. నాయనలారా! ఆచరణయే ముఖ్యము. ఆలాపము కేవలము నిష్ఫలము. శాంతిసైన్యమనఁ బేరు చేపాటికట్టువ్రేటునా? తప్పు నాయనలారా తప్పు. మతము పేరిటి ప్రచార మనుమాట! మహావిష్ణు మహాదేవరథయాత్రావిధ్వంసనమా! పోనిండు. నాయనలారా! ఈయంశములు నాకేల? రాజకీయతంత్రాంశములఁ గూర్చి మే ముపన్యసింపఁగూడ దని సాక్షియాజ్ఞ. ఇప్పటిప్రచారమున మతము రాజకీయతంత్రము మేళవింపఁబడి యుండుటచేత నీమాత్రమైనఁ జెప్పవలసివచ్చినది. మా యుపన్యాసముల కితరవిషయములు సమృద్ధిగ లేవా? మీరు దీర్ఘాయుష్మంతులై యుండి యవకతవక లాచరించుచున్నంతకాలము మాకుప

న్యాసవిషయములకు లోటేమి? మాకావిచారము లేదు. ఇంతకును జెప్పఁదలచిన దేమనఁగా –కోపల్లె హనుమంతరావు పంతులుగారి స్వార్థపరిత్యాగ మిప్పుడు చెప్పిన స్వార్థపరిత్యాగము కంటె బహుభంగులఁ బ్రవిమలమైనది. ప్రశంసార్హమైనది. ప్రశస్తమైనది.

నాయనలారా! శ్రీమద్రామానుజయోగి చరిత్రము నుండి యొక చిన్నయంశమును మనవి చేసెదను. పన్నిద్దఱాళ్వాదుల తరువాతఁ బ్రఖ్యాతిఁగన్న వారిలో 'నాథమని' 'ఆళ్వందారు' వీరిద్దఱు ప్రధానులు. రామానుజులవా రాళ్వందారుని మనుమరాలి పుత్రుఁడు. ఆళ్వందారునికే యామునాచార్యులవారని పేరున్నది. ఈమహాత్ముఁడు శ్రీరంగమున నివసించి రంగసేవచే స్వరూపగ్రంథరచన పఠనాదులచేఁ గాలక్షేపము చేయుచుండెను. యాదవప్రకాశునియొద్దఁ జదువుకొనుచున్న తన మనుమరాలి కొడుకగు శ్రీరామానుజాచార్యుని ధీనైశిత్యము విశాలమనస్కత–మొదలగు నసాధారణగుణములను విని తన యవసానము సమీపించుచున్నదని యెఱిఁగి యుండి యాతనిఁ జూడవలయునను కుతూహలమున పెరియనంబి యనుభాగవతోత్తముని రామానుజ సన్నిధికిఁ బంపెను. రామానుజుఁడాపెరియనంబితో బయలుదేరి శ్రీరంగమునకు వచ్చుసరికే యామునాచార్యులు పరమపదించెను. ఆయనను గావేరీసికతాతలమున నుంచి యగ్నిసంస్కార మింకొక్క నిమిషమున కాచరింతు రనఁగా శ్రీరామానుజముని యాయనను గాంచి సాష్టాంగమిడెను. ఆళ్వందారుకుడిచేతివ్రేళలో మూఁడుముడుచుకొనియుండెను. అందుకేమి కారణమని రామానుజు లచ్చటి వారి నడుగ వారు ప్రత్యుత్తర మీయలేకపోయిరి. అంత రామానుజులించుక యోజించి ''యామునాచార్య మునివర్యా! మీ హృదయమునఁ దీఱని కోరికలు మూఁడున్నవి. మొదటిది బ్రహ్మసూత్రములకు విస్పష్టమై నిపులమై –విశిష్టాద్వైతమతసంప్రదాయానుసారమైన భాష్య మొనర్చుట. రెండవది వ్యాసపరాశరనామము లిద్దఱి బాలుర కిడుట–మూఁడవది ద్రవిడవేదమునకు వ్యాఖ్యానము రచియించుట. ఈ కోర్కెలు మూఁడు శ్రీరంగేశ్వరకటాక్షమున నావలనఁ గొనసాగఁగలవు. కావున దేవరవారి తిరుహస్తమున ముడుచుకొని యుండు మూఁడువ్రేళ్లను వికసింపజేయఁ దగునని యాదీనుఁడు యాదాసుఁడు ప్రార్థించుచున్నాఁడ.'' నని మొఱపెట్టెను. అంతట నాళ్వందారు వ్రేళ్లుసరిగా నయ్యెను. నాయనలారా! వింటిరా! ఎంత చిత్రమైన యంశమో? ఇది కథకాదు. నాయలారా! అది ప్రకృతి సత్యములలో నొకటి యని నమ్మవలయును. శారీరక మానసిక శాస్త్రములలోని యెంత లోఁతైనరహస్య మిందు నిమిడియున్నదో చెప్పవలయునా? ఈరహస్యమునుగూర్చి యిప్పుడు చెప్ప నవకాశము లేదు. ఇప్పుడే చెప్పునెడల నిదివఱ కెంత చెప్పితినో యంత చెప్పవలసి యుండును. కావునఁ జెప్పను. సాక్ష్యుపన్యాసములు మిగుల దీర్ఘములగు చున్నవనియు, సారస్యతానుబంధమున సింహభాగ మవియే తీసికొనుచున్నవనియుఁ గవులు, విమర్శకులు–తావుచాలక యిఱుకట్టు మందుచున్నారనియుఁ గొందఱు మమ్ము నిందించుచున్నారని తెలిసినది. నాయనలారా! క్షమింపుఁడు. ఇంతటినుండి తగ్గింపఁ బ్రయత్నింతును. ఈ సంగతి కేమి. యామున లక్ష్మణయోగి శిఖామణుల యుపాఖ్యానమును వింటిరా? దానిని మనస్సున బాగుగా ననుసంధింపుఁడు. మీభావనాశక్తి నొక్కనిమిషము బలిష్ఠమగునట్లొనర్పుఁడు. నేనొక్కచిత్రము నగపఱతును. ఆ గోడపైఁ జూడుఁడు. నిశ్చలముగఁ జూడుఁడు–చిత్తనై శిత్యముతో గోడ చిల్లిపడునట్లు చూడుఁడు. ఆహాహా! ఎవరగపడుచున్నారు? నల్లని మొగముతోఁ–దెల్లని సొగతో–నిర్గర్వమై ప్రశాంతమైన దృష్టితోఁ

బెద్దవియగు ముందు దంతములతో–మందహాసోన్ముఖమైన ముఖముతోఁ గన్నుల కగపడె డివా రెవరు? ఆయనయే కోపల్లె హనుమంతరావు పంతులుగారు. నాయనలారా! నమస్కరింపుఁడు–చాలదు. మఱియొకసారి నమస్కరింపుఁడు. నాయనలారా! ఆయన కుడిచేతనిని బరికింపుఁడు. అన్నివ్రేళ్లు మృతివలనఁగలిగిన సంకోచముచే (Rigor Mortis) ముడుచుకొనిపోయెను గాని చూపుఁడు వ్రేలట్లు ముడుచుకొనియుండక సాఁగియున్నదేమి? అది బందరు జాతీయ కళాశాలనైపునకే యింకను జూపుచున్నదే!!! ఆహాహా! హనుమంత రాయా! ఎంత మహనీయుఁడవోయీ! నీ పేరిటియాతనియంత కార్యదీక్షఁగలవాఁడయ్యా నాయనా! ప్రాణముపోయినను నీకింక నదియే దృష్టియా! నీవేమియుఁ జింతింపవలదు. నీ యభిసంధిని నీతరువాతి వారు నెఱవేర్తురు. ధనికులగువారందఱు కళాశాలాపోషణార్థమై నిధిని సమకూర్పఁ బాటుపడుచున్నారు. అదిగాక ఆంధ్రపత్రిక నందుకొనువారైదాఱువేలజ నులకంటె నెక్కువ లేకపోయినను సాక్ష్యుపన్యాసములు చదువునా రేఁబదివేలజను లాంధ్రదేశ మున స్త్రీపురుషు లున్నారు. వారంద ఱీ మహాకార్యమునకుఁ దోడుపడకపోవుదురా? –తలకొక్క రూపాయ నర్పించుకొనియెడల నిధి ధనములో నగము వీరివలననే సమకూ డునే. హనుమంతరాయా! చేసినంతకాల మాదర్శప్రాయముగఁ బ్రజాసేవ చేసినావు. ప్రజ లలో నొక్కఁడవై యుండుటచేఁ బ్రజాసేవ చేసినావు. ఇప్పుడు దేవసన్నిధానవర్తివై యుండు టచే శ్రీమన్నారాయణదేవుని పాదము లాశ్రయించి కృతార్థుఁడవు కమ్ము. పునర్జన్మగహిత మైన శాశ్వతపదవి నందుము.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

27. మహాశివరాత్రి

మాఘకృష్ణ చతుర్దశి–

శివరాత్రి–

జంఘాలశాస్త్రి పాదగయాపుష్కరిణిలో స్నానంచేసి, అక్కడజేరిన భక్తుల్ని, వారికి సంకల్పంచెప్పి డబ్బులు వసూలుచేసుకునే బ్రహ్మణులనీ వాళ్ళచేష్టల్నీ విశదంగా పరిశీలిస్తున్నాడు. ఆ రోజున ఆపుష్కరిణిలో స్నానంచేసిన స్త్రీ పురుషులసంఖ్య నిర్ణయించడం కష్టం.

జంఘాలశాస్త్రి ఆలోచనలు మనుషుల మనస్తత్వాలమీదికి పోయాయి. సృష్టి సౌష్ఠవానికి మనిషంతగా కీడుచేసేవాడు, ధ్వంసం చేసేవాడు మరొకడు లేడనుకున్నాడు.

ఇలా ఆలోచించుకుంటూ పుష్కరిణి ఒడ్డున ఒక అరుగుమీద దర్భాసనంమీద కూర్చుని శివధ్యానం చేసుకుంటున్నాడు. అంతలో–అది నిద్రకాదు, కలకాదు; ఒక విస్మృతి కలిగినట్టైంది. ఎదుట ఒక సజీవదృశ్యలాగ కళ్లకు కనిపిస్తోంది.

నైకుంఠానికి బ్రహ్మ రావడం–విష్ణువుతో ఘర్షణపడడం–ఇద్దరిమధ్య ఎవరు గొప్ప అనే వట్టుదలతో యుద్ధం జరగడం–ఇద్దరి సైన్యాలు సమావేశం కావడం–వారిని వారించి బ్రహ్మ విష్ణువులు, శాంకర పాశుపతాస్త్రాలను ఒకరిపై ఒకరు వదలడం–నారదాగమనం–బ్రహ్మవిష్ణువుల మధ్యన ఒక అగ్నిస్తంభం లేచి, దానిలో ఈ అస్త్రాలు కలిసిపోవడం–విష్ణువు బ్రహ్మతో ఆ అగ్నిస్తంభం శివజ్యోతి అనీ, అదే సృష్టిస్థితిలయ కారణమనీ చెప్పడం–బ్రహ్మ ఇంకా 'అహం' చావక ఆస్తంభం ఇరుకొనలు కనుక్కొందామని చెప్పి విష్ణువుతో అనడం–విష్ణువు వరాహరూపంలో క్రిందికి పోగా, బ్రహ్మ హంసవాహనంమీద పైకి పోవడం, –విష్ణువు తన ప్రయత్నం వ్యర్థమైందని మూడుసార్లు ఒప్పుకోవడం–బ్రహ్మతాను కృతార్థుణ్ణయ్యానని అబద్ధం ఆడడం–శివుడు అగ్నిస్తంభంలోంచి లింగాకారాన ఉద్భవించి, భైరవుడి చేత, బ్రహ్మ అయిదవ తలను నరికించి, పూజార్హత లేకుండా చెయ్యడం–దేవతలు శివస్తోత్రాలు చెయ్యడం పరవశంతో జంఘాలశాస్త్రి చూశాడు.

నేను సభకుఁ బోవునప్పటికి జంఘాలశాస్త్రి యుపన్యసించుచుండెను. ఒక్క పావుగంటనుండి యాతఁడు మాటలాడుచున్నట్లు తెలిసినది. నేను సభకు వెళ్ల

నప్పుడేమి చెప్పెనో కాని నేను వెళ్లినపిమ్మట నిట్లు చెప్పసాగెను.

''ఈతఱుప్పలు, తాటిపంటిపీచులు, గొఱ్ఱెబొచ్చుతొంతరలు, కనుపగడ్డిదుబ్బులు, చికిలింతకంపలు, చిట్టడవులు నైన తలలు సైత మాదినమునఁ బాదగయాహ్రదమున ముంపఁబడినవి. పండ్రెండు మాసములనుండి పాడుపడిన, పనికిమాలిన మొగము లాదిన మున భస్మ రేఖానముజ్జ్వలము లైనవి. తెల్లవారునరికి 'కాఫీ' మధ్యాహ్నము 'టీ' నడుమ నడుమ సోడా, నిద్రావస్థవఱకు, గొంతుకలో ద్రిమ్మరించిన చేతులు, లింగోద్భవనమయము వఱకుఁ గుక్కుట లింగాభిషేచన ప్రాంచనము లగుచున్నవి. అకాలానందర్భాశనములచే, నంతతముఁ బూరింపఁబడిన కడుపు లుపవాసదీక్షచేఁ దెఱపిగఁ, దేలికగ నున్నవి. ప్రపంచ యాత్రామాత్రార్థములగు కడుపుఁగూడు కట్టుగుడ్డ మాటలతో నపవిత్రము లైన నోళ్లు, పంచాక్షరీమంత్రజప పారాయణము లగుచున్నవి. చుట్టలకై, సిగరెట్లకై బీడీలకై విసుగు విరామము లేకుండ నగ్గిపుల్లలు వెలిగించిన వ్రేళ్లు కర్పూరదీపారాధన సమంజనము లగుచున్నవి. పాదగయాపుష్కరిణిలో నాదినమున స్నానమొనర్చిన స్త్రీపురుషులసంఖ్య నిర్ణయించుట కష్టము. సంకల్పము చెప్పి నీటికాను దెచ్చుకొను ''గయావాలాలు'' స్నానార్థమై యటకు వచ్చిన స్త్రీలపై గనఁబఱచు స్వాతంత్ర్య మింతింత యని చెప్పవీలులేదు. కొందఱు చేతులను బట్టుకొని కొంతలను గబగబ పుష్కరిణిలో దింపుచున్నారు. నీటిలో దిగుటకు సంకోచించుచున్న కొందఱు పడుచుల కీయంశవారీలు చేయూఁత లిచ్చుచున్నారు. పెద్ద పెద్ద కట్టుబట్టలనూడ్చే సౌకర్యార్థము సామాన్యవస్త్రములను గట్టుకొనుచున్న స్త్రీలయొద్దకుఁ గొందఱు పైసకక్కుఱాతిబ్రాహ్మణులు పోయి, ఆస్త్రీలు వస్త్రధారణ మొనర్చుకొనువఱ కాఁగవచ్చునా? ఊఁహూ తమకున్న డబ్బుతొందరచే వారినిగూడఁ దొందరపెట్టుచు నాయడావడిలో నాగందరగోళములో దాముకూడఁ గొంత పూచీని పైనివేసికొనిన ట్లాచరించుచున్నారు.

వీరి యల్లరి కాలిపోను! వీరి యఘాచరణము నట్టేటఁ గలియను. స్త్రీలింక నొడ్డుమీఁద నుండగఁనే సంకల్పము కొంద ఱారంభించుచున్నారు. మెట్లపైనున్న ప్రాఁకుడుచేఁగాబోలు కాలుజాఱిపడిన స్త్రీలను బహుభంగులఁ బరామర్శించుచున్నారు. పేరడుగుట లేదు. గోత్ర మడుగుట లేదు. ఒక్కటే లొడలొడ. ఒక్కటే గడబిడ. సంకల్పమైనపిమ్మటఁ గొంగులను గట్టియున్నడబ్బులమూఁటను విప్పుటకై వారు ప్రయత్నించుచుండఁగా, నింతవఱకీ బ్రహ్మణులకు శాంతియేది? కలియఁబడి తామే యామూట లను విప్పుకొనుచున్నారు. వీరి స్వాతంత్ర్యము చట్టుబండలుగాను! పైస్త్రీల నందఱను దమవారినిగానే భావించుచున్నారే! తమ బుజముమీఁది గావంచకుఁ బైకాంతల సైఁట చెఱుఁగులకు భేదము లేదు. తమ రొంటిలోని డబ్బులకుఁ బరస్త్రీల సైఁటకొంగుముళ్లలోని డబ్బులకు భేదము లేదు. తమ దేహములకుఁ బైమగువల శరీరములకు భేదము లేదు. అద్వైత మనఁగా నిదియే కాఁబోలు?

ఆహాహా! పరస్పర్శనంబంధముచే నాపాదగయలోని చేపలన్నియు జచ్చి పైకిఁ దేలినవికదా! నరుని స్పర్శము తగిలిన తరువాత మాత్రమే వస్తువైనసరే యిఁక బాగుడపదని నిశ్చయముగా నమ్మవలెను. నరులు పెంచిన చెట్టు చూడుఁడు. అడవిలోఁ దనంతఁదా పెరిఁగినచెట్టు చూడుఁడు. నరుఁడు పెంచిన చిలుకకు నడవిచిలుకకు నెంత భేదమున్నదో

చెప్పవలయునా? నరుఁడు సృష్టికిఁ బ్రభుఁడని, పరిపోషకుఁ డని యేవో మెతకమాటలు, కొందఱు మేధావంతులు పలుకుదురు కాని సృష్టి సౌష్ఠవమునకు, నరుఁ డంత సంపూర్ణమారకుఁడు మఱియొకఁడు లేఁ డని నమ్మవలయును.

లాభాధిపతికి, ద్వితీయాధిపతికి, సప్తమాధిపతికే నేటి శని కున్న సాముదాయక మారణబలముకంటె మనుజునకున్న బల మెక్కువ యని నేను సత్యానత్యగ్రహణశూన్యుఁ డనై యేదో కప్పగంతులుగ మనసులో ననుకొనుచు, హ్రదతీరమందున్న యరుగుమీఁద దర్భాసనమునఁ గూరుచుండి 'ఓం నమశ్శివాయ' యని స్మరించుకొంటిని. నీటిపైఁ దేలినచేపలకైకాఁబోలు, పైనెగురు గరుడపక్షి, నడుమనడుమ కృష్ణాయని యఱచుచున్నది. ఆహాహా! శివభక్తులంద ఱుపవసించుచుండఁగా విష్ణుభక్తాగ్రగణ్యుఁడు, చేఁపలను దిని కడుపునిండించుకొనఁ జూచుచున్నాఁడు. శివరాత్రియందు శ్రీ మహావిష్ణు వుపవసింపవలసియుండఁగా, వైకుం ఠైకాదశియందు శివుఁ డుపవసింపవలసియుండఁగా, శివవిష్ణు భక్తులలో నీ వ్యత్యస్తచింతలేలయో! పరమార్థగ్రహణశూన్యతయే దీనికంతకుఁ బ్రధానకారణమై యుండునని నాలో నేను వెట్టిమొట్టిగ ననుకొనుచుండఁగా సాయంకాలమైనది. దేవాలయ ములో వీరాంగఫు ఘ్రోఁతలు ప్రాకారప్రతిఫలితములై, బహుగుణీకృతపాటవమునఁ బ్రబలుచు న్నవి. శంఖధ్వానములు, రుంజలప్రచండరవములు, గగనకర్పర ఖండనాఖండఘాటులతోఁ జెలరేఁగుచున్నవి. ఓమ్ హరహర! మహాదేవ శంభూ! ఓమ్ హరహర! మహాదేవశంభూ! యను భక్తుల మంగళ నినాదములు మనోరంజకములుగ నున్నవి. ఎదుటఁ గలఁగిపోయిన నీటితో మధ్యస్థమండపముతో పాదగయాహ్రదము ప్రకాశించుచున్నది. నాకేమో కొంత విస్మృతికలిగిన ట్లయ్యెను. నిద్రయని నేను జెప్పఁజాలను. శివరాత్రియందు నిదురింపఁగూడ దని నేనెఱుఁగనా? అదిగాక, కన్నులు తెఱచియుండఁగానే నిద్రించుటకు నేను మత్స్య మునా? లేక దేవతనా? ఆహాహా! కన్నులపండువుగా! అదిగో పాలసముద్రము. ఆహా! ఆహా! వానిమధ్యమున శేషశయనమున శ్రీమన్నారాయణమూర్తి దివ్యమంగళవిగ్రహధారియై, నీలమేఘశ్యామలకోమలతనుఁ డై, కుడి ప్రక్కనొత్తిగిలి శయనించుచున్నాఁడు. ఇంతలో నెవ రాఁడు! ఆహా! ఐదుమొగములతో నచ్చటికి వేంచేసినాఁడు! శేషశాయి యగు మహా విష్ణువును దిలకించుచున్నాఁడు. తల పంకించుచున్నాఁడు. మొగము చిట్లించుచున్నాఁడు. చేతనున్న బంగారువేత్రముతో శ్రీ మహావిష్ణువుని చేతిపై, నిద్రాప్రబోధనార్థమై, పొడుచ-ుచున్నాఁడు! శేషశాయి కన్నులు తెఱచి, "వచ్చితివా! పద్మసంభవా! సంతోషమే!" యని సంబోధించి, పాలసముద్రముమీఁది పచ్చిమీగడలవంటి పలుకులతో నాతని కాతిథ్య మిచ్చెను. "ఏమీ! సర్వజగత్సృష్టికర్తను, భర్తను నైన ననుఁ బూజించుపద్ధతి యిదియేనా! పండుకొనియా! బ్రహ్మనారాధింతువు? కాళ్లు చాచుకొనియా? కమలభవుని గౌరవింతువు! నగము తెఱచిన కనులతోడనా? జగత్పరిపాలకున కాతిథ్య మిచ్చెదవు! ఏమి? యీ గర్వాతిశయము?" అని కన్నులు జేవురింప బ్రహ్మవిష్ణువును గద్దించెను. "జగత్తు నీవలనఁ బుట్టినదో లేదో యీసంగతి యిప్పుడెందులకుఁగాని నీ వెవనివలనఁ బుట్టితివో నీ వెఱుఁగ నట్లు స్పష్టపడుచున్నది. విశ్వాసఘాతకునితో నింతకంటె మాటలాడఁదగదు. కావునఁ బోయావలికిఁ బో" యని విష్ణుమూర్తి పద్మజునితోఁ బలికెను. కటములదఱ గాత్రము కంపింప కన్నుల నిప్పులురాల, బ్రహ్మ వీరావేశమున నట్టహాసమొనర్చి, బ్రహ్మదండముతో వైకుంఠనిలయుని వక్షస్థలమునఁ గొట్టెను. ఆ దెబ్బతో, రోషావిష్టుఁడై, పంచాలి

తగదాదండుఁడై శేషశయనమునుండి శ్రీమహావిష్ణువు చెంగున గ్రిందికి దుమికి, బ్రహ్మభుజ ముపై నొక్కవ్రేటు వ్రేసినాఁడు. అదిగో! ఆవ్రేటుజూచి శేషమూర్తి 'బళి' యనునట్లు సహస్రశిరము లొక్కసారి కంపించుచున్నాఁడు. కమలభవుఁ డంతట గాఢతర కోపాటోపోద్దీతుఁడై అగ్నికీలాస్త్రము కాఁబోలు నభిమంత్రించి విడుచుచున్నాఁడు. అదిగో మంట. లంకాపురీ దాహనమైన ట్లగపడుచున్నది. గప్పుమన్నమంట కన్నుదెఱచునంతలో మాయమగుటయేకాక, అదియేమి! అదియేమి! పైగ వర్షముకూడ గుఱియుచున్నదే! ఇది నీరజాక్ష నిర్ముక్త వారుణాస్త్ర మహిమము కాఁబోలు! తన ధైర్యసారమటు నీరు గాఁజోయి నందులకుఁ గాఁబోలు చిన్నబోయి డిల్లపడి పద్మజుఁడు తొప్పపాటుకాలము సాధనాంతర యోజనానిర్మగ్నుఁడై యుండెను. ఇంతలో సత్యలోకమునుండి బ్రహ్మను చరులందఱునవా హనులై, సాయుధులై విచ్చేసిరి. ఇట్లు వీరు వచ్చి బ్రహ్మపక్షమున పంక్తులు దీర్చి, అఖిలజగన్నిష్టికర్తా! అంబుజసంభవా! అపవర్గప్రదా! భారతీకాంతా! ప్రజాపతీ! పరమేష్ఠి జయా! జయా! యని హెచ్చరించుచుండిరి. ఈధ్వనులలోనే, ఆహాహా! మఱియొకవైపు నుండి చక్రపాణీ! చతుర్భుజా! దామోదర! దైత్యాంతకా! పద్మనాభా! వాసుదేవా! జిష్ణో! జయా! జయా! యను వైష్ణవ ధ్వనులు కలసి భండన సీమయందుఁ బర్వి, పదిదిక్కులఁ గ్రమించెను. అప్పుడు విష్ణుమూర్తి సహస్రనయుద్రనిర్ఘోషనీకాశధ్వానమున నిట్లనియెను. విష్ణుభటులారా! మీరెవ్వరును బ్రహ్మానుచరులతోఁ బోరాడవలదు. సర్వజగద్రక్షణపోషణ శాసనాధికారము నాదా? నా పుత్రునిదైన బ్రహ్మదా? యను వంశము స్థిరపఱుపుటకై మేమిప్పుడు పోరాడుచున్నాము. కావున మీరు తటస్థులై యుండుఁడు. ఈమాటలు విష్ణుమూర్తి పలుకుసరికి ''హే-హే-హే-వైకుంఠవాసా!'' యని పరిహాస ప్రగల్భతాసూచకముగఁ బంచవదనములతో డను నవ్వి-నారాయణా! నాసైన్యమును గూడ నీకే యిచ్చెదను. ఈరెండుసైన్యముల సాహాయ్యముతోడను మగటిమి తెచ్చుకొని, నీవు నన్ను మార్కొనుము. పురాణపురుషుఁడవు కాఁబోలు! బటులను వలదని వారింతు వేల?'' యని బ్రహ్మ నల్వురు బ్రహ్మలంత స్వరూపము గలుగునట్లుప్పొంగి పలికెను. మధుసూధనుఁ డా మాటలను సహింపలేక శాంకరాస్త్ర మొక్కటి యనుబంధించి జలజ సంభవునిపై వదలెను. అది మహారౌద్రస్వరూప మున బయలువెడలు చుండఁగా బ్రహ్మ పాశుపతాస్త్రము విష్ణుమూర్తిపై విడిచిపెట్టెను. అయ్యయ్యో! అది యేమి? కొఱవులు, వేలు, లక్షలు, కోటులు బ్రహ్మాండకటాహమంత యును గ్రమ్మచున్నవి. ఒక్కటితో నొక్కటి డీకొనుచున్నవి. చిటచిట, పెటపెట, విస్ఫులింగములు, అగ్నిగోళములు, ఉల్కలు, అగ్గిపిడుగులు వర్షించుచున్నవి. ఆహవదిద్ధ క్షాబద్ధదీక్షులై విమానములతో వేంచేసి, పైనపంక్తులు తీర్చియున్న దేవతలు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు మొదలగువారు వాహనములు కాల, వస్త్రములు కాల, విమానములు కాల, శరీరములు కాల, కేశబంధములూడఁ, గట్టుకొన్నవస్త్రములు జాఱఁగ, మైదీఁగలు గంపింపఁగ మొఱ్ఱోయని భర్తలను గౌఁగిలించుకొనిన కాంతలతోడ నొక్కటేపరుగు! ''హరహరా! హరహరా! త్రిలోకాధినాథుఁడ వైన-మహాదేవుఁడ వైన, పరమేశ్వరుఁడ వైన, సృష్టిస్థితిశాసనని యంత వైన, నీవుగాక, ఈలోకాపదను, ఈ యకాలజగత్ప్రళయమును, నిరోధింపగల్గువాఁ డెవ్వఁడును లేఁడు. ఓమ్ హరహర మహాదేవశంభూ! మహాదేవశంభూ'' యను నాలాపములు, నాక్రందనములు, నాకాశమంతయు నెక్కడినుంచి వచ్చినవో యెడము లేకుండ నాక్రమించినవి. ఇన్ని ధ్వనుల మ్రింగుచునింత యుల్లరిఁ జల్లార్చుచు నింత

గందరగోళము గ్రమ్మెను, నొక్కపాట వీనఁబడుచున్నదే! ఆహా! ఆహాహా! అదియేమి! అదియేమి! వీణాధారియైన నారదమహర్షి గానమా యేమి! అదిగో! అదిగో! ఆహా! ఆహా! గజ్జెలుకట్టుకొని తాండవించుచున్నాఁడే! కుడిచేతనున్న చిఱుతలతోఁ దాళగతినిఁ జూపుచున్నాఁడే!

పాట

ఆనందమానంద మాయెను, గొప్పయావహము నేడుగల్గెను; తాతకుఁ దండ్రితోఁ, దండ్రికిఁ దాతతో దారుణయుద్ధము తారసించెను బళిIIఆనంII శంకర భక్తశంకర రావయ్య, శంకర భక్తవశంకర రమ్మింక IIఆనంద II

నారదుఁడిట్లు పాడుచునేయున్నాఁడు. శాంకరపాశుపతాస్త్రములింక హోరోహోరిగాఁ బోరాడుచునే యున్నవి. వాయువు బహు ప్రచండముగ వీచుచున్నది. సర్వజగత్తుకూడఁ బునాదులనుండి పెల్లగిల్లిపోవుచున్నట్లున్నది. గ్రహములెల్ల మహాసంక్షోభము నొందుచున్నవి. మహాగ్నేయవాలములతో, ధూమకేతునహస్రములు పడుగుపేకగాఁ బరుగులిడుచున్నవి. బ్రహ్మయు విష్ణువు నొక్కరి యెదుట నొక్కరు శతసహస్రార్కసందీప్తితో వెలుఁగుచు సమరోత్సాహమున విజృంభించుచున్నారు. ఇంతలో ఆహా! ఆహాహా! అది యేమి! అది యేమి! అద్భుతము. మహాద్భుతము. ఆవాఙ్మానసగోచరము, ఆద్యంతరహితము. ఆహా! అనలస్తంభమొక్కటి బ్రహ్మవిష్ణువుల నడుమ నుద్భవించినది. ఉద్భవించిన యుత్తరక్షణముననే యాశాంకర పాశుపతాస్త్రములు రెండును రప్పున నాయాగ్నేయస్తంభములోఁ గలసి పోయినవి. ఆహా! ఆయనలస్తంభకాంతి నే మని చెప్పను? దారుణముగానున్నది. ఉష్ణముగా నున్నది. చల్లగా నున్నది. కాగడాలముందు దీపములు మకమకలాడును. విద్యుత్కాంతిముందుఁ గాగడాలు కాంతివిహీనములై యుండును. సూర్యకాంతిముందు విద్యుద్దీపములు వెలవెలలాడును. సహస్రసూర్యులైననరే బ్రహ్మవిష్ణువులయెదుట నిస్తేజస్కులైయుందురు. అట్టి బ్రహ్మవిష్ణులిద్ద ఱాహైశ్వానరస్తంభము ముందుఁ గాంతిశూన్యులై కనఁబడుచున్నారు. ఆహా! ఇది యేమి కాంతియో! ఇదియాగ్నేయకాంతియామఱియొకటియా? ఔనని చెప్పవచ్చును. కాదని చెప్పవచ్చును. అప్పుడు వెలవెలలాడుచున్న బ్రహ్మను జూచి "నాయనా! ఈజాతవేదస్తంభమే, యీహైమ జ్యోతియే జగత్కారణము. జగత్పాలకము జగన్నాశకము. నీవుకావు. నేను గాను. ఇక మనము యుద్ధమును మానఁదగిన" దని విష్ణుమూర్తి పలికెను. "మధుసూదనా! ఈపీతిహోత్రస్తంభమే నీకంటె నాకంటె నెక్కువయని నేనుగూడ నొప్పుకొంటిని కాని నీవధికుఁడవో నేనధికుఁడనో యను సంశమింకఁ దేలలేదుగదా" యని, యింకను శేషించియున్న రాజసముతోఁ బ్రహ్మపలికెను. అంత విష్ణుఁడు కొంతనవ్వి నాయనా! ఈపావకస్తంభమునకు మొదలేదో నేను గనుఁగొనఁబయత్నింతును. చివరయేదో నీవు కనుగొనఁ బయత్నింపుము. నాప్రయత్నమున నేను కృతార్థుఁడ నైన యెడల నేనే నీకంటె గొప్పవాఁడను. నీవు కృతార్థుఁడ వయినయెడల నీవే నాకంటె గొప్పవాఁడవు. అట్లు సేయుదము' అని బ్రహ్మతోనన్నెను. మనమిద్దఱము గూడఁ గృతార్థుల మయినయెడల నెట్లని బ్రహ్మ వితర్కించెను. అటు లెన్నఁడు జరుగదు. సందేహము వలదు. వెఱ్ఱివాఁడా నడునడు అని విష్ణువు బ్రహ్మను మందలించెను. ఆహాహా! అదేమి! కాటుకకొండయా కానట్లున్నదే. ఆహాహా! కదలుచున్నదే! ఆహాహా! అదివరాహస్వరూపము కాఁబోలు!

స్తంభముచుట్టు ప్రవ్వుచున్నది. లోనికిఁ బోవుచున్నది. అదిగో అంతలో క్రిందికి ది
మాయమై పోయినది. విష్ణుమూర్తి యాహవ్యవాహనస్తంభము మొదలు కనుఁగొనఁ
కేఁగినాఁడు. శంభుదేవుఁ డిక్కడ నున్నాఁ డని కాఁబోలు విశ్లేషమును సహింపలేక కైలాస
ర్వత మెగిరి వచ్చుచున్నదే! అయ్యయ్యో! పొరపాటు కాదు. బ్రహ్మదేవుని హంసవాహనము
దానిపయి నెక్కి బ్రహ్మపయికిఁ బోయినాఁడు.

అగ్నిస్తంభ మవిచ్ఛిన్నకాంతితో, నప్రతిహత తేజస్సుతోఁ బ్రకాశించుచున్నది
ఇంతలో నాదివరాహము జ్యోతియొద్దకు వచ్చి, స్వస్వరూపము నొంది, బంగారుదుప్ప
టము నడుమునకుఁ జుట్టుకొని, నాల్గుచేతులు జోడించుకొని, అభవా! ఆదిమధ్యాంతర
హితా! దేవాది దేవా! మహాదేవశంభూ! మహాదేవశంభూ! యనియుచ్చైస్వరమున
బ్రార్థించుచుఁ బ్రదక్షిణ మాచరించుచుండెను. ఇంతలో సత్యంతాలౌకిక పరిమళ భరితుఁడై
హంసవాహనారూఢుఁడై, యంబుజసంభవుఁ డాయాగ్నేయ స్తంభమునొద్ద నవతరించి
''అంబుజాక్షా! నీప్రయత్నమేమైన'' దని యడిగెను. ''వ్యర్థమైనది. వ్యర్థమైనది. వ్యర్థమైన''
దని ముమ్మా రావిష్ణుమూర్తి పలుకఁగ నాప్రయత్నము కృతార్థమైనదని బ్రహ్మ విష్ణువుతో
బలికెను. ''నిదర్శన మేదీ'' యని విష్ణువుఁ డడుఁగ నిదిగో యని తన చెవిసందున నిడిన
కేతకీపుష్పమును గనఁబఱచి 'శంకర జటాజూటస్థమైన యీపుష్పమును నేను గ్రహించి
తెచ్చితిని. నీకిఁక సందేహమగునెడల నీపుష్పమును ప్రశ్నసేయవచ్చునని బ్రహ్మవిష్ణువుతో
ననియెను. బ్రహ్మవాక్యముల కనుగుణముగ నాపుష్పముగూడ పలికెను. విష్ణువంత
తెల్లఁబోయి యోజించుచుండ నిమేషార్ధభాగముకంటెఁ దక్కువ కాలములో నాయాగ్నేయ
స్తంభములోనుండి మహాలింగము పానపట్టముతో నుద్భవించినది. ఆగ్నేయస్తంభము మాయ
మైనది. మఱియొక నిమేషార్ధములో దేవతలు, యక్షులు, గంధర్వులు, కింపురుషులు,
నరులు, రాక్షసులు, తిర్యగ్జంతువులు, పక్షులు, కీటకములు మొదలగు సర్వప్రాణులన్నియు
లెంపలు వాయించుకొనుచు, మహాలింగోద్భవమైనది. మహాదేవశంభూ, మహాదేవశంభూ
యని యఱచుచు, నాకాశగంగనీటితోఁ గామధేనువుపాలతోఁ, గల్పవృక్షములపూలతో,
బంగారుపద్మముల తేనెతో, కొబ్బెరకాయల నీటితో హరహర హరహర హరయని యాక్రో
శించుచు నభిషేకము లొనర్చుచున్నారు. మహాశివరాత్రి మహాశివరాత్రి యిదే యిదేయని
బ్రహ్మాండము పగిలిపోవునంత ధ్వని యగుచున్నది. ఆహాహా! జన్మము తరించినది. పునర్జన్మ
మిఁక లేదు లేదని సర్వప్రాణులు కూడమహానంద మొందుచున్నవి. ఆహాహా! ఆహాహా!
అదియేమి! ఆహాహా! ఆకాశమునం దంతటను, దేహములమీఁద, బట్టలమీఁద గాలిలోను,
నీటిలోను, నెల్లయెడలను గూడ ''మహాదేవశంభూ! మహాదేవశంభూ'' యను జ్యోతిర్మ
యాక్షరము లగబడుచున్నవే. ఇది యేమి వింత! కాని యంతకంటె వింత యిది యేమి!
అదిగో! ఆమహాలింగ నంభంధమగు ఫాలప్రదేశము కదలుచున్నది. ఎందుచేతనో?
అయ్యయ్యో! అందులోఁ బొగ యుదయించుచున్నదే. అవిగో మంటలు! ఫాలమును
భేదించుకొని ఆమంటలమధ్యమున నొక్కపురుషుఁ డుదయించినాఁడు. అతనితో నామహా
లింగమూర్తి గంభీరభాషణముల ''భైరవా! అదిగో బ్రహ్మ! అతఁడు నాజటాజూటమునుండి
కేతకీపుష్పమును హరించినాఁడ నని యనత్యమాడినాఁడు. అదిగో చూడు! అనత్యమాడిన
యాశిరమును నీచేతనున్న కత్తితో ఖండింపు'' మని యాజ్ఞాపించెను. అయ్యయ్యో! అప్పుడు
నాకొడలు కంపించినది. అనత్యమాడి j తలను దెగనఱుకుటయేధర్మమగు నెడలఁ బ్రపంచ

మున నొక్కతలయైన నిల్చునోలేదో యని యనుకొనుచుండగ నింతలో బ్రహ్మకపాలము కత్తివ్రేటుతో క్రిందఁబడెను. మిగిలిన నాల్గు శిరములు 'హర! ఓమ్ హరహర మహాదేవ శంభూ!' యని యాక్రోశించినవి. అప్పుడు విష్ణువువంక నామహాలింగమూర్తి యవలోకించి "వైకుంఠవాసా! తన శక్తిహీనత నొప్పుకొనుటలో నెవడు యథార్థమాడునో ఆతఁడు పూజ్యుఁడు. నీవు సర్వత్ర పూజనొందుదువు. బ్రహ్మకుఁ బూజ్యత మృషావాదనకారణమునఁ దగ.' దని వచించెను. అంత మహాదేవశంభూ! మహాదేవశంభూ! యని విష్ణుమూర్తి యుచ్చైస్స్వరమున నుచ్చరింపఁగ నక్కడఁ జేరిన ప్రాణములన్నియుఁ బశుపక్షికీటకాదులుసైతము మహాదేవశంభూ యని యఱచెను. స్వర్గకాంతలు కంటిచూపులతోఁ గర్పూరదీపముతో గానకలాపములతో, మహాలింగమూర్తికి మంగళపు టారతు లిచ్చిరి. మాఘకృష్ణచతుర్దశి యగు నీ దినమే మహాశివరాత్రి. మధ్యమరాత్రియే మహాలింగోద్భవసమయము. జయ మహాదేవశంభూ! జయ మహాదేవ శంభూ! యని దేవతలెల్ల గ్రుక్కతిప్పుకొనకుండ శివనామ ముచ్చరించుచు మందారపుష్పములు, పారిజాత కుసుమములు, సురనదీవర్ణకమలములు, శ్రావణభాద్రపదమ్మష్టిగ వర్షించిరి. ఆహా! ఆహాహా! ప్రమాదమున నొక్క బంగారుకమలము నాతలపైఁగూడఁ బడినది. అట్టి యదలీపడి తల తడిమి చూచుకొనఁగ బంగారుపద్మము కాదు. నాయనలారా! బల్లి; అపుడే లేచి పాదగయా హ్రదమునఁ దిరుగ స్నానమొనర్చి భస్మధారణ మాచరించి 'హరహర మహాదేవశంభూ!' యనుచుఁ గుక్కుటేశ్వరుని యాలయములోనికిఁ బోయితిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

28. ధనుర్దాసుని స్వార్థపరిత్యాగము

ఒకసారి హరిభక్తి పరాయణుడైన ఒక సాధువు సత్యపురం వచ్చాడు. పద్మనాభస్వామి ఆలయంలో కట్టడి ప్రాసాదంలో కాలక్షేపం చేస్తున్నాడు. అతను కులానికి శూద్రుడు.

కాలాచార్యులు ఒకసారి అతన్ని కలిసి–శ్రీభాష్యం, స్వరూపగ్రంథాలలో తనకున్న పాండిత్యాన్ని వెల్లడించాడు. కాలాచార్యులు ఉద్దేశంలో, ఆ హరిభక్తుడికి ఎక్కువగా పుస్తకపరిచయం లేదని తేలింది. అయితే పద్మనాభస్వామి ఆలయం చూడడానికి వచ్చే ఆడ, మగ ఆ భక్తుణ్ణి చూడకుండా మాత్రం వెళ్లేవారుకాదు. అతను తన భక్తి ప్రవత్తులతో, నిరాడంబరవేషంతో అందరినీ ఆకర్షించాడు.

కాలాచార్యులే మరొకసారి ఆయన్ని కలుసుకుని, సాక్షిసంఘం సభలో ప్రసంగించమని కోరాడు. అతను ఒప్పుకున్నాడు.

అనుకున్నప్రకారం సభకు వచ్చి నిండైన వినయవిధేయతలతో సభకు నమస్కరించి – పైపైవేషాలు ప్రధానంకాదు, లోపల, అంతరంగం పరిశుద్ధంగా వుండడం మోక్షపదం చేరడానికి చాలా అవసరమంటూ శ్రీరామానుజాచార్యుల వారు తమ శిష్యులకు చేసిన హెచ్చరికను, వారు అలా చేయడానికి కారణమైన ధనుర్దాసు అనే విష్ణుభక్తుడి కథను–ఉపన్యసించాడు.

ధనుర్దాసు మొదట భార్యాదాసుడై ఉన్నాడు. రామానుజాల దయవల్ల విష్ణుభక్తుడై, నిర్లిప్తుడై, స్వచ్ఛశీలంతో ప్రవత్తితో అగ్రజుడై పండితులకు సైతం ఆదర్శంగా ఎలారూపొందాడో వివరంగా చెప్పాడు ఆ హరిభక్తుడు. కులమూ, పాండిత్యం కంటె మానసిక పరిశుద్ధి గొప్పదని విన్నవించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! మా సత్యపురగ్రామమున కెక్కడనుండియో కాని యొక హరిభక్తుడు వచ్చినాఁడు. ఆతఁడు శూద్రకులసంభవుఁడు. దాదాపుగా నేబదిసంవత్సరముల వయస్సున్నవాఁడు. హరినామస్మరణ పరాయణుఁడు. శంఖచక్రాంకధారి. తులసీమాలాభూషితుఁడు. ద్వాదశోర్ధ్వపుండ్రాలంకృతుఁడు. ఏకకావారాశనవ్రతుఁడు. ధీర్ఘశ్మశ్రుజటా

మండితుఁడు. అసితవర్ణుఁడు. రోమశశరీరుఁడు. కౌపీనమాత్రధారి. అట్టి భాగవతవర్యుఁడు మాపద్మనాభాస్వామియాలయములో నాలుగుదినములనుండి వాసముచేయుచున్నాఁడు. వైదేశికుల కేర్పాటయిన కట్టడిప్రసాదముతోఁ గాలక్షేపము చేయుచున్నాఁడు. తులసిపూసల గణించుచు రంగనామ ముచ్చరించుచు నభయహస్తములు తలపయిఁ బెట్టుకొనుచు శ్రీపాద రేణువుఁ గన్నుల కంటించుకొనుచు దినము లీడ్చుచున్నాఁడు. పద్మనాభమూర్తిని సేవింపవ చ్చిన స్త్రీలు పురుషులు నీ హరిభక్తుని జూడకుండఁ బోవుటలేదు. మాకాలాచార్యులుగా రాయనను జూచుటకు మూడునాల్గుమాఱులువేంచేసి తనకు శ్రీభాష్యాదులయందును, స్వరూపగ్రంథములందును గలపాండిత్య మాయనయొద్ద వెల్లడించెను. విశేష గ్రంథావలోకన మాయనకున్నట్లు కనఁబడదని కాలాచార్యుల యభిప్రాయము. కాలాచార్యుఁడు వట్టి ప్రపంచ జ్ఞానశూన్యుఁడని యాహరిభక్తుని యభిప్రాయమేమో మనకుఁ దెలియదు. ఏదీ? లోపలియభి ప్రాయము మోముపై నే విలక్షణవైఖరిలో కనఁబడుట కవకాశములేకుండ ఫాలమంతయు నూర్ధ్వపుండ్రమయ్యెను. పెద్ద జుంజుఱు కనుబొమ్మలయ్యెను. లోఁతుకన్నులయ్యెను. బొద్దుమీసము లయ్యెను. దుబ్బు గడ్డమయ్యెను. కాలాచార్యులు తిరుగ నీయుదయమున హరిభక్తుని వీక్షించి ''మాసాక్షిసంఘములో నొక్కయుపన్యాస మిచ్చెదరా?'' యని యడి గెను. ఆయన యట్లొనర్చుట కంగీకరించెను. ఇదిగో యిప్పుడే రానైయున్నారు. ఆయనవ చ్చునేమో యని నేనింక నేదియు నారంభింపకుండనున్నాను. అదిగో వచ్చుచునే యున్నారు. లేచి హరిభక్తున కాతిథ్యమిండు. (సభ్యు లట్లొనర్తురు) స్వామీ దయచేయుఁడు. మాసభ్యులతో మిమ్మఁగూర్చి నాకుఁ దెలిసినయంశములేవో చెప్పియుంటిని. తాము తమకుఁ దోఁచినవిషయమునుగూర్చి యుపన్యసింపవచ్చును.

హరిదాసుని యుపన్యాసము:–

శ్రీమతే రామానుజాయ నమః భాగవతోత్తములయిన దేవరవారంద ఱిక్కడ వేంచేసియుండుటచే నడియేనికి దేవరలతోఁ గొంత భగవద్గుణానుసంధానము –భాగవతగుణానుసంధానము చేయఁదగిన యవకాశము సిద్ధించినదని యీదీనుఁడు –దాసుఁడు–ఈనిర్భాగ్యుఁడు మనవిచేసికొనుచున్నాఁడు. అడియేని యువకతవకసంభాషణ మంతయు దేవరవారల తిరువుళ్ళములోనికిఁ దెచ్చి యీయధమాధముని క్షమింతురని నమ్మెచున్నాను. ఈదాసుఁడంతటి పాపాత్ముఁడు ప్రపంచమున మఱియొక్కఁడున్నాఁడని దేవరవాత లెంచఁదగదు. దక్షిణహిందూదేశమున నున్న సమస్తదివ్యదేశములను బాదచారినై సేవించితిని. ఒక్కొక్కదివ్యస్థలమునఁ గొన్నిమానములుండి యచ్చటి విష్ణుభగవాను నారా ధించి యచ్చటి భాగవతోత్తముల తిరువడిగళ్ళను గొలిచి యచ్చటి పన్నిద్దరాళ్వారులను బూజించి పెరియతిరుపడి చిరియతిరువడి తిరువడిగళ్ళకు మ్రొక్కియచ్చటిదేవతాప్రసా దము కన్నుల కద్దుకొని స్వీకరించి యాహరించి గాలక్షేపమును జేయుచుంటిని. ఇట్లు శ్రీజగన్నాథము మొదలుకొని శ్రీసారనారాయణమువఱకుఁ దిరిగి భగవద్భాగవతోత్తము లసేవఁ జేయుచుంటిని. ఇట్టిసేవవలన నడియేను తరించునని నమ్మియున్నాఁడు. అడియేని కక్షరాభ్యాసమయిన లేదు. అడియేని యన్నప్రాశనమేదో యూరంగని యధీనమ్మైయున్నది. ప్రపంచములో నెందరో దుర్మార్గులున్నారని కొందఱు మహానుభావు లానతిచ్చిరి కాని నాకొక్క దుర్మార్గుఁడైనఁ గానఁబడలేదు. అందఱు భాగవతోత్తములే! వారందఱ డియేనికి

గురువులే. వారికడియేను శిష్యప్రశిష్యకోటిలోనివాఁడే. నేను జూచినవారందఱు నాకుఁబ్రభువులే. వారందఱు కడియేను దాసానుదాసుఁడే! ప్రపంచము దుఃఖభూయిష్ఠ మని కొందఱు పండితు లానతిచ్చిరని వినియున్నాను. ప్రపంచమున నేనొక్కఁదుఃఖమయిన ననుభవింప లేదు. ఒక్కఁదుఃఖమైనను నేను జూచియుండలేదు. (ఆహాహా! ఎంతయుత్తముఁడవయ్యా! అని సభలో గేకలు) దేవరవారట్లు దీనుని మన్నింపఁదగదు. నేనధముఁడను. అధమాధమాధముఁడను. కాలమెంతకు జరుగకుండ నున్నదయ్యా యని కొందఱు పలుకుదురని నేను వినుచున్నాను. స్వామిసేవకై పూలఁగోసికొనుటలోఁ-దులసీదళములు త్రుంపుటలోఁ-జందన మరుగఁదీయుటలో-నారాధనసమయమున జేగంట వాయించుటలో-శంఖమూఁదుటలోఁ గర్పూరపుటారతులు గన్నుల కద్దుకొనుటలో-అహాహా-అన్నిటికంటెను గజేంద్రాళ్వారుని రక్షించిన యాశోన్నవర్ణంశైదవెరుమాళ్లువారి తిరుముఖమండలమును దెరపిలేకుండఁ దనివిలేకుండఁ దొప్పపాలైన లేకుండ వీక్షించుటలో నాతండ్రియుఁ బల్లియునైనఁ బెరుమాళ్లును బిరాట్టియు గర్భాలయములో శయనించియుండ, నీవల నిలువఁబడి పవళింపుసేవపదములను బాడుకొనుటలో-దేవాలయమును వేంచేసిన భాగవతోత్తముల తిరువడిగళ్ళ నొక్కొక్కరివి తరువాత నొక్కరివి మెత్తగ నొత్తి కన్నులకద్దుకొని నడుముకట్టుకొని ముందునడచుచు వారినిండ్లయొద్ద దిగఁబెట్టుటలోఁదిరిగి యాలయములోనికి వచ్చిధ్వజస్తంభమునొద్ద భాగవతుల పాదధూళిచేఁ బవిత్రములగు జాలపై నాచ్ఛాదనము లేకుండ రంగ రంగ రంగా రంగ రంగ రంగా యని ప్రాకరము లదరున ట్లుచ్చైస్వరమున నరచుటలో నోభాగవతోత్తములారా! నా కీకాల మెంతమాత్రమును జాలకుండ నున్నదని మనవిచేసికొనుచున్నాను. అందువలన నసంతుష్టి నొందుచున్నానని యనుకొనకుఁడు. భక్తాగ్రగణ్యులారా! మన తండ్రియగు రంగఁడు చేసినదంతయు మనకు మేలే! చేయుచున్నదంతయు మనకు మేలే! చేయఁబోవున దంతయు మేలే! ఇచ్చినదంతయు సుఖమే ఇచ్చుచున్నదంతయు సుఖమే. ఈయఁబోవున దంతయు సుఖమే. భాగవతోత్తములందఱలోఁ బ్రపంచమున నున్న వస్తువులన్నిటిలో నారంగదేవుఁడు దివ్యమంగళ విగ్రహుఁడై మందహాసనుందరవదనారవిందుఁడై మనకు దర్శనము కటాక్షించుచుండఁగాఁ బ్రపంచమునఁ గష్టమేది? నాకున్నవారు భక్తవరదుఁడైన యారంగఁడు భాగవతోత్తములగు మీవంటివారు. వీరికంటె మఱియెవ్వరు లేరు. తల్లిలేదు. తండ్రిలేఁడు. సోదరుఁడు లేఁడు. పెండ్లి లేదు. ఇల్లు లేదు. యోగ్యత లేదు. ఏమియు లేదు. ఎక్కడఁ బుట్టితినో యెప్పుడు పుట్టితినో నే నెఱుఁగను. జరిగిపోయినదానిని గూర్చి చింతరాఁదగినదానినిగూర్చి యోజన లేదు. అడియేని కాలయములో దొరకినప్రసాదము ముందుగా నతివృద్ధులగు రిక్తులకు గ్రుడ్డివాండ్రకుఁ గొంతబెట్టి-పుట్టలయొద్ద చీమలకుఁ గొంత విదిర్చి శిష్టాన్న మేమైననున్న యెడలఁ దిందును. లేనినాఁ డదియును లేదు. భక్తులారా! రంగనామముతోఁ గడుపు నిండించుకొన్నమనకు-రంగదర్శనమునఁ గన్నులు నిండించుకొన్న మనకు రంగసేవచే మనస్సు నిండించుకొన్నప్పు డాఁకలియగుట కేమి యవకాశ మున్నది? భాగవతోత్తములారా! ఏమియు నక్కఱలేదు. ఒక్కభాగవతోత్తముని జూచినయెడలఁ బంచభక్ష్య పరమాన్నములతోవలెఁ గడుపు గిట్టుననిండును. భాగవతోత్తములు చేరినచోటులందెల్ల రంగఁ డుండితీఱినాఁడు. రంగఁడున్నచోటులందెల్ల భాగవతోత్తము లుండితీఱినారు. మీ యీ సంఘమున రంగదేవుఁ డుండుటఁబట్టియే యిందఱు నాతల్లులు-ఇందఱు నాసోదరు లిచ్చట

చేరినారు. ఇప్పుడు పెద్దపెద్దసంత లున్నవా! అక్కడ రంగఁ డుంటఁబట్టియే యందఱుభక్తు లచ్చటికిఁ జేరుచున్నారు. పెద్దపెద్ద కోర్టులున్నవా? అందఱు భాగవతోత్తము లట కేల వేంచేయుచున్నారు? అక్కడ రంగడుండుటఁబట్టియే! అంతకంటె వేఱుకారణము చెప్పు టకు సాధ్యమగునా? రంగనామస్మరణ మొనర్చుకొనుచు నెందఱో భక్తశిఖామణులిప్పుడు కాఁగృహములకుఁ బోవుచున్నారు–కాదా? వారూరకపోవుచున్నారా! రంగఁడచ్చట నుంట చేతనే? అతనిని దర్శించుటకే పోవుచున్నారు. రంగ రంగ రంగా రంగ! ఇప్పుడు కొందఱు–కొందఱు భాగవతోత్తములు–చేరి స్వార్థపరిత్యాగమునుగూర్చి శాంతినిగూర్చి యుపన్యాసము లిచ్చుచుండగా నచ్చటచ్చటఁ జూచితిని. అడియేని కాయుపన్యాసము లానందమిచ్చినవి. ఈ స్వార్థపరిత్యాగమును గూర్చియే శ్రీమద్రామానుజయోగిచరిత్రము న–శ్రీమతేరామానుజాయనమః–ఒక్కచిన్నకథయున్నది. అక్షరాస్యుఁడనుగాని కారణ మున దానిని బెద్దలవలన వింటిని. ఎట్లునింటినో యట్లు మనవిచేసికొందును. మనవిచేసికొను మని భక్తులయాజ్ఞయేనా? (అభ్యంతమేమి యని సభలోఁగేకలు.)

భక్తవర్యులారా! అదిగో శేషాంశసంభవుఁడైన శ్రీమద్రామానుజ యోగిపుంగవుఁడు. ఆహాహా! ఎట్లున్నాఁడో చూడుఁడు!

ముద్దుమొగంబు కెంజిగురుమోవి దయారసమొల్కు పల్కులున్
నిద్దపుఁజూపులున్ బసిఁడినిగ్గులుదేరెడు మేనుతీరుగా
దిద్దినయూర్ధ్వపుండ్రమును దెల్లనిజన్నిదమున్ ద్రిదండమున్
దద్దయు నొప్ప చిన్నశిఖదాల్చిన మాయతిరాజు గొల్చెదన్.

శ్రీమతే రామానుజాయ నమః. భాగవతోత్తములారా! భాష్యకారులవారిని దర్శించి తిరా! ఆహా! ఆహా! కావేరీపుణ్యనదీతీర్థమున స్నానమాడి యాయన వేంచేయుచున్నారు! కూడ నెందఱో శిష్యులు ద్రావిడవేదమును బఠించుచున్నారు. చూడుఁడు శిష్యులనఁగా సామాన్య శిష్యులా? దిగ్దంతులవంటి పండితులు శేషగుణసంపన్నులు దేవతాంతర మంత్రాం తర సాధనాంత రోపాయాంతరరహితులు అర్థపంచక జ్ఞాననిధులు మహాభాగవతోత్తములు యోగాభ్యాసపరులు. అట్టిశిష్యులనడుమ సూటిగ గోపురమువలెనున్న యోగిశిఖామణి ఆహా! యెందులో యాఁగిపోయినారు. ఆఁగి యాసందువంకఁ జూచుచున్నారేమి? అదిగో ఆసందునుండి పెద్దవీధికి వచ్చువారెవరో యెఱుఁగుదురా? ఆయనయే ధనుర్దాసుఁడు బహుబలాఢ్యుఁడు కొలఁది గొప్పధనముకలవాఁడు సంసారసుఖాతిలోలుఁడు. భార్య దాసుఁడు. అదిగో ''ఁడు. బారెడుకంటె నెక్కువ పై కెక్కనిబాలార్కునికాంతిచే భార్యమోము వాడిపోవునేమో యని యామెకు ఛత్రసేవ యొనర్చు, గాలిలోని పరాగరే ణువు లామెయాకర్ణాంత దీర్ఘనేత్రములలోఁ బడునేమో యని యామెకు వింజామర సేవ సేయుచుఁ బదచలనమువలన బడలి తూలిపోవునేమోయని యామెకుఁ జేయూత సేవఁజే యుచు నామెను విహారార్థ ముద్యానవనమున కెట్లు తీసికొనిపోవుచున్నాఁడో! ఆమె పద్మినీ జాతిస్త్రీలలోనిదఁట. నాకాగొడవయేమియుఁ దెలియదు. మనుష్యులలో నాకు హరిదాసజా తితప్ప మఱియొక్కజాతి గోచరింపలేదు. ఆమె మహా సుందరియఁట. నామట్టునకుఁ దిరుచూర్ణపుబుట్టకున్న సౌందర్య మామె మోములోఁ గానఁబడదు. నిర్భాగ్యుఁడైన యడి యేని యభిప్రాయమెందులకు? భాష్యకారులవా రాధనుర్దాసునివంక నెంతకరుణముగఁజూచు

చున్నారోడు మోహపాశాబద్ధుఁడై రాగలంపటుఁడై గ్రామ్యసుఖేచ్ఛారతుఁడై తరుణీదాసానుదాసుఁడై, యామెభర్త యెట్లు భ్రష్టుఁడైపోవుచున్నాఁడో యను హృదయఖేద మారామానుజయోగినేత్ర కమలములం దెట్లు విస్పష్ట మగుచున్నదో? ఛత్రాసేవచేయవలసి నది పరమేశ్వరునకా భార్యకా? చామరక్షైంకర్య మొనర్పవలసినది చక్రపాణికా? నతీమణికా? తరించుటకై దర్శన మొనర్పవలసినది పరమేశ్వరునికా భార్యకా? చామరక్షైంకర్య మొనర్పవ లసినది చక్రపాణికా? నతీమణికా? తరించుటకై దర్శన మొనర్పవలసినది దైవముఖమా తరుణీపృష్ఠమా? ఉదారపురుషుఁడు నిష్కళంకచిత్తుఁడు నైన ధనుర్దాసుఁ డీదారసౌందర్యకార ణమునఁ దత్త్వజ్ఞానాభావుఁడై దర్శనీయమైన వస్తువును దర్శింపక సేవింపఁదగినమూర్తిని సేవింపక పతితుఁడై పాడైపోవుచున్నాఁడే యనుదుఃఖము కరుణాసముద్రుఁడైన యాలక్ష్మణ యోగి శిఖామణి కనుగొలుకుల మౌక్తికమణిస్వరూపమున నూరు కోహినూరుల కాంతితో నెట్లు మెఱసిపోవుచున్నదో చూడుఁడు. ఆహాహా! లలితలలితమై సుకుమార సుకుమారమై కోమల కోమలమైన యాదయాస్వరూపుని చిత్తముముందు శిరీషకుసుమము శిలా ప్రాయమనఁదగినది కదా! పరకష్ట లేకచ్ఛాయనైన నామహాత్ముఁ డొర్వలేఁడుకదా! ప్రపంచక ష్టము లన్నిఁటిలో భగవచ్ఛింతాశూన్యతకంటెఁ గష్టమున్నదా? తినుట కొక్కకబళమైన లేకుండట కష్టముకాదు. కట్టుకొనుటకు కొక్కచింకిపేలికయైన లేకుండుట కష్టముకాదు. తలదాచుకొనుటకు రవంతతానైన లేకుండుట కష్టముగాదు. సతీసుతబలాత్కారమృతి యైనఁగష్టముకాదు. అన్నికష్టములలో మహాకష్టము ప్రపంచలాంపట్యము. స్వకీయోత్తరగతి భ్రష్టతకు సంపూర్ణముగ సిద్ధవడి వరతార్మునకై పాటుపడిన స్వార్థపరిత్యాగి సార్వభౌముఁ డగు రామానుజులహృదయములోని దయారస మెంతలోఁతుగలదియో చెప్ప సాధ్యము గునా? మూఁడు 'ఎవరెస్టు' పర్వతములైన దానిలో సూక్ష్మముగ సునాయానముగఁ గబుళైనలే కుండ మునిఁగిపోవునే! ఆహాహా! భాగవతవర్యులారా! అటు చూచుచున్నారా! రామానుజులు తనదారివదలి ప్రక్కబారుగధనుర్దాసున కెదురగఁ బోవుచున్నాఁడే! ఆహాహా! కాంచినుండి తిరుపతినుండి శ్రీపెరంబుదూరునుండి కాశీక్షేత్రమునుండి కుండలాలపండితులు శిష్యరిక మునకై, సేవకై రామానుజసన్నిధికిఁ, గృతాంజలులై వచ్చుచుండఁగ, నామహనీయుఁడు పాదచారియై పరితాపపరీవృతవదనపద్ముఁడై బాష్పపరిచ్ఛన్న నేత్రపుండరీకుఁ డై యొక్క భవపంకనిర్మగ్నమలీమన మానసునియొద్దకు–భార్యాకింకరాధమునియొద్దకు–అతనినిఁ దరింపఁజేయుటకుఁ బోవుచున్నాఁడే! సముద్రమునఁబడి మునిఁగిపోవుచున్న మానిసిని బ్రతికించుటకై యబ్ధి కడ్డుపడిన యీఁతకాఁడు దయాళుఁడుకాఁడు. కాలి దిగఁగూలిపోవు చున్న యింటిలో నేమూలనో మ్రగ్గిపోవుచున్న మునలియాఁడుదానిని బ్రతికించుటకై మంటలలోదుమికిన సాహసికుఁడు దయాళుఁడు కాఁడు. తుచ్ఛసుఖపరంపరాభిరతుఁడై, కాంతాకనకా దేవతావిగ్రహారాధనతత్పరుఁడై యింద్రియలోలుఁడై, శుద్ధచపలుఁడై, నాస్థికమా ర్గవలంబుఁడై పాడైపోవుచున్న మనుజుని మతములోని కాకర్షించి ప్రపంచసుఖవిరక్తి కలుగఁజేసి దైవపాదపద్మములఁబడనైచి యధఃపతనమగుచున్న యాత్మకూర్ధ్వగతినిచ్చి తరింపఁజే యునాతఁడాహాయెంతదయాళుఁడో చెప్పనలవియగునా? ఆహా! రామానుజు లాధనుర్దాసుని బుజముపైఁ జేయివైచినారే! పద్మనేత్రపూజాభాగధేయమైన తనహస్తమును సంతత సతీపరీ రంభసంరంభసముజ్జృంభమైన యాతని బాహువునందు నిస్సంశయముగా నామహాత్ములుం చిసారే! కొక్కొకముమీఁద రామకోటిపత్ర ముంచినయెడలఁ గళాశాస్త్రమునకే కాంతికాని

తారకనామమున కేమయిన డాగున్నదా? సాలగ్రామము రూపాయలగోతములోఁ బడినయెడల రూపాయలసంచి విలువయే హెచ్చినదికాని సాలగ్రామపువిలువ తగ్గలేదే. ''నాయనా ధనుర్దాసా! పరమసుకుమారయై పద్మినీజాతినంభవయై బహుసుందరస్వరూపిణియైననీ భార్య నీకు మహానందమిచ్చుటచేతనేకదా నీ వామెకింతవశుఁడవై ప్రపంచసుఖైకతత్పరుఁడవై పామరత్వమునఁ బ్రాకులాడుచున్నావు?'' అని రామానుజు లాతనినిఁబ్రశ్నించిరి. ''ఔను! మహాత్మా! ఆమెస్వరూపసౌందర్యము–ఆమె ఛాయాసౌందర్యము ఆమెవదన సౌందర్యము –అన్నిటినిమించిన యామెనేత్రసౌందర్యము–న న్నామెకుఁ బాదాక్రాంతునిగఁ జేసినవి. నాబ్రదుకు నానుఖము నానర్వస్వమామె యాకర్ణాంతవిశాలనేత్రాంచలమున నున్నవి'' యని ధనుర్దాసుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ''నాయనా! ధనుర్దాసా! నీయిల్లాయఖిసౌందర్యము కంటె, సహస్రగుణాధికసౌందర్య నమనిత్వములగు కన్నులను నేను నీకుఁ గానఁబఱచినయెడల నీవు వీనియందుఁ గొంతవైముఖ్యమును వహించియుండఁగలవా?'' యని నన్యాసి నంసారిని నతియెదుట సందేహశూన్యముగఁ బ్రశ్నించెను. ''స్వామీ! అభ్యంతరమేమి?'' యని ధనుర్దాసుఁడు పలికెను. అటుపైని నావెంటరమ్మని యాతనిభుజముమీఁదఁ దనచేయినుంచియే శ్రీరంగేశ్వరునియాలయములోని కాతనిఁ గొనిపోయెను. శిష్యులు రామానుజమతమున కేగిరి. భాగవతోత్తములారా! అదిగో రంగఁడు మనకావేరిరంగఁడు. కస్తూరి రంగఁడు. తర్వాపై దులసి, యధరమున నలౌకికతేజన్వంతమైన మందహాసము, మెడను గౌస్తుభము, వక్షమున శ్రీదేవి, పిరాట్టి కటిని పీతాంబరము, పాదనన్నిధిని భూనీళాదేవులు, ఆహా! ఒత్తిగిలి శేషశయనమునఁ బండుకొనిన యాజగదాధారుని-యాసౌందర్యరాశిని, భాగతోత్తములారా! కన్నులారాఁ జూచితిరా!

''కుడదిశై ముడియై వైత్తు క్కుణదిశై పాదంనీట్టి
వడదిశై పిన్బుకాట్టి తెన్నిశై యిలంగైనోక్కి
క్కుడల్ నిఱక్కుటవుళెందై యరవణై త్తుయిలుమాకం
దుడలెన క్కురుకుమాల్ వెన్శెయ్గే నులగత్తిరె''

అని తొండరడిప్పొడియాళ్వారు సాయించిరిగదా! శ్రీరంగేశ్వర తిరువడిగళే శరణం. ఎంబెరుమానార్ తిరువడిగళే శరణం. అళగైమనవాళ్ నయనార్ తిరువడిగళే శరణం. (అని లెంపలు వైచుకొనుచున్నాఁడు) అదిగో లక్ష్మణయోగిశిఖామణి! ధనుర్దాసునికన్నులు కడుగుకొమ్మని తన కమండలువులోని పవిత్రోదకము నాతనిచేతిలోఁ బోసినాఁడు. కన్నులఁ గడిగికొని ధనుర్దాసుఁడు శ్రీరంగమూర్తికన్నులవంకఁ జూచుచున్నాఁడు. ఒక్కత్రుటికాలము చూచి శరీర ముప్పొంగఁ బులకలెత్తఁగంపింపఁ బంచప్రాణములు గొంతుములోఁ స్తంభింప రంగ రంగ రంగా యని గర్భాలయ మదఱునట్లు గట్టిగఁ గేకవైచి యాధనుర్దాసుఁడు రామానుజులబాహులందు నిశ్చేతనుఁడయి పడిపోయెను. కమండలూదకమును గొంత యాతనిపైఁజల్లి రామానుజు లాతని నీవలికి మెల్లఁగదెచ్చినారు. ధనుర్దాసుఁడు కన్నులఁ దెఱచి చూడఁగా రామానుజులు రవంతదూరములో నున్నారు. పైటచెఱుఁగుచేభార్య యాతనికి విసరుచుఁ బ్రక్కనే యుండెను. ''పో! ఆవలికిబో! నీవు నాకక్కఱలేదు'' అని భార్యను గద్దించి ''గురూత్తమా! యోగిశిఖామణీ! నాకిప్పుడే సన్యాస మిప్పింపుఁడు. నేనిఁకఁ బ్రపంచసౌఖ్యలంపటుఁడనయి యుండఁజాలను.'' అని వలవల నాభాగవతోత్తముఁ

డేడ్చుచున్నాఁడు. చూచితిరా! భాగతోత్తములారా! దేవుని కళాలేశమయినఁ గాంచినవానికి దిక్కుమాలిన ప్రపంచసంబంధము కావలయునా? రామానుజుఁ డాయన కాశ్రమ మిప్పిం చుట కిష్టపడక వారి నింటికిఁబంపివైచి తాము తమమఠమునకు వేంచేసిరి. ఇట్లనుదినము రామానుజులు కావేరీస్నాన మొనర్చి పండితశిష్యులను వెంటబెట్టుకొని ధనుర్దాసుని యింటి ప్రక్కనుండి పోవుచు నాతని బిలిచి యాతనిభుజముపైఁ జేయివైచి శ్రీరంగేశ్వరుని యాలయ ములోనికిఁ దీసికొని పోవుచుండెడివారు. యతిరాజ శేఖరులగు రామానుజులు స్నానానంతర ముగూడ నిట్టుల బ్రాహ్మణుఁడగుధనుర్దాసుని స్పృశించుట రామానుజశిష్యులలోని బ్రాహ్మ ణపండితుల కందఱకుఁ గడుదుస్సహముగానుండెను. పండితులలో గుసగులారంభముల యినవి. వెక్కిరింపులు విజృంభించినవి. మూడుమాటలు తలసూపినవి! పలుచపలుచగఁ దిట్లు బ్రబలినవి. ఇతఁడు బ్రాహ్మణాచారశూన్యుఁడని కొందఱు–ఇతఁడు వర్ణసాంకర్యమునకు మతధ్వంసమున కవతరించిన కలిపురుషుఁడని కొందఱు–మొదట గోడచాటును-తరువాత రామానుజులు మొగముచాటున ననుకొని యనుకొని తుదకుఁ దెగించి రామానుజులనన్న దినే వినుగుఁదల మాటలతో విధేయతారహితప్రవర్తనములతో నధిక్షేపణములతో, బహిరంగ నిందలతో నందఱుకూడఁ దమయంతరగములందలి యసహ్యతను వెల్లడించిరి. ఆహాహా! ఎట్టియుత్తమునికైనను సమకాలికులవలన నిందలు తప్పవు కదా! రామానుజులు వారి నిందావాక్యములను మందహాసవదనముతో విని యూరకుండెను గాని మామూలుచర్యమా త్రము మానలేదు. శిష్యులందఱు స్నానార్థమై పోయినప్పుడు గడచినరాత్రి మఠములో నాఱవైచిన వారి మడిబట్టలు నన్నిఁటికొసలుచింపుమని రామానుజులవా రొకనమ్మకమైనవాని కాజ్ఞాపింపఁగా వాఁ డట్లు చేసెను. స్నానముచేసివచ్చి శిష్యులు తమతమ మడివస్త్రములనుదీ సికొనఁబోవుచు ''అడడా! అడడా! ఇదెన్న! ఇదెన్న! అద్భుతమాయిరికె. ఇంగెతన్కరవన్ యారు? నల్లతుణ్ణియెల్లభ్రష్టయిపోచి'' యని కేకలువైచుచుఁ గీరుగారనుచుఁగీసరకాసరమ నుచు, థూకరించుచుఁ, జీకొట్టుచు-ఉన్ ముర్దాడ్! ఉన్ చోర్ అని యొకరినొకరు తిట్టుకొనుచుఁ గలియఁబడి కొట్టుకొనిరి. రామానుజులు మందహాసమొనర్చి యూరకుం డెను. పదిదినములు దాఁటినపిమ్మట నొకరాత్రి తనకు విశ్వాసపాత్రము లగు నిద్దఱు శిష్యులను బిలిచి ధనుర్దాసు నింటికిఁబోయి యాతనిభార్య యొడలిమీఁద యాభరణములఁ దెండని రామానుజులు వారి కాజ్ఞాపించిరి. వారట్లాహరిభక్తు నింటికిఁ బోయిరి. భార్యాభర్తలు వేఱువేఱుశయ్యలపైఁ బండుకొని యుండిరి. దొంగలురాఁగానే ధనుర్దాసునకు మెలఁకువకలి గెను. కాని కన్ను లఱమూసికొని లోలోన రంగనామస్మరణ మొనర్చుకొనుచుండెను. దొంగలు ధనుర్దాసుని భార్యయొద్దకువచ్చి నిలువఁబడిరి. ఆమె యొత్తిగిలి పండుకొనియుం డెను. ఒకచెవి దుద్దును ఒకచేతితట్టువంకియు నొకముంజేతి గాజులును నొకకాలి నూపుర మును దస్కరించిరి. ఇవితీసికొనుచుండఁగనే యామెకు మెలఁకువవచ్చెను గాని కదలకుండ యామె పండుకొనియుండెను. ఒకపార్శ్వమున నున్న వస్తువులన్నియు వారు తీసికొనినపి మ్మట నామె రెండవపైపున కొత్తిగిల్లెను. ఆమెకు మెలఁకువకలిగినది కదాయని జడసి శిష్యులు పాఱిపోయిరి. తెల్లవారుచుండఁగనే ధనుర్దాసుఁడు భార్యనువెంటఁబెట్టుకొని రామానుజమఠ మునకు వచ్చి సామీ ''ఈమెవలన మహాభాగవతాపచారము కలిగినది. ఈమెను మీరు శిక్షింపవలయును. నాకు నన్యాయమును గటాక్షింపుమని యెంతప్రార్థించినను మీకు దయరా లేదు. ఇప్పుడైన దయయుంచి దాని ననుగ్రహింపవలయును.'' అని తాను రామానుజుల

కాళులకు మ్రొక్కి భార్యచేమ్రొక్కించెను. ఈయల్లరి యేమియోయని శిష్యులంద ఱచట వేంచేసిరి. అంత రామానుజులు 'సతీమణీ మా అమ్మా! నీవలనఁ గలిగిన మహోపచారమే' దని యామె నడిగెను. ''మహాత్మా! తాము పరిశీలింపఁ గర్తలు. తమ రేశిక్షవిధించినను మహాభాగ్య ముగ - మహావిష్ణుప్రసాదముగ–స్వీకరింతును. నిన్నరాత్రి మాయింటి కెవ్వరో దొంగలు వచ్చిరి. నే నొత్తిగిల్లి పండుకొంటిని. వారొకపార్శ్వమునన్నున్న యాభరణములను మాత్రమే దీసికొని యొక్క-ఱెప్పపాటుకాలము నిలువఁబడియుండిరి. ఇదివఱకుఁ తీసికొననవస్తువు లతో వారికి సంతుష్టిగా లేనట్లున్నది? పాపము వారికి ధన మెంతయావశ్యకముగనున్నదో రెండవవైపువస్తువులు గూడ నారు తీసికొనుట కవకాశమిచ్చి పుణ్యము కట్టుకొనివలయునని, రెండవవైపున కొత్తిగిల్లితిని. నే నొత్తిగిల్లితిని గావున మేలుకొంటినని దొంగలు పాఱిపోయిరి. మహాత్మా నేనింతకంఱె నేమియుఁ జేయలే''దని యామె మనివిచేసుకొనెను. ''అదిగో తిరుగ నదియేమాటయా? రెండవవైపున నున్నవస్తువులు తీసికొనటు కవకాశమిచ్చుటకై యొత్తిగిల్లి తినని చెప్పుచున్నావు. అవకాశమిచ్చుదానవు నీవా? నీవిచ్చుటయు నీనగలు భాగవతోత్త ములు పుచ్చుకొనుటయునా? ఇచ్చుటకు నీవా కర్తివి. నీ కాస్వాతంత్ర్యమేల? నీకా యహంభావ మెందులకు? నీవొత్తిగిల్లుటచేతనే కదా యాపరమభాగవతులు –అసంపూర్ణమనోరథులై–పోవలసివచ్చినది! నీరెండవవైపు వస్తువులు వారికిఁ గావలసినయే యుండునెడల నిన్ను రెండవవైపున కొత్తిగించి యాపుణ్యాత్ములు వానిని దీసికొనియే పోవుదురే! శేషగుణసంపన్నురాలవై పడియుండకుండ నీవొత్తిగిల్లుటవలననే భాగవతాపచా రము సిద్ధించినది.'' అని ధనుర్దాసుఁడు భార్యను మందలించి యామెను శిక్షింపఁదగునని రామానుజులఁ ప్రార్థించెను. ఆహాహా! ఱాలు గరఁగిపోవలసినమాటలే, మోళ్లు చిగిరింపవలసిన మాటలే! పశువులకుఁ బాండిత్యమీయఁదగినమాటలే. ఆహా! అట్టినమయమున రామానుజు లేమి సాయించుచున్నారు! వినుఁడు. నాయనలారా! అమ్మా-స్వార్థపరిత్యాగము సంపూర్ణ ముగా గలదానవు నీవు–స్వార్థపరిత్యాగస్వరూపమే నీభర్త. శిష్యులారా! పండితులారా! స్నానమొనర్చి యాయబ్రాహ్మణుని నేను స్పృశించినందులకు మీరు నన్ననేకవిధముల నిందించితిరే. ఈయన యెట్టిమహనీయుఁడొ మీకిప్పుడు తెలిసినదా? బట్టలు మెడలకుఁ జుట్టుకొని యాయన కాళులకు సాష్టాంగదండప్రమాణమ మేల యాచరింపఁదగదు? ప్రాతగు డ్డలకొసలు–బెత్తెడో జేనెడో పోయినవని గిలగిలలాడిపోతిరే. కస్సుబుస్సని యొకరి నొకరు తిట్టుకొంటిరే–నీవే దొంగవు. నీవే దొంగవని యొకరి నొకరు కొట్టుకుంటిరె? అదియేనా మీస్వార్థపరిత్యాగమహిమ! ఇదియేనా మీవైర్యాగసంపత్తి! ఇదియేనా మీ తృష్ణానిర్మూలనశక్తి! నమ్మాళ్వారి తిరువాయిమొళిని సేవించితిరే. ఇతరములగు స్వరూపగ్రంథములన్నియు సేవించితిరే. రంగదేవస్మరణ సాంగత్యమునఁ బ్రకాశించుచుంటిరే. అక్షరజ్ఞానమైన లేని ధనుర్దాసుని కాలిగోటికొనానైనఁ బోలలేకుంటిరే! పండితులారా? మీరు ముక్తినొందఁగోరితి రేని పైపైవేషములతోఁ బనిలేదు. పైపై మాటలతోఁ బనిలేదు. ధనుర్దాసుని యంతరంగశుద్ధి వంటి యంతరంగశుద్ధిని గాంచుఁడు. అతని నిర్లిప్తతవంటి నిర్లిప్తతను బొందుఁడు. అతని నిశ్చలద్వైవభక్తిని గుదురుపఱచుకొనుఁడు. అవి రానంతవఱకు మీకీబంధములుండక మానవు.'' ఇట్లు రామానుజు లానతిచ్చి స్నానమునకై పోయిరి.

భాగవతోత్తములారా! నేను రామానుజచరిత్రమునుండి చెప్పఁదలఁచిన కథను చెప్పి తిని. ఉపన్యసించుట చేతఁగానివాఁడనగుటచేఁ గథలోనంగతి కొంత, నానంగతి కొంత

కలిపి కలగపులగముక్రిందఁ జేసి చెప్పితిని. క్షమియింపవలయును. శ్రీమతే రామానుజాయ నమఃఁ.

నాయనలారా! హరిదాసుని యుపన్యాసము నానందమునవింటిమి. ఈయన హృదయ పరిపక్వత దైవభక్తికలవారు. వీరు శ్రమచేసి యిచ్చటకువచ్చి యీసంఘమున నుపన్యసించు టచే వారికి మనముఁ గృతజ్ఞులము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిఃఁ.

29. తాండవకృష్ణుడు – తాండవశకంరుడు

జంఘాలశాస్త్రి తనకు వచ్చిన ఒకకల గురించి ఈసారి చెపుతున్నాడు. అతను రాత్రిభోజనమయ్యాక రాట్నంమీదనూలు వడుకుతూ కాస్సేపు కాలక్షేపంచేశాడు. ఇంతలో ఒక ఈగవచ్చి రాట్నం ఆకుమీద వ్రాలింది. దాన్ని రెండుసార్లు తరిమాడు. ఆ ఈగని చూడగానే మనిషికీ దానికీ స్థూల, సూక్ష్మదృష్టులలో సైతం ఏమిటి భేదం?–అని అలోచన కలిగింది. దానికి మనస్సుంటే, మనిషి మనస్సుకీదానికీ భేదం ఏమిటి? అనే ఆలోచన కలిగింది.

ఈ ఆలోచనలమధ్యనే జంఘాలశాస్త్రికి నిద్రపట్టింది. అందులో ఒక కల. మహాయుద్ధనావల తెలచాపలంతేసి రెక్కలు అతనికి మొలిచాయి. అతని కళ్లు తాజమహలుపై గుమ్మ్లంత పెద్దవైపోయాయి. అతను ఆకాశంలో ఎగురుతున్నాడు. బృహస్పతి గోళానికి వెళ్లాడు. అక్కడ విలాసజీవితంచూశాడు. చార్వాకుల్ని చూశాడు. అంతలో తలతిప్పి భూమివైపు చూశాడు. కుజగోళం, శనిగోళం మొదలైన గ్రహాలన్నీ సూర్యుడిచుట్టూ తిరుగుతూ కనిపించాయి.

అలా భూగోళంవైపు జంఘాలశాస్త్రి చూస్తుండగా భూచక్రం ఇటూ అటూ తిరుగుతూ, మారుతూ, రెండు గొప్పదృశ్యాలు కనిపించాయి. ఒకటి: క్షీరసాగరమధనం. రెండవది: బాలకృష్ణుడు కాళీయుణ్ణి మర్దించడం.

ఈరెండు దృశ్యాలలో మహత్తరత్యాగం, బాలకృష్ణ తాండవంలోనూ, శివతాండవంలోనూ గల జగన్మోహన సౌందర్యం జంఘాలశాస్త్రిని ఒక దివ్యకాంతిలో ముంచింది. కలకరిగిన జంఘాలశాస్త్రి మేలుకొని బాగాపొద్దెక్కిందని గ్రహించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! రాత్రి యొకవింతయైననవ్వప్నము వచ్చినది అది యేదో చెప్పెదను. అది యెట్లారంభమయ్యెనో జ్ఞప్తిలేదు. రాత్రిభోజనమైనపిమ్మట గొంతసేపు బత్తిరాట్నము గూరుచుంటిని. ఏకులువడుకుకొనినట్లా మగనియొద్ద జోండుకొనినట్లా? యనుసామెత మనకున్నది. ఆహారపచనార్థకపోషణాశన భక్షణాది కార్యములైన పిమ్మట

స్త్రీలకుఁ జేయఁదగిన పనులు రెండే–ప్రత్తిరాట్నము నొద్దనైనఁ గూరుచుండవలయును. లేదని భర్తయొద్దనైనఁ బండుకొనవలయును. నువాసినులగు సుందరుల కందఱకు భర్తలకొలువుకంటెఁ బ్రత్తిరాట్నపుఁగొలువు ముఖ్యమైనది. కావుననే దాని కీసామెతయందుఁ బ్రథమస్థాన మీయఁబడినది. మగువలకు విధ్యుక్తమయిన యాయేకులు వదుకుకొనుట మగలకుఁ గూడ నిప్పుడు విధ్యుక్తమైనది. మృదులతరమైన వ్రేళ్లుగలవారగుటచేఁ గాంతలుతీసినదార మెక్కువసన్నముగ నాణెముగ నుండునని మొదట రాట్నము రమణీమణుల యధీనముజేయఁబడినమాట నిజమేకాని యీకాలములోఁ గట్టుగుడ్డకు నన్నమేమి ముదుకయేమి? ఏదియో యొకటి యున్నఁజాలును. రొట్టకట్టులేకుండినఁజాలు. అట్లు రాట్నము నుద్రిప్పుచు జోపటిసాక్ష్యుపన్యాసము దేనినిగూర్చి చెప్పుదునా యని యోచించుకొనుచుంటిని. ఇంతలో నొకపెద్దయీఁగ రాట్నపుటాకుపై వ్రాలినది. రాట్నము నాఁపి యీఁగను ద్రోలివైచి తిరుగఁ ద్రిప్పుట నారంభించితిని. ఈఁగ తిరుగవచ్చి యాకుపై వ్రాలినది. మఱల దానిని ద్రోలివైచితిని. రాట్నము పాడుచున్నపాట వినుటకేయది వచ్చియున్నదో రాట్నముతోఁబాటు గిరగిరతిరుగుట అంకురరాట్నములోని బాలకునికివలె, దానికి ముచ్చటగనుండటచే వచ్చియున్నదో, యెవరు చెప్పఁగలరు? మనలోనున్న మనమనస్సే మనకుఁ దెలియదే? ఇకఁ బరమనఃపరీక్ష మనకెట్లు సాధ్యము? ఎందులకో యొకందులకు రాట్నముపై నది వ్రాలినది. పోనీ! దానిజోలి మనకేలయని యనుకొని కొంతసేపు దారముతీసి, తీసినదారమును భద్రపఱచి పండుకొంటిని. కాని దృష్టిమాత్ర మీఁగమీఁదనే యున్నది. ఆహాహా! స్థూలముగఁజూడ సృష్టిలో నీఁగ యెంతసూక్ష్మమగు వస్తువో? కాని సూక్ష్మముగఁ జూడ నది యెంత స్థూలమగువస్తువో చెప్పశక్యమగునా? యంత్రసాహాయ్యమున దానికంటిని బరీక్షించి చూడుఁడు దానిలోని చిత్రములన్నియు నవిస్తరముగ గ్రహించుటకు మనుజునియాయువుచాలదు. తలత్రిప్పకుండ ననన్నివైపులఁగూడ నీఁగ చూడఁగలిగినప్పుడు తచ్ఛక్తిలేని మనుజుఁడు దానికంటె ఘనుఁడని చెప్పుట కేమి యవకాశమున్నదో యోజించుకొనుఁడు. ఆ! అదేమిమాట? మనజునకు మనస్సున్నదికాదా? అందుచే నాతఁడు సర్వోత్కృష్టుఁ డేల యనరాదందురాయేమి? అబ్బ! మనస్సా! అది యీఁగకు లేనట్లు మీకెట్లు తెలియును? మీమనస్సులకుఁ గొన్నిశక్తులున్నవి. దానిమనస్సుకు మఱికొన్ని శక్తులున్నవి. దానికున్న మనశ్శక్తులు మీకు లేకపోవచ్చును. మీకున్న మనశ్శక్తులు దానికి లేకపోవచ్చును. మీకున్న మనశ్శక్తులు దానికి లేకపోవుటచేత మీరు దానికంటె గొప్పవారని యనుకొనుట యెంతన్యాయమో దానికున్న మనశ్శక్తులు మీకులేకపోవుటవలన తాను మీకంటె నెక్కువయని యది యనుకొనుటయు యంతేన్యాయముకాదా! సర్వశక్తులే ప్రాణిమనస్సునకును గూడ లేదను మాట స్పష్టమే గద! అట్టిచో మనుజుని ఘనతయేదో మక్షిక నీచతయేదో నాకు గోచరించుట లేదు. ఈఁగతొక్కలోనియింద్రధనువులసౌందర్యమును–వెల్లడించుటమాటయటుంచుము –సమగ్రముగ గ్రహించి యానందించుటకైన మనుజునకు మనస్సున్నదా? అని యిట్లెదో మనస్సులో నిమ్మళముగ యోజించుకొనుచుఁ బండుకొంటిని. తరువాత నేమియోజించుకొంటినో, నాకు జ్ఞప్తిలేదు. వెనుకటి తేఁగసాగుడేదో యిచ్చటఁ దెగిపోయినట్లున్నది. ఈనడిమి వెలితియైనతరువాత స్వప్నమారంభమయ్యెను గాఁబోలు. నాకు మహాయుద్ధనావలకున్నంత తెరచాపలంతటి తొక్కలువచ్చినట్లయ్యెను. ఆతొక్కలదీఁది సౌదామనీలతలు శక్రచాపములు, శతసహస్రసంఖ్యాకములై వెలిఁగిపోవుచున్నవి. ముందున కుబికిన నావేత్ర

ములు 'తాజ్‌మహలు' పైనున్న పెద్దగుమ్మి యంతంతలని నే ననుకొంటిని. ఆంజనేయు లాకాశముననెగిరినట్లు పొక్కలసాహాయ్యముననే నెగురుచుంటిని. ఇట్లిగిరియెగిరి యొకగోళ ములోనికిఁ బోయితిని. బృహస్పతిభగవానునకు జయా! తారాభగవతికి జయా! యని మగకంఠములతోఁ గలసిన యాఁడుకంఠములతో హెచ్చరికలు వినఁబడుచున్నవి. ఆహా! ఇది గురుగోళముకాఁబోలు నని నే ననుకొంటిని. ఇక్కడివారందఱు చార్వాకమతస్థులే. వీరికి దైవచింత యనుమాటయే లేదు. దేహమేయాత్మ. భోగమే పుణ్యము. రోగమే పాపము. మృతియే మోక్షము. అంతకంటె మఱేదియు లేదు. చందనాదిచర్చలు, పుష్పకందుకక్రీ డలు, చుంబనాదివిలాసములు, పరీరంభసంరంభములు, నర్మాలాపకలాపములు, మద్యపానవి జృంభణములు, నెచ్చటఁ జూచిన స్త్రీపురుషలలో నెడములేకుండ జరుగుచున్నవి. మిడియ ములేకుండ నలపులేకుండ సొలపులేకుండ విసుగులేకుండ విరతిలేకుండ వారు జరిగించుచు న్నప్పు డవిజరగుటకేమి? ఆహాహా! ఆస్త్రీలసౌందర్య మేమని చెప్పవచ్చును? మన భూలోక మునందలి మనుజులలో మహాసుందరి యామగువలముందు 'బలాదూ'రునకైనఁ బనికి రాదు. వారి యొయ్యారపునడకలలో వారి కుప్పిగంతులలో వారి దాఁగుడుమూఁతలలో వారి జెట్టిపట్టులలో వారి చెడిగుడులలోఁ గొందఱు పైఁటకొంగులు కొందఱి గాగరాకొసలు కొందఱి జడకుచ్చులు నాకుఁ దగిలినవి. ఒడలు జలదరించినమాట సత్యము. తప్పొప్పు కొన్న తగవు లేదుకదా? ఈఁగనైయుండి నీకీ హావభావవిలాసము లెందుల కందురేమో? ఈఁగనైయున్నను గాడిదనైయున్నను మగవాఁడనైయున్నను నాఁడుదానినై యున్నను పైవేషమే వచ్చినది కాని లోపలనున్న నేను అనుతత్త్వము చచ్చినదా? నన్నుఁజంపినను జావని యాతత్త్వము నాలోన నున్నంతకాలము తలపైఁగత్తిరింపున్ననేమి కచమున్ననేమి? ప్రక్కల పొక్కలున్ననేమి? పృష్ఠమునఁ దోఁకయున్ననేమి? అచ్చటివారు వారివారి సౌఖ్యసం ధాన ప్రయత్నసంరంభములలో నన్నుఁ జూచినట్లు నే ననుకొనలేదు. కాని యాహా! అదియేమి! వారిలోఁ గొందఱు కొందఱు మాత్రమే-స్త్రీలయినట్లా? పురుషులయినట్లా? -స్త్రీలగుదురు పురుషులు నగుదురు. కాని వారు వేఱువేఱుగాఁ గానఁబడక శాశ్వతముగాఁ గలిసి గొనిపోయినారేమి? కుడిప్రక్కను మగవాఁడు, ఎడమప్రక్కను మగువ-నడుము స్థిరమైన యదుకు. స్త్రీపురుషల కేకశరీరమే యయిపోయినదే! ఆహా! వారు మరతలుపులవలె నొట్టు కలిసికొనుచున్నారు. అట్టి విడిపోవుచున్నారు. ఏమిచమత్కారముగ నున్నది! వీ రెవ్వరై యుందు రని నే ననుకొనుచుండఁగా నింతలో వేఱువేఱుస్వరూపములతో నున్న స్త్రీపు రుషు లచ్చటికి వచ్చి లెంపలువైచుకొని చేతులు జోడించుకొని మహాత్ములారా! నిత్యసంగు లారా! ప్రపంచసౌఖ్యపరమావధిపట్టభద్రులారా! నమోనమః నమోనమః యని మ్రొక్కిరి. వీరు చార్వాకమత మహావేదాంతులు కాఁబోలు! బృహస్పతిమత మహాయోగీంద్రులు కాఁబోలు! కానియెడల సామాన్యజనులు వీరి నిట్లు గౌరవింపనేల? మనలో యతిశేఖరు లెట్లో మతగురువు లెట్లో సర్వసంగపరిత్యాగు లెట్లో సంఘసంస్కర్త లెట్లో వీరిలో నీమహామూర్తులట్లుకాఁబోలు నని నే ననుకుంటిని. మన భూలోకమే భామాలంపటత్వమునఁ బ్రపంచసుఖ పరంపరానుభవ ప్రాబల్యమున భ్రష్టమైపోయినదేయని మన మేడ్చుచుండఁగా నీలోకము దాని నీడ్చి చెంపకా యకొట్టఁదగియున్నట్లున్నదే! పైలోకము పైలోకమన్న పే రిందులకా దీనికి వచ్చినది? పాపములోఁ బైలోకమా? భ్రష్టతలోఁ బైలోకమా? వ్యక్తులలోనేమి జాతులలోనేమి నాగరికత హెచ్చినకొలఁది ధనము హెచ్చినకొలఁది హెచ్చిపోవునది స్వార్థలోలతగాని స్వార్థపరిత్యాగము

కాదు. తరుణీచింతకాని దైవచింతకాదు. తృష్ణకాని విరాగముకాదు. రక్తికాని భక్తికాదు. ఈవిషయమున మనుష్యలోకమే పరమానహ్యముగ నుండఁగా గురులోకమని పేరొందిన యాలోకము మనలోకముకంటె సహస్రగుణము లధమమై యేడ్చుచున్నదేల యని యేమేమో యోజించుకొనుచు మన భూలోకమునకు శీఘ్రముగఁ బోవునెడల మిగుల బాగుగా నుండునేమోయని యనుకొంటిని. ముండ్లలో నివసింపవచ్చును. మంటలో నుండవచ్చును. కత్తులబోనులోఁ గాపురమొనర్పవచ్చునుగాని దైవచింత లేనిచోట మాత్ర మొక్కనిముషముండఁదగదు. అందులోఁ గేవల నాస్తికమతదుర్ణయభూయిష్ఠమైన యీలోక మున నుండుటెట్లు? ఎట్లు వచ్చితినో యట్లెగిరిపోవలయునని భూలోకమువంకఁ జూచితిని. ఆహా! ఆహా! అదిగో కుజగోళము! ఎఱ్ఱయెఱ్ఱగనున్నది. అదిగో శనిగోళము! నల్లనల్లగ నున్నది. ఆహాహా! గ్రహములన్నియు నూర్యునిచు ట్టిట్లు తిరుగుచున్నవో! ఒకరిచుట్టొకరు తిరుగవలసినప్రారబ్ధ మేలోకమునకుఁ బోయినను దప్పదు గదా? బానినవాఁడు నాయకుని చుట్టుచుట్టు తిరుగుచున్నాఁడు నాయకుడు సముద్దారుని చుట్టుచుట్టు తిరుగుచున్నాఁడు. సముద్దారుఁ డమీను చుట్టుచుట్టు తిరుగుచున్నాఁడు. అమీను ప్రధానుని చుట్టుచుట్టు తిరుగుచున్నాఁడు. ప్రభువుతా నుంచుకొన్నముండప్పృష్ఠము చుట్టుచుట్టు తిరుగు చున్నాఁడు. తనముద్దుల మగఁడైన గుఱ్ఱపుఁ గాసావాని చుట్టుచుట్టు తిరుగుచున్నది. ఆపంద తనకు త్రాగుడు మిత్రుఁడైనబానిస చుట్టుచుట్టు తిరుగుచున్నాఁడు. బానిసయొద్ద నుండి యారంభమైన యాశ్రయచక్రము తిరుగ బానిసయొద్దనే పూర్తియైనది. ఈ చక్రగమన నంప్రదాయ మన్నిదేశములలో నున్నది. అన్నిజాతులలో నున్నది. అన్నిగోళములలోఁ గూడ నున్నది. ఎందులకో యీగ్రహములన్నియు నూర్యుని చుట్టిట్లు తిరుగుట? నూర్యునకు మాత్రమేమి స్వాతంత్ర్య మేడ్చినదా! ఈ నూర్యమండలమువంటి మండల ములు లెక్కలేకుండ నున్నవి. ఇవి యొకదాని చుట్టొక్కటి తిరుగుచున్నవే! నిలుకడ యెవరికున్నది? స్థిమితత యెవరికున్నది. స్వాతంత్ర్య మెవరికున్నది? గిరగిర గిరగిర నోరుమూసికొని చచ్చినట్లు తిరుగుచున్నవారేకాని యెందులకుఁ దిరుగవలయునో యని రవంత నిలువఁబడి యోజించు కొనువారొక్కరును లేరే. నిలువఁబడునరికి పుంఖానుపుంఖ ముగ నుద్దండ వేగముతో వెనుకనుండి తఱుముకొని వచ్చు లక్షోపలక్షసంఖ్యలుకల వస్తువులుమీఁదఁ బడి త్రొక్కి దుమ్ము చేసి పోవనుండఁగా నిలువఁబడుట కవకాశ మేమున్నది! ఉన్నకానంతబుద్ధియైన నుపయోగపఱచుకొనుట కవకాశ మేమున్నది? ఉపయోగపఱచిన ఫలముమాత్ర మేమున్నది?

ఇతని నతఁ డీడ్చు వేఱొక్కఁ డతని నీడ్చు
నంద అందఱు నీడ్చు కయ్యంబె జగతి
అందఱు స్వతంత్రరాజు లూహాములయందు
బానిసలకంటె బానిసల్ పనులయందు.

అని యొకఁడు చెప్పినమాట యసత్యముగాదు. అందఱు బానిసలు, అందఱు బానిసలు ఒక్కపరాత్పరుఁడు తక్క స్వతంత్రుఁ డెవఁడు లేఁడు. ఆతఁ డెక్కడ నున్నాఁడో! ఏలాగున నున్నాఁడో! ప్రజాపన్నివారకుఁడగునో కాఁడో యని యాస్వప్నములోనే శుద్ధబుద్ధిహీనుఁడ నగు నేను మహావిద్యాంనాసివలె బూర్వపక్షరాద్ధాంతము లొనర్చుచు మనభూలోకమువంక

కోరుకొండమెట్టయంతలేసి గ్రుడ్డలోఁ జూచితిని. అదిగో! సముద్రమధ్యమునఁ గొండ! ఆహా! సముద్రమథనమాయేమి? కాకేమి? దేవత లొకవంక రాక్షసుల లొకవంక నదిగో? మందరపర్వతమునకు శేషాహిని జుట్టబెట్టి తరచుచున్నారు. ఒక్కయాఁడుది జైఁ జైఁ యని పురుగు తరచుచ్చునప్పుడే మనోహరముగా నుండునుగదా? మహాంభోధి మథనమెంతమనో హరముగా నుండునో చెప్పఁదరమా! కాని యూహాహా? అదియేమి! సముద్రమునుండి బయలుదేఱున దదియేమి? పొగయా? కాదే! పొగకంత వేఁడిమియుండునా! మంటలా? కానట్లున్నదే? మంటలు నల్లగానుండునా! గోదనీకుహరమంత వ్యాపించుచున్నవే అయ్యయో! నక్షత్రములు నల్లనైపోయినవి. గ్రహము లన్నియు నల్లబడిపోయినవి. పాలసము ద్రమంతయు నల్లబడిపోయినది. హాహా! జగతి తపించిపోవుచున్నది. సురాసురులు మహాభీత చిత్తులై మథనమును మానివైచినారు. మందరము కదలకుండ నిల్చియున్నది. శేషుఁ డూపిరితీసుకొనుచున్నాఁడు. ఎంతాతాపమైన భరించవచ్చునేమో కాని యీతాపములో నీగాలేమి? కొఱ్ఱేమి? ఈగొఱ్ఱేమి? ఈవాసనదగిలిన ప్రతిజీవము కూడ మత్తుచే సొమ్మసిల్లి పడిపోవుచున్నదే! దేవతలు రాక్షసులు కూడ జైతన్యములు దక్కియున్నారే. బ్రహ్మయు విష్ణువు నటకు వేంచేసి శంకరా! ఈలోకాపదను బాపుమని మొఱ్ఱలిడుచున్నారు. అదిగో! శంకరభగవానుఁడు శాంకరీసహితుఁడై విచ్చేసినాఁడు! స్వామీ! అకాలజగత్ప్రళయమును నిరోధించి రక్షింపవా యని స్మృతినొందిన జీవు లన్నియుఁ గేకలువైచుచున్నవి. అప్రతిహత ప్రాబల్యముతో, అవాఙ్మనసగోచరధాటీపటిమతో, హాలాహలము విజృంభించుచున్నది. దాని భయానకత కోర్వలేక బ్రహ్మ విష్ణువులు పరమేశ్వరుని జగదవన మొనర్పుమని తిరుగఁ బ్రార్థించుచున్నారు. శంకరుఁ డాజగత్ప్రళయప్రతీకాశమగు సన్నివేశమునుగాంచి శాంభ వివంకఁ జూచుచున్నాఁడు. శాంభవీదేవి ''ప్రాణనాథా! నందేహింపకుము. మన కెంత బాధయయిన నగునుగాక! లోకమును రక్షింపుము. ఆహాలాహలమును మ్రింగుము. ఆలస్య మొనరింపకు'' మని భర్తతోఁ బలికెను. హహా! త్రిలోకజననీ! కరుణాలవాలా! వీరపత్నీమణీ! చుని యచ్చటివారెల్ల రామెను గొనియాడుచున్నారు. అదిగో! అయ్యయో! ఇఁక ముందరి చర్య యేదియుఁ గనఁబడకుండ భూమి రెండవవైపునకుఁ దిరిగిపోయినదే! కాని యీ రెండవపార్శ్వమున నేమున్నది?

అదిగో పెద్దమడుగు, దానిలో నొక్కకాలాహి! మడుగులోదిగిన పశువులనెల్ల జంపుచు న్నది. ఎందఱుపిల్లలనో మ్రింగినైచినది. ఎందఱుకాంతలనో యది నోటఁ బెట్టుకొనినది. ఊరంద ఱోడ్చుచున్నారు. యశోదాదేవియొద్దకు వచ్చుచున్నారు. తల్లీ! లోకనాథుఁడైన కొడుకును గంటివి. చనుబాలతోఁ బూతనపంచప్రాణములను గ్రోలినబిడ్డఁడు. మహావిష్ణువు కాని మనుజుఁడు కాఁడు. కాళియనాగేంద్రుని బాధ సహింపలేకుండ నున్నాము. నీకొమరు నటకుఁ బంపి యాపామును జంపించి వ్రేపల్లె నుద్ధరింపుమమ్మా యని యాక్రోచించుచు న్నారు. అదిగో శ్రీకృష్ణుఁడు!

మెరుఁగుగుండలముల మిసమిసల్ గండభా
గములపై నట్టిట్టు గంతులిడగ
రంగారుఁగట్టిన బంగారుపుట్టంబు
చిరుబొజ్జనుండి కొంచెముగ జాఱఁ

బవనపూరణమున జవుజవ్వమని లేఁతఁ
బుగ్గలు బూరలై పూరటిల్ల
నిగనిగఁ గలగుజ్జు సిగనున్న శిఖిపించ
మెయ్యారమునఁ దల యూపుచుండ
నుత్తమోత్తమజన్మమై యొప్పుమురళి!
నధరమునఁ బూని జల్లల్లు మనఁగ జగతి
గానమునజేయు కల్యాణకాంతు లొలుకు
తేజములకెల్ల తేజమౌ తేజ మదిగొ!

అదిగో! యీమహానుభావునకు జన్మించినపుణ్యరాశి! ఆమెచేయిపుట్టుకొని నిమ్మళముగ మడుగునొద్దకు వచ్చుచున్నాఁడు. అచ్చటి యీబాలగోపాలమంతయు మహారోదనరావ ములతోఁ దమకుఁ గలిగిన మహాసంక్షోభమును వెల్లడించుచుఁ దల్లీ! మమ్ము రక్షింపుము. అని దీనాలాపములఁ బ్రార్థించుచున్నారు. మడుగులోని కాళాహి యీకలకల మంతయు నాలకించి తీవ్రకోపోద్రేకమున విషవహ్నులను గ్రక్కుచున్నది. వ్రేపల్లెలోని స్త్రీపురుషులు భయకంపితులై యేడ్చుచున్నారు. అంత యశోద ''నాయనా! కృష్ణా! నీవేమో మహిమములు గనపఱచితివని వీరు చెప్పుచున్నారు. నేనుగూడ వానిని జూచియేయుందును. చూచిన రవంతసే పెట్లో యుండును. ఆస్థితి యేదో నేను జెప్పఁజాలను. కాని యుత్తరక్షణమునుం డియే యదియెల్ల మఱపు. కాని నాకా యనుభవముకంటె నాయనా! నిన్నొడిలోఁగూరుచుండఁబెట్టుకొని తలతదువ్వి పూలుదురిమి శిఖిపించమును సవరించి బొట్టుపెట్టి నీమోమునకు దృష్టి తగులునేమో యనుభయమునఁ గన్ను లరవ్రాల్చినిన్ను ముద్దుపెట్టుకొనుటవలనఁ గలుగుచున్న యీయనుభవమే యనేకగుణము లధికముగాఁ గానిపించుచున్నది. నాయనా! ఆర్ద్రహృదయనగుటచే వీరందఱుపడుబాధ చూడలేకుండను న్నాను. నీవేమో వారిని రక్షింపఁగలవని వారంద ఱనుచున్నారు. నేను నీతోఁగూడ వత్తును. నాతండ్రీ! వారిని రక్షింపఁగలిగినయెడల రక్షింపుము. పరోపకారముకంటె బ్రదుకున కేమి వినియోగము'' అని శ్రీకృష్ణభగవానునితోఁ బలికెను. ''ఆహా! పరకష్టనివారణమునకై కొడుకును బామునోటఁబడమని చెప్పుచున్న యీకాంతాలలామ ప్రపంచమున కలంకారము కాదా! ఆహాహా!'' యని యాకాశవాణి పలికిన ట్లయ్యెను. అయ్యయ్యో! అదియేమి? భూవలయము తిరిగిపోయినదే! తిరుగమొదటిపార్శ్వ మెదుట గనఁబడుచున్నదే!

ఆహా! అదిగో శంకరభగవానుఁడు! ''నాథా! నాథా! హాలాహలమును మ్రింగుము మ్రింగు'' మని శాంకరీ భర్తను ప్రోత్సహించుచున్నది. శంకరుఁడు భయంకరస్వరూపుఁడై 'హా' యని నోరుతెఱచి హాలాహలమును కబళించినాఁడు. హాహా! అద్భుతము! అద్భుతము! మహాద్భుతమని యచటివారంద ఱుచ్చైస్వరమున నుచ్చరించుచు మహాదేవశంభూ! మహాదే వశంభూ! యని ప్రార్థించిరి. హాలాహలభక్షణమున భగవానుఁ డెంత తపించుచున్నాఁడో యని వాయుదేవుఁడు పూలసురటిచే నాయనకు వీచుచుండెను. పారిజాతపరిమళభరితమైన చల్లనివర్షముచే నింద్రుఁ డాలోకేశు నభిషేకించుచుండెను. శాంకరీదేవి చల్లనిచూపులచే –బాష్పోదయముచే మఱింత చల్లఁబడిన చూపులజేఁగాంతునికిఁ దాపశాంతి చేయుచుండెను. భవుఁ డేమో బాధ నొందుచున్నాఁడని సైరందఱు భ్రమపడుచున్నారు. కాని యీయనకు

హాలహాలకీలాజాలబాధ యేమున్నది? ప్రపంచమునంతను గాల్చుదగిన మహాగ్నిఫాలమున నడుచిపెట్టిన మహాదేవునకు గొంతుక దిగిదిగని హాలహలాగ్ని యెంత? ఆహా! శంకరదేవుడేమి మహాద్భుతదర్శన మిచ్చుచున్నాడు! తఱుచుగా జూచుచున్న సురాసురలు సైతము డిల్లపడి కొయ్యలై నోళ్లుతెఱచి నిల్వ్రగుడ్లతో పులకీకృతాంగములతో ముకుళీకృతకరయుగ్మములతో భయవిభ్రాంతచేతస్కులయి యామహామూర్తిని దర్శించుచున్నారే. యెఱుగకుండ ఎంతసేపటినుండి చూచున్నారో యెఱుగకుండ c జూచుచున్నారే. ఎవరు చూచుచున్నారో కూడ నెఱుగకుండ జూచుచున్నారే. అయ్యయ్యో! ఇంక రవంతసేపు చూచుభాగ్యము లేకుండ నయ్యయ్యో! భూచక్ర మట్టె తిరిగిపోయినదే. ఈసారి శీఘ్రముగా దిగిరిపోయినదేమి చెప్పుమా!

ఆహాహా! రెండవపార్శ్వమున నదిగో మురళీకృష్ణుడు! అదిగో రాధాకృష్ణుడు! అదిగో గోపాలకృష్ణుడు. ఆహా! మడుగునొడ్డున నున్న కదంబవృక్షముమీదికి జెంగుచెంగున నెక్కి గుభాలున మడుగులోనికి దూఁకినాఁడు! అయ్యయ్యో! అయ్యయ్యో! కాళియనాగేంద్రమానవనీతకోమలుని–శిఖిపింఛశిరోభూషణుని–ఆమందస్మితవదనుని– ఆతమాలపల్లవ శ్యామలసుందరాంగుని – ఆయుపనిష ద్వల్లరి ప్రసవమంజరుని గఱచినది. అంతటితో సంతుష్టిపడక యాబాలకునొడలిచుట్టు దాను గట్టిగ జట్టుకొనినది. తటాకతీరమునుండి హాహా కారములు మిన్నుముట్టుచున్నవి. యశోదాదేవి కొయ్యయై పడిపోయినది. గుండెలు కొట్టుకొనువారు, తలవెండ్రుకల నూడలాగికొనువారు, తలలు నేలఁగొట్టువారు, కృష్ణాకృష్ణా యని యఱచువారునై యచ్చటిజనమంతయు నెంతకలవరమయినఁ బొందినది. ఎంత సంక్షోభమైనఁ జెందినది! ఎంత గగ్గోలైనఁ బడినది. ఆహా! గోవు లంబా యని యఱచుచుఁ గన్నీరు విడుచుచున్నవే. ఆహా! నల్లగనున్న బాలుఁ డాసమయమున నొక్కత్రుటికాలము సహస్రార్కసంకాశుఁ డయ్యె నేమి చెప్పుమా? అంత చిన్నపిల్లవాఁడు కదా! అట్టె మేనుపెంచి యంతలో విజృంభించి యిట్టె పాడుగై యొక్కతొప్పపాటుకాల మెంత పెద్దవాఁడైనాఁడో! కాని పామేమైనది? ఆతనికి విధేయమై శిరసాగ్గినమస్కరించి యాతని కాళులయొద్ద దీనమై భగత్కరుణకై వేచియున్నది. తొప్పపాటింకఁ బడుచుండగనే కృష్ణభగవానుఁడు పెంచినదేహమును సంకుచించి తిరుగ బాలకృష్ణుఁడైపోయినాఁడే! ఆహా! ఎంత దివ్యసందర్శనసేవ యెల్లవారికిఁ గటాక్షించుచున్నాఁడో! కృష్ణా! కృష్ణా!

"నీ వడవిన్ బగ ల్దిరుగ నీకుటిలాలకలాలితాస్య మి
చ్చావిధిఁ జూడనట్టినిముసంబులు మాకు యుగంబులై చనున్
గావున రాత్రులైన నినుఁ గన్నుల నెప్పుడు చూడకుండ ల
క్ష్మీవర తొప్ప లడ్డముగఁ జేసె విధాత యిదేల క్రూరుఁడై."

యని పోతరాజుగారు సెలవిచ్చినారు. స్వామి సందర్శనసేవలో తొప్పపాటు ప్రతిబంధమై పోయెనని భక్తులు విలపించుచుండఁగా నయ్యయ్యో! తిరుగ భూవలయము తిరగిపోయినదే! రెండవపార్శ్వము కన్నుల కెదుటఁబడినదే!

ఆహా! హాలహాలభక్షకుఁడైన శంకరుండు మహోత్సాహముల నాట్యమొనర్చుచున్నాఁడు. ఆహాహా! నేత్రపర్వముగ నున్నది. జటాజూటమందలి గంగలోని తరంగములుబ్బెత్తుగ లేచుచుండ, తలపై నున్న బాలచంద్రుఁ డదటున కాఁగలేక యెగిరియెగిరిపడుచుండ, మహావేగసంరంభమున జాజీ దూరముగఁబడిపోవుదుమేమో యని సర్పహారములు సంకుచించి సంకుచించి మెడను రవంత గట్టిగఁబట్టుకొనియుండ, చేతనున్న లేడిపిల్ల తూలి

పడిపోవుదునేమో యనుభయముచే నుత్తీరయమైన గజచర్మపుముడుతలలో నిటికి దాఁగియుండ, మహావిష్ణువు పాంచజన్యధ్వానమున నుపాంగముపట్ట, బ్రహ్మ మృదంగవాదన సేవ యొనరించుచుండ, శృంగిభృంగులు వింజామరులు వైచుచుండ, దేవేంద్రుఁడు తాళము వేయుచుండ, నంతరిక్షమున నప్సరసలు గీతములతోఁ బుష్పాంజలు లిచ్చుచుండ, ''ఓమ్ఓమ్ఓమ్'' అని నాదబ్రహ్మమగునట్లు మాహతిపై నారదుఁడు శ్రుతిమీటుచుండ, లక్ష్మీపార్వతి సరస్వతులు మంగళపుటారతు లిచ్చుచుండ, జగదేకనటుఁడు–ఆహాహా! ధరణీచక్ర మదరు చుండ, తరణ్యాదిగ్రహములు చలనములు మాని యవలోకించుచుండ, తాండవించు చున్నాఁడే! ఆహా! ఆనాట్యవైభవమును గాంచుట కొడలినిండ నింద్రునికివలెఁ బ్రాణులకుఁ గన్నులుండినయెడల–అయ్యయ్యో! అప్పుడే భూవలయము తిరిగిపోవుచున్నదే! ఈసారి మఱింత శ్రీఘ్రముగఁ దిరిగిపోయిన దేమి చెప్పుమా?

అదిగో రెండవప్రక్క కన్నులకెదుటఁ గనఁబడుచున్నది. వహ్వా బాలకృష్ణుడు కాళియఫణీంద్రుని ఫణాగ్రమునం దెక్కి తాండవించుచున్నాఁడే! లోకైకసుందరా! ఆభీరభూప్రియా! బృందావనవిహారా! నందనందనా! యశోదకిశోరా! వాసుదేవా! నమస్తే నమస్తే యనుధ్వను లెల్లయెడల వ్యాపించినవి. అవతంసభూషణమైన మయూరపింఛ, మిట్టటుజోగుచుండ, గర్ణములందలి మద్దిగాయలు గంపించుచుండ, మురళి యధరమును జేరి మ్రోఁగుచుండ, బంగారుగజ్జెలు గల్లుగల్లు మనుచుండ, పవ్యాపసవ్యపదఘట్టమును సహింప లేక నాగేంద్రుఁడు బుస్సుబుస్సు మనుచుండఁ దటాకదీరమందలి స్త్రీపురుషులచేతులతోఁ దాళములు వైచుచుండ, నావులు వత్సములు కన్నులు పూర్ణముగాఁదెరచి చెవుల నిగుడఁబెట్టి దోఁకలెత్తి యెడ ళ్లుప్పొంగ రెప్పపాటైనలేకుండఁ జూచుచుండఁ దీరస్థవృక్షములందలి గరుడపక్షులు కృష్ణాయని కూయుచుండ, దృష్టిదోషము తగిలిపోవునేమో యని భయమొందుచున్న యశోద ''నాయనా! ఇకఁజాలు, రావోయి నాతండ్రీ! ఎంతసేపు తాండవింతువు? కాళులు నొప్పులుపెట్టునయ్యా' యని పిలుచుచుండ, దేవతలు పుష్పవృష్టి గురియుచుండ, నాహాహా! శ్రీకృష్ణభగవానుఁడు తాండవక్రీడ సలుపుచున్నాఁడే! ఆహాహా! ఆహాహా! కాని అయ్యయ్యో! భూచక్రమప్పుడే తిరిగిపోయినదే!

రెండవైపున నాహా! ఆహా! శంకరదేవుఁ డింకను నాట్యమొనర్చుచున్నాఁడే! మహాదేవ శంభూ! మహానటకశిఖామణీ! నమోనమః నమోనమః''–అయ్యో! అయ్యో! అదియేమి? అప్పుడే భూమితిరిగిపోయినదాయేమి? అప్పుడేతాండవకృష్ణుఁడగపిడినాఁడేమి! ఆహాహా! భూవలయ మతివేగముగాఁ దిరుగుచున్నదే. ఎందుచేతనో! అదిగో తాండవకృష్ణుఁడు అదిగో తాండవశంకరుఁడు. మహావేగాతిశయమున మహీచక్రము దిరుగుచున్నదే. ఆకృతి యస్పష్టమైనది నీలవర్ణము శ్వేతవర్ణము కలిసి గిరగిరతిరుగుచున్నవే! ఆహాహా! కన్నులు తిరుగుచున్నవి. తల గిఱ్ఱుమనుచున్నది. తిరుగఁ గన్నులు తెఱచునరికి శంకరుఁడులేఁడు కృష్ణుఁడులేఁడు. ఒక్కటే వెలుఁగు కానఁబడుచున్నది! అదియెట్లున్నదో తెలియదు. వాని మొదలేదో తుదియేదో తెలియదు. ఆవెలుఁగును జూడలేకున్నాను. కన్నులు నేమోకాని యది పొడుచుచున్నట్లున్నది దానిని సహింపలేకకాఁబోలు కన్నులు తెఱచి చూడఁగ దాదాపుగాఁ గంటక్రింద నుదయించి వెలుఁగుచున్న సూర్యునికాంతి యద్దపుకిటికిగుండ గదిలో ప్రవేశించి వ్యాపించియున్నది. నాయనలారా! చాలసేపు నిద్రించితిని. ఆమాటయెందులకుఁ గాని యిప్పుడు చాలసేపు చెప్పితిని. క్షమింపవలయును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

30. శ్రీయాజ్ఞవల్క్య నాటకము

ఒకసారి సాక్షినంఘానికి అనకాపల్లినుంచి ఒక ఉత్తరం, దానితోపాటు కొన్నికాగితాలు వచ్చాయి. ఆ ఉత్తరం ప్రాసినమనిషి తన దున్నపోతును తుమ్మపాల సంతలో అమ్మడానికి వెడుతూండగా ఈకాగితాలు దొరికాయనీ, తన భార్యసలహామీద సాక్షినంఘానికి పంపుతున్నానని వేర్కొన్నాడు.

జంఘాలశాస్త్రి ఆకాగితాల వివరాలు చదివి పూర్వాపరాలకథ చెప్పాడు. ఆకాగితాలు 'శ్రీయాజ్ఞవల్క్య నాటకము' అనే ప్రాతప్రతిలో అసంపూర్ణంగా వున్న రెండోఅంకం సంభాషణల్ని సూచిస్తున్నాయి. ఇది ఆధారంగా జంఘాలశాస్త్రి ఒక విన్నపంచేశాడు.

యాజ్ఞవల్క్యుడు శాకల్యుడి శిష్యుడు. శాకల్యుడు సుప్రియుడనే రాజుకి పురోహితుడు. ఆ సుప్రియుడి కారణంగానే యాజ్ఞవల్క్యుడు గురువు ఆగ్రహానికి గుర్తై, ఆయనబోధించిన విద్య వినర్జించి-సూర్యోపాసనద్వారా మళ్ళీ సంపాదించుకున్నాడు.

యాజ్ఞవల్క్యుడు విసర్జించినది కృష్ణయజుర్వేదం. ఆయన శుక్లయజుర్వేదానికి మూలపురుషుడు. ఆయన మహాసాహసికుడు. సంస్కర్త. ధీశాలి. ఈ మహర్షిని యోగీశ్వరుడంటారు. ఈయనకి పదిహేనుమంది శిష్యులున్నా, వారిలో కాణ్వులు, మాధ్యందినులు రెండుతెగలవారే అనూచానంగా ప్రసిద్ధంగావున్నారు. నియోగులలో కాణ్వశాఖివారినే ప్రథమశాఖీయులంటారు.

కణ్వుడు యాజ్ఞవల్క్య శిష్యుల్లో మొదటివాడు కావడమేకాదు, అనేక విధాల 'ప్రథమ' గణనీయుడు. ఆయనకి యాజ్ఞవల్క్యుడి ద్వారా అనేక గ్రంథాలు సంక్రమించాయిగాని, అవి పేర్లుమాత్రమే వినిపించే దశలో వున్నాయని జంఘాలశాస్త్రి వాపోయాడు. ఉత్తర హిందూదేశంలో మాధ్యందినశాఖవారు తమ గ్రంథాలన్నీ ఈనాటికీ భద్రపరుచుకున్నారనీ ఆంధ్రలోవున్న ప్రథమ శాఖవాళ్లు, కాణ్వశాఖ గ్రంథాలను వెదికించి భద్రపరచాలనీ, ఆవిన్నపం సారాంశం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:-

నాయనలారా! ఈలేఖ అనకాపల్లినుండి వచ్చినది:-

''సాక్షికి–అయ్య నమస్కారములు. నేను దున్నపోతును విక్రయించుటకై తుమ్మపాలసంత కీనడుమను బోవుచుంటిని. లులాయశేఖరునిఁ బదునైదుదినములనుండి బాగుగా మేపుటచే నది బలిష్ఠమై యున్నది. దానిని బాగుగాఁ గడిగి యాఱుఁబెట్టి నిగనిగలాడుటకై యొడలి నిండ నాముదమును రాచి, మెడను బలుపుంచి యాపలుపు చేతితోఁ బట్టుకొని బలాత్కారమున నిన్న తెల్లవారుజామున సంతకు లాగికొనిపోవుచుంటిని. ఎ ఏ యని యది యఱచుచు వెనుకడుగునైచుచుండ ముందున కీడ్చుకొనిపోవుచుంటిని. ''ఎక్కటికి తన్నుఁ దీసికొనిపోవుచున్నావు? ఎందులకుఁ దీసికొనిపోవుచుంటివి? ఏమాత్రపు సొమ్ము నావలన సంపాదింతువు? ఏమంత పెద్దమనుష్యుఁడవయ్యా! ఏడువలేకపోయినావు వెనుకకు నడువు'' మని దాని ఎ ఏల కర్థమేమో యని నేననుకొనుచు నడచుచుండఁగాఁ బక్కనుండి వీచుచున్నగాలిచే నేదియో యొక తెల్లనిరవంత పొడుగైన వస్తు వెగిరి దాని కాళులసందునఁ బడెను. అది బెదరియెగిరిపడి నాచేతిలోని పలుపు గుంజుకొని పరుగెత్తికొనిపోయెను. దానితో నేను గనుచీఁకటిలోఁ బరుగెత్తగలనా? పైసంతనాఁ డమ్మవచ్చునని యెంచిదాని కాళునడుమ నెగిరిపడినవస్తు వేదో పరిశీలించితిని. దాదాపుగా నొక్క యడుగు పొడుగున్నది. మూఁడంగుళముల వెడల్పున్నది. పైన నెట్టనిత్రాడున్నది, అదియేదో కాగితపుఁగట్ట యని యనుకొంటిని. ''దానిలోనివి నాయదృష్టవశమున ననేకసహస్రములు విలువగలసర్కారునోట్లు కాఁగూడదా? ఏమో నాయదృష్టమెటులున్నదో ఇరువదివేల రూపాయలు నోట్లు దొరకఁగూడదా? ఈదున్నపోతునిఁక సంతలో నమ్మట యెందులకు? మనకుఁ గావలసినంత సొమ్మున్నప్పుడు విశాఖపట్టణపు వీరిసాని నుంచుకొనవచ్చును. కర్నాటకపు పేపరుమిల్లులో నూరువాటాలు పుచ్చుకొనవచ్చును. పశువులసంతపాటమనమే పాడవచ్చును. ఇంకను గొంతసొమ్ము మిగిలినయెడల మోటారుబండి కొనవచ్చును. అయినను నిరువదివేలే దొరకునన్న మాట యేమి? లక్షరూపాయలనోట్లు దొరకఁగూడదా'' యను నిన్నియూహములు ఇంకను మీకు వ్రాయుటకు లజ్జపడుచున్న మఱికొన్నియూహములు–తళుకు తళుకు మని మనస్సులో నొక్క ఱెప్పపాటుకాలములో–ననఁగ–వంగి కాగితపు బొత్తిని బైకిఁ దీసుకొనునంతకాలములోఁ గలిగినవి. ఆహా! మనస్సువేగ వేమనిచెప్పవచ్చును. ఆహాహా! కాగితములు చూచుకొనినపిమ్మట నాయేడు పేమని చెప్పవచ్చును? ఎందులకో యంతయేడుపు! నాకిప్పుడు క్రొత్తగాఁ బోయిన దేమియు లేదే. పోయిన దొక్కదున్నపోతు. అదియైన నింటికే పోయినది. ఇఁక నేఁడుపెందులకో? తగని యాశలు పెట్టుకొని యాయాశలు తీఱలేదనియా యిప్పు డేడ్చుట? దున్నపోతునకు నాకు బారెఁ డెడమైనలేకుండ వీధిలో నేను బోవుచుండఁగా లక్షలకొలఁది విలువగల నర్కారునోట్లు నాకాళ్లయొద్దకు గాలిచేఁ గొట్టుకొనివచ్చునని నే నడియాస లందవలసినదా? నేనింత మూఢుఁడనై యున్నప్పుడు మాయిద్దఱిలో నిజమైనదున్నపోతు వెనుకనున్న జంతువా? ముందున్నజంతువా? యని నన్ను నేను కొంతసేపు మందలించుకొని యాకాగితములలో నేమినంగతు లున్నవోయని యప్పుడే యుదయించుచున్న సూర్యకాంతిసాహాయమునఁజూచితిని. అవి వ్రాఁతకాగితములుకాని యచ్చుకాగితములు కావు. నాలుగైదుకంటె నెక్కువలేవు. మొదటి పత్రములో మొదటి పంక్తిలో ''శ్రీయాజ్ఞవల్క్యనాటకము'' అని యున్నది. రెండవ పంక్తిలో రెండవ యంకమని యున్నది. మూఁడవ పంక్తిలో ప్రదేశము సుప్రియుని మందిరము –నాలుగవపంక్తిలో ప్రదేశము సుప్రియుఁడు యాజ్ఞవల్క్యుఁడు అని యున్నది. కడపటి

పత్రమందు కడపటి పంక్తిలో ద్వితీయాంకము సంపూర్ణము. శ్రీ శ్రీ శ్రీ అని యున్నది. పాపము! ఎవఁడో కవిపట్టణములలోఁ దినుబకుఁ బట్టెడన్నమైన దొరకక మాడుగుల ప్రాంతమందలి మన్నెపు జ్వరముచేఁ జచ్చిన బాగుగానుండునని యాపైపులకుఁబోవుచు దారిలో నీయంకమును బాఅవైచుకొనెనో! కాదేని యేమన్నెపుగవియో బుణబాధ పడలే కయో కుటుంబపోషణమొనర్చుకొనలేకయో, అనకాపల్లిస్టేషను సమీపమున రైలుచక్రము లక్రిందఁ బడి చచ్చినయెడల లోకమునకుఁ దనకుఁ దెఱపిగా నుండునని యీదారిని బోవుచు నీయంకమును బ్రమాదముననో బుద్ధిపూర్వకముగనో విడనాడిపోయెనో? యేమియుఁ దెలియదు. అయినను నా కీగొడవ యెందులకు? ఈకాగితములుమాత్రము నాకెందులకు? కాఁబుద్దున్నపోతుకొఱ కేడ్వవలసిన నేను గవికై యేడ్చుట యెందులకని తిరిగి మనస్సునకు బుద్ధిచెప్పుకొని వెనుకకు మరలి అనకాపల్లికి పోయితిని. ఎంతసేపును మనస్సునకు బుద్ధిచెప్పు కొనుటతోడనే మనుజుని బ్రతుకు కడతేఱిపోవుచున్నది గదా! ఒక్కతప్పుటడుగు –ఒకలెంపకాయ–తనదో సైవారిదో–అంతే. బ్రతుకులో నంతకంటె సౌభాగ్య మేమియు నాకగపడుటలేదు. ఇంటికిపోయి ''బావా! దున్నపోతింటికి వచ్చినదటోయి'' యని యడిగి తిని. ''నీవు వచ్చితివికాదా? సంతోషమే'' యని యాతఁడు నన్నుఁ బరిహసించెను. బందెలదొడ్డిలోఁ బడియుండెనేమోయని యొక పిల్లవానినటకుఁ బంపి నాకు దొరికిన కాగితములను మాబావ కగపఱచితిని. అతఁ డెగాదిగఁ జూచి నరే అత్తగారి యౌషధపుబొట్ల ములకై పనికివచ్చునులే యని పలికెను. ''బాబయ్యా! నా గాలిపడగకో'' యని మాయన్నగా రికుమారుఁ డాకాగితములు లాగగ వానిలోరెండు కాగితములు చినిగిపోయినవి. అయ్యయ్యో! ఇప్పుడు జరిగిన ఈయసందర్భ మాకవియే చూచియుండునెడల నాతఁ డెంతబాధపడియుం దునో!'' అప్పుడు నాభార్య యీవలికివచ్చి యాకాగితములను జూచి–పాపము ఏభాషాసేవకుఁ డీగ్రంథము వ్రాసెనో? ఈయంకము పోయినందుల కాతఁడెంతఖేదమొం దుచున్నాఁడో–నామాట విని యాకాగితములను సాక్షి నంఘములకు భద్రముగఁ బంపుఁడు. సాక్షిలో నీనంగతి జంఘాలశాస్త్రి వెల్లడిచేయునెడలఁ దత్క్రవి సాక్షికి లేఖవ్రాసి పోయిన యీయంకమును దెప్పించుకొని సంతసించును.'' అని మాకు బుద్ధివచ్చునట్లు పలికెను. అందువలన మీకీ కాగితములను బంపితిని. మీయిష్టానుసారము వాని నుపయోగపఱుపవ చ్చును. చిత్తగింపవలయును. విధేయుఁడు. సాక్షి నంఘాభిమాని–

నాయనలారా! ఈయుత్తరమును వింటిరా! ఇదిగో యాజ్ఞవల్క్యనాటకమున ద్వితీ యాంకము. ఈయంకములోని గాథకుఁ బూర్వమందలి గాథను మీకుఁ గొంతచెప్పినఁగాని యిది బోధముకాదు. కాఁబట్టి సంగ్రహముగ వెనుకటికథను జెప్పెదను. యాజ్ఞవల్క్యుఁడు బ్రాహ్మణవంశసంభవుఁడు. ఇతనితండ్రి బ్రహ్మరాతి; తల్లి సునంద. ఈతఁడు మహాబుద్ధి శాలి, ఈతఁడు శాకల్యనియొద్ద గృష్ణయజుస్సును నేర్చుకొనునుండెను. శాకల్యుఁడును మహాపండితుఁడు సుప్రియుఁడను రాజునకుఁ బురోహితుఁడు. రాజున కసాధారణమైనవ్యాధి యేదియో యుండెను. ఔషధసేవచే నది శాంతింపలేదు. అసాధ్యమగు నీవ్యాధిచేఁదాను మరణింపక తప్పదని సుప్రియుఁడు ఖేదపడుచుండఁగా శాకల్యుఁడాతనియొద్దకేగి తాను జపహోమాదులవలన వ్యాధిని నిస్సంశయముగా నివారింపఁగలనని చెప్పెను. అట్టిశాంతి క్రియ లాచరింపుఁడని రాజు పురోహితుని ప్రార్థింపఁగ నాతఁ డట్లొనర్చుట కంగీకరించి, వాని నాచరించి మంత్రతీర్థమును దెచ్చి రాజున కిచ్చెను. దానివలన శాంతింపలేదు. కొంతకాల

మిట్లు చేయఁగఁజేయఁగ శాంతించునని పురోహితుఁడు రాజును సమాధానపఱచెను. ''మీరు పెద్దలుకావున మంత్రోదకమును దెచ్చియిచ్చుశ్రమము మీరు పొందవలదు. మకు ముప్పదు గురు శిష్యులున్నారుగాఁబోలు. దినమున కొక్క-శిష్యునిచే తీర్థమును బంపుఁ'' డని రాజు పురోహితునితోఁ జెప్పెను. ఏదినమున నేశిష్యుఁడు తీర్థము కోటలోనికిఁ దీసికొనిరావల యునఁ ఆదినమున నాతఁడే హోమాదిక్రియ లాచరించి తీర్థమును దీసికొనిపోవుచుండవల యునని పురోహితుఁడు శిష్యుల కాజ్ఞయిచ్చెను. ఇట్లు కొందఱుశిష్యులు తీసికొనిపోయిరి. రాజునకెంతమాత్రమునువ్యాధితగ్గలేదు. ఒక్కదినమువయాజ్ఞవల్క్యుని వంతువచ్చినది. ''గురూత్తమా! ఈదినమునఁ దీర్థము తీసికొని వెళ్లవలసినవాఁడను నేను. రాజొకవేళ ననున్నుఁ బరాభవించునెడల నేనేమిచేయవలసినది?'' యని శాకల్యుని యాజ్ఞవల్క్యుఁ డడిగెను. ''ఏమిచేయుట కేమున్నది? నీవు తిరుగ రాజదర్శనమును చేయనక్కఱలేదు.'' అని గురుఁడు సెలవిచ్చెను. చిత్తమని సెలవుతీసికొని రాజునొద్దకు యాజ్ఞవల్క్యుఁడు తీర్థకలశము చేతఁబుచ్చుకొని పోయినాఁడు–ఆశిష్యునకు నారాజునకు జరిగిననంభాషణ మీయంకములో నున్నది సావధానచిత్తులరై యీయంకమును వినుఁడు–చదివెదను.

శ్రీయాజ్ఞవల్క్యనాటకము–ద్వితీయాంకము.
ప్రదేశము–సుప్రియునిమందిరము.
ప్రవేశము–సుప్రియుఁడు–యాజ్ఞవల్క్యుఁడు.
సుప్రి–ఏమంటివయ్యా?
యాజ్ఞ–నీవనినది నరిగా లేదంటిని.

సుప్రి–మంత్రీతీర్థము నాయెడలఁబనిచేయకపోవుటచే మంత్రోదకమువలన వ్యాధికు దురనేరదని రోగపీడితుఁడనైన నేననుట సహజమై యున్నదనుకొందును. పోనీ మంత్రశోధ నము మాకెందులకు? నేననినది నరిగా లేదంటివి? ఒప్పుకొంటిని. కానినీవేషము నరిగాను న్నదని నీవు చెప్పఁగలవా! అదినరిగాలేదని నేను జెప్పుచున్నాను. నీవేమిచెప్పుదువు?

యాజ్ఞ–మంత్రశోధనము చేయఁదగదని యిప్పుడే చెప్పితిని కాదా! అట్టి మంత్రశోధ నమే తప్పయినప్పుడు మంత్రములు బ్రాహ్మణాధీనము లగుటచే బ్రాహ్మణశోధన మంత కంటె తప్పని యేల తెలిసి కొనఁజాలవు?

సుప్రి–మంత్రములు బ్రాహ్మణాధీనములే! బ్రాహ్మణుని కధీనములుకాని నీకెట్లధీన ములు! బ్రాహ్మణబాహ్యవేషమైన లేని నీవు బ్రాహ్మణుఁడని నని యెట్లు చెప్పుకొనఁగలవు? చెప్పుకొని మమ్మెట్లు విశ్వసింపఁజేయఁగలవు?

యాజ్ఞ–రాజా! నీవిశ్వాసముపైననే బ్రాహ్మణ్యము నిలిచియుండలే దనుసంగతి నీవెఱుఁగనట్లున్నావు. బ్రాహ్మణ్యమున కంతదుర్గతి యింకఁ బట్టలేదు. ఈమాటలేల? గురునందేశమును నిర్వర్తింపవచ్చితిని. ఈతీర్థము దీసికొనుము. నేను బోయెదను.

సుప్రి–తీర్థకలశము దెచ్చినావా? అబ్బ! నీచేతిలోఁ బన్నీరుబుడ్డి యుండఁదగినది కాని తీర్థకలశ ముండఁదగినదికాదే? నీవుచ్చరింపఁదగినది పద్మబాణమంత్రము కాని పంచాక్షరీమంత్రము కాదే? బొట్టునైఖరి జుట్టునైఖరి కట్టునైఖరి చూడఁగ–ఓ–శృంగారపురుష శేఖరునివలెఁ గానఁబడుచున్నావే? పరాకున మాయింటికి వచ్చితివికాని బుద్ధిపూర్వకముగ

వచ్చితివని నే ననుకొందునా!

యాజ్ఞ–బుద్ధిపూర్వకముగ రానిమాట సత్యమే. గురుబలాత్కృతిచే రావలసివచ్చినది. నిన్నుఁ జూడఁదగినపని నా కేమున్నది? నావేస మెట్లున్న నీకేమి? దాని నంతపరిశీలించుట నీకేల? నీవు మూతిపై వెండ్రుకలఁ జూచువాఁడవేనా! కాలిపై జోడు చూచువాఁడవేనా? పృష్ఠముపై గోఁచి చూచువాఁడవేనా? విద్యాబుద్ధులతో నీకుఁబనిలేదా! ఆహా! ఏమి లలితుఁడవు? ఏమియింగితజ్ఞుఁడవు? ఏమిసరసుండవు? నీవు ప్రభుఁడనై యుండటచే నీదేశ మెంత యదృష్టవంతమైనది! రాజా! పూర్వజన్మమున నే మహాపురుషనింద యొనర్చుటచేతనో నీవిప్పుడీ వ్యాధిచే బాధపడుచున్నావు–భద్రముగఁ బ్రవర్తింపుము.

సుప్రి–(వికటముగ నవ్వి) హే హే హే. మాయం దకారణజాయమాన కటాక్షముచే దర్శన మిప్పించినవారు మహాపురుషులా పురుషోత్తములా! అవతారమూర్తులా! భక్తపాపవిచ్ఛే దకులా! లోకోద్ధారకులా? సెబాస్. నే నెంతధన్యుఁడనైతిని. ఇది శివావతారమయినట్లా? విష్ణ్వవతారమైనట్లా? లేక రెండునా? ఏమహాకార్యము నాచరించుట కవతరించితిరి. మహాత్మా! మీభక్తమణు లందఱు మీకు నిత్యకైంకర్యాదులు నలుపుచున్నారా? సందర్శన సంభాషణ సంస్పర్శనాది సత్కారములచే వారిని సంభావించి సంతోషపెట్టుచున్నారా? వారు తను యనురాగపూర్వకాదరణముచే నిత్యశోభనాదివైభవములతోఁ బుత్రపుత్రికాది సంపత్తితో.....

నాయనలారా! ఇక్కడఁ గొంతకాదిగము చినిఁగిపోయినది. తరువాతి గ్రంథమును జదువుటకు వీలులేదు. కావున యాజ్ఞవల్క్య చరిత్రమున నే నెఱిఁగిన తరువాతి ముఖ్యాంశములు మనవిచేసెదను–సుప్రియుఁడను రాజమహర్షి బాహ్యవేషమును దిలకించి యెంత యధిక్షేపించినను–యోగివర్యుఁడు సహించి యూరకుండెను. నీకుఁ దెచ్చిన తీర్థమేమిచేయు మని నీయభిప్రాయమని ఋషి యాతని నడుగ, ''అదిగో! అచ్చటఁ గనఁబడుచున్న కట్టుకొయ్యమీఁదఁ బోసి పొమ్మని రాజనెను–అంత మహర్షిశిఖామణి 'దివం మాలేఖీ' త్యాదిమంత్రము నుచ్చరించి, యాకట్టుకొయ్యపైఁ దీర్థమును బోసి చివాలునఁబోయెను. రెండుఘడియ లగుసరికిఁ గట్టుకొయ్య కడిచెట్ల కొమ్మలతోఁ జిలువలతోఁ బలువలతో దివ్యపరిమళభరితములగు బహుసుందర పుష్పగుచ్ఛములతోఁ బుష్పములపై వ్రాలిన బంధరములతోఁ గలకరావము లిచ్చుచున్న పక్షులతోఁ బ్రకాశించుచుండెను. దానిని రాజు గాంచి యత్యాశ్చర్యమగ్నమానసుఁడై కొంతసేపు నిశ్చేష్టుఁడై నిలువఁబడి యంత ''అక్కటా! యాజ్ఞవల్క్య మంత్రోదకమున నీ కట్టుకొయ్య చిరకాలముక్రిందటఁ జచ్చి మోడైన యీకట్టుకొయ్య–యెట్లు బ్రదికి బాగుపడినదో! ఆతీర్థమువలన నేను వ్యాధిదూరుఁడైన యట్లు బాగుపడవలసినదేకద! నాబుద్ధిహీనతచే నట్లు కాలేకపోయితిని'' అని యోగీంద్రపరాభవమునకై లెంపలు వైచుకొని యాజ్ఞవల్క్యుని తిరుగ దనయింటికిఁ బంపుఁడని శాకల్యునకు వార్తనంపెను. యాజ్ఞవల్క్యుఁడు మొదటఁ దనకు గురువిచ్చిన బాసననుసరించి నేను బోనని చెప్పెను. అంత రాజు శాకల్య నింటికి వచ్చి యాజ్ఞవల్క్య ననేకభంగులఁ బ్రార్థించెను. శాకల్యుఁ డెన్నివిధములనైనఁ దనశిష్యునకు రాజు ననుగ్రహింపుమని బోధించెను. ఆయన గుర్వాజ్ఞ వినలేదు. అంత శాకల్యుఁడు కోపోద్దీపితుఁడై ''అవిధేయుఁడా! నేను నీ కిచ్చినవిద్యను నా కొనఁగి పో ఆవలికిఁ బో'' మ్మని తీండ్రించెను. తీసికొనుమని యాజ్ఞవల్క్యమహర్షి

యావిద్యను వాంతియొనర్చెను. దానిని దిత్తిరపక్షులు భక్షించిన హేతువున దానికిఁ దైత్తిరీయ మని పేరువచ్చెనని చెప్పుదురు.

యాజ్ఞవల్క్యయోగీంద్రుల చరిత్రములో నంశము లన్నియు నేను జెప్పఁదలఁచుకొన లేదు. ఆతఁడు పిమ్మట సూర్యోపాసన మొనర్చివిద్యను సంపాదించెను. ఆతఁడు శుక్లయజు ర్వేదమునకు మూలపురుషుఁడు. శాకల్యుఁ డాతని మొదటనేర్చినవేదమును గృష్ణయజుర్వేద మనియందురు. కృష్ణయజుర్వేదమున మంత్రబ్రాహ్మణభాగము లొకక్రమము వరుస ననుస రించి కూర్పఁబడియుండక కలగపులగముగఁ గూర్పఁబడియుండి యస్పష్టార్థప్రయోజన ములై యుండుటచే నీవేదమునకుఁ గృష్ణయజుస్సని పేరు వచ్చియుండుననియును, క్రమమైనవరుస ననుసరించి మంత్రాదిభాగములు కూర్పఁబడి యుండుటచేతను నర్థప్రయో జనాది విషయక విస్పష్ట కాంతిచేతను యాజ్ఞవల్క్యవేదమునకు శుక్లయజుస్సని పేరు వచ్చియుండుననియుఁ గొందఱు చెప్పుచున్నారు. యాజ్ఞవల్క్యుఁడు జనకసభలో ననేక వైదికర్షులను. బ్రహ్మవాలములం దోడించి, బ్రహ్మిష్ఠుఁడను పేరు వడసెను. ఎందఱొళ్వారు లున్నను ఆళ్వారనఁగా సమ్మాళ్వారని యెట్లు రూఢ్యర్థమో యెందఱు యోగీశ్వరులున్నను యోగీశ్వరులనఁగా యాజ్ఞవల్క్యులనియే రూఢ్యర్థమున్నది. ఈతఁడు మహాసంస్కర్త. అంతకుఁ బూర్వమున నున్న వేదక్రమాదులు సమంజసములుగ లేవని కనిపట్టి క్రొత్తపద్ధ తితో పురాతనవస్తువుకంటె సమీచీనతరముగా నొకవేదమును రచియించు మహానుభావుని వంటి మహాసంస్కర్త, మహాధీశాలి, మహాసాహసికుడు, మఱియొక్కఁ డేఁడీ? తాను నూతనవే దమును రచియించుటయే కాక యధ్వరాదిక్రియలందు దాని నాచరణములోనికిఁ దెచ్చెను. శంకరభక్తులీతనిని శంకరావతార మందురు. విష్ణుభక్తు లీతనిని విష్ణ్వవతార మందురు. సూర్యోపాసకు లీతనిని సూర్యావతార మని యందురు. యాజ్ఞవల్క్యశాఖలో ద్వైతు లున్నారు; విశిష్టాద్వైతు లున్నారు; అద్వైతు లున్నారు. ఈమహానుభావునికిఁ బదునేనుగురు శిష్యులని చెప్పుదురు. ఆశిష్యుల కందఱకు వారివారి యధికారము ననుసరించి తాను బ్రహ్మపదార్థబోధన మొనర్చెను. కాని యాశిష్యులలోఁ గాణ్వులు మాధ్యందిను లని రెండుతెగలవారే యిప్పుడు కానవచ్చుచున్నారు. కాణ్వులనే ప్రథమశాఖవారందురు. వీరిపూర్వుఁ డగు కణ్వుఁడు యాజ్ఞవల్క్యునకుఁ బ్రథమశిష్యుఁ డగుటచే నాతని తరువా తివా రందఱకుఁ గాణ్వులని ప్రథమశాఖవారని పేరు వచ్చియుండును. అదిగాక కణ్వుఁడు శిష్యసంఖ్యలో మొదటివాఁడే కాక యధికారములో నర్హతలో నాధిక్యములోఁ గూడ మొదటివాఁడని యెన్నవచ్చును. ఆతనికి యాజ్ఞవల్క్యుడు కటాక్షించినగ్రంథము లనేకము లున్నవి. మహామహిమగల మహోద్గ్రంథము లనేకము లున్నవి. వీనినామములు మాత్రమే యిప్పటికి నిల్చియున్నవి. అట్టి యుత్తమగ్రంథము లన్నియు నేమైనవో తెలియదు. ప్రథమశాఖాబ్రాహ్మణులని చెప్పుకొనువా రాగ్రంథములేవియో యెచ్చటనున్నవో యేమిప్రయ త్నము లొనర్చినయెడల ననియుఁ గాకపోయినఁగొన్నియైన లభించునో యనునంశము లేమియైన యోజించుచున్నారా? లేనట్లు కనుబడుచున్నది. ఏల! వారిలో బుద్ధిమంతులు తక్కువ సంఖ్యవారున్నారా! లేరు. లేరు. వారిలో మహాబుద్ధిశాలు లనేకులున్నారు. తగుమా త్రపు జమిందారీలు కలవారున్నారు. పెద్దపెద్ద న్యాయవాదు లున్నారు. గొప్పగొప్పవర్తకు లున్నారు. విద్యాధికులున్నారు. విమర్శకు లున్నారు. దక్షిణహిందుస్థానమునం దనేక స్థలములందు ప్రథమశాఖవారు ప్రబలులైయున్నారు ఉత్తర హిందుస్థానమున మాధ్యందిను

లక్లేయున్నారు. మాధ్యందినులు తమకుఁ బూర్వులు కటాక్షించిన గ్రంథజాలమునంతయు భద్రపఱచియున్నారు. ప్రథమశాఖివా రేమిచేసినారు? తమగ్రంథములు తమవి కావని యూరకుండినారు. అని రామబాణముల కధీనములై యంతము నొందుచున్నపుడు మనకెం దులకని మాటలాడక మిన్నకుండినారు. మీగ్రంథము లేమైనవని యెవ్వరైన వారి నడిగినయె డల మాకెట్లు తెలియు ననుచున్నారు. మాగ్రంథములు కొన్నియున్నవా యనుచున్నారు. ఆహా! ఏమి మతాభిమానము! ఎంత మతగ్రంథాభిమానము! సర్వభారతీయవిమర్శక మహాస భలలో యాజ్ఞసల్క్య గ్రంథప్రశంస వచ్చినప్పు డేగ్రంథములు ప్రదర్శింపఁబడి పరీక్షింపఁబడు చున్నవో యెఱుఁగుదురా? మాధ్యందిన గ్రంథములు మాత్రమే. కాణ్వగ్రంథము లేమైన నట్లు చేయఁబడుచున్నవా? లేవని చెప్పుట కితరశాఖీయులకే సిగ్గగుచుండఁగా ప్రథమశా ఖీయు లనిపించుకొనినవారు రవంత యులుకు పలుకైన లేకుండ నున్నా రేమిచెప్పుమా? వారిహృదయముల కాంచిత వారిమనస్సుల కాసంకోచము లేశమైన నున్నట్లగపడకపోవుట యేల! పోనిండు. పరాశాఖీయులందఱు వారివారిమతగ్రంథములను సేకరించుకొని భద్రప ఱుచుకొని వ్యాఖ్యానసమన్వితముగఁ జేసికొని మతసంబంధమైన కొంతపరిజ్ఞానమును సంపాదించుకొనుటకుఁ బ్రయత్నించుచుండఁగా సర్వజనసామాన్యమైన గతానుగతికన్యా యమున నైన వీరేల ప్రవర్తింపకుండనున్నారో? మతగ్రంథసమీకరణము మతగ్రంథపూజ మతగ్రంథ భాష్యరచనము మొదలయిన పనులు దోషము లని యెంచి మన ప్రథమశాఖీయు లింతయుపేక్ష యొనర్చుచున్నారా? ఇంతయనాదరణ మొనర్చుచున్నారా? ఇంతమతగ్రం థవైరాగ్యమును బూనియున్నారా? ప్రథమ శాఖీయసోదరులారా! అసాధారణమై దాదాపుగ ననహజమని చెప్పఁదగిన మీయుపేక్షకుఁ గారణ మేదో నాకు దుర్జ్ఞేయమైయుండుటచేత గ్రుడ్డివాఁడు తడుముకొనునట్లు కారణములకై తడుముకొనుచున్నాను. క్షమింపవలయును. పొడుముడబ్బిబిరడ జాఱిపోయినయెడల దొరకినదాఁకఁ దహతహలాడుదమే. తులమెత్తు బంగారమునకు ముప్పది రూపాయలకంటె నెక్కువ విలువలేదుగాని తులమెత్తు మతగ్రంథస్థ పురాణతాళిపత్రసమితికి మూఁడువేలు కావుకదా ముప్పదివేలు విలువయుండునే! ఆహా! మనకాణ్వులు తమతమగ్రంథములు మసిబొగ్గు లనుకొనుచున్నారో? మునిసిపల్ తుక్కను కొనుచున్నారో? తండ్రిగారిచ్చిన పట్టభూమికయిన గాలానుసరణముగా కొట్టుసిస్తులఁగట్టి దానిరాబడి ననుభవించుచున్నామే. చిల్లిద్దైనసరే మెడయూడినదైనసరే తాతగారి యిత్తడిచెం బని దానిని భద్రపఱచుకొని బంధుకోటికి దాని నప్పుడప్పుడు గానఁబఱచి యానందించుచు న్నామే. అయ్యో! కాణ్వులారా! మీకు మూలపురుషుఁడే! శ్వేతయజుఃకర్తయే! సార్థకయోగీం ద్రనాముఁడే! మహాసంఘసంస్కర్తయే! ఆర్కావతారమే హర్యవతారమే. హరావతారమే! ఆహాహా! అట్టి లోకోత్తర ప్రతిభాశాలి దయస్వరూపుఁడై జగదుద్ధారణార్థమయి లోకమునకు వెల్లడిచేసి తనభక్తులగు మీకుఁ గటాక్షించిన యమూల్యధనమును జ్ఞానభండారమును దేజోనిక్షేపమును మీ రుపయోగించుకొననక్కఱలేదా? మీరు భద్రపఱచుకొనినైన నక్కఱ లేదా! పోనిండు. వానినామములైనఁ దెలిసికొనఁ బ్రయత్నింపరా? మాకక్కఱలేదని యడ్డముగఁ దలనూఁపుచున్నారా? అయ్యయ్యో! తప్పుకాదా. తప్పుమాట యటుంచుఁడు. ఆర్యస్వభావమునకుఁ గూడ విరుద్ధతకాదా? బట్టు తిన్నగ సవరించుకొమ్మని చెప్పిన కోడలిపై నత్తగా రాగ్రహించినట్లు మీరీమాటలకు నాపైఁ గోపపడక నన్ను క్షమించి నాప్రార్థన నంగీకరించి మీగ్రంథము లెచ్చటెచ్చట దొరుకునో తెలిసికొని యాతావులకుఁ దిరిగి తిరిగి

యావశ్యకమగునెడల దేశమంతయు గాలించి యెంతధనమైన వ్యయమొనర్చి వానిని సంపా దించి కాణ్వమఠ మొక్కటి కట్టించి వాని నందు భద్రపఱుపవలయును. మీసంపాదములలోఁ గొంతభాగ మీమహాకార్యమునకై వినియోగపఱుపఁదగును-పఱుపక తప్పదు. కాణ్వగ్రంథ నిధి యనుపేరఁ గొంతసొమ్మును ముందుగాఁ జేర్చి దానిని గ్రంథసంపాదన కార్యమున నినియోగింపుఁడు. ఇదివఱకే యాలస్యమైనది. మాధ్యందిన గ్రంథముల మహాప్రచారమును బట్టి కాణ్వగ్రంథములు లేనేలేవను నప్రతిష్ఠ మూలపురుషునివఱకు మీయుపేక్షమూలమున వ్యాపించినది. లేనివారు లేక యేడ్చుచుండఁగా నున్నప్పుడుకూడ మీకీదరిద్రతయేల? మీకీ క్షామబాధ యేల? ''ఓహో! ఈగ్రంథములన్నియు సేకరించిన తరువాత నివియన్నియుఁ జదువవలసివచ్చునుగాఁబోలు. మాకుఁ దెఱపియెక్కడ? సంచులమూఁతులకు తాళ్లుక ట్టుటలోఁ దెఱపిలేకుండ మేము దేవులాడుచుండఁగా తాటాకుపుస్తకముల గ్రాళ్లువిప్పుటకు మాకుఁదీఱిక యేదీ? నెత్తికి విశ్వనాథతైలము మూఁతికి వాసిలైను దేహమునకు సబ్బు రాచికొనుటలోఁ గాలము కాసంతయు గడచిపోవుచుండఁగా మతగ్రంథములకు మసిపూ యుటకుఁగాని మట్టితైలము రాయుటకుఁగాని మాకెక్కడతెఱపి. మతగ్రంథములచదువా? మా కింతలో నంతతొందర యేమి గల్గినది? ఏమో కొంతకాలము బ్రదుకఁదలఁచియుండ మరణశాసనలేఖన మంతటి యోగాయిత్యపుపని మే మేల చేయవలయును? మాకీచదు వక్కఱలేదే.'' అని నన్ను గాఢముగా మందలింతురాయేమి? పోనిండు. మీయిష్టము చదువుకొనవలసినదని మీకు బోధించునంతటి బుద్ధిహీనుఁడను గాను మీరు శ్రమపడి గ్రంథములనుమాత్రము సంపాదింపుఁడు. ముం దెప్పుడైన మీలో మతగ్రంథములు చదివి వానికి వ్యాఖ్యలు వ్రాసి వానిని విపులముగఁ జేయఁగల మహాధీమంతులు బయలుదేఱఁగలరు. వారి కక్కఱకువచ్చుటకే మీరశ్రమ మొనర్పవలయును. మీరు బాగుగాఁ బరిశీలించునెడల నిప్పటికేమీలో మంచి బుద్ధిమంతులయిన విమర్శకులు బయలు వెడలియున్నారు. నాయన లారా! జన్మమాత్రముననే ప్రథమశాఖీయుల మనిపించుకొనక మతాభిమానమునఁ బాండిత్య మున మతగ్రంథసంపాదనమున యథార్థముగఁ బ్రథమశాఖీయు లనిపించుకొనుఁడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

31. సభాస్వకీయ వ్యాపారములు

ఈసారి ఉపన్యాసం ఏమీ లేకుండా, సాక్షీ సంఘానికి వచ్చిన ఉత్తరాలను చదివి వినిపిస్తున్నాడు జంఘాలశాస్త్రి.

ఇవి అయిదు ఉత్తరాలు. మొదటిదానిలో–స్త్రీలు జాకెట్లు, గుండీ రవికలు తొడుక్కోవడంగురించి విమర్శించవలసిందిగా ప్రేరేపిస్తూ, తిలకధా రణం పద్ధతినికూడా ఎత్తుకోమని సూచిస్తూ అంశాలున్నాయి.

స్త్రీల గురించి అవసరమైన విమర్శలు ఇదివరకే చేశామనీ, మళ్లీ అనవసరమనీ దీనికి జంఘాలశాస్త్రి సమాధానం చెప్పాడు.

సాక్షీ వ్యాసాలలో మతవైషమ్యం, విసుర్లైన రాతలు, కనిపిస్తున్నాయనీ, అంతటి నిర్భయస్థితిని అవలంబించడం మంచిదికాదనీ పెచ్చరికలు రెండో ఉత్తరంలో వున్నాయి.

దానికి జంఘాలశాస్త్రి జవాబు చెపుతూ–సర్వమత సామరస్యంగురించి అనేక పర్యాయాలు కంఠశోషగా అరిచిన తనమీద ఇంత కఠిన విమర్శ తగదన్నాడు.

ఇక–మూడో వుత్తరం సాక్షి ప్రసంగాలలో వైవిధ్యం, నిర్భీకత అభినం దిస్తూ వుంది.

నాలుగో వుత్తరం *1918* నాటి ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో ప్రచురింపబడిన ''తెలుగుకవుల అపరాధాలు'' అనే పద్యాలలో ఒకటి –స్వప్నాల గురించి జంఘాలశాస్త్రికి తగిలేలాగ వుందనీ, దీని గురించి అభిప్రాయం తెలుసుకోదలిచామని–దీనికి జంఘాలశాస్త్రి జవాబేమీ చెప్పక వూరుకున్నాడు.

ఆఖరు ఉత్తరం ఒక దారుణపు ఆత్మహత్య సూచనచేసి, దానిగురించి సాక్షిలో ఉపన్యాసం ఇవ్వమని–శాస్త్రి దీనికి కూడా ఏమీ జవాబు చెప్పలేదు. సభచాలించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

''నాయనలారా! ఈదినమున నుపన్యాస మేదియు లేదు. మానభావిషయకములగు వంశము లీనడుము నెప్పుడు వెల్లడించియుండలేదు. సాక్షి కనేకలేఖలు సాక్ష్యుపన్యాస

పఠకులయొద్దనుండి ప్రతిదినమును వచ్చుచుండును. వానిలోఁ గొన్ని యిప్పుడు చదివెదను. వానినిగూర్చి నేను విమర్శింపను. విమర్శింపనక్కఱలేదు. వానిలోని నిజానిజములు గొంతకాలమునుండి మాయందలి దయవలన దీక్షతో–విమర్శన బుద్ధితో –నిష్పక్షపాతాంతఃకరణముతో మాయుపన్యాసములనుజదువుచున్న పఠకులకే తెలియఁగలవు. నేనంతకంటెఁ జెప్పవలసిన దేమియు లేదు. ఈలేఖ లేయూరనుండి వచ్చినవో యెవరు వ్రాసిరో మీకుఁ దెలుపనక్కఱలేదు. వానివిమర్శనమునందు మీకు సాహాయ్యము కాఁగలవను నమ్మికతో నాయుత్తరములతేదీలనుమాత్రము తెలియఁబఱచుచున్నాను.''

''అభివాదములు. 10-3-22.

అయ్యా! మనస్త్రీలు పూర్వాచారమును గురించి–ప్రస్తుతా చరణమును గూర్చియు –మీయభిప్రాయమ మేమి? కొందరు జాకెట్లు కొందఱు గుండీరవికలు తొడుగుచున్నారు గదా! నేను ఒకటి రెండుసార్లు ప్రశ్నించి సదుత్తరము (తృప్తికరముగా) బడయలేకపోయితిని. శరీరము ఇతరులకు కనుపించకుండా చేయుటకని వారివాదము. పూర్వులు మామూలురవి కెలు తొడిగి కాసెబోసి చీరెకట్టినందున వారి పాతివ్రత్యమునకు భంగ మాపాదించెనా? ఇప్పటి నాగరికత ఆంగ్లేయులను బోలియుండదా? కనుబొమలమధ్యను నూదిమొనలతోఁ బెట్టెడు (దృష్టిదోష నివారణార్థము బెట్టెడు) తిలకము ఏహ్యముగా నుండదా? అన్నివిషయములు విమర్శించు మీరలు ఈవిషయమున ఊరకుండట సంతాపకరము. రాఁబోవు ఆంధ్రపత్రికలో ఈవిషయమై మీసాక్షిసంఘవిమర్శ నోపన్యాసము చూచుట కుత్సాహించుచున్నాను. మఱి యొక ప్రార్థన సాక్షి ప్రథమభాగమును పంపవలయునని ఎంతమంది పుస్తకవిక్రేతలకో వ్రాసితిని. చివరకు జబాబుగూడ లేదు. దయయుంచి వెంటనే ఈక్రింది చిరునామాకుఁ బంపఁ బ్రార్థితులు.

చిత్తగింపుఁడు.

ఈయంశములఁగూర్చి స్త్రీలనుగూర్చిన యుపన్యానములలో శక్తివంచనలేకుండఁ జర్చించియుంటిని. కావునఁ దిరుగ విమర్శించుట యనావశ్యకముగఁ దోఁచుచున్నది. ఆజ్ఞోల్లంఘనమునకు మన్నింపవలయును. తరువాతి యుత్తరమును జదివెదను.

''విశ్వామిత్రుని నెత్తిగత్తిరించిన గత్తెర నసిష్ఠుని గడ్డముపై నాడ వెనుకాడుచున్నది –లింగముపైఁ జుట్టుపీక స్ఫురించినట్లు–పవననందనుని తలపైఁ బెట్టఁబడుచున్న బావాజీగారి బంగిచిలిమిగొట్టము స్ఫురించుటలేదు. బోనము నెత్తికెత్తుకొని తాండవించుచురజకుఁడు తాండవకృష్ణుని బోలక ప్రళయకాలరుద్రుని బోలుచున్నాఁడు. సాలగ్రామ మాలభక్తున కుండు....సౌష్ఠవము రుద్రాక్షమాల వానివక్షమున రూఢిగా గానిపించుటలేదు. మతాంతరు లగు దేశభక్తులు సాక్షినోటఁ బడుటకు సదీ్వరపాషాణప్రాయు లగుచున్నారు. భవిష(ద్బ్రహ్మవ తారులైన కవులు మణిమంజరీ మధ్వవిజయాది గ్రంథములను మఱల సృష్టించుచున్నారు. మతసాంప్రదాయబోధక మహావాక్యములు పిచ్చిరాముని పిచ్చికూతలైనవి. మహాత్మా! పాలలో పాపరకాయరసమును బిందుచున్నారు. పులి...మేక గఱచునా యని నిర్భయస్థితి నవలం బింపకుఁడు. విమర్శకులు మీజీవితకాలములలో నూరకున్నను తర్వాతనైనను మీమతాభిమా నదుష్పథమును వెలిబుచ్చకమానరు. జాగ్రత్త జాగ్రత!! మాఘ బ ౧౩ ౧౯౪౩''

నాయనలారా! మతవైషమ్యమును గూర్చియు సర్వమతసామరస్యమును గూర్చియు ననేకపర్యాయములు కంఠము శోషిల్లున ట్లఱచిననాపై నిట్టి కంఠనవిమర్శనము తగునేమో మీరే యోజింపవలయును. ఇంతకంటె మీకుఁ జెప్పఁదగిన దేదియులేదు. తరువాతి యుత్తరము చదివెను.

అయ్యా! 24-2-12.

తమదర్శనం నేను యన్నఁడూ చాయలేదు గాని నేటికి తమయశశ్శరీరదర్శనం చేసి తమదర్శనలాభం యెప్పుడు తటస్థమవునో అని భగవంతుని ప్రార్థిసున్నాను. నేను ఇదివరలో యీపేర్లు వగయిరాలు యన్నఁడూ చూడఁడంలేదు. ఇప్పుడు అందరు చూస్తూవుంటే దీనిలో యేమివిశేషం వున్నదో అని నాకుకూడ కుతూహలంకల్గి గతానుగతికోలోకః అనేరీతిగా నెలరోజులనుంచి ఆంధ్రపత్రిక చూస్తూ వున్నాను. అత్యుత్సాహం-అతిప్రేమ-అతిభక్తి కల్గి మ్మనిచ్చుకున్నద్రవ్యము-యెక్కువవిలువ యీవృత్తాంతమే చాలునని మిక్కిలి తృప్తినొంది తిని. దీనిలో నీతి లోకవ్యవహారంలో ప్రతివానికి స్వానుభూతి దురాత్మలను చల్లగా పండితరాయలువంతుగా అన్యాపదేశంవున్నదిగాని లేనిదికాదు. స్వభావోక్తి నవరసభూయిష్టంగాను వుండుటచేత నాకు హృదయరంజకంగా వుండి యీమహాత్ములు యెవరు వీరివాసస్థలం యెక్కడ అని కొందరిని యిదివరలో పరిచయంకలవార్లను అడగగా భగవదనుగ్రహం చేత పీఠికాపుర వాస్తవ్యులనిన్నీ తమది యెక్కువశక్తికి అనిన్నీ మంచివాణి అనిన్నీ శ్రీరాజావార్కి తమయందు యెక్కువప్రేమ అనే మొదలయ్ని సంగతులు విని తమరు లోకోపకారార్థమయి నీతి నుపదేశించి సజ్జనరక్షణ దుర్జనిశిక్షణ నిమిత్తం అవతరించినమహాపురుషునిలకళామయులని రూఢిగా నమ్మి యీదరఖాస్తు వ్రాసుకున్నాను. ''స్వభావ మన్యథాకర్తుం కశ్శక్యోదైవనిర్మితం'' అనులోకోక్తిని బుచ్చుకొని మ్మం యేమిచాయగల మందురేమో. వాల్మీకిమహర్షికి మహాత్ముల దర్శనమాత్రంచేతనే ముక్తుఁడయినట్లు వింట్టున్నాముకదా! కాబట్టి తమరచనసామర్థ్యం చేతనున్నాదైవకృపచేతనున్నా దుష్టబుద్ధి మంచిబుద్ధిలోకి రావచ్చును. బుద్ధులు రెండులేవు. ఒకటే అని తమరు మొన్న పేపరులో వ్రాయించినారు. గానవ్రాసుకోవడమయినది. ''అర్థమిత్రం విషంపత్యం అధర్మోధర్మతాంవ్రజేత్, అనుకూలే జగన్నాథే విపరీతే విపర్యయః'' అని వున్నది. తమశక్తి అమానుషశక్తి అని విన్నాను. చన్నపురిలో వైద్యంఆఫీసు పెట్టుకొని నడిపిస్తూవున్నవానిని గురించి తమయందు నిరాకరణ భావం కనుపించగా అతనిమీద ప్రయోగించిన వాక్శరములచేత శబ్దవేదిబాణప్రయోగంచేత దుష్టశిక్ష చేశ్నిరామభూమపాలునివతుగా యశస్సు తమకు అయినట్లు వింటున్నాను. కవర పంపించుకున్నాను. గాన వెంటనే జబాబు దయచేయింపకోరుతాను.

చిత్తగించవలెను

మఱియొకలేఖ. 1-3-22

''మహారాజశ్రీ సాక్షిగారికి అనేకనమస్కారములు.

ఆంధ్రపత్రిక 1918 వ సంవత్సరాదినంచికయందుండు 'ఆంధ్రకవుల యపరాధము' అను పద్యములను తాము చదివియుందురు. అందులో 28 వ పద్య మిట్లున్నది.

ఒకడు స్వప్నప్రకారము నుగ్గడింప
నెల్లవారలకు గలలె దెల్లవార్లు
నవ్వుడురను తలంపులే దెవ్వరికిని
పేరుకొన నేమిటికి నట్టి బీదకవుల.

మీసంఘసభ్యుఁడగు జంఘాలశాస్త్రిగారికి అనేకస్వప్నములు వచ్చుచుండఁగా ఆస్వ
ప్నవర్ణనలవలన మమ్మందరిని సంతోషపరచుచుండిరి సంతోషపరుచుచున్నారు. ఈపద్యము
ఆయనకొఱకే వ్రాసిన ట్లగపడుచున్నది. ఇట్లు వ్రాసినపిదపకూడ ఆయన స్వప్నములు
తగ్గలేదు. అధిక్షేపించిన వెనుకకూడ స్వప్నము తగ్గలేదు. అధిక్షేపించిన వెనుకకూడ
స్వప్నములు వర్ణించుచునే యున్నారు. ఇందులకు కారణ ముండక తప్పదు. మేము
మీసంఘమందు అభిలాషకలవార మగుటచే ఈపద్యము కేమిసమాధాన మిచ్చెదరో విన
కుతూహలము గలవారైయున్నాము. 1918 వ సంవత్సరసంచిక ఈదిన మగపడిసదా
అధిక్షేపించెదరేమో. ఇదివరకే చూచితిమిగాని కొందరి ప్రోత్సాహమువలన ఈదినమ
వ్రాసినాము. ఇందువెంబడిని ఇంకను కొన్నివిమిర్శలు తెలుసుకొనవలెనని కుతూహలముగా
యుండెను గాని దీనికే శ్రమ యిచ్చినందులకు చింతిల్లుచున్నాము. ఇంతే అనేక నమస్కా
ములు.''

ఇందుకు వారు నన్నుఁగోరిన యంశమేదియో నాకు విస్పష్టముగఁదెలియలేదు.
తరువాతలేఖను జదువుచున్నాను.

అయ్యా, 8-3-23

పూర్వ మొకప్పుడు అయుష్కర్త విషయమై కొంతతెలియపఱచవలెనని మిమ్మల
నడిగినప్పుడు సవిస్తరముగా నాకేగాక యందఱకు తెలియునట్లుగా సాక్షీమూలముగా
తెలియపర్చిరి. చాల సంతోష మయినది. ఇప్పుడు మొన్నమహాశివరాత్రిని గుఱించి సారస్వ
తానుబంధములో వ్రాసిరి చదివి ఆనందించడమయినది. వచ్చేవారముకూడా యాశివరాత్రి
గుఱించియే వ్రాయుచు యీ నేక్రింద వ్రాయబోవు దారుణపు నాత్మహత్యనుగుఱించి
విపులముగా వ్రాయ ప్రార్థితులు. మీపేర ఒకరు యీభోగట్టా వ్రాసినట్లుగా వ్రాయక మీరు
చూచినట్లు–ఏకలలోనో చూచినట్లు–వ్రాయప్రార్థితులు.....

ఇంక ననేకలేఖ లున్నవి. వాని నన్నియుఁ జదువుట కిప్పుడవకాశములేదు. కావున
మన్నింపవలయును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

32. శ్రీరామనవమి

జంఘాలశాస్త్రికి ఒక కల వచ్చిందట. దానిగురించి సాక్షినంఘం నభలో చెపుదామను కున్నాడుగాని,—ఖద్దరుటోపీ ధరించిన నేరానికి కారాగారంలోవడిన వాణీదాను ఒక ఉత్తరం, శ్రీరామచంద్రుడి గురించి కొన్ని వద్యాలూ సాక్షి పేరిట వంపి, ఆవద్యాలను సాక్షినంఘం నభలో జంఘాలశాస్త్రి చేత చదివించి, తిరిగి తనకివంపమన్నాడు.

వాణీదాను ఆపద్యాలు ఎందుకు వ్రాశాడో ఆ వివరాలుకూడా ఉత్తరంలో వ్రాశాడు. జైలులో అతని మిత్రులలో ఒక ఉపాధ్యాయుడు, ఒక స్లేడరు, ఒక వీమీవనిలేని 'జంటిల్‌మన్', అతన్ని కవిగా అభిమానించారు కాని—అతని శ్లేషకవిత్వాన్ని అభిమానించలేకపోయారు.

చివరికి—జంటిల్‌మన్ ప్రోత్సాహంమీద మామూలు ధోరణిలో శ్రీరామచంద్రుడి మీద వాణీదాను పద్యాలు రాశాడు. ఎల్లుండే శ్రీరామనవమి. ఈ వద్యాలు జైలులో 'రామనవమి' చేసుకుని చదువుదామని జంటిల్‌మన్ ప్రతిపాదించాడట. అతను చిత్రకారుడట. శ్రీరాముడి బొమ్మజైలుగోడ మీద వేస్తాడట. ఆ బొమ్మముందు వాణీదాను తనవద్యాలు చదువాలి. ఆవద్యాలు చమత్కారంగా వుండాలని షరతు.

నరే—సాక్షి ఆజ్ఞప్రకారం, వాణీదాను రచించి వంపిన ఆచమత్కార వద్యాలు వదకొండింటిని జంఘాలశాస్త్రి ఆ నభలో చదివి వినిపించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:—

నాయనలారా! రామా రాఘవా! రాజీవలోచనా! యని స్మరించుకొనుచు విన్నరాత్రి నిద్రింపగ నొకమహావిచిత్రమైనస్వప్నము వచ్చినది. ఆస్వప్న మేదో మీకుఁ దెలియఁబఱుప నెంచితినిగాని యొక చిన్నయభ్యంతరము కలిగినది. ఖద్దరుటోపీని ధరించుటచేఁ గారాగృహమునం దుండవలసివచ్చిన వాణీదానుఁడు కారాగృహమునందే శ్రీరామచంద్రునిపైఁ గొన్నివద్యములు రచియించి యీలేఖతో నా కిప్పుడే పంపినాఁడు. లేఖను ముందుగాఁ జదివెదను.

"సాక్షికి—వాణీదానుఁడు కారాగృహమునుండి యనేక నమస్కారములు. ఇచ్చట ఖైదుకొట్టులో మిత్రబృందముతో సుఖముగా నున్నాను. అచ్చటి మీక్షేమసమాచారములను

దెలిసికొనఁ గోరుచున్నాను. ఎటులో సారస్వతానుబంధమును సంపాదించి జంఘాలశా
యుపన్యాసములన్నియు మామిత్రులకుఁ జదివి వినిపించుచున్నాను. వారందఱు సంతోషి
చుచున్నారు. నాగ్రంథములోని పద్యములు చదివి వినిపింపుమని వీరందఱు నస్మ
దఱచుగాఁ గోరుచున్నారు. కవియన్న పేరేకాని రచియించినగ్రంథములు కనఁబడ
కంకణబంధము చదివి వారికిఁ గొంతయర్థము చెప్పితిని. ఆవులించినవాఁ డొకఁడు
–మూఁతిముడిచినవాఁ డొకఁడు–గోటితో మట్టితీసుకొనువాఁ డొకఁడు–మూత్రపుగుండ
చూచువాఁడొకఁడేయైపోయెనుగాని యొక్కఁడైన శ్రద్ధగా వినలేదు. ఇదియేమికర్మమో
సరసమైన శ్లేషకవిత్వములోనున్నసొగ సొక్కఁడైన గ్రహింపలేకపోయెను. వారు నిద్యాశూన్
లుగారు. మందబుద్ధులుకారు. బియ్యేపరీక్షలో నుత్తీర్ణుఁడైన యుపాధ్యాయుఁ డొకఁడ
డిస్ట్రిక్టుమునసబుకోర్టు ప్లీడరొకఁడు ఏమియుఁ బనిలేకుండ నన్నిపనులకుఁ దానేసిద్ధమై
యిల్లన్నమాటయైనలేకుండ నన్నియింట్లలోను దానే తిరుగుచు, ధనమన్న ప్రసక్తియై
లేకుండ నందఱధనమును దానే బదులురూపమునఁ దెచ్చి వాడుకొనుచు నన్నిరసజ్ఞులం
గలిగిన యొక జెంటిల్‌మ్యాను మాలో నున్నాఁడు ఆతనిని మేమందఱము 'జంటిల్‌మ
అని పిలుతుము. అతఁడు కొంత యాంగ్లేయభాషాజ్ఞానము కలవాఁడగుటచేత నాంగ్లేయక
త్వమునకు, నాంధ్రకవిత్వమునకు భేదమేమియో తఱచుగా నుపన్యసించుచుండును. అత
విశేషము లింక ననేకములున్నవి. అతనిసంగతి మీరు పూర్తిగా దెలిసికొనఁదగినదియే అ
ముందెప్పుడైన వ్రాసెదను. అతఁడు మాసభలో నిట్లుపన్యసించినాఁడు. ''ప్రియసోదరులార
ఎల్లుండి శ్రీరామజయంతి నేను చిత్రకార విద్యను బాగుగానెఱుఁగుదును. శ్రీరా
పట్టాభిషేకమును గోడపై గీచెదను. మీరందఱు రేపావిగ్రహమును బూచింపవలయును
వాణీదాసా! నీవు శ్లేషకవిత్వమును విడిచి శ్రీరామునిమీదఁ జమత్కారముగఁ గొన్ని
పద్యములు వ్రాయుము ఆపద్యములు పూజానంతరమున నీవు శ్రీరామసన్నిధిని జదువవ
యును. నేనుగూడఁ గొంతప్రేయరు (prayer) ఆసనమయమునఁ జేసెదను. ఈయుపన్యా
మును మేమందఱు మాసెందమున వింటిమి. అట్లుచేయుటకు సిద్ధపరచుకొంటిమి. నేన
నిన్నరాత్రియంతయు మేలుకొని యీపద్యములను వ్రాసితిని. సాక్షిగారు! మీరుచూచినగా
యీపద్యములను నేను శ్రీరామసన్నిధిని జదువను. మీరు విత్తగించినపిమ్మట సాక్షి సభలో
జంఘాలశాస్త్రిచే నొక్కమాఱేపద్యము లన్నియుఁ జదివింపుఁడు. జదివినవెంటనే యీపద్
ములను దిరుగనాయొద్దకు? బంపుఁడు. వ్యవధి తక్కువగా నున్నది. కావున వెంట
చదివింపుఁడు ఈదినమున జంఘాలశాస్త్రియుపన్యాసపుగొడవ లేమియు జరిగింపకుఁడు
ఇక్కడ వాణీదానుసిలేఖ పూర్తియైనది.

నాయనలారా! సంఘకవి యిట్లు వ్రాయుచున్నాఁడు–సంఘాధికారియగు సాక్షి యిట్ల
సెలవిచ్చుచున్నారు. అనుసరించునది మిత్రుని యిష్టము. జరుగునది సాక్షియాజ్ఞ చదువున
శ్రీరామచంద్రునిమీఁది పద్యములు వినఁదలఁచినవారందఱు దైవభక్తులు. ఇంతకంటె గావ
సినదేమి. చదివెదను.

ఉ. శ్రీకరభూసురౌఘ సుతోఖర శోకరసా కరోగ్ర బా
ధాకర భీకరాసుర మహరణదారణ మారణోగ్ర వి
ద్యాకథినాశుగాశుగ ధరామలకోమల ధామలాల సత్
ప్రాకటహస్తునంజన విరాముని రాముని రాము నెంచెదన్.

నీ. హరువిల్లుతుత్తుము రౌనట్లు విఱిచియు
నీశుస్థాపించి పూజించినావు
ధారిణీపతివయ్యు ధారిణీసంజాతఁ
బరిణయంబునను జేపట్టినావు
ఇంద్రాదిసురరక్ష కిలనుజన్మించియు
నింద్రజుతల నూడనేసినావు
తరుణికై రావణుఁ బరిమార్చియును సతి
వనవీధిఁ ద్యజియించి వైచినావు

ఏనరుండైన నిట్లాచరించునొక్క
యెటులొచేసినఁ గీర్తి దక్కించుకొనునె
దైవమవుకాన ధాటితో దాఁటిపోతి
వయ్య రామయ్య నిన్న నేమందునయ్య!

చ. అసిత శుభాంగసుందరు, దరామల సద్గళ ధారుధారుణీ
ప్రసవతనూనుతాపదన పంకజ మంజుమరందసారు, సా
రసనఖనూనమాన పరిరక్షణ లాలనధీరు, ధీర రా
క్షసవినర ప్రణాశకర కార్ముకరాముని రాముఁ గొల్చెదన్.

నీ. బొమ్మఱాబొమ్మను బుత్తడిబొమ్మయౌ
బుషికొమ్మఁగాగఁ జేయించినావు
పాదుకాద్వయముచేఁ బ్రబలరాష్ట్రం బవ
లీల మేలిమిగ నేలించినావు
పర్వతసంఘుంబు పాథోధిజలమున
జీల్గులాగునఁ దేలఁ జేసినావు
క్రోతులచే నెల్లుగొడ్డుచే దానవా
హానాహవములఁ జేయించినావు

ప్రకృతినొంచితివని మోదపడునె? సీత
కొఱకు బారుమంటివని నేఁగూడ నేడ్వ
నే? భవత్తత్త్వము నెఱుంగ నెందుగొఱకో
నమ్మితిని తండ్రి నీదుచిత్తమ్ము పిదప.

ఉ. ఎప్పుడు భూమిఁబుట్టితిఱో యెప్పుడు జానకిఁ బెట్టఁబట్టితో
యెప్పుడు కానమెట్టితివొ, యెప్పుడు రావణుఁ గిట్టఁగొట్టితో
అప్పటి గాథలన్ని జనులందఱు చిత్తములందు గట్టిగా
ముప్పిరిపేట నల్లుకొనిపోయెనహో యెటువంటివాఁడవో?

నీ. హస్తలాఘవముచే హరునివిల్లొక్కటి
వింటిజోడుగను జూపించినావు
చరణలాఘవముచేఁ జాపఱాబండను

దాపసాంగనగాఁగ జూపినావు
కనుకట్టువిద్యచే మునుముట్ట రణసీమ
శ్రీరామశతకోటిఁ జేసినావు
మదికట్టువిద్యచే ముదిమ్రుచ్చు మునులకుఁ
జేడెలపోడుము ల్జేసినావు

ఐంద్రజాలికుఁ డగుదేమొ? యడిగినాఁడ
మాటవరునకుఁ గాని నిర్మలజగద్వి
పులత మజ్ఞానుకంటె నీ మోనమునను
గట్టుపడువాఁడె ధన్యుఁడుగాఁ దలంతు.

ఉ. కూరిమి విప్రబాలకుని గోఁతిని బ్రోచితి నంచుఁ బైకిఁగా
దూరక లోన దీమనము నొందెదవేమొకొ? నన్నుఁ బ్రోవగా
నేరవు నిన్నుదాటి చనునేరము లే నొనరించినాఁడ నిన్
గోరను బోవుమంచుఁ గనుగొందము ముందటి సొద్దులేమొకో?

సీ. వీథిపురాణంపు నేదికపై నీవు
పారాయణప్రఁబీటపైన నీవు
దృశ్యప్రబంధంపుఁ దెరలసందున నీవు
మృతివార్త శ్రుతిఁబడ్డయెడను నీవు
గొల్లసుద్దుల రేకుడొల్లలందున నీవు
యక్షగానపుఁ జిందులందు నీవు
చండాలుచేనున్న మొండితంబుర నీవు
తోలుబొమ్మల సంతగోల నీవు

పడుకగదులగోడల నీవు భక్తహృదయ
రననలను నీవు యాయావరతను నీవు
సృష్టి నీమయమో నీవు సృష్టిమయమొ
యెట్టులైనను నాకేమి? యేమినీకు?

సీ. తారకమంత్రంబు ధరకిచ్చి పఠియించి
తాదిత్యహృదయంబు నాలమందు
సత్యాచరణ ధైర్యశాలివై కల్లనే
రమునకై విడిచితి రమణినడవి

నాయనలారా! మూఁడవపాద మేదో తెలియకుండనున్నది. కావునఁదరువాతి పాదమున
జదివెదను.

పితృవాక్యపాలనవ్రత మిల బోధించి
కొడుకులచే వ్రేట్లుపడితి వకట
రామ! నినుఁబోలె నీచరిత్రంబుగూడ

మొదలు తుదిలేనిదై యిలఁ బొదలనేల?
ఇంతకంటెను దిక్కు వేఱొదియు లేక
ప్రాకులాడుచు నీకాళ్లఁ బడితినయ్య.

సీ. సర్వరాష్ట్రములోష్ఠ సమముగా విడనాడి
బంగారులేఁడికై పఱచినావు
మృతిని జీవితుఁజేయు ప్రతిభచేఁ బ్రధితుఁడ
వనుజుమూర్ఛకు నల్లలాడినావు
ధర్మసంగర కళాదక్షుఁడవై యుండి
దొంగపోటున వాలి దోర్చినావు
అవనిజాచోరునినైనఁ దిట్టకయుండి
కట్టల్కఁ బిట్టలఁ దిట్టినావు

ఇంత సందర్భశూన్యమై యెసఁగెనేమి?
త్వచ్చరిత్రంబు నాకవిత్వంబుఁ బోలె?
తెలియలేమి నాతప్పని పలుకుదేమొ?
తెలియ నీకుంటమాత్రము దేవ! యేదొ?

సీ. బ్రహ్మోపదేశంబు వాల్మీకి కాంచినాఁ
డేనది కలనైన నెఱుఁగనయ్య
నీగురుండగుటచే నిన్నె ఱుంగువసిష్ఠుఁ
డించుకైనను నాకు నెఱుకలేదు
తనవెంట గాధేయముని త్రిప్పుకొనె నిన్ను
నే నిన్ను మదిఁ జేరనీయలేదు
జయదేవముఖకవు ల్సాహితీసంపన్ను
లామాట మాయొద్ద ననఁగరాదు

ఇంతకంటె వేఱొకపని యెదియులేక
పాదయుగ్మంబు గట్టిగాఁ బట్టుకొంటి
చేతనగునెడ రక్షింపు చేతఁగాదొ?
ఇదిగొ గొలుసు కాలికిఁ దగిలింతు రమ్మ.

నాయనలారా! పద్యములన్నియు నైనవి బాగుగా నున్నవా (ఉన్నవి-కాని కడపటిపా దము సవరించినయెడల మంచిదనుకేక) సరే వీని నిప్పుడే వాణీదానునకుఁ బంపుదును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

33. శ్రీరామనవమి – విచిత్రస్వప్నము

క్రితంసారి జంఘాలశాస్త్రి తనకు వచ్చిన ఒక విచిత్రమైన కలగురించి చెపుదామనుకోగా–శ్రీరామచంద్రుడి గురించి వాణీదాసు రచించిన పద్యాలు చదివి వినిపించవలసి వచ్చింది. అప్పుడు చెప్పడానికి వీలులేకపోగున ఆ ఉదంతం జంఘాలశాస్త్రి ఇప్పుడు చెపుతున్నాడు.

తెల్లవారితే శ్రీరామనవమి కదా అని–రామా! రాజీవలోచనా! అని స్మరించుకుంటూ శాస్త్రి వడుకున్నాడు. క్రితంసారి శ్రీరామనవమి మద్రాసులో జరుపుకున్నాను కదా! మద్రాసులో జరిగినంత వైభవంగా ఈ సత్యపురంలో జరగదుగదా! అనే ఆలోచనకూడా ఒకగాలి తెరలాగ కలిగి మనస్సుమీద నుంచి వెళ్లిపోయింది.

ఇంతలోకల. ఆ కలలో జంఘాలశాస్త్రి ఒక సముద్రపొడ్డున ఇసక మీద కూర్చుని వున్నాడు. మద్రాసు గురించి మనస్సులో వుందేమో, మద్రాసు సముద్రతీరమే కలలోనూ కనిపించింది. ఆలోచనలు పరిపరి విధాలపో యాయి. మనస్సుని అరికట్టడం ఎవరితరం? అనుకున్నాడు.

అంతలో సముద్రతీరాన్నే, ఆ అష్టమీతిథి చంద్రోదయవేళ ఒక సన్నివేశం జంఘాలశాస్త్రి కంటబడింది. ఒక స్త్రీ, పురుషుడు కొంతదూరం నడిచి దట్టమైన మొక్కలచాటున కూర్చున్నారు. వాళ్లవైఖరిచూస్తే భార్యాభ ర్తల్లాగ లేరు. వద్దు వద్దను కుంటూనే జంఘాలశాస్త్రి క్రీనీడలో నిలబడి వాళ్ల చర్యలు గమనించాడు. ఆ స్త్రీ వైష్ణవి. ఆ పురుషుడు ఒక పిళ్లై. ముద్దు పెట్టుకో బోయే తరుణంలో ఆవైష్ణవి జంఘాలశాస్త్రిని చూసి కెవ్వుమంది. పిళ్లై అతన్ని 'దొంగ' అన్నాడు. దానికి శాస్త్రి దొంగవి నువ్వా నేనా? అని ఆమెను మందలించి ఇంటికి పొమ్మన్నాడు. కొంత ఘర్షణ పడ్డాడు. శ్రీరామా! ఇదెక్కడికల! అనుకున్నాడు శాస్త్రి.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

రామా రాజీవలోచనా యని స్మరించుకొనుచు నొకరాత్రి శయనింపఁగ నొక విచిత్ర మైన స్వప్నము వచ్చినది. దానిని గ్రిందటిసారియే మీకుఁ దెలుప నిశ్చయించితిని. వాణీదాస కవి రచియించి పంపినపద్యము లాదినమునఁ దప్పక చదువఁదగిన వగుటచే నాయుపన్యాస

మింతవఱకు నిలుపఁబడినది. ఆస్వప్నమేదియో యిప్పుడు చెప్పెదను-వినుఁడు.

నాయనలారా! తెల్లవాఱినపిమ్మట రానున్న శ్రీరామజయంతినెట్లు జరుపుదునా యని మనసులో యోజించుకొనుచుఁ బండుకొంటిని. క్రిందటి శ్రీరామజయంతికి మదరా సులో నుంటిని. ఈసారి సత్యపురములో నుంటిని. మదరాసులో దొరకినపుష్పములు -ఫలములు-సత్యపురములో నెట్లు దొరకును? అచ్చట జరిగించుకొనినాఁటి యుత్సవ వైభవము రేపు సంభవించుట కవకాశము లేకపోయెనే! రామా రాజీవలోచనా! నీయుత్సవము నీవే జరిగించుకొనుము. నాచిత్తమున భక్తిలేదు. చేతఁ బైసలేదు. ఒడల శక్తిలేదు. వ్యర్థుఁడను బుద్ధిహీనుఁడను. చిలుకవలె నీనామము నప్పుడప్పుడు స్మరించుట తక్క నంతకంటె నాచేత నేమియుఁగాదు. రామా! రక్షింపు. రక్షింపు మని మనసులో వెఱ్ఱిమొఱ్ఱిగ ననుకొనుచుఁ బండుకొంటిని. అట్టియట్టి తొప్పలు దళసరియెక్కినవి. తల తేలికయైన ట్లుండెను మనసులో నేదియో యీఁదుచు నీఁదుచు దిగిపోవుచున్న ట్లుండెను.....

మఱికొంతసేపటికిఁ గాబోలు నే నొక యిసుకతిప్పపైఁ గూరుచుంటిని. అష్టమీచంద్రుఁ డాకసమున వెలుఁగుచున్నాఁడు. ఎదుటవార్ధి ప్రబలతరంగపంక్తులచే ఘూర్ణిల్లుచున్నది. వెనుకవైపున నరుణపాషాణరచితమహాభవనపంక్తు లుత్తుంగగోపురములతోఁ బతాకములతోఁ బ్రకాశించుచున్నవి. గాలి యన్నివైపులనుండికూడ వీచుచున్నట్లున్నది. తొమ్మిదిగంటలరాత్రి యైయుండు నని యనుకొంటిని. మదరాసులో శ్రీరామజయంతిచేసి కొనుట కలుగపోయినదనిజాగ్రదవస్థలో విచారించిన హేతువుచేత మదరాసునకు వచ్చినట్లు కలగనుచున్నా నని కలలోనే నిశ్చయపఱచుకొంటిని. ఆహా! ఇంతవఱకు మంచిదేకాదా? కల కల యని తెలిసికొనుట ఘనత కాదా? కాని యాజ్ఞానము నిలువఁబడవలయును. అదియే నిలువఁబడినయెడల నిఁకఁ గావలసిన దేది? అట్లు నిలువఁబడదు. జగద్వ్యాపారముకంటె మహాస్వప్నము మఱియే మున్నది! అది వట్టిస్వప్నము నిశ్చయనిర్ణిద్ర నిరంతరజ్ఞానమున్నవాఁడు లోకాతీతుఁడు కాఁడా? కొందఱు కట్టిజ్ఞానము స్వల్పపూర్వ పుణ్యవశముచే-సద్గురుబోధముచే-గష్టపరంపరానుభవముచేఁ గలుగును. కాని యది మెఱపు వలె నిలువఁబడదు. చెకుముకిజాతిపై బలాత్కారమునఁగలిగిన మఱింత గాఢాంధకారము గును. అజ్ఞానము ద్విగుణీకృతసాంద్రత్వముతో నావరించును. భార్యాపుత్రాదులు కేవల స్వప్నగతపాత్రములని పలుకువా రనేకు లున్నారు. అట్టివారికే యింటిలో నెనమండ్రు ప్రత్యక్షపుఁబిల్లలు. గూడెములోఁ దొమ్మండ్రు రహస్యపుఁబిల్లలు. అట్టివారికే యింటిలోనిదెల్ల పేళ్లుచెక్కిన కనకపాత్రములు పెట్టెలోని వెల్లరూసాయకు రెండణాల ధర్మవృద్ధితోనున్న తనఖాపత్రములు. ప్రపంచసుఖములన్నియు కేవల మాయాకల్పితములను మహానుభావు లనేకులున్నారు. అట్టివారికే సత్యసేవకై పంచబాణరసఘుటికలు. అనిష్ట గర్భవిచ్ఛిత్తికై గోసాయిచిటుకలు సర్వప్రపంచచర్య స్వప్నమని నిశ్చయించుకొనువానికంటె నిజమైన జ్ఞానియేఁడీ? నిజమైన ముక్తుఁడేఁడీ? పిచ్చివాఁడు తాను పిచ్చివాఁడ నని గ్రహించినవెనుక జ్ఞానికంటె భిన్నుఁడా? భాగ్యవంతుఁడు తాను భాగ్యవంతుఁడ నని గ్రహించినపిమ్మట నానందస్వరూపుఁడనుట కేమైన సందేహమా? అజ్ఞుఁడు తా నజ్ఞుఁడ నని గ్రహించినపిమ్మట విజ్ఞానమూర్తియే కాఁడా? స్వస్వరూపగ్రహణమైన తరువాత రాగ మెక్కడిది? మోహ మెక్కడిది? బంధ మెక్కడిది? కాని యట్టిగ్రహణము నిలుచు మార్గమేది? మనస్సుకట్టి

స్థైర్యమేది? బుద్ధికట్టి బింక మేది? యేనుఁగుతొండమును జేతఁబట్టుకొని కదలకుండ నిలుపవచ్చును! గాజుపలకమీఁద పాదరసమును గదలకుండ నాఁపవచ్చును. మనస్సులోని చాంచల్యమును స్థంభింప సాధ్యమగునా? సంసారములోనివంక సంవరింపవచ్చును. కుక్కతోఁకలోనివంక కుదుర్పవచ్చును. మనస్సులోనివంక మాప సాధ్యమగునా? పనికిమా లిన యన్నింటిలోను బనికిమాలినది మనస్సు–సిగ్గుమాలిన యన్నింటిలోను సిగ్గుమాలినది మనస్సు–నీతిమాలిన యన్నింటిలోను నీతిమాలినది మనస్సు–దాని కదియేసాటి. కాని నాయనలారా! నా కీ కప్పదా టెందులకు? దేనినిగూర్చి చెప్పదలఁచితిని. ఏమి చెప్పుచుం టిని. మదరాసుతీరమునఁగలిగిన స్వప్నమును జెప్పవలసినవాఁడనైన నేను మనస్తత్త్వమున గలిగిననంకటములను జెప్పుచున్నానే! మనస్సున కా కాకిచెమ్మలనైఖరి. యున్నప్పుడు మనయిష్ట మేమున్నది?

నాయనలారా! మదరాసులో సముద్రతీరమునఁ గూర్చుంటిని. నిమిషనిమిషము నకు బడబడబడబడమను తరంగములధ్వనితప్ప యఱియేధ్వనియును వినష్టముగఁ గానరాకున్నది. ఇంత నిర్జనస్థలమున నేనొక్కఁడ నెందులకు? పట్టణములోనికిఁ బోవుదునని నిశ్చయపఱచుకొని లేచితిని నాబుద్ధిహీనత కాని పట్టణములో నేమున్నది? లేనివాఁడు లేదనియేడుపు ఉన్నవాఁడంతకంటె నెక్కువ లేకపోయినేయని మఱింతయేడుపు. బోదసౌ భాగ్యాలచేతఁ గాలీడుపు, క్రుళ్లు వాసనచేత ముక్కు మోడుపు. మగవారిలో ననేకు లశక్తులగు టచే మగువలు మొగముమాడుపు. అంతకంటెఁ బట్టనములో నే మున్నది? ప్రకృతి సౌందర్యసౌభాగ్య ప్రధానరంగమైన వార్ధితీర్థమును విడిచి లెట్రీను పెట్రోలియపు దుర్గుంధ ములతో నిండిన ''మెట్రొపోలిసో'' యని నేను దేవులాడుట యెందులకో? నిజమైన కారణమేదియోచెప్పనా? సృష్టిసౌందర్యమును గాంచి నంతసించుటకు నాకుఁ గవితాశక్తిలేదు. అన్నప్రాశనమే కాని యక్షరాభ్యాసము లేనియాతఁడు కాఫీహోటలువంకఁ జూచునా? గ్రంథాలయమువంకఁ జూచునా? కవిత్వమున్నవాఁ డీతేజస్సు సౌరభము రుచి చలువగల యీప్రదేశమును విడిచి దుమ్ముధూళి ధూమము దుర్గంధముగల నగరములోనికిఁ బోవయ త్నించునా? నాయనలారా! అటుచూడుఁడు. ఇద్ద ఱొవరో ప్రకృతి సౌభాగ్యస్వాదన తత్పరు లు–జగత్సౌందర్య సాహితీసంపన్నులు–అష్టమీచంద్రసౌరభము నాఘ్రాణింపఁగ –శీతలవాతపోత సౌందర్యము నవలోకింప నుత్తుంగతరంగరంగత్సౌభాగ్యము నభిష్వంగమొన ర్ప-అఖిలజగదాధారుని యనంతశక్తి నానందగీతపుష్పాంజలులతో నారాధింపఁగాబోలు –నాఁ!హా! ఆపుణ్యమూర్తులిద్దఱు పరమహేయమైన పట్టనమును వదలి పరమసుందరమైన యీప్రదేశమునకే వచ్చుచున్నారుకదా? సెబాస్! ఇఁక నేను బట్టనములోనికిఁ బోవుటకంటెఁ దెలివిలేమి యున్నదా యని మనసులో నూహించుకొని వారిద్దఱను సమీపింప యత్నించితిని గాని అదియేమి? నేను నూటిగ వారికెదురఁగఁ బోవఁగ వారు నన్నుఁ దప్పించుకొనుటకు గాఁబోలు ప్రక్క కేగుచున్నారే! సత్పురుషుల నేల వదలిపెట్టవలయు నని నేను తిరిగి యటు పోవఁగ వారు గిరుక్కున నిటు మఱలుచున్నారు. ఇది యేమివింత? నాయం దామహాత్ముల కంత యలక్ష్య మేల? అలక్ష్యముకాక వారికి లక్ష్యమేల యుండవల యును? స్నానమొనర్చినవారు మలీమసాంగుని సమీపింతురా? పవిత్రాంతఃకరణులు పాప చిత్తులఁ దలీయుదురా? సత్యాలాపులు మిథ్యావాదిని చేరుదురా? విద్వాంసులు శుంఠను జూతురా? కవులకు విమర్శకునియం దెంత యనహ్యమో చెప్పవలయునా? అటులే వారు

నన్నుఁ జూచి యేవపడుచుంటిరని నేనెంచితిని. అదేమికర్మమో కాని వారు నన్నుఁ దప్పించుకొనిపోఁదలఁచిన కొలఁదివారెవరో తెలిసికొనవలయునని పట్టుదలనా కెక్కువయ గుచున్నదే! (Mere Fisherman) అనుమాటలు నాకు గాలివాటమున నులువుగా వినఁబడి నవి. నేను జాలరి నని వారనుకొనుచున్నారని యెంచితని. ఇంతలో No No అను మృదులాలాపములు వినఁబడినవి. ఆహా! తంబురతీఁగగాని యేకునారకాదే? గంటకాని లొడుగుకాదే! ఇద్దఱుకూడ మగవారనుకొంటిని. ఆయిద్దఱలో నొకతె కాంతయాయని వితర్కించుకొని భార్యభర్తలుగాఁబోలు వారిని సమీపించుట యెందులకని చివాలున మొగ మాపైపునుండి త్రిప్పుకొని నాదారిని నేను బట్టణములోనికిఁ బోవుచుంటిని. కాళిదాసుఁడు చెప్పినట్లు దేహమే ముందునకుఁ బోవుచున్నది కాని మనస్సు వెనుకచూపే చూచుచున్నదే! వారు నిజముగా భార్యాభర్తలై యుండినయెడల వారు నన్నుఁ దప్పించుకొనిపోవుట కంత యాత్రపడనేల? పవిత్రతకు భయమునకుఁ జాలదూరమే. వాలుచూపులు నక్కటుక్కులు ప్రక్కకొత్తి గిల్లుటలు తప్పించుకొని తారుటలు నెదుటఁబడుటకు జంకుటలు మొదలగు లక్షణములు భార్యాభర్తల పవిత్రశృంగారమున ఁకుందునా? 'ఇమిటేషను' దంపతులకే యిన్నిపోగాలము లని నిశ్చయపఱచుకొని గిఱుక్కున మఱలిచూచితిని. నేను బోయితి నని నిశ్చయపఱచుకొని కాఁబోలు వారిద్దఱు కొంతదూరము నడచి దట్టమైన మొక్కల చాటునఁ గూరుచుండిరి. నే నటకుఁబోయి కొంత సమీపమునఁ గ్రీనీడను నిలువఁబడి వారిని జూచితిని. వారు నిజముగాఁ దస్కరదంపతులనియే నిశ్చయపఱపుఁడు. వారికర్మ మున వారు తిరుగుచున్నప్పుడు నేను వారి యొద్దకుఁబోయి యేల చూడవలయునని –వారిరహస్యములతో నాకేమి పనియున్నదని–నా కామాత్రపుబుద్ధి యప్పు డేల లేకపోవల యునో యని నాకిప్పుడు మిగుల ఖేదముగా నున్నది. కాని నాయనలారా! స్వప్నచర్యకు నేనెట్లు బాధ్యుఁడను? కేవలము బాధ్యతలేదని త్రోచినైచుటకుఁ గూడ వీలులేదేమో. అయ్యయ్యో! ఆపురుషుఁడెవఁడో చెప్పుమా? యేఁబదియావకాయలు పట్టుఁదగిన కుండ యంత తలతోనున్నాఁడు. ఆతనితలపై నెఱ్ఱగ నదియేమి? 'పిత్ టర్ బెన్' కాబోలు! వహవ్వా! 'హైకోర్టులో' సాక్ష్యమునుకొంటివా? 'లెజిస్లేటివ్ కౌన్సిలుమీటిం' గనుకొం టివా? నీమొగమీడ్వ? అర్ధరాత్రమున సముద్రతీరమునందుఁ దేఱియిల్లాలితోఁ జెట్లచాటున సరసమేడ్చుటకు జేరిన నీకు జీలుగుబెండు బుట్ట నెత్తిమీఁద నెందులకురా? ముద్దులకు ధశీదు లీయవలయునేమో అణాబిళ్లలు Fountainpen కూడ జేబులోఁబెట్టుకొనియే వచ్చి తివా? ఆహా! స్వాటకపుమచ్చలచే నిండిన యాతనిమోము క్రొత్తగ గంట్లువైచిన తిరుగలిని ధిక్కరించుచున్నదే! చీ! చీ! చూచుట కసహ్యముగా నున్నది. అదిగో రోలంత బోదకాలు –ఆతనికి వయస్సు దాదాపు ఏఁబది యుండును. కాని యాతని కుడిబుజముపై చేయివైచు కొని యాతని యెడమబుజముపై మొగము పెట్టుకొనియున్న యాబంగారుబొమ్మ –యామనుష్యరూపశంపాలత–యాలావణ్యమూర్తి-యెవ్వతియో? కట్టు బొట్టు జుట్టువైఖరి చూడ నామె శ్రీవైష్ణవి యని తెలియుచున్నదే. ఆసోగకన్నుల మిలమిలలు–జిలజిలలు–ఓ –ఉత్తరపుగొసనున్న 'హైకోర్టుమీఁది' విద్యుద్దీపకాంతిని సొగతీసి దొడపై కొట్టునట్లున్నవే? నాయనలారా! బ్రాహ్మణాబ్రాహ్మణ వైరప్రధానరంగమైన యీపట్టనములో నీయబ్రాహ్మణున కాబ్రాహ్మణికంతమైత్రి మెందులకో యను స్వప్నసంబంధమైన సందర్భశూన్యతకే బ్రశ్నిం చుకొంటిని. 'పొలిటిక్సు' లోనేగాని 'యిరాటిక్సు'లో వారికట్టి శషభిషలు లేవుకాఁబోలునవి

కలలో నాకు నేనే ప్రత్యుత్తర మిచ్చుకొంటిని. ఆహా! స్వప్నవైచిత్రిక సాటి మరియొకటియేది? వారిట్లు సంభాషించుకొనుచున్నారు.

వైష్ణవి–పిళ్లగారు 'ఆర్ అండు సన్స్' లోని 'నెక్లెసు' మాటయేమి?

పిళ్ల–ఎంత సేపు నెక్లీసని–కమ్మర్ బందని–రిష్టువాచి యనివేఁపుకొని తిందువేకాని యొకయు ద్దీయవుకద.

వైష్ణవి–మూటలువదలకుండ ముద్దులు లభించు ననుకొంటివేమి? గెటప్‌వేళ యగు చున్నది. మావారు వెలింగ్టనునుండి యింటికి వచ్చువేళ గావచ్చినది.

పిళ్ల–నీభర్తవట్టిబ్లాక్‌హేడ్ –ఆ Fool ను బాగుగా టోపీ వేయుచున్నావు.

వైష్ణవి-నేను నాభర్తను మోసముచేయుచున్నాననుచున్నావా!

నీభార్య నిన్ను మోసముచేయుట లేదనుచున్నావు కాఁబోలు. ఇచ్చటికి రెండుపర్లాం గులదూరముననున్న రేవులో నీయిల్లాలు Soldier తో చెట్టపట్టములు వైచుకొని తిరుగుచు న్నది.

పిళ్ల–హహహ (నవ్వును) విట్టి. వెరివిట్టి–వెల్ రిటార్డెడ్ ఏది! ఒకముద్దు.

ఆ సౌందర్యవతి మళ్లెపూ వికసించినట్లు మందహాస మొనర్చుచున్నది. గడ్డ మిసు మంత పైకెత్తి మూఁతి రవంత పొడుగు చేసినది. ఇఁక నాశృంగారవతి యీనిర్భాగ్యుని ముద్దిడుకొనును. చూడును చూడుమని కాబోలు నొకనక్షత్రము మఱియొకనక్షత్రమునకుఁ గన్ను గీఁటుచున్నది. చంద్రుఁడు తారావార్తజ్ఞప్తికిరాఁగ జుంబనద ర్శనోత్కంఠచే నాకస్మికముగ నడ్డువచ్చిన మేఘమునుండి యొక్కదుముకు దుమికినాఁడు. గాలి యేమోకాని రవంత స్తంభించిన ట్లున్నది. పిళ్లగారు–బంధమువైచినపిమ్మటఁ బాలుపిదు కుటకు సిద్ధముగనున్న గొడిగేదెవలె కదులకుండ నిలువఁబడినాఁడు. ఈసన్ని వేహామును జూచి నాకు నవ్వువచ్చినదేమో నేను జెప్పఁజాలను. కాని యాకాంత నన్నుఁజూచి కెవ్వుమ న్నది. పోనిండు. అప్పుడైన నే నక్కడినుండి యెక్కడకైనఁ బోవచ్చునా? పాపుట కెందువల ననో కాని కాళ్లాడినవికాపు. దొంగ దొంగయని పిళ్లగారు ననున్నుఁగాంచి కేకవైచిరి. ''పిళ్లా! దొంగవు నీవా నేనా? ఈమె నీభార్యకాదుకదా! ఈమె నిచ్చటకుఁ దెచ్చిన దొంగవు నవా నేనా? ఏల వెఱ్ఱిమాటలాడెదవు. పోపో! అమ్మా! నీభర్త వెల్లింగ్టనునుండి వచ్చువేళయైనది. శీఘ్రు మింటికిఁ బొమ్ము. ఇఁకనెప్పు డిట్లు లాచరింప నని యానముద్రముతో నొట్టు పెట్టుకొ నుము. మావాణీదానుని కుక్కయైననీతని మూఁతిమీఁద మూత్రించుట కసహ్యపడునే. అట్టి వీనిని ముద్దుకొనుటకు సిద్ధపడుచున్నావు. నిన్నేమన వచ్చును.'' అని నేను వారిద్దఱితో నంటిని. అప్పుడు పిళ్ల ''నిన్ను 'ప్రాసిక్యూటు' చేయింతును నీపేరేమి?'' యని నన్నడిగెను. నాపేరు జంఘాలశాస్త్రి యని చెప్పితిని. నాపేరు వినుటతోడనే వారిద్ద ఱదరి పడినట్లు నాకుఁ గానఁబడెను. ఎందులకో నాకప్పటికిఁ దెలియలేదు. 'సాక్షి' నంఘములోని జంఘాలశా స్త్రివేనా యని యాసుందరి నన్నడిగెను. ఔనౌనని ప్రత్యుత్తర మిచ్చితిని. దోషము లేనిచోటనై నను దోష మారోపణముచేసి నీవు చెడమడదిట్టు భావముకలవాఁడవే. నీవు మమ్ము వదలిపెట్టుదువా. మమ్ము బ్రదుకనిచ్చెదవా? మమ్ము రచ్చచావడి కెక్కింపకుందువా? ఛీ

ఛీ! నీవిఁకఁ జావకతప్పదు. అని యాపిళ్ల నాతోఁబలికి అంతలో సీతారామ్ అని కేకవైచెను. ఆహా! రామనామ మిప్పటికైన వినఁబడినదా? ఱేపే శ్రీరామజయంతికదా. రామా రాజీవ లోన! అని కేకవైచితిని. కమింగ్ అని కేకవైచుచు నొకబొందలి వచ్చెను. అతఁడు మహాబలాఢ్యుఁడు. వారి మోటారుబండిని తోలువాఁడిన గ్రహించితని. నీయొద్ద పిస్తోలు న్నదా యని పిళ్ల యాతని నడుగ నున్నదని చెప్పెను. అతనిపిస్తోలును దీసికొని 'ఈదెబ్బతో సాక్షిసంఘముపైస' అని పిళ్ల నానుదిపైఁ బేల్చెను. ఆదెబ్బతో మేల్కాంచితిని. మేలుకొని చూడగ నింటికప్పునుండి పెంకుముక్క నుదిటిపైఁ బడినదని గ్రహియించుకొని -దెబ్బకేమికాని-ఆహా! యెంతపనికిమాలిన స్వప్నమువచ్చినదో? శ్రీరామచంద్రమూర్తిని మనస్సున గాఢముగా స్మరించుకొని పండుకొంటినే! రామా రాజీవలోచనా యని పదేపదే స్మరించుకొనుచుఁ బండుకొంటినే! రామచంద్రమూర్తిని గూర్చి స్వప్నము కలుగునేమో యని యెంత యాసయైన పడితినే. తుద కీదిక్కుమాలిన స్వప్నమా వచ్చినది! తుదకు శ్రీరామభగావానుని గూర్చి కల కలుగలేదు. కాని వైష్ణవరామునుగూర్చి కల వచ్చినది. రాజీవలోచనుఁడగు రామప్రభునిగూర్చి స్వప్నము రాలేదు. కాని రాజీవలోచనయగు రామనుగూర్చి స్వప్నము వచ్చినది. కలల కేమి కొదవయని యందురుకాని నాయనలారా! కలలుమాత్రము మంచివి కాంక్షించినప్పుడెల్ల కలుగునా? రామా! రాజీవలోచనా! దుస్వప్నాశనా! రిక్షింపుము. రక్షింపుము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

34. రైలు ప్రమాదము
హిమవన్నగరప్రాంత ప్రదేశప్రభావము

ఖిందులో జంఘాలశాస్త్రి రెండుఅనుభవాలు గురించి ప్రసంగించాడు. ఒకటి వాస్తవంగా జరిగినది. రెండోదికల.

శాస్త్రి మద్రాసునించి రైలులో ఏలూరు వెడుతూండగా, బెజవాడ దాటిన నాలుగు నిమిషాల్లో రైలాగిపోయింది. రాత్రి. కారణం, ఎవరో నలుగురు రైలుకిందపడి పోయారట. వారికి సంబంధించిన ఒకమనిషి ఏడుస్తున్నాడు. ఆ సందర్భంలో రైలులోప్రయాణంచేసే వారి మనస్తత్వాలను, ప్రశ్నలను, సందేహాలను, జంఘాలశాస్త్రి కధనంచేశాడు. సరే–రైలు వెనక్కి నడిచి మళ్లీ బెజవాడస్టేషన్‌లోకి జేరింది. జంఘాలశాస్త్రికి గత రెండురాత్రులు నిద్రలేకపోవడంవల్ల బాగా నిద్రపట్టింది. అందులో కల. ఆకలలో మళ్లీ ఒకకల. అలాగే కలలోని కలలోని కల–. తనూ, మరికొందరూకలిసి ఆకాశవిహారం. అంతలో వాళ్లు తనను క్రిందికి పడత్రోశారు. ఈకల చెదిరి, తను ఒకవ్యక్తి బుజంమీద 'కందువా'లాగ పడివుండి చేస్తున్న పర్వతాలనడిమి ప్రయాణం సాగుతోంది. ఆప్రయాణంలో, ఆ వాహకుడైన పురుషుడు హిమవత్ ప్రాంతం లోని శేష(తాల్ని చూపిస్తున్నాడు. జంఘాలశాస్త్రి హిమాలయానికి భక్తిగా నమస్కరించాడు. వాహకపురుషుడు–శ్రావణ పౌర్ణమాసి నందర్భంగా అక్కడ వారాహీఆలయ పరిసరాలలో జరిగే చిత్రమైన తీర్థం, మైదానంమీద జరిగేకోలాహలం, వారిమధ్య జరిగే దొమ్మీ–అన్నీ చూపించాడు. వారాహి, మహేశ్వరిని దర్శించడమనే ఆచారం చూపించాడు. అయితే–అక్కడ వాహకపురుషుడు మాయమయ్యాడు. జంఘాలశాస్త్రికి ఏలూరులో మెలకువ వచ్చింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! పదునైదుదినములక్రిందటి శనివారమునాడు సాయంకాలమున మదరాసులో బయలుదేఱి యేలూరు వచ్చుచుంటిని. బెజవాడకు రైలుబండి వచ్చునరికే మామూలువేళకంటె నిరువది నిమునము లాలస్యమైనది. బెజవాడలో బండి యాగ వలసినచోటికంటె నెక్కువచోట పాగి బయలుదేఱినది. బండి బెజవాడ వదులటయేమి? నేను–తిరుగ కన్నులు మూసికొని పండుకొనుటయేమి? కన్నులు మూసికొన్నపిమ్మట

నాల్గునిమిసము లయిన కాకుండనే బండి యాఁగిపోయినది. బండి యాఁగుటయేమి? తిరుగ నేను గన్నులఁ దెఱచుటయేమి? 'గాడీ కాహికు ఖడీగయా' యని యొక లబ్బీసాహెబు సిగరెట్టు ముట్టించుకొని తనకు సమీపమున నున్న శకటద్వారము నొద్దకుఁబోయి తొంగి చూచు నిలువఁబడెను. ఇంతలో నొక విశ్వబ్రాహ్మణుఁడు కాఁబోలు నావెనుకప్రక్కనున్న బల్లపైఁ బండుకొన్న యాతఁడులికిపడిలేచి బెజవాడస్టేషను వచ్చినదికాదా యని కన్నులు తెఱచియున్న నన్నడిగెను. రాను వచ్చినది దాఁటను దాఁటినదని నేనంటని! అయ్యో! అయ్యో! ఆమాత్రము రవంత చెప్పలేకపోయినావఁటయ్యా. యని యాతఁడు వృథగ నన్ను నిందించెను. ఆహా! జనుల నిందలకుఁ గారణలేశమైన నక్కఱలేదుకాఁబోలు. ఆతఁడు బెజవాడలో దిగునని నాకెట్లు తెలియును? తనకిష్టమయినపనియే పైవారు చేయవలయునని తన కనిష్టమయినపని నెల్లరు మానవలయునని తన సదుపాయమే పైవారు చూడవలయునని తన యసదుపాయమే యెల్లరు నిరాకరించపవలయునని లోకము తనకొఱకే సృష్టింపఁబడిన దనియు మనుజున కెంతగర్వము! ఎంతమౌఢ్యము! ఎంతయహంభావము! ఎంత పరనిరసన బుద్ధి! ఎంతతలతిక్క! ఎంతకొసవెట్టి! ఇట్లు నాపైఁ గోపపడి యాస్వర్ణకారకుఁడు మూట నెత్తిమీఁద బెట్టుకొని దిగఁబోవుటకు యత్నింపఁగ నాతనిప్రక్కనున్నయాత్రఁ డాతని నాఁపెను. ఇంతలో గార్డు, వానికి సహాయుఁడును జెఱియొకదీపమును జేతఁబట్టుకొని బండి ప్రక్కనుండియే యింగ్లీషున మాటలాడుకొనుచు నడచుచుండిరి. వారి మాటలలో 'accident' అనుమాట నాచెవినిబడినది. యంత్రమేభాగము నందైనఁ జెడిపోవుటచే బండి యాఁగిపోయి యుండునని నేననుకొంటిని. ఇంకను గదలలేదేమి యని మఱికొందఱు విసుగుఁదలతో లేచి తలుపులయొద్దకుఁ బోయి తొంగిచూడఁబోయి టంగుననేబల్లకొసయో యేమేకు కొసయో తలకు దిగులఁ దలపై చేయిపెట్టుకొనియే వంగి వీక్షించుచుండిరి. ఎప్పు డీబండి లంఘనాలబండియేరా యని యొక్కవర్తకుఁడు కాఁబోలు నావులించుచు ఎమ్. ఎస్. ఎమ్. ఆర్. కంపెనీ, బి. ఎన్. ఆర్. కంపెనీవార లందఱు నొక్కటే కట్టకట్టి వారిపైఁ జిల్లరచిల్లరగాఁ గాక టోకుటోకుగాఁ గోపపడి వెంటనే ముసుఁగిడి గుఱుకొపెట్టెను. ఇంతలో నెవఁడో బండిక్రిందఁబడి చచ్చినాఁడయ్యా యన్నవార్త కర్ణాకర్ణికగ వచ్చెను. బండి నడచ-ుచుండఁగా బండిలో నున్నవాఁ డెవఁడో క్రిందఁబడి మరణించియుండునా? యని కొంద ఱడిగిరి. బండినుండి పడినవాఁడు బంటిక్రిందఁబడుట కవకాశము లేదని యెఱుఁగరు కాబోలునని యొక ప్రకృతశాస్త్రవిద్యార్థి ప్రకృతిసూత్రపాంటితీగర్వమునఁ గాఁబోలు ప్రత్యు త్తరమిచ్చెను. ఒకఁడు కాఁడు మృతిచెందినవా రిద్దఱు. ఇద్దఱని మఱియొక కేక వినఁబడెను. ఇంతలో మాబండిలోని జనులందఱు నాతోఁగోడఁ గ్రిందికి దిగిరి. చచ్చినవారిద్ధఱుకారు ముగ్గురు ముగ్గురని మఱికొందఱ కేకలు వినఁబడెను. చుట్టలు సిగరెట్లు కాల్పనలవాటుకల వారు బండిచక్రములక్రింద కళేబరఖండము లేవైన గనఁబడునేమో యని జేబులలోని యగ్గిపెట్టెలు వెలిగించిరి. ఇంతలో లాంతరుదీపముల సాహాయ్యముచే నాపనియే గార్డును వాని తరువాతి యుద్యోగియు మఱియొకవైపున నుండి చేయుచుండిరి. "మే మయిదుగు ఱము బయలుదేరితిమి. నే నొక్కఁడనే మిగిలితిని. తక్కిననల్వురు చచ్చిపోయినా రయ్యోదేవుఁడా" యని యొకఁడు గట్టిగా నేడ్చెను. ముగ్గురుకాదు నల్వురు నల్వురని జనులంద ఱాకేకవైచినవానియొద్దకుఁబరుగులిడిరి. మీరెవరు? ఎందులకు బయలుదేరితిరి! మీలో స్త్రీ లెవరైననున్నారా? నీకు మరణించినవారంద ఱేమి కావలయును? ఎక్కడకుఁ

బోవుచున్నారు? బోయినవా రేమాత్రపు వయసుగలవారు? వారియొద్ద వెండి బంగారువస్తువు లేమైన నున్నవా? రైలుబండి మీమీఁదఁ బడఁబోవునరికి మీకది యెంతదూరమున నున్నది? వంతెనకది యడ్డుగా వచ్చినప్పుడు వంతెనక్రిందికైన దుముకలేకపోయినారఁటయ్యా! యని యెవరికిదోఁచినప్రశ్నము నర్థానర్థావశ్యగత లేకుండవా రాహతశేషు నడిగిరి. ఏడ్చుచున్నవాఁడు పాప మేమిచెప్పఁగలఁడు? చెప్పిన వినియోగ మేమున్నది? ఆప్రశ్నముల కుత్తరము లాతఁడు చెప్పినపిమ్మట వారందఱు మొదటిసారికంటె రెండవసారి యంతకన్న నెక్కువసంఖ్యగల ప్రశ్నములు వేయరని యేమినమ్మక మున్నది? ఏడ్చుచున్నయాతని జూచి కొంద ఱోదార్చిరి. పెద్దపొణకయంత లావుగ నున్నయతఁ డొక్కఁడు తాను గూర్చుండి బండిదిగక దిగిన నల్వురయి దుగురస్థలము తానే యాక్రమించుకొని బండిలో విశాలముగఁ జాఁచుకొని గూరుచుండియే ''ఏమోయి! అదేపనిగ నెందుల కేడ్చెదవయ్యా! బుద్ధిలేనిపని చేసినందులకు నోరు మూసికొని యనుభవింపక యేడ్చెదవేమి? బండి కడ్డాల రావలయును? ఆమాత్రము తెలియనక్కఱలేదా? చాలుచాలు ఊరకుండు'' మని తలవాచిన ట్లామృతావశిష్టుని చీవాట్లుపెట్టి గద్దించెను. ఆహా! నరులలో నెట్టి విచిత్రప్రకృతు లున్నవోయని యనుకొని యాతఁ డెవఁడో యాతని మొగముకూడ బుద్ధివలెనే యున్నదేమో కనుగొందమని యాతని మొగము పరిశీలించుచుంటిని. ఇంతలో నచ్చటిసంఘమున నున్నయొకఁడు శకటమార్గపార్శ్వముననున్న కంకఱతూలలో నొకటి తీసి యాస్థలిష్టునిపై విసరెను. అతనివ్రేటు సూటిగఁ దగులలేదనికాఁబోలు సానుభూతితో వేఱొకఁడు మఱియొక తూతిని విసరెను. ఆ! ఆ! అని యాతఁ డఱచుచు లేవఁబోవుచుండ ముమ్మాఱు మర్యాదను నిలువఁబెట్టుటకుఁ గాఁబోలు మఱియొకఁడు మఱియొకబెడ్డను విసరెను. అక్కడ బెడ్డలకేమికొదవకాని, యాబెడ్డమాత్రము మత్స్యయంత్రమును గొట్టిన యర్జునుని బాణమువలె నాతనికంటెపైఁ గొట్టగ నాతఁడు ''అమ్మయ్యో! అమ్మయ్యో!'' యని యేడ్చెను. ఆయేడ్పు నాలించి ''ఏమోయి! అదేపనిగ నేడ్చెద వెందులకు? తెలివితక్కువపని చేసినందులకు నోరుమూసికొని యనుభవింపక యేడ్చెదవేల? ఆడగూడనిమాట యేల యాడవలయును? చాలుచాలు ఊరకుండు'' యని జననంఘమునుండి యొకఁడాతని గట్టిగనదల్చి గాండ్రించెను. ఇంతలో వేఱొకబండి ప్రక్కనుండి శివశివా! రామరామా! హా హా హా హా! అల్లా! అల్లా! యనునాలాపములు వినఁబడినవి. అచ్చటి కందఱు పోయిరి. గార్డుచేతిలోని దీపకాంతి సాహాయ్యమునఁజూచిరి. తునుకలైన కాళులు చేతు లవిగో! అయ్యయ్యో! అచ్చటినేల రక్తముతో నెట్లుతడసియున్నదో! అబ్బ! అబ్బ! అదేమి? కడుపులోని కోశములు ప్రేవులు నీవలకు వచ్చి యచ్చట తొట్రుడంత ప్రోఁగుగాఁబడియున్నవే-ప్రోఁ గొక్కటియేకాదు. అచ్చటి మఱియొక్కటి యున్నది. రామ రామ రామ రామా? ఎట్టిగ నల్లగ తెల్లగ నదియేదో మఱియొకరంగుగ -శ్రీహరీ శ్రీహరీ! ఒడలు జలదరించుచున్నది. గుండె నీళ్లైపోవుచున్నది. అని యెవరికిఁ దోఁచినట్లు వారు విలపించి యాభీభత్సదర్శనమున కాఁగలేక యెవరిబండిని వారెక్కుటకుఁ బోయిరి. ప్రాణమనఁగానెంత! యెనియొకఁడు. నిమునమునకు వచ్చెడిసంగతి తెలియదుగదాయని, యొకఁడు, మృత్యుదేవత వారి నచ్చటి కట్లీడ్చుకొని వచ్చినదని యొకఁడు, ఆఘటనముల కంతటితోనే సరియని యొకఁడు, అన్నియుఁ గనిపట్టిన యాసీమదొరలు చావులేకుండఁ గనిపట్టలేకపోయినారేమో యని యొకఁడు, ఈరైలు రాకముందు మనదేశములో నిట్టిదుర్మరణములు లేవని యొకఁడు, వింతసుఖములతోడనే వింతకష్టములు

వృద్ధియగునని యొకఁడునై యిట్లెవరికిఁ దోఁచినట్లు వారు మనుష్యజీవనముపై లఘువ్యాఖ్యానములు రచియించుచుండిరి. నామేనమామ మూఁడులక్షలరూపాయలు పెట్టి పెద్దమేడ కట్టించినాఁడు. ఆయనకుఁగొడుకులు కూఁతులు మనుమలు నల్లురు మొదలగు కావలసినంత బంధువర్గముండెను. ఇంటిలోఁ జల్లియన్నమునకు మూఁడుకుంచాల బియ్యము వారెడివి. ఆతఁ డొకనాఁ డూరివెలపలికి షికారుపోయి యాకస్మిక మూర్ఛచే విఱుచుకొని పడి పశువులు నడచుపుంతలో నీవు నేను మాటలాడునంతలోఁబ్రాణములను విడిచినాఁడు. ఊరిలోమూఁడులక్షలరూపాయల మేడయేమి! ఊరివెలుపల బొమ్మచెముడుకంపల ప్రక్కను నేలపైఁజావేమి?'' యని యొక యబ్రాహ్మణవితంతువు తనమాతుల మరణగాథను సంక్షేపముగఁ జెప్పి కన్నులొత్తుకొనెను. ఆమాటలకు కర్థము తెలిసికాఁబోలు లబ్బిసాహెబుగారు ''అమ్మా! మట్టిమీఁద మర్‌జానా ఒకటే తక్తుమీఁద మర్‌జానా ఒకటే ఫరఖ్ లేదు. ఇందుకు ఫార్సీకవి ఇసీ మొవాఫిక్ సెలవిచ్చినాఁడు.

జహాఁ. అయిబిరాదర్ నమానద్ బకస్
దిల్ అందెరె జహాఁ ఆఫరీన్ బంద్ ఒ బన్
మకున్ తెక్య బర్ ములుకెదున్యావొ పుష్త్
కె, బిస్యార్‌కస్ చోఁతో పర్వర్ద్ వొకుష్త్
చొ ఆహంగె రఫ్తన్ కునద్ జానెపాక్
చెబర్ తఖై ముర్దన్ చెంబర్ రూయెఖాక్.

పాపము లేకుండావుండే అనఁగా 'పాక్' యీప్రాణం వున్నదే ఇది 'తన్' కి విడిచిపెట్టి 'ఉడాయించే' టప్పుడు మట్టిమీఁద 'మర్జానా' కి 'లుక్సాన్' యేమి తక్తుమీఁద మర్జానాకీ నఫాయేమి రెండుకూడ ఏకిచ్'' అని ప్రస్తుతవానఁ గావలసి కడపటి రెండుపాదములకు మాత్రమే తాత్పర్యము చెప్పి యూరకుండెను. ఉర్దూబాస పదియణాలు నాంధ్రభాష యాఱణాల కూడికతో నున్న యీ యసాధారణ వ్యాఖ్యాన మాబ్రాహ్మణేతరవితంతువునకుఁ దెలియకకాఁబోలు ''సాహేబుకు చెవుడుకాఁబోలు నే నొకటిచెప్పఁగఁ దానొకటి చెప్పునేమి'' యని యామె విసుఁగుకొనెను. ఇంతలో బండికూసి వెనుకకుఁ బోవ నారంభించెను. పంచాయతి మొదలగు నాచారములకొఱకుఁ గాఁబోలు బెజవాడస్టేషనుకుఁ బోవుచున్నదని యచ్చటివారు కొంద ఱనిరి! బెజవాడకుఁ బోయినపిమ్మట నచ్చట నేమజరిగెనో నేమియుఁ దెలియదు. గతించిన రెండురాత్రులుగూడ నాకు నిద్రలేకపోవుటచేఁ గాఁబోలు మనస్సు మహోందోళన మొందుచున్నను నాకు గునుకువచ్చినది. ఆకునుకులోనే స్వప్నము కలిగినది. దానిని జెప్పెదను. దయయుంచి వినవలయును.

నేనొక్క కొండపై నిద్రించుచుంటిని. వింటిరా. నాయనలారా! కలలోఁగూడ నిద్రించునట్లు కల! అట్లు నిద్రించుచుండఁగా నెవ్వఁడో వచ్చి నన్ను నిద్రనుండి లేపెను. నే నులికిపడి మేల్కాంచి కూరుచుంటిని. నాయనలారా! ఈమేల్కొనుటకూడ నిద్రలోనే. ఈకలకూడఁ గలలోనే–కలలోనే కన్నులు తెఱచి యాపురుగునివంకఁజూచితిని బొచ్చుతో నున్న గొఱ్ఱెచర్మముల నాతఁడు తొడుగుకొని యుండెను. తలకు గొఱ్ఱెచర్మపుటోపి పెట్టుకొనియుండెను. తనకంట దీర్ఘమగు నొక వేణుదండము నాతఁడు చేత ధరియించి యుండెను. నే నాతనిఁగాంచి యిట్టివేషధరుల నిదివఱకు నాయుత్తరదేశయాత్రలలోఁ

జూచియుండుటచే విశేష మచ్చెరువుపడక నన్నేల లేపితివని యాతని నడిగితిని. నీవు నిద్రపోవుచుండుటచేత లేపవలసివచ్చినదని యాతఁడు నాకుఁ దెలుఁగుననే ప్రత్యుత్తర మిచ్చెను. ఈతఁ డాంధ్రమెటనభ్యసించినాఁడో యని నామనస్సునఁ గలిగిన యాశ్చర్యము నడఁచుకొని నిద్రనున్నవారినెల్ల లేపుటయే నీపనియా యని నే నాతని నడిగితిని. తెల్లవాఱవ చ్చుచున్నను నిద్రించుటయే నీపనియా యని యాతఁడు ననున్నధిక్షేపించి ''లెమ్ము ఇఁకలెమ్ము! నాతోఁగూడ రమ్ము నీకుఁ జిత్రములఁగానఁబఱతు'' నని యాతఁడు ననున్ను హెచ్చరించెను. ''నీతోఁగూడ రాకపోయినయెడల నీవేమిచేయుదు'' వని యాతని నే నడుగ, నిన్ను బుజముపైఁబట్టుకొనితీసికొనిపోవుదునని యాతఁడు నాతోడననెను! అట్లేచేయరాదా ఈమాత్రపుభాగ్యమునకు వేఱ నన్నేలయడిగెదవని నేనాతనితో ననఁగ, దండెమునన్నున్న యంగవస్త్రమును స్నానమునకుఁబోవుచు మనము బుజముమీఁద వైచికొనున ట్లాతఁడు ననున్నుఁ దనస్కంధమునఁ బెట్టుకొని యతిశ్రీఘ్రమనమున నొక కొండమీఁదినుండి మఱి యొక కొండమీఁదికిఁ బోవుచున్నాఁడు. ఆతఁ డిట్లు పరుగెత్తుటవలన గలిగిన కుదుపుచే నాకు మరలఁ గును కారంభమయ్యెను. నాయనలారా! వింటిరా! కలలోఁగలిగిన కలలోఁ దిరుగ నిద్ర—ఈనిద్రలోఁదిరుగఁ గల వచ్చుచున్నది. చెప్పెదను వినుఁడు. ఇది కలలోని కలలోనికల—నేనును మఱికొందఱను గలసి యొక యాకాశవిమానములోఁ గూరుచుండి వినువీధుల గంటకు నూఱుమైళ్లకంటె హెచ్చువేగమునఁగాఁబోలుఁ బోవుచుంటిమి. మాలో నేనుదక్కనంద ఱబ్రాహ్మణులే. వీఁడు బ్రాహ్మణుఁడువలె నున్నాఁడే! అందులో ఖద్దరు ధరించుటచే (Non-Co-operator) వలె నున్నాఁడే? చూచెదవేమి? త్రోచివేయుఁడు. క్రిందికిఁ ద్రోచివేయుఁడని మనవారే—మనయాంధ్రులే—మన మిత్రులైన యబ్రాహ్మణులే —మనదేశ లాభనష్టములకు బాధ్యులైన మనవారే—యొక్కత్రోపుతో ననున్నుఁ గ్రిందికిఁ దోచివై చిరి. ఈత్రోపుతో మేల్కాంచితిని. ఇక్కడి కీకల సరి. కుదుపువలనఁ గలిగిన దరిమిలాకునుకు సరి. ఇంతకుఁ బూర్వమున్న కలలోనే మేల్కాంచి తిరుగ నిద్రరాకుండ భద్రముగ బలవంతముగఁ గన్నులుతెఱచి జాగ్రత్తగ బింకముగఁ గూరుచుండి నరవాహనముపై నగములెక్కుచు నగములు దిగుచు నంతరిక్షమునఁ బోవుచుంటిని—''జంఘాలశాస్త్రీ! కునుకు చున్నావుకాఁబోలు ఖబర్‌దార్ అని హెచ్చరించి నేనుజెప్పుమాట లేవోవినుచు నేనుజూపు ప్రదేశములను జూచుచుండుము. ఇదిగో! యీయంజనమును గంటికి రాచికొ నుము నిద్ర రాకుండఁజేయును. అదిగాక దూరస్థపదార్థదర్శనశక్తినిచ్చును'' అని యాతఁడు పలికినాఁడు.

''ఇదిగో నాచేతినైపునఁ జూడుము. అదియే జ్యోతిష్మతము. అదిగో! తపోవనము. జ్యోతిష్మతమునకుఁ బ్రాగ్దక్షిణమధ్యదిశను భవిష్యద్బదరీనారాయణ మున్నది. నమస్కరిం పుము'' అని యాతఁడుచూపెను. నారాయణ నారాయణ నారాయణా యని స్మరించుకొం టిని. ''అదిగో! అదిగో! భవిష్యద్బదరిచుట్టు కొంతదూరమున దక్షిణముగాఁ బ్రవహించుచు ముత్యాలక్రోవవలె నున్న నదియేదో యెఱుఁగుదువా? అదియే ధవళనది. చూచితివా?'' యని నన్నాతఁ డడిగెను. ''అయ్యా? నాకేమోకాని కన్నులు తిరుగుచున్న'' వని నే నంటిని. ''అటులైనఁ గన్నులు మూసికొనుము. మఱికొంత పోయినతరువాత నీసులువు చూచుకొని తిరుగఁ జెప్పెద'' నని యాపురుషుఁడు సెలవిచ్చెను. నేను గనుల మూసికొంటిని. కొంతసేపైనపిమ్మట నాతఁడు ననున్నుఁ బిలిచి ''ఈసారి కనులఁ దెఱువుము. అదిగో!

దేవలఘట్టము. అక్కడనే రెండు చిన్ననదులు గలసినవి. దానిగట్టుననే యొకమహారాజు మందిరము శిథలమైయున్నది. చూచితివా! అదిగో! యాఘట్టమునకు మఱియొక పార్శ్వమున మహాదేవుని యాలయమున్నది. బాగుగాఁజూడుము'' అని యాతఁ డనెను. ''చూచుచున్నాను నాయనా!'' యనిపల్కి మహాదేవశంభూ! మహాదేవశంభూ! యని స్మరించుకొంటిని. ''మహాదేవుని యీయాలయమునకు మహారాజవరుని యీమందిరమునకు నొక్కము హూర్తమందే శంకుస్థాపనము జేయవలయు ననియచ్చటి మహారాజు మహంతుకూడఁ గలసి నిశ్చయించుకొనిరి. కాని యామర్యాదను మహారాజు పాటింపక మహంతునకు వార్తనైనఁబంపక తనమందిరనిర్మాణము నారంభించెను. ఈయంశము మహంతు తెలిసికొని త్రీవక్రోపుఁడై మహాదేవుని యాలయము నిలుచును. మహారాజుమందిరము కూలు ననిపలికెను. అందువలన మహారాజు మందిరమటుల శిథలమై యున్నది వింటివా?'' అని యాతఁడు నన్ను హెచ్చరించెను.

''వింటిని శ్రద్ధగా వింటిని గాని కన్నులు మఱలఁ దిరుగుచున్న'' వని నే నంటిని. ''నీకర్మము నేనేమిచేయగలను'' అని యాతఁడు మాటలాడకుండఁ గొంతదూరము నన్ను మోసికొనిపోయెను. ఎటులున్నదని కొంతసేపటి కాతఁ డడుగ బాగుగనే యున్నదని యంటిని. ''అదిగో నందికేసరి. ఇచ్చట రెండు దేవాలయము లున్నవి. చూడు! నందీశ్వరుని దొకటి–మహాదేవుని దొకటి. మహాదేవుని వాహనమునంది. పార్వతీదేవి వాహనము కేసరి–ఈ రెంటిచేఁ బవిత్రమగుటవలన నీస్థలమునకు నందికేసరి యనుపేరు కలిగినది'' అని యాతఁడు పలికెను. దుర్గా! భవానీ! మహాదేవశంభూ యని స్మరించుకొనుచుఁ గన్నులు తిరుగుటచేఁ దిరుగఁ గన్నులు మూసికొంటిని. కొంతసేపైన పిమ్మట, ''నయ్యా! మరి యేమైనఁ జెప్పవా'' యని యడుగ ''అదిగో త్రిశూలపర్వతము దీని ప్రాక్కునయే హిమాలయములోఁ గలియును. అదిగో సూర్యుఁడుదయించుచున్నాఁడు. త్రిశూలపర్వతమునైనఁ జూడుము. పొగ వచ్చుచున్నది. అచ్చటఁ బాండవుల మహాసనమున్నది. దానినుండి పొగ యప్పుడప్పుడు వచ్చుచుండును.'' అని యాతఁ డనఁగ, రావణునిశ్మశానప్రదేశమునుండి నిత్యమిప్పుడపొగ వచ్చుచుండునని యున్న జనవాక్య మప్పుడు నాకు స్మృతికివచ్చినది. ''తిరుగ నిద్రయేనా'' యని యాతఁడు ననుఁ బ్రశ్నింపఁగ 'లే' దని యంటిని. మనగమ్యస్థానము నింక బహుశ్రీఘ్రముగఁ గన్పట్టుచున్నవో! అవిగో దేవదారు కదంబ కపాలవృక్షములు. తక్కినచెట్లు వేళ్లు స్పష్టముగఁ దెలియవు. చూచితివా!'' యని ననుఁ బ్రశ్నింప ''మహాప్రభూ! చూచుచుంటిని. హిమవన్నగరాజమా! నమస్కారము. లోకమాతయగు హైమవతీదేవి నీయందేకదా యుద్భవించినది! నీమహాదృష్ట మేమని చెప్పవచ్చును? జగద్భర్తయు జగద్భర్తయునగుపరమేశ్వరుఁడు నీయింటి యల్లుఁడగునప్పుడు నీమహాభాగ్య మేమని చెప్పవచ్చును? లోకపావన మూర్తులగు సింధు గంగా బ్రహ్మపుత్రాదినదుల కాధారభూతుఁడవు నీవేకావా? సర్వపర్వతరాజములకు సార్వభౌముఁడ నీవేకదా! సముద్రములు చవుటిపల్లములైనవి. చవుటిపల్లములు సముద్రములైనవి. మహాఖండములు చిన్నద్వీపములైనవి. చిన్నద్వీపములు మహాఖండములైనవి. పేరులేనిజాతులు పెద్దజాతులైనవి. పెద్దజాతులు పేరులేనివైనవి. గవ్వలు కనకరాసులైనవి. కనకరాసులు గవ్వలైనవి. మహానాగరకులు మృగప్రాయులైరి. మృగప్రాయులు మహానాగరకులైరి. పురాతనగోళములు కొన్ని తిరోధానమొందినవి. క్రొత్తగోళములు ప్రత్యక్షమైనవి. ఆదిత్యమండలమునకైనఁ బూర్వతీక్ష్ణత పూర్వచండత పూర్వశక్తి

కానరాకున్నవి. కాని పశుపతీశ్వరా! హ్రాలేయాచలశేఖరా! నీవొక్కరీతిగానేయున్నావే! ఆర్యావర్తవాసుల సత్యమువలెఁ, శౌచమువలె, దయవలె, దైవభక్తివలె, స్వార్థపరిత్యాగమువలె, శాంతివలె, యోగశక్తివలె, నార్యావర్తసుందరులయతిథిపూజవలెఁ బాతివ్రత్యమువలె నాపత్సహనమువలె నీవొక్కరీతిగనే యున్నావే! సెబాస్! నీకట్టిమహానుహిమ మార్యావర్తసంబంధమునఁ గలిగినదో–ఆర్యావర్తమున కిట్టి యలౌకికయోగ్యత అన్యమతవిద్వేషశూన్యత, ఆత్మచింతాపరతనీవలనఁగలిగినదోఎటులైననేమి? తలనుబట్టియేహృదయమునకుఘనత-హృయమునుబట్టియే తరకుఘనత-భారతీదేవి హీరకిరీటమా! నమస్తేసమస్తే'' యనినేనుచ్చైస్వరమునఁబలుకుచుండఁగా నన్నుమోయుచున్న నరసత్తముఁడు ననొక్క చిన్న మెట్టపైఁ గూరుచుండఁబెట్టెను. ఇచ్చటివింతల నేమాపెదను చూడుమనియిట్లుచెప్పెను. ''అదిగో దేవీధరమను గ్రామము! అదిగో నాచేతివైపున సమీపముననే రెండు గొప్పబోడిఱా ళ్లున్నవి. క్రిందిజాతిమీఁదఁ బైఱాయి యమర్పఁబడినట్లున్నది! పైఱాతిపైని సమప్రదేశము మిగుల సుందరముగను విశాలముగను నున్నది దీనికి రణశిల యనిపేరు. దానిపైనుండి క్రిందనఱా కబిల మున్నది. ఆబిలమును భీమసేనుఁడు తనగదతో నాపాషాణమున నిర్మించినాఁడు. ఆరణశిలపైని చతుశ్రమైన యొక్క పెద్దఫలకమున్నది. దానిపై గజాశ్వాదిరూపముల మలచినటా లున్నవి. ఆఫలకమే భీమసేనుఁడు ద్రౌపదియు నాడుకొనిన చతురంగపాళి –మఱికొంతపైన మఱికొన్ని బోడిఱాలున్నవి. ఆఱాల కీరణశిలకును నడుమనున్న చరియలోనే వారాహిదేవియాలము మహాదేవునియాలము భీమసేనునియాలయము నున్నవి. వానిని నీకుఁ దరువాతఁ జూపుదును. ప్రస్తుత మిక్కడ నిపుడు జరుగఁబోవు చిత్రమును నీవు చూడుము. ఈదినము శ్రావణపూర్ణిమాసి. ఇక్కడ నొకతీర్థము జరుగును. నడుమ నడుమ నీ కేదియైనఁ దెలియకున్నయెడల నన్నడుగుము. అంతేకాని నీవు మఱియెవ్వరితోడను మాటాడఁదగదు'' అని యాతఁ డనఁగ సరేయంటిని కన్నులు తెఱచి చూచుచుంటిని. ఎప్పుడు తొప్పడినదో నేను జెప్పలేను గాని తిరుగ తొప్పలెత్తుసరికి కా పెద్దమైదానమంతు జనులతో నిండియున్నది. చర్మవస్త్రధారులు, చర్మాంగరక్షధారులు, చర్మోష్ణీషధారులు, చండస్వరూపులు, గదాదండపాణులు, ఖడ్గాలంకృతావలగ్నబంధులు వందలు వేలు మెఱపు మెఱసి మాయమగునంతకాలములో నటకుఁ జేరిరి. చేరి యేమిచేయఁదలఁచిరో యెవరికి దెలియును! కోవాపాలదుకాణములు లాడూ బర్ఫీ దూడ్ పేడా దుకాణములు, పండ్లదుకాణములు, భంగుదుకాణములు, బీడీలదుకాణములు, చిత్రచిత్రములగు చర్మవస్త్రముల దుకాణములు, సారాయిదుకాణములు నంబరుగుండ్లు అంకులరాళ్ళనులు చిత్రవస్తుప్రదర్శనశాలలు పగటిభాగవతులమేళములు, లాటరీనివేశనములు, పుస్తకములయంగళ్లు నిఁకనేవియో మఱియిఁకనేవియో మైదానమందంతట వర్తులముగ వ్యాపించియున్నవి. దారాహీమాయీ లారా! హిమాయీ యను మహారవములు చుట్టుపట్లనున్న పర్వతము డీకొని మాఱుమ్రోగుచున్నవి. ఆహాహా! దాక్షాయణీభక్తు లెంద ఱిచ్చటఁజేరి యొడలుప్పొంగ, మనసుపుష్పింప, నాత్మ తరింప నాలోకమాతను స్మరించుచున్నారో! ఆహా! ఎంత దివ్యదర్శన మగుచున్నది! అదేమి అదేమి? వారంద ఱట్లు చేతులెత్తి యొకచేతి నటు వేలొకచేతి నిటు విదుర్చుచున్నా రెందుచేతనో! జయా కాళికేశ్వరీ! జయా కాత్యాయనీ! జయా కాదంబినీ! యని యుత్తుంగస్వరములవారాహీదేవికి హెచ్చరికలు పఱించి అట్టె చిటుకవ్రేసినంతలోనచ్చటిభక్తులెల్లరు రెండుపాయలుగా విడిపోయిరి. వారి యిద్దఱి మధ్యమున దారాపుగా రెండువందలగజము లెడమున్నది.

అంతకుముందుఁ గానఁబడలేదు కాని యాయవకాశపునడుమ పొలిమేరఁదెలియఁజేయు చిన్నఱాల చాలున్నది. ఆప్రక్కనా రంద ఱాపైపు గ్రామములవారు. ఈప్రక్కనా రంద ఱోపైపు గ్రామములవారు. అందఱు వారాహీభక్తులే—ఈపక్షమునుండి యొకపురోహితుఁ డాపక్షము నుండి యొక పురోహితుఁడు పసపుతోఁ, గుంకుమతో, విభూతిపండ్లతోఁ వేఁపమండలతో, వేణుదండములతో, నుభయపక్ష జయజయ ధ్వానములతోఁ, బటహభేరీకాహళఢంకానినాద ములతోఁ బొలిమేరయొద్దఁ దారసించిరి. జయా వారాహీదేవికి జయా జయా వారాహీదేవికి జయా యని కేకలువైచి కరాగ్రములందున్న కట్టెలతో నొకరి నొకరు—మోదుకొనిరి. వా రన్యోన్యతాడనపీడన సంరంభులైయుండ నిట్లే జయజయధ్వానము లిచ్చుచు నీవైపునుండి కొంద ఱావైపుననుండి కొందఱు నడుమకువచ్చి, ముష్టిఘాతములచేఁ, బాదతాడనములచేఁ, దరవారివ్రేటులచే, గదాఘాతములచే నొండొరులఁదాఁకిరి. వీరికి వారి కేమైన శత్రుత్వమా? లేదు. వీరికి వారికేమైన మతులుపోయినవా? లేదు. అమితసురాపానమున వీరికి వారికి విస్మృతి కలిగియున్నదా? లేదు. ఒకరిపై నొకరికిఁ గోపముకాని మత్సరముకాని యీర్ష్యకాని యున్నదా? లేదు. ఏమియులేదు- సరేకదా! వారందఱు మిత్రులు బంధువులు కాళీభక్తులు. అన్యోన్యక్షేమలాభాపేక్షచే వారట్లుకొట్టుకొనుచున్నారు. తన్నుకొనుచున్నారు. పొడుచుకొ నుచున్నారు. నఱుకుకొనుచున్నారు. దెబ్బలు కొట్టినవారిపై దెబ్బలు పడినవారిపై దేవీక టాక్ష మమోఘముగ వచ్చునని సంపూర్ణవిశ్వాసముతో సమంజసదీక్షతో సంతతభక్తితో వారట్లాచరించుచున్నారు. దెబ్బలుకొట్టిన వారికి దెబ్బలు పడినవారికిఁగూడ నాసంవత్సర ముమట్టునకు స్ఫోటకబాధలేదు. మహామారిబాధ లేదు. విషూచీబాధ లేదు. క్షామబాధ లేదు. మృగబాధ లేదు. సర్పబాధ లేదనునమ్మకము వారియెముకలలోని మూలుగులలోని మూలుగులలోఁ దేజోమయాక్షరమువలె ముద్రింపఁబడియున్నది. ఎటులో యొకట్లు భక్తుల యొడళ్లనుండి రక్తధారలు స్రవింపవలయును. స్రవించినఁగాని శ్యామలాంబాకటా క్షము వారిపై రానేరదు. అందుకొఱకు బాధయనునదియే యెఱుఁగక మహోత్సాహమున మహాసంతోషమున వారొకరినొకరు మర్దించుకొనుచున్నారు. ఆహాహా! బొంబొంబొమ్మని శంఖములు మ్రోగుచుండ ఘణఘణమని జయఘంటలు శబ్దించుచుండ డమ్ డమ్ డమ్మని డంకాలు ధ్వనించుచుండ, పర్వతములనడుమనుండు సన్ననిచరియనుండి ప్రభంజనుండు శతకోటి తురంగధాటితో ప్రబలరోనధ్వానములతో రైంరైమని వీచి దేవదారువృక్షములను దల్లినేల్లతో నూఁగఁజేయుచుండ సంతోష సముజ్జ్వలదాస్యమండలులై వారు మఱల డీకొను చున్నారే! ఝుఫ్, ఫఫ్, కఱక్క్, కసిక్, గభి గుభి, ఢామ్, ఢిమ్, టప్ టిప్ అను భయంకరధ్వనులు శతసహస్రగుణితములై శ్రవణపుటములఁ బడుచున్నవే కాని యామహా సంచలనములో- నామహాందోళనములో- నాదొమ్మిలో-నాధూళిలో నాహాహా! మఱే మియుఁగనఁబడుటయేలేదే! మఱియొక్కనిమిషమున కేకారణముననో యాగందరగో ళము శాంతించినది. భక్తుఁ డొకఁడు చచ్చినాఁడని యాప్రక్కనుండి వినఁబడినది. జయా వారాహీదేవికి జయా! ఈభక్తునకు మోక్ష మిప్పింపుము. మా యీ వారాహీమాయీ యనుప్రార్థనలు వినఁబడినవి. ఒకఁడుకాఁడు. ఇద్దరు చచ్చినారని యాప్రక్కనుండి మఱల నుద్ధీవమున నొక్క కేక వినఁబడినది. జయా వారాహిదేవికి జయా! ఈభక్తునకు మోక్షమిప్పిం పుము మాయీ వారాహీమాయీ యనుప్రార్థనలు వినఁబడినవి. ఆహాహా! మహాసంతోషము మహాసంతోషము. ఇద్దరుకారు. ముగ్గురు భక్తులు దేహముల చాలించి రనుకేక యాప్రక్క

నుండి మఱుల వినఁబడినది. జయా వారాహీదేవికీ జయా! ఈభక్తునకు మోక్షమిప్పింపుము. మాయీ వారాహిమాయీ యనుప్రార్థనలు వినబఁడినవి. ఆహాహా! ముగ్గుఱుకారు. నల్వురుభక్తులు మరణించిరని యాప్రక్కనుండి మఱికొన్ని కేకలు వినఁబడినవి. జయా వారాహీదేవికి జయా! ఈభక్తునకు మోక్ష మిప్పింపుము. మాయీ వారాహిమాయీ యను ప్రార్థనలెల్లెడల వినఁబడినవి. ఇఁకచాలు! ఇఁకచాలు నని మొదట సరిహద్దునొద్దఁ దారసిల్లి పురోహితులు కాఁబోలు కేకలు వైచిరి. మేము శాంతింపము. మాకింక దెబ్బలు తగులలేదు. మాయొడళ్ళనుండి యింకరక్తము రాకున్నది. మీ రదృష్టవంతులై మమ్ము నిర్భాగ్యులఁ జేసేదరా? దేవీకటాక్షమునకు మీరేకాని మేము పాత్రులముకామా యనుకేక లుభయపక్షములనుండియు వినఁబడనవి. అంత నాపురోహితులిద్దఱు నతే మీభక్తికి సంతసించితిమి. కత్తులతో గట్టలతో గడలతోనిఁక బోరవలదు. చిన్నచిన్నఱాలతోఁ గొట్టుకొనుఁడని దయాపూర్వక ముగ వారు సెలవీయగఁ గుడిప్రక్క వ్రేలాడుచున్న తోలుసంచులలోని ఱాలు తీసికొని యొకరిపైనొకరు ఱువ్వుకొనిరి. ఱాలవర్షము ఓ తెఱపి తెంపులేకుండ గురియుచున్నది. దడదడ బడబడ చిట పట ధ్వనులతోసూటిగఁ బ్రక్కబాఱుగ నారోహణగతితో నవరోహణ గతితో నవ్యాపనవ్యధాటులతో ఱాలు పడుచున్నవి. హస్సుహస్సుగాని అమ్మ అబ్బయని కాని అయ్యో కట్టా యనికాని కుయ్యోమొఱ్ఱోయనికాని యొకపిల్లవానినోటినుండియైన వినఁబడదుకదా! ఆహాహా! నీరంధ్రమైన నిశ్చలమైన నిరుపద్రవమైన భక్తికి యెట్టి యనాగరక భక్తికైన నరే యెంత మహానహనశక్తియున్నదో! ఆహాహా! కత్తివ్రేటు పూవుపాటే. ఫిరంగి గుండు వీలాకందుకమే. మహాగ్నికీల మంచుగడ్డయే. ఆధ్యాత్మికశక్తియున్నవానిని శతఘ్నులు హింసింపగలవా? బాంబులు ఛేదింపఁగలవా? ధరాకంపము లూపఁగలవా? అగ్నిపర్వతములు కాల్పఁగలవాయని నాలో నేననుకొనుచుండ "నింకఁ జాలు" అనుకేక వినఁబడినది. ఆకేకతో నందఱు విడిపోయిరి. తిరుగ నుభయ పక్షమధ్యమున రండువందలగజముల యవకాశ మగపడినది. అంతనీపక్షముండి యయిదుగు రాపక్షమునుండి యయిదుగురు చిన్నచిన్న ఱాలతో విలాసముగఁ గొట్టుకొనుచు సరిహద్దునొద్దకు వచ్చి యక్కడఁగొంత పూజచేసి యొక్కసారి పదిశంఖము లూఁదిరి. ఆధ్వనితో నీపక్షమువా రాపక్షమువారు బిలబిల కలసికొని మహానందమున వారాహీదేవి కోనలోనికిఁ బరుగెత్తిరి. నన్ను బుజమున వైచుకొని నామిత్రుఁడు వారివెంటఁ బరుగెత్తెను. వారాహీదేవిని నేను దర్శించి నమస్కరించి "మాతం గన్యాం మనసాస్మరామి" యను మకుటమున్న శ్లోకములను బఠించి తెంపలు వైచుకొంటిని. అంతట నొక జాత్యంధుని దేవాలయపుబూజరి లోని కంపి తలపు లీవలవైచెను. అమ్మవారి కలంకారాదులు జాత్యంధుఁడే చేయవలయు ననునాచార మున్నది. పైకి నిరర్థకముగఁ గానఁబడుచున్న యీయాచారములో నెంత గంభీరార్థ మిమిడియున్నదో యని నేను ముక్కుపై వ్రేలువైచికొంటిని. ఇంతలో తలుపుతీసి పూజారి లోనికిఁబోయి పైనున్న చర్మాంగరక్షయు చర్మోత్తరీయమును దీసివైచి చర్మపుదోవతిమాత్రమే మిగుల్చుకొని వారాహీదేవిని దలపైఁ బెట్టుకొని యీవలికి వచ్చెను. జనులందఱు జయజయధ్వానము లిచ్చుచు నమ్మవారియూరేగింపుతో బయలుదేఱిరి ఇంతలో నెటనుండివచ్చిరో కాని రెండుమూడు వేలకాంతలటకుఁజేరిరి. కాంతలు పురుషులు కలసియే వారాహీదేవి ననునరించి నడుచుచుండిరి. మాయీ! గోత్రాలను రక్షింపు. పిల్లలందఱు పోయినదాననను. రక్షింపుమాయీ! మాయీ వారాహిమాయీ యనియాయమ్మవారివెంట కొందఱు స్త్రీలు కేకలు వైచుచుఁ బరుగెత్తిరి.

అమ్మవారిని ముట్టుకొనినయెడల నధమ మమ్మవారిని శిరముపై ధరించువానిని స్పృశించిన యెడల నంతానవతు లగుదురని యాకాంతల విశ్వాసము. ఏకాంతమైననరే యమ్మవారిని గాని తన్నుఁగాని స్పృశింపకుండునట్లు తన్ను నమ్మవారినిగూడ భద్రముగాఁ గాపాడుకొనుచుఁ బూజరి బహుచాకచక్యమునఁ బరుగెత్తుచున్నాఁడు. భర్తలు భార్యలను జేతులతోఁ బైకెత్తి యమ్మవారిని స్పృశింపఁజేయుచున్నారు. అమ్మవారందనివా రర్భకునినైన స్పృశించుచున్నారు. అప్పుడే గర్భములు నిలిచిన ట్లానందపడుచున్నారు. ఇట్లు సమస్తవిధ వాద్యములతో నమ్మవారు తిన్నగఁ దనచెల్లెలగు మాహేశ్వరీదేవిని జూడఁబోయినారు! ఆమె యాలయమునొద్ద జనులంద ఱొఁగి యచ్చటి మహేశ్వరీదేవిని గానతాళములతోఁ గీర్తించు చున్నారు. ఒక పాషాణరచితసింహముపై రెండు సింహశాబకవిగ్రహము లున్నవి. ఈమూర్తియే మాహేశ్వరిమూర్తి. ఇచ్చట క్షీరము లమ్మవారికిఁ బూజరు లర్పించుచున్నారు. అక్కడ సెల్లెండ్రు సంవత్సరముకైన నొకసారి తప్పక కలసికొనవలయునని దీనియర్థము కాబోలునని నేననుకొంటిని. అందులో శ్రావణమాసమునఁ దప్పక కలసికొనవలయునని దీని యభిప్రాయమై యుండునేమో? కలలో నొకబాటయేమి యొకపద్ధతియేమి? కాని యిదియేమి? న న్నిటకు మోసికొని తెచ్చినపురుషుఁడు కనబడడేమి? నేనెటు లింటికిఁ బోవుదునాయని యనుకొనుచు నిటునిటు తిరుగుచుంటిని. అంత ''నయ్యా! ఏలూరు వచ్చితిమి లెండు లెం'' డని నాకొఱకు స్టేషనుకు వచ్చిన నామిత్రులు నన్ను లేపిరి. ఒక్కనిమిసమువఱకు దిగ్భ్రమము నొంది నాయాందోళనము సైవారికిఁ దెలియనీయకుండ నడఁచుకొని వారివెంట బోయితిని. ఇచ్చటికి స్వప్నము పూర్తియైనది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

35. జెంటిలుమాన్

మద్రాసునుంచి సాక్షిసంఘానికి ఒక ఉత్తరం వచ్చింది.

ఆ లేఖ వ్రాసినవ్యక్తి ఒకనాడు తమరాజుగారి దగ్గరకూర్చుని, జంఘాల శాస్త్రి ఉపన్యాసాలలో ఒకటి చదువుతూండగా ఆరాజు సేవకుడొకడు వచ్చి ఒకతెల్లని చీటీ దాఖలుచేశాడు. దానిమీద పేరు చూసి, రాజావారు కాసేపు ఆలోచించి ఆచీటీ లోపలికి పంపినమనిషి ఇంకా ఏమైనా అన్నాడా? అని భటుణ్ణో అడిగారు. చాలతొందరపనిమీద వేరే చోటకు వెళ్లాలనీ, వెంటనే దర్శనం ఇప్పించమని కోరాడనీ వాడు చెప్పాడు. ఇప్పుడు చూచే అవకాశంలేదనీ, వేరేపని చూసుకోమనీ రాజావారు వర్తమానించారు. రాజావారి చర్యమీదట, సన్నిధినివున్న, ఈఉత్తరం వ్రాసినవ్యక్తికి, అకబురు చేసిన మనిషి ప్రవృత్తిమీద రకరకాల ఆలోచనలు పోయాయి.

భటుడు మళ్లీవచ్చి ఆయన చాలా గొప్పవాడినంటున్నాడనీ, వెంటనే దర్శనం కోరుతున్నాడనీ చెప్పాడు. రాజావారు చిరునవ్వునవ్వి ఆవ్యక్తిని చూడడానికి అనుమతి ఇవ్వలేదు. ఈసారి ఈప్రవృత్తి మరింత ఆశ్చర్యం కలిగించగా, ఈఉత్తరం వ్రాసిన వ్యక్తి ఆమనిషిని చూడడానికి వెళ్లాడు.

ఆవ్యక్తి పాశ్చాత్యవేషంలో అట్టహాసంగా వున్నాడు. ఇంకా బండిలోనే కూర్చున్నాడు. ఈవ్యక్తి అతన్నివలకరించి, అతని డాబుదర్పాల మాటల్ని రుచిచూశాడు. తానొక జంటిలుమాన్ నని అతను చెప్పినమాట ఈవ్యక్తికి మరింత ఆశ్చర్యంకలిగించింది. కడకు తేలిందేమిటంటే, అతను చిన్నపిల్లల బొమ్మలు, పటాలు అమ్ముకునే మనిషి– ఏమైనా ఆమనిషికి రాజదర్శనం దొరకలేదు. అతని స్వభావాన్ని సాక్షి సంఘానికి తెలియజేయడంకోసం ఈవ్యక్తి ఉత్తరం రాశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

''మదరానునుండి యీలేఖ వచ్చినది. సాక్షిసంఘాభిమానులలో నొకడు వ్రాసినాడు. దానిని జదివెదను.''

సాక్షికి నమస్కారములు. ఇచ్చట మేము మదరానులో క్షేమముగా నున్నాము.

అచ్చటి మీక్షేమాతిశయములు ప్రాయించి పంపఁగోరెదను. తరువాత–నేనొక్కదినమున మాప్రభుని నన్నిధానమునం గూరుచుండి మీసాత్ప్యపన్యాసములలో శ్రీరామచంద్రమూర్తిమీఁది పద్యములున్న సాక్షిని జదువుచుంటిని. అంతలో భటుఁడొకఁ డువచ్చి ప్రభువుగారి కొక తెల్లనిచీటి నగపఱచెను. ఆచీటిపైనున్నపేరు వారు చూచుకొని యొక్కనిమేషముపాటు యోజించి యానామము నుచ్చరించి యీపేరిని మీరెప్పుడైన వినియుంటిరా యని నన్ను బ్రశ్నించిరి. వినియుం లేదని నేను విన్నవించితిని. ఆచీటినిచ్చి 'లోనికిఁదీసికొనిపొ' మ్మని మాత్రమే యాతఁడు నీతోఁ జెప్పినా, ''బాబూ! మఱికొన్నిమా టలు చెప్పినాఁడు'' అని యాతఁడు సంశయించుచుఁ బ్రత్యుత్తర మిచ్చెను 'సందేహమేల? ఏమిచెప్పినాఁ' డని రాజుగారు తిరుగ నడుగ ''నేను మీరాజుగారిని జూచుటకు వచ్చినాను. పండ్రెడుమైళ్లదూరమునుండి గుఱ్ఱపుబండి యద్దెకుఁ దీసికొని యిచ్చటికి శ్రమపడి వచ్చి నాను. నేను వెంటనే వారిని జూడవలయును. నాకింకఁ బన్నులెన్నియో యున్నవి. ఇచ్చట నాలసించుటకు నాకవకాశము లేదు. వెంటనే వారిని జూడవలయును.'' అని తమతో మనవిచేయుమని యాతఁడు నాతోఁ జెప్పినాఁడని కొంత సందేహించుచు భటుఁడు బదులుచెప్పెను. మారాజుగారు మందహాసమొనర్చి ''నాకిప్పుడు తీఱికగాలేదు. తొందర పను లెన్నియో యున్నవనియు నాలసింప నవకాశము లేదనియు నాయనయే చెప్పినారు. కావునఁ ద్వరలో వారు మఱియొకచోటికి దయచేయవచ్చునని చెప్పు'' మనివారు భటుని కానతిచ్చిరి. చిత్తమని భటుఁడు రాజసన్నిధినుండి వెడలిపోయెను. రాజుగారు కొంచెము యోజనాపరులైరి. వారు యోజించుచున్నప్పుడు నేనుమాత్రమూరక కూరుచుండట యెందులకని నేనిట్లు యోజించుకొంటిని. ''ఈమహానుభావుఁ డెవఁడో! పండ్రెండుమైళ్లదూ రమునుండి వచ్చితి నని పరితపించుచున్నాఁడుకదా! ఈయన నవశ్యముగ దయచేయ వలసినదని యాహ్వానించినవారెవరో! అద్దెబండిపై వచ్చితినని యాందోళనపడుచుండెను గదా! జెట్కాబండిప్రారబ్ధమేమి? 'షె ర్లాక్'పై నారోహింపలేకపోయినాఁడా–ఆలసింప వీలులేదు. వెంటనే చూడవలయునని యంత యాతురపడుచుండెనుగదా–కొంప లేమైనఁ దగులఁబడుచుండె నని యింత కోలాహల మొనర్చుచుండెనా? అటులైన Fire Department వారియొద్ద కేగవలయును గాని ప్రభుసన్నిధికేల రావలయును? ప్రాణమిత్రుని కెవనికైనఁ బ్రాణముమీఁదికి వచ్చుటచే నింత పరితాపపడుచుండెనా? అటులైన రాయవరపుటానుపత్రి యుండగాఁ రాజభవనమున కేల రావలయును? ఈమహానుభావుఁడెందుల కిచ్చటికి వచ్చెను జెపుమా? తనలాభము నపేక్షించియో తనవలనఁ బరలాభము నపేక్షించియో వచ్చియుం డును గాని రాజదర్శనమున కంతకన్నఁ గ్రొత్తవానికి వేఱుకారణ మేమియుండును? అట్టిలాభము నపేక్షించిన వాని యాలాపవైఖరి యిదియేనా? వెంటనే దర్శనమా? కార్డు పంపినవెంటనే దర్శనమా? రాజుల కిట్టివారికి దర్శనమిచ్చుటకన్న వేఱుపని యేదియు లేదని యాతని యభిప్రాయముకాఁబోలు! తానెవఁడో తెలియునా? ఎక్కడనుండి వచ్చెనో తెలియునా? ఎప్పుడు వచ్చెనో తెలియునా? ఎందులకువచ్చెనో తెలియునా? ఆతఁ డెట్టివ్య క్తియో తెలియునా? ఏమియు దెలియకుండఁ జీటిముక్క చూచుకొనుటతోడనే ప్రభు వాతనిఁ బ్రత్యుత్థానముచేసి గౌరవించునని యాతని కీప్రత్యయమేమో? రాజులకు మఱేమియుఁ బనిలేదని యతని నమ్మకముకాఁబోలు! ఎవఁడైననరే యెందులకైననరే యెప్పుడై నసరే కార్డుచేతనైనసరే కాకిచేతనైనసరే కబురుపంపినవెంటనే 'నీమాజమా' దగుల్చుకొని

నీకొఅకే సిద్ధముగాఁ గూరుచుంటిని రావయ్యా! ఇంతకంటె గావలసినదేమి యని యాహ్వానించి యాడుంచి బతిమాలి బహూకరించి పంపివేయవలసినదే! రాజులనఁగ మహాకార్యభారములు మీఁదనున్న పురుషులుకాక యెవరికిఁదోచినపుడు వారు వెంటనే చూచుటకు గోడమీఁదిబొమ్మ లనుకొనినాఁడు కాఁబోలు! వంటపూటింటికిబోయి ''వెంటనే అన్నము కావలయును. ఆలస్య మొనర్చుటకు వీలులేదు. నాకింక నెన్నో పనులున్నవి రిక్షావేసికొని దూరమునుండి వచ్చినానురా! వేగమురా!'' అని కేకవేయు నతిథినిజూచి ''గంటమాయించు వఱకు నోరుచేసికొనక వీథియరుఁగుమీఁద గూరుచుండు'' మని యాయన్నసత్రాధికారి యాతని నావలికిఁ బంపకుండునా? పూఁటకూటివానికున్న స్వాతంత్ర్యమైన భూపతికిఁ దనకోటలోలేదా? చుట్టల దుకాణమునొద్దకుఁ బోయి ''తే! పాతికచుట్ట లిటుతే! శ్రీఘ్రముగఁ బోవవలయును. అదిగో! వెంటనే తెమ్మన నింక నీయఁడు!'' అని తొందర పడినబేరగానిఁ గాంచి చుట్టలవర్తకుఁడు ''పోవయ్యా! నీనొక రిక్కడలేఁడు. అక్కొగిరిపడెద వేల? ఇచ్చువఱకు వేచియుండు'' మని బేరగానిపై వర్తకుఁడు తీవ్రపడకుండునా? దర్బారు గౌరవము తంబాకుబేరముపాటిదైనఁ గాదని యాతని యభిప్రాయము కాఁబోలు! సర్వకార్యములకుఁగూడ సమయ మున్నదనుసంగతి యాతెల్ఱమొగమునకుఁ దెలియనే తెలియదుకాఁబోలు! ఆహా! యెంతయనందర్భపు టలౌకికపు టవకతవక యల్లరిచిల్లరి యఘాయతపు టభాగ్యవ్యక్తియో యది'' యని నాలోనే ననుకొనుచుండఁగ నింతలో భటుఁడు వచ్చెను. అతనిని గాంచియేమైనదని రాజుగా రడిగిరి. ''ఆయన మిగుల గొప్పవాఁడఁట–ఆయన యనేకులగు గొప్పవారిని జూచినాఁడట–బొంబాయినుండి యిక్కడకు వచ్చినాఁడట – బొంబాయి కమెరికా మొదలగుప్రదేశములనుండి వచ్చినాఁడఁట. నేను మీరాజుగారిని జూడకుండఁ బోవుటకు వీలులేదు. నిమషములమీఁద సమావేశము కావలయును'' అని యాతఁడనుచున్నాఁడని భటుఁడు రాజుగారితో వినయభయసంశయాకులచిత్తుఁడై విన్నవించెను. ఆమాటలు విని రాజుగారు నవ్వుచు ''ఆయన గొప్పవాఁడై యుండవచ్చును. గొప్పవారి ననేకులను జూచి యుండవచ్చును. నే నాయనను జూచుటకు వీలులేదు. కావున నెక్కడికైన వారిని దయచేయుఁడని చెప్పు'' మని యానతిచ్చెను. అప్పుడు నేను మనసులో ''ఏమిది? బొంబాయినుండివచ్చిన గొప్పవాఁడట! బొంబాయినుండి మనవైపులకు మహామారివ్యాధి రాలేదా? అమెరికానుండి వచ్చినఘనుఁడట–అమెరికానుండి మనవైపులకుఁ బొగాకు రాలేదా! ఆయాస్థలములనుండి వచ్చితినని చెప్పుటలోఁ గలిగినయాధిక్యమేమో నాకవగాహన ముకాలేదు. గొప్పవాఁడఁట! గొప్పవాఁడగువాఁడు రావలసినక్రమ మిదియేనా? గొప్పవాఁడు పంపవలసినవందేశమిదియేనా? గొప్పవాఁడుపలుకవలసిన వచోవైఖరి యిదియేనా? చీచీ! ఆవలకుఁబొమ్మనినను గదలకు మెదలక బిట్టుబిగిసికొని లజ్జాశూన్యతతోఁ బెంకిపట్టుతోఁ బీటలుపెట్టుకొని తిష్ఠవేసికొనువానియెడల నేనా గొప్పవాఁడనుపేరు వర్తింపవలసినది? పెళుసుదనము గొప్పయా? పెంకితనము గొప్పయా? మూర్ఖత గొప్పయా? మూఢత గొప్పయా? దేశకాలపాత్రజ్ఞాన శూన్యత గొప్పయా? ఈతఁడు మతిలేనివాఁడేమో'' యని సందేహించుచుఁ బ్రభువునొద్ద సెలవుదీసికొని యావిచిత్రవ్యక్తినిఁ జూడఁబోయితిని. ఆతఁడింక బండిలోనేకూర్చుండియున్నాఁడు. ఆతనిబండిచుట్టు కొందఱు భటులు, కొందరు రాజోద్యోగులు, కొందఱు బాలురు మూఁగియున్నారు. ఆతఁడు పాశ్చాత్యవేషమున నున్నాఁడు. ఆతఁడు కూరుచున్నబండిలోఁ దనకెదురుగ నొక చిన్నకాగిదపుఁగట్టయు

నొక చిన్నపెట్టెయు నున్నవి. ఆతనిరంగు స్వర్ణచ్ఛాయకుఁ గ్రిందిది. చామనచాయకుఁ బైది. నేత్రములు మార్జాలనేత్రములు. వయస్సు దాదాపుగా ముప్పదియయిదుసంవత్సరములు. మొగము వెలవెలలాడుచుఁ గళాహీనమై యున్నది. కన్నులు మెఱుకకన్నులు. కాని యేకారణముననో యెఱ్ఱగ నున్నవి. కాని యాగంధమేమి? తలకురాచికొనిన 'పామేటమ్' దాఁటి, బట్టలపై జిలుకరించుకొన్న సెంట్లను దాఁటి, కాలుచుఁ గరాగ్రమున నున్న సిగరెట్టును దాఁటి, మాటిమాటికి మాటమాటకు గుప్పుగుప్పు మనుచుఁ బ్రవ్యాపించు నాపరిమళమేమి? ఆహాహా! Exshaw దా? Three daggers దా? Old Tom దా? Arrack దా? కాలానుసారమైన శుద్ధస్వదేశీయపు టీఁతచెట్టుదా ఏదియైనదేమి వస్తుతత్త్వమున నన్నియు నొక్కటేకద! ఈవాసనకు సహించి నే నాతనిబండియొద్దకుఁ బోయి యాంగ్లభాషలో ''అయ్యా! మీరెవ్వరు? మీకేమిపని'' యని యడిగితిని. ''నేను చేయనిపనియేము న్నది? నాకు సంబంధములేనిసంఘ మేమున్నది? పశ్చిమార్ధగోళములోనేమి ప్రాగర్ధగోళము లోనేమి నాప్రచారములేని వ్యవహారమేదియు లేదు. New York లో నంతర్జాతీయసంఘము నకు కార్యదర్శిని; జపానులో నూది యగ్గిపుల్ల గడియారపుగర్మశాలలలోఁ గోశాధిపతిని: P. C. Ray గారి Science శాలలో 'నూపరింటెండెంటు' ను; France లో Fair Sex League లో Fashion pointer ను, The all Europen టెంపరున్సు సొసైటీలో అండర్ సెక్రటరీని. The all world physiological psychological agricultrual, musical, pharmaceutical wirless telegraphical Erotical సంఘములో ఫైసుప్రెసిడెంటును'' అని యాతఁ డాంగ్లేయ భాషలోనే ప్రత్యుత్తర మిచ్చెను. ''మీయుద్యోగముసంగతి యేదోచెప్పినారు. మీరెవరో నాకు తెలియలే'' దని నే నంటిని, "Well, Iam a Gentleman" అని యాతఁడు బదులుచెప్పెను. ఈమూటలతో నేను దెల్లబోయితిని. మీ రెవ్వరనఁగ నేను పరమహంస నని చెప్పుకొనువాఁడున్నాఁడు. నేను భాగ్యవంతుఁడ నని చెప్పుకొనువాఁ డున్నాఁడు. నేను గవి నని చెప్పుకొనువాఁ డున్నాఁడు. నేను జమీందారుఁడనని చెప్పుకొనువాఁ డున్నాఁడు. నేను చంద్రముఖికిఁ గన్నెటీకపుఁ బెండ్లికొడుకనని చెప్పుకొనువాఁ డున్నాఁడు. నేను సంధానకర్త నని చెప్పుకొనువాఁ డున్నాఁడు. కాని నేను Gentleman అని చెప్పుకొనువారి నెవ్వరిని నిదివఱకుఁ జూడలేదు. అట్టివాఁ డిచ్చటఁ గనఁబడినాఁడని నా కాశ్చర్యము కలిగినమాట నిజము. ఆంగ్లేయులున్నారు. ఆఫ్రికావా రున్నారు. బ్రాహ్మణులున్నారు. బ్రాహ్మణేతరు లున్నారు. విరాగు లున్నారు. నేదాంతు లున్నారు. యతు లున్నారు. గాయకు లున్నారు. వేదాధ్యయనశీలు రున్నారు. పండితు లున్నారు. ప్రభువు లున్నారు. దాత లున్నారు. కాని జంటిల్మేన్ యేఁడీ. జంటిల్‌మన్ అనునది యొకమతముకాదు. ఒక కులముకాదు. ఒక శాఖకాదు. ఒక విద్యకాదు. ఒకవర్ణముకాదు. ఒకవృత్తికాదు. ఒకయాశ్రమముకాదు. ఒక పదవికాదు. అట్టి దేదియుగాదే! ఆ Gentleman తత్త్వ మందఱిలోను నుండవచ్చును. కొందఱిలో నుండవచ్చును. ఎవరిలోను లేకపోవచ్చును. తాను Gentleman యే! అబ్బ! జగత్తులో Gentleman యెంత చవుకయైపోయినారు. జట్కాబండి యెక్కినవాఁడెల్ల జంటిలుమనే. సిగరెట్లు నోటఁబెట్టినవాఁడెల్ల జంటిల్‌మనే. అమెరికానుండి వచ్చినవాఁడెల్ల జంటిల్‌మనే. ఆరక్కుత్రాగినవాఁడెల్ల జంటిల్‌మనే. అటులైన నింకఁ బెద్దమనుష్యులకు బ్రపంచమున లోపమేమున్నది? పశువులసంతలలోఁ బెద్దమనుష్యులు–బోగమువీథులలోఁ బెద్దమనుష్యులు–కల్లుపాకలలోఁబెద్దమనుష్యులు– కన్నకాండ్రలోఁ బెద్దమనుష్యులు

–నెత్తికోఁతలవాండ్రలోఁ బెద్దమనుష్యులు–ఇంక భూలోకమే వైకుంఠము! ఇంతకన్నఁ గావలసినదేమి'' యని నాలో నే ననుకొనుచు ''అయ్యా! మీరు జంటిల్‌మన్ అని వేఱే చెప్పనక్కఱ లేదు. మీస్వరూప మానంగతి చెప్పుచున్నది. మీస్వభావ మానంగతిచెప్పుచున్నది. మీసౌరభ మానంగతి చెప్పుచున్నది'' యని నే నంటిని. నామాటలను లక్ష్యపెట్టక యాతఁడు ''మీరాజుగారి నిప్పుడే చూడవలయును. నీవుపోయి చెప్పుము నీవొక్కఁడవు రవంత Right senses లోనున్నట్లు నాకగపడుచున్నది. తత్‌క్షణమే తత్‌క్షణమే దర్శనము కావలసియున్నది.'' అని నాతో తీవ్రముగ ననెను. అప్పుదీర్పుమని ఋణప్రదాత యింత తొందర పడఁజాలఁడేయని లోలోన ననుచుకొనుచు ''అయ్యా మికిక్కడిప్రభునితో నేమిపనియున్న'' దిన నేనడిగితిని. ''పని యనఁగా నింతయంతయునా? ప్రపంచమంత పనియున్నది. నేను కొలఁదిపనిమీఁద వచ్చువాఁడనా?'' యని యాతఁడు బదులుచెప్పెను. ''ఆపని యెంతపని యైనను నాతోనైనఁ జెప్పరాదా'' యని నేననగ ''అటులైన వినుఁ. అడియారులో రాజకీయసంఘమున్నది. మతసంఘమున్నది. సారస్వతసంఘమున్నది. మైలాపురములోఁగూడ నటులే యున్నవి. అన్ని పేటలలోగూడ నటులేయున్నవి. ఈయన్నిసంఘములుకూడ జాతిభేదములేకుండఁ బ్రయోజనభేదములేకుండ స్థలభేదములేకుండఁ గాలభేదములేకుండఁ దత్తత్వభేదము లేకుండ సామరస్యముగా సమ్మేళనముచేసి సమానమైన మట్టములోనికిఁ దెచ్చి –సజాతీయమైన తత్త్వమిచ్చి'' యని యాతఁడు పైమాట తోఁపక యూరకుండగ –సాజాత్యమైత తత్త్వమిచ్చి సముద్రములో గలుపఁదలఁచితివా యేమి యని నేను వాక్యసంపూర్తిచేసితిని.—''అన్నివిధములైనసంఘములు కలగూరగంపక్రింద గ్రుచ్చియెత్తుటే –అట్లుతద్దెపులుసు క్రిందఁగలిపికాచుటే–నాకేమియుబోధపడలేదు. నిర్బంధ విధానపుగడబిడలోఁ దద్దినపుమంత్రపు లొడలొడ గలుపవలసినదనియా? ఈరెంటికూడికలో వితంతువివాహపు దడదడ మేళవింపవలసినదనియా? అయ్యయ్యో! ఇదియెట్లు? పారణప్పుఁబిండములలో బాంబులగోళయా? రాట్నప్పుఁగీచులో రైలుచార్జీయాధిక్యపుటేడుపా? ఈనానాసంఘసమ్మేళనప్పుఁ గంగాళీయేమో నాకెంతమాత్రము మనస్సునకుఁ బట్టలేదు. అంతవఱ కెందులకు? మనకు సామాన్యాంశములలో సమ్మేళనములేదు. ఒక మతములోని రెండుశాఖలకు మేళనము లేదే. ఒక్కశాఖలోని రెండు పలువలకుఁ గూడికలేదే. ఒక్కపలవలోని రెండుచిలువలకుఁ బొత్తులేదే. ఒక్కచిలువలోని రెండుపత్రములకైన నఖ్యములేదే. అట్టిచో ఫిరంగిగుండునకు బ్రహ్మముడికి పొత్తెక్కడనుంచివచ్చును? ప్రాచీనావీతిమంత్రమునకుఁ బంచమప్రశ్నమునకు సామరస్య మెక్కడినుండిరాగలదు. అని మనసులో నడ్డదిడ్డముగ ననుకొనుచు ''అయ్యా! మీపనియేదో నాకుఁదెలియలేదు. మీకుఁదెలిసినయెడల సంతోషమే. అయినను రాజుగారిని మీరు చూచుట కిప్పు డవకాశములేదు. కావున దయయుంచి దయచేయుఁ'' డని నేనంటిని. ''ఇప్పటికవకాశము లేకపోయినయెడలఁ బోనిమ్ము. ఱేపు పండ్రెండుగంటలకు వత్తును. అప్పుడు నేను దప్పక యాయనను జూచెదను. నీవందులకుఁ బూచీపడిసయెడల నేను బోవుదు'' నని యాతఁడు ఛెప్పెను. నేనంతట లోనికిఁబోయి రాజుగారిని గాంచి యీసంగతి మనవిచేయఁగ, వారందుల కిష్టపడలేదు. వారియనిష్టత నీతనికిఁ దెలియఁబఱుపగ నీతఁడు నరే! ఎందుల కిష్టపడలేదో హేతువులు చెప్పినగాని నే నిచ్చటినుండి కదలను. అని పలికెను. హేతువులు చెప్పవలసినబాధ్యత వారికి లేదని నేనంటిని. నేను ''జంటిల్‌మను'' నగుటచేత నాకు హేతువు లడుగుట కధికారమున్నదని యాతఁడు తీండ్రించెను.

నీవట్లుకాకపోవుటచే నీ కట్టియాధికారమున్నదని యనుకొనుట ప్రమాదమని దగ్గఱ నున్నవా రెవ్వరో యనిరి. నరే మఱియొక జమీన్ దారునొద్దకుఁబో యెదనని చెప్పి యాతఁడు పోయెను.

ఆతఁ డేవో చిన్నపిల్లలబొమ్మలు చిన్నపటము లమ్ముకొనుటకు వచ్చినవర్తకుఁడని తరువాతఁ దెలిసినది. అట్లు స్పష్టముగఁ జెప్పరాదా? ఆయాటవస్తువులేవో లోనికంపి వానిని విక్రయించుకొనరాదా? ఈమాత్రపు టత్యల్పవ్యాపారమున కమెరికాగొడ వెందులకు? పశ్చిమార్ధప్రపంచాంతర్జాతీయసంఘ సంభాషణ మెందులకు? అఖిలజగన్నా నాసంఘసమ్మేళ నసాంకర్యసన్నాహ మెందులకు? లోపల తాడికాయపైకి తాటికాయయునా? లోపలఁ గొల్లగింజ పైకి గుమ్మడికాయయునా? లోపల డొల్లపైకి డాబునా? ఇంత పనికిమాలినవ్యాపార మెందులకు? ఉన్నయూఁపిరి యెంతయొ యంతయే యుపయోగించుకొనరాదా? గొంతు నకు మించినయేడు పెందులకు? కాలికిఁదగని పరుగెందులకు? మూఁతికిఁ దగని కూఁత యెందులకు? ఎవఁడు మెచ్చునని నీయభిప్రాయము? జగత్తులోనివారందఱు జాత్యంధులు, నీ వొక్కఁడవే నేత్రములుగలవాఁడవునా? నీవంటి నిర్భాగ్యునివలన, నీవంటి మందునివలన, నీవంటి నోటియొట్టపువానివలన, నీవంటి తుచ్ఛస్వభావునివలన, నీవంటి యసత్యప్రలాపుని వలన–నీవున్న సంఘము కెంతయగౌరవము గలుగుచున్నదో నీ వెఱుఁగుదువా? సంఘమున దాదాపుగా నందఱు నీవంటివారే యని పైవా రనుకొనినయెడల వారితప్పా? నీకబురులు కాలిపోను! నీకోఁతలు కూలిపోను! ఎంతసేపుచెప్పినను గవర్నరుగారి గందరగోళములు, గవర్నరుజనరలుగారి గాథలు, స్టేటు శక్రటరీగారి చిత్రములు–అఖిల భారతీయసంఘపు టల్లరులు, సర్వ ప్రజాసంఘసమ్మేళనమలే కాని యంతకంటె నొక్క యంగుళమైనఁగ్రిందికి దిగవే! నీయాకాశపు బలిటీల కంతమే కనఁబడదే–నేలవిడిచిన సాము నీయిల్లు బంగారముగా ను–ఎన్నిసంవత్సరములనుండి చేయుచుంటివో! ఒక్కఁడైన నీకిది నీతిగాదని చెప్పియుండఁ డేమి? ఈసంగతి సాక్షినంఘమునకు వ్రాసినయెడల నిట్టి వ్యక్తులనుగూర్చి విమర్శింతురేమో యనివ్రాసితిని. మీజంఘాలశాస్త్రి యిట్టి వ్యక్తులనుగూర్చి యింక నేల యుపేక్షించినాఁడో తెలియకున్నది. ఇట్టి గుల్లరకపుసరకు, ఇట్టి కీఁచుపిట్టలు, ఇట్టి యోటికుండలు, ఇట్టి బుడబుక్కలవేసములు, అన్నిజాతులలో–నన్నిదేశములలో– నన్నికాలములో– నన్నివ్యాపా రములలో– నన్నిపదవులలో– నన్నిపరిస్థితులలో బహుళముగా నున్నవి. భక్తితలో నొకవ్య క్తిని, జ్ఞానములో నొకవ్యక్తిని, కర్మములో నొకవ్యక్తిని Co-operation లో నొకవ్యక్తిని Non Co-operation లో నొకవ్యక్తిని, మేళముగట్టి సాక్షినభారంభమున నొక్కనాటకము మీజంఘా లశాస్త్రి యింక నేల యాడలేదో తెలియకున్నది మీకును మీ శాస్త్రిగారి కనేకనమస్కారములు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

36. హరిభక్తురాలివైభవము

జిరఘూలశాస్త్రి ఒకహరిదాసును ఆరోజు సభకి పరిచయంచేసి, ఆయన ఒకహరిభక్తురాలి వైభవం తెలియచెప్పడానికి దోహదంచేశాడు.

యతిరాజశేఖరులైన శ్రీరామానుజా చార్యులవారు ఇద్దరు శిష్యులతో 'అష్టసహస్రనామ గ్రామం' వెళ్లి, యజ్ఞేశుడనే వైశ్యుడికి తమరాక తెలియజేస్తూ శ్రీముఖం పంపారు. మహాసంపన్నుడైన ఆవైశ్యుడు పెద్దగా ఏమీ చలించ లేదు. ఉదాశీనంగా ఊరుకున్నాడు. గురుపూజ వంటిదేమీ చేయడానికి ముందుకురాలేదు.

శిష్యులవల్ల సంగతి విన్నరామానుజులవారు చిరునవ్వి, శిష్యులిద్దరితో కలిసి తమశిష్యులైన వరదాచార్యులింటికి వెళ్లారు. అది ఇల్లుకాదు. పట్టుమని పది తాటాకులైనా లేని పూరిల్లు.

శ్రీరామానుజులు వెళ్లేసరికి వరదాచార్యులు ఉంఛవృత్తికి బయటకువె ళ్లాడు. అతనిభార్య తిరుప్పత్తికొల్లెనాచ్చియారు కట్టుకోవడానికి బట్టగూడా సరిగాలేని కారణంగా తలుపు తెరిచినట్టే తెరిచి వేసుకోగా– రామానుజులు తమకాషాయపు ఉత్తరీయం కట్టుకోవడానికిచ్చారు. వరదాచార్యసతి, స్వామికి, శిష్యులకు స్వాగతం చెప్పగా– శ్రీరంగదేవ నివేదనం కోసం తళిహ ఆమెనే సిద్ధంచెయ్యమన్నారు. నాచ్చియారుకేం పాలుపోలేదు. చివరికి ఒక నిశ్చయానికివచ్చి, వైశ్యశిఖామణి యజ్ఞేశుడి ఇంటికివెళ్లి, స్వామి సేవకు సంభారాలిమ్మనీ, అందుకు ప్రతిఫలంగా ఆరాత్రికి తనదేహం అర్పిస్తాననీ అంది. యజ్ఞేశుడు అంగీకరించాడు. స్వామి ఆరాధన గడిచింది.

కాని– యజ్ఞేశుడి కళ్లు, నాచ్చియారు ఇచ్చిన ప్రసాదంవల్ల, వరదాచా ర్యులిచ్చిన తీర్థంవల్ల విచ్చాయి. అతన్ని ఆ దంపతులు, స్వామిదగ్గరకు చేర్చారు.

జిరఘూలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! మన సాక్షిసభారంగమున నొక్క హరిదాసుడు నేడుపన్యసించును. అదిగో–ఆ హరిభక్తుడిటకుఁ వేంచేయుచున్నాఁడు. లేచి వారికి స్వాగత మీయవలయును.

(అంద అట్లుచేయుదురు) స్వామీ! యిట్లు దయచేయుఁడు. భాగవతోత్తమా! మిమ్ముఁగూర్చి యిదివఱకే సభాసదులతో విన్నవించుకొంటిని. ఇఁక మీరుపన్యాస మారంభింపవచ్చును.

హరిదాసుని యుపన్యాసము

''మేషార్కసంభవమ్ విష్ణోర్దర్శనస్థాపనోత్సుకమ్,
తుండీరమండలే శేషమూర్తిం రామానుజం భజే.''

శ్రీమతే రామానుజాయ నమః.

''శ్రమద్భూతపురీశ కేశవనివేశీ భూతహృత్పద్మని
ష్కామావేశ పరాశరాదికమునీశశ్రేష్ఠవాగ్వంశని
స్సీమప్రాభవరంగరాజపదమేస్థేమప్రకాశా యతీ
శా, మాణిక్యమయత్రిదండకరదేశా, కేశవార్యాత్మజా.''

శ్రీమతే రామానుజాయ నమః– దేవరవారల తిరువడిగళ్లదర్శన మడియేనికి లభించుటచే నీదాసుఁడు–ఈదీనుఁడు–ధన్యాత్ముఁడు. మహాధన్యాత్ముఁడు. దేవరవారల సన్నిధానమునందు దేనినిగూర్చియైన నుపన్యసింపవలసిన దని యీనుందబుద్ధి కాజ్ఞయగుటచేత దేవరల యాజ్ఞయే మహాప్రసాద మని సాక్షిసంఘరంగమం దడియేను భయభక్తివినమ్రుఁడై నిలువఁబడినాఁడు. ఉపన్యాసములకు విషయములు ప్రపంచమున రెండే యున్నవి మూఁడవది లేనేలేదు. ఎంతసేపు చెప్పినను నెన్నియుపన్యాసములు చెప్పినను, నెవ్వరు చెప్పినను, నేదేశమునఁ జెప్పినను తత్తునుగూర్చి చెప్పవలయును. తదీయులను గూర్చి చెప్పవలయును. అంతకన్న విషయము మఱియేమున్నది. 'తత్' అనఁగాఁ బరమపరనాథుఁడైన పద్మదళాయతాక్షుఁడు. తదీయులనఁగా నామహామహుని పాదపద్మములను భక్తితో సేవించువారు. హరిభక్తులారా! నేఁటిదిన మొక్క–హరిభక్తురాలి వైభవమునుగూర్చి యుపన్యసించి జిహ్వను జిత్తమును బవిత్రము చేసికొందును. దేవరవారందఱు శ్రద్ధాళువులై యాకర్ణింపవలయును.

''భక్యవర్యులారా! యతిరాజశేరులగు రామానుజాచార్యులవారు–శ్రీమతే రామానుజాయ నమః–అదిగో–అదిగో–ఇద్దఱు శిష్యులతో నష్టసహస్రనామగ్రామమునకు వెలుపలనున్న యుద్యానవనమునఁ బున్నాగవృక్షచ్ఛాయను వేంచేసియున్నారు. ఆహా! పున్నాగవృక్షమా! నీజన్మ మెంత ధన్యమైనది! పూర్వయుగమునందు బాలగోపాలకృష్ణపరబ్రహ్మమునిన్నాశ్రయించియే కదా భక్తమణులను దరింపఁజేసినది! జగచ్చేతన తారణార్థమవతరించిన శ్రీమల్లక్షణయోగి వర్యులుకూడ నిన్నే యాశ్రయించియున్నారే. పురుషుఁడై పుట్టుటకంటెఁ బొన్నచెట్లై పుట్టుటయే పురుషార్థమేమో! అదిగో రామానుజాచార్యులవారి యిద్దఱుశిష్యులుకూడ శ్రీముఖములతోను మంత్రాక్షతలతోను గ్రామములోని వేంచేయుచున్నారు. వారు యజ్ఞేశుఁడను సంపన్నవైశ్యునియింటికిఁ బోయి యాగృహమేధికి జగద్గురుని శ్రీముఖమును జూపి మంత్రాక్షత లతనితలయందుంచి విశిష్టాద్వైతస్థాపనాచార్యవర్యులను త్రిదండిశేఖరులు నగు శ్రీమద్రామానుజులవారు శిష్యసంచారార్థమై బయలుదేఱి యీగ్రామ బహిఃపురోద్యానమున వేంచేసియున్నారు. మీరు వారి శిష్యకోటిలోఁ జేరినవారగు

టచే యతిరాజారాధన మొనర్చి కృతార్థులు కావలయునని విన్నవించుచున్నామని యతనితోఁ బలికిరి. శ్రీరామానుజులవా రంపిన శ్రీముఖము సెనగల బేరపుఁ జీటియో పెసల బేరపుఁ జీటియో యగునెడల నాశ్రీమంతుఁడు శ్రద్ధతోఁ బరిశీలించియుండును. ఉడయవ రుల శ్రీముఖములో వట్టి షరతున్నదా? వడ్డికి వడ్డిషరతున్నదా? భూమి తనఖాషరతు న్నదా? ఏమున్నదని దాని నాసంపన్నుఁడు దీక్షతోఁ జూడవలయును? ఏమున్నదని సందేహమేల? మహాత్ముని మంగళాశాసన మున్నదికదా? మహాత్ముల కెక్కడికి? మంగళాశా సనముల కెక్కడికి? మాటల కేమికొదవ? ఆశీర్వాదముతో నాయుష్యములా? తథాస్తులతో ధనాగమములా? ఎక్కడిమాటలు! వేదబుక్కులకు దిక్కులేకుండ నున్నది. ప్రాచీనమం త్రములఁ బలుకుబడి కనఁబడకున్నప్పు డిప్పటి మతగురువుల మంగళాశాసనములకా? అక్షతలతో నైశ్వర్యములు వచ్చుమాట యున్నయెడలఁ గొణిదెడుబియ్యపుగింజలతోఁ గుబేరులు కావలసినదికాదా? మాటలదారి వేఱు. మూఁటలదారి వేఱు. ఏదో గతాను గతికన్యాయముచేత, లోకమర్యాదకొఱకు, తప్తచక్రధారణకాలమందు తోఁచినదేదో గురువు నకు ముట్టఁజెప్పనే చెప్పినాను. మూఁడుమూఁడునాళ్లకదియేపనియా? ఏదో యొకసారి యయిపోయినది. అంతేకాని యిదియేమి మాసికమా? తిర్వధ్యయనమా? జయంతియా? తిరునక్షత్రమా? రాహుకాలములాగునఁ బ్రతిదినము వచ్చుచుండినయెడల శిష్యులకు వేఱ నన్న్యాస మక్కఱలేదు. సాగసుగనే యున్నది. సాగుచుండుటచేసరి''యని యాతఁడుమన స్సులో నేమేమి యూహించుకొనెనో కాని యాగురుశిష్యులతో నేమియుఁ బలుకక మొగము చిట్లించుకొని లోనికిఁ బోయెను. ఇట్లుపేక్షింపఁబడిన శిష్యులు తమ గురుపాదములయొద్ద కేగి యెంతయు వినయవిభ్రాజితులై విన్నవించుకొనిరి. మహాత్ముఁడు మందహాసమొనర్చి నారాయణనామస్మరణ మొనర్చులేచి, కరాగ్రగతత్రిదండకమండలుఁడై, కాషాయాంచలా చ్ఛాదిత మస్తకమండలుఁడై శిష్యులు కోశరాజములను దిర్వారాధనపుఁ బెట్టను మహించి వెంటఁజనుదేర నాగ్రామమం దెవ్వరియింటికో కాని పోవుచున్నారు. ఆయదృష్టశాలి యెవఁడో! ఆపుణ్యరాశి యెవఁడో! అలౌకిక తపోనిధి యెవఁడో! పాదములపైఁబడి భిక్షావం దన మొవర్చి నాగృహమును బవిత్రమును జేయుమని నాజన్మమున గృతార్థమును జేయుమని నాచిత్తమును శేషగుణసంపన్నముగఁ జేయుమని నాయాత్మను దరింపఁజేయుమని మనఃపూ ర్వకముగఁ బ్రార్థించినఁగాని యథార్థభక్తితో నాశ్రయించినఁగాని బయలుదేఱరాని యతిరాజ శేఖరుల ప్రార్థనపూర్వకముగ, ననాయనముగ, ననుగ్రహపూర్వకముగఁ దనయంతదానే యేమహాపురుషుని యింటికో పాదచారియై వేంచేయుచున్నారే! ఆహాహా! అదిగో మొండిగోడ లేకాని పైన మదురైనలేని-కప్పన్న పేరేకాని పైనఁ బదిచేతులు తాటియాకులైనలేని, ద్వారమ న్నపేరేకాని లోన గొండ్లమైనలేని-యాకుటీరమునొద్ద-ఆహాహా! భాగవతోత్తములారా! చూచుచుంటిరా! అఖిలదారిద్ర్యలక్షణోపేతమైన యాకుటీరమునొద్ద మాణిక్యమయత్రిదం డధారియు యతిసార్వభౌముఁడు నగుమహాత్ముఁడు నిలువఁబడినాడే! ద్వారమున కీవైపు ననున్నఁ బెరియతిరువడి యావైపుననున్నఁ జిఱియతిరువడి యావైపుననున్న శంఖము నావైపుననున్న చక్రమును వానినడుమను జిత్రింపఁబడిన శ్రీరంగనాథుని శ్రీపాదములను వానినడుమనున్న శ్రీచూర్ణరేఖ నామహాత్మఁ డవలోకించి యవనతశిరస్కుఁడై యానంద బాష్పము లంభోజసన్నిధములగు నక్షులనుండి విడుచుచున్నాఁడే! ఒక్కనిమేషకాల మట్లు నిలువఁబడి వరదాచారీ యని పిలువుమని యొకశిష్యున కాజ్ఞాపించిరి. ఆహా! రామానుజశిష్యఁ

డగు వరదాచార్యులవారి తిరుమాళిగ యదే! "వరదాచార్యవర్యా" యని యాశిష్యుఁ డాచార్యాజ్ఞ ననుసరించి పిలువఁగ ఆహాహా! వారెవరు? ఆగుమ్మమునొద్దకు లోపలినుండి యట్టివచ్చియెట్ట లజ్జాసాధ్వసాక్రాంతయై తలుపులుచైచికొని లోని కట్టపోయిన వారెవరు? ఆమెయే తిరుప్పత్తికొల్లినాచ్చియారు. వరదాచార్యుని దర్మపత్ని–మహాసాధ్వీమణి– పూర్వ జన్మ మహాపుణ్యమునఁగాని లభింపని యతిరాజశేఖరదర్శన మామె కయాచితముగ నిట్లు లభింపఁగ, గురువరేణ్యుని కెదుట నిలువఁబడి ప్రదక్షిణ మాచరించి నమస్కరించి యర్ఘ్యపాద్యములిచ్చి యాదరించి లోనికిఁ దీసికొనిరావలసినదా? ఆపతివ్రతాశిరోమణి యింత భాగవతాపచార మొనర్చినదేమి చెప్పుమా? ఆసాధ్వీరత్నము గురుదేవుని యెదుట నేల నిలువఁబడలేకపోయెనో చెప్పనా? చెప్పినయెడల మీమనస్సు కిబ్బందిగనుండునేమో? నాయనలారా! చెప్పనా! ఆమెకుఁ గట్టుకొనుట కొడలునిండిన గుడ్డయే లేదు. మొలకుఁ జుట్టుకొందమన్న–హరిహరీ! పైఁటకులేదు. పైటవేసికొందమన్న–రామరామా! మొలకు లేదు. నానోరు చచ్చిపోవఁగ నీమాటలాడితిని. ఇంతకన్న నేమిచెప్పఁగలను? రెండు మూళ్లగుడ్డతో నాయరుంధతీదేవి కాంతునితోఁ గాఁపురముచేయుచున్నది. నాయనలారా! యేపుట్టగోఁచి పెట్టుకొన్ననైనఁ బురుషునకు దినములు దొరలిపోవునుగాని యయ్యయ్యో ఆఁడుదాని కట్టుజరుగుట సాధ్యమా? ఇట్టిమహారిక్తుల యింటిముందా యాశేషాంశసంభవుఁడవతరించినాఁడు! తలుపట్టైచికొని లోని కాయిల్లా లేలపోయెనో గురువరేణ్యుఁడు గ్రహించి కంటికొలుకులు గానంతయరుణములుగాఁగ–నార్ద్రములుగాఁగా–దన తిరుమేనిపై గవ్పుకొనిన కాషాయాంబరమును దీసి–మదురలేని గోడపైనుండి–యింటలోనికి విసరినై చెను. మహాప్రసాదము మహాప్రసాదమని యామగువ లోనుండి కేకవైచెను. ఆహాహా! యతిరాజ వర్యా! లోకోద్ధరణార్థ మవతరించిన నీపవిత్రమైన యొడలిన్పర్శమున మహాపవిత్రమైన కాషాయశాటిని, జగమంతయు నాక్రమింపఁగల దయారసముగల నీహృదయప్రదేశమునం దాచ్ఛాదనభాగ్య మవధరించిన కాషాయశాటిని–అన్నిదివ్యదేశములం దర్చావిగ్రహముగ వెప్పుడారాధింపఁబడుచున్న నీదివ్యమంగళమూర్తిపైఁ బ్రకాశించినకాషాయశాటిని –ప్రణవజపావనరమున నీతిరుముఖమండలముపై రవంత వ్రాలియుండుటచే తన్మృళోద్ధి కాలంకార దివ్యసౌరభ సంవాసితాంచలయైన కాషాయశాటిని–రామానుజమునీంద్రా! అత్యంత రిక్తురాలగు నబలాశిరోమణి మానసంరక్షణార్థమై వినియోగించితివా? సెబాస్! లోకోత్తరత న్సంపన్నా! భాగ్యవతులగు నాగ్రామమందలికాంతలు–ఆమె యసాధారణయోగ్యత నాకర్ణించిన నన్నిహితగ్రామకాంతలు–ఎందఱు–యెన్నిపర్యాయములో–ఆమెకుఁ బీతాంబరములు న్వర్ణచేలములు కానుకలుగాఁ బంపియుండినను, వలదు వలదని వాని నన్నిటిని వినయపూర్వకముగఁ దిరుగ వారివారికిఁ బంపివైచినస్వార్థపరిత్యాగిని–సాధ్వీశిరోమణి–నన్యాసియిచ్చిన శాటిని సంతోషపూర్వకముగ గ్రహించినదా? అదిగో! అదిగో! పండుటాకులలోఁ గవ్పఁబడిన పుష్పమువలె శాటీసంవృతయైయున్న సాధ్వీమణి యదిగో! తలుపులు తీసికొని పైకివచ్చి పరివ్రాజకోత్తమునకుఁ బ్రదక్షిణ మాచరించుచున్నదే! ఆహా! భాగవతతేజమునకుఁ బతివ్రతాతేజము ప్రదక్షిణమొనర్చుచున్నదే! ఆతఁడు రామానుజులని యప్పటి కామెకుఁ దెలియదు. వరదాచారి యేఁడని యాయన ప్రశ్నింపఁగ భర్తవలన నిదివఱకు రామానుజయాత్రమగూర్చి వినియుండటచేత నాయన రామానుజు లనిగ్రహించి "మహాత్మా! ఉంఛవృత్తికై వెడలినారు. వారిబదులుగ నేను భిక్షావందన మర్పించుచున్నాను. దయయుంచి నాయాతిథ్య

మునుగైకొని మాకుటీరమును బావనమొనర్ప వేఁడుచున్నాను'' అని వినయపూర్వకముగ విన్నవించుకొనెను. రామానుజులు శిష్యసమేతులైలోనికి దయచేసిరి. అంత నామె చప్పునఁ జారితాటియాకొకటి లాఁగిశుద్ధోదకముల గడిగి శాటి చెఱఁగుచే దుడిచి యాయతిపతి యాసీనుఁడగుట కాస్తరణముగ నమర్చెను. నారాయణస్మరణ మొనర్చు నామని పుంగవుఁడు దానిపై నుఖాసీనుఁ డయ్యెను. ఆహా! యతిచక్రవర్తీ! పతివ్రతాతిలక మిచ్చిన ప్రాఁతతాటాకుపై నుపవసించినంత యుత్సాహముతో మహారాజార్పితమణిమయాసనము లపై నుపవసించియుండవుగదా! మానినీతిలకమా! నీమహాత్మ్య మేమనవచ్చును? అనేకధరా కాంతకిరీట మణిఘృణీరంజితపాదపీఠుఁ డగు పరివ్రాజకోత్తముని ప్రాఁతతాటాకుపై నధి వసింపఁజేసితివే. అమ్మా! అమ్మా! నీవు యతిరాజసేవచేఁ దరింతువో లేదో కాని నిన్ను స్మరించినంతమాత్రమున మేము తరింతుమనుమాట నిశ్చయము. నాయనలారా! మనకామె తల్లివంటిది. కావున నామెవంకఁజూచినఁ దప్పులేదు అదిగో! చూడుఁడు. కాషాయాంబరా చ్ఛాదితయైన యామె యెట్లు వెలిఁగిపోవుచున్నదో! మొదలే స్త్రీతేజము. దానిపైఁబాతివ్రత్యా గ్నిజ్వాలా తేజము. మఱిదానిపై సర్వసంగపరిత్యాగ సంయుక్తప్రపంచాతీత సన్యాసినీతేజము ప్రసన్నమై, యప్రేక్ష్యమై, చల్లనై, యుష్ణమై, పరశాంతమై, భయంకరమై ప్రకాశించుచున్న యాతేజ మపర్ణాముకదా! అప్రతిహతముకదా! ...మానముకదా! అలౌకికముకదా! నాయ నలారా! రామానుజులవారామెతో నేమో యానతిచ్చుచున్నారు వినుఁడు. ''అమ్మా! వరదా చార్యసహధర్మచారిణీ! నీయాతిథ్యమునకు మిగుల సంతసించితిని. సర్వజనసమాదరణీయ మైన సద్గుణసమాజము నీయందున్నది. శ్రీరంగదేవ నివేదనమునకై యీదినమునఁ దళిహ నీవే యొనర్పుము. ఇఁక గృహకృత్యములు నిర్వహించుకొనుము'' అని రామానుజులవా రాయమ్మతో సెలవీయఁగ మహాభాగ్యమని యామె వంటియింటిలోనికిఁ బోయెను. వంట యింటిలో నేమున్నది? ప్రాయ్యయున్నది. దానిలో రవంత బూడిదయున్నది. అంతే అంతకంటె నేమియులేదు. ఒక్కయరగిద్దెడు నూకలులేవు. ఒక్కయుప్పుగల్లులేదు. ఒక్క చింతపండుట్టిలేదు. శ్రీరామరక్ష శ్రీరామరక్ష. ఆహా! పరాత్పరుఁడా! ఆదంపతుల నెంతదారిద్ర్య మనుభవింపఁజేయుచున్నావు. తండ్రీ! ఎందుకొఱకు? ఎందుకొఱకు? పాదభ క్తులను బాధించుటకేనా కంకణము కట్టుకొంటివి? దయలేదా! దాక్షిణ్యములేదా? ఇది నీ విలాసమా? వారిప్రారబ్ధమా? ఖాక మా మతిలేనియేడుపా! పైరెంటిమాట నాకంతతెలియదు. కాని యీచివరిది సిద్ధాంతము. వారు దరిద్రతార్తి నెఱుఁగనే యెఱుఁగరు. సంతుష్టచేతస్కులై సంతతసౌఖ్యసంయుక్తులై వారు నంసారమును జరుపుకొనుచున్నారు. కడుపునిండిన సంతు ష్టియే యామెకు లేకుండునెడల గజమున్నఅకట్టుపేలికతో నాకాంత కాఁపురముచేయఁగ లదా? ఊరఁదిరిగి సేరుబియ్యముచేకూర్చుకొనియింటికి వచ్చినభర్తను మఱియొక పావుసే రుబియ్యము తెచ్చుటకుఁ గాళులు పీఁకుకొనిపోయెనా యని యిల్లా లీసడించును. సరిగంచు జగ్గయపేఁటచీరగల జవరాలు జపానుసిల్కువస్త్రము లేకపోయెనే యని మగనికి వెన్నిచ్చి మంచపు బట్టై కొఁగిలించుకొని పండుకొనును. తారహారములోనికిఁ దాంద్రబెత్తంత పచ్చ యేనా తెచ్చితివి? అరచేయియంత గాత్రపుది తేవలయునని యెఱుఁగవేమి యని పెదుషాచెవి పట్టుకొని భార్య జొకాయించును. ముష్టినాఁడు మోరపాకలో ముష్టియేడు పేడ్చు చున్నాఁడు. సామాన్యఁ డింటిలో 'ఇంటర్మీడియటు' యేడు పేడ్చుచున్నాఁడు. పాదుషా పైయంతరుపై ఫస్టుక్లాను యేడు పేడ్చుచున్నాఁడు. తుడుము మొదలుకొని దేవతార్చనవఱ

కంద ఱేడ్చుచునేయున్నారు. ఎవనిమట్టునకు వాఁడు గంభీరముగాఁ గ్రమ్ముదలగా నొకఁడే డ్చినట్లు రెండవవానికిఁ దెలియనీయకుండ మర్యాదగా–మానుషముగా నేడ్చుచున్నాఁడు. నోరుతెఱచిపైకి బారుననేడ్చినయెడల బాధతీఱియేపోవునేమో! అట్లుకాక నోరుమూసికొని కుమిలికుమిలి క్రుళ్లి క్రుళ్లి యేడ్చుటచేతనే మఱింత పుట్టిమునుఁగుచున్నది. సౌఖ్యమనునది చల్దిగంజిమూఁకుటిలోను లేదు. స్వర్ణక్షీరపాత్రములోను లేదు. సంతుష్టిలో నున్నది. అట్టిసంతుష్టిని నిరంతరముగల వరదాచార్యధర్మపత్నికి నామె భర్తకు సౌఖ్యమున కిప్పటి కేమియు కొదవలేదు. మధ్యాహ్నమగునరికి మగఁ డుంఛవృత్తిచే సోలెఁడుబియ్యమును దెచ్చెను. ఆనూకలు పొంగఁబెట్టుకొని తదన్నము తద్రసముగా వా రొక్కపూటనే భుజియిం తురు. మఱునాఁటి కొక్కబియ్యపుగింజయైన నిలువయుండదుసరే. ఇదివఱకు దినము లెటులో గడచిపోయెను గాని యాయిల్లాలికీదిన మెట్లుగడచునో? రామానుజులవారు శిష్య లిద్దఱితో నింటికి వేంచేసిరే. శ్రీరంగనివేదనమునకు చిత్రాన్నదధ్యోదనక్షీరాన్నాదిపక్వాన్న ములు కావలయునే. అవియెట్లువచ్చును? అంతనఱకెందులకు? అత్తెసరుమెదుకులైన నచ్చు నాధారమేది? స్వాములవారు తిర్వారాధనమారంభించినారు. భర్తవచ్చువఱకు పచనక్రియ లాఁగునా? ఆఁగక జరుగునుపాయ మేమున్నది? భర్త వచ్చుననియే యనుకొందము. సోలెఁడునూకలతో నైదుగురికి సాపాటెట్లు? చుట్టుపట్టనున్న యమ్మ లెవరైనఁ జేబదులీ యరా? తీర్పలేనిదాని కొక్కగింజయైన దొరకునా? బియ్యము దొరకుననియే యనుకొం దము. తండులములలోని కెన్నివస్తువులున్నఁగాని యతీశ్వరభిక్షయగును? ఈవస్తువులన్నియుఁ జేబదు లెచ్చటదొరకును? వట్టికల్ల. పోనీ! బదులెందులకు? ఒక్కయి త్తడి చెంబును విక్రయింపరాదా? ఏబాధయులేదే. ఇత్తడిజెంబే! ఎంతమాట! అది యుండినవాఁ డెంతనాఁడు! అదిగో! ఆడాకతో వండుకొనుచున్నారు. ఆకడముంతతో నీరు ద్రావుచున్నారు. హరిహరీ! పోనీ! మెడలో మంగళసూత్ర మమ్మి యతిసంతుష్టి యొనర్పఁ గూడదా? రామరామ! బొందున్న బసపుకొమ్ముతక్క మఱియేదియులేదే! ఇట్టిస్థితిలో నాపడఁతి సన్యాసి సమారాధన మెట్లాచరింపఁగలదో రంగరంగరంగా! ఆయింతి కెట్టియి క్కట్లు తెచ్చిపెట్టితివయ్యా! ఎట్టిసంధి తెచ్చిపెట్టితివయ్యా! ఇఁక నేమికావలసినది? ఏమిచే యుటకును దోఁపక యా యిల్లాలు ప్రాయ్యియొద్దఁ గూరుచుండి కడుపు దఱుగుకొని పోవఁగ నెట్లేడ్చుచున్నదో! సామాన్యుఁడగు నతిథియే నిష్ణువని చెప్పినప్పుడు సన్యాసియగు నతిథి యెంతవాఁడో చెప్పవలయునా? అందుళో జగద్గురుఁడగు నతిథి యాధిక్య మెన్నుట కెవినితరము? ధనములేనంతమాత్రమున నట్టివాని కాతిథ్యమీయక నిరాకరింపవచ్చునా? నిరాకరింపక చేయవలసిన దేమున్నది? అయ్యయ్యో! ఆరమణీశిరోమణి రంగరంగాయని కురరివలె విలపించుచున్నదే. రంగరంగా! యెక్కడనుంటివయ్యా? అయ్యయ్యో! ఈగూ టిలో నొకవరహా దొరకరాదా? ఆగుంటలో నొక్కరూపాయ దొరకరాదా యని మతిలేనిదాని వలె గూళ్లలో నెమకుచున్నదే–గుంటలు త్రవ్వుచున్నదే! కాని యదియేమి? ఆమె మొగము తీక్ష్ణముగ నగపడుచున్నదేమి? చిత్తజల్లువలె నాయెండలో వర్షము కురియుచున్నదేమి? హాహా! ఆమె భయంకరస్వరూపిణిగ నున్న దెందువలననో! ఏమిచెప్పుమా? ప్రాణత్యాగమొన ర్చుకొనునా? అట్లుచేసినయెడల యతిభక్ష యేలాగున? ఒకపాపముతో మఱియొక పాపము కూడనా? కన్నులనుండి జాఱుచున్న బాష్పములను శాటిచెఱగుచేఁ దుడిచికొని రెండుచే తల పైకెత్తిమింటివంక చూచి "రంగరంగా! తుచ్ఛమైన యీదేహము నేధనవంతునికైన

విక్రయించుకొని సన్యాసి సంతర్పణ మొనర్చెదను. ఈదినముతో నాసాధ్వీత్వము సరి
రంగరంగా! కటాక్షింపుము'' అని పలుకుచున్నదే. అయ్యయ్యో! ఇవి యామె యనినమాట
లేనా? రామరామా! సాధ్వీతిలక మెంతసాహసమున కొడిగట్టినదో! అయ్యయ్యో! పరివ్రాజ
సమారాధన మాచరింప నిశ్చయించుకొనినదా? అయ్యయ్యో? అప్పుడే యింటినుం
బయలుదేరినదే! ఆహా! ఆహాహా! ఇప్పుడైన నామెకాళులకు దారిలో నాల్గురూపాయ
లున్నమూఁట దగులరాదా? మూటయువలదు ముల్లెయువలదు ఆమె మృదులారుణచరణ
ముల కేదైన కఱకుఱాయి దగులుటచే నామెప్రయాణ మాఁగిపోరాదా? రంగరంగరంగా
నీవామెకు బ్రసాదించిన మహాదారిద్ర్యమువలననేకదా యానారీశిరోమణి యిట్టిఘోరకృత్య
మునొనర్ప నిశ్చయించుకొనినది. నీవైన నామె నాఁపజాలవా? ఇది పాపమే యగునెడ
నీపాపమునకు భాధ్యుఁడవు నీవగుదువు. జాగ్రత్త! రంగరంగరంగా! రక్షింపవా? ఱాయియైన
నడ్డుపడదే. రంగఁడైన నడ్డుపడఁడే! అయ్యయ్యో! వీధివెంటఁబోవుచున్నదే! ఫాంటెన్ అన
స్త్రీ తానుగన్నపిల్లను సంరక్షించుకొనుట కాధార లేశమైనలేక తెగబాఱెఁడైన తన తలవెంద్ర
కలను సవరములుకట్టువాని కమ్ముకొని వచ్చిన సొమ్ముతోఁ బిల్లను బెంచుకొనెనని 'విక్టర్
హ్యూగో' షను మహాకవి మహావిశేషాంశముగ 'లెస్‌మిసరబిల్స్' అను గ్రంథరాజమున
జెప్పినాఁడు. వరదరాజధర్మపత్నీచరిత్రము ముం దామెచరిత్ర మెంత? వెంద్రుకలు కత్తిరిం
పించుకొన్న విశేషమేమి? సంవత్సరము తిరుగకుండ సందెఁడు వెంద్రుకలు తిరిగివచ్చును
ఆహా! పోయిన పాతివ్రత్య మట్లు తిరుగవచ్చునా? చచ్చినవాఁడు తిరుగ జన్మింపవచ్చున
గాని మాసిపోయిన మగనాలితనము మఱుల వచ్చునా? అదిగాక నోరులేని పిల్లకొరకుఁ
దల్లిపడిన పాటులకును శిష్యురాలు గురువుగారికొఱకుఁ బడినపాటుల కెంతవ్యత్యాస
మున్నది! ఓ ప్రపంచమంతవ్యత్యాసమున్నది. కన్నకొడుకు కొఱకు గాడిదకాళ్లు వసు
దేవుఁడు పట్టుకొన్నాఁడని చెప్పుదురు. పైవాని కొడుకుకొఱకు గాడిదకాళ్లతఁడుపట్టుకొన్న
యెడల నప్పుడు వసుదేవుని భళీయనఁదగినదికాదా? ఏకష్టములొందియైననెవరిపిల్లలను
వారుపోషించుకొనుటలో విశేషమేమున్నది? ''కం. దిక్కును దెసయునుగలుగనిపెక్కుఱ
బిడ్డలనుబెంచుప్రేమాంబునిధీ'' యని యెవనినిగూర్చి పలుకఁదగునోయా
మనుజమార్తాండుఁడే మహనీయుఁడుకాదా? ఆహాహా! కాంతాశిరోమణీ! నీవంటిపతివ్రత
యార్యావర్తమునఁగానిమఱియొక్కడనుండఁగలదు? ఆహా! ఆర్యావర్తదేశమా! నీపూర్వనాగ
రకతయంతయు బుగ్గియైపోయినను నీఘనతయంతయు గడ్డలైనను, నీమయూరసింహాస
నాది సంపత్తి యంతయు నంతరించినను, నీమతసంప్రదాయసామగ్రియంతయు మాసిపోయి
నను, నీస్వాతంత్ర్యమంతయు చట్టుబండలైనను, నీపురుషులం దనేకులు దేశభక్తిరహితులైదే
శభాషాజ్ఞాన శూన్యులై బలహీనులై బ్రజ్ఞాభావులై ప్రాచీనాచారదూరులై స్వార్థశీలురై సంసారసు
ఖలంపటులై యేటికొకరు కూటికొకరులాగుకొని క్రుమ్ములాడుచు బహుధావిభిన్నులై
పాడైపోయినను నీకుఁ బ్రపంచమున నిట్టి దురవస్థలలోనైన నింతమాత్రపుఘనతయైనను
మిగిలియుండుటకు నీస్త్రీల పాతివ్రత్యమే కారణమునుమా! ఆహా! వరదరాజధర్మపత్నీ!
ఆగుమ్మమెక్కుచుంటివా? హరిహరీ! ఆఁడుది స్వయముగాఁబోయి మగవాని నడుగఁగూడ
దనియైన నెఱుఁగలేవమ్మా! ఎంతముద్దరాలవమ్మా! ఎంతనిష్కపటివమ్మా! అదిగో! అదిగో!
భూకంప మొదవుచున్నదా? మనమనసులోఁగలిగినవడకేనా? ''ఓవైశ్యవర్యా! నీయొద్ద
కొక్కపనికై వచ్చితి'' నని యామె పలికెను. ఆతఁడు తలయైన నెత్తక యామాటలు

వినిపించుకొనక ఏ వోలెక్కలు మాచుకొనుచుండుటచే నొక్కనిమున మీయిల్లా లాఁగిపోవల సివచ్చినది. అయ్యయ్యో! అభిప్రాయసూచకముగ, నర్మగర్భముగ ధ్వని ప్రధానముగఁ బలుకకుండ పగులఁగొట్టినళ్లే చెప్పునుగాఁబోలు! హరిహరీ! ఏమైన నెఱుఁగునా? వట్టిగోల!

ఏమాయయు నెఱుఁగదే–ఏకల్మషము నెఱుఁగదే. శుద్ధసత్య స్వరూపిణి– శుద్ధతేజఃస్వరూపిణి–మంచుగడ్డకైన మచ్చయున్నదికాని యామెమనసున మచ్చలేదే– చిన్నిపూఁదేనెయందైన జేఁదున్నది కాని యామ హృదయరసమునఁ జేదులేదే– సూర్యకిరణమునకైన సూటి తక్కువతనమున్నది కాని యామెవర్తనమున వంకలేదే– ఆకాశమునకైమఱుఁగున్నది కాని యామెయంతరంగమున మఱుఁగులేదే! ఆహాహా! అట్టికాంత కెట్టిప్రారబ్ధము సంభవించినదో! హరిహరీ! కాని యీమె యిప్పుడేదొ మాటలాడబోవనున్నది. నాయనలారా! వినుఁడు. ''వైశ్యరాజా! జగద్గురువర్యుఁడగు శ్రీమల్లక్ష్మణయోగిపుంగవులు మాకుటీరమును బావనమొనర్పగ దయచేసినారు. వారి సత్కార సమారాధనాదులకు నాయొద్ద నొకగవ్వయైన లేదు. నాదరిద్రస్థితిని బట్టి నాకు ఋణమిచ్చువారెవ్వరును లేరు. నీవు మొగము చిట్లించుకొననక్కఱలేదు. నిన్ను ఋణమడుగుటకు వచ్చినదానను గాను. తాకట్టిచ్చుటకు నా కీతనువుతక్క తదితరమేదియు లేదు. శూరాత్రి దీనిని నీకు భోగార్థ మద్దెకీయ నిశ్చయించుకొంటిని. యతిసమారాధనమునకు నాకుఁ గావలయు సామగ్రినంతు నీవీయఁగలవా?'' యని యామె యాతని నడిగెను. ఇదివఱకు జిట్లించుకొన్న మొగమిప్పుడు వికసించినది. ఇదివఱకు వ్యతిరేకపుజూపులజూచినవాఁ డిప్పుడు బాబాకరపుఁజూపుల జూచుచున్నాఁడు. గూనవలె నిదివఱకుఁ గూలఁబడియుండినవాఁ డిప్పుడు గువ్వపిట్టవలెఁ గులుకుచు నెగురఁబోవుచున్నాఁడు. ఇదివఱకు వెన్నుమీఁది తామర గోకికొన్నవాఁ డిప్పుడు మూఁతిమీసాలను వంపుచున్నాఁడు. ఇదివఱకు నల్లగ నిర్వైద్యముగ నిస్తేజస్కముగ నున్నవానికిప్పుడు నలుపు రవంతజాఱినట్లు రవంత తళుకు కళుకుగూడఁ గలిగినట్లగపడుచున్నదే. ఆహాహా!. శృంగారరసదేవతామహిమము! అందులో నంతరంగమున కెక్కఁదగిన యాఁడుది తనంతతానచ్చి యడిగినప్పు డిక్కఁజెప్పవలసినదేమున్నది? దిష్టిబొమ్మకుఁదేజఃప్రాణములు వచ్చునే? పందికి, ప్రతిభాపౌరుషము లుదయించునే? గాడిదకు గాన ముద్భవించునే? కాని ఆవైశ్యరా జేమనుచున్నాఁడో విందురా?'' రాత్రియా? అబ్బ! అంతవఱకా? వెఱ్ఱిమొగమా! వ్యవహారములకెల్ల అదనే ప్రధానము. అది రవంతయు దాఁటిపోనిచ్చినయెడల నెక్కడిసరకక్కడే'' అని యింక నాతడేమో చెప్పఁబోవుచుండగ ''నేను మఱియొకని యాచింతునని'' యామె తొందరతోఁ బలికెను. ''అయ్యా! ఒక్కటే తొందర! కొట్టుదగ్గఱకు వచ్చినదేది? మొగముతిన్నగాఁ జూపినదేది? అన్నిసరకులుగూడ నెంతప్రియముగా నున్న వనుకొన్నావు. సామ్మా? మఱియొకటియా? చూడుసరే! నాకిష్టమే కాని యెందఱకు సరకులు పంపవలయు'' నని యాతఁ డడుగ, నార్గుర కనిచెప్పి తటాలునఁ బోయెను. సామాగ్రులన్నియు వచ్చినవి. వంటయైనది. రంగనాథనివేదనమైనది. శిష్యులతోఁ గూడ స్వాములవారిభోజనమైనది, ఆమెభర్త రాకకెయెదురుచూచున్నది. ఇద్దఱకు సరిపోయిన సోఁడునూకలను మూఁటకట్టుకొని వరదాచార్యులు లోనికివచ్చి గురూత్తమునకుసాష్టాంగ 'దండప్రణామ మాచరించి చేతులు జోడించుకొని నలువఁబడెను. ''వరదాచార్య! నీభార్య మాకుఁ బంచభక్ష్యపరమాన్నములతో విందొనర్చినది. నీకుఁ బ్రొద్దుపోయినది. త్వరగ శ్రీపాదతీర్థమును దీసికొని భుజియింపుము'' అని స్వాములవారు పలికిరి. ఎట్లుజరి

గెనో యేమో'' యనుకొని 'మహాభాగ్య'మని యాతఁడు లోనికిఁ బోయెను! భార్య భర్తకు నమస్క-రించి చేపట్టుకొని పంచపాళీలోనికిఁ దీసికొనిపోయి ''ప్రాణకాంతా! యతిరాజశేఖర సంతర్పణమున కీసామాగ్రియంతయు నెట్లువచ్చిదో యెఱుఁగుదురా?'' యని భర్త నడిగెను. ఆప్రశ్నయే నే నడుగఁదలఁచితి నని భర్త బదులుచెప్పెను. స్వాములవారు మనకుటీరమునకుఁ దమయంత దాము విచ్చేసిరి. వారు నాకిచ్చినశాటియిదిగో! వారికి భిక్షనిచ్చుటకు మనయొద్ద నేమియులేక పడమటివీథినున్న వైశ్యరాజు నింటికిఁబోయి యారాత్రి నాశరీర మాతనికి భోగార్థమై యర్పింతునని వాగ్దానమొనర్చి సామగ్రిని దెప్పించి యతిపూజనొనర్చితినని యాయె చెప్పుచుండగా ''ధన్యోస్మి! ధన్యోస్మి! కాంతాశిరోమణీ! కులపావనీ! నీవట్లుచేసి నీవు కృతార్థురాలవైతివి. ననుఁ గృతార్థునిఁజేసితివి'' యని యామెరెండుచేతులు పట్టుకొని ''పవిత్రచరిత్రా! ఇవి చేతులుకావు కాళులు'' అనిచెప్పి కాసంతఘర్మముచేఁ గంపముచేఁగ్రాలు చున్న యామెకరములను బాష్పజలపూరితములగు తనకన్నులకు బదేబదే యద్దుకొని రంగరంగరంగా! నాయిల్లాలిమూలమున నాజన్మగూడ తరింపఁజేసితివి. తండ్రీ! రంగరంగరంగా! యని రవంత సొమ్మసిలి తిరుగ లేచెను. ఆహాహా! వరదాచార్యవర్యా! నీభార్యయే లోకోత్తరస్వభావయని యాశ్చర్యరసనిమగ్నులమై యుండ నీవంతకంటె లోకోత్తరస్వభావుఁడనైతివా? ఆహా! ఎంతవాఁడవోయి! ఎంత స్వార్థపరిత్యాగివి! ఎంతశాంతయుక్తుఁడవు! ఎంత గురువిశ్వాసముకలవాఁడవు! ఎంతదైవభక్తిగలవాఁడవు! నీమనస్సెట్టిదో తెలియఁబఱచుటకు మాకు వాక్కులు లేవే! నీమన సెట్టిదో యూహించుకొనుటకైన మాకు మనస్సులేదే! బ్రతికియుండియు భార్యతోఁ గాపురము చేయుచుండియు నైహికలాంపట్య మణువులో సహస్రాంశమైనలేని నీమనస్సు-ఆహా! అది మనస్సా! యేదివ్యతత్త్వమో నీకుఁదెలియఁదగినది. నీవు నమ్మిన శ్రీరంగమూర్తికిఁ దెలియఁదగినది. కాని యంతకంటె నెవరికి దెలియును.

సాయంకాలమైనది. రంగనికి మంగళహ్రటారతి యైనది. పరివ్రాజకునకు ఫలాహారమైనది. మహ్మేతుని మతోపన్యాసమైనది. రాతిరి పదిగంటలైనది. స్వాములవారు శయనించిరి. కాని యాదంపతులేరి? ఏరా! అదిగో వీథివెంటఁ బోవుచున్నారు. వైశ్యోత్తముని యింటికే? కాకేమి? అయ్యయ్యో! ఇద్దఱుగూడఁ గలసి పోవనేల? తనవెంట నిప్పుడు భర్తకూడ నెందులకని భార్యకైనఁ దోఁపలేదా? భార్యవెంట నీసమయమునం దానెంతులకని భర్తకైనఁ దోఁపలేదా! ఏమివింత! ఏమివిరుద్ధత? ఏమివిపరీతత! కాని ఆయమ్మచేతిలోనున్న దదేమి? స్వామిప్రసాదముంచిన చిన్నబుట్ట. వైశ్యవర్యుని కావైష్ణవప్రసాదము సమర్పింపఁ దీసికొనిపోవుచున్నది కాఁబోలు! హాహా! కాని యాచార్యులవారి చేతిలోనున్న దదియేమి? చిన్నమల్లి. దానిలో శ్రీపాదతీర్థమున్నది. దానిని వైశ్యరాజున కీయ నాతఁడు తీసికొనిపోవుచున్నాఁడు. హాహాహా! ఆతనికిఁ దీర్థప్రసాదము లిచ్చుటకు దంపతు లిద్దఱు పోవుచున్నారా? భార్యచేయి పట్టుకొని భర్త మెల్లగ నామెను బరభర్తయింటికిఁ దీసికొనిపోవుచున్నాడు. కాని చిన్నధ్వని వినఁబడుచున్నదేదది? నాయనలారా! వారేదో పదము పాడుకొనుచుఁ బరమానందమునఁ బోవుచున్నారే!

పదము

యతిరాజుల పేరంటే యమలోకం పాడైపోవు ॥ యతి॥

ఆహా! యతిరాజును గీర్తించుఁ బోవుచున్నారే! ఆఆ ఇంకను మఱేదో పాడుచున్నారే!

కాంభోచి-పదము

వైభోగరంగని పదములఁగొలిచిన పరమపదము మనము పడయుట సత్యము ఈభూమిపైన్ను ఏభోగమూలైన ఏవలే యుగుగాని యేమున్నదందున॥ వైభోగ రమారమణగోవిందోహరి! ఆహాహా! వారు గురుదేవన్మరణ మొనర్చు నానందసము ద్రమున నీఁదులాడుకొనుచుఁ బోవుచున్నారే ఆహా! ఆమరులారా! గంధర్వులారా! కింపురు షులారా! పంచభూతములారా! సూర్యచంద్రభగవానులారా! ఇట్టి భార్యాభర్తల నెచ్చటనైన నెప్పుడైనఁ జూచితిరా? ఇంకను బుష్పవృష్టిఁ గురియ కుపేక్షించుచున్నారేల? ఇంతకంటెఁ బ్రబలావసర మేమున్నది? కానిండు ఓ! ఓ! శ్రీహరీ! శ్రీహరీ! అతనియిల్లు సమీపించినకొ లది మఱింత యుత్సాహభమున నుప్పొగింపోవుచున్నారే! అదిగో వైశ్యరాజు గమగమలా డుచు గదిలోఁ గూరుచుండినాఁడు. మన నాచ్చియారమ్మ స్వామిప్రసాదమును దీసికొని గదిలోనికిఁ బోవుచున్నది. ఆచార్యులు తలుపునొద్ద నిలువఁబడినాఁడు. ''వచ్చితివా సుందరీ'' యని యాతఁ డెదురుగ వచ్చినాఁడు ''రాకపోవుదునా? వైశ్యరాజా! కాని యిదిగో స్వామిప్రసాదము కన్నుల కద్దుకొని భుజింపుము.'' అని యాతనిచేతిలో రవంత వెణ్ణొంగలి యుంచినది. అది కన్నుల కద్దుకొని నోటిలో వైచికొనినాఁడు. ఇంకను దానిని మ్రింగినాఁడో లేదో ''హరిహరీ! హరిహరీ! పాపాత్ముఁడను. పాపాత్ముఁడను లెంపలు కొట్టుకొనుచున్నాను. అమ్మా! అమ్మా! నీయెడల మహాపరాధ మొనర్చితిని! నీవు నాతల్లివి. తల్లివి రంగరంగా! రక్షించు రక్షించు'' అని పెద్దగావుకేకలు వైచుచున్నాఁడు. మొఱ్ఱోమొఱ్ఱోయనుచున్నాఁడు. తలఁగొట్టుకొనుచున్నాను. గుండె బాఁదుకొనుచున్నాఁడు. క్షమింపవా? తల్లీ! రక్షింపవా? యని యెగిరి యెగిరి యామెకాళులపైఁ బడుచున్నాఁడు. ఆమె యానందబాష్పపూరితా క్షియై యవలోకించుచున్నది. ఇంతలో భర్త శ్రీపాదతీర్థకలశముతో లోనికివచ్చి ''భాగవతో త్తమా! లెమ్ము. ఇదిగో శ్రీపాదతీర్థము. దీనిని దీసికొనుము. నీమనస్సు శాంతించు'' నని చెప్పి యిచ్చెను. అప్పుడాతఁడు కొంత కుదుటఁబడినపిమ్మట నాతని నిద్దఱు చెఱియొక చేయి పట్టుకొని శ్రీరామానుజగురూత్తమునియొద్దకుఁ దీసికొనిపోయిరి. ఆలస్యమైనది. మన మింక సభ చాలించి యింటికిఁ బోవుదము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

37. ఉన్మత్తుని యుపన్యాసము
స్త్రీపురుష సౌందర్యము

జంఘాలశాస్త్రి ఒకసారి మద్రాసులో ఒక పిచ్చిఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ప్రకృతిశాస్త్ర పండితుడైన ఒక పిచ్చివాడు అతనికొక ఉపన్యాసం ఇచ్చాడు. దాని సారాంశం ఏమంటే శాఖాప్రపంచంలో, పక్షిప్రపంచంలో, జంతు ప్రపంచంలో, స్త్రీజాతికంటె మగజాతి మాత్రమే సౌందర్యప్రధానమైందని—.

అందుకు ఆ పిచ్చివాడు అనేక ఉదాహరణలు ఇచ్చాడు. తనవాదానికి ధాతు ప్రపంచం ఆధారమన్నాడు. పరిణామక్రమం ఆధారమన్నాడు.

మనుష్య ప్రపంచానికి వచ్చేసరికల్లా ఈపరిస్థితి తారుమారై, స్త్రీ సౌందర్యరాశిగా చెలామణీ అయిపోతోందనీ పిచ్చివాడు వాపోయాడు. పశువులు మొదలైనవాటికంటె మనకి 'రీజను' అనే తత్త్వం ఉండడంవల్ల, ఇంత స్త్రీ చాపల్యం కలిగిందన్నాడు. స్త్రీ బంగారు బొమ్మకావడానికి కారణం మనిషిలోని వ్యసనం అన్నాడు.

జంతుప్రపంచంలోగాని, పక్షిప్రపంచంలోగాని 'ఇన్‌స్టింక్టు' ప్రధానంకాగా, మానవ ప్రపంచంలో 'రీజను' కూడా తోడై మనిషి స్త్రీలోలుడయ్యాడని, ఇందుకు కవులు ప్రధానకారకులని తీర్మానించాడు పిచ్చివాడు.

పిచ్చివాడి మనస్సు ఎలావనిచేస్తుందో తెలుసుకోవడానికి జంఘాలశాస్త్రి చేసిన ప్రయత్నంవల్ల, అతని ప్రోత్సాహంవల్ల ఈ ఉపన్యాసం తటస్థించింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:—

నేనొకదినమున మదరాసులోని పిచ్చియాసుపత్రిఁ జూడఁబోయితిని. అచ్చట నొక పిచ్చివాఁడు నేఁబోవునరికే యేదో చెప్పుచుండెను. నేను వెళ్లినతరువాత నిట్లు చెప్పసాగెను.

''ఆఁడుది యెక్కడ? సౌందర్య మెక్కడ? ఏయాఁడుదానికైన సౌందర్యమున్నదా? సౌందర్యహీనమైనజాతియే స్త్రీజాతి. మగజాతియే సౌందర్యయుక్తమైనది. మగజాతి

సౌందర్యముముం దాఁదుజాతిసౌంద ర్యమధమము–అత్యల్పము. నేనేమో వెఱ్ఱిముండకొడ కును గావున నిట్లు చెప్పుచున్నానని మీరనుకోవలదు. నేనే వెఱ్ఱివాఁడనైనయెడల మీరుమాత్ర మేల వెఱ్ఱివారుకారు? కొట్టులో నుండుటచే నేను వెఱ్ఱివాఁడనని మీ రెంచుచున్నారు కాఁబోలు. మీరున్నకొట్టు నేనున్న కొట్టుకంటెఁ బెద్దదగుటచే మీరు నాకంటె నెక్కువవెఱ్ఱి వారు. తెలిసినదా? పిచ్చిలేనివాఁ డెవఁడు? ఒకఁడు మాటలాడుచున్నప్పుడు తలనిట్టి యిట్టి యెగురవేయును. ఒకఁడు భుజము నెగురవేయును. మాటలాడు ప్రతిమనుజునికిఁ గూడ నేదో యొక్కయూఁతపద ముండితీఱినది. ఒకఁడు ''ఏమి? ఏమి?'' యని నడుమనడుమఁ బనిలేదే ప్రయోజనము లేనిదే యనును. ఇది పిచ్చికాదా! ఒకఁడు ''ఏమన్నాగాని–మతేగలిగితే –దేవుఁడు మీకు చాలా మేలుచేస్తే'' యని యిట్లేదో యొక్కటి మాటల కూఁతఁగా బలుకును. ఇది పిచ్చికాదా? పిచ్చివాఁడే కాకున్నయెడల దశరథునకు ముగ్గురుభార్యలు మూడువందల యుంపుడుకత్తె లెందులకు? ఎలిజిబెతు కెనిమిదివేల ఫ్రాక్కులు, తొమ్మిదివేల షర్టులు పదకొండువేల కంఠబంధములు పదునాలుగువేల కాలిజోళ్లెందులకు? ఇంతవఱకెందులకు? ''నాకుఁ బిచ్చిలేదురా మీమొగములుమండ'' నని తలఁగొట్టుకొన్ననైన నెవ్వఁడును వినఁడే! ఒక్కముండ కొడుకు తిక్కయైనఁ దీఱదే''.....

అయ్యా! ఒకవిషయమునుండి మఱియొకవిషయమునకు జారిపోవుచున్నారు. మొదట స్త్రీపురుషసౌందర్యభేదమునుగూర్చి చెప్పనెంచి వేఱొక్కయంశమునుగూర్చి యిప్పుడు చెప్పుచున్నారని పూర్వవిషయమును నే నందించితిని.

''నేనంత మఱపున్నవాఁడను గాను. ఈనక్షత్రము లన్నియు నొకరాత్రి యూఁది క్రిందఁబడిపోవగ మాతాతగా రెక్కడి నక్షత్రమక్కడ తెల్లవారుసరి కమర్చినారు. నక్షత్రశాల లోని దూరదర్శినీ యంత్రము చూచితివా? 'గెలీలియో' అనునాతఁడు చంద్రునిలో నగ్నిపర్వతము లున్నట్లు కనిపెట్టినాఁడుకాని తనతత్త్వములో నున్నతమాష కనిపెట్టలేక పోయినాఁడు. గజమ్ మిథ్య పలాయనమ్ మిథ్యయని దాఁటుకొనిపోయిన వినియోగము లేదు. ఆ–(సుతివేయును.)

శ్లో. దేవీం వాచముపాసతే హి బహవస్సారంతు సారస్వతాం
జానీతే నితరామసౌ గురుకుల క్లిష్టో మురారిః కవిః,
అబ్ధిర్లంఘితయేవ వానరభటైః కింత్వన్య గంభీరతా
మాపాతాళనిమగ్న పీవరతనుర్జానాతి మంథాచలః.

అని కవి పలికినాఁడు. వీనిపిచ్చి కాలిపోను! కవికున్న పిచ్చివంటి పిచ్చి మఱియెవ్వనికి లేదు. అబ్బ! వానికున్న తెగనీలుగు–తలతిక్క–పొగరుఁబోతుఁదనము–కొనవెఱ్ఱి –కొంకనక్క–తనము మఱియొకనికున్నదా? కవియంతటి పిచ్చివానిని మీరు కనఁబఱచినయె డల జోడుసాలువులు తోడా వేయింతును. ఏఁడీ? చూపుఁడు అద్దే యువరాజుగారు మదఁకాను వచ్చినప్పుడు వారి సొంత తిరుహస్తములనుండి సాలువులు తోడా లందుకొన్నవారే మంత గొప్పపండితులు! ఏమంత గొప్పకవులు! ఏదో అభిమానమును బురస్కరించుకొని ప్రపంచము దొరలిపోవుచున్నది. దేశభాషలు పోషించుచున్నామని సర్కారువారి కదియొక చమత్కారమైన కల్పన.

అయ్యా! స్త్రీలసౌందర్య మధమమని యొక వింతమాటచెప్పితివి. దానిని బుజువువర చుకొనకుండ వేఱువేఱుమార్గములఁ బోవుచున్నావు. స్త్రీలే సౌందర్యవంతులని నేను వాదింతును. నీవు నావాదమెట్లు ఖండింతువో చెప్పుమని యూయున్నత్తునితోఁ బలికి యాతనిని గావుగాయుచున్నవాని చేతిలో రెండురూపాయ లుంచి మమ్ము రవంతసేవు స్వేచ్ఛగా మాటలాడనీయవలసినదని బతిమాలితిని.

''నాతో నీవు వాదింతువా? ఏమీ! ఎంతవాఁడవు? నే నెవఁడనో యెఱుఁగుదువా? 'నాచురలు ఫిలాసఫీ' లో 'ఏం. ఏ'ను. 'ఎవల్యూషను' లో మహామహోపాధ్యాయుఁడను. నాతో నీకు వాదమెందులకు? అనమానవైరము. అనమానవైరము. పో! ఆవలికిఁ బో! స్త్రీజాతి సౌందర్యవంతమైనదని నాతో వాదించుటకే వచ్చితివేమి? కాని–పట్టు–ఏమాత్రము వాదిం తువో! చూడు–ధాతుప్రపంచము–వీనిలోనున్న సామ్యభేదములనే మనము పరిశీలింతము. వీనిపైనున్న దేవతా ప్రపంచము మన కిప్పు డక్కరలేదు. అత్యధమజాతినుండి దానిపైజాతి నుండి యాపైజాతి, దానినుండి దానిపైజాతి యిట్లవిలంఘ్యక్రమమునఁ బరిణామప్రక్రియ జరుగుచున్నదని యొప్పుకొందువా? అన్ని ధాతువులలోఁగూడ స్త్రీపురుషభేద మున్నది. మగబంగారమని యాఁడుబంగారమని భేదమున్నది. ఉండితీఱినది. ఇఁక మాటలాడకు –నోరుమూసికొని యొప్పుకో–మగమణిశిల యాఁడుమణిశిలకంటె నెక్కువ సుందరముగా నుండును. ఇందుల కాంగ్లేయశాస్త్ర మొప్పుకొనునాయని ప్రశ్నింపకుము. ఆంగ్లేయశా స్త్రము మనకేమి యాగమవాక్యమా? సజీవవస్తువులు నిర్జీవవస్తువులు నని (ఆర్గానికు, ఇనార్గానికు) వారుచేసిన భేదమేమైనది. తలక్రిందైనది. ధ్వస్తమైనది. ప్రపంచమున సప్రాణము లేకాని నిష్ప్రాణములు లేవని మనవేదర్షులు సింధునదీప్రాంతమునఁ జెప్పినమాటయే సిద్ధాంత మైనదికదా! జీవమున్నచోట స్త్రీపురుషభేదము లేకుండుట కెట్లు సాధ్యము! స్త్రీపురుషత త్వము లొక్కవస్తువులోనే యిమిడియుండనీ. వేఱువేఱువస్తువులలో విస్పష్టముగ నుండనీ –అది నాకు గణనీయముకాదు. స్త్రీపురుషభేదము దేశకాల పాత్రనియమములు లేకుండ నుండి తీఱినది. అందులో స్త్రీతత్త్వము సౌందర్యమున నధమము. పురుషతత్త్వము సౌందర్యమున నధికమని నావాదము. ఇది కాదన్నవానిని గిఱగిఱ త్రిప్పి బంగాళాఖాతమునఁ బాఱవేయుదురు. ఆమాత్రపు వాదబలము లేకపోలేదు. తొమ్మిది గంటలరాత్రివేళ, వార్ధితీర మునకు షికారుపోవలదని యెంత నిర్బంధించినను వినని భార్యను భర్తయైన వకీలుగా రేమిచేసినారు! గడునువాఁడునావలె వాదబల మున్నవాఁడు కావున నావషికారు వంకపెట్టు కొని భార్యను జిన్నపడవలో కెక్కించుకొని యామెరోగము నీటివైద్యమునఁగాని కుదురదని బుడుక్కున సముద్రములోనికిఁ ద్రోచివైచినాఁడు...

అదిగో! తిరుగ మఱియొకమార్గమునఁ బోవుచున్నావు సరే–ధాతుప్రపంచమున మాటవరుసకు స్త్రీపురుషభేదమున్నదని యొప్పుకొందును. ఆఁడుజేగురుకంటె మగజే గురే యెక్కువసుందరమని నీజబర్ దస్తీచే నొప్పుకొంటిని. సరే–దానిపైనున్న శాఖాప్రపం చపు సంగతిచెప్పుము. మఱియొకదారిని బోకు. మనస్సును గట్టిగఁ బట్టుకొని మాటలాడు మని నే నాతనిని ప్రోత్సహించితిని.

''నాకు జంఘాలశాస్త్రిలాగున నట్టి మాటలాడుట యసహ్యము. ఇది శాఖాప్రపంచమునుగూర్చి చెప్పెదను. తాటిచెట్లలోఁ బోఁకచెట్లలోఁ–గొబ్బరిచెట్లలో –

మామిడిచెట్లలో – పొన్నచెట్లలో బొమ్మజెముడులో–పరిమిచెట్లలో–గాడిదగడపలో –కూఁతురుబుడమలో–స్త్రీపురుషభేద మున్నది. ఆఁడుచెట్టుకంటె మగచె ట్టత్యంతసౌంద ర్యము–ఒప్పుకో–తిరుగుమాటలేకుండనొప్పుకో–నీవాసౌందర్యవ్యత్యాసత నేల గ్రహింలేక పోయితివో నేను జెప్పనా? నీకందులకుఁ దగిన కనులులేక–మాముత్తాతగారి కుత్తరవయ స్సులో నేత్రావరోధత సిద్ధించినది. ఆయనను బరామర్శించుటకు కొకఁడు వచ్చి ''తాత గారూ! మీకుఁ గన్నులు బొత్తిగాఁ గనఁబడవు కాఁబోలు నేమి'' యని యడిగెను. ఆముసలియాయన యేమనెనో యెఱుఁగుదువా? ''నాయనా! నీకు వెనుకచూపులేదు. నాకు వెనుకచూపు ముందుచూపుగూడ లేదు భేద మింతమాత్రమే నుమా'' అని యాయన పలికెను. ప్రపంచమున నూటికిఁ దొంబదుగురుకుఁ గనులులేవు. అందులో సౌందర్యరసగ్ర హణమున నూటి కిద్దఱుకుఁగంటెఁ గనులులేవని నానమ్మకము. ఇఁక నీగ్రుడ్డి పెద్దమ్మలా సౌందర్యవ్యత్యాసతను గనిపట్టువారు? ధృతరాష్ట్రున కంధత్వమెందుకువచ్చినదో యెఱుఁగు దువా? ఆనవడలుతినుటచేత ఇప్పుడు మనవారు కాఫీత్రాగుటచేతఁ గౌరవరాజేంద్రునికంటె ఘను లనిపించుకొనుచున్నారు.''

అయ్యా! అంతటితో నాఁగవయ్యా–సరే–శాఖాప్రపంచమున నేదియో జెబ్బపుట్టిపా కముగాఁ జెప్పితివి. ఒప్పుకొనకపోయిన యెడలఁ దిట్టుదువని యొప్పుకొంటిని. శాఖాప్రపం చముపైనఁ గ్రిమిపక్షి పశ్వాదిప్రపంచ మున్నది. దానినిగూర్చి నీయభిప్రాయమేమో చెప్పుము చూడు...మనసు కప్పదాట్లు వేయఁబోవుచుండ రవంతమఱుల్చుకొని మఱి మాటలాడు మని నే నాతనితోఁ బలికితిని.

''పక్షిపశ్వాదులఁగూర్చి యిఁకజాడు నావాగ్ధాటి–తుపాను పట్టిన ట్లుపన్యసింతునో లేదో బందరుగాలివాన సంవత్సరము రక్తాక్షియున్నదే–అదే నాజనన సంవత్సరము. మన మాలాగున నవనిపైనవతరించుటయేమి? అనేకనహస్రజీవరాసుల నంతిపురి కనుపుటయేమి అద్దే! దుష్టశిక్షణ శిష్టరక్షణభారములు వహించిన యవతారమన్నమాట. అయిననేమి–మన కిప్పుడే నేటిశని–ఊఁచియూఁచి నేలను గొట్టుచున్నది. ముప్పదియేండ్లక్రైనఁ బెండ్లిచేసికొ నని కన్యకల నందఱును గవర్నమెంటువారు బేవారు సాస్తిక్రింద నేంచి దాఖలుచేసికొనుట విషయములో నీయభిప్రాయమేమి? ''The Hindu Trigenarian girls-Escheat Bill'' మనకు ''స్వపరిపాలనము (సెల్ఫ్) గవర్నమెంటు) వచ్చినయెడల నా మదరాసుగవర్న రీపదవిలో సాగఁదీసి పాసుచేయింపక పోదునా.....

ఓరి నీవెట్టికాలిపోను. భారతదేశస్వరాజ్యములో మనరాజధానికిఁ బ్రథమప్రభుఁడవు నీవా? అయ్యా! నీతో మాటలాడుటచేత నామతి గూడ వెనకాడుచున్నది. పక్షిపశ్వాదులలో స్త్రీపురుషసౌందర్య భేదమునుగూర్చి చెప్పెదవా? పొమ్మందువా? యని నేను బ్రాణము విసుగుటచేఁ బలికితిని.

''వెరివెల్ నీకుఁ దెలిసికొనవలెనని కుతూహలమున్నదో లేదో (ఎట్లు) చేయుటకు గాను నేనిట్లు 'డిలే' చేయుచున్నాను. వెరిగుడ్ మొదటఁ బక్షులను దీసికొని, పిచ్చుకనుండి మన మారంభింతము. మగపిచ్చుకకు నాఁడుపిచ్చుకకు సౌందర్యమునం దెంత వ్యత్యానము న్నదో సూర్యకాంతివలెఁ గనబడుడలేదా? మగపిట్టకున్న వెండ్రులకసొగను రంగులతీవి, రూపవర్తులత్వము కంఠమాలాసౌభాగ్యము నాఁడుపిట్టకున్నవా? ఆఁడుపిట్ట మగపిట్ట

ముందు దిగదుడుపునకైనఁ బనికివచ్చునట్లున్నదా? చూడు. కన్నులు తెఱచిచూడు! స్త్రీపక్షి పురుషపక్షి యనురాగమునకై యెట్లు దేవులాడుచున్నదో! ఆకారవైభవముచే మగ పిట్టయాఁడుపిట్ట నెంతవిశృంఖలముగ నాకర్షించుచున్నదో! ఎక్కు. ఇకఁ జిలుకయొద్ద కెక్కు. ఓహో! కీరశరీరసౌందర్యసారము కీరనారియందుఁ గనఁబడుచున్నదా? మగపిట్ట ముక్కున యరుణిమ యాఁడుపిట్టముక్కునఁ గనఁబడుచున్నదా? మగపిట్ట క్రేగంటికటాక్ష మున కెన్నియాఁడు పిట్టలు శృంగారరసపులకితాంగములై వేచియున్నవో చూడు! నీకుఁబక్షి శృంగారవైభవము తెలియునా? తెలిసినయెడల నదిగో! ఆయాఁడుపిట్ట యిప్పుడు ముక్కుతో ఱెక్కప్రక్క నేల గోఁకికొనునో చెప్పుము. నేను జెప్పఁగలను. ఆహా! మగపిట్ట కున్న కంటిసౌందర్యమును గంఠమాలాసౌందర్యము నాయాఁడుపిట్టలు ముక్కులు తెఱచి తోఁకలెత్తి కన్నులతోడనే యెంతపిపాసచే గ్రోలుచున్నవో చూడు. ఇక్కడకుఁ దెలిసినదా శుకశుకీసౌందర్యవ్యత్యానత? ఎక్కు, కోడిపుంజవఱకెక్కు. ఎక్కితివా? వెరిగుడ్ ఇంద్రధ నుస్సుగాని యిది పుంజటోయి! దీని సౌందర్యము నీకేమి తెలియును? నార్తరన్ సర్కారు లలో నున్న జమీన్ దారులకుఁ దెలియులసినది. ('నాచురలు ఫిలాసపరు') నైనానాకుఁ దెలియవలసినది. అంతేకాని థూ! థూ! నీకా తెలియుట చూడు. దివిటీముందు దివ్వెఱవలె నాఁడుపిట్ట లెట్లు వెలవెలపోవుచున్నవో చూడు. ఓ ఆకంఠసౌందర్య మేమి! ఆవక్షసౌందర్య మేమి! ఆస్కంధ సౌందర్య మేమి! ఆవాలసౌందర్య మేమి! అన్నిటిని మించిన యాశిరసౌందర్య మేమి! ఓ! ఏమహారాజునెత్తిపై నిట్టి మాణిక్యమయకిరీటమున్నదోయి! విస్పష్టముగ నిచ్చట స్త్రీపురుష సౌందర్యవిభేదము కనఁబడుచున్నదా? ఎక్కు! మయూరమువఱ కెక్కు. ఎక్కితివా? వెరిగుడ్ . ఓ! ఓ! కన్నునైకుంఠము! ఆమగపిట్ట మెడకున్న సౌందర్యము సహస్రశక్రశాపములకైనఁ గలదా? మెడవఱ కెందులకోయి దానిపించమున నున్న యొక్క కంటిసౌభాగ్య మింతింతని చెప్పఁదరమా? మయూరకంఠ కాంతిని స్పృశించినయెడలఁ దనకిరణములు శోభావంతము లగునవి భాస్కరుఁడు దానిపైఁ బ్రకాశించునే! పించసౌందర్య మును జూడవలయునని మేఘుఁ డంతరిక్షమున వేస్రాడుచుండునే! ఆహాహా! దాని నెత్తిమీఁద దదియేమి? ఏవజ్రాలతురాయి సర్పేషుకూడ దాని కీడురాదే! చూచితివా? దానిముం దాఁడునెమిళులు దిష్టిబొమ్మలవలె–దిగదుడుపులవలె నెట్లున్నవో! ఎక్కు. హంసవరకెక్కు. ఎక్కితివా.

వెరిగుడ్ . స్త్రీపురుషహంసల సౌందర్యభేదమును దిలకించితివా? పక్షిలోకమందెల్ల నిదియే పద్ధతి. స్త్రీజాతి నాకర్షించుటకే పురుషజాతికి సౌందర్యము. తెలిసినదా? హెహెహె! (నవ్వును) నవ్వుచున్నప్పు డేడ్చుచున్నట్లున్న యాఁడుదానిమొగము నీవెప్పుడైనఁజూచి తివా? అది యేడ్చుటయే సిద్ధించినప్పుడు వహవ్వా వహవ్వా! ('మైగుడు హెవెన్సు').

"అదిగో! అదిగో! తిరుగఁ బెడదారి పట్టుచున్నావు. తరువాతఁ బక్షులనుగూర్చి చెప్పుము. క్రిందటిసారివలెనే తఱచు తొట్రుపాటొందకుండఁ జెప్పవలయును." అవి నేనంటిని.

"వెరివెల్! వినువాఁడున్నప్పుడు చెప్పుట కేమిలోపము. అదిగో! కురంగము. వహవ్వా! ఏమిచక్కనియాకృతియోయి! సెబాన్! నేత్రపర్వముగనున్నదోయి! చూడు చూడు. కురంగిని యెటులున్నదో! కొమ్ములులేక కుతికిలఁబడినట్లు కొణుగుబాఱినట్లు

చిన్నతలతో దానిముందెంత సౌందర్యవిహీన మయియున్నదో చూడు. ఎక్కు పెద్దపులి వలెకెక్కు ఎక్కితివటోయి వెరిగుడ్. ఓ ఓ జాగ్రత్తగా బరిశీలింపుము. ఏమి మొగము సీటు. ఏమి వంజాబ్రేటు. ఏమి పిల్లిగడ్డపుగోటు. ఏమి చారలకోటు–ఏమి కన్నులపోటు –ఏమి వాలపుతీటు. సెబాస్! భయములోఁ బ్రభయున్నదే! కఠినతలోఁ గమ్రతయున్నదే! చూడు! అదిగో శార్దూలిని అచ్చటనే యున్నదే–శార్దూలముముం దది కుక్కవలె నున్నట్లగ పడుటలేదా? చిన్నతలతో, వంగిముడుచుకొన్న దేహముతో, బోడిమొగముతోఁ బొట్టితోఁ కతో దానిముం దది యెంతలావణ్యహీన మయియున్నదో? ఇఁక జాలునా? సరే! ఏనుఁగమీఁది కెక్కవోయి మూతిపండ్లు విఱుఁగునో మూర్ఛాభిషిక్తుఁడవగుదువో! కానీ! ఎక్కు! ఏనుఁగు నెక్కినప్పుడేకదా వెనుకటి (వైసురాయి) గారు మంచమెక్కుట సిద్ధించినది.

''అదిగో! ఆఁగు. తిరుగఁ దప్పుదారి ద్రొక్కుచున్నావు. జాగ్రత్త! ముందు చెప్పవలసి నదానిని జెప్పు'' మని నే నంటిని. పిచ్చివానియభిప్రాయము లెట్లుండునో తెలిసికొనవలయు నని యభిలాషముచే నేనింత దేవులాడుచుంటిని.

''గడియగడియకు జ్ఞప్తిచేసెద వెందులకు? ఏనుఁగవఱకుఁగదా వచ్చితిమి. వెరిగుడ్. అదిగోకరి. అదిగోకరణి. ఏది సౌందర్యాధిక్య సంపన్నమో నీకుఁ గనఁబడుటలేదా? నేను వేఱుచెప్పవలయునా? మగయేనుఁగుముం దాఁడుయేనుఁగు కళాహీనమయి కనఁబడుట లేదా? ఆదంతములవలన నుగది యెంత శోభావంతమై యున్నదో! అదిలేక బోసిదై యాఁడు దెట్లు చిన్నబోయి యున్నదో! ఎక్కు, సింహమువఱకెక్కు. ఎక్కితివా? వెరిగుడ్. ఓహోహో! మొగమునం దేమివిశాలత! కంటియం దేమితేజము! మెడయం దెంతజూలు! వక్షమునం దెంతవిపులత! తోఁకయం దెంతసొగుఁడు! అంగన్యాసం దెంతసూక్ష్మత! ఆకారమం దెంత యౌన్నత్యము! నడకయం దెంత రాచఠీవి! సకల సౌందర్యలక్ష్మీవిరాజమాన మగు మృగరాజముముం దదిగో యాఁడుసింహము వాలుమొగముతో, బొక్కజొమ్మ్రితో. బోడిమెడతో, హ్రస్వవాలముతో, సంకుచితాకారముతోఁ, జిన్నతలతో నున్నది. చూచి తివా? ఆసౌందర్యమున కీసౌందర్యమున కెంతవ్యత్యాసమున్నదో స్పష్టముగఁ గనఁబడుచునే యున్నదికాదా? నిజముగ మగజాతిదే సౌందర్యము. స్త్రీజాతి కత్యంతోత్సాహము ననురా గము నభిలాషము నందువలన నన్వయవృద్ధి కలుగుటకే మగజాతిలో నింతసౌందర్యము ప్రకృతిలోఁ గలుగవలసివచ్చినది. తెలిసినదా? ఇఁక బైకెక్కు. నరులవఱకెక్కు. ఎక్కితివా? వెరిగుడ్. నరులనఁగా నాకు రోఁతిత–నన్ను బిచ్చివాఁడనినవారెవరు? నరులే–నన్నుఁ గారాగృహమం దుంచినవారు నరులే–నాకిక్కడఁ గడుపునిండ నన్నముపెట్టకుండ నున్న వారు నరులే. నాకుఁ బిచ్చిలేదని మొత్తుకొనినను బిచ్చియని స్థిరపఱచినవారు నరులే. నిజమైనపిచ్చినాదో యీనరులదో! దేవతలు మావాదములో మాధ్యస్థ్యము చేయవలసియు న్నది. క్రిందిజాతులలోవలె నరజాతితోఁ గూడఁ బురుషజాతియే సౌందర్యవంతమని నావాదము; కాదు. కాదు. స్త్రీజాతిదే సౌందర్యమని నాశత్రువులవాదము. నావాదమున కాధారమేది? నాకు ధాతుప్రపంచ మాధారము. శాఖప్రపంచ మాధారము. పశుపక్ష్యాదిప్రపంచ మాధారము. పరిణామప్రక్రమ మాధారము. ధాతుప్రపంచములో శాఖాప్రపంచములోఁ బక్ష్యా దిప్రపంచములోఁ బురుషజాతి సౌందర్యమే సిద్ధాంతమై పశుప్రపంచమునకు సరిగఁ బైమెట్ట యిన నరప్రపంచమున స్త్రీజాతి సౌందర్యమే సిద్ధాంతమగునా? థూ! థూ! పరిణామప్రక్రమ మిచ్చట భగ్నమగుట కేమి కారణము? తొమ్మిదొకట్లు తొమ్మిది సత్యమా? తొమ్మిదిరెండ్లు పదునెనిమిది సత్యమా? తొమ్మిదిమూళ్లిరువదియేడు? సత్యమా? తొమ్మిదినాలుగులు

ముప్పదియాఱుగాక యఱువదిమూఁడు నత్యమా? అట్లున్నవాని నూచిపుచ్చుకొని సాగఁదీసి దొడ్డపై గొట్టవలసినదేనా? కాలికిఁ జేతికిఁ గల బందమునైచి పిచ్చియానుపత్రిలో నుంపవలసినదేనా? ఆఁడుదియఁట. సౌందర్యవతియఁట అబ్బ! అబ్బనాఁడులేదు. తాతనాఁడులేదు. ముత్తాతనాఁడులేదు. కోఁతినాఁడులేదు. గొంగళిపురుగునాఁడులేదు. మొక్కనాఁడులేదు. తీఁగనాఁడులేదు. ఱాయినాఁడులేదు. ఱప్పనాఁడులేదు. పూర్ణసౌందర్యయుక్తుఁడైన పురుషుని ముందు బోడిమొగము చేసికొని పేడబొమ్మలాగున నుండవలసినయాఁడుది ఓస్! నేఁ డేమైనది? చిగురుబోడియట! తడాకా! ఆఁ! తామరసదళనేత్రయఁట! తమాషా! బింబాధరయఁట! భేష్ భేష్‌కాంత యెంతయైనది ఆహాహా! కాలగతికాలగతి. నమస్త సౌందర్య నంపన్నుఁడైన మగవాడు మట్టిముద్దయగుటా? మగవానియెదుట మట్టిముద్దగ నుండ వలసినమగువ మాణిక్యములకోవయగుటా? ప్రపంచము తలక్రిందైపోయినదే! మగవారి కందఱకుఁగూడ మతులుపోయినవే! పోనీ! మన యార్ష్యావర్తమందే యీయవకతవక యేమో యనుకొన్న నట్లుగాదే–అఖిలప్రపంచమందుఁగూడ నీయున్నానమునకు గురుఁ డేకాదశ మందున్నాఁడే! పాశ్చాత్యులలో స్త్రీజాతి (ది-ఫెయిర్-సెక్సు) అఁ ట, తాము (అన్-ఫెయిరు-సెక్సు) అనియే తమయభిప్రాయము కాఁబోలు! అదిగాక నింకొక తమాషా-పాశ్చాత్యజాతులలోఁ బాతికముప్పదినంవత్సరము లొక్కపట్టున నదే పనిగ ''కోర్టింగు'' అయ్యయ్యో! మగవాఁడేమి? ఆఁడుదానిని 'కోర్టింగేమి? అనుచితముకాదా? అవకతవక కాదా? అస్వభావముగాదా–ఛూ! ఛూ! ననున్నఁజూడవోయి ననున్న స్పృశింపవోయి యని మగవానిని బ్రార్థించుచు మగవానిచుట్టు నాఁడుది తిరుగవలసియుండగాఁ మగవానికట్టి 'పవరు' ఉండఁగా నతఁడు భ్రష్టుఁడై పనికిమాలినవాఁడై భామాదాసుఁడై యాఁడుదానిచుట్టు గిరగిరతిరుగుచన్నాఁ డేమికర్మమయ్యా! మనలోఁగంటె పాశ్చాత్యులలోనే యీవెఱ్ఱిప్రబలత రముగా నున్నట్లున్నదే! వీరి ప్రకృతిశాస్త్రజ్ఞానము వీరిప్రపంచజ్ఞానము వీరిభాషాజ్ఞానము వీరి నాగరకతావిశేషము తుదకీలాగునఁ దురకచదువులాగున వెనుకకుఁ బోవుచున్నదేమి? ఇంతకు నొక్కటేమాట. అందఱకు మందుపెట్టినవారు కవులు–అందఱమతులు పోఁగొట్టిన వారు కవులు. అందఱపుట్టి ముంచినవారుకవులు. ఈకవులును గట్టఁగట్టి యేమిచేసినను బాపములేదు. స్వరాజ్యమురానీ! అప్పుడు నాతమాషా. కవులకుఁబ్రత్యేకము పిచ్చియానుప త్రులు కట్టించి, యాఁడుదాని నెప్పు డడలుఁబోడి యనవుకద, వనిత నెప్పుడు వనజాక్షి యనవుకద యని బారగట్టులనుగట్టించి తూర్పుపడమరలక్రిందఁ దోఁపతోఁపఁగాఁ గొట్టింప నియెడల నన్ను వెఱ్ఱిముండకొడకా యని పిలువుము.

పోనీ! స్త్రీసౌందర్యము నంతబాహుళముగా నంతసాంద్రముగా నంత జిగిబిగిగా నంత పట్టుదలగా వర్ణించిన కవులలో నొక్కఁడైనఁ బురుషసౌందర్యమును వర్ణించినాఁడా? ఆఁడుదాని నూఁగారుమీఁద నఱువదిపద్యములు చెప్పినవాఁడు మగవాని మీసముమీఁద నొక్కపద్యము చెప్పఁగూడదా? ఉహు. అది పనికిరాదు, ఎంతసేపు చెప్పినను నాఁడుదాని చక్కఁదనమును గూర్చియే చెప్పవలెను. కాంతపైఁటచెఱఁగుమీఁదఁ బద్యముచెప్పినక విగాఁడు నాగావంచమీఁద నెందులకుఁ జెప్పఁగూడదు? నాకుఁ బట్టుకొన్న పెద్దపిచ్చియిది! మన మగజాతిలోనివాఁడే మనలఁ బరాభవించినప్పు డింకఁ జెప్పవలసిన దేమున్నది? నే నొక్కతమాషా చేయదలఁచియున్నాను. అది కొంతరహస్యము. నీవు మఱియెవ్వరితోడను జెప్పవలదు. ఇప్పుడు నేఁజేయుకల్పన యేదనఁగ నిది స్త్రీవర్ణనములతోఁ గెక్కుకెక్కుమను చున్న మనకావ్యములు ప్రబంధములు పురాణములు మొదలగుననిన్ని గ్రంథములున్నవే

చేయబడియుండెననియుఁ దురువాత స్త్రీలుకొందఱు చదువునేర్చి యసూయావిష్టులైపురు షవర్ణనలన్నియుఁ జమత్కారముగ స్త్రీవర్ణనల క్రింద మార్చివేసిరనియు నొక చిత్రమైన సిద్ధాంతము చేసి మగవారి మర్యాద నిలువఁబెట్టుఁటలఁచియున్నాను. ఈమార్పులలోఁ జాతిభేదముచే వర్ణనాంశములందుఁ గొన్నితేడాలు తికమకలు తెటుకులు తకరారులు వచ్చునని నే నెఱుఁగకపోలేదు. అవి యన్నియు 'ఇంటర్‌పొలేషన్సు' క్రింద నీడ్చివేయుఁ దలఁచుకొన్నాను. తప్పుకొనుట కున్నమార్గమిదియొక్కటేకాదా? సారస్వతవిమర్శన మని (లెటిరెరీసెర్చి) యొక 'బైవీక్లీ' ఆంధ్రదేశమధ్యమందు స్థాపింపఁదలఁచియున్నాను. ఏదీ? నే నీ యాసుపత్రినుండి యావలికిఁ బోవుమార్గమే కనబడకుండ నున్నదే? పైవారి కందఱకుఁ బిచ్చియైనప్పుడు నే నొక్కఁడను భాషాభివృద్ధినెట్లు చేయఁగలను? పశ్చాదిప్రపంచమునకంటె నదనముగా మనకు 'రీజను' అనుతత్త్వ మొకటి యున్నది. ఈరీజనుచేతనే మనకు మతులు పోయినవి. అది లేకపోయినయెడల నింత పుట్టిముంచుకలేదు. ఈరీజనుచేతనే మనకింత స్త్రీలోలత కలిగినది. ఇన్ని వ్యసనసహస్రములు వచ్చినవి. పడఁతి బంగారుబొమ్మ యెందుల కైనది? మన వ్యసనముచేత నైనది. ఈరజీనుకుబైమూపుపోయి క్రిందిచూ పెప్పుడువచ్చినదో యన్నివ్యసనము లప్పుడే నధోలోకమునకుఁ బోయినను నంతకంటె నధోలోకము వేఱొకటి కల్పన యగుచునే యున్నది. మనకున్న సంతతకాంతాచింత పశువులలో నున్నదా? ఏదో ఋతుకాలమని కార్తెయని కొంత వానిలో నియమమున్నది. అది మనకుఁ బూర్ణానుస్వారమే 'పర్సు'లో పావులాడబ్బులకంటె నెక్కువగ నెప్పుడుండునో యప్పుడే మనకు ఋతువు. ఎందుచేత? అక్కడ 'ఇనిష్టింక్టు' మాత్రమే యున్నది. అక్కడ 'ఇనిష్టింక్టుకు రీజను తోడైనది చూచితివా? మఱియొక తమాషా. మనకున్న యనవరత కాంతాభిలాషము నకుఁ జాలక దానితో సంతుష్టిపడక నల్లమందని నక్సువామికా అని నాపిండకూడని నల్లమడుగని మఱింత దోహదమొనర్చుచున్నాము. థూ! థూ! దిక్కుమాలిన ఈరీజనుచేతనే కదామన కీకల్పన గలిగినది. మనలను బిశాచమువలెఁ బట్టుకొని పీడించుకొని తినుచున్న యీబుద్ధిని వదల్చు కొనుటయే మనకుఁ బురుషార్థమువలెఁ గనఁబడుచున్నది. ఎవ్వఁడు తిరుగఁ బశువగునో వాఁడు బుద్ధిశాలి. నేఁ జెప్పినమాట నీకర్థమైనదా? తొట్టివైద్య మంద ఱారంభించినయెడలఁ బ్రకృతిలో నున్న యీస్వభావోద్రేకమంతయి నడఁగి చల్లగ సరళముగ సాపుగ పశుత్వములో నికి జాఱిపోవుదుము. 'ఎవల్యూషను' సత్యమైనప్పుడు ఇన్వల్యూషను మాత్ర మేల సత్యము కాదు? రాట్నము తిరుగుచున్నప్పుడు క్రిందియంచు మీఁదికి నాతరమా? వృద్ధునకుఁ దిరుగ బాల్యలక్షణము లన్నియు వచ్చినవందువా లేదందువా? ఏఁబదియేండ్లున్న స్త్రీకిఁ దిరుగఁ గన్యాత్వము వచ్చినదందువా లేదందువా?.....

అయ్యా! అయ్యా! మీరు పోవలయును. సూపరింటెండెంటుగారు వచ్చుచున్నారని యచ్చటి భటుఁడు నాతో ననెను. నేను బిచ్చివానియొద్ద సెలవుతీసికొని పోఁబోవుచుండ "అయ్యా? ఱేపు తిరుగరావలయునుజుమా? ఈసారి 'ఎవల్యూషనుపై నెటువంటి యుపన్యా సమిచ్చెద ననుకొన్నావు? వ్యాసుని జడలకు డార్వినను గడ్డమునకు ముడిపెట్టి యూలంకెను హెర్బర్టు స్పెన్సరు భజముమీఁద వైచి ఓహో ఓహోభాయి! ఓహో ఓహో భాయి యని సవారిమూల్గులు మూల్గించి నాన్‌కోఆపరేషను తాషామరపాలతో గాంధీటోపీలతోఁ బ్రపంచ మంతయు నూరేగింపనియెడల మూఁతిమీఁది మీసము గొరిగింపు" మని యాతఁడు శపథముచేసి లోనికిఁబోయెను. నాయనలారా! నేనింటికిఁబోయితిని.

38. ఉన్మత్తుని యుపన్యాసము
దశావతారములు

జంఘాలశాస్త్రి పిచ్చాసుపత్రికి మరోసారి వెళ్లాడు. స్త్రీ సౌందర్యం కంటె పురుషసౌందర్యం గొప్పదని ఉపన్యాసమిచ్చిన పిచ్చివాణ్ణి మరోసారి పలకరించాలని–

ఇతను వెళ్లేసరికి అతని భోజనసమయం. అతను తినడానికి పేచీ పెడుతుంటే, అక్కడ హాస్పిటల్ సేవకుడు, కొరడాతో రెండుగతల్నిచ్చి అన్నంతినేలాగ చేశాడు. అతనాపిచ్చిధోరణితోనే భోజనంచేశాడు. భగవంతు ణ్ణిమించిన పిచ్చివాడు లేడని సిద్ధాంతీకరించాడు.

భోజనమైన తరువాత జంఘాలశాస్త్రి అతన్ని పలకరించి 'థియరీ ఆఫ్ ఎవల్యూషన్' గురించి ఏమైనా చెప్పమన్నాడు.

అప్పుడా పిచ్చివాడు మనకు సాంప్రదాయికంగా వస్తున్న మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, బలరామ (కృష్ణ), బుద్ధ, కల్క్యవతారాలతో, మానవజాతి వరకూ జీవి పొందిన మార్పుల్ని సమన్వయిస్తూ వ్యాఖ్యానించాడు. అతని సిద్ధాంతంప్రకారం:

''మత్స్యః కూర్మవరాహో చ
నారసింహశ్చ వామనః''

అనే శ్లోకంలో రెండోభాగం ఏంచెబుతూంటే, ఏనరజాతికి వామనుడు మొదట మచ్చగావున్నాడో, ఆజాతి ఏయే మెట్లెక్కి, పరిపూర్ణమైన అభివృద్ధిసాంది, ఏయేమెట్లు దిగి క్షీణించిందో, పశుత్వంలో కలిసిపోయిందో ఆమార్గాన్ని నిర్దేశిస్తోంది. ఈ ప్రపంచంలో ఉన్న, ఉంటున్న, ఉండబోయే మానవస్వభావాలు దశావతారాల్లో ఇమిడి పోయేవే. ఉంటే కొంత సంకరం ఉండవచ్చనంతే.

పిచ్చివాడి ప్రలాపంలాచ్చుండే యీ సిద్ధాంతం గురించి మనల్ని జంఘాలశాస్త్రి ఒక్కసారి ఆలోచించమంటున్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

''నాయనలారా! స్త్రీసౌందర్య మధమమని పురుషసౌందర్య ముత్కృష్టమని యానడ

మను బోధించిన పిచ్చివానియొద్దకు మఱియొక్కసారి పోవలయునని కౌతూహలముకలిగి యాతఁడున్న గదియొద్దకుఁబోయి నిలువఁబడితిని. ఆతఁడు గదిలో నేమిచేయుచుండెనో నాకుఁ గనఁబడుటలేదు కాని యాతనిమాటలు నాకు వినఁబడుచుండెను. ''నక్ బిన్ కటాదేఖే నీస్ భారీజటా దేఖే జోగికన్ ఫటాదేఖేఖాన్ లాయెతన్మే, సూర్‌దేఖే బీర్ దేఖే బార్‌దీర్‌దేఖే సైనదేఖేజిన్కెలాలుచీ నహితన్మే హెహేహేహే నదేఖే నదేఖే నదేఖే వహవ్వా! వహవ్వా బలవా నింద్రియగ్రామో విద్యాంనమపి కర్షతి-కర్షతి-కర్షతి-కర్షత్యేవ తడాఖా! కాంతాకనకకాంక్షాక్రాంతుఁడు కానివాఁ డెవఁడురా! నన్నుఁగాక మఱియొక్కనిఁ జూపుము. కనిష్ఠ కాధిష్ఠితకాళిదాసః ఛీ. మ॥ మలధూయిష్ణుఁ దోలుబొమ్మయగు కొమ్మంజూచి విద్వాంసుడుం బులినశ్రోణి మహారన్తని...హేహే! ఇప్పుడు నవనాగరకులయొద్ద నదిగొ ఆమాట యనుటకు వీలుకాదఁట! యనభ్యమటఏ థూ థూ! పనికిమాలిన పెద్దమ్మలు! మలపసన్యానులు! వట్టినపుంనకులు! థూ! మాతాతగారికాలములో నటులేయుండెనా! ఓ! పేకజావ్వలు! పెటేపకాయలు! ఫెరంగిగుండ్లు! ఇంగ్లీషుచదువులు వచ్చినతరువాత మనదేశ మువకు వచ్చిన దీనిన్నత్వము. ఈకంటిబెదఱు, ఈకాళ్లపీకు, ఈనడుమీడ్పు, ఈగుండె దడ, ఈయాడంగితనము. మన వేదవిద్యలో నున్నంత ధాతుపుష్టి విదేశవిద్యలో నెక్కడిది! తర్జినపుబ్రాహ్మణుఁడు డెబ్బదివఱకు బ్రతుకుచున్నాఁడు. బి.ఏ., గాడు below Thirty (ముప్పదేండ్లయిన నిండకముందే) థూ! ప్రాణముమీఁదికి వచ్చినప్పుడుకూడఁ బైచదు వెందుకోయి? ఈడ్చివేయవోయి త్రోచివేయవోయి. పెట్టు అక్కడఁబెట్టు. అదిగో పెట్టుమనగాను-మానిషాదప్రతిష్ఠాంత్వమగ మశ్శాశ్వతీస్సమాఃఅది మనకుఁ దగినచదువు. అంతేగాని Once upon a time there lived a donkey and an ass హేహేహే రెండు నొక్కటియే కాఁబోలునేమి never mind.''

ఈమాటలు వినఁబడినవెంటనే మఱియొకకంఠరవమున నోరు మూసికొని యున్న ముతిందువా కొరడాతో బజాయింపనా యని యింకొకఁడు మాటలాడినట్లు వినఁబడెను. ''నోరుమూసికొని యున్నము తినుట యేలాగునోయి fool కన్నుమూసికొని నీవు చూడఁగలవా block head! ముక్కుమూసికొని యాఘ్రాణింపగలవా idiot! అని పిచ్చివాని మాటలు వినఁబడెను. ఇంతలో చేటలుమని కొరడాదెబ్బ వినఁబడెను. ''అమ్మ నీసిగదరగ ఎంతదెబ్బ కొట్టితివిరా! నేను మతిలేనివాఁడ నగుటచేతనేకదా నీవు నన్నుఁ గొట్టుట సిద్ధించినది! మతియున్నవాఁడవు నీవిశేషముమాత్ర మేమున్నది? మతియున్నవాఁడు మతిలే నివానిని గొట్టినప్పుడు యథార్థముగా మతిలేనివాఁడు మతియున్నవాఁడా? మతిలేనివాఁడా? కూలిముండకొడుకవే. కోటీశ్వరుని గొరడాబుచ్చుకొని కొట్టితివే! నీగొంతుగోయ! నీకుఁ బుట్టగతులున్నవఁటరా! కానీ! కానీ! మావేదర్షులు బోధించినదేదో యెఱుఁగుదువా? శాంతి. గాంధిగారు క్రొత్తగా నిప్పుడు చెప్పిన దేదియు లేదు. అదియే రాట్నపూజక్రముతోఁ దిరుగఁ దోడినారు. ఉపన్యానధోరణివలన వామహాత్మునకుఁ గారాగృహబాధ కలిగినది. నాకుఁ గారాగృహబాధవలన నుపన్యాసధోరణి కలిగినది. వారికి మనకున్నభేదమేయిది'' అని పిచ్చివాఁడు పలికెను. అన్నముతిందువా మఱియొకవ్రేటువేయనా యని తిరుగ నతని నాకాఁపరి బెదరించెను. ''ఉండు rascal ఉండు విఘ్నేశ్వరపూజలేకుండ వివాహమా? పాదప్రక్షాళనము లేకుండ దద్దినమా? దైవప్రార్థనములేకుండ సాపాటా? నిలువఁబడు. Rogue అక్కడనే నిలువఁబడు. చెవులో వ్రేళ్ళుక్రుక్కుకొని మహమ్మదీయులు ప్రార్థింతురు.

చెవులతమ్ములు లాగుకొని యరవలు ప్రార్థింతురు. చేతులు జోడించుకొని యాంధ్రులు ప్రార్థింతురు. నిలువఁబడి మహారాష్ట్రులు ప్రార్థింతురు. మాకీపద్ధతులు నచ్చకపోవుటచేతఁ బండుకొని మేము ప్రార్థింతుము. ''ఓయిభగవంతుఁడా! పిచ్చివానిని గొట్టింతువా? మేము మతిలేక యేడ్చుచుండగాఁ బైగా మాకు దెబ్బలా? ఇది యేటి న్యాయము? నీప్రపంచపరిపాలన మింత యవకతవకగా నున్నదేమి! ఈ పదునాల్గుభువనములలోను బిచ్చిముండకొడుకను నే నొక్కఁడనే నీకంటికిఁ గనఁబడితినా? పిచ్చిలేనివాని నొక్కనినైన నీవు సృష్టింపనే లేకపోయినప్పు డీలోపము నీలో నున్నట్లు కనఁబడుచుండఁగా నాకు దెబ్బ లెందులకయ్యా? పటుపట యుపన్యాసము లిచ్చువారే కారి బోధనప్రకార మాచరించువాఁ డొక్కఁడైనఁ గనఁబడడుగదా? వారందఱు పిచ్చివారుకారా? వారిలో నెవరినైన నొక్క కొరడాదెబ్బఁ గొట్టించితివా? పదునాల్గుపెండ్లిండ్లు చేసికొని పదునార్గురుఅవేశ్యల నుంచుకొని దేశోపకారము చేయుచున్నవారందఱు పిచ్చివారుకారా? ఊచిపుచ్చుకొని యొక్కలెంపకాయ వారి నెప్పుడైనఁగొట్టించితివా? కోడిపందెములలో నాస్థానగ్రామములను గూడ నొడ్డఁదగిన సామంతులు–ఓ! దేశాలంకారములుగ నున్నారే! వారిని జేయిచేసికొనుటకు నీకు సందేహముగా నున్నయెడలఁ బోనీ? యొక్కనిపైనైనఁ గన్నెఱ్ఱజేసి చూచితివా? వారియందు నీకీపాక్షికమెందులకు? నాయం దీవైరమెందులకు? ఎవ్వరిమాటయు నాకేల? నీవు పిచ్చివాఁడవు కావని నీవు ధైర్యముగ టొంకకుండ గుండెకొట్టుకొని చెప్పఁగలవా? పిచ్చివాఁడవేకాని యెడల నీ కీప్రపంచపు జంజాటమంతయు నెందులకు? ఇంతగొడవ నెత్తినిపైచికొనుట యెందులకు? సరే పైచికొంటివయ్యా! తిన్నగ నిర్వహింప నక్కఱలేదా? వ్యవహార మనుకొంటివా? వెఱ్ఱివానిచేతి ఱాయి యనుకొంటివా? నీపరిపాలనము నీపరిశీలనము నెట్లున్నవో చెప్పనా? ఇదిగో? నాకంటెఁ బిచ్చివాఁడు చెప్పినకవిత్వము! చదువుచున్నాను కాచికో.

గీ. వీరవరుకంఠమునఁ దరవారికోఁత
భీరుగళమున సితపుష్ప విజయమాల
శేముషీమంతు పెట్టెలోఁ జెదలపుట్ట
వాలుతలవానిమొలను బత్రాలకట్ట
పరమదాతకు నుభయపార్శ్వములఁ దిట్టు
లెపుడయిన నిచ్చునని నుతుల్ కృపణునకును
భక్తు నింటన శ్రాద్ధాబహుళతయును
నాస్తికునియింట సత్యకళ్యాణకలన
సత్యవాగ్ధీరునకుఁ జెఱశాలత్రోపు
నన్యతవాదికిఁ దూఁగుటుయ్యాలకైపు
మెత్తనగువానికంటికిఁ జిత్తవాన
మఱి కసాయిమీసాలకు మల్లెనూనె.

ఇదేకాదా నీసౌభాగ్యము! నీవ్యవహారపుడౌలు! అంత చేతఁగానివాఁడ వైనప్పుడు వ్యవహారమునుండి రవంత తప్పుకొనలేకపోయితివా? తగినవాని నెవనినైన నేను జాగ్రత్తపెట్ట కపోవుదునా? దొరకడు? జానేదేవు; ప్రపంచమంతయు నొక్కసారి పోవుటయే దానికి మంచిది మనకు మంచిది. ప్రపంచమున్న విశేషముమాత్ర మేమున్నది? ఇదిగో మావంటి

పెద్దమనుష్యులకుఁ గొరడాదెబ్బలకే కాదా? నన్నీబానిసముండకొడకుచేత దెబ్బలుకొట్టిం చుట నీకు లీలకాబోలు నేమి? నీ కది ఖేలనముకాబోలునేమి? నాన్‌సెన్స్ నాకంటె సహస్రగుణములు పిచ్చివాఁడవైన నిన్నెవఁడు కొరడాపుచ్చుకొని కొట్టుచున్నాఁడు? ఆమాత్ర మాలోచించుకొననక్కఱలేదా? నీవరున నాకెంతమాత్రము బాగుగా నున్నది కాదు. అయిననేమి? మొక్కఁట కీమాత్రపు గ్రుడ్డికంటి బొమ్మయైన వేఱొకటి కనఁబడకపో వుటచే మనమేమిచేయవలసినది? మొక్కెదము. మొక్కెదమేమి? ఇదిగో! మొక్కినాము! రక్షింపగలిగినయెడల రక్షింపు. లేపోవునెడల కొరడా దెబ్బలే తిందుము. ఇంతకంటెఁ జెడను దేమున్నది? తథాస్తు.''

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఈవిచిత్రమైన దైవప్రార్థన మొనర్చి యాతఁడు గదిలోనే భుజియించెను. భోజనసమ యమునం దిట్లు ప్రలపించెను. ''భోజనందేహి రాజేంద్ర ఘృతసూపసమన్వితమ్! మాహి షంచ శరచ్చంద్రకా ధవళం దధి!! ఈశ్లోకములో 'మాహిషంచ' శబ్దములోఁ దప్పున్నదాలేదా యని మూఁడుదినములు నిక్షేపవిత్తాచార్యులవారితో మనము వాదించి యది ప్రమాదమేవ' యని సిద్ధాంతీకరించినాము. మహిషాసురమర్దనికి జయా! అఁడుదానికున్న దేహపాటవ మనురుని కెక్కడిది? అఁడుది సంకల్పించుకొన్నతరువాత మగవానిగొంతక యరఁటిదూఁ టవలెఁ గోయుట కేమైన సందేహమా? అందుకొఱకే మునివారు జాగ్రత్తోభయం నాస్తి న్యాయముచేత ''భజగోవిందం భజగోవిందం భజగోవిందం మూఢమతే, ఇహసంసారే –కృపయాపారే పాహిమురారే భజగోవిందం'' అని సెలవిచ్చినారు. దీనికిఁ బాఠాంతరముగ ''త్యజసంసారమ్ త్యజసంపారమ్ బహుదుస్తారం బహుదుస్తారం–భజగోవిందమ్'' అని మనము సెలవిచ్చినాము. కారణములేని కార్యముండుట కవకాశమేది? ''పర్వతో వహ్ని మాన్ కుతః బహిర్గత ధూమత్వాత్'' ''స్పెన్సర్ కంపెనీసుండి రెండణాల కొకటిచొప్పునఁ దెచ్చిన చుట్టయైసననే వట్టి యరటిసారగు గాటా కారమా కైపా! థూ!'' ధూమజ్యోతి స్సలిలమరుతాం సన్నిపాతః క్వమేఘ, స్సందేశార్థాః క్వపటుకరణైః ప్రాణిభిఃప్రా పణీయాః, మధ్యేషామా శిఖరి దశనాపక్వబింబాధరోష్ఠీ–'' ఆ ఆ తప్పినదాయేమి? అబ్బ! దీని సిగఁదరగ! మఖలోనుండి పుబ్బలోనికి దాఁటితిమాయేమి? (నెవర్‌మైండ్) మఖాపుబ్బా నక్షత్రజాతకుల కందఱి కిప్పుడే నేఁటిశని వెళ్ళిపోవచ్చినది.. ఇఁక గొలఁదిదినములు మాత్రము కన్నులు మూసికొని కాలక్షేపము వహ్వా! వాహ్వా–చూడవోయి! కందస్వామి కల్యాణమోయి! ఊ–ఊ-ఉపాంగముపట్టు.

జంఝూటి

మగవానినీ నమ్మరాదే చెలి!! మగ!!
వద్దనున్నసేపు వగలమాటలతీపు
వద్దలేనిమాపు వారు వారకంటిచూపు!! మగ!!
తధిగిణతోమ్ తధిగిణతోమ్ తధిగిణతోమ్.

వారకంటిచూపఁట వహ్వా! శబ్దములోనున్న వంకర యటుంచదోయి! అర్థములో వంకర కనఁబడుచున్నదే సెబాస్! ఈనడుమ సాటి దృష్టిశాస్త్రము వ్రాయుదునని

సారకాయకోఁతలు గోసినాఁడే! ఏదీ! నీకు సందేహ మెందుకు? సాక్షిని సాగఁదీయుటకు నే నున్నానని చెప్పవోయి–మనది పాట్టిమిరెపుకాయవంటి బుద్ధిగాదటోయి. అబ్బ! ఎంతకా రము వేసినాఁడు గాడిదకొడుకు. ఉస్సు–సరే! ఇక్కడికి మజ్జిగ వలకు వచ్చినామన్నమాట –బేవు–బేవు–మనకు సాపాటులో నాద్యంతములు పుష్కలముగా నుండవలయుననన్నమాట –''సంస్కృతం బాద్య(ప్రకృతి ప్రాకృతంబు ద్వితీయ(ప్రకృతి'' యని వ్యాకరణశాస్త్రమర్యాద. చిన్నయసూరియు శాత్తనుఁడే–మూడయ్య శాత్తనుఁడే–ఎంతభేద మున్నదో ధూ! ధూ! బేవు–బేవు–ఇక్కడికి నాటకాంతం కవిత్వం హి! ఇఁక భరతవాక్యము మిగిలినది. ఇఁక లేవవలెను. ఉఁహుఁబాబా! ఉఁహుఁ! అబ్బ! దయ్యముపట్టినవానికివలె నొడలు బరువెక్కినదేమి చెప్పుమా? ''హ్రీం హ్రీం ఐం ఫట్ ఫట్! జారేతూ! హైవాన్'' ఇట్లు హుంగామాచేసి యూహరించి యూపసూరావాని నావలికిఁ బంపి ''భుక్త్వాతు శతపదం గత్వా'' అను న్యాయము చేత మనమూసంచపాళితోనికిఁ బోక తప్ప'' దని నేను నిలువఁబడినచోటికి దగ్గఱగావచ్చి నన్నుఁ జూడకే యటునిటు తటపటాయించుచుండెను. ''మనుష్యుఁడంత పూయకాఁడు మఱియొక్కఁడున్నాఁడా? ముందునకు వాఁడే నడచును. ఆకాళ్లతోనే వెనుకకును వాఁడే నడచును. ఛీ! పెరుసు ముస్సయెడల ముందునకైనఁ బోవలయును. లేకపోయినయెడల వెనుకకైనఁబోవలయును. అంతేకాని ఖిల్వపుఁబోత్రములాగున వెనుకకు ముందునకుఁ గూడనా? ధూ! ఇక పస మీతుచ్ఛమైన పిష్టపేషణ వ్యాపారమునఁ దిగఁగూడదు. బన్ ఖడోబాబా! ఖడో''

ఇట్లు పలికి యూతఁడు నిలుపఁబడి నావంక జూచెను. ఆతఁడు న న్నానవాలు పట్టఁగలడో లేఁ డో మాతమని నే నేమియు మాటలాడక యూతనివంకఁ జూచితిని. ఆతఁడు నన్నుఁ దీవ్రముగఁజూచి ''కానీ వయ్యా! కానీ! పంచాంగశ్రవణమునకై ప్రభుసన్నిధికి వచ్చినవాఁడవుకదా! పందిటిగుంజవలెఁ బలుకకుండ నిలువఁబడెదవేల? వానీ–మసనదుపై సిద్ధముగా బైఠాయించియున్నాము.

సీ. ఉదయాచలేంద్రంబు మొదల నెవ్వనికుమా
రతకుఁ గ్రౌంచాచలరాజమయ్యె
రెండవది యెట్ సటరా
దానితరువాతిది–యెట్‌సటరా
ఘనభూజాదండంబు కల్పశాఖి
ప్రబల రాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశబిరుద చిటివీరయూగ్రగణ్యుఁ
డాసుపత్రిని గొలువున్న యవసరమున.
వడ్డించు–మఱియొకటి వడ్డించు–ఔర్ఏక్ఔర్ఏక్
సీ. ఇందీవరంబుల నీనుక్రొళ్గన్నుల
శరదిందుముఖులు చామరము లిడగ

వహవ్వా! వహవ్వా! మనప్రక్కలో నిందలు పడఁతు లెందులకోయి! తాడిల్లిజాతి దొకతె–నూనెపరుగుడుజాతి దొకతె–తివాచి పాడజాతిదొకతె–నల్లికన్నులజాతిదొకతె

–మిడినాగుజాతి దొకతె–జెట్టిగొడ్డుజాతిదొకతె–జనమేజయుడు సర్పయాగముచేసిన ట్లీ దండునంతను మంచిరోజుచూచి 'అగ్నినాగ్నిస్సమిధ్యతే' యని ''సహేంద్రతక్షకాయ స్వాహా'' యనకుండునెడలఁ జెవి గోయించుకొనక మానుదునా? నాకుఁ జెవి లేకపోయినంత మాత్రముచేత బ్రపంచమాగిపోయినప్పుడు చూడవచ్చును. హేహే! శ్లో. కర్ణారుంతుదమేవ కోకిలరుతం తస్యాక్రుతేభాషితే'' యన్నవాఁడెవఁడయ్యా! మాటలాడవేమి? అక్షయపాత్రకు లాగున నీకు నోరేకాని కూఁతలేదేమి? నన్ను వెక్కిరించుటకే వచ్చితివా? డొక్కచీల్చి పాలుగొట్టెదను'' అని యాతఁడు తీండ్రించుచు నన్నుఁ గొట్టవచ్చెను. ''ఆహా! అమావాస్య యగుటచేఁగాఁబోలు నీదిన మీతఁడింత తీవ్రముగ నున్నాఁడు'' అని మనసులో ననుకొని ''అయ్యా! నన్నుఁ జూచినట్లు మీకు జ్ఞప్తియున్నదా'' యని యడిగితిని. ''కుంభీపాకములోఁ జూడలేదటోయి! కప్పస్తంభమును గౌఁగిలించుకొనుటకు నీభార్యను నీవు తీసికొనివచ్చిన ప్పుడు డశ్వత్థప్రదక్షిణములు చేయింవలసినదని యుపన్యాస మిచ్చినవాఁ డెవడు? ఇదిగో! నీఁడు-వీఁడు'' అని గుండె కొట్టుకొనుచున్నాఁడు. అయ్యా! ''యెవల్యూషన్'' ను గూర్చి మీ యుపన్యాసమున వినుటకే తిరుగ వచ్చినాను. మనసు రవంత శాంతిపఱచుకొని యుపన్యసింపఁగోరితిని'' అని నేనంటిని. (వెరిగుడ్) నీవు నీవేనఁటోయి! నీవు నీలాగున లేనప్పుడు నేను నిన్ను నీవనుటకు నీకిష్టమైనను నాకేమి యధికార మున్నది? సరే-ఇప్పుడు కావలసినదేమి? ఉపన్యాసములన్నియు సమకూర్చి కొన్నిసంపుటములుగా నచ్చువేయించి ప్రకటింవలయునని యూహించుచున్నాము. నీవు మనపక్షమున ఏజెంటుగానుండి కొంతరు సము తీసికొని పనిచేయఁగలవా? పాసఁగుడు వ్యాపారములోనున్న గౌరవము దనాగమము మఱియొకదానిలో నున్నదనుకొంటివా? ఎ–A go between is always a gentleman, but a gentleman is not always a go between. తెలియలేదా.

''అయ్యా! ఈమాటలకేమిగాని తొందర నడచుకొని యూపిరితీసికొని రవంత నిదానించుకొని (యెవల్యూషన్) పైన నీకుఁ దెలిసిన సంగతులు చెప్పవలయును. ఊ –ఆరంభింపుము.

''బస్ బస్ ఆగాజ్ ఖిస్సే కాకర్తాహు-జరాకాస్ ధర్‌కర్‌సునో–ఔరమస్ నఫీకరో –అరెరే చార్‌దర్వేష్ పడ్తాహుఁక్యా–ధూ! మనకుఁ జూచితివా? పెండ్లిమంత్రములోనుండి తద్దినపు మంత్రములోని కొక్కటేదాటు–పిండశ్రాద్ధమంత్రమునుండి పునస్సంధానమంత్ర ములోని కొక్కటే (లాంగ్ జంప్) కంll ఇటుచూపటు నటుచూపిటు పటుతరశస్త్రంబు లేసె పార్థుం డంతన్. వహావ్వా! సవ్యాప సవ్యచాకచక్యమునకు మనది పెట్టినదిపేరు! అందులో నాఱుభాషలు జిహ్వాగ్రమందుఁ దాండవించుచున్నప్పు డడ్డమేమున్నదోయి! తడాఖా!.....

''అయ్యా! అయ్యా! ఎవల్యూషన్‌గూర్చి చెప్పెదనంటిరి. చెప్పుదురా? పోదునా'' యని నేనంటిని.

''అదిగో! ఒక్కటేతొందర–చెప్పుచుండఁగా గడియ గడియకు నడ్డుదగిలెద వెందు లకు? విశేషముగఁ దొట్రుపాటువచ్చినప్పుడు తక్క నే నేదిచెప్పినను బ్రతిబంధింపకుండ నీవు వినఁదలఁచుకొన్నయెడల విను–లేనియెడలఁ బో నీవు శ్రోతవుకానియెడల నా యుపన్యా సమునకు గౌరవహీనత యనుకొంటివా? ఇక్కడ నేను బ్రతిదినమున పంచభూతముల కుపన్యసించుచుంట లేదా?

అవి చచ్చినట్లు వినుచున్నవా లేదా? హరిః ఓమ్మని యారం భించుచున్నాను కాచికో.

''జంతువులపరిణామమునుగూర్చియే యిప్పుడు చెప్పెదను. గుండె దడగా నుండుటచేఁ
నడుము బిట్టుగా నుండుటచేతఁ దల గిట్టుగా నుండుటచేత నంతకంటెఁ గ్రిందికిదిగుటక
మన కవకాశములేదు. మొట్టమొదట సృష్టిలోఁబుట్టిన జీవమున్నదే. అది యెట్టిదైనన
నీటిలోఁబుట్టిన జంతువుకాని భూమిపైఁబుట్టిన జంతువుకాదు. ఈయంశము బాశ్చాత్యుల
మూఁడువందల సంవత్సరములక్రింద మూఁడుచెరువులనీరు త్రాగి ముప్పుతిప్పులఁబడ
కనుగొనినారు. మనవారీయంశమును మూఁడువేలసంవత్సరములక్రిందనే ముక్కుమూసి
కొని కనులుమూసికొని కమలాసమునఁ గూరుచుండి కనుగొనినారు. మొదటఁబుట్టిన
యత్యల్పజంతువు చర్మపుఁదిత్తివలె నుండును. అది సర్వావయవశూన్యమై యుండును
అట్టి యల్పజంతువులనుగూర్చి మనవారు చెప్పలేదు. తెలియకకాదు. వానిపేరేమి ఊరేమి
రూపమేమి స్వభావమేమి? ఏమియులేదు. అందుచేఁ జెప్పలేదు. నీటఁబుట్టినజంతువు
ప్రప్రథమజంతువని కనిపట్టిన మనవారు నామరూపములులేని యితరజంతువులను దీసికొ
నక మత్స్యమే మొదటిజంతువని చెప్పినారు. దీనికిఁగాళ్లులేవు. చేతులులేవు. నోరులేకపో
వుటచేఁ గొన్ని ముక్కువెంటనే యాహారమును దీసికొనును. కొన్నిటికి నోరున్నను
గంతనాళములేదు. లంచముపుచ్చుకొనుముండకొడకునకుఁ బడుచుకొని జీవించుముండ
కును గొంతుకముడి యుండదనునంగతి నీవెఱుఁగుదువా? యాభావ బ్రహ్మచర్యాశ్రమము
నకు భగంములేకుండ నొకదాసిదానిని యజ్ఞపశువుక్రిందఁబట్టి...

''అదిగో! తప్పుదారిని బోవుచున్నావు. జలసంభవమైన చేప మొదటిప్రాణిగ
మనవారు గ్రహించినారు. అటుపైన–

''ఎంతరక్తిగలకథ చెడఁగొట్టితివోయి! థూ! చేప మొదటిది. దీనిపైజంతువును
గూర్చి చెప్పెదను. నీవు పైకెక్కగలవా? ఎక్కు ఎక్కు! తాఁబేలువఱకెక్కు. బలిష్ఠమైన
బొరుసున్నది. దీనికిఁ దల ప్రత్యేకముగఁ గనఁబడుచున్నది. మెడ కొంచెముకనఁబడుచు
న్నది. కాళ్లుచేతులు వేఱువేఱుగఁ గనఁబడుచున్నవి. యిది యేచ్చటఁబుట్టినదో యెఱుఁగు
దువా? అతినూర్యకాంతిచేఁ గొంతసముద్రము తరిగిపోవుటవలన భూమిపైకిఁ గానఁబడిన
భూమికి నీటికి మధ్యమునసున్న యవకాశములో నిది పుట్టినది. అందుచేఁ దాఁబేలు
స్థలజంతువు జలజంతువుగూడను. మొదటి తరగతి జంతువులలో మనవారు మచ్చనకు
చేపను దీసికొనినట్లు రెండవతరగతిజంతువులలో మనవారు తాఁబేలును మచ్చునకు
తీసికొన్నారు. అట్లు వెఱ్ఱిమొగము వైచుకొని చూచెదవేల? హక్స్‌లేనడుగు. డార్విను
నడుగు. స్పెన్సరు నడుగు. అసత్యమని చెప్పినయెడలఁదలకదపా, అంతే? వెఱ్ఱిముండకొ
డుక ననుకొంటివా? బ్రహ్మర్షిసిద్ధాంతములకుఁ బాశ్చాత్యులసాక్ష్యము కావలసివచ్చినదేమి?
థూ! హైకోర్టెప్పుడు తీసెదరో యెఱుఁగుదువా? మామిత్రునిబావగారు మఱఁదలికి
మనోవృత్తి నిచ్చుచు గాలముచేసినారు. కాలముచేసినతరువాత నాయనభార్యయే
యిదివఱకుఁ బ్రచ్ఛన్నముగా మనోవృత్తిపుచ్చుకొనుచున్న మఱఁదలు కావున నిప్పుడు మన
తరుపు బారిస్టరుగా రీమఱఁదలను లోపుచేసికొనుటకుఁ బ్రయత్నించినట్లు మనకుఁ దెలిసిన
ప్పుడు...''

''అయ్యా! ఇకఁజాలు తప్పుధోరణిలోఁ బడిపోయినారు. మనసు కుదుటఁబఱచు
కొని ముందెచెప్పుడు. తాఁబేలు రెండవతరగతిలో మచ్చుజంతువు సరే. అటుపైన'' నని
నేను మందలించితిని.

''ఇంకొకమె ళ్ళెక్కఁగలవా! మఱియొక్క పందివఱ కెక్కు? ఎక్కితివా? వెరిగుడ్ . ఇది కేవలము స్థలజంతువు ఈతరగినుండి పైని పుట్టినవన్నియు స్థలజంతువులేకాని జలజం తువులు లేవు. ఎన్ని జలజంతువులైనన మొదటి రెండుతరగతులలోనివే. పంది పరిపూర్ణవయ వస్ఫూర్తిగల జంతువు. దీనికంటె బలిష్ఠతలో నెక్కువ జంతువు లున్నవి. కాని యవయవ స్ఫూర్తిలో నధికములగు జంతువులు లేవు. ఈజాతి జంతురాజమైన సింహమువఱకు వ్యాపించియున్నది. దీనిపైజాతియేది?

''నరజాతి–నరజాతి'' యని యంటిని.

''తప్పు తప్పు. సింహస్వరూపము నరస్వరూపములోనికిఁ బరిణమించులోపల రెండింటికిమధ్యమునన్న మఱియొక్కస్వరూపము నొందినది. ఇదియే నరసింహస్వరూ పము. చేఁప యిప్పటి కున్నది. తాఁబే లున్నది. పంది యున్నది. కాని నరసింహజంతు వున్నదా యనుప్రశ్నము రాకతప్పదు. అట్టిజంతువు పూర్వమం దుండియుండవచ్చును. స్వల్పకాలముమా త్రమే యుండి యది స్వరూపనాశన మయియుండవచ్చును. కాదనఁగలవా రెవరు? కాదనినయెడల మూఁతిపైఁ గొట్టెదను. నన్నడ్డుకొనఁగలవా రెవరు? మామ్మతు అను జంతువు స్వరూపనాశనమైన ట్లిప్పుడు ప్రకృతిశాస్త్రజ్ఞు లెందరో ఘోషపెట్టుచుండుట లేదా? మూఁడేనుఁగులంజంతువే మాయమైనప్పుడు నాలుగడుగులయెత్తు నరసింహ మేల మాయము కాకూడదు? అందున నసందర్భమేమున్నది? అవిగాక యన్ని భగవదవతారము లుకూడఁ గొంతకాలము భూమిపై నున్నవి. కాని నరసింహావతార మొక్కయరగడియలో మాయమైనదని మనవారే చెప్పియుండలేదా? ఆజంతుజాతి స్వరూపనాశనమప్పుడే యైన దేమో. అదిగాక, అట్టిజంతువు మొదలు పుట్టనేలేదని మీరు సిద్ధాంతపఱచినప్పటికి నాకు నమ్మఁబలియే. ఎటులైనను నరునకు సింహమునకు నడుమ మనవారొక ఇంటర్‌మీడియేట్ స్టేజ్ కల్పించినారు. అందువలన నధిక్షేపించుట కెవని కధికారమున్నది? అధిక్షేపకుఁ డవఁడోరానీ! బడితబాజాతక్క మనకు రెండవపద్ధతి లేదు. చాణక్యనీతి దానికందదు. 'దండమ్ దశగుణం భవేత్త' న్నదియే ప్రథమరాజనీతిసూత్రము. కాంతలకుమాత్రము కార్పొరల్ పనిష్‌మెంటు పనికిరాదని సర్వజాతి శిక్షాశాస్త్రములు చెప్పుచున్నవి. ఎందులకు వారి నాశిక్షనుండి తప్పించినారో యెఱుఁగుదువా? తిరుగఁబడి.మరల గొట్టుదురని ఇది శాస్త్రరహస్యము.''

''అయ్యా! ఆగొడవ యిఁకఁజాలును. ఇఁకఁ దరువాత ఁజెప్పుఁ''డని నేనంటిని.

''ఎక్క నరునిభజముమీఁది కెక్కు. ఎక్కితివా? వెరిగుడ్ . యతీశ్వరులకువలె నీకు బ్రహ్మరథము సిద్ధించినదిరా! ఓహోభాయి! ఓహోభాయి! ఓహోభాయి! దింపు సవారిదింపు! దింపుటకాదురా. తిరుగఁ ద్రోయరా! నర్పభవ–నర్పభవ–ఇక్కడికి నహుషుఁ డేమైనాఁడో యెఱుఁగుదువా? బడితెతే కొట్టు కొట్టు–ఓరినిర్బ్యుఁడా చంపు. దొరకలేదా? –కలుగులోనికిఁ బాఱిపోయినదఁటరా? అయ్యయ్యో! చండాలుఁడా! ఎంతపనిచేసితివిరా! పోనీ. సుబ్బారాయుఁడా తండ్రీ రక్షింపు. నాయనా! నాగులచవితినాఁడు నీపుట్టలోఁబాలుపోసి కొందునుబాబూ! మాయావిడెచేత నాగులకోక కట్టింతును తండ్రీ! మొదటిబిడ్డ యాఁడుదై నయెడల సుబ్బమ్మ, మగవాఁడైనయెడల సుబ్బారాయుఁడు.

''నీ–వెళ్ళి మండిపోను! ఎక్కడను హద్దుపద్దు కనఁబడకుండ నున్నది. ఒక్కొక్క ప్పుడు తిన్నగనే మాటలాడుదువే. ఇప్పుడింతలో నీదిక్కుమాలిధోరణి యెక్కడనుండి వచ్చినదయ్యా! నరునిగూర్చి చెప్పవయ్యా!'' యని నేనంటిని.

''అద్దే అద్దే! ఇక్కడికి వామనావతారపుట్టము నొద్దకు వచ్చితిమి. మొదటినరు ఁడెట్టివాఁడు? పొట్టివాఁడు. బడుగు. పాపము పెండ్లిలేదు. వట్టి బ్రహ్మచారి. మొదటినరుఁడు కావుననే యాతఁ డర్భకుఁడుగ హ్రస్వస్వరూపుఁడగఁ జెప్పఁబడినాఁడు. మొదటిగ్రంథ మేమి? మొదటి బిడ్డఁడేమి? మొదటిప్రయత్న మేదైననేమి? సర్వసాధారణముగా బలహీన ముగా నుండక తప్పదు. పెద్దన్నయ్య యనఁగా దద్దయ్య–ప్రథమ ప్రయత్నమనగాఁబాడైన ప్రయత్నమాట–దీనికి మినహాయింపు లుండవచ్చును. మినహాయింపులే సామాన్యసూత్ర మును బలపఱుచుచున్నవి. క్రమక్రమవృద్ధియే ప్రపంచసూత్రము. ఇది భిన్నభిన్న నరవ్యక్తు లలో నెల్లు సత్యమో సాముదాయక నరజాతిలోఁ గూడ నంతయే సత్యము. మైకేలుఏంజిలో అనునాతఁడు ప్రథమపురుషుఁడగు ఆడము యొక్క శిలాస్వరూపమును నిర్మించినప్పు డైదుగురు కోడి రామమూర్తి బహద్దరులంత విగ్రహమును సృష్టించినాఁడు. మనవారి ప్రథమ పురుషుఁడు మూఁడడుగులవాఁడు. పరమార్థజ్ఞాననసంపన్నులు. గ్రీకులోయూర్యులో యిందువలనఁ గనిపట్టలేవా? కావున వామనుఁడే యెఱుఁగుదువా? వట్టి మాయకాడు వట్టిమోసగాడు. బలిచక్రవర్తినాశీర్వదించుచునే యున్నాఁడు. అధోలోకమునకుఁ బంపించు చునే యున్నాఁడు. ఇదిగాక మఱియొక్కచిత్రము. నీవెఱుఁగవేమో–పిల్లలంతమోసగాండ్రు పెద్దవారుకారుసుమా.

అన్ని యింద్రజాల మహేంద్రజాలవిద్య లర్భకులయొద్ద నున్నవి. శుద్ధమాయాస్వ రూపు లెవరనఁగా–పిల్లలు. బ్రహ్మభేద్యమైన గుట్టుకలవా రెవరనగా–పిల్లలు. భూగర్భమం దున్న పాతాళగంగనైన సులభముగాఁ బైకిఁ దీయఁగలవు కాని తఁగొట్టుకొనియైన పిల్లవాని హృదయమునుండి రహస్యమును నీవు తీయలేవు. ఇది భిన్న భిన్న నరవ్యక్తులలో నెల్లు సత్యమో సాముదాయక నరజాతి వ్యక్తియం దంత సత్యమే. అందుకొఱకే వామనుఁడు మాయకాఁడయ్యెను. ప్రపంచమందితరజాతులలో ఎవల్యూషన్ పైఁ గలిగిన యన్నిగ్రంథము లుతెచ్చి యొకపెద్దకాటాలో నొక్కప్రక్క నుంచుము. ''మత్స్యః కూర్మ వరాహశ్చ నారసిం హశ్చ వామనః, రామో రామశ్చ బుద్ధః కలికియేవచ'' యను శ్లోకమును దాటాకుముక్కపై వ్రాసి దానిని రెండవవైపున నుంచుము. సంస్కృతశ్లోకమే బరువుగా నున్నదే! వెరిగుడ్ వెరిగుడ్ . ఇతరగ్రంథములలో వివరము లెక్కువయుండునీ! గాని–ప్రిన్సిపల్ అంతయు నొకటి. అదిగాక వారి ఎవల్యూషన్ నరునిపుట్టుకతోఁ బూర్తియైనది. ''మత్స్యః కూర్మవరా హశ్చ నారసింహశ్చ వామనః'' అంతటితోడనే వారి ఎవల్యూషన్ పూర్తియైనది. మనయేర్పా టుప్రకార మింక నర్ధశ్లోకము తరువాయియే యున్నది. ఉత్తరార్ధము దేనినిగూర్చి చెప్పుచు న్నది? ఏనరజాతికి వామనుఁడు మొదటిమచ్చగాఁ దీసికొనఁబడినాడో యానరజాతి యేయే మెళ్లెక్కి తుదకుఁ బరిపూర్ణాభివృద్ధి నొంది యేయేమెట్లుదిగి క్షీణించి క్షీణించి తుదకుఁ బశుత్వములోఁ గలసిపోయినదో యాయెగుడుదిగుడుమార్గము చెప్పుట కీయుత్తరార్ధము చెప్పఁబడినది. ఇదేఇన్‌వల్యూషన్‌కు మార్గము. పుట్టి యెదిగి పెరిగి వస్తువునకు క్షీణదశ శుష్కదశ నాశనదశ చెప్పకుండనెడల వస్తుతత్త్వ పరిపూర్తి యేదీ? ఛీ! పాశ్చాత్యులు

ఇవ్వల్యూషన్ ఒప్పుకొనకపోయినయెడల మనమీసముమీఁద నొక్క-నెంద్రుకయైన నూడ లేదు. థూ! సెల్ఫ్‌సేవింగు చేసికొనువాఁడున్నాడే–స్వయంపాకనియమస్థుఁడైన యూహి తాగ్ని యన్నమాట–ఉఫ్ ఉఫ్ మనిప్రొయ్యి యూఁదినప్పుడు మీసములు కాలుననియే మనవారు శ్మశ్రుముండనము శ్రోతియత్వమండనముగాఁ జెప్పినారు. This is the Economic and Scientific aspect of the problem.

''అదిగో అదిగో తిరుగఁ దప్పాడుచున్నావు. వామనునితరువాత నేనిచెప్పఁదలఁచి తివో చెప్పు.''

''పరశురాముఁడు–ఛీ ఛీ వట్టికఠినుఁడు. ప్రభులోకమునంతను బనసకాయపొట్టుక్రిందఁ గొట్టినాఁడు. ధరణీనాథుల లెక్క-యేమి తల్లిగొంతునే కోసినాఁడు –తండ్రిసెలవైనదని తల్లిగొంతు కోసినవాఁడు–తల్లిసెలవైనయెడలఁ దండ్రిగొంతు కోయుట కభ్యంతరమేమి? పరమకిరాతుఁడు కాని వట్టి యమాయకుఁడు. చూచితివా వామనునిలోను న్నమాయ వామనుఁ డెదిగి పరుశురాముఁ డగుసరి కెట్లు మాయమైనదో! ఈసంగతి ప్రకృతి సత్యము, జ్ఞప్తియందుంచుకొనుము. మఱియొకటి–జంతుస్వభావమైన క్రౌర్యము నరజాతి పరిణామదశలో నీయవతారము వఱకుఁగూడ నింక వృద్ధియగుచునే యున్నది. పరశురాము నిలో నున్నసింహ మింక శతగుణముగ బొబ్బరించుచునేయున్నది. శాంతిలేదు. క్షమలేదు. అహంకారవర్జనము లేదు. అడఁకువలేదు. బ్రాహ్మణ్యము నామమాత్రముగ నున్నది. కర్క-శక్షాత్రముగ క్రౌర్యసహితమై గాఢముగ నున్నది. ఇక నీతని వదలిపెట్టి పైకిఁబోవు దము. అగిగో అదిగో పడవోయి. మనతండ్రి శ్రీరామచంద్రమూర్తి కాళులపైఁ బడవోయి! ఓ! నామనస్సునకు నచ్చినవాఁడు నరజాతికిఁ బరిపూర్ణాభివృద్ధి ఈయవతారమందే. నరజా త్యభివృద్ధికి రాముఁడే శిరోనక్షత్రము. తెలియలేదా! ఇతఁడు పరిపూర్ణబ్రాహ్మణుఁడు. పరిపూర్ణక్షత్రియుఁడు పరిపూర్ణప్రభుఁడు పరిపూర్ణభర్త. పరిపూర్ణపిత, పరిపూర్ణమిత్రుఁడు. పరిపూర్ణసోదరుఁడు. పరిపూర్ణబంధుఁడు పరిపూర్ణమౌని. పరిపూర్ణసేవకుఁడు. పరిపూర్ణ మనుజుఁడు. నరత్వ మిచ్చటఁ బరమావధినొందినది. ఇచ్చటినుండియే దిగుదల మొదలుపె ట్టినది. పడి మఱిలినది. తీఁత యారంభమైనది. అదిగో! యిసుక దిబ్బలు. ఊటలంక యదిగో! అరరే పాగాకునకు చల్లతెర బట్టినదిరా! మొలగజ్జికి పాగాకంతమందు లేదు సుమీ. పాగాకువాసన దగలిసచోట మహాపురి ప్రవేశింపనేరదు.

''అయ్యా! శ్రీఘ్రముగఁ దురువాతిసంగతికూడఁ జెప్పు'' మని యాతనిని బతిమాలి తిని.

''నాన్‌సెన్సు నీతొందరయేకాని చెప్పకుందునా? రామో రామశ్చ రామశ్చ–ఇఁక మూఁడవరాముఁడు–రాముఁ డనగా బలరామ కృష్ణులని యర్థము. అస్త్రములు పోయినవి. శస్త్రములు పోయినవి. అంబులపొదులు పోయినవి. పూర్వక్షాత్రము రూపాయలో ముప్పావు లావఱి కెగిరిపోయినది. పరశురామునిచేతిలో గండ్రగొడ్డలియేమి? బలరామునిచేతిలో నాగలి యేమి? ఇప్పటికి యెంతదిగిపోయినదోచూడు. అదిగాక వామనావతారములో నున్న మాయవంటి మాయ తిరుగఁ గృష్ణునిలో నారంభమైనది. నరజాతి చిన్నతనములో మాయ అనఁగా వామనావతారములో మాయ-మధ్యవయస్సులో మాయలేదు. (అనగా బరశురాము శ్రీరామావతారములలో) మఱలుదలవయస్సులోఁ దిరుగ మాయ. (కృష్ణావతారములలో)

ఈసంగతి జ్ఞప్తిలోనుంచుకొనవలయును నరవ్యక్తులలోఁగూడ నిట్లే. అదిగాక మఱియొకసంగతి. పరశురాముఁడు బ్రహ్మచారి. శ్రీరామచంద్రుఁడేకపత్నీవ్రతుఁడు. కృష్ణున కెనమండ్రు భార్యలు. పదునాఱువేలు గోపికలు. చక్రము పట్టలేదు విల్లు వంపలేదు. మహానుభావుఁడు. కన్నుగీటినంత మాత్రమునఁ బదునెమిది యక్షౌహిణులసైన్యము చచ్చినది. పదునాఱువేల గోపికల యిండ్లలో ననుక్షణము సంచరించుచున్నను నన్యులీత బ్రహ్మచారి. కృష్ణా! నమస్తే నమస్తే నమస్తే.

కృష్ణుని యవసానమైనపిమ్మట నరజాతితత్త్వములో నరవ్యకితత్త్వములో క్షాత్రము పూర్తిగాఁ జచ్చినది. గాత్రబలము ధ్వస్తమైనది. మోసము హెచ్చినది. అనేక కాంతాలోలత హద్దుమీఱిపోయినది. స్వసుఖవాంఛ సంపూర్ణ బలాన్వితమైనది. శ్రీరామావతారమునకు బుద్ధావతారమునకు నెంత యేతపెట్టుగా నున్నదో చూచితివా? ఓ అనుక్షణము సమస్తయోగ్యతలు దిగిపోవుచున్నవి. అట్టిసమయమున బుద్ధుఁడవతరించినాఁడు. వేదము లేదు. భగవంతుఁడు మిథ్య. ఆత్మ నహి. మోక్షమిల్ల యని యామహానుభావుఁడు బోధించినాఁడు. ఇదివఱకే దిగిపోవుచున్న యవస్థలో నుంటిమేమో యిది మఱింత దిగలాగినది. బుద్ధుఁడు ప్రేమమతము బోధించినాఁడు కాని యొకని నొకఁడెందులకుఁ బ్రేమింపవలయునో యాకారణమును దిన్నగఁ జెప్పలేకపోయినాఁడు. అతని నీతికిఁగూడఁ గారణ మంతగా నగపడదు. నీ వెప్పుడైన సంధ్యావందనము జేసినావా? బౌద్ధావతారే యని యెచ్చటనైన నున్నదేమో జ్ఞప్తియున్నదా? అదేయిది ఇప్పటి దైహిక మానసిక సాంఘిక నైతికావస్థలన్నియు నీకే తెలియును. నేను జెప్పవలసిన దేమున్నది? ధనమే దైవము. స్వసుఖమే మోక్షము. ఈప్రక్కనువేశ్య అప్రక్కను దాసి. ఈచేతిలో బ్రాందిబుడ్డి ఆచేతిలోఁ జుట్టు. ఆజేబులో నోట్లకట్ట ఈజేబులో సిగరెట్లపెట్టె. వాచిజేబులో సెంటుబుడ్డి. టిక్కటుజేబులో నల్లమందు. గొంతుకకుఁ ద్రాడు. పాషన్ మీఱకుండ జోడు ప్రేగుజాఱకుండబెల్టు. మఱి నాపిండకూడు. నల్లమడుగు. ఈదిక్కుమాలిన నేషముతో మగవాఁడున్నాఁడు. ఇఁక నాఁడుదాని వేసము శాంతమ్ పాపమ్. శాంతమ్ పాపమ్ చెప్పనే వీలులేదు.

"కోకమీఁద గొల్లభామోయినాసామిరైకమీఁద రాజహంస పేడిమూఁతికి నూగుమీసం నాసామి బోడితలకు తనులపాకు." ఓహోహో వహవ్వారే.

"ఛీఛీ! ఇఁక గట్టిపెట్టు. అంతటితోఁ జాలును. కలికమూర్తినిఁగూర్చి యేమైనఁ జెప్పుదువా?"

ఇక నేమున్నది. ఇకనేమున్నది. కలికావతారము వచ్చినపిమ్మట జాతివర్ణభేద మెంతమాత్రము లేక యందఱు కలసి యొక్కగూనలోఁగల్లుత్రావి యొక్కగొడ్డును బీఁకుకొని తిందురు. వావివరుసయు లేక జనులెల్లరు ప్రవర్తింతురు. ఇప్పటికే మీఁగాళ్లవాపు మొగముమీఁదఁ గనఁబడుచుండఁగా నన్నడిగెద వెందులకు? అందఱు వట్టిపశువులగుదురు కొంతకాల మట్లుండి శాఖాప్రపంచములోనికి జంకిపోవుదురు. అంత నగ్నిప్రళయము కలుగును. దానిపై జలప్రళయము కలుగును. ఒక్కటేసముద్రము. దానిలోనిది నీరో పాలో యేమియుఁ దెలియదు. ఆసముద్రముపై 'ఒకటి పండ్రెండైనప్పుడు నాలుగే సున్నయినయప్పుడు ఆకుమీది రామచిలుక యట్టి సుఖముగ నిద్రబోవు దీనిభావము దెలియవలెనండి జనులార మీరుదీని.'

అని వెట్టిరామశాస్త్రియన్నగారు చెప్పినట్లుండును తెలిసినదా? ఎవల్యూషన్ చెప్పు మని నీవడిగినప్పటికి ఇన్‌వల్యూషన్‌కూడ భోధించినాము. డబ్బిమ్మనుసరికి రెండుడబ్బు లిచ్చు స్వభావముచేత నాలాగున్న జేసితిమి. అయినను దప్పులేదు. ''మత్స్యః కూర్మవ రాహో చ నారసింహశ్చ వామనః, రామో రామశ్చ రామశ్చ బుద్ధః కలికయేవ చ'' యను నీయొక్కశ్లోకమునకే మనపురాణములు నితిహాసములన్నియు వాఖ్యానములు నమస్తస్సృష్టి యీశ్లోకమునకే వ్యాఖ్యానము సాలగ్రామములలో మత్స్యమూర్తి మొదలుకొని కలికమూర్తి వఱి కన్నిమూర్తు లున్నవి. స్త్రీపురుషులలో మత్స్యముఖులు, కూర్మముఖులు, వరాహము ఖులు, సింహముఖులు, వామనముఖులు, రామముఖులు, కృష్ణముఖులు, బుద్ధముఖులు, కలికముఖు లున్నారు. ఇదిగాక మఱియొక్క చిత్రమును జెప్పెదను. వినుము. ప్రపంచము నందున్న, యుండిన నుండఁబోవు జనులందఱస్వభావములు కూడ నీశ్లోకమునఁ జెప్పిన పదిలోనే యిమిడియున్నవి. ఇందులోనిది కొంత యందులోనిది కొంత కలిసిసాంకర్య ముండవచ్చునేమో కాని యీపదినిమించిన స్వభావములు మాత్రము లేవు ముమ్మాటికి లేవు. ఇఁక నీకుఁ జెప్పవలసినది లేదుపో'' యని యాతఁడు తటాలున లోనికిఁ బోయెను.

నాయనలారా! పిచ్చివానిప్రలాపములను వింటిరా? అనందర్భాలాపములేగదా యని యలక్ష్యముచేయక రవంత యోజించుకొనుఁడు. యోజించుకొన్నమీఁదటఁ గూడ ననంద ర్భములని తోచిన యెడల మఱచిపొండు.

39. ఆరోగ్యము

కాలాచార్యులు అధ్యక్షతన ఒక ఆయుర్వేద వైద్యుడు సాక్షి సంఘసభలో, ఆరోగ్య విషయాలగురించి ఉపన్యాసం ఇచ్చాడు. జంఘాల శాస్త్రి ఆవైద్యుడు సభకురావడానికిముందే చేసిన పరిచయధోరణిని బట్టి, ఆవైద్యుడిమీద గౌరవంతోకంటె అవహేళనగానే ఉపన్యాసానికి పిలిచినట్లు, అతనిఅజ్ఞానాన్ని అలా బయటపెట్టదలచినట్లు అర్థమవుతుంది.

వైద్యుడు వచ్చాడు. ఉపన్యాసం ప్రారంభించాడు. పొద్దుటే లేచి చన్నీటిస్నానం చెయ్యాలనీ, వేళకుభోజనం చెయ్యాలనీ, మంచి ఆయుర్దాయానికి చిట్కా, జఠరాగ్నిని మందగించకుండా చూసుకోవడమేననీ, చుట్ట, కాఫీ, టీ, మత్తుపదార్థాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయనీ, చెప్పిచెప్పి—చివరికి ఆయుర్వేద విధానంలో నాడీపరీక్షా పద్ధతిలో లోపాలు సవరించి తానొక పుస్తకం వ్రాస్తున్నాననీ, పత్రిక నొకటి ప్రారంభిస్తున్నాననీ, చందాలు ఇమ్మన మనీ పట్టి తీశాడు.

కాలాచార్యులు అధ్యక్షుడుగా ముగింపు మాటలు చెపుతూ, ఆ ఆయుర్వేద వైద్యుడి ఆరోగ్యసూత్రాలన్నింటినీ ఖండించి—తనుచెప్పే సూత్రాలు ఆరోగ్యపరిరక్షణకు సిసలైనవని ప్రతిపాదించాడు. ఎవరి ఆరోగ్యమైనా కర్మానుసారంగా వుంటుంది గనుక, మందులన్నింటినీ గంగలో పారెయ్యమన్నాడు. ఈ ఆయుర్వేద వైద్యుడికి ఎవరూ చందాలివ్వనక్కర్లేదని ప్రకటించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:—

నయనాలారా! ఒక యాయుర్వేదభిషగ్వరుఁడు నేఁడు మనసంఘమున నుపన్యసించును. మన సాక్షిసంఘము నాంధ్రదేశీయులందఱు మహాభిమానమున నాదరించుచున్నారు. మన సంఘోపన్యాసము లనేకులు విమర్శనబుద్ధితోఁ జదివి వారికిఁ దోఁచినసందేహములను నిరాతంకముగ నడుగుచున్నారు. వారియుపన్యాసములను మనసంఘమందు నాచేఁజదివించుటకయి పంచుచున్నారు. కొందఱుకొందఱు విద్వాంసులు సాక్షిని దర్శించుటకై వచ్చి మన సంఘమునం దుపన్యాసము లిచ్చుచున్నారు. ఇదికాక—ఏలూరు రాజోలు మొదలగు గ్రామములలో మన సాక్షిసంఘమున కుపసంఘములుగా కొన్ని సంఘములను స్థాపించినారు.

ఆసంఘములలో మనలోవలె సాక్షి–జంఘాలశాస్త్రి కాలాచార్యులు వాణీదానుఁడు సెట్టియు నున్నారు. వారమున కొకతూరి మనవలె వారుకూడ నుపన్యాసము లిచ్చి వారి కార్యక్రమ మును మనకప్పటప్పటఁ బంపుచున్నారు. సరస్వతీకటాక్షమున నచిరకాలములో మనసుబు కరణముల రచ్చసావడివలె గ్రామగ్రామమున కొక్కసాక్షి పంచాయతీసావడి యుండవచ్చును. ఇప్పు డొక యాయుర్వేదభిషగర్వుడిచ్చట నుపన్యాస మిచ్చును. ఆంగ్లేయాయుర్వేద మహమ్మదీయాది భిన్నభిన్నజాతి వైద్యప్రక్రియా సామ్యభేదాదులను గూర్చి యుపన్యసింపుఁ డని నేను గోరితిని. అంతవఱకుఁ దనకిప్పు డవకాశములేదనియుఁ బ్రస్తుతమున నారోగ్యము నుగూర్చి కొన్నిమాటలు మాత్రమే చెప్పెదననియు నాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ఉపన్యాస మెట్లుండునో యని సంశయముగా నున్నది. తిన్నఁగాని రుచితెలియునా? దిగినఁగాని లోఁతు తెలియునా? కనినఁగాని గర్భవేదన తెలియునా? చదివినఁగాని సారస్యము తెలి యునా? వినినఁగాని విశేషము తెలియునా? కావున వినఁదలఁచిన దానినిగూర్చి యిప్పుడు విమర్శనమెందులకు? ఈభిషగ్వరుఁడు కొంతయాంగ్లేయభాషాజ్ఞానమును సంపాదించినవె నుక నాయుర్వేద వైద్య వైదగ్ధ్యమును సంపాదింప నెంచి యొకయాంధ్రదేశప్రభుని సాహా య్యముచేఁ గాళీఘట్టమునకుఁ బోయి యచ్చట నగదంకారవిద్య నభ్యసించి భిషఙ్మణి యను బిరుదమును బిరుదముతోపాటు గరువమున సంపాదించి–జనాభాను దగ్గించు నముచితోద్దేశ ముతో స్వదేశమును జేరెను. శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్. సర్వేజనాఃసుఖినో భవంతులోకాఃసమస్తాస్సుఖినో భవతు. క్రొత్తబియ్యమువలనఁ గడుపునకు బాధ. క్రొత్తమంగ లివలన గడ్డమునకు బాధ. క్రొత్తవైద్యునివలనఁ బ్రాణమునకు బాధ. నాయనలారా! క్రొత్తవైద్యుఁడు వరిగత్రాచువంటివాఁడు. నేనొక్క యాంగ్లేయవైద్యు నెఱుఁగుదును. ఆతఁ డాంగ్లేయుఁడగుటచే నాపరేషనులో నధికుఁ డాయని యడుగనక్కఱలేదు. ఆతని ఆపరేషను లన్నియు నక్సెస్‌పుల్–జయప్రదములు–అని చితాలో జమకట్టు కనఁబడుచున్నది. రోగులు బ్రతికిరా చచ్చిరా యను విచారణ మక్కఱలేదు. ఉన్నను నది ద్వితీయపక్షము. (సెకండరీ) అది శల్యతంత్రవ్యావహారికపుస్తకము కాని జననమరణముల లెక్కకాదే. అందులోని చా వొకపద్దుగా గణింపదగదు. ఆపరేషన్ జయప్రదమగునా కాదా అనియే ప్రశ్నము. అంతటితో సరి. కాని చావేల యందఱకు సంభవింపవలయును? ఆఫ్టర్ ఎఫెక్టుకు అతఁ డెట్లు బాధ్యుఁడు? మెదటిలోనుండి కప్పలను దీసినాఁడు. కన్నులలోనుండి జెట్టులను దీసినాఁడు. కార్జములోనుండి ఱాలను దీసినాఁడు. ఇట్లింద్రజాల మహేంద్రజాల విద్యలను ముప్పదినంవ త్సరము లగపఱచినాఁడు. ఇప్పుడున్నవాఁ డుత్తరక్షణమున హూత్!

ఒకఁడా! యిద్దఱ్ఱా! వందలు పేలు! అతనికత్తి కట్టి కఱకు. ఆతని చేతి కంత చుఱుకు. తుద కాతఁడే నంపూర్ణప్రజ్ఞాశాలియై శల్యతంత్రమం దంతవాఁడు లేఁ డనిపించుకొనినాఁడు. నీయిల్లు కాలిపోను. నీబుద్ధి బుగ్గిగాను. నీకడుపు మాడిపోను. నిన్నుఁ బాము గరువను. నిన్ను బ్రహ్మరాక్షసుఁడు పట్టుకోను. అనునవి తిట్లుకావు. నీనాడి బాలవైద్యుఁడు చూడను –అనునది తిట్టు–ఓ! అంత తిరుగులేనితిట్లు మఱియొక్కటి యున్నదా? అబ్బ! అబ్బ! బ్రహ్మాస్త్రమునకుఁ బ్రతిహతమున్నది. ప్రబలనిర్ఘాతపాతమునకుఁ బ్రతిరోధ మున్నది. బాలవైద్యునివైద్య మప్రతిహతము. అప్రతిరోధకము. శ్లో. ''నహాస్రాదిత్య నంకాశమ్ సర్వ శత్రు నిబర్హణమ్, రామశక్తిమయం ధ్యాయే చమోఘమ్ రామసాయకమ్.'' అని రామబాణము హాత్మ్యమును వర్ణించియున్నారు. సర్వశత్రునిబర్హణశక్తిమాత్రమే రామబాణమం దున్నది.

శత్రుమిత్రభేదరహితమైన నిబర్హణశక్తిమన బాలవైద్యుని హస్తమందున్నది. ఆతఁడు సర్వసమ వర్తి. అతఁడు మాటలోనే వచ్చుచున్నాఁడు. నాయనలారా! లేచి వారికి స్వాగత మీయవల యును. (అట్లుచేయుదురు) అయ్యా! భిషఙ్మణీ! మిమ్మఁగూర్చియే యింతవరకుఁ జెప్పుచున్నాను. మీరిఁక నుపన్యాస మారంభింపవచ్చును. ఈసభకుఁ గాలాచార్యులవారి నగ్రాసనాధిపతిగా నేను శ్రోతలపక్షమున నియమించుచున్నాను.

వైద్యునియుపన్యాసము

''అగ్రాసనాధిపా! సోదరులారా! సాక్షిసంఘమునుగూర్చి యిదివఱకుఁ జెవులార వినుటయేకాని కన్నులారఁ జూచుభాగ్యము సిద్ధింపలేదు. దాని నిప్పుడు చూచుభాగ్యమేకాక దానిలో నుపన్యాస మిచ్చుభాగ్యము కూడ సిద్ధించినది. అంతేకాక వైద్య లెవ్వరిదివర కీసభయందుపన్యసించి యుండకపోవువలన. వైద్యవృత్తి నవలంబించువారిలో ప్రథమోపన్యాసకుఁడను నేనే యగుట మఱింతభాగ్యమని యెంచుచున్నాను. (అయ్యా! డాక్టరు పింజారిరావుగారు తమకంటె ప్రథములేమో యని సభలోఁ గేక) అటులయిన క్షమింపవలెను. అయినను బింజారిరావుగా రాంగ్లేయవైద్యులు. నే నాయుర్వేదవైద్యుఁడను. కావున నేనే మొదటివాఁడ నగుదునేమో (ఆంగ్లేయవైద్యమైన నేమి? ఆయుర్వేదవైద్యమైన నేమి? అమ్మకడుపు చల్లగానున్నంతవఱ కాయున్నన కాతంకము లేదని యెవ్వఁడో విన నిమ్మళముగ సణుగుకొనును) నేనిప్పుడు మీకు శరీరారోగ్యమునుగూర్చి చెప్పవచ్చితిని. ఆరోగ్యనుందఱ కిష్టమే. ఆరోగ్య మంద ఱపేక్షించునదే కాని యారోగ్యార్జన మందఱుకూడ నలక్ష్యముగఁ బ్రవర్తించుచున్నారు. ఇది కడుశోచనీయము. ఆరోగ్యమున నంపాదించుట యెంతమాత్రమును నష్టముకాదు. ఉషఃకాలమునఁనే లేచి కాలకృత్యములను నిర్వహించుకొన వలయును. ఉషఃకాలమున లేచుట యేమంతకష్టము? ఒకటి రెండు ధినములు రవంత కష్టముగాఁగానఁబడినను శీతోదకస్నానమే చేయవలయును. ఉష్ణోదకస్నానము తగదు. ప్రవాహినియగు నదిలో స్నానమొనర్చుట ప్రథమపక్షము. తటాకస్నానము రెండవది. కూపాద్యుదకస్నాన మధమము.

''అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగకపాఱు నేరును ద్విజుఁడున్
జొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టియూరు చొరకుము వేమా.''

అని వేమనమహాయోగి పలికినాఁడు (ఇది నుమతిశతకపద్యమేమో నుమండీ యని యొకఁడు కేక-ఎడతెగకపాఱు నేరున్నచోట నారోగ్యమునకు లోపము లేదుకదా. అక్కడ వైద్యుఁ డెందుకండియని యొకఁడుకేక) కొందఱైన సరిగ నుషఃకాలమం దాయేటిలో స్నానముచేయుట కలక్ష్యము చేయుదురను కారణముననే కవి నదికంటె వైద్యునినే ముందుఁజెప్పినాఁడు తెలిసినదా? (తెలిసినదండి. వైద్యుఁడు తప్పక యుండవలసి వచ్చినది కావున నంతకన్న తప్పని సరిగి శ్రాద్ధమంత్రములకుఁ గాఁబోలు ''ద్విజుఁడున్'' అని కవి పలుకవలసివచ్చినది. అని యొకఁడు సభలోఁ గేక) అది కేవలము బుద్ధిహీనత. రోగమును నివారించుటకే వైద్యుఁడు. వ్యాజ్యేమును గెలిపించుటకే న్యాయవాది. నంధానము కొఱకే రాయబారి. ఆకృత్యము లొకప్పుడు తప్పిపోవచ్చును. అందులకు విచారింపఁబనిలేదు.

(విచారము మీకెందుకయ్యా? ధననష్టి ప్రాణనష్టికూడ పొంది యేడ్చువారము మేముంటిమి కాదా! యని యొకఁడు గొణుగుకొనును) ఇప్పుడీలోకమందు–ముఖ్యముగా నవనాగరకలోకమందు–వైద్యుని జమత్కారమునఁ బరిహసించు దురాచారమున్నది. అది యొక గొప్పబుద్ధి విశేషమని యధిక్షేపకులయభిప్రాయము. అది శుద్ధబుద్ధిహీనతకాని వేఱుకాదు. నరే; ఈగొడవయెందులకు? ప్రాతఃస్నానమైనపిమ్మట సంధ్యావందన మాచరించుకొని కొంతసేపు ప్రాణాయామము నారోగ్యము నపేక్షించువా రందఱు చేయవలయును. దీనియుపయోగము లనంతములు. ఈయుత్తమసాధనమువలన శరీరమున వ్యాధియే యుండదు.

ఆర్యులారా! మీ రప్పుడే యావులించుచున్నారు. నావాక్యములు మీకు రుచివంతములుగా లేకపోవచ్చును. మీజంఘాలశాస్త్రివలె జనరంజకముగ మాటలాడుశక్తి నాయొద్దలేదు. ఒక్కనాయొద్దనేకాదు. వైద్యులెవ్వరియొద్దను గూడ నాశక్తియుండుట కవకాశములేదు. వైద్యుల కెంతసేపు చేతితోనేగాని నోటితోఁ బనియేలేదు నరే. ప్రాణాయామమైనపిమ్మట కాఫీ గాని–టీ గాని – కోకోకాని–యేదియుఁబుచ్చుకొనఁగూడదు. ఇవి తత్కాలికోద్రేకమునిచ్చినను శ్వాసకాలమున శరీరమును బాడుచేయును.

పగలు రెండుయామములకుఁ బూర్వమునందు భుజింపవలయును. సాయంకాలమునఁ దిరుగ నెనిమిదిగంటలకు లోపల భుజింపవలయును. పదకొండుగంటలు వినకుండ వినకుండ నిద్రింపవలెను.

పాడుముకాని–చుట్టకాని–నల్లమందుగాని–గుడిగుడికాని–యెంతమాత్రమును దగవు. పొగాకులోని విసము బహుప్రబలమైనది. దానివలననే హృదయవ్యాధి–కార్జ్వవ్యాధి –మందాగ్ని–పక్షవాతము–మొదలగురోగములు సంభవించును. పొగచుట్ట యొక్కటితెచ్చి యదిసగముత్రుంచి యొకతునుకను సాయంకాలమున యొకయరసేరు నీళ్లలోవైచి తెల్లవాఱువఱకు దానిలో నాననిచ్చి యానీటిని బలిష్టమైన ఆస్ట్రేలియాగుఱ్ఱమునకుఁ బోయుఁడు. అంత గుఱ్ఱము కూడ గిఱ గిఱ తిరిగి యరగంటలో టారునఁ జచ్చును. పొగాకులోని విస మంతభయంకరమైనది. తాంబూలచర్వణము కూడఁదప్పే! తాంబూలము హెచ్చుగా నెవరు వేయుదురో వానినెత్తిపై మందాగ్ని మూఁడుపంక్తులఁ దప్పదు. పొగాకు తాంబూలమున వేయునాచారము కొన్నిదేశములం దున్నది. ఇది మఱింత దూష్యము. ఇదికాక మత్తుఁగలుగఁజేయుపదార్థ మేదియుఁదీసికొనరాదు. అందువలన నారోగ్యము నశించును.

అంటువ్యాధు లూరనున్న కాలమునందు జననమ్మర్దము విశేషముగా నున్నచోటికిఁ బోరాదు. రాత్రులందుఁ దఱచుగా నిల్లువెడలఁదగదు. వేళమించకుండఁ–దప్పకుండఁ –భోజన మొనర్పవలయును. నిదురింపవలయును. భయము మనస్సునఁ జేరనీయరాదు. ఉడికినీరు చల్లాఱనిచ్చి దానిని ద్రావినమంచిది. ఉదయమున నెచ్చటికిని బోరాదు. పరగడుపున విషక్రిములు శీఘ్రముగ వ్యాపించును.

ఇట్లింతయని–యెన్నియని–చెప్పగలను? ఒక్కొక్కయంశమునై నొక్కొక్కగ్రంథమును వ్రాయఁదగును. ప్రధానాంశమొక్కటి చెప్పెదను. మనుజుఁ డేమిచేసినయెడల నాయుష్మంతుఁ డైయుండును? అనునది వైద్యశాస్త్రమందు ప్రప్రథమప్రశ్నము. ఎవఁడు జఠరదీపికను బాగుగాఁ గాపాడుకొనునో వాఁడాయుష్మంతుఁడని యాప్రశ్నకుత్తర మీయఁబ

డెను సోదరులారా! వింటిరా? 'అఖిలరోగకారకమైనది. యజీర్తి ఆయుఃక్షయకరమైనది యజీర్తి. అట్టి మందాగ్ని రాకుండ మనుజుఁడు ప్రవర్తింపవలయును. మందాగ్నివలన జ్వరము-కానము-క్షయ - పాండువ-అది యిది యననేల-సమస్త వ్యాధులు కూడఁ బుట్టును. ఇఁక మఱియొక్క చమత్కార మున్నది. చెప్పమందురా? (అక్క-అలేదు. అక్క-అలేదు అని గునుగునలు) మందాగ్ని యున్నరోగిప్రపంచమందున్నయన్నిరోగము లను తానేయనుభవించుచున్నాఁడను భావనకు లోనై యుండును. నేను జెప్పినమాట మీకర్థమైనదా? శాస్త్రీయరహస్యము లగుటచయేత సామాన్యజనుల బుద్ధుల కందువు. (ఏడ్చినట్లే యున్నదని యొకఁడు మఱియొకనిమీఁద వంకబెట్టి యనెను.) మందాగ్ని యున్నవాఁడు హృదయవ్యాధిచేఁ దాను బాధపడుచున్నట్లు భ్రమించును. మందాగ్ని యున్నవాఁడు క్రిమివాతముచేఁదాను బాధపడుచున్నటుల భ్రమించును. మందాగ్నియున్నవాఁడు మేదోవ్యాధిచేఁ దాను బాధపడుచున్నట్లు భ్రమించును. ఇట్లు మందాగ్నియే సర్వబాధలకు మూలము. మందాగ్నివలన నిట్టిభ్రమములు కలుగుటకుఁ గారణము లేవో నేను జెప్ప మొదలిడినయెడల మీకవి దురవగాహములుగ నుండును. చిరకాలము నేర్చుకొన్న శాస్త్రీయాంశములు క్రొత్తవారికిఁ దెలియుట సాధ్యముకాదుగదా! (అది మాకుఁ జెప్పుమని దేవులాడినవా రెవరిని కేక) ఇదవఅకేమి చెప్పితిని? మందాగ్నియే సర్వరోగమూలక మని చెప్పియుంటినిఃఁ (ఈతని మానుమని చెప్పవలసినదని యధ్యక్షుఁడగు కాలాచార్యుని కొకచిన్నచీటి నొకఁ డిచ్చుచున్నాఁడు. దాని నాతఁడు చూచుకొని దానితాత్పర్యమేదో తెలియక కాఁబోలుఁ-దెలిసినయెడల నేమి చేయుటకును దోఁపకకాఁబోలు నిశ్చేష్టుఁడై-రవంతసేపుండి తనవ్రేళ్ల చిటికలోనున్న పొడుము నాచీటిలోనుంచి యాచీటిని మందుపొట్లముగాఁ గట్టి మందాగ్ని నెట్లు నివారించుకొనవచ్చును. అనఁగ -నగ్నిదీప్తి నెట్లు కాపాడుకొనవచ్చును? ఇందుకుఁ బాశ్చాత్యుల వైద్యపద్ధతి వేఱు. మనపద్ధతి వేఱు. వారు తఱచుగా పెప్సిన్-జైమిన్-ఇన్‌గ్యులిన్-పేపియానా -మొదలగు పదార్థముల నిచ్చి యగ్నిదీప్తిని బైనుండి కలుగఁజేయుదురు. అది మనవారి కిష్టముగు పద్ధతి కాదు. లోపలినుండియే యగ్నిదీప్తిని మనవారు కలుగజేయుటకు యత్నింతురు. వారివైద్యము సాధారణముగా బాహ్యవైద్యము. మనవైద్య మాంతరవైద్యము. జ్వరమును వారు రోగికి చెమ్మటపట్టించి తగ్గింతురు. మనవా రీపద్ధతి కిష్టపడరు. మనవారు పైరక్తపు వేఁడిమిని తగ్గించుట కిష్టపడక లోనికోశములందు వేఁడిమి పుట్టించి పైవేడిమి లోని కాకర్షించుకొందురు. ఇవి యన్నియు శాస్త్రరహస్యములు. మచ్చుకొక్కటి మీకుఁ జెప్పితిని. (ఏడువలేకపోయినావు. అని గునగునలు) నామాటలను వినుటకు మీకు వినుఁగుగా నున్నట్లు కనఁబడుచున్నది. అయినను మఱి నాల్గునిమిసములు కాలమిచ్చినయెడల నొక ముఖ్యమైననంగతి చెప్పఁదలఁచియున్నాను. (త్వరగ దిగవయ్యా యని కేక) త్వరగనే దిగుదును. ఈయాయుర్వేద మున్నదే అచ్చటచ్చట నిదికొంత యసందర్భముగఁ గనఁబడుచున్నది. కొన్నికొన్ని ఘట్టములు నిరర్థకములుగ నిష్ప్రయోజములుగ నున్న ట్లున్నవి. మఱికొన్ని యస్పష్టాభిప్రాయములుగ నున్నవి. కొన్నికొన్ని భాగము లసంపూర్తిగ నున్నవి. కొన్ని యథోచితస్థానము లందుండక యసంబద్ధస్థానములందున్నవి. (ఓరీ నీగొంతుగోయ యని యొక్కఁడు నిమ్మళముగ ననుచున్నాఁడు) నాడీనిదానమును గూర్చి రవంత విచారింతుము. (కావలసిన యెడల నీవు శాశ్వతముగా విచారింపుము. మాకక్క-అలేదని కేకలు) నాయనలారా! తొందర

పడెదరేల? శాస్త్రోపన్యాస మనుకొంటిరా? లొడలొడచెప్పుటకు సామాన్యాంశములపై నుపన్యాసము లనుకొంటిరా? క్షమింపవలెను. అయినను త్వరలో ముగింతును. ఒక్క నాడీవిధానము గూర్చి రవంత యోజింతము. ఇప్పటికిఁ దర్జనమీఁదిది వాతనాడియో పైత్యనాడియో తేలలేదు. ఆపక్షమున బలమున్నది. ఈపక్షమున బలమున్నది! చిత్రమేమనఁగా పైత్యనాడి యనుకొనినను బని జరుగుచున్నది. వాతనాడి యనుకొనినను బని జరుగుచున్నది. (పని జరుగుట పెద్దబ్రహ్మాండమా? గుక్కెడుప్రాణ మెంతసేపు లాఁగివేయవలయును?) సోదరులారా! అట్లుకాదు. పైత్యజ్వరము వాతరాక్షసమునఁ గుదురుచున్నది. వాతజ్వరము వనంత మాలినివలనఁ గుదురుచున్నది. (పైత్యనాడి యేదో తేలనప్పు డిది పైత్యజ్వరమని-యది వాతజ్వరమని-నిర్ధారణచేయుటకు నీకేమి యధికారమున్నది? యని కేకలు. బ్లాక్ హెడ్ అనిగుసగుసలు.) అట్టియాధారమున్నది లెండు. ఆలోఁతునంగతులు మీకుఁ దెలియవు లెండు. ఎటులైన నేమి? నాడీనిదానమంతయు రెండుతలలపామువలె నిట్టు లట్టులు గూడఁ బ్రాకుచున్నది. ఇది యిట్లుండఁగా నాడియనునది యొకటి యున్నదా? ఉన్నయెడల నంగుళమాత్రప్రదేశములో వివిధములైన మూఁనాళ్లుండుట కెట్లవకాశమున్నది? కావున నీనాడీవివరణ మంతయు-నెండమావులని యడ్డునుడివాద మొకటి బయలుదేఱుచున్నది. దీని మూలమునకే మోసము వచ్చినట్లగపడుచున్నది. ఆయుర్వేదమున నవరణలు చేయవలసిన భాగములన్నియు నేను దీక్షతో విమర్శించియున్నాను. అవి యన్నియు లోకమునకు వెల్లడిచేసి శాస్త్రమునకు దేశమునకు నూతనప్రబోధమును గల్పింపఁదలఁచియున్నాను. (ఆ! ఎంతవాఁడవు! నూతనప్రబోధము నీవలనఁగలుగునా? నూతనప్రబోధము కాదు. నూతనప్రాణోపద్రవమని వినఁబడి వినఁబడునట్లు ధ్వనులు) సోదరులారా! నాప్రయత్న మలక్ష్యముగా భావింపకుఁడు. నేను ''దేశీయభేషజ'' పత్రిక యనుపేరిట నొకవారపత్రికను స్థాపింపఁదలఁచియున్నాను. ముఖ్యమైన స్థలములందెల్ల ప్రచార మొనర్చి యాపత్రికకుఁ గావలసిన చందాదారులను సంపాదించుచున్నాను. మీరందఱుపత్రికకుఁ జందాదారులుగ నుండటయేకాక కొంత మూలధనముకూడ శక్తివంచనలేకుండ నీయవలసియున్నది. దేశహిత మలాభాదులకై చేయు మాహాకార్యములకు దేశీయులు తోడుపడకపోయినయెడల నెవరు తోడ్పడుదురు? అందులో రైతులను బీల్చిపిప్పి చేసి యార్జించినసొమ్ము నల్లరిచిల్లరి వేడుకలందు వ్యయపఱచు కొందరు జమీందారు లున్నారే, వారొక్క సానికై కట్టించిన మోహినీమహల్ విలువతో నాముద్రాక్షరశాల నిర్మితమగును. (నీకర్మము సావివై పుట్టలేకపోయినావా? యను గుసగుసలు) వారొక్క సంక్రాంతి పండుగకుఁ గోడిపందెములకై వ్యయపఱచిన సొమ్ముతో నూతననాడీ నిదానమును నాగ్రంథము లోకోద్ధరణార్థమై పైకి రాఁగలదు. ఇక నట్టి చెప్పఁదలఁచుకొనలేదు. ఇదిగో చందాపట్టి. మీరందఱు దయయుంచి-(దిగు దిగు అను కేకలు) చందాలునిచ్చి-నాప్రయత్నము సఫలమగునట్లాచరింపుడు. భగవంతుఁడు మీకు హృదయములందు దేశోపకారాభిలాషమును దృఢముగాఁ గలుగఁజేయుఁగాక. తథాస్తు (తెలిపి లేని చప్పటలు.)

కాలాచార్యుని యుపసంహారోపన్యాసము

''నేనిప్పు డుపసంహారోపన్యాస మీయవలయును గాఁబోలు! ప్రారంభోపన్యాస మిచ్చిన యధ్యక్షున కుపసంహారోపన్యాస మర్హము కాని యుపసంహారోపన్యాసమే ప్రారంభోప

న్యాసముగాఁగల యధ్యక్షుఁడిప్పు డీయఁబోవు నుపన్యాసము నేమందురో యాయుప
సమే యాయవలసియున్నది. భిషజ్మణియను పేరునందున్నంత బిల్టు–వారి వాక్యములఁ
నగపడదు. చేతిచఱుకే కాని వైద్యులకు నోటిచఱుకుండదని వారే సెలవిచ్చినారు. కావ
వారికిఁగాని మనకుఁగాని యీవిషయమం దుపద్రవ మేదియులేదు. ఎటువచ్చినను సిద్ధాం
పూర్వపక్ష వ్యవహారములందుఁ జికిలిచేసిన కత్తివంటివాఁడను గావున నొకరు 'ఔ' నన్న
కాదనుటయే నే నేర్పాటుగాఁ బెట్టుకొనియున్నాను. అదిగాక యధ్యక్షుని వ్యాపారము తు
కన్నియుపన్యాసములను ఖండించుటయే యని నేను వినియున్నాను. కావున నేనిప్పు
చెప్పఁబోవునదేమనఁగా–భిషజ్మణియుపన్యాసము హరిః ఓమ్ మొదలుకొని–తథాస్తువఱక
–నంతయు మిథ్య రజ్జువందు సర్పత్య మెంతయున్నదో శుక్తియందు రజతత్వ మెంతున్నది
–మరీచికలందు వీచిక లెంతయున్నవో–వీరియుపన్యాసమందు సత్య మంతయున్నది. ఇ
నెందులకు? ఖండింపఁదలఁచుకొన్నప్పు డాపాదశిరఃపర్యంత మొక్కఁటేదెబ్బ కొట్టిన మం
దికాని చిల్లరచిల్లర దెబ్బలు కొట్టనేల? అది నా కిష్టముకాదు. ఆబుగ్గమీఁద నొక్కఁగిల్లుగి
నేమిలాభము. ఈవ్రేలు రవంత విఱిచిన నేమిలాభము. మోచేతితోఁ బ్రక్కలో నొక్కఁపోటు
టిచిన నేమిలాభము. ఱొక్కఁగూళ్ళనడుమ నొక గ్రుద్దుగ్రుద్దిన నేమిలాభము. సర్వావయవ
ల్యముగలుగునట్లు–సర్వాంగశీతలతగలుగఁ–ళ్లొక్కఁటేదెబ్బ – పాదనాడి మొదలుకొ
బ్రహ్మరంధ్రమువఱకుఁ గొట్టితిని. ఇఁకఁజాలునా? నేనిఁకఁ గూరుచుండవచ్చునా
(అదేమి? స్వామి యంశముల నొక్కొక్కదాని ననువదించి దానిని సకారణముగ ఖండించి–
తుదకు మీయభిప్రాయము చెప్పవలయును గాని యీఖండనవైఖరియేమి? గొడ్డలిపెట్టు
నొక్కఁటే దెబ్బయా? కావున నుపన్యాసాంశములను వివరించి ఖండింపుఁడు. అని సభ
నొక్కఁడు కేక) ఆలాగునఁటయ్యా! సరే. రవంతపొడుముపట్టేది? (పుచ్చుకొని పీల్చును
ఏదో పెద్దదెబ్బ కొట్టినాముకదా! చిన్నదెబ్బ లవశ్యముగాదని యుపేక్షించితినిగాని చేతగా
యూరకుంటినా? చింతచెట్టు కొట్టివానికిఁ జింతబఱికలులాగుట కష్టమా? చింతా
దూయుటకష్టమా? సరే! ప్రాతస్నాన మావశ్యకమని మనవైద్యులు సెలవిచ్చినారు. నే
వ్యతిరేకముగాఁజెప్పవలసినదేకాదా? సరే. ఇది సత్యముకాదు. ఉష్ణప్రదేశములలో బ్రా
స్నాన మారోగ్యప్రదము. కాని శీతప్రదేశములలోఁ బ్రాతస్నానము ప్రాణాపాయకర
అదిగాక–ప్రాతస్నానము కొందఱతత్త్వములకుఁ బడదు మాతాతగారికదేపద్ధతి. నా
నదేపద్ధతి. స్నానమే వదలుకొన్నయోగి వేయి సంవత్సరములు ఱాయివలె జీవించున
నీటికాకి పెడేమనునంతలోఁ జచ్చును. పాశ్చాత్యులందఱకు నిత్యస్నానములున్నవా
పక్షస్నానములైన నున్నవా? మాసస్నానములైన నున్నవా? వారు దీర్ఘాయుష్మంతులై యూ
గ్యవంతులైయుండలేదా? కావునఁ బ్రాతస్నాన మారోగ్యమున కావశ్యకముకాదు. స్నానవ
గూర్చి యిఁకఁ ద్రోచివేయవలసినదేనా? సరే. తాతాచార్యులుగారూ! రవంత నస్యమ
(పీల్చును)

టీగాని కాఫీగాని ప్రాఁగఁగూడదని వారు చెప్పినారు. ఖండించుటయే మనపని గావు
ప్రాఁగవచ్చునని నాసిద్ధాంతము. అవి ప్రాగుటచేతనే యారోగ్యము చెడినట్లు నేనెక్కడ
వినియుండలేదు. నేననేకులను గడవలకొలఁది కాఫీ ప్రాఁగినవారి నెఱుఁగుదును. వా
పిప్పళ్ళబస్తాలవలె నున్నారు. చెక్కుచెదఱులేక–జిట్టునఁజీదకుండ– తుసుక్కున తుమ్మకు
డ–నమృతముప్రాఁగిన యాదిత్యులవలె– నున్నారు. అంతమాత్రమునకే యారోగ్యవ

చెడదు. మానివేసినంత మాత్రమున రాదు. ఇది యిఁకను ద్రోసివేయునా? నరే. పంతులూ! ఇదిగో! (అని అధ్యక్షుఁడు ముక్కు చూపుచున్నాఁడు)

ఇఁకను రెండుపూటల సరియైనవేళకు భోజనముగూర్చి చెప్పదను. (శాస్త్రులూ! నాచేతిలోఁ బొడుముపట్ట కనఁబడకుండ నున్నది. ఇప్పుడు నేను బొడుము పీల్చినట్లే కాదా? అని రహస్యముగా నడుగును.) భోజనమునకు నిద్రకు వేళయేమి? కడుపులోని కఱకనుబట్టి సాపాటా? గడియారపు గదలికనుబట్టి సాపాటా? దీని కొకఁడు చెప్పనక్కఱ లేదు. ఒకసూత్ర మక్కఱలేదు. ఆకలియగునప్పుడు తినవలసినది. నిద్రవచ్చినప్పుడు నిద్రింపవలసినది. ఓ! ఇంతకన్న బాహాటమైన పద్ధతి లేదు. ఆలాగునఁ జేసినవాని కేరోగము నుండదు. వాఁడు సర్వవ్యాధి దిగ్విజయ మొనర్చును. ఇఁక నిదిసరి.

పొడుముకాని పొగచుట్టకాని తగదని వారు చెప్పినారు. ఇది లోకవిరుద్ధమైనమాట. దానికి లోనుగానివా రెవ్వరోకాని లేరు. దినమునకుఁ బలము వేఁబ్రోలుపొగాకు కాల్చి నూటయిరువదినంవత్సరములు జీవించిన వెలమదొరగారిని నే నెఱుఁగుదును. ఇట్లొకరా యిద్దఱా? దీనివలన నారోగ్యము చెడునన్నమాట స్వప్నవార్త, అసలు పిండపుష్టి యుండవల యును. జమునెమ్మిక నుండవలెను. అంతేకాని–నెలతక్కువ– పాలబీఱ–నిర్భాగ్యపు పెద్ద మ్మిలు చుట్టత్రాగుటవఱ కెందులకు? మజ్జిగత్రాగిననే చచ్చెదరు. మరికొందఱకు మజ్జిగ వర్జ్యమా? పీల్చినట్లే యున్నది. సూత్రమున కొక నబబు సందర్భ ముండనక్కఱ లేదా? ఇది యిఁక ద్రోచివేయవలసినదేకదా! పంతులూ! తిరుగ నిన్నడిగినయెడలఁ గోపమురాదు కదా! ఇదిగో రవంత! (పీల్చును) మనవైద్యుఁడు తనయుపన్యాసమునఁ జెప్పిన శాసముల న్నియు నిట్టివే. ఒక్కటియుఁ బరీక్షకాఁదగినది లేదు. ఇఁకను నాకుఁదోచిన యారోగ్యసాధన ములచెప్పెదను. ఇవి సిద్ధాంతవాక్యము లని నేను చెప్పెదను. మీయిష్టానుసారముగ మార్చు కొనవచ్చును.

మొదటిది:–(1) పెండ్లిచేసికొనఁగూడదు. ఇట్టివాఁడు తలపోటులేక–కడుపుమండ లేక–జాతివిగ్రహమువలె–నొడల ముడుతయైన లేక–నూఱేండ్లు జీవించును. అందులకు నాదిపూజ. (2) బుద్ధిలేక పెండ్లి చేసికొనినయెడల–భార్యపై నధికారము చేయఁదగదు. ఇట్టివాఁడు బట్టతలలేక–పండ్లు రాలిపోవుటలేక – యంతర్గతమైన యుష్ణములేక –గుండెలోగుబులులేక – యఱువది సంవత్సరములపఱకు జీవించుటకు నాదిపూచి.

రెండవది:– ఎట్టితగవులయినను నంధిమార్గమునఁ దీరుమానించు కొనవలయునే గాని కోర్టు కెక్కఁగూడదు. ఇట్టివాఁడు పార్శ్వపునొప్పి – పక్షవాతము–పరిణామశూల –మొదలగువ్యాధులు లేక యారోగ్యవంతుఁడై యెనుఁబది సంవత్సరములవఱకు జీనించను.

మూడవది:–జంజాట మెన్నఁడను వృద్ధిచేసికొనఁ గూడదు. ఎంత తగ్గించుకొనిన నంతమంచిది. ఇట్టివాఁడు మూర్ఛావ్యాధి జన్నియను సన్నిపాతవ్యాధి చమ్ఝవాతము జలోదరము మొదలగునవి లేక యారోగ్యవంతుఁడై తొంబది సంవత్సరములవఱకు జీవించును.

నాలుగవది:–కూలికి మాత్రము గ్రంథ మెన్నఁడను వ్రాయఁగూడదు. ఇట్టివాఁడు నక్కమోరు–నారకురుపు – నయనరోగము మొదలైన రోగములు లేకయెనుబది సంవత్సర ములవఱకు జీవించును.

అయిదవది:–పరస్త్రీని బ్రక్కచూపునఁ జూడఁదగదు. ఇట్టివాఁడు తిమ్మిరివాతము వీర్యనష్టము–కుష్ఠము–అండవాతము – పుంస్త్వహీనత మొదలగునవి లేక డెబ్బదిసంవత్సరములు జీవించును.

ఆఱవది:–లేదని యెన్నఁడను దేవులాడవలదు. ఇట్టివాఁడు అరిసెరోగము– అజీర్తి–గుండెబరువు – హృద్వ్యోగము మొదలగునవి లేక డెబ్బదిసంవత్సరములు జీవించును.

ఏడవది:–ఒకని కుండిపోయెనే యని యెప్పుడు విచారింపవలదు. ఇట్టివాఁడు కాలుసేతులు మంట–కార్లైములో పోటు–అంతరకుసుమము మొదలయిన వ్యాధులు లేక అఱువదిసంవత్సరములు జీవించును.

ఎనిమిదవది:–ఱేపటిమాట యేమి యని యోచింపవలదు. ఇట్టివాఁడు హృదయవ్యాధి పార్శ్వశూల–మూత్రకృచ్ఛ్రము మొదలగు వ్యాధులు లేక యరువదిసంవత్సరములు జీవించును.

తొమ్మిదవది:–పోయినదానినిగూర్చితలపెట్టవలదు. ఇట్టివాఁడు–కామిల– పాండుత్వ రక్తక్షయము–అపస్మారము మొదలగు వ్యాధులు లేక యఱువదివత్సరములు జీవించును.

పదవది:–దేవుఁడు రక్షింపఁడేమో యని భయపడవలదు. ఇట్టివాఁడు–విషూచి మహామారి–స్ఫోటకము మొదలగు వ్యాధులులేక యెనుబదివత్సరములు జీవించును.

మనహృదయవ్యాపారమును బట్టి యారోగ్య ముండును గాని తిన్నయన్నమునుబట్టికాని–త్రాగిన కాఫీనిబట్టిగాని – కాల్చిన చుట్టనుబట్టికాని–పీల్చినపొడుమును బట్టికాని – వేసికొవిన గంజాయియుండను బట్టికాని యుండదు. ఇవియన్నియు నిమిత్తమాత్రములు. ప్రధానమైనది. హృదయనైఖరి.

ఈపదిసూత్రములు–ప్రాతస్నానములకంటె – ప్రాణాయామములకంటెఁ– బదునాలుగురెట్లు – ప్రశస్తములు. కాని యేమిచేసినను నాయుర్విషయమై యారోగ్యవిషయమై కర్మసూత్రమునకంటె భిన్నముగా నెన్నఁడు జరుగదు. ఈసంగతి జ్ఞప్తియందుంపవలయును. ఆయుర్వృద్ధికి నారోగ్యవృద్ధికి మనకున్న మందులన్నియు గంగలోఁ బాఱవేయవలసినదే కాని కంటితోఁ జూడనైనఁ దగదు. ఎంతపరిమాణమో జంఘాలశాస్త్రీ! నేనింతకుఁబూర్వమునఁ జిన్నకాగితపుజేటిలోఁ బొడుముంచి పొట్లము కట్టితిని. నీవు చూచితివా నరే. (పీల్చును).

అయుర్వేదములో దిద్దుపాటులని యతఁడు చెప్పినమాటలున్నవే అవియన్నియు నవకతవకలు. ఆధ్వాన్నములు. అర్థహీనములు. అపరిశుద్ధములు. అవాచ్యములు. అన్మరణీయములు. ఏదో ముద్రాక్షరశాలకై చందాలు కోరినాఁడే–ఆచందా లెవ్వరు నీయవలసినవసరము లేదు. ఆతఁ డట్లు యువన్యాస మిచ్చినాఁడని యైన మీరెవ్వరితో ననవలదు.

''కాలాచార్యులసంగతియేమియుఁ దెలియకుండనున్నది. ఆతడేమి చేయుమన్నాఁడు'' అని యన్మదీయశ్రేమశ్రవణకుతూహలులై యొక బ్రాహ్మణవర్యుఁడు వొకవెలదొరగారును మఱియొకరును బెంటునాగులవలననుండి సాక్షికి లేఖవ్రాసినారు. మరిదియకు నేను మిగులఁగృతజ్ఞుఁడను. సాక్షిసంఘమునకు వచ్చినలేకలన్నియు మూఁడువేలలొకసారి 'స్వవిషయనల్లావములలో' జదువునాచారమునుబట్టి యాపెంటనాగులవలన లేఖకూడ నప్పుడే చదువఁబడునని యనుకొందును. నేనింకఁగూరుచుందును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

40. వైద్యుని లేఖ–ఆరోగ్యము

ఒక వైద్యుడు సాక్షి సంఘానికి ఒక ఉత్తరం వ్రాశాడు. మనిషి ఆరోగ్యంగా బ్రతకాలంటే ఏం పనులు చేయాలనేది ఆ ఉత్తరం సారాంశం.

నిజమాలోచిస్తే మనుషులకున్నన్ని రోగాలు పశువులకు లేవు. మనిషి కొత్త కొత్త వైద్య పద్ధతులు వ్యాప్తిలోకి తెచ్చేకొద్దీ కొత్త కొత్త రోగాలూ పుట్టుకొస్తున్నాయి. ఒక చిన్న వైద్యంకోసం వెళ్ళి–అంతకంటె వేగే పెద్ద రోగంలోకి మళ్ళి మరణిస్తున్నాడు. లేదా చావు తప్పి కన్ను లొట్టబోయి బ్రతుకుతున్నాడు. మనిషిలో రోగాలన్నీ బుద్ధిపూర్వకంగా తెచ్చుకొన్నవే.

మనిషికి పరిపూర్ణమైన ఆయుర్దాయం నూట ఇరవై యేళ్లని చెపుతారు.

మన దేశంలో మనుష్యుల్లో వ్యాధులు ప్రబలడానికి ముఖ్యకారణం అజ్ఞానం. ఆహార, విహారాలలో లోపాలు వల్ల వ్యాధులు సంక్రమిస్తున్నాయను కోరు. వ్యాధి రావలసి వుంది వస్తోంది–అనే సూత్రం మనకి అలవాటై పోయింది. ఇది ముఖ్యంగా స్త్రీలలో, అందునా ముసలివారిలో ఎక్కువ. మగవాళ్లలో చాలా మంది బుద్ధిపూర్వకంగా వ్యాధుల్ని కొని తెచ్చుకుంటున్నారు. రుచుల పేరిట ముఖ్యంగా శరీరాన్ని అనారోగ్యం పాలు చేసుకుంటున్నారు.

అన్నిటికీ మించి–అంటువ్యాధులు కేవలం మనిషి అజాగ్రత్త వల్ల, అపరిశుభ్రత వల్ల వ్యాపిస్తున్నాయి. చేతులు ఎంత పరిశుభ్రంగా ఎన్నిసార్లు కడుగుకుంటే అంత మేలు. దేన్నిపడితే దాన్ని తాకడం మంచిది కాదు. చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మీద మనిషి ఆరోగ్యం మూడు వంతులు ఆధారపడి వుంది. ఆపైన జాగ్రత్త పడవలసింది మనస్సు విషయంలో మానసికమైన బెంగలే చాలా వ్యాధులకు మూలం. కనుక దాన్ని స్వచ్ఛంగా ఉంచుకొనే ప్రయత్నాలు బుద్ధిపూర్వకంగా చేయాలని ఆ వైద్యుడు వివరించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

ఎవ్వఁడో వైద్యుఁడు సాక్షిసంఘమునకు వ్రాసిపంపిన లేఖను జంఘాలశాస్త్రి యిదివఱకే

చదువుచుండెను. అదివఱకేమి చదివెనో కాని నేను సభకుఁ బోయిన తరువాత నిట్లు చదువసాగెను.

"లెవ్వు–వాని కిన్ని రోగము లెక్కఁడివి? ఇంత చిత్ర విచిత్ర వ్యాధిసమూహము పశువుల కెక్కఁడిది? నరుఁడు తనబుద్ధి మహత్వముచే నిన్ని యపూర్వవ్యాధుల సంపాదించుకొనినాఁడనుట కేమైన నందేహమా? బుద్ధి రోగవృద్ధికే యుపయోగించినదా? సృష్టించిన వైద్యగ్రంథములు సృష్టించుచునే యున్నారు. వృద్ధియగుచున్న రోగములు వృద్ధియగుచునే యున్నవి. క్రొత్తరోగములకుఁ గారణముల నూహించుచునే యున్నారు. ఆ కారణములను నాశనమొనర్చుటకుఁ బ్రయత్నించుచునేయున్నారు. ఆ ప్రయత్నమువలననే క్రొత్తరోగములు పుట్టుచున్నవి. వీనిని తగ్గించుటకుఁ గ్రొత్తక్రొత్తవైద్యపద్ధతులు కల్పించుచున్నారు! ఆపద్ధతులవలననే యెన్నఁడెఱుఁగని వింత వింత రోగములు వందలు వేలు పుట్టుచున్నవి. నరుఁడీవెట్టియోజనలు కల్పనలు చేయక నోరుమూసికొని యుండిన యెడల ప్రపంచమున నింత రోగవృద్ధి యుండదేమో? పశువుల వలె నింతకంటె సహస్రగుణములైనయారోగ్యముగలిగినరుఁడు పథ్యపుఁదిండిలేక మాత్రమ్రింగుడు లేక కత్తికోఁత లేక నూదిపోటు లేక రవంత సుఖముగా నుండునేమో? మనుజునకు బుద్ధి యున్నంతకాల మట్లు నోరుమూసికొని పడియుండుట కవకాశమేది? వయసుచేతనో యేదైన ప్రమాదముచేతనో దంతము కదలుచున్న యెడల నింతలో యేమి పుట్టి మునిఁగినది? నాల్గుదినములు నోరుమూసికొని పడియుండరాదా? ఉహూ–అదికారుచే నూఁడలాగించుకొనువఱకొకటేతహతహ–తనంతఁ దా నూఁడిపోఁదలఁచిన దంతమునుగూర్చి నరునకీదౌర్జన్య మెందులకు? నరే. ఏతలమాసిన కంటిజోటి నోటిధాటి యవకతవక యపాతీకెరీ యొద్దకో పోవును. ఆ తొందరలో నతనిచేత జబ్బుపన్నుతో మంచిపన్నుకూడ నూఁడలాగించుకొని ముఖపక్షవాతమునకో మూర్ఛకో లోనగును. ముఖపక్షవాతమునకై సైన రాచిగాటగు మందులతోఁ గంటిలో నుడుకు బయలుదేఱి లోనివసము హరింపజేయును. ఇప్పుడైన సిగ్గుపడి లెంపలు వైచుకొని యాఁత డూరకుండునా? ఉహు. ఆయెండుకంటి కాపరేషను చేయించుకొనును. అందువలన నది పూర్తిగ లొట్టపడిపోవుటయేగాక తలతిరుగుడు, మెదటిలో నొకవిధమైనవిక్కితియుఁ గలుగును. దానివలనఁ ద్వరలో మతిపోవును. అది తగ్గుటకుఁ దలగొరుగుడని, నిమ్మకాయమర్దనలని, మృత్తికాస్నానములని, నస్యములని, యరదండములని, నంకెలలని, కొరడా దెబ్బలని యనుభవింపవలసిన యాపదలన్ని, యనుభవించి యంత మొందును. ప్రథమమందుఁ బన్నూడఁదీయించుకొని దాని పర్యవసానముగాఁ బ్రాణమును బోఁగొట్టికొనినాఁడు. వైద్యుఁడు పట్టుకారుతో లాగినది పన్నుకాదు ప్రాణమేయని నిశ్చయింప, దగినట్లు కనఁబడు చున్నది. ఇట్లీప్రపంచమందు నిమిసమున కొక్కఁడు బుద్ధిపూర్వకముగఁ దెచ్చుకొన్న మఱియేదో రోగపరంపరచేఁ జచ్చుచుండును.

నరునకుఁ బరమాయువు నూటయిరువది యని శాస్త్రములు చెప్పుచున్నవి కాని జనసంఘముయొక్క సాముదాయికాయుష్యము మిగులఁ దక్కువగా నున్నట్లు లెక్కలవలన స్పష్టమగుచున్నది. ఆరోగ్య శాస్త్రజ్ఞాన మాకాశమంటిన యాంగ్లేయదేశమందుఁగూడ సాముదాయకాయుఃపరిమాణము 45.5 అయియున్నది. అన్ని యారోగ్య శాసనముల నలక్ష్యము చేయుటయేకాక యనావశ్యకములని ప్రాగ్దిశనున్న బంగాళాఖాతములోను నపరది

ఁనున్న యరేబియా సముద్రములోను గట్టకట్టి పాఱవేయ సంకల్పించుకొన్న యార్యావర్తదే
శమున నాసాముదాయికాయుర్మితి యెట్లున్నదో విందురా? ముప్పదియో ముప్పదికిఁ
బక్కువయో యున్నది. మనకట్టి యారోగ్యశాసనోల్లంఘన మెందులకుఁ గలుగవలయునో!
శరీరారోగ్యశాసనము నటుంచుఁడు. మనలో స్వభాషనైనఁ జదువుకొనినవా రెందరున్నారో
మాచితిరా? నూటికిఁ బదివంతుచొప్పున నున్నారు. మూర్ఖులలోఁ దొంబదుగుఱు కక్షరజ్ఞా
నమే లేనప్పు డారోగ్యశాసనజ్ఞానమెటనుండివచ్చును? రోగము వచ్చినప్పుడు చచ్చిపోవుదు
మేమో యని విచారించుచున్నారు. రోగము పోయినప్పుడు యథాపూర్వకముగాఁ బ్రవర్తిల
ఁచున్నారు. రోగము తనంత తాను రావలసివచ్చియుండెను కాని యారోగ్యశాసనోల్లంఘన
మున వచ్చినదని వారి కూహమేలేదు. ఉడికియుడుకని పప్పు తినినందువలన నాతనికిఁ
గడుపునొప్పి వచ్చినదని నీ వెవనితోడ నైనఁజెప్పినను వండినప్పంతయు నాతఁ డొక్కఁడే
తినెనా యనియు మిగిలినవారందఱు తినలేదా యనియు నందఱకుఁ గడుపునొప్పి రాక
యాతనికి మాత్రమే యేలరావలయుననియు నుడుకని పప్పునకుఁ గడుపు నొప్పికి సంబం
ధము లేశమాత్రమునులేదనియు నట్టి సంబంధమున్నదని తలఁచువారందఱు పరమమూ
ర్ఖులనియు రావలసివచ్చినప్పుడు కడుపు నొప్పి రాకతీఱదనియు నతఁడు నిన్నుఁ
దలవాచునట్లు మందలించును. ఆవకాయ తినందువలనఁ గాకచేయలేదు. కాకచేయవలసి
కాకచేసినది. వేఱుసెనగకాయలు చెడ దినినందువలనఁ బైత్యము చేయలేదు. పైత్యము
చేయవలసి చేసినది. తినఁగూడని యన్ని వస్తువులు తినినను దినఁదగినవస్తువులన్నియు
మితిమీఱి తినినను, జేయవలసిన పనులు వేళకుఁ జేయకున్నను, జేయఁగూడనిపను
లెన్నిచేసినను వ్యాధి వచ్చుటలేదు.. వ్యాధి రావలసి వచ్చుచున్నది. ఈసూత్రమునకు
మినహాయింపు లేదు. ఇట్టి యభిప్రాయముగలవా రనేకులున్నారు. వీరిలో స్త్రీలధికముగా
నున్నారు. మఱి వారిలో మునలివారు ప్రబలసంఖ్య గలవారై యున్నారు.

ఇదిగాక విద్యావంతులైనను ననూచానముగ వచ్చుచున్న యాచారముల మీఱలేక
కొందఱువ్యాధిని గొని తెచ్చుకొనుచున్నారు. వారిలోను స్త్రీ లధికసంఖ్యగలవారే. ఏక
భుక్తియగు శనివారమున సాయంకాలమం దుప్పిడిపిండియో మినుపరొట్టియో తిని మఱునా
టికి గుండెబరువుతోఁ దలనొప్పితోఁ గడుపుపీకుతో విలవిలలాడుచున్నారు.
నాగులచవితినాఁడు పచ్చచలిమిడి చిమ్మిలియుండలు తిని యారాత్రి నుండియే గ్రహణివలనఁ
బదునైదుదినములవఱకు బాధపడి చావుతప్పి తేలుచున్నారు. తీర్థయాత్రలకై బోయి
దారిలోఁ బచ్చిపులుసు మెదుకులు పచ్చిపెసరపప్పు పచ్చడి పగలు మూఁడుగంటలకుఁ దిని
వాంతులకు భేదులకు లోనై యమదర్శనము తరువాయిగా నన్నికృత్యములు నెఱవేర్చుకొను
చున్నారు. ఈకారణమువలన మనవారిలో ననేకులు బుద్ధిపూర్వకముగ నారోగ్య శాసనోల్లం
ఘనమును చేయుచున్నారు. అందువలనఁ గలిగిన రోగములచే ననేకులు మరణించుచు
న్నారు. మరణించినవాఁడైనను రోగముచే మరణింపలేదనియు మరణింపవలసియే
మరణించినాఁడనియు మనవారు సిద్ధాంతీకరించుచున్నారు. మృతి తత్త్వ నిర్ణయమును
గూర్చి విచారణ మిప్పుడక్కఱలేదు. ఎటులైనను బుద్ధిపూర్వకముగనో యబుద్ధిపూర్వక
ముగనో యారోగ్యశాసనము లుల్లంఘింపఁబడుచున్నవి. ఏకారణములచేనైననేమి? అనేకవిధ
ములగు రోగములు నరులలోఁ గలుగుచున్నవి. ఈరోగములు పశుజాతిలోఁగల్గు రోగముల
కంటె సంఖ్యలో హెచ్చు తీవ్రతలో హెచ్చు విచిత్రతలో హెచ్చు. వ్యాప్తిలో హెచ్చు నాశనశక్తిలో

హెచ్చు. ప్రజారోగములకీ బహువిధ ప్రాబల్య మేల కలిగినదో రవంత పరిశీలింతము పక్వములైన ఫలములను భుజించి పరిశుద్ధమైన యుదకమును మాత్రమే త్రావి మనుజుఁడ బహు సుఖముగా బ్రాణయాత్ర జరుపుకొనఁగలఁడు కాని–మనుజుఁ డట్టిసామాన్యాహా ముతో సంతుష్టినంది యుండఁగలఁడా? ఉహు భగవత్ప్రసాదితమైన బుద్ధిని బశువులకంటె నదనముగాఁ గలిగి యున్నవాఁడు కావున నాబుద్ధిని బశువులకంటె నదనముగాఁ గలి యున్నవాఁడు కావున నాబుద్ధిని బొడిచి పొడిచి యుపయోగపఱచి యాహారమును సాధ్యమై నంతరుచిమంతముగా నుండునట్లు చేయుటకుఁ బానీయమును సాధ్యమైనంత యాస్వాదన యోగ్యముగ నుండునట్లు చేయుటకు మఱింతయాహారమును దినుటకు మరింతపానీయ మును ద్రావుటకుఁ బరిపూర్ణప్రయత్న మొనర్చును. చిత్రవిచిత్రములైన రుచులు చిత్రవిచిత్ర వస్తునమ్మేళనమున నుద్భవింపజేయుట కుత్సహించును. చిత్రవిచిత్రాతివిచిత్ర మహావిచిత్ర ములైన రుచులు గలిగించుటకు బుద్ధి కెన్నికల్పనలునెంత పాత్రౌచిత్యము నెంతభావగాంభీ ర్యము నెంతయర్థశైద్యము నెంత కవిత్వ వైచిత్యము వ్యాకరణశాస్త్రముకంటెఁ దర్కశాస్త్ర ముకంటె వేదాంత శాస్త్రముకంటె ముందుగాఁ గల్పింపబడిన దేశశాస్త్రము? పాకశా స్త్రము భగవద్గుణానుసంధానమునకయి యాయఁబడిన బుద్ధి? ప్రప్రథమమ్మునఁ బ్రధా ముగా నెందులకు వినియోగింపబడినది? పొగపు సొగసునకు; మసాలామజాకు–తిరుగబోఁత పరిమళమునకు.దేవునికయి యుపయోగపడవలసిన బుద్ధి తిండికయి యుపయోగపడుచు న్నది. ప్రార్థనచే నిండవలసిన నోరు పన్నీటి మిఠాయిచే నిండుచున్నది. మహాదేవశంభూ యని పలుకవలసిన నోరు మసాలాపకోడీని మ్రింగుచున్నది. పార్థివలింగ పూజచేయవలసిన చేయి పరమాన్నమును బావుకొనుచున్నది. వడలలోఁ గొత్తిమిరెము, కాకరకాయపులుసులో నీరుల్లిపాయ, పనసకాయకూరలో నావ, కోడిగ్రుడ్డట్నులో జీడిపప్పు, ఆవకాయలో నూఁబిండి, వాసెన తెలకపిండిలో వెల్లుల్లి, కందబూరెలలో పలావుమసాలా, ఇట్లే ఒకటా? ఒక విధమా! వందలు వేలు, ఇన్ని చిత్రకల్పన లెందులకు? జుఱ్ఱున నోరూరుటకు–గట్టున గడుపునింపుటకు–బట్టునఁ ద్రేచుటకు. ఇన్నిపనికిమాలిన వస్తువులు, నరముల కుద్రేకము లిగించు నిన్నిగాటువస్తువులు, గిట్టునఁ గన్నీరుకలిగించు నిన్ని కారపువస్తువులు రోగముల కలిగించుట కాశ్చర్యమేమి? నీకుఁగలిగిన కన్నీ ళ్లానందముచే వచ్చినవి కావనుట నిష్టమే కదా? ఏడ్పుచే వచ్చినపని యెఱింగియుండియు నింక నాయేడుపే యేడువనేల? అన్నభా మయిన యాగాటునకు, ఆబాధకు-ఆపొగరునకు-ఆక్షౌరమునకు-ఆకొఱ్ఱునక -ఆగొట్రునకు నీబుద్ధివిశేషముచేత నీ వలవాటువడియుంటివి. కావున నీ కాయేడ్పుకూడ నలవాటయినది. ఆచారిమయినది. సహజముకూడ నైనది. సంతతాభ్యాసమువలన నేడుపే డుపుగాఁ దోఁచుటలేదు ఎన్ని బాధలయినఁ బడి యెన్ని యేడ్పులైన నేడ్చి చేయవలసిన దేమి? గొంతుముడివఱకుఁ దినవలయును. అంతకంటెనేమిపని? అదియైనతరువాత నే యన్ని వన్నెలు చిన్నెలు కాంతాలోలుడు శక్త్యుత్సాహవర్ధకముగా గంజాయియుండనో వల్లమందునో వేసికొనినయెడల నాతని మీరేమనుచున్నారు. తుచ్ఛుఁడనుచున్నారు. చిత్తక ర్తెకుక్క యనుచున్నారు. వాఁ డట్టివాఁడైనప్పు డధికరుచి కొఱకు నత్యాహారముకొఱక మెంతపెరుగులో నావముద్ద కలిపిన వాఁడు మాత్ర మెవఁడు? చేరులో రొయ్యపప్పు కలిపినవాఁడు మాత్ర మెవడు? పకోడీలో గైమా కలిపినవాఁడు మాత్రమెవఁడు? వాఁడెవఁడో వీఁడు కూడ నట్టివాఁడే నారీసుఖాధికతకొఱకు (Nux Vomica) వేసికొన్నవాఁ డెట్టివాఁడో

పెసరట్లుపలావులో వెల్లుల్లి మసాలా వేసికొన్నవాఁ డట్టివాఁడే వెల్లుల్లిపాయలు నూరి కాళ్లకు రాచికొనునెడలఁ గాళ్లు పెక్కులెక్కినవి గదా! అవి కడుపులోనికి వెళ్లిన పిమ్మట నీ మొగము చూచి నీ తండ్రిబిళ్లకచ్చఁ జూచి నీతాతకుండలములు చూచి నీకు రోగము కలిగింపకుండ నూరకుండు ననుకొంటివా? అశన విషయకకల్పనా వైచిత్రిచే ననారోగ్యము జనులలో ముఖ్యముగా సిద్ధించుచున్నది. ఇది మనము బుద్ధిపూర్వకముగఁ దెచ్చుకొనుచున్నది కాని యది రావలసివచ్చినది కాదు.

తరువాత ఏదోవృత్తిచేసికొనకుండ మనుజునకు జీవయాత్ర గడచునా? ఈవృత్తులలో ననేకములు రోగములు జేయునవి కుట్టుపని వానికి గూను, గుఱ్ఱపుసవారునకు మూలశంక, మూవటీనికి గుండెదడ, ఱాలు చెక్కువానికి క్షయ, ఉత్కంఠగాయకున కుబ్బసము, వణిజునకండనాతము, మోటారు నడుపువానికి నేత్రోష్ణత, వైద్యునకు సాంక్రామిత వ్యాధి, కవిత్వము చెప్పువానికిఁ బిచ్చి, వాచిపనివాని కంతరకుసుమము; మటీయొకనికి మటీయొకటియుఁ దఱచుగా సిద్ధించును. ఇదిగాక ప్రభువులయెదుట చాలసేపు నిలువఁబడి వారి సెలవులేకుండఁ గదలుట కవకాశ మెంతమాత్రములేని భటులకు మూత్రపుపురీషవిసర్జనము లావశ్యకమయినపుడు లేకపోవుటవలన గర్భాశయ రోగములు నాంత్రనాళ రోగములు మూత్రకోశ రోగములు కలుగును. రాజుగారి వదాన్యతచేఁదనకు సిద్ధించిన వస్త్రములు కంఖాణములు కాంచనము నొక్క సంవత్సర ములో నెగిరిపోవును గాని తన లోభమునఁ దనకు సిద్ధించిన కీళ్లవాతము మూత్ర కృచ్ఛ్రము మందాగ్ని చచ్చినదాఁక నిలచియుండను. నీవు రాజసేవలో సంపాదించుకొనినది బుజముమీఁద సాలువే కాదు, వీఁపుమీఁది రాచపుండు కూడను.

ఇక మటీయొకటి. మేజువాణీలమూలమున నర్కులమూలమున నాటకముల మూలమున సినీమాలమూలమునఁ బడుచుభార్యల మూలమున రాత్రులు చాలసేపు మేలు కొని యుండువారికి రోగముల కభ్యంతరమేమి? కన్ను మూయవలసినప్పుడు తెఱచినను రోగమే. తెఱువవలసినపుడు మూసినను రోగమే. కంటితోఁ బీకులాట మాత్రము గట్టిదను టకు సందేహమా!

తరువాత సాంక్రామిక వ్యాధులను గూర్చి రవంత చెప్పవలసియున్నది. ఇవి స్ఫోట కము విషూచి గ్రహణి ఆంత్రజ్వరము మొదలగునవి. చేతులు పరిశుభ్రముగాఁ గడుగుకొనక పోవుటవలన నెన్ని సాంక్రామిక రోగములైన సంభవించుచున్నవి. చేతులిట్టియట్టినీటి పాత్రలోఁ బెట్టి కడుగుకొనిన లాభములేదు. ధారావంతమైన నీటిలోఁ గట్టిగఁ గడుగుకొనవల యును. గోళ్లసందు లెంతచాందసముగఁ గడుగుకొనిన నంత మంచిది. మొదలుగోళ్లు లేశమైనఁ బెరుగనీకుండఁ దఱచుఁ దీసివేయించుకొనుచుండవలయును. సందేహాస్పదమైన వస్తువును గూడఁ దాకఁగూడదు. కర్మముచాలక తాకుట తటస్థించునెడల నాచేతులతోఁ దలగాని పెదవులుగాని వస్త్రములుగాని తాకకుండ వెంటనే చేతులను గడుగుకొనవల యును. చేతులను గడగికొనుటకుఁ బిండికంటెఁ గుంకుడుకాయకంటెఁ బరిశుద్ధమైనమట్టి బహు ప్రశస్తము. దోషము నాకర్షించుకొని తనయం దిమిడ్చుకొనుటలో మట్టివంటిది మటీయొక్కటి లేదు. సమస్తదోషభోగ్యత్వగుణము మట్టిలో నున్నది. మనవారి మృత్తికా స్నానములు నిరర్థకములు కావు. నీటికాకిమున్కలు కావు. మట్టితో నిప్పు డనేకవ్యాధులు

కుదిర్చుచున్నారు. ఈయంశమును గూర్చి యిప్పు డింతకంటె నక్కఅలేదు. సాంక్రామిక వ్యాధులవలని జననాశనమునకంతకును ముఖ్యకిచేతులే మూలకారణము. అపరిశుద్ధ హస్తము లాచరించుచున్న జననాశన మగ్ని పర్వతములైన జేయఁజాలవు. అవనీకంపములైనఁ జేయఁజాలవు. ఏదియో యొక్క సాంక్రామికరోగమును గూర్చి రవంత యోజింతుము. టైఫాయడ్ జ్వరము (ఆంత్రజ్వరము) గూర్చి యోజింతుము. ఈజ్వరము సాధారణముగా మృగశీర్షా ప్రవేశమైన పిమ్మట నారంభమై అనఁగా జూనునెల చివర నారంభమై అక్టోబరు చివరవఱకుండును. అన్ని విధములైన యంటు రోగముల కిదియే ప్రధానసమయము. ఈజ్వరము కూడ నన్నిటివలెనే యన్నపానాదుల మూలమున సర్వసాధారణముగా వ్యాపించును. పాలు పిదుకుటను గూర్చి బహు శ్రద్ధవహింపవలయును. పాలు పిదుకువాడు తన చేతులను మట్టియో పేడయో పెట్టి ధారోదకమున బహు జాగ్రత్తగాఁ గడుగుకొనినపిమ్మటఁ గాని పిదుకుట నారంభింపఁ గూడదు. ఈజ్వరసంబంధమైన సూక్ష్మక్రిమి పాలలో బహుశీఘ్రముగా వ్యాప్తిచెందును. పాలు పైకిఁ బరిశుభ్రముగా నున్నను దానిలో విషక్రిములు బహుళముగా నుండి ప్రాణముల కపాయకరములై యుండవచ్చును. ఒక గొప్ప వైద్యుడు పరిశోధించి యిట్లు వ్రాయుచున్నాఁడు. "బహుపరిశుభ్రమైన పాలలో 78 సూక్ష్మక్రిము లున్నవి. అవి యిరువది నాల్గు గంటలలో 60000 అయినవి. 48 గంటలలో 10300000 అయినవి. ఏడు దినములలో 480000000 అయినవి. అంగళ్లలోని మిఠాయి మొదలగు పదార్థములు గాని వీధుల వెంట నమ్మఁబడు పెసరపుణుకులు నావడలు మొదలగు వస్తువులు గాని రుచిచూడఁగూడదు. సరేకదా తాకనైనఁ గూడదు. అనేకులు భుజించుచున్న యన్నసత్రములలో నొకనిగుడ్డ కాని, యొకని చెంబుకాని యొకనిపీఁటకాని యెంతమాత్ర మును స్పృశింపఁగూడదు. అచ్చటనున్న పుస్తకములుగాని కాగితములుకాని తాకఁగూడదు. అద్దెమోటారుబండ్లు కాని ట్రామ్‌బండ్లు కాని స్పృశింపరాదు. గొప్పగొప్ప షాపులలోని మేడమెట్లెక్కవలసి వచ్చినప్పుడు మెట్ల ప్రక్కనున్న కటకటాలు తగులకుండ వానిమీదఁ బ్రమాదవశమునఁ జేయివైవకుండ బట్టచెంగైన వానికిఁ దాఁకనీయకుండ నెక్కవలయును. ఇన్ని మాటలేల? ఈచేయి ముట్టుకొని యాచేయి కడుగుకొనవలయును. ఆచేయి ముట్టుకొని యీచేయి కడుగుకొనవలయును. ఈవిషయములందెంత భద్రముగఁ బ్రవర్తింతురో యంతక్షేమము. ఈశాసనము లుల్లంఘించువాఁడు సంఘమునకెల్ల ద్రోహి. ఒక్కని యజాగ్రత్త మూలమున నొక్కపట్టణము నాశనము కావచ్చును. ఒకనియన్నములోఁ బాషాణము కలిపినవానికి ద్వీపాంతర శిక్షయో మరణశిక్షయో యగుచున్నది. పాషాణము పెట్టినవాని పాపమువలన నొక్క ప్రాణమే పోవుచున్నది. కానీ పరిశుద్ధినొందని చేతులు గలవాని పాపమువలనఁ బదివేల ప్రాణములైనఁ బోవుచున్నవి. ఇది యెంత మహాపాపమో యోజింపుడు. దీనికేమి శిక్షయున్నది? ఏమియు లేదు. ఇక్కడ లేనంత మాత్రమున నక్కడలేదని యెవరు చెప్పఁగలరు? సందేహాస్పదమైన వస్తువేదియు స్పృశింపనే కూడదు. అనేక కుటుంబపోషణధురీణులగు మహారాజులు సొమ్మును స్పృశింపనే కూడదని చెప్పుదురు. ఇది యెంత దివ్యశాసనమో! దీనిలో నెంతగంభీరార్థమున్నదో! ఎంత ప్రకృతి శాస్త్ర రహస్యమున్నదో! డబ్బుకంటె దేశసంచారి ప్రపంచమున గలదా? స్నేటకపువాని తలక్రింద దిగదుడుపుగఁ బెట్టిన రూపాయ సోదెచెప్పు మాదిగవాని చేతిమీఁదుగా గేదెతామరగల కోమటివాని గళ్లాపెట్టెలోఁ బడి యటనుండి పాదపూజాదక్షిణారూపముగాఁ బరమహంసగా

రిచేతఁ బడి యాతనియొద్దఁ గుష్ఠరోగమునకై మందుపుచ్చుకొనుచున్న వేశ్య కుందరదన రొంటనుబడి యటనుండి యంతకంటె నేహ్యమైన మఱియొక్క చోటికిఁ బోయి యొక్క నిముసమైనఁ గాలు నిలువక దిమ్మదిరుగు డబ్బు నూరేండ్లు నిరుపద్రవముగా బ్రదుకవలసిన యనేక సహస్రకుటుంబపోషకుఁడగు నవనీధవుని హస్తమునఁ బడవచ్చునా? సమస్తసాంక్రామిక రోగములను వృద్ధిచేయుటలోఁ బైసవంటి పనికి మాలిన పదార్థము ప్రపంచమున మఱియొక టేది? అట్టిడబ్బు నెవరికైన దాన మీయవలసి వచ్చినప్పుడు ధారాపూర్వకముగ నేల యీయవలయునో యిప్పుడు తెలిసినదా? నరునిపాపము లాతనిధనము నాశ్రయించి యుండునని పెద్దలు చెప్పినమాట నిరర్థకమైనది కాదు గదా? ధారావంతమైన యుదకమునఁ జేతులు కడుగుకొనకుండ నేపనియుఁ జేయఁగూడదని యిదివఱకుఁ జెప్పియుంటిని. మనకు సాధారణముగా వంటచేయు నౌకరు లెంతయపరిశుద్ధులో యెంత ముఱికివారో యెంత యెడ్డివారో యెంత దుర్గంధభూయిష్ఠులో చెప్పవలయునా? వంటయిండ్లు వడ్డనసాలలకుఁ గొంతచాటుగ నుండుటచే నౌకరుల నుంచుకొన్న భాగ్యవంతులు బ్రదుకుచున్నారు. కాని వాంతిభేదులతో వారము దినములలోఁ బరమపదింపవలసినదనుట కేమైన సందేహమా? డాఁకలో బడు చేఁపను జూతిపై నఱుగఁదీసిన ట్లీవంటవాండ్రను మన్ను గొబ్బెర పీఁచుతోఁ బడఁదోమించిన పిదపఁగాని వారిని వంటశాలలలోనికిఁ బోనీయఁదగునా? గోళ్లలో మట్టి యుంచుకొన్న Cook ను గోదావరిలో వారముదినములు నానఁబెట్టినపిమ్మటఁ గాని ప్రాయ్యియొద్దకు రానీయఁగూడదే. ఇద్దఱుసాహేబులు చెఱియొక పళ్లెరములోని వంటక మును భుజించినపిమ్మట వారివంటవాం డ్రాపళ్లెరములను వంటగదిలోనికిఁ దీసికొనిపోయిరి. ఆ పళ్లెరములను గడిగి వేఱొక పదార్థము వానిలో నుంపవలసియున్నది. ''జల్దీజావ్'' అని యింతలో ముసలిమానులు కేకవైచిరి. ఆ పళ్లెరములను మంచితీర్థమునఁ గడిగి యార్చి వానిలో నూతన పదార్థములను బెట్టుటకు వ్యవధి చాలక తుబుక్కున నాపళ్లెరములలో నుమిసి గుడ్డతోఁ దుడిచి క్రొత్తవంటకముల వానిలో నుంచి తీసికొనిపోయిరి. ఆహాహా! ఎంత దారుణకృత్యమో! ఇంతకంటె మహాఘోరకృత్యములు మీవంటయింటిలో జరుగుచున్నవి. చెప్పఁదగదు సరికదా! స్మరింపనైనఁ దగదు. అట్టివారివలన నాంత్రజ్వరవ్యాధి వృద్ధియై వ్యాపించుననుట కేమైనసందేహమా? బాధ్యత ప్రేమలేని నౌకర్లచే పండించుకొనుట కంటె స్వస్త్రీలచే వండించుకొనుట సర్వోత్తమము కాదా? వారైనను స్నుస్నాతలై యత్యంత జాగరూకతోఁ జేతులను గడగుకొని వంట చేయవలయును. పచనకాలమం దాచేతులతో నే వస్తువును స్పృశించిననైన సరే దిరుగఁ జేతులను భద్రముగఁ గడిగికొనవలయును. పుణ్యస్త్రీలకుఁ దఱచు శిరస్నానమున కవకాశములేని హేతువున వితంతువులే పగలు వంటచేయుట యాచారమైనది. నౌకరులచేఁ గాక భార్యచేతనే తములపాకులు చుట్టించుకొన వలయును. ఆమెయైనను వానిని జుట్టునప్పుడు ప్రేళ్లతోఁ దలను గోకికొనకుండునట్లు చెప్పవలెను. ఎంతభద్రముగఁ బ్రవర్తింతురో యంతమంచిది. ఎంతతఱచుగఁ జేతులు కడిగికొందురో యంతమంచిది. ప్రాణముతోఁ జేరినపని. బద్ధకము వలదు. అలక్ష్యము తగదు. అశ్రద్ధ పనికిరాదు.

ఆంత్రజ్వరము వచ్చి కుదిరినవా రయిదు మొదలుకొని దాదాపుగఁ బదివారములవఱకు తద్వ్యాధి నితరులకు వ్యాపింపచేయుటకుఁ జాలియుందురు. నూర్గురిలో నయిదుగురివ్యాధిని బ్రతికియున్నంతకాలముకూడ వ్యాపింపజేయుదురు. వారు చచ్చిన పిమ్మటఁగాని

వారి వ్యాపనశక్తి పోదు. ఆజ్వర మంత భయంకరమైనది. దానివిష మంత ఘోరమైనది. దానిపట్టంత ప్రబలమైనది. నీటిలో ముంచనిచేతులు ప్రజలకొంప లెంత ముంచుచున్నవో యూహించుకొనునంతటి తెలివియెవ్వరికో కాని లేదు. మనవైద్యులలోఁ గొందఱు రోగి చేయి చూచి తమచేతిని నేలపై టక్కు టక్కునఁ గొట్టుదురు. ఆమాత్రమునకే యాసూక్ష్మజీవులు క్రిందఁ బడిపోవునని వారినమ్మకము. మఱికొందఱు చేతులు గడిగికొందురు. చేతులు గడిగికొనుటయే శిష్టాచారము. రెండవది రెండవపక్షము. చేతులుగడుగుకొనకుండఁ జేయి చూచునట్టియుఁ జేయిచూచి చేతులు గడిగికొననట్టియు వైద్యుఁడు ప్రత్యక్షయమదూత. కరము లిట్లు తఱచుగాఁ బరిశుద్ధపఱచుకొను సదాచారము తల్లిదండ్రులు పిల్లలకుఁ జిన్నతనమునుండియే బోధింపవలయును. కొంతకష్టమైన యాచారమయ్యును ప్రాణసంరక్షణముతోఁ జేరినదగుటచే దానిని వారిచేఁ యభ్యసింపఁజేయవలయును. అంత మహాధికావసరము కలిగినప్పుడు కాని యొకరినొకరు ముట్టుకొనఁదగదు. మనలో నొకరి నొకరు చూచుకొనుట సిద్ధించినప్పుడు చేతులు జోడించుకొని యన్యోన్య నమస్కార మాచరించుకొందురు. ఇట్టి సదాచారము మనలో నుండగాఁ బాశ్చాత్యులలోని కరచాలనమర్యాదను మనవారు పరిశీలనహీనులై యనుకరించుచున్నారు. పాశ్చాత్యులలోని యాకట్టుపాటు శాస్త్రీయ మెంతమాత్రమును గాదు. ఈకట్టుపాటెందులకు నిరాకరణీయమో మీకిప్పుడు తెలియకపోదు. స్వకీయసదాచారమును వదలుటలోఁ బరకీయదురాచారములను బైన వడవే సికొనుటలో మనవారియంత మహాశూరులు మఱెవ్వరు? ఎంతసేపు మనది గొడ్డు గేదె పై వానిది కామధేనువు. మనకు చీకు, పైవానిది చేవ. మనది యంట్లకుండ, పై వానిది యపరంజికుండ. ఇట్టి దుర్బుద్ధిచేతనే కాదా మొదటినుండియు సరస విధిసమంజసమైన జాతీయత్వమును జంపుకొంటిమి. మనదేశమునకుఁ దగిన, మనజాతికిఁ దగిన, మనకాల మునకుఁ దగిన బట్టకట్టు మనవారు మనకేర్పాటుచేసియుండగాఁ గ్రమ్మదలకుఁ గ్రమ్మదల గాలికిగాలి అవసరకృత్యముల నిర్వహించుకొనుట కత్యంతమైన సులువు, నగ్నిభయము కలిగినవెంటనే యట్టె యొక్కయూపుతో నూడఁదీయుట కవకాశమున్న బట్టకట్టు మన వారు మనకేర్పాటుచేసియుండఁగా John గారిని జూచి బొంతయరఁటికాయ పోలికగాఁ బంట్లముతో సిద్ధపడిన నిన్నేమనఁదగినదో తెలియకుండనున్నదే–సంవత్సరమున కయిదు మానములు 114కు దాఁటి నూటికి దిగని మహోష్ణతచే మరగి మంగలములో మాడిపోవు చున్న నీకీబుజముల మీఁదినుండి బిగించిన తోలుపటకాలతో నున్న ప్లానలుపంట్ల మెందు లకో యను కాసంతయైన చింతఁ గలుగకపోవుట నీపూర్వులగు మహర్షుల మహాపాపముగాని మఱియొకటియా? ఇప్పుడిప్పు డేదో రవంత ప్రక్కగాలి తిరిగినది కదా కొయ్యలెత్తి చాపలం కారించి మొఱ్ఱాబిగించి కాపుదలకొఱకు డమాను చేత వదలుగాఁబట్టి ప్రవాహమున కెదురె క్కుటకుఁ బ్రయత్నింపగాఁగా–ఇదేమి కర్మమో! ఇదెంతమహాపాపమో! ఇదెంత ప్రారబ్ధమో పడవ కెక్కడఁ జూచినఁ దూటులే–ఎక్కడఁ జూచిన బీఁటలే–బ్రాహ్మణాబ్రాహ్మణైక్యమును బెద్దసురంగము పడవమోర్జాలోఁ బడినప్పు డీజాతి మునిగి పోవలసినదే కాని యింకఁ దేలుట కేమైన నాధారము కనబడుచున్నదా? సాక్షిగారూ! మీరీయంశమును గూర్చి యనేకపర్యాయ ములు ప్రశంసించి యున్నారు. ప్రాసంగికవశమునఁ జెప్పితిని మీకంటె నెక్కువసాగనుగాఁ జెప్పగలనని చెప్పియుండలేదు, క్షమింపుడు.

ఇదిగాక–రోగముల కారోగ్య శాసనోల్లంఘనముకంటె వృత్తి భేదములకంటె, వ్యవన

ములకంటెఁ బ్రధానకారణమైనది. మనస్సు. సంతతచింతయే సర్వరోగములకుఁ గారణము. భర్తలకు భార్యలను గూర్చి బెంగ, భార్యలకు భర్తలను గూర్చి మఱింతబెంగ; తండ్రికిఁ గొడుకుల బెంగ, కొడుకులకుఁ దండ్రిబెంగ; కొడుకుల విషయమై కోడండ్ర బెంగ, కూతులను గూర్చి యల్లుర బెంగ; చావకుండనున్న ముసలివారిని గూర్చినబెంగ, చచ్చినప డుచువాండ్రను గూర్చినబెంగ, ఉన్నదానితో సంతుష్టిలేని బెంగ, లేనిదిరాలేదని బెంగ, మఱియుఁక నెందులకో బెంగ, అప్రుతీర్పలేని బెంగ, ఇఁక నెందులకో బెంగ, ఆస్తిదాఁచలేని బెంగ, అప్రుతీర్ప లేనిబెంగ, ఇఁక నెందులకో బెంగ, మఱియుఁక నెందులకో బెంగ, ఎన్నియని చెప్పగలను. ఇన్ని బెంగలుగల నీమనస్సు నాల్గుచూరలంటుకొన్న పూరికొంప లాగునఁ దెమలి మండను మండక, యూఁపిపోను నాఁపిపోక, రాజిరాజి కుమిలికుమిలి లోలోపలనే కాలికాలి యొక్కొక్క ప్రక్కనుండి కూలికూలి యేడ్చుచుండఁగా నీకుఁ బార్శ్వశూల యాశ్చర్యమేమి? పక్షవాత మాశ్చర్యమేమి? జ్వరమాశ్చర్యమేమి? జలోదర మాశ్చర్యమేమి? అక్షిరోగ మాశ్చర్యమేమి? అండవాత మాశ్చర్యమేమి? నీకు జ్వరమువచ్చి టచేత నీవు లంఘనములు చేయుచుండుట లేదు. నీవు లంఘనములు చేసిన హేతువుచే నీకు జ్వరము వచ్చుచున్నది. తెలిసినదా? నీకు మందాగ్నిచే నిద్రపట్టక పోవుటలేదు నిద్రపట్టకపోవుట చేతనే మందాగ్నిరోగము సిద్ధించినది. తెలిసినదా? హిక్కారోగముచేత నీవేడ్చుటలేదు. ఎప్పుడు లోలోన నేడ్చుటచేతనే నీకు హిక్కారోగము వచ్చినది తెలిసినదా? మీరోగములు మీరు కుదుర్చుకొనవలసినదే కాని మీకు ధన్వంతరియైన మూట దక్కునట్లు మందీయలేఁడు. మీ రోగములకు భగవద్గీత బ్రహ్మసూత్రములు పనికివచ్చును గాని బాహాటము బసవరాజీయము పనికిరావు. మీరోగములు కుదర్పగలవారు వేదాంతులుగాని వైద్యులుగారు. అందుకొఱకు-పోయినదినములేవో పోయినవి. ఇప్పుడైన లెంపలువైచుకొని యుషఃకాలస్నాన మాచరించి యుపనిషద్భాష్యము పఠింపుఁడు. అప్పుడుకాని మీరోగముల న్నియు రూపుమాసిపోవు. జ్వరము వచ్చినప్పుడు సన్నిపాతభైరవికంటె సనత్సు జాతీయ మెక్కువ పనిచేయును. కాక చేసినప్పుడు గులాబీషర్బత్తుకంటె గజేంద్రమోక్షణగాథ తురాయకట్టు-ఊ. లెండు. ఇఁక సందేహింపకుడు. తలపైనున్న బంగాళాపంపిణీలను భూమి మట్టముచేసి వేపకాయ యంత పిలక యుంపుఁడు. చుట్టలపెట్టెల సిగరెట్లపెట్టెల మూలలఁ బాఱవైచి రుద్రాక్షమాలలు గోముఖములు మూలలనుండి పైకిఁదీయుడు. పనికిమాలిన కాఫీకై నోరుతెఱచుట మాని ప్రాణాయామమునకై ముక్కు మూసికొనుడు. ప్రాచీనాచారము లవలంబించి నీరోగదీర్ఘాయుస్సంపన్నులై యుండుఁడు. తథాస్తు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

41. అఖిలభారతయాయుర్వేదపరిషత్తు

రాజోలుకు చెందిన ఒక సాక్షి సంఘాభిమాని ఈ సంఘానికే ఒక ఉప సంఘాన్ని అక్కడ స్థాపించి, తానే (చిన్న) జంఘాలశాస్త్రిగా వ్యవహరిస్తూ, మధ్య మధ్య (అసలు) సాక్షి సంఘానికి ఉత్తరాలు వ్రాస్తూండే వాడు.

ఈసారి–రాజమండ్రిలో జరిగిన ఒక ఆయుర్వేద పరిషత్తు గురించి అతను అక్కడకు వెళ్ళి వ్రాసిన ఒక ఉత్తరాన్ని జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నాడు.

అక్కడ సభ కప్పల తక్కెడ వ్యవహారంగా అతనికి కనిపించింది. ఒకరు ఇంగ్లీషులో (దాని అనువాదం తెలుగులో) ఒకరు సంస్కృతంలో (దాని సంక్షిప్త అనువాదం తెలుగులో) మరొకరు హిందీలో ప్రసంగాలు చేశారు–

మొదటి రోజు అలా గడిచాక, రెండో రోజు సభలో ఒక అయ్యంగారు వచ్చీరాని తెలుగుతో మాట్లాడాడు. ఒక వైష్ణవుడు నిన్నటి అధ్యక్షుడి సంస్కృతోపన్యాసానికి క్లుప్తమైన తెలుగు అనువాదం చదివాడు. గాని –అందులో ఏమీ విశేషం లేదు. మరొక వ్యక్తి ఏదో వ్రాసి తెచ్చాడు. గాని చదవడానికి గొంతు లేవలేదు. విషయంలో స్పష్టత లేదు. ఒక మహమ్మదీయుడు వ్రణాలను గురించి ఏదో చదివాడు.

ఈ విషయాలన్నీ చెప్పాక ఆ లేఖ వ్రాసిన వ్యక్తి (చి.జం.శా) ఆయుర్వేద వైద్యంలో అతి ముఖ్యమైన నాడీ నిదానం, దానిలో మత భేదాల గురించి విశదంగా వ్రాశాడు. సారాంశం ఏమంటే, చచ్చుపడి నట్టుగా కూర్చోకుండా ఆయుర్వేద శాస్త్రాన్ని పట్టుదలతో అధ్యయనం చేయాలనీ, ఆంగ్లేయ శాస్త్రాన్ని కూడా అధ్యయనం చేసి అవసరమైన విషయాలు కలుపుకుని, శాస్త్రాన్ని అభివృద్ధి చెయ్యాలనీ, రాశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! రాజమహేంద్రవరమునుండి నేఁ డీలేఖవచ్చినది. దీనిని జదివెదను.

సాక్షికి:– అయ్యా! నమస్కారములు. నేను సాక్షిసంఘాభిమానమును బూర్తిగాఁ గలవాడఁను. మాగ్రామమగు రాజోలులో మేము మీ సంఘము ననుకరింపఁదలఁచి స్థాపించు కొనిన యుపసాక్షిసంఘ మహారాజశ్రీలలోఁ జేరినవాఁడైనయెడల నేను జిరంజీవులలోనైనఁ జేరినవాఁడనగుదును. ఆనడుమ నేను మీసంఘమునకు మాతాలూకా బోర్డులోని యెన్నికల నుగూర్చియు మాకళాశాలలోని గత్తరులను గూర్చియుమాబొఱ్ఱయ్యశెట్టి మనస్సులో వ్యాపించిన తామరను గూర్చియు మఱియింక వేనినో గూర్చియు లేఖలు వ్రాసి వానిని మీసభలోనఁ జదివింపుఁడని కోరఁగ మీ రుపేక్షయొనర్చినారు. ఉపేక్షకుఁ గారణమేమో తెలిసియుండు నెడలఁ దప్పెదోదిద్దుకొనియైన నుందుము. మాతప్పెదో చెప్పకుండ మీ రూరకుండుటచేత దప్పు మాలోనున్నదో మీలోనున్నదో తెలియకుండ నున్నాము. ఒకవేళఁ గ్రిందటిసారి మేము వ్రాసినయంశములు జనసామాన్యమున కభిరుచి నీయఁగలిగినవి కాక పోవుటచేత మీరు మాలేఖలను బ్రకటింపలేదేమో యని మాలో మేమొక కారణమును గల్పించుకొని సర్వజనాదరణపాత్రములైన యంశములనే యీసారి వ్రాయఁదలచితిమి.

~~ఈనెల~~ 5,6,7 తేదీలను గోదావరీతీరమందుఁ బుట్టిన కోహినూరగు రాజమహేంద్రవ రమునందు నఖిలభారతీయాయుర్వేదపరిషత్తు జరుపఁబడునని తలఁచి యటకుఁ బోయి తిని. నేను సభకుఁబోవుసరికే సమ్మానసంఘాధ్యక్షుని యుపన్యాస మైనదని తెలిసినది. ఆయన తనయుపన్యాస మాంగ్లేయమున వ్రాసినారుకాఁబోలు. దాని నెవరో యాంధ్రీకరించిరి కాబోలు. వానిలో నేప్రతియ నాకు దొరకకపోవుటచేత నందలి విశేషములేవో నేను జెప్పఁజా లను. నేను సభలోనికిఁ బోవునప్పటికే యాయుర్వేదసభాధ్యక్షులగు నాయుర్వేద పంచానన శివకృష్ణ శాస్త్రిగా రుపన్యసింపుచున్నారు. అదివఱ కేమిచెప్పిరో యచ్చట నేను లేకపోటచేత నేను జెప్పఁజాలను ఆయన మాటలాడిన మాట లేవో నాకుఁ దెలియకపోవుటచేత నటుతరు వాత గ్రంథమును జెప్పఁజాలను. ఆయన సంస్కృతమున మాటలాడినట్లుమాత్రము నేను జెప్పఁగలను. సంస్కృతమున మాటలాడునెడల సాధారణముగా మనప్రాంతములందెవ్వరికో కాని తెలియదు. అభాషాప్రచార మార్యావర్తమందు వాగ్రూపకముగాఁ దక్కువకావున నట్లు జనసామాన్యమునకుఁదెలియక పోవుట యాశ్చర్యముకాదు. సభలోఁగూరుచుండిన వైద్యులలోఁ గొందఱు తెలిసినవారివలెఁ దలలూఁపమొదలుపెట్టిరి. అంతదూరమునుండి యిక్కడికి వ్యప్రయాసములకు లోనై వచ్చినవా రామాత్రమైనఁ జేయకుండునెడలఁ బైవా రేమనుకొందురో యని యట్లుచేసియుందు రేమో? నాకుఁగలిగిన సందేహమును బాపుకొను టకు విశేషముగాఁదల నూఁపుచున్న యొక విశిష్టాద్వైత వైద్యునియొద్దకుఁ బోయి ''అయ్యా మీరు తల యంతగాటముగా నూఁపుచున్నారు. మీ కేమి తెలిసినదో నాకు రవంత చెప్పరా'' యని యడిగితిని. ''నాకేమియుఁ దెలియకుండ నున్నదని తల యూఁపుచున్నావయ్యా! నన్నుఁ జంపక యావలికిఁ బో''మ్మని యాతఁడు నన్నుఁ జీవాట్లుపెట్టెను. ఒకరూపాయ దండుగ పెట్టి నేను సభలోనికి వచ్చితినయ్యా! నాకేదో కాసంత చెప్పవయ్యా యని యాతనిని నేను దిరుగఁ బ్రార్థింప ''నైదురూపాయలు దండుగ పెట్టుకొనిన నే నెవనితోఁ జెప్పుకొన నయ్యా నడునడు'' మని యాతఁడు నన్నుఁ గొట్టసిద్ధపడెను. అంతలో మఱియొక మహారాష్ట్ర వైద్యశేఖరుఁడు హిందీభాషలో నేమేమో చెప్పెను. నాకేమియుఁ దెలియక పోవుటచేత మీయిష్టమువచ్చినట్లు చెప్పుకొన్నుఁడని లేచి పాకయంతయు నిటునటులు తిరుగ నారంభించితిని. ధన్వంతరి. వశిష్ఠుఁడు. క్షీరవాణి మొదలగు నామములు గల పటములు

స్తంభములకు వ్రేలాడగట్టఁబడి యుండెను. చ్యవనప్రాశనమని విటప్రియయని మఱియేమో యని కొన్ని మందులపేళ్లు స్తంభములఁ గాగిదములపై వ్రాయఁబడి యున్నవి. విటప్రియయ సుమం దేరోగమునకని నే నచ్చటనున్న యొకయువకునడిగితిని. ''నా ప్రాణము కాపాడిన చదియేనయ్యా–సుఖవ్యాధులన్నిఁటి కంతదురాకట్టు మఱియేదియు లేదయ్యా'' యని నా చెవిలోఁ జెప్పెను. నా వెనుకవైపునఁ బిల్లలేడ్చినట్లు వినఁబడగ నులికిపడి వెనుకకుఁ జూడఁగ నెత్తైన యరపమీన సభాదర్శనలాలసలగు సరోజాక్షులు పనియేదియు లేకపోవుటచేఁ గాబోలు నెడపిల్లలను గొట్టుచుఁ గొందఱు చంటి పిల్లలకుఁ బాలిచ్చుచుఁ గొందఱుఁ గునికిపాటులుపడుచుఁ గొందఱు నొడళ్లు విఱుచుకొనుచుఁ గొందఱుఁ గూరుచుండిరి. సంస్కృతమున వైద్యశాస్త్రమును జదువుకొనిన వైద్యులకే యీయుపన్యాసములు తెలియకుండ నున్నప్పుడు తల్లులారా! యింతశ్రమచేసి మీ రేలవచ్చితిరి యని లోలోన ననుకొని సభవిడచి పోయితిని.

మరునాడు సాయంకాలమునఁ దిరుగ సభకువచ్చి యుపన్యాసరంగమున నొకమూలఁ గూరుచుంటిని. ధన్వంతరిప్రార్థన మొకవైద్యుఁడు చదివెను. ఆనాఁటిసభ కొకదాక్షిణాత్యుఁడగు నయ్యంగారి నధ్యక్షునిగ నెన్నుకొనిరి. ఆయన తెనుఁగున బాగుగా మాటలాడలేదు. తెనుఁగు దేశమునఁబుట్టిన మనవారే మనభాషను బాగుగా మాటలాడలేనప్పు డయ్యంగారి యాంధ్రమైన నపశబ్దములు మాపుట యసమంజసముకాదా? అంత నొకవైష్ణవుఁడు నిన్నటి యధ్యక్షునిసంస్కృతోపన్యాసమునకుఁ దాత్పర్యము తెనుఁగున సంక్షేపముగాఁ జదివెను. నామట్టునకు నా కందులోని విశేషము లేవియు నగపడలేదు. గోదావరీ స్నానమువలనఁ బుణ్యమున్నదనియు నాంధ్రదేశమందలి వైద్య గ్రంథము లితర దేశములందువలెఁబరరాజులచే హరింపఁబడలేదనియు, సర్కారువారీయఁబోవు మూల్యము నాయుర్వేదాభివృద్ధికై గ్రహింపవలయునే కాని నిరాకరింపఁదగదనియు నాయుర్వేదమునకు జయమగుగాక యనియు మాత్రమే మిగుల సంక్షేపముగానావైష్ణవుఁడు చెప్పెను. శంకరాచార్యులవారు రామానుజాచార్యులవారు మధ్వాచార్యులవారు కూడా నాంధ్రదేశమందే పుట్టిరని కూడఁ జెప్పెను. ఈమాట దేశచరిత్రకేమైన నక్కఱకు వచ్చునేమో చరిత్ర లేఖరులు చూచుకొనవలసినదేకాని యాయంశము నేను విచారింపఁదగదు. ఆయన తరువాత నధ్యక్షు లుపన్యాసముల వ్రాసి పంపిన వైద్యులలో నెవరిపేరొకాని పిలిచిరి. ఆపేరు గలవారు రాలేదని ప్రత్యుత్తరము రాగ మఱియొక పేరు పిలిచిరి. అంతట నొక్క రుపన్యాసరంగమున వచ్చి నిలువఁబడి తన యుపన్యాసమును జదువ నారంభించెను. పదినిమిషములకంటె మీకు వ్యవధి లేదు. కావున నుపన్యాసమంతయుఁ జదువ వీలులేదనియు ధానిని సంగ్రహించి చెప్పుఁడనియు నధ్యక్షు లాతనిఁగోరిరి. ఆయన పాపము పిఱికివాఁడు కాఁబోలును. ఈమాటలతో మఱింత బెదటి గద్గదసహితమైన హీనస్వరముతోఁ జదువనారంభించెను. అంతట 'లవుడరు' అని నాటక పద్ధతిగా నొక్కఁడు సభలోనుండి కేకవైవఁగ నాతనికున్న యూపిరికూడ సన్నగిలెను. అది త్రిదోషములఁగూర్చిన యుపన్యాసమని జ్ఞప్తియున్నది. చదువుట కవకాశము లేదు. సంగ్రహముగఁ జెప్పుట యతనికిఁ జేతకాదు. చచ్చుటతప్ప మార్గాంతరమేమియుఁ గనఁబడని యామహాసంధ్యవస్థలో నధ్యక్షుఁడు పత్రమునకు ముఖ్యములైనవి మూడు పంక్తులుమాత్రమే చదువుఁడు అని యాతనిని హెచ్చరించెను. అంత రవంత యాతఁడు కుదుటపడి యిట్లు చదువసాగెను. సత్వరజస్తమోగుణములను మూఁడుగుణములే నీప్రపంచమున

నున్ననదులలో ముఖ్యములైనవి–కావుననే ధన్వంతరి యానతిచ్చినటువం–వరించినప్పుడు వెనుకవి ముందునకు ముందుకు వెనుకదిరా–ఇట్లతఁడు చదువనారంభించెను. ఏమియు నర్థము సందర్భము తెలియక సభాసదులు గ్రుడ్లు తేలనైచిరి. పత్రమునకు మూఁడేసిపంక్తులు చదువవలయునని యధ్యక్షుఁడు తన కిచ్చినయాజ్ఞననుసరించి యొకపత్రములోని మొదటి పంక్తియుఁ దొమ్మిదవ పంక్తియుఁ బదునేడవపంక్తియుఁ జదివెను. అది పెంకితనమునఁ జేసిన పనికాదు. కేవల మజ్ఞానముచేత. ''అట్లు చదువరాదు. ఒక్కపత్రమైన సరే పూర్తిగఁ జదువుఁ'' డని యధ్యక్షుఁడు పలుక, నాతఁడు చదువుట కారంభించెను. చదువ జరుగనిదే మాట తొడుకనిదే–''ఇది మీరు వ్రాయలేదా'' యని యెవ్వరో యడిగిరి. నేనే యని యాఁతడు ప్రత్యుత్తర మిచ్చెను. అటులైన నేమివ్రాసితిరో చెప్పలేరా'' యని మఱియొక్కరడిగిరి. ''అప్పుడేమి వ్రాసితినో యిప్పు డెట్లు తెలియు''నని కాబోఁలు నాతఁడు తిరిగి చెప్పెను. ''పోనీ, చూచి చదువుట కభ్యంతరమే'' మని మఱియొక్క రడిగిరి. ''అక్షరము తెలిసినయెడల నభ్యంతరమేమి'' యని కాఁబోలు నాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ''అది మీరు వ్రాసినది కాదా'' యని మఱి యెవ్వరో యడిగిరి. ''నేనే వ్రాసియుందును గాఁబోలు'' నని యాతఁడు పలికెను. ఇంతలో నధ్యక్షుఁడు గంట కొట్టెను. మఱియొకరిని పిలిచిరి.

ఈసారి వచ్చినయాతఁ డొకమహమ్మదీయుడు. ఈతఁడు వ్రణములను గూర్చి వ్రాసినాఁడు. ఉపన్యాసమును కాతనియొద్ద జత్వారపుజోడు లేకుంటచే నధ్యక్షుఁడుగారే కాబోలు నెవరిదో యాచించి తెచ్చి యిచ్చిరి. ఈతని యుపన్యాసములోఁ బ్రధమవాక్య మేదియో చెప్పనా! ''ఉత్తమ ఆడుదానితో సంబోగించినట్లయితే నెత్తిమీఁద రణము పుట్టును.'' ఈమాటతో సభ్యులకు మతులుపోయిన ట్లుండెను. తరువాత నాతఁ డేదో చదివెనుగాఁబోలు–ఏగ్రామములోని ప్రజలప్రాణము లిట్టి వైద్యుల యధీనములై యున్నవో –రామ రామ రామా!

సాక్షి! మీజంఘాలశాస్త్రి యాయుర్వేదమహాత్మ్యమును గూర్చి యనర్గళధాటితో నుపన్యసించియున్నాఁడు. నే నాయుర్వేదనభలఁ గూర్చి పరిహాసముగా వ్రాయుచున్నానని తలఁపవలదు. అంత మూఁఢుఁడనుగాను. అంత దేశభక్తిలేనివాఁడను గాను. వైద్యులలోని ప్రత్యేక వ్యక్తులను గొందఱు నధిక్షేపించుచున్నాను. వారు వైద్యజ్ఞాననంపాదనమున మిగుల దురవస్థలో నున్నారు. పౌరోహితుఁడు మంగళసూత్రకాలమందు, మధ్యమ పిండముద్వా సయా యని కప్పగంతు నైనప్పు డాతని నధిక్షేపించినచో వేదదూషణమగునా? ఆయుర్వేద మును శిరమునైఁ బెట్టుకొని పూజించుచున్నామని యజ్ఞులగు వైద్యయమదూతల నధిక్షేపిం పక మానుదమా! మన ప్రాణములు బీయుటకు నడుముకట్టుకొని వచ్చిన వానిని బరిహసిం పనైనఁ గూడదా!

మీజంఘాలశాస్త్రి యొక్కసారి నాడీవిషయకమగు నొక్క యంశమును మఱియేదో సందర్భమునఁ బలికినాడు. తరువాత నాయంశమును గూర్చి విపులముగఁ జెప్పునేమో యని వేచియుంటిమి. ఇంతవఱకుఁ జెప్పియుండలేదు. పెద్దజంఘాలశాస్త్రి యుపేక్షించిన యంశమును జిన్న జంఘాలశాస్త్రి యుపక్రమించిన యెడలఁ దవ్వులేదనికొందును.

మన యాయుర్వేదమున రోగనిదానమంతయు నాడీపరీక్షపై నాధారపడియున్నది. గోడకుఁ బుట్టయెట్టిదో మనవైద్యశాస్త్రమునకు నాడీ నిదాన మట్టిది. రోగ నిర్ణయమునకు

మూత్ర పరీక్ష పురీషపరీక్ష తరువాతవి కాని దానికంటె బ్రధానమగునవి కావు. గృహస్థావస్థకు కన్యకాపాణిగ్రహణ మెట్లు ప్రథమకర్తవ్యమో చికిత్సాకర్మమునకు రోగి పాణి గ్రహణ మట్లు మొదటిది. తెలిసినవాఁడు చేయిచూచుచున్నాఁడు. తెలియనివాఁడును జేయి చూచుచున్నాఁడు. తెలిసినవాని కేమి తెలియునో తెలియదు. తెలియనివాని కేమితెలియదో తెలియదు. అంగుష్ఠమూలము వెనుక నొక్కయంగుళము విడిచిపెట్టి వైద్యులు నాడి చూచుచున్నారు. తర్జనిమీఁదిది పైత్యనాడియనియు మధ్యమము మీఁదిది కఫ నాడియనియు అనామికమీఁదిది వాతనాడియనియుఁ జెప్పుచున్నారు. ఇదికొందఱమతము. మధ్యమముమీఁదిదో వాతనాడియనియు ననామికమీఁదిది శ్లేష్మనాడియనియు నంగుష్ఠమూల మున ననామికయుంచి తలక్రిందుగాఁ జూడవలయునని కొందఱమతము. అప్పు డనామిక మీఁదిది పైత్యనాడి యగును. తర్జనిమీఁదిది వాతనాడి యగును. ప్రాణోత్క్రమణసమ యమందుఁ దర్జనిపై వాతనాడి యుండునని మఱికొందఱ మతము. ఈయర్థములన్నిఁటిని దప్పనియు దర్జనిమీఁది దుత్పుల్లగతిగా నుండినఁ బైత్యనాడి యనియును దానిమీఁదిది మందగమనముగా నున్నయెడల శ్లేష్మనాడియనియు, దానిమీఁదిదే, వెనుక కూఁగు స్వభా వము గలదిగనున్న యెడల వాతనాడియనియు, నాడి చూడవలసిన దొక్కవ్రేలిమీఁదమాత్ర మేయనియు, నావ్రేలిమీఁది నాడిగతులను బట్టియే పిత్తవాతశ్లేష్ములు నిర్ణయింపవచ్చిన నియు మఱికొందఱమతము. అట్లే నిజమగునెడల సన్నిపాతము నెట్లు నిర్ణయింపవచ్చునని యితరు లాక్షేపించుచున్నారు. అనఁగా శీతపైత్య జ్వరమును నిర్ణయించు టెట్లని వారి యధిక్షేపణము కాఁబోలు. పిత్తమున కుత్పుల్లగతికదా! వాతమునకు మందగతి కదా! రెండును గలిసియుండుట తేజస్తిమిర న్యాయము కదా! ఈయసందర్భమును సమర్థించు టెట్లని వారి యధిక్షేపణము కాఁబోలు. ఒక్క పిడికిటిలో ముందువ్రేలిపై పైత్యమని, వెనుక వేలిపై శ్లైత్యమని జెప్పఁదగదనియు దీనియభిప్రాయము మఱియేదో యుండుననియుఁ గొందఱి యభిప్రాయము. వీరియభిప్రాయమేదో తెలియదు. మఱియేదో యభిప్రాయము ముండునని మాత్రమే వీరియభిప్రాయము. పిత్తమునకుఁ గాల్జైమను కోశమున్నది. శ్లేష్మమున కూపిరితిత్తులున్నవి. వాతమునకుఁ బ్రత్యేకముగా నొకకోశము దేహములోఁ గానబడదు. దానికిఁ బ్రధానకోశము కొంత శ్వాసకోశయుగమైనను వాతమనునది ప్రత్యేకముగ నొక్కకోశ ముతో సంబంధించినది కాదనియు దానికి స్వతంత్రవ్యక్తిత్వము తక్కువయనియు నది యెప్పుడుకూడ దేనితోడనో యొకదానితోఁ జేరియుండుననదే యనియు నవసాననమయ మందు విజృంభించి యొక్కటియే చెలరేగి ప్రాణములు తీయుననియుఁ గొందఱు చెప్పుచు న్నారు. నాడిని బరికించు రక్తనాళములలోఁ బూర్వులు కొందఱు వాయువు ప్రవహించుచు న్నదని యభిప్రాయపడినట్లు కనఁబడుచున్న దనియు నందువలననే వానికిఁ బాశ్చాత్యులు ఆర్టరీస్ అని పేరిడిరనియుఁ బ్రధానమైనది వాతమే యనియు నదియే యవస్థానభేదములఁ బట్టి పిత్తశ్లేష్ములుగ దేహాంతఃకోశ సంఘర్షణమున మాఱుననియు మఱికొందఱు చెప్పు దురు. ఇంక ననేకాభిప్రాయము లున్నవి. వీనిలో నేది సత్యమో నిర్ధారణపఱచుట కిట్టి మహాభిషక్ప్రఖ్యామణులు కాక మఱియెవ్వరు సమర్థులు. నాడీనిదానములోనే యధిక్షేపణము వచ్చినతరువాత నిఁక చికిత్సాతంత్రములనందు విశ్వాస మధికముగా నుండుట కెట్లవకాశ మున్నది? కొలతపాత్రలో వ్యత్యాస ముండగూడదు కాదా? కాపున వైద్యులందఱు మెద దులు చింపుకొనియైనను నీయంశమును స్థిరపఱుపవలసి యున్నది. పూర్వులేదో నిర్వచిం

చినారని యదియే సిద్ధాంతముగాఁ బట్టుకొనఁదగదు–సంతతాభివృద్ధి నొందుచున్న శాస్త్రములలో వైద్యశాస్త్ర మొక్కటి. ఇట్టి మహావైద్యులందఱు దానిలోని సందేహములను నివృత్తిచేసి క్రొత్తక్రొత్త విమర్శనము లొనర్చి నూతన పద్ధతులఁ గల్పించి దాని నభివృద్ధిపఱుపవలయును. అది వారివిధియై యున్నది. వారట్లు ప్రయత్నించుచున్నట్లు కానఁబడదు. ఈనడుమనుండియే కొంతసంచలనము వైద్యప్రపంచమున బయలుదేఱినది. అప్పటి నుండియు వార్షికసభలని, ప్రదర్శనములని, పరీక్షించి బహుమానములనియు నేదో కొంతపని జరుగుచున్నది. ఇది యింకను జాలదు. ఆయుర్వేదవైద్య మొకవైద్యము కాదనియు శారీరజ్ఞానము ప్రపంచ జ్ఞానము తక్కువగా గల పూర్వపువారు దానిని దోఁచినట్లు కల్పించినారనియు దాని ననుసరించి యిపుడు వైద్యము చేయదగదనియు నది మహమ్మదు గారి గడ్డపువెంద్రుకలాగుననో బుద్ధుని దంతములాగుననో యెచ్చటనో దానినిబట్టి దాని ప్రాచీనతనుబట్టి మాత్రమే దానిని గౌరవింపదగుననియుఁ గొలదిసంవత్సరములక్రిందట మన సర్కారు వారి యభిప్రాయమై యుండెడిది. ఆయుర్వేదముకూడ నొకజాతి వైద్యశాస్త్రము కావచ్చుననియు దానియందుఁగూడ నేదో కొంత గౌరవముంపదగుననియు నిప్పుడిప్పుడు వారు కొంత తెలిసికొనుట మహాసంతోషము. కానివారాయుర్వేదప్రాశస్త్యనిర్ణయమున కేర్పాటుచేయుచున్న సంఘములవారి కాయుర్వేదజ్ఞానము తక్కువ యగుటచేత నింకను దీని ప్రాశస్త్యము వారికి బాగుగాఁ దెలియకున్నది. వారికి దీని ప్రాశస్త్యము తెలియనియెడల మన శాస్త్రగౌరవము పోవునని మనము భయపడవలసినపని లేదు. వారికిఁ దెలిసిన నొక్కటే తెలియకున్న నొక్కటే. వారు మనమం దెన్నఁడును బుచ్చుకొనరు. మనమందులేవో మనము పుచ్చుకొన్నయెడలఁ బుచ్చుకొనుటకు స్థిరపఱచుకొన్న యెడల మనకుఁ జాలును. ఆయుర్వేదమునుగూర్చిన కొన్ని ప్రశ్నలకు మన వైద్యులు ప్రత్యుత్తరములు చెప్పవలసియున్నదట. చెప్పవలసినదా మానవలసినదా యని మనవారు త్రొక్కులాడుచున్నారు. చెప్పవలసినదియే యని యీసభలోని యధ్యక్షులు చెప్పినారట, చెప్పకపోయిన యెడల మనశ్శాస్త్ర మసందర్భముగా నున్నదని పైవా రనుకొందురేమో యనియేకదా భయము? అభివృద్ధి శాస్త్రములో నసందర్భములేని వెచ్చటవైన నున్న వేమో వారుమాత్రము చెప్పఁగలరా? ఉన్నవి–లేవు అవి మనము చూచుకొనవలసినది కాని యొకరితోఁ జెప్పుట యెందులకు? చెప్పినయెడల వారు మనకుఁ జేయునదేది? చేసినందువలన మనశాస్త్రమునకు వచ్చు గౌరవమేది? ప్రశ్నోత్తరముల కిదియేమి తర్కమా మీమాంసయా? ప్రత్యక్ష ఫలప్రధానమైన శాస్త్రముకాని వాదప్రధానమైన శాస్త్రమే కాదే? అట్టిచోఁ బ్రశ్నముల కుత్తరము లెందులకు? ఈయకపోయినయెడల మనసమర్థులమని యనుకొందురే మోయని భయమా? మనము సమర్థులమని యిదివఱ కనుకొన్నవా రెవ్వరు? వీరికిఁ బ్రత్యుత్తరములు చెప్పినమాత్ర మనుకొందురా? ఏమియులేదు. ఈ ప్రశ్నముల కుత్తరములిచ్చినవెనుక నిన్నిటికి మూఁడు రెట్లుప్రశ్నములు ముందురావని యేమినమ్మకము? మనమిచ్చు ప్రశ్నలకు వారు ప్రత్యుత్తరము చెప్పుదురేమో? కనుగొనుఁడు.–ప్రశ్నములజాబితా పైవారమున జదివెదను. ఒకరినొక రడుగవలసినది లేదు. ఒకరినొకరు ప్రత్యుత్తర మీయవలసిన దంత కంటె లేదు. సాహాయ్యములపయి మొదలే యాశలేదు. మనవా రీశాస్త్రమును బోషించుకొన్న నంతయే చాలును. ఈశాస్త్రమును మిక్కిలి పట్టుదలతో మనవా రింకను జదివి యాంగ్లేయశాస్త్రముకూడ బాగుగా నభ్యసించి దానిలో నేవైన యంశములు మనదానిలోఁ

జేర్చుకొనదగినవి యున్నయెడల వానిని జేర్చుకొని మనశాస్త్రము నభివృద్ధిపఱచుకొనవల సియున్నది. ఇందులకు మనవారే మనకు సహాయులుకాని యొరులుకారు. తిరువాన్కూరు మైసూరు మొదలగు రాజ్యములలో నాయుర్వేదవైద్య మభివృద్ధిలోనున్నట్లు వినుచున్నాము. ఎందఱు రాజులున్నారు. ఎందఱు జమీందారులు–ఎందఱు మహారాజులున్నారు. వీరందఱు తలఁచుకొన్నయెడల నేవిధమైనకొదవయు నుండదు. అదికాక యనేకులు భాగ్యవంతులు న్నారు. వీరుకూడ సాహాయ్య మాచరింపఁగలరు. సామాన్యప్రజలున్నారు. వీరికి జబ్బు సిద్ధించునెడల మనమందు పుచ్చుకొన్నఁ జాలును. మనమందులవలన మరణించినవారు పయిమందుల వలన బ్రతికినవారు నున్నట్లు నేనెఱుఁగను అదిగాక ఆయుస్సు చల్లగా నున్నయెడల బ్రదుకుదుమను విశ్వాసమున్న వారముకాని అల్లోపతి వలననే బ్రతుకుదుమను నమ్మకమున్నవారము కాము. ఈసభకే హైదరాబాదునుండి యొక గొప్పవైద్యుఁడు వచ్చినాఁడు. ఆతనికొక చిత్రమైన ప్రజ్ఞకలదు. ఒకని కేదోరోగము వచ్చిన దనుకొనుము. మఱియొకఁడు పోయి యారోగమేదో కనిపెట్టి వచ్చినాఁ డనుకొనుము. ఆతఁడు మఱి యింకొకనితో తాను గనిపట్టి వచ్చినరోగమును గూర్చి చెప్పినాఁడనుకొనుము. ఈతఁడు పై హైదరాబాదు వైద్యునియొద్దకు వచ్చెననుకొనుము. ఈతనిచేయి చూచి యారోగమేదో యామనుజునివయస్సెంతో యన్నియు నితఁడు చెప్పును. అయ్యా! అనేక విద్యలున్నవి. విద్యలను బోషించుట మాత్ర మరుదుగా నున్నది హైవానిని బడదీసి లెంపకాయకొట్టి పాముగఱచినవానిని బ్రతికించినవారనేకు లున్నారు. మృతునికిఁ బ్రాణముఁ బోయఁగల యనేక దివ్యయోగములున్నవి. ఏమున్ననేమి? అదృష్టము లేదు. ప్రజ్ఞావంతులమని చెప్పుకొనుటకుఁ గూడ భయము. ఒకరిని మనము నిందింపవలదు మనల నెవరు నిందించినను మనము తప్పుగా భావింపనక్కఱలేదు. తప్పులున్నయెడల దిద్దుకొందము. దేశభక్తి గలిగి, యాత్మవిశ్వాసముకలిగి, వెన్నెముక గలిగి, ప్రవర్తింతము. అంతకంటెఁ జేయవలసిన దేదియు లేదు. ఇప్పటి కిదిచాలును.

42. అఖిలాంధ్రదేశ మశకమత్కుణమూషిక మహాసభ

సాక్షి సంఘాభిమాని ఒకరు ప్రాసినలేఖను జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నారు. సాక్షి సంఘాభిమాని ఒకరు మద్రాసుకు తమరాజావారు వస్తున్నారంటే దర్శనం చేద్దామని బయలుదేరి రైలులో ఇంటర్ మీడియట్ క్లాసులో ప్రయాణంచేస్తూ దోమలు, నల్లులు, ఎలుకలుకూడా ఆబోగీలో ఉన్నట్లు గమనించాడు.

నిద్రపోయాక ఒకకల వచ్చింది. అందులో ఒక పెద్దమైదానంలో లక్షలకొద్దీ దోమలూ, నల్లులూ, ఎలకలూకలిసి అఖిలాంధ్రసభ చేశాయి. సభకు ఒకఎలక అగ్రాసనాధిపత్యం వహించి–మనిషితాను మహాగొప్పవాడి ననే అహంకారంతో చేస్తున్న దౌర్జన్యాలను ఏకరువు పెట్టింది. అతగాడి పీరికి బతుకును ఎగతాళి చేసింది. అతని ముఖంతో పోల్చిచూస్తే మన ముఖాలే కాళాకాంతులతో వుంటాయని వక్కాణించింది. ఎలుకలకు, దోమలకు, నల్లులకు ఉన్నవిశ్వాసం మనిషికి లేనే లేదని చీదరించింది.

ఈ మూషిక ఉపన్యాసం తరువాత కీచురావు అనే మశకం ప్రసంగించింది. మనం నర్వలోకానికే జ్ఞానజ్యోతులం అని ప్రకటించింది. దోమకాటుచేత మన్నెపు జ్వరాలువస్తున్నాయనే మాటను ప్రస్తావించి, మరి, మనిషిరక్తం వల్ల మనకెంత కీడు కలుగుతోందో గమనించండి అని–అందువల్ల జాతిభేదాలు, వర్ణభేదాలు, పెచ్చుతగ్గులు ఎన్ని విధాలుగా దోమజాతిలో అభివృద్ధికి వచ్చాయో చెప్పింది. మత్కుణరాజమైన మంజాళాచార్యులు తన ఉపన్యాసంలో, స్వజాతిలోనే ద్వంద్వవైఖరిని విమర్శించగా– ముగింపు ఉపన్యాసం ఇచ్చిన హ్రస్వకర్ణుడనే మూషికం, మనుష్యజాతిని అంతమొందించాలని పిలుపు ఇచ్చింది. ఇంతలో సూర్యోదయమై నరుడి దర్శనం కావడంతో ఎక్కడివక్కడచెల్లా చెదురయ్యాయి. కలచెదిరింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! సాక్షిసంఘాభిమానులలో నొకరు సాక్షి కొకలేఖ నంపినారు. అది యిదిగో! దానిని జదివెదను. శ్రద్ధతో వినఁగోరెదను:–

సాక్షికి–అయ్యా! అనేకనమస్కారములు. ఆంధ్రపత్రికలో వారమున కొకపర్యాయము వెలువడుచున్న సాక్ష్యుపన్యాసములను చదివి వినిపించుటకై నేను మదరాసులో వేంచేసియున్న మారాజుగారిదర్శన మపేక్షించి రైలుబండిలోఁ బ్రయాణము చేయుచుంటిని. ఇంటర్ మీడియేటు తరగతి బండిలోఁ బండుకొని పైనున్న దీపపువెలుతరుసాహాయ్యమున నేదియో యొకపుస్తకమును జదువుకొనుచుంటిని. దోమలు చెవియొద్దఁ జేరి గానకాలక్షేప మారంభించినవి. నేను బండుకొన్న బల్లపై నపర్ఁబడిన పీఁచుపఱుపు నాశ్రయించి యభివృద్ధి నొందుచున్న నల్లులు తమకేర్పడిన స్థానమాక్రమించుకొంటినను కోపముచేఁ గ్జాబోలు ననున్ఁ జెడమడ పొడుచుచుండెను. వానిబాధ పడలేక లేచి ప్రక్కదులుపుకొంటిని. ప్రక్కను దులుపఁగలను గాని బల్లపై బంధింపఁబడిన పఱుపు నూఁడలాఁగగలనా? లేచి యిట్లు ప్రక్కదులుపుచుండగ నాకాలిపై నేదియో ప్రాకినట్లుకాఁగ నులికిపడి చూచితిని. చిన్నయెలుక యట్టిప్రాకి పైబల్లకున్న గొలుసుపై నాఁగి నే నెవఁడనోయని నిరసనదృష్టిచేఁ బరిశీలించుచుండెను. ''నీవు బండితోఁ గూరుచుండుట కర్హుఁడవుగావు దిగిపో'' మ్మని యాయెలుకయభిప్రాయము కాబోలు! ఆహాహా! యెంతవిరుద్ధముగ నున్నది! సొమ్మిచ్చి టిక్కెట్టుకొని ప్రయాణముచేయుచున్న నాపై టిక్కెట్లు లేకుండఁ బ్రయాణమొనర్చుచుండ నాయెలుక కంతకోప మెందులకో? నిదురఁబోవుచున్న వారినైన బలాత్కారమున లేపి టిక్కెట్లు మూఁడేసిగంటల కొకసారి పరీక్షచేయు నిందఱు రైల్వేయుద్యోగు లెందులకో మనలను బాధించుటకేనా? ఆయెలుకమాట నెవ్వడు దలపెట్టడేమి? శాసనము మీఱకుండ భయభక్తులతో నడచుకొనువారిని బాధించుటకేనా యాయుద్యోగుల యధికారములు! చట్టములు చుట్టచుట్టి నట్టిటఁబాఱినైనవారిని జూడ నధికారులకే భయముకాబోలు! ఇట్లు నేను మనసులో నేదేదియో యనుకొనుచుఁ దిగుగఁ బండుకొంటిని. నడిమివయసున నుండుటచే రక్తపుష్టికలవాఁడను గావున నల్లులను గణింపక దోమలను లెక్కింపక యెలుకలను లక్ష్యపెట్టక నిద్రించితిని. కలఁత నిద్దురయేకాని గాఢనిద్రమాత్రము పట్టి లేదు. ఆనిద్రలో స్వప్నము వచ్చినది.' ఆస్వప్నము కొంత వింతగనుండుటచే జంఘాలశాస్త్రిచే నభలోఁ జదివించుటకొఱకు మీసన్నిధికిఁ బంపితిని.

స్వప్నము

అది యొక్కపెద్దమైదానము కనుజాపు మేర వ్యాపించియున్నది. అది నాలుగు సమభాగములగ భాగింపఁబడి యున్నట్లున్నది. ఒక్క భాగమునిండ ననేకలక్షలకోటుల దోమలు విడిసియున్నవి. ముచ్చటలాడుకొనుచు మూర్ఖింపుచు మూఁగుకొనుచు ముద్దిడుకొనుచు మురిసికొనుచు మూల్గుకొనుచు మూత్రించుకొనుచు నాదోమలన్నియు చిత్రవిచిత్రచేష్టానమన్వితములై యున్నవి. కాని యాజండాలపై నాయక్షరము లేమి? ఆంధ్రాక్షరములవలెఁ గనఁబడుచున్నవే! సెబాస్! ఇఁకనేమి? చదివెదను. ''పాలకొల్లు మశకములవిడిది'' ఆహాహా! ఇందున్నవన్నియుఁ బాలకొల్లుగ్రామమునుండి వేంచేసిన మశకమతల్లికలా! కాని యామీఁదిదేది? ''కొల్లేటిమశకరాజములమహలు'' వహ్వా! కోడిపెట్టల నెత్తికొని పోఁగలవను కృష్ణామండలైనకవిఖ్యాతి నొందిన కొల్లేటిదోమలాయని! సెబాను–దీనితరువాతి దదియేది? ''కళింగదేశ మశకమహారాజముల మౌక్తికమందిరము?'' ఆహా! గవాక్షముల పట్టిపట్టని బలిష్ఠగాత్రస్థౌల్యముగల విజయనగరస్థాన

మశకములాయివి! వహవ్వా! కాని యాపైదియేమి! ''ఆనెగొంది మశకసార్వభౌములు మహాలక్ష్మినికేతనము'' శ్రీమన్ మహామండలేశ్వర మహారాజాధిరాజు గండరగండాదిబిరు దాంకితులయిన శ్రీకృష్ణదేవరాయల యాస్థానమందలి క్షీరపట్టీరహీరచంద్రికాసార ధిక్కార జగద్విశ్రాంత యశస్సాంద్రములైన కిప్కిందదోమలా? వహవ్వా! ఆప్రక్కనున్న గుడారము లెవరివి? చిట్టెలుకల దిది. చూఁటెలుకల దది. గుంటయెలుకల దిది. గాదెయెలుకల దిది. ఎట్టయెలుకల దిది. పొలపుటెలుకల దది. నాగుటెలుకల దిది. బొంతయెలుకల దది. చుంచులదది. పందికొక్కుల దిది. సెబాస్! సెబాస్! అర్బుదములు నిర్బుదములు దాఁటిననసంఖ్యలు గలసర్వజాతిమూషకము లిచ్చటఁ గిచగిచలాడుచు వెనుకాళ్లపైనిలువఁ బడి ముందుకాళ్లతో ముక్కులు గోకికొనుచు మూఁతులుమూఁతులఁ గలుపుచు, తోఁకలు తోఁకలు పైనపైచుచుఁ గీచుకీచుమనుచు గీరుగారమనుచుఁ జెవులట్టె విప్పుచు నట్టమూయుచు బిలబిలలాడుచు మిలమిలలాడుచుఁ గనుచూపు నిలువఁబడలేనంత కదలికతోఁ బోట్లకాయలగబ్బితోఁ గ్రాలుచున్నవే! సెబాస్! కాని, యాపైపుననున్న విడుదులెవరివో? అవియన్నియు నల్లులోయి నాయనా! ఎట్టినల్లులు, నల్లనల్లులు, ఱొక్కలనల్లులు, మిడినల్లులు శంకమహాసంఖ్యాతిత సంఖ్యాకములై తాంద్రబెత్తంతతనువులు గలవై కొత్తిమిరెపువానఁ గొట్టుచున్నవి. చీ చీ! తెట్టలుతెట్టలుగఁ గుప్పలుకుప్పలుగ రాసులురాసులుగఁ జేరి సముద్రతరంగములవలె లేచుచున్నవి. ప్రాకుచున్నవి. విఱుగుచున్నవి. తిరుగ వెనుకకు దొరలుచున్నవి. హరిహరీ! ఆసన్నివేశము నిప్పుడు తలఁచుకొనగ నేయెడలు గగురువొడుచుచున్నదికదా! గుండె నీరు విడుచుచున్నదికదా! ఆహా! అప్పుడెట్టులుండెనో యోచించుకొనుఁడు.

పూర్ణిమాచంద్రుఁ డంబరమధ్యమునకు వచ్చి యామశకమత్కుణ మూషికాది మహాపరిషద్వైభవము నవలోకించి యాహ్లాదించుచున్నాఁడు. సంఖ్యలో మనమేమో వహాధికులమని యిదివఱకు విఱ్ఱవీఁగితిమి. పట్టుమని యొక్కయాంధ్రదేశమందున్న నల్లులసంఖ్యముందు మనసంఖ్యయెంత యధమమో యిప్పుడు తెలిసినదికదా! గర్వప్రాయ శ్చిత్తమైనదికదా యని తలలు వంచుకొని మొగములు ముడుచుకొని సిగ్గుఁదెచ్చుకొని నక్షత్రము లెట్లు చిన్నవోయి కునుకుచున్నవో!

ఇంతలో నొకనల్లి యెట్టమొకమాలుకోటుతో నిభరాజయానమున సభామధ్యప్రదేశ మునకు వచ్చి తిర్యగ్రేఖరిగ నున్నతలను వీలగునంతవఱ కెత్తి యాంధ్రభాషతో నిట్లనియెను.

''అఖిలాంధ్రదేశీయ మత్కుణ మశక మూషకాది సోదర సోదరీమణులారా! ఈమహాపరిషద్వ్యాపారము మనస్వభాషయగు నాంధ్రభాషతోడనే జరుపుకొందుము. స్వభాషాగౌరవములేనిజాతి జాతికాదు. ఈయాంధ్రజాతీయ మహాసంఘకార్యక్రమ నిర్వాహ కత్వము నకధ్యక్షుని నియమింపవలసి యున్నది. కృష్ణదేవరాయస్థాన ప్రధాననగరమును విద్యారణ్యపీఠమును నగు విద్యానగరమునుండి యిచ్చటకు విచ్చేసిన మూషకరాజములలో మహామూర్తివంతమైన దీర్ఘాల నామకమూషకశిఖామణిని సాహితీగౌరవమునుబట్టియు, స్థానగౌరవమును బట్టియు ననాతనరాజేంద్రగౌరవమునుబట్టి నగ్రాననాధిపతిగా నేను సభవారిపక్షమున నెన్నుకొనుచున్నాను'' ఇంతలో నొక బోఁదురుకప్పయంత కొల్లేటి

దోమ క్కైమని ముందుకువచ్చి వల్లిగా రొనర్చిన ప్రతివాదమును బరిపోషించెను. గుంయిమని యొక్కపెట్టున దోమలన్నియు సంతోషసూచకముగ మొఱపెట్టెను. ఎలుకలు కీచుకీచుమని రొదచేయుచు తమజాతిలో నొక్కని కిట్టిమహాసభ కధ్యక్షపదవి కలిగెనని పొంగినదేహములతో నిండినమనసులతో నుండ, సధ్యక్షుడుసవ్యపురఃపాక ముతో మీసము నవరించుకొని వెనుకకాలితోజెవియొద్ద- దురదచేగాదు విలాసముచే -గోకిక్కొని పాడుగుతోకను గుడియెడమలకు జెటకాయించి సభామధ్యమునకుఁ బోయి వెనుకకాళ్లపై నిఱువఁబడి ముందుకాళ్లను వినయపూర్వకముగ లోనికివంచి యువనతశిర స్కమై నిలువఁబడగ నెలుకలన్నియు వాలతాళధ్వనులిచ్చెను. దోమ లుచ్చైస్వరమున నభినందించెను. అంత నధ్యక్షనిర్ణయమొనర్చిన మొదటినల్లి యొకచిన్న కాగిదము నధ్యక్షుని చెవినందున నుంచెను. అది సభాకార్యక్రమ పత్రము. దాని నందుకొని గాలి కెగరిపోవుననికాఁబోలు నధ్యక్షుఁడు కాలిక్రింద నుంచుకొనెను.

అధ్యక్షుని ప్రారంభోపన్యాసము

ఆర్యసోదరసోదరీమణులారా! అఖిలాంధ్రజాతీయ మశకమత్కుణాది మహాసభకు (ఆహాహా? వినుఁడు-వినుఁడు-ఏమిస్వార్థపరిత్యాగము! ఏమినైవ్యము! తనజాతిపేరేయెత్తినాఁడుకాఁడే యనికేకలు) నన్నధ్యక్షాధిపతిగాఁ జేయుటచే నాజాతి యంతయుఁ గృతార్థమైనది. ఆహా! మీరేమి సామాన్యులా? మీసభ విద్వత్సభకాని మఱియొక్కటియా? ఓ! వేదవేదాంగవిజ్ఞానసంపన్నులు, ప్రకృతిశాస్త్రపాండితీ మండి తులు, రాజకీయతంత్రపారగులు-బ్రాహ్మణాదులు - భక్తాగ్రగణ్యులు-కవిశిఖామణులు - గాయకోత్తములు-చిత్రలేఖకులు -మితహాదులు -మధ్యనాదులు-నతివాదులు - సర్వతంత్ర స్వతంత్రులగు నెందఱో యిచ్చట న్వస్వరూపముతో నకుటుంబ బంధుమిత్ర పరివారులై వేంచేసియుండ నల్పుఁడనగు నేను-మశక సోదరులారా! మీవలె వ్యోమయానశక్తిలేని నేను-మత్కుణసోదరులారా! మీవలె మృదులశరీరాంతరంగ సౌష్ఠవములేని నేను-మశక సోదరులారా! మీవలెఁ గంఠస్వర మాధురీపరిపాకము లేని నేను మత్కుణసోదరులారా! మీవలె శత్రుహింసాపరాయణతలేని నేను-మీకధ్యక్షుఁడనై నిలువవలసివచ్చినది. ఎందువ లన? మీమీయాజ్ఞవలన. నాయీపదవికి మీ రుత్తరవాదులైనప్పుడు జ్ఞానశూన్యతచే వచించిన నాపలుకులలోని తప్పులకు మీరేల యుత్తరవాదులు కాకపోవుదురు? ప్రకృతివిషయమునకుఁ బోవుదము.

నరజాతియంతటి తుచ్ఛజాతి ప్రపంచమున మఱియొకటిలేదు. నరుఁడు మనకు శత్రుఁడు-ప్రబలశత్రుఁడు - తానే మహావీరుఁడట! వీరాధివీరుఁడఁట-అతిరథుఁడఁట - మహారథుఁడఁట - వీనిగర్వము కాలిపోను! పిఱికిపెద్దమ్మలలో నగ్రగణ్యుఁ డెవఁడు? నరుఁడు. తెలిసినదా? (వినుఁడు-వినుఁడు - శత్రుదర్శనముననే తోఁక ముడుచుకొని పరుగెత్తువాఁ డెవఁడు? నరుఁడు. ఎంతసేపును బ్రాణ మఱచేతిలో నుంచుకొని మూలమూలల దాఁగినవాఁ డెవఁడు? నరుఁడు. (సెబాస్ సెబాస్ అనుకేకలు) చేతవాఁతగాని చచ్చు పెద్దమ్మలలో నగ్రతాంబూలమునకు సిద్ధపడువాఁ డెవ్వఁడు? నరుఁడు. తేలునుజూచి భయమా! జెల్లీనిగాంచి యేడుపా? పామునుజూచి పరుగా?-దోమ కఱచిపోవునేమో యని సాయంకాలమగునరికే నన్ననిగుడారములో దూఱినవాఁడు

వీరుఁడా? మన నల్లిపోతులలో నొక్కటి ప్రక్కఁజేరి కటుక్కున నంటఁబొడిచినయెడలఁ గల్లుద్రావినవానివలెఁ దెయితక్కలాడువాఁడు ధీరుఁడా? అంతవఱకుఁగూడ నెందులకు? ముల్లు కాలికిఁగ్రుచ్చుకొనునేమోయని ముచ్చెలుదొడిగికొని కాని వెలుపలికి రాఁడే. వీనిభయము బ్రద్దలైపోను. పల్లేరుగాయ యనఁగ గడగడలాడిపోవునే – బట్టలోఁ జీఁపురుము ల్లున్నయెడల నూడఁదీసికొనినఁదాక నేడ్చుచునేయుండునే–గాలి చల్లఁబడిన యెడల నొక్కరోగము – మోతాదుగనున్న మజీయొక్కరోగము–వెచ్చఁబడిన వేఱొక్క రోగము-గంగిఱెద్దునకున్నంత గంతవేసికొని కాని వెలుపలికే వేంచేయఁడే–వీనికొతరత గడ్డలైపోను వీఁడేనా వీరుఁడు? వీఁడేనా సృష్టికిఁబ్రభుఁడు? నీకింతబొంతమోతయెందుల కురా యని మూఁతిమీఁదనీడ్చి పండ్లువిఱుగ నొక్కటి వాయింపఁగల నాసోదరుఁడేఁడీ? మన మట్టివేషములు వైచుచుంటిమా? ఓ తుపానుపట్టనీ–అగ్నిపర్వతము ప్రేలనీ! భూకంపములు రానీ! మంచుగడ్డలు వర్షింపనీ! మనము దిగంబరులమై యొక్కవెండ్రుక యైన నూడకుండ నొక్కటొక్కయైన జాఱకుండఁబంచభూత మహాసంక్షోభమును మహావీరులమై యెదుర్కొనుటలేదా? యథార్థవీరుఁ డెవఁడో యిప్పుడు తెలిసినదా? యథార్థముగ సృష్టికిఁబ్రభుఁ డెవఁడో యిప్పుడు మీకుఁ దెలిసినదా?

తరువాత వానిబుద్ధినిగూర్చి నాల్గుమాటలు చెప్పెదను. ఎలుకలను జంపుట కాతఁ డెన్నెన్ని యేడ్పులేడ్చుచున్నాఁడో మీకుఁదెలియని సంగతియా? కట్టబోనట-లోపల మినుపరొట్టియఁట. కత్తెఱబోనఁట. లోపల గారెముక్కయఁట. వానిమాయమండ- తనువు చీల్చిననైన వానియొద్ద ధారాళతయున్నదా? ఎందుల కీదగాబాజీ? ఎందులకీమో నము? ఇదిగాక (Ratsbone) అఁట–మీరు వినలేదా? పత్రికలలోఁ బ్రచురించి మిడుకుచున్నాఁడే–వీనిదౌర్జన్యము మాసిపోను. ఆవిసము తిని తానేల చావరాదు? పుణ్యపాపము లెఱుఁగని మనలకుఁగూఁటిలో విసముపెట్టి గొంతుకోయునా? ఇదిగాక గౌరవార్హులగు కరుణాలవాలములగు నామశకమత్కుణ సోదరులకు సంఘమరణ మిచ్చుట కేవో– పొడర్లఁట–ద్రావకములఁట! మాత్రలఁట. పత్రికలలోఁ బ్రచురణమఁట! బజారు లలో నమ్మకమఁట! వానిమొగము! వానిమోర! ఆర్యసోదరులారా! నరునిమొగ మెప్పుడైనఁ బరిశీలనముగఁ జూచితిరా! మనమొగము వలె ధారాళమై, తేజస్వంతమై, నిష్కపటమై, దాక్షిణ్యయుక్తమై, యమాయికమైయుండునా? ఉహు. వట్టిదొంగమొగము ఇంద్రజాల మహేంద్రజాల విద్యలన్నియు వానిమొగమున మొలకలెత్తుచుండును. ఊఁ యనఁగ నంగీకారమని యర్థముకాదు. 'ఉహూహూ'నఁగ ననంగీకారమని యర్థముకాదు. నవ్వుఁబట్టి దయయని యనుకొందురేమో? అసత్యము. అసత్యము బాష్పములనుబట్టి పరితాపమను కొందురేమో? వట్టికల్ల. నవ్వుచునే నఱుకఁగలఁడు. థూ థూ! అంతటక్కరి యంతదొంగ యంతమాయకాఁడు మజీయొకఁడు లేఁడు.

తరువాత నాతని విశ్వాసమునుగూర్చి చెప్పెదను. మనసోదరులలో ముం దొక్క దోమను దీసికొనుఁడు. ఒక్కసారి యది యొకనరుని గఱచినదనుకొనుఁడు. ఆతని నెప్పుడైన నది వదలునా? తిరుగ నాతనినే కఱచుచు నాతనియొద్దనే మంచియో చెడ్డయో కనిపెట్టుకొని యుండును గాని యవిశ్వాసముతో నాతని నెన్నఁడైన వదలియుండునా? బట్టతోఁ ద్రోచినైన నైనఁ జేతితో విదళించిననైన జెవులకుఁగట్టిగ గట్టుకొని

దరిఁజేరనీయకపోయిన నైన ''నాతఁడే చెడినాఁడు. ఈమాత్రమునకై మనకేమి తక్కువ'' యని యాతనినే యంటఁగ్రాగియుండునుగాని యావలికిఁ బోదే. ఇఁక మామత్కుణసోదరులవిషయమై యీనద్గుణమునుగూర్చి చెప్పవలసిన దేమున్నది? తుంగచాఁపనుగాని బల్లనుగాని కుర్చినిగాని మంచమునుగాని యాశ్రయించి యొక్కనల్లిపోఁ తొక్కసారి యొక్కనరునిరక్తము దబ్బలపుమొనయంత త్రావినయెడల నావిశ్వాసము దానికి హరియని యంత మొందువఱ కుండవలసినదేకదా! అది యానరు నెన్నఁడైన వదలునా? ఎన్నఁడైన మఱచునా? నరునివఱ కెందులకు? ఆచాఁపను వదలునా? ఆసోఫాను వదలునా? ఎండలోఁ బెట్టి మోదనీ! ఉడుకునీళ్లు పెట్టితడుపనీ! అప్పటికిఁ జచ్చిన ట్లుల్లిపారవలె నుండినను మఱునాఁటికే పదనెక్కి యాతని దుర్నయమును గడింపక మఱల నాతనిచే యంటఁబొడిచి యట్లే ప్రక్కనాశ్రయించియే యుండునుగాని యావలికిఁ బోదే! ఇఁక మాజాతినంగతి రవంత మననిచేసికొందును. ఫలాహారపుబీరువానో ధాన్యపుగాదెనో యాశ్రయించి మాలో నెవ్వఁడైన నుండినయెడల నాయునికి యునికి యట్లే యుండఁదగినది గాని యందులకు భిన్నముగ జరుగుట కవకాశమున్నదా? ఇంటిలోని దానీ చీఁపురకట్టతోఁ గొట్టనీ! ఇంటిలోని వితంతువు బోనులో నుండ్రపుముక్కఁ బెట్టనీ! కొట్టు పెట్టుగూడ సమముగనే చూచి యీయిల్లెన్నటికైన వదలునా? నరున కట్టివిశ్వాసమున్నదా? కృతఘ్నుఁడు! చీ! కృతఘ్నుఁడు! మహారాజు నాశ్రయించి యాతనివలన ననేకోపకారము లొంది, భాగ్యవంతుండైన నరుఁ డామహారాజుచేనైన నొక్కమాట పడుటకుఁ జచ్చిపోవునే–సాలువు లిచ్చినపుడు ధరింపవచ్చును గాని చీ యనినప్పుడు సహింపఁగూడదేమి? తుచ్ఛుఁడు! విశ్వాసఘాతకుఁడు! అంతటితో సరిపోయినదా? అట్లుకాదే? మహారాజుపై నాగ్రహించి యెదురుకొని యాతని కపకారమును గూడ జేయుటకు సాహసించునే! ద్రోహి–పరమద్రోహి. అతని పరశ్రేయస్సహనమును గూర్చి రవంత చెప్పెదను. తనసుఖములవలన నరునకుఁ గలుగునంతోషముకంటె నితరులయాపదవలనఁ గలుగునంతోష మెక్కువ. తాను దనతమ్ముఁడు తగవులేకుండ నుండుట నంతోషము కాదు. పైవారిలో నన్నమ్మలు తగవులపడి జుట్టుజుట్టు పట్టుకొని కొట్టుకొని కచ్చేరి కెక్కినారనఁగ, అబ్బ! అబ్బ! ఏమిసంతోషము! చెవిఁగోసికొని యావార్తను మహానందమున వినును. తాను జుట్టులుజుట్టుకొనియో అంకులదాట్నము త్రిప్పుకొనియో పావులాడబ్బులు తెచ్చుకొనుచుండగా నందులకు సంతోషింపరాదా! ఉహు పెద్దెతుపాను బట్టగ నోడలన్నియు నొక్కసారియే మునిఁగిపోవుటవలనఁ బైవర్తకుఁ డెవఁడో దివాలాతీసినాఁ డనియు నాతని నందఱు దుమ్మెత్తి తిట్టుచున్నారనియు వినినయెడల–ఓ! ఏనంగీతము దానిముందుఁ బనికిరాదే! ఆహా! వీనిస్వభావము చట్టుబండలై పోను! తాను దనభార్యయు సుఖముగాఁ గాఁపురముచేయుచున్నప్పు డాసంతోషము తనకుఁ జాలదా? చాలదు. ముమ్మాటికిఁ జాలదు. పై ఇంటియాబిడ మాటమాటమీఁద మగనిని లెంపకాయఁ గొట్టి పుట్టినింటికుడాయించినదని వినఁగ ఓహోహో! ఏమికులుకు? ఏమి కిచకిచ! ఏమి వెకవెక! ఎంతసేపు తనసుఖముల నంగతి మఱచే–పైవారిబాధలే, ప్రాణహింసలే–శోకములే తనకుఁ బ్రత్యక్షసుఖము నిచ్చునవి. తనభోగముకంటె నొకనిరోగము తన కెక్కువసంతోషమైనప్పుడు, తన సుఖముకంటె బ్రొనిదుఃఖము తన కెక్కువ సంతోషమైనప్పుడు వానిప్రకృతి యెంతదిక్కుమాలిన ప్రకృతియో చెప్పవలయునా?

నేనయింక నుపన్యసించునెడల మహావక్తలయిన మత్కుణమశకరాజేంద్రుల కవకాశమేదీ? ఇదిగో! కార్యక్రమపత్రము. ఇక మశకోత్తములగు కీచురావుగా రుపన్యసింతురు. ఆయన ఆనెగొంది నివాసి. అనేకబిరుదముల నాంధ్రలోకమున సంపాదించినాఁడు. ఆయన యుపన్యాసము శ్రద్ధగా వినుఁడు. కీచురావుగారి యుపన్యాసము.

అగ్రాసనాధిపతీ! సోదరులారా! సోదరీమణులారా! మీనాగతర యెంతపురాతనమైనదో మీరెట్టి మహోన్నతదశను బూర్వమందనుభవించితిరో మీజాతులు పూర్వమం దెంతకట్టుదిట్టముగ నుండెడివో మీరెఱుఁగుదురా? ప్రకృతిశాస్త్రమేమి వైద్యశాస్త్రమేమి వేదాంతశాస్త్రమేమి ఆర్థికశాస్త్రమేమి రాజతంత్రశాస్త్రమేమి అదియిది యననేల? సర్వశాస్త్రములుకూడ మొదట నెవరివి? మనవి. వాని నన్నిటి నెంతయభివృద్ధిలోనిఁ దీసికొనరాఁదగునో యంతయభివృద్ధిలోనిఁ దెచ్చినవారెవరు? మనము. శాస్త్రజ్ఞానసంపూర్ణులై జగద్విశ్రాంతకీర్తిని సంపాదించినవారెవరు? మనము సర్వలోకమునకు జ్ఞానజ్యోతికి గానఁబఱచినవారెవరు? మనవఁు. అట్టిమనము–మతములో నగ్రణ్యులమైన మనము–కళలలో నగ్రగణ్యులమైన మనము–నాగరికతలో నగ్రగణ్యులైన మనము – ప్రపంచమునకంతకు సర్వ విషయములందు మార్గదర్శకులమగు మనము–అట్టిమనము నేఁడెట్లున్నాము? పతితులమై, భ్రష్టులమై, పనికిమాలినవారమై ప్రజ్ఞాశూన్యులమై, పరతంత్రులమై, బలహీనులమై, ప్రతిష్ఠాశూన్యులమై పెంటలపైఁ, దుక్కుపైఁ దూగరపై, బొరియలలోఁ బుట్టలలో నామరూపములులేక పడియున్నాము. (వినుఁడు వినుఁడు అనుకేకలు) ఎందువలన? నరునివలన. నిర్భాగ్యుఁడైన నరునివలన. నిన్నఁగాక మొన్నఁబుట్టిన నరునివలన. సమస్తవిద్యలు మనపాదములయొద్దఁ బడి నేర్చుకొనిన నరునివలన. మనజ్ఞానమంతయు, మనతేజమునంతయు, మనఘనతనంతయు, మనఖ్యాతి నంతయు నపహరించిన నరునివలన (సిగ్గు సిగ్గు అను కేకలు) కవిత్వము గానము నరుఁ డెవనియొద్దనుండి సంపాదించెను? మనమశకసోదరులనుండి కాదా? Aviation అని యిప్పుడిప్పు డెగిరియెగిరి క్రిందఁబడి పండ్లగిలించుచున్న నరుఁ డాశాస్త్రము నెవరి యొద్దనుండి యపహరించినాఁడు? మన మశకసోదరుల యొద్దనుండి కాదా? భూమిపై త్రవ్వుట – దానిలోని లోహముల నెత్తుట–అన్ని విధములయిన Subterranean activitiesతోఁజేరిన 'జియాలొజి' యనుశాస్త్రము మెవ్వరియొద్దనుండి యాతఁ డపహరించినాఁడు? మనమూషకసోదరులనుండి కాదా? అంతవఱ కెందులకు? ధాన్యపుమట్టులు మఱికొన్ని యిరతయంత్రములు మన మూషకసోదరుల పండ్లనుబట్టికదా యాతఁడు కల్పించుకొనినాఁడు. ఇటు లెన్ని చెప్పవచ్చును. మనపందికొక్కుసోదరుల యొడలిబొచ్చును జూచికదా ఉన్నిబట్టలని రాంకవములని కోటులని కుడితినీలని యిప్పుడిప్పుడు మిడుకుచున్నాఁడు! స్వతంత్ర జ్ఞానములేక కల్పనాశక్తిలేక యఖిలతంత్రములందు మనల ననుకరించికొనలు త్రుంపి తలలుమార్చి యంచులూడఁదీసి క్రొత్తరంగుపూసి లక్కికినిక్కిగ మక్కికి మక్కిగ మిడికి విక్కుచున్నాఁడే! ఏదొంగయో యే మ్రుచ్చో యంతటితో నూరకుండెనా? ఉహు. శారదాపీఠ మయిన మనపయి నెదురు తిరగినాఁడే. మనలను మారణహోమ మొనర్పఁ బ్రయత్నించుచున్నాడే. విశ్వాసఘాతకుఁడు ప్రకృతిశాస్త్రమందు మహాపండితుఁడట. ఆతని కల్పన లొకటిరెండు విమర్శింతును.

మాకాటువలనఁ దనకు మన్నెపుజ్వరము వచ్చుచున్నదని మొదలుతుదలేదని సిద్ధాం

తమొకటి స్థాపించినాఁడు. ఇది యీభూతకల్పన ఈపనికిమాలిన రాద్ధాంతమొనర్చి ప్రకృతిశాస్త్రమున కావలిగట్టు చేరితినని విజ్ఞాపిఁగుచున్నాఁడు. సింహము మొదలుకొని చీమవఱకు మాకాటు తిననిజంతువు లోకమున నున్నదా? అవియన్నియుఁ జలిజ్వరమునకు లోనయి యున్నవా? అన్నిజంతువులకు రాదనియు నన్నిదోమలవన రాదనియు నాసిద్ధాంతముక్రింద వెంటనే హంసపాదముంచినాఁడు! వీనిసిగ్గు చిమిడిపోను ఇక్కఁడి కీసిద్ధాంతము సగమువచ్చినదా? అన్నిజాతుల దోమలలోను విషజాతియొకటి యున్నదని పైతుడుపునకు దిగువనే యొక చిన్న బ్రహ్మసూత్రము కల్పించినాఁడు. నరులలోగూడ నట్టివిషజాతి యున్నదేమో? తనబుద్ధి కీమాత్రమైన వినియోగ మక్కఱలేదా? సరే ఆతగవెందులకు? అట్టివిషజాతి యున్నది. ఆవిషజాతి గఱచినవారందఱకయినను మలేరియా వచ్చుచున్నదా? లేదని తానే చెప్పుచున్నాఁడు. ఇక్కఁడికి తరువాతిసిద్ధాంతముకూడఁ బరమపదించినట్లేకద? ఆచలిజ్వరపు 'టెండెన్సీ' యున్నవారికేమో యదివచ్చునని సరిక్రొత్త సిద్ధాంతము. ఈటెండెన్సీ యేమి తన మొగము నామొగము; అనగా రావలసినవారికి వచ్చును. రాఁగూడనివారికి రాదన్నమాట! అంతేనా? అంతకంటె నర్థమేమైన నున్నదా? ఈమాట మొదటనే దేవులాడక నిష్కారణముగా మమ్మె నెపపెట్టుటెందులకు? మమ్మె మాడ్చినైచెటకుఁ బ్రయత్నము లెందులకు? మలేరియల్ పారసైటట మతిలేనిమాటలఁట మాదిగమంచమట –తననరత్వమును దానెఱిఁగి మిడికినప్పుడుకదా మాతత్వమును బరీక్షించుట. మలేరియల్ పారసైటుమాకెట్లువచ్చినదో తనకు నట్లేవచ్చినదని యనుకొనరాదా? మలేరియావలన పారాసైటు పుట్టుచున్నది కాని పారాసైటువలన మలేరియాపుట్టుచున్నదా? తోఁచినట్లూహ ములా? ఏదోయొక్కటి కర్మము చాలక సరిపోవునెడల శాశ్వతసిద్ధాంతస్థాపనమా? ఇదివఱకు మాలో నొక్కవిషజాతియే యున్నదనికదా చెప్పినాఁడు. ఇపుడు రెండవ విషజాతి బయలుదే ఱినదఁట. అది బోదకాలు కలుగఁజేయునఁట. బోదకాలు నీటిచేఁ గలుగునని కొన్నినాళ్లు, అనిటిదెబ్బలు–అలికిదెబ్బలనేకములు కొట్టికొట్టి యిపుడు దోమయే ఫైలేరియాకుఁ గారణ మని ఢంకామీఁద దెబ్బకొట్టికోటలోఁ బాగావేసి ఝాంకరించుచున్నాఁడే. ఇంత మతిలేని వ్యక్తులు మాజాతిలో నున్నయెడల ముక్కలక్రిందఁగొఱికినైవక మానుదునా? పామకాటు చేనైనఁ బ్రాణము పోకపోవచ్చును గాని నరునికాటులకు దిరుగున్నదా? తిరుగులేదని యెఱిగియుండియు నరులను జంపుచున్నవారెవరు! ఆమాత్రపు నీతి తనకేలయుండకపోవల యును? పోనిండు. ఈగొడవయంతయు నెందులకు? మాకాటువలనన యతనికి మన్నెపు జ్వరము బోదకాలు వచ్చుచున్నవనియే సిద్ధాంతపఱుపుఁడు. మనముకూడ నొప్పుకొం దము. ఆతని రక్తము మనము త్రావినందువలన మన కెన్నివ్యాధులు వచ్చుచున్నవోయతఁ డెఱుగునా? మనవలన నతనికి మలేరియా వచ్చుచున్నదేకాని యతనివలన మన కంతకంటె భయంకరమైన జలేరియా వచ్చుచున్నది. మనవలన నతనికి ఫైలేరియా వచ్చుచున్నదని నా సిద్ధాంతము కాదనఁగలవారెవరు? మీరుమాత్రము మూడేసిదినములు మొద్దునై పడియుం డుట లేదా? మీకుమాత్రము దేహములు వాడుటలేదా? మొదటి చచ్చువాతపువ్యాధికి జలేరియాయనియు రెండవదైన గాత్రపు పొంగువ్యాధికిఁ గైలేరియాయనియు నేను పేళ్లుపెట్టి తిని. నన్నడ్డుకోఁగల వారెవ్వరు? ఇంతే? ప్రపంచధోరణి యింతే? ప్రకృతిశాస్త్రపరీశీలన మింతే? ఉll-నాలుకమెటులాగునో యటువాగుటా! కల మెటులాగునోయటు వ్రాయుటా! పోనిండు. ఆతనియిష్టమువచ్చినన్ని పూర్వపక్షరాద్ధాంతము లొనర్చుకొననిమ్మ. కాని

నరుని సిద్ధాంతమువలన మాకు బ్రాణహరణ మెందులకు? మనసిద్ధాంతమువలన నరుని కేమాత్రపు బ్రాణోపద్రవము కలిగినది? ఈమాత్రపుటౌచిత్యము తనకేల యుండరాదు! తాను బలిష్ఠుఁడా! మనము బలహీనులమా? తనబలిమిపసయేదో లోకమునకు వెల్లడియైనది కాదా? జీమకు దాసుఁడే–జెట్టికి దాసుఁడే–కామాక్షి దాసుఁడే–వీనిబల మిట్లున్నది. పలుకులు చూడఁబోవఁగఁ బ్రపంచములు ప్రపంచములు దాఁటిపోవుచున్నవి. పనిచూడఁగఁ బ్రాణహరణము తప్ప మఱేదియుఁ గనఁబడదు. ఇంత దొరలాటయు, నింతదుర్బుద్ధియు, నింత పరపీడాకరుఁడు, ఇంత తుచ్ఛుఁడు, ఇంత దుర్మార్గుఁడు ప్రపంచమునందలి మఱియేజాతిలోనైనఁ గనఁబఱుఁపగలిగినయెడల నీమశకజాతియంతయు నగ్నిప్రవేశమొనర్చి ప్రాణపరిత్యాగ మొనర్చుటకు శపథము చేయుచున్నది. పోనిండు. మనవలన నతనికి రోగములు వచ్చినను నతనివలన మనకు రోగములు వచ్చినను మనల నతఁడు చంపినను మన మతనిని జంపినను నేనంత బాధగ గణింపలేదు. నరరక్తము ద్రావుటవలన మాకు మఱియొక్క పెద్దపుట్టి మునుక వచ్చినది. నరుని రక్తములో నున్న యన్నిదోషములును మాకు సంక్రమించినవి. సంక్రమించుచున్నవి. ఈనడుమ మఱింతతీవ్రముగ సంక్రమించుచున్న అయ్యయ్యో! మేమెన్నఁడు వర్ణభేదమెఱుఁగమే. ఎన్నఁడు జాతిభేదమెఱుఁగమే. నల్లఁ మలఁట. యెఱ్ఱదోమలఁట. అయ్యయ్యో! ఎఱ్ఱదోమలకంటె నల్లదోమ లెక్కువయఁట. అయ్యయ్యో! జాతిభేదమట మశకబ్రహ్మగారి మూఁతిమీసాలనుండి పుట్టిన దొకజాతియఁట. తొక్కలనుండిపుట్టిన దొకజాతియఁట. నడుముకణపునుండి పుట్టిన దొకజాతియఁట. సుఖములనుండి పుట్టిన దొకజాతియఁట. థూ! వీనిలో నొకదానికంటె నొకటి తక్కువయఁట. తిరుగ నొక్కొక్కభాగములోఁ బదునాలుగేసి యంతర్భాగము లఁట. ఒకభాగము ప్రాఙ్ముఖము. ఒకటి పశ్చిమముఖము. ఒకటి యుదఙ్ముఖము. ఒకటి దక్షిణముఖము. మఱియొకటి యూర్ధ్వముఖము. ఇంకొకటి యధోముఖము. దానికిది యష్టమచంద్రుఁడు. దీని కది నైఋతార. దాని కిది చుక్కయెదురు. దీనికది యేలేటిశని. దాని కిది ద్వితీయాధిపతి. దీని కది సప్తమాధిపతి. ఇది సాపడిన పేడకడి నది తాకఁగూడదు. అది త్రావిన మురికికుండనీ రిది తాకఁగూడదు. దీనిని దలపెట్టినయెడల దానికి నరకము. దానిని దలపెట్టినయెడల దీనికి నరకము. కుటుంబవ్యాపారములలో సంఘవ్యాపారములలో రాజకీయవ్యాపారములలో మతవ్యాపారములలోఁ జెప్పనే యక్కఱలేదు. ఒకరినొకరుతిట్లు –తెఱపిలేనితిట్లు–బూతులు – పచ్చిబూతులు. ఈయుద్దండశాపములతోడనే యుపన్యాసములు. చీ! ఈబండ బూతులతోడనే పదములు. థూ! ఏమిశ్రాద్ధయోగ్యముగ నున్నదోయున్నది. పండితుల కొక్కటేరోగము, పామరులకు నొక్కటేరోగము. వేదాంతుల కొక్కటెతెగులు, వీటకాండ్రకు నొక్కటే తెగులు. సైయుద్యోగుల కొక్కటే సంకటము. క్రిందిభటులకు నొక్కటే సంకటము. ఈకర్మము–ఈగాడిదగత్తర– ఈగందరగోళము మాజాతులలో మునుపెప్పుడు లేదు. అందులో పదిపండ్రెండు సంవత్సరములనుండి యీరవ్వ –యీరాయిడి– యీరసొభానము–యీరణగణధ్వని పందెపుగుఱ్ఱపుఁజరుగువలె బడాయించుచున్నవి.

మఱియొకసంగతి చెప్పనా? పూర్వమందు మాకింత స్త్రీవాంఛలేదు. ఏదో కాలానుగుణముగా యధోచితముగ నంటియంటనట్లుగమేము కాంతావ్యాపారమును నిర్వహించుకొంటిమి. ఇప్పు డిట్లుకాదే? ఊహఁ. ఎప్పు డదియేచింత! ఇదేమికర్మమో! ఇదంతయు

మాకేదో యొకవ్యాధిలాగున బట్టుకొనియున్నది. పూర్వము ప్రాణివిధిక్రిందజరిగిన వ్యాపార మిప్పుడు దిక్కుమాలినవ్యసన మైనదే. ఇదిగాక మాలోఁ గొందఱునైద్యులు-వీరితెక్కలూడిపోను-వీరితొండములు తెగిపోను-ముసిడిజిగు రిందులకు దోహదమని మాసోదరులకు బోధించుచున్నారు. ఇన్ని బాధలు నరరక్తపానమువలనఁ గలిగినవి.

మఱియొకయంశముచెప్పనా! (''మశకోత్తమా! ఉపన్యాసము లీయవలసినవారు కార్యక్రమము ననుసరించి యిఁక నిద్దఱున్నారు. తెల్లవాఱవచ్చుచున్నది. శీఘ్రముగ నభ చాలింపక తప్పదు. కావున నీకింతకన్న కాల మీయఁదలఁచుకొనలేదు. తరువాత మత్కుణ రాజమును మహామహోపాధ్యయుఁడను నగు మంజుళాచార్యులవా రుపన్యసింపవలయును,'' అని యధ్యక్షుఁడు పలుకును.)

మహామహోపాధ్యాయుని యుపన్యాసము

అగ్రాసనాధిపతీ! మశక మత్కుణ మూషక సోదరమహనీయులారా! మన రావుబహద్దరుగారి యుపన్యానమును మహానందమున వింటిమి. నేను జెప్ప నిశ్చయించిన యంశముల న్నియు వారే సెలవిచ్చినారు. మనుష్యరక్తపానమువలన మనలో శారీరకముగ మానసికముగఁ గలుగుచున్నవని వారు సెలవిచ్చినబాధలు మాలోమట్టునకు శతగుణములుగ వ్యాపించి మమ్మ బాధించుచున్నవి. మాకు మనుష్యరక్తముచే గడుపునిండించుకొనుటకంటె సాపడుటకు మఱియొకసాధనమే లేదు. అందుచే మనుష్యునకున్న యవగుణములన్నియు మాలో సంపూర్ణముగ నున్నవి. మనస్సాక్షమార్గము; మాట మఱియొకమార్గము చేష్ట వేఱొక్కమార్గము. మాలో నిప్పుడు వక్తలెందఱో బయలుదేరినారు. రాజకీయాంశములఁగూర్చి రమ్యోద్యములవలె మాటలాడుచున్నారు. నల్లిజాతి నభివృద్ధిపఱచుటకు నల్లిజాతి నేకీభావముగఁజేయుటకు నల్లిజాతి జాతీయతను సమగ్రముగజేయుట కెందఱో మహావక్తలు మంచములలోనుండి మహాసనములలోనుండి ప్రతాస్తరణములలోనుండి మనుష్యుల వస్త్ర ములలోనుండి మహోదారముగ మహాగంభీరముగ నుపన్యసించుచున్నారు. స్వార్థపరిత్యాగ మని శాంతియని దేశక్షేమమని త్యాగమని యెన్నియో సద్గుణములను బోధించుచున్నారు. ఎంతసేపు బోధనమే. ఆచరణమన్నమాటయైన లేదు. ఇట్టి గుణములను బోధించువారైన నాచరించుటలేదా? లేదు. సోదరులారా? లేదులేదని చెప్పుటకు విచారములేదు. లజ్జకూడ లేదు! దాదాపుగ నందఱిలో నదియే లోప మున్నప్పుడు చింత యెందులకు? సిగ్గెందులకు? నరునిరక్తము త్రాగఁగూడదని యుపన్యసించువారే యత్యధికపానమున నజీర్తిబాధ పడుచున్నారు. శాంతిశాంతియని చాఁపలు జలజలలాడ మంచపుగోళ్లు మాఱుమ్రోయ నుపన్యసించువారే నేనెక్కువయని నీవు తక్కువయని నీది నీచమైన మిడిజాతియని నాది ఘనమైన ఱెక్కజాతియని యొకరినొకరు కఱచుకొని పీకుకొని క్రుమ్మలాడుచున్నారు. స్వార్థపరిత్యాగము స్వార్థపరిత్యాగమని సాగఁదీసి పలికెడు స్వార్థపరిత్యాగులు కుర్చీఁపునందలి నల్లిసోదరులను మంచపుఁదలటామునకుఁ జేరనీయకుండ దున్నుచున్నారు. ఇంద్రియనిగ్రహమును బోధించు విరాగిశిఖామణులు సర్వసంగశూన్యులు జాముజామునకు గ్రుడ్లు పెట్టుచున్నారు. (వ్యవధి యెంతయోలేదు. త్వరగఁ దెములుము అని అధ్యక్షుఁడు మందలించును.)

తానుజెప్పిన నీతులు తనకుమాత్రమే వర్తింపవనియుఁ దానుదక్క నంద ఱీవి యనుష్ఠింపవలయుననియు ప్రతివక్తకుఁ బట్టుకొన్నపంతము. నాయనలారా! ఆలస్యమగుచు

న్నదని యధ్యక్షుఁ డానతిచ్చుచున్నాఁడు. ఒక్కయంశముమాత్రమే చెప్పెదను. మలేరియా పైలేరియాలసంగతి నేనెఱుఁగను గాని కాలాహజారను జ్వరమును మేము వ్యాపింపచేయుచున్నామని మమ్మఁజంపుటకు నరుఁడు నిశ్చయమొనర్చుకొని యున్నాఁడు. అన్నిజాతిజంతువులను జంపి పొట్టబెట్టుకొని వీడొక్కఁడు ప్రపంచమున నేమిచేయఁదలఁచినాఁడు? వీనితెలివి తెల్లవాఱిపోను. వీని ప్రకృతిజ్ఞానశాస్త్ర మిట్లు బ్రద్దలైనది. ఏమని చెప్పను! (ఇకఁ జాలునని యధ్యక్షుని కేక. ఆచార్యులుపన్యాసము చాలించును.) సోదరులారా! కార్యక్రమమునుసరించి మూషికసింహమగు తర్కశిరోమణి హ్రస్వకర్ణశాస్త్రిగారి యుపన్యాస మింకఁజరుగవలసి యున్నది.

హ్రస్వకర్ణుని యుపన్యాసము

సోదరసోదరీమణులారా! మన మనస్సులోని యభిప్రాయములేవో వెల్లడించుకొంటిమి. ఎన్ని యుపన్యాసములిచ్చిననైన నింతకంటె విశేషమేమున్నది? నేను చెప్పవలసినమాటలు నాకేమియుఁ గానఁబడకున్నవి. మహామారివ్యాధినిగూర్చి మమ్మాతఁడు పెట్టినబాధలు లోకవిదితములు. మాజాతినంతయు మాడ్చి మాపుటకే యత్నించెను. ఆవివరణములఁగూర్చి యిప్పుడు చెప్పుట కవకాశములేదు చెప్పుటకుద్దేశమును లేదు. మనుజజాతిని మాడ్చివేయుటకు మనకు సాధనమేమైన నున్నదా యని యిప్పటిప్రశ్న. (నరులను జంపవలయును. చంపకతప్పదు. అను కేకలు) తప్పదనువాఁ డారియేమున్నదో కానఁబఱచుఁడు. అంతేకాని యఱపులతో నేమివినియోగము? అదిగో చూచుచున్నారా? తెల్లవాఱుచున్నది. సూర్యుఁడు వచ్చుచున్నాఁడు నరుఁడింక లేచును. అయ్యయ్యో! అదిగోనరుఁడు! పొండు-పొండు – ఇప్పుడు మాటలాడుకొనుట కవకాశములేదు – లేదు-పరుగెత్తుఁడు-ఎగురుఁడు-ఇఁక నొక్క ఱొప్పపాటైన నాలస్యము చేయఁదగదు. తగదు.....అధ్యక్షుఁడే ముందు పరుగువాఱెను. బిలబిలలాడుచు నన్నియుఁ బరుగెత్తిపోవు చుండ నొక్కలేఁబ్రాయపునల్లి యిట్లు గంభీరముగఁ బలికెను. ఇదిగో-కరపత్రము-నే నిందులో జెప్పఁబడిన పనులన్నియుఁ జేయఁగలను. అత్యద్భుతము. మహాద్భుతము. యోగశక్తిసారము.

1. పరుగెత్తుచున్న యెలుకతోఁ మూఁతితోఁ గఱచిపట్టి యూఁపుట.

2. పందికొక్కుపైఁ బందికొక్కును దానిపై మూఁడవపందికొక్కును వీఁపుపై నెక్కించుకొని జరజరప్రాఁకుట.

ఇదిగో యీమూఁడవది మఱింత యద్భుతము-వినరా! పోవుచున్నారా?''.....ప్రాణ రక్షణార్థమై పోవుచున్న యీజంతువు లాబాలమత్కుణము చెప్పునదేమో పూర్తిగ వినకుండనే పరుగెత్తిపోవుచుండెను. ఆసందడిలో నొక్కయెలుక నాకాలిపై కెక్కును. అమ్మయ్యో యని యడిపోయి లేచితిని. 'గూడూరు గూడురు' అని స్టేషనునొద్దనున్న భటుఁడు కేకవేయుచుండెను.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

43. స్త్రీలసభ

మద్రాసులో రహస్యంగా ఒక స్త్రీలసభ జరిగిందట. ఆ సభకు జంఘాలశాస్త్రి భార్య కూడా వెళ్లి ఉండడం వల్ల అక్కడ జరిగిన విషయాలు శాస్త్రికి తెలిసి మనకు ఉపన్యాస రూపంలో ఒక రిపోర్టరు లాగ చెపుతున్నాడు.

సాయంకాలం 4.30 కి సభ అని నిశ్చయపరుచుకున్న స్త్రీలు–వీళ్లై మంది మాత్రమే వచ్చారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది ఆంధ్ర మహిళలే. తమిళులు, కన్నడిగులు, మహమ్మదీయులు కొద్దిమంది వున్నారు.

వచ్చిన వారందరిలో కాస్తోకూస్తో చదువు సంధ్యలున్న వారే ఎక్కువ. సభ ప్రారంభం కావడం కొంచెం ఆలస్యమైంది. సభకు అగ్రాసనాధిపత్నిగా భ్రమరాంబగారు ఎన్నికయ్యారు. వయస్సు, విద్యాయోగ్యతలున్న ఆమె అగ్రాసనాధిపత్నీత్వాన్ని అంతా సంతోషంగా ఆమోదించారు. ఆమె తన ప్రారంభోపన్యాసాన్ని లాంఛనంగా ముగించి మంగతాయారంబగారిని మాట్లాడడానికి ఆహ్వానించారు.

మెయిల్ పత్రికలో ప్రకటింపబడిన ఒక వార్త–మగవాడి మనస్సును కనిపెట్టే యంత్రం నిర్మాణమైందన్న సంగతి–ఆమె ప్రసంగానికి వస్తుంది.

ఇటువంటి యంత్రం పుట్టడం నిజంగా స్త్రీ జాతికి వరమనే అభిప్రాయపడిందామె. మగవాడి దుర్నయాలింక కట్టుబడతాయని నొక్కివక్కాణిస్తూ–ఆ యంత్ర స్వరూపం తనకి తెలియకపోయినా, ఊహించి, దాని పనితీరును విశ్లేషించింది. స్త్రీలు ఇందు గురించి విచారించి, విమర్శించి స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరుచుకోవడం కొసమే ఈ రహస్య సమావేశమని చెప్పింది. ఆ తరవాత వేంకట వేంకమాంబగారు కారణాంతరాలవల్ల ఉపన్యసించలేకపోగా– తాయారంబగారి ఉపన్యాస విషయాల్ని జాగ్రత్తగా నమీక్షించి, భర్తను ఎలా, ఎందుకు జాగ్రత్తగా చూసుకోవాలో భ్రమరాంబగారు సభకు నచ్చచెప్పారు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను–

నాయనలారా! ఈనడుమను మదరాసులో నొకస్త్రీలసభ జరిగినది. అది కొంత ఉపన్యసభయఁట–నాభార్యకూడ నామహిళా సభకుఁ బోయినది. ఆమె వలన నా

కొనభావృత్తాంతములన్నియుఁ బూర్తి గాఁ దెలిసినవి. అవి నేను మీతో మనవిచేసికొందును: దయతో విన వేఁడుచున్నాను.

అదియేదోవీథి–దానిలో నేదో కవాటసంఖ్యగల భవనము. సాయంకాలమున్నందు నాలుగుగంటల ముప్పదినిమునములకు నభయని వారిలో వా రెట్లో తెలియబఱచుకొనిరి. కాని కరపత్రములు లేవు. కుడ్యపత్రములు లేవు. పత్రికాప్రకటనములు లేవు. బ్యాండు మేళముతోఁ దిరువీథులు లేవు. సరిగ నావేళకు దాదాపుగా నేఁబదుగురుస్త్రీలు మాత్రమే నభకు విచ్చేసిరి. కాని వీరుమాత్ర మాణిముత్తెములు–బ్రహ్మజాతిహీరకళలు –సరస్వతీమూర్తులు–వారిలో విశేషముగ నాంధ్రమహిళాశిరోమణు లున్నారు. తమిళదేశ స్త్రీలు, కర్ణాటకదేశస్త్రీలు, మహమ్మదీయవనితలు కొలఁదిగా నున్నారు. ఏయుద్యమమం దైన ముందడుగు మనయాంధ్రులదేకదా? ఈపనివలన దేశక్షేమము కలుగునని తెలిసినయె డల నాపనిలో ముందుగాఁ బ్రవేశించువా రాంధ్రులే కాదా? ఈప్రయత్నమువలన భాషాభివృద్ధి కలుగునని తెలిసినయెడల నాప్రయత్నమందు మొదట నడుముకట్టుకొని దిగువా రాంధ్రులే కదా? ఈకార్యమువలనఁ బరోపకారము కలుగునని తెలిసినయెడల నాకార్యమందు మొదటి యంజవేయువా రాంధ్రులేకదా? చొరవలోఁ బట్టుదలలో కష్టసహనములో స్వార్థపరిత్యాగములోఁ బరోపకారశీలతలో దక్షిణహిందూస్థానములోని యితరదేశీయుల కెంతమాత్రమును దీసిపోక పోవుటయేకాక వారికంటె నావిషయముల రవంత చురుకుపాటు కలిగినవా రాంధ్రులేకదా! కాని మన కర్ణాటసోదరులలో నున్న దూరదృష్టికి మనవారి దూరదృష్టి రవంత జంకునేమో! రవంత వన్నెతక్కువ గలిగియుండునేమో? వారు చప్పున నేయంశము నమ్మరు. నమ్మిన పిమ్మటనైన నెంతకాలమో నిదానించి కాని యత్నింపరు. ఆయత్నము నైనను సందేహముతో జంకుతో సామాన్యోత్సాహముతోడనే యారంభింతురు. కాని మనవలె నిశ్చయబుద్ధితో నిర్భీతితో నీరంధ్రోత్సాహముతో యత్నించరు. ఎంతసేపు వారు స్వరక్షణమును జూచుకొనుచునే పైకిఁ బోయెదరు. కాని మనవలె మిగులనీ, తగులనీ, ఉండనీ ఉడనీ' యని మాత్రము తెగింపరు. మనవా రెంతసేపు వారిలో వారే గుడుగుడుగుం చము లాడుకొందురు. కాని యితరదేశీయసోదరులతో నంతగాఁ గలియరు. వారు మనలను గలియవచ్చినను వీలగు నంతవఱకు వారిని దప్పించుకొని తమగూటిచిలుకలితోడనేకూడి కులుకుచుందురు. ఈయెంట రెత్తుదనము మనపలుకులలో వ్రాతలలో నడతలలో మొగ ములలోఁ గూడఁ గనబడును. జన్మ దేశమును వదలిపెట్టి పోవుట మనవారికిఁ జావుగఁ గనబడునుగాని యది దాక్షిణాత్యాదిసోదరుల కెంతమాత్రమును గష్టకార్యముగఁ గనబడనే రదు. నాయనలారా! అంతయే చాలును! ఈ సామ్యవిభేదన పరిశీలనప్రవాహమున నిఁకఁ గొట్టుకొనిపోక ప్రకృతివిషయమునుగూర్చి పలికెదను.

రాజీవాక్షీమతల్లుల రహస్యపరిషత్తునికదా మనవిచేసియుంటిని? బ.ఏ., పరీక్షలో నుత్తీర్ణులైన మత్తకాశినులు, నుభయభాషాకవితాశోభితలగు నిభరాజయానలు, నాంగ్లేయా యుర్వేద వైద్యవిద్యాధురంధరలగు నుధామధురాధరలు, రాజకీయ శాస్త్రజ్ఞానగంభీర లగు ధారాధర ధీరలు, నభోగంగాభంగభంగ ఘుంఘుమారవసార వచఃపాటవ లగు హాటకగాత్ర లెందరో యట నభ నలంకరించియుండిరి. ఆహా! వజ్రముచే బంగారమునకు శోభ –పుష్పముచే వృక్షమునకు శోభ–సత్యముచే వాణికి శోభ–దైవభక్తిచే హృదయమునకు

శోభ-పడఁతిచే భవనమునకు శోభ-ఆఁడుదాని యడుగుఁదమ్ములచేఁ బవిత్రముకాని భవన మెందుకొఱకు? పరశురామస్రీతికొఱకు. అదిగో వలపలిపాపటులవారు, డాపలి పాపటుల వారు, మాధ్యమిక సీమంతములవారు, ముచ్చటముళ్లవారు. జారుకొప్పులనారు, చక్రబంధపు జడచుట్టలవారు, తెగబారెడు నల్లత్రాచు జడలవారు, దీర్ఘముఖలు, హ్రస్వముఖలు, వర్తులముఖలు, మధ్యబంగీవదనలు, బంగారుచాయఁగలవారు, మొగలిపువ్వుచాయవారు, బాదముపప్పుచాయవారు, చామనచాయవారు, జీడిరంగువారు, సీమబొగ్గురంగువారు, బండికందెన రంగువారు, చంటిపిల్లలతోఁ జేతిపిల్లలతో, కడుపులోని పిల్లలతో నటకు వేంచేసి యదృష్టవంతములైన కుర్చీలపైఁ గూరుచుండి యొకరినొకరు చూచుకొనుచు నెవరిమట్టునకు వారే తమయంతవారు లేరనుకొనుచు ముసిముసినవ్వులు నవ్వుకొనుచుఁ బక్కవారితో పనిలేనిదే యేదో ముచ్చటించుచు, నడుమనడుమ నాంధ్రపత్రికను విలాసార్థముగఁ జూచుచు సభాప్రారంభమునకై వేచియున్నారు. కలువల గమగమ, పద్మముల వాసన, గులాబిపూల గుమగుమ, మొల్లపూవుల మొత్తు, మొగలిపూల బుగబుగ, పారిజాతముల పరిమళము, చెట్టుసంపగుల గొట్టు, మదనమస్తకుల మత్తు కలసి ద్రవరూపమున సమకూర్చి యబలామతల్లుల యంగసౌభాగ్య సంపర్కమున గృతార్థత నొంది తరించుటకై యారు ఋతువులుకూడ నచ్చటవే కలసిమెలసి కాంతాసేవ సాయించుచున్నవే! వింత వింత తళుకులు చిత్రచిత్రవర్ణ ముగల చీరలు ప్రక్కనున్న సాలగచ్చు గోడలలోఁ బ్రతిఫలించి యకాలశక్రచాపశతములను గల్పించుచున్నవే! విద్యుదాయసవ్యంత పరిభ్రమణమునఁ జెలరేగి విసరుచున్న యోవాయు దేవా! యాకాంతామతల్లుల కుంతలములను గదలించిన సరే-కొందఱ చేతులలోనున్న సాక్షికాగితమును భవనద్వారములవఱ కెగురఁగొట్టిన సరే! కాని యీపూఁబోడుల మోము లందలి ''పౌడరు''ను మాత్రమెగురఁగొట్టకుమా? అది మహాదోషము సుమా? ఆబూడిదెనే యా పుష్పగంధులు పరమసౌందర్యలక్షణముగ భావించుచున్నారు. భద్రముగఁ బ్రవర్తింపవల యునుసుమా!

నాయనలారా! సభ యింక నారంభింపఁబడి యుండకపోవుట వలనఁ గాలక్షేపములేక కాంతలు కొంచరావులించుచున్నారు. కొందరు మణిబంధములనున్న గడియారముల నవలోకించుచున్నారు. కొందరొడళ్లు విరుచుకొనుచున్నారు. కొంద రుస్సుహుస్సుమని యాతుర పడుచున్నారు. కొందరు కూనురాగములఁ దీయుచున్నారు. కొందరెందులకో కాని కిసుక్కుమనుచున్నారు. ఒక వనితారత్నము Native punctuality అనఁగ నిదేయని యార్యావర్తదేశము నాసేతుహిమాచలపర్యంత మాక్షేపించి తన చిత్రవచోధోరణి కెవ్వరును నవ్వక పోవుటచేఁ దానే హాహాహాయని నవ్వెను. నాయనలారా! ఆమె యెటులున్నదో చెప్పనా? రెల్లుపూవంత తెల్లనిగౌను దొడిగికొనియున్నది. ఆమెగొంతుముడిక్రింద జేనెడు వఱ కర్ధచంద్రాకారముగ నామెశరీరము నిరాచ్ఛాదితమై కనఁబడుచున్నది. కన్నులపండువుగఁ గనఁబడఁదగిన మొగమైనను బూర్తిగఁ గనఁబడకుండ మనవారు మేలుము సుగుమర్యాద నేర్పాటు చేసియుండ నయ్యయ్యో యీయమ్మ దిగంబరపద్ధతి సవలంబించిన దెందువలననో! ఆమెభర్త సీమవెళ్లినాఁడట-అది యీమె వస్త్రమైఖరికిఁ గారణమఁట. నాయనలారా! చూచితిరా? కొందరు కునికిపాటులు పడుచున్నారు. అబ్బ! కనిపెట్టుకొని యుండుట కష్టము కాదా? ఇంతలో నొక్కయామె ''అబ్బ! కుర్చికి నల్లులమ్మా'' యని తటాలున లేచి వీపుగోఁకికొనుచు మరియొక కుర్చీపైఁ గూరుచుండఁబోవఁగఁ గొందరు

నవ్విరి. ''అమ్మా శ్యామలా! నల్లి యనఁగా జ్ఞప్తికి వచ్చినది. క్రిందటిసారి సారస్వతానుబం ధములోఁ బడిన–మశక మత్కుణ మూషక మహాసభాసాక్షిని నీవు చూచితివా?'' యని యొక స్థూలకాయపు సుందరాంగి యొక్క యడుసుకంటి యంబుజాక్షి నడిగెను. ''చూడకే మమ్మా! రుక్మిణీ! కాని యది యేయుద్దేశముతో నాతఁడు వ్రాసెనో తలఁగొట్టుకొనిననైనఁ దెలిసినది కాదేమి?'' యని యామె ప్రత్యుత్తర మిచ్చెను. ''అదియే యన్నమాట యేమి?'' యని యామె తిరుగ ననెను. వారియిద్దఱి సమీపమునఁ గూరుచుండి యీసంభాషణ మంతయు వినిన యొక్క పూర్వసువాసిని ''పానుగంటి లక్ష్మీనరసింహారావుగారఁట! ఆయనకు సాక్షియు జంఘాలశాస్త్రియు నేమగుదురని'' వారియిద్దఱి నడిగెను. ''ఓసీ! నీపాండిత్యము బండలైపోను!'' యని వారిద్ద రెందువల్లనో కాని కడుపు చెక్కలగునట్లు నవ్విరి. ఇంతలో నందరు లేచుచున్నారు. అగ్రాసనాధిపత్నిగారు వచ్చిరి. ''క్షమింపవలెను. క్షమింపవలెను'' అని కీఁచుగొంతుకతోఁ బలికి యామె యొకకుర్చిపైఁ గూరుచుండెను.

అంతలో నొక్కమహిళామతల్లి లేచి గొంతుసవరించుకొని పైటపైనున్న బొత్తామును రవంత భద్రపఱచి కుడిచేతితోఁ బయ్యెద చెఱఁగును గాసంత దగ్గఱ తీసికొని యొక్కకాలిపై నిలువఁబడి యొక్క కాలిని గుర్చియంచుపైనుంచి దీర్ఘమైన నిశ్వాసము నొక్కటి తీసికొని మెడలోని గడియారపు గొలుసు మీఁద గానఁబడకుండఁ బైటలోనికి వేసుకొని యిట్లుపన్యసిం చెను. ''సోదరీమణులారా! మీయందఱిపక్షమున నేను నాల్గుమాటలు చెప్పుటకై లేచితిని. పాలలో వెన్న యెట్లో పుష్పములో మకరంద మెట్లో యీపురంధ్రులలో నిచ్చటఁ జేరిన వారట్లని నేను దృఢముగాఁజెప్పగలను. ఈసభ కొన్ని కారణములవలన రహస్యముగాఁ జేయఁబడినది. ఇది మనము జయప్రదముగా జరుపుకొనఁగలిగినయెడల నఖిలభారతీయ నారీవారపరిషత్తున చిరకాలములో మనము స్థాపించి పనిచేయఁగలుగుదు మని నావిశ్వాసము. ఈసభ యెందులకుఁ జేయఁబడినదో యగ్రాసనాధిపత్ని గారివలనను నుపన్యాస మీయఁబోవు నాసోదరీమణులలోఁ గొందఱవలనను మీకుఁ దెలియఁగలదు. మన మిప్పుడు సభాకార్యనిర్వహణమున కగ్రాసనాధిపత్నినెన్ను కొనవలసియున్నది. ఏఁబది సంవత్సర ములు దాటినవారును, బురాణేతిహాసాది పరిచితి గలవారును బదుగురు పిల్లలఁగన్న తల్లియు సద్గుణసంపన్నయు నువాసినీమణియు నగు శ్రీమతి భ్రమరాంబగా రగ్రాసనాధిపత్నిగా నుండుటకు వయసుచే యోగ్యతచే విద్యచే నర్హులములగువారుకావున వారిని నేను సభవారిపక్ష మున నెన్నుకొనుచున్నాను.'' ఇట్లీమె ప్రతిపాదించినపిమ్మట నొక్క లేపు లీలాలోలయై లేచి ''యీపరిపోషణమును నేను బ్రతిపాదించుచున్నాను?'' అని చెప్పి వెంటనే ''ఆ! ఆ! కాదుకాదు. యీప్రతిపోషణమును నేను బరిపాదించుచున్నాను.'' అని దిద్దుకొని యంతలో ''ఆ! ఆ! అదికాదు కాఁబోలు! యీప్రతిపాదమును నేను బరిపోషించుచున్నాను'' అనిపలికి ముచ్చెమటలు పట్టఁగ నడుకుగింజయంత మొగముచేసికొని యట్టె కుర్చిపైఁ గూరుచుల డెను. Not a happy selection'' అని గొనుకట్టు కాంతాశిరోమణి యగ్రాసనాధిపత్నిని గూర్చి కొంత గొణుగుకొనెను. అగ్రాసనాధిపత్నిగా రుపన్యాసరంగమునకుఁ బోయి నిలువఁబడగ నందరు కరతాళధ్వను లొనర్చిరి.

అగ్రసనాధిపత్నిగారి యుపన్యాసము

''సోదరీమణులారా!'' నద్దునద్దు–నద్దునద్దు–''నన్ను మీరు''–నద్దునద్దు ''నన్ను

మిరు''-కరతాళ ధ్వనులచే నిద్దరు చంటిపిల్లలు నిద్రనుండి లేచియో బెదరియో కాని యింటిపైంకు లెగిరిపోఁ బోరుపెట్టుచున్నారు. ఉపన్యాస మందువలన నాగిపోవలసివచ్చి నది 'Silence' అనఁగ జప్పున నోరుమూసికొని పడియుండుటకు జ్ఞానమున్నవారా? అయ్యయ్యో వట్టి చంటిపిల్లలు. ''రవంత నమలఁ బెట్టరాదటమ్మా?'' యని యగ్రాసనాధిప త్నిగారే వారిని మందలించిరి. ''దేశక్షేమమునకుఁ బిల్లలే పెద్ద యుపరోధమని'' పూర్వపూ ర్వసువాసినిగారు పరమ సిద్ధాంతవాక్యముగఁ బలికిరి. ''నీకాబాధ లేకపోవుటవలన నీవు మహాదృష్టవంతురాలవమ్మా'' యని యగ్రాసనాధిపత్నిగా రామెను బరిహసించిరి. పెద్ద కార్యక్రమునకంతకును బిల్లలచే విఘ్న మాపాదింపఁ బడినదనియు యందరు తహతహలా డిరి. సభలోఁగలిగిన యీతహతహ యీతంద్రత నీయశాంతి యీసంక్షోభము యీరోత గాంచి యాపిల్లలతల్లులు క్రోధోద్రిక్తులై క్రమ్మదలగఁ బైట యడ్డుపెట్టి ప్రచ్ఛన్నముగఁ బైరికిఁ గనుకట్టుగ హస్తలాఘవచమత్కారమునఁ బిల్లల తొడలపై గట్టిగగిల్లి దౌడలు దగ్గఱగ నొక్కి విసుఁగుకొనుచుఁ జీకొట్టుచు సభాభవనద్వారమునొద్దకుఁబోయి యచ్చటి పారాజవానుగడ్డమును గట్టనుజూపి బెదరించుచు ''తానింటియొద్ద నిప్పుడు గోళ్లుగిల్లుకొనుచుఁ గూరుచుండుటకు బదులుగ నీగుమ్మములోఁ గూరుచుండి కుట్టకుంక లను రవంత సముదాయింపఁగూడదేమి?'' యని సమయమున కక్కఱకురాకుండనున్న మగలను జనవుబలిమిచే సాధించుచు–నీసారి పైసభకు వచ్చినప్పుడు పిల్లలను దీసికొని రాఁగూడదని శపథపూర్వకమగు నిశ్చితమొనర్చుకొనుచు నచ్చటనే కొంతసేపు నిలువఁబ డిరి. ఇఁక నిచ్చటినుండి భ్రమరాంబగారి యుపన్యాసపుఁ దరువాయి జరుగుచున్నది.

''మీరు నన్నగ్రాసనాధిపత్నిగాఁ జేయుటచే నేను మహానందమొందితిని! బెంగు ళూరులోఁ జదువుకొని బి.ఎ. పరీక్షలో నుత్తీర్ణురాండ్రైనవా లెందరోయుండ నీమకుఁబోయి సర్వవిధముల శ్రేష్ఠమైన జన్మాంతమేపొంది–విచ్చేసిన లోకోత్తరకళాసంపన్నులైన లోలాళు లుండ–నూరుదాఁటి యెన్నడును బైకిఁబోయి యెరుఁగని నేను–మీయెదుట యెన్నడును బైకిఁబోయి యెరుఁగని నేను–మీయెదుట నిలువఁబడుటకైన నర్హతనీయఁగల యక్షరజ్ఞానసా మగ్రియైన లేని నేను–బూర్వాచారపరాయణనైవృద్ధనైయున్న నేను–యీనవనాగరక నారీసభ కగ్రాసనాధిపత్నిగా నియమింపఁబడుట హాస్యాస్పదముగ నుండునేమోయని యడలుచు న్నాను (No No) అని సభలోఁ గేకలు) ,అనివార్యమగు కారణములచే నే నాలస్యముగ వచ్చినందులకు క్షమింపవేడుచున్నాను! కార్యక్రమము ననుసరించి నేను బ్రారంభోపన్యా సము మొదలిడినయెడల మరింతయాలస్యమగును గాన దానిని వదలుకొని నేను జెప్పవలసిన మాట లేవో కడపటనే చెప్పెదను. క్షమింపవలయును. శ్రీమతి మంగతాయారంబగా రిప్పుడుపన్యసింతురు'' అని యగ్రాసనాధిపత్ని పలికెను. కొంతావార కరతాళ గర్జశతమధ్య మున మంగతాయా రుపన్యాసపీఠ మెక్కెను. ''ఆమగచెంపలచేతఁ గొంత యసహ్యముగా నున్నది కాని స్వరూపము కొంతమంచిదేసుమా'' యని తాయారమ్మగారినిగూర్చి యొక్క తరుణీమణి ప్రక్కనున్న కాంతతో నిమ్మళముగఁ బలికెను. ''నిట్టితాడి లాగున నా పొడుగుమాత్ర మేమంత సొగసుగానున్నదని యాకాంత మంగతాయారులో మరియెక్కలో పము నగపఱచెను. ఆహాహా! అన్యోన్య సౌందర్యపరీక్షకంటె నన్యోన్య వస్త్రాలంకారపరీక్షకంటె నాఁడు వారి కత్యంత ముఖ్యమైనకార్యము మరియొక్కటి లేదుకదా! ఒకస్త్రీ మరియొక్క స్త్రీని జూచుట తటస్థించినప్పు డీమె యామెబుగ్గలు బుంగ బుగ్గలో చెవులు దొప్పచెవులో

గ్రుడ్లు పిల్లిగ్రుడ్లో పరిశీలింపక యుండనే యుండదుకద. ఇక నీమె యామెనడుము లావనియు నుదురు కొంత మెఱకయనియుఁ గనులు మిగుల లోఁతనియు నొక్కఁజాబితా మనస్సులో సిద్ధపఱచుకొని యుండును. విద్యావతులుకాని వెలఁదులలో మాత్రమే యీవెఱ్ఱి యున్నదే మోయని యనుకొందురేమో అట్లు కాదు. స్వభాషలో విద్యావతులుకానీ! విదుషీమణులు కానీ! కవితా మహనీయులుకానీ! యాంగ్లేయభాషలో B.A.లుకానీ! M.A.లుకానీ! ఇఁక నెంతవారైనఁ గానీ యొకరినొకరు చూచుకొనుట సిద్ధించినతోడనే యీకన్ను ముక్కుతీరు బరీక్షమాత్రము తప్పదు. తప్పదు. ఎర్రసిల్కు జాకెట్టు నల్ల మొకమాలుగాగరా పరీక్ష తప్పదు. ఒకరివంశమునుగూర్చి విద్యనుగూర్చి బుద్ధినిగూర్చి పరీక్షయనునది వారిలో ద్వితీయము కూడఁ గాదు. తృతీయపక్షమేమో ఒకమగవాఁడు మరియొక మగవానిని జూచినప్పు డాతఁ డేకాలేజీలో పండితుఁడో యని యోజించును గాని యాతని దెంతబుద్రము క్కోయని యిగిలింపఁడు. ఇఁక నిదిచాలును. తాయారమ్మగా రుపన్యసించుచున్నారు. విందము.

తాయారమ్మ యుపన్యాసము

అగ్రాసనాధిపులారా! సోదరీమణులారా! అయినది–అతనిపని; అడఁగినది ఆతనియె గురు–చల్లారినది అతనిపొంగు–మగవాఁ డింక మనకు దాసుఁడు–దాసాధముఁడు. మన కన్యాభినందన మహావసరము సిద్ధించినది. ఇది మహాసుదినము. భామాపరిణామచరి త్రమం దిది యుత్తమోత్తమాధ్యాయము. అదేల? అట్లూరకుండెదరేల? హుర్రే! హుర్రే యని కేకలువైవరేమి? అట్లుతెల్లబోయి తిలకించుచుంటిరేల చూడలేదా? Mail పత్రికలలో నేమివ్రాయఁబడియున్నదో? సతుల కన్గలువలకుఁ జంద్రికాసారములే? అయ్యయ్యో! వినవైన లేరా? కాంతల కర్ణములకు గాంధర్వగానములే–మగవాని మనస్సును బరీక్షింపఁగల యంత్రము నిర్మింపఁబడినదఁట–'అట' యేమి నిశ్చయమే–ఆతని మనస్సు బట్టబయలుగఁ జేయుసాధనము నేఁడు సౌభాగ్యవతుల భాగ్యవిశేషముచే బయలువెడలినది. (వహవ్వా! వహవ్వా యను కేకలు) ఇప్పుడు మీమనస్సు లుప్పొంగుచున్నవా? ఇప్పుడు మీహృదయము లెగిరియెగిరి తాండవించుచున్నవా? ఇప్పుడు మీతనులత లాపాదమస్తకముగ మొగ్గదొడిగి శోభిల్లుచున్నవా? ఆతనిమనస్సున కింక దాఁపరిక మెక్కడిది? దాఁచినాఁడు. దాఁచినంతకా లము దాఁచినాఁడు. పిడికిటిలోఁ గట్టిగఁ బట్టుకొని దాఁచినాఁడు–కోటుజేబులో దాఁచినాఁడు. కనుబొమముడిలో బిగించి దాఁచినాఁడు. వెకిలినవ్వులతో నులాముచేసి దాఁచినాఁడు. వేళాకోళపుమాటలతోఁ దేనెపూసి దాఁచినాఁడు. (సిగ్గుసిగ్గు అనుకేకలు) ప్రియతమాలాప పుష్పకలాపముల క్రిందనడిచిపెట్టి దాఁచినాఁడు. (ఛీ ఛీ యనుకేకలు) వెలిబడిపోవునేమో యని గాఢపరీరంభముల యిఱుకటను దాఁచినాఁడు. మనసున దొంగత నమే లేకుండునెడల నింత ముడుచుకొనుట యెందులకు? ఇంత యడఁచి పెట్టుకొనుట యెందులకు? ఇంత మూలమూలల దాఁచిపెట్టుకొనుట యెందులకు? ఇంత ప్రాఁతిపెట్టుకొ నుట యెందులకు? సోదరీమణులారా! మనము వట్టిబేలలము. అమాయికలము. నిష్కపట లము. తెల్లని వెల్ల పాలు నల్లనివెల్ల నీళు లనుకొను శుద్ధసత్యకాలపు గోలలము. (వినుఁడు వినుడు అనుకేకలు) రాత్రులం దాలస్యముగ నింటికి వచ్చినందులకు మగవాఁడు కారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? ముంగాళ్ల మీఁదఁ గూరుచుండి మూఁడుమెదుకులు ముక్కున

నంటించుకొని తుఱ్ఱున నెగిరిపోయినందులకుఁగారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? మొగము ముడుచుకొని ధుమధుమలాడుచున్నందులకుఁ గారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? పొట్టిపొట్టి టుక్కుటిక్కు ప్రత్యుత్తరముల కెప్పుడైనఁ గారణముఁ జెప్పినాఁడా? ఎడమొగము పెడమొగములకుఁ గారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? అర్థములేని చూపులకుఁ గారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? పదునాల్గు పర్యాయము లద్దము చూచుకొని నీటుగా గోటుగాఁ బాపట నవరించుకొని మీసాలకు మల్లెనూనె రాచికొని పట్టువస్త్రములఁ దొడిగికొని పైని సెంట్లుచల్లుకొని యత్తరువుసాహేబులాగున గమగమలాడుచు వీథిలోని కొయ్యారముగఁ బోవుటకుఁ గారణ మెప్పుడైనఁ జెప్పినాఁడా? (చీ–చీ యనుకేకలు) క్రొత్తగాఁ గాపురమునకు వచ్చిన పిమ్మట నేపదిదినములు మనసిచ్చి ధారాళముగ దయాదాక్షిణ్యయుక్తముగ మాటలాడెనో కాని యటుపైన నాతఁ డట్లుండెనా? ఆతని మనస్సులో నేమున్నదో యని తెలిసికొనుట కెంతయైన దేవులాడితిమే! ఇప్పు డది మనకు ముంజేతికంకణమైనది! మనకాతని మనస్సిప్పుడు కరతలామలకమైనది! ఇంతటినుండి యాతనియాటలు సాగునా? ఆతని తిరువీథు లింక జరుగునా? సినీమా వంకపెట్టుకొని సింగారించుకొని యాతఁడు పోఁబోవఁ జెవిపట్టుకొని యాతని నీడ్చితెచ్చి మంచముపైఁ గూరుచుండఁ బెట్టుదుము. కాని మానుదుమా? అతనియెక్కువయేమి యేడ్చినది?

అది యెంతచమత్కారమైన యంత్రమో మన మూహించుకొనలేము. తెల్లని గాజు బుడ్డిలోఁ బెట్టిన తేలులాగున నాతనిమనస్సు మనకుఁ దేఁట తెల్లముగఁ గనఁబడునఁట. సెబాస్. ఇంతకంటె మనకుఁ గావలసినదేమి? ఆమనస్సు పెద్దపెనరట్టంత కంపస్సుపెట్టి వలె గుండ్రముగా నుండునుగాఁబోలు! దాని క్షౌరపుటంచంతయు 'హెడ్డింగు'ల క్రింద భాగింపఁబడియుండును గాఁబోలు! నాయూహమేదో చెప్పుచున్నాను. తప్పైనఁ గావచ్చును. ఆ హెడ్డింగులేవో నాకుఁ దోఁచినట్లు చెప్పెదను. (1) భార్యను బుట్టినింటికిఁ బంపుట కిష్టములేకపోవుట (2) భార్యకు నగలు చేయించుటకు నమ్మతింపకపోవుట. (3) భార్య నవనాగరకవర్ధతిగ సింగారించుటకు వీధిగుమ్మములో నిలువఁబడి సృష్టిలోని వింతలను విమర్శించుట కంగీరింపకపోవుట. (4) ప్రెసిడెంటుగాఁ గాని సీ్పకరుగాఁగాని పెండ్లాము పైకిఁబోవుట యాఁపలేక లోలోన నేడ్చుట. (5) బంధుమిత్రమర్యాదచే భార్య పైవారితో మాటలాడుట పనికిరాకపోవుట. (6) తనకువచ్చిన రాఁబడినంతయు నణాలపైసలతో భార్యకు నప్పఁజెప్పుట కనమ్మతమగుట. (7) భార్య నాన్‌కోఆపరేషనులోఁ జేరుటకుఁ జింతిల్లుట. ఇవిగాక–దొంగకర్చులు–దొంగప్రేమలు–అట్టి వన్నియుఁ గలిసియొక్క హెడ్డింగు క్రిందఁ జేర్చెదను. ఇటులెన్ని చెప్పఁ గలను? ఇట్లు మరికొన్ని హెడ్డింగులేవో యాపెనరట్టుచుట్టు దగ్గర దగ్గఱగా వేఱువేరుగా నగత్యమగునప్పు డంతర్భాగములతో నుండునని నాయభిప్రాయము. దానిమీఁద నీయంచు మొదలుకొని యాయంచవఱకొక్క ముల్లుండును. కంపస్సులో ముల్లుత్తరదిశను జూపునట్లు దానిపై ముల్లున్నదే అది యవసరమువెంబడి నాయా హెడ్డింగులు నూటిగఁ జూపుచుండును సోదరీమణులారా! తమకుఁ దెలిసినదా? ఇక లోపమేమున్నది? పరస్త్రీలోలత యను హెడ్డింగునైపున ముల్లు రవంత చూపుచున్నట్లు మనకంటఁగానంతపడినయెడల జుట్టుపిలకపట్టుకొని యీడ్చి తెచ్చి మంచపుఁగోటికి నవారుపట్టెడతోఁ గట్టిపెట్టజాలని పనికిమాలిన వనిత బ్రహ్మసృష్టిలో నెచ్చటనైన నుండునా? (వినుఁడు వినుఁడు అను కేకలు) మరియొక్క నంగతి యేదనఁగా

–పరస్త్రీలోలతయను పెద్ద హెడ్డంగున్నదె–ఇదిబ్రాహ్మణాబ్రాహ్మణాంతర్భాగముల క్రింద విభాగింపఁబడియుండి యటుపైన నొక్కొక్కయంతర్భాగములో శాఖాంతశ్శాఖాభేదములు గూడ నుండినయెడల బాగుగా నుండునేమో మీరాలోచింపవచ్చును. ఇంతకు నాయంత్ర మెట్టిదో తెలియకుండ నున్నది. ఎటులున్నను స్త్రీల కిది యత్యంతోపయుక్తముగా నుండకతీఱదు. కావున పుణ్యస్త్రీలందరు తలకొక్క యంత్రమును గొని యుపయోగించు కొనుచుండునెడల స్వాధీనభర్తృకలై సౌఖ్యమొందుదురని నాయభిప్రాయము! అదిగాక కన్యా ప్రదాన సమయమందుఁ దండ్రి కన్య కిది యరణముగా నిచ్చు సదాచారము త్వరలో స్థాపింపఁబడవలయును. ఆయంత్రము మగవానిమెడలో శాశ్వతముగఁ గట్టవలయునో కాక పరీక్షావసరమున మాత్రము చంక క్రిందఁ బెట్టియో నడుమునకుఁ గట్టియో యుపయోగింపవ లయునో యిఁక దెలియకున్నది. ఇచ్చటఁ జేరిన స్త్రీరత్నము లిందునుగూర్చి విచారించు కొని విమర్శించుకొని స్థిరపఱచుకొనుటకై యీరహస్యసభఁ గావింపవలసి వచ్చినది. కావున నాసోదరీమణు లంద రాలోచింపవలయును.''

ఇట్లుపన్యసించి యామె యుపన్యాసరంగమునందుండి క్రిందికిఁ దిగెను. అందరు కరతాళము లిచ్చిరి. అంత నగ్రాసనాధిపురాలు లేచి సోదరీమణులారా! తరువాత శ్రీమతి వేంకట వేంకమాంబగా రుపన్యసింపవలయును అని పలికెను. ''అగ్రాసనాధిపురాలా! నాపిల్ల యింక నేడుపు మానలేదమ్మా! నేను రాఁజాలను! నావంటిదాని కుపన్యసములుకూడనా? నాపిల్లయేడుపులే యుపన్యాసము.'' అని శ్రీమతి వేంకమాంబగారు సభాద్వారమునొద్ద నుండి కేకవైచెను. ''ఏమిపిల్లలమ్మా!'' యని కొందరు వినుఁగు కొనిరి. అట్టి పెద్దవిదుషీమణి యుపన్యాసము పిల్ల కారణమున లేకపోవుట మిగుల శోచనీయమని కొందఱు చింతించిరి. ''ఏమైన నగుఁగాక! పిల్ల నింటియొద్ద దిగవిడిచి రాలేకపోయినదా?'' యని కొందఱు మందలించిరి. ఇట్లు కొంతసేపైన పిమ్మట శ్రీమతి భ్రమరాంబ గారు లేచి యిట్లుపన్యసిం చిరి.

భ్రమరాంబగారి యుపన్యాసము

సోదరీమణులారా! అనివార్యములగు కొన్ని కారణములవలన మనసోదరీమణి శ్రీమతి వేంకట వేంకమాంబగా రుపన్యసించుటకు వీలులేకపోవుటనుబట్టియుఁ దరువాత నుపన్యసించువారు కార్యక్రమము ననుసరించి యెవ్వరును లేకపోవుటనుఁబట్టియు నాకుఁ దోఁచినమాటలలో చెప్పెదను. సోదరీమణులారా! నేను బెద్దదానను. పూర్వాచారపరాయ ణను, నామాటలు మీకు రుచిమంతములుగా నుండకపోవవచ్చును. అయినను మాటలాడక తప్పదుకావున మాటలాడెదను. మాకాలస్థితి వేరు. మీకాలస్థితి వేరు. మేమత్తమామల యాజ్ఞలో మెలఁగినవారము. ఱాడుబిడ్డల యదపులలో నారితేరినవారము. బావలయెడల భయభక్తులుకలిగి ప్రవర్తించినవారము. మఱదులను మన్నించినవారము. పదుగురు పిల్లలఁగ నినను భర్తతోఁ బగలెన్నడు మాటలాడియైన నెఱుఁగనివారము. భర్త మాకంటె నధికుఁడ నియు భర్తృబంధువులందరు పూజనీయులనియు విశ్వాసముతోఁ బెరిగినవారము. మామ గారి విన్తరిలోఁ బట్టెడన్న మెప్పుడైనఁ బెట్టినపాపమున మీరు పోయితిరా? లేదు. అత్తగారి కాలిమీఁద నట్టి చేయివైచి యెఱుఁగుదురా? లేదు. పోనిండు. బావగారు వచ్చినప్పుడు రవంత లేమటకైన బ్రయత్నించియుంటిరా? లేదు. భర్త వచ్చినప్పుడు లెక్కయేమి?

వనవుచే గౌరవింపకపోయినను గణనలేదు. ఏదీ? అత్తమామల నావలికి సాగనంపకుండ మీరు భర్తనే చేరకపోయితిరి. ఇక బావగారిలెక్క-యేమి? మీనైఖరి చూచి వానియంత వాడే లేచిపోయెను. గర్భాధానమైన వెంటనే హరిఃఓమ్ అని మీకు వేరింటి కాపురమయ్యెను. ఆర్యావర్తదేశమున ననూచానముగ వచ్చుచున్న సంఘకుటుంబసం ప్రదాయమును జంపినవా రెవరు? సోదరీమణులారా! మీరేకారా? తండ్రికిఁ గొడుకులకు వ్యాజ్యేములు-సోదరులకు సోదరులకు వ్యాజ్యేములు-లక్షోపలక్ష లెవరిమూలమున వచ్చుచున్నవి? సోదరీమణులారా! మీమూలముననేకాదా? అడ్డిషనల్ కోర్టులు స్థాపింపఁబడుటకు, హైకోర్టులలో నిందరు న్యాయమూర్తులు నియమింపఁబడుటకుఁ జాలమట్టునకుఁ గారణభూతు లెవరు? సోదరీమ ణులారా! మీరేకారా! ఈవేళొంటి కాపురములు వచ్చినతరువాతఁ-గొడుకుమీఁదఁ దండ్రికి లేదు. దండ్రిమీఁదఁ గొడుకునకు లేదు. అన్నమీదఁ దమ్మునికిలేదు. తమ్మునిమీఁదన నన్నకు లేదు. అన్ని బంధుప్రేమలుకూడ నడుగంటినవి. అతిథిపూజ లంతకుముందే యంతరించినవి. అందువలనఁ జింత యక్క-ఱయే లేదు. పోనిండు. అత్తమామలు వలదు. ఆఁడుబిడ్డలు వలదు. బావమఱఁదులువలదు. మఱియెవ్వరును వలదు. భార్యయే నైకుంఠ మని భర్త-భర్తయే నైకుంఠమని భార్య-యనుకొని యన్యోన్యము ప్రేమించుకొనుచు మీరైన సుఖముగ నున్నారా! శ్రీరామరక్ష! శ్రీరామరక్ష! ఆసుఖమైనఁ గనఁబడదేమి ప్రారబ్ధము.

M.A. పరీక్షలో నుత్తీర్ణుఁడైన వానికైన నేబదిరూపాయల కంటె నెక్క-వ దొరకుటలేదు కదా? అందులో బ్రాహ్మణుఁడైనయెడల నామాత్రమయిన లేదుగదా! సంసారము దిద్దుకొ నుట మీచేతకాదు కదా! అరసేరుబియ్యి మత్తెసరువేయుట కారురూపాయల కమ్మలక్క కదా! భర్త పైకిఁ బోయినయెడల నింటిలో దిక్క-లేకపోవుటచే నాల్గురూపాయల కొకనౌకరు కదా! ఈ నౌకరులు సంసారమును ధ్వస్తము చేయకుండ రవంత కనిపట్టుటకు గ్రంథరచన మూలమునను బత్రికా పఠనమూలమునను మీకుఁ దెఱపిలేదుగదా! ఇదిగాక వారమునకు రెండు వైటురోజునబ్బుబిళ్లలు-రెండుమోహినీతైలపుబుడ్లు-రెండు వాసిలీనుబుడ్లు-రెండు మొగపుమెరుగుబూడిదె డబ్బాలు-రెండు సెంటుబుడ్లు-ఇక నేవో రెండు, మఱియింక నేవో రెండయ్యెను. ఇక మీ సంసారములు బాగుపడుట యెట్లు? రోజున కైదుపర్యాయ ములు నబ్బుపెట్టి మొగము గట్టిగఁ దోముకొనుచున్న మీరుదయముననే యొక్క-సారి యంటతొప్పల తోముకొనలేరేమి? గంటగంటకుఁ బన్నీరు బుడ్డి పైన విలాసముగాఁ జిలుకరించుకొన్నమీరు ముంగిటిలో రవంత పేఁడనీళ్లుచల్ల లేరేమి? మీకిందులకు దాసీయెం దులకు? ఏది మీయిష్టము. ఇవియే తగనికర్చులై యుండునప్పుడు సాయంకాలమగుసరికి సినీమా తప్పదయ్యెను. మగవాఁ డింతవ్యయము నెదురుకొనుటకు ధన మెక్క-డి నుండి తీసుకొనివచ్చునని మీరనుకొనుచున్నారు? అప్పుదొరకినదికాదురా, భగవంతుఁడా యని లోలోపలఁ గుమిలియేడ్చుచు భర్త యింటికిరాఁగ "నదిగో ననుఁ జూచి మొగము ముడుచుకొంటివి. నీదృష్టిమఱియెవతెమీఁదనో ప్రాలిన" దని పెద్దతనమైన యోజింపకుండ నాతనిమూఁతిమీఁదఁ బొడుచుటకు మీరు సిద్ధపడుచున్నారు. పాపము! మీధాటి కాఁగలేక పారిపోయిన యాతని తల్లియుఁ దండ్రియు నాతనియొద్దనున్నయెడల మీరంతపని చేయలేరు గద! సోదరిమణులారా! మీయెడల మీభర్తల మంచితనమున కెన్నడు లోపములేదని నేను నిశ్చయముగాఁ జెప్పఁగలను. మీబూట్సుకై స్టాకింగులకై, గౌనులకై, జాకెట్లకై, ప్రామినరీ నోట్లు ప్రాసిప్రాసి, తిరుగఁదోడి ప్రాసి తుట్టతుదకు తనవాటా దరిమిలాయినా

మమ్ముకొనినాఁడా లేదా? మీగానముకొఱకు గేదె దూడ నమ్మి కృష్ణాహార్మోనియమ్ కొనినాఁడా లేదా? సంగీతము చాలదు, పాశ్చాత్యులవలె నాట్యముకూడఁ గావలయునని మీరుకోరినప్పు డేయొంటికాలిభరతమో చెప్పించినాఁడందురా? లేదందురా? దొరసానులవలెఁ బురుషులతో Shake hands చేసినఁగాని ఘనతలేదని మీరు మూతిముడి పెట్టినప్పుడు తాను నల్గురు పెద్దమనుష్యులయొద్దకు మిమ్మఁ దీసికొనిపోయి వారితోఁ గరచాలనమహోత్సవము చేయించినాఁడందురా? మీరు బెజవాడకో విశాఖపట్టణమునకో కాంతాసభల నుపన్యాసము లిచ్చుటకో వినుటకో పోయినప్పుడు తాను జేయిగాల్చుకొని అమ్మా అమ్మా యని యేడ్చు చంటిపిల్లనోదార్పలేక కంట నీరుపెట్టుకొనినాఁడందురాలేదా! సోదరీమణులారా! మంచికి మంచిచెప్పుకోవలయును. చెట్టుకుఁ జెట్టుఁ జెప్పుకోవలయును. ముంగురుల వంకరటింకర సాగనుకొఱకు మీరు తల నీచెంపయు నాచెంపయు బెత్తెడు వెడల్పునఁ గత్తిరించుకొన్నను నేను బ్రతికియుండగానే యీకర్మము చూడవలసివచ్చినదా యని లోపల నేమి యేడ్చినాఁడో కాని పై నోరుమూసికొని పడియుండెనందురా లేదా? అతడు మీదయకొఱ కిన్నివిధముల ప్రాకులాడుచున్నాఁడుగదా! మీసంతోషముకొఱ కన్ని యును జంపుకొనినాఁడుగదా! మీరే పరదైవములుగ భావించి ప్రార్థించుచున్నాఁడుగదా! ఇంతకంటె నాతఁడు మీకేమి చేయవలసినదని మీయభిప్రాయము? మీకింత విధేయుఁడై యున్నను మీయెడల నింత దైన్యపడియున్నను మీకొఱకు వట్టి పనికి మాలినవాఁడైపోయి నను నింక నతని మెడకో నడుమునకో యీక్రొత్త యంత్ర మొక్కటి దగిలించి యీతనిమన స్సును గేవలము దిగంబరమొనర్చి యీతనిని మఱింత బాధింపఁదలఁచితిరా? మగముండకొ డుకునకు మనస్తత్వమని ప్రాణమని యేదియు నుండఁగూడదనియేనా మీయభిప్రాయము? మీచేతిలో బొమ్మవలె మీకాలిక్రింద జోడువలె నాతఁడు నిశ్చైతన్య ప్రపత్తితో నుండవలసినదని యేనా మీ యభిప్రాయము?

సోదరీమణులారా! కుట్టు మాటలాడుచున్నానని కోపపడకుఁడు. శ్రీమతి తాయారమ్మగారి తీవ్రమైన యుపన్యాసములోని సంగతులను బట్టి యిట్టిమాట లడవలసివచ్చినది. క్షమింపుఁడు ఒకనిమన స్సొకని కప్రత్యక్షమగునట్లు భగవంతుఁడు సృష్టించుటచేతనే బ్రతుకు లింక దక్కుచున్నవి కాని యటులేకానిచో వాడు దానిని దన్ని, యది వానిని గఱచి, వాఁడు దానిని నఱకి, యది వీనిని గొంతుపిసికి అయిదు ఖండములలోనున్న యీఁడువారుమగవారంధఱు మూఁడుదినములలో నొకరి నొకరు జంపుకొందురనుట కేమైన సందేహమా?

ఇది కాక మఱియొకటి. ఈదిక్కుమాలినయంత్రము నెవఁడు సృష్టించినాఁడో యెఱుఁగుదురా? మగవాడు ఎందులకు సృష్టించెనో యెఱుఁగుదురా? మనకున్న తెలివి మగవానికి లేదు. పదునాల్గుపుటములువేసిన రాదు. మనమెట్లయిన మగవానిమనస్సు కనిపెట్టఁగలము. కాని తల పగులఁగొట్టుకొని గింజుకొని తన్నుకొని చచ్చిననైనసరే వాఁడు మనమనస్సులను గనిపెట్టలేఁడు. ఎన్నిపాటులుపడినను యెన్ని యేడ్పు లేడ్చినను మనరహస్యము లాతనికిఁ దెలియకపోవుటచేత తుదకుఁ బ్రాణము విసిగి యిందువలనఁ బ్రపంచము భగ్నమైనను సరేయని యీయంత్ర మొక్కటి నేటికిఁ గల్పించినాఁడు. ఈయంత్రమొక్క మనుష్యునివలన సృష్టియైనదికాదు. సృష్టి యారంభమునుండియు మగజాతి యీఁడుదానిమ

నస్సులోని రహస్యములు తెలిసికొనుటకుఁ బాట్లుపడగాఁ బడగా–నూహము లూహింపఁగ నూహింపఁగఁ–గల్పనలుచేయగఁ జేయగ–దారులు త్రొక్కగఁ ద్రొక్కగ–ప్లానులు వేయగ వేయగఁ దుట్టతుదకుఁ స్త్రీచేతిలో వట్టి పనికిమాలిన చచ్చుపెద్దమ్మ యగునప్పటికి కీయంత్రమును సృష్టింపఁగలిగినాఁడు. ఇది మీకొంపతీయుటకుఁ బుట్టినదికాని మరియొకటి కాదు. (మాకట్టిరహస్యము లేమున్నవని కేకలు) ఎంతమాట! నేనెఱుఁగనా? లేకపోవచ్చును. కాని యేవో యున్నవనుకొను నాతెలివితక్కువ మగ నిర్భాగ్యుని సందేహము పోవు టెట్లు? కావున నాయంత్రముజోలికి మీరు పోవలదు.

ఇదిగాక మఱియొకమాట చెప్పుచున్నాను సోదరీమణులారా! అతఁడు చెప్పినమాట వినక యాతనిప్రాణము విసిగింపక, యాతని రాచి అంపమునఁ బెట్టక, యాతనివ్యక్తిని వల్లకాఁడుచేయక, యాతని పురుషతత్త్వమును గాపాడి మీస్త్రీతత్త్వమును గాపాడుకొని సృష్టిని యథాక్రమముగా మాత్రము జరుగనిండు. అట్టి తొందరపడకుండు. అదిగాక వట్టి మట్టిముద్దయైనమగఁడు మనకెందులకు? బసవన్నాపాలుద్రాఁగుదువా యనఁగ నూ, త్రాగ వాయని యనఁగ నూహ అని మీకొరడావ్రేటు భయమునఁ దలనాడించు గంగిఱెద్దును వెంటనైచుకొని మీ రూరూరఁదిరుగుట మీకుమాత్ర మేమంత గౌరవము? వారిగౌరవము గడ్డలైపోనిండు. అది మనకెందులకు? సోదరీమతల్లులారా! ఒక్కటేప్రార్థన. ఆతని స్వాతంత్ర్యముమాత్రము చంపవలదు. ఆతని తలబిరుసుఁదనము మాత్రము తగులబెట్టవలదు. పకోడీవంటిది రవంత పంటిక్రింద కాగికఱకఱలాడుచుండినఁగాని మీకు రుచియేలేదే. పోఁకచెక్కవంటిది కాసంత దంతముల కెదురెక్కి కటుక్కుమన్నఁగాని సొగసేలేదే. అట్టిచోఁ మగఁడు వట్టి పెసరపప్పు గరిటెజారు పాకపువాఁడైనయెడల మీకుమాత్ర మేమి సౌఖ్యము? సోదరీమణులారా! భర్తను దైవమువలెఁ జూచుకొనుఁడని చెప్పునెడల ననున్నఁ దలకొకఱాయి రువ్వి చంపుదు రేమో యని భయముగా నున్నది. బానిసలాగునమాత్రము చూడకుఁడు. అంతేచాలు. ఆమాత్రమునకే యాతఁడు సంతోషించును. పాపము! వట్టియల్పసంతోషి. అదిగాక మఱియొకప్రార్థన. ఇట్లు మనము రహస్యనభ చేసికొంటిమనిమాత్ర మెవ్వరికిని దెలియఁదగదు. ఇకఁ జాలునా? ప్రియసోదరీమణులారా! మరియొక చిన్నమాట –మీయమ్మలు మీయమ్మమ్మలు వారినాయనమ్మలు వారివారిభర్తల నెట్లు గౌరవించి సేవించిరో మీరుకూడ మీభర్తల నట్లు గౌరవించి సేవించినయెడల మీవంశములోని మూలపురుషులు మెత్తురు. మీకులదేవతలు మెత్తురు. అదిగాక మగవాని సర్వస్వముమీఁది. ఆతనిశరీరమే మీఁది. ఆతని ప్రాణమే మీలో నున్నది. ఆతనివలన మీరు బంగారపుఁ బూవులు పూయుచున్నారు. బంగారుకాయలు కాచుచున్నారు. అట్టి యాతనిని మీరు కన్నులలోఁ బెట్టుకొని గౌరవింప వలసినది కాదా? మీకంటె నిజముగా నాతని కెవరున్నారు. ఎంద ఱొవ్వరున్నను మీరగుదురా? ''కార్యేషు మంత్రీ కరణేషు దాసీ రూపే చలక్ష్మీ క్షమయాధరిత్రీ, భోజ్యేషుమాతా శయనేషురంభా షట్ ధర్మయుక్తాకులధర్మపత్నీ'' అను నీశ్లోకము మీరెఱుఁగనిదికాదు. కేవల మెఱిఁగి యున్నంతమాత్రమున వినియోగములేదు. ఆచరణములోని కవశ్యము తేవలయును. అప్పుడు మీరు వారుకూడఁ గృతార్థత చెందెదరు. ఇదికాక భర్తను భగవంతునిగాఁ జూడవలసినదని మనవారెందులకు శాసించినారో యెఱుఁగుదురా? అట్లు చూడుఁడని మీకు బోధించుచున్నానని నాపైఁ గొఱకొఱలాడకుఁడు. భర్తయందలి మీకున్న భావనాగౌరవమునుబట్టి మీకు సంతానము కలుగును. తెలిసినదా? భర్తయే

పరాత్పరుఁడని మీరెంచి యాతని సేవింపుఁడు. మీకు దేవతల వంటి పిల్లలు పుట్టుదురు. భర్త మీకు బానినయని యెంచి మీరాతనిపై నధికార మొనర్పకుఁడు. మీరు బానిసక్రింది బానినవంటి పందలను గందురు. అది నిశ్చయము. ముమ్మాటికి నిశ్చయము. ఈనంగతి బాగుగా జ్ఞప్తియందుంచుకొనుఁడు. అభిమన్యుని సుభద్రయే కనవలయును గాని మఱి యొక్కఁ తె కనఁగలదా? భరతుని శకుంతలయే కనవలయును గాని మఱియొకతె కనఁగలదా? ఈకాలములో నభిమన్యులు భరతు లెందుకు లేరు? సుభద్రలు, శకుంతలలు లేకపోవుటవలన –భర్తలను దైవములుగ సేవించుటకు భగవత్సములైన భర్త లిప్పుడున్నారా యని తెలివితక్కువప్రశ్న మొనర్పకుఁడు. ఒకప్పుడుమాత్రము భగవత్సములైన వారుండిరా? ఇప్పు డంత కంటె లేరు–లేకపోయినప్పటికి మీభావన కభ్యంతరమేమి? మగలుకాని మట్టిబొమ్మలుకారె మట్టిబొమ్మనే ద్రోణాచార్యులుగ భావించినవాఁడు ధానుష్క–శిఖామణి కాలేదా? ప్రథమమునఁ గేవల విగ్రహారాధకుఁడైన రామకృష్ణార్యుఁడు పరమహంసశిఖామణి కాలేదా? అంతవఱ కెందులకు? గాజులతట్టుతోఁ గలుపఁబడిన గోడిగ యరేబియా గుఱ్ఱమును గనుటలేదా? భావనయే ప్రధానమా? అంతకంటె నేమైన నున్నదా? అట్టి యీభావనలోపముననే జాతిలోని బానినతన మెక్కువ యగుచున్నది. మీయొద్ద మీ భర్తలు గడగడలాడినపిమ్మట మీరు కన్నకొడుకు లెలుకనుజూచి పిల్లిని జూచి యేడ్చినారనగ వింతయేమున్నది? సోదరీమణు లారా! బాహుబలసంపన్నులు–ప్రజ్ఞాశాలులు–క్షాత్రవంతులైనపుత్రులఁ గని భారతదేశ ప్రాచీన గౌరవమును గాపాడుదురుగాక.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

44. దేశకాలపాత్రములు

ఒకసారి ఒక పండితుడు సాక్షి సంఘానికి వచ్చి, దేశకాలపాత్రాలకు, మనిషి జీవితానికి ఉండే సంబంధం గురించి విశదంగా మాట్లాడాడు.

మనిషి శరీరతత్త్వం, మనస్తత్త్వం కూడా దేశకాలపాత్రాల్ని బట్టి ఏర్పడతాయంటూ ఉష్ణదేశాలు, సమశీతోష్ణ దేశాలు, శీతల దేశాలలో మనుషుల శరీర తత్త్వాన్ని వివరించడం ప్రారంభించాడు.

నీగ్రోలు, ఆర్యులు, ఉష్ణదేశంలోనే ఉన్నా, వారివారి బుద్ధుల్లో తేడా లుండడానికి కారణం, పాత్రత, దేశస్థితి సమానమైనా ఇదే, భేదాన్ని కలిగి స్తుంది. పాత్రత అంటే ఏమిటంటే, తల్లిదండ్రులు శరీర, మనస్స్వభావమే.

ఆర్యుల ప్రత్యేకత, వారి నాగరికతా వృద్ధికి కారణం ఆర్యావర్తభూమి. ఇక్కడ వుండే వనరులు గొప్పవి. అవే మిగతా దేశాల మనుషుల కంటె భిన్నంగా వీరిని దిద్ది తీర్చాయి. గాన విద్యలో, కావ్య విద్యలో, చిత్రలేఖనం వంటి విద్యలలో ప్రత్యేకత కలిగించాయి.

శీతలదేశంలో పుట్టినవారికి మానసికంగా, శారీరకంగా ఎదుగుదల కొంచెం మందంగా జరిగినా దృఢంగా, బుద్ధిప్రధానంగా వుంటుంది. ఉద్రేక ప్రధానంగా వుండదు.

ఇంక-కాల ప్రభావం అంటే ఋతువుల ప్రభావం, ఒక్కొక్క వ్యక్తి పుట్టుకను బట్టి వారి శరీర, మనస్తత్వాల మీద గాఢంగా; వుంటుంది. వాత, పిత్త, శ్లేష్మాల ప్రభావం కాలాన్ని బట్టి మనిషికి ఏర్పడుతుంది. జన్మదినం నిజానికి ఉత్సవంగా జరుపుకోదగింది కాదు. గండదినం. అందుకే అర వయ్యో పుట్టిన రోజుకి మహాగండమని పేరు. దేశ, కాలపాత్రాల ప్రభావం మనిషి పుట్టి, పెరిగి, అభిరుచులు పెంపొందడంలో ప్రధానపాత్ర వహిస్తాయి.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:-

''నాయనలారా! యీదినమున నొకపండితుఁడు సాక్షిని జూచుటకు వచ్చినాఁడు. సాక్షి యీగ్రామమునందున్నాఁడని నమ్మి యాయన యిటకు వచ్చియుండెను. ఆయన యొద్దకుఁ బోయి సాక్షినంఘమున నొక యుపన్యాస మిమ్మని యాతనిని బ్రార్థించితిని.

అందుల కాతఁ డంగీకరించెను. ఆయన యదిగో యిక్కడికి వచ్చుచునే యున్నారు. మీరు లేచి యాయనకు స్వాగతమిండు. (అంద ట్లుచేయుదురు) అయ్యా! మీ రుపన్యాస మారంభింపవచ్చును.''

''నాయనలారా! మనుజుని దేహతత్త్వము మనస్తత్త్వము కూడ దేశకాలత్రములఁబట్టి యుండునని పెద్దలు చెప్పినమాట యసత్యము కాదు. ఏదేశమునుబట్టి యాకాలమునుబట్టి యాపాత్రములబట్టి యాతని దేహమనస్తత్త్వములుండునని మనవా రభిప్రాయపడుచున్నారు. ఉష్ణప్రదేశములందుఁ బుట్టువారు సన్నిహితసూర్యతేజముచేఁ గాలవర్ణమున నుందురు. సామాన్యోష్ణప్రదేశములఁ బుట్టినవారు సర్వసాధారణముగాఁ బచ్చనిరంగుకలవారై యున్నారు. శీతాతిశీతప్రదేశముల జన్మించినవారు మంచుగడ్డవలెఁ దెల్లగ నుందురు. అత్యుష్ణప్రదేశము లందుఁ బుట్టినవారి దేహములు కొలదికాలములో నెదిగి స్వల్పకాలమే బలిష్ఠములై యుండి త్వరలో క్షీణించి నాశనమొందును. ఈప్రదేశము లందలి పురుషులు దాదాపుగాఁ బదునేనుసంవత్సరములకే బాగుగా నెదిగి యిరువదియయిదువఱకుఁ బూర్ణబ లాన్వితులై యుండి యంతటి నుండియే యుత్తరవయస్సులోఁ బడి క్రమముగా క్షీణించి నలువదిలోపలనే నాశనమొందుదురు. నిజముగా నార్యావర్తసాముదాయికాయుర్మితి ముప్పది కంటె నెక్కువయేలేదని నే ననుకొందును. పదునాఱేండ్లకే భార్యతోఁ గలిసి పదునేడవయే టికే వానపామువంటి బిడ్డకుఁ దండ్రియై వాఁడు తొట్టిలో బాలులేక తాను ప్రక్కమీఁద నోపికలేక యేడ్చునవస్థలోనికి దిగిపోవును. మగవానిబ్రదుకే యిటులుండ నిఁక నాఁడు దానిబ్రదు కెంత చింతాకరమో యోజింపుఁడు. పదియేండ్లకు సమర్తస్నానము నాఁడే పునస్సంధానము. గర్భవేదన పడలేక ,పరమపదింపకుండు నెడలఁ బదునొకటవయేట తొండపిల్ల యంతబిడ్డకుఁ బిండిబొమ్మవంటి తల్లి. రామరామరామా! ఇది దురవస్థాగ్రగ ణ్యము. తానుగన్న పిల్లవంటి కొయ్యబొమ్మలతోఁ దానాడుకొనవలసిన వయస్సులో నింతపూచీతోఁ జేరిన యాశిశుపాలనకృత్య మహాభారము పర్వతమువలెఁ బైనఁ బడినప్పు డామెబ్రదు కెంత మహాకష్టభూయిష్ఠమో చెప్పవలయునా? తల్లియే పిల్లయైనప్పు డామెపిల్ల యెంతపిల్లయో? నూతికాదిరోగములకై మందులుతిని, పిల్లరోగములకై చప్పిడిపథ్యములు చేసి, పిల్లయేడ్పు చేత రాత్రులు బిగించిన కొట్టుగదిలో రేయింబగళ్లు వెలుఁగుచున్న గంటవంటి దీపమునఁగలిగిన దుర్గంధముచేత, వాము వెల్లుల్లిపొట్టు ధూపపుగొట్రు చేత మ్రింగిన యింగువమాత్రల తెకతెకచేత, నూపిరిసలుపకుండ మంతురసాని బిగించిన యేను గుమెలతనడుముకట్టుటవలనఁ గలిగినయాయాసముచేతఁ బిల్లూనివేఁడిమకొఱకు నులక మంచము క్రిందఁబెట్టిన యూఁకకుంపటిపొగవలనఁ గలిగిన యుక్కిరిబిక్కిరిచేతఁ బీల్చినదు ష్టవాయువునే మరలఁ బీల్చుటవలనఁ గలిగిన రక్తమాలిన్యముచేత సమస్తబాధలుపడి పడి తన తల్లికడుపు చలువయున్న యెడలఁ దానే నూతికాగృహమునుండి యావలికి వచ్చును. తనబిడ్డ నిర్భాగ్యురాలే యగునెడల నూతికాగృహమునుండి యావలికిఁ దీసికొనిపోఁబడును. హరిహరి! ఈబాధ యెంతయైన మనదేశమున నున్నది. దేహవికసనమునుగూర్చి యిఁకజా లును.

మనవారిబుద్ధులు బహుశీఘ్రముగ వికసించుచున్నవి. కొలఁది కాలమే పరిమళించి త్వరలోనే వాడిపోవుచున్నవి. బుద్ధి జాతి యత్యుత్కృష్టమనుట కేమాత్రము సందేహము—

లేదు. కాని యతిశీఘ్రవికసనము. అతిశీఘ్రవృద్ధి–అతిశీఘ్రనాశనము కలది. ఇంద్రధనస్సు వలె నది యెన్ని వన్నెలు చిన్నెలు గలదియైన నగును. కాని దానివలెనే యల్పకాలపరిమితి కలద. నమస్తశక్తినిక్షేపమైన సూర్యుఁడత్యంతసన్నిహితుఁడగుటచే పీరిబుద్ధులందుఁ దీవ్రత చండత నైశిత్యము ధాటి విశేషముగ నుండును. ఈబుద్ధులందు వింతయైన విద్యుల్లతలు ప్రకాశించుచుండును. ఎంతసేపు పరుగు–ఎంతసేపు దుముకు–ఎంతసేపు నమస్తావకాశవ్యాపనశక్తి వీనియందు నిరాఘాటముగా నిశ్శంకముగా నున్నవి. (ఉష్ణప్రదేశములందున్న నీగ్రోల కట్లున్నదా యని సభలోఁ గేక) నాయనలారా! చెప్పుచున్నాను. ఒక్కదేశముబట్టియే బుద్ధి ఘనాఘనత లుండవు. ఒక్క కాలమును బట్టియే యుండవు. ఒక్కపాత్రమునుబట్టియే యుండవు. ఈమూఁటినిగూర్చియు నొక్కసారియే చెప్పుట కసాధ్యమగుటచేఁ గ్రమమును బట్టి యిప్పుడు దేశమునుగూర్చి చెప్పుచున్నాను. మీరడిగినప్రశ్న నరియైనదే–నీగ్రోలు నార్యులుకూడ నుష్ణదేశమందే యుండినను వారివారిబుద్ధుల కంతవ్యత్యాస మేల యుండవలయునని యడిగినారు. దేశస్థితియే నమానము కాని పాత్రస్వభావ మనగా నేమి? ఆర్యావర్తమునన్న, పాత్రాధిక్యమేమి? ఆఫ్రికాలోనున్న పాత్రహీనతయేమి? మొదటఁ తల్లిదండ్రులదేహమనన్స్వభావమే పాత్రము. ఆర్యులు హిందూదేశమునఁ బ్రవేశించినపిమ్మట శీఘ్రకాలములో వారి నాగరికత పరిపూర్ణావస్థకు వచ్చినది. దేవతాప్రార్థనలందేమి, శత్రువిజయకార్యములందేమి, వాణిజ్యకృత్యములందేమి, కృషివ్యాపారము లందేమి, పరిశ్రామికతంత్రములందేమి, యంత్రాదినిర్మాణములందేమి, వారు మహోన్నతదశకు దాగలిగిరి. మొదటిపాత్రము మాతాపితృతత్త్వ విశేషమని చెప్పితిని. ఆపాత్రమునకు సాహాయ్యపడిన ఇతర పాత్ర సన్నివేశమేమనగా రత్నగర్భ యని సార్థకనామమును ధరించుట కేకారణమువలన నర్వ్వవిధముల నార్యావర్తభూమి నమర్థమైనదో యాకారణనమూహమే యితరపాత్రసన్నివేశము. నేల యత్యంతము ఫలవంతమైనది. బంగారము పండదగిన పార్థివతత్త్వము ప్రపంచమున మఱి యొకటి యేది? ఈవైపునఁ బంచోపనదులతోఁ గైలాసము వెనుకనుండి కచ్చివైపుకు సింధునది. అది దాటి రవంత కుడిప్రక్కకు రాఁగనే, యభవజటాజూటోద్భవయై, యనేకోపనదులతో, నమృతాధిక మాధుర్యధురీణాంబుప్రవాహముతో, ననేక శతయోజన పర్యంతావనీస్థల ఫలీకరణపాటవ ప్రాబల్యముతో, ననేక జన్మార్జితాఘ వినాశన మాహాత్మ్యముతో నార్యావర్తమున కామూలనుండి యీ మూలవఱకు జగజ్జనజేగీయమానప్రకాశముతోఁ బ్రవహించు నార్యావర్తభాగ్యదేవతయైన గంగాదేవి–మఱిరవంతఁదాటఁగనే ధవళగిరిపైన యెవరెస్టుపైన నాపై నున్న శిఖరములపైన నేమూలనో యుద్భవించి వాయువేగముతోఁ బ్రాగ్దిశగాఁ బ్రవహించి 'ఆస్సాము' నొద్ద మోచేతివాటముగా మఱలి దక్షిణముగఁ బ్రవహించు బ్రహ్మపుత్ర –ఇది కాక నర్మద, మహాగౌతమి, తుంగభద్ర, కావేరి మొదలగు మహానదులు తమ శీతలత్వముచే తమ నిరళత్వముచే తమ మాధుర్యముచే తమ పవిత్రతచే తమ ప్రవాహశక్తిచే నార్యావర్త జననంఘ బుద్ధితత్త్వమునకు శీతలత్వము సారళ్యము మాధుర్యము పవిత్రత ధాటి యొనఁగుటకుఁ జాలియున్నవని చెప్పుట యతిశయోక్తి కాదే. ప్రపంచపర్వతములలోఁ బ్రథమగణనీయమగు హిమాలయాచలము భరతదేశ మాతృదేవతకు హీరకిరీటమై ప్రకాశించుచుండ, వింధ్యాద్రి వజ్రాల మొలనూలై యుండ, సింహళద్వీపము పాదపీఠమైయుండ, నమస్త ప్రకృతివైచిత్రీ నన్నివేశ ప్రథమనిదానమైన భరతవర్షమునందుఁ గవులకు గాయకులకు భక్తులకు జ్ఞానులకుఁ గార్మికులకుఁ జిత్రలేఖకులకు నేమాత్రమైన లోపమున్నదా? నాయన

లారా! పాత్రసన్నివేశ మాఫ్రికాలో నున్నదా! ఆఫ్రికాలోనే యున్నమాటయేమి? మఱీయెచ్చ టనైన నున్నదా? 1,30,00,000 చదురపుమైళ్లు గలిగిన యార్యావర్తములో మైలునకు మూడేసి దేవాలయము లున్నవే. ఎన్ని మహాగోపురములు–ఎన్ని యద్భుత ధ్వజస్తంభములు –ఎంత శిల్పనైపుణ్యము–ఆహాహా! ఎలిఫెంటాలోనున్న గుహాదేవాలయము లార్యావర్తదేశము నకే కాక యవనీస్థలి కెల్లనద్భుత జనకములు కావా? దేవతానిర్మితములవలెఁ గాక మనుష్యనిర్మి తములవలె నున్నవా! తమ ప్రయోజకత్వముచేఁ గాక శక్తిలోపముచే రవంత యొకప్రక్కకొర గిన 'పైసా'లోని దేవాలయమును ప్రపంచాద్భుత సప్తకములోఁ బాశ్చాత్యులు పరిగణించిరి కదా! యంతకంటె నాశ్చర్యజనకములగు దేవాలయములనంగతి వారే చెప్పలేదో? పోనిండు –అందులకు దగవేల? ఇకఁ జిత్రలేఖనమును గూర్చి చెప్పెదను. ఈ విద్య బహుమృదులమై నదగుటచే దేహసౌష్ఠవముచేఁ జిత్తసౌష్ఠవముచే శరీరకుసుమకోమలతరలైన పూవుఁబోడుల యధీన మొనర్పఁబడినది. పుష్పములోని కేసరములకైన రవంతకఠినత కలదుకాని యార్యావ ర్తసుందరీమణుల–యందులో మహారాజకాంతల–యంగుళ్యగ్రములం దామాత్రమైన కర్క శత లేదే. ఒంటెకుచ్చునైన నుపయోగింపక వ్రేళ్లకొనలతోడనే రంగులుపూసి వారుచేసిన వింతసృష్టిలోని వింతవింత వ్యక్తు లార్యావర్తవిజగీషులగు విదేశీయులు పాడుచేసినకోటలలోని యంతఃపురభాగములందలి కుడ్యములందింక–గోడమీఁదినుండి దుముకఁ బోవుచున్నట్లు –నోరు తెఱచి మాడలాఁడ బోవుచున్నట్లు–కులకాంతల యంతఃపురములోని కేలవచ్చితివో యావలికిఁ బొమ్మని చేయియూఁపునట్లు–వెచ్చనియూరుపు పైకిఁబఱపునట్లున్నవే. పోయి కన్నులు కృతార్థములగునట్లు చూడుఁడు. హృదయము తాండవించునట్లు చూడుఁడు. చిత్రలేఖనవిద్యయు సంగీతము స్వభావసిద్ధముగ స్త్రీలసొమ్ము.

గానవిద్యను గూర్చి రవంత చెప్పెదను. రాగప్రస్తారమునుగూర్చియుఁ దాళప్రస్తార మునుగూర్చియు మనదేశమునన్న యనుపమానమైన యగాధమైన యత్యంతవిపులమైన యద్భుతావహమైన శాస్త్రము మఱీ యే దేశమున నున్నది? గానశాస్త్రజ్ఞానముఁ బరమావ ధిని భరతదేశమందే పొందినది. స్వరూపసౌందర్యముచేనేమి స్వరసౌష్ఠవసౌభాగ్యముచే నేమి యదియిది యననేల సర్వవిధములచే సంపూర్ణమైన గానకళా యంత్రమగు వీణ యేదేశమున నుద్భవించినదో యాదేశమున శారదాదేవి, యప్సరఃకాంతల వెనుకపాటలనడుమ, దేవతల పుష్పవృష్టులనడుమఁ, దుంబురునారదుల సాధుసాధ్వితిప్రశంసాలాపపూర్వక శిరఃకంపముల నడుమ, వొడలు తెలియని మహానందముతోఁ దాండవించుననున కేమైనా సందేహమా? మహీమండలిలోనున్న మంగళవాద్యములలో మహత్తరమైదేది? మద్దెలను మించినది మఱేదియుఁ గానఁబడదే!

కవితనుగూర్చి కానంత చెప్పెదను. వేదములవంటి ప్రాచీన గ్రంథములు ప్రపంచ మున లేవు. వేదబుక్కులలోనికవితవంటి నిష్ప్రయత్నోద్భుద్ధమైన కవిత్వము లేదు. వేదర్షులవంటిహారివఱి కెందులకు! వ్యాసునివంటి బహుగ్రంథరచనాసమర్థుఁ డీయైదు ఖండములలోఁగూడ నొక్కఁడైనఁ గనఁబడడు. వీరరసప్రధానమైనభారతేతిహాసము ప్రపంచ మందలి వీరరసప్రబంధములలో నగ్రగణ్యమనుటకు సందియములేదు. వ్యాసుఁ డొక్కఁడే కాఁడనియు ననేకు లాపేరను గ్రంథములు రచియించిరనియు నూతనవిమర్శనము బయలు దేఱినమాట సత్యమే. దాని నంగీకరింతము. పోనిండు. విద్యారణ్యునివంటి శతాధిక

గ్రంథకర్తను మఱియొక్కని పూర్వచపశ్చిమార్ధగోళముల నగపఱుపఁగలరా? కల్ల–వట్టికల్ల. రామాయణకవిత్వమంత సర్వాంగసుందరమైన కవిత్వము వెనుకలేదు. ముందుండదు. పరదేశియు లింక ప్రబంధ మననేమో యెఱుఁగనిస్థితిలో నుండఁగా మనకాళిదాసుఁడు నాటకరాజము లనురచియించినాఁడు. ఉష్ణదేశమననున్నవారి భావనాశక్తియొక్కయెగురులో స్వర్గమున కెగిరి, యొక్కజెటకాలోఁ బదునాల్గుభువనములుదిరిగి, యొక్కయూఁపులో ''నలోకంబగు పెంజీఁకటి కవ్వల నెవ్వం డేకాకృతివెల్గునతని'' నేవింపఁగల మహావ్యాపనశక్తి గలదైయుండును. ఉష్ణప్రదేశమగుటచేత మనవారికి శృంగారరసమం దధికాదర ముండును. ఆ శృంగారరసమే భగవంతునిపైఁ బఱపిన భక్తియగును. మన యార్యావర్తదేశమున నొక్కగ్రామముననున్న దైవభక్తులు పరఖండములలో నొక్కదేశమందైన లేరు. ఆసేతుహిమాచరపర్యంతము మతమందానక్తిలేనివాఁడులేఁడు. కట్టులో మతము. జుట్టులో మతము. బొట్టులో మతము. మాటలో మతము. పాటలో మతము. బ్రదుకులో మతము. చావులో మతము. చచ్చినతరువాతఁగూడ మతము. ప్రాక్తనకర్మమే మనల నాడించుచున్నదనియు, మన కష్టసుఖములు మనపూర్వ కర్మఫలములేయనియుఁ బడమూల్గకుండఁ దెగనీల్గకుండ వాని ననుభవింప వలయుననియుఁ బ్రారబ్ధమున కనుభవమునఁగాని క్షయములేదనియు, భారతదేశమునఁ బరమహంసమొదలుకొని బానిసవఱకుఁబరిపూర్ణ విశ్వాసమున్నది. ఏదీ? అమెరికాదేశమున నొక్క గొప్పవర్తకుని ప్రారబ్ధమననేమొ యడుగుము. భగవత్తత్త్వము సగుణమా నిర్గుణమా యని యడుగుము. ఆ సామానేదో మేమెప్పుడు తెప్పించియుండలేదని అతఁడు చెప్పవచ్చును. అమ్మా! నీపిల్లవాఁ డింత రోగభూయిష్ఠుఁడై యున్నాఁడేల యని మనయూరిలోని ముష్టిదాని నడుగుము. ఏమని చెప్పును? నాయనా! పూర్వమం దెవనికో క్రుళ్లుకాయ దానమిచ్చినహేతువుచే నిప్పు డిది నాకు సిద్ధించినదని చెప్పును మతమే మనమూలుగులోని మూలుగైయున్నది. అలౌకికభావనాశక్తివ్యాపన ఫలమైనమతము మనకు బ్రప్రధానమైనప్పుడు, మనముక్కుల కూఁపిరియైనప్పుడు, మనకంటికిఁ దేజమైనప్పుడు, మనజాతి యెంతభావనాశక్తియుక్తియైనప్పుడు, వేఱె చెప్పవలయునా? ఈభావనాశక్తి యంతయు నవిత్తనన్నిహితత్వముననే వచ్చినది.

శీతలప్రదేశములం దుద్భవించినవారు సూర్యకాంతిదూరులగుటచే నల్లగనుండక శ్వేతరక్తవర్ణములు గలవారై యుందురు. వీరు బలిష్ఠశరీరులై యుందురు. దీర్ఘాయుష్మంతులై యుందురు. వీరిశరీర మాలస్యముగ వికసించును. విశేషకాలము పూర్ణశక్తిసమన్వితమై యుండును. మనలోఁ బదునాఱేండ్లతల్లి–చేత నెడపిల్లతోఁ జంకను జంటిపిల్లతోఁ గడుపులోఁ గ్రొత్తపిల్లతోఁ గదలక హన్నుహన్ను మనుచుండగా–నదేయీడుగల యాంగ్లేయబాలిక మగఁడనఁగనేమో యెఱుగనిస్థితిలోఁ జేరి క్రికెట్టుబ్యాటుతోఁ జంకను బంతితోఁ గడుపునకు బిగించినతోలుపటకాతోఁ గిలకిల నవ్వుచుఁ గేకలువైచుచు లేడిపిల్లవలె నాటస్థలమునకు గంతులువైచుచుఁ బోవును. మనబుద్ధులు వికసించి నంతశీఘ్రముగా వారిబుద్ధులు వికసింపవు. మనలోఁ బదియేండ్లపిల్లవాఁడెన్నియో గుంటచిక్కు లెఱిఁగియుండును. తల్లిని బింకముగ నెదిరింపఁగలఁడు. తండ్రి నవలీలగఁ గన్నుకప్పఁగలఁడు. కనిష్ఠసోదరులపై నింటిపెద్దవలె నధికారము చేయఁగలఁడు. మంచిమాటలతోడనే వారిబొమ్మలను హరింపఁగలఁడు. ఉపాధ్యాయునికుర్చిపైఁ బల్లేరుకాయలుంచినందువలన నాతఁడుబాధపడుచుండఁగా నానందవాచకపుస్తకము చాటునానందమొందుచుఁ బ్రక్కనుగూరుచున్న

బాలునిపైఁ బల్లేరుకాయతప్పున బడఁద్రోయఁగలఁడు. అదేయీడుగల యాంగ్లేయబాలుఁ డింక నక్షరనిర్ణయమునే నేర్చుకొనకుండ నమాయకుఁడై యమ్మగౌను కొంగు పట్టుకొని వదలకుండ నల్లరిచిల్లరిచేష్టలు లేకుండ నాడుకొనుచుండును. మనలోఁ బదునాలు గేండ్లపిల్లవాఁడు పండ్రెండేండ్లయాఁడుదానితో మాటలాడవలసినప్పు డమాయకమైన యానందమయమైన యామెమోమును నిష్కపటమైన పరిశుద్ధమైన నిర్వ్యంచమైన బూర్ణము గదెఱిచిన కన్నులతోఁ జూడక, యోరచూపుల, వట్టిదొంగచూపులనామె ఱవిక బొత్తాముల ఱవికయో మామూలు ముడిఱవికయో మెడలోని జగినీకి ముత్యములున్నవో మువ్వలు న్నవో తెలిసికొనుటకుఁకాబోలు సాభిలాషముగఁ జూచును. అదే యీడుగల యాంగ్లేయబాలుఁడు తనచెల్లితో మాట్లాడిన ట్లామెతో మాటలాడి యానందమొందును. మనవారిచదువు పూర్తియగునరికి వారిచదు వారంభదశవదలి యభివృద్ధిదశలో నుండును. మనవా రైదుగురుబిడ్డలు గన్నవయస్సున నాతఁడు కోర్టింగుప్రయత్నమునకై క్రొత్తకోటుకొ ఱకు గుడ్డవెదకుచుండును. మనవారు పూర్ణాయుష్మంతులై నలుబదిదాఁటువఱకు జీవించి యుండునెడలఁ జేతిలోఁ గఱ్ఱ కంటికి కాటరాక్టుతీసినతరువాతఁ బెట్టినజోడు, చెవికి బాకా, నోటికిఁ జొల్లు కడుపులో నల్లమందు, వీఁపుమీఁది రాచపుండుమచ్చ గలిగియుండఁగా నదేయీఁడున నాంగ్లేయుఁడు క్రొత్తగాఁ గాఁపురమునకువచ్చిన దేవకన్యతోఁ దెఱపిలేకుండ 'హనీమూన్' ఆనందసముద్రమున నోలలాడుచుండును. మొత్తముమీఁది శృంగారసంబంధ మగు సాంసారికసౌఖ్య ముష్ణప్రదేశస్థులమైన మనలో నున్నంతహెచ్చుగా వారిలో నుండదు. ఎన్నిదేశములు లేవు. ఎన్నిశాస్త్రములులేవు. మనదేశముననున్న కామశాస్త్రము మఱి యింకనెక్కడది!

ఇక బుద్ధినిగూర్చి రవంత యోజింతము. వారిబుద్ధి విశేషప్రఢిమకలది సూక్ష్మమైనది కాదు. స్థూలమైనది. బర్మావలే కఱకఱ యడుగువఱకుఁ గోయలేదు. నమ్మెటవలెఁ జావఁగొట్టి సాగఁదీయును. రసోద్రేకముతోఁ జేరని నర్వకళాశాఖలందు వారు మనకంటె ఘనులు కంటితోఁజూచి పరీక్షించి సామ్యవస్తువులను జేరఁదీసి సామ్యగుణమును గనుపెట్టి దాని తత్త్వమును నిర్ణయించి లోకమునకు వెల్లడించుటలో వారుత్కృష్టులనక తప్పదు. వారిబుద్ధి యెంతసేపు దేశమువలెఁ జల్లనిబుద్ధి. ఎంతసేపటికైన వేడి యెక్కదు. తాఁబేలువలె నిమ్మళముగ నడచునుగాని లేడిపిల్లవలెఁ బరుగెత్తదు. రవంత పరుగెత్తి కాళులు లటలటలాడ గుండె దడదడలాడ నాలుక వ్రేలాడ వగర్చుకొనుచుఁ జెట్టుక్రిందఁబండుకొనదు ఆమందగ మనముతోడనే కష్టములకు జంకక యభ్యంతరములకు లొంగక యాయాసమునకు లోను గాక యంత్యశ్వాసమువఱకుఁ బోవును. రనవిజృంభణము వారిసొమ్మికాదు అది మనది. వారు శారీరశాస్త్రములో శాఖాశాస్త్రములో జంతుశాస్త్రములో దశాస్త్రములో ప్రకృతిశా స్త్రములో యంత్రనిర్మాణశాస్త్రములో వర్తకశాస్త్రములో వంటశాస్త్రములో రాజకీయశా స్త్రములో వస్తువులు నంకెలు గీతలుగల యన్నిటిలో వారు మహాధీశాలులనక తప్పదు. కేవల భావనాశక్తిపై నాధారపడిన సమస్తకళలలో నుష్ణప్రదేశస్థుల కాధిక్యమీయక తప్పదు. గొప్పగొప్ప కళాభిజ్ఞులు వారిలో ననేకులు లేరాయని యందురేమో. మనలోకంటె నెక్కువ లేరు. ఉన్నవారైనను గళలలో గట్టివారేలయ్యెరో కాలమునుగూర్చి చెప్పినప్పుడు చెప్పుదును. బుద్ధి నిశ్చలత్వములో శీతలప్రదేశస్థులకు విజయపత్రమీయక తప్పదు.

Imagiantion భావనాశక్తిలో Emotion రసమయత్వములోమన మధికులమనుట నిస్సంశయము Intellect ధీశక్తిలో will లో వారు ఘనులనుట యంతకంటె నిస్సంశయము. వారు కష్టముల కోర్వఁగలవారు. మన కాశక్తి కొంత తక్కువ. వారిహృదయముల దయారసము. తక్కువ. మనకున్న భండారమే యది. వారినిశ్చితముక్కుకంటె వజ్రముకంటె గట్టిది. మనది వెన్నపూసకంటె మెత్తనిది. వారికి వారమున కొక్కదినము గుడికిఁ బోవునెడలఁ గొల్ల. మనకు నిత్యదేవతార్చనమైన పిమ్మటనే కాని ప్రాణాహుతులు లేవు. మతము నునది వారికున్న యన్నివ్యాసంగములలో నొక సామాన్యప్రాధాన్యముకలది. మనకు మతమే సర్వస్వము. దేశమునుగూర్చి యిఁకఁ జాలింతును.

దేశకాలపాత్రములని చెప్పియుంటిసిగదా ఇఁకఁ గాలమునుగూర్చి చెప్పెదను. దేహతత్త్వము మనస్తత్త్వము దేశమున కెట్లధీనములై యుండక తప్పదో యట్లే యవి కాలమున కధీనములై యుండకతప్పదు. Spring, Summer, Autumn, Winter. ఱుతు శీతోష్ణాది స్థితులఁబట్టి సంవత్సరము నాల్గుభాగములుగాఁ బాశ్చాత్యు లొనర్చిరి. పునవా రాఱుఋతువులుగా విభాగించిరి. మూఁడేసిమాసములకొక పాశ్చాత్యర్తువు రెండేసిమాస ముల కొక్కమనఋతువు. స్థూలముగా సంవత్సరమును వేసవికాలమని వర్షకాలని శీతకాల మని సామాన్యులు విభజించుచున్నారు. ఫాల్గునము చైత్రము భాద్రపదము నాశ్వయుజము కలిసి వర్షకాలమనియు, కార్తికము మార్గశీర్షము పుష్యము మాఘము కలసి శీతకాలమనియు, స్థూలవ్యవహారము, సామన్యమనుష్యులలో నున్నది. విశేషవ్యత్యాసము లేనిహేతువుచేతమన మీవిభాగత్రయమునే విద్యమానవిచారమున నవలంబింపవచ్చును. విశేషదోషములేదు. ఈలె క్కప్రకారము వేసవికాలములోఁబుట్టినవారు మంచిచాయగలవారై తీవ్రస్వభావముకలవారై దీర్ఘదేహులై కల్పనాశక్తి కలవారై కళాభిజ్ఞులై సూక్ష్మగ్రాహులై చంచలస్వభావముకలవారై సత్యమందు కించిద్వైరాగ్యము కలవారై యుద్రేకము వచ్చినప్పుడు భక్తిరసమగ్నులై యాతీ వ్రత యడఁగినప్పుడు గ్రామ్యసుఖసక్తులై కోపనులైపశ్చాత్తాపయుక్తులై యుందురు. పుట్టినకా లమే నరునిస్వభావమును శాశ్వతముగా స్థిరపఱచుటకుఁజాలియున్న దని తెలిసికొనఁదగి నది. ఆకాల మెంత వివరముగాఁదెలియునో నరునిస్వభావ మంత విస్పష్టముగఁ దెలియును. ప్రతివస్తువునందుఁగూడఁ బృథ్వీతత్త్వము విశేషముగ నున్నది. అట్లే నరునిలోఁ గూడ నున్నదని వేఱ చెప్పనక్కఱలేదు. పృథ్వి యాపస్సు తేజము వాయువు నాకాశము నని పంచభూతములు. వేసవికాలమందుఁ బ్రబలమైన భూతము తేజస్సు. వర్షకాలమునందు వాయువు. శీతకాలమునం దాపస్సు–అనఁగ నీరు. ఇదిగాక పిత్తము వాతము శ్లేష్మమని మూఁడు ప్రధానవిధములగు నాళ్లు. వేసవికాలమునఁ బైత్యము వర్షకాలమున వాతము శీతకాలమున శ్లేష్మము ప్రధానములుగ నుండును. వేసవికాలమనఁ బుట్టినవానికి శరీరము నందు మనస్సునందుఁ దేజ మధికముగా నుండుటయేగాక, దేహతత్త్వమునందుఁ బైత్య మధికముగా నుండును. వాతశ్లేష్మములు సామాన్యముగా నుండును. ఇట్టివానికి మేహజాతి జ్వరముఁ బైత్యాధిక్యమునఁ గలిగిన యశక్తి, స్ఫోటకము, స్థలదోషము, రక్తక్షయము, మూత్రమున నుద్దకట్టు, తలత్రిప్పు, నపస్మారము, నేత్రరోగము. ఎక్కిళ్ళి, మతిభ్రమము, దడ మొదలగు హృద్రోగములు సంభవించును. ఇంతవఱకుఁ జాలును. వర్షకాలములో –ఆషాఢము శ్రావణము భాద్రపదము నాశ్వయుజము–ఈమానములలోఁ బుట్టినవానికి దేహమనోనిర్మాణములందు వాయువు ప్రబలముగా నుండును. వేసవికాలమునఁ

బుట్టినవానికిఁ బైత్యనాడి ఎట్లు ప్రబలముగా నుండునో వర్షకాలమునఁ బుట్టినవానికి వాతనాడి యట్లు ప్రబలముగా నుండును. ఇతఁడు సర్వసాధారణముగాఁ జూమనచాయగలిగి యుండును. పొడుగువాఁడు కాఁడు. రవంత నిశ్చలమైన యభిప్రాయములు గలవాఁడు. దైవచింతకలవాఁడు. న్యాయమందు బుద్ధికలవాఁడు. తొట్రుపాటులేని మనస్సుకలవాఁడు. వ్యవహారమందు నిపుణుఁడు. ఈ మొదలగుగుణములు కలిగియుండును. ఇట్టివానికి వాతజ్వరము వాతసంబంధమగునజీర్తి, కీళ్లవాపు, మలబద్ధత, క్రిమివాతము, తిమ్మిరివాతము, మిషూచి మొదలగువ్యాధులు సంభవించును. ఇకను శీతకాలమందు–అనఁగఁ గార్తిక మార్గ శీర్ష పుష్య మాఘమాసములలోఁ బుట్టినవానికి దేహమనోనిర్మాణములయందు నీరు ప్రబల ముగా నుండును. వేసవికాలమందుఁ బుట్టినవానికిఁ బైత్య మెట్లు ప్రధాననాడియో వర్షకాలమందుఁ బుట్టినవానికిఁ ననఁగా–వాయుతత్త్వమువానికి వాతమెట్లు ప్రధాననాడియో, శీతకాలమందుఁబుట్టినవానికి–ననఁగానాపస్తత్త్వము వానికి శ్లేష్మనాడి యట్లుప్రధానము. అట్టి వానికి జలోదరము బోదకాలు–అండవాతము–ఉబ్బుశ్వాసము క్షయ ఉబ్బసము గ్రహణి నిషపుబడిసెము మొదలగువ్యాధులు సంభవించును. ఇతఁడు పరమశాంతుఁడు. స్థనిష్ఠదే హము కలవాఁడు. నల్లనిరంగుగలనాఁడు. ఆహారాదిత్రయాసక్తుఁడు. మాటలాడునంతలో గుర్రుమని గుర్రుతీయువాఁడు. లెక్కలలో నమర్థుఁడు. వ్యవహారనిపుణుఁడు. స్థూలమైన బుద్ధిగలవాఁడు. ఇతనికి సర్వసాధారణముగా నేదియు మనసున కెక్కుఁడు. ఎక్కువదేదో విడువడు. తొందరపాటులేనివాఁడు. ఇట్టిగుణములు గలిగి యితఁడు చిరకాలజీవియై యుండును.

శీతలప్రదేశములందైన నుష్ణకాలమధ్యమునఁ బుట్టినవారికిగూడ మంచి కళాభిజ్ఞత యుండును. ఉష్ణదేశములందైన శీతకాలమందుఁ బుట్టువారికి కళాసైముఖ్యము సిద్ధించును. దేహ మనస్తత్త్వములకు మూలకారణములు దేశకాలపాత్రములు. వీనితరువాత శిశుపోషణ వైఖరులు. విద్యాభ్యసనవైఖరులు, సహవాస స్వభావవైఖరులు, వృత్త్యాదివైఖరులు మొదలగు నవి యాయాదేహమనస్తత్త్వములను గొంత బలపఱచుటకుఁ గాని క్షీణింపజేయుటకుఁ గాని చాలిన కారణములగును కాని దేహమనస్తత్త్వములందుఁ బ్రథమముద్రను, ప్రధానముద్రను వేయునని జన్మదేశకాలములు. తరువాతఁ గలిగిన కారణము లంత ప్రబలమైనవి కావు. ఇదివఱకున్న దేహమనస్తత్త్వములకు రవంత వన్నెలు చిన్నెలు పెట్టుటకు, రవంత సాపుచే యుటకుఁ గాసంత వెఱ్ఱితలను ద్రుంపుటకు, రవంత యెగుడు దిగుడులను సవరించుటకు మాత్రమే యక్కఱకు వచ్చునని తప్పక తెలియఁదగినది. ఏకాలమం దెవ్వఁడు పుట్టునో సర్వసాధారణముగా వాఁడాకాలమందే మరణించును. అదికాక యాకాలమునఁ బ్రకృతినిబట్టి యేయేవ్యాధు లుండునో వానిలో నేవ్యాధిచేతనో మరణించుటగూడ సర్వసాధారణముగా జరుగుచున్నది. జన్మస్థలమందే మరణించుటకు బ్రతి జనుని కెట్లు మహావాంఛయుండునో యాత్మకు దేహముతో సంబంధ మేమానమం దేగడియయందు గలిగినదో యామానమందే యాదినమందే యాగడియయందే దేహ సంబంధము విడుచుట కాత్మ యట్లుత్సాహమొందు చుండును. కావున బుట్టినదినము ప్రతి సరున కుత్సాహదినము గాదు ఉత్పాతదినము. పర్వదినము కాదు భయంకరదినము. మంగళదినము కాదు మరణదినము. పుట్టినదినము గండదినమని నిశ్చయింపవలసినది. ఏకారణముచే నట్లయ్యెనో యిప్పుడు చెప్పుటకు నాకవకాశములేదు, ఈయంశమును గూర్చి యొకపర్యాయము కాఁబోలు జంఘాలశాస్త్రి

గారు చెప్పియుండిరని నాకు జ్ఞప్తి యున్నది. పుట్టినదినములందు పలావు తినవలసినది కాదు. పరమేశ్వరారాధన మొనర్పవలసినది. కారపుబూంది బొసంది తినవలసినది కాదు గండశాంతికై రుద్రాభిషేకములు చేయింపవలసినది. వేశ్యా వృత్త గానాదులతో దైవపూజలతో గాలక్షేపము చేయదగినది అని జన్మదినములలో నరువదియవది మహాగండము. అది మహాగండము కావుననే దానికి మహాగండమనియే మనవారు పేరిడిరి. ప్రత్యాస్తికుడును షష్టిపూజ చేసికొనక తప్పదు, అది వైదిక మహామంత్రము. వానినంతయు విధ్యుక్తముగా నెఱవేర్పవలయును. కొందరు మహామహులు జన్మదినమునందే మరణించిరి. అది కాకతాళీయముకాదు. కారణనిబద్ధము. ఆకారణములన్నియు జెప్పుట కిప్పుడవకాశ ములేదు. క్షమింపవలయును. పాత్రమునుగూర్చి యిదివఱకే దేశసందర్భమున యథోచిత ముగా మనవిచేసియుంటిని. అంతకంటె విపులముగ జెప్పుట యనావశ్యకము. ఇదివఱకే చాల జెప్పితిని కాబోలు. నాతప్పులను మన్నింపవేడుచున్నాను. భగవంతుడు సర్వదా మిమ్ము రక్షించు గాక.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

45. వాణీదాసుని విడుదల

జూలై 15-1922.

జంఘాలశాస్త్రి ఆంధ్రపత్రికాధిపతికి ఒక ఉత్తరం రాస్తూ–ప్రతి శనివారం వారికి పంపే ఉపన్యాసం పంపడం లేదనీ, కారణం ఈరోజున సాక్షిసంఘ సభ్యుడైన వాణీదాసు జైలునుంచి విడుదలవుతున్నాడనీ అందువల్ల ఈరోజు సాక్షిసంఘానికి సెలవిచ్చామనీ తెలియజేశాడు.

వాణీదాసు విడుదల సంగతి ముందుగానే నిరాకరణ సంఘ కార్యదర్శి ద్వారా తెలియడంవల్ల చుట్టుపక్కల పల్లెటూళ్ల నుంచి ప్రజలు అతనికి స్వాగతం చెప్పడానికి జైలు దగ్గరికి వెళ్లారు. మేళతాళాలతో కాలాచారీ, జంఘాలశాస్త్రి కూడా. నిరాకరణ సంఘ కార్యదర్శితోపాటు వెళ్లారు.

పాణి ద్వారం నుంచి వాణీదాసు బయటకురాగా స్వాగత కార్యక్రమం ముగిసింది.

తరవాత అతన్ని శివాలయం వరకు తీసుకువచ్చాక మిగిలినవారు వెళ్లిపోగా కాలాచార్యులు, జంఘాలశాస్త్రి చేయించవలసిన ప్రాయశ్చిత్తకర్మలు చేయించి ఇంటికి తీసుకువెళ్లారు.

భోజనం అయిన తరవాత మాటల సందర్భంలో వాణీదాసు తానొక గ్రంథం రచించినాని, దాని పేరు కారాగారకాచారఖండనం' అని చెప్పాడు. దానిని పద్యాల్లో ఎందుకు వ్రాశావని జంఘాలశాస్త్రి ఆక్షేపించగా–వాణీదాసుకీ, అతనికీ రగడ జరిగింది. దానిమీద జంఘాలశాస్త్రి ఎవరిక్కైనాసరే వారి అల్పజ్ఞత తెలిసిరావడమే నిజమైన జ్ఞానం అనీ, తానొక గొప్ప వక్తనని తాను భావించడం లేదనీ చెప్పారు.

ఇంతలో మళ్లీ మంగళవాద్యాలతో వాణీదాసుకి ఊరేగింపు జరపడానికి జనం వచ్చారు. పొద్దుట బాగా జరగలేదని వాళ్లు భావించడమే ఇందుకు కారణం.

సత్యపురమునుండి
15–7–22

ఆంధ్రపత్రికాధిపతిగారికి:–

జంఘాలశాస్త్రియనేక నమస్కారములు–మీసారస్వతాను బంధమునకు మేము ప్రతిశని వారము నొక్కయుపన్యాసమును బంపుచున్నాము. ఈదినమునఁగూడ నాయాచారము

ననుసరించి పంపవలసినదే. కాని యట్లు పంపకుండుటకుఁ గారణమేమో యెరుఁగుదురా? మూవాణీదాసకవి కీదినమునఁ గారాగృహవిముక్తి కలిగినది ఇది మాకు మహోత్సాహదినము. కావున సాక్షిసంఘద్వార మిదినమునఁ దెఱచుటకుఁ వీలులేదు. సాక్షిసంఘమున కీదినమున సెలవిచ్చి మాసంఘకవిని గౌరవింపవలసియున్నది. కవిని దిట్టువారేకాని గౌరవించు వాఱెవ్వరునులేరు. మాకవినైన నాతనికవిత్వమునుబట్టి యిట్లుగౌరవింపఁ దలఁచుకొనలేదు. కాలధర్మము నొందకుండఁ గారాగృహమునుండి వచ్చినాఁడని గౌరవింపవలసి వచ్చినది. కారాగృహవిముక్తుల నందఱను బ్రజలు గౌరవింపవలసినదా? స్వార్థలోలురై పరబాధాకరులై కారలోఁ బడి విడుగడయైనవారిని గౌరవింపనక్కఱలేదు. కాని స్వార్థపరిత్యాగులై, దేశక్షేమలాభాదులకై దేహస్వాతంత్ర్యపరిత్యాగ మొనర్చి మోక్షము నొందినవారిని గౌరవింపక తప్పదు. వాణీదాసుఁ డీదినమున నుదయమున ముక్తుఁ డగునని కడచినరాత్రియే యిచ్చటి నిరాకరణసంఘకార్యదర్శి చుట్టుపట్టులనున్నఁ బదిపండ్రెండు చిన్నగ్రామములలో జాటించి తెలియఁ బరుప నుత్తరువిచ్చియుంటచే నీయుదయముననే యనేకజనులు పల్లెలనుండి వాణీదాసుని గౌగవించుటకు నుత్సవముదర్శించుటకు వచ్చియుండిరి. ఈదినమున దైవకటాక్షముచే మఁగ్రామమందు బశువులసంతయగుటచే విజయగనరము తుంపాల యాప్రాంతముల నుండునట్టియు దాక్షారామము కాకఱపర్రు నీప్రాంతముల నుండునట్టియు కాపులనేకులు పశువులను కొనుటకో యమ్మటకో వచ్చియుండిరి. గ్రామమంతయు జనసమ్మర్దముచే సంకులముగ నున్నది.

ఉదయమగునరికే గ్రామములోని నిరాకరణవాదులు మఱికొందరు వాణీదాసుని కారాగృహమునొద్ద కేగి యాతని బహిరాగమనమునకై నిరీక్షించుచుండిరి. ''అదిగో! ఆవచ్చుచున్నవారు వాణీదాసకవిగారే'' యని నిశ్చయపఱచుకొని ''జయా! వాణీదాసకవిగారికి జయా'' యని యచ్చటి జనలోకమంతయు నొక్కపెట్టున నార్చెను. అంతలో నచ్చటి మంగళవాద్యములన్నియు మ్రోయింపబడెను. ఆతఁడు దైవవశమున వాణీదాసకవికాక నియతమైన దుస్తు తీసినైచి యావలికిఁ గాలక్రుత్యములకై కాఁబోలు–వచ్చుచున్న రక్షకభటుఁడగుటచే నెవరిమట్టునకు వారు పశ్చాత్తప్తులై ''సద్దుసద్దు'' అని కేకలు నైచిరి. మంగళవాద్యము లన్నియు నాఁగిపోయినవి. కొంతసేపటి వఱకు జనులు ఖద్దరు వ్యవహారమును గూర్చియు గాంధీమహాత్ముని గూర్చియుఁ గాలస్థితిని గూర్చియు మాటలాడుకొనిరి. ఎంతసేపటికిని వాణీదాసుఁ డీవలకు రాలేదు. ఇంతలోనెవ్వఁడో వచ్చి వాణీదాసుఁడు కారాగృహపుఁ బాణిద్వారమున విడువఁబడినాఁడని చెప్పెను. సింహద్వారము నుండి విడువబడవలసినవాఁడు పాణిద్వారమునుండి యేల విడువఁబడినాఁడని రమ్మడోలువాండ్రతో బాకాలవాండ్రతో మిగిలినవారందరు దొడ్డిగుమ్మమునొద్దకుఁ బరుగెత్తిరి. అప్పటికే యాతఁడు తలవంచుకొని మాకెదురుగ నడచి వచ్చుచుండెను. జను లాతనిఁ గాంచి మహానందభరితులై ''జయా వాణీదాసునకు జయా'' యని కేకలిడిరి. కాలాచార్యుఁడుత్సాహపూరితుఁడై యాతనిమెడలోఁ దెల్లగన్నేరు పూలదండను వేయుచుఁ దొందరలో నాతనికంటిలోఁ దనవ్రేలి చిటికెలోనున్న బొడుముగూడ నైచెను. వాణీదాసుని బాష్పోద్గమమునకుఁ బట్టరాని యానందమేకాక పాటిపాగాకు పొడుముకూడఁ గారణమయ్యెను. నాకాతఁడు నమస్కరించి సాక్షి యెప్పుడు మదరాసునుండి వచ్చునని యడిగెను. ఆతని నాశీర్వదించి రెండుమూఁడుదినములలో సాక్షి వచ్చునని చెప్పితిని. జనులు మహోత్సాహ

మున దేశభక్తివిషయకములగు కీర్తనలఁ బాడుచు దైవభజనలు చేయుచు ముందునకు నడచుచుండిరి. అప్పటి కూరిలోని కొందఱు వేశ్యాకాంతలు వచ్చి జనసంఘమునఁ గలిసి గన్నేరుపూలదండను బట్టి కారాగృహవిముక్తి కవిశిఖామణిని గుర్తించి యాతనికి నమస్కరించిరి. వేశ్యలు మనసంఘమునఁ జేరరాదని యిచ్చటి జనులలోఁ గొంద అధిక్షేపింపగ ''వారిప్పుడు పూర్వవృత్తులు మానుకొని దేశక్షేమమునకై నూలు వడకుకొని కాలక్షేపము చేయుచున్నా''రని కొందఱు వారిని బ్రశంసించిరి. కాలాచార్యుఁడు బొళ్ళుముక్కుగల యొకవేశ్యను గాంచి యామె పొడుముపీల్చును గాఁబోలునేమి యని యరువది డెబ్బది జనులకుమాత్రమే వినఁబడునంత మెల్లగా వాణీదాసు నడిగెను. ఆమెనే యడుగరాదాయని వాణీదాసుఁ డాతనికిఁ బ్రత్యుత్తరమిచ్చి నన్నుగాంచి ''జంఘాలశాస్త్రీ! ఇఁకముందు జరుగవలసినదేది?'' యని యడిగెను. క్షురకర్మమని నేను బదులు చెప్పితిని. ''అదికాదయ్యా! దేశక్షేమమునుగూర్చి యేమి జరుగవలసినదని నే నడిగితిని'' నని యాతఁడు పలికెను. ''ప్రాయశ్చిత్తకర్మమైన తరువాత భారతదేశాభివృద్ధివిషయ మాలోచించుకొనవచ్చునులే, దేశ మోక్షమునకు నీవొక్కఁడనే తరువాయి యనుకొనుచున్నావు కాఁబోలు నేమి'' యని నేనంటిని. నామాటల కాతఁడు కొంత కోపించి నాతో మాటలాడక యటునిటు చూచుచుండెను. ఇంతలో శివాలయము నొద్దకు వచ్చితిమి. ఈదినమున శనివారమైనను క్షురకర్మవిషయమైన తిథివారవిశోధనము కారాగృహవిముక్తునియెడలఁ జూడఁదగదను కారిక ననుసరించి యాతని కక్కడనే క్షురకర్మము చేయించితిమి. వాణీదాసునికి జయా యని జనులు నాల్గుకేకలునైచి యెవరిదారిని వారుపోయిరి. మేమట్లు పోవుటకు వీలులేనివారమగుటచే నేనును గాలాచార్యులు నాతనియొద్దనే యుండి మృత్తికాస్నానములు రుద్రాభిషేకము మొదలగు విధులన్నియు శాస్త్రీయపద్ధతిగాఁ జేయించి మాయింటికిఁ దీసికొనిపోయి పంచగవ్య మిప్పించి పరిశుద్ధునిఁ జేసి భోజనమిడితిని. భోజనమైనపిమ్మట మాలో మేమిట్లు సంభాషించుకొంటిమి.

కాలా–వాణీదాసా! నీవు చుట్టకాల్చువాఁడవుకదా? నీకుఁ గారలోఁ జుట్టయెట్లుదొరకెడిదో నాకుఁ జెప్పలేదేమి?

వాణీ–కారాగృహనిర్బంధములవలననే నాకాదురభ్యాసము పోయినది. నీనస్యాభ్యాసముకూడఁ బోవునేమో నీవుకూడఁ గొట్టులోనికిఁ బోయెదవా యేమి? ఈమాటకేమి? కాని కారాగృహనివాసమువలన నిజముగాఁ గొన్ని లాభములు లేకపోలేదు. నేనొక్క గ్రంథమును వ్రాసితిని.

జంఘా–అది యేదయ్యా?

వాణీ–కారాగృహపద్ధతులలో నేయేదోషములున్నవో యవి యెట్లు నివారింపవలయునో యను విషయమునుగూర్చి వ్రాసితిని.

కాలా–ఆగ్రంథముపేరు?

వాణీ–కారాగార కాచారఖండనము

కాలా–''కాచార'' యనఁగా నేమి? గ్రహచారమా?

వాణీ–దురాచారములని యభిప్రాయము.

జంఘా—ఈపుస్తకము గద్యముననే వ్రాసితివా?

వాణీ—లేదు. పద్యమునన్.

జంఘా—పద్య మెందులకోయి నీమొగము! నీగ్రంథ మెవరు విందురని నీయభిప్రా యము? అరణ్యరోదనమువలె నీ కీకారాగృహ కవిత్వమెందులకు? పోనీ! వేణుగోపాలశత కమో కుక్కు టేశ్వరశతకమో వ్రాయలేకపోయితివా? కొందరైనఁ జదివి సంతసింతు రేమో?

వాణీ—శతకముల కివి దినములుకావు.

జంఘా—నీపంటి కవికిఁగూడఁ గావు.

వాణీ-నీవంటివక్తకుమాత్ర మివి దినము లనుకొనుచున్నావు కాఁబోలు. నీయుపన్యా సముల నెంద ఱధిక్షేపించుచున్నారో యెఱుఁగుదువా?

జంఘా—వాణీదాసా! ఇదివఱకేమో పరిహసించితిని. కోపపడకుము. నేను వక్తనుగానని నేనెఱుఁగుదును. నాయుపన్యాసముల నధిక్షేపించుచున్నవారిని నేనెఱుఁగుదును. ప్రశంసిం చుచున్న వారిని నే నెఱుఁగుదును. అందులకు నాకు విచారములేదు. ఇందులకు సంతోష మును లేదు. ఎందుచేతనో చెప్పనా? అధిక్షేపించుచున్నవా రెందుల కధిక్షేపించుచున్నారో యెఱుఁగరు. ప్రశంసిం చున్నవా రెందులకు ప్రశంసించుచున్నారో యంతకంటె నెఱుఁగరు. అట్టివారి నిందాస్తుతులతోఁ బనియేమి? నీ వొకని శిరఃకంపనమునకు లక్ష్యపెట్టవలదు. మరియొకని మూతిముడుపునకు లక్ష్యపెట్టవలదు. ఒకనిదీవనను గణింపవలదు. మరియొక నితిట్టును గణింపవలదు. అభిప్రాయప్రకటనమే ప్రతి వ్యక్తికి స్వభావము. వేదర్షులబుక్కు లెంత స్వభావజన్యములో కాలాంబుదములోని గర్జారావము లంత స్వభావజన్యములు. ప్రసవమునుండి వెడలిన పరిమళ మెంత స్వభావజన్యమో కవి ముఖోల్లిఖితమగు గీత మంత స్వభావజన్యము. మహావక్త యురిమిన యుపన్యాసమెంత స్వభావజన్యమో పెద్దపులియైచిన అంకె యంత స్వభావజన్యము. ఎవని స్వభావమునకుఁ దగిన, యెవని హృదయమునకుఁ దగిన, ఎవనివిద్యకుఁదగిన యెవని ముఖమునకుఁ దగిన పలుకు వానినుండి బయలువెడలుచు న్నది. కణకణమను మృదంగమునుజూచి బెకబెకలాడుకప్ప యేడ్చిన వినియోగ మేము న్నది? కలస్వరకలితపగు కలకంఠమునుజూచి గాడిదె తన్నుకొని యోండ్రపెట్టిన లాభ మేమి? అదిగాక యొకవ్యక్తిని జూచి యొకవ్యక్తి యసూయపడుట కొకని ఘనతయేమి? యొకని నీచతయేమి? అన్నివ్యక్తు లల్పములే అన్ని యభిప్రాయప్రకటనలు కూఁతలే. వస్తుతత్త్వమున, దోమ గుంయిమనుట యెట్టిదో పెద్దపులి గాండ్రుమనుట యట్టిదే. ఱాకలిచేఁ గుక్క తోఁక నాడించుట యెట్టిదో పౌరుషమున సింహము కేసరముల జళిపించుట యట్టిదే. పరమార్థజ్ఞానాభావునకు, పామరాధమున కది యెక్కువ యని యిది తక్కువయని —యది మనోహరమని యిది కర్ణకఠోరమని కనఁబడును. నీవు బుద్ధిహీనుఁడవు కావున నీవల్పుఁడవు కావున నీవు జడుఁడవు కావున నీ కాభేదము కనఁబడుచున్నది. సచ్చిదానంద స్వరూపుఁడైన భగవంతునియెదుటఁ గుమ్మరిపురువు తక్కువయేమి? గోరాజ మెక్కువ యేమి? రొయ్య తక్కువయేమి? తిమింగిల మెక్కువయేమి? నల్లి తక్కువయేమి? నరుని యెక్కువయేమి? పరిపూర్ణ శక్తిమంతుఁడైన పరమేశ్వరునివఱ కెందులకో! గాలిగుమ్మట మెక్కి మైలున్నర పైకిఁ బోయి చూడుము. హైకోర్టుగుమ్మి యెంతయో ఱాడుపిల్ల సముద్రతీరమునఁగట్టిన పిచ్చుకగూడు నంతయే—కాకచేసినయెడల మసకగాఁ గనఁబడిన,

సైత్యముచేసినయెడలఁ బచ్చగాఁ గానఁబడిన, హ్రస్వదృష్టితో దూరమునకుఁ గనఁబడని, దూరదృష్టితో దగ్గఱకుఁ గనఁబడని, చీఁకటితో మొదలే కనఁబడని, వట్టి పనికిమాలిన కన్నుగల నీకే మైలు పాడుగునఁ బైకెక్కు-నరికి గొబ్బెరచెట్టునకు నేలములగచెట్టునకు భేదమే గానఁబడునప్పు డనేకాద్భుతగోళములకుఁ గ్రిందమీఁద లోనవెలుపల నిండియున్న, యప్రతి హతమైన యనిర్వాచ్యమైన యనను సంధేయమైన భగవద్వ్యక్తికి, వాణీవానుఁడు పొట్టివాఁడని జంఘాలశాస్త్రి పాడుగువాఁడని భేదముండునా? వట్టికల్ల-వట్టికల్ల నీవల్పజ్ఞుఁడవు. నీ వధికుఁడవని యనుకొనువాఁడు, నీకంటె నల్పజ్ఞుఁడు. వాఁడధికుఁడని యనుకొనువాఁడు వాని కంటె నల్పజ్ఞుడు. ఈసంగతి బాగుగాఁ దెలిసికొనుము. తెలిసికొని యనుసంధింపుము. అనుసంధించి యనుభవమునకుఁ దెచ్చికొనుము. ఈప్రపంచమున గర్వమున్నవానికి గతి లేదు. ముమ్మాటికి గతిలేదు. జాగ్రత్త. జాగ్రత్త. "నే నల్పజ్ఞుఁడను-అజ్ఞుడను-నాకీ ప్రపంచవై చిత్రి యణుమాత్రమైనఁ దెలియకున్నదోయి బాబూ! భగవంతుఁడా!" యని గొంతెత్తి గట్టిగ నేడ్వుము. భారతీదేవి గనమును నీయేడ్పునుగూడ నాపరాత్పరుఁడు చెఱియొక కర్ణముతో నణుమాత్రమైన వ్యత్యానములేని యానందముతో వినును.

ఇంతలో వాఁకిటిలోఁ దిరుగు మంగళవాద్యముల ధ్వనియైనది. ఉదయమున బాగుగా నూరేగింపలేదని వాణీదాసుని దిరుగ నూరేగించుటకు జనులు వచ్చినారు. ఎంత కోలాహల ముగనైననున్నది. కారాగృహబంధమునుండి విడుదలనొందిన యొక్క సామాన్యునిగూ ర్చియే యిన్ని మంగళవాద్యములు వాయించుచున్నారే. భవబంధము నుండి విడుదలనొం దిన ప్రజ్ఞాస్వరూపునిగూర్చి యింక నేమి వాయింపవలసినదో ఇంక నెన్నివాయింపవలసినదో (వాని కేమియును నక్క-ఱలేదని కాలాచార్యులు కునికిపాటులలోనే పలికెను.)

ఆంధ్రపత్రికాధిపతీ! వాణీదాసుని దీసికొని మే మూరేగింపులోని కిప్పుడే పోవుచు న్నాము. ఈతొందరచేత మా కీశనినార ముపన్యాసము లేదు. క్షమింపవలయును. దేశబాంధ వులగు మీకు భగవంతుఁడు సర్వశ్రేయసము లొసఁగూర్చుఁగాక.

46. కర్నూలులోని కాటుకము

దత్తమండలాల ప్రాంతంలో ప్రజలు ఆసంవత్సరం ఎదుర్కొంటున్న వేసవి దుర్భర పరిస్థితులు గురించి సాక్షికి ఒకరు ఉత్తరం రాశారు. ఎందుకు రాశారంటే, అక్కడ తిన తిండిలేక, కట్టుకొను బట్టలేక, పనులకు పనులులేక సామాన్య ప్రజలు ఎంత కాటకంలో ఉన్నారో సాక్షిసంఘం ద్వారా తెలియ జేస్తే, ఆంధ్ర దేశంలో ధనవంతుల నుంచి ఆ ప్రజలకి ఏదైనా సాయం అందుతుందని–

వర్షాలు కొద్దిగా కూడా లేకపోవడంతో ఆకుమళ్లు ఎండిపోయాయి. ముఖ్యంగా కర్నూలుకు పది పన్నెండు మైళ్లదూరంలో వున్న పల్లెల్లో ప్రజలు దుర్భర బాధలు అనుభవిస్తున్నారు. కొంతలోకొంత గుడ్డిలో మెల్ల లాగ, సర్కారువారు రాళ్లుకొట్టే పనిని కల్పించి–మగవాడికి తొమ్మిది కానులు లెక్కన కూలీ ఇస్తున్నారు. దీనికే ఉదయం నుంచి సాయంకాలం వరకూ వాళ్లు ఒళ్లు విరుచుకోవలసి వస్తోంది. ఇదిలా వుండగా కాయకష్టం చెయ్యలేని ముసలి వారికి, రోగులకి, సర్కారువారే ధర్మంగా అన్నం పెడుతున్నారు. అది కూడా కొలత ప్రకారం..

స్త్రీల దుస్థితి మరీ దుర్భరంగా వుంది. వాళ్లకి నిజంగా 'మాన' రక్షకి తగిన బట్టలు కూడా శరీరం మీద లేవు. చంటిపిల్లల్ని వీపున కట్టుకుని, చాలీచాలని బట్ట కట్టుకుని భారంగా బతుకీడుస్తున్నారు. ఈ పేద సోదరుల్ని ఆదుకుని ధన రూపేణా, బట్టల్ని దానం రూపేణా ఇచ్చి వెంటనే ఆదుకోవాలని ఆ ఉత్తరం వ్రాసిన వ్యక్తి ఎంతో వేదనతో ప్రకటించాడు. ఈ ఉత్తరాన్ని జంఘాలశాస్త్రిచేత సభలో చదివించమనీ, ఆంధ్రపత్రికలో ప్రకటించమనీ పంపాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను–

నాయనలారా! సాక్షి కొకలేఖ వచ్చినది. దీనిని జదివెదను.

సాక్షిగారికి–అయ్యా! నమస్కారములు మృగశీర్షానక్షత్రమున నర్కుడు ప్రవేశించి యిదివఱకు నెలపైఁ బదునైదుదినములు దాటవచ్చినది. వర్షములు మిగులఁ దక్కువగా నున్నవి. ఆకుమ ళ్లొకసారి యెండిపోగా రెండవసారి మేఘములను నమ్మికొని యాకులు

పోసినారు. అవికూడ నెండిపోవుచున్నవి. నదీజల ప్రవాహము సస్యాధారమైన కొన్నికొన్ని పట్టులందుమాత్రమే భూమి రవంత పచ్చబచ్చగ నున్నది కాని మిగిలినస్థలములందెల్ల నిర్జీవమై శుష్కమైయున్నది. ఆంధ్రదేశమందెల్లను దత్తమండలములలోని ప్రజలు మరింత హెచ్చుగఁ దహతహపడుచున్నారు. నేనెరిఁగినంతవఱకుఁ గర్నూలునకు పదిపండ్రెండు మైళ్లదూరములోనున్న కొన్ని పల్లెలలోని జనులదురవస్థ వ్రాయుచున్నాను. అచ్చట నీనరికిఁ గొన్ని వర్షము లుండినయెడల వారింత దురవస్థలో నుండియుండరు. వర్షమో వర్షమో యని యేడ్చుచున్నారు. ఏదైన నొకసేద్యమున కవకాశము మేఘుఁడు కలిగించియుండినయెడల జను లంత యాందోళనపడుట తటస్థించియుండదు. కాని సర్కారువారు కాయకష్టముచేసి పనిచేయఁగలవారికొఱకు కొంతపనిని గల్పించి యున్నారు. వారిట్లు ప్రజలయెడలఁ గనఁబ అచుచున్న దయ కాంధ్రదేశస్థులందరు వారికిఁ గృతజ్ఞులు.

ఒకగ్రామమునకు రెండుమూఁడు మైళ్లదూరమున నొకకొండ యున్నది. ఆకొండ మీఁది రాలు తట్టలలో నెత్తుకొని యీ రెండు మూఁడు మైళ్లదూరము మోసి యొక్కచోట గుట్టగావేసి యారాలు చిన్నచిన్న ముక్కలుగాఁ గొట్టుటకు మగవానికి దొమ్మిదిబొట్లు నాఁడుదాని కేడుబొట్లుకాబోలు కూలిని సర్కారువా రేర్పాటుచేసి యిట్లు చేయించుచున్నారు. కాని యుదయమం దారుగంటలనుండి సాయంకాలమం దారుగంటలవఱకుఁ బనిచేయుటచే మిగులఁ గ్లేశమొందుచున్నారు. తత్రాపి 10 గంటలు మొదలుకొని సాయంకాల మయిదు గంటలవఱకుఁ గాయుచున్న భయంకరమైన యెండలోఁ, జెట్టుపుట్టయైనలేని బయళ్ళలో మహానదీప్రవాహమువలె మరీచికాప్రవాహములు వరదలుగట్టుచున్న బంగనబయళ్లలో కాలిపోయిన బోడికొండలనుండి వెడలుచున్న భయంకరమైన యుష్ణముచే సామజమునైన శవమును జేయఁజాలిన వడగాడుపులో, మోకాళ్లవఱకైన దిగని ముదుకలాగులతో, సహస్రౌష్ణమైన ముదుకదుప్పటి తట్టపాగతోఁ గదుపుకొఱకుఁ బశువులకంటెఁ బ్రబలముగ భయంకరముగఁ బాటుపడుచున్న మనసోదరులను జూచి మన మేమియు వారికి జేయులేకున్నను గన్నీరైన విడువఁ జాలమా?

ఆమాత్రపు త్యాగమైన మనకుండ నక్కఱలేదా?

అయ్యయ్యో! సర్కారువా రింతవఱకైన నీలాగైన వారికి జీవనాధారమును గల్పించుచున్నారు. కావున భీమగజములవంటి మనయాసోదరు లింక సప్రాణులై యున్నారే! పూటకు శేరున్నర జొన్నపిండి రొట్టెలకు, దాకెడు కందిబేడలపులునుతో గన్నుమూసి తెఱచునంతలో గ్రసించు మహాబలిష్ఠులకుఁ దొమ్మిదిడబ్బులు కూలితో నేమగును. కూలి యింకను హెచ్చుచేయుఁడని సర్కారువారిని బ్రార్థించుట న్యాయమగునా? సర్కారువా రెట్లో పోషించుచునేయున్నారు. మనకేమని మనలోని భాగ్యవంతు లుపేక్షించియుండుట సోదరధర్మమగునా? మనుష్యధర్మమగునా? దనియాలపొడి మిరియాలచారుతో నఱిగిద్దెడు నన్నబియ్యపు టన్నము తిని యజీర్తిచే హాహాకార మొనర్చు ''అర్బన్'' బ్యాకింలో నఱువదివేలో యాఱులక్షలో నమాధిచేసిన నిర్భాగ్యులైన భాగ్యవంతులు మనలో నెందఱులేరు? అయ్యయ్యో! తాము తినరే- తినలేరే- తినినయెడలఁ జచ్చిపోవుదురే–ఒకరికిఁబెట్టరే- పెట్టలేరే –పెట్టినయెడలఁ జచ్చిపోవుదురే. తమకు నక్కఱకు రాకమైోరికి నక్కఱరాక లోక సంగ్రహార్థ మాఁపిరిమాత్రము విడుచుచున్న యీగాలి తిత్తులవలనఁ బ్రయోజన

మేమి? ''బకోపికిన్నకురుతే చంచ్వాస్వోదర పూరణమ్'' అనిన ట్లదియైన మనవారిలోఁ గొందఱెఱుఁగరే! ఇంతకన్న నధమమైనస్థితి యున్నదా? సర్కారువారుచేయుచున్న ఘనకార్యమునకు మనవారేల యిప్పుడైనఁ దోడుపడఁగూడదు?

ఇదికాక కాయకష్ట మొనర్చి జీవింపలేని వృద్ధులకు రోగులకు బాలురకు నవధ్యులకు సర్కారువారుధర్మముగ నన్నము పెట్టుచున్నారు. ఇట్లు మూఁడునాల్గువందల ప్రాణులు పోషింపఁబడుచున్నవి. జొన్నసంకటియేదో కొలతప్రకారమిచ్చి వారిని బోషించుచున్నారు. ఇంకనెందఱో యిట్లు పోషింపబడవలసినవా రున్నారు. గుంటలుబడిన కనులతో దించుకొని పోయిన చెక్కులతో హీనస్వరముతో ''నన్నమోరామచంద్రా'' యని వారేడ్చుచున్న యేడ్పులతోపాటు పైకివచ్చుచున్న వారి హృదయస్థనంతాప స్వరూపాగ్నిజ్వాలాజాల మాంధ్రదేశాదృష్టమునంతయు మాడ్చివేయుటకుఁ జాలియున్నదను నంశము జ్ఞప్తియం దుంపవలయును.

ఇంక స్త్రీలదుర్గతి చెప్పుట కలవిగాకయున్నది. మీజంఘాలశాస్త్రియే యిచ్చటి స్థితిగతులన్నియుఁ జూచియుండినయెడల నవియన్నియు మీకన్నులఁ గట్టినట్లు చెప్పఁగలిగి యుండును. నాజిహ్వకట్టి శక్తిలేదు కాని మనసున నెంతయాందోళమైన నున్నది. స్త్రీలుకూడఁ బురుషులతోఁబాటు శ్రమపనిచేయుచునేయున్నారు. సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయమువఱకుఁ బాటుపడుచున్నారు. సాయంకాల మగుసరికి లేచి యింటికిఁ బోవుటకైన శక్తిలేకుంటచేఁ గంటిలో నేడుపుబొట్లు–చేతిలో నేడుబొట్లు. ఈయేఁడుబొట్లను దినుట కేడుగురుబొట్టులు. ఈమాత్రమైనను గరుణాళువులగు సర్కారువారు చేయుచున్నారు. మన మేమిచేయుచున్నాము? అబ్రాహ్మణుఁడని వానిని జెడమడ దిట్టుచున్నాము. బ్రాహ్మణుఁ డని వీనిగొంతున కురిబెట్టుచున్నాము. తినలేక కడుపు గట్టుచున్నాము. కూడఁ దీసికొనిపోవుటకు మూటఁగట్టుచున్నాము. ముష్టిదానిని జేకొట్టు చున్నాము పాలీయక సోదరుని వెడలఁగొట్టుచున్నాము. తండ్రిని బస్తుపెట్టుచున్నాము! భార్య మొట్టినమొట్లకు రహస్యముగఁ గంట నీరుబెట్టుచున్నాము. దేశక్షేమమని కేకలుపెట్టు చున్నాము. వచ్చినచందాలు స్వక్షేమమునకై కర్చుపెట్టుచున్నాము. స్వార్థ పరిత్యాగమని మొట్టి పెట్టుచున్నాము. వకాలత్నామాకొఱకుఁ దండ్రికిఁ గొడుకునకు ముళ్లుపెట్టుచు న్నాము. అదిగో స్వరాజ్యమని గంతలు పెట్టుచున్నాము. అయ్యో! పిల్లవాఁడు చెప్పినమాట వినినాడుఁ, కాఁడని కూనురాగములఁ బెట్టుచున్నాము. ''నాయనలారా! మీకీచర్య తగదు. మీపూర్వులైన యార్యులు ప్రవర్తించినట్లు ప్రవర్తింపుఁడు. భద్ర భద్ర''మని యేజంఘాలశా స్త్రియో గొంతెత్తి యఱవగ నతని నడ్డమైన తిట్లు తిట్టుచున్నాము. అంతేకాదా? మనప్రయోజ కత్వ మెవరెఱుఁగరు? ఇట్టిమీరు–కన్నకొడుకులతోఁ గాటులాడి కోర్టుల కెక్కిన మీరు దత్తమండలములోఁ గడుపుకాలి యేడ్చుచున్న సోదరీమణులకు సాయమొనర్తురా? ఆఁడుది ఱాలు ముక్కలుచేసికొని బ్రతికినతరువాత దానియెముకలు ముక్కలైనవనుట కేమైన సందేహమా! వారికి సాహాయ్యము చేయలేనివారి మర్యాద మన్నైనదనుట కేమైన సందేహమా! చంటిపిల్లలను వీపునకుఁగట్టుకొని ఱాలుగొట్టుచున్నారు. ఎడపిల్లలను గుండ్రాతిక్రిందినీ డను బండఁబెట్టుచున్నారు. 21 పైనలకుఁ బండ్రెండుగంటలు పనిచేయుచున్నారు. ఆకష్ట ముపడి యామాత్రమైన సంపాదనచేసికొనలేని స్త్రీలెందరున్నారో యెఱుఁగుదురా! ఎంద

ఉన్నారో తెలిసినమాత్ర మేమి వినియోగము? ఆసదుమ నింటింటి కొక రాట్నము నిరాకరణవాదులెవ్వరో యిచ్చినారఁట. ఆరాట్నములకుఁ బనియేది? పనిచేయుటకు సిద్ధములైనహస్తములున్నవి గాని ఏకులేవి? ఏకులో యేకులో యని యచ్చటిస్త్రీలందఱు గోలబెట్టుచున్నారు. ఇచ్చినవారేరి? ఇయ్యనక్కఱలేదు. యేడ్చినయేడ్పులు వినినైన నక్కఱ లేదా? బ్రహ్మపురమునుండి బళ్లారి చివఱవఱకుఁదిరిగిన నిరాకరణవాదులు తరుగుచునే యున్నారు. ఇచ్చిన యుపన్యాసముల నిచ్చుచునేయున్నారు. బోధించినబోధలను బోధిం చుచునేయున్నారు. ఖండించిన ఖండనలుఖండించుచునేయున్నారు. పెట్టినయాసలు పెట్టు చునే యున్నారు. చూపిన మొండిచేతులు చూపుచునేయున్నారు. ఎందుల కీఅంకులరా ట్నపు సంచారము? ఎందుల కీ యసాధారణశుష్కవ్యయము? ఎందుల కీనీరసోపన్యాస ములు? ఖద్దరులోని సాంకర్యము నాఁపఁగలిగితిరా? ఇదివఱకుఁ ఇదివఱకుఁ జేతగానివార మనిపించుకొంటిమి. కాని యిప్పుడు దొంగ లనిపించుకొనుచున్నామే హరిహరీ! పనిలేని ప్రయాణములకొఱకు వీరు ఎమ్.ఎస్.ఎమ్.ఆర్. వారికి బోసినధనములో నాల్గవవంతు ధనములో మాదత్తమండలములలోని పడఁతుల పనిలేని హస్తములనున్న మూగరాట్నములకుఁ గావలసినన్ని యేకులువచ్చునే? అయ్యయ్యో! ఇప్పు డెట్లిచ్చెదరో యేకులిండు. ఈయకపోయినయెడల మీరు దేశక్షేమాభిలాషులని యెట్లనిపించుకొనఁగలరు. బిరుదములు వహించుట విశేష మనుకొనుచున్నారు కాఁబోలు. కార్యభారమును నిర్వహింప వలయును.

ఇదిగాక ఇంటను గూరుచుండినస్త్రీలకుఁ గట్టుకొనుట కేమున్నదో తెలియునా? ఏమున్నదో ఏమిలేదో యెట్లు తెలియును. ఈవలికి వచ్చుటకు సిగ్గుచేత రాలేకుండను న్నారు. శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్. కాని కొందరుస్త్రీలు వెలుపలికివచ్చి జాలు గొట్టుచున్నారు కదా! వారిదు నెట్లున్నదో చెప్పనా? మూఁడుజేనెలు వెడల్పుగల మూఁడుమూరల పొడవుగలగుడ్డ నడుమునకుఁ జుట్టఁబెట్టుకొనియున్నారు. అక్కడికావ స్త్రముసరి, మూరెడువెడల్పుగల మూరన్నరపొడవు గల యొకపేలిక నడుముకట్టుముడికి ముడివేయఁబడి యెడమభుజముపై నుండి వెనుకకుఁ బోవుచున్నది. ఇది హైటు-కూలి యాఁడువాండ్ర కిదిపూర్ణమైన దుస్తు వంగుట తటస్థించునెడలఁజైట పొట్టిదగుటచేఁ గ్రిందఁ బడిపోవునేమోయని హైటుచెఱ గప్పుడు మెడకుఁ జుట్టఁబెట్టుచున్నారు. రామరామరామా! ఈదుస్తుతో గుప్తమానధనలై వారు పైకి వచ్చి నిర్భయముగఁ బాహాటముగఁ బనిచేయుచు న్నారు. వీరి వస్త్రవైఖరియే యిటులుండ వెలుపలికి వచ్చుటకు సిగ్గుపడి లోనఁ గుండల చాటునఁ గూరుచుండువారి వైఖరి యెట్లున్నదో భగవంతుఁడా?

సాక్షి! నేను వదలుకొన్నను నన్ను వదలదని స్లేడరుతో విడాకులు పెట్టుకొనుటకు మదరాసునకుఁ బోయితిని. అక్కడ నొక్కసర్కసు వారిచ్చిన ప్రదర్శనమును గాంచితిని. ఆప్రదర్శనములోని విశేషము లన్నియు వివరముగా విస్తరముగా మీకు వినుగుడల కలుగు నట్లు వ్రాయుదునేమో యని యనుకొనకుఁడు. అట్లు చేయువాఁడను గాను. ప్రదర్శనారంభ మున జరిగిన యొకయంశముమాత్రమే సంకుచితముగ వ్రాసెదను. వర్తులాకారముననున్న పటకుటీరములో వారివారి నియమితములైన స్థానములలో స్త్రీపురుషులు గూరుచుండియు న్నారు. నాల్గుగంటలు కొట్టినారు. ఇంకను వెలుతురు బాగుగనే యున్నది. ప్రదర్శన మారంభమయ్యెనుగదా యేమివచ్చునో యని జనులందరు సనంభ్రములై చూచుచున్నారు.

ఆరంభమున నొక్క కాంతవచ్చెను. ఆమె శ్వేతముఖి జర్మనీదేశపుదో, ఫ్రాన్సుదేశపుదో, అమెరికాదేశపుదో తెలియదు. పాశ్చాత్యదేశ స్త్రీలలో నొకతె. ఆమె యారడుగులకుఁ దక్కువలేదు. మన దేశ స్త్రీలలో నిక్కిలి లావుగానున్న వారిని మువ్వురను గట్టగట్టినయెడల నీత్రిమూర్త్యాత్మక స్వరూప మెంత లావుగనుందునో యామె యంతలావునకుఁ దక్కువయుండదు. కాని శరీరము నందు లవలవ తపతవకాని యేమియులేదు. శ్వేత పాషాణ పాంచాలిక వలె నున్నది. ఇంతవఱకుఁ బ్రకృతిలోఁబుట్టిన గంగవెఱ్ఱి కావున నిందుల కామె నేమియు ననఁదగదు. ఆమె ధరించినదుస్తు లెట్లున్నవో చెప్పనా? ఆమె కీబుజమున రెండువ్రేళ్ల వెడల్పు పట్టాయును నాబుజమున రెండువ్రేళ్లపట్టాయును నున్నవి. ఈపట్టా లకు ముందువైపున బ్రొద్దుదిరుగుడుపూవుల రంగుతో నదేయకృతిగల రెండుచక్రములు చనుగప్పులై యున్నవి. ఈరెండుచక్రము లాయవయవములమీఁద వైరాగ్యభావులు సంసార ములోవలె నంటియంటనట్లున్నవి. ఈయంగున కంటిపెట్టుకొని కటిప్రదేశముచుట్టుతిరి గిన రెండుజేనెలమాత్రమే వెడల్పు గల యొక జూలున్నది! ఆమెదుస్తునకు దీనితో నాశ్చాసాం తము. ఆమె రెండుబాహులు పైకెత్తుకొని తాండవించినది. శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్. పటకుటీరములో గూరుచుండిన పాశ్చాత్యస్త్రీలు కిలకిలలాడిరి. ఇదియొక వింతగా వారికిఁ దోఁచలేదుకాబోలు. ఇంతలో నామె గిరగిర దిరిగినది. చలపాదులలో మిగులఁ జలపాదియైన వాయుదేవుఁ డామె లోకసంగ్రహార్థమై మొలచుట్టు ధరించిన జూలు రవంతయుఁ బైకెగురఁగొ ట్టనా? నారాయణా! ఆపదుద్ధారకా! అచ్చటఁ జేరిన మనదేశపు మగవారందరు డిల్లపడి కొయ్యలై కత్తివ్రేటు నైచిన నెత్తురుచుక్కయైన రాకుండినట్లుండిరి. నేనుగూడ స్తంభీభూతుఁ డనై రవంతసేపుండి స్మృతినొంది యచ్చటఁజేరిన యార్యావర్తసుందరుల వంకఁ జూడఁగ వారందరు మోములు వెనుకప్రక్కకు మఱలుచుకొని యుండిరి. అంతటితోనైన సంతుష్టి నొందక జేబురుమాళ్లను గన్నులపై నడ్డుపెట్టుకొని యుండిరి. కాంతాధర్మమునకు గౌరవ భంగమైనదని వారట్లు కన్నుల బాష్పముల విడుచున్నారో, రక్తపుచుక్కల విడుచుచున్నారో యెవరి కెరుక. ఆఁడుదానిమర్యాద యెట్టిదో పూర్తిగా దెలిసిన మగవాఁడొక్కఁడైన నున్నాఁడా? ప్రాణముకంటె మానమును సహస్రగుణాధికమగు ప్రయత్నముతోఁ గాపాడుకొ నుచున్న మనదేశసుందరులవంటివారు మహీమండలిలో నెచ్చటనైన నున్నారా? అట్టి మన ఆంధ్రదేశసుందరీ మణులను నే నొకందులకుఁ బ్రార్థించుచున్నాను. వారిలో దరిద్రులు న్నారు. సాధారణ లున్నారు. భాగ్యవంతులున్నారు. రాజకాంత లున్నారు. మహారాజకాంత లున్నారు. దరిద్రస్థితిలోనున్నవారిని నేను ప్రార్థింపను. గుడ్డలేక వెలుపలికి వచ్చుటకు నందేహపడి గుడిసెలలోనే కూరుచుండియున్న కూలి యాఁడువాండ్రని నేను మొదట వ్రాసితినే–వారికి సాధారణలగు స్త్రీ లొక్కకోకయిచ్చినఁ జాలును. భాగ్యవంతులు రెండుకో కలిచ్చినఁ జాలును. రాజకాంత లిరువదికోక లిచ్చినఁ జాలును. మహారాజకాంత లేఁబదికోక లిచ్చినఁ జాలును. పదునారుమూరల ముదుక కోకకు నాల్గురూపాయల వెల. వారీమహో దా రమైన కార్యమును దాదాపుగ దిగంబరలై యున్నవారి సోదరీమణుల కొనర్చి శాశ్వతమైన పుణ్యమును గట్టుకొనక తప్పదు. కడుపునిండిన యన్నములేక వారు గతించినను నొడలు నిండిన గుడ్డతోనైన దారీవలికిఁ దీసికొనిరాఁబడుట కవకాశము కలుగునట్లు చేయవలయును. సాక్షీ! ఈలేఖను మీరు జంఘాలశాస్త్రిచే సభలోఁ జదివింతురని పంపితిని. నేనీలేఖ యాంధ్రప త్రికకుఁ బంపినయెడల ననామకుఁడనని నాలేఖను వారు ప్రకటింపరేమో యనుభయముచే మీద్వారమునఁ బంపినయెడల ప్రకటింతురను నాసచే మీయొద్దకుఁ బంపితిని.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

47. పిత్రృదేవతాగౌరవము

''పిత్రృదేవతల్ని గౌరవించడం''–అనే విషయంలో దేశదేశాలలో విశ్వాసాలు, ఆచారాలు ఎలా వుండేవో ఒక సాక్షిసంఘాభిమాని వ్రాసిన ఉత్తరాన్ని జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నాడు.

మనదేశంలో వుండే పిత్రృదేవతారాధన అందరికీ తెలిసిందే. ఇలాగ అన్ని దేశాల్లో, అన్ని మతాల్లో ఈ గౌరవం, ఆరాధన ఏదో ఒక రూపంలో వుంది. పిత్రృదేవతలు బ్రతికివున్న తమ వంశస్థుల క్షేమానికి సంతోషిస్తారనీ, కష్టం వస్తే దుఃఖిస్తారనీ, అన్ని దేశాల్లో సర్వసాధారణమైన నమ్మకం.

గ్రీకులలో, యూదులలో, జపానులో, రోమ్‌లో ఈ విశ్వాసాల తీరు ఎలా వుండేదో విపులంగా ఆ ఉత్తరంలో వుంది.

పూర్వపు జాతుల్లో ఒక విచిత్రమైన ఆచారం ఏమంటే, తల్లి వల్లనే పిల్లలు పుడతారని, తండ్రి వల్ల కాదని–ఆస్ట్రేలియాలో ఇటువంటి జాతులవారుండేవారు. స్త్రీలు అడవుల్లో వేటకో, నదీ తీరాలలో చేపలు పట్టడానికో తిరిగేటప్పుడు చెట్లలో ఆత్మలు గాని, నదుల్లో ఆత్మలుగాని వారి గర్భంలో ప్రవేశించి పుడతాయని వారి నమ్మకం.

ఏది ఏమైనా, చనిపోయిన మనిషి ఆత్మకు మరణానంతర జీవితం వుంటుందనే నమ్మకం ఈ పిత్రృదేవతారాధనకి ముఖ్యమైన ఆధారం.

నాస్తిక మతాన్ని బోధించాడని కొందరు చెప్పే బుద్ధాచార్యులవారు కూడా గతించినవారి జ్ఞాపకార్థం ఉత్సవాలను చేసుకోమని బోధించారట.

పిత్రృదేవతారాధన, వారిపట్ల ప్రస్తుతం జీవించి వున్నవారికి గల గౌరవానికి గుర్తు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! సాక్షికి లేఖ వచ్చినది. దీనిని జదివెదను.

సాక్షికి–అయ్యా! నమస్కారములు. మీజంఘాలశాస్త్రి యెన్నెన్నో విషయములపై నుపన్యాసము లిచ్చుచున్నాఁడు. చెప్పినది చెప్పకుండఁ జెప్పుచున్నాఁడు. చాల సంతోషమై

నది. మానవజాతికున్న పితృదేవతాగౌరవమునుగూర్చి యిదివఱకుఁ జెప్పియుండలేదు. ఈవిషయముపై నేను గొన్ని యంశముల నీలేఖలో వ్రాసి మీకుఁ బంపితిని. దీనిని మీసంఘమునఁ జదివింప వేఁడుచున్నాను.

ప్రపంచముననున్న మానవజాతి యందంతటఁగూడఁ బితృదేవతా గౌరవము వ్యాపించియున్నది. సర్వజాతులవారియందు సర్వమతముల యందుఁ గూడ నిది ప్రధానవిషయమై యున్నది. ఇతర దేశస్థులలో నీమర్యాద యెటులున్నదో కనుగొందము. మనదేశమునం దెట్లున్నదో మనకందఱకుఁ దెలియనే తెలియును. పితృదేవతలు బ్రదికియున్న తమవారి క్షేమమునకు సంతసింతురనియుఁ, గష్టమునకు దుఃఖింతురనియు వారు సంపద్వంతులై యుండి తమనోటికిఁ జిరకాలము నీరిచ్చుచుండవలయునని నదా కోరుకొనుచుందురనియు సర్వజాతులవారి యభిప్రాయమై యున్నది.

పితృదేవతలు బ్రదికియున్న తమవంశస్థుల సంపదలకు సంతసింతురనియు నాపదల కార్తిఁ జెందెదరనియు నిశ్చయించుకొనకపోవుట మనుజధర్మము కాదని ఎరిస్టాటల్ అను నతఁడు తన ఎథిక్స్ అను గ్రంథమునందు వ్రాసినాఁడు. ఇదికాక తమవంశజులు భూమిలో నున్నంత కాలమే తమ కుత్తమగతు లుండుననియు వారు నిర్వంశమగువెంటనే తము కధోగతి సిద్ధించుననియు వారెంచి తమవంశాభివృద్ధి కెల్లప్పుడు కోరుకొనుచుందురను నభిప్రాయము కూడ దాదాపుగనున్న జాతులలోఁగూడ నున్నదనుట కెంతమాత్రమును సందియము లేదు. పూర్వకాలపు యూదులలో నిట్టి యభిప్రాయము లేదని కొందఱనుచున్నారు. కాని యది యంతసత్యమని వంచింప వీలులేదు. వారిలోనైన గతించిన పూర్వుల జ్ఞాపకార్థముగ ప్రాఁతఁబడిన చెట్లు కట్టఁబడిన స్తంభములు నున్నతప్రదేశములందు నిర్మింపఁబడిన సమాధి గృహము లున్నవికాని లేకపోలేదు. ఓల్డు టెస్టుమెంటునాఁటికే వారిలోఁ బితృదేవతాపూజ నశించినట్లు కనఁబడుచున్నదని కొందరందురు కాని, యది నశించినట్లు సిద్ధాంతీకరింపఁగల దృష్టాంతములు విశేషముగఁ గానఁబడవని మరికొందఱ యభిప్రాయము. అదిగాక యట్టి యూహము మనుజుని హృదయమునుండి వెడలిపోవుటకుఁ బ్రకృతియే యంగీకరింపదు. ప్రతిజీవములో (సెల్ఫ్ ప్రిజర్వేషను) నాత్మసంరక్షణాభిసంధికంటె ప్రప్రధానమైన కోరిక యేదియులేదు. ప్రకృతి నిర్మాణములోనే యట్టి యేర్పాటున్నది. దానినిఁ దొలఁగించుట కిప్పు డీశ్వరునితరమైనఁ గాదు. అదిలేనిదే బ్రతుకేలేదు. సృష్టిస్థితి దాని మీఁదనే యాధారపడి యున్నది. అది మనుజుని కున్నంతకాలము పితృదేవతలందు భక్తిపోవుట కవకాశమే లేదు. తాను జచ్చినతరువాతనైనను దన్నుఁ దనవారు గౌరవించి పూజించుచుండవలయు ననువాంఛ తన కున్నప్పుడు తన పితృదేవతలందుఁ దన కటిటమనోవైఖరి యేల యుండదు. అట్లు లుండకపోవుట సృష్టియుండకపోవుట కాని మరియొకటి కాదు.

మనుజులు మరణించినతరువాత వారు బ్రతికియుండునప్పు డేయే సుఖము లనుభవించిరో యాసుఖములన్నియు ననుభవింపవలయునను మహావాంఛ గలిగియుందురను విశ్వాసము జనులలోఁ బూర్తిగ నున్నది. శ్రాద్ధాదులన్నియు నందుకొఱకే వస్త్రదాన స్వర్ణదాన పుస్తకదాన భూదానాదులన్నియు నందుకొఱకే–ఇదికాక కొన్ని జాతులలోఁ బూర్వముండిన సహగమనమునకుఁ గారణ మిదియే–కౌమారమందేమి యౌవనమందేమి వార్ధకమందేమి భార్యకంటె నధికసుఖసంధానచరణమైన వస్తువు వేరొక్కటి పురుషునకు

లేదు. పరలోగగతుడైనవాఁ డాకారణమున భార్యాహచర్యవాంఛాప్రబలుఁడై యుండును. కావున సహగమనాచారము పుట్టియుండవచ్చునని తోఁచుటలో దప్పు కనఁబడకుండ నున్నది. ఒక్క మనలోనే యిట్టియభిప్రాయమా? మరియెవ్వరిలోనైన నున్నదా? సిధియనులలో రాజు మరణించినప్పు డతనిని మట్టిలోఁ గలుపు సమయమందున నాతఁ డుంచుకొన్న దాసిని నాతనికి దాహమిచ్చువారిని, వంటవానిని, నాతఁ డెక్కుగుఱ్ఱమును, నాతనికవులను, గాయకులను, ప్రధానుని గొంతుపిసికి చంపునాచార మున్నదని ''హిరాడటన్'' అను చరిత్రకారుఁడు చెప్పినట్లు మఱియొకరు చెప్పుచున్నారు. ఇట్టియాచారము పితృదేవపూజతో సంబంధించిన దనుట కేమైన సందేహమా? అనేకదేశములలో నివి కాకపోయినను నిట్టివి పితృదేవపూజాసంబంధములైన వున్నవని యంద ఱంగీకరించిన మాటయేకాని వివాదాస్పదమనమాట కాదు. అదికాక రాచపీనుగ తోడులేకుండఁ బోదన్నసామెత మనలో నూరకేకలిగియున్నదా? మనలోగూడ నాతఁడు కన్నెచెఱబాపినదాసిని, కార్యదర్శిని గవిని కట్టఁగట్టి కాటిమీఁద పెట్టి కాల్చునట్టి యాచారమున్నది కాని లేకపోలేదు. ఇట్టి కఠినాచారములు కారణాంతరబాహుళ్యముచేఁ గొంతవఱకు గర్కశతలోఁ దగ్గినను నిప్పటి కాయాచారములన్ని దేశములందు నున్నవి కాని లేకపోలేదు. పితృదేవతలు తమ్మనిశము కనిపెట్టియుందురనియుఁ దమనీడవలెఁగూడ దిరుగుచునేయుందురనియుఁ గష్టములనుండి తమ్ములఁ దొలగించుచుందురనియుఁ దమయింట్లను దొంగలనుండి కాపాడుచుందురనియుఁ దమపండలను జంతువులనుండి రక్షించుచుందురనియుఁ దమశత్రువులతోఁ దాము పోరాటున ప్పుడు తమభుజములకు బాటవము తమఖడ్గములకు వాఁడియు నిచ్చుచుందురనియుఁ జీనాదేశములోవారి కిప్పటివఱకుఁ బరిపూర్ణవిశ్వాస మున్నది. ఘనకార్యములకు గౌరవ మెవ్వరికి గల్గునో తెలియునా? ఆకార్యము లొనర్చిన మనుజునికిఁ గాదు, ఆతని పితృదేవతలకు-చూచితిరా? పితృదేవపూజ వీరిలో నెంతగాఢముగానున్నదో-(రస్సో జపానీసు) రష్యా జపానుదేశములకు యుద్ధము సిద్ధించినప్పుడు పితృదేవతలు తమ్ముఁ గాపాడుచుండిరను పూర్ణవిశ్వాసమే కొండవంకాయయంత జపానును గుమ్మడికాయయంత రషియాతోఁ బోరాడించినది. చచ్చిపోయినవారి పేళ్లను రాగిరేకులమీఁదనో కర్రపలకలమీఁదనో చెక్కించి వారియాత్మలను వారిలోని కాకర్షించి యారక్షకరేఖలను చీనావారు భద్రముగ దానుకొని వారివారి మృతతిథులందు వానినితీసి పూజించుకొందురు కానుప్యూసి యను అంతటివా డట్లాచరించినప్పు డితరుల లెక్కయేమి? మనకు వ్యానునికంటె చీనావారికి కానుప్యూసి యను యెక్కువవాఁడు.

ఇక రోము గ్రీకుదేశములం దిందునుగూర్చి యభిప్రాయమెట్లుండునో చూతము. చిరకాలనాగరకతగల రాజ్యములందుఁ బరిశీలన మొనర్చిన నెందునుగూర్చియైన తత్త్వనిర్ణయమగును గాని నిన్నఁగాక మొన్నఁ గన్నఁ దెఱచినజాతులయందుఁ బరీక్షించిన వినియోగమేమి? ప్రాఁతనాణెములు పాడైనకోటలలో దొరకునుగాని క్రొత్తకోటలలో దొరకునవి కోడియాకెలేకదా? రోమురాజ్యములోఁ గూడఁ బైనిచెప్పిన యాచార మొకవిధముగా నున్నది. మరణించిన వీరుల విగ్రహములను మైనముతోఁజేసి వానిని భవనములలో దాచికొందురు. ఆ రాజ్యమున నెవ్వఁడైన నధికుఁడు మరణించినయెడల సమాధిస్థలమున కాతని కళేబరముఁ దీసికొనిపోవునప్పు డీవిగ్రహముల నాకళేబరమునకు ముం దూరేగించు వాడుక కలదు. గతించిన మహావీరులయాత్మ లావిగ్రహములలో నున్నవని సామాన్యులు నమ్మెడి

వారు. ఇదిగాక ప్రతి గృహమందలి జనులుకూడ వారివారి పితృదేవతలవిగ్రహములు చిన్నవి మైనమున నిర్మించి వానికిఁ గుక్కతోలుతోఁ జేసినదుస్తులఁ దొడిగి వాని నింటిలో భద్రముగా నుంచుకొందురు. ఉత్సవదినములు సిద్ధించినపు డావిగ్రహములుకుఁ బూలదండలు వైచి సింగారించి వానికిఁ దాము తినఁబోవు నాహారాదులను నివేదించి భుజియించుచుందురు. అట్లు చేయకున్నఁ బితృదేవత లధోలోక మొందుదురని వారి దృఢవిశ్వాసము. వారిలోఁ గూడ మనలోవలెనే దత్తపుత్రునిఁ దెచ్చుకొనువాడుక గలదు. శ్రాద్ధ మాచరించుటకును, దానికిఁ బ్రతిఫలముగా మృతుని యాస్తిననుభవించుటకును దత్తపుత్రస్వీకార మేర్పాటైనది ప్రధానమైనది శ్రాద్ధకర్మము కాని ధనానుభవము కాదు. శ్రాద్ధకర్మ మొనర్పని వానికిఁ గాని విధ్యుక్తముగఁ జేయనివానికిఁగాని మృతునిసంపద ననుభవించుట కధికారములేదు.

ఇదికాక కొన్ని పిశాచము లున్నవని మనవారునమ్మినట్లే రోము రాజ్యమునందలివారు నమ్మెడివారు. బాలెంతచావు చచ్చినస్త్రీలు, దుష్కర్మములొనర్చిన పురుషులు, విధ్యుక్తశ్రాద్ధములు లేనిమృతులు మొదలగువారు యోగ్యులగు పితృదేవతలలోఁ జేరక పిశాచగణములో జేరుదురను విశ్వాసము వారిలోఁగూడ నున్నది. వారిలో నట్టిపిశాచముల దఱిమివేయుపద్ధతి వారికవి యొకఁడు చెప్పినాఁడు. గృహస్వామి రాత్రి రెండుయామములకు లేచి కాలుసేతులు గడుగుకొని పాదరక్షలు ధరియింపకుండ నుపదేశముద్రను వహించి పొమ్మని యర్థమిచ్చు సంజ్ఞలను జేతితోఁ జేయుచు నిల్లంతయు నటునిటు తిరుగుచుఁ దొమ్మిది చిక్కుడుగింజలను నోటిలో నుంచుకొని ''వీనితో నేను నా వారు నీనుండి విముక్తియగుచున్నా'' మని కేకలువైచుచుఁ దొమ్మిది గింజలను గింజ నొక్కొక్క పర్యాయము తొమ్మిదిసారులు ధూకరించును. అంతటితో నాపిశాచము లాచిక్కుడుగింజలలోఁ బ్రవేశించి యడఁగిపోవును. ప్రపంచమందంతను గూడఁ బిశాచోచ్చాటనపద్ధతి యున్నది కాని లేకుండఁబోలేదు. ఆపిశాచముల కేదో యిష్టమైన యాహారమిచ్చి తరిమివేయుదురు కాని శుష్కోదరములతో నుండఁగా వానిని దరిమివేయరు. అట్లెల్లచోటులను జరుగుచునే యున్నది. సెయింట్సు (మహనీయులను) బూజించుట క్రైస్తవులలోఁ గూడ యున్నది. క్రైస్తవుఁడు కాని యొక గొప్పజమీందారుఁ డొకప్పుడు క్రీస్తుమతబోధమును విని క్రైస్తవమతమును దీసికొన నిశ్చయించుకొనెను. క్రైస్తవమత స్వీకారారంభకర్మమగు పరిశుద్ధస్నాన మాతఁడు గ్రహించుటకుఁ బవిత్రమైన తొట్టెయొద్దకుఁ జేరిన గురువులతో ''అయ్యా! నేను క్రీస్తుమతమును స్వీకరించుటకు సిద్ధముగా నున్నాను. మీమతము ననుసరించి నేను జేయఁదగిన విధులన్నియు యథాప్రకారముగాఁ జేసి నేను మరణించిన జూడఁగలనా?'' యని యనెను. చూడలేవని వారు ప్రత్యుత్తర మిచ్చిన మీఁదట మీమోక్షము నాకక్కరలేదని యాతఁ డావలికిఁ బోయెను. చూచితిరా! ఈవిచిత్రమైన యంశము మతముదాఁటి మరియొక్క మతములోనికి బోవుచున్నను గతించిన తండ్రితాతలను గలిసికొనుటకే మనుజుని కోరికగాని మఱియొకటి కాదు. అన్యమతస్వీకరణమందు లెక్కయేమి? పితృదేవతలలో దండ్రులను జేర్చుకొనని పూర్వ జాతులయందుఁ గూడ నొకవిధముగాఁ బితృదేవపూజ లున్నవి. వారు తల్లివలనఁ దాము పుటినట్లే నమ్ముదురు. కాని తండ్రివలనం బుట్టినట్లు నమ్మనే నమ్మరు. ఆస్ట్రేలియా దేశపుఁ బూర్వపువా రట్టిజాతులలో నొకరు. స్త్రీ యడవులలో వేఁటకై కాని నదులయొద్దఁ జేపలుపట్టుకుఁ గాని పోవునప్పుడు చెట్లలోని యాత్మలుకాని నదులు నధివసించిన యాత్మలు కాని యాఁడువారి గర్భములందుఁ బ్రవేశించి వారినుండి పుట్టుదురని నమ్మకము. అట్లు

ప్రవేశించినట్లు నిదర్శన మేదనగా స్త్రీలు చెట్లదగ్గఱనుండి పోవుచుండగాఁ జెట్టులోనున్న భూత్మ యామెగర్భమునఁ బ్రవేశించినయెడల నొక చిన్నకట్టముక్క చెట్టుపైనుండి పడును. ఇదియే నిదర్శనము ఆకట్టముక్కను దెచ్చి యది యొక్కచోట యాజాతిలోని పెద్దలు గూతురు. ఆకర్రలోనున్న యాత్మయే యామె బిడ్డకు పిత్పదేవత. ఆకట్టముక్కల నిట్లాజాతివారు భద్రపఱచి వాని కెన్నెన్ని యుత్సవములైనఁ జేయుదురు. ఆకట్టర్రముక్కలకుఁ బసురురాచి యభ్యంగనము చేయించి, బట్టలుకట్టించి, ముద్దాడి ప్రార్థనలు నల్పుదురు.

నాస్తికముత్తమును బోధించెనని కొందఱచేఁ జెప్పఁబడిన బుద్ధాచార్యులవారు కూడ గతించినవారి జ్ఞాపకార్థ ముత్సవము లొనర్చుకొనుఁడని బోధించిరి.

సాక్షీ! నే నప్పుడప్పుడు గ్రంథమువలనఁ దెలిసికొనినదియుఁ బెద్దలవలన వినినదియు మీకు వ్రాసితిని. ఇందునుగూర్చి మీయభిప్రాయ మేమో జంఘాలశాస్త్రిచేఁ జెప్పింపవలయు నని ప్రార్థించుచున్నాను.

చిత్తగింపవలయును.

విధేయుఁడు,
సాక్షిసంఘాభిమాని

నాయనలారా! ఈలేఖనువింటిరా? అవకాశము వెంబడిని దీనికిఁ బ్రత్యుత్తర మీయువచ్చును.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

48. మహారాజ బిరుదము

సాక్షి సంఘానికి ఒకరొక లేఖ వ్రాశారు. తమవూరి రాజుగారికి మహారాజు బిరుదం వచ్చిన సందర్భంగా తమ వూళ్లో జరిగిన గొప్ప ఊరేగింపు ఉత్సవం గురించిన వర్ణన అది. దానిని జంఘాలశాస్త్రి విని వేశాడు.

గ్రామంలో ప్రజలంతా, పరిశుభ్రమైన బట్టలుధరించి మహారాజు కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆఆస్థాన ప్రభువుల ఇలవేల్పైన శ్రీమాధవస్వామి రుక్మిణీసహేతుడై, సత్యభామా ద్వితీయుడై గరుడ వాహనం ఎక్కి మంగళ వాద్యలతో, నృత్తగానాలతో ద్రావిడవేదనాదాలతో కోట ముందుకు వేంచేశాడు. కోటదగ్గర నుంచే ఈ ఉత్సవం ప్రారంభమైంది.

ఏనుగులమీద ధంకాసొబత్తులు, వాటి వెనక అరేబియా గుర్రాలు, బయలు దేరాయి. ఇక్కడ కంటిమాపు ద్వారా వ్యక్తమయ్యే భావ వైవిధ్యం గురించి ఆలేఖ వ్రాసిన వ్యక్తి వ్యాఖ్యానించాడు.

ఈ గుర్రాలవెనక బాణాకర్రలవారు, ఒంటరులు మొదలైన ఆస్థానవీరులు విన్యాసాలు చేస్తూ నడుస్తున్నారు. వారి వెనక–ఆస్థాన వందిమాగధులు –ఆ మాగధవర్గం వెనక రకరకాల జండాలతో పాటలుపాడే బాలబాలికలు–వీరి వెనక పెద్ద పెద్ద ఆబోతులు–వాటి పక్కన ఉత్సాహంగా పాటలుపాడే గొల్లలు–ఆవెనక భజనకీర్తనమేళాలు–ఆ మీదట వేశ్యల మేళాలు,–ఆపైన వైష్ణవ పండితులు, అద్వైతుల వేదపఠనం.

సాయంకాలంవేళ దీపపంక్తులమధ్య ముంగిళ్లలో ఆడవాళ్లు మంగళహారతు లిస్తున్నారు. పెద్ద బజారు చౌకు దగ్గర స్త్రీలు శ్రీ మాధవస్వామికి నీరాజనాలిస్తూ, మహారాజునుద్దేశించి మంగళహారతులు పాడారు. ఈ కథనంలో మధ్యమధ్య ఈ లేఖ వ్రాసినవ్యక్తి సందర్భానుగుణంగా మానవమనస్తత్వ వైవిధ్యం గురించి వ్యాఖ్యలు చేశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! సాక్షి కీలేఖ వచ్చినది. దీనిని జదివెదను.

సాక్షిగారికి–నమస్కారములు. మాయూరి రాజుగారికి మహారాజ బిరుదము వచ్చి నది. ఆశుభవార్త మాకుఁ గ్రిందటి శనివారము సాయంకాలమునఁ దంత్రీవార్తామూలమునను భానువారము మధ్యాహ్నమున వార్తాపత్రికలమూలమునను దెలియ, బహుసంతోషతరంగిత స్వాంతులమైతిమి. సర్కారువారు ముమ్మాటికి మిగుల మంచిపనిచేసి నారనునట్లు కోటబు రుజుమీఁది ఫిరంగి ముమ్మాటు మ్రోఁగినది. ఫిరంగిమాట సత్యమేయని బురుజుమీఁది తెల్లపట్టుజెండా శిరఃకంపన మొనర్చినట్లు కనఁబడినది. రాజోద్యోగులు గ్రామములోని ప్రజలెల్లరు కోటముందు పరిశుభ్రవస్త్రధారులైచేరి "మహారాజదంపతులకు వారినంతతికి సకలాయురారోగ్యైశ్వర్యాదులు సిద్ధించుఁగాక" యని యుచ్చైస్స్వరముల నభినందించిరి. మాయాస్థానప్రభువుల యిలువేల్పగ శ్రీమాధవస్వామి రుక్మణీసత్యభామాదేవులతో గరుడ వాహనారూఢుఁడై నమస్త మంగళవాద్యారవసమన్వితుఁడుతుడై నృత్తగానాది వైభవములతో ద్రావిడ వేదనినాదకలాపముతోఁ గోటముందునకు వేంచేసిరి. ఇక్కడనుండియే యుత్సవ మారంభమైనది.

ఏనుఁగులపై నమర్పబడిన ఢంకానౌబత్తుల బజాయింపులు నలుదిక్కులఁ దీఁగప్రాఁకి పుష్పించి పరిమళించుచున్నవి ఏనుఁగులు మందయానమున నొయ్యారముగఁ బోవుచు హుష్టే హుష్టే యని యఱచుచున్నవి. వానికీవైపున నావైపున నతిజాగరూకతతో భటులు తట్టలతో మిఠాయి నందించుచున్నారు. మిఠాయియుండలు మిగుల రుచిమంతములుగా నున్నవని కాఁబోలు. రుచిగ్రహణపారీణములగునవి శిరఃకంపన మొనర్చుచున్నవి. ఏనుఁగ కెంతసేపు తిండి. పామున కెఁతసేపునిద్ర పిచ్చుక కెంతసేపు కలయిక శశమున కెంతసేపు భయము. ఏనుగులపై నెక్కివారు దగ్గఱదగ్గఱగఁ గట్టఁబడిన మామిడాకుల తోరణముల క్రిందనుండి వంగి దూఱి పోవుచుండఁ దుండములెత్తి కరులు తోరణముల స్పృశించుచు న్నవి. వాని వెనకు నరేబియాగుఱ్ఱములు–ఆస్ట్రేలియాకంఖాణములు, రంగూను టంగనాలు సర్వశుభలక్షణసమన్వితము లైనవి; జుల్మతీనికాసుదారులచేఁ జిత్రవిచిత్రాటికనములతో నడపింపఁ బడుచున్నవి. ఏనుఁగుల హుష్టేలకు గుఱ్ఱము లిహిహిహీయని సకిలించి పరిహసిం చుచున్నవి. 'రూపసౌందర్యములోఁ, జాకచక్యములో, వర్ణ వైచిత్ర్యములో వేగాధికతలో యుద్ధనైపుణిలో మేమె యగ్రగణ్యులమై యుండఁ దాము మాకంటె ముందు నిలిచి హుష్టేయని స్తుతించుచున్నవి. వీనికి బుద్ధియొకటి యున్నదా? రసగ్రహణశక్తి యున్నదా? మెచ్చిన మేమే మెచ్చవలయును గాని వీని కేమియధికారమున్న' దని గుఱ్ఱము లిహిహీయని యధిక్షేపించుచున్నవికాఁబోలు. సురంగులపై' నొకరాలపైఁ బంచకల్యాణులపై షఫ్గాపై నీఁగయైన వ్రాలనీకుండ దుమ్మైనఁ బడనీకుండ వింజామరములు వేఁబూని భటులు విసరుచుండ 'మనుష్యుఁడు మనసేవకై భగవంతునిచే సృష్టింపఁబడినాఁ' డను గర్వముచేఁ దమసేవకులను వాలుగంటఁ జూచుచుఁ దల నెగురనైచుచు విఱ్ఱవీఁగుచు నొయ్యారముగ నడచుచు నడుమనడుమఁ బక్కనున్న యూఁడుగుఱ్ఱములను సవిలాసముగా సాదరముగా సాపేక్షముగా సానునయముగా సరసముగా వీక్షించుచున్నవి. గుఱ్ఱములు మనవలె మాట లాడలేవను లోపము వాని కేమైననున్నదా? ఓ! కంటిచూపులో నున్నంతగ్రంథము నోటిమా టలో నున్నదా? పనికిమాలినమాటలోఁ బసయేమున్నది? ఎంత చమత్కారమైన మాటకైన రెండుమూఁడర్థము లుండునరికిఁ జావుత్రెంపులైపోవును! చూపున కట్టివెలితియున్నదా? చూపు సూటిగావెడలిక నొకయర్థము. అర్థచంద్రాకృతిగవెళ్లిన నొక యర్థము. పామువెలిక

లుగవెళ్లిన వేఱొకయర్థము. కప్పదాఁటులుగవెళ్లిన నింకొకయర్థము. తరంగఫక్కిగావెళ్లి
వేఱొకయర్థము. ప్రక్కబారుగఁ బోయిన మఱియొకయర్థము. మొదట నేటవాలుగ
గ్రిందికిఁ బోయి యటనుండి యెదురెక్కుగఁ బైకెక్కిన నొక్కయర్థము. ముందున
వెనుకకుఁ దటపటాయించుచుఁ బోయిన నింకొకయర్థము. అదిగాక మఱియొకచిత్రమ
చూపెంతపొడుగు వ్యాపించునో యంతపొడుగున కొక్కటే యర్థముకాదు. మొదటియం
ళములో నొకయర్థము. మూఁడవయంగుళములో రెండవయర్థము. అయిదవయంగు
ములో మూఁడవయర్థము. ఇట్లివి దీర్ఘమైనకొలఁది స్థలభేదములఁ బట్టి యర్థభేదము
గలిగియుండును. చూపులోనున్న గడుసుదనము మాటలో నున్నదా? మాట వట్టితెల్ల
–వట్టిబట్టబయలు–వట్టివెలితి–చూపట్టిదా? జ్ఞానేంద్రియము కన్నా నోరా
నోరుపోయిననైనఁ గంటితో సమస్తగ్రంథములు చక్కఁబెట్టవచ్చును. మనవా రిప్పుడ
బుద్ధిహీనులై నోరెక్కువ చేసికొనుచున్నారు. కన్ను తక్కువచేసికొనుచున్నారు. అందువ
ననే యెక్కడఁ జూచినను మనుష్యులలోఁ దఱుచుగ బ్రహ్మకాయలు, బోదురుకప్పల
కీచుపిట్టలు, తాషామరపాలు, పెటేపకాయము–నోటితొందరను డాబును ధాటిని వృద్ధిచే
కొనువాఁడే కాని కంటికిఱుకును గనునికను గ్రహణశక్తిని వృద్ధిచేసికొనువాఁడు కనఁబడఁడ
తులలో నెక్కువగానున్నట్లు కనఁబడుచున్నది. కాంతలలో సాధారణముగాఁ గంటికి నోట
లంకియే కనఁబడదు. వారిలోమట్టుకు నూటికినుబదుగుఱివఱి కెక్కడి కక్కడికే కప్పల
క్కెడ. ఎక్కడి కక్కడికే పీఁతల మొగము. ప్రపంచపరిజ్ఞానపరిపూర్ణులైన యోసాక్షిగారు
మీరు దృష్టిశాస్త్రమన్న బేరితోఁ గంటిమహత్తునుగూర్చి యొకగ్రంథము వ్రాయరాదా
జగత్తులోఁ గన్నున్నంతకాల మది శాశ్వతముగానుండునే.

జుల్మతీని బోవుచున్న గుఱ్ఱములవెనుక నొంటరులు మొదలగు నాస్థానవీరు
బాణాకఱ్ఱలు త్రిప్పుచు జిరుతలను బజాయించుచుఁ గత్తులను జుళిపించుచుఁ దుపాకుల
డామ్మనిపించుచు నౌళ్లను రోడ్లపై మోదుచు 'జయా! మహారాజాసర్కారునకు జయ
జయా! మహారాజ్ఞీ సర్కారునకు జయా! జయా! మహారాజసంతతికి జయా!' య
జయజయధ్వానములతోఁ దుపాకిదెబ్బల నౌళ్లవ్రేటుల ననచివేయుచుఁ బోవుచున్నా
వీరు పూర్వరాజేంద్రుల యోధులవంశములోనివారు. వీరితాతలు వారితండ్రులు మహ
రులు. ఆరక్తతేజోధాటి వీటిలోఁగూడ నున్నది. అయిననేమి? కఱ్ఱ చేత బట్టుట
వీలులేదు. కత్తి యంతకంటెఁ బట్టుటకు వీలులేదు. కఱ్ఱుబట్టినయెడల గేదె నింట
మలపుకొనవలయును. కత్తిపట్టినయెడలఁ బలుదోముపుల్ల గోసికోవలయును. అంతకం
వీరి యిప్పటిప్రయోజకత యేదియులేదు. పగలు చుట్టల దుకాణము రాత్రి పహరాకా
వీరి పూర్వపౌరుషము లెంతగా నశించిపోయినవి! సాము కుస్తీ మొదలగు మనపూర్వవి
లెంతగా ధ్వస్తములైనవి! ఏమిచేయఁగలము? కాలగతి! పోదలచిన వస్తువును భోకుండ నె
డాపఁగలడు? రాఁదలఁచిన వస్తువును రాకుండ నెవఁ డడ్డుకోఁగలఁడు? ఈయాప
వానివలన వచ్చినది. ఈసుఖము వానివలనఁ బోయినది. ఈసుఖము వానివలన వచ్చిన
ఈయాపత్తు వానివలనఁ బోయినది'' యను నీనాళ్లువాక్యములు పరిశీలనహీనుల నోటనుం
రాఁదగినవి. మంచియైననరే–చెడ్డయైననరే–ఇచ్చువాఁ డొక్కపరాత్పరుఁడు తక్క నెవ్వఁ
లేఁడు. మంచియని చెడ్డయని తెలివితక్కువ భేదము నీవు చేసుకొన్నదికాని యాలోకేశ్వర
ద్భష్టిచే నంతయు మంచిదే. మంచియేకాని యెడల నాతఁడు మన కెందుల కిచ్చును! నీవ

యేదో నీవు చేసికొనుము. సర్వయత్నఫలమును భగవంతునిపై నుంపుము. ఇకఁ నీకు బానినతన మెక్కడనో చూచెదను. నీబానినతనము పోఁగొట్టుకొనుశక్తి నీలో నున్నప్పుడు వారా వీరాయని దేవులాడెదవేల? ఎవ్వరిపైఁ గూడ నాన పెట్టుకొనకుము.

ఈవీరుల వెనుక నాస్థాన ఎందిమాగధజాతిలోనివారు నడచుచున్నారు. ఊరకే పోవుచున్నారా? లేదు. గొంతునరములు పొంగునట్లు పాడుచున్నారు. ప్రేగులు కదలునట్లు పాడుచున్నారు. ఆపాట లేవియో? ఆస్థానపూర్వరాజేంద్రుల పవిత్రములైన పద్యపదరూపక గాథలు. వారు భీష్మునివలె యుద్ధనిపుణులనియు ధర్మరాజువలె ధర్మనిష్ఠ పరులనియు శ్రీరామునివలె నేకపత్నీ వ్రతులనియు హరిశ్చంద్రునివలె నత్యదీక్షాధురంధరులనియుఁ జెవులు పవిత్రము లగునట్లు జిహ్వాదోషము లడఁగునట్లు గాలి పరిశుద్ధమగునట్లు పాడుచున్నారు. పూర్వరాజేంద్రు లెటకుఁ బోయినను నీమాగధులు వారితోఁగూడఁ నుండి హెచ్చరికలు చెప్పుచుండెడివారు. ఇది మిక్కిలి యుపయోగకరమైన పూర్వాచారము. దీని నాదరింపఁదగినది కాని విడువవలసినదికాదు. పూర్వరాజన్యులు వీధులవెంట స్వారులు పోవుచుండునప్పుడు పయోధరోత్తుంగచంద్రశాలాసదనముగాని పయోధరోత్తుంగచంద్రము ఖివదనముగాని తమ కంటఁబడినప్పుడు మనుష్యధర్మముచే బుద్ధి తప్పుదారి త్రొక్కునేమో యని ''నీతండ్రి పరధనము లోష్ఠప్రాయముగ భావించినాఁడనియు, నీతాత పరకాంతను దల్లిగా భావించినాఁడనియు'' హెచ్చరికలు వినుచుండెడివారు. ఇప్పటివా రట్టి పవిత్రగాథల ననుక్షణమును వినకపోవుట వలన వీరిలోఁ గొందఱు వీధులవెంట స్వారులు చేయునప్పుడు –వేఱుపురలో నొక్క మహారాజమార్తాండుఁ డెవరో తక్కఁ బరకాంతలను జూచి కిచకిచలాడుచున్నారు. లొట్టలు వేయుచున్నారు గ్రుక్కిళ్లుమ్రింగుచున్నారు. గుబగుబలాడుచున్నారు. గమగమలాడుచున్నారు. చిటపటలాడుచున్నారు. కన్నుమూసితెఱచులోపలఁ బండ్లగిలించుచున్నారు. వీరిబుద్ధి తప్పుదారిఁ బట్టి దొరలిపోవునప్పుడు గట్టిబిగింపు దిట్టమైన 'లగా' మేదియు లేకపోవుటవలన ముప్పు విశేషముగా నున్నది. పురాణములలోని పూర్వరాజేంద్రుల నీతిపుంజములైన యెన్నియాఖ్యాయిక లైనను ''మీతండ్రిగా రట్లు ప్రవర్తించినారు. మీతాతగారిట్లు ప్రవర్తించినా'' రను హెచ్చరికలతో సాటిరావు. కుటుంబగాథలకున్నశక్తి పురాణగాథలకు లేదు. మీతండ్రిగా రానూతినీరు ద్రాగినారనఁగ మీరుకూడ నానూఁతినీరె త్రాగవలయును. మీతాతగారికిఁ గాకరకాయ యిష్టమైనయెడల దానిచేదు మీరు భరింపలేకపోయినను దాని యందు గౌరవము మాత్రము మీకుఁ దప్పదు. తాతగారినిబట్టి తప్పదు.

ఆమాగధవర్గము వెనుకఁ బలువిధములగు రంగులజెండాలను జేతులఁ బట్టుకొని బాలురు బాలికలు గలసి మహోత్సాహమున మహామధురస్వనములఁ బాడుచున్నారు.

బిలహరి–రూపకము

మహారాజ నూరేండ్లు మమ్మఁ బాలించి సంపదలతోఁ
దులదూఁగుమీ॥మ॥

పరసతులఁ దల్లులుగఁ జూచుచుఁ బరుల కుపకారములఁ జేయుచుఁ
పరమభక్తిని దేవుఁ గొల్చుచుఁ బరమసుగుణా భరణుఁడగు శ్రీ ॥మహా॥

బాలవాక్యము బ్రహ్మవాక్యముగాదా! ఈపాట విని మదగజములు హుఙ్కారధ్వనులు చేయుచున్నవి. ఆ ధ్వనులు విని మావారు మదగజములు వచ్చుచున్నవని తెలిసికొనిరి. ఆ మదగజములు మావారి కెదురుగా వచ్చి వారిని చుట్టుకొని తొండములతో వారిని పైకెత్తి తమ మస్తకములపై నుంచుకొని ఘీంకారములు చేయుచు వారిని ముందుకు గొనిపోవుచున్నవి. ఆ మదగజములు మావారిని

నఱచుచున్నవి. శతమృదంగరంగద్రవములతో గుఱ్ఱములు నకిలించుచున్నవి.

సెబాస్! కుక్కచెవి జెటకాయించిన శకునము, గాడిదకూసిన శకునము, గుఱ్ఱమునకి లించిన శకునము వహ్వా! యుత్సవము ముందునకుఁ బోవుచున్నది. ఈబాలనమాజము వెనుక

సీ. పసపుమోమున రాచి పట్టినామముఁబెట్టి
పొట్టికొమ్ములఁ బూలు చుట్టఁ బెట్టి
గంటలపేరులు కంఠమందున నైచి
కులుకుసింగారముల్ కుస్తరించి
నట్టి యాఁబోతులచుట్టును నిలఁబడి
తబుకుతాళముల నాదములతోడ
డొల్లతోకులమీఁది గుల్లదెబ్బలతోడ
గొల్లలెల్లరుఁగూడి గొంతులెత్తి
రందు! మనరాజు శ్రీమహారాజునుండి!
కృపను మాధవుఁ డతని రక్షించుఁగాక
యంచుఁ బాడుచుఁ దెయితక్క లాడుకొనుచు
నొడలు తెలియని ముదముతో నుందు రహహ.

ఆహా! వారియుత్సాహ మింతింతని చెప్పరాదుగదా! ఐరావత మంతటి యాఁబోతులు కూడ నాహాహా! ప్రశంసాసూచకముగఁ దలలూఁపుచున్నవే? ప్రభునియెడల విశ్వాసమనునది పెద్దయుద్యోగులలోకంటె భటవృత్తిలో వారికే హెచ్చుగా నుండునుగాఁబోలు. తత్త్వములోఁ దెలివితక్కువయైనకొలది విశ్వాస మెక్కువకదా! అందులో వట్టి యమాయకులగు గొల్లలకు విశ్వాసమింతంతయా! చతుష్పాత్తులకుఁ గలవిశ్వాసము ద్విపాత్తులకు లేనేలేదు. నరులలోఁ బదవి యెక్కువయైనకొలఁది ప్రభునియందు భక్తి తక్కువయయిన ట్లగపడుచున్నది. పెద్దపదవిలో నున్నవానికిఁ దనప్రయోజకత్వమువలననే యాపదివి సిద్ధించినదని రవంత తెగనీలుగు మొట్టమొదట నుదయించును. అది క్రమముగాఁ గొన్ని రోజులలోపల గుబగుబ లాడి యాగుబగుబ పొగరురూపముగా నొడలంత వ్యాపించును. ఆరంభించిన తెగనీలు గిట్లు చిన్నరోగముక్రిందఁ బరిణమించి యది క్రమముగా ముదిరి ఘనీభవించి చర్మగతి దాటి రక్తగతి నొంది రక్తగతిఁదాటి మాంసగతి నొంది, మాసంగతి దాటి యస్థిగతినొంది యభివృద్ధి నొందును. అంతట నొక చిత్రమైన చెవుడు సంభవించును. అది బంధుమిత్రులమాట వినకపోవుటగా నారంభమై రాజుగారిమాటవినకపోవుటవఱకు వ్యాపించును. ఈచెవుడిట్లు దినదిన ప్రవర్ధమానమై తేజరిల్లుచుండగఁ గంటికి గాసంతపొర యారంభించును. చెవికిఁ గంటి కేమినంబంధమందురేమో? ఒక యింద్రియ మవిటిదైనప్పుడు బీరకాయపీఁచువంటి నరములనంబంధముచేత రెండవది కూడఁ జెడినఁ జెడవచ్చును. ప్రకృతివిరుద్ధమైన యంశ ముకాదు. ఈపొర యారంభమైనపిమ్మట దగ్గఱవాఁడేమో దూరముగాను దూరపువాఁడేమో దగ్గఱగాను నున్నట్లుగపడును. చిన్నవస్తువు పెద్దవస్తువులాగునఁ బెద్దవస్తువు చిన్నవస్తువు లాగునఁ గనఁబడుటకూడఁ గలదు. ఈపొర శ్రీఘ్రకాలములోనే నీటిమీద నైచిన నూనెచు క్కలాగున నట్టి యట్టి కన్నంతయు వ్యాపించును. అంతటినుండి ప్రభువుగారు కనఁబడనే

కనఁబడరు. కనబడకపోవుటచేత రాజుగారు లేనేలేరని స్వల్పమైనభ్రాంతి కాతఁడు లోనై యుండును. ఈప్రపంచమంతయు వట్టి భ్రాంతిమయమే కాదా! చెవికిఁ గంటికిఁ బుట్టిన పైరోగ మిప్పుడు క్రమముగా భ్రాంతిరూపముగా మనస్సులోనికి వ్యాపించినది. ఈభ్రాంతి మొట్టమొదట హెచ్చువాగుడుగ నారంభమగును. ఈవదరుఁబోతుఁదనము రవంత మతి చెదరుట లోనికి జారి యంత క్రమముగా ముదిరిముదిరి భయంకరమైన యున్మాదములోనికి దిగును. అంతటినుండి యందఱకును దిట్లు. ఓ! శరపరంపరలు! ఓ! యొక్కఁటే వడగండ్ల వాన. పాపము పిచ్చివాఁడు. ఆతని ననవలసినపని యేమున్నది? పెద్దపనులవలన వచ్చిన బద్ధకములు, ననారోగ్యములు, నుస్తీలు, చిన్నరోగములు, పెద్దరోగములివి. ఇట్టి వేవియు లేని యధమసేవకులలోనే విశ్వాసముమట్టున కధమత్వముతోఁ జేరిన గుణముకాని యాధిక్యముతోఁజేరిన గుణము మాత్రముకాదు. ఈగొల్లలకుఁ గొంతవెనుక భజనకీర్తనమేళము లున్నవి. పిడేలుసుతులలో రేకుఁదాళపుదెబ్బలతోఁ గీర్తనపరులు భగవంతునిఁ గీర్తించుచున్నారు. హాహాహా! ఏమిభక్తి పరవశులై పాడుచున్నారు?

కాంభోజి–ఆది

మాధవ! నీనామస్మరణ మొనర్చిన మనుజుల కే
లోపమును గలుగదుగా॥మా॥
శ్రీధర కేశవ రాధారమణ హరి బాధితసకలాఘ
బోధామృతరూప॥మా॥
మా మహారాజును మాన్యచరిత్రుని
మా మహారాజ్ఞిని మహితచరిత్రను
మా మహారాజకుమారుల సుతలను
మహిమాయువు లిచ్చి మరిమరి రక్షించు ॥మా॥
జయ రమారమణ గోవిందో హరిః

నరిగా, నరిగా, మరిసరిగా, మరిమరి నరిగా పాడినారనికాఁబోలు పిడేలు పలుకుచుఁ గులుకుచున్నది. కణకణలాడుచు మ్రోగుచున్న మృదంగము, మహిమను గూర్చియు నాయువును గూర్చియే భజకీర్తనపరులు పాడినారుకని ధనముమాట పొరపాటుపడినారు కాఁబోలు నని ధనమ్ ధనమ్ ధనమ్ అని జ్ఞప్తిచేయుచున్నది. సంవత్సరమునకుఁ బాతికలక్షల రూపాయలు వచ్చు ప్రభునిగూర్చిపలుకుచున్నప్పుడు ధనము మాటఁజెప్పవలయునఁట! ఇది బుద్ధిహీనతకాదా!'' యని గుట్టము లిహిహీ యని నకిలింతచే మృదంగమును బరిహసించుచున్నవి. ముందున్న యేనుఁగు లీయశ్వపరిహాసములను హుట్టేహుట్టే యని తిరుగ నామోదించుచున్నవి.

ఈభజనకీర్తనపరుల వెనుక వేశ్యలు వీలగునప్పు డొకహస్తమును బట్టుచు నొక్కగంతు వేయుచు నొక్కకన్ను త్రిప్పుచు (రెండవ కన్ను లేకపోవుటచేఁగాబోలు) కత్తికోఁతగాఁడనియో అత్తగా రింట లేదనియో యొక్కముక్కమాత్రమే పాడుచు వెంటనే యుత్సవముతో నడుచుచున్నారు. సరిగా వారి వెనుక ప్రక్కనే చేరియున్న యాస్థానోద్యోగులు గ్రామములోని యితరమహాజనులు కలసి తొందరలో ముందునకుఁ బోవునప్పుడు పొరపాటుచొప్పుననో కాక విధిలేకయో వేశ్యలకాళ్లు త్రొక్కుచున్నారు. కత్తికోఁతగాఁడు

కాఁడే కాలుత్రొక్కుఁడుగాఁడే యని వేశ్యలు తమలోఁ దాము నవ్వుకొనుచు భజనకీర్తనపరు లను ముందునకుఁ ద్రోయుచున్నారు. ఆనందడిలో నొక భజనకీర్తనపరుఁడు తన జుట్టులోని గులాబిపూ వున్నదో యూఁడినదో చూచుకొనఁబోయి ప్రమాదమున నొక వేశ్య నెత్తిపై నున్న నాగరమును తడుముచుండెను దొంగ దొంగ యని యావేశ్య కేకనైచెను. ఇన్నికోర్టు లుండి యిందరు న్యాయమూర్తు లుండి, యిందరు న్యాయవాదులుండి యింతకాలము విచారణము లుండినను దొంగ యెవఁడో దొరయెవఁడో తిన్నగఁ దేలకుండనున్నప్పు డాపెద్దనందడిలో దొంగను గనిపెట్టువాఁ డెవఁడు? భజనకీర్తనపరు లాత్రోపులతో గొల్లలపైఁ బడుచున్నారు. ఆగొల్ల లదరిపడి యూఁబోతులపైఁ బడుచున్నారు. అట్టితొందరపడకుఁ డట్టి తొందరపడుకుఁ డని యూఁబోతులు తలల నడ్డముగ నూఁపుచున్నవి. మనుష్యుల త్రొక్కుఁలాటలలోఁ ద్రోపులాటలలోఁ బశువులు మనుష్యులకు బుద్ధిచెప్పవలసివచ్చినది! కాలగతి! తెలివిమాలిన నరుఁడు! ఎంతసేపు గ్రుడ్డిత్రోపుగ ముందునకుఁ బోవుటకే దేవులా డును గాని యెందులకుఁ బోవలయునో! పోవలసియున్నను బోవచ్చునో లేదో యనుచింత లేశమాత్రమును జేయఁడు కదా! ముందున్నది మృత్యువేకాని వేరొక్కటి లేదనుజ్ఞాన మీతని కెంతమాత్రమును లేదేమి? వీని తెలివి తెల్లవారిపోను! ఎప్పుడైన వీనికి జ్ఞానము వచ్చునా? అత్యంతోత్సహమున నగ్గిలో నాహుతి యగు మిడుతకు నీతనికి భేదమేమైనఁ గనఁబడుచున్నదా? ఈగొడవ యెందులకుఁగాని–

వీరివెనుకనే యుద్ధాత్రములతో నొక్కఁప్రక్కను వైష్ణవులు మరియొక్కఁ ప్రక్కఁ నధ్వైతులు వేదములఁ బఠించుచున్నారు. ఆహాహా! ఏమి హృదయంగమముగ నున్నది! ఎంత యుదారాభిప్రాయబోధకముగ నున్నది! ఎంతదివ్యముగ నున్నది! ఉద్యోగులతోఁ గలసిన వేశ్యల పరమానహ్యపుఁబొత్తుననే ఈ మహాపవిత్రమధురగాధాగాననన్నివేళ మున్నదే! కంఠాభరణములోని వెట్టిదామశాస్త్రులు నరకమునకు న్వర్గమునకు బెత్తెడేకాదా యెడమని పలికినప్పు డది వట్టి తెలివితక్కువమాట యనుకొంటిమి. "వ్యక్తురాలను కాలేదు." అని వారకాంత పాటయేమి? అందుల కీమీసాలయుద్యోగుల యూహాహాలు పహవ్వా లేమి? సరిగా వారిప్రక్కనే "ఏకమేవాద్వితీయమ్ ఖల్విదం బ్రహ్మ" త్యాది మహావాక్యపఠన మేమి? బొగ్గుప్రక్కనే వజ్రమున్నది పామువినపు గోరుకుపైననే మణియున్నది. పాపము నంటియే పుణ్యమున్నది. వాని సామీప్య మెఱుఁగక యోగి భోగియగుచున్నాఁడు. భోగి యోగి యగుచున్నాఁడు. వహవ్వా! ఈవేదపాఠకుల వెనుకనే యెవ్వరున్నారు? వేదవేద్యుఁడు పురుషోత్తముఁడు వసుదేవనందనుఁడు రాధాకాంతుఁడు నగు శ్రీకృష్ణపరబ్రహ్మము గరుడ వాహనారూఢమై యున్నది. కన్నులు కృతార్థములగుచున్నవి. మనసులట్టియట్టి పెద్దవియై జగమంతయు వ్యాపింపఁబోవుచున్నవి. జన్మమున కింతకంటె సార్థకత యేమున్నది? ప్రపంచలంపటవలన మన నట్టియట్టి ముడుచుకొనిపోవునే! ఎంతసేపు దిక్కుమాలిన మనసు–తాను తనకుటుంబము–తనసుఖము–తనభాగ్యము–తనబ్రతుకునే చూచుకొనుచు నొక్క యంగుళములోనే గిఱగిఱ తిరుగుచు గుడుగుడు గుంచము లాడుచు దేవులాడుచుం డునే! గానుగయెద్దు కాశి కెన్నఁ డైనఁ బోఁగలదా! ఉదయమునుండి సాయంకాలమువఱకుఁ దిరుగుచునే యుండునే! కాశివఱ కెందులకు? గడప దాఁటఁగలిగినదా? ప్రాజ్ఞుఁ డనిపించు కొనుచున్న మనుజుఁ డంతకంటెఁ బ్రయోజకుఁడు కాఁడే? కన్నులు గానఁబడకపోవుటచే బుద్ధిలేకపోవుటచేత గానుగ యెద్దును గొంత క్షమింపవచ్చును గాని మొగముమీఁద రెండుక

న్నులున్న మనుజుఁడు మనసులో మూఁడుకాలములకు మూఁడుకన్నులున్న మనుజుఁడు –పశువుకంటెఁ బనికిమాలినవాఁడైన యప్పుడు వాని కేమిటమాపణ యున్నది? స్వచింత తక్క పరచింత యెవ్వనికో కాని లేనేలేదే! తన యావరణము దాఁటినప్పుడుకదా మనస్సునకు వ్యాప్తి? మనస్సునకు వ్యాప్తికలిగినప్పుడుకదా తనకుఁ బరునకుఁ దత్త్వమున భేదమేమైనను న్నదేమో కనిపట్టుక? గంట కొకసారి తప్పకుండఁ జిన్నముంటిని స్పృశించుచుఁ బిల్లముంటిని దనచుట్టు త్రిప్పుకొనుచు ముద్దిడుకొనుచుఁ బరిభ్రమించుచున్న గడియారపు బెద్దముల్లు మూతదాఁటి పైకి నెప్పుడుపోవునో యప్పుడే, భార్య నట్టియట్టి స్పృశించి బిడ్డ నట్టియట్టి ముద్దిడుకొని ''వానలప్ప'' తిరుగు పరచింతా శూన్యుఁడు స్వచింతా లోలుఁడు ముక్తినొందును. గంగానదిపైఁబడిన పులివిస్తరాకైన సముద్రమునఁ జేరుచున్నది. కాని గంగలో నున్న సుడిగుండములు భీష్ముఁడు పుట్టినప్పు డెక్కడనుండెనో యిప్పుడు కూడ నక్కడనే యున్నవి. పరచింతాశూన్యుఁడైన నరుని బ్రదుకునకుఁ బర్యవసానము శ్మశానముకంటె వేఱేది! భవతాప పరితప్తప్రాణిలోక తాపోపశమనార్థమై భగవద్గీతామృత మును బార్థవ్యాజమునఁ బ్రపంచమునకుఁ బ్రసాదించిన యో పరమపురుషా! పావనబృందావన గోపికాచ్ఛలమున భక్తియోగవైభవమును బోధించిన యోపురుషోత్తమా! సమస్తే సమస్తే నమస్తే. కాని మాధవా! రుక్మిణీభామాధవా! ఒక్క చిన్నమాట నడుగుచున్నాను. పార్థసారథి స్వరూపమున మదరాసులో వేంచేసిన నీవు మొన్నటి యాదివారమున తేనాంపేట మీఁదుగా సైదాపేట మీఁదుగా మీ యాస్థానగ్రామమైన మాంబళమునకు జమాబంది నిమిత్తమై వేంచేసితివఁట నిజమేనా! అంద ఱుద్యోగులుండ మీరే యంతశ్రమ మొందుట న్యాయమా! కోఁతిని బంపి వ్యవహారముయొక్క 'ఆను' కనిపెట్టినవాఁడవుకదా! ఈమాత్రమునకుఁ బీఠమేల కదలిచితివి! నాయనా! పాండవకౌరవసంధియని బయలుదేఱుతివా? భీష్మవధమని చక్రముపట్టుకొని బయలుదేఱుతివా? నాకు బోధపడినదిగాదు తండ్రీ! నీ వెందులకు బయలుదేఱుతివి? రవంత చెప్పవు? ఒకవేళ యిందుకొఱకైయుండునా? కోడిపందెములని సానిమేళములని యాస్థానవ్యవహారములను న్యాయముగఁ జూచుకొనక యన్నివిధములైన యాగడము లాచరించుచున్న కొందఱు జమీందారులకు సంవత్సరమున కొక్కదినమందైన మీయెస్టేటు గ్రామములు చూచుకొనుఁడని బోధించుట కిట్లు బయలుదేరియతివా? ఏమో? అందుకొఱకేమో! కాని యీయూహముకూడ సరికానట్లు కనఁబడుచున్నది. ఇందులో నొక్క ప్రత్యవాయ మున్నట్లున్నది సర్వజ్ఞుఁడవు నీకుఁ దెలియని దేమున్నది. Estate Land Act మూలమున జమీందారుల కన్నియధికారములుగూడ నంతరించినవని నీవెఱుఁగవా నాయనా! జమీందారుల కింక జమాబందియెందులకు? జమీందారులకు జమీందారీయే లేనప్పు డింకను జమాబందియేమిటి నాతండ్రీ! Estate Act ప్రకారము నిజమైన జమీందారుఁ డెవరు? రైతేకదా! ఇదివఱకు జమీందారుఁడని యనుకొనుచున్నవాఁ డిప్పు డెవరు? శిస్తుదారుఁడు మాత్రమే కాదా? జమీందారునకు భైనయేకాని జమీనేది? కృష్ణా యదునందనా! ఇచ్చటి ఘృతకోశన్యాయము చిత్తగించితివా? ఎస్టేటు గ్రామములలోనికి వెళ్లుమని మీరు బోధించుచున్నా రనుకొందము నరే! పెద్దవారు గనుక తాము చెప్పవలసినదే. కాని జమీందారులకు వారిగ్రామములలోఁ బలుకుబడియుండుట కవకాశమే లేనప్పుడు పనిలేనిదే పోయి పరాభవమొందుట యెందులకు? రమ్మనిన రైతు రాఁడయ్యెను. కరణము కబురునకే యందఁడయ్యెను. ఇఁక జమాబందిలోఁ జేయవలసిన దేమున్నదయ్యా? ఈ అక్కువలన

జమీందారులు పొందుచున్న యిబ్బందులున్నవే శాంతమ్ పాపమ్ శాంతమ్ పాపమ్ చెప్పనలవి కాదు కృష్ణా! నీకైనఁ దెలియవేమో యని నాసందేహము. ఇటులంటినని కోపపడకుము. కృష్ణా! నీవు లక్ష్మీవయస్కుఁడవు. నీ కితరులబాధ చవ్పున నాటునా? అదిగాక మరియొక్క పెద్దకారణమున్నది. దేవాదాయములు Estate Land Act అనలునుండి సర్కారువారి ధర్మమాయని మినహాయింపఁబడుటచే మీరిప్పు డీషన్ షోకులతో జమాబంది యనుచు సింగారించుకొని బయలుదేరితిరి కాని లేకున్నయెడల మాజమీందారులవంటిస్థితియే మీఁదియునై యుండునే? దేవకీనందనా! రాజాధిరాజా! నాదొక్క ప్రార్థనయున్నది. విందురా? ఈయాక్షను శీఘ్రముగా నవరణచేయించి ప్రభువుల గౌరవమును గాపాడవలయు నను నదుద్దేశమును శాసననభ్యుల హృదయములందు మీరు ప్రవేశించి కలిగింపవేఁడుచున్నాను. మీరు తలఁచుకొన్న యెడల నెంతపనియైనను నగును. జమీందారులేమి సామాన్యులా? ఎంత యాదాయము వచ్చుచున్నవారు? ఎంతెంత పరోపకారకృత్యము లొనర్చిన వారు? పూర్వపువారివంశములోనుండి నర్కారునకుఁ బూర్వపుపాదుషాలకు నెన్నెన్ని మెహనతులుచేసినవారు! ఈదినము వఱకు సర్కారు సెలవనఁగ లక్షలకొలఁది రూపాయలు ద్రిమ్మరించుచున్నారే. అట్టివారికి ఇప్పుడు క్రొత్తయధికారము లేవియు నీయనక్కఱలేదు. వారి పూర్వాధికారములిచ్చినఁ జాలు. ఆమాత్రమునకే కొండయెక్కినట్లు వారు సంతోషింతురు. స్వామీ! మాధవా! ఏమిసెలవు?

మామహారాజునకు జయ! మామహారాజ్ఞికి జయ! మామహారాజసంతతికి జయా! యను జయజయధ్వానములతో నుత్సవము ముందునకుఁ బోవుచున్నది. సాయంకాలమగుటచే దీపపంక్తులచే శోభిల్లుచున్న ముంగిళ్లలోని యంగనలు మంగళపుటారతుల పళ్లెరములు పేతఁబుచ్చుకొని మాధవస్వామిని సేవించుచున్నారు. ఏవో మంగళపుటారతులు పాడుచున్నారు. ఈసందడిలో నేదైన వినఁబడునా? ఈసమయమున బాణాసంచాగూడ కాల్చుచున్నారు. ఇఁక వినఁబడుటయేమి? కన్పుమని ఉన్నయధికారమేదో యూడినరువాతఁ జల్లగఁ జఱగవలసినదే కాని లేనిపోని కన్పుబున్పు లెందులకు? చిచ్చుబుడ్లగ్నేయవృక్షములు సీనుచున్నవి. అదిచూచి భయముచేఁ దుండము చుట్టిచుట్టి నోటఁ బెట్టుకొని యూపిరి నలువనీక ఆత్మహత్య చేసికొనుట కేనుఁగ ప్రయత్నించుచున్నది. మనకంటె శరీరమే యెక్కువకాదు. భయముకూడ నెక్కువేయని గుఱ్ఱము లిహిహీయని పరిహసించుచున్నవి. గుఱ్ఱములు మాత్రము భయపడుట లేదా? కాని యేనుఁగులు తమకంటె భయపడుచున్నవని వానిని బరిహసించుచున్నవి. ఎంతవిచిత్రముగా నున్నదో ఈపరిహాసమున కర్థ మేమైనను న్నదా? కాని ప్రపంచమిఖరి యదియే; దినమునకు నియమముగా రెండుచుట్టలు కాల్చువాఁడు వదునాల్గు చుట్టలు గాల్చువానిని నిత్యాగ్నిహోత్రియని యధిక్షేపించును. రెండైననేమి వదునాలుగైననేమి? పైవాని చుట్టలు పనికిమాలిన పొగాకుచుట్టలనియుఁ దనచుట్టలు తులసికట్టలనియుఁ దనయభిప్రాయము కాఁబోలు! నంసారపక్షముగా నొక యాటుకత్తెను జాగ్రత్తవఱచి నందడి చవ్పుడు లేకుండఁ బ్రచ్ఛన్నముగ భవతరణ మొనర్చుచున్న పవిత్రగాత్రుఁడు వేశ్యావీథివెంటఁ దిరుగు గిరజాల మీసాల జారుకచ్చరాయని మిండకాఁడని, ముండలముఠాదారని రౌడీయని స్కాంద్రెలని చెడమడఁ దిట్టును. తానుమాత్ర మెవఁడు? పెండ్లామయొక్క ప్రక్కనుండి పెడద్రొక్కిన తరువాత ఆదుముకు పొడుగైనయెడల నగౌరవము పొట్టిదైన యెడల గౌరవమని తన యభిప్రాయముకాఁబోలు పైవాడుంచుకొన్న

వారు గుడిసెవ్రేటులనియుఁ దానుంచుకొన్నది కీర్తికాంత యనియుఁ దనయభిప్రాయము కాఁబోలు. ఎంతమతిమాలినతనము! బ్రాంది త్రాగినవాఁడు రమ్ త్రాగినవానిని బరిహసించును. రమ్ త్రాగినవాఁడు తాటికల్లు త్రాగినవాని నధిక్షేపించును. తాటికల్లు త్రాగినవాఁడీతకల్లు త్రాగినవానిని బరిహసించును. ఇట్లే కీడులో మేలు చూచుకొని జనుఁడు తన్నుఁ బొగడుకొనుచుఁ బరులను బరిహసించును. ఇదియే మనుష్యప్రకృతి. ఈవాసియే పశువులలోఁగూడ నున్నది. అందువలననే చిచ్చుబుడ్లచే గుఱ్ఱములుగూడ బెదరినను దమకంటె నెక్కువ బెదిరిన యేనుగులఁ బరిహసించుచున్నవి. అదిగో గొట్టములనుండి మామహారాజు కీర్తివలె నచ్చములై వెన్నముద్ద లెట్లిగురుచున్నవో! కృష్ణా! నవనీతప్రియా! ఆవెన్నముద్దలను రవంత కబళింపఁగలవా? ఏమి సందేహించుచున్నావు? ప్రక్కలఁ గూరుచుండిన రుక్మిణీసత్యభామ లింక మాభర్తగారికిఁ జిన్నతనపుఁ జేష్టలు వదలినవి కావని యధిక్షేపింతురేమో యని సందేహించుచుంటివా? లేక మూఁతి కాలునేమో యని భీతిల్లుచుంటివా? నాతెలివి లేమిచే నేనేమైన నిన్నన్న యెడల నాగ్రహింపకుమా? కృష్ణా! అదిగో లంకాపురీదహనము! అదేమి! అదేమి! ఇప్పుడు నీవు సౌమిత్రిసహితుఁడవై యరణ్యవాసివైన రామచంద్రమూర్తివలెఁ గనఁ బడుచున్నావేమి? కథనుబట్టి యవతారము కాని యవతారమునుబట్టి కథయా? దశరథరాజనందనా! విశ్వామిత్ర యాగసంరక్షణా! జానకీ ప్రాణనాథా! పరశురామగర్వభంజనా! దండకారణ్యవాసీ! మారీచ మదనా! సీతావిరహవ్యాకులచిత్తా! సుగ్రీవప్రియమిత్రా! వాలిహరణా! ఆంజనేయశ్రితపాదపంకజా! రావణశిరఃఖండనప్రవీణా! నమస్తే నమస్తే నమస్తే.

ఉత్సవము ముందునకింకఁ బోవుచున్నది. అచ్చటఁ బెద్దబజారు చౌకులోఁ జేరిన పురంధ్రులు స్వామికి నీరాజనములిచ్చుచు మంగళపుటారతు లెట్లు పాడుచున్నారో?

సురటి–రూపకము.

స్మరియింపరారే మా–పరమపురుషునిఁస్మ॥
మఱిమఱి దయఁగల్గి మమ్మఁబ్రోవుమనిఁస్మ॥
మామహారాజును మామహారాజ్ఞిని
మానుమహారాజకుమారుల నుతలను
శ్రీమహితాయుష్య శేముషు లొనఁగుచు
కామితార్థము లిచ్చి కాపాడవలెననిఁస్మ॥

తథాస్తు–తథాస్తు–

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

49. కాలాచార్యుని యుపన్యాసము-బ్రాహ్మణత్వము

జంఘాలశాస్త్రికి రొంపభారం, కాళ్లునొప్పులు కారణంగా ఏమీ ప్రసంగించే స్థితిలో లేదు. అందువల్ల కాలాచార్యులు వేదికయెక్క-వలసివ చ్చింది. అతను మత, ఆధ్యాత్మిక విషయాలగురించి ప్రసంగించ దగినవాడు గనక-ఎనిమిది విధాల భక్తుల గురించి యెత్తుకుని, 'భక్తి' ఎనిమిది విధాలుగా ఎలా ఎలా ఆచరిస్తే మనిషి బ్రాహ్మణుడని పించుకుంటాడో చెప్పాడు. పుట్టుకవల్ల బ్రాహ్మణత్వం సిద్ధించదని స్పష్టం చేశాడు. నిజం చెప్పవలసివస్తే, ప్రజల్లో వుండే భేదం భక్తులు-అభక్తులు అని తప్ప, బ్రాహ్మణులు అబ్రాహ్మ ణులు అనేది కాదన్నాడు. శాంతి, దాంతి, తపస్సు, వైరాగ్యం అనేవి లేకుండా బ్రాహ్మణుడు జాతిలో పుట్టినంతమాత్రాన గర్వపడితే ఎంత మూర్ఖుడో, -కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలతో వుండి, తన శ్రేయస్సే చూసు కుంటూ, సర్వవేద కర్మలకూ దూరుడై దైవభక్తి రహితుడై, బ్రాహ్మణ నిందాపరుడై, బ్రాహ్మణుడికంటె నేనేయెక్కువ అని గర్వపడే బ్రాహ్మణేతరు డుకూడా అంతే మూర్ఖుడు. వాళ్లూ, వీళ్లూ కూడా ఒక్క-జాతికిందనే లెక్క. వాళ్లూ, వీళ్లూ తిట్టుకోవడం కేవలం ప్రజ్ఞాహీనత. సారాంశం ఏమంటే భగవద్భక్తి ఎక్కడ వుందో అక్కడే బ్రాహ్మణత్వం వుంది. ఎక్కడ భక్తిలేదో అక్కడ బ్రాహ్మణత్వం లేదు. ఇది పుట్టుక చేత వచ్చేది కాదు. ఆచరణవల్ల వచ్చేది-అని-కాలాచార్యులు, భారతంలో కౌశికుడనే బ్రాహ్మణుడికథనూ, శ్రీరామానుజ శిష్యుల్లో ఒకరైన, పంచములైన, మార్నేరునంబిగారి కథనూ చెప్పాడు.

ఇంతలో మద్రాసునుంచి సాక్షి వ్రాసిన వుత్తరం వచ్చింది. న్యాయదీపిక పత్రికలో పులవర్తిక మలావతమ్మగారు సాక్షి ఉపన్యాసాల గురించి చేసిన విమర్శను చూడమని, తిరిగి నిందించవద్దని-వివరణ-అందులో వుంది.

కాలాచార్య లిట్లువన్యసించెను:-

"శ్రీమతే రామానుజాయ నమః ఆర్యులారా! ఉపన్యాస పీఠమున నే నీదినమున నిలువఁబడవలసివచ్చినది. అందువలన మీరు లేచిపోవలసివచ్చునేమో యని సందేహించుచు న్నాను. సాక్షి యిప్పుడిచ్చట నుండినయెడల వక్తృత్వము లేని నే నుపన్యాసమిచ్చుటకుఁ బ్రయత్నించుట తటస్థపడియుండదు. ఆయన మదరాసులో నున్నను జంఘాలశాస్త్రివలన

నిచ్చటి సభావ్యాపార మెట్లో జరిగిపోవుచునే యున్నది. కాని జంఘాలశాస్త్రి రొంపభారముచేఁ గాళ్లు నొప్పులచే బాధపడుచుండుటచేత నాతఁ డీదినమున నుపన్యసించుటకు వీలుకలుగక పోయినది. ఉపన్యానమునకుఁ గాళ్లునొప్పు లంతప్రతిబంధము కావనియే నావిశ్వాసము. కాని రొంపభారము క్రొంత ప్రతిబంధమై యుండవచ్చునని తోఁచుచున్నది. అది నస్యములవలనఁ గొంత నివారణ కావచ్చునని నాదృఢమైన నమ్మకము. తొలకరించిన హేతువుచే నిప్పు డందఱకు దగ్గులు రొంపలు ప్రబలముగా నుండకతీఱదు. కప్పలకుఁ గూడ తొలకరి ప్రారంభమందు రొంప పట్టునో పట్టదో సిద్ధాంతముగాఁ జెప్పుటకు వీలులేదు కాని దగ్గు మాత్రము సిద్ధించుట సిద్ధాంతము. ఆదగ్గునే బెకబెక లని జంతుశాస్త్రజ్ఞులు క్రొందఱు పేర్కొనుచున్నారు. వానకా రారంభించుటతోడనే మనుజప్రపంచమునం దేమి, శాఖాప్రపం చమునందేమి యిమిడియున్న, యంతస్తత్వము పైకి రాకతప్పదు. తీఁగ మొగ్గతొడుగుట, చెట్టు చిగిరించుట, ఱాయి మదము స్రవింపఁ జేయుట, నేలపై గడ్డి మొలచుట, యతిమాత్ర రోగికి రాచపుండు పుట్టుట, కప్ప బెకబెకలాడుట, జంఘాలశాస్త్రి దగ్గుట వస్తుతత్వమున నన్నియు నొక్కటే. ఇదికాక సర్వరసరాజమైన శృంగారరసమునకుఁ దొలకరియారంభ మందే యుద్రేకమని నాయభిప్రాయము. బ్రహ్మచారి యభిప్రాయమును మీరు పరిగణింపకపో వచ్చును. అందుకొఱకే కాళిదానుఁడు ''కశ్చిత్కాంతా విరహగురుణేత్యాది'' శ్లోకము చెప్పిన వెంటనే ''ఆషాఢస్య ప్రథమదివసే మేఘ మాశ్లిష్టసానుం వప్రక్రీడా పరిణతగజ ప్రేక్షణీయం దదర్శ'' యని మేఘసందేశమునందుఁ జెప్పుటకుఁ గారణమైనది. ''అయ్యా! భగవద్విషయకగ్రంథములు చదువుకొన్న మీకీప్రకృతిగొడవ లెందుకయ్యా! ప్రపంచజ్ఞాన మున్న మీ కెందులకయ్యా! కావున మీకుఁదోచినట్లుదో పూర్వాచార్యులఁగూర్చియో పూర్వా చారములఁ గూర్చియో భక్తినిగూర్చియో ప్రపత్తినిగూర్చియో చెప్పఁగోరుచున్నాము. బాగుగానుండిన నుందుము. లేకున్న మీబాధమాకులేదు. మాబాధమీకులే'' దని యొక్కఁడు సభవారిపక్షమునఁ బలికెను.

కాలాచార్యులు ''అద్దే! అందుల కభ్యంతరమేమి''? శ్రీమతే రామానుజాయ–ఏదీ రవంత పొడుము–శ్రీమతే–చాలదు. మఱికొంచెము. శ్రీమతే రామానుజాయ నమః. మీయిష్టము ననునరించి భక్తినిగూర్చి యొకటి రెండు శ్లోకములు చదివి యర్థము చెప్పెదను. నేనుపన్యానమీయ శక్తిగలవాఁడను గాను. భక్తి యెనిమిదివిధములని చెప్పఁబడినది.

మద్భక్తజనవాత్సల్యం పూజాయాం చానుమోదనం
న్వయ మభ్యర్చనం చైవ మదర్థే దంభవర్జనం
మత్కథాశ్రవణే భక్తిః సర్వనేత్రాంగవిక్రియా
మమానుస్మరణం నిత్యం యచ్చ మాం నోపజీవతి
భక్తి రష్టవిధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛే పి వర్తతే
సవిప్రేంద్రో మునిశ్శ్రీమా న్ నయతిస్సచ పండితః
తస్మై దేయం తతో గ్రాహ్యం సచ పూజ్యో యథాహ్యహం.

భగవద్వాక్య మిట్లున్నది. దీనిలో వర్ణింపఁబడిన యెనిమిదివిధములైన భక్తి యెవ్వని కుండునో వాఁడు మ్లేచ్ఛుఁడైనను వాఁడే బ్రాహ్మణోత్తముఁడు. బ్రాహ్మణమాతాపితలకుఁ బుట్టుటగాని యుపనయన సంస్కార మొందుటఁగాని యూర్ధ్వతిర్యక్పుండ్రాందిధారణ

మొనర్చుట కాని వేదాధ్యయన మొనర్చుటకాని యజనయాజనము లొనర్చుట కాని బ్రాహ్మణత్వమునకు నిశ్చయాభిజ్ఞానములు కావు. నిశ్చయమైన సంజ్ఞ యొక్కటియే యున్నది. అదియే భక్తి. భక్తివలననే బ్రాహ్మణత్వమును నిశ్చయపఱుపవలసియున్నది. నవిప్రేంద్రః అయిపోయినది. ఇక న మునిః వాఁడే ముని, మౌనవ్రతమును ధరించి వ్యాఘ్రాజినమునఁ గూరుచుండికాని పంచాగ్నిమధ్యమునఁ గూరుచుండికాని తలక్రిందుగ వ్రేలాడికాని జపమొనర్చి కాయక్లేశము లొంది కందమూలాదు లాహరించి యారణ్యవాసియై యుండుటయే మునిత్వమునకు నిశ్చయ లాంఛనము కాదు. నిజమైనలక్షణ మొక్కటియే యున్నది. అదియే భక్తి. అట్టి లక్షణముకలవాఁడు మహమ్మదీయుఁడైనను మౌనియే. మాలవాఁడైనను మౌనియే. మఱి యేజాతివాఁడైనను మౌనియే. నవిప్రేంద్రో శ్రీమాన్ –ఆతఁడే శ్రీమంతుఁడు–భండారములలోఁ బరిమితిలేని ధనమ్మువాఁడు–పతివ్రతయైన భార్యను గలవాఁడు, పితృభక్తియుక్తులగు బిడ్డలుగలవాఁడు, బహుదానదానీజనసంవృత్తుఁ డైనవాఁడు యథార్థముగ శ్రీమంతుఁ డని చెప్పవీలులేదు. భక్తియున్నవాఁడే శ్రీమంతుఁడు. న యతిః వాఁడే యతి–యజ్ఞోపవీతత్యాగ మొనర్చి, శిరోముండన మొనర్చుకొని, కాషాయదండధారియై ప్రణవజప మొనర్చినవాఁడే యతి కాఁడు. (ఇచ్చట ద్వైతాద్వైతయతుల సంగతియే చాలఁ జెప్పి తమయతులమాట చెప్పలే దెందువలననో యనుకేకలు) భక్తిగలవాఁడే యతి. న చ పండితః వాఁడే పండితుఁడు–తర్కవ్యాకరణాది శాస్త్రజ్ఞానముకాని నాటకాలంకారజ్ఞానము కాని వేదార్థజ్ఞానముకాని పండితుని జేయలేవు. భక్తియున్నవానికే పండితనామమున కర్హతయున్నది. అట్టివాఁ డేజాతివాఁడైనను వాఁడే బ్రాహ్మణుఁడు. వాఁడే ముని. వాఁడే మోక్షలక్ష్మీయుక్తుఁడు. వాఁడే యతి. వాఁడే పండితుఁ డని తెలియఁదగినది. ఇదిగాక,

''న శూద్రా భగవద్భక్తాః, విప్రాః భాగవతాస్మృతాః,
సర్వవర్ణేషు తే శూద్రాః, యేహ్యభక్తా జనార్దనే.''

అని సాయించిన హేతువుచేత నరులలో బ్రాహ్మణాబ్రాహ్మణ భేదము లేనే లేదు. భక్తిహీనుఁ డైనబ్రాహ్మణుఁ డబ్రాహ్మణుఁడు. భక్తియుక్తుఁడైన యబ్రాహ్మణుఁడు బ్రాహ్మణుఁడు. ప్రజలలో నున్న భేదము భక్తానభక్తభేదముకాని బ్రాహ్మణాబ్రాహ్మణభేదము కాదు. కాదని స్పష్టముగాఁ దెలియఁదగినది. శాంతిలేక దాంతిలేక తపస్సులేక వైరాగ్యములేక సదాచారములేక స్వార్థపరిత్యాగములేక దైవభక్తిలేక నేను బ్రాహ్మణుఁడ నని విఱ్ఱవీఁగు జన్మబ్రాహ్మణుఁడే యధముఁ డనిపించుకొనునప్పుడు కామక్రోధలో భమదమత్సర యుక్తుఁడై సర్వవేదకర్మదూరుఁడై స్వశ్రేయోభిలాషియై బ్రాహ్మణనిందాపరుఁడై ప్రపంచ సౌఖ్యాకాంక్షా సమన్వితుఁడై దైవభక్తిరహితుఁడై నేను బ్రాహ్మణాధికుఁడనని సంతతము గర్వపడుచున్న జన్మబ్రాహ్మణేతరుఁడు మాత్రమధముఁ డనిపించుకొనఁడా? ఇద్దఱుకూడ సమానముగ నధములు. ఇద్దఱుకూడ నొక్కవర్ణమువారు. ఒక్కజాతివారు. ఒక్కయధికార మువారు. ఒక్కగతికే పోవలసినవారు. వీరిని వారు దూషింపఁ దగదు. వారిని వీరు దూషింపఁదగదు. ఇదిగాక–శ్లో. శ్వపచో పిమహీపాల, విష్ణుభక్తో ద్విజాధికః, విష్ణుభక్తివిహీ వస్తు, యతిశ్చ శ్వపచాధమః. అని పెద్దలు సాయించినారు. ''భగవద్భక్తియుక్తుఁడైనను శ్వపచుఁ డైనను ద్విజానికంటె నధికుఁడు–భగవద్భక్తిశూన్యుఁడగు యతియైనను శ్వపచుని

కంటె నధముఁడు'' అని విస్పష్టముగాఁ జెప్పఁబడినప్పు డిఁక బ్రాహ్మణుఁ డెవఁడు? అబ్రాహ్మణుఁ డెవఁడు? బ్రాహ్మణు నబ్రాహ్మణుఁడు తిట్టుట యెందువలన? అబ్రాహ్మణుని బ్రాహ్మణుఁడు తిట్టుట యెందువలన? ప్రజ్ఞాహీనతవలన–పరమార్థజ్ఞానశూన్యతవలన –ప్రజలగర్వాతిరేకమువలన–అందువలన భక్తియే ప్రధానముకాని వర్ణలింగజాత్యాదులు ప్రధానములుకావు. అభక్తి యెన్నివిధములు? ఎనిమిది విధములు. మొదటిది –మద్భక్తజనవాత్సల్యం; అందఱము దేవునికుటుంబములోనివారముకదా! సోదరులము కదా! ఒకరినొకరు సోదరులవలెఁ బ్రేమించుకొనుచున్నామా? నాయూర్ధ్వపుండ్రములు నీకుఁ జెమ్మకాయలు–నీవిభూతిరేఖలు నాకుఁ బెండెకట్లు. వేపారుల నామములు మనకిద్దఱకు బెండకాయబొట్లు. వాఁడు నీటికానువాఁడు. వీఁడు నియోగిప్రభుఁడు. వాఁడు వెలనాటి వెల్లోవాఁడు. వీఁడు వేగినాటి నన్యాసి. వాఁడు తెలినాఁటి తెగనీల్గుబోతు. వీఁడారామద్రావిడి హంశవారి వాఁడు నపాదుఁడు–వీఁడు నిష్పాదుఁడు. వీఁడరవ–వాఁడాంధ్రుఁడు. వీఁడు బ్రాహ్మణుఁడు–వాఁ డబ్రాహ్మణుఁడు. ఇటులెన్ని చెప్పవచ్చును? ఈరీతిగాఁ గొంతకాలము నుండి యొకరినొకరు గాఢముగా దూషించుకొనుచున్నారు. జ్ఞానహీనములగు నితరజంతువులెట్లు తమలోఁదాము పోరాడినను గఱచుకొనినను నవి క్షంతవ్యములుకాని జ్ఞానయుక్తులగు మన మిట్లొకరినొకరు తిట్టుకొని తండ్రులను దాతలను గూడ నోటికిరాని దుర్భాషలాడుకొని పూర్వాచార్యులవారినిగూడ బుంఖానుపుంఖముగఁ దిట్టుచు వీరిపై వారు వ్రాసికొనుచు వారిపై వీరు వ్రాసికొనుచు వీరు వారి నడచినైనఁ బ్రయత్నించుచు వారు వీరి నడచినైనఁ బ్రయత్నించుచు వీరావేశములఁ దెయితక్కలాడుచుండు నెడల మన కేమి క్షమాపణయున్నది?

ఇఁక రెండవది:–పూజాయాం చానుమోదనమ్. దీనినిగూర్చి చెప్పనక్కఱలేదు. మూఁడవది స్వయమభ్యర్చనం చైవ–దీనినిగూర్చి నాల్గుమాటలు చెప్పవలసియున్నది. ఱవంత జరుగుబాటున్న కుటుంబములలో దేవతార్చనపు బ్రాహ్మణుఁ డొకఁ డుండక తప్పదు. మనవారు కూలిపెట్టి దైవపూజ చేయించుచున్నారు. మనము కూలిపెట్టి భోజనము చేయించుటలేదు. నిద్రచేయించుట లేదు. కాలకృత్యములు నిర్వహింపించుటలేదు, తుదకుఁ గూలిపెట్టి చుట్టయైనఁ గాల్పించుటలేదు. పొడుమైనఁ బీల్పించుటలేదు. ఇవియన్నియు మనము న్యాయముగఁ జేసి కొనుచున్నాము. న్యాయముగఁ జేసికొనఁదగిన యావశ్యకకృత్యము కాక పోవుటచేతనే కదా దైవపూజ కూలిపెట్టి చేయింపవలసియున్నది. ఎట్లు తగులఁబెట్టినను బాధలేని పనికిమాలిన తంతుకావుననే యట్లుచేయుచున్నాము. మనము మంచమునైఁబడి చేతులు జోడించుటకు స్వాధీనములు కాకపోయినప్పుడు గోవిందా మహాదేవా యనుటకు నోరైనస్వాధీనము కానప్పుడు నంతతదున్నహబాధచేత మనస్సునకుఁ గానంత నిలుకడయైన లేనప్పుడు కూలిపెట్టికాని వెట్టికిఁగాని దైవపూజ చేయింపవచ్చునేమో కాని, బజారునకుఁ బోయి భార్యకుఁ బక్కోడీలు, బనారనుకాజాలు తీసికొనివచ్చుట కోపికయుండగా గరణముగారిని యాచించి కట్టుకుండు తెచ్చి' పొడుముచేయుట కోపికయుండఁగాఁ నుంచుకొన్న వేశ్యయింటికిఁ బైనా డెవ్వఁడైన వచ్చునేమో యని బ్రచ్ఛన్నముగ వీధిమొగను గావుంచి దాని పెరటిగుమ్మమునొద్ద మునుఁగు వైచికొని తెల్లవాఱినదాఁక గనిపెట్టుకొనియుండుటకు గాత్రశక్తి యుండఁగా రవంతసేవు దేవతారాధన వేదికపైఁ గూరుచుండి పుష్పమొక్కటి పుండరీకాక్షునిపై వేయుటకే చేతు లక్కఱకు రాక పోయెనా?

పనికిమాలినకూత లెన్నియైన గూయుటకుఁ దెఱపియున్నది. కాని నారాయణా! పరమే
శ్వరా! యనుటకు నాలుకయే లేకపోయినదా? ఇఁక దీనినిగూర్చి చాలును. 'మదర్థే
దంభవర్జనమ్' అని మఱియొకటి. తాను దైవపూజచేయుచున్నట్లు నలుగుఱకుఁ దెలియవల
యును. గ్రామస్థులందఱు వచ్చి తనయంత భక్తుఁడు లేఁడని కొని యాడవలయును.
వీరవరపు వెంకటేశ్వరునకు దాను వింజామరము లిచ్చిన ట్లాంధ్రపత్రికలోఁ బెద్దయక్షరము
లతో వేయింపవలయును. తన కేదైన రోగమువచ్చినప్పుడెవ్వఁ డేసాధనముచెప్పునో యని
నలుగుఱతోఁ జెప్పుకొనవచ్చును. రోగ మెంతయైన రట్టుచేసికొనవచ్చును. అంతేకాని
తాను దేవీనవరాత్రములు చేసినట్లు తెలుఁగుపత్రికలలోఁ బ్రకటించుకొనుట యెందులకు?
తాను బెంచుచున్న కుక్కపిల్ల తప్పిపోయినయెడల డప్పువేయించి చాటింపవచ్చును.
పత్రికలలోఁ బ్రకటింపవచ్చును గాని గోపాలస్వామికిఁ దానుజేయఁబోవు దీసారాధనమును
గూర్చి బ్యాండు మేళములతోఁ గరపత్రములు పంచిపెట్టించుట యెందులకు? ఇదేమి?
నాటకమా–సర్కసా–అడవిమృగమును బ్రదర్శించుటా? క్రొత్తస్లీడరు వృత్తిప్రారంభమా?
తాను భక్తుఁడని భగవంతుని మనసులో నుండవలయునా? మునసబుకరణముల మనసులో
నుండవలయునా? భగవంతునికున్నప్పు డితరులకు లేని నష్టమేమి? ఇతరులకున్నను
భగవంతునికి లేనప్పుడు లాభమేమి? ''శ్లో. అయి ప్రసన్నే మనకిం గుణేన త్వయ్యప్రసన్నే
మమకిం గుణేన, రక్తే విరక్తే చ వరే వధూనామ్ నిరర్థకః కుంకుమపత్రభంగః'' అనునట్లు
సంతుష్టినొందవలసిన లోకనాథుఁడు సంతుష్టినొందనప్పుడు నరులెందఱు సంతోషించిన
నేమి? తన్నుఁ దర్శింపఁజేయువాఁడు మహాదేవుఁడు కాని మనుష్యుఁడు కాఁడే! రేపు నీవు
చచ్చి దండధరుని దర్బారులో నిలువఁబెట్టఁబడినప్పుడు బాణాసంచాకట్టిన భద్రయ్యకాని,
మేళ మొప్పుకొనిన మంగలి వెంకస్వామికాని, యూరేగింపురాత్రి గజ్జెకట్టిన యిక్కసానికాని,
నీవు దైవభక్తుఁడవని సాక్ష్యమిచ్చెదరా? ఈదంభము మహాదోషము–భక్తిలేనివాఁడు లేనట్లు
ప్రవర్తించినయెడలఁ గొంత మంచిదికాని యున్నట్లు డాబుచేసినయెడల భక్తిలేనందు కొక
శిక్ష నటనమున కొక్కశిక్షయు సిద్ధింపవా? ఇఁక దరువాత–మత్కథాశ్రవణే భక్తిః
–ప్రాఁతకుర్చీలు వేలముపాడుచున్నారని తెలియగఁ బరుగెత్తువాఁడే కాని భాగవతపురాణము
వినుటకు గడపదాఁటి యీవలికి వచ్చినవాఁ డెవఁడున్నాఁడు! పంచనాథయ్యరు జావళీకిం
దలయూఁపినవాఁడే కాని తిరుప్పావులోని పాశురమునకు శిరఃకంపన మొనర్చినవాఁ డెవఁడు
–తరువాత స్వరనేత్రాంగవిక్రియా–పరమదయాపరిపూర్ణుని గుణానుసంధానమున స్వరము
గద్గదిగ నొందవలయును. నేత్రములానంద బాష్పపూర్ణములై యుండవలయును. దేహము
రోమాంచాది లక్షణ సమన్వితమై యుండవలయును. కూఁతురత్తవారింటికిఁ బోవునప్పుడు
గొంతుకలోఁ గెక్కు కెక్కు మనువాఁడే కాని గోపాలస్వామివాహనారూఢుఁడై
యింటిముందుఁ బోవునప్పుడు కానంతయైనఁ గరగినవాఁ డెవఁడు? దొంగలువచ్చి యట్లుకట్ట
దొంగిలించుకొని పోయినారని స్వప్నమురాగ గొంతుగద్గదతతో గేకలు వేసినవాఁడే కాని,
గోపికలు తరించుటకుఁ గోపాలుఁడు వారి వస్త్రము లపహరించినాఁడనఁగ గద్గద గలిగినంత
వెఱ్ఱివాఁ డెక్కడ నున్నాఁడు? వదినెగారికి మనోవృత్తి నీయనక్కఱలేదని కోర్టువారిచ్చిన
యెగఁ బెట్టు తీర్పును దెచ్చినస్లీడరు మొగముచూచి యానందబాష్పములు విడిచినవాఁడే
కాని, శ్లో. న ధర్మనిష్ఠో స్మి నచాత్మవేదీ? న భక్తిమాన్ త్వచ్చరణారవిందే, అకించనోనన్యగతి
శ్శరణ్య, స్త్వత్పాద మూలం శరణం ప్రపద్యే'' అను శ్లోకమును జదువుచుఁ బార్థసారథిని

దర్శనముచేసినప్పు డానందబాష్పములను విడచినవాఁ డెవ్వఁడు? ''అంగవిక్రియా'' యనఁగ రోమహర్షాదులు–వెనుకఁబడిన కష్టములు తలఁచుకొన్నప్పు డొడలు జల్లుమనుచున్నది కాని కష్టములనుండి కాపాడిన కావేరిరంగని దలఁచుకొనినప్పుడు కాదుగదా. చూచినప్పుడైన నొడలు పుకరించుచున్నదా? లేదు. భక్తులారా లేదు. తరువాత–''మమానుస్మరణం నిత్యమ్'' పూజావేళమాత్రము రవంతసేపు దైవచింత చేయుచు నితరవేళలందు దైవమేలే నట్లు ప్రవర్తించువా రనేకులున్నారు. ద్వాదశోర్ధ్వపుండ్రధారణమొనర్చి–ధనుర్మాస వ్రతదీక్ష నాచరించి దైవనివేదిత ప్రసాద మారగించి–శిరోవేష్టమును ధరించి–సివిల్ కోర్టునకుఁ బోయి యబద్ధసాక్ష్యములు ప్రసాదించిన యాచార్యపురుషులెందఱు? పుణ్యస్త్రీలయింటికి వేంచేసి పవళించిన భాగవతో త్తములెందఱు? ఇప్పుడు చెప్పిన యెనిమిది విధములైన భక్తి కలవాఁడేజాతివాఁడైనను వాఁడే పూజ్యుఁడు–వాఁడే బ్రాహ్మణుఁడు–వాఁడే మౌని–వాఁడే శ్రీమంతుఁడు–వాఁడే యతి–వాఁడే పండితుఁడు–ఇది నిశ్చయము. అందువలన బ్రాహ్మణుఁ డార్యావర్తమునఁనే కాదు. ఆఫ్రికాదేశమున నుండవచ్చును. అమెరికాదేశమున నుండవచ్చును. ఆస్ట్రేలియాదేశమున నుండవచ్చును. భగవద్భక్తి యెచ్చటనున్నదో యచ్చట బ్రాహ్మణత్వ మున్నది. అది యెచ్చటలేదో యచ్చట మహీసురత్వములేదు. సరేకదా మనుజత్వమైన లేదని చెప్పవచ్చును. భక్తుఁడు శ్వపచుఁడైన సరియే వాఁడు నావలెనే పూజార్హుఁ డని భగవంతుఁడు పలికినాఁడు.

తస్మైదేయం తతోగ్రాహ్యం–అని సాయింపఁబడినది. అనఁగా నట్టివాని కీయవచ్చును. అట్టివానినుండి గ్రహింపవచ్చును. ఏది? చిత్రాన్నముకాదు–చిట్టిగారెలుకావు –కోడిపలావుకాదు–కుందేటి కుర్మాకాదు–కొక్కు–గొడు గూరగాయకాదు–చక్రధరభక్తుఁడు సర్వాధికారయుక్తుఁడు. కాన నతనికిచ్చునవి మహామంత్రములు. ఆతని యొద్దనుండి గ్రహించునవి మహామంత్రములు. నిస్సంశయముగా నట్టివాని కుపదేశింపవచ్చును. అతని నుండి గ్రహింపవచ్చును. అట్లు జరిగినట్లెచ్చటనైన నిదర్శనమున్నదా యని యందురేమో? పంచమవేదమైన భారతమునుండి యొకకథ మనవిచేయుదును.

శ్లో. కశ్చిద్ద్విజాతిప్రవరో వేద ధ్యాయీ తపోధనః
తపస్వీ ధర్మశీలశ్చ కౌశికో నామ భారత.

అట్టికౌశికుఁ డను బ్రాహ్మణుఁ డొక్కవృక్షముక్రిందఁ బద్మాసనాసీనుఁడై తపమొనర్చుకొనుచుండఁగా నొకకొంగ యాతనితలపై రెట్టవైచెను. అందుపై బ్రాహ్మణుఁడు కోపోద్రిక్తుఁడై యాపక్షివంకఁ జూడఁగ నది భస్మమైపోయెను. అట్లు భస్మమైపోవ్టకుఁ బ్రకృతిశాస్త్ర సంబంధమగు కారణమేదో జంఘాలశాస్త్రి యిదివఱకే చెప్పియున్నాఁడు. పక్షి బ్రాహ్మణకోపాగ్ని చేతనే భస్మమైనది. బ్రాహ్మణుఁ డంతఁ దిరుగస్నానమొనర్చి పరిశుద్ధుఁడై మాధ్యాహ్నికకృత్యములు నిర్వహించుకొని భిక్షకై బయలునెడలెను. ఒక బ్రాహ్మణుని యింటియొద్దకుఁ బోయి నిలువఁబడెను. ఆయింటి బ్రాహ్మణి యాకౌశికునిఁ గాంచి స్వామీ! ప్రసాదము తెచ్చుచున్నానని మనవిచేసికొని లోనికిఁ బోయెను. ఇంతలో నామెభర్త యింటికివచ్చెను. వచ్చినభర్తనుగాంచి వినయమున నాతనికి నమస్కరించి స్నానమునకు నీరిచ్చి స్నానానంతరమున సంధ్యావందనమునకుఁ గావలసిన సామగ్రినంతయు సందిచ్చి యటుపైన దేవతార్చనవేదికపై ముగ్గులుంచి గోఘృతదీపము లమర్చి నీరాజనమునకుఁ గర్పూరాదిసా

మగ్గిని సిద్ధపఱచి యాతఁడు దేవతారాధన మొనర్చినపిమ్మట నాతనికి భోజనమిడి భోజనా
నంతరమునఁ గరపాద ప్రక్షాళనమునకు నీరిచ్చి తములపాకులు చుట్టియిచ్చి యాతఁడు
నిద్రించిన పిమ్మటఁ గొంతప్రసాదము నొక్కపళ్ళెరముననుంచి గుమ్ముములోనికి వచ్చి
''అయ్యా! క్షమింపవలయును. ఆలస్యమైనది. నాభర్తగారింతలో దయచేసినకారణమున
ననివార్యమగు నీయాలస్యము జరిగినది. మీకుఁ గలిగించిన శ్రమమునకు మన్నింపవల
యును.'' అని వినమ్రయై ప్రార్థించెను. అంత నాతఁ డుగ్రుఁడై ''పతియే దైవం కండీర్
అతిథిపూజవేండావో'' (పతియే దైవము కాఁబోలునేమి? అతిథిపూజ యక్కఱలేదేమి?)
అని యుద్రీవుఁడై గర్జించెను. ఆమాట లామహాపతివ్రత విని ''నాయనా! కోపముతోఁ
గర్జించెను. ఆమాట లామసాపతివ్రత విని ''నాయనా! కోపముతోఁ బలికినను మీరు కొంత
సత్యమే పలికినారు. పతియే దైవము. అంతవఱకు నిశ్చయము.

'శ్లో. పతిర్హి దైవతం నార్యాః పతిర్బంధుః పతిర్గతిః, ప్రాణైరపి ప్రియం తస్మాత్ భర్తు
కార్యవిశేషతః' అని తమవంటి పెద్దలు చెప్పిన మాటనే వేదవాక్యముగా నెంచి ప్రీతిపూర్వ
మే మాచరించుకొనుచున్నాము. నాయనా! అంత తీవ్రముగఁ జూచెద మెందులకు? నీక్రూర
వీక్షణమున భస్మమగుట నేనేమి గ్రుడ్డికొక్కఱ ననుకొంటివా?'' యని యామె పలికెను.
ఆమెమాటలు విని గడగడ పడఁకి ''అమ్మా! నేను బాపాత్ముఁడను. నీవు బహుపణ్యశీలవు.
నీతపస్సామర్థ్యమున నీవు కాలత్రయవేదినివలె నున్నావు. నాకేమైనఁ దారకమార్గమును
బోధింపు'' మని యామె నాబ్రాహ్మణుఁడు ప్రార్థించెను. ''నాయనా! వినుము. శ్లో.
క్రోధశ్శత్రుశ్శరీరస్థో మనుష్యాణాం ద్విజోత్తమ, యః క్రోధమోహౌత్యజతి తం దేవా
బ్రాహ్మణం విదుః'' అని యామె కొంచెము కఠినముగాఁ బలికి యామాత్రమునకే యాతఁ
డిబ్బందిపడునేమోయని యెంచి శ్లో. భవానపిచ ధర్మజ్ఞ స్స్వాధ్యాయనిరతశ్శుచిః, నతు
తత్తేన భగవన్ ధర్మా వేత్తీతి మే మనః'' అని కొంత మృదులముగాఁ బలికెను. ''అందుకొఱకే
నన్నుఁ దరింపఁ జేయుసాధనమును బోధింపుమని వేడుకొనుచున్నాను.'' అని తిరుగ నాతఁ
డాపతివ్రతను ప్రార్థించెను. ''నావలన నేమగును? ధర్మవ్యాధుఁడను నొకమహాత్ము
డున్నాఁడు. శ్లో. మాతాపిత్భ్యాం శుశ్రూషు స్సత్యవాదీ జితేంద్రియః, మిథిలాయాం వసన్
వ్యాధః.....తత్ర గచ్ఛస్వ భద్రంతే యథాకామం ద్విజోత్తమ. వ్యాధః పరమధర్మాత్మా
నతే చ్ఛేద్యతినంశయాన్'' అని యామె పలికెను. ఆమెకు నమస్కరించి యాతఁడు
పోవుచుండఁగా–''అయ్యో! మఱియొక్కమాట–నేను బ్రాహ్మణుఁడనుగదా! ఆచారవంతుఁ
డనుగదా! అధికుఁడనుగదా యను గర్వమును బూర్తిగాఁ జంపుకొని సంతత మాతాపిత్భసే
వాసంసక్తమానసుఁడగు నాతని కేమాత్రమైన తొందరయుఁ గలుగనీయక,
యాతనిగుమ్ములోఁ బడియుండి, యాతనితో నీవు ముందుగా మాటలాడక, యాతనిని
బిలువనైనఁ బిలువక, యాతఁడు నిన్నవలోకించి మాటలాడునప్పుడే నీవు మాటలాడి
నీసంగతి యాతనికి నివేదించుకొని యాతని సమయమును గనిపెట్టి తత్త్వజ్ఞానము
నొందుము'' అని యాబ్రాహ్మణుఁడెట్లయినఁ దరింపవలయునను వాంఛచే నాతనియందలి
కరుణచే దిరుగనామె పలికెను. ''అటులే యని'' యామెయొద్ద సెలవుతీసికొని ధర్మ
వ్యాధునియొద్దకుఁ బోయి యాతని యథానిర్దిష్టముగా సేవించి, ''శ్లో. పంచైతాని పవిత్రాణి
శిష్టాచారేషు నిత్యదా, ఏతన్మహామతే వ్యాధ ప్రబ్రవీహి యథాతథా'' యని ప్రార్థింపఁగ, శ్లో.
యజ్ఞం దానం తపోవేదః నత్యంచ ద్విజసత్తమ, పంచైతాని పవిత్రాణి శిష్టాచారేషు నర్వదా''

యని ధర్మవ్యాధులవా రాబ్రాహ్మణునకు సాయించిరి. ఇక్కడఁ గౌశికుఁడు నేర్చికొన్న గ్రంథమంతయుఁ బోగొట్టుకొన్న నందేహము లన్నియు నంపాదించిన తత్త్వమార్గమంతయుఁ జెప్పవలయుననియే యున్నది. కాని చెప్పుట కవకాశములేదు. ధర్మవ్యాధన్ వాసిలిలెతువండు ధర్మనందేహంగళై శమిపిత్తుకొండార్గళ' (ధర్మవ్యాధునిగు మ్మములోఁ బడియుండి ధర్మనందేహములను శమింపఁజేసికొనినారు) అని చెప్పఁబడినది. అందువలన బ్రహ్మోపదేశమైనను భగవద్భక్తుఁడైన యెడల నాతనికి బ్రహ్మోపదేశము చేయవలసినది. భగవద్భక్తియే ప్రధానముకాని వర్ణలింగజాత్యాదులు ప్రధానమైనవి కావు. ముమ్మాటికిఁ గావు.

"భారతదేశములోనున్న కథలన్నియు నత్యములనుట కేమి యాధారమున్నది? ఎప్పటిభారతము! ఎప్పటికథలు వానియందు మనకంత ప్రమాణబుద్ధి యుండవలసినపని యేమున్న" దని నవనాగరకులు కొందఱధిక్షేపింపవచ్చును. ఆయధిక్షేపణమున కాధారము న్నను లేకున్నను దానిని నిరాకరింపక యంగీకరింతము. పురాణములలోని పూర్వగాథల వఱ కెందులకు? ఆపురాణకాలముతోఁ బోల్చినప్పుడు మొన్న మొన్నగా భావింపవలసిన శ్రీమద్రామానుజులవారి కాలములో జరిగిన యొకచిత్రమును మనవిచేసెదను. మార్నేరునంబి గారును బెరియనంబిగారును గూడ యామునాచార్యులవారి శిష్యులు. పెరియనంబిగారు బ్రాహ్మణుఁడు, మార్నేరునంబిగారు పంచముఁడు. పెరియనంబిగారు రామానుజులవారి గురువు-మార్నేరునంబిగారి కవసానదశ సమీపించినది. "ఈశరీరముఁ బరమగురు భగవా నుండగు యామునా చార్యులవారికి శేషత్వమొందినది. అట్టి యీదేహమును బ్రకృతిసంబం ధులగువారు స్పృశించుట నాకంగీకారము కాదు. అంతటిమహాత్ముని సేవచేయుటచే వారికి శిష్టమైన యీగాత్రము వారి మహాత్మ్యమును బట్టి ప్రాకృతికస్పర్శము తగులకుండఁ గాపాడుకొనవలయునని యూహించుచున్నాను. మీరు బ్రాహ్మణులు భాగవతోత్తములు మీఁదు మిక్కిలి దానునికి సతీర్థులు. దేవరవారు దీనుఁడగు నడియేనికి బ్రహ్మమేధ సంస్కారమును గావింతురా" యని పెరియనంబిగారికి మార్నేరునంబిగారు వార్త పంపిరి. "అభ్యంతరమేమి? మహాభాగ్యమని యామహోదారమనస్కుఁడగు పెరియనంబిగారు చర మావస్థలోనున్న మార్నేరునంబిగారిని సేవించి వారికి బ్రహ్మమేధసంస్కారమును గావిం చెను. మార్నేరునంబిగా రిట్లు చరమవాక్యముగా సాయించి పరమపదించిరి.

"నా యిన్నపడి యిన్నడి సెయిదాల్, నీర్ యిన్నపడి యిన్నపడి సేయుంగో" దీనియర్థ మేమనఁగా నేను ఈరీతిగా-ఈరీతిగా-ఈరీతిగాఁ జేసియుంటినేని, మీరు-ఈరీతిగా-ఈరీతిగా-ఈరీతిగాఁ జేయ వేఁడుచున్నాను. ఈరీతిగా నేను జేసిన యెడల మీ రీరీతిగాఁ జేయవలెను. ఈరీతిగా నేను జేసినయెడల మీ రీరీతిగాఁ జేయవలెను. నేను-ఈరీతిగాఁ జేసినయెడల మీరీరీతిగాఁ జేయవలయునని క్రమాలంకారసందర్భముగా మార్నేరునంబిగారు సెలవిచ్చిరి. దీనికిఁ దాత్పర్యమేమనఁగా:-"నేను దైవనామమును స్మరించుచుఁ బ్రాణములు విడిచినయెడల మీరు దశరాత్రము లాశౌచము పట్టి కర్మ మాచరింపవలయును. నేనాచార్యుల స్మరించుచుఁ బ్రాణములు విడిచినయెడల మూఁడుదిన ములు మాత్రమే మైలపట్టి కర్మ మాచరింపవలయును. నే నెవ్వరిని స్మరింపకుండఁ బ్రాణములు విడిచితినేని మీరేకర్మముకూడ నాచరింప నక్కఱలేదు." మార్నేరునంబిగారి

యీయవసానాజ్ఞను శిరమున ధరించి యీయనకు యతీశ్వరార్హమైన చరమకైంకర్య మొనర్చి స్నానమైనఁ జేయక, వస్త్రములయిన మార్పక, పెరియనంబిగారు తిర్వారాధన మొనర్చి కొని నాపాటు కానిచ్చుకొనెను. ఆహాహా! ఇది యెట్టి మహాద్భుతాంశమో! ఇది కేవలము కల్పితమైన కథయని యెట్లు చెప్పనగును? దీనిని నమ్మకపోవుట కిందున నసాధ్యమైన దేమున్నది? అస్వాభావికమైన దేమున్నది? అనుచితమైన దేమున్నది? అసాధారణమైన దేమున్నది? ఇట్లు జరిగినదనియే నిశ్చయపఱుపవలయును. పూర్వగ్రంథములం దామాత్ర మైన విశ్వాసము లేనియెడల మన కొక్కనిమునమైన జీవయాత్ర జరుగునా? నమ్మకపోవుటకుఁ గారణాభాసమైన నుండవలయునా? పదిపండ్రెండువందల సంవత్సరముల నుండి తరతరముగా వచ్చుచున్న యీపవిత్రగాథ పరమార్థమైనదేకాని తదతిరేక మెంత మాత్రమునుగాదు దీనివలన నేమి తెలిసికొనఁదగినది? నరుఁడు భగవద్భక్తి చేతనే బ్రాహ్మణుఁ డగును. భగవద్భక్తిశూన్యతచేతనే యబ్రాహ్మణుఁ డనిపించుకొనును. స్థిరమైన బ్రాహ్మణత్వ మెవ్వరికిని లేదు. స్థిరమైన యబ్రాహ్మణత్వ మంతకంటెలేదు. బ్రాహ్మణుఁడబ్రాహ్మణుఁడు కావచ్చును. అబ్రాహ్మణుఁడు బ్రాహ్మణుఁడు కావచ్చునని మనపెద్దలు చెప్పినారు. నరుల మగుటచే మనకు సోదరత్వమే సిద్ధత్వమైనదికాని బ్రహ్మణాబ్రాహ్మణ త్వము కాదు. కావున నిశ్చలమైన భగవద్భక్తిని సంపాదించుకొని యందరము కూడ బ్రాహ్మణుల మగుదుము. అందఱము బ్రాహ్మణులమైనప్పుడు మనకుఁ దగవులేల? భగవ ద్భక్తిని వదలి ప్రపంచలంపటులమే యందఱైనయెడల నందఱబ్రాహ్మణులమే యగుదుము. అప్పుడుకూడ మనకుఁ దగవు లక్కఱలేదు. పరమేశ్వరునందలి భక్తి సంపాదించుకొని తరింతము.

ఆర్యులారా! ఇదిగో సాక్షి మదరానునుండి జంఘాలశాస్త్రికి వ్రాసినలేఖ–దీనిని జదువు మని జంఘాలశాస్త్రి యిప్పుడే నాయొద్ద కంపినాఁడు.

జంఘాలశాస్త్రికి–సాక్షి యనేకనమస్కారములు. 19దవ తేదిగల న్యాయదీపికలోఁ జిరంజీవిని సౌభాగ్యవతియగు పులవర్తి కమలావతమ్మ గారు వ్రాసినవ్యాసమును నీవు చూచియుందువు. ఆంధ్రదేశీయులందఱు జూడఁదగిన వ్యాసమది. ఆవ్యాసమున్న న్యాయదీ పికనైన నందఱు సంపాదించుకొని చూడవలయునని నీవు సభలో నాపక్షమున సభ్యులను బ్రార్థింపవలయును. దానిలో సాక్ష్యుపన్యాసములఁగూర్చి యేదో విమర్శనమున్నదని నీవు భ్రాంతిపడి తొందరచే నామె వ్యాసమును గ్రూరముగ ఖండింతువేమో యని భయపడి నీపేర నీయుత్తరమును వ్రాసితిని. నాయనా 'అది విమర్శనము కాదు. సాక్షిని దిట్టిన తిట్లు సాక్ష్యుపన్యాస విమర్శనమగునా? తిట్లకుఁదిట్టుగాక వేఱప్రత్యుత్తర వేమున్నదని యెంచి నీవు మనసోదరీమణిని దిరుగఁబడి మనసులోనైనఁ దిట్టెదవేమో సుమా! మగువను దిట్టుట మహాపాతకము సుమా! నవనాగరకతామహాత్మ్యమువలనఁ బురుషులలోనేమి స్త్రీలలోనేమి కలిగి మనజాతితత్వము భంగపఱచుచున్న దురాచారములఁగూర్చి మృదులముగాఁ బలుకు టయే మనవిధి. అందువలనఁ బురుషులుకాని స్త్రీలుకాని తిరుగఁబడి తిట్టినఁ దిట్టుదురు గాక! తెఱపిలేకుండఁ దిట్టినఁ దిట్టుదురుగాక! తిట్టినప్పుడే మనయుపన్యానములు వారిమన స్సునకు బాగుగా నెక్కినవని భావింపవలయును. వారి దురాచారములను వారు బాగుగాఁ దెలిసికొను చున్నారని నిశ్చయింపవలయును. సామాన్య మనుష్యధర్మముచేతఁ గోపమును

బట్టలేక యులుకుచేతఁ దిట్టుదురు. వారితిట్లకు మన దీవనలే ప్రత్యుత్తరములు. అందులోఁ గాంతామణి–మన సంఘమునకు స్త్రీజాతియందున్న యసాధారణగౌరవమునుబట్టి యధిక భక్తినిబట్టి యామెనేమియు నేనఁదగదు. భర్తను బరదైవముగభావించి పూజించుచు నామె చిరకాలము సౌభాగ్యము ననుభవింపవలయునని యాశీర్వదింపవలయును. పండ్లవంటి బిడ్డలగని పౌత్రప్రపౌత్రదౌహిత్రవృద్ధితో నామె చిరకాలము వర్ధిల్ల వలయునని యాశీర్వదింప వలయును. ఇంతకంటె నిప్పటికి ప్రాయఁ దగిన దేదియులేదు.

ఇట్లు విన్నవించు సాక్షి.

ఆర్యులారా! ఈలేఖయైనది నేను జెప్పఁదగినదియు నైనది. ఇఁక పెద్దలకు నమస్కరించుటతక్క జేయఁదగినది లేదు. ఆళ్వార్ తిరువడిగళే శరణం–ఎంబెరుమానార్ తిరువడిగళే శరణం–జియ్యర్ తిరువడిగళె శరణం–అళహియమనవాళ్ నయనార్ తిరువడిగళే శరణం.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

50. గ్రంథపరిష్కారము

సాక్షికి ఒక వ్యక్తి ఒక ఉత్తరం రాశాడు. అది వాళ్ల వూళ్లో ఒక కవి గురించి. ఆయన బాగానే కవిత్వం చెప్పగలవాడు, చక్కగా చదువుకున్న వాడూ అయినా, బాగా పిరికివాడు. ఎంతో చనువు ఏర్పడితేగాని, మాట్లాడే స్వభావంకాదు.

ఆయనతో పక్కవూరిలో ఒకతను చాలాకాలం స్నేహంచేసి, చనువు సంపాదించి, ఒకనాడు తన మనస్సులో కోరిక బయట పెట్టాడు. అతనికి తన తాతగారు వ్రాసిన పుస్తకాలను పరిష్కారం చేయించి ముద్రించాలని వుంది. ఆ పుస్తకాలు పీచుకాగితాల మీద ఎప్పుడో వ్రాసినవి. కొన్ని అక్షరాలు కనపడక, కొన్ని అక్షరాలు శిథిలమైపోయి కొన్ని అస్పష్టంగా వున్నాయి. కొందరేమో కొన్ని శబ్దాలు అపశబ్దాలన్నారట. ఆపుస్తకాలు పరిష్కరించి పెట్టమని అడిగాడు.

అందుమీదట, ఈకవి అసలు సుశబ్ద, అపశబ్దాలను ఇతరులు నిర్ణయించి (కవి హృదయం తెలుసుకోకుండా) పారెయ్యడం సరికాదు. ఆ గతించిన కవి ఎంతో బుద్ధి వెచ్చించి, సందర్భశుద్ధిగానే వ్రాసివుంటాడు. నీకు తెలిసిన వ్యాకరణం క్రిందికి రానివి తప్పులని నిశ్చయం చేసేయాలా? నీకు తెలియని శబ్దం అపశబ్దమేనా? శబ్దజాలమంతా నీకు తెలుసా? నిఘంటువులోకి ఎక్కని శబ్దమల్లా అపశబ్దమేనా?—నిజంగా కళాపరమైన కోరికవుంటే కవి మీద గౌరవంతో ఆ పుస్తకం చదవాలి. తెలియని వన్నీ తప్పులనెయ్యకూడదు. ఒకటికి రెండుసార్లు చదవాలి. కవి గ్రంథాన్ని విమర్శించడానికి కాలం వుంది. దానికి వదిలిపెట్టాలి—అన్నాడు.

తప్పుల్ని ఒకరినుంచి ఒకరిమీద మోపే ప్రయత్నాన్ని పరిహాసం చేసే ఒక కథను ఉదాహరించాడు. —కనక—మీ తాతగారి పుస్తకాల గుణదోషాల్ని వెతికి విమర్శించే పని పెట్టుకోనని చెప్పాడు.

జిరిఘూలశాస్త్రి యిట్లు పలికెను:—

నాయనలారా! ఈలేఖ వినుఁడు:—సాక్షికి—అయ్యా! నమస్కారములు.

మాయూర నొకకవి యున్నాఁడు. ఆతఁ డనేకనాటకములు నవలలు రచించినాఁడు.

ఆయన బాగుగనే కవిత్వము చెప్పగలఁడని నావిశ్వాసము. ఆంగ్లేయభాషను జదివినవాఁడు. ఆయన మిగులఁ బిఱికివాఁడు. పదిమందిలోనికిఁ వచ్చునెడల నెట్టబట్టనుచూచిన సంతపశువు వలె నెగిరి యెగిరిపడును. కేవలము కుగ్రామమున నుండువాఁడు కావున నాతఁ డెవరిని జూచియెఱుఁగడు ఆతని నెవరు చూచియెఱుఁగరు. అతఁడు గ్రంథరచనాసమర్థుఁడనియే యనేకు లెఱుఁగరు. ఆతని గ్రంథము లచ్చుపడకపోవుటచేత నాతనిపేరు వ్యాప్తిలోనికి రాలేదు. అతఁడు దైవభక్తికలవాఁడు. ధర్మబుద్ధిగలవాఁడు. పాపభీతికలవాఁడు. ఏవిషయముం దుగూడఁ బ్రవేశించుటకు భయముకలవాఁడు. మిత్రు లొకరిద్దఱు వచ్చునెడల వారియెదుట మాత్రము స్వేచ్ఛగా సంతోషముగాఁ జక్కఁగాఁ జమత్కారముగా మాటలాడును. క్రొత్తవాఁ డెవఁడైనవచ్చినఁ దలవంచుకొని మాటలాడక యూరకుండును. ఈతఁడు విద్వాంసుఁ డని, కవియని, ధీశాలియని యాతని గ్రామమునకుఁ జుట్టుపట్టులనున్న గ్రామములవారిలోఁ గొందఱుమాత్రమే యెరుగుదురు. సమీప గ్రామమునుండి యొకఁడు వచ్చి యాతని నాశ్రయించుచుండెను. ఒక సంవత్సర మాశ్రయించినపిదప నాతఁ డీతనితోఁ గొంతచనువుతో మాటలాడసాగెను. ఇంకను గొంతకాలము వారికి స్నేహ మభివృద్ధి యైనపిమ్మట నొక్కనాఁ డానమీపగ్రామవాస్తవ్యుఁ డాతనితో నిట్లు మాటలాడసాగెను. ''అయ్యా! మిమ్ము లను గొంతకాలమునుండి యాశ్రయించుచున్నాను. మీవలన నేదియో మేలుకోరి యాశ్ర యించుచున్నాను గాని నిష్ప్రలాభినంధిచేఁ గాదు కాని మీరు నాకేమియు మేలుచేయనక్కఱ లేదు. మీవలన భాషకు మేలుజరుగవలసియున్నది. అందులకై మిమ్మింతకాల మాశ్రయించి తిని'' ఇట్లాతఁడు పలుకుట తొడనే మెత్తగనుండినవాఁడు రవంత గట్టిపడెను. తలయెత్తికొని యుండు వాఁడు తల వంచుకొనెను. ఇదివఱకుఁ బ్రసన్నుఁడుగనుండినవాఁ డేమో సంకుచిత వదనుఁడయ్యెను.

అట్లయ్యును 'మిత్రమా! నీవాంఛయేదో తెలుపు'మని యాతఁ డాతని నడిగెను. ఇదిగో చెప్పెదము. మాతాతగారు కొన్ని గ్రంథముల రచియించిరి అవి తాళపత్రములమీఁద వ్రాయఁబడిన గ్రంథములు కావు. పీచుకాగితములమీఁద నవి వ్రాయఁబడియున్నవి. కొన్ని దండకములున్నవి. రెండుమూఁడునాటకము లున్నవి. నాల్గుశ్రవ్య ప్రబంధములున్నవి. పదిశతకములవఱ కున్నవి. ఒక వేదాంతగ్రంథము కూఁబోలు నున్నది. ఈగ్రంథముల న్నియు చాలవఱకు మంచిస్థితిలో యున్నవికాని కొన్నిస్థలములం దక్షరములు పోయినవి కొన్నిచోటుల నన్వయములుగ నున్నవి. కొన్నికొన్నిశబ్దములు నుశబ్దములు కావని కొందఱు నుచున్నారు. నాకు భాషాపాండిత్యము లేదు. వానిలోని మంచిచెడ్డల నేనెఱిఁగినవాఁడనైనయె డల మీకింతశ్రమ మిచ్చియుండను. అవి మీరు పరిష్కరించి నన్ను గృతార్థునిజేయునెడల వాని నచ్చువేయింతును. ఆ గ్రంథములు భాషాప్రచారములో నున్నయెడల మాతాతగారి యాత్మ సంతసించును. చదువుకొనువారనేకులు బాగుపడుదురు. స్వల్పముగ ధనము నాకు రాఁగలదు. కావున మీరు నామాటను ద్రోసిపుచ్చరని నమ్మియున్నాను'' అని యాతఁడు వినయముతోఁ బలికెను. అప్పు డాతఁ డిట్లు పలికెను. ''నాయనా! నీయభిప్రాయమేమో నాకుఁ దెలిసినది నీతాతగారిని నెనెఱుఁగునంతటి యదృష్టము నాకుఁ బట్టకపోయినను నాయననుగూర్చి వినినివాఁడనుగాను. ఆయన గొప్పకవియనియు నాటకాలంకారసాహి త్యము బాగుగాఁ గఱపారనియు యోగాభ్యాసపరుఁడనియు, భగవద్భక్తుఁడనియు వినియుం టివి. ఆయన రచియించిన గ్రంథములలో నందర్భములను నవరింపుమని నీవు నన్నుఁ

బ్రోత్సహించుచున్నావు. వానిలోఁ దప్పులున్నవని నీకు న్యాయముగాఁ దెలిసికొనుట కవకాశము లేదనుచున్నావు. ఎవరో వానిలోఁ దప్పులున్నవని నీతోఁ జెప్పియుందురు. అవి తప్పులో యదార్థమగు నొప్పులో వారుమాత్ర మెఱ్ఱిఱుఁగుదురు? నాయనా! శబ్దార్థము లొకరిసొమ్మా? ప్రమాదములకు లోనుగానివారెవ్వరు? మీతాతగారు బ్రహ్మజ్ఞాన సంప న్నులు. ఆయన యోగదృష్టిచే నాగ్రంథములు వ్రాసియుందురని తోఁచుచున్నది. నీ కసందర్భములని తోఁచినవానిని సందర్భములనియే వారు ప్రయోగించియుందురు. ఒకకవి గ్రంథము వ్రాయుట కెంతయో శ్రమమొందియుండును. ఎంతబుద్ధియో యందున వినియోగ పఱచి యుండును. ఎన్నిసారులో దానిని గ్రిందినుండి మీఁదికి మీఁదినుండి క్రిందికిఁ బరిశీలించియుండును. తన శక్తియంతయు దానిపై ధారపోసి యుండును. అట్టి గ్రంథమును దెఱచి యాదృచ్ఛికముగ నీవేదో పత్రమునుజూచి ''హేహే! ఇందునఁ దప్పులున్న''వని నీవనుట బుద్ధిహీతనకాదా? ఇంకొకపత్రముఁ దెఱచి 'అబ్బే యిందునఁ బాత్రౌచిత్యము భ్రష్టమైన''దని తేలికగ నీవు మాటలాడుట పిచ్చికంటె భిన్నమా? ఉన్మత్తుఁడా యుత్తమకవి గ్రంథములను విమర్శించుట! కవి తన గ్రంథరచనయందుఁ బడినకష్టములలో సహస్రాంశ మైన నీవు పడకుండనే గ్రంథములో దప్పులున్నవని పలుకుటకు నీవెవఁడవు? ఆమూలాగ్ర ముగనైనఁ గ్రంథమును జదువకుండ యధిక్షేపించుటకు నీకేమి యధికారమున్నది? మీమాత్రపుఁ బ్రయోజకుఁడు గ్రంథకర్తకాఁడనియే నీయభిప్రాయమా? తప్పులని నీవనుకొ న్నావే. తప్పులని నీకాతెగనీలు గెందులకు? తప్పులేవో యొప్పులేవో నీకు నిర్ధారణపట్టికలను జాగ్రత్త పఱచియుంటివా? నీకుఁ దెలిసిన వ్యాకరణము క్రిందకి రానివి తప్పులని నిశ్చయింప వలసినదేనా? నీకుఁ దెలియనిశబ్దమపశబ్దమనియే నీనిశ్చితమా? శబ్దజాలమంతయు నీ వెఱుఁగుదువు కాఁబోలు నేమి? నిఘంటువులో లేనంతమాత్రమున నపశబ్దమని నిరాకరింపవ చ్చునా? శబ్దస్వరూపముల లెక్కయేమి? భావస్వరూపమునే బరిహసించుచున్నావే? ఇక్కడ నౌచిత్యము లేదనుచున్నావే? ఇక్కడ స్వభావము చట్టుబండలైనదని పలుకుచున్నావే? ప్రపంచములోని బాహ్యాంతర ప్రకృతులు నీకుఁ గరతలామలకములు కాఁబోలు నేమి? నీప్రకృతినిబట్టి యస్వభావమైనదానిపై నడ్డుగీఁత గీయవలసినదియే నీయాశయమా? నీప్రకృ తిని బరిశీలించుకొని తెలిసికొనలేనివాఁడవు మూఢా! నీ వొరులప్రకృతిని బరశీలించి యది స్వభావమని యిది స్వభావమని పలుకుట నీతరమా? పప్పులో గరిటెలాగున నిత్యము నీసంసారమునందు నీవు తిరుగుచున్నావు కదా! నీయింటిలో నొక్క ప్రకృతినైన తెలిసికొనఁ గలిగితివా? నీయెదుట మొద్దులలాగున నీవలెనే తిరుగుచు మాటలాడుచుఁ జేష్టలాచరించుచు నున్నవారి ప్రకృతులనే నీకుఁ బరిశీలించుటకుఁ జేతగాదే అట్టిచో పుస్తకమందలి పాత్రముల స్వభావములను గనిపెట్టఁగలవేమి? ఆ పాత్రము లేకాలమందు నివసించిరో యేదేశమందు నివసించిరో, యేపరిస్థితులనడుమ నివసించిరో వారి విద్యాబుద్ధు లెట్టివో వారాడిన మాటల కేయే మనస్థితులు కారణములో యట్టి మనస్థితులు వారికిగల్గుట కిదివఱకు వారనుభవించిన కష్టసుఖము లెంతమట్టునకు హేతువులో వారు మనస్సువిప్పియే మాటలాడుచున్నారో ప్రచ్ఛన్నముగనే మాట లాడుచున్నారో యట్టిచింతలు–యింతకంటె సహస్రగుణాధికము లగు చింతలు–ఒక పాత్రమాడిన యొక్క చిన్నమాటనుగూర్చి తలఁగొట్టుకొని పరిశీలింపవ లసియుండఁగా–నోహో? ఊనరవల్లిరంగులకంటె, నింద్రధనుస్సురంగులకంటె, వాయువు లోనిపోకలకంటె, గంగ వెల్లిరాకలకంటె ననేకకోట్లరెట్ల సంచలనముతో చంచలత్వముతో

నున్న మన సత్యములోనిమాయ సందుగొందుల పద్మవ్యూహ నమస్రమండలి తలవెండ్రుకల చిక్కుకంటె చిక్కులగుచిక్కుల నూడఁదీయగలవేమి? సెబాన్ కాళిదానునికంటె మురారి యెక్కువ స్వభావజ్ఞానము కలవాఁడని యున్నవారిప్పటికిగూడ నెందరో యుండుటలేదా? షేక్స్పియరు కంటె బెన్‌జాన్సను యెక్కువవాడన్నవాద మిప్పటికిఁగూడ ఇంగ్లాండులో నచ్చటచ్చట నేడ్చుచున్నదేకాని శాంతించినదా? విమర్శకాగ్రగణ్యుఁడైన డాక్టరు జాన్సను గారు షేక్స్పియరునుగూర్చి యేమివెప్పినారో యెఱుఁగుదురా? షేక్స్పియరునకు రసపోషణజ్ఞానము తక్కువ యనియును నెట్టి గంభీరమైనరసమును పోషింపవలసిన సమయ మందైనను రవంత హాస్యరసప్రకటనమున కవకాశ మున్నదని తోచినయెడల వెనుకఁ బోషించుచున్న రసమంతయు ధ్వస్తపఱచి హాస్యరసము వెంట కుఱ్ఱువాఁడు శీతాకోకచిలు కవెంటఁ బరుగెత్తినట్లు బరుగెత్తుననియు నింతకంటె నసందర్భముగ మఱియేమేమో పలుకలేదా? ఆతనిమాట యెంతసత్యమైనదో ప్రపంచమంతయు నిప్పు డెఱుఁగునే! కాళి దాను శాకుంతలములో దుర్వాసుఁడను మహర్షి యిచ్చిన శాపము నుంగరము మొదలగు గొడవయంతయు నదికినది కాదని యధిక్షేపించినవారెందఱు? ఇప్పుడు వానియావశ్యక మేదో యందఱకు విశదమైనదికాదా? మాక్బెతులో విచెనును ప్రవేశపెట్టి నాటకమంతయు వల్లకాడుచేసినాఁడని షేక్స్పియరును ఎందఱు మహావిమర్శకులు దూషింపలేదు? ఆ విచెనునుబట్టియే యది ప్రసంగములోని యత్యుత్తమనాటకములలో నొక్కటియైనదని యిప్పుడు తేలినదికాదా? ఇటు లెన్ని చెప్పవచ్చును. కళాకర్మమైన గ్రంథము ననుభవింప నిచ్చ నీకుఁ గలదేని కవియెడల గౌరవము కలిగి దానిని జదువుము. తెలియనివేవో తప్పులని యనవలదు. ఒక్కసారి చదివినయెడలఁ దెలియకున్న మూడుసారులైనఁ జదువుము. అప్పటికిని సందేహములు విడనియెడలఁ బెద్దల నడుగుము. తెలిసి కొనుము. అంతేకాని కవినిగూర్చి బుద్ధిహీనమైన మాట యెన్నఁడును పలుకకుము. కవి గ్రంథమును విమర్శించుటకుఁ గాల మున్నది. దానికి వదలిపెట్టుము. నాయనా! ఒకఁడు వ్రాసినదానిలోఁదప్పుపట్టుట కిన్ని బాధలున్నవి. ఇన్నిచిక్కు లున్నవి. సత్యశోధ, నతీశోధ, స్వభావశోధ, సత్కవిశోధ, సర్వేశ్వరశోధయు నొకరితరమా? తప్పులను భ్రమముచే, నొప్పులను తప్పులఁ జేసినవా రెందఱు ఇట్లొనర్చుట నిజముగాఁ బాపమని నాభయము. నాయనా! ఒక చిన్న కథను జెప్పెద. మునుపు మనవారు చెప్పినకథయే నేను గ్రొత్తగఁ గల్పించినది కాదు.

ఒక యూరి కొకసన్యాసి వచ్చెను. ఆసంగతినెఱిఁగి గ్రామవాస్తవ్యులలో నొకగృహస్థుఁ డాసన్యాసికి భిక్షావందనమొనర్చి తలయింటి కాహ్వానించెను. ఆగృహస్థుఁడు బీదవాఁడు. అందుచే భటుల సాహాయ్యములేనివాఁడు. సన్యాసివడ్డనలోనికి గొల్లయింటినుండి పెరుగు దీసి కొని వచ్చుట కెవ్వరును లేక తానే తీసికొని వచ్చుచుండెను. ఇంతలో నొకనర్పము నొడిసిపట్టి యొకగరుడపక్షి యంతరిక్షమునఁ బోవుచుండెను. ఆసమయమున యాపాము నోటినుండి గరళబిందువులు కొన్ని యాబ్రాహ్మణుని దధిపాత్రములోఁ బడెను. పాపము! బ్రాహ్మణుఁ డేమియెఱుఁగును? ఆదధి నింటికిఁదెచ్చి సన్యాసికిఁ బెట్టెను. సన్యాసి చచ్చెను. కొంతకాలమైనపిమ్మట నాగరుడపక్షియు నాపాము నాబ్రాహ్మణుఁడు యమలోకమున యమునియెదుట నిలువఁబెట్టబడిరి. బ్రాహ్మణునిపై సన్యాసినిజంపిన బ్రహ్మహత్యపాతకము మొదట మోఁపబడినది. అప్పుడు బ్రాహ్మణుఁడు దండధరునితో నిట్లనియెను. ''అయ్యా!

నాకు బ్రహ్మహత్యాపాతక మేమున్నది? సన్యాసికి భిక్షచేసిన పుణ్యమేకాని బ్రహ్మహత్యాపాత కము నాకెట్లు సిద్ధించును? పెరుగులో విసమున్నదని నేనెఱుఁగుదునా? నేను పెరుగుదెచ్చు చున్న కాలమందు గరుడుఁడు సైనుండి సర్పమును బట్టుకొనిపోవునని నేనేమైనఁ గలఁగం టినా? నేను జేయనిపనికైనాపై నేరము మోపుట తగునా? బ్రహ్మహత్య నాకుఁ గట్టఁదగదు'' ఇంతసందర్భముగా నాతఁడు పలుక దండధరుఁడు ''గరుడపక్షీ! బ్రహ్మహత్య నీకుఁ గట్టవలసియున్నది. నీ వేమందువు'' అని పలికెను. ''అయ్యా! దండధరా! ఇదియేటిన్యా యము. నాకాహారముగ భగవంతుఁడు నియమించిన పామును బట్టుకొని నేను దారిని గాలిలోఁ బోవుటయేమి? భూలోకమున నెవఁడో చచ్చినాఁడని యాతనిఁ జంపినపాపము నానెత్తినిఁ గట్టుటయేమి? ఎంత విరుద్ధముగానున్నది? బ్రాహ్మణుని జంపవలసిన యావశ్య కత నాకేమిగల్గినదో రవంత యోజింపరాదా? నేనాతనికిఁ గావలసినవాఁడనని జంపితినా? ఆతని యాస్తిని వైచుకొనుటకుఁ జంపితినా? ఆతనిని స్పృశింపకుండనే యాతనిని జూడకుం డగనే యాతని నెఱుఁగకుండగనే యాతని దలఁపకుండగనే యాతని జంపితి ననుట న్యాయమా?'' యని గరుడుఁడు పలికెను. అంతట దండధరుఁ డేమియుఁ దోఁపక ''సర్పమా! నీజిహ్వాగ్రమునుండి పడినవిషబిందువులచే సన్యాసి చచ్చినాఁడు. కావున నీకు బ్రహ్మహత్య కట్టవలసియున్నది. నీవేమందు'' వని పలికెను. ''అయ్యా! దండధరా అన్నిటికంటె నిది బాగుగా నున్నది. గరుడుఁడు ననొక్కడిసిపట్టుటతోడనే నాచైతన్యము పోయినది. చచ్చిన నాకళేబరమునుండి విషబిందువులే జారినవో రక్త బిందువులే జారినవో నేను జచ్చినతరువాత జరిగినవానికిఁగూడ నేనే బాధ్యత వహింపవలసినదనుట ధర్మమా? ధర్మస్వరూపుఁడవే. నేను బ్రహ్మహత్య వహింపను–నాకేమి?'' అని సర్పము నిర్దాక్షిణ్యముగాఁ బలికెను. అంత దండధరుఁడు దగ్గలేక, మ్రింగలేక, యూపిరి సలుపక మిడు తుమిడుతు రవంతసేపాద్విజత్రయము వంకఁజూచి ఱేపాలోచింతము రండని యప్పటికి వారిని వదల్చుకొనెను.

ఆమఱునాఁడు భూలోకమున నిద్దఱు బ్రాహ్మణులు పొలములో పంటలయంచనా చూచుటకై కలసి పరిమళ్ల సమీపమునఁ దిరుగుచుండిరి. వారిలో నొక్కఁ డింక నీయూర నుండఁదగదు పోవుద మని రెండవ వానితోఁ బలికెను. ఇంతలో రెండుపక్షులు సమీపవృక్షముమీఁద మాటలాడుకొనుచుండెను. పక్షిభాష వారియిద్దఱిలో రెండవవాఁ డెఱుఁగును. మగపక్షి తాను యమలోకమునకు విలాసార్థముగాఁ బోయితిననియు బ్రహ్మహ త్యనుగూర్చి పెద్దతగ వచ్చట జరిగినదనియుఁ దీర్పు జెప్పుటయే తరువాయిగా నున్నద నియు నది ఱేపు చెప్పుదురనియు ఱేపు గూడ యక్కడకువెళ్లి యాతీర్పువిని నీకుఁ జెప్పెదననియు వివరములతో గూడ నాఁడుపక్షితోఁ జెప్పెను. ఆమాట లీరెండవవాఁడు విని యాశ్చర్య రసమగ్నుఁడై ఱేపటితీర్పేదో వినఁగోరి మొదటివానితో ''నీయూరనుండి యెల్లుండికాని బయలుదేరిరా'' నని చెప్పెను. అంత మొదటివాఁ డందులకుఁ గారణమేమని గ్రుచ్చిగ్రుచ్చి యడుగఁగాఁ జివరకు రెండవవాఁడు పక్షివలనఁ దాను వినినయంశములన్నియుఁ బూసగ్రుచ్చినట్లు చెప్పెను. ''ఈమాత్రమునకు యమున కింత యోజనమెందులకు? ఱేపటివఱకుఁ దీర్పు నాఁపియుంచుట యెందులకు? గరుడునకు బ్రహ్మహత్యదోషము లేదు. సర్పమున కంతకంటె లేదు. ఉన్నదోషమంతయు బ్రాహ్మణు నిది; తాను సన్యాసి కాహారముగ దధిని దీసికొని పోవునప్పుడు దధిపాత్రపై మూఁతవేయకపో

వుట యాతనితప్పు. అట్లు చేయవలసినవిధిని చేయక పోవుటచే బ్రహ్మహత్య బ్రాహ్మణునిత లపై గట్టవలసినది. తీర్పింతసులభముగాఁ గనఁబడుచుండగా యముని కీనీళ్లు నములుట యెందులకో'' అని మొదటివాఁడు రెండవానితోఁ జెప్పెను. ఈమాటలు పక్షులుగూడ వినినవి. వానిలో మగపక్షి మరునాఁడు యమలోకమునకుఁ దిరుగఁబోయి సభలోఁ గూరు చుండి దండధరునితో నిట్లనియెను. ''అయ్యా! దండధరా! బ్రహ్మహత్యానియోగములో నీదినమునఁ దీర్పు మీరీయవలసియున్నది. నిన్నను మీకేమియుఁ దోఁపక కాఁబోలు దీర్పు నాఁపియుంచిరి. బ్రాహ్మణుఁడు దధిపాత్రపై మూతవేయకపోవుటవలన నీబ్రహ్మహత్య సిద్ధించి యుండుటఁబట్టి యాబ్రాహ్మణునకే బ్రహ్మహత్య కట్టవలయు'' ననెను. ఈమా టలు విని దండధరుఁడు కోపించి ''ఈతీర్పు నీకుఁ దోఁచినదా మరి యెవ్వరైనఁ జెప్పిరా'' యని ప్రశ్నింప మాయూరికివచ్చిన యంచనా బాపనయ్యలలో మొదటివాఁడు చెప్పినని చెప్పెను. ''ఈలోకమువారమైన మేము ధర్మనిర్ణయ మెనర్చుటకు సందేహించుచుండగ నడుగకుండఁ దీర్పుఁజెప్పుటకు సాహసించిన యాబ్రాహ్మణునినెత్తిపై బ్రహ్మహత్య కట్టితి నని యాతనితోఁ జెప్పు''మని యముఁడు పక్షితోఁ బలికెను.

వింటివా? నాయనా! నీవు నన్ను సీతాతగారి గ్రంథముల విమర్శించి గుణదోషనిర్ణయ మెనర్చుమని చెప్పితివి. సీతాత నన్నడుగ లేదు. అంద లేకారణముననో యట్లుచేయక సందేహించి యూరకుండఁ దగుదు నమ్మయని నేను బనిలేనిదే ముందునకువచ్చి యీగ్రంథ ములను విమర్శించునెడల నాబ్రహ్మహత్యదోషము నాతలపయిఁ బడునని మిగుల సందేహము గానున్నది. అందుచే నావలనఁగాదు. నీవు దయచేయవచ్చును. నీకు భగవంతుఁడు మేలొనర్చునుగాక.

51. ఉపసంహారం

రెండోసారి స్థాపించిన సాక్షిసంఘం (1920 సెప్టెంబరు 1) తన ఉపన్యాస పరంపరను రెండేళ్లపాటు కొనసాగించింది. ఈ ఉపన్యాసాలన్నీ ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో ప్రకటన కూడా అయ్యాయి. ముందు ఒక్క సంవత్సరమే అనుకున్న ఉపన్యాసాలు రెండు సంవత్సరాలు నడిచాయి. ఇంక ఈ ఉపన్యాసాలు ఆపుతామని ఆంధ్రశ్రోతృ, పాఠకులకు వేసిన విన్నపమే ఈ ఉపసంహారం.

ఈ సందర్భంగా జంఘాలశాస్త్రి చాలా వినయంగా మాట్లాడాడు. ఎన్నో విశేషాలు ఈ ప్రపంచంలో పుట్టి గతించిపోతుంటే, సాక్షిసంఘం మూతపడడంలో ఏమీ వింతలేదన్నాడు. కవి అయినవాడు ప్రజలందరిలోకీ తానే అగ్రగణ్యుణ్ణి అనుకుంటాడు. చచ్చిపోయాక కూడా శాశ్వతకీర్తితో వుంటాననుకుంటాడు. పెడితే పెళ్లి లేకపోతే తద్దినం అనే ధోరణిలో వుంటాడు. తనే పండితుణ్ణనీ, తనే కవిననీ, తనవల్లే భాష ఉద్ధరింపబడుతోందనీ, అనుకునేవాడు శుంఠలలో శుంఠ.

ప్రపంచపు పరిధిలో నిలిచిచూస్తే సృష్టిలో ఎన్నెన్నో పరిణామాలు జరిగిపోతున్నాయి. జరిగిపోతాయికూడా. ప్రకృతికి ఎప్పుడు ఏదేశంలో, ఎలాంటి వాడవసరమో వాణ్ణి కాలమే బయటకు తీసేసి నిలబెడుతుంది. అంటే, మనిషి కాలానికి లొంగివుండేవాడు–కనుక కవి అహంకరించ నక్కరలే దని జంఘాలశాస్త్రి వాక్కు.

సాక్షి వృద్ధుడై సూర్యోపాసన చేసుకుంటున్నాడు. కాలాచార్యులు సర్పవరం భావ నారాయణ స్వామి ఆలయంలో వంటకు కుదిరాడు. వాణీదాసుకి కాకినాడ జాతీయ పాఠశాలలో ఉద్యోగంవచ్చేలాగుంది. జంఘాల శాస్త్రి బదరీ నారాయణం యాత్రకి సిద్ధపడుతున్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! సాక్షిసంఘము తిరుగ స్థాపించి రెండుసంవత్సరములు నిన్న సెప్టెంబరు మొదటితేదికిఁ బూర్తియయివది. ఇది 1920 సెప్టెంబరు 1వతేదీని ఆంధ్రపత్రికాధిపతియగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ప్రోత్సాహమున రెండవసారి స్థాపింపఁబడినది.

ఆయనపత్రికలోని సారస్వతానుబంధమునకు వారమున కొక్క సాహిత్యోపన్యాసము నొక్కసం వత్సరమువఱకు బంపించుట కేర్పాటుజరిగినది. ఆసంవత్సరముకూడఁ బూర్తియైనది. ఎంతకాల ముపన్యాసము లిచ్చుచున్నను భాషాభిమానులగు మీరు వానిని దయతో నాదరింప కపోరు ఉపన్యాసవిషయములకుఁ బ్రపంచమున హద్దుపడ్డున్నదా? ఇదివఱకు మే మెన్నివిష యములఁ గూర్చియో చెప్పియుంటి మని గర్వపడుచుండుటలేదు. అయ్యో! ముఖ్యముగాఁ జెప్పవలసిన వింక నెన్నియో మిగిలిపోయెనే యని విచారించుచున్నాము.

సాక్షి కుత్సాహమే యున్నది కాని దేహశక్తిలేదు. ఆతఁడు మొదటినుండియు దుర్బలశరీరుండు. వార్ధకమున నిప్పుడు మఱింత దుర్బలశరీరుండై యున్నాఁడు. సాక్షిసం ఘమును సాగించుట కింక నాయన యభిప్రాయము లేదు. శనివార మెప్పుడువచ్చునో –సాహిత్యోపన్యాస మెప్పుడు చూతుమో–యని యత్యంతోత్సాహముతో నున్న సాక్షి పాఠకుల కందఱి కిప్పుడాశాభంగము కలిగింపవలసివచ్చెఁగదా యని సాక్షి విచారించుచున్నాఁడు. కాని నాయనలారా! ఒక్కవారము మాత్రమే రవంత క్రొత్తగ నుండునేమో కాని వైవారము నుండి ప్రాతపడియే పోవును. ఎన్నెన్ని మహాసంఘములు స్థాపింపఁబడలేదు. ఎన్నియంతరిం పలేదు. వానికెవరిప్పుడు విచారించుచున్నారు. అట్టివానికే గతిలేనప్పుడు జలబుద్బుదసమ మైన సాక్షిసంఘముమాట చెప్పవలయునా?

దేశోపకారము నావలన జరుగుచున్నదికదా, భాషాభివృద్ధి నావలన జరుగుచున్నది కదా, నేను లేకుండు నెడలఁ బ్రపంచమునకు లోపముకదా, యని యనుకొనువానికంటె వెఱ్ఱిముండకొడుకు ప్రపంచమున లేఁడు. నావంటికవి ప్రపంచమున లేఁడు. ప్రపంచములో మంచి కవిత నాతో సరియనుకొనువాఁడు బుద్ధిహీనసార్వభౌముఁడగుట కేమైన సందే హమా? కవియగువాఁడు తానే ప్రజలలో నగ్రగణ్యుఁడనుకొనునే! ప్రపంచమున నాతనికున్న గర్వము తెగనీలుగు–మఱియొకని కున్నవా? వారిలో సాధువు లనేకులున్నారు. కొంద ఱసాధులుగూడ నున్నారు. అట్టివాని తత్త్వమునుగూర్చియే చెప్పుదును. ఆతనికున్న శాపాలాపములు–నాకాశగమనములు–నధఃపతనములు–మఱియొకనికి లేవు. నన్ని పాతరోగి కంటె విస్మృతియే! కల్లుద్రావినవానికంటెఁ గైపే! ఉన్మత్తునికంటె నుద్రేకమే! చేతిలోఁ జెంబులేదు, కావలసినంత దాహము ఱాకులోని కాదరవులేదు, కావలసినంత యూఁకలి సంసారమును జరుపుకొనఁదగిన శక్తిలేదు. ప్రపంచపరిపాలనతంత్రమును బోధించును. బ్రతికియుందునని సంపూర్ణవిశ్వాసముతో నుండును. పైనచేతఁబెట్టినవాఁడు ప్రభుఁడు, పెట్టనివాఁడు పిశాచము. తనకవిత్వమునకు బళి యనినవాఁడు పండితుఁడు, అననివాఁడు పామరుఁడు. తన్నుఁ జేరఁదీసినవాఁడు చక్రవర్తి, చేరఁదీయనివాఁడు చండాలుఁడు. అంతే –అంతే అతని మంచిచెడ్డలవిభాగము కడుపులోని మంటచేఁ గనఁబడినవారినెల్ల బానినమొ దలు ప్రభువువఱకు భవతి భిక్షాందేహి ఈయనివారినిగూర్చి నోటికివచ్చినట్లెల్ల కూఁతలు. చేతికివచ్చినట్లెల్ల వ్రాఁతలు, సామాన్యులయెడల బడితెబజాకుఁ గూడఁ బ్రయత్నము పర్యవసానమునఁ జెప్పునదేమనగా:–తానే పండితుఁడనియుఁ గవియనియుఁ దనవలననే భాష యుద్ధరింపఁబడుచున్నదనియుఁ దాను లేకున్నయెడల భాషకు నష్టమనియు ననుకొనువాఁడు ''శుంఠలందఱిలోపల శుద్ధశుంఠ.''

గోపురము ప్రక్కను జిత్రింపఁబడిన కోఁతి గోపురమును దాను

మోయుచున్నాననియుఁ దాను లేనియెడల గోపురముకూలిపోవుననియు ననుకొనుట యెట్టిదో–మోటారుబండి చక్రపుటాకుపై నున్నయ్యాఁగ నామూలమున బండి యెంతవే గముగాఁ బోవుచున్నదో యని యనుకొనుట యెట్టిదో–ప్రపంచశాసనముల కన్నిఁటికి బానిసయై పుట్టిన మనుజుఁడు ప్రపంచమునకు నావలన మేలుజరుగుచున్నదని యనుకొనుట యట్టిది. పుణ్యపాపముల పరిపాకమునవలనఁ గొన్నిదేశములు భూకంపములచేఁ బాతాళమునకుఁ గ్రుంకిపోవుచున్నవి. కొన్ని ద్వీపములు సముద్రమునుండి లేచుచున్నవి. కొన్ని జాతులు వృద్ధియగుచున్నవి. కొన్ని నశించుచున్నవి. కొన్నిగ్రహము లాటిపోవుచున్నవి. కొన్ని క్రొత్తనక్షత్రములు బయలుదేఱుచున్నవి: ఈసృష్టి యెగిరిపోవుచున్నది. మఱియొకసృష్టి సిద్ధమగుచున్నది. కాలచక్రమే యంతయుఁ ద్రిప్పుచున్నది. ఎప్పటికేదేశమున కెట్టిపరిస్థితులనదుమ నెట్టివాఁ డర్హుఁడో యట్టివానిని గాలమేప్రకృతిగర్భము నుండి పైకిదీసి యటఁబెట్టుచున్నది. అప్పటికనుకూలమైన రాగముతోఁ–దాళముతో –నాతని నాడించుచున్నది. పాడించుచున్నది. పాటయైనవెంటనే చెవిపట్టుకొని యీడ్చి పాఱవైచుచున్నది. స్వప్రయోజకత్వమున నాతఁ డట్లూడలేదు. అట్లు పాడలేదు. మఱియొక రీతిగా నాడుటకుఁగాని పాడుటకుఁగాని యాతని కవకాశములేక యట్లూడినాఁడు. అట్లుపాడినాఁడు–ఇకఁ బ్రయోజకత యేమున్నది. స్వాతంత్ర్యమేమున్నది? ఏమియులేదు. ''లేకేమిలేకేమి? Freedom of the will మనకులేదా? యని వెఱ్ఱివెఱ్ఱిమాటల నాధారపఱచుకొని నాపై నీసభలోని పదుచువాండ్రు గుట్టుమందురుగాక! నాయనలారా! ప్రత్యక్షానుభవమునఁగాని తెలియని యీనీతి మీకు బోధవలనఁ దెలియదు. ఇఁక బదియేండ్లోపికచేయుఁడు. తలవెండ్రుక లూడనిండు. పండ్లు రాలనిండు. దృష్టి తగ్గనిండు. ప్రపంచ లంపటత వలనఁ గలుగునన్ని మొట్లు సన్నితన్నులు నన్ని చెప్పుదెబ్బలు తగులనిండు. అప్పుడీయుపన్యానమును దిరుగఁజూడుఁడు. చెప్పఁదగినంతదృఢము నేను జెప్పలేదని మీ రప్పుడు నన్నధిక్షేపించకపోరు.

ఏమైననేమి ఏవియో కొన్ని వెఱ్ఱిమొట్టివ్యానములు మానభనుండి వెడలినవి. వానిని మీరంద ఱాదరించి వినినారు. మీయెడల మిగులఁ గృతజ్ఞులము. మాకింక సెలవిండు. సోదరీమణులారా! మా యుపన్యానములలోని యంశము లేవియైన మీమనస్సుల కెప్పుడైన నొప్పి గలిగించినయెడల దయాపూర్వకముగ మిమ్ము క్షమింపవేఁడుచున్నాము. దైవభక్తిఁ గలిగి మీరు తరింపుఁడు. మీభర్తలను దరింపఁ జేయుఁడు. ఆంధ్రపత్రికాధిపతీ! అనేక నమస్కారములు. మేమెందునుగూర్చి యుపన్యానములిచ్చినను–నెట్లిచ్చినను –మాయందలి దయచే మీరు వానిఁ బ్రకటించినందులకు మేము కృతజ్ఞులము. మిమ్ము మానఘముతో సమావేశపఱచిన పరమేశ్వరునికటాక్షమున మేము చేయఁదగిన పనియేదో శక్తివంచనలేకుండ నిర్వహించుకొంటిమని నమ్ముచున్నాము. దేశక్షేమకరములైనట్టియు భాషోపకారములైనట్టియు ననేకకార్యములు మీచే నర్వేశ్వరుఁ డొనర్పజేయుచు మిమ్ము దీర్ఘాయురారోగ్యాదిసంపన్నునిగఁ జేసి రక్షించుగాఁక.

వృద్ధుఁడైన సాక్షి శేషించిన కొలఁదికాలము యథాపూర్వకముగా సూర్యోపాసనఁ జేసికొనుచు భగవంతునియాజ్ఞకై యెదురు చూచుచుండును. కాలాచార్యులు నర్సవరములోని భావనారాయణ స్వామి యాలయములోని తిరువంటుపల్లిలో పాచకోద్యోగియై

పోనున్నాఁడు. కారాగృహ నిముక్తుఁడైనప్పటినుండియుఁ గాకినాడ జాతీయ పాఠశాలలో నాంధ్రోపాధ్యాయపదవిని వాణీదానుఁ డపేక్షించుచున్నాఁడు. ఆతఁ డక్కడకుఁ బోవునేమో – జయసీతారామ్' అని నేను బదరీనారాయణమునకుఁ బోవుదును.

ఇదిగాక ఆంధ్రదేశీయులారా! బ్రహ్మపురము మొదలు బళ్ళారి వఱకు వినఁబడఁదగిన యొక్క కేకను గడపటిసారివేయుచున్నాను. వినుఁడు. 'సాఙ్ఖ్యపన్యాసములన్నియు నాళ్లు నంపుటములుగా నచ్చుపడుచున్నవి. ఈనెల చివరకు రెండు నంపుటములు పూర్తి యగును. పైమాసాంతమునకే మూఁడవదియు నాల్గవదియు వెలువడును. మాగ్రంథములను విక్రయిం చుటకు మేము మహారాజ శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులువారికి శాశ్వతమైన యధికార మిచ్చితిమి. మీరు వారికి వ్రాసి వానిని దెప్పించుకొని శ్రద్ధతో విమర్శనబుద్ధితోఁ జదువుఁడు. చదువుఁడు. మీకు భగవంతుఁడు మే లొనర్చుఁగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

372

BLANK PAGE

పాండవ విజయము

మూడవ సంపుటం

కవిశేఖర
పానుగంటి
లక్ష్మీనరసింహారావు

BLANK PAGE

విషయసూచిక

	పుట.
1. సాక్షి	1
2. సాక్షిసంఘ పునరుద్ధారణము	4
3. చిత్రలేఖనము	8
4. కవి	15
5. వైష్ణవుని యుపన్యాసము	23
6. వీరశైవులు	34
7. ఉన్మత్తుని యుపన్యాసము	44
8. ప్రకృతిశక్తులు	52
9. ఉన్మత్తుని ప్రలాపము	62
10. ఆయుర్వేదవైద్యుని యుపన్యాసము	68
11. సభావ్యాపారములు	77
12. సాక్షిసంఘ పునరుద్ధారణ	82
13. పురుషప్రయత్నము	85
14. అస్పృశ్యత	94
15. కురుక్షేత్రము	102
16. సభాస్యకీయ వ్యాపారములు	109
17. క్షురకసభ	112
18. సుఖప్రారబ్ధము	120
19. సభావ్యాపారములు	127
20. భవభూతి	132
21. ఉత్తరరామ చరితము-పటము	138
22. మహాత్ముని తపఃపరిసమాప్తి	146

23. తాజ్ మహలు	151
24. అత్యద్భుత స్వప్నము	157
25. గానకళ	165
26. పిచ్చివాని మరణ శాసనము	173
27. సుఖము, దుఃఖము	179
28. మహోపతివ్రత	187
29. సభా వ్యాపారములు	196
30. ఒక కథ	200
31. దొరకిన యుపన్యాసము	210
32. శ్రీమతి సు.స.గారికి బహిరంగ లేఖ	219
33. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారికి బహిరంగ లేఖ	227
34. సు.స.గారికి బహిరంగ లేఖ	236
35. ఆంధ్ర సాహిత్య పరిషదేకాదశ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసము	244

1. సాక్షి

1922లో సాక్షి సంఘం మూతపడిన తరువాత, - ఈసారి మళ్లీ తెరిచారు. జంఘాలశాస్త్రి ఈ విషయం ప్రకటిస్తూ, ఆంధ్రపత్రికలో ఇందుకు సంబంధించిన ప్రకటన శ్రోతలు చూసి వుండరనీ, మళ్లీ సర్వపురంలోనే, పోస్టాఫీసు ఎదుట ఇళ్లే సాక్షి ఆఫీసనీ తెలిసి వుండదనీ అన్నాడు.

జంఘాలశాస్త్రి వీధి అరుగుమీద ఒంటరిగా కూర్చున్నాడు. ఇంతలో ఒక అపరిచిత వ్యక్తి వచ్చి ఎదుట నిలబడ్డాడు. అతన్ని 'శనివారపు సంతకు వచ్చావా?' అని అడిగాడు. నిజానికి అతను ఉపన్యాసం వినడానికి వచ్చాడనే శాస్త్రి అనుకున్నా, బాగుండదని మాటమార్చి అడిగాడు. దాని మీదట తను అవలంబించిన 'దొంగ' మాటల పద్ధతి తనకే అసహ్యం వేసి - ఉపన్యాసం వినడానికి వచ్చావా! అని అడిగాడు. ఆ మనిషి తనకు సాక్షి సంఘమేమో, ఉపన్యాసమేమో ఏమీ తెలియదనీ, తమ కరణం గారికి మందు తప్పుగా ఇచ్చి చంపిన వైద్యుడవు కాదా? అని అడిగాడు. దానికి జంఘాలశాస్త్రి తను ఎందుకక్కడ కూర్చున్నదీ చెప్పాడు. ''అవసరం నీది గనుక, ఇలా ఇక్కడ కూర్చోవడం ఏం బాగాలేదు. శనివారపు పశువుల సంతలోకి వెళ్లయినా ప్రసంగించు'' - అని చెప్పి వెళ్లిపోయాడు.

జంఘాలశాస్త్రి ఈ ఉదంతం ఎందుకు చెప్పాడంటే, సాక్షి సంఘం మళ్లీ మొదలైంది శ్రోతల్లారా గమనించండి అని చెప్పడానికే —.

జంఘాలశాస్త్రి యిట్లు వ్రాసెను.

''సోదరులారా'' యని సంబోధించి యుపన్యాస మిచ్చుటకు సభలో నేనుదక్క మఱి యెవ్వఁడును లేఁడే! సాక్ష్యుపన్యాసములు తిరుగ నారంభ మగు నని యాంధ్రపత్రికారాజములోఁ బ్రకటించిన ప్రకటన నెవ్వరు చూచియుండలేదు కాఁబోలు! చూచి యుపేక్షించిరి కాఁబోలు! ఎటులైన నేమి? సభలో వినువాఁడు లేఁడు. సభలో నిది గొప్పలోపము కాదా?

గాయకుఁ డగువాఁడు వినువారు లేకుండినను దనలోఁ దానుపాడుకొని యొకప్పుడు సంతోషింపవచ్చును. కవి యగువాఁ డొకపద్యమును వ్రాసి, దానిని భైరవితో నొకసారి చదివి,

మారువాతో మఱియొకసారి చదవి తనలోఁ దా నానందింపఁ గలఁడు. చిత్రలేఖకుఁడగువాఁ డొంటెకుచ్చుతో నృష్టించిన తన యుంచుకొన్నదాని మొగమునెగ దిగఁ జూచి తనలోఁ దాను మురిసిపోఁగలఁడు. కాని వినువాఁడు లేకుండ ''ననఁగననఁగ'' నని కథ నెవఁడైన నారంభింపఁ గలఁడా? పీఁటలపై వధూవరులైన లేకుండఁ బురోహితుఁడు విఘ్నేశ్వరపూజ నారంభించుట యెక్కడనైన నున్నదా? తలుపులకు, గోడలకు, నటుకమీఁది గబ్బిలాలకు నుపన్యసించువాఁ డున్మత్తశాల కర్హుఁడు కాఁడా? ప్రబల వక్తప్రవరుఁడైన ''బర్క్'' దొర గారు వట్టిబల్లలకుఁ గుర్చీలకు నుపన్యసించెనని వినియున్న మాట సత్యమే. కాని, వారికిఁ గలిగిన పరిస్థితియే నాకుఁ గూడఁ గలిగిన దని నంతసించుట బుద్ధిహీనతకంటె భిన్నమా? అనేకసహస్రశ్రోతలయెదుట నుపన్యాసము లారంభించిన యాదొరగారి కుపన్యాసావసాననమ యమున నుపన్యాసద్రాఘిష్ఠతాదికారణములచేత శ్రోతలు లేకుండిన లేకుందురు గాక! మాకు మొదటి నుండియుఁ బూర్ణానుస్వారముగ నున్నదే. ఆజన్మదరిద్రుఁడు మృణ్మయపాత్రతో నీరు ద్రాగినాఁడు: అర్కవంశ్యమహారాజు త్రాగినాఁడు. అభావస్థితినిబట్టి సామ్యమును నర్ణయించుట తప్పు కాదా? మాచకమ్మకు ఋతుకర్మము లేదు. వార్ధకాక్రాంతయైన వనితకును లేదు.

ఒంటరిగ నుపన్యాసశాలలోఁ గూరుచుండుట యెందుల కని వీథియరఁగుమీఁదఁ గూరుచుంటిని. ఎవ్వరైన వచ్చుచున్నారేమో యని యటునిటు చూచుచుంటిని. ఇంతలో నెవ్వఁడో వచ్చి నన్నుఁ గొంచెమెఱిఁగినవాఁడువలె నాయెదుట నిలువఁబడినాఁడు. ఇతఁ డుపన్యాసము వినుటకే వచ్చినవాఁడనియే నానమ్మకము. శ్రోతలు లేకపోవుటచేతవారికై యెదురుచూచుచు వీథిలోఁ గూరుచుంటి నని యాతని కేమాత్రమైనఁ దెలియునెడల నపహసించునేమో యనభయముచేత ''శనివారపు నంతలోనికి వచ్చితివా'' యని యెఱుఁగనివాఁడువలె యాధాలాభముగ నడిగితిని. ఆహాహా! ఇంతలో మనస్సెంత దొంగతన మునకు సాహసించినదో! ఇంతనటన కిప్పు డేమంతపుట్టి మునిఁగినది? ఈతఁడెవఁడో క్రొత్తవాఁడు గదా! ఈతఁడు నన్నుఁగూర్చి యేమనుకొన్న నాకేమి? ఆతనిఁ జూచుటతోడనే మనస్సెట్టి యట్టి ముడుఁచుకొనియపోయినదే నత్యమడుగంటినదే. మోసమునకు ముందడుగుపడినదే. కల్లపలుకు నోటివెంట వెడలినదే! మనస్సున కింత పిఱికితన మేల యుండవలయును. ఇప్పుడంత యవసర మేమి వచ్చినది? ఉపన్యాసప్రారంభదినమున శ్రోతలు లేకుండుట తప్పా? ఆసంగతి యీక్రొత్తవానికిఁ దెలిసినంతమాత్రమున హానియా, అప్రతిష్ఠయా? ఇంతమాత్రమునకే మర్యాద మట్టిఁగలసిపోవునా? మర్యాదను గూర్చి పనికి మాలిన భ్రమములకు లోనైయెన్నియో నటన లొనర్చుచుంటిమి గదా? సైమనుజునిఁ గూర్చి మనకున్నలక్ష్యములో, భయములోఁ బదునాల్గవవంతులక్ష్యము, భయము మనకు భగవంతు నిపైనుండునెడల నెంతబాగుగా నుండును! ఈయిగిలింపులు-ఈ సకిలింపులు-ఈకల్లలు -ఈ గారడులు-ఈహస్తలాఘవములు-ఈయభినయములు నుండవుగదా. స్వచ్ఛమై, తేజస్వంతమై, నివాతమైన దీపకళికవలె మనస్సు నిరుపహతముగఁ బ్రకాశించుచుండునుగదా.

ఇట్లు మనస్సులో నూహించుకొని నటించిన నటనకు వెగటుపడి, యడిగిన ప్రశ్నమునకు బిడియపడి' ''అయ్యో! నీ వుపన్యాసమును వినుటకే వచ్చితివి కాదా'' యని బహిరంగముగ నడిగితిని. ''నీపేరేదయ్యా'' యని యతఁడు నన్నడుగఁ గొంత నిరుత్సాహ

మొందినవాఁడ నయ్యును వెంటనే మనస్సు నిర్మల మొనర్చుకొని ఛంఘాలశాస్త్రియని చెప్పితిని. ఆతఁడు డొక్కు నన్నుఁ దేరిపాఁఁ జూచి, ''నిన్నెచ్చటనో చూచిన ట్లున్నదయ్యా'' యని మొగము రవంత శాలోచనభావసూచనముగఁ బైకెత్తెను. ''ఔను నీవే కాదు. అనేకాం ధ్రులు దైవకటాక్షమున నాపేరు వినియుందురు. సాక్షిసంఘమని, సాక్ష్యుపన్యాసములని యాంధ్రలోకమునఁ గొంతసంచలనము కొన్ని సంవత్సరముల క్రిందఁ గలిగినది. ఆసందర్భ మునసే నీవు నాపేరు విని యుందువు. అటులైన నీవు నాకు మిత్రుఁడవే'' యని కొంత కలుపుగోలుతనమునఁ బలికితిని. ''సంవత్సరా లెక్కఁడనయ్యా, నాల్గుమాసములైనఁ బూర్తిగ నైనదా? సాక్షియేమో, సంఘమేమో, నాకాగొడవ యేమియుఁ దెలియదయ్యా. సన్నిపాతభైర విలో శుద్ధిచేయని నాభి వేసి మాకరణముగారిని టారునఁజంపినవాఁడవు నీవే కాదఁటయ్యా'' యని యాతఁడు కఠినముగఁ బలికెను. ''నాయనా నేను వైద్య మెఱుఁగ''నని యింక నేమేమో చెప్పఁబోవుచుండఁగా, ''నెఱుఁగక పోవుటచేతనేనయ్యా ఇంత కొంపతీసినా'' వని యాతఁడు తొందరతో నడ్డుగఁ బలికెను. ''నేను సారస్వత సాంఘికాద్యుపన్యాసముల నిచ్చినవాఁడనే కాని సన్నిపాతభైరవ్యాదు లిచ్చినవాఁడను గానయ్యా'' యని నే నంటిని. ''నీయుపన్యాసములవలన నిదివఱ కెవరు చావలేదుగద'' యని యతఁడు నిష్కల్మషముగ నడిగెను. లేదంటిని. ఇప్పు డిక్కడ నెందుల కుంటివని యాతఁ డడుగ, ''ఉపన్యాసమీయఁ దలఁచి వినువారికై నిరీక్షించుచుంటి''నని నే నంటిని. ''సరే కాని నీవు నీ యావశ్యకతకొఱ కుపన్యాసముల నిచ్చుచుంటివా'' యని న న్నాతఁడు ప్రశ్నించెను. ప్రత్యుత్తర మిచ్చుట కేమియుఁ దోఁపక కొంత సేపూరకుండి, ''నాయనా! సాక్ష్యుపన్యాసములు తిరుగ సాగింపవల సిన దని యనేకసోదరులు కోరినారు. ఈరీతిగ భాషాసేవ చేతనైనంత వఱకుఁ జేయుటకు నేనును సంకల్పించుకొంటిని. ఉభయపక్షములందుఁగూడ నావశ్యకత యున్న ట్లూహింప వచ్చు'' నని నేనంటిని. ''నాకు నచ్చలేదు. నీయావశ్యకతయే ప్రధానము కావున శ్రోతలు లేరని నీ విచ్చటఁ గూరుచుండక యిప్పుడు సాగచున్న శనివారపుఁ బశువుల సంతలోనికిఁ బోయి యక్కడ నుపన్యసింపు''మని పలికి యాతఁడు పోయెను.

సాక్షిసంఘము తిరుగ స్థాపింపఁబడినది. వెనుకటిసత్యపురమే సాక్షిసంఘస్థానము. లేఖాలయమున కెదుటియిల్లే సాక్షిసంఘకార్యాలయము. వెనుకసాక్షిసంఘసభ్యులే యిప్పటిస భ్యులు. వెనుకటివలెనే సాక్షి యనుశీర్షిక క్రింద నుపన్యాసము లీపత్రికలోఁ బ్రచురింపఁబ డును. నెలకు నాలుగే పడునో, యంతకంటెఁ దక్కువయే పడునో చెప్పఁజాలము. శుక్రవారపత్రికకొఱకు నిరీక్షింపవలయును నని సోదరులను బ్రార్థించుచున్నాను.

2. సాక్షి సంఘ పునరుద్ధారణము

జంఘూలశాస్త్రి సాక్షి సంఘం మళ్లీ ప్రారంభమైందని చెప్పి తొలి ఉపన్యాసం ఇద్దామని వస్తే శ్రోతలు లేక గతంలో ఊరుకున్నాడు. ఇప్పుడు, అదలాజరగడం ఒక విధంగా మంచిదైందని సంతోషిస్తూ తొలి ఉపన్యాసం చెప్పడానికిరోజు మంచిదన్నాడు. [illegible] వినాయకచవితి. శివ ప్రీతికరమైన రోజు. *1920* నాటిసాక్షి సంఘం శివరాత్రిరోజున స్థాపన జరిగిందట.

జంఘూలశాస్త్రి తన ఉపన్యాసం ప్రారంభించాడు. ధర్మశాలలు, దేవాలయాలు, వైద్యాలయాలు, సారస్వతసంఘాలు, మనకి చాలావున్నాయి. వాటిని పునరుద్ధరణ చెయ్యడంగాని, అటువంటివాటిని కొత్తగా స్థాపించడంగాని, మన పెద్దలు నిర్ణయించిన పవిత్రదినాలలో జరిపించడం మంచిది.

అవతారపురుషుల జన్మదినాలు, మరణించిన దినాలు, సంస్కర్తలజయంతులు, వర్ధంతులు, దేవీనవరాత్రులు, వసంత నవరాత్రులు, గణపతినవరాత్రులు, ఇటువంటి కార్యకలాపాలకు శ్రేష్ఠాలు. అలాచేస్తే ఆయా ధర్మకార్యాలలో, ఆరోజులకు అధిష్ఠాతలైన మహాపురుషులు, దేవతలుకూడా మనసభల్లోకూర్చుంటారు. ఆశీర్వదిస్తారు.—

ఇలా అంటూ జంఘూలశాస్త్రి ఒక మహా ఆవేశానికి, భక్తిపారవశ్యానికిలోనై పురాణదంపతులను-పార్వతీపరమేశ్వరులను-స్మరింపిచే ఒక దివ్యతేజస్సును ఎదుటచూసిన అనుభవం పొందాడు.

జంఘూలశాస్త్రి యిట్లు పలికెను.

ఆంధ్రపత్రికారాజములోని ప్రకటనమును గాంచి క్రిందటిసారి యమావాస్యాదినమున నుపన్యాసమునువినుట కెవరైన వత్తురేమోయని కొంతసేపు నిరీక్షించితిని. ఎవ్వరును రాలేదు. రాకపోవుటయే మంచిదయ్యెను. ఈదినము వినాయకచతుర్థి. శివప్రీతికరమైన దినము. మంగళకరమైన దినము. సర్వమంగళామోదకరమైన దినము. సర్వవిఘ్ననాశకుడైన శాంభవీపుత్రుని పూజాదినము. ఈపవిత్రదినమున సాక్షి సంఘపునరుద్ధారణ మాచరించి ప్రథమోపన్యాస మీయవలయునని తలచి విఘ్ననాయకుని మనఃపూర్వకముగ నారాధించి, కొందఱు మిత్రులతోc బక్వాన్నములభుజించి సోదరులారా! మీకొఱకు వేచియుంటిని.

మీరందఱు విచ్చేసితిరి. చాలా సంతోషమైనది. క్రిందటిసారి సాక్షిసంఘము శివరాత్రియందు స్థాపింపఁబడినది. ఈసారి శివపుత్త్రరాత్రియందు స్థాపింపఁ బడినది.

నాయనలారా! ధర్మాన్నశాలలు, ధర్మవైద్యశాలలు, దేవాలయములు, గ్రంథాలయములు, సారస్వతసంఘములు, భజనమందిరములు మొదలగుపవిత్రసంస్థ లనేకములు మనకున్నవి. ఇట్టివానిని నింక స్థాపింపవలసివచ్చినప్పుడు కాని, పునరుద్ధారణ మొనర్పవలసివచ్చినప్పుడు కాని మనపెద్ద లేదినములు పవిత్రములుగా గణించినారో యాదినములందే యాకార్యములు జరిగింపవలయును. మనకెన్ని యే పవత్రదినములున్నవి. అవతారపురుషులు జన్మించినదినములు మనకుఁ బవిత్రదినములు, మన భారతమహావీరులు జన్మించినదినములు, మరణించినదినములు, మనలో మతకర్తలు వేదాంతులు సంస్కర్తలు జన్మించినదినములు, మరణించిన దినములు మనకుఁ బవిత్రదినములు. ఇవికాక, దేవీనవరాత్రము లని, వినాయకనవరాత్రము లని, వసంతపూజాదినము లని యనేకములైన పవిత్రదినములు మాకున్నవి. ధర్మనిర్వహణమునకై, జ్ఞానప్రదానమునకై యేర్పాటుకాఁబడునంస్థలస్థాపనము, పునరుద్ధారణము మొదలగు లోకోపకారకకార్యము లిట్టి పవిత్రదినములందే మనపెద్ద లచే మనభారతదేశముచే, మనదేవతలచేఁ బావనములని యెంచఁబడిన యిట్టి మహాదినములందే జరిగింపవలయును.

ఇరువదియవ శతాబ్దమందు జీవించియున్న మనకు-నాంగ్లేయభాషాజ్ఞాన మేకొలఁదియో సంపాదించినమనకు-కాల మనఁగా Sequence of Events వలన మనస్సులోఁ గలిగిన impression కంటె మఱియేదియు కాదని యాంగ్లేయగ్రంథములు చెప్పచుండఁగా వినినమనకు నింకనుదర్శ దుర్దినమని, ఏకాదశి సుదినమని గూఢమైన మౌఢ్యముండనేలయని సైవారధిక్షేపింతురా? ఊఁ, అధిక్షేపింపనిండు. ఎందులకయిన సరే, యెవనినైనసరే, యధిక్షేపింపకూరకుండిన దెవఁడు? పవిత్రదినములు లేనిజాతిప్రపంచమందున్నదా? ఉండుట కవకాశ మున్నదా? మనమహ్మదీయసోదరులకు బక్రీత్, రమ్‌జాను, మొహరము మొదలగు పవిత్రములు లేవా? మన యాంగ్లేయసోదరులకు క్రిస్మసుపండుగలు, మేయుత్సవములు మొదలగునవి లేవా? ఇదికాక వారికిఁ బ్రత్యాదివారముకూడఁ బవిత్రదినమేకాదా? ఒకదినము మంచిది వేఱొకటి జబ్బేకానియెడల Good Friday కర్థమున్నదా? దానిపవిత్రత యెఱిఁగియే దాని నట్లు పిలిచినారు. ఇది కాక వర్ణభేదము మిథ్య యని, వేదములు కృత్రిమము అని, జీవాత్మలెండమావులని, భగవంతునిగూర్చి విచారింపఁ దగదని బోధించినబుద్ధుఁడు సైతము పెద్దలుగతించిన దినములను బవిత్రములుగాఁ జూచుకొనుమని బోధింపలేదా? అందఱుకూడ నీవిషయ మంగీకరించినదే అడగినప్పుడు మాత్ర మొప్పుకొనుటకుఁ గొంత జంకుచున్నారు. కాని మన కాభయమక్కఱ లేదు. పెద్దలు నడచినత్రోవను నడుచుచున్నంతకాలము మనమెవ్వరికి భయపడవలసినపని లేదు.

మనపవిత్రదినములందే మన ధర్మసంస్థల సంబంధములగు నుత్సవములను జరిగించుకొనవలయును. ఆదినములు పావనము లగుటచే జనుల మనస్సులం దొకమంచిమార్పు కలుగక తప్పదు. శివరాత్రిదినమునఁ జేయవలసిన పవిత్రవిధు లన్నియు యథావిధిగఁ జేయనివాఁడైనను జేయలేకుంటిమని రవంతవంతకైనఁ బాల్పడక తీరఁడు. ప్రతిదినమును క్షురకర్మ మొనరించుకొనువాఁడైనను భీష్మైకాదశీదినమున గడ్డము తడిపించుకొనుటకుఁ

గాసంత తటపటాయించును. పవిత్రదినములం దెట్టిపాపశీలుని మనస్సునందైన రవంత పశ్చాత్తాపము తాత్కాలికముగనైనఁ గలుగక మానదు. అట్టిపవిత్రాంతఃకరణములతో జనులెల్లరు మనయుత్సవములఁ బాల్గొందురు. వారితో మన మాయుత్సవములందు వివిధ భక్ష్యభోజ్యాదులతో నసాధారణమైన విం దారగింతుము. పెద్దలేర్పఱచిన యట్టిపవిత్రదినములందే యట్టిపక్వాన్నములఁ దినవలయునుగాని మనయిష్టానుసారముగ నేదోయొక్కటి కల్పించి, యాదినమున నసామాన్యములయిన పిండివంటలతోఁ జిత్రాన్నదధ్యోదనములతోఁ, బరమాన్నములతో నుదరపూరణ మొనర్పఁదగదు. చేత సామ్మున్నదికదా; అంగడిలో ఘృతపిష్టాదివస్తువు లున్నవికదా; పడమటింటి బానిసతనమునకుఁ బరిపూర్ణవితంతువగు వదినెయున్నదికదా; ఒడల దారఢ్యమున్నదికదా; ఉదరమున క్షుత్తున్నదికదా; యనినీ కిష్టమైనదినమున నకారణముగ పాకపుగారెలు; పలావు తినవచ్చునా? తగదు. పెద్దలను దలఁచుకొనుము, పూర్వపుహావీరుల సంస్మరించుకొనుము, నవతారపురుషులలో వారినారాధించుచుఁ గాలమును గడపపలసినపవిత్రదినములందే యిట్టి యారగింపు లాచరింపవలయును. అంతేకాని రుచివైవిధ్యముకొఱకు, కండల పుష్టికొఱకు, నైహికసుఖముకొఱకు, రక్తపటిష్ఠతకొఱకు, నరముల యుద్రేకమునకై యిష్టానుసారముగ మనము బలాహారముల నేమియుఁ దినఁదగదు.

''యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైఃl
తే త్వఘం భుంజతే పాపాయే పచంత్యాత్మకారణాత్.''

ఆత్మ కారణముగ వండుకొనువారు భుజించునది అఘము కానియన్నము కాదని శ్రీకృష్ణభగవానులు సెలవిచ్చినారు. అట్టివారు తమకొఱకై పండుకొనుటయే పాపము. భుజించుటవఱ కక్కఱయేలేదు. శరీరపుష్టికై, యైహికసుఖమునకై భోజనప్రయత్న మొనర్చువారు పాపులని స్పష్టపడినదికదా.

ఐహికసుఖదినములయినవివాహదినములందు నిరంకుశముగ మన మన్నిపిండివంటలు తినుటలేదా యని యందురేమో? అదేమిమాట? మన కులదేవతలు కాక ముప్పదిమూఁడుకోట్ల దేవతలు వివాహవేదికపై నాహ్వానింపఁబడియున్నారు. వివాహమైహికసుఖమునకుఁ గానేకాదు. మనపెద్దలు దాని నట్లు గణింపనే లేదు. స్వర్లోకవాసులకు పెద్దలకు నివాపవారి నిచ్చి వారియుత్తమగతుల సంరక్షించుటకు, నిత్యదేవతాపూజాకార్యమునకు, నతిథిసత్కారమునకు, స్వార్థపరిత్యాగియై పరోపకారముకొఱకు పాటుపడుటకును బనికివచ్చు వంశపావనుఁడైన కొడుకును దెచ్చుకొనుటకు నేర్పఱుపఁబడిన వివాహతంత్ర మైహికసుఖతంత్రమా? ధర్మమందే చరించుట కీయాశ్రమము తీసికొనుచున్నామని యగ్నిసాక్షిగఁ బ్రమాణము లొనర్చుకొన్న భార్యభర్తల ప్రథమనమావేశోత్సవములో నైహికగ్రంథలేశమైనను న్నదా?

పర్యవసానమునఁ జెప్పున దే మనఁగా మనము తీసికొనుచున్న యాహార మున్నదే, అది యైహికమార్గమందు బల మిచ్చుటకుఁగాదు; ఆముష్మికకార్యములందు దీక్ష నిచ్చుటకు. లాంపట్యవృద్ధికొఱకుఁగాదు; వైరాగ్యవృద్ధికొఱకు. రక్తికొఱకుఁ గాదు; భక్తికొఱకు వ్యసేవకొఱకుఁ గాదు; పరసేవకొఱకు. శరీరముకొఱకుఁ గాదు; ఆత్మకొఱకు. ఇంతింత వ్యత్యాంశములందుఁగూడ మనపెద్దలు మన కహంభావము రాకుండ, దేహమత్తత కలుగకుండ, స్వార్థలోలత పెరుఁగకుండఁ, బశుత్వము వృద్ధికాకుండ, జాగ్రత్తపెట్టుటకుఁ

బ్రయత్నించినారు. దేవతానివేదితాన్నమే కాని తినఁగూడ దనఁగ నర్థమేమి? తిన్న యాహారమంతయు దేవసేవకొఱకే యని యన్ననుతోఁ బ్రమాణముచేయుటయే కాదా?

అందుచే మతకర్తలసంబంధముచే, మహావీరుల సంబంధముచే, దేవతల సంబంధ ముచే, దేవతల సంబంధముచే, నవతారపుగుఁషులసంబంధముచేఁ బవిత్రములగు దినము లందు మన ధర్మసంస్థల యుత్సవము లన్నియు జరిగించుకొనుట సర్వవిధముల శ్రేయము. ఆదినముల కధిష్ఠాతలగు మహాపురుషులుకూడ, మహాత్ములుకూడ, దేవతలుకూడ, మనతో పాటు సభలలోఁ గూరుచుందురు; మనకు మంచియూహలఁ గలిగింతురు; మనకు సత్కార్యదీక్షను బుట్టింతురు; వారివారి యాత్మలలోని విద్యుచ్ఛక్తిని మనము సహింపఁదగి నంతవఱకు మనకుఁ బ్రసాదింతురు; మనకు సర్వకార్యసాఫల్యమును జేయుదురు; మనసం స్థలు శాశ్వతముగ వర్ధిల్లవలయు నని యాశీర్వదింతురు; దేవతలస్మరింపకుండ మనమేదియు సంకల్పించుకొనఁదగదు. దేవతల నాహ్వానించి యారాధింపకుండ మన మేప్రయత్నముఁజేయఁదగదు. వినాయకదేవు నిచ్చటఁ బ్రతిష్ఠించి, పత్రపల్లవప్రసవాదులచేఁ బూజించి, ఫలమోదకాదిభక్ష్యములు నివేదించి, భక్తితోఁ బాదములకుఁ బ్రణమిల్లి, యేతత్పా దపద్మ సన్నిధానమున సాక్షిసంఘపునర్నిర్మాణ మొనర్చుటచేత, సాక్షిసభలో నిప్పుడు వేంచేసియున్నావా రెవరో యెఱుఁగుదురా?

నాయనలారా! సంసారచింతల కొక్కక్షణము శాంతిఁ జెప్పి, కప్పదాఁటులు వేయుమ నస్సును గట్టిగఁబట్టి, శ్రద్ధావంతులై, యీశ్వర ధ్యానతత్పరులై రవంతసే వుండఁగలరా? అదిగో, ఏమి కానవచ్చుచున్నదో? నిశ్చలదీక్షతో, నిర్మలమనస్సుతో నీరంధ్రదృష్టితోఁ జూచెదరా! ఆహా! చీమకుత్తుకలో సింహము ప్రవేశించినదే! సముద్రసప్తకము చొటిపడియలో నిఱికినదే! పరమాణువులలోఁ బర్వత మిమిడినదే! కానులేనివానిగుడిసెలోఁ గైలాస మవతరిం చినదే! ఆహా! చూచితిరా! రజతాద్రియెట్లు వెలిఁగిపోవుచున్నదో! ఉదయమార్తాండుని కిరణజాలమాకొండపైఁ బ్రసరింపఁగఁగొండ యేమియఖండతేజోమండితమై ప్రకాశించుచు న్నది! కుడిప్రక్కను గాంచితిరా? లక్షలు, కోటు లగునింద్రధనస్సులు పడుగుపేకగా నల్లుకొనిపోయి చిత్రవిచిత్రాతివిచిత్రమహా విచిత్రవర్ణములను వర్షించుచున్నవికదా! ఆతేజ స్సంఘాత మొకప్పుడుపాము మెలికలుగఁ బ్రవహించుచున్నది, చూచితిరా! ఇప్పుడు తరంగ ఫక్కగ తవణించుచున్నది. ఇప్పుడదిగో జలయంత్రములోని నీటిసోనవలెఁ బైకెగసి రంగురంగులపూవుల నీనుచున్నది. అదిగో, ఇంతలోనుడిగుండములోవలె గిరగిరఁ దిరిగి క్రిందికిఁ గ్రుంకిపోవుచున్నది. కన్నులు చెదరుచున్నవి. ఒక్కనిమిసము కన్నులుమూసికొ నుట మంచిది. ''శంకర భగవానుఁడా! కన్నులు చెదరిపోకుండఁ గటాక్షింపుము. తలతిరుగ కుండునట్లు దయసేయుము. త్వదీయవైభవమును జూచి తరింతుము. తండ్రీ! తండ్రీ! ఓహో! అనిర్వర్ణ్యమైన యాయద్భుత తేజమునుండి యంతకంటె ననిర్వర్ణ్యమైన యొకతేజో రాశి బయలువెడలుచున్నదే! ఆతేజోరాశి యొకత్రుటిలోఁ గుడివైపు శుద్ధస్ఫటికసహస్ర కాంతితో, నెడమప్రక్క నింద్రనీలకోటికాంతితో, రెండుపాయలుగా విడిపోయియుఁ గలసియే యున్నదే! వారే పురాణదంపతులగు పార్వతీపరమేశ్వరులు! ధన్యోస్మి! ధన్యోస్మి! శంకరా! అఘనాశంకరా! దుర్గా సంరక్షితభక్తవర్గా! నమస్కారములు. నమస్కారసహస్రములు. నమ స్కారకోటులు.

ఓమ్ శాంతి శ్శాంతిః.

3. చిత్ర లేఖనము

ఈరోజున తుంగభద్రాతీరవాసులు, చిత్రకారులు అయిన ఒక శాస్త్రిగారిని సాక్షి సంఘసభకు ఆహ్వానించి, ఆయనచేత ఉపన్యానం ఇప్పిం చాడు జంఘాలశాస్త్రి.

ఆశాస్త్రిగారు ముందు చిత్రలేఖనం గురించి, స్త్రీ మూర్తులచిత్రణంగు రించి కొంచం మాట్లాడారు. కొన్ని నెలలనుంచీ తాను ఆంధ్రదేశంలోని చిత్రకళాశాలల్ని చూస్తున్నాననీ, కొన్ని స్త్రీవిగ్రహాలకు పైటగాని, జాకెట్టు గాని లేవనీ, అన్ని స్త్రీ విగ్రహాలకు బొడ్డుకన్పిస్తుందనీ, మరికొన్ని విగ్రహా లకు చీరకట్టేలేదనీ ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి విగ్రహాలు నంతోషం కలిగించడానికిబదులు నంతాపం కలిగించాయన్నారు. బుద్ధిమంతులైన చిత్ర లేఖకులు వాటిని అలా ఎందుకు చిత్రించారా! అని ఆలోచిస్తూ పడుకుంటే ఆశాస్త్రిగారికే ఒకకల వచ్చిందట. ఆకలలో అనందర్భాల్నితొలగించి నంద ర్భశుద్ధిగా వ్రాసిందే ఈ ఉపన్యానం.

కలలో శాస్త్రిగారిని ఒక పురుషుడు ఒక నభలోకి తీసుకువెళ్లాడు. అందులో శ్రోతలంతా పురుషులే. ఉపన్యానరంగంమీద ఒక యువతి మాత్రం కుడిచేతిలో కొరడాపట్టుకుని వుంది. ఆమె తేజస్సులో సౌందర్యం కాఠిన్యం, కలగలిసివున్నాయి. ఆమె ఉపన్యసిస్తోంది. ఆడవాళ్లమర్యాద గురించి మీకే మైనా తెలుసునా? అని గద్దిస్తోంది. స్త్రీమూర్తుల్ని చిత్రించేటప్పుడు అర్ధది గంబర స్వరూపాలను, పూర్తి దిగంబర స్వరూపాలను ఎందుకు చిత్రిస్తారని నిలదీస్తోంది. తనదేశంలో స్త్రీ ఔన్నత్యం ఏమిటో, ఆమె వ్యక్తిత్వం ఏమిటో, –అది స్త్రీ మనస్సుతో అందుకుంటేనే అర్థమవుతుందని వివరించిది. స్త్రీ పుట్టింది మొదలు, చనిపోయేవరకు, ఏమాన మర్యాదల్ని ప్రాణంగా చూను కుంటుందో చెప్పింది. స్త్రీ పట్ల గౌరవంకలిగి ప్రవర్తించండి అని చెప్పింది. స్త్రీపట్ల గౌరవంకలిగి ప్రవర్తించండి-అని పెచ్చరించి, కొరడాతో ఛళ్ళున్న నభానదుల్నికొట్టింది-అని శాస్త్రిగారు ముగించారు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! మనసంఘమును దిరుగ స్థాపించినపిమ్మట రెండుపన్యానములైన నిచ్చితినో లేదో, ఇంతలోనే నంఘ వ్యాపారములకు విఘాతము తటస్థించినది. అందుల

కెంతయైన వగచుచున్నాను. దైవకటాక్షమున నట్టి యంతరాయము లిఁకముందు రాఁబో వని యంతరంగమున నమ్మియున్నాను.

నాయనలారా! నాప్రక్కను గూరుచుండిన యీశాస్త్రిగారు తుంగభద్రాతీరగ్రామవా సులు. ఈయనకుఁ జిత్రకళానైపుణ్యము కొంతకలదు. చిత్రకళాశాల లన్నిటికిఁ బోయి వానిలోని చిత్రములను సందర్శించుపనిపై స్వగ్రామమునుండి కొంతకాలము క్రింద బయలు దేఱి తిరుగుచు మన గ్రామమునకు దయచేసినారు. వారీదినమున నుపన్యసింతురు. మీరు శ్రద్ధాళువులై వినఁగోరుచున్నాను. అయ్యా! శాస్త్రిగారూ! మీ రింక నుపన్యసింతురుగాక.

శాస్త్రిగారియుపన్యాసము-స్వప్నము

చిత్ర లేఖనమునందుఁ బ్రావీణ్య మార్జింపఁ దలఁచి కొన్నిమాసములనుండి యాంధ్రదే శమందలి చిత్రకళాశాలను సందర్శించుచున్నాను. అనేకములైన చిత్రములను జూచినాను. కొన్ని స్త్రీవిగ్రహములకుఁ బైట లేదు. కంచుకమును లేదు. అన్నిస్త్రీ విగ్రహములకు నాభి కానఁబడుచున్నది. అనేకవానికి చీరకట్టు బొడ్డునకు రెండు బెత్తెళ్లు దిగువగ నారంభింపఁ బడియున్నది. కొన్నివిగ్రహములకుఁ జీరకట్టలేదు. లేకున్నను మర్మస్థానము లూరువిన్యాసా దిపరిస్థితులవలన రవంత గుప్తములుగ నుంచఁబడినవేమో యనఁగ రామరామా! అట్లుకాదు. ఏమని చెప్పుదును? ఇట్టి విగ్రహములు సంతోషమిచ్చుటకు బదులుగ సంతాపము నిచ్చినవి. ప్రీతి నిచ్చుటకు బదులుగ రోఁత నిచ్చినవి. బుద్ధిమంతులగు చిత్రలేఖకులు వాని నట్లే వ్రాసిరో యని యూహించుకొనుచుఁ బండుకొంటిని. ఒకస్వప్నము వచ్చినది. స్వప్నానం తర మాస్వప్నములో నేనుఁ విన్నదంతయు స్వప్నములో సహజముగఁ గల్గునసందర్భత లను సవరించి సందర్భశుద్ధిగ నాశక్తికనుగుణమగునట్లు వ్రాసితిని. స్వప్నములో నొక్కఁడు ననుఁ బిలిచి ననుఁ దనతోఁగూడ రమ్మనినాఁడు. మాటలాడకుండ నాతనివెంటఁ బోయితిని. ఆతఁడు ననొక్కసభలోనికిఁ దీసికొనిపోయినాఁడు. ఆసభలో ననేకపురుషులు కూరుచుండినారు. నేను నొకబల్లపైఁ గూరుచుంటిని. ఉపన్యాసరంగమున నొక్క యువతి మాత్రము నిలువఁబడి యున్నది. ఆమె యమానుషతేజస్సమన్వితమై యున్నది. ప్రసన్న తలో భయానకత్వము, శాంతిలోఁ దీవ్రత, వెన్నెలలో నెండ, కరుణలోఁ గాఠిన్యము నామెవదనమందు సమంజసముగ సమ్మేళన మొందియున్నవి. ఆమెకుడిచేతిలో నొక్కకొర డాయున్నది. ఆచేయిచాఁపి యామె యుపన్యసించుచున్నది. నేను సభలోని కేఁగకముం దామె యేమిచెప్పెనో నాకుఁ దెలియదుకాని నేను గూరుచుండిన పిమ్మట నా కీమాటలు వినఁబడెను.

''మీకుఁ దెలియునా? చెప్పిననైనఁ దెలియునా? ఆఁడుదాని మర్యాద యెట్టిదో మీరు గ్రహింపఁ గలరా? అది యాకాశముకంటె స్థూలమైనది. సూదిమొనకంటె సూక్ష్మమైనది. అది వజ్రముకంటెఁ గఠినమైనది. గాజుకంటెఁ బెళుసయినది. అది శతకోటికంటె శాంతమై నది. శిరీషముకంటె మృదులమైనది. జీవాత్మతత్త్వమును గ్రహియింపవచ్చును. జగత్తత్త్వ మును గుర్తెఱుంగవచ్చును. పరమాత్మ తత్త్వమును భావింపవచ్చును గాని మానినీమానసత త్త్వము గ్రహింప మీతరమా? అది మీదృష్టికి కానునా? మనస్సున కందునా? బుద్ధికిఁ బొడకట్టునా? అదిగో యనుసరికి మాయ మగునే? మనన మొనర్చినకొలఁది మానసా తీతమగునే! అట్టి యసాధ్యమైన తత్త్వమునుగూర్చి, అట్టి యజ్ఞేయమైన తత్త్వమునుగూర్చి

మీయూహము లెట్లున్నవి? మీపలుకు లెట్లున్నవి? మీరచన లెట్లున్నవి? మీచేష్ట లెట్లున్నవి? ఆఁ, ఆఁ ! పడఁతుల మర్యాదనుగూర్చి పరిహాసములా? వెక్కిరింతలా? అల్లరులా? పటములా? బజారులోఁ బ్రదర్శనములా? ఆఁ ? ఏమనుకొనుచున్నారు? మంచిచెడ్డ లక్కఅలేదా? భయోభక్తు లక్కఅలేదా? పుణ్యపాపము లక్కఅలేదా? తల్లులున్న మీరు –చెల్లెండ్రున్న మీరు–అక్కలున్న మీరు–కన్నయాఁడుబిడ్డలున్న మీరు నాదేశమందలి స్త్రీల విగ్రహములను సృష్టించునప్పు డర్ధ దిగంబరస్వరూపములను సృష్టించుచున్నారుకాదా? ఎందుకొఱకు? ముచ్చటకొఱకా? వేడుకకొఱకా? తేటి పాఱఁ జూచుటకొఱకా? చూచి కిసుక్కుమనుటకొఱకా? బజారులోఁ బెట్టుటకొఱకా? ప్రజల నాకర్షించుటకొఱకా? పది రూపాయలఁ దెచ్చుకొని కడుపు నిండించు కొనుటకొఱకా? ఆఁడుదాని రహస్యావయవ ములనుఁ జిత్రించి ప్రకటించి యంగడిలోఁ బెట్టుకొని యమ్మికొని యాఁకలి తీర్చుకొనుచు న్నారా? ఇంతకంటె నీకు బ్రదుకుతెరు వేదియుఁ గనఁబడలేదా? కాక ఇది ఖ్యాతికారణమని యిందు దిగితివా? ఇది పరమార్థ మని దీనితోఁ దరింతునని జన్మరాహిత్య మొందుదు నని యూహించితివా? రామరామా! కానఁగూడని యవయవములను గోనపై కెక్కించితివే? చెప్పరాని యవయవములను విప్పి బట్టబయలు చేసితివే? స్మరింపరాని యవయవములను సంతలోఁ బెట్టితివే? నిన్నేమనవలసియున్నది? ఎంతసేపు నాఁడుదాని గుప్తావయవములపై దృష్టియా? వానిప్రతిబింబములను మనస్సులో దింపుకొనుటా? వానిని కాగితముపై నెక్కిం చుట? ఒంటివెంట్రుక కుచ్చుతో రంగులు పూసి యెత్త పల్లముల విభజించి వెలుఁగునీడల వివరించి ఓ-తబిశీల్లపై దబిశీళ్లతోఁ జిత్రించుటా? ఇది పశుత్వము గాక పాండిత్య మగునా? యథార్థముగాఁబురుషులు ప్రబలకామాతిరేకులు. సంతతగ్రామ్యసుఖాభిలాషులు. అంగనార హస్యాంగ సంతతసందర్శనాభీష్ట భూయిష్ఠులు; నాదేశమం దెల్లెడల నిండియున్న జమీందా రులలో నూటి కేఁబదుగురవఱ కీవ్యాపారమునఁ బండితాగ్రగణ్యులు.

వయసు పెచ్చినకొలఁది వీరి కావాంఛ పెచ్చగుచున్నది. తలవడఁకినకొలఁది యూతలఁపు బింకమగుచున్నది. అస్రపటిమ తగ్గినకొలఁది యూయభిలాష పెచ్చగుచున్నది. అనుభవశక్తి తగ్గినకొలఁది యీలోకనరక్తి మ్రొగ్గగుచున్నది. గాడిదకంటెను బందికంటెను గుక్కకంటెను నధమాధములైన యిద్దఱుముగ్గురు గుడిసెవ్రేడిముండలను వీరు భద్రపఱచి ముక్కులపైఁ జాత్వారపుజోళ్లతోఁ, జేతులలో భూతద్దములతో, నాకులాటధామలయెదుట వీ రొనర్చు నసందర్భతలు, నల్లరులు, నానురచేష్టలు హరహరా! చెప్పఁదగదు. వినఁదగదు. తలఁపఁదగదు. జరుగుఁబా టున్న జమీందారు లిట్లొనర్చుచుండగా నదిలేని యితరపురు షులు దిగంబరచిత్ర లేఖనములతో ముచ్చటలు దీర్చుకొనుచున్నారు. మొత్తముమీఁద బురుషులకందఱ కీరోగమున్నది.

చిత్రలేఖకులారా? మీ రిట్టియవకతవకచర్య కిఁక నాశ్వాసాంతము చెప్పవలయును. అనంతసృష్టిలోఁ జిత్రించుట కెన్నివిచిత్ర వస్తువులు లేవు? అనంతమగు గ్రంథజాలములో నెన్ని యద్భుతపరిస్థితులు లేవు? బాహ్యప్రపంచమందలి పరమాకర్షకసన్నివేశము లట్లుండఁగా నాంతరప్రపంచమునఁ జిత్రవిచిత్రాతిచిత్రమహాచిత్రపరిస్థితు లెన్నిలేవు? వానిలో నొక్కదానిని బూర్ణముగఁ జిత్రించుటకు మీకుబ్రహ్మ యిచ్చిన యాయువు చాలదే. అట్టిలో నేవి పవిత్రము లని, గుహ్యములని, ప్రకటనబాహిరము లని దర్శనమువలనఁ బుణ్యక్షయక

రము లని యెన్నఁబడుచున్నవో యట్టివానిపై దృష్టి మీ కెందులకు? కవిత్వము నేర్చుకొ నుట కుచవర్ణనమునకా? చిత్రలేఖన మభ్యసించుట గుహ్యాంగ రూపప్రకటనమునకా? కవి యెన్ని పాట్లు పడినను వర్ణ్యవస్తున్వరూపము నెదుటఁ బెట్టలేఁడు. మీకళ యాకృతివిషయ మున న ట్లసమర్థ మైనది కాదే. కావున మీరు కవులకంటె నెక్కువలోకోపకారకులు.

ఱేఁడు వారిమర్యాదయెట్టిదో మీ కావంత యైనఁ దెలిసినయెడలఁవారి నిట్లు మీకళ లలో నెంతగా నగౌరవపఱతురా? బట్టబయలైన పయోధరములతో, బట్ట మొదలే లేని మొలతో మీరు వ్రాయుచున్న విగ్రహములఁ గాంచి నాదేశస్త్రీ లెంత యేడ్చుచున్నారో మీకుఁ దెలియునా? శరీరములు చావఁగా మనసులు పుండుగాఁగాఁ గనులవెంట రక్తబొష్ప ములు విడుచుచున్నారే! వా రంతకంటె నేమి చేయఁగలరు? వారు తిరుగఁబడి మిమ్మఁ బరాభవింప సాహసింతురా? వారు చిత్రలేఖనమును నేర్చుకొని పురుషవిగ్రహములను నిగతకౌపీనముగఁ జిత్రింపఁగలరా? చావనైనఁ జచ్చెదరుగాని యట్టిసిగ్గుమాలినపనికి మీవలె వారొడఁబడుదురా? నాదేశస్త్రీలకు సహనము, సాధ్వసము, లజ్జ, సరళత, సద్భావము, సర్వేశ్వరభక్తి సహజాలంకారములు కావా? ఒడలి యాభరణము లన్నియుఁ బోయినస్త్రీ లున్నారు. కొడుకులు పోయిన స్త్రీ లున్నారు. కాని సహనము, లజ్జపోయినస్త్రీని నాదేశమున నాసేతుహిమాచలపర్యంతము చూపఁగలరా? వారికి సహనమే పోయిన యెడల మీదుర్నయము లింతకాలమునుండి యెట్లు సాగుచున్నవి? వారికి లజ్జయే పోయినయెడల మీబ్రదుకు లింతకాల మిట్లుండునా? సహస్రకారణములచే నగము చచ్చిపడి యున్న యిల్లాండ్ర రహస్యావయవములను నడివీధి కెక్కించి వారిని సాంగకముగ నమనస్కముగ సాత్మకముగ సంపూర్ణముగఁ జంపఁదలఁచితిరా?

పోనిండు మీ రంతటితోనైన నాఁగినారా? జగన్మాత లైన లక్ష్మీ సరస్వతీ పార్వతీదేవుల గతు లంతకంటె నధ్వాన్న మొనర్చితిరే! అంతకంటె నవకతవకఁ జేసితిరే! దుర్గాదేవికిఁ దొడలపై రవంత కప్పనక్కఱలేదా? భారతీదేవికిఁ బయోధరములపై రవంత ప్రచ్ఛన్నత యక్కఱలేదా? కన్నతల్లుల బ్రదుకులే యిట్లు కాల్చితిరేల? ఇది మాతృద్రోహము కాదా? జాతిద్రోహము కాదా? దేశద్రోహము కాదా? దేవతాద్రోహము కాదా? జర్మనీదేశమందలి చిత్రలేఖకుఁడో యాంగ్లేయచిత్రలేఖకుఁడో మావిగ్రహములఁ గాంచి మెచ్చుకొనినాఁడని యసందర్భవాక్యము లాడకుఁడు. భారతదేశనారీగౌరవము పరశురామప్రీతి యగునెడల, పాశ్చాత్యవిచిత్రలేఖకుల కేమి పోయెను? పరీక్షాధికారుల ప్రాశస్త్యనిర్ణాయకులు మీకుఁ బాశ్చా త్యులా? మీ చిత్రకళ యెక్కడ? వారిచిత్రకళ యెక్కడ? మీజాతితత్త్వమెట్టిది? వారిజాతి తత్త్వమెట్టిది? మీనాగరకత యెట్టిది? వారినాగరకత యెట్టిది? మీవివాహోద్దేశమేమి? వారివివాహోద్దేశమేమి? మీ స్త్రీలవస్త్రనైఖరి యెట్టిది? వారిస్త్రీలవస్త్రనైఖరి యెట్టిది? భేద మింతయంత యని చెప్పఁ దరమా? మీస్త్రీలతత్త్వము మీకే తెలియనప్పుడు వారికిఁ దెలియక పోవుట వింతయా? పాంచాలిని వివస్త్రను జేయుటకై రారాజు శాసించెననుటలో నర్థమేమి? మగువను దిగంబరను జేయుటకంటె నామగువకు దానిమగనికి దానిజాతికి వేఱు శిరచ్ఛేదనము లేదనియే కాదా? ఆంజనేయులు రావణునియంతఃపురమున రాత్రి సంచరించు నప్పుడు నిద్రావశలైన రాక్షసస్త్రీలరహస్యావయవములు ప్రమాదవశమునఁ గంటఁబడున ప్పుడు రామ రామా యని స్మరించుకొనుచు మహాపాప మొనర్చితినని గడగడ వడఁకలేదా?

సకంచుకుఁడైన సన్న్యాసిని నిష్కంచుక యైనసువాసినిని గాంచినవెంటనే సచేలస్నాన మొ
రింపవలయు నని ధర్మశాస్త్ర ముద్ఘోషించుట లేదా? అది కాక నాల్గువేల సంవత్సరము
క్రిందట నైన మహామూర్ఖ జాతిలో నైన నత్తగారినిగోడ లాఁకలిచేఁ దినుసరమాంసభక్షకస
ఘములో నైన నాఁడుదానిమొలకు రొట్టకట్టుండెనని మనము విన్నప్పుడు, ఇరువదవశ
బ్దము నందలి మీదిగంబరస్త్రీల కర్థ మేమి? అదికాక పాశ్చాత్యచిత్రలేఖనము కేవ
మాకారప్రతి బింబమైన (Photography) లోనికి దిగఁబోయి పాడైపోయిన దనియు, మాచి
లేఖనమునకు భావలావణ్యప్రకటనమే ప్రాణమనియు నీనడుమ పెద్దపెద్దపలుకులు పలికితి
కాదా? అటులే మాటవరుస కంగీకరింతము. నుదుటిచిట్లింపులో, భ్రూభంగములో, కను
యరచూపులోఁ, బ్రక్కచూపులో, నిండుచూపులో, చూచిచూడకుండఁ జూచి
చూపులోఁ, జూడకుండఁ జూచినచూపులోఁ, బైచూపులోఁ, గ్రిందిచూపులో, ముక్కుపుక
ముడుతలలోఁ, జెక్కులయెఱుపులో, నిగనిగలో, వెలవెలలో, గడ్డపుదైర్ఘ్యములో, గుండ్రశ
ములో, గుంటలో, హస్తవిన్యాసములలో భావప్రకటనమున కవకాశముండునుగాని పయోధ
ముల సందున నేభావము ప్రకటన మగునని మైఁట లాగివేసితిరయ్యా? ఆత్మసౌందర్యవ
(Beauty of the soul) కానఁబఱుతునని పలికి పార్వతీదేవిని వస్త్రహీనమొనర్చి ప్రదర్శ
ములలోఁబెట్టితిరా? మీకు మతులున్నవా? మతుల కేమి? ఉన్న వినియోగము మాత్రమేవ
న్నది? ముందు గతులుండునా?

బిడ్డలారా! స్త్రీతత్త్వ మేదియో మీకుఁ గొంతఁ జెప్పెదను. నేను జెప్పున దేదియె
మీరు గ్రహింపలే రని నే నెఱుఁగుదును. నేను జెప్పుమాటలకు మీకర్థము తెలియ ద
నాయభిప్రాయము కాదు. మీకు మనసున కెక్కదు. మీ కది యనుభవములోనికి రాద
వచ్చుట కవకాశము లేదు. ఎందుచేత? ఆఁడుదాని కున్న మనసువంటి మనసు మీకు లేద
నే నిప్పుడు చెప్పఁబోవునంగతు లన్నియు మీ కెంత మాత్రమును గ్రొత్తవి కావు. మీ
రనుదినమునఁ జూచుచున్నవే. అయిననేమి? వానిలో నిమిడియున్న గుట్టు మీరు గుర్తెఱు
నేరరు.

ఆఁడుపిల్లల పుట్టఁగనే సమీపస్థులైన వృద్ధస్త్రీలు తటస్థముగ మాటలాడ కూరకుందు
గాని యాఁడుపిల్ల పుట్టిన దని చప్పునఁ జెప్పరు. ఆఁడుపిల్ల పుట్టినప్పుడే యీసంకోచము
ఎందుచేత, ఆఁడుపిల్ల యిఁకనొక యరనిమిషమునకు బుట్టు ననఁగా సిగ్గను తత్త్వ
పుట్టును. సిగ్గు పుట్టినయుత్తరక్షణముననే స్త్రీశిశువు భూమిపైఁ బడును. సిగ్గుపుట్టు
యనఁగా నేమో మీమనస్సున కెక్కినదా? ఎక్కదని నే నెఱుఁగుదును. ఈపిల్లతోఁ బుట్టినసి
దీనిమృతిపర్యంతము రక్షింపఁబడునో లేదో యని వృద్ధస్త్రీలకు జన్మకాలమందుఁ గలిగి
నంకోచము. స్త్రీజన్మమునకు శరీరముకంటె, ప్రాణముకంటె, మనస్సుకంటె, నాత్మకంటె
సిగ్గు ముఖ్యము. అదియే ముందు అదియే మొదటిది. అది లేనియెడల స్త్రీవ్యక్తికి శరీరవ
లేదు. ప్రాణము లేదు. మనస్సు లేదు సుఁమీ యేమియును లేదు. దానితోడనే స్త్రీకి జన్మము
దానితోడనే, వృద్ధి. దానితోడనే చావు. చచ్చినతరువాత నది నిల్చియుండును. కాని పోవున
కాదు.

మీయాఁడుపిల్లలకు మీభార్యలో దానులో యుగ్గుపోయినప్పుడు మీరుచూచియుం
కపోరు. బొడ్డుమీఁదినుండి మోఁకాళ్లవఱకు గుడ్డకప్పిన పిమ్మటఁగాని యుగ్గు పోయర

మగపిల్ల వానికిఁగూడ నొళ్లిపోయుదు రనిమీరు వెకవెకలాడవలదు. ఆఁడుపిల్లకై పుట్టిన యాచారము తెలియక మగపిల్ల వానికిఁగూడ వ్యాపింపఁ జేసిరి కాని మఱియొకటికాదు. ఆఁడుపిల్ల తప్పుటడుగులు వేయ నారంభించు వెంటనే యభిమానపుబిళ్ల కట్టుట యాచార మని మీ రెఱుఁగకపోరు. అంత చిన్నగ్రుడ్డున కది కట్టకపోయిన నేమి పుట్టి మునిఁగిపోయె నని మీకుఁదోఁచును. కాని యది కట్టినదాఁకఁ దల్లి తహతహలాడిపోవును. అది కట్టఁగనే తల్లికనుల కెంతయైన నిండు. తల్లి మనస్సున కిఁక నిస్సంకోచత. తాను బదునెనిమిదిమూ రల చీర కట్టుకొని దట్టమైన రైక తొడిగికొని మేలుముసుఁగు వైచుకొనినయెడలఁ దనశరీరము నకెంత నిండో, తనచిత్తమున కెంత నిర్భీతియో, తనశిశువుబిళ్లకట్టుచూచి తానంతసంతోష ముగ నంతసంకోచరహితముగ నుండును. ఆఱేండ్లయిన శిశువునకు రాకుండనే పరికిణీలకై రైకలకయి పైటలకయి తల్లి చేయు ప్రయత్నమింత యంత కాదు. మీ కిది యంతయుఁ బిచ్చఁగఁ గానఁబడును. ఆయీడు మగపిల్లవాఁడు గోచిపెట్టుకొనియో తీసివైచియో కాళ్లసందునఁగట్టి నుంచుకొని వీధిలో గుట్టపుసవారులు చేయుచుండఁగా నాఁడు పిల్లల కీబట్టలభారము ప్రచ్ఛన్నత–ఆఁడుపిల్లలను బెంచుటయందుఁదల్లి పడుశ్రమములోఁ బదునా ల్గవవంతయిన మగపిల్లవానిని బెంచుటయందుఁ బడదు. పడవలసిన యావశ్యకత లేదు. ''అక్క యెంతసేపుఁ దలవంచుకొనియే మాటలాడుననియు, నెప్పుడూ మూచినన్నైన నమ్మచెఱుఁగపట్టుకొని వెనుకవెనుకనే గ్రుడ్డిదానివలె దేవులాడుచుండ ననియుఁదన పలకపు ల్లను హరించిన పొరుగింటిపిల్లవానిని గలియఁబడి నాలుగుదెబ్బ లిడ్చి కొట్టక సిగ్గులేక పంతులతోఁ జెప్పుకొన్నదనియు'' నాఱేండ్లతమ్మిఁ డధిక్షేపించుచుండ ననాదరణసే యుచుండఁ బదేండ్ల బాలిక వినయమునకు నిలయమయి సాధుత్వమునకు స్థానమయి సిగ్గున కాకరమయి సోదరులకు సహాయయై తల్లికంటెవెలుఁగయి తండ్రికి గర్వకారణమయి తోట కూరకాడవలె నట్టియట్టి యెదుఁగుచు, నెదిగినకొలఁది సిగ్గావరించుటచేత జంకుఁ గొంకుచు బంగారువంటిప్రాయమును బడయుచుండును.

ఇక భర్తయింటికిఁ బోయినపిమ్మట నాతని దుర్నయమువలన నేవియైన రోగములు సిద్ధించినఁగాని సహజముగ గర్భకోశసంబంధములగు కుసుమాదిబాధలు సిద్ధించినఁగాని నోరెత్తక, బాధపడినట్లు పైకిఁగూడఁ గనఁబడక సహించి సహించి, నీరసించి మృతినైన నొందుట కంగీకరించును గాని యత్తతోఁ జెప్పునా? ఆఁడుబిడ్డతోఁ జెప్పునా? ఊహుఁ –ఆఁడుదానిగుట్టైట్టిదో యెఱుఁగుటకు బుద్ధిలేని మీరు స్త్రీలు వట్టిపనికిమాలిన మూర్ఖ లని, రోగములు దాఁచెద రని, తలగొట్టుకొనినన్నైన వెల్లడింప రని మించిపోయినతరువాత నేమి యేడ్చిన నే మున్నదని వారిపైఁ దీండ్రింతురు. కాలిలో ముల్లు గ్రుచ్చుకొనియెడల గ్రామమంతయుఁ గాలిపోవుచున్నట్లుగా గావుకేకలు వైచుచు వీథులవెంట మొలను గుడ్డయైన నున్నదో లేదో యెఱుఁగకుండనొంటికాలితోడనే పరవళ్లు ద్రొక్కుచు మీ రేడ్చుచుందురు కదా? అట్టిచో నోర్వఁజాలని బాధ సహించుచు నోరుమూసికొని యుండుటకు వారికిఁ బ్రబలమైన కారణ మున్నదందురా? లేదందురా? అది వారిమూర్ఖత యని యెన్నఁడును భ్రమపడఁకుడు. దేనిని బోఁగొట్టుకొనుటకంటె జీవమును బోఁగొట్టుకొనుట మంచిదో దానిరక్షించుకొను సంకల్పమే యట్టిచర్యకుఁగారణము. నేను జెప్పిన యీమాటల సార మును మీరు గ్రహింపలేనియెడల మీరు చచ్చి స్త్రీలై పుట్టినపిమ్మటఁ దెలియునుగావున నంతవఱకు నిరీక్షింపుఁడు.

ఆఁడువారు వీణవాయింపుచుండ మీలో ననేకులు చూచి యుందురు. మగవారివలె వారు వీణను నిలువఁ బెట్టి వాయింపరు. ప్రక్కబారుగ వాయింతురు. అది సులభమార్గ మగుటచేతఁ గొందఱు మగవారుకూడ నాపద్ధతి నవలంబించినారు. దానికేమి? మగవారివలె నిలువఁబెట్టి యెందులకు వాయింపరో యెఱుఁగుదురా? నిలువఁబెట్టి వాయించునెడల నెడమచేయి పైకెత్తవలసివచ్చును. అంతమాత్రముచేతనే (Modesty) మంటఁ గలియునని వారిభయము. సూదిమొనలో సహస్రాంశముకంటె సూక్ష్మమైన దాఁడుదానిమర్యాద. అత్యంతసూక్ష్మములో సూక్ష్మమైన దాఁడుదానిమర్యాద. అట్టివిచిత్రమైన తత్త్వమును గ్రహింపలేక నాదేశనారీమణులను మీసోదరీమణుల నింతదారుణముగ నగౌరవపఱచితిరే.

పాశ్చాత్యదేశమునం దనేకపాషాణపాంచాలికలు దిగంబరముగ సృజింపఁబడలేదా యని యందురేమో! వారి చిత్రము లెంతసొగసుగ నున్నను నెంతయాకృతిసౌష్ఠవమున వెల్లడించినను నెంతప్రకృతి ప్రతిబింబములైనను వారిచిత్రలేఖనపద్ధతియే వేఱు. వారికళకు గమ్యస్థానమేవేఱు. వారివిగ్రహము లెంత నాగరికతాసౌందర్యముగలవియైననుసరే; యెంత సంస్థానసౌష్ఠవసౌభాగ్యసంపన్నములైన వయిన సరే, యెంత జీవకళాకలితము లైన సరే వారిచిత్ర లేఖనకళయం దైహికలంపటతాపంకిలత్వ మున్నది. మనచిత్రము లెంతమోటువైన సరే. మన చిత్రలేఖనకళయం దాముష్మికపరిమళప్రకాశ మున్నది. ఇది ప్రధానభేదము.

మనకు శిలావిగ్రహము లనేకకోటు లున్నవి. అవి యన్నియు దిగంబరములుగ నున్నవా? దిగంబరములైనను గాకున్నను వస్త్రములు లేని విగ్రహములను మనము పూజించుచున్నామా? అది గాక యీసందర్భమున నత్యంత విచిత్రమైన యాచార మొక్కట యున్నది. చెప్పనా? మన దేవాలయములలోని స్త్రీవిగ్రహములకు బట్టలు కట్టింపవలసి వచ్చినప్పుడు పూజరి కనులకు గంతలు కట్టుకొని మరి కట్టవలయును. ఆహా! ఇంత యద్భుతమైన యాచారము మరి యేదేశమందైన నున్నదా? అసాధారణమైన యద్వితీయమైన యాశ్చర్యకరమైన ఈయాచరమును బట్టియైనను నాదేశమందలి యాఁడువారిమర్యాద యెట్టిదో రవంతయైన మీరు తెలిసికొనలేరా? మీకింతకంటెఁ జెప్పవలసినది లేదు. మీరింతటినుండియైన బుద్ధి కలిగి, జాతిభక్తి కలిగి దేశభక్తి కలిగి స్త్రీగౌరవము కలిగి మీకళను వృద్ధిచేసికోవలయును.

అదిగాక మీకళకు భావము ప్రధానమని చెప్పుచు, మీ విగ్రహములకన్నులు బొత్తిగ బాడుచేయుచున్నారు. కన్నులు సగము మూయునెడల నేదో భావము ప్రకటిత మగునని మీ రనుకొనుచున్నారు కాఁబోలు. మీవిగ్రహములకన్నుల యసందర్భతనుగూర్చి మఱియొకసారి యుపన్యసింపఁదలఁచితిని.

కాని నాదేశరక్షకదేవత లైన లక్ష్మీ సరస్వతీ పార్వతీదేవుల విగ్రహసృష్టియందు మీ రొనర్చిన మహాదోషమునకు మిమ్ము శిక్షింపకతప్పుదు, ఇదిగో''

అని పలికి కొరడాతో చెటేలున సభాసదులఁ గొట్టెను. అమ్మయ్యో యని యేడ్చుచు నిద్రనుండి లేచితిని.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

4. కవి

కని ఎలా ఆలోచిస్తాడు? ఎలా ప్రతిస్పందిస్తాడు? ఎందుకు, దేనిగురించి ఆరాటపడతాడు? - అనే విషయాలను తరిచి జంఘాలశాస్త్రి ఈ ఉపన్యాసం ఇస్తున్నాడు.–

కవి, ఒక గడ్డిపరకలో సైతం పరమేశ్వరుడి కరుణ, పరమేశ్వరుడి లీల, పరమేశ్వరుడి జ్ఞానం, పరమేశ్వరుని ఆనందం, పరమేశ్వరుడి మహిమ, భావించి ఆ మూర్తిని సేవించి సేవించి, ఆశక్తిని ధ్యానించి ధ్యానించి, ప్రకృతిలో సహజతకు సంతోషించి, వలచి, వశుడై, సౌందర్యగీతాలను అరచిఅరచి, వ్యక్తిత్వాన్నిమరచి, తన్మయుడవుతాడు.

నవ్వితే ఒక సొగసు, బెదిరిస్తే వేరొకసొగసు, తల ఊగిస్తే మరోసొగసు, రౌద్రంగా ఝుంకరిస్తే ఇంకొకసొగసు, బతిమాలితే మరోసొగసు కనిపించే ప్రకృతికిలొంగి, సౌందర్యం అనే పాలసముద్రంలో చేతులు బారలువిసిరి ఈదుతూ-మరొకసారి ఏచిరు కెరటంమీదనో తలవాల్చి మైమరచి పడివుండే మనిషి కవి.

బాహ్యప్రకృతే ఎంతో ఆశ్చర్యంగా వుందనుకుంటే, మరిలోపలి ప్రకృతి ఇంకా ఆశ్చర్యకరమైంది. అక్కడ తలెత్తే ఉత్పాతాలు బాహ్యప్రకృతిలో వాటికంటె తీవ్రమైనవి.

మనం రకరకాల వ్యవధానాలతో చరిత్రలో సాగిన అనేక యుద్ధాలగురించి వినివున్నాంగాని, సృష్టిప్రారంభంనుంచే అరిషడ్వర్గం (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు)తో మనిషికి లోపలి ప్రకృతిలో జరిగే యుద్ధం దాని సంక్షోభం వాటికంటె బీభత్సమైంది. ఈరెండు విధాల ప్రకృతులలో విశేషాలను తన అనుభవంతో పట్టుజాలినవాడు కవి. అతనికి మాటల్ని బొమ్మలుగాచేసే శక్తివుంది. కవి ఒక విధమైన పిచ్చివాడు. కోటి విధాల పరమార్థగ్రహణ మార్గాలలో ఒక మార్గమే ఆపిచ్చి. అటువంటి వెర్రితో, తాను ధన్యుడై లోకాన్నిధన్యంచేసేవాడు కవి.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

ఎక్కడఁ జూచిన జిగజిగ, ఎక్కడఁ జూచిన మిలమిల, ఎక్కడఁ జూచిన నీరు, ఎక్కడఁ జూచిన పరిమళము, ఎక్కడఁ జూచిన వెలుఁగు, ఎక్కడఁ జూచిన బయలు, ఎక్కడఁ జూచిన

రంగు. ఆహాహా! ఏమివింత! ఏమిచిత్రము! పచ్చనిబయళ్లు! ఫలములతో నిండినచెట్లు, పుష్పములు గుత్తులుగుత్తులుగా నున్న లతలు, భూమినుండి యుబికి యుబ్బెత్తుగ లేచుకొండలు, స్వాదుజలభరితములగు నదులు, నొడ్డులేని సముద్రము, నంతములేని యాకాశము, తేజోమయములగు గ్రహములు, కంటికి తేజము, చెవికి హాయి, యొడలికిఁ జలువ, ఘ్రాణమునకు సౌరభము, జిహ్వకు రుచి నిచ్చుచున్నవికదా? ఈతేజముకంటె, నీహాయికంటె, నీచలువకంటె, నీసౌరభముకంటె, నీరుచికంటె విలక్షణమైన యాశ్చర్యకర మైన, యనుభవైకవేద్యమైన యానందము ప్రకృతిదర్శనమున మనస్సునఁ గల్గుచున్నదికదా? ఆయానందప్రభావమున మనస్సెట్టి యిట్టి తేలికయై యట్టి యట్టి విస్తీర్ణమై ప్రకృతియందు వ్యాప్తమై లీనమై పోవుచున్నదికదా? ఏవస్తువును గాంచిన సౌందర్యామృతము వర్షించుచున్నట్ల గదుచున్నదికదా? ఏవస్తువును గాంచిన సౌందర్యామృతము వర్షించుచున్నట్లగదుచున్నది కదా? ఆహా? ఆకసమున నీవైపునుండి యావైపునకు వ్యాపించిన యింద్రధనుస్సువంపులతో, రంగులతో, వ్యాప్తితో, సౌందర్యముతోఁ కలసి ప్రకృతిసౌభాగ్యదేవతకు మంగళహారతు లిచ్చుచున్నవికదా? ఒక్కగులాబిపువ్వులోని సారళ్యము, సౌందర్యము, సౌరభము నాలోకింపఁ బోయి, యస్వాదింపంబోయి, యనుభవింపఁబోయి, యాపుష్పసౌభాగ్యములోఁ గలసి, యాకేసర మార్దవమున నార్ద్రమై, యామకరందబిందుసందోహమున లీనమై మన స్సెట్టి యట్టి తన్మయత్వమును జెందుచున్నదే. తుట్టతుద కొక్క గడ్డిపరకలోఁ బరమేశ్వ రుని కరుణ, పరమేశ్వరునిలీల, పరమేశ్వరునిజ్ఞానము, పరమేశ్వరునియానందము, పరమే శ్వరునిమహిమము భావించి, యామూర్తిని సేవించి సేవించి, యాశక్తిని ధ్యానించి ధ్యానించి తరింప వచ్చునుగదా! ప్రకృతిసామంజస్యమునకు, ప్రకృతి సామీచీన్యమునకు, వలచి వలచి వశుఁడై వశుఁడై సౌందర్యగీతము లలీచి యలచి, వ్యక్తిత్వమును మఱచి మఱచి, తన్మయుఁ డగు నాతఁడు కవి. తాను వలచిన ప్రకృతిఁ జూచినకొలఁది, చూచినకొలఁది సుందరన్వరూ పయై కానఁబడునే. ఆఘ్రాణించినకొలఁది నధిక పరిమళభరితయై కానఁబడునే. కొఁగిలించిన కొలఁది కొఁగిలించిన కొలఁది కఠినతలో మెత్తన, మెత్తనలోఁ గఠినత. కఠినతలో గఠినత, మెత్తనలోమెత్తన, వేఁడిలోఁ జలువ, చలువలో వఁడి, చలువలోఁ జలువ నిమిషనిమిషమున కధికతరముగఁ గానఁబఱచుచున్నదే. ముద్దుపెట్టినకొలఁది ముద్దులోఁ దేనె, యాతేనెలో కలకండ, యారెంటిలో ద్రాక్షపండ్లరసము, నామూఁటిలోఁ బద్మసౌరభము, ఆనాల్గింటిలో శిరీషపేశలత క్షణక్షణప్రవర్ధమాన మగుచుఁ గానఁబఱచుచున్నదే ప్రాఁకులాడినకొలఁది ప్రాఁకులాడినకొలఁది వన్నెలు, చిన్నెలు, హొరఁగులు, హొయలులు, తళుకులు, బెళుకులు, వగలు, వద్దికలు నేకొత్తతాభివృద్ధిగాఁ గానఁబఱచుచున్నదే. మల్లెపూవులలో రెల్లుపూవులలో నట్టి యట్టి మందహాస మొనర్చుచున్నదే. చక్కని చుక్కలమాటునఁ జేరి కాముకుఁడైన కవికిఁ గన్నట్టియట్టిఁ గీటుచున్నదే. పర్వతములప్రక్కఁ జేరి తెల్లని జిలుఁగుపయ్యెదతోఁ బయోధరములాంధ్రవనితవలెగూఢతయుఁ బ్రత్యక్షతయుఁ గాకుండ మాటుకొనుచు బయ లుసేయుచున్నదే. అంభోధరములచెంత నిలిచి మొగము ముడుచుకొని ధుమధుమలాడుచుఁ గంటివెంట నిప్పులు గ్రక్కుచు బడబడాయమానశబ్దములతోఁ గఠోర ముగ ఝూంకరించుచున్నదే. అట్లు ఝూంకరించి ఝూంకరించి స్త్రీనైజము ననుసరించి ధారాపాతముగఁ గన్నీరు విడుచుచున్నదే. గంగావాల్గాదిముక్తాహారాలంకృతగళసీమయై, నక్షత్రపుష్పవారవిరాజితకేశబంధయై, భానుమండలసిందూరతిలక ప్రభాభానమానఫాలసీ

మయై పద్మపన్నీరచంపకశేఫాలికాదిపుష్పపరిమిళభరిత నిశ్వాసయై, సర్వగోళసంచలనో
ద్భూతమహారవగీతామాధురీరమాధురీణయై ప్రకాశించు నీప్రకృతికాంత చూచిన
మాపులకుఁ, బలికిన పలుకులకుఁ, బాడినపాటలకు, నాడినయాటలకు, చేసినచేష్టలకు
నధీనుఁడై, పరవశుఁడై, కవి రసమయుఁడై విరాజిల్లునే. సర్వాంగసుందరయై బంగారుప్రాయ
మున నున్న వేశ్యాకాంతను విటుఁ డెంతగాఢముగఁ బ్రేమించునో, ప్రేమించి దానిపాదముల
మొద్దనే యొడ్డిలఁబడి, దాని మొగమునందే సదా దృష్టిధ్యానముల నిల్పుకొని యుండునో
ప్రకృతి ప్రమదాశిరోమణి నంతకంటె గాఢముగఁ బ్రేమించి యామెకొంగు దగిలినఁ జాలు
నని, యామెముఖసౌరభ మబ్బిన భాగ్య మని, యామె యవయవవర్తులత కనఁబడిన నదృష్ట
మని, యామె చిఱునవ్వువెన్నెలచే మనస్సు చల్లఁబడిన స్వర్గ మని, యామె క్రీగంటఁ
దన్నుఁ గటాక్షించిన మోక్షమని, కవి యామెను నేత్రపుష్పములచే, వాక్పుష్పములచే,
మనఃపుష్పముచే నారాధించుచుండునే. ఆకుపచ్చనితలఘుగాగరాకట్టి, పూలరవికఁ దొడిగి,
పంటకాలువలయొడ్డునను, జలప్రపాతముల ప్రక్కలను, నడివలెఁ దాండవించుచుండ కవి
మహానందమున లయానుసారముగ గీతములు పాడుచుఁ జేతులతోఁ దాళములు వైచుచుం
డునే. ఒడలు భయంకరముగ నదరుచుండ, నోటివెంటఁ బొగలు, గంధకపుజ్వాలలు,
రాతినీరు గ్రక్కుచు రౌద్రస్వరూపిణియై చెలరేఁగుచుండ, నొడిఁగి, యడఁగి
శోకనంతప్తచిత్తుఁడై కన్నీళ్లతోఁ గని కరుణగీతములఁబాడుచుఁ గరఁగిపోవుచుండునే. పండు
టాకులనడుమ, శిథిలములైన మహాభవనములనడుమ సంధ్యారాగము వెనుక నన్యాసినివలెఁ
గాషాయాంబరధారిణియై, యస్తమించుచున్న సూర్యునిఁ జూచుచు నాలోచనభావమున
నిశ్శబ్దముగ నడఁగియుండఁ, గవి జగదశాశ్వతతత్త్వము, సర్వసంగపరిత్యాగమును బోధిం
చువైరాగ్యగీతములు పాడి తానుగూడఁ గాషాయమాత్రధారియై నిర్మలుఁడై, నిర్లేపుఁడై
నిస్సంగిఁయై, నీఱయిపోవునే. నవ్వినఁ నొక్కసొగసు, రౌద్రమున ఝంకరించిన నిఁక
నొక్కసొగసు, నేడ్చిన మఱియింక నొక్కసొగసు, బతిమాలిన మఱిమఱి యిఁక
నొక్కసొగసుఁ, గల ప్రకృతికాంత కధీనుఁడై కవి సౌందర్యక్షీరవారాశిలో నొకపుడు చే బాఠలు
నైచి యీఁదుచు మఱియొకపుడు కదలిన ట్లగపడక నిల్చి టీఁతనీఁదుచు, వేఱొకపుడు
సౌందర్యామృతమును గడుపునిండఁగ్రోలి కదలలేకుండ నలసిసొలసి యేతరంగముమీఁదనో
తలయుంచి యొక్కనిమేషకాలము మైమఱచి పడియుండునే. నోటివెంటఁ గనులవెంటఁ
జెవులవెంట ముక్కువెంట లావణ్యామృతము నధికముగాఁ గ్రోలుటచేఁ గెక్కు కెక్కుమ
నుచు నూపిరియాడక, బుడుక్కున మునిఁగి యొక్కసారి తేలి, మఱియొక్క మున్కలో
నమృతమయుఁడై యద్వైతస్థితి నొందునుగదా!

బాహ్యప్రకృతియే యింతయనిర్వ్యాఖ్యమై, యద్భుతమై యప్రతిహతమై యుండ దీనిని
మించిన ప్రకృతి వేఱొక్కటి యున్నది. అదియే యాంతరప్రకృతి. బాహ్యప్రకృతి యెంతవిని
ధమో, యెంతవిపులమో, యెంతవిస్మయజనకమో, యాంతరప్రకృతి యంతకంటె వివి
ధము. అంతకంటె విపులము. అంతకంటె విస్మయజనకము. దానిలోఁ బ్రకాశించుచున్నది,
యెండయా కాదు, వెన్నెలయా కాదు, ఎండయు వెన్నెలయుఁగలసి యెండయు వెన్నెలయుఁ
గాని, యెకవింతకాంతియై, వింతలలో వింతయై వెల్గిపోవుచున్నదే. లక్షసూర్యులు, కోటి
చంద్రు లొకదానిప్రక్క నొక్కటి, యొకదానిలో నొక్కటి యేకకాలమందుఁ బ్రకాశించుచు
న్నవే. ధ్వనికంటె, వెల్తురుకంటె, విద్యుచ్ఛక్తికంటె నెక్కువ వేగవంతములైన వింతవింతబా

రుమెఱపులేవో నుల్క-సహస్రములతోఁ గొఱివిదయ్యపుఁ గోటులతో లోన జఱిజఱి మనుచున్నవే. అంతరప్రకృతిలోని రత్నములమందు, మీపట్టువజ్రము, మీ కోహినూరువజ్రము దిగదుడుపునకైన నక్క-ఱకు వచ్చునా? అనంతరప్రకృత్యాకాశమునఁ గలుగు నింద్రధనస్సులమందు బాహ్యప్రకృతిలోని యింద్రధనస్సులు వెలవెలఱాడుచున్నవే. నిస్తేజస్క-ము లగుచున్నవే మాసిమాయమగుచున్నవే. అంతశ్శక్రచాపములలో వట్టి రంగులుమాత్రమేనా? కాదే, రంగులో శబ్దమో, ఆశబ్దములోఁ బరిమళమో, ఆపరిమళములో మాధుర్యమో, ఆమాధుర్యములోఁ జలువయో, అన్నిటిలో ననిర్వచనీయమైన సౌందర్యమో, ఆహా! ఏమి యంతఃప్రకృతి! ఏధరణీ కంపములైన, నే యగ్నిపర్వతోత్షేములైన, నేగాలివానలైన, నాంతరప్రకృతిలోని సంక్షోభముల కీడువచ్చునా ఎనిమిదినములయుద్ధమున్నది. పదునెనిమిదినములయుద్ధ మున్నది. మూఁడుసంవత్సరముల యుద్ధమున్నది. నూరుసంవత్సరముల యుద్ధ మున్నది. కాని సృష్ట్యాదినుండి కామక్రోధాదులయుద్ధ మవిచ్ఛిన్నముగ నాంతరప్రకృతిలో జరుగుచున్నదే. రామాయణయుద్ధమైన భారతయుద్ధమైన ఐరోపామహాసంగ్రామమైన నవియన్నియునైన నరిషడ్వర్గ సంక్షోభము ముందెంత? పిడుగుపాటుముందు పికిలికూతలు కావా? నముద్రపుహోరుముందు సరుగుడుచెట్లుగానము గాదా? అట్టిబాహ్య ప్రకృతికి నిట్టియాంతర ప్రకృతికి నేమిసంబంద మున్నదో, యేమి భేదమున్నదో, దానిలోఁ దిరుగునప్పు డేమియానందమో, దీనిలోఁ దిరుగునప్పుడేమియానందమో, యీయానందమున కీయానందమున కెచ్చట సామ్యమో, యెచ్చటభేదమో, యనుభవమునఁ గనిపెట్టఁజాలినయాతఁడు కవి. చెట్టుమొదలే కొమ్మయై, కొమ్మయే యాకై, యాకే చిగురై, చిగురే పుష్పమై, పుష్పమే మకరందమైనట్లు బాహ్య ప్రకృతియే జడత్వమును ద్యజించి, భారమును వదలి, మోటుతనమును విడిచి, క్రమముగా సున్నితమై, మృదులమై, తేలికయై, వేగవంతమై, సూక్ష్మతమమై, విపులతరమై, యీంతరప్రకృతిగ మారెనో, కాక యీంతర ప్రకృతియే క్రమముగ మందమై, బరువై కఠినమై మొద్దై బాహ్యప్రకృతిగ మారెనో తెలిసికొనఁ గోరి యొక్కసారియే యందులో నొకకా లిందులో నొకకాలుంచి, యందులో నొకచేయి, యిందులో నొకచేయి యుంచి, యందులో నొకక న్నిందులో నొకక న్నుంచి, పరిశీలించి, కాశిపట్టుబట్టకు, మెఱుఁగునైపు, మోటునైపులెట్లో యట్లే యని యనుభవమునఁ గనిపెట్టఁజాలినయాతఁడు కవి. అట్లు కనిపట్టి యాకృతిచే, రంగులచే, రుచిచే, బరువుచే, స్వభావముచే, గతిచే, భేదములైన యావస్తువు లన్నిటికి లోపల వెలుపల, నొకవిలక్షణమగుశక్తి నిండియున్న దనియు స్పష్టములగు నర్వపదార్థములుగూడ నామహాశక్తి సాగరమందలి తరంగములు, తుంపరలు, బుద్బుదములు, ఫేనము లని యావేశమున గనిపట్టఁజాలినయాతఁడు కవి. అందుచే నేకత్వమే బహుత్వముగా నున్నదికాని, బహుత్వ మనత్యమనియు, నేకత్వమే సత్య మనియుఁ గనుపట్టు నాతఁడు కవి.

ఈశక్తియందుమాత్రము, కవికి, వేదాంతికి సామ్యమున్నది. ఉత్తమమైనకవిత్వము వేదాంతముకంటె భిన్నముకాదు. "Poetry is the highest Philosophy" అని పాశ్చాత్య విమర్శకచక్రవర్తి చెప్పినాఁడు. జగత్తత్త్వమును గూర్చి, పరబ్రహ్మతత్త్వమునుగూర్చి పలికిన వేదర్షులందరు మహాకవులు కారా? జగత్పుస్తకమును జదివి, దాని యర్థమును గ్రహించి, దానిభావమును గుర్తెఱిఁగి, దాని రచియించిన మహాశక్తియొక్క తత్త్వము ననుమానింపఁ గలిగిన యాతఁడే కవి, భూమిలో నుండు గాజురాయి మొదలుకొని యంతరిక్షమున నత్యంత

దూర మందుండు చుక్కలకు సమస్తపదార్థములందు నీతిని, శాసనమును, ప్రేమమును, సౌందర్యమును, మతమును, నవిలంఘ్యక్రమమును బుద్ధివైశిష్ట్యముచే గనిపట్టఁజాలిన యాతఁడు కవి. ఫలభారమున వంగిన చెట్లు ప్రపంచమున కేమి బోధించుచున్నవి? విద్యాంసుఁడు వినయవంతుఁడై యుండవలయు ననియేకదా? ఉదయముననే భరతపక్షి 'తుష్టు' మని సూర్యునివంక కేల యెగురుచున్నది? నిద్రావస్థలో నిస్సహాయస్థితిలో రక్షించిన భగవంతుని పాదములపై మనుజుని యాత్మకృతజ్ఞతా వందనములతో నుబ్బెత్తుగ నెగురవలయు ననుమతమును బోధించుటకేగదా. గులాబిపొదపై నొకపూవును మనము లాఁగగా దానిపై కొమ్మపై నుండుపువ్వు తానుగూడ వంగుట యెందులకు? ఒకచెంపఁ గొట్టువానికి రెండవ చెంపఁగూడ చూపు మని యేసుక్రీస్తుఁ డెందులకు బోధించెనో యందులకే. పురపాలకసంఘమువారి వీధి దీప మేమి బోధించెనో యందులకే. పురపాలకసంఘమువారి వీధి దీప మేమి బోధించుచున్నది? తా నంతస్తాపముచే దహింపఁ బడినసరియే. పరులకు మే లొనర్పు మను స్వార్థపరిత్యాగమహాపాఠమును బోధించుట లేదా! కన్ను లున్న వానికి, మన సున్నవానికి రాతిలో నీతి యున్నది. మట్టిలో మత ముున్నది.

అట్లు చూచువాఁడు కవి. చూచి యూరకుండునా? ఆవేశ మూరకుండనిచ్చునా? ఆనందము పొరలి పోకుఁడ నాఁగునా? లోపల చిత్తము తాండవించుచున్నప్పుడు జిహ్వపై శారద తాండవింపకుండునా? కలకంఠకలస్వనములతో నొకప్పుడు, శ్రీనివాసదేవాలయ ఘంటా ఘణఘణధ్వనులతో నొకప్పుడు శ్రీశైలేశ్వర శంఖారావములతో నొకప్పుడు, ఆఫ్రికాదేశపంచాననభయంకరగర్జారావములతో నొక్కప్పుడు పలికి, చిత్తోత్సాహమును, జిత్తోద్రేకమును నప్రయత్నముగ, ననర్గళముగ వెల్లడించునాతఁడు కవి. ఎవనిపలుకు లొకప్పుడు గంగా ఝరీవేగసన్నిభములో, యొకప్పుడు పుత్రునియాలింగనమువలె చల్లనలో, సంతోషజనకములో, యొకప్పుడు పదుచుపెండ్లాము నాలింగనము వలె గోరువెచ్చనలోఁ గుతూహలప్రదములో, యొకప్పుడు పన్నీటితుంపరవలె పరిమళభరితములో, యొకప్పుడు వీణావాదమువలె మధుర మధురలలితలలితములై హృదయాకర్షములో, యొకప్పుడు వేదవాక్కులవలె శాసనములో, యొకప్పుడు నిస్సంబంధములుగాఁ గానఁబడుచు, దూరస్థములుగఁ గానఁబడుచు, మెలికలై ప్రక్కబాటునఁ బోవుచు, తిరుగుడులై వెనుకబాటున వచ్చి కాళ్లు చేతులు మనస్సు గట్టిగాఁ గట్టి డబ్బాటున మోసముతో స్వాధీనపఱచుకొనుదాఁక స్వభావము తెలియని పలుకు లొకప్పుడు, రివ్వుమని పైకిఁ బోయి యచ్చట నింద్ర చాపవర్ణములఁ బూలను ద్రిమ్మరించి క్రింద జాఱిపోవుపలుకు లొకప్పుడు, నుపయోగించు సమయానుసారసర్వతో ముఖసమ్మోహినీకరణసరస్వతీమూర్తియగు నాతఁడు కవి.

పైకి మందుఁడై, బాహ్యప్రపంచజ్ఞానశూన్యుఁడై, జడుఁడై, యాంతరప్రపంచముచే గాఢముగ నవలోకించుచు, గోఁచితో, గొంగళి పాఁతతో, నెడమచేతివెదురుకఱ్ఱతోఁ, గుడిచేతికుండతోఁ, గడుపులో నాఁకలితో, నడుముపై వంపుతో, శిరముపైఁ గంపతో బిచ్చగాఁడై, మాధుకర మెత్తుకొనుచు నొకపుడు, ధర్మసింహాసనాధిష్ఠాతయై, కిరీటాంగదధారియై, స్వర్ణక్షేత్రధరసేవితుఁడై యొకచేత ధర్మశాస్త్రమును, నొకచేత కత్తిని ధరించి యొకయడుగు చందనమున, నొకయడుగు నగ్నియం దుంచి, ప్రజలను యథాన్యాయముగఁ బరిపాలించుచు నొకపుడు, ముండియై, దండియై, కాషాయాంబరధా

రియై, బ్రహ్మవర్చసము ముఖమున భవణింప నుపదేశముద్రను వహించి, యుపనిషత్సార మును బోధించుచు నొకపుడు, చిఱువెండ్రుకలతో, పాలబుగ్గలతో, నోటిచొంగతో, కంటికాటుకతో, మాటిమాటికి పైకెత్తుచున్న నడుముతో, చమురుతలతోఁ, దొట్టిలోని బొత్తులలోఁ బండుకొని వ్రేలు నోటఁబడక వెక్కివెక్కి యేడ్చుచు నొకపుడు నిట్లు భావనాప్రపంచమున, భావనానాటకమున, భావనారంగమున సర్వవేషధారియై బాహ్యప్రపంచాతీతుఁడై తన ప్రపంచమునఁ దా నొక్కఁడై సర్వమై యుండునాతఁడు కవి.

ఎదుట లేనివస్తువుల వర్ణించునపు డాంతరదృష్టితో, వజ్రధారకంటె వాఁడియైన యాంతరదృష్టితో, నావస్తువుల యాకృతి, రంగు, రుచి, వాసన, ధ్వని, స్పర్శము మొదలగున విపరిశీలించి వాని బాహ్యాంతస్స్వరూపముల నెట్టయెదుటఁ బెట్టఁగల యింద్రజాలమహేంద్ర జాల విద్యావిశారదుఁ డగునాతఁడు కవి. ఏయేవస్తువుల నెట్లెట్లు వర్ణించిననవి స్వస్వరూపములతోఁ బ్రత్యక్షము లగునో యట్టి చాకచక్యసంపత్తితోఁ గొన్నిటిని బలిష్ఠములైన నాల్గు జటకాలతోనో, కొన్నిటిని బలిష్ఠములైన మూఁడువ్రేతలతోనో కొన్నిటిని దేలికతేలిక లేతలేత యగు పదివ్రేటులతోనో నిర్మించి యెంతదూరముననో యెన్నిమూలలలోనో దాఁగియున్న వానిని సాక్షాత్కరింపఁ జేయఁగ[illegible]యియానుసారశబ్దార్థగుంభనాసమర్థుఁడగు నాతఁడు కవి. ఎవనిబొమ్మలు మాటలో యతఁడు చిత్రకారుఁ డగునట్లే యెవనిమాటలు బొమ్మలో యతఁడు కవి.

నాయనలారా! కవియొక్క ప్రధానశక్తులను జెప్పుచున్నాను. ఇట్టిశక్తుల కుదాహరణములు మనభాగవతభారతరామాయణాది గ్రంథములనుండి యెత్తిచూపునెడల నాల్గుదినములకైన నీయుపన్యాసము తెమలదు. కవిలక్షణములనుమాత్రమే చెప్పెదను. లక్ష్యములను మీరు చూచుకొనవలయును. (అయ్యా మీపూర్వోపన్యాసములం దెన్నిటిఁ గూర్చియో చెప్పెద నని వాగ్దాన మొనర్చియున్నారు. ఈసందర్భమునఁ గవిభేదములఁగూర్చియుఁ బాత్రౌచిత్యమునఁగూర్చియుఁ జెప్పవలసి యున్నది. పూర్వవాగ్దత్తములైన వన్నియు నీసారి చెప్పినదాఁక మిమ్మువదలము–అని సభలోఁ గేకలు.) నాయనలారా! కూతురు కొడుకును గందునన్నఁ దల్లి వల దనునా? వినువా రున్నప్పుడు చెప్పకుందునా? పూర్వమున నుపేక్షించిన వానినే కాక నింక ననేకవిషయములఁగూర్చి చెప్పెదను. ప్రపంచచర్య లంత కంటె నంతకంటెఁ జెడుచునేయున్నప్పుడుపన్యానవిషయములకు లోపమేమి? భగవత్కటాక్షము మాత్రముండవలయును.

నాయనలారా! కవిలక్షణము లింకఁ జెప్పెదను. ఇది చప్పున మనస్సునఁ బ్రవేశించువిషయము కాదు. కావున సావధానచిత్తముతో వినవలయును. వస్తువర్ణనశక్తి నింతవఱకుఁ జెప్పియుంటిని. పరుల సుఖదుఃఖాద్యవస్థాభేదములను తనవిగాఁ జేసికొని పరులహృదయములందు దూరి తన్నుఁ బూర్తిగ మఱచి తనవ్యక్తిత్వమును బూర్ణముగఁ దుడిచిపెట్టి వారిహృదయములం దైక్యమై, వా రట్టియవస్థాభేదములం దెట్లు మాటలాడుదురో, యెట్లు పాడుదురో, యెట్లు గంతులిడుదురో, యెట్లు కూలఁబడుదురో, యెట్లేడ్తురో యట్లు మాటలాడి, యట్లు పాడి, యట్లు గంతులిడి, యట్లు కూలఁబడి, యట్లేడ్చునాతఁడు కవి. కళత్రవిహీనుఁ డగునిర్భాగ్యుఁ డేడ్చిన ట్లొకపుడు, పుత్రోదయమైన భాగ్యవంతుఁడగు వృద్ధుఁ డుప్పొంగి మహానందమున నోలలాడిన ట్లొకపుడు, సందిగ్ధావస్థలో నెటు చేయుటకుఁ దోఁపని యాపన్ననివలె నూఁగులాడి యొకపుడు, నపకారి యగుసరి యెదుటఁబడిన

వీరాగ్రేసరునివలె బాయకత్తి జళిపించి ఝంకరించి, సంహరింప బోవుచు నొకపు డిట్లే యందఱాడవలసిన యాటలు తానే యాడి తానే పరవ్యక్తు లైనట్లు మాటలాడు నవ్యక్తిసంభవన్న పూర్వకపరవ్యక్తిప్రవేశ పాండితీమండితుఁడగు నాతఁడు కవి.

ఆంతరప్రపంచములోని రూపశూన్యములైన రసభేదములు, నవస్థాభేదములు నటిగో చరములు కాకుంటచే వానిని వివరించి, విస్పష్టముగా మనయెదుట బెట్టవలసివచ్చుచున్న పుడు బాహ్య ప్రపంచమున మన కనుభవములో నున్నవస్తువులను జట్టుభట్టు సందర్భానుసా రముగ నుపమలొనర్చి తెలియనివానిని దెలియున ట్లొనర్చి చీకటిపై వెలుతురిని బ్రసరింపఁజేయు విజ్ఞానతేజశ్శాలియగునాతఁడు కవి. మనస్సంకల్పములు, చిత్తవికార ములు, బుద్ధిభ్రమములు, వివిధరసస్ఫురణములు, వర్ణ్యవిషయములైనప్పు డాయగోచరపరి స్థితులను దెలియఁబఱచుటకు బాహ్యప్రపంచమునందలి సామ్యపరిస్థితులసాహాయ్య మావశ్య కము, ఆంతరప్రపంచమందలి సామ్యపరిస్థితులసాహాయ్య మావశ్యకము, ఆంతరప్రపంచము నందలి యజ్ఞవిషయమునెల్ల సూక్ష్మముగా, సునాయూనముగా, సుప్రశస్తముగా, నత్యంతన ముచితములైన యుపమలతో లంకెవేసి మనసుతోనైన స్పష్టముగ గ్రహించుట కవకాశము లేనివానిని గంటితోఁ జూచునట్లు చేయు ప్రకృతిజ్ఞానపరిపూర్ణుఁ డైనయాతఁడు కవి. కవి ప్రాశస్త్యము సముచితోపమానసంఖ్యనుబట్టి గ్రహింపవచ్చును. శ్రీమద్రామాయణము నందు వాల్మీకి యుపయోగించిన యుపమలకు హద్దు లేదు. తులసీ దాసుని రామాయణమునందుఁ గూడ నట్లే యున్నవి. మనఃప్రపంచమునందలి యవస్థాకోటులకెల్ల బాహ్యప్రపంచమున నుపమానకోటులున్నవి. కవి వానిని గ్రహింపవలయును. అది యిదియు నొకటే, అది యిదియు నొకటే యనుటకు సామ్యముకొఱకు గని యెట్లు ప్రకృతినిఁ బరిశీలించునో, యది యిది కాదు, అది యది కాదు, (నేతి, నేతి) యని పలుకుటకు వేదాంతియు నట్లే ప్రకృతినిఁ బరిశీలించును. సామ్యపరిజ్ఞాని కవి. భేదపరిజ్ఞాని వేదాంతి. సామ్యముఁ తెలియకపో వుటకు నిజమే. కాని కవి యందు సామ్యజ్ఞానము విశేషముగ నుండును. వేదాంతి యందు విభేదజ్ఞానము విశేషనుగ నుండును. ఇది స్థూలమైన నిర్వచన మని యెఱుఁగవలయును. అపదార్థములైన యంతరంగావస్థలకుఁ బదార్థత్వమిచ్చి ప్రత్యక్షము చేయుట కుపమాలంకా రము మహాకవులందఱు మిక్కిలి విరివిగా వాడియున్నారని చెప్పియున్నాను. బాహ్య పరిస్థితులను వెల్లడించునప్పుడు గూడఁ గవు లుపమలను వాడినారు, వాడుచున్నారు. వాడఁగలరు. ఇది కేవల మావశ్యకము కాదు కాని యలంకారమునకుఁ, జమత్కారమునకు, సౌందర్యమునకు, వస్తువైశద్యమునకుఁ గవు లట్లు చేయుదురు. మఱియుఁ గవులు మఱి యొక విధములయిన యుపమలను గూడ వాడుచున్నారు. అవి యేవనఁగ బాహ్యావస్థలను వెల్లడించు నప్పు డాంతరావస్థల నుపములుగఁ దీసికొనుచున్నారు. ఇది కేవలము విరుద్ధము. రవంత దెలిసినదానిని దెలుపఁగోరి తెలియని దానినిగాఁ జేయుచున్నారు. ఇట్టిక్లిష్ట పరిస్థితుల కుదాహరణములు గొన్ని యిచ్చెదను. మహాకవిశిఖామణియైన వాల్మీకినుండియే యిచ్చె దను. అశోకవనమందుండిన సీతాదేవిని వర్ణించునప్పుడు శుక్లపక్షాదియందలి చంద్ర రేఖవలె నున్నదని చెప్పినారు. ఇది తెలిసినది. ''పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః అని మఱియుఁ జెప్పినారు. ఇదికూడఁ దెలిసినది. కాని 'స్మృతీమివ సుసందిగ్ధాం కీర్తిం నిపతితా మివ, నిహతామివ చ శ్రద్ధా మాశాం ప్రతిహతామివ.. బుద్ధిం నకలుషామివ' యని యనేకము లయిన యంతరావస్థల నుపములుగా జేసినారు. సందిగ్ధమైన స్మృతివలె, నిపతితమైన కీర్తివలె, నిహతమైన శ్రద్ధవలె, ప్రతిహతమైన యాశవలెఁ, గలుషమైనబుద్ధివలె సీతాదేవి యున్నదని జెప్పుటవలన సీతను గూర్చి తెలియకపోవుటయే కాక తెలియనియవస్థానభేదము లెన్నియో

మన్నాఁ బడినవి. ఈపద్ధతి సమంజసము కాదేమో? కాని యావాల్మీకి తిరుగబడి ''నాపున్న కము నిన్నుఁ జదువు మన్నవాఁ డెవఁడు? నీకుఁ దెలియుట కొఱకే నేను కవిత్వము చెప్పవలయునా? ఒకనికిఁ దెలియుట యనునది కవితోద్దేశమా? నాయుత్సాహము కొలఁది నాయిష్టమువచ్చినట్లు నాసంతోషముకొఱకై నాకొఱకే పాడుకొంటి'' నని మనల ధిక్కరించు నెడల మనము కొంతసేపటి వఱకు మూఁగలమైయుండవలసివచ్చునేమో? వాల్మీకి మహర్షి చెప్పిన యధిక్షేపణము నిజమే. మామిడిచిగురువగరున జేరవదలినకంఠముతోఁ గలకంఠ మెవనికొఱకుఁ బాడుచున్నది? మధుపాన మొసర్చి పాడు తుమ్మెద నీవు వినుటకే పాడుచున్నదా? ప్రకృతి జ్ఞానాస్వాదమున మత్తిల్లి మైమఱచి వినువారు లేకున్నను వ్రాయు వారు లేకున్నను నాత్మసంతోషము కొఱ కానందగీతములను బాడు గాయకశిఖామణి కవి.

''అభ్రకం రససిందూరం గంధకం టంకణం నమ'': మ్మనుయోగము ననుసరించి యాయావస్తువులను గలిపి సింధూర భూషణమును జేయు వైద్యునివలె, వివిధములయిన రంగులను చిత్రచిత్రములగు పాళ్లతోఁ గలపి యొకవింతరంగును చేయుచిత్రకారునివలె రామాశుగ సన్నిభమైన దృష్టిని బదునాల్గుభువనము లొక్కవిసరున నుందునకు వెనుకకుఁ బఱపి సర్వవస్తుజాలమును బరిశీలించి యావస్తువులలో దేనిదేని సేయవిధములుగా గలపిని బాగుగా నుండునో యోజించి యట్లు కలపి నూతన వస్తువుగఁ జేసి వాని నుంచుటకుఁ దావు, వాని బిలుచు టకుఁబేరుకల్పించి వానిని వాగ్రూపములగు ప్రతిమలను జేసి మనయెదుటఁ బెట్టఁగలద్వితీయద్వితీయ సృష్టికళా బ్రహ్మయగునాతఁడు కవి.

కవి పిచ్చివాఁ డనుమాట సత్యమే. ఎట్టిపిచ్చిలో నేమాత్రమైన వెగటును లేదో, యెట్టిపిచ్చి జగదుద్ధరణపటిష్ఠమో, యెట్టిపిచ్చిలో జ్ఞానవిజ్ఞానములు దుర్నిరీక్షమైన తేజస్సుతో వెల్గునో, యెట్టివెఱ్ఱికి వేయి విధములు గాక, కోటి విధములైనను బరమార్థగ్రహణ విధానమున నొక్కటే విధము గలదో, యెట్టి వెఱ్ఱి వెఱ్ఱులన్నింటికంటె వెఱ్ఱిదో, యట్టి వెఱ్ఱిని, నట్టి లోకాతీతయైన వెఱ్ఱిని, నట్టి వెఱ్ఱి లేని వెఱ్ఱిఁ గలిగి తాను ధన్యుఁడై ధన్యముజేయు నాతఁడు కవి.

ఆ. మల్లెపూవుఁ దూఁటి మధుపంబుతోఁ బాడి
గంధవాహుతోడఁ గలసి వీచి
యబ్ధిలోన మునిఁగి గలసి వీచి
యబ్ధిలోన మునిఁగి యౌర్వవహ్నిని గ్రాఁగి
నీటిబుగ్గ యగుచు నింగిఁ బ్రాఁకి
తోఁక చుక్కతోడ డీకొని శ్రమఁజెంది
సాంధ్య రాగనదిని స్నానమాడి
తనువునిండ నింద్రధనుసురంగులు పూసి
కైరవాప్తసుధను గైపుఁ జెంది
గోళగానరుతికి మేళవింపుగఁ బాడి
పాడి యాడి పాడి యాడి సోలి
భావనామహత్వపటిమను బ్రహ్మమై
పోవుకవికిఁ గోటిమ్రొక్కు లిడుదు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

5. వైష్ణవుని యుపన్యాసము

జంఘాలశాస్త్రి ఒకసారి ఒక వైష్ణవభక్తుడి ఉపన్యాసాన్ని సాక్షి సంఘసభలో ఏర్పాటు చేశాడు. ఆయన పేరు తిరువేంగడాచార్యులు.

ఆయన భక్తి అంటే ఏమిటో, శాస్త్రోక్తంగా ముందు నిర్వచిస్తూ –తైలధారలాగ, ఎక్కడ తెంపు, వంపు లేకుండా, తరుగు విరుగు లేకుండా వుండే–భగవంతుడిపట్ల–ఏకాగ్ర చిత్తం అని సూచించాడు. భక్తి పేరిట రకరకాల మనుషులు చేసే వింత ప్రవర్తనల్నిబట్టి బయలుచేశాడు. కొందరికి కష్టాలు ఎదురైనప్పుడు తాత్కాలికంగా భక్తి ప్రబలుతూ వుంటుంది. కష్టం వెనకబట్టగానే, భక్తి పలాయనం చిత్తగిస్తుంది. ఇటువంటి భక్తికంటె నాస్తికత్వం మేలు. నాస్తికతలో నీతి వుంది. శాసన విధేయత వుంది.

కొందరు మనుషులు సుఖంగా అంతా జరిగిపోతున్నప్పుడు భక్తులు. పూజలు, హారతులు, నైవేద్యాలు, దానాలు, పురాణ పఠనాలు-అబ్బో! అదంతా గొప్ప ప్రదర్శనమే. వీళ్లకి కాస్త ఒళ్లు వెచ్చబడితే చాలు ఒకటొకటీ మూల పడతాయి. సొంత సేవలు, బ్రతుకు భయాలు వరించేస్తాయి. ఈ ప్రదర్శనాలకీ, భక్తికీ కూడా ఏమీ సంబంధం లేదు. వీరిది పూజా మందిరం కాదు. బొమ్మల దుకాణం.

ఆచార్యులుగారు . భగవద్గీతనుంచి ముఖ్యశ్లోకాలు తీసుకుని –భక్తితత్వం ఎంత గహనమైనదో, ఎంత ఆర్తిలోంచి, తపనలోంచి, త్యాగంలోంచి, అర్పణ భావంలోంచి పుడుతుందో వివరించారు. ఇందుకు గజేంద్ర మోక్షం కథనీ, ద్రౌపదీ మానసంరక్షణం కథనీ ఉదాహరించి–ప్రపత్తికి పరాకాష్ఠను సూచించారు. సారాంశంగా–భక్తిమార్గం ప్రకృతి మార్గానికి భిన్నమైంది కాదనీ, భగవంతుని మీద దృష్టి లేకుండా ఒక్క ఆలోచనకూడా చెయ్యవద్దని మనవి చేశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! ఒక శ్రీవైష్ణవుడు మనసభలో భక్తినిగూర్చినే ఉపన్యసించును. ("ఇదివఱకు భక్తినిగూర్చి యుపన్యసించితిరి కాదా? తిరుగ నావిషయమునుగూర్చియే యుపన్యాస మెందుల" కని సభలోఁ గేక.) నాయనా! అట్లన గూడదు. మంచిమాట లెవరు

చెప్పినను వినవలసినదే. అందులో జన్మతారకమైన భక్తినిగూర్చిన మాట లనుదినమున ననుక్షణమునఁగూడ వినవలయును. వినఁగా వినఁగాఁ గొన్నిమాటలైన మనస్సున స్థిరముగఁ బ్రవేశించునేమో, యవి యెన్నఁటికైన నాచరణములోనికి వచ్చునేమో యని నేను దేవులాడుచున్నాను. ఒకసారి వచ్చినది తిరుగ రాఁగూడదనుట కిది యేమి స్వోటకమా? అదిగో యావైష్ణవులు మాటలోనే వచ్చుచున్నారు. నాయనలారా! ఉపన్యాసము వల దనకుఁడు.

అయ్యా తిరువేంగడాచార్యులుగారూ! దయచేయుఁడు. నాయనలారా! నే నిప్పుడు మీతో మనవిచేసిన యాచార్యులవారు వీరే శ్రద్ధతో వారిభక్తివిషయకోపన్యాసమును వినవల యును.

వైష్ణవుని యుపన్యాసము

శ్రీమతేరామానుజాయ నమః సోదరులారా–అడియేనికి రవ్వంత సంస్కృతసాహిత్య మున్నది. వైష్ణవమతగ్రంథములను గొలఁదిగా నడియేను సేవించినాఁడు. ఈసభలో ననేకులు తఱచుగ వచ్చి యుపన్యసించుచుండఁగా నడియేను కాభాగ్య మేల లేకపోవలయును నని యిచ్చట కిందులకు సిద్ధపడినాఁడు. ఐహికవిషయములపై నేమి చెప్పిన నేమి వినియోగమని యెంచి, భక్తినిగూర్చి చెప్పఁ దలఁచితిని–అచ్చటచ్చటఁ గొన్ని ప్రపత్తిమాటలుగూడ రావచ్చును.

భక్తి యనఁగా నేమి? తైలధారావదవిచ్ఛిన్నస్మృతిసంతాన రూపాపన్నజ్ఞానము భక్తి యని పెద్దలు సాయించినారు. తైలధారవలె సంతతము నిరంతరముగ భక్తియుండవలయును. ఎక్కడను దెంపుగాని, వంపుగాని, తరుఁగుగాని, విరుఁగుగాని యుండఁగూడదు. ఎందఱెం దఱకెన్ని యెన్నిరోగములు వచ్చినసరే, యెన్నియెన్ని వ్యవహారము లెట్లు ధ్వస్తమైన సరే, యెన్నెన్ని పరాభవములు, ప్రజానిందలు సిద్ధించిన సరే, భక్తిసాంతత్యమునకు భక్తినైరంతర్య మునకు, భక్తిప్రవాహవేగమునకు భంగము లేశమైన రాఁగూడదు. తీయనీటికిఁ జేఁప యెక్కినట్లు, భక్తి మనస్సునం దట్టి యట్టి ప్రవేశించి, మనస్సులోని యైహికసంకల్పము లన్నియు నావలఁ ద్రోచి, తానుమాత్రమే భగవత్ప్రేమరూపముగా నిల్చియుండవలయును.

కొందఱకుఁ గష్టములు సంభవించినప్పుడు తాత్కాలికము భక్తి కలిగిన ట్లుండును. కాలికి ముల్లు గ్రుచ్చుకొన్నప్పుడు మనుజుఁ డమ్మాయని యబుద్ధిపూర్వకముగ ననుచున్నాఁడు. అమ్మను నిశ్చయముగా మనస్సునందుఁ దలఁచి యమ్మపైనుండు ప్రీతిచే, భక్తిచే నాతఁ డట్లమ్మాయని యఱచినాఁడా? అమ్మ వచ్చి రక్షించు ననువిశ్వాసముతో నామెను బిలిచెనా? అట్టి యాక్రోశములకు మనస్సుతో సంబంధము లేదు. అవి కొంచెము హెచ్చుతగ్గుగ దైహికవికారములు కాని మఱియొకటి కావు. ''నారాయణా! నారాయణా! భగవన్నారాయణా! నారాయణా'' యని పాడుచు ముష్టిదానరయ్య వచ్చును. ఆతని నారాయణస్మరణము మనఃపరిపాకముచేఁ గలిగినదా? కడుపుమంటచేఁ గలిగినది. ఆఁకలిచే నది కలిగినది కాని యంతశ్శుద్ధిచేఁ గలిగినదా? అలవాటుచే నది కలిగినది కాని యాముష్మికార్థిచేఁ గలిగినదా? జోలి నిండఁగనే నారాయణస్మరణము రవంతయుఁ గట్టుపడును. అటుపైని దా నెవఁడో నారాయణుఁ డెవఁడో! దాక నిండుకై వచ్చిన నారాయణస్మరణమునఁ దత్త్వము

పండునా? జోలి యావలఁ బాఱివైచినాఁడు. కల్లుకొట్టులోఁ బ్రవేశించినాఁడు. త్రాగి యొడలు తెలియక యడ్డమైన బూతులు కనఁబడినవారి నెల్ల తిట్టినాఁడు. ఇట్టిభక్తికంటె నాస్తికత మంచిది కాదా? నాస్తికతలో నీతియున్నది. శాసనవిధేయత యున్నది. దీనిలో నవియైన లేవే.

కొందరు నరులు సుఖకాలమునందు దైవస్మరణ మొనర్చుచుందురు గడియగడి యకు రామరామా యని యఱచుచుందురు. కన్నబిడ్డలు గారుగీరు మనుచు గంతులువై చుచు నాడుకొనుచున్నంతవఱకు, గల్లాకొట్టులోఁ గృష్ణకాటుకలు సమృద్ధిగ నున్నంతవఱకుఁ, జేతిపెట్టెలో జార్జిసార్వభౌముని మొగములు చాలఁ గనఁబడుచున్నంత వఱకుఁ, గడుపుచల్లగ నున్నంతవఱకుఁ, బ్రక్కలో భార్య వెచ్చవెచ్చగఁ బండుకొన్నంత వఱకు, వీరి రామస్మరణ మింత యంత యని చెప్పఁదగదు. దేవతార్చన లందు జయఘం టలు కావు–శుభనాదములు కావు–సాంబ్రాణి ధూపములు కావు–కప్పురపుటారతులు కావు –గోఘృతదీపములు కావు–చిత్రాన్నదధ్యోదనాదిభోగములు కావు–శ్రీపుష్పయోగములు కావు–ఓ చేతులజోడింపులు కావు; లెంపల వాయింపులు కావు–పైగడబడలు, దడబడలు, నెన్నియైన జరుపుదురు. ప్రతిరాత్రి పురాణకాలక్షేపము; పక్షమునకు సాలగ్రామదానము; మాసమునకు సత్యనారాయణవ్రతము–సంవత్సరమునకుఁ బెరుమాళ్లకుఁ బిరాట్టికిఁ బున స్సంధానము. వీరు సుఖదినములలో దైవము పేరుపెట్టుకొని యెంత కోలాహల మైన నెంత హంగామా యైనఁ జేయుచున్నారు. సాయం కాలమగునరికి యొడలు రవంత వెచ్చఁబడినది. ఆరాత్రియే పురాణకాలక్షేపము మూలఁబడినది. తెల్లవాఱునరి కమ్మగారికిఁ దొంబదియెనిమి దివఱ కుండవలసినదానికి నూటమూఁ డున్నది. ఆయుదయమే పెరుమాళ్ల కష్టోత్తరశతనా మార్చన మున్నయైనది. అయ్యగారి కుషఃకాలస్నానము లేదు నరేకదా, తొమ్మిదిగంట లైనను దంతధావనమైన లేదు. మొగము కడుగని యయ్యవారు సాలగ్రామములు కడుగునా? పిరాట్టిశిరమునకుఁ దిరుమంజనము మాని పెండ్లామ తల కమ్మతాంజనము రాయు చున్నాఁడు.. మూల్గుచున్న భార్య వంకఁ జూడవలసిన యయ్యవారు నోరుమూసికొన్న పెరుమాళ్లవంకఁ జూచునా? పూజాకాలమందు సేవాకాలము చెప్పుటకు రావలసిన భాగవత్తములు దిగులువడ్డ మొగములతో, శ్వాసకోశపరీక్షాయంత్రములతో, ముక్కుద్ధములతోఁ జేతిదుడ్డుతోఁ, జర్మపాదరక్షలతో మహమ్మదీయవైద్యుఁ డొకఁడు, మంగలివైద్యుఁ డొకఁడు, మాలవైద్యుఁ డొకఁడు లోనికిఁ బ్రవేశించి, యమ్మగారిని బరీక్షించుచున్నారు. శ్వాసకోశము లలో రవంత గురుకున్న దని యొకఁ డనినాఁడు. ప్రేగులోఁ గానంత గళు కున్నదని మఱియొకఁ డనినాఁడు. హృదయకోశములో రవంత 'మర్మ' రున్న దని యింకొకఁ డన్నాఁడు. శ్లేష్మవాతజ్వర మని (Pneumonia) యొకఁ డనినాఁడు. ఆంత్రజ్వర మని (Typhoid fever) మఱియొకఁడన్నాఁడు. మన్నెపుజ్వర మని (Malaria) ఇంకొకఁ డన్నాఁడు. ఏది సిద్ధాంతమని యయ్యవా రడిగినాఁడు. విశిష్టాద్వైతమే సిద్ధాంత మన్నవాఁ డీ మాలమంగలి వైద్యులను జ్వరసిద్ధాంత మడిగినాఁడు. భార్య బ్రదుకదని యేడ్చు చున్నాఁడు. అపాయకర మని ముగ్గురుకూడఁ జెప్పినప్పుడేమిచేయును? శ్లో. న ధర్మని ష్ఠోస్మి న చాత్మవేదీ, న భక్తిమాన్ త్వచ్చరణారవిందే । అకించనో నన్యగతిశ్శరణ్య, స్త్వత్పాదమూలం శరణం ప్రపద్యే. యని బట్ట మెడఁ జుట్టుకొని పెరుమాళ్లకు సాష్టాంగ పడవలసిన యయ్యవారు నాభార్యను రక్షింపరా యని మాలవైద్యుని కాళ్లపైఁ బడుచున్నాఁడు.

ప్రమాదమున నైనను రామనామ ముచ్చరించుట లేదు. అంతటితో నాఁగినఁ గొంతమంచిదే ''పనికిమాలిన ప్రపంచము, ఎంతసేపు పుణ్యాత్ములకే చిక్కులు. భక్తులకే బాధలు. ఏమిలోకము? ఏమి దేవుఁడు? ఉన్నాఁడో లేఁడో కూడను ఉండిచేయుచున్న సౌభాగ్య మిదియే కాదా? కరుణాళుఁ డఁట! ఆపద్రక్షకుఁ డఁట. చెప్పినవానిని, వినినవానిని గూడఁ జెప్పుదీసికొని తన్నవలయును. ఏదో సుఖముగా జీవనము జరుగుటకేకదా యిన్నిపూజ లొనర్చితిని. నేఁ జేసిన పూజ లన్నియు బుగ్గియైపోయినవా? ఎన్ని దివ్యదేశములు సేవించితిని! ఎంతడబ్బు తగులఁ బెట్టితిని! ఇచ్చిన యీవులు, చేసిన సత్కారములు, పెట్టిన నైవేద్యము లన్నియు దిగమ్రింగి, తీర పని వచ్చినప్పుడు మొండిచేయి చూపుటా? కనఁబడినాఁడుకొఁడు కాని యీడ్చి సాగఁదీసి.....'' యని యయ్యవారు పలుకుచున్నాఁడు. నాస్తికతయింత కంటె సహస్రగుణములు మంచిది కాదా? పశుత్వమే యింతకంటెఁ బ్రశస్తతరము కాదా? శ్రీరామ కృష్ణపరమహంసగా రిట్టి వారిని జిలుకతోఁ బోల్చినారు. దోరజామిపండు కడుపునిండఁ దిని, కొబ్బెర చిప్పలో నీరు ద్రావి, పంజరమున నడ్డుగనున్న యినుపశలాకపైఁ గూరుచుండి 'అఖిలజగన్నాయకా! అపన్నివారకా! జగచ్చక్రవర్తీ! జగన్నాథమూర్తీ!' యని ముద్దులొలుకఁ బలుకును. పంజరమునొద్దకుఁ బిల్లివచ్చి దానితోఁక గ్రహింపఁ బోవఁగ జగచ్చక్రవర్తి లేఁడు, జగన్నాథమూర్తి లేఁడు. కేరుకేరున నొక్కపెట్టునఁ గూయుచు పిలవిల కొట్టుకొనును. నోటితుంపరకు మనస్సున కెంత సంబంధ మున్నదో, యిట్టి వారి హరినామస్మరణమునకు నాత్మకు నంత సంబంధ మున్నది. వీరిట్లొనర్చు హరినామస్మరణము, దేవతార్చనము మొదలగునవి భక్తితో సంబంధించిన వేమాత్రము గావు. ఆఁడుపిల్లలు కాగితాల యిండ్లు కట్టుకొని యాడుకొన్న మగఁడు పెండ్లామాటలకు శృంగారరసముతో నెంత సంబంధ మున్నదో, వీరి బొమ్మలదుకాణమునకు భక్తిరసముతో నంత సంబంధ మున్నది. ఇవి కర్మముతో సంబంధించినవి మాత్రమే యగును. సుఖము సిద్ధించినయెడల నొడలు తెలియక తెయితక్కలాడుట, కష్టములు సంభవించినయెడల నెత్తి నోరు కొట్టుకొని యేడ్చుట భక్తుని లక్షణమా? భక్తుఁడు సుఖదుఃఖముఁదు కాఁడా?

శ్లో. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహంకారస్సమదుఃఖసుఖః క్షమీ.
సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పితమనోబుద్ధిః యో మేభక్తస్స మే ప్రియః.
యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి,
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః.
సమశ్శత్రౌ చమిత్రే చతథా మానావమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః.
తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్,
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః.

ఈశ్లోకములందు భక్తునిలక్షణములు కొన్ని శ్రీకృష్ణభగవానులు సెలవిచ్చియున్నారు. సుఖదుఃఖనమత్వము, శత్రుమిత్రభేదశూన్యత, స్తుతినిందాతుల్యత్వము, శుభాశుభ వరిత్యాగము, సంతతసంతుష్టచిత్తత మొదలగునవి భక్తునిలక్షణము లని సెలవిచ్చినారు. కాని, యట్టిభక్తి యెట్లు కలుగును?

శ్లో. జన్మాంతరసహస్రేషు తపోజ్ఞానసమాధిభిః,
నరాణాం క్షీణపాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే.

అనేక సహస్రజన్మములు తపోజ్ఞాన సమాధులవలన పాపక్షయమైన పిమ్మట నరులకు శ్రీకృష్ణభగవానునియందు భక్తిపుట్టును. అంతకాలమైన పిమ్మట, నంతశ్రమ మొందినపి మ్మట, కృష్ణభక్తి యుదయించునని చెప్పఁబడినది. అది సందుకొట్టి చావకుండ బ్రదికి, బాల్యగండము లన్నియు దాఁటి బ్రదికి, పరిపుష్టి నొంది పుష్పించి ఫలించుటకు మఱియెంత కాలము పట్టునో? ఒక జన్మములో వైయాకరణులము కావచ్చును. తార్కికులము కావ చ్చును, వేదాంతులము కావచ్చును; ఇవియన్నియు గూడఁ గావచ్చునుగాని యనేక సహస్రజన్మసంసారమునఁ గాని భక్తి కలుగదు.

భగవంతుఁడు మనల రక్షించి యుద్ధరించు ననమాట నిశ్చయమేనా? ఇంకను సందేహ మేమి? ఆయన రక్షించి యుద్ధరింపకుండు నెడల నింక రక్షించువాఁ డెవఁడు? మృత్యుసంసార సాగరమునుండి యుద్ధరించువాఁ డెవఁడు?

శ్లో. యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే,
తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్
భవామి నచిరాత్పార్థ! మయ్యావేశితచేతసామ్.

అని కృష్ణభగవానులు సెలవిచ్చియున్నారు.

మహాశక్తియున్న యీశ్వరుఁడు కాని మనుజుల రక్షింపఁగలఁడా? అందులో నొకరా యిద్దఱా? అదిగాక యనేక సహస్రజీవకోటులను రక్షించి యుద్ధరింపవలయునే?

శ్లో. శక్తే స్సూపసదత్వాత్ కృపాయోగాచ్చ శాశ్వతాత్
ఈశేశితవ్య సంబంధాత్ అనిదం ప్రథమాదపి
దక్షిష్యత్యనుకూలాన్నః.....

అని పెద్దలు సాయించినారు.

సర్వేశ్వరుఁడు సర్వశక్తిసంపన్నుఁ డగుటచేతనే మనల రక్షింపఁ గలఁడు. భూమిలో నున్న రాజులు, రాజాధిరాజులు, చక్రవర్తులు మనల రక్షింపఁగలరా? వట్టిమాట. వారే మనలను రక్షించునెడల వారిని రక్షించువాఁడెవఁడు? వారికున్న కాంచసరాను లన్నియు వారికష్టములకే కారణము లగుచున్నవికావా? వారి కున్న సుఖసాధనము లన్నియు వారికి దుఃఖదాయకములే యగుచున్నవి కావా? వారి కున్న భోగపరికరము లన్నియు రోగపీడాకర ములే యగుచున్నవి కావా? అందుచే వారి కున్న కష్టములు మనకష్టములకంటె శతసహస్రగు ణాధికములై యున్నవి. వా రీకష్టములనుండి విముక్తి నొంద లేక గిజగిజ కొట్టుకొను చుండఁగా, వారు మనకేమి చేయగలరు? మనకంటె వారి కనేకములైన విలువగల పదార్థము లున్నవి. మణులరాసు లున్నవి. ఏడంతరువుల మేడ లున్నవి. దాసదాసీజనశతము లున్నారు. అశ్వగజాందోళికాది సంపద లనేకము లున్నవి. కాని మానవ శక్తిలో వారు మనకంటె నెక్కుడువ ఘనులు? భగవంతుఁ డట్టివాఁడా? ఆయన దివ్యశక్తిసంపన్నుఁడు. అద్వితీయశక్తి సంపూర్ణుఁడు.

కాని యెంత మహాశక్తినంపన్నుఁ డైనను నాతఁడు మనల రక్షించు నని యెట్లు

నమ్మవచ్చును? ధనవంతుఁ డైనవాఁ డెల్ల త్యాగి యగుచున్నాఁడా? విద్యావంతుఁడైనవా
డెల్ల గురుఁ డగుచున్నాఁడా? ప్రపంచజ్ఞాన మున్నవాఁ డెల్ల కవి యగుచున్నాఁడా? అట్లే
శక్తియున్నవాఁ డెల్ల రక్షించు నని యేమి నమ్మకము? శక్తిని రక్షణకార్యమునకై ప్రోత్సహించు
గుణ మొక్కఁటి దానివెనుక నుండవలయును. ప్రపంచజ్ఞాన మున్నవాఁ డెల్ల కవి యగుట
లేదు. అట్టిజ్ఞానమును చిత్రవిచిత్రముగ లోకనమ్మోహనకరముగ నుపయోగపఱచుటకు
సమర్థయైన నవనవోన్మేషశాలిని యగు ప్రతిభ దానివెనుక నుండవలయును. అట్లే భగవం
తుడు తనశక్తిఁ జూపుటకుఁ బ్రేరణ సేయుఁగల యేగుణము దానివెనుక నున్నది? లేదా ఇదిగో
''కృపాయోగాచ్చ శాశ్వతాత్'' అని శ్లోకమున లేదా? ఓ! కృపగలశక్తిమంతుఁడు రక్షించుట
కడ్డేమి? అందులో శాశ్వతమైన కృపయే. ఈదినమున నిల్చి రేపు మాయ మగునది కాదే?
ఎందఱు నెంతకాలము రక్షించినను దరుఁగునది కాదే? అందుచే నాతఁడు మనల రక్షించుట
నిశ్చయము.

కాని ఆతఁ డెవరు? మన మెవ్వరము? మనల నాతఁడేల రక్షింపవలయును?
ప్రపంచమున శక్తిమంతులు, కరుణాళురు నందఱను రక్షించుచున్నారా? ''రష్యాచక్రవర్తి
యిక్కడివారిని రక్షించుటకుఁ బూనుకొనునా'' అని యన నక్కఱలేదు. అట్టిసందేహ
మనావశ్యకము, రక్షించుట కట్టిసంబంధముగూడ నున్నది. అది యెప్పు డారంభమైనదో
యెరుఁగ నంతపురాతనమై యున్నది. ఆసంబంధమేది? ఈశేశితవ్య సంబంధ మని శ్లోకమున
చెప్పఁబడినదికాదా? ఇఁక నేమి?

కాని మఱియొకటి యున్నది. ''రక్షిష్యత్యనుకూలాన్నః'' అని శ్లోకమున చెప్పఁబడి
నది. అనుకూలురమైన మనలను రక్షింపఁగలఁడఁట. ఈయనుకూలత్వము మనగుణము.
మన మెట్లుండిన నాతని కనుకూలురమై యుందుమో రవంత తెలిసికొనవలసియున్నది.

భగవంతుఁడు మనల రక్షాపేక్షను ప్రతీక్షించును. ''పరమేశ్వరుఁడా! రక్షింపు'' మని
మన మెప్పు డైన నాతనిఁ గోరుదుమా, అట్టి కోరిక తనచెవి నెప్పుడైనఁ బడునా యని
యాపన్న రక్షణార్థమై దయా సముద్రుఁడగు భగవంతుఁడు వేచియుండునఁట. ఆమాత్రపు
మాటయైన మననోటినుండి వెడలదే! అట్టిమాటలు నోట వెడలుచున్న కొందరి కామాటలు
నాల్క చివరనుండి వచ్చినవి కాని మనస్సునుండి వచ్చినవికావు. అట్టి శుష్కవాక్యము
లక్కఱకు రావు. ఆర్ద్రమైన మనస్సుతో, విశ్వాసపూర్ణమైన మనస్సుతో, దృఢనిశ్చితమగు
మనస్సుతో, నన్యగతికమైన మనస్సుతో, న్వరక్షణతత్పరతాశూన్యమైన మనస్సుతో,
నియతేంద్రియులమై, కేవలభగవద్విషయక ప్రవృత్తి కల మనస్సుతో, 'బరమేశ్వరుఁడా!
నన్నుద్ధరింపవా' యని యొక్క త్రుటి కాలము ధ్యానించిన నైన నాశక్తిమంతుఁడు,
ఆదయాసముద్రుఁడు మనల రక్షించి తీరును. మన మట్టిచిత్తశుద్ధి, చిత్తదార్ఢ్యముఁ గలిగి
యున్నామా? అట్టి రవంతసేపు స్వప్రయోజకత్వ విశ్వాసము, ఇట్టి రవంతసేపు నర్వేశ్వర
చింత ఇందులో నొక్కయడుగు, అందులో నొక్కయడుగు. ఇట్టి సంకరపుబ్రదుకు
బ్రదుకుచున్నాము. ఇట్టి యుభయభ్రష్టత్వపుబ్రదుకు బ్రదుకుచున్నాము. క్రొత్తకుండ,
ప్రాతతెడ్డు. జగద్రక్షకా! జానకీపతీ యని జ్వరపీడిత యగునహధర్మ చారిణిరక్షకై యాక్రో
శించుచునే యున్నాము. Genaspirin పొట్లములు వేయుచునే యున్నాము. ఉత్తమర్ణుఁడు
మనయాస్తి నొందుటకై జప్తు హకుముఁ దీసికొని రాఁగాఁ దహతహచే, 'శ్రీనివాసా,

శ్రియఃపతీ, రక్షింపు' మని మొఱ పెట్టుచునే యున్నాము. చెంబుత్పెలయు దొడ్డి దారిని బొరుగింటికిఁ బంపించుచునే యున్నాము. ఈచర్యకర్థమేమైన నున్నదా? ప్రయోజన మేమైన నుండునా? మనకంటెఁ బ్రోరెవ్వరు నిక్కడ లేకపోవుటచేతను, గొంచెము పెచ్చుత గ్గుగ నందఱి మొక్కఁటే తరగతిలోనివార మగుటచేతను సరిపోవుచున్నది గాని, దేవతలు మన యీ యసందర్భచర్యలను జూచునెడల వారు పైనుండి మనమొగములపై నుమియుదు రేమో!

మనబుద్ధు లెంత, మనశక్తు లెంత, మనప్రయోజకత లెంత, మన పాండిత్యము లెంత, మనదూరదృష్టు లెంత, మనప్రయత్నము లెంత? తెలియఁదగిన యంశ మేదియు మనకుఁ దెలియనే తెలియదే. నిజమాలోచింపఁగ మట్టిలోఁ బొరలెడుకీటకములకంటె మనమె క్కువయో నాకు బోధపడలేదు. ఆహారనిద్రాదులతో నవియు మనముఁ గూడ సమానప్రతి పత్తితోఁ గాలక్షేపము చేయుచున్నాముగాదా? మనుష్యులమై పుట్టినందులకు, సృష్టికిఁ బ్రభుల మని సిగ్గులేక చెప్పుకొనుచుండునందులకు, మనకు రవంత యదనముగ నేమైన సుగుణసం పత్తి యుండవలదా? భగవద్భక్తియే మనకు లేకుండునెడల నవియు మనము నొక్కమట్టము లోనివారమే కాదా? ('కీటకములకు భక్తియున్నదేమో. మనమెట్లు చెప్పఁగలము' అని సభలోఁ గేక.) అటులైన మనము, కీటకములకంటె నధమప్రాణుల మనుటకు నందేహమేమి? చేసినప్రయత్నము లెన్నెన్నియో భగ్నములై పోవుచున్నవే. ఎంతెంత ప్రయత్నములో చేయుచున్నామే. ఎన్నెన్ని యాసలోఁ బెట్టుకొనుచున్నామే. ఫలము నందఁగలుగుచు న్నామా? రామపట్టాభిషేకమునకు దశరథుఁ డెంతగాఁ బ్రయత్నించినాఁడు! వసిష్ఠుఁ డంతవాఁడు సుముహూర్త ముంచినాఁడే. శ్రీరామచంద్రునిహస్తమున కామహర్షి పట్టాభిషేక కంకణముఁ గట్టినాఁడే అన్నియు సిద్ధము చేయఁబడినవే. సీతారాము లుపవాసముచేసి రాత్రి జాగరముఁగూడ జేసిరే. మందుకొట్టంటుకొన్నట్లంతయు టప్పున నొక్కసారి యెగిరిపో యెనే. పట్టాభిషేకము లేదు సరికదా, పైఁగ బదునాలుగేండ్లు వనవాసమా? అప్పుడు శ్రీరామచంద్రుఁడు జనుల కేమి బోధించెనో విందురా!

గీ. జనులయత్నంబు లేపాటి శక్తిగలవొ
బుద్ధు లేపాటి ఘనములో బొమ్మలైన
నరుల నాడించు నది యేదొ నావిచిత్ర
పట్టమును గాంచి తెలిసికో వలయు జనులు
ఐహికము లశాశ్వతములౌ నందు మనుజు
లంద తెరిఁజీనయంశమే యంద దెపుడు
మఱచునంగతి యది యుండె మఱవకుండ
నాచరించెడివాఁడె జ్ఞు నాధికుండు
ఘనతరంగాహతాంగంబు కల్గి కరము
నెత్తి నది దాఁటుకరివోలె నెన్నియాప
దలు సుఖమును గదల్చిన విరసదూర్వ
ద్భజ్మనన్కూడొ నరుఁ డు త్తరించు భవము.

నాయనలారా! ఇవి మనకు బుద్ధిరాఁదగిన మాటలేకావా? ఎంత సేపు నధోదృష్టియే

కాని యూర్ధ్వదృష్టి మన కలవడనే లేదే? Evolution అట! అది యేదో నాకుఁ దెలియదు కాని, తరులతాజాతినుండి క్రమక్రమముగా నున్నతదశలోనికి సృష్టిపరిణామము జరుగుటచే మనుష్యుఁ డైనాఁడట! దాని వివరములు నాకేమియుఁ దెలియవు. అదియే నిజమైనయెడల మనుష్యత్వమునుండి క్రమముగా దేవత్వములోనికిఁబోవలసినవారము కదా, పీతవలె నిక్కడ నుండి వెనుకకు నడచుచున్నా మేల?

ధనము లేనప్పుడు ప్రభువుల కాళులు పట్టుకొను చుందుట లేదా? రోగములు వచ్చినప్పుడు వైద్యుల కాళులు పట్టుకొనుచుండుట లేదా? తుట్టతుదకు ఋణము కావలసివచ్చినప్పుడు ఋణప్రదాతల కాళులు పట్టుకొనుచుండుట లేదా? ఇందఱు కాళ్ళ నింతనైచ్యముచే నింత బానిసతనముచే బట్టుకొనుచున్నామే. ఏదీ, తుదకు కోర్కెలు ఫలించెనా? ఫలించినను వానిపై కోర్కెలు వెంటనే కలుగకుండ మానినవా? ఒక్కని కాళ్లు–పదునాల్గుభువనముల కొక్కఁడైవాని యొక్కని కాళ్ల ''న జానే కర్మ యత్కృంచిన్నాపి లౌకికవైదికే, న నిషేధవిధీ విష్ణో తవ దాసోస్మి కేవల'' మ్మని భక్తితోఁ బట్టుకొనినయెడల నింక నేయాపదయును లేదే. ఏలోపమును లేదే. అట్లుచేయకపోవుట కంటె బుద్ధిహీనత, పశుప్రాయత వేఱ కలదా?

అదిగాక, ''రావోయి రక్షింతును; రావోయి రావోయి రక్షింపు మని కానంతమాట మనసార నార్తితోఁ బలుకవోయి'' యని మనలఁ బ్రార్థించుచు భగవంతుడు మనలఁ దరింపఁ జేయుటకు మనలోపల, మనవెలుపల, మనచుట్టు నల్లలాడుచుండఁగా నింకను బుద్ధిహీనులమై ప్రవర్తించుట మహోన్మాదముకంటె భిన్నమా? ''నాయనా! వంట యింటిలోనికి రావోయి, రవంత యన్నము తినవోయి, నీకొఱకింకఁ గనుపెట్టుకొని యుంటినోయి' యని తల్లి వేఁడుచుండఁగ నామాటలు పెడచెవినిఁ బెట్టి వీథుల, నూరూర, దేశదేశాలు దిరిగి, ముష్టియెత్తుకొను నిర్భాగ్యు నేమనవలసినది? పోనీ. దేశయాత్ర జరిగినది. సంతోషమే. కాని యెవఁడైన ముష్టి బెట్టినాఁడా? ఎవఁడు పెట్టఁగలడు? అందరు భిక్షుకులయినప్పుడు పెట్టుట కెవఁడు సమర్థుఁడు? ఒకఁడు ధనభిక్షుకుఁడు, ఒకఁడు కీర్తిభిక్షుకుఁడు, ఒకఁడు బిరుదభిక్షుకుఁడు; ఒకఁడు సంతానభిక్షుకుఁడు, ఒకఁడు తరుణీభిక్షుకుఁడు, ఒకభిక్షుకుఁడే మొగముఁబెట్టుకొని రెండవభిక్షుకుని యాచించును? సర్వభిక్షుకులను భ్రీమంతులుగఁ జేయుటకుఁ బరమేశ్వరుఁ డుండఁగఁ బై చూపు చూడకఁ గ్రిందిచూపు జూచెదవేమి? ఇంకఁ గ్రిందనో క్రిందనో యని యేడ్చెదవేల? క్రిందనుండియే కాదా పై వచ్చితివి. చచ్చినపిమ్మట నీశరీరము నీవు చూచుచున్న క్రిందనే యుండునులే. నీయాత్మ రించు నుపాయముఁ జూచుకో.

సర్వక్షణాభిలాషపూర్ణముగ పిడిచిసఁగాని భగవంతుడు రక్షింపఁ డనుటకుఁ గొన్ని యుదాహరణము లిచ్చెదను. గజేంద్రుఁడు మొసలికిఁ జిక్కుకొనినాఁడు. గజేంద్రునికాలు మొసలి పట్టుకొని నీటిలోని కాతని లాగుకొనిపోవుచున్నది. ఈతఁడు కాలు వెనుకకు లాగుకొని మొసలిని విదల్చివైచినాఁడు మొసలి యొక్కదుముకున ముందునకు వచి గజేంద్రుని మరియొక కాలు పట్టుకొనఁ బోవుచున్నది. గజేంద్రుఁడు తప్పించుకొని మొస నొక్కత్రోక్కు త్రొక్కఁబోవ గిట్టునఁ దిరిగి, మొసలి తోఁకతో నొకదెబ్బ మొగముపై కెగి కొట్టను. తుండముతో దానిని గజేంద్రుఁడు దూరమునకు విసరివైచినాఁడు. మొ

మెఱసినంతలో వచ్చి యెగిరి గజేంద్రునిఁ బండ్లతోఁ బీకినది. ఆతఁడు దానిని దంతములతో ఛట్టించినాఁడు. ఇది ముందు లాగ, నతఁడు వెనుక కీడ్వ, నది మీఁది కెగుర, నతఁడు తప్పించుకొన, నది కఱవ, నితఁడు కొమ్మలతోఁ గొట్ట నిట్లు సహస్రదివ్యవర్షములు గజేంద్రమకరేంద్రులు హోరాహోరిగఁబోరాడ గజేంద్రునకు బలము క్షీణించెను. మొసలి డస్సియు స్థానబలముచేఁ బటిష్ఠమై యుండెను. మొసలి ముందునకు లాగుచున్నది. నీరసించిన గజేంద్రుఁడు వెనుకకుఁ బోవ గింజుకొనుచున్న వాఁ డైనను మొసలిలాగినట్లే ముందునకుఁ బోవుచున్నాఁడు. గజేంద్రునకుఁ గాళ్లు పూర్తిగ మునిఁగిపోయెను. మొసలి యింకను ముందున కాకర్షించుచున్నది. గజేంద్రుఁడు బలహీనుఁడయ్యెను నింక మొరాయించి వెనుకకుఁ దగ్గుచునే యున్నాఁడు. గజేంద్రునిశరీర మంతయు నీట మునిఁగినది. ఈఁదఁగలిగినను నాతనికిఁ గాళ్లు తేలిపోవుచున్నవి. ఇంతలోఁ దలకూడ మునిఁగినది. తుండమునకుఁ జివరనున్న ముక్కఱంధ్రములు మాత్రము నీటిమట్టమున కొక్కఱుగు సైను న్నవి. ఇఁక నొక్క యీడ్పుతో సరి యన్నట్లున్నది, అప్పుడు.

శ్లో. పరమాపదమాపన్నో మనసా చింతయద్ధరిం
సతు నాగవరశ్రీమాన్ నారాయణపరాయణఃఁ.

సర్వప్రయత్నమును బూర్తిగ విడుచుకొని నారాయణపరాయణుఁడై శ్రీమంతుఁడైన గజేంద్రుండు పరమాపన్నత నొంది శ్రీహరిమనసారధ్యానించెను. సర్వేంద్రియములు మనస్సు బుద్ధి యాత్మయుఁ బరమేశ్వరునియందు లీనమొనర్చి యొక్కక్షణకాలము ధ్యానింపఁగఁ దనపుట్టి మునిగిపోయినట్లు, తనకొంప గూలి నట్లు లొక్కయొగురున

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగమున్ జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగడతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లను చక్క నొత్తఁడు వివాదప్రోద్ధతశ్రీకుచో
పరిచేలాంచలమైన మీడఁడు గజ ప్రాణవనోత్సాహియై.

అట్టి మహావిష్ణువు ప్రత్యక్షమై గజేంద్రుని రక్షించెను.

మరియొక యుదాహరణము చెప్పెదను. ఏకవస్త్రయైన ద్రౌపదిని దుశ్శాసనుఁడు కబరీవికర్షణ మొనర్చి సభలోని కీడ్చి తెచ్చి యా మహాపతివ్రతవస్త్రము నొలుచున్నాఁడు. అతఁడు పైట లాగుచున్నప్పుడు కత్తెరమాదిరిగ నీమెచేతు లడ్డుపెట్టుకొనుచున్నది. అతఁడీమెచేతు లూడిపోవునట్లు చెఱఁగు గట్టిగ లాగుచున్నాఁడు. ఈమె వంగుచున్నది. ఇంకను లాగఁబోఁగ ముడుచుకొని కూరుచుండుచున్నది. కొప్పుపట్టుకొని యామె నాతఁడు పైకి లేవఁదీయఁగ, నొకచేతితో శిరోజములు పట్టుకొని, యొకచేతిని జందెముమాదిరి వక్షమునం దుంచుకొని, యొకతొడపై రెండవతొడ హత్తించి, రవంత వంగియున్నది. మానరక్షణమున కెన్నిపాటులైనఁ బడుచున్నది. ప్రక్కకొత్తిగిల్లు చున్నది. గరిగిర తిరుగుచున్నది. ఏమిచేసినను మహాపాపాత్ముఁడగు నాతఁడు తనదుష్ప్రయత్నమును మానలేదు. మానప్రాణము నొక్కసారి యిఁక నొక్కపావుగడియలోఁ బోవునని నిశ్చయించుకొని, స్వారక్షణ ప్రయత్నమున లాభములేదని పూర్తిగ గ్రహించి, దానిని బరిత్యజించి, రెండు

చేతులు ప్రక్కను వ్రేలాడుచుండునెడలఁ బ్రమాదవశమున మానరక్షణ ప్రయత్నముచేసికొనఁ బ్రయత్నించుట సిద్ధించునేమో యని భయపడినదియై, రెండుచేతులు పైకెత్తి, మానభంగచింత లేశము లేనిదియై, ''శంఖచక్రపాణీ!'' యని మహార్తితో నాక్రోశించిన ప్పుడు కదా శ్రీకృష్ణభగవానుఁ డామె నుద్ధరించుట సిద్ధించినది! ఆపన్న రక్షకై శంఖచక్ర ములు చేతుల ధరించిన నీవు నన్నిప్పుడు రక్షింపకయే పోవునెడల నీచేతులనున్న శంఖచక్ర ములు నాచేతుల గాజులవంటివే యని తెల్పుటకుఁ జేతులు పై కామె యెత్తినదని బుద్ధిమంతు లగు వ్యాఖ్యాతలు చమత్కరించిరి.

నాయనలారా! దృఢచిత్తము మాత్రము మన కుండవలయును. దృఢచిత్తుఁడు కానివాఁ డిహమునకుఁ బనికిరాఁడు; పరమున కంతకంటెఁ బనికిరాఁడు. భగవత్కరుణ యందు, భగవద్రక్షణశక్తియందుఁ బరిపూర్ణమగు విశ్వాస ముంపవలయును, నిశ్చలవిశ్వాస మున్నవాఁ డెన్నఁడు చెడియుండలేదు. అవిశ్వాసి యెన్నఁడు బాగుపడలేదు. ''సంశయా త్మావినశ్యతి'' యనుమాట నిశ్చయము. శ్రీకృష్ణభగవానుఁడు పరమదయాళుఁడై ప్రాణిలో కమున దరింపఁ జేయుటకై ప్రపంచమున కంతకుఁ గటాక్షించిన భగవద్గీతయందుఁ దేజోమయములగు నక్షరములతో నిట్లున్నది.

శ్లో. మయ్యేవ మన ఆధత్స్వమయి బుద్ధిం నివేశయ,
నివసిష్యసి మయ్యేవ–అత ఊర్ధ్వఁ న సంశయః

సెబాన్! ఇంతకంటెఁ గావలసినదేమి? ''నీబుద్ధిని, నీమనస్సును నాయందే నిరంతర ముగ నుంపుము. నీవు నిస్సంశయముగా నాయందు నివసింపఁగలవు'' అని భగవంతుఁ డానతిచ్చినాఁడే. సమస్త కష్టభూయిష్ఠమైన ప్రపంచనివాసమును వదలి సచ్చిదానందమయ తత్త్వమున శాశ్వతముగా నివసించుటకంటె జన్మమునకుఁ గావలసిన దేమి?

ఒకవేళ మనస్సును, బుద్ధిని నాతనియందే నిరంతరముగ మనము నిలుపలేకపోవునె డల నేమి చేయవలసినదను సందేహము మనకుఁ గలుగునేమో యని తా నెంచి,

శ్లో. అథ చిత్తం సమాధాతుం నక్నోషి మయి స్థిరం,
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ.

అని సెలవిచ్చినారు. అట్లభ్యసించుటగూడ మనకుఁ గష్టమగునేమో యని,

శ్లో. అభ్యాసే ప్యసమర్థోసి మత్కర్మపరమో భవ,
మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి.

అట్లు తననిమిత్తమై కర్మములుగూడ మనము చేయలేకుండు నెడల.

శ్లో. అధైవ మవ్యశక్తోసి కర్తుం మద్యోగమాశ్రిత,
సర్వకర్మ ఫలత్యాగం తతః కురు యతాత్మవాన్.

అని సెలవిచ్చిరి. మనము చేయు సర్వకర్మముల ఫలములుకూడఁ గృష్ణార్పణ మొనర్పవలయును. కర్మఫలత్యాగముకూడ మనకు మహాకష్ట మనుట నిశ్చయమే. దమ్మిడి విచ్చి క్రొత్తడబ్బు లాగఁజూచుచున్న మనము, గోఁచి నిచ్చి గొంగళిని గ్రహింపఁ జూచుచున్న

మనము, చేసిన కర్మములఫలము త్యాగ మొనర్పఁగలమా? అందు కంతస్వార్థపరిత్యాగ ముండవలయును? ఎంతవాఁ డంత పని చేయవలయును? అది గాక సర్వకర్మములఫలము త్యాగ మొనర్పవలయు నని మనము నిశ్చయించుకొనునెడల నొకవిషయముమాత్ర మున్నది; మనకు దుష్కర్మము లన్నియు నొక్కసారి కట్టుపడును. వ్యభిచరించి కృష్ణార్పణ మనఁగలమా? అనత్యమాడి కృష్ణార్పణ మనఁగలమా? తుట్టతుదకుఁ జుట్టుఁగాల్చి కృష్ణార్పణ మనఁగలమా? నిష్కామ్యకర్మమును గూర్చి మీజంఘాలశాస్త్రిగా రిదివఱ కుపన్యసించియే యున్నారు. అందుచే నింకఁ జెప్పనక్కఱలేదు.

భక్తిమార్గము ప్రకృతి కెంతమాత్రము భిన్నమైన మార్గము కాదు. సహజములైన హృదయరసములనేమియు శోషింపఁ జేయనక్కఱలేదు. నీభార్యాపుత్రులందు నీకున్న నిశ్చలానురాగ మున్నదే, దానినే భగవంతునిపైఁ బఱపుము. నీ ప్రేమయొక్క గతిమాత్రమే, గమ్యస్థానముమాత్రమే భేదముకాని యంతకంటె భేద మేమియు లేదు. ఒక్కభగవంతుఁడు తక్క నీ వస్తువేదియు లే దని నీవు నిశ్చయముగా నమ్మవలయును. నీయాస్తి భగవంతునిది. నీయాలుబిడ్డలు భగవంతుని వారు. వారు నీయొద్ద భగవంతునిచే నుంపఁబడినవారు కాని నీవారు కారని నిశ్చయముగా నమ్మవలయును. భగవంతునిపై దృష్టిలేకుండ నొక్కతలఁపైనఁ దలఁపకుము; ఒక్కమాటయైన నాడకుము; ఒక్కపనియైనఁ జేయకుము. అట్లు నిరంతరాభ్యాస మొనర్చునెడల నెప్పటికైన సుగతి నిశ్చయము.

నాయనలారా! చాలసేపు చెప్పితిని. క్షమింపవలయును. శ్లోకములు చదువుచు వాని కర్థములు చెప్పుచు బడిపంతులు పిల్లలకుఁ జెప్పినట్లు చెప్పినమాటనే చెప్పితినేమో యని యనుకొనుచున్నాను. నేను మీకు బోధించుటకు రాలేదు. మీకుఁ దెలియని యంశములు కావు. దయ యుంచి వినినందులకు సంతసించుచున్నాను.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

6. వీరశైవులు

సాక్షి సంఘంలో మతవిషయక ఉపన్యాసాలు దాదాపుగా అన్నీ విష్ణుప్రశంసా ప్రధానాలుగా వుండడం గమనించదగినది. ఈసారి ఒక వీరశై వుడు వచ్చి సాక్షి సంఘసభలో ప్రసంగించాడు. అద్వైతి అయిన జంఘాలశాస్త్రి శివ సంబంధమైన వీరశైవగాథను ఏదీ చెప్పకపోవడానికి తనకు కారణం తెలియదంటూనే–అది క్షమింపదగని ఉపేక్ష అన్నాడు. కనక–ఒక శివభక్తుని కథ చెప్పడానికి ఉపక్రమించి–పాల్కురికి సోమనాథుడు రచించిన 'బసవపు రాణం' నుంచి కిన్నెర బ్రహ్మయ్య కథ ప్రారంభించాడు.

బ్రహ్మయ్య మహాశివభక్తుడు. ఒకసారి అతను శివనామం గానం చేసుకుంటూ, బసవేశ్వరుడి దర్శనం కోరి, బయలుదేరాడు. అతను సంగమేశ్వరం చేరడానికి ముందే బసవేశ్వరుడెదురువచ్చి మన్నించి తన యింటికి తీసుకువెళ్లాడు.

అదే వూళ్లో వున్న త్రిపురాంతక దేవాలయానికి దర్శనం కోసం బ్రహ్మయ్య వెళ్లాడు. అక్కడ బాటవెంట ఒక 'గొర్రె' మెడకు తాడువేసి లాగుతూ ఒక వేటుడు తన ఉంపుడుగత్తె ఆరోగ్యం కోసం బలి ఇవ్వడానికి తీసుకుపోతున్నాడు. అది మెడతాడు తెంపుకుని బ్రహ్మయ్య దగ్గరకు వచ్చి నిలబడింది. కరుణాశీలి అయిన బ్రహ్మయ్య ఆ వేటుడికి వెయ్యిమాడలిచ్చి ఆగొర్రెను కొన్నాడు. దానికి విభూతి రక్షపెట్టి పంచాక్షరి దాని చెవిలో ఊదాడు.

వేటుడు మరో గొర్రెను తీసుకొని వేశ్య ఇంటికివెళ్లి, గొర్రెను మార్చినందుకు తాపులు, తిట్లుతిని, బ్రహ్మయ్య దగ్గరకు వచ్చి తన గొర్రెను తిరిగి ఇమ్మన్నాడు. ఘర్షణ జరిగింది. వేటుడు న్యాయ కోల్పోయి మరణించాడు. ఈవార్త చిలవలు పలవలు అల్లుకొని రాజు దగ్గరకు వెళ్లింది. విచారణకు వచ్చిన రాజుకు, త్రిపురాంతకదేవుడి సాక్ష్యంతో కళ్లు విచ్చాయి. మాయ నుంచి బయటపడి బతికిన వేటుడు మహాశివభక్తుడయ్యాడు. బసవేశ్వరుడు బ్రహ్మయ్యను ఎంతోమన్నించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! ఒక శివభక్తుడు మనసభలో నేడుపన్యసించును. అతడు లింగధారి.

కేవలశైవుఁడు. మిగుల వయస్సు గడచిన వాఁడు. బుద్ధిశాలి. ఆతఁడు మాటలోనే వచ్చుచున్నాఁడు. లేచి నిలువఁబడి యా మహాభక్తుని గౌరవింపుఁడు. (అంద ఱిట్లొనర్తురు) అయ్యా శంకరభక్తాగ్రణీ! దయచేసి పీఠ మెక్కి యుపన్యసింపుఁడు.

శైవవర్యుని యుపన్యాసము.

శివభక్తులారా! సాక్షిసంఘోపన్యాసములఁగూర్చి వినుచునే యున్నాను. ఇదివఱకు జంఘాలశాస్త్రి యనేకోపన్యాసము లిచ్చినాఁడు. జంఘాలశాస్త్రి మాధ్వుఁడు కాఁడు. శ్రీవైష్ణవుఁడు కాఁడు. అద్వైతియయ్యును హరభక్తినిగూర్చి యుపన్యసించి యుండలేదు. పత్తికొల్లె నాచ్చియారువిశేష ముపన్యసించినాఁడు కాని బసవేశ్వరమహిమమును గూర్చి యుపన్యసించినాఁడా? ధనుర్దాసునికథ చెప్పినాఁడు కాని తేడర దాస్యయ్యకథ చెప్పినాఁడా? భక్తినిగూర్చి చెప్పిన యుపన్యాసములందైనను విష్ణుభక్తినిగూర్చియే చెప్పినాఁడు కాని వీరశైవభక్తినిగూర్చి చెప్పినాఁడా? శివుఁడు దేవుడు కాఁడనియా, శివభక్తులు భక్తులు కారనియా? ఆతని యుపేక్షకుఁ గారణమేమో తెలియఁజాలకున్నాను. ఏకారణమైననేమి జరుగఁగూడని యుపేక్ష జరిగినది. క్షమింపఁదగని యుపేక్ష జరిగినది. శివభక్తులారా! ఈసంగతి మీతో మనవిచేసి మీకొక శివభక్తునికథ నుపన్యసింపవచ్చితిని. సావధానచిత్తులరై వినఁగోరుచున్నాను.

అనఁగ ననఁగ నొక వీరశైవుఁడు. ఆతనితల్లి యెవతెయో తెలియదు. తండ్రి యెవఁడో తెలియదు. ఇంటిపే రేదో తెలియదు. అతఁ డేగ్రామనివాసియో యదికూడఁ జెప్ప వీలు లేదు. బొండూరని కొందరు బోడూ రని కొంద అందురు. ఆతని పేరుమాత్రము బ్రహ్మయ్య. ఆతఁడు,

ద్వి. వీరవ్రతై కనిష్ఠారమణుండు–
సారశివాచారపారాయణుండు
లోకైకపూజ్యఁ డలో కానుసారి–
ఏకాంతభక్తి మహిష్ఠమండనుఁడు
నఘటితనాద విద్యాపండితుండు
నఘవినాశనకారణావతారుండు
విదితకారుణ్యసముదితానురాగ–
హృదయుఁడు సర్వజీవదయాపరుండు

నని కవి యాతనిమహామహిమమును గానమొనర్చెను. ఆతఁ డనేకవిద్యల నభ్యసించినవాఁడగుటచే సహస్రవిధముల ధన మార్జించి యంతయును మహేశ్వరమూర్తులకర్పించి వారిని సేవించుచుఁ గాలక్షేపమొనర్చుచుండెను. ధనమంతయు నీరీతి వెచ్చ మొనర్చి క్షయించిన యాతఁడు శుద్ధినొందిన రసఘటికవలెఁ దేజస్స్వరూపుఁడై వెలిఁగి పోవుచుఁ గిన్నరను జేతఁబుచ్చుకొని వీథివీథిని గాన మొనర్చుచుండెను.

''ఈశ్వరా! జగదీశ్వరా! పరమేశ్వరా కరుణాకరా'' యని యీచ్చైస్స్వరమున మ్రోళ్లు చిగుర్చునట్లు గాలి స్తంభించి వినునట్లు కైలాసాధిపతిని గానమొనర్చునతఁ డాతఁడే మనస్సునకున్న చెవిచే వినుచున్నారా?

మనము వినుట లెక్కయేమి? శంకరభగవానుఁ డంతరిక్షమునఁ బ్రత్యక్షమై యానంద నమున నుప్పొంగుచుఁ గిన్నరబ్రహ్మముఖోద్గత మధురగీతానుసార తాళానుగుణముగఁ దాండవించుట కుత్సహించి డమరుకమును వాయించుట కుద్యమించుచున్నాఁడే! గజచర్మ పుముదుతలలోఁ దలల నిమిడ్చి, కునుకుచున్న నర్పములు శిరముల నొట్టి యదల్చి పడగలువిప్పి, జిహ్వలుముందునకుఁద్రోచి కన్నులుమాత్రమేకాక యొడలంతయుఁ జెవులు చేసికొని వీరశైవుఁడగు బ్రహ్మయ్య గౌరీశ్వరగానమును విని పరవశము లగుచున్నవే! మహేశ్వరజటాజూటస్థ యగు చంద్రరేఖ మహాగాయకగీతామాధురికిఁ జొక్కి చొక్కి అమృతమనుపేర నానంద బాష్పములను విడుచుచున్నదే. ఈమహానన్నివేశమున కనాహూతులై వీణాధరులైన తుంబురునారదులు విచ్చేసి మహాగానామృతమునఁ దలమున్కలగుటచే నుక్కిరిబిక్కిరి యగుచు గ్రుడ్లుస్తంభింప నిశ్చేతనులగుచు నిలువఁబడినారే! వీరశైవశిఖామణీ! భక్తియనఁగనీ దేయగునుగాక! గాన మనిన నీదే యగునుగాక! జన్మమనఁగ నీదేయగును గాక! మహా దేవుఁడు నీకు బిరుద మిచ్చినాఁడా! అందుచేతనే కిన్నరబ్రహ్మయ్య వైతివా?

ఆహా! భక్తికి గానమున కెంత చేరువ? భక్తి హృదయమున నంకురింపఁగనే గొంతుక లోని తంత్రులు తమంతతాము, మేళవించుకొని సిద్ధముగ నుండునే! భక్తి హృదయకోశ మును రవంత సంచలింపఁ జేయ నా యూఁపుతో హైరైఁ మని భైరవియో, శంకరాభరణమో యాలాపింప నారంభించునే. భక్తిహృదయమునఁ దాండవింప నప్రాసంచికగాన మమృతరంగ ములతో నాకస మంతయు వెల్లివిరియునే! చెట్లు చిగుర్చునే! శిలలు కరఁగునే! నదులు పొంగునే! అగ్నిజ్వాల లంతరించునే! వాయువు చల్లఁబడునే! భవరోగములన్నియుఁ బటా పంచలైపోవునే! సృష్టియంతము ప్రేమదృష్టిచే నార్ద్ర మగునే?

గానశక్తి లేనివాఁడు గానమునకుఁ జెవి లేనివాఁడు కిరాతహృదయుఁడు, నరఘా తుకుఁడు, జీవద్రోహి యని యొకయాంగ్లేయకవి చెప్పినాఁడు. ఆమాటలు నా కంత నచ్చలేదు. ప్రపంచమున గానశక్తి లేనివాఁ డెవఁడు? గానానుభవశక్తి లేనివాఁ డెవఁడు? ఒక్కని గానఁ బరుపఁగలరా? కంటికి నచ్చిన కాంతను జూచి కూనురాగము తీయలేని మొద్దుముండ కొడు కెవఁడయిన నున్నాఁడా? ఈకూనురాగములో గానమున్నదా? లేదా? తుంబురునార దులు పాడినట్లు పాడినగాని గానము కాదా యేమి? ఆఁడుకోడి నాకర్షించుటకు మగకోడి యెంతచిత్రముగ గానమొనర్చునో వినలేదా? మగకుక్క యాఁడుకుక్కపైఁ దాఁటఁ బోవున ప్పుడు కుయికుయికుయిమని గాన మొనర్చుచుండుట లేదా? కాలువయొడ్డునఁ బొద లోని కీచురాయి యెందులకుఁ బైస్థాయిలో గానమొనర్చుచున్నది? ఆఁడుపురుగు నాశ్లేషము నకే కాదా? ఐహికానందరసము ననుభవించుట కేజీవము పనికిరాదో దానికిమాత్రమే గానము లేదు. సుఖదుఃఖముల కధీనముకాని ప్రాణ మొకటియైనఁ బ్రపంచమున నున్నదేమో చెప్పఁగలరా? నిశ్చేతనములకుఁ గూడ సుఖదుఃఖానుభవమున్నదని యిప్పటి ప్రకృతిశాస్త్ర జ్ఞులు సిద్ధాంతీకరించుచుండఁ, జేతనములమాట నందేహింప నేల? ప్రాపంచికానందమువలన గాన ముద్భవించును. పరమేశ్వరానందమువలన గాన ముద్భవించును. రక్తిచే గానముద్భవిం చును. భక్తిచే గాన ముద్భవించును. సాంసారికానందమువలనఁ గలిగినగానము నిష్ఫలము. గుడిగుడి త్రాగుటచే గలిగిన మబ్బు తెరవంటి క్రైపుచేఁ బుట్టిన మోహాదైన యానందమున పాదుషాయీల వేయుట యెట్టిదో పణ్యవనిత తలదువ్వుకొనుచు విటుని వశపఱచుకొంటి

నను నానందమున ''చిన్నదానరా'' యని జావలి పాడుట యట్టిదే. పాదుషాయీాల యెంత ప్రయోజనమో పణ్యవనిత జావళి యంతప్రయోజనము ఐహికానందమును గాన మొనర్పలే నివా రెవ్వరు? ఇట్టిగానము జీవుని మరింత ప్రకృతిబద్ధ మొనర్చుటకే పనికివచ్చును. సంసారసాగరమున జీవుని మరింత ముంచుటకే యక్కఱకువచ్చును. గానము లేనివారు క్రూరులు, ద్రోహు లని చెప్ప వలనుపడునా? గాన మొనర్పగలవారు లోకోపకారులై మిడుకుచున్నారా? సాలెపురుగు నాల్గువందలనంబరును మించిన మహాసూక్ష్మతంతువులచే నిర్మింపఁబడిన తన పద్మవ్యూహపు మహలులోని చంద్రశాలలోఁ దాను గూరుచుండి మధురగీత మాలాపించు టెందులకు? చుట్టుపట్టులనున్న యీఁగల నాకర్షించి మ్రింగుటకే కాదా? ఇది గొంతుకోఁత గానము కాదా? పాషాణహృదయుల మధుర గానమున కానపడి యెంద ఱమాయిక కాంతలు భ్రష్టులై పతితలై ప్రాణములఁ గోలుపోవలేదు? రోమపట్టనము నాల్గుమూల లంటుకొని మండిపోవునప్పుడు చక్రవర్తియగు ''నీరో'' అయ్యయ్యో యని యైన ననెనా? అంతఃపురములోఁ గూరుచుండి ఫిడేలువాయించు కొనుచు హాయిహాయి యనలేదా? ఎందుల కీ గానశక్తి? నాదనామక్రియకు సాధుప్రవర్తన కేమి సంబంధము? జంపె తాళమునకు స్వార్థపరిత్యాగమునకు సంబంధమున్నదా? ఐహికగానములవలన సరున కుద్గతి లేదు. సంసారతరణమునకు లోకకల్యాణమునకుఁ గావలసినది భక్తిగానము. రక్తిగానము గానమే. భక్తిగానము గానమే. ఒకటి వేశ్యాజటామండలిలోని గులాబిపూవు. ఒకటి ఈశ్వరజ టామండలిలోని గులాబిపూవు. గానము లేనివాఁడు నరఘాతుకుఁడని చెప్పుట నమంజ నము కాదేమో? భక్తిలేనివాఁ డట్టివాఁడు. నిజముగా నట్టివాఁడు. భక్తులకథలు విని కరఁగనివాఁ డట్టివాఁడు. ప్రధానమైనది భక్తి. గానము దాని కుపలక్షణము. రక్తికిఁగూడ నదియే యుపలక్షణము. ఉపలక్షణమును బ్రధానముగఁ జేసి చెప్పుటచే నాంగ్లేయకవిమాటలు నచ్చలే దని చెప్పవలసివచ్చినది. గరళకంఠభక్త శిఖామణిగాథలో గానమునుగూర్చిన తగవులాట చెప్పిసందులకు మన్నింపవలెను. మనభక్తాగ్రేసరుఁడగు బ్రహ్మయ్య బనవేశ్వర స్వామిని దర్శింపఁ బాదచారియై పయనమై పోవుచున్నాఁడు. అడుగడుగునకు, హరహరా! అంధకహర! భక్తపాపనంహర! గంగాధర! శశాంకరేఖధర! యని స్మరించుకొనుచుఁ బాడుకొ నుచు నాడు కొనుచుఁ బోవుచుండెను. కాని మనబ్రహ్మయ్యను సంగమేశ్వరమునకు ముందే యెదుర్కొనవచ్చుచున్న యా యలౌకికతేజోరాశి యెవరు? ఆహాహా! కన్నులు ధన్యము లగున ట్లవలోకించితిరా? మహారణ్యములో నొకమహాజ్వాల రెండవజ్వాలను దరియుచున్న ట్లున్నదే! నముద్రమున నొకహిమసౌధము (Iceberg) రెండవ హిమసౌధమును సమీపించు చున్నట్లున్నదే! బ్రహ్మయ్యగారిరాక యాతఁ డెట్లు గ్రహించెనో. స్వచ్ఛాత్మకు స్వచ్ఛాత్మకు నిస్తంత్రీతంత్రవార్తలు జరుగుచుండును గాఁబోలు. ఒకచుక్క రెండవచుక్కకుఁ గన్నుగీట, నొకయాత్మ రెండవయాత్మకు నన్న చేయకుండునా? కాని యావచ్చుజ్యోతీరూప మెవరో? ఎవరో–చెప్పుమందురా?

ద్వి. ''శాశ్వతసర్వజ్ఞ–శశ్వద్గుణాంక–
విశ్వేశ శ్రీగురవే నమో యనుచు

నద్వఃప్రసన్నానవద్య వేదాంత–
వేద్యాత్మ శ్రీగురవే నమో యనుచు

దత్తకైవల్యయుదాత్త నదృక్త
విత్తేశ శ్రీగురవే నమో యనుచు
నమితపరంజ్యోతి రాకారదివ్య
విమలాంగ శ్రీగురవే నమో యనుచు
స్థిరతరసృష్టిస్థితిలయప్రపంచ
విరహిత శ్రీగురవే నమో యనుచు
సకలనిష్కళచరాచర రూపవిగత
వికృతాంగ శ్రీగురవే నమో యనుచు
నాద్యంతరహిత నిత్యామలతేజ
విద్యాత్మ శ్రీగురవే నమో యనుచు
నధ్వషట్కాతీత యవిపాతకోఘ
విధ్వంన శ్రీగురవే నమో యనుచు
మోక్షార్థిరక్షణ దక్షకటాక్ష
వీక్షణ శ్రీగురవే నమో యనుచు
నజ్ఞానతిమిరసంహారార్థదత్త
విజ్ఞాన శ్రీగురవే నమో యనుచు
ధన్యాత్మశిష్యమస్తకక్పాపహస్త
విన్యాస శ్రీగురవే నమో యనుచు
నఘహరణార్థ శిష్యజనోపభుక్త
విఘసన శ్రీగురవే నమో యనుచు
నశ్రాంతభక్తజనాత్మాంబుజాత
విశ్రాంత శ్రీగురవే నమో యనుచు
ననఘగురు ప్రసాదామృతహృదయ
వినివాస శ్రీగురవే నమో యనుచు

చెన్నబసవఁ డేమహామహుని నోరార మనసార స్తుతియించెనో యాబసవేశ్వరుఁడే మన కిన్నర బ్రహ్మయ్యకు సాక్షాత్కరించెను. అట్లు ప్రత్యక్షమైన బసవేశ్వరునిఁ జూచి సారహారహర మహాదేవ శంభూ'' యని సాష్టాంగదండప్రణామ మాచరించెను. బసవేశ్వరుఁడు కూడ నాభక్తునకుఁ జాఁగిమ్రొక్కి, యనునయించి యతిథిపూజ నాచరించి ''సవిశేషతత్త్వా నుభవ భవ్యగోష్ఠి'' నలుపుచుఁ దన నిలయమునకుఁ దీసికొనిపోయి యథార్హముగ గౌరవిం చెను.

ఆపురమునన్న త్రిపురాంతక దేవాలయమునకు మహాదేవదర్శనార్థమై బ్రహ్మయ్య వెడలెను. దేవాలయమునెదుట నొకచిత్రము జరుగుచున్నది. ఒక గొల్లమెడకుఁ ద్రాడు కట్టి యాత్రాటిని జేతఁబట్టుకొని యొకఁడు దానిని లాగుకొనిపోవుచుండెను. తానుంచు కొన్న వారాంగనకొఱకు దానిని బలి నిచ్చుటకై కొనిపోవుచుండెను. ఉంచుకొన్నదానికై దానిని వధించునెడల నామె యారోగ్యవతియై, యైశ్వర్యవతియై, తనయం దనురాగవతియై యుండుసవి యాతఁడు దాని నుత్సాహమున నీడ్చుకొనిపోవుచున్నాఁడు. కాని యాగొల్లె

యంతవేడుకతో నాతని వెంబడింపఁగలదా? ఉరికంబములయొద్ద కాతని మజీయొక్కఁ డీడ్చుకొనిపోవునెడల నింతయుత్సాహముతో నాతఁడు నడచునా? చంపుటకై తన్నుఁ దీసికొనిపోవుచున్నాఁ డని యది గ్రహింపకున్నదా? పెంచుకొనువాఁ డెవఁడో చంపువాఁ డెవఁడో యది యట్టి గ్రహింపఁ గలదే! దానికున్న తెలివికంటె నాతనితెలివి యేమంత హెచ్చు? తన తనువును బాడుసేయుచుఁ, దనధనము దోచుకొనుచు, వంశమర్యాదను వల్లకాఁడుచేయుచుఁ గీర్తిని భ్రష్టపఱచుచు సర్వవిధములఁ దనగొంతుకోయ సంకల్పించుకొ నిన కులటాధనమను దనప్రాణరక్షకదేవతగఁ జూచుకొనుచు, గౌరవించుచు నారాధించు చున్న యానిర్భాగ్యుఁడు గొట్టె కంటె నెట్లక్కువ తెలివిగలవాఁడు? ఆహా! ప్రక్కనే త్రిపురాంతకుఁడగు మహేశ్వరుని యాలయ మున్నదే! మోక్ష ప్రదాతయైన యాదేవతాసార్వ భౌముని పాదపద్మముల నాశ్రయింపక ముట్టికితొత్తు పృష్ఠ మాశ్రయించిన బుద్ధిహీను నే మనవలయును?

గొట్టె గుంజుకొనుఁ వెనుకకుఁ దగ్గుచున్నది. వీఁడు హుంకరించుచు ముందునకు లాగుచున్నాఁడు. ''బే ఏ ఏ ఏ'' యని గొట్టె యాతనిహృదయము కరఁగునేమో యని యేడ్చుచున్నది. గుడిసెవ్రేటిదాని బుడిబుడిబొల్లి దుఃఖములకుఁ గరఁగిన బొజ్జఁగుల రాయఁడు–ప్రాణోత్క్రమణసమయమున నోరులేని ప్రకృతి యొనరించిన యమాయక మైన యార్తిపూర్ణమైన యాక్రోశమునకుఁ గరగుఁటే! పరీక్షించుటకుఁ గన్నున్నయెడలఁ దెలిసికొ నుటకు మనసున్న యెడల నజ్ఞమగు జంతు ప్రపంచముతోడనే కాదు, దూరమని మనమను కొనుచున్న శాఖాప్రపంచముతోఁగూడ మనకున్న సంబంధ మెంతగాఢమో, యెంతనిర్హే ద్యమో యెంతయన్యోన్యాభివృద్ధికరమో కొంతయైన గ్రహింపవచ్చును.

త్రాడుత్రెంపుకొని గొట్టె దేవాలయములోఁ దూఱినది. అట బ్రహ్మయ్యగారిచేతిలో మూతిపెట్టి నిలువఁబడినది. సెబాస్! చతుష్పాదమా! నీవు ధన్యజన్మమవు. ప్రాణప్రయాణస మయమున నీకుఁ బరమేశ్వరదర్శన మైనది. గొట్టె వయ్యును. బ్రహ్మయ్యగారి వ్రేలనున్న నందికేశ్వరుని మూర్క్కొనుచున్నావు. శంకరభక్తుఁ డెవఁడో సానిమగఁ డెవఁడో కనిపట్టుటకు మీజాతి కెంత తెలివియున్నది! అతని యొద్ద హాయిగ నిలువఁబడితిని. ఇతనిని వదల్చుకొనుదాఁక తహతహ లాడితిని! తుద కితనిత్రాడు త్రెంపితివి. ఓవిటూఢమా! నీవెప్పు డీయాలయములోనికిఁ బోవలేదు కదా! గొట్టెను దెచ్చుకొనుటకై యిప్పుడు పోఁదలఁచి తినా? త్రిపురాంతకవర్శనమువలన నీకు లభింపవలసినది గొట్టెబొచ్చా! ఆగొట్టెను దెచ్చు కొని నీఅంకులాడిమొగమునకు దిగదుడిచి చంపుదావా? నీపుణ్య మేమనవచ్చును? అదిగో యాతఁడు గుడిలోనికి రాఁబోవుచున్నాఁడు. బ్రహ్మయ్యగా రాఁగు మాఁగు మని గద్దించుచు న్నారు. అదరిపడి నిలువఁబడి యాతఁ డేమనియెనో విందురా? ''ఈగొట్టె నాది. దీనిని నేను గొంటిని. నాసానియారోగ్యార్థమై దీనిని బలి నిడ దానియింటికిఁ దీసికొని పోవుచు న్నాను. నాగొట్టెను నా కిటుతోలిపెట్టుము'' ఇట్లాతఁడు పలుక, నాయనా! నేను దీనిలోని కాహ్వానించితినా? నేనేల పొమ్మని తోలిపెట్టుదును? ఇది ప్రాణభీతిచేఁ బరమేశ్వరాలయము చొచ్చినది. దీనిని జంపఁదగదు. ఇది నన్ను శరణు చొచ్చినది. శంకరదాసుఁడ నగు నేను దీనిని వదలను. నీకు దీనికై యెంత సొమ్ము కానలయునో యంతయు నిచ్చెదను. నీ వీగొఱియపై నాశ వదలుకొని పో'' మ్మని బ్రహ్మయ్య బదులు చెప్పెను. ''నీకు మతి

యున్నదా లేదా? శంకరదాసుఁడ నని చెప్పితివే! ఊరివారినర్వస్వము నూరక చూఅగొను వారేనా శంకరదాసులు! గొప్పదాసుఁడవే బయలుదేరినావు. నీవంటిదాసుఁ డింకొకఁ డీ యూర నున్నయెడల నిఁక నంసారములకు నీళ్లు వదలుకొనవలసినదే కాదా? చాలు చాలు. నా గొఱ్ఱెను మారుమాటడక తోలిపెట్టెదవా, లేదా?'': యని విటుం డఱచెను. ''నేను నీగొఱ్ఱెను హరింపలేదు. ఇది ప్రాణభయార్తయై యిటుఁ జేరినది. దీనికి శంకరభగవానునిద ర్శన మైనది. దీనివలువ యెంతయైన నరే యిచ్చెదను. కఠినోక్తు లాడక నీకు రావలసినసొమ్మే దియో తీసికొనిపో''మ్మని బ్రహ్మయ్యగారు ప్రత్యుత్తర మిచ్చిరి. ''అటులైన వేయి మాడ లిచ్చి గొఱ్ఱెను దీసికొ''మ్మని విటుఁ డర్థాశచేఁ గొంత, యంత విలువ నిచ్చుట కిష్టపడఁ డను నిశ్చయముతోఁ గొంత, పలికెను. భక్తుఁ డాసొమ్ము బసవేశ్వరుని యింటినుండి తెప్పించి విటున కిచ్చెను. విటుఁడు తెగినత్రాటితో వేశ్యయింటికిఁ బోయెను.

ఆగొఱ్ఱె నొసట రవంత విభూతి రాచి మెడలో ననఁటితడపతో మారేడుపత్రి గట్టి త్రిశూలముద్రాంగుళీయకముతో దాని కొమ్ముల నడుమ నొచ్చోత్తి ఓన్నమశ్శివాయ, ఓన్నమశ్శివాయ, ఓన్నమశ్శివాయ యని దాని దక్షిణకర్ణమూలమునఁ బంచాక్షరి నుపదేశించి శివధ్యానైక తత్పరుఁడై బ్రహ్మయ్య యటనే కూరుచుండెను.

కలకలలాడుచున్న మొగముతో గలగలలాడుచున్న కొంగుముడితోఁ జేత మరియొక గొఱ్ఱెతో విటుఁడు వేశ్యయింటికి నంతసమున దడదడలాడు హృదయముతో వచ్చి మందహాస మొనర్చెను. ''నీవెంత దొంగన వ్వేడ్చుచున్నను నీది పనికిమాలిన పేఁడతట్ట ప్రాఁతమొగమే కాదా? కాని యాగొఱ్ఱెది క్రొత్తమొగమై యుండుటకుఁ గారణమేమి?'' యని వీఁపుమీఁది తామరను విసరకఱ్ఱతోఁ గోఁచికొనుచు విటకత్తె పలికెను. ''ఉండు, తొందరప డెద వేల? ఈదినమున నీవు నన్నెంతమెచ్చుకొను పనిచేసితి ననుకొనుచున్నా'' వని, పలుకుచు వేయిమాడల కొంగుమూఁట నామెపాదములయొద్దఁ బెట్టి విప్పెను. ఆమె యానందించిన దయ్యును రొసరొసలాడుచు ''నీ వెటనైన నీధన దొంగిలించిన దగునెడల నింత బహిరంగముగా నిల్లు ప్రవేశించి యింత వెల్లడియగునట్లు నాయెదుటఁ బెట్టెదవా? ఓరిపనికిమాలినపందా?'' యని తిట్టి యిప్పుడైనఁ దలుపు మూయుము. దీనిని బ్రాతిపె ట్టుదు మని చెప్పఁగ, నాతఁడు నవ్వి పూర్వవృత్తాంతము నంతయుఁ బూనఁగ్రుచ్చినట్లు చెప్పెను. ''వేల్పుల కని ముందే దత్తమైన గొఱ్ఱెను జచ్చు వేయిమాడల కమ్మితివా? నిర్భాగ్యపు ముండకొడుకా! నీకు సొమ్మే ప్రధానమా? ఆగొఱ్ఱెకుఁ బ్రతినిధిగ నింకొకదానినిఁ దెచ్చితివా? నీకు బదులుగా నల్వురు ముండకొడుకులను దెచ్చి నీయాలిప్రక్కలోఁ బట్టలేక పోయితివా? సిగ్గు మాలినచెనఁటీ! నీవు నాగొఱ్ఱెను దేనియెడల నీగొంతు కోసెద''నని యామిండకత్తె మండిపడెను.

''నీయిష్ట మెటులో యటులే'' యనిపలికి, యామాడల నాతఁడు తిరుగ మూటకట్టు చుండెను. ''నీవు నామాడల నంటనేల? దుడుకున దుడుకున ముడిపైచుకొనుచున్నావా? నీయబ్బసొమ్ము, నీతాతసొమ్మను కొంటివా? పో! ఒక్కమాడయైన నీయను. పోయి గొఱ్ఱెను దెమ్ము, కానియెడల గ్రుడ్లూడఁ దీసెదను. గొంతు పిసికి చంపెదను. నాగొఱ్ఱె నమ్మితివా? నీకూఁతు నమ్ముకొనలేకపోయితివా'' యని యతనిగుండెపైఁ దనయెదుట్రేళ్లంటున ట్లొకచ ఱపు చఱచెను.

ఆహా! విటశేఖరా! ఎన్నితిట్లు తినుచుంటివయ్యా! మీయమ్మచే నొకతిట్టు తింటివా? అబ్బచేఁ దింటివా? అన్నమిచ్చి పోషించు నవనీధవునిచేఁ దింటివా? ఇది యెవతె యని తినుచున్నావయ్యా? డబ్బిచ్చి తిట్టించుకొనుచున్నావే. మడిమాన్యము లిచ్చి తిట్టించుకొను చున్నావే. వెట్టికొలువు చేసి తిట్టించుకొనుచున్నావే! నీవు మనుష్యుఁడవేనా? మతియున్న వాఁడవేనా? అహంకారము చంపుకొంటివే, రోసము. చంపుకొంటివే, మానాభిమానములు చంపుకొంటివే! పోనీ, మంచిపనియే జరిగినది. ఇన్నిటిని జంపుకొనినందులకు నీచూపు దుర్గంధభూయిష్ఠమై చెప్పుటట్టివలె నున్న సానిమొగమునఁ బఱపుటకంటె సర్వేశ్వరుని పాదారవిందములందు లగ్న మొనర్చునెడలఁ దరింతువే, ఉత్తమగతికిఁ జేరువనుచున్నావు. నిన్ను రక్షించువాఁడు పరమేశ్వరుఁడు తక్క మరియెవ్వఁడు లేఁడు! రా! ఇదిగో పరమేశ్వరా లయము.

ఆహా! అదిగో! విటుఁ డాలయమునొద్దకు వచ్చుచున్నాఁడు. తెల్లఁబారిన మొగముతోఁ దడఁబడుచున్న కాళులతో నంతరంగోద్రేకమున నదరుచున్న పెదవులతోఁ బట్టుదలను వెల్లడించు కన్నులతో భయంకరముగ ముడివడిన బొమలతోఁ జివరలంది త్తడిపొన్నులున్న చేపాటికత్రతో వచ్చుచున్న యూరూపము నవలోకించితిరా? చావో బ్రదుకో దుఃఖమో నుఖమో నరకమో స్వర్గమో యేదోయొక్క త్రుటి కాలములోఁ దేలవలయు ననుఁ నాగ్రహముతో వచ్చుచున్నట్లు కానఁ బడుచున్నదా? ''నాగొట్టెను నాకిచ్చెదవా చచ్చెదవా'' యని విటుఁడు భక్తునిమీఁదికి వచ్చుచున్నాఁడు, ''వేయిమాడలను దీసికొంటివి కదా! ఇంక నీగొట్టె యెట్లు ఇది త్రిపురాంతకుని'' దని భక్తుఁడు నిమ్మళముగఁ బలికినాఁడు. ''నేను దీని నీ కమ్మితినా? నీవు నాకు మాడలిచ్చితివా! దొంగముండకొడుకా! తల పగులగొట్టెదను. ఇచ్చెదవా లేదా'' యని కట్టునెత్తి భక్తునినెత్తిపై వ్రేయ నాతఁడు చేతనున్న లాతాముతో దెబ్బను మరలించుకొనెను. చేతనున్న చేపాటికట్టి దూరమునఁబడఁగ విటుఁడు డబ్బాటున భక్తునిపైఁ గలియఁబడెను. భక్తునిచేతనున్న లాతాము విటునికణతపైఁ బ్రమాదమునఁ దగులుటచేఁ గాఁబోలు విటుఁడు గిజగిజ కొట్టుకొనుచుఁ గ్రిందఁబడెను. ఓన్నమశ్శివాయ యని భక్తుఁడాతని దక్షిణకర్ణమున నుపదేశ మొనరించుచుండఁగ నతఁడు ప్రాణములు విడిచెను.

ఎవడో భక్తుఁడు గ్రామమునకువచ్చినాఁ డనియు నాతఁ డొక గొట్టెను దొంగిలించె ననియు నది తన దని చెప్పవచ్చిన వానిని జంపి యాతని మూఁటలోనున్న నాల్గువేల మాడలను దీసికొనియె ననియుఁ జంపఁబడినవాఁ డుంచుకొన్న వాని కీతఁ డాసామ్మిచ్చి దానిని జేరఁదీసె ననియు మరియింక నేమేమోవార్త లూరఁ బ్రబలెను.

ఆ. అప్రమాణవార్త యానోట నానోట
నిట్టి యిట్టి ప్రాఁకి యెల్లయెడల
వ్యాప్త మగునుగాదె వరుసైన ప్రాఁతతా
టాకుటింటిమీఁద యగ్గివలెనె.

అందులో భక్తులఁగూర్చి కల్గు నపవాదముల వ్యాప్తికి హద్దున్నదా? నీటిమీఁద నైచిననూనెచుక్క కూడ నంతవేగముగ వ్యాపింపదే, కారుచిచ్చుగూడ నంతశీఘ్రముగ వ్యాపింపదే. గాలి కూడ దానివ్యాప్తివేగమునకు జంకునే, పోయినకొలఁది పోయినకొలఁది

''రెఫల్'' దెబ్బవలె నది వలె నది విశాలమగునే. అడుగడుగునకుఁ గొత్త కల్పనలతో నిమిసనిమిసమునకు నూతన విజృంభణములతో నవనవాలంకారములతోఁ గొమ్మలపై రెమ్మలతో రెమ్మలపైఁ జిలువలతోఁ జిలువలపైఁ బలువలతోఁ బలువలపైఁ జిగుళ్లతో విరిసి విరిసి విజృంభించి పోవునే!

ఆగ్రామప్రభుని కీవార్త తెలిసినది. అత్యంతరహస్యవార్తలే యాతనికిఁ దెలియునప్పుడింత వ్యాప్తి నొందినవార్త తెలియకుండునా?

గీ. గాలి చొరనట్టి చోటులు గలవు కాని
యతనిచెవిని జేరనిరహస్యములు లేవు
అత్తకోడండ్ర దెప్పులు నాలుమగల
గుసగుసలు నాఁడుబిడ్డల రొసరొసలును
తోడికోడండ్ర వెడవెడకోడిగములు
మొదలుగా నన్ని సంచారములను గల్గు
ఛిద్రతతి యిట్టి యాతని చెవిని జేరు.
దాసి గదిలోన గాయకుఁ దన్నె ననుచు
గురువుగారింటిలోఁ గల్లుకుండ యనుచుఁ
జెవికొఱుకువారు తార్పుడు సేయువారు
కొంటెకూఁతలవారును గోడెగాండ్రు
బానిసలు రాజుమెప్పుకై పలుకుచుండ్రు
మొలకతళుకులు బెళుకులు తులకరించు
కలికిపలుకులకులుకుల కవితకంటె
నధికముదమున వినుచుందు రవనిపతులు.

ఆకపటభక్తునిఁ జూచి యథార్థమును దెలిసికొని రమ్మని రాజు తన యుద్యోగిని బంపెను. భక్తుఁడు జరిగినది జరిగినట్లు చెప్పెను. నీకు సాక్షు లెవ్వరని యుద్యోగి యడుగ నీత్రిపురాంతకదేవుఁడే యని యాతఁడు బదులుచెప్పెను. ఈయంశము లుద్యోగివలన రాజు విని పరివారముతో నాలయమునకు వచ్చెను. భక్తుఁ డఁటఁ! సానిసుంచుకొన్నాఁడఁటఁ! నాల్గువేలమాడలు దానికిచ్చినాఁడఁటఁ! దానివిటుని జంపినాఁడఁటఁ! అతఁడు నిర్దోషి యని త్రిపురాంతుకుఁడు సాక్ష్యమిచ్చునఁట. ఇఁక నూరనున్నహా రాఁగుదురా? ఆబాలగోపాల మటకు వచ్చిరి. భక్తుఁడు జరిగిన వృత్తాంత మంతయు రాజుతో మనవిచేసెను. నీసాక్షిని బిలువుమని రాజు హేళనముగ ననియెను. అభ్యంతరమేమి? ఇదిగో యని ''ఓమ్ హరహరహర మహాదేవ శంభూ'' యని యుచ్చైస్స్వరమున భక్తుఁడు పలుకుసరికి ''ఓ'' యని శంకరదేవుఁడు పలికినాఁడు. అయ ప్రాపంచిక నాదస్ఫూర్తితో భూమి యదరినది. సూర్యుఁడు కంపమొందెను. చుక్కలు రాలినవి. గాలి స్తంభించినది. అచ్చటి ప్రాణులన్నియు నిశ్చేతనములై పడిపోయినవి. శివభక్తులా! లేదు. ఇద్దరు మాత్రము నచేతనులై శంకరధ్యాన తత్పరులై నిలువఁబడినారు. ఒకఁడు మనభక్తుఁడు బ్రహ్మయ్య. రెండవవా రెవరు? ఎవరా? ఎవనినామమును స్మరించుటవలనఁ బ్రాణులు మృత్యుసంసారసాగరమునుండి సముద్ధరింపఁ బడుదురో యాబనవేశ్వరస్వామియే. ఆయన బ్రహ్మయ్యకు మ్రొక్కి యిట్లు పలికెను.

ద్వి॥ సజ్జనశృంగార సత్యగంభీర
యిజ్జగద్ధార యీశ్వరాకార
మంగళగుణధామ మహిమాభిరామ
లింగాభిరూప యభంగ ప్రతాప
నిర్జితాహంకార నిఖిలోపకార
దుర్జనదూర విధూతసంసార
కారుణ్యపాత్ర యకల్మషగాత్ర
వీరవ్రతాచార్య విపరీతశౌర్య
యంచితాగణ్య నిరంతరపుణ్య
సంచితసుఖీలీల శరణవిలోల
నన్నుతకీర్తి సాక్షాద్రుద్రమూర్తి
కిన్నర బ్రహ్మయ్య కృపసేయుమయ్య.

బ్రహ్మయ్య బనవేశ్వరునకు మ్రొక్కి శంకరభగవాను స్మరించి ''హే'' యని యున్నై స్స్వారమునఁ బలుక సృష్టి యథాక్రమము నొందెను.

ఒక్కగొర్రె కారణముగ గోళములన్నియు వ్యత్యస్తము లైనవే. ఆహా! ప్రపంచమున కపాయము తేఁజాలనంత యధమమై వస్తువున్నదా! సృష్టిలోఁజరిగిన-జరుగుచున్న మహోందోళనము లన్నిటికిఁ గారణము లరసి చూడ నత్యల్పములై యత్యధమములై కానఁబడునే. పదునెనిమి దక్షౌహిణుల ప్రాణములు తీసిన భారతయుద్ధమునకుఁ బ్రథమకారణము పాంచాలీ పరిహాసమేకాదా! గూనిదానికుబ్జచేతనే కాదా కుంభకర్ణుఁడు రావణుఁడు చచ్చినది. అయిదు ఖండములందుఁగూడ నంటుకొనిన మొన్న మొన్నటి మహాహవము ప్రపంచపటమునఁ బల్లేరుకాయయంత ప్రదేశముకొఱకే కాదా?

ఈసంగతికేమి-దేవాలయమునొద్ద మూర్ఛ నొందినవా రెల్ల లేచిరి. వారితోపాటు గొర్రెకొఱకు ప్రాణములఁ బాసిన వీఱుఁడు కూడ లేచెను. ఇప్పు డాతఁడు వీఱుఁడా? మూర్ఛావనరమున బ్రహ్మముఖమునఁ బంచాక్షరీమంత్ర ముపదేశ మందిన యాతఁ డింక వీఱుఁ డగునా? అతఁడు బ్రహ్మయ్యకు సాష్టాంగపడఁగ, నాతని నతఁడు లేవనెత్తి ''నీకు నాకు నర్వ లోకమునకు గురుఁ డీ బనవేశ్వరస్వామి. ఈయనకు మ్రొక్కు'' మని యాతనికి మ్రొక్కికొంచెను. చెనఁటియైన కులటచేఁ జేవ్రేటుదిన్న యాతని గుండెపై నిప్పుడు శ్రీకంఠమూర్తి ప్రకాశించుచున్నాఁడు. ఆతని హృదయోపరిభాగమున వేశ్యయైదువే ళ్లెట్లుం టెనో యాతని హృదయాంతర్భాగమునఁ బంచాక్షరి యట్లుంటెను. పైపైనున్న దశాశ్వతము లోలోనిదే శాశ్వతము కాదా? బసవేశ్వరస్వామిని బ్రహ్మయ్యను జయజయధ్వానములతో నూరేఁగించి రాజు వారికి సాష్టాంగపడి సెలవుతీసికొని కోటకుఁ బోయెను.

చిత్రమైన యీగాథ పాల్కురికి సోమనాథకవి ప్రణీతమైన బసవపురాణములోనిది. దానిలో మహావిచిత్రములైనగాథ లనేకమున్నవి. ఈగ్రంథము నూతనముగ దేశోద్ధారక నాగేశ్వరరావుగారిచే నచ్చొత్తింపఁబడి ప్రకటింపఁబడినది. మహేశ్వరభక్తులైన మహామహుల విచిత్రగాథలన్నియుఁ జదివి యాంధ్రసోదరులు తరింతురుగాక!

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

7. ఉన్మత్తుని యుపన్యాసము

జంఘాలశాస్త్రి విశాఖపట్నం వెళ్లి పిచ్చి ఆసుపత్రికి వెళ్లాడు. పిచ్చివాళ్ల మాటల ధోరణి వినడం అతనికి ఇష్టం. పూర్వం స్త్రీపురుష సౌందర్యం గురించి, పరిణామక్రమం గురించీ తనతో మాట్లాడిన పిచ్చిమనిషి వుంటూడేమోనని అతనుండిన కొట్టుదగ్గరకు వెళ్లాడు. అతను లేడుగాని మరొకాయన వున్నాడు. ఆయన తను కూర్చుండే తాటాకు చాపలో ఆకుల్ని చీలుస్తున్నాడు. జంఘాలశాస్త్రి ఎందుకలా చేస్తున్నారని ప్రశ్నించాడు.

'సృష్టిలో ఉన్న ఒక్కొక్కడి ఆకు ఇలా చింపుతున్నా'నని–ఉపన్యాసం ప్రారంభించాడు. సృష్టి పనికిమాలినదనీ, అర్థంలేనిదనీ, నశించడమే మంచిదనీ ప్రకటించాడు. సృష్టికర్తను గురించి తెలియకపోవడమే జ్ఞానమని నిర్వచించాడు. ఇక్కడ పాతవిభేదాల స్థానంలో కొత్తతరహా మానవ విభేదాలు తలెత్తడం ఒక్కటే విశేషమన్నాడు. మనుషుల రెండు నాల్కల ధోరణిని విమర్శించాడు. ప్రతివారూ ప్రేమతత్త్వాన్ని, సామరస్యాన్నీ వేదికలెక్కి ప్రబోధించేవాళ్లే, –క్రియకు వచ్చేసరికి అంతాదొంగలే. దేశభక్తుల పేరిట చెలామణీ అయిపోతున్న వారి రంగుల్ని ఎండగట్టాడు. నిజమైన దేశభక్తి అంటే దేశీయ దేవతల్ని ఆరాధించడం, దేశీయ ఋషులు బోధించిన వేదాలననుసరించి కర్మ చేయడం దేశీయ జనాన్నేకాదు, సర్వభూతాలను తనతో సమానంగా చూసేవాడే దేశభక్తుడని నిర్వచించాడు. శాంతి, సహనం లేకుండా ఎవడికి వాడే నాయకుడనుకునే వాడే కద! అని ఈసడించాడు–

జంఘాలశాస్త్రి ఆయన మాటలు తీరుచూసి ఆశ్చర్యపోయాడు. ఆయన, తనుపిచ్చివాణ్ణే కాదనీ, మేనబావను చూడ్డానికి ఇక్కడకువచ్చి –అతను తప్పించుకుపోగా, గత పద్దెనిమిది నెలలుగా ఇక్కడే వుంటున్నానని చెప్పాడు. వీలైతే ఈ 'చెర' నుంచి విడిపించమన్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! మొన్న విశాఖపట్టణమునకుఁ బోయి యచ్చటి పిచ్చి యాసుపత్రిలోని కేగితిని. నాకుఁ బిచ్చివారిమాటలను వినుట కెంతయో కుతూహలమగుటచే నచ్చటికిఁ

బోయితిని. పూర్వమున బురుష సౌందర్యమునుగూర్చి, సృష్టిపరిణామక్రమమునుగూర్చి యుపన్యసించిన యున్మత్తుని జూచుటకై యాతని కొట్టునొద్దకుఁ బోయితిని. అతఁడేమయ్యెనోకాని కానఁబడలేదు. కాని యాతనివంటివాఁడే యొక్కఁడాకొట్టులోఁగూరు చుండి యాస్తరణముగ నున్న తాటియాకు చాప యాకులను దీసి చీల్చుచున్నాడు. అయ్యా! యని యాతనిఁ బిలిచితిని. తన పైకెత్తి నాల్క రవంత కఱచికొని తిరుగఁ దల వంచుకొని యాకులను జీల్చుచుండెను. అయ్యా! యని మరియొకసారి పిలిచితిని. ఇంతలో నొకభటుఁడేఁగూలనుండియో వచ్చి "ఎవ రక్కడ! పిచ్చివానితో మాటలాడుచుంటివా? పో! ఆవలికిఁ బొ" మ్మని నన్ను గర్దించెను. ఆతనిచేతిలో నాలుగణా లుంచి, "రవంతసేపు వినోదమునఁ గాలక్షేపము చేయుదును క్షమింపు" మని యాతని వేఁడుకొంటిని. "సరే. అట్టేసేపుండుటకు వీలులే" దని చెప్పి యాతఁడావలికిఁ బోయెను. "అయ్యా" యని పిచ్చివానిని బిల్చితిని. ఆతఁడు మాటలాడలేదు. సరికాదా, ఈసారి తలయెత్తనైన లేదు. "అయ్యా! తాటియాకు లట్లు చీల్చుచుంటి వెందుల" కని నే నంటిని.

పిచ్చివాని సంభాషణము

"సృష్టిలోనున్న యొక్కొక్కని యా కిట్లు చింపుచున్నాను. ఈ సృష్టినంత నాశమొన ర్చుటయే మంచిది. సృష్టి పనికిమాలిన సృష్టి. అర్థము లేనిసృష్టి. నశించుటయే నమంజ నము. దీనిలో నొక యుద్దేశమున్నదా? నీతి యున్నదా? శాసనమున్నదా? ప్రేమయు న్నదా? ఒక క్రమమైన నున్నదా? మనబుషు లే మని చెప్పిరో వింటివా? సత్తులేదు, అసత్తులేదు. చావులేదు, శాశ్వతత్వము లేదు. పగలు లేదు, రాత్రిలేదు, ఒక్కటియే యున్నది. అది తనంత తానే యున్నది. దానికంటె వేరు లేదు. ఉన్న దనున దేదో దానినుండియే వచ్చినది. ఇ ట్లెందులకు వచ్చెనో దానికే తెలయును. అదికూడ నెఱుఁగు నని చెప్పవలనుపడదు. ఇక్కడకు సృష్టికర్తస్థితి యెట్లున్నది? జ్ఞానమున్నది, లేదు. Will ఉన్నది, లేదు. ఉనికి యున్నది, లేదు. తననుండి సృష్టికలిగిన దనుసంగతి యని యెఱుఁగును, ఎఱుఁగదు. ఇట్టి తత్త్వమని మనబుషులు స్థిరపఱచినారు. ఇది తెలియుటా, తెలియకపోవుటా? తెలియుట కాదు, తెలియకపోవుట కాదు. తెలియకపోవుట, తెలియుట యనఁగా నిదియే. సృష్టికర్తను గూర్చి యెఱుఁగకపోవుటయే జ్ఞానము. ఎఱుఁగుట యజ్ఞా నము. ఇవి మహావాక్యము లని మనవా రెల్ల రంగీకరించినారు. సృష్టిప్రారంభము నుండి యిప్పటివఱ కిట్టి మహోత్కృష్టవాక్యములు పుట్టలేదు. ప్రథమ కారణమునుగూర్చి పాశ్చా త్యప్రకృత్యాది శాస్త్రములన్నియు దప్పులుచేసి దిద్దుకొని, తిరుగఁ దప్పులుచేసి మరల దిద్దుకొని, తుట్టతుద కీమహావాక్యములే సత్యము లని యంగీకరించుచున్నవి. అవి యంగీక రించుటచే మనకు ఘనత యున్న దని నేను జెప్పుటలేదు. కాని మనమహావాక్యముల ననునరించియే మనవారిలో నూటికిఁ దొంబదుగురవఱకు నడచుచుండుటచే మనకు మహాఘనత వచ్చుచున్న దని చెప్పవలసి వచ్చినది.

మన కాప్రథమకారణమువలెనే జ్ఞానమున్నది, లేదు. ఉద్దేశమున్నది, లేదు. బుద్ధియు న్నది, లేదు. Will ఉన్నది, లేదు. పనిచేయుచున్నాము, చేయుచుండుట లేదు.

వర్ణవిభాగ మంత పనికిమాలిన యేర్పాటు లే దనియు, భారతీయుల బానిసతనమునకుఁ బ్రధానకారణ మదియే యనియు, నిట్టి యసందర్భమైన, యసహజ

మైన, యపకారమైన బంధము లేని యితర దేశీయులు స్వతంత్రులై, జ్ఞానసంపన్నులై, సౌఖ్యవంతులై, సర్వజనసములై కాలక్షేపము చేయుచున్నా రనియు, నిది మనచేతి కరదండ ములుగఁ, గాళ్ళకు సంకెలగఁ, గంటికి గంతలుగ, మనస్సునకు దిగఁడుకుడుగ నుండుటచే మన మెదుగు బొదుగులేక, శరీరమున నల్పులమై, జ్ఞానమున నంధులమై, కార్యమునఁ గాతరులమై, చిత్తమున బానిసలమై యున్నామనియు, నీపిశాచమునుండి యెంతత్వరగ విముక్తినొందుదుమో యంతత్వరలో మనకు సమస్తజనసోదరత్వమే కాక, సర్వజీవసోదరత్వ మును గ్రహింపఁ గల్గుదు మనియు, నట్లాచరించుటకుఁ దగిన వీర్యము, వెన్నెముక, విదగ్ధత కలవారమగుదుమనియు, మనదేశమునకు, మనజాతికీ యథార్థముగ మనుజజన్మమునకుఁ గూడ లాఘవకరమైన, లజ్జాకరమైన యీ ''నన్ను ముట్టుకొనకుఁదనపు'', బుద్ధిహీనపుపశు ప్రాయపుటేర్పాటెప్పుడు పరశురామప్రీతి యగునో యప్పుడే మనకు జాత్యైక్యము సంభవిం చుననియు, జాత్యైక్యముతో శరీరపాటవము; శరీరపాటవముతో సౌఖ్యసంపదయు; సౌఖ్యసం పదతోఁ జిత్తవికాసము; చిత్తవికాసముతో బుద్ధిస్థైర్యము; బుద్ధిస్థైర్యముతో నాత్మస్వాతం త్ర్యము సిద్ధించు ననియు మన ముపన్యాసపీఠములపై సింహగర్జనము లొనరించుచుండుట లేదా? ఇట్లు జాత్యైక్యసమారిజననంరంభ మొకవంక జరుగుచునే యున్నది. వేరొకవంక, తూర్పు మంగళ్ళ కొక్క కాన్పరెన్సు, పడమటి మంగళ్ళ కొక్క కాన్పరెన్సు, వ్యాసరాయమఠ స్థుల కొక్కటి, కానలనాటివారి కొక్కటి, వేఁగినాటివారి కొక్కటి, మెరవీధి తెలగాల కొకటి, పల్లపువీధి తెలగాల కొకటి, నపాదవైష్ణవుల కొక్కటి, నిష్పాదవైష్ణవుల కొక్కటి, పెదమాలపల్లి యాదిద్రావిడుల కొకటి, చినమాలపల్లి యాదిద్రావిడుల కొక్కటి జరుగుచునే యున్నవి. ఒక తెకవారి కట్టుపాటులు వేరొక్క తెగవారి కనిష్టములు పరిపూర్తిగ ననిష్టములు.

గీ. తెల్లరసుద్దకు మరి విభూతికి బడదు
సుద్దముక్కల రెంటికిఁ జుక్కయెదురు
పగిలిన విభూతిపండులోఁ బ్రబలతమము
లైనతెగల రెంటికిని షష్ఠాష్టకంబు
బొగ్గుదారి బొగ్గుది సుద్దబూడిదలకు
దాని కెప్పుడు నైధనతారవరున
అరవలకు నాంధ్రులకు గ్రుద్దులాటధాటి
పైఁగ బ్రాహ్మణాబ్రాహ్మణభండనంబు.

సభావేదికలపై సామరస్యము, గృహాంతరముల గ్రుద్దులాట, పలుకులలో మిత్రత, పనిలో శత్రుత, బోధనములో భూతదయ, ఆచరణలోఁ గత్తికోఁత.

(ఆతఁడొక్క త్రుటికాల మాఁగి గొంతు నవరించుకొని నావంకఁ జూచెను. ఈతఁడు పిచ్చివాఁడువలె మాటలాడుట లేదే యని నేను మనస్సున ననుకొంటిని. ఆంతలో నాతఁడు తిరుగ నారంభించినాఁడు.)

ఇంతటితో నరిపోయినదా: ఊహుఁ. మరియొకచోట నెట్లుపన్యసించుచున్నారు? ''బెడ్డవ్రేట్లను సహించి రేగుచెట్లు మనకుఁ దీయని ఫలము లిచ్చుచున్నవి. పట్టులేక గాలిలో నర్వశ్రమములఁ బొంది యల్లాడుచు మేఘములు మనకు సుధాసన్నిభములైననీరము లిచ్చుచున్నవి. కత్తికోఁతను సహించుచు మేకలు మన కాహార మిచ్చుచున్నది. తమగడ్డి

తాము దినుచు గోవులు మనకుఁ గుంభవృష్టిగ మధుమధుర క్షీరముల నిచ్చుచున్నవి. పేఁడచేఁ బెంటచే సంతుష్టినొంది సమస్తధాన్యసమృద్ధిని సర్వం సహాదేవి సమకూర్చుచున్నది. పశువులు సైతము ప్రాణహీనములగువస్తువులు సైతము స్వార్థపరిత్యాగ మాచరించి పదార్థనం విధాన మొనర్చుచున్నవి. ప్రేమతత్త్వమే సృష్టికి మూలాధారమై యున్నది. ఎక్కడఁ జూచినఁ బ్రేమ. ఎక్కడఁజూచినఁ బ్రేమ. గ్రహములందుఁ బ్రేమ. నక్షత్రములందుఁ బ్రేమ. అంతరిక్షమునఁ బ్రేమ. గాలిలోఁ బ్రేమ. నీళ్లలోఁ బ్రేమ. భూమిలోఁ బ్రేమ. ప్రపంచమునందలి ప్రతిపరమాణువునందునఁ బ్రేమ. పరమేశ్వరుఁడు ప్రేమస్వరూపుఁడు. ఆతని స్వరూప మున సృష్టినందిన మనుజుఁడు ప్రేమస్వరూపుఁడనుట కేమైన సందేహమా? బుద్ధుఁ డెట్టివాఁడు? ఏసుక్రీస్తెట్టివాఁడు? రామానుజుఁ డెట్టివాఁడు? చైతన్యుఁ డెట్టివాఁడు? ఇట్టి ప్రేమైకనిధానములైన మహానుభావు లవతరించిన భారతభూమి ప్రేమరససిక్తమై, ప్రేమరసార్ద్రమై, ప్రేమరసైకనిధానమై ప్రకాశించుచున్న దనఁగా నాశ్చర్యమేమి? ప్రేమరసవాహినులచే భారతదేశ మంతయుఁ జల్లనై యున్నదనఁగ వింత యేమున్నది? పైనిమంచు కొండల బారువలనఁ గలిగిన చలువ, మూఁడు ప్రక్కలఁగూడ నావరించినమున్నీటి చలువ, గంగతల్లి మొదలు కావేరమ్మవఱకు నడుమనున్న పవిత్రనదుల చలువ, శ్రీకృష్ణవిరహమున గౌరాంగుఁడు వర్షించినయశ్రుధారల చలువ, బుద్ధదేవుని ప్రేమమతపుఁ జలువ, పుట్టతేనెతోఁ గలిసిన శ్రీరామనామామృతపుఁ జలువ, మహర్షులదయాదృష్టులచలువయుఁ గలిగిన భారత దేశమునఁ దీవ్రత కెక్కడనైనఁ దావున్నదా? కఠినత్వమున కెక్కడనైన నవకాశమున్నదా? క్రూరత్వమున కేమైన నెడమున్నదా? హింస కెక్కడనైనఁ జోటున్నదా? మనకాలిక్రింద నడఁగిపోవు పురుగునకు మనకుఁ దత్త్వమున భేదమేమైన మున్నదా? నిన్ను నీవెట్లుప్రేమించు కొనుచున్నావో, నీతోడిమానవులనందఱ నట్లు ప్రేమింప వలయును గాదా? మానవులకంటె భిన్నములైన జంతువులఁగూడ నీవట్లే ప్రేమింపవలయును గాదా? పరుఁడని నీవనుకొను చున్న ప్రతి ప్రాణియుఁ గూడ యథార్థముగ నీవే. కావునఁ దలఁపులోఁగాని, మాటలోఁగాని, చర్యలోఁగాని యెవ్వరికిఁ గూడ నీవలన నపకారము జరుగఁగూడదు. పరకష్టమాత్మకష్టము. పరదుఃఖ మాత్మదుఃఖము. పరహింస యాత్మహింస. పరత్వ మనునది యథార్థముగ నాత్మత్వమే కాని వేరు కాదే? సూర్యుఁడు దాను గర్భానలజ్వాలాజాలముచే మండి పోవుచుఁ బ్రపంచమున కారోగ్యమును బ్రాసాదించునట్లు సర్వకష్టనిష్ఠుర తల కోర్చి జనోపకార మాచరింపుము.

ఇట్టిమాటలు సభావేదికలపైఁ బలుకువా రొకరా, యిద్దరా? కాదు, వేలు. ఆమోదించు వారు శిరఃకంపనమొనర్చువారు, నెట్టి యాచరణమునకైన శపథము లొనర్చువారు లక్షలు. ఏదీ, తుదకు ఫలమేమి? ఏమున్నది? ఆలుమగల తిట్లు; తన్నులు; తండ్రికొడుకుల త్రోపులాటలు, తాపులాటలు; అన్నదమ్ముల యర్ధచంద్రప్రయోగములు, విషప్రయోగ ములు; అత్తకోడండ్ర గ్రుద్దులాటలు, కూపపతనములు; తోడికోడండ్ర యట్లకర్రవేటులు, రోఁకలిపోటులు; శ్వశురజామాతలచీకొట్లాటలు, చెంపపెట్టులు. ఒక్కకుటుంబములోని పేరిప్రేమమే యిట్లు వెలిఁగిపోవుచుండఁగ నింకఁ బరులపై ప్రేమ మెట్టులున్నదో వేఱ చెప్పవలయునా? కన్నపుదొంగతనములు, కొంపలఁ గాల్చుటలు, తలఁగొట్టుటలు, స్త్రీలఁ జెఱపుటలు, న్యాయసభలో వ్యాజ్యేములు, చార్జీలు, కారాగృహవాసములు, ఉరిశిక్షలు -ఇవిగాక భూమిమీఁద యుద్ధములు, నీటిలో యుద్ధములు, గాలిలో యుద్ధములు. పరుని

యెడ నొక కఠినవాక్యమైనఁ బలుకఁదగదని నోటఁ బలుకుచున్నాము. పరరాష్ట్రమునకైపితంగి చెవుల నిప్పంటించుచున్నాము. పరులసుఖములో మన సుఖ మున్నదని బోధించుచున్నాము. పరప్రాణములు పోట్టఁ బెట్టుకొని సుఖించుచున్నాము. అనేక పుణ్యనదులచేఁ జలువయెక్కిన మనదేశమందుఁ దీవ్రత కవకాశము లేదని నోటఁ బలుకుచున్నాము. జాతినైషమ్యములచేఁ బరులకొంపలఁ గాల్చి పరుల వేఁడినెత్తుటిచే మాతృభూమినిఁ దడిపి మహానదుల నపవిత్ర మొనర్చుచున్నాము. మనకు బుద్ధియున్నదా, లేదా? ఉన్నది–లేదు. ఆలాపములలో బుద్ధి; ఉద్యోగరంగమున బుద్ధిహీనత. కూపములేని కుగ్రామ మున్నది. కోమటిదుకాణములేని కుగ్రామ మున్నది. బ్రాహ్మణ బ్రువుఁడైనలేని కుగ్రామమున్నది. దేశభక్తులులేని కుగ్రామమున్నదా? లేదు. లేనేలేదు. గతించిన దుష్టకాలములో నాలుగుశతాబ్దములకో, పదిశతాబ్దములకో యెవ్వఁడో యొక దేశభక్తుఁడు కాలానుసరణముగ నుదయించుట, కొంతకాలము నిశ్శబ్దముగ నిరాడంబరముగ నిశ్చలముగ నిరుపద్రవదీక్షతో వ్యత్యస్తపరిస్థితులను సరిచేయుట, ప్రజాహిత మాచరించుట, దేవసేవామార్గమును గానఁబఱచుట, తిరోధానమగుట జరుగుచుండెడిది. ఇప్పు డటులా? ఏమి విచిత్రకాలము? పినిమిదిసంవత్సరములలోపల నీ భారతవర్షమున బయలుదేరిన దేశభక్తులసంఖ్య మిగిలిన సర్వప్రపంచమందు నెనిమిది వేలసంవత్సరకాలములోఁ గలిగిన దేశభక్తుల సంఖ్యకంటె నెన్నిమడుగులో హెచ్చని భావింపవలసినట్లున్నది. అసాధారణమైన, యాశ్చర్యకరమైన, యద్వితీయమైన యీయభివృద్ధి యారోగ్యలక్షణమా, యామయలక్షణమా? కండల పెటపెటయా, క్రొవ్వు తవతవయా? నరములసారా, నంజునీరా? ఓయేమియుపన్యాసముల ఝూంకారములు! యేమియుద్బోధనలయహంకారములు! సర్వభూత సమత్వమునుగూర్చి, స్వార్థపరిత్యాగమునుగూర్చి, శాంతినిగూర్చి, నిర్మలాంతఃకరణమును గూర్చి, నియతేంద్రియత్వమునుగూర్చి, దేశభక్తిని గూర్చి, దేవభక్తిని గూర్చి యేమి వావదూకతావైభవము. తిట్లు దీవననే నడఁగుననియుఁ, గొట్టు పెట్టుచే శాంతించుననియుఁ, గత్తివ్రేటు కొఁగిలిచే బోవు ననియు, శత్రుత్వము మిత్రత్వముచే నడలు ననియుఁ, నెట్టియెట్టిమాట లాడుచున్నారు? ఆహాహా! బుద్ధదేవుఁ డాడఁదగినమాటలే? రామానుజుఁ డాడఁదగినమాటలే? దేశోద్ధరణమును సంకల్పించుకొనిన మీరు వట్టిమాటలతోఁ గృతార్థులు కాఁగలరా? మాటల కనుగుణమైన తత్త్వము మీలో నున్నదో లేదో పరిశీలించుకొంటిరా? ఆధ్యాత్మికవిద్యలో నేమంతఁ గృషిచేసినా రని మీరు దేశభక్తు లనిపించుకొనుచున్నారు? ఆధ్యాత్మిక విద్యదాఁక నెందులకు? ఐహికవిద్యలో మీరేమంత పరిచితి కలవారో యోజించుకొనరాదా? నాల్గవతరగతి పరీక్షలోఁ గృతార్థులు గాలేక దేశభక్తిలోఁ బడినవారు కొందరు, పంచకావ్యపఠనములో నందుగొట్టుటచే దేశభక్తిలోఁబడినవారు కొందరు; పదిజమీందారీయాస్థానములను దిబ్బలుచేసి, నిలువఁ జేసిన ధనము లక్షలకొద్ది మూల్గుచుండ నకస్మాత్తుగా స్వార్థపరిత్యాగులై దేశభక్తిలోఁ బడినవారు కొందరు, నేవిధముగాఁగూడఁ గీర్తి రాకుండ నున్న దని యేరక్షకభట నిర్భాగ్యునో పనిలేక కొట్టి శ్రీకృష్ణజన్మస్థానముఁ జేరి దేశభక్తిలోఁ బడినవారు కొందరు, నిట్టివారే కదా నూటికిఁ దొంబదుగురు దేశభక్తులు! పూర్వ మొనర్చిన జాతిద్రోహములు, మిత్రద్రోహములు, దేశద్రోహములు, మతద్రోహములు, దైవద్రోహములు, ఖడ్గరుట్టోపితో సమూలముగ నెగిరిపోయినవా? ఇంకను నిల్చియున్నవేమో? లోనికి దృష్టిని గాఢముగఁ బఱపి పరిశీలించుకొనరా? మిమ్ము దేశభక్తులను జేసినది దేశీయవస్త్రధారణమేనా? అంతకంటె నేమైన

నున్నదా?. పంగనామములచే భాగవతోత్తముఁడవు కాఁగలవా? ఆనపకాయచే సన్న్యాసివి కాఁగలవా? ఖద్దరు నీయొడలిమీఁదనా యుండవలసినది? నీమనస్సులో నుండవలయును. నీమనశ్శాటిలోని పడుగుపేక స్వదీశీయభావతంతువులతో నెప్పుడు చేయఁబడినదో యప్పుడు నీవు దేశభక్తుఁడ వగుదువు. తెఱచాఁపగుడ్డ మొలకు బిగించుట గాదు. వేదవిహిత కర్మములచే మనస్సును బిగింపవలెను. స్నానములేక, సంధ్యావందనము లేక కట్టుకొనిన బట్టయైన మార్పకుండఁ, బదునాల్గుసార్లు మూత్రము విడిచినగుడ్డతో నేడుగంటలైనఁగా కుండ నేగూడురులోనో, యేయేలూరులోనో యూఁకలి రవంతయైననాఁపలేక యాంగ్లేయ భోజనమందిరములలోని కల్లురొట్టితో కాఫీతోఁ గడుపు నిండించుకొనుచున్ననీవు దేశభక్తుఁడవేనా? దేశభక్తున కుండవలసిన నియతేంద్రియత్వముమాట దేవుఁ డెరుఁగును. ప్రప్రథమ సోపానమైన యాహారనియమమే నీకులేదే? తాటిపాకనవారు తలపాగబరువును మోయఁగలిగిన నీవు రవంతవ్యతిరేకపుమాట సహింపలేనపుడు తుల్యనిందా స్తుతుఁడగు దేశభక్తుఁడ వగుదువా? వదినెగారికి మనువృత్తి నీయవలసివచ్చు నని యెంచి యామె వ్యభిచరించిన దని యపవాదము కల్పించితివే. దేశభక్తుని కుండవలసిన సర్వప్రాణిసమత్వము మాట యటుంపుము. స్వబంధుభక్తియైన నీకున్నదా? ఇంతయేల? కల్లుపాకలనుండి కులటల గుడిసెలనుండి పవిత్రములగు రాట్నపుజెండాలతో వెలువడిన దేశభక్తు లెంద రున్నారో యెరుఁగుదురా? అట్టి వారిని జూచుటతోడనే దేహముచచ్చినది. దేశము చచ్చినది, భక్తి చచ్చిన దనవలయునుగాదా? దేశభక్తి యని తెగసాగెద రెందులకు? స్వార్థపరిత్యాగి దేశ భక్తుఁడు, మీరు చేయుచున్న పనులందు వేనిలో స్వార్థపరిత్యాగమున్నదో చెప్పుఁడు. తాడికాయ నిచ్చి తాటికాయలాగఁ జూచుచున్న మీకు స్వార్థపరిత్యాగమా? స్వార్థపరిత్యాగ మెంత వైరాగ్యము గలవానికి కలుగవలెను? ఒక్క వైరాగ్యమే కాదు. ఎంత యధ్యాత్మికజ్ఞాన మున్నవానికి కలుగవలయును? తనకుఁ బరునకుఁ దత్త్వమున భేదము లేదనియు, భేదము మిథ్య, యేకత్వము సత్యమనియు నెఱిఁగి యనుభవములోనికిఁ దెచ్చుకొని యాచరించు వానికిఁ గాని స్వార్థపరిత్యాగముకలుగునా? అట్టి మనస్థితి నీకు లభించువఱకు పరోపకార మని భ్రమపడి నీవు చేయుచున్నపను లన్నియు డాంబికములు డబ్బుదండుగలు.

దేశభక్తి దేశభక్తి యని యందువుకద, దేశమునకు ముక్కా, నోరా? తలయా? తోఁకయా? దేశము నారాధించుట యెట్లు యెఱుఁగుదువా? దేశీయదేవతల నారాధిం చువాఁడు దేశభక్తుఁడు. దేశీయుల ఋషులనుండి యుద్భుద్ధములైన వేదముల ననుసరించి కర్మముల నాచరించువాఁడు దేశభక్తుఁడు. దేశీయజనులనే గాక సర్వభూతములను తనతో సమానముగఁ జూచుకొనువాఁడు దేశభక్తుఁడు. తాను తన విద్య, తనబుద్ధి, తననర్వస్వము దేశీయజనసేవ కని త్రికరణశుద్ధిగ నమ్మి ప్రతిఫలవాంఛాశూన్యుఁడై ప్రజాసేవ యొన ర్చువాఁడు దేశభక్తుఁడు. అంతేకాని వచ్చినధనముతో సంతుష్టి లేక, సంభవించిన యాపద లలో శాంతి లేక, తెచ్చినఋణము లెగఁబెట్టుటకు జంకు లేక, సంభాపీఠమున నిలువఁ బడి యసత్యమును బలుకుటకు బిడియములేక, కర్మానుష్ఠానమున కోపిక లేక, త్యాగ మొనర్చుటకు బుద్ధిలేక, యధమాధమ వృత్తులు చేసికొని జీవించునయ్యలు, నమ్మలు మనఃపూర్వకముగ మృతమహానుభావుల నిధులకై యర్పించినధనముతో రైలుఖర్చులు, ఫలాహారపుఖర్చులుఁ బెట్టుకొని యీమూలనుండి యామూలకు, నామూల నుండి మరి యొక మూలకుఁ బనిలేక తిరుగుటకు వినుగువిరామములేక యల్లలాడు నద్భుతతరపురుష ఏగు మీరు దేశభక్తు లగుదురా?

మీరు బోధించుచున్న జాత్యైక్యముమాట ముందు చూచుకొనవచ్చును గాని మీలో మీ కేమాత్ర మైక్యమున్నదో సెలవిండు. ఒక్క తెగగా బయలుదేరిన దారుమానములైనఁ గాకుండ రెండు తెలైనవిగదా? అవి యిప్పటికిఁ బదునాలుగైనవికదా? ఇంకొక పదునాల్గు చీలికలు సైనంవత్సరములోఁ గావని యెవరు చెప్పగలరు? క్రిందఁబడిన పాదరసపుబుడ్డివలె నిన్నిముక్కలైన మీరు వర్ణవిభాగమును మాన్పనుపన్యసించుచున్నారా? ముక్కలైన త్రాటితోఁ గట్టెలమోపుఁ గట్టవచ్చునా? మొన్న మొన్న విడిపోయిన తెగలను సవరించుకొన లేక యెన్ని వేల సంవత్సరములనుండియోయున్న వర్ణవిభేదములను మాన్పఁ బ్రయత్నించు చున్నారా? తలకుఁ దగని తలఁపులా? నోటికిఁ దగని మాటలా? చేతికిఁదగనిపనులా? చెప్పినమాటవినక నిల్లు విడనాడిపోయిన చంచలాక్షిమగఁడు ఆంధ్రపత్రికలో స్త్రీవశ్యపుమందుఁ బ్రకటించునెడల మీరు వెకవెక లాడరా? అట్లే మిమ్ముఁ గాంచి పరులు వెకవెక లాడుదు రనుబుద్ధి మీకేల యుండక పోవలయును?

అదిగాక మీలో నెవ్వరైన సరే యొకని యగ్రయాయిత్వమున కంగీకరింతురా? ఏవ్యక్తికావ్యక్తియేగజ్జెకట్టి కలాపము వినిపింపవలయు ననుకుతూహలతతో నుండుటయే కాని యాతఁడు మననాయకుఁడు, ఆతని ననుసరించి మనము పోవుద మను శాంతిచిత్తత, సహనశీలత, మీలో నెవ్వని కున్నదో యొక్కనిప్రేలు మడఁచి చెప్పుఁడు? మీయేలుబడిలో ముందు దేశీయజనుల నుంచుకొనఁ దలఁచినవారు కదా? మీలో నొక్కఁడైన నొక్కనికి విధేయుఁడై ప్రవర్తింప లేకుండు నప్పుడు మీవలన మేము నేర్చుకొనవలసిన దేది? మీకు విధేయత లేనప్పుడు మావలన విధేయత మీ రెట్లపేక్షింపఁగలరు? ఏలఁబడువాఁడే యేలికయ గుట కర్హుఁడు. విధేయతఁ జూపఁగలిగినవాఁడే యాజ్ఞనిచ్చుటకుఁ దగినవాఁడు. వినఁదగినవాఁడే చెప్పఁదగినవాఁడు.

''జంఘాలశాస్త్రి! నిన్ననే నెఱుఁగుదును. సాక్షిసంఘమున నీయుపన్యానములు కొన్నిసార్లునేను వింటిని ఇంతసేపటినుండి మాటలాడుచుంటిని గదా, నాయభిప్రాయము లతో నీవేకీభవింపక పోవచ్చును. కాని, నే నేమైన నున్మత్తుఁడు మాటలాడినట్లు మాటలాడి తినా'' యని నన్నడిగెను. ''నేను నందులకే యాశ్చర్యపడుచున్నాను. నీవిచ్చటికేల వచ్చితి'' వని యాతని నడిగితిని. ఆతఁ డిట్లు చెప్పెను; ''ఈ కొట్టులోఁ గొంతకాల ముండిన పిచ్చివాఁడు మామేనత్తకొడుకు వచ్చితిని. ఆతఁడు ననుఁ జూచి నాతోఁ గొన్ని యసందర్భపుమాటలాడి 'నీవిచ్చటఁ గొంతసేపు గూరుచుండుము. నేను జలస్పర్శమునకుఁ బోయివచ్చెద'నని పోయెను. ఒకగంటసేపు కూరుచుంటిని. ఆతఁడు రాలేదు. ఇంతలోఁ గారాగృహాధిపతి వచ్చి 'యింతరాత్రి యైనను నీ వింక నిటనే కూరుచుంటి వేల' యని నాపైఁ దీండ్రించెను. 'అయ్యా! పిచ్చివాఁడు జలస్పర్శమునకుఁ బోయినాఁడు. నే నాతనిబావను. ఆతనికొఱకే చూచుచున్నా'నని కారాధీశునితోఁ జెప్పితిని. చేతిలోనున్న లాంతరు పైకెత్తి నామొగముఁ బరిశీలించి పిచ్చివాఁడు నా మేనత్తకొడు కగుటచేత వాతనిరూ పమునకు, నారూపమునకు భేద మెంతమాత్రమును లేకున్న కారణమున కొరడాతో నొక్క దెబ్బకొట్టి నన్నికొట్టులోనికిఁ ద్రోచి తలుపువైచినాఁడు. పదునెనిమిదిమానములనుండి యిచ్చటఁ బడియున్నాను. నే నెవ్వరితో నేమి చెప్పుకొన్నను లేశమైన వినియోగింపలేదు. నా కింతవఱకుఁ బిచ్చియెత్తలే దనుకొందును. ముం దేమగునో తెలియదు కాని

మనుష్యజాతిమీఁద నాకుఁ గలిగిన యనహ్యత యింత యంత కాదు. గుణగ్రహణమును మానినైచి యెంతసేపు దోషగ్రహణమే చేయుచు, మనుష్యులనెల్లఁ దిట్టుచుఁ గాలక్షేపముఁ జేయుచున్నాను. నీకుఁ జేతనగునెడల నాస్థితిని వెల్లడించి నన్నీ చెఱనుండి విడిపింపుము'' అని చెప్పి యాతఁ డూరకుండెను.

హరిహరీ! పిచ్చివాఁ డైనమఱఁదిని జూచుట కితఁడు వచ్చుట యేమి, పిచ్చివాఁడు పారిపోవుట యేమి, పిచ్చిలేనివాని కీ కారాబంధన మేమి! ఏమిచిత్రము! కర్మమార్గము దుర్గ్రహము కదా?

ఓం శాంతిః శ్శాంతిః శ్శాంతిః

8. ప్రకృతిశక్తులు

జంఘాలశాస్త్రికి, పిచ్చివాళ్లని పలకరించి వారిచేత మాట్లాడించడంలో ఆసక్తివుంది కదా! క్రితంసారి విశాఖపట్నం పిచ్చిఆసుపత్రికి వెళ్ళి, ఒక మనిషిని పలకరించి, అతను సృష్టిలో నీతి, శాసనం లేవనే పద్ధతిలో మాట్లాడగా–ఆసంగతి మనకు శాస్త్రి చెప్పాడు కదా! ఈసారి కూడా అదే మనిషిని పలకరించగా, ఆయన విజ్ఞానాన్ని ప్రకృతిశక్తుల గురించి మాట్లాడాడు.

సృష్టిలో 'క్రమం' అనేది సున్న. శాసనం అనేది ఎండమావి. ప్రేమ అనేమాట పచ్చి అబద్ధం. చెప్పకతప్పదంటే, స్వార్థప్రేమే తప్ప పదార్థప్రేమ ఈ ప్రపంచంలో లేదు. 'ప్రేమ' అనే మాటకి–'చంపి తినడం' అని అర్థమైతే, సృష్టిలో కావలసినంత ప్రేమ వుంది. ఎంతసేపు మనిషికి తన తిండి, తన సుఖం, తన డబ్బు, తన కీర్తి–తనకి ఎంతవరకు ఉపయోగపడుతుందో అంతవరకే ఆలోచన. అంతకుమించి పోడు. ఇందులో కొంచం హెచ్చు తగ్గులుండవచ్చుగాని మూలసూత్రం మాత్రం స్వార్థమే. 'పరోపకారం' అనేది ఎక్కడైనా పొరపాటున వుంటే, అది కూడా 'మారువేషం వేసుకున్న' స్వార్థమే.

ఆపిచ్చివాడి లెక్కప్రకారం–మూలకారణమైన అనిర్వచనీయమైన మహాశక్తినుంచి అనేక అంధప్రాయాలైన శక్తులు పుట్టాయి. మనుషుల్ని పునాదుల్లోకంటూ కదిలించి ఆకారణంగా జాతులకు జాతుల్నే కూల్చేసే ప్రకృతిశక్తులివి. ఆటలమ్మ, మశూచి వంటివి జబ్బులుకావు. ఇలాంటి అకారణ, ఉన్మత్తశక్తులే. ఈసృష్టిలో క్రమం అనేది లేదు. అక్రమమే సహజం. ఇన్ని అస్తవ్యస్తాలున్నా మనదేశం ఆచారాలలో ఇంకా అనేక ఇతర విషయాలలో విలక్షణమైంది. భయంకర శక్తుల్ని సైతం దేవతల పేర్లతో పూజిస్తాం –అయినా మనుషులకి మతిలేదు అని తేల్చాడు. జంఘాలశాస్త్రి ఈఉపన్యాసంతో ఏకీభవించలేదు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

పిచ్చి యాసుపత్రిలోనిపిచిచ లేనివానిని జూడవలయునను పిచ్చిచే దిరుగ నాతనియొద్దకుఁ బోయి నిలువఁబడి, ''అయ్యా! క్రిందటిసారి నిన్నుఁ జూచినప్పుడు సృష్టిలో

నీతి లేదని శాసనము లేదని ప్రేమ లేదని యీపనికిమాలిన సృష్టి నాశన మొనర్చుటయే మంచిదని యేమేమో చెప్పితివే" యని నేనింక నేమేమో యనుచు నుండఁగనే తీవ్రముగ నాతఁ డిట్లనియెను.

"క్రమమా? క్రమమే!! అబ్బ! క్రమము లేకపోవుటయే క్రమము. శాసనమా? అబ్బ! శాసనహీనతయే శాసనము. ప్రేమలఁట! అబ్బ! సృష్టిలో నఁట–కథలలో నాటకములలో నుపన్యాసములలోఁ–గ్రంథలలోజో అంతేకాని ప్రత్యక్షసృష్టిలోఁ బ్రేమమే! ప్రేమతత్త్వమును బ్రపంచములో నొక్కపగలుమాత్రమే యాచరణములో నుంచుట తటస్థించునెడల సృష్టిలో నున్న సర్వజీవము లొక్కసారి నాశన మగుట కేమైన సందేహమా? ఒక్కజీవము మరియొక్క జీవమునకు జీవనాధారముగా నున్నప్పు డింకఁ బ్రేమ యుండుట కవకాశమేమున్నది? మనుజుఁడు తనతత్త్వమునకు సరిపోయిన యన్నిజంతువుల ననన్నిశాకములఁ దిను చున్నాఁడు; సరిపడక పోయినవానిని మాత్రమే మిగుల్చుచున్నాఁడు. ఒక్కమధ్యాహ్నభోజన ములో నైదారు జంతువుల జీవనములు నన్నములోఁ బదివేల శాకనుల జీవనములును ద్రాగునీటిలోఁ బదిలక్షల సూక్ష్మజంతువుల జీవనములును మనుజుఁడు తన పొట్టఁ బెట్టుకొ నుచున్నాఁడు. వాయుభక్షణమున నెన్నికోట్ల సూక్ష్మజంతువులను నాశన మొనర్చు చున్నాఁడో చెప్పఁదరమా? ప్రేమమునకు లక్షణము వంపి తినుటయే యగునెడల సృష్టిలోఁ గావలసినంత ప్రేమ మున్నది. దినమునకు నాల్గుకోట్లజీవనములను గుటుక్కున మ్రింగి గర్రునఁ బొట్ట నింపుకొని, బల్లునఁ ద్రేంచి, ప్రపంచము ప్రేమమయ మైయున్న దని సభాపీఠముల బోధించు మనుజునే మనవలయును? మోసగాఁడనిఁ జూలునా? కటికవాఁ డన్నఁ జాలునా? అతని నేమనునెడలఁ దగియుండునో చెప్పుము–ఓ! లోడలోడమని యుపన్యసించువాఁడవుకదా? ఏదీ? నీతర మగునా? మనుజుఁడు చేయుచున్న యక్రమచర్య కాతని కనుగుణమైన తిట్టు శబ్దజాలమునఁ జూపఁ గలవా? ఏవో కొన్ని జంతువులను గొన్ని శాకములనుమాత్రమే మనుజుఁడు బుద్ధిపూర్వకముగఁ దప్పనినరిగఁ దనలోఁ బడి నశించు ప్రాణులవిషయమున నాతఁ డేమి చేయవలసిన దని నీ వందువేమో? ఏమి చేయవలసినదా? ఇఁక బ్రేమోపన్యాసములు పలుకక తప్పనియెడల స్వార్థప్రేమమే కాని పరార్థప్రేమము ప్రపంచమున లేదని స్పష్టముగాఁ జెప్పవలసినదని చెప్పుము. ఎంతసేపు తనతిండి, తనసు ఖము, తనధనము, తనకీర్తి–అంతే తన కెంతవఱ కుపయోగించునో యంతవఱకే తలఁపు; అంతవఱకే మాట; అంతవఱకే చేష్ట. అస్వార్థపరత్వములోనే పెద్దతల యున్న వానికిఁ బెద్దతలఁపు. పెద్దనో రున్నవానికిఁ బెద్దమాట. పెద్దచేయి యున్నవానికిఁ బెద్దచేష్ట. పెద్దబుద్ధి యున్నవానికిఁ బెద్దయాశ. పెద్దకడుపున్న వానికిఁ బెద్దతిండి. పెద్దబల మున్నవానిఁ బెద్దపెట్టు. చిన్నప్రకృతి వాని కన్నియుఁ జిన్న–ఇదియే భేదము. ఇంతకంటె భేద మేమియు లేదు. అందరుకూడ స్వార్థపరులు. పెద్దవారి స్వార్థపరత్వముచేఁ జిన్ననాఁడు బాధపడునఁ దనకంటెఁ జిన్నవారిని దాను బాధించును; రాజుగారు మంత్రిని జీవాట్లు పెట్టుఁగ మంత్రి తనయింటికిఁ బోయి యిల్లాలి నడ్డమైనతిట్లు తిట్టును; ఆమె తనపిల్లను గోపమున దొడ్డపై నొక్కటి వ్రేయును. ఆపిల్ల యుడుకుఁబోతుఁదనమునఁ దనబొమ్మను నేలవైచి పగులఁగొ ట్టును. ఎంతసేపు నొకనిచేయికంటెఁ దనచేయి పైనున్నదను సంతోషము తనకు మిగులవల యును. ఒకని బాధించుటకుఁ దగినశక్తి తన కున్నదనునంతోషము తనకు మిగులవల యును. ఎట్టిపనిలోనైనఁ దనయాధిక్యము తనసంతోషమే కావలయును. అందుకొఱకే,

యంత వఱకే యితరులతో సంబంధము యాజ్ఞవల్క్యమహర్షి యెంత సత్యములైన మాటలా డెనో యెఱుఁగవా? నీనుఖముకొఱకే నీభార్యను నీవు ప్రేమించుచున్నావు. నీనుఖముకొఱకే నీవు నీపుత్రునిఁ బ్రేమించుచున్నావు. నీకు యథార్థమైన ప్రేమము నీయందే తక్క నితరు లెవ్వరి యందును లేదు. ఇవి యెంత వింతగఁ గనబడుమాటలో యెంత సత్యము లైనమాటలు! వీనినత్య మెట్టిదో రవంత పరిశీలింతము.

రెండేండ్లపిల్లవాని తత్త్వమును బరీక్షింతము. అంతపిల్లవాని నేల పరీక్షింపవలయు ననఁగా, నాతనిలోఁ బ్రపంచసంబంధమైన మోసము, దాంభికము, మాయ, యిచ్ఛకము మొదలగు నేదోషము లింక సంక్రమింపలేదు. సాంకర్యరహితమై స్వచ్ఛమై సహజమై యతనితత్త్వము పుట్టినది పుట్టినట్లున్నది. ఇదియే పరీక్షింపదఁగిన సమయము. ఆదర్శ స్వచ్ఛతను దెలిసికొనవలయు నెడల దానిపై మాలిన్య మేమియుఁ జేరనప్పుడే పరీక్షింపవల యును గాదా! గాలిలోనిచెమ్మ దానిపైఁ జేరకుండునప్పుడే పరీక్షింపవలయును గాదా! ఎదుటను బ్రక్కనున్న వస్తువుల చాయలు దానిపైఁ బడకుండునప్పుడే పరీక్షింపవలయును గాదా! పుట్టుకతోఁ బుట్టినగుణము లేవో తెలిసికొనఁదలచినయెడల నట్టిబిడ్డనే పరీక్షింపవల యును. బిడ్డచేతి కర్ధమిచ్చిన నరే, బొమ్మనిచ్చిననరే, మఱియేది యిచ్చిననరే, దాని నేల నడఁచికొట్టును. నాశన మొనర్చుటయే దానిప్రకృతి యని తెలిసికొనవలసినది. ఎవఁడైన మఱియొక పిల్లవాఁడు తనయొద్దకు వచ్చునెడల వానిని గొట్టి పీఁకినదాఁకఁ దహతహలాడి పోవును. సహజజాతితో నంతత నైరమే మనుజప్రధానగుణ మని తెలిసికొనవలసినది. తనతల్లి క్రొత్తగ వచ్చినపిల్లవాని నెత్తుకొనువఱ కక్కఱలేదు. దరిఁజేర్చుకొన్న యెడలఁ దలఁ గొట్టుకొని యేడ్చును. తనస్థితి నెవరైన నాక్రమింతురేమో యను నసూయయే ప్రధానగుణ మని తెలియఁదగినది. తండ్రి పెద్దమిఠాయి పొట్ల మింటికిఁ దీసికొనిరాఁగ, నన్నకొక్క యుండ పెట్ట వలనుపడునా? అక్క కొక్కయుండ పెట్టవలను పడునా? పొట్ల మంతయుఁ దనచేతి కీయవలయును. ఇచ్చినదాఁక నింటిపెంకు లెగురఁ గొట్టుచునే యుండును. కేవలము స్వార్థలోలతాగుణ మిందు జాజ్వల్యమానముగాఁ బ్రకటన మగుచుండుటలేదా? కేవలము పిల్లవాఁడు కావునఁ గ్రమ్మకొనుటకు మోస మెఱుఁగనివాఁడు కావున నతని స్వార్థలోలత బట్టబయ లొనర్చుకొనినాఁడు. వాఁడే పెద్దవాఁ డగుపిమ్మట నట్లు పలుకునా? అట్లాచరించునా? మోసకాఁడై కపట ప్రేమఁగల చూపులఁ జిలుకుచు నళికనైరాగ్యప్రతిపాదక ములగు పలుకులఁ బలుకుచు మాయానమస్కృతులతో, మాయాపరీరంభములతో, మహా మాయామందహాసములతో నాపాదశిరఃపర్యంత మాక్రమించిన స్వార్థలోలతను మాటుఁ జేసికొని యంతయు మీదే యంతయు మీదే యని వట్టిచేయి వారివంకఁద్రిప్పి సర్వముఁ దానే కబళించును. మాటలు బైరాగిమాటలు. తిండి దయ్యపుతిండి. ధరించినది శాటి. వరించినది బోడి. చదివినది వేదము. చేసినది ద్రోహము. స్వార్థపరత్వమే నరుని ప్రధానగుణ మనుట స్పష్టము. పరోపకార మెటనైన నెప్పుడైన గనఁబడినట్లున్న యెడల నదికూడ మారువేషమందిన స్వార్థపరత్వమే కాని మరియొకటి కాదని నిశ్చయముగ నమ్మవలయును. పైని పాదరసము రాచిన రాగిడబ్బు. కరకరంగుపూసినమునలిమీనము. సృష్టిలోఁ బ్రేమను గూర్చి యిది చాలును.

ఇక సృష్టిలోని క్రమమునుగూర్చి చెప్పెదను. మూలకారణమగు ననిర్వచనీయమైన

మహాశక్తినుండి యనేకములైన యంధప్రాయములగు శక్తులుద్భవించినవి. పంచభూతముల యొక్క మహోన్మత్తచర్యలు జగద్విదితములేకదా? కారణము లేకుండ నవి చెలరేఁగినవా యని యందువేమో? కారణములా? అబ్బ! మొదట సృష్టికిఁ గారణమున్నదా? సృష్టించె నని మన మనుకొనుచున్న మహాశక్తికే కారణము కనఁబడనప్పుడు నీవు గంగవెఱ్ఱులకుఁ గారణము చెప్పఁబూనెద వెందులకు? ఇఁక గార్యకారణసంబంధము నాయెదుటఁ జెప్ప కేమి. నీ మనస్సునకు సంతుష్టికలిగినట్లు నీమొగము చెప్పుచుండుటలేదు. బందరు గాలివానకు బరామీటర్‌లోని పాదరసశలాక యని atmosphere అని, density యని, Nature abhors vacuum అని చప్పనిసారహీనమైన చచ్చు Science మాటలు నాతోఁ జెప్పఁ బూనెదవా? నామనస్సు పరబ్రహ్మ మని చెప్పఁబడు మహాశక్తివంక కెగురఁ జూచుచుండఁ బనికిమాలిన ప్రకృతిమాటలు పలికి దానిని దిగలాగెద వేమి? పూర్వోత్తర సందర్భశూన్య ముగ బుడబుడక్కులధోరణిని సత్యపురసాక్షిసంఘమునందుపన్యాసము లిచ్చుటకాదు. ఆలోచించి మరి మాటలాడుము.

కూలిముండకొడు కొక్కఁడు కునికిపాట్లు పడుచు నెర్రజెండా చూపుటకు బదులు పచ్చజెండా చూపినంతమాత్రమున ధూమశకటము పట్టాలనుండి జారి తిరుగఁబడుటా? వందలకొలఁది జనులు మహాఘోర మరణము లొందుటా? అద్భుతమైన, యనిర్వాచ్యమైన, యద్వితీయమైన మహాశక్తివలనఁ గలిగినసృష్టి నొక్క రెప్పపాటుకాలములో ధ్వస్తమొనర్చుట కొక్కమనుజ కీటకాధమము సమర్థమైనదా? అట్లనుటకంటెఁ బరిహాసాస్పదమైనపలుకు వేరొక్కటియున్నదా? చావవలసినవారు మహాకాలునిచేఁ జావనే చచ్చినారు. "నిమిత్త మాత్రం భవ నవ్యసాచిన్" అని శ్రీకృష్ణుఁడు చెప్పలేదా?

భూకంపములచే నెన్ని వేలపట్టణములు దించుకొని పోలేదు! ఎన్నికోట్లజీవములు నజీవసమాధుల నొందలేదు! వీరందఱి కైకకాలిక లోకాంతర ప్రాప్తియగుటకు వీరందఱు జన్మపత్రములలో మారకాధిపతి దశలే యానిమిషమున సంభవించినవా? ధరామండలగ ర్భాంతరవాయు సంచలనమే దానికిఁ గారణ మని యంటినేని తత్సంచలనమునకుఁ గారణమేమి? సంచలనముమూట కేమి, మొదలు తత్తునకుఁ గారణమేమి? సన్యాసిమఠము దించుకొనిపోయినది. సానికొంప దించుకొని పోయినది. కల్లుదుకాణము దించుకొనిపోయి నది. కాళికేశ్వరియాలయము దించుకొనిపోయినది. గోమారకవిపణిశాలయుఁ గూలినది. గోరక్షకసంఘనిలయము కూలినది. 'ఇంతటితో నయినదా? పదివందల ధూమశకటముల గొట్టములలోనుండి వచ్చుపొగకంటె హెచ్చుగఁ బర్వతవదనగహ్వరమునుండి పొగ యుబ్బెత్తుగఁ బ్రబలవేగముతో నెగయుచున్నది. రోదసీకుహర మంతయుఁ గ్రమ్మెచు న్నది. అకాలగాఢాంధకారభయంకర పరిస్థితిచేఁ బట్టపగలు కీచుకీచు మనుచు గీరుగారు మనుచుఁ బక్షులు రొదసేయుచున్నవి. ఆవు లంభా యని యార్చుచున్నవి. పందులు నెలుకలు గాడిదలు మొదలగునవి ఘుర్ఘురించుచుఁ గిచకిచలాడుచు నోండ్రపెట్టుచు నటు నుండి యిటు నిటునుండి యటు నొడలు తెలియని యవస్థతోఁ బరుగు లిడుచున్నవి. బంధుఁడు లేదు మిత్రుఁడు లేదు తల్లి లేదు తండ్రి లేదు తమ్ముఁడు లేదు కొడుకు లేదు. ఎవరిమట్టునకువారు మహాభయోద్రిక్తహృదయములతో స్వప్రాణము లెట్టులయినఁ గాపాడు కొను నాత్రముతో నాచీఁకటిలోనే కనఁబడనియాదుర్దశలోనే యెక్కడికో యెఱుఁగకుండఁ

బాఱిపోవఁ జూచుచున్నారు. గానుగయెద్దుల లాగున నందరు తిరిగినదారులలోనే యల్లాడు చున్నారు. ముందునకుఁ బోయినవారేరి? తెన్నా? కన్నా? ఏమున్నది? ఇంతలోఁ బటల ములు పటలములుగఁ బైకెగయుచున్న ధూమరాశిలో నుండి చిన్నచిన్న విస్ఫులింగములు చిటచిటాయమాధ్వనులతో మించి నక్షత్రములవలె రాత్రి తమాలవృక్షమునఁజేరిన మిడుఁగు ఱులకోటులవలెఁ గానఁబడుచున్నవి. భయంకరగాఢాంధకారము రవంత పలుచఁబడినది. రవంత పాయయిచ్చినది. కన్ను కన్ను రవంత కనఁబడుచున్నది. అంతలోఁ జండప్రచండ మగు జ్వాలాజాలములు కోట్లకొలఁది జిహ్వలతోఁ గొన్ని యెఱ్ఱగఁ గొన్ని పచ్చగఁ గొన్ని తెల్లగఁ గొన్ని నీలిగ బయలుదేరి యాకసమంత గ్రమ్మికొనుచున్నవి. సాయంకాలమున సంధ్యారాగ కాంతిచేఁ బశ్చిమ పార్శ్వమున నాకాశ మెట్లుండునో యావదాకాశముఁగూడ నట్లే యున్నది. జను లాకాఁకాకు నిలువలేక, చర్మములు బొబ్బలెక్క, దాహముచే జిహ్వ లీడ్చుకొనిపోవ, నతికాంతిచేఁ గన్నులు చీఁకటులు గ్రమ్మ, దయ్యములు పట్టినవారివలెఁ బిచ్చివారివలె జుట్లు పీఁకికొనుచు గుండెలు కొట్టుకొనుచు నట్లిట్లు పోవుచు నాకసము పగులునట్లాక్రోశ మొనర్చుచున్నారు. ఈయేడ్పులు విన్నవారెవరు? దయ యెవరికి? దాక్షిణ్య మెవరికి? ఆంధ్రప్రకృతిలోని యంధతరశక్తులకు జాలియే? కడవలంత బానలంత ద్రోణములంత చట్టిగుడిసెలంత యెఱ్ఱగఁ గ్రాగినజాలు, నలనల తెల్లగ మరిఁగిన గంధక ధారలతో ధారాపాతముగ శతకోటిశత కోటిధ్వనులతో వర్షించుచున్నవే! చెదలున్నపుట్టలోఁ దాటియాకు మంట పెట్టినయెడల నేమగునో యదియే యంతకంటె భయంకరముగ బీభత్సముగ నైనది. తెల్లవారునరి కెటు చూచినఁ బదిమైళ్లవఱకు యున్నది. దానిక్రింద మహాశ్మశానమున్నది.

వాంతులతో భేదులతో మూత్రబంధములతో, నెక్కుపట్టిన నరములతోఁ, గంటిగుం టలతో, నొడలిచలువతో, నానన్న మరణలాంఛనమగు నాభీలశిరోవేదనతో, భరింపరాని బాధలుపడుచున్న జనులనూడ్చి పెట్టుటకుఁ దోఁకచుక్క యంతచీఁపురు చేతఁబట్టుకొని మురికికాలు ఫలప్రక్కలను గోడిరెట్టలగుట్టలనడుమను గొట్టాలమ్మ తాండవించుచున్నదే! షడుప్తరశతపర్యంత మెగఁ బ్రాఁకిన జూర్తిమహార్తితో నిముననిమునుమునకు నోరెండిపోవఁ జేయుచున్నదగవగతో బాహునందులఁ బగిలిన, పగులుచున్న, పగులనున్న బొబ్బలవలని బొబ్బలతోఁ గన్న కొడుకైన నొద్దలేక, యెటులున్న దని యడుగువా రైన లేక, గుండెలు పగుల నేడ్చుచున్న నిర్భాగ్యులను గఱకఱ నమలి గుటుక్కున మ్రింగుదు నని యార్చుచు నోరుతెఱచి హాహాకార మొనర్చు మారికామహాదేవత మృతమూషకగిరిసింహాననమునఁగొ లుపుచేయుచున్నదే! వీరి తోఁబుట్టువు లగు చుఱుకులమ్మ స్ఫోటకదేవత మొదలగువారు వారివారి పరివారములతోఁ బ్రజపై దాడివెడలి భూమినంతయు నేడ్పులతో రక్తముతో శవములతో దుర్గంధముతో ధ్వస్త మొనర్చుచున్నారే! ఇపి రోగము లని యిప్పటివఱకుఁ బాశ్చాత్యులు భ్రమించు చున్నారు కాని యివి ప్రకృతిశక్తులని, వీనికి మందీయ నక్కర లేదని, బ్రదికినవారు మందుచే బ్రదికినవారు కారని, చచ్చినవారు మందులేక చచ్చినవారు కారనియు, నేసుక్రీస్తు పుట్టముందే మనవారు చెప్పినారు. ఎందుల కీశక్తులుండి యిట్లు చెలరేఁగవలయునో వానికే కారణములు తెలియనప్పుడు మన కెట్లు తెలియును? అధర్మశిక్షకుఁ బాపనాశనమునకు నిట్టివి బయలుదేరి యుండునేమో యనుకొందమన్నఁ బాపాత్ములతోఁ బుణ్యాత్ములుగూడఁ బుంఖానుపుంఖములుగఁ బూర్వపక్షము లగుచు

న్నారే! ధర్మహీనులతో ధర్మసహితులుగూడఁదండోపతండములుగ మండిపోవుచున్నారే! కుటుంబములు కుటుంబములు నామహీనముగ నశించిపోవుచున్నవి కదా! అన్ని కుటుంబములోనొక్క పాపదూరుఁడైన లేకపోయెనా! పెద్దవాండ్రు, పాపాత్ములు తఱచుగా నగుచుందురు. కావున వారు శక్తిచే శిక్షితులై యుండవచ్చును గాని మూఁడుదినముల గ్రుడ్డుకూడ మృతినొందనేల?

అది యసత్యము. ఆశక్తుల కొకరిని శిక్షించు నుద్దేశము లేదు. వాని కేవిధమైన క్రమములేదు. ఎందులకో చెలరేఁగుచున్నవి. గ్రుడ్డిత్రోపుగ నొక్కపెట్టున నన్నిటినిఁ దుడిచినైచుచున్నవి. దానిదారిలో నున్న వన్నియు నశింపవలసినదే! దయలేదు. పగలేదు. ధర్మములేదు. అధర్మము లేదు. చిన్నలేదు. పెద్ద లేదు. పుణ్యము లేదు. పాపములేదు. క్రమములేదు; ఆక్రము లేదు. సృష్టిశక్తులస్వభావ మిట్లున్నది.

''క్రమములేదు క్రమములేదని యింత గింజుకొందువేల? సూర్యచంద్రగ్రహాదుల యుదయాస్తమయము రొక్కని మేషమైనవ్యతిరేకము లేకుండ జరుగుచున్నవికాదా? ఋతు క్రమము ననుసరించి పుష్పఫలాదులు కలుగుచున్నవి కాదా? పై కెగురవైచిన బరుగువస్తువు భూమి మీఁదనే యెల్లప్పుడు పడునుగాని పై కెగిరిపోవుచుండుట లేదుకదా?'' యని నీ వందువుకాఁబోలు. ఇదియా నీకున్నపట్టు? మహోన్నత్తుని ప్రలాపములలోనైనఁ గొన్ని టియందుఁ గ్రమముండునే! ఆంత్రజ్వరితుని యసాధ్యసన్నిపాతపుఁగేకలలోనైనఁ గొన్ని కారణబద్ధములై యుండునే! అత్యసత్యాలాపియుఁగూడ ''నీమెయేనా నిన్నుఁగన్నతల్లి'' యని యడుగ, సత్యమాడక తప్పదే! అంధుఁడు నైచిన పదిరాతి విసరులలో నొక్క జాతివిసరుచేనైన మామిడి కాయయొక్కటి రాలవచ్చునే! సిరాలో మునిఁగిన సాలెపురుగు కాగితముమీఁదఁ బ్రాకినప్పు డన్ని చికిబికులలోను బ్రమాదమున నొకయక్షరముండవ చ్చునే! ఇంతయేల? ఆఁగిపోయిన గడియారమైనను దినమునకు రెండువేళల సరియైన కాలము చూపునే! అక్రమములో నక్కడక్కడ క్రమముండక తప్పనే తప్పదు. అక్రమము, క్రమము ననునవి యన్యోన్యాశ్రయస్థితులుగాని స్వతంత్రమును కావే! మనము చూడవలసిన దేదనఁగా సృష్టికిఁ గ్రమము సహజమా, యక్రమము సహజమా యనునది. అక్రమమే సహజమనుట సిద్ధాంతము.

సృష్టికర్తనుగూర్చి చెప్పవయ్యా యని యెందఱు సన్యాసులో బతిమాలఁగ బుద్ధదేవుఁ డేమనియెనో విందువా? ''ఈమూలతత్త్వమున్నప్పటికి మీ కది లేనట్టిదే. ఆతత్త్వమునకు మీముక్కు మూఁతల సమాధు లక్కఱకు లేదు. మీనిలువుకాళ్ళ తెలివితక్కువ ప్రార్థనము రక్కఱలేదు. మీపసిఁడికుండల దేవాలయము లక్కఱలేదు. మీకర్పూరపుహారతు లక్కఱ లేదు. మీసాతాళించిన సెనగ లక్కఱలేదు. మీ పుణ్యములఁ గాంచి మీమ్మాతఁడు తొడ్పాఁ గూరుచుండఁ బెట్టుకొనువాఁడు కాఁడు. మీ రాతత్త్వమును ధలపెట్టనక్కఱలే'' దని చెప్పలేదా? చెప్పినఁగాని వలనుపడ దని యామహానుభావుని నిరోధింపఁగ నాతఁ డేమని యెనో విందువా? ''ప్రపథమమున సత్తున్నది. ఇది కేవలము జ్ఞానశూన్యమైనది. ఈయవిద్యా మహాసముద్రమునఁ గొన్ని యంధశక్తు లుద్భవించిన'' వని యాతఁడు పలికినాఁడు. సత్తులేదు, ఆసత్తులేదని మనవారు చెప్పినారు. సత్తున్నది కాని యది యసత్తుకంటె భిన్నముకాదని యాతఁ డనినాఁడు. శక్తు లజ్ఞము లని వారు వీరుకూడ నంగీకరించినారు.

వేదప్రమాణము నంగీకరింపని బుద్ధదేవుఁడు కూడ వేదర్షులు పలికినట్లే పలికినాఁడు. అదియే నత్యమని తోఁచుచున్నది. ఆశక్తులకుఁ బుణ్యపాపవిచక్షణమే యుండు నెడలఁ బ్రపంచస్థితి యిట్లుండనేల? ఎట్లు?

గీ. మొద్దువట్టుఁ డొకనతి లేక మొత్తుకొనఁగ,
వృద్ధునకు నల్వ రిల్లాండ్రు, వేశ్య కొనరు,
నీతిమంతుఁడు గతిలేక నింద నొంద
బానిసీనికి ద్రోహికి బ్రహ్మరథము
ఇచ్చువానినె తిట్టుదు రెల్లవారు
పిసినివానికె పెద్దపెద్ద బిరుదచయము
పాంసులాత్మకు ఫలముపైఁ బ్రబలఫలము
ఏకపుత్ర మరణము నుశ్లోకునకును
సత్యవాగ్దీక్షునకుఁ జెరసాల త్రోపు
అనృతవాదికిఁ దూఁగుటుయ్యాలపైపు
మెత్తనగువానికంటికిఁ జిత్తవాన
మఱి కసాయిమీసాలకు మల్లెనూనె
సృష్టిలో నిట్టిమార్మెలి యిట్టివెలితి
గలుగ నేలోకొ చెప్పఁగాఁ గలఁ డెవండు?

సీ. చక్రవర్తులు సర్వసంపదలఁబాసి
పరితపించుచు ఘోరవనములందొ
తత్పాదుకలనైనఁ దలమోపఁ దగనట్టి
యధము లీశులయి రాజ్యంబులందొ?
మగనాండ్రహృదయముల్ మండిపోనేడ్చుచు
నసురుల కారాగృహంబులందొ?
సుతులఁ గాటికిఁ బంపి పతులగొంతులఁగోయ
ధూర్తలు బంగారుతొట్టెలందొ?
గీ. శమదమాద్యులౌమునులు రాక్షసులనోళ్ళ
లందొ? పరమచండాలురౌ నసురహతకు
లామునులమగువలప్రక్క లందొ? యకట!
దైవమా! మంచిచెడ్డలు లేవె నీకు?

సీ. నత్యనంధులు కష్టచయముల మునుఁగుటో?
దొంగ లుప్పొంగుచుఁ ద్రుళ్ళిపడుటొ?
తలగొరిగించుకో దాతకు లేకుంటొ?
కృపణుఁడు లక్ష్మీసమృద్ధిఁ గనుటొ?
విద్వాంసు లుదరముల్ వెన్నంటి యేడ్చుటో?
మూఢులపొట్టలు పొణక లగుటొ?
కాను గల్గినవానిబాన వేదం బౌటొ?
బువ్వలేనతనివి బూతు లగుటొ?

గీ. త్వత్పదారాధకులు ముష్టిదాసరయ్య
లగుటొ? నాస్తికుల్ వారల మొగములందు
నుమియుటయె! యేమి యిది కన్ను లున్నవె? మతి
యున్నదే? యుంటివే? చేయుచున్న దిదియె?

సృష్టిలో నిట్టివ్యత్యస్తత యున్నదనుమాట సత్యమే కదా! ఒక్కొక్క వ్యక్తికిఁ గొన్నివ్యత్యస్తపరిస్థితులు సిద్ధింపవచ్చును. మనము జాతిమీఁద జూచుకొన్నగాని సత్యమును నిర్ణయింపలే మని నీ వందువేమో? మనజాతిస్థితియే యోజింతము. మనజాతి యెంత ఘనమైనదో ప్రపంచమంతయునెఱిఁగిన సంగతియేకదా! విశ్వవంద్యములగు వేదములు మనజాతిమూలపురుషులవలననేకాదా యుద్భవ్దము లయినవి? ప్రపంచమున నొక్క చదరపుటడుగులో నూఅంగుళములు వ్యాపించిన మతమును బోధించిన బుద్ధభగవానుఁడు మనలోనివాఁడే కాదా? ప్రపంచమం దేదేశమందయిన నేకాలమందైన ధనము తీసికొనకుండ విద్యాప్రదాన మెనర్చుట జరిగియుండెనా? మనభరతఖండమున జరిగినది ఇప్పటికి జరుగుచునే యున్నది. బిచ్చగాండ్రకు నన్నమిచ్చుట, బియ్య మిచ్చుట, డబ్బిచ్చుట యెచ్చటనయిన జరిగియుండెనా? ఇచ్చట జరిగినది. ఇప్పటికిని జరుగుచున్నది. ఇతరదేశములందు భిక్షుకులువీథిలోఁగనఁబడునెడల రక్షకభటులు వారినిఁ గారాగృహములం దుంతురు. మనము భుజించుచుండఁగా మాధుకర మెనర్చుకొను నాతఁడు సీతారామాభ్యాం మనఃయని జోలితో రాఁగ మనము నోటి కెత్తుకొనుచున్న కబళమును దిరుగ విస్తరిలోనుంచి, యాయతిథి కన్నమిడిన తరువాతనే యాకబళమును నోటఁ బెట్టుకొన వలయుననన్న నిబంధన మొక్క భరతఖండమునఁ దక్క మఱియెచ్చటనయిన నుండుట కవకాశమున్నదా? అతిథికి ముందు పీఁట, ముందు విస్తరి, అతఁ డాపోశన మెనర్చి ప్రాణాహుతులయినఁ దీసికొన్న తరువాతఁగాని యేగృహస్థుఁడైనఁ బరిషేచన మెనర్చునా? ముందుగఁ గాకబలి, శ్వానబలి లేకుండ నెవఁడయిన మెదుకుఁ నోటఁ బెట్టునా? ఆతిథ్యములో నత్యంత సూక్ష్మము లయిన యేర్పాటు లిచ్చటఁ గాక మఱి యెచ్చట నున్నవి? ఇందువలన నాతిథ్యగుణము మనదేశమున నెంత పరిపూర్ణముగఁ బరిపోషింపఁబడినదో తెలియవశమా? చీమలకుఁ బిండి బెల్లము ప్రతిదినము వైచువా రెంద ఱున్నారో యెఱుఁగుదువా? తుదకుఁ బాములకుఁ జిమ్మిలి, పాలుపోయుచున్న కాంతలెంద ఱున్నారో యెఱుఁగుదువా? శత్రువులకుఁగూడ నాతిథ్య మిచ్చినవారు మనజాతివారే కాదా? నూఱేసి యంతరువుల మేడలున్న యమెరికాదేశ మొకదేశమా? దోమకుట్టుబాధ నివారించుటకుఁ బశువులకయి రాపిడి స్తంభములున్న మనదేశమే దేశ మగునుగాక! జాతి కుండవలసినది భోగవాంఛయా? భూతదయయా? మనజాతి కీసుగుణసంపత్తియుంతయు నున్నది కదా! ఇది నీమతానుసారముగఁ బుణ్యమే కదా! సరే.

సాలగ్రామములపై నిర్మాల్య భారమును దీసివేయనివాఁడు ధరాభారముగ నెన్నఁబడుచున్నాఁడు కాదా? మైలుమైలున కొక్కదేవాలయ మున్నదే. ఫర్లాంగు ఫర్లాంగున కొక్క భజనమందిర మున్నదే! ప్రతిదినము నేదోయొకవేళనయిన దైవధ్యాన మెనర్పని భారతీయుడెవఁడయిన నున్నాఁడా?

అబుద్ధిపూర్వకముగనైన దైవనామస్మరణ మెనర్పనివాఁ డీపుణ్యభూమిలోనివాఁడు

కాడే? పాశ్చాత్యులలో దైవచింత యెంత యరుదుగా నున్నదో యంద లెఱిఁగినదే కాదా? వారికి దైవచింతకుఁ దీటిక యెక్కడిదో? దైవనామస్మరణ మొనర్చుటకు నైనఁ దెఱపి యెక్కడిది? పొగయంత్రములలో, నీటియంత్రములలో, వాయుయంత్రములలో, విద్యుద్యంత్రములలో, నముద్రగర్భములో, నంతలలో, నక్కడ యిక్కడ యని లేక, నర్వతోముఖముగఁ దిరుగుచు క్షణము పోయిన ధనము పోవు ననునాందోళనముతో నత్యాతురతతో దేవులాటయుఁ దిరుగులాటయుఁ బరుగులాటయు నెగురులాటయుఁ బ్రాకులాటయుఁ బొరలాటయుఁ దక్క నంతకంటె మఱేమియులేదే! ధనచింతా ప్రాబల్యమే కాని దైవచింతాలేశమయిన నెప్పుడైన నున్నదా?

మనకట్లా? దైవనామస్మరణ మొనర్చు నుదయమునఁ గనుదెఱచినది మొదలు, దైవనామస్మరణ మొనర్చు రాత్రికనుమూయు వర్యంతము మనము దైవముపేరు పెట్టుకొని చేయుచున్నవను లిన్నిన్నియా? కొడుకులకుఁ, గూఁతులకు, మనుమలకు మనుమరాండ్రకు దేవుని పేరు పెట్టుకొని నోరాఱఁ బిలుచుకొనుచున్నాము కాదా? ఏదో యొక దైవముతో సంబంధింపని పేరు మనలో నెవరికైన నున్నదా? మత్స్యనాథరావు కూర్మనాథరావు వరాహరావను పేళ్లుగూడ మనలో నెందఱికో యున్నవికాదా? ఎటు వచ్చినను గడ్డయ్య–పెంటయ్య–పుల్లయ్య యను పేళ్లు కారణాంతరములచేఁ గొందరు శిశువుల కున్నను బాల్యగండములు దాఁటిన పిమ్మట వారినిఁ బవిత్రనామధారులుగాఁ చేయుచుండుట లేదా? ఏసుక్రీస్తుపై మహాభక్తి పాశ్చాత్యులలో నున్నదికదా–ఆతని పేరు కొడుకులకుఁ గూఁతులకుఁ బెట్టినవా రెందఱున్నారో యెఱుఁగమా? మొగములందు భుజములందు మనము దేవుఁడని నమ్మినవారి లాంఛనములను ధరించుచుండుట లేదా? మెడలో శంకరమూర్తులను ధరించువా రెందఱు లేరు. ఇంటిగోడలకు విష్ణుపాదము లంటించినవా రెందఱు లేరు? ఎటుపోయినను దేవునిరూపమో, యెటువిన్నను దేవుని పేరో, యెటు చూచినను దేవునిగుఱుతో, యెటఁ జదివినను దేవుని కథయో మనకు లేనిపరిస్థితి యీజాతి పుట్టినప్పటినుండి యిప్పటివఱకున్నదా? ఇఁక ముందుందునా! ప్రహ్లాదునివంటి భక్తుఁ డితరప్రపంచమున నుండెనా? హరిశ్చంద్రునివంటి నత్యవాదికథ పాశ్చాత్యుల గ్రంథజాలములో నొక్కటియైన నున్నదా? భగవద్భానులని, బైరాగులని, యతులని, సన్యాసులని, పరమహంసలని, యోగులని, సాధువులని, యింక నేమేమో యని దేశసేవచేయుచు నీదేశమున నెన్నిలక్షల జనమున్నదో చెప్పఁగలమా? ఈజనసంఖ్యలో సహస్రాంశమైన నితరదేశములందున్నదా?

మరియొక్క విశేషము: ఏగ్రుడ్డివో యేనడ్డివో యేక్రూరమైనవో యేగొంతుకోఁతవో యగు భయంకర ప్రకృతిశక్తులనుగూడ శ్యామలాంబ యని మరిడమ్మ యని పేళ్లతో మనము పూజించుచుండుట లేదా? దైవముకొఱకే తను వంతయు మనస్సంతయు నాత్మయంతయు నర్పణ మొనర్చుకొన్నజాతి మఱియొకటి ప్రపంచముననున్నదా? ఈభూతదయయు, నీదైవభక్తియు మహాపుణ్య మని యాచరించుచున్న యీ జాతి యెంత యున్నతస్థితిలో నుండవలసినది? సృష్టిమహామూలశక్తికి దయాదాక్షిణ్యములే యుండునెడలఁ బుణ్యపవిచక్షణతయే యుండునెడల, ధర్మాధర్మవిభేదమే యుండునెడల, మనహృదయములోని తన యందలి ప్రేమమును దెలిసికొనుటకు జ్ఞానమే యుండునెడల, మనయవస్థను

జూచుటకుఁగన్నే యున్నయెడల మనదేశమునకీ మహాదుర్గతియేల? ఇతర రాష్ట్రములలోని వారు వారి రాష్ట్రములను వా రేలుకొనుచుండ, మనమేమి చేయుచున్నాము. మనమేడ్పులను మన మేడ్చుచున్నాము. బొంబాయి రేవులో నుండి పొగయోడలోనికిఁ జేరినయెలుక ప్యాసుపోర్టు అక్కఱలేకుండ ఏ అమెరికాదేశమునకో యింగ్లాండునకో పోవుచున్నదే! ఎలుకకున్న జన్మస్వాతంత్ర్యమైన హిందువునకు లేదే.

సాక్ష్యుపన్యాసములు తిరుగ నారంభింపఁబడిన వని వినఁగనే యాపిచ్చియాసుపత్రిలో నివారందఱేమిచేసినారో యెఱుఁగుదువా? వారందరు 'ది ఫిలాసఫర్సు కాన్ఫరెన్సు' అనుపేర నొకసభచేసి సాక్ష్యుపన్యాసములు పడుచున్నంతకాల మాంధ్రపత్రికను మనము తెప్పించు కొంద మని తీర్మానించుకొని యట్లు తెప్పించుకొనుచున్నారు. మతియున్న వారికంటె మతిలేనివారికే నీయుపన్యాసము లెక్కువ రుచించునట్లు కనఁబడుచున్నదే! నీవుకూడ వారిజట్టులోని....."

"కోన్‌రే వహాఁ! దివానాసే గుప్తగో కర్తాహై! జారే" యని యొకమహమ్మదీయుఁ డఱచెను. నేను వెడలివచ్చితిని.

నాయనలారా! సృష్టిశక్తులనుగూర్చి యీతఁడు చెప్పినమాట లన్నియు మీతోఁ జెప్పితిని. ఈమాఁటలు మీ కెట్లున్నవో కాని నాకు నమంజసముగఁ గనఁబడలేదు. ఈయుపన్యానమును గఠినముగ విమర్శింప వలసియున్నది. ఈతఁ డింక మతిలేనివాఁడు కాలేదు. కాని మనుజ దూషకుఁడైనాఁడు. నిష్కారణముగఁ దనకుఁ గారాబంధమును గలుగఁ జేసి, యవమానించిన మనుజులను శిక్షింపలేదని దేవదూషణమునకుఁ గూడఁ బూను కొనినాఁడు. ఈతలతిక్క తత్త్వజ్ఞాన మిందుమూలమునఁ గలిగినది. ఇతనికిఁ గారాబంధమో క్షము వేగముగ నగుఁగాక!

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

9. ఉన్మత్తుని ప్రలాపము

మద్రాసులో తిరువల్లిక్కేణి సముద్రతీరానికి షికారు వెళ్లాడు జంఘాలశాస్త్రి. అక్కడ రకరకాల మనుషుల్ని చూశాడు. అద్భుతమైన సముద్ర సౌందర్యాన్ని సాయం సంధ్యా సౌందర్యాన్ని చూసి పరవశించ కుండా, నానా సంసార విషయాలతో సతమతమయ్యేవాళ్ల ధోరణిని ఏవగించు కున్నాడు. కంటికి తనివి తీరనంతగా చూడదగింది ఆకాశం. అలాగే చూడదగిన రెండోది సముద్రం.

సముద్రపు హోరునే శ్రుతిగా చేసుకుని పాడుకుంటూ ఉత్తరం దిక్కుగా నడిచాడు శాస్త్రి. అక్కడ బాడిదె కర్ర తెప్ప మీద ఒక్కడూ కూర్చున్నాడొక పిచ్చివాడు. దేశభక్తుడో, దైవభక్తుడో అనుకుని దగ్గరకు వెళ్లాడు.

ఆపిచ్చివాడు ఉద్యమాల్ని, ఉపన్యాసాలిచ్చేవాళ్లనీ తెగ తిడుతూ జంఘాలశాస్త్రితో మాట్లాడాడు. దేశభక్తి, జాతీయ ఐక్యం గురించి ఉపన్యా సాలు ఎవరూ ఇవ్వరాదని నిషేధిస్తున్నాడు. ఇప్పటి జాతి భేదాలకు, కులభేదాలకు, మనుషుల మధ్య పరస్పరం కుమ్ములాటలకు కారణం ఈది క్కుమాలిన ఉపన్యాసాలే అన్నాడు. ఈఉపన్యాసాలు చెప్పేవాళ్లంతా స్వలాభం కోసం పాకులాడే శుంఠలే నన్నాడు. ఈ ఉపన్యాసాల వ్యాధి ప్రబలడానికి ముందు దేశంలో జాతులు, కులాలు నిజంగా సఖ్యంగానే వున్నాయన్నాడు. అప్రయత్నంగానే బాగావున్న స్థితిని ప్రయత్న పూర్వకంగా తగలబెట్టార న్నాడు. మీ ఉపన్యాసాలే సందేహాలకీ, అవిశ్వాసాలకీ కారణమన్నాడు. రాట్నపు ధ్వని తప్ప, నోటితో మాటలాడరాదని నిషేధించాడు. ఆచరించని మనుషులున్నంత కాలం జాతి కర్మ మింతే అన్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

మదరాసులో సముద్రతీరమున నీనడుమ నొక సాయంకాలమున దిరుగుచుంటిని, పవనభక్షణమునకై కొందఱు, పడుచు విలాసినుల జూచుటకై కొందఱు, పనిలేక కొందఱు నటకువచ్చి క్రిందిమాపులతో నిట్టులట్టు లల్లాడుచు, నిట్టి కలియుచు, నట్టి వేఱగుచు, వంక దండములతో, మాయాకరచాలనములతో, దొంగనవ్వులతో, వింత యిగిలింపులతో

సంధ్యాసమయమును సంపూర్ణముగఁ జంపుచున్నారు. మనుజహృదయము నట్టి యట్టి వ్యాపింపఁజేసి, యట్టి యట్టి విశాలమగునట్లు చేసి ప్రకృతి పరీవాహమున లీనమగునట్లు చేయఁగల సన్నివేశములు సృష్టిలోఁ బ్రధానముగ రెండున్నవి: మొదటి దాకాశము; రెండవది సముద్రము. కన్ను తనివి లేకుండఁ జూడఁ దగినది మొదటిది మిన్ను; రెండవది మున్నీరు. సంధ్యాకాలమున నీరెండును మదరాసులోని తిరువల్లిక్కేణి ప్రక్క నెంత మహాసౌందర్యసమన్వితములై యుండునో యనుభవింప వలసినదే కాని వచింపఁ దరమా? అట్టి పరమోత్కృష్టమైన స్థలమునఁ జేరినజను లేమిచేయుచున్నారో విందురా? అత్తగా రాఁడు బిడ్డచీరలకై యింటిలో బియ్య మమ్మచున్న దని భర్తతో భార్య చెప్పుచున్నది. సంసారచౌర్య కథనము సముద్రతీరముననే కాని సముచితముకాదా? ప్రకృతి సౌభాగ్యరంగమునఁ బనికిమాలిన పడమటింటి గొడవ యెందులకు? ప్రకృతిసౌందర్యగ్రహణశీలుం డగుభర్త భార్య మాటలు వినుచుఁ బల్లెవానితో రొయ్యపప్పు బేరమాడుచున్నాఁడు. పాఠశాలలలోఁ జదువుకొనుచున్న బాలురు నారీకలాశాలలలోని వితంతువుల వింతలు చెప్పుకొనుచు నెకవెకలాడుచున్నారు. నాలుక యల్లాడు చున్నంతకాలము నారీమణి నధిక్షేపింపఁజాలనిమూఢుఁ డెవఁడు? ఆమాటలు రవంతవిన్న యొకయాంధ్రోపాధ్యాయుఁ డచ్చటి యబలాసంఘము లందలి యద్భుత సన్నివేశములవంటివి మఱొక్కఁడ నుండవని తా నుంచుకొన్న పూఁటకూటింటి వూవుఁబోఁడికి బోధించెను. ప్రభువులనైఁ, బడఁతులనైఁ బనికిమాలిన ప్రసంగము లొనర్చుట కేమంత ప్రయోజకత్వము కావలయును? నోటిలోఁ జేయిపెట్టినఁ గఱవఁ జాలని శక్తిహీనుఁడైన నందులకు సమర్థుఁడే కాదా? మఱియొక చోటఁ గొందఱు సై మనువ్యవహార సందర్భమునఁ దురకలనోటనుండి వెడలిన బూతులఁ గూర్చి, చేతినుండి వెడలిన చెడావులఁగూర్చి చెప్పుకొనుచున్నారు. ఇటులె పనికిమాలినవార్తలతో, దిక్కుమాలిన సోదెలతో, నవకతవక గాథలతో, ననర్థము లయిన యెత్తిపొడుపులతో నచ్చటివారు కాలక్షేపమొనర్చుచున్నారు. పెద్దపీఁట కాలిసై బ్రాఁకఁగఁ గంపమంది గగ్గోలయి యెగురఁబోయి నెత్తిపై మునుగు జొటఁ గ్రిందఁబడిన వితంతు నారీమణిని గాంచి హేహేహే యనుచారె కాని రాజధానీకళాశాల వెనుక నారికేళవృక్షముల తోఁపులో సహస్రకోటిజపాకుసుమతేజోరాశియై యధఃపతన మందుచున్న నభోమణిని గాంచి హాహాహా యను వాఁడైవఁడైన నున్నాఁడా?

ఈగొడవ నా కెందుల కని యిట్టి మహావిచిత్రప్రకృతి కధీశుఁడగు పరమేశ్వరుని సముద్రపుహోరు సుతిగఁ జేసికొని గాన మొనర్చుకొనుచు నుత్తరదిశాభిముఖుఁడనై కొంత దూరము పోయితిని. అక్కడ బాడిదెకల్లు తెప్పపై నొక్కఁడు కూరుచుండి యున్నాఁడు. అతఁడు ఖాదీవస్త్రములను ధరించి యున్నాఁడు. ఎవఁడో దేశభక్తుఁడు, దేవభక్తుఁడని నిశ్చయించుకొని యాతనియొద్ద కేగి నిలువఁబడితిని. ననుఁ జూచి యాతఁ డిట్లనియెను:–

''బైరో బైరోభే!.....కూతుకొండు రాయరే కూతుకొండు. ఆడడా! ముత్థాళ్–ఉకార్–ఉకార్–బస్ కూరుచుంటివా బస్–కం. ఊరక రారు మహాత్ములు, మీరలు మాయింటి కిపుడు మేలొనఁ గూడెన్, గూరిమి మీఱిన పలుకుల, ధోరణితో విం దొనర్చి తుష్టుం జేతున్. ఆశుకవిత్వము చెప్పఁగలవయ్యా? ''సీ. బిరుదైన కవిగండ పెండేరమున కీవ తగుదని నాదుపాదమునఁ దొడిగె''నని యన్నవాఁడు పెద్దన్నయే కాదా? తాళ్లపాక చిన్నన్న యుండుటచేతనే యాతఁడు పెద్దన్న యైనాఁడు. Relativity of knowledge అనఁగ నిదియే

సుమా! నీవెప్పు డుంటివో నే నప్పుడున్నా నన్నమాటయే. నీవు నా కాధారము, నేను నీకాధారము. అన్యోన్యాధారము మన కెక్కడకుఁ బోయినను దప్పనేతప్పదు తెలిసినదా? అంత తప్పనియాధార మున్నను గేవలము మందభాగ్యముచేఁ దార్కి కుల కుపాదానకారణము కలిగినది. భవతి భిక్షాం దేహి యని భగవంతునైనను మోక్షమును గూర్చి యాచించుట తప్పయినపుడు మారాజ్యము మా కిమ్మని నర్కారువారిని యాచింతుమా. థూ; అది నామర్దా. I am the monarch of all I survey; నిన్నడ్డుకొన్నవాఁ డెవఁడు? నీయిష్టము వచ్చినంత రాజ్యము పరిపాలింపవయ్యా. ఈప్రపంచములో నీదికాని దేమున్నదయ్యా! మూఢుఁడవై, బానిసవై, తుచ్ఛుఁడవై, భిక్షుకుఁడవై, దేహి యని చేయిచాఁచెదవా? చాఁచినచే తితో బ్రహ్మరంధ్రముమీఁదఁ గొట్టుకొని ప్రాణములను విడువుము. అది నీకు గౌరవము, అది నీకు మనుష్య ధర్మము. అంతే కాని తెలివిమాలిన యుద్యమము లెందులకు? హరతాళము లెందులకుఁ జేయుచున్నారు? ఏమి యూహము? ఏమి ప్రయోజనము? అంతకంటెఁ దెలివిమాలిన యూపన్యాసము లెందులకు! ఇంక నుపన్యాసము లిచ్చినయెడల నీగొంతుకోసెదను. హె హె హె ఖబర్ దార్. దారులలోకెల్ల జమీందారీయని పిచ్చిరామశాస్త్రి చెప్పిన మాట జ్ఞప్తియున్నదా? ఒక్కజమీందారి యాస్థానములో నొకదాసి గుఱ్ఱపు పెంపఁబడు చున్నది. పదుమూఁడేండ్లది, బనారసుకాజా! గులాబ్‌జామిన్! బురాఖ్ బొమ్మ–వహవ్వ! సంఘజపండిత సాంబయ్య చెప్పినట్లు తులముతులము మోతాదు చొప్పున గుటుకు గుటు కున మ్రింగిఁ దగినది. దానికిఁ గన్నె చెఱఁ బావుటకై యెవఁడైన మహారాజుపుత్రుని దెచ్చితి వేని మాజమీందారీ నీకు దానవిక్రయాదిసర్వస్వాతంత్ర్యములతో ధారాదత్త మొనర్పనియెడలఁ జెవి కదపా.''

''అయ్యా, అంతటితో నాఁగుము. తప్పుధోరణిలోఁ బడిపోవుచున్నావు. దేశభక్తిని గూర్చి, జాత్యైకమత్యమునుగూర్చి యుపన్యాసము లీయవల దని యెందులకు చెప్పినావు? రవంత మనస్సు శాంతపఱచుకొని చెప్పుడు'' అని నే నడ్డు తగిలితిని.

''ఉపన్యాసముల నంగతియేనా? చెప్పకుందునా? తొందరపడకోయి ఫూల్. ఉపన్యా సము, ఉపన్యాసము, నన్న్యాసము, సన్న్యాసము. సన్న్యాసి యగువాఁడు 'అధవా విధవాశ్లేష' మను నాపక్షన్యాయముచేత విటుఁ డైనప్పుడు వితంతువు యోగినియైనట్లా? నన్యాసి సంసారి యైనట్లా? ధర్మసూక్ష్మ మాలోచించి మరిచెప్పుము. శూద్రుఁడు యజ్ఞోపవీతధారణ మొనర్చినాఁడు; గాయత్రికి శూద్రత్వము వచ్చినట్లా? శూద్రునికి బ్రాహ్మణత్వము వచ్చి నట్లా? బ్రాహ్మణుఁడు మహమ్మదీయమతానుసారముగ నుపనయనము చేసికొన్నప్పుడు బ్రాహ్మణునకు మహమ్మదీయత్వ మెంత వచ్చి యేడ్చినదో శూద్రునకు ద్విజత్వ మంత వచ్చి యేడ్చినది.

'విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః.

అను భగవద్గీతాశ్లోకమున కిక్కడఁ బప్పుడుక దయ్యా, తెలిసినదా. కం. ''పప్పేపస బ్రాహ్మణులకు, నుప్పేపస రుచులకెల్ల నువిదలకెల్లన్, గొప్పేపస'' యన్నాఁడుగదా. ఇక్కడఁ గవి యువిదతనమునకుఁ గొప్పునకు నవినాభావసంబంధము చెప్పినాఁడుకదా! వితం తుత్వము వచ్చినప్పుడు కొప్పెగిరి పోయినది. పోలేదా? కాని స్త్రీత్వమున కేమిలోపము

వచ్చినదయ్యా? నేను ప్రతిపాదించిన పూర్వపక్షము నీకు బోధమైనదా? తెలివిమాలిన మొగముతో నట్లు నిరర్థకమైనజాపు చూచెదవేమి? బ్లాక్ హెడ్! అదికాక వితంతువు మైనవస్తువును మన మంటఁగూడదు. కావున నాచారకాండ ననుసరించి దానిని విసర్జింతము. వదలితివికదా! ఇఁక నాపైపున నాళఁపెట్టుకొనవుకదా! నరే పుణ్యస్త్రీనే తీసికో. ఉభయతారక మైన పద్ధతిని మన మవలంబించుటకు నందేహమేల? ఇప్పటి పుణ్యస్త్రీలకుమాత్ర మందఱికిఁ గొప్పున్నదా? ఉంగరాల గిరజాలుంచుకొన్నంత మాత్రముచేత నువిదతన ముడాయించినదా? క్రాపువెండ్రుక లుంచుకొన్నంతమాత్రము చేత ప్రధానమైన సుదతీ త్వము నున్నయైనదా?

పదము ''మెడను గుత్తికకంటు లేదోయి నాస్వామి
మొగముమీఁదను బొట్టు లేదు
కప్పుకొప్పుబదులు క్రాపోయి నాస్వామి
మగఁడు మిగిలిన కురిడిసఱకు''

''ఇఁకఁ జాలింపవయ్యా ఒక్కటే పనికిమాలినధోరణియా? ఉపన్యాసము లిచ్చువారి గొంతు కోసెదనంటివే. దానికిఁ గారణ మేమని నే నడిగితిని.''

''జ్ఞప్తిలేక మానివేయలేదయ్యా! స్టుపిడ్! జ్ఞప్తియుండియే మఱచిపోయినాము. చూచితివా, విరోధాభాసాలంకారమునకు మన వాణియే ప్రతిపదిక.

ఆగజానన పద్మార్కం గజానన మహర్నిశం,
అనేకదంతం భక్తానా మేకదంత ముపాస్మ హే.

గజదంత మని గ్రంథములలోఁ బ్రయోగమున్నది. ''తత్రహేతు రదంతతా'' యను టచే మనుష్యదంత మని ప్రయోగమున్నది. మేకదంత మను ప్రయోగ మేమిరా? నీమొగ మని సాగఁదీసి యొక్క లెంపకాయ నిన్నుఁ గొట్టునెడలఁ గవికి బుద్ధివచ్చును. చెప్పవచ్చినవా నిని జెంపకాయ కొట్టినప్పుడు పైయూరివా రా పాముకాటు నిమ్మదించినదా లేదే? మే మసంబద్ధముగా మాటలాడువారము కాము. మాకు మతి లే దనుకొనుచున్నావు కాఁబోలు. మతి లేకపోవుట నీకా, నాకా? నామతిలేని మాటవలన దేశమున కేమినష్టి వచ్చినదో నీవు చెప్పు, మీమతిలేనిమాటలవలన దేశమున కెంతదుర్గతి వచ్చినదో నేను జెప్పుదును. కాచికో, చూడు. ఆ. ఇప్పుడు తెర రవంత తొలఁగిన ట్లున్నది. మన స్సిప్పుడు రవంత నిర్మలముగా నున్నది. ఈసమయములోనే చెప్పవలసిన దేదో యొక్కవాయలో నలఁగఁ గొట్టెదను.

పదిపదునాల్గు సంవత్సరములక్రిందట దేశములో నింత యశాంతి యున్నదా? ఇన్ని మతకక్ష లున్నవా? ఇన్ని శాఖాభేదమ్యము లున్నవా? ఇన్ని తిట్టులాట లున్నవా? ఇన్ని కొట్లాట లున్నవా? ఇంత రక్తపాత మున్నదా? ఇంతమహారోదన మున్నదా? మీతెలివిమాలిన యుపన్యాసములే దేశము నింత భ్రష్టపఱచినవి. ఇంతకుముందు బ్రాహ్మణులు నబ్రాహ్మణులు నెంత కలసి మెలసి యుండెడివారు. అన్నా, మామా, బావా, యను వరుసలతో వొకరి నొకరు పిలుచుకొనుచు నొక్కకుటుంబములోని వారివలె నుండెడివారు కారా! వీరి వారి స్త్రీ లత్తా, వదినా, అక్కా యనువరుసలతో నొకరి నొకరు పిలుచుకొనుచు నీరక్షీరన్యా యముగా నుండెడివారు కారా? ఇప్పుడు గజకచ్ఛపన్యాయముగానున్నారా లేదా? పంచము

లతోనెన్నఁడైన మన కరమటీక యుండెనా? వారు మనముంగిళ్లలోనికి, పెరళ్లలోని కెంత స్వేచ్ఛగా వచ్చుచు; బోవుచుండెడివారు? వారు మనయెడల నెంతదయతో, నెంతవిశ్వా సముతోఁ బ్రవర్తించుచుండెడివారు? దొంగలవలన మనయాస్తి కపాయము, వస్తువుల కపా యము సంభవించునప్పుడు మనలఁ గంటికి రెప్పలవలెఁ గాపాడిన వారు వారే కారా? ఏవో జాతిసంబంధములైన పూర్వపు కట్టుపాటుల ననుసరించి తనువులు వేరుగ నుండెనుగాని వారికి మనకు మనస్సులయందెంత యైక్యముండెడిదో మీ రెఱుఁగరా? వా రెఱుఁగరా? భారతదేశ రక్షక దేవత లెఱుఁగరా? వారికి మనకు నిప్పుడు మూషకమార్జాలవైషమ్య మెందులకుఁ గలిగెను? మీ బుద్ధిహీనోపన్యాసముల మూలమునఁ గలిగినది. వారి యస్పృశ్యత తత్క్షణము మానుపవలయుననియు, వారిని దేవాలయములోనికి వెంటనే రానీయవలయు ననియు, వారితోఁ బం క్తిభోజనము లుత్తరక్షణముననే కానీయవలసిన దనియు మీరు లొడ లొడ యుపన్యాసము లిచ్చినంత మాత్రమున మీరు ద్వంద్వాతీతులైన మహావేదాంతు లొక్కసారి యైపోయినా రని వారనుకొనినారా? మీయుపన్యాసములోఁ జేవ యున్నదో, చెత్తయున్నదో వారెఱుఁగుదురా? ఆకస్మికముగ మీ కవతరించిన ప్రేమలలో గుల్ల యున్నదో, గట్టియున్నదో వారు కనిపట్టలే రనియే యనుకొనుచున్నారా? మీరు సమయా నుసారవ చోవిభవాభిరాములైన నటకశిఖామణు లని వారు గుర్తెఱుఁగ లేనంత మూఢులా? మీ నవ్వులు దొంగ నవ్వు లని, మీ యేడ్పులు మొసలి యేడ్పు లని, మీరు స్వలాభోద్దేశము చేతనే యీమహామాయానాటక మాడుచున్నా రని తెలిసికొన లేనంత బుద్ధిహీనులా? వా రట్టిబుద్ధి హీనులని మీరు నిశ్చయపఱచుకొన్నట్లు వారు తెలిసికొని మీయందు మరింత యాగ్రహగ్రస్తులయి యున్నా రన్న సంగతి యెఱుఁగరా? స్వరాజ్య వాంఛానమన్వితు లైన మీరు జాత్యైక్యము కొఱకు వారి నిప్పుడు కూడఁగట్టుకొనుచున్నారు. స్వరాజ్యము వచ్చుట యెన్నఁటికైన సిద్ధించునెడల గేదెకు గేదెయే, దూడకు దూడయే. అప్పుడు తల్లి పిల్ల సంబంధము తెగవలసినదే యని వారికిఁ దోఁపక పోవునా? వారి మాట యెందులకు? మీతలపై రామాయణముఁ బెట్టి మిమ్మడుగు చున్నాను. మీకుఁ బంధములపై స్వలాభచింతా శూన్యమైన యవ్యాజ ప్రేమ మున్నదా? వెట్టి మొగము నైచికొని యూరకుందు రెందు వలన? మీలో నందఱి కట్టిప్రేమ ముండనక్కఱలేదు. ఒక్కనికైన నున్నదా? వట్టిమాట, లేదు. దేశభక్తులని బిరుదును నెత్తికిఁ గట్టుకొనఁ గలవు గాని బుద్ధున కున్న ప్రేమము హృదయమునఁ బెట్టుకొనఁ గలవా? నీవు రామానుజుఁడ వైనప్పుడు నీ కట్టినిర్వ్యాజప్రేమము కలుగును. ఇక మాటలాడక, ఒక్కనిమిషమైన నాలస్య మొనర్పక, కలుపులాగివేసిట్లు, బిరుదు లూడఁదీసికొనుఁడు.

హిందూమహమ్మదీయ సఖ్యమును మీయుపన్యాసములే ప్రధానముగఁ బాడుచేసినవి. మహమ్మదీయులకు మనకు మతవిషయములైన భేదాభిప్రాయము లున్నను సామాన్య ప్రాపంచికవ్యవహారములందైక్యఁ గావలసినంతసఖ్యము చిరకాలమునుండి యుండి యుండెను. మహమ్మదీయచక్రవర్తి యిచ్చిన యీనాములను, రాజ్యములను ననుభవించువా రిప్పటివఱ కెందరున్నారో యెఱుఁగరా? వారి రాజకీయవ్యవహారములందు మనవా రెంత తోడుపడి యుండిరో యెఱుఁగరా? వారికి మనకు నిచ్చిపుచ్చుకొను బాంధవ్యముకూడఁ బూర్వమున నుండలేదా? ఏది యెటులున్నను ప్రత్యక్షవైషమ్య లేశమైన లేకుండఁ బదునాలుగు సంవత్సర ముల క్రిందటివఱకు సరళముగ, సౌమ్యముగ, సలక్షణముగ జరిగియుండలేదా? అప్రయత్న

ముగ బాగుగ నున్నస్థితిని బ్రయత్నమునఁ బాడుచేసితిరే? మీరుపన్యాసము లీయకుండునె డల నిట్టియిక్కట్టు తటస్థించియుండునా? ఏకీభావమున నుండినప్పు డుపన్యాసము లెందులకు? మీయుపన్యాసములే సందేహమునకు, విశ్వాసరాహిత్యమునకు, మనస్సులోని మాయకు నిదర్శనములై యుండలేదా? కిక్కురు మనకుండ నూరకుండినయెడల యథాపూర్వకముగ దినములు దొరలిపోయి యుండునే? జాతికి మరింతయైక్యమును సంకల్పించుకొని మీయుపన్యాసముల మూలమునఁ బ్రయత్నించినతరువాతనే జాతి కింతవిభిన్నత కలిగినది; జాతిలో నిన్నివైషమ్యము లేర్పడినవి; ఇన్నికల్లోలములు కలిగినవి. జాతిలో నైక్య మభిమానముచేత, నాదరణముచేత, నన్యోన్యసానుభూతి చేత, ననురాగపూర్వకములైన యాచరణములచేతఁ గలుగునుగాని గొంతుచింపుకొనినందువలన, బల్ల గ్రుద్దినందువలన, గంతులు వైచినందువలనఁ గలుగునా? దేశభక్తులారా! జాతిసర్వాంగకముగఁ జచ్చినంతటి యాపదకు దానిని దెచ్చినారు. ఇప్పుడైన మీయుపన్యానములకు శాంతిఁ జెప్పెదరా? ఇఁక మాటలాడ మని శపథ మొనర్చుకొనరా? మీ రిఁక బెదవులు గదల్పకుండునెడల మనస్సులలోఁ గలిగిన నఱుకులు, తమంత తా మదుకుకొనును. చిత్తమునఁ గలిగిన పుండ్లు తమంత తాము మానును. సన్నిపాతరోగికి నిద్రపట్టినతరువాత దేహము స్వస్థమైనట్లు దేశము సామ్మసిల్లి రవంత శాంతిపడి, తనంత తానే సుఖస్థితికి రాఁగలదు. మనము చేయవలసినపనియేమి? మనము చేయుచున్నపని యేమి? 'సర్వేజనాస్సుఖినోభవంతు, లోకాస్సమస్తా స్సుఖినో భవం' తని సర్వదా సర్వేశ్వరుని బ్రార్థింపవలసినవారము కామా? ఇంతవిశాల హృదయమైన ప్రార్థన ప్రపంచమున నెచ్చటనైన నున్నదా? మీరట్లు దైవధ్యాన మొనర్చుకొనుచు మాటలాడకుండ నుందురా? ఒక్కటే మాట–రాట్నపుధ్వనితప్ప నోటి మాట భారతదేశమున నీదినమున నుండి వినఁబడఁగూడదు. అట్లు మీరాచరింపఁగలరా? అయ్యయ్యో, ఆచరింపరా? ఆచరింపరా? దేశకర్మ మిఁక నింతే? జాతికర్మ మిఁక నింతే? ఇంతే?''

అని యాయున్మత్తుఁ డేడ్చుచు లేచినాఁడు. 'అయ్యా కూరుచుండు'మని నే నంటిని. 'నాకు నీబలాత్కారమా Rascal, డొక్క చీల్చెదను. జాగ్రత్త'యని యాతఁడు నాచేయి విదల్చుకొని పాఱిపోయినాఁడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

10. ఆయుర్వేదవైద్యుని యుపన్యాసము

సాక్షి సంఘసభలో రకరకాల విషయాల గురించి–జంఘాలశాస్త్రి అప్పుడప్పుడు కాలాచార్యులు, ఎప్పుడో ఒకసారి వాణీదాసు, బుద్ధిపుట్టినప్పుడు సాక్షి మాత్రమే ఉపన్యాసాలివ్వడం కాకుండా–ఇతర విషయాలమీద కూడా, ఆయా రంగాలకు చెందినవారి చేత మాట్లాడించడం కూడా వుంది.

ఒక ఆయుర్వేద వైద్యుడు ఈసభలో మాట్లాడుతూ–అయినదానికీ, కానిదానికీ శస్త్రచికిత్సలకు ఎగబడే మన దేశీయుల మూర్ఖత్వాన్ని గట్టిగా విమర్శించాడు.

మల విసర్జన విషయంలో బాధ వున్న వారికి–ఆబాధ తీర్చడానికి ఆముదం వుండగా ఎనీమా అనవసరం. పుప్పి పన్నుకు మూలికావైద్యం వుండగా పన్ను పీకించే పద్ధతి అనవసరం. అలాగే వ్రణాలలోని క్రిముల్ని బయటకులాగే ఓషధులున్నాయి. ముల్లుగుచ్చుకున్న మనిషి కంటిలో రెండు పసరు చుక్కలు వేస్తే, ఎక్కడి ముల్లు అక్కడ బయటపడే వీలుండగా, ముల్లు పీకడానికి కత్తులు, కఠారులూ ఎందుకు? కాలి బెణుకు తక్కువ సర్దుకోవడానికి ఆముద వైద్యం వుండగా, ఆకాలు తొలగించవలసిన స్థితి ఎందులకు తెచ్చుకోవాలి? రాచకురుపు హరించడానికి ఒక మూలిక పసరుంది. ఇంజెక్షనులు, టీకాలు ఎంత అనవసరాలు? శస్త్రవైద్యం పనికిరాని వ్రణాలెన్నో వున్నాయి. వాటికి ఆయుర్వేదం మందులున్నాయి. స్త్రీలకున్న మలబద్ధత హరించడానికి మందులున్నాయి. కడుపులో గడ్డలకీ, గుల్మాలకీ, లోపలికి మందు వాడాలి గాని శస్త్రచికిత్స కాదు. శస్త్రచికిత్సవల్ల కార్యనాశనమే కాని, కారణ నాశనం కాదు. అందువల్ల దేశీయతను నమ్ముకోవాలి. దేశీయతలో పుట్టి, పెరిగి, మరణించడం ఒక్కటే నవైన దారి అని ముగించాడు వైద్యుడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నేను సభకుఁ బోవునరికే యొక యాయుర్వేద వైద్యుఁ డుపన్యసించుచుండెను. అంతకుముం దేమి చెప్పియుండెనో కాని నేనుసభలోఁ బ్రవేశించినపిమ్మట నాతఁ డిట్లు పలికెను:

''ఆముదముండగా నెనీమా (Enema) యెందులకు? కడుపులో నున్నకల్మషములు ద్రోచివైచుట కది మంచిదా, యిది మంచిదా? అధోమార్గమున నెక్కించిన నీ రేమాత్రము లోని కెక్కగలదు? ప్రేగుల చుట్టలోని చిట్టచివర భాగములోఁ గొంతవఱకే యెక్కగలదు కాని యంతకుఁ బై కెక్కగలదా? అందువలన నచ్చటే కల్మషమే తొలఁగి పోవును గాని పైనున్న ప్రేగులలోని కల్మషముమాట? నోరు స్వాధీనము కాకుండ నున్నప్పుడు, పండ్లు గట్టిగ దగ్గఱఁబడినప్పుడు రెండవ మార్గ ముండనే యున్నది కాని, గిన్నెలకొలఁది కాఫీ త్రాగుటకు, బుడ్ల కొలది సోడాత్రాగుటకు, పుంజీలకొలఁది నారింజపండ్లు మ్రింగుటకు దినములకొలఁదినుండి యుపచారములను జేయువారిని జెడమడ తిట్టుటకు నోరు విచ్చలవిడిగ విశృంఖలముగఁ బనిచేయుచుండఁగ గోఁచిలోపల గొట్టమెందులకు? పోనీ! ఎక్కించితివయ్యా–పసరు పోయినదా–క్రిమిపోయినదా? ఆముము పోయినదా? ముంగిలి తుడిచినంతమాత్రమున నిల్లంతయు శుభ్రపడినదా? అదిగాక జ్వరభేదమువలననేమి, ప్రేగులలోని వేఁడిమి గల నీరే రోగుల కందఱ కుపయోగపరుచుచున్నారే. అందుచేఁ గొందరప్రేవు లుష్ణాధిక్యముచేఁ గుమిలిపోవుచున్నవి–కొందఱప్రేవులు హీనోష్ణతచేఁ బచ్చిచేసి పట్టుపట్టుచున్నవి. ఉష్ణాధిక్యము చేసిన ప్రేవులనుండి రక్తము పడుచున్నది. పచ్చిచేసిన ప్రేవులలో శూలయారంభమగుచున్నది. కొందఱ కేబాధయు లేక నరిపోవుచున్నది. పోనీ! కొందరైన సుఖముగా నున్నారని సంతోషింతమన్న, వారి బ్రదుకు లెట్లున్నవో చెప్పుదునా? ప్రాతఃకాలమున యథాపూర్వముగ మలమోచనము జరుగదు. ఎప్పుడు జరుగును? చిలుకకొయ్య కెక్కిన సీమ యినుపరేకుడొక్క గొట్టముతోఁ గ్రిందికి దిగవలయును. పంచపాళితోఁ గ్రాఁగుచున్న నీరు దానితోఁ బడవలయును. నపుంసకుఁడు పెండ్లాముగదిలోనికిఁ బోయి తొంగిచూచి గిరుక్కున మరలినట్లు గొట్టమ్ముగొన యాసనములోనికిఁ బోయి మరలవలయును. అప్పటికిఁ గృతార్థత–అప్పటికి మహేంద్ర పదవి–అప్పటికి నప్తపురుషాంతరమునందలి పెద్దలు తరించుట! ఆహా! ఎంతపనికిమాలిన బ్రదుకు బ్రదుకుచుంటి వయ్యా! ఆరుపైసల యాముదము నీకు, నీయిల్లాలికి, నీకొడుకునకుఁ గూడ నర్ధసంవత్సరమువఱకు వచ్చునే! న్వదేశీయమై, సర్వవిధముల నీకు నరిపోవు నాముదమును మాని, మాననానాళధమని నంటఁగట్టుకొని బ్రదు కడవి యధ్వాన్నము చేసికొంటివే. మూర్ఖా! నిన్నేమి చేయవలయును? పొరుగూరికిఁ బోవలసివచ్చునప్పుడు చెంబుకంటె, గుడ్డలమూటకంటెఁ, బ్రక్కచుట్టకంటె, భోజనపాత్రల దొంతరకంటె, దేవతార్చనపుఁ బెట్టెకంటె నీవిరేచనపుడొక్క ముందా?

రామరామా! కొందఱాఁడువారుగూడ నీప్రయోగమున నద్వితీయ లనిపించుకొనుచున్నారే! పెండ్లికిఁ బోవునప్పుడు పన్నీటిబుడ్డికంటె నీపాయిఖానాపాత్ర ముఖ్యమైనదే! అయ్యయ్యో! ఆరోగ్యముమాట యటుంపుఁడు. బ్రదుకుమాట యటుంపుఁడు. అన్నిటికంటె ముఖ్యములైన సిగ్గుబిడియములు బుగ్గియగుచున్నవే! అంతటినుండి పెండ్లింట్లలో వియ్యపురాలి యలంకారములలో, నాఁడుబిడ్డ కట్నములలో, నీయ మాంగళ్యపుగొట్టము చేర్తురు కాఁబోలు! అల్లుని కెక్కుటకు గుఱ్ఱములతోఁబాటు, బండ్లతోఁ బాటెక్కించుకొనుటకు నీబహిర్దేశపుఁ దిత్తిని జేర్తురుకాఁబోలు. మనబుద్ధు లింత పాడగునప్పుడు దేశసౌభాగ్యము తొలఁగిపోయె ననఁగ నాశ్చర్య మేమి? తాను తనది యనునభిమానము పోయినపిమ్మట మోక్షమైన రావలయును, భైక్ష్యమైన రావలయును. మన స్వార్థపరిత్యాగము పదార్థస్వ

కరణముకొఱ కైనది కావున మన కీరెండవది దాపురించినది. కావున మొదట బాగుచేసికొనవ లసినది దేశముకాదు, బుద్ధి వదల్చుకొనవలసిన బానిసతనము దేశసంబంధమైనది కాదు, మనస్సంబంధమైనది. దేశములో నీవు లేవు–నీలో దేశమున్నది.

మఱియొక సంగతి. పుప్పిపటించే బాధపడునపు డేమిచేయుచున్నావు? దంతోద్భ టన ప్రవీణుఁ డగు దామోదరన్ దగ్గఱకుఁ బోయి పంటి నూడఁదీయించుకొనుచున్నావా? –పంటిలోఁ బురు గూడఁ దీయింపవలయునా? ప న్నూడఁదీయింపవలయునా? రేపు ముక్కునకు బాధకలిగినయెడల ముక్కూడఁ దీయింతువా? కంటిలోఁ బూవువేసిన యెడలఁ బూవును హరించుట వైద్య మగును గాని కంటిని బెఱుకుట వైద్యమగునా? ఏకోశ మున నైన దోష మేదైనఁ జేరునప్పుడు దోషసంహరణ మొనర్చుట తగునుగాని కోశనంహ రణ మొనర్చుట తగునా? గోరుచుట్టు వేసినయెడల వ్రేలూడఁదీయవలసినదే! ఇది చికిత్సాక్రమమేనా? ఇది మనుష్యపద్ధతియేనా? మనుష్యపద్ధతిమాట యటుంపుఁడు. తోఁకపై నీఁగవ్రాలినయెడల దానిని వదల్చుకొనుటకై కుక్క తోఁకను జెటకాయించును గాని కొఱికివైచుకొనునా? అధమప్రాణిపద్ధతికిఁగూడ వ్యతిరేకమైన యీపద్ధతి మనకెందులకు? పురుగు చేరినదంతమును బెఱికివేయుఁటె–పూచిననాల్కనుగూడ లాగించుకొనలేకపోయి నావా? దంతములోఁ బురుగు నూఁడదీయుట కెన్ని చికిత్సలులేవు? అవి యన్నియు నిరుపయోగము లనియే యెంచితివా? అట్టి చికిత్స లేర్పాటు చేసిన యవతారపురుషులు వెఱ్ఱిముండకొడుకు లనియే యెంచితివా? ఒక్క యోషధిలోని కాకర్షింపఁబడునే! ఎంతమహి మగల యోషధియో యొకసారి పరీక్షించుటకైనను నీకు బుద్ధి పుట్టనప్పుడు నీకు మొదలే బుద్ధిపుట్ట లే దనుకొనవలయును గాని బుద్ధి కొంతకాలముండి తరువాతఁ బోయిన దనుకొనుచున్నావా? వ్రణములలోని క్రిమిజాల మంతయుఁ బైని కట్టినమూలికలవలన వెలుపలికి వచ్చునే? మఱియొక చిత్రము: ఒకని కొడలినిండఁ గుఱుపులు వేసినవి. ఒకవైద్యుఁడు వచ్చి యొకమూలికను దెచ్చి దాని నాతని యొడలికిఁ దగిల్చి బురదనీటిలోఁ బ్రాతిపెట్టెను. రెండుదినముల కామూలిక చచ్చెను. వెంటనే రోగి శరీరమందలి కుఱుపుల న్నియు నంతరించెను. శరీరమందలి రక్తములో నున్న యాటవికజ్వరసంబంధమైన క్రిమిస మూహమునుగూడ వనమూలికలు చంపఁగలవు. దినమునకు రెండుసారులు, దినము విడిచి దినము, మూఁడుదినముల కొకసారి వచ్చు చలిజ్వరము లవలీల నుచ్చాటన మొనర్పఁగల మూలికలు మన కుండ, రక్తములోనికి విషమును నూదితో నెక్కింపుకొని తపించి తపించి యేలచావునకు సిద్ధమగుదువు? నాడీస్థానమునఁ గట్టిన యోషధివలన నాళమందలి రక్తము లోని పురుగు చచ్చుచుండఁగా దంతములోని పురుగుకొఱకు దంతమును గారుచే లాగించు కొంటివా? దంత మూఁడిపోయిన దనియుఁ, దెఱపిని బడితిమనియు సంతోషించు చున్నావేమో కాని యందువలన నీనరములలో నెన్నిరోగములకు బీజము వేయఁబడినదో గ్రహించుకొంటివా? మెదటికిఁ దగిలిన యదటువలన నీకుఁ దలతిరుగుడు రావచ్చును. ఉన్మాదముకూడ రావచ్చును. దృష్టి నున్న కావచ్చును. ముక్కునుండి రక్తస్రావము కలుగవచ్చును. ముఖమునకుఁ బక్షవాతము రావచ్చును. మూర్ఛ రావచ్చును. పన్నూడఁదీ సిన యుత్తరక్షణముననే పక్షవాతము వచ్చినవారిని, మూర్ఛవచ్చినవారిని నేను జూచితిని. ఒక్కమూలికతో నిర్మూలన మొందవలసిన పంటిరోగము కొఱకుఁ బ్రాణమున కింత ముప్పు తెచ్చుకొనుట తగునా?

పాశ్చాత్య దేశచక్రవర్తులలో నొక్కనికిఁ గాలిలో ముల్లు గ్రుచ్చుకొనినది. వైద్యులు నూదితోఁ గుట్టినారు; శ్రావణముతో లాగినారు; కత్తితోఁ గోసినారు. ముల్లూడిరాలేదు. క్రమముగా నాభాగమంతయు వాచినది. జ్వరము వచ్చినది. పరాకు పుట్టినది. అన్యస్థత హెచ్చినది. శస్త్రవైద్యులు పరీక్షించి మోఁకాలిచిప్పపై నైదంగుళములవఱకుఁ గాలు ఖండింప వలయు నని సిద్ధాంతీకరించినారు. ఖండించినారు. తక్షణమే ధనుర్వాతముతో రోగి చచ్చినాఁడు. ఈసందర్భమునం దెఱుఁగవలసినయంశ మే మనఁగా, ఒక్కయాకుపసరు తెచ్చి రెండు కన్నులలో రెండు చుక్కలు వైచినయెడల శరీరమున నెక్కడ గ్రుచ్చుకొన్న ముల్లయినసరే, యొక్కదినములో నూడిపోవును. అన్నిటికి శస్త్రచికిత్సయేనా? కత్తి, కారు, నూది, తంటనము, అంపమే రోగ నివారకసాధనము లైనప్పు డింక వైద్యశాస్త్ర మంతయు నరేబియా సముద్రమునఁ బాఱవేయవలసినదేకదా? సమగ్రమైన శాస్త్రములేనివా రేమిజేసిన, నెట్లుచేసినఁ జేయుదురుకాక. కలిగియు మనకర్మ మిట్లు కాలిపోవ నేల?

కొంతకాలము క్రిందట నొక్క చక్రవర్తిపుత్రుఁడు మనదేశమును జూడవచ్చినాఁడు. గుఱ్ఱ మెక్కుటలోనో, దిగుటలోనో, నడకలోనో, నిద్రలోనో, బంతియాటలోనో, జంటనా ట్యములోనో యాతనికి మోఁకాలు బెణికినది. కాలు వాచినది. సలుపు, పోటు హెచ్చినది. రోగి కూరుచుండలేఁడు, పండుకొనలేఁడు; ప్రక్క కొత్తగిల్ల లేఁడు. రేయుంబవళ్లు కురరివలెఁ గూయుచున్నాఁడు. నిద్రపట్టుకు మందు లిచ్చినారు. నూదు లెక్కించినారు. పై బాధ హరించుటకుఁ బట్లు వేసినారు. కాపులు కాచినారు. జెలగ లంటించినారు. మంచునీటి తుంపరలు తగిల్చినారు. ఊహుఁ. గాఢముగ యోజించుచున్నారు. కాలు ఖండింపవలసిన దని కట్టకడకు కాంగ్రెసులో సిద్ధాంతీకరించినారు. రోగి యేమి గతిలేని వాఁడా? సామా న్యుడా? అయ్యయ్యో! మహాచక్రవర్తి జ్యేష్ఠపుత్రుఁడే! చక్రవర్తి మూఁడువేలమైళ్ల దూరములో నున్నాఁడే! ఆతఁ డంగీకరింపకుండ నీతని కాలు కొట్టివేయుట సాధ్యమగునా? ఆయనకుఁ దంత్రీ మూలమునఁ దెలియఁబఱిచినారు. ఇరువదినాళ్లుగంట లుపేక్షించినయెడల కాలు ఖండించినను రోగి బ్రదుకఁ డని Concensus of medical opinion (వైద్యుల యేకగ్రీవాభి ప్రాయము) కలిగినది. రోగి రోగి యని వారందు రెందులకు? రోగ మెవరికి? కాలు బెణుకుట రోగమా? ఇదేమి జ్వరమా? జలోదరమా? అతిమూత్రమా? అండవాతమా? నాపిండ కూడు? రోగ మెవరికి? అందఱు శస్త్రచికిత్సకులు చేరి రోగము శాసించినప్పుడు కా దనఁగలవా రెవ్వరు? అన్ని పరీక్షలలో నారితేఱినవారామాత్రమైనఁ దెలిసికొనలే రని చెప్పుట విద్యాద్రోహము కాదా? అందులో నొకరా, ఇద్దఱా–ప్రాణమున కొక్కఁడుచొప్పున నైదుగురు కలసి రొద్దాంత మొనర్చినపుడు బుద్ధిమంతులు మొద్దులాగున నుండవలసినదే కాని పెదవులు కదల్పఁదగునా? చరణఖండనమునకై చక్రవర్తిగారి యంగీకారముకొఱకు శస్త్రవైద్యులు క్షణ మొక్క యుగముగా నిరీక్షించుచున్నారు. ఇంతలో నొకదేశీయమహారాజునొద్ద నుండి యొవైద్యుఁడు వచ్చెను. ఆతఁడు కుమ్మరి. వయస్సుమీరిన వాఁడు. మహారాజలేఖతో శస్త్రవైద్యుల నాతండు దర్శించెను. ఇతఁడు Quack అని యొక వైద్యుఁ డనెను. ఇతఁడు ''పూలు'' అని మరియొకఁ డనియెను. నీయోగ్యతాపత్రములు (Certificates) చూపుమని మఱియొకఁ డనియెను. మహారాజులేఖను మన్నింపవలదా యని మఱియొకఁడు సందేహించుచుఁ బలికెను. మహారా జైన నరే, మహారాజాధిరా జైన నరే, నల్లని భారతీయుని నమ్మఁగూడ దను నర్థమిచ్చునట్లు మరియొకవైద్యుఁడు తల యడ్డముగ నూఁపెను.

''వైద్యులారా! మీరింత గుబ్బెటలు పడనక్కఱలేదు. నేను లోపలి కేమియు మందీయను. మీ చక్రవర్తిపుత్రు నొక్కసారి చూచెదను. అనుజ్ఞ నీయవలయు''నని కుమ్మరివైద్యుఁడు పలికెను. ఈవైద్యునికి రోగిని చూపుటా మానుటా యనుసంగతినిగూర్చి యైదుగురుగూడఁ గొంతసేపు పూర్వపక్షరాద్ధాంతము లొనర్చుకొనిరి. ''హృదయము చాల దుర్బలముగా నున్నది. ఇట్టిసమయములోఁ గ్రొత్తవానిని చూచుట వలన నందులో నల్లని 'బ్లాక్ హెడ్'ను జూచుటవలన, రోగికిఁ గొంత (Shock) యదటు కలుగవచ్చును. అందువలన హృదయ మాకస్మికముగ నాఁగిపోవచ్చును'' అని యొకఁడు పలికెను. ''రోగి మొగమును జూడవలసినపని యేమున్నది? మొగమున కెదుట నొకదిట్టమైన తెరయడ్డు కట్టుదము. బాధ కాలిమీఁదఁ గావునఁ దెర కట్టవలదు. అది గాక హృదయము మిక్కిలి దుర్బలముగా లేదు. రోగితోఁ జెప్పియే యాతని నందుకు ''ప్రిపేర్'' (సిద్ధము) చేసియె యీతనికి దర్శన మిప్పింపవచ్చునని మఱియొకఁడు తన యభిప్రాయమును వెలిపుచ్చెను. ''ఎందులకైన మంచిది, "Strophanthus" strong dose (పెద్దమోతాదు) చేసి యిచ్చియే దర్శనము చేయింపవచ్చు''నని యింకొకఁ డనియెను. ''ఆమాత్రపు టదటున కాఁగలే నివాఁడు పెద్ద 'ఆపరేషను' కెట్టాగునా యని నాకుఁ జాలభయముగా నున్నది. I have my own serious doubts'' అని మఱియొకఁడు గుర్రపుమొగమంతకోలనైన మొగము కలవాఁడు బిఱ్ఱబిగియుచు దుమదుమలాడుచుఁ బలికెను. ఏలాగైన నేమి, తుట్టతుదకుఁ గుమ్మరిని లోనికిఁ దీసికొనిపోయిరి. కుమ్మరి కొంతసేపు చూచి చక్రవర్తిపుత్రుని మోఁకాలిపైఁ జేయివైచుట కనుజ్ఞని మ్మనెను. No No (నొ నొ) యని తలకు రెండేసి ''నోల'' చొప్పునఁ బది నో లొక్కసారి రావణాసురు నుండివలె బయలువెడలినవి. మోఁకాలిపై నీఁగ వ్రాలిననైన సహింపలేఁడు కావున వీలు కాదని యందరు చెప్పిరి. మరేమియుఁ దొందరలేదు –బాధ తగ్గింతు నని కుమ్మరి యావైద్యులతోఁ జెప్పెను. చేతులు పరీక్షించి ''పర్‌మాంగనేట్ ఆఫ్ పొటాషు''తో నాతనిచేతులు గడిగించి, తుడిచి, నిప్పుసెగను గాపించి, తుదకు మోఁకాలిని స్పృశించుట కనుజ్ఞ నిడిరి. చక్రవర్తి పుత్రుని మోఁకాలిపైఁ గుమ్మరి చేయి వైచి యంటియంటనట్లు కొంతసేపు రాచెను. చక్రవర్తిపుత్రుఁ డూఁ యనలేదు. ఆఁ యనలేదు. ఉహుఁ అనలేదు. ఆహా! పిల్ల యేడ్పునకుఁ దల్లి జోకొట్టెట్టిదో బెణుకునొప్పికిఁ గుమ్మరిపట్ట ట్టిది. అట్లాతఁడు రెండునిముసములు రాచి జేబులో దాఁచిన యొక తెల్లనిసీసా పైకిఁ దీసెను. నాన్ సెన్సు వాటీజ్ దట్ (బుద్ధిహీనుఁడా! అదియేమి) అని వైద్యులు కుమ్మరిని గద్దించిరి. ''ఇది యాముదము. దీనితో రవంతసేపు తోమెద'' నని కుమ్మరి బదులు చెప్పెను. ''అది Perchloride of mercury వంటి Poison కావచ్చును. కెమికల్ యెగ్జామినేషను ''చేసినఁగాని వీలులే''దని ఘంటాపదముగ వైద్యులు సెలవిచ్చి యట్లు చేసిరి. అంత నాతఁ డాముదమును మోఁకాలికి రాచి, నిమ్మళముగ రాచి రాచి, యద నెఱిఁగి కీలెఱిఁగి, మార్దవముతో బింకముగ నొక్కనొక్కు నొక్కెను. దానితో టక్కుమని ధ్వనియైనది. అంత వైద్యులు భయభ్రాంతులై మతులుచెడి కుమ్మరిని జేతులు పట్టికొని యావలికి లాగిరి. పదునైదు దినములనుండి నిద్ర నెఱుఁగని యాతఁడు గురుకపట్టి గాఢముగ నిద్రించుచున్నాఁడు. ఆతనినాడి నొకరు చూచుచున్నారు. హృదయపరీక్ష నొకరు చేయుచున్నారు. గుఱ్ఱుచూచి న్యూమోనియా యేమో యని యొకఁడు సందేహపడినాఁడు. ఎందులకైన మంచిది రోగిలేచువఱ కీకుమ్మరిని గారాగృహ మందుంచుట మంచిదని వైద్యులు తీర్మానించినారు. మఱునాఁటికే చక్రవర్తి లేచి

తిరుగాఁడ మొదలిడినాఁడు. మహారాజు ప్రాణముపై మహారాజు వైద్యుల కందఱి కంతయభిమానము, నంతయాదర ముండవలసినదే. కాని చికిత్సా పద్ధతియం దంతకంటె తెలివిమాత్ర ముండవలయును.

చిట్టచివరకుఁ దేమనఁగా, చీటికి మాటికి శస్త్రచికిత్స చేయుఁదగదు. శస్త్రచికిత్సాసాధనము లాయుర్వేదమునఁ దక్కువగానున్న వని దాని నధిక్షేపించుట పరులయాచారమై యున్నది. అది దానికలంకము కాదు–అలంకారము. అది దానితప్పు కాదు–ఒప్పు. అది దానియధిక్షేపణము కాదు–అభినందనము. శస్త్రవైద్య మంతయావశ్యకము కాదనియే యాయుర్వేదాభిప్రాయము. ఏవో కొన్ని జాతి వ్రణములకుమాత్రమే యది యావశ్యకము. మిగిలిన వ్రణములన్నియు నోషధీమాహాత్మ్యముననే మాన్పఁదగును. అంగసంఘాతములో నొక్కయంగము చెడిపోయి మిగిలిన యంగములఁ బాడుచేయు ననుభయము కలిగినప్పుడు శస్త్రవైద్య మావశ్యకము. రాచపుంటికిఁ గూడ శస్త్రవైద్య మక్కఱలేదు. శస్త్రవైద్యమునఁ గాని యది లొంగదను నభిప్రాయము సమంజసము కాదు. దాని కొక్కచిత్రమైనచికిత్సా పద్ధతి కలదు. ఆకుఱుపుసంబంధమైన కదు మెంతవఱకు వ్యాపించునో యంతవఱకుఁ జుట్టు నొకమూలికపసరు రాయుదురు. కొన్నిగంటలైన పిమ్మట గోడమీఁదనుండి పీడుక యూడిన ట్లాభాగ మంతయు నొక్కదిమ్మలాగుననుండి పడిపోవును. పిమ్మట నామూలికయే నూనెలోఁ గాచి యావ్రణమునకుఁ బూయుచుండవలయును. కొలఁదిదినములలో మాను పట్టి మచ్చపడును. ఇది విచిత్రమైన చికిత్సాక్రమము. ఇట్లు చేయునాతఁడు జోలార్‌పేటలో నున్నాఁడు.

శస్త్రవైద్యము కోటి కొక్కమాఱు విధిలేకుండునప్పుడు మాత్రమే జరిగింపవలసియుండఁగా నిప్పుడు దాదాపుగా నన్నిరోగముల కదియే యవలంబించుచున్నారు. ఇంజెక్షను శస్త్రవైద్యము కాదా? నెత్తుటిలోనికిఁ బోయినది నూది యైన నేమి, కత్తి యైన నేమి? మందేమి, విందేమి–నోటిగుండఁ బోవవలసినదే. నోటిద్రవములతోఁ గలసి పదనై పరిపక్వమై యుదరకోశములోనికిఁ బోవలసినదే. అచ్చట వివిధము లగుజాఠరరసములతో మేళన మొంది రక్తములోఁ జేరి యన్ని కోశములందు సహజమై సంచలన మొంది సౌఖ్యమీయవలసినదే—ఈక్రమమావస్థలలో మందున కేలోపము కలిగినను నది సహజమైన గుణమీయదు. భగవంతుఁ డేర్పాటుచేసిన క్రమ మది. దానికి వ్యతిరేక మగుపద్ధతి యసహజము కావున ననర్థము, అనుచితము. తాత్కాలికముగ ఇంజెక్షనువలనఁ గొంత గుణ మగపడినను నది ప్రబలాపాయమునకు ముందు ముందు కారణము కాకమానదు. ఇంజెక్షనువలని యపాయము లిప్పటి పాశ్చాత్యశాస్త్రజ్ఞులు కొందరుకనిపెట్టి యాచికిత్సాపద్ధతికి నిరుత్సాహ మిచ్చుచున్నారు. మనూరిటీకాలుమాత్రము? వానియందు జనుల కెంతగౌరవముండెను? ఎంతనమ్మిక ముండెను? పాశ్చాత్యులలోనే టీకాలు ప్రాణాపాయకరము లని వాదించు నొకతెగవారు బయలుదేరినారా, లేదా? అసహజములైన పద్ధతు లన్నియు నప్పుడో, యటుపిమ్మటనో యపాయకరములే; అనువినాశకము–అందుచే ననవలంబనీయములే. నిద్రకింజెక్షనా? నిద్ర కింజెక్షను తీసికొన్నవారికి రక్తమందసహజమైన వేడిమి బయలుదేఱి పిత్తాధిక్య మొనరించి, కార్శ్యమును బాడుచేసి యెంత శాశ్వతమైన యవకృతి నాచరించినదో యెరుఁగుదువా? ప్రజల కన్నివిషయములందుఁగూడ శాంతి, యోపిక,

యోజనము, దూరదృష్టి పూర్వవస్త్వభిమానము తొలఁగిపోవుటచేతనే వారు తాత్కాలిక సుఖముకై దేవులాడి దేహమనస్తత్త్వములు శాశ్వతముగాఁ బాడుచేసికొనుచున్నారు.

నూదిపోటు తత్త్వవిరోధ మని, తప్పని, తగ దని చెప్పినప్పుడు కత్తికోఁత యెట్టిదో వేఱె చెప్పవలయునా? కొన్ని కొన్ని వ్రణములకుఁ దప్పనిసరి యైనప్పుడు శస్త్రచికిత్స యుండనే యున్నది. అన్ని వ్రణములకు మాత్రము శస్త్రచికిత్స సాధ్యమగునా? గొంతుక లోని వ్రణముమాట యేమి? అది కంటికి దొరకునా? కత్తి కందునా? వ్రేలికందునా? పట్టికి లొంగునా? ఇట్టివ్రణములను శస్త్రసంపర్కము లేకుండ బాగుచేసినవా రెందఱులేరు? రోగికంటికిఁ గ్రంతలు గట్టిగ గట్టించి పాదరసపుఁ బొడి నాతనిచే లోనికిఁ బీల్పింపఁజేసి వ్రణమును సులువుగా బాగుచేసినవారు వ్రణవైద్యులుకారా? కత్తితోఁ గోసినవాఁడే శస్త్రచికిత్సకుఁడా? శస్త్రవైద్యమున సంపూర్ణప్రజ్ఞ నొందిన పాశ్చాత్యులు నారకుఱుపున కేమి చేయఁగలరు? కత్తితోఁ, గోయఁగలరా? చిమ్మటతో లాగఁ గలరా? పరిపక్వదశ కైనఁ బట్లువేయఁ గలరా? అదికూడ నక్కఱలేదు. కురుపుస్థాన మేదో నిర్ణయింపఁగలరా? ఏమి చేయఁగలరు? రోగి మాసములకొలఁదిఁ గోండ్రింపవలసినదే! లోనుండి నిమ్మళముగ వచ్చినారను జిన్నపుల్లకుఁ జుట్టుకొని భద్రముగఁ బాట్లు పడవలసినదే? త్రాడు తెగిన యెడలఁ దనువంతయు నార ప్రాఁకవలసినదే? నరలోకానుభవము నరలోకమున నొందవలసినదే? దీనికిఁ జికిత్స లేనేలేదా? లేకేమి? గురివెంద గింజయెత్తుగల యొకమందు నరఁటిపండులోఁ బెట్టి యేడుదినము లిచ్చిన యెడల నార యంతయు నొక్కసారి యూడి యీవలఁ బడిపోవును. ఏండ్ల కేం డ్లేడ్పించెడునట్టి దేడుపూఁటలలో సంపూర్ణముగ బాగగును. విచిత్రమైన యోషధికాదా? రసమా, విషమా, గంధకమా, పాషాణమా? ఏమియుఁగాదె! కంబము గిద్దలూరు మారికాపురము నంద్యాల బళ్లారి హుబ్లి ఆదోని మొదలైన తావులందే కాక యుత్తరదేశ మందీ కుఱుపు బాధ పడువా రనేకు లున్నట్లు వినుచున్నాము.

కావునఁ జెప్పఁబోవున దేమనఁగా?–శస్త్రవైద్యము పనికిరాని వ్రణము లెన్నివిధములై నవో యున్నవి. వ్రణములకే దానిపని యక్కఱకు రానప్పు డితరరోగములకు శస్త్రచికిత్స నాచరించుట హాస్యాస్పదము కాదా? జలోదరమునకు శస్త్రచికిత్సయెందులకు? కాళుల కుబ్బు కలిగినప్పుడు, మొగమున కుబ్బు కలిగినప్పుడు రంధ్రము పొడిచి నీరు తీయుచున్నారా? మందిచ్చి యానీటిని హరింపఁజేయు చుండునప్పుడు జలోదరమునకు శస్త్రచికిత్స యెందులకు? నీరొకసారి తీసివేసినప్పుడు రోగి కర్మముచాలక జీవచ్ఛవమువలె బ్రదికియున్నను మూఁడవసారి చచ్చుట ముమ్మాటికి నిశ్చయము కాదా? ఈరోగమున కనుపమానములైన యాయుర్వేదౌషధము లుండఁగా వానిని సేవింప నొల్లకపోవుట జీవింపనొల్లకపోవుటకంటె భిన్నమా?

స్త్రీల కందఱకుఁ బ్రధానముగ నున్నవ్యాధి మలబద్ధత. గృహిణీ ధర్మమును యథావిధిగ నిర్వర్తించుటకై రేయుంబవళ్లింటిలోనే యుండి మంచిగాలి వెల్తురులేక, తగినవ్యాయామములేక, వేళపట్ల భోజనము లేక పచనాదిక్రియలందుఁ దడిగుడ్డలు కట్టుకొనినఁగాని పనికి జరుగుపాటు లేక, పిల్లలయేడ్పులతో రాత్రి నిద్రలేక పడుచున్న బాధలవలన మొట్టమొదట మలబద్ధత యారంభమై యదియే మందాగ్నిగఁ బరిణమించును. అడ్డబాస యున్నయాఁడు దిప్పు డెట్లు లేదో యజీర్తి లేని యాఁడు దట్లు లేదు. మొగమునకు మెరుఁగు

కాచికొనుటయందు వీరి కున్న శ్రద్ధలో నగమైన మందాగ్నిని గుదుర్చుకొనుటలో వీరి కున్నయెడల వీరి కొంటిపూటసాపాటు లుండునా? భర్తల కణాబిళ్లలపై నంతకము లుండునా? బిడ్డల కూసరపొట్టలు నుద్దకట్టు లుండునా? అగ్నిమాంద్యమున కాయుర్వేదౌష ధములు సేవింపలేక, యథావిధిగాఁ బథ్యము సేయలేక, జిహ్వాచాపల్యము నడఁచుకొనలేక, యంతకంతకు రోగవృద్ధి చేసికొనుచున్నారు. మన మందులు మంచివి కా వని మహర్షులను విట్టుచున్నారు. ఆసుపత్రులకుఁ బోయి యానీ రీనీరు త్రాగుచున్నారు. దొరసానులచేఁ బరీక్ష చేయించుకొనుచున్నారు. వారిచేఁ గడుపు కోయించుకొనుచున్నారు. మరణోన్ముఖులై బిడ్డలపుణ్యమున మరల బ్రదుకుచున్నారు. మందాగ్ని తగ్గినదా? దేహమునకుఁ బాటవము తగ్గినది. నరములలో శక్తితగ్గినది. మొగములోఁ దేజస్సు తగ్గినది. కంటికి దృష్టి తగ్గినది. మనస్సులో నుత్సాహము తగ్గినది. బ్రదుకునం దపేక్ష తగ్గినది. అంతేకాని మందాగ్ని తగ్గుటే! జిలజిల మని జిల్లుమని జాఠరరసములు కడుపులోని కూరుట లోనికిఁ దీసికొన్న రసాయనమువలనను, గల్పముల వలనను గలుగవలయును గాని కత్తికోఁతవలనఁ గలుగునా? భగవంతుని నిర్మాణము ననుసరించి కడు పెట్టున్నదో దాని నట్లే యుండనీయవలయును గాని దానిని మామిడికాయతరిగినట్లు తరిగితరిగి కుట్టి దానిని గురూపను జేసినతరువాత నది సహజమైనపని చేయఁగలదా? భగవంతుఁ డేర్పఱచిన సంచలనము దాని కిప్పుడు చెడినదా లేదా? లోని యాహారమును నొక్కఁగలశక్తి, నలుపఁగల శక్తి, గిరగిర త్రిప్పఁగలశక్తి, ముందునకుఁ ద్రోయఁ గలశక్తి కత్తివ్రేటు తిని కుట్టుపడిన కడుపునకు దైవసం కల్పమున నుండిన ట్లుండుట కవకాశ మున్నదా? పంటికుసి (దంతకుసి) కత్తిచేఁ గోయించుకొనుటచే దౌడపై నరయంగుళము లొట్ట యున్నవాఁడు సెనగలు నీయంత విశృంఖలముగ నమలఁ గలఁడా? ఏయవయవమునకుఁ గత్తికోఁత కలిగినదో యాయవయవములోఁ దీఱనిలోపము చేరిన దన్నమాట. మూలశంకరోగమునకు శస్త్రచికిత్స చేయించుకొన్నవాని కాసనరం ధ్రము మునుపటికంటె శాశ్వతముగాఁ దగ్గినదా లేదా? గంటల కొలఁది వీరు పెరళ్లలోఁ గూరుచుండి విరేచనము తెమలకపోవుట, నెంతకు సంతుష్టి లేకపోవుటచేత బ్రదు కెల్ల భ్రష్టమైనదని యేడ్చుచున్నారా లేదా? మూలశంక నిర్మూలన మైనయెడల నీయేడుపులు గణింపవలసిన పని లేదు. పోయినదా? ఆ. సొమ్మె–సుఖమొందుదు మనునాశ–అంతేకాని యది పోవుటే? తిరిగి పిలుకబయలు దేరుచున్నదే. గులాబికొమ్మ మొదలంటఁ గత్తిరించి తిమి. తిరుగ నంకురించినదా లేదా? మొవ్వులోని కనఁటిని నఱకి వైచితిమి–తిరిగి మొలకెత్తి సదా లేదా? ''కాటరైజు'' (కాల్చుట) చేసితిమికాన నింకరాదని వైద్యులు చెప్పినమాట నమ్మవలదు. భూమిని గాల్చివైచినను జికిలింత మొలవలేదా? చీఁపురుమొక్క తలయెత్త లేదా? కాల్చుటచేత మరింత శీఘ్రముగ, మఱింత యెత్తుగ నంకురించినది. అటులే కడుపు కోయుటచేతనే యజీర్తి మఱింత వృద్ధియగుచున్నది.

కడుపులో గుల్మములు, గడ్డలు మొదలగునవి యన్నియు లోనికౌషధమును తీసికొని కరఁగించుకొని నిర్మూలించుకొనఁ దగినవేకాని కత్తిచేఁ గోయించుకొనఁదగినవి కావు. తాత్కాలిక మగుదోషమే కత్తి నివారింపఁగలదు కాని దోషకారణమును నాశ మొనర్పఁగలదా? కారణమును గనుఁగొని దానిని భేదించినయెడలఁ గార్యముఁ నాశన మగును గాని కార్యమును దొలఁగించినయెడలఁ గారణము నశింపఁగలదా? చింతచెట్టును జంపఁ దలఁచినవాఁడు తల్లివేరు తెగవ్రేయవలయును గాని చింతాకు దూయునా? ఈసందర్భమున నొక్క సంగతిమాత్రము చెప్పి విరమింతును.

జ్వర మనునది మఱియొక వ్యాధికి లక్షణము కాని యది ప్రత్యేక వ్యాధి కాదు అజీర్తిచేఁ, బసరుచే, వామముచే, బడలికచే, నింక ననేక కారణములచే జ్వరము రావచ్చును ఆహారనిద్రావ్యత్యస్తపరిస్థితులచేఁ గలిగిన వాతపిత్తశ్లేష్మ దోషములవలనను, వాని సంయోగము లవలనను గలిగిన జ్వరములుమాత్రమే చికిత్సార్హములు జ్వరము ప్రధానవ్యాధి కాదు. కావున ప్రధానవ్యాధి యేదో కనిపట్టి దానికొఱకు మందీయవలసినదే కాని జ్వరము తగ్గించుట కెన్నఁడును మందీయఁదగదు. జ్వరమునకు మనము తఱచుగా శీతాంకుశరసము, ఆనంద భైరవి, న్వచ్ఛన్నభైరవి, వసంత మాలిని, వైష్ణవీరసము, కాకకూటము, వాతరాక్షసము మొదలగు నౌషధములు వాడుదుము. అన్నియుఁ గూడ ననిన్నిజాతులజ్వరములకుఁ బు ర్వతే శాశ్వతములైన (Prescriptions)గా నేర్పాటుచేసి యుండిరి. శుద్ధపిత్తజ్వరము కొకటి. శుద్ధశ్లేష్మజ్వరమున కొక్కటి. శుద్ధవాతజ్వరమునకొక్కటి. శీతపిత్తజ్వరము కొక్కటి. శ్లేష్మపిత్తజ్వరమున కొక్కటి. శ్లేష్మవాతజ్వరమున కొక్కటి. ఈకూడికలలో గలుగునవాంతర భేదములకు మరికొన్ని మహర్షులు నియమించిరి. ఇవి జ్వరౌషధమ లన్నమాటయే కాని జ్వరమును దగ్గించున వెంతమాత్రమునుగావు. జ్వర కారణములగు దోషములను హరించును. వీనిలో శుద్ధిచేసిన నాభికలసిన మందులు గొన్నియున్నవి. అ మాత్రము జ్వరితుని దేహమునుండి రవంత చెమటను వెలువడఁజేయును. ఆస్పిరిన్ ఫినాసిటిన్ మొదలగు మందులు వాడఁదగదు. ఆమందులు తఱచుగ నిచ్చి జ్వరము చప్పు జారిపోవు దుష్టస్వభావమును దత్ఫ్వమునకు మప్పఁగూడదు. అదియెంత ముప్పునకైన గారణము. వానివలన హృదయకోశము బలహీన మగును. రక్తములో వేఁడి తగ్గిపోవును నరములకుఁ బటుత్వము క్షయించును. ఆనంద భైరవ్యాదిరసములు హృదయబలమున గాపాడుచు, రక్తోష్ణతను రక్షించుచు, నరములకు వాతదోషము రానీయకుండ దోషకార ణమును దొలగించి జ్వరవిముక్తి చేయును.

పర్యవసాన మేమనఁగా:–శస్త్రచికిత్సవలనఁ గార్యనాశనమే కాని కారణనాశ మెన్నఁడుఁ గాదు. కారణనాశనమున కౌషధసేవ కంటె వేరుమార్గము లేదు. అవసరానుసా ముగ నన్నిచికిత్స లాయుర్వేదమున నున్నవి. మీకుఁ జదువుకొనుట కోపిక యుండవ యును; తెలిసికొనుటకు బుద్ధి యుండవలయును; ఆచరించుటకు దీక్ష యుండవలయును అన్ని యునుండియు నేమియు లేన ట్లీడ్చుదేశము ప్రపంచమందిది యొకటియే. శ్రుతు లున్నవి; స్మృతు లున్నవి; శాస్త్రములున్నవి; పురాణము లున్నవి; సమస్త కళ లున్నవి కాని మనది యను నభిమానము మాత్ర మింతవరకుఁ బూర్తిగ కలుగలేదు. ఇప్పు డిప్పు డేదో మాఱువడి దేశకాలములందుఁ గలిగినట్లు కానఁబడుచున్నది; కావునఁ జెప్పుచు న్నాను. దేశీయదేవతల నారాధింపుడు; దీశీయర్షులను బూజింపుఁడు; దేశీయ గ్రంథములను జదువుఁడు; దేశీయకళ లభ్యసింపుఁడు; దేశీయ కర్మముల నాచరింపుడు; దేశీయతల్లో బుట్టి, దేశీయతలోఁ బెరిఁగి దేశీయతలో మృతినొందుఁడు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

11. సభావ్యాపారములు

సాక్షి సంఘానికి వచ్చే ఉత్తరాలు చదివి వినిపించడంగాని లేక తమ సంఘానికి సంబంధించిన లెక్కడొక్కలు, సాధక బాధకాలు చర్చించుకోవడం రెండు నెల్లకో మూడు నెల్లకో ఒకసారి అలవాటే.

ఈసారి రెండు ఉత్తరాలు చర్చకు వచ్చాయి. మొదటి ఉత్తరం బళ్లారి జిల్లా ఆనెగొంది నుంచి–సి. బాలనాగమ్మ అనే స్త్రీ సాక్షిసంఘంలో సభ్యత్వం కోరుతూ రాసినది. చేర్చుకోతగునా? తగదా? అని వాణీదాసు, కాలాచార్యులు, జంఘాలశాస్త్రి చర్చించారు. చివరికి సాక్షి నిర్ణయానుసారం ఆమెను సభ్యురాలిగా జేర్చుకోవడానికే నిర్ణయించారు. స్త్రీ అనేక రంగాలలో పురోగమిస్తున్న దృష్ట్యా ఈనిర్ణయాన్ని జంఘాలశాస్త్రి సమర్థించాడు.

రెండో ఉత్తరం గంజాం జిల్లా ఉర్లాం గ్రామం నుంచి ఒక 'సత్యవాది' వ్రాశాడు.

చిత్రలేఖనంలో కొందరు లేఖకులు స్త్రీలను అవమానపరిచే విధంగా రచిస్తున్నారనే విమర్శను ప్రస్తావించాడు. పురుష చిత్రకారులే కాక, మహిళా చిత్రకారులు కూడా కొందరు ఈదారినే నడుస్తున్నారని హెచ్చరించాడు. ఆపైన కవుల వర్ణనల ప్రస్తావన తెచ్చి–వారు ఎలాగ తమ కావ్యాలలో స్త్రీల అంగాగ వర్ణనలు చేశారోచెప్పి, వారు చిత్రకారులకంటె ఘోరమైన దండనకు అర్హులని గర్హించాడు. అటువంటి వారు తెలుగు కవులలోనే కాదు; సంస్కృత కవులలో కూడా వున్నారని జ్ఞాపకం చేశాడు. ఇంగ్లీషు భాషలో కూడా ఈధోరణి రచనల్ని ఉటంకించాడు.

జంఘాలశాస్త్రి ఈవిమర్శకు జవాబు చెపుతూ–కవుల ప్రస్తావన చేసినప్పుడు చెపుదామనుకున్నాననీ ఈలేఖకుడు తన పని తేలిక చేశాడనీ అభినందించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

సోదరులారా! సభావ్యాపారములు రెండుమాసములనుండి చూచుకొనుటయే లేదు. సాక్షిసంఘముపేర నిదివరకు వచ్చినలేఖలలో ముఖ్యములైనవానిని జదివెదను.

సాక్షికి–నమస్కారములు–మీసంఘమున నిదివఱ కైదుగురుండెడివారు. ఇప్పుడు మీతో నల్వురే యున్నారు. అయిదవవారి నెవ్వరి నైనఁ జేర్చుకొనుట కుద్దేశ మున్నదా? అట్టియుద్దేశము మీ కుండునెడల స్త్రీని జేర్చుకొందురా? ఆస్త్రీ సత్యపుర గ్రామవాసినియే యైయుండవలయునా? అక్కఱలేదా? ఈసంగతులు నాకుఁదెలుపఁగోరెదను.

విత్తగింపవలయును, విధేయురాలు,
సి. బాలనాగమ్మ,
ఆనెగొంది, కమలాపురము పోస్టు, బళ్లారి జిల్లా.

సోదరులారా! ఈలేఖను వింటిరా? ఈసోదరీమణి మన యుపన్యాసములను విని సంతోషించుటయే కాక, మనసంఘములో నొక సభ్యురాలై మనసంఘోద్దేశ నిర్వహణకార్య మునందు మనకు సహాయయై శ్రమపడు చుండుట కుత్సాహించుచున్నట్లు తోఁచుచున్నది. బళ్లారి జిల్లాలోనున్న హేతువుచేత నెప్పుడో కాని మన కామె దర్శనమిచ్చుట కవకాశము లేనిదైనను, దనయభిప్రాయములను దఱచుగ మన కామె పంపవచ్చును. అందుచేత నామెను జేర్చుకొనుటయే నాయభిప్రాయము, వాణీదాసా! నీ వే మందువు?

వాణీ–స్త్రీని సభ్యురాలిఁగఁ జేసికొనవచ్చు నని మనసంఘశాసనములలో నున్నదా?

జంఘా–చేర్చుకొనఁగూడ దని లేదు.

వాణీ–స్త్రీని గూర్చిన ప్రసక్తియే లేనప్పుడు స్త్రీనిఁ జేర్చుకొనుట కవకాశ ముండదు.

జంఘా–సభాశాసనములకు విరుద్ధము కాని పనిని జేయుట తప్పుకాదు.

వాణీ–సభాశాసనములు చెప్పనిపని చేయుట తప్పు.

జంఘా–కవీ! మొండివాదము చేయకుము. మనసోదరీమణు లిప్పుడు మిగుల నున్నతదశలలోనికి వచ్చుచున్నారు. విదుషీమణు లగుచున్నారు; గాయనీమణు లగుచున్నారు; కవయిత్రు లగుచున్నారు; చిత్రలేఖిక లగుచున్నారు. వక్తృత్వమున వారిని మించిన వారు లేరనిపించుకొను చున్నారు. శాసనసభలలో, సంఘసంస్కరణసభలలో, మతవిషయక సభలలో, న్యాయసభలలో, రాజకీయసభలలో సభ్యురాండ్రై లోలాక్షీమణు లెందఱు లోకక ల్యాణమునకుఁ దోడుపడుచున్నారో నీవెఱుఁగుదువా? స్త్రీలు సర్వసభలలో సభ్యురాం ద్రుగ నుండుట సభలకే కాక దేశమునకుఁగూడ నలంకారము. అందుచే నామె కోరునెడలఁ జేర్చుకొనుటయే నాయభిప్రాయము.

వాణీ–నాయభిప్రాయ మేదో చెప్పితిని. మార్చుకొనవలసిన కారణము నాకగపడలేదు.

జంఘా–కాలాచారీ! నీయభిప్రాయ మేమి?

కాలా–నాయభిప్రాయమున కేమున్నది? నాకు స్త్రీయైన నొకటే, పురుషుఁడైన నొక్కటే, ఆరెంటిలో భేదమేదో నామనస్సున కెక్కలేదు. వేదాంతశాస్త్ర మాత్మకు లింగము లేదని చెప్పుచున్నది. పైస్వరూపమువలననే యీవ్యక్తి యాఁడుది, యీవ్యక్తి పురుషుఁ డని పామరులు గ్రహించుచున్నారు. కాని పరమార్థ మాలోచింపఁగ స్త్రీ పురుష భేదము లేనే లేదు. అందుచేత–

జంఘా–కాలాచారీ! ఇకఁ జాలించు. స్త్రీపురుషభేదము నీ మనస్సున కెక్కలే దని చెప్పితివి కదా! నాలుగేండ్లక్రిందట వివాహమాడుటకు దక్షిణదేశయాత్ర పోయి యక్కడ నీయలౌకికచర్యలచేఁ గారాగృహప్రవేశ మంది చావునకు సిద్ధమయితివే. జ్ఞప్తి లేదా?

కాలా–అప్పుడు నేను బుద్ధిపూర్వకముగఁ బోయితి ననుకొంటివా? ఏదో యితరుల ప్రోత్సాహముచే నట్లు జరిగినది?

జంఘా–సరే. నీయభిప్రాయ మేమని నిర్ణయించెదవు?

కాలా–నాకుఁ బ్రత్యేకాభిప్రాయ మేమియు లేదు. పెద్దల యభిప్రాయమే నాయభిప్రాయము.

జంఘా–అది యేదో స్పష్టముగఁ జెప్పుము.

కాలా–వాణీదానుఁడు చెప్పినట్లు స్త్రీని జేర్చుకొనకుండిన మంచిది. నీవు చెప్పినట్లు చేర్చుకొనినను మంచిదే.

జంఘా–సరే నీయభిప్రాయము నపుంసకము కావున నది గణింపఁబడదు. వాణీదాసా! స్త్రీని జేర్చుకొనవచ్చుననియే సాక్షి యభిప్రాయము. ఆయభిప్రాయ మీలేఖమీఁదనే వ్రాయఁబడియున్నది. హెచ్చునంఖ్యగల సభ్యులచే నామోదింపఁబడుటచేత స్త్రీని జేర్చుకొనుటకే నిర్ణయింపఁబడినది.

వాణీ–సాక్షియభిప్రాయ మట్లున్నదని మొదటనే ఏల చెప్పలేదు.

జంఘా–ఇదిగో! మఱియొక లేఖ–గంజాము జిల్లా–నరసన్నపేట పోస్టు–ఉర్లాము గ్రామము నుండి యీలేఖ వచ్చినది. దీనిని జదివెదను.

సాక్షికి నమస్కారములు.

అయ్యా! మీరు చిత్రలేఖకుల దిగంబరవిగ్రహములఁ గూర్చి యిచ్చినయుపన్యాసము లోని సంగతు లన్నియు బాగుగాఁ దెలిసికొంటిని. ఉపన్యాసము బాగుగనే యున్నది. అట్టిదోష మెంతశీఘ్రముగఁ బరిహరింపఁబడునో చిత్రకళ కంత క్షేమము. కొందరు స్త్రీలు కూడ నట్టివిగ్రహములను జిత్రించుచున్నారని తెలియుచున్నది. ఇది మరింత ఘోరము. ఇప్పటి చిత్రలేఖకు లేవోపిచ్చియూహలు పెట్టుకొని, చిత్రించుచున్న కన్నులనుగూర్చి యుపన్యసించెద నని చెప్పియున్నారు. ఆయుపన్యాసముకొఱకు వేచియున్నాము. తప్పకుండ నట్టి యుపన్యాసము త్వరలో వెడలవలయును. వారు చిత్రించుచున్న కన్నులనుజూడ నెంత రోఁతయైనఁ గలుగుచున్నది. మీరు ముఖ్యముగా విమర్శింపవలయును. అదిగాక వంగీయకళ తప్పకుండ మీవిమర్శనమునకు గుఱి కావలసియున్నది. కాని యొకసంగతి. ఆనడుమను: గొంతకాల మెండి మొండైన చిత్రకళ నూతనముగ నిప్పుడే యుజ్జీవింపఁబడుచున్నది. లేలేఁతరెమ్మలు వైచుచుఁ జిగుర్చు మొగ్గదొడుగుచు నెదుగుచున్నది. మీవిమర్శనము కేవలము ఖండకముగానుండక, కొంతపరిపోషకముగా నుండవలయు నని చెప్పుచున్నాను. వెఱ్ఱివెఱ్ఱి తలలను గఱకుకత్తితోఁ దెగనఱకఁగూడ దని నాయభిప్రాయము కాదు. అట్టినఱకులవలన, మిగిలిన చెట్టు మునుపటికంటె బలముగలదియై, మునుపటికంటె

వ్యాప్తికలదియై, మునుపటికంటె హెచ్చుచిగుళ్లు, హెచ్చుమొగ్గలు కలదియై యుండునట్లు మాత్రము చూడవలయును. అది నాకోరిక.

మరియొకసంగతి–ఆడుదాని మర్యాదకు భంగకరములైన పటములను జిత్రించు చిత్రలేఖకులను భారతమాత చేతికొరడా వ్రేటున నట్టిశిక్ష కర్హులైన కవుల నుపేక్షించి, చిత్రలేఖకులమీదనే మీరు దాడివెడలుట తగదు. ఆడువారి యవయవరహస్యముల బయటఁబెట్టుటలోఁ గవులకుఁ జిత్రలేఖకు లందుదురా? ఒక్కొక్క యవయవమున కెన్నేసి పద్యములను జెప్పినారు. వారు వర్ణింపనియవయవమున్నదా? చిత్రలేఖకుల పటములలో నాభి కానఁబడుచున్నదని మీరు వారి సంతతీవ్రముగ విమర్శించితిరే! నాభిపై నొక్కొక్కకవి యెన్ని యెన్ని శ్లోకముల నెన్నెన్ని పద్యములఁ జెప్పియుండలేదు? చెలమ లని, దిగుడుబావు లని, కొండబిలము లని మఱి యేమో యని యెన్ని వర్ణనములు కవులగువా రొనరించి యుండలేదు? అంతట నాఁగిరా? నాభిపై నున్ననూగారు, దిగువనున్న నూగారుగూడ వర్ణింపలేదా? ''నూగారు గూఢపదమా చెలికిన్'' అన్న వా రెవ్వరు? ఇకఁ బయోధర వర్ణనములకు హద్దుపద్దున్నదా? మనసులోని యుబలాటము తీఱునట్లు, నోటికసితీఱు నట్లు, చేతిదురద తీఱునట్లు పయోధరవర్ణనము లెంతబహుళముగా గ్రంథములందు వ్రాసినారు? ఎంత పెద్దవి యని చెప్పినను హృదయమున కింక సంతుష్టి లేక, అబ తీఱక, తాటకాయ లని, కుండ లని, కొండ లని, వారిమొగ మని మొఱపెట్టినవా రెవరు? కవులు కారా? పిరుఁదులను వర్ణింప కుండినకవి యొక్కఁడైన నుండెనా? అవి పెద్దదిబ్బ లని, యినుకతిప్పలని, మెట్టలని, గుట్టలని వర్ణించి వర్ణించి, యంతటితో దయ్యపు టూఁకలి శాంతింపకపోవుటచే, భూవలయముతో వాని నంట గట్టలేదా? కాంతలరహస్యావయవము లను వర్ణించుటలోఁ గవుల కున్న రాక్షసవాంఛ చిత్రలేఖకుల కున్నదా? పిరుఁదులవర్ణనలతో సరిపుచ్చిరా? ఎందులకు సరిపుత్తురు? సరిపుచ్చి యూరకుండఁగలరా? సరిపుచ్చి బ్రదుకఁగ లరా? సరిపుచ్చి కవు లనిపించుకొనఁగలరా? ఆకారముకాదు, రంగుగాదు, మఱియేదో కాదు, ఇం కేదో కాదు–ఎన్నెన్ని వివరములతో నోపికగా, శ్రద్ధగా, భల్లూకపుఁబట్టుతోఁ దలఁపఁగూడని యవయవములను, గానరాని యనయవములను మనయెదుటఁ బెట్టలేదు; పోనిమ్ము. అంతటితో నాఁగిరా? ఆఁగుటే? హాహాకారమెత్తి నప్పు డాగుటే–స్మరింపరాని నంభోగవర్ణనములను నంతనగ సాపుగ నముజ్జృంభణముగ సాగింపలేదా? అంతటితో నయిన శాంతిపడి మిన్నక పడియుండిరా? ఊహుఁ ''పునారతికౌతుకంబుతో'' లేచి గంటములు చేతఁ బుచ్చుకొని బింకముగఁ గూరుచుండిన మునలికవు లెందరు? ఈఘోరచర్యలోఁ దిరుగవేసి మఱుఁగవేసి, ఉల్టాసీదాల సౌభాగ్యము జూపినవారెందరు? చీ చీ! ఏచిత్ర లేఖకుఁడయిన నిట్టినన్నివేళమును జిత్రించి నంతలోఁ బెట్టినాఁడా? ఈమోట మొండివ్యాపారమునఁ గవులకంటెఁ జిత్రలేఖకు లెంతతక్కువ? చిత్రలేఖకులు కొరడావ్రేటుల కర్హులయినప్పుడు కవులు కొఱత మేకుల కర్హులు కారా?

ఆంధ్రకవిత్వములో మాత్రమే యిట్లున్నదా? సంస్కృతములో నింతకంటె బాగైన నేడ్చిన దేమో యని చూడఁగ, నది యింత కంటె నధ్వాన్నముగ నున్నదే. జగన్మాతల స్తవరాజములలో గుహ్యాంగకములకుఁ బ్రత్యేక మొక్కొక్కస్తబకమా? తల్లిదండ్రు లగుపార్వతీ పరమేశ్వరుల సంభోగమును వర్ణించుటకు సాహసించినవారు సంస్కృత

భాషామహాకవులే కాదా? బ్రహ్మచారులు, వేదాంతులు, సన్న్యాసులు సయితము దేవీస్తవరాజములలో నెంతలజ్జాకరము లయిన విగ్రహములను నిర్మించినారు.

ఇంత నాంగ్లేయభాష యీసన్నివేశమున నేభాషకుఁ దీసిపోవునది కాదు. సమస్తభాషలలోనున్న యుద్గ్రంథములుగూడ నాభాషలోఁ బరివర్తన మొందియున్నవి. కావున సమస్తజాతులవారి కీపిచ్చి యెంతగాటముగ నున్నదో తెలియవచ్చును. Shakespeare రచించిన Sonnets లో, Venus and Adonis లో, The Rape of Lucrece లో స్త్రీల గుహ్యావయవము లెంత వ్రీడాకరముగ, నెంత జుగుప్సాకరముగ వర్ణింపఁ బడియున్నవి? Aristophanes వ్రాసిన హాస్యరసరూపకముల నవలోకించితిరా? పూర్వపువా రట్లు రచియించిరి కాని యిప్పటివారు భద్రముగనే యున్నారని యనుకొనకుఁడు. ఇటీవలి గ్రంథమైన "Leaves of Grass"లోని, "The love that awaits me" అను పద్యమాలికను జూచితిరా? ఎంతరోఁత కలిగించుచున్నదో! చెప్పఁబోవున దేమనగ–చిత్రలేఖకు లెట్టిదోష మొనర్చిరని మీరు చెప్పినారో, కవు లంతకంటె నెక్కువదోషముల నొనర్చినారు. వారిని దూషించి వీరి నుపేక్షించుట ధర్మము కాదు.

చిత్తగింపుఁడు.

సత్యవాది

జంఘా–ఈలేఖను వింటిరా! కవులందుఁ బాక్షికముచే నేను వారిని విడువలేదు; చిత్రలేఖకులందుఁ గోపముచే వారిని దూషింప లేదు. కవుల యీవెఱ్ఱినిగూర్చి చెప్పుఁదలఁచియే యున్నాను. చిత్రలేఖకులఁగూర్చి నేను జెప్పినప్పు డది సమంజసముగ నున్నదో లేదో చూడవలయును గాని కవులనుగూర్చి చెప్పలే దని యధిక్షేపింపవచ్చునా? నే నింకఁ జెప్పనివేళ యేది? ఉన్న దొక్క చిన్ననోరు: ఉపన్యాస విషయములు లక్షలు 'కవి'నిగూర్చి యీనడుమ నుపన్యసించితిని. కవి భేదములు మొదలగు నంశములఁగూర్చి యుపన్యసించున ప్పుడు కవుల యీపిచ్చినిగూర్చి సోదాహరణముగ సవిస్తరముగఁ జెప్పుఁదలఁచితిని. కాని యుత్తమవిమర్శకుఁ డగు మన ఉర్దూముపండితుఁ డీవిషయమును గూర్చి వ్రాసి నాకు శ్రమలేకుండఁ జేసినందుల కాయన కనేకనమస్కారము లర్పించుచున్నాను. ఇఁక జదువఁదగిన యుత్తరము లున్నవికాని యిప్పటి కివి చాలును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

12. సాక్షిసంఘ పునరుద్ధారణ

సాక్షిసంఘాన్ని పునరుద్ధరించే ప్రయత్నం మరోసారి జరుగుతోం దని జంఘాలశాస్త్రి చెపుతున్నాడు. ఆంధ్రపత్రికలో సారస్వతానుబంధానికీ, సాక్షికీ అటువంటి సంబంధం ఏర్పడిందనీ, సారస్వతానుబంధం జరుగుతు న్నంతకాలం సాక్షి సభలు జరగవలసిందేననీ సాక్షిసంఘం భావిస్తోంది.

గత పదిసంవత్సరాలనుంచి సాక్షి వృద్ధుడైనప్పటికి కూడ దేశాటనం చేస్తూనే వున్నాడనీ, రకరకాల ప్రదేశాలు, అక్కడ రకరకాల మనస్తత్వాలు పరిశీలిస్తూనే వున్నాడనీ జంఘాలశాస్త్రి చెప్పాడు. ఈమధ్యనే తటస్థించింది. కనక-అక్కడ రకరకాల విభిన్న అంతస్థుల మనుషుల్ని గురించి కూడా మంచిచెడ్డల్ని ముచ్చటించుకునే అవకాశం కొత్తగా ఏర్పడింది.

ఇంకో విశేషం కూడా వుంది. ఇక ఈఉపన్యాసాలు సత్యపురంలో కాక, మద్రాసులో సముద్రతీరంలో జరుగుతాయి. ప్రతి శుక్రవారం సాయంకాలం ఉపన్యాసం జరిగి ప్రతి శనివారం సారస్వతానుబంధంలో ప్రచురణ జరుగు తుంది.

సముద్రతీరానికి విహారం కోసం వచ్చేవారి సొంత ప్రవృత్తులకీ, వారి కాలక్షేపాలకీ, ప్రలోభాలకీ, ఏ బంధం కాకుండానే ఆరుగంటల లోపలే ముగిసిపోతాయని జంఘాలశాస్త్రి 'హామీ' ఇచ్చాడు. ఏ సమయంలో, ఏవి షయం ప్రస్తావనకు వస్తుందోననే నిశ్చల దయతో సారస్వతానుబంధం చూడవలసిందిగా ఆంధ్ర మహాజనానికి శాస్త్రి విజ్ఞప్తి చేస్తున్నాడు.

'సాక్షి' తమను నడిపే చైతన్యమూర్తి నాయకుడు అనీ, అతని సూచనలను బట్టి తన ఉపన్యాసాలుంటాయనీ జంఘాలశాస్త్రి విన్నవించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

ఆంధ్రపత్రికలోఁ దిరుగ సారస్వతానుబంధము శ్రీపత్రికాధిపతి ప్రచురించుచున్న దులకు మహానంద మొందితిని. సారస్వతాను బంధమునకు సాక్షికిఁ గల సంబంధము నర్వాంధ్రలోకమునకు విదితమే. సారస్వతానుబంధ మున్నచోట సాక్షి యున్నాఁ డన్నమా టయే. సారస్వతానుబంధము జరుగుచున్నంతకాలము సాక్షి సభలు జరుగవలసినదే

పై వారమునుండి సాక్షిసభలు మదరాసులో జరుపవలయు నని తలఁచు చున్నాము.

కడచిన పదిసంవత్సరములనుండియు, సాక్షి వృద్ధిఁ డయ్యును దేశాటన మొనర్చు చునే యున్నాఁడు. చిత్రవిచిత్రప్రదేశము లనేకములు చూచినాఁడు. పురుషులైన స్త్రీలను, స్త్రీలైన పురుషులను, పిల్లలైన పెద్దలను, పెద్దలైన పిల్లలను, ప్రభువులైన దాసులను, దాసులైన ప్రభువులను, భక్తులైన దొంగలను, దొంగలైన భక్తులను, బుద్ధిమంతులైన బుద్ధిహీనులను, బుద్ధిహీనులైన బుద్ధిమంతులను మఱియింక నెన్నియో మహావిచిత్రప్రకృతులను జూచినాఁడు. ఆతఁడు పాశ్చాత్యదేశములఁగూడ నీనడుమనే చూచినవాఁ డగుటచేత నచ్చటి ప్రభువులఁ గూర్చి ప్రజలఁగూర్చి కవులఁగూర్చి గాయకులఁగూర్చి చిత్రలేఖకులఁగూర్చి నుపన్యాసము లీయఁదలఁచినాఁడు.

ఈసారి సాక్ష్యుపన్యాసములు మా కారాధనమూర్తి యగు సూర్యభగవానుని సంతతా నుగ్రహవిశేషమున వినోదకరములై విచిత్రతరములై విలక్షణములై యుండునట్లు సోదరులగు మీరాశీర్వదింతురు గాక! ప్రతి శుక్రవార సాయంకాలమున సముద్రతీరమున నీయఁబడు నుపన్యాసము మఱునాఁడే ప్రచురణార్థమై యాంధ్రపత్రికకుఁ బంపఁబడును.

కృతి పాడఁదగినది. కథ యూఁ కొట్టఁదగినది. నాటక మాడఁ దగినది. ఉపన్యాసము వినఁదగినది. ఓమదరాసుసోదరులరా! మీపట్టణమున సుమా రైదులక్షల జన మున్నది. మీలో నేఁబదివే లైన సముద్రతీరమునకు వచ్చి సాక్ష్యుపన్యాసములు వినుచుండవలయును. మీరు సాధారణముగా సాయంకాలమునందు సముద్రతీరమున కెందులకుఁ బోవుచున్నారో యెవ రెఱుగరు? ప్రకృతిసౌందర్య సౌభాగ్యవలోకమునకా? ఊహఁ-పవనప్రాశనమునకా?-ఊహఁ-దేహవ్యాయామమునకా? ఊహఁ-విశ్రాంత్యనుభవ మునకా? ఊహఁ-గ్రామ్యకవితవలెఁ గడలు త్రొక్కుటకుఁ బోవుచున్నా రని మీరంద ఱెఱుఁగరా? లోక మెఱుఁగదా-లోకనాథుఁ డెరుఁగఁడా? నూఱ్ఱురలోఁ బనికిమాలిన నిర్భా గ్యులగు నేపదిమందియో తప్ప మిగిలినవారందరు పైతిరుగుడులోని భావకవిత్వమును బ్రత్యక్షము చేసికొనుటకే పోవుచున్నారు కదా? నేనసత్యమాడు చున్నా నని యనుచు న్నారా? ఆఁడుదాని నైదుదినములు సముద్రతీరమునకు సర్కారువారు రాకుండఁ జేసినయె డల సముద్రతీర మంతయును సహారా యెడారి యైపోవదా? మీప్రయోజకత్వ మేమున్నది? మిమ్మాకర్షించు యంత్రము లచ్చట నున్నవి. మీ ప్రక్కబారుటిగలింపులసొంపులు, మీవంకర చూపుల మెలికలు, మీతస్కరకరసంచాలనములగగుర్పాటులు, మీముద్దుల ముద్రల విద్యుల్లతలు, మీ దొంగ యాలింగనముల యద్వైతబ్రహ్మానందములు మాయుపన్యాసమైన తరువా తనే ద్విగుణీకృతోత్సాహముతో గానిచ్చుకొననచ్చును. పాపభూయిష్ఠములైన మీబ్రదుకు లెంతటివో సాక్షియెఱుఁగఁడా? మీరెంత ధనికులైనను, నెంత యుద్యోగులైనను, నెంత విద్యావంతులైనను, నెంత వర్తకులైనను, నెంత వక్తలైనను మీ కింటియొద్ద సుఖలేశమైన నున్నదా? చూచిన మొగమునే చూచి, ముద్దిడుకొనిన మూతినే ముద్దిడుకొని, పట్టినచేతినే పట్టి, పండుకొనిన ప్రక్కనే పండుకొని రుచిరచి లేని చొప్పదంటు జీలుగుబెండువట్టి గడ్డి సంసారపురోధను బడియున్న మీకుఁ బైయింటి తరవాడితోఁ బ్రాణము లేచిరాదా? ఎదుటింటి యయ్యంగారి యమ్మణ్ణిచేతి ప్రసాదము శ్రీమూర్తితీర్థప్రసాదముకంటెను స్థిరతరానందప్రదమునుకాదా? మీబ్రదుకుల కంతకును సాయంకాలమున సముద్రతీరమునఁ

గప్పగంతులలో నాకర్షణపు టీలలలో గుట్టుపు నకిలింపులలోఁ బొంచి కాచుటలలో నట్టి గ్రహించుటలలో నలికిడి ననుసరించి యిట్టి పరిహరించుటలలో మీకు నిత్య మగుచున్న కాలక్షేపపు గడియలు నాలుగే యథార్థముగఁ గృతార్థములైనవి. మీజన్మ రాహిత్యమున కెన్నఁటికైన నవియే తోడ్పడును. పురుషులైన మీకు మీసొంత స్త్రీలపై నింతనైరాగ్యము, నవ్యవ్యక్తిపై నింత యనురాగము వంటివె మీస్త్రీలకు మీయం దేల యుండఁగూడ దనుజ్ఞానము మీ కున్నయెడల నింత యవకతవకచర్య కవకాశముండునా? ఉభయపక్షముల వారు రాజీపడియుందురా యని యనుకొనఁ దగినంత మితి మీఱియున్నదే. అటులైనఁ జేఁపలశాల వెనుక నొక పక్షమువారు, మేరీపాఠశాల కెదుట నొకపక్షమువారు, విశాలరంగమునఁ జెఱియొక వైపున నేకాంక నాటకము లాడుచున్నారా? అట్టి మీమహానంద మున కడ్డురాకుండ మాయుపన్యాసము నాఱు గంటలకు లోపలనే ముగించుకొందుము. మనుష్యత్వము పశుత్వమునకు దిగిపోవునంతవఱకు మీ రానందము ననుభవింపవచ్చును.

ఇట్టి నియమశూన్యత, యిట్టి నిరంకుశత, యిట్టిపనితనము, నిట్టి దిగదీఁత, యిట్టిక్షమము, నొక్క మీనీతియందే సిద్ధించినవా? దేహశక్తి యందో మనశ్శక్తియందో హృదయశక్తియందో యాత్మశక్తియందో కొల్పమునందో గానమునందో చిత్రలేఖనమునం దో–యిప్పు డవియన్నియు నేల? సోదరులారా! ఒక్కటే ప్రార్థన–ఏవిషయమును గూర్చి యెప్పు డేవిసరువచ్చినో చూతమనుతలఁపుతో మాయందు నిశ్చలదయ గలవా రయి సారస్వతానుబంధమునకై యుత్సాహముతోఁ గనిపెట్టుకొని యుండవలయును. సారస్వతా నుబంధవిజయము మీయాదరణములలో నున్నది. కాని మావంటివారిలో లేదు. సారస్వతా నుబంధ మంత మహాదీప్తితోఁ బ్రకాశించును. మాకధికారి యగు సాక్షియొక్కతత్త్వమును నేను గొంత యెఱిఁగిన వాఁడను గావున నిట్టిమాట లనుచున్నాను. నేను గేవలము శక్తిహీనుఁడను. సాక్షి నాయందలి యనురాగముచేత సూచించు సూచనలనుబట్టి యాకాశమంత నోటితో నే నుపన్యసింతును. అదియే నాలోని విశేషము. అది లోపమందురా? మీయిష్టము. సోదరులారా! మొదటిసాక్షి యట్టె దీర్ఘముగ నుండఁగూడదు కావున సెలవు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

13. పురుష ప్రయత్నము

పూర్వం ఒకసారి దశావతారాల గురించి ఉపన్యాసం ఇచ్చిన పిచ్చిమనిషిని చూడడానికి, మళ్లీ ఏమైనా చెపితే వినడానికి జంఘాలశాస్త్రి వెళ్లాడు. ఆయన పేరు ముష్టిచిట్టి వీరయ్యశాస్త్రి. అద్వైత విద్వాంసుడు.

'పురుషకారం' గురించి చెప్పమని జంఘాలశాస్త్రి ఆయన్ని అడిగాడు. అంటే ఈప్రపంచంలో స్వతంత్రంగా మనిషి చేసే ప్రయత్న మన్నమాట. దేనిగురించైనా ప్రయత్నాలు చేస్తాడుకదా! ఫలించవచ్చు, ఫలించకపోవచ్చు.

దీని మీద వీరయ్యశాస్త్రిగారు చెలరేగి మాట్లాడాడు.

ఫలానికి పురుష ప్రయత్నం కావాలంటున్నావు. మళ్లీ, అదే పూర్తిగా చాలదు, దైవ ప్రయత్నం తోడుపడాలంటున్నావు. అంటే దైవప్రయత్నానికి క్రింద చోటుగా పద్నాలుగు సాళ్లు పురుష ప్రయత్నం ఉండాలంటావు! పూర్తిగా పురుషకారాన్నేగా గౌరవించాలి. పూర్తిగా దైవ ప్రయత్నాన్నేగా గౌరవించాలి. రెండింటిని తగలబెడుతున్నావు. పురుష ప్రయత్నం ఏమీ లేకుండా కేవలం దైవప్రయత్నాలేవీ లేవంటావా! పిడుగుపాటు, తుపాను, భూకంపం వంటి వాటికి కారణం ఎవరి ప్రయత్నం!

ప్రపంచంలో ఒకేఒక్క అద్భుతశక్తి వుంది. అదే సర్వత్రా వ్యాపించి వుంది. మిగతా శక్తే ఇన్నివిధాల బహిర్గతమవుతోంది. అంతా అంధకారం. అంతా ఇంద్రజాలం. అంతా కల. అందులో బుద్ధి వున్న వాళ్లమనుకొని స్వభావం కాని ప్రయత్నంతో మనం తిరిగే తిరుగుడు ''నిద్రలో తిరుగాడడం'' దీని మీదే మనవాళ్లు సగుణతంత్రాన్నంతా సిర్మించారు అని –ముగించాడు. మొత్తం మీద 'మానవ ప్రయత్నం' అనేది ఒక మిథ్య అని తేల్చాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! దశావతారములఁగూర్చి యుపన్యసించిన పిచ్చివానిని జూడ మొన్నను వైద్యశాల కేఁగితిని. ఆపిచ్చివాఁడు తనగది వెలుపలఁగూరుచుండినాఁడు. నన్నుఁజూడఁగనే నమస్కరించినాఁడు. ఆశీర్వదించి నెమ్మదిగా నున్నదా యని యడిగితిని. రసంత సొద్దుమి

మ్మని సంజ్ఞచేసి చేయి చాఁపినాఁడు. నాయొద్ద నస్యము లేదయ్యా యని యంటిని. ఆవలికిఁ బొమ్మను నట్లాతఁడు సంజ్ఞచేసినాఁడు. ఏదైన నుపన్యాస మిమ్మని యడిగితిని. పాడుము తీసికొనివచ్చి మరిమాట లాడవోయి ఫూల్! ఆమాత్రపు పరేంగితజ్ఞాన మక్కఱలేదా? నోరార్చుకొనిపోయినప్పు డక్కఱలకఱ్ఱ, ముక్కఱార్చుకొనిపోయినప్పుడు పాడుము, ఇంతకంటెఁ బరమహంసక్రియలు మరెక్కడివి? Well get up Right about turn March, left right left right అని యాతఁడు లేచినాఁడు గదిలోపలికిఁ బోవునేమో! పోయెనయెడలఁ దిరుగఁరాఁడేమో యని భయపడి ''అయ్యా! ఇక్కడనే కూర్చుండుఁడు. ఒక్కనిముసములో నస్యము తెచ్చి యిచ్చెదను. అని పరుగెత్తి నస్యము తెచ్చి యాతని కిచ్చితిని. రా! ఆలాగున దారిలోనికి రా. అంతే! మన మనఁగాఁ బ్రజకు గడగడ. ఆమాత్రపుఁ బటుత్వము లేకుండ నన్నికోట్ల జనమును బరిపాలించుట లేదయ్యా. ఇప్పటి ప్రజలు తమంతఁ దామే పరిపాలించు కొందురఁట! వెఱ్ఱిముండకొడుకులు! తమంతఁ దాము తినవచ్చును. తమంతఁ దాము భార్యయొద్దఁ బండుకొనవచ్చును. అంతే కాని తమంతఁ దాము పరిపాలించుకొనుట యేమోయి? మతిలేనిమాట! పరిపాలకుఁడు వేరు. పరిపాలితుఁడు వేరు. ద్వైతవిష్టాద్వైతము లంగీకరించిన యంశమే కాదా? వారిద్దఱకు భిన్నత్వమే. ఇద్దఱకు తేజస్తిమిర న్యాయమే. తాను తానునై మరియొకఁడుగూడ నగుట యెట్లు సాధ్యము? ఇందులో నున్న తిరకాసు కనిపెట్టితివా? తన్ను తా నెందులకుఁ బరిపాలన చేసికొనఁగూడదు. అది నీవు నాతో వాదింతువా? మాటలాడ వేమి? ఓ! వాదభిక్ష నిచ్చుటకు సిద్ధముగా నున్నాము. పెట్టు, నీమాధుకరపుఁజోలి యక్కడఁ బెట్టు. అదిగో పెట్టుమనఁగాను! తన్నుఁ దాను పరిపాలించు కొన్నవాఁ డెంతవాఁడయ్యా? అట్టివాఁడు పాపభూయిష్ఠమైన భారతదేశమున కర్హుఁడా? పరమపదమున కర్హుఁడా? ''అహందేహో నచాన్యోస్మి, బ్రహ్మైవాహం నశోకభాక్, సచ్చిదానంద రూపోహం, నిత్యముక్త స్వభావవాన్.''

''అయ్యా! అయ్యా! ఈపనికిమాలిన గొడవ నాకెందులకు? ఏదైన విజ్ఞానబోధ మొనర్పుఁదగు నంశమునుగూర్చి యుపన్యసింపుము. ఎంతయో ప్రయత్నముచేసి నిన్నుఁ జూడవచ్చితిని'' అని నే నంటిని.

తప్పు తప్పు, నన్నుఁ జూచుటకు నీవు ప్రయత్న మొనర్చితివా? నీవు ప్రయత్నము చేయుట! ఓ! ఎంత యహంకారివి! నీకేదైనఁ జేయుటకు స్వాతంత్ర్యమున్నదనుకొనుచున్నావా? కన్ను లెంతమీఁదికి వచ్చినవి! నీవు నన్నుఁ జూచుటకు గొప్పప్రయత్న మొనర్చితివా? సరే, మాట వరుస కొప్పుకొందము. నేను నీకొఱ కేమిప్రయత్నము చేసితి నని నీవు నాయెదుటికి వచ్చితివయ్యా? నీవైపునఁ బ్రయత్నము కావలసినపని నావైపున నప్రయత్నముగ నేల యయ్యెను. పరమార్థ మేమనఁగ నిద్దఱివైపునఁగూడఁ బ్రయత్నమే లేదు. ప్రయత్నము చేసితినని నీయందుఁ గర్తృత్వమును బుద్ధిహీనుఁడవై యారోపించుకొనుచున్నావు. దైవశక్తి మహిమను నమ్మి నేను కిమ్మనకుండ నూరకుంటిని.

''అదేమి? అదేమి? ప్రయత్నము లేకుండ కార్య మెట్లగును? పురుషకార మని వినియుండలేదా'' అని నే నంటిని.

పురుషకారమా? స్త్రీకారముకాదేమి? అర్థములేని మాట లావలికిఁ ద్రోచివేయవోయి! వైష్ణవసంప్రదాయపుఁ జచ్చుమాటల ద్వైతసిద్ధినొందినవానియొద్ద నఁటోయి! చిత్రాన్నము

చిట్టిగారెలు రాగభోగాదులు పవళింపుఁగైంకర్యములు శ్రీపుష్పయోగములు సేవాకాలములు వైష్ణవ మతమున కక్కఱకువచ్చును గాని పరమార్థనిశ్చయమున కక్కఱకు వచ్చినఁటోయి.

పదము

దాసురాల రా రమ్మఁడియేన్ దానీ నను మనిరే,
భాసురాంగితిరుమంత్రము చెప్పెద పఠనసేయుమనిరే ॥ గోవిందా ॥
ముద్రధారణముచేసెద మని పెద్దముసుఁగువైచినారే
ముసుఁగులోననా.....హే హే హే!

ఏలాగు? ఆమాత్రపు రక్తి లేకపోయినతరువాత మత మెందులకోయి? ఏడువను, మొత్తుకొనను! మా శిష్యురాండ్రలోఁ బుణ్యస్త్రీ వితంతు భేదము లేదు.

వితంతుత్వనువాసినీత్వములు బహిరాగతములు కాని వస్తుతత్త్వమున నున్నవి కావు. ఒక్క స్త్రీత్వమే అచ్చాణియైన స్త్రీత్వమే–కమ్మి కలితి లేని స్త్రీత్వమే–స్వయంభువైన తత్త్వము. జ్ఞానులమైన మనకుఁ జేతాళములు పనికిరావు. అందుచేత మనము ''సర్వం ఖల్విదంబ్రహ్మం'' న్యాయముచేత–

అంతటితో నాఁగవయ్యా! దిక్కుమాలినధోరణిలోఁ బడిపోవుచున్నావు. పురుషప్రయత్నము పూర్తిగ లేదని చెప్పినావు. ఆసంగతి నిర్ధారణచేయఁగలవా! వెఱ్ఱిధోరణిలోఁ దిరుగఁబడిబోకుండ నిదానముగ–

ఉండు–అయ్యో–ఉండు మనఁగాను–''అద్వైతశాస్త్ర ప్రవీణుఁ డైనట్టి ముష్టి చిట్టివీరయ్యశాస్త్రిగారికి వెఱ్ఱిధోరణి పూర్తిగా నశించినది. ఇకఁ బదునైదుదినములలో వైద్యశాల నుండి యాతఁడు పోవచ్చును''అని డాక్టరుగాడు మనకిచ్చిన యోగ్యతాపత్ర మాగోడమీఁద నున్నది. చూచుకో. ఈడాక్టరుగాడిదె కిప్పుడు తలతిక్క తీసినది. నాకు మతిపోలేదు. నాకేవిధమైన జబ్బు లేదురా. నన్ను బాధ పెట్టకురా యని పదునాల్గుసంవత్సరముల నుండి చిలుకకుఁ జెప్పినటు చెప్పుచుంటినే! వీఁడు నామాట లక్ష్యపెట్టినాఁడా! ఉహు! పిచ్చియాసుపత్రి యనఁగా, పిచ్చివారి రోగమును కుదుర్చు నాసుపత్రి యని యర్థము కాదు. పిచ్చిడాక్టర్లుగలయాసుపత్రి యని యర్థము. వాఁడిచ్చిన యోగ్యతాపత్రమును జూచి నే నేమంటినో యెఱుఁగుదువా? నాకుఁ బిచ్చి లేదని నీవు చెప్పుటచేత నీకుఁ బిచ్చిలేదన్నమాట నామూలమున సిద్ధాంతపడినది. కావునఁ బిచ్చిడాక్టరు లుండవలసిన వైద్యశాలలో నీవుండ నేల? మన మిద్దఱము కలసియే యావలికిఁ పోదము రమ్మని యంటిని.

''నాకీ సోదె ఏమియు నక్కఱలేదు. పురుషప్రయత్నమునుగూర్చి చెప్పుదువా లేదా'' యని యంటిని.

నన్ను బెదరింతువా? Nonsense, డాక్టరు ముండకొడుకు కొరడాదెబ్బలకు లక్ష్యపెట్టని వీరాగ్రేసరుడ నని యెఱుఁగవా? ఆపనికి మాలినవాని యోగ్యతాపత్రమును నేను గౌరవింతునా? నే నిక్కడనే యుందును. నన్ను వాఁ డేమిచేయునో చూతును. ఈనడుమ నొక్కయత్యంత చిత్రమైన యంశము జరిగినది సుమా.

''నీవిచిత్రాంశము నాకక్కఱలేదు. పురుషప్రయత్నమునుగూర్చి చెప్పుదువా పోవుదునా'' యని యడిగితిని.

బాబూ! నామాట విని యుండుము. ఈయొక్కటిమాత్రము వినుము. అటుపైని నీయిష్టమువచ్చిన యంశముపై B.N.R. పొగబండికూఁతతో నుపన్యసింతుము. రవంతసేపు బాబూ! శాంతింపుము. ఏమైన దనఁగా, ఈనడుమ నీడాక్టరు వీథివెంటఁ బోవుచుండఁగా నొకయింటిలో నొకయాఁడుది యేడ్చుచున్నట్లు వినవచ్చెను. ఆతఁడు లోనికిఁ బోయి చూడఁగ నొకమునలి వితంతువు మంచమునొద్దఁ గూరుచుండి యేడ్చుచుండెను.

సీ. ''అంతంత మొగములై యంతంతలొమ్మలై
యంతంత యుదరంబు లైన వింత
యాకారములతోడ నేకుముక్కలవలెఁ
బలుచపల్చని వెలవెలలతోడ
నిదురమబ్బులతోడ నిట్టూర్పుబుసతోడ
నీరుపట్టినకాళ్ల బూరతోడ
మెల మెల్ల నెదురీఁత యలపుల సొలపుతో
గాజుకాయలబోలెఁ గానఁబడుచుఁ
గుత్తుకుత్తను''.....చున్న యొక్క చక్కని వ్యక్తి నచ్చటి మంచమునైఁ గాంచెను

"What is the matter" అని వైద్యుఁ డామునలిదాని నడిగెను. ఏమియుఁ దెలియక యామె మరింత యేడ్చెను. అప్పు డా వైద్యుఁడు చేయి చూచి నవమాసస్ఫూర్తియైనట్లు ప్రత్యక్షముగఁ గానఁ బడుచున్న కడుపునకుఁ గుడివైపునఁ జివిలో నొకగొట్టము పెట్టుకొని రెండునిముసములు నిదానించి 'వెంటనే midwife ను బిలిపింపుము. మరేమియు భయము లేదు. ఇది మొదటి కానుపే కాదా'' యని యడిగెను. ఔను నాయనా! ఇది మొదటి కానుపే తరువాత నన్నియు గంగలోఁ గలిసినవి కావా యని తన కానుపులసంగతి చెప్పి మాట లేదు, చూపు లేదు, రక్షింపు మని యామునలి దాతని కాళులపైనఁ బడి యేడ్చెను. ఒక్కజామునకు delivery అగు ననఁగా నొందఱి కిట్టి fits వచ్చును. తొందరలేదు నేను బోయెదను. అని చెప్పి యాతఁడు పోయెను. హె హె హె ఎంత విచిత్రము! ఎంత విచిత్రము!

''అంత నవ్వెదవేల? ఇందుల నేమి విచిత్రమున్నది. నీ మొగము'' అని నే నంటిని.

ఉండవోయి dunce చెప్పుచుఁడఁగా నంతతొందరపడెద వెందులకు? ఆమంచము మీఁద నున్నదని చెప్పఁబడిన వ్యక్తి మగవాఁడు కాని యాఁడుది కాదు. వాఁడా మునలిదాని కొడుకు. వాఁ డూరిలోఁ బ్రచురించిన ''శ్రీరామజనన'' నాటకములోఁ గౌసల్యపాత్రమును ధరించి, సొమ్మి రాకపోవుటచేత నాటకము మానినైచి చెడఁద్రాగి యుండుటచేత వేనము తీసివేసికొనవలయునను జ్ఞానములేక యిట్లు చేరుసరికి మైకము హెచ్చగుటచేత నిశ్శే తనుఁడై మంచమునైఁ బడిపోయెను. చూచితివా పాశ్చాత్యవైద్యులపస! ఇంగ్లండులోఁ గృతార్థుఁడై వచ్చిన వానిగతి యిది. ఈకీడును బాపుకొనుటకు పీఁడేమి చేసినాఁడో యెఱుఁగుదువా? కలకత్తాకు వ్రాసి ''కలియుగ ధన్వంతరి'' యను బిరుదమును పదుమూఁడు రూపాయలకు వి.పి. గాఁ దెప్పించినాఁడు. భగవదవతారమని చెప్పఁబడి ధన్వంతరి నెట్టివానిని జేసినారు! మతియున్న వాఁడో, మతిలేనివాఁడో యెఱుఁగని మతిలేని వానిని జేసినారు. గొంగళి పురుగునకుఁ గుక్కకుఁ గ్రోఁతికి స్వభావసిద్ధముగఁ దెలిసిన

స్త్రీ పురుషభేద మెరుఁగని మూఢశిరోమణిని సార్వభౌమునిఁ జేసినారు. జ్ఞానశూన్యు లగువారికి బిరుదము లిచ్చి ప్రాచీనమహావ్యక్తులపరువును బరశురామప్రీతి యొనర్తురా యని వంగదేశ పరిషత్తువారికి నేను తెలియఁ బరుపఁగా–

ఈపనికిమాలిన గొడవ నా కెందులయ్యా నే నడిగిన పురుష ప్రయత్నమునుగూర్చి చెప్పుమని యంటిని.

ఏరే–కాచికో! నీవు ప్రయత్నించి, నీయూపిరి తిత్తులలోని కన్పుబున్సుల నాఁపగ లవా? హృదయకోశమునందలి తాళప్రసారమును గట్టివేయఁగలవా? నీవు పుట్టితివిగదా –నీపుట్టుకకు నీ వేమి ప్రయత్న మొనర్చితివో యెఱుఁగుదువా? నీమరణమున కెట్టి ప్రయత్నముఁ చేయఁదలచియున్నావో? ఎవ్వఁడైన గష్టమును కోరుకొనునా? దారిద్ర్య మును కోరుకొనునా? చెప్పఁగలవా? చావు కోరుకొనునా? జీవునకు ప్రధానవాంఛ యేది? న్వసౌఖ్యము. అప్రయత్నముగా భూమిపైఁ బడినదిమొద లప్రయత్నముగాఁ గాటిలోఁ బడువఱకు నర్వస్థల సర్వకాలనర్వావస్థలయందుఁ జేయుప్రయత్న మంతయు న్వసౌఖ్యము నకే కాదా? చావు దప్పించుకొనవలయు ననిపుట్టినది మొదలు ప్రయత్నముఁ జేయుజీవుఁడు చావుకొఱకే ప్రయత్నించు చున్నాడు కాదా? చావువంకకే పరుగెత్తుచున్నాఁడు కాదా? ఇంకను బ్రయత్న మని, ఫలమని యేల వెఱ్ఱిపడుదువు? ఇంతకాలమునుండి న్వరాజ్యసంపాద నప్రయత్నము జరుగుచున్నది కదా! ఇప్పటి కేమైనది. మన లెక్క యేమి. భగవానుఁ డైన శ్రీకృష్ణుఁడు కౌరవసభకు సంధి కొఱకుఁబోయి యేమి చేయఁగలిగినాఁడు?

"అయ్యా! చదువుకొననివాఁడు వాదించునట్లు వాదించుచున్నావు. నేను జెప్పిన దే మనఁగా, ఫల మున్నప్పుడు ప్రయత్నముండి తీరవలయును. ప్రయత్న మున్నచోట నెల్లప్పుడు ఫలము లేకపోవచ్చును. ఎందుచేత ననఁగా నెంత పురుషప్రయత్న మున్నను దైవసాహాయ్యము లేనియెడల నాప్రయత్నము ఫలింపదు. పురుషప్రయత్నము పదునాల్గు పాళ్లు, దైవప్రయత్నము రెండుపాళ్లు" అని నేనంటిని.

ఈమాత్రపుబుద్ధి, యీమాత్రప్రుఁజదువు, యీమాత్రపువాదన శక్తి నాకు నున్నవి. సాక్షిసంఘములోని ప్రథానవావదూఁకుడ నని కన్నులు నెత్తి మీఁదికి వచ్చినవి. జాగ్రత్త! ఇక్కడ నే ననుదినము నంతరిక్షమున నవతరించిన యాదిత్యులసభలో నధ్యక్షుఁడనై యుపన్యసించు చున్నాను. త్రినేత్రి, సహస్రనేత్రాదులు ప్రత్యక్షములైన పంచ భూతములతోఁ గిక్కురు మనకుండ వినుచున్నారు. నీయుపపాదన మేదో నాకుఁ దెలియకపోలేదు. నాపూర్వ పక్షమైఖరి నెఱుఁగకుండ మాటలాడుచున్నావు. మొదట నీ వేమంటివి? ఫలమునకుఁ బురుషప్రయత్నము కావలయు నని యంటివి. ఇప్పుడే మనుచున్నావు? పురుష ప్రయత్న మునకు దైవప్రయత్నము తోడుపడవలయు ననుచున్నావు. ఎంతపురుషప్రయత్న మున్నను దైవప్రయత్నము లేకుండ ఫలము లేదనుచున్నావు. అనఁగా దైవప్రయత్నమునకుఁ బదునా ల్గుపాళ్లుపురుష ప్రయత్నము బోటుగాఁ గ్రింద నున్నఁగాని ఫలము లేదని నీయభిప్రాయము. గౌరవించినయెడలఁ బూర్తిగాఁ బౌరుషము నైన గౌరవింపుము. లేదేని దైవమునైన గౌరవిం పుము. అట్లు చేయక రెంటిని దగులఁబెట్టుచున్నావు. పురుషప్రయత్నమే లేకుండఁ గేవలము దైవికము లున్నవా, లేవా? వీథివెంటఁ బోవుచున్న యొకమునలిదానిపైఁ బిడుగుపడినది. ఇది కేవలము దైవిక మందువా? పదునాల్గుపాళ్లు పౌరుషముతో మేళవించిన దైవికమందువా?

ఇది దైవికము కానియెడలఁ బిడుగు పాటునకై ప్రయత్నించినవాఁ డెవఁడు? మేఘుఁడైన ప్రయత్నించె నని చెప్పఁగలవా? పోనీ–ఆవీథి నామునలిది యానమయమున బుద్ధిపూర్వక ముగా నడచుటచేత దాని చావునకు నారీతిగఁ దానే ప్రయత్నించెనని చెప్పఁగలవా? దైవికము లున్న వని యెప్పుకొందువా, లేదా? ఇట్టివే కొన్ని తుపాను, భూకంపము, వహ్నిపర్వతనం క్షోభము మొదలగునవి యున్న వని యెప్పుకొనవలయు నని గొణుఁగుకొనుచున్నావా? నీబుద్ధి కందని విషయములలో నీశక్తికి మించిన సన్నివేశములలో నత్యద్భుతములై, యనిర్వా చ్యములై, యగ్రాహ్యము లగువిషయములతో మాత్రము ముక్కుచు, మూల్గుచు దైవిక మని యెప్పుకొని నీచచ్చుచచ్చున్నర కుంటి; గ్రుడ్డి, మూఁగ బుద్ధికందిన వంట పెంట గుడ్డగుడుసు వ్యాపారములలో–ఓ చెలరేఁగి, నాప్రయత్నము పదునాల్గు పాళ్లకు రవంత దైవము తోడుపడునెడల నఖిలైహికకార్యములు నేను చేయఁగల నని వీథులవెంట నోండ్రపె ట్టుచు పరగడలు ద్రొక్కుచుంటివా? నీవింత దైవశక్తిద్రోహి వగునందులకు నీనాలుకఁ గోయింపవలదా? పోనీ–సాంసారికకృత్యములలో నైన నీ వనునట్లు నీప్రయత్నమునకుఁ గృతార్థత కలుగుచున్నదా? నీకళ్యాణమునకు నీవే కన్యాన్వేషణ మొనర్చితివే –జ్యోతిషికపండితుఁడవైన నీవే జాతకపరీక్ష జేసితివే–నీవేకన్యాపూర్వ సంప్రదాయముల నెల్ల దడవితివే–అది మహాపతివ్రతయగు నని దానిఁ బెండ్లాడితివే–అది చపలయై చెలరేఁగి, జారులవెంట స్వారిపోవుచున్నదికదా. నీవు పురుషప్రయత్నముచే దాని నాఁపఁగలిగితివా? పాపము. నీపదునాల్గుపాళ్ల పురుషప్రయత్నమునకు దైవము రెండుపాళ్లతోఁ దోడుపడకపోవు టచేత నిట్లయిన దని లోలోన నేడ్చుచున్నావా? ఆలాగా? నీభార్య సైయాటలాడుట పరపురుషులకేకాక పరదైవమునకుఁ గూడ నిష్టమే యని యభిప్రాయపడుచున్నావా? దైవమే యామెను తప్పుతిరుగుడులలోఁ ద్రిప్పుచున్నా డనికూడ నమ్ముచుంటివా? అటులైన నింక నాలస్య మేల? పట్టు–మట్టిగిడిసలవంటి పదునల్వురుముండలను సంపాదించు బారుకొ ట్టులు గట్టి వారి నందు విడియింపుము. నల్గురు తార్పుడుకాండ్రను నియమించు. ఈధనమహోత్సవమదినములలో నేడు రూపాయల జీతముపై బి.ఎ. గాఁడు వచ్చును కాని –యూరూర చాటింపించు పత్రికలలోఁ బ్రకటించు సోదరీ మానవిక్రయమహనీయుఁడవై కోటీశ్వరుఁడవై మానవజాతికంతకు మేటికిరీటమువలె–

చీ! ఆఁగు అంతటితో నాఁగు. నీవాదమైఖరి నాకేమియు బోధ కాలేదు. అంతయు దైవమే యందువా? అటులైనఁ బుణ్య మేమి? పాప మేమి? స్వర్గమేమి? నరక మేమి? బుద్ధిస్వాతంత్ర్య మేమి? నడవడి నూటియేమి? జాతీయన్యాయమేమి? మనుష్య విధి యేమి? నాపిండ కూడేమి? నల్లమడు గేమి? బుద్ధిహీనుఁడనై నీయొద్దకు వచ్చితిని. నేను బోదును అని నే నంటిని.

ఉండవోయి Nonsense ఆఁగవోయి! Idiot! నీవు బుద్ధిహీనుఁడవను మాట సత్యము. నీవే కాదు నీతోడి ప్రజ లందరు బుద్ధిహీనులు–బుద్ధిహీనుల రగు మీరు బుద్ధిమంతు లని భ్రాంతిపడుటచేత మఱింత బుద్ధిహీనులు. పశుపక్షికీటకాదులైన యితర ప్రాణులు మీయంత బుద్ధిహీనములు కావు. మీరు చెట్లకంటె బుద్ధిహీనులు. చెట్లెదుగుచున్నవా లేదా? ఏ ప్రయత్నముచేసి యెదుగుచున్నవి? ఇంతకు మఱ్ఱిగింజ యెంతో! మఱ్ఱిచెట్టు యూరం తయు నూడలతో నాక్రమించుచున్నది కదా! ఏమి ప్రయత్నముచేసి యట్లెదుగుచున్నది.

ఏమి ప్రయత్నమొనర్చి చచ్చుచున్నది. తన ప్రయత్న మక్కఱలేదు. ఇతరుల ప్రయత్నలేశ మైన నున్నదా. దానిలోని పురుగులు నీళ్లలోనిపురుగులు ఏమి ప్రయత్న మొనర్చి జీవించుచు న్నవి? ఏప్రయత్నలోపమునఁ జచ్చు చున్నవి. ఇటులే పైజంతువులకుమాత్ర మేల కాదు? ఏజంతువుకూడ స్వప్రయత్నమునఁ బుట్టదు. ఏజంతువుకూడ స్వప్రయత్నమున నెదు గదు. స్వప్రయత్నమున నశింపదు. ప్రయత్నమే లేదు. ప్రయత్నించుట కుద్దేశమైన లేదు. ప్రయత్నించుటకు స్వతంత్రతయే లేదు.

చూచితివా? ప్రపంచమున నెచ్చటనయిన నత్యద్భుత మయిన శక్తి, యవాచ్య మయినశక్తి, యవర్ణ్య మయినశక్తి లేనియంగుళము అరయంగుళము అంతవఱకుకూడ నెందులకు? ఒకచుక్కయంత స్థలమయిన లేదు. ప్రమాదవశమున నోటనుండి జారినతుం పర రేపు అట్లాంటికు మహాసముద్రమున నుండి బయలుదేరిన యావిరితోఁ జేరి యమెరికాలోని వర్షముల కాధారము లయిన యబ్దమండలముల కాదికారణమగుచున్నది. ఆశక్తియే చంపించుచున్నది. పుట్టించుచున్నది. పెరిఁగించు చున్నది. త్రిప్పించుచున్నది, తనలోఁ గలుపుకొనుచున్నది. తిరుఁగ దనలోనుండి మరియొకరూపమున మరియొక పరిస్థితిని తీయించుచున్నది. సాగించుచున్నది. మరల గుణించుచున్నది. టప్పుమనిపించు చున్నది. ఇంతకంటె మనుష్యస్థితి యెక్కువకాదు కాదు కాదు. మనుష్యునికి బుద్ధియున్నది కాదా? అందుచేతఁ బ్రయత్నము చేయుచున్నాఁ డని చెప్పుదువా? బుద్ధి యెక్కడ నుండి మనుజునకు వచ్చినది? పురుగునుండి వచ్చినదా? చెట్టునుండి వచ్చినదా? చేపనుండి వచ్చినదా? మృగమునుండి వచ్చినదా? క్రిందివారి కెవ్వరికిలేని యీతత్త్వము మనుజుని కెటనుండి వచ్చినది? మనుజుఁ డితర జంతువులవలెనే బుద్ధిహీనుఁడు. మనుజుఁ డక్కడకు వెళ్లినా ననుచున్నాఁడు. ఇక్కడకు వచ్చినా ననుచున్నాఁడు. ఇన్ని గంటలకు భుజించెద ననుచున్నాఁడు. ఇన్నిగంటలకు నిద్రించెద ననుచున్నాఁడు. అక్కడ ననఁగా నేమో, యిక్కడ ననఁగా నేమో, గంట అనఁగా నేమో, కాలము అనఁగా నేమో చెప్పఁగలఁడా? స్థల మనఁగా నేమి, కాలమనఁగా నేమి, స్థలము కాలము బాహ్యాస్తములే యని కొందఱనుచు న్నారు. స్థలమనఁగా ననన్నిస్థలము లని కొందరు ఱనుచున్నారు. ఇన్నిస్థలము లెక్కడివి? ఉన్నదొక్కటే స్థలము. అది మనకు వెలుపల లేదనుచున్నారు. ఎక్కడ నున్నదని యడుగ నది మనస్సులోని యభిప్రాయ మనుచున్నారు. ఇక్కడకు తేలినది. కందస్వామియాలయ మునకుఁ గపాలేశ్వరునియాలయమునకును దూరము మదరాసులోనిది కాదు. నీతలకాయ లోని దనుచున్నారు. ఇటులే కాల మనఁగా ననన్నికాలము లనుచున్నారు. భూతభవిష్యద్వర్త మానముల భేదము చచ్చినది సరేకదా! పగటిరాత్రి భేదముకూడ భగ్నమైనది. తుట్టతుదకుఁ గాలము కూడ మనస్సులోని యూహయనుచున్నారు. అటు లయిన ''ఎక్కడ''కు ''ఎప్పుడు''కు భేద మే మున్న దని యడుగఁగా లేకపోయిన లేకపోవచ్చు ననియనుచు న్నారు. ఈస్వల్పాంశమునుగూర్చియే మనుజుని యజ్ఞాన మింత గాటమైనప్పుడు మనస్సు నుగూర్చి, యాత్మనుగూర్చి యడుగ నేల?

మనుజుఁడు మహామందుఁడు! బుద్ధియున్న దనుభ్రాంతిచేత మఱింత బుద్ధి హీనుఁడు. సృష్టినంతయు నాక్రమించిన యద్వితీయశక్తి కెండిపోయిన యా కెంత యధీనమై చచ్చినట్లు దాని విసరునఁ బోవుచున్నదో మనుజుఁడుకూడ నాయసారశక్తికిఁజచ్చినటులే

నెక్కువగ నధీనుఁడై దాని వినరుచే నెగురుచు నేను విలాసముగా విహరించుచున్నానని తనప్రయత్నమును గొనియాడుకొనుచున్నాఁడు. దాని మరియొక వినరుచే నుత్తరక్షణమున సముద్రతరంగమునఁ బడి చచ్చితి నయ్యో దైవశక్తి నాప్రయత్నమునకుఁ దోడువడలే దని యేడ్చుచున్నాఁడు.

అద్వితీయమైన యాశక్తిలో ననేకశక్తులు లీనమైయున్నవి. ఒక్కటి పుట్టించుశక్తి యొకటి వృద్ధిశక్తి, యొకటి క్షయశక్తి, యొకటి వికాసశక్తి, యొకటి సంకోచశక్తి, యొకటి బహుమానశక్తి, యొకటి శిక్షణశక్తి, ఒకటి యానందశక్తి, యొకటి దుఃఖశక్తి, ఇట్లు యనేక కోటుల శక్తులున్నవి. ఇవి యన్నియు వేరుకావు. పరాత్పరుని శక్తి యిన్ని విధములుగా నగుచున్నది. ఆశక్తి కధీనుఁడై సముద్రముమీఁది నురుగువలె, గాలిలోఁ బరమాణువువలె బానినయై కొట్టుకొనిపోవు మనుజుడు Chance చేత ననుకూలశక్తి వినరులోఁ బడినయెడల నప్రయోజకత్వమని యెగురుచున్నాఁడు. ఆ Chance చేతనే యననుకూల శక్తి వినరులోఁ బడినయెడలఁ బ్రారబ్ధమని యేడ్చుచున్నాఁడు. ప్రారబ్ధము కాదు. ప్రయోజకత్వము కాదు. మనుజుఁ డస్వతంత్రుఁడు. అప్రయోజకుఁడు. మహాశక్తి కధీనుఁడై పోవువాఁడే కాని వేఱు కాదు కాదు.

గీ. కుక్కగొడుగులవలెఁ బుట్టి క్రుంగు మనము
ప్రాక్తనప్రకృతిగతి ప్రవాహ మద్ది
పఱతుమే? బుద్బుదములట్లు? పైన నూఁగి
యెటనొ టప్పన కుండఁ బ్రేలుటయె కాక.

గీ. వస్తు యాధార్థ్య మెఱుఁగక వస్తువునకు
నేదొ సంజ్ఞను మనముంచి యెరిఁగినట
లల్లాడుదు మిది యంత యైంద్రజాల
మందు దుముకులాడెడుబొమ్మలాట కాదె?

గీ. స్వప్నమునకంటె స్వప్నమై సత్యముగను
మాయకును మాయ యగుచు నమ్మకము గాఁగ
శూన్యములకంటె శూన్యమై సుస్థిరముగఁ
గనఁబడెడు దీని నే మని యనఁగవచ్చు?

అంతయు నంధకారము. ఆ యంధకారములో నింద్రజాలము, అందులో నిద్ర. ఆనిద్రలో స్వప్నము. ఆస్వప్నములో బుద్ధిమంతుల మనుకొనిచేయు నస్వభావప్రయత్నము లచేతఁ గలిగిన Somnambulism (నిద్రలో తిరుగాడుట) ఇట్టి మహాదురవస్థలో మనమున్నా మనము లిచ్చు చున్నాము. గ్రంథముల వ్రాయుచున్నాము. అందుచేతనే యవి యన్నియు నొక్క వస్తువునుగూర్చి యైన యథార్థజ్ఞానము నీయకుండ నున్నవి. అన్నియుఁ బరశురామ ప్రీతి కర్షములు. వేనవికాల మైననేమి? వేయ వోయి చలిమంట వేయవోయి! ఇదియే పరమార్థము. దీని మీఁదనే మనవారు నగుణతంత్ర మంతయుఁ గట్టినారు. అది యంతయు పట్టి మిథ్య. ఇదియే పరమార్థము. దీనిఁగూర్చియే చిరకాల మాలోచింపఁగ నాకు మతిపోయిన

దని యిచ్చటికిఁ దెచ్చినారు. నే నింటికిఁ బోవుదును. నీవు నాకుఁ బ్రతినిధిగ గదిలోఁ గూర్చుండఁగలవా యని యడిగెను.

నే నూరకుండుసరికి Faithless fool అని నన్నుఁ దిట్టి తానే గదిలోనికి పోయెను.

ఇతఁడు తప్పుదారిని బడకుండ కొంతసేపటినుండి యుపన్యసించుచున్నాఁడు. పిచ్చి చాలభాగము కుదిరినది. అప్పుడప్పుడు రవంత కనఁబడుచున్నది.

ఇతని యుపన్యాసమునుగూర్చి నే నిప్పు డేమియుఁ జెప్పను. ఆలస్య మైనది. క్షమింపవలయును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

14. అస్పృశ్యత

అంటరాని తనాన్ని గురించి ఎవరో పంపినఒక వ్యాసాన్ని సాక్షిసంఘానికి పంపారు. దానిని జంఘాలశాస్త్రి చదివి వినిపిస్తున్నాడు.

అస్పృశ్యత, చెప్పరానితనం–అనే రెండు లక్షణాలు ప్రపంచంలో ఏదేశంలోనూ లేవు. ఒక్క భారతదేశంలోనే వున్నాయి. భారతీయుల మనస్సులో వున్న రెండుకళ్లలోనూ రెండు పువ్వుల్లాగ వున్నాయి.

బ్రాహ్మణుడైనానరే, అంటరానివాడైనా నరే, జ్ఞానసంపన్నుడైనవాడే తనకు గురువని శంకరాచార్యులవారు చెప్పారు. పూర్వ మహానుభావులందరుకూడా పంచముల్ని ముట్టుకుని, ముట్టుకున్నాడని సంతోషించి కృతార్థులయ్యారు. అంటరానితనం అనేది చండాలత్వంలో లేదు, భగవద్భక్తి, విద్య, వున్న చండాలుడు పూజ్యుడే. పరమార్థజ్ఞానంలేని బ్రాహ్మణుడే అంటరానివాడు.

అటువంటి పూజ్యులు ఇప్పుడెక్కడ వున్నారనే ప్రశ్నవద్దు. అలాంటి చండాలురూ లేరు; బ్రాహ్మణులూ లేరు. అయితే, మీమొగాలకు తగిన చండాలురు ఇప్పుడున్నారు. వారికి మీరేం చేస్తున్నారు? చండాలుర్ని అస్పృశ్యులుగా మనపూర్వులు భావించలేదు. బ్రాహ్మణుడెవరో, చండాలుడెవరో, బుద్ధుడు విభాగంచేసి చూపించాడు.

సహగమనం, వైధవ్యపాలనం, రజస్వలానంతర వివాహం, సీమవెళ్లిన వారిని బహిష్కరించడం, దేవరన్యాయం–వంటి అన్యావసర ఆచారాలు పోయినట్టే, అంటరాని తనం కూడా పోవాలి. పోయినవన్నీ బాహ్యాచారాలు. మతానికి ప్రధానాలు దయా, సత్య, శౌచాలు, స్వార్థ రాహిత్యం అనేవి. పంచములుచేసే చాకిరీ, వారుచేసే ఉత్పత్తులు పనికివచ్చి వారిని ముట్టుకోవడం పనికి రాదా! ఈ అస్పృశ్యత అవశ్యం నశించాలి–అని ఆ ఉత్తరం సారాంశం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నాయనలారా! అంటరానితనమును గూర్చి యెవఁడో యొక యనామకుఁ డొక వ్యాసము వ్రాసి సాక్షిసభలోఁ జదువు మని పంపినాఁడు. దానిని జదువుట కనుమతి నీయవలయును.

నేను శుత్రు లెఱింగిన వాఁడను కాను.. న్మృతు లెఱుఁగను. శాస్త్రములు చదువలేదు. (ఏమియుఁ జేతకాని వాఁడవుకదా, నీ కుపన్యాన మేల నోరు మూసికొని యుండలేకపోయి నావా అని సభలోఁ గేకలు) ఈకాలమున నస్పృశ్యతను గూర్చి యందఱు చెప్పుచుండఁగా నాకుఁగూడ బుద్ధి పుట్టినది. (అంటరానితన మంటురోగముఁటయ్యా అని సభలోఁ గేకలు) ప్రపంచమున నితరజాతు లన్నియు వారివారి వర్తక వ్యాపారములు, వ్యావహారికధర్మములు, రాజకీయతంత్రములు, కళాభివృద్ధిమార్గములు, ధనసంపాదనతంత్రములు నిర్వహించుకొనుచుండఁగా మన మేమి చేయుచున్నాము? మన విద్యలను బైవారి కంటఁగట్టి, మన ధనమును బరులయొడిలోఁ బోసి, మన యాధిక్యమును మన్ను చేసికొని, మనప్రభుత్వమును బానిసతనము క్రింద మార్చుకొని, మనుష్య స్వరూపములతో మాత్రమే చచ్చినకంటె నెక్కువ హీనపుబ్రదుకును బ్రదుకుచు నీ యధమత్వములో నీయధమాధమత్వములో నీకంటె నే నెక్కువ యని నేను మడి యని నిన్ను మట్టుకొనిన నే నొడలు గోయించుకొనవలె వని, నేను మోక్షార్హుఁడ నని నీవు చెప్పరానివాఁడ వనియు, నితరజాతులు వినిపోదురేమో యని సిగ్గుబిడియములులేక, మానాభిమానములు మంటఁబెట్టి సభలలో వాదించుకొనుచున్నాము. పత్రికలలోఁ బ్రచురించుకొనుచున్నాము. అన్నియుఁ బేఁడలోని పురుగులే యైన ప్పుడు, ప్రక్కనున్న పురుగుకంటెఁ బైనున్న పురుగు ఘనత, గౌరవము, ప్రశస్త్యము, పరమయోగ్యత, యధికము లనవచ్చునా? అజ్ఞతములైన యర్భకులు సైతను నిట్టి యవాచ్య చర్యల కధీను లగుదురా?

అస్పృశ్యత, చెప్పరానితనము—ఈస్థితిమాత్రము ప్రపంచమందున్న దేశములలో నొక్క భారతదేశమునందు మాత్ర మున్నది. అమెరికాదేశస్థులుఁ నీగ్రోల నిట్లు హీనముగాఁ జూచుచున్నారని చెప్పుదురు. కాని యింత పాపము, యింత ఘోరత, యింత మూర్ఖత, యింత క్రౌర్యము మనదేశమందే తక్క మఱి యెచ్చటను లేవు. అంటరాని తనము చెప్పరానితనము నను నీ రెండు మాటలు నొక్కభారతదేశ సారస్వతమునందే యున్నవి. ప్రబలమైన మన యజ్ఞానమున కివి ప్రచండ నిదర్శనములై యున్నవి. భారతీయుల మనస్సులలో నున్న రెండు కన్నులలోను నివియే రెండు పూవులై యున్నవి.

మనపూర్వ్ లెట్టివారో, మనదేశ మెట్టిదో యీ సందర్భమున రవంత చూచుకొనవల సియున్నది కాదా? లోకమున కంతకును జ్ఞానతేజస్సును ప్రసాదించినవారు మనపూర్వ్లు. తత్త్వజ్ఞాననిశ్రేణికపై మనవా రెక్కినయెత్తుపఱకుఁ దల లెత్తిచూడలేక కన్నులు దిరిగిపోవఁ బాశ్చాత్యతాత్త్విక విద్వాంసులా నిచ్చెన యడుగు మెట్టుదగ్గఱఁ గూలఁ బడియున్నారు. ఒక్కకళయందుఁ గాదు, ఒక్కశాస్త్రమందుఁ గాదు. అన్నిటియందుఁ గూడ మన పూర్వ్లు పరమావధియైన పరమార్థమును గనుఁగొనివారు. అత్యంతతపోనిష్ఠాగరిష్ఠతచే మనపూర్వ్ లగ్ని తేజస్సుతోఁ బ్రకాశించెడివా రగుటచేత వారంటరాని వారని చెప్పవచ్చును. వారియోగ్యతను గూర్చి చెప్పినతరువాత, నానోటితోడనే యితర జాతులను గూర్చి చెప్పఁగూడదు. కావున వారు చెప్పరానివారైరి. అంటరాని చెప్పరాని మాటల కర్థమిది కాని మఱియొకటి కాదు.

అట్టివారి సంతతివార మైన మన మిప్పు డెట్లున్నాము? ఒకరు చెప్పనేల? మనకే తెలియును? లోకమున కంతకంటెఁ దెలియును. ''విద్యావినయసంపన్నే బ్రాహ్మణేగని

హస్తిని'' అని శ్రీకృష్ణదేవులానతిచ్చినారు. బ్రహ్మజ్ఞానసంపన్నుఁడైన బ్రాహ్మణునికిని, నీచజంతు వైనకుక్కకును, దానిని దినుజండాలునకును బరమార్థమున భేదము లేదని చెప్పినారు. అట్టిభేదముఁ జేయువాఁడు కుక్కకంటె నధముఁడు కాఁడా? కాలిక్రిందఁ బ్రాఁకుచీమకును, గగనమున వెలుఁగొందునూర్యునకును దత్త్వమున నెంతమాత్రము భేదము లేదని బుద్ధదేవుఁ డానతిచ్చినాఁడు. ద్విజుఁ డైన నరే, చండాలుఁ డైనను నరే యెవ్వఁడు జ్ఞానసంపన్నుఁడో వాఁడే నాకు గురుఁ డని శంకరాచార్యులు సెలవిచ్చినారు.

ఇక చిత్రమైన సంగతి చెప్పెదను. పెరియనంబియు మార్నేరు నంబియు ననుఁ బిద్దలు యామునాచార్యులవారియొద్దఁ జదువుకొనినారు. మార్నేరునంబి పంచముఁడు– పెరియ నంబి బ్రాహ్మణుఁడు. ఇట్లుండఁ గొంతకాలమునకు మార్నేరునంబి కవసాన సమయము సిద్ధించినది. అప్పుడాయన పెరియనంబిగారి కిట్లు వార్త నంపినారు. యామునాచార్యభగవా నునక శేషత్వ మొందిన యీతనువును బ్రాకృతులు మట్టిలోఁగలుపుటకు నే నిష్టపడను. దేవరవారు ననుఁ గరుణించి నా యంత్య సంస్కారముల లాచరింపవలయు నని కోరు చున్నా నని వార్త నంపెను. ఆహాహా! ఇది యెంత యాశ్చర్యకరమైన విషయమో! వైష్ణో త్తముఁడై బ్రహ్మజ్ఞానసంపన్నుఁ డైన యామునాచార్యశిఖామణి యేమి! ఒక పాదమునొద్ద బ్రాహ్మణుని, నొకపాదమువద్దఁ బంచముని గూరుచుండఁ బెట్టుకొని విద్యను బోధించుట యేమి! ఆహా! ఇది యిప్పుడెంత విశేషాంశము! పొట్లపిందెవలె వంకరటింకరలు వోయినమన బుద్ధులకు దేశమహాప్రారబ్ధముచేత దిగజాఱి దిగజాఱి నేలములగ చెట్టునకు నిచ్చెన వేయవల సివచ్చిన మనబుద్ధులకు–సర్వజాతిసామ్యము సర్వజనసోదరత్వము, స్వార్థపరతాశూన్యత, భూతదయయుఁ జిరకాలపు బానినతనముచేత నంతరించిపోయిన మనబుద్ధులకు ఈయుం శము విశేషాంశముగఁగనఁబడదా! యామునాచార్యులవారు మార్నేరునంబిగారికి బాలబో ధము చెప్పినారా? బ్రహ్మసూత్రభాష్యము బోధించినారు. ఆనంద వాచకపుస్తకము చెప్పి నారా! ఆత్మజిజ్ఞాసాశాస్త్ర ముపదేశించినారే. ఇది యప్పటిదినములలో సామాన్యవిషయమే.

అప్పటిస్థితికి నిప్పటిస్థితికి నెంత యేతపుఁబెట్టుగా నున్నదో చెప్పవలయునా? మహాగౌరవముతో వంశపారంపర్యముగఁ బోషింపఁబడుచున్న వైదిక విద్వాంసుఁడు తన మహారాజునొద్దనైత మొక్కవేదవాక్యమైన వచింపఁడే! జపతపములులేని చదువు సందెలులేని మంచిచెడ్డలులేని ముండమోపిమిండఁడైన యేబాఁపనశుంఠ నైనను దగ్గఱఁ బెట్టుకొని యానిర్భాగ్యునిమొగము చూచుచు మహారాజునొద్ద వేదము వచించునే! ఆహా! ఇది యెంతదా రుణము. వీని వైదికపాండిత్యము మండిపోను! శూద్రుఁడు వేదము వినఁగూడదా? అతఁడు తరింపఁదగదా? ఇతఁడేనా పండితుఁడు. ఇతఁడేనా ప్రాజ్ఞుఁడు. ''ఓ బ్రాహ్మణుఁడా నీవే యపండితుఁడవు. నీవే పనికిమాలినవాఁడవు. నీవే తరింపఁదగినవాఁడవు. నీవే శాశ్వత శిక్షార్హుఁడవు. నీలో నున్న వేదజ్ఞానమందలి గౌరవముచేత నిన్నుఁ బోషించుచున్న మహారాజే బ్రాహ్మణుఁడు. అతఁడే వైదికవిద్వాంసుఁడు. అతఁడే తరించువాఁడు'' అని యనఁదగదా?

మార్నేరునంబి కోరికపై పెరియనంబి వచ్చి యాతనికి నమస్కరించెను. అప్పుడు పంచముఁ డిట్లు పలికెను. ''నేను దైవనామస్మరణ మొనర్చుకొనుచు మరణించునెడల నీవు నాకు బదిదినములు మైలపట్టి యుత్తరక్రియ లొనర్పవలయును. ఆచార్యవర్యుని స్మరించుకొ నుచు మరణించునెడల నొక్కదినముమాత్రమే మైలపట్టవలయును. నే నెవరిని స్మరింప

కుండ, నేతలఁపు లేకుండ, నిర్మనస్కముగ మరణించునెడల నీవు నాకొఱకు మైలపట్ట నక్కఱలేదు. అగ్నిసంస్కారము మాత్ర మొనర్చిపొమ్ము'' అని చెప్పెను. బ్రాహ్మణుఁడేమి? పంచమునకేమి అశుచి పట్టుట యేమి? ఔర్ధ్వదైహికక్రియ లాచరించుట యేమి? ఆహా! ఎంతవింత! తల్లిదండ్రులకుసోదులకుఁ జేసినట్లే పంచమునకు బ్రాహ్మణుఁడంత్యక్రి యలు చేయుటయే! సర్వజనభ్రాతృత్వ మనుసంగతి మనకుఁదెలియును. వారికిఁ దెలి యును. వారి కాచరణములో నున్నది. మనకు లేదు అదియే భేదము. తెలిసినవాఁడు విద్వాంసుఁడు కాఁడు. తెలిసి నట్లాచరించువాఁడే ఘనుఁడు. పెరియనంబి మార్నేరునంబికి బ్రహ్మమేధ సంస్కార మొనర్చి స్నానమైనఁ జేయకుండ, బట్టలైన మార్పకుండ, తిర్వారా ధాన కానిచ్చుకొని భుజించినాఁడు. ఏశవమునైనను ముట్టుకొన్న పిమ్మట స్నానము చేయవలసియుండఁగా పంచమశవమును దాఁకియూతఁడు స్నానము చేయలేదు. ఆశ్చర్యక రము! భగవద్భక్తునియం దున్నమహిమము!

ఇందువలన నేమి తెలియఁదగిన దనఁగా:–పూర్వమహానుభావులందఱుకూడఁ బంచ ములను స్పృశించి స్పృశించితి మని సంతోషించి కృతార్థులైనారు. అందుచే నస్పృశ్యత మనునది చండాలత్వములో లేదు. భగవద్భక్తుఁడైన చండాలుఁడు పూజ్యుఁడే. విద్య గలచండాలుఁడు పూజ్యుఁడే. పరమార్థజ్ఞానాభావుఁడైన బ్రాహ్మణుఁడే యస్పృశ్యుఁడు.

అట్టి పూజ్యులైన చండాలు రిప్పు డెక్కడ నున్నారని బుద్ధిహీనమైన ప్రశ్నము వలదు. అట్టి చండాలురు లేరు. పెరియనంబి వంకఠాచార్యులవంటి బ్రాహ్మణులు లేరు. కాని మీ మొగములకుఁ దగిన చండాలు రిప్పు డున్నారు కాదా. మీరు వారి కే మొనర్చినారు?

అదిగాక బుద్ధుని జంపుట కలవకుఁడు, నంగినమాలుఁ డని యిద్దఱస్పృశ్యులు వచ్చినారు. ఒకఁడు నరఘాతకుఁడు. ఒకఁడు నరమాంస భక్షకుఁడు. ఇద్దఱు కలసి బుద్ధదేవు రూపుమాపుటకు వచ్చినారు. దేవతాతేజస్సుతోఁ బ్రకాశించుచున్న దివ్యమంగళవిగ్రహ మును గాంచి తెల్లబోయినారు. ప్రేమావతార మగుబుద్ధదేవుఁడు వారిని గౌఁగిలించుకొని చెఱియొకతొడ్పాఁటఁ గూరుచుండఁ బెట్టుకొని నీతిని బోధించి వారిని బుద్ధమతావలంబకులుగఁ జేసినాఁడు. పన్నిద్దఱాళ్వారులలో నొకఁడు పంచముఁడు. ఇందువ లన యోగ్యతయే ప్రధానము కాని మటియొకటి కాదు. చండాలు నస్పృశ్యునిగా మనపూ ర్వులు భావింపలేదు. బ్రాహ్మణుఁడెవఁడో చండాలఁ డెవఁడో బుద్ధుఁడు చేసినవిభాగమును గూర్చిన పద్యములు నాల్గు వినదగినవి.

కాని యవి బుద్ధనాటకములో నుండుటచే నిట ప్రాయలేదు.

ఇప్పుడు మనల మనము గాఢముగాఁ బరిశీలించుకొన్నయెడల మనకున్న బ్రాహ్మ ణత్వ మేమో మనకుఁ దెలియును. మనకు వేదాధ్యయన మున్నదా? స్మృతులను శాస్త్రము లను జదివితిమా? పురాణములు భూతులని మానినైచిన వా రెవరు? పూర్వ బ్రాహ్మణాచార ములైనఁ జేయుచుంటిమా? ఏకారణముచేత మనము ఘనుల మని చండాలురు నీచు లని మనము చెప్పఁగలము? యథార్థ మాలోచింపఁగ జ్ఞానశూన్యుల మైన మనమే యస్పృశ్యుల మేల కాము?

మన పూర్వాచారము లెన్ని నశించిపోయినవి? సహగమన మిప్పుడున్నదా?

పుణ్యాత్ముఁడైనరాజా రామ మోహనరాయలు దీని నివారించుటకుఁ బ్రయత్నింపఁగా నాకాశ మంత నోరు పెట్టుకొని మనవారు వాదించియుండలేదా? మతము పోవు నని మొఱపెట్ట లేదా? మహజర్లు చేయలేదా, మామగలతో మేము చితి నెక్కినఁగాని మాకు మోక్షము లేదు లేదని స్త్రీలచేత సంఘవిజ్ఞాపనములు చేయింపలేదా? మత మిప్పు డేమాత్రము పోయినది?

వితంతువివాహము పనికిరాదని మనము ఘోషింపలేదా? అందును గూర్చి యెన్ని తగవులైనవి? ఎన్నివ్యాజ్యెములు పడినవి? ఎన్ని చార్జీలు జరిగినవి? మతము పోవు నని యెంత యల్లరి ప్రబలినది? సంస్కర్తల కెన్నితి ట్లయినవి? చిట్టచివర కవి బాహాటముగ జరుగుచుం డుట లేదా? అసలు పెండ్లికూఁతు మొగములోకంటె విధవపెండ్లికూఁతు మొగములో నెక్కువ పెండ్లికళను మనవారు చూచుచుండుట లేదా? పెద్ద లంద ఱట్టి పెండ్లిండ్లకు సంఘసంఘముల క్రింద నుత్సాహమున చేరుటలేదా? ప్రస్తుతపుమగఁడు పరమపదించినపి మ్మట మనమతని వితంతువును జేసికొంద మని కొంద రుట్టూటలూరుచుఁ గనుపెట్టికొని యుండుటలేదా? ఇప్పుడు తమమత మేమైనట్లు? ఏమాత్రము పోయినదయ్య!

రజస్వలావివాహమునుగూర్చి యెంత గందరగోళ మైనది? ఆచట్టమువచ్చినతర్వాత నోరు మూసికొని పడియుండిరా? లేదా? సీమవెళ్లినవారి నేమాత్రము బహిష్కరించుచు న్నాము? అట్టివారే వెళ్లనివారిని బహిష్కరించుటకుసిద్ధమైయున్నారుకాదా? పలసైత్కకము మానిన తరువాత తమ మత మేమైనఁ బోయినదా? పూర్వపు దేవరన్యాయము మాటయేమి?

అదిగాక స్త్రీవిద్యయే కూడ దని యెంత యుద్ధులమై వాదించితిమి. ఇట్టి మన యుప్రతిష్ఠ యస్వాభావికత యనౌచిత్యము హిమాలయపర్వత ముండఁదగినంతకాల ముండఁదగినది కాదా? మన యానాఁటి యవకతవకమాటలు భారతకాంత కొడలిమీఁది వ్రాతలుగా నిల్చి యుండును గాని పోవునా? వేదాధ్యయనము లేదు. బ్రహ్మచర్యము లేదు. పోని గూడక ట్టయిన నున్నదా? యజ్ఞోపవీత మున్నదో లేదో తడిమి చూచుకొనుఁడు. త్రిమతస్థులలోని వైదికులకుఁగూడ కొందఱు సన్న్యాసులకుఁగూడ నుల్లిపాయల పెసరట్లు లేకుండ కాఫీ గడచుచున్నదా? ఇది గాక ఆంగ్లేయభోజనమఠములలో మనము దినుచున్న మాంసజాతులకు హద్దున్నదా? ఏలయుండును? పప్పునియమ మెప్పుడు దాఁటితిమో పందిమాంస మైన నేమి, నందిమాంస మైన నేమి, సవర్ణులుపయోగించుచున్న మాంసమును బ్రాందిని నేపం చము లుపయోగింపఁగలరు? మతమో మతమో యని యిఁక నేమొగము పెట్టుకొని దేవులాడుచున్నారు? తమ మిదివఱకే పోయినదా? ఫకఁ బోదు. ఇదివఱకుఁబోలేదా ఇంకఁ బోదు.

పోయిన వన్నియుఁ గూడ బాహ్యాచారములు, మతమునకు బహిర్లాంఛనములు. మతము విభూతిపండుతోఁగాని చిట్టిగారెతోఁగాని గోపీచందనముతోఁ గాని నిల్చినది కాదు. రాజునకుఁ గిరీట మెట్టిదో భటునకు డవాలి యెట్టిదో మతమున కాచార మంత కంటె నెక్కువది కాదు. నవనాగరకనారీశిరోమణీ చీకటులఁ జిమ్ము జుట్టు కత్తిరించుకొని మోఁకాళ్ల వఱకు మాత్రము లాగుతొడిగికొని సైకిలెక్కి వీథులవెంట స్వారిచేసినంత మాత్రమున నామె స్త్రీత్వ మేమైన దగ్గినదా? మతమునకుఁ బ్రధానము లైనవి కొన్నియున్నవి. అవి పోయినయెడల మతము పోవును. అవి యేవన, దయ సత్యము శౌచము స్వార్థశూన్యత వైరాగ్యము భక్తి జ్ఞానము మొదలగునవి. వీనిలోఁ గొన్నియైన మనకుండునెడల మత మెన్నఁటికిని

బోదు. మనము తిరుగ నాంతరంగిక పరీక్ష చేసికొందము.

మనజాతి భతదయకుఁ బ్రసిద్ధి కెక్కినది. ఈదేశములో జరుగుచున్న యన్నదాన మెచ్చటను జరుగటలేదు. ఇన్ని దేవాలయము లెచ్చట నున్నవి. ఇన్ని చలిపందిళు లెచ్చటనున్నవి? చెదల కాహారములే, చీమలకు చిందబెల్లములే, పాములకు క్షీరాభిషేకములే. తుదకు దోమలు కుట్టిన పశువులొడలు రాచుకొనుటకు రాతికంబములే. అట్టి మనము వితంతు స్త్రీలను భర్తలతోఁ గాల్చినప్పు డెంతదయఁ గనఁబఱచితిమో చెప్పవలయునా? వితంతువులకు వివాహము లేకుండ వారికి భోజనమైనఁ దిన్నఁగ లేకుండ వారితలలపై గృహకృత్యభారఁ ముంచి వారిని బాధించునప్పుడు మనదయ యెట్టిదో లోకమునకుఁ దెలియుట లేదా? తోడిమానవులైన పంచములను, మన కెన్నివిధములుగానో యుపకరించు చున్న పంచములను నధమస్థితిలోనుంచి వారిని మనుష్యుల వలెఁ జూడకున్నప్పుడు తెలియలేదా? వారివ్యవసాయము మనకుఁ బనికివచ్చు నేమో? వా రిచ్చిన ధాన్యము మనకుఁబనికివచ్చునేమి? వారుమేపిన పశువుల పాలు మనము త్రాగవచ్చునేమి? వారుచేసిన శ్రమ యంతయు మనకుఁ బనికివచ్చునేమి? అట్టిచో నింత యుపకారకుల నేల యస్పృశ్య లగా నుంచవలెను? కుక్క ప్రవేశించిన యిల్లు మైలపడలేదో? గాడిద లోనికివచ్చిన మైలపడలేదో? పంచముఁడు వచ్చిన యెడల మైలపడునా? మనము వారియెడల మనుష్యులవలెఁ బ్రవర్తించుటలేదు. ఆమనుష్యులను నీచజంతువులకంటె నీచముగాఁ జూచిన ప్పుడు మనము మనుష్యులమే కా మని పైవా రనుకొనినఁ డప్పేమున్నది?

ఇక సత్యమునుగూర్చి చెప్పెదను. సత్యము సృష్టి కాధారమై యున్నది. అట్టి సత్యము మనలో నెట్లున్నదో చూతము. ఏమి చెప్పవలయును. ఎవఁ డెఱుఁగఁడు. అసత్యముకొఱకే కానియెడల నిన్నికోర్టులెందులకు? ఇందరు న్యాయమూర్తులెందులకు? ఇందరు న్యాయవాదు లెందులకు? ఇందరు కక్షిదారు లెందులకు? ఇంతబిళ్ల కర్చెందులకు? ఇందరు సాక్షు లెందులకు?

పూర్వమున నివి యేవియైన నుండునా? తాటాకుపాయమే పత్రము –సూర్యచంద్రులే సాక్షులు–ఇప్పుడట్లాపత్రము వ్రాయుఁబోవునప్పుడే, యెగఁబెట్టుటకు సాధన మెట్లో స్థిరపఱచుకొనుటకుఁ గట్టుదిట్టములైన యాలోచనలు చెప్పుటకు కల్పవృక్ష మైన స్లీడరు మన కున్నప్పుడు చిక్కేమున్నది? అతఁడే లేనియెడల వితంతువైనవడినెగారు వ్యభిచారిణి కావున మనోవృత్తి వ్యాజ్యెము చెల్లఁగూడ దన్న చల్లనియూహ మనకుఁ జెప్పినవా రెవరు? భార్యను జంపిన పాపాత్మునికిఁ దాత్కాలికోన్మాద మని రుజువు పఱచి యురినుండి తప్పించిన బుద్ధిమంతుఁ డెవరు? ఎట్టిఘోరాపరాధ మొనర్చిన వానికైనఁ బెరుమాళ్లకంటె స్లీడరే యెక్కువరక్షకుఁడు కాదా? వారిలో నసత్య ప్రోత్సాహకులు కొందరైన నుండుటచేతనే యిట్లు ప్రపంచ మింత దొరలిపోవుచున్నది.

ఇకఁ బాతివ్రత్యమును గూర్చి చెప్పెదను. భారతదేశమందుండిన ధనమంతయుఁ బడమటికిఁ బోయినప్పటికిని భారతదేశ సౌభాగ్యమంతయుఁ బరశురామప్రీతి యైనప్పటి కిని, భరతదేశ స్వాతంత్ర్యమంతయు భగ్నమైనప్పటికిని, పునకింక మిగిలిన తఱుగులేని విఱుఁగులేని విలువలేని ధన మొక్క స్త్రీల పాతివ్రత్యమే కాదా?

నత్యము, ధర్మము, దయయుఁ, బాతివ్రత్యము ననునవి Barbaric Virtues అనియును, నవి యనాగరకులయొద్ద నుండఁదగినవి కాని దమయొద్ద నుండఁదగినవి కావనియు గొందఱ యభిప్రాయము. మనవారు నత్యము ధర్మము దయము Virtues నుండి తీసివైచినారు. ఇఁకఁ బాతివ్రత్యమునుగూడ నట్లు తీసివేయుదురేమో తెలియదు. చంచలబు ద్ధులగు మగవార్లు తీసివై చిననుబూర్వమహాపతివ్రతలచలువ చేత నట్టి దుర్దశ రానేరదు.

వంక దాఁటులలో మగవారు ఘనులు
వంశమర్యాద యెన్నఁడు వదల దబల
యింటిపరిశుద్ధి యెల్లప్పు డింతి వలన
నిలఁబడును గాని మగవాని వలనఁ గాదు
ఱేడుదాని యాచార మాహాత్మ్యమునను
బురుషు కానికూళ్లును దొంగపోకడలును
బైగనే కాని యింటిలోపలికిరావు
కాన నిప్పటికినిజాతి ఘనతదక్కి
కట్లు విడఁద్రెంపి చెలఁరేఁగ కాంత నడవ
దేశదుస్థితి సంజ్ఞగాఁ దెలియవలయు
నిట్టిదుర్దశ మనకు లే దింతవఱకు
భావిగతి యేదొ యెవ్వరు పలుకఁ గలరు?
ఎంత చెడినను మన స్త్రీలె యిలను గలుగు
నబలలం దుత్తమోత్తమ లనుట తగును
దేశమభగత మగవాని తెలివిఁబట్టి
నిలువ దబలయోగ్యతఁ బట్టి నిలుచుఁగాదె?

తండ్రియిచ్చిన యవకతవక యాజ్ఞల నన్నియు నంత బుద్ధిహీనముగా వినుటయేనా? తన కామాత్రపు Judgment అక్కఱలేదా? అందుచే రాముఁడు వట్టి Blockhead అనుచున్నారు. హరిశ్చంద్రు నంతటివానిని భార్యావిక్రయ సందర్భమున Inhuman brute అనుచున్నారు. అతని నత్యరక్షణమును గూడ నెంతమాత్ర మిప్పటివారు మెచ్చకుండ నున్నారు. భార్య నొకనికి దాన మిచ్చిన రఘుమహారాజును At once an Emperor and go-between అనుచు డాఫరుజాతిలోని కీడ్చివేసినారు. నత్యైరాగ్యస్వార్థరాహిత్యాద్యనేక గుణములు మోక్ష సాధనము లైనవి పోయినను మత మింక నిల్చి యున్నదా? ఇట్టి మనస్థితిలో నొక్కమాట నడిగెదను. యథార్థముగ నన్యశ్యులు మనమా పంచములా? వారికి మనవిద్య లేదు. అందుచేత మనకున్న యింద్రజాలమహేంద్రజాలములు వా రెఱుఁగరు. వారికి మనకున్న నాగరకతలేదు. అందుచేత మనకున్న కానికూళ్లు తప్పుతిరుగుడులు వారికిలేవు. అందుచేత మనమే మన్యశ్యులము. మనయుద్ధరణము మాట యేమి? ముందు నృష్టిలోనో యీపై నృష్టిలోనో జరుగునో లేదో యను నంశమునుగూర్చి యిప్పుడు చింత యేల?

బ్రాహ్మణస్త్రీకి శూద్రునివలన గలిగినబిడ్డలు పంచములని చెప్పినారు. ఇది నత్యమో యసత్యమో యెవరు చెప్పగలరు? ఎటులైనను తలక్రిందు పెండ్లిండ్లు తగవని, యందువలనఁ గలిగినసంతానములు బహిష్కారయోగ్యము లని యిందువలన నిర్ణయించుట కవకాశము

న్నది. అయినను వారిదోషమువలన వారట్లు కాలేదు. మనదోషము వలన నైరి. ఎన్ని వందల సంవత్సరముల క్రిందటనో యైరి. అట్టినిర్దోషులను–అది గాక మనదోషముల వలననే యట్లు కావలసి వచ్చినవారిని సంఘములోనికి విద్యాబుద్ధులు చెప్పించుచుఁ దీసికొనుట మంచిది. ఎప్పుడో జరిగిన యీతప్పును గూర్చి యేల?

ఇప్పు డిట్టి తలక్రిందుపెండ్లిండ్లు ఎన్ని యగుచుండుటలేదు? ప్రత్యక్షముగ బాహాటముగఁ బ్రచ్ఛన్నముగ నరచాటుగ నెన్ని జరుగుటలేదు? అందువలన మన సంఘమందెన్ని సంతానములు కలుగుటలేదు. దినమున కట్టి సంతానములు భారతదేశమందు వేలకొలఁదిఁ గలుగుచుండుట నిస్సందేహము. అవి మన మెఱుఁగుదుము. ఎఱుఁగము. ఎఱిఁగియు నెఱుఁగక యున్నాము. ఎఱుఁగకుండ నెఱిఁగియున్నాము. అట్టివారిని మన సంఘమందుఁ బ్రాణప్రదముగ నుంచుకొనుచుండుట లేదా? వారి సంతానములను కర్ములైనప్పుడు–ఎన్నివేల సంవత్సరములక్రిందటనో మన దోషమువలననే బహిష్కృతులైన వారిని సంఘమున కేల తీసికొనఁగూడదు? సంఘములో నింత దొంగతనము–నింతపాపము–నింత క్రుళ్లుదాఁచుకొని దాఁచుకొని సహించు చున్నప్పుడు నిర్దోషులైన వారి నేల తీసికోఁగూడదు?

భారతీయ పూర్వాచారము లన్నియు నశించినవి. వానివలెనే యీ యస్పృశ్యతకూడ నశింపఁ దగినది. అది మనకు బాధ నిచ్చుట లేదు. కావున దీని నింక యట్టె యుంచినాము. ఇది మరింత పాపము.

మీకు మతము పోవునప్పటికి బ్రదుకుపోవునప్పటికి మోక్షము పోవునప్పటికి రామానుజులు గోపుర మెక్కి తిరుమంత్ర ముపదేశించినట్లు మీరు వారి నుద్ధరించుట మహాకార్యము. మీరట్లు చేయలేరా? ఇప్పుడే కాకపోయిన మరి యింక కొలఁది కాలమునకైన వారె మన స్థాన మాక్రమింతురు. ఇప్పుడే యట్లు చేసి మూట దక్కించుకొనునట మంచిది.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

15. కురుక్షేత్రము

జంఘాలశాస్త్రి ఒకసారి ఢిల్లీ వెళ్ళి అక్కడ నుంచి కురుక్షేత్రం యాత్ర చేశాడు.

రైలుదిగి, సూర్యకాంతికి ముచ్చటపడి ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అనుకున్నాడు. ఆశ్చర్యపడే శక్తి మనిషికున్న శక్తుల్లో ముఖ్యమైంది. ఆశక్తి నించే ఎంతటిజ్ఞానమైనా పుట్టింది–అనుకున్నాడు.

జంఘాలశాస్త్రి ఒక బ్రాహ్మణుడింటికి వెళ్ళి స్నానం, భోజనం ముగించుకుని, కురుక్షేత్రంలో యుద్ధభూమిని చూడటానికి వెళ్లాడు. శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతా బోధ చేసిన స్థలమేది?–అని అడిగి తెలుసుకొని–అక్కడ నిలబడ్డాడు. ఆ స్థలం కొంచం ఎత్తుగావుంది. అక్కడొక మండపం వుంది. దాని వెనక చిన్నచెరువుంది. భూమ్యాకాశాలు కలిసేవరకు అక్కడ కనుచూపుమేర ఒక్కటే బయలు భయంకరంగా కనిపించింది. రక్కసికంపలు, జిల్లేడు మొక్కలు, వంటివి తప్ప ఇంకే మొక్కలూ లేవు.

ఇదేనా కురుక్షేత్రం! అని–భారత ఘట్టాలు తలుచుకుని–భగవద్గీతను తలుచుకుని–పరవశించాడు జంఘాలశాస్త్రి. అంతలోనే–ఢిల్లీలో తాను చూసిన పాదుషా దివాన్‌ఖానా గుర్తొంచ్చింది. దాని సౌందర్య ప్రశంస గుర్తొచ్చింది. కాని–జంఘాలశాస్త్రి–'మనకు కురుక్షేత్రమే స్వర్గం' అన్నాడు. ధర్మరాజు ద్వైధీభావ మనస్సునీ, అర్జునుడి అజ్ఞానతత్వాన్ని తలుచుకుని –కునుకు తీసిన శాస్త్రి ఒకకల వచ్చింది. అందులో వ్యాసమహర్షి కనిపించాడు. భగవద్గీతకు భిన్నభిన్న అర్థాలలో వ్యాఖ్యానాలు పుట్టాయెందుకని ప్రశ్నించాడు. ఆ వ్యాఖ్యలు సరియైనవి కావు అన్నట్టుగా ఆ మహర్షి చిరునవ్వు నవ్వాడు.–బస్సు మనిషికేకతో జంఘాలుడు మేలుకొన్నాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

నేను సభకుఁ బోవునరికి జంఘాలుఁ డేదియో యుపన్యసించుచున్నాఁడు. అంతకుముం దేమి చెప్పనో గాని నేను వెళ్లినపిమ్మట నిట్లు చెప్పెను.

కురుక్షేత్రపుస్టేషనులో నేను దిగుట యేమి, నూర్యుఁ డుదయాద్రిపై నెక్కుడ యేమి.

ఆతఁడు కరకర లేచుచున్నాఁడు; నేను జర జర నడచుచున్నాను. సూర్యోదయము కాకమునుపే స్నానముచేసి, యర్ఘ్యప్రదాన మొనర్చి, సూర్యనమస్కారము లాచరింపవలసిన నేను దంతాధవన మైన లేకుండ సూర్యునిపైపుదిరిగి చెంపలు గొట్టుకొనకుండ, మూట చేతఁ బట్టుకొని, మునిఁగిపోయిన ట్లూరిలోనికిఁ బోవుచున్నాను. సవిత్రమండలదర్శన మొనర్చి మనవేదర్షు లాతేజోవైభవమునకు, నాతమశ్చటూ విచ్ఛేదనసామర్థ్యమునకు, నా సర్వమాలిన్య నివారణమహనీతయకు, నా యారోగ్యప్రదానప్రవీణతకు, నన్నిఁటిని మించిన యాహృదయతాపాపహరణశక్తికి, నాత్మవికానశక్తికి వింతపడి, యొడ లంత చూపుగఁ జేసికొని, యాచూ పంతయు మననుగఁజేసికొని, యామన సంతయు నాత్మగఁ జేసికొని, యా యాత్మ నంతయుఁ బరమార్థ జ్ఞానసంపన్న మొనర్చుకొని కవులై, భక్తులై, గాయకులై, విరాగులై, వేదాంతులై యెన్నివేల నంవత్సరముల క్రిందటనో పాడినపాటలు, చేసిన నృత్యములు, వెదచల్లిన తత్త్వములు, భారతదేశమున కిచ్చిన వెలుఁగే కాదా? ప్రపంచమునం దంతయు నిప్పటివఱకుఁనిలిచి, నృష్టిపోయినను నిల్చునది యాతేజ మొక్కటియే యైనట్లు చెప్పకచెప్పుచున్నదే. ప్రకృతిలోని తేజస్సుముద్రమును, సౌందర్యరాశిని, శక్తిసంపన్నతను, మహామహిమ విశేషమును గాంచి, యద్భుతపడని వాఁడు పనికిమాలిన పందలలోఁ బ్రప్రథముఁడు. చూడఁదగినవస్తువును జూచి శిరఃకంపనము చేయనివాఁడు పశువుకంటె నధముఁడు. ఆశ్చర్యపడుట యనుశక్తి మనుజశక్తిలలో ముఖ్యమైనది. ఆశక్తినుండియే యెంతజ్ఞానవిజ్ఞానములైన నుదయించినవి. నర్వదేశసర్వకాలసర్వవిధ సారస్వతములకం తయు నాశక్తియే మూలము. హృదయమునందుఁ దఱుగు మిఱుగులేని రసోద్రేక మున్నవానికిఁగాని యాశక్తి యుండదు. అట్టిశక్తి యున్నవాని మెప్పే మెప్పు. నవ్వే నవ్వు. ఏడుపే యేడ్పు. బ్రదుకే బ్రదుకు. గగనమందుఁ గన్నులనైకుంఠముగఁ గ్రాలు బంగరుచట్టు జల తారునీలిచీర సింగారించిన ప్రకృతియువతిచేతిలోని సప్తమణివినిర్మిత చాపమును గాంచి చేతు లెత్తి గంతులువైచి యొడలు తెలియని యానందమున మత్తిల్లువాఁడే మనుజుఁడు. కాలిక్రిందఁ బ్రమాదవశమునఁ బడిన చీమ దేహాత్మావిచ్ఛేదనసమయమున నిచ్చినమూల్గు సింహగర్జనమువలె నాకర్ణించి కడుపుపగిలి కండలు కంపించునట్లు గాఢముగ నేడ్చువాఁడే మనుజుఁడు. అంతేకాని పట్టుమని తినలేక, యెంగిలిలంఘనములు చేయుచు, నొడలు తెలియనినిద్ర పోలేక యులికి యులికి యేడ్చుచు నేదైన వింతవస్తువును గాంచి వింతపడి 'హాయి హాయి' అని మఱవలేక తల కదలించి కదలుపనట్లు నోరు మెదలించి మెదల్పనట్లు లేదో కొండనాలుకకు వెనకు గొణఁగుకొనుచు, నత్యంత ప్రియమైన వస్తువు జాఱిపోయినను గాలిసయితము విని గడగడలాడున ట్లేడువలేక కుక్కపిల్లవలె కుంయి కుంయి మని వినఁబడి వినఁబడకుండునట్లు లేడ్చుచు, భోజనమునొద్ద షండులై పాలఁతియొద్ద షండులై పుస్తకము నొద్ద షండులై, యానందానుభవమున షండులై దుఃఖానుభవమున షండులై చావకుండఁ జచ్చియున్నవ్యర్థులు బానిస లీప్రపంచమున దాస్యమును, నీచతయు, నజ్ఞతయు, రోగ మును, చచ్చుటకుఁ దప్ప వేఱుకార్యమున కక్కఱకురాని జనాభాను వృద్ధిపఱచుటకును, దక్కఁ మఱియెందులకు?

ఇట్లు పూర్వస్థితిని స్మరించుకొని సంతసించుచు, నిప్పటిస్థితిని స్మరించుకొని విచారించుచు, ముందునకు నడుచుచుంటిని. అచ్చటనొక్క బ్రాహ్మణునిజూచి యిచ్చటికి యుద్ధభూమి యెంతదూరమున్నదని యడిగితిని. యుద్ధభూమిసంగతి నాకేమియుఁ దెలి

యదయ్యా యని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. అయ్యా! ఈయూరిబయట జరిగిన భారతయుద్ధమునుగూర్చి నీ వెఱుఁగనే యెఱుఁగవా యని యడిగితిని. "నిన్నగాక మొన్నజరిగిన వ్యాపారమే మఱిచిపోదుముగదా. యెప్పుడో జరిగిన యుద్ధముమాట యెవనికి జ్ఞప్తిలోనుండునయ్యా యని నాకు సిగ్గువచ్చినట్లాతఁడు మందలించుచు బదులు చెప్పెను. పోనీ మీయింటిలో నాకీదినమున భోజనము పెట్టుదురా యని యడుగ నేను వృత్తిచేత వంటవూడివాఁడను గానున్నను నొక్కరూపాయినిచ్చినయెడల నాభార్యతోఁజెప్పి యీయు పకారము చేయింపఁగల నని యాతఁడు పలికెను. ఆతని యింటికిఁబోయి స్నాన మొనర్చి భుజించి మోటారుబస్సును మాటాడుకొని యుద్ధభూమి కేఁగి శ్రీకృష్ణభగవానుఁడు పార్థునకు జ్ఞానోపదేశమొనరించిన స్థలమేది యని యడిగి తెలిసికొని యచ్చట నిలువఁబడితిని.

ఆస్థలము కొంచె మెత్తుగా నున్నది. అచ్చట నొక్కమండపమున్నది. దానికి వెనుకభాగమునందుఁ జిన్నచెఱువున్నది. ఆచెఱువు నీటితోడనే రథాశ్వములను భగవంతుఁడు కడిగినాఁడని యచ్చటిజలముతెచ్చి యొకమునలిది నాపైఁ గొంత చల్లెను. రెండుడబ్బులిచ్చి యామెను వదల్చుకొంటిని, భూమ్యాకాశములు గలయువఱకు నొక్కటే బయలు భయంకరముగ గనఁబడుచున్నది. చిన్నకంకరఱాలు, చికిలింతదుబ్బులు బల్ రక్కసి కంపలు జిల్లేడుమొక్కలు మొదలగునవి విరళముగ నున్నవి. చూపున కడ్డువచ్చు నొక్కనిలువుపాటి చెట్టయిననను లేదు. అది యెండకాలమగుటచే నెండమావుల ప్రవాహములు మిక్కుటముగ నున్నవి. పిట్ట పీచు మనుప లేదు. గాలియైన గట్టిగ వీచుటలేదు. భయంకరమ గునిశ్శబ్దతావస్థ ప్రబలియున్నది. శ్రీకృష్ణభగవానుని ప్రార్థించి యాపవిత్రస్థలమునకు సాష్టాం గపడితిని.

ఇదియేనా కురక్షేత్రము? ఇదియేనా మహావీరులమహాస్త్రముల మహాజ్వాలలచే మండి పోయిన భండనరంగము? ఇదియేనా పనునెనిమిదక్షౌహిణుల రక్తములఁ దడిసిన ప్రదేశము? ఇదియేనా భీష్మఁడంపశయ్యపైఁ బండుకొని ధర్మబోధన మొనర్చిన పవిత్రస్థలము? ఇది యేనా పార్థవ్యాజమున భగవంతుఁడు ప్రపంచమున కంతకును ప్రజ్ఞాప్రదాన మొనర్చిన దివ్యక్షేత్రము? బంగరుగని యొకగనియా? వజ్రములగని యొకగనియా? శాననములగని యొకగనియా? విగ్రహములగని యొకగనియా? రత్నాకరమొక రత్నాకరమా? జ్ఞానధన మెటనుండి యుద్భవమై ప్రపంచమంతయు వ్యాపించినదో యట్టి కురుక్షేత్రమనియే మని.

నేనొక పాడుషా దివాన్‌ఖానా జూచితిని. అది పాలఱాతిదూలములతోఁ బలకలతో వానములతో నిర్మింపఁబడినది. ఎదుట నెన్నియో దివాన్‌ఖానాలు నాకుఁ గనఁబడుచున్నవి. ఈప్రక్క నాప్రక్కను వెనుకగూడ నెన్నియో శాలలు గనఁబడుచున్నవి. ఈశాలల పాడువు నకు వెడల్పునకు హద్దే కనఁబడుకుండ నున్నది. లెక్కలేనన్ని నాన్వారూపములు ననుఁజూచి వింతపడుచున్నవి. శ్రీరామచంద్రమూర్తి గాంధర్వాస్త్రమును విడిచినప్పుడు యుద్ధ సీమయంతయు నామయము నైనట్లు కనబడుచున్నది. నేను ముందునకుఁ బోవ నేనే నన్నెదుర్కొనుచున్నాను. మనస్సునకుఁ గలఁతగనుండి వెనుకకుఁ బోవ నాన్వారూపము నన్నే వెంబడించుచున్నది. మయసభలో నీరు లేనిచోట నీరున్నట్లు నీరున్నచోట నీరులే నట్లు భ్రమ గలుగుచుండెనను మాట జ్ఞప్తికి వచ్చినది. నీరున్నను లేకున్నను నీరున్న స్థలమని

నీరులేని స్థలమని రెండుస్థలములు వేర్వేఱుగ నచ్చట నున్నవి కాని యిచ్చట శాలలేని చోట శాల కనఁబడుచున్నది. ఒకటా? చెప్పలేనన్ని నేను లేనిచోట నేను గనఁబడుచున్నాను. ఒక్క నేనా లెక్కలేనన్ని నేను గృహనిర్మాణకళా (architecture) సంబంధమగు నింద్రజాలమునకు వశుఁడ నై కలవరపడితిని. అంతలో మనను రవంత గుదుటఁబఱచుకొని నన్ను నే నిట్లు నిందించుకొంటిని. ''సాక్షి శిష్యుఁడ వగునీ కీ బుద్ధిహీనత యేల? ఇది యొక్కభ్రమమా? ఇది యొక్క యింద్రజాలమా? ఇంతకంటె కోటిగుణములు భ్రమాపాదకమైన యింద్రజాలములో నఱువది సంవత్సరములనుండి పడియుంటివి కాదా? ఆ మహామాయ కలవాటుపడియుంటివి కాదా ''ప్రకృతిలోఁ బ్రతిఫలించిన పరమాత్మగానఁబఱచిన మహామహేంద్ర జాలమేకాదా. ఇన్ని లక్షలగోళములు, ఇన్నికోట్లజీవరాసులు. అనంతమై యప్రమేయమై యద్వితీయమైన ఈసృష్టియంతయు మహేంద్రజాలమే కాదా? పరబ్రహ్మాపాదకమైనభ్రమకు పరిపాటియైన నీవు పాదుషాభవనమున నిట్లు భ్రమపడెద వేల యని నన్ను నేను నిందించుకొంటిని. అంతలో నిమ్మళముగ ననినట్లు నాకు వినఁబడి ఉలికిపడి వెనుకకు జూచితిని. మావంక నేలచూచెద వని వెనుకనున్న నేను లన్నియుఁ నన్నుఁబ్రశ్నించెను.

మనస్సులోఁ గలిగిన తొట్రుపాటు నివారించుకొని నిదానముగ నచ్చటి చిత్రములన్నియుఁ బరిశీలించితిని. పైఁగప్పురాలపైఁ జెక్కఁబడిన పుష్పములు లతలు ఫలములు పక్షులు బొమ్మలు బంగారము మీఁది పనికంటె నెక్కువ సుకుమారముగ సున్నితముగ సురుచిరముగ నున్నవి. కొన్నిదూలములకుఁ గొన్నిస్తంభములకుఁ గొన్నిగవాక్షములకుఁ గొన్నివిగ్రహములకుఁబైన నుల్లిపొరవంటి బంగారులేకులు కప్పఁబడియున్నవి. నడుమ నడుమ నవనరానుసారముగ నలంకారార్థముగఁగల్ల కెంపులు వైడూర్యములు స్ఫటికములు పుష్పరాగములు మఱియు ననేకములుగా మణులు చెక్కఁబడి యున్నవి. జిగజిగలా మిలమిలలా తళతళలా! ఓ! వచింపటకు శక్యముకాని వింతకాంతులు ప్రజ్వరిల్లుచున్నవి. ఆసమయమున నెవఁడో వచ్చి యగ్గిపుల్లను వెలిఁగించెను. ఆహాహా! ఏమి వైభవము? నూఱేండ్రధనువు లొక్క త్రుటికాలములో నచ్చట నవతరించి వెలిఁగిపోయిన ట్లయ్యెను. అత్యంత మాధుర్యమునఁ ద్వరలో మొగము మొత్తును. అత్యంతదీప్తిచేఁ గన్నులు జీకట్లు పడును. అత్యంతోష్ణముచే వేగఁ జలికలుగును. అత్యంతశీతలతచే జ్వరము కలుగును. అత్యంతసౌందర్యమున–మనసు మొద్దెక్కును. నిర్జీవసౌందర్య మెంతసేపాకర్షింపఁగలదు? జీవత్సౌందర్యమునకే దిక్కులేదే–కన్నుముక్కు తీరు నితరావయములసొరు, నెక్కడ నేయం గుండవలయునో యాయంగుల నన్నిఁటిని మించిన రంగుమాత్రమే కల యంగన సైతమొకదినము కంటె నెక్కువ యాకర్షింపలేదే. సౌందర్యము నంతతాకర్షణీయముగ నుండుట కెన్ని పరిస్థితులు తోడుపడవలయును. అవి తోడుపడని యెడల గోనెగుడ్డమీఁది నూనెబొమ్మయెట్టిదో యదియు నట్టిదే. ఈవిషయమునుగూర్చి ప్రత్యేకముగఁ జెప్పెదను గాని యిప్పుడు చెప్పఁదగదు.

సౌందర్యానుభవమునఁ జప్పఁబడిన మనసుతో నింటికై మరలిపోఁబోవఁగ నెదుట గోడపై బంగారువర్ణములుగల రెండు పంక్తులు గానఁబడెను. అవి హిందుస్థానివర్ణములు. ఆ వ్రాతలోని యభిప్రాయ మేమనఁగా:–భూలోకమందు స్వర్గమే యున్నయెడల నది యిదే. అది యిదే. అది యిదే. వెగటుపడినమనస్సుతో నుంటినేమో, నాకామాటలు మఱింత వెగటయ్యెను.

నాయనలారా! కురుక్షేత్రమునకు నాతోఁ దీసికొనిపోయిన మిమ్మోఁ బ్రసంగవశమున హస్తినాపురమునకుఁ దీసికొని పోయితిని. నాయం దనుగ్రహించి తిరుగఁ గురుక్షేత్రమునకు దయచేయుదురుగాక. ఉర్దుకవి వ్రాసిన వ్రాఁతలోని యర్థమును దెలిసికొంటిరికాదా? వారికిఁదెల్లరాతి పలకలు పాలసున్నము బంగరురేకులు విలువగలమణులు ఫలాహారములు షర్బతులు లవలవఅకు ముదురనినవనవయువతీమణుల మొగములే స్వర్గమైననగుఁగాక, వైకుంఠమైన నగుఁగాక, పరమపదమైన నగుఁగాక! కాని మనకుమాత్ర మీకురుక్షేత్రమే స్వర్గము. ఇచ్చటి కంకరరాలే రత్నరాసులు. ఇచ్చటి బుడ్డమేడిచెట్లులే కల్పవృక్షములు. ఇచ్చటిమట్టియే బంగారము. ఇచ్చటి యెండమావుల వెల్లువలే యాకాశ గంగాప్రవాహములు. ఎందుచేత? లోకములోనున్న అన్నిబంగారు గనులకంటెను నన్ని రత్నాలగనులకంటెను నత్యధికమైన విలువ గల భగవద్గీత యిచ్చట నుద్భవ మగుటచేత. నాయనలారా? ఆగ్రంథముచే మనము తరింతుము. అంతేకాని కాసులగోనె నెత్తిపైఁబెట్టుకొని వైకుంఠసోపాన మెక్కినవాఁ డెవఁడు? ధర్మరాజుతోఁ బైలోకమునకు వచ్చినది శునకముకాని ద్రౌపది కాదే. పోనిండు. ద్రౌపది యుమ్మడియాస్తి కావున నాతనితోఁ బోకపోవచ్చును గాని యెవరికిఁ దగిన సొంతసరకును వారు జాగ్రత్తపెట్టుకొనియే యున్నారు కాని, యుపేక్షింప లేదే. ధర్మరాజుమాత్రము తత్త్వవాక్యములలో శ్రుతపాండిత్యము సంపాదించినవాఁడుకాని ప్రక్క దాపు లేకుండఁ బండ్రెండుమాసములు గడపఁగలిగిన యెడలి స్థిమితత గలవాఁడా?

భగవద్గీతను లోకగురునిచే నుపదేశ మందిన నరునకుఁ బైలోకమేల రాలేదో యడుగ రేమి? అర్జునునకు జ్ఞానసంపాదన కధికారము లేదు. ఆతఁడు గుంటయోనమాలయొద్ద నున్నవాఁడే కాని యంతకుఁబైని బోయినవాఁడు కాఁడు. సోదరులను గురువులను బంధువు లను జంపుట కిష్టపడక యుద్ధము మానుకొని యేడ్చుచుఁ గూరుచుండిన పార్థునకు "శత్రువు లందఱు నాచేతనే చచ్చినారు. నీ పూరక ధనువు పట్టుకొని నిమిత్తమాత్రుఁడనై నిలుచుండి క్షత్రియధర్మమును నిర్వహించుకొను" మని చెప్పిన కృష్ణునిబోధన యంతమా త్రమే సరునికి బోధమైనది కాని మిగిలినదంతయు నతని యాచరణములోనికి రానిదే యయ్యెను. సర్వకర్మములుకూడ జ్ఞానమందుఁ బరిసమాప్తి నొందవలసిన దని పురుషోత్తము లుకూడ చేసిన బోధ మతని యంతరంగమున నెక్కినదా? అట్లాచరించినాఁడా! సర్వజ్ఞానస ముదయము కూడ యుద్ధకర్మమునందుఁ బరిసమాప్తి యైన ట్లయినది.

ఇక ధర్మరాజుమాట–అతనికి రాజ్యమందున్న తృష్ణ యెవ్వనికిని లేదు. అతనికి జాదమం దున్నప్రీతి దేనియందును లేదు. ఆతని గడుసుమాటలు, కల్లయేడ్పులు, బొల్లినైచ్యములు, ముఖస్తుతులు; సమయోజితప్రవర్తనములు మఱి యింక నెన్నియో యతని నరకార్హునిఁజేసినవి. కాని యాసపడి యాసపడి యేడ్చియేడ్చి తెచ్చుకొన్న రాజ్యములో నర్వశూన్యతతక్క పెద్దవల్లకాడుతక్క నిత్యశ్రాద్ధాలుతక్క మఱే యేదియు లేకపోవుటవల నను బుద్ధిపూర్వకముగ నున్నను జంపించుటచేతఁ గలిగిన ఘోరపశ్చాత్తాపమువలనను నరకార్హత కొంత తప్పినది. అందుపై భీష్మునిధర్మబోధములు నమయోచితముగఁ గలుగుట చేత నాతని మనస్సునకు శాంతి కలుగఁ జేసినవి. అందుచేత నాతనికిఁ గొంతకాలమైన స్వర్గలోకవాసము కలిగినది. ఇట్లుగా ధర్మరాజు జ్ఞానమువలన నుత్తమలోకార్హుఁ డయ్యెను.

అట్టి జ్ఞానబోధ మీ కురుక్షేత్రమున జరిగినది. అందుచేత నీ భూమి మిగుల

పవిత్రమైనది. మనస్సులలో సాష్టాంగపడుఁడు కన్నుల కద్దుకొనుఁడు–కృష్ణా! ఆపదుద్ధారకా! సంసారసాగరతారకా! యని యా నేలపైఁ బడితిని. ఒకవిధ మగుకలఁతనిద్ర కలిగెను. దానిలో నొకస్వప్నము వచ్చినది. అది వినుఁడు.

రెండుకొండ లెదురుగఁ గనఁబడినవి కాని నడుమునున్న కోనలో నొక చక్కని యాశ్రమమున్నది. అచ్చటికిఁ బోయి పరిశీలించితిని. దానిలో నొక్క రావిచె ట్టున్నది. ఆచెట్టు భూలోకమందలి చెట్లవలె మూలము నొద్ద నే మున్నదో పరీక్షింతు మని తలయెత్తగఁ జెప్పరాని, చూడరాని, తలఁపరాని వెలుఁగుచేఁ గన్నులు మనస్సుకూడఁ జీకట్లు పడినవి. పైకిఁజూడలేక చలువలు వెదచల్లుచున్న యాకులవంకఁ జూచితిని. ఒక యాకు తేజస్వంతమై యున్నది. ఒకటి నల్లగ నున్నది. ఒకటి తెల్లగ నున్నది. ఒకటి శ్రవణమనోహరస్వరమయమై యున్నది. ఈ యాకుల క్రింద నొక మహావ్యక్తి యాసీనుఁడై యుండెను.

ఈతఁడు కూరుచుండునప్పుడే నాలుగడుగులకంటె నెత్తుకలవాఁడై యున్నట్లు కనఁబడినది. నల్లని శరీరకాంతికలిగి పచ్చని జటలుకలిగి యాతఁడు ప్రకాశించుచుండెను. ప్రక్కనొకకట్టి భూమిపై నున్నది. అప్పుడు ''ప్రాంశుపయోదనీలతనుభాసితు నుజ్జ్వలదండ ధారు'' అనుపద్యము జ్ఞప్తికివచ్చినది. అదిగాక యాచెట్టునైఖరి జూడ ''ఊర్ధ్వ మూలమధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్'' అన్న శ్లోకము జ్ఞప్తికి వచ్చెను. అందుచే నీతఁడు వ్యాసమహ ర్షియై యుండునని యనుకొంటిని. అదిగాక యా యశ్వత్థవృక్ష వర్ణములైన వేదములనొద్ద నీతఁడు కూరుచుండి యుండెను. ఈతఁడు తప్పక వేదవ్యాసుఁడని నిశ్చయించి యెదుటికిఁ బోయి సాష్టాంగపడి యి ట్లంటిని.

మహర్షి శేఖరా? మీరు విభాగించిన వేదముల నెవ్వరు నిప్పుడు పఠించుట లేదు. స్పృశించుట లేదు. అంటరానితనము చెప్పరానితనము నీవేదములకు మనవా రంట గట్టిరి అని యందుచే పై ఖండములవారి యధీనములయ్యెను. మీరు రచియించిన భగవద్గీతకూడ మొన్నమొన్నటి వఱకు బుట్టదాఖలై యుండెను. అది మిక్కిలి యుద్గ్రంథ మని పాశ్చాత్యులు స్తుతించుటచేత వారిమాటల నాధారము చేసికొని యిప్పుడిప్పుడే గ్రంథఘనత కచ్చెరు వొందుచున్నారు.

మహర్షిచంద్రమా! క్షమించునెడల నొక్కసంగతి యడిగెదను. భగవద్గీతకు బుద్ధిమం తులగు పండితు లందఱు వివిధములగా వ్యాఖ్యానములు చేయుచున్నారేల? శంకరాచార్యుల వలె రామానుజులు చేసినారా? వారివలె మధ్వాచార్యులు చేసినారా? యుద్ధకర్మము చేయుటకే యిప్పటివా రనుచున్నారు. మఱియొకరు భగవద్గీతను మీరు రచియింపనే లేదని తుండు తుపాకి నెగురఁగొట్టుచున్నారు. మీరను నొక వ్యక్తియే లేదని కొంద ఱనుచున్నారు. కృష్ణుఁ డన్న యాతఁడు దశావతారములలోనివాఁడు కాఁడని మఱికొందఱనుచున్నారు. ఈచచ్చు వాదములకేమి కాని యిన్నివిధములైన వ్యాఖ్యానములు బుట్టుటకు హేతువేది? కృష్ణభగవానుఁ డిన్ని యర్థములగునట్లు చెప్పునా? కాక యాయన యభిప్రాయమును మీరు నరిగాఁ దెలిసికొన లేక యిట్లు వ్రాసితిరా? కాక యన్ని విధములగు నర్థములకు లోపము మీవ్రాఁతలోనిదా? నాకుఁ దెలియక యడుగుచున్నాను దేవా! క్షమింపుఁడు.

మీవేదాంతసూత్రములకు మతత్రయవ్యాఖ్య లున్నవి. ద్వైతశ్రుతులు నద్వైతశ్రు

తులు వేఱువేఱుగా విరివిగా నుండుటచేత జ్ఞానమే మోక్షమసాధనమని తన బుద్ధిచే నమ్మిన
శంకరాచార్యులు ద్వైతశ్రుతులను ముక్కుముక్కలక్రింద నఱికి వాని కద్వైతార్థమునుగలిగించి
నారు. భక్తియే మోక్షసాధక మని నమ్మిన రామానుజాచార్యు లద్వైతశ్రుతులకుఁ జచ్చిచెడి
ద్వైతార్థమును గల్పించినారు. పూర్వాచార్యపురుషులగువా రిట్లే వారి వారిమనస్సులలోఁ
దమయభిప్రాయములచేతఁ బూర్వమే నంకల్పించుకొన్న సిద్ధాంతములఁ బట్టి
కాలస్థితులవలనఁ గలిగిన సొంత నమ్మకములఁ బట్టి వ్యాఖ్యానములు చేసినారేకాని మీగ్రంథ
మందున్న యథార్థసత్యమును గ్రహింపలేదని యిప్పటి యాచార్యపురుషులనుచున్నారు.
కాని యిప్పటివారి వ్యాఖ్యానములుకూడ నరిగా నిట్టి యధిక్షేపణకే లోనై యున్నవి. ఈ
అత్తగారు తన్ను బాధించినదని యాక్షేపించిన యిల్లాలు తాను కోడలిని బాధపెట్టకుండ
జరుపుకొన వలసినది. అట్లు జరుగుట కవకాశము లేకపోయినది.

మహర్షిపురందరా! భగవద్గీతకు నిజమైనయర్థమేదో నాకు బోధింపఁదగదా! యని
ప్రార్థించితిని. ఆయన ముసిముసినవ్వులు నవ్వినాఁడు. దానివలన నా కప్పటి కేమి తెలిసిన
దనఁగా పూర్వుల వ్యాఖ్యానములు నరియైనవి కావని యాయన యభిప్రాయపడినట్లు నాకు
గోచరమైనది. కాని యీ యంశము నిశ్చయముగాఁ దేలకపోవుటచేత గ్రుచ్చిగ్రుచ్చి
మఱియొకసారి యడిగితిని. అంతట నాతఁడు తన ప్రక్కనున్న కఱ్ఱనెత్తినాఁడు. కొట్టునేమో
యని లేచి యిప్పటివారు చెప్పినట్లు భగవద్గీతకు బడితెబాజాయే యర్థమా యని
యనుచుండఁగా నన్ను లేపినాఁడు. స్వప్నము నరి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

16. సభాస్వకీయ వ్యాపారములు

నెలకోకసారి ఉపన్యాసానికి బదులు సాక్షినంఘపు సొంత వ్యవహారాలు చూసుకోవాలనే నియమం చొప్పున ఈసారి, నంఘానికి వచ్చిన ఉత్తరాలు చూడడానకి నిశ్చయించాడు జంఘాలశాస్త్రి.

ఒక ఉత్తరం శవచింతామణీ గ్రంధాలయ కార్యదర్శి వ్రాశాడు. వారి గ్రంథాలయంలో, సాక్షి ఉపన్యాన సంపుటాలు ఒకటి, మూడు మాత్రమే వున్నాయట. రెండు, నాలుగు సంపుటాలు 'ఉచితం'గా పంపమని అభ్యర్థన. అలాగ కవులు తమగ్రంథాలు పంపిస్తూంటారట.

ఈ లేఖ వ్రాసినాయన ఒకసూచన కూడా చేశాడు. కాలాచార్యులు, వాణీదాసు కూడా తరుచు ఉపన్యాసాలిస్తే బాగుంటుందని.

దానిమీద వ్యాఖ్య అనవసరమని తీర్మానించారు. రెండో ఉత్తరం, కృష్ణాగోదావరీ మండలాలలోని యావదాంధ్ర షౌరశాలల సామాన్యకార్యదర్శి నుంచి వచ్చింది. ఏలూరులో ఈ నంస్థకు సంబంధించిన ప్రధాన కార్యాలయంలో, పద్దెనిమిదవ వార్షికోత్సవం జరగమోతోందనీ, దానికి అగ్రగనాధిపతిగా రావలసిందనీ, జంఘాలశాస్త్రికి ఆహ్వానం.

దీనికి అంగీకరించడమా? మానడమా? అని చర్చకు పెట్టగా –వాణీదాసు, వెళ్లాలని చెప్పాడు. కాలాచార్యులు వ్యతిరేకించాడు. కాని –ఉపన్యాసం ఉంటుందని వినడానికి అక్కడకు జేరిన ఇతరశ్రోతలు ఊరుకోలేదు. వారిలోంచి ఒకడు లేచి, జంఘాలశాస్త్రి ఆ నభకు వెళ్లకపోతే వచ్చే నష్టాల గురించి చెప్పి, వెళ్లి తీరాలని ప్రతిపాదించాడు. మిగిలినవారు కరతాళ ధ్వనులతో ఆమోదించారు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను.

ఈదినమున నుపన్యాన మేదియును లేదు. పూర్వనియమాను సారముగా మానమున కొకతూరి నభాసంబంధము లగునంగతులను గూర్చి నల్లాపించుకొందుము. ఉపన్యాన ముండు నని పెద్ద లందఱు వచ్చినారు. కావున నాయనలారా! ఉపన్యానము లేనందులకు క్షమించి మావ్యవహారములలో మీకుఁ దోఁచిన యభిప్రాయముల నొనంగి తోడుపడఁ గోరుచున్నాను. సాక్షికార్యాలయమునకు వచ్చినలేఖలఁజదివెదను.

మొ దటిది.

శవచింతామణీగ్రంథాలయ కార్యదర్శియగు గొంగళి భుక్తసాకీన్ గొలాంత్రగారియె
ద్ధసుండి

శ్రీ శ్రీ రాజమాన్యరాజపూజితులగు సాక్షిక్షి–

అయ్యా! మీ సంఘము తిరుగ స్థాపింపఁబడిన దని విని మిగుల నానందించుచున్నాము
మాపుస్తకాగారమున మీ సంపుటములలో మొదటిది మూఁడవదిమాత్రమే యున్నవి. రెండ
నాల్గు సంపుటములు మాకుచితముగాఁ బంపవేఁడుచున్నాము. మానిలయము మిగు
దరిద్రస్థితిలో నున్నది. ధైనికమగు నాంధ్రపత్రిక నా విశ్వదాత పంపుచున్నాఁడు. ఆయ
కనేక నమస్కారములు. మాగ్రంథనిలయమునకుఁ గొందఱుకవులు వారి వారి గ్రంథములన
ధర్మముగాఁ బంపుచున్నారు. ఆకవులకు నమస్కరించుచున్నాము. మీ జంఘాలశా
యుపన్యాసములు వినుభాగ్యము తిరుగ మాకు లభించినందులకు సంతస మగుచున్నది
కాని యొకందులకుఁ గొంచెము వగచుచున్నాము.

1. జంఘాలశాస్త్రి నడుచు నడుమ నాంగ్లేయపదముల నుపయోగించుచున్నాఁడు
వాని కర్థము తెలియక చిక్కుపడుచున్నాము.

2. ఈయంశమునుగూర్చి తరువాతఁ జెప్పెద నని వాగ్గాన మొనర్చిన విషయమ
లెన్నియో గలవు. అవి యన్నియు నిప్పుడు చెప్పఁగోరుచున్నాము.

3. మీలో కాలాచార్యులు, వాణీదాసకవియు నున్నారుకాదా? వారుగూడ తఱచుగ
నుపన్యాసము లిచ్చిన బాగుగా నుండునని నామనవి.

4. మాయూర నొకవైద్యుఁ డున్నాఁడు. ఆతఁడు మీయుపన్యాసము లన్నియు
నప్పజెప్పఁగలఁడు. మీసంఘమునం దాతని సభ్యునిగాఁ జేర్చుకొనవలయును.

చిత్తగింపవలెను
గొంగళిభుక్త

కార్యదర్శి.

జంఘాలశాస్త్రి యిట్లు లేఖను బూర్తిచేసి దీనికిఁ బ్రత్యుత్తర మక్కఱలేదు కాదా యని
సభవారి నడిగెను. అందఱున లే దనిరి.

జంఘాలశాస్త్రి రెండవయుత్తరమును దీసి యిట్లు పలికెను.

సోదరులారా! ఇది రెండవయుత్తరము దీనిని జదివెదను.

కృష్ణాగోదావరీమండలాంతర్గతసర్వాంధ్రక్షురకశాలసామాన్యకార్యదర్శియొద్దనుండి
–జంఘాలశాస్త్రిగారికి–

రామ్ రామ్,

ఏలూరులో స్థాపింపఁబడిన యీ సర్వక్షురకశాలాప్రధానకార్యాలయమునం దీసంఘసం
బంధమైన పదునెనిమిదివార్షికోత్సవ మీనెల 27వ తేదిన జరుపుటకుఁ బెద్దలు నిశ్చయించి
నారు. ఆంధ్రదేశమునందుండు క్షురకవిద్యాపారీణుల కందఱి కాహ్వానములు పంపించుచు
న్నాము. చిత్రవిచిత్రోపన్యాసము లీయఁగల మంగలిమహావక్త లెందఱో రాఁగలరు. క్షురకవి

వ్యారహస్యము లెన్నియో వెల్లడింపఁ గలరు. అట్టి మహాసభకు మతాభిమానన్యాయముచేత మంగలియే యధ్యక్షుఁడుగా నుండఁ దగినది. కాని మొన్న జరిగిన కార్యనిర్వాహకసభలో మిమ్మధ్యక్షుఁడుగా నాహ్వానించుట కేకగ్రీవముగఁ దీరుమానించుకొంటిమి. మంగలికి రాఁదగిన మహాగౌరవమును మతాంతరున కిచ్చి స్వార్థపరిత్యాగమును మాసభవా రగపఱచి నారు. మీ రగ్రాసనాధిపతిగా దయచేసి మమ్మానందింపఁ గోరుచున్నాను–ఇట్లు విన్నవించు కార్యదర్శి.

ఉత్తరమైనది. దీనికిఁ బ్రత్యుత్తర మేమని సభలో జంఘాలశాస్త్రి యడిగెను.

అంత వాణీదాసుఁడు లేచి యిట్లనియెను. క్షురకసోదరశిఖామణులు మీ కిచ్చిన గౌరవమునకు మీరు సర్వవిధముల నర్హులు కావున నంగీకరించితినని లేఖ వ్రాయవలయును.

అంత కాలాచార్యులు లేచి యిట్లనియెను.

ఇది మతవిద్యతోఁ జేరినయంశము. మతవిషయక మగు నాసభకు మతేతరుఁ డధ్యక్షుఁడుగా నుండుట తగదు. అందుచే జంఘాలశాస్త్రి పోఁగూడదని నా యభిప్రాయము.

అంత సభనుండి యొక్కఁడు లేచి యిట్లనియెను.

సోదరులారా! కాలాచార్యులు చెప్పినమాట కేవల మనుచితముగ నున్నది. ఇందఱు మంగళ్లయభిప్రాయమును నిరాకరించుట తగదు. అందులో మతవిభేదమే కారణముగ నెన్నఁడును నిరాకరింపఁదగదు. మతసంబంధమగు పట్టుదలచేతనే జంఘాలశాస్త్రి నిరాకరించినాఁడని మంగళ్ల కేమాత్రము తెలిసినను వారు బ్రాహ్మణులపై సత్యాగ్రహమును జరిపి తీరెదరు. అప్పుడు బ్రాహ్మణులు గిజగిజలాడవలసి వచ్చును క్షురకర్మ మెట్లో స్వయముగాఁ దీర్చుకొందుమని పురుషులు లక్ష్యపెట్టక పోయినను స్త్రీలమాటయేమి? వితంతువులలోనే కాకుండ నీకాలములో సువాసినులకుఁగూడఁ దల కత్తిరించుకొనుటకై మంగలి యపేక్షగలదు. ఇదివఱకే యనేకభేదములుచే దేశ ముల్లోలకల్లోలమై తపించుచుండ శక్తివంచనలేకుండ నుపశాంతిచేయుటకు బదులుగ వృద్ధిపఱచుటకై ప్రయత్నించుట బుద్ధిహీనతకంటె భిన్నమా? కావున జంఘాలశాస్త్రి యంగీకరింపవలసియున్నది.

ఈయుపపాదనమును సభవారందఱు కరతాళధ్వనులతో నంగీకరించిరి.

ఇంతకంటెఁ జదువఁదగినలేఖలు లేవు. చూడఁదగిన వ్యవహారము లంతకన్న లేవు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

17. క్షురకసభ

ఏలూరులో జరిగిన క్షురకసభకు జంఘాలశాస్త్రి అధ్యక్షుడిగా వెళ్లాడు. సభకు ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. జంఘాలశాస్త్రిని సభామందిరం దగ్గరకు సోడాబండిమీద కూర్చోపెట్టి లాక్కొని వెళ్లారు–గౌరవసూచకంగా–

రకరకాల పతాకాలు క్షురకసభకు గుర్తుగా అక్కడ సభాభవనం దగ్గరకట్టారు. దాదాపు వెయ్యిమంది దాకా ఆసభకు హాజరయ్యారు.

ఒక మంగలిసోదరుడు వేదికమీది కెక్కి, సాక్షి సంఘానికి చెందిన జంఘాలశాస్త్రిని ఎందుకు అధ్యక్షుడిగా ఉండమని కోరినమీద వివరించాడు. సాక్షిసంఘానికీ క్షురకమండలికీ ఉన్న పోలికలను వివరించాడు.

జంఘాలశాస్త్రి అధ్యక్షస్థానంనుంచి మట్లాడుతూ, ఈదినం శారదాచరిత్రలో అద్వితీయం కాగలదని నొక్కి చెప్పాడు. తను ఇక్కడ ఇలా వుండడం పూర్వజన్మ అనుబంధం అయి వుంటుందని సవినయంగా చెప్పాడు.

అనంతరం ఒక మంగలి సోదరవక్త, పరిశోధకుడు, వేదికఎక్కి, క్షురక జాతికి బౌద్ధమతంతో వున్న సంబంధం, దేశ చరిత్రలో క్షురకజాతివారు, పాలక ప్రభువుల సన్నిధిలోవుండి చేయించిన మంచిపనులు, వివరించాడు. అయితే ఈ పరిశోధన ఉత్సాహంలో క్షురక, క్షత్రియ జాతుల్ని ఏకం చెయ్యడంవల్లనూ, మంగళ్లలో ఏలూరు మంగళ్లు ఎక్కువ పరిశుద్ధులనడం వల్లనూ, గొడవజరిగి, ఉపన్యాసం ముగించవలసి వచ్చింది.

మరొకవక్త వచ్చి–నున్నితమైన క్షురకర్మకీ, సారస్వత సృష్టికీ వున్న పోలికలు వివరించాడు. క్షురకర్మలో ఉన్న వేదాంతార్థాన్నికూడా విశదంచేశాడు. ఇంతలో సభారంగం బయట రణరంగంగా మారడంవల్ల అధ్యక్షుడి ముగింపు వాక్యాలు లేకుండానే సభ ముగిసింది.

జంఘాలశాస్త్రి నేను వెడలినతరువాతి నిట్లు చెప్పెను:–

ఎన్నడుఁజూడలేదు. ఎన్నఁడు వినలేదు. అట్టివైభవము హేలాపురమున 27 వ తేదీని కాననయ్యెను. క్షురకసభాశాలపై వేలకొలఁది పతాకములు వివిధవర్ణనిరాజమానములై ప్రకాశించెను. ఒక జెండాపై మంగలికత్తి చిత్రంపఁబడియున్నది. మఱియొక్క జెండాపై దానిని

రాతిమీద విలాసముగ నూఁఁచున్న యొక క్షురకుఁడు చిత్రంపఁబడినాఁడు. ఇఁక నొక్క జెండాపై తోలుపాది నొడిలోఁ బెట్టుకొన్న మహాలక్ష్మీదేవి చిత్రింపఁబడియున్నది. ఇంకొక్క జెండాపై శారాదాదేవి, చేతిలో నొక్కతక్కెడతో నవ్వుచు నిలువఁబడియున్నది. ఆత్రాసులో కొక చిప్పయందు గంటము, ఒంటె వెంట్రుక కుచ్చుతాపి ఉలియు, రెండవచిప్పయందుఁ గత్తెరయు నున్నవి. కత్తెరపైపున బరు వెక్కువగా నున్నట్లు కనఁబడుచున్నది. బహిరంగతకొఱకు ననొకసోడాబుడ్లబండి మీఁదఁ గూర్చుండఁబెట్టి యెనమండ్రు క్షురకవిద్యాపారంగతులనేక శతమంగళవాద్యములు ఘోషించుచుండ నభకు లాగుకొని పోయిరి. అప్పటి కింక నుదయ మేడుగంటలకంటె నెక్కువ యైయుండపోవుటచేత నభయైనతరువాత నక్కఱకు వచ్చు ననికూడఁ దెచ్చుకొన్నపాదులను కొందఱు కరతాళధ్వనుల సౌకర్యముకొఱకు నాయొడిలోఁ బెట్టిరి. సోడాబండిదడదడలో నవి యీడిక్రిందఁబడునేమో యని కొన్నిఁటిని జేత గట్టిగఁ బట్టుకొనియుఁ గొన్నిటిఁ దొడల క్రిందఁ బెట్టి నొక్కియు వాయువేగముతోఁ బట్టుకొనియుఁ గొన్నిటిఁ దొడల క్రిందఁ బెట్టి నొక్కియు వాయువేగముతోఁ బోవుచున్నాను. ఒక్కమంగలియొద్ద నొక్కపాదికంటె నెక్కువగా నుండవలసిన యగత్యము లేనప్పటికి మంగలినభాధ్యక్షుఁడనైన నాయొద్ద నేడుపాదు లేకకాలమందుండు నదృష్టము సిద్ధించినది. ఎట్లో నభలోనికిఁ బోయితిని. నభ కన్నుల వైకుంఠముగ నున్నది. కదళీవృక్షచ్ఛటలు, వట్టివేళ్లతడకలు, చలువ చప్పరములు, కొబ్బెరాకుల వీవనలు మండువేసనిని మఱువఁజేయుచున్నవి. నభలోఁవేయిమంది క్షురకు లున్నా రని తెలియవచ్చినది. ఇతర శాఖలవా రింక నెందఱో యున్నారు.

అంత నొక్కమంగలి చెంగు చెంగున నుపన్యాసరంగ మలంకరించి దైవప్రార్థన మిట్లొనర్చెను.

ఉ. ఎప్పుడు భూమిఁ బుట్టితిఱా యెప్పుడు జానకిచెట్టఁ బట్టితో
ఎప్పుడు కానమెట్టితిఱా యెప్పుడు రావణు గిట్టఁగొట్టితో
అప్పటి గాథలెల్ల నిల నార్యుల చిత్తములందు గట్టిగా
ముప్పిరి పేట నల్లుకొని పోయె రఘూద్వహ! మమ్మిఁ బ్రోవుమా.

సోదరులారా! ఈనభకు మన మెవ్వరినైన నధ్యక్షుని నియమించుకొనవలసియున్నది. సాతినంఘమునకు క్షౌరశాలకు భేద మేమియులేదు. మనమొక చిన్నకొట్టులో మనదుకాణ మొకరిద్దఱసాహాయ్యముచేఁ బెట్టుకొనినట్లే వారుకూడ నొకకొట్టులో నొకరిద్దఱితోడుతఁ జిన్న నంఘము స్థాపించుకొనినారు. మనఁ జూచుటకు నిత్య మెందఱో వత్తురు. వారిని జూచుట కనుదిన మెందఱో వత్తురు. మనయొద్దకు వచ్చినవారిమనస్సున కాహ్లాదముగ మనము వర్తిల్లునట్లే వారియొద్దకు వచ్చినవారిమనస్సు కానందమగునట్లు వారు ప్రవర్తింతురు. వారమున కొక్కదినమున ననఁగా నాదివారమున మనకు లెక్కలేనంత జనము వచ్చినట్లే, శుక్రవారమునాఁడు వారినంఘమునకు నట్లే వత్తురు. ప్రధాన క్షౌరకుఁడు మనలో నొక్కఁడే యున్నట్లు వారిలోఁ బ్రధానవక్త యొక్కఁడే. మనసంఘమును స్థాపించిన పూర్వాచార్యుల పేరిటనంఘమెట్లు నడచుచున్నదో వారి నంఘముకూడ సాక్షిపేర నట్లే జరుగుచున్నది. సాక్షి యువన్యసించుటగాని, వ్రాయుటకాని యేమియు లేదు. మన నంఘస్థాపకుఁడట్లలంకారముగా గోడపై నుండుటయేకాని యొక్కకత్తి నూఁతినాఁడా? ఒక్కగడ్డము

తడిపినాఁడా? ఏమియు లేదు. దినములు దొరలిపోవుటకు మనసంఘమె ర్పాటయినదో వారి సంఘముకూడ నందులకే యేర్పాటయినది. దేశసేవ యని లోకోపకార మని, బుద్ధిహీనులు బోధించెడి బోధకాలిమాటలు బూటకములు. కోట్లకొలఁదిధనముతో వ్యవహరించు సంఘమైనఁ గూటికొఱకే–ఆరోగ్యప్రదాసమునకై పాశ్చాత్యదేశీయు లిట స్థాపించిన యాసుపత్రులు, ధర్మసంస్థలు మొదలైన వన్నియు దనసంపాదనకే. జ్ఞానబోధముకొఱకు మతగురువులను దేశదేశములకుఁ బంపుసంఘము లన్నియు సందేహరహితముగ సంపాదనకే –వారివలనలోకమునకేదియో యుపకారము జరుగుచున్నది కాదా యని యందురా? వారివలననే యన్నమాట యేమి? ఎన్నియో యాఁగలను దనపొట్టను బెట్టుకొని బల్లి యంటురోగములను బ్రాఁకకుండ నాఁపుచున్నది కాదా? బల్లి లోకోపకారమునకే యట్లు చేయుచున్నదా? పిల్లి యెలుకల నెన్నిఁటినో చంపి మారికావ్యాధి నరికట్టుచున్నదికాదా? పిల్లి లోకోపకారమునకే యట్లు చేయుచున్నదా? మాటలచే మనము మనల మోసపుచ్చుకొనుట తగదు. లోకమునఁ బ్రతిజీవమువలననే కాదు, ప్రతినిర్జీవవస్తువులనగూడ లోకోపకారము జరుగుచున్నది. వేపాకువలన మనూరిరోగము స్తంభించుచున్నది. తెల్లజిల్లేడు వలనఁ గాసరోగము తగ్గుచున్నది. ఉమ్మెత్తవలన నుబ్బసమునకు వడిమఅలుచున్నది. బల్ రక్కసి వలనఁ దేలుబాధ పోవుచున్నది. నాభివలన జ్వరము హరించుచున్నది. తుదకు మనకాలి క్రింద మట్టివలన జరుగుచున్న లోకోపకార మింతంతకాదు. ఇట్టి నిర్జీవపదార్థములవలనఁ బ్రపంచమునకు మేలు జరుగుచున్నట్లే జీవపదార్థములవలనఁ గూడ జరుగుచున్నది. స్వభావసిద్ధముగ మాత్రమే జరుగుచున్నది. ఉద్దేశపూర్వకముగ జరుగుట లేదు. లేదు. కావున సాక్షిశాల మనశాలకంటె భిన్నముకాదు. ఆశాలానిర్మాణమునకు, మన Saloon మార్గదర్శిని యని చెప్పక తప్పదు. సాక్షి మనకు జన్మసోదరుఁడే కాక వ్యాపారసోదరుఁడు కూడను. ఆసంఘప్రధానవక్తయగు జంఘాలశాస్త్రిని మనసభ కధ్యక్షునిగా నియమించుకొనుట మిక్కిలి ప్రశస్తము. సభవారిపక్షమున నే నీయుపపాదన మొనర్చుచున్నాను. అంత సభలోఁ గరతాళధ్వనులు.

తరువాత నొక్కఁడు లేచి యుపపాదనమును బలపఱచెను. నేను గరతాళధ్వనులన దుమ నధ్యక్షపీఠ మెక్కితిని. ఒక్కఁడు వచ్చి నా మెడలోఁ బుష్పమాలిక వైచెను. మఱి యొకఁడు వచ్చి నాచేత నొక కార్యక్రమపత్ర ముంచెను. నేను వినమ్రుఁడ నై లేచి యిట్లంటిని.

సోదరులారా! పాలలో మీఁగడయెట్లో చిన్నవూదేనిలోఁబలుకులెట్లో యాంధ్రక్షురక మహామండలిలో మీరట్టి యుత్కృష్టు లైనవారు. ఇది వసంతర్తువగుటచే నొక్క మంగలిదర్శనమగుటయే మహాదుర్లభమైయుండ, నిందఱదర్శన మయాచితముగ నగుట యనర్ఘుఁడ నగు నాపుణ్యమే కాక యఖిలాంధ్ర దేశపుణ్య మని చెప్పిన నతిశయోక్తికాదు. ఆంధ్రసారస్వతచరిత్రలో నీదినమర్య సువర్ణాక్షరములతో లిఖింపఁబడఁదగినది. ఈసభలో నెందఱో క్షురకవిద్వాంసు లుండనెందఱో క్షురకోద్యోగులుండ, నెందఱో క్షురకకవు లుండ నెందఱో క్షురకవక్తలుండ, క్షురకుఁడనుగాని, నాకీగౌరవము లభించుట యాంధ్రశారదాచరిత్రలో నద్వితీయమగు నంశముగ నుండఁగలదు. అంబష్ఠజాతి కంతకు నాయందుఁ గల యవ్యాజాభిమానమును బట్టి చూడఁగా నేను పూర్వజన్మమున మంగలినై యుందు నేమో యని యనుకొనవలసి వచ్చుచున్నది. (సభలో కరతాళధ్వనులు) లోకమున నకారణాభిమాన

ములు సహేతుక ద్వేషముల పూర్వజన్మములందలి సంబంధవైషమ్య ములవలనఁ గలుగుచున్నవి. ఒకనిని జూడ నహేతుకమైన కూరిమి. ఇంకొకనిఁ జూడ నహేతుకమైన కోపము. పూర్వభవానుభవజన్యములు గాని మఱియొకటి కాదు. ఇందునుగూర్చి పూర్వోపన్యాసము లలో విపులముగాఁ జెప్పితిని. చర్వితచర్వణము తగదు. మీవృత్తిమర్యాదలఁ గూర్చియు మీవృత్తిలోని నిశేషములఁ గూర్చియుఁ గార్యక్రమపత్రములోఁ బేర్కొనఁబడిన వక్తలు చెప్పుదురు. అంతకుఁబూర్వ మాహ్వాన సంఘాధ్యక్షుని యుపన్యాసము జరుగవలసియున్నది. స్వామిరావుగారూ! మీరు దయచేసి యుపన్యాసపీఠ మలంకరింపవలయును. అంత నొక బుగ్గమీసాల పురుషుడు నలువదేండ్లవాఁడు రంగమెక్కి యిట్లుపలికెను.

అధ్యక్షశార్దూలమా! మంగలిసింగములారా! ఆతఁడు కొంతసేపు గొంతుక సవరించుకొనుటతోడను, గొంతసేపు దగ్గుతోడను గాలక్షేపము చేసి యాత్మగౌరవప్రకటనార్థముగా నటునిటు చూచుచుండెను. అధ్యక్షశార్దూలమా! మంగలిసింగములారా! యని విచిత్ర సంబోధనచేసిన వ్యక్తి మిక్కిలి రోమకుఁడైయుండుటచేత వావదూకభల్లూకమా! యని పిలిపించుకొనఁదగినట్టున్నవాఁడు. తరువాత నాతఁ డిట్లు మాటలాడెను.

మనజాతి మూలపురుషులలో నొక్కఁడైన మహామహుఁడు బ్రాహ్మణోత్తములగు మహాపండితులచే, వేదాంతులచే సాష్టాంగనమస్కారము లందినవాఁడు. ఆమహానుభావుఁడు మతబోధనమొనర్చుఁజేసిన పర్యటనమువలన భారతదేశమంతయుఁ బవిత్రమైనది. ప్రాగ్దేశములందే కాక, పాశ్చాత్యదేశములందుఁ గూడ నాతనిపేరు మ్రోఁగుచున్నది. అట్టిభగవానుఁ డెవరో యెఱుఁగుదురా, ఎఱుఁగరు. ఎఱుఁగరు మనకర్మ మట్లున్నది. మన యజ్ఞత యట్లున్నది. మన మతాభిమాన మట్లున్నది. బుద్ధభగవానునిప్రక్కన గూరుచుండుటకు జ్ఞానతేజముచే నధికారమున్నవాఁడు మనమూలపురుషులలో నొక్కఁడు, వింటిరా. అట్లు తెల్లబోయి చూచెదరేల, నే నసత్యమాడుచున్నానా?. నే నసత్యమాడినను జరిత్ర లసత్యమాడునా? శాసనము లసత్యములాడునా? ఈశాసనములు, ఈచరిత్రములు తరువాతి వగుటచేత సత్యదూరములు కావచ్చునేమో? పోనీ–బుద్ధభగవాను నడుగుఁడు. జయాబుద్ధ దేవా! అని నమస్కరించి యడుగుఁడు. ఏమనుచున్నాఁడు? వినుడు! కర్ణములు పవిత్రముల గునట్లు వినుఁడు. అదిగో! అదిగో! దివ్యధ్వని వినఁబడుచున్నది. అవతారపురుషుఁ డగుట తక్క ఉపలివర్మగారు నాతో సమానులని యనుచున్నారే. ఆమహాత్ముని పేరేది? (ఉపలి ఉపలి అని సభలోఁ గేకలు.) మహాపండితు లగు, మహాకస్యపమక్కళాచార్యాదిమహనీయుల కంటె ముందుగా బుద్ధదేవప్రసాదితమగు శాటిని బరిగ్రహించినవాఁ డవఁడు? (సభలో ఉపలి అని కేకలు.) సర్వతోముఖ పండితులగు బ్రాహ్మణులకు సైతము నిరాకరింపఁబడిన నన్మాన మీమహానుభావున కయాచితముగ లభించినది. కళింగదేశమునం దంతను బుద్ధబోధసుధను వర్షించి జ్ఞానాంకురములు గలిగించిన గురుసార్వభౌముఁడెవఁడు? (ఉపలి యని సభలోఁ గేకలు.) అట్టి యాదిపురుషునిపేరు మనపిల్లలకుఁ గాని, మన పిల్లలపిల్లలకుఁగాని పెట్టుకొంటిమా? లేదులేదు. (సిగ్గుసిగ్గు అని సభలోఁ గేకలు) పోనీ ఇన్ని క్షురకశాల లున్నవికదా. ఉపలిమంగళాయతన మనికాని, ఉపలిదేవాలయ మనికాని దేనికైనఁబే రుంచితిమా? (సిగ్గు సిగ్గు అని సభలోఁ గేకలు) నాతనుపును బుద్ధ మతసంబంధమైన పరిశోధనకార్యమందుఁ బవిత్రమొనర్చుకొనుచున్నాను. నేను మీకు బుద్ధమతమును నాల్గుముక్కలలో బోధింతును.

మీరు మీశాలలకు వచ్చువారికందఱకు క్షురకర్మకాలమందు బుద్ధమతమును బోధించుచుం డవలయును. అందువలన మీరు తరింతురు. మీపాదముల యొద్దకు వచ్చి మీ సమయమును కనిపట్టి మీవలనఁ గృతార్థులగుచున్న మీయాశ్రిత లందఱు తరింతురు.

ఇది కాక పూర్వమహాప్రభువులయాస్థానములలోఁ బ్రభుశిఖామణికి మంగలి యొక్కఁడు కొంచెము హెచ్చుతగ్గుగా వేడుకచెలికాని వంటివాఁ డుండెడువాఁడు. ఆతనికి నియమితమైన కొలు వేదియు లేదు. ఆతఁడు రాత్రియెనిమిది గంటలకు మహాప్రభువునొద్దకుఁ బోయి యాతని మంచమునొద్ద విలాసముగాఁ గూర్చుండి వేడుకకై యొక్కసారి యాయన కాళులనైఁ జేయినైచి యూరిలోనివింత లన్నియుఁ జెప్పుచుండె డివాఁడు. ఇట్టి మంగలిమహానుభావు లెందఱో మహాప్రభువులచేతఁ బ్రజలకు నీనాములిప్పిం చినారు. ఉద్యోగము లిప్పించినారు. బహుమానము లిప్పించినారు. మహాస్థానములలోనున్న యినాములన్నియు నిట్లు పుట్టినవే. మన ముత్తాతల ముత్తాత లిట్టు లెన్నిలేల కుటుంబము లకో యుపకృతు లొనర్చినారు. అట్టిగౌరవము మన కిప్పు డున్నదా? లేదు. అట్టి మహాప్రభువు లిప్పుడున్నారా? లేరు.

మనజాతిపుట్టుకనుగూర్చి యనేకములగు పాఠభేదము లున్నవి. ఈపాఠభేదము లన్నియుఁ బరిశీలించి నా విమర్శనశక్తి నంతయు ధారపోయఁగాఁ తుదకు నాకేమి తోఁచిన దనగా మంగళ్లు కత్తిచే జీవించువారగుటచేతను, క్షత్రియులు కత్తితో జీవించువా రగుటచే తను, వీరు వారుకూడఁ బౌరుషవంతు లగుటచేతను బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులన్న వర్ణవిభాగము సరియైనది కా దనియు, బ్రహ్మక్షురకవైద్యశూద్రులుననది సరియయిన దనియు మంగలిమహాజాతిలో క్షత్రియజాతి యంతర్లాపి యనియు నేను స్థిరపఱచినాను.

'తన్ను తన్ను' మని సభలోఁ గొందఱు రాజులు లేచిరి. రాజులీసభ కేల వచ్చియుండ రనఁగా నాదినమునఁ బశువుల సంతలోఁ బశువులఁ గొనుటకై వచ్చి జెండాలబండారముఁ జూచి యిది యేమోయని యిక్కడకు వేడుకకై వచ్చియుండిరి. అంత సభలోఁగొంత యల్లరియైనది. నేను లేచి క్షత్రియులను బతిమాలుకొని శాంతిపఱచితిని. క్షత్రియులు కొందఱు, బ్రాహ్మణులు కొందఱు సభనుండి లేచిపోయిరి. ఇట్లు పోయిన బ్రాహ్మణులకుఁ గాని; వారి బంధువులకుఁ గాని క్షౌరము చేయకుండుటకు మంగళ్లు రహస్యముగ నేర్పాటుచే సికొన్నట్లు వారి గుసగుసలవలన నాకుఁ దోఁచినది. వక్త తిరుగ నిట్లు చెప్పసాగెను.

కవులకుఁ దిట్లు తప్పవు. పరిశోధకుల కంతకంటె తప్పవు. భూమి తిరుగుట లేదన్నవాఁడు భూమిపై నున్నాఁడు. అది తిరుగ నని చెప్పినవాఁ డంతకపురియం దున్నాఁడు. నాపరిశోధన సత్యమును గ్రహించుటకుఁ బ్రజ లింకఁ దగినజ్ఞానముతో లేరు అయినను నీపట్టణసంబంధమగు నొక్కపరిశోధనము చెప్పి విరమింతును.

అంతట నేను లేచి యిట్లంటిని. ''అయ్యా! నీపరిశోధనమున నీ కొక్కనికే ప్రాణముమీఁదికి వచ్చునెడల నెట్లయిన సహింపవచ్చును. అందువలన నాకు, నీపరిషత్తునకుఁ గూడ ప్రాణముమీఁదికి వచ్చునప్పుడు సహింపదగదు. చావునకు నీవలె నందఱు తెగించి యున్నారని యనుకొనఁదగ'' దని బలుకఁగ నాతఁ డిట్లనియెను.

సొందర లేదు. ఈవిమర్శన యంత యపాయకరము కాదు. ఏలయ్య యను పేరుగల

యొకమంగలి తల్లిదండ్రులతో రామేశ్వరమునకు పోవుచుండఁగాఁ బురుహూతికాపీఠనమీప మున నాతని తలిదండ్రులిద్దఱు మరణించిరి. వారిపై నొక్క నదిని భగీరథునివలె (భగీ రథుఁడు మంగలికాదుగదా యని నభలోఁ గేక) ఆసంగతి వలదు–ప్రవహింపఁజేయ నెంచి పీఠమునొద్దఁ గూరుచుండి తపస్సుచేసి గంగను దెప్పించెను. ఏలయ్య తపస్సువలన వచ్చిన గంగ కావున నేలే రని దానికిఁ బేరు కలిగెను. అంతట నాతఁ డేలేశ్వర మను నొకగ్రామమును స్థాపించి రామేశ్వరమునకుఁ బోవుదారిలోఁ గృష్ణానదీసమీపమునఁ దపస్సు చేసికొను చుండఁగా ''నీ విచ్చట నుండవలయు నని'' స్వప్నమున నొకదేవత చెప్పిన ట్లయ్యెను. అప్పు డాతఁ డేలూరు స్థాపించి యిక్కడనే పరమపదించెను. ఏలూరిలోఁ బుట్టిన మంగళ్లుమా తమ్రే యేలయ్య సంబంధమువలనఁ బరిశుద్ధులైన మంగళ్లు. నిజమైన మంగ ళ్లేలూరివారే. బెజవాడ మంగళ్లని, రాజమండ్రి మంగళ్లని పెద్దపేరేకాని వారి జన్మములలోఁ గొంతకలితి కక్కుటీతి కల వని నేను దృఢముగా.

''నీ సిగగొఱుగ! నీగొంతుగోయ! మేము సంకరజాతివారమా! చూచెదరేమి'' యని రౌద్రాకారులై పదిమంది మంగ ళ్లుపన్యాసరంగమునొద్దకు వచ్చిరి. నేను వారిని శాంతిపఱచి 'నీవు కూరుచుండుము. ఇఁక మాటలాడవల' దని యావక్తను శాసించితిని.

తరువాత నొక్కఁడు పీఠ మెక్కి యిట్లనియెను. సోదరులారా! మనవృత్తి విశేషములు నేను గొన్ని చెప్పుదును. వక్తను గాని హేతువుచే నుపన్యాసమును వ్రాసికొనిచ్చితిని. శిశువు గలిగినప్పుడు బొడ్డుకోయుటకు మనకత్తి యవసరము. ఉపనయనసమయమున మనకత్తి యవసరము. మంగళసూత్రధారణసమయమున మనకత్తి యవసరము. నిత్యకృత్యములందు మనకత్తి యవసరము. మగవాఁడు చచ్చినప్పుడాతని భార్యశిరోజములను దీయుసేళ మనకత్తి యవసరము. అట్టియాచారము లేనిచోటనైనను మంగళసూత్రము ద్రెంపుసేళ మనకత్తి యవసరము. పుట్టినది మొదలు చచ్చినపర్యంతము మంగలితోఁ బనియున్నది. పరిపాటిగల దలగొరిగించుకొను వితంతువునొద్ద మంగలి యెంతదగ్గఱగాఁ గూర్చుండునో యెఱు గమా? సర్వస్త్రీలయందు మాతృభావము మనపవిత్రమైనవృత్తియే మనకు నేర్పుచున్నది. ఇంత పుణ్యవంతమైన వృత్తిమాత్రము ప్రపంచమున నింకొకటి లేదు. పీఠాధివీరులగు రాజాధిరాజులనుగూడ మంగలి తనముందుఁ గదలకుండ మెదలకుండ గూరుచుండఁబెట్టు కొనునే. జుట్టు చేతఁ బట్టికొనినను వారు నోరెత్తుటకు వీలులేదే! ఓహో ఎంత మతగౌరవ ప్రపత్తులుగల వృత్తియో చెప్పవలయునా? ఈవృత్తి ఘనత పూజ్యత చెప్పుటకు నాల్కకు శక్తి చాలదు. తలఁచుటకు మనస్సునకు శక్తిచాలదు.

మనకు వృత్తి క్షౌరవముకాని గానముకాదు. సన్నాయిపాట బలిజీలు దూదేకులసాహే బులు మొదలగువారు నేర్చుకొనుచున్నారు. గానము క్షౌరమునకు రవంత సహాయకార్య ముగ మనలోఁగొంద ఱంగీకరించినారు. 'మనపూర్వపుఁగొయ్యపిడి చేతకత్తులకాల మునాఁటి క్షౌరపుసాగ నీనాఁడు లేదు. ఈనాఁడు కత్తిగుల్లయె పనికూడ నట్లె గుల్లసాగను నునుపు, డాబేకాని పనివానితనపు పనందు లేదు. గుల్లకత్తితోఁ గూటివచ్చునా? చేతకత్తి కది చెప్పిన నుగుణము. ఈచేత కత్తితోఁ జేసిన గడ్డము ప్రబంధకవిత్వమువలెఁ బ్రశస్తగాన మువలెఁ బ్రజ్ఞాప్రకటకమై ప్రకాశించును. చిత్ర లేఖనమువలె, గానమువలె క్షురకర్మ యొకక ళయే గాని శాస్త్రము కాదు. కవి యెట్లు పుట్టవలయునో, క్షురకుఁ డట్లే పుట్టవలయును.

ఆ. చేఁతక త్తిమహిమఁ జింతించి చెప్పంగఁ
బమ్మతరమె వాని బాబుతరమె?

యని మంగలి సుబ్బరామ కవి చెప్పిననావేశపూర్ణములగు వాక్యములు వేదవాక్యముల కంటె వేరుకావు.

క్షురకవృత్తిలోని రహస్యములఁ గొన్ని మనవి చేసెదను. ఒకగడ్డమును క్షౌరముచే యుట కొక్కఁ డొకగంట తీసికొనును. ఒక్కఁడైదు నిమిసములలో మూఁడుగడ్డములుచే యును. ఆహ్వానసంఘాధ్యక్షుని మేనమామగారు గానుగయె ద్దొకచుట్టు తిరిగివచ్చులోపల నొకగడ్డమును బూర్తిచేసెదువాఁడు. వేగముగాఁ జేయువాఁడు నిమ్మళముగఁ జేయలేఁడు. నిమ్మళముగఁ జేయువాఁడు వేగముగఁ జేయలేఁడు. సారస్వతమందు మాత్రము? గొలుసుక ట్టుగ వ్రాయువాఁడు విడి యక్షరములు వ్రాయలేఁడు. విడియక్షరములు వ్రాయువాఁడు గొలుసుకట్టుగ వ్రాయలేఁడు. మెత్తని పదనుకత్తితోఁ జేయువాడు గరసుపదను కత్తితోఁ జేయలేఁడు. గరసుపదనుకత్తితోఁజేయువాడు మెత్తనిపదను కత్తితోఁ జేయలేఁడు. సారస్వత మందు మాత్రము? సన్నకలముతో వ్రాయువాఁడు ముదుకకలముతో వ్రాయలేఁడు. ముదుక కలముతో వ్రాయువాఁడు సన్నకలముతో వ్రాయలేఁడు. ఎడమచేతి వాటముకలవాఁడు క్షౌరము కుడిదౌడ నారంభింపలేఁడు. కుడిచేతి వాటముగలవాఁ డెడమదౌడను బని యారంభింపలేఁడు. సారస్వతమందు మాత్రము? బాగుగా మాటలాడఁగలఁడు బాగుగా వ్రాయలేఁడు. బాగుగా వ్రాయగలవాఁడు బాగుగా మాటలాడలేఁడు. చర్మము చిట్లకుండ కూటీతీయగలవాఁడు మిగులజాణ. అట్లుచేసియు ''కూటీ'' కాయలు మొలవ నీయకుండఁ జేసినఁవాడు మఱింతజాణ. సారస్వతమునందుమాత్రము? శబ్దాలంకారములకొఱకు దేవులాఁడువాఁడు రసపుష్టికలుగఁజేయలేఁడు. రసపుష్టికిఁ జూచువాఁడు పద్యము కుంటిగఁజె ప్పును. ఈలోపములఁదీర్చువానికి గ్రంథచౌర్యము తప్పదు. ఇట్టిలోపములు సారస్వతమం దెట్లో క్షౌరమునం దట్లే. ఈలోపములను సాధ్యమైనంతవఱకు రానీయకుండ సవ్యసాచులై సంపూర్ణులై మీరుప్రకాశింపవలయునని నాప్రార్థన. అన్ని లోపములగూడ సాధ్యమైనంతవఱకుఁ జేతకత్తి తీర్పఁగల దనివార్చ విశ్వాసము. ఈచేతకత్తితోనే జగప తులు, గజపతులు కాలక్షేపము చేయించుకొనిసైలోకమునకు వెడలిపోయినారు. నిద్రవచ్చి నట్లు క్షౌరము చేయఁగలకత్తి చేత కత్తి. నూరాఱులు, వేయాఱులు, నగ్రహారములు సంపాదించిన దీచేతకత్తియే. ఒకసారి మాకుటుంబములో జరిగినచిత్రమును జెప్పెదను. మా పూర్వులలో నొకఁడు పెద్దాపురపుజగపతులలో నొకరికి క్షౌరము చేయుచుండెను. చేయుచుండఁగా కత్తికొయ్యపిడి వదలయినది. పిడి బిగించుటకై యాతఁడు టక్కుటక్కున ప్రభునినెత్తిపైఁ గొట్టెను. అంతట జొటజొట కన్నీళ్లు ప్రభువునకు వచ్చినవి. కాని గోనేడవారు, పోలవరపువారు కుదుర్పలేక పోవుటచేత చిరకాలమునుండి బాధించుచున్న పోలవరపువారు కుదుర్పలేక పోవుటచేత చిరకాలమునుండి బాధించుచున్న పార్శ్వపునొప్పి మంత్రల పిడిపోటుచే నెగిరిపోయినది. అసతి కందుకై యగ్రహార మొసంగబడినది. అప్పటి నుండియుఁ బార్శ్వపునొప్పియున్నవారు శిరోవాతమున్నవారు నాతనియొద్ద నట్లు నెత్తిపైఁ బిడి బిగింపించుకొనుచుండెడివారు. చేఁతకత్తితో గీఁకిన తలకుఁ గలుగు చలువ యావునే తితో గలుగదు. ఆముదముతోఁ గలుగదు. వేదాంతసంబంధమైన విశేషమొక్కటి కలదు.

బ్రహ్మరంధ్రమున నుండి యమృతబిందు వంగిటలోనికి మహాపుణ్యాత్మునికి మోక్షకాల మునందుఁ బడునఁట. అట్టిబిందువు మఱింత శీఘ్రమగు స్థానమునుండి జార్చి యంగిటఁ బడఁజేయుటకుఁ జేఁతకత్తిపిడిపోటు యోగశాస్త్రసాధనము లన్నిఁటికంటె సర్వోత్తమ మని యామహాపురుషుఁడానతిచ్చెడివాఁ డని వాడుక. అందుకొఱకు అనఁగ మోక్షమును సంపా దించుటకొఱ కొకఁడు ప్రయత్నించునట్లును మన పూర్వుని పిడిటొకాయింపుచేత నమ్మృత బిందువు నోటిలోఁ బడఁగ వెంటనే యతఁడు మోక్షను పొందినట్లును వింతయైనకథ యున్నది. పామరులగు జనులేదో కొంత యల్లరిచేసినట్లుకూడ జనవాక్య ముండెను. ''అందఱు నా చేతఁ జావనే చచ్చినారు. నీవు చంపున దేమిటి నీమొగము. నిమిత్తమాత్రుఁ డుగ నుండవోయి బుద్ధిహీనుఁడా'' యని నరునకు నారాయణుఁడు చెప్పిన భగవద్గీతానీతినే మనపూర్వుఁడు జ్ఞానహీను లగునప్పటి ప్రజలకు బోధించినాఁడఁట. అందుచేతనే నాతని కపరకృష్ణుఁ డని పేరు వచ్చెనఁట. జ్ఞానబోధమున నాతని యంత వాఁడు లేఁడు. మోక్షసాధనములలోఁ జేఁతకత్తి యంత సుఖమైనది లేదు.

భారతదేశమున బ్రజలుచేయు ప్రత్యాచారమునకును వేదాంతార్థ మున్నది కాని లేకపోలేదు. ఏపనికాని శరీరపోషణాదివృత్తులతో నెన్నఁడును మనము చేయుము. స్నానము దేహ పరిశుద్ధికిఁ గాదు. మనఃపరిశుద్ధితోఁ గర్మ మొనర్చుటకు భోజనము ప్రాపంచికకార్యము లొనర్చుటఁ కైన దేహదార్ఢ్యమునకుఁ గాదు. యోగాదిసాధనములు చేసి మోక్ష మందుటకు. అటులే క్షుర కర్మమునకుఁగూడ వేదాంతార్థముండక తప్పదు. అది యేదియో యోచిం తము. తలయే శరీరమందలి ముఖ్యభాగము. ఎందుచేత? మనస్సునకు స్థానమగుటచేత. మనస్సులోనే సర్వపాపము లుదయించి బయలు వెడలును. ఆ పాపములే వెండ్రుకల రూపమున తలనుండి వచ్చుచున్నవి. క్షురకర్మ మనఁగ పాపవిచ్ఛేద మన్నమాట. అందుచేత మతమే సమస్తమయినభారతదేశ మునమట్టుకు మతగురుండు మంగలి యని చెప్పునెడల సత్యమునకు దూరమై యుండదు. మోక్ష ప్రదాతలలో మంగలికూడ నొకఁడు.

మమ్మఁ బరాభవించుటకే పిల్చినారా, మేము సంకరకులము వారమా? ఏలూరివారు పరిశుద్ధులా అని పెద్దకేకలు పాక వెలుపల వినఁబడుచున్నవి. అందుపై దళ్ల వెదురుకఱ్ఱ లూడఁదీసి చూచెదరేమి తన్ను, కొట్టుమని యెందఱో కేకలువేసిరి. ఒక్క నిమునములోఁ బాకలోని వారందఱుఁ బైకి పోయినారు. పాకలోనుండి యంతకు ముందెప్పుడో కాని చల్లగ జాఱి వావదూకభల్లూకముగారు పాకవెలుపల నుపన్యాస మారంభించినాఁడు ''నాపరిశోధ నలు తప్పులా? వేదపురుషులందఱు మంగళ్లని నిదర్శనములు చూపించెదను.'' అని యాతఁడు వెట్టి కేకలు వైచుచున్నాఁడు. ఇంతలో రక్షకభటులు వచ్చిరి. అల్లరికి కారణమైన వారు దీరకపోవుటచేత నేమియు నెఱుఁగని నలుగురు బడిపిల్లలను, నాదారినప్పుడు చెంబుతో ముష్టికిఁ బోవుచున్న బలిజ వితంతువును బట్టుకొని కొట్టులోఁ బెట్టిరి. ఉపసంహా రోపన్యాసమున నంతయుఁ జెప్పవలయునని ప్రారంభోపన్యాసమును నాల్గుముక్క.లలోఁ గడతేర్చితిని. అవకాశములేక యుపసంహారోపన్యాసమును మానితిని. సభ తుద కిట్లయ్యె.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

18. సుఖప్రారబ్ధము

జరిఘూలశాస్త్రి ఈప్రపంచం తీరుగురించి వివరిస్తూ–ప్రతి జీవికీ కష్ట ప్రారబ్ధం ఎలాంటిదో, సుఖప్రారబ్ధం కూడా అలాంటిదేనని వివరిస్తున్నాడు. అంటే, కష్టాన్ని తప్పించుకోలేనట్టే. నీవు నిర్ణయించివున్న సుఖాన్ని కూడా తప్పించుకోలేవురా! అని చెప్పడం.

భగవంతుడి తత్త్వాన్ని గురించి ఏమీ చెప్పకుండా మౌనంగా వూరుకున్న బుద్ధుడు సైతం మన కర్మాన్ని అనుసరించే ఉత్తర జన్మఫలం వుంటుందని స్పష్టంగా చెప్పాడు.

మన సంపదలకీ, మన ఆపదలకీ, మన జన్మలకీ, మన మోక్షానికీ,–ఇదీ అదీ అని లేదు. మనతో సంబంధించిన అన్నింటికీ కూడా కర్తలం మనమే. తిట్టుకోదలుచుకుంటే మనల్ని మనమే తిట్టుకోవాలి. కొట్టుకోదలుచుకుంటే మనల్ని మనమే కొట్టుకోవాలి. కోసుకోదల్చుకుంటే మనల్ని మనమే కోసుకోవాలి. ఇతరుల్ని పల్లెత్తు మాటకూడా అనకూడదు. పరిపాలకులకేమి, ఈశ్వరుడికేమి, మనకర్మతో నబంధం లేదు. మన కర్మల్ని అనుసరించి ఈశ్వరుడు ఆయా కర్మఫలాన్ని పంచిపెడతాడు. కష్టకాలాన్ని కాని, సుఖ కాలాన్నికాని రవ్వంత కూడా పెంచడం సాధ్యం కాదు. మనమే ఒక ప్రపంచం. మనకు మనమే ఈశ్వరులం.

ఇందుకు ఉదాహరణగా, ఒక విరాగి జనక చక్రవర్తిని కలుసుకున్న ప్పటి ఉదంతాన్ని జంఘూలశాస్త్రి విపులంగా కథనం చేశాడు. సుఖప్రారబ్ధం అనేది, అడవులబట్టి పోయినా వెంటబడి వస్తుందని నిరూపించాడు.

జరిఘూలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! ప్రపంచజీవులలో నాకారములందు భేదమున్నది. ఆయుఃపరిమితులందు భేదమున్నది. గుణగణములందు భేదమున్నది. బుద్ధిజాతులందు భేదమున్నది. భాగ్యనైఖరులందు భేదమున్నది. అభ్యానరీతులయందు భేదమున్నది. కాని కష్టసుఖానుభవములందు భేదము లేదు. ఎవనివంతు వచ్చినప్పుడు వాఁడు కష్ట మనుభవింపవలసినదే. సుఖముకూడ నట్టే యనుభవింపవలసినదే. నాకుఁ గష్ట మక్కఱలేదని నిరాకరించిన నదిపోదు. అనువాఁడు లేఁడుకాని నాకు సుఖ మక్కఱలేదని త్రోచినైచిన నదియుబోదు.

కష్టప్రారబ్ధ మెట్టిదో ప్రతిజీవునకు సుఖప్రారబ్ధ మట్టిదే. ఇప్పు డీసుఖప్రారబ్ధమును గూర్చియే నాల్గుమాటలు చెప్పెదను.

సాదీయను మహాకవి యొకకథను జెప్పినాఁడు. కథయన యసత్య మనుకొనకుఁడు నత్యగాథనే చెప్పెను. ఒకయూర నొకదుండగీఁ డుండువాఁడట. ఆతఁడు స్వభావదుష్టత చేత, ధనమదాంధతచేతఁ, బడుచుఁదనపు బొగరుచేతఁ, ద్రాగుడుమహిమచేత, ధనమదాంధ తచేతఁ, బడుచుఁదనపు బొగరుచేతఁ, ద్రాగుడుమహిమచేత, నెన్నితుచ్ఛపుఁబనులో చేయు చుండెడివాఁడు. ఆతని దుశ్చేష్ట లసంఖ్యాకములు. ఒకనాఁ డొకనన్యాసి వీథిలోఁ బోవు చుండఁగా నీదుండగీఁ డాతని కెదురుగఁబోయి పెద్దజాయి తీసికొని తలపై గురిచూచివై చెను. అది యదృచ్ఛికముగఁ దలపైఁ బడక భుజముపైఁబడెను. నన్యాసి యేమిచేయఁ గలఁడు. తలవంచుకొని తన దారిని తాను పోయినాఁడు. మఱికొన్ని మానములు కీతని దుర్నయములు మఱింత దుర్భరములు దుస్సహములుకాఁగా మహారాజాతని బట్టించి పెద్దబావిలోఁ బడవేయించెను. ఈ నంగతి యా నన్యాసికిఁ దెలిసి యొక పెద్దజాయి చేతిలోఁ బట్టుకొని యానూతి యొద్దకుఁ బఱుగెత్తి యాజాతి నాతనిపైఁ బడవైచెను. ''ఇట్లు చేసితివేమి'' యని యచ్చటివారు నన్యాసి నడుగ ''ఈ జాతితో నన్నాతఁడు కొన్ని మానముల క్రిందట కొట్టినాఁడు. దీని నప్పటినుండియు భద్రపఱచి యిప్పుడు తిరుగఁగొ ట్టితి''నని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. ''నిన్ను గొట్టినప్పుడే యా జాతితో తిరుగఁ గొట్టలేకపోయితివా'' యని ప్రజలడుగ ''నాతని కింక నుఖ మనుభవింపవలసిన దినము లుండగ నెవఁడేమి చేసిన వినియోగమేమి? అదిగాక యేమిచేయుటకు శక్తిగలవాఁడెవఁడు? ఇప్పటి కాతని సుఖప్రారబ్ధము తీరినది. అందుకొఱ కాతని జాతితోఁగొట్టుచు ''నాయనా! నన్నీజాతితోఁ గొట్టితివి. తిరిగి నిన్నుగొట్టక తప్పకపోవుటచేతఁ గొట్టుచున్నాను. నీదుర్మా ర్గజీవనమునకుఁ బశ్చాత్తాప మొందఁదగిన యుత్కృష్ట సమయము సిద్ధించినది. పూర్వపాప మునకు వగచి భగవంతుని ప్రార్థించుకొనుము'' అని చెప్పియే యాతని గొట్టితిని. నామాటలు మీకు వినఁబడలేదు కాబోలు నని నన్యాసి చెప్పెను.

ఇందువలన జనుఁడు తన పూర్వకర్మము ననుసరించి తనవంతునకు వచ్చిన సుఖము లేశమైన మిగులకుండ నింట ననుభవింపక తప్పదు. అట్టి యనుభవమున కడ్డురాఁగలుగువా డెవ్వఁడును లేఁడు.

సుఖముకాని కష్టముకాని యెప్పుడేది యేరీతిగా ననుభవించినను మనకర్మముయొక్క ఫలమునే మన మనుభవించుచున్నాము. కాని మన కెవ్వఁడుగూడ నిచ్చటలేదని స్పష్టముగాఁ దెలిసికొనవలెను. అట్లిచ్చట కెవ్వఁడును గూడ స్వతంత్రుఁడుగాఁడు. నీమట్టు వకు నీవే స్వతంత్రుఁడవు. నీబుద్ధికి నీశరీరమును జోడుపఱచి చేతులార, మనసార స్వతంత్రుఁడవై కర్మమును జేయుచున్నావు. ఫలకాలమందు దానిఫల మనుభవించు చున్నావు. భగవత్తత్త్వమునుగూర్చి మూఁకీభావమును వహించిన బుద్ధుఁడు సయితము మనతోఁ గూడ వచ్చినది మనకర్మ మొక్కటి తక్కవేరు లేదనియు, మనకర్మము వమనరించియే యుత్తరజన్మఫల ముండుననియు విస్పష్టముగాఁ జెప్పినాఁడు.

గీ. ఎంతో నమ్మించి నీలో వసించునట్టు
లున్న ప్రాణమె నినుబాసి యుఱుకునపుడు

నీది యని చెప్పఁదగు వస్తువేది యిచట?
యపుడు నీవెంటవచ్చెడు నద్ది యేది?

ఏవియును గూడ రావన్ని యిచట నిలుచు
సుతలు మనుమలు బందుగుల్ సుతులు సతులు
తోడబుట్టువుల్ హితులు నీతోడరారు
ధనమురా దొకమొలత్రాడయిననురాదు.

వాఙ్మనఃకాయముల దేనివలన నైన
నీవుచేసిన కర్మమే నీదిసుమ్ము
ఇదియె వదలక నిన్వెంబడించునద్ది
నీది యనఁదగినది మఱియేది లేదు.

నీడలాగునఁ గర్మంబు నిన్ను విడువ
దెపుడు దుష్కృతు లుపసంహరింపఁబడవు
ధర్మ కార్యంబు లెపుడు వ్యర్థములు కావు
భావిఫలనముచ్చయ దానవైభవము లగును.

మన సంపదలకే కాదు. మన యాపదలకే కాదు; మన జన్మములకే కాదు; మన మోక్షమునకే కాదు; మనతో సంబంధించిన యన్నిటికిఁ గూడ మనమే కర్తలము. కాని సుఖ మనుభవించునప్పుడు మన ప్రయోజకత్వమని యహంకరించి కష్టములు వచ్చినప్పుడు మాత్రము పైవారి నుత్తరవాదులుగాఁ జేయుచున్నాము. తిట్టించుటకు, నెట్టించుటకుఁ, గట్టించుటకుఁ, బ్రభువులు చాలియున్న కారణముచేత వారు తమ కపకృతిజేసినారని నిష్కారణముగా వారిని జనులు నిందించుచుందురు. ఇది యత్యంతపాప హేతువని నిశ్చయముగా నమ్మవలయును. నీ కర్మముతోఁ బ్రభువుల కేమిసంబంధము? ప్రభువుల కర్మముతో నీ కేమైన సంబంధమున్నదని నీవు చెప్పఁగలవా? వారి విషయమున నీకు సంబంధము లేనట్లే నీ విషయమున వారికిఁగూడ లేదను జ్ఞానము నీ కుండనక్కఱలేదా?

భారతదేశ దాస్యమునుగూర్చి పరిపాలకులను బరిపరివిధములుగా నిరసించుట కలదు. భారతదేశ ప్రారబ్ధమునకుఁ బాశ్చాత్యదేశప్రారబ్ధమునకు నేమిసంబంధము? తండ్రికర్మమునకుఁ గొడుకుకర్మమునకు సంబంధము లేనప్పు డనాత్మతత్త్వమునకు నధ్యాత్మతత్త్వమున నేమిసంబంధము? వారిప్పుడు సుఖప్రారబ్ధమున నున్నారు. మనము కష్టప్రారబ్ధమున నున్నాము అంతే! అంతకాక మరి యేమున్నది. మన వేదములను వదలుకొని, మన వర్ణాశ్రమధర్మములను వదలుకొని, మన మతమును వదలుకొని, మన యాచారములను వదలుకొని, మన విద్యలను వదలుకొని, మన స్వాతంత్ర్యములను వదలుకొని, మనజాతితత్త్వమును గూడ వదలుకొని, యేకాలమందుఁగూడ నేదేశమందుఁగూడ నేజాతికూడఁ జేయని చేయలేని మహాఘోరకర్మమును జేసినందులకు ఫలమిప్పు డనుభవించు చున్నాము. కన్నులు దెఱచి బుద్ధిపూర్వకముగ, సంతోషపూర్వకముగ జుట్టుచేతి కిచ్చిన మనము స్వతంత్రతకావలయునని యిప్పుడు గించుకొన్న వినియోగమేమి? ఒక్క స్వతంత్రతమాత్ర మెన్నడయిన వచ్చునా? మనము బుద్ధిహీనతచే వదలుకొన్న వేదాదులన్నియు వచ్చినప్పుడే

స్వతంత్రత వచ్చును. కావున వేదపఠనము మొదలుగా చేయవలసిన కర్మములన్నియు భారతదేశము తిరుగ ననుష్ఠించునెడల సర్వసౌభాగ్యములు సిద్ధింపఁగలవు. భారతదేశ మిప్పుడు చేయవలసినకర్మ మిదియే. రాట్నపు సుతితో వేదగాన మొనర్పుటకంటె వేరుసాధనము లేదు. కాని యది నిశ్చలముగ నిర్మలమనస్కతోఁ జేయఁదగినది. అంతేకాని స్వాతంత్ర్యము కలిగిన పిమ్మట తిరిగి చల్లచల్లగా వదలుకొనునేర్పాటు మీఁద వేదాదుల సాహాయ్య మపేక్షింపతగదు. మనకుఁ బరిపాలకులు చేసిన యపకృతి లేదనియు మనము మనదేశమునకు, మతమునకు చేసిన యపకృతి ఫల మనుభవించుచున్నామనియు నమ్మవల యును. తిట్టుకోఁదలఁచుకొన్న యెడల నిన్ను నీవుతిట్టుకో. కొట్టుకోఁదలఁచినయెడల నిన్ను నీవుకొట్టుకో. కోసికోఁదలఁచినయెడల నిన్ను నీవు కోసికో. అంతేకాని పరులఁగూర్చి పల్లెత్తుపలుకైన పలుకఁదగదు. పరిపాలకుల లెక్కయేమి? మనకర్మముతో నీశ్వరునకే సంబంధము లేదు. ఏమియు సంబంధము లేదాయని యడుగు చున్నారా? లేనట్లున్నది. ఉండుటకంటె లేకుండుటయే మెరుగన్నట్లున్నది. మనకర్మముల ననుసరించి మనకీ శ్వరుఁడు తత్కర్మఫలమును బంచిపెట్టును. ఇంతకంటె నాతని ప్రయోజకత్వ మేమియు లేదు. ఆతఁ డందువలన మోతకూలి కాని దాతకాఁడు. ఆవెట్టిపనికే జను లాతని దిట్టుచు న్నారు. సుఖానుభవకాలము రవంత పెంచుటకుఁగాని కష్టానుభవకాలము కాసంత త్రెంచుటకుఁగాని యీశ్వరునికి శక్తిలేదు. మనమే యొకప్రపంచము. మనకు మనమే యీశ్వరులము.

దేవతలు హిరణ్యకశిపుబాధ పడలేక, నెత్తినోరు కొట్టుకొనుచు రోదసీకుహర మదర వలవల నేడ్చుచుఁ బ్రతిక్రియ చేయలేక పరుగు పరగున శ్రీమహావిష్ణువు సన్నిధికిఁజేరి యసురసంహార మొనర్పుమని ప్రార్థింపలేదా? ఆమహానుభావుఁ డేమనినాఁడు? మాఱుమా టాడక యిండ్లకుఁ బొమ్మనినాఁడు. ఎందుచేత? ఎందుచేతనో వినుఁడు.

శా. వేధోద త్తవరప్రసాదమహిమన్ వీఁ డింతవాఁడై మిమున్
బాధం బెట్టుచు నున్నవాఁడని మదిం భావింతు భావించి నే
సాధింపం దటీకాదు కావునఁ గడున్ సైరించితిన్ మీఁదటన్
సాధింతున్ సురలార! యింక చనుఁడీ శంకింప మీ కేటికిన్.

అనియే కాదా భగవంతుఁ డానతిచ్చినాఁడు. ''సాధింపందరికాదు కావున'' నని కారణ మగపఱచినారు. అనఁగా నేమి? దేవతల కష్టానుభవ కాలములో రవంతయైన దగ్గించుట కవకాశముకాని, శక్తికాని తనకు లేని కారణమున–నసురుని సుఖానుభవకాల మింకఁ గొంత జరుగవలసి యున్నది కావున దానిని దగ్గించుట కవకాశముకాని, శక్తికాని లేని కారణమునను దేవతలకు సైరణ బోధించి నివాసములకుఁ బొమ్మనినాఁడు. కావునఁ బ్రభువులకు మన కష్టసుఖములపై నధికారములేదు. భగవంతునికిఁగూడ లేదు. పోనిండు. మనకష్టములపై మనకైన నధికారమున్నదా? లేదు. ఏడ్చుచుఁ గష్టము పూర్తిగ ననుభవింపవలసినదే. ఏడ్పువంటివ్వతో సుఖముకూడ నట్లే యనుభవింపవలసినదే! కష్టములను మనము తగ్గించుకొనలేము పోనిండు. సుఖములను తగ్గించుకొనలే కేమి? అట్లుకూడఁ జేయలేమా? ఊహు, ఇందునుగూర్చి యొక గాథ యున్నది. దానిని జెప్పుదును.

జనకమహారాజుసభాశాలలోని కొక విరాగి యాతని దర్శనార్థము వచ్చెను. అప్పుడే

మహారాజు పూర్వాహ్ణకృత్యములన్నియు నెరవేర్చుకొని యగ్నిశాలనుండి సభాశాలకు వచ్చుచున్నాఁడు. బ్రహ్మవర్చసము క్షాత్రతేజము నాక్రమించుకొనియుండెను. కన్ను లెండ గాయు చున్నవి కాని చెక్కిళ్ళు వండువెన్నెల లీనుచున్నవి. పరమశాంతతఫాల మంతయుఁ గప్పియుండెనుగాని కొలచినట్లున్నట్టిగడ్డము పట్టుదలను సూచించుచున్నది. శరీర మెట్టినీ టివలెదయందుఁ బూర్ణచంద్రుఁడు ప్రతి ఫలించుచున్న ట్లున్నది. కవులు భావించి యేదో వెట్టిమొట్టిగ వర్ణింపఁ దగినయంశము. నాకేల? జయా! జనకచక్రవర్తి! యని వందిమాగధా దులు బిరుదావళులఁ బఠించుచుండ, నొకవంక బారులుగట్టి మునులాశీస్సులతోఁ బుష్పవృ తలు వర్షించుచుండ, సామంతరాజులు పాదాక్రాంతులగుచుండ, నుద్యోగులు నడుములు చేతులు కట్టుకొని యాజ్ఞలకై వేచియుండఁ, గవులు చక్రవర్తిపైఁ బ్రబంధములు పఠింపుచుండ, గాయకులు చిత్రవిచిత్రరీతుల గీతామృతములు వెదఁజల్లుచుండ, వారాంగన లుత్సాహమున నృత్యము లొనర్చుచుండఁ, జేతులు సాచి దోసిళులు పట్టి 'ఇటు దయచేయుఁడు, ఇటు, ననుమఁ గార్యదర్శులు మార్గదర్శులై వెనుకకు నడచుచుండఁ గనుసన్నలతోఁ, జేతిజోడింపు లతో, శిరఃకంపనములతో, మందహాసనములతో, వ్రేలియూఁపులతో, నభిప్రాయప్రకటనము లగు నాలోకనవిలాసములతో, నెవ్వరి నెట్లాదరింప వలయునో యట్లాదరించుచు మొకమా లుమడుగలపై నడుగు లిడుచు, నిమ్మళముగ సింహాసనము నొద్దకు వచ్చి, కూరుచుండుఁ డని యందఱికు సంజ్ఞచేసి తాను గూరుచుండెను. రాజకార్యపులెక్క లుద్యోగులు వినిపించు చున్నారు. కొందఱి కిచ్చుచున్నాఁడు. కొందఱికు బిగబట్టుచున్నాఁడు. కొందఱి కెగఁబె ట్టుచున్నాఁడు. నత్కార్యములందుఁ ద్యాగమెంతయో నిరువయోగకృత్యములం దంతపిసిది తన మగపఱచు చున్నాఁడు. న్యాయమెంతయో నిర్దాక్షిణ్య మంతకనఁబఱచుచున్నాఁడు. ప్రజలందుఁ బ్రేమ మెంతయో భయంకరత్వ మంతకనఁబఱచున్నాఁడు. ప్రజలందుఁ బ్రేమ మెంతయో భయంకరత్వ మంతకనఁబఱచుచున్నాఁడు. రాయబారుల బహుమానములు గొనుచున్నాఁడు. తాత్కాలికపుద్రోపుడుమాటలచే వారిని బంపుచున్నాఁడు. ఇష్టమయ్యును గొందఱితో మాటలాడకుండనున్నాఁడు. అనిష్టమయ్యును గొందఱితో మాటలాడ చున్నాఁడు. ఉబ్బెత్తుగ వచ్చిన నవ్వును బెదవులబిగింపుచే దబాయించు చున్నాఁడు. నడుమనె డుమ కొన్నిగుల్లనవ్వులను జలామణిచేయుచున్నాఁడు. రాజ్యతంత్రమంతయు నెట్లు నిర్వ హింపవలయునో యట్లు నిర్వహించుచున్నాఁడు.

చక్రవర్తిని జూచుటకు వచ్చినాఁడని చెప్పియుంటినే ఆ విరాగితో నింక మాటలాడ లేదు. వేచియుండలేక యాతనిప్రాణము వినుగుచున్నది. రాజసభకుఁ బోయినపిమ్మట మనయిష్టమా? మన తొందర లక్కఁడఁ బనికివచ్చునా? నమయ మగువఱకు నోరుమూసి కొని పడియుండవలసినదే కాదా? సెలవు తీసికొని పోవువారు పోవుచున్నారు. తుట్టతుది కందఱు పోయిరి. మన విరాగి యొక్కఁడుమాత్రమే కొందరు రాజభటులతో మిగిలియుం డెను. అదినమయ మని యెంచి యాతఁడు చక్రవర్తియొద్దకుఁ బోయి యాశీర్వదింప మీరెవ్వ రని యాతఁడు డడిగెను. నాతోఁ గొంత సేపు రహస్యముగ మీరు మాటలాడవలసియున్న దని విరాగి పలుక, భటుల నందఱ నావలికిఁ బొమ్మని చక్రవర్తి యాజ్ఞాపించెను. వారిద్దఱీట్లు మాటలాడుకొనిరి.

విరాగి:-చక్రవర్తీ! మంచుకొండలలోయలలోపలఁ గూడ నీకీర్తివిహరించుటచే దర్శ

నము చేయవలయునని వచ్చితిని. యాజ్ఞవల్క్య శిష్యుఁడవై కర్మయోగి వైన నీ వీజన్మమునసే మోక్ష మొందగలవని పెద్దలవలన విని మీపుణ్యదర్శనమున నేనుగూడఁ దరింపవచ్చునని వచ్చితిని. మీదర్శనము నాకగునో కాదో, నేను వచ్చునరికి నీవు ప్రబలసమాధి నిష్ఠాగరిష్ఠత బ్రచ్ఛన్నచైతన్యుఁడవై యుందువో, కాక బహిరంగముగఁ బ్రాణాయామము బట్టిపై కెగురు చునుందువో యని యనుకొంటిని. నిన్ను జూచి డిల్లపడిపోయితిని. కర్మ యోగివని పేరొందిన నీవు భవభోగివని బిరు దొందుటకుఁ దగియున్నావు. ఏసంసారి కిన్నిభోగములు న్నవి? ఏపామరుని కింతభవలంపటత యున్నది? ఆహాహా! కిలిక్రిందనున్న పాదుకలక్రిందఁ గూడ పట్టుపురుపులు పఱపించితివే. పంచభూతములను బానిసలుగాఁజేసికొని వానిచేఁ గొలువు చేయించుకొనుచుంటివే. ఈపనికిమాలిన రాజ్యము నీ కెందుకు? శుఖపరవశుఁడవై నిన్ను నీ వేలుకొనలేక పోయినప్పుడు నీవొకరి నేలుటయేల? అయ్యయ్యో! ఈయాశ్రితు లేమి, ఈయుద్యోగులేమి, ఈరాయబారులేమి, ఈవిచారణములేమి, ఈశిక్షలేమి, ఈధన కాంక్షలేమి, ఈవేశ్యావృత్తగీతాదులేమి, ఈకవిగాయక మాగధాదిస్తోత్రపాఠములేమి, నిన్నుజూడఁగ నాకు వెట్టియెత్తుచున్నది. ఇట్లేలయుంటివో నాకుఁ జెప్పవలయును.

జన:-మునిచంద్రమా! నీవు బుద్ధిమంతుఁడవు. నాయందలి మహాభిమానముచే నిట్లు పలికితివి. ఇది యంతయు లాంపట్యమని నే నెఱుఁగక పోలేదు. ఈ మహాసంసారతంత్రమునఁ జిక్కుకొని తిరుగుచుంటినని యెఱుఁగకపోలేదు. కాని మూఢు నకు నాకు నున్నభేద మేమనఁగా నే నది వ్యర్థమని యెఱిఁగియుండియే తిరుగుచున్నాను. వాఁ డిదియే పరమార్థమని తిరుగుచున్నాఁడు. ఇద్దఱిలో నేనే దోషి నని తెలిసికొనకపోలేదు. ఎఱిఁగియుండియు నింక నేల యిందుఁ దిరుగుచుంటి వని యడుగుదువా? తప్పనిసరి యగుటచేత నాసుఖప్రారబ్ధముయొక్క శేష మింక నున్నది. అదికూడ ననుభవించువఱకు నేను దీనిని వదలుకొని నను నది నన్ను వదలదు. నాయనా! నే జేసినకర్మముయొక్క ఫలమును నే ననుభవింపక నాకుఁ దప్పునా? 'శ్లో॥ అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం, నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటిశతైరపి' అని మీ వంటి విద్వాంసులే యానతిచ్చిరికాదా? అందుచేతఁ బ్రారబ్ధఫలానుభవ పూర్తియగువఱకు నోరుమూసికొని చచ్చిన ట్లనుభవింపవలసినదే.

విరాగి:-చక్రవర్తీ! నీమాటలు నాకు నచ్చలేదు. నీవు వదలి వైచిన సౌఖ్యములు తిరుగ నీవెంట నంటివచ్చునా? రాజ్యమును ఋణప్రాయముగ వదలివైచిన నీయల్లుఁడగు రామచం ద్రునితో సాకేతపుర రాజ్యము కూడఁ బోయినట్లు వినియుంటివా? స్వార్థపరత్యాగశక్తి నీ యొద్ద లేదు. అందువలన నిట్లు లాడుచున్నావు.

జన:- నాయనా! చాలసంతోషము. నా కీసౌఖ్యసంఘాతమంతయు వదలిపోయి తిరుగ రాకుండుటకు నన్నేమి చేయుమందువో చెప్పుము.

విరాగి:- నీవు సౌఖ్యమును వదలుకొనుటకు సిద్ధపడియుంటివా? మందది నాకుఁ జెప్పుము.

జన:- ఈ నిమిసమందు వదలుకొందును. ఆసౌఖ్యములు నాకు తిరిగి రాంకుండ నీవు చేయుఁగలవా? ముందది నాకుఁ జెప్పుము.

విరాగి:- అందులకు నాది పూచీ, హిమాలయమునకు రమ్మి పోదము.

జనకచక్రవర్తి ప్రధానునితో నిట్లు పలికెను. ''నాకుఁ గొంతపని యున్నది. నే నీమునితోఁ బోయెను. నే నెక్కడకుఁ బోయెదనో నన్ను గూర్చి యేప్రయత్నము జేయవలదు. నాయిష్టమువచ్చినప్పుడు తిరుగవత్తును. నీవు నన్నేమియు నడుగవలదు.''

అట్లు చెప్పి చక్రవర్తి విరాగితోఁ బోయెను.

* * * * * *

వారు మహారణ్య మధ్య భాగమున నడచుచున్నారు. చక్రవర్తికమితమగు దగవేసెను. చుట్టుపట్టుల మంచినీరము దొరకదయ్యెను. నే నెచ్చటికైనఁ బోయి తెచ్చిపెట్టెదనని విరాగి చెట్టుక్రింద నాతనని బండపెట్టి పోయెను. రాజునకు విస్మృతి కలిగెను. ఇంతలో జనకచక్రవర్తి యొక్క సామంతరాజొకఁడు తనకొడుకులను జక్రవర్తికిఁ జూపించుతలంపుతోఁ గొంత సైన్యముతో భటులతో నాశ్వికులతో సమస్తసామగ్రీ సమృద్ధితో బయలుదేఱి జనకచక్రవర్తి పండుకొన్న చెట్టుక్రింద నుండి పోవుచు నామహాతేజమును చక్రవర్తి యని యెఱిఁగియుండుటచే నీమహానుభావుఁ డిక్కడ పడియుండుట కేమి కారణమో యని తెల్లపోయి యాతనియుద్ధఁ గూరుచుండి తన వైద్యులను బిలిపించి చక్రవర్తికి దాహశాంత్యాదులను జేయించెను. నిద్దుర మెలఁకువరాకుండ నిమ్మళముగఁబట్టుపఱపులపై నాతని నుంచిరి. పైన తన పెద్ద డేరా వేయించి డేరా చుట్టు భటులను గుఱ్ఱపుసవారులను గాఁపుగాయుచుండ నాజ్ఞాపించెను. తాపశాంతి కొఱకుఁ బన్నీరు భూమిపై జల్లించుచుండెను. పూవులసురటలతో దాసీ జనముచే విసరించుచుండెను. నిమ్మళముగ మెలఁకువ కలుగుటకై మిక్కిలి సున్నితముగ వీణావాదనము జేయించుచుండెను. మహాచక్రవర్తి యారోగ్యమునకై ద్విజులచేఁ బ్రార్థనలఁ జేయుచుండెను. ఒక్క గంటలోపల నిన్ని మార్పులు జరిగెను. అడవి పట్టణమయ్యెను. ఎందుచేత? ఇన్ని సౌఖ్యములు పొందవలసిన వాఁ డరణ్యమున నుండుట చేత.

రాజునకు మెలఁకువ కలిగినది. సామంతరాజుచే సంగతులన్నియుఁ దెలిసికొనెను. ఒకముని యెవరైన నాకొఱకు వెదకుచున్నారేమో కనుఁగొనమని చక్రవర్తి యాజ్ఞ యయ్యెను. లోనికి వచ్చెదనని యెంత సేపటి నుండియో యఱచుచున్న సన్యాసియొకఁడు వెలుపల నున్నాఁడు. సెలవు లేకపోవుటచేత రానీయలే దని యచ్చటివా రెవ్వరో చెప్పిరి. మునిలోనికి వచ్చి బంగారుపీఠముపైఁ గూరుచుండి తనకుఁ బాదాక్రాంతులైన సామంత రాజపుత్రుల నిద్దఱ నాశీర్వదించుచున్న చక్రవర్తిని గాంచి ''కర్మయోకి చక్రవర్తీ! నావలన మహాపరాధము గలిగినది. నాకు బుద్ధి వచ్చినది. నన్ను క్షమింపుఁ''డని బట్ట మెడఁజుట్టుకొని సాష్టాంగపడెను. ఈసన్నివేశ మచ్చటివారి కెవ్వరికిఁ దెలియలేదు. మునిని లేవనెత్తి నీవు మఱేమియు ననుకొనవల దని చెప్పి యాతనిని వినమ్రుఁడై యనునయించి సామంత రాజపరివారముతో, విరాగితోఁ దనరాజ్యమునకుఁ బోయెను.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

19. సభావ్యాపారములు

ప్రత్యేకించి ఉపన్యాసం ఈ రోజు లేకపోయినా, జంఘాలశాస్త్రి ఒక చిత్రమైన ఉత్తరం చదివి వినిపిస్తున్నాడు.

ఒక అమ్మాయి గురించిన ఉత్తరమది. ఆమెకు పదో ఏట పెళ్ళి, వధ్నాలుగో యేడు దాటింది లగాయతు కాపరానికి యోగ్యంగా తయారైంది. తండ్రి ఇచ్చిపోయిన డబ్బు వుంది. భర్తకి ఈమె మీద వల్లమాలిన మమకారం. ఆమెకి మాత్రం భర్తంటే అంత వెర్రి లేదు.

ఇలా వుండగా ఒకసారి ఆమె తండ్రికి మేనమామకి మనవడు ఈమెను చూడడానికి వచ్చాడు. కొన్నాళ్ళున్నాడు. ఆమెకి క్రమంగా అతనితో చనువు పెరిగింది. భర్త మీద విముఖత కూడా పెరిగింది.

ఇలా వుండగా భర్త, పెద తండ్రికి ప్రాణం మీదికి వచ్చిందంటే, అతను చూడడానికి వెళ్లాడు. ఆ వెళ్లిన వాడు మళ్లీ తిరిగి రాలేదు.

చిత్రం-భర్త అడ్డు తొలగగానే తన ప్రణయ వ్యవహారంలో విజృంభించ వలసిన ఆమె, తన తండ్రి మేనమామ మనవణ్ణి అదే వూళ్లో వేరే యింట్లో వుండమంది.

మరి`కొంతకాలానికి ఈమెకు పక్షవాతం వచ్చింది. ఆమె ప్రియుడు తరచు వచ్చి చూసేవాడు. చేతనైన సేవలు చేశాడు. పక్షవాతం పూర్తిగా తగ్గింది. కాని, భర్త బ్రతికి వుండగా, ఈ ప్రియుణ్ణి దరిజేర నివ్వని ఆమె, భర్త మరణించాడని తెలిశాక పెళ్లి చేసుకుంది. కాని పెళ్లినాటి రాత్రి, గర్భాధాన సమయంలో–ఆమె, తన పూర్వ భర్త తన గొంతు పిసుకుతున్నాడని భయపడింది. చిత్రం-మరికొంత నేపటికి ఈనూతన భర్త, చచ్చిపడివున్నాడు,–ఇదే ఉత్తరం సారాంశం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

ఈదినమున నుపన్యాస మేమియు లేదు. సభలోఁ జదువఁబడుటకై వచ్చిన యుత్తర మొక్కటి మాత్రమే యున్నది, దీనిని జదివెదను. ఇది కొంత చిత్రముగానే యున్నది. దీనిని వ్రాసినయతనిపే రేదో తెలియదు. ఏయూరనుండి యిదివచ్చినదో యంతకంటెఁ

దెలియదు. ఉత్తరముపై నున్న ముద్రఁ జూడఁగ నస్పష్టముగ నున్నది. ఏయూరనుండి వచ్చిన నేమి? ఏవరు వ్రాసిననేమి? దానిలోని యంశములే మనకుఁ గావలసినవి కాదా? ఉత్తరమును జదివెదను.

సాక్షికి:– ఈయూర నొక బ్రాహ్మణి యున్నది. ఆమె కిప్పటికిఁ బదునాల్గు సంవత్సరములు. ఆమెతండ్రి మరణించి యొక సంవత్సరమైనది. ఆతఁడు శవవవహనాది క్రియలచేఁ గొంతసొమ్ము సంపాదించినాఁడు. బిడ్డను మేనల్లుని కిచ్చి వివాహము చేసి యాతనిని తనయింటనే పెట్టుకొనినాఁడు. ఆపిల్లకుఁ బదవయేట వివాహమైనది. పదునొక టవ యేఁట నామె యీడేరినది. రజస్వలాస్నానదినముననే గర్భాదానము గూడ జరిగినది. ఇట్లు తన బిడ్డయు నల్లుఁడును రెండు సంవత్సరములు కాఁపుర మొనర్చినతరువాత నాబ్రాహ్మణుడు మరణించినాఁడు. ఉన్న సొమ్మంతయుఁ గూఁతు నధీనమైనది. తాను మగఁడుమాత్రమే యింటిలోనుండ లేక భటు నొక్కని సాయముకొఱ కింటిలోఁ బెట్టుకొని నారు.

ఈబ్రాహ్మణికి భర్తయందు వెఱ్ఱిమమకారము లేదు. భర్తకు భార్యయం దెంతయను రాగ మైన నున్నది. ఆమెకనునన్నలను మెలఁ గుచు నామెకు సమస్తోపచారములను జేయుచుండెను. తన్నాశ్రయించి సేవించినకొలఁదియు నాతనిపై నామె మనస్సునం దనిష్టత హెచ్చుచుండెను. భర్త మిగుల దేహదార్ఢ్యసంపన్నుఁడే. రూపవంతుడే. పరస్త్రీ పరాఙ్ముఖుఁడే. అయిననేమి? అతనియోగ్యతలన్నియు దోసములుగా నామెకుఁ గనఁబడుచుం డెను. భర్త తలయెత్తి యామెను చూడఁగ నామె కనులు మూసికొని తలవంచుకొనుచుండెను. భర్త దగ్గఱకు రాఁగా నామె దూరముగఁ బోవుచుండెను. భర్త తనతో మాటలాడఁగ నామె వినినట్లు భటునిఁ బిల్చి యేదియో చెప్పుచుండెను. ఇట్టిభర్త కేమిసుఖమున్నది? వీరి దాంపత్యములోని చిత్రములను వాణీదానునివంటి కవి వర్ణింపఁదగినది. కాని నేను జెప్పఁజా లను. మీ జంఘాలశాస్త్రి వంటివాఁ డీదాంపత్య సౌఖ్యమును గూర్చి యుపన్యసింపవలయును గాని నావలన గాదు. చప్పనిమాటలతోఁ జుచ్చుచ్చుగా మాత్రమే వ్రాయఁగలవాఁడను.

ఇది యిట్లుండఁగా నీమెతండ్రికి మేనమాయ మనుమఁ డొకఁడు వచ్చెను. ఆతని నీసంసారిణి గౌరవించి యాదరించుచుండెను. ఆతఁ డట్టి రూపవంతుఁడు కాఁడు. శరీరదారుఢ్యముకూడ బాగుగా నున్నవాఁడు కాఁడు. ఈమెభర్త కాకపోవుటయే యాతని నుగుణమని యెన్నఁదగి యున్నది. ఆమెకు నతనికిఁ గొంతకాలము కనుసన్నలు నడచెను. తరువాత గొన్ని దినములు ముసిముసినవ్వుల 'లావాదేవీలు' జరిగెను. కొన్ని దినములు చిన్నచిన్నమాటలు జరిగెను. తరువాత సావకాశముగా బుక్కిటి పురాణములలోను, లోకాభి రామాయణములోను, లొట్టాబట్టీయములోను కొన్నిదినములు నడచెను. అందుపైన ప్రమాదవశమునఁ జేతులు చేతులు కలియుటలు, నట్టినొచ్చుకొనుటలు, నిట్టిశ్వాసలు జరిగెను. అందుమీఁద తొందరతొందరగ వదలువదులు హస్తస్పర్శములు, పిమ్మట కొంతబి గింపులు, రవంత గిలిగింతలు, కానంత యిగిలింతలు చెలరేఁగెను. అటుపైన బెదరుబెదరు నాలింగనములు, అట్టివిడిపోవుటలు కలిగెను. అందుపైన మూతిమూతి కలియుటలు, శిరఃకంపనములు మొదలైనవి జరిగెను. అంతటితోఁ గొన్ని దినములాగెను. స్వభావసిద్ధముగ వదృతమైన యీశృంగార గ్రంథము యొక్క ప్రతిపదార్థమంతయుఁ దనకు బాగుగఁ

దెలియకపోయినను రవంతభావమైనను భర్తకు తెలిసియుండకమానదు.

భర్తయెంత చేతగానివాఁడైనను భార్య యెంతస్వతంత్రురాలైనను భర్త యింటిలో నున్నంతకాలము భార్యకు విశేషస్వేచ్ఛయుండుట కవకాశము లేకపోయిన కారణముచేతఁ గాఁబోలు బాహ్యవిలాసముల తోడనే కాలక్షేపము జరిగినది. భర్త యిల్లు విడిచి లేచిపోయిన బాగుగ నుండునని భార్య యనుకొనినది. ఇంతలో దైవవశమున భర్త పెద తండ్రికి ప్రాణముమీఁదికి వచ్చినదని యాతనికి తంతివార్త వచ్చినది. అంతట నాతఁడు పోయినాఁడు.

భర్త యింటనుండినంతసేపు పైయవేక్ష కలిగియుండిన భార్యకు భర్త వెళ్ళినది మొద లావృత్తి నన్నగిల్లెను. ఇంటిలో నున్నవాఁ డెన్ని విధముల బతిమాలినను నీమె యంగీకరింప లేదు. అది గాక నింటిలో భర్త యున్నప్పు డెందఱు పరపురుషులున్నను బరిసిపాఱిపోవును గాని భర్తయింటిలో లేనప్పుడు మాత్ర మొక్కపురుషునినైన నింట నుండనిచ్చుట సానివృత్తి కంటె భిన్నము కాదని యెఱింగియుండి కాఁబోలు నాతని నాయూరనే మఱియొక్కయింట నుండుమని చెప్పెను. ఈమె మిక్కిలి నాగరికతగల స్త్రీ యగుటచేత ననేకులగు నుద్యోగు లీమెతోఁ గరచాలన మొనర్చి మాటలాడుటకు వచ్చుట గలదు.

తరువాత గొలదిదినములలోనే ఈమెకు పక్షవాతము వచ్చెను. అల్లామె యొక్క సంవత్సరము మంచముమీఁదనే యుండెను. ఆమె మిత్రుడు తఱచుగ వచ్చిచూచుచుఁ జేతనైనయుపచారములను జేయుచుండెడివాడు. భర్త యెక్కడ నున్నాఁడని యామె తఱచుగా నీతని నడుగుచుండెను. అతని పెదతండ్రి గ్రామములోనే యున్నాఁడనియు, నక్కడ నాతఁడు చిన్నపొలమును సంపాదించుకొని వ్యవసాయముచే జీవించుచున్నాఁడనియు, నిక్కడ కింక రాఁడనియుఁ దన కాయూరనున్న మిత్రుఁ డొకఁడు వ్రాసినాఁడని యామెతో నాతఁడు చెప్పెను. ఇట్లుండ నామెకుఁ బక్షవాతము పూర్తిగ నిమ్మళించెను. నామాట యేమని యామెను మిత్రుఁ డడిగెను. ''నీవు నన్ను బెండ్లిచేసికొన వీలులేదు. నేను పడుచుకొనుట నాకిష్టము కాదు. నన్నేమి చేయుమంటివి'' యని యామె పలికెను. ''నిన్నే నేను వలచితిని. నిన్ను వదలువాఁడనుగాను'' అని యాతఁడు పట్టుపట్టి కూరుచుండెను. ఇట్లుండ నొక్కనాఁడు భర్త పెద్దతండ్రియొద్దనుండి యామెకుఁ దంతి వచ్చెను. తనభర్త మరణించి నట్లు దానిలో నుండెను. ఇక్కడకుఁ బీడ వదలినదని యిద్దఱు కూడ సంతోషించిరి.

భర్తమృతికై యనేకు లీమెను బరామర్శించిరి. నెలదినములు కాకుండానే తాను దనమిత్రుని వివాహముచేసికొందునని యామె ప్రకటించెను. సహజమైన ప్రేమ, దేశకాలాబా ధితమని యందఱు సంతోషించిరి. వివాహదినమున నీమెను జూచుటకు వచ్చిన యుద్యోగు లకు లెక్క లేదు. ఒక హైకోర్టుజడ్జి కాఁబోలు నిందకొఱకు సెలవు పుచ్చుకొని Orr & Sons నుండి యొక హారముతో నామెను జూచుటకు వచ్చి యామెనాగరకతకు, యోగ్యతకు మిక్కిలి సంతోషించుచు నొక్క చక్కనియుపన్యాస మిచ్చెను. సిద్ధాన్నము కావున నారా త్రియే గర్భాధానము. రాత్రి గర్భాధానశయ్యయొద్దకుఁగూడ నెందఱో యుద్యోగులు వచ్చి యాయదృష్టవతిపై నభివందనములు వర్షించిరి. డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెం టొక్కఁ డామెతోఁ గరచాలన మొనర్చి కెంపుపొడి గలయొక బంగారపు నూది యామెపైటపైఁ గ్రుచ్చెను. ఉన్నతన్యాయస్థానాధికారి యొకఁడు వచ్చి యామె మస్తకమందు హస్తముంచి రెండవ హస్తముతో నామెబుగ్గలు పైకెత్తి పవిత్రప్రేమ పూర్ణమైన, దేవతా సంబంధమైన యొకముద్దును

నుదుటిపైఁ బెట్టుకొనెను. అందఱు కరతాళము లిచ్చిరి. వధూవరు లన్యోన్యప్రేమ గలిగి సుఖింతురుగాక యని యాశీర్వదించి గది తలుపులు వేసిరి.

ఇంతటినుండి విచిత్రమైనగాథ యారంభమైనది. చిరకాలమునుండి గాఢాశ్లేషమునకై యువ్విళ్లూరుచున్న దంపతులు కలిసి యొకరిపై నొకరు చేయి వైచుకొని, తాంబూలమును వైచుకొని, పండుకొని యురితీసినంత బింకముగాఁ గౌఁగిలించుకొనిరి. అంతట పుస్తకములు బీరువా ప్రక్కనొక్క నీడ యామెకుఁ గనబడెను. ఏమోయని కొంత సంశయించి బీరువానీడయై యుండునని యూరకుండెను. ఈసారి మిగులగాటముగా ముద్దిడుకొనుచుఁ బ్రమాదమున వెనుకఁజూడఁగా నీడకదలుచున్నట్లుకన బడుచున్నది. కదలుట యేలనని జడిసి యానీడను భర్తకుఁ గనఁబఱచెను. ఆతఁడు చూచి మరేమియులేదు. పండుకొనుమని యామెకన్నులమూసి లేవఁబోవగా వద్దు, వద్దు, నాకక్కఱలేదు. నాపూర్వభర్త స్వరూపమదిగో గొంతు పిసికెద ననన్నట్లు సంజ్ఞయొనర్చుచున్నాఁడని బలవంతముగా నామె లేచికూరుచుండెను. ద్వితీయభర్త కూడ లేచిచూడఁగా నీడయు లేదు. జాడయునుగూడ లేదు. అంత నిద్దఱుగూడ నవ్వుకొనుచుఁ దిరుగఁ బండుకొని యిట్లు మాటలాడుకొనిరి. నాభర్త దయ్యమైనాఁడు కాఁబోలునని యామె యనఁగా దయ్యములు లేవు, భూతములు లేవు. నీహృదయమం దున్న యాతనివిగ్రహము నీయెదుటఁ గాంచుచున్నావు. ఇది మనస్సంబంధమగు నింద్రజాలము గాని మఱొకటి కాదు. నీవు నాయొద్దఁ బండుకొనుటతోడనే పూర్వసంస్కారవిశేషమువలన నీభర్తను గాటముగా తలఁచుకొంటివి. అంత నాతనిస్వరూపమును పైనఁ గాంచితివని నూతనభర్త యామెను సమాధానపఱచెను.

గీ. కాతరుఁడు మదిఁ గలపాము గాంచు నెదుట
విరహి యెదుటఁ జూచును లోన వెలయు చెలిని
మెదటిలోని స్వర్గమును కవియెదుటఁ గాంచు
మనను చూడు మన్నట్టులే కనులు చూచు.

ఈసారి తప్పకుండఁ బండుకొనవలయునని మహోత్సాహమునఁ బ్రయత్నము నల్పగఁ దిరుగ నానీడయే యిద్దఱికుఁ బ్రత్యక్షమైనది. ఇది యేమియును బాగుగ నున్నది కాదు. దీపమార్పి పండుకొందమని భర్త భార్యతోఁ జెప్పఁగ, నామె యెంతమాత్ర మంగీకరింపలేదు. నాకు భయమునైచుచున్నది. అక్కడ నేమున్నదో చూచిరమ్మని భార్యభర్తను గోరెను. ఏమియు లేదు పండుకొను మని భర్త బలాత్కారప్రయత్నమునకు సిద్ధము కాఁగా వింతలో నేమయ్యెనో యెవ్వరికిఁ దెలియదు. కాని తెప్పపాటు కాలములో గర్భాధానపుఁ బెండ్లికొడుకు చచ్చిపడియుండెను. ఎట్లు చచ్చినాఁడో యెవ్వరికిఁ దెలియదు. కెవ్వుమని యింటిక ప్పెగిరి పోవునంత కేకవైచి యాతని భార్య క్రిందఁ బడిపోయెను. గదివెలుపలి వారు భయపడి తలుపులయుతక లెత్తి లోనఁ బ్రవేశించిరి. ఆమెకుఁ గొంతసేపటికిఁ స్మృతిరాఁగ నీసంగతులన్నియు నామెవలనఁ దెలిసినవి. ఈ సంగతి రక్షకభటులకుఁ దెలుపగ, వా రేమో ప్రయత్నించుచున్నారు.

ఇది జరిగిన కథ. దీనిని మీరు ప్రచురించవలయును. చిత్తగించవలయును.

ప్రచురింపవలయునా లేదా యని జంఘాలశాస్త్రి నభవారి నడిగెను. పోలీసు విచారణలో

నున్న వ్యవహారమును గూర్చి మనయభిప్రాయ మేమో తెలుపఁగూడదని యొక్కఁ డనెను. వితంతువివాహములు చేసికొనఁదలఁచిన మన సోదరీమణుల కిది కొంత నిరుత్సాహముగా నుండును గావునఁ బ్రచురింపవలదని మఱియొక్కఁ డనెను. చచ్చిన భర్తలందఱు దయ్యములై తమ వితంతువుల ప్రక్కలలోనికి రాత్రిభాగమునందు వచ్చుచుండునెడల నింక వివాహము లెందుకు? క్రొత్తవారి విశేషముమాత్ర మేమున్నది? అందుచేత నిరుత్సాహముగా నుండదు. ప్రచురింపుమని యొక్కఁడనెను. ఇది ప్రధానసాక్షిలోఁ బ్రచురింపక సభావ్యాపార సాక్షిలోఁ బడవేయువలయు నని యింకొక్కఁ డనెను. అందఱుగూడ నీ కడపటి యభిప్రాయమును మన్నించిరి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

20. భవభూతి

సంస్కృత పండిత విమర్శకుడొకాయన సాక్షి సంఘ సభలో ఒక చిన్న విమర్శనం చదువుతానని కోరడం వల్ల జంఘాలశాస్త్రి ఆ శాస్త్రిగారికి అవకాశం ఇచ్చాడు.

ఆ విమర్శనం భవభూతి వా[illegible]ని గురించి

అతని కవిత్వం ఎంతో మృదువు. లలితం. ఎంత ప్రయోజకుడైనా, సమకాలికుల చేత ఎక్కువ తిట్లు తిన్నవాడు. శబ్దార్థాలకి రెండింటికీ సమాన గౌరవం ఇచ్చేవాడైనా, ఒక్కొక్క సారి శబ్ద వ్యామోహానికి లొంగిపోతాడు. అక్కడక్కడ మానవ ప్రకృతి పరిశీలనంలో తేలిపోతాడు. మాలతీ మాధవీయం, మహావీర చరిత్రం, ఉత్తరరామచరిత్ర అనే మూడు నాటకాలు వ్రాశాడు. ఈ కవి ఉత్తమ కవుల్లోని వాడే. ఈ కవి గర్వభూయిష్ఠుడు. తనను ప్రశంసించని వాళ్ళని తిట్టే స్వభావం గలవాడు.

ఈ పండితుడు, భవభూతి స్వభావం బయటపడే శ్లోకాలను ఉదాహరించి వివరించాడు. 'సర్వథా వ్యవహర్తవమ్' అనే శ్లోకార్థాన్ని వివరిస్తూ విమర్శకుల్ని తిట్టడానికే అవకాశం భవభూతి ఉపయోగించుకున్నాడని చెప్పాడు.

కవిత్వం, చిత్రలేఖనం, ఇవి అభిరుచి ప్రధానమైన కళలు. కవులు గ్రంథాల్ని దేశం మీద విడిచి పెట్టినప్పుడే, ప్రజలకి వాటిని విమర్శించే అధికారం వుంది. కవులలో చాలా మంది తమ అభిరుచి ప్రకారం వ్రాశారు. ప్రకృతి సూత్రాల్ని బట్టి వ్రాయలేదు. విమర్శించేవారు తన అభిరుచిని బట్టి విమర్శిస్తాడు. ఈ తగవు పరిష్కారానికి సూత్రాలేమిటి? ఆ చింత అక్కడ లేదని ఆ సంస్కృత పండితుడి ఉద్దేశం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! ఒక సంస్కృత పండితుడు విమర్శకుడు మన సభలో నొక చిన్న విమర్శనము చదివెదనని కోరిన హేతువుచేత నంగీకరించితిని. మీరా విమర్శనమును శ్రద్ధతో వినవలయును. అయ్యా! శాస్త్రులుగారూ! మీరింకఁ జదువగోరెదను.

అంతనొక శాస్త్రులుగా రుపన్యానరంగ మెక్కి కంటికి జోడు పెట్టుకొని యిట్లు చదివెను.

భవభూతి భారతీయ మహాకవులలో నొకడు. మాలతీమాధవీయము, మహావీరచరిత్రము, ఉత్తర రామచరిత్రము ననువేళ్లుగల మూఁడు నాటకము లీతఁడు వ్రాసినాఁడు. వానిలో నుత్తర రామచరితము ముత్తమమైనది. ఈకవి యుత్తమ కవులలో నొకఁడు. అతని కవిత్వ మత్యంతలలితమైనది. మృదుల మృదులతర మృదులతమాధికశబ్దములను వర్ణ్యవిష యానుసారముగా కూర్చి కవిత్వము జెప్పిన మహామహుఁడు. శబ్దార్థములు రెండును సమానగౌరవముతోఁ జూచునుద్దేశము కలవాఁడయ్యును నొక్కొక్కప్పుడు శబ్దముల యింద్రధనస్సు రంగులకు వ్యామోహపడి సందర్భమును కొంచె మలక్ష్యము జేయును. అదిగాక నచ్చటచ్చట మనుష్యప్రకృతి పరీక్షయందుఁ దేలిపోయినట్లు గనఁబడుచున్నది. ఈతఁడెంత ప్రయోజకుఁడయ్యును సమకాలికులచే మిక్కుటముగాఁ దిట్లుదినిన వాఁడు. సమకాలికులచే దిట్లు తినుటకు ప్రయోజకతాప్రయోజకతాభేదము లేదు. పరోపకారవేశమున ద్యాగమును జేయువారిని కీర్తిభిక్షకులనియును, స్వగౌరవప్రకటకులనియుఁ బ్రజలు దూషిం చుచున్నారు. ప్రజాసౌఖ్యాభివృద్ధికై భాషాగౌరవవృద్ధికై పాటుపడు ప్రభువులను బరిపాలక బిరుదవాంఛాలాలసులని ప్రజలు నిందించుచున్నారు. దేవభక్తిచే మహాక్షేత్రములందు చేనాల యములను నిరన్నానశాలలను స్థాపించునారిని పూర్వకృత బ్రహ్మహత్యాదిదోషనివారణకై చేయుచున్నారని జనులు దూషించుచున్నారు. ఏపని యెట్లు జేసినను దిట్లు తప్పవు. చిత్రలేఖకునికిఁ బాంచాలికారచనయందుఁ గల్పన లేదనియు రహస్యముగాఁ దీసికొని దాఁయుంచిన ఫొటోలను బెద్దజేసి వ్రాయు దొంగయనియు ప్రజలు తిట్టుచున్నారు. తంత్రజ్ఞునికి గాత్రము లేదనియు, గాత్రజ్ఞునికి దంత్రములేదనియు, రాగకల్పన పూర్తిగా నున్నవానికిఁ బల్లవిజ్ఞానము తక్కువ యనియు, నందఱుకూడ నుండలమునాదారులనియు గాయకులను దూషింతురు. ఇక గనిబద్రు కెట్లున్నదో చెప్పనా. కవిత్వమల్లిన వాని కొక్క మనలిదియో, పడుచుదియో, యటునిటు కాసిదియో, సువాసినియో, వితంతువో, యటు నిటు కానిదయో యొక్కతె ప్రక్కదాపుగా నుండక తప్పదని జనులనమ్మకము. దేవుడున్నా డను నమ్మకము కంటె జనుల కిది దృఢతరమై యున్నది. దేవీభక్తుఁడగు నమ్మకము కంటె జనుల కిది దృఢతరమై యున్నది. దేవీభక్తుఁడగు కాళిదాసునకుఁ గూడ నీనింద తప్పినది కాదు. కవియనఁగా సోమరి, ప్రపంచజ్ఞానశూన్యుడు. తిక్కతత్వము గలవాఁడు. స్వతంత్రమైనవృత్తిచే జీవించువాఁడు కాదు. ఒకని నీడను దిరిగి బ్రతుకువాఁడు. అందఱకు దాసుఁడు. కాని ఎవడు చెప్పిన మాటనువినువాఁడు కాదు. అందఱిని దిట్టువాఁడు. కాని ఎవడు చెప్పిన మాటనువినువాఁడు కాదు. అందఱిని దిట్టువాఁడు, అందఱిచేత దిట్లుతినువాఁడు. దరిద్రతలో నింతతెగనీల్గు మఱి యెచ్చటనులేదు. చేతగానితనములో నింతగర్వము మఱియెచ్చటనులేదు. ప్రత్యక్షమందుఁ జేత రాగికాను లేకున్నను భావనలోఁ తలక్రింద మేరుపుగలవాఁడు. ఆపూట కన్నము లేక చావు. ఆచంద్రార్కముగా శాశ్వతుడనను నమ్మ కము కలవాఁడు. బ్రహ్మదేవుఁడు తన్ను బాగుజేయు యత్నించినను బాగుపడువాఁడు కాఁడు. కాని ప్రపంచమునంతను బాగుచేయుటకు బ్రయత్నించువాఁడు. కవి యిట్టివాఁడు. ఇంతకంటె ధిక్కవాఁడు. మఱి యింతకంటె కొనవెళ్లివాఁడు. అతని వెట్టికి ప్రజలే కొంత కారణము. ప్రజలాతని దిట్టి రేఁగఁగొట్టుచున్నారు. రేఁగినప్పుడు మాత్రము వెట్టికుక్కవలె

వాతఁడందఱఁ గలచును. కవిని దిట్టఁజాలనంత మొద్దు ప్రపంచమున లేదు.

నీ. బండిఆాయన నెద్దుబండియా పోతుల
బండియా యనెడు మొద్దుండవచ్చు
గుక్కఁగొడు గనగ గుడ్డదో దాటాకు
దోయని యడుగు మొద్దుండవచ్చు
దాండ్రబెత్తనఁ దాటితాండ్రయో, మామిడి
దోయని యడుగు మొద్దుండవచ్చు
జాముండి యనగ మునలిముండ యొబాల
రండయొ యడుగు మొద్దుండవచ్చు

తే. నుర్వి నెటువంటి మొద్దయిన నుండుగాని
యాధునికకవి కవితయం దన్ని దోష
ములె యటంచుఁ బల్కఁగలేని మొద్దు లేదు
సర్వదేశంబులను సర్వజాతులందు.

పనికిమాలినకవి వస్తుపడుచునైన బద్యమల్లకమానడు. అల్లిన వాఁడు తనలోఁ దాను సంతోషించి యూరకుండునా? ఉహూఁ! ప్రత్యానక్తిగ వనికట్టుకొని బండికర్చుపెట్టుకొని బత్తెము మూటఁ గట్టుకొని పోయి పదిమందికి వినిపించినదాఁక కొట్టుకొనునే కాని యితని దిక్కుమాలిన సోదె యెవఁడు వినును.

నీ. తలను గొట్టుకొని మెదడు జింపుకొని యొక్క
గద్యమో పద్యమో కవిత యల్లి
జనులకు వినిపింపఁ గనుబొమ చిట్లించు
నొకఁ డడ్డముగ మొగ మూఁపు నొకఁడు
ఒక్కఁడోష్ఠము విఱుచు నొకఁడు వంకగ వవ్వు
నొక్కఁడు పూర్వగవుల నుబ్బిపొగడు
ఎట్లున్నదండి యం చేడ్వగ నకిలించి
ఊ యున్నదని సాగఁదీయు నొకఁడు

ఆ.వె. ప్రాయుచుండ బాధ ప్రాయుపిదపఁ దిట్లు,
కడుపుమంట మిగులు గలుగు కవిగఁ
బుట్టుకంటె ఘోరజన్మారబ్ధ
కఠినఫలము లేదుగాదె యకట!

అని ఒక్కకవి కూనురాగమునకు బెద్దయేడ్పునకు నడుమనున్న కంఠమాధుర్యముతో వేడ్చెను.

భవభూతికూడ నట్లె ప్రజంవలనఁ దిట్లు తినినవాఁడే. కోపము పట్టలేక యతఁడు ప్రజలఁ దిరుఁగబడి తిట్టినాఁడు.

శ్లో. యేనామ కేచిదిహనః ప్రథయంత్యవజ్ఞాం
జానంతు తే కిమపి తాంప్రతి నైషయత్నాః
ఉత్పత్స్యతే మమ తు కోపి సమానధర్మాః
కాలోహ్యయం నిరవధిర్విపులాచ పృథ్వీ.

ఈకవి గర్వభూయిష్ఠుడు. తన్ను స్తుతింపని వారిని నిందించు స్వభావముగలవాడు. ప్రజలు కవిదూషణము చేసినప్పుడు కవి ప్రజాదూషణ చేసిన తప్పేమున్నది. కవుల కెంతసేపు నాత్మస్తోత్రము, పరహేళనము, వానితోపాటు గర్వము ననూయయు సాధారణ మగు నవగుణములు. కవులకున్న పౌరుషము యుద్ధవీరులకు లేదు. వారికున్న యసూయ జారులకు లేదు. వారికున్న స్వస్తోత్ర పరనిందలు పదుచుసానులకు లేవు. తిట్లు తిట్టుటయందుఁ దినుటయందుఁ గూడ మహాఘనులు. తన కవిత్వమును ప్రజలు నిందించు చున్నారని కడుపు మండుటచేత చిత్తము పుండగుటచేత భవభూతి యీశ్లోకమును జెప్పినాఁడు. దానియర్థమిది. ''ఎవ్వరైన మా తిరస్కారము బ్రకటింతురు గాక! వారుగూడ నేదియో కొంచెము తెలిసినవారే యగుదురు. అట్టివారికొఱకు నేనీ గ్రంథమును వ్రాయలేదు. కాల మంతములేని దగుటచేతను, భూమి విశాలమగుటచేతను, నేకాలమందైన నేస్థలమందైన నావంటి బుద్ధిధర్మముగలవాఁడు పుట్టగలఁడు'' కాని దీని యాంతరంగికాభిప్రాయమేమనఁగ, ''నా కవిత్వము మిగుల సారవంతమైనది. దానిలో నున్న విశేషమును, రసమును నాస్వాదిం చుట కీకాలపువా రశక్తులై పోయినారు. గుడ్లగూబ తన యశక్తిరోగమును నిందించుకొనక యర్కతేజమును నిందించునట్లు వీయసమర్థులు తమ రస గ్రహణషండత్వమును నిందిం చుకొనక భారతీమండనాయమాన మగు నాకవిత్వమును దూఱుచున్నారు. ఇట్టి రసహీనాగ్రేస రులను సంతోష పెట్టుటకు నేను గవిత్వము చెప్పినవాఁడనుగాను. నేను నాకవిత్వము నెంత కళాకౌశలవిశేషముతోఁ జెప్పితినో యంత కళాకౌశలసామర్థ్యమున్నవాఁడు ముందెప్పు డైన నెక్కడనైనఁ బుట్టవచ్చును. వాఁడే నాకవిత్వమును గ్రహించి యానందించుగాక. వానికొఱకే యిప్పు డీ కవిత్వమును జెప్పుచున్నాను. అట్టివాఁ డుద్భవింపఁగలఁ డనుని శ్చయ మేమిగల దందురేమో ధరామండల మత్యంత విశాలమైనది. కాలము పరిమితి శూన్యమైనది. ఎందులకుఁ బుట్టఁగూడదు'' ఇవి యేమి సాధారణ వాక్యములా? ఎంత యాత్మశక్తి విశ్వాసమున్న వాఁ డిట్లు పలుకవలెను. ఎట్టి పాండిత్య మదమత్తుఁ డిట్లు పలుకవలయును. జనులయం దెంతోరోఁతగలవాఁ డిట్లు పలుకవలయును. ఆ మహాకవి యెంత బుద్ధిశాలి, యెంత వికతాపటిమ కలవాఁడు. యెంత ప్రాణము విసుగకపోయిన యెడల నింతతేలికగ మాటలాడును. ఎంత రసస్ఫూర్తి గలవాఁడు, యెంతబాధపడకుండిన నెంత యెడలు చిల్లులుపడకుండిన నింతపేలవముగఁ బలుకఁగలఁడు. జనులను సంతోషపెట్టుఁ దలఁచి తా నేడ్చువాఁ డొక్క కవియే. పుణ్యమునకు బోయి బూతులు తినువాఁ డొకకవియే. ప్రజాసేవకుఁ బోయి బడితె బాజా కధీనుఁ డగువాఁ డొకకవియే. భవభూతివంటివాని బ్రతుకే కడతేఱనప్పు డిప్పటివారి మాట చెప్పవలయునా? కాళిదాసుఁడు మాత్రము జనులతిట్లగు రికి దాఁటిపోఁ గలిగెనా? ఆతని కవిత్వములోఁ బటుత్వము తక్కువయనియు నాతఁడు యమకకవిత్వమున నజ్ఞుఁడనియు నింకనేమో ప్రజలు నోటికి వచ్చినట్లల్ల దూషింపలేదా? కాళిదాసుడు గంభీరుడు. భవభూతి బేలగుండె కలవాఁడు. కాళిదాసుఁడు గడుసుకవి. ఈతని నెందఱు తిట్టినను దన శాకుంతల నాందిలో ''శ్లో. ఆపరితోషా ద్విదుషాం న సాధు మన్యే

ప్రయోగవిజ్ఞానం, బలవదపి శిక్షితానా మాత్మన్యప్రత్యయం చేతః'' అని వ్రాసినాఁడు. ఇది యెంతలౌకికపు వ్రాతయో చూచితిరా? తన్నుఁ దూలనాడుచున్న వారిని విద్వాంసులని శ్లాఘించుచున్నాఁడు. వారి శిరఃకంపనమే తనకుఁ గావలసిన దనుచున్నాడు. అది లేనియెడల దన గ్రంథమసాధు వనుచున్నాడు. ఆహా! ఇవి యెంతగడుసుమాటలు! తిట్టువారి నోటికింత కంటె గట్టిమంత్రమేమున్నది? తిట్లు స్తోత్రమువలననే యడఁగును గాని తిట్లవలనఁ బోవునా? ఈమాత్రపు బ్రకృతిరహస్యమును గ్రహింపలేక భవభూతి తెగిపడి తిట్ట నారంభించినాఁడు. ఉత్తమకవుల ప్రౌఢన్యమును నమకాలికులే కాదు. కొంచెము తరువాతి వారు గూడ గ్రహింపలేరు. షేక్స్‌పియరు యొక్క మహాప్రజ్ఞనాకాలములో గ్రహించినవా రేరి? బ్యాక వంటివాని కనులకే యీమహాకవి కళాకౌశలము కనఁబడలేదే! అతని తరువా తివా రగు జాన్‌సన్ మొదలగువా రీకవికి లేనిదోషములను గల్పించి తూలనాడిరి. జాన్‌సన్ కంటికి, నాంగ్లేయసారస్వతతిమింగల మనిపేరొందిన వానికంటికి పోపు అనువాఁ డెక్కువ కవిగాఁ గనఁబడినప్పుడిక జెప్పవలసి దేమున్నది?

పాపము. భవభూతి యిట్లు ప్రజలతిట్లవలన బాధపడినాఁడు. ఏమి చేయవచ్చును? కవితా ప్రారబ్ధమున్న ప్రతినిర్భాగ్యున కీబాధ తప్పదు. కొందఱు కవులు విని వినన‌ట్లుం దురు. కొందఱు కవువు వినకుండ నెన్ని ప్రయత్నములైన జేసికొందురు. కొందఱు విని ముసిముసినవ్వులు నవ్వి యూరకుందురు. కాని లోకబాధ పడనివాఁ డొక్కఁడును లేఁడు. ప్రజలను దిరుగఁబడి నోటికసిదీఱ తిట్టుట కవకాశమునకై కొందఱు వేచియుందురు. అట్టి యవకాశము రాకపోయినను గల్పించుకొందురు. భవభూతి ఉత్తర రామచరిత్ర నాందీప్రస్తావ నలో విమర్శకులఁ దిట్టుట కట్లవకాశమును బుద్ధిపూర్వకముగఁ గల్పించుకొనినాఁడు. ఎట్లో వినుడు. నటసూత్రధార సంభాషణములలోనిభాగ మిప్పుడు మీకు విన్పింతును వినుఁడు. బ్రహ్మశ్రీ జయింతి రామయ్యపంతులుగారి యాంధ్రీకరణ మనుసరింతము.

సూత్ర:– మన కిదియంతము నేల? నిజకులమర్యాదానుసారముగ రాజద్వారమునే సేవింతము రమ్ము.

నటు:– అట్లయిన, రాజుగారియొద్దఁ బఠించుటకై నిర్దుష్టమైన స్తోత్ర మొకటి రచింపుము.

అంతటితో రవంత యాగుదుము. రాజద్వారమును సేవించుట నిజకులమర్యాదాను సార మైనప్పుడు నిజకులమర్యాదానుసారముగ నటుఁడు రాజుగారియొద్ద మామూలుగాఁ బఠించుచున్న స్తోత్రములను బఠింపవలయునే గాని యారాత్రి నటునకు ప్రత్యేకముగ నిర్దుష్టమైన స్తోత్ర మెందులకు? ఒకవేళ ప్రతిదినమును నూతనస్తోత్రమును జరుపవలయు నన్న నిర్బంధము నటునకున్నదా? ఉండదు. కాని యున్నదే యనుకొనుఁడు. ఉన్నప్పు డందులకైనటుఁడు మహారాజకవిని గౌరవలయును కాని నాటక పాఠములను చెప్పునూత్రధా రుని వేఁడనేల? సూత్రధారుఁడు మాత్రము కవి కాఁగూడదా? ఎక్కఁడను వినలేదు. నరే. కవి యని యంగీకరింతము. అందుపైన సూత్రధారుఁ డేమనియెనో విందురా.

సూత్ర:– శ్లో. సర్వధా వ్యవహర్తవ్యం కుతో హ్యవచనీయతా యథావాచాం తథా
స్త్రీణాం సాధుత్వే దుర్జనోజనాః

దీనియర్థ మేమనఁగా, జనులు నిందింతు రను భీతిని వదలిపెట్టి నిర్దుష్టముగాఁ గవిత్వము చెప్పవలసినది. నిందలేదన్నమాట యెన్నఁడును లేదు. కవులవాక్కులఁ యెడలఁ గాంతలయెడల జనులు తప్పునే తడవుచుందురు. నటుఁడు నిర్దుష్టమగు స్తోత్రమును కోరినప్పుడు సూత్రధారుఁడిదియంతయుఁ జెప్పనేల? నటుని మాటకు సూత్రధారుని మాట నందర్భమైన ప్రత్యుత్తరముగాఁ గనఁబడుచున్నదా? ఒకవేళ నటుఁడు ''సూత్రధారా! వేను స్తోత్రము రచియించినయెడలఁ తప్పులు వచ్చునేమో నీవే నిర్దుష్టముగాఁ జెప్పవలసిన'' దని కోరినయెడల సూత్రధారునిపై ప్రత్యుత్తరము కొంత నందర్భముగా నుండునేమో భావికథాసూచనకు నంతకంటె ముఖ్యమైనది విమర్శకులను దిట్టుట కీ యవకాశమును బుద్ధిపూర్వకముగఁ గవి కలిగించుకొనినాఁడని నాకుఁ దోఁచుచున్నది.

సోదరులారా! పై శుక్రవారమున నుత్తరరామచరిత చిత్రపటము అను విషయమును విమర్శింతును. అపండితుడవు. ననామకుఁడ వగు నీవు భవభూతిని విమర్శింతువా? తప్పుకాదా? ఊరకుండుమని నన్ను దిట్టుదురా? కవులగ్రంథ సంచయమునకు, కాఫీహోటలునకు, నాకు భేద మగపడలేదు. హోటలునకుఁ బోయి పాకపుగారెలు తినునప్పుడు పాకములోఁ దగినంత బెల్లము వేయలేదని యనుటకు నాకధికారము లేదా? నీవు మంచివంటగాఁడవైనట్లే తెగనీల్గుచున్నావే యని పై వారు కాని; యధికారిగాని నన్నుఁ దిట్టుట ధర్మమా? కవిత్వమేమి, చిత్రలేఖనమేమి, యభిరుచి ప్రధానమైన కళలు. నాయభిరుచి కనుకూలమైనదానిని నేను బాగుగ నున్నదందును. లేనిదానిని బాగుగ లేదందును. అది నా జిహ్వాలోని గుణము కావచ్చును. దోషము కావచ్చును. ఆమాత్రమునకుఁ గవులకు నాపైఁ గోప మెందులకు? ప్రజలకు నాపైఁ గోపమెందులకు? నేను బాగుగా లేదన్నది బాగుగానుండఁగూడదా? నేను బాగుగానున్నదన్నది యోగుగా నుండఁగూడదా? కవులు గ్రంథములను దేశమున నెప్పుడు విడిచిపెట్టినారో యప్పుడే ప్రజలు వానిని విమర్శింపనధికారముగల వారైనారు. కళలకైనను గేవల మభిరుచియే ప్రధానమా? మంచిచెడ్డలను బరిశీలించు ప్రకృతిసూత్రము లేవియు నక్కఱలేదా? యని యధిక్షేపింతురా? ప్రకృతిసూత్రములను బట్టి వ్రాసినవా రెందఱు? అట్లు పరిశీలించినవా రెందఱు? నీ రుచి ననుసరించి నీవు వ్రాసినావు. నారుచి ననుసరించి నేను విమర్శించినాను. బొమ్మలో నాయుఁడు గారి మొగము సరిగా లేదని నే నంటిని. ఉన్నదని నీ వనుచున్నావు. తగవు పరిష్కారమున కేప్రకృతి సూత్రములు కావలయునో చెప్పఁగలవా? కావున నాచింతవలదు.

''ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.''

21. ఉత్తరరామచరితము-పటము

భవభూతి గురించి తమ సభలో ప్రసంగించిన శాస్త్రిగారు ఆ కవి వ్రాసిన ఉత్తర రామచరిత నాటకం గురించిన మరొక విమర్శను చదువుతానంటే, జంఘాలశాస్త్రి మళ్లీ అవకాశమిచ్చాడు.

ఈ నాటకంలో 'చిత్రపటదర్శనాంకం' అని ఒక అంకం వుంది. ఉత్తరరామచరితను చెప్పడానికి ముందు స్థాలీపులాక న్యాయంగా పూర్వరామ చరిత్ర చెప్పడానికి ఉద్దేశించినదీ కల్పన.

తమ చరిత్రమే చిత్రపటాన వ్రాయించి తామే చూపించుకుని, జనులు సంతోషించడమో, ఏడవడమో, జరిగింది ఈ నాటకంలో మాత్రమే.

ఉత్తరకాండం వాల్మీకిదేనని కొందరు, కాదని కొందరు వాదించడం వున్నా, భవభూతి మాత్రం అది రామాయణంలోని భాగమేనని నమ్మినట్లు తోస్తోంది.

వాల్మీకి, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు మాత్రమే సీతారామలక్ష్మణుల హృదయ ప్రకృతుల్ని ఎరిగినవాడు. భవభూతి, ఈ చిత్రపట దర్శనాంకంలో ప్రకృతి విజ్ఞానాన్ని సంపూర్ణంగా, జాగ్రత్తగా పాటించలేదని పండితుడి విమర్శ. కొన్ని కొన్ని సందర్భాలలో నరిగా కనిపెట్టినా, ఏ ఏ సన్నివేశాల్లో 'చిత్రపట దర్శనం' అనేది విచారాన్ని పెచ్చిస్తుందో, తగ్గిస్తుందో, భవభూతి పారపడ్డాడని, ఈ విమర్శకుడు భావించాడు. ఈ అంకంలో అంశాన్ని ఒక క్రమంలో ఈయన విమర్శించినా – 'దే హి నో ద్విసాంగతాః' అనే శ్లోకంలో ఆయన చూపిన కవిత్వ శక్తిని ప్రశంసించాడు. ఈ కవికి రసపుష్టి కలిగించడం మీద ఎక్కువ అభిమానమనీ, ఆయన ఆవేశ శీలుడనే ''కిమపి కిమపి'' అనే ఒక్క శ్లోకమే ఆయన మహాకవి అనడానికి చాలుననీ తీర్మానించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

భవభూతి యుత్తరరామచరితమునుఁ గూర్చి కొఱఁదినముల క్రింద నుపన్యసించిన యాతఁడు తిరుగ నొక విమర్శనము చదువును. శ్రద్ధతో వినవేఁడుచున్నాను. శాస్త్రులుగారిట్లు చదివిరి:–

ఉత్తరరామచరితములోని చిత్రము సారస్వతప్రపంచమందుఁ జిత్రమై యున్నది. నాటకములలో నంతర్నాటకములున్నవి. ఇంద్రజాల ప్రదర్శనము లున్నవి. కాని తమచరితమే చిత్రపటమున వ్రాయించి తామే చూచుకొని జనులు సంతోషించుటయో, ఏడ్చుటయో జరుగట మాత్ర మీనాటకమందు మాత్రమే యున్నది. ఉత్తరరామచరిత ముత్తరకాండలోని గాథతో నంబంధించినది. ఈకాండ వాల్మీకిరామాణమునఁ జేరలేదనియుఁ బ్రక్షిప్తమనియుఁ గొంతప్రతీతి యున్నది. కాని యుత్తరకాండకూడ వాల్మీకికృతమే యనియు నుత్తరకాండ కూడ రామాయణములో నొక్కభాగమేయనియు భవభూతి యభిప్రాయమైనట్లుత్తరరామ చరితమువలననే తెలియుచున్నది. అందుచే నుత్తరకాండలోని గాథను ప్రత్యేకముగ నాటక మును వ్రాయుఁదలఁచిన భవభూతి, కథైక్యము కొఱకు పూర్వకాండలలోని కథ నతినంగ్ర హముగాఁ బలికింపవలసివచ్చినది. కౌశికుఁడు రామునకు జృంభకాస్త్రము లిచ్చుట, శివధనుర్భంగము, సీతావివాహము, పరశురామ గర్వభంగము, మంథరావృత్తాంతము, వనవాసము, విరాధాదివధ, మాల్యవత్పర్వతనివాసము, వాయుపుత్రసందర్శనము, సుగ్రీవన ఖ్యము మొదలుగా గల రామకథ లంకలో జరిగిన యార్యాహృతాశనశుద్ధివఱకుఁ బటములో లిఖింపఁబడెను. తరువాతఁ బట్టాభిషేకమునకు వచ్చిన బంధువులు వెళ్లఁగనే యుత్తరరామచ రిత్ర ప్రథమాంకకథ యారంభమైనది. ఇట్లీ క్రొత్తగాథను బ్రాఁతగాథతో నాతఁ డదికినాఁడు. గ్రంథైక్యసిద్ధియే భవభూతి యభినంధియైనను బట మందుకొఱకు నిర్మింపఁబడినదని యనగూడదు. కావునఁ దండ్రి మిథిలాపురమునకు వెడలుటవలన బెంగగొన్న జానకీదేవి వేడుకకై యది చిత్రింపఁబడిదనది రామలక్ష్మణులచే ననిపించినాఁడు.

లక్ష్మ:– (ప్రవేశించి) ఆర్యులకు జమయగుఁగాక. మనము చెప్పినప్రకార మర్జునుఁడు మీ చరితము నీ పటముందుఁ జిత్రించి తెచ్చి నాడు. చూడఁదగును.

రామ:– వత్సా! వ్యాకులచిత్తమైయున్న దేనికి వినోదము కల్పించుమార్గము నీ వెఱుఁగుదువు.

భవభూతి యిట్లు చిత్రపట కారణమును సర్దుబాటుగఁ జెప్పినాఁడు. కాని యీ పటపరీక్షలో నేమిజరిగినదో యిఁక జెప్పుదును.

లక్ష్మణుడు పటమును జూపుచున్నాఁడు.

లక్ష్మ:– ఆర్యా! ఇది చూడఁదగిన పట్టు. ఇతఁడు భగవంతుఁడగు భార్గవుఁడు.

సీత:– (సంభ్రమముతో) నాకు వడఁకు పుట్టుచున్నది.

కల్యాణమైన పిదప జానకీరాము లయోధ్యకు నబంధుపరివారులై యేగుచుండ దారిలో నడ్డుకొనిన పరశురాముని వృత్తాంతమాతని విగ్రహదర్శనము జ్ఞప్తికి రాగసీతకు వడఁకుపుట్టిన దని యనుకొనవలయును. అంతేనా? అంతకంటెఁ గారణమేమైన నుండునా? ఉండదనుట నిన్నందేహము. చిత్రకారుఁ డొక్క పరశురాముని మాత్రమే చిత్రించి యూరకుండఁడు కదా? రాముఁడతని చేతిలో నున్న ధనస్సుతో పాటతనితేజముఁగూడ లాగుకొనిన నన్నివేశ మక్కడనే చిత్రింపబడియుండక తప్పదుకదా? శివధనున్భంగమే కాక పరశురామ గర్వభంగముఁ గూడ నొనర్చిన జగదేకవీరుఁడైన భర్త తన ప్రక్కనే యుండ నట్టివిగ్రహ

మును జూచి యుత్సాహపడునా? అప్పుడే యనఁగ 24 సంవత్సరముల క్రింద సంతరించి
యిన భార్గవునిబొమ్మఁ జూచి భయపడునా? అపాయమేదో దాటిపోయినది. ఆ ప్రయత్నము
చేసినవాఁడు శాశ్వతముగా శక్తివిహీనుడై పోయినాఁడు. అపకారమునుండి రక్షించి
జగద్రక్షకుఁడు తనప్రక్కనే యున్నాఁడు. ఇక భయమెందులకు?

అదేమి మాట? స్త్రీలు సహజముగ భీరువులు. సహజముగా భయమునకు హేతుకల్ప
నశక్తితాత్కాలికముగ నశించును. అందుచేత భయమిచ్చుట సహజమే యని యుంధురా?
సహజమో కాదో తరువాత విమర్శింతము. ఇప్పటి వఱకు సహజమనియే మాటవఱుస
కొప్పుకొందము. మానవస్త్రీ యగుటచేఁ గొఁలదిదినములలో సుఖప్రసవము కావలసిన
సీతామహాదేవి కా సమయమున భయమను చిత్తావస్థ కలుగనీయవచ్చునా? పటదర్శనమ
సీతాదేవివేదుకకయి కదా చేయఁబడుచున్నది. భయము కలిగించుట వేదుకా? భయము
లన నరములపట్టు లూడిపోవునని యందఱెఱింగినదే కాదా? అట్టి దురవస్థపూర్ణగర్భవతికి
గలుగనీయఁ దగునా? అది కలిగినతరువాత నయినను బటములో నావలి చిత్రములన
జూపించుట లక్ష్మణుఁడు మానినాడా? లక్ష్మణుఁడు చిన్నవాఁడు కావున నాతనికిఁ దెలియ
పోవచ్చును. గాని పట మింక మానుమని రాముఁడైనను లక్ష్మణుని మందలింపలేదే! ఇ
విరుద్ధముగఁ గనఁబడుట లేదా? ఇప్పటి కంత విరుద్ధముగా లేదనుకొందము. కా
రాముఁడింకమీద లక్ష్మణున కట్లాజ్ఞాపించి పటము పాఱవేయించునేమో చూతము.

లక్ష్మణుఁ డింకఁ బటమును బఠించుచున్నాడు.

లక్ష్మ:– ఇది శూర్పణఖావృత్తాంతము.

సీత:– హా ఆర్యపుత్రా! ఇంతవఱకే నీ దర్శనము.

రాము:– వియోగత్రస్తురాలా! ఇది చిత్రపటము సుమీ.

సీతాదేవి భయాకులచిత్తయై యుండెను. ఇప్పుడు కూడ బటమూపవలసిన దన
రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పక ''వియోగమును వచ్చునని జడిసెదవేల? ఇది చిత్రపటము
సుమా'' యని సీతాదేవికి ధైర్యము సెప్పినాఁడు. బొమ్మను జూచి భయముగాని దుఃఖముగాని
పడనక్కఱ లేదు. లేదని రాముని యభిప్రాయమైనట్లు స్పష్టము. కాని ఈ వంక్తికి
బైపంక్తియందే యనఁగా నొక ఱెప్పపాటు కంటెఁ దక్కువకాలములోనే రాముఁ డిట్లు
పలికెను.

రాము:– అక్కటా! జన్మస్థానవృత్తాంత మిప్పుడు జరుగుచున్నట్లే పొడకట్టుచున్నది
నాకు.

లక్ష్మ:–

చ. ఖలహరిణంబు రూపమున నట్లు మిషం బచరించి క్రూరుల్గ్ర
కులిశము వ్రక్కలౌ పగిదిఁ గొండలు సైతము నేడ్చునట్లు మి
మ్మలమఱచేసినట్టి కుటిలానురవృత్తము నెల్ల బాపికోఁ
గలిగితి మైన నద్ది పొడగట్టినచో నెద వ్రక్కలయ్యెడున్.

ఈ దుఃఖకరసన్నివేశము చూడ గుండెలు పగిలిపోవుచున్న వని లోన లక్ష్మణుఁ డగ్ని పర్వతమువలెఁదపించుచున్నాఁడు. కాని జానకీదేవి యేమిచేయుచున్నది.

సీత:– (సబాష్పయై) తనలోను) అక్కటా! దినకరకులనందనుఁడు కూడ నాకారణ మున నట్లు క్లేశపడెను గదా!

భర్త తన కొఱకు వెనుక నేడ్చినాఁడని యామె యిప్పుడు లోన నెంతైన నేడ్చుచు న్నది. బాష్పములు కన్నులవెంట ప్రవహించుచున్నవి. కాని పెదవులు విప్పకుండ లోలోననే యామె యేడ్చుచున్నది. ఈ యేడ్పు మఱింత యపాయకరము కాదా! తొమ్మిది నెలలు నిండిన చూలాలిట్టి మహాదుఃఖము నడచిపెట్టుటకై చేసిన యస్వభావప్రయత్నము వలన నేమిపుట్టిమునుఁగునో యని భర్తగాని మఱఁదిగాని యాలోచించినారా? లేదు కాని రామునఁ డేమిచేయుచున్నాఁడో! ఏమిచేయుచున్నాఁడో లక్ష్మణుడే చెప్పుచున్నాఁడు వినుఁడు.

లక్ష్మ:– (రాముని బరికించి సాభిప్రాయముగ) ఆర్యా! ఇదియేమిటి?

ఆ. సరము పెరుగ రాలు వరమౌక్తికములు నా
దొరలు నశ్రు లివ్వె ధరణిమీఁదఁ
గదలుచున్న నాసికాపుటాధరములు
బిగియఁ బట్టి నట్టి వగపుఁ దెలుపు.

''వియోగగ్రస్తులారా! ఇది చిత్రము సుమా'' యని సీతాదేవికి ధైర్యము బోధించిన రామచంద్రమూర్తి యుత్తరరక్షణముననే కన్నీరు భూమిమీఁదఁ బడి నిల్చి గుర్తులై యుండు నంత విరివిగ విస్తారముగ నేడ్చినాఁడు. ఎటువచ్చినను ధీరోదాత్తుఁడు గావునఁ బెదవులు బిగఁబట్టినాఁడు. పోనీ యాబిగఁబట్టుటమాత్ర మెంతవఱకు నిల్చినదో చూతము. ఉత్తరపం క్తియే చదువుచున్నాను వినుఁడు.

రాము:– వత్సా!

తే. ప్రియను బాసిన దుఃఖంబు పెద్దయైన
శత్రు సాధించువాంఛచే సైచినాఁడ
మరల దుఃఖాగ్ని యధికమై మండుచుండి
మెండు బాధించు నెదలోని పుండువోలె.

ఇట్లు రాముఁడు పండ్లపట్టు విడిచి బారుమనెను. జనస్థానవృత్తాంతమును బటమునఁ జూచినప్పుడే ''దినకరకులనందనుఁడు నాకారణమున నెంతయేడ్చినాడో'' యని జానకీదేవి యేడ్చియుండఁగఁ నిలువున నెగిరి పోవలసినదే కాదా? అప్పుడు సీత యేమన్నది.

సీ:– అతిమాత్ర భయావేగముచేత నే నిప్పు డార్యపుత్రునిఁ బాసినట్లు తోఁచ-
ుచున్నది.

అక్కటక్కటా! చూచితిరా! దుఃఖము భయము నతిమాత్రము లైనవి సహించుకొనఁ దరమా? ఎదుటనున్న భర్త యామెకన్నుల కగపడుటలేదు. తనకు రామునితో విరహము కలిగినదని భ్రమమునఁ బడియున్నది. దృఢశరీరులు దృఢమనస్కులే సహింపలేరు కదా?

అందుపై స్త్రీ–అందుపై రాజకాంత–అందుపై మహాసుకుమారి–అందుపై బూర్ణగర్భవతి భగవత్కటాక్షమున నామెచూలు నిలిచెను గాని నిలువఁదగినదా? అట్లు తటస్థించునెడ సీత బ్రతుకునా? రామలక్ష్మణులు కూడ నామెగతియే పొందకుందురా?

రాముఁడప్పు డేడ్చిన యేడుపెందులకో ''జానకీదేవి విరహమెంత దుస్సహమైనన శత్రుని సాధింతమను తీవ్రవాంఛచేత దానిని వెనుక నడఁచుకొంటిని. ఇప్పు డడఁచుకొనుట యేలాగు? అని యేడ్చెను. ఈ కారణముచేతమాత్ర మింతగా నేడ్వఁ దగదని నామన ''పూర్వమున నాకుఁ కలిగిన దుఃఖ మొకకారణముచేఁ గలిగినది. దుఃఖమున కేది కారణమున్నది కదా యని వెనుక దానిని సహించుకొంటిని. ఇప్పుడేడ్చుటఁకు దగి కారణము లేకుండనే కలిగినయేడుపు నెట్లు సహించుకొనగలనని యేడ్చుచున్నా'' న యొకఁడు మనతోఁ జెప్పిన నెట్లుండునో రాముఁడనిన మాటకూడ నట్లే యున్నదని యనవ సివచ్చినందుకలకు విచారించుచున్నాను. ''ఏడ్చుటకుఁ గారణము లేనిదే. యేడుపేలకలు వలయు'' నని మన మాతని నడిగినట్లే ''శ్రీరామచంద్రమూర్తీ! పూర్వము మహాశత్రు వుండుటచేతనే సీతావిరహము కలిగినది. ఆ శత్రువును జంపు వాంఛచేతనే విరహమున సైచికొంటిమి. నిజమేనా? ఇప్పుడో శత్రువునే కాక సర్వశత్రువులను జంపితివే. శత్రు లేనప్పుడు విరహమని యేడ్చుట యెందుల''కని యడుగవలసినది కాదా? పోనిండు ఈగొడవ యేల?

ఇంతపుట్టి మునిఁగినను బట మావలఁ బాఱవేయుమని రాముఁడనలేదే, ఏమో.

గర్భవతుల వేడుకలకై జరిగించుట కెన్ని వినోదము లున్నవి. వీణాగాన మొనరించ చ్చునే. ప్రహసనము లాడింపవచ్చునే. భక్తిబోధకములగు గ్రంథములు వినిపించపవచ్చునే భయము కలుగునని యింద్రజాలము లాడింపవచ్చునే. పగటిభాగవతుల కాలక్షేపములు జరిగింపవచ్చునే. లక్షలకొలఁది గ్రామములుండఁగా వెనుకలేనిదియు, ముందెవ్వఁడు నను రింపనిదియు నగు చిత్రపటమును రచియింపించి గర్భవతి యెదుటఁ బెట్టి బొమ్మలవివరము చెప్పుదురా? సంతోషముకొఱకు చేసినయీపని సీతారామలక్ష్మణుల మహాదుఃఖమునకు గారణమైనదే. పటమిప్పుడైనా విసర్జింపఁ దగదా?

వాల్మీకి యొకఁడు, వశిష్ఠుఁ డొకఁడు, విశ్వామిత్రుఁడొకడు వీరు మువ్వురు మాత్రమే సీతారామలక్ష్మణుల హృదయప్రకృతుల నెఱింగినవారు. మిగిలిన రామకథాకర్తలందఱు తమతమ ప్రకృతులనే యామహావ్యక్తుల కారోపించి మాటలాడించినవారే. అందుచేత భ భూతి మాట లాడించినట్ల సీతారామలక్ష్మణులు మాటలాడినారు. వారి కిందుతోనేమీయ సంబంధము లేదు. పటమర్జునుఁడు వ్రాసినాఁడు. ఆతఁడు శ్రీరామ కాలములనో నుండి చిత్రలేఖకుఁడు కాఁబోలు. పటములో దోషమేమియు లేదు. ఇఁక భవభూతి ప్రకృ జ్ఞానమున గుణమెచ్చట నున్నదో లోపమెచ్చట నున్నదో మనవి చేయుదును.

వ్యాకులచిత్తయై యున్న సీతాదేవి కుత్సాహమును గలుగఁ జేయుటకుఁ జిత్రపటమ సమర్థమని గొప్పప్రకృతిజ్ఞానముచేత భవభూతి కనిపెట్టినాఁడు. అంతేకాక చిత్రపటమ కొన్ని కొన్ని నన్నివేశములందు విచారము పెచ్చుచేయునన్న సంగతిగూడ దనప్రకృతిజ్ఞా ముచేతనే కనిపెట్టినాఁడు. కాని యే నన్నివేశములందు విచారమును దగ్గించునో వేనియంద

హెచ్చించునో గ్రహించుటయందుఁ గొంత పొరపాటు పడియుండెనని నాకుఁ దోఁచినది.

నాయనలారా! కొంచెము శ్రద్ధతో వినుఁడు. ఈ సందర్భము నందలి నామాటలు మీ మనస్సుల కెక్కవేమో యని యనఁగా నెక్కనంత స్పష్టముగ నేను జెప్పలేనేమో యని భయపడుచున్నాను.

మనమందఱము సుఖములు పడుచున్నాము. కష్టములు పడుచున్నాము. సుఖములు శాశ్వతములు కావు. కష్టములు శాశ్వతములు కావు. కష్టసుఖములు రెండునుగూడ మనమనస్సులందు స్థిరములైన సంస్కారములను గలుగఁజేయుచున్నవి. మనము స్వభావసిద్ధముగా వెనుకఁబడిన సుఖములను గష్టములను గూడ స్మరించెదము. మన మనఃపటములందుఁ గష్టసుఖములను భగవంతుడు చిత్రించినాఁడు. ఆపటము యొక్క యనుకరణమే భవభూతి పటము....సుఖసంస్మరణములు.

పశ్చాత్తాప సహితములు కాకున్నయెడల సుఖమునే యొనఁగును. కష్టసంస్మరణములు మాత్ర మొకప్పుడు సుఖము నిచ్చును, ఒకప్పుడు కష్టము నిచ్చును. అది యెప్పుడు? ఇది యెప్పుడు? మనమెన్ని కష్టములఁ బడిన నరియేకాని యొక్కప్రాణమైన పోకుండ నందఱము బాగుగానుండి కష్టములు దరించుట సిద్ధించినయెడల నీకష్టములస్మృతి యందు విచార మెంతమాత్రము కూడ గలుగదు. అంతేకాక యుత్సాహము కూడా గలుగును. కష్టము గడచిపోయిన కొలఁది కాలమునకైన మన మందఱము కలిసి యాకష్టములఁగూర్చి ముచ్చటించుకొనుట మిగుల నానందదాయకమగును. ఎక్కట కష్టములు పడితిమో యాస్థలము చూచునప్పుడు పూర్వకష్టములలో మనము కనఁబఱచిన ధైర్యము భక్తి సాహనము నుగ్గడించుకొని యుత్సాహ మందుదుము. వెనుకటి కష్టము లలో మనము బేలగుండెతో నేడ్చినను వానిని స్మరించుకొనునప్పుడు మాత్రము కష్టములు మన ప్రయోజకత్వముచేతనే కడతేఱిన వని రవంత వెల్లడించుటకై కొన్ని రజ్జులు కొట్టుటకూడ సామాన్యమనుజ స్వభావమైయున్నది. పూర్వానుభూతము లగు నెంతభయంకర దుఃఖకరసన్నివేశములు స్మరించుకొనినప్పుడైనను గాసంతయదటు బొప్పపాటు కాలములోఁ దళుక్కుమని కొన్ని యత్యంతభీరు ప్రకృతులందుఁ గలుగునుగాని వెంటనే యాభయము దుఃఖము నడఁగిపోవును. అంతేగాని వడఁకుటవఱకుఁ గాని యేడ్చుటవఱకుఁగాని యెన్నఁడు రాదు. మన మందఱము బాగుగానుండి కష్టములఁ దరించినప్పుడే స్మృతి కాలమున నీనిర్విచారస్థితి.

అందుచేత సీత భార్గవునిఁ జూచి వడఁకిన దని చెప్పుట స్వభావ దూరము. అట్లే పటదర్శనమున సీతాశోకము, రాముని దుఃఖము, లక్ష్మణుని మనఃపరితాపము సహజములు కావని నామనవి.

కాని పటము దుఃఖమును గలుగఁజేయు సన్నివేశ మేదనఁగా: మనకత్యంత ప్రేమాస్పదులగువా రెవ్వరైనా మృతులైయుండ వారి విగ్రహదర్శనము మనకు సంతాపము కలిగించుము. ఇది కూడ కాలక్రమమునఁ దగ్గును. సీతాకళ్యాణమైనతరువాత నయోధ్యప్రవేశించు సందర్భమున లక్ష్మణుఁడు పటమునఁ బఠించుచున్నాఁడు.

లక్ష్మ:– ఇదిగో మన మయోధ్య ప్రశేశించితిమి.

రాము:– (కన్నీరు విడుచుచు) తలఁపునకు వచ్చినది. అక్కటా! తలఁపునకు వచ్చినది.

గీ. నాన్నగారు సజీవులై యున్నయప్పు
డమ్మ లిమ్ముగ సేమమ్ము నరయుచుండఁ
గ్రొత్తగా సాగివచ్చిన కూర్మి సతులఁ
గలసి మనమున్న యాదినములు చనెను నకట.

సంస్కృత శ్లోకము:–

జీవత్సు తాతపాదేషు, నూతనే దారసంగ్రహే
మాతృభిఃపాల్యమానానాం, తే హి నో దివసాగతాఃా.

భవభూతి ఈసన్నివేశమున నీ చిన్న శ్లోకముచే రాము నేడ్పించి యాతని పితృభ్రే
మను మిగులఁ జూకచక్యముతో లోకమున కింకొకసారి వెల్లడించి కృతార్థుఁడైనాఁడు. ఇంతేకా
కుటుంబాధికారియైన తండ్రి కుటుంబ సంరక్షణ చేయుచుండఁ గరుణాలవాలయైన తల్
సమస్తోపచారములు చేయుచుఁ గన్నబిడ్డలను గన్నులలోఁ బెట్టుకొని పెంచుకొనుచుండ
గ్రొత్తగాఁ గాపురమునకు వచ్చిన భార్యలతో నిర్విచారమగు నిత్యమహానందము నొంద
పడుచువారి సౌఖ్యాధిక్యమును, సర్వకాలములందలి, సర్వదేశములందలి, సర్వజాతులందల
సంసారముల కన్నిఁటికి నరిపోవునట్లు వర్ణించి దేవతలు తనపైఁ బుష్పవృష్టిఁ గురియ
దనంత కవితాప్రాగల్భ్య మీ కవి యనుష్టుపునం దగపరచినాఁడు. సెబాస్.

కాని మృతుఁడైన తండ్రిపటమును జూచిన విచారమైననుఁ గాలక్రమమునఁ దగ్గున
మనవిచేసియున్నాను. కొంతకాలమునకు మృతుల పటములు గూడ సంతోషదాయకము
గును. ఈ విగ్రహము మా తండ్రిగారిదని, యిది మా తల్లిగారిదని యితరులకుఁ బ్రత్యానక్తిగ
మనము చూపింతుము. అపసవ్యపుఁ జూవులు మాత్ర మధికకాలము తీసికొనక తప్పదు.

పటసందర్భమున భవభూతి చేసెనని నాకుఁ దోఁచినలోపము లేవో కనఁబఱచినాను
అవి యసహజములని యాతఁ డెఱుఁగఁడా యని మనము కఠినముగ మనలఁ బ్రశ్నించుకొ
దము. 'ఎఱుఁగడని యెట్లు నన్పుముగఁ జెప్పఁగలము.' ఎఱిఁగియుండియు నేల యట్ల
వ్రాసినాఁడు.

నాటకమునకు భావికథాసూచనము మహాభూషణము. ఈకవికి భావికథాసూచ
యందున్న వాంఛ యింత యంతకాదు. ప్రతిస్వల్పవిషయ మందులకే ఉపయోగించినట్ల
ప్రయత్నించును. ఈ కవికి రసపుష్టి కలుగఁజేయుటయం దభిమాన మసాధారణము. ఈక
యావేశ పూరితమైన హృదయము కలవాఁడనుట స్పష్టము. అట్టి యావేశసందర్భములందు
ప్రకృతిసూత్రములను గొంత యలక్ష్యము చేసినను జేయఁగల స్వతంత్రుఁడ
నిరంకుశుఁడు.

ఉత్తరరామచరిత్రము ప్రదర్శింపఁబడఁగ రెండుసారులు చూచితిని. రెండుసారుల
కూడ మొదటి యంకమేమో చూచువారికి విసుగు గలిగించినది. తరువాతి యంకమ
లఖండరసప్రవర్షణ సమర్థములై యున్నవి.

"కిమపి కిమపి మందం మందమాసత్తియోగా
దవిరళితకపోలం జల్పతోరక్రమేణ

అశిథలపరిరంభవ్యాప్తైకైకదోష్ణో
రవిదితగతయామా రాత్రి రేవ వ్యరంసీత్.''

అన్న శ్లోకము మాత్రమే నిల్చి మిగిల్చిన యాతని శ్లోకములన్నియు నేమాయచేనైన శాశ్వతముగ నంతరించిపోవుట సిద్ధించినను నీ కవిని శాశ్వతజీవునిఁ జేయుట కీశ్లోక మొక్కటియే చాలును. కరుణరసమందీతం డద్వితీయుఁడు. ఈతనిభావనాశక్తి యసాధారణము.

మల్లెపువ్వు చూరి-మధుపంబుతోఁబాడి
గంధవాహుతోడఁ గలసి వీచి
యబ్ధిలోన మునిఁగి యౌర్వవహ్నిని డాఁగి
నీటిబుగ్గయగుచు నింగి బ్రాఁకి
తోఁక చుక్కతోడ ఢీకొని శ్రమఁజెంది
సాంధ్య రాగనదిని-స్నానమాడి
తనువునిండ నింద్ర-ధనుసురంగులు పూసి
కైరవాప్తసుధను-గైపుఁజెంది
గోళగానరుతికి-మేళవింపుగఁ బాడి
పాడి యూడియూడి-పాడి సోలి
భావనామహత్వ-పటిమను బ్రహ్మమై
పోవుకవికి గోటిమ్రొక్కు లిడుదు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

22. మహాత్ముని తపఃపరిసమాప్తి

గాంధీగారు నిరశనవ్రతం పూని, పరిసమాప్తి చేశారని తెలిసిన తరవాత జంఘాలశాస్త్రి ఆ చర్యలో ప్రత్యేకత గురించి ప్రశంసిస్తూ ఉపన్యాసం చేశాడు.

వైష్ణవ సంప్రదాయం ప్రకారం దేవుడి కంటె భక్తుడే పూజ్యతరుడు. దేవభక్తుడు కావడం వల్ల పూజ్యుడైన మహాత్ముని ప్రశంస ఈరోజు జరుగుతోంది.

మూడడుగులున్నర వడుగు బలిచక్రవర్తి చూస్తుండగా, మూడడుగులని చెప్పి సృష్టినంతా ఆక్రమించినట్టే, రమారమి అయిదడుగులు పొడుగు కల మనిషి సర్వప్రపంచ మానవ హృదయాలను గాఢంగా ఆక్రమించుకున్నాడు. మహాత్ముడు ఈ ఒక్క జన్మానికే తరిస్తాడని చెప్పవచ్చు. ఆత్మపరిణామ క్రమంలో, అలనాటి విష్ణుభక్తులైన జయ విజయుల కంటె మహాత్ముడు అగ్రస్థానం ఆక్రమించుకోగలడు. మొదటి మహాత్ముల్ని మనం ఎరగము. ఇప్పటి మహాత్ముని కాలంలో జీవించడం వల్ల పుణ్యాత్ములం. ఆయన మనస్తత్వాన్ని చదివి, జన్మాన్ని సార్థకం చేసుకోండి. మనకీ, భగవంతుడికీ మధ్య మహాత్ముడు మజిలీగా వున్నాడు.

నాయనలారా! చదువులన్నీ కట్టిపెట్టండి. వాటివల్ల ఏం ప్రయోజనం లేదు. చదవదగిన పుస్తకం చదవండి. అది పర్ణకుటీరం లో వుంది. దైవప్రార్థన చేద్దాం అని జంఘాలశాస్త్రి అంటూండగా ఒక క్రైస్తవ మత గురువు లేని, గాంధీ గారి ఉపన్యాసం గురించి ప్రస్తావించి ఉపవాసం రహస్యంగానే తప్ప బహిరంగంగా చేయకూడదని జీసస్ చెప్పాడని చెప్పాడు. జంఘాలశాస్త్రి, జీసస్ దేశకాలాలకీ, మహాత్ముని దేశ కాలాలకీ తేడా వుందని చెప్పి, సభను తన ఒక్కడి ప్రార్థనతోనే ముగించవలసివచ్చింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

మహాత్ముఁడు మహోదారమగు తపస్సును నిర్విఘ్నముగఁ బరిసమాప్తి నొందించి ప్రపంచమున కానందము కలుగఁజేసినందుల కాలోకోత్తరపురుషునిఁ బ్రశంసించుఁ బరమేశ్వరుని ధ్యానించుటకంటె సార్థకమైనకృత్యము వేఱొండు లేదు. ఏదినమున హరికథా

కాలక్షేపమగునో యాదినము దినములన్నిటిలో నుత్తమమైనదని పెద్దలు నిర్వహించినారు. దేవునకు దేశభక్తునకు లేశమైన భేదము లేదు. వైష్ణవసంప్రదాయానుసారముగ దేవునికంటు దేవభక్తుడే పూజ్యతరుడు. దేవభక్తు డగుటవలన బూజ్యు డగుమహాత్ముని ప్రశంస యాదినమున జరుగచున్నది. కావున నీ దినము పవిత్రమైన దినము. ఈస్థలమునందు జరుగుచున్నది. కావున నిది పవిత్రమైన స్థలము.

అన్ని కాలములందు, నన్ని దేశములందు దేశభక్తులెందఱో యుండిరి. వారిలో ననేకులు సంసారముల రోసి, నివాసములఁ ద్యజించి యేగిరి. ఏగహ్వారమునందో యేచెట్టునీ డనో తపస్సుచేసికొని తాము తరించిన వారేకాని యితరులఁ దరింపఁజేసినవారు కారు. అట్టివా రెంతయుత్కృష్ట జీవులయ్యును వారుకూడ నొకవిధమగు స్వార్థపరులేకాని కేవల స్వార్థరహితులు కారు. శ్లో. ''యస్మి జీవతి జీవంతి బహువ స్సతు జీవితి'' అని కవి గాన మొనర్చినాడు. ఎవని జీవమువలన ననేకులు జీవింతురో వాఁడే జీవించినవాఁడని యాతఁడు చెప్పినాఁడు. అదియే నిజము. కాని దానికి మఱికొంత చేర్పవలసియున్నది. ఎవఁడు తరించుటవలన ననేకులు తరింతురో వాఁడే తరించినవాఁడు కాఁడా?

అందుచే మహాత్ముఁడు దేవభక్తుఁడేగాక, దేశభక్తుఁడు ప్రజాభక్తుఁడు ప్రపంచభక్తుఁడు. ఆతఁడు తమ శత్రువేమో యని భ్రాంతిపడుచున్న వారికిఁ గూడ భక్తుఁడు. వార్ధకమున నుపక్రమించిన ఘోరతపస్సు వలని ప్రమాదము లేకుండ వెలిబడిన భక్తసార్వభౌమునిఁ గూర్చి ప్రశంసించుచుండఁగా నిటనున్న గాలియే పవిత్రమగుచున్న దని చెప్పినప్పుడు మన లెక్కయేమి? ప్రపంచమున సాధారమణముగ నూటికిఁ దొంబదైదు గురు స్వార్థపరులు. మిగులువా రైదుగురు కూడ తరబడిగతరబడిగ స్వార్థరహితులే. కాని పరిపూర్ణస్వార్థరహి తులు కారు. సంపూర్ణస్వార్థసంహారకుఁడగువాఁడు లక్ష కొక్కఁ డుండునేమో? మహాత్ముఁ డట్టి సంపూర్ణ స్వార్థచ్ఛేదకుఁడు మాత్రమే కాక నంతకంటె నున్నతపదవి నధిష్ఠించి నాఁడు ఎట్లు? పరుల పాపపర్వతములను తలపై వైచుకొనలేదు? వారు పొందవలసిన పశ్చాత్తాపము లను తానే పొంది దహించిపోవుచున్నాఁడు. కాదా? వారిపాపప్రశాంతికి తానే ఘోరతప మొనర్చి శల్యావసిష్టుఁడు కాలేదా? వారి దోషము లన్నియుఁ దనవే యని త్రికరణశుద్ధిగా నమ్మి ప్రాయోపవేశ మొనర్చి ప్రాణత్యాగ మొనర్చుటకు సిద్ధపడినాడు. కాఁడా? వస్తుత్వము చేత, తత్త్వముచేత తనకును బరులకును భేదము లేదు లేదని ప్రత్యక్షముగ నాచరణయందు జూపిన యద్భుతవ్యక్తి వెనుకటి కాలములో లేఁడు. వెనుకటి సృష్టిలో లేఁడని చెప్పుట యతిశయోక్తి కానేరదు. ఉక్తికెంత యతిశయతయున్నదో యంతకంటె విశేషము చర్యలోఁ జూపించిన యలౌకిక చరిత్రుని పాదపద్మముల కతిశయోక్తి దిగదుడుపు కాదా?

నాయనలారా! ఎవ్వరో గొణిగికొనుచున్నారు. ఏమందురు? ఏసుక్రీస్తు లేఁడా యని యనుచున్నారా? నాయనలారా! నేను విస్మృతి పడలేదు. ఏసుక్రీస్తు భగవంతుని కొడుకు. అందుచే భగవదంశమున జనించినవాఁడు. మేరీకన్యకుఁబుట్టినప్పుడేయాతఁడు దేవాంశోద్భవుఁడని గ్రహింపదగినది కాదా? అట్టివాఁ డెట్టివాడైనా విశేషమేమి? ఆ విశేష మేదో మామహాత్మునిది. మనుజుఁడై పుట్టి, స్వయంకృషిచే, స్వప్రయోజనకతచే, సాధనసక్ర మముచే నెంతవాఁ డగుటకు సృష్టితత్త్వ మంగీకరించునో యంతవాఁడైనాఁడు. ఆతఁడు మొదట నాంగ్లేయ భాషాపండితుఁడే/. ఆంగ్లేయవేష ధారియే. తరువాత స్వదేశీయ

వస్త్రధారి యైనాఁడు. పిదప స్వదేశస్వాతంత్ర్యరక్షకుఁ డైనాఁడు. పిమ్మట నింద్రియ నిగ్రహుడై నాఁడు. దానిపై శమదమాదిసంపన్నుఁడైనాఁడు. అందుమీఁద లోకాద్భుతచరితుం డైనాఁడు. దానిపై లోకపవిత్రుఁడైనాఁడు. ఆతఁడు స్వరూపమున పాడుకరి కాఁడు. తూని కలో నూటరెండుపౌనుల కంటె హెచ్చినవాఁడుకాఁడు. అట్టిదుర్బల శరీరుండు శ్రీరంగప్ర ధానగోపురముపై నింక నూట రెండంతరువులు నైనయెడల నది యల్లిదిగియెదిగి పసిడికుండలతో భగవంతుని పాదములను స్పృశించినట్లుండునో యాతఁ డందఱు చూచుచుండఁగనే, చూచుచుండఁగనే యిట్టి యింత యాధ్యాత్మికౌన్నత్య మొందినాఁడు. అత్యాశ్చర్యకరము మూఁడడుగులున్నర వడుగు బలిచక్రవర్తి చూచుచుండఁగనే మూఁడడుగు లాక్రమించుకొందునని చెప్పి, సృష్టినంతయు నాక్రమించుకొనినట్లే రమారమి యైదడుగుల పొడుగుగల మనుజుఁడు సర్వ ప్రపంచజనహృదయములను గాఢముగ నాక్ర మించుకొనినాఁడు. ప్రపంచచరిత్రములో నీవిచిత్రమే క్రొత్తగఁ జేర్పవలసియున్నది.

జయవిజయులు శాప మొందినప్పుడు మూఁడుజన్మములలో భగవద్ద్వేషముతో తరింతురా? యేడుజన్మములలో భగవద్భక్తులో ధరించతురా? యని యడుగఁబడగ మూఁడుజన్మములలోఁదరింతుమనిరి. మూఁడు జన్మములకంటెఁ దక్కువకాలములో నెవ్వరు తరింపలేరు. ఆంగ్లేయవిగ్రహముగా నారంభించిన యీవ్యక్తియొక్క యిప్పటి యాధ్యాత్మికోత్కర్షత చూడఁగా మహాత్మాఁడీ యొక్క జన్మమునకే తరించునని చెప్పుఁదగి యున్నది. అట్లు జరుగునెడల నాత్మపరిణామక్రమమున జయవిజయుల కంటె నీఁత డగ్రస్థాన మాక్రమించుకొనఁగలఁడు.

అద్వైతమం దేకజీవవాదమని యొకటి యున్నది. ఇప్పుడు కనబడుచున్న శరీరములన్నిఁటిలోను జీవుఁడు లేఁడనియు, నేదో యొక్క శరీరమందు మాత్రమే జీవుఁడున్నాఁడనియు, నాతఁ డెప్పుడు తరించునో యప్పుడే మిగిలినవారందఱు తరింతుర నియు నీవాదమునకు ముఖ్యాభిప్రాయము. అట్టివాదము ననుసరించి సజీవుఁడగువాఁ డొక్క మహాత్మాఁడే యేమో! ఎవరు చెప్పఁగలరు? నేను గొంతకాలమునుండి మహాత్మునిఁగూర్చి వినుచున్నాను. ఆయన మాటలకుఁ జర్యలకు నాకుఁదెలిసిన యర్థమును గ్రహించుచు న్నాను. ఆయనమన స్సెట్లైనట్లు పరిణామము నొందుచున్నదో నాకున్న జ్ఞానలేశమునుబట్టి గ్రహించుచున్నాను. నేను మహాదేవుని కొక్కటి మహాత్మునకు రెండు నమస్కారము లర్పించి మనవి చేయున దేమనఁగా; నాయనతత్త్వము నాకెంతమాత్రము బోధము కాలేదు. ఆయన సన్నిధానవర్తు లెందఱో యున్నారు . వారికేమైన దెలిసినదేమో యనఁగ వా రావిషయమున మనకంటె ఘనులు కారని వినుచున్నాను. వారు తెలియనివారని నేను స్పష్టముగాఁ జెప్పఁజాలను. కాని తెలిసినవారు కారని స్పష్టముగాఁ జెప్పఁగలను. వర్ణాశ్రమధర్మము, నస్పృశ్యత మొదలగు మహావిషయములఁగూర్చి అందుకుఁదగిన మాటలేవో నేర్చుకొని మన ముపన్యాసనాటకము లాడుచున్నామా లేదా? మనము చెప్పుచున్న మాటలయర్థము మన కగుచున్నదా? అట్టివో మహాత్మునితత్త్వ మెట్లైఁయుఁగఁగలము?

ఈనడుమ నన్నుఁ జూచుట కొక నటోత్తముడు వచ్చినాఁడు. నడుమ నొకనాటక మాడితిమి. నాటకప్రదర్శనము బాగుగనే యున్నదనినారు. ఆ నాటకములో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వారి భార్యలతో వత్తురు. తుట్టతుద కెవ్వరిభార్యయొద్దకు వారు వెళ్లుట

తోతటస్థించినప్పుడు బ్రహ్మగారు పార్వతికొంగు బట్టుకొన్నాఁడు. మహాదేవయ్యా గారు మహాలక్ష్మమ్మబుజముపైఁ జేయివైచినాఁ''డని చెప్పినాఁడు. మహాత్ముని గూర్చి మనయం దఱి యజ్ఞాన మానటకుల యజ్ఞానముకంటె తక్కువది కాదు. నిశ్చయముగా మహాత్ముని తత్వము దుర్గ్రహమైనది. అది తెలిసికొనినయాతఁడు ప్రపంచమును దెలిసిన యాతఁడే.

(Aesop) ఈసప్ అనునాతఁడు మిట్టమధ్యాహ్నమునందు చేతిలో లాంటరును పట్టుకొని వీథులలోఁ దిరుగుచుండెను. ప్రభువువలెఁ బగటిదివిటీతో బయలుదేరితివేమని యెవ్వరో యడుగఁగా మనుష్యఁ డెవ్వడైన, నిజమైన మనుష్యునకొఱ కంత కష్టపడి వెదుకఁదగినదే. అతని ప్రయత్నమెంతయైనఁ గొనియాడఁదగును. ఆతని శ్రమకు మన మెన్నియైన ధన్యవాదము లీయవలసినదే. కాని యాతఁడు వెదకుచున్న స్థలమున్నదే యదియంత తగినది కాదేమో యని మాత్రమే సందేహము. పశ్చిమదిశను వదలి తూర్పుగా వచ్చినయెడల నాతని ప్రయత్న మనేకపర్యాయములు గృతార్థమైయుండెడిది. అట్టి ఈసప్ మాత్రమే కాదు. ఈ సృష్టియంతయు సంతోషింపఁదగినది. నిజమైన మనుజుఁడు తిరుగ భారతభూమియం దుద్భవించినాఁడు. ఊరక సంతోషించి యూరకొనకుఁడు. ఆయనను బఠింపుఁడు. The proper study of mankind is man శ్రద్ధగాఁబఠింపుఁడు. వెనుకటి మహాత్ములను మన మెఱుఁగము. ఇప్పటి మహాత్ముని కాలమున జీవించియుండుటచే పుణ్యాత్ములము. ఆయన మనస్తత్వమును జదివి జన్మమును సార్థపఱచుకొనుఁడు. ఒక్క సారి మనము భగవంతుని యను భవమును సంపాదించుకొనలేము. అది మనకసాధ్యము. మనకు భగవంతునికి నడుమ మహాత్ముఁడు మజలీగ నిల్చియున్నాఁడు. ఆయనను మనము శ్రమపడి తెలిసికొందము. ఆయనతత్వము నెఱిఁగినవెనుక నీశ్వరతత్వమును గ్రహించుట విశేషకష్టము కాదు. ద్వైతమతస్థులందఱు ముఖ్య ప్రాణమూర్తిమాధ్యస్థ్యమున దరింతుమని యనుకొనుచున్నారు. మహమ్మదీయు లందులకు మహమ్మదుగారిని నమ్మియున్నారు. క్రైస్తవమతస్థులందఱు జీసస్సును నమ్మియున్నారు. విశిష్టాద్వైతులు కూడ పురుషకారమును పూర్తిగ నమ్మినవారే. అటులే యిప్పుడు మహాత్ముఁ డామాధ్యస్థ్య కృత్యమును నిర్వహించు టకు భగవంతునిచే నాజ్ఞాపింపఁబడినట్లు తెలిసికొనవలసియున్నది.

''నాయనలారా! చదువులన్నియుఁ గట్టిపెట్టుఁడు. వానివలన నేమియు లాభము లేదు. చదువఁ దగినపుస్తక మున్నది. అదియే చదువుఁడు. ఆపుస్తకము పర్ణకుటీయందు భద్రముగనున్నది. దానిలోని యక్షరములు నక్షత్రములవలె నేదేశమునుండి చూచినను కనఁబడును. నాయనలారా! అదే చదువుఁడు. దైవప్రార్థన మొనర్త మందలములెండు'' అని నే నుపన్యసించుచుండఁగా నొక్క క్రైస్తవమతగురుఁడు లేచి యిట్లు పలికెను! ''నే నిప్పుడు లేచినది మీదైవప్రార్థనకొఱకు కాదు. గాందిగారొనర్చిన యుపవాసమును గూర్చి నేను గొన్నిమాటలు చెప్పవలసియున్నది. ఏసుక్రీస్తువారు దేవునికొడుకు ఆయన చెప్పినమాటలు దేవుడు చెప్పినమాటలే. బైబిల్ మాకు వేదసత్యము. ఏసుక్రీస్తు ఉపవాసముచేసినాఁడని యనేకుల యభిప్రాయమైయున్నది. ఆయన యట్లొన్నఁడు జేయలేదు. సలువదిదినములు రేయుంబవళ్లు భోజనము లేకుండ మాత్రముండినాఁడు. ఎందుచేత ననఁగా పాపాత్ముల నెట్లు పరిశుద్ధులను చేయుదునా యను మహాచింతచే భోజనమొనర్చుట కాయనకుఁ దీరికయే లేకపోయినది. అంతేకాని పాపప్రాయశ్చిత్తముగాగాని భగవంతుని యనుగ్రహముకొ

అకుగాని యాయన యుపవాసము చేసియుండలేదు. తాను పవిత్రాత్ముఁడగుటచే నట్లు చేయవలసిన యగత్యమును లేదు. కాని యుపవాసాచార మెప్పు డారంభమైనదో తెలియఁదగ నంత ప్రాచీనమై యున్నది. దేవుని కుమారుని కాలములో మతవిషయములైన దొంగతనము విశేషముగా నుండెను. నిజమైన భగవద్భక్తులు మిక్కిలి యరుదుగా నుండెడివారు. ధనముకొ ఱకో, యశముకొఱకో, ప్రజాగౌరవము కొఱకో, మతసంబంధమైన ప్రార్థనలు, దానములు, నుపవాసములు మొదలైనవి చేయుచుండెడివారు. ప్రజలను మోసపుచ్చుటకే తన్కర భక్తు లిట్లు చేయుచున్న యుపవాసాది దాంభికాచారములను క్రీస్తుగారు మిగుల గర్హించుచుండెడి వారు. దైవకార్యములను తుచ్ఛమైన యైహికలాభముకొఱకై యుపయోగించుకొనుచుండెడి వారు. లెక్క లేకుండ నుండిరి. Phairisees అను పెద్ద తెగవారంద ఱట్టివారే. ఇంత ననేకములైన యిట్టితెగలుండెడివి. వారికందఱి కేసుక్రీస్తువారు బోధించినదేమనఁగా మీకును భగవంతునికి మాత్రమే నంబంధమున్న మతవిషయక కర్మములన్నియు గూడ నెవ్వరికిఁ దెలియకుండ రహస్యముగఁ జేసికొనుఁడు. అందులో నుపవాసము రహస్యముగనే కాని బహిరంగముగ జరుపకూడదని యాయన యనేకస్థలములందు శాసించినాఁడు.''

ఇట్లు చెప్పి యాక్రైస్తవుం డూరకుండెను. అప్పుడు నేను లేచి యిట్లంటిని. నాయనలారా! క్రైస్తవమతబోధ మనయందు దయగలిగి యేసుక్రీస్తువార కాలమందలి దేశస్థితి, యుపవాసమును గూర్చి జీసస్సుగారి యభిప్రాయమును వారికిఁ దెలిసినంతమట్టు నకు విస్పష్టముగాఁ జెప్పినందులకుఁ గృతజ్ఞులమై యున్నాము. ఈమతగురుడు పరమశాం తుడు. ధారాళహృదయము గలవాఁడు. వారిమతమందుఁ బరిపూర్ణ విశ్వాసమున్నవాఁడు. ఎంతసేపు చెప్పినను నిరాహారతపము రహస్యముగాఁ జేయవలయునను జీసస్సుగారి యభి ప్రాయమనియే చెప్పినాఁడు. కాని మనమహాత్ముని యుపవాసబహిరంగతనుగూర్చి యొక్క యెత్తిపొడుపు పలుకైనఁ బలుకలేదు. కాని యట్టినూచన తప్పదు. అట్లనకున్నను ననినట్లే. దూదూ యని యెంతముద్దుగ ననినను వచ్చునది కుక్క యని గ్రహించుకొనలేమా? ఈమతగురుఁడు చెప్పినమాట లాలోచింది విమర్శింపదగినవి. దీనిని గూర్చి యిప్పుడు చెప్పఁబూనిన యెడల నొక గంటసే పగును. ఉపవాసమనగ నేమో, అది యెందులకు చేయవలయునో, పూర్వకాలమం దెవరెవరు చేసిరో, ఎట్టిఫలము లందిరో, ఏసుక్రీస్తుకాలమం దలి నాగరికత యెట్టిదో, సంఘస్థితి యెట్టిదో, ఉపవాసము రహస్యముగనే చేయవలసినదని యెందుల కాతఁడు జెప్పవలసియున్నది. ఇప్పుడు బోధించెనో యీయంశములన్నియు విపులముగ జెప్పవలసియున్నది. ఇప్పుడు కాదు గావున మైవారముల నెప్పుడో జెప్పెదను. మతగురుఁడు మాటలాడు చుండఁగనే యందఱు సభనుండి లేచిపోయినారు. దైవప్రార్థనఁ జేయుటకు నేనొక్కఁడనే యుంటిని.

బిళహరి- ఏక.

జయరామ- జయరామ- జయజానకీరామ
జయనర్వగుణధామ-జయసార్వభౌమా
జయశుభాకరనామ- జయనైరిభీమా. ''జయ''

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

23. తాజ్ మహలు

జంఘాలశాస్త్రి తాజ్‌మహల్ గురించి చమాలుడు నభలో చెప్పిన దాన్ని వివరిస్తున్నాడు.

తాజ్‌మహల్ని ఒకడు పాలరాతి స్వప్నం అన్నాడు. ఉత్తమమైన లలితకళా సృష్టిని నిశ్శబ్దంగా, నిశ్చలంగా పరిశీలించినప్పుడు కేవలం అలౌకిక మైన ఆనందం కలుగుతుంది – తప్పదు.

తాజ్ నాటకానికి కథానాయిక అర్జుమంద్ బానూబీగమ్ ముంతాజ్.

సౌందర్యం అనేది సమ్మేళనానికి సంబంధించిన 'సాముదాయిక ఫలం' తాంబూలం రక్తిమలాగ, పువ్వులదండ పరిమళం లాగ, స్వరాల సమ్మేళనం లాగ, మనస్సుల కలయిక లోంచి పుట్టే సామరస్యం లాగ, 'సౌందర్యం' అనేది కూడా ఎంచదగినది. ఈ కలయిక ఫలం, పటంలో కనబడదు.

అసలీ తాజ్‌మహల్ అవతరించడానికి కారణం – బెంగాల్‌లో రాజు, రాణి వ్యవహార సందర్భంగా సంచారం చేస్తుండగా ముంతాజ్‌కి ఒక చెడ్డ కల వచ్చింది. షాజహాన్ ఓదార్చాడు. కాని, ఆమె ఒక కోరిక కోరింది. నాకు కట్టే గోరీ లాంటిది ప్రపంచంలో ఎక్కడా వుండకూడదు. తీర్థయాత్ర లాగ జనం వచ్చి చూసేలాగ వుండాలని –

ఆమె ప్రసవించి, మరణించిన తరవాత ఏడాదికి, ఏడాదికి, ఈ 'మహలు' నిర్మాణం కొన్నేళ్లకి పూర్తయి ఆమె శరీరం, ఈ ప్రదేశంలో నిక్షేపించడం జరిగింది.

ఇలా, తాజ్‌మహల్ గురించి చాలా విశేషాలు ఉపన్యాసంలో చెప్పాడు. 1632లో నిర్మించబడిన ఈ మహలు 'పటా'న్ని సృష్టించిన వ్యక్తి 'ఉస్తాదు ఈసా' అనే పారశీకుడు.

బోయర్ యుద్ధ మహావీరుడు లార్డ్ రాబర్ట్స్–''హిందూదేశయాత్ర తాజ్ దర్శనం వల్ల సార్థకమౌతోంద''ని వ్రాశాడట.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నేను సభలోనికిఁ బోవునరికి జామాలుఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

చెవులారా వినఁదగినది. జూడఁదగినది. నోరారఁ గొనియాడదగినది. మనసార నానందింపఁదగినది. పాలరాతి పద్యప్రబంధము. అది లోకమున ఖ్యాతినొందినది. అంత కల్పనా వైదుష్యము కల్గి నది. అంత యభిరుచి ప్రకటమైనది, అంత నంస్థాన నమంజనమైనది, యంతయలంకారభూయిష్ఠమైనది, యంతభావోద్యోతకమైనది, యంత శాశ్వతమైనది మఱి యొకటి లేదని యఖిలనాగరకప్రపంచ మంగీకరించి యున్నది. దానిని జను లెన్ని యెన్ని ముద్దుమాటలఁ గొనియాడవలయునో యట్లుచేసియే యున్నారు. దీనిని బాలరాతిన్వప్న మని యొకఁడు స్తుతించినాఁడు. అల్లికల జిగిబిగల యూహల నేతచేతన్వప్నపటము నిర్మింపఁబడినట్లో చంద్రకిరణములకంటె నున్నితములై పాలరాతి దీఁగలతోడి పూవుల కాయల మహానుకుమారమైన ననన్నివేశమున నీ ''తాజ్'' నిర్మింపబడినదని యట్లు స్తుతించిన వాని యభిప్రాయ మై యుండునేమో! పండు వెన్నెలలో దీనిన గొంచెము దూరముననుండి చూచినప్పుడు దీని సౌందర్యము వర్ణశక్తివలె నవాఙ్మనసగోచరమై యుండును. పున్నమచం దమామ తెల్లనికాంతి యాభవనమును గ్రమ్మగ వెనుక జెరగిలఁబడుట కనువుగా నున్న యనేక నక్షత్రప్రభాజిగిజిగాయమాన మగునాకసముతో, వివిధరత్ననంకలితమగు నీభవన మట్టి యడఁగి మడఁగి లీనమైపోయి భూలోకమునుండి స్వర్గలోకమున కిదియే దారినుమా యని చూపించు నట్లుండును. న్యాయ మాలోచింపఁగా నుత్తమమయిన లలిత కళాకార్యము నిశ్శబ్దముగా, నిశ్చలముగా బరిశీలించినప్పుడు కేవలమౌకికమగు నాత్మానందము కలుగక తప్పదు.

'తాజ్' నాటకమునకు కథానాయిక ''అర్జమంద్ బానూబీగమ్ ముంతాజ్'' యను మహోమ్మదీయమానినీమణి. ఈమె షాజహాను భార్య. ఈమెదని చెప్పఁబడిన రూపమును జూచితిని. పటమలో నన్నియు బాగుగనేయుండును. ప్రత్యక్షముగఁ జూచినప్పుడే సౌందర్య నిర్ధారణ కెక్కువ యవకాశము కలుగును. కుక్కగొడుగు ఛాయావటము మహాసౌందర్య ముగా నుండును. అవయవములకూర్పులో నిర్దుష్టత, గమనికయే సౌందర్యమునకుఁ బ్రధానములైనవి. కావు. సౌందర్యమునది నమ్మేళనము యొక్క సాముదాయక ఫలము. ఒక స్త్రీకిఁ గన్ను సోగగా, విశాలముగా, బాగుగనే యుండును. ముక్కు ప్రత్యేకముగాఁ బరీక్షించిన యెడల నూటిగాఁ దగుమాత్రమైన యెత్తుగాఁ జివర రవంత మొనగలవంపు కలిగి నుందరముగనే యుండును. గడ్డమునట్టునకుఁ బ్రత్యేకముగా నిదానించినయెడల నదియు యన్నియుఁ గలిపి చూచిన యెడల నది యేమి కర్మమోగాని తీర్థమునకుఁ దీర్థము, ప్రసాదమునకుఁ బ్రసాదముగను నుండును. కళకట్టనిదే కంటిసోగతనముతో ముక్కు నూటితనము కలసి గడ్డపు గుండ్రతనముతో మేళవించిగప్పుమని, యనిర్వచనీయమైన కాంతి పుట్టినప్పుడదు కదా సౌందర్యము! తాంబూలరక్తి యెట్టిదో, ప్రసవమాలాపరిమళ మెట్టిదో, స్వరనంఘాతమాధుర్య మెట్టిదో, మనస్సుల కలయికవలన సామరస్య మెట్టిదో సౌందర్య మట్టిది. ఈకలయిక ఫలము పటములోఁ గనఁబడదు. కన్నుల నింద్రజాలమున నైచి మనస్సున కూపిరి నలుపకుండ తలపులిమి స్వాధీనముచేసికొను కాంతా శరీరవర్ణసౌభా గ్యము పటములో రానేరదు.

ఆ.వె. సొగసులన్ని మించి సొగసులకోటీర
మైనతళుకు, తళుకు లోనితళుకు
మొలకకులుకు లొలుకు కలకల కలదందు
నాదుదాని మొగమె యాదు మొగము.

మొత్తముమీఁద 'ముంతాజ్' సౌందర్యవతి యని చెప్పకతప్పదు. ఆమెయెడల భర్త కత్యంతానురాగ మని యెంత చెప్పినను సరిపోదు. తా నెక్కడకుఁ బోయినను, భార్య నొక్కదినమైన వదలకుండఁ గూడఁ దీసి కొనిపోవువాఁడు. వంగదేశమునందుఁ గాఁబోలు వారు వ్యవహార సందర్భమున సంచారము చేయుచుండగా నొక్కరాత్రి యామె నిద్ర నుండి లేచి గడగడ వడకుచు నేడువనారంభించెను. ప్రక్కనున్న భర్త యదరిపడి లేచి యేమి యేమని గ్రుచ్చి(గ్రుచ్చి కౌఁగలించుకొనుచు గ్రుచ్చి గ్రుచ్చి యడిగెను. అప్పుడామె పూర్ణగర్భవతియై యుండెను. నాకొక్క దుస్వప్నము కలిగినది. నే నింక జీవింపనని యామె విలపించెను. భర్త యామె నోదార్చుట కెన్ని పాటులైనఁ బడెను. ఇట్లొక్కగంట జరిగిన పిమ్మట నామె రవంత తెప్పిరిలి భర్తతో నిట్లు పలికెను. ''నాశరీరనిక్షేపమునకై నీవు కట్టబోవు 'గోరీ' యంత విలువకలది, అంత చక్కనిది ప్రపంచమున మఱియొక్కటి యుండఁగోడదు. తీర్థయాత్ర సేవించునట్లు నా గోరీని జూచుటకై ప్రపంచమున మారుమూలల నున్నవారైన వచ్చునట్లుండవలయును. ఏమి? ఏమందువు'' ''అమాట యిప్పుడెందుల'' కని భర్త యామెను మందలించెను. నీవట్లు చేసెదనని వాగ్దానమిచ్చినఁ గాని నా యాత్మకు శాంతి యుండదని యామె పట్టుదలతోఁ బ్రత్యుత్తర మీయఁగా నట్లేయని భర్త మాటనిచ్చెను.

అటుతరువాతఁ ద్వరలోనే యామె ప్రసవించి, మరణించెను. ఆమె కళేబరము నొకభద్రమైన గృహమందుఁ గాపాడి, తుదకుఁ గొన్ని సంవత్సరములయిన పిమ్మట నీ భవనమును బూర్తిచేయించి దాని నామె భర్త నిక్షేప మొనర్చెను.

దీనికి చాల రాతిపలక లెక్కడనుండి వచ్చినవో, యెంతకాలము దీనిపని చేసినారో, యెంతసొమ్ము వ్యయమయ్యెనో యను నంశములు విచారణీయములు కావు. ప్రతిమనుజునకుఁ దాను శాశ్వతముగా నుండవలయుననున్న వాంఛసహజము. తనతత్త్వము తానెఱిగిన మనుజునకుఁ దాను శాశ్వతుఁడనియే తెలియును. శాశ్వతుఁడను కావలయునని కోరుకొన నక్కఱలేదు. కాని మనుజసామాన్యుల కట్టి పరమార్థజ్ఞానముండదు. మనపేరు భూమపై నెంతకాలముండునో అంతకాలము మనకు స్వర్గలోకసుఖ ముండునని మాత్రమే వారు నమ్ముదురు. ఈనమ్మకము హిందువులలో నెట్లున్నదో మహమ్మదీయులలోఁగూడ నట్లేయున్నదనుకొందును. అందుచేత తమపేరు మీదుగా నుండఁదగిన స్థిరమైనపనులను జనులు తఱచుగఁ జేయుచుందురు.

ఈమహమ్మదీయవనిత సహజమైన యీవాంఛచేతనే యింత కోరిక కోరెను. భార్యానురాగముచేతనే భర్త యిందుల కంగీకరించి నాఁడు. భార్యానురాగమేమి? శత్రువులయందలి క్రోధమేమి? సంసారచర్యలలో నుపయోగపడుచున్న అన్ని రసములు గూడ మహోపకారకృత్యములను జేయించినవి. చేయించుచున్నవి. ఆడుదానియందలి యనురాగము తాజ్ యంత లోకోత్తరమైన కృత్యమునకుఁ గారణమైనది. శత్రువులపైని క్రోధము చీనాయంతటి మహాదేశమునకుఁ జుట్టుగోడను కట్టించినది. ఇటులెన్ని చెప్పవలెను? క్రోధాదులను సంహరింపవలసినదని మనపెద్దలు శాసించిరి. వారిమాట కాదనగలవా రెవరు? అయినను ప్రపంచము వానిచేతనే సుఖవంతమగుచున్న దని జెప్పవలసి వచ్చుచున్నది.

కాని ప్రాపంచికసుఖమే పరమార్థము కాక పోవుటచే నట్లు పెద్దలు నిర్వచించిరని యనుకొనవలసియున్నది.

సౌఖ్యమును రోసి, సంసారమును త్యజించి, ప్రాపంచిక సుఖమును వదలుకొని యే కొండగుహలనో, యేనిర్ఝరతీరముననో తపమొనర్చి తానొక్కఁడుమాత్రమే తరించి యద్వ్యానందము నొందుట కంటే జనుడు మనుజులలోఁ దిరుగుచు వారిని గష్టములనుండి యుద్ధరించుచు వారి సుఖసాధనము లభివృద్ధిపఱచుచు స్వార్థపరిత్యాగియై వారిని సేవించుచు తనువు కృతార్థము జేసికొని తరించుటయే విశేషము కాదా? తానొక్కఁడు తరించుటయే పరమార్థమగునెడల గురుధిక్కారపాపమున కొడిగట్టి గోపురమెక్కి తిరుమంత్రార్థమును త్రిదండి శిఖామణి ప్రజల కేల యుపదేశించి యుండును. ప్రేమమతమును బుద్ధుఁ డేల ప్రపంచమున వెదజల్లియుండును. ఇతరులను దరింపఁజేయుచు తాను దరించువాడు భగవంతుని ప్రతినిధి యనకతప్పదు. ప్రజాపాపనివారణమునకై ప్రాణము లర్పించిన పవిత్రాత్ముఁడు భగవంతునికొడుకు కాక మరెవ్వఁడు.

నాయనలారా! ప్రధానవిషయమునువదలితిని మారుదారిని బోవుచున్నాను. ఈ దినమున దేహమునకు మనస్సునకుఁగూడ నస్వస్థతగా నున్నది. నాయనలారా! ఒక్క మనవి. నేను చెప్పఁబోవునది శ్రద్ధగా వినుడు.

ఇదిగో ఈ యెఱ్ఱరాల ముఖాద్వారపుమేడక్రింద నిలువఁబడి ''తాజ్‌మహలు'' వంకజూతము. తెల్లనిగుమ్మటమువలె శారదాభ్రసంచయమువలె నగపడుచున్న యారజత గిరి శకలమే దర్శనీయమైన ''తాజ్‌మహలు''. ఇక్కడ నుండియే యొక్క వింతసంగతి కనిపెట్టెదను. తాజ్‌మహలు మనకిక్కడనుండి రెండు ఫర్లాంగుల దూరములో నున్నది. దాని నిక్కడనుంచి చూచు మనకది యనలు భవనముకంటెఁ జిన్నదిగాఁ గనఁ బడక తప్పదు కదా! ఎంతచిన్నదిగాఁ గనఁబడుచున్నదనఁగాఁ దాని చిన్న పరిమాణముతో నది మనయొద్దకు వచ్చునెడల నది యీ మేడలోనికి సులభముగాఁ బ్రవేశింపదగినట్లున్నది. అత్యంతము సున్నితమగు దూరదృష్టిసంబంధమైన పరిమాణజ్ఞానముతోడ నీ సింహద్వారము సృష్టింప బడినది.

మనమింక ముందునకుఁ బోయెదము. దారిలో నీప్రక్కనా ప్రక్కఁ జక్కనితోట యున్నది. ఎదుటి మహాదర్శనము ముం దీతోటవంక జూచువాఁడెవ్వడు. ఇంకొక్క యద్భుత సన్నివేశమిక్కడ కనబడుచున్నది. మనము తాజ్‌మహలు వద్దకు వెళ్లుచుండగా నది మనవద్దకు వచ్చుచున్నట్లగుపడుచున్నది. ఇది మాయయో, కనుకట్టో తెలియదు. ఆభవన సంబంధమైన సౌందర్యశక్తిమన నింత దూరమున నుండగనే మన మన స్సానందవశ మగునట్లు క్రమ్మివేయుటచేత మనము కదలకుండనుంటిమనియు, నాభవనమే మనయొ ద్దకు వచ్చుచున్నదనియు భ్రాంతి కలుగుచున్నదేమో. అత్యంతసౌందర్యవంతమైన వస్తువును జూచునప్పుడు భ్రమయేమి, నిశ్చేష్టతయేమి, యస్వాధీన మనస్కతయేమి, గలుగఁదగని వికారమేదైనా నుండునా? పార్థసారథిస్వామి దర్శనమునకు బోవు యాత్రికుడు ప్రాకారము వెలుపల నింకనుండగనే పరమేశ్వరుని పవిత్రాతాశక్తి యాతని యొద్దకుపోయి పాపసంకులమైన యతని మనస్సునకు బరిశుద్ధినిచ్చి మఱిలోనికి దీసికొనిపోవును.

ఇప్పుడు తాజ్ భవనపు మెట్లెక్కుచున్నాము. ఈమెట్లమీద మన శరీరము మాత్రమే యడుగడుగునకుఁ బైకి లేఁచుచున్నదా? కాదు. మనస్సు కూడ నట్లే లేఁచుచున్నది. తాజ్ కెదుట నిలువఁబడి నాము. ఎదుటివసారాకున్న పాలరాతితడకలమీది పనివానితనము ముందు చూడగూడదా? ఊహఁ లోనికి బోయినదాక నొక్కటే తొందర. రెండు పాలరాతి గోరీలు రవంతయెత్తయిన పాలరాతి తిన్నెపై నున్నవి. ఇవి నిజమైన గోరీలు కావు. వీనికి దిగువ క్రింది యంతస్థులో భూమిలో నిజమైన గోరీలు కావు. ఈగోరీలే భార్యభర్త లిరువురవి. డాబామీద గోరీలు జవాబుగోరీలు. వీనికిఁగూడ నాల్గుపైపులను నాల్గు పాలరాతితడకలున్నవి. పైని పెద్దగుమ్మ్చియున్నది. ఎక్కడ చూచిన పాలరాతి తలతల. రత్నముల మిలమిల. పచ్చరాలు, నెఱ్ఱరాలు, నీలపురాలు, నాకుపచ్చరాలు, పాలరాతి పూఁదీఁగల చిత్రవిచిత్రపుఁ బనులపై వరునలుగాను, నడ్డుదిడ్డముగాను, తోరణములుగాను, పడుగుపేకలుగాను, అయి మూలవాటముగానుఁ జెక్కబడియున్నవి. నాయనలారా! చూచి యాసౌందర్య మనుభవింప దగినదే కాని చెప్పదగినది కాదు.

ఇది 1932 లో నిర్మింపబడినది. వీనిని మనస్సులో గల్పించుకొని పటము సృష్టించిన యాతఁడు ''ఉస్తాదు-ఈసా'' యను పారశీకుఁడు Austen De Bordeany అను ఫ్రెంచియాతఁడు దీనినిఁ గల్పించెనని చెప్పుదురు. కాని యది సత్యము కాదు.

కాని నాల్గుపైపులను నాల్గు పాలరాతిస్తంభము లున్నవేల? సముద్రతీరమందలి దీపగృహమువాదిరిగా నున్నవి. అవి యెట్లున్న సరే వాని యాకృతిలో మనకుఁ దగవులేదు. కాని యవి యక్కడ నేల యున్నవి. ఈ ప్రశ్నమున కుత్తరము చెప్పువారెవ్వరు? తాజ్ భవనమునకు నాల్గుపైపుల నాల్గుగుమ్మ్చి లేలయుండవలయును. అందుకై ఈ స్తంభములు గూడ నున్నవని మీకు న న్నదిక్షేపింతురా? నాల్గు క్రిందనున్నవి. కనుక గదిక్కొక్కటి చొప్పున నాల్గుగుమ్మ్చిలు కట్టవలసివచ్చినది. అవి భవనములోని భాగములే కావా? తాజ్ పాడుకాకుండ నొక్క గుమ్మ్చియైన తీయఁగలమా? వెలుపలనున్న ఈ స్తంభములట్లా? వానితో భవనముతో నేమి సంబంధమున్నది? అవి తీసిపారవై చినవైన తాజ్ సౌందర్యము లేశమైనా జంకునా?

ఉన్న ప్రయోజనము లేదయ్యెను. లేకున్న నష్టములేదయ్యెను. అటులయిన నుండనేల? మీరిండ్లు కట్టుకొనుచున్నారు కదా! ఇల్లు పూర్తియైన పిదప నింటికి రవంతదూర ముగ నాల్గునైపుల నాలుగు స్తంభములను ప్రాతి యూరకుండుటకు మీమనస్సొప్పుడైనఁ బోయినదా? అట్లొవఁడైనఁ జేసియుండినయెడల పెద్దలెవరైనా నధిక్షేపింపరా? కాకులు గ్రద్దలు పాడుచేయునేమో, పిడుగులవలని యుపద్రవ మేమికలుగునో యని తాజ్‌పై నొక పెద్ద గుమ్మ్చికట్టుటకు నాల్గునైపులా నాల్గు స్తంభములు కట్టఁబడినవా? అట్లేయగునెడల ప్రధానభవ నముతో నీస్తంభములకు సంబంధమున్నది. అప్పుడు స్తంభముల కర్థమున్నది. కాని యందు కొఅకే యని చెప్పగలిగినవాఁ డెవ్వడు. పిడుగుతో పైగుమ్మ్చి పగులు నప్పుడు లోని దాగునా? గదాఘాతమును తలపైఁ జుట్టుకొన్న సేలు వాఁపఁగలదా?

కవులు దీనిని ప్రబంధమనలేదా? గాయకులు దీనిని గీతమనలేదా? చిత్రవిలేఖరులు దీనిని జిత్రపట మనలేదా? శిల్పకులు దీనిని కళానిలయమనలేదా? కవితా, గానము, చిత్రలేఖనము, శిల్పము నను నాల్గుకళలు గూడ దీనిని సేవించుచున్నవని యీ స్తంభముల

కర్థము మనము చెప్పఁగూడదా? దీనిని జిత్రపట మన్న వారెవరో నాకుఁ దెలియదు. శిల్పకళావైచిత్ర్యమునకు ఫలమైన యీ భవనమును శిల్పకళ కూడ సేవించుచున్నదనుట తప్పుకాదా? అందుచేత నీ స్తంభము లెందుకున్నవో చెప్పలేము. ఈసాగారు మొదట వ్రాసినపటమందు నివియుండెనో లేదో! ఉండునని నిశ్చయముగాఁ జెప్పలేము. ఉండినయె డల వానికేదో పరమార్థ ముండితీరవలయును. తెలియ రాని విషయమును గూర్చి యీ ప్రయత్నమెందులకు?

Lord Roberts అనునాతడు **Boer** యుద్ధమున వీరాగ్రేసరుడని మీరు వినియు న్నారు. అతఁడు నలువదియొక్క సంవత్సరములు హిందూ దేశమం దుండెను. అతఁడు తన గ్రంథమున నిట్లు వ్రాసినాడు. ''కవిత్వమువలనఁగాని, చిత్రలేఖనమువలనఁగాని, యెంత భావనాధార్ఢ్య మున్నవానికైనా నీ విచిత్రకల్పన యొక్క స్వచ్ఛత యెట్టిదో, నర్వజన సంతోషప్రధాన ప్రతిభ యెట్టిదో, రవ్వంతయైన తెలియజేయుటకు సాధ్యము కాదు. హిందూదేశయాత్ర తాజ్ దర్శనమువలన సార్థకమగు చున్నదని తాజ్ ను గూర్చి వ్రాసినాడు

పండు వెన్నెలలో నీభవన మత్యంత శోభాయుక్తముగ నుండునని పెద్దలవలన విని రాత్రికూడ నటకుఁ బోయి కూర్చుంటిని. రవ్వంత సేపటి కింటికి వచ్చి నిద్రపోయితిని. ఒక చిత్రమయిన కల వచ్చినది. దాని వైచిత్ర్య మింతింతనరాదు. దానిని పైవార మెప్పుడైనా జెప్పెదను.

''ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః''

24. అత్యద్భుత స్వప్నము

తాజ్‌మహల్ చూసిననాటి రాత్రి వచ్చిన కలను జంఘాలశాస్త్రి చెప్పుతున్నాడు.

షాజహాన్, ముమ్‌తాజ్ కలిసి అంతఃపురంలో వుండగా ఒక బంగారు మువ్వలాంటి ఒక స్త్రీ మేలి ముసుగు వేసుకుని అక్కడికి వచ్చింది. ముమ్‌తాజ్ ఆమె ఎవరని, షాజహాన్‌ను ఎక్కడీసింది. ఆమెను తాను వివాహమాడినట్లు, చక్రవర్తి నెమ్మదిగా వెల్లడించాడు. ముమ్‌తాజ్ వెంటనే కోపాన్ని వెనక్కినెట్టి ఆమెను 'చెల్లెలి'గా మన్నించింది. ఆ స్త్రీ పేరు కిన్నెత్.

చక్రవర్తి ఆస్త్రీ, ఆస్త్రీ అంతఃపురానికి వెళ్ళాక, ముమ్‌తాజ్ తన అసూయ వెళ్లగక్కింది. కిన్నెత్‌ను అంతం చెయ్యడానికి పెద్దకుట్ర పన్నింది. ఈ కుట్రలో రోషనార కూడా ప్రముఖపాత్ర వహించింది.

కిన్నెత్, చక్రవర్తి కలిసి వక్కపై దిండు మీద ఒక లేఖ చక్రవర్తి కంటపడింది. ఆ లేఖను చక్రవర్తి చదివిన క్షణంలో కిన్నెత్ లోపలకు వెళ్లింది.

ఆ లేఖ సారాంశం ఏమంటే, కిన్నెత్ కులట అని – ఆ అంతఃపురంలో వున్న యాకుతీ స్త్రీ కాదని పురుషుడని కిన్నెత్ ప్రియుడని –

చక్రవర్తికి దారుణంగా కోపం వచ్చి కిన్నెత్‌ను చంపివేద్దామనుకున్నాడు గాని, నిగ్రహించుకుని, కిన్నెత్‌నే నిజం చెప్పమని అడిగాడు. ఆమె తన శీలం నిప్పువంటిదని చెప్పింది. యాకుతీ చెప్పిన సాక్ష్యం వల్ల తన కుటుంబం వాళ్లు కిన్నత్‌కు ఎంత వ్యతిరేకంగా వున్నారో తెలిసింది. చక్రవర్తి, కిన్నెత్ శీలవతేనని నమ్మిన అనంతరం, ఆమె అక్కడి కక్కడే అల్లాను తలుచుకుని తల వగలుకొట్టుకొని చనిపోయింది. షాజహాన్ మనస్సు కలిగిపోయింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

తాజ్‌మహలు చూచినరాత్రి నాకుఁ గలిగిన స్వప్నమును జెప్పెదనని క్రిందటిసారి చెప్పితిని. ఇప్పుడ దానిని గూర్చి చెప్పెదను. స్వప్నమిట్లుండెను.

షాజహాన్ చక్రవర్తి మమ్తాజ్‌ను బతిమాలు కొనుచున్నాఁడు. మూఁటికంటె నెక్కువ పనికిరాదని యామె యనుచున్నది. ఆసెలవును బొంది ముద్దు పెట్టుకొనుట కాతఁడుపక్రమించినాఁడు, ఏక్ దో. ఏక్‌దో. ఔర్ ఏక్. ఔర్ దో. ఫిర్ ఏక్. ఫిర్ దో దోయనుచు మూడన్న అంకె నోటి వెంటఁ బలుకకుండ మూఁడువందలముద్దులు టపాకచ్చే రిలో ముద్రల వలె నామెమాతిపై పెడిపెడి ముద్రించినాడు. అన్ని ముద్దులు పెట్టుకొనుట కాచక్రవర్తి కెంతప్రేమయో. ఇన్ని మూతినొక్కు లనుభవించుట కాయమ్మ కెంతయోపికయో యని తెల్లబోయితిని. మూడుకంటె నెక్కువ పనికిరాదన్నప్పుడే యంతకుంభవృష్టి కురిపిం చిన యయ్యవారు నీయిష్టము వచ్చినన్ని పెట్టుకొనవచ్చునని చెప్పి, ''సర్వదుంబాల'' చీటి నిచ్చినయెడల పుష్కలావర్తకములు తెగి పడి జలప్రళయము చేయునట్లు ముద్దుపెట్టుకొ నుచు గాఁబోలు నని ననుకొంటిమి.

ఇంతలో బంగారు శలాకవంటి యొక చక్కని కాంత యెచ్చటి నుండియో గాని యచ్చటకు మేలిముసుఁగుతో వచ్చెను. ''నీవెవతెవు? ఇట కేలవచ్చితివి'' అని ముమ్తాజ్ ఆమెను గద్దించెను. ''ప్రియురాలా! ఆమెను బెదరగొట్టకుము నిన్నుఁ జూచుటకే గడగడలా డుచున్నది. నీవు న న్నేలినట్లే యామెనుగూడ నేలికొనుము. నీకు సర్వతా విధేయురాలు'' అని చక్రవర్తి మమ్తాజ్‌తో క్రొత్తయువతిని గూర్చి చెప్పెను. ''ప్రాణనాయకా! నీవు చెప్పిన మాటలలో నొక యక్షరమైన నాకుఁ దెలియలేదు. ఆమె యెవతె? ఇక్కడ కెందులకు వచ్చినది? నా యంతఃపురములోనికి నాసెలవులేకుండ నచ్చట కామెకేమి యధికార మున్న'' దని ముంతాజ్ తీవ్రపడెను. వారి కిట్లు సంభాషణ జరిగెను.

ష:– ప్రాణప్రియా! నీదర్శన మామెకు లభింపఁజేసి నిన్నామెపై సర్వాధికారిణిగ జేయుటకు నేనే యామె నిక్కడకు రమ్మంటిని.

ముంతాజ్:– ఏమీ! నేను లేనప్పుడు నీ వీపడుచుకుర్రదానితో నేల మాటలాడితివి? మీకు మాటలు జరుగుటా! అది నీకు నచ్చుటా! నీవు దానిపై నిష్టపడుటా! దానిని నాయంతఃపురములోనికి రమ్మని నీవు రహస్యపుమాట చెప్పుటా! అది యట్లిచ్చటికి వచ్చుటా! నాయెదుటచే నీవు దానిచర్యను సమర్థించుటా! అని నాకుఁ గూడ నీకైనయట్లే యిష్టపదార్థమగుటకు నీవు నన్ను బతిమాలుటా! నా కనుభ్రూమి యింతచర్య జరిగించితివా? దానిని నా యంతఃపురములోని కేల రమ్మంటివి? ఈయంతఃపురమునుండి నన్ను వెడలఁ గొట్టి యామె నిచ్చట సింగారింపఁ దలచితివా? నేను లేచిపోవుదును.

(ముంతాజ్ లేచి పోఁబోవును.)

ష:– (ఆమెకాళ్లపైఁబడి) నన్ను క్షమింపుము. నావలనఁ దప్పు గలిగినది. మించిపోయి నదాని కేమిచేయఁగలము? నే నామె నాకస్మికముగఁ బైయూరఁ గాంచి ''నాయొద్దకు వచ్చునెడలఁ బదివేల అషరఫీ లిచ్చెద''నని వార్త నంపితిని. ''ఊరివారిసొత్తైన తొత్తు ననుకొంటివా? పదివేల అషరఫీ లిచ్చిననైన నేను నీ మొగమువంకఁ జూతునా? నాకు నాల్గషరఫీల యలంకారములైన సీయకుండ నన్ను వివాహము చేసికొనునెడల నా కంగీకా రము'' అని యామె తిరుగ వార్త నంపెను.

ముంతాజ్:– ఆ! ఆ! అంతవఱకు వచ్చినది? వివాహము చేసికొంటివా! చేసికొంటివా!

షాజ:– క్షమింపుము. క్షమింపుము. చేసికొంటిని.

ముంతాజ్:– ఐనది కదా. నీ వుంచుకొన్నదానిని నాయొద్దకు దెచ్చితివేమో యని నే నంత తీవరించితిని. ఇకనేమి! నీయెడల నామెకును నాకుఁ గూడ, సమానమైన హక్కేకదా? ప్రాణనాథా! లెమ్ము! మనశాస్త్ర మంగీకరించినపనిని చేసితిని. కాని నీవు తప్పుచేయలేదే? చెల్లెలా? ఇటు రమ్ము. (కౌఁగిలించుకొనును.) మన మొక్కఁతల్లిబిడ్డల వలెఁ గాలక్షేపము చేయుదము. నీ యిష్టమువచ్చినప్పుడు నీ విక్కడకు రావచ్చును. నాకు వీలగునెడల నేను నీ యంతఃపురమునకు వత్తును. ప్రాణనాథా! నీవు నీ క్రొత్తపెండ్లికూఁతును గౌఁగిలించియుండఁగాఁ జూచియుండలేదు. కావున నా చెల్లెలిని నాయెదుటఁ గౌఁగలించు కొనుము.

షా:– అక్క చెల్లెండ్ర నిద్దరి నొక్కసారి కౌఁగలించుకొనుటకు, రెండు బాహువులుండ వేరువేరుగఁ గౌఁగలించుకొనుట తప్పుకాదా? (ఇద్దరను గౌఁగలించును.)

ఇంతలో లోనిగదిలోనుండి యొక రవంత కీచుగొంతుకధ్వని యయ్యెను.

ముంతాజ్:– రోషనార్ నన్ను బిలుచుచున్నది. నేను లోనికిఁ బోవుదును. చెల్లెలికిఁ బ్రశస్తమైన అంతఃపుర మీయక తప్పదు. నోటివెంట మాటయైన నెఱుఁగని ముద్దరాలు. ఆమెను జూడ నాకు జాలియగుచున్నది. మీవంటి ముసలితొక్కుఁదొరుకుట యామె దురదృష్టము. కాని పడుచుప్రాయపు పసలచే బెసఁగకుండ గసిమసపుబంగారు బొమ్మ ప్రక్కలోని కమరుట నీ మహాదృష్టమే కదా? అఁడుదానికర్మ మెట్లయిన నరే మగవాఁడు సుఖపడినఁ జాలును కదా. (షాజహాను లెంపలైఁ బరిహాసముగఁ గొట్టును. లోనికిఁ బోవుదును.)

షాజ:– మే మిక్కడ నెందులకు? మేముగూడఁ బోయెదము. (షాజహాను, క్రొత్త పెండ్లికూఁతురు పోవుదురు.)

ముంతా:– ఇద్దరు గూడఁ బోవుదురా? నే నీముండను దెల్లవాఱకుండఁ బరాభవించి చంపింపనా? అంతేకాని వీరిని గాఁపురముచేయ నిచ్చెదనా? ఈ పెండ్లిసంగతి నాకు పదిహేనురోజుల క్రిందటనే తెలిసినది. రోషనార్ యీసరికి తగిన మాయపన్నియే యుండును. రోషనార్! (అని పిలుచును) (రోషనార్ ప్రవేశించి) మీకు జరిగిన సంభాషణ వింటిని. ఈమె నీరాత్రి చంపించుట కేర్పాటుచేయించితిని. నీవు విచారము వదలుము. రమ్ము లోనికిఁ బోవుదము. సంగతులన్నియు వివరముగాఁ జెప్పెదను.

ముంతాజ్:– క్షాని నాపేరు మాత్రము పైకి రాఁగూడదు సుమా.

రోష:– రానేరదు. వచ్చినను మరేమియుఁ దొందరలేదు. లోనికి రమ్ము. (ఇద్దరు పోవుదురు.)

అంతలో నాస్థలమంతయు గిరగిరఁ దిరిగిన ట్లయ్యెను. నాకుఁ గన్నులు స్వప్నము లోనే చీఁకటులు పడినవి. అంతలో షాజహాను తన నూతనభార్యచెఱఁగుఁ బట్టుకొని లాగుచున్నాఁడు. ఈమెపేరు కిన్నెత్.

కిన్నెత్:– అబ్బే! అబ్బే! ఇప్పుడుగాదు. పాదుషాసర్కార్ క్షమింపవలెను. నాక్రొత్త

దాసి యక్కడనే యున్నది. అదిచూడదా? అదిపైకిఁ బోయి యేవియో తెలివితక్కువమాట లాడకుందునా?

షాజ:– దాని నావలికిఁ బొమ్మని చెప్పుము.

కిన్నె:– యాకుతీ! ఇటురా! (యాకుతి వచ్చును.)

యాకు:– పర్వ్యర్దిగార్ (పాదుషాకు నమస్కరించును.)

షాజ:– నీ వీగదివెలుపల నేను బిలుచువఱ కుండుము. (యాకుతి పోవును.)

కిన్నె:– నే నొక్కసారి లోనికిఁ బోయి పన్నీరుతెచ్చి మీపై జల్లెదను. (కిన్నెతు పోవును.)

షాజ:– ఈయుత్తర మెవరిదో అది యిచ్చటికి వచ్చుటకుఁ గారణమేమి? (తలగడపై నున్న యుత్తరముందీసి) దిక్కుమాలినరాజకార్యతంత్రము భార్యయొద్ద దిన్నగఁ బండుకొ ననైన నీయదుగదా? ఏమి? (జరూరని దీనిపైన వ్రాయఁబడియున్నదే. (సీలు విప్పి చూచును.) మంచముమీఁదఁ గూలఁబడి) అల్లా! అల్లా! అల్లాహోఅక్బర్! అల్లాహో అక్బర్! ఈగుడిసెవ్రేటిముండ నాపరువు తీసివేసినదే. నన్ను మాయచేసినదే. మా మొగలాయివంశ మునకుఁ ద్రోఁగులుదీసి కుక్కలకుఁ బెట్టించెదను. నాయెడల నింతవిశ్వాసఘాతుకురాలై ప్రవర్తించిన యీ తుచ్ఛురాలి ద్రోఁగులను విశ్వాసవంతములైన నాకుక్కలు స్పృశించునా? నా క్షైజారును వ్యభిచారదోషమున మలిమసమైన యీముండరక్తమున నపవిత్రము గావించె దనా? నేను దానిని జంపను. దీనిని సంతలోఁ బెట్టించి ఒక్కొక్క యవయవ మొక్కొక్కది నమునఁ గోయించి చిత్రవధఁ జేయించెదను. నే నిప్పుడేమియుఁ దెలియనటులే నటింతును. అది చేసినదోషమునుగూర్చి విమర్శింతును. చంపించుట యెంతసేపు? ఏనిమిసమున నైనను తలారి చేయఁగలఁడు. ఆమోసకత్తెయైనముండ యిటకు వచ్చుచున్నది. నేను జూడనట్లు నటింతును.

పన్నీటిబుడ్డితో వచ్చి కిన్నెత్ షాజహానును వెనుకప్రక్కనుండి కౌఁగిలించును.

షాజ:– (వెగటుపడి వెంటనే క్రమ్మికొని) ప్యారీ? బైఠీయే? (ఆమె కూరుచుండును) చూడు. వయసు ముదిరినవాని యుబలాటము. తాటాకు మంటవంటిది. రవంత యాలస్య మగునెడల నావాంఛ యంతటితో నశించును. ఇపుడు నీతో రవంత మాటలాడవలసియు న్నది. నరిగఁ బ్రత్యుత్తర మిచ్చెదవా? జడిసి యసత్యమాడుదువా?

కిన్నె:– నా నోటివెంట యింతవఱకు సత్యమేకాని యసత్యమెన్నఁడు రాలేదు. నే నొకరిని జూచి భయపడుటకు నావలన నేమైన దోషమున్నదా? భగవంతునియెడలఁ గూడ, నేను బుద్ధిపూర్వకముగఁ దప్పుఁజేసి యుండలేదు. నీ వెంతమాత్రము సందేహింపక, నీకుం దోఁచినదేదో యడుగుము.

షాజ:– తలాడపైనున్న యీయుత్తర మెవరు తెచ్చిరి?

కిన్నె:– నాక్రొత్తదాసి. ఆది కోటలోనికి వచ్చుచుండఁగా, పహిలీ దర్వాజాయొద్ద నెందరో జనులు మూఁగియున్నారఁట. వారిలో నొక్కఁడు దానిచేతి కీలేఖ నిచ్చి, పాదుషా సర్కారువారి క్రొత్త జనానాలో దాఖలుచేయుమని చెప్పినఁట. అట్లుతెచ్చి నాచేతి కివ్వఁబోవఁగా నాభర్తతలాడపై నుంపుమని చెప్పితిని. అది అట్లు చేసినది. నేను మీతో యీ

లేఖనుగూర్చి చెప్పఁదలఁచితినిగాని మఱచిపోయితిని. క్షమింపవలెను.

షాజ:– దీనిలోనిసంగతులు నీ కేమైనఁ దెలియునా?

కిన్నెత్:– నర్కార్! నాకెట్లు తెలియును?

షా:– ఈ యుత్తరములోని సంగతులు నే నెరుఁగుదును. నా కనుభవములో నున్నవని నీచే ననిపించినయెడల–

కిన్నె:– అదేమి నర్కార్! నీయుత్తరములోనున్న గూర్చి యేమియుండును? నైవారెవ్వరైన ననున్నుఁగూర్చి మీపేర నేమైన వ్రాసినారని మీఅభిప్రాయమా?

షా:– ఔను.

కిన్నె:– నే నెఱిఁగిన సంగుతులన్నియు నిర్భయముగాఁ జెప్పెదను.

షా:– నీవు నన్ను వివాహము చేసికొనకపూర్వము ని న్నెవఁడైనా వలచెనా?

కిన్నె:– ఆ! ఆతనివల పసాధారణమైనదని నేను దృఢముగాఁ బలికెదను. నేను వానిని స్పష్టముగ నిరాకరించితిని. చచ్చెదనని నాకు వార్త నంపినాఁగు. నీ యిష్టమని తెలియుఁ బఱచితిని.

షా:– అంతవలపు గల పడుచువానిని నిరాకరించి నీవు నన్నేల చేసికొంటివి?

కిన్నె:– అతనియందు నాకు వలపు లేదుగావునఁ జేసికొనలేదు. నీయం దున్నది గాన నిన్ను జేసికొంటిని.

షా:– ఆతఁ డిప్పు డెక్కడ నున్నాఁడు?

కిన్నె:– నేను మిమ్ము జేసికొన్నపిమ్మట వెర్రివెర్రి యాసలన్నియు నడుగంటులచే నెక్కడకుఁ బోయెనో, నే నెట్లు చెప్పఁగలను?

షా:– అసత్య మాడుచున్నావు.

కిన్నె:– అయ్యో! వాఁడెక్కడ నున్నాఁడో నా కెట్లు తెలియును?

షా:– ఎక్కడ నున్నాఁడో తెలియదా? నన్ను జెప్పుమందువా? ఎక్కడ నున్నాఁడా, నీయంతఃపురములో నున్నాఁడు, నీ ప్రక్కలో నున్నాఁడు, నీకొఁగిట నున్నాఁడు.

కిన్నె:– అట్లున్న యాతఁడు నామగఁడైన చక్రవర్తియే కాఁడా?

షాజ:– నీ మగఁడు కాఁడు, నీ అంకుమగఁడు. (ఆమె గుండెపైఁ జఱచుచున్నాఁడు.)

కిన్నె:– పాదూషాసర్కార్! ఆగర్భశ్రీమంతుఁడవే, మహాసుకుమారమూర్తివే, అంత దెబ్బ కొట్టఁగ, నీచేయి కందిపోదా? వ్రేళ్లు నొప్పులు పెట్టవా? నీవు కేవలము పొరపాటుపడు చున్నావు. నే నాదోషమెరుఁగను. ఎరుఁగను. అల్లాహో అక్బర్! నేను దోషసహిత నగు నెడలఁ ననున్నుఁ గొట్టుటకుఁ గఱ్ఱలేదా? కఱ్ఱతోఁ బనియేమున్నది? కత్తితో నఱకరాదా? కాని తప్పు నిదానింపుము. తొందరపడకుము. నా కాకస్మికముగఁ గలిగిన స్థితినిబట్టి యనేకులు నాకు వైరు లుందురు.

షా:– నేను సత్యమునే పరిశీలించుచున్నాను. నీ అంకుమగని నీయెదుట కిప్పుడు బిలిపింతునా?

కిన్నె:– ఓ! అభ్యంతరమేమి? అట్లు ముఖాముఖిని బెట్టి నిర్ణయింపుము.

షా:– యాకుతీ యని పిలువుము.

కిన్నె:– యాకుతీ! (యాకుతీ వచ్చెను.)

షా:– చూడు. అటుచూడు. కన్నులు పెట్టుకొని చూడు. వాడు నీఅంకుమగడు కాడా? నీవు వచ్చినమరునాడే నీ అంకుమగని నిచ్చటికిఁ దెచ్చి నాయెదుటనే మీవృత్తిని సాగింపఁ దలచిఁచినారా? నీ దగ్గఱ నుబలాటముతోఁ బండుకొనుట కీగాడిదకొడుకునకు నేను జీతము బత్తెము నలంకారము లెదురీయవలసినదా? నీయిల్లు వల్లకాఁకాడుగాను. నామర్యాద నింతయైనఁ జూడ నక్కఱలేదా? వీఁపుమీఁద గట్టిగఁ గొట్టగఁ బడిపోవును) యాకుతీ! నీవు మగవాఁడ వగునా? కాదా? నిన్నెవరు లోనికిఁ బంపినారు? ఈతంత్రమంతయు నీవలన జరిగినది అంతయు సరిగాఁ జెప్పనియెడల నిన్ను జంపుదును. బజానాక్రింద ముందొక తమాంచా తీసికొనుము. అని కొట్టును.

యాకు:– నే నాఁడుదాసను గాను. మగవాఁడనే.

నేను నీభార్యను గాటముగా వలచితిని. ఒక్కసంవత్సరమునుండి యీమెను గాఢముగాఁ బ్రార్థించుచున్నాను. గొంగళిపురుగును జూచిన కంటె, నెక్కువ యసహ్యముగ నన్ను జూచినది. నే నామె యాస నిది వఱకే వదలుకొంటిని. నేను మరియొక గ్రామము పోయి యక్కడ నాకుఁ దగినదానిని, నన్ను వలచినదానిని బెండ్లి చేసికొనవలె ననినిశ్చయించుకొని పోవుచుండఁగా, మంతాజ్ గారి యిద్దరుదాసులు నా యొద్దకు వచ్చి నిన్ను జక్రవర్తినిగారు బిలుచుచున్నారనఁగా నేను ప్రాణముల నరచేతఁ బెట్టుకొని దాసులవెంటఁ బోయితిని. నాతో వారు చెప్పిన దేమనఁగా, చక్రవర్తిగారి క్రొత్త పెండ్లికూతును నీవత్యంతము వలచితివని మేము వినియున్నాము. ఆమె నిన్ను మోసగించి చక్రవర్తిని జేసికొన్నది. నీకు రెండువేల అషరఫీ లిచ్చెదను. ఇదిగో తీసికొనుము నీ పీ యాఁడు వేసముతోడనే యీమెయొద్ద దాసిగా నుండవలయును. నీ కెంత యదృష్టము పట్టునో యెవరు చెప్పఁగ లరు? ఇట్టిమాట లామంతాజ్ గారు సట్టుదలగఁ బలికినను, నే నిష్టపడక యింటికిఁ బోదలఁచితిని. కాని నన్ను వారు నిరోధించి యిక్కడనే బలాత్కారముగ దాసిగా నుంచిరి. మహాప్రభూ! నే నేమి చేయఁగలను? చక్రవర్తీ! ఇప్పుడు నన్ను బొమ్మనిన నేను సంతోషముగఁ బోవుదును. నాదోషమేమియు లేదు.

షా:– నీకును, గ్రొత్తపెండ్లిగూఁతునకు నిదివఱకు సంబంధము లేదా?

యా:– లేదు. లేదు.

షా:– ని న్నిట్లు బలాత్కరించి క్రొత్తరాణియొద్ద వా రుంచి నారని నీ వీమెతోఁ జెప్పితివా? లేదా?

యా:– చెప్పినయెడల నెగచి తెగనఱకించు నని భయపడితిని. నాస్వరూపము నిప్పుడు బాగుగా నిదానించి క్రొత్తరాణియే మీతో జెప్పినది గాఁబోలును.

షా:– ఆమె చెప్పలేదు. ఈయుత్తరము చెప్పినది. దీనిని నీ కిచ్చినవా రెవరు?

యా:– తల్లి సెలవుపైని రోషనార్ నాకిచ్చినది. తా నిచ్చినట్లు చెప్పవలదన్నది.

షా:– ఎవరిచ్చినారని చెప్పవలసినదని నీ వడుగలేదా?

యా:– అడిగితిని. వీథిలోని ప్రజమహాజరిచ్చుకొనినారని చెప్పుమన్నది. అట్లే నేను కిన్నెత్తుతోఁ జెప్పితిని.

షా:– నీదోషము లేకుండ నీవు చేసికొన్నావు. నీ వుంచుకొన్న ముండదోషము గనపడకుండ సమర్థించినావు. నాముసలితనమునకు నీ పడుచుదనముఁ దోడుపఱచి దానిని సుఖపెట్టుటకే నీవు వచ్చితివి. నీతలఁ బగులఁగొట్టెదను. (చేతికర్రతోఁ దలపైఁ గొట్టఁగ వాఁడు క్రిందఁ బడిపోవును).

షా:– ఈసంగతి సత్యమో, యసత్యమో? ఎవఁడు చెప్పఁగలఁడు. అసత్యమైనప్పుడే తరుగని చెరుగని యప్రతిష్ఠయైనప్పుడు, సత్యమే యైనచో నిఁకఁ జెప్పఁదగిన దేమున్నది. దీనిని జంపించుతంత్రమున మమ్‌తాజ్‌తో నాకూఁతులు, వారిదాసులు, వీరిదాసులు, మిగిలిన జనానావారు, వారికొజ్జాలు, వీరి కొజ్జాలంద రేకీభవించి నా కెదురు తిరిగినారు. ఇంత కుటుంబవైరమును నహింపఁగలనా? కడుపునఁబుట్టినబిడ్డ లుండఁగాఁ, దిరుగ నిక్కాకు సిద్ధపడినవానిని ముక్కముక్కలక్రిందఁ గోసినను పాపమున్నదా? నాదోషముచేతనే యింతపని జరిగినది. కిన్నెత్ వలనఁ దప్పున్నదని నాకు నమ్మకములేదు. తప్పులేనిదానిని నెట్లు చంపఁగలను? తప్పు లేనిదానిని అంతఃపురమందే యుంచుకొనుటకు నాభార్యలు సహింపకుండ నున్నారు. నాబిడ్డలే సహింపకుండనున్నారు. నాప్రజలు కూడ నా కెదురు దిరిగినారని భయ పెట్టుటకే లేఖను గోటవెలుపలి జనులెవ్వరో యిచ్చిన మహజరని మాయచేసినారు. ఇదియంతయు మమ్‌తాజ్ మహిమయే కాని మరియొకటి కాదేమో. ఇట్టి మహేంద్రజాల మధ్యమున నేను క్రొత్తరాణిని బెట్టుకొని నిర్వహింపఁగలనా? కావున దీని నెక్కడకైనఁ బొమ్మని చెప్పుదును. అక్కడ దీనిసంరక్షణకుఁ దగు నేర్పాటును జేయింతును.

కిన్నెత్:– (మూర్ఛనుండి కొంచెము తెప్పిరిలి) పాదుషా సర్కార్! నే నేదోస మెరుఁగను. అగ్నివలె పరిశుద్ధనై యున్నాను. మంచుగడ్డవలె స్వచ్ఛనై యున్నాను. నన్ను రక్షింపుము.

షా:– కిన్నెత్! లేవఁగలవా? లేనియెడల నేను రవంత యూఁత నిచ్చెదను. లెమ్ము.

కిన్నె:– (లేచి) సర్కార్! మీరు నాకొరకుఁ జింతపాలు గావలదు. నామాటలు ఖొరానుమాటలవలె నమ్మవలెను. నేను దోషమేమియు నెరుఁగను.

షా:– నీ వట్టిదానివే యగుదువు. కాని నీ మీఁద నింత యల్లరియైన పిమ్మట నిన్ను నే నెట్లు నిర్వహింపవచ్చును?

కిన్నె:– ఆడుదానిపై ప్రజలకుఁ దప్పుమాటఁ జెప్పుకొనుటయే నైజము. బుద్ధిమంతు లైన న్యాయాధిపతులు సత్యమును బరిశీలించి నిందలేదని స్పష్టపరుపవలెను గాని ప్రజలకు జడియుదురా? నన్ను మీరు న్యాయసభలోఁబెట్టి బహిరంగముగ విచారించి, నాకు న్యాయము దయచేయుఁడు.

షా:– మరియొకరి తప్పయినయెడల నట్లు చేయఁదగినదే. కాని పాదుషానైనా నాయింటిలోని అంకుగాదా? నేను ఫిర్యాదినా? నా దాసులు సాక్షులా? ఇది చాలతప్పు గాదా? అదిగాక యీతంత్రమున నాకుఁ గావలసినవారందరు చిక్కుకొనియున్నారు. నాప్రతిష్ఠ, నాప్రాణము, నామానము పోఁదగినతంత్రము సిద్ధించినది.

కిన్నె:– ఇది తంత్రమేకాని, సత్యముకాదని మీరొప్పుకొందురా?

షా:– ఒప్పుకొంటిని.

కిన్నె:– ఒప్పుకొంటివా? సంతోషమే. అటులైన న న్నేమి చేయుమంటివి.

షా:– నీయిష్టము వచ్చినచోటికి నీవు బొమ్మ్మ.

కిన్నె:– పాదుషా! నేను నిర్దోషినైన నీ భార్యనని నీవు పలికితివి. నా కంతియే చాలును. నేను నీసెలవు ప్రకారము నాయిష్టము వచ్చినచోటికిఁ బోవుదును. నాకు సెలవా? అల్లాహో అగ్బర్! అల్లాహో అగ్బర్! అల్లాహో అగ్బర్! (పాదుషాకు సాష్టాంగపడి) బిస్‌మిల్లా! బిస్‌మిల్లా! (యని తల బళ్లుమని నేలఁ గొట్టుకొనినది.)

షా:– ఆ! ఆ! ఎంత ప్రమాదము. యాకుతీ! ఆమెతలకు దెబ్బ తగిలినది. ఎట్లు రక్తము ప్రవహించుచున్నదో, మంచముమీఁద నిమ్మళముగఁ బరుండఁబెట్టెదము. రవంత సాయము చేయుదువా?

యా:– పాదుషా సర్కార్! ఆమె పార్సా (మహాపతివ్రత) ఆమెను నే నంటుదునా?

షా:– అటులైనఁ బరుగెత్తుకొనిపోయి దాసులను హుజూర్ తబీమ్‌ను (వైద్యుఁడు) బిలుచుకొని రా?

(యాకుతి బోవును.)

షా:– అల్లా! అల్లా! ఎంతసని జరిగినది. ముసలితనమున వీర్యవృద్ధికొరకు హల్వాలను మింగి నల్లమందు మొదలగు నిషాపదార్థముల నెక్కించి, ఉద్రేకమును బుట్టించు కథలను విని, ప్రదర్శనములను గాంచి, కనఁబడి కాంతావాంఛను తీర్చికొనుటకై యీపడుచు బంగారుబొమ్మ బ్రదుకు భ్రష్టమొనర్చితిని. అయ్యయ్యో! ప్యారీ! వెళ్లిపోయితివా! (మొగమున గుడ్డవైచుకొని హా! యని యఱచుచు నావలికిఁ బోయెను.)

ఆతని హాహాకారముతో మేల్కాంచితిని, ఇక్కడికి స్వప్నము సరి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

25. గానకళ

జంఘాలశాస్త్రి ఏమీ తోచకుండా వుంటే, ఒకనాడు పిచ్చివాణ్ణి చూడబోయాడు. అలా తనకు అనిపించడం కూడా ఒక మానవ సహజగుణం అంటాడు. ప్రకృతిగతికి భిన్నమైనది మనల్ని ఆకర్షిస్తుందంటాడు.

ఈ పిచ్చివాణ్ణి రాజమండ్రిలో జంఘాలశాస్త్రి కలుసుకున్నాడు. పేరు కొంపెల్ల రామభట్టుగారు. ఆయన్ని యోగి అని చెప్పుతారట జనం.

జంఘాలుడు ఆయనతో మాటలాడి, ఆయన వెర్రి ధోరణిని నెమ్మదిగా మరలించుకొని వచ్చి-ఉపన్యాన ధోరణిలో పెట్టాడు.

ఆ పిచ్చి మనిషి మాట్లాడడం సాగించాడు. మన సిద్ధాంత ప్రకారం ఉన్న దొక్కటేరసం. అది శృంగారం. అదే అవస్థా భేదం వల్ల కరుణగా, భక్తిగా మారింది. సృష్టిలో వేదాలతోపాటే కాదు, అంతకుముందే పుట్టిన కళ గానం. ఇదే లలితకళలన్నింటిలో ఉత్తమం. మొదటి రసం భక్తి. మొదటి కళ గానం. భక్తిపూర్ణమైన దేవతాగానంలో గానం. భక్తిపూర్ణమైన దేవతాగానంలో అక్షరాలక్కరలేదు. ముక్కలకంటె, అక్షరాలేవీ లేని 'కూత' ముందు పుట్టింది. కోయిలపాటలో, రాగాలాపనలో, అక్షరాలు లేవే! గానకళ అత్యంత స్వతంత్రకళ. మనవాళ్లు అక్షరాల సాయమిచ్చి సార్థకమూ, విశాలమూ చేశారు. తొలిసారస్వత మంతా గానమే. గానకళే ప్రథమ గణ్యం. దానికి రవ్వంత తోడుగా మాత్రమే కవిత్వం ఉండదగినది. ఒక్క గానానికే ప్రత్యేక 'కళాత్వం' గాని, కవిత్వానికి కాదు. చిత్రలేఖనం కృత్రిమం. గానకళ ప్రత్యేకంగా పరమాత్మతో సంబంధించిన కళ.

ఇలా మాట్లాడి మాట్లాడి పిచ్చివాడు హఠాత్తుగా పరవశంలోపడి నందకుమారా! నవనీతచోరా! అంటూ, కృష్ణకీర్తనం చేసి పడిపోయాడు–అని జంఘాలశాస్త్రి ముంగించాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! ఏమియుఁ, దోపకపోవుటచేత వినోదముకొఱకుఁ బిచ్చివానిఁ జూడఁ బోయితిని. చూచితిరా! మనుజప్రకృతి యెట్లున్నదో! స్వభావసిద్ధముగ నున్నవానిని జూడ

మనకు వేడుకగా నుండదు. స్వభావములోనో, స్వరూపములోనో, యెక్కడనో రవంత వ్యత్యాసము కాసంత తెటుకు నున్న గాని మన కక్కడకు మనస్సు పోదు. ప్రకృతిగతి భిన్నమైన దేదియైనసరే మనల నాకర్షింపక తప్పదు.

గీ. చిన్నబొట్టున్న వాని వీక్షింప రెవరు
పెద్దబొట్టున్నవాని భావింత్రు జనులు
పిలువఁగనె పల్కు వానిని బెద్ద సేయ

రెంతకైనఁ బల్కనివాని నెంత్రు జనులు
తనువు గప్పినవానికి ఘనత లేదు
గోచిపాతయు దిసమొల గొప్ప యంద్రు

నెత్తివెండ్రుక లున్న నొరెత్త రెవరు
నేలవెండ్రుక లున్న గణింత్రు జనులు
ఇంటఁ గూర్చున్న వాని యోజింప రెవ్వ
రడవి మిడికెడువాని నాహా యటంద్రు

కాళ్లు తలక్రింద నుండుట ఘనత కాదు
కాళ్లు తలపైన నుండుట గౌరవంబు
చావపైఁబ్రక్క ఘనతకు సంజ్ఞకాదు

శంకుపర్యంక మతిగౌరవాంక మగును
నిండుకడుపును జనుల గణింపకుంద్రు
మండుకడుపును భావింత్రు మహిత మనుచు.

ఇట్లు మనవాడుకలలో, మన యలవాటులలో, వేషభాషలలో బుద్ధిపూర్వకముగ మనము జేసికొన్న స్వల్పములైన మార్పులే జనులను మనవంక కాకర్షించుచుండ శక్తిస్వరూపిణియగు ప్రకృతినుండి బయలువెడలిన యనేకాంధశక్తులయొక్క తొందరపాటులవలనఁ, దికమకలవలన, దేడాలవలన, గందరగోళములవలన, గంగవెర్రులవలన బ్రాణులలోఁ గలిగిన యస్వభావసన్నివేశములు జనుల నెంతగాటముగ నాకర్షించునో చెప్పవలయునా? ఆడోరివానిఁ జూచుటకు మనకెంత యుత్సాహముగ నుండును? కొజ్జావానిఁ జూచుకుతూహల మింతింతయా? మగచెంపల మానినికున్న యాకర్షణశక్తి దోరజామి ప్రాయఁపుదొయ్యలికి లేదే! కవలదూడలను బెట్టినయావునే యందరు చూడవత్తురుకదా! మనుష్యులలో వేరే చెప్పనేల? చేతులులేక నోటితో నీరు కదకువానికి జనుల వలననే జీవనము జరిగిపోవుచున్నది. గంగిరెద్దునకు మూఁపురముదిగువనున్న మూరెడుతోలే గంగి రెద్దువాని కడపరాల మిద్దెకుఁ గారణమైనది. మరుగుజ్జువారి వక్రత్వమే వారి వడ్డివ్యాపారమునకుఁ బెట్టుబడియైనది. రెండుతలలరాకాసిపిండమే తండ్రిని లక్షాధికారిఁ జేసినది.

ఇవియన్నియు బాహ్యావిక్రతులు. వీని యాకర్షణమే యింతగా నున్నప్పుడు అంతరవిక్రతులమాట వేరే చెప్పవలయునా? పుట్టుక తోడనే కొన్ని మనస్సులు స్వభావవిరుద్ధముగ నుండును. అనేక కారణములచేతఁ దరువాతఁ గొన్ని స్వభావ విరుద్ధములుగ నగును. వీనిలో భేదము లనేకము లున్నవి. వీనిచింత యిప్పుడు మన కక్కఱలేదు.

మతిలేనివానితోఁ గూడనున్న మనుజసంఘము మహారాజునకు లేదు. ఆతఁడొక్క యాస్థానమునకే యధికారి. ఈతఁడు సర్వప్రపంచమునకుఁ బ్రభువు. ఆతనికిఁ గొలఁదియైన రాఁబడి యే కాని, యీతనిధనమునకు హద్దు లేదు. ఆతని కనేక కారణములవలన విచారము. ఈతని కెప్పుడో కాని విచారము కలిగినను జిత్తజల్లుగ వచ్చి వెంటనే పోవును. ఉత్తరక్షణమునే భావప్రపంచమునఁ దిరుగాడుచు నాడుచుఁ బాడుచు నెగురుచుఁ బరుగెత్తుచు నాతఁడుండును.

నే నొకసారి రాజమహేంద్రవరమున కొంపెల్ల రామభట్టు గారిని జూచితిని. ఆయన యోగి యని చెప్పిరి. నా కాసంగతి తెలియదు. కాని యున్నత్తుఁడు. ఆతఁడాజానుబాహుఁడు. స్థూలకాయుఁడు. రోమశుఁడు. కౌపీనమాత్రధారి. నిత్యమందహాస వికసితవదనుఁడు. ఆతనిమందహాసముననున్న సౌందర్యమును నే నెక్కడను జూచియుండ లేదు. అది యేమో కాని యప్రాపంచిక తేజస్సుతోఁ బ్రకాశించె నని నా నమ్మకము. చిరునవ్వు నవ్వునప్పుడు ధ్వనియన్నమాట లేదు. పెదవులు కదలకుండ బిగించుకొనియుండెడివాఁడు కాఁడు. పై పెదవియు నడుగు పెదవియు నరయంగుళము వెడల్పుగ వేరుచేసి వింతగ, విలక్షణముగ, నప్రయత్నముగ, నాశ్చర్యకరముగ పువ్వు వికసించునట్లు మొగమంతయు వికసింపఁ జేసెడివాఁడు. ఇట్లు మొగమునుండి బయలుదేరిన యలౌకికకాంతి గుండ్రముగ మొగముచుట్టు వ్యాపించి చంద్రునిచుట్టు పరివేష్టమువలె నుండెనని చెప్పిన నతిశయోక్తికాదు. చిన్నచిన్న గులకరాలు, బొమ్మరాలు గ్రహించుచు విసర్జించుచుఁ దనలోఁదా నేదో మాటలాడుకొనుచు నా నందమయుఁడై యుండెడివాఁడు. ఏచక్రవర్తి కీయానందము సుఖము నున్నవి! సుఖమొందుటకు మతి పోఁగొట్టుకొనుటకంటె మార్గాంతరము గోచరించుటలేదని నాలో నేమో తెలివితక్కువగ భావించుకొనుచుఁ బిచ్చవానియొద్ద కేగితిని.

పిచ్చివాఁడు నన్ను జూచుటతోడనే నమస్తే యని కేకవైచెను. నీవు వచ్చెదవని యనుకొనుచునే యున్నాను. ద్రౌపదీవస్త్రాపహరణము ప్రక్కసందులో రాత్రి యాడినారు. డాక్టరుగారు నన్నుగూడ నాటకములోనికిఁ దీసికొని వెళ్లినారు. ధృతరాష్ట్రసభ జరుగుచున్నది. పాండవులోడిపోయి ఖిన్నులై కూరుచుండినారు. దుర్యోధనుఁడు మీసాలు వడివేసి సకిలించుచున్నాఁడు. దుశ్శాసనుఁడు ద్రౌపదిచీర లొలుచుచున్నాఁడు. ఎంతమట్టునకు లాగవలయునో దుశ్శాసనునికిఁ దెలియదు. ఎంతమట్టుకు లాగించుకొనవలయునో ద్రౌపదికిఁ దెలియదు. ఇద్దరుకూడ చెడద్రాగి యున్నారు. వద్దు వద్దని తెరచాటునుండి కేకలు వినఁడుచునే యున్నవి. తుట్టతుదకు రైకతో నెత్తిపై సవరపుబుట్టతో నడుమునకు గావంచతో సృష్టికంతకు నొక్కటే దిష్టిపిడతగ ద్రౌపది మిగిలినది. దుర్యోధనాదుల తోడు లేకుండనే జాత్యంధుడైన ధృతరాష్ట్రుఁడుగూడ రెప్పపాటులోఁ దెఱచాటునకుఁ బరుగెత్తినాఁడు. తెర వేయఁబోవఁగ బడలేదు. అప్పుడు ద్రౌపది లోనికిఁబోయినయెడల నధికారి కొట్టునని భయముచేత గాఁబోలు బెద్దమనుష్యులు గూరుచుండిన గోతిలో నురికి బ్రచ్ఛన్నత కొఱకో, పురుషులు కొట్టుదురను భయముచేతనో, స్త్రీలకుఁ బ్రత్యేకించిన స్థలములో దాగినాఁడు. స్త్రీలు పాక కాలిపోయినంతకేకలు వేసి యటునిటు పారిపోవ యత్నించిరి. కొందఱు పురుషులు స్త్రీలస్థలములోనికి వచ్చి ద్రౌపదిని జావఁగొట్టి గెంటివైచిరి.'' ఇట్లు పలికి యాతఁడు. లోనికిఁ బోవుటకు సిద్ధపడినాఁడు. అది చూచి నే నాతని కడ్డుదగిలి ''అయ్యా

యుపన్యాసమీయరా'' యని తొందరపెట్టితి. ''నీకుఁ బిచ్చి యీనుపత్రివదలి వెళ్లుటకుఁ బైవారి యనుమతి వచ్చినదా యని యడుగ'' నింకఁ గొన్నాళ్లిక్కడనే యుండుమన్నారు. పైవాఁడెవఁడు? క్రిందివాఁడెవఁడు? అందఱును దొంగముండకొడుకులే. ప్రపంచమునకంతకు మతిలేదని నేను గనిపెట్టి వెల్లడించుటయేమి? నాకు మతిలేదని వీరు నన్నిక్కడ బంధించుట యేమి? శ్రీకృష్ణభగవానుఁ డేమనినాఁడు.

యా నిశాసర్వభూతానాం తస్యాం జాగర్తి సంయామీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః

నేను వెల్గులోనున్నాను. ప్రపంచమంతయుఁ జీఁకటిలో నున్నది. నావెలుఁగు వారికిఁ జీఁకటి. వారివెలుగు నాకుఁ జీఁకటి. కాని నాకు బాధ, వారికి సుఖము.

గీ. వీరవరుకంఠ మునం దరవారికోఁత
భీరుగళమున విజయమందారమాల
శేముషీమంతు పెట్టెలోఁ జెదలుపుట్ట
వాలుతలవానిమొలను బత్రాలకట్ట.

విద్యావంతుల కెప్పుడు విద్యావిహీనులచేత, జ్ఞానవంతుల కెప్పుడజ్ఞులచేత, నర్హుల కెప్పు డనర్హులచేత బాధతప్పదు. ప్రపంచ చరిత్రములో మొదటిపంక్తిలోనున్న యీపాఠమే యిప్పటికి తుదిపంక్తిలో నున్నది. Socrates కేమయినది. విద్యాదూరులనోటికి విందు, పాత్ర విజ్ఞుల నోటికి విషపాత్ర, పాపాత్ముల కడుగడుగునకు మెత్తనిమడుఁగు. పవిత్రాత్మునకు నందినందికి కొరతమేకుఁ. గజం మిథ్య పలాయనం మిథ్య యని పారిపోయినను నేనుఁగు కాలిక్రిందఁ ద్రొక్కింపక మానుదురా?

అయ్యా అయ్యా నీవు చెప్పుచున్నది నాకేమియు బాగుగా లేదు. మనస్సునకేమియుఁ దోపకపోవుటచేత వినోదమునకై నీయొద్దకు వచ్చితిని. ఏదైనసరే యుపన్యాసమొకటి యిమ్మని యాతనిఁ దొందరపెట్టితిని. నా ధోరణికి నీవడ్డు రాకుండ నుందువా? అది ముందు చెప్పుమని యాతడు నన్నడిగెను. సాధ్యమయినంతవఱ కొల్లె యని నే నంటిని.

సరే విను. హరిఃఓమ్ ప్రపంచమం దున్నది యేకత్వమే గాని ద్వివిధత్వము కాదు. ఏదియున్నను నొక్కటియే యున్నదికాని యిన్ని లేవు. రెండునునది మనము తరువాత కల్పించుకొన్నదికాని స్వయముగా లేదు. నాషడ్డకుడు నాయంతవాడు సుమా Economical depression (ధనలోపము) దేశమునకుఁ గలిగిన తరువాతనే సానివీథిలో Commission agency (పొసగుడువ్యాపారము) పెట్టిసానిదాని యింటిలోనే నే రాత్రియైన సరసుడు లేఁడన్న యప్రతిష్ఠమాట లేకుండఁ జేసినాఁడు. సానివాండ్రను దేల్చినాడు. తాను దేలినాఁడు. వహ్వా అట్లుభయతారకముగ.

తప్పుదారినిఁ బోవుచున్నావని నే నతని మందలింపగ నేను జెప్పను పోపో యని యాతఁడు కేకవైచెను. ఈమాత్రము కూడ నుండదేమోయని భయపడి సరే నీయిష్టమువచ్చి నట్ల కానిమ్మని బతిమాలితిని. నన్నడ్డకుము, జాగ్రత్తగనే మాటలాడుదును. ఏదోయొక ప్రణాళిక చేసి కొంటిని. ఆదారిని నన్నుఁ బోనిమ్ము సరే యెంతవఱకుఁ జెప్పితిని అని

యాతఁడు నన్నడిగెను. సానివీథిని నరసుడు లేడన్న మాట లేకుండజేసి నరే నరే ఇక జెప్పనక్కఱలేదు. ఈ నడుమను దురకపేటలో మంగలి వానిమేడలో జరిగిన యఖిలాంధ్రక ళావతి పరిషత్తులో మాషడ్డకుఁ డధ్యక్షుఁడై యేమని యుపన్యసించె ననఁగా:—

ప్రపంచమున నున్న దొక్కటే రసము. అది శృంగారరసము. భవభూతి యది కరుణరస మనుగాక! ధూ!

''భవభూతి సాహితీప్రజ్ఞాప్రభాయుక్తుండామాటమాయొద్దననఁగరాదు''

అందుచేత స్వయంప్రకాశులైన మన పరిషత్తులో సారస్వతపండితునకుఁ దావులేదు. ఆతని నావలి కీడ్చివేయవలసినదే. మన సిద్ధాంత ప్రకారమున్న దొక్క శృంగారరసమే. ఆరసమే పరిస్థితి విభేదములఁ బట్టి వీరరసమగుచున్నది. అన్నియు యథావిధిగా జరుగుచున్నంతసేపు శృంగార రసము నిష్ప్రమాదముగఁ బ్రవహించుచుండును. మన ముంచుకొన్న సానివారి చక్కని చుక్కయొద్ద నెవఁడైన పైనరసుఁడు మనకంటఁబడినాఁ డనఁగ శృంగారరస మునకుఁ దొట్రుపాటు. పరిణామావస్థ కలిగినదా లేదా? మనము గొడుగుకామతోను వాడు పై జారుతోను దారసిల్లినప్పు డరగంట క్రిందటి శృంగారరసమే వీరరసమైనదా లేదా? అంతేకాని ఇంతలో స్వర్గమునుండి వీరరసము దిగినదా? తప్పు. మనము వాడు కొంతసేపు గుంజులాడిన పిదప వాడు మన క్రిందఁ బడఁద్రొక్కఁగ మన మలో యని యేడ్చితిమా లేదా? నిమిషముక్రిందట వీరరసముగా మారిన శృంగార రసమే యిప్పుడు కరుణరసముగా మారినదా లేదా? మఱికొంతసేపైన తరువాత సానివారి మణిపూస మనయొద్దకు దీంద్రించుచువచ్చి నాయింటి కెవ్వడైన పెద్దమనుష్యుడు బందుమర్యాదచే వచ్చినప్పుడు నీవింతయల్లరి చేయుదువా? పో యని మన్నైఁ గోపపడఁగ దాని దయకొఱకు ''అకించనో నన్యగతిశ్శరణ్య స్త్వత్పాదమూలం శరణం ప్రపద్యే'' యని బట్టమెడఁజుట్టుకొని మనము దానికాళులపై బడినప్పుడు వెనుకటి శృంగార రసమే యిప్పుడు దివ్యమైన భక్తిరసముగా మారలేదా? అందుచేతనున్న దొక్క శృంగారరసమే శాస్త్రీజీ! ఈ గొడవ యంతయు నే నెందులకుఁ జెప్పితినో జ్ఞప్తియున్నదా? నే నెట్లుపన్యాస మారంభించితినో చెప్పఁ గలవా?'' యని యాతడు న న్నడిగినాఁడు.

ప్రపంచములో నేకత్వమే కాని ద్వివిధత్వము లేదని యుపపాదించి నావు. దానిని స్థిరపఱచుకొనుటకు మీషడ్డకుని శృంగారరసైక్య ప్రవచనమును చేసినావు. అని నే నతనికి జ్ఞప్తిచేసితిని.

సరి నరి. ఇక దారిలోఁ బడినాను. తొందరలేదు. మాషడ్డకుని శృంగారరసవిషయకో పన్యాసమున కలరి యాతనిని మా బంధువులలో బ్రహ్మ రథము పట్టినారు. నేను నట్టి యైక్యమునే మఱియొక నన్నివేశమున స్థాపింప దలచినాను.

నీకు నీతండ్రికి వస్తుతత్త్వమున నేమైన భేదమున్నదా? లేదు. లేనప్పుడు నీతండ్రికి నీవు మ్రొక్కవలసినదని జనులేల యనుచున్నారు? నీకుఁ గారకుఁడగుటచేతనే కాదా? అట్టిచో నీవంటి మనుష్యులను నితర జీవములను, ననంతగోళములను సృష్టించిన భగవంతు నెడల నీవు చేతులు జోడించి మ్రొక్క భక్తిగనుపఱుపవలసినదేనా? అట్లుచేయుచున్నావా? సోదర సోదరీమణులఁ ద్యజించుచున్నామే. గురువులను ధిక్కరించు చున్నామే. తల్లిదండ్రు

లను తిట్టుచున్నామే. ఇన్ని దుర్గుణములు మనకుండ దైవభక్తి కలుగునా? ఏమియును లేదు. ఇక మనబ్రతుకు లెందులకు? కడుపునిండించుకొనుటకు, కైపుకలుగునట్లు త్రాగుటకు, కలవునకుఁ జచ్చి నంతమంది నిర్భాగ్యులను గనుటకు, అంతేనా?

మన పూర్వులే కాదా సృష్టి చిత్ర్యమునకు వింతపడి సృష్టిక్రమమును బరిశీలించి సృష్టినంతయు నిండిన యద్వితీయశక్తికి భక్తివినమ్రులై వేదబుక్కులతో దేవతాగాన మొనర్చి నారు. అందుచే మొదటసృష్టవ లోకనమునఁ గలిగిన రసమేది? భక్తి. ప్రపంచమున మొట్టమొదట వేదములతో బాటేకాదు. వేదములకంటెఁ గొంతముందుగాఁ బుట్టినకళ యేది? గానము. ఈ కళయే లలితకళ లన్నిటిలో నుత్తమమైనది. కవిత్వమే? ప్రపంచమున మొట్టమొదటఁ బుట్టినకళ యని పాశ్చాత్యులేకాదు. పౌర్వాత్యులే కాదు. ప్రపంచజనుల యందఱ యభిప్రాయముయి యున్నది. అది కేవలము తప్పు. సర్వప్రపంచముగూడ నాపైఁ దిరుగఁబడి నను దోకచుక్క చేత బుచ్చుకొని తోపతోప క్రిందఁగొట్టినియెడల –మూతిమీసముకదపా పచ్చిరొయ్యలు గోంగూరలో వేసినప్పటి మజా–

ఉండు. ఉండు నిదానించుకో తోకచుక్కమాట, గోంగూరమాట యిప్పుడెందు లకు? శాంతింపు మని యాతనిని శాంతిపఱచితిమి. ఈతని పిచ్చిలో వెనుకటికి నిప్పటి కెంత వ్యత్యాసమున్నదో నా కాశ్చర్యముగ నున్నది. నిమిషనిమిషమునకుఁ బెడమార్గము పట్టి తిరుగఁ డ్వరలో దారికి రాలేనివాఁ డింతమట్టునకు తాజూపడుట గొప్ప సంగతి కాదా? అని లోన ననుకొంటిని.

ఒక్కనిమిషమైన పిమ్మట నెంతవఱకు జెప్పితి నని యాతడు నన్నడిగెను. మొదటి రసము భక్తియని, మొదటికళ గానమని చెప్పితివి. తరువాతఁ జెప్పుమని వేడితిని.

సరే. సరే. ఆశ్చర్యకరమైన సన్నివేశము మనము తిలకించునప్పుడు దానిపై మనకు భక్తి గలిగినప్పుడునిష్ప్రయత్నముగ నబుద్ధిపూర్వకముగ "ఓ" యని ధ్వనికలుగునట్లు మనము నోరు తెఱతుము. వేదములకు ముందు ఓంకార ముద్భవమైనదని మనపూర్వులు జెప్పిన దదియే కాని వారి ఓం, లో నక్షరములున్నవి. నా, ఓమ్, ఇట్టినాదమే కాని యక్షర సహిత మెంతమాత్రము కాదు. నాదమును విని సంతసింపక యందులో నక్షరములున్నవని దానిన ముక్కలక్రిందఁ గొట్టనేల? ఉదయపర్వతమునై గెంపులసింహాసనమునై గెందామ రల కిరీటముతోఁ దలచూపుచున్న భానుబింబమును గాంచి మహానందభరితమై భక్తిపారవశ్య సహితమై భరతపక్షి గానముచేయుచున్నది గాదా! ఆగానములో నేయక్ష రములున్నవో పరిశీలనయేల? ఏయక్షరములు లేవు. స్వరంసంఘాతము తప్ప యది మఱేదియునుగాదు. షడ్జమస్వరము ముందుబుట్టిన తరువాత దానికి 'స' అనుగుర్తు వచ్చినదా? కాక అది పుట్టినప్పుడే 'స' యను గుర్తు దానియందున్నదా? పిల్లవానికి వట్టిధ్వని ముందునచ్చినదా? కాక మాట ముందువచ్చినదా? భక్తిపూర్ణమైన దేవతాగానమం దక్షరము లక్కరలేదు. నీలాల నిగనిగలీనుచున్న నీరదమును గాంచి మహానందముగఁ గప్పకూసినకూఁతకు, వరుణదేవతా కములగు ముక్కులకు, నంతఃకరణపరిశుద్ధియందు భేద మున్నదని యెవ్వడైనా జెప్పగ లడా? కప్పకూఁతలో నక్షరములు లేవు. వేద ముక్కనం దక్షరము లున్నవి. ముక్కుల కంటె కూఁతయే ముందుఁబుట్టినదని నేననుచున్నాను. పండ్లండఁ దలంచుకొనినయెడల నీవు కాదనగలవా? అదికాక యక్షరసాహాయ్యము లేని గానము ప్రపంచమున నెంతలేదు?

సంవత్సరమునకు నాల్గుమాసములు పాడిన కోయిలపాట నిరక్షరము కాదా? అదిగాక రాగాలాపన నిరక్షరము కాదా? రాగమునలన కలిగినయానందమున కీర్తనవలనఁ గలుగునా? గాయకులలోఁ బదుగుఱ నేయొక్కఁడో గాత్రజ్ఞుఁడున్నాడు. కాని మిగిలినవారందఱు యంత్రజ్ఞులే కాదా? గానకళ యత్యంతస్వతంత్రమైన కళ. దానికి మనవా రక్షరములు సాయమిచ్చి సార్థముగ, విశాలముగ జేసినారు. మొదటఁబుట్టిన సారస్వతమంతయు గానమే. అప్పటివఱకింకఁ యూరుపేరు లేదు. మృదువులైన యక్షరములు, నభిప్రాయములు. గానధ్వనులలోఁ జేరుచున్నవి కాని వానికిఁ గవిత్వమని పేరులేదు. ఏదైన రవంతపేరున్నను నది గానమునకు సహాయకళగా నున్నదిగాని స్వతంత్రకళగా లేనేలేదు.

గానమున్నంతసేపు, భక్తియున్నంతసేపు కవితాకళకుస్వాతంత్ర్యమేర్పడదని వారి తరువాతవార లెంచి గానమనుండి దానిని తప్పించి, భక్తిని దీసిపారవైచి పరమాత్మభక్తికి వ్యతిరేకమైన ప్రాపంచకభభక్త్యాదులను రసనులుగా నేర్పఱుచుకొని యైహికవిషయములందు మాత్రమే కవిత్వమును జెప్పి దానికి గళాస్వాతంత్ర్యమిచ్చుట కెన్నిపాటులైనఁ బడినారు. అంతటినుండి వేదగానము వదలి దానికి కవిత్వముబయలుదేరినది. రామాయణమును వ్రాసి వాల్మీకి దానిని రామునియెదుటఁ బాడించెనఁట. వాల్మీకి యెంతగడుసువాఁడో గానకళ మొదటికళ యని, కవిత్వము దానికి సహాయకళయని యంగీకరించుటకు వాల్మీకి యెంత మాత్రము నిష్టపడక గానమకంటె గవిత్వమే ముందని వెల్లడిజేయుట కిట్లు కవిత్వము చెప్పి పాడించినానని చెప్పినాఁడు. తెలిసినదా? కవిత్వము చెప్పి గానముచేయించుట కల్ల. పాడి పాడించెననుట పరమార్థము.

తరువాత నన్నిరసములందు నన్ని రసహీనవిషయములందుఁగూడఁ గవిత్వము విచ్చలవిడిగ బయలుదేరినది. కవిత్వముననే నిఘంటువులు, వైద్యశాస్త్రము, జ్యోతిషశాస్త్రము, పాకశాస్త్రము, సాముద్రికశాస్త్రము, నశ్వాది సమస్తశాస్త్రములుఁగూడఁ జెలరేగి బయలుదేరినవి. చిట్టచివరకు చరిత్రలు కథలు కూడ కవిత్వముననే బయలుదేరినవి. పంచాంగం మాత్రము పద్యములతో బయలుదేరలేదు. ఇట్టి దుస్థితిని బరిశీలించి భవబంధమోక్షణసాధనమగు గానమునకుఁ దిరుగఁ బ్రాధాన్య మిచ్చి పూర్వపవిత్రస్థితిని నిలువఁబెట్టఁ దలఁచి త్యాగరాజు, క్షేత్రయ్య, భక్తిరసమున భవతారకగాన మొనర్చిరి. అందువలన దుస్థితి రవంత యడ్డినదేగాని యాగలేదు. గానమునకుఁ బతనము భ్రష్టమార్గమునఁ గవిత్వమునకు బుష్టి వృద్ధియగుమనే యుండెను. ''చేతులెత్తి మ్రొక్కుచుంటిరా నాతండ్రి'' యను భక్తికీర్తనకుఁ బ్రతాంతరముగ ''చెఱఁగు మాసియున్నదా నరా నాసామి'' యని యవకతవక శృంగారరసకీర్తన బయలుదేరిన గానమునకు మొదట సహాయకళగానున్న కవిత్వ మిట్లను చితమార్గముల నన్యభావముగ విజృంభించి యిప్పుడు గానముల కంటె బలవత్తరముగ గానబడుచున్నది. కాని ఈబలము కృత్రిమము. గానకళయే ప్రథమమయినది. దానికి రవంతతోడుగనే కవిత్వముండఁదగినది. గానము వట్టిధ్వని కదా? అక్షరసాహాయ్యము లేనిదే అది యెట్లు శాశ్వతముగా నిల్చునవి నన్నధిక్షేపింతురా? ధూ! కళయగునా కాదా యనునదే పరిశీలనాంశము. కాని స్థిరమా యస్థిరమా యనునది కాదే. సృష్టిలో స్థిరమైన దొకటియున్నదా? ఒకగానమునకే ప్రత్యేకకళాత్వము కాని కవిత్వమునకు గాదు, కవిత్వమే కళకానప్పుడింకఁ జిత్రలేఖనమా? అది మఱింత కృత్రిమమైనది. కళ గానకళ యొక్కటియే. ప్రత్యేకముగాఁ బరమాత్మతో సంబంధించిన కళ.

ఇప్పుడన్నియుఁ గళలే. పంట యొకకళ. కల్లుగీత యొకకళ. దొంగ తన మొకకళ. శ్వార మొకకళ. తుదకు "Murder is a fine art" (జీవహత్య యొక్క లలితకళ) వఱకు వచ్చినది.

కవీ! నీకొక్క శబ్దమయిన నీయను. కవిత్వముఁ జెప్పగలవా? ఏమనుచున్నావు? గట్టిగఁ జెప్పుము? నావలనఁ గాదనుచున్నావా? అటులైన దూరముగఁ గూరుచుండుము. గాయకుడా! నీ కొక్క యక్షరమున నీయను. పాడఁగలవా? ఏమనుచున్నావు? అద్దేఅద్దే. అవలీలగఁ బాడఁగల ననుచున్నావా? సరే పాడుదువుగాని ఒక్క నిముసముండుము అదేమి? అదేమి?

నీ. మెఱుఁగుఁగుండలముల మిసమిసల్ గండభా
గములపై నట్టిట్టు గంతులిడగ
రంగారఁగట్టిన బంగారుపుట్టంబు
చిఱుబొజ్జనుండి కొంచెముగ జారఁ
బవనపూరణమున జవుజవ్వుమని లేత
చెక్కులు బూరెలై పూరటిల్లఁ
నిగనిగల్ గలగుజ్జు సిగనున్న శిఖిపింఛ
మొయ్యారమునఁ దలయూఁపుచుండ

నుత్తమోత్తమజన్మమై యొప్పుమురళి
నధరమునఁబూనిజల్లిల్లు మనఁగజగతి
గానమును జేయు నీలాల కాంతిరాశి
గొల్లభామలబంగారు కొంగుమూట!

ఆహాహా! ఏమిగానము తీఁగలు పుష్పించుచున్నవి. రాలు ద్రవించుచున్నవి. ముక్కులు తెఱచుకొని పక్షులు విని పరవశము లగుచున్నవి. పశువులు మోరలెత్తి గానామృతమును ద్రావి సోలుచున్నవి. కదలిన యెడల నేమగునోయని గాలి స్తంభించియున్నది. లక్షలకొలది యింద్రధనుస్సులనుండి సుధావర్షము దేవతల పుష్పవృష్టితో గురియుచున్నది. నాయనా! నందకుమారా! నవనీతచోరా! యని కేకలు పెట్టి పెద్దపెట్టున నేడ్చుచు నా పిచ్చివాఁడు క్రిందపడినాఁడు.....

ఓహో! నాయనలారా! పిచ్చివాడు మనల నెట్టి పవిత్రసన్నివేశమున విడిచి తాను విస్మితుడైనాడు. ఆహాహా! ఏమియేడుపేడ్చినాఁడు? ఇట్టియవసరమున నేడ్వలేనివాఁ డీశ్వరద్రోహి. శారదాగానము కంటెఁ దుంబురునారదాది నైగీకులగానము కంటె బిచ్చివానియేడ్పు నాతండ్రీ! నీ కెక్కువగాఁ భీతికరముగా నుండును గదా! వెఱ్ఱిబాగులవాని భక్తిరోదనమొక్కటి, తల్లిచావుపిల్ల శుద్రోదన మొక్కటి, పదునాల్గు భువనములను బునాదులతో గూడ నల్లలాడింప సమర్థములైనవి. కృష్ణా! ఆపదుద్ధారకా! రక్షింపుము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

26. పిచ్చివాని మరణశాసనము

ఈమధ్య పిచ్చివాడికి జబ్బు చేసిందని తెలిసి జంఘాలశాస్త్రి చూడడానికి ఆస్పత్రికి వెళ్లాడు. పిచ్చివాడు, జంఘాలుణ్ణి చూడగానే సంతోషించి తాను మరణ శాసనం వ్రాశాననీ, అతన్ని సాక్షి సంతకం చెయ్యమనీ, నీ రాక కోసమే ఎదురు చూస్తున్నాననీ చెప్పి, లోపలకి వెళ్ళి కొన్ని కాగితాల దొత్తి తెచ్చి చూపించాడు. అతను వ్రాసిందేమిటో చదవ కుండా తాను సాక్షి సంతకం పెడతాననీ ఎలా అనుకున్నావనీ, చదవమనీ, జంఘాలుడు, పిచ్చివాణ్ణి కోరాడు. దానిమీద, పిచ్చివాడు విసుక్కుని జమీం దార్లంతా సంతకాలు పెట్టవలసిన కాగితాలన్నీ చదివే పెడుతున్నారా? అని గద్దించి నేను చదివేది ఇందులోదే చదువుతున్నానని నమ్మరేమిటని అడి గాడు. ఎప్పుడో ఒకప్పుడు నమ్మక తప్పదు గనుక, చదవకముందే నమ్మమనీ అడిగాడు. తనకి శనిదశ వచ్చింది కనుక మరణ శాసనం రాశానని చెప్పాడు. 'హరిః ఓమ్' అని కాకుండా 'ఖర్మఃఓమ్' అని మరణ శాసనం చదవడానికి ఉపక్రమించి గాడిదకి, కవికీ, విష్ణువుకి వున్న సంబంధం పురస్కరించుకుని తను 'ఖర్మఃఓమ్' అని చదువుతానన్నాడు. తనింక పదిహేనేళ్లు మించి బతకడని తెలిసి, మరణ శాసనం రాశానన్నాడు. గురువు, శిష్యుడు, అశాశ్వతం అని తెలిసినా, జ్ఞానం శాశ్వతం గనక ఇలా 'శాసనం' రాశానని చెప్పాడు. ఈ శాసనంలో మూడు అంశాలు మూలాధారాలుగా వున్నాయి. ఒకటి ఎవరైనా నిన్ను పిచ్చివాడంటే, అన్నవాడికే పిచ్చి అని నమ్ము. రెండు సాధ్యమైనంతగా నీ భటులతో పోరాడు. నువ్వు మహారాజు వనినమ్ము. మూడు! అలౌకికానందం నీ జన్మధనం – ఇవి మూడు సూత్రాలు – ఇవి చెప్పి పోతన్నగారి పద్యం స్మరించుకుంటూండగా – డాక్టరొస్తున్నట్టు తెలియడం వల్లా, శాస్త్రి అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

ఈనడుమఁ బిచ్చివానికి జబ్బుచేసిన దని తెలియుటవలన నాతనిఁ జూడఁబోయితిని. ననుఁ జూచుటతోడనే చేటయంత మొగము చేసికొని వచ్చితివఁటయ్యా యని యాతఁడు కేకనైచి ''వచ్చినప్పుడు రాకుండినవాడువలెగాక రానప్పుడు వచ్చియుండినవాడు వచ్చుటయే సిద్ధించినయెడల నా వచ్చుటను వచ్చుటతో గుణించినంత వచ్చుట వచ్చునో కాదా

అదియే Factorial Zero కాదా'' యని యాతఁ డనెను. ''ఇప్పుడు నే నెందుల'' కని యాతని నడుగ నే నీనడుమను మరణశాసనమును వ్రాసితినిలే. దానిలో నీవు సాక్షివ్రాలుచే యుదు వని నీరాక కొఱకు నిరీక్షించుచున్నారని చెప్పి తుఱ్ఱునఁ లోపలికిఁబోయి నాల్గు కాగితములబొత్తి నొకదానిని దెచ్చెను. అదియటునిటు రెండుసారులు తిరుగవైచి దీని కొసన సంతకమును జేయుమని నన్ను గోరెను. విననిదే సంతక మెట్లు చేయును? చదువుమని హెచ్చరించితిని. సంతకముచేయుటకుఁ జదువెందులకోయి పూల్. ఒక్క రిద్దఱు తక్కఁ మీందార్లు పాలక ప్రధానుడు చదివియే సంతకము చేయుచున్నడా? దినమునకుఁ బదివేల్ పదునాల్గువేలో సంతకము చేయవలసిన రష్యాచక్రవర్తిమాట యేమి? నమ్మకముమీఁ ప్రపంచము దొరలిపోవుచున్నది. సరే నీయిష్టానుసారము చదివెద ననుకో. నే నిందులోని చదువుచున్నామని నీవు నమ్మవలసినదే కాదా? ఎప్పుడో యొకప్పుడు నీవు నన్ను నమ్మ తప్పనే తప్పదు. అట్టియెడల చదువకముందే నమ్మరాదా?

''అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి
నాయం లోకోస్తిన పరోనసుఖం సంశయాత్మనః''

అదిగాక నీకు విధేయుఁడనై వినిపించి నీ సంతకము గొనుటకు నేను నీసేవకుఁ ననుకొంటివా? పో! ఆవలికిఁ బో! నాప్రధానగ్రంథము నీసంతకాని కుపోద్ఘాతముగఁ బఠి తునా. ఈ గ్రంథమును బంగాళాఖాతములోఁ బాఱవైచెదనుగాని, నే నట్టి నీచమై పనిచేయుదునా?

శ్లో. అనాఘ్రాతం పుష్పం కిసలయమనూనం కరరుహై, రనావిద్ధం రత్నం! ఆహ చూచితివా అది పట్టు. కాళిదాసుడు మంచి గడుసువాడు. ఏనుఁగమెలికవైచి పట్టినాఁడ వహవ్వా! శిరఃకంపనము రోమహర్షణమైన పట్టు.

గీ. తగిన కాలమందుఁ దగిన స్థలంబునఁ
దగిన రీతిఁ దగిన తరుణితగుల
వ్రేలుకుండలాల విద్వాంసుడైనను
గక్కుఱితిని బడక కదలిపోడు.

అంత గట్టివాఁడైన కాళిదాసుగూడ తన అభిజ్ఞానశాకుంతలములోఁ బెసరపప్పువ జారినాఁడు. ఆతమాషా మఱియొకప్పుడు చెప్పెదను. ఉత్తర రామచరిత్రలో సాక్షి కనఁబ ఛిన యనౌచిత్యముకంటె నెక్కువ యనౌచిత్యము నటఁ గనఁబఱతును.

ఎందుకయ్యా! ఈ మతిమాలిన గొడవ. మరణశాసనపుసంగతులు చెప్పుమని నే తొందరపెట్టితిని. మరణశాసనముకై నాకులేని తొందర నీ కెందులకోయి Dunce! పండిత డెవ్వఁడు బ్రతికియుండుట నీకిష్టము లేదా? ''శ్లో. అతిక్రమ్య గ్రహాన్ సర్వాన్ నిహం పాపకృచ్ఛనిః'' అన్నట్లు శనిదశ వచ్చుటచేత మరణశాసనము వ్రాసితిని. కాని యింద గొంత కలతకొట్టున్నది కాని లేకపోలేదు. ''శరీరే ఝర్ఝరీ భూతే వ్యాధిగ్రస్తే కళేబరే యనియే కాదా మనపూర్వుల యభిప్రాయము. కావున నిట్లు యశాశ్వతత్వ శరీరమునకుఁ బుట్టినప్పటి నుండియు నున్నదన్న మాటయే గాదా? అందుచేత బొడ్డుకో మరణ శాసనపువ్రాఁత యొక్కసారి జరుగవలసియుండఁగ వ్యాధివచ్చినవఱకు మనవా

యుపేక్షించుచున్నారు? రోగముతోనే కాని చావఁ గూడదా? భార్యకు విపరీతమైన జబ్బు. భర్తయే రేయంబవ ళ్లామె కుపచారము చేయుచుండెను. నిద్రహారములు లేక మొద్దువంటి భర్త చచ్చినాఁడు. చావునకు సిద్ధమైన యిల్లాలు భర్తసాపిండపుగా రెలతో సంపూర్ణమైన సాపాటు. కొడుకునకు వెల్ఱికుక్క కఱచినది. తండ్రి టూరున జచ్చినాఁడు. ఆత్మావైపుత్రనా మాసి యున్నది నిదర్శనమైకదా. నామాల నుద్ధపట్టు మూత్రబంధమునకు మిగుల దురా కట్టు. వడహలసంప్రదాయము పురుషులలోఁ బదఖండనము, స్త్రీలలో శిరోముండనము. మండన మిశ్రుని భార్యతో వాదించుటకు శంకరాచార్యులకుఁ బరకాయప్రవేశము కావలసివ చ్చినది. కాని ఏది? మన మక్కడ నుండినయెడలఁ దమాషా కనఁబఱచియుందుము. ఱాడుదనఁగా మనకు నల్లేరుమీఁద బండిగాదఁటోయి! ఓ గిరగిరగిరగిర గంపసిడి యాడిన ట్లాడనఁటోయి.

ఏడ్చినళ్లే యున్నది. ఈదిక్కుమాలిన గొడవయంతయు నెందులకు? మరణశాస నము 'చదువుదువా' పోవుదునా యని కఠినముగా నడిగితిని.

అటులైన వినుఖరఃఓం ఖరఃఓం
అదేమి అదేమి ఖరఃఓం అనెదవేమి. అని నేను మొత్తుకొంటిని.

ఉండవోయి తొందరపడకు. ''శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్నవ దనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే'' యను విష్ణు బోధకమైన యీశ్లోకమును గాడిదెపర ముగా నన్వయించిన వారెవ్వరో యెఱుఁగుదువా? మాగురువుగారు. గాడిదా! నీవును గవివిగావుగదా యన్నవాఁడు కవియేనా? అందుచేతఁ గవికి గాడిదకు సవినాభావసంబంధము న్నదని తేలుచున్నది. గాడిదె కావైపున విష్ణువుతో సంబంధమున్నది. ఈవైపునఁ గవితో సంబంధమున్నది. అందుచేత సృష్టికి మూలతత్త్వము గాడిదయే యని నిశ్చయింపక తప్పనట్లగపడుచున్నది. కావున హరిఃఓం అని ప్రారంభంచేయకుండఁ బరమార్థజ్ఞానము గల నేను ''ఖరఃఓం'' షని ప్రారంభించితిని? బుద్ధుని కింత ఖ్యాతి యేల కలిగెను? అతని కాలమందున్న వేదాచారములను ఖండించుటచేత. అట్లే చిరకాల ప్రారంభపద్ధతిని ఖండించి క్రొత్త త్రోవ సహేతుకముగాఁ ద్రొక్కినందులకుఁ గూడ నట్లే యందువా లేదా? వితంతువివా హమున కున్న వైభవము, జనాకర్షణము పూర్వానారవివాహమునకు లేదు. బాపనకోమ టులు, మాలమాదిగ, చచ్చట జంగాలు కలసిచేసిన విందులో నున్న తేజస్సు పరిపాటిగ జరుగుచున్న యన్న నంతర్పణలో లేదు. ఎందుచేత పద్ధతికి విరోధమగుటచేత, పద్ధతి నియోగమనఁగా నెఱుఁగుదువా? గోపరాజు రామఁడు ప్రధానిగారు ''చాలులే అంతటితోఁ గట్టిపెట్టుము. నీ వీనడుమ నింత బుద్ధిహీనముగ మాటలాడలేదు. ఇంత క్రమశూన్యముగ మాటలాడుచుంటి వేల? ఇంతలో నిట్లు చెడుటకుఁ గారణమేమి?'' అని నే నంటిని.

కారణ మెందులకోయి fool! కార్యమునకుఁ గారణ మెంతమాత్రమక్కఱలేదు తెలిసినదా? ప్రపంచసిద్ధికంటె నెక్కువ కార్యము లేదు గదా! దీనికిఁ గారణమున్నదా? లేదు అంతవఱ కక్కఱలేదు. కుండయున్నది. దీనికిఁ గారణమున్నా? లేదు. మట్టియే కారణమందువా? మట్టికి కుండకు భేద మేమున్నది? ''అదియేమి కుమ్మరివాఁడు ప్రధానకార ణము కాదా యని'' యడిగితిని. ఓరి fool కుమ్మరివాడు మాత్రము మట్టి కాదఁటోయి! Dust thou art to dust returnest'' అన్నమాట నెమరనకుఁ దెచ్చుకో. అందుచేతఁ గారణము

మట్టియే. కార్యము మట్టియే. కార్యకారణ భేదమింక నెక్కడిది? ఇదే అద్వైతమునకుఁ బ్రాతిపదిక. ఉన్నదొక్కటి. కార్య మదియే కారణము నదియే. ''కాశీతలవాసినీ గంగా'' అదేప్రశ్నము నదేయుత్తరము కాదా? ఈ సందర్భమున మాకవిత్వము చిత్తగించినావా? ''ఏ యక్షరము మొదలింగ్లీషుభాషకు'' అదే ప్రశ్న అదే యుత్తరము కాదా?

''నాకీ దిక్కుమాలిన సోదె యెందులకు? నేను బోయెదను'' అని వసారాలోనికి వచ్చుసరికి నన్ను బావాబావా యని యెవ్వరో పిలిచినారు. అదరిపడి ప్రక్కనుజూడగ వాగదిలో నొకపిచ్చిది యున్నది, నీవు మాబావతో నేమిమాటలాడుచున్నావని గట్టిగ నన్ను గద్దించెను. అంతలోఁ బిచ్చివాఁడు నెత్తినోరుకొట్టుకొని నన్ను లోనికి రమ్మని సంజ్ఞ చేసెను. ఇది యేమో యని పోయితిని. అప్పుడు నన్నాతఁడు ''గట్టిగ మాటలాడకు నన్ను బావా యని పిలిచినదే మృత్యుదేవత. ఇది నన్నను దినము నాహ్వానించుచున్నది. ఇఁక దేహము చాలింపక తప్పదని నిశ్చయ పఱుచుకొని యీమరణశాసనము వ్రాసితిని. నేను జదివెదను ఆగుము'' అని యాతఁడు నన్ను బతిమాలెను. సరే చదువుమని నే నంటిని.

ఈశరీర మికఁ బదునైదునంవత్సరములకంటె నెక్కువకాలము నిల్చునది కాదని నిశ్చయించి నాలోకానుభవమంతయుఁ బ్రజకు బోధింపవలెనని దీనిని వ్రాసినాను. నే నశ్వత్థుఁడను. ప్రజలు కూడ నశాశ్వతులే. గురుం డశాశ్వతుఁడు. శిష్యుఁ డశాశ్వతుఁడైనప్పుడే ప్రయత్నమెందులకని యధిక్షేపము కలదు. బోధింపదలచిన జ్ఞానము శాశ్వతము కావున నే నట్లు చేయవలసి వచ్చినది.

1. మొదటినూత్రము:– ఎవ్వడైన నీకుఁ బిచ్చి యని యన్న యెడల నట్లు నిన్నన్న వానికేపిచ్చియని నిశ్చయింపుము. నిన్ను వెట్టివైద్యశాలయందుంచుటకు వారు యత్నింపఁగ బోవుచుంటినని యెంచవలయును. వారెవ్వరైన నిన్ను జూడవచ్చినయెడల వారి తెలివితక్కువమాటలు, బుద్ధిహీన చేష్టలు చూచి వినోదించి వారుపొందుచున్న దుర్గతి నీకు లేకుండా నిన్ను భగవంతుడు రక్షించినాఁడని యెంచుము. నీకున్న ప్రపంచజ్ఞానము నప్పుడప్పుడుపన్యాసములమూలమున వారికి వెల్లడింపుము. నీవిట్లు జ్ఞానబోధము చేయుచుండినగాని ప్రపంచోద్ధరణము దుర్ఘటము.

2. రెండవసూత్రము:– నీవు మహాసంపన్నుఁడవు. మహారాజవు. నీ కోటలోని సేవకులందఱు నీ కుపచారములు చేయుటకు నియమింపఁబడినవారే. నీ గదినూడ్చుటకు వచ్చిన సేవకుఁడు. నిన్ను మోసపుచ్చి యేదియో పట్టుకొని పోవునని యెంచుము. సౌఖశాయనికుఁడైన, యారోగ్యమును గనుఁగొనుట నుదయముననే వచ్చిన వైద్యసేవ కుడు నీయందలి యనూయచే ని న్నున్మత్తుని జేయుటకు వచ్చిననాఁడని నమ్ముము, వాడిచ్చిన మందును దీసికొనకము. గొంతుకలోఁ బోసినను దానిని దాచి వాడటునిటుచూచునప్పుడు గుడ్డతో మూతు తుడుచుకొన్నట్లు నటించు యాగుడ్డలోఁ జప్పుడు కాకుండ నుమియుము. నీకాహారము దెచ్చిన భృత్యుడు నమయమును జూచి నీకు విషము పెట్టి నీరము దెచ్చిన భృత్యుఁడు నమయమును జూచి నీకు విషము పెట్టి నీ సంపదను హరించుటకు వచ్చినట్లు నిశ్చయింపుము. నందిగ్ధవస్తువని నీకుఁ దోఁచిన దానిని వానినోటఁ బెట్టుము. లేకున్నయెడల నాహారమును వినర్జింపుము. ఎవ్వడైన నిన్ను నీభవనపుటావరణములో గాలికై భటుఁడు వినయపూర్వకముగఁ ద్రిప్పినయెడలఁ జమత్కారమునఁ గనుమొఱఁగి

పైకిఁ బొమ్మ–నీకొఱ కెంతయాందోళన మందుదురో నీవు లేకుంటచే నీ భవన మెంత గగ్గోలై పోవునో నీవు వినోదముగఁ దెలిసికోవచ్చును. ఒకవేళ సేవకులు నిన్ను గొరడాతీసి కొని కొట్టుట సిద్ధించునెడల ప్రజలు ప్రభువును నిరాకరించి తామే పరిపాలించుకొన ప్రయత్నించుట ప్రస్తుతకాలానుగుణమైన పరిస్థితి యని భావించి సాధ్యమైనంతవఱకు నీభటులతోఁ బోరాడుము. మనుజుని కాటునకు మందులేకపోవుటచే నీవు వారిని కఱచుట కంటె నుపాయం లేదు. ఇక వా రెప్పుడు నీజోలికి రారు. కాంతాప్రశంసలో గరవెంత సుఖదాయకమో కలహప్రయత్నములో నది యంతదుఃఖదాయకము. ఇదిగో రవంతసేపు చదువుమాని పూర్వసంగతి చెప్పుదును.

వలదు వలదని నేను మందలించినను నాతడు మానక యిట్లు చెప్పెను. దంతక్షత నఖక్షతసంప్రదాయము మన శాస్త్రములోనిది. నేనొకనాడు చిన్నతనములో బైసరసపు బసందేదో పరిశీలింతమని పడుచు దాసియింటికి బోయితిని. అచ్చట గుమ్మములో వేంచేసియున్న వేశ్యా మాతను జూచి సాష్టాంగ మాచరించి –

పదము.

చేతిలోనిగట్టి యూతోయి నా దేవి
నడుముచుట్టు గోనెపాత
మాతలందఱలోను మాతోయినారాణి
అడ్డునడకను గారుపీత.

అని ధ్యానించినది. ఆమె ప్రసన్నురాలై సరసానికి వచ్చితివా తండ్రీ! ఏదీ చేతిలో నొకకాను పడవేయవోయి యని సెలవిచ్చినది. అది నాయొద్ద లేదంటిని. పోనీలే. అందఱు నీయఁగలుగువారే యుందురా'' అని ''ప్రక్క చీకటికొట్టులో మంచముమీద నామనుమరాలు పండుకొన్నది. అది సరిక్రొత్త కుఱ్ఱది. మొన్నను సూర్యగ్రహణము నందు మంచి బింకమైనపట్టులో నది వెళ్లఁబడినది. అది భయమున నటునిటు పాఱిపోకుండ గట్టిగఁ గౌఁగలించుకొని సుఖపడు బాబా'' యని నన్ను బ్రేమమున హెచ్చరించెను. అంత గదిలోనికిఁ బోయి గట్టిగా గౌగలించుకొంటిని. బొయ్యిమని యఱచి నులకమంచముమీఁది కుక్క నాగొంతుక పట్టుకొనెను. ఏడ్చుచు గిజగిజ కొట్టుకొనుచుండగా చీచీయని యఱచుచు, వేశ్యమాత లోనికి వచ్చి కుక్కను గొట్టదలచి కాబోలు నావీపుపై గట్టిపుచ్చుకొని కొట్టెను, పెద్దగోలయయ్యెను. చుట్టుపట్టులవారు లేచివచ్చి కుక్కను విడిపించి నేను దొంగనని నన్ను బట్టుకొని కొట్టిరి. వేశ్యమాతపాతచీరగుడ్డ ఆరణాలు విలువగలదానిని హరించుటకు వచ్చినానని నాపై నేరము మోపిరి. మైత్రిలోను కరువుమంచిదే, వైరములోను కరువుమంచిదే యని చెప్పితినే అది యిది, ఎట్లయిననేమి, అప్పటినుండి యీడు దనఁగా గడగడ. భూశయనము.

సరే గొప్ప ప్రయోజకుడవే. కాని యిక సోదె కట్టిపెట్టి మరణ శాసనమును జదువుమని నే నంటిని. ఇదివఱ కెన్నిసూత్రములు చెప్పితినని యీతఁ డడుగఁగా రెండు చెప్పితిని.

3. సరేమూడవ సూత్రము–నీతత్త్వమేదో యెఱుఁగక నిన్నులోకులు గేలిసేయుదురు. నీతత్త్వ మేదో నీకుగూడ బాగుగాఁ దెలియదు. కావున నేను జెప్పదను.

నీవులోకులవలెఁ బామరుఁడవు కావు. గుడుగుడుగుంచము లాడుచు లొడితెడగు బాహ్యప్ర కృతిలో మిడుకువాఁడవు కావు. నీవు జగత్ప్రాజ్ఞుఁడవు లోకాతీతుఁడవు. ఐహికపుదేవులాట నీకేమియులేదు. ఏదిపోయినను నీ యానందము నీ జన్మధనమైయున్నది. పంచభూతములు న్వన్వరూపములతో నీకుఁ బ్రత్యక్షములగుదురు గదా! ముక్కోటిదేవతలు కింకరులవలె నీ చుట్టుచుట్టుతిరుగుచుందురు గదా! అప్సరస్త్రీలల యాటపాటలతో మైమఱచి యుందువుగదా!

కాలేన పంచత్వమితేషు కృత్స్నతో
లోకేషు పాలేషు చ సర్వజంతుషు
తమన్తదాసీద్గహనం గభీరం
అన్తస్యపారేభి విరాజతే విభుఃʼʼ
అని వ్యాసుఁ డన్నట్లు,

క. లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగినపిదప నలోకంబగు పెం
జీకటికవ్వల నతతము
నేకాకృతి వెల్గునతని నే సేవింతున్.

అని పోతరాజుగారు జెప్పినట్లు ''ఏకాకృతి వెల్గునతని'' నీవెప్పుడు సేవింతువు. నీ కింక మోక్షమున కడ్డేమి? కవికందని, భక్తునికందని, జ్ఞానికందని యాపదవిని నీవు సులభముగా.....

ఎవఁడురా అక్కడ డాక్టరుగారు వచ్చుచున్నారు. పో! ఆవలిఁకిబో అని పెద్దకేక లోనుండి వినఁ బడినది. వెంటనే పిచ్చివానిని విడిచిపోయితిని.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

27. సుఖము, దుఃఖము

ఈ ప్రపంచంలో సుఖదుఃఖాల తీరు ఎటువంటిదో విచారణ చేయడంకోసం వివరంగా చేసిన ప్రసంగం ఇది.

ప్రపంచంలో వేదాంతులంటూ ఎంతమంది వుంటారు? ఒక్క చేతి మీద లెక్క పెట్టినా అయిదువేళ్లూ పూర్తికావు. మిగిలిన వాళ్లంతా మొండితనంతో బతకవలసిందేనా?

హరిశ్చంద్రుడు, రామచంద్రుడు, పడినకష్టాలకు లెక్కవుందా?– అయితే పట్టాభిషిక్తులయ్యారుకదా! అంటే, వారుపడిన మనోవేదన ముందు ఈసుఖం ఏపాటిది? బతికినన్నాళ్లూ పధ్నాలుగు బతుకులకు సరిపోయే ఏడుపుఏడిచి ప్రాణంపోయేవేళకి భగవత్కటాక్షం కలిగి బాగుపడ్డామని చెప్పిన మహాపురుషులంతా పెరిగిన వెలుగుమాత్రం ఏమంత దొడ్డది?

సుఖపడాలంటే, మొండివాడైనా కావాలి. వేదాంతి అయినాకావాలి. ప్రపంచంలో సుఖం సంపాదించే ధనం, సంసారం, వస్తుసామగ్రి లేకపోతే ఎంతకష్టమో మరీ ఎక్కువుంటే కూడా కష్టమే. సదానందయోగి చెప్పిన ఒకతత్త్వాన్ని బట్టి చూస్తే ప్రకృతిస్థితి, మధ్యమార్గంలో నడుస్తున్నంతసేపే మనిషికి సుఖం. బాహ్యప్రకృతికంటె ఆశ్చర్యకరమైన ఆంతరప్రకృతిలో సైతం-కష్టసుఖాలకు సంబంధించినంత వరకూ-బాహ్యప్రకృతి సూత్రాలేవర్తిస్తాయి. సుఖం, బాధ అనేవి ప్రకృతిస్థితులుగాని, స్వతంత్ర తత్త్వాలుకావు. ఒక ప్రకృతి సన్నివేశానికి ఈచివరకష్టం. ఆచివరకష్టం. నడుమ సుఖం. ఈ తత్త్వాన్ని వివరించడానికి ఒకపేద బ్రాహ్మడికథ చెప్పాడు. హఠాత్తుగా 'లాటరీ'లో డబ్బురావడంతోపాటు, పెరిగిన దుఃఖతత్త్వం ఇందులోసారం.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

అంతకుఁబూర్వ మేమిచెప్పినో కాని నేను వెళ్లిన పిమ్మట నిట్లు చెప్పెను.

జాలిగుండెవాఁడు జను లేమియందుఁ
యనుచు భీతిఁజెందు నట్టివాఁడు
బిడియమునకు గొంకి వెనుకొఁడువాఁడును
ధరణిలోన నెపుడు దక్కలేరు

పరుగులిడుచుండఁ గ్రిందనుబడియుఁ గెరలి
మొండిత్రోపుగ ముందుకుఁ బోవువాఁడు
తన్నొకఁడు గొట్టఁ బదుగురఁ దాను మంచి
చెట్టఁగాంచ కెవ్వరినైనఁ గొట్టువాఁడు
నేడ్చుచునె పెండ్లివిం దారగించువాఁడు
స్వార్థమే పరమార్థమై యలరువాఁడు
బ్రదుకఁదగినట్టివాఁ డీప్రపంచమందు
సౌఖ్యవజ్జీవు లిద్దఱే జగతియందు
మొండియొకఁడు వేదాంతియొకండుసుమ్ము
నడిమివారల బ్రదుకు వినాశకరము
గడియగడియకు మృతికంటె ఘనతరంబు.

కవి చెప్పినయీమాటలు బాగున్నవా? సుఖాపేక్షకు లందఱు Rowides కమ్మని యుపదేశించినఁడే. ప్రపంచమున వేదాంతులెందఱు లుందురు? ఒక్కచేతివ్రేళ్లయిన నన్నియు వంగవే! మిగిలినవారందఱు మొండితన మవలంబింపవలసినదేనా? ఏమో! ప్రపంచతత్త్వము దియే యేమో, యెవరు చెప్పఁగలరు? సరియైన ప్రవర్తనకు న్యాయమైన ఫలమెవ్వరికైనఁ గలిగినదా? కలుగుచున్నదా? బిస్‌మిల్లా యని కట్టుబుచ్చుకొని లేవలేనిబక్కపాదూషాకు నల్గురు భార్యలు, పణ్యకాంత కొసరునా? నీతిసత్యసంరక్షణకై శపథముచేసికొన్న యేకపత్నీవ్రతుఁడైన ప్రభుశిఖామణికిఁ బదుచుఁదనములో భార్యవియోగమా! ఏమియిది!

సీ. సత్యసంధులు కష్టచయముల మున్గుటో
దొంగ లుప్పొంగుచుఁ ద్రుళ్ళిపడుటో
తలగొఱిగించు కోదాతకు లేకుంటో
కృపణుఁడు లక్ష్మీసమృద్ధిఁ గనుటో
విద్వాంసు లుదరముల్ వెన్నంటి యేడ్చుటో
మూఢులపొట్టలు పొణక లగుటో

గీ. త్వత్పదారాధకులు ముష్టిదానఁజయ్య
లగుటొ! నాస్తికుల్ వారల మొగములందు
నుమియుటయె! యేమి యిది! కన్నులున్నవె! మతి
యున్నదే! యుంటివే! చేయుచున్న దిదియె!

న్యాయవర్తనమునకు న్యాయఫలము గలుగపోవు నిట్టి మార్మెలి, యిట్టి వెలితి, యిట్టి తోరట సృష్టిలోనే యున్నదేమో. సత్యపాలకుఁడౌ హరిశ్చంద్రుఁడు భ్రష్టరాజ్యుఁ డగుటా, శ్మశానవాసి యగుటా, భార్యావిక్రయసాహసి యగుటా, మృతపుత్రుఁ డగుటా. ఆహా! ఏమి ప్రపంచధర్మము! పితృవాక్యపరిపాలకుఁడగు రామచంద్రుఁడు నాలచీరధారియగుటా, కందమూలాశి యగుటా, భ్రష్టరాష్ట్రుఁడగుటా హరిహరీ! అపహృతదారుఁ డగుటా, ఛీ! ఇంతకంటె నేమి వ్యత్యస్తఫలముండును? చిట్టచివఱకు వారు మహాసౌఖ్యాన్వితులు కాలేదా? పట్టాభిషిక్తులై భగవత్తుల్యులై ప్రభాభాసురులై వెలిఁగిపోలేదా? యనియందురా? వారు సంవత్సరములకొలఁది పడరానిపాటులు పడి చివఱకు వెలుఁ గిదియేనా?

నాతోఁ జిన్నతనమున నొకబాలుఁడు చదువుకొనెను. మాకుగ్రుడ్డి గోపాలశాస్త్రి యన్న యాతఁడు గురువు. ఆయన కొక్కగది, ఒక్కభార్య, ఒక్కకొడుకు, ఒక్కచొక్కా, ఒక్కకన్ను. నెలతప్పుడయనఁగా నేమి యని మా గరువు నా సహపాఠిని బ్రశ్నించెను. నెలతప్పుట యనఁగా క్షౌరమని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. మాగురువుగారు కోపా విష్టుఁడై యాతని కొక్క లెంపకాయ సంకల్పించి చేయియెత్తెను. గురువుగారొంటికన్ను వారగుటచేత నామిత్రునికిఁ దగులవలసినదెబ్బ నాకుఁ దగిలెను. పంతులుగారూ! నన్ను గొట్టనారేమయ్యా! యని నే నేడ్వఁగ, నిట్టి బుద్ధిహీనునితోఁగూడఁ జదువుకొను దోషము నీది కావునఁ గొట్టితి నని గ్రుడ్డితనమును సమర్థించుకొనెను. ఇట్టి బుద్ధిహీనునికిఁ బాఠముఁ జెప్పిన మీమాట యేమని నే నంటిని. తరువాత నామిత్రుని బుజ్జగించి నెలతప్పుట యనఁగా క్షౌరమని యేలచెప్పితి వని నేను, గురువుగారుగూడ నడుగ, మా మామ్మ నెల కొక్కమాఱు క్షౌరము చేయించుకొనుటచే నే నట్లు చెప్పితినని యాతఁడు నిఘంటుకారునివలె శబ్దమునకు వ్యుత్పత్యర్థముచెప్పెను. తరువాత నామిత్రుఁడు బి.ఎల్. పరీక్షలోఁ గృతార్థుఁడై జిల్లాకో ర్టులో వకీలుగాఁ జేరినాఁడు. శ్రీరామరక్ష, శ్రీరామరక్ష, పైస బోణిలేదు. పట్టాసొమ్ము కట్టువేళ పాత్రనమానుతాకట్టు. మరియొకవృత్తిచేసికొనవయ్యా యని నే నెన్నివిధములఁ జెప్పినను నీ కెందులకు, చూడవోయి నేనొక్కవెల్గు వెల్గక తప్పనోయియని నన్ను నిరాకరించుచు వచ్చినాఁడు. చిట్టచివరకు మూఁడు పుట్లకట్టతో అబ్బానల్లిగడ్డమీఁద "ఆఖరు" వెల్గువెలిఁగినాడు. బ్రతికియున్ననాళ్లు పదునాళ్లు బ్రతుకులకు సరిపోయినయే డుపు లేడ్చి ప్రాణావసాన సమయమునకు భగవత్కాటాక్షము గలిగి బాగుపడితిమని చెప్పిన సత్పురుషులందఱు వెలిఁగినవెలుఁగుకూడ రవంతకంటె నెక్కువది కాదు.

ఇంతకుఁ జెప్పినదేమనఁగా సుఖపడుటకు మొండివాఁడైనఁ గావలయును, వేదాం తియైనఁ గావలయును. అటులైన, నీతి తీసివేసి యావలఁబెట్టుము. ఇఁక న్యాయమంతయు గోదావరిలోఁ గలుపుము. సిగ్గుమాలినతనమా! రా! అన్యాయమా! రా! అసత్యమా! రా! స్వార్థమా! రా! మొండితనమా! రా! పాపమా! రా! నా సౌఖ్యమునకే మిమ్మాహ్వానించుచు న్నాను.

ఏమిది? ఇట్లు జరుగఁదగినదేనా? దారుణముగ నున్నదికాదా? ఇది పరమార్థమని నమ్మకుఁడు. ఇట్టి తుచ్ఛప్రవర్తనమునకు రాజశాసనమే యంగీకరింపదు గదా. భగవచ్ఛాసన మెట్లంగీకరించును?

అది యిప్పటి కాలాగున నుండనిండు. సోదరులారా! మీరీతత్త్వమును వింటిరా.

పాట

వినరా సదానందయ్యోగీ! నీవు విననేర్తువని విన్నవింతు బైరాగీ॥ వినరా॥
ధనము లేకున్న దుఃఖమురా-చాలధనము కల్గినదాని దాఁపదుఃఖమురా॥ వినరా॥
ఆలు లేకున్న దుఃఖమురా-చాల నాండ్రు గల్గినవారి నడప దుఃఖమురా॥ వినరా॥
బిడ్డ లేకున్న దుఃఖమురా-చాల బిడ్డలు గల్గిన పెంచ దుఃఖమురా॥ వినరా॥

ఈజ్ఞాని పాడినతత్త్వమెట్లున్నదో వింటిరా? ప్రపంచసుఖసాధనములగు ధనసంతానాదిక వస్తుసామగ్రి బొత్తిగ లేకపోవుట యెట్టికష్టమో యని విశేషముగ నుండుట యట్టికష్టమే.

మధ్యస్థితిలో నున్నవారిబ్రతుకు సుఖవంతమని చెప్పవచ్చునని దీనివలనఁ దేలుచున్నది కాదా? మొదట కవి చెప్పినదానికిని నేవేదాంతి చెప్పినదానికిని నెంత యేతము పెట్టుగా నున్నదో చూచితిరా! ఈరెండుబోధనములకు తేజస్తిమిర న్యాయ మున్న ట్లగపడుటలేదా? వీనిలో నేది సత్యమో రవంత పరిశీలింతమా? సదానందయోగి పాడిన తత్త్వమును గూర్చి యిప్పుడు చెప్పుదును.

వర్షములు లేకపోయినయెడల పంటలు లేవు. అతివర్షములైనఁదిరుగ పంటలు లేవు. జీర్ణశక్తి తగ్గిపోయినయెడల మనుజానకుఁ గష్టము. అతి జీర్ణశక్తి గలుగుటకూడ నట్టికష్టమే. అనఁగ మందాగ్ని యెట్టికష్టమో అత్యగ్ని యట్టికష్టమే. రక్తపుపోటు మనుజునకుఁ గొంతసహ జముగ నుండవలయును. అది మిక్కిలి తగ్గిన శరీరము నిలువదు. మిక్కిలి హెచ్చినను శరీరము నిలువదు. జనునితనువుగాక 98.4 బదులు 98 ఉండినను జావే; 107 ఉండినను జావే. గాలి హెచ్చనుగూడదు, తగ్గనుకూడదు. రక్తములో నీరు హెచ్చనుగూడదు. తగ్గనుగూడదు. ప్రకృతిస్థితి మధ్యమార్గమున నడచుచున్నంతసేపే మనుజునకు సుఖము.

ఇదివఱకు మనము బాహ్యప్రకృతినే పరిశీలించినాము. బాహ్యప్రకృతికంటె బహువిచి త్రమైన యత్యద్భుతమైన యవర్ణ్యమైన యాంతరప్రకృతి మనుజునకు లేదా? ఇంతవఱకు మనము విచారించినది శరీరసుఖమేకాదా? మనస్సుఖము మాత్రము సుఖముకాదా? అందువ లన మనస్తత్త్వముగూడఁ బరిశీలింపవలసియున్నది. ఈతత్త్వమునుగూర్చి జంఘాలశాస్త్రి తనయుపన్యాసములలో మిగుల విపులముగఁజెప్పినాఁడు. నేనుచెప్పుట హాస్యాస్పదముగ నుండును. కాని బాహ్యప్రకృతి కెట్టిసూత్రములున్నవో ఆంతరప్రకృతికిగూడ నవియే సూత్రములు. బొత్తిగ లేకపోవుట, అత్యంత మెక్కువయగుట, బాహ్యప్రకృతిలో గష్టములై నట్లే యాంతరప్రకృతిలోగూడ నవియే కష్టములు. బాహ్యప్రకృతిలో మధ్యావస్థ యెట్టిసు ఖమో, ఆంతరప్రకృతిలో గూడ నదియే సుఖము. ప్రేమతత్త్వ మేమనస్సున లేదో యామ నస్సు పశుమనస్సుకంటె నధమ మైనది. అత్యంతకష్టనిష్ఠురమైనది. అమిత మగు ప్రేమ (ఐహికము) యెవనికుండునో వాఁడు పామరుఁడై బానిసయై తుచ్ఛుఁడై సంతత దుఃఖమప రంపరచేతఁ జచ్చుట యంతకంటె మేలన్నట్లుండును. ఒకనియందు లేశము నమ్మకములేనివాఁడు పొందుబాధ యాకాశమువోలె హద్దులేనిది. అత్యంతము నమ్మకము గల్గినవాఁ డందఱికాళులధూళి తలయందుంచుకొనుచు నష్టకష్టములఁ బడచు నేడ్చినయే డుపు అనంతమైయుండును. విద్య బొత్తిగలేనివాఁడు, తినున దన్నమని చెప్పవచ్చునా? అమితమైన విద్య గలవాఁడుగూడ దినునది గడ్డియే. ఎందువలన? చదువుకొననియప్పుడు మనస్సులో నున్న జ్ఞానము మిక్కిలి చదువుకొనిన తరువాత ముక్కలై కాలి బూడిదయై యెగిరిపోయినది. బ్రహ్మరంధ్రము మొదలు పాదాంగుష్ఠమువఱకు నిప్పుడున్న వన్నియు నందేహములే. అన్నియు నన్యోన్యవ్యత్యస్తములైనవే. ఏఏదియు మనస్సునకెంత మాత్రము పట్టనిదే. బొత్తిగా సత్యములేనివాని నూరివారు రాతివినరులతో కట్టుదెబ్బలతో వెట్టికుక్కను గొట్టినట్లు గొట్టుదురు. అత్యంత సత్యనియమమున్నవాఁ డాముష్మికసుఖమును దరువాత బొందుఁగాక! ఇచ్చట మాత్రము బంధువిరోధియై, ప్రజాశత్రువై పడవలసినబాధ లన్నియుఁ బడును. ఉభయమధ్యావస్థయందే మనుజజాతికి సర్వప్రపంచమునకు సౌఖ్యమున్నది. అందు చేత సుఖము, బాధ యనునవి ప్రకృతిస్థితులుగాని స్వతంత్రత్త్వములు గావు. ఒక్క

ప్రకృతిసన్ని భోవొమువంకఁబోయి కష్టమైనది. అమితత్వమువంకఁ బోయి కష్టమైనది. అందుచేత సుఖము, బాధ యనునవి వస్తుతత్త్వమున నొక్కటే యని స్పష్టపడుటలేదా? బుద్ధభగవానుఁ డేమి సెలవిచ్చినాఁడు?

గీ. ఉభయదిశలఁ గష్ట ముండు సౌఖ్యమునకు
నదియె నడుమఁ జేరి యగును సుఖము
బాధ సుఖము నొకటి వస్తుతత్త్వమునను
గతినిబట్టి భేదకలన కలిగె.

ఉభయమధ్య సుఖావస్థనే **The golden mean** అని పాశ్చాత్యులభినందించినారు. ప్రకృతి సత్యము సృష్టిసంబధమైన **Economy** తో సంబంధించి యుండవచ్చును. తక్కువ వస్తుసామగ్రితో నెక్కువజన మెక్కువసౌఖ్య మొందుటకంటె కావలసినదేమి?

నాయనలారా! నే నిదివఱకుఁ జెప్పినయంశములను మీమనస్సులకుఁ బట్టఁజేయఁగల యొకచిన్నకథను జెప్పెదను. కథయనుటచే అది యసత్యమని యెంచకుఁడు. అది సత్యగాథయే.

ఒకమూర నొక బీదకుటుంబము. దానిలో భార్య, భర్త, ఇద్దఱు కొడుకులు, నిద్దఱుకూఁతులు. భార్యాభర్తలు నడికాలమున నున్నవారె కాని వృద్ధులు కారు. వారి పెద్దకొడుకునకు 18 సంll ములు వయస్సుండును కాని తరువాతిపుత్రునకు 16, మొదటికూఁతునకు 14, రెండవ కూఁతునకుఁ బండ్రెండుండును. మగపిల్ల లిద్దఱకు మెడలలో జందెములున్నని. కాని యవి పొరుగూర వేయఁబడిన దొంగజందెములు. 14 సంవత్సరములపిల్ల వివాహము కాకుండ రజస్వల యగుటచే వారికుటుంబ మొక్కసంవత్సర మునుండి బహిష్కరింపఁబడియున్నది. ఎవ్వరును వారి యింటికి రారు. వా రెవ్వరింటికిని బోరు. తిండిలేక మలమలమాడిపోవు చుండిరి. బహిష్కృతునకు ముష్టిమాత్రము పెట్టువారె వ్వరు? పైయూరికిఁ బోవుదమనన నడచిపోవుటకు శక్తిలేదు. బండియెక్కుటకు పైసలేదు. దినమున నొక్కపూఁట తిన్నసునార్గుఱకు భోజ్యము కావలయును గదా! అరసోలెడు నూక లింటియొద్దలేవు కదా! ఎట్లు కుటుంబము జీవింపవలసినది? దంపతులు శ్రీరామనామస్మ రణ చేసికొనుచు గూరుచుండుటతక్క నంతకంటె నేమి చేయలేరు. మగపిల్ల లిద్దఱు పైయూళ్లకుఁబోయి కూలినాలి చేసికొనివచ్చి తల్లిదండ్రులను బోషింపరాదా? వారిల్లు కదలువారుకారు. పౌరుషవంతులు. ఇఁక బ్రదుకు టెట్లు? మగపిల్లలకుఁ జదువులేదు వారు పరమమూర్ఖులు. అందుచేత వారితల్లిదండ్రులొక్కపని జేసిరి. రాత్రి యెనిమిదిగంటలకుఁ దండ్రి పదునాలుగేండ్లకూఁతును, దల్లి పండ్రెండేడ్ల కూఁతును దీసికొని చెఱి యొక కుండచేతబుచ్చుకొని ముసుఁగులువైచికొని రూపములుదాచివైచికొని సందెబిచ్చ మెత్తు కొని రాత్రి పదిగంటల కింటికి వచ్చి యాయన్నమును కొడుకులకుఁ బెట్టి తాముఁ దినుచుండెడివారు. ఈసంగతి యెవ్వరికిని దెలియదు. ఇట్లు జరుగుచుండ నొకరాత్రి వేఱువేఱుకుండలలోనున్న యన్నము నొక్కచోట నుంచుచుండఁగాఁ దనకుండలో నొక బంగారుగాజాపిల్లల తల్లికిఁ గనఁబడెను పాపము! ఏనంసారిణియో తనకుండలో నన్నమువేసి నప్పు డాగాజు జాఱిపడెనని యామె యూహించుకొనెను.కాని యెవరిదని యెవరి కీయఁగ లరు? ఎందఱు నంసారిణు లామెకుండలో నన్నమువైచిరో ఎవరి గాజో కాని నాయొద్ద

నున్నదని వెల్లడిచేయునెడలఁ దనసందెబిచ్చపుగొడవ వెల్లడికాక తప్పదే! అందువలన మఱునాఁడు కూడుదొరకదే! ఏమి చేయుటకును దోఁపక యొక్కభర్తతోమాత్ర మీసంగతి చెప్పెను. ఇది భగవత్కటాక్షచిహ్న మని యాతఁ డనుకొని "నిన్ననే నీతల్లి యిటకు వచ్చినది కదా! ఆమెచేతి కీ గా జిచ్చి తనయూరుపోయి దానిని విక్రయించి యాసొమ్మిక్కడకుఁ దెమ్మని చెప్పు"మని భార్యతోఁ బలుక నామె యిట్లు చేసెను. ఆసొమ్ము రాఁగనే యాతని కేమిబుద్ధిపుట్టెనో గాని దానిని లాటరీలో వేసెను. అయిదాఱుమాసములు కాకుండనే యాతనికి మొదటి బహుమాము 15 లక్షలరూయలు వచ్చెను. కాని పైపన్నెని, అదనఁపుఁబన్నెని, జాస్తిపన్నెని, లాటరీపన్నెని యింకేమో యని యింకేమో యని రూపాయ కొక్కయర్ధరూపాయి మట్టుకు ప్రభుత్వమువారు లాగివేసిరి. శేషించిన దింటికిరాఁగనే యాగృహస్థునికి గుండెలు గరినలఁబడఁగఁ దలదిరుగఁ బడిపోయెను. పడిపోయిన తండ్రి యొద్దకుఁ గొడుకులురాలేదు. వారితల్లియు రాలేదు. ఈసొమ్ము జాగ్రత్తపెట్టుటకు మార్గము లాలోచించుచుండిరి. నాన్న చచ్చిపోయినాఁడమ్మా యని 12 సంవత్సరముల వయస్సుగల కూఁతురేడ్వ మఱేమియుఁ దొందరలేదని కొడుకులనిరి. భార్యయున్నట్లే యనెను. అతఁడు మాటలాడలేనిస్థితిలో నున్నాఁడే కానిస్మృతిగలియున్నవాఁ డగుటచేత నీమాట లాతనికి వినఁబడెను. కొంతసేపటికిఁ దనయంత తానులేచెను. అనుభవింపవలసిన నెత్తిబ్రాఁత యింక నుండఁగ నప్పుడే చచ్చునా? పదునైదులక్షలకు నెనిమిదిలక్షలే యుండె నేమి యని తండ్రియడుగఁగఁ బన్నెలక్రింద మినహాయింపఁబడిన దని వారు చెప్పిరి. అందులకై యాతఁ డూరెగిరిపోవునట్లు గుండెలు కొట్టుకొని యేడ్చెను. "పోనీ! నాన్నా మనకు వచ్చినవే యెనిమిదిలక్ష లనుకొనరాదా" యని చిన్నపిల్ల తండ్రిని మందలింపఁగా, నాతఁడు మొగము దిగనైచుకొని లోలోన నగ్నిపర్వతమువలెఁ గుమిలిపోవుచుండెను.

ఈబ్రాహ్మణుని కింతధనము రాఁగానే యాజిల్లావా రంద ఱీతనిదర్శనము చేసి యభినందనములు ప్రకటించిరి. ఇతనికుటుంబము నితనినిఁ బెద్దమోటారుల్లోఁ గూరుచుండఁబెట్టి పుష్పవర్షము గురియుచు నూరివెంట నూరేగించి మహాజనసభలోనికిఁ దెచ్చి ప్రత్యక్షముగఁ బూజించిరి. కవులు పద్యములు చదివిరి. గాయకులు భార్యాభర్తలపై మంగళహారతులు బాడిరి.

అతనిపిల్లలను జేసికొందుమనియు, మగపిల్లలకుఁ బిల్లల నిచ్చెదమనియు లక్షాధికారు లయొద్దనుం బడేబడే వార్తలు వచ్చుచుండెను. కులభ్రష్టత యేమైనదో బహిష్కార మేమైనదో పైసముందన్నియుఁ బటాపంచలైపోయినవి. ధనమా! నీవెంత మహిమగలదానవు. అంద ఱును దానులుగఁ జేసికొంటివే! నీకు, భగవంతునకు భేద మెక్కడనున్నదో చెప్పెదవా? భగవంతునిఁ గూడ నొకప్పుడు తిట్టిన ప్రజ నీపాదధూళి శిరమున నిరంతరము ధరియిం చునే! భగవంతుని మాటయే మఱచిపోయి కోటీశ్వరుఁడు నిన్నే కొల్చుచున్నాఁడే! ఆహా! నీ మహిమకుహద్దున్నదా? బుద్ధిహీనుని బృహస్పతిగఁ జేయుచున్నావే. నంగినంగిమాటల శుంఠను మహావక్తగఁ జేయుచున్నావే. చెవులపిల్లిని సింహముగఁజేయు ప్రజ్ఞ నీది కాక మఱెవ్వరిది? పాపమందు బుణ్యమును, విషమందు మాధుర్యమును, దొంగతనమందు దొరతనమును, మిథ్యయందు సత్యమును, నవ్యాపనవ్యధోరణిని గనఁబఱుచు మహేంద్ర జాలము నాడించు ప్రజ్ఞ నీది కాక మఱెవ్వరిది. ధనమా! పరబ్రహ్మముకూడ నీవేనా" నమస్తే.

తనకున్న ధనముచేతనే ప్రజ లిట్లు తన్ను గౌరవించుచున్నారనియు, తన్నిదివఱ కనేకవిధముల బాధలు పెట్టిన జననంఘము నీతిజాతి మాలినదనియు, నీ బ్రాహ్మణుఁడు గ్రహింపలేదా! కష్టవిద్యాశాలలో గడితేఱినయాతఁ డామాత్రమైన గ్రహింపలేదా? తాను జావునకు సిద్ధమైనప్పుడు తనభార్యకుఁ గొడుకులకు దయ లేకపోయిన దని ప్రత్యక్షముగ నెఱిఁగినవాఁడు సభాధ్యక్షుల కర్పూరమాలలకుఁ, గవుల చంపకమాలలకుఁ గట్టువడునా?

ధనవిషయమై మనుజుని కున్న పసి యింత యంతయునా? అందులో దానిని గూర్చి వ్యాయవాదికున్న పసి చెప్పఁదరమా? ముగ్గురు న్యాయవాదులు వారిలో వారు సంప్రతించు కొని ధనసందర్భములం దీకుటుంబమున కింకఁ గలుగఁదగిన కలహములను నివారణచేసి వారిని బాగుచేయుటకై వచ్చితి మని వీరి యింటికి వచ్చిరి. కిట్టినివా రింకొకరీతిగా ననుకొనిరి. అది గణింపఁదగినది కాదు. ఒక్క న్యాయవాదియే యనేకాస్థానములను దిబ్బలు చేసియుండ ముగ్గురు న్యాయవాదు లీబ్రాహ్మణుని సొత్తునేమి చేయలేకుందురు? ఒక న్యాయవాది తండ్రినీ జీలదీసినాఁడు–ఒకఁ డొకసోదరునిపక్ష మైనాఁడు–మఱియొకఁడు మఱియొకసోదరున జేబులో నిముడ్చుకొన్నాఁడు. మీకుఁ గల్గిన యాస్తిన్యాయవాదుల యాస్తివలె కేవలము స్వార్జితమనియు, నది పంపకమునకు రాదనియుఁ జల్లనిమాట బ్రాహ్మణునితో న్యాయవాది చెప్పఁగ నాతం డదివఱకే కొడుకులపైఁ గోపమున్నవాఁడు కావునఁ జేటంత మొగము చేసికొని నాయనా! నాపంతము గెలిపింపుమని న్యాయవాదిని బతిమాలెను. ''అద్దే! అవలీలగ గెలిపింతును. ఒక్క చిల్లిగవ్వ కొడుకులకీయవలదు. ఏమి చేయఁగలరో చూతము. మీరాపట్టుమీఁదనే నిలువఁబడుఁడు. నాతమాష చూపింతు''నని న్యాయవాది మీనములు దువ్వుచుఁజెప్పెను. మిగిలిన యిద్దఱు న్యాయవాదులు సోదరులతో నేమి మాట్లాడిరో తెలియదు. కాని వారు తండ్రియొద్దకు వచ్చి మనకున్న సొత్తును బంచుకొందమని తండ్రికి బోధించిరి. ఆతఁడు కఠినముగ నిరాకరించెను. ఈసంగతి యెఱుఁగక ''నీవు నీ కొడుకులు పంచుకొన్నయెడల నడుమ నేను నాకూఁతులు చెడిపోవలసి నదా? వారి శుభకార్యములకు నా బ్రతుకు తెరువునకుఁ గావలసినంతసొమ్ము ముందుగా వేఱుచేసి మిగిలియున్నదే పంచుకొనవలయును.'' అని భార్య భర్తతోఁ జెప్పెను. ''నీకూఁతుల కేమి యిచ్చినను వారు తమ భర్తలకుఁ గలుపుదురు. నీకేమి యిచ్చినను నీవు పుట్టినింటివారికిఁ జేర్తువు. కొడుకుల కేమి యిచ్చినను వా రీకానులగోతములన్నియుఁ గోడంద్రనెత్తికెత్తెదరు. ఇదియంతయు నాకష్టార్జితమే. నే నొకరి కీయను. పో''మ్మని భర్త బదులుచెప్పెను. ఈ సంగతియేమియుఁ దెలియక లాటరీసొమ్మంతయుఁ దానుఁ దనకూఁ తులు హరింపఁ బ్రయత్నించుచున్నా రని తల్లిపైఁగొడుకులు చెలరేఁగి కొట్లుటకు సిద్ధమైరి. ఇంతలోఁ గర్మముచాలక యత్తగారు వచ్చినది. తనకు వినము పెట్టుటకుఁ బుట్టినింటనుండి భార్య తనతల్లిని బిలిపించిన దని బ్రాహ్మణుఁడు నిశ్చయపఱచుకొనెను. ఆమె కీసంగతియేమియుఁ దెలియక చనవుచే నల్లునియొద్దకుఁ బోయి, ''నాయనా! నీభాగ్యమునకు మూలాధారమును నేను. నే నాసొమ్ము తీసికొనివచ్చి నీచేత లాటరీవేయించుటచేత మనపుణ్య మాయని యింతమాహలక్ష్మి మనయిల్లు చేరినది. అందుచేత నీవు నాకెంత యిచ్చినను ఋణము తీర్చుకొనలేవు'' అని పరిహాసముగఁబలికెను. అత్త నల్లుఁడుమాదిగ మంచముక్రిందఁ గొట్టఁగ భార్య యడ్డుకొనెను. భార్యను మెడఁబట్టిగెంటఁగ నామె గోడమీఁ దబడి మూర్ఛపడియెను. అత్తగారు పెద్దగోలచేయఁగఁ బెద్దకొడుకువచ్చి మునలిదానిగొంతు

గట్టిగ నొక్కఁగ నామె క్రిందఁబడి చచ్చెను. తండ్రికి మతిపోయి యున్నదని వేంక కల్పించుకొని తండ్రినిఁ గ్రిందఁబడద్రోచి గొంతుకపై ద్రొక్కి తలగడక్రిందనున్న నోట్లక ట్టను దీసికొనుచుండెను. ఇంతలో నాడుపిల్లల యేడుపువిని దొడ్డిలోనున్న రెండవకొడుకు వచ్చి నాకులేకుండ నీవే యంతసొమ్మును దీసికొందువాయని చేతిలోఁ జెంబుదీసికొని యన్నగారి వెత్తిపైఁ గొట్టఁగ నాతఁడు చచ్చెను. అంతలోఁ గ్రిందనున్న తండ్రి లేచి నాసొమ్ము నీవు పట్టుకొనిపోవుదువా యని రెండవ కొడుకుగొంతు గట్టిగాఁ బట్టుకొనెను. తనప్రాణము రక్షించుకొనుటకుఁదిరుగ నాకొడుకు తండ్రిగొంత పీసికెను. ఇద్ద ఱక్కడవే చచ్చిపడిరి. తల్లి యిదివఱకే చచ్చెను. ఱడుపిల్లలిద్దఱు మాత్రము నిల్చిరి. చేతగవ్వలేనప్పుడున్న కష్ట మీకుటుంబ మనుభవించినది. లక్షలున్నప్పటికి కష్టము ననుభవించినది. సుఖసాధనములు లేకున్నను గష్టమే, మిగుల హెచ్చైనను గష్టమే.

అమిత మనుచు నభావంబు ననుచు రెండు
కష్టదశ లెప్పు సుఖము ప్రక్కలనె యుండు
నడుమను సుఖార్థి యూఁగక నడవవలయుఁ
దాటిబద్దపై నేటిని దాఁటినట్లు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

28. మహాపతివ్రత

హిమాలయ ప్రాంతాలనుంచి ఒక మహాయోగిని వస్తే–జంఘాలశాస్త్రి తమసాక్షి సంఘసభలో ప్రసంగింపజేశాడు.

ఆమె ఒక మహాపతివ్రత గురించి చెప్పడం సాగించింది.

పువ్వుల్లో గులాబిలాగ, రాళ్లలో వజ్రంలాగ, లోహాల్లో బంగారంలాగ, మగవారిలో శూరుడిలాగ, స్త్రీలలో 'పతివ్రత' పరిగణించబడింది. ఆడది పరమేశ్వరుడి ప్రతినిధి.

ఇలా చెప్పిన ఆమహాయోగిని తాను దూరశ్రవణశక్తి గలదాననీ, ఒకరాత్రి హిమవత్పర్వత కాంచనగంగా శిఖరమునకూర్చుని వుండగా ఇద్దరు విద్యాధరస్త్రీలు చెప్పుకొన్నమాటలు విన్నాననీ, వారి సంభాషణలో విషయాలే ఆధారంగా తాను చెపుతున్నాననీ,–వివరించింది.

ఆ మహాపతివ్రత కృష్ణా గోదావరీ మండలాల మధ్యప్రదేశంలో చాలా సంపన్నకుటుంబంలో, 'పుట్టుసిరి' లాగ పుట్టింది. ఆమె పుట్టుక, పెరకువ కూడా, ఇంట్లో వారికీ బయటివారికీ కూడా మహాలక్ష్మిసమానంగా అనిపించాయి. చిన్నతనంనుంచీ అసాధారణమైన మంచిలక్షణాలను ప్రదర్శించింది.

క్రమక్రమంగా ఇంటిదగ్గరే విద్యాభ్యాసం చేసింది. ఆంగ్లవిద్యకూడా కొంత ఇంటిదగ్గరే నేర్చింది. చదవను, వ్రాయను, తొందరగా నేర్చింది.

ఆమెరూప, శీల, సంపదలకు అనుకూలమైన మరొక సంపన్న కుటుంబంలో కోడలుగా మెట్టింది. అయింటి తనమంచితనం, దానశీలం, నిగర్వత, విద్య, వినయం పెంపొందించుకుంటూ భర్త ప్రేమలో పునీతురాలై, ఇరవైయేడేళ్లు కాపురంచేసింది. పాతకాలపు పతివ్రతల్ని మనంచూసి వుండక పోవచ్చుగాని–ఈమె ఈకాలంలో సర్వసాధరణంగా 'గృహిణి' ఎలాప్రవర్తించాలో తనప్రవర్తనతో నిరూపించింది. పద్దెనిమిది అధ్యాయాలలో భగవంతుడు బోధించిన అనాసక్తియోగాన్ని ఆచరణలో చూపింది. ఆమె పవిత్రాగ్ని స్పర్శతో దేహంచాలించిందని, విద్యాధరస్త్రీలు మాట్లాడుకోగా విన్నానని మహాయోగిని ప్రశంసాపూర్వకంగా చెప్పింది.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

హిమాలయప్రాంతమునుండి వచ్చిన యొకమహాయోగిని నేఁడీసభలో నుపన్యసించును. సావధానచిత్తులరై వినఁగోరెదను.

మహాయోగిని యుపన్యాసము

పుష్పములలో గులాబి యెట్లో, ఱాలలో వజ్ర మెట్లో, లోహములందు కాంచన మెట్లో, మగవారిలో శూరుఁ డెట్లో, యాఁడువారిలోఁ బతివ్రత యట్లు.

గీ. ''ధరణి నుండు ద్వితీయమౌదైవ మదియె'' యని యొకకవి చెప్పినాఁడు. ఆఁడుజన్మ మెత్తితరింపవలయును. అందులోఁ బతివ్రతయై తరింపవలయును. మఱియొక మార్గము లేదు. బ్రహ్మజ్ఞానసంపత్తిచేఁ బదునాల్గుజన్మములకైనను మగవాఁడు మోక్షము నొందకపోవచ్చును కాని, నిష్కలాపేక్షమైనపతిభక్తిచే నాఁడది యొకజన్మములో ముక్తినొందఁగలదు. పరమేశ్వరుఁడు కేవలప్రేమమయుఁడే కాక ప్రేమస్వరూపుఁడు కూడను. అందుచే ప్రేమతత్త్వమే సంసారతారక మైనది.

గీ. దంపతులప్రేమవంటి దీధరణి లేదు
వారికేమ్ము విభన మెప్పటికి నైన
వట్టిబ్రహ్మచారికి మోక్షపదవి సున్న
జ్ఞానియగువాని కద్ది సంశయము సుమ్ము.
ప్రేమలతఁ గోయు మని మనపెద్ద లనిరి
నాకు క్షమియింపు మామాట నచ్చలేదు
జన్మరాహిత్య పరమశాశ్వతసుమంబు
భవ్యతమరాగ లతికోద్భవంబు కాదె?

అందుచేత నాఁడువారిలో నొక్కగృహిణికి తప్ప బ్రహ్మచారిణులకు, యోగినులకు, సన్న్యాసినులకుఁ గూడ ముక్తిలభించు నని ధైర్యముగఁ జెప్ప వీలులేదు. ప్రేమాదిరసములు పుట్టుకతోడనే మనహృదయములం దున్నవి. మనము మనుజులకంటె నధమజంతువులుగా నున్నప్పటినుండియు నారసములు మనహృదయములం దున్నవి. ప్రియాగమనమున గుళుకు గుళుకు మనుగవ్వప్రేమాతిథ్య మెట్టిదో, సతీమణియింటి కేతెంచిన భర్తపాదసేవ నరిగా నట్టిది. వానికి రెంటికిని తత్త్వమున భేద మేమియు లేదు. జ్ఞానము మనుజునకు సహజము కాకపోవచ్చునేమో కాని ప్రేమామాత్రము సహజ మని యొప్పుకొనక తప్పదు. అట్టి ప్రేమరస మెండఁజేసికొనఁ బ్రయత్నించి జ్ఞానమువేఁ దరింపఁబూనుట యతికష్టము. అసహజము. అవసానమున దృశ్యాదృశ్యము కూడను. ప్రేమరస మెప్పటికినిగూడ నెండునది కాదు. ప్రేమ తొలఁగదు. జ్ఞానము కలుగదు. అట్టి సంధ్యవస్థలో మనుజుఁడు చిక్కుకొని యుభయభ్రష్టత నొందుట తగదు. అట్టిప్రేమాదిరసములు సత్కార్యములందు, సత్పాత్రములందు, సముచితముగ, సద్వినియోగము చేసికొనుట చేతనే జన్మసాఫల్యము కలుగును.

అది గాక స్త్రీతత్త్వసమ్మేళనములో జ్ఞానముపాలుకంటె, భక్తిపాలు హెచ్చు. ఎందుచేతనఁగా పరమేశ్వరునిచేతిలోనప్రత్యక్షముగ నున్ననృష్టితంత్ర మంతయుఁ బ్రత్యక్షముగ స్త్రీచే నిర్వహింపఁబడుచున్నది. ఆఁడుది పరమేశ్వరుని ప్రతినిధిని యైయున్నది. ప్రేమను

ధలచేఁగాని కనుటయుఁ బెంచుటయు నెన్నఁడు సిద్ధింపదు. అందులకు జ్ఞానమక్కఱలేదు. ప్రపంచపుటునికికిఁ బ్రేమయే మూలాధారము.

భగవంతుఁ డున్నాఁ డని, లేఁ డని, యున్నాఁ డనుమాటయే కాని యాతనికి సృష్టితో సంబంధము లేదని, లేనట్లే యున్నాఁ డని, యెన్నితలతిక్కకొసవెట్టే సన్నిపాతపుదారులైన మగవాఁడు బుద్ధిలేక త్రొక్కినాఁడు కాని మగువ యాచింత కెన్నఁడైన లోనైనదా? ఆసంశయుఁ మెన్నఁడైనఁ బొందినదా? ప్రేమస్వరూపుఁ డైనపరమేశ్వరుని యందు నిర్మలవిశ్వాసము, నిశ్చలభక్తి తప్ప ఆమెహృదయమున నింక ముఖ్యమైన దేమైన నున్నదా? ప్రేమామృతపూర్ణమైన యామెహృదయమందు మఱి యొక్కటి యుండుటకుఁ దా వెక్కడిది?

ఒకమహాపతివ్రత వృత్తాంతమును చెప్పుదును. దూరయానశక్తి కలదానను. కావున నే నొక్కరాత్రి హిమవత్పర్వతకాంచన గంగాశిఖరమునఁ గూరుచుండియుండఁగా నిద్ధలు విద్యాధరస్త్రీలు చెప్పుకొన్న మాటల వింటిని. అందువలన నేను చెప్పఁబోవు మహాపతివ్రతను గూర్చిన యంశము లనేకములు వారి సంభాషణవలనఁ దెలిసికొంటిని. అవి తరువాత చెప్పుదును. ముం దాయుత్తమకాంత యైహికకథావృత్తమునఁ గర్ణములు పవిత్రములు చేసికొందము.

కృష్ణగోదావరీమండల మధ్యగతప్రదేశమున నొక సంపన్నుని కుటుంబమున నామె కొన్ని సంవత్సరములక్రింద ప్రాచీగర్భమునఁ గాంతి రాశివలె నుదయించెను. ఆమె పుట్టినస్థల మేదియైన మీ కెందులకు? జన్మస్థలమునకు, జన్మకాలమునకుఁ బ్రాముఖ్య మీయఁదగదు. మంచి స్థలమునఁ బుట్టినజీవుఁడు. మంచివాఁ డని యనఁదగునా? చెడ్డస్థలమునఁ బుట్టినవాఁడు. చెడ్డవాఁ డనఁదగునా? జాతకుని స్వరూపస్వభావాదులు జన్మస్థలకాలములఁబట్టి లేశము నుండవు. మాలపల్లెయం దరుంధతి పుట్టలేదా? బ్రహ్మవంశమున బుట్టినశూర్పణఖ మాట యేమి? దేశ కాలపాత్రాదులు జీవప్రకృతులపైఁ గొంతమార్పు తప్పకుండఁ గలుగఁ జేయుపని కొందఱు చెప్పుదురు. కాని యది సాధారణప్రకృతుల వర్తించుమాట కాదు. అసామాన్యప్రకృతులన్నియు దేశకాలపాత్ర బద్ధములైనవి కానే కావు. సృష్టిసూత్రమున కవి లొంగునవి కానేకావు. వానిని మినహాయింపులక్రిందనే మనము చూచి గౌరవింపఁదగును. మనగౌరవము నని యపేక్షించునవి కానే కావు. అట్టి యసాధారణశరీర తేజస్సుతో, నంతకంటె నూఱురెట్లు హెచ్చయిన బుద్ధితేజస్సుతో, నంతకంటె నూఱురెట్లు హెచ్చయిన యోగ్యతాతేజస్సుతో, నంతకంటె నూఱురెట్లు హెచ్చయిన భక్తితేజస్సుతో, నంతకంటె నూఱురెట్లు హెచ్చయిన యాత్మతేజస్సుతో నా తేజస్వినీమణి వేణువులో నాఁటి ముత్తెము పుట్టినట్లు, పంకమున భగవత్పాదార్హమైనపద్మము పుటినట్లు నాఁగటిచాలున సీతామహాదేవి పుట్టినట్లు, సముద్రమున జగమంతయు శాసించు మహాలక్ష్మి పుట్టిన ట్లాసంపన్ననికుటుంబమున నీప్రభారాశి ప్రభవించెను. ఆకుటుంబమున కెంతో కాంతి వచ్చినది. ఆరాష్ట్రమున కెంతో కాంతి వచ్చినది. భారతదేశమున కంతకుఁ గూడఁ గాంతిఁ దేఁగల కమలాస్వరూపిణియై వెలసెను. ఆమె మహాలక్ష్మి యవతార మని పుణ్యాత్ములైన తల్లిదండ్రులెఱిఁగి యామెకు మహాలక్ష్మి యని నామముంచిరి. ఈబిడ్డ పుట్టినప్పటినుండియుఁ గన్నవారి కైశ్వర్యము వృద్ధి కాఁజొచ్చెను. తెల్లవాఱి లేచి మొదట నీపిల్లమొగము చూడకుండ దైవప్రార్థనమైనఁ దల్లిదండ్రులు చేసి యెఱుఁగరు. ఈమె మొగము చూచిన నేమిలాభము

కలుగునో యని యితరులుగూడ భావించి చూచుచుండెడివారు. ఈమె నెత్తుకొన్న నే
విశేషమో, యీమెకు పాలిచ్చిన నేమివిశేషమో, తల దువ్విన నేమివిశేషమో యని య
యూరిప్రభుకాంతలు, బ్రాహ్మణకాంతలు తలఁచుచు, సమస్తోపచారము లీపిల్లకుఁ జేయ
చుండిరి. ఎవ్వరికైన జబ్బుగా నున్నయెడల నీమెను వా రింటికిఁ దీసికొనిపోవుచుండుదుర
ఈమెయున్న చోట సుఖము, నారోగ్యము, నైశ్వర్యము, సంపత్తి యుండక తప్ప వ
యందఱసమ్మకమైయుండెను.

కాని యీమె బాల్యముననే కొన్నియద్భుతగుణములు వెల్లడించుచుండెను. పిల్ల
సాధారణముగాఁ బప్పని, పండ్లని, భక్ష్యములని వలపులాడిపోవుదురు కదా, యీమె యెదు
నెన్నిమధురపదార్థము లుంచినను వారి నేవియు ముట్టక వ్యాసపీఠమున నున్న భగవద్గీత
చేతఁ బుచ్చుకొని యక్కడఁ గూరుచుండెడిది. బొమ్మలని, గడియారములని, తోపుదుఱ
డ్లని ఎన్నివింతవస్తువు లెదుట నుంచినను వాని నేవియు స్పృశింపక వీణయొద్దకుఁ బ్రా
తీఁగలను గదల్చి కలకలలాడుచుండెడిది. ముత్యాలసరము లని, పచ్చలహారము ల
బంగారుకంఠమాలలని–ఎన్నియెన్ని వస్తువు లామెయెదుట నుంచినను వానినిఁ తప్పిం
కొని తల్లిగారి దేవతార్చనలోని జపమాల పట్టుకొని ప్రాఁగి వచ్చుచుండెడిది. ఈగుణమువ
నీమె పరుల కానందము, సుఖము, సంపద కలుగఁజేయువారే కాని స్వలాభము నపేక్షిం
యేపనియైనను జేయువారు కారని యప్పుడే యంద ఱనుకొనిరి. భక్తురాలగునని కొందఱ
సన్యాసిని యగు నని కొందఱు, ఎవరికిఁ దోఁచినట్లు వా రను కొనుచుండిరి. జనకమహా
చక్రవర్తియు, సన్యాసియు నేక కాలమందే యైనట్లీమె చక్రవర్తినియు, సన్న్యాసియుఁగూ
నేకకాల మందే కాఁగూడదా? యని కొంద ఱనిరి. ఇంత యసామాన్యప్రకృతు లర్ధాయుర
క్కులే యనియు, ఋణశేషముఁ దీర్చుకొనుటకు వచ్చి తుడిచిపెట్టఁదగినంత తుడిచిపె
తుట్టున నెగిరిపోవు ననియు మఱికొంద ఱనిరి. ఎవరినాలుక కడ్డేమున్నది? అన్ని స్వా
త్ర్యము లంతరించినను రాజకీయవిషయే తరతంత్రములందు మన కింక నాలాపస్వా
త్ర్యము మిగిలియున్నది కాదా?

ఇంటియొద్దనే యామెకు విద్యాభ్యాస మైనది. అతిశీఘ్రముగ వ్రాయను, చదువ
నేర్చుకొనెను. ఆంగ్లేయభాషయుఁగూడఁ గొంత నింటియొద్దనే నేర్చుకొనెను. అట్టి య
వయస్సు హెచ్చుచున్న కొలఁది మొగములో లక్ష్మీకళ హెచ్చుచున్నది. శరీరము పుష్టియై
కొలఁదిఁ గంటిలోని శాసనతేజము తీక్ష్ణమగుచున్నది. చిత్తమునకు వికాసము కలిగినకొల
నావరించిన పవిత్రత హెచ్చగుచున్నది.

ఒక మహాసంపన్నకుటుంబములోని బాలఁ డామెస్వరూప స్వభావాదులను
వరించి, వివాహము చేసికొనెను. ఆమె పుట్టినింటి వారికంటె నత్తింటివారికి హెచ్చుసంప
తయు, రాబడియు నుండెను. మహాదృష్టవంతురా లని జనవాక్యము విజృంభించెను.
వట్టి తెలివితక్కువమాట. ఈమెవలన నామహాసంపన్నుడే మహాదృష్టనంతుఁ డైనాఁ ద
మాట బుద్ధికలిగిన మాట. ఆయన కప్పటికున్న కష్టము విచారము లీమెవలనఁగాని శాంతి
వని భగవంతుఁ డెఱిఁగి యీమెను వారియింట సంరక్షకదేవతగ నుంచినాఁడు. పూజకొల
పురుషుఁ డన్నసామెత యిచ్చట వర్తింపదు. ఆతఁడు చేసికొన్న పూజకొలఁది
యీపొలఁతి లభించిన దని యనుకొనుట సరిగా నుండును. ఇక నామహారాజున కేమిలోప

ఆడినది యాట, పాడినది పాట, పలికినది పలుకు, చేసినది చేత, ముట్టినది ముత్యము, పట్టినది బంగారము–ఇట్లు లిరువదియేడునంవత్సరము లఖండవిజయముతో జరిగినది. ఆమె నంసార మెట్లు జరుపుకొనెనో ప్రతికాంతయేకాక, ప్రతి పురుషుఁడు గూడ తెలిసికొనవ లసినదే. మనుష్యలోకమునకంతకు నాదర్శప్రాయమైన యీమెవర్తనముఁ దెలిసికొనుటవలన దోషశమన మగును. పూర్వమహాపతివ్రతల కథలందువలె నీ మెచరితమునందు దావానలభక్ష ణములు, నూర్యగ్రహనిరోధనములు, మృతసంజీవనశక్తులు మొదలగు నమానుషప్రజ్ఞలు లేవు. ఆకాలపరిస్థితులఁబట్టి యానన్నివేశములు సిద్ధించినవి. ఈకాలమున నవి యేమియుఁ గలుగవు. ఇప్పుడు నర్వసాధారణముగా నర్వనంసారములందు జరుగు నన్నివేశములలోఁ బతివ్రతయైన గృహిణి యెట్లు ప్రవర్తింపవలయునో యీపాఠమును దేశమునకు శాశ్వతముగా నేర్పిన యీమహాపతివ్రత కనేకనమస్కారము లర్పించి మఱి చెప్పెదను.

నతికిఁ బ్రధమగణ్యమైనగుణము పత్యనురాగము. ఇదియే పునాదిగ నంసారభవన మంతయు నిర్మింపఁబడుచున్నది. ఇది యెంత బింకముగా నుండునో భవన మంతనిలుకడ కలదై యుండును. దీనితత్త్వమెట్టిదో రవంత పరిశీలింతము. భర్త పలికినపలుకులఁబట్టి, యిచ్చిన యీవినిబట్టి, చేసిన చేష్టనుబట్టి, చూపిన గౌరవమునుబట్టి భార్యయనురాగ మూనరవెల్లితలవలెఁ గ్రిందికి మీఁదకి నూఁగులాడుచుండును. అట్టి హెచ్చుతగ్గులు పత్యను రాగమున నెప్పుడు భార్యకుఁ గలిగినవో యది యనురాగము కాదని భావింపవలసియున్నది. భార్యకుఁ బతిని జూచిన మొదటిదినమున నెట్టియనురాగ ముండునో యట్టియనురాగమే విష్ణు దూతను జూచువఱి కుండవలయును. ఇట్టి యనురాగము కేవలము నిశ్చలమైనది. దీనికి హెచ్చుతగ్గులుండుట కవకాశము లేనేలేదు. తనకొఱకుఁ దా నెప్పుడు భర్తను బ్రేమించునో యప్పు డాయనురాగ మను రాగము కాదు. భర్తకొఱకే భర్తను ప్రేమించు పడఁతిమాత్రమే పత్యనురాగము కలది. పతివ్రత యని కొనియాడఁదగినది. అనఁగా నైహిక వాంఛాశూన్యమైన యనురాగము పత్యనురాగము. దేశమందున్న స్త్రీలందఱుఁ గూడ నిట్టియనురాగము నాకు నాభర్తపై నున్నదా యనా ప్రశ్నించుకొనఁగ యథార్థ మేదియో తెలియును. నే నెఱిఁగినంతవఱి కొక్కయీయిల్లాలిపత్యనురాగమే యట్లు నిశ్చలమైనది. సూర్యకాంతికి హెచ్చుతగ్గు లున్నవి; చంద్రతేజమునకు వృద్ధిక్షయము లున్నవి; సముద్ర మునకుఁ బోటుపాటు లున్నవి. కాని, యీమె యనురాగమునకు హెచ్చుతగ్గులు లేవు. మొదటితత్త్వ మైనయాకాశ మెట్లు మార్పు లేనిదో యీమె యనురాగ మట్టిది. నీ కెట్లు తెలియు నందురా–నే నద్భుతశక్తులను నంపాదించినదానను గాన మీరు విశ్వసింపవల యును. పదునెనిమిదధ్యాయములలో భగవంతుఁడు బోధించినయాననక్తియోగ మీమె నర్వ సౌఖ్యసంపూర్ణమైన నంసారమునఁ బ్రత్యక్షముగ నాచరణ మందుఁ జూపించిరి. స్త్రీ కిదియే మోక్షమునకు మొదటిమె ట్టని గ్రహింపవలసినది.

ఇఁక మఱియొక సుగుణమును గూర్చి చెప్పెదను. పతివ్రతలు సాధారణముగా గర్వభూయిష్ఠులై యుందురు. కాని బీదలపాలిటి కల్పవల్లియైన యీమహాలక్ష్మికి గర్వ మనునది గంధగంధలేశమైన లేదు. ''గీ. వినయకారుణ్యబుద్ధి వివేకలక్ష, ణాదిగుణముల కాటపట్టయినవాని'' అని ప్రహ్లాదునిఁగూర్చి పోతరాజుగారు చెప్పినారు. నర్వశుభ గుణము లలో వినయ ముత్తమమైనది. అట్టిగుణ మీమెకుఁ గలదు. ఎంతబీదపిల్లలైన నరే, యెంత

దరిద్రకాంత లైన నరే, యెంతరోఁతగలుగు స్వరూప స్వభావాదులు గలవారైన సరే యెంతయో దయతో లాలించి, బుజ్జగించి, యాదరించి, ప్రేమించి, బహూకరించి తిరిగి రమ్మని పంపివేయునుదారస్వభావ మామెయందుఁ దక్క నే నెక్కడఁ జూడలేదు. ఈ కాంతాశిరోమణి తనకుఁ బరులకుఁ దత్త్వమున నెంతమాత్రము భేదము లేదని త్రికరణశుద్ధిగ నమ్మినయిల్లాలు. అట్టి పరమార్థదృష్టిచే నామెకుఁ గలిగిన యీవినయ మామెను బరమపూజ్యు రాలిగఁ జేసెను.

గీ. ఇతఁడు నాశత్రుఁ డితని శిక్షింతు ననుచు
నతని నడఁచి త్రొక్కెడునాతఁ డధమతముఁడు
అందఱకు నేను దాసుఁడ ననుచు శిరము
నవనతము చేయునాతఁడే యధికతముఁడు.

అని బుద్ధుఁడు చెప్పిన నీతి నాచరణమునఁ జూపినజ్ఞానవతి.

ఇఁక గారుణ్యమును గూర్చి చెప్పెదను. దాదాపుఁగా నిరుది యేడు సంవత్సరముల నుండి యెన్ని వందలకుటుంబములకు గుప్తదానము చేసి పోషించెనో యెవరు చెప్పఁగలరు? చఁదువులకుఁ గొందఱకు, భోజనములకుఁ గొందఱకుఁ పుస్తకములకుఁ గొందఱకు, బట్టలకుఁ గొందఱకు, పత్రికానిర్వహణమునకుఁ గొందఱకుఁ, గవితాప్రోత్సాహమునకై కొందఱకు, నిత్యభుక్తికై కొందఱకు, నలంకారములకై కొందఱకు, బుద్ధిలేక పాడైనవారి కింతటినుండి బుద్ధి కలుగుటకై కొందఱకు, పరీక్షాబహుమానములకై కొందఱకు–తెఱపిలేని యీవి, తెంపులేని యీవి, మెప్పుకోరని యీవి, త్రికరణశుద్ధియైన యీవి, ప్రచ్ఛన్నమైన యీవి, కృతజ్ఞతాలేశ మైన నపేక్షింపయీవి, పరమాత్మ ప్రీతి కరమైన యీవి మనుష్యస్వరూప దేవతాకాంతయైన యీమెహస్తమునన్నది. ఎవరిమట్టునకు వారు నామీఁత నున్నదయ యీమహాలక్ష్మికి మఱి యెవ్వరిమీఁతను లేదని నిశ్చయముగా నమ్మి యీమెను బ్రేమించు చుండిరి. ఇట్టిభ్రమను గలిగించు ననురాగవైచిత్ర్యము శ్రీరామచంద్రమూర్తిహృదయమున నుండెను.

విద్య, జ్ఞాపకశక్తి మొదలగువానిఁగూర్చి చెప్పెదను. ఈమెకు మూఁడుభాషలలో నసాధారణపాండిత్య ముండెను. ఆంధ్రసంస్కృత భాషాగ్రంథముల లెక్కయేమి? మహాగ్రం థాలయములం దున్నయన్ని యాంగ్లగ్రంథము లీమె చదివినారు. చదివిన దంతయు జ్ఞప్తిలో నున్నది. ఈమెబుద్ధి యేకసంతగ్రాహిత్వము కలది. వీరికుటుంబము పశ్చిమఖండప్రయా ణము చేసినప్పు డీమె యాంగ్లేయ భాషాధోరణి, యాంగ్లేయ భాషాజ్ఞానమును గాంచి యచ్చటి గొప్పగొప్ప విద్వాంసులాశ్చర్య మంది యీమెను గౌరవించిరి. ఆంధ్రభాషలో నమృతప్రాయమై, ధారాశుద్ధి యైనకవిత్వ మీమె చెప్పఁగలిగియుండెను. ఈమె కవితా చాకచక్య మెట్టిదో విమర్శనప్రాగల్భ్య మట్టిది. కథాసంవిధానము నుండుఁగాని పూర్వోత్తరసం దర్భమునందుఁగాని, వాగ్వ్యవహారము లందుఁగాని యవలీలగ దోషము కనిపెట్టి దిద్దఁగలమ హానైపుణ్య మీమెకున్నది. ఈమె స్త్రీలసభలలో నెన్నిసారులో యుపన్యాసము లిచ్చి యుండెను. శారదాదేవివలె నుపన్యసింపగల విశాదరత యీమెకుఁ గలదు. ఇదికాక వీణావాద నమందు నేర్పరి. తనకుఁగల్గిన యిద్దఱు మగపిల్లలను, నల్గురాఁడుపిల్లలను మూడు భాషలందుఁదనవలె బాండిత్యము గలవారిగను, వీణావాదనమందు శక్తిగలవారిగను జేసి

నారు. పిల్లలందరు దైవభక్తి గలవారు. మాతృపితృభక్తిగలవారు. ప్రజాహిత తత్పరులు. వినయవంతులు, వివేకులు, సత్ప్రవర్తనులు, ఇట్టియుత్తమ సంతాను మామె కాంచెను. ఆ కాంతాలలామ చేసికొన్న పూర్వమహా పుణ్యముచేత నిట్టిసత్సంతాన మామెకుఁ గలిగినదని చెప్పఁదగదు. పిల్లలు చేసికొన్న పూర్వజన్మసుకృతముననే వీ రామెగర్భమునఁ బడుట సిద్ధించెనని చెప్పఁదగినది.

ఎన్నినెలలు ప్రయాణమైనను నరే యన్నినెలలలోను, నన్ని పట్టణములలోను, నెప్పటి కేవస్తువు కావలయునో యని ముందుగఁ దెలిసికొని వాని నెచ్చటెచ్చట భద్రపఱుపవలయునో భద్రపఱచి, యవసరానుసారముగ నుపయోగించి యొక్కవస్తువైనఁ బోకుండ నన్నియు నింటికిఁ దీసికొనిరావలసినదే. ప్రయాణపుఁబెట్టెల నామెయే సర్దవలయు నని చెప్పుదురు. ఎంతదూరదృష్టియో, యెంతవివేకమో, యెంతయవసరజ్ఞానమో, యెంతమేధాశక్తియో, యెంతభద్రప్రవర్తనమో చెప్పుటకు నాకు శక్తి చాలదు. కోటలో, బొమ్మలమేడలో, నెడమవైపున, రెండవగదిలో కుడిగోడమీది గుండ్రనిగూఁటిలో నున్న యావస్తువును భద్రపఱుపవలసిన దని జ్ఞాపకార్థముగా నిక్కడిదానులకు రెండువేలమైళ్లదూరముననుండి వ్రాయుట నెక్కడనైన వనియుండిరా? నేను వినలేదు. లక్షలకొలది రూఁబడి గల మహాసంసారపు భారమును భర్తకు లేశమైనఁ దగులకుండ నంతయుఁ దాను వహించి యవలీలగ నిర్వహించి పరమసుఖముగఁ బ్రవర్తించి వ్యవహారపుఁగాగితములు చూచుకొనుట, చదువుకొనుట, సుఖముగ మిత్రులతో సంభాషించుట మాత్రమే భర్తకు వదలినిచి యాయనను నిర్విచారస్థితి నుంచిన యా యిల్లాలి ఘనతకు, నుదారతకుఁ బ్రేమకు హద్దున్నదా! ఆహా! పరాతత్పరుఁడా! ఎట్టియాత్మను సృష్టించితివో యి!

ఆమెయొద్ద నున్ననందడి కెన్నడైనఁ దెఱపియున్నదా! సంగీతములవారు, సాహిత్యములవారు, పురాణములవారు, కవిత్వములవారు, సుపన్యాసములవారు, మంగళపుటారతులవారు, హాస్యసంభాషణలవారు, నగరులోఁ దనచుట్టునుండి గౌరవింపఁబడుచుండ, పహారామీఁద బట్టలు తెచ్చినవారు, బంగారువస్తువులు చేసి తెచ్చినవారు, చేఁపలవారు, నడవిపందులవారు, పండ్లగంపలవారు, బట్టలుకుట్టువారు లోపలకిఁ బంపిన దాసులు లోనుండి వార్తలు వస్తువులు మోచికొనిపోవుచు వచ్చుచుండ, నోహోహో! కన్నులపైకుంతము కదా! చూచి తీరవలసినదే–ప్రతిదినము పెంట్లియింటవలె నుండెడిదే. నిత్యకల్యాణమును పచ్చతోరణము కనఁబఱచినదే! దైవవశమునఁ బిల్లల కెప్పుడైన జబ్బు చేసినను భర్తకుఁ దెలిసినయెడల నాయన బెంగ పెట్టుకొను నని యెంచి సాధ్యమైనంతవఱకు రహస్యముగ నుంచెడివారు. తనసౌఖ్యముకొఱకు తా నొక్కపనియైనఁ చేసియుండ లే దని కంఠోక్తిగాఁ బలుకఁగలను. self అను తత్త్వమును బూర్తిగాఁ దుడిచి పాఱవైచినవ్యక్తి నెప్పుడైన వింటిరా! ఇప్పుడు విని పవిత్రత నొందుఁడు.

ఆమెకు మృతి యనఁగ భయము లేశమైన లేదు సరికదా మహానందము కూడను. భర్తప్రోత్సాహముచేతను దొరసానుల తొందరవలనను operation చేయించుకొనవలసివచ్చినప్పుడు బల్లమీఁదఁ బండుకొని, తన్నుఁ గోయఁ దెచ్చినకత్తులవాడిని బరీక్షించి, యిది యెందులకది యెందుల కని యన్నిటి యుపయోగమును దెలిసికొని నవ్వుచు మత్తుమందు తీసికొన్న మానినీశిరోమణికి మరణభయ మున్నదా?–ఏదైన నవ్వుకున్న యెడల దోష

మున్నయెడల దేవతన్ని ధానమునకుఁ బోవుటకు జంకుకాని, చంటిపిల్లవంటి నిష్కల్మషహృదయ యగునామెకు జంకేమి?

ఈమెకంఠరవము మర్దళధ్వనితో సమమైనది. అదియే యీమెకు మహాదృష్టలక్షణము. ఈమెమామగారిగొంతు మఱియొక విధముగా నుండెడిది. అది మందరధ్వనిలో మహాగంభీరమైనది. మాటలాడుచుండఁగా నాయనధ్వని యెంతయో లావుగ నిండుగ నున్నట్లగపడుచుండెడిది. అది యీయన కదృష్టలక్షణము. అట్టికంఠధ్వని యిప్పటి యుత్తరాదిమతస్థులవారి కున్నది కాని యీయిల్లాలిగొంతువంటిది నేను వినియుండలేదు.

తనకు రాఁబోవుమృతి నాఱుమానములకుఁ బూర్వమే యీమె కనిపెట్టెను. ఎప్పుడది వచ్చునో జాముజాము గడియగడియా లెక్కపెట్టుకొనుచుఁ బాఠశాలను వదలి బాలిక యింటికిఁ బోవునట్లు మహోత్సాహమున నుండెను. ఆమె కన్యగ్రామములో మృతి సిద్ధించెను. స్వగ్రామమునుండి వెడలఁ బోవునప్పుడామె మామగారి నిల్వువిగ్రహమునకు మోకాళ్లనమస్కరించి యిట్లు మనవిచేసెను. "మీవంశమును కొల్చినవకాశము నా కిఁక లేదు, మీపూర్వులవలన మీవలన వంశమునకుఁ గలిగినగౌరవమును నేను జెడఁగొట్టలే దనుటకు నాయంత రాత్మ సాక్షి–మీ నిశ్శరీరాత్మ సాక్షి. పరమాత్మ సాక్షి. నాకు సెలవు. నమస్కారము." అటుపిమ్మటఁ గొన్ని విష్ణుపటముల యొద్దకుఁ బోయి వానికి నమస్కరించి యిట్లు పలికెను. "నాకుఁ బరమేశ్వరునియందు దృష్టి నిలుకడగా నుండుటకు మీరు కొంత సాయము చేసినారు. ఇఁక నేను బరమాత్మయొద్దకే పోవుచున్నాను. నాకు సెలవిండు." తరువాతఁ దోఁట లోనికిఁ బోయి తాను పెంచినపూలచెట్లనన్నింటిని జూచి, స్పృశించి పుష్పములఁ ద్రుంపకుండ నాఘ్రాణించి "మిమ్మింకఁ జూడను. మీకు నాకు ఋణము తీఱినది" యని పలికి, జయపరమేశ్వరా! యని యుత్సాహమునఁ బోయి తనకుటుంబముతో రైలెక్కెను.

ఆమె యిప్పుడు వైకుంఠమున లక్ష్మీసన్నిధానమున నున్నది. అట్టి యత్యుత్తమురాలింతకాలము జీవించియుంటయే దుర్లభము. ఆంధ్రదేశమున నామెకొఱ కిప్పటి కేడ్చుచున్నారు. ఆమెకుఁ బునర్జన్మము లేదు. శాశ్వతమహానందము నామె రమాసన్నిధి ననుభవించుచున్నది. కొందఱుస్త్రీలామెను దేవతార్చనలో మహాలక్ష్మితో పాటు పూజచేసి కొనుచున్నారు.

విద్యాధరస్త్రీ లేమో మాటలాడుకొనుచున్నా రని చెప్పితిని కాదా! ఒకతె రెండవదానితో నిట్లనెను. "ఒక మహారాజు ధర్మపత్నియఁట. అత్యుత్తమురాలఁట. మంచివయస్సులోఁబవిత్రాగ్నిసపర్శమువలన దేహము చాలించినదఁట. ఆమెమహాలక్ష్మిసన్నిధానమున సావిత్రితో పాటు గౌరవింపఁబడుచున్నది. హంసయాన మెక్కి యామె యుత్తరద్వారమునొద్దకు రాగానే యప్సరస్త్రీలామెకు మంగళపుటారతులిచ్చిరి. కల్పవృక్షము జల్లునఁ బూవు లామెపై గురిసెను. అమ్మా! అమ్మా! యని కామధేను వానందమున నఱచెను. అరుంధతీదేవి యామెతలపైఁ గరముంచి యేదియో చదివెను. తనలోఁ గలుపుకొనున ట్లామెను మహాలక్ష్మి కౌఁగిలించుకొనెను. నీ కప్పుడు చూచుభాగ్యము లేక పోయెను. ఆమె పూర్వజన్మమున నొక్క మహాతపశ్శాలి యఁట. మోక్షమునకై తపస్సుచేయఁగా విష్ణుమూర్తి ప్రత్యక్షమై యిఁక రెండుజన్మము లెత్తినఁ గాని వీలులేదని పలికెను. తపస్సునకుఁ దిరుగ

నాతఁడు కూరుచుండెను. తిరుగ విష్ణువు ప్రత్యక్ష మయ్యెను. ఒక్క జన్మముకంటె నే నెత్తను. నా కప్పటికైన మోక్ష మిమ్మని యాతఁడు ప్రార్థింపఁగా నరే యాఁడుజన్మ మెత్తు మని విష్ణుఁ డానతిచ్చెను. ఆసాధువే యాయిల్లాలై పుట్టినఁట. పూర్వను సాధువున కలవాటున్న నూర్యోపాసన యామె స్త్రీజన్మమునఁ జేసికొనెనఁట. దేవతార్చన సంబంధ మగు నగ్నిజ్వాలచేఁ జీర యంటుకొన నొడలు కాలిపోయెనఁట. అట్టిపవిత్రాగ్నిచేఁ గాలినది జన్మపరంపర కాని శరీరము కాదఁట. ఇఁక నేమేమో యరుంధతిగా రుపన్యసించినారు. ఆమాటలు నాకుఁ దెలియలేదు. ఈమె మహాలక్ష్మి సన్నిధానమున శాశ్వతముగా నుండునఁట.'' ఇవే నేను విన్న మాటలు. కాంతలారా! మీరు చేయఁ గూడనిపని యొక్కటి యున్నది. అది యేదనఁగా, ఆమె యీపాపప్రపంచమును వదలిపోయిన దని యెన్నఁడు కంట నీరు పెట్టవలదు. మీరు చేయవలసినపను లున్నవి. అవియేవో చెప్పెదను.

ఆమెపేరు తలఁచుకొని కీర్తింపుడు. ఆమె స్వరూపమును దలఁచు కొని పూజింపుడు. ఆమెయోగ్యతను దలఁచుకొని యనుకరింపుడు. ఆమెప్రేమను దలఁచుకొని భగవత్ప్రేమ యట్టిదే యనుకొనుఁడు. ఆమె స్వార్థహీనతను దలఁచుకొని మహోత్తమజీవులతత్త్వ మదియే యనుకొనుఁడు. అఖండములైన సర్వసౌఖ్యములం దామె యంటిముట్టనట్లుండిన చర్యను దలఁచుకొని మోక్షమున కిదియే ప్రథమలక్షణ మనుకొనుఁడు. అట్టి దేవతాతేజస్సు లోకసంగ్రహార్థమై యవతరించి యొక్క సారి రప్పుమని వెంటనే శాంతించిన దనుకొనుఁడు. ఆమెకు జయజయ ధ్వానములిండు–జయ మహాలక్ష్మికి జయ–జయ చిన్నమ్మతల్లికి జయ జయ, ఆండాల్మహాదేవికి జయా–జయా–జయా, మహాపతివ్రతతాపతల్లికి జయ (నభలో నొకరు) యోగినమ్మా! మమ్మేడువవలదని చెప్పి మీరే యేడ్చుచున్నారేమి? అమ్మా! నిజమే. ఈమె యుత్తమగుణము లొక్కసారి మనము స్మరించుకొనుటచేతనే మనకింత దుఃఖము కలుగుచుండఁగా దాదాపుగా ముప్పదినంవత్సరము లామెతో సర్వసౌఖ్యము అనుభవించిన యామహాప్రభుఁడు నామెతో నేకప్రాణుఁ డైన మహాప్రభుఁడు యేకపత్నివ్రతుఁ డైన మహాప్ర భువు తరుగని దుఃఖములో మునిఁగియున్నాఁ డనుట యాశ్చర్యమేమి? కాంతలారా! నిత్యమామెను స్మరియించుకొనుచు సంసారములఁ జూచుకొనుచు సుఖముండుఁడు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

29. సభావ్యాపారములు

ఈరోజు ఉపన్యాసమేమీ లేదు. కాలాచార్యులు, వాణీదాసు, జంఘాలశాస్త్రి పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నారు.

సాహిత్య ప్రయత్నం, కృషి అనేవి ముందరి నుంచీ దరిద్రమైనవే. కాఫీ హోటలు, సినిమాలు ఈ రెండూ డబ్బు సంపాదించే వ్యాపారాలుగా కనిపిస్తున్నాయని జంఘాలశాస్త్రి అని–కాలాచార్యుల అభిప్రాయం అడిగాడు. దానికి అతడు తర్క–ధోరణిలో, చావుబతుకుల గురించి చెప్ప విచారించవలసిన అవసరం లేదన్నాడు. వాణీదాసు, కాలాచార్యులు తర్క ధోరణిని ఖండించి, రవంత సేపు పాడుము దొరక్క–సోతే నీ బాధ ఆదేవుడికి తెలుస్తుంది అన్నాడు. దాంతో, కాలాచార్యులు, తాను పాడుము మానేశానని చెప్పాడు. వీరు ఇలా మాట్లాడుకుంటుండగా, పోస్టులో సాక్షి పేర ఒక ఉత్తరం వచ్చింది. వ్రాసినవాడు 'అనామకుడు'. అందులో విషయం ఏమంటే, హరిజన సేవ చేసిన మహానుభావులు వార్తలలోకి ఎక్కినవారు ఎక్కగా, ఎక్కకుండా అజ్ఞాతంగా వుండిపోయిన వారు అనేకులు వున్నారనీ, వారి వివరాలు సేకరించి ప్రచురించవలసిన అవసరం ఎంతైనా వుందని – ఇందుకు తార్కాణంగా, వేదాధ్యయన పరుడైన ఒక బ్రాహ్మణుడి గురించీ, అతని భార్య గురించీ, వారి నిరతాన్నదాన దీక్ష గురించీ వ్రాశాడు. ఈ అన్నదాన విషయంలో కులభేదాలు ఏమీ లేవని వివరించాడు.

ఒకరోజు రాత్రి ఏటికవతలనుంచి, అన్నం కోసం ఒక హరిజనుడి కేకవిని–మాంచి వరద బిగిమీద వున్న యేటికి అడ్డం పడి ఆ మనిషికి విస్తరి వేసి అన్నం పెట్టిన వైనం తెలియచేశాడు. అన్నదానం చెయ్యడం తప్ప ఏ కీర్తీ ఆశించని ఆ బ్రాహ్మణుడి పేరు అజ్ఞాత అన్నయ్య చైనులు గారని, ఆ అనామకుడు వ్రాశాడు.

జంఘాలశాస్త్రి యిట్లు పలికెను:–

ఈదినమున నుపన్యాస మేదియు లేదు. సభావ్యాపారముల కేర్పాటయినదిన మిది. ధనము లేకపోవుటచేత నన్ని వ్యాపారములు నశించినట్లు మావ్యాపారముకూడ నశించినది. సారస్వత వ్యాపారము నృష్ట్యారంభమునుండియు దరిద్ర వ్యాపారమే. అందులో నిపుడు

మజీంత పుట్టిమునుక వచ్చినది. ఇది యెందులకు వచ్చినదో యెవ్వఁ డెఱుఁగఁడు. ఎంతకాల ముండునో యెవ్వఁ డెఱుఁగఁడు. ఏమిప్రతిక్రియ చేయవలయునో యెవ్వఁ డెఱుఁగఁడు. ఇప్పటికిఁగూడ కాఫీహోట లొకటి, సినీమా యొకటి, యీరెండువ్యాపారములు మాత్రమే ధనాకర్షణ సమర్థములై యున్నవి. కాలాచారీ! నీ యభిప్రాయమేమి?

కాలా:– చచ్చిపోవుదు మనియేనా బెంగ? చావకుండ నున్నంత వఱకు బ్రదికియే యుందుముకదా! బ్రతికియుండఁగా జావువిచారమేల? చచ్చిన తరువాత విచార మసలే యక్కఱలేదు గదా! ఇఁగ బెంఁగఁగొన వలసిన యవస్థయేదో నా కగపడుట లేదు.

వాణీ:– అంతేకాని మధ్యావస్థ లేదా?

కాలా:– మధ్యావస్థ యనఁగాఁ జావునకుఁ బూర్వావస్థయేనా? కొన్నిదినము లారోగ్యము పూర్తిగాఁజెడి రోగముచేఁ దీసికొను నవస్థయేనా?

వాణీ:– ఔను.

కాలా:– మధ్యావస్థకు నూత్రము మధ్యానస్థ యనునది రెండు భాగములుగా నున్నది. జ్ఞానవంతమైన యవస్థ, జ్ఞానములేని యవస్థ, అనఁగా నొడలు తెలియని యవస్థ, ఒడలు తెలిసిన యవస్థ. ఒడలు తెలిసిన యవస్థలో బ్రదికియున్నా మన్నసంగతి యెఱిఁగియే యుందుము గనుక బ్రతికియుండఁగా విచార మక్కఱలేదన్న సూత్రము పనికే వచ్చును గదా! ఒడలుతెలియని యవస్థలో విచార ముండుట కవకాశమే లేదు గదా!

వాణీ:– ఏడ్చినట్లే యున్నది.

జంఘా:– వాణీదాసా! అతనికిఁదోఁచిన ట్లతఁడు చెప్పినాఁడు. అతని నట్లు నిందించుట తప్పు కాదా?

వాణీ:– మనలో మనము స్నేహముచే ననుకొన్న మాటలకు లెక్కయేమి?

కాలా:– మనలో మనమే యన్నమాట యక్కఱలేదయ్యా పైవారు నన్నుదిట్టినను నేను దిట్టువాఁడను సరే కదా! తిట్టినట్లు కూడ నే ననుకొనను.

వాణీ:– ఎందుచేత?

కాలా:– దీనికిఁ గూడ నదియే సూత్రము. ఒకఁడు నన్ను దిట్టుటకు నే నర్హుఁడను గానంతవఱకు పైవారు తిట్టినది నన్ను గానే కాదు కదా. నాకు బాధ యెందులకు? అర్హుడనే యగుదునా ఆతిట్లను వందనములతో నంగీకరింతును. ఏవిధముచేత బాధ కనఁబడదే.

వాణీ:– ఆచరణమున కక్కఱకు రాని శుష్కాలాపము లాడుచున్నావు. రవంతసేపు పొడుము దొరకకున్న యెడల నీబాధ దేవ్ఁడెఱుఁగును.

కాలా:– నీ వెఱుఁగవు కాఁబోలు. పొడుము మానివేసి 3 సంవత్సరము లైనది. చక్రవర్తిగారు డబ్బు లేకపోవుటచేత కాఫీలో పంచదార తగ్గించుకొనినప్పుడు నాముక్కు వారి నోటికంటె నెక్కువయాయని యొక్కసారి నస్యవినర్జన మొనర్చినాను.

వాణీ:– నీపీడ, దేశపుపీడకూడ వదలినది.

అంతలోనే తపాజవాను సాక్షిపేర వచ్చిన యొక యుత్తరమును నాకిచ్చెను. నేను జూచుకొని నా మిత్రులకు వినిపించితిని. అదియిట్లుండెను.

సాక్షికి:– అనామకుఁడనేక నమస్కారములు.

మాజిల్లాలో హరిజనులకు సేవఁజేసిన మహానుభావుఁడొకఁడుండెడువాఁడు. ఆతఁడు చేసినసేవయంతయుఁ బ్రచ్ఛన్నముగ జరిగియుండుటచేత నాతనికి విశేషఖ్యాతి రాలేదు. కాని యాపుణ్యాత్మునిఁ గూర్చి యీ మండలములో మట్టున కెన్నియో చిత్రములై కథ లిప్పటికిఁ జెప్పుకొనుచున్నారు. ఇట్లు ప్రతిమండలమునకు నొక్కరిద్దఱు హరిజన సేవకు లుండిరి. హరిజనసేవాపవిత్రములైన యీదినములలోనే వారి ప్రచ్ఛన్న చరిత్రమును పైకిఁదీసి యవి ప్రజల కుపయోగించునట్లు చేయకపోయిన యెడల దోషము కాదా! కృతఘ్నత కాదా? ఆంధ్రులలోఁ బ్రముఖ లేమిచేయనలెననఁగా మండలమున కిద్దఱు బుద్ధిమంతులను నియమించి పూర్వమున నచ్చటచ్చట హరిజనసేవకు లెవ్వరో వయస్సు మీరిన స్త్రీపురుషు లను గనుఁగొని వారిచరిత్రము లన్నియుఁ బ్రోగుచేయింపవలసియున్నది. అవి పరిశీలించి ప్రకటింపవలసియున్నది. వారిలో నెందఱో పవిత్రులు నవతారపురుషు లున్నారు. నేను మాజిల్లాలో బాహాటముగ నందఱకు చెప్పుకొనుచున్న కథ నొక్కదానిని మీకుఁ బంపించితిని. దీనిని మీరు సాక్షిలోఁ బ్రకటింపవలయును.

అనఁగ ననఁగ బ్రాహ్మణుఁడు. ఆతఁడు వేదాధ్యయనసంపన్నుఁడు, పవిత్రచ రిత్రుఁడు. అతని భార్య యత్యుత్తమురాలు. భర్తను పరమదైవముగఁ గొల్చుచుండెను. వారికిఁ బిల్లలు లేరు. ఉన్న భూవసతి వలని రాఁబడిచేత వారు సర్వజాతుల కన్నప్రదానమొన ర్చుచు భుక్తశేషమును దాముదినుచు సుఖముగ నుండిరి. కాని నిరతాన్నప్రదానము చేత ఋణమెక్కుఁవైనది. దానినిఁ దీర్చుటకై భూముల నమ్మివేసినాఁడు. ఇల్లుమాత్రము మిగిలి నది. ఇకను విరివిగ నన్నప్రదానముజేయుచున్నాఁడు. ఋణము నెమ్మదిగాఁ దిరుగఁ బెరుగుచున్నది. ఈతని యన్నప్రదానమున కా నేళ యీవేళయు లేదు. ఆజాతివాఁ డీజాతివాఁ డనుభేద మంతకంటె లేదు. ఎప్పు డెవఁడు వచ్చి యన్నమడిగిన నరే వానికిఁ బెట్టవలసినదే.

ఇట్లుండ, నొక్కనాఁటిరాత్రి నిదురించుట కింకఁ బ్రయత్నపడుచుండఁగా నేటియా వలినుండి ''చైనులుగారూ! అన్నము! అన్నము'' అని కేక వినఁబడెను. ఆకేకతో నదిరిపడి ''ఆ'' యని యొక్క కేక వైచెను. ఇంతలో ''నేను చండాలుఁడ నని ఈచుట్టుపట్టుల గ్రామములవారు నాకన్నము పెట్టలేదు. మీరుపెట్టుదురని తెలిసి మీయొద్దకు రాఁబోవఁగ నేరడ్డము వచ్చినది'' అని మఱింతగట్టికేక వినఁబడెను. వచ్చుచున్నా నని బ్రాహ్మణుఁడు గొంతెత్తి యఱచెను. రాత్రిభాగము కావున నడుమ నీరున్న కారణమున నేరు విశాలమైనద య్యును గేకలు సులభముగా వినవచ్చుచుండెను. ఏటికిఁ బూర్తిగా వఱద తగిలినది. నడుము బిట్టాక్కి నురగలతోఁ బ్రవహించుచున్నది. భయంకరముగ నున్నది. అది చీఁకటిరాత్రి. అంతలో బ్రాహ్మణుఁ డేటియొద్దకు వచ్చినాఁడు. మోకాలు దిగని యంగ వస్త్రము కట్టినాఁడు. దానిపై మఱియొక్క యంగవస్త్రము నడుమునకు బిగించినాఁడు. పెరుగున న్నము కలిపియుంచినకుండ నెత్తిపైనున్న చుట్ట కుదిటిపైఁ బెట్టినాడు. కుండపైనున్న మూఁకుటిలో నావకాయ మొదలగువానిని బెట్టినాఁడు. దానిపై రెండడ్డాకువిస్తళ్లు

పెట్టినాఁడు. దానిపై నొక్క యంగవస్త్రము వైచి గడ్డము క్రిందికి గావంచయంచులు రానిచ్చి గట్టిగ ముడివైచినాఁడు. ''జయా! పరమేశ్వరా!'' యని యేటికడ్డుపడి ''నాయనా పంచమసోదరా! వచ్చుచున్నాను. ఒకపావుగంట శాంతింపుము'' అని చుట్టుపట్టులనున్న మెట్టలు ప్రతిధ్వనించున ట్లొక్క కే వైచినాఁడు.

ఆహా! ఆహాహా! ఈతఁడు మనుజుఁడా? దేవతయా? యని గాలి హాహా కార మొనర్చుచున్నది. ఎంత పరోపకారశీలతయో యని చెట్ల మీఁదిపిట్టలు తత్కీర్తిగానము చేయుచున్నట్లుండెను. ఏటిప్రవాహమొకప్రక్కకుఁ ద్రోచివైచుచున్నను బింకముగ నిల్వుటీఁత నీఁదుచు సాధ్యమగునంతవఱ కేటి కడ్డముగఁ బోవుచున్నాఁడు. అంతరిక్షము నుండి దేవతలు పుష్పవృష్టి గురియుచున్న యట్లు చినుకులు పరకపాటుగఁ బడుచున్నవి. ఇంతసాహసమేల చేయవలయు నని భార్యయైనఁ జెప్పలేదా? బతిమాలుకొనలేదా? కాళ్లైఁ బడలేదా? ఏడ్వలేదా? ఏమో! ఎవఁడెఱుంగును! కాని యామె యింటియొద్ద నెంత యేడ్చుచున్నదో! ఆమె యింటియొద్దనున్నదా? ఏటియొద్ద దైవప్రార్థన మొనర్చుకొనుచుఁ గూరుచుండియున్నదే! పంచమసోదరుని క్షుద్బాధ శాంతింపఁజేసి భర్త తిరుగ వచ్చుట సిద్ధించునెడల నే నాతనితోడనే యింటికిఁ బోవుదును. రాఁడేని యేగంగతల్లి కడుపున నాభర్త యుండునో యక్కడనే నే నుందునని నిశ్చయపరచుకొని యటుఁ గూరుచుండియున్నది. ఆహా! ఏమియిల్లాలు! దైవప్రార్థన యెట్లుచేసికొనుచున్నదో చెప్పనా? ''పరమేశ్వరా! నీవు నాభర్తను రక్షింపుము. నన్ను నాభర్తయే తరింపఁజేయును. కావున నన్నుఁగూర్చి ప్రార్థించి నీకు శ్రమమీయను. ఒకవేశ నాభర్త కీ రాత్రితో యూఁకలి శాంతించువఱకైన నా భర్తను సజీవునిగ నుంపుము. ఇంతకంటె నేను మఱేదియుఁ బ్రార్థింపను. నా భర్తతో నేనుందును గావున నాకు విచారము లేదు.''

ఆహాహా! ఇట్టిప్రార్థన మెచ్చటనైన వింటిరా! ఆంధ్రసోదరులారా! ఈదంపతులలో నెవరు యోగ్యతరులో చెప్పఁగలరా? ఇట్టి వారిని గన్న మామండల మెంతకృతార్థమో చెప్పవలయునా?

ఆవలిగట్టుచేసి విస్తరిలో నన్నము వడ్డించి యొడిలో నాహారి జనుని బెట్టుకొని యెడమభుజమునకుదాపుకొని యన్నముతినుటకుకూడ హవాలా తప్పిన యాతనినోటిలో రవంత రవంత యన్నము పెట్టి మంచినీరిచ్చి శోషిల్లుచున్న ప్రాణములకు శక్తినిచ్చి బ్రదికించి, పుణ్యము కట్టుకొన్న యాబ్రాహ్మణోత్తముని పేరేదో చెప్పనా? అజ్జాడ అన్నయ చైనులుగారు. అజ్జాడ అన్నయ చైనులుగారు! హరిజనప్రపంచమా! ఆంధ్రదేశమా! ఒక్కసారి ధన్యవాద మిమ్మ్మ! చాలదు. మఱియొక్క సారి! ఆంధ్రదేశమా! ఆతనిభార్యపేరు తెలి యునా? ''పాపాత్మఁ''డనైన నాకుఁ దెలియదు. ఎవ్వరైన నెఱిఁగియుండునెడల సాక్షిద్వా రమునఁ దెలియఁబఱచి సంతసింపఁజేయుదురా? అజ్జాడ చైనులకు రెండు ధన్యవాదములే యిచ్చిరి. కాని యీనారీశిరోమణి మూఁడుధన్యవాదముల కర్హురాలు. కానిండు. ఒకటి, రెండు, మూఁడు.

చిత్తగింపుఁడు,
అనామకుఁడు.

30. ఒక కథ

జిరఘూలశాస్త్రి ఈరోజు ఉపన్యాసం ఏమీలేదని చెప్పి–ఒక కవి వ్రాసిపంపిన కథ చదివి వినిపించాడు.

ఆ కథ, నిరతాన్నదాత, అఖండ రామభక్తుడు కొర్నిపాటి సుబ్బరాజు గారిది. 1922 నాటికి నూరేళ్ల క్రితం జరిగిన కథ. ఆ సుబ్బరాజుగారు జొన్నల అన్నం, నక్క-దోసకాయ ఊరగాయ, గోగుపచ్చడి, బర్రె పెరుగుతో నిరతాన్నదానం ముప్పై సంవత్సరాలు చేశాడు. ఇది చేస్తున్న కాలంలో అనేక ఆంధ్ర కావ్యాల్ని గునపమంత గంటంతో తాటాకుల మీద వ్రాసి దాచిపెట్టేవాడు. అలాగే పోతన్నగారి భాగవతం కూడా వ్రాసుకుని తన అభిమాన గ్రంథంగా పెట్టుకున్నాడు. కవులందరి పోలికలను తన ఊహతో దర్శించినట్లు అందరికీ చెప్పేవాడు.

కాలక్రమాన ఆయన ఆర్థికంగా పూర్తిగా చితికిపోయాడు. ఈ సంగతి తెలిసి, ఊరిలో ఒక సంపన్నుడు ఆదుకోబోతే, వద్దని తిరస్కరించి–భాగవత ప్రతిని తలమీద కట్టుకొని–భార్యనీ, అయిదేళ్ల ఆడపిల్లనీ తీసుకుని –ఒంటిమిట్ట కోదండరామున్ని నమ్ముకొని–ఊరు విడిచి వెళ్లిపోయాడు.

అది ముహమ్మదీయ రాజ్యం. ఒకనాడు నవాబుగారు వెళ్లేబండికి అడ్డు నిలచి తన చేత కావ్యాల ప్రతులు వ్రాయించుకొని, తనకు జరుగుబాటు చేయించమని కోరాడు. అతని తీరు నచ్చకో ఏమో నవాబు భటుల చేత కొట్టించాడు. ఒక భటుడు, సుబ్బరాజుగారి జంధ్యం తెంపబోతే, రొంటి నున్న గంటంతో వాడి తలమీద కొట్టాడాయన. వాడు పడిపోయాడు. సుబ్బరాజు గారికి కారాగారం ప్రాప్తించింది. ఆయన కారాగారంలో వుండగానే, ముందు కూతురు, తరువాత భార్య మరణించారు. ఆయన గంటంతో కొట్టిన మనిషి ఇరవై రోజుల తరువాత మరణించడంతో, నవాబుగారు సుబ్బరాజుగారికి మరణశిక్ష విధించారు. తలారి, ఆయన తల నరకలేకపోయాడు. సుబ్బరాజుగారు, తను తలమీద కట్టుకున్న భాగవత ప్రతిని విప్పి పక్కన పెట్టి, కోదండ రామప్రభో! అని గట్టిగా అరిచి, క్రిందపడి మరణించాడు. ఈ సన్నివేశానికి ఆ తరువాత నవాబుగారు, ఆయన ప్రజలు ఏడిచారు. నవాబు రామభక్తుడయ్యాడు.

సుబ్బరాజుగారి కథను, ఈదేశంలో రామభక్తి పారవశ్యానికి గుర్తుగా ఆ కవి వ్రాసి పెట్టాడు.

జరిఘూలశాస్త్రి యిట్లు పలికెను:–

నాయనలారా! నే డుపన్యాసము లేదు. ఎవరో యొక కవి సాక్షిసంఘములోఁ జదువుటకొఱ కొకకథను వ్రాసిపంపెను. దానిని చదివెదను. సావధానముగ వినఁగోరుచున్నాను.

I

నక్కదోసకాయ యూరుగాయ, గోఁగుకూర పచ్చడి, బట్టై పెరుఁగు అంతే. అంతకంటె నక్కడ నేమి దొరకును? అవే పంచభక్ష్య పరమాన్నములు. ఇట్లునుదినము వేళపాళయని లేక కొర్నిపాటి సుబ్బరాజుగా రన్నప్రదాన మాచరించుచుండిరి. అన్నము జొన్న యన్నము. విస్తరి బొడ్డుమేడియాకు విస్తరి. ఉప్పు ఱాతియుప్పు. నీరు దిగుడుబావి నీరు. ఇప్పటి మాటయా? దాదాపుగా నూఱేండ్లక్రిందటిమాట, ముప్పది సంవత్సరములీ ట్లబ్రాహ్మణుఁ డన్నప్రదాన మొనర్చినాఁడు. మహానుభావుఁడు. నిర్గర్వుఁడు. నల్వురు మోయఁదగిన చొప్పమోపును తానే పొలమునుండి తలపైఁ బెట్టుకొని తెచ్చి బట్టైలకు వేయును. వానిపాలు పాలికాపులచేఁ బితికింపక తానే పితుకును. ఇంట నందఱి కాతని భార్యయే వంట చేయును. వంటలక్కలు కాని, నీట్లబ్రాహ్మణులు కాని వారి కెవ్వరును లేరు. ఉంచుకొనవలసిన యావశ్యకతయు వారికి లేదు. తమయింటిపని నొకరిచేఁ జేయుంచుట వారు తప్పుగ భావించుచుండెడివారు. పచనాదికృత్యములను బైఁరిచేఁ గూలిపెట్టి చేయించినయెడల నతిథిపూజాఫలము పరిపూర్ణముగఁ దమకు సిద్ధింపదేమో యని వారికి భయము. పాలుమాలికలేక, యొడలు దాఁచు కొనక భూతసంతుష్టి చేయుటయే పుణ్యకార్య మని నమ్మి వా రట్లు చేసిరి.

మగనికిఁ దనకుఁ దవ్వెడుబియ్యము కుతకుతలాడించుటకే యీ కాలపుఁ గుల కాంతల కోపికలేదు. దొడ్డిలో దాసి. వీథిగుమ్మములో సేవకుఁడు. ఇంటిలో వంటలక్క. ఇంతపై బలగమున్నఁగాని యీలు మగనికంటె నెక్కువలేని యిద్దఱికాఁపుర మీ దినములలోఁ గడతేఱకుండ నున్నది. పంచపాళిలో నాఱవైచినబట్ట భటునిపాలు. పెరటిలోఁ బాఱవైచిన తొప్పల దాసిపాలు. పడమటింటిలోని పప్పు నేయి సామాను బాపనక్కపాలు. అమ్మగారు పడకటింటిలో నౌరంగజేబు నవలను జదువుచు నావులింతల పాలు. అయ్యగా రణాబిల్లపై సంతకములతో నప్పులపాలు. ఇంతేకదా యిప్పటి సంసారముల సౌభాగ్యము! అతిథిపూజ లేదు. సరేకదా పతివిస్తరిలోఁ బచ్చడి మెదుకులయినఁ జేసి పెట్టినదేది? వంటప్రొయ్యి యొద్దఁ గూరుచుండు నెడల మొగముమెరుగు కరఁగిపోవునప్పుడు మగనిమొగాన నింక మొద్దులేగాని మఱియేమున్నది! ప్రాసయతి మంజరీద్విపదలో నుండవచ్చునో లేదో తెలియును గాని, పప్పుడికిన తరువాత నుప్పువేయవలయునో–యుడుకకముందు వేయపలయునో తెలియదు. ఉండలు జిల్లెడుకాయలు కాకుండ నత్తెసరు వేయగల యమ్మగా రన్నపూర్ణాదేవి గారు. వంటయింటిలోని ప్రాణాహతులతోను, బజారులోని కారపుఁబూనతోను గాఁపురము లెట్లో జరుగుచున్నవి. జరుగకమానునా? కాలచక్రము నెవరడ్డగలరు? ఆయువుండఁగా నెవరేమి చేయఁగలరు? మగలబ్రతుకులే యిట్లు దిగనాఱునప్పుడు మఱఁదుల, బావల, యత్తల బ్రదుకు లడుగవలయునా?

కాని యాహా! ఏమిదుర్గమ్మ! దూపాటి సీమనుండి వచ్చినవాఁ డొకఁడు. నల్లమల నుండి వచ్చినవాఁ ఁడొకఁడు. కోనసీమనుండ వచ్చినవాఁ డొకడు. పలనాటిసీమనుండి వచ్చినవాఁ డొకఁడు. ఇట్లెందఱో యతిథులై రాఁగా, వారి కందఱకు బహుపరిశుభ్రముగా వండి భర్తకుట్టి సిద్ధపఱచి యుంచిన యాకులలో వడ్డించి, వారు సంతుష్టిగ భుజించిన తరువాతఁ దాను భుజించును. ఇట్లొక్కదినమా? ఒక్కమాసమా? ఒక్క సంవత్సరమా? ఆఁడుదాని పరిపూర్ణ సహాయ్యము లేకుండ బ్రహ్మదేవుఁడైన నన్నప్రదాన మాచరింపలేఁడు. అన్నప్రదానపుణ్యమంతయు నంగనదే!

ఇఁక నీ యతిథులకు సాయంకాలమున మూఁడుగంట లగుటతోడనే –అనపుఁగాయదినములలో తంపటిపైచిన యనుపగుగ్గిళ్లు, లేజొన్న కంకులదినములలో నూచబియ్యము. మొక్కజొన్న పొత్తుల కాలములో మొక్కజొన్నపొత్తులు. ఇట్లు ఏయే కాలములలో నేది వచ్చునో యది యల్పాహారముగా వారియెదుటఁ బెట్టి తాను చేగునప మంత గంటము చేతఁ బుచ్చుకొని, తాటియాకులపై భాగవతమో, హరివంశమో, మఱే దియో యా సుబ్బరాజుగారు వ్రాసికొనుచుండును. ఇట్లాతఁ డెన్ని గ్రంథములో వ్రాసినాఁడు. కవీశ్వరు లాతనికిఁ గన్నులఁ గట్టినట్లుందురు. తిక్కన సోమయాజి యాఱడు గుల పొడవగువాఁడని గ్రద్దముక్కుకల వాఁడని నడుముకట్టులోఁ జురకత్తి కలవాఁడని, కాలిన మొక్కజీడిపప్పు రంగువాఁడని యాతఁ డా యతిథులతోఁ జెప్పుచుండును. చేతిలోనున్న యనుపపప్పు ముందుఁ గథలోనున్న కాలిన మొక్క జీడిపప్పెక్కువ రుచింపకుండుటఁజేఁ గాఁబోలు వా రామాటలను గణింపకుండెడివారు. తిక్కన సోమయాజిగా రిట్లుండెనని మీకెట్లు తెలిసినదని యాయన నెవ్వరు నడుగలేదు. అడిగినయెడలఁ గారణ మాయనకు మాత్ర మేమి తెలియును? అట్లాయనకుఁ దోఁచుటయే కారణము, పింగళి సూరన్నగారికి ముందుదంతములలో నొకటి పొడుగని, యొకటి పొట్టియని చెప్పును. ఆయనకు ఆలాగునఁ గనఁబడుచుండఁగ నెవరు కాదనఁగలరు? ఒకనాఁడు తాను తనభార్యయుఁ బండుకొని యుండఁగాఁ దాను ''దుర్గా! పోతరాజుగా రెట్లుందురని నీయభిప్రాయ''మని యామె నడిగెను. ఈప్రశ్నయామె కెందులకో బోధపడదు. ''పొడుగుగాను, సన్నముగాను నుందు రని నే ననుకొందు'' నని యామె బదులుచెప్పెను. భర్త యడిగిన నడుగును కాక! భార్య కీప్రత్యుత్తర మెందులకో యంతకంటె బోధపడదు. ''అలాగునఁ గాదుసుమీ, పొట్టిగా నుందును. తగుమాత్రమైన బొజ్జ కలిగి యుండును,'' అని భర్త బదులు చెప్పెను. ఔనని, కాదని, భార్యా భర్తలిట్లొక్కనిముసము సంభాషించుకొన్నమీదట భర్త–''నేనన్న మాటయే నిజమగునెడల–నదిగో–గోడబల్ల మీదఁ బెట్టిన మద్దెల యున్నదే అది గణగణ మ్రోఁగును'' అనుసరి కేదైన యెలుక దానిని గదల్చెనో మఱేమైన జరిగెనో తెలియదు. కాని, మద్దెల గణగణ మ్రోఁగెను. అంత నాఁతడు మహానందమున లేచి మద్దెలను గ్రిందిగి దింపి దానికిఁ బూజ లొనర్చి, పోతరాజుగారి మద్దెల యని దానికిఁ బేరిడి, పోతరాజుగారి గజేంద్రమోక్షాది గాథలలోని పద్యములన్నియుఁ గీర్తనముగాఁ బాడుకొనుచు మద్దెల వాయించుకొనుచుం డెను. ఇది జరిగి యిరువదేండ్లు దాఁటినది. అల్పాహారకాలమునం దీకథ యతిథులకుఁ బ్రతిదినమును చెప్పును. అట్లు కొంతసేపు చెప్పి–

క. ''పలికెడిది భాగవతమఁట, పలికించెడివాఁడు రామభద్రుండఁట నేఁ
బలికిన భవహర మగునఁట, పలికెద వే యొండుగాథ పలుకగ నేలా?''

యను పద్యమును చదివి ''ఆహా! మహానుభావుఁడు! ఎంత మృదులముగా, నెంత లలిత ముగా, నెంత మనోహరముగాఁ జెప్పినాడో! మాతండ్రి–పోతరాజుగా రిప్పు డెక్కఁడ నుండునో యని కన్నులనీరు జలజల రాల్చుచుండును. ఊచబియ్యపుఁబదనుచేఁ జొంగలు గార్చుచున్న భుక్తిప్రియులకుఁ బోతరాజుగారి కవిత్వ మప్పుడు కావలయునా?

ఇట్లు కొంతకాల మత్యల్పముగా నాసంసారమునకు దినములు జరిగినవి. కాలమెక్కఁరీతిగాఁ గడచునా? వర్షమునలు వెనుకఁ బట్టినవి. పంటలు తగ్గిపోయినవి. క్షాము తలసూపినది. అందువలన నతిథులు మఱింత వచ్చుచున్నారు. అందఱకు సంతుష్టిగాఁ బెట్టుచునే యున్నాఁడు. అప్పులు చేసినాఁడు. పాటిపెర ళ్లమ్మినాఁడు. ఇల్లమ్మినాఁడు. ఇంటిలోఁ బాత్రసామగ్రి నమ్మినాఁడు. కోటప్పకొండ మ్రొక్కఁతో సంబంధించిన తన యెడమకాలి వెండికడియ మమ్మినాఁడు. అమ్మగా మిగిలిన రెండుగేదెలు కూడఁ జచ్చిపోయి నవి. ఇంటిలో నేమియు లేదు. మట్టమధ్యాహ్నమగుసరి కిద్ద ఱతిథులు వచ్చినారు. ఇంటిలో నరసోలెడు గింజలు లేవు. అప్పుడు భార్యయొద్ద కాతఁడు పోయి యిప్పుడువచ్చిన యతిథులను బూజించు టెట్లు?–అని యడిగెను. పసుపురాచిన దారమును మెడను గట్టుకొని మంగళసూత్ర మిచ్చి ''ఇది యమ్మి వారికిఁ గావలయు సామగ్రిని తెండు. అమ్మాయి చల్దియన్నము తినినది. మన మీ దినమున భుజింపవలదు. వారికి సాయంకాలము కాకుండ భోజనము పెట్టి పిల్లను దీసికొని రాత్రి యెటకైనఁ బోవుద''మని భార్య పలికెను. మంగళ సూత్రమునకు రెండువరాలు కాఁబోలు వచ్చినది. కొంత వ్యయపఱచి యాయతిథు లకు సంతుష్టిగా భోజనము పెట్టి శిష్టాన్నము కొంత సాయంకాలమునఁ గూఁతునకుఁ బెట్టి, తాము తినక వా రారాత్రి యెవ్వరి తోడను జెప్పకుండ వెడలిపోవఁ బ్రయత్నించిరి. కాని, యీ యూరకున్న యొకనంపన్నుఁ డీయంశమును గర్ణాకర్ణిగా విని యాయనయొద్ద కారాత్రి వచ్చి ''సుబ్బరాజుగారూ! మీకు దుర్దినములు వచ్చినవి. దరిద్రతకంటె దుస్థితిలేదు. మిమ్మి నేను గనిపట్టుదును. మీ రెక్కఁడికిని భోవల''దని చెప్పెను. ''ఓయబ్బ! దుష్టదిన ములు మాత్రము మమ్మేమి చేయఁగలవయ్యా! దరిద్రము పోతరాజుగారు పడలేదా? ఆయనకంటె మే మెక్కువవారమా? ధర్మబుద్ధిచే నొకరు నాకింత పెట్టగ నేను దినువాఁడను గాను. పోతరాజుగారిని రక్షించిన యెంటిమెట్ట కోదండరామమూర్తి మమ్మేల రక్షింపకుం డును? అడవులఁ బట్టి పోవుదుము. నాయనా! పోతరాజుగారు ''అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమునఁ జచ్చు''నని చెప్పినారు. మ మ్మొడ్డుపెట్టకుము. కాని నా దొక్క కోరికయున్నది. ఎవ్వరైన నతిథులు వచ్చినెడల బోతరాజుగారు సంతసింతురు అని చెప్పి యాతని నంపివైచి, ఇదివఱకుఁ దాను వ్రాసిన తాటాకు గ్రంథములన్నియు నటుకమీదఁ బదిలముగా దాఁచి, తాను వ్రాసిన పోతరాజుగారి భాగవతమును దేవతార్చనపుఁ బెట్టెతోఁగూడ నంగవస్త్రమునఁ జుట్టి తలపైఁ బెట్టుకొని, పోతరాజుగారి మద్దెల వీపునఁ గట్టుకొని, గంటము మొలలోఁ బెట్టుకొని, గూఁతు నెత్తుకొని, భార్యచేయి పట్టుకొని–

క. ''శ్రీకంఠచాఖండన, పాకారిప్రముఖవినుతభండన విలస
త్కాకుత్స్థవంశ మండన, రాకేందు యశోవిశాల రామన్నపాలా!''

– యని పఠించుకొనుచు వెడలిపోయెను.

II

అది మహమ్మదీయుల రాజ్యము. ఆయూరిపే రేదో తెలియదు. జోడుగుఱ్ఱ బండిమీఁద నవాబుగారు బయలుదేఱి–'కాసు' తోఁట జూచి తిరుగ నింటికిఁ బోవు న్నారు. ఆదారిలో నొక బ్రాహ్మణుడు నిలువఁబడియున్నాఁడు. గుఱ్ఱపుబండి వచ్చు న్నది. ''ఓయబ్బా! ఆఁపవయ్యా బండి! ఒక్క లేపరుగా?'' యని బండివాని కాతఁడ కేక వైచెను. బండియాఁపక యాతఁడు తోలుకొనిపోవుచుండఁగా నా బ్రాహ్మణుఁడ గుఱ్ఱపుఁగళ్ళెములు బట్టుకొని బండి నాఁపెను. గుఱ్ఱములు బెదరుచున్నవి. కాని వానినిగదల కుండ నాతఁడు పట్టుకొనియున్నాఁడు. ముందుఁ గొంతదూరము పోయిన తురుపున రులు వెనుకకుఁ దిరిగిరి. మఱికొందరు జనులు మూఁగిరి. నబాబుగారు బండి దిగినారఁ ఆయన యొద్ద కాతఁడు వెళ్ళి ''మాయబ్బ! నీవేనఁటయ్యా! ఈచుట్టుపట్ల పొలాల కంతకు రాజవు? సరేకాని, నా కేమైన భత్య మేర్పాటు చేసి తాటాకుగ్రంథములు వ్రాయింపరాద టయ్యా! నాకు జరుగుబాటుగను నుండును. నీకు ఖ్యాతిగాను నుండును. సుఖముగాఁగ రుచుండి వ్రాయుదును. నీ కచ్చేరిలోనికి నన్ను రానీయరని నిన్నుఁజూచుట కీడ వచ్చినాను. ఎవరేమి చెప్పుకొందురో వినవచ్చును. బండి నిమ్మళముగాఁ దోలించుకొన దయ్యా'' యని సబాబుగారి ననియెను. బ్రదుకుఁదెరువు కొఱకుఁ బ్రభుని ప్రథమము సందర్శించునప్పటి సంభాషణమిట్లున్నది. పాపము! భటత్వమెఱుఁగునా? ప్రభు మెఱుఁగునా? మన్ననయెఱుఁగునా? మార్దవమెఱుఁగునా? మర్యాదయెఱుఁగునా? మాట రెఱుఁగునా? అయ్యో! వట్టిజానపదుఁడు. రూపమున మోటు. వస్త్రమున మోటు. పలుక మోటు. వట్టి నిష్కల్మషుఁడు. అమాయకుఁడు. మనసున నొకటి నోట నొకటి యున్నది శుద్ధ సత్యకాలపువాఁడు. ఋషి విగ్రహుఁడు. హరిహరీ! ఇప్పటి యింద్రజాల మహేంద్రజ మహామహోపాధ్యాయులలోనివాఁడా? ఇప్పటివారిలోఁ గొందఱు సత్యసంధులకుఁ దక్ దఱుచుగా నెవ్వరినిఁ జూచినను నొసలు వెక్కిరింపు. నోరిగిలింపు. మొగమెదుట నమస్కా ములు. వెనుకఁ దిరస్కారములు. పలుకు తేనెపట్టు. ఫిడికిలి కోఁతిపట్టు. పెదవిని మంద సము. హృదయమునఁ జంద్రహాసము. ఆతఁ డిట్టివారిలోవాఁడా? తన కుపకారపు మా యేదో యెఱుఁగఁడు. ఎదుటివాని కపకారపు మాట యేదో యెఱుఁగఁడు. మనసులో స సత్యమని తోఁచునో యది పైకి రావలసినదే. ఆ వచ్చటలో నొక సాపులేదు. నంట లేదు. నీటు లేదు. మూట లేదు. వట్టి కల్లుపడి కంకరరాతిపాకముతో రావలసినదే! ఆ డనిన మాటలు విని నబాబుగారు కొంత నిశ్చేష్టితులై యూరకుండిరి. నబాబు గారివంటి నిని సుబ్బరాజుగా రెట్లు చూడలేదో, సుబ్బరాజు గారి వంటి వానిని నబాబుగా రట్ చూడలేదు. ''మాయబ్బ, అదేమి చూపయ్యా!

''కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం జెందరే?
వా రేరీ సిరి మూఁట కట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులున్ ప్రీతి న్యశస్కాములై
యీరే కోర్కుల వారలన్ మఱచిరే! యిక్కాలమున్ భార్గవా!''

యని పోతరాజుగారు సెలవిచ్చిరయ్యా! అడుగక యడుగక యఱువదియేఁ కడిగినానయ్యా! నీపాలా లన్నియు నా కూరకే యిచ్చినను నా కక్కఱలేదు. ఏ

కొలువు చేయించుకోవయ్యా! ఎందుల కింతయోజన! నీ విచ్చు భత్యము నా కేమియు నక్కఅలేదు. వింటివా? పూట కొక్కయతిథి కన్నముపెట్టి మిగిలిన గంజితో నా కూఁతును రక్షించుకొందును. నేను నా భార్యయుఁ బస్తుండెదము. కాదేని కాయయమో కసరో తినుచుందుము. మామాట కేమి?'' అని బ్రాహ్మణుఁడు పలికెను. ఇంకను నబాబుగారు నిల్వ్రగ్రుడ్లవైచుకొని చూచుచుడఁగా ''నీతో నాకేమి పోవయ్యా! రా జన్న ప్పుడు పోతరాజుగారే రాజుగాని నీ వెక్కడి రాజువయ్యా'' యని యాతఁడు పోబోవ్రుసరికి నబాబుగారు భటులకుఁ గన్నుసన్న చేసిరో యేమో కాని నల్వురుభటులు సుబ్బరాజుగారిని సున్నములోని కెముకలేకుండఁ గొట్టిరి. సుబ్బరాజు గారు రామరామ యనుచు నా దెబ్బలన్నియు నే మాత్రము తిరుగుబాటయిన లేకుండ కన్నయినఁ జిట్లించుకొనకుండ సహించెను. మఱి యొక భటుఁ డింతలో వచ్చి యాయన జన్నిదమును ద్రెంపఁబోవఁగ నాతని నెత్తిపై తన గంటము మొదటితోఁ గొట్టెను. వాఁడు గిలగిల లాడుచుఁ గ్రిందఁబడిపో యెను. అంత సుబ్బరాజుగారు కారాగృహమందుంపబడిరి. నబాబుగారు తమ మహలునకుఁ బోయిరి.

III

స్ఫోటకపువ్యాధులచే, విషూచివ్యాధులచే నా మహమ్మదీయ గ్రామమంతయు నిండి యున్నది. జనులు కుప్పతిప్పలుగాఁ జచ్చుచున్నారు. బండ్లమీఁద వైచి శవములను దీసికొని పోవుచున్నారు. సుబ్బరాజు గారి కారాగృహమున కొక్క నలువది బారల దూరములో నొక కానుఁగు చెట్టున్నది. అది వీధి ప్రక్క నున్నది. దాని క్రిందనే దుర్గమ్మ యామెకూఁతుతో నివసించుచున్నది. తనకుఁ, దనభర్తకు నన్నము లేక పోయినను ఏజిరుగడమో కష్టపెండ లమో తిని కాలక్షేపము చేయఁగలరు. కాని, అయిదేండ్లపిల్ల అట్లు బ్రదుకఁగలదా? ఆపిల్లను సంరక్షించుట కామె యెచ్చటినైన దాన్యమున కొప్పుకొని చేయవలయును గదా! ఎక్కడెక్కడఁ దిరిగినను సదుపాయమగు నౌకరి దొరకలేదు. తుదకొక్కయింట నెల కొక్క వరాజీతమున కొప్పుకొని యాయింటను స్ఫోటకపు వ్యాధిచే బాధపడుచున్న యొక కాంత కుదయమునుండి సాయంకాలమువఱ కుపచారము చేయుట కంగీకరించెను. మానవేతనములోఁ దీర్చుకొవనుపద్ధతి మీద నొక్క మాడ ముందుగాఁ దీసికొని పిల్లదానికిఁ గావలయు సామగ్రి కొని కుండతోఁ దెల్లవారకముందే రవంత వండి, కూతునకుఁ బెట్టి, దానిని దండ్రిగారాగృహముగుమ్మము వెలుపల విడిచి, తాను సేవకుఁ బోవుచుండును. ఇట్లు పదునైదు దినములు గడవకుండ నామెపిల్లకు జ్వరము వచ్చెను. పుచ్చుకొన్న మాడ కింకను రెండు దినములసేవ బాకియున్నది. ఋణము తీర్చుకొన కుండరాదనియు, నుచితముగ నెవ్వరిసొమ్మును దీసికొనఁగూడదనియు నాజ్వరము తోడనే పిల్లను గారాగృహాంగణమున విడిచి సేవకుఁ బోయి యాబాకి తీర్చుకొని, యంతట నుండి సేవకు రాఁజాల నని చెప్పెను. పిల్లకు స్ఫోటకము వచ్చినది. రెండీతాకు లడ్డుకట్టుకొని యాచెట్టుక్రిందనే వాని చాటునఁ బిల్లను బెట్టుకొని కంటికిమంటి కొక్కధారగా నేడ్చుచుండును. తండ్రి కారాగృహమందు భీష్మస్తవరాజమును జదువుకొనుచుండును. ఇట్లుండఁగాఁ బైటచాటున గుడ్డలలోఁ బిల్లను బెట్టుకొని యొక్కనాఁ డుదయమున దుర్గమ్మ కారాగృహమునొద్దకు వచ్చి పిల్లను తండ్రికి జూపి యేడ్చెను. ఉదయ మయిదుగంటలకే యాపిల్ల మరణించెను. మృతినొందిన తనకూఁ

తను, రోదనము చేయుచున్న భార్యను గాంచి, కన్నులనుండి జాలిన యిందుపగింజలం తటి రెండు బాష్పములి నట్టి త్రోచినైచి–''ఓయబ్బ! ప్రపంచ మిట్టిదని యెవ రెఱుఁగరు? తొందరపడకు. ఒంటిమెట్ట కోదండరాముఁ డిచ్చినాడు. ఆయనయే తీసికొన్నాఁడు. ఓయబ్బ! తనసొమ్ము తాను తీసికొనఁడేమి? పోతరాజుగారి మాటయందు నాకున్నట్లే నీకుఁ బ్రమాణబుద్ధి యున్నది కావునఁ జెప్పెదను.

''మచ్చిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము! దేహి పుట్టుచుం
జచ్చుచునుండఁ జూచెదరు చావకమానెడువారిభంగి నీ
చచ్చినవారి కేడ్చెదరు చావున కొల్లక దాఁగవచ్చునే?
యెచ్చటఁ బుట్టి నచ్చటికి నేగుట నైజము ప్రాణకోటికిన్.''

అందువలన నిప్పుడు మనయమ్మ వైకుంఠమునననున్నది. నే నెఱుఁగుదును. నాకు రాత్రియే తెలిసినది'' అనెను. ఇంతలో స్నోటకపుశవము నచటికిఁ దీసికొని రాఁగూడదు పోపో యని భటు లామెను బెదరించిరి. ఆమె యేడ్చుచు ''నాయనలారా! పోవుదును. క్షమింపుఁ''డని భర్తవంక తిరిగి ''ఎవ్వరికైన నొకటంక మిచ్చినఁగాని యీపిల్లకుఁ దరువాతికర్మము జరుగదు. నావద్దనేమియు లేదు. నేనే తీసికొనిపోయి నా చేతులతోనే యీపని చేయవలయునా? యని గోలున నేడ్చుచుఁ దటాలునఁ బోయెను. ఆమె యేడ్చువాని భర్తగుండెలేకావు బ్రహ్మాండగోళమంతయు గడగడవడఁకిన ట్లయ్యెను. నిజమైన యాపద వచ్చినప్పుడు– అందులో మహాపతివ్రత కాపదలవచ్చినప్పుడు–ఆ యాపద కన్నకడుపుతోఁ జేరినప్పుడు–పునాదులతోఁ బెల్లగిల్లునట్లు–ప్రకృతి కంపించుననఁగా నాశ్చర్యమేమి? అంత సుబ్బరాజుగారు–

''లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
దావుల్దప్పెను మూర్ఛవచ్చె తనువ్ డస్సెన్ శ్రమంబయ్యెడి
నీవేతప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగుం దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!''

యను పద్యమును జదువుకొని కొంత శాంతిపడి రామనామస్మరణ మొనర్చుకొనుచుండెను.

IV

సుబ్బరాజుగారి గంటపు దెబ్బతిని భటుఁడిఱువదిదినములు బాధపడి మరణించెను. ఖూనీ నేరము చేసినందులకు సుబ్బరాజుగారిని నబాబుగా రింక శిక్షింపవలసియున్నది. విచారణ కొక్కదినమున నాయనను నబాబుగారి కచ్చేరికిఁ దీసికొనిపోవుట కేర్పాటయినది. వకీళ్లు కావలయునా? దస్తావేజులు కావలయునా? సాక్ష్యము కావలయునా? నబాబుగాని యెదుటనే కాదా నేరము జరిగినది? భీష్మైకాదశీదినమున విచారణ జరుగనైయున్నది. ఆ యుదయముననే దేఁకుకొనుచు నాతని భార్య కారాగృహము నొద్దకు వచ్చి భర్తను గాంచి ''నా కీయుదయమున నుండి వాంతులు భేదు లగుచున్నవి. నా తమ వీ సాయంకాలమువఱకు నిల్చునని తోఁపదు. నడువలేక యిట్లు దేఁకుకొనుచు వచ్చితిని. సర్వధాయనుగ్రహముంపవలయును.'' అని లోయేఱుఁబడిన గొంతుతోఁ బలికెను. భార్యనుగాంచి భర్త

కొయ్యవాఁడైను. ఒక్క నిమునమునకుఁ బ్రజ్ఞుఁగాంచి చూచుసరికిఁ దనపాదముల నాయనశలా కనుండి యావలకు లాఁగి వానిని గన్నులందుఁ జేర్చుకొని–శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః–యని భార్య యనుచున్నది. భర్తకుఁ గంటివెంట నీటిచుక్క లేదు. భార్య నంతకంటె లేదు. అతిశుష్క మైన వస్తువున కయిన రసమున్నది. అతినీచమైన కార్యమునకై రసమున్నది. అగ్నిజ్వాలలకైన రసమున్నది. కాని యతిదుఃఖమున రసము లేదు. ''మీపాదసన్నిధిని నాకు మరణింపవలయునని యున్నది. కాని యీవ్యాధి గల నన్నిక్కడఁ గొంతసేపైన నుండనీయరు. భటులు పొమ్మనకుండనే స్వామీ వెడలిపోదును. నమస్కారము'' అని యామె దేఁకుకొనుచుఁబోయెను. ఆమె యేమనుకొనుచుఁ బోయెనో యేమనుకొనుచుఁ గొట్టులో నుండెనో వారికే తెలియఁదగినది. అంత–

క. కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగి గణములపాలన్
గలఁడందు రన్నిదిశలను
గలఁడుకలం డనెడివాఁడు కలఁడో లేఁడో

యని చదువుకొనుచు నిట్లు గలిగిన సందేహమును వెంటనే పరిహరించుకొని–

క. నీపాదకమలసేవయు, నీపాదార్చకులతోడి నెమ్మి నితాంత
శ్రీపాదకమలసేవయుఁ దాసమందార నాకు దయసేయఁగదే.

యని ధ్యానించుకొనుచుండెను. ఇంతలో విచారణకొఅ కాయనను గచ్చేరికిఁ దీసికొనిపోవుభటులు వచ్చిరి. వా రాయనను తీసికొని పోవుచుండఁగ ''ఆకానుఁగు చెట్టుక్రింద ననొక్కసారి నిలుపవయ్యా! నా భార్యను చూచి వత్తు''నని వారిలో నొక్కని నాతఁడు కోరెను. వా రంగీకరింపక చెట్టుప్రక్కనుండియే యాతనిఁ దీసికొనిపోవుచుండ, దుర్గా! దుర్గా! దుర్గా! యని సింసగర్జనమునఁ బిలిచెను. పలుకలేదు. ఆమె మరణించెనని నిశ్చయపఱచుకొని కోదండరామప్రభూ! యని యొక్క కేకవైచి ''ఓ కానుగుచెట్టా! నాదుర్గను, నా బిడ్డను, నేను బోషించుకొనదైన నా భార్య కళేబరము ప్రక్కనుండియే దానిని జూడకుండ నేను బోవుచున్నాను. నీవట్టిదానవుకావు. నీవింక నామెయొద్దనే కనిపెట్టుకొని యున్నావు. నీవే నాకంటె ధన్యతకలదానవు. నీ కుత్తరజన్మమున మహోత్కృష్టమగు జన్మము సిద్ధించును గాక!'' యని నడుచుచునే చెట్టును దీవించి కచ్చేరికిఁ బోయెను. కచ్చేరిలో విచారణ యేమున్నది. ''నీవు మాభటుని గంటముతోఁ గొట్టి చంపితివి నీకు మరణశిక్ష యేల విధింపఁగూడదో చెప్పుకొందువా'' యని నబాబుగా రాయన నడిగిరి. ''ఓయబ్బ! గంటపు దెబ్బకే చచ్చిపోయినాఁడయ్యా! గట్టిగాఁ గొట్టనే లేదయ్యా! మాయబ్బ! ఎన్ని గ్రంథములు వ్రాసిన గంటమయ్యా! ముందుజన్మమున వాఁడు మంచికవియై పుట్టును. ఈడను మంచి మేలు పొందుటకే యాడకుఁ బోయినాఁడని నమ్మవయ్యా! మఱి న న్నేదో చెప్పుమంటి వెందుకు? న న్నడుగు టెందుకు? నీయిష్టము వచ్చినట్లు చేసికోవయ్యా. అడిగి యడిగి నీ వేమాత్రము చేయఁగలవయ్యా? పోపో'' యని కచ్చేరీ నుండి పోవుటకుఁ బ్రయత్నింప భటు లాయనను బట్టుకొనిరి. ఇంతగర్వి, ఇంత పొగరుఁబోతు, నింతదుర్మార్గుఁడు లేఁడని యచ్చటివారంద ఱనుకొనిరి. ప్రజల యభిప్రాయములు సౌష్ఠవము సౌభాగ్యము నిది. ఈ యంశమునందే కాదు. అన్ని యంశములందుఁగూడనిట్టిదే. ఆతనితల నఱుకవలయుననిన

బాబుగాయి భటుల కాజ్ఞాపించెను. ''ఓయబ్బ! ఇంతేనా? ఈమాత్రానికి న న్నీడకుఁ బిలిపించు టెందుకయ్యా'' యని యాబ్రాహ్మణుఁడు పలికెను. భటు లాతనిని వధ్యస్థాన మునకుఁ గొనిపోయిరి. తలారి కత్తి చేతఁ బట్టుకొని యాతనిమొగము గాంచి గడగడ వడఁగి నే నీపనిని జేయఁజాలనని కత్తి నావలఁ బాఱవైచెను. ఏల నఱుకలేవని నబాబుగా రాతని నడుగ ''ఆతనిరూపము నా కేమో భయంకరముగా నున్నది. నాచేతు లాడకున్న'' వని యాతఁడు నబాబు గారి పాదములపైఁబడెను. ''నీవాతనిని నఱుకకుండునెడల నిన్ను ముందు నఱికింతు'' నని నబాబుగా రాతని బెదరించిరి. అంత నాతఁడేమిచేయఁగలఁడు? గడగడ వడచుకు సుబ్బరాజుగారి కంఠమున బిస్మిల్లాయని కత్తి విసరెను. కంఠము తెగలేదు. మరియొక్కసారి చొరవ తెచ్చుకొని వైచెను. తెగలేదు. ''ఓయబ్బ! నీవలనఁగాదయ్యా! భాగవతము తలమీఁదనుండఁగాఁ దలతెగుననియే యనుకొంటివఁటయ్యా! నీబొంద పడ! ఎక్కడనో యడవిమృగమువలె నున్నావు. విను. నీ వేమియుఁ గష్టపడకు. వెనుకకు విఱిచికట్టిన నాచేతులు విప్పవయ్యా? భాగవతము తలమీఁదినుండి దింపుదును. తరువాత సుళువుగా సుఖముగా నఱకుదువుగాని ఎందుకింత యోజన'' అని సుబ్బరాజుగారు పలికిరి. చేతులు విప్పుమని నబాబుగారు భటునకు సంజ్ఞచేసిరి. అంత సుబ్బరాజుగారు, కొర్నిసాటి ప్రయాణమునుండి యానిమిషమువఱకుఁ దలమీఁదనే కట్టుకొనియుంచిన భాగవతమును చసి, కన్నులద్దుకొని దూరముగనుంచి దానికిఁ బ్రదక్షిణ మొనర్చి సాష్టాంగ మాచరించి లేచి కోదండరామప్రభో! యని బ్రహ్మాండకటాహ మదఱున ట్లొక్క కేక వైచి చాపచుట్టగఁ గ్రిందఁబడి ప్రాణములు విడిచెను. కత్తితో భటుఁడింక నఱుకూట యెందుకు? ఆతఁ డెట్లు మరణించెనో? యని యందఱుకాశ్చర్యముగా నున్నది. పరీక్షించి చూడగ నాతనినోటినుండి రక్తమొలికినది. పిడుగుపడినట్లు కోదండరామప్రభూ యని యాతఁడు వైచిన కేకతో గొంతులోని రక్తనాళము తెగి యారక్తపుఁజుక్కలు వాయుద్వారమునఁ బోవుటచే నూఁపిరి యాడక నిమిషములో మరణ మీతనికి సిద్ధించినదని యటనున్న వైద్యుఁడు శాస్త్రీయసమా ధానమును (Scientific Explanation) చెప్పి, తనపాండిత్య మందఱకుఁ దెలిసినదో లేదోయని యటునిటు చూచెను. పరమాత్ముని యాజ్ఞ యయినది కావున బ్రాణములు దేహమును వదలిపోయిన వని చెప్పఁగ నందఱకును దెలిసినమాట.

సుబ్బరాజుగారు మరణించిరనుమాట చెవినిఁబడఁగనే కన్నుల కేదైనఁ గనఁబడునో, కడపులో నేమైన గుబులు పుట్టినో కాని గడగడ వడఁకి నబాబుగా రేడ్చిరి. వారికంటె ముందుగానే కాఁబోలు వారిభటు లేడ్చిరి. అచ్చటిప్రజ లందఱికంటె ముందుగాఁ గాఁబోలు నేడ్చిరి. అంద ఱేడ్చుచున్నారు. ఎందుల కేడ్చుచున్నారో యెవ్వరు నెఱుఁగరు? ఏది? ఆ సమయమున నెవ్వరికైన మతులున్నవా? చైతన్యము లున్నవా? గోలుమన్న రోదనము తప్ప నంతకంటె నేమియులేదు. అంతయుఁ దీఱిన తరువాత నేడ్చిన లాభమేమి? సుబ్బరాజుగారి కథ విన్నవారికే కన్నులు చెమ్మగిల్లవలసి యుండఁగ నాయనకథను జూచిన వారికిఁ గడువు చెఱువయ్యే ననఁగ నాశ్చర్యమేమి? నబాబుగారేమో రామభక్తుఁడైనాడఁట! అగుఁగాక. రామభక్తులెందఱో లేరు. వారిలో నాతఁ డొకఁడు. సదా కోటి జంగాలలో నొక బోడిలింగము. లెక్కయేమి? ఆర్యావర్తదేశమున నారామచంద్రమూర్తి మహాత్మ్య మెఱుఁగని నరుఁడెవ్వఁడు? నరునివఱ కెందులకు? కోఁతినడుగు, కొండముచ్చునడుగు, కాకినడుగు, గ్రద్దనడుగు అందఱకుఁ గూడ నెందులకు? చెట్టునడుగు, పుట్టనడుగు, ఱాతినడుగు,

అప్పనడుగు దేశమంతటను రామనామము శతకోటిజిహ్వాలతో మాఱుమ్రోఁగుచున్నది. రాముఁడు లేనిచోటేది? రామునిగూర్చి యొకానొకఁ డిట్లు పలికినాఁడు.

నీ. వీధి పురాణంపు వేదికపై నీవు,
పారాయణపుఁ బీఁటపైని నీవు,
దృశ్యప్రబంధంపుఁ దెరలసందున నీవు,
మృతివార్త శ్రుతిఁ బడ్డ యెడను నీవు,
గొల్లసుద్దుల జోకు డొల్లలలందున నీవు,
యక్షగానపుఁ జిందులందు నీవు,
చండాలుబుజముపై మొండితంబుర నీవు,
తొలుబొమ్మలసంత గోల నీవు,

పడుకగదుల గోడల నీవు, భక్తహృదయ
రననలను నీవు, యాయావరతను నీవు,
సృష్టినీమయయో? నీవు సృష్టిమయమొ?
యెట్లయిననేమి? రామ! రక్షింపుమయ్య!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

31. దొరకిన యుపన్యాసము

ఒకసారి పానుగంటివారు తణుకు నుంచి పిఠాపురం వెడుతూ, నిడదవోలులో రైలులో ఎక్కారు. రైలు కదిలిన కొంతసేపటికి, బెర్తును ఉత్తరీయంతో దులిపి, నడుం వాలుద్దామనుకుంటూండగా ఒక కాగితాల బొత్తి కనిపించింది. అది ఒక మహిళ వ్రాసిన ప్రసంగ పాఠం. ఆ మహిళ, ఆ ప్రసంగాన్ని ప్రకటించడమే ఉత్తమమని ఎంచి, దానికొక ప్రతిని రాసి – భారతి పత్రికాధిపతికి పంపాడు. ను.స. అనే పొడి అక్షరాలో వున్న ఆ ప్రసంగ పాఠం సారాంశం ఇది:–

పురుషుడు మొట్టమొదటి నుంచి స్త్రీ అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తూనే వున్నాడు. కొద్దికాలం క్రితం వరకూ కూడా మగవాడు ఆడదానిని వీధి గుమ్మం వరకు కూడా రానివ్వలేదు. నారీ సంఘం అంతా ఈ అనారీ సంఘాన్ని ఎందుకు అణగద్రొక్కకూడదు? ఆడది మగవాళ్ళని అనుకరిస్తోందని మగవాడి వుద్దేశం. నిజానికి స్త్రీ పురుషుణ్ణి అనుకరించడమంత రోత మరొకటి లేదు. ఆ మాటకొస్తే పురుషుడే నాటకాలలో స్త్రీవేషం వేసి అనుకరిస్తూ స్త్రీ జాతినే అవమానిస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా స్త్రీ సహజమైన హావభావాలను పురుషుడు అనుకరించలేడు. చేసే, ఆంగికమైన అనుకరణ అతనిలో 'స్త్రీత్వ' సౌకుమార్యాన్ని తీసుకురాకపోగా, ఉన్న పురుషత్వ లక్షణాలను దూరం చేస్తోంది. ఎందరినో ఆకర్షించే జంఘాలశాస్త్రి మగవాడు ఆడవేషం వెయ్యడాన్ని ఎందుకాక్షేపించాడు. కేవలం, తను మగవాడు గనుకనే, మగతత్వం, ఆడతత్వం మౌలికంగా భిన్నమైనవి. పురుషుడు స్త్రీని అనుకరించడం మానాలి. ఆంధ్రదేశంలో వున్న నాటక సంఘాధిపతులకి ఒక ఆజ్ఞాపత్రం పంపాలి. ఏమనంటే మగవాళ్లు ఆడవేషం వెయ్యరాదు. స్త్రీలకే పాత్రలిచ్చి పోషించాలి అని. అందుకు ఒప్పని, స్త్రీ వేషాలు వేసే భర్తల్ని వారి భార్యలు త్యజించడానికి సంశయించకూడదు. దీనిని ప్రచురణకు పంపుతూనే, దాని జాబు వ్రాస్తామని పానుగంటివారు భారతీ పాఠకులకు ఒక లేఖ కూడా జత చేశాడు.

శ్రీ భారతీ పత్రికాధిపతీ! నమస్కారములు.

ఈనడుమ నా సొంతపనిమీద నేను దణుకు వెళ్ళి యచ్చట నొక్కదిన ముండి తిరుగఁ

బీతికాపురమును జేరుటకై నిడుదవోలునొద్ద రైలుబండిలో నెక్కఁబోవుచుండఁగఁ, గొందఱు స్త్రీలు పురుషు లొకగదినుండి దిగఁబోవుచుండిరి. వారు వారిసామగ్రితో దిగినపిమ్మట నేను గదిలోనికిఁ బోయి కూరుచుంటిని. రైలు నడవనారంభించెను. కొంతసేపు కునికిపాటులు పడిపడి పండుకొనుటకై యెంచి లేచి బల్లపైనున్న మెత్తనుత్తరీయముతో దులుపుచుండఁ గ్రిందిమెత్తకును, వెనుకనున్న మరియొక మెత్తకును నడుమనున్న యవకాశమున నొక కాగితములబొత్తి నాకంటఁ బడినది. దానిని గ్రహించి చూచితిని. అదియొక కాంతారత్నము వ్రాసిన వ్రాఁతవలె నాకుఁ దోఁచినది. ఈ కాగితములు పోవుటచే నాకాంత యెంత పరితపించుచుండునో యని కొంతసేపు విచారించితిని. ఆ వనితామతల్లి ప్రకటింపనెంచిన యభిప్రాయములను బ్రకటించుటయే మంచిదని నే నూహించుకొని యాకాగితములకుఁ బ్రతివ్రాసి దానిని మీయొద్దకుఁ బంపితిని. మీరు ప్రకటించినయెడల దానిని వ్రాసిన నారీమణి సంతోషించునని నావిశ్వాసము. ఈ క్రిందిదియే దాని ప్రతి.

చిత్తగింపవలయును.

పానుగంటి లక్ష్మీనరసింహారావు.

ప్రారంభోపన్యాసము

''సోదరీమణులారా! మీ యందఱితో నొక ముఖ్యాంశమును ముచ్చటింప నెంచి మి మ్మిట కాహ్వానించితిని. ఆయంశము మీతో నెంతకాలమునుండియో చెప్పఁదలఁచితిని మీ మనస్సులకు స్ఫురింపని యంశము నామనస్సున కేల తట్టునో యని నాకే సందేహముగా నుండుటచే మానివైచితిని. ఇప్పు డన్నిసందేహములను మించిన యాతురత నన్నుఁ బ్రేరేప, నా యభిప్రాయమును మీకు వెల్లడించి హృద్భారమును బాపుకొన నిశ్చయించుకొంటిని.''

''కాంతలస్థితిగతులు కొంతకాలమునుండి యభివృద్ధి దశలో నేయున్నవి. ఇట్టి మనయభివృద్ధికి మనమే కారణముకాని మగవాఁడు కాఁడని లోకమెఱిఁగియే యున్నది. మగవానివలన మేలు జరుగునని మన మెన్నఁడనుకొనియుండలేదు. ఆతఁడు మనసందర్భమునఁ గేవల నిరుపయోగుఁ డనియే నిశ్చయపఱచితిమి. ఆతఁడు నిరుపయోగుఁ డైన నంతమాత్రమున మనము నిచారింపవలసిన పని లేదు. సమర్థతాశూన్యత క్షంతవ్యము కాని యాతఁడు మనయభివృద్ధికి మొట్టమొదటినుండియుఁ బ్రతిబంధకారుఁడై పరమశత్రుఁడై ప్రత్యక్షమారకుఁడై ప్రవర్తించుటచేతనే మన మాతనిని నిందింపవలసివచ్చినది. ఆతనిపాపమున నాతఁడే పోవునని మన మూరకుండక మన బానిసతనమునకుఁ బరితపించి, మన విద్యాశూన్యతకు విచారించి, మనవ్యక్తిరాహిత్యమునకు వ్యసనపడి యాతని లక్ష్యపెట్టక, యవసరానుసారముగ నాతని కెదురుతిరిగి, స్వయంకృషిని నమ్మియాత్మ విశ్వాసమును గల్గి, మన పురోభివృద్ధికి మన పాటులేవో పడుట చేతనేకదా ప్రాయ్యయొద్దఁ గట్టల పొగనడుమఁ గూలఁబడవలసిన మన ముపన్యాసపీఠములపైఁ గరతాళముల నడుము నిలువఁబడుచున్నాము! వేఁడనీళ్లతో నట్టింట్లలికిన మనము నవరసములతో నాటకములను సృష్టించుచున్నాము! పిల్లల తొట్టెలయొద్ద జోలపాటలు పాడిన మనము న్యాయసభలందు ధర్మవాదము లొనర్చుచున్నాము! లొడిలెడు సంసారములో గుడుగుడుగుంచము లాడవలసిన మనము లోకోపకారమునకై భారతదేశమం దంతటఁ బర్యటన మొనర్చుచున్నాము!

మగనాఁ డనునాఁ డాఁడుదానిని వీధిగుమ్మమువద్దకుఁ గొలఁది కాలము క్రిందటివ అకు రానిచ్చినాఁడా? చీఁపురుకట్ట వదలి Briefbagను బట్టనిచ్చినాఁడా? తనసేవ మఱచి దేశసేవమూట నెన్నఁడైనఁ దలఁప నిచ్చినాఁడా? ఎంతసేపు తాను, తనవిద్య, తనసుఖము, తనకీర్తి, తన వృద్ధియే కాని సృష్టిలోఁ దనసాటిదైన యాఁడు దున్నదనియైన మనసునఁ బెట్టినాఁడా? ఇతర దేశ స్త్రీల యభివృద్ధి వినియైనను రవంత దయ, కాసంత దాక్షిణ్యము, నిసుమంత సమభావము మనయెడలఁ గనఁబఱచి నాఁడా? తరతరములనుండి యుగయుగ ములనుండి కార్కొని ఘనీభవించిన యజ్ఞానాంధకారమునుండి స్వప్రయత్నముచేత నతిశీ ఘ్రకాలములో జ్ఞానతేజః ప్రపంచమున కుబ్బెత్తుగ నుబికిన జాతి సర్వప్రపంచ చరిత్రమం దొక్క యూర్యనారీజాతి తక్క మఱియొకటి యున్నదా? బ్రాహ్మణులేమో తమ్మ జ్ఞానమునఁ బడఁద్రోచిరని యబ్రాహ్మణులు వారి కెదురు తిరిగిరి. కాని నారీసంఘ మంతయు నీ యనాదీసంఘము నేల యెదుర్కొని త్రొక్కివేయఁగూడదో నాకు బోధ పడుటలేదు. మగవాఁ డంత స్వార్థలోలుఁడు, ననూయాపరుఁడు, నధర్మశీలుఁడు నహంకారదూషితుఁడు ప్రపంచమున లేఁడని మనచరిత్రవలన స్పష్టపడినదా? పాపము పండిపండి బ్రద్దలు కాకమా నునా? చొటిసడియలని తా ననుకొనినవే కాదా - ప్పుడు నుక్షేత్రఖండిక లైనవి? రాక్షసిబొ గ్గుదిబ్బలని తా ననుకొనిననే కాదా యిప్పుడు రత్నాలగను లైనవి! ఎండి, మెలికలు పడి, పిట్టతలలు నైచి కంపతొడుగైన తీఁగలే కాదా యిప్పుడు ప్రసవఫలబంధుర పరిమళప్రాంచిత ములైనవి! వంటయింటి పదుకటింటి బానిసలే కదా యిప్పుడు భారతదేశ సౌభాగ్య దేవతలై ప్రకాశించుచున్నారు! చిరకాలనాగరికత, చిరకాలవిద్య, చిరకాలాభ్యాసము, చిరకాలాహంభా వము కలిగిన మనవాఁ డిప్పుడు మనకు నెనుకఁబడినాఁడా లేదా? భారతదేశ సమస్తకార్యభా వహనక్రియాకలనయందు ముందుబుజము మనదా యాతనిదా? మనము పాడినపాటను బట్టి తనయడు గిప్పుడు సర్దుకొనుచున్నాఁడు. మార్గదర్శకవ్యాపారమున మగువ నిల్చి మగవానిని వెంటఁద్రిప్పుకొనుచున్నప్పుడేకదా నాగరకత శిరోనక్షత్రమంటిన క్లించవలసి యున్నది!

ఇట్టిస్థితిలో మన ముండుటచేత భగవంతు నెంతయైనఁ బ్రార్థింపవలసియున్నది. మనము మనల నెంతయైన నభినందించుకొనవలసియున్నది. మగవాని నెంతయైన నిందింపవ లసియున్నది. కాని యింతనంతోషమందుఁ గూడ నొకటి రెండు విచారహేతువులున్నవి కాని లేకపోలేదు. ఒక దానిని గూర్చియే యిప్పుడు చెప్పెదను. నేను జెప్పఁబోవు నంశము మీ రెఱుఁగనిది కాదు. మీరేల యింతకాల ముపేక్షచేసి యూరకుంటిరోయని నాకాశ్చర్య ముగా నున్నది. ఈయంశము కూడ మగవాని దుష్టవ్యాపారముతో సంబంధించినదే. ఈదోష మేదో వెల్లడించి దీనిని దిద్దుబాటు చేయుటకుఁ బ్రథమావకాశము భగవంతుడు నాకుఁ గటాక్షించి నాఁడు కదా యని నేను నహేతుకమైన గర్వమొందుటలోఁ దప్పులేదని యనుకొందును.

సోదరీమణులారా! మనము కంటికి జోడుపెట్టుకున్నప్పుడు కొలఁది కాలము క్రిందటఁ దానెంత వెక్కిరించినాడో మీకు జ్ఞప్తి లేదా? అక్షిరోగమునకేకాక యాన్యసౌభాగ్య మునకుఁగూడ నద్దములను దాను ధరించునప్పుడు వానిని మన మేల ధరింపఁగూడదో? అది తన యనుకరణమఁట. మనము కంటితోఁ జూచుటకూడఁ దన యనుకరణమే

యగును గావున మనము కన్నులు మూసికొనవలసి దని యభిప్రాయము కాబోలు! అరుంధతినాఁడో ఆదిశక్తినాఁడో కల్పింపఁబడిన యంద మాకారములేని యాప్రాఁతయొడ్డాణమే మనము ధరింపవలయును గాని నడుమునకుఁ బటకా పెట్టుకొనఁగూడదఁటు! ఈయధిక్షేపణములో హేతువున్నదా? నీతి యున్నదా? మనుష్యధర్మమైన యున్నదా? షరాయి తొడిగికొని చర్మపాదరక్షలు మనము ధరించినపుడు తా నెంత వెకవెకలాడెనో మీ రెఱుఁగనిదా? అంత వెకవెక లెందులకు? అదేమి హానియా, అపకీర్తియా? తన్ను మన మెంతమాత్ర మనుకరింపగూడదఁట! ఆ ప్రధానరోగమునకు బాహ్యలక్షణములే యీతలయూఁపులు, నీవెకవెకలు, నీ నకిలింపులు, నీ కటకటలు, ఎన్ని నవ్వులు నవ్వినసరే యెన్ని యేడ్పు లేడ్చినసరే మనము మానఁదలఁచుకొన్నప్పుడే కదా యాతఁడు విధిలేని వైరాగ్యమును వహించి యూరకుండినాఁడు. మనము సైకి లెక్కఁగూడదని సంఘమర్యాద, వ్యాకరణమునఁ గ్రియాపరిచ్ఛేదమునఁ బ్రథమసూత్రము ప్రాయుటకు దా నెవఁడు? ఇది మన వారి పంచమహాపాతకములలో నొక్కటా? ఏసుక్రీస్తువారి పది యాజ్ఞలలో నొక్కటా? ఇది కాక మన డబ్బిలోనిది ముక్కుపొడి, తనడబ్బిలోనిది శ్రీపాదరేణువునా? ముక్కు భగవంతుఁడు తనకే ఇచ్చినాఁడా? ఇంతతెగనీలు గెందైన నున్ననదా? మనజేబులోనివి సిగరెట్లా? తన జేబులోనివి తులసికట్టలా? ఇంతకు నో సోదరీమణులారా! కారణము చెప్పియే యుంటిని. ఱాడుది మగవాని ననుకరించుటకంటె మగవానికి రోత వేఱొక్కటి లేదు. మన కుచితమైనదియు, నుపయోగకరమైనదియు, నర్హమైనదియు, నవసరమైనదియు మనము చేయుచున్నాము కాని తన్ననుకరించు నుద్దేశ మెంతమాత్రము మనకు లేదని తా నేల యెఱుఁగడు? తా నెవరి ననుకరించి యిన్ని వేషములు తెచ్చుకొనినాఁడు? ఆమాత్రపు టూహ తనకేల యుండఁగూడదు? అతనికి మొదటినుండియు మనయెడల నదూహయే యున్న యెడల మనకిన్ని పాటులెందులకు? తనకిన్ని తిక్కెందులకు? మనము తన్నెంత మాత్ర మనుకరింపఁగూడదు. కాని తాను మనలఁ బూర్తిగా ననుకరింపవచ్చును గాఁబోలు! అది తప్పులేదు కాఁబోలు! అందులకు మన మాతని నేమియు ననఁగూడదు కాఁబోలు! నాటకములలో స్త్రీపాత్రములను ధరించి తాను మనల నేల యనుకరించుచున్నాఁడో చెవిపట్టుకొని జొకాయించి నిలువబెట్టి యేల యడుగరాదు? ముంగురులు వింతయైన సొగసుగా నుండునని మన మీ చెంప నా చెంప నొక్క యంగుళముమాత్రపు వెడల్పున వెండ్రుకలు కత్తిరించుకొన్నప్పుడు తానెంత యల్లరి పెట్టినాఁడో! తలవెండ్రుకలు పూర్తిగా తీయించుకొనినట్లుగా నింటిపెంకు లెగిరిపోవున ట్లెంతహంగామా చేసినాఁడో! అట్టియాతఁడిప్పుడు మీసములు పూర్తిగా గొరిగించుకొని సవరములు నెత్తికిఁ గట్టుకొని నాటకరంగమునఁ బోఁతుపేరఁటాలైనిలువఁబడినప్పుడు "నీకిది యెవఁడుచెప్పినాఁడురా" యని మన మాతని మూతిపై నేల యీడ్చికొట్టరాదు? కోటులాగున నుండునెడలఁ గ్రమ్మదలకుఁ గ్రమ్మదల, సొగసునకు సొగసుగా నుండునని రైకకు బొత్తాము లంటించి చేతులు రవంత పొడుగుచేసి ధరించి సహజమైన సిగ్గుతో నూత్నమైన శోభతో మనము ప్రకాశించుచుండఁ దన కన్నులలోఁ జీలలు కొట్టుకొనినాఁడే! అట్టినాఁ డిప్పుడు మనరైక తొడిగికొని దానిలో మజేవో తగులఁబెట్టుకొని సిగ్గులేక, యుభయభ్రష్టత్వపుఁ బాడురూప ములతో రంగమున మగముత్తైదువై నిలువఁబడి మనలఁ బరాభవించుచున్నప్పు డాతని నేమి చేసిననైనఁ బాపమున్నదా? కట్టువడి యెడలిపై నడ్డుకట్టుకోకతో, నడ్డుచీలల ముంజే

తుల కదికింపుగాజులతోఁ గండలపై జేరుబొందులవంటి నరములుబికిన మొఱకు కంఠమున గాజుపూసలతోఁ, జుట్టపాగచేఁ బొక్కి మూడి చచ్చిన పెదవులపై లత్తుకతో, గూటితీయుటచేఁ గాయలుగాచి గీఁతలుపడిన దొడలపై బూడిదెతో, వేంకటేశ్వర పాద ములపైఁ దుమ్మకాయ గొలుసులతో, నాడుదాని తలకంటె సహజముగఁ బెద్దదైన తలపై సవరముల జవునుకూర్చుచే భయంకరముగ నగపడు రాకాసితలతో, రంగముమీద సంకర స్వరూపమున నవతరించిన యీ జగన్మోహినీ దేవతను జూడగ నార్యావర్తదేశమంతయు నొక్కఁపెట్టున నేడువవలసియున్నట్లున్నదే! తా నాఁడుదానిని బూర్తిగ ననుకరించినట్లు లోలోపల నుత్సాహమున నుబికి యుబికిపోవుచున్నాఁడు. కాఁబోలు! తానా? ఆఁడుదాని ననుకరించుటా? తనతరమా? సహజలావణ్యముగల యాఁడుదానిని గనులకు సూటిగ నొక్కఁజేనెడు చూచి టంగున (Tangeal) కు మఱలిన చూపుగల యాఁడుదానిని–నెగడు దిగుడుగఁ దరంగ ఫక్కిగఁ జూడఁగల యాఁడుదాని–నెగడు దిగుడుగఁ దరంగ ఫక్కిగఁ జూడఁగల యాఁడుఁదానినినింద్రధనుస్సు వలె లోకమునకంత నొక్కసారి మంగళపుటారతి నీయఁగల యాఁడు దానిని పాము మెలికల జిగజిగలతో మెఱపు గప్పున మెఱసి చప్పున మాయమైనట్లు చూడఁగల యాఁడుదానిని దానా? అనుకరించుటా? మతి యుండియే యీపని చేయుచున్నాఁడా? పెదవులపై లక్ష చందమామల పండు వెన్నెలల కలకలతోఁ గానఁబడవలసిన మందహాసమును బెదవులపై మాటుపఱచి దానిని గంటికొసలో నొక (Geometrical point) లోఁ గేంద్రీకరణ మొనర్చుట కొక్కనిజమైన యాఁడుదియే తగును కాని యీకొజ్జాస్వరూపమే–అందులకుఁ దగుటే! చచ్చియాఁడుదియై పుట్టినప్పటిమాట కాని యిప్పటిమాటయా?

సోదరీమణులారా! ఇంత యసాధ్యకార్య మాతనివలనఁ గాదు, పోనిండు! ఆఁది నిలువఁబడినట్లయినఁ దాను నిలులవబడలేనప్పుడు తన మొగము, తనమోర, యిఁక, ననుక రణ మెందులకు? చనవు, ప్రేమ, రవంతమోతాదుమించిన వాల్లభ్యము గనఁబఱుపవలసిన భర్త యెదుట నాఁడుది యెట్లు నిలువఁబడునో, కాసంత మాత్రమే గౌరవము గానఁ బఱుపవలసిన పెద్దబావగారి యెదుట నెట్లు నిలువఁబడునో, యధికభయ గౌరవములు గనఁబఱుపవలసిన మామగారి యెదుట నెట్లు నిలువఁబడునో, యీ భేదములలో నొక్క భేదమైనఁ దాను గనఁబఱుపఁగలఁడా? నా భర్త యీ నడుమ నాటకము లోనికి వెళ్లెదని చెప్పుటచేఁ బొమ్మంటివి. ''నీ భర్త కీరాత్రి నాటకములలో వేసమున్న'' దని మాయింటిపోరు గమ్మలక్కలలో నొక్కతె నాచెవి నూదెను. నా భర్త వెడలిపోయిన కొంత సేపటికి నేను నాటకశాలకుఁ బోయితిని. అభిజ్ఞానశాకుంతలమున నాభర్త ప్రియంవదవేసము కాఁబోలు వేసినాఁడు. కణ్వమున్యాశ్రమములోని మొక్కలకు నీళ్లుపోయుటకై శకుంతలతోఁగూడఁ జేతిలో నొకయిత్తడి చెంబును బుచ్చుకొని నా భర్త రంగమునకు వేంచేసినాఁడు. నేనప్పుడు కొంతసేపు డిల్లపడి కొయ్యనైపోయితిని. నాకప్పుడు మనస్సునఁ గోపమే కలిగెనో, రోఁతయే పుట్టెనో, నవ్వే కలిగెనో యేడుపే వచ్చెనో నే నేమియుఁ జెప్పఁజాలను. ఒక్కనిమున మట్లున్నపిమ్మట నాభర్త నిట్టిస్థితిలోఁజూచుటకంటెఁ జచ్చిపోవుటయే మంచిదని ప్రపంచ వాంఛా నిస్పృహతను జెందితిని. అంతలో నున్నపుగుల్లపొంగువలె రోన మెక్కడ నుండియో గుబగుబలాడుచు నుబికి నన్నుఁ గంపితురాలిఁగఁ జేసెను. రంగస్థలమునకుఁబోయి యాతని యెదుటఁబడి నెత్తిపైనున్న నవరపుబుట్ట లాగి ''నీకువచ్చిన యేం క్లేవనికి వచ్చినవి? నీ కీ దిక్కుమాలిన నంకరపు వాలక మేల?'' యని యాబుట్టతో నెత్తిపై నాల్గు వాయింపవలయు

నని బుద్ధి పుట్టినది. కాని యారోసమును గష్టపడి శాంతిపఱచుకొని, పండ్లు గొఱుకుకొనుచు లోలోపల నెన్ని తిట్లయిన దిట్టుకొనుచు గూరుచుంటిని. రంగమున నాభర్త యెట్లు నిలువఁబడెనో చెప్పనా? అయ్యయ్యో! ఇంక నా భర్తయేమి? నానవతియో నాయాఁడుబిడ్డయో యైన యాపురుష సువాసినీ స్వరూపము నిలువఁబడినతీవి యెట్లున్నదో చెప్పనా? ఎడమ చేయి నడుము మీఁదికి జారిపోయినది. కుడిచేత నిత్తడిచెంబు పట్టుకొని ప్రక్కనుండి పాఠము చెప్పువానివంకఁ జూచుచున్నాఁడు. అప్పుడు నా కాతఁ డెట్లుండినట్లుతోఁచెనో చెప్పనా? లెట్రీనులో నెవఁడో యుండుట చేత గుమ్మమువంకఁ జూచుచు నాతురతతోఁ గనిపెట్టు కొన్న వాఁడువలె నాకుఁ గానఁబడినాఁడు. చీ! చీ! నడుముమీఁదఁ జేయినైచుకొన్న యెడల నాఁడుదాని ననుకరించినట్లే! బుగ్గమీఁద వ్రేలు పెట్టుకున్న యెడల నాఁడుదాని ననుకరించి నట్లే! పైఁట మాటిమాటికి నవరించుకొన్నయెడల నాఁడుదాని ననుకరించినట్లే. వెట్టి వెట్టి ప్రక్కచూపులు చూచి ముసిముసి నవ్వులు నవ్వి ముడుచుకొనిపోయినట్లయిన నాఁడుదియై పోయినట్లే! ఇంతయే యాతని యనుకరణము. కాంతల బాహ్యలక్షణములనే యనుక రింపలేని మగవాఁ డిక నంతరంగలక్షణముల ననుకరింపగలడా? కల్ల. నాటకర్తలే యాఁడువా రిని జిత్రింపనెంచి మగతనముచెడిన మగవారిని సృష్టించుచున్నారే. అట్టిచో నాటకకర్తల మాటల ననుసరించి మిడుకవలసిన నటకులా యాఁడువారి ననుకరించుట? అసాధ్యము.

కాని, దమయంతి దమయంతియే యైపోయె ననియుఁ జంద్రమతి చంద్రమతిని గూడ దాఁటినదనియుఁ బండితుల ప్రచురములకు లోపము లేదు. పాత్రధారుల బంగారుపతకము లకు లోపములేదు. మగవారు మగవారిని స్తుతింపకమానుదురా? ఏదీ! జంఘాలశాస్త్రి యెందఱనో యధిక్షేపించినాఁడు కదా! కాంతల నధిక్షేపించుటలో నేమి, వారిచేఁ దిట్లు తినుటలో నేమి గట్టివాఁడేకదా! నిష్పక్షపాతముగ విమర్శింతు నని యనేక పర్యాయములు చెప్పిన యాతఁడు సైతము–మగవాఁ డాఁడు వేసము వేసి జాతికంత కప్రతిష్ఠ తెచ్చుచున్నాఁ డన్న యంశమును విమర్శించినాఁడా? ఆతఁడు మగవాఁడు. అ క్ష్మీలచేయును?

పక్షపాతస్వభావముచే బుద్ధిపూర్వకముగ నాతఁడు విడిచిపెట్టిన యీయంశమును నేను విమర్శింపనెంచితిని. మగవాఁడు మగువ ననుకరింప లేఁడని నా సిద్ధాంతము. అనుకరింపఁగలవాఁడైనను ననుకరింపలేని వాఁడైనను ననుకరించుటకుఁ బ్రయత్నించువా రెల్ల జాతికి ద్రోహులని చెప్పకతప్పదు. అందులోఁ గొలఁదిగా ననుకరించవానికంటె బాగుగా ననుకరించువాఁడే జాతికిఁ బరమద్రోహి. మగతత్త్వము నాఁడుతత్త్వము నొక్కమందడినే యంటియున్నైనను దానికి దీనికి నత్యంత భేదమున్నది. ఒకటి కఠినము, రెండవది మార్దవము. ఒకటి హేతుబద్ధము, రెండవది రసప్లుతము. ఒకటి సంచలనము, రెండవది స్థిరము. ఒకటి బలీయము, రెండవది దుర్బలము. ఒకటి మలీమసము, రెండవది పరిశు ద్ధము. ఇంకను మఱి యెంతయోభేద మారెంటి కున్నది. ఈ రెండుతత్త్వములు నింత భిన్నములుగ సృష్టిలో నుండుటచేతనే స్త్రీపురుషుల కన్యోన్యాకర్షణము నన్యోన్యానురాగము లున్నవి. విజాతీయ విద్యుచ్ఛక్తి యుక్తములగు వస్తువుల కన్యోన్యాకర్షణము కాని సజాతీయ శక్తియుక్తములగు వానికిఁ బరిపూర్ణమైన ప్రాతికూల్యమేకదా! కావునఁ బురుషుఁడు. పొఁతి ననుక రించునెడల నన్యోన్యానురాగము లీక ననుస్వారములు; సంసారములును చట్టుబం డలు; బ్రతుకులు వ్యర్థములు.

ఇదికాక, కప్పకూత నిత్యము కూయువానికిఁ గప్పకున్న గొంతు వంటి గొంతు రాకున్నను బురుషునికుండవలసిన తన గొంతులో మాత్రము కాసంతమార్పు కలుగకత ప్పదు. ఆఁడుదానివలెఁ జూడఁదలఁచి చూడఁ దలఁచి పట్టుదలతోఁ బ్రయత్నించిన మగవాని కాఁడుదానిచూ పలవడకున్నను మగచూపులో మార్పుకల్గుట సిద్ధాంతము. ఆఁడుదాని కంఠరవము ననుకరింపఁదలఁచి విశాలమైన గంభీరమైన తన గొంతును సన్నపఱచుకొని కుదించుకొనిన మగవానికి సహజలలిత మధురమృదులమగు స్త్రీకంఠము రాకున్నను మగగొంతు చెడుట నిశ్చయము. అట్టి సిగ్గుపడిన యాఁడుదానిబుగ్గ యెఱుపులు, కంటిప్రాలుటలు, తలయోరలు, మొగపుఁ దళుకులు, నొడలి ముడుపులు సంతతము ననుకరింపఁదలఁచి ప్రయత్నించిన మగవానికి లలనాజనసహజలజ్జాసౌభాగ్యలీలాకలాపము పట్టుపడదు. కాని మగయొడలిపొంకములు ధ్వస్తములగుట తప్పదు.

మనసే సర్వసృష్టికిఁ గారణమని పెద్దలనిన మాటలో సత్యము లేకపోలేదు. చూడవల యును జూడవలయున నని మనస్సు వాంఛించుట చేతనే కదా శరీరమునకుఁ గన్నులు కలిగినవి! తినవలయును తినవలయునని సంతతవాంఛ కలుగటచేతనే కదా శరీరమునకు నోరు వచ్చినది! ప్రాతిపదికమగు జంతువున కివి యేమియు లేవుకదా! తరువాత మనస్సు లోని సంచలనములవలననే కదా దేహమున కవయవవైవిధ్యము కలిగినది. మనఃప్రవృత్తులు శరీరమందలి మార్పుల కెట్లు కారణములో, సంతతాభ్యాసమున దేహమునందు కలిగించు కొన్నిమార్పులు మనస్సులో మార్పుల నెందులకుఁ గలుగఁజేయఁగూడదు? నుదుటఁ బూసికొన్న విభూతిరేఖ శివదర్శనమునకై బుద్ధిపుట్టించుచున్నది. ఒడలిపై ధరించిన మల్లెదండ బోగమువీధికై మనస్సును లాగుచున్నది. యోగశాస్త్రానుసారము దేహమున కిన్ని ముద్రలు, నాసనలు, కఠినములగు గరిడీపద్ధతులు నేల కలిగినవి? మనశ్చాంచల్యనివృత్తికే కదా! ఐహికతుచ్ఛ వాంఛాలంపటతను వీడి నైరాగ్య జ్ఞానసంపత్తిని మనస్సు గ్రహించుటకే కదా! దేహపరిణామభేదములు చిత్తవృత్తులలో మార్పులు కలుగఁజేయకుండు నెడలఁ బాతంజల యోగశాస్త్రమంతయుఁ బారిశుద్ధ్యసంఘమువారి బండితుక్కువలెఁ బరశురామ ప్రీతి కర్మమేకాదా? దేహములోని మార్పులు మనస్సులో మార్పులు కలుగఁజేయక యెట్లుండ గలవు? తా నాఁడు దాననని యనుకొని యనుకొని, పరపాత్రచే నాఁడుదివలె సంబోధింపఁ జేసికొని, యాఁడుదానిపోడుములు తెచ్చిపెట్టుకొని, యాఁడుదానివలెఁ జూచి, మాటలాడి, తక్కి, తారి, యిగిలించి, త్రిప్పుకొని యేడ్చిన మగవానిదేహములో సంతతాభ్యాసమువలనఁ గలిగిన మార్పు లాతని మనస్సులోఁ దదనుగుణములగు మార్పులను గలుగఁ జేయకత ప్పదు. అందుచేత నాఁడుదాని మనస్తత్త్వ మాతనికి రాదుకాని మగవాని మనస్తత్త్వము మట్టిలోఁ గలసిన దనుట నిశ్చయము.

నాయనుభవములోనున్న యొకచిన్నయంశమును జెప్పెదను. నే నొకరోజున వీథిగు మ్మములో నిలువఁబడితిని. ఆవీథి నప్పు డొక్క స్త్రీపాత్రధారి బజాఱులోఁ గొనినకూర లంగవస్త్రమున ఘాటుఁగట్టు కొని యామూటఁ జేతితోఁ బట్టుకొని, యొడలిపైఁ జొక్కాలేకుండఁ గట్టుకొన్న బట్టతోమాత్రమే యింటికిఁ బోవుచుండెను. ఆతని నే నెఱుఁగుదును. ఆతఁడు జన్మమున నాఁడారివాఁడు కాని పది సంవత్సరములనుండి స్త్రీ పాత్రముల ధరించుచున్నాఁడు. ఇంతలో నాతని కెదురుగ నొక పెద్దమనుష్యుడు వచ్చుచుం

డెను ఆతఁ డొకనాటకసంఘమున కధికారి. ఆతనిఁ జూచుటతోడనే యీమందభాగ్యుఁ డట్టె సిగ్గుపడి, యట్టెముడుచుకొని, మూటగట్టిగా మిగిలిన యంగవస్త్రపుఁ గొసను రవంత పైఁటగ వేసికొనఁబోయి యది చాలకపోవుటచేఁ తహతహపడి రెండుచేతులను గత్తెరమాది రిగ ఱొమ్ముపై వైచుకొని తలవంచుకొని నిలువఁబడినాఁడు. ఆహా! అతఁ డెంతలో మగరూపమును మన్నుచేసి కొవనినాడో యని నా కెంతయైన జాలికలిగినది.

ఎంతకాల మలవఱచుకొన్నను స్త్రీపాత్రధారి కాఁడుదానిబహిరంత స్తత్త్వములు రావు కాని మగతత్త్వము భగ్నమగుట నిస్సందేహము. అందుచే నిప్పు డాఁతఁ డెట్టివాఁడు? మగతనము చెడినవాఁడు. ఆఁడుది కానివాఁడు. ఆతఁడు పూర్తిగా నాఁడుదియే యైనయెడల నేమో మనతోపాటు తానుగూడ నుండియేయుండును. ఇంటిలోవంటకుఁ బెంటకు మనకుఁ జేదోడుగ నుండియేయుండును. అటుకాక యిటుకాక యిప్పుడాతఁడు నడుమ నూగులా డుటచేత గిజగిజ లాడుచున్నాము. ఆతఁ డాఁడుది కాని హేతువుచేఁ జేపట్టనా? మగతనము మాసిపోవుటచే వదలిపెట్టనా? అడుగంటిన యనురాగము లడుగంటనేయంటినవి. పోనీ! ఏలాగుననో సృష్టితంత్రము జరుగుటకై యేయెడమొగము పెడమొగముగనో సంసారములో శేషభాగ మీడ్చివేయుదమని సిద్ధపడిన యెడల మాకింకఁ బుట్టఁదలఁచినపిల్లలమాట యేమి? మగవాఁడు కాకుండ నాఁడుది కాకుండ నడుమనున్న సంకరస్వరూపములను గనివారి నేడ్పించి మే మేడ్చుటకంటెఁ బడుగకది కొక్కనమస్కార మర్పించి వంటయింటిలోఁ బ్రత్తిబుట్టముందో, సీతానగరములో నుపన్యాసపీఠమందో తనువు వెడలఁబుచ్చుకొనుట సర్వశ్రేయము కాదా? ఇప్పటి పరిస్థితులలో భారతదేశ మెట్టి కొడుకులను గనవలయునో యెవ రెఱుఁగరు? ఇనుపకండలవారిని, దేశభక్తులైనవారిని, విద్యాశాలులైనవారిని మన మిప్పుడు కనవలసియున్నది కాని లంగా కట్టుకొని నాట్యమాడు మగరంభను, గోవులపంచెక ట్టుకొను పోతువితంతువును మన మిప్పుడు కనవచ్చునా? ఇప్పుడున్న స్త్రీపాత్రధారులు చాలరా? అదిగాక జన్మముచే నాఁడారిపెద్దమ్మ లెందఱున్నారో? వీరుచాలక, యిఁక నిట్టి యర్ధపురుషసృష్టికి మనము పూనుకొనుట బుద్ధిహీనత కధా? దేహద్రోహము కాదా?

''నీ వాఁడువేసము వేసితిని కావున నీతో నేను గాఁపుర మొనర్ప'' నని స్పష్టముగ నేను నాభర్తతో–అదేఅర్ధభర్తతో–ఆఁడుమగనితోఁ జెప్పితిని–''నేనిప్పుడే వైచితినా? ఆఱుమా సములనుండి వేయుచున్నా'' నని యాతఁడు వెకవెకలాడెను. సోదరీమణులారా! చూచితిరా! ఆతని దుర్నయము! ఆతని దురాగతము! తాను జెడనే చెడినాఁడు; జాతిని సంకరపఱచుటకుఁగూడ సంకల్పించుకొనినాఁడు. ఇది నీకు నీతిగాదని మనము మందలింపఁబోగ మనలను బరాభవించుచున్నాఁడు. ఇంతకంటె నాఁడుదానికి విచారణకా రణ మేమియుండగలదు? ఇది మనము సహించి, నోరుమూసికొవని పడియుండవలసిన దేనా? నే నట్టినీచత కంగీకరింపను. విద్యావతులు, మానవతులు, దేశభక్తియుక్తలైన నా సోదరీమణులందఱు నాయభిప్రాయముతో నేకీభవింతురని నమ్మియున్నాను. ముందు జరిగింప వలసిన పని యొకటి యున్నది. ఆంధ్రదేశమున నున్న నాటకసంఘాధికారుల కందఱకు మన మొక్కయాజ్ఞాత్ర మంపవలసియున్నది. దానిలోని యంశము లి ట్లుండవల యును.

''మీరు మాభర్తలచే మీ నాటకములలో నాఁడువేసములను వేయించుచున్నారు.

మగవాని కనర్హమైన స్త్రీపాత్ర ధారణమువలన వారు చెడిపోవుచున్నారు. వారట్లుపాడై జాతినిగూడ భ్రష్టపఱచుటకు సంకల్పించుకొనియున్నారు. వ్యక్తివినాశకమైన, జాతివినాశక మైన యీ కృత్యమును మీరు ప్రోత్సహింపఁదగదు. కావున మా భర్తలను మీసంఘములనుండి బహిష్కరింపవలయును. ఇంతటినుండి పురుషులచే స్త్రీవేషములను వేయింపమని మీరు శాసన మొనర్చుకొనవలయును. నాట్యకళాభివృద్ధి మా కిష్టమే. స్త్రీలకే స్త్రీపాత్రము లిప్పించి మీ రాకళను బరిపోషించి, పరిపూర్ణకీర్తి నొందవలయును, నాగరికతగల యన్నిదే శము లందుఁగూడ నదియే పద్ధతి. మీరు దానికి విరుద్ధముగ నడువఁదగదు. సహేతుకమైన మా యాజ్ఞాపత్రమును మీరు సన్మానింపవలయును.''

ఇట్లు వ్రాసి స్త్రీలందఱుచే సంతకములు చేయించి వారికిఁ బంపవలయును. అటుపిమ్మటఁగూడ మనభర్తలు చీర రైక సొగసు చిత్తగించుట మానకపోవునెడల నింక నంతే–వారికి వారే, మనకు మనమే వారితో మనము పూర్తిగ విడిపోవలసినదే. రాజకీయ ప్రపంచమున Non-Co-operation యెట్లు పుట్టినదో శృంగార ప్రపంచమున నిప్పుడు Non-Co-operation అట్లు పుట్టవలసియున్నది. మనకు జాతిపరిశుద్ధి ప్రధానము కాని సంసారవృద్ధి కాదు. దేశసేవ ప్రధానము కాని భర్తసేవ కాదు. భారతదేశసేవ ముందుఁ బతిసేవ యెంత? మనకుఁ బతులు శాశ్వతులు కారు. వారికిష్టత తప్పినను బోవుదురు. మన కిష్టత తప్పినను బోవుదురు. కాక మృత్యువున కధీనులైపోవచ్చును కాని భారతదేశము శాశ్వతము! ఆమె యిప్పుడు పుత్రపుత్రి కాసేవ నపేక్షించుచున్నది. పూర్వసౌభాగ్యము, నాగరకత, విజ్ఞానము, సంపత్తు, స్వాతంత్ర్యము, గౌరవము నశించుటచే దీనమై, శోభారహితమై, దాస్యశృంఖలానిబద్ధమై పరితపించుచున్నది. శీతజ్వర మారికాది మహావ్యాధులచేతను, గూటికి గుడ్డకుకూడఁ గఱవైన దారిద్ర్యములచేతను, రక్తపాతములకుఁ గారణము లగు చున్న వర్ణవైషమ్యములచేతను జాతియంత యథాయథ లగుటవలన, నాకంటికొలికినీరు బంగాళాఖాతముగ నా కంటికొలికినీరు పశ్చిమసముద్రముగ మహాసంక్షోభ మొందు భారతదే శమును సేవించి పూజించి మనతనువులు కృతార్థము లగునట్లు చేసికొనవలయును–ను. న.

''భారతీపత్రికాధిపతీ! ఈకాంత వ్రాసిన సాహసపువ్రాఁతలలో నొకటి రెండశములు నేను విమర్శింపవలసియున్నది. ఆవిమర్శనము త్వరలోఁ బంపెదను. ఆశ్వయుజమాసమునఁ బ్రకటింపఁబడు భారతిలో దానివి ప్రకటింపఁగోరుచున్నాను.

చిత్తగింపుఁడు,
పా. ల. నరసింహారావు.''
(''భారతి'' నుండి పునర్ముద్రితము).

32. శ్రీమతి సు.స. గారికి బహిరంగ లేఖ

ఆడవేషాలు వేసే మగవారి గురించి దుమ్మెత్తి పోసిన సు.న. గారికి – కొన్ని విషయాల గురించి– సమాధానంగా పానుగంటివారు ఈ వ్యాసం వ్రాశారు.

ఉపన్యాసం స్త్రీలను ఉద్దేశించినదే అయినా, పురుషుల్ని ఉద్దేశించి పుంఖానుపుంఖాలుగా అందులో తిట్లున్నాయి. భర్తమీద కోపంతో వెల్లడించిన అభిప్రాయాలకు, భారతీయ జాతి పరిశుద్ధితో లంకె ఉండడం వల్ల స్త్రీపురుషులంతా చదవాలని పానుగంటి వారు భారతిలో ప్రకటించారు.

సు.న. గారి వ్యాసంలో నాలుగు భాగాలున్నాయి. నాలుగింటా ఒకటే సంకల్పం, పురుష జాతిని తిట్టడం.

స్త్రీపాత్రధారణం చేసే మగవారి మూలంగా కలిగే పిల్లలు సంకర స్వరూపులై ఉంటారనే వాదం సరైంది కాదు. కాదని చెప్పడానికి దృష్టాంతాలున్నాయి.

HERIDITY మూలంగా కన్ను, ముక్కు, మూతి వంటి పోలికలు రావచ్చును గాని–గుణగణాలు రావాలని లేదు. మహాపండితుడి కొడుకు శుంఠ కావచ్చు. నిరక్షరకుక్షి వంశంలో మహామేధావంతుడు పుట్టవచ్చు. బహుపత్నీకుడైన దశరథుడికి–శ్రీరాముడి వంటి ఏకపత్నీవ్రతుడు కొడుకు కావడం, విష్ణుద్వేషి అయిన హిరణ్యకశిపునికి హరిభక్తుడైన ప్రహ్లాదుడు పుట్టడం గమనించలేదా!–జీవుడి పూర్వజన్మ సుకృత దుష్కృతాలే ఈ జన్మలో గుణగణాలకు కారణాలవుతాయి. మగవాడు ఎలాంటివాడైనా, స్త్రీ భావన, బిడ్డల్ని కనడంలో ప్రముఖం. స్త్రీల భావన లోపం వల్లనే జాతిలో బానిసతనం ఎక్కువవుతుంది. ఆడవాళ్లు స్త్రీపాత్రల్ని ధరించడంలో గృహిణులైన వారికి చాలా సాధకబాధకాలున్నాయి. వేశ్యల్ని తెచ్చి వేషాలు వేయిస్తే ప్రమాద పరంపర ఇంకా పెచ్చు. స్త్రీ పాత్రధారణ చేసే పురుషులు బాగానే చేస్తున్నారు. ఈ సందర్భంలో, కొత్త సంస్కరణ లేమీవద్దని, సు.న. గారికి సలహా ఇచ్చారు.

అమ్మా! శ్రద్ధతో వ్రాసి యశ్రద్ధతో విడిచిపెట్టిన నీయుపన్యాసము దైవవశమున నాకు దొరకుటచే దానిని సంతోషమునఁ జదివి విమర్శింప వలసివచ్చెనని విచారించితిని.

ఆ యుపన్యాసము స్త్రీలకై యుద్దేశింప బడినదైనను; దానిలోఁ బురుషులకుఁ బుంఖానుపు
ఖముగాఁ ది ట్లుండుటవలనను, భర్తృపై గోపమున వెల్లడించిన యభిప్రాయములక
భారతీయజాతిపరిశుద్ధితో లంకెయుండుటవలనను దానిని స్త్రీపురుషులందఱు చదువలవ
సినదని యెంచి భారతిలోఁ బ్రకటింపించితిని. అట్లు ప్రకటించుటకు మీ సెలవులేద
యెఱుఁగుదును. కాని మీ రెవ్వరో నే నెఱుఁగనప్పుడు మీ సెలవు నొందకపోవుట లోపమ
కాకపోవచ్చును. అదికాక జాత్యుపద్రవ మేదో వచ్చినదని మీరు భావించుచు మహోందోళ
మొందుచుండ నట్టి యాపత్కాలములో ననుజ్ఞ యుక్కఱలేదని యనుకొనుట కూ
లోపము కాకపోవచ్చును. ఎటులైనను భారతీసేవకై సంకల్పింపఁబడినది భారతినే చేరినది

అమ్మా! నీయుపన్యాసము నామూలాగ్రముగ బండిలోనే చదివితిని. అది నాల్గుభా
ములుగా విభజింపబడినట్లు స్థూలదృష్టికిఁ గానఁబడుచున్నది. మొదటిభాగము మగవానికి
దిట్లు; రెండవ విభాగము మగవానికిఁ దిట్లు; మూఁడవవిభాగము మగవానికిఁ దిట్లు; నాల్గ
విభాగము మగవానికిఁ దిట్లు; మగవాఁడు వట్టి వ్యర్థుఁడని మీ యభివృద్ధికిఁ బ్రతిబంధకారు
డని, పరమశత్రుఁడని, ప్రత్యక్షమారకుఁడని, యాతనిఁ ధృణీకరించి స్వప్రయత్నమున
మీ రిట్టిమహోన్నతదశకు వచ్చితిరని, మగవాని నేల నడఁచిత్రొక్కినను బాపములేద
మొదలగు ప్రారంభ శాపవాక్యములు మొదటియధ్యాయమునందుఁ బ్రకాశించుచున్నవి. మీ
బుద్ధిచేత మీకర్షములని యుపయోగకరములని మీరెంచిన బాహ్యవేషములను ధరించుచ
నభినవశోభావి రాజమానలై యార్యావర్తకల్యాణ దేవతలై యలరారుచుండఁగ, బాహ్యవేషధా
ణమునఁ దన్నేమో మీ రనుకరించుచున్నారని భ్రాంతిపడి మగవాఁడు మి మ్మెంతయె
యల్లరిపెట్టినాఁ డనుకోపమున మీ రాతనిని జెడమడఁ దిట్టినతిట్లు రెండవయధ్యాము
నేర్చినరత్నాలవలె భాసిల్లుచున్నవి. మగవాఁడు కోక కట్టుకొని, కాటుక పెట్టుకొని
నవరపుబుట్ట నెత్తిని గట్టుకొని, బూడిద మొగమునఁ గొట్టుకొని కోడెసెయ్యయై రంగమున
నవతరించి నందులకు కాతని కడ్డమైన తిట్లు–మాయదారిచూపులు–మంగళపు టారతిచూ
పులు–చూడలేకపోయెనని మఱిమఱితిట్లు–ఆఁడుది నిలువఁ బడినట్లు నిలువఁబడనై
లేకపోయినాఁడని నిలువెల్లఁ దిట్లు–మానినీ తత్త్వము ననుకరింపలేకపోయెను. గాని మగయె
డలి పొంకములు, మనస్తత్త్వము కూడ మన్ను చేసికొనినాఁడని–ఓ–హద్దుపద్దులేనితిట్లు
–మూఁడవయధ్యాయమునఁ బ్రచండధాటిపరిపాటితో విజృంభించుచున్నవి. సంకరరూపన
మార్జనమున సంసారకృత్యమున కర్హుఁడు కాని యాతఁ డా నాటకరంగమందే పడియుండి
మగవాఁడు కాకుండ, నాఁడుది కాకుండ నేదో మధ్యమమార్గగామియై దేహము చాలించు
కొనక, సిగ్గులేక, యిల్లుచేరి, తగుదునమ్మా యని తనవంటి మందభాగ్యుల నింక నవతరించ
పజేయుటకుఁ బ్రయత్నించుచున్నాఁడని, దేశద్రోహియని, జాతిద్రోహియని తిట్టినతిట్లు
–హరిహరీ!–తురీయాధ్యాయమున నప్రతిహతములై యనిర్వ్యూఢములై యున్నవి. వేదోచ్చా
ణమును వదలి చతుర్ముఖుఁ డగు బ్రహ్మదేవుడు తిట్లకు లంకించుకొన్నయెడల నింతకంటె
నెక్కువ తిట్టలేఁ డేమో యనునందేహమును గలుగఁజేసితివి. ఈనాలుగధ్యాయములలో
నాలుగువర్ణములవారికి, నాలుగాశ్రమములవారికి, నాలుగుయుగములవారికిఁ దలమున్కలైన
తిట్లు ప్రసాదించితివి; తల్లీ! శాపాలాపశారదావతారమవు!

వెట్టితిట్లకు విమర్శన మేమున్నది? స్వర మగునెడల గాంధారమా మధ్యమమా

మఱియొకటియా యనుపరీక్షకాని, యపస్వరమునకుఁ గైశికియా కాకలియా యనువిచికిత్స యుండునా? ఉపేక్షకంటె నుత్తమవిమర్శనము వేఱొకటి లేదు కావుఁ దిట్లనంగతి యింకఁ దలపెట్టక విమర్శింపవలసినయంశము లేవో కొలదిగా విమర్శింతును.

అమ్మా! స్త్రీపాత్రధారణము తఱుచుగఁజేయు మగవానిమూలమునఁ గలుగుపిల్లలు సంకరస్వరూపులై యుందురని మీవాదము. ఇది మీభావనకాని ప్రకృతినత్యము కాదు. అఁడారివా రెందఱో ప్రపంచమున నున్నారు. నే ననేకుల నెఱుఁగుదును. వారి యాఁడారితన మింత యంతయని చెప్పవీలులేదు. మూటలోఁ, జూపులో, రూపులో, నడకలోఁ దలంపులోఁ, జర్యలో సంపూర్తిగా నాఁడువారివంటివారేకారు–అఁడు వారే? అంతయో యింతయో దుష్టత్వ మాఁడంగితనమున కంటియే యుండును. అఁడారివాఁడు గుమ్మము నొద్ద నిలువఁబడియుండఁగ వీథిలో నెవఁడైన సుందరుడు పోవుచుఁ దనవంకఁ జూడకుండిన యెడలఁ గనపుట్టి యేమిమునిఁగిపోయినది? తన స్త్రీత్వము నాతఁ డవమానపఱచినాఁడని యాతఁ డ ట్టుడికిన ట్లుడికిపోయెను! ఆసుందరుఁడు మఱియొకయాఁడు దానిఁ జూచి మందహాస మొనర్చునెడల నాఁడారివాఁ డసూయచేఁ దలనేలఁగొట్టుకొనుటకు సిద్ధపడును. అట్టి యాఁడంగివాఁడైనను బుంస్త్వసహితుఁడై పతివ్రతయైన తనభార్యయం దిట్లునిండిన బిడ్డలఁ గనుచున్నాఁడు. వారు సంకరస్వరూపులైయున్నారా? అణువంతయాఁడారి తన మాతనిపుత్త్రులయం దెచ్చటనైనఁ గనఁబడుచున్నదా? దుర్బలులైనపిల్లలఁ గనుచున్నాఁడా? ఉక్కుతునుకలవంటి వారిని గనుచున్నాఁడు. పౌరుషనిహీనులై వారిని గనుచున్నాఁడా? లేదు, శౌర్యసహితులనే కనుచున్నాఁడు. అఁడారితండ్రికిఁ బుట్టినవాఁ డెవ్వడుకూడ నాఁడారి వాఁడు కాలేదని యనేకదృష్టాంతములు చూపవచ్చును. అంతవఱ కిప్పుడవసరము లేదు. స్త్రీపాత్రధారియైన పురుషుఁడు దేహమనస్తత్త్వములం దాఁడంగివానికంటె నెక్కువ చెడిపోయినాఁడా? లేదు అఁడంగివాఁడే యట్టిబిడ్డలను గనుచుండ, స్త్రీపాత్రధారి సంకరస్వ రూపులను గనుననుట సత్యదూరము; సాహసము.

వేదవిహితాచారసంపన్నుఁడై స్వచ్ఛమూర్తియైన వైదికశిఖామణికి, రైల్వేవారి భోజన మతములందు గొడ్డుమాంసమును బీఁకుకొని తిను కర్మచండాలుఁడు జన్మించుచున్నాఁడు. పార్వతీపరమేశ్వరులవలె నపత్రిమాన దాంపత్యసహితులై పరమప్రశస్తులైన భార్యాభర్తలకు వారవనితామాతచేఁ జెప్పుదెబ్బలు దిను వంశోద్ధారకుఁ డుదయించు చున్నాఁడు. షట్కా స్త్రపాండితీమండితుఁడై సర్వదిగంత విశ్రాంతకీర్తి యుక్తుఁడైనవానికి శుంఠలలో శుంఠ జన్మించుచున్నాఁడు. అమ్మా! ప్రపంచచరిత్రమును జూచుచుండుట లేదా? వితరణకళాదీక్ష యందు బలిశిబికర్ణాదులంతటి మహావదాన్యులగర్భమునఁ దండ్రిప్రాణోత్క్రమణసమయ మున నాతనితలవైపునఁ బెట్టుదీపము దండుగ యని యార్పఁ జేయులుబ్ధాధమాధముఁడు కలుగుచున్నాఁడు. నవరసమయ నవజగన్నిర్మాత యైన Shakespeare మహాకవి గొడ్లు కోసికొను కటికవానిపుత్రుఁ డని యందురు. ఒకనీగ్రోజాతి యాతఁడు మహావిద్వాంసుఁడై మహాసభయం దొకమహోపన్యాన మిచ్చుచుండగా విని మహాశ్చర్యభరితుఁడైనట్లు శ్రీవివేకా నందస్వామి సెలవిచ్చినారు. ఆ నీగ్రోపండితుని తండ్రితాతలు వట్టి మూఢులైయుండ, నట్టివిద్వాంసుఁడు వారివంశమునఁ బుట్టుట చూడగా Hredity యుననది కల్లకాని వేఱుకాదని యాస్వామి స్పష్టపఱచినారు. ఏఁడడుగులయెత్తు దాఁటినవానిని Giant అని

యందురు. అట్టివారెందరో యిదివఱకు జన్మించిరి. కాని వారి తల్లిదండ్రులు సామాన్యాకృతి కలవారే కాని తద్భిన్నులు కారని పరిశోధనమువలనఁ దెలిసియనంశమే కదా! ఏఁడడుగులయెత్తుగల తండ్రికి మూఁడడుగుల వామనుఁ డుద్భవించుట లేదా? ఇంతయేల? ముగ్గురుభార్యలు చాలక దినమున కొకతె చొప్పున మూఁడువందల యఱువదుగు రుంపుడుకత్తెలను జేరఁదీసిన దశరథమహారాజునకు–పరశురాముడు కాఁబోలు యుద్ధార్థ నంపఁగాఁ జేతులకు గాజులు తొడిగించుకొని యూఁడువారిగుడారము లలో దూఱిన దశరథమహారాజుకేకదా –ఏకపత్నీవ్రతుఁడైన జానకీనాథుఁడు–జగదేకవీరుఁడైన శ్రీరామచంద్రమూర్తి జన్మించినాఁడు; అమ్మా! ఇంకను Heredity ని నమ్మెదవా? Heredity యనుదాని వలనఁ దండ్రిసంబంధమైన ముక్కుపొడుగో, తల్లిసంబంధమైన కన్నుసోగయో, మేనమామసంబంధమగు మూతివంకరయో పిల్లవానియందుఁ గాదాచిత్కముగ నంక్రమింపవచ్చునుగాని, జగత్తునేలుటకు సామర్థ్యముగలయట్టియుఁ గాక జగత్తునకు బానిస యగునంతటి తుచ్ఛత్వము గలయట్టియు, మనస్సులోని శౌర్యము, గాంభీర్యము, త్యాగము, నాపత్సహనము, భూతదయ, దైవభక్తి మొదలగు సద్గుణపరంపర కాని, కాతరత, లాఘవము, లోభము, శాంతిరాహిత్యము, తామసను, నాస్తికత మొదలగు దుర్గుణపరంపర కాని, Heredity వలనఁ గలుగుటకవకాశము లేదు. అట్టియవకాశమే యుండునెడలఁ బ్రహ్లోదుఁడంతటివాఁడు హిరణ్యకశిపునంతటివానికిఁ బుట్టుట సంభవించునా? అనూచానత కారణము కానియెడలఁ గారణమేదనియడుగుదువేమో? జీవుని పూర్వజన్మానుకృతదుష్కృతములే జన్మములోని గుణాగుణములకుఁ కారణములు కాని వేఱుకాదు. అమ్మా! నమ్మటకు నీ కిష్టమైనయెడల నమ్ముము; కాని యెడల మానివేయుము. నీనమ్మకమువలన నార్యమతమునకు బలము లేదు. నీతిరస్కారమువలన నీరసతయులేదు. మహాబుద్ధిశాలులైన పెద్దలు నిర్వచించిన మాటలను నాకుఁ దెలిసినంతవఱకు నా యత్యల్పశక్తి ననుసరించి చెప్పుచున్నాను. వేదర్షులయందలి విశ్వాసము చేనైనను నీనూతన సిద్ధాంతమును ద్యజింపఁదగును.

''నీవు స్త్రీపాత్రధారణ మొనర్చితివి కావున నీతో నేను గాఁపుర మొనర్ప''నని నీవు భర్తతో నిరంకుశముగఁ బలికితివే! ఆహా! భారత దేశ సంరక్షకదేవతలు గడగడ వడఁకునంతటి మాటయంటివే! భర్తపైటవేసికొని వంకరగఁ జూచినంతమాత్రముననే భర్భభార్యాసంబంధము తెగునని యనుకొంటివా? అదిగాక ''మనకు భర్తలు శాశ్వతులు కారు; వారియిష్టము లేకున్నఁ బోవుదురు. మన యిష్టము లేకున్నను బోవుదు'' రని వ్యాసుఁడు బ్రహ్మసూత్రరచన మొనర్చినట్లు నీవు పరిణయసూత్రములను గల్పించితివే! అమ్మా, యెంతదానవు! మనవివాహశాసనము వంటపూటింటివ్యాపారమువంటిదే యనుకొనుచున్నావా? రషియావారి మూఁడునంవత్సరముల ''కాంట్రాక్టు'' వంటిదే యనుకొనుచున్నావా? భార్యాభర్తలు తనువులు వాసినను బంధము వీడునది కాదని యెఱుఁగవా? శరీరయాత్ర చాలించి స్వర్గమున నఖండానందసముద్రమున నోలలాడుచుండునిల్లాలైనను భూలోకమం దింక జీవించియున్న తనభర్తకై గ్రుడ్లనీరుగ్రుక్కుకొనుచునే యుండునుగదా? తనభర్త యన్యకాంతానక్తుఁడు కాక తనయందే యపేక్షగలవాఁడై యుండవలయు ననియుఁ దన గృహదేవతలను బూజించుచు, నతిథినత్కార మొనర్చుచు, సదాధర్మమందే చరించుచుఁ గీర్తికాముఁడై యుండవలయు ననియుఁ, బుణ్యరాశియైన యాతఁడు, భూలోకయాత్రావసానమాప్తి యైనపిమ్మట స్వర్గమునఁ దన్నుఁజేర యవ్యయానందము ననుభవింపవ

లయు ననియు, నామె భగవంతున కెల్లప్పుడు మ్రొక్కుకొనుచునే యుండును గదా! ఇది సత్యమని నిరూపించుటకు నిదర్శనములున్నవి కాని లేకపోలేదే! అట్టిచోనిడ్డెనపాత్రము పొరుగింటినుండి తెచ్చుకొని యిడ్డెనలు చేసికొన్న పిమ్మట వారిపాత్ర వారికిఁ బాఱవైచినట్లు భర్తతో నవసరము తీఱినవెంటనే యాతనిఁ బైకిఁ బొమ్మనుటకు నీ కధికార మున్నది యనుకొనుట తప్పు కాదా! పట్టరానికోపముచే నటులంటివి కాని నీమనస్సులో నట్టియుద్దేశము లేదని పెద్దవాఁడనైన నేను గ్రహింపలేనా? ఆఁడువేనములు వేసిన పురుషులవలన సంకరస్వరూపులు పుట్టుదురని స్వప్నమందైన ననుకొనకుము.

అమ్మా! మఱియొక్క మాట. మీకున్న భావనబట్టియే మీకుఁ బుత్రులు కలుగుదురు. ఈయంశమునుగూర్చి జంఘాలశాస్త్రి చెప్పియే యున్నాఁడు. ఆతనిమాటలనే చెప్పెదను. ''భర్తయందు మీకున్న భావనాగౌరవమును బట్టియే మీకు సంతానము కల్గును. తెలిసినదా? భర్త పరదేవతయని యెంచి మీ రాతనిని సేవింపుఁడు. మీభావనాబలముననే మహాపురుషులు మీ గర్భమున నవతరింతురు. భర్త మీకు బానిసయని యెంచి యాతనిపై నధికార మొనర్పఁకుడు. మీరు బానినక్రింద బానినవంటిపిల్లలఁ గందురు. అది నిశ్చయము. అభిమన్యుని సుభద్రయే కనవలయును. భరతుని శకుంతలయే కనవలయును. ఈ కాలములో నభిమన్యులు, భరతు లెందుకు లేరు? సుభద్రలు, శకుంతలలు లేకపోవుటవలన. భర్తలను దైవములుగ సేవించుటకు భగవత్సములైన భర్తలిప్పుడున్నా రాయని తెలివితక్కువ ప్రశ్న మొనర్పకుఁడు. ఒకప్పుడు మాత్రమూ భగవత్సము లైనవారుండిరా? లేరు. ఇప్పుడింతకంటె లేరు. లేకపోయినప్పటికి మీ భావనకభ్యంతరమేమి? మగలు కాని మట్టిబొమ్మలు కారే. మట్టిబొమ్మనే ద్రోణాచార్యుఁడుగ భావించి సేవించినవాఁడు ధానుష్కశిఖామణి కాలేదా? అంవఱ కెందులకు? గాజులతట్టతోఁ గలుపఁబడిన గోడిగ యరేబియా గుఱ్ఱమును గనుటలేదా? భావనయే ప్రధానమా? అంతకంటె నేమైన నున్నదా? అట్టి మీ భావనలోపమువ లననే జాతిలో బానినతన మెక్కువ యగుచున్నది. మీయొద్ద మీ భర్తలు గడగడలాడినప్పుడు మీరు కన్నకొడుకు లెలుకలను జూచి, పిల్లులను జూచి యేడ్చినారనగ వింతయేమున్నది? సోదరీమణులారా! బాహుబలసంపన్నులు, ప్రజ్ఞాశాలులు, క్షాత్రవంతులైన పుత్రులఁ గని భారతదేశ ప్రాచీన గౌరవమును గాపాడుదురుగాక!''

విమర్శింపఁ దగినయంశ మింకొక్కటియున్నది. నాగరకతగల యితర దేశములందలి పద్ధతి ననుసరించి స్త్రీలకే స్త్రీపాత్రములిచ్చి నాటక కళను బరిపోషింపవలసినదని మీరు నాటకసంఘాధికారుల కొనఁగఁ దలఁచిన యాజ్ఞాపత్రములో నున్నది. అమ్మా! అవశ్యకమైన యెడల నన్యదేశీయ పద్ధతి నవలంబించవచ్చును. కాని, దాని నవలంబించుటకుఁ బూర్వము మనదేశ శీతోష్ణస్థితులేమో, సాంఘికనైతికాదిస్థితులేమో, జాతియాదర్శమో, యన్యదేశీయపద్ధతి మన యీ పరిస్థితులకు సరిపోవునో, వికటించునో, మనతత్త్వములకు విరుద్ధమైనమందును దీసికొనుటవలన నున్న రోగ మట్లుండఁగా మఱి యింక వేరోగము కలుగునో రవంత చూచుకొన నక్కఱలేదా? పాశ్చాత్యదేశములలో మిక్కిలి శీతలప్రదేశములందలి వారికి శీతోదకస్నానము స్వప్నమందైన లేదు గదా! ఉష్ణోదకస్నానమైన దినమున కెన్నిసారులని యడుగవలదు; వారమున కెన్నిసారులని యడుగవలదు; మానమున కెన్నిసారులనియైన నడుగవలదు. సంవత్సరమున కయిదాఱుపర్యాయములు లైనయెడల-ఓ

–సమృద్ధి పండ్రెండుస్నానము లొనర్చువాఁడు పరిపూర్ణస్నాననిష్ఠాగరిష్ఠుఁడు. ముంజేతులకు మొగమునకు మాత్రమే యుష్ణోదకస్పర్శము కాని యొడలి కేది? వారు నాగరికత కలవారు కారా? అట్లని వారి పద్ధతి మనమవలంబించు నెడల భారతదేశమంతయుఁ బదిమాసములలో నిర్జన మగుట కేమైన సందేహమా?

అమ్మా! France దేశమునకుబోయి యచ్చటి యొకనటిని నీ వీవృత్తినేల యవలంబించితివని యడుగుము. ''ఈవృత్తిలోఁ జాకచక్య మగపఱచి, ధనము సంపాదించునెడల మగఁడెవ్వఁడైన లభించునేమో యను నాసతో నిందు దిగితి'' నని యామె ప్రత్యుత్తరము చెప్పును. ముప్పది రెండేండ్ల కన్య మొగమునకు బూడిద రాచుకొని యర్ధదిగంబర వేషముతో నాట్యమాడుచు, వలతోఁ జిగురుగండెలతో, పక్షికూతలతో మగలకైవేఁటాడుచు, నెవ్వనినో యొకని గ్రహించి వానిని కొంత కాలము పరీక్షించి నచ్చనియెడల విడిచిపెట్టుచు, మఱియొకని గ్రహించి, వాఁడు చేసిన మోసమువలనఁ గలిగిన ఫలముల కేడ్చుచు, మఱల మఱియొకనికై ప్రయత్నించుచు, నాందోళనపడుచు, నల్లాడుచు, మిడుకవలసిన స్థితి భారతదేశస్త్రీ కెన్నఁడైన నేమాత్రమైనఁ గలుగుటకు సాధ్యమగునా? ముప్పదిరెండేండ్లవఱ కెందులకు? పదునెనిమిదేండ్లు దాఁటిన కన్యను సాధారణముగా భారతదేశమందుఁ జూపఁగలమా? అంతవఱకుఁ గూడ నెందులకు? పదియేండ్లకుఁ బెండ్లి, పదునొకండేండ్లకు సమర్థ, పండ్రెండేండ్లకు లొడితెడుబిడ్డయు గల గృహిణి భరతశాస్త్రాభ్యాసము చేయుటెప్పుడు? ప్రసన్న యాదవములో నూర్వశియై తాండవించు టెప్పుడు? అమ్మా, Germany లో మఱియొక్క నటిని నీ వీవృత్తిలో నేల చేరితి వని యడిగెదవా? ఆమె యేమిప్రత్యుత్తర మిచ్చుచున్నది. Excitement కొఱకని చెప్పుచున్నదా?. అమ్మా! అనఁగ నేమో నీకర్థమైనదా? ఉత్సాహమునకు–ఉబికిన యుద్రేకమునకు–నరముల కదలికకు ఆమె యీవృత్తిలో జేరినదఁట! ఇంట బండపనిచే, భర్తసేవచే, బంధువుల యాదరణముచే, నతిథిజనసన్మాన ముచే, దేవపూజా ద్రవ్యసమార్జనముచేఁ, బిల్లల కొనర్పవలసిన మొదలు తుదిలేని, తెఱపి తెంపులేని యుపచారపరంపరచే నిత్య ముత్సాహతోఁ గదలికతో మెలఁగవలసిన మననారీమణుల కెప్పుడైన నట్టి Excitement కావలసియుండునా? పరదేశనటీశిఖామణులు బ్రహ్మచారిణులగుటచే నేవిధమైన జంజాటము నెఱుఁగని హేతువున వారి కట్టి యుద్రేకస్థితి యావశ్యకము కాని, యూఁపిరి విడుచుటకైన దెఱపిలేని యుద్రేకస్థితిలోఁ దఱచుగా నుండవలసిన మననారీమణుల కది యె ట్లున్వయింపఁగలదు? ఒకవేళ నెప్పుడైన నే కారణమునైన రవంత మాంద్యముగా నున్న యెడలఁ దోఁపకుండ నుండునెడలఁ గదలికకొఱకు గ్రచ్చకాయలాడుకొందురు; చతురంగ మాడుకొందరు; పాటలు పాడుకొందురు; పదిమంది చేరి యేదైన గ్రంథమును జదువుకొందురు. అంతేకాని యంతకంటె నుద్రేక మిచ్చుపను లొనర్చుటకు మనవారు పాల్పడఁగలరా? పట్టపగలు, భర్తతోనైన రవంత యే కాంతముగ మాటలాడినయెడల నత్తగారు రొనరొరలాడునే! ఆఁడుబిడ్డ మూఁతి విరుచునే! వరపురుషుని స్పృశింపఁ దగదు; చూడఁదగదు; తలఁపఁదగదని ముప్పేటయేనుఁగు మెలికలబంధముతో జాతితత్త్వ పరిశుద్ధనిమిత్తమై పరమసంతోషపూర్వకముగ బంధించుకొన్న మన సోదరీమణులు నాటకములలోఁ బరపురుషులచే నాలింగన మొనర్పఁబడుటకుఁ గాని, ముద్దు పెట్టుకొనఁబడుటకుఁగాని యంగీకరించుట యెన్నఁడైన సాధ్యమగునా? పదవయేఁట గట్టుకొని, యెనిమిదేండ్ల నుండి కాఁపురముచేయుచు నల్వురుబిడ్డలను గన్నమగఁడింటిలో నుండఁగా

మనదేశమందలి సంసారిణి ''ప్రాణప్రియా'' యని బొరంగజేబుమీఁదఁ జేయి వేఁగలదా? వైన హిమాలయము, ప్రక్కను సముద్రము లున్నంతకాలము భారతదేశస్త్రీల కట్టిదుర్యోగము పట్టదు? ఇతరదేశస్త్రీలందు మాత్రము నటీవృత్తి వివాహముతో సామాన్యముగ నంతముకాకుండ సాగుచున్నదా? అందుచే సంసారిణుల కది యనర్థమని ప్రపంచమంతయు నంగీకరించిన విషయము లాగునఁ గనిపించుచున్నది.

ఇఁక మిగిలినవారు వేశ్యలు. అమ్మా! వీరికి స్త్రీపాత్రము లీయవలసిదని నీయభిప్రాయమై యుండవచ్చును; ఇది సమంజస మగునో కాదో చూతము. ఇప్పుడు వేశ్యలలో గొప్పసంస్కరణ మారంభమైనది. దైవకటాక్షమువలన నిది దేశమంతట వ్యాపించును. అత్యంతము న్యాయమైన యీసంస్కరణమునకు సంపూర్ణవిజయము సిద్ధింపవలయును నని మనుష్యమాత్రుఁడెల్లఁ గోరఁదగినది. ఇఁక నొక్క పదిసంవత్సరములలోఁ బెండ్లికాని వేశ్య కనఁబడకపోవచ్చును. అంతవఱకిప్పుడున్న వారిని నాటక రంగమునఁ బ్రవేశపెట్టి కాలక్షేపమేలచేయరా దందువా? అమ్మా! అటులే యదికూడఁ జూతము.

చెవికంటెఁ గన్నెక్కువ జ్ఞానేంద్రియమగుటచే, శ్రవ్యప్రబంధ పఠనమున మనము సంపాదించుకొను విజ్ఞానము కంటె దృశ్యప్రబంధ ప్రదర్శనమున సంపాదించుకొను విజ్ఞాన మెక్కువ–యెక్కువ సుసాధ్యము–యెక్కువ బలీయము–యెక్కువ శాశ్వతము.

నీతికిఁ దావై, ధర్మమునకు నిలయమై, శాంతి కాకరమై, స్వార్థపరిత్యాగమునకు స్థానమై, దేశభక్తికిఁ దావలమై, దైవభక్తికి మూలమై, మోక్షనిశ్రేణికకు మొదటిమెట్టై ప్రకాశించు పవిత్రనాటకరంగమును ప్రత్యక్షపాపవృత్తివలన జీవించు వేశ్యలసమావేశముచేఁ గలుషపఱచుట సమంజసము కాదని భావించుట న్యాయము కాదా? ఇప్పు డున్ననటకు లందఱు మోగులు, భక్తులు, జ్ఞానులేనా యని యధిక్షేపింకుము. మంచివారున్నారు, చెడ్డవారున్నారు. పోనీ! నీయభిప్రాయప్రకారము చెడ్డవారే హెచ్చుసంఖ్యావారున్నారని యంగీకరింతము. ఇదివఱకున్న కీడే ప్రబలమైయుండెనని నీ వొప్పుకొనుచున్నప్పుడు దాని కంతకంటెఁ బ్రబలమైనకీడును జేర్పఁ బ్రయత్నింపవచ్చునా? ఉష్ణప్రదేశమగుటచే నుప్పులేకుండ ముప్పందుము త్రాగఁగల యిట్టినటకులతో–సంభాషణములకు, సరాగములకు, సాహచర్యములకు, సమాలింగనములకు–ప్రత్యక్షవేశ్యలనే యంటఁగట్టియెడలఁ గొంపలు నట్టేట వేఱె కట్టుకొననక్కఱలేదు. ఇఁక నటులలోఁ బరస్పరము కొట్లాటలు, గ్రుడ్డులాటలు జరుగుట కేమైన సందేహమా? వారకాంతలను స్త్రీపాత్రములుగఁ జేసికొన్న యొకటి రెండునాటకసంఘముల నే నెఱుఁగుదును. ఆసంఘములు సంవత్సరము జరుగకుండనే యంతరించినవి. ఆ యొక్క సంవత్సరములో జరిగిన హంగామా యింతయంతకాదు –తాతలనాఁటి యీనాముల తనఖాలు, వేశ్యకాంతల బంగారువస్తువుల చౌర్యములు, న్యాయసభలలో నభియోగములు, బ్రాందిబుడ్లతో నొకరినొకరు కొట్టుకొనుట, ప్రేక్షకులు కొందఱు నాటకరంగమున బలాత్కారమునఁ బ్రవేశించుటలు, రక్షకభటులు నిరోధములు, తెరల యేలములు, పాకకు నిప్పంటించుటలు, సివిల్ ఖైదులు–సుఖ వ్యాధులు.

అమ్మా! క్రొత్తసంస్కరణ మేమియు వలదు. ఏదోశాంతియుక్తముగా జరుగుచున్నదానిని జరుగనిమ్ము. బాగుచేయఁదలఁచి మఱింత పాడుచేయుట ధర్మముగాదు. స్త్రీపాత్రధారులకు మగతనము మట్టిలోఁ గలిసినదేకాని యిసుమంతయైన స్త్రీత్వము రాలేదని యట్టి

పట్టుపట్టకుము. ముంగురులు కత్తిరించుకొని యిజారు తొడికికొని సైకిలెక్కి నందువలన మీ కెంతమగతనము వచ్చినదో యామాత్రపుస్త్రీత్వ మాతనికి రాకపోలేదమ్మా! ఇప్పటిన టులు బాగుగనే యభినయించుచున్నారు. కొంద ఉత్తమస్థాన మాక్రమింపనున్నారు. నాట్యకళాభివృద్ధి కెందఱో పాటుపడుచున్నారు. బుద్ధిమంతులైనవిమర్శకు లాకళపై గ్రంథ ముల వ్రాయుచున్నారు. నాటకపరిషత్తు నొకదానిని స్థాపించి తత్కళాభివృద్ధికి మార్గములు యోజించుచున్నారు. భరతశాస్త్రాభ్యసమునకై భరతమునిబృంద మొకటి స్థాపింపఁబడినది. అమ్మా! ఏకళలోనైన నుత్తమస్థితి త్వరలో లభించునా? పాటుపడఁగఁ బడక లభింపకమానునా? నాట్యకళకు సుదినములు రాఁగలవని తోఁచుచున్నది.

అమ్మా! మఱియొకమాట. పాశ్చాత్యవనితలకుఁ గలిగినంత యభివృద్ధి దశ మీ కింక రాలేదని చీటికిమాటికి విచారింపవలదు. అట్లు విచారించి వారిపద్ధతులను మీ రవలంబింపఁ బ్రయత్నింపవలదు. వారి యభివృద్ధిదశతో వారేమో విసుగుఁజెందియున్నట్లు కొలఁదిగాఁ గనఁబడుచున్నదనియు, సర్వసౌఖ్యాకరమైన సమస్తగౌరవవభాజనము సర్వమధుర మైన గృహిణీత్వపదము నపేక్షించుచున్న ట్లగపడుచున్న దనియు నింకొక పదిసంవత్సరములలో వెనుకకు నడచినడచి యథాస్థానమును జేరవచ్చుననియు నొకపాశ్చాత్య గ్రంథకర్త "The Modern Girl nonsense" అను శీర్షికతో మొన్న మొన్నవచ్చిన Titbits లోఁ దన యభిప్రాయ మును వెల్లడించినాడు. దానిని నీవు చూడవచ్చును.

అమ్మా! పురుషులు స్త్రీపాత్రముల ధరించి జాతికంత యప్రతిష్ఠ తెచ్చుచున్నా రన్నవిషయము జంఘాలశాస్త్రి పక్షపాతబుద్ధిచేత విమర్శించుట మానినాఁడని నీ వాతని నిందించితివి. ఈ విషయమున నిన్ని చిక్కులుండుటచేతనే మానినైచినాఁడు. కాని పక్షపాత బుద్ధిచేఁ గాదని నే ననుకొందుము. జంఘాలశాస్త్రిని నేను రవంత యెఱిఁగినవాఁడనగుటచే, నాతఁ డిప్పుడు బదరీనారాయణమున నుండుటచే నాతనిపక్షమున నేను నీ కి ప్రత్యుత్తర మీయవలసివచ్చినది. కాని యాతఁడు కొలఁది కాలములో మనవైపులకు వచ్చునని కింవదంతి యున్నది. వచ్చుటయే సిద్ధించునెడల దిరుగ నేదో యొక సంఘమును స్థాపించి కొంత గడబిడ చేయకమానఁడు. అమ్మా! సౌభాగ్యవతివై, యాయుష్మతివై, సంతానవతివై సుఖమున నుండుము.

(భారతినుండి పునర్ముద్రితము)

33. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారికి బహిరంగలేఖ

సు.స.గారు వ్రాసినది

రైలుబండిలో దొరికిన తన ఉపన్యాసానికి పానుగంటి వారిచ్చిన సమాధానం ఏమి అర్థవంతంగా, శాస్త్రీయంగా లేదని ఖండిస్తూ శ్రీమతి సు.స.గారు బహిరంగ లేఖ వ్రాశారు.

ఇందులో, పానుగంటివారు పురుష పక్షాన కలిగించుకొని సమర్థిస్తూ మాట్లాడినట్లు సు.స.గారు భావించారు.

ఆడది అణిగిమణిగి అణుకువతో అడ్డమైన బానిసతనం చేసినంత సేపు మగవాళ్ళు చేస్తే స్త్రీ స్తోత్రానికి హద్దు లేదు. ఎన్నో అభూతల్ని, గొప్పతనాన్ని ఆమెకు కట్టబెడుతూ మాట్లాడడం అలవాటే. నేను శాపాలాప శారదావతార మైతే, మీరు వాదాలాప వాచస్పతులో,– ఆడదాని నోట వెలువడిందల్లా తిట్టా? మగవాడు పలికినవన్నీ హేతుకల్పనలా? నావంటి ఆడది గ్రామగ్రామానికీ ఒక్కతె వుంటే, ఆర్యావర్త దేశాన్నంతనీ మూడేళ్లలో ఆడ మళయాళం చేసేయమా?–అని సు.స.గారు పానుగంటి వారిని ఈసడించారు. ముందు మిమ్మల్ని మీరు విమర్శించుకుని, తరవాత మమ్మల్ని విమర్శించండి – అని హెచ్చరించారు. చివరకి *HEREDITY* విషయం గురించి పానుగంటి వారి వివరణల్ని ఎత్తుకొని దాన్నొక్కదాన్నే విపులంగా విమర్శించాడు. పిల్లల లక్షణాల నిర్ణయంలో తల్లివైపు వారివీ, తండ్రివైపువారివీ గుణగణాలు పరిగణనలోకి వస్తాయన్నారు. ఒక కుటుంబంలో కలిగిన బొమ్మ తల్లిదండ్రులు మాత్రమే చేసింది కాదు, అన్నారు. ఇదే విధంగా *HEREDITY* విషయంలో శాస్త్రీయమైన ఉదాహరణలతో పానుగంటివారి జవాబును ఖండించి జంఘాలశాస్త్రి దీనికి జవాబు చెప్పాలని కోరుతూ ముగించారు.

అయ్యా!

మీకు రైలుబండిలో దొరకిన నాయుపన్యాసమునకు ఖండనముగా వ్రాసి ప్రచురించిన మీబహిరంగలేఖను శ్రీభారతిలోఁ జూచి యానందించితిని. ప్రత్యేకముగ నాఁడువారి

కొకయాఁడుది వ్రాసిన యుపన్యాసముపై మీ రంతయాగ్రహించి యస్త్రశస్త్రములను సమకూర్చుకొని యాహవరంగమునకు దుమికి తెఱపిలేకుండఁ దీవ్రబాణపరంపరలను గ్రుమ్మరించితిరే! ఎందుల కీ వీరావేశము! ఈ పట్టుదల! ఈ వాద విజృంభణము! ఈ శివశక్తిగంతులు! ఆఁడుదానిమాట రవంతయైనఁ బైనుండఁగూడదు కాఁబోలు! అంతమాత్ర మునకే మగవాని పుట్టియంతయు మునిగిపోవును గాఁబోలు! మగవాని గోడంతయు గోడగడ్డ లగును కాఁబోలు! మగవాని ''సృష్టిప్రభుత్వ'' మంతయు మాసిపోవును గాఁబోలు! అనక యనక, యాఱుమాసములకో, సంవత్సరమునకో, కాక యర్ధోదయమునకో, యాఁడు దొక్కమాట యన్నయెడల దానిని వెంటనే ఖండించి తీఱవలయును గాఁబోలు! అంతవఱకు మీకు మతులుండవు కాఁబోలు! ఓస్! మీసతీగౌరవము చట్టుబండలుగాను! మీపాండిత్యప్రభా వము పదటఁ గలియను! ఆఁడుది యడఁగిమడఁగి యడఁకువతో నడ్డమైన బానిసతనము నొనర్చునంతసేపు నాఁడుదానిని మీరు చేయుస్తోత్రములకు హద్దున్నదా? ఆఁడుదియే సంసారసముద్రమునకు నావ యనియు, నాఁడుదానివలననే మగవాఁడు గౌరవపాత్రుఁడై సత్యవంతుడై స్వార్థపరిత్యాగియై పుణ్యమూర్తియై ప్రకాశించుచున్నాఁడనియు, నాఁడుది యేదేశమున నేజాతివలన గౌరవింపఁబడి పూజింపఁబడునో యాదేశమే దేశమనియు, నాజాతియే జాతియనియు, దేశసౌభాగ్యమేమి, జాతి పరిశుద్ధియేమి, యాఁడుదానివలననే నిలువఁ బడునుగాని మగవానివలన నిలువఁబడనేరదనియు, మగవానికి మోక్షలక్ష్మి నిచ్చుట కుగూడ నాఁడుదియే యర్హురాలనియు, నిట్టిమాటలు–మఱి యింక నిట్టిమాటలు, కాంతలకుఁ గర్ణరసాయనములుగలఁ జిత్తరంజకములుగ మీరు పలుకుచుందురే. ఆఁడుది రవంత ప్రతివాక్యమాడినయెడల నసూయావిష్ఠులై, యాగ్రహాతిరేకులై, యహంభావపూర్ణులై యాఁడుదానిని నిరసించి, విమర్శించి, ఖండించి పరాభవించిన దాఁక నెత్తినేలఁ గొట్టుకొను చుందురే! ఇదియేనా మీ సహనము! మీ శాంతి! మీ సమభావము! మీ సౌజన్యము! మీ దొంగమొగము లెవతె నమ్మును? మీ గుల్లమాట లెవతె విశ్వసించును? మీ లక్క ప్రేమ కెవతె కరఁగును? మీ మొసలియేడ్పుల కెవతె మోసపడును?

ఇట్టిజాతిని దిట్టవలసినదా? రూపుమాపవలసినదా నా యుపన్యాసములలో మొదటి యాశ్వాసమునఁ దిట్లా? రెండవ యాశ్వాసమునఁ దిట్లా? ఊఁ! ఓహోహో! ఏమి యుక్తిపరుఁడవు! ఏమి చతురవచనరచనాచణుడవు! ఈమాత్రపు మీయుక్తికై మీవారు కులుకు చున్నారు కాఁబోలు! ఏమీ! ఏమీ! నాకు శాపాలాపశారదావతార మని బిరుదు కటాక్షించి తివా? పండితుఁడవు కాఁబోలు! ఎంతమాట కల్పించితివయ్యా! హేహే! కవివికూడనఁటే! నేను శాపాలాపశారదావతారమ నైతినా? మీరు! మీరు! వాదాలాపవాచస్పతులు కాఁబోలు! మీవ్యత్యస్తబుద్ధి యెంత స్పష్టముగ, నెంత బహిరంగముగ వెల్లడించితిరయ్యా! ఆఁడుదానినో టనుండి వెడలినవెల్లఁ దిట్లా? మగవాఁడు పలికినవెల్ల హేతుకల్పనలా? ఆఁడుది బుద్ధిహీ నయా? మగవాడు బుద్ధిమంతుడా? ఆఁడుది దుష్టయా? మగవాడు శిష్టుఁడా? నావంటి యాఁడుది గ్రామగ్రామమునఁ కొక్కతె యున్నయెడల నార్యావర్తదేశమంతయు మూఁడు సంవత్సరములలో నాఁడుమళయాళము చేయలేకుందుమా? అప్పు డాఁడుది బుద్ధిమంతు రాలో, మగవాఁడు బుద్ధిమంతుడో ప్రపంచమునకు వెల్లడియై తీఱును. ఏదీ? మీకింక మంచిదినములు రవంత మిగిలియున్నవి. కానిండు. కానిండు.

అయ్యా! నాయుపన్యాసముపై విమర్శనము జంఘాలశాస్త్రి పక్షమున మీరు వ్రాసినట్లు వ్రాసితిరే! ఆయన బదరీనారాయణము నుండి వచ్చి యీప్రాంతముల నేదోసంఘము స్థాపించి యుపన్యాసము లారంభించుదనుక వేచియుండక యింతలోఁ ద్వరపడి మీ రాతనిపక్షమున నేల వ్రాయవలసివచ్చినది. ఇంతలో లోకములు ముంచుకొని పోవునని మీరు భయపడితిరా? నేను తొందరపడుట తప్పని మీ రెఱిఁగి నప్పుడు మీ రేల తొందరపడవలయునయ్యా! కాక, జంఘాలశాస్త్రి సాంఘికవిమర్శనముకంటె మీవిమర్శన మెక్కువ సందర్భముగా, సొగసుగా నుండునని వ్రాసితిరా? పాపము! నాయుపన్యాసమును బాగుగా ఖండించితినని యనుకొనుచున్నారు. కాఁబోలు! ఆనందించుచున్నారు కాఁబోలు! అన్యోన్య మభినందించు కొనుచున్నారు కాఁబోలు! అల్పసంతుష్టులైన మిమ్ముఁ గాంచ మాకు జాలియగుచున్నదే! మీ విమర్శన మెంత నీరసముగ, నెంత పేలవముగ, నెంత యుక్తి శూన్యముగ, నెంత యశాస్త్రీయముగ నున్నదో మీరు గ్రహించు కొనలేకుండ నున్నారు. అవును! మా తప్పులు గ్రహించుటలో మీరు మహావిద్వాంసులు కాని మీ తప్పులు గ్రహించుకొనుటలో మీరు మందబుద్ధులే కాదా? తప్పులు లేనిచోటులనైనను జిలువలకుఁ బలవలు, పలవలకుఁ గొమ్మలు, కొమ్మలకు గుత్తులు కల్పించి వేయతప్పులు మాలోఁ జూపఁగలరు కాని లక్షలకొలది తప్పులున్న మీవారి వ్రాతలకుఁ గనులుమూసికొనని, నోరుమూసికొనని పడియుండువారే కాదా? ఱెండుదాని యణువంతతప్పు హిమవత్పర్వతముగా మీదయ్యెడుఁ గంటికిఁ గాఁబడునే! అట్టి మీకన్ను మీకెంతమాత్రమును వినియోగింపకుండ నున్నదే! మీ పాండిత్యము మమ్మల్గరిపెట్టుటకే కాని మిమ్ముబాగుపఱచుకొనుట కేమాత్రము తోడుప డకుండ నున్నదే! మీ విమర్శనజ్ఞానము మా వ్రాఁతలలోని కలుపుతీఁతకే మీ మనస్సులలోని గర్వోపశాంతికి వినియోగపడకుండ నున్నదే! ఇంతటినుండియైనఁ దెలివి తెచ్చుకొని మిమ్ము మీరు మొదట విమర్శించుకొని పిమ్మట మమ్ము విమర్శింప మొదలిడుఁడు. మిమ్ము మీరు విమర్శించుకొన్న యెడల మా జోలికెన్నడు మీరు వచ్చుటయే సిద్ధించియుండదు. కురూపుఁడు తన రూపదౌష్ట్య మెఱింగినపిమ్మట సామాన్యస్వరూపమును వెక్కిరించునా? మొగముమీద మొటిమలుగల మగువను గుష్ఠరోగి యధిక్షేపించపగలడా?

అయ్యా! ఎంతయో యుత్సాహపడి, యెంతయో తొందరఁ జెంది, యెంతయో కష్టపడి మీరు వ్రాసిన విమర్శనము, నిస్సారమై యున్నదన్న హేతువుచేత దానిని విమర్శిం పక, నిరాదరణ మొనర్చి యూరకఁ బారవైచినచో, మీవాక్యములే సిద్ధాంతములని మీవారనుకొ నిపోవుదురేమో యని, మమ్ము మీరు గెల్చినారని బుజము లెగుర వైచి గంతులు వేసెదరేమో యని మీ విమర్శనకుఁ బ్రతివిమర్శనము వ్రాయవలసివచ్చినది. మీవిమర్శనమున విమర్శింపవ లసిన దొక్క యంశమే యున్నది. అందుఁగూడ నొక్క వాక్యముమాత్రమే విమర్శింపదగి యున్నది. అది యేదన:–

"Heredity యనుదానిపలనఁ దండ్రిసంబంధమైన ముక్కు పాడుగో, తల్లిసంబంధ మైన కంటిసోగయో, మేనమామసంబంధమైన మూఁతివంకరయో సంతానమందుఁ గాదాచి త్కముగ సంక్రమింపవచ్చునుగాని జగత్తు నేలుటకు సామర్థ్యముగలయట్టియు జగత్తునకు బానిసయగునంతటి తుచ్ఛముగలయట్టియు మనస్సులోని శౌర్యము, గాంభీర్యము, త్యాగము, సాపత్సహనము, భూతదయ, దైవభక్తి, బ్రహ్మజ్ఞానము మొదలగు సుగుణ

పరంపరకాని, కాతరత, లాఘనము, లోభము, శాంతి రాహిత్యము, తామసము, నాస్తికత మొదలగు దుర్గుణ పరంపరకాని Heredity వలనఁ గలుగుట కవకాశములేదు.''

ఇది మీ ప్రధాన వాక్యము. ఈవాక్యమువలన మీప్రపంచజ్ఞానము మిక్కి-లి యల్పమని స్పష్టపడుచున్నది. వాక్యము బారెఁడేగాని పసగలది కాదు. ''తండ్రి సంబంధమైన ముక్కు-పొడుగో'' సంతానమందు సంక్రమింపవచ్చునని మీరు వ్రాసినారు. సంక్రమింపవచ్చుననియే కాని సంక్రమించునని మీరు స్పష్టముగ వ్రాయలేదు. అంతేకాక, దానికి వెనుకఁ ''గాదాచిత్క-ముగ'' నని యొక్క-బంధ మంటఁగట్టినారు. ఇందువలన మీకు Heredity యందు విశ్వాసము లేనట్లు స్పష్టమగుచున్నది. ఈవిషయమున మీకుఁ బూర్వజన్మమే శరణ్యముగ నున్నది. ''పూర్వజన్మమునందు నాకుఁగల విశ్వాసమువలన నార్యమతమునకు బలము కాని, యవిశ్వాసమువలన నీరసతకాని లే'' దనీ మీరు న న్నధిక్షేపించి తిరికాదా? Heredity యందు మీకుఁగల విశ్వాసమువలన సృష్టి శాస్త్రమునకు బలముకాని యవిశ్వాసమువలన నీరసత కాని లేదని మిమ్ము నేను దిరుగ నధిక్షేపించవచ్చును గదా! మీ యధిక్షేపణమునకుఁ బ్రత్యధిక్షేపణమును మీకప్ప-జెప్పితినిగదా! ఇఁక మాటలాడ కూరకుండుఁడు. విడిచినవాద మును దిరుగ నందుకొని సాగింతము.

కాఁకరగింజ నాటినయెడలఁ గాకరతీఁగయే పుట్టుచున్నది కదా? 'కాదాచిత్క-ముగ' గాఁకరతీఁగ పుట్టవచ్చునని మీ రనరు కదా! తరులతాజాతియందు సహజమైన, సత్యమైన ధర్మము పరిణామనిశ్రేణికలో మొదటి మెట్టుపైనున్న మనుష్యసంతానమునకేల సత్యము కాదు? మనుజ దంపతులకుఁ బుట్టిన సంతానము గూర్చి యింక ననేక విచిత్ర పరిస్థితులు, చిరకాలసంప్రదాయములు, ననేక వ్యక్తిలక్షణసముదాయములు, ననేక లక్షణముల యన్యోన్య సమ్మేళనమువలనఁ గలిగినలక్షణము లెన్నో పరిశీలింపవలయునుగాని తరులతాదిజాతియందుఁ బరమార్థముగ జరుగుచున్న సామాన్యధర్మమే యిచ్చటఁగూడ జరుగుచున్నది కదా? అంతకంటె భేద మేమియు లేదే? కాని యిక్కడ నల్పిక లెక్కువ యున్నవి. చికిబికు లెక్కువయున్నవి. క్రొత్తకూర్పు లున్నవి. దూరమాలోచింప వలసియున్నది.

బిడ్డలక్షణములు పరిశీలింపవలసివచ్చినప్పుడు తల్లిదండ్రుల లక్షణములు మాత్రమే పరిశీలించి యూరకుండఁజనదు. ఆబిడ్డని పితామహి లక్షణములు, పితామహిలక్షణములు, వారి యితర సంతానలక్షణములు గూడఁ బరిశీలింపవలయును. అంతేకాదు, మాతామహ లక్షణములు, మాతామహిలక్షణములు, వారి యితరసంతానలక్షణములు గూడ బరిశీలింపవలయును. ఇట్లింకఁ బై రెండుమూఁడు తరములవఱకైనఁ జూడఁ దగినది. బిడ్డలోని యనేక లక్షణములు తల్లిదండ్రుల లక్షణముల బట్టియే నిర్ణయింపదగును. తల్లిదండ్రులలో లేని లక్షణములేవైన బిడ్డయందుఁ గానఁబడినయెడల వానికొఱకు వంశవృక్షములోని పైకొమ్మల నెక్కి పరీక్షించినయెడల వానికిఁ గారణము లగపడితీఱును.

ఒకయూఁడుపిల్ల పుట్టిననిమిసము మొదలుకొని ముసలిది యగు వఱకు నడుమ జరుగు ప్రధాన చేష్టలను బరిశీలింతము. పిల్ల చేఁటలోఁ బడగనే కేరుకేరున నేడువవలయును గదా! అటు లీ పిల్ల యేడువలే దనుకొనుము. ఎందుచేత? ఆపిల్లతల్లియో, తండ్రియో భూపతనమగుటతోడనే యేడువకపోయియుండవలయును. ఆసంగతి వారితల్లితండ్రుల

వలన సులభముగఁ దెలిసికొనవచ్చును. జనులు నిదురించునపుడు కుడి ప్రక్కనో యెడమప్రక్కనో పండుకొను నలవాటు కలవారై యుందురు కాని రెండు ప్రక్కలను సమాన సౌలభ్యముతోఁబండుకొననేరరు. ఒకవేళ నిద్రలో నలవాటు లేని ప్రక్క కొత్తిగిల్లుట తటస్థించినను రెండుమూడు నిమునములలోనే మేల్కొంచి యలవాటైన ప్రక్కకుఁ దిరుగుదురు. మనము పరీక్షింపదలచిన పిల్లతండ్రికో, తల్లికో యెడమవైపునఁ బండుకొనునలవాటున్నదనుకొనుము. ఈపిల్లగూడ నెడమప్రక్కనే పండుకొనును. తెలియక తల్లి యాపిల్లను గుడిప్రక్కను బండుకొనఁ బెట్టిన యెడల బిల్ల యిల్లెగిరిపోవ నేడ్చును. ఎడమప్రక్కగాఁ బండుకొనఁ బెట్టిన వెంటనే కిక్కురుమనకుండ నిద్రించును. బాల్యమునఁ దల్లికో తండ్రికో యెడమచేతివ్రేళ్లో కుడిచేతివ్రేళ్లో నోటఁ బెట్టుకొను నలవాటున్న యెడలఁ బిల్ల యాచేతివ్రేళ్లే యావయస్సులోనే నోటఁబెట్టుకొనును. పిల్లతల్లికిఁ దండ్రికిఁగూడ నత్యంతమధురపదార్థమిష్ట మనుకొనుము. ఈపిల్లకేమో కాని తీపి యిష్టము లేదునరేకదా పులు పనగ మహాప్రీతి! ఈవ్యత్యాసమునకుఁ గారణమేమో యని దూరాలోచన చేయకుండఁ బూర్వజన్మమే కారణమని తొందరపడి సిద్ధాంత మొనర్పకుము. అంత దూరాలోచన కూడ నేల? వంశవృక్షమున నీపిల్ల తండ్రిప్రక్కనేయున్న యామె యెవతెయో యెఱుఁగుదువా? ఆమెయే యీపిల్ల పెద్దమేనత్త. ఈమె దినమున కొకపదలము చింతపండుపులుసు ద్రాగునప్పుడు మేనగోడలికిఁ బులు సిష్టమనగ నాశ్చర్యమేమి? తల్లికాని, మేనత్తకాని యెన్నవయేఁట నెన్నవమాసమునఁ బ్రథమరజస్వలయగునో యన్నవయేఁటనే మాసమైన బీరుపోకుండఁ బిల్ల రజస్వలయగును. కాని తల్లి మేనత్తల సాంప్రదాయము ననుసరించి యీపిల్ల పండ్రెండవయేఁట రజస్వల కాక, పదియవ యేఁటనే రజస్వల యయ్యెనేమి చెప్పుమా? ఈమాత్రమునకై తొందరపడి వెనుకజన్మమువఱకుఁ బోక, ముందువసారాలోఁ గూర్చుండి చిమ్మిలి దంపించుచున్న పిల్లపితామహియొద్ద కేగి యడుగుము. ఈవిషయమున నామనుమరాలికి నాపోలికవచ్చినదయ్యా యని యామె పైకి విసుఁగుజెందిన ట్లగపడుచున్నను లోన మురియుచుఁ దన చరిత్రములోని విచిత్రాంశమును బహిరంగపఱచును: ప్రథమ రజస్వలాదినములలో నీపిల్ల కావునేయి, పులగము, ప్రొఁతబెల్లముఁ దక్క మఱియేదియునీయకుండ నెంతకఠికపథ్యమునుఁ జేయించినను దల్లికిఁ గాని, మేనయత్తకుఁ గాని బుతుశాల యున్నయెడల నీపిల్లకుఁగూడ నేకొలఁదిగనో యది సంక్రమించును గాని విడువదు. ఇఁక గర్భవతిగా నుండునప్పుడు ప్రక్క శూలఁగాని, పక్కనొప్పిగాని వంశములోని పూర్వస్త్రీల యాచారము ననుసరించి కలుగును. సంతానక్రమము కూడ సంసారసంప్రదాయము ననుసరించియే యుండును. రజోదోష నివృత్తికూడఁ దల్లినిబట్టియో, తల్లితల్లినిబట్టియో, తండ్రి సోదరినిబట్టియో, యామెతల్లినిబట్టియో యుండును. వేయేల? తల్లిదండ్రుల సామాన్యము లైన యభ్యాసములు కూడఁ బిల్లలకు సంక్రమించునుగాని వదలవు. మాటలాడుచున్నప్పుడు తండ్రి చేతు లెట్లూడించునో, తల యెట్లు విసరునో బిడ్డ కూడ నటులే చేయును. తల్లికాని తండ్రికాని గొంతుకూరుచుండి భుజించుటయే యలవాటు కలిగియుండునెడలఁ బిల్లగూడ నటులేకూరుచుండి భుజించును. బలాత్కారమునఁ బద్మాసనమునఁ గూరుచుండఁ బెట్టి యాపిల్లను భుజింపఁజేయునెడల నోటనిడుకొన్న కబళము దిగకపోవుటచేఁ గెక్కు కెక్కుమనును. సాధారణముగా జనులు నాలుగైదునిమునములకంటె నెక్కువకాలము నిలువఁ బడవలసివచ్చినప్పుడు రెండు కాళులపై సరిగ నిలువఁబడరు. కుడికాలి పైనో యెడమకాలి

పైనో బరువెల్ల మోపి మిగిలిన కాలికిఁ బనియేమియు నీయరు. కుడికాలిపై నిలువ నలవాటుగగల తల్లిదండ్రులకుఁ బుట్టినపిల్ల ప్రధానముగఁ గుడికాలిపైనే నిలువఁబడును. మన మప్పుడప్పుడు కుడి చేతివ్రేళ్లసందులలో నెడమచేతివ్రేళ్లిముడ్చుకొని కొంతసేపట్లే యుంచుకొనుట తటస్థించుచున్ననది. అట్టి హస్తపుటమునకు మొట్టమొదటి వ్రేలు కుడిబొట నవ్రేలైనఁ గానవచ్చును. ఎడమబొట్టనవ్రేలైన గానవచ్చును. దక్షిణాంగుష్ఠమే మొదటిది యగునట్లుగా హస్తములు ముడుచుకొను నలవాటు తల్లికో తండ్రికో యున్నయెడలఁ బిల్లకూడ నటులే హస్తయుగ్మమును ముడుచుకొనును. నడుచునపుడు ముందువేయు కాలుకూడ ననూచానస్థితి ననుసరించి యుండుననుట యతిశయోక్తి కాదు.

అయ్యా! Heredity కల్లయని నిర్ధారణ మొనర్చుటకు మీరు కొన్ని యుదాహరణ ములు నిచ్చినారు. అవి సమంజసముగ లేవు. పండితాగ్రగణ్యునకు శుంఠ జన్మించుచున్నాఁ డని చెప్పినారు. తండ్రి షట్శాస్త్ర పాండిత్యమునే మీరు పరిశీలించినారు. కాని మేనమామ శుంఠత్వ సామ్రాజ్యమును మీరు పరీక్షింపలేదు. ఈ తప్పు మీదికాని Heredityది కాదు. మహావదాన్యుఁడైనవానికి లుబ్ధాధమాధముఁడైన నిర్భాగ్యుఁ డుదయించుచున్నాఁడని మీరు చెప్పినారు. ఈలుబ్ధాధమాధముని పితామహుడు శ్రాద్ధములు చేసి, శవములు మోసి, శల్యపరమాన్నమును దిని, చౌర్యము లొనర్చి స్వామిద్రోహకృత్యము లొనర్చి తాను తినక యొకనికిఁ బెట్టక కూడఁబెట్టిన ధనమంతయుఁ దనకొడుకు తాను జచ్చిన పిమ్మట దానధర్మములకై తగులఁబెట్టుచున్నాఁ డని కడుపుమంటచేఁ గాలిపోవుచుఁ దనధనము నెటులైనఁ గాపాడుకొనవలయునను దయ్యపుఁ బట్టుదల కలిగి, ద్విగుణీకృత లుబ్ధత్వముతోఁ దానే తనకు మనుమఁడైపుట్టెనని మీరు గ్రహింపలేకపోవుటచేత మీకు వ్యత్యాసముగాఁ గనఁబడుచున్నది. కొంతాలంపటుఁడై, కాతరుఁడైన దశరథునకు శ్రీరామచంద్రు నివంటి యేకపత్నీవ్రతుఁడు, జగదేకవీరుఁడు జన్మించినప్పు డింక Heredityని నమ్మవలసిన పనియేమున్నదని మీరు పలికినారు. అట్లనుట తప్పు. అందుచేతనే మఱింత నమ్మవలసియున్నది. దశరథుని కాంతా లోలత్వమే మీరు గణించితిరి కాని హోమాగ్నిజ్వాలాతుల్యయగు కౌసల్యాదేవిపరిశుద్ధిని మీరు గణించితిరి కారే! దశరథుని భయస్వభావమునే మీరు గణించితిరి కాని రఘుదిలీపాదిమహారాజుల పౌరుషసంఘాత మంతయు శ్రీరామచంద్రపరబ్రహ్మము లోని కాకర్షింపఁబడినదని మీరు గ్రహింపలేకపోయితిరే! మీరిచ్చిన యుదాహరణము లన్నియు నిట్లే యసంబద్ధములై యవిచారపూర్వకములై యున్నవనుట నిశ్చయము.

ఇక వంశానుక్రమముగ వచ్చు రోగములను గూర్చి రవంత చెప్పవలసియున్నది. ఉబ్బసము, మూలవ్యాధి, క్షయము, కుష్ఠము నీతరగతి లోని ప్రధానవ్యాధులు Intermittence of the Heart (నాడి నాలుగైదు దెబ్బలు కొట్టినతరువాత నొక దెబ్బకాలము నిలిచిపోవుట) అనునదికూడ మూఁడుతరములనుండి యొక కుటుంబములో నున్నట్లు కనిపెట్టఁబడినది. Hysteria యనునది కూడ నట్టి వ్యాధియే యని కొందఱు చెపుచున్నారు. అంధత్వముకూడ నీ తరగతిలోనిదే యని కొందఱు యభిప్రాయము. తాతగారి యంధత్వము మనుమనికి వచ్చుట కలదు. అది జనుషాంధత్వమైన సరే. చెప్పరాని వ్యాధులలో నొకదానివిసము వంశములో నాల్గుతరములవఱకు నిలిచియుండునని కొందఱు చెప్పుచున్నారు. పిల్లనిచ్చుటకుఁ గాని తెచ్చుకొనుటకుఁ గాని మనవారు కుటుంబసంప్రదాయమును

విశేషముగా బరిశీలించుచున్నారు. ఒక్కవంశములోని వ్యాధులు మఱియొక్క వంశములోనికి సంక్రమించుట కవకాశము కలుగకుండుటకే మనవారు పరిణయనిర్ణయపూర్వమునందింత పరిశోధన చేయుచున్నారు. ఇట్టి పరిశోధనము రోగవ్యాప్తి నివారణమునకే కాక, దుష్టప్రవర్తన వ్యాప్తి నివారణమునకుఁగూడ నైయున్నది. అందుచేఁ బిడ్డలప్రవర్తనముకూడ వంశానుక్రమసూత్రమున కధీనమై యున్న దనియే స్పష్టపడుచున్నది.

అయ్యా! దేహసంబంధములగు కొన్ని లక్షణములు బిడ్డలయందు గానఁబడవచ్చును గాని జగత్తునేల గలట్టియు, జగత్తునకు బానిసయగు నంతటి తుచ్ఛత్వము గలయట్టియు మనస్సులోని సుగుణపరంపర గాని దుర్గుణపరంపర కాని Heredity వలన రాదని మీరు స్పష్టముగఁ జెప్పినారు. మీకుఁ గోపమువచ్చినను సరే కాని యిది వట్టి తెలివితక్కువ మాటయని చెపుచున్నాను. ప్రవర్తనము (Character) దేహముతోఁ జేరినదా మనస్సుతోఁ జేరినదా? దేహముతోఁ జేరినదని మీ రనుటకు సాహసింపలేరుకదా! మనస్సుతోఁ జేరినదని యొప్పుకొనక తప్పదు కదా! Heredity వలననే మనస్సు సత్ప్రవర్తనము గలదిగాని దుష్ప్రవర్తనము కలది కాని యగుచున్నదని యిప్పుడే నిర్ణయింపఁబడినదా కాదా? ఆ నిర్ణయము నేను జేసినదగుటచే మీకు నచ్చ లేదందురా? పోనిండు. Heredity మనస్సునైఁ బనిచేయునని మహాశాస్త్రవేత్తలు చేసిచూపిన నిర్ణయమును విందురా? (Idiocy) జన్మమందత్వము, (Insanity) పిచ్చి, యివి మనస్సుతోఁ, జేరినవా? దేహముతోఁ జేరినవా? దేహముతోఁ జేరినవని మీ రనునెడల మి మ్మేమనవలయునో మాకుఁ దెలియదు. ఇదివఱ కైదుతరములనుండి Idiocy తీఁగ సాగుచున్న వంశములు రెండు Franceలో నున్నట్లు శాస్త్రవేత్తలు చెప్పినారు. తాతకుఁ బిచ్చి, తండ్రికి బిచ్చి, యన్నకుఁ బిచ్చి, చెల్లెలికిఁ బిచ్చి, తనకుఁ బిచ్చియైన కుటుంబములు తఱచుగ లేకున్న విరళముగ నున్నట్లు వినుచున్నాము. తండ్రికిఁ బిచ్చిలేదు కాని తీవ్రమైన కోపము, పెద్దకొడుకునకు సామాన్యపుఁబిచ్చి, రెండవకొడుకున కంతకంటె నెక్కువపిచ్చి, మూఁడవకొడుకునకుఁ బూర్తిగాఁబిచ్చిగల యొక్క కుటుంబము గోదావరీ తీరమందుండుట నే నెఱుఁగుదును. ఇప్పు డేమందురయ్యా! ఇంకను మనస్సునకు Heredity కి సంబంధము లేదని యందురా? అటులైన నొక మనశ్శాస్త్ర పరిశోధకుఁ డగు మహావైద్యుడు చెప్పినమాటలను విందురా? "The heredity transmission of a liability to mental disease must be reckoned as the most important among all predisposing causes of insanity" చూచితిరా, Heredity యే యున్మాద కారణములలోఁ బ్రబలతమమైన దని తెలిసినదా? మఱి యింకను వినుఁడు. "It probably well within the mark to say that at least 50 percent of the insance have a direct or collateral heredity tendency towards insanity" ఇక్కడకుఁ బిచ్చివారిలో నధమము నూటి కేఁబదుగురవఱకీ తరగతిలోనివారే యని స్పష్టపడినదా?

మూర్ఖ వంశానుక్రమమగు వ్యాధి యగుటచేతను, మూర్ఖ ముదిరి పిచ్చికావచ్చును గావునను, మూర్ఖయున్న కుటుంబములో నుండి పిల్లను దెచ్చుకొనగూడదు. ఆకుటుంబములోనికిఁ బిల్ల నీయఁగూడదు. చెడఁద్రాగెడువారికుటుంబముతో నెన్నఁడును సంబంధము చేయఁ దగదు. ఆసంబంధమువలన నున్మాదము మఱియొక్క కుటుంబములోనికి రాఁగలదు. ఏదోయొక్క విషయముననే యత్యద్భుతప్రజ్ఞ కలవాఁడును హద్దుమీఱిన

చుఱుకుఁదనమును గలవాఁడున్న కుటుంబముతో సంబంధము చేయఁగూడదు. అట్టి ప్రజ్ఞావంతుని తరువాత రూపాయకుఁ బదణాలవఱకుఁ బిచ్చివారు కలుగవచ్చును. మేన మామ కూఁతునకు మేనత్తకొడుకునకు, మేనమామ మేనకోడలికి, మేనత్తకూఁతునకు మేనమామకొడుకునకు వివాహసంబంధము లొనర్చి లొడితెఁడైన యావరణములో గుడుగు డుగుంచము లాడుచు ముళ్లపై ముళ్లు దగుల్చుకొనువారికుటుంబములలోఁ దఱచుగాఁ బిచ్చివారు పట్టుదురని చెప్పుదురు.

Heredity వలననే దేహలక్షణములన్నియు గలుగుచున్నవి. మనోలక్షణములన్నియుఁ గలుగుచున్నవి. ఇట్టిలక్షణములు సంక్రమింపఁ జేయుటలో తల్లి దండ్రులతరమువారి కెంతశక్తియున్నదో, వారి పైతరములవారి కెంతశక్తియున్నదో వారిపై పైతరములవారి కెంతశక్తియున్నదో యను సంశయములు కూడ శాస్త్రవేత్తలు సంతతపరిశోధనమువలనఁ గనిపట్టినారు. తల్లికాని తండ్రికాని (0.5); పితామహుడు కాని మాతామహుడు కాని $(0.5)^4$; యేడవతరములోని పురుషుఁడు $(0.5)^{14}$; x తరములోని పురుషుఁడు $(0.5)^{2x}$ గా, దైహిక మానసికలక్షణములు పిల్లలకు సంక్రమింపజేయుదురని వారు చెప్పినారు. కాని యీసూత్రము మాత్రము ప్రత్యేకవ్యక్తిపరముగాఁ గాక, సాంఘికసాముదాయికపరముగా సత్యమని వారు చెప్పినారు.

కావుననేమి తేలిన దనఁగా: ఒక కుటుంబములోఁ గలిగిన బొమ్మతల్లిదండ్రులు మాత్రమే చేసినని కాదు. వారు, వారిపై వారు, వారి పైవారు నేబదుగురో యఱువదుగురో చేసిన బొమ్మయని తెలియఁ దగినది. దేహలక్షణములు సంతానమునందుఁ 'గాదాచిత్కముగ' గానఁబడుననియు, మనోలక్షణములు మొదలే కానఁబడవనియు మీరు చెప్పిన మాట యాచారవిరుద్ధమైనదియు, నశాస్త్రీయమైనదియు, నసత్యమై నదియునై యున్నది. తల్లిదండ్రుల లక్షణములే కాదు; వారి పూర్వుల లక్షణములే కాదు; మనుష్యజాతికి బూర్వులైన యన్ని ప్రాణుల లక్షణములు గూడ మనలో నున్నవి. ఇలకోడికూఁత యెఱుఁగుదువా? దాని కెదురు పడినప్రేయసిని సంతసింపజేయుట కది కూయుచున్నది. కప్పయు నందుకొఱకే కూయుచున్నది. మగవాఁడు తన కిష్టమైన కాంతను జూచి యట్లే కూనురాగ మీడ్చుచున్నాడు. మగనెమిలి యాఁడునెమిలి సంతసము కొఱకుఁ బురివిప్పి తాండవించును. మగవాఁడు దనకిష్టమైన మగువ ప్రీతికై తల యెగురవైచుకొని యొడలు విరుచుకొని యొయ్యారమునఁ దిరుగులాడి మిడికిమిడికి మొత్తుకొనుచున్నాడు. క్రూరజంతువుల హింసాసాధనములు మననోటఁ గోరలుగ నిల్చియున్నవి. కోఁతితోఁక మన వెన్నుపాము చివర Coccyx రూపమున నిల్చియున్నది. కోఁతి కిచకిచలే మనవ్యవహారములైనవి. కోతి వెక్కిరింపులే మన యధిక్షేపణములు. కోఁతి చాంచల్యమే మన మనస్సులో శాశ్వతముగ నిల్చియున్నది. అయ్యా! ఇకఁ జాలు. నామాటలు నచ్చినవానికి నింకఁ జెప్పనక్కఱలేదు. నచ్చనివానికి నింకఁ జెప్పనక్కఱలేదు. అందుచే విరమించుచున్నాను.

కాని మఱియొక్కమాట. మునుపటివలెనే యీసారికూడఁ దొందరపడి జంఘాలశాస్త్రిపక్షమున మీరు ప్రత్యుత్తర మీయవలదు. రాఁదలఁచిన జంఘాలశాస్త్రి వచ్చి, స్థాపింపఁదలఁచిన సంఘమేదో స్థాపించిన తరువాత, నీయవలసిన యుపన్యాసములలోఁ బ్రథమసాంఘికోపన్యాసమే నాకుఁ బ్రత్యుత్తరముగా జంఘాలశాస్త్రి యీయవలయును. అది నాకోరిక. ఆతని

యుపన్యాసములు విని యెంతకాలమో యైనది. ఆతఁడు మమ్మెంత యధిక్షేపించినను మా కెవ్వరికి నాతనిపై నినుమంత యైనఁ గోపము రాలేదు. ఆతనిని మా సోదరునివలెఁ జూచుకొనుచున్నాము. ఆతఁడు బదరీనారాయణమునుండి వచ్చి నూతనసంఘమును స్థాపించి యాంధ్రదేశమునందు నమంజసమైననంచలనము, సంతోషము నెప్పుడు సమకూర్చునో యని నముత్కంఠచే నిరీక్షించుచున్నాము.

(భారతినుండి పునర్ముద్రితము)

34. సు.స.గారికి బహిరంగ లేఖ

సు.స.గారు పానుగంటి వారిపై మండిపడి మందలిస్తూ వ్రాసిన *HEREDITY* వాద విశేష వివరాలను ఆయన ఖండిస్తూ తాను చెప్పిన విషయానికి మరకొంత వివరంగా, తన విశ్వాసభూమిక, విశదం చేస్తున్నారు.

జంఘాలశాస్త్రి జవాబు చెప్పాలని సు.స.గారు ఆశించినా, ఆ పని జరిగేలోగా తన శక్తిమేరకు సమాధానం చెప్పక తప్పదన్నారు. ఏది ఎలా వున్నా *HEREDITY* వల్ల బిడ్డలో స్థూలదేహ లక్షణాలు అన్నీ కలగవచ్చునంటేనూ, కొన్నైనా కలుగుతున్నాయంటేనూ తనూ ఒప్పుకొంటానన్నారు గాని–శరీర పరిణామంలో *HEREDITY* పనిచేయడానికి శక్తి కలిగిందే నని ఒప్పుకొంటానన్నారు గాని మనస్సు మీద దానికి పిసరంత కూడా అధికారం లేదని తన అభిప్రాయమన్నారు.

మనస్సుకి మెదడు ముఖ్యావయవం గనుక మనస్సులో పరిణామం *HEREDITY* వల్ల కలిగినట్లు కనిపిస్తుంది గాని అది భ్రమ అన్నారు. ఉన్మాదాలన్నీ దేహపరిణామాలే కాని, మనఃపరిణామాలు కావన్నారు.

పాశ్చాత్య శాస్త్రజ్ఞులలో ప్రకృతి శాస్త్రజ్ఞానం సంపూర్ణంగా వుండే మహావిద్వాంసుల్లో నూటికి 95 మంది నిరీశ్వరవాదులు. మిగిలిన వారు అజ్ఞేయ *(AGNOSTICS)* వాదులు.

మన హిందూ సిద్ధాంత ప్రకారం శరీరాలు మూడు. స్థూల, సూక్ష్మ కారణ శరీరాలు. స్థూల శరీరం మంటలోనో, మట్టిలోనో కలిసిపోతుంది. లోపల జీవాత్మగల సూక్ష్మ శరీరానికే మనవారు పునర్జన్మను నిర్మించారు. ఈ సూక్ష్మశరీరంలోనే, మనిషి సంతరించుకున్న అనేక పూర్వజన్మల కర్మఫలం వుంది. కనుక ఒక బిడ్డలో వ్యక్తమయ్యే గుణాగుణాలన్నీ అతగాడి సొంత సొమ్ము. అంటే, 'మనస్సు' అనేది బిడ్డ సొంతమే. ఆత్మ, పునర్జన్మ, విశ్వాసాలుంటే తప్ప ఈ లెక్క మతం మీద విశ్వాసం వల్లనే మనిషి మనిషి అనిపించుకొంటున్నాడు.

అమ్మా!

కార్తీకమానభారతిలో మీరు ప్రచురించిన బహిరంగలేఖను జదివితిని. జంఘాలశాస్త్రి యుపన్యాసములువిని చాలఁ గాలమైనదనియు, నాతఁడు శీఘ్రముగ వచ్చి నూతననంఘము

నేదైన స్థాపించి యుపన్యాసము లిచ్చుచు నాంధ్రదేశమునఁ దిరుగ సమంజసమైన సంచల నము, సంతోషము నెప్పుడు సమకూర్చునా యని నిరీక్షించియున్నా మనియు మీరు వ్రాసి భాషాభిమానమును వెల్లడించినందులకు సంతసించితిని గాని యాతఁడే మీబహిరంగలేఖను దన ప్రథమ సాంఘికోపన్యాసమున విమర్శింపవలయును గాని నీవు దొందరపడి దానిని విమర్శింపవలదని శాసించితి రేల? ఆతఁడు వచ్చిపిమ్మట నటులే జరుగవచ్చును గాని యంతవఱకు నేను వేచియుండ నేల? ఆతఁడు విపులముగ విమర్శించిన విమర్శించుగాక! నేను నా యల్పశక్తి ననుసరించి సంగ్రహముగ విమర్శింపకుండుట తగదు. కావున నందులకు మీ యనుజ్ఞ కోరుచున్నాను.

అమ్మా! నా బహిరంగలేఖలో మీరు విమర్శించిన దొక్కటే వాక్యము. Heredity వలనఁ దల్లిదండ్రుల దేహలక్షణములు కాదాచిత్కముగ బిడ్డలయందు సంక్రమింపవచ్చును గాని మఱేలక్షణము లేవియు నట్లు సంక్రమించుట కవకాశములేదని నా వాక్యమునందలి యనిప్రాయము. నేను దల్లిదండ్రుల లక్షణములు మాత్రమే యెత్తుకొంటిని. అవియైనఁ గాదాచిత్కముగ సంక్రమింపవచ్చునని నే నంటిని. మరికొన్ని తరములవారి దేహలక్షణ ములు గూడఁ బరీక్షింపవలయు ననని మీరంటిరి. అది చాలకపోవునెడల నింకను బైకిఁ బోవలయునని కూడ మీరు చెప్పితిరి. దేహలక్షణపరీక్ష కంత విశాలమైన యవకాశమును మీరు కల్పించుకొనినను, బూర్వుల దేహలక్షణములన్నియు బిడ్డకుఁ తప్పకుండ సంక్రమిం చునని మీరును జెప్పఁజాకపోయితిరి. మీరిచ్చిన యుదాహరణములఁబట్టి చూడఁగ నెవరివో కొన్ని దేహలక్షణము లెప్పుడో యొకప్పు డేదోబిడ్డకు సంక్రమించునని స్పష్టముగఁ దేలుచున్నది. అట్టిచోఁ గాదాచిత్కముగ సంక్రమించునని నేనంటినని నాతో మీ కింతవాద మెందులకు? Heredity ని గూర్చి పదునాల్గుతరముల వఱకైనఁ బరీక్షించుట గూడ మీ యభిమతమైనట్లు కనఁబడుచున్నదే! అట్టి పరీక్ష కవకాశ మెట్లు? తరమునకు సామాన్య ముగా ముప్పదిసంవత్సరములు చూచుకొన్నను బదునాల్గుతరములగుటకు 420 సంవత్సర ములుపట్టునే! ఈలోపల నెన్నివందలజనమో పుట్టి చచ్చియుందురు గదా! ఈవంశములోఁ బుట్టిన మగవారికొఱకుఁ దెచ్చుకొన్న యాఁడు పిల్లలవంశములో వారి నందఱ లెక్కపెట్టు కొన్న యెడల మఱికొన్ని వందల జనాభా తేలుచున్నదే! అధమసంఖ్యగా జూచుకొనుటచే వందల వఱకే తేలినదే కాని యనేకసంతానయుక్తులైన వారి వంశములో నీ సంఖ్య వెలవఱ కెగఁబ్రాఁకు ననుట కేమైన సందేహమా? ఈ సహస్రజనసంఘములో నెవనిదో యొకనిపోలిక యిప్పటి తరములోఁ బుట్టినబిడ్డకు సంక్రమించును గావున Heredity సత్యమని మీరు వాదించుచున్నారా? వేలకొలది జనుల పోలికలో నెవరిదో యొకనిది బిడ్డకు సంక్రమింపకుండ నెట్లుండగలదు? మఱియొకవంశములోని వేయిజనుల దేహలక్షణములు మాత్రమీ వేయిజ నుల దేహలక్షణములకంటె భిన్నముగ నుండుట కవకాశ మున్నదా? ఇంతదూరపరీక్షవలన మనుష్యుల లక్షణములేకాని వంశస్థుల లక్షణములు నిర్ణయింప శక్యమగునా? అందువలన వంశములోని Heredity కి భంగము కలుగుచున్నదని మీ రేల గ్రహింపలేదు? కప్ప, యిలకోడి లక్షణములు కూడ మనయందుఁ గనిపించుచున్న పనికూడ మీరు వ్రాసినారు. ఇది సర్వప్రాణికోటిసంబంధమై సామాన్యలక్షణక్రమమై యుండవచ్చును. అంతేకాని మనకు వివాదాంశమై వంశము లోని Heredity కి సంబంధించినది మాత్రము కాదు.

ఏది యెటులున్నను Heredity వలన బిడ్డలోని స్థూలదేహ లక్షణములన్నియుఁ గలుగవచ్చుననియు, గొన్నియైన గలుగవచ్చుననియు. నా కంగీకృతమే. దేహపరిణామ మందే Heredity పనిచేయుటకు శక్తికలది కాని మనస్సుపై దానికి లేశముకాని, యధికార ములే దని నా యభిప్రాయము. ఈ నా యభిప్రాయమును ఖండించుటకు మీరు కొన్ని వాక్యములు వ్రాసినారు; అవి యేవనఁగా–''ఇదివఱ కైదుతరములనుండి Idiocy తీఁగ సాగుచున్న వంశములు రెండెచ్చ టనో యున్నట్లొక మనశ్శాస్త్రజ్ఞుడు చెప్పుచున్నాఁడు. తండ్రికిఁ బిచ్చి లేదుకాని తీవ్రమైన కోపము, పెద్దకొడుకునకు సామాన్యపుఁబిచ్చి, రెండవకొడుకున కంతకంటెఁ బిచ్చి, మూఁడవకొడుకునకు బూర్తిగాఁ బిచ్చియున్న కుటుంబము నొకదానిని గోదావరీతీరమందు నే నెఱుఁగుదును.'' మీరిట్లు వ్రాసినారు. అమ్మా! గోదావరీ తీరమందలి కుటుంబము నే నెఱుఁగునది కాదు. Heredity మనస్సు మీఁదఁగూడఁ బనిచేయునని నిర్ధారణ చేయటకై మీరు చెప్పిన యీ రెండుదాహరణములు గూడ మీ కనుకూలించునని కావని తెలియఁజేయవలసివచ్చినందులకు విచారించుచున్నాను. ఎందుకన్న మెదడు (Brain) మనస్సుయొక్క అవయవము (Organ) అని పాశ్చాత్యులతోపాటు మనముకూడ నొప్పుకొనిన యంశమే కాని వేఱుకాదు. Brain అనునది తలలో నుండు నని మీ రెఱిఁగినయంశమే కదా! ఈతల తగినయెత్తుతోఁ, దగినపొడవుతోఁ, దగిన వెడలుపుతోఁ, దగిన యాకృతితోఁ దగినచుట్టుకొలతతో గోధుమరంగు గల తగిన యంత ర్వస్తువుతో నుండవలయును. అప్పుడే తలలోని మెదడు మనస్తత్త్వమునకుఁ దగిన యవయవ మగును. వీనిలో లోపములు కలుగుటచేతనే మనస్సు శక్తిహీనమై చెడినట్లుండును. ఎదిగినమ గవానితల సర్వసాధారణముగా 22 అంగుళముల చుట్టుకొలత కలిగియుండును. ఆఁడుదాని తల యిరువదియొకటికి నిరువదిరెంటికి నడిమికొలతకలదై యుండును. మహాబుద్ధిశాలు లగువారి తలలు 23, 24 అంగుళముల చుట్టుకొలత కలవియై యుండును. ఎట్టి యద్వితీయ మేధాసంపన్నుని తలయైనను 24½ అంగుళముల కొలతకంటె హెచ్చుకొలత గలిగియుం డదు. అంతకంటెఁ బెద్దతల రోగచిహ్నమని యెంచవలయును. మందులతలలు 19 అంగుళములను, Idiots తలలు 18 అంగుళముల కొలతకలవియై యుండును. అమ్మా! జన్మమందత్వము Idiocy అయిదుతరములనుండి తీఁగ సాగుచున్న కుటుంబములు రెండున్నవి చెప్పితివే! వారంద ఱట్టి తలలు గలవారే. తలలనుబట్టియే వారు Idiots అయిరి. తండ్రికోలమొగము Heredity వలన బిడ్డకు నెట్లు సంక్రమించునో తండ్రిబుద్ధి హీనమైనతల కొడుకున కట్లు సంక్రమించుచున్నది. ఇది దేహపరిణామమే కాని మనఃపరిణామ మెంతమా త్రము గాదు. అమ్మా! గోదావరీతీర మందలి పిచ్చికుటుంబమును గూర్చిరవంత చెప్పె దను. తండ్రి, తల్లి, ముగ్గురుకొడుకు లాకుటుంబమున నుండిరి. తండ్రినరముల కత్యంత మైన యుద్రేకము. వాఁకిటిలోఁ గుక్క రవంత మొఱిగినయెడల భూకంప మైనంత తహతహ లాడిపోవును. అట్టి యాతనికి వెనుకవ్రాలుతలగల (Pyramidal-forehead) యిల్లాలు సిద్ధించెను. వా రిద్దఱకు ముగ్గురుకొడుకులు పుట్టిరి. మొదటివాఁడు పాముతలవాఁడు. ఇతనికి నుదుటిసంబంధమగు మెదడు (Frontel brain) లేదు. రెండవకొడుకు మిక్కిలి చిన్నతలతో బుట్టెను. ఇతఁడు జన్మమందుఁడు. చిన్నయన్న గారి చిన్నతలతోఁ దల్లివ్రాలు తలతోఁ, దండ్రి నరముల యుద్రేకముతో మూఁవకొడుకు పుట్టినాఁడు. ఈతఁ డీఁగను జూచి యెగిరి యెగిరి పడువాఁడు. పిల్లిని గాంచి యేడ్చెడువాఁడు; కాకిని గాంచి గాన

మొనర్చెడివాఁడు. పంచభూతములకు భాషావిషయకోపన్యాసము లిచ్చువాఁడు; ఇతఁడు పూర్తిగాఁ బిచ్చివాఁడు జన్మమందత్వమే కాదు, పెద్దపెద్ద యున్మాదములే కాదు, చిట్టచివరకు మనుజులకు సర్వసాధారణముగా నున్న కొనవెట్టులు గూడ మెదటితో, నరముల కూట మితో సంబంధించినవే కాని, వేఱు కాదు. ఇవియన్నియు దేహపరిణామములే కాని మనఃపరిణామములు కావు. కాని మనస్సునకు మెదడు ప్రధానావయవము కావున మనస్సులోఁ బరిణామము Heredity వలనఁ గలిగి నట్లు కానఁబడుచున్నది. కాని మఱియొ కటి కాదు. అది కేవలము భ్రమము. మనస్సు చెడిపోయిన ట్లగపడుట కనేక కారణములుం డును. పచ్చకామిలగలవాని కంటికిఁ బికిలిపిట్ట పసపుపొత్తి పిట్ట. సర్పదష్టుని జిహ్వాకు లవణము కలకండ. అధర్మాయచెవియందు నిర్ఘాతమునకు నిశ్శబ్దత్వము. నన్ని పాతరోగియె డుట Socrates కు, శంకరాచార్యుల వారికి, జగన్మిథ్యాత్వవాదము జరుగచుండును. అలవాటు లేనివానికి అరయవున్న Exshaw గొంతుక దిగుటయేమి? యప్పరస లెదుటఁ దాండవించుటకై యమరలోకమునుండి దిగుటయేమి? ఇట్టి వన్నియుఁ దాత్కాలికోన్మాద ములు. వీనికి మహోన్మాదములకుఁ దత్త్వమందు భేదమేమియులేదు. నిలుకడలో మాత్రమే భేదమున్నది. సన్నిపాతరోగికి జ్వరహర మగువెంటనే యున్మాదము వదలును. అటులే యశ్వినీదేవతలు వచ్చి జన్మమందునిఁ జిన్నతలను బెద్దతలగాఁ జేయునెడల Idiot కున్మా దము వదలును. అదియులేదు; యిదియు లేదు, కాని కొన్ని కొన్ని యున్మాదము లౌషధసాధ్యములనుట సత్యమే; ఏ యౌషధమైనను శరీరమునకుఁగాని చిత్తమునకుఁ గాదని యంద ఱెఱిఁగిన యంశమే. అందుచే నున్మాదము లన్నియు దేహపరిణామములు కాని మనఃపరిణామములు కావు.

ఆమ్మా! Heredity మనస్సునై బనిచేయునని నీ వెన్నఁడు నమ్మవలదు. నీయభిప్రా యమును సిద్ధాంతీకరించుకొనుటకు మనశ్శాస్త్రజ్ఞుఁ డైన పాశ్చాత్యమహావిద్వాంసుని మాటలఁ గొన్నిటి నుదాహరించినావు. అవి యేవనఁగ:– "The heredity transmission of a liability to mental disease must be reckoned as the most important of all predisposing causes of insanity" ఈమాటలనుబట్టి mental disease (పిచ్చి) Heredity వలననే వచ్చుచున్నదని నీ వనుకొంటివి అమ్మా! అట్లనుకొనుట తప్పు. పిచ్చికి Heredity యే కారణమని యావాక్యముల వ్రాసిన పండితుని యభిప్రాయము కాదు. పిచ్చికి Liability యున్నదే. అదే Heredity వలన వచ్చునని యాతని యభిప్రాయము. ఆ Liability యెప్పుడుకూడ దేహపరిణామమే కాని మఱియొకటి కాదు. అందుచే Heredity దేహముమీఁ దనే కాని మనస్సు మీద బనిచేయదు; చేయలేదు.

అమ్మా! ఒకమాట చెప్పుచున్నాను; శ్రద్ధగా వినుము. మనమార్షమతస్థులము. పరమాత్మను, జీవాత్మను, బునర్జన్మమును నమ్మిన వారము. మనదేశమునందుఁ బుట్టిన చార్వాకమతమునందుమాత్ర మివి యేవియు లేవు. బుద్ధుఁడు దైవమును గూర్చి మూకీభా వము వహించినను జీవాత్మతత్త్వమును గూర్చి కొంతవేఱుగాఁ జెప్పెనను బునర్జన్మము నొప్పుకానినాఁడు. అమ్మా! పాశ్చాత్యశాస్త్రజ్ఞులలో ననేకు లనాత్మవాదులు. ఆత్మలేనప్పుడు పునర్జన్మము దేనికి? అందులోఁ బ్రకృతిశాస్త్రజ్ఞానము పరిపూర్ణముగ నున్న మహావిద్వాంసు లలో నూటికిఁ దొంబదియైదుగురు నిరీశ్వరవాదులు. మిగిలిన యయిదుగురు Agnositcs

అమ్మా! Evolution గూర్చి Heredity ని గూర్చి యట్టివా రొనర్చిన విపరీత సిద్ధాంతము లందు నీవు విశ్వాస ముంచి మనహారి సిద్ధాంతములను బాటిసేయకుండుట తగునా? ఇంతకును నీవు మన సిద్ధాంతసాంప్రదాయములను బూర్తిగ నెఱుఁగకుండఁ బైవారి వాక్యములే సిద్ధాంతము లని నిర్ణయించుటకు నీకేమి యధికారమున్నది? ఆత్మను బునర్జన్మమును నమ్మిన మన కనాత్మవాదుల సిద్ధాంతములు వలదు. నిరీశ్వరవాదుల సిద్ధాంతములు మొదలే వలదు. మనలో మతమునకు వేదాంతమునకు సంపూర్ణసామరస్య మున్నది. వారిలో లేదు. వారిలో మతమును నమ్మిన వాఁడు వేదాంతమును బారలౌకికానందభంజకముగను భగవ త్తత్త్వ దూషకముగను భావించును. ప్రకృతిజ్ఞానసంపన్నులైన సిద్ధాంతులు మతము మూఢజ నచిత్తాకర్షణమైన బొమ్మలాటగ భావింతురు. ఈ రెంటికి సామరస్యము కుదిరినఁ గాని మతము నిలువదు; వేదాంతము నిలువదు. వేదాంతము లేని మతమైనఁ గొంతకాలము నిలుచును గాని మతము లేని స్వసౌఖ్యపరమావధికిఁ బరహింసాప్రవీణతకుఁ బ్రపంచవిశ్రాంత ప్రఖ్యాతికిఁ బనికివచ్చును గాని చిత్తశాంతికి, వైరాగ్యమునకు, యోగమునకు, నాత్మజిజ్ఞాసకు, నపరోక్షమార్గమునకు నక్కఱకు రాదు. అసంతుష్టి కరములై, యపూజ్యములై, యనాత్మక ములైన వారిసిద్ధాంతములకు వారే కొంతకాలమైన పిమ్మట వెగటుపడక తప్పదు. ఇప్పుడి ప్పుడే యేదో కొంత విసుగుదలతోఁ గూడిన స్వల్పవైముఖ్యము వారి మనస్సులం దీసిద్ధాంతముల యెడలఁ గలుగుచున్నట్లు కొన్నిచిహ్నము లగుపడుచున్నవని కొందఱు చెప్పుచున్నారు. పుణ్యమున కుత్తమలోకఫలము లేదన్న వేదాంత మెంతకాలము మనస్సు నకు సంతుష్టి నీయఁగలదు? సర్వరక్షకుఁడే లేని వేదాంతమం దెంతకాలం మనోధైర్య ముండఁగలదు? అణువులు (Atoms) నిన్ను రక్షించునని చెప్పినమాటను నీ వెంత కాలము నమ్మఁగలవు?

అమ్మా! నీ విట్టి సిద్ధాంతముల నాధారముచేసికొని వాదించుట సమంజసము కాదు. నీయాంగ్లేయభాషాజ్ఞానమునకు, నీగ్రంథపరిశోధనమునకు నేను సంతసించితిని. కాని మన యార్షమతమునందలి నీ యనాదరణమునకు విచారించుచున్నాను. మన పెద్దలు జీవుని పునర్జన్మమును గూర్చి యెట్టియభిప్రాయమును వెల్లడించిరో రవంత కనుగొందము. అమ్మా! నేను నీమాత్రమైనఁ జదువుకొన్న వాఁడనుగాను. కాని పెద్దల సేవించుచు పెచ్చుకాలము గడపినవాఁడ నగుటచే వారిప్రసాదమునఁ గొన్నిమాటలు నాచెవి నప్పుడ ప్పుడు పడినవి. అవి సంగ్రహముగ మనవి చేసెదను.

స్థూల సూక్ష్మ కారణశరీరములని శరీరములు మూఁడు. మనుజుని మరణానంతరము స్థూలశరీర మిచ్చట మంటలోనో మట్టిలోనో కలసిపోవును. ఇఁక సూక్ష్మకారణశరీరములు న్నవి. సూక్ష్మశరీరములోఁ గారణశరీర ముండును. బాదముకాయలోఁ బలు కెట్లో యటులే యుండును. సూక్ష్మశరీరము వెలుతురు (Light) విద్యుచ్ఛక్తి (Electricity) వంటిది. సూక్ష్మశరీరములో నున్న జీవాత్మకు మోక్షము సూక్ష్మశరీరము పూర్తిగా నశించిన పిమ్మట గాని కలుగదు. అట్టిస్థితి కర్మరాహిత్య వాంఛారాహిత్య పూర్వకమయిన జ్ఞానమువలనఁ గని, భక్తివలనఁగాని పరమేశ్వరకటాక్షమువలనఁగాని కలుగును. అంతవఱకు సూక్ష్మశరీర మాత్మ నంటిపెట్టికొనియే యుండును. లోపల జీవాత్మగల యీసూక్ష్మశరీరమునకే మన పెద్దలు పునర్జన్మమును నిర్మించినారు. ఈ జీవుఁడు విశేషపుణ్యము లొనర్చుకొన్నవాఁడైన యెడల

నుత్తమలోకము లందుఁ దత్పుణ్యఫలక్షయ మగువఱకు మహాసుఖమంది యటుపిమ్మట మర్త్యలోకమునఁ దిరుగ జన్మించును. ఉత్కృష్టపుణ్యకార్యములు కాని, పాపకార్యములు కాని సామాన్యముగాఁ జరించి మరణించినవానినూక్ష్మ శరీరమునకు వెంటనే పునర్జన్మము నంభవించును. విశేషపాపకర్మము లొనర్చినవాఁడు మరణించి శ్వ సూకరాది జంతువుల గర్భమందుఁ బుట్టును. పునర్జన్మ మెత్తవలసినజీవుఁడు తన కర్మానుగుణమైన తావు చూచుకొని వ్రీహిమూలమునఁ బురుషుని యుదరమునఁ బ్రవేశించి యటనుండి మాతృగర్భకోశమునఁ బ్రవేశించును. పుట్టఁదఁలచిన జీవుఁడు తనంతతానే ప్రయత్నించి పుట్టుచున్నాఁడు; కాని మనప్రయోజకత్వముచేఁ బుట్టుచుండుటలేదని స్పష్టముగఁ దెలిసికొనవలయును. జీవుని వదలకుండ వెంటాడించుచున్న యతని సూక్ష్మశరీరము కూడ జీవునితో పాటే తల్లికడుపునఁ బ్రవేశించును. ఈసూక్ష్మశరీరము కూడ జీవునితో పాటే తల్లికడుపునఁ బ్రవేశించును. ఈసూక్ష్మ శరీరములో నేమున్న వనఁగా: అనేక పూర్వజన్మములలో జీవుఁ డొనర్చుకొన్న కర్మముల ఫలమున్నది. అదికాక విద్యయున్నది. విద్య యనఁగా వేదవేదాంతజ్ఞానము, శాస్త్రాదిజ్ఞానము మొదలగునవి. ఇదికాక ప్రతిభ యున్నది. ప్రతిభ యనఁగా బుద్ధివికానము, లలితకళా ప్రావీణ్యము, వాక్చతురత, వ్యవహార నైపుణి మొదలగునవి. ఈశక్తులన్నియు దల్లి గర్భమునఁ దనంతఁ దాను ప్రవేశించినజీవుని సొంత సొమ్మే కాని తల్లిదండ్రులిచ్చిన వెంతమాత్రమును కావు. ఇక్కడనే నశించిపోవుట కర్హమైన స్థూలశరీరమును (దేహము) మాత్రమే తల్లిదండ్రులు బిడ్డ కిచ్చుచున్నారు. ఈ దేహమైనఁ దల్లిదండ్రులు బిడ్డకు యథాక్రమముగఁ బూర్తిగ నిచ్చుచున్నారా? ఈయ శక్తిగలిగియున్నారా? కల్ల. అట్లే యగునెడల నిందఱు వికృతాంగులు, నిందఱు నపుంసకులు, నిందఱు రాకాసిరూపులు ప్రపంచమున నుండనేల? బిడ్డనికి దేహమిచ్చుటలోఁ దల్లిదండ్రులు బిడ్డని కర్మమునకుఁ దమ కర్మమునకుఁగూడ ననుగుణమగు నంతవఱకే దేహమిచ్చుచున్నారు. ఎటు లిచ్చినను బ్రధానముగఁ దెలియఁదగిన యంశమేదనఁగా: బిడ్డకుఁ దల్లిదండ్రులిచ్చునది దేహమే కాని తద్వ్యతిరిక్త మెంతమాత్రము కాదు. మన న్నసునది బిడ్డనిదే. దానిపైఁ దల్లిదండ్రుల కధికారము లేనే లేదు. అందుచేతనే యొకనికిఁబుట్టిన యెనమండ్రు కొడుకులలో నొకఁడు మహాబలాఢ్యుఁ డగుచున్నాడు. ఒకడు కాలుచేతులులేని మొండె మగుచున్నాఁడు. ఒకఁ డెనుబది సంవత్సరములు పూర్ణారోగ్యమున జీవించుచున్నాఁడు. ఒకఁ డెనిమిదవదినమున సందుగొట్టి చచ్చుచున్నాఁడు. ఒకఁడు మహాకవి యగుచున్నాఁడు. ఒకఁడు నిరక్షరకుక్షి యగుచున్నాఁడు. ఒకఁడు పరమహంసశిఖామణి యగుచున్నాఁడు. ఒకఁడు బందిపోటుదొంగ యగుచున్నాఁడు. ఈ వ్యత్యానముల నన్నిటిని **Heredity** సమన్వయింపఁగలదా? ఊహఁ

పాశ్చాత్య వేదాంతులలో నూతనముగఁ గొందఱు మఱియొక యభిప్రాయమును బడుచున్నారని వినుచున్నాను. **Heredity** వలన బిడ్డని దేహపరిణామములన్నియుఁ బూర్తిగఁ గలుగుచున్నవని వీ రంగీక రించుచు మనఃపరిణామములోఁ గొన్ని మాత్రమే **Heredity** వలనఁ గలుగుచున్నవని వీ రభిప్రాయపడుచున్నారు. ఆకొన్ని యేవనఁగా:– బుద్ధివికానముతోఁ జేరిన మనఃపరిణామములు మాత్రమే **Heredity** వలనఁ గలుగుచున్నవి. కాని పుణ్యపాప నంబంధంతోఁ జేరిన నడవడి మాత్రము **Heredity** వలనఁ గలుగుటలేదని వీరి యభిప్రాయమైనట్లు కనఁబడుచున్నది. గణితశాస్త్రప్రావీణ్యము **Heredity** వలననే కలుగు

చున్నది. గణితశాస్త్రప్రావీణ్యము Heredity వలననే కలుగుచున్నది. కాని కాంతాలలాపట త్వముమాత్రము దానివలనఁ గలుగుట లేదఁట! ప్రబంధరచనానైపుణ్యము Heredity వలననే కలుగుచున్నది. కాని, వైరాగ్యజ్ఞానసంపత్తి దానివలనఁ గలుగుటలేదఁట! సరే, కలుగుటలేదు. దేనివలనఁ గలుగుచున్నవని వీరి నడిగినయెడల నాత్మ నొప్పుకొనవలసి వచ్చునను భయముచేత Science యింకను Progress అయిన కొలదిఁ దెలియునని కాఁబోలు మూకీభావమును వహించుచున్నా రని వినుచున్నాను. ఏమైనాసరే కాని వీ రాత్మ నొప్పుకొనుట కిష్టపడరు.

"This doctrine (Transmigration) famous in antiquity and still held as a religious tenet by certain sects of the civilised world has its roots far back in primitive culture. It is developed out of three universal savage beliefs, (1) that man has a soul; (2) that animals and plants have souls; (3) that souls can be transferred from one organism to another."

అమ్మా! వింటివా! ఆత్మాస్తిక్య విశ్వాసమున్న మనలను బాశ్చాత్యసిద్ధాంతులు Savages అని పిలుచుచున్నారు. కాని యింత నాగరకత యుండియు నింత శాస్త్రజ్ఞాన ముండియు Heredity మనస్సునై Intellectual Side ననేకాని Moral Side నఁ బనిచేయనదని చెప్పునట్టి వీరిని మన మేమని పిలువవలయునో? జవుననఁటికాయ లాగున మనస్సున కొకప్రక్కను బుద్ధిభాగము, రెండవ ప్రక్కను నీతిభాగము నున్నవని వీరి యభిప్రాయము కాఁబోలు! సరే. ఎటులో యొకటు లుండుఁగాక! నగము మనస్సునైఁ బనిచేసినది. మిగిలినసగము పై నేలపనిచేయదో? నీటిలో ముంచినగుడ్డకుఁ బదుగు తడిసి పేక పొడిగనుండునా? అమ్మా! ఆత్మవిశ్వాసము పునర్జన్మ విశ్వాసమున్నఁగాని యీలెక్క "కజబాజు"లు గిట్టవు. బుద్ధిచేతనే ప్రపంచపుఁ గట్టుకథను విప్ప సాధ్యమగునా? ప్రపంచమున మన లౌకిక బుద్ధికి స్వాధీనమైనది రూపాయ కొక్క యర్ధపైసంతయినఁ గాదే. మిగిలినదంతయు భగవద్వాక్యములని మనము నమ్మినవానివలనను సమాధినిష్ఠాగరిష్ఠులై యపరోక్షజ్ఞాననిక్షేపులైన మంత్రదష్టల పలుకులవల నను దెలిసికొనవలెను. Nonsense అది మూఢవిశ్వాస మనిపై వా రందురా? అది Nonsense అయినయడెల నీక్రిందిదానిని వా రేమందురో? "One cannot accept the theory of Evolution or the theory of Heredity built upon the Evolutionary hypothesis without discording the Bible and rejecting the dominent note in Christianity. We are not progeny of the brute. We have not tumbled upward by chance but rise by a power which finds its highest Expression in Christ." W.J. Bryan అను నొక పాశ్చాత్యవిద్వాంసుఁ డీమాటలను వ్రాసినాడు. Evolutionary heredity ని బూర్తిగ ఖండించిన వారిలో నితఁడు ప్రముఖుఁడు. ఈతఁ డుద్రేకమున "God or Gorilla?" అని యఱచినాఁడు. "The worldfamous lawyer, politician and orator" అని ఖ్యాతి చెందినవాఁడు. అమ్మా! ఈతఁ డింక నేమని వ్రాసెనో విందువా? "I would propose the Bible as a substitute for all materialistic doctrines, because the Bible is not only the foundation of ever present standard of morals but also gives us our only conception of God and Jesus Christ.

మతమునందలి విశ్వాసముచేతనే మనుజుఁడు మనుజుఁ డగుచున్నాఁడు. కాని, లౌకిక మైన బుద్ధిచేతఁగాదని నమ్మవలయును. ఎంతటి వాఁడైననరే, యెక్కడివాఁడైననరే, యుశా స్త్రీయములైన మతవిశ్వాసములు కలవాఁడు మూఢుఁడేకాని మఱియొకఁడు కాఁడని యింకను బాశ్చాత్యవేత్తలు మనల నధిక్షేపింతురా? ఊఁ, అటులే కానిమ్ము. బ్రహ్మర్షులతో పాటు మనము తప్పునఁ బడియుండుటే తగునుకాని పాశ్చాత్య శాస్త్రవేత్తలతోపాటు నందేహాహతులమై భ్రష్టత్వమొందుట తగదు. అనాగరకులలో నధము లనిపించుకొన్న మన మాస్తికులమై యుండదము; కాని నాగరకశిఖామణు లనిపించుకొనుచు నాస్తికులమై యుండవ లదు. అమ్మా! ఎవరు చూడవచ్చినారు. ఏమో! ఏమో!! ఏమో!!!

(భారతినుండి పునర్ముద్రితము)

35. ఆంధ్రసాహిత్యపరిషదేకాదశ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసము

ఆంధ్రదేశ సాహిత్య చరిత్రలో, గ్రాంథిక భాషా పరిరక్షణ కోసం *1911*లో ఆంధ్రసాహిత్య పరిషత్తు అవతరించింది. ఈ పరిషత్తు స్థాపక, వ్యాపకులలో పిఠాపురం మహారాజా సూర్యారాయ మహీపతి, జయంతి రామయ్య పంతులు ప్రముఖులు.

ఈ పరిషత్తు *11*వ వార్షికోత్సవం దుందుభినామ సంవత్సర భాద్రపద శుద్ధ ఏకాదశి రోజున పిఠాపురంలో జరిగింది. ఈ సభకు పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు అధ్యక్షత వహించి చేసిన ఉపన్యాస పాఠం ఇది.

ఆయన ముందుగా పిఠాపురం విశిష్టతను, ఆ సభ జరుగుతున్న మహారాజు మందిరం విశిష్టతను ప్రశంసించారు. అప్పటికి వున్న ఆంధ్ర భాషా స్థితిని–నాటకీయంగా–ఎదుట దృశ్యం కనిపిస్తునట్లు వర్ణించారు. ఎన్నెన్ని రకాల సాహిత్యం, ఎన్నెన్ని రకాల కవుల సందడి, దేశాన్ని క్రమ్ముకొని వుందో విశదం చేశారు. ఆంధ్రదేశ ప్రజలలో నూటికి ఇరవై మందికి మించి ఆంధ్రభాషా జ్ఞానం లేక పోవచ్చుగాని–అదే చాలునన్నారు.

ఆంధ్రులైన వారు ప్రతి వ్యక్తీ, ఆంధ్ర గ్రంథాల్ని కొనాలని విన్నవించారు. ప్రజాపోషణ గ్రంథకర్తలకు అవసరమన్నారు. పుస్తకాలలో మంచివాటిని గౌరవించాలనీ, చెడ్డవాటిని బహిష్కరించాలనీ, సూచించారు. తెలుగులో ఉత్తమ 'సాహిత్య విమర్శ' అభివృద్ధి కావడానికి పరిషత్తు కృషి చెయ్యాలన్నారు. ఒక్క సాహిత్య సంబంధ గ్రంథాలేకాక, అనేక ఇతర శాస్త్ర గ్రంథాలు కూడా తెలుగులోకి అనువాదం కావాలనీ, ఛందస్సులో కవిత్వ రచనే కాక, వచన సాహిత్యం విరివిగా వుట్టి భాషను అభివృద్ధి చేయాలనీ, కవుల చరిత్రల్నీ, చిత్రపటాల్నీ పరిషత్తు సేకరించాలనీ, ముఖ్యంగా వివిధ వచనశైలీ నిర్మాణం రచయితల వల్ల జరగాలనీ కోరారు. ఇందుకు ప్రజలు, పరిషత్తుకి ఆర్థికంగా చేయూత ఇవ్వాలన్నారు. అర్హులైన పండితులకు, పరిషత్తు బిరుదులివ్వాలని సూచించారు. కొంత సొమ్ము కేటాయించి పేదకవులను ఆదుకొనే యత్నం చేయాలన్నారు. ఏటా వార్షికోత్సవ నివేదికల కంటె ముఖ్యంగా పరిషత్తు, నిర్మాణాత్మకమైన కృషి గ్రంథ రచన రూపంలో చూపించాలన్నారు.

ఆంధ్రసాహిత్యపరిషదేకాదశవార్షికోత్సవసభకు న న్నగ్రాసనాధిపతిగా నియమించి నందులకు మీ కెంతయుఁ గృతజ్ఞుఁడను. క్రిందటిసారి యేలూరులో నిట్టిసభ జరిగినప్పుడు న న్నగ్రాసనాధిపతిగాఁ కోరిరి. అప్పటి యనారోగ్యస్థితివలన నే నంగీకరింపకపోయినప్పటికి ననున్నుఁ దిరుగ నెన్నుకొని గౌరవించినందుకు మఱింత కృతజ్ఞుఁడను.

నేను బండితుఁడను గానని యీయూరివా రెఱుఁగుదురు; పై గ్రామములవా రెఱుఁగుదురు. న న్నెఱిఁగినంతవఱ కాంధ్రదేశమంతయు నెఱుఁగును. సాహిత్యహీనతలో జనమెఱిఁగినవాఁడను గాని సాధారణుఁడను గాను. ఇట్టి ననున్నుఁ బరిషత్తువా రేల యెన్నుకొన వలయునో నాకుఁ దెలియదు. తెలిసినవిషయ మేమియో యంతకంటెఁ దెలియదు "వెనుక జరిగినది పది పరిషత్సభలకుఁ బండితుల నెన్నుకొంటిమి కదా! ఈసారి యపండితు నెన్నుకొందము. ఇంతలోఁ జెడిపోవున దేమున్న" దని యూహించి మార్పుకొఱకై న న్నెన్నుకొని యుందురేమో! ఎట్టులైన నేమి? అవిలంఘ్యు మైన మహాజనులయాజ్ఞ దులసీ దళమువలె శిరమున ధరించి యిట నిలువఁబడితిని. నాకు సందేహమెందుకు? న న్నిటనిలువఁ బడుటకు నియమించినవారే నాచేఁ దమకార్యమును నిర్వహింపించుకొనుభారమును వహించి యున్నపుడు పనికి మాలి సందేహము లొండుటకంటెఁ బామరత్వ ముండునా? కవి కుండఁ దగిన యోచన, తొట్రుపాటు, సందేహము, నలజడి కవిచేతిలోని కలమున కెందుకు? ఈస్వల్పసాధనమును మీ యిష్టానుసార ముపయోగపఱచుకొని మిమ్ము మీరు కృతార్థులుగఁ జేసికొనుఁడు. కలముగూడఁ గానంత మంచిదే యనునట్లు నన్ను రవ్వంత కృతార్థునిఁ జేయుఁడు. చేయుట కవకాశము లేక పోయిన బోనిండు. ఇఁక గార్యక్రమము ననుసరించి సభాచర్య జరిగింతము.

సమ్మానసంఘాధ్యక్షులగు శ్రీ శ్రీపిఠాపురమహారాజావారి మనోహరమైన యుపన్యా సమును వింటిమి. దానినిగూర్చి నే నేమైనఁ జెప్పవలసియుండునెడల నా యుపసంహారోప న్యాసము ముందుఁ జెప్పెదను. ఇఁక నా యుపన్యాసమును జదివెదను.

పీఠికాపురము:— ఈసభ పీఠికాపురమునకే తదాస్థానమహారాజువారిచే నాహ్వానింపఁబ డినది. ఆహ్వానించినవా రెట్టివారు? ఆంధ్రభాషాపోషకులు, నాంధ్రభాషాకోవిదులు, నాంధ్ర భోజబిరుదాఢ్యులు, నత్యంతసుగుణసంపన్నులగు నీ మహారాజుగారు. ఆహ్వానింపఁబడిన దేది? అన్ని దేశ భాషలలో సమృతాధిక మాధురీధురిణీ యని యేభాష యాచంద్రార్కఖ్యాతిఁ గాంచినదో, యేభాషామతల్లిని సేవించుటచే రాజరాజ నరేంద్రుఁడు మన యందఱయిండ్లలో దేవతార్చన వేదికలపై దివ్యమూర్తులతో పాటు పూజ సందుచున్నాఁడో యేభాషయొష నభ్యర్చించుటఁ గృష్ణదేవరాయలయశస్సింహాసన మష్టదిగ్గజములు వహించుచున్నవో యట్టి యాంధ్రభాషాదేవిని సేవించుట కేర్పాటుకాఁబడిన సాహిత్యపరిషత్తు. ఆహ్వానించిన దెచ్చ టికి? రామలింగకవి కాలమునకుఁ బూర్వమునుండియే కాక యిప్పటికిగూడఁ గళింగదేశా భరణమగు పీఠికాపురమునకు. మల్లన్న-ప్రౌఢకవి మల్లన్న కాఁడు. పావులూరి మలయమారు తముతో వచ్చిన రసికజనమనోభిరామపరిమళము లీటకు రెండుబారలలోనివే. లక్షణాపరి ణయ శబ్దాలంకారపు టంగుటింగు లిక్కడికి మూఁడుబారలలోనివే. అయిన నిది కేవలము సారస్వతప్రాముఖ్యమునందిన పట్టణము మాత్రమే కాదు. శివకేశవసన్నిధానమునఁ బరమపవి త్రమైనది కూడను; పాదగయాక్షేత్రమగుటచే నిది మహాక్షేత్రము. అష్టాదశపీఠములలో నిది

టికి? రామలింగకవి కాలమునకుఁ బూర్వమునుండియే కాక యిప్పటికిగూడఁ గళింగదేశా భరణమగు పీఠికాపురమునకు. మల్లన్న-ప్రౌఢకవి మల్లన్న కాఁడు. పావులూరి మలయమారు తముతో వచ్చిన రసికజనమనోభిరామపరిమళము లీటకు రెండుబారలలోనివే. లక్షణాపరి ణయ శబ్దాలంకారపు టంగుటింగు లిక్కడికి మూఁడుబారలలోనివే. అయిన నిది కేవలము సారస్వతప్రాముఖ్యమునందిన పట్టణము మాత్రమే కాదు. శివకేశవసన్నిధానమునఁ బరమపవి త్రమైనది కూడను; పాదగయాక్షేత్రమగుటచే నిది మహాక్షేత్రము. అష్టాదశపీఠములలో నిది

యొకటి. మహాకవినిలయ మగుటచే రక్తికి, మహారాజాస్థాన మగుటచే భుక్తికి, మాధవమహా క్షేత్ర మగుటచే ముక్తికి నిదానమైన యీపుర మాంధ్రదేశమహిళామతల్లికంఠ మాలానాయకమ ణియై ప్రకాశించుచున్నది.

ఇదిగాక చీనాదేశపువారి రాయబారి హియా త్సాంగ్ అనునాతఁడు మన యార్యావర్త దేశమునకు వచ్చి యిచ్చటివిశేషములు వ్రాయుటలో దక్షిణమునఁ బిష్టపుర మనునొక ప్రసిద్ధమైనపట్టణ మున్నదని వ్రాసినాఁడనియు, నంతకుఁబూర్వఁ డెవఁడో గ్రీస్తుదేశస్థుఁడు కాఁబోలుఁ బిష్టపురఖ్యాతిని వెల్లడిచేసియుండె ననియు మ-రా-రా శ్రీది హానరెబిల్ న్యాయ మూర్తి వేపా రామేశముపంతులుగారు నాతోఁ బలికిరి. ప్రాచీనచరిత్రాంశవిమర్శనాసక్తులగు వారిమాటలను బట్టి యీ పట్టణము దాదాపుగాఁ గ్రీస్తుశకమునకుఁ బూర్వమునుండియుఁ బ్రసిద్ధి వహించియున్నదేమో యని యెంచఁదగియున్నది.

మహారాజమందిరము:– అట్టి యీపట్టణమున మహారాజమందిరమున మనసాహిత్యప రిషత్తు సమావేశమైనది. సంగీతసాహిత్యప్రసిద్ధుఁడగు కవివర్యుని యనేక చిత్రవిచిత్రార్థప్రతి పాదనయుక్తమైన వసుచరిత్ర సంగీతపురాణ పఠనము జరిగిన దీ సభయందే. సర్వకామదకుఁ బరిణయ మెందుకోయి యని రామభక్తుఁడైన లక్ష్మణుఁడు కృష్ణమూర్తిని బరిహసించిన దీ సభయందే. బులుసువారింటఁ బుట్టిన విద్వాంసుఁడు. ముప్పదిరెండుపుట్ల రత్నగర్భను రామార్పణముగ గ్రహించిన దీ సభయందే. భరతాధ్యుదయాధిపతి శతఘంటక కవిత్వకాల మున శారదా దేవితోకూడ గజ్జెలు కట్టుకొని తాండవించిన దీ సభయందే. రావువంశముక్తావ ళిని రామరాజేంద్రుని కంఠసీమనలంకరించిన యాస్థాన సోదరకవు లర్దసింహాసన మధిష్ఠించిన దీ సభయందే. కవులకుఁ గనకవర్ష మన్నిబుతువులందుఁకూడఁ గురియుచున్న దీ సభయందే. నవీనగౌతములు, నర్వాచీనపాణినులు, నూతన బాదరాయణులు విజయదశమినాఁడు మా మహారాజేంద్రునిపై వారి పుత్రపుత్రికాసంతతిపై నాశీఃప్రసవవృష్టిఁ గురియించుచున్న దీ సభయందే. ఆస్థానవైణికాగ్రగణ్య వీణారవామృతాస్వాదనావశములైన చిలుకలుఁగూడ స్తంభోపరివిటంకములనుండి సహవైఖరిని ''రామా'' యని యనఁబోయి సంగీతవైఖరిని ''రీమా'' యని యనుచున్న దీ సభయందే. అట్టి యీసభయందుఁ దెనుఁగు రాయఁడు మొదలు తెనుఁగుభాసలోఁ బండితుఁడు తెలుఁగుబాసకుఁ బరిపోషకుఁడు నగు నీ మహారాజువలకు విద్యాపోషణమునకు విశేషవిశ్రుతి కెక్కి దినదిన ప్రవర్ధమానముగ నెక్కుచున్న యితోధికవృద్ధిగా నెక్కఁ గల యీసభయందు, రమాశారదాకేళీమందిరమగు నీ సభయందు మనము నేఁటికి సమావేశమైతిమి. ఎందుకు? ఆంధ్రశారదాదేవీసమారాధన మునకు. ఆహా! ఎంత మహాకార్యమునకై–యెంత మహారాజుచే నాహ్వానింపఁబడి యెంత మహాక్షేత్రమున నెంత మహోన్నతయశస్వంత మైనసభయం దెందఱు మహాకవిపండితులు నమకూడిరో! ఆంధ్రభాషా పండితులను, నాంధ్రభాషాభివృద్ధికై యత్యంతము శ్రమమొనర్చు చున్న వారును నగు గౌరవ్యులకు శ్రీరాజా పానుగంటి రామారాయణంగారు నిరంతర రాజకార్యనిర్వహణదీక్షాబద్ధులై యుండుటచే నిటకు దయచేయుట తటస్థింపదేమో యని సందేహించితిమి. కాని యాదృచ్ఛికమునఁ గార్యాంతరములచే గంజాముమండలమునకు వారు వచ్చి తిరుగ మదరానునకుఁ బోవునప్పుడు తమ మిత్రులగు మా మహారాజాగారిని జూడనిటు దిగి పరిషత్ప్రభ నిట్లలంకరించుట భాషాభిమానుల కందఱకుఁ బరమానందముగా

నున్నది. మదరాసులో రాజప్రతినిధిగారు ప్రథమమంత్రి వీరగుటచే రాజప్రతినిధిగారే పరిషత్సభ నిట్లు బహూకరించి రని యెంచవలసియున్నది. ఆహాహా! ఇది యెంత మహాసుదినము! సెప్టెంబరు రెండవతేది. సోనిండు. అని మన కెందుకు? దుందుభినామ సంవత్సర భాద్రపదశుద్ధైకాదశి భాషాచరిత్రయందు బంగారువర్ణములతో ముద్రింపవలసిన భద్రతిథి కాదా? ఆంధ్రశారదాజయంతి జరుపఁదగిన యమూల్య దిన మిదియేకదా! ఆంధ్రభాషకు జయమగుఁ గాక! ఆంధ్రభాషాపోషకులకు జయమగుఁ గాక? ఆంధ్రసాహిత్యపరిషత్తునకు జయమగుఁ గాక!

ప్రస్తుతాంధ్రభాషాస్థితి:– ఆంధ్రభాష ప్రస్తుత మెట్టి స్థితిలో నున్నదో రవంత చెప్పెదను. నేను జెప్పుట యెందుకు? ఆంధ్రభాషాదేవి యెట్లున్నదో మీరే చూడుఁడు. అదెట్లు? సహజభావనాబలసంపన్నులమైన మనము మనస్ఫూర్తిగాఁ జూడఁదలఁచుకొన్నయెడల శారదాదేవి మనకుఁ బ్రత్యక్షము కాకపోవుటయే. మనశ్శక్తికి బద్ధులుకాని దేవత లెవరు? నాయనలారా! బాహ్యనేత్రములను రవంత ముకుళింపఁ జేయుఁడు. ఆంతరనేత్రజ్యోతి నెగసఁ బొడిచి దానికిరణము లటు లిటులు చెదరనీయక సంక్షుభవింపఁజేసి మనకుఁ గావలసిన విషయములపై సుస్థిరముగ నూటిగఁ గేంద్రీకృత మొనర్పుఁడు. ఆహవనౌకలందలి యన్వేషణజ్యోతికంటె ననేకగుణతేజస్సమృద్ధమగునట్లు, వెలుఁగఁ జేయుఁడు? ఇంకనేమి? అదిగో! అదిగో! ఒడలు జలదరించునట్లు, కనులు కృతార్థములగునట్లు, మనస్సు పుష్పించునట్లు, జన్మము తరించునట్లు–ఆంధ్రశారదాదేవి దర్శన మిచ్చుచున్నదే! అనేక సహస్రచంద్రమండల సన్నిభమైన యాస్యమండలము వీణాదండమువంక రవంత యొఱగి యున్నది. అందుచేఁ గిరీటమునుండి వ్రేలాడుచున్న ముత్తెములగుత్తి మేరువునొద్దనున్న వీణబిరడపై వ్రేలాడుచున్నది. బాగుగాఁ బరిశీలింపుఁడు. ఎడమమోఁకాలిపై మడఁచినకుడిమోఁకాలివంపుప్రక్కను రవంత వెనుకగ దేవతాచందన నిర్మితమైన వీణకుండ ప్రకాశించుచున్నదే. దివ్యసర్వసుధాసేచనమున వీణాదండము తీఁగచెట్టు చిగిర్చిన ట్లామె యెడమ చేయ్వ్రేళ్లు తంత్రులపై నెట్లు కదలుచున్నవో. ఆహా! అదిగో గుడివైపున రాజరాజనరేంద్రుఁడు, నెడమవైపునఁ గృష్ణదేవరాయలు వింజామరములు చేతఁ బుచ్చుకొని యెట్లు వీచోపు లిడుచున్నారో! అదిగో! ఆపీఠము మొదటఁ బీతాంబరపు నడకట్టుతో నిలువఁబడి దేవికిఁ బారిజాతపష్పములతోఁ బూజ లొనర్చుచున్న యాపౌరోహిత్యబ్రాహ్మణుఁడెవరో యెఱుఁగుదురా? అదిగో! ఒక్కచింతాకంతవాసి–క్రిందుగ నిలువఁబడిన యాకుండలాల సోమయాజి కప్పురపుటారతిపళ్లెరము చేతఁ బుచ్చుకొని–వహ్వా! నీరజాసననీరజపత్రాక్షికి నివ్వాళు లిచ్చు చున్నాఁడే! మరియొక బెత్తెఁడు క్రింద–పురోహితునియంత పొట్టియుఁ గాక, సోమయాజియంత సోగయుఁ గాక మట్టసపు మాదిరిగనున్న మంత్రి శిఖామణి మహాలక్ష్మిదేవి కోడలిని మందాకినీసలిలపుగిండి దోసిటఁబట్టుకొని సేవించుచున్నాఁడే! ఆర్యులారా! చూచుచున్నారా?

ఉ. క్ష్మాతలంబు నెన్నుదురుసోఁకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందర వేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవచిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామశుక వారిజపుస్తకరమ్య పాణికిన్.

అని పఠించి చాపచుట్టుగ సాష్టాంగదండప్రణామ మిడుచున్న యాజాంబూనదవిగ్రహమును గాంచి మీకన్ను లానందబాష్పములను విడుచుచున్నవా? ఆహా! అది యేమి? ఆకవిత వినియేనా శారదాదేవి శిరఃకంపన మొనర్చినది! కాక యుభయమహారాజేంద్రుల వింజామరసేవలనా యామెచెవినున్న చెంగల్వ గదలినది! అట్లు కదలిన చెంగల్వనుండి జరిన యమృతబిందువు లెట్లు వీణాతంత్రులపైఁ బడుచున్నవో! నాయనలారా! ఈచర్యయంతయు నామెపీఠమునకు దిగువనున్న రెండుమూఁడు మెట్లమీఁదిది! కాని యిదియంతయు మనకేల? దిగుఁడు; ఏడెనిమిదిమెట్లు దిగుఁడు; మృచ్ఛకటికాపరివర్తనమును జూలియస్ సీజరుపరివర్తనమును జేతఁ బట్టుకొని నిలువఁబడిన యాష్టవిష్ణుని గాంచితిరా! బిల్వేశ్వరీయ శంకరవిజయధ్వజాది గ్రంథములను జేతఁ బుచ్చుకొని ''పలుకుదయ్యమా! ఇది పాయస మమ్మా! బమ్మదయ్యపుటిల్లాలా! ఇది పానకమమ్మా! త్రాగుమమ్మా'' యని తల కంపింప స్పష్టముగ సంబోధించుచున్న యాహ్రస్వరూపుని గాంచితిరా? అదిగో! మహేంద్రవిజయ నయనోల్లాసకర్తలగు సోదరకవులు శ్రవణానందముగ శారదాగాన మొనర్చుచున్నారు. వినుచున్నారా! వారి గాన మధురిమచే నాకర్షింపఁబడి కాఁబోలు నొక్క శాంతస్వరూపుఁ డైన వృద్ధుఁ డటకువచ్చి యారంభించిన భారతము పూర్తికాలేదు; ఇది యమ్మగారి కర్పింపవచ్చునా లేదా'' యని పీఁచు కాగితముల పెద్దకట్టను వారికిఁ జూపి యడుగుచున్నాఁడు. ఆలకించుచున్నారా? ఏవో బరువైన గ్రంథములు పదిసంపుటములు కాఁబోలుఁ జేతఁ బుచ్చుకొని యెర్ర మధుర పాగఁజుట్టుకొని దగ్గుచు గష్టమున మెట్లెక్కుచున్న యాముసలి యాయన యెవరో యెరుఁగుదురా? ఈయనను జూచి బిలేశ్వరీయకర్త గుట్టుమనుచున్నాఁడేల? తన ప్రసన్న రాఘవ విమర్శనముమూట పరాకు పడినాఁడు కాఁబోలు! ఆహా! శతఘంటకపు లిద్దరు–ఒకరు మునలివారు; నొకరు పడుచువారు. ఒక రెట్టినివారు; నొకరు నల్లనివారు. ఒకరు పొట్టివారు; నొకరు రవంత పొడుగువారు. నొండొరులఁ గౌఁగిలించుకొని మనగ్రంథములు శారదాదేవి కర్పింతమని యొకరితో నొకరు చెప్పుకొనుచుఁ బూర్వవైరములు వదలి చెట్టపట్టముల వైచుకొని మెట్లు లెక్కుచున్నారు వారిని గాంచితిరా? కాని వీరి కొకటి రెండుమెట్లు ముందు బుద్ధచరిత్రమును సరస్వతీనంచికలను జేతఁ బట్టుకొని కంటిజోటితో ముందునకుఁ బోవుచున్న యా భాషాపోషకతేజ మేబ్రాహ్మణ ప్రభునిదో పరిశీలించితిరా?

మహాజనులారా! ఇదివఱకు మనము కాంచినవారందరు గతించినవారు. ఇప్పుడు బ్రదికి బట్టకట్టుచున్న వారిని గ్రంథము కలముఁ బట్టినవారి నిఁకముందు చూడఁదలచియున్నాము. ఇఁక గొన్ని మెట్లు దిగుఁడు. అదిగో! శారదా దేవీచరణారాధనమునకై యింద్రధనుస్సు రంగులుగల యెన్ని యోపూవులను దట్టలోఁ బెట్టుకొని యొక్క మునలియాయన యా మెట్టుమీఁదఁ గూరుచుండినాఁడు, కనఁబడుచున్నాఁడా? అవి భక్తచింతామణిపుష్పములు కాఁబోలు! అచ్చట నొక పెద్దదుకాణమున్నది. చూచితిరా! అ దేదో వంగభాషనుండి పరివర్తనమునొందిన బహుళములైన నవలలుగల గ్రంథనిలయము కాఁబోలు! ఆప్రక్కను ఫర్లాంగు చదరపుస్థలములో దాదాపుగఁ బండ్రెండుగజములయెత్తు వఱకుఁ బేర్పఁబడిన యా పుస్తకములసమూహమేదో యెఱుఁగుదురా? అవియే పాటలనాటకములు. ఓ! యెగురుచున్నవి. గిరగిర దిరుగుచున్నవి! నేలపైఁబడుచు నెంతగందరగోళమైనఁ జేయుచున్నవి. ఈసందడిలోఁ బర్లాకిమిడి వాస్తవ్యుఁడైన బ్రాహ్మణుఁ డొక్కఁడు నవ్యసంగీతపురాణ

ధోరణితోఁ దాళపుఁజిప్పలు చేతఁబుచ్చుకొని తాండవించుచున్నాఁడు. అదిగో! ఒక్క భాషాపండితుఁడు ''ఇటుచూడుఁడు'' అని తర్జనితోఁజూపించుచున్న పెద్ద యక్షరములేవో చదువఁగలరా? ''విజ్ఞాననర్వస్వాది గ్రంథము లిక్కడ''నని వ్రాయఁబడియున్నది. సెబాస్! ఇవి గీతపద్యనాటకము లని యెవ్వఁడో యొకఁడు కిత్తనారసంచిమూటను విప్పుచున్నాఁడు. ఇవి స్వతంత్రముగ రచియించిన నవలలని గుమికూడి కొందరేవోపేళ్లను జదువుచున్నారు. సౌందర్యతిలక మని మరియేమో యని వినఁబడుచున్నది. ఇదిగో! నూతనాంధ్ర వాఙ్మయచరిత్ర మని యొకపుస్తకమును బైకెత్తి యెవరో చూపుచున్నారు. ఆమూలను రాశిపోసిన వన్నియు గ్రామ్యభాషాగ్రంథములు. అచ్చట వృద్ధుఁ డయ్యును బలిష్ఠుడైన యొకబ్రాహ్మణవర్యుఁడు గ్రామ్యభాషోత్కృష్టత నుపన్యసించుచుఁదమ పుస్తకములలోఁ బ్రమాదమునఁబడిన విమర్శాదర్శవిమర్శాదర్శమను గ్రంథమును బైకిఁదీసి గీత నాటకముల దొంతరపైకి ధూయని విసరి సైచుచున్నాఁడు. అచ్చటఁ జేరిన గ్రంథకర్తలయిదారువందలకుఁబైగ నున్నట్లు కనుపట్టుచున్నారు. వీ రందఱిచేతులలో నొక నాటకమో, నవలయో, ప్రహసనమో, చిన్నకథయో యున్నది కాని రిక్తహస్తుఁ డొకడును లేఁడు. ఇక్కడఁ జుట్టకాని సిగరెట్లుకాని కాల్చఁగూడదని పెద్దయక్షరములు గోడలపై వ్రాయఁబడియున్న యాకొట్లోవో యెఱుఁగుదురా? అవియే తాళపత్రగ్రంథనిలయములు. ఆనమీపము ననే కొందరు చేతులలో నేమియోకాని గలగలలాడించుకొనుచుఁ దిరుగుచున్నారు కనుచున్నారా? రాగికడియములలోఁ దగిల్చిన రాగిరేకులున్నవే యవియే పూర్వశాసనములు; వారే భావ్యాంధ్రసారస్వత చరిత్రకారులు. వహవ్వా! ఎక్కడఁ జూచినఁ గవియే. ఎక్కడఁ జూచిన నాటకకర్తయే. ఎక్కడఁ జూచినఁ దూర్పువారి పొట్టియేచ, పడమటివారి బారెఁడేసి దీర్ఘములు, మధ్యమండలపువారి మట్టసపు మాటలు. ఒకరీతి యేమి యొక వైఖరి యేమి? అచ్చట నన్నియుఁ గలసియున్నవి. కవులు గవులను దిట్టుచున్నారు. కవులు విమర్శకులను దిట్టుచున్నారు. విమర్శకులు కవులను దిట్టుచున్నారు. విమర్శకులు విమర్శకులను దిట్టుచున్నారు. కవులు విమర్శకులైన వారు విమర్శకులు గవులైనవారిని దిట్టుచున్నారు. వీరిపక్షపువారు వారి పక్షపువారిని దిట్టుచున్నారుఁ. వారిపక్షపువారు వీరిపక్షపువారిని దిట్టుచున్నారు. ఏపక్షమున లేనివారు రెండు పక్షములవారిని దిట్టుచున్నారు. మహాజనులారా! ఈ మహాకోలాహలములోఁ గొందరు మగువలుకూడఁ గనఁబడుచున్నారు చూచితిరా! అబలానచ్చరిత్రరత్నమాల యని, పావిత్రీనాటకమని, మరియేమో యని సన్నసైన గొంతులతో సంగీతము వంటి ధ్వనులు వినఁబడుచున్నవి. తెల్లగ సుద్దకొండలవలె నగపడునవి యేవో తిలకించితిరా! ఆంధ్రపత్రికలు, కృష్ణాపత్రికలు, హితకారిణీపత్రికలు, న్యాయదీపికలు, గోదావరీపత్రికలు, జన్మభూమిపత్రికలు. ఇవికాక యెన్నియో గ్రంథరూపమున వెలువడిన సంచికలు. ఇఁక నావైపున నున్నవారెవరు? వారే నవ్యకవులు. తెనుఁగుతోటలో యుద్ధగీతములు, మోహగీతములు, భావగీతములు, ప్రేమపాటలు రుంయిమని రొదచేయుచున్నవి. వినుచున్నారా? ఈమహాసంకులములో రాట్నపుగీతములు, ప్రత్తిగీతములు, ఖద్దరు పాటలు, నూలొడుకుపాటలు, ఏకుచేయుపాటలు, స్వరాజ్యదర్పణములు, స్వరాజ్యతాంబూలములు! వాక్కునకు వ్రాతకు వింత విజృంభణము ముందెన్నఁడైన నుండెనా? ఓ! ఏమి సంక్షోభము! ఎంతశక్తి! ఎంత జీవము! ఎంతధాటి! శారదాదేవి కింత మహోత్కృష్టదినములే లేనట్లు కనఁబడుచున్నదే! కాని మొదటి రెండుమూఁడు మెట్లమీఁది వారెవరో కేకలిడుచున్నారు వినుఁడు.

''ఎందుకాగోల! ఎందు కాపనికి మాలినవ్రాత! ఎందు కాతుక్కు! అపెంట'' యని కేకలిడుచున్నారే! నరస్వతీదేవి యామాటలు విని నన్నగ నన్నగ నవ్వుచున్న దెందుకో! ఎవ్వరైన నెఱుఁగుదురా? ఎఱిఁగియుండునెడల నాకుఁ జెప్పరా? మీరు, మీరు. ఇంతలో నా మూలనుండి యేదియో ధ్వని వచ్చుచున్నది. వినుఁడు ఎవఁడో మాటలాడుచున్నాఁడు. ''పనికిమాలిన వ్రాఁతయా! అబ్బ! మమ్మధిక్షేపించుచున్న మీరు చెప్పిన కవిత పనికి మాలినవ్రాఁతకాదు కాఁబోలునేమి! మీపై వారికవితముందు మీరుచెప్పినదియుఁ దుక్కే క్రిందివారివ్రాఁత పైవారి వ్రాఁతముందుఁ దుక్కు. అది వారి పైవారి వ్రాఁతముందుఁ బెంట. అన్ని కవిత్వములు గాళిదానుని కవిత్వముముందుఁ దుక్కు. కాళిదానుని కవిత్వమును పుట్టతేనె కవిత్వముముఁదుఁ బెంట. అదియైనను బ్రహ్మానుసంధానమున వేదర్షుల నుండి నిష్ప్రయత్నముగ నుద్బుద్ధమునఁ దపోమాహాత్మ్యమునఁ బ్రకృతి కాంతఁముంగురులలో నొక్క వెండ్రుకలోని వంకరటింకరలైనను నరిగఁ జెప్పలేకపోయిరే, అట్టిచో నెవనికవిత్వము దుక్కు, ఎవని కవిత్వము ముక్కు, ఎవనికవిత్వము పెంట, ఎవనికవిత్వము పంట. అందరుఁ బ్రయోజకులే! అంద అప్రయోజకులే! మాకాలమందు మమ్మెట్లు పైవారు తిట్టుచున్నారో, మీకాలమందు పైవారు మిమ్మట్లు తిట్టినవారే. లోకచరిత్ర మన్నియుగములందుఁగూడ నాడిన యాటయే యాడుచున్నది. కాని యొకచోటఁ గ్రోఁతులభాగవతమాడి యొకచోట గోవిందనామస్మరణ చేయుట లేదు. బుద్ధిలేకపోవుటచేత నెప్పటి కప్పటికే పరాకు. పైమెట్టువారు వారిపై మెట్టువారి మొట్లనుదినుచుఁ దమక్రిందిమెట్టున నున్నవారిని మొట్టుచున్నారు. ప్రపంచమునకు సిగ్గెక్కడిది?'' అని ఇంక నేమేమో జంఘాలశాస్త్రి యాకాశమంత నోరు పెట్టుకొని మొండి మోటత్రోపుగా బడితబాజాపద్ధతినిఁ బలుకుచున్నాఁడు. సాక్షినం ఘోపన్యానము లింకఁ గట్టిపెట్టరాదఁటయ్యా యని పైమెట్టునుండి వెంకట రత్నముగారు కాఁబోలు పలికినారు! ఈ వెంకటరత్నముగారికి సాక్షి యన్నఁగ నింతద్వేష మెందుకో! మహాజనులారా! మరియొకప్రక్కను జూడుఁడు. అరువది సమీపించుచున్న వృద్ధపండితుల యెదుట నిద్దరు పదుచుపండితులు కూరుచుండి యప్పుడే యక్షరస్వీకరణ మెనర్చుచున్న యర్భకులవలె ''అలా ఉఁఁ'' అనుచున్నా రేల? వారే సూర్యరాయనిఘంటు కార్యాలయమం దలి పండితులు. గ్రామ్యభాషాగ్రంథోపద్రవము నుండి భాషను రక్షించి యుద్ధరించిన భాషాకోవిదుఁడైన యాంధ్ర భోజమహారాజు మీయెదుటనే కానఁబడుచున్నాఁడు. ''భాషోద్ధారకా! పుత్రపౌత్రాది సంపత్తితో నిండుగా నూరేండ్లు వర్ధిలుమయ్యా మహారాజా!'' యసి మహాజనులంద రొక్క మా రాశీర్వదింపరా? మహాజనులారా! తెఱ పడుచున్నది. దేవతాద ర్శన మిఁక జాలును.

మహాజనులారా! శక్తివంచన లేకుండ శారదాదేవీపూజకైయెందరు గ్రంథకర్త లెంతగాఁ బాటుపడుచున్నారో చూచితిరా? ఇన్ని పాటులుపడి యేమి ప్రతిఫల మొందుచున్నారో యెఱుఁగుదురా? వస్తులు, పరిభవములు. ఈపుస్తకములన్నియు మంచివికాకపోవుటచేతనే ప్రజలు వాని నిరాకరించుచున్నారా? మంచివో చెడ్డవో చూచినతరువాతఁగదా తెలియవలసి నది. అట్లు చూచినవా రెవరు? చూచుట కోపిక యెవరికి? చూచుటకుఁ దీరిక యెవరికి? చూచుట కంత భాషాభిమాన మెవరికి? చూచుట కక్షరజ్ఞానమైన నెందఱకు? ఆంధ్రదేశ ప్రజలలో విరివిగా లెక్కచూచుకొనినయెడల నూటి కిరువదిమంది కాంధ్రభాషాజ్ఞాన మున్న దేమో! చాలు. అంతే చాలును. లేకపోయినప్పుడు చాలదని దేవులాడిన లాభ మేమున్నది? యెఱుఁగుదురా? వస్తులు, పరిభవములు. ఈపుస్తకములన్నియు మంచివికాకపోవుటచేతనే ప్రజలు వాని నిరాకరించుచున్నారా? మంచివో చెడ్డవో చూచినతరువాతఁగదా తెలియవలసి నది. అట్లు చూచినవా రెవరు? చూచుట కోపిక యెవరికి? చూచుటకుఁ దీరిక యెవరికి? చూచుట కంత భాషాభిమాన మెవరికి? చూచుట కక్షరజ్ఞానమైన నెందఱకు? ఆంధ్రదేశ ప్రజలలో విరివిగా లెక్కచూచుకొనినయెడల నూటి కిరువదిమంది కాంధ్రభాషాజ్ఞాన మున్న దేమో! చాలు. అంతే చాలును. లేకపోయినప్పుడు చాలదని దేవులాడిన లాభ మేమున్నది?

చదువుట కర్హులగు నీ యిరువదుగురిలో వారెవ్వరో చెప్పనా? న్యాయవాదులు, సర్కారుద్యోగులు, వర్తకులు, పాఠశాలోపాధ్యాయులు, గ్రంథాగారసంపాదకులు, మార్గస్థులు, వేశ్యాప్రియులు మొదలగువా రున్నారు. న్యాయవాదులు, సర్కారుద్యోగులు, వర్తకులు, పాఠశాలోపాధ్యాయులు నాంధ్రభాష చదువరు. ఆంధ్రభాషలోఁ దఱుచుగ మాటలాడరు. ఆంధ్రగ్రంథములు ముట్టరు. తత్రాపి యాధునికుల గ్రంథములపేరే వినరు.

వీరివలన భాషకుఁగాని భాషాజ్ఞానసంపన్నులగు గ్రంథకర్తలకుఁ గాని యేవిధమైన లాభములేదు. ఇఁక గ్రంథాగార సంపాదకులు బీరువాలలోఁబెట్టి బీగము పెట్టుటకు వారి గ్రంథములు నగమువెలకుఁ గొందురు. ఇఁక నటకులు రూపాయకు మూఁడుపావులాలు తగ్గించుకొని యాగ్రంథములనుగొని వారికి నోటికందని జ్ఞప్తిలోనుండని పనికిమాలినవని తోఁచినభాగములను ఖండించి నాటకములలో నుంచిన పాత్రములలోఁ గొన్నింటిని దీసివైచి మఱికొన్ని సొంతపాత్రములఁజేర్చి చావవలసినవారిని బ్రదికించి, బ్రదికియుండవలసిన వారిని జంపి గదిలోని భార్యా పరిరంభక్రియమొదలు కాటిలోని కడపటికర్మమువఱ కన్నిపనులుగూడ పార్శ్వమట్లపాటలచేత జరిపించి గ్రంథమంతయు భంగ మొనర్చి భ్రష్టమొనర్చి పరశురామప్రీతి చేయుదురు. ఇఁక మార్గస్థులు రైలులోఁ బ్రయాణమొర్చువారు రెండణాల కొక్కనాటకమో యారుడబ్బుల కొక్కనవలయో కొని కునికిపాట్లువచ్చునప్పుడు రవంతచూచుఁ చు జుట్టగాల్చి దానిపైఁ బ్రమాదవశమున ధూకరించుచుఁ దప్పనరియైన ప్పుడు మాత్రము పాదరక్షలతోఁ ద్రొక్కుచు నేసందడిలోనో కాఫీపాత్రయో నీటిచెంబో తిరుగఁబడుటచే నది తడిసిపోవఁగ దాని నావలనో మూత్రపు గదిలోనో పాఱవేయుదురు. ఇంక వేశ్యాప్రియులు తమవేశ్యలయొద్దఁ దాము మిగుల రసజ్ఞులు మనిపించుకొనుట కేదో నవలయో నాటకమో కొని వారియొద్ద వారిప్రీతికొఱకై నాటకపద్ధతిగాఁ జదివి మంచము క్రిందఁ బాఱవేయఁగా దానిని వేశ్యమాత యద్ధుపాగకో, ప్రధాన నాయిక పాలాస్త్రిపట్టులకో వినియోగింతురు. గ్రంథము లెట్లు భ్రష్టమయినను గ్రంథకర్తలొక్కపూఁటయైనఁదినుటకు వీరివలననే సదుపాయమగుచున్నది. ముష్టికారువాఁడు గ్రంథము కావలసినదే కాని పావుల డబ్బులు పెట్టి భాగ్యవంతుఁ డొక్కపుస్తక మైనఁ గొనఁడే. నలువది రూపాయలు జీతము తెచ్చుకొనుజనుఁడు మొదలు నాల్గువేలరూపాయలు జీతము తెచ్చుకొను జిస్టిసు వఱకుఁ జదువుకొనుట కొక్కయాంధ్ర గ్రంథమైనఁ గొనినవాఁడు కనఁబడఁడే. సిగ్గుసిగ్గు. జాతికి సిగ్గు. దేశమునకు సిగ్గు. ఆంధ్రగ్రంథముకొనినయెడల నప్రయోజకత. అభాగ్యత. అప్రతిష్ఠ. అజ్ఞత. ఈభాగ్యవంతులలో నట్టియపోహ మంతరించినఁగాని యట్టి గర్వము కడతేరినఁగాని, యట్టియజ్ఞానము ధ్వంసమైనఁగాని భాష బాగుపడనేరదు. కడుపుకట్టుకొని కవు లెన్నిగ్రంథములను వ్రాయఁగలరు? ఎంతకాలము వ్రాయఁగలరు. భాషాసేవకై వినియోగపడని వీరి భాగ్యమెందుకు? వీరు గ్రంథములు వ్రాయనక్కఱలేదు. చదువనక్కఱలేదు. వీరు మైన్సు పినాల్ కోడ్ (Maynes Penal Code) కంఠపాఠము తలక్రిందుగాఁ జేయవచ్చును. కళాపూర్ణోదయగాధనైన వినక్కఱలేదు. జస్టిను బెన్సను (Benson) గారి తీర్పులన్నియు వీరి జిహ్వాగ్రమున నుండనేవచ్చును. జనకచక్రవర్తి యెవరో వీరికిఁ దెలియనక్కఱలేదు. వీరు భాగ్యవంతులయొద్ద బదుళ్లు తీసికొని దివాలాలు తీయనేవచ్చును. సుమతిశతకమైనఁ జదువనక్కఱలేదు. ఆంధ్రదేశమునఁబుట్టి ఆంధ్రులై ఆంధ్రజాతిరక్తమును దేహమునఁగలిగియున్న వీ రాంధ్రకవులగ్రంథముల నాంధ్రదేశముకొఱకైనను, నాంధ్రభాషకొఱకైనను,

నాంధ్రజాతికొఱకైనను, దమ యాంధ్రత్వమును నిలువఁ బెట్టుకొనుటకైనను గొనక తప్పదు. కొన్ని గ్రంథములు చదువనైన నక్కఱలేదు, చదివినయెడల మరింత మంచిదె. భాషాజ్ఞానమును నంపాదించుకొని కవులను పోషించినయెడల మరింత మంచిదే. పోషించుట యేమున్నది? పుస్తకమును గొన్నయెడల నంతే చాలును. భారత భాగవతము లెరుఁగ మివాఁడు బారిష్టరైన నేమి? భండారాధిపతియైన నేమి? ప్రభుఁ డైననేమి? బ్రహ్మాండనాయకుఁ డైననేమి? ఆతఁ డాంధ్రుఁడుమాత్రము కాఁడు. ప్రజాపోషణము గ్రంథకర్తల కత్యావశ్యకము, మనదేశమునందే లేదు గాని మిగిలినయన్ని దేశములందుఁ గూడఁ గవులకుఁ బ్రజాపోషణ మున్నది. ఈ నిర్భాగ్యత, యీ దురవస్థాగ్రగణ్యము మనదేశమందే. ప్రభువు లెందరుకవు లను బోషింపఁగలరు? ఎంతకాలము పోషింపఁగలరు? ప్రజ లాభాషాపోషణభారమును గొంతవహించుట విధి. దేశభక్తియని, భాషాపోషణ మని, స్వార్థపరిత్యాగ మని, స్వరాజ్య మని, మరియేమో యని యార్యావర్తదేశమంతయు నట్టుడికిన ట్లుడుకుచున్నప్పుడే యాంధ్ర వర్తదేశక్షోభమునుగూర్చి యవతలిప్రపంచమంతయు నాందోళనపడుచున్నప్పుడే భూకం ణాల డబ్బు లిచ్చి యొక్క యాంధ్రగ్రంథమును ననేకసహస్రనమార్జనసాహితీచక్రవర్తులలో నొక్కఁడైనఁ గొనలేకుండ నున్నాఁడే! ఆహా! ఏమి యాంధ్రదేశ భాగ్యము! ఘఁటోఁ జొలును, దానికిఁ జొలును; మనకుఁ జొలును.

నిజమే. గ్రంథము లెల్లెడలఁ బయలువెడలుచున్నవి. గోరంటలు వట్టుచున్నవి. గుల్‌షబులు పుట్టుచున్నవి. గులాబులు పుట్టుచున్నవి. కుక్కగొడుగులు పుట్టుచున్నవి. అన్నయు మంచివే పుట్టవలెనని ప్రకృతిలో శాసనమున్నదా? ఎచ్చటనైన నటులు పుట్టినవా? ఏకాలమందైన నట్లు పుట్టినవా?! ఏజాతిలోనైన నట్లు పుట్టినవా? ఉహూహు. అన్ని యెడల నుహూహన్న ప్రకృతి మనయెడల మాత్రము "ఊ" యని యేల యనవలయును? కలువతీఁగెప్రక్కనే మొండిచేయి; ఘనాఘనగర్జ వెంటనే కప్పకూఁత; దేశకాలపాత్రములఁ బట్టి ప్రకృతి తన మనోభావమును బహిర్గత మొనర్పకతప్పదు.

మామిడిపూఁత యెట్టిదో మనూచిపోఁత యట్టిది. గోరంటపూవు వానన యెట్టిదో కోరింతద గ్గట్టిది. గుబ్బలాఁడి కంటితళు కెట్టిదో మబ్బులోని సీడు గట్టిది. పద్మములోని మధు వెట్టిదో పాములోని విస మట్టిది. గ్రంథకర్త రణగీతమెట్టిదో యతిమూత్రరోగి రాచవుం డట్టిది. అన్నియుఁ బ్రకృతినంబంధములే. అన్నియు బహిర్గతాంతస్తత్త్వములే. అయిన నేమి? చూలింతరాలివేవిళ్లకు నూడిద లిచ్చుచున్నాము. కలరావాంతులకు కర్పూరారిష్ట మిచ్చుచున్నాము. మొగలిపూవును గులకాంత కొప్పులో నుంచుచున్నాము. మూలవ్యాధిని ఛేదించుచున్నాము. అటులే గ్రంథము లన్నిటిలో మంచివానిని బహుమానింపవలయును. చెడ్డవానిని బహిష్కరింపవలయును.

వైద్యశాస్త్ర మెందుకుఁగలిగెనో, ధర్మశాస్త్ర మెందుకుఁగలిగెనో విమర్శనశాస్త్రము కూడ నందుకె గల్గినది. వైద్యశాస్త్రమునకున్న వ్యాప్తి విమర్శనశాస్త్రమునకు లేదు. నిజమే. అటులేల యుండును? మాటవచ్చినది కావునఁ జెప్పుచున్నాను. మీ రెంతప్రశస్తమైన భావగీతమును బాడినను బాముకా టంతశీఘ్రముగఁ బ్రాణము తీయఁగలరా? గోడయున్న యెడలఁ జిత్రకర్మమునకు లోపమేమని ముందు మనవారు తనువులు భద్రపఱుచుకొనుటకుఁ దంటాలువడి వైద్యశాస్త్రమును ధర్మశాస్త్రమును సృష్టించినారు. కావున విమర్శనశా

స్త్రము ప్రధాన కృత్యముకాక వేడుకపనియైనది. కాగితములు చవుక యగుచున్నవి. అచ్చుశాలలు వృద్ధియగుచున్నవి. నాటకసంఘములు హెచ్చగుచున్నవి. గ్రంథమాలలు ఘనము లగుచున్నవి. కవులు మితిమీరిపోవుచున్నారు. గ్రంథము లసంఖ్యాకము లగుచున్నవి. వీనిలో మంచి వేవో నిర్ణయించి చెడ్డవి త్రోచివైచుట ప్రకృతిపద్ధతినిబట్టి యావశ్యకమై యున్నది. ఇవి యన్నియు భూమికి భారమగునని యెవ్వఁడును జెప్పుటలేదు. వీనివలన వచ్చిన బాధయేదో చెప్పెదను. మాయమాత్తెమున కున్నతళుకు మంచి ముత్తెమునకు లేదు. ముచ్చెబంగారమున కున్న మెరుఁగు మేలిమి కున్నదా? అసత్యమున కున్న చాకచక్యము, జమత్కృతి సత్యమునకు కెక్కఁడిది? అది మున్నాళ్ల ముచ్చట. ఇది ముప్పదితరములకైన పోనిది. అల్పగ్రంథమునకు హర్షించినవారే యనేకులు మంచిగ్రంథమును దెలిసికొని యనుభవించినదాఁక నెవనికి? మహాజనులారా! నూటి కెనుబదుగురు రసగ్రహణమునఁ గేవలము మూఢులు. వారు పామరుల తెయితక్కలకు బళీయందురు కాని ప్రకృతిలోని తలవెండ్రుకల చిక్కువిప్పిన గ్రంథములకు నంతసించెదరా? ఉహుఁ. చెంచునాటకమున కున్న జనానురాగము శాకుంతలమున కేది? పంచదారకుఁ బట్టిన యెర్రచీమలకంటెఁ గుంకుఁడుకాయలకుఁ బట్టిన యెర్రపురుగు లెక్కువకదా! ఇఁక గ్రంథకర్తలమాట చెప్పెదను. గ్రంథకర్తలలో నుపజ్ఞాసహితుఁడు వేయి కొక్కఁడైన నుండునో లేదో! అనేకు లేదైన నొకగ్రంథ మామోదించి యాకవిని బహుమానించుట సిద్ధించునెడల "ఆహా! వ్రాయవలసినపద్ధతి యదియే కాఁబోలు! మనముకూడ నట్లే వ్రాయవలెను గాఁబోలు!" నని యనేకకవులు భ్రమపడుదురు. పైకి వారిని దిట్టుచునే యుందురు. కాని లోపల నీయపోహములకు లోనైయుందురు. వారంత క్రమముగా దిగి యంతకంటె జారి యధఃపతితులై నీచగ్రంథసృష్టినిర్మాతలై ప్రకాశింతురు. మరికొంద రింకొకవిధముగా మారుచున్నారు. అయ్యవారులుగారి పాటలనాటకమునకుఁ బండ్రెండువందలరూపాయలొక్కరాతిరి వచ్చినవనఁగ నిఁకఁ బ్రకృతి లేదు. పాత్రౌచిత్యము లేదు. ఏమియు లేదు. పదిదినములలోఁ బాటలనాటక మొక్కటి కవి ప్రజలపైఁ బాఱవైవల సినదే. పాటలనాటకములు ప్రకృతివిరుద్ధము లని యాతఁ డెఱిఁగియుండియుఁ బైనకారకుఁ బ్రఖ్యాతికొఱకు బహుళముగా ధన మిచ్చి వ్రాయించుకొను నాటకసంఘములకొఱ కాతఁడు వ్రాయును. కడుపు కక్కురితిచే మనస్సాక్షిబోధన కాతఁడు వ్యతిరేకముగఁ బ్రవర్తించును. సామాన్యబుద్ధియుక్తుఁడైన యాతఁడట్లు ప్రవర్తించుట విశేషముగాదు. మహాధీశాలియై శారదాదేవిచే త్వమేవాహమ్మని యనిపించుకొనె నని చెప్పఁబడిన కాళిదాసుఁడుసైతము సామాన్యజనాభిరుచి ననునరించి రఘువంశములోని కడవటిసర్గలలో నవలానవ లాలితేత్యాది శబ్దమాత్కారములను గవిత్వములో సింగారించి కవిత్వము భ్రష్టపఱచుకొనె నని పూర్వవిమర్శకులే వెల్లడిచేయలేదా! మన యీదేశమందే యిట్టిసన్నివేశముకాదే. అలెగ్జాండరు పోపు (Alexander Pope) కవిత్వము వాని ననునరించిన వారికవిత్వము వట్టి గజముబద్ధకవిత్వ మని, తక్కుఁడ తవ్వ కవిత్వ మని యెఱిఁగియున్న బైరన్ (Byron) వంటి స్వతంత్రబుద్ధినహితుఁడు సైతము యశఃకనకము లపేక్షించి తనకవిత్వముకూడ కంపసు కవిత్వములోనికి దింపినాఁడు కాదా! అంకవాటకములకు డబ్బు రానియెడల రంగనాటకములనుఁ వ్రాయుదము. అంతే. దేన్ వాలమట్టుల నాటకములకు డబ్బు రానియెడల పార్సీమట్టులనాటకముల వ్రాయుదము. దీని కింతయోజన యెందుకు. పార్సీమట్టుల నాటకములకు డబ్బు రానియెడల బ్యాండు ట్యూన్సు (Band tunes) నాటకములఁ జేయుదము. దానితెగు లింతటితో డక్కునఁ

గుదురునో. ప్రకృతిపరీక్ష యక్క-అలేదు. పాత్రతత్త్వభేద మక్క-అలేదు. ప్రసంగ చమత్క్ర
యక్క-అలేదు. పాత్రౌచిత్య మక్క-అలేదు. ఏమియు నక్క-అలేదు. పాఠాంతరమునకుఁ బా
దొరికినఁ జాలును. ప్రకృతి ప్రతిబింబములుగ గ్రంథముల వ్రాయవలసిన కవులీ కారణముల
భ్రష్టులై పోకుండ విమర్శగ్రంథములు పుట్టవలసియున్నది. ఒకకవి వేరొకకవిని విమర్శింపఁ
గదు. అది ప్రబలవైరమునకుఁ గారణమగును. ఆభయంకరవైరకీలాజాలము పుష్క-లావర్త
ఘమునఁ గాని శాంతింపదు. నిష్పక్షపాతబుద్ధితో సాహిత్యపరిషత్తువా రీవిమర్శనకృత్యమున
మీఁద వైచుకొనక తప్పదు. కవిత్వము చెప్పుటకు శక్తిలేని వాని కవితారసమును గ్రహింపఁగ
లోకోపకారబుద్ధి గల నిర్దాక్షిణ్య స్వభావము గలపండితుల నిందుకై పరిషత్తువారు జాగ్ర
పెట్టవలసి యున్నది. వారి విమర్శనములను బరిషన్మహాసభ్యుల యామోదము నొందిన
మ్మట లోకమున విడువవలయును. పరిషన్ముద్ర వారిపైఁ బడుటచే నవి యెచ్చటికిఁ బోయి
సరే నాణెములవలె మారును. అవి తుపాకిపిక్క-కుఁ జెదరవు. బల్లెపుఁబోటునకు జంకి
వీటివడి కెదు రెక్క-ఁ గలవు. కాని కవుల యనుమతి లేకుండ వారిగ్రంథములను విమర్శిం
దగదు. నీగ్రంథముల విమర్శింతుము. నీ వేమందు వని పరిషత్తువారు కవి నడుగనెడ
వలదని యూతఁడన. గలఁడా? వలదన్న యెడల నందున నేమి క్రుళ్లున్నదో యని యితర
లనుకొందురేమో యనుసందేహ మాతని కుండదా? విమర్శన బహుజాగరూకతత్
జేయుట యత్యావశ్యకము. ఎట్లు చేయవలయునో నేను జెప్పను. ఎట్లు చేయఁగూడదో
మాత్రము రవంత చెప్పెదను. స్వల్పదోషమైన నుపేక్షింపఁదగదు. దోషములను నిర్ణేతృ
ముగ నిర్ణయింపఁగూడదు. చిన్నయ్య కాలమున నట్లు వ్రాసిరి. పెద్దన్న కాలమున నట్ల
వ్రాసిరి. నన్నయ్య కాలమున నట్లు వ్రాసిరి. కావున మీరుగూడ నట్లే వ్రాయవలయు ని
శాసింపఁదగదు. సర్వ కవులకేకాక సర్వకళాభిజ్ఞులకుఁగూడ నవిలంఘ్యము లగుబహిరం
ప్రకృతిశాసనములకంటె భిన్నములైన శాసనములు గుణదోషనిర్ణయమున క్క-అ
రాఁగూడదు. దోషములు నిర్ణయింపవలసినదే కాని యిట్లు దిద్దుపాటు లొందినయెడ
నాదోషములు గుణము లగు నని యెన్నఁడును బలుకవలదు. గ్రంథరచనయం దొకపద్ధతి
గాని, మార్గమునుగాని, క్రమమునుగాని చూపఁదగదు. మీవిమర్శనమువలనఁ గవితక
దళుకుమాత్రమే హెచ్చించి దార్ఢ్యము తగ్గింపఁగూడదు. ఆకార సౌందర్యము మాత్ర
వృద్ధిపరిచి రసమును దగ్గింపఁగూడదు. అలంకారములు వృద్ధిపరిచి యవయవసౌంద
మును నాచ్ఛాదింపఁ జేయఁగూడదు. మదగజయామినీత్వమును మాత్రమే హెచ్చుచే
మగతనమును దగ్గింపఁదగదు. అనుకరణము మాత్రమే యధికపరిచి యుపజ్ఞ క
రాఁగూడదు. చిత్రవిచిత్రము లగురుచులుమాత్రమే వృద్ధిపరిచి జీర్ణశక్తిని దగ్గింపఁగూడద
కల్పనకు స్వచ్ఛందత్వమును తగ్గించి బండిజాడనుబట్టి పోవునట్లు మాత్ర మెన్నఁడు
జేయఁదగదు. అట్లే మీ రొనర్చినయెడల మధ్యకాల ప్రబంధశకము దిరుగ నుదయిం
జేసినవా రగుదురు. ఇఁక మేనమామపోలికలు, కవలపిల్లల పోలికలు, ఇఁక ననుకరణముల
ననుకరణమున కనుకరణములు, ఛాయాపటములు, నచ్చుబొమ్మలు మొదలయినవి బం
లుదేరును. విమర్శనములోని కట్టుదిట్టములకు మీ రేన్ని శాసనములు కల్పించిన
సామాన్యకవితాశక్తికలవాని కవి ప్రతిబంధము లగునుగాని యుపజ్ఞానహితుఁ డగు నుత్తమక
ముందెప్పుడయిన నుదయించునెడల నాతని నేశాసనములు కూడఁ బ్రతిబంధింపఁజాలవ
నిఘంటు వాతని ననుసరించి పోవును. వ్యాకరణ మాతని వెంబడించును. పద్యలక్షణ మాత

కనుసన్నల మెలఁగును. భాష యాతనిఁ గాంచి గడగడ లాడును.

వచన రచన:–వచన ప్రబంధములు మనలో మొదటినుండియుఁ దక్కువగనేయున్నవి. వానియందు మనవారి కాదరము తక్కువ. చదువవలసినవారికా; వ్రాయవలసినవారికి? చదువవలసినవారికిఁ జదువునందే యాదరణము లేనప్పుడు వచనప్రబంధములం దనాదరణ మనివాపోవుట యెందుకు? వ్రాయవలసినవారికే వానియందు నైరాగ్యబుద్ధి; వచనమును వ్రాయువాఁడు వట్టి తెలివి తక్కువవాఁడని సాధారణ జనాభిప్రాయమై యున్నది. కవితామణి కోటీరమును ధరించుట కర్హుఁడు కానివాఁడే యీకట్టిలమోపు మోయఁ దగినవాఁ డని జనుల నమ్మకము. సాధారణజనులకే యటులుండ నిఁక బద్యప్రబంధకర్త వచనప్రబంధకర్త నెంతచులుకనగాఁ జూచునో చెప్పవలయునా? తాను దేనెపట్టినియు నాతఁడు చొప్పదంటనియుఁ, దనది పూలయంగడి యనియు నాతనిది పుల్లలదుకాణ మనియుఁ, దననెత్తిపై మకుట మనియు నాతని నెత్తిపై మట్టితట్ట యనియుఁ బద్యలేఖరి వచనలేఖరిని గూర్చి భావించును. ఎంతబుద్ధిహీనతయో! ఈబుద్ధిహీనత యీనాఁటిది కాదు. చిరకాలమునుండి వచ్చుచున్నది. నిజముగా నాసేతుహిమాచలపర్యంతము మన యార్యజాతి యంతయుఁ గవిజాతి. భరతదేశమందలి ప్రకృతిసౌభాగ్యమువలన మనము జన్మకవులము. రత్నగర్భ యని సార్థకనామము ధరించుటకు సర్వదేశములందు మన యార్యావర్తదేశమే నమర్థమైనది కాదా? బంగారము పండఁ దగిన బార్థివతత్త్వము ప్రపంచమున మఱియొకటి యేది? ఈనైపునఁ బంచోపనదులతోఁ గైలాసమ్ముపై నుండి కచ్చివటకు సింధునది, యదిదాఁటి రవంతకుడిప్రక్కకు రాఁగానే యభవ జటాజూటోద్భవయై యనేకోపనదులతో నమృతాధిక మాధుర్యధురీణాంబు ప్రవాహములతో ననేక శతయోజన పర్యంతావనీస్థలఫలీకరణ పాటవప్రాబల్యముతో ననేక జన్మార్జితాఘవినాశన మాహాత్మ్యముతో నార్యావర్తమున కామూలనుండి యామూలవటకు జగజ్జనజేగీయమాన ప్రకాశముతోఁ బ్రవహించు నార్యావర్త భాగ్య దేవత యైనగంగాదేవి–మఱిరవంత దాఁటఁగనే ధవళగిరిపైని–నెవరెస్టుపైని–నా పైనున్న శిఖరములపైని నేమూలనో యుద్భవించి వాయువేగముతోఁ బ్రాగ్దిశగాఁ బ్రవహించి అస్సామునొద్ద మోచేతివాటముగా మరలి దక్షిణముగఁ బ్రవహించు బ్రహ్మపుత్ర యిదికాక వీనిక్రింద నర్మద, మహానది, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, కావేరి మొదలగు మహానదులు తమ శీతలత్వముచేతఁ దమరసరళత్వముచేఁ దమ మాధుర్యముచేఁ దమప్రవాహశక్తిచేఁ దమపవిత్రతచే నార్యావర్తజనసంఘబుద్ధితత్త్వమున శీతలత్వము, సారళ్యము, మాధుర్యము, పవిత్రత, ధాటి యొసంగుటకుఁ జాలియున్నవని చెప్పుట యతిశయోక్తికాదే. ప్రపంచపర్వతములలోఁ బ్రథమ గణనీయమగు హైలేయాచలము భరతదేశమాతృదేవతకు హీరకిరీటమై ప్రకాశించుచుండ, వింధ్యాద్రివజ్రాలమొలనూలై యుండ, సింహళద్వీపము పాదపీఠమైయుండ, సమస్తప్రకృతివైచిత్రీసన్నివేశ ప్రథమనిదానమైన యాభరతఖండమునందు నన్ని హితసూర్యకాంతి జనులరక్తమునకుఁ దేజోధికత, ధాటి, దీప్తి గలిగింప భావనాప్రపంచమున శంపాలతాకోటులఁ బ్రాఁకింప బవనునకు బంగారుపూఁతవోయఁగ సర్వవిధములఁ బ్రకాశించు నార్యావర్తదేశమందుఁ గవులకు, గాయకులకుఁ, జిత్రలేఖకులకుఁ, భక్తులకు, జ్ఞానులకు నేమాత్రమైన లోప మున్నదా! కావున మనది యాజన్మకవిజాతి; మనగ్రంథము లన్నియు వైద్యగ్రంథములే కావు, చరిత్రగ్రంథములే కావు, నిఘంటువులే కా వన్నియుఁ గూడఁ బద్యముననే పూర్వము వ్రాయఁబడినవి. ఇప్పుడు మన కట్టిభావనాశక్తి యున్నదా? ఉహుఁ.

ఇప్పుడు మనకట్టికవితాసంపత్తి యున్నదా? ఉహుఁ. మనచిత్తముల కట్టియుత్సాహమై
నున్నదా? ఉహుఁ. విదేశీయపరిపాలనమున, విదేశీయగ్రంథపఠనమున, విదేశీయాచారావల
బనమున, విదేశౌషధ గ్రహణమున మనపూర్వవ్యక్తి పూర్తిగ నశించినది. గంగాదే
నురుగులోఁ గైలాసేశ్వరుని జటాజూట మావరించిన జనని మందహాసమును మనము గాంచ
నప్పుడు మనకుఁ గవిత్వ మెక్కడిది? గరుడుఁడు కృష్ణా యనునప్పుడు 'విష్ణువా
నమస్తుభ్యం పక్షిరాజాయతే' నమః. యని చేతులు జోడించుకొనలేని మనకుఁ గవిత్
మెక్కడిది? అట్లు చేసిన వానిని బుద్ధిహీనుఁడని మనము పిలుచుండినపుడు మన కింక
గవిత్వ మెక్కడిది? ఇదికాక మతమును వృద్ధిచేయకుండ, దైవభక్తిని హెచ్చింపకుండ
నాధ్యాత్మికజ్ఞానమును బలపరుపకుండఁ, దైవభక్తిని హెచ్చింపకుండ, నాధ్యాత్మికజ్ఞానమున
బలపరుపకుండఁ బ్రకృతిశాస్త్ర మనందర్భముగ, ననర్థముగ, ననుచితముగఁ బవిత్రప్రదే
ములందలి పైకప్పులను దొలఁగించినప్పుడు మన కింకఁ బ్రకృతిపై రోఁతయే కాని ప్రీ
యే మున్నది? విసుఁగే కాని వింత యేమున్నది? అగ్నిజ్వాలలోని యసాధారణలావణ్
మును జూచి యానందింపలేక యిది చూచి కెమికల్ కాంబినేషన్ (Chemical combina
tion) యొక్క ఫల మని నిర్లక్ష్యముగఁ జేయి నూఁపుచున్నాము. కలకంఠము గానకాలక్షే
మొనర్ప నొడలు జల్లు మనవలసి యుండఁగా వోకల్ కార్డ్సు (Vocal chords) యొక్క
అరేంజిమెంట్సు (arrangements) ఆతీరున నున్న వని మనపెదవి విఱుచుచున్నాము
తుట్టతుదకు: గన్నీటిబిందువు చూచినను మనమనస్సు కరఁగకున్నదే! లాక్రిమల్ (La
chrimal) రసము కొంత, సున్నము కొంత, యుప్పు కొంత, ఆక్వా (Aqua) కొంత యవి
యనేక లక్షల యాణిముత్తెముల నిలువ చేయఁగల యశ్రుబిందువుల ననేకధాభ్రష్టపరిచి
భంగపరిచి దానివంకఁ బృష్ఠము త్రిప్పుచున్నాము. ఇంకను గవిత్వ మని పద్యము లని యేల
దేవులాడవలయును. మనపూర్వపరిస్థితులన్నియుఁ బూర్వమున నున్నట్లే యున్నవి. కాని
మన మనస్సులలో లేనప్పుడు, మన గోదావరీనదిలో రసమే కాని మన మనస్సులలో
లేనప్పుడు, మన కరకకాయయందు భావనయే కాని మన మనస్సులలో లేనప్పు డింక
గవిత్వ మెందుకు? మన సూర్యభగవానుఁడు మన కత్యంతసమీపముననే యున్నాఁడు
కాని మన మనస్సులలోఁ గరఁగని మంచుకొండ యున్నపుడు మనకుఁ గవిత్వ మెక్కడిది?
కవిత్వము చెప్పనివాని నింక నధిక్షేపించు టెందుకు? ఎట్టిపిచ్చిలో నేవిధమైన వెగటును
లేదో, ఎట్టియున్మాదము ప్రపంచోద్ధరణపటిష్ఠమో, యెట్టిమతిమాలిన తనములో జ్ఞానవిజ్ఞా
ములు దుర్నిరీక్ష్యమైన తేజస్సునే వెల్గునో, యెట్టి వెఱ్ఱికి వేయివిధములు కాక కోటివిధము
లయ్యును బరమార్థ గ్రహణవిధాన మనునొక్కటే విధానమున్నదో, యెట్టి వెఱ్ఱి వెఱ్ఱు
లన్నిటికంటె వెఱ్ఱిదో యట్టి వెఱ్ఱిని, యట్టి లోకాతీతమైన వెఱ్ఱిని, నట్టి వెఱ్ఱిలేని వెఱ్రిని
గలిగి తాను ధన్యతఁ జెంది మనల ధన్యులఁ జేయు నాతఁడు కవి. ఇప్పుడైన నట్టిపిచ్చి
లక్షకుఁ గోటి కెవ్వనికైన నుండినయెడల వాఁడు కవితాగానము చేయువచ్చును. అంతే
గాని కవిత్వమున నేదో ఘనత యున్నదని యాసించి యందుకై ప్రయత్నించి జను
లనందర్భగ్రంథముల సృజించి యకాలపు వెఱ్రులై ప్రకృతి కాపత్తుఁ దెచ్చిపెట్టుట
న్యాయమా? అంతేకాక వచనమును వ్రాయువానిని దీసివ్రేతసరకుగఁ గుక్కమూతిపిందెగఁ
దృణీకరింప న్యాయమా? పద్యమునఁ గవిత్వ ముండి వచనమున లేకుండునా? ఎచ్చట
రసముండునో యచ్చటనే కవిత్వ మున్నది. కవిత్వము గుణములో నున్నది కాని గణములో

నున్నదా? అభిప్రాయప్రకటనమే కావలసినది. అన్ని నాగరకదేశములందుఁగూడ వచనప్రబంధములు లక్షోపలక్షలుగా వృద్ధిపొందుచున్నప్పుడు మనదేశమం దట్లు జరుగకపోవుట కడు శోచనీయముకాదా? వచన గ్రంథరచనాబాహుళ్యమునఁ గాని భాష యభివృద్ధి నొందనేరదు. మనపరిపాలకులగు నాంగ్లేయులభాషలో వివిధ విషయములపై నెన్నివేల వచనగ్రంథములున్నవో మీ రెఱుఁగనివిషయమా? మీరు వానిలో నెన్నిఁటినో చదివియే యుందురు. చదివి యూరకుండుట తగునా? ఆజ్ఞానము నంతను సంపాదించినమీరు మనమాతృభాష నభివృద్ధిపఱచుటకుఁ దోడుపడనక్కఱలేదా? మన కెంతసేపు నాటకమో, నవలయో, ప్రహసనమో, చిన్నకథయో, మోహగీతమో యంతకంటె మరేమియు లేదే! విజయనగర రాజ్యమునుగూర్చి నూయల్ వ్రాసిన గ్రంథమైన మనవా రాంధ్రీకరింపకుండి రే! చాణక్యుని యార్థికశాస్త్ర మెవ్వరైన మనకుఁ దెనుఁగుబానను నేర్పిరా? ఒక్క గులాబిపువ్వునుగూర్చి యెన్నియాంగ్లగ్రంథములో యున్నవి. మన కొక్క గ్రంథమైన నున్నదా? శారీరశాస్త్ర మొక్కటి సంపూర్తిగాఁ బరివర్తన మొనర్పఁదగియున్నది కాదా? ఫోటోగ్రాఫీ (Photography) మీఁద మెటలర్జీ (Metallurgy) మీఁద ఇవల్యూషను (Evolution) మీఁద మరి దేనిమీఁదనో మరి యింక దేనిమీఁదనో యున్నగ్రంథములలో నుత్తమమైనదానిని మచ్చున కొక్కటియైన మనభాషలోఁ జేర్పఁగలవారు మనలోని యాంగ్లేయవిద్యాధికులే కాని మఱి యెవ్వరున్నారు. వారు మన కేమని యూరకుండునపుడు భాషకు: దుర్గతి యెట్లు వదలును. ఆంగ్లేయు లెన్నిపరభాషాగ్రంథములను దమభాషలోనికిఁ దెచ్చుకొనుట లేదు? మన మట్లేల సేయరాదు? అదికాక స్వతంత్రగ్రంథముల కేమంత ప్రోత్సాహ మున్నది? శృంగారరసమున వ్రాసినగ్రంథము లనభ్యమనభ్య మని మదరాసులోఁ బఠనగ్రంథనిర్ణాయకసంఘము బరిలో నొక్కక్రైస్తవుఁడో మహమ్మదీయుఁడో వైచినకేక చత్రపురపుఁ జవుటిపట్టలకుఁ దాఁకి బళ్లారి బోడిగొండలమీఁదఁ బ్రతిధ్వనించు నప్పుడింకఁ జేయవలసినదేది? కరుణరసమున గ్రంథము వ్రాసినయెడల గజనీమామూదు సోమనాథలింగభంగ మొనరించినది. మొదలు త్రికాలములయందు మనకలవాటున్న రసము కరుణరసమే యగుటచేత నెవ్వరాగ్రంథమును లక్ష్యపెట్టుదురు? హాస్యరసమున గ్రంథము వ్రాసినయెడల నితరజాతుల కెట్లున్నను మన కది మిగులఁ దప్పు. మనకు లైఫ్ (Life) చాల సీరియస్ (Serious) అని యేదో పుట్టి మునిఁగిపోయినట్లు జీలుగుబెండుకంటె దానిని లఘువుగఁ జూతురే? వీరరసముపై వ్రాయుటకుఁ జేతులు కదలకుండ నరదండములే యయ్యెను. అందుచేఁ గల్పనకుఁ గవితకు నవకాశమేది? ఏమున్నదో నే జెప్పనేల? మీరెఱుఁగనిదియా? అందుచే బ్రతుకుఁదెరువు పుస్తకములు, ప్రతిదేశ వీరచరిత్రములు, ప్రాణరక్షణగ్రంథములు, ప్రకృతిశాస్త్రగ్రంథములు, రాజనీతిపుస్తకములు, పరిశ్రమగ్రంతములు నింక నిట్టివే భాషలోనికి దింపవలసియున్నది. గ్రంథజాలము యథార్థమైన సారస్వత మగునాయని నందేహము వలదు. ''సమిష్టిస్వర్వశాస్త్రాణాం సాహిత్య మితికథ్యతే'' యని యున్నదికాదా? సాహిత్యపరిషత్తువారికే యిఁక నందేహమేల? కాలానురణమైన సారస్వత మిదియే. ఈపని యాంగ్లేయభాషావిద్వాంసులగు నాంధ్రులవలననే కాని కాదు. వారిలో మాతృభాషయం దాదర మున్నవారు కొంద రున్నారు. వా రెట్లున్నా రనఁగ ననేకవిషయజ్ఞానసామగ్రి యంతయు సిద్ధపరిచికొనియున్నారు. విషయవిభాగములఁ గూడఁ జేసికొనియున్నారు. తెనుఁగుభాషలో వ్రాయుటకు జంకుచున్నారు. చేతఁగాక కొంత. సిగ్గుచే గొంత. మాకన్నియుఁ దెలియు నని వెల్లడించుచువే యున్నారు.

ఎప్పుడో వ్రాసెదమని వాగ్దాన మొనర్చుచునే యున్నారు. తీర నెవ్వఁడైన నొక్క తెలుఁగు గ్రంథము వ్రాసి దీని కుపోద్ఘాతము వ్రాయుఁడని వారిలో నెవరికైనఁ జూప నుపోద్ఘాతము నాంగ్లేయభాషలో వ్రాయుచున్నారు. పీఠిక లాంగ్లేయమున నున్న తెలుఁగుగ్రంథములు మనకుఁ గొన్ని లేవా? ఇదేమి కర్మము! ఆంధ్రసారస్వతచరిత్ర మాంగ్లేయభాషలో వ్రాయుచున్నానని చెప్పినవారిని నే నెఱుఁగుదును. సంధ్యావందన మింగ్లీషుతోఁ జేయుదుమన్న వారితో మనకేమి వినియోగము. కాని వారిసాహాయ్యము లేనిదే మన మేమిచేయఁగలము. వారు సాహసించి తెనుఁగున వ్రాసినఁట్లైన భాష కుపకృతి జరుగుట నిశ్చయము. వారందరు మెకాలే (Macaulay), రస్కిన్ (Ruskin), గిబ్బన్ (Gibbon), కార్‌లైల్ (Cariyle), అడిషన్ (Addision), లాక్ (Locke), హెర్బర్టు స్పెన్సర్ (Hearbert Spenser) మొదలగు మహావచన ప్రబంధకర్తల శైలీభేదములు పూర్తిగ నెఱుఁగుదురు. వారి కభిరుచియైన యేశైలినో యనుసరించి వారు గ్రంథములను వ్రాయుదురు. ఓ! ఇఁక నేమికొదువ? ఖదమునడకవంటి శైలి యొకటి, చాదర్ ఖావంటి శైలి యొకటి, బాజీవంటి శైలి యొకటి, పందెపుదౌడువంటి శైలి యొకటి మనభాషలో నవతరింపఁజేయఁగలరు. చిత్రములైన శైలీభేదములు మనభాషలో మిగుల నరుదుగా నున్న వని వేఱె చెప్పనేల? రైమని పేకచువ్వ పై కెగిరినట్లున్న శైలిభేద మేది?

కాకి పై కెగిరియెగిరి రెక్కలు కదలకుండ జందెపుఁ బెట్టుగ సాపుగ వాలుగ దిగునప్పటి లఘుపతనచమత్కృతి కనఁబరుచు శైలి పద్ధతి యేది? తాళము వాయించునప్పటి తళుకుబెళుకులు, టంగుటింగులు, గలగలలు, జలజలలు గలశైలి యేది? మహాజనులారా! ఇట్లు నే నెన్ని చెప్పవచ్చును? భయంకరమయ్యును మనోహరమై, మహాశక్తి సక్తమయ్యు మార్దవయుక్తమై, ధారాళమయ్యు విశాలమై, స్వభావ సమృద్ధమయ్యు సరసాలంకారభూయిష్ఠమై, సముద్ర ఘోషముగలదయ్యు సంగీతప్రాయమై, సృష్టీకృతసకలవిషయతత్త్వ మయ్యు ననన్యసామాన్యతత్త్వమై చదువరులకుఁ గనుకట్టు, వాకట్టు, మదిగట్టు తల పులిమినట్లు శ్వాసమైన సలుపకుండఁ జేసినట్లు ముష్టివాని చిప్పనుండి మూర్ధాభిషిక్తుని కిరీటమువఱకు భూమిక్రింది యరలనుండి సముద్రములోని గుహలవఱకు నెవరెస్టు కొండనుండి యింద్రధనుస్సు రంగుల వఱకు మందాకినీతరంగరంగద్ధంసాంగనాక్రేంకారములనుండి మహాదేవ సంధ్యాసమయ నాట్యరంగమువఱకు మనోవేగముతో నెగురుశక్తిగల చిత్రవిచిత్రశైలీభేదము లింక నెన్నియో భాషలలోఁ బుట్టవలసియున్నవి. అట్లు సృష్టికి సమర్థులగువా రెందరో యిట నున్నారు. బహుధన మున్నది. పరికరనికరమున్నది. పాత్రసామగ్రియున్నది. పాచకులున్నారు. ప్రబలుఁడైన శని నోటనుండుటచే భాషావచనశైలి బలహీనమై పౌరుషరహితమై యున్నది. నకన కలాడుచు నన్నమోరామచంద్రా యనుచున్నట్లున్నది. ఈలోప మెట్లు తీరఁగలదో సాహిత్య పరిషత్తువారు సత్వరము సమగ్రముగ యోచించుట కర్తవ్యము.

సాహిత్యపరిషత్తు:–సాహిత్యపరిషత్తువారే యీబాధ్యత బహుళముగా వహింపవలయు నని నా వినయపూర్వక విజ్ఞాపనము. వారు మైలారెవరిచేతనో యీ గ్రంథముల వ్రాయింప నక్కఱలేదు. ఆంధ్రదేశ పండితు లాంధ్రదేశవచన గ్రంథకర్తలు నాంధ్రదేశకవులు సాహిత్యపరిషత్తులోనివారే కాక మైలా రెవ్వరున్నారు? అట్టివా రెవరైన నున్నయెడల వారిని బ్రార్థించి పరిషత్తులోఁ జేర్చుకొందము. పైనిజెప్పినగ్రంథములు వ్రాయవలసినవరు మనలోనివారే.

ఎటువచ్చినను వారిని బ్రత్యేకముగ నమావేశ మొనర్పవలసియున్నది. పరిషత్ను బ్రతినంవ త్సర మెవ్వరో యొక రేదోయూరి కాహ్వానించుచున్నారు. మన మెవ్వరినో యధ్యక్షు నేర్పరుచుకొనుచున్నాము. ఏదో కార్యక్రమము ననుసరించి యెట్టులో జరుపుకొనుచు న్నాము. పై నంవత్సరమునకు మరేదో యూరు పోవుచున్నాము. అంతే జరుగుచున్న దంతే. ఇన్నినంవత్సరములనుండి భాషాభివృద్ధికై ప్రయత్నించుచుంటిమి కదా! అది యేతీ రున నైనది? ఎంతవఱ కైనది? వేనివలన నైనది? అని మనము మనలను గఱినముగాఁ బరీక్షించుకొనఁదగదా? ఇతరులు మనలఁ బరీక్షింపకుండ మనమె యట్లొనర్చుకొనట మంచిదికాదా? పదునైదు పదునారు పూర్వప్రబంధము లచ్చువేయించితిమి, పారిభాషికపద ముల పట్టికలు గొన్ని రచియించితిమి, ప్రశస్తములైన యుపన్యాసము లనేకములు పరిషత్పత్రి కలో నచ్చువేయించితిమి. A Defecne of Literary Telugu అను గ్రామ్యవాదఖండనగ్రం థము ప్రకటించితిమి. కాని మనము చేసిన యీసేవ చాలకపోవుటచేఁ గాఁబోలుఁ బరిషత్క్ర న్యక యుండవలసినట్లు లేదు. పండ్రెండవయేఁడు జరుగుచున్న పడు చెట్లుండవలసినది? ఓనన్నుఁ జూడు ననున్నుఁజూడు మన్నట్లుండవలసినదే–అట్లున్నదా–అయ్యయ్యో! సంవత్సర ములున్న నావలెనే చప్పిదొడలతో శల్యావశిష్టయై యున్నట్లున్నదే! బంగారమువంటి ప్రాయ మంకురించినపడుచు పట్టుఁబగ్గములు లేకుండ నుండవలసినదే. అయ్యో! కాలానుసారగ్రంథ పోషణమునఁ గాని కావ్యకన్యక యొడలు చేయదు. రేకెత్తదు. జబ్బపై జబ్బ వేయదు. జగన్మోహకముగఁ గనఁబడదు. ఇదివఱ కెన్నో నాటకములు నవల లున్నవి కదా వానివలన భాషాభివృద్ధి కాలేదా యని యందురేమో ఏదో స్వల్పముగ నయియుండును గాని వానివలన భాషలో నూతనాభిప్రాయములు గలిగినవా? నూతనవిషయము లేమైన బోధింపఁబడినవా? నూతనశబ్దజాల మేమైన భాషలోఁ బ్రవేశించినదా? అవి యన్నియు మెరుఁగులుఁ, జమత్కార ములు, విలానములు, వన్నెలు, వగలు, నొయ్యారములు, తళుకులు, బెళుకులు, అంతేకాని వానివలన భాష యభివృద్ధినొందిన ట్లెట్లు చెప్పఁగలము. ఒకభూగోళశాస్త్రము మనలోనికిఁ దెచ్చుకొన్నయెడల మనవారి కిదివఱకుఁ దెలియని విషయము లెన్ని తెలియును? ఇదివఱకు భాషలో లేనియభిప్రాయములిపుడు క్రొత్తగా నెన్ని చేరును? ఇదివఱకు భాషలో లేని యెన్ని శబ్దము లిప్పుడు క్రొత్తగాఁ జేరును? లీలావతినాఁటి గణితముతరువాత మనకట్టి దేదైన నున్నదా? ప్రపంచమున నున్నయన్ని శాస్త్రములలో నన్నికళలలో నన్నితంత్రములలో నేమేమి మెరుఁగు లున్నవో తెలియఁ జేయఁగల గ్రంథములు మనకుఁ గావలయును. ఇతరజాతులవా రందఱట్లు సంపాదించుకొనుచున్నారు. కావున నింతగా దేవులాడవలసివచ్చి నది. ఒక్కొక్కజాతిగ్రంథము భాషాదేవి కొక్కొక్కముందడుగుగా నుండవలెను. అట్టిగ్రంథ ములను సృష్టించుటకు మన మిపు డేమిచేయఁ దగియున్నది? అధ్యక్షకోపన్యానమైన తరువాతఁ గార్యదర్శిని వేదనమేదో యున్నదికదా! దానితరువాతఁ బండితులయుపన్యా సము లున్నవి కదా! ఉపన్యానబాహుళ్యము కొంత తగ్గించి మొదటిదినమునందుఁ గాని రెండవదినమందుఁ గార్యనిర్వాహకసంఘనభకుఁ బూర్వమో పరమో కాని గ్రంథకర్తలందరుఁ గలియవలయును. కేవలము తెనుఁగు తెలిసినవారేకాక, సంస్కృతాంగ్లేయభాషలయందుఁ బ్రవేశ ముండి యాంధ్రమున వ్రాయఁగల గ్రంథకర్తలు కలియవలెను. ఈసంవత్సరమున కేదో జరిగిపోయినది. పైసంవత్సరమునుండి యట్లు చేయుట మంచిదేమో యోజింపుఁడు. అట్లు కలసి యివ్వు డాంగ్లేయముననుండి సంస్కృతమునుండి యాంధ్రభాషలోనికిఁ

దీసికొనిరావలసిన గ్రంథములేవో మొదట నిర్ణయించుకొనవలయును. వానిలో ముఖ్యములైన గ్రంథము లేవో నిశ్చయించి, మనలోని గ్రంథకర్తల శక్తులన్నియు మనకుఁ దెలియునుగాన, ''అయ్యా! యీగ్రంథమును మీరీ గ్రంథమును మీ రని మనలో మనము పంచుకొనవల యును. ఆగ్రంథములు పైపరిషత్సభకుఁ బూర్తిచేసి తీసికొనివచ్చు నేర్పాటు చేసికోవల యును. మహాజనులారా! ఈయేర్పాటుమాత్ర మధ్యక్షోపన్యాసముకంటెఁ గార్యదర్శి సాంవ త్సరికచర్యా నివేదనముకంటెఁ గార్యనిర్వాహకసంఘపుఁ దీర్మానములకంటె నత్యంతము ముఖ్యమైనది. ఏపరిషత్సభలో భాషాపండితులు సంవత్సరము కష్టపడి పూర్తిచేసి తీసికొనివ చ్చిన గ్రంథములు ప్రదర్శింపఁబడునో యీపరిషత్సభయే జయప్రదముగా జరిగినదని చెప్పవలసినది. మిగిలినసభ లన్నియు మిత్రదర్శనములు బంధుసమాగమములు లీలాప్రయా ణములు గాలిమార్పులు అట్ హోములు (At home) టీపార్టీలు–ఇన్ని మాటలు చెప్పితివి గదా! నీ వేగ్రంథము నేల రచియింపలేదని మీరు న న్నడుగఁదగినదే. ఇదిగో! చెప్పుచు న్నాను. నాగుణలోపముకూడఁ జెప్పెదను. ఆంధ్రభాషలో నాయభిప్రాయమును వెల్లడిం చుటకుఁ దగినశక్తి నాకుఁ గలదు కాని సంస్కృతభాషలో నాకుఁ బ్రవేశము తక్కువ. సామాన్యపుఁదక్కువ కాదు. లేదని చెప్పఁ దగినంత తక్కువ. ఆంగ్లేయభాషాజ్ఞానము మొదటినుండియుఁ గలఁత కొట్టయినది. సంవత్సరముల క్రిందటఁ జదివిన యాంగ్లేయగ్రం థమే కాని తరువాతఁ జదివిన దొక్కటైన లేదు. జీవనోపాధిలో నాంగ్లేయ భాషాజ్ఞాన మేమైన నక్కఁ అవచ్చిన దేమో యనఁగ శ్రీరామరక్ష. శ్రీరామరక్ష. మహారాజశ్రీయే కాని మై డియర్ సర్ (My dear Sir) అని యెవరికి వ్రాయవలసిన యావశ్యకత నాయదృష్టమున లేకపోయినది. అందుచే న న్నాంగ్లేయభాష రానివాఁడుగనే మీరు గణింపవలయును. మీ రిట్లు సంవత్సరక్రమముగాఁ జేయవలసిన గ్రంథజాలమువలన భాష యభివృద్ధి నొందుటయే కాక గ్రంథకర్తలలో నభ్యముకూడఁ బభివృద్ధి నొందఁగలదు. కవికిఁ గవి కున్న కాకోదరమం దూకము నైఖరి, కవికి విమర్శకున కున్నమూషకమార్జాలనైఖరి, విమర్శకునకు విమర్శకున కున్న సామజపంచాననపద్ధతి, సత్వరముగ నంతరించి వారిలో సాహచర్యము సామనస్యము సౌభ్రాత్రత్వము నంభవింపఁగలవు. గ్రంథకర్తలలో నిట్టి మనస్థితి భాషకు దేశమునకుఁ బరమ శుభోదర్కము. సాహిత్యపరిషత్పక్షమున నిప్పుడు రచియింపఁబడుచన్న యాంధ్రభాషాశిరో భూషణ మైనగ్రంథము సూర్యరాయాంధ్ర నిఘంటువు. ఇది పరిషత్పక్షముననే రచియింపఁబ డుచున్నను బరిషత్సభ్యులకు ధనవిషయ మైనశ్రమము లేకుండ నిఘంటుసంబంధము లగునమస్త వ్యయప్రయాసములను మామహారాజుగారే మహోదారమనస్కులై వహించుచు న్నారు. భాషాపండితులును నుత్తమవిమర్శకులును నగు మ–రా–రా–శ్రీ, జయంతి రామ య్యపంతులుగారు కేవల భాషాప్రేమ పూర్వకశ్రమమునకులోనై భాషాసేవయే ప్రతిఫలముగా నెంచి నిఘంటు సంపాదకత్వమున నిర్నిద్రదీక్షులై యున్నారు. ఈనిఘంటువు మహోత్తమ గ్రంథము కాఁగల దని నమ్మియున్నాము. మరియు ననేకాంధ్రప్రబంధవ్యాఖ్యానరచయిత లును ననేకగ్రంథద్రష్టలును నపారసాహిత్య సంపన్నులును శాస్త్రానవిద్వాంసులు నగు శ్రీపురాణవండ మల్లయ్యశాస్త్రులుగారిచే బ్రహ్మసూత్రభాష్యమును మహారాజుగారే యాంధ్రీ కరింపఁజేసిరి. భాషాపుష్టికర మైనదియు విషయగౌరవప్రాశస్త్యాదులం బట్టి యాచంద్రార్క ముగ నాంధ్రభాషలో నుండఁదగినదియు నైయున్నది. ఇది కాక యనేక పాఠాంతరములతో నర్హమైన వ్యాఖ్యతో నాంధ్రభారతమందుఁ గొన్నిపర్వము లీపండితవర్యునిచేతనే

క్రీ ౬౦౦౨ఁ బడియున్నవి. భాష కీమహోపకారము కూడ మామహారాజుగారే యాచరించు చున్నారు. ఇది కాక కవిచక్రవర్తియైన కృష్ణదేవరాయలచే రచింయింపఁబడిన యాముక్తమాల్య దకు మామహారాజుగారు బ్రహ్మశ్రీ మహామహోపాధ్యాయేత్యాదిబిరుదాంకితు లయిన వేదము వేంకట రాయశాస్త్రులవారిచే వ్యాఖ్యానము వ్రాయించిరి. దాని నచ్చువేయించుట కెన్ని సంవత్సరముల క్రిందటనో యేర్పాటు చేసియుండిరి. వ్యాఖ్యారచన పూర్తియైన దఁట! అ చ్చింకఁ గాలేదు. కారణము తెలియదు. ఇదిగాక యాస్థానతర్కవిద్వాంసు లగు శ్రీమాన్ గుదిమళ్లవేంకటరంగాచార్యులవారిచే శ్రీవచనభూషణ మనుసంస్కృతగ్రంథము నాంధ్రీ కరింపఁజేసిరి. ఇట్లు భాషాపోషకులు భాషాపండితులు నగు శ్రీమహారాజుగారికి దీర్ఘాయురా రోగ్యాది సకలైశ్వర్యములు సర్వేశ్వరుఁడు ప్రసాదింపవలయు నని పరిషత్పక్షమున నేను బ్రార్థించుచున్నాఁడను.

వ్యాకరణము:—ప్రస్తుతవ్యాకరణము లసమగ్రముగ నుండుటచేత భాషాపరిశుద్ధి రక్షణ మునకై విపుల మగునొక వ్యాకరణమును రచియించుట మంచిదని పూర్వసభలలో నుపన్య సించిన యధ్యక్షులు కొందరు సెలవిచ్చిరి. వారియిష్టము ననుసరించి వ్రాసినను వ్రాయవ చ్చును. మీయుపేక్ష ననుసరించి మానినను మానవచ్చును. ప్రపంచమున నున్న ప్రతిసారస్వ తపరిషత్తునకు రెండే ప్రధానోద్దేశములు. భాషాపోషణము, భాషాపరిశుద్ధరక్షణము. మొదటిది గ్రంథములవలన నగును. రెండవది వ్యాకరణశాస్త్రమువలన నగును. ఇదివఱకు మన మనుకొనిన ట్లింకఁ, గొన్నివత్సరములు గ్రంథములు వృద్ధినొందినతరువాత వ్యాకరణరచనా నుచరణనుగూర్చి యోజింపవచ్చును. ఇప్పు డంత తొందరలేదు. ఇప్పుడే రచియింపవ లయు నని యోజించు వారు వారి యిష్టానుసార మాచరింపవచ్చును. ఎప్పుడు రచియించినను బరిషత్పక్షముననే యది రచియింపఁబడుట మంచిది. పరిషన్ముద్ర దానిపైఁగూడ నుండవల యును.

మహాజనులారా! ప్రభువుల యాదరణ మున్నను లేకున్నను బ్రదుకుఁదెరు వున్నను లేకున్నను బ్రపంచయాత్రలోఁ బరిపరివిధములఁ గష్టములొందినను భాషాచరిత్రమునఁ దమపేరు స్థిరముగా నిలిచియుండునను ప్రజలశ్వాసముచేత నూరుసంవత్సరములలోపల నెందఱో గ్రంథములు రచియించి మరణించియున్నారు. తమహృదయరక్తముతో వ్రాసి వారు మనకొఱ కిక్కడ విడిచిపెట్టిన గ్రంథములను మనము భద్రపరిచి గౌరవించుచున్నామో లేదో యని వారి నిశ్శరీరాత్మ లాందోళనము నొందుచున్నవి. తమ్ముఁ గూర్చి తమతరువా తివా రేమనుకొనుచున్నారో యనియుఁ దమ్ముఁ బ్రశంసించుచున్నారో దూషించుచు న్నారో మఱచియే పోయినారో యనియు వారు తహతహలాడుచున్నారు. నిజము చెప్పవలసి నయెడల మనము కొందరి నప్పుడే మఱచియే పోవుచున్నాము. మండపాక పార్వతీశ్వరశా స్త్రులవారు రచియించిన గ్రంథనామము లన్నియు మనకుఁ దెలియునా? ఆయన జననతిథి మృతతిథి యేవో మనకుఁ దెలియునా? పోనిం డెంతకాలము జీవించిరో యెఱుఁగుదుమా? శతాధిక గ్రంథకర్తచరిత్రమే మనకు సందేహాస్పద మైనదే. వావిలాల వాసుదేవశాస్త్రులవారు, బెల్లపుకొండ రామారావుగారు, కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు, ధర్మవరము కృష్ణమాచార్యులుగారు, డి. కృష్ణశాస్త్రులుగారు, దేవులపల్లి సుబ్బరాయ తమ్మన్నశాస్త్రుల వారు, దేవగుప్త సన్న్యాసిరాజుగారు. తిరుపతిశాస్త్రులవారు మొదలగువా రెందరో గ్రంథముల

వ్రాసి కాలగతిం జెందినారు. వారిచరిత్రములు తెలిసినంతవఱకు సంపాదింపవలసియున్నది. ఈభారముకూడఁ బరిషత్తు వారే భరించుట కర్హులు. కందుకూరి వీరేశలింగము పంతులు గారి కవి జీవితగ్రంథముల తరువాత వ్రాయఁదగిన గ్రంథముల కుపయోగపడు సామగ్రి పరిషత్తువారికిఁ గావలదా? అదిగాక మృతకవులయందఱి ఛాయాపటములఁ గూడఁ బరిషత్కార్యాలయమున నుంచుట మంచిది. వారి నావిధముగ మనము గౌరవింపవలయును.

ధనార్జనము:–కాని ప్రాఁబలుకులకుఁ బ్రణవ మెట్లు ప్రారంభమో, వివాహాదిశుభకార్యములకు విఘ్నేశ్వరపూజ యెట్లు ప్రారంభమో, నాటకములకు నాందీపూజ యెట్లారంభమో, పరిషత్కార్య నిర్వహణమునకు ''సొమ్ములేదు సొమ్ములే'' దను పంచాక్షరి ప్రారంభమై యున్నది. ఇది యొక్క మనపరిషత్తునకుఁ గలిగినబాధయే కాదు, పార్లమెంటునభ యందు మొదలు పంచాయతీకోర్టులోవఱకుఁ బాడఁబడుచున్న పాటలన్నిటికిఁ బల్లవి యిదియే. సొమ్ములేదు. సరియే కాని, యుత్సాహము లేకున్నఁ జిక్కు కాని సొమ్ము లేకున్న నంత చిక్కు లేదు. సొమ్ము పై నుండి రావలసినది, యుత్సాహము లోనినుండి రావలసినది. ఉత్సాహమె మనకు బూర్తిగ నున్నయెడల సొమ్ము వచ్చియే తీరును. ఉపకారవేతనమును దీసికొనక పూర్వము మ.రా.శ్రీ. జ. రామయ్య పంతులుగారు పరిషత్తునకు ధనలోప మెక్కువగా నుండుటను జింతించి తా మాంధ్రదేశముననున్న ప్రతిగ్రామమునకే గాక ప్రత్యాంధ్రుని గృహమునకుఁ గూడఁ దిరుగుదు ననియు నింటికొక్క రూపాయచొప్పున సేకరించి పరిషత్తున కీకొఱఁత దీర్తు ననియు నీగ్రామమందే సెలవిచ్చియుండిరి. ఆయన యుత్సాహమే పరిషత్తునకున్న ప్రధానాధారములలో నొక్కటి. ఆయన పెద్దలగుచున్నారు. యువకులగు భాషాభక్తు లాయనకుఁ దోడుపడినయెడల సొమ్ము లేదన్న పంచాక్షరీమంత్రము సొమ్ము లేకపోలే దనునష్టాక్షరీమంత్రముక్రింద మార్పఁగలరు. మహారాజులు రాజులు జమీందారులు మొదలగునంపన్ను లిదివఱకే విశేషధన మిచ్చియున్నారు. అందులో మామహారాజుగారు పైగ ప్రధానమైన నిఘంటునిర్మాణమునకు వలయుధనము నంతయు నీయసంకల్పించుకొనియే యున్నారు. ప్రజలే తమ బాహుబలమున నింకఁ బరిషత్తునకు ధనము సమకూర్చి వలసియున్నది. ఊరనున్న ప్రతి గృహముపై యూనియను పంచాయితీ పన్నిచ్చుచున్నామా? లేదా? ఒక్కరూపాయ మొదలు పది యిరువది రూపాయలకు పైగ నిచ్చుచున్నామా? లేదా? పరిషత్తు పన్నుక్రింద నింటింటి కొక్కరూపాయ యింతటినుండి వసూలు కావలయును. అది యెంతబీదవారి యింటికైనను భార మని యనిపింపదు. ఇదివఱకు మన మెన్నిపన్ను లిచ్చుచుండలేదు. ఇంక నెన్ని యిచ్చుటకు సంసిద్ధులమై యుండలేదు. అవియన్నియు మనకు మోక్షప్రదములా? ఇది కాకపోవునా? నిజ మాలోచింపఁగాఁ బరిషత్తుపన్నుకంటె మ్యునిసిపల్ పన్ను మనకుఁముఖ్యమైనది కాదు. ఇంటిముందు పేంట యుండుట మంచిదా? మనసునందుఁ బెంటయుండుట మంచిదా? కావునఁ బంచాయితీపన్ను కంటెఁ బదిరెట్లు సంతోషముతోఁ బరిషత్తుపన్నును మన మీయవలయును. ఇప్పుడు మనదేశమందున్న గ్రంథకర్తలతాతలో తాతలతండ్రులో ప్రత్యాంధ్రునియింటిలో జరిగిన వివాహములలోఁ గవిత్వపుఁ బల్లెరమును గ్రహించినవారైయుందురు. నేనుగూడఁ గవిత్వపువరహా గ్రహించు నాచారము గల వారివంశములోని వాఁడను.

కవులారా! మనహక్కులను మనము విడుచుకొంటిమి. అది తప్పు. Lispendens

Resjudicata జ్ఞానమువలన మనము సంపాదించుచున్న సంచులకంటె కాస్‌తీటా సైన్‌తీటా జ్ఞానము సంపాదించుచున్న ముల్లెలకంటె D.C.B. Income-tax జ్ఞానమువలన సంపాదించుచున్న మూటలకంటె Cash credit జ్ఞానమున సంపాదించుచున్న గోతములకంటె కవితాదేవతారాధనపూర్వకముగ మనముత్తాతలు కళ్యాణకాలమందు సంపాదించిన పరమపవిత్రమైన కరకువరహాయున్నదే యది మాత్రము సోదరగ్రంథకర్తలారా! అధికమైనది. అమూల్యమైనది. అనుపమానమైనది. మదరాసు బ్యాంకి (Bank) లోని ధనమంతయు మీదే యైనను మాటవరుసకుఁ జూడీ తప్పులేదుకద! దానికంటె మీ కవిత్వపువరహా ఘనమైన దని యెంచవలయును. అట్టి యత్యుత్తమ ధనము మన మేల పదులుకొనవలయును? ఆంధ్రసోదరులారా! ఇంతటి నుండి మీయింట జరుగు కళ్యాణమునందు మాకు రావలసిన కవిత్వపుఁగట్నము మీరీయకతప్పదు. మీపూర్వులు మాపూర్వుల కిచ్చిరి కావున మీరు మాకీయవలసియున్నది. గ్రంథరచయితల మగు మే మాంధ్ర సాహిత్యపరిషత్తునఁ జేరియుంటిమి కావున మాకు రావలసిన దేదో మీరు పరిషత్తునకే యర్పింపవలయును. మాయింట్లలో జరుగు పెండ్లింట్లకుఁ గూడ మేము గవిత్వపుఁగట్నమును పరిషత్తునకే సమర్పించుకొందుము. మహాజనులారా! పరిషత్పోషణము మీచేతులలోనే యున్నది. మీ వలన వచ్చుధనము పరిషత్కార్యముల కింకను జాలకుండునెడల మరల దేశీయప్రభువులనే ప్రార్థింతము. పదేపదే వారినడుగుటలో మనకు వెనుక యడుగు లేదు. మరల మరల నెందు కీయవలయునని వారికి వెనుకచేయి లేదు. ఇట్లు రాఁ దగినధనములో నెనిమిదవభాగ మైనను బండ్రెండవ భాగమైన నే నింకఁ జెప్పఁబోవుపనికై వినియోగింపవలయు ననివా ప్రార్థన. నాయనలారా! మీరు శాసననిర్మాణసభలలో సభ్యులైనను మంత్రిపదవుల కర్హులైనను గాలాంబరకవచధారులై కర్కశతర్క వాగ్వాహినితో న్యాయసభలందుఁ జేరి కాకిని గ్రద్దను, గ్రద్దను కాకిని జేయఁ గల యింద్రజాల మహేంద్రజాల విద్యామహామహోపాధ్యాయు లైనను దర్క వ్యాకరణ వేదాంతాది శాస్త్రపంచాననులైనను భాషాభివృద్ధి మాత్రము కలము చేతఁ బుచ్చుకొని కడుపు చేతఁ బుచ్చుకొని గ్రంథముల వ్రాయు కవులవలనఁ గాని మీవలనఁ గాదు. కాదు. గ్రంథరచనా బాహుళ్యమునఁగాని భాషాభివృద్ధి కాదు. కాదు. వెనుకటియధ్యక్షులు చెప్పిన దదియే; ఎన్నిసారులైన నేను జెప్పిన దదియే; రాఁబోవువారు కూడఁ జెప్పఁదగినదదియే. అధ్యక్షులలో భేదమే కాని పాటలో భేదము లేదు. మునుపటి సుతియే. మునపటి రాగమే. మునుపటి తాళమే. మునుపటి పల్లవియే. మునుపటి యెత్తుబడియే. చివఱకు మునుపటి యాశాభంగమే. అది మాత్రము రానీయకుండు. నిజముగా గవులు మిగుల దురవస్థలో నున్నారు. గాదులలో గరిసెలకొలఁదిఁ గల్లా యున్నవారు, సర్కారివారియొద్దఁ బత్రము లున్నవారు, మిద్దెలమీఁదఁ గొబ్బెర కురిడీలను నిలువఁజేసినవారు, నింక నేమోచేసినవారు, ఇంక మరియేమో చేయుచున్నవారు నట్టిమీకుఁ గవులు పడుక్షోభ మెట్లు తెలియఁగలదు. కవిజన్మమంత యనందర్భజన్మము మఱియొకటి లేదు. స్వభావజ్ఞాన నిక్షేపమైన కవికి సంసారమును బొదుపుగా జరుపుకొను బుద్ధిలేదు. భావనాభండార ప్రభూత్తముఁడైనకవి కాఫీనీటికై మూఁడుకానులకొఱ కల్లల్లాడిపోవును. తనయభిప్రాయములను వారణాసీ పీతాంబరములతో ఢాకామసిలినులతో జలతారు బుటేదారీపనులతో సింగారించినకవి కమీజుమెడక్రింది చినుగు లనుంగ్రమ్మికొనుటకుఁ గంథముచుట్టు బట్టచుట్టుకొనును.

ఇట్టిదుస్థితిలో నున్నను మనస్సులో నతినికి దీనత లేదు. నైచ్యము లేదు. అడఁకువ

యన్నమాట లేదు. శాశ్వతముగా నుండువాఁడు దానొక్కఁడే కాని మిగిలినవా రందరు నశించువారే యని నమ్మికతోఁ దా నుండును. అట్టివాఁ డొకని నాశ్రయింపఁగలఁడా? అతనికున్న గర్వము నహంభావము రణశూరుల కున్నదా? రాజాధిరాజులకున్నదా? తలతిక్కలో నంతవాఁడు మఱియొక్కఁ డేఁడి? తనరుచియే తనది; తన మతమే తనది; తనధోరణియే తనది. ఫాదుషాను మెచ్చువాఁడు కాఁడు. భగవంతునే మెచ్చువాఁడు కాఁడు. కాని యిట్టికొన వెఱ్ఱివారివలననే భాషాభివృద్ధి యయినది; యగుచున్నది. కావలసియున్నది. వారింట్లలోఁబడి యష్టకష్టములఁ బడుచు భాషాసేవ చేయుచున్నారు. వారంత దురవస్థలో నున్నారని చెప్పుటయే సత్యము. వీథుల వెంటఁదల లెత్తుకొనితిరుగుచునే యున్నారని మీరు నన్నధిక్షేపింపకుఁడు. వా రంటుజవాను లే వైపుననుండి వచ్చుచున్నారో యని యటునిటు తలలెత్తి చూచుచున్నారు. కాని మరియొకటి కాదు. నామాట యథార్థమని విశ్వసింపుఁడు. అట్టివారు కొన్ని యమూల్యగ్రంథములను వ్రాసి యంతరించినారు. ఇంక నంతరింప నున్నారు. వారిగ్రంథము లచ్చుపడుట కాధారము లేదు. అవి భాషలోఁ జేరు ననునాన లేదు. ప్రతిమండలమందుఁ బుస్తకముల యేజంటులు నున్నారుకదా! వా రాగ్రంథ ముల నుద్ధరించి కవులకష్టములఁ గడతేర్పరాదా? అఁ! కడతేర్చుచునే యున్నారు. కవులను గ్రంథములనుగూడ నూటి కెనుబదియ్మైదు కమీష నను వాఁడొకఁడు మూఁడువేలప్రతు లచ్చువేయించుకొని మూఁడుపాతికల ప్రతులు కవికిచ్చెద ననువాఁడొకఁడు. ఇట్టివారే యున్న వారిలో ననేకులు. ఇతరదేశములలోఁ బూర్వశతాబ్దములందలి గ్రంథవిక్రేతలు కవులనైన మిగిల్చిరి. ఇప్పుడు పరదేశములలో గ్రంథకర్తలు గ్రంథవిక్రేతలుఁగూడ బాగుపడు చున్నారు. మనదేశమందు గ్రంథవిక్రేతలు కలియుగవ్యకోదరులై మన గ్రంథకర్తలనుగూడఁ గబళించుచున్నారు. గ్రంథకర్తలలో బొత్తిగారిక్తులగువారిని మీరు కాపాడవలసియున్నది. ధనశక్తి తక్కువైనకొలఁదిఁ గవితాశక్తి యెక్కువగ నున్నవా రెందరో యున్నారు. ఆ సంగతి మీరు బాగుగఁ దెలిసికొని యట్టివారి గ్రంథముల నచ్చువేయించి వారికి గ్రంథప్రతుల నిచ్చునెడల వారు బాగుపడుదురు. వానిని గ్రంథనిర్ణాయకసంఘమువారు పఠనగ్రంథములుగ నియమించునెడల వారు రవంత నిలువఁబడి యింకను గ్రంథముల వ్రాయుదురు. పరిషద్ధ నములోఁ బండ్రెండవవంతో యెనిమిదవవంతో యొకందులకు వినియోగింపవలసి యున్న దని నే నింతకుముందుఁ జెప్పితినే, యీ యుత్తమకార్యమునకై యది వినియోగపడవలసియు న్నది. ప్రపంచమందలి యితరదేశములలోని పరిషత్తులు దాదాపుగా నన్నియు నిట్లు నిరుపేదకవులకు సాయమొనర్చినవి. అదికాక యట్టివారు మరణించినపిమ్మటఁ గూడ వారిపిల్లలకుఁ గొంతయుపకారవేతనము లిచ్చినవి. అంతపని మనము చేయఁ జాలము. ప్రధానకృత్యములకే పరిషత్తుధనము లేకుండ బాధపడుచుండఁగాఁ బారమార్థికకృత్యము లెట్లు చేయఁగలదు? అదిగాక రెండు మూఁడు వందలసంవత్సరములక్రిందటఁ బాశ్చాత్యదే శములందలి కవుల దరిద్రతవంటిది ప్రపంచమున లేదు. మనకవులలోఁ గూడ లేనివారనేకు లున్నారు. కాని వారియంత లేనివారు కారు. అయిదుదినము లొకలిచే మూఁడిమూఁడి యాకస్మికముగ దొరికిన రొట్టె నాత్రముతో మ్రింగఁబోవ నది యంగిటి కడ్డుపడుటచే నంతలో ననువులను బాసిన ఓట్వే (Otway) వంటి కవి మనలో నేఁడీ? తనయస్థిపంజరము నమ్ముకొని రొట్టివాని కీయవలసిన ఋణమును దీర్పు మని మరణశాసనము వ్రాసిన వాజిలాల్ వంటికవి మనలో నేఁడీ? కావున మనకవులకు గ్రానవానముల కంతసాహాయ్య

మావశ్యకము లేదు. మంచి గ్రంథములు వారు రచించునెడల వాని నప్పుడప్పుడు పరిషత్తువా రచ్చువేయింప వలయును.

బిరుదములు:—ఆర్యులారా! మరియొక చిన్న విన్నప మున్నది. ఆంధ్రదేశపండితులలోఁ గొందరు నర్కారువారు బిరుదములు నొసంగు చున్నారు. నర్వసం గపరిత్యాగు లైనసన్యాసులు సైతము వదలని వదలఁగూడని భాషాభిమానముచే భాషావిద్వాం సులలోఁ గొందఱకు బిరుదము లిచ్చినారు. శంకరాచార్యపీఠస్థులొకరు బ్రహ్మశ్రీ కొక్కొండ వేంకటరత్నమువంతులవారి కొక బిరుద మిచ్చినారు. వానమామల జియ్యరు గారు శ్రీమాన్ కాండూరి భాష్యకారాచార్యులవారికిఁ గవి సార్వభౌముఁడను బిరుదమును గాఁబోలుఁ గటాక్షించిరి. కామకోటి శంకరాచార్యపీఠస్థులు మన బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి కనేకబిరుదము లీనడుమనే యిచ్చినట్లు వినుచున్నాము. తుదకుఁ గాళీ ఘట్టమున నున్నసంఘమువా రెవరో మనయాంధ్ర దేశీయపండితులకు బిరుదము లిచ్చి బహుమానించుచున్నారు. కాని మనసాహిత్య పరిషత్తు వా రిచ్చుచున్న దేమున్నది? మనవారిచ్చుచున్నవి రెండే బిరుదము; సామాన్యసభ్యుఁడు, కార్యనిర్వాహకసభ్యుఁడు. ఇంతే. ఈబిరుదమునైన నేదో కొంత దక్షిణ తీసికొని యిచ్చుచున్నారు. కాని పాండిత్యబ హూకృతిగా నిచ్చుటలేదు. మీ కాంధ్రదేశమున బిరుదార్హులైన పండితులు కనఁబడనేలేదా యేమి? అటులైన మీకుఁ గనఁబడనివారు సైవారి కెట్లు కనఁబడుచున్నారు? ఒకరి కిచ్చినయెడల మిగిలినవారు మాకేల యీయక పోవలయునని వివాదపడుదు రేమో యనునం దేహమున మానివైచితిరా! అటులైన నర్కారువారిపైనున్న, శంకరాచార్యులవారిపైనను నిందుల కిప్పుడు వ్యాజ్యములు తెచ్చినవా రెవ్వరు? బిరుదముల కర్హులైన పండితు లందరు మనసాహిత్యపరిషత్తులోనే యున్నారు. కాని బిరుదములను గూర్చి యేపండితుఁడుగూడ నిదివఱకు ముచ్చటించి యుండలేదు. ఎందుకో మీ రెఱుఁగరా? ఏపండితుఁడైన ముచ్చటిం చినయెడలఁ దనకు బిరు దిమ్మని యడుగుచున్నాఁడని సైవా రనుకొని పోవుదు రనుభయముచేఁ బండితు లెవ్వరుఁ గిక్కురుమనకుండనున్నారు. నే నాపాండిత్యబాధ లేనివాఁడను గావున నిర్భయముగాఁ బలికితిని. ఆపండితుని నభాధ్యక్షునిగా నెన్నుకొనుట వలనఁ గలిగినలాభ మిది. ఇంతకంటె నే నిప్పుడు చెప్పఁదగినది లేదు. సాహిత్యపరిషత్తు నిచ్చటి కాహ్వానించిన భాషాపోషకు లగు శ్రీపీఠికాపుర మహారాజుగారియెడలఁ గృతజ్ఞులమై యుండి వారి క్షేమాయురారోగ్యైశ్వర్యాభివృద్ధులకు భగవంతునిఁ బ్రార్థింపవలయును.

BLANK PAGE

BLANK PAGE

268

SAAKSHI

PANUGANTI LAXMI NARASIMHA RAO

ABHINANDANA PUBLISHERS, VIJAYAWADA.

సంఘంలో దురాచారాలున్నాయి. చెక్కుచెదరని మూఢవిశ్వాసాలున్నాయి. ఏది ఆధునికమో దానినల్లా మహాప్రసాదంగా భావించి, ఆరాధించే వ్యామోహాలున్నాయి.

అసూయా, ద్వేషమూ, అహంకారమూ, ఇంకా అనేకానేక మానసిక రుగ్మతలూ, ఈ మానవ సంఘాన్ని ఆక్రమించి మనిషిని చీకటివైపు నడిపిస్తున్నాయి. ఈ చీకటిని చీల్చి చెండాడడమే సాక్షి సంఘం లక్ష్యం.

"..... బిరుదములు వలదు. బహుమతులు వలదు. మన మేపనిని జేయుటకు బూనుకొని యుంటిమో దానిని నిశ్చల దీక్షతో జేయుదుము. వారి యెడల దైన్యమక్కరలేదు. వీరి యెడల భయమక్కరలేదు. వారి బహుమానములతో బనిలేదు. వీరి పదాభవములతో బనిలేదు. వారి స్తుతులతో బనిలేదు. వీరి నింద లతో బనిలేదు. దైవమును నమ్మి ప్రవర్తింతుము."

ఇది 'సాక్షి' దీక్ష

"కవిశేఖర" పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి గారి వాక్ ప్రహారాల, వాక్ ప్రవాహాల తరంగమాలికలను ఈ సంపుటి పుటలలో చిత్తగించండి.

కొని చదవండి.. కొనిపించి చదివించండి...

-సాక్షి



అభినందన పబ్లిషర్స్

28-9-24, జలీల్ వీధి, అరండల్‌పేట,

విజయవాడ - 520 002.

ఫోన్ : 0866-2572222/11

Check List

Book Number	G.VPolR178	Date	24-3-2021
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	C1, 372, 374, 266, 267		
Missing Pages	NO		
Prepared	G.Sowdhri	Scanned	Shahina.
BOOK SIZE	H 8.4 W 5.5	Pages	1093